ఈనాడు
అల్లూరి సీతారామరాజు

సోమవారం 3 నవంబరు 2025

హిమపాతమా.. ఇల కైలాసమా!

శీతాకాలం ప్రారంభమైన నేపథ్యంలో మన్యంలో మంచు అందాలు కనువిందు చేస్తున్నాయి. ధారాలమ్మ ఘాటీలో ఆదివారం ఉదయం పాలసముద్రం దర్శనమిచ్చింది. ఈ అందాలను పర్యాటకులు ఆస్వాదించారు. ధారాలమ్మ అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఈ దృశ్యాలను తమ చరవాణుల్లో బంధించారు. – న్యూస్‌టుడే, సీలేరు

నేటి నుంచి కళా ఉత్సవ్

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: స్థానిక ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో సోమవారం నుంచి కళా ఉత్సవ్-2025 జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రంపచోడవరం ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ చెప్పారు. పాఠశాల ఆవరణలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. రాష్ట్రస్థాయిలో ఏకలవ్య గురుకుల పాఠశాలల విద్యార్థులకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 24 పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరవుతారన్నారు. గిరిజన తెగల ఆచార వ్యవహారాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. గురుకులాల సంయుక్త కార్యదర్శి ప్రసాద్, గిరిజన సంక్షేమశాఖ డీడీ రుక్మాంగదయ్య, ప్రిన్సిపల్ శంకర్‌ప్రసాద్, తహసీల్దారు బాలాజీ, ఎంపీడీవో రవికిశోర్ పాల్గొన్నారు.

భద్రం బిడ్డా.. దాటాలి గెడ్డ!

మన్యంలోని మారుమూల ప్రాంతాల చిన్నారులు చదువుకునేందుకు సాహసం చేయాల్సి వస్తోంది. కొండలు, గుట్టలు, వాగులు దాటుకుంటూ బడికి చేరాల్సిన పరిస్థితి. డుంబ్రిగుడ మండలం కొల్లాపుట్టు పంచాయతీ గొల్లోరివలస గ్రామంలో పాఠశాల లేదు. అక్కడికి రెండు కిలోమీటర్ల దూరంలోని దిగువ కొల్లాపుట్టులోని ప్రాథమిక పాఠశాలకు 15 మంది పిల్లలు వెళ్లి చదువుకుంటున్నారు. మార్గమధ్యలో కొండగుట్టలు, ప్రమాదకర వాగును దాటి బడికి చేరుతున్నారు. తుపాను తర్వాత బడులు పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఇలా వాగు దాటుతూ బడికి వెళ్తున్నారు. – న్యూస్‌టుడే, డుంబ్రిగుడ

చింతూరు ఏఎస్పీగా హేమంత్

చింతూరు, న్యూస్‌టుడే: చింతూరు ఏఎస్పీగా బొడ్డు హేమంత్‌ను ప్రభుత్వం నియమించింది. ఇక్కడ పనిచేస్తున్న పంకజ్ కుమార్ మీనాను జిల్లా అదనపు ఎస్పీ (ఆపరేషన్స్)గా పదోన్నతిపై బదిలీ చేసింది. గ్రేహౌండ్స్‌లో అసాల్ట్ కమాండర్‌గా పని చేస్తున్న హేమంత్‌ను చింతూరు ఏఎస్పీగా బదిలీ చేశారు.

వనితలకు కష్టమొస్తే అండగా!

జెండర్ రిసోర్సు కేంద్రాల ఏర్పాటు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే

మహిళా సాధికారికతకు కృషి చేయడంలో భాగంగా రుణాలివ్వడం, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడంతోపాటు కష్టమొస్తే కూటమి ప్రభుత్వం అండగా నిలవనుంది. కుటుంబ, ఆర్థిక, సామాజిక, మానసిక సమస్యలను అధిగమించేందుకు వారిలో భరోసా నింపనుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో జెండర్ రిసోర్స్ కేంద్రాలు (జీఆర్‌సీ) ఏర్పాటు కానున్నాయి. చింతపల్లి, రంపచోడవరం, అరకులోయ, పాడేరులలో ఈ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. వీఆర్‌పురం, జి.మాడుగుల, అడ్డతీగలలో ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు.

సామాజిక మాధ్యమాలు, సమాజంలో చోటుచేసుకుంటున్న పలు ఘటనలతో అతివలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కలత చెందడం మినహా ఎవరికీ చెప్పుకోలేక వారిలో వారే మానసికంగా కుమిలి పోతున్నారు. పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లలేక మిన్నకుండిపోతున్నారు. ఇలాంటి వారందరికీ జీఆర్‌సీలతో ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా ప్రతినిధులే ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ప్రత్యేక కమిటీలు బాధిత మహిళలకు దన్నుగా నిలిచి కష్టాల నుంచి గట్టెక్కించేందుకు తోడ్పాటునందిస్తాయి. కేంద్రాల్లోనే ఒకటి, రెండు రోజులు వసతి కల్పిస్తారు.

గ్రామ, మండల, జిల్లా స్థాయిలో నియమితులైన ఆఫీస్ బేరర్ల ఆధ్వర్యంలో పొదుపు సంఘాల్లో బాగా చదువుకున్న వారిని గుర్తిస్తారు. వీరు రిసోర్స్ పర్సన్లగా వ్యవహరిస్తారు. మిగిలిన సభ్యులు సలహాదారులుగా ఉంటారు. జెండర్ కేంద్రంలో ప్రతి గురువారం వీరంతా అందుబాటులో ఉంటారు. మిగతా రోజుల్లో వెలుగు సిబ్బందిని సంప్రదించవచ్చు.

అందించే సేవలు

- ఉన్నత విద్యను అభ్యసించేలా, ఉద్యోగాలు సాధించేలా బాలికలకు ప్రోత్సాహం.
- బాల్య వివాహాలను అరికట్టడం.
- మహిళలకు సమాన పనికి సమాన వేతనం.
- నాయకత్వ లక్షణాలపై అవగాహన, నిర్ణయాధికారం కల్పించడం.
- హింసలేని జీవితాన్ని అందించడం.
- ఆస్తి హక్కుల్లో వాటా.
- పోషకాహారం అందజేత, రక్తహీనత నివారణ.
- సాంకేతిక విజ్ఞానం, నైపుణ్యాల పెంపు.
- వేధింపులకు అడ్డుకట్ట.

ఎవరైనా సాయం పొందొచ్చు..: బృందంలో ఐదుగురు రిసోర్స్ పర్సన్లు ఉంటారు. ఒకరు ఛైర్‌పర్సన్‌గా, మరొకరు కార్యదర్శిగా వ్యవహరిస్తారు. ఏదైనా సమస్య ఉంటే సిబ్బంది ద్వారా గానీ, నేరుగా అయినా సంప్రదించవచ్చు. మహిళలు ఎవరైనా ఈ కేంద్రాలను ఆశ్రయించి సాయం పొందొచ్చు. – **మార్టిన్ లూథర్, డీపీఎం (హెచ్‌డీ), అల్లూరి జిల్లా**

క్యార్.. క్యార్..

ప్రసవాల్లో చింతూరు ఆసుపత్రి రికార్డు

చింతూరు, న్యూస్‌టుడే: జిల్లాలో అత్యధిక ప్రసవాలతో చింతూరు సామాజిక ఆసుపత్రి ముందుంటోంది. రాష్ట్ర విభజనకు ముందు సివిల్ ఆసుపత్రిగా ఉన్న దీన్ని విభజన తర్వాత తెదేపా ప్రభుత్వం 2018లో సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్పు చేసింది. ఇటీవల ప్రాంతీయ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు మెరుగైన సేవలు అందేలా ఇద్దరు గైనకాలజిస్టులను నియమించింది.

- ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 80కిపైగా ప్రసవాలు చేయగా, అక్టోబరు నెలలో ఇప్పటివరకు వంద ప్రసవాలు నమోదయ్యాయి. జనవరిలో 64, ఫిబ్రవరిలో 48, మార్చి 50, ఏప్రిల్ 68, మే 48, జూన్ 54, జులై 50, ఆగస్టు 92, సెప్టెంబరు 95 ప్రసవాలు చేశారు. విలీన మండలాలతోపాటు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి ఈ ఆసుపత్రికి వైద్యం కోసం వస్తుంటారు. రోజూ ఆసుపత్రి ఓపీ 300కుపైగా నమోదవుతోంది.
- ప్రసవం అయ్యాక శిశువులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా ప్రత్యేకంగా వైద్య సేవలు అందించేందుకు ఇంక్యుబేటర్లతోపాటు ఎస్ఎన్‌సీయూ అందుబాటులో ఉంది. రికార్డు స్థాయిలో ప్రసవాలు నమోదుకావడంతో వైద్యులు, సిబ్బందిని ఐటీడీఏ ఇన్‌ఛార్జి పీవో శుభం నొఖ్వాల్ అభినందించారు. ప్రజల్లో మరింత నమ్మకం కల్పిస్తూ ఆసుపత్రి ప్రసవాలు ఇంకా పెరిగేలా కృషి చేయాలని సూచించారు.

బాలింతకు వైద్య సేవలు అందిస్తున్న ఏఎన్ఎం

శివోహం.. జ్యోతిర్లింగరూపం

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కార్తిక మాసం.. పరమ పవిత్రమైంది. ఈమాసంలో పరమ శివుడిని దర్శించుకునేందుకు భక్తులు శైవక్షేత్రాలకు పోటెత్తుతున్నారు. కాశీకి దగ్గర పోలికలు ఉన్న శివాలయం అనంతగిరి మండలంలోని కాశీపట్నం గ్రామంలో ఉంది. ఇక్కడి శ్రీఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం ఆధ్యాత్మిక వైభవంతో అలరారుతోంది. కార్తిక మాసంలో ఈ ఆలయానికి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి, అనకాపల్లి జిల్లాల భక్తులు, పర్యాటకులు తరలివస్తున్నారు. సోమవారాల్లో వేలాది మంది ఈ ప్రాంతాన్ని సందర్శిస్తున్నారు. ఇక్కడ గోస్తనీ నదిలో స్నానాలు చేసి.. శివయ్యకు పూజలు చేస్తుంటారు. వన సమారాధనలూ జరుపుకొంటున్నారు.

« కాశీలో ఉన్నట్లుగానే ఇక్కడ రుద్ర భూమి, నది పక్కనే ఉన్నాయి. మిగిలిన శివక్షేత్రాల్లో ఎక్కడా భక్తులు నేరుగా శివలింగాన్ని తాకి పూజలు చేసుకునే అవకాశం ఉండదు. ఈ క్షేత్రంలో మాత్రం భక్తులు నేరుగా శివలింగాన్ని తాకి పూజలు చేసుకునే అవకాశం ఉంది.

« ఇక్కడ 500 సంవత్సరాల చరిత్ర గల చెట్టు ఉంది. పర్యాటకశాఖ అధికారులు టూరిజం ప్యాకేజీలో భాగంగా కాశీపట్నంలోని టెంపుల్ ట్రీని దర్శనాన్ని చేరుస్తామని గతంలో పేర్కొన్నారు. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చేరుకునేదిలా: విశాఖపట్నం నుంచి ఎస్.కోట మీదుగా కాశీపట్నం జంక్షన్‌కు చేరుకోవచ్చు. అక్కడి నుంచి కుడివైపు అర కిలోమీటరు దూరం వెళ్తే ఈ ఆలయం ఉంటుంది.

మర్రిచెట్టు తొర్రలో ఉమా రామలింగేశ్వర స్వామి

మత్స్యగుండం.. మహాద్భుతం!

మత్స్యలింగేశ్వర స్వామి

హుకుంపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి విశాఖ జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా మత్స్యగుండం వెలుగొందుతోంది. హుకుంపేట మండలంలోని మఠం పంచాయతీ మత్స్యగుండం గ్రామంలో మత్స్యలింగేశ్వర స్వామి దర్శనానికి కార్తికమాసంలో మన్యం, మైదాన ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఇక్కడ మత్స్యగెడ్డలో పవిత్ర స్నానాలు చేసి.. మత్స్యాలను దర్శించుకుంటారు. ఆలయం వెనుక ఉన్న లింగాన్ని తాకి మూడు సార్లు ఎత్తితే కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. పచ్చని చెట్ల కింద వంటలు చేసుకొని.. సహపంక్తి భోజనాలు చేస్తుంటారు.

శివాలయాల్లో పటిష్ఠ భద్రత

పాడేరు: జిల్లాలోని అన్ని ప్రధాన శివాలయాల్లో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ అమిత్ బర్దార్ ఆదేశించారు. కార్తిక మాసం రెండో సోమవారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందన్నారు. పాడేరు ఉమానీలకంఠేశ్వర, చింతపల్లి, సీలేరు శివాలయాలు, హుకుంపేట మండలంలోని మత్స్యగుండం, కాశీపట్నం తదితర శైవక్షేత్రాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీ ప్రతినిధులకు సూచించారు.

చేరుకునే మార్గం..: పాడేరు నుంచి డి.చింతలవీధి మీదుగా 12 కిలోమీటర్ల దూరంలోని మఠం జంక్షన్‌కు చేరుకోవాలి. అక్కడి నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో మత్స్యగుండం వెళ్లొచ్చు. అరకు నుంచి వచ్చేవారు హుకుంపేట మీదుగా బర్మాన్‌గుడ కూడలికి వచ్చి.. కుడివైపు మార్గంలో మఠం చేరుకొని.. అక్కడి నుంచి మత్స్యగుండం వెళ్లొచ్చు.

నిలకడగా గోదావరి

దేవీపట్నం, న్యూస్‌టుడే: గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద గోదావరి నిలకడగా కొనసాగుతోంది. ఆలయం వరద ముంపులోనే ఉంది. పోశమ్మగండి- నాగలపల్లి గ్రామాల మధ్య పలు చోట్ల ఆర్అండ్‌బీ రహదారిపై వరద నీరు చేరడంతో పురుషోత్తపట్నం వైపునకు వాహనాల రాకపోకలు నిలిచాయి. సీతపల్లి వాగులో గోదావరి ఉద్ధృతి కొనసాగుతోంది. ఆదివారం కావడంతో అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు కొండ పైనుంచే అమ్మవారికి మొక్కులు చెల్లించారు. సీతపల్లి వాగులో సీతారం వద్ద రాకపోకలను పోలీసులు నిషేధించారు.

పాపికొండల పర్యాటకం పునఃప్రారంభం

టికెట్లు తనిఖీ చేస్తున్న పోలీసులు, నిర్వాహకులు

గండిపోశమ్మ అమ్మవారి ఆలయం నుంచి ఆదివారం రెండు బోట్లలో 103 మంది పర్యాటకులు పాపికొండల విహారయాత్రకు వెళ్లారు. మొంథా తుపాను నేపథ్యంలో వారం రోజులుగా పర్యాటక బోట్లను నిలిపివేసిన విషయం తెలిసిందే. జలవనరుల శాఖ అధికారులు అనుమతించడంతో పర్యాటకం ప్రారంభమైంది. పోచవరం నుంచీ పాపికొండల పర్యాటకం పునఃప్రారంభమైంది. రెవెన్యూ సిబ్బంది, పోలీసుల తనిఖీల అనంతరం బోట్లు కదిలాయి. మూడు బోట్లలో 130 మంది విహరించారు. పాపికొండల పరివాహక ప్రాంతం, పేరంటపల్లి శివాలయం పర్యాటకులతో సందడిగా మారాయి. కార్తిక మాసం కావడంతో పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని బోటు నిర్వాహకులు పేర్కొన్నారు. – **న్యూస్‌టుడే, దేవీపట్నం, వరరామచంద్రాపురం**

నర్సీపట్నంలో శ్రీవారి కల్యాణం నేడు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి నర్సీపట్నంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం ముస్తాబైంది. తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం ప్రాజెక్టు ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు హరికథాగానం, 5 నుంచి 6 గంటల వరకు అన్నమాచార్య సంకీర్తనలు, 6 నుంచి రాత్రి 8 గంటల వరకు కల్యాణం జరగనుంది. 150 మంది శ్రీవారి సేవకులు భక్తులకు సేవలందించనున్నారు. సభాపతి అయ్యన్నపాత్రుడు ఆదివారం ఉదయం ఏర్పాట్లను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. శ్రీవారి కల్యాణం చూసేందుకు తిరుమల వెళ్తుంటాం. తితిదే ఆధ్వర్యంలో నర్సీపట్నంలో కల్యాణం నిర్వహించడం హర్షణీయం. నాలుగు వేల మంది కూర్చుని వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. తహసీల్దారు కార్యాలయ ఆవరణ, ఇందిరా కూరగాయల మార్కెట్‌ను వాహనాల పార్కింగ్‌కు కేటాయించినట్లు చెప్పారు. సాయంత్రం 5 గంటల నుంచి కల్యాణం ముగిసే వరకు పాల్ఘాట్ కూడలి నుంచి అబీద్‌కూడలి వరకు వాహనాలకు వన్‌వే విధానం అమలు చేయనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆ ఖర్చు తుక్కుగా అమ్మినా రాదు

గోదావరిపై కచ్చులూరు వద్ద ఆరేళ్ల కిందట జరిగిన బోటు ప్రమాదం ఘటనతో పాపికొండల పర్యాటకంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. దేవీపట్నం మండలం పోశమ్మగండి నుంచి 2019 సెప్టెంబరు 15న రాయల్ వశిష్ఠ పున్నమి పర్యాటక బోటులో 77 మంది పాపికొండల విహారయాత్రకు వెళ్తుండగా కచ్చులూరు (మందం) వద్ద గోదావరిలో బోటు మునిగిపోయింది. ఈ ప్రమాదంలో 51 మంది మృతి చెందారు. అప్పట్నుంచి పాపికొండల విహారయాత్రకు వెళ్లే లాంచీలు, చెక్క బోట్లపై ప్రభుత్వం నిషేధం విధించింది. మూడు లాంచీలు, మూడు చెక్క బోట్లను వాటి నిర్వాహకులు పోశమ్మగండి వద్ద వదిలేశారు. తుక్కుగా విక్రయిద్దామంటే.. వేరు చేసేందుకు అయ్యే ఖర్చు వచ్చేలా లేకపోవడంతో అలాగే వదిలేసినట్లు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, దేవీపట్నం

పోశమ్మగండి వద్ద లాంచీలు, చెక్క బోట్లు

ఎంఈవో పోస్టుకు పైసల వల!

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీధి మండల విద్యాశాఖ అధికారి పోస్టుకు తీవ్ర పోటీ నెలకొంది. తమకే కావాలని, ఎంత ఖర్చయినా పర్లేదంటూ ఆశావాహులు ప్రజాప్రతినిధులు, నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. ఎంఈవో-1 తగ్గి సత్యనారాయణ అనారోగ్య కారణాలతో ఇటీవల ఆ బాధ్యతల నుంచి స్వచ్ఛందంగా తప్పుకొన్నారు. ఆ పోస్టును భర్తీ చేసేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. వాస్తవానికి ఈ పోస్టును ప్రధానోపాధ్యాయులకు ఇవ్వాలి. వారు లేని పక్షంలో మండలంలో సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు అవకాశం కల్పిస్తారు. వారిలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టెస్ట్ (ఈవోటీ), గెజిటెడ్ ఆఫీసర్ టెస్ట్ (జీవోటీ)లు ఉత్తీర్ణత సాధించిన వారికే అవకాశం ఉంటుంది. మండలం నుంచి నలుగురు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పోస్టును దక్కించుకునేందుకు ఆశావాహులు గట్టిగానే ప్రయత్నం చేస్తున్నారు వారిలో ఇద్దరు అధికార పార్టీ నాయకులు, మరో ఇద్దరు ప్రజాప్రతినిధుల ద్వారా పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. నలుగురిలో ఒకరిని ఖరారు చేస్తూ సోమవారం అధికారికంగా ఉత్తర్వులు వెలువడనున్నాయని డిప్యూటీ డీఈవో చెల్లయ్య చెప్పారు.

సంక్షేమాధికారుల్లేక పర్యవేక్షణ పడక!

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే

గిరిజన సంక్షేమ ఆశ్రమాలు, ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల పర్యవేక్షణకు ప్రతి మండలానికి సహాయ గిరిజన సంక్షేమాధికారి పోస్టులు ఉండేవి. వైకాపా ప్రభుత్వ హయాంలో రద్దయ్యాయి. జిల్లాలో నాలుగు మండలాలకు చెందిన ఏటీడబ్ల్యూవో పోస్టులను ఎత్తేశారు. మూడేళ్లుగా ఇన్‌ఛార్జిలే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రెండు మండలాల బాధ్యతలు చూడాల్సి రావడంతో ఒత్తిడికి గురవుతున్నారు.

- ఐటీడీఏల పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణకు గతంలో తెదేపా ప్రభుత్వం సహాయ గిరిజన సంక్షేమాధికారుల వ్యవస్థను తీసుకొచ్చింది. ఒక్కో మండలానికి ఒక ఏటీడబ్ల్యూవోను నియమించింది. ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహ విద్యార్థుల బాగోగులతోపాటు ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. వీరంతా ఐటీడీఏ పీవో, గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకుల పర్యవేక్షణలో పనిచేస్తారు. మండల కేంద్రాల్లో ఏటీడబ్ల్యూవో కార్యాలయాలకు భవనాలున్నాయి.

గూడెంకొత్తవీధిలో మూతపడిన ఏటీడబ్ల్యూవో కార్యాలయం

సకాలంలో మంజూరుకాని బిల్లులు

- ప్రతి మండలంలో పది నుంచి 15 గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలు, 30 నుంచి 40 వరకు ప్రాథమిక పాఠశాలలున్నాయి. పాఠశాలలను వారంలో ఒక్కసారైనా తనిఖీ చేయాల్సి ఉంటుంది. రోజుకు రెండు పాఠశాలలను సందర్శించినా.. వారంలో అన్నింటికి వెళ్లలేని పరిస్థితి. వారంలో మూడు రోజులు సమావేశాలకు హాజరుకావాల్సి వస్తోంది. మండలానికో ఏటీడబ్ల్యూవో ఉంటే ఇబ్బంది లేదు. అదనపు బాధ్యతలను చూడాల్సి రావడంతో పని ఒత్తిడి పెరుగుతోంది. ఫలితంగా పాఠశాలల్లో పర్యవేక్షణ లోపం తలెత్తుతోంది.
- పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలో 210 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, 670 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఆశ్రమ పాఠశాలల వసతి గృహాల్లో లక్ష మంది వరకు బాలబాలికలు ఉండగా, ప్రాథమిక పాఠశాలల్లో 60 వేల మంది వరకు విద్యనభ్యసిస్తున్నారు. వీరందరి పర్యవేక్షణ బాధ్యత ఏటీడబ్ల్యూవోలదే.
- వైకాపా ప్రభుత్వం జిల్లాల పునర్విభజన సమయంలో ఈ పోస్టులను తొలగించింది. అప్పటివరకు ఆ పోస్టుల్లో ఉన్న వారికి మరోచోటకు బదిలీ చేసింది. జిల్లాలో గూడెంకొత్తవీధి, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, హుకుంపేట మండలాల్లో ఏటీడబ్ల్యూవో పోస్టులు రద్దయ్యాయి. ఆయా మండలాల బాధ్యతలను సమీపంలోని చింతపల్లి, అరకులోయ, పెదబయలు, పాడేరు మండలాల ఏటీడబ్ల్యూవోలకు అప్పగించారు.
- రెండు, మూడు నెలలకు ఒకసారి వసతిగృహాల బిల్లులు మంజూరయ్యేలా ఏటీడబ్ల్యూవోలు పరిశీలించి నివేదిక పంపాలి. సొంత మండలంతోపాటు పక్కనున్న మండలాల బిల్లులు పరిశీలించి పంపడంలో జాప్యం జరుగుతోంది. ఫలితంగా రెండు, మూడు నెలలకు రావాల్సిన బిల్లులు ఆరు నెలల నుంచి ఏడాది పడుతోంది. వసతిగృహ సంక్షేమాధికారులు అప్పులు చేసి హాస్టళ్లను నడపాల్సి వస్తోంది.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం: నాలుగు మండలాలకు ఏటీడబ్ల్యూవో పోస్టులు లేవు. పర్యవేక్షణకు ఇబ్బంది లేకుండా సంక్షేమాధికారులు ఒత్తిడికి గురికాకుండా చర్యలు తీసుకుంటాం. ప్రతి మండలానికి పోస్టులు ఉండేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తా. – పరిమళ, ఉపసంచాలకురాలు, పాడేరు

63,507

జిల్లాకు కేటాయించిన దోమతెరలు

మలేరియా కారక దోమల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. వాతావరణంలో మార్పులు, వర్షాలతో అల్లూరి జిల్లాలో దోమల వ్యాప్తి అధికమైంది. మలేరియా, వైరల్ జ్వరాలు ప్రబలే ప్రమాదం పొంచి ఉన్నందున నివారణ చర్యలకు ఆరోగ్య శాఖ ఉపక్రమించింది. జిల్లా వ్యాప్తంగా దోమతెరల పంపిణీకి సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో జిల్లాకు 63,507 దోమతెరలను కేటాయించినట్లు ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రకటించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 3,256 మలేరియా పాజిటివ్ కేసులు నమోదైనట్లు జిల్లా మలేరియాధికారిణి తులసి పేర్కొన్నారు. దోమతెరలు రాగానే పంపిణీ చేస్తామన్నారు. రెండు విడతల్లో దోమల నివారణ మందు పిచికారీ చేసినట్లు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, పాడేరు పట్టణం

వ్యవసాయ పర్యాటకానికి మోకాలడ్డు

చింతపల్లి, న్యూస్‌టుడే: ఏటా చలికాలంలో మన్యంలో మంచు అందాలను ఆస్వాదించేందుకు దూర ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. వారిని ఆకర్షించడంతోపాటు ఆదాయ సముపార్జనలో భాగంగా ప్రత్యేకంగా అగ్రి టూరిజం ప్రాజెక్టు ఏర్పాటుకు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు రెండేళ్ల కిందట శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా పలు కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. పూర్తిస్థాయిలో ప్రాజెక్టును పట్టాలెక్కిద్దామనుకుంటే ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ అధికారులు మోకాలడ్డారు. ప్రాజెక్టు అమలుకు నిధులు విడుదల చేయకపోవడంతో ఆదిలోనే హంసపాదు ఎదురైంది.

- సహజ వనరులతోనే అగ్రి టూరిజాన్ని అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకట్టుకోవాలన్న ఆకాంక్షతో ఇక్కడి శాస్త్రవేత్తలు గతంలో పలు కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా పరిశోధనా స్థానం ప్రవేశ ద్వారం వద్ద సందర్శకుల కోసం ప్రత్యేకంగా పర్ణశాల నిర్మించారు. వెదురు, కర్రలు, గడ్డి, మట్టి వంటి సహజ వనరులతో దీన్ని తీర్చిదిద్దారు. గిరిజన ప్రాంతాల్లో లభించే చిరుధాన్యాలు, వాటితో తయారు చేసే అనుబంధ ఉత్పత్తులు, ఆరోగ్యపరంగా కలిగే ప్రయోజనాలపై ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.
- చలికాలంలో ఇక్కడకు వచ్చే పర్యాటకులు వివిధ రకాల పంటల గురించి తెలుసుకునేందుకు వీలుగా వరితోపాటు రాజ్‌మా, చిరుధాన్యాలు, పలు రకాల కాయగూరలు, పప్పుదినుసులు, పూల సాగు వంటివి చేపట్టారు. వీటిని మ్యూజియం క్రాప్స్‌గా రహదారికి ఇరువైపులా వేశారు. ఇవన్నీ ఇప్పటికీ అందుబాటులోనే ఉన్నా అధికారికంగా అగ్రి టూరిజం ప్రాజెక్టు అమలుకు ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ అధికారులు పచ్చజెండా ఊపలేదు.

పరిశోధన స్థానంలో పర్యాటకులకు ఏర్పాట్లు

- పర్యావరణానికి హాని జరగకుండా అగ్రి, ఎకో టూరిజం ప్రాజెక్టుకు అవకాశాలు మెండుగా ఉన్నా.. అడుగు ముందుకు పడకపోవడానికి అధికారుల తీరే కారణంగా కనిపిస్తోంది. ఈ విషయమై చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామిని సంప్రదించగా.. అగ్రి టూరిజం ప్రాజెక్టు అమలుకు సంబంధించి ప్రత్యేకంగా నిధులేవీ అందుబాటులో లేవన్నారు. వ్యవసాయ వర్సిటీ నుంచి అనుమతులు రావడంతోపాటు నిధులు విడుదల చేస్తే ప్రాజెక్టు పట్టాలెక్కుతుందని పేర్కొన్నారు.
- పర్యాటకులను ఆకట్టుకునేందుకు ప్రత్యేకంగా గ్లాడియోలస్, లిల్లియం, తులిప్, చైనా ఆస్టర్ వంటి వివిధ రకాల పూల సాగు చేపట్టి సత్ఫలితాలు సాధించారు. సందర్శకులకు స్థానికంగా గిరిజనులు పండించే చిరుధాన్యాలు, అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు, విలువ ఆధారిత ఉత్పత్తులను విక్రయించేందుకు వీలుగా జీసీసీ అధికారులతోనూ సంప్రదింపులు జరిపారు. పరిశోధనా స్థానం ముందు భాగాన్ని ఆధునికీకరించారు. పర్యాటకులు సేదదీరేందుకు వీలుగా విశ్రాంతి మందిరాలను నిర్మించారు. కుర్చీలు, బల్లలు, ఊయలలు ఏర్పాటు చేశారు. సుమారు రూ. 90 లక్షలతో ప్రత్యేకంగా అతిథి గృహాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు.

(c) eenadu

పెళ్లి సంబంధాల కోసం వెతుకుతున్నారా..!

నేడు కమ్మ అవివాహితులకు 'ఈనాడు పెళ్లిపందిరి' ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదికైన 'ఈనాడు పెళ్లిపందిరి' కమ్మ అవివాహితుల కోసం ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ నిర్వహిస్తోంది. అభ్యర్థులు పాల్గొనేలా 'ఈనాడు' కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమం జరుగుతుంది.

★ వివాహం కోసం ఎదురు చూస్తున్న అవివాహితులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (సోమవారం, నవంబరు 3న) ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పాల్గొని ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

★ మరిన్ని వివరాలకు 9154918858, 8008001616 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు. ఫోన్ లేదా యాప్ ద్వారా కూడా ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. బయోడేటా, ఫొటోలను పైన తెలియజేసిన వాట్సప్ నంబర్లకు పంపవచ్చు.

వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లో అభిమానుల విజయోత్సాహం

తిరుగులేని 'అమ్మాయిలు'.. అభిమానుల సంబరాలు

మహిళల వన్డే క్రికెట్ వరల్డ్ కప్‌లో భారత జట్టు అమ్మాయిలు విజేతలుగా నిలిచారు. ఫైనల్లో దక్షిణాఫ్రికా జట్టును మట్టి కరిపించి విశ్వవిజేతలుగా ఆవిర్భవించిన భారత మహిళల జట్టు విజయాన్ని ఆస్వాదిస్తూ నగరంలో క్రికెట్ అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఆది వారం పలు ప్రాంతాల్లో భారీ తెరలు ఏర్పాటు చేసి మ్యాచ్‌ను ఆద్యంతం వీక్షించారు. భారత్ గెలిచిన అనంతరం మువ్వన్నెల జెండాలు చేతపట్టి నృత్యాలు చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ విజయం మహిళా క్రికెట్‌కు మేలిమలుపని పలు వురు క్రీడాకారులు హర్షం ప్రకటించారు.

-న్యూస్‌టుడే, విశాఖక్రీడలు

నిధులు జేబుల్లో.. దోమలు ఇళ్లల్లో..!

ఫాగింగ్ యంత్రాల డీజిల్ పక్కదారి

జీవీఎంసీలో యథేచ్ఛగా స్వాహాపర్వం

ఈనాడు-విశాఖపట్నం: జీవీఎంసీ పరిధిలో దోమల సంహారం పేరుతో స్వాహా పర్వానికి తెర లేపారు. మెకానికల్ విభాగంలో కొందరు సిబ్బంది... క్షేత్రస్థాయిలో పలువురు వార్డు స్థాయి నేతలు జత కలిసి మాయ చేస్తున్నారు. కాకి లెక్కలతో జేబులు నింపేసుకుంటున్నారు. వర్షాలతో దోమల బెడద పెరిగి నగరవాసులు ఇబ్బందులు పడుతుంటే... ఫాగింగ్ ప్రక్రియ నామమాత్రంగా జరుగుతున్నట్లు విమర్శలున్నాయి.

అధికారుల సమర్థించిన లెక్కల్లోనూ గతంలో పర్యాయాలు అందడంతో అప్పటి కమిషనర్ ఆదేశాలతో విచారణ సైతం జరిగింది. ప్రస్తుతం మళ్లీ అదే పరిస్థితి కొనసాగుతోంది. విచిత్రమేమంటే 8 ఫాగింగ్ వాహనాల్లో కొన్ని మరమ్మతులకు గురై జీవీఎంసీ కార్యాలయం లోనే ఉన్నా.. లెక్కల్లో మాత్రం ఆ వాహనాలు నగరంలో తిరుగుతూ ఫాగింగ్ చేస్తున్నట్లు చూపిస్తున్నారు.

మెకానికల్‌లో మాయ: ఫాగింగ్ యంత్రాలు, వాహనాలకు పెట్రోలు బంకుల్లో డీజిల్ కార్డులతో ఆయిల్ కొట్టించే బాధ్యతను జీవీఎంసీ మెకానికల్ విభాగం చూస్తోంది. ఇంత వరకు బాగానే ఉన్నా కొన్ని పెట్రోల బంకుల యజమానులతో కొందరు అధికారులు కుమ్మక్కై డీజిల్‌ను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వాహనాలకు రోజుకు వంద లీటర్ల డీజిల్ కొట్టిస్తున్నట్లు లెక్కల్లో చూపిస్తుండగా, వారికి ఒక్కసారి కొన్ని వార్డుల్లో ఫాగింగ్ వాహనాలు తిరిగిన జాడ కనిపించడం లేదు. ప్రతి నెల ఈ వాహనాల ద్వారానే రూ.10లక్షల మేర నిధులు స్వాహా చేస్తున్నట్లు అంచనా.

మా వాహనాలకు నింపండి..

వార్డుల్లో హ్యాండ్ మిషన్‌లతో ప్రతి రోజూ ఫాగింగ్ చేయాలి. ఫాగింగ్ చేసినట్లు కార్పొరేటర్ సంతకం పెడితేనే బిల్లులు మంజూరు చేస్తారు. ఇక్కడే అసలు కథ మొదలవుతోంది. కొందరు కార్పొరేటర్లు, చోటా నాయకులు వార్డుల్లో ఫాగింగ్ పక్కన పెట్టి, ఆ డీజిల్‌ను సొంతానికి ఉపయోగించుకుంటున్నారు. 'ఈ రోజు నా వార్డులో ఫాగింగ్ అవసరం లేదు. నా కారుకు కొట్టండి' అంటూ కొందరు ప్రజాప్రతినిధులు డీజిల్‌ను వాడేస్తున్న ఘటనలు ఇటీవలే వెలుగులోకి వచ్చాయి.

సీజనల్ సిబ్బంది ఎక్కడ?

దోమల నివారణకు సీజనల్ వర్కర్స్ పేరుతో రెండు నెలల కోసం 400 మంది సిబ్బందిని జీవీఎంసీ పరిధిలో నియమించుకున్నారు. ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున వేతనం ఇస్తున్నారు. వీరిలో అధికశాతం ముఖ ఆధారిత హాజరు వేసి క్షేత్రస్థాయిలో కనిపించడం లేదనే ఆరోపణలున్నాయి. కొందరు కార్పొరేటర్లు తమ అనుచరులకు ఈ పోస్టుల ఇప్పించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

జీవీఎంసీలో..

ఫాగింగ్ వాహనాలు: 8	రోజుకు ఇచ్చే ఆయిల్ (ఒక్కో దానికి): 100 లీటర్ల డీజిల్, 10 లీటర్ల పెట్రోలు	చిన్న యంత్రాలు (హ్యాండ్ మిషన్లు): 50	రోజుకు ఇచ్చే ఆయిల్ (ఒక్కోదానికి): 15 లీటర్ల డీజిల్, 2లీటర్ల పెట్రోలు

సింహగిరిపై వైభవంగా క్షీరాబ్ది ద్వాదశి వేడుక

సింహాద్రినాథుడికి చిమ్మిలి నివేదన

చెరకు గడలతో చిమ్మిలి దంచుతున్న అర్చకులు

సింహాచలం, న్యూస్‌టుడే: కార్తిక శుద్ధ ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సింహాద్రి అప్పన్న స్వామి దేవాలయంలో ఆది వారం సాయంత్రం క్షీరాబ్ది ద్వాదశి ఉత్సవం సంప్రదాయబద్ధంగా జరిగింది. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు నేతృత్వంలో అర్చక పరివారం ఉత్సవాన్ని జరిపించారు. తొలుత స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని దేవేరులు, శయన బేరం వేణుగోపాల స్వామి, ఆళ్వారాచార్యుల సహితంగా శోభాయమానంగా అలంకరించి ఆలయ ఉత్తర మండపంలోని వేదికపై ఆసీనులను చేశారు. స్వామి ఎదుట రోలు, రోకలి అధిష్ఠింపజేసి ఆవాహన పూజలు, ఆరాధనలు చేశారు. రోలులో పాలు, బెల్లం, నువ్వుల పప్పు వేసి వేదమంత్రాల నడుమ తొలుత చెరకు గడలతో దంచారు. అనంతరం రోకళ్లతో చిమ్మిలి దంచి స్వామికి నివేదించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని తిలకించారు. అనకాపల్లి ప్రాంతానికి చెందిన ఆదారి కుటుంబీకులు ఆన వాయితీ ప్రకారం చిమ్మిలి నివేదనకు అవసరమైన ద్రవ్యాలను సమర్పించారు. కుటుంబంతో సహా ఉత్సవంలో పాల్గొని స్వామిని సేవించారు.

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు

ఎన్‌సీడీఈఎల్‌కు చెందిన డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌వీ హరప్రసాద్ ఆదివారం సతీసమేతంగా సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణ చేశారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేశారు. అధికారులు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు.

★ రాష్ట్ర డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఆదివారం సాయంత్రం సింహాద్రినాథుడికి సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, వైదికులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

డిసెంబరులో జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థుల సమావేశం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల (కాకినాడ) పూర్వ విద్యార్థుల సమావేశం డిసెంబరు 7వ తేదీన ఎంవీపీ కాలనీ ఐఏఏం కళాశాలలో నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపకులు ఎ.ఎస్.ఎస్.ప్రసాదరావు, సంఘం ప్రెసిడెంట్ ఒ. ఆర్.ఎం.రావు, జాయింట్ సెక్రటరీ బి.అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు ఎంవీపీకాలనీలోని ఐ.ఎ.ఎ.ఎం. కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సంఘం నాయకుల సమావేశం జరిగింది. ఆ రోజు పూర్వ విద్యార్థులందరూ తప్పక హాజరు కావాలని కోరారు. సంఘం కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర సహాయ మంత్రి రాక

విశాఖపట్నం, న్యూస్‌టుడే: కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ సోమవారం విశాఖ రానున్నారు. ఉదయం 8.45 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని, అక్కడ నుంచి అనకాపల్లి జిల్లా కొంకితేట మండలం తాళ్లపాలెం వెళ్తారు. స్థానిక కార్యక్రమాలు పాల్గొని, మధ్యాహ్నం 1.30 గంటలకు బయలుదేరి 3.10 గంటలకు నగరంలోని రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకుంటారు. ఆ తర్వాత ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొని, రాత్రి 8.50 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని హైదరాబాద్ బయలుదేరుతారు.

పటిష్ఠ కార్యాచరణతో గంజాయికి అడ్డుకట్ట

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పట్టుబడిన సుమారు 10 వేల కిలోల గంజాయిని ఆదివారం కాపులుప్పాడ డంపింగ్ యార్డు వద్ద దహనం చేశారు. ముఖ్య అతిథిగా డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా హాజరయ్యారు. ఆయా స్టేషన్ల పరిధిలో ఏయే ప్రాంతాల్లో గంజాయి స్వాధీనం చేసుకున్నారో ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శన, పవర్ ప్రజెంటేషన్‌ను వీక్షించారు. సీపీ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ మొత్తం 533 గంజాయి కేసుల్లో నిందితుల నుంచి 96 ద్విచక్రవాహనాలు, 16 ఆటో రిక్షాలు, 39 కార్లు, 2 లారీలు స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి రవాణా నియంత్రణే ధ్యేయంగా సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. 15 డ్రోన్లతో పాటు 14 చోట్ల హైఎండ్ సీసీ కెమెరాలను విశాఖ జిల్లాలో ఏర్పాటు చేసి నిరంతర నిఘా ఉంచుతున్నామన్నారు. కొన్ని ప్రధాన ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, రైల్వేస్టేషన్లు, బస్‌కాంప్లెక్సుల వద్ద తనిఖీలు ముమ్మరం చేశామని, ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని, నగర పరిధిలో 866 మంది మాదకద్రవ్యాలు సేవించే వారిని గుర్తించి వారికి చికిత్స అందిస్తున్నామన్నారు. నవసమాజ నిర్మాణం, ప్రజలతో ముఖాముఖి, సుప్రవాహనాల ద్వారా

చిత్ర ప్రదర్శనను వీక్షిస్తున్న డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్తా, కమిషనర్ శంఖబ్రతబాగ్చీ, కలెక్టర్ హరేంధిరప్రసాద్ తదితరులు

అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈగల్ టీంలతో పాఠశాలలు, కళాశాలల్లో చైతన్యసదస్సులు నిర్వహిస్తున్నామని డీజీపీ వివరించారు.

★ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న 80 వేల కిలోల గంజాయిని దహనం చేశామని ఈగల్ ఐజీ రవికృష్ణ తెలిపారు. కలెక్టర్ ప్రతి తల్లి ఒక బ్రాండ్ అంబాసిడర్ అని.. పిల్లల ప్రవర్తన, నడవడిక గమనించాలని, ఏదైనా అనుమానాలు కలిగితే వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 1972కు ఫోన్ చేయాలని సూచించారు. ఇటీవల ఎన్‌సీబీ సమాచారం అందించి గంజాయి పట్టుకునేలా సహకరించిన పోలీసు సిబ్బంది ప్రశంసించారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు..

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా గంజాయి నిర్మూలనను ముందుకు తీసుకెళ్తుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అన్నారు. యువతలో గంజాయి సేవించాలనే ఆలోచనను మొగ్గదశలోనే తుంచివేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నాయన్నారు. విశాఖ పరిధిలో కేజీహెచ్, మానసిక ఆసుపత్రుల్లో టెలిమానస్ కేంద్రాలున్నాయన్నారు. అంతే కాక గ్రీన్‌వ్యాలీ వంటి పలు స్వచ్ఛంద సంస్థలు సైతం భాగస్వాములను చేస్తూ వారి సేవలను వినియోగించుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీసీపీలు మేరీ ప్రశాంతి, కె.లతామాధురి, ఏసీపీలు ఎస్.అప్పలరాజు, లక్ష్మణమూర్తి, అన్నెపు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆరుద్ర రచనలు స్ఫూర్తిదాయకం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఆరుద్ర రచనలు ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని తెలకపల్లి రవి అన్నారు. డాబాగార్డెన్స్ దరి అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సాహితీ ప్రవంతి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆరుద్ర జయంతి ముగింపు వేడుకల్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న తెలకపల్లి రవి మాట్లాడుతూ తెలుగు సాహిత్యం, సినీ గీతాలు, అనువాదాలు, నాటక రచనల్లో ఆరుద్ర తన ప్రత్యేకత చాటుకున్నారన్నారు. అనంతరం 'తిమిరాన్ని తరిమేస్తాం' పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్. శర్మ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాహితీ ప్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీకటి దివాకర్, అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పొలమరశెట్టి ఫ్రాన్సిస్, ఇతర సభ్యులు సత్యాజీ, రామకృష్ణ, చలసాని కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

సమావేశంలో వక్తలు

నేడు కలెక్టరేట్‌లో యథావిధిగా పీజీఆర్ఎస్

కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నామని కలెక్టర్ విజయకృష్ణన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. అన్ని మండల, డివిజన్ కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మీ కోసం వెబ్‌సైట్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చన్నారు. 1100 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి అర్జీల స్థితిగతులను తెలుసుకోచ్చని తెలిపారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్ష

విశాఖపట్నం: యూపీఎస్సీ పరీక్ష ఆదివారం నగరంలో ప్రశాంతంగా ముగిసింది. మొత్తం ఏడు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 3,268 మంది అభ్యర్థుల కోసం ఏర్పాట్లు చేయగా, కేవలం 1058 మంది మాత్రమే హాజరయ్యారని అధికారులు తెలిపారు.

విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

ఉపాధ్యాయ సంఘ నేతలతో చిరంజీవిరావు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు పేర్కొన్నారు. అనకాపల్లిలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ నేతలు, ఉపాధ్యాయులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సీనియర్ ఉపాధ్యాయులు టెట్ పరీక్ష రాయాలని సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను నిలిపి వేయడానికి ఉన్న అవకాశాలను మంత్రి నారా లోకేశ్ పరిశీలిస్తున్నారన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని పట్టభద్రుల ఎమ్మెల్సీలంతా కలిసి వెళ్లి మంత్రి లోకేష్‌కు సమస్య వివరించి, సుదీర్ఘ కాలంగా విధుల్లో ఉపాధ్యాయులను మినహాయించాలని కోరామన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛన్‌దారులకు జీతాలు, పింఛన్లు చెల్లించి వారి ఆత్మాభిమానాన్ని కాపాడాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయమన్నారు. ఇటీవల అందరు ఉద్యోగ, ఉపాధ్యాయ నేతలతో నేరుగా ముఖ్యమంత్రి మాట్లాడి ఒక డీఏను ప్రకటించడంతో పాటు వెంటనే అమల్లోకి తీసుకువచ్చారన్నారు. నిబంధనలు పాటించని అధికారులపై చర్యలు తప్పవని, ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకువచ్చే అధికారులను ఊపేక్షించేది లేదన్నారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంపాల వెంకటరమణ, రాష్ట్ర కార్యదర్శి రాజు, నాయకులు కోట్ని రాంబాబు, ఎం ఉమామహేశ్వరరావు, నూకేష్, సన్యాసిరావు కృష్ణ మోహన్, బాబ్జీ పాల్గొన్నారు.

గండి పూడ్చివేత పనులు వేగవంతం చేయాలి

రాంబిల్లి, న్యూస్‌టుడే: మేజర్‌శారదా నది గండి పూడ్చివేత పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ జలవనరులశాఖ అధికారులను ఆదేశించారు. వై.లోవ-రజాల మధ్య మేజర్‌శారదా నది గండి పూడ్చివేత పనులను ఆదివారం ఉదయం ఆయన పరిశీలించారు. ఇక్కడ పూడ్చివేతకు కూటమి నాయకులు వి.దిన్నుబాబు, పప్పల నూకన్నదొర, కర్రి సింహగిరిప్రసాద్ అధికారులకు సహకరిస్తున్నారు. దిమిలిలో సిద్ధం చేసిన ఇసుక బస్తాలను గండి వద్దకు ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. రెండు రోజుల్లో గండిని పూర్తిగా పూడ్చుతామని డీఈ సాయిప్రశాంతి, ఏఈ శివాజీ చెప్పారు.

పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మూగజీవిపై మురిసిన మానవత్వం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: తుపాన్ సమయంలో గాయపడిన ఆవుకు వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. గొర్లె ధర్మవరం శివారు మెట్టధర్మవరానికి చెందిన పెంకె మారేష్‌కు చెందిన పాడి ఆవుపై పశువులపాక పడిపోవడంతో ముందు కాలు విరిగిపోయింది. అప్పటి నుంచి గాయంతో నడవలేని పరిస్థితి ఎదురవుతోంది. ఆదివారం అనకాపల్లి నుంచి వచ్చిన వైద్య నిపుణులు శివకుమార్, శివప్రసాద్ ఆవుకు శస్త్రచికిత్స నిర్వహించారు.

శస్త్రచికిత్స నిర్వహించిన పశువైద్యులు

భక్తిశ్రద్ధలతో సంస్మరణ దినోత్సవం

ప్రసంగిస్తున్న విశాఖ అగ్రపీఠాధిపతి ఉడుమల బాల

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ప్రతి కుటుంబంలో మృతి చెందిన వారి ఆత్మలకు నిత్య విశ్రాంతి కలిగేలా ఏటా నవంబరు మాసంలో ప్రత్యేక ప్రార్థనలు చేయాలని విశాఖ అగ్రపీఠాధిపతి ఉడుమల బాల పేర్కొన్నారు. సకల ఆత్మల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం సమీప శ్మశానవాటికలో ఆదివారం దివ్య పూజబలి నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రపీఠాధిపతి ఉడుమల బాల మాట్లాడుతూ... మరణించిన వారు చేసిన తప్పుల్ని మన్నించి, వారి ఆత్మలు దేవుని రాజ్యం చేరాలని అనుదిన ప్రార్థనల్లో గుర్తు చేసుకోవాలన్నారు. ముందుగా విశ్వాసులు పునీత పేతురు ప్రధాన దేవాలయం నుంచి శ్మశానవాటిక వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం ప్రతి సమాధి వద్ద దేవాలయం ఫాదర్ జొన్నాడ ప్రకాశ్, సహాయక విచారణకర్తలు ఫాదర్ ప్రేమ్‌కుమార్, ఫాదర్ థామస్, తదితరులు ప్రార్థనలు చేశారు. క్రైస్తవ విశ్వాసులు తమ కుటుంబీకుల సమాధులను పూలతో అలంకరించి, కొవ్వొత్తులు వెలిగించారు.

భూ తగాదాలతో ఒకరి హత్య

విచారణ చేస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్సై షణ్ముఖరావు.. పక్కన సత్తిబాబు మృతదేహం

జి.మాడుగుల, న్యూస్‌టుడే: భూ తగాదాలతో జరిగిన కొట్లాటలో ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్రగాయాల పాలయ్యారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్సై షణ్ముఖరావు అందించిన వివరాల ప్రకారం.. జి.మాడుగుల మండలం గడుతూరు పంచాయతీ బొబ్బంపాడు గ్రామానికి చెందిన గెమ్మెలి సత్తిబాబు(59), పాంగి రామ్‌ప్రసాద్‌లకు పీఎం జన్‌మన్ గృహాలు మంజూరయ్యాయి. రామ్‌ప్రసాద్‌కు చెందిన భూమిలో సత్తిబాబు నూతన గృహం నిర్మిస్తున్నాడని గతంలో వీరిద్దరి మధ్య తగాదా జరిగింది. అదే విషయంపై ఆదివారం మరోమారు ఘర్షణపడ్డారు. ఇప్పటివరకు నిర్మించిన ఇంటి గోడలను కూల్చివేస్తానని రామ్‌ప్రసాద్ హెచ్చరించాడు. ఈ క్రమంలో కోపోద్రిక్తుడైన రామ్‌ప్రసాద్ పక్కనున్న కర్రతో సత్తిబాబు(59) తలపై మోదాడు. అతను అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. అడ్డుకోవడానికి వచ్చిన అతని భార్య నీలమ్మను తీవ్రంగా గాయపరిచాడు. ఆమె అపస్మారక స్థితికి చేరుకోంది. అనంతరం నిందితుడు అక్కడినుంచి పరారయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న సీఐ, ఎస్సై, పోలీసు సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతికి గల కారణాలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన నీలమ్మను పాడేరు ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. మృతుడి కుమారుడు సుమంత్ ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్సై పేర్కొన్నారు.

నూకరాజు కుటుంబానికి అండగా ఉంటాం

కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు జడ్పీటీసీ సభ్యుడు దివంగత వారా నూకరాజు కుటుంబానికి అండగా ఉంటామని ఎంపీ తనూజారాణి, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. నూకరాజు సంతాప సభ చిట్టెంపాడు గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి ఎంపీ, జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరాజు, మత్స్యలింగం, మాజీ మంత్రి అమర్‌నాథ్, మాజీ ఎంపీ మాధవి, మాజీ ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, ఉమాశంకర్ గణేష్ తదితరులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అమర్‌నాథ్ మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ప్రభుత్వ వైఫల్యమేనని ఆరోపించారు. మండల అభివృద్ధికి నూకరాజు కృషి చేశారని ఎంపీ తనూజారాణి అన్నారు. ఆయన విన్నపంమేరకు మండలానికి రూ.25 లక్షలు కేటాయిస్తున్నట్లు చెప్పారు. చిట్టెంపాడులో స్మారక మందిరం లేదా ఉద్యానం నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని సుభద్ర పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి రూ. ఐదు లక్షల చెక్కును నేతలు అందించారు. ఎంపీపీ రమేష్ బాబు, వైకాపా మండల అధ్యక్షుడు బి.అప్పారావు, బాబులు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి. సత్యనారాయణ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముసిలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నూకరాజు కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎంపీ తనూజారాణి, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రి తదితరులు

ఆదివాసీ యువగళం 15న

చింతూరు, న్యూస్‌టుడే: మన్యంలో ఆదివాసీలకు శతశాతం ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న చింతూరులో ఆదివాసీ నిరుద్యోగ యువగళం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జేఏసీ డివిజన్ ఛైర్మన్ నరేశ్ పేర్కొన్నారు. ఆదివారం చింతూరులో నిరుద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో నూరు శాతం ఉద్యోగాలు గిరిజనులతోనే భర్తీ చేసేలా చట్టాన్ని తీసుకురావాలని, ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలన్నారు. మైదాన ప్రాంతం నుంచి వచ్చిన ఉపాధ్యాయులను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. రంపచోడవరం కేంద్రంగా జిల్లాను ప్రకటించాలన్నారు. నాయకులు రవితేజ, తిమ్మాసాయి తదితరులు పాల్గొన్నారు.

సమావేశమైన ఆదివాసీ నాయకులు

నిజాయతీతో విధి నిర్వహణ

వాక్‌థాన్‌లో బ్యాంకు ఉద్యోగులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: బ్యాంకు ఉద్యోగులు విధుల్లో నిజాయతీగా ఉంటూ, బాధ్యతగా వ్యవహరించాలని యూనియన్ బ్యాంకు జోనల్ హెడ్ షాలిని అన్నారు. నిఘా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ద్వారకానగర్‌లోని జోనల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా ఎల్ఐసీ కూడలి వరకు అవగాహన వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఉద్యోగులు వృత్తిపరమైన జీవితంతో పాటు, వ్యక్తిగత జీవితంలోనూ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జోనల్ విజిలెన్స్ అధికారి ఐవీ.కృష్ణ మాట్లాడుతూ... పారదర్శకత, నైతిక విలువలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రీజనల్ హెడ్ జె.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

విషాదం నింపిన కడలి కెరటం

సముద్రంలో స్నానానికి వెళ్లి విద్యార్థి మృతి

భానుప్రసాద్ (పాత చిత్రం)

రావికమతం, న్యూస్‌టుడే: చిన్నతనంలోనే తల్లి చనిపోయింది. అమ్మమ్మ లాలనలో పెరిగాడు. పదో తరగతి చదువుతున్న మనుమడిని మృత్యువు కడలి రూపంలో కబళించిందని అమ్మమ్మ, తాతయ్య కన్నీరుమున్నీరయ్యారు. స్నేహితులతో సరదాగా గడిపేందుకు సముద్ర తీరానికి వెళ్లిన విద్యార్థి అలల ధాటికి గల్లంతై మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం తీరంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంకు చెందిన సూరెడ్డి భాను ప్రసాద్ (15) తల్లి మాణిక్యమ్మ మరణంతో రావికమతం మండలం తోటకూరపాలెంలోని అమ్మమ్మ లాలం దేముడమ్మ వద్ద ఉంటున్నాడు. పరవాడ మండలం తానాంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఉంటూ అక్కడి జడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు శనివారం డుమ్మా కొట్టి ఐదుగురు స్నేహితులతో కలిసి ముత్యాలమ్మపాలెం తీరానికి వెళ్లారు. సముద్రంలో స్నానం చేస్తుండగా కెరటానికి అందరూ కొట్టుకుపోయారు. ఆ సమయంలో అక్కడ ఉన్న మత్స్యకారులు కొట్టుకుపోతున్న వారిలో నలుగుర్ని రక్షించారు. భానుప్రసాద్ కోసం గాలించినా ఆచూకీ దొరకలేదు. సీఐ మల్లికార్జునరావు ఘటనా స్థలానికి చేరుకుని డ్రోన్ సహాయంతో వెతికించారు. ఆదివారం ఉదయం భానుప్రసాద్ మృతదేహం తీరానికి కొట్టుకురాగా పోలీసులు బంధువులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. విద్యార్థి మృతితో తోటకూరపాలెంలో విషాదం నెలకొంది.

వరిలో కేళీలు.. దిగుబడులపై ప్రభావం

కేళీలు వచ్చిన వరి పంట

అనకాపల్లి, న్యూస్‌టుడే: ఈ ఏడాది వరిలో కేళీల బెడద ఎక్కువైంది. సాధారణంగా రైతులు సొంతంగా తయారు చేసుకున్న విత్తనాల్లో ఎక్కువగా ఈ సమస్య వస్తుంది. ఈసారి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ అందజేసిన వరి రకాల్లోనూ కేళీలు ఉన్నాయని రైతులు వాపోతున్నారు. కేళీలు ఎక్కువగా ఉంటే ధాన్యం దిగుబడి, నాణ్యతపై ప్రభావం ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వరి సాగులో కేళీలు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వరి నాట్లు వేశాక వచ్చే వీటి విషయంలో ఆచరించాల్సిన యాజమాన్య పద్ధతులను అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కేవీ రమణమూర్తి వివరిస్తున్నారిలా..

★ వరి సాగు చేసే రైతులు సొంతంగా విత్తనం అభివృద్ధి చేసుకుంటే మంచిది. విత్తనంగా సేకరించే పంట విషయంలో ముందు నుంచీ జాగ్రత్తలు తీసుకోవాలి. దీర్ఘకాలిక రకాలు అయితే నాట్లు వేసిన 60 రోజుల వరకు, స్వల్పకాలిక రకాలైతే 45 రోజుల వరకు పంటను జాగ్రత్తగా గమనించాలి. ఎగుడు దిగుడుగా మొక్కలు ఉంటే ప్రధాన రకంలో ఇతర రకాలు కలిసినట్లు లెక్క.

★ పిలక, పొట్ట దశలో కేళీలను తొలగించాలి. పైరు ఎదుగుదల ఒకేలా ఉంటే కేళీలను గుర్తించడం కష్టం. శ్రీకాకుళం సన్నాలు, ఇంద్ర, అమర రకాలు పంట ఎత్తుగా ఒకే విధంగా పెరుగుతాయి. ఒక రకంలో మరో రకం కలిసినా పంట దశలో తెలియదు. కోత అనంతరం తేడాగా ఉన్న ధాన్యం గింజలను వేరు చేయాలి. నూర్పు సమయంలో నేలపై టార్పాలిన్ వేసుకోవాలి. లేకపోతే గతంలో నూర్పు చేసిన వరి రకం గింజలు కలిసిపోయే ప్రమాదముంది.

★ ఒకే రకం పంట కాకుండా ఇతర రకాలు కలిస్తే వాటిని కేళీలు అంటారు. కేళీలు, ప్రధాన పంట ఒకేసారి పక్వదశకు వస్తే పర్వాలేదు. రెండూ పక్వ దశల సమయాలు వేర్వేరుగా ఉంటే దిగుబడులు తగ్గుతాయి. ప్రధాన పంట కంటే కేళీలు ముందుగా పక్వానికి వస్తే.. వాటి ధాన్యం గింజలన్నీ రాలిపోతాయి. అలస్యంగా వస్తే గింజ కట్టకుండా పొల్లుగా మిగిలిపోతాయి. కేళీలు ఉంటే ధాన్యాన్ని బియ్యంగా మర ఆడించే సమయంలో నూకలు ఎక్కువగా వస్తాయి. ఇలాంటి ధాన్యం కొనుగోలుకు వ్యాపారులు ఆసక్తి చూపారు.

★ విత్తనం వేసే ముందే పరీక్ష చేయించుకోవాలి. ప్రభుత్వం విత్తన పరీక్షలను వ్యవసాయ శాఖ ద్వారా ఉచితంగా చేస్తోంది. నాణ్యమైన విత్తనం వేసుకుంటేనే ఆశించిన దిగుబడులు, నాణ్యమైన పంట వస్తుంది.

యువకుడిపై హత్యాయత్నం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని తాకాశీవీధిలో యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన ఒకరిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్టా గ్రామ్‌లో పోస్టు విషయంపై గతనెల 31న హర్షవర్ధన్, వినయ్ యువకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఇక్కడ ఉన్నవారు వీరిని విడిపించారు. అనంతరం హర్షవర్ధన్‌పై వినయ్ కత్తితో దాడిచేసి గాయపరిచాడు. బాధితుడు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. దీనిపై బాధితుడి తండ్రి చంద్రరావు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై భాస్కరరావు తెలిపారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	111	105
లైవ్	138	125
డ్రెస్‌డ్	200	220
స్కిన్‌లెస్	228	230

(c) eenadu

రంపచోడవరం, న్యూస్‌టుడే: నరసాపురం నుంచి పోక్సుపేట వెళ్లే ప్రధాన రహదారిలో తుప్పలు ఏపుగా పెరిగాయి. వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. - సురేష్ బాబు, దేవరతిగూడెం ✓: తుప్పల తొలగింపునకు చర్యలు తీసుకొంటాం. - ప్రదీప్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, రంపచోడవరం

మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు: 89853 66570 | అరకులోయ: 63034 86346 | రంపచోడవరం: 94908 77172

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి నుంచి బొడ్లూరు వెళ్లే ప్రధాన రహదారిలో కొత్తకాలనీ వద్ద ఎండిపోయిన చెట్టు ప్రమాదకరంగా ఉంది. ఇది జనావాసాల మధ్య ఉండడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. - గండే బాబూరావు, కొత్తకాలనీ, ✓: చెట్టును తొలగిస్తాం. - ప్రదీప్, ఏఈ, ర.భ.శాఖ

ఆలయాల్లో ద్వాదశి పూజలు

సీలేరు, న్యూస్‌టుడే: క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా సీలేరులోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఏకాదశి సందర్భంగా ఉపవాసలు దీక్షలు చేపట్టిన మహిళా భక్తులు ఆదివారం ఉదయం స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకుని దీపాలు వెలిగించి పూజలు చేశారు. స్వామివారిని తులసిమాలలతో అలంకరించారు.

తులసిమాలల అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పరిహారం జమ

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: మాటలతో కాలయాపన చేయకుండా.. కూటమి ప్రభుత్వం పోలవరం నిర్వాసితులకు పరిహారం జమ చేస్తోంది. ఇప్పటికే రూ. రెండు వేల కోట్ల జమకు చర్యలు చేపట్టింది. చిన్నమట్టపల్లి పంచాయతీలోని ప్రత్తిపాక, రాజుపేట పంచాయతీలోని పాతారాజుపేట గ్రామస్థుల ఖాతాల్లో శనివారం రాత్రి పరిహారం జమైనట్లు చరవాణిలకు సందేశాలొచ్చాయి.

నిధులు వృథా.. తప్పని వ్యథ!

అనంతగిరి, న్యూస్‌టుడే: నాడు-నేడు పథకంలో నిధులు మంజూరైనా తమ పాఠశాల భవనం పనులు పూర్తికాలేదని కొనాపురం పంచాయతీ సారగుడ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రెండు భవనాలు ఉండగా.. 40 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. గతంలో నాడు-నేడు కింద రూ.12 లక్షల నిధులు మంజూరు కాగా అప్పట్లోనే పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారని తల్లిదండ్రులు చెబుతున్నారు. కనీసం భవనం పైకప్పు రేకులు సక్రమంగా వేయకపోవటంతో వర్షాలు పడినప్పుడల్లా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యుదీకరణ పనుల కోసం గోడలను తొలిచి పైపులు పెట్టి.. వాటికి పూర్తిస్థాయిలో ప్లాస్టరింగ్ చేయించలేదు. అసలు నిధులు ఏమయ్యాయో.. కనీసం తమకు చెప్పలేదని తల్లిదండ్రులు, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు ఆరోపించారు. నాడు-నేడు పేరిట బాగున్న పాఠశాలను ఉపాధ్యాయుడు అధ్వానంగా తయారుచేశారని పాఠశాల కమిటీ ఛైర్మన్ సోమేల రాము, గ్రామస్థులు సోమేల మధు, సంజీవ్‌రావు, బుద్రయ్య, దొన్ను, పెంటన్న తదితరులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయమై ఎంఈఓ బాలాజీను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఎంత మేర నిధులు డ్రా చేశారు.. ఎంతవరకు పనులు జరిగాయని విచారణ చేపడతామని తెలిపారు.

సారగుడలో అసంపూర్తిగా పనులు

విద్యార్థులకు 'విద్యుత్తు' వెతలు

ఇరుకిరుకు గదుల్లో ఇక్కట్లు పడుతున్న ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు నూతన భవనాలు అందుబాటులోకి రావడంతో కష్టాలు తీరాయని అంతా భావించారు. అయినా ఇంకా విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. డుంబ్రిగుడ ఏకలవ్య పాఠశాలను ప్రస్తుతం అరకులోయలోని తాత్కాలిక భవనాల్లో నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం భవనాల నిర్మాణానికి నిధులు మంజూరుచేసింది. పనులు సైతం పూర్తి చేసింది. ఈ విద్యాలయంలో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ మాత్రమే అందుబాటులో ఉంది. విద్యార్థుల అవసరాలకు త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండాలి. ట్రాన్స్‌ఫార్మర్ కోసం అధికారులు సుమారు రూ. 17 లక్షలు విద్యుత్తు సంస్థ అధికారులకు ఇప్పటికే చెల్లించారు. అయినప్పటికీ ఇంకా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. దీంతో విద్యార్థులు ఇరుకు గదుల్లోనే ఇబ్బందులు పడుతూ చదువు సాగిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. - అరకులోయ, న్యూస్‌టుడే

డుంబ్రిగుడలోని ఏకలవ్య పాఠశాల

కార్తిక దీపోత్సవం 5న

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఐ.పోలవరం గోకుంటగిరిపై వెలసిన వేంకటేశ్వరుని ఆలయంలో ఈనెల 5వ తేదీన కార్తిక పౌర్ణమి సందర్భంగా దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు గోవిందగిరి శ్రీవారి సేవా బృందం కో-ఆర్డినేటర్ నల్లమిల్లి వెంకటరామారెడ్డి తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఐదేళ్ల సర్వీసు మిగిలి ఉన్న ఉపాధ్యాయులను మినహాయించి.. మిగిలినవారంతా తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణత పొందాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్లు ఎల్.వేణుగోపాల్, కృష్ణ, జిల్లా కార్యదర్శి నాగభూషణం ఆదివారం తెలిపారు. ఉపాధ్యాయులంతా 2030 సెప్టెంబరులోపు టెట్ ఉత్తీర్ణులవ్వాలని సూచించినట్లు పేర్కొన్నారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు

కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు మల్లికార్జున స్వామి ఆలయంలో కార్తిక సోమవారం సందర్భంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ ఆవరణలో భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకొంటామన్నారు.

భవనం ఇక్కడ.. అధికారులు ఎక్కడ

ముంచంగిపుట్టులో గ్రామీణ నీటిసరఫరా విభాగం ఇంజినీరింగ్ కార్యాలయం నిత్యం మూతపడి దర్శనమిస్తోంది. కార్యాలయం చుట్టూ తుప్పలు, భవనం స్లాబుపై మొక్కలు పెరిగి విషసర్పాలకు నిలయంగా కనిపిస్తోంది. ఇంజినీర్లు స్థానికంగా ఉండకపోవడంతోపాటు జల్‌జీవన్‌మిషన్ పనులు పడకేశాయి. నీటి పథకాలకు సంబంధించిన పైపులు, ట్యాంకులు కార్యాలయం చుట్టూ నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. రూ.లక్షల ఖర్చుతో నిర్మించిన భవనం ఇక్కడ ఉన్నప్పటికీ.. సంబంధిత అధికారులు అందుబాటులో ఉండక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సుజనకోటలో పదకొండు గ్రామాలకు నీరందించేందుకు నిర్మించిన నీటి పథకం మూలకు చేరినా ఎవరూ పట్టించుకోని పరిస్థితి. - ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

ముంచంగిపుట్టులో నిరుపయోగంగా ఇంజినీరింగ్ కార్యాలయం

అసంపూర్తి పనులతో అవస్థలు

దశాబ్దాల కల నెరవేరుతుందని ఆనందించిన అక్కడి గిరిజనులకు నిరాశే ఎదురవుతోంది. డుంబ్రిగుడ మండలం అరమ పంచాయతీ పోడుజొల గ్రామానికి ఇటీవల బీటీరోడ్డు మంజూరైంది. పనులు ప్రారంభించిన గుత్తేదారు ఇరువైపులా మట్టిని తీసి పనులు నిలిపేశారు. మట్టిరోడ్డు ఛిద్రంగా తయారై కాలినడకకు సైతం గిరిజనులు అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పనులు పునఃప్రారంభించి రవాణా కష్టాలు తీర్చాలని గిరిజనులు కోరుతున్నారు. - డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

పోడుజొలలో రోడ్డు ఇలా..

వలిసె సొగసు చూడతరమా!

ప్రకృతి అందాలకు నిలయమైన మన్యంలో కొండలమధ్య సాగు చేసిన వలిసె పూల సోయగాలు కనువిందు చేస్తున్నాయి. పసుపు రంగు తివాచీ పరిచినట్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కిలగాడ, దారెల, జర్రెల, జైపూర్ కూడలి, జలవిహారి ప్రాంతాల్లో గిరి రైతులు సాగు చేసిన వలిసెల అందాలను తిలకించేందుకు పర్యాటకులు పరుగులు తీస్తున్నారు. వంటనూనె కోసం సాగు చేసిన ఈ పూలు డిసెంబరు వరకు ఇక్కడ దర్శనమిస్తుంటాయి. - ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

కిలగాడ సమీపంలో వలిసెపూల సోయగాలు

వానొస్తే అంతే..

అనంతగిరి మండలం చిలకలగెడ్డలో హెల్త్ క్లినిక్, రైతు సేవా కేంద్రం, బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ వద్దకు వెళ్లే మార్గంలో రెండు అడుగుల మేర నీరు నిల్వ ఉండిపోయింది. వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైంది. సిబ్బంది, ప్రజలు ఇక్కడకు చేరుకునేందుకు అవస్థలు పడుతున్నారు. తరచూ ఇదే పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉండే కాలువను మూసేయడంతో ఈ పరిస్థితి ఎదురవుతోందని చెబుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

హెల్త్ క్లినిక్ ప్రాంగణం చుట్టూ నిలిచిన నీరు

అ వీ ఇ వీ

రగ్గుల పంపిణీ

మోతుగూడెం, న్యూస్‌టుడే: మోతుగూడెం జెన్‌కో ప్రాజెక్టులో గుత్తేదారు పారిశుద్ధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న 44 మందికి రాజమహేంద్రవరం లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎంఎన్‌వీ కిరణ్‌కుమార్ రగ్గులను వితరణగా అందజేశారు. ఎంపీటీసీ సభ్యులు వేగి నాగేశ్వరరావు, నాగేశ్వరరావు, జెన్‌కో ఉద్యోగి నరసింహమూర్తి, ఎం.శ్రీనివాసరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో 20 టన్నుల యూరియా

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: స్థానిక సొసైటీలో 20 టన్నుల యూరియా అందుబాటులో ఉందని పీఏసీఎస్ ఛైర్మన్ కేశవ్ తెలిపారు. కావల్సిన రైతులు సోమవారం తీసుకోవాలని కోరారు. పొటాష్, జింక్, వేపపిండి అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

అందరికీ రేషన్ సరకులు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: వడ్డిగూడెం రేషన్ దుకాణం పరిధిలో లబ్ధిదారులందరికీ సరకులు అందుతాయని తెదేపా మండల అధ్యక్షులు బొర్రా నరేశ్ అన్నారు. కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఆదివారం రేషన్ దుకాణం వద్దకు వచ్చిన గ్రామస్థులతో మాట్లాడారు. సాంకేతిక సమస్య, డీలర్ అవగాహన రాహిత్యంతో ఆలస్యం జరిగిందని పేర్కొన్నారు. గొడవలు జరగకుండా పోలీసుల సహకారంతో సరకులు అందించారు.

రైతులను ఆదుకోవాలి

సీలేరు, న్యూస్‌టుడే: ధారకొండ పంచాయతీ పేట్రాయిలో మొంథా తుపానుతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన సమాఖ్య మండల కార్యదర్శి పి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామంలో పర్యటించి రైతులతో మాట్లాడారు. ఈదురుగాలులతో రాగులు, సామలు పూర్తిగా నేలమట్టమయ్యాయని చెప్పారు. మండలంలోని పలుచోట్ల ఇదే పరిస్థితి ఉందని, నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మండల సహాయ కార్యదర్శి రాము, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైంది

గంగవరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైందని, ఈ వృత్తిలో 33 ఏళ్లపాటు ఉండటం ఆనందంగా ఉందని సూరంపాలెం ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మేడిశెట్టి సత్య సాయిబాబా అన్నారు. గత నెల 31వ తేదీన పదవీ విరమణ పొందిన ఆయనను ఆదివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. ఎంఈవోలు టి.మల్లేశ్వరరావు, కె.వి.వి.సత్యనారాయణ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.కృష్ణ, కారం బొజ్జిదొర, వెంకటేశ్వర్లు, రఘుబాబుదొర తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా?

జి.మాడుగుల, న్యూస్‌టుడే: కొక్కిరాపల్లి ఘాట్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించడంలో ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పాలమామిడి సర్పంచి రామకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా.. అధికారులకు పట్టడం లేదన్నారు. పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారులకు తెలియజేశామన్నారు. తుప్పలను తొలగించి, రక్షణ గోడలకు మరమ్మతులు చేయాలని కోరారు.

పురుషోత్తపట్నంలో సంతకాల సేకరణ

ఎటపాక, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైకాపా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పురుషోత్తపట్నం గ్రామంలో ఆదివారం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కురినాల వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు ఆకుల వెంకటరామారావు, దామెర్ల రేవతి, నాగలక్ష్మి, ఆదినారాయణ పాల్గొన్నారు.

సందర్శకుల సందడి

చెరువులవెనంలో మంచు అందాలు ఆస్వాదిస్తున్న పర్యాటకులు

పొల్లూరు జలపాతంలో..

చింతపల్లి మండలంలోని పర్యాటక కేంద్రాలు ఆదివారం కళకళలాడాయి. కార్తిక మాసం, వారాంతపు సెలవులు రావడంతో దూరప్రాంతాల నుంచి శని, ఆదివారాల్లో పర్యాటకులు తరలివచ్చారు. వాతావరణం మారడంతో మంచు దట్టంగా కురిసింది. చెరువులవెనం, తాజంగి, లంబసింగి, బోడకొండమ్మ ఆలయం వద్ద ఉన్న వ్యూపాయింట్‌లు రద్దీగా మారాయి. మోతుగూడెం పర్యాటక ప్రాంతాలకు పర్యాటకుల సంఖ్య తగ్గింది.. - చింతపల్లి, మోతుగూడెం, న్యూస్‌టుడే

బండరాళ్లు.. తొలగించక బాధలు

అనంతగిరి, న్యూస్‌టుడే: మొంథా తుపాను సమయంలో జారిపడిన బండరాళ్లను తొలగించకపోవటంతో ఇబ్బందులు పడుతున్నామని పెదకోట పంచాయతీ జీడిమెట్ట గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలకు కొండచరియ జారడంతో వాటితోపాటు వచ్చిన బండరాళ్లు రహదారికి అడ్డంగా ఉండిపోయాయి. దీంతో చటాకంబ- జీడిమెట్ట గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లేందుకు సైతం రాళ్లు అడ్డంగా ఉన్నాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రాళ్లను తొలగించాలని గిరిజనులు కోరుతున్నారు.

రహదారికి అడ్డంగా బండరాళ్లు

విద్యారంగ సమస్యలపై పోరాటం

జి.మాడుగుల: విద్యారంగ సమస్యలపై పోరాడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్ అన్నారు. జి.మాడుగులలో ఎస్ఎఫ్ఐ మహాసభ నిర్వహించారు. కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.దేవరాం, మండల కార్యదర్శిగా కె.ప్రభాష్, సహాయ కార్యదర్శిగా ప్రదీప్, ఉపాధ్యక్షుడిగా మధుతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గం..

వైకాపావి శవ రాజకీయాలు

పాడేరు, న్యూస్‌టుడే: వైకాపా శవ రాజకీయాలు మానుకోవాలని జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. పాడేరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాశీబుగ్గలో జరిగిన ఘటన దురదృష్టకరమన్నారు. వైకాపా నాయకులు మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వంపై వైకాపా తప్పుడు ప్రచారం మానుకోవాలని సూచించారు. ఇప్పటికే బాధిత కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలిచాయన్నారు. ఎస్టీ కమిషన్ సభ్యుడు కిల్లో సాయిరాం, సర్పంచులు వెంకటరమణరాజు, పాండురంగస్వామి, శశిభూషణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, తెదేపా నాయకులు

గిరిజన ప్రాంత అభివృద్ధికి చర్యలు

కొయ్యూరు, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జీసీసీ మాజీ ఛైర్మన్ ఎంవీవీ ప్రసాద్ అన్నారు. పెదమాకవరంలో రూ.12 లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం గిరిజన ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బట్టపనుకులలో రూ.32 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. సర్పంచులు నూకాలమ్మ, బాలకృష్ణ, చింతపల్లి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ డి.చిట్టిబాబు, తెదేపా మండల అధ్యక్షుడు చంద్రరావు, భీమరాజు, పి.దేముడు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంవీవీ ప్రసాద్ తదితరులు

అంబులెన్సులో ప్రసవం

ఎటపాక, న్యూస్‌టుడే: అయ్యవారిపేట గ్రామానికి చెందిన గర్భిణి కరక సంధ్యకు ఆదివారం పురిటినొప్పులు వచ్చాయి. కుటుంబసభ్యులు 108 వాహనానికి కాల్ చేసి సమాచారం అందించారు. అంబులెన్సులో గర్భిణిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికమయ్యాయి. వెంకటరెడ్డిపేట వద్ద వాహనం నిలిపి ఈఎంటీ కృష్ణార్జున్, పైలట్ చందు, ఆశా కార్యకర్త సహాయంతో ప్రసవం చేశారు. మగ శిశువు పుట్టాడని, బరువు 2.5 కిలోలు ఉన్నట్లు వారు తెలిపారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని, భద్రాచలం ఆసుపత్రిలో చేర్పించామని పేర్కొన్నారు.

బిడ్డతో 108 సిబ్బంది

మాదకద్రవ్యాలతో ఎన్నో అనర్థాలు

అవగాహన కల్పిస్తున్న ఎస్సై

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: వ్యసనాల జోలికి వెళ్తే భవిష్యత్తు అంధకారం అవుతుందని రాజవొమ్మంగి ఎస్సై శివకుమార్ అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలల్లో గంజాయి, మత్తు పదార్థాల వినియోగంతో అనర్థాలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వినియోగంతో జీవితాలు నాశనమవుతాయని పేర్కొన్నారు. సైబర్ నేరాలు, బాలికలు, మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ సత్యవేణి, ప్రధానోపాధ్యాయురాలు నాగసుశీల, సిబ్బంది పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు నచ్చి పార్టీలో చేరామని బలపం పంచాయతీ వైకాపా వార్డు సభ్యులు పాంగి లింగారావు, సిందేరి సోమరాజు, కొర్రా రంగారావు, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు సిందేరి చిన్నయ్య అన్నారు. జనసేన మండల అధ్యక్షుడు బుజ్జిబాబు ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ సమక్షంలో ఆదివారం విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో వీరు పార్టీలో చేరారు. కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మన్యంలో పార్టీ బలోపేతానికి కలిసి కృషి చేద్దామన్నారు. పాలికి శ్రీను, కొర్రా రాజబాబు, సుబ్బారావు, రమణ తదితరులు పార్టీలో చేరినవారిలో ఉన్నారు. నాయకులు మర్రి మనోహర్, చంటి పాల్గొన్నారు.

జనసేన పార్టీలో చేరిన వార్డు సభ్యులు, పెసా కమిటీ ప్రతినిధులు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

పెదబయలు, న్యూస్‌టుడే: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ప్రధానోపాధ్యాయుడు పి.పండన్న అన్నారు. భగవాన్ బిర్సా ముండా 150 జయంత్యుత్సవాల సందర్భంగా స్థానిక గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో ఆదివారం ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కనాటి నీరు పోస్తున్న హెచ్‌ఎం పండన్న, ఉపాధ్యాయులు

ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: ఆరోగ్య పరిరక్షణపై ప్రతిఒక్కరూ శ్రద్ధ వహించాలని రాజమహేంద్రవరానికి చెందిన వైద్య నిపుణుడు గోలి వెంకటరామారావు పేర్కొన్నారు. స్థానిక సత్యసాయి సేవా కేంద్రం వద్ద సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మారేడుమిల్లి, గుర్తేడు ప్రాంతాలకు చెందిన సుమారు 300 మందికి రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించి.. వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆయనతోపాటు డాక్టర్ వడ్డాది సురేశ్ సేవలందించారు. సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు యోగేశ్వరరావు, రామ్మోహన్‌రావు, వీరయ్య, గోపాలకృష్ణ, సేవాదళ్ సభ్యులు గురునాథరెడ్డి, సురేంద్ర, రమణారెడ్డి, జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళను పరీక్షిస్తున్న వైద్యుడు రామారావు

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) బాబూరావునాయుడు తెలిపారు. పెదవలస పంచాయతీ టెంట్లవీధి, దామనాపల్లి పంచాయతీ చుట్టుగొంది గ్రామాల్లో గిరిజన వికాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న వ్యవసాయ పద్ధతులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం భూమి, రైతులకు మేలు చేస్తుందన్నారు. జిల్లా డీపీఎం భాస్కర్‌రావు, గిరిజన వికాస్ సంస్థ కార్యదర్శి సత్యనారాయణ, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లు యమున, రమ్య తదితరులు పాల్గొన్నారు.

పసుపు పంటను పరిశీలిస్తున్న రైతు సాధికార సంస్థ ఈడీ బాబూరావునాయుడు తదితరులు

శ్రమదానంతో రోడ్డు బాగు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: దేవరాపల్లి పంచాయతీ సాగులు ఎర్రచెరువుల రహదారి భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. ఉపసర్పంచి గుమ్మడి బాలరాజు ఆధ్వర్యంలో స్థానికులు ఆదివారం శ్రమదానం చేసి కోతకు గురైన చోట మట్టి వేసి రాకపోకలకు వీలుగా మార్చారు.

శ్రమదానం చేస్తున్న గిరిజనులు

రాష్ట్రస్థాయి కబడ్డీ జట్ల ఎంపిక

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: తుమ్మపాల పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక ఆదివారం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో బాలబాలికలు హాజరయ్యారు. కబడ్డీలో ప్రతిభ చూపిన 14 మంది చొప్పున బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. కర్నూలు జిల్లా మంత్రాలయంలో ఈనెల 7 నుంచి జరగనున్న సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్షురాలు కె.శాంతకుమారి చెప్పారు. జిల్లా కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్, కోశాధికారి మహారాజ్, పీఈటీలు వీరునాయుడు, రాజు, నూకరాజు పాల్గొన్నారు.

ఎంపికైన జట్టుతో అసోసియేషన్ సభ్యులు

కాఫీ కార్మికుల సమ్మె 6 నుంచి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఈనెల ఆరో తేదీ నుంచి కాఫీ కార్మికులు సమ్మెకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ పిలుపునిచ్చారు. కిన్నెర్ల కాఫీ తోటల్లో పనిచేస్తున్న కార్మికులతో ఆదివారం మాట్లాడారు. ఏపీఎఫ్‌డీసీ యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చి 20 రోజులకుపైగా అయిందని, ఇంతవరకు స్పందన లేదన్నారు. కరవు భత్యం, రోజు కూలీ పెరిగినప్పటికీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా వాటిని అమలు చేయడం లేదన్నారు. కాఫీ తోటలు సంరక్షణ లేక అంతరించిపోతున్నాయని, ఏపీఎఫ్‌డీసీ కనీసం పట్టించుకోలేదన్నారు. బాలకృష్ణ, రాములమ్మ, లక్ష్మి, సుబ్బమ్మ, రోహిణి, రామారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాఫీ కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్యపడాల్

అవినీతి నిర్మూలనకు కృషి

మోతుగూడెం, సీలేరు, న్యూస్‌టుడే: విజిలెన్స్ వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం లోయరు సీలేరు ప్రాజెక్టు సెక్యూరిటీ విభాగం ఇన్‌ఛార్జి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో మోతుగూడెంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా సెక్యూరిటీ కార్యాలయం నుంచి జెన్‌కో కాలనీ మీదుగా ర్యాలీ చేపట్టారు. అవినీతి నిర్మూలనకు కృషి చేస్తానని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ప్లాంట్ మేనేజర్ బాలకృష్ణ, సెక్యూరిటీగార్డులు పాల్గొన్నారు. సీలేరులో సెక్యూరిటీ, విజిలెన్స్ విభాగం ఇన్‌ఛార్జి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏఎస్‌వో కార్యాలయం నుంచి రామాలయం కూడలి వరకూ ర్యాలీ చేపట్టారు. అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దామని నినాదాలు చేశారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

సీలేరులో వ్యాసరచన పోటీలో విద్యార్థులు

మోతుగూడెం జెన్‌కో కాలనీలో సెక్యూరిటీ అధికారులు, సిబ్బంది ర్యాలీ

అమ్మాయిలు అదరగొట్టారు..

అభిమానులు జై కొట్టారు..

ముంబయి వేదికగా ఆదివారం జరిగిన మహిళల క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌ను విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో వీక్షించేందు ఏసీఏ ఆధ్వర్యంలో తెర ఏర్పాటు చేశారు. మ్యాచ్ చూసేందుకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో భారత్ విజయం సాధించడంతో అభిమానులు కేరింతలు కొడుతూ సంబరాలు చేసుకున్నారు.

- ఈనాడు, అమరావతి

తుపానుకు దెబ్బతిన్న పంటలను సంరక్షించుకుందాం

ఈనాడు తోడు

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో పంటలు దెబ్బతిన్నాయి. వరి, పత్తి నేలవాలాయి. మిర్చి, అపరాలు, కూరగాయలు, ఉద్యాన పంటలు నీటిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించే ఫోన్ ఇన్ కార్యక్రమంలో పాల్గొని పంటల సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై సూచనలు తెలియజేసేందుకు ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి, శాస్త్రవేత్తలు సంసిద్ధత తెలిపారు. వీరు కార్యక్రమంలో పాల్గొని పంటలను కాపాడుకోవడానికి అవసరమైన సూచనలు చేస్తారు. ఇందుకు రైతులు చేయాల్సిందల్లా ఈ కింది నంబరుకు ఫోన్ చేసి తమ సందేహాలను తెలియజేయడమే.

నేడు డయల్ యువర్ ఆంగ్రూ వీసీ

- న్యూస్‌టుడే, జిల్లాపరిషత్తు (గుంటూరు)

98491 76527 | తేదీ: సోమవారం (3.11.2025) | సమయం: ఉదయం 10 నుంచి 11 వరకు

వైద్య విద్యలో సూపర్ సిస్టర్స్

సంకల్ప బలం ఉంటే చాలు... కొండనైనా పిండి చేయొచ్చంటారు. చదువంటే భారం కాదు... ఆసక్తి సాధన చేస్తే అద్భుతాలు సృష్టించొచ్చని నిరూపిస్తున్నారు ఇద్దరు అక్కాచెల్లెళ్లు. సాధారణ కుటుంబ నుంచి వచ్చి.. ప్రజ్ఞ చాటి.. వైద్యవిద్యలో బంగారు పతకాలు అందుకున్న సాయి శ్రీనిజ, సాయి శ్రీనిఖిత గురించి తెలుసుకుందామా....

తెనాలికి చెందిన ప్రైవేటు ఉపాధ్యాయులు శంకరసాయి శర్మ, రాజరాజేశ్వరి దంపతుల కుమార్తెలు శ్రీనిజ, శ్రీనిఖిత. తల్లిదండ్రుల మార్గనిర్దేశకత్వంలో లక్ష్యాలను నిర్దేశించుకున్న వీరిద్దరూ చక్కని ప్రణాళికతో విద్యతోపాటు వారికి ఆసక్తి ఉన్న అంశాల్లోనూ రాణిస్తున్నారు.

తల్లిదండ్రులతో ప్రతిభామూర్తులు సాయిశ్రీనిజ, సాయిశ్రీనిఖిత

పదో తరగతిలో పది జీపీఏ, ఇంటరులో 96 శాతం మార్కులతో ఉత్తీర్ణురాలైన **సాయిశ్రీనిజ** నీట్‌లో 2,590 ర్యాంకు సాధించి విజయవాడలోని నోరి రామశాస్త్రి ఆయుర్వేదిక్ కళాశాలలో బీఏఎంఎస్ వైద్య విద్య చేసింది. అత్యధిక మార్కులు సాధించి రాష్ట్రం లోనే తొలిస్థానంలో నిలిచింది. బెస్ట్ అవుట్‌గోయింగ్ స్టూడెంట్ ఆఫ్ ది యూనివర్సిటీగా గత సెప్టెంబరు 9న విజయవాడలో నిర్వహించిన స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా మూడు బంగారు, ఒక వెండి పతకం అందుకుంది. ప్రస్తుతం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర ఆయుర్వేదిక్ కళాశాలలో ఎండీ (కౌమార భృత్యం) చేస్తున్నారు.

పదో తరగతిలో 93%, ఇంటరులో 97.3% మార్కులు (సీబీఎస్ఈ) తెచ్చుకున్న **సాయిశ్రీనిఖిత** నీట్‌లో 1,400 ర్యాంకుతో విశాఖలోని శ్రీగాయత్రీ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చేసింది. కళాశాల ప్రథమురాలిగా.. బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్‌గా నిలిచి ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన స్నాతకోత్సవంలో విశ్రాంత ఐఏఎస్ పూనం మాలకొండయ్య చేతుల మీదుగా బంగారు పతకాలతో పట్టా అందుకుంది. ప్రస్తుతం అక్కడే హౌస్ సర్జన్ చేస్తున్నారు.

ఇద్దరూ హిందీలో ప్రవీణ పట్టా అందుకున్నారు. శాస్త్రీయ సంగీతం, నృత్యంలోనూ పట్టాలు సాధించారు. వివిధ ఆలయాల్లో ప్రదర్శనలిచ్చారు. శ్రీసత్యసాయి యువజన విభాగంలో సభ్యులుగా కొవిడ్ సమయంలో పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో తల్లిదండ్రులతో కలిసి సేవలందించారు. పేదలకు ఉచిత వైద్యం అందించాలన్నదే ధ్యేయమని సోదరీమణులు తెలిపారు.

- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

ఇక రాజధానికి రయ్.. రయ్



- కృష్ణా పశ్చిమ డెల్టా కాలువపై స్టీల్ వంతెన నిర్మాణం
- మూడు నెలల్లో పూర్తి చేయాలని సంకల్పం

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే

అమరావతి రాజధానికి వెళ్లే సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణ పనుల్లో వేగం పుంజుకుంది. ఈ-3 రోడ్డును పాత జాతీయ రహదారికి అనుసంధానం చేసేందుకు కేఎల్‌రావు కాలనీ వద్ద కృష్ణా పశ్చిమ డెల్టా ప్రధాన కాలువపై స్టీల్ వంతెన నిర్మించేందుకు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏడీసీఎల్) రూ.70 కోట్లతో పనులు ప్రారంభించింది. 128 మీటర్ల పొడవున నాలుగు లైన్లుగా డెల్టా కాలువపై నిర్మించే స్టీల్ వంతెన ప్రకాశం బ్యారేజీ నుంచి ఉండవల్లి సెంటర్‌కు వెళ్లే మార్గంలో కేఎల్‌రావు కాలనీ వద్ద రోడ్డుకు అనుసంధానం చేస్తారు. దీని పనులు మూడు నెలల్లో పూర్తి చేయాలని సంకల్పించినట్లు ఏడీసీఎల్ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. రాజధాని అమరావతికి వెళ్లే వాహనాలు కృష్ణా కరకట్ట మీద కాకుండా నేరుగా స్టీల్ వంతెన మీదుగా సీడ్ యాక్సెస్ రోడ్డు నుంచి వెళ్లిపోయే విధంగా వంతెన నిర్మాణం ప్రారంభించారు. ఇందుకుగాను పీడబ్ల్యూడీ వర్క్‌షాప్ వద్ద వంతెనకు సంబంధించి పిల్లర్ నిర్మాణ పనులు చేపట్టారు.

డెల్టా కాలువపై సీడ్ యాక్సెస్ రోడ్డు కలిపేందుకు స్టీల్ వంతెన గూగుల్ రేఖా చిత్రం

డెల్టా కాలువ పక్కనే వంతెన కోసం పిల్లర్ నిర్మాణ పనులు

మరో పైవంతెన సన్నాహం..

ఉండవల్లి సెంటర్‌లోని కేఎల్‌రావు కాలనీ వద్ద నుంచి 16వ నంబర్ జాతీయ రహదారిని అనుసంధానం చేస్తూ మరో పైవంతెన నిర్మించేందుకు సంకల్పించారు. కేఎల్‌రావు కాలనీ నుంచి జాతీయ రహదారిని కలవాలంటే రోడ్డు మార్గంలో చెన్నై కలకత్తా రైలు మార్గంతోపాటు డెల్టా కాలువ ఉంది. వీటిపై నుంచి మరో వంతెన నిర్మాణానికి ప్రతిపాదించారు. త్వరలోనే దీని నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించనున్నట్లు ఏడీసీఎల్ అధికారులు తెలిపారు.

వేగంగా సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణ పనులు...

రాజధాని అమరావతిని కలిపే సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. పెనుమాక, ఉండవల్లి రైతులు రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూములు ఇవ్వడంతో పనుల్లో వేగం పుంజుకున్నాయి. ఉండవల్లిలో ఇటీవల 12.40 ఎకరాలు రోడ్డు నిర్మాణానికి రైతులు తమ భూములు ఇచ్చేందుకు అంగీకార పత్రాలను అందజేశారు. మరో 5.6 ఎకరాలు రైతుల నుంచి భూ సమీకరణ కింద తీసుకోవాల్సి ఉంది. వారితో కూడా అధికారులు చర్చిస్తున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే ప్రకాశం బ్యారేజీ వద్ద నుంచి అమరావతి రాజధానికి వెళ్లేవారు డెల్టా కాలువపై నిర్మించే స్టీల్ వంతెన మీదుగా నేరుగా చేరుకునే వెసులుబాటు కలుగుతుంది.

డీసీసీబీ అక్రమాలపై సమావేశం నేడు

గుంటూరు(గోరంట్ల): గత వైకాపా ప్రభుత్వంలో డీసీసీబీలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఇలా పలు జిల్లాల్లోనూ సహకార సంఘాల్లో జరిగిన అక్రమాలు శాసనసభలో ప్రస్తావనకు రావడంతో హౌస్ కమిటీని నియమించారు. సచివాలయంలో సోమవారం నిర్వహించే కమిటీ సమావేశంలో గుంటూరు జిల్లాతో పాటు మరో ఏడు జిల్లాల సహకార శాఖ అధికారులు, బ్యాంకు సీఈవోలు పాల్గొననున్నారు. ఈ కమిటీలో ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, తెనాలి శ్రావణ్‌కుమార్, బూర్ల రామాంజనేయులు సభ్యులుగా ఉన్నారు.

నకిలీ పత్రాలతో కోట్లలో దోపిడీ: గత వైకాపా ప్రభుత్వంలో నకిలీ పత్రాలతో సొసైటీల ద్వారా రూ.కోట్ల రుణాలు అక్రమంగా పొందారు. గత ప్రభుత్వంలోనే ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చినా నాటి ప్రభుత్వం వారి అనుచరులను కాపాడుకునే ప్రయత్నాలు చేసింది. అక్రమాలపై అప్పట్లోనే ప్రతిపక్ష నేతలు ప్రశ్నించినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటిపై పూర్తి స్థాయిలో విచారణకు ఆదేశించింది. ఈనేపథ్యంలో శాసనసభలో కమిటీ సోమవారం సమావేశం కానుంది.

రాత్రి వేళ అనవసరంగా రోడ్లపై తిరిగితే చర్యలు

జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్.. 477 మందిపై కేసులు

కౌన్సెలింగ్ చేస్తున్న పోలీసులు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : ఈ నెల 1వ తేదీ అర్ధరాత్రి జిల్లా వ్యాప్తంగా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 176 మంది, రాత్రివేళల్లో అనవసరంగా రోడ్లపై తిరుగుతున్న 301 మందిపై కేసులు నమోదు చేశారు. మొత్తం 477 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రాత్రి వేళల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనవసరంగా రాత్రి సమయాల్లో రోడ్లపై తిరగరాదని, బహిరంగంగా మద్యం తాగకూడదన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై టౌన్ న్యూసెన్సు యాక్టు కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇక్కడి గంట.. కిలోమీటరు వినపడేనంట

ఫిరంగిపురం బాలయేసు కథెడ్రల్ దేవాలయం (చర్చి)కి 133 ఏళ్ల ఘన చరిత్ర ఉంది. ఫాదర్ థియోడోర్ డిక్మన్ నేతృత్వంలో 1891లో దీన్ని నిర్మించారు. నిర్మాణానికి మొత్తం కొండరాయి, గానుక సున్నం వాడారు. ఒకేసారి పది వేల మంది విశ్వాసులు ప్రార్థన చేసుకునేందుకు విశాలమైన స్థలం ఉంది. ఆవరణలో 100 అడుగుల ఎత్తులో భారీ గంట స్తంభం ఉంది. ఇక్కడి గంటను ఒక్కసారి మోగిస్తే ఆ శబ్దం కిలోమీటరు మేర వినిపిస్తుంది. ఏటా క్రిస్మస్ వేడుకలు, తేరు ఉత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. గుంటూరు జిల్లా నుంచే కాకుండా కడప, కర్నూలు, నంద్యాల వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి విశ్వాసులు పెద్ద ఎత్తున తరలివస్తారు. ఇక్కడ భక్తులే స్వయంగా కొబ్బరి కాయలు కొడతారు. విశ్వాసులు తలనీలాలు సమర్పించే వెసులు బాటు కలదు. చర్చి ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన 50 అడుగుల మేరీమాత స్వరూపం ప్రత్యేక ఆకర్షణగా చెప్పవచ్చు.

- న్యూస్‌టుడే, ఫిరంగిపురం గ్రామీణం

సేంద్రియ 'బాట'లో బంధువులు

వారంతా బంధువులు. అందరికీ వ్యవసాయమే జీవనాధారం. రసాయన ఎరువుల వినియోగానికి స్వస్తి పలికి.. పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్య రక్షణకు ఉపయుక్తంగా ఉండే పంటలు పండించాలని భావించారు. అనుకున్నదే తడవుగా సేంద్రియ బాట పట్టి మంచి ఫలితాలు సాధిస్తున్నారు. వారి సాగు విధానాలను ఇటీవల కాలంలో బ్రెజిల్, స్విడ్జర్లాండ్ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధుల బృందం కూడా సందర్శించింది. మంగళగిరి మండలం నూతక్కి గ్రామానికి చెందిన కళ్లం శ్రీనివాసరెడ్డి, అన్నపురెడ్డి రామలింగారెడ్డి, కళ్లం సుబ్బారెడ్డి, సాంబిరెడ్డి సేంద్రియ విధానంలో పసుపు, అరటి, కంద సాగు చేస్తున్నారు. ఆవు పేడ, ఘనజీవామృతం, ఇతర కషాయాలను సొంతంగా తయారు చేసుకుని వినియోగిస్తున్నారు. భూసారం పెంపునకు పచ్చిరొట్ట విత్తనాలు వాడుతున్నారు. దీని వల్ల సాగు ఖర్చులు బాగా తగ్గాయని వారు చెబుతున్నారు. సుమారు నాలుగేళ్లుగా ఈ వ్యవసాయం చేస్తున్నామని, ఇంటికి అవసరమైన కూరగాయలతోపాటు పంటను బట్టి ఎకరాకు సుమారు రూ.లక్ష ఆదాయం వస్తుందని వారు చెబుతున్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని ఆ గ్రామంలోని పలువురు రైతులు కూడా సేంద్రియ బాట పట్టారు.

ఏపుగా ఎదిగిన అరటి తోట

ఇటీవల వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన విదేశీ బృందానికి వివరాలు చెబుతున్న కళ్లం శ్రీనివాసరెడ్డి

- న్యూస్‌టుడే, మంగళగిరి గ్రామీణం

గతుకులకు అతుకులు

జీఎంసీలో గుంతలు పూడ్చేందుకు అధికార యంత్రాంగం దృష్టి

ఈనాడు - అమరావతి

రహదారులపై ఏర్పడ్డ గుంతలను యుద్ధప్రాతిపదికన పూడ్చడానికి అధికారులు డివిజన్ల వారీగా షెడ్యూలు రూపొందిస్తున్నారు. ఇందుకోసం రూ.1.40 కోట్ల వ్యయంతో ప్రత్యేకంగా పాట్‌హోల్ యంత్రాన్ని కొనుగోలు చేశారు. గతంలో జరిగిన దోపిడీ పునరావృతం కాకుండా చూడాలన్న ఉద్దేశంతో ఉన్నారు.

జీఎంసీ పరిధిలో చాలా రహదారులు దెబ్బతిన్నాయి. గుంతలతో.. రాళ్లు తేలి ప్రమాదకరంగా పరిణమించాయి. కాస్త వర్షానికే మడుగులను తలపిస్తుండగా.. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం రాగానే దృష్టి పెట్టి రూ.4 కోట్లు కేటాయించింది. గతేడాది అక్టోబరులో పనులు చేపట్టిన గుత్తేదారులు కంకర, రాతిపొడితో నింపేశారు. మరికొన్నిచోట్ల నాసిరకం తారు మిక్సింగ్‌తో పూడ్చడంతో ఏడాది పూర్తికాకుండానే రాళ్లు పైకి తేలాయి. గుజ్జనగుండ్ల, ఏటీ అగ్రహారం, సంజీవనగర్, నెహ్రూనగర్, బృందావన్ గార్డెన్స్ రోడ్డు, పెద్దపలకలూరు రోడ్డు, పాతబస్టాండు.. ఇలా అనేకచోట్ల ఇదే పరిస్థితి.

నగరంపాలెం సమీపంలో ప్రధాన రోడ్డుపై గుంతలు

డివిజన్ల వారీగా షెడ్యూల్

పాట్‌హోల్ యంత్రాన్ని డివిజన్ల వారీగా వినియోగించేందుకు షెడ్యూలు రూపొందిస్తున్నారు. ఎక్కువగా గుంతలున్న డివిజన్లను మొదటి ప్రాధాన్యంగా ఎంపిక చేస్తున్నారు. తుపాను ప్రభావం తగ్గుముఖం పట్టాక దీన్ని వినియోగిస్తారు. తుపాను ధాటికి దెబ్బతిన్న రోడ్లకూ దీనిద్వారానే మరమ్మతులు చేయనున్నారు. ప్యాచ్‌వర్క్‌ల పేరుతో రూ.4 కోట్లను గుత్తేదార్లు మింగేయగా.. ఇప్పుడు మళ్లీ రూ.1.40 కోట్లతో ప్రత్యేక యంత్రాన్ని కొనుగోలు చేసిన అధికారులు.. ఏ మేరకు సద్వినియోగం చేసుకుంటారన్నది వేచి చూడాల్సిందే.

వర్షాలతో అధ్వానమే..

గత నాలుగు నెలలుగా కురుస్తున్న వర్షాల కారణంగా నాసిరకంగా పనులు చేసిన చోట రాళ్లు తేలి రోడ్లపై చెల్లాచెదురయ్యాయి. కొన్నిచోట్ల మడుగుల్లా మారిపోవడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. బీటీరోడ్ల నిర్మాణం పేరుతో సుమారు రూ.10 కోట్ల వ్యయంతో పనులు చేసినచోట తారు మిక్సింగ్ పరిచి వదిలేయడంతో అవీ దెబ్బతిన్నాయి.

రూ.1.40 కోట్లతో యంత్రం

రోడ్లపై గుంతలు పూడ్చడానికి జీఎంసీ అధికారులు రూ. 1.40 కోట్లతో పాట్‌హోల్ యంత్రం కొనుగోలు చేశారు. ఇప్పటివరకు విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాల్లోనే ఈ తరహా యంత్రాన్ని వినియోగిస్తున్నారు. ఇప్పటికే దీనితో ట్రయల్‌రన్ నిర్వహించాక సత్ఫలితాలు రావడంతో పూర్తిస్థాయిగా వినియోగించనున్నారు.

తేనెలూరు తెనాలి.. ఆహా అనాలి..

ఈనాడు, అమరావతి

తేనె.. ఈ పేరు చెప్పగానే ఠక్కున గుర్తొచ్చేది అరకు, విశాఖ మన్యం. అయితే, మన గుంటూరు జిల్లాలోనూ ఓ ప్రాంతం తేనె ఉత్పత్తి, విక్రయాల్లో పేరుపొందింది. అనేక రాష్ట్రాలకూ ఇక్కడి నుంచి సరఫరా అవుతోంది. తెనాలి ప్రాంతంలోని ఆ తేనెపట్టుల కథే.. ఇది.

తెనాలికి తేనె ఉత్పత్తిలో మంచి పేరు. గత 15 ఏళ్లుగా ఉత్పత్తి, విక్రయాలతో ఈ ప్రాంతం కళకళలాడింది. కరోనా, లాక్‌డౌన్ కారణంగా ఎగుమతులు నిలిచిపోయి అనేక మంది ఈ వ్యాపారానికి దూరమయ్యారు. అయినప్పటికీ పది మంది మాత్రం ఆ వారసత్వాన్ని ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. సంగం జాగర్లమూడి-తెనాలి మధ్య రోడ్డు వెంట ఈ దుకాణాలు, వాటి ఎదుట తేనె సీసాలతో నిత్యం సందడిగా ఉంటోంది. పొన్నూరు, వలివేరులోనూ కొందరు ఇదే వ్యాపారంలో ఉండగా.. వీరు తెనాలితోపాటు గోదావరి జిల్లాల్లో కొబ్బరి తోటలు, ఏలూరు వైపు పామాయిల్ తోటల్లో, కర్నూలులో నువ్వులు, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న.. కృష్ణా డెల్టాలో మామిడి, సపోట, జామ, నిమ్మతోటల్లో తేనెపెట్టెలు పెడుతున్నట్లు చెబుతున్నారు.

నిమ్మతోటల్లో పెట్టెలతో ఉత్పత్తి

ఇక్కడే ఎందుకు..?

తెనాలి పరిసరాల్లో ఎటుచూసినా జలసవ్వళ్లు..ఉద్యాన తోటలతో చల్లటి వాతావరణం ఉంటుంది. ఇది తేనెటీగలు బతకడానికి, తేనె ఉత్పత్తికి అనువైనదని ఉత్పత్తిదారులు చెబుతున్నారు. ఇక్కడి నిమ్మతోటలు ఇందుకు కేంద్రంగా మారుతున్నాయి. వీరి వద్ద అరుదుగా దొరికే వాము పూత తేనె అయితే కేజీ ధర రూ.800 నుంచి రూ.1000 ఉంటోంది. అడవి తేనె కేజీ రూ.వెయ్యి వరకు పలుకుతోంది. ఇక, మామూలు తేనె రకాన్ని బట్టి రూ.370, రూ.440, రూ.640.. చొప్పున విక్రయిస్తున్నారు. ఐరోపా ఈగలతో ఉత్పత్తయిన తేనె కేజీ రూ.250గా ఉంది. ఇది తొందరగా ఉత్పత్తయ్యే హైబ్రిడ్ రకం కావడంతో ధర తక్కువగా ఉంటోంది.

నిమ్మతోటల్లో పెట్టిన తేనెపెట్టెలు

రోడ్డుపక్కన విక్రయాలు

ఈగలు దొరికేది అక్కడే..

కేరళ, జార్ఖండ్‌లోని తేనెటీగల నర్సరీల నుంచి పెట్టెలు, తేనెటీగలు తెస్తున్నారు. అక్కడ పెట్టె ధర రూ.3,500 వరకు ఉండగా.. ఒక పెట్టెకు 6 నుంచి 8 రేకలు ఉంటున్నాయి. రేకకు 3వేల వరకు ఈగలు ఉంటుండగా..ఇందులో రాణి ఈగ కీలకం. అది చనిపోతే ఇక ఆ పెట్టె పాడైపోయినట్లే. పూత బాగుంటే పెట్టెకు 30-45 రోజుల వ్యవధిలో 3 కిలోల తేనె వస్తుందని ఉత్పత్తిదారులు చెబుతున్నారు.

ప్రతి నెలా టన్ను వరకు విక్రయిస్తా

– సుబ్బారావు, తేనె ఉత్పత్తి, విక్రయదారు, అంగలకుదురు

నా వద్ద 320 తేనెపెట్టెలు ఉన్నాయి. వీటిని స్థానికంగా, ఇతర ప్రాంతాల్లోని ఉద్యాన తోటల్లో పెడుతుంటాను. సీజన్, ఉత్పత్తిని బట్టి నెలకు టన్ను వరకు విక్రయం జరుగుతుంది. నా ఉత్పత్తి నెల్లూరు, శ్రీకాళహస్తి, శ్రీశైలం నుంచి బెంగళూరు, చెన్నై వరకు వెళుతుంది.

వాటర్‌షెడ్ పథకంతో భూగర్భ జలాలు పెంచేందుకు చర్యలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గ్రామీణాభివృద్ధిలో భాగంగా వాటర్‌షెడ్ పథకాన్ని ఏర్పాటు చేసి భూగర్భ జలాలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంలోని చెరువును ఆయన ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈనెల 11న నిర్వహించబోయే వాటర్‌షెడ్ జాతీయ కార్యక్రమానికి సంబంధించి సభా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. పెమ్మసాని మాట్లాడుతూ 'వాటర్ షెడ్ పథకానికి వెంగళాయపాలెం చెరువును ఎంపిక చేశాం. రూ.1.2 కోట్లు ఖర్చు చేసి ఎంట్రన్స్ ప్లాజా, పార్కింగ్, ఓపెన్‌జిమ్, పిల్లల ఆటస్థలం, సామాజిక భవనం వంటి సౌకర్యాలు కల్పించి చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయబోతున్నాం. ప్రజలు బాధ్యత తీసుకుని నిర్వహించుకోవాలి. 300 కొబ్బరి చెట్లు, చేపల పెంపకం ద్వారా ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఈ ప్రాజెక్టును విజయవంతం చేసి ప్రధాని మోదీ ద్వారా జిల్లాలో మరిన్ని గ్రామాలకు నిధులు సేకరించి మోడల్‌గా రూపొందించాలని ప్రయత్నిస్తున్నాం. ఈనెల 11న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబోతున్నాం'.. అని తెలిపారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ రాయలసీమ వంటి ప్రాంతాల్లో వాటర్ షెడ్ పథకం గొప్ప అవకాశమన్నారు. భూగర్భ జలాలు సమృద్ధిగా అందుబాటులోకి తీసుకురావాలన్నదే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ, తెదేపా నాయకులు కల్లూరి శ్రీనివాసరావు, లీలా మల్లికార్జునరావు, పంచుమర్తి శేషు, కల్లూరి అవినాష్, జనసేన సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న పెమ్మసాని చంద్రశేఖర్, బూర్ల రామాంజనేయులు

పబ్లిక్ అండర్‌టేకింగ్ కమిటీ రాక రేపు

గోరంట్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర శాసనసభ పబ్లిక్ అండర్‌టేకింగ్ కమిటీ ఈ నెల 4న జిల్లాలో పర్యటించనుందని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కలెక్టర్ కార్యాలయానికి కమిటీ చేరుకుని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్, రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ కార్యకలాపాలను సమీక్షిస్తుందన్నారు. అదే విధంగా ఏపీ ఏవియేషన్ కార్పొరేషన్, ఏపీ విమానాశ్రయాల అభివృద్ధి కార్పొరేషన్ కార్యకలాపాలను కూడా సమీక్షిస్తుందని పేర్కొన్నారు.

చక్రాలపై వైద్యం.. చెంతకే ఆరోగ్యం..!

గుంటూరు రైల్వే డివిజన్‌లో విజయవంతంగా 'హెల్త్ ఆన్ వీల్స్'

రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు

ఈనాడు, అమరావతి

నవంబర్ 1వ తేదీ శనివారం.. ఐదు బోగీలతో ఉన్న ఓ రైలు దొనకొండ స్టేషన్ వద్దకు వచ్చి ఆగింది.. అందులో నుంచి తెల్ల దుస్తులతో ఉన్న వైద్యులు, సిబ్బంది ప్లాట్‌ఫామ్‌పై దిగారు.. కాసేపటికి రైల్వే యూనిఫాంలో ఉన్న కొందరు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆ బోగీల్లోకి వెళ్లారు.. వారికి వైద్య పరీక్షలు నిర్వహించడం, మందులు అందించడం.. చకచకా జరిగిపోతున్నాయి.. ఒక్క దొనకొండలోనే కాదు.. ఆ తర్వాత గజ్జల, మార్కాపురం రోడ్, తర్లుపాడు, కంభం, జంగంబొట్ల కృష్ణాపురం, సోమిదేవిపల్లి, గిద్దలూరులోనూ ఇవే దృశ్యాలు కనిపించాయి. ఇంతకీ ఈ రైలు ఏమిటి.. ఇందులో వచ్చిన ఆ వైద్యులు, సిబ్బంది ఎక్కడి వారు..వారి అందించే చికిత్స.. ఈ కథనంలో తెలుసుకుందాం..!!

'హెల్త్ ఆన్ వీల్స్'.. రెండు నెలల క్రితం గుంటూరు రైల్వే డివిజన్‌లో ప్రారంభమైన కార్యక్రమం. గతేడాది కొంతకాలం పాటు ఇది సాగినా.. అనివార్య కారణాలతో ఆగింది. అయితే, గుంటూరు రైల్వే డీఆర్‌ఎంగా సుదేష్ణ సేన్ బాధ్యతలు స్వీకరించాక ఈ కార్యక్రమంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. గత రెండు నెలల్లో ఐదు దఫాలుగా ప్రత్యేక రైలును వివిధ మార్గాల్లో నడుపుతున్నారు. ఇందులో రైల్వే ఆసుపత్రి వైద్యులు, పారా మెడికల్ సిబ్బందితోపాటు రెఫరల్ ఆసుపత్రి వైద్యులు ఉంటారు. వీరికి కేటాయించిన మార్గం, తేదీల్లో ఆ ప్రత్యేక రైలులో వెళ్లడం.. సూచించిన స్టేషన్లలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. రైలుబోగీలోనే దీన్ని ఏర్పాటు చేస్తుండగా.. ఆ స్టేషన్, పరిసర ప్రాంతాలకు చెందిన రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు అందులో వైద్యపరీక్షలు, చికిత్సలు చేస్తున్నారు. ఒకవేళ తీవ్ర అనారోగ్య సమస్యలుంటే రెఫరల్ ఆసుపత్రికి వెళ్లాలని సూచిస్తుండడం గమనార్హం.

ప్రత్యేక రైలు ఇదే..

అనేక మార్గాల్లో సేవలు

ఇప్పటివరకు అనేక మార్గాల్లో ఈ సేవలు అందినట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు. సెప్టెంబర్ 20న గుంటూరు-దొనకొండ స్టేషన్ల మధ్య 140 మంది ఈ తరహాలో వైద్య సేవలు పొందగా.. అక్టోబర్ 17న నడికుడి-నల్గొండ సెక్షన్‌లో 162 మంది లబ్ధి పొందారు. గుంటూరు టు రేపల్లె, మంగళగిరి, నడికుడి మార్గాల్లోనూ ఈ సేవలు అందించారు. వారానికి లేదా రెండు వారాలకు ఒకసారి ఈ ప్రత్యేక రైలు పట్టాలపై పరుగులు తీస్తోంది. గిద్దలూరు టూ నంద్యాల, నల్గొండ మార్గాల్లో ప్రస్తుతం ఈ సేవలు అందించాల్సి ఉన్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.

కలెక్టరేట్‌లో అర్జీల స్వీకరణ నేడు

కలెక్టరేట్: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహిస్తామని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. సమర్పించిన అర్జీల వివరాలు, వాటి స్థితిని 1100 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ఫిర్యాదులను Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లోనూ నమోదు చేసుకోవచ్చని చెప్పారు. కలెక్టర్ కార్యాలయం సహా అన్ని డివిజన్, మండల కార్యాలయాల్లోనూ అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు.

(c) eenadu

ఇంటి నుంచే విద్యుత్తు సేవలు

● అందుబాటులో ఏపీఎస్పీడీసీఎల్ యాప్



విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఏపీఎస్పీడీసీఎల్ ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టింది. ఆండ్రాయిడ్ చరవాణుల్లో ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీనిద్వారా వచ్చిన సమస్యలను విద్యుత్తు శాఖ అధికారులు పరిశీలించి సత్వరం పరిష్కరిస్తారు.
- న్యూస్‌టుడే, పట్నంబజారు

జిల్లా	గుంటూరు	సీఆర్డీఏ
కనెక్షన్లు	91,658	87,881
ప్రతినెలా బిల్లు (రూ. కోట్లు)	135	105.2

బిల్లు చెల్లించొచ్చు: విద్యుత్తు బిల్లులు చెల్లించేందుకు బిల్‌పే ద్వారా సర్వీసు నంబరు, చరవాణి నంబరు పొందుపరిస్తే సంబంధించిన వివరాలు ప్రత్యక్షమవుతాయి.

నూతన కనెక్షన్: నూతన కనెక్షన్ కోసం సమగ్ర వివరాలను యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. అధికారులు పరిశీలించి కనెక్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటారు.

మొబైల్ లింకింగ్: విద్యుత్తు వినియోగదారులు తమ విద్యుత్తు కనెక్షన్‌కు సంబంధించి చరవాణి నంబరును అనుసంధానిస్తే విద్యుత్తు బిల్లుల సమాచారం చరవాణికి అందుతుంది.

ఎనర్జీ కాలిక్యులేటర్: ఏ ఉపకరణానికి ఎంత విద్యుత్తు ఖర్చవుతుందో దీని ద్వారా తెలుసుకోవచ్చు. నెలవారీ విద్యుత్తు వినియోగానికి సంబంధించిన మీటరు రీడింగ్ వివరాలు పొందుపరిస్తే బిల్లు సమాచారం కనిపిస్తుంది.

కస్టమర్ కేర్: వినియోగదారులు తమ సమస్యలను ఇందులో పొందుపరచొచ్చు. అందిన సర్టై వివరాలు, అవసరమైన అన్ని లింకులు ఇందులో పొందుపరిచి ఉంటాయి.

ఫీడ్ బ్యాక్: విద్యుత్తు శాఖ అందిస్తున్న సేవలపై అభిప్రాయాలు పంచుకోవచ్చు.

కన్‌జంప్షన్: వినియోగదారులు వాడిన యూనిట్లు.. చెల్లించాల్సిన నగదు.. బిల్ లెడ్జర్ వివరాలు అందుబాటులో ఉంటాయి.

పేమెంట్ హిస్టరీ: వినియోగదారులు నెలవారీగా చెల్లించిన విద్యుత్తు బిల్లుల సమాచారం ఇందులో ఉంటుంది.

ఎనర్జీ సేవింగ్స్ టిప్స్: విద్యుత్తు ఉపకరణాలు వాడుతున్నప్పుడు ఆచరించాల్సిన పొదుపు సూచనలు విపులంగా ఉంటాయి.

పే బిల్: సర్వీసు నంబరు నమోదు చేసుకుని నెలవారీ విద్యుత్తు బిల్లులకు సంబంధించిన నగదు చెల్లించొచ్చు.

అధికారుల వివరాలు: వినియోగదారుల పరిధిలోని అధికారుల ఫోన్ నంబర్లు లభ్యమవుతాయి. ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

టారిఫ్: వినియోగదారులకు సంబంధించిన టారిఫ్ వివరాలు ఇందులో పొందుపరిచి ఉంటాయి.

క్విక్‌పే: సర్వీసు నంబరు, చరవాణి నంబరును నమోదు చేస్తే సంబంధిత బిల్లు వివరాలు వస్తాయి. అక్కడినుంచి బిల్లు చెల్లించొచ్చు.

పెళ్లి సంబంధాల కోసం చూస్తున్నారా
అన్ని కులాల సాఫ్ట్‌వేర్ ఉద్యోగ వధూవరులకు సువర్ణావకాశం

నేడు అన్ని కులాల సాఫ్ట్‌వేర్ ఉద్యోగ వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి అన్ని కులాల సాఫ్ట్‌వేర్ ఉద్యోగ అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు **నేడు (3 నవంబరు 2025)** ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ★ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్లో యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు క్రింద తెలిపిన ఫోన్ నెంబర్లను సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

మరిన్ని వివరాలకు
95501 28306 & 83744 45190
ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

కార్తికమాస పూజల్లో 1,008 మంది దంపతులు

కార్తికమాస విశిష్టత వివరిస్తున్న పెనుగొండ పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి, పూజలో పాల్గొన్న భక్తులు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం 1,008 మంది ఆర్య వైశ్య దంపతులతో సామూహిక రమా సహిత సత్య నారాయణ స్వామి వ్రతం, కార్తిక వన సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. వాసవీ యూత్ తెనాలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెనుగొండ పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి ప్రత్యేక పూజలు చేశారు. డబుల్ హార్స్ మినపగుళ్ల, ఫుడ్స్ పరిశ్రమ అధినేత ఎం. శ్యామ్‌ప్రసాద్, ఆర్యవైశ్య సంఘాల ప్రముఖులు పాల్గొన్నారు.

సీడీఈలో సూపరింటెండెంట్ ఇష్టారాజ్యం

ఏ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూర విద్యా కేంద్రం(సీడీఈ)లో పనిచేస్తున్న ఓ సూపరింటెండెంట్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. నిబంధనల ప్రకారం ఏ విభాగానికైనా ఒక్కరే సూపరింటెండెంట్ ఉండాలి. కానీ ఇక్కడ రెండో వ్యక్తిని పెట్టడంతో కార్యాలయ పనులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. సీడీఈలో నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న సదరు సూపరింటెండెంట్ గతంలో రెండు సార్లు ఏసీబీకి చిక్కారు. కేసు విచారణలో ఉండగా ఉద్యోగం ఇవ్వడానికి ఉండదు. అయినా ఆయన ఉద్యోగం చేస్తున్నారు. విచారణ కొలిక్కి వచ్చేంత వరకు ఎలాంటి పదోన్నతీ ఇవ్వకూడదు. అయినా ఓ ఉన్నతాధికారి అండతో ఉద్యోగంలో చేరడమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతి ఇవ్వడంతో పాటు కాన్ఫిడెన్షియల్ విభాగంలో విధులు కేటాయించారు. దీంతో పాటు ఏఎన్‌యూలోని స్టడీ సెంటర్‌ను కూడా ఆయనకే అప్పగించారు. ఈ ఏడాది జులైలో నిర్వహించిన పరీక్షల్లో కొంతమంది విద్యార్థులు ఆయన నిర్వాకం వల్లే ఫెయిలయ్యారు. పరీక్షల సమయంలో విశ్వవిద్యాలయానికి స్టడీ సెంటర్ల నుంచి వచ్చిన విద్యార్థుల ఎసైన్‌మెంట్‌లను సక్రమంగా సరిపోల్చి, థియరీ పరీక్షల మార్కులకు కలపాలి. అలా చేయకపోవడంతో సుమారు 1,000 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. దీనిపై సీడీఈ పరీక్షల విభాగం సమన్వయకర్త ఆచార్య రామచంద్రన్‌ను వివరణ కోరగా ఆ సూపరింటెండెంట్ వద్దని ఇన్‌ఛార్జి వీసీ గంగాధర్‌కు అప్పగించినా మళ్లీ విధులకు వస్తున్నారని చెప్పారు. విద్యార్థులు పంపించిన ఎసైన్‌మెంట్లను సరిచేస్తున్నామని, త్వరలోనే ఫలితాలు వాళ్లకి అందిస్తామన్నారు.

సాగర్ ఇన్‌ఫ్లో 72,272 క్యూసెక్కులు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయం నాలుగు క్రస్టు గేట్లు అయిదు అడుగులు ఎత్తి 32232 క్యూసెక్కుల నీటిని ఆదివారం విడుదల చేశారు. శ్రీశైలం నుంచి 72,272 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 33,008, కుడి కాలువకు 7033 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయ నీటిమట్టం 589.60 అడుగులకు చేరింది.

రెంటచింతల: ఎగువ సాగర్ జలాశయం నుంచి వరద నీటి ప్రవాహం సత్రశాల టెయిల్‌పాండ్‌కు కొనసాగుతోంది. సాగర్ నుంచి 65,118 క్యూసెక్కులు రాగా.. ఆరు గేట్లు ఎత్తి దిగువ పులిచింతల ప్రాజెక్టుకు 48,244 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తికి 4,288 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు జెన్‌కో ఎస్ఈ తెలిపారు. రిజర్వాయరులో 7.080 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

దశాబ్దాల కలను నెరవేరుస్తున్నాం

మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్. వేదికపై ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తదితరులు

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకానిలోని లూథర్‌గిరి, యడవల్లి నగర్ కాలనీ వాసుల దశాబ్దాల కలైన కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని చేపడుతున్నందుకు సంతోషంగా ఉందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. స్థానిక లూథర్‌గిరి కాలనీలో రూ.52 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న కమ్యూనిటీ హాలుకు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌తో కలిసి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అంతకు ముందు అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి వారు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ తనకు అమెరికాలో పరిచయమున్న సాఫ్ట్‌వేర్ సంస్థ యజమాని ఎర్రంరెడ్డి అనిల్‌రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధి కోసం సీఎస్ఆర్ నిధులు కేటాయించారని తెలిపారు. తొలుత కమ్యూనిటీ హాలుకు ప్రాధాన్యం ఇచ్చామని, నిపుణులైన ఇంజినీర్లకు నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారు. వైకాపా హయాంలో ప్రజాధనాన్ని దోచుకోవడంపై పెట్టిన శ్రద్ధ.. రాష్ట్ర ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో చూపలేదని మండిపడ్డారు. పెదకాకానిలో ఇళ్లకు నష్టం వాటిల్లకుండా డ్రైనేజీ నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రజల కష్టాలను తెలుసుకొని పరిష్కరించటమే కూటమి ప్రభుత్వ నైజమని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నట్లు చెప్పారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

5న అతి రుద్ర మహాయాగం

తుళ్లూరు, న్యూస్‌టుడే: తాళ్లాయపాలెంలోని శైవక్షేత్రంలో ఈ నెల 5న కార్తిక పౌర్ణమి సందర్భంగా అతి రుద్ర మహాయాగం, ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించనున్నట్లు క్షేత్ర పీఠాధిపతి శివస్వామి తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఆదివారం ఆయన మీడియా సమావేశంలో వెల్లడించారు. బుధవారం ఉదయం 8 గంటలకు జరిగే యాగంలో 5 రకాల ద్రవ్యాలు, నదీ జలాలతో రాజరాజేశ్వరీదేవి సమేత కోటిలింగేశ్వర స్వామికి అభిషేకాలు, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేయనున్నట్లు వివరించారు. సాయంత్రం 6 గంటల నుంచి కృష్ణానది హారతి, శివపార్వతుల శాంతి కల్యాణ మహోత్సవం తదితర సేవా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.

మాట్లాడుతున్న శివస్వామి

కూరగాయల ధరలు పైపైకి..

పొన్నూరు, న్యూస్‌టుడే

తుపాను ప్రభావం, కార్తిక మాసం సీజన్ కావడంతో జిల్లాలో కూరగాయల ధరలు దారెత్తుతున్నాయి. వర్షాల ధాటికి 325 హెక్టార్లలో వివిధ రకాల కూరగాయల తోటలు దెబ్బతిన్నట్లు ఉద్యానశాఖ అధికారులు ప్రకటించారు. దీంతో రైతుబజార్లకు వచ్చే దిగుబడి ఒక్కసారిగా తగ్గిపోయింది. ఇప్పటికీ తోటల్లో నీళ్లు నిలిచి ఉండటంతో మొక్కలు ఉరకెత్తి వడిలిపోతున్నాయి. గత 4 రోజుల నుంచి పూర్తిగా దిగుబడులు తగ్గిపోయాయని రైతు బజారు అధికారులు చెబుతున్నారు. దీనికి తోడు కార్తికమాసం కూడా కావడంతో కూరగాయలకు డిమాండ్ పెరిగింది. దిగుబడి తగ్గడం, ధరలు పెరగడం ఏకకాలంలో జరగడంతో ధరలు పెరిగిపోయాయి. దిగుబడులు సాధారణ స్థితికి వచ్చే వరకు ధరలు ఇలానే ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు.



చింతలపూడి సమీపంలో ఎండిపోతున్న బెండతోట

పొన్నూరు రైతు బజారులో 1కి ధరలు..(కేజీ రూ.ల్లో)

కూరగాయలు	తుపాను ముందు	తుపాను తర్వాత
వంకాయ	30	60
బెండ	28	46
బీర	25	35
దొండ	26	44
కాకర	30	44

పురపాలక సంఘం	రైతు బజార్లు	కూరగాయల రాక (క్వింటాళ్లు) తుపాను ముందు	తర్వాత
గుంటూరు	3	240	190
మంగళగిరి	1	30	20
తెనాలి	6	260	60
పొన్నూరు	1	35	24
మొత్తం	11	565	394

ఎర్రన్నాయుడి సేవలు చిరస్మరణీయం

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడి వర్ధంతి పురస్కరించుకుని మంత్రి నారా లోకేశ్ ఆదివారం నివాళులర్పించారు. ఈ మేరకు నియోజకవర్గ పార్టీ కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటన విడుదలైంది. ఉత్తరాంధ్ర అభివృద్ధితోపాటు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి ఎర్రన్నాయుడు అని కొనియాడారు. రాజకీయాల్లో ఆ కుటుంబం ప్రత్యేక స్థానం సంపాదించుకుందని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు.

ఎస్‌డీపీవో కార్యాలయం ప్రారంభం 4న

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర సచివాలయం సమీపంలో ఎన్-9 రహదారి పక్కన నిర్మించిన తుళ్లూరు సబ్ డివిజనల్ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఈ నెల 4న నిర్వహించనున్నట్లు డీఎస్పీ టి.మురళీకృష్ణ తెలిపారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ముఖ్యఅతిథిగా హాజరై డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, విద్య, ఐ.టి శాఖ మంత్రి నారా లోకేశ్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌లను గౌరవ అతిథులుగా ఆహ్వానించినట్లు డీఎస్పీ తెలిపారు. సంబంధించిన అన్ని ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

పట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ అనుపమ చక్రవర్తికి స్వాగతం పలుకుతున్న తహసీల్దార్ హరనాథ్

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వై.లక్ష్మణరావు ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తొలుత వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు, వేద పండితులు, ఆలయ పర్యవేక్షకుడు స్వాగతం పలికారు. నాగదేవత పుట్టకు పూజలు చేసి మంగళ హారతులు సమర్పించారు. అనంతరం స్వామికి నిర్వహించే మహాన్యాస రుద్రాభిషేకాల్లో న్యాయమూర్తి దంపతులు పాల్గొన్నారు. వేద మంత్రాలతో పండితులు ఆశీర్వదించారు. స్వామి వారి చిత్రపటాలు, పట్టువస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

✤ పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి.. మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హరనాథ్ ఆమెకు స్వాగతం పలికారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి న్యాయమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది స్వామి వారి చిత్రపటాలు, పట్టువస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నాగదేవత పుట్టలో పాలుపోసి మంగళ హారతి సమర్పిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ లక్ష్మణరావు దంపతులు

బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలే తెదేపా లక్ష్యం

అరండల్‌పేట(గుంటూరు), న్యూస్‌టుడే: బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలే తెదేపా లక్ష్యమని మాజీ మంత్రి, తెదేపా సీనియర్ నాయకుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని వైన్ డీలర్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో బీసీ రాష్ట్ర స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది. మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ దేశం సమగ్రాభివృద్ధి సాధించాలంటే చట్టసభలు, స్థానిక సంస్థల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈడబ్ల్యూఎస్, బీసీల రిజర్వేషన్ల విషయంలో తీర్పులు వేర్వేరుగా ఉండడం విచారకరమని, న్యాయవ్యవస్థలో కూడా రిజర్వేషన్ లేకపోవడమే దీనికి కారణమన్నారు. హక్కుల సాధనకు బీసీ సంఘాల బృందాన్ని ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్తానని పేర్కొన్నారు. అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్‌యాదవ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ రిజర్వేషన్ల సవరణకు, సామాజిక రక్షణ చట్టం అమలుకు, శాఖల వారీగా సబ్‌ప్లాన్ నిధుల కేటాయింపులకు, ప్రత్యేకంగా బీసీల అభివృద్ధికి శాసనసభ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు నేతృత్వంలో బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలతో ఒక ప్రతినిధి బృందాన్ని ప్రధాని మోదీ వద్దకు తీసుకెళ్లి రిజర్వేషన్ల రాజ్యాంగ సవరణకు ఒత్తిడి తేవాలని కోరారు. ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి డాక్టర్ ఏపనగండ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ 63 వేల బీసీ, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు, కెనరా బ్యాంకు ఓబీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సి.బాలకృష్ణ, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓర్సు ప్రేమరాజు మాట్లాడుతూ రిజర్వేషన్ల సాధనకు రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, సంఘాల ప్రతినిధులతో జాతీయ స్థాయి ఐకాస ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రతినిధులు రాజపుత్ర సత్యం సింగ్, కె.గోపికృష్ణ, పి.పద్మజ, సుజాన్‌సింగ్, పేరయ్య, సుబ్బారావు, శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు ఏడుకొండలు, వివిధ సంఘాల నాయకులు సత్యనారాయణ, కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి మాణిక్యవరప్రసాద్, పక్కన అంగిరేకుల వరప్రసాద్‌యాదవ్ తదితరులు

ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

విజయవాడ, న్యూస్‌టుడే: ఆరోగ్య కార్డులపై ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తామని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. ఉద్యోగుల వైద్య సేవలపై ఆదివారం విజయవాడలోని ఎన్జీవో భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల ఆరోగ్య కార్డులకు సంబంధించి 60 రోజుల్లోనే ప్రక్షాళన చేసి, నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా కమిటీ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం సంతోషకరమన్నారు.

పెట్రోల్ పోసుకుని ఎన్ఎస్‌యూఐ నాయకుల ఆత్మహత్యాయత్నం

స్వాతంత్ర్య సమరయోధులను కించపర్చిన నటులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

గాంధీ విగ్రహం వద్ద దీక్షా శిబిరంలో ఒంటిపై పెట్రోలు పోసుకున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధులపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎస్‌యూఐ నాయకులు ఆత్మహత్యాయత్నం చేయడం కలకలం రేపింది. గుంటూరు హిమని సెంటర్ కూడలిలోని గాంధీ బొమ్మ విగ్రహం వద్ద ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆదివారం నిరాహార దీక్ష చేపట్టారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూలను కించపర్చేలా మాట్లాడిన సినీనటులు శ్రేష్టివర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, రాహుల్ రామకృష్ణలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శిబిరంలో కూర్చున్న ఇద్దరు నాయకులు ఒంటిపై పెట్రోల్ పోసుకున్నారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు, పోలీసులకు మధ్య ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆ తర్వాత పరిస్థితి సద్దుమణిగింది.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, రిటైల్ ధర - 148, చికెన్ విత్‌స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్ - 244.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 252 చికెన్ స్కిన్‌లెస్ - 262.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 575 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.96/-.

పరిహారం చెల్లించకుండా ఇళ్లు ఖాళీ చేయమంటే ఎలా?

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని గ్రామం మోదుగలంకపాలెం గ్రామంలోని సర్వే నంబరు 7లో ఆళ్ళ సురేష్ బాబుకు 423 గజాలు, మంచుమర్తి వెంకటేశ్వరరావులకు చెందిన 423 గజాల స్థలం, ఇల్లు ఉంది. ఇంటితో సహా ఆ స్థలం మీదుగా ఈ-4, ఎన్-10 రాజధాని రహదారులు నిర్మించాల్సి ఉంది. రహదారుల నిర్మాణాల్లో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న వారికి సీఆర్డీఏ ప్రకటించిన ఎన్ఎస్‌పీ (నెగోషియేటెడ్ సెటిల్‌మెంట్ పాలసీ) ద్వారా అందించే పరిహారానికి మోదుగలంకపాలెంలో రహదారి నిర్మాణాల్లో ఇళ్లు, స్థలాలు యజమానులు అంగీకారం తెలిపారు. వారికి ఎన్ఎస్‌పీ పాలసీ ప్రకారం నగదు పరిహారం, ప్లాట్లు కేటాయించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం రాజధాని రోడ్డు నిర్మిస్తున్న ఆర్‌వీఆర్ గుత్తేదారు సంస్థకు చెందిన సిబ్బంది వచ్చి సర్వే నెం.7లోని ఇల్లు ఖాళీ చేయాలని చెప్పారని స్థలం యజమానులు తెలిపారు. ఆదివారం మరోసారి కార్మికులు ఇంటి వద్దకు వచ్చి యంత్రాలతో చెట్లు కోసివేయటం ప్రారంభించారు. ఎన్ఎస్‌పీ క్రింద పరిహారం చెల్లించకుండా ఇళ్లు ఎలా తొలగిస్తారంటూ రైతులు అడ్డుకోవటంతో కార్మికులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీనిపై సీఆర్డీఏ తహసీల్దార్ ఫణీంద్రకుమార్‌ను వివరణ అడగగా సర్వే నంబరు 7లో ఈ-4, ఎన్-10 జంక్షన్‌లో ఉన్న ఇళ్లు, స్థలాలకు పరిహారం చెల్లించాల్సి ఉందని తెలిపారు. స్థలం యజమానులకు ఎన్ఎస్‌పీ పరిహారం అందించే వరకు అక్కడ నిర్మాణ పనులు చేపట్టవద్దని గుత్తేదారు సంస్థల ప్రతినిధులకు చెబుతామని వివరణ ఇచ్చారు.

వాహనం ఢీకొని ఒకరి మృతి

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో మృతి చెందిన ఘటనపై ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు. . వేములూరిపాడుకు చెందిన షేక్ అషుదుల్లా(52) కొండ రాళ్లు కొట్టే పని చేస్తుంటారు. ఇంటి దగ్గర ప్రహరీ నిర్మాణ పని నిమిత్తం శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చారు. ఈ క్రమంలో ఫిరంగిపురం శివారులో ఆయన్ను వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. తీవ్ర గాయాలు కావడంతో అషుదుల్లా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూప్, VJA, వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/ వంట, బేబికేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 95537 86677/96404 96677.

REAL ESTATE

HOUSE FOR SALE

GENERAL

గుంటూరు సిటీ SVNకాలనీ నందనవనంలో 466గ॥ ఇల్లు పడమర,దక్షిణం రోడ్లతో అమ్మకానికి కలదు. నోబ్రోకర్స్, డైరెక్ట్ 9849502430, 8341342696.

TO LET

COMMERCIAL

బాపట్ల జిల్లా, నగరం నందు శ్రీకృష్ణ మందిరం దగ్గర వ్యాపారసంస్థలకు దక్షిణముఖ 229 చ॥గ॥లో 2 స్టేర్ హౌస్ (1300 Sft) అద్దెకు. ✆ 94908 48822.

JOBS

Immediate openings for Customer Service Executive & Branch Manager Positions in Cherukuri Group, Located in Eluru, Tanuku, Guntur & Vijayawada. Qual: Min Inter. ✆ 9885206666, E-mail: hr@cherukurigroup.org.

Wanted female nurse for home patient. Exp: BSc nursing & food and Nutrition. Timings: morning 6am to 6pm pls send ur Biodata with photo to following mail ID (staffbala5@gmail.com)

Sri Balaji Hospitals required HR manager, pharmacy sales executive, tally operator. Experience 2 years. Ph: 83095 46242.

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్ HDFC/ AXIS బ్యాంక్, క్లర్క్,లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆ 82976 75825.

WANTED
HDFC BANK కొరకు
గుంటూరు & ప్రకాశంజిల్లాలో పనిచేయుటకు
కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
DRA సర్టిఫికేట్ కలిగినవారికి తొలి ప్రాధాన్యత. వెంటనే సంప్రదించండి.
లలితా ఫైనాన్స్ లింక్స్
కాంగ్రెస్ ఆఫీస్ రోడ్, విజయవాడ.
✆9951001348

7 HILLS ఆఫీస్ నందు కంప్యూటర్ ఆపరేటర్-1, Tallyఅకౌంటెంట్-1, స్టాఫ్(Female) కావలెను. 35 సం॥లోపు. భారత్‌పేట, గుంటూరు. 72888 77785.

చైతన్య సాయి పేపర్‌మిల్స్ గుంటూరు ఆఫీస్ నందు పనిచేయుటకు అనుభవమున్న సీనియర్ అకౌంటెంట్ మరియు యడవల్లి నందు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 90595 14555.

సెక్యూరిటీ గార్డులు చందోలులో పనిచేయుటకు కావలెను వ॥ 40Y, చదువు: 10th, డ్యూటి : 12 గం॥, జీతం: 16,800/-. ✆ 95506 06916.

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5 % జి.ఎస్.టి. అదనం

బెన్ ఎలక్ట్రిక్‌బైక్ షోరూమ్ గుంటూరులో పనిచేయుటకు ★సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ ★ టెక్నీషియన్స్ **కావలెను.** అనుభవం గలవారు సంప్రదించండి. ✆ 99516 66619

హైదరాబాద్ హోంకేర్‌లో ఏజెంట్లకు మంచి అవకాశం. వర్కర్స్‌ని పంపితే ప్రతినెలా 2వేలు కమీషన్. వర్కర్స్ జీ: 18k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 89775 47749.

పబ్లికేషన్స్ బుక్‌వర్క్‌లో 2 సం॥ల పైబడి అనుభవం కల్గిన పేజ్‌మేకర్, ఇన్ డిజైన్ వచ్చిన "ఆపరేటర్లు" కావలెను. అ॥జీతం. ✆ 74169 52459.

R.K ఇంజనీరింగ్ కాలేజీ నందు పనిచేయుటకు ఎలక్ట్రీషియన్స్ కావలెను. అనుభవమును బట్టి జీతం+భోజనం+ఉచిత వసతి కల్పించబడును. కేతనకొండ, ఇబ్రహీంపట్నం మండలం, విజయవాడ, 97014 73399.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
80080 03297

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

తెనాలి
• తెనాలి • పొన్నూరు

అదుపు తప్పితే అంతే సంగతి

మండల పరిధిలోని చింతలపూడి నుంచి వడ్డిముక్కలకు వెళ్లే మార్గంలో మురుగు నీటి కాలువ వద్ద రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎటువంటి ప్రమాదం జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, పొన్నూరు

వడ్డిముక్కల రహదారిలో వంతెన వద్ద కోతకు గురైన రహదారి

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

పట్టణ పరిధిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలోని లక్ష్మి, పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. - న్యూస్‌టుడే, పొన్నూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పొన్నూరు పట్టణ పరిధిలోని 6వ వార్డులో ప్రధాన రహదారిలో వీధి దీపం వెలగడం లేదు. -ఎ.భాస్కర్, 6వ వార్డు.

✔ బాగు చేయించడానికి చర్యలు తీసుకుంటా. -షేక్ హసీనా, పురపాలక సంఘం సహాయ ఇంజినీరు.

? పొన్నూరు పట్టణ పరిధిలోని 19వ వార్డు శివారులో చెత్త పేరుకుపోయింది. - ఎం.నారాయణరావు, 19వ వార్డు.

✔ చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటా. - శ్రీనివాసులు, ప్రజారోగ్యశాఖాధికారి.

✦ మేమున్నాం...మీకు తోడుగా శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పట్టణ పరిధిలోని విద్యానగర్‌లోని మురుగునీటి కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను కార్మికులు తొలగించారు. - న్యూస్‌టుడే, పొన్నూరు

స్పందనకు వందనం

ఆదమరిచి ఉంటే అంతే సంగతులు

✦ నాలుగు సవర్ల బంగారు గొలుసు, రూ.50 వేల నగదు ఉన్న సంచితో గత నెల 6న తెనాలి బస్టాండ్‌లో విజయవాడ బస్సు ఎక్కిన ప్రయాణికులు తమ గమ్యస్థానం చేరిన తర్వాత చూసుకుంటే ఆ సంచి లేదు.

✦ గత నెల 8న బంగారు నగల సంచితో విజయవాడ నుంచి తెనాలి బస్సు ఎక్కిన ఒక పెద్దాయన గమ్యస్థానం వచ్చిన తర్వాత పరిశీలిస్తే సంచి మాయమైంది.

విచారణ కేంద్రం వద్ద ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని ప్రకటిస్తున్న సిబ్బంది

తెనాలి టౌన్, న్యూస్‌టుడే

తెనాలి బస్టాండ్ 8 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇక్కడి నుంచి రోజూ 106 సర్వీసుల ద్వారా సుమారు 40 వేల మంది ప్రయాణిస్తున్నారు. ఈ ప్రాంగణం ఎంత రద్దీగా ఉంటుందో ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. బస్టాండులో వేచి ఉన్నప్పుడు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న సమయంలో చోరీలు ఇటీవలి కాలంలో పెరిగాయి. ఎక్కువగా బంగారం, డబ్బు పోతుండగా సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నవారూ ఉన్నారు. బస్టాండ్‌లో కూర్చున్న సమయంలో, రద్దీగా ఉన్న బస్సు ఎక్కే వేళ, బస్సు లోపల ఈ మూడు సందర్భాల్లో చోరీ ఎక్కడైనా జరిగే ప్రమాదముంది. బంగారం, నగదుతో ఉన్న బ్యాగును నిర్లక్ష్యంగా పైన పెట్టడం, అందరి ముందూ కంగారు పడుతూ ఒకటికి నాలుగు సార్లు బంగారు వస్తువులను చూసుకోవడం, బస్సు లోపల ఇతరులతో మాట్లాడుతూ పరధ్యానంగా ఉండడం, సెల్‌ఫోనులో మునిగిపోవడం వస్తువులు పోగొట్టుకోవడానికి కారణాలుగా అధికారులు అభిప్రాయపడుతున్నారు. వెనుక జేబులో సెల్‌ఫోను పెట్టుకుంటే బస్సు ఎక్కేటప్పుడు ఎలాంటి హడావుడీ లేకుండా చోరీ చేసేస్తారని తెలిపారు. ప్రయాణికులు ఇలాంటి అలవాట్లపై జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

ప్రతి 15 నిమిషాలకు సూచన చేస్తున్నాం

ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని విచారణ కేంద్రం నుంచి ప్రతి 15 నిమిషాలకోసారి అనౌన్స్ చేస్తున్నాం. రద్దీ సమయాల్లో నాతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది బస్టాండ్ ప్రాంగణంలోనే ఉండి పర్యవేక్షిస్తున్నారు. పోలీస్ పహారానూ కోరాం. భద్రతపరంగా మరిన్ని చర్యలు తీసుకుంటాం. ప్రయాణికులు అప్రమత్తంగా ఉంటే ఈ చోరీలకు అడ్డుకట్ట వేయవచ్చు. - రాజశేఖర్, తెనాలి ఆర్టీసీ డిపో మేనేజర్

పూజా విధానం గురించి వివరిస్తున్న అర్చకుడు, పూజలో పాల్గొన్న దంపతులు

వేడుకగా సత్యనారాయణ వ్రతం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: స్థానిక శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతంలో 175 మంది దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కన్నుల పండగగా జరిగిన కార్యక్రమాన్ని ఛైర్మన్ కె.సాయిబాబు, ఈవో వి.అనుపమ పర్యవేక్షించారు.

మాట్లాడుతున్న మంత్రి మనోహర్

యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలి: మంత్రి నాదెండ్ల

తెనాలి (కొత్తపేట): కొత్త నైపుణ్యాలను పెంపొందించుకొని ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలని గౌడ యువతకు పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. ఆదివారం తెనాలి వైకుంఠపురి సన్నిధిలో నిర్వహించిన గౌడ సంఘీయుల కార్తిక వనసమారాధనలో ఆయన పాల్గొన్నారు. ఉద్యాన పంటల సాగులో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, వ్యాపారాలు చేసుకోవటానికి తగిన ప్రాధాన్యం కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు. కల్లు గీత కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావటానికి ప్రభుత్వం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు తుళ్లూరు శ్రీనివాసరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు పాల్గొన్నారు.

రౌడీయిజం చేస్తే కఠిన చర్యలు

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సాంబశివరావు, ఎస్సైలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మద్యం తాగి గొడవలు చేయడం, ఇరుగుపొరుగు వారిని ఇబ్బంది పెట్టడం వంటి పనులు చేస్తే కఠిన చర్యలు తప్పవని త్రీ టౌన్ సీఐ సాంబశివరావు హెచ్చరించారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో ఆదివారం ఆయన రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వారిపై నమోదైన కేసులు, ప్రస్తుతం చేస్తున్న పనులు, ప్రవర్తనా తీరులను వ్యక్తుల వారీగా విశ్లేషించారు. నిరంతర నిఘా కొనసాగుతుందని, సత్ ప్రవర్తనను కొనసాగిస్తే రౌడీషీట్లు మూసేయాలని దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ఎస్సైలు కరీముల్లా, ప్రకాశరావు, సిబ్బంది ఉన్నారు.

బియ్యం అక్రమ రవాణాదారులపై సస్పెక్ట్ షీట్లు: రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేయడం, అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలతో పాటు సస్పెక్ట్ షీట్లు తెరుస్తామని సీఐ సాంబశివరావు స్పష్టం చేశారు. గతంలో కేసులు నమోదైన వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

యువత సేవలు స్ఫూర్తిదాయకం

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: సమాజానికి సేవలందిస్తూ స్ఫూర్తిని పంచుతున్న యువత అభినందనీయులని సెర్ప్ బాపట్ల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కొత్తపల్లి రవీంద్ర బాబు పేర్కొన్నారు. తెనాలి మండలం కొలకలూరులో ఆదివారం విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మంచికలపూడి దానియేలు స్మారకంగా సహాయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెవి, ముక్కు, గొంతు ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సీనియర్ వైద్యులు డాక్టర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొని వైద్య సేవలు అందించగా, ట్రస్ట్ ఛైర్మన్ అనుపమ్ పర్యవేక్షించారు. కే.బేబీపాల్, నలుకుర్తి విమలమ్మ శిబిర నిర్వహణకు చేయూత ఇచ్చారు. వైద్య శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

నంబూరు (పెదకాకాని), న్యూస్‌టుడే: నంబూరులోని నాగారప్పమ్మ ఆలయం వద్ద ఆదివారం ఆర్‌ఆర్ యూత్ ఆధ్వర్యంలో వాసన్ ఐకేర్, కోస్టల్ కేర్, వారాహి డెంటల్, శ్రీ ఆసుపత్రుల వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన వచ్చినట్లు నిర్వాహకులు చెప్పారు. వందల మంది రోగులకు ఎముకలు, దంత, గుండె, సాధారణ సమస్యలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు డి.వంశీకృష్ణ, మోహనరావు, నారాయణరెడ్డి, రూప, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కార్తిక దీపోత్సవం

పెదకాకాని మల్లేశ్వరస్వామి

పెదకాకాని, న్యూస్‌టుడే: దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో కార్తికమాసాన్ని పురస్కరించుకొని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దీపారాధన పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ఆలయంలోని యజ్ఞాల బావి వద్ద పుణ్య స్నానం ఆచరించి ప్రాంగణంలో దీపాలు వెలిగించారు. భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు. క్యూలైన్లో ఉన్న భక్తులకు సిబ్బంది ఉచితంగా తాగు నీరు, పాలు, మజ్జిగ పంపిణీ చేశారు. వివిధ సేవా టికెట్ల రూపంలో ఒక్క రోజులో రూ.6.5 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈవో గోగినేని లీలాకుమార్ తెలిపారు. సీఐ నారాయణస్వామి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

దీపారాధన చేస్తున్న భక్తులు

శలపాడు (చేబ్రోలు): మండలంలోని శలపాడులో గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కార్తిక దీపోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దీపాలు వెలిగించి ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారిని దర్శించుకున్నారు.



శలపాడులో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఉద్యోగికి ముఖ్యమంత్రి అభినందన

మొన్నటి తుపాను సమయంలో మెరుగైన పనితీరు, సేవలు అందించినందుకు కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం సచివాలయం గ్రామ ఉద్యానవన విభాగ సహాయకురాలు వి.శిరీషను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించి జ్ఞాపిక, ధ్రువపత్రం అందించారు. ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఈ కార్యక్రమం జరిగిందని ఎంపీడీవో విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. - న్యూస్‌టుడే, కొల్లిపర

ప్రయాణంలో జాగ్రత్తలపై అవగాహన

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి నుంచి హైదరాబాద్, బెంగళూరు, విశాఖ, తిరుపతి తదితర దూర ప్రాంతాలకు వెళుతున్న ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులకు అవగాహన కలిగిస్తున్నారు. అత్యవసర, ఇబ్బందికర సమయాల్లో బస్సు నుంచి బయటకు రావడానికి ఏ విధంగా స్పందించాలో చెబుతున్నారు.

ఆదివారం రాత్రి హైదరాబాద్ వెళుతున్న ఇంద్ర బస్సులో అవగాహన కలిగిస్తున్న డ్రైవర్ సత్యనారాయణ

రోడ్లపైనే పశువులు

తెనాలిలోని రద్దీ కూడళ్లలో ఆవులు, ఇతర పశువులు గుంపులుగా సంచరించడం, రోడ్లపైనే ఉండిపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఒక్కోసారి ఇవి ఆకస్మికంగా వాహన చోదకులపై దాడులు చేస్తున్నాయి. ప్రజలు ఈ సమస్య గురించి అధికారులకు చెప్పినప్పుడల్లా వారు పశువుల యజమానులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తున్నారు. తర్వాత మళ్లీ మామూలే. శివాజీ చౌక్ నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో పరిస్థితిని చిత్రంలో చూడవచ్చు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

భారీ తెరపై మహిళల క్రికెట్ మ్యాచ్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: భారత్, దక్షిణాఫ్రికాల నడుమ ఆదివారం జరిగిన మహిళల ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌ను తెనాలిలో భారీ తెరపై ప్రదర్శించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని తెదేపా నాయకులు పర్యవేక్షించారు.

వీధి దీపాలు వెలగక ఇబ్బందులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి సుల్తానాబాద్ సుందరయ్యనగర్‌లో వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో ఆరు వీధి దీపాలు ఉండగా కొన్ని రోజులుగా ఒక్కటీ వెలగడం లేదని చెబుతున్నారు. శివారు ప్రాంతం అయినందున సాయంత్రం అయితే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

మురుగు అవస్థలు తీర్చరూ

పట్టణంలోని పెమ్మసాని పెట్రోలు బంకు వెనుక ఖాళీ స్థలంలో మురుగు నీరు నిలిచిపోయింది. దీంతో టీబీ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దోమలు, విష పురుగుల సంచారం పెరిగింది. ఈ మురుగును ఆర్ అండ్ బీ రోడ్డు పక్కనున్న కాలువలోకి మళ్లించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తెనాలి (కొత్తపేట)



డాక్టర్ మహితను సత్కరిస్తున్న ఉమామహేశ్వర్, క్లబ్ ప్రతినిధులు

దీర్ఘకాలిక సమస్యలకు ఆయుర్వేదంతో పరిష్కారం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు ఆయుర్వేదం సహజ పరిష్కారాలను ఇస్తుందని ఆయుర్వేద నిపుణులు డాక్టర్ జె.మహిత తెలిపారు. వాకర్స్ క్లబ్ తెనాలి-2 ఆధ్వర్యంలో ఆదివారం చెంచుపేటలో నిర్వహించిన ఆయుర్వేద వైద్యం, అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. వంటింట్లో ఉండే వస్తువుల్లో లభించే ఔషధ గుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మితాహారం, సీజనల్ ఆహారం, ధ్యానం, యోగ వంటి అంశాలు వృద్ధాప్యంలో వచ్చే ఆరోగ్య సమస్యలను అదుపులో ఉంచుతాయని వివరించారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించిన క్లబ్ అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ మాట్లాడుతూ నడక ఆయుర్వేద వైద్యంలో ఒక భాగమని, ఆ అలవాటును రోజూ ఆచరించాలని సూచించారు. క్లబ్ సభ్యులు ఆనందరావు, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత సదస్సుకు హాజరైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఔషధాలు అందించారు.

బ్రాహ్మణులు వ్యాపారాల్లోకి రావాలి

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: బ్రాహ్మణులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి వ్యాపారాలు పట్టుకొమ్మలని బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ కె.బుచ్చిరాంప్రసాద్ అన్నారు. ఆదివారం బ్రాహ్మణ పరిషత్ తెనాలిశాఖ ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌ఐ కళాగంటల సహకారంతో నిర్వహించిన బ్రాహ్మణ కార్తిక వన సమారాధనలో పాల్గొన్నారు. దేవాదాయశాఖకు చెందిన 5,800 ఆలయాల ట్రస్టు బోర్డుల్లో సభ్యునిగా ఒక బ్రాహ్మణుణ్ని నియమించేలా ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చిందని ఆయన గుర్తు చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బ్రాహ్మణులకు ఇరువురికి కౌన్సిలర్లుగా అవకాశం కల్పించాలని మంత్రి మనోహర్, ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్‌లను కోరతానని చెప్పారు. వ్యాపార రంగంలో మంచి అవకాశాలు ఉన్నాయని, బ్రాహ్మణులు ముందుకు రావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పరిషత్ సభ్యులు బుచ్చిరాంప్రసాద్‌ను సత్కరించారు.

ఛైర్మన్ బుచ్చిరాంప్రసాద్‌ను సత్కరిస్తున్న బ్రాహ్మణ పరిషత్ తెనాలిశాఖ ప్రతినిధులు, సభ్యులు

5న సినీ సంగీత విభావరి

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రావిపాటి వీరనారాయణరావు, ఇతర ప్రతినిధులు

తెనాలి టౌన్: ప్రముఖ సంగీత దర్శకులు సాలూరి రాజేశ్వరరావు జయంతి సందర్భంగా ఈ నెల 5న సినీ సంగీత విభావరి ఏర్పాటు చేస్తున్నట్లు తెనాలి కల్చరల్ ఫిలిం సొసైటీ అధ్యక్షుడు రావిపాటి వీరనారాయణరావు తెలిపారు. పట్టణ నాజరుపేటలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రం వేదికగా సాయంత్రం 5 గంటలకు సంగీత దర్శకులు సాలూరి వాసూరావు సారథ్యంలో సంగీత విభావరి జరుగుతుందని తెలిపారు. సంగీత ప్రియులు వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

బాధితుడికి రూ.55 వేల సాయం

విజయవాడలో కానిస్టేబుల్ దాడి చేయడంతో కన్ను పోగొట్టుకున్న జాయ్ బాబుకు మాదిగ అభివృద్ధి సంక్షేమ సంఘం అండగా ఉంటుందని సంఘ వ్యవస్థాపకుడు సుద్దపల్లి నాగరాజు పేర్కొన్నారు. పట్టణంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం జాయ్‌బాబుకు రూ.55 వేల ఆర్థిక సాయం అందించారు. ఇందుకు సహకరించిన అక్బర్, సాయిగోపి, మోహన్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఘటనకు కారణమైన కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

ఏడుగురు జూదరుల అరెస్ట్

పెదకాకాని, న్యూస్‌టుడే: జూదమాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు పెదకాకాని సీఐ నారాయణస్వామి ఆదివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నంబూరు శివారులోని ముస్తఫా పొగాకు కంపెనీ వద్ద కొందరు జూదం ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో వెళ్లి ఏడుగురిని అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి రూ.5,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

వ్యభిచార గృహంపై దాడి

తెనాలి టౌన్: కఠెవరం గ్రామంలోని ఒక ఇంటిలో వ్యభిచారం జరుగుతుందన్న సమాచారంతో తెనాలి గ్రామీణ పోలీసులు ఆదివారం దాడి చేశారు. నిర్వాహకులైన దంపతులు, మరో మహిళను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం ధ్వంసంపై ఫిర్యాదు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేసిన ఘటనలో కేసు నమోదైనట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన కథనం ప్రకారం.. తెనాలి పట్టణ ఐతానగర్‌కు చెందిన భాగ్యరాజు తన ద్విచక్ర వాహనం నుంచి తరుచుగా పెట్రోల్ చోరీ అవుతూ ఉండటంతో స్థానిక యువకుణ్ని ఈ విషయంపై ఆరా తీశారు. ఆ యువకుడు విషయాన్ని అక్షయ్ అనే స్నేహితుడికి చెప్పడంతో అతడు కర్రతో ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేయడంతో పాటు భాగ్యరాజుపై దౌర్జన్యం చేశాడు. బాధితుడు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

కదళీ ఫలానికి కలిసొచ్చిన కార్తిక మాసం

కొల్లిపర, న్యూస్‌టుడే

మార్కెట్‌లో అరటిగెలలు

కదళీఫలం (అరటి) సాగు చేపట్టిన రైతులకు కార్తిక మాసం కలిసొచ్చింది. కొల్లిపరలో అరటి మార్కెట్లు గెలలతో కళకళలాడుతున్నాయి. పర్వదినాలు కావడంతో అరటి పళ్లకు డిమాండ్ పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. కర్పూరం, చక్రకేళి, అమృతపాణి, కూర అరటికి మంచి ధర వస్తోంది.

అరటిరకం (1 గెల)	కనిష్ఠం (రూ.ల్లో)	గరిష్ఠం (రూ.ల్లో)
కర్పూర	150	410
అమృతపాణి	160	420
చక్రకేళి	175	375
కూరఅరటి	100	160

ఎగుమతులు: కొల్లిపర నుంచి నిత్యం పొన్నూరు, చీరాల, బాపట్ల, పెడన, మచిలీపట్నం, కాకాని, గుంటూరు తదితర ప్రాంతాలకు అరటి గెలల ఎగుమతులు జరుగుతున్నాయి. రోజుకు 1,000 నుంచి 2,500 గెలలను వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఆర్టీసీలో ఉద్యోగ విరమణ చేసిన వారి బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘ నాయకుడు వి.రామారావు డిమాండ్ చేశారు. తెనాలిలోని సంఘ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ అంశంపై తాము పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరికీ కుటుంబ సమస్యలు, ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఉన్నాయని, బకాయిల కోసం ఎదురు చూస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ సమస్యను పరిష్కరించాలని, లేకుంటే తదుపరి కార్యాచరణ చేపడతామని స్పష్టం చేశారు

నష్ట నమోదును ఇంకా ఎందుకు ప్రారంభించలేదు?

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తుపాను వెళ్లి రోజులు గడుస్తున్నా ఇంకా పంట నష్ట నమోదు ప్రక్రియను ప్రారంభించకపోవడంలో ఆంతర్యమేమిటని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ప్రశ్నించారు. ఆయన ఆదివారం ఇతర ప్రతినిధులతో కలిసి తెనాలి మండలం నేలపాడు, కంచర్లపాలెం తదితర గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బోస్ రోడ్డు బ్రాంచ్-20349, తెనాలి, గుంటూరు జిల్లా-522201, ఆంధ్రప్రదేశ్

స్వాధీనత ప్రకటన

(APPENDIX-IV) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002

రూల్ 8(1) ననుసరించి (స్థిరాస్థి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బోస్ రోడ్డు బ్రాంచ్, తెనాలి, గుంటూరు జిల్లా** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13(12) కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో సదరు నోటీసు తేది నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొనబడిన బకాయి **తేది.19.08.2025** నాటికి HTL A/c : **62272055742; 41136523078 & 40613213948** కొరకు **రూ.23,94,212/-** (అక్షరాల ఇరవై మూడు లక్షల తొంభై నాలుగు వేల రెండు వందల పన్నెండు రూపాయలు మాత్రమే) కాంట్రాక్టువల్ రేటు ప్రకారం వడ్డీతో ఖర్చులు, ఛార్జీలు మొ॥నవి సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా **ఋణగ్రహీత : శ్రీమతి మేకల లక్ష్మి కరుణ కుమారి, భర్త : అద్దేపల్లి శ్యామ్‌దాస్ బిల్లి గ్రహం, డి నెం.15-8/2,** కోనేటిపురం గ్రామం, కొలకలూరు పోస్ట్, తెనాలి మండలం, గుంటూరు జిల్లా-522307 వారిని కోరుతూ **తేది.19.08.2025 న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత మరియు హామీదారు సదరు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టం, 2002 సందలి రూల్ 8 & 9 ప్రకారం దిగువ వివరించిన ఆస్తిని తేది **30.10.2025** న **లాంఛనాత్మకంగా స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీత/హామీదారు & ప్రజానీకమునకు ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

ఋణగ్రహీత/హామీదారు మరియు యావన్మంది సాధారణ ప్రజానీకమును ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తితో జరిపే ఏ లావాదేవీలైనా **తేది.19.08.2025 నాటికి రూ.23,94,212/- (అక్షరాల ఇరవై మూడు లక్షల తొంభై నాలుగు వేల రెండు వందల పన్నెండు రూపాయలు మాత్రమే)** తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మొ॥నవి **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బోస్ రోడ్డు బ్రాంచ్, తెనాలి, గుంటూరు జిల్లా** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

చట్టం యొక్క సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారము ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడమునకై శ్రద్ధ వహించవలెను.

స్థిరాస్తి వివరములు

గుంటూరు జిల్లా, దుగ్గిరాల సబ్ డివిజన్, కొలకలూరు గ్రామ పంచాయితీ ఏరియా, కొలకలూరు గ్రామం, డి నెం.868 ఉమ్మడి నడవ పట్ట ఉత్తరం వైపున డోర్ నెం.15-8/2, ఆంజనేయ స్వామి గుడి దగ్గర విస్తీర్ణం 461 ½ చ॥గ॥లు (427 ½ చ॥గ॥లు + 34 చ॥గ॥లు)లోని 2 ఐటమ్స్ మరియు నిర్మించబడిన ఆర్‌సిసి రూఫ్ భవనం రిజిష్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ **నెం.429/2013, తేది.26.02.2013** ప్రకారం **శ్రీమతి మేకల లక్ష్మి కరుణ కుమారి, భర్త : అద్దేపల్లి శ్యామ్‌దాస్ బిల్లి గ్రహం** గారికి చెందినది. **ఐటమ్ నెం.1 విస్తీర్ణం - 421½ చ॥గ॥లు హద్దులు : తూర్పు :** కోనేటిపురం శ్రీ ఆంజనేయ స్వామి గుడి యొక్క ఆస్తి - 79 లింకులు, **దక్షిణం :** ఓలేటి సౌభాగ్యమ్మ గారి ఆస్తి - 113 లింకులు, **పడమర :** ఆర్‌సిఎం స్కూల్ యొక్క ఆస్తి - 79 లింకులు, **ఉత్తరం :** పసుపులేటి రాజేష్ గారి ఆస్తి కొంతవరకు & ఐటమ్-2 యొక్క ఆస్తి కొంతవరకు - 110.50 లింకులు. **ఐటమ్ నెం.2 విస్తీర్ణం - 34 చ॥గ॥లు హద్దులు : తూర్పు :** 14 అ॥ల వెడల్పు గల ఉమ్మడి నడవ, కోనేటిపురం శ్రీ ఆంజనేయ స్వామి గుడి యొక్క ఆస్తి, **దక్షిణం :** ఐటమ్ నెం.1 ఆస్తి, **పడమర :** పసుపులేటి రాజేష్ గారి ఆస్తి, **ఉత్తరం :** బద్దుల మహేశ్వర రావు గారి ఆస్తి.

పైన పేర్కొన్న 2 ఐటమ్స్ క్రింద ఆస్తి ఒకదానికొకటి ప్రక్కనే కలదు, మొత్తం 461 ½ చ॥గ॥ల స్థలం మరియు RCC రూఫ్ రెసిడెన్షియల్ భవనంతో గల ఒకే ప్లాట్ కలదు.

తేది : 30.10.2025 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : తెనాలి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

రాజధాని రైతుల సమస్యలు పరిష్కరించండి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: రాజధాని ప్రాంతంలో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటికీ పరిష్కారం చూపించాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు. క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, జాయింట్ కమిషనర్ భార్గవ్‌తేజలతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాజధాని రైతుల సమస్యలపై కేంద్ర మంత్రి అధికారులతో చర్చించారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్, వీధి పోట్లు, గ్రామకంఠం, అసైన్డ్ ల్యాండ్, భూసేకరణ, లేఅవుట్ డెవలప్‌మెంట్ సమస్యలపై జాబితాను సిద్ధం చేయాల్సి ఉందని పెమ్మసాని అన్నారు. మంత్రి నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌తో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కారం చూపాలన్నారు. రాజధానిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు, ఉద్యోగుల క్వార్టర్లు, విదేశీ భవన్, పెండింగ్ అంశాలు ఉంటే జాబితా ఇవ్వాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? ఎర్రబాలెం రైస్ మిల్లు బజారులో పంచాయతీ బావి రోడ్డులో వర్షపు నీరు నిలబడి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. నీటిని తొలగించాలి. - **రామకృష్ణ చైతన్య, ఎర్రబాలెం**

✓ సచివాలయ సిబ్బందిని పంపి అక్కడ పరిస్థితిని పరిశీలించి సమస్య పరిష్కారం చేస్తాం. - **అలీబాషా, నగరపాలక కమిషనర్, మంగళగిరి** - **న్యూస్‌టుడే, మంగళగిరి**

నూతన కార్యవర్గం ఎన్నిక

మంగళగిరి గ్రామీణం: మంగళగిరిలోని ఏసీ పోర్ట్ వర్కర్స్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆళ్ల కృష్ణ, గౌరవాధ్యక్షుడిగా పుప్పాల కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఆలేటి పూర్ణ, చంద్రబోస్ వెంకట దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా శంకర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

మహిళా క్రికెట్ ప్రపంచ కప్ సందడి

మంత్రి నారా లోకేశ్ సహకారంతో ఎల్‌ఈడీ స్క్రీన్లు

మంగళగిరి, న్యూస్‌టుడే: మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్ క్రికెట్ మ్యాచ్ తిలకించేందుకు మంత్రి నారా లోకేశ్ సహకారంతో మంగళగిరిలో ఎల్‌ఈడీ స్క్రీన్లు కలిగిన ప్రత్యేక వాహనాలను తెదేపా ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. దక్షిణాఫ్రికాపై భారత జట్టు విజయం సాధించడంతో యువత సంబరాలు చేసుకున్నారు.

టిడ్కో గృహ సముదాయం వద్ద ప్రత్యేక వాహనంపై ఏర్పాటు చేసిన తెర

భారత్ గెలవాలని పూజలు

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్ గెలవాలని కోరుతూ మంగళగిరిలో తెలుగు మహిళలు పానకాల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారత్ - దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న వన్డే ఫైనల్ మ్యాచ్‌లో ఇండియా విజయం సాధించాలని ప్రార్థించారు. తితిదే పాలకవర్గ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి, పట్టణ అధ్యక్షురాలు ఊట్ల దుర్గామల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నృసింహుని ఆలయ ప్రాంగణంలో తెలుగు మహిళలు

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఫౌండేషన్‌కు సీఎం ప్రశంస

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: మొంథా తుపాన్ ప్రభావిత ప్రాంతాలకు ఆహారాన్ని పంపిణీ చేసి సేవలందించినందుకు తాడేపల్లి మండలం కొలనుకొండ వద్ద ఉన్న హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. శనివారం సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షుడు వంశీధరదాసకు ప్రశంసాపత్రాన్ని సీఎం అందజేశారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, కోనసీమ జిల్లాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లోని బాధితులకు ఆ ఫౌండేషన్ నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించినట్లు ఆ సంస్థ ఉపాధ్యక్షుడు విలాస విగ్రహదాస, పీఆర్వో రఘునందనదాస తెలిపారు.


సీఎం చంద్రబాబు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న వంశీధరదాస

శివ భక్త బృందం అన్నదానం

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి శివాలయం వద్ద ఆదివారం శివభక్త బృందం ఆధ్వర్యాన అన్నదానం నిర్వహించారు. ప్రతి నెలా అమావాస్యకు ముందు వచ్చే ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నిర్వహించిన అన్నదానాన్ని మార్కెట్ యార్డు మాజీ ఉపాధ్యక్షుడు మన్నెం రమేష్‌బాబు, భక్తులు సహకారంతో అన్నదానం గత 34 ఏళ్లుగా నిర్వహిస్తున్న రామాంజనేయులు, శివాలయం పాలకవర్గ అధ్యక్షుడు బోగి కోటేశ్వరరావు, భక్తబృందం ప్రతినిధులు కృష్ణారెడ్డి, కదం రాంబాబు, గుండా రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిండా ముంచి.. అవస్థలు మిగిల్చి..

మొంథా తుపాను ప్రభావంతో పత్తి రైతులు విలవిల

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే

మొంథా తుపాను పత్తి రైతులను నిండా ముంచింది. వట్టిచెరుకూరు మండలంలోని గ్రామాలలో పత్తి పంట సాగు చేసిన రైతుల స్థితి దయనీయంగా మారింది. ఇక్కడ రైతులు ఎకరాకు రూ.40 వేల పెట్టుబడితో సుమారు 3,500 ఎకరాల్లో పత్తి పండించారు. కొద్ది పంట చేతికి అందుతుందనుకున్న సమయంలో వచ్చిన మొంథా తుపాను నష్టాన్ని మిగిల్చింది. ఈదురు గాలులకు మొక్కకు 25 నుంచి 40 కాయలు వరకు చెట్ల నుంచి జారి నేల పాలయ్యాయి. పగిలిన పత్తి పంట కూడా నీటి పాలైంది. పలు చోట్ల పంట సిద్ధంగా ఉన్నా కొనేందుకు వ్యాపారులు ఆసక్తి కనబరచడం లేదని, పత్తి తడిసిందంటూ తక్కువ ధరకు అడుగుతున్నారని పలువురు రైతులు చెబుతున్నారు.

కొర్నెపాడు సమీపంలో పత్తి చేలో నిలిచిన నీరు

చిత్తడిగా చేలు..

కొర్నెపాడు, చింతపల్లిపాడు, పుల్లడిగుంట, వింజనంపాడు, గారపాడు, చమళ్లమూడి, అనంతవరప్పాడు, లేమల్లెపాడు గ్రామాలలో పత్తి పంట తీవ్రంగా దెబ్బతింది. ఇంకా పంట నేలలు చిత్తడిగానే దర్శనమిస్తున్నాయి. ఎకరాకు రూ.40 వేల పెట్టుబడి పెట్టామని, ఇప్పుడు కనీసం ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని కర్షకులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి సాయం అందించాలని వారు కోరుతున్నారు.

ఉద్ధృతంగా వాగులు..

పంట పొలాలను ఇంకా వరద నీరు పూర్తిగా వీడలేదు. మరోపక్క నక్కవాగు, కొండవాగు, జల్లవాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ ప్రభావం మొక్కల ఎదుగుదలపై పడింది. వాగులో పూడిక తీయిస్తేనే ప్రయోజనం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టాను..

రూ. రెండు లక్షల పెట్టుబడితో నాలుగు ఎకరాల్లో పత్తిపైరు సాగు చేశాను. పత్తి తీసి సీసీఐకి వెళ్దామనుకుంటున్న తరుణంలో తుపాను వచ్చింది. కష్టం నీటిలోనే కరిగిపోయింది. పత్తి అంతా నేలపై పడిపోయింది. ఇప్పుడు పత్తి తీత చేపడితే క్వింటాలుకు రూ.3 వేలు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. **-మన్నవ సుబ్బారావు, రైతు, కొర్నెపాడు**

నష్ట వివరాల సేకరణ..

'33 శాతం కన్నా ఎక్కువగా పత్తికి నష్టం జరిగిన గ్రామాల్లో రైతుల వివరాలు సేకరిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నష్ట పరిహారం ఉంటుంది' అని మండల వ్యవసాయశాఖ అధికారి సునీత తెలిపారు.

గండి పూడ్చండి సారూ..

తాడేపల్లి, న్యూస్‌టుడే: వడ్డేశ్వరం, గుండిమెడ మధ్య రహదారికి కొట్టిన గండి పూడ్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం స్థానిక నాయకులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. వర్షాలు వచ్చినప్పుడల్లా రహదారికి గండి కొట్టడం వల్ల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయన్నారు. ముంపు నివారణకు సిమెంటు తూములు ఏర్పాటు చేసి కల్వర్టు నిర్మించాలని కోరారు. గత 40 రోజులుగా గండి పూడ్చకపోవడం వల్ల ఆయా గ్రామాలకు సంబంధించిన రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీపీఎం నాయకులు పల్లె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మహా పడి పూజకు ఏర్పాట్లు

తాడేపల్లి, మంగళగిరి: మంత్రి నారా లోకేశ్ సహకారంతో మంగళగిరి నృసింహస్వామి గాలిగోపురం వద్ద ఈనెల 4న తేదీ సాయంత్రం అయ్యప్ప మహా పడిపూజ నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 10 వేల మంది భక్తులు పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం గురుస్వామి మదునుబాబ్జి ఏర్పాట్లు పరిశీలించారు. మంత్రి నారా లోకేశ్ పూజ కార్యక్రమానికి హాజరవుతారని నిర్వాహక బృందం తెలిపింది.

PASSPORT MISSING
I, Marri Venkata Surendra S/o Sita ramaiah D.No 1-17, Visadala Medikonduru Mandal, Guntur Dist 522438, A.P. I Lost my Passport No.W9381039 Date of issue 09/02/2023 Dated Expiry 08/02/2033 while i am travelling visadala to perecharla on 28.09.2025 Xerox purpose. If any one found inform me
Ph: 70328 64865

దుగ్గిరాల శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బేతపూడిలో హోమం

పుష్పాలంకరణలో మల్లేశ్వరస్వామి

కంఠంరాజకొండూరులో..

దీపోత్సవం.. నయన మనోహరం

దుగ్గిరాల: దుగ్గిరాలలోని శ్రీగంగాపార్వతీ సమేత నాగేశ్వరస్వామి దేవస్థానం(శివాలయం)లో ఆదివారం రాత్రి కోటి దీపోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. అర్చకులు నాగేశ్వర యుగంధర్ పవిత్ర వేదమంత్రాల మధ్య తొలుత కొలగాని రాధాకృష్ణ దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం హాజరైన మహిళలంతా దీపారాధన చేశారు. ఈవో శ్రీనివాసరావు, దుంపా కల్యాణి, వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కంఠంరాజకొండూరు మహంకాళి అమ్మవారిని చందనంతో, దుగ్గిరాల శివాలయంలో అమ్మవారికి వెండి చీరె అలంకరణ చేశారు. శివలింగాన్ని కూడా వెండి కిరీటంతో అలంకరించారు.

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామాలలో ఆదివారం తెల్లవారుజాము నుంచి కార్తిక మాసం పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. వట్టిచెరుకూరు బ్రహ్మేశ్వరస్వామి, ముట్లూరు రామలింగేశ్వరుని ఆలయాల్లో మహిళలు దీపాలు వెలిగించారు.

ఫిరంగిపురం గ్రామీణం: బేతపూడిలో ఆదివారం తితిదేకు చెందిన హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో 'మన గుడి' వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీతారామాంజనేయ స్వామి దేవాలయం వద్ద హోమం, అన్నమయ గీతాలు, హరి నామ సంకీర్తనలు ఆలపించారు. తీర్థ ప్రసాదం, అన్నదానం చేశారు. ఆలయ ఛైర్మన్ నాగరాజు, అర్చకులు పాల్గొన్నారు.

శివలింగం, త్రిశూల ఆకారంలో..

5న 'విష్ణు హారతి-అడవి తల్లికి హారతి'

తుళ్లూరు, న్యూస్‌టుడే: కార్తిక పౌర్ణమి సందర్భంగా ఈ నెల 5న తాళ్లాయపాలెం శైవక్షేత్రం వద్ద కృష్ణానది హారతి, 'విష్ణు హారతి- అడవి తల్లికి హారతి' కార్యక్రమాన్ని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కొండవీటి జ్యోతిర్మయి నిర్వహించనున్నట్లు గురు కొండవీటి జ్యోతిర్మయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం రాజధాని నిర్మాణానికి భూ సమీకరణలో అర ఎకరం లోపు భూములు ఇచ్చిన 22 మంది పేద రైతులకు పాద పూజ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

NOTICE
IN THE COURT OF THE PRL.CIVIL JUDGE (JUNIOR DIVISION) :: MANGALAGIRI
I.A.No.1099/2024 in I.A.No.364/2024 in O.S.No.168/2009
Between:
Kallam Siva Reddy. ..Petitioner/Plaintiff
And
Kallam Sanjeeva Reddy(Died pendent lite) & Others.
...Respondents/Defendants
To,
R-7:Kallam Kalyani, D/o.Late Kallam Sanjeeva Reddy, R/o.Penumaka Village, Tadepalli Mandal, Guntur Dist.
పై నెంబరు ఐ.ఎ.నెం. 1099/2024 LRs పిటీషనులో 7వ రెస్పాండెంటు అయిన మీకు నోటీసును ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది.03-12-2025కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుటహాజరై మీకుగల ఆక్షేపణలుతెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా తేది:03-12-2025
ఆరెగకూటి రామ్మోహన్ రెడ్డి,
పిటీషనరు/ వాది తరపు అడ్వకేట్, మంగళగిరి, సెల్: 9989870118

గుంతలమయం.. నడవడమే నయం

అధ్వానంగా కంతేరు వెళ్లే రహదారి

లాం వంతెనపై కొట్టుకుపోయిన రోడ్డు

ఎర్రవాగు వంతెనపై ఇలా..

తాడికొండ, న్యూస్‌టుడే

ఫోకస్

నియోజకవర్గ కేంద్రం తాడికొండకు రాకపోకలు చేసేందుకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నలువైపులా ప్రధాన రహదారులు దెబ్బతిని గుంతలతో నిండిపోయాయి. కంతేరు, లాం, పొన్నెకల్లు, పరిమి గ్రామాల నుంచి తాడికొండ చేరుకునే ఏ ఒక్క రహదారీ ప్రయాణానికి అనువుగా లేదు. భారీ వాహనాలు సైతం గోతుల్లో ఇరుక్కుపోతున్నాయి. రాత్రి వేళ దేవుడిపై భారం వేసి ప్రయాణం చేస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదమరిస్తే వాహనాలు పంట కాలువల్లోకి దూసుకెళ్లే ప్రమాదం పొంచి ఉంది.

తాత్కాలిక మరమ్మతులతో సరి.. అధికారులు మాత్రం గుంతలను తాత్కాలికంగా పూడ్చి వదిలేస్తున్నారు. దీంతో వర్షం కురిస్తే మళ్లీ పరిస్థితి మొదటికి వస్తోంది. తుపాను ధాటికి ఎర్రవాగు వంతెన, కంతేరు ప్రధాన రహదారి, లాం వద్ద కొండవీటి వాగు వంతెనపై రహదారి కొట్టుకుపోయి భారీ గుంతలు పడ్డాయి. ఇప్పటికైనా శాశ్వత ప్రాతిపదికన గుంతలు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఇదేం నిర్వహణ..?

మంగళగిరి మండలం చినకాకాని గ్రామ పరిధిలోని జాతీయ రహదారి వెంబడి ఉన్న విద్యుద్దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉంటున్నాయి. మరికొన్ని చోట్ల రాత్రి వేళల్లో వెలగడం లేదు. దీంతో రాకపోకలకు జనం ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు కాజ గ్రామ బస్టాండ్ సెంటర్‌లో విద్యుత్ స్తంభానికి లైటు కనిపించనంతగా పిచ్చి మొక్కల తీగలు అల్లుకున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, మంగళగిరి గ్రామీణం

రాకపోకలకు భయం

ఆత్మకూరు గ్రామం నుంచి పెదవడ్లపూడి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న వంతెనకు రక్షణ గోడలు సరిగా లేవు. నిత్యం ఇటుగా వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ నేపథ్యంలో అదుపు తప్పితే నేరుగా కాలువలోకి దూసుకుపోవడమే. ఈ ప్రాంతంలో వీధి దీపాలు కూడా లేవని వాహనదారులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరగకముందే తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, మంగళగిరి గ్రామీణం

దస్తావేజు పోయినది
నా క్లయింటు అయిన గుంటూరు సిటీ, ఆర్.టి.సి. కాలనీ, 1వ లైను కాపురస్తులు యర్రం కోటిరెడ్డి గారి కుమారుడు రామకృష్ణారెడ్డి(సెల్:9440220345) గారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు తిరుమల సాయి స్టోన్‌క్రషర్ అను పేరుతో వ్యాపారము చేయుచున్నారు. నా క్లయింటు దిగువ షెడ్యూలుదాఖలా ఆస్తిని ది.11-11-2019న విక్రయ దస్తావేజు నెం. 6962/2019 నల్లపాడు యస్.ఆర్.ఓ.ద్వారా బత్తుల ఈశ్వరమ్మ వగైరాల వద్ద నుండి కొనుగోలు చేసి రిజిష్టరు పొంది యున్నారు. సదరు కొనుగోలు సమయము నందు బత్తుల ఈశ్వరమ్మ వగైరాలు దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించిన లింకు దస్తావేజులు అనగా ది.21-03-2005న రిజిష్టరు కాబడిన ద.నెం.1600/2005 మరియు ది.30-06-1999న రిజిష్టరు కాబడిన ద.నెం.1706/1999 యస్.ఆర్.ఓ.నల్లపాడు గల దస్తావేజులను నాక్లయింటుకు ఇచ్చియున్నారు. ది.30-10-2025న నా క్లయింటు పేరేచర్లలోని తన క్రషర్ నుండి పేరేచర్ల సెంటర్‌కు జిరాక్స్ నిమిత్తం వెళ్ళినపుడు తన వద్ద గల లింకు దస్తావేజులలో ఒక లింకు దస్తావేజు నెం.1706/1999 పోయినదని గమనించి నాక్లయింటు వచ్చిన దారి నందు, ఆ చుట్టు ప్రక్కల ఎంత వెతికి ననూ లేదా విచారించిననూ దొరికి యుండలేదు. కావున సదరు లింకు దస్తావేజు నెం.1706/1999 ఎవరికైనా దొరికినయెడల నాకుగాని లేదా నాక్లయింటు యొక్క చరవాణి నందు సంప్రదించి అందజేయగలరు.
షెడ్యూలు:గుంటూరు డి॥, నల్లపాడు సబ్.డి॥, పేరేచర్ల గ్రామ పంచాయితీ, పేరేచర్ల గ్రామ డి.నెం.397లో య.5-92 శెంట్లు మెట్ట భూమికి హద్దులు. **తూర్పు:** అడవి భూమి, **దక్షిణం:** రామ కోటయ్య భూమి, **పడమర:** రావు గారి భూమి, **తిరిగి దక్షిణం:** రావుగారి భూమి, **తిరిగి పడమర:** డొంక, **ఉత్తరం:** పోలిశెట్టి రామారావు భూమి.
వి. చంద్రశేఖర రెడ్డి, అడ్వకేట్
షాప్ ఎంప్లాయీస్ కాలనీ, గుంటూరు. సెల్:7013267626

తోటల్లో మందుబాబుల తిష్ఠ

కంఠంరాజుకొండూరు (దుగ్గిరాల), **న్యూస్‌టుడే:** కంఠంరాజుకొండూరు మహంకాళి అమ్మవారి ఆలయ పరిసరాల తోటల్లో ఆదివారం మందుబాబులు తిష్ఠ వేశారు. తోటల్లో మద్యం తాగకూడదు కానీ తోటల నిర్వాహకులకు ఇదేమీ పట్టడం లేదు. ఆదివారం ఇక్కడి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఈ నేపథ్యంలో మందుబాబులతో ఇబ్బందులు తలెత్తే అవకాశం లేకపోలేదు. పోలీస్ నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎర్రన్నాయుడి సేవలు చిరస్మరణీయం

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: కేంద్ర మాజీ మంత్రి దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు తెదేపాకు చేసిన సేవలు చిరస్మరణీయమని మంగళగిరి తెదేపా అధ్యక్షుడు పడవల మహేష్ అన్నారు. మంగళగిరి తెదేపా కార్యాలయంలో ఎర్రన్నాయుడి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, గోశాల రాఘవ, నరేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి తెదేపా కార్యాలయంలో నివాళులర్పిస్తున్న పడవల మహేష్ తదితరులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: సమాజ సేవలో కేంద్ర మాజీ మంత్రి, తెదేపా నేత కింజరాపు ఎర్రన్నాయుడు ఒక విలక్షణ నేతగా పేరు తెచ్చుకొని ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని ప్రముఖ న్యాయవాది వి.ఆదినారాయణ పేర్కొన్నారు. ఆదివారం మందడంలోని అమరావతి ఉద్యమం శిబిరంతో పాటు రాష్ట్ర సచివాలయం సమీపంలో ఆయన నేతృత్వంలో ఆయన వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాజధాని ఐకాస నేతలు కట్టా రాజేంద్ర, వీరబాబు, బెజవాడ సాంబయ్య, పాతూరి రాంబాబు, బుల్లయ్య, గోవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందడంలో ఆహార పొట్లాల పంపిణీ

మొక్కల పంపిణీ

బడేపురంలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

తాడికొండ: తాడికొండలోని భగవాన్ సత్యసాయిబాబా జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బడేపురంలో ఆదివారం ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో రహదారుల వెంబడి ఉన్న పిచ్చి చెట్లు తొలగించి శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటి.. పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌బాబు మాట్లాడుతూ చెట్లు మానవాళి మనుగడకు దోహదపడతాయన్నారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ఎం.వేణుబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక

తాడేపల్లి: అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీలకు తాడేపల్లి మండలం పెనుమాక లోని వందేమాతరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 3 నుంచి 5 వరకు పల్నాడు జిల్లా నరసరావుపేటలో స్కూల్ గేమ్స్ అండర్-17 పోటీల్లో వీరు పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు అనంత శివ ఆదివారం తెలిపారు. జిల్లా తరపున కల్యాణ్‌నాయక్, కె.చరణ్, ఐ.చరణ్ పోటీలకు హాజరవుతారు. విద్యార్థులను అభినందించారు.

ఎంపికైన వారితో ఉపాధ్యాయులు

పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

తాడికొండ, న్యూస్‌టుడే: మొంథా తుపాను కారణంగా పత్తి రైతులు నష్టపోతున్నారని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పేర్కొన్నారు. పొన్నెకల్లులో తుపానుకు దెబ్బతిన్న పత్తి పంటను ఆదివారం వారు పరిశీలించారు. ప్రసాద్ మాట్లాడుతూ ఒక్కో క్వింటా పత్తి రూ.12 వేలు చొప్పున కొనుగోలు చేయాలన్నారు. తక్షణమే కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి తేవాలన్నారు. తేమను 18 శాతానికి పెంచాలన్నారు. నాయకులు ముపాళ్ల శివశంకరావు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరావు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నెకల్లులో పత్తి పంట పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

వ్యక్తి అదృశ్యంపై కేసు

మేడికొండూరు: వ్యక్తి అదృశ్యమైన ఘటనపై శనివారం రాత్రి కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పేరేచర్లకు చెందిన మద్ది తిరుపతయ్య ఆటో నడుపుతుంటారు. గుంటూరుకు చెందిన ఒక ప్రయివేటు సంస్థ ద్వారా రుణం తీసుకున్నారు. తిరిగి కొంత చెల్లించారు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురయ్యారు. అప్పు తీర్చలేక కొన్నాళ్లుగా మనోవేదన పడుతున్నారు. గత నెల 28వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. బంధువులు ఎంత వెతికినా ఆచూకీ తెలియలేదు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

తాడేపల్లి: నులకపేట ఆర్సీఎం సమాధుల ప్రాంగణంలో సకల ఆత్మల మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. రోమన్ కేథలిక్ సంప్రదాయంలో ఈ పర్వదినాన్ని జరుపుకొంటారు. మరణించిన కుటుంబ సభ్యుల ఆత్మలకు దేవుడు నిత్య విశ్రాంతి ప్రసాదించాలని కోరుతూ పాస్టర్ సెంటర్ డైరెక్టర్ ఆంథోనిబాల, ఫాదర్లు దాసయ్య, పాపయ్య పాల్గొని ప్రార్థనలు చేశారు. గ్రామ విన్సెంట్ ది పాల్ సంఘం సభ్యులు, క్రైస్తవులు హాజరైనట్లు సంఘ పెద్ద జయరాజ్ తెలిపారు.


తాడేపల్లి: ఆర్సీఎం సమాధుల ప్రాంగణంలో ..

ఫిరంగిపురం గ్రామీణం: ఫిరంగిపురం బాలయేసు కథెడ్రల్ దేవాలయం విచారణ గురువు ఫాతిమా మర్రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మల పండగను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గుంటూరు మేత్రాసన పీఠాధిపతులు చిన్నా బత్తిని భాగ్యయ్య హాజరై వాక్యోపదేశం చేశారు. విచారణ గురువులు, విశ్వాసులు పాల్గొన్నారు.

ముట్లూరు (వట్టిచెరుకూరు): ముట్లూరు గ్రామంలో పునీతశౌరి వారి దేవాలయంలో ఆత్మల పండగను క్రైస్తవ సోదరులు ఆదివారం రాత్రి కనుల పండువగా జరుపుకొన్నారు. తొలుత దేవాలయం నుంచి సెయింట్ గ్జేవియర్స్ ఉన్నత పాఠశాలకు ప్రదర్శన కొనసాగింది. అక్కడ విచారణ మతగురువు మార్నేని దిలిప్‌కుమార్ ప్రార్థనలు చేశారు.

ఫిరంగిపురం గ్రామీణం: వాక్యోపదేశం చేస్తున్న బిషప్ భాగ్యయ్య

వట్టిచెరుకూరు: ముట్లూరులో ఫాదర్ దిలీప్‌కుమార్ తదితరులు

తెదేపా నాయకుడు విలియం మృతి

విలియం (పాత చిత్రం)

మంగళగిరి: తెదేపా మంగళగిరి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి వెలగపాటి విలియం(55) ఆదివారం గుండె పోటుతో మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన చేసిన సేవలు మరువలేనివని పలువురు తెదేపా నాయకులు అన్నారు. ఆయన మృతదేహాన్ని పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య సందర్శించి నివాళులర్పించారు. బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, శివాలయం పాలకవర్గ సభ్యులు జంజనం వెంకట సుబ్బారావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, కట్టిపోగు వెంకయ్య, మోరంపూడి నాగేశ్వరరావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

వేలం ప్రకటన
మహారాజశ్రీ పొన్నూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
EP No. 27/2022 in O.S. No. 15/2019
Between:
షేక్ రహ్మతున్‌బీ ...పిటీషనరు/డి.హెచ్.ఆర్.
మరియు
సయ్యద్ ఫాతిమా బీ ...రెస్పాండెంట్/జె.డి.ఆర్.
పై నెంబరు E.P. No. 27/2022 లో పిటీషనరు డి.హెచ్.ఆర్. యొక్క డిక్రీ బాకీ వసూలు నిమిత్తం రెస్పాండెంట్, జె.డి.ఆర్. యొక్క ఈ దిగువ E.P. షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారిచే ది. 20-11-2025 తేది ఉదయం 10.30 ని॥ లగాయతు వేలం వేయబడును. సదరాస్తిని వేలంలో పాడుకొనుటకు ఇష్టమైన వారు శ్రీ కోర్టు వారి ఎదుట ప్రత్యక్షంగా హాజరై వేలం పాటలో పాల్గొనవచ్చును.
షెడ్యూలు : గుంటూరు జిల్లా నర్సరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, కాకుమాను సబ్-జిల్లా కాకుమాను మండలం, కొమ్మూరు గ్రామం, కొమ్మూరు గ్రామ పంచాయితీ ఏరియా కొమ్మూరు గ్రామం D.No. 268/2, సమీప డోర్ నెం. 6-47 పడమర ప్రక్క, చిన మసీదు బజారు, విస్తీర్ణం 80 చదరపు గజాల ఖాళీ నివేశన స్థలం Out of Ac. 17.20 Cents ఆస్తికి హద్దులు. తూర్పు: పంచాయితీ బజారు, దక్షిణం: పర్చూరి బాబు గారి స్థలం, పడమర: పర్చూరి బాబు గారి స్థలం, తిరిగి దక్షిణం: పర్చూరి బాబు గారి స్థలం, తిరిగి పడమర: మంగళగిరి మౌలాలి ఇల్లు, ఉత్తరం: పర్చూరి అజీజ్ గారి స్థలం.
DHR Value: 2,50,000/- Amin Value: 5,50,000/-
వేలం తేది: 20-11-2025 ఫర్‌దర్ హియరింగ్: 28-11-2025
N.B.: E.C. దాఖల షెడ్యూల్ దాఖలాస్తిపై ఎలాంటి అన్యాక్రాంత్యములు లేవు.
పొన్నూరు
ది. 27-10-2025
ఇట్లు : మల్లెల ఈరేసు, అడ్వకేట్ & నోటరీ
దాంద్రపాటి నాసరమ్మ, అడ్వకేట్
పొన్నూరు, 522 124
Cell No. 94405 18613

(c) eenadu

గుంటూరు తూర్పు

కృష్ణనగర్ రైతుబజారులో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో): టమాట 28, వంగ 62, బెండ 44, పచ్చిమిర్చి 24, కాకర 50, బీర 44, క్యాబేజి 28, క్యారెట్ 74, దొండ 40, బంగాళదుంప 28, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుడు 44, దోస 22, సొర 30, పొట్ల 32, అరటికాయ 7, పెద్దచిక్కుడు 70, చామదుంప 26, మునగ 10, బీట్‌రూట్ 49, కీరదోసకాయ 29, బీన్స్ 74, క్యాప్సికం 74.0 కొత్తిమీర 30, ఆకుకూరలు 18, నిమ్మకాయలు 28, అల్లం 80, వెల్లుల్లి 110. - న్యూస్‌టుడే, పట్టాభిపురం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
94406 38515, 80085 73097

★ జయప్రకాష్‌నగర్ ప్రధానరోడ్డులోని కాల్వల్లో పూడికలు చేరి మురుగు పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికులు హరిప్రసాద్ సమస్యను 'మేమున్నాం..మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ ఆయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లడంతో కాల్వల్లో పూడికలు తీయించారు.

★ రాజీవ్‌గాంధీనగర్ 2వ లైన్‌లో చెత్తకుప్పలు తీయకపోవడంతో వీధి అపరిశుభ్రంగా ఉందని స్థానికులు వెంకటరత్నాలు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలిపారు. సమస్య ప్రజారోగ్య విభాగం అధికారులకు తెలియజేయడంతో చెత్తకుప్పలు తీయించి తరలించారు. -న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ(గుంటూరు)

సహకార సదస్సు

ప్రసంగిస్తున్న మల్లికార్జునరావు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: సహకార వ్యవస్థ బలోపేతం కావాలన్న ఆసక్తి ఉంటే అదే ఉన్నతి అని విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ డైరెక్టర్ పీవీ మల్లికార్జునరావు, సిఎంక్ రామారావు, చిన కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం కొరిటెపాడులోని బ్రాంచిలో సహకార సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జీఎం ఏర్రయ్యరెడ్డి, మేనేజర్ బి.కుమార్ సభ్యులు పాల్గొన్నారు.

వీధికుక్క దాడిలో వ్యక్తికి గాయాలు

కొత్తపేటలో వ్యక్తిపై దాడి చేస్తున్న వీధి కుక్క

నగరపాలక సంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: వీధి కుక్కలతో నగర ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతం నుంచి ఫిర్యాదులు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. శనివారం కొత్తపేట ప్రధాన రహదారి ప్రాంతంలో ఓ వీధి కుక్క నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిపై దాడి చేసింది. దాడితో కింద పడిపోయిన ఆవ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన అక్కడి దగ్గరలోని ఓ సీసీ కెమెరాలో నిక్షిప్తం కావడంతో వారు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. జీఎంసీ అధికారుల నిర్లిప్తతతో వీధికుక్కల దాడులు పెరిగాయని ప్రజల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా జీఎంసీ ప్రజారోగ్య అధికారులు వీధికుక్కలను నియంత్రించేందుకు వెంటనే చర్యలు చేపట్టాల్సి ఉంది.

ఉదయం ఉక్కపోత.. రాత్రికి జోరువాన

గోరంట్ల, న్యూస్‌టుడే: జిల్లాపై వరుణుడు ఉన్నట్టుండి ప్రతాపాన్ని చూపాడు. ఆదివారం ఉదయం నుంచి తీవ్ర ఉక్కపోతతో అల్లాడిపోయిన ప్రజలు ఆదివారం రాత్రి సమయంలో కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. రాత్రి 9 గంటల సమయంలో కురిసిన వర్షంతో ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. అరగంటకు పైగానే వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

అంతర్గత డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే

ప్రధాన కాల్వలతో అనుసంధానం లేక ఇబ్బందులు

రైలుపేటలో ఇళ్ల ముందు చేరుతున్న మురుగునీరు

నగరంలో అంతర్గత డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో చిన్నపాటి వర్షం కురిసినా వీధులు, ఇళ్ల మధ్యకు నీరు చేరి ప్రజలు అవస్థలు పడుతున్నారు. అంతర్గత కాల్వల నిర్మాణాల్లో లోపాలతో సమస్యలు వస్తున్నాయి. ప్రధాన డ్రెయిన్లకు వీటిని పక్కాగా అనుసంధానం చేయాల్సి ఉన్నా.. నగరపాలక సంస్థ అధికారులకు అవేమీ పట్టడం లేదు.

గత రెండు నెలలుగా నగరంలో వర్షాలు భారీగా కురుస్తున్నాయి. వర్షం పడిందంటే ఏటీ అగ్రహారం శివారు, తూర్పులో శివనాగరాజు కాలనీ, రైల్వేలైన్ పక్క ప్రాంతాలు నీటమునుగుతున్నాయి. ఇళ్లల్లోకి సైతం వరద నీరు వస్తోంది. ఎప్పుడూ లేని సమస్యలు ఇప్పుడు వస్తుండడంతో ఆయా ప్రాంతాల వాసులు కార్పొరేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారులు, ప్రధాన డ్రెయిన్ల పనులు చేస్తున్న సందర్భంలో అంతర్గత డ్రైన్ల కాల్వలను పట్టించుకోవడం లేదు. దీంతో అవి ప్రధాన డ్రెయిన్ కంటే తక్కువ ఎత్తులో ఉంటున్నాయి. కొన్ని సందర్భాల్లో చేయడం లేదు. పరిణామంగా అర్బన్‌లోని నీరు ప్రధాన కాల్వల్లోకి ఆనీరు రహదార్లపైకి చేరి చెరువులు మారుతున్నాయి. ఒక్క ఏటీ అగ్రహారం, మురికిపేట కాదు.. నగరంలోని మిగిలిన ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు అంతర్గత కాల్వల నిర్మాణాల్లో లోపాలు సవరించాల్సి ఉంది.

నగరంలో డివిజన్లు	57
వార్డు సచివాలయాలు	206
పారిశుద్ధ్య కార్మికులు	3200

అంతర్గత కాల్వల పొడవు సుమారు 1550 కి.మీ.

ఇలా చేస్తేనే సమస్యలకు పరిష్కారం

★ అంతర్గత వీధుల్లోని సైడ కాల్వలను పక్కా డ్రైనేజీలతో ప్రధాన డ్రెయిన్లకు కలపాల్సి ఉంటుంది. అదే క్రమంలో కాల్వల నిర్మాణం ప్రమాణాలకు అనుగుణంగా జరగాలి. ★ వీటిలో ఇరువైపులా నిర్మించే కాల్వలు రహదారి కంటే తక్కువ ఎత్తులో ఉండేలా, ప్రధాన డ్రెయిన్లకు అనుసంధానమయ్యేలా పనులు చేయాల్సి ఉంది. ★ వర్షం కురిస్తే వరదనీరు పారేలా ఉండేలా చూడాల్సి ఉంది. ★ కాలనీల్లోని ప్రధాన డ్రెయిన్లకు మలుపుల వద్ద పూడికలు పేరుకుపోకుండా ఇనుప జాలీలు ఏర్పాటు చేయించాలి. అక్కడ చేరే వ్యర్థాలు, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలి. ఈప్రక్రియ నిరంతరం జరగాలి. అంతర్గత కాల్వలు, కాలనీల్లోని ప్రధాన కాల్వల నిర్మాణం పక్కాగా ఉంటేనే ముంపు, వరదనీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఇన్నాళ్లు అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు అంతర్గత కాల్వల వ్యవస్థను పకడ్బందీగా నిర్వహించాల్సిన అవసరం ఉంది.

నేడు పుష్పయాగ మహోత్సవం

పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : నెహ్రూనగర్ 2వ వీధిలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి పవిత్రోత్సవాలు కనులపండువగా నిర్వహిస్తున్నారు. ఆదివారం స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శ్రీవారి అభిషేకం బృందం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ప్రధాన మూర్తులకు, గరుడ మూర్తికి క్షీర స్నపనం, పవిత్రారోహణ, శాంతి హోమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఉత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈనెల 3న శ్రీ స్వామివారికి పుష్పయాగమహోత్సవం జరుగుతుందని ఆలయ పర్యవేక్షకులు పసుపులేటి సాంబశివరావు తెలిపారు.

శ్రీవారికి అభిషేకాలు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: హిందూ కళాశాలలోని ఏకాదండయ్య పంతులు హాలులో ఆదివారం రాత్రి జరిగిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. రాధామాధవ్ రసరంజని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నృత్య ప్రదర్శనల్లో నాట్య గురువు వేణుగోపాలరావు(విజయవాడ) శిష్యులు పలువురు కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించి అందరి మన్ననలు అందుకున్నారు. రాధా మాధవ నాట్య క్షేత్రం విద్యార్థుల జానపద నృత్యాంశాలు, అద్దంకి నాగరాజు టాకింగ్‌డాల్ తదితర అంశాలు ప్రదర్శితమయ్యాయి. నాట్యాచార్య షేక్ ఖలీల్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: స్థానిక సమస్యల పరిష్కారానికి వీలుగా సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని కమిషనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ముందు కమిషనర్ ఛాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్(0863- 2224202) కార్యక్రమం ఉంటుందన్నారు. తర్వాత ఒంటి గంట వరకు కౌన్సిల్ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ ఉంటుందని తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

నరసింహనాయుడికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే నసీర్

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీని బలోపేతం చేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ సూచించారు. ఆదివారం తొమ్మిదో డివిజన్ అధ్యక్షుడిగా చిన్నంశెట్టి నరసింహనాయుడు ఎమ్మెల్యే ప్రత్యేకించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి నాయకులతో సమన్వయం చేసుకుంటూ పార్టీని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యల్లావుల అశోక్, జాగర్లమూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి హామీ అమలు చేయండి

మాట్లాడుతున్న రాజేంద్ర

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలని, అమరావతిని ఫ్రీ జోన్ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తపేటలోని కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. రాజేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి హామీ అమలు చేయాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కృష్ణకాంత్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు పవన్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చైతన్య, వలి, పలు సంఘాల నాయకులు బుజ్జి, శివాజీ, జగన్నాథం, శ్రీను, ప్రవీణ్, గోపి, అజయ్ పాల్గొన్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణను సత్కరిస్తున్న ఏపీ టీచర్స్ గిల్డ్ నాయకులు

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులు, సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ అన్నారు. ఆదివారం అరండల్‌పేట సెయింట్ ఇగ్నేషియస్ పాఠశాలలో ఏపీ టీచర్స్ గిల్డ్(ఏపీటీజీ) ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల హెల్త్‌కార్డుల సమస్య ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సభకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ జయరాజు అధ్యక్షత వహించారు. ఎయిడెడ్ విద్యాసంస్థల నుంచి ఇటీవల ఎంఈవోలుగా బాధ్యతలు స్వీకరించిన బి.సత్యనారాయణసింగ్, ఎస్.ఉపేంద్రకుమారి, బి.శ్రీనివాసరెడ్డిలను, మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణను నాయకులు సత్కరించారు. ఏపీటీజీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా బీవీఎల్.బాలశౌరిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎం.వరప్రసాద్, సహాధ్యక్షులుగా ఏకా సాయికుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా షేక్ యజదానీబాషాలు ఎన్నికయ్యారు.

కామన్ సర్వీస్ రూల్స్‌పై పోరాటానికి సమాయత్తం

గుత్తా శ్రీనివాసరావును సత్కరించిన సంఘం నాయకులు

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: కామన్ సర్వీస్ రూల్స్‌పై న్యాయ పోరాటానికి అందరూ సమాయత్తం కావాలని ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఏపీ ప్రధానోపాధ్యాయ సంఘం కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షులు ఆవుల తిరుమలేష్ అధ్యక్షత వహించారు. సమావేశంలో పదో తరగతి నామినల్ రోల్స్ రూపకల్పన సమయంలో సాంకేతిక సమస్యలు, పరిష్కారాలు, అపార్ ఐడీ ఏర్పాటు తదితర అంశాలపై రాష్ట్ర కమిషనర్‌కు వినతిపత్రం అందజేయాలని నిర్ణయించారు. సంఘం రాష్ట్ర వజ్రోత్సవాలను గుంటూరు జిల్లా రాజధాని పరిసర ప్రాంతాల్లో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నియోజకవర్గంలో నిర్వహిస్తే బాగుంటుందని సభ్యులందరూ అభిప్రాయపడినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

ఇదేం ప్రమాద సూచిక?

లాంచెస్టర్ రోడ్డులోని అమ్మవారి గుడి సెంటర్ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇటీవల అధికారులు ఈ ప్రాంతంలో డ్రైనేజీకి మరమ్మతులు చేసి గుంతపై మట్టి పోశారు. ప్రమాదసూచికగా కర్రను ఏర్పాటు చేశారు. తెనాలి, పొన్నూరు, బుడంపాడు, బాపట్ల తదితర ప్రాంతాలకు వెళ్లే వారంతా నిత్యం ఇటువైపు నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు మధ్యలో ఉన్న మట్టికుప్పలు చీకట్లో కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. - న్యూస్‌టుడే, పట్నంబజారు

యథేచ్ఛగా పెట్రోలు లూజు విక్రయాలు

బహిరంగ ప్రదేశాల్లో నిబంధనలకు విరుద్ధంగా పెట్రోలు లూజుగా విక్రయిస్తున్నారు. పాత గుంటూరులోని నందివెలుగురోడ్డు, పొన్నూరురోడ్డు, ఏటుకూరురోడ్డు, ప్రగతినగర్, సుద్దపల్లిడొంకరోడ్డు తదితర ప్రాంతాల్లో కొంతమంది సీసాల్లో నింపి బహిరంగంగానే ప్రదర్శిస్తున్నారు. మణిహోటల్ సెంటర్, పాతబస్టాండు సెంటర్, ఇందిరాప్రియదర్శినీకాలనీ తదితర ప్రాంతాల్లో తినుబండారాలు తయారు చేసే ప్రదేశాల్లో లూజుగా విక్రయిస్తున్నారు. ఏ మాత్రం ప్రమాదం జరిగినా ఆస్తినష్టంతోపాటు, ప్రాణనష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. - న్యూస్‌టుడే, పట్నంబజారు

రహదారి ఇలా.. రాకపోకలు ఎలా

బుచ్చయ్యతోట 1వ వీధిలో రహదారి గతులకులమయంగా మారింది. తారు రోడ్డు గుంతలు పడి అందులోని కంకర రాళ్లు బయటపడ్డాయి. నెహ్రూనగర్, కొత్తపేట, సీతానగర్, న్యూగుంటూరు, మూడు వంతెనల వైపు నిత్యం వేలాదిమంది ప్రయాణిస్తారు. గుంతల్లో పడి ద్విచక్రవాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.
- న్యూస్‌టుడే, నెహ్రూనగర్

నష్టపోయిన రైతులను ఆదుకోండి

మాట్లాడుతున్న అజయ్‌కుమార్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : మొంథా తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం బ్రాడీపేటలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అధికారులు హడావుడిగా పంటనష్టం అంచనా వేస్తున్నారని తెలిపారు. దీనివలన రైతులకు నష్టం జరుగుతుందన్నారు. వరి, పత్తికి రూ.25 వేలు, అపరాలకు రూ.10 వేలు, ఉద్యానపంటలకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలని కోరారు.

మధుమేహం నియంత్రణ మన చేతుల్లోనే

మాట్లాడుతున్న డాక్టర్ కాశ్యప

బ్రాడీపేట, న్యూస్‌టుడే: మధుమేహం నియంత్రణ మన చేతుల్లోనే ఉందని ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ వి.బి. కాశ్యప జన్నాభట్ల అన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో సమావేశం సర్వీస్ హెల్త్‌ఆర్గనైజేషన్, హైపర్‌టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా మధుమేహ నిరోధక మాసం సందర్భంగా 'మధుమేహం-కారణాలు-నిర్ధారణ పరీక్షలు-చికిత్స-నిరోధక మార్గాలు' అనే అంశంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సేవకుమార్ అధ్యక్షత వహించారు. డాక్టర్ కాశ్యప మాట్లాడుతూ మధుమేహుల్లో చాలా కాలం పాటు ఎలాంటి లక్షణాలు కనిపించవని, అయితే బయటపడిన తర్వాత కూడా నిర్లక్ష్యం చేస్తుంటారన్నారు. వైద్యులను సంప్రదించేసరికే శరీర అవయవాల్లో అనేక అనారోగ్య, నిర్మాణాత్మక మార్పులు జరిగిపోతున్నాయన్నారు. 30 ఏళ్లు పైబడిన వారిలో ఇప్పటికే ప్రతి వంద మందిలో 14 మంది ప్రీడయాబెటిక్ దశలో ఉన్నారని తెలిపారు. వీరంతా తగిన నిరోధక చర్యలు చేపట్టకపోతే మధుమేహ బాధితులుగా మారి ఆరోగ్య పరంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడక తప్పదన్నారు. ప్రతి ఒక్కరు మధుమేహంపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఏటా ఒక్కసారైనా మధుమేహ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వైద్య శిబిర ఛైర్మన్ టి.ధనుంజయ్‌రెడ్డి, డాక్టర్లు తేజస్విని, చల్లా చైతన్య, ఎస్‌హెచ్‌వో మేనేజర్ పి.నిర్మలారాణి, పావులూరి రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కోటేశ్వరరావు మృతి పేదలకు తీరని లోటు

నివాళులర్పిస్తున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నందకిశోర్

నగరంపాలెం, న్యూస్‌టుడే: ఐఎంఏ గుంటూరు శాఖ సభ్యుడు, సీనియర్ వైద్యుడు డాక్టర్ పులిపాటి కోటేశ్వరరావు మృతి పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు తీరని లోటని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.నందకిశోర్ అన్నారు. డాక్టర్ కోటేశ్వరరావు భౌతికకాయాన్ని ఆదివారం ఆయన నివాసంలో సందర్శించిన డాక్టర్ నందకిశోర్, కన్నా మాస్టార్, శ్రీనివాసరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ కోటేశ్వరరావు తన పేరున, తల్లిదండ్రుల పేరున ట్రస్టు ఏర్పాటు చేసి, సంపాదించిన మొత్తం ఆస్తి ఇచ్చేశారన్నారు. ట్రస్ట్ ద్వారా నగరంలో కల్యాణ మండపం, బాలికలు, బాలుర వసతి గృహాలను నిర్మించాలనుకోవడం, భవన నిర్మాణాలు ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ నగర శాఖ అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్, కార్యదర్శి బి.సాయికృష్ణ, ఐఎంఏ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు డాక్టర్ డి.అమరలింగేశ్వరరావు, డాక్టర్ ఆర్.నాగేశ్వరరావు, పి.నిర్మలారాణి తదితరులు ఉన్నారు.

పూల వ్యాపారానికి మొంథా దెబ్బ

న్యూస్‌టుడే - నెహ్రూనగర్

రైతుబజార్‌లోని హోల్‌సేల్ మార్కెట్ వద్ద పడేసిన పూల బస్తాలు

మొంథా తుపాను పూల వ్యాపారులను దెబ్బతీసింది. మూడు రోజులపాటు కురిసిన వర్షాలకు టన్నులకొద్దీ పువ్వులు పాడైపోయి రూ. లక్షల్లో నష్టపోయామని వ్యాపారులు వాపోతున్నారు. రైతుబజార్, జీఎంసీ సమీపంలోని పెద్దకూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో హోల్‌సేల్ పూల మార్కెట్లు ఉన్నాయి. విక్రయం, పెద్ద దండల తయారీతో వందలాది మంది వ్యాపారాలు చేస్తున్నారు. గుంటూరు నగరం సహా జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది ఇక్కడికొచ్చి కొనుగోళ్లు చేస్తుంటారు. తోపుడుబండ్లపై విక్రయించేవారితోపాటు శుభకార్యాలకు అలంకరణ చేసేవారు ఇక్కడికే వస్తుంటారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు మహారాష్ట్ర, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి వివిధ రకాల పూలను ఇక్కడికి దిగుమతి చేస్తుంటారు. రవాణా సమయంలో టన్నుల కొద్దీ పుష్పాలు దెబ్బతిన్నాయి. దీంతో వాటిని బయట పారబోయాల్సి వచ్చిందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. తుపాను దెబ్బకు సుమారు రూ. 10 లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు అంచనా.

అందుబాటులో ఆధునిక నేత్ర వైద్యం

ఎమ్మెల్యే గళ్లా మాధవికి మొక్క అందజేస్తున్న ఆసుపత్రి నిర్వాహకులు

గోరంట్ల, న్యూస్‌టుడే: లక్ష్మీపురంలో అత్యాధునిక సదుపాయాలతో గీతా కంటి ఆసుపత్రి ఆదివారం ప్రారంభమైంది. కార్యక్రమంలో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, నక్కా ఆనందబాబు, గళ్లా మాధవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఆసుపత్రిని అన్ని సదుపాయాలతో అందుబాటులోకి తీసుకురావడం వల్ల నగర ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. గీతా కంటి ఆసుపత్రి అధినేత డాక్టర్ పి.నరసింహారావు మాట్లాడుతూ మెట్రో నగరాలకు దీటుగా అన్ని ఆధునిక కంటి శస్త్రచికిత్సలు, నేత్ర వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. డాక్టర్ పి. మోహనకృష్ణ, డాక్టర్ బి.ప్రత్యూష, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

రాజధాని రైతుల సమస్యలు పరిష్కరించండి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: రాజధాని ప్రాంతంలో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటికీ పరిష్కారం చూపించాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు. క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, జాయింట్ కమిషనర్ భార్గవ్‌తేజలతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాజధాని రైతుల సమస్యలపై కేంద్ర మంత్రి అధికారులతో చర్చించారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్, వీధి పోటు, గ్రామ కంఠం, అసైన్డ్ ల్యాండ్, భూసేకరణ, లేఅవుట్ డెవలప్‌మెంట్ సమస్యలపై జాబితాను సిద్ధం చేయాల్సి ఉందని పెమ్మసాని అన్నారు. మంత్రి నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌తో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. రాజధానిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు, ఉద్యోగుల క్వార్టర్లు, విదేశీ భవన్, పెండింగ్ అంశాలు ఉంటే జాబితా ఇవ్వాలన్నారు.

యువకుడిపై దాడి.. కేసు నమోదు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : ఇద్దరు గొడవ పడుతుంటే సర్ది చెప్పడానికి వెళ్లిన యువకుడిపై దాడిచేసిన ఘటన ఇది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హుస్సేన్‌నగర్‌కు చెందిన సలీం పొత్తూరువారితోటలోని తన దుకాణానికి వెళుతున్నాడు. దారి మధ్యలో బారాఇమామ్‌పంజా వద్ద ఓ యువకుడిని ఇద్దరు కొడుతున్నారు. దీంతో ఇతను వారికి సర్దిచెప్పడానికి వెళ్లాడు. అంతలో చుట్టుపక్కల పెద్దలు వచ్చి అందరినీ అక్కడ నుంచి పంపించేశారు. ఈక్రమంలో గౌస్, ముజీబ్, జమాల్‌తోపాటు మరికొందరు కలిసి కొద్దిరోజుల కిందట దుకాణంలో ఉన్న సలీంపై దాడి చేశారు. ఆసుపత్రికి వెళ్లి గాయాలకు చికిత్స చేయించుకొని ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వీరయ్య చౌదరి తెలిపారు.

సెమీఫైనల్స్‌కు ఎల్వీఆర్ క్రీడాకారులు

పోటీలో తలపడుతున్న క్రీడాకారుడు

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: ఎల్వీఆర్ సన్స్ క్లబ్‌లో ఏపీ స్టేట్ బిలియర్డ్స్, స్నూకర్ ర్యాంకింగ్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. బిలియర్డ్స్‌లో ఎల్వీఆర్ క్లబ్ క్రీడాకారులు శంకరరావు, శ్రీనివాసరావులు సెమీఫైనల్స్‌కు చేరారు. బిలియర్డ్స్ విభాగంలో శ్రీనివాసరావు 3-1 స్కోర్‌తో సుశీల్‌పై, శంకరరావు 3-0 స్కోర్‌తో సాగన్‌పై విజయం సాధించారు. స్నూకర్స్‌లో అఖిల్ 3-0 స్కోర్‌తో సోమేశ్వరరావుపై, శంకరరావు 3-0 స్కోర్‌తో చంద్రశేఖర్‌పై, శివశర్మ 3-1 స్కోర్‌తో శ్రీనివాస్‌పై విజయం సాధించారు.

ప్రకృతిని కాపాడుకోవడం అందరి బాధ్యత

మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణంరాజు

గోరంట్ల, న్యూస్యస్‌టుడే: ప్రకృతిని కాపాడుకోవడం అందరి బాధ్యతని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కృష్ణంరాజు అన్నారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో ఏసీ కళాశాలలో ఎన్ఎంఎంఎస్ శిక్షణకు హాజరయ్యే విద్యార్థుల చైతన్య సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణంరాజు మాట్లాడుతూ భూమి మనకు లభించిన వరమని, దాన్ని కాపాడుకోకపోతే భవిష్యత్తు తరాలకు జీవనాధారం ఉండదన్నారు. ప్రతి పౌరుడు ప్రకృతికి మిత్రుడిగా మారాలని, నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు. వ్యర్థాల నిర్వహణ యాజమాన్యం అలవాటు చేసుకోవాలన్నారు. రసాయనాల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని వ్యవసాయదారులను కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి కె. సతీష్, మానవత సంస్థ ఛైర్మన్ పావులూరి రమేష్, అధ్యక్షుడు కోటా శ్రీనివాసరావు, డైరెక్టర్ ఉప్పాల సాంబశివరావు, జి.ఆనంద్, చావా శివాజీ, కె.పావని, రిసోర్స్‌పర్సన్లు గేరా ప్రకాష్, బేతపూడి మంగారావు, రెహమాన్, ఆదినారాయణ, జగదీష్, అరుణాచలం, ఎం.రాధాకృష్ణ పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో అంతర్గత బదిలీలు

నగరపాలకసంస్థ: నగరపాలకసంస్థలో పరిపాలన కారణాల నేపథ్యంలో పని సర్దుబాటులో భాగంగా కమిషనర్ పులి శ్రీనివాసులు పలువురు ఉద్యోగులను అంతర్గతంగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. జీఎంసీ మేనేజరుగా ఉన్న షేక్ బాలాజీబాషాను సీ సెక్షన్, లీగల్‌సెల్, ఎన్నికల విభాగం ఇన్‌ఛార్జిగా, పట్టణ ప్రణాళిక విభాగం సూపరింటెండెంట్‌గా నియమించారు. ఆర్‌వోగా, కమిషనర్ పేషీలో విధుల్లో ఉన్న ఎస్.ఎన్.ప్రసాద్‌కు అకౌంటెంట్-1గా అదనపు బాధ్యతలు అప్పగించారు. అకౌంటెంట్‌గా ఉన్న పి.నమ్రత్‌కుమార్‌ను మేనేజరుగా నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారు.

శాలివాహనుల కార్తిక వన సమారాధన

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన ఆదివారం జరిగింది. పేరేచర్ల ప్రధాన రోడ్డులోని పెట్రోల్ బంక్ పక్కన మైదానంలో సంఘ జిల్లా అధ్యక్షుడు ఇందుర్తి శివన్నారాయణ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర, శాలివాహన కార్పొరేషన్ అండ్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ పి.ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

గుంటూరు పశ్చిమ

మెగా ఉద్యోగ మేళా పోస్టర్ ఆవిష్కరణ

ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో డిసెంబరు 13న తేదీన జరగనున్న మెగా ఉద్యోగ మేళా పోస్టర్లను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ, జిల్లా అధ్యక్షుడు శంకరమంచి లలితశర్మ, జాబ్ మేళా కమిటీ సభ్యుడు కొప్పర్తి సీతారామేష్, మాటేటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, గోరంట్ల

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80086 22566, 97042 53525, 80085 74897

చెత్త, వ్యర్థాల తొలగింపు: గుండారావుపేట చెక్కల బజారు వీధిలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన పారిశుద్ధ్య సిబ్బందిని పంపి వీధిలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించారు.

స్పందనకు వందనం

కాలువల్లో పూడికతీత: సాంబశివపేట ప్రధాన వీధుల్లోని కాలువల్లో మురుగు పేరుకుపోయి పారుదలకు ఆటంకం ఏర్పడింది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు దృష్టికి తీసుకెళ్లాం. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించారు. -న్యూస్‌టుడే, నగరంపాలెం

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: స్థానిక నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని కమిషనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ముందు కమిషనర్ ఛాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్(0863- 2224202) కార్యక్రమం ఉంటుందన్నారు. తర్వాత ఒంటి గంట వరకు కౌన్సిల్ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ ఉంటుందని తెలిపారు.

ధరవరలు



కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు (కిలో రూ.ల్లో)

టమాట 28, వంగ 62, బెండ 44, పచ్చిమిర్చి 24, కాకర 50, బీర 44, క్యాబేజి 28, క్యారెట్ 74, దొండ 40, బంగాళదుంప 28, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుళ్లు 44, దోస 22, సొర 30, పొట్ల 32, అరటికాయ 7, పెద్దచిక్కుళ్లు 70, చామదుంప 26, మునగ 10, బీట్‌రూట్ 49, కీరదోసకాయ 29, బీన్స్ 74, క్యాప్సికమ్ 74.0 కొత్తిమీర 30, ఆకుకూరలు 18, నిమ్మకాయలు 28, అల్లం 80, వెల్లుల్లి 110. -న్యూస్‌టుడే, పట్టాభిపురం

వాకింగ్ ట్రాక్ పూర్తయ్యేదెన్నడు?

వాహనాలు తిప్పుతుండడంపై అభ్యంతరాలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే

ఎన్టీఆర్ స్టేడియం వాకింగ్ ట్రాక్ ఇటీవల రూ.లక్షలు వెచ్చించి అభివృద్ధి చేశారు. పనులు సక్రమంగా జరగకపోవడంతో ట్రాక్ పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. నడకదారి అభివృద్ధి చేశాక ఎటువంటి వాహనాలు ట్రాక్‌లోకి అనుమతించరాదని వాకర్స్ కోరడంతో అందుకు అధికారులు సమ్మతించారు. అయితే ఓ వాహన సంస్థ డీలర్ ఆదివారం ఎన్టీఆర్ స్టేడియంలో ఓపెన్ జిమ్ పక్కన స్టాళ్లను ఏర్పాటు చేసి కార్లను ట్రాక్‌లో తిప్పడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాగైతే రూ.లక్షలు వెచ్చించి వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేసినా ఉపయోగం ఏముంటుందని వాకర్స్ వాపోతున్నారు.

వాకింగ్ ట్రాక్‌లో కార్లు

ట్రాక్ పరిస్థితి ఇలా...

పరిశీలనలో ఎన్నాళ్లు..

ఎన్టీఆర్ స్టేడియంలో అభివృద్ధి పనులకు అప్పటికప్పుడు రూ.24 లక్షల వరకు నిధులు కేటాయించారు. రన్నింగ్ ట్రాక్ నిర్మాణానికి రూ.9 లక్షలు, వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి రూ.9 లక్షలు, ప్రహరీ నిర్మాణానికి రూ.6 లక్షలు మంజూరు చేశారు. రన్నింగ్, వాకింగ్ ట్రాక్ నిర్మించిన తీరు సక్రమంగా లేదని ముందు నుంచి వాకర్స్ సభ్యులు చెబుతూనే ఉన్నారు. ముందు చేసే పని వెనుక, వెనుక చేసే పని ముందు చేయడంతో పనుల్లో తీవ్ర జాప్యం జరగడంతో పాటు నాణ్యత దెబ్బతింది. జూన్ 1వ తేదీ నుంచి వాకర్స్‌ను అనుమతించడం లేదని బోర్డులు ఏర్పాటు చేశారు. ఇప్పటికీ గేట్లకు ట్రాక్ పరిశీలనలో ఉందని బోర్డులు దర్శనమిస్తున్నాయి. ముందుగా అధికారులు కెర్బ్ వాల్ ఏర్పాటు చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. ముందు రన్నింగ్ ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టారు. తర్వాత కెర్బ్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభించారు. వర్షాలు పడడంతో రన్నింగ్ ట్రాక్‌లో ఉన్న ఎర్రమట్టి డ్రైనుల్లో నిండిపోయింది. ప్రస్తుతం ట్రాక్ పనులు పూర్తి చేసి సరిదిద్దుకొనే పనిలో భాగంగా గుత్తేదారు డ్రైనుల్లో ఉన్న మట్టిని తొలగిస్తున్నారు. ఈసారైనా ట్రాక్ దెబ్బతినకుండా వాకర్స్ నడిచేలా పెద్ద ట్రాక్, క్రీడాకారులు ప్రాక్టీస్ చేసుకునేలా రన్నింగ్ ట్రాక్‌ను గోతులు లేకుండా గుత్తేదారు అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

వాకింగ్ ట్రాక్‌లో వాహనాలు తిరగనివ్వొద్దు

స్టేడియంలోని వాకింగ్ ట్రాక్‌లోకి వాహనాలు రాకపోకలను సాగించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఎటువంటి వాణిజ్య కార్యకలాపాలకు ఇవ్వకూడదు. వాకింగ్ ట్రాక్‌లో ఇనుప కడ్డీలు పాతకుండా చూడాలి. ఈవిధంగా చేయడం వల్ల ట్రాక్ పాడైపోతుంది. ట్రాక్ పరిశీలనలో ఉందని నెలలుగా చెబుతున్నారు. ఇప్పటికైనా పూర్తిగా అభివృద్ధి చేసి ఇబ్బందుల్లేకుండా చూడాలి.

-షేక్ లాల్‌వజీర్, వాకర్స్ సంఘం నేత

నగరపాలక సంస్థలో అంతర్గత బదిలీలు

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థలో పరిపాలన కారణాల నేపథ్యంలో పలు సర్కిళ్లలో భాగంగా కమిషనర్ పులి శ్రీనివాసులు పలువురు ఉద్యోగులను అంతర్గతంగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. జీఎంసీ వేస్ట్ జరుగా ఉన్న షేక్ బాలాజీబాషాను సీ సెక్షన్, లీగల్‌సెల్, ఎస్టేట్ విభాగం ఇన్‌ఛార్జిగా, పట్టణ ప్రణాళిక విభాగం సూపరింటెండెంట్‌గా నియమించారు. ఆర్‌ఓగా, కమిషనర్ పేషీలో విధుల్లో ఉన్న ఎస్.ఎన్.ప్రసాద్ అకౌంటెంట్-1గా బాధ్యతలు అప్పగించారు. అకౌంటెంట్‌గా ఉన్న పి.నరసింహారావును మేనేజరుగా నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారు.

సీఎం హామీలు అమలు చేయాలి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: రాజధాని ప్రాంతంలో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటికీ పరిష్కారం చూపించాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, జాయింట్ కమిషనర్ భార్గవ్‌తేజలతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాజధాని రైతుల సమస్యలపై కేంద్ర మంత్రి అధికారులతో చర్చించారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్, వీధి పోటు, గ్రామకంఠం, అసైన్డ్ ల్యాండ్, భూసేకరణ, లేఅవుట్ డెవలప్‌మెంట్ సమస్యలపై జాబితా సిద్ధం చేయాల్సి ఉందని పెమ్మసాని అన్నారు. మంత్రి నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌తో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. రాజధానిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు, ఉద్యోగుల క్వార్టర్లు, విదేశ్ భవన్, పెండింగ్ అంశాలు ఉంటే జాబితా ఇవ్వాలన్నారు.

జోగి రమేష్‌కు కులం ఆపాదించడం జగన్ అవివేకం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: నకిలీ మద్యం మాఫియాతో చేతులు కలిపి అక్రమాలకు పాల్పడిన మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టు అయితే.. దానికి కులం ఆపాదించడం జగన్ అవివేకమని ఎమ్మెల్యే గళ్లా మాధవి విమర్శించారు. గుంటూరులోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. 'పోలీసులు జోగి రమేష్‌ను అరెస్టు చేయడాన్ని స్వాగతిస్తున్నాం. ప్రజలకు హాని తలపెట్టే ఇటువంటి అరాచక శక్తులకు శిక్ష పడినప్పుడే న్యాయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరుగుతుంది. ఈ అరెస్టుతో ప్రజల్లో ధైర్యం పెరిగింది. రాజకీయం పేరుతో చెలరేగిన వైకాపా అరాచక శక్తులకు గట్టి దెబ్బ ఇది. తప్పులు చేసి దొరికిపోయిన దొంగలు తప్పించుకునేందుకు కులాన్ని అడ్డం పెట్టుకుంటున్నారు. బడుగు, బలహీనవర్గాల వారు సైతం జోగి అరెస్టును సమర్థిస్తున్నారు. సమాజానికి చెడు చేసేందుకు ప్రయత్నించిన ఇటువంటి అరాచక శక్తులను ఏరిపారేయాలని బీసీలు గట్టిగా కోరుకుంటున్నారు'.. అని పేర్కొన్నారు.

ఉదయం ఉక్కపోత.. రాత్రికి జోరువాన

గోరంట్ల: జిల్లాపై వరుణుడు ఉన్నట్టుండి ప్రతాపాన్ని చూపాడు. ఆదివారం ఉదయం నుంచి తీవ్ర ఉక్కపోతతో అల్లాడిపోయిన ప్రజలు ఆదివారం రాత్రి సమయంలో కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. రాత్రి 9 గంటల సమయంలో కురిసిన వర్షంతో ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. అరగంటకు పైగానే వర్షం కురవడంతో వాతవారణం ఒక్కసారిగా చల్లబడింది.

సెమీఫైనల్స్‌కు ఎల్వీఆర్ క్రీడాకారులు

పోటీలో తలపడుతున్న క్రీడాకారుడు

గుంటూరు క్రీడలు: ఎల్వీఆర్ సన్స్ క్లబ్‌లో ఏపీ స్టేట్ బిలియర్డ్స్, స్నూకర్ ర్యాంకింగ్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. బిలియర్డ్స్‌లో ఎల్వీఆర్ క్లబ్ క్రీడాకారులు శంకరరావు, శ్రీనివాసరావులు సెమీఫైనల్స్‌కు చేరారు. బిలియర్డ్స్ విభాగంలో శ్రీనివాసరావు 3-1 స్కోర్‌తో సుశీల్‌పై, శంకరరావు 3-0 స్కోర్‌తో సాగన్‌పై విజయం సాధించారు. స్నూకర్స్‌లో అఖిల్ 3-0 స్కోర్‌తో సోమేశ్వరరావుపై, శంకరరావు 3-0 స్కోర్‌తో చంద్రశేఖర్‌పై, శివశర్మ 3-1 స్కోర్‌తో శ్రీనివాస్‌పై విజయం సాధించారు.

రహదారిలోనే చెత్త.. రాకపోకలు సాగించేదెలా..?

సంతోష్‌నగర్ నుంచి నల్లపాడు రోడ్డులో చెత్త కుప్పలు

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: జీఎంసీ ప్రజారోగ్య విభాగం పనితీరు నానాటికీ తీసికట్టుగా ఉంటోంది. స్వచ్ఛతకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పుకోవడమే గానీ క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కరించేందుకు పకడ్బందీగా వ్యవహరించడం లేదు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మంచి ఫలితాలు సాధించేందుకు ఏకంగా ఒక ఉద్యోగిని నియమించారు. వేరే రాష్ట్రాల స్టడీ టూర్‌లకు వెళ్లొస్తున్నారు. నివేదికల తయారీపైనే దృష్టి సారించి క్షేత్ర స్థాయిలో పారిశుద్ధ్యం గాలికొదిలేస్తున్నారు. దీంతో పశ్చిమ నియోజకవర్గం వెంకటరమణ కాలనీ, సంతోష్‌నగర్‌ల ఎక్స్‌టెన్షన్ మొత్తం డంపింగ్‌యార్డులా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టకుంటే ఆ రహదారి పూర్తిగా డంపింగ్‌యార్డులా మారి చుట్టుపక్కల ప్రాంతాల వాసులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

వానొస్తే.. సీట్లు మార్చుకోవాల్సిందే

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: నగరంలో వర్షం కురిస్తే చాలు.. డీఆర్‌డీఏ కార్యాలయ సిబ్బంది సీట్లు సర్దుకుంటారు. ఇది ఒకసారి, రెండు సార్లు కాదు.. వర్షం కురిసినప్పుడల్లా ఇదేవిధంగా సీట్లను మార్చుతూ కంప్యూటర్లు తడవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. భవనం స్లాబ్ పాడవడమే దీనికి కారణం. మొంథా తుపాను ప్రభావంతో మూడు, నాలుగు రోజులు భారీ వర్షాలు కురవడంతో స్లాబ్ నాని నీరు కిందకు జారడంతో సిబ్బంది కంప్యూటర్లపై తెరలు కప్పారు. వారు కూర్చున్న కుర్చీలు, బల్లలను పక్కకు జరుపుకోవడం నిత్యకృత్యంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఛాంబర్‌లోనూ నీరు చేరడంతో అధికారి అసౌకర్యానికి గురయ్యారు. ఏళ్లుగా ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికీ భవనం మరమ్మతులకు చొరవ చూపడంలేదు. శిథిల భవనానికి మరమ్మతులు చేయాలని, లేకపోతే కొత్తదైనా నిర్మించాలని సిబ్బంది కోరుతున్నా ఉన్నతాధికారుల నుంచి ఆమోదం లభించడం లేదు. దీంతో శిథిల భవనంలోనే భయపడుతూ విధులు నిర్వహిస్తున్నామని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా డీఆర్‌డీఏ భవనం

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

హిందూ కళాశాలలోని ఏకాదండయ్య పంతులు హాలులో ఆదివారం రాత్రి జరిగిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. రాధామాధవ రసరంజని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నృత్య ప్రదర్శనల్లో నాట్య గురువు వేణుగోపాలరావు (విజయవాడ) శిష్యులు పలువురు కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించి అందరి మన్ననలు అందుకున్నారు. రాధామాధవ నాట్య క్షేత్రం విద్యార్థుల జానపద నృత్యాంశాలు, అద్దంకి నాగరాజు టాకింగ్‌డాల్ తదితర అంశాలు ప్రదర్శితమయ్యాయి. నాట్యాచార్య షేక్ ఖలీల్ కార్యక్రమాలను పర్యవేక్షించారు

-న్యూస్‌టుడే, గుంటూరు సాంస్కృతికం

పేరులో భాగ్యం.. ప్రగతిలో దూరం..

భాగ్యనగర్‌లో దిగజారుతున్న పారిశుద్ధ్యం

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే

శివారు కాలనీల అభివృద్ధి విషయంలో అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నా ఎవరు అడుగుతారులే అన్న ధీమాతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని 36వ డివిజన్ భాగ్యనగర్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఇక్కడ కనీసం సైడు కాలువలు లేకపోవడంతో ఇళ్లలో వాడుకున్న మురుగునీరు రహదారుల పైకి, ఖాళీ స్థలాల్లోకి చేరుతోంది. ఓవైపు భరించలేని దుర్వాసన, మరోవైపు దోమల వ్యాప్తి అధికంగా ఉండి బెంబేలెత్తిపోతున్నారు. ప్రధాన రహదారి మినహా అడ్డరోడ్ల నిర్మాణాలు చేయకపోవడంతో వర్షం వస్తే బురదమయంగా మారుతున్నాయి. ఇటుగా వెళ్లాలంటే వాహనదారులు అగచాట్లు పడుతున్నారు. పారిశుద్ధ్యం దిగజారడంతో పందుల సంచారం పెరిగి ఎక్కడ అనారోగ్యం బారిన పడి ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తుందోనని స్థానికులు ఆందోళన చెబుతున్నారు.

భాగ్యనగర్‌లో సైడు కాలువలు లేక రోడ్డుపై చేరుతున్న మురుగునీరు

కౌన్సిల్‌లో పలుమార్లు ప్రస్తావించినా..

భాగ్యనగర్‌లో సమస్యలపై స్థానిక కార్పొరేటర్ ఉడుముల లక్ష్మి పలుమార్లు కౌన్సిల్ సమావేశాల్లో ప్రస్తావించారు. అభివృద్ధికి ప్రతిపాదనలు చేసి పనులు చేపట్టాలని కోరినా అధికారులు స్పందించిన దాఖలాలు లేవు. ఇళ్ల మధ్య అపరిశుభ్ర ఖాళీ స్థలాలు పెద్ద సమస్యగా పరిణమించాయి. ఐదు లైన్లుగా విస్తరించిన భాగ్యనగర్‌లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఇంజినీరింగ్ అధికారులు వెంటనే క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రతిపాదనలు తయారు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సైడు కాలువల నిర్మాణంతో పాటు అడ్డరోడ్ల నిర్మాణం, ఖాళీ స్థలాలను శుభ్రం చేసుకునేలా ఆయా యజమానులకు నోటీసులు ఇచ్చేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గోతులమయంగా సాయినగర్ వైపు రహదారి

శాలివాహనుల సమస్యల పరిష్కారానికి కృషి

వన సమారాధనలో కుమ్మర శాలివాహన సంఘ నాయకులు

ఏటీ అగ్రహారం: ఆంధ్రప్రదేశ్ కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన ఆదివారం జరిగింది. పేరేచర్ల ప్రధాన రోడ్డులోని పెట్రోల్ బంక్ పక్కన మైదానంలో సంఘ జిల్లా అధ్యక్షుడు ఇందుర్తి శివన్నారాయణ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర, శాలివాహన కార్పొరేషన్ అండ్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ పి.ఈశ్వర్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పద్మ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బెజవాడ ఆదిశేషయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడు పారేళ్ల బసవేశ్వరరావు, ఉమ్మడి గుంటూరు జిల్లా సంఘ నాయకులు, కుల సంఘాల పెద్దలు హాజరయ్యారు. తుగ్గలి నాగేంద్ర, పి.ఈశ్వర్‌లు మాట్లాడుతూ శాలివాహనుల సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడు ఇందుర్తి శివన్నారాయణ మాట్లాడుతూ సంఘీయులకు ఏ సమస్య వచ్చినా ముందుండి పోరాడతామన్నారు. బెజవాడ ఆదిశేషయ్య, పారేళ్ల బసవేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా, పట్టణ, యువజన, మహిళా కమిటీ సభ్యులు, మండలాల, నియోజకవర్గాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా కార్తిక సమారాధన

సమారాధనలో అపార్ట్‌మెంట్ వాసులు

నగరపాలకసంస్థ(గుంటూరు): కార్తిక మాసంలో వివిధ సంఘాల సభ్యులు, కుటుంబాలు ఐక్యంగా వనసమారాధనలు చేసుకుంటుంటారు. సమైక్యతకు చిహ్నంగా స్తంభాలగరువు శ్రీఆంజనేయం అపార్ట్‌మెంట్‌లో కార్తిక సమారాధన నిర్వహించారు. చిన్నారులు, మహిళలకు మ్యూజికల్ ఛైర్స్, పరుగుపందెం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నేచురోపతి వైద్యులు ఉమాసుందరి మహిళలకు ఆరోగ్య జాగ్రత్తలు చెప్పారు. తులసి, ఉసిరి మొక్కల నడుమ శ్రీకృష్ణుని ప్రతిమ ఉంచి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్‌ఎం తులసీదాస్, భాస్కరరావు, బుచ్చిబాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కోటేశ్వరరావు మృతి పేదలకు తీరని లోటు

కోటేశ్వరరావు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు నందకిశోర్

నగరంపాలెం, న్యూస్‌టుడే: ఐఎంఏ గుంటూరు శాఖ సభ్యుడు, సీనియర్ వైద్యుడు డాక్టర్ పులిపాటి కోటేశ్వరరావు మృతి పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు తీరని లోటని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.నందకిశోర్ అన్నారు. డాక్టర్ కోటేశ్వరరావు భౌతికకాయాన్ని ఆదివారం ఆయన నివాసంలో సందర్శించిన డాక్టర్ నందకిశోర్, కన్నా మాస్టార్, శ్రీనివాసరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ కోటేశ్వరరావు తన పేరున, తల్లిదండ్రుల పేరున ట్రస్టు ఏర్పాటు చేసి, సంపాదించిన మొత్తం ఆస్తి ఇచ్చేశారన్నారు. ట్రస్ట్ ద్వారా నగరంలో కల్యాణ మండపం, బాలికలు, బాలుర వసతి గృహాలను నిర్మించాలనుకోవడం, భవన నిర్మాణాలు ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ నగర శాఖ అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్, కార్యదర్శి బి.సాయికృష్ణ, ఐఎంఏ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు డాక్టర్ డి.అమరలింగేశ్వరరావు, డాక్టర్ ఆర్.నాగేశ్వరరావు, పి.నిర్మలారాణి తదితరులు ఉన్నారు.

అప్పులపాలై యువకుడి బలవన్మరణం

పట్టాభిపురం: అప్పులపాలై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హిమనినగర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హిమనినగర్‌కు చెందిన మహేష్‌బాబు(27) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మద్యం తాగే అలవాటు ఉంది. ఆయన తన తండ్రి శంకరరావు వద్దకు వెళ్లి రూ.1,50,000 వరకు అప్పు ఉంది.. స్థలాన్ని బ్యాంకులో పెట్టి వచ్చిన సొమ్ముతో అప్పు తీరుద్దామని చెప్పాడు. తర్వాత మాట్లాడదామని తండ్రి చెప్పారు. మనస్తాపం చెందిన కుమారుడు ఇంటికి వెళ్లి ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి గమనించి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. శంకరరావు ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మధుమేహం నియంత్రణ మన చేతుల్లోనే

మాట్లాడుతున్న డాక్టర్ కాశ్యప

బ్రాడీపేట, న్యూస్‌టుడే: మధుమేహం నియంత్రణ మన చేతుల్లోనే ఉందని ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ వి.బి.కాశ్యప జన్నాభట్ల అన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో సమావేశం సర్వీస్ హెల్త్‌ఆర్గనైజేషన్, హైపర్‌టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా మధుమేహ నిరోధక మాసం సందర్భంగా 'మధుమేహం-కారణాలు-నిర్ధారణ పరీక్షలు-చికిత్స-నిరోధక మార్గాలు' అనే అంశంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సేవకుమార్ అధ్యక్షత వహించారు. డాక్టర్ కాశ్యప మాట్లాడుతూ మధుమేహుల్లో చాలా కాలం పాటు ఎలాంటి లక్షణాలు కనిపించవని, అయితే బయటపడిన తర్వాత కూడా నిర్లక్ష్యం చేస్తుంటారన్నారు. వైద్యులను సంప్రదించేసరికే శరీర అవయవాల్లో అనేక అనారోగ్య, నిర్మాణాత్మక మార్పులు జరిగిపోతున్నాయన్నారు. 30 ఏళ్లు పైబడిన వారిలో ఇప్పటికే ప్రతి వంద మందిలో 14 మంది ప్రీడయాబెటిక్ దశలో ఉన్నారని తెలిపారు. వీరంతా తగిన నిరోధక చర్యలు చేపట్టకపోతే మధుమేహ బాధితులుగా మారి ఆరోగ్య పరంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడక తప్పదన్నారు. ప్రతి ఒక్కరు మధుమేహంపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఏటా ఒక్కసారైనా మధుమేహ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వైద్య శిబిర ఛైర్మన్ టి.ధనుంజయ్‌రెడ్డి, డాక్టర్లు తేజస్విని, చల్లా చైతన్య, ఎస్‌హెచ్‌వో మేనేజర్ పి.నిర్మలారాణి, పావులూరి రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఆధునిక నేత్ర వైద్య చికిత్సలు

ఎమ్మెల్యే మాధవికి మొక్క అందజేస్తున్న ఆసుపత్రి యాజమాన్యం

గోరంట్ల, న్యూస్‌టుడే: లక్ష్మీపురంలో అత్యాధునిక సదుపాయాలతో గీతా కంటి ఆసుపత్రి ఆదివారం ప్రారంభమైంది. కార్యక్రమంలో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, నక్కా ఆనందబాబు, గళ్లా మాధవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఆసుపత్రిని అన్ని సదుపాయాలతో అందుబాటులోకి తీసుకురావడం వల్ల నగర ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. గీతా కంటి ఆసుపత్రి అధినేత డాక్టర్ పి.నరసింహారావు మాట్లాడుతూ మెట్రో నగరాలకు దీటుగా అన్ని ఆధునిక కంటి శస్త్రచికిత్సలు, నేత్ర వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. డాక్టర్ పి.మోహనకృష్ణ, డాక్టర్ బి.ప్రత్యూష, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఏపీ టీజీ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

గుంటూరు విద్య: ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులు, సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ అన్నారు. ఆదివారం అరండల్‌పేట సెయింట్ ఇగ్నేషియస్ పాఠశాలలో ఏపీ టీచర్స్ గిల్డ్(ఏపీటీజీ) ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సభకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఖయూంబాష అధ్యక్షత వహించారు. ఎయిడెడ్ విద్యాసంస్థల నుంచి ఇటీవల ఎంఈవోలుగా బాధ్యతలు స్వీకరించిన బి.సత్యనారాయణసింగ్, ఎన్.ఉషాకుమారి, బి.శ్రీనివాసరెడ్డిలను, మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణను సత్కరించారు. ఈసందర్భంగా ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా వీఎల్.బాలశౌరిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.వరప్రసాద్, సహాధ్యక్షులుగా ఏకా సాయికుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా షేక్ యజదానీబాషాలు ఎన్నికయ్యారు.

కామన్ సర్వీస్ రూల్స్‌పై పోరాటానికి సమాయత్తం

గుంటూరు విద్య: కామన్ సర్వీస్ రూల్స్‌పై న్యాయ పోరాటానికి సమాయత్తం కావాలని ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఏపీ ప్రధానోపాధ్యాయ సంఘం కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షులు ఆవుల తిరుమలేష్ అధ్యక్షత వహించారు. సంఘం రాష్ట్ర వజ్రోత్సవాలను రాజధాని పరిసర ప్రాంతాల్లో మంత్రి లోకేశ్ నియోజకవర్గంలో నిర్వహిస్తే బాగుంటుందని సభ్యులందరూ అభిప్రాయపడినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

ప్రకృతిని కాపాడుకోవడం అందరి బాధ్యత

మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణంరాజు

గోరంట్ల, న్యూస్‌టుడే: ప్రకృతిని కాపాడుకోవడం అందరి బాధ్యత అని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కృష్ణంరాజు అన్నారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో ఏసీ కళాశాలలో ఎన్ఎంఎంఎస్ శిక్షణకు హాజరయ్యే విద్యార్థుల చైతన్య సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణంరాజు మాట్లాడుతూ భూమి మనకు లభించిన వరమని, దాన్ని కాపాడుకోకపోతే భవిష్యత్తు తరాలకు జీవనాధారం ఉండదన్నారు. ప్రతి పౌరుడు ప్రకృతికి మిత్రుడిగా మారాలని, నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు. వ్యర్థాల నిర్వహణ యాజమాన్యం అలవాటు చేసుకోవాలన్నారు. రసాయనాల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని వ్యవసాయదారులను కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి కె.సతీష్, మానవత సంస్థ ఛైర్మన్ పావులూరి రమేష్, అధ్యక్షుడు కోటా శ్రీనివాసరావు, డైరెక్టర్ ఉప్పాల సాంబశివరావు, జి.ఆనంద్, చావా శివాజీ, కె.పావని, రిసోర్స్‌పర్సన్లు గేరా ప్రకాష్, బేతపూడి మంగారావు, రెహమాన్, ఆదినారాయణ, జగదీష్, అరుణాచలం, ఎం.రాధాకృష్ణ పాల్గొన్నారు.

NOTICE

IN THE COURT OF THE XII ADDL. DIST. JUDGE CUM FAMILY COURT JUDGE:: GUNTUR

F.C.O.P No. 869 / 2023

Between :
Kalavakuntla Ravi Kumar. ...Petitioner
And
Kalavakuntla Madhuri ...Respondent
To,
Kalavakuntla Madhuri,W/o. Kalavakuntla Ravi Kumar, R/o.Door No: 26-38-82/1, 2nd Lane, A.T. Agraharam, Hanuman Nagar, Guntur.

పై నెంబరు ఓ.పి.లోని పిటీషనరు రెస్పాండెంటుతో జరిగిన వివాహంను రద్దు పరచమని కోరుచూ దాఖలు చేసిన పిటీషనులో రెస్పాండెంటు అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని సార్లు నోటీసులు పంపించినను ముట్టనందున మీకు నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది.27-11-2025కి వాయిదావేసినారు. కావున వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
వాయిదా తేదీ.: 27-11-2025

యరసాని అజయ్ కుమార్,
పిటీషనరు తరపు అడ్వకేట్, గుంటూరు.సెల్: 9490245603

In the court of the Additional District Judge, Ramanathapuram
M.C.O.P.No.216/2022
Minor.Kirubakaran, age 16/25, S/o Madhavan ... Petitioner
Vs
Ramesh Babu, S/o.Chinna Masthan Rao, **122-5-328** 1st Lane Ratnagiri Nagar near current office, Guntur - 522006, AndhraPradesh ... Respondent

Notice

It is hereby noticed that my client Minor.Kirubakaran, age **14/23,** S/o. Madhavan residing at Munusuvalasai, Valantharavai, Ramnad District, Tamil Nadu has filed a claim petition against the above respondent before the Hon'ble Additional District Court Ramanathapuram in MCOP No.216/2022 in which the hearing has been posted on 6.11.2025, if any objections, may be given either in person or by his advocate. Unless, exparte order will be passed upon him.

Advocates: Mr.Deva Manoharan Martin, B.A.,B.L., Mr.Deva Prithi Dhinaharan, B.A.,B.L., Mr.N.Manickam, B.A.,B.L., Mr.R.Muthukumar, M.A.,B.L.,

In the court of the Additional District Judge, Ramanathapuram
M.C.O.P.No.211/2022
Vengateswaran, age 23/25, S/o Madhavan ... Petitioner
Vs
Ramesh Babu, S/o.Chinna Masthan Rao, **122-5-328** 1st Lane Ratnagiri Nagar near current office, Guntur - 522006, AndhraPradesh ... Respondent

Notice

It is hereby noticed that my client Minor.Kirubakaran, age **14/23,** S/o. Madhavan residing at Munusuvalasai, Valantharavai, Ramnad District, Tamil Nadu has filed a claim petition against the above respondent before the Hon'ble Additional District Court Ramanathapuram in MCOP No.216/2022 in which the hearing has been posted on 6.11.2025, if any objections, may be given either in person or by his advocate. Unless, exparte order will be passed upon him.

Advocates: Mr.Deva Manoharan Martin, B.A.,B.L., Mr.Deva Prithi Dhinaharan, B.A.,B.L., Mr.N.Manickam, B.A.,B.L., Mr.R.Muthukumar, M.A.,B.L.,

GENERAL NOTICE

IN THE COURT OF THE PRL.CIVIL JUDGE (SENIOR DIVISION):: GUNTUR

SOP No: 80 / 2025

BETWEEN :
1)Meda Sarojini,W/o. Late Sambasiva Rao, 2) Meda Sireesha Lakshmi,D/o. Late Sambasiva Rao, 3)Meda Srikanth, S/o. Late Sambasiva Rao, (3rd Petitioner is an "Authorized GPA Holder" for the 2nd Petitioner) All R/o.Door No.2-6-4, Old Post Office Road Stambalagaruvu, Guntur, Guntur Dist.-522006. ...Petitioners
And
Nil .... Respondents

The petitioners herein for grant of succession certificate declaring them as legal heirs of the deceased late Meda Sambasiva Rao, S/o. Ankamma, R/o. Door No.2-6-4, Old Post Office Road Stambalagaruvu, Guntur, Guntur Dist. - 522006. On account of his Death on dated: 04-12-2022 in the above said court. So those who are interested to object the claim of the petitioners may appear in person on through advocate on dated **01-12-2025** from **10-30am** in the above mentioned court.
(By order of the Court)

P.V.S.G. PRASAD, Smt. K. SRIVIDYA,
Advocates, Vijayawada- 520003. Cell: 9849786173

(c) eenadu

అమ్మాయిలు అదరగొట్టారు..

అభిమానులు జై కొట్టారు..

విజయం మనదే..

ఆంధ్ర క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెర

ముంబయి వేదికగా ఆదివారం జరిగిన మహిళల క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌ను విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో తెరపై వీక్షించేందుకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో భారత్ విజయం సాధించడంతో అభిమానులు కేరింతలు కొడుతూ సంబరాలు చేసుకున్నారు. - ఈనాడు, అమరావతి

విలువలు వీడి.. విర్రవీగి జోగి..!

★ మూడు నియోజకవర్గాల్లోనూ భారీగా అక్రమాలు ★ పెడనలో అధికారులను సైతం బెంబేలెత్తించి...

వైద్య పరీక్షల కోసం జీజీహెచ్‌కు తరలిస్తుండగా పోలీసులపై జోగి అసహనం

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో జోగి రమేశ్ అడుగుపెట్టిన ప్రతి నియోజకవర్గంలోనూ ప్రశాంత వాతావరణం మాయమైపోతుందనే అపవాదు ఉంది. మైలవరం, పెనమలూరుల్లో.. అక్కడి స్థానిక ఎమ్మెల్యేలను కూడా అధికారంలో ఉండగా.. తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. పెడనలో ఏకంగా అవినీతి సామ్రాజ్యాన్నే స్థాపించారు. ఈ మూడు నియోజకవర్గాల్లోనూ స్థానికంగా ఉండే.. ఇసుక, మట్టి, బుసక.. నిల్వలపై ప్రధానంగా దృష్టిపెట్టి తన ఆధీనంలోకి తెచ్చుకునేవారు. గత ఎన్నికల ముందు తన సోదరుడు, కుమారుడు, బాబాయి, ఇద్దరు ప్రధాన అనుచరులను రంగంలోకి దింపి విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడ్డారు. ఇసుక రీచుల్లో పాగా వేసి డబ్బులను భారీగా దోచుకున్నారనే విమర్శలున్నాయి. ఇదేంటని అక్కడి ఎమ్మెల్యేలు నిలదీస్తే.. వారిపై సామాజిక మాధ్యమాల వేదికగా బురదజల్లే ప్రయత్నం చేసేవాళ్లు. మైలవరం, పెనమలూరుల్లోనూ ఇలాగే ఎన్నికల ముందు చేశారు. తమ వసూళ్లకు అడ్డొస్తే.. సొంత పార్టీ నేతలనైనా బలి చేసేందుకు వెనుకాడేవారు కాదు.

పెడన నియోజకవర్గాన్ని జోగి, అతని వర్గం పదేళ్లు శాసించింది. 2009, 2019లో రెండుసార్లు పెడన నుంచే గెలిచారు. 2009లో తొలిసారి పెడనకు వచ్చిన జోగి.. నియోజకవర్గంలో తనకు బలమైన అనుచర వర్గాన్ని తయారు చేసుకున్నారు. వారి ద్వారానే పనులన్నీ చక్కబెట్టేవారు. ఎక్కడా తెర ముందుకు మాత్రం జోగి వచ్చేవారు కాదు. ఏ అధికారి అయినా తాను చెప్పినట్టు నడుచుకోవాల్సిందే. తన ఆదేశాలను పాటించని అధికారులను ముప్పతిప్పలు పెట్టేవారు. ప్రభుత్వ శాఖలతో పనిలేకుండా నేరుగా అనుమతులిచ్చి పనులను చక్కబెట్టించేవారనే ఆరోపణలు జోగిపై తీవ్రస్థాయిలో ఉన్నాయి. మడ అడవులను చెరువులుగా మార్చేందుకు, అక్రమ నిర్మాణాల అనుమతుల విషయంలో.. పెడనలో విచ్చలవిడిగా నిబంధనలకు పాతరేశారు. జోగి హయాంలో నిర్మించిన అనేక అక్రమ భవనాలకు ఇప్పటికీ సరైన అనుమతులు లేవు. ఇప్పుడు వాటిపై అధికారులు దృష్టిసారిస్తే.. అనేక అవకతవకలు వెలుగులోకి వస్తాయి.

దృష్టిపెడితే భారీగా అక్రమాలు..

కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గం కృత్తివెన్ను మండలం ఇంతేరు గ్రామం పరిధిలో సముద్ర తీరంలో ఉన్న అత్యంత విలువైన మడ అడవులను భారీగా కొట్టేసి ప్రకృతి సమతుల్యతను దెబ్బకొట్టారు. 2021 నుంచి 24 మధ్య కాలంలో ఈ విధ్వంసం భారీగా జరిగింది. సముద్ర తీరప్రాంతంలోని చిత్తడి నేలల్లో పెరిగే మడ అడవుల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. తుపాన్లు వచ్చిన సమయంలో ఇవి తీవ్రతను తగ్గిస్తాయి. ఈ అడవుల్లో జీవపర్యావరణం కీలకం. పలురకాల జంతుజాలం అభివృద్ధి చెందుతుంది. అంతరించే జాతులు వృద్ధి చెందుతుంటాయి. ఇంత ప్రాధాన్యం ఉన్న మడ అడవులను విచ్చలవిడిగా జోగి ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న సమయంలో కొట్టేశారు. కానీ ఇంతవరకూ ఒక్క అధికారి కూడా ఇటువైపు కన్నెత్తి చూసింది లేదు. కనీసం కేసు కూడా ఇంతవరకూ నమోదు చేయలేదు. రెవెన్యూ, అటవీశాఖ సంయుక్తంగా సర్వే చేస్తే.. అనేక అక్రమాలు వెలుగులోకి వస్తాయి. - ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం, పెడన

ఎక్సైజ్ స్టేషన్ వద్ద వైకాపా నాయకులు తలశిల రఘురాం, పేర్ని నాని తదితరులు

ఎక్సైజ్ స్టేషన్ ముందు పోలీసులతో వాగ్వాదానికి దిగిన జోగి అనుచరులు

కథ అడ్డం తిరిగింది..!

ఈనాడు, అమరావతి

వైకాపా పాలనలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం దర్యాప్తు, పెద్దల పాత్రపై వెలుగుచూస్తున్న సంచలనాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు జోగి రమేశ్ వదిలిన బాణంగా అద్దేపల్లి జనార్దనరావు తెర మీదకు వచ్చారు. ఆయన్ని పావుగా వాడుకుని గుడ్డకాల్చి కూటమి సర్కారుపై వేయాలని వైకాపా అరాచకం రాసిన కట్టుకథ అడ్డం తిరిగింది. జనార్దనరావు అరెస్టుతో లాగిన తీగ డొంక మొత్తాన్ని కదిలించింది. ఈ వ్యవహారంలో అద్దేపల్లి పాత్రధారి మాత్రమే అని అసలు సూత్రధారి జోగి రమేశ్ అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్న క్రమంలో ఆదివారం ఆయన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

చిన్నప్పటి నుంచి తెలుసు..

జోగి రమేశ్ ఇల్లు అద్దేపల్లి దుకాణం దగ్గరే ఉంటుంది. ఆ సమీపంలోనే ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నకిలీ మద్యం సరఫరా జరిగింది. వీరిద్దరికి చిన్నతనం నుంచి మంచి పరిచయాలున్నాయి. అద్దేపల్లి ఎన్నికల ఖర్చులకు సైతం జోగికి గతంలో భారీగా డబ్బులు ఇచ్చినట్లు ఎన్నికలకు ముందు నియోజకవర్గంలో పెద్ద చర్చ జరిగింది. అద్దేపల్లి ఇంట్లో ఏ కార్యక్రమం జరిగినా జోగి హాజరవుతుంటారు.

కూటమి సర్కారుపై బురదజల్లే నాటకానికి తెర

జోగి వారు కలిసి ఉన్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. వీరిద్దరి మధ్య జరిగినట్టు చెబుతున్న వాట్సప్ సంభాషణలు సైతం వెలుగులోకి వచ్చాయి. జోగి ఎమ్మెల్యే, మంత్రిగా పని చేసిన సందర్భంలో అద్దేపల్లి వ్యాపారాలకు అండగా నిలబడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. అద్దేపల్లి గతంలో ఆఫ్రికా దేశాల్లో మద్యం వ్యాపారం చేసినట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. అక్కడ మద్యం తయారీ విధానాన్నే ఇక్కడ కూడా అనుసరించినట్లు గుర్తించారు. విషయం వెలుగులోకి వస్తుందన్న నేపథ్యంలో ఆఫ్రికా నుంచి తిరిగి రావాల్సిన అద్దేపల్లి జనార్దనరావు రాకుండా అక్కడే ఆగిపోయారు. తనకు అసలు సంబంధమే లేదంటూ ఓ వీడియో సైతం విడుదల చేశారు. తర్వాత గన్నవరం విమానాశ్రయంలో దిగిన తర్వాత సైతం ఈ కేసుతో తనకు ఏ సంబంధం లేదని, కావాలనే ఇరికిస్తున్నారని మీడియాతో మాట్లాడారు. విచారణలో అసలు విషయాలు వెల్లడించారు.

వైకాపా పాలనలోనూ అద్దేపల్లితోనే..

'జోగి రమేశ్ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన నేతృత్వంలోనే నకిలీ మద్యం తయారు చేశా. ఆయన ఆదేశాలతోనే హైదరాబాద్ నుంచి తెచ్చిన మద్యాన్ని నా బార్‌లో అమ్మేవాడిని. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా నకిలీ మద్యం దందా ఆపేశాం. మళ్లీ ఈ ఏడాది ఏప్రిల్‌లో రమేశ్ తన తమ్ముడి ద్వారా నన్ను పిలిపించి నకిలీ మద్యం తయారు చేసి కూటమి ప్రభుత్వంపై బురద చల్లాలని చెప్పారు. అన్నీ తాను చూసుకుంటానని భరోసా ఇచ్చారు. రూ.3కోట్లు ఇస్తానని ప్రలోభ పెట్టారు.' అని పోలీసులకు ఇచ్చిన వీడియో వాంగ్మూలంలో అద్దేపల్లి కుండబద్దలు కొట్టారు. ఈ పరిణామం తర్వాతే జోగి, అద్దేపల్లి బంధం, జోగికి సైతం కల్లు, మద్యం వ్యాపారం చేసిన నేపథ్యం ఉండడం..జనార్దనరావుతో మంచి సంబంధాలు ఉన్నప్పటికీ 'జనార్దన్‌కు నాకు సంబంధం లేదని' అని జోగి బహిరంగంగా చెప్పడం..ఇలా అనేక అనుమానాస్పద వ్యవహారాలతో జోగి రమేశ్‌కు ఉచ్చు బిగుసుకుంది.

డిసెంబరు 13న జాతీయ లోక్‌అదాలత్

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు డిసెంబరు 13న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా జడ్జి జి.గోపి తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని మచిలీపట్నం, విజయవాడ, గుడివాడ, నూజివీడు, నందిగామ, అవనిగడ్డ, కైకలూరు, గన్నవరం, తిరువూరు, జగ్గయ్యపేట, బంటుమిల్లి, మైలవరం, ఉయ్యూరు, మొవ్వ ఇలా అన్ని కోర్టుల్లోనూ ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. దీని కోసం ఆయా న్యాయస్థానాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద క్లెయిమ్‌లు, సివిల్ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు తమ న్యాయవాదిని సంప్రదించి ఇందులో కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు.

'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' నేడు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం తెలిపారు. కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని అన్ని మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ సమీపంలోని మండల, డివిజన్ కేంద్రాల్లో అర్జీలు సమర్పిస్తే అధికారులు తగు చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు.

✦ **మీకోసం వెబ్‌సైట్‌లోనూ అర్జీల దాఖలు..** ప్రజలు తమ సమస్యల అర్జీలను మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ దాఖలు (నమోదు) చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఇందులో దాఖలైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నంబరుకు నేరుగా ఫోన్ చేయవచ్చని ఆయన వివరించారు.

కలరా ఆసుపత్రికి ఆ పేరెలా వచ్చిందీ..

విజయవాడలోని చిట్టినగర్ సమీపంలో కలరా ఆసుపత్రి సెంటర్ ఇది. నాడు సర్ ఆర్థర్ కాటన్ పర్యవేక్షణలో ఆనకట్ట నిర్మిస్తున్న రోజుల్లో కలరా వ్యాధి ముమ్మరంగా వ్యాపించింది. ప్రజలు వేల సంఖ్యలో మృతి చెందుతున్న నేపథ్యంలో భయాందోళనలు పెరిగిపోతాయన్న దూరదృష్టితో ఆ వ్యాధికి ప్రచారం రానివ్వలేదు. వ్యాధి సోకిన వారిని అప్పట్లో నగరానికి పొలిమేరగా ఉన్న ఊరు చివర క్వారంటైన్‌లో ఉంచడం ప్రధానమని ఆయన భావించారు. అందుకు తగిన ప్రదేశం ఇప్పుడు మనం పిలిచే కలరా ఆసుపత్రి సెంటర్. అప్పుడు తాటాకు పాకలు వేసి రోగులకు నివాసం కల్పించారు. అక్కడే కలరా వ్యాధిగ్రస్థులకు చికిత్స చేయించారు. బయట నుంచి ఆ ప్రాంతానికి జనాన్ని రానివ్వకుండా కట్టుదిట్టం చేయించారు. కలరా వ్యాధి సోకి పెద్ద సంఖ్యలో ఇక్కడ చికిత్స చేయించడం వల్ల కలరా ఆసుపత్రిగా పేరుగాంచింది. కాలానుగుణంగా నగరం పెరిగిన నేపథ్యంలో ఇప్పుడు దానిని సర్కిల్-1 కార్యాలయంగా విస్తరించారు. దానిలో జోనల్ కమిషనర్, ఈఈ-1, శానిటరీ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సచివాలయం, పన్నుల వసూళ్ల కేంద్రం, సచివాలయం నిర్వహిస్తున్నారు. ప్రజలకు పలు సేవలందిస్తున్నారు. - న్యూస్‌టుడే, చిట్టినగర్

ఆలయం ఏలూరు.. మెట్లు కృష్ణా..!

హనుమాన్ జంక్షన్ అభయాంజనేయస్వామిని ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు, దేశ, విదేశాల్లో ఉన్న భక్తులు సైతం కొలుస్తుంటారు. నాలుగు అరటి పండ్లు, కొంత సిందూరం సమర్పించి, చేతులు జోడించి అభయమివ్వు స్వామీ అని ప్రార్థిస్తే చాలు అండగా నిలబడతాడని భక్తుల నమ్మకం. నూజివీడు జమీందారు అటుగా వెళుతూ అలసటతో జంక్షన్‌లో ఆగగా, ఓ వానరం ఆయనకు అరటి పండు తెచ్చి ఇచ్చింది. దీంతో ఆ హనుమంతుడే తన ఆకలి తీర్చాడని నమ్మిన జమీందారు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు స్థల పురాణం ప్రచారంలో ఉంది. గుడి నిర్మాణం, స్వామివారి విగ్రహం ఎంతటి ఆసక్తికరమో, ఆయన కొలువుదీరిన ప్రదేశమూ అంతే ఆసక్తిగా ఉంటుంది. ఎక్కడా లేని విధంగా ఈ ఆలయం రెండు జిల్లాల పరిధిలో ఉండటం విశేషం. ప్రధాన ఆలయం, స్వామివారు ఏలూరు జిల్లాలో ఉంటే, ముందు భాగం, కొన్ని మెట్లు కృష్ణా జిల్లాలో ఉన్నాయి. అందుకే ఈయన రెండు జిల్లాల ప్రజలకు అభయమిచ్చే దేవుడయ్యారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఆలయ నిర్వహణ ఏలూరు జిల్లా వారికి కేటాయించినా, కృష్ణా జిల్లా భక్తులే అధికంగా స్వామివారిని దర్శించుకుని కానుకలు సమర్పిస్తుంటారు. – హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

పాండురంగ ఉత్సవం.. భక్తుల ఆనందం

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : మన బందరు పండగ.. పాండురంగ ఉత్సవం అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలో ప్రసిద్ధి చెందిన పాండు రంగ స్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద నుంచి ప్రారంభమైన ఉత్సవం రాత్రి వరకు సాగింది. మంత్రి రవీంద్ర రథానికి అనుసంధానించిన ట్రాక్టర్ నడిపి ప్రత్యేక పూజలు చేశారు. విచిత్ర వేషధారణలు, కళాకారుల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

స్వామి రథోత్సవంలో ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి కొల్లు

కళాకారుల ప్రదర్శన

ఓఆర్‌ఆర్ 3ఏమాయె..!

☛ ప్రతిపాదనల తయారీలో జాప్యం
☛ ఎన్టీఆర్ జిల్లాలో కొలిక్కి రాని ప్రక్రియ

ఈనాడు, అమరావతి

నవ్యాంధ్ర రాజధాని అమరావతికి మణిహారమైన ఓఆర్ఆర్‌కు కీలకమైన 3ఏ ప్రతిపాదనల తయారీ జిల్లాలో నత్తనడకన సాగుతోంది. పల్నాడు, ఏలూరు జిల్లాల్లో ఇప్పటికే ప్రక్రియ పూర్తికాగా.. కృష్ణా జిల్లాల్లోనూ దాదాపు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఎన్టీఆర్‌లో మాత్రం ఇప్పటికి బాలారిష్టాలు దాటలేదు. 35 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. భూసేకరణ, పరిహారం, నిర్మాణం వంటి అనేక దశల ప్రక్రియ సజావుగా సాగేందుకు ముఖ్యమైన 3ఏ ప్రతిపాదనల తయారీ ఆలస్యం కావడంతో ప్రాజెక్టు ఆలస్యమయ్యే పరిస్థితి ఉంది.

ఇంకా ఆరు గ్రామాలే.. మొత్తం ఓఆర్ఆర్ 23 మండలాల్లో 97 గ్రామాల మీదుగా వెళ్తుండగా ఎన్టీఆర్ జిల్లాలో కంచికచర్ల, మైలవరం, వీరులపాడు, జి.కొండూరు మండలాల్లోని 18 గ్రామాల్లో నిర్మాణం చేయనున్నారు. దీని కోసం ఆయా గ్రామాల్లో సేకరించాల్సిన భూముల వివరాలు, సర్వే నంబర్లు, యజమానుల పేర్లు, ఆ భూమి సాగు చేస్తున్నారా లేక వ్యాపారాలు నిర్వహిస్తున్నారా, నివాసాలున్నాయా ఇలా అనేక వివరాలు పొందు పరిస్తూ 3ఏ ప్రతిపాదనలు తయారు చేస్తారు. ఇప్పటివరకు రెవెన్యూ శాఖ పెరకలపాడు, పొన్నవరం, జగన్నాథపురం, గూడెంమాధవరం, మున్నలూరు, కినికినపాడుకు సంబంధించిన వివరాలు మాత్రమే సిద్ధం చేశారు. అంటే 33.3 శాతం గ్రామాల్లో మాత్రమే ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఇంకా 12 గ్రామాల్లో ప్రక్రియ కొలిక్కి రాలేదు. ఈ ప్రతిపాదనల ఆమోదం అనంతరం అభ్యంతరాల స్వీకరణ, పరిహారం నిర్ధారణ, భూసేకరణకు గెజిట్ ఉత్తర్వులు జారీ.. ఇలా అన్ని పరిణామాలకు ఇదే కీలక దశ. జిల్లా రెవెన్యూ యంత్రాంగం మాత్రం మీనమేషాలు లెక్కించడం గమనార్హం.



పంపినవి సవరించాల్సిందే..

ఓఆర్ఆర్ నిర్మాణం గుంటూరులో 90 కి.మీ మేర జరుగుతుండగా తర్వాత అత్యధికంగా 51 కిలోమీటర్లు ఎన్టీఆర్ జిల్లాలో ఏర్పాటవుతోంది. 700 హెక్టార్ల భూమి అవసరం ఉన్న నేపథ్యంలో మిగిలిన జిల్లాలతో పోలిస్తే కొంత ఆలస్యం అవ్వడానికి ఆస్కారం ఉంది. క్షేత్రస్థాయిలో అంతకు మించి జాప్యం అవుతుండంతో రెవెన్యూ అధికారులు ప్రక్రియను సాగదీస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటి వరకు సిద్ధం చేసిన 6 గ్రామాల 3ఏ ప్రతిపాదనల్లో సైతం రహదారి నిర్మాణానికి తీసుకోబోయే భూమి, దాని సర్వే నంబర్లు మాత్రమే నమోదు చేశారు. నిబంధనల ప్రకారం సదరు సర్వే నంబరులో మొత్తం ఎంత భూమి ఉందన్న విషయం కూడా స్పష్టంగా పొందు పర్చాలి. దీంతో తయారు చేసిన గ్రామాల ప్రతిపాదనలను సైతం సవరించి పంపాల్సి రావడంతో మరింత ఆలస్యమవుతోంది. వేగంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

దెబ్బతిన్న పంటల రక్షణపై కేవీకే శాస్త్రవేత్తతో ఫోన్‌ఇన్ నేడు

డి.సుధారాణి

మొంథా తుపాను పంటల్ని నిలువునా ముంచేసింది. దీనికి ముందు వర్షాలు చాలా వరకు దెబ్బతీశాయి. వరుస అలజడుల నేపథ్యంలో ఉన్న పంటనైనా కాపాడుకోవాలని రైతు తాపత్రయ పడుతున్నాడు. ఈనేపథ్యంలో వరి, మినుము, చెరకు, తదితర పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతుల సందేహాలను నివృత్తి చేయడానికి 'ఈనాడు..మీతోడు' ఆధ్వర్యంలో ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సమన్వయకర్త డి.సుధారాణితో ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. రైతుల సమస్యలు, సందేహాలకు ఆమె సమాధానాలు ఇస్తారు. అన్నదాతలు చేయాల్సిందల్లా కింది సెల్ నెంబరుకు సూచించిన సమయంలో ఫోన్ చేయడమే. – ఘంటసాల, న్యూస్‌టుడే

80082 01253

తేదీ: 03-11-2025 సోమవారం ఉదయం: 11 నుంచి 12 గంటల వరకు

ఆశకు పోతే.. కేసుల మోతే!

◆ అక్రమ లావాదేవీలకు అమాయకులు బలి
◆ బెట్టింగ్, విదేశాలకు డబ్బు తరలింపునకు వినియోగం

ఈనాడు, అమరావతి

☛ **విజయవాడలోని చిట్టినగర్‌కి చెందిన** కూలీని ఇటీవల ఒడిశాకు చెందిన ఒకరు కలిశారు. బ్యాంకులో పొదుపు ఖాతా తెరిచి మూడు నెలలు లావాదేవీలు చేసుకునేందుకు ఇవ్వాలని కోరాడు. ఇందుకు నెలకు రూ.5వేలు చొప్పున ఇస్తానని ఒప్పించి, ఖాతా తెరిపించాడు.

☛ **ఇటీవల క్రికెట్ బెట్టింగ్ కోసం** ఒడిశాకు చెందిన మధ్యవర్తులు కొత్తగా పలువురితో బ్యాంకు ఖాతాలు తెరిపించారు. వారి పాస్ పుస్తకాలు, బ్యాంకు కిట్లు దిల్లీకి పంపారు. కేసు దర్యాప్తులో అద్దె ఖాతాల వ్యవహారం వెలుగుచూడడంతో అమాయకులు పోలీసుల విచారణ ఎదుర్కొంటున్నారు.

అదనపు ఆదాయం ఆర్జించాలన్న ఆశను పలువురు మోసగాళ్లు తమకు అనువుగా మార్చుకుంటున్నారు. మీ బ్యాంకు ఖాతా పాస్‌బుక్, అంతర్జాల, మొబైల్ బ్యాంకింగ్ ఐడీ, పాస్‌వర్డ్‌లను వివరాలు ఇస్తే చాలు కమీషన్ ఇస్తామని ఆశచూపుతున్నారు. ఖాతాలు, యూపీఐ ఐడీల ద్వారా వ్యవహారాలు చక్కబెడుతున్నారు. వీరి మాటలు నమ్మి యువత, గృహిణులు పోలీసు కేసుల్లో చిక్కుకుంటున్నారు.

మధ్యవర్తులే తెరిపిస్తున్నారు..

అమాయకుల నుంచి బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించేందుకు దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో మధ్యవర్తులు పుట్టుకొచ్చారు. సామాజిక మాధ్యమాలు, పరిచయం ఉన్న వారి ద్వారా కమీషన్ల ఎర వేసి ఖాతాలు సేకరిస్తారు. దళారులకు ఠంఛనుగా కమీషన్ ముడుతుంది. ఖాతాదారుల మొబైళ్లకు ఫిషింగ్ లింక్స్ పంపి వాటి ద్వారా ఖాతాల రిజిస్టర్డ్ ఫోన్ నంబరుకు ఎస్ఎంఎస్‌లు వెళ్లకుండా అవి తమకు ఫార్వార్డ్ అయ్యేలా చూస్తారు. ఖాతాల్లో జమ అవుతున్న నగదును బినామీ ఖాతాలకు మళ్లిస్తున్నారు. ఆ ఖాతాల నుంచి దేశం దాటిపోతోంది. క్రిప్టో కరెన్సీ రూపంలో ఇతర దేశాలకు చేరుతోంది.

డబ్బు ఎర వేసి..

తేలికగా డబ్బు సంపాదించేందుకు అలవాటు పడ్డ కేటుగాళ్లు ఆర్థిక లావాదేవీలకు తెలివిగా ఇతరుల ఖాతాలను ఉపయోగిస్తున్నారు. పోలీసులకు ఎక్కడా దొరక్కుండా ఉండేందుకే ఈ ఎత్తుగడ వేస్తున్నారు. అసలు ఖాతాలే లేని వారినీ కమీషన్ ఆశచూపి నిందితులే తెరిపిస్తున్నారు. వీరికి తమ ఖాతాల ద్వారా పెద్ద మొత్తాల్లో లావాదేవీలు జరుగుతున్నట్లు తెలియదు.

జాగ్రత్తలు తీసుకోవాలి..

★ మీ బ్యాంకు, యూపీఐ వివరాలెవరికీ చెప్పొద్దు.
★ సులభంగా డబ్బు సంపాదించండి అని చెప్పే ఉద్యోగ ప్రకటనలు, ఆన్‌లైన్‌లో వచ్చే ఆఫర్లు నమ్మొద్దు.
★ ఎవరైనా మీకు డబ్బు ఇచ్చి.. ఇతరులకు పంపమని లేదా ఖాతా ద్వారా అందుకోమని కోరితే స్పందించకపోవడం ఉత్తమం.

(c) eenadu

కుటుంబాలు లెక్కించేలా.. పథకాలు అందించేలా..

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో గంగపుత్రులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వీరి సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోంది. అయితే కొందరు పలు కారణాలతో వీటిని పొందలేక పోతున్నారు. క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలను గుర్తించి సముద్రంపై ఆధారపడి జీవించే మత్స్యకారులు ఎందరు ఉన్నారు.. ఎక్కడెక్కడ ఉంటున్నారో సర్వే నిర్వహించాలని సర్కారు ఆదేశించింది. 18 నాటికి ఈ సర్వే పూర్తి చేయాలని ఆదేశించింది. దీనిలో భాగంగా సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎంఎఫ్ఆర్ఐ), ఫిష్ సర్వే ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఈ నెల 3 నుంచి సర్వే చేపట్టను న్నారు.

నేటి నుంచి మత్స్యకారుల గణన సర్వే

ప్రత్యేకంగా యాప్‌లో వివరాల నమోదు..

జిల్లా వ్యాప్తంగా మచిలీపట్నం, కృత్తివెన్ను, నాగాయలంక, కోడూరు మండలాల్లో సముద్రంపై ఆధారపడి జీవించే మత్స్యకారుల గ్రామాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లోని గంగపుత్రులు కొందరు చేపల వేటకు వెళ్లే.. మరికొందరు వలల తయారీ, ఇతర అనుబంధ వృత్తులు చేస్తుంటారు. అలాంటి కుటుంబాలను లెక్కించాలని ప్రభుత్వం నిర్ణయించి డిసెంబరు వారికి తెలియజేసి గ్రామాల్లో సర్వే చేసి ఆయా వివరాలను సీఎంఎఫ్ఆర్ఐ రూపొందించిన యాప్‌లో నమోదు చేస్తారు.

అర్హులకు పథకాలు

మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందించాలన్న లక్ష్యంతోనే ఈ సర్వే చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. వేట సాగించే మత్స్యకారులకు వేట నిషేధ కాలంలో పరిహారం, డీజిల్ రాయితీ, రాయితీపై బోట్లు, వలలు, వివిధ పరికరాలు అందిస్తున్నారు. దీంతో పాటు వారి కుటుంబాల్లోని మహిళలకు సముద్ర ఉత్పత్తులతో చేసే వంటకాలు, ఎండు చేపల తయారీ తదితరాలపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి పేదకు ఒకటికి ఎకాల మాదిరిగానే మత్స్యకార గణన జరుగుతుందని జిల్లా మత్స్యశాఖాధికారి నాగరాజు తెలిపారు.

తీర విస్తీర్ణం	111 కి.మీ
మెకనైజ్డ్	66 (బోట్లు)
మోటరైజ్డ్	2,131
నాన్‌మోటరైజ్డ్	73
మొత్తం పడవలు	2,270
తీర ప్రాంత మండలాలు	4
మత్స్యకార గ్రామాలు	50
గతంలో జరిగిన సర్వేలో గుర్తించిన మత్స్యకార కుటుంబాలు	16 వేలు

గిలకలదిండి రేవులో బోటు నుంచి చేపలను బయటకుతెస్తున్న గంగపుత్రులు

అర్ధనారీశ్వరునికి వెండి ఆభరణాల బహూకరణ

కొలవెన్ను(కంకిపాడు), న్యూస్‌టుడే: మండల పరిధి కొలవెన్నులోని శ్రీఅర్ధనారీశ్వర స్వామి దేవస్థానంలోని మూలవిరాట్ అలంకరణకు అదే గ్రామానికి చెందిన గ్రంథాల మోహనరావు, సౌభాగ్యమ్మ దంపతుల కుమారుడు లక్ష్మీవరప్రసాద్, కుమార్తె శివలక్ష్మీలు రూ.5.82 లక్షల విలువైన 3.620 కిలోల వెండి ఆభరణాలను ఆలయ ధర్మకర్త మద్దాలి జోగేశ్వరశర్మ, పూజారి మామిళ్లపల్లి సోమేశ్వరరావులకు ఆదివారం అప్పగించారు. ఈ సందర్భంగా దాతలను దేవాలయ సంప్రదాయం మేరకు సత్కరించారు.

శివాలయం ప్రతినిధులకు ఆభరణాలు అప్పగిస్తున్న దాతలు

5 నుంచి 11 వరకు యోగా తరగతులు

రామవరప్పాడు, న్యూస్‌టుడే: ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇన్నర్ ఇంజినీరింగ్ పేరుతో రామవరప్పాడులోని ఎస్‌వీవీ గ్రీన్ మెడోస్‌లో ఈ నెల 5 నుంచి 11 వరకు ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం, సాయంత్రం పూట రెండు బ్యాచ్‌లలో నిర్వహిస్తున్నట్లు, ఆసక్తిగలవారు 91664 94989 నంబరును సంప్రదించాలని సూచించారు.

పెళ్లి సంబంధాల కోసం చూస్తున్నారా

అన్ని కులాల సాఫ్ట్‌వేర్ ఉద్యోగ వధూవరులకు సువర్ణావకాశం

నేడు అన్ని కులాల సాఫ్ట్‌వేర్ ఉద్యోగ వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, అన్ని కులాల సాఫ్ట్‌వేర్ ఉద్యోగ అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. విజయవాడ ఆటోనగర్‌లోని స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, బి బ్లాక్, 5వ అంతస్తులోని ఈనాడు కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు **నేడు (3 నవంబరు 2025)** ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ★ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు క్రింద తెలిపిన ఫోన్ నెంబర్లను సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

మరిన్ని వివరాలకు

95501 28306 & 83744 45190

ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

అనుచిత లబ్ధి పొందినవారికి నోటీసులు

అగ్రిగోల్డ్ కేసులో సొమ్ము రాబట్టేందుకు చర్యలు

ఈనాడు, అమరావతి

అగ్రిగోల్డ్ బ్రేకింగ్ కంపెనీ మోసం కేసులో అనుచిత లబ్ధి పొందిన ఏజెంట్లు, డిపాజిటర్ల నుంచి సొమ్మును కక్కించేదుకు పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించారు. నష్టపోయిన వారికి న్యాయం చేసేందుకు రావాల్సిన దాని కంటే ఎక్కువ పొందిన వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. ఇప్పటికే కొందరిని పిలిపించి మాట్లాడుతున్నారు. అదనపు సొమ్మును తిరిగి చెల్లించాలని, లేనిపక్షంలో నిందితులుగా చేర్చి అరెస్టు చేస్తామని హెచ్చరిస్తున్నారు. చెల్లిస్తే సాక్షులుగా పరిగణిస్తామని చెబుతున్నారు. దీంతో కొందరు గడువు ఇస్తే తిరిగి చెల్లిస్తామని హామీ ఇస్తున్నారు.

రూ.70 కోట్లు రాబట్టేలా..

మొత్తం 62 మంది ఏజెంట్లలో 32 మంది ఎక్కువ ప్రయోజనం పొందారు. రూ.54కోట్లు పెట్టుబడి పెట్టి ఏకంగా రూ.105 కోట్లు లబ్ధి పొందారు. వారికి దక్కాల్సిన దాని కంటే రూ. 49 కోట్లు అనుచితంగా పొందారు. వీరితో పాటు కొందరు డిపాజిటర్లు కూడా ఇలా ప్రయోజనం దక్కించుకున్నారు. 204 డిపాజిటర్లు రూ.35 కోట్లు పెట్టుబడి పెట్టగా రూ.56 కోట్లు వచ్చింది. ఈ రెండు వర్గాల నుంచి అదనంగా రూ.70 కోట్ల వరకు అనుచితంగా ప్రయోజనం పొందారు. ఈ సొమ్మును తిరిగి రాబడితేనే నష్టపోయిన వారికి ఉపశమనం కలుగుతుంది. ఇప్పటికే 52 చరాస్తులను గుర్తించి ఎటాచ్ చేసేందుకు ప్రభుత్వానికి లేఖ రాశారు. వీటి డాక్యుమెంట్ విలువ రూ.20 కోట్లు కాగా మార్కెట్ విలువ ఐదు రెట్లు ఉంది.

☛ లబ్ధి పొందిన ఏజెంట్లలో పలువురు ఆజ్ఞాతంలో ఉన్నారు. హైదరాబాద్‌కు చెందిన వారు.. ఇటీవల ప్రత్యేక బృందం సోదాల సమయంలో ఇళ్లలో లేకుండా పరారయ్యారు. లోకల్‌గా ఉండే ఏజెంట్లను పిలిపించి వారు లబ్ధి పొందిన మొత్తం వివరాలు అందజేస్తూ.. డబ్బును చెల్లించాలని గట్టిగా చెబుతున్నారు. దీనికి వారు వారం రోజుల సమయం కోరుతున్నారు. గడువు దాటిన తర్వాత కూడా ఇంకా స్పందించకపోతే వారికి సంబంధించిన ఆస్తులను ఎటాచ్ చేయడంతో పాటు అరెస్టు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో న్యాయమూర్తులు

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వై.లక్ష్మణరావు ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తొలుత వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు, వేద పండితులు, ఆలయ పర్యవేక్షకుడు స్వాగతం పలికారు. నాగదేవత పుట్టకు పూజలు చేసి మంగళ హారతులు సమర్పించారు. అనంతరం స్వామికి నిర్వహించే మహాన్యాస రుద్రాభిషేకంలో న్యాయమూర్తి దంపతులు పాల్గొన్నారు. వేద మంత్రాలతో పండితులు ఆశీర్వదించారు. స్వామి వారి చిత్రపటాలు, పట్టువస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

మంగళ హారతి సమర్పిస్తున్న జస్టిస్ డాక్టర్ లక్ష్మణరావు దంపతులు

☛ పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి.. మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హరనాథ్ ఆమెకు స్వాగతం పలికారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి న్యాయమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది స్వామి వారి చిత్రపటాలు, పట్టు వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

జస్టిస్ అనుపమ చక్రవర్తికి స్వాగతం పలుకుతున్న తహసీల్దార్ హరనాథ్

పృథ్వీశ్వర క్షేత్రం ప్రాశస్త్యం ప్రశంసనీయం

నడకుదురు(చల్లపల్లి), న్యూస్‌టుడే: నరకాసుర సంహార క్షేత్రంగా స్కంద పురాణంలో లిఖించి.. పేరుగాంచిన పృథ్వీశ్వర క్షేత్రం ప్రాశస్త్యం ప్రశంసనీయమని ప్రముఖ ప్రవచనకర్త, ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం చల్లపల్లి మండలం నడకుదురులోని ప్రాచీన క్షేత్రం పృథ్వీశ్వరస్వామి ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆలయ అభివృద్ధి కర్త మండవ రవీంద్ర-రమణకుమారి దంపతులు, డాక్టర్ యార్లగడ్డ మధుకిరణ్-డాక్టర్ మండవ సింధూర దంపతులు, ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావులు స్వాగతం పలికి.. పట్టు వస్త్రాలతో సత్కరించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేసిన మండవ రవీంద్ర-రమణకుమారి దంపతులను చాగంటి కోటేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం క్షేత్రం ఆవరణలోని పాటలీవనంలో మొక్కలు నాటారు. కార్తిక వనసమారాధనలో పాల్గొన్నారు. చాగంటి మాట్లాడుతూ దేవతావనాలైన పాటలీ వృక్షాలు కాశీలో మాత్రమే ఉంటాయని, ఆ తరువాత వాటిని పృథ్వీశ్వర క్షేత్రంలో చూశానన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు యార్లగడ్డ శ్రీనివాసరావు, విశ్రాంత ఆర్డీవో నాదెళ్ల శివరామకృష్ణ, మాజీ సర్పంచి పరుచూరి సురేష్, మల్లుపెద్ది త్రివిక్రమరావు పాల్గొన్నారు.

క్షేత్రంలో ప్రముఖ పవచనకర్త, ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

గూడూరులో జగన్ పర్యటన రేపు

పెడన, న్యూస్‌టుడే: మాజీ సీఎం జగన్ ఈ నెల 4న కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గంలోని గూడూరు మండలంలో పర్యటిస్తారని వైకాపా నియోజకవర్గ కన్వీనర్ ఉప్పాల రాము ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ మండలంలోని తరకటూరు నుంచి రామరాజుపాలెం వరకు సాగనున్న పర్యటనలో ఇటీవల తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను వైకాపా అధ్యక్షుడు పరామర్శిస్తారని పేర్కొన్నారు.

రామలింగేశ్వరుడికి పంచదారతో అభిషేకం

నాగాయలంక, న్యూస్‌టుడే: నాగాయలంక శ్రీరామపాద క్షేత్రం పుష్కర ఘాట్ కృష్ణా నది ఒడ్డున కొలువైన గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామికి ఆగమ పండితులు అంబా సాయికిరణ్‌శర్మ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేసి, నవ జ్యోతులు సమర్పించారు. భక్తులు 150 కేజీల పంచదారతో స్వామి వారిని స్వయంగా అభిషేకించారు.

ఆంజనేయుడిగా శివుడు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం అవనిగడ్డ శివాలయంలో శివుడిని.. ఆంజనేయ స్వామిగా అలంకరించారు. అంతకు ముందు అర్చకులు ఘంటసాల రాజశేఖర్‌శర్మ, పవన్‌కుమార్ శర్మలు.. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

మోపిదేవి క్షేత్రం కిటకిట

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. దాదాపు 13 వేల మంది తరలించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్తిక జ్యోతులు వెలిగించారు. రూ.9,25,419 ఆదాయం వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు.

గుండె జబ్బును 20 ఏళ్లు ఆపవచ్చు

గుడివాడ, న్యూస్‌టుడే : ‘గుండె జబ్బు వస్తుందనే భయం వద్దు. అధునాతన ఏఐ సాంకేతికతతో సీటీ కరోనరీ యాంజియోగ్రఫీ ద్వారా ముందుగానే ముప్పును గుర్తించి.. చికిత్స ద్వారా 20 నుంచి 25 ఏళ్ల వరకు గుండె జబ్బును ఆపే అవకాశం ఉందని’ ప్రముఖ గుండె వైద్య నిపుణుడు పోతినేని రమేష్ బాబు పేర్కొన్నారు. గుడివాడలోని ఐఎంఏ హాలులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం చాలా వరకు గుండె సమస్యలకు స్టంట్, బైపాస్‌లు అవసరం లేకుండానే వైద్యం చేయవచ్చన్నారు. గుండెకు 70 నుంచి 80 శాతం వరకు బ్లాకులు ఉన్నా.. శస్త్రచికిత్స లేకుండా స్టంట్‌లు లేకుండా వైద్యం చేస్తున్నామన్నారు. గతంతో పోల్చితే.. ఏఐ రాకతో గుండె వైద్యంలో రోగనిర్ధారణలో పూర్తిగా మార్పులు వచ్చాయన్నారు. గుండె జబ్బులకు చాలా రకాల పరీక్షలు చేస్తున్నారని.. నేడు అవన్నీ అవసరం లేదని, సీటీ కరోనరీ యాంజియోగ్రఫీ చాలన్నారు. ఈ పరీక్షను 30 ఏళ్లు దాటిన వారు చేయించుకుని, ముందు జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. వైద్యులు కూడా జబ్బుల లక్షణాలపై సరైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు మాగంటి శ్రీనివాస్, కార్యదర్శి పుణుకొల్లు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఉండవల్లి శ్రీనివాస్, కోశాధికారి దేవరపల్లి సూరజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పోతినేని రమేష్ బాబు తదితరులు

మొంథా మిగిల్చిన గాయం

మొంథా తుపాను ధాటికి మండలంలో ప్రధాన రహదారులు ధ్వంసమయ్యాయి. మండలంలో ఎదురుమొండి శివారు గొల్లమందకు వెళ్లే ప్రధాన రహదారి కృష్ణా నది అలల తాకిడికి బ్రహ్మయ్యగారి మూల నుంచి జింకపాలెం, గొల్లమంద రహదారి పూర్తిగా ధ్వంసమై నడవడానికి వీలు లేని విధంగా తయారయ్యింది. ఇటీవల దీనికి తాత్కాలిక మరమ్మతులు చేశారు. కృష్ణాకు వచ్చిన వరదలకు, తర్వాత వచ్చిన తుపానుకు పూర్తిగా దెబ్బతిని బాహ్య ప్రపంచానికి సంబంధాలు తెగిపోయాయి. ఎదురుమొండి-గొల్లమంద రహదారికి రూ.13.08 కోట్లు మంజూరైన సంగతి తెలిసిందే. త్వరితగతిన రహదారి నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు. ☛ వక్కపట్ల వారిపాలెం ఓఎన్‌జీసీ రింగ్ వంతెన నుంచి భావదేవరపల్లి వరకు, మర్రిపాలెం నుంచి కమ్మనమోలు వరకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మర్రిపాలెం-కమ్మనమోలు వెళ్లే ప్రధాన రహదారిలో చోడవరం గ్రామం దాటిన తరువాత రోడ్డు అంచు కొద్దిమేర పగుళ్లిచ్చింది. **- నాగాయలంక, న్యూస్‌టుడే**

చోడవరం నుంచి కమ్మనమోలు వెళ్లే రహదారి ప్రమాదకరంగా..

ఎదురుమొండి నుంచి గొల్లమంద వెళ్లే మార్గంలో కోతకు గురై..

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234. **అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 575 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.96/-.

అమరవీరుల త్యాగాలపై కళాజాత

భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే : పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు ఆదివారం లక్ష్మీటాకీస్ సెంటర్‌లో పోలీస్ బ్యాండ్ సిబ్బందితో కళాజాత నిర్వహించారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను, సేవలను గుర్తు చేస్తూ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాఘవయ్య, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాండ్ ద్వారా గీతాలు ఆలపిస్తున్న పోలీస్ సిబ్బంది

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

మచిలీపట్నం నగరపాలక సంస్థ

హెచ్చరిక నోటీసు మరియు బహిరంగ ప్రకటన

ఆర్.ఓ.సి.నెం. G1/10501/2025 తేది. 02-11-2025

ఇందుమూలముగా నగర ప్రజలకు తెలియజేయునది ఏమనగా.. ఖాలేఖాన్‌పేట మున్సిపల్ హైస్కూల్ వద్ద మున్సిపల్ హైస్కూల్‌లో అంతర్భాగముగా ఉన్న శిథిలావస్థలో ఉన్న బిల్డింగ్ వద్దకు ప్రజలు కానీ హైస్కూల్ స్టాఫ్ కానీ మరియు స్కూల్ స్టూడెంట్స్ గానీ ఎవరు వెళ్ళవద్దు అని హెచ్చరించడమైనది. అదే విధముగా MPDO Office కు ఎదురుగా మరియు గౌరవ కన్స్యూమర్ కోర్ట్ ప్రక్కన ఉన్న ప్రభుత్వ శిధిల భవనము వద్దకు కూడా నగర ప్రజలు ఎవరూ కూడా వెళ్ళవద్దు అని హెచ్చరించడమైనది.

ఈ రెండు భవనములను కూలగొట్టుటకు మచిలీపట్నం నగరపాలక సంస్థ నిర్ణయించడమైనది. ఇందుపై ఎవరికైనను, ఏమైనను అభ్యంతరములు ఉన్నచో లిఖిత పూర్వకముగా మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ గారికి ఈ ప్రకటన వెలువడిన మూడు (3) రోజులలోగా తెలియజేయవలెను.

పురమిత్ర యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి - మున్సిపల్ సేవలు వినియోగించుకోండి. పన్నులు చెల్లించండి - మచిలీపట్నం నగర ప్రగతికి తోడ్పడండి.

సం/- కమిషనర్, మచిలీపట్నం నగరపాలక సంస్థ

ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఆరోగ్య కార్డులపై ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తామని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. ఉద్యోగుల వైద్య సేవలపై ఆదివారం విజయవాడలోని ఎన్జీవో భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల ఆరోగ్యకార్డులకు సంబంధించి 60 రోజుల్లోనే ప్రక్షాళన చేసి, నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా కమిటీ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం సంతోషకరమన్నారు. వైద్య సేవల్లో సమస్యలు, పాత ప్యాకేజీ ధరల వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఆసుపత్రులకు సరిగా చెల్లింపులు చేయకపోవడం వల్ల తలెత్తే సమస్యలు, దశాబ్ద కాలం క్రితం నిర్ణయించిన రెండు లక్షల రూపాయల సీలింగ్ తదితర సమస్యల పరిష్కారానికి ఏపీ ఎన్జీవో కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు 60రోజుల్లో అన్ని పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతిష్ఠాత్మకమైన ఎన్జీవో ఎన్నికలకు సంఘం సిద్ధంగా ఉందని తెలిపారు. వేతన సవరణ, ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ, అడిషనల్ క్వాంటమ్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, పదోన్నతులకు కృషి చేయాలని, ఎన్జీవో 75 సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించాలని సమావేశంలో రాష్ట్ర కార్యవర్గం తీర్మానించింది. సంఘం రాష్ట్ర కోశాధికారిగా పీఐవో డిపార్టుమెంట్‌కి చెందిన భారతిప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి జగదీశ్వరరావు, ప్రసాద్ యాదవ్, మాధవ్, 26 జిల్లాలకు చెందిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విద్యాసాగర్. వేదికపై రమణ, జగదీశ్వరరావు, ప్రసాద్ యాదవ్, మాధవ్ తదితరులు

5న కార్తిక దీపోత్సవం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: కార్తిక పౌర్ణమి సందర్భంగా ఈ నెల 5న దేవస్థానం సేవాదళ్ ఆధ్వర్యంలో దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు దుర్గగుడి ఈవో శీనానాయక్ తెలిపారు. ఇంద్రకీలాద్రిపై మల్లికార్జున మహామండపం నాలుగో అంతస్తులోని ఈవో కార్యాలయంలో పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఏసీపీలు దుర్గారావు, రామచంద్రరావులతో కలిసి భవానీ దీక్షల విరమణ, కార్తిక మాస వేడుకలకు సంబంధించిన గోడపత్రాలను ఆదివారం విడుదల చేశారు. అనంతరం వైదిక కమిటీ, పోలీసు, ఇంజినీరింగ్ దేవస్థానం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ.. భక్తుల భద్రత దృష్ట్యా దీపాలు వెలిగించేందుకు ప్రత్యేకంగా 500 మంది సేవాదళ్ సభ్యులు అర్చకులకు సహకరిస్తారన్నారు. డిసెంబరు 4న సత్యనారాయణపురంలోని శివరామకృష్ణ క్షేత్రం నుంచి దుర్గగుడి వరకు ఊరేగింపులో భవానీ దీక్షాధారులు పాల్గొంటారని చెప్పారు. పశ్చిమ, వన్ ట్రాఫిక్ ఏసీపీలు దుర్గారావు, రామచంద్రరావు, సీఐలు ఉమామహేశ్వరరావు, గురుప్రకాష్, ఈఈలు కోటేశ్వరరావు, రాంబాబు, ఏఈవోలు రమేష్, వెంకటరెడ్డి, సుధారాణి, చంద్రశేఖర్, వాసు, గంగాధర్ పాల్గొన్నారు.

91.9FM Vijayawada ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఆ రోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 87907 41166

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూప్, VJA, వృద్ధులకు, పేషెంట్లకు, బెడ్‌పేషంట్లకు వసతి. ✆ 95537 86677/96404 96677

JOBS

Wanted Real Estate Marketing Executives and Female Telecallers. LIC Colony, Vijayawada. ✆ 94324 54545.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

Furniture Showroom Requires Male Helpers Q: 10th / Inter (25-45). Alankar Steel Products, Museum Road, VJA. ✆ 70325 78687

Immediate openings for Customer Service Executive & Branch Manager Positions in Cherukuri Group, Located in Eluru, Tanuku, Guntur & Vijayawada. Qual: Min Inter. ✆ 98852 06666, E-mail: hr@cherukurigroup.org

DRIVERS

SECURITY GUARDS

గమనిక

మచిలీపట్నం
●మచిలీపట్నం ●పెడన

రహదారికి నూతన శోభ

నాడు: రాళ్లుపైకి లేచి ఇలా..

పెడన, పెడన గ్రామీణం, న్యూస్‌టుడే : పెడన-గూడూరు మండలాలను కలిపే నడుపూరు-ఆర్పీపల్లి రహదారి నూతన శోభను సంతరించుకుంది. గుంతలుగా ఉండే ఈ రోడ్డును రూ.1.32 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులతో అభివృద్ధి చేశారు. 2022లో అప్పటి వైకాపా నాయకులు రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో గుత్తేదారుడు పనులు చేపట్టలేదు. అప్పటి నుంచి నిలిచిపోయిన పనులను కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభించింది. నెల కిందట ప్రారంభమైన పనులు ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. ఈ రహదారి నిర్మాణంతో నడుపూరు, నెరికేపాలెం, ఆర్పీపల్లి, కంకటావ గ్రామాల ప్రజలు మచిలీపట్నం, పెడనలకు త్వరితగతిన చేరుకోనున్నారు.

నేడు: తారుతో అద్దంలా మెరుస్తూ..

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందనకు వందనం

✦ మచిలీపట్నంలోని బైపాస్ రోడ్డులో ఉన్న ఖాళీ కొబ్బరి బొండాలను తొలగించడం లేదని స్థానికులు ఈ సమస్యను 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వారు స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపి తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ✦నగరంలోని సుకర్లాబాద మసీదు ప్రాంతంలో రోడ్డు పక్కన వేసిన వ్యర్థాలను తొలగించక పోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ సమస్యను స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా అధికారులకు తెలిపారు. వారు స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపించి వాటిని తీయించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. – న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

✦ మండలంలోని పెదతుమ్మిడి పరిధిలోని ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడి ఇబ్బంది పడుతున్నామని వాహన చోదకుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు సంబంధిత శాఖ అధికారులు స్పందించారు. తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. త్వరలో రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. ✦మండల పరిధిలోని జాతీయ రహదారిపై పలు చోట్ల రోడ్డు అంచులు కోతకు గురయ్యాయని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించి.. అంచులు సరి చేయించారు. - **న్యూస్‌టుడే, బంటుమిల్లి**

? పట్టణంలో పలు సచివాలయాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు పనిచేయడం లేదు. ప్రింట్ బయట తీసుకోమని ఫోనుకు సందేశం పంపుతున్నారు. - **స్థానికులు**

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - **చంద్రశేఖరరెడ్డి, పురపాలక కమిషనర్** – న్యూస్‌టుడే, పెడన గ్రామీణం

చాగంటికి సన్మానం

మొవ్వ(కూచిపూడి), ఘంటసాల, న్యూస్‌టుడే: మొవ్వలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు.. తన శిష్యబృందంతో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు శేషవస్త్రాలు అందజేశారు. వారికి ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్వీ సుబ్బారావు, అర్చకులు దివి సీతారామ్‌హనుమాన్, వంశీమోహన్‌లు స్వాగతం పలికారు. వేణుగోపాలుడి క్షేత్ర వివరాలను.. అర్చకులు వివరించారు. అనంతరం ఆలయం తరపున చాగంటిని సత్కరించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కళారత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ కూచిపూడి నృత్య ప్రదర్శన చేయగా.. ప్రశంసించారు. ఆధ్యాత్మిక గ్రామమైన పెదముత్తేవిని సందర్శించాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లిగమనేని రామలింగేశ్వరరావు.. చాగంటి కోటేశ్వరరావును ఆహ్వానించారు.

ధర వరలు

టమాట 29, వంగ 50, బెండ 44, పచ్చిమిర్చి 26, కాకర 40, క్యాబేజీ 28, క్యారెట్ 72, దొండ 35, బంగాళదుంప 24, ఉల్లిపాయలు 24, గోరు చిక్కుడు 44, దోస 22, సొర 25, అరటికాయ 5/6, చిక్కుళ్లు 90, బీర 42, చామదుంప 90, మునగ 10/08, కంద 46, బీట్‌రూట్ 50, కీరదోస 38, బీన్స్ 95, క్యాప్సికం 78, అలసందలు 50, చిలకడదుంప 44, కొత్తిమీర 30/15, పుదీనా 15/5 సోమవారం ఉదయం 7 గంటల వరకు ఈ ధరలే వర్తిస్తాయి. ఫిర్యాదులు ఉంటే ఎస్టేట్ అధికారి చక్రవర్తి ఫోన్ : 91823 61295లో సంప్రదించవచ్చు. - **న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)**

సినిమాలు

రేవతి : బైసన్
సిరికృష్ణ : బాహుబలి
సిరిసెంటర్ : మాస్ జాతర
- **మచిలీపట్నం (గొడుగుపేట)**

బురద వీడదు.. ప్రయాణం సాగదు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే

వైకాపా హయాంలో రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రధానంగా మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లోని అనేక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఆయా రహదారుల వెంట ప్రయాణం అంటేనే ప్రజలు హడలి పోతున్నారు. గూడూరు మండలంలోని మల్లవోలు నుంచి జీలగలగండి వెళ్లే రోడ్డు బురదమయంగా మారింది. గత ప్రభుత్వంలోనే దీన్ని అభివృద్ధి చేయాలని పలువురు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. మల్లవోలు, కమ్మపాలెం, ఛటారిపాలెంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు చల్లపల్లి వెళ్లేందుకు ఇది దగ్గరి మార్గం. ఈ క్రమంలో ఎక్కువ మంది దీన్నే ఆశ్రయిస్తారు. ఇటీవల కొందరు ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌లకు కూడా సమస్యను వివరించి అభివృద్ధి చేయాలని కోరారు. మూడు కి.మీ మేర ఉండే రోడ్డు నిర్మాణాన్ని ఎవరూ పట్టించుకోవటం లేదని ఆవేదన చెందుతున్నారు. గూడూరు మండలంలోని అనేక మార్గాలు ఇలానే తయారయ్యాయి.

అధ్వానంగా మల్లవోలు నుంచి జీలగలగండి వెళ్లే రోడ్డు

నిధులు కేటాయించినా...

గూడూరు మండలమే కాదు పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని అనేక రోడ్లు ఇలానే ఉన్నాయి. పెడన మండలంలోని చేవెండ్రపాలెం నుంచి నరసపురపాడు ప్రధాన రహదారిని కలిపే రోడ్డుపై అడుగులోతు గుంతలు పడ్డాయి. వర్షం వస్తే ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని దుస్థితి. తెదేపా హయాంలోనే దీని నిర్మాణానికి నిధులు కేటాయించగా తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వంలో పనులు ఆగిపోయాయి. ఇటీవల ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ చొరవతో రూ.33 లక్షలు కేటాయించి టెండరు ప్రక్రియ పూర్తయి నెలలు గడుస్తోంది. కానీ పనులు ప్రారంభించిన దాఖలాలు లేవు. బంటుమిల్లి మండలంలోని బోగిరెడ్డిపల్లి, బొర్రపోతుపాలెం, ఎస్ఎన్ గొల్లపాలెం, కృత్తివెన్ను మండలంలోని పీతలావ తదితర గ్రామాల్లో రహదారులు అగాధాలుగా మారాయి. వీటిలో కొన్నింటికి నిధులు కేటాయించినా పనులు చేపట్టడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి వాటిని అభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

హసీమ్ బేగ్‌ను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే : రాష్ట్ర మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన డా. హసీమ్ బేగ్‌కు సిల్లాఫీస్ కమిటీ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కమిటీ సభ్యులు హసీమ్ బేగ్ చేస్తున్న సామాజిక సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు, తెదేపా నాయకులు, మత పెద్దలు ఆయన్ను పూలదండలతో సత్కరించారు.

సకల మృతుల సంస్మరణ పండగ

బంటుమిల్లి, న్యూస్‌టుడే: ఆర్‌సీఎం, తదితర సంఘస్థులు ఆదివారం సకల మృతుల సంస్మరణ పండగను నిర్వహించారు. బంటుమిల్లి విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ కొండ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో విచారణ పరిధిలోని ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ప్రార్థన చేస్తున్న విశ్వాసులు

నాగార్జునసాగర్‌లో ఎల్ఐసీ డివిజన్ కౌన్సిల్ సమావేశం

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: లైఫ్ ఇన్సూరెన్సు ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, మచిలీపట్నం డివిజన్ కౌన్సిల్ సమావేశం నాగార్జునసాగర్‌లో ఆదివారం జరిగింది. ముందుగా దివంగత నాయకులు స్టాలిన్‌బాబు, సోమయ్యకు నివాళులర్పించారు. స్టాలిన్‌బాబు ఏజెంట్ల సమస్యలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనంలో తిరిగిన వ్యక్తి అని ఆలిండియా సెక్రటరీ జనరల్ మార్కొండయ్య పేర్కొన్నారు. సభకు డివిజన్ ప్రెసిడెంట్ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, జోనల్ ప్రెసిడెంట్ కె. వేణుగోపాలరెడ్డి, డివిజన్ జనరల్ సెక్రటరీ రవీంద్రరెడ్డి, డివిజన్ జనరల్ కోశాధికారి జగన్నాథం, రఘు, రామచంద్రరావు, మారుతి, శ్రీనివాసరెడ్డి, ప్రకాష్, మునీశ్వరరావు, అన్ని బ్రాంచీల ఏజెంట్లు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న యూనియన్ నాయకుడు

ప్రమాదమని తెలుసు... ఎందుకింత అలుసు!

నగరంలోని మాచవరం బీసీ వసతిగృహం ఎదురుగా ప్రధాన రహదారి మధ్యలో ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. వర్షం వస్తే నీరు అందులో చేరి కనిపించక ప్రమాదాలు జరగడంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా పట్టించుకోక పోగా అక్కడ ఓ బారికేడ్ ఏర్పాటు చేసి వదిలేశారు. రేవతీ కూడలిలో కూడా ఇలాంటి పరిస్థితే ఉంది. దీంతో ఆ ప్రాంత వాసులు ఆ గుంతలో కర్రలు పెట్టి వదిలేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని వెంటనే ఆయా గుంతలను పూడ్చించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్**

మాచవరంలో గుంత వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్

స్పందించారు.. గుంత పూడ్చించారు

స్పందనకు వందనం

మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కూడలిలో ప్రధాన రహదారి మధ్యలో ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. నగరంలోని సర్కారుతోట, చిలకలపూడితో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, రాకపోకలు సాగించే ప్రయాణికులతో రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షం కురిసినప్పుడు అందులో నీరు చేరి ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. ఈ సమస్యపై ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. సిబ్బందితో గుంతను పూడ్చించారు. సమస్యను పరిష్కరించారు. **- న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)**

క్రికెట్ మ్యాచ్ వీక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు

మచిలీపట్నం కార్పొరేషన్: భారత దేశ మహిళల క్రికెట్ జట్టు ప్రపంచకప్ ఫైనల్‌కు చేరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్, దక్షిణాఫ్రికా జట్టుతో తలపడగా మంత్రి కొల్లు రవీంద్ర చొరవతో మచిలీపట్నం బస్టాండ్ కూడలి, కోనేరు సెంటర్‌లో ప్రత్యేక స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. దీంతో వీక్షకులు మ్యాచ్‌ను ఉత్కంఠగా చూస్తూ కనిపించారు.

బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన స్క్రీన్

అవయవదానం అభినందనీయం

గుడివాడ, న్యూస్‌టుడే: అవయవదానం ద్వారా మరికొందరి జీవితాల్లో వెలుగులు ప్రసరింపజేయవచ్చని.. ఈ విషయంలో గుడివాడ హరి విజయ్‌కుమార్(46) కుటుంబం అందరికీ ఆదర్శంగా నిలిచిందని.. జనసేన నాయకుడు దాసరి మహేష్ పేర్కొన్నారు. గుడివాడకు చెందిన జన సైనికుడు గుడివాడ హరివిజయ్‌కుమార్ గత నెల 30న బ్రెయిన్ డెడ్ కావడంతో కుటుంబ సభ్యులు అతడి అవయవాలను దానం చేశారు.

తల్లిదండ్రులు.. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే : రహదారి ప్రమాదాల్లో ఇటీవల కాలంలో మృతి చెందిన వారిలో ఎక్కువ శాతం మంది యువకులే అని మచిలీపట్నం ట్రాఫిక్ సీఐ సున్న రాజు అన్నారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ సీహెచ్.రాజా ఆధ్వర్యంలో ఆదివారం మచిలీపట్నంలోని వివిధ ప్రాంతాల్లో డ్రైవింగ్ చేస్తున్న 25 మంది యువకులకు సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. సరదా కోసం వాహనాల జోలికెళ్లి ప్రమాదాల బారిన పడవద్దని హితవు పలికారు. తల్లిదండ్రులు వారికి వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. మైనర్లకు చట్టాలపై అవగాహన కల్పించి, జరిమానా విధించారు. మైనార్టీ తీరకుండా డ్రైవింగ్ చేయమని వారితో ప్రతిజ్ఞ చేయించారు.

కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రాజు

పాండురంగ.. పండరి నాథ విఠలా

కోనేరు సెంటరులో నృత్య ప్రదర్శనలు

రుక్మిణీ సమేత పాండురంగ స్వామి

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : మచిలీపట్నంలోని పాండు రంగస్వామి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా నిర్వాహకులు ఆదివారం రథోత్సవం నిర్వహించగా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు, నగరవాసులు ఆసక్తిగా తిలకించారు. వివిధ రకాల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వరంగల్‌కు చెందిన మహిళా డప్పుకళాకారుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ నిర్వాహకుడు టేకి నరసింహం తదితరులు దేవతామూర్తులకు పూజలు చేశారు. డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, తెదేపా రాష్ట్ర నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, పంతం గజేంద్రరావు, చలమశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొని కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మహిళల కోలాటం

వివిధ వేషధారణలతో కళాకారులు

అభిషేకాలు.. అర్చనలు

మచిలీపట్నం(గొడుగుపేట), గూడూరు, న్యూస్‌టుడే : బందరు, పెడన నియోజకవర్గాల్లోని వివిధ శివాలయాల్లో కార్తిక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో లింగార్చనతో పాటు విశేష పూజలు జరిపించారు. బచ్చుపేట మల్లేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గూడూరులోని రామలింగేశ్వర స్వామి, ఐదుగుళ్లపల్లి, తరకటూరు, మద్దిపట్ల తదితర గ్రామాల్లోని ఆలయాల్లో జరిగిన పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

బందరులో రామలింగేశ్వరుడు

సోమేశ్వర స్వామి

చిట్టిపాలెంలో అర్ధనారీశ్వర స్వామి

బంటుమిల్లి: ఈ నెల 5 నుంచి వచ్చే ఏడాది జనవరి 8వరకు అయ్యప్పలు, భవానీలు, ఇతర మాలాధారులకు రోజూ మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు స్థానిక అయ్యప్పస్వామి దేవస్థానంలో అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పెడన : కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఐదుగుళ్లపల్లిలో..

చిట్టిపాలెం(మచిలీపట్నం రూరల్): మచిలీపట్నం మండలం చిట్టిపాలెంలోని కోటి మృత్తికా శివలింగ అర్ధనారీశ్వర స్వామికి లక్ష రుద్రాక్షలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన చేపట్టారు.

★ ఎస్.ఎన్.గొల్లపాలెంలోని శ్రీఉమా సమేత సోమేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం, మంగినపూడిలో నగరేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

బంటుమిల్లి: పాశ్చాపురం సువర్చల ఆంజనేయ స్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు వెంకట హనుమంతాచార్యులు స్వామి అమ్మవార్లకు శాంతి కల్యాణం వేడుకగా నిర్వహించారు. సోమవారం ఉదయం 8 గంటలకు సామూహిక హనుమద్వ్రతం అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

స్వామి వారి కల్యాణోత్సవం

సామూహిక సత్య వ్రతాలు

పెడన: స్థానిక 3వ వార్డులోని శ్రీసత్యసాయి మందిరంలో ఆదివారం సామూహిక సత్య వ్రతాలు నిర్వహించారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో 116 మంది దంపతులు పాల్గొని వ్రతాలు ఆచరించారు. సత్యసాయి సేవాసమితి పట్టణ కన్వీనర్ సమయమంతుల ముత్యాలరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. పురోహితుడు ఆకురాతి కృష్ణమోహన్ అర్చకత్వంలో వ్రతాలు జరిగాయి.

వేలం ప్రకటన

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE COURT, MACHILIPATNAM.
E.P. NO: 173/2015 IN O.S. NO: 75/2000

Between:
1. Viswanatha Venkata Subbayya (Died)
2. Viswanatha Vanya Kumari, W/o. Venkata Subbaiah, A/65
3. K.V.Vijayalakshmi, D/o. Venkata Subbaiah, A/43
4. D. Uma Bhargavi, D/o. Venkata Subbaiah, A/41,

All are R/o D/No. 5-405, Flat No.301, Vamsi Valamudi Castle, Near Mineral Water Plant, SBI Colony, Kanuru, Vijayawada .... D.Hrs / Plaintiffs

AND

1. Bolla Kamakshmma, W/o. Radhakrishna
2. Bolla Rama Phanidra Kumar, S/o. (Late) Radhakrishna, A/26
3. Bolla Naga Siva Jyothi, D/o. (Late) Radhakrishna, A/28
4. Bolla Varalakshmi @ Bolla Deepthi, D/o. (Late) Radhakrishna, A/23
5. Bolla Kamalamma, W/o. Ramulu, A/70

All are R/o. Pedatummidi Village, Bantumilli Mandal, Krishna District. .... J.Drs / Defendants

పై నెంబరు డిక్రీ బాకీ రాబట్టుకునే నిమిత్తం J.Drs కు సంపూర్ణ స్వాధీన హక్కు, భుక్తములు కలిగిన యీ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు నందు ది. 26-11-2025న ఉదయం గం॥ 10.30 ని॥ల నుండి వేలం వేయబడును. సదరు ఆస్తిపై లావాదేవీలు ఏమియున్నూ లేవు. కావున పాటదారులు పై తేదీన జరుగు వేలం పాటలో పాల్గొని పాడుకొనవచ్చును. షరతులు వర్తించును.

Schedule: The Schedule property is immovable property of tank belongs to the 1st J.Dr in the hands of J.Drs No. 2 to 5 situtated at Pedatummidi Village of Bantumilli Mandal in R.S.No.764 an extent of Ac. 0.50 Cents out of Ac.2.79 Cents in R.S. No. 764/1 and 762/B and Boundaries for AC. 0.50 Cents by Boundaries.
East: Murugu Kaluva, **West:** Bolla Rama Phanindra Kumar, **South:** Bolla Rama Phanedra Kumar, **North:** Viswanatha Lakshmana Rao within the boundaries of Ac. 0.50 Cents of tank.

Value of D.Hr : Rs. 5,00,000/-
Amina Value : Rs. 10,00,000/-
Market Value : Rs. 7,00,000/-

వేలం తేది: 26-11-2025 **V.V.Varada Rajulu**
D.Hrs / వాదుల తరపున అడ్వకేట్, మచిలీపట్నం

అందరూ కలసి ఉండడమే వనసమారాధన లక్ష్యం

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే : వన సమారాధనతో కుటుంబాల మధ్య ఆత్మీయత, అనుబంధాలు పెరుగుతాయని డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక గాంధీ విద్యాలయంలో యాదవుల వన సమారాధన నిర్వహించారు. ఇందులో రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ ప్రకృతిని ఆరాధిస్తూ, వనాలను రక్షిస్తూ, కులమతాలకు అతీతంగా కలసి ఉండటమే వనసమారాధన లక్ష్యం కావాలన్నారు. యాదవ సంఘ నాయకులు గోకుల్ శివ, నాగనబోయిన రవి తదితరులు రామకృష్ణ, గడ్డం రాజును సన్మానించారు. డీసీ వైస్ ఛైర్మన్ శాయన శివయ్య, కూనపురెడ్డి ప్రసాద్, కొలపల్లి గణేష్ పాల్గొన్నారు.


రామకృష్ణ, రాజులను సన్మానిస్తున్న యాదవ నాయకులు

రాఘవయ్య మృతి బాధాకరం

గూడూరు, న్యూస్‌టుడే: రాఘవయ్య మృతి బాధాకరమని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని ముక్కొల్లుకు చెందిన సమ్మెట రాఘవయ్య ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదివారం మచిలీపట్నంలోని రాఘవయ్య ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వ్యాపారవేత్తగానే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన రాఘవయ్య తనదైన గుర్తింపు పొందారని అన్నారు. డీసీ ఛైర్మన్ పోతన లక్ష్మీనరసింహస్వామి, పీఏసీఎస్ అధ్యక్షులు సమ్మెట రాఘవ ప్రసాద్, నాయకులు గోపి నాగబాబు, ఎన్ఏబేగ్, సమ్మెట శేఖర్, కట్టెడ్డి మురళి తదితరులు పాల్గొన్నారు.


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కాగిత

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

ప్రతిభ చాటిన వారికి ప్రోత్సాహం

విద్యార్థినికి నగదు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే : వాసవీ క్లబ్ ద్వారా అనేక సేవలు అందిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. వాసవీ క్లబ్‌తో పాటు అనుబంధ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఓ వేడుక మందిరంలో వివిధ తరగతుల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహాన్ని అందించారు. సంస్థ ప్రతినిధులు వై. సురేష్, ఎస్.రేణుకారాణి, శిరీష, అశోక్, దివ్యశ్రీ రంగనాయకులు, కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..

బంటుమిల్లి నుంచి పెదపట్నం మీదుగా మచిలీపట్నం వెళ్లే ప్రధాన రోడ్డు వెంబడి కొందరు భవన నిర్మాణ వ్యర్థాలను వేశారు. ఈ నేపథ్యంలో రాత్రి పూట అవి కానరాక వాహన చోదకులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం అధికంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు వాటిని వెంటనే తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, బంటుమిల్లి**

సంస్థల సేవలు ప్రశంసనీయం

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : హ్యూమనిటీ ఫౌండేషన్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని సన్‌స్టార్ పాఠశాలలో పలువురికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పేట సీఐ ఏసుబాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, ఎస్.సాయిస్వరూప్ తదితరులు పాల్గొని మాట్లాడి ఆయా సంస్థల సేవలు అభినందనీయమన్నారు. హ్యూమనిటీ ఫౌండేషన్ అధ్యక్షులు నూర్జహాన్, ప్రతినిధులు నాగూర్ హుస్సేన్, అజ్మతున్నీసా, అనిల్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జి.కిశోర్ కుమార్, ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా హ్యూమనిటీ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు డా. హసీమ్‌బేగ్‌ను సత్కరించారు.

కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న ఏసుబాబు తదితరులు

" నీతిమంతుని జ్ఞాపకం చేసుకొనుట ఆశీర్వాదకరమగును " సామెతలు : 10:7

అమృతమూర్తికి 9వ వార్షికోత్సవ శ్రద్ధాంజలి

(లేటు) శ్రీమతి **అరిగెల రత్నబాయమ్మ** గారు
Retd. F.N.O. Govt. Hospital, మచిలీపట్నం
W/o. (లేటు) అరిగెల లక్ష్మీనరసింహం (సామ్యేల్)
జననం: 1-7-1935 మరణం: 03-11-2016

ప్రేమాభిమానాలకు, మమతానుబంధాలకు విలువనిస్తూ.. మంచితనం మూర్తీభవించిన మహోన్నత వ్యక్తిగా మా అందరి అభివృద్ధికి అహర్నిశలు శ్రమించి మా జీవితాలకు పూలబాట వేసిన మీరు మా నుండి దూరమై దివికేగి నేటికి 9 సంవత్సరాలైన సందర్భంగా మేము మీకు అర్పిస్తున్న శ్రద్ధాంజలి.

కుటుంబ సభ్యులు

మనుమలు: M. ప్రేమ్ వసంతకుమార్, G. పవన్ కుమార్, D. శ్యామ్ అరుణ్, V. సందీప్‌కుమార్, అరిగెల సన్నీ ప్రశాంత్‌బాబు, అరిగెల అభిషేక్, గాలంకి దినిష్ కుమార్, N. అభిలాష్‌పాల్

కుమారులు		కోడళ్ళు
అరిగెల రవీంద్రనాధ్‌బాబు	-	నిర్మలజ్యోతి
అరిగెల రఘునాధ్‌బాబు	-	మేరిజోన్స్
అరిగెల రమేష్‌నాధ్‌బాబు	-	శౌరికుమారి

కుమార్తె		అల్లుడు
గాలంకి అరుణకుమారి	-	గాలంకి సతీష్‌కుమార్

మనుమరాండ్రు : M. స్రవంతి, G. రమ్య, D. కీర్తి, V. అనిషా, అరిగెల ఆరాధ్య, N. శ్రీజ
మునిమనుమలు : M. సిరిల్‌పాల్, G. ప్రీతమ్ పాల్, V. సామ్యేల్ నిస్సిపాల్ **మునిమనుమరాళ్ళు :** D.రూబి, D. ఐవి

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలి

రాష్ట్ర స్థాయి పటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తాచాటాలని ప్రముఖ విద్యావేత్త కొమ్మినేని రామకృష్ణ అన్నారు. స్థానిక కేవీఆర్ స్టేడియంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరుగుతున్న డివిజన్ స్థాయి అండర్-14, 17 బాలబాలికల జట్ల ఎంపిక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచి ఎంపికైన క్రీడాకారులను అభినందించిన ఆయన పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల వ్యాయామోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

హోరా..హోరీగా పికిల్ బాల్ టోర్నీ

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: నగరంలోని పడల్ థియేటర్ పికిల్ బాల్ కోర్టుల్లో శుక్రవారం నుంచి జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఓపెన్ పికిల్ బాల్ టోర్నీలో భాగంగా ఆదివారం సాయంత్రం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో పలువురు క్రీడాకారులు హోరా... హోరీగా తలపడ్డారు. రాష్ట్రంలోని పలు పట్టణాల నుంచి 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారని నిర్వాహకుల రాహుల్ మద్దెల, సతీష్ రెడ్డి తెలిపారు. రాత్రి జరిగిన క్వార్టర్ ఫైనల్స్ డబుల్స్ విభాగంలో హర్ష, రవితేజ జోడీ 15-13 స్కోర్ తేడాతో కార్తిక్, దినకర్ జోడీపై, బసంత్, జీత్ జోడీ 15-3 స్కోర్ తేడాతో ప్రతీక్, ఉమేష్ జోడీపై, రోహిత్, నిహాల్ జోడీ 15-13 స్కోర్ తేడాతో అంజిత్, అవినాష్ జోడీపై విజయం సాధించి సెమీ ఫైనల్‌లో ప్రవేశించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కనూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందన

★ గంగూరులో తుపాన్ తీవ్రతకు చెట్ల కొమ్మలు రహదారులపై విరిగిపడటంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందని గ్రామస్థులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. గ్రామ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ స్పందించి సమస్య పరిష్కరించారు. ★ గంగూరు కేవీ సారథి కాలనీలో కొన్ని రోజుల నుంచి వీధి దీపాలు వెలగడం లేదని కాలనీ వాసులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. గ్రామ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ స్పందించి కొత్త దీపాలను ఏర్పాటు చేయించారు. ★ పెదపులిపాక బీసీ, ఎస్సీ కాలనీల్లో డ్రైనేజీలో పూడిక తీయకపోవడంతో దుర్వాసన వస్తోందంటూ స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. గ్రామ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ స్పందించి సమస్య పరిష్కరించారు. - పెనమలూరు, న్యూస్‌టుడే

★ పోరంకి ప్రియా సంస్థ సమీపంలో కొన్ని రోజులుగా చెత్త కుప్పలు తీయడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. ఈ విషయమై కమిషనర్ షేక్ నజీర్ స్పందించి పరిష్కరించారు. ★ కానూరు సనత్‌నగర్‌లో రోడ్డుపై చెత్త తీయడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. శానిటరీ అధికారి సుధాకర్ స్పందించి.. సమస్య పరిష్కరించారు. - న్యూస్‌టుడే, పోరంకి, కానూరు

జీతాల అందజేత

నూర్యారావుపేట, న్యూస్‌టుడే : పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ అంబేడ్కర్ స్మృతివనం కార్మికులు నెల రోజులుగా చేస్తున్న దీక్షలను ఆదివారం విరమించారు. గుత్తేదారు సంస్థ ఆరు నెలలు జీతాలు చెల్లించలేదు. మిగిలిన మూడు నెలల జీతాలను నెల రోజుల్లో చెల్లిస్తామని హామీ ఇవ్వడం.. దీంతో సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు కార్మికులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేశారు.

నయనానందకరం.. శ్రీవారి పుష్పయాగం

తాడిగడప (కానూరు), న్యూస్‌టుడే : కార్తిక మాసం క్షీరాబ్ది ద్వాదశి పురస్కరించుకుని ఆదివారం తాడిగడప శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పుష్పయాగం నిర్వహించారు. అంతకు ముందు పుష్పయాగానికి వినియోగించే పుష్పాలతో వంతెన నుంచి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని, స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసంతర్పణ జరిగింది.

పూలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

లక్ష్మీ వెంకటేశ్వర స్వామి

ఎర్రన్నాయుడికి ఘన నివాళి

కింజరాపు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెదేపా నాయకులు, కార్యకర్తలు

పెనమలూరు, న్యూస్‌టుడే : దివంగత తెదేపా నేత, మాజీ కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు వర్ధంతిని పోరంకిలోని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెదేపా నాయకులు శౌరిని శివరాం ప్రసాద్, సీతా గోవింద్, అనుమోలు ప్రభాకర రావు, మారుపూడి దనకోటేశ్వరరావు, కోయ ఆనంద్, వెలగపూడి శంకరబాబు, వీరంకి కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

పునర్విభజన పరిష్కారం చూపేనా..!

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

వైకాపా హయాంలో చేసిన జిల్లాల పునర్విభజనతో గన్నవరం నియోజకవర్గానికి సంబంధించి పరిపాలన పరంగా అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. విజయవాడకు అతి సమీపాన ఉన్నప్పటికీ గన్నవరాన్ని కృష్ణా జిల్లాలోనే కొనసాగించారు. ఈ నేపథ్యంలో కీలకమైన రెవెన్యూ, పోలీసు, వివిధ ప్రభుత్వ శాఖల పరిధులు కూడా మారాయి. తాజాగా కూటమి ప్రభుత్వం చేపట్టిన పునర్విభజనతో మార్పు, చేర్పులకు వీలుగా అన్ని కార్యాలు రంగం సిద్ధం చేశారు. ఈ క్రమంలో ఎన్టీఆర్ జిల్లాలోకి చేర్చుతుందని పాటు, కొన్ని కీలక పరిణామాలు చోటు చేసుకుంటాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గన్నవరం గాంధీ బొమ్మ కూడలి

రెవెన్యూ డివిజన్లపై మల్లగుల్లాలు

గన్నవరం కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ఊహాగానాలు జోరందుకున్నాయి. వాస్తవానికి గత ప్రభుత్వంలోనే ఈ ప్రతిపాదన వచ్చింది. పోలీస్ సబ్ డివిజన్ గన్నవరం నియోజకవర్గానికి ఇచ్చినందున, రెవెన్యూ డివిజన్ పెనమలూరు నియోజకవర్గానికి కేటాయించాలన్న డిమాండ్‌తో ఉయ్యూరు కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేశారు. తాజాగా ఈ రెండు నియోజకవర్గాలను కలిపి గన్నవరం కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన వినిపిస్తోంది. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం, ఎన్డీఆర్ఎఫ్, ఐటీ పార్కు, స్వర్ణ భారత్ ట్రస్ట్ వంటి కీలక సంస్థలు ఇక్కడ ఉండటంతో ప్రోటోకాల్ సౌలభ్యానికి ఇది ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ఒకవేళ నూజివీడు నియోజకవర్గాన్ని కూడా ఎన్టీఆర్ జిల్లాలో కలపాలన్న దానికి ఆమోదం వేసి, గన్నవరం, నూజివీడు నియోజకవర్గాలను నూజివీడు ఆర్డీవో పరిధిలోకి చేర్చే అంశం పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

విజయవాడ కమిషనరేట్‌లోకి..

పునర్విభజనకు ముందు హనుమాన్‌జంక్షన్ సర్కిల్ మినహా నియోజకవర్గంలోని అన్ని సర్కిల్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు విజయవాడ కమిషనరేట్ పరిధిలో ఉండేవి. గన్నవరం కేంద్రంగా కొత్తగా సబ్ డివిజన్ ఏర్పాటు చేసి గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలను పూర్తిగా కృష్ణా జిల్లా ఎస్పీ పరిధిలో చేర్చారు. దీంతో విమానాశ్రయ భద్రత, వీవీఐపీ బందోబస్తుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విజయవాడ గ్రామీణ మండలంలోని తొమ్మిది గ్రామాలు మాత్రం కమిషనరేట్‌లోనే కొనసాగించారు. తాజా సమాచారంతో మొత్తాన్ని కమిషనరేట్ లోకి చేర్చడం ఖాయమన్న వాదన వినిపిస్తోంది.

ఎన్నికల హామీ మేరకు..

గతంలో గన్నవరం నియోజకవర్గంలోని మూడు ప్రధాన మండలాలకు సంబంధించి అన్ని ప్రభుత్వ శాఖల డివిజన్ కార్యాలయాలు నూజివీడులోనే ఉండేవి. 2022 పునర్విభజన తర్వాత డివిజన్ పరిధిని అధికారులు గుడివాడకు మార్చారు. ఎన్నికల హామీ మేరకు నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలిపితే తిరిగి గన్నవరం నియోజకవర్గంలోని మూడు ప్రధాన మండలాల డివిజన్ పరిధి తిరిగి నూజివీడుకు మారే అవకాశం ఉంది.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

మందులు తీసుకుంటున్న రోగులు

పెనమలూరు, న్యూస్‌టుడే : అనుమోలు ఆదరణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కార్యాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ట్రస్టు అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, తెదేపా నాయకులు శిబిరాన్ని పర్యవేక్షించారు.

అవయవదానం అభినందనీయం

గుడివాడ, న్యూస్‌టుడే: అవయవ దానం ద్వారా మరికొందరి జీవితాల్లో వెలుగులు ప్రసరింపజేయవచ్చని.. ఈ విషయంలో గుడివాడ హరి విజయ్‌కుమార్(46) కుటుంబం అందరికీ ఆదర్శంగా నిలిచిందని.. జనసేన నాయకుడు దాసరి మహేష్ పేర్కొన్నారు. గుడివాడకు చెందిన జనసైనికుడు గుడివాడ హరివిజయ్‌కుమార్ గత నెల 30న బ్రెయిన్ డెడ్ కావడంతో కుటుంబ సభ్యులు ఆతడి అవయవాలను దానం చేశారు.

వైభవంగా లక్ష దీపోత్సవం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా మడిచర్ల శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి సన్నిధిలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. ఇందులో పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

మడిచర్ల : దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఉయ్యూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : కార్తిక మాసం సందర్భంగా ఆదివారం రాత్రి కడవకొల్లు శివారు వీరవల్లిమోఖాసాలోని రామాలయం వద్ద లక్ష దీపోత్సవం నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

వీరవల్లిమోఖాసాలోని రామాలయం వద్ద..

దేవాలయాల పరిరక్షణకు కృషి

పటమట, న్యూస్‌టుడే: దేవాలయాల పరిరక్షణతో పాటు గో పరిరక్షణకు కృషి చేస్తానని హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన క్షేత్రపాల్ సాయిరామారావు అన్నారు. ఆదివారం రామవరప్పాడులోని వేంకటలమ్మ ఆలయంలో హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. కర్నూలు బసవరాజు, ప్రధాన కార్యదర్శి పిల్లడి రుద్రయ్య, ఉపాధ్యక్షుడు జై శ్రీరామ్ ముఖ్య అతిథులుగా హాజరై జిల్లా అధ్యక్షుడితో పాటు ఇతర కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి సభ్యులు, రామవరప్పాడు గ్రామ పెద్దలు కొల్లా ఆనంద్, కొంగన రవి, అద్దేపల్లి సాంబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడితో పాటు ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

కుటుంబంలో మృతులను స్మరించాలి

దివ్యపూజాబలి అర్పిస్తున్న ఫాదర్లు కిశోర్, సందీప్

కేసరపల్లి(గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే: కుటుంబంలో మృతులను స్మరించుకోవడం కతోలిక ఆనవాయితీ అని.. తిరుసభ వారి కోసం ప్రత్యేకంగా ప్రార్థించేందుకు సకల ఆత్మల పండుగను కొనియాడుతుందని గన్నవరం మండలం కేసరపల్లి విచారణ కర్త ఫాదర్ నూతలపాటి కిశోర్, కంచర్ల సందీప్ తెలిపారు. గన్నవరం, కేసరపల్లి, కొండపావులూరు, తేలప్రోలు, ఆత్కూరు, పెద్దఆవుటపల్లి కతోలిక విచారణల్లో సకల ఆత్మల పండుగను ఆదివారం నిర్వహించారు. కతోలిక సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కుటుంబంలో మరణించిన వారిని స్మరించుకున్నారు. అనంతరం పవిత్రజలంతో సమాధులను మతపెద్దలు ఆశీర్వదించారు. ఆయా కార్యక్రమాల్లో ఫాదర్ పసల దామస్, పాలడుగు జోసెఫ్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే..అన్నదాతలకు ఇక్కట్లే!

కాటూరు గ్రామ పరిధిలోని బాడవ డొంక రోడ్డు పూర్తిగా దెబ్బతింది. దీంతో చిన్నపాటి వర్షం కురిసిన రహదారిపై రోజుల తరబడి వర్షపు నీరు నిలిచిపోతోంది. ఈ రహదారి పక్కన సుమారు వెయ్యి ఎకరాల వరి పొలాలు ఉన్నాయి. దీని వల్ల పశుగ్రాసం తీసుకురావాలన్నా, వ్యవసాయ ఉత్పత్తులు రవాణా చేయాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని ఈ మార్గాన్ని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కాటూరు(ఉయ్యూరు గ్రామీణం)

ఆక్రమణలకు అడ్డేది..?

మండలంలోని పునాదిపాడు కాటన్ సర్కిల్ పరిధిలో ఆక్రమణలు పెరుగుతున్నాయి. ఈ ప్రాంతం కంకిపాడు నుంచి గన్నవరం, గుడివాడ, భీమవరం తదితర ప్రాంతాలకు వెళ్లే వారికి కూడలి. రహదారి పక్కన తమ వాహనాలను నిలిపే వీలుంది. ఇదే అదనుగా భావించిన పలువురు ఇప్పటికే చిన్న బడ్డీ దుకాణాలను పెట్టి వాటిని విస్తరించారు. పునాదిపాడు, కోలవెన్ను, ఉప్పులూరు, కోమటిగుంట, జగన్నాథపురం గ్రామాల్లో పలు బహుళార్ధ సంస్థలు తమ వ్యాపార గోదాములు ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతం వచ్చే వారి సంఖ్య పెరిగింది. ఇప్పటికైనా పంచాయతీ, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులు స్పందించి ఆక్రమణలను అడ్డుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, కంకిపాడు గ్రామీణం

బస్సుల రాకపోకలకు అడ్డుగా వాహనాలు

ఉయ్యూరు ప్రధాన బస్టాండ్ ప్రాంగణంలో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అక్కడే రైతు బజార్ ఉండటంతో కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చే వారు.. వారి ద్విచక్ర వాహనాలను బస్టాండ్ ప్రాంగణంలోని ఖాళీ స్థలంలో ఉంచుతున్నారు. బస్సులు ఆర్టీసీ ప్రాంగణంలోకి వచ్చి ప్రయాణికుల్ని ఎక్కించుకొని రైతుబజార్ వైపుగా వెళ్లాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వందలాది వాహనాలు అడ్డుగా ఉంటున్నాయి. ఈ విషయమై ఆర్టీసీ అధికారులు ఎన్నిసార్లు జరిమానాలు వేసినా ఫలితం శూన్యం. రైతుబజార్‌కు వేరుగా వాహన స్టాండ్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఉయ్యూరు

ఉత్సాహంగా కార్తిక వనసమారాధన

గన్నవరం మండలం చిన్నఅవుటపల్లి శివారు తోటల్లో పట్టణ వాకర్స్ అసోసియేషన్ కార్తిక వనసమారాధనను ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. తొలుత ఉసిరిచెట్టుకు ప్రత్యేక పూజలు చేసి.. అనంతరం ఆటపోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుల కేవీఆర్ కిశోర్, న్యాయవాది తిరువీది వెంకయ్య తదితరులు పాల్గొన్నారు. - గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే

ప్రజల ఆరోగ్యం.. జీవన స్థితిగతులపై సర్వే

కంకిపాడు, న్యూస్‌టుడే: కానూరులోని వెలగపూడి దుర్గాంబ సిద్ధార్థ న్యాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కంకిపాడులో వారం రోజుల పాటు సామాజిక సేవ, ప్రజల ఆరోగ్యం, జీవన స్థితిగతులపై సర్వే చేపట్టనున్నట్లు పీవో ఎం.పాండురంగారావు తెలిపారు. దీనిలో భాగంగా ఆదివారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలోని పిచ్చిమొక్కలు, వ్యర్థాలను తొలగించారు. 'ఇంటింటి ఆరోగ్య సర్వే'పై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. తుమ్మలపల్లి పరమేశ్వరరావు ట్రస్టు ఆధ్వర్యంలో శిబిరంలో పాల్గొంటున్న 50 మంది వాలంటీర్లకు ఏడు రోజుల పాటు భోజన, అల్పాహార తదితర వసతులు కల్పిస్తున్నట్లు సంస్థ ఛైర్మన్ హరికృష్ణ తెలిపారు. శ్రమదానంలో వాలంటీర్లతోపాటు సీహెచ్‌సీ ఛైర్‌పర్సన్ బోయిన రోహిణీకుమారి, నిర్వాహకుడు యర్రపోతు రామకృష్ణ, పీఏసీఎస్ ఛైర్మన్ సుంకర శివ, తెదేపా నాయకులు చిట్టూరి నాగేశ్వరరావు, అన్నే రామారావు తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు సీహెచ్‌సీ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, సామాజిక సేవకులు

చిత్రకళా ప్రదర్శనలో ప్రతిభ

పెనమలూరు: ఆర్ట్ అసోసియేషన్స్ గిల్డ్ ఆధ్వర్యాన విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన మన సంస్కృతి- చిత్రకళా ప్రదర్శనలో పెనమలూరు జడ్పీ ఉన్నత పాఠశాల మాజీ చిత్రలేఖనోపాధ్యాయుడు ఆరేపల్లి అప్పారావుకు ప్రసంశలు దక్కాయి. ఇందులో ఆయన చిత్రించిన గ్రామీణ సౌందర్యం చిత్రానికి నిర్వాహకులు జ్ఞాపిక అందించారు. ఈ సందర్భంగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ కార్యదర్శి ఎన్‌వీపీఎస్ఎస్ లక్ష్మి తదితరులు అప్పారావును సత్కరించారు.

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ నుంచి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకుంటున్న అప్పారావు

పోరాటంతోనే సమస్యలు పరిష్కారం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: కార్మిక సమస్యల పరిష్కారానికి పోరాటాలే ఏకైక మార్గమని ఏపీ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. గన్నవరంలో సంఘ జిల్లా మహాసభను ఆదివారం నిర్వహించారు. మండల అధ్యక్షులు మామిడి గణేష్, కె.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులు నిరంతరం సమస్యలతో సహజీవనం చేస్తున్నారని చెప్పారు. వారికి కనీస వేతనం రూ.18వేలకు పెంచాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ లాంటి కనీస సౌకర్యాలను కల్పించాలన్నారు. తొలుత పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి బుద్ధవరం సర్పంచి బడుగు బాలమ్మ పూలమాలతో నివాళులర్పించగా.. సీఐటీయూ పతాకాన్ని సంఘ నాయకులు నాగమణి ఎగరవేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ తాతబ్బాయ్, మిరప నాగేశ్వరరావు, కె.రామరాజు, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు తదితరులు

స్పందించండి.. చర్యలు తీసుకోండి

గన్నవరం గ్రామీణం: ఉంగుటూరు మండలం తేలప్రోలులో పంచాయతీ నిర్వహణ తీరు వివాదాస్పదంగా మారింది. స్థానిక హరిజనవాడలోని ఓ చర్చి మీదుగా డ్రెయినేజీని మళ్లించడంపై విశ్వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి డ్రెయినేజీ చర్చి మీదుగా కాకుండా రోడ్డు మధ్యలోని తూముల్లో నుంచి వెళ్లేదని, ఇటీవల కురిసిన వర్షాలకు పంచాయతీ అధికారులు హడావుడిగా కాలువ తీసి మురుగును చర్చి వైపుగా మళ్లించారని వాపోయారు. గ్రామంలో ఆక్రమణలకు గురైన వాటిని పట్టించుకోకుండా ఎవరు అడగరులే అని ఇలా చేయడం సరికదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇంతకు ముందుకు లాగేనే డ్రెయినేజీని తూముల నుంచి మళ్లించాలని కోరుతున్నారు. మరో వైపు హరిజనవాడలో సరైన డ్రెయినేజీ వ్యవస్థను నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

డ్రెయినేజీ నిర్వహణ లేక రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

మద్యం మత్తులో లారీ డ్రైవర్ బీభత్సం

ఫుట్‌పాత్‌ను ఢీకొట్టడంతో టైర్లు పగిలి నిలిచిన లారీ

రామవరప్పాడు, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఓ లారీ డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. జాతీయ రహదారిపై ఫుట్‌పాత్‌ను ఢీకొట్టి ఆగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం బెంజిసర్కిల్ వైపు నుంచి గన్నవరం వైపు వస్తున్న ఓ లారీ మహనాడు సిగ్నల్ వద్ద మీతిమిరిన వేగంతో వెళ్తుండగా..కొంతమంది వాహనదారుల త్రుటిలో తప్పించుకున్నారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న 4వ ట్రాఫిక్ పోలీసులు గమనించి ఆపే ప్రయత్నం చేయగా మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ ఆగకుండా వెళ్లిపోయాడు. దీంతో ట్రాఫిక్ సీఐ రమేష్ కుమార్ ఎనికేపాడు జంక్షన్ వద్ద ఉన్న సిబ్బందికి అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి లారీని ఆపాలని సూచించి వెంబడించారు. ఈ క్రమంలో లారీ డ్రైవర్ వేగం పెంచడంతో ఎనికేపాడు వద్ద మహేంద్ర షోరూమ్ ఎదురుగా ఉన్న ఫుత్‌పాత్‌ను ఢీకొట్టడంతో టైర్ పగిలి నిలిచిపోయింది. సంఘటన స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ సీఐ రమేష్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. క్రేన్ సాయంతో లారీని జాతీయ రహదారిపై నుంచి తొలగించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో లారీని సీజ్ చేసినట్లు తెలిపారు.

క్రేన్ సాయంతో లారీని రోడ్డుపై నుంచి తొలగిస్తున్న ట్రాఫిక్ సీఐ రమేష్

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

పెనమలూరు, న్యూస్‌టుడే : గోసాల పెట్రోల్ బంకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడు(65) ప్రాణాలు కోల్పోయాడు. మచిలీపట్నం వైపున బందరు రోడ్డుపై ఇతను అచేతనంగా పడి ఉన్నట్లు పెనమలూరు పోలీసులకు ఆదివారం వేకువ జామున సమాచారం అందింది. దీంతో వారు అక్కడకు వెళ్లి పరిశీలించగా అప్పటికే వృద్ధుడు మృతి చెంది ఉన్నాడు. ఇతడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడు ఎవరు అనేది గుర్తించలేక పోయారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ సెక్యూరిటీ గార్డు..

పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన ఓ సెక్యూరిటీ గార్డు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిగడపకు చెందిన ఓగిరాల శ్రీనివాసరావు(49) ఓ కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తుంటారు. గత నెల 26న రాత్రి 10 గంటల సమయంలో విధులకు హాజరు కావడానికి తన ద్విచక్ర వాహనంపై కళాశాలకు బయలుదేరారు. కామయ్యతోపు వద్ద యూటర్న్ తీసుకుని కళాశాల వైపు వెళ్తుండగా అదుపుతప్పి బందరు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో అతను అదుపుతప్పి వాహనంపై నుంచి కిందపడ్డారు. తల వెనుక భాగంలో తీవ్రగాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. దీంతో మృతుని కుమారుడు తాండవ ప్రసాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముఠా కార్మికుడి మృతదేహం లభ్యం

ఉప్పులూరు(కంకిపాడు): ఉప్పులూరు జగనన్న కాలనీలోని ఓ ఖాళీ ప్రదేశంలో ముఠా కార్మికుడి మృతదేహాన్ని గ్రామస్థులు ఆదివారం గుర్తించారు. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు జరిపారు. మృతుడు నిడమానూరులోని ఒక లిక్కర్ గిడ్డంగిలో పని చేస్తున్న కొమరవల్లి కోటేశ్వరరావు(38)గా గుర్తించారు. ఆయన వారం కిందట మరణించి ఉంటాడని భావిస్తున్నారు. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెనమలూరు : వివాహిత అదృశ్యంపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. యనమలకుదురుకు చెందిన ఈమెకు భర్తతో మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో ఈమె రెండ్రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో భర్త శ్రీనివాస్ ఆదివారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామ్మోహనరావు సేవలు చిరస్మరణీయం

హనుమాన్‌జంక్షన్: బాపులపాడు మండలం వీరవల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కొల్లి రామ్మోహనరావు సేవలు చిరస్మరణీయమని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. రామ్మోహనరావు ఇటీవల మృతి చెందగా కొనకళ్ల, చలసాని ఆదివారం వేర్వేరుగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుదీర్ఘ కాలం ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసిన రామ్మోహనరావు మంచి గుర్తింపు పొందారని కొనియాడారు.

రామ్మోహనరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొనకళ్ల నారాయణ

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

FEDERAL BANK
YOUR PERFECT BANKING PARTNER
Address: D.No 8-149, RS No.33/2, Raja Gari layout, Kobbari Thota, Gosala Village, Penamaluru Mandal, Krishna District, Andhra Pradesh - 521151.

Federal Bank, Gosala branch seeks applications from eligible candidates to be engaged as Gold Appraiser. Interested candidates may submit their application in the prescribed format by visiting the Gosala branch subject to the terms & conditions as stated below:
1. Candidates should be from Vijayawada and Gosala City.
2. Candidates should be traditional gold smiths and well experienced in gold ornament making/appraising with good reputation.
3. Candidates should possess a minimum educational qualification of 10th class/SSLC pass and shall not exceed 60 years as on 02/11/2025.
4. Candidates should have a minimum experience of 2 years in the field of jewellery making/appraisal.
5. Candidates shall be a citizen of India.
For further terms & conditions, please contact the Gosala branch of Federal Bank

(c) eenadu

గుడివాడ

• గుడివాడ • పామర్రు • అవనిగడ్డ

నాగాయలంక రేవులో దెబ్బతిన్న పడవలను పరిశీలిస్తున్న మత్స్యకార నాయకులు

పడవల నష్టాన్ని సక్రమంగా అంచనా వేయాలి

నాగాయలంక, న్యూస్‌టుడే: మొంథా తుపాను కారణంగా మత్స్యకారుల పడవలకు జరిగిన నష్టాన్ని అధికారులు సక్రమంగా అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదించాలని మత్స్యకార నాయకులు లకనం నాగాంజనేయులు, కర్రి కృష్ణమూర్తి తదితరులు కోరారు. ఆదివారం నాగాయలంక పడవల రేవులోని పడవలను వారు పరిశీలించారు. నష్టపోయిన ప్రతి మత్స్యకారునికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు : 80085 74684 అవనిగడ్డ: 80085 74679

స్పందనకు వందనం

పెదపారుపూడి, న్యూస్‌టుడే

✤ పెదపారుపూడి మండలం యలమర్రులో తాగునీటి పైపులైన్‌కు లీకు పడిన వైనాన్ని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. పంచాయతీ కార్యదర్శి చైతన్య శ్రీనివాస్ స్పందించి.. మరమ్మతులు చేయించారు. ✤ యలమర్రు ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని గ్రామస్థులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. కార్యదర్శి చైతన్య శ్రీనివాస్ స్పందించి.. సమస్య పరిష్కరించారు. ✤ యలమర్రులో పంచాయతీ ఎదురుగా డ్రెయినేజీ పూడిపోయింది. ఈ విషయాన్ని గ్రామస్థులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. కార్యదర్శి చైతన్య శ్రీనివాస్ స్పందించి.. సమస్య పరిష్కరించారు. ✤ పెదపారుపూడి మండలం చినపారుపూడిలో పాత పంచాయితీ కార్యాలయం వద్ద చెత్త పేరుకుపోవడంపై గ్రామస్థులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. కార్యదర్శి దయామణి స్పందించి.. సమస్య పరిష్కరించారు. ✤ చినపారుపూడి పంచాయతీ చెరువు వద్ద వీధి దీపాలు వెలగడం లేదని గ్రామస్థులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. కార్యదర్శి దయామణి స్పందించి.. సమస్య పరిష్కరించారు. ✤ చినపారుపూడిలో ఎంపీపీ పాఠశాల పక్కన డ్రెయినేజీ పూడిపోవడంతో గ్రామస్థులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. కార్యదర్శి దయామణి స్పందించి.. పూడిక తీయించారు.

నేటి నుంచి అందుబాటులోకి ఆధార్ కేంద్రాలు

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: మండలంలోని ఉన్నత పాఠశాలల్లో సోమవారం నుంచి విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాలను ప్రభుత్వం అందుబాటులోకి తేనుంది. విద్యాశాఖమంత్రి లోకేశ్ సూచన మేరకు విద్యార్థుల ఆధార్‌లో మార్పులు, చేర్పులు, కొత్తగా వివరాలు నమోదు చేసుకునే వారి కోసం వీటిని ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం అంగలూరు బాలుర, మంగళ, బుధవారాల్లో కౌతవరం, గురువారం వడ్లమన్నాడు, శుక్రవారం విన్నకోట జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఆయా కేంద్రాలు పనిచేయనున్నాయి.

అయ్యప్ప మాలధారులకు సత్కారం

సత్కరిస్తున్న మండలి వెంకట్రామ్

అవనిగడ్డ, న్యూస్‌టుడే: మండల పరిధిలోని వేకనూరుకు చెందిన అయ్యప్ప మాలధారులు.. పాలు, పెరుగు, పూలు తదితర కావిడులతో మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం పాదయాత్రగా వెళ్లారు. వారికి స్థానిక వంతెన కూడలిలో జనసేన నాయకుడు మండలి వెంకట్రామ్ స్వాగతం పలికి, సత్కరించారు. తాగునీరు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో పలువురు గురుస్వాములు పాల్గొన్నారు.

రహదారులు ఇలా.. రాకపోకలెలా..?

నాగాయలంక, న్యూస్‌టుడే

మండలంలోని తీర గ్రామాల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. వర్షం వస్తే కాలు బయట పెట్టాలంటే భయమేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుల్లలమోద, ఏటిమొగ తదితర గ్రామాల్లో అంతర్గత రహదారులు పూర్తికాకపోవడం, మరికొన్ని మట్టివి కావడం, ఇంకొన్ని చోట్ల డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో చిన్నపాటి వర్షానికి నీరు చేరి చిత్తడిగా మారుతున్నాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు ఆయా గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఏటిమొగ గ్రామ ప్రధాన రహదారిపై చేరిన నీరు

పెదకమ్మవారిపాలెంలో అంతర్గత మార్గం ఇలా..

పులిగడ్డలోని మార్కెట్ దారి దుస్థితి

అవనిగడ్డ గ్రామీణం: అవనిగడ్డ మండలంలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు ధ్వంసమయ్యాయి. నడకే నరక ప్రాయంగా మారిందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. మోదుమూడి- అశ్వరావుపాలెం గ్రామాలను కలిపే అనుసంధాన మార్గం అధ్వానంగా ఉంది. భారీ గోతులు పడ్డాయి. చినుకు పడితే చిత్తడి మారి ప్రమాదాలకు నిలయంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ★ దివిసీమ ముఖద్వారమైన పులిగడ్డలో మార్కెట్ రహదారిపై పడిన భారీ గోతుల్లో నీరు నిలిచింది. ★ అవనిగడ్డ-అశ్వరావుపాలెం ప్రధాన రహదారి.. వంతెన అనుసంధాన మార్గం వరకు గుంతలమయంగా మారింది. ★ మోదుమూడి ప్రధాన, తుంగలవారిపాలెం ప్రధాన రహదారులు అధ్వానంగా ఉన్నాయి.

కనుల పండువగా సూర్యదేవుని కల్యాణోత్సవం

క్రతువు నిర్వహిస్తున్న ఆగమపండితుడు

వేకనూరు (అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: కార్తిక మాసోత్సవాలను పురస్కరించుకుని వేకనూరు సూర్యదేవాలయంలో స్వామి వారి కల్యాణోత్సవం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. తొలుత ఆదిత్యుడికి ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ మూర్తులను పట్టువస్త్రాలు, పూలదండలతో అలంకరించారు. కల్యాణోత్సవానికి వచ్చిన భక్తులకు.. ఆలయ వ్యవస్థాపకుడు తుంగల వీరవసంతరావు-ఇందిర దంపతులు వన భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు.

కల్యాణ వేంకటేశ్వరుడికి పుష్పయాగం

గరుడ వాహనంపై వివిధ రకాల పుష్పాల అలంకరణలో స్వామి

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: కార్తిక మాసోత్సవాలను పురస్కరించుకుని దివిసీమ ముఖ ద్వారం పులిగడ్డలో కల్యాణ వేంకటేశ్వరస్వామికి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పుష్ప యాగం నిర్వహించారు. గరుడ వాహనంపై ప్రతిష్ఠించి వివిధ రకాల పుష్పాలతో పూజలు చేసి అలంకరించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఈవో వాసుదేవరావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు మండలి భవన్నారాయణ తదితరులు పర్యవేక్షించారు.

వైభవంగా దీపోత్సవం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి స్వామివారి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సతీమణి విజయలక్ష్మి, కుమారుడు వెంకట్రామ్, కోడలు సాయిసుప్రియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోటి దీపోత్సవాన్ని విజయలక్ష్మీ ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త పోతురాజు భాస్కర్‌రావు దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక సిద్ధేశ్వరాలయంలో లక్ష దీపోత్సవం నిర్వహించారు.

శివలింగాకృతిలో అమర్చిన దీపాలకు మహిళలు పూజలు చేశారు.

అధికారుల సేవలు ప్రశంసనీయం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: విపత్తుల వేళ ధైర్య సాహసాలతో పనిచేసిన ప్రతిఒక్కరూ స్ఫూర్తిదాయకులని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా మొంథా తుపాన్ ఫైటర్ అవార్డులు అందుకున్న కోడూరు తహసీల్దార్ జలగం సౌజన్య కిరణ్మయి, అవనిగడ్డ గ్రామ సచివాలయం-5 షిషరీస్ అసిస్టెంట్ లేబాక నాగేంద్రబాబులను ఆదివారం ఎమ్మెల్యే తన కార్యాలయంలో సత్కరించి, అభినందించారు. తుపాన్ సమయంలో నియోజకవర్గ అధికారులు ఉత్తమ సేవలు అందించారని ప్రశంసించారు.

ఆలయాల్లో చాగంటి పూజలు

మొవ్వ వేణుగోపాలస్వామి ఆలయంలో హారతి అందుకుంటున్న ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు

మొవ్వ(కూచిపూడి), ఘంటసాల, న్యూస్‌టుడే: మొవ్వలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు.. తన శిష్యబృందంతో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు శేషవస్త్రాలు అందజేశారు. వారికి ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్వీ సుబ్బారావు, అర్చకులు దివి సీతారామ్‌హనుమాన్, వంశీమోహన్‌లు స్వాగతం పలికారు. వేణుగోపాలుడి క్షేత్ర వివరాలను.. అర్చకులు వివరించారు. అనంతరం ఆలయం తరపున చాగంటిని సత్కరించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కళారత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ కూచిపూడి నృత్య ప్రదర్శన చేయగా.. ప్రశంసించారు. ఆధ్యాత్మిక గ్రామమైన పెదముత్తేవిని సందర్శించాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లిగమనేని రామలింగేశ్వరరావు.. చాగంటి కోటేశ్వరరావును ఆహ్వానించారు. ✤ ఘంటసాల జలధీశ్వరాలయం, శ్రీకాకుళంలో చారిత్రక ఆంధ్ర మహా విష్ణువు ఆలయాలను ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

'పంట నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతా..'

ఘంటసాలలో వరి పంట పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కూటమి నాయకులు

ఘంటసాల, న్యూస్‌టుడే: తుపాన్ నేపథ్యంలో కురిసిన వర్షాలకు అవనిగడ్డ నియోజకవర్గంలో వరి పంటకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఘంటసాలలో వర్షాలకు దెబ్బతిన్న వరి పొలాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంట నష్టపోయిన రైతుల వివరాలు నమోదు చేయాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తుమ్మల చౌదరిబాబు, గొర్రెపాటి వెంకటరామకృష్ణ, బండి పరాత్పరరావు, రైతులు కొండపల్లి రామకృష్ణ, వేమూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా వన సమారాధనలు

మోపిదేవిలో వన భోజనాలు

మోపిదేవి, న్యూస్‌టుడే: కార్తిక మాసం ఆదివారాన్ని పురస్కరించుకుని మోపిదేవి బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి పుట్ట వద్ద వన భోజనాలు ఏర్పాటు చేశారు. సుమారు 3 వేల మంది అన్న సంతర్పణలో పాల్గొన్నారు. తొలుత గోమాతను పూజించారు. స్వామికి విశేష పూజలు చేసి, అలంకరించారు.

గుడ్లవల్లేరు: స్థానిక పురాతన వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. క్షీరాబ్ధి ద్వాదశిని పురస్కరించుకుని గత నాలుగు నెలలుగా మహిళలు చేస్తున్న చాతుర్మాస వ్రత దీక్ష విరమించారు. ఆలయ ఛైర్మన్ వల్లభనేని సీతారాం, లక్ష్మణరావు, పోలవరపు సీతారామయ్య, పెంటపాటి చిట్టిబాబు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గుడివాడ: గుడివాడ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని తటివర్రు రోడ్డులోని శ్రీరమణ మహర్షి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో కార్తిక వనసమారాధన నిర్వహించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

కొండలమ్మ ఆలయం కిటకిట

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని ప్రసిద్ధ వేమవరం కొండలమ్మ ఆలయానికి ఆదివారం భారీగా భక్తులు తరలివచ్చారు. మహిళలు పాలపొంగళ్లు వండి నైవేద్యంగా సమర్పించారు. తలనీలాలు, మొక్కులు తీర్చుకుని బంధుమిత్రులకు అన్నసమారాధనలు చేసుకున్నారు.

పంట కాలువలో పడి వ్యక్తి మృతి

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: పోటుమీద పంట కాలువలో పడిపోయి వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ చాణక్య కథనం మేరకు.. పెదగుడుమోటు గ్రామానికి చెందిన నంబూరి గణేష్ (27).. గత నెల 25న భావదేవరపల్లిలోని సోదరుడి ఇంటికి వెళ్లాడు. రాత్రి సమయంలో బహిర్భూమికని కాలువ వద్దకు వెళ్లి.. ప్రమాదవశాత్తు అందులో పడిపోయి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య ఉంది.

మంటాడ శివాలయంలో చోరీ

దొంగలు తెరిచిన హుండీ

మంటాడ (పమిడిముక్కల), న్యూస్‌టుడే: మంటాడ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీలోని నగదు చోరీచేశారు. మూడు నెలలుగా హుండీ తెరవకపోవడంతో అందులో రూ. లక్ష వరకు కానుకలు ఉండొచ్చని అర్చకులు చెబుతున్నారు. ఆదివారం వేకువజామున సిబ్బంది ఆలయ తాళాలు తీసిన సమయంలో హుండీ తలుపు తెరిచి ఉండటాన్ని గమనించి.. ఆలయ ఛైర్మన్‌కు సమాచారం ఇచ్చారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్సై బి.శ్రీను.. సిబ్బందితో సంఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దివ్యాంగునిపై కత్తితో దాడి: నిందితులపై కేసు

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: సరిహద్దు తగాదా నేపథ్యంలో మండల పరిధిలోని బడేవారిపాలేనికి చెందిన అనుమకొండ వీరాంజనేయులు అనే దివ్యాంగుడిపై.. గత నెల 31న కత్తితో దాడిచేసి గాయపరిచిన.. అనుమకొండ వెంకటేశ్వరరావు, అతడి భార్య శివపార్వతిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చాణక్య తెలిపారు. బాధితుడు విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

గుడివాడ, న్యూస్‌టుడే: వ్యక్తి అదృశ్యంపై గుడివాడ ఒకటో పట్టణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు. . పట్టణంలోని గాంధీబొమ్మ వీధికి చెందిన గేదెల సత్యన్నారాయణకు మతిస్థిమితంగా ఉండదు. ఈ క్రమంలో గల నెల 27న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతకగా అచూకీ లభించలేదు. దీంతో అతడి భార్య వెంకటలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

నాగాయలంక, న్యూస్‌టుడే: మండలంలోని సంగమేశ్వరంలో జూద శిబిరంపై దాడి చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎనిమిది మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ. 7,300 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

అవయవదానం అభినందనీయం

గుడివాడ, న్యూస్‌టుడే: అవయవ దానం ద్వారా మరికొందరి జీవితాల్లో వెలుగులు ప్రసరింపజేయవచ్చని.. ఈ విషయంలో గుడివాడ హరి విజయ్ కుమార్(46) కుటుంబం అందరికీ ఆదర్శంగా నిలిచిందని.. జనసేన నాయకుడు దాసరి మహేష్ పేర్కొన్నారు. గుడివాడకు చెందిన జన సైనికుడు గుడివాడ హరివిజయ్‌కుమార్ గత నెల 30న బ్రెయిన్ డెడ్ కావడంతో కుటుంబ సభ్యులు అతడి అవయవాలను దానం చేశారు. మానవత్వం చాటుకున్న హరి విజయ్‌కుమార్ కుటుంబాన్ని ఆదివారం మహేష్ పరామర్శించారు. జనసేన పార్టీ వారికి అండగా ఉంటుందని చెప్పారు.

వసతులు లేక.. ఉండలేక..!

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్క రోడ్డులో నాలుగేళ్ల కిందట ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో మౌలిక వసతులు లేక స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం రహదారి సౌకర్యం కూడా లేకపోవడంతో కొద్దిపాటి వర్షానికి కూడా బయటకు రావడానికి అవస్థలు తప్పడం లేదని వాపోతున్నారు. రహదారులు, డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని ప్రజా ప్రతినిధులను ఎన్నిసార్లు అడిగినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కోడూరు వచ్చిన కలెక్టర్ డీకే బాలాజీని కలిసి కాలనీ వాసులు తమ సమస్యలపై వినతి పత్రం కూడా ఇచ్చారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో ఆడిట్ విభాగం అధికారిణి

క్రాంతికుమారికి స్వామిచిత్రపటం అందజేస్తున్న ఆలయ పర్యవేక్షకుడు మధుసూదనరావు

మోపిదేవి, న్యూస్‌టుడే: ఏలూరు ఆడిట్ విభాగం(మూడు జోన్లు) ప్రాంతీయ ఉప సంచాలకురాలు బీఆర్ క్రాంతికుమారి ఆదివారం మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. నాగపుట్టకు పూజలు చేశారు. స్వామి వారి పంచామృతాభిషేక పూజలో పాల్గొన్నారు. వేద పండితులు ఆమెను ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకుడు అచ్యుత మధుసూదనరావు స్వామి చిత్రపటం, ప్రసాదాలు అందించారు. పట్టు వస్త్రాలతో సత్కరించారు. జిల్లా ఆడిట్ అధికారి సూర్యభాస్కర్ పాల్గొన్నారు.

అధునాతన వైద్య విధానాలపై అవగాహన అవసరం

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పోతినేని రమేష్‌బాబు

గుడివాడ, న్యూస్‌టుడే: గుండె జబ్బులను సకాలంలో గుర్తిస్తే రోగిని ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ పోతినేని రమేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక ఐఎంఏ హాలులో విజయవాడ ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుడివాడ వారు ఒక రోజు నిరంతర వైద్య విద్యా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు అధునాతన వైద్య విధానాలను అందిపుచ్చుకోవాలంటే ఎప్పటికప్పుడు వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. సుమారు 200 మంది రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చి పలు రకాల వైద్య విధానాలపై అవగాహన పెంచుకోవడం.. శుభ పరిణామమన్నారు. ఈ సందర్భంగా గుండె జబ్బుల చికిత్సలో తాజాగా వచ్చిన పురోగతిని రమేష్‌బాబు వివరించారు. పలువురు వైద్యులు వారి వైద్య విధానంలో వచ్చిన నూతన మార్పులను పంచుకున్నారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు మాగంటి శ్రీనివాస్, కార్యదర్శి పి.శ్రీనివాస్, ఏపీ మెడికల్ కౌన్సిల్ పరిశీలకుడు దుర్గాప్రసాద్, ఐఎంఏ నాయకులు ఉండవల్లి శ్రీనివాస్, దేవరపల్లి సూరజ్, మన్నెం భవానీ శంకర్, పాలడుగు వెంకట్రావు, గోగినేని వెంకటరత్నం, లావు కరచంద్, పొట్లూరి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెదేపా కార్యకర్త కుటుంబానికి సాయం

బాబూరావుకు రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న శ్రీనివాసరావు

నాగాయలంక, న్యూస్‌టుడే: కార్యకర్తల సంక్షేమానికి తెదేపా అధిక ప్రాధాన్యమిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, అవనిగడ్డ నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు కె.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పర్రచివర పంచాయతీ శివారు గణపేశ్వరానికి చెందిన తెదేపా కార్యకర్త చాట్రగడ్డ సువార్తమ్మ ఈ ఏడాది మే 9న రోడ్డు ప్రమాదంలో మరణించడంతో.. ఆమె భర్త బాబూరావుకి రూ.5 లక్షల చెక్కును శ్రీనివాసరావు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, మెండు లక్ష్మణరావు, మంచాల తిరుపతి వరప్రసాద్, పర్చూరి దుర్గాప్రసాద్, బండే రాఘవ, మేకొండ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య వృత్తిదారులు పేర్లు నమోదు చేసుకోండి

అవనిగడ్డ, న్యూస్‌టుడే: సముద్ర మత్స్యకార జనగణన జాగ్రత్తగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. స్థానిక మత్స్యకార సామాజిక భవనంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నవంబరు 3 నుంచి డిసెంబరు 18 వరకు దేశ వ్యాప్తంగా నిర్వహించే జనగణనలో మత్స్య వృత్తిదారులంతా తమ పేర్లు నమోదు చేయించుకునేలా సంఘాల నాయకులు చొరవ చూపాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే మత్స్యశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

దుర్వాసనతో అవస్థలు

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వెనుక వైపు పోల్‌రాజ్ లాకుఛాంబర్‌లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దాని పక్కనే మాంసం, చేపల మార్కెట్ ఉండటంతో విక్రయదారులు వాటి వ్యర్థాలను ఛాంబర్‌లో వేస్తున్నారు. మండల కార్యాలయాలకు వచ్చే వారు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పామర్రులో భారీ వర్షం

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రులో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ వర్షంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావడానికి ఇబ్బందులు పడ్డారు.

డిజిటల్ తెర ఏర్పాటు

పామర్రు, న్యూస్‌టుడే: భారత్-సౌత్‌ఆఫ్రికా మహిళల వన్డే వరల్డ్ కప్ ఫైనల్ పోటీ సందర్భంగా పామర్రు ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఆధ్వర్యంలో ఆదివారం డిజిటల్ తెర ఏర్పాటు చేశారు. క్రికెట్ అభిమానులు వీక్షించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సోదరుడు వర్ల చైతన్య, పార్టీ నాయకులు పర్యవేక్షించారు.

పేదల అభ్యున్నతికి ఎర్రన్నాయుడి కృషి

గుడివాడలో ఎర్రన్నాయుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కూటమి నాయకులు

గుడివాడ, న్యూస్‌టుడే: పేదల అభ్యున్నతికి కృషి చేసిన నాయకుడు కింజారపు ఎర్రన్నాయుడు అని కూటమి నాయకులు పేర్కొన్నారు. ఎర్రన్నాయుడు వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక నీలామహల్ రోడ్డులోని ఆయన విగ్రహానికి కూటమి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన గుడివాడ బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్, తెదేపా నాయకుడు వెనిగండ్ల రామకృష్ణ, చేకూరు జగన్‌మోహన్‌రావు, పండ్రాజు సాంబశివరావు, మార్కెట్ యార్డు ఛైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, వంగపండు ఆదినారాయణ పాల్గొన్నారు.

అవనిగడ్డ, న్యూస్‌టుడే: కింజరాపు ఎర్రన్నాయుడి వర్ధంతి ఆదివారం స్థానిక తెదేపా కార్యాలయంలో నియోజకవర్గ పరిశీలకుడు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రన్నాయుడి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి, పార్టీకి, పేదలకు ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, బండే రాఘవ, దుర్గాప్రసాద్, మేడికొండ విజయ్, కోట సాయి, కొట్టే విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తుల ప్రైవేటీకరణ తగదు

ఘంటసాల, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను అందరూ అడ్డుకోవాలని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఆదివారం ఘంటసాలలో ప్రజావైద్యం-ప్రజల హక్కు. అంటూ వైద్య కళాశాలలు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైకాపా చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమ కార్యక్రమాన్ని రమేష్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు తుమ్మల మురళీకృష్ణ, కుంపటి నాగేంద్రబాబు, వేమూరి వెంకట్రావు, ప్రవీణ్ పాల్గొన్నారు.

పంచమ వర్ధంతి

కీ॥శే॥ డా॥ కోట శ్రీహరిరావు గారు M.S. (Gen)
అవనిగడ్డ

మహోన్నతమైన మంచి మనిషికి కన్నీటి నివాళి. మీరు భౌతికంగా మా నుండి దూరమై 5 సంవత్సరములు అయినను మా అందరి మనసుల్లో మీ జ్ఞాపకాలు పదిలం. మీ స్ఫూర్తిని కొనసాగిస్తూ, అశ్రునయనాలతో...

భార్య : కోట వెంకటలక్ష్మి

కుమార్తె - అల్లుడు: డా॥ దీప్తి M.S. - డా॥ G. రవి M.S.M.CH
మనుమరాలు : G. అమేయ
మనుమడు : G. శ్రీమన్యు

కుమారుడు - కోడలు: డా॥ ప్రవీణ్ M.D. - డా॥ ఉష M.S.,
మనుమరాలు : K. శ్రీ హావిష
మనుమడు : K. ఆభాన్ భార్గవ్

అమ్మాయిలు అదరగొట్టారు..

అభిమానులు జై కొట్టారు..

విజయం మనదే..

ఆంధ్ర క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెర

ముంబయి వేదికగా ఆదివారం జరిగిన మహిళల క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌ను విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో తెరపై వీక్షించేందుకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో భారత్ విజయం సాధించడంతో అభిమానులు కేరింతలు కొడుతూ సంబరాలు చేసుకున్నారు. - ఈనాడు, అమరావతి

విలువలు వీడి.. విర్రవీగె జోగి..!

వైద్య పరీక్షల కోసం జీజీహెచ్‌కు తరలిస్తుండగా పోలీసులపై జోగి అసహనం

★ మూడు నియోజకవర్గాల్లోనూ భారీగా అక్రమాలు ★ పెడనలో అధికారులను సైతం బెంబేలెత్తించి..

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో జోగి రమేష్ అడుగుపెట్టిన ప్రతి నియోజకవర్గంలోనూ ప్రశాంత వాతావరణం మాయమైపోతుందనే అపవాదు ఉంది. మైలవరం, పెనమలూరుల్లో.. అక్కడి స్థానిక ఎమ్మెల్యేలను కూడా ఆధిపత్యంలో ఉంచగా.. తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. పెడనలో ఏకంగా అవినీతి సామ్రాజ్యాన్నే స్థాపించారు. ఈ మూడు నియోజకవర్గాల్లోనూ స్థానికంగా ఉండే.. ఇసుక, మట్టి, బుసక.. నిల్వలపై ప్రధానంగా దృష్టిపెట్టి తన ఆధీనంలోకి తెచ్చుకునేవారు. గత ఎన్నికల ముందు తన సోదరుడు, కుమారుడు, బాబాయి, ఇద్దరు ప్రధాన అనుచరులను రంగంలోకి దింపి విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడ్డారు. ఇసుక రీచుల్లో పాగా వేసి డబ్బులను భారీగా దోచుకున్నారనే విమర్శలున్నాయి. ఇదేంటని అక్కడి ఎమ్మెల్యేలు నిలదీస్తే.. వారిపై సామాజిక మాధ్యమాల వేదికగా బురదజల్లే ప్రయత్నం చేసేవాళ్లు. మైలవరం, పెనమలూరుల్లోనూ ఇలాగే ఎన్నికల ముందు చేశారు. తమ వసూళ్లకు అడ్డొస్తే.. సొంత పార్టీ నేతలనైనా బలి చేసేందుకు వెనుకాడేవారు కాదు.

పెడన నియోజకవర్గాన్ని జోగి, అతని వర్గం పదేళ్లు శాసించింది. 2009, 2019లో రెండుసార్లు పెడన నుంచే గెలిచారు. 2009లో తొలిసారి పెడనకు వచ్చిన జోగి.. నియోజకవర్గంలో తనకు బలమైన అనుచర వర్గాన్ని తయారు చేసుకున్నారు. వారి ద్వారానే పనులన్నీ చక్కబెట్టేవారు. ఎక్కడా తెర ముందుకు మాత్రం జోగి వచ్చేవారు కాదు. ఏ అధికారి అయినా తాను చెప్పినట్టు నడుచుకోవాల్సిందే. తన ఆదేశాలను పాటించని అధికారులను ముప్పతిప్పలు పెట్టేవారు. ప్రభుత్వ శాఖలతో పనిలేకుండా నేరుగా అనుమతులిచ్చి పనులను చక్కబెట్టేవారనే ఆరోపణలు జోగిపై తీవ్రస్థాయిలో ఉన్నాయి. మడ అడవులను చెరువులుగా మార్చేందుకు, అక్రమ నిర్మాణాల అనుమతుల విషయంలో.. పెడనలో విచ్చలవిడిగా నిబంధనలకు పాతరేశారు. జోగి హయాంలో నిర్మించిన అనేక అక్రమ భవనాలకు ఇప్పటికీ సరైన అనుమతులు లేవు. ఇప్పుడు వాటిపై అధికారులు దృష్టిసారిస్తే.. అనేక అవకతవకలు వెలుగులోకి వస్తాయి.

దృష్టిపెడితే భారీగా అక్రమాలు..

కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గం కృత్తివెన్ను మండలం ఇంతేరు గ్రామం పరిధిలోని సముద్ర తీరంలో ఉన్న అత్యంత విలువైన మడ అడవులను భారీగా కొట్టేసి పర్యావరణ సమతుల్యతను దెబ్బకొట్టారు. 2021 నుంచి 24 మధ్య కాలంలో ఈ విధ్వంసం భారీగా జరిగింది. సముద్ర తీరప్రాంతంలోని చిత్తడి నేలల్లో పెరిగే మడ అడవుల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. తుపాన్లు వచ్చిన సమయంలో ఇవి తీవ్రతను తగ్గిస్తాయి. ఈ అడవులు జీవవైవిధ్యానికి కేంద్రం. పలురకాల జంతుజాలం అభివృద్ధి చెందుతుంది. అంతరించే జాతులు వృద్ధి చెందుతుంటాయి. ఇంత ప్రాధాన్యం ఉన్న మడ అడవులను విచ్చలవిడిగా జోగి ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న సమయంలో కొట్టేశారు. కానీ ఇంతవరకూ ఒక్క అధికారి కూడా ఇటువైపు కన్నెత్తి చూసింది లేదు. కనీసం కేసు కూడా ఇంతవరకూ నమోదు చేయలేదు. రెవెన్యూ, అటవీశాఖ సంయుక్తంగా సర్వే చేస్తే.. అనేక అక్రమాలు వెలుగులోకి వస్తాయి. - ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం, పెడన

ఎక్సైజ్ స్టేషన్ వద్ద వైకాపా నాయకులు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, దేవినేని అవినాష్ తదితరులు

ఎక్సైజ్ స్టేషన్ ముందు పోలీసులతో వాగ్వాదానికి దిగిన జోగి అనుచరులు

కథ అడ్డం తిరిగింది..!

ఈనాడు, అమరావతి

వైకాపా పాలనలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం దర్యాప్తు, పెద్దల పాత్రపై వెలుగుచూస్తున్న సంచలనాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు జోగి రమేష్ వదిలిన బాణంగా అద్దేపల్లి జనార్దనరావు తెర మీదకు వచ్చారు. ఆయన్ని పావుగా వాడుకుని నకిలీ మద్యం బురదను కూటమి సర్కారుపై వేయాలని వైకాపా ఆరాటపడగా రాసిన కట్టుకథ అడ్డం తిరిగింది. జనార్దనరావు అరెస్టుతో లాగిన తీగ డొంక మొత్తాన్ని కదిలించింది. ఈ వ్యవహారంలో అద్దేపల్లి పాత్రధారి మాత్రమే అని అసలు సూత్రధారి జోగి రమేష్ అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్న క్రమంలో ఆదివారం ఆయన్ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

చిన్నప్పటి నుంచి తెలుసు..

జోగి రమేష్ ఇల్లు అద్దేపల్లి దుకాణం దగ్గరే ఉంటుంది. ఆ సమీపంలోనే ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నకిలీ మద్యం సరఫరా జరిగింది. వీరిద్దరికీ చిన్నతనం నుంచి మంచి పరిచయాలున్నాయి. అద్దేపల్లి ఎన్నికల ఖర్చుల కోసం సైతం జోగికి గతంలో భారీగా డబ్బులు ఇచ్చినట్లు ఎన్నికలకు ముందు నియోజకవర్గంలో పెద్ద చర్చ జరిగింది. అద్దేపల్లి ఇంట్లో ఏ కార్యక్రమం జరిగినా జోగి హాజరవుతుంటారు.

కూటమి సర్కారుపై బురదజల్లే నాటకానికి తెర

ఇటీవల వారు కలిసి ఉన్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. వీరిద్దరి మధ్య జరిగినట్లు చెబుతున్న వాట్సాప్ సంభాషణలు సైతం వెలుగులోకి వచ్చాయి. జోగి ఎమ్మెల్యే, మంత్రిగా పని చేసిన సందర్భంలో అద్దేపల్లి వ్యాపారాలకు అండగా నిలబడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. అద్దేపల్లి గతంలో ఆఫ్రికా దేశాల్లో మద్యం వ్యాపారం చేసినట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. అక్కడ మద్యం తయారీ విధానాన్నే ఇక్కడ కూడా అనుసరించినట్లు గుర్తించారు. విషయం వెలుగులోకి వస్తుందన్న నేపథ్యంలో ఆఫ్రికా నుంచి తిరిగి రావాల్సిన అద్దేపల్లి జనార్దనరావు రాకుండా అక్కడే ఆగిపోయారు. తనకు అసలు సంబంధమే లేదంటూ ఓ వీడియో సైతం విడుదల చేశారు. తర్వాత గన్నవరం విమానాశ్రయంలో దిగిన తర్వాత సైతం ఈ కేసుతో తనకు ఏ సంబంధం లేదని, కావాలనే ఇరికిస్తున్నారని మీడియాతో మాట్లాడారు. విచారణలో అసలు విషయాలు వెల్లడించారు.

వైకాపా పాలనలోనూ అద్దేపల్లితోనే..

'జోగి రమేష్ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన నేతృత్వంలోనే నకిలీ మద్యం తయారు చేశా.. [illegible] అని పోలీసులకు ఇచ్చిన వీడియో వాంగ్మూలంలో అద్దేపల్లి కుండబద్దలు కొట్టారు. ఈ పరిణామం తర్వాతే జోగి, అద్దేపల్లి బంధం, జోగికి సైతం కల్లు, మద్యం వ్యాపారం చేసిన నేపథ్యం ఉండడం.. జనార్దనరావుతో మంచి సంబంధాలు ఉన్నప్పటికీ 'జనార్దన్‌కు నాకు సంబంధం లేదని' అని జోగి బహిరంగంగా చెప్పడం.. ఇలా అనేక అనుమానాస్పద వ్యవహారాలతో జోగి రమేష్‌కు ఉచ్చు బిగుసుకుంది.

డిసెంబరు 13న జాతీయ లోక్‌అదాలత్

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు డిసెంబరు 13న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా జడ్జి జి.గోపి తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని మచిలీపట్నం, విజయవాడ, గుడివాడ, నూజివీడు, నందిగామ, అవనిగడ్డ, కైకలూరు, గన్నవరం, తిరువూరు, జగ్గయ్యపేట, బంటుమిల్లి, మైలవరం, ఉయ్యూరు, మొవ్వ ఇలా అన్ని కోర్టుల్లోనూ ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. దీని కోసం ఆయా న్యాయస్థానాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద క్లైమ్‌లు, సివిల్ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు తమ న్యాయవాదిని సంప్రదించి ఇందులో కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు.

'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ నెల 3వ తేదీ సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/ నగరపాలక సంస్థ కార్యాలయాల్లో, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్ ఆవరణలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతి పత్రాలు స్వీకరించనున్నట్లు వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

✦ **మీకోసం వెబ్‌సైట్‌లోనూ అర్జీల దాఖలు..** ప్రజలు తమ సమస్యలను మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ దాఖలు (నమోదు) చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఇందులో దాఖలైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నంబరుకు నేరుగా ఫోన్ చేయవచ్చని ఆయన వివరించారు.

కలరా ఆసుపత్రికి ఆ పేరెలా వచ్చిందీ..

చిట్టినగర్ సమీపంలోని కలరా ఆసుపత్రి సెంటర్ ఇది. ఈ పేరు రావడానికి పెద్ద కథే ఉంది. నాడు బ్రిటీష్ అధికారి సర్ ఆర్థర్ కాటన్ పర్యవేక్షణలో ఆనకట్ట నిర్మిస్తున్న రోజుల్లో కలరా వ్యాధి ముమ్మరంగా వ్యాపించింది. ప్రజలు వేల సంఖ్యలో మృతి చెందుతున్న నేపథ్యంలో భయాందోళనలు పెరిగిపోతాయన్న దూరదృష్టితో ఆ వ్యాధికి ప్రచారం రానివ్వలేదు.

ఇప్పుడు సర్కిల్-1 కార్యాలయం

వ్యాధి సోకిన వారిని అప్పట్లో నగరానికి పొలిమేరగా ఉన్న ఊరు చివర క్వారంటైన్‌లో ఉంచడం ప్రధానమని ఆయన భావించారు. అందుకు తగిన ప్రదేశం ఇప్పుడు మనం పిలిచే కలరా ఆసుపత్రి సెంటర్. అప్పుడు తాటాకు పాకలు వేసి రోగులకు నివాసం కల్పించారు. అక్కడే కలరా వ్యాధిగ్రస్థులకు చికిత్స చేయించారు. బయట నుంచి ఆ ప్రాంతానికి జనాన్ని రాన్వికుండా కట్టుదిట్టం చేయించారు. కలరా వ్యాధి సోకి పెద్ద సంఖ్యలో ఇక్కడ చికిత్స చేయించడం వల్ల కలరా ఆసుపత్రిగా పేరు గాంచింది. కాలానుగుణంగా నగరం పెరిగిన నేపథ్యంలో ఇప్పుడు దానిని సర్కిల్-1 కార్యాలయంగా విస్తరించారు. దానిలో జోనల్ కమిషనర్, ఈఈ-1, శానిటరీ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సచివాలయం, పన్నుల వసూళ్ల కేంద్రం, సచివాలయం నిర్వహిస్తున్నారు. ప్రజలకు పలు సేవలందిస్తున్నారు. - న్యూస్‌టుడే, చిట్టినగర్

ప్రకృతి వరం.. క్రీడాకారులకు ఊతం

జగ్గయ్యపేట శివారు కె.అగ్రహారంలోని పాలేరు ఈతకొలనుకు ప్రత్యేకత ఉంది. ఇది సహజసిద్ధంగా ఏర్పడింది. ఇక్కడ ఓంకారేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న స్నానాలఘాట్‌లో రెండు దశాబ్దాల క్రితం పెద్ద గుంత పడింది. అప్పట్లో సమస్యగా భావించిన ఆ గుంతే ఇప్పుడు క్రీడాకారులకు వరమైంది. కీళ్ల నొప్పుల కారణంగా నడవలేని విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్ మోహనరావు.. వైద్యుల సూచన మేరకు ఇక్కడ ఈత కొట్టేవారు. ఈ క్రమంలో ఎంతోమంది ఆయన వద్ద శిక్షణకు కూడా వచ్చేవారు. ఇలా సహజసిద్ధమైన ఈతకొలనుగా మారింది. ఆ తర్వాత కృష్ణా స్విమ్మర్స్ అసోసియేషన్ వారు పోటీలు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఇక్కడే సాధన చేసిన ఈత క్రీడాకారులు పాండురంగారావు, లక్ష్మీ దంపతులు డ్రీమర్స్, స్విమ్మర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసి ఐదేళ్లుగా క్రీడాకారులను జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలకు తీసుకెళుతున్నారు. దేశంలో ఎక్కడ ఈతల పోటీలు జరిగినా విజేతల్లో జగ్గయ్యపేట ప్రాంత క్రీడాకారుల పేర్లు వినిపిస్తుంటాయి. ఇందుకు ఇక్కడ ప్రకృతి వరంగా ఏర్పడిన పాలేరు ఈతకొలనే కారణంగా భావిస్తుంటారు. – జగ్గయ్యపేట, న్యూస్‌టుడే

తిరుపతమ్మకు పసుపు కొమ్ముల అలంకరణ

పెనుగంచిప్రోలులోని శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారిని ఆదివారం ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో అలంకరించారు. కార్తిక మాసం రెండో ఆదివారం సందర్భంగా ప్రత్యేక అలంకరణ చేసినట్లు ఆలయ ఈవో కిశోర్‌కుమార్ తెలిపారు. పెద్దసంఖ్యలో తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి పాలపొంగళ్లు తయారుచేసుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి పాల పొంగళ్లు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. - న్యూస్‌టుడే, పెనుగంచిప్రోలు

ఓఆర్ఆర్ 3ఏమాయె..!

☛ ప్రతిపాదనల తయారీలో జాప్యం
☛ ఎన్టీఆర్ జిల్లాలో కొలిక్కి రాని ప్రక్రియ

ఈనాడు, అమరావతి

నవ్యాంధ్ర రాజధాని అమరావతికి మణిహారమైన ఓఆర్ఆర్‌కు కీలకమైన 3ఏ ప్రతిపాదనల తయారీ జిల్లాలో నత్తనడకన సాగుతోంది. పల్నాడు, ఏలూరు జిల్లాల్లో ఇప్పటికే ప్రక్రియ పూర్తికాగా.. కృష్ణా జిల్లాల్లోనూ దాదాపు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఎన్టీఆర్‌లో మాత్రం ఇప్పటికి బాలారిష్టాలు దాటలేదు. 35 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. భూసేకరణ, పరిహారం, నిర్మాణం వంటి అనేక దశల ప్రక్రియ సజావుగా సాగేందుకు ముఖ్యమైన 3ఏ ప్రతిపాదనల తయారీ ఆలస్యం కావడంతో ప్రాజెక్టు ఆలస్యమయ్యే పరిస్థితి ఉంది.

ఇంకా ఆరు గ్రామాలే.. మొత్తం ఓఆర్ఆర్ 23 మండలాల్లో 97 గ్రామాల మీదుగా వెళ్తుండగా ఎన్టీఆర్ జిల్లాలో కంచికచర్ల, మైలవరం, వీరులపాడు, జి.కొండూరు మండలాల్లోని 18 గ్రామాల్లో నిర్మాణం చేయనున్నారు. దీని కోసం



ఆయా గ్రామాల్లో సేకరించాల్సిన భూముల వివరాలు, సర్వే నంబర్లు, యజమానుల పేర్లు, ఆ భూమి సాగు చేస్తున్నారా లేక వ్యాపారాలు నిర్వహిస్తున్నారా, నివాసాలున్నాయా ఇలా అనేక వివరాలు పొందు పరుస్తూ 3ఏ ప్రతిపాదనలు తయారు చేస్తారు. ఇప్పటివరకు రెవెన్యూ శాఖ పెరకలపాడు, పొన్నవరం, జగన్నాథపురం, గూడెంమాధవరం, మున్నలూరు, కినికినపాడుకు సంబంధించిన వివరాలు మాత్రమే సిద్ధం చేశారు. అంటే 33.3 శాతం గ్రామాల్లో మాత్రమే ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఇంకా 12 గ్రామాల్లో ప్రక్రియ కొలిక్కి రాలేదు. ఈ ప్రతిపాదనల ఆమోదం అనంతరం అభ్యంతరాల స్వీకరణ, పరిహారం నిర్ధారణ, భూసేకరణకు గెజిట్ ఉత్తర్వులు జారీ.. ఇలా అన్ని పరిణామాలకు ఇదే కీలక దశ. జిల్లా రెవెన్యూ యంత్రాంగం మాత్రం మీనమేషాలు లెక్కించడం గమనార్హం.

పంపినవి సవరించాల్సిందే..

ఓఆర్ఆర్ నిర్మాణం గుంటూరులో 90 కి.మీ మేర జరుగుతుండగా తర్వాత అత్యధికంగా 51 కిలోమీటర్లు ఎన్టీఆర్ జిల్లాలో ఏర్పాటవుతోంది. 700 హెక్టార్ల భూమి అవసరం ఉన్న నేపథ్యంలో మిగిలిన జిల్లాలతో పోలిస్తే కొంత ఆలస్యం అవ్వడానికి ఆస్కారం ఉంది. క్షేత్రస్థాయిలో అంతకు మించి జాప్యం అవుతుండంతో రెవెన్యూ అధికారులు ప్రక్రియను సాగదీస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటి వరకు సిద్ధం చేసిన 6 గ్రామాల 3ఏ ప్రతిపాదనల్లో సైతం రహదారి నిర్మాణానికి తీసుకోబోయే భూమి, దాని సర్వే నంబర్లు మాత్రమే నమోదు చేశారు. నిబంధనల ప్రకారం సదరు సర్వే నంబరులో మొత్తం ఎంత భూమి ఉందన్న విషయం కూడా స్పష్టంగా పొందు పర్చాలి. దీంతో తయారు చేసిన గ్రామాల ప్రతిపాదనలను సైతం సవరించి పంపాల్సి రావడంతో మరింత ఆలస్యమవుతోంది. వేగంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

దెబ్బతిన్న పంటల రక్షణపై కేవీకే శాస్త్రవేత్తతో ఫోన్‌ఇన్ నేడు

మొంథా తుపాను పంటల్ని నిలువునా ముంచేసింది. దీనికి ముందు వర్షాలు చాలా వరకు దెబ్బతీశాయి. వరుస అలజడుల నేపథ్యంలో ఉన్న పంటనైనా కాపాడుకోవాలని రైతు తాపత్రయ పడుతున్నాడు. ఈనేపథ్యంలో వరి, మినుము, చెరకు, తదితర పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతుల సందేహాలను నివృత్తి చేయడానికి 'ఈనాడు..మీతోడు' ఆధ్వర్యంలో ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సమన్వయకర్త డి.సుధారాణితో ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. రైతుల సమస్యలు, సందేహాలకు ఆమె సమాధానాలు ఇస్తారు. అన్నదాతలు చేయాల్సిందల్లా కింది సెల్ నెంబరుకు సూచించిన సమయంలో ఫోన్ చేయడమే. – ఘంటసాల, న్యూస్‌టుడే

డి.సుధారాణి

80082 01253

తేదీ: 03-11-2025 సోమవారం ఉదయం: 11 నుంచి 12 గంటల వరకు

ఆశకు పోతే.. కేసుల మోతే!

◆ అక్రమ లావాదేవీలకు అమాయకులు బలి
◆ బెట్టింగ్, విదేశాలకు డబ్బు తరలింపునకు వినియోగం

ఈనాడు, అమరావతి

☛ **విజయవాడలోని చిట్టినగర్‌కి చెందిన** కూలీని ఇటీవల ఒడిశాకు చెందిన ఒకరు కలిశారు. బ్యాంకులో పొదుపు ఖాతా తెరిచి మూడు నెలలు లావాదేవీలు చేసుకునేందుకు ఇవ్వాలని కోరాడు. ఇందుకు నెలకు రూ.5వేలు చొప్పున ఇస్తానని ఒప్పించి, ఖాతా తెరిపించాడు.

☛ **ఇటీవల క్రికెట్ బెట్టింగ్ కోసం** ఒడిశాకు చెందిన మధ్యవర్తులు కొత్తగా పలువురితో బ్యాంకు ఖాతాలు తెరిపించారు. వారి పాస్ పుస్తకాలు, బ్యాంకు కిట్లు దిల్లీకి పంపారు. కేసు దర్యాప్తులో అద్దె ఖాతాల వ్యవహారం వెలుగుచూడడంతో అమాయకులు పోలీసుల విచారణ ఎదుర్కొంటున్నారు.

అదనపు ఆదాయం ఆర్జించాలన్న ఆశను పలువురు మోసగాళ్లు తమకు అనువుగా మార్చుకుంటున్నారు. మీ బ్యాంకు ఖాతా పాస్‌బుక్, అంతర్జాల, మొబైల్ బ్యాంకింగ్ ఐడీ, పాస్‌వర్డ్‌లను వివరాలు ఇస్తే చాలు కమీషన్ ఇస్తామని ఆశచూపుతున్నారు. ఖాతాలు, యూపీఐ ఐడీల ద్వారా వ్యవహారాలు చక్కబెడుతున్నారు. వీరి మాటలు నమ్మి యువత, గృహిణులు పోలీసు కేసుల్లో చిక్కుకుంటున్నారు.

మధ్యవర్తులే తెరిపిస్తున్నారు..

అమాయకుల నుంచి బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించేందుకు దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో మధ్యవర్తులు పుట్టుకొచ్చారు. సామాజిక మాధ్యమాలు, పరిచయం ఉన్న వారి ద్వారా కమీషన్ల ఎర వేసి ఖాతాలు సేకరిస్తారు. దళారులకు దండిగా కమీషన్ ముడుతుంది. ఖాతాదారుల మొబైళ్లకు ఫిషింగ్ లింక్స్ పంపి వాటి ద్వారా ఖాతాల రిజిస్టర్డ్ ఫోన్ నంబరుకు ఎస్‌ఎంఎస్‌లు వెళ్లకుండా అవి తమకు ఫార్వార్డ్ అయ్యేలా చూస్తారు. ఖాతాల్లో జమ అవుతున్న నగదును బినామీ ఖాతాలకు మళ్లిస్తున్నారు. ఆ ఖాతాల నుంచి దేశం దాటిపోతోంది. క్రిప్టో కరెన్సీ రూపంలో ఇతర దేశాలకు చేరుతోంది.

డబ్బు ఎర వేసి..

తేలికగా డబ్బు సంపాదించేందుకు అలవాటు పడ్డ కేటుగాళ్లు ఆర్థిక లావాదేవీలకు తెలివిగా ఇతరుల ఖాతాలను ఉపయోగిస్తున్నారు. పోలీసులకు ఎక్కడా దొరక్కుండా ఉండేందుకే ఈ ఎత్తుగడ వేస్తున్నారు. అసలు ఖాతాలే లేని వారినీ కమీషన్ ఆశచూపి నిందితులే తెరిపిస్తున్నారు. వీరికి తమ ఖాతాల ద్వారా పెద్ద మొత్తాల్లో లావాదేవీలు జరుగుతున్నట్లు తెలియదు.

జాగ్రత్తలు తీసుకోవాలి..

★ మీ బ్యాంకు, యూపీఐ వివరాలెవరికీ చెప్పొద్దు.
★ సులభంగా డబ్బు సంపాదించండి అని చెప్పే ఉద్యోగ ప్రకటనలు, ఆన్‌లైన్‌లో వచ్చే ఆఫర్లు నమ్మొద్దు.
★ ఎవరైనా మీకు డబ్బు ఇచ్చి.. ఇతరులకు పంపమని లేదా ఖాతా ద్వారా అందుకోమని కోరితే స్పందించకపోవడం ఉత్తమం.

(c) eenadu

సాధన చేస్తూ..

బాలికలకు శిక్షణ.. ఆత్మరక్షణ

- జిల్లాలో 162 పాఠశాలల ఎంపిక
- నేటి నుంచి కార్యక్రమానికి శ్రీకారం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

బాలికలు తమను తాము రక్షించుకోవడానికి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడానికి శక్తిమంతులమనే భావన కలుగజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో 'రాణి లక్ష్మీ బాయి ఆత్మరక్ష- స్వీయ రక్షణ శిక్షణ'ను సోమవారం నుంచి శ్రీకారం చుట్టనుంది. ఇందులో భాగంగా జిల్లాలోని 17 మండలాల్లో 162 పాఠశాలల్లో ఈ శిక్షణ కార్యక్రమాలను రెండు నెలలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి సమగ్ర శిక్షా పథకం అధికారులు ఆయా పాఠశాలల్లో ఏర్పాట్లు చేశారు.

నిపుణులైన శిక్షకుల నియామకం

బాలికలపై దాడులు, అఘాయిత్యాలు జరుగుతున్నాయి. ఇలాంటి వాటిని ఎదుర్కొని స్వీయరక్షణ పొందాలని జిల్లాలోని అన్ని పాఠశాలలకు నిపుణులైన శిక్షకులను నియమించింది. వీరు ఆరు నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థినులకు స్వీయ రక్షణ పద్ధతులు, అత్యవసర సమయాల్లో ఎలా స్పందించాలో శిక్షణ ఇవ్వనున్నారు. ఒక్కో పీరియడ్ 90 నిమిషాలు చొప్పున 60 రోజుల్లో 20 శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇది కేవలం బాలికలకే పరిమితం కాకుండా పాఠశాలల్లో విలువల నిర్ధారణలో వ్యాయామ ఉపాధ్యాయులకు ఈ నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తారు. వీరు నేర్చుకున్న తరువాత వీటిని విద్యార్థులకు నేర్పించాలి.

వ్యక్తిత్వ వికాసానికి దోహదం

బాలికల స్వీయ రక్షణ కార్యక్రమం వారిలో ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించడానికి దోహదపడుతుంది. జీవితంలో ఏదైనా సమస్య వచ్చినపుడు ధైర్యంగా ఎదుర్కోవడానికి తోడ్పడుతుంది. తమను తాము రక్షించుకోగలమనే సురక్షిత భావన కలుగుతుంది. వీటి వల్ల సామాజిక దృక్పథంతో ఉంటారు. ఈ శిక్షణ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకారం అందించాలి. - ఎం.రజనీకుమారి, సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వై.లక్ష్మణరావు ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తొలుత వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు, వేద పండితులు, ఆలయ పర్యవేక్షకుడు స్వాగతం పలికారు. నాగదేవత పుట్టలో పూజలు చేసి మంగళ హారతులు సమర్పించారు. అనంతరం స్వామికి నిర్వహించే మహా న్యాస రుద్రాభిషేకంలో న్యాయమూర్తి దంపతులు పాల్గొన్నారు. వేద మంత్రాలతో పండితులు ఆశీర్వదించారు. స్వామి వారి చిత్రపటాలు, పట్టువస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నాగదేవత పుట్టలో పాలుపోసి హారతి ఇస్తున్న జస్టిస్ డాక్టర్ లక్ష్మణరావు దంపతులు

5 నుంచి 11 వరకు యోగా తరగతులు

రామవరప్పాడు, న్యూస్‌టుడే: ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇన్నర్ ఇంజినీరింగ్ పేరుతో రామవరప్పాడులోని ఎస్ఆర్ఎస్ గ్రీన్ మెడోస్‌లో ఈ నెల 5 నుంచి 11 వరకు ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం, సాయంత్రం పూట రెండు బ్యాచ్‌లతో నిర్వహిస్తున్నట్లు, ఆసక్తిగలవారు 91664 94989 నంబరును సంప్రదించాలని సూచించారు.

పెళ్లి సంబంధాల కోసం చూస్తున్నారా
అన్ని కులాల సాఫ్ట్‌వేర్ ఉద్యోగ వధూవరులకు సువర్ణావకాశం

నేడు అన్ని కులాల సాఫ్ట్‌వేర్ ఉద్యోగ వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, అన్ని కులాల సాఫ్ట్‌వేర్ ఉద్యోగ అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. విజయవాడ ఆటోనగర్‌లోని స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, బి బ్లాక్, 3వ అంతస్తులోని ఈనాడు కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు **నేడు (3 నవంబరు 2025)** ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ★ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్టర్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు క్రింద తెలిపిన ఫోన్ నెంబర్లను సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

మరిన్ని వివరాలకు
95501 28306 & 83744 45190
ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

'జోగి పాపం పండింది'

పటమట, న్యూస్‌టుడే: వైకాపా నేతలకు దోచుకోవడం.. దాచుకోవడం అలవాటుగా మారిందని.. తప్పులు చేయడమనేది వాళ్ల డీఎన్ఏలోనే ఉందని మాజీ ఎమ్మెల్సీ తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న మండిపడ్డారు. ఆదివారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కల్తీ మద్యం కేసులో సంబంధం ఉన్న మాజీ మంత్రి జోగి రమేష్, అమ్మవారి ముందు దొంగ ప్రమాణం చేశారని, అందుకే ఆతని పాపం పండి అరెస్ట్ అయ్యారన్నారు. ఇదే కేసులో అరెస్ట్ అయిన జనార్దనరావు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగానే జోగి రమేష్‌ను సిట్ అధికారులు అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. ఈ అరెస్ట్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. తన అరెస్ట్‌ను ముందే గ్రహించిన జోగి తన స్థాయిని పెంచుకోవడానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లపై ఆరోపణలు చేస్తున్నారని బుద్దా ఆగ్రహం వ్యక్తం చేశారు. జోగి రమేష్ గురించి ఆలోచించే తీరిక చంద్రబాబు, లోకేశ్‌లకు లేదన్నారు. తప్పు చేసిన దొరికిపోయిన జోగి రమేష్, తన అరెస్ట్ సమయంలో కులం గుర్తుకు రావడం సిగ్గు చేటన్నారు. వైకాపా రాష్ట్రంలో బీసీలకు అధికార పాత్ర కల్పించిందన్నారు. జోగి రమేష్ మందిరిని జగన్ సర్టిఫికెట్ ఇవ్వడం విడ్డూరంగా ఉందని బుద్దా విమర్శించారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్, నాయకులు నరసింహా చౌదరి, మాదిగాని గురునాథం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బుద్దా వెంకన్న, చిత్రంలో భవకుమార్, నరసింహ చౌదరి, గురునాథం

ఈ నెల 5న కార్తిక దీపోత్సవం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: కార్తిక పౌర్ణమి సందర్భంగా ఈ నెల 5న దేవస్థానం సేవాదళ్ ఆధ్వర్యంలో దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు దుర్గగుడి ఈవో శీనానాయక్ తెలిపారు. ఇంద్రకీలాద్రి మల్లికార్జున మహామండపం నాలుగో అంతస్తులోని ఈవో కార్యాలయంలో పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, స్థానాచార్య శివప్రసాద్ శర్మ ఏసీపీలు దుర్గారావు, రామచంద్రరావులతో కలిసి భవానీ దీక్షల విరమణ, కార్తిక మాస వేడుకలకు సంబంధించిన గోడపత్రాలను ఆదివారం విడుదల చేశారు. అనంతరం వైదిక కమిటీ, పోలీసు, ఇంజినీరింగ్ దేవస్థానం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ.. భక్తుల భద్రత దృష్ట్యా దీపాలు వెలిగించేందుకు ప్రత్యేకంగా 500 మంది సేవాదళ్ సభ్యులు అర్చకులకు సహకరిస్తారన్నారు. డిసెంబరు 4న సత్యనారాయణపురంలోని శివరామకృష్ణ క్షేత్రం నుంచి దుర్గగుడి వరకు ఊరేగింపులో భవానీ దీక్షాధారులు పాల్గొంటారని చెప్పారు. పశ్చిమ, వన్ ట్రాఫిక్ ఏసీపీలు దుర్గారావు, రామచంద్రరావు, సీఐలు ఉమామహేశ్వరరావు, గురుప్రకాష్, ఈఈలు కోటేశ్వరరావు, రాంబాబు, ఏఈవోలు రమేష్, వెంకటరెడ్డి, సుధారాణి, చంద్రశేఖర్, వాసు, గంగాధర్ పాల్గొన్నారు.

గోడపత్రం విడుదల చేస్తున్న ఈవో శీనానాయక్ రాధాకృష్ణ, శివప్రసాద్ శర్మ తదితరులు

అనుచిత లబ్ధి పొందినవారికి నోటీసులు

అద్విక కేసులో సొమ్ము రాబట్టేందుకు చర్యలు

ఈనాడు, అమరావతి

అద్విక ట్రేడింగ్ కంపెనీ మోసం కేసులో అనుచిత లబ్ధి పొందిన ఏజెంట్లు, డిపాజిటర్ల నుంచి సొమ్మును రికవరీ చేసేందుకు పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించారు. నష్టపోయిన వారికి న్యాయం చేసేందుకు రావాల్సిన దాని కంటే ఎక్కువ పొందిన వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. ఇప్పటికే కొందరిని పిలిపించి మాట్లాడుతున్నారు. అదనపు సొమ్మును తిరిగి చెల్లించాలని, లేనిపక్షంలో నిందితులుగా చేర్చి అరెస్టు చేస్తామని హెచ్చరిస్తున్నారు. చెల్లిస్తే సాక్షులుగా పరిగణిస్తామని చెబుతున్నారు. దీంతో కొందరు గడువు ఇస్తే తిరిగి చెల్లిస్తామని హామీ ఇస్తున్నారు.

రూ.70 కోట్లు రాబట్టేలా..

మొత్తం 62 మంది ఏజెంట్లలో 32 మంది ఎక్కువ ప్రయోజనం పొందారు. రూ.54కోట్లు పెట్టుబడి పెట్టి ఏకంగా రూ.105 కోట్లు లబ్ధి పొందారు. వారికి దక్కాల్సిన దానికంటే రూ. 49 కోట్లు అనుచితంగా పొందారు. వీరితో పాటు కొందరు డిపాజిటర్లు కూడా ఇలా ప్రయోజనం దక్కించుకున్నారు. 204 డిపాజిటర్లు రూ.35 కోట్లు పెట్టుబడి పెట్టగా రూ.56 కోట్లు వచ్చింది. ఈ రెండు వర్గాల నుంచి అదనంగా రూ.70 కోట్ల వరకు అనుచితంగా ప్రయోజనం పొందారు. ఈ సొమ్మును తిరిగి రాబడితేనే నష్టపోయిన వారికి ఉపశమనం కలుగుతుంది. ఇప్పటికే 52 చరాస్తులను గుర్తించి ఎటాచ్ చేసేందుకు ప్రభుత్వానికి లేఖ రాశారు. వీటి డాక్యుమెంట్ విలువ రూ.20 కోట్లు కాగా మార్కెట్ విలువ ఎన్ని రెట్లు ఉంది.

☛ లబ్ధి పొందిన ఏజెంట్లలో పలువురు అజ్ఞాతంలో ఉన్నారు. హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ఉండటంతో ప్రత్యేక బృందం సోదాల సమయంలో ఇళ్లకు తాళాలు వేసి పరారయ్యారు. కొందరు ఏజెంట్లను పిలిపించి వారు లబ్ధి పొందిన మొత్తం వివరాలు అందజేస్తున్నారు. డబ్బును చెల్లించాలని గట్టిగా చెబుతున్నారు. దీనికి వారు వారం రోజుల సమయం కోరుతున్నారు. గడువు దాటిన తర్వాత కూడా ఇంకా స్పందించకపోతే వారికి సంబంధించిన ఆస్తులను ఎటాచ్ చేయడంతో పాటు అరెస్టు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఆరోగ్య కార్డులపై ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తామని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. ఉద్యోగుల వైద్య సేవలపై ఆదివారం విజయవాడలోని ఎన్జీవో భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల ఆరోగ్యకార్డులకు సంబంధించి 60 రోజుల్లోనే ప్రక్షాళన చేసి, నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా కమిటీ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం సంతోషకరమన్నారు. వైద్య సేవల్లో సమస్యలు, పాత ప్యాకేజీ ధరల వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఆసుపత్రులకు సరిగా చెల్లింపులు చేయకపోవడం వల్ల తలెత్తే సమస్యలు, దశాబ్ద కాలం క్రితం నిర్ణయించిన రెండు లక్షల రూపాయల సీలింగ్ తదితర సమస్యల పరిష్కారానికి ఏపీ ఎన్జీవో కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు 60రోజుల్లో అన్ని పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతిష్ఠాత్మకమైన ఎన్జీవో ఎన్నికలకు సంఘం సిద్ధంగా ఉందని తెలిపారు. వేతన సవరణ, ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ, అడిషనల్ క్వాంటమ్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, పదోన్నతులకు కృషి చేయాలని, ఎన్జీవో 75 సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించాలని సమావేశంలో రాష్ట్ర కార్యవర్గం తీర్మానించింది. సంఘం రాష్ట్ర కోశాధికారిగా పీఐవో డిపార్టుమెంట్‌కి చెందిన భారతిప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి జగదీశ్వరరావు, ప్రసాద్ యాదవ్, మాధవ్, 26 జిల్లాలకు చెందిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విద్యాసాగర్. వేదికపై రమణ, జగదీశ్వరరావు, ప్రసాద్ యాదవ్, మాధవ్ తదితరులు

ధర వరలు

వంకాయలు-46/50, టమాటా-28, బెండ-44, పచ్చిమిర్చి-26, కాకర-40, బీర-42/46, క్యాలీ ఫ్లవర్-20/22, క్యాబేజి-28, క్యారెట్-56/72, దొండ-34, బంగాళదుంప-32, ఉల్లిపాయలు-24, గోరుచిక్కుళ్లు-44, దోస-22, సొర-25, పొట్ల-28/25, అరటికాయ-5/6, చామదుంప-28, అల్లం-80, మునగ-10/8, ఆకు కూరలు (కట్ట)-4/10, కంద-46, బీట్ రూట్-50, కీరదోస-38, బీన్స్-85/95, క్యాప్సికమ్-78, చింతకాయలు-70, నిమ్మ (డజను)-24/28, కొత్తిమీర-13/26, పుదీనా-5/15, ముల్లంగి-10, పచ్చిమామిడి-20/15 (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**

కమిషనరేట్‌లో ఎస్సైల బదిలీ

విజయవాడ నేరవార్తలు, గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో నలుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యారావుపేట ఎస్సై జి.అనిల్‌ను గంపలగూడెంకు, గంపలగూడెం ఎస్సై ఎస్.శ్రీనును రెడ్డిగూడెంకు బదిలీ చేశారు. నున్న క్రైం ఎస్సై జి.మహాలక్ష్ముడును ఎ.కొండూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేయగా ఎ.కొండూరు ఎస్సై చల్లా కృష్ణను వీఆర్‌కు పంపారు.

తగ్గిన కృష్ణా వరద

ఎన్టీఆర్ కలెక్టరేట్: కృష్ణా నదిలో వరద ప్రవాహం ఆదివారం కాస్త తగ్గింది. నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి ఉదయం ఆరు గంటలకు 1,58,175 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేశారు. సాయంత్రం ఆరు గంటల వరకు ఇదే పరిస్థితి ఉంది. బ్యారేజీ వద్ద 25 గేట్లను నాలుగు అడుగులు, 44 గేట్లను మూడు అడుగుల మేర ఎత్తారు. నీటి మట్టం 12 అడుగులు ఉంది.

రాయనపాడు రైల్వేగేటు మూసివేత

గొల్లపూడి: రైల్వే ట్రాక్ అభివృద్ధి పనుల్లో భాగంగా రాయనపాడు రైల్వేగేటును మూడు రోజుల పాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈనెల 3వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 5వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మూసివేస్తామన్నారు. ఆ మార్గంలో ఏవిధమైన వాహనాలను అనుమతించడం జరగదని పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 575 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.96/-.

మహారాజశ్రీ విజయవాడ 14వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో ఎన్.టి.ఆర్. జిల్లా

I. A. No. 971/2025
IN
F.C.O.P. No. 975/2025

బిట్వీన్:
పెద్ది కృష్ణచైతన్య ... వాది
వర్సెస్
పెద్ది సాయిసుమన ... ప్రతివాది

పై నంబరు గల విడాకుల పిటిషన్‌లోని ప్రతివాది పెద్ది సాయిసుమన అయిన మీకు, మీ యొక్క హాజరు నిమిత్తం మహారాజశ్రీ విజయవాడ 14వ అదనపు జిల్లా జడ్జి వారు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన ద్వారా మీరు ది. 17-11-2025 ఉ. 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై, ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకోవలెను. లేని యెడల ఈ విడాకుల పిటిషన్ మీ పరోక్షమున తీర్మానింపబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
ఇట్లు, జెట్టి ప్రణీత్‌కుమార్,
అడ్వకేట్, మొఘల్‌రాజపురం,
విజయవాడ– 520 010
Cell No: 97031 82682

ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా హనుమాన్‌పేట, విజయవాడ టౌన్, ఎన్.టి.ఆర్. జిల్లా నందు గల శ్రీ గుంటూరు సీతారామయ్య అన్నసత్రం ట్రస్ట్‌నకు అభివృద్ధి పనులు చేయుటకు రూ.2.00 లక్షలకు టెండరు పిలుచుట జరుగుచున్నది. ఇతర వివరములకు వెబ్‌సైట్ www.apeprocurement.gov.in నందు చూడగలరు.

ఇట్లు : కార్యనిర్వాహక అధికారి

కేరింతలతో హోరెత్తిన ఐజీఎంసీ స్టేడియం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో ఏసీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్యాన్ పార్క్‌కు నగర వాసులు, క్రికెట్ అభిమానులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఐసీసీ ఉమెన్ వరల్డ్ కప్-2025లో భాగంగా ఆదివారం భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగే ఫైనల్ మ్యాచ్‌ను తిలకించేందుకు మూడు పెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేశారు. క్రికెట్ అభిమానులకు గ్యాలరీతో పాటు కింద కూర్చొని తిలకించేందుకు కార్పెట్ పర్చారు. కొంత మంది అభిమానులు స్టేడియంలోని స్టాండ్స్‌పై నుంచి వీక్షించారు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ జట్టు సభ్యులు సిక్సర్లు, బౌండరీలు కొట్టినప్పుడు ప్రేక్షకులు చప్పట్లు, కేరింతలు కొడుతూ సందడి చేశారు. అధిక సంఖ్యలో మహిళలు రావడం విశేషం. క్రికెట్ అభిమానులు టీమ్ ఇండియాకు మద్దతుగా జాతీయ జెండాలను ఊపుతూ ఆనందం వ్యక్తం చేశారు. ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) రాత్రి స్టేడియానికి వచ్చి క్రికెట్ అభిమానులతో కలిసి ఆసక్తిగా తిలకించారు. ఏసీఏ కోశాధికారి దండమూడి శ్రీనివాస్, బీవోసీడబ్ల్యూ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, తిరువూరు నియోజకవర్గ తెదేపా పరిశీలకుడు సుఖవాసి శ్రీనివాస్, తెదేపా నాయకులు వల్లభనేని గిరి, ఎన్టీఆర్ జిల్లా తెదేపా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్‌వర్మ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్కే కరీముల్లా, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి యాదవ్ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ(డీఎస్ఏ) శిక్షకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మ్యాచ్ తిలకిస్తున్న ఎంపీ శివనాథ్, శ్రీనివాస్, రఘురామరాజు

రైతులకు పూర్తి పంట నష్టపరిహారం చెల్లించాలి

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : మొంథా తుపాను వల్ల నష్టపోయిన రైతులకు పూర్తి పంట నష్ట పరిహారాన్ని చెల్లించడంతో పాటు.. వారి నుంచి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విజయవాడలో విలేకర్లతో మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని తుపాను బాగా దెబ్బతీసిందన్నారు. ఎన్నికల సమయంలో కౌలు రైతులకూ సమగ్ర పంటల బీమా పథకాన్ని ప్రవేశపెడతామని తెదేపా వాగ్దానం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రం ఒత్తిడితో 2024 రబీ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేసిందని ఆరోపించారు. రైతులే ప్రీమియం చెల్లించే స్వచ్ఛంద బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఉచిత బీమా పథకం వల్ల 2024 ఖరీఫ్‌లో 35 లక్షలమంది రైతులకు 84 లక్షల ఎకరాలకు బీమా వర్తిస్తే.. కొత్త పథకం వల్ల ఈ సంఖ్య 19 లక్షల ఎకరాలకు పడిపోయిందన్నారు. బీమా చెల్లిస్తున్న రైతుల సంఖ్య 7 లక్షలకు తగ్గిందన్నారు. ప్రభుత్వమే పంటల బీమా కంపెనీ పెట్టి.. ఉచిత బీమా పథకాన్ని అమలు చేస్తే ఎలాంటి నష్టం ఉండదన్నారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో తొక్కిసలాట ఘటన విచారకరమన్నారు. ఉత్తరాంధ్ర తిరుపతిగా ప్రచారంలో ఉన్న దేవాలయం.. ప్రభుత్వ దృష్టిలో లేదని దేవాదాయ శాఖ మంత్రి చెబుతుండటం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పేదరిక నిర్మూలనలో రాష్ట్ర ప్రభుత్వం కేరళ ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

బస్సు ఢీకొని వృద్ధాశ్రమ నిర్వాహకుడి మృతి

కృష్ణలంక: ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వృద్ధాశ్రమ నిర్వాహకుడు మృతి చెందిన సంఘటన కృష్ణలంకలో ఆదివారం చోటుచేసుకుంది. కృష్ణలంక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్ట గురవయ్య(55) వృద్ధాశ్రమ నిర్వాహకుడు కాగా.. పల్నాడు జిల్లా నరసరావుపేట ఎస్కేవీఎన్ నగర్‌లో కుటుంబంతో ఉంటున్నారు. ఇబ్రహీంపట్నంలో ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లేందుకు ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి భార్యతో ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. విజయవాడ వచ్చి బీసెంట్ రోడ్డులో షాపింగ్ ముగించుకున్న అనంతరం కుమార్తె వద్దకు వెళ్లేందుకు సాయంత్రం సుమారు 5గంటల సమయంలో వీఎంసీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో మితిమీరిన వేగంతో వెనుక నుంచి వచ్చిన గవర్నర్‌పేట-1 డిపోకు చెందిన నూతక్కి-రైల్వేస్టేషన్, 217సీ నంబరు ఆర్టీసీ బస్సు వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో గురవయ్య కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. సమీపంలోని వారు అతడిని ఆసుపత్రికి తరలించగా కొద్ది సేపటికి మృతి చెందారు. ఘటనాస్థలానికి చేరుకున్న కృష్ణలంక పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుండె జబ్బును 20 ఏళ్లు ఆపవచ్చు

గుడివాడ, న్యూస్‌టుడే : 'గుండె జబ్బు వస్తుందనే భయం వద్దు. అధునాతన ఏఐ సాంకేతికతతో సీటీ కరోనరీ యాంజియోగ్రఫీ ద్వారా ముందుగానే ముప్పును గుర్తించి.. చికిత్స ద్వారా 20 నుంచి 25 ఏళ్ల వరకు గుండె జబ్బును ఆపే అవకాశం ఉందని' ప్రముఖ గుండె వైద్య నిపుణుడు పోతినేని రమేష్ బాబు పేర్కొన్నారు. గుడివాడలోని ఐఎంఏ హాలులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం చాలా వరకు గుండె సమస్యలకు స్టంట్, బైపాస్‌లు అవసరం లేకుండానే వైద్యం చేయవచ్చన్నారు. గుండెకు 70 నుంచి 80 శాతం వరకు బ్లాకులు ఉన్నా.. శస్త్రచికిత్స లేకుండా స్టంట్‌లు లేకుండా వైద్యం చేస్తున్నామన్నారు. గతంతో పోల్చితే.. ఏఐ రాకతో గుండె వైద్యంలో రోగనిర్ధారణలో పూర్తిగా మార్పులు వచ్చాయన్నారు. గుండె జబ్బులకు చాలా రకాల పరీక్షలు చేస్తున్నారని.. నేడు అవన్నీ అవసరం లేదని, సీటీ కరోనరీ యాంజియోగ్రఫీ చాలన్నారు. ఈ పరీక్షను 30 ఏళ్లు దాటిన వారు చేయించుకుని, ముందు జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. వైద్యులు కూడా జబ్బుల లక్షణాలపై సరైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు మాగంటి శ్రీనివాస్, కార్యదర్శి పుణుకొల్లు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఉండవల్లి శ్రీనివాస్, కోశాధికారి దేవరపల్లి సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ పోతినేని రమేష్ బాబు తదితరులు

స్మృతివనం నిర్వహణలో అలసత్వం తగదు


మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ. పక్కనే సీపీ రాజశేఖరబాబు, కమిషనర్ ధ్యానచంద్ర, మల్లికార్జునరావు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని అంబేడ్కర్ స్మృతి వనం నిర్వహణలో అలసత్వాన్ని సహించే ప్రసక్తి లేదని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఇప్పటి వరకు నిర్వహణ బాధ్యతలు చూసిన కాంట్రాక్టు సంస్థను తొలగించాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు, ఇతర బకాయిలు చెల్లించాలని సదరు సంస్థను ఆదేశించినట్టు చెప్పారు. ఆదేశాలు బేఖాతరు చేస్తే బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు. స్మృతి వనం నిర్వహణ, ప్రగతిపై నగరంలోని కలెక్టరేట్‌లో ఆదివారం సమన్వయ శాఖల అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. స్మృతి వనం నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖలకు ప్రభుత్వం అప్పగించిందన్నారు. ఈ శాఖల ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం నిరంతరం ప్రత్యక్ష పర్యవేక్షణ ఉంటుందని, ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ అంబేడ్కర్ ఆశయాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలిచేలా కృషి చేయనున్నట్టు వివరించారు. జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, వీఎంసీ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై పోరాటానికి ముందుకు రావాలి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: సమాజాభివృద్ధికి అవినీతి అవరోధంగా మారిందని, దానిని తరిమికొట్టాల్సిన అవసరం ఉందని ఏసీబీ డైరెక్టర్ జనరల్ అతుల్‌సింగ్ పేర్కొన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవం-2025లో భాగంగా ఆదివారం స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో ఆయన సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అవినీతికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించడానికి విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలో సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. ఏదైనా అవినీతిపై ఫిర్యాదు చేయాలనుకుంటే 1064కు కాల్ చేయవచ్చన్నారు. దీనిపై వెంటనే అవినీతి నిరోధక శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. అవినీతిపై పోరాటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి మంచి సహకారం ఉందన్నారు. ఇందిరాగాంధీ స్టేడియం వద్ద ప్రారంభమైన సైకిల్ ర్యాలీ మహాత్మాగాంధీ రోడ్డు మీదుగా బెంజిసర్కిల్ తిరిగి పోలీస్ కంట్రోల్ నుంచి ఐజీఎంసీ స్టేడియం వద్దకు చేరుకుంది. ప్రదర్శనలో ఏసీబీ డైరెక్టర్ ఆర్.జయలక్ష్మి, హెడ్ క్వార్టర్స్ అదనపు ఎస్పీ సుధాకర్, అదనపు ఎస్పీలు మహేందర్, దిలీప్ కిరణ్, పలువురు అధికారులు, యువత పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏసీబీ డైరెక్టర్ జనరల్ అతుల్‌సింగ్

VIJAYAWADA MUNICIPAL COPORATION
'e'Procurement Tender Notice No.
Rc.E3/PD3(Parks) - 118905/2025, Dt: 03-11-2025

Supply of Red Earth for plantation and Development of Kamineni Nagar Park (Rs. 39.55 Lakhs)

Download of bid document starts from : 03-11-2025 from 04:00 P.M.
Last Date / Time for receipt of Tenders: 17-11-2025 up to 04:30 P.M.
Opening of Tenders : 17-11-2025 at 04:30 P.M.
For details contact : Officer of the Executive Engineer Project Division - III. VMC Main Office.

Sd/- EXECUTIVE ENGINEER, PD-III (Parks)
Vijayawada Municipal Corporation

91.9 FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 87907 41166

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూప్, VJA, వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/ వంట, బేబికేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 95537 86677/96404 96677

JOBS

Wanted Real Estate Marketing Executives and Female Telecallers. LIC Colony, Vijayawada. ✆ 94324 54545.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

క్రాంతి రోడ్ ట్రాన్స్‌పోర్ట్ VJA ఆటోనగర్ ఆఫీస్‌నందు గుమస్తాలుగా పనిచేయుటకు 10 ఆపై చదివిన 30 సం.లోపు వయస్సు గల మేల్ అభ్యర్థులు కావలెను. బ్యాచిలర్స్‌కు వసతి సౌకర్యం కలదు. సంప్ర: 81798 68999.

స్వగృహఫుడ్స్‌లో పని చేయుటకు సేల్స్ బాయ్స్, సేల్స్‌గరల్స్ కావలెను. అర్హత 10th, పార్ట్‌టైం/ ఫుల్‌టైం. 20 సం. -35సం.లోపు. MG రోడ్ VJA ✆ 81425 45000

Furniture Showroom Requires Male Helpers Q: 10th / Inter (25-45). Alankar Steel Products, Museum Road, VJA . ✆ 70325 78687

Immediate openings for Customer Service Executive & Branch Manager Positions in Cherukuri Group, Located in Eluru, Tanuku, Guntur & Vijayawada. Qual: Min Inter. ✆ 98852 06666, E-mail: hr@cherukurigroup.org.

రాయ్‌పూర్, ఛత్తీస్‌గఢ్‌లో ఒక హోటల్/ రెస్టారెంట్ కోసం అనుభవజ్ఞుడైన సౌత్ ఇండియన్ వంట మాస్టర్ టిఫిన్స్, కాఫీ, టీ మొ|| చేయుటకు కావలెను. మంచి జీతం కలదు. ఉచిత నివాసం, భోజన వసతి & వారి పిల్లలకు ఉచిత విద్య కలదు ✆: 94252 96305, 93290 27580

R.K ఇంజనీరింగ్ కాలేజీ నందు పనిచేయుటకు ఎలక్ట్రీషియన్స్ కావలెను. అనుభవమును బట్టి జీతం+ భోజనం+ ఉచిత వసతి కల్పించబడును. కేతనకొండ, ఇబ్రహీంపట్నం మండలం, విజయవాడ, 97014 73399.

రామ్ ఇంజినీరింగ్ & కన్‌స్ట్రక్షన్స్ Pvt LTD సంస్థ నందు పనిచేయుటకు 5సం|| అనుభవజ్ఞులైన సీనియర్ అకౌంటెంట్ కావలెను ✆ 62814 98795.

DRIVERS

విజయవాడ ఏలూరు రోడ్డులో వ్యాలెట్ పార్కింగ్ సందు పని చేయుటకు డ్రైవర్స్ కావలెను. ✆ 98486 11113 / 96183 82562

SECURITY GUARDS

సెక్యూరిటి, హౌస్ కీపింగ్‌లో అనుభవంగల ఫీల్డ్ ఆఫీసర్స్ అర్జెంటుగా కావలెను. మంచిజీతం. Q: ఇంటర్/డిగ్రీ (SRSF) ✆ 76748 52033/ 62819 38283

సెక్యూరిటీ గార్డులు కావలెను. పిన్నమనేని పాలీ క్లీనిక్ ఏరియాలో ప్రముఖ జ్యూయలరీ మాల్‌కు. జీతము: 15,000/- + ఫుడ్, PF, ESI ఫెసిలిటి కలదు. ✆ 80994 44758, 96401 48367.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

తిరువూరు
• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
ఇబ్రహీంపట్నం గ్రామీణం 9773300487 గొల్లపూడి 8008574638

? అంతర్గత రహదారుల వెంట మురుగు కాలువల నుంచి తొలగించిన పూడికను రోడ్డుపైనే వదిలేయడంతో ఇబ్బందిగా ఉంది. - గిరిబాబు, స్థానికుడు
✔ కార్మికులతో పూడికలను తొలగించి, తరలిస్తాం.
- ఉమామహేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్.
– న్యూస్‌టుడే, మైలవరం

? దుగ్గిరాలపాడు గ్రామంలోని కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగునీరు పారక దోమలు, దుర్వాసనతో అవస్థలు పడుతున్నాం. - కె.కిరణ్, గ్రామస్థుడు
✔ సమస్య తెలిసింది. తక్షణమే సిబ్బందితో కాలువలు పూడిక తీయించి దోమల నివారణ చర్యలు చేపడతాం.
-మనోజ్, పంచాయతీ కార్యదర్శి- న్యూస్‌టుడే, జి.కొండూరు

? కొండపల్లి ఆరు పంపులకు వెళ్లే రహదారి మూల వద్ద ఆదివారం చెత్తను తొలగించకపోవడం వల్ల ఆవులు, పందులు అక్కడి పరిసరాలను అపరిశుభ్రంగా మార్చాయి. దీంతో అటుగా రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉంది. అదే రహదారిలో మురుగు కాలువలోని చెత్త తొలగించకపోవడం వల్ల ప్లాస్టిక్ కవర్లు, చెత్త కాలువలో పేరుకుపోయింది. -శ్యామలరావు, స్థానికుడు ✔ సోమవారం ఉదయం సిబ్బందిని పంపి ఆ ప్రాంతమంతా శుభ్రం చేయిస్తాం. - వెంకటరత్నం సంబంధిత అధికారి
– న్యూస్‌టుడే, కొండపల్లి

స్పందనకు వందనం

✦ ఇటీవల కురిసిన వర్షాలకు సున్నంపాడు గ్రామంలోని కాలువల్లో పూడిక పేరుకుపోయి దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన 2వ తేదీన వార్త ప్రచురించగా పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ స్పందించారు. సిబ్బందితో కాలువల్లో పూడిక తీయించి దోమల నివారణ బ్లీచింగ్ చల్లి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. – న్యూస్‌టుడే, జి.కొండూరు

✦ పట్టణంలోని 9వ వార్డులో గల డ్రెయినేజీలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు పారుదలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును శానిటరీ అధికారి దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. – న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

✦ విస్సన్నపేట అనుమోలు వారి వీధి, కుక్కలపు వారి వీధి, తిరుపతమ్మ తల్లి గుడి ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు తెలిపిన సమస్యను మేమున్నాం మీకు తోడుగా శీర్షిక ప్రచురించగా ఈవో కేశవ హరికృష్ణ కుమార్ స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. కార్మికులు చెత్తను ట్రాక్టర్‌కి ఎత్తి డంపింగ్ యార్డ్‌కి తరలించారు. – న్యూస్‌టుడే, విస్సన్నపేట

పుణ్యక్షేత్రాలకు బస్సు సర్వీసులు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రాలైన అన్నవరం, పంచరామాలు, వాడపల్లి ఆలయాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను 4వ తేదీ నుంచి ప్రారంభించనున్నామని డిపో మేనేజర్ జివి.నాగమల్లేశ్వరావు తెలిపారు. పూర్తి సమాచారం కోసం 98856 61835, 73824 87969 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వడ్డె ఓబన్న విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ నేడు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన రెడ్డిగూడెం, ముచ్చనపల్లి గ్రామాల్లో వడ్డె ఓబన్న విగ్రహం ఏర్పాటుకు సోమవారం భూమిపూజ చేస్తారని ఆ సంఘం నాయకులు బండారు సత్యనారాయణ, వేముల బాబులు తెలిపారు. మండల పరిధిలోని రుద్రవరం, కూనపరాజుపర్వ, ముచ్చనపల్లి గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించి.. ప్రదర్శనగా రెడ్డిగూడెం చేరుకొని పూజా కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. ఏపీ వడ్డెర సంక్షేమ సంఘం, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ మల్లె ఈశ్వరరావు పాల్గొంటారన్నారు.

భక్తిశ్రద్ధలతో జయంత్యుత్సవం

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలనులో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గుడిలో భక్త బృందం ఆధ్వర్యంలో ఆయన జయంత్యుత్సవం ఆదివారం నిర్వహించారు. అర్చకులు రామలింగేశ్వశర్మ ఆధ్వర్యంలో గోవిందమ్మ, వీరబ్రహ్మేంద్రస్వామి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, పూజలు చేశారు. తదుపరి భక్తులు స్వామివారి చిత్రపటంతో గ్రామంలో పల్లకీసేవ చేశారు.

ఘనంగా పడిపూజ

జి.కొండూరు, న్యూస్‌టుడే: స్థానిక పార్వతీ సమేత అమృతలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్పస్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములు భక్తి గీతాలాపన చేస్తూ పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సద్ది కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాలను స్వీకరించారు.

సీసీఐ జాడలేదు.. గ్రామాల్లో ధరలేదు..!

మైలవరం, న్యూస్‌టుడే

అక్టోబరులోనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాల్సిన భారత పత్తి సంస్థ (సీసీఐ) నవంబరు మొదటి వారంలో ప్రారంభిస్తారని అధికారులు ప్రకటించారు. మొదటి వారంలో మూడ్రోజులు గడిచినా, నిర్దిష్ట కార్యాచరణ ప్రకటనా వెలవడలేదు. ఇప్పటికే అధిక వర్షాలతో అయోమయంగా మారిన పత్తి రైతుల పరిస్థితి, కొనుగోలు జాప్యంతో మరింత దిగులు చెందుతున్నారు. సీసీఐ కొనక, బయట మార్కెట్‌లో మద్దతు ధర దక్కక దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

✤ పత్తి కొనుగోళ్లలో కానరాని కార్యాచరణ

మైలవరంలో చివరి దశకు చేరిన పత్తి చేలు

రూ.రెండున్నర వేలకు పైగా...

మైలవరం, తిరువూరు నియోజకవర్గాల పరిధిలో సుమారు 40వేల ఎకరాల వరకు పత్తిని సాగు చేశారు. అధిక వర్షాలు ఈ ఏడాది పత్తి రైతులను దెబ్బతీశాయి. మొంథా తుపాను సమయానికి పత్తి తీతలకు సిద్ధంగా ఉన్నా, కూలీల కొరతతో మూడొంతుల విస్తీర్ణంలో సాధ్యం కాలేదు. దాంతో నాలుగు రోజుల ముసురు తీవ్ర ప్రభావాన్ని చూపాక, గత మూడ్రోజులుగా తీతలు ముమ్మరంగా సాగుతున్నాయి. అయినా నాణ్యత పేరిట ప్రైవేటు వ్యాపారులు క్వింటా పత్తికి రూ.5,500 మించి ధరలివ్వడంలేదు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.8,110లుగా ప్రభుత్వం ప్రకటించినా, బయట మార్కెట్‌లో అమ్ముతున్న రైతులు, క్వింటాకు రూ. రెండున్నర వేలకు పైగా నష్టపోతున్నారు.

ఆందోళన మొదలైంది..

పత్తి దిగుబడులు అక్టోబరు తొలి వారం నుంచే ప్రారంభమవగా, వెంటనే సీసీఐ రంగంలోకి దిగుతుందని రైతులు భావించారు. అందుకు అనుగుణంగా రెండు వారాల కిందట జిల్లాస్థాయి అధికారుల సమావేశం నిర్వహించి, నవంబరు మొదటి వారం నుంచి పూర్తిస్థాయిలో సీసీఐ కొంటుందని ప్రకటించారు. రెండు నియోజకవర్గాల పరిధిలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీల్లోని, మూడు చోట్ల ఈ కేంద్రాలను తెరిస్తే రైతులకు ఉపయుక్తంగా ఉండేది. అయితే అధికారుల నుంచి నేటికీ కొనుగోలు కార్యాచరణ ప్రకటించకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. మరోవైపు తీవ్ర వర్షాలతో పత్తి చేలు జీవం కోల్పోయాయి. కేవలం ఒక్క తీతకే చేలన్నీ ఎర్రబారి కనిపిస్తున్నాయి. దాంతో ఈ నెలలోనే ఒకే తీతతో పత్తిని తీసేసి, మొక్కజొన్న సాగుచేయాలని రైతులు ఆలోచన చేస్తున్నారు.

తీవ్రంగా నష్టపోయాం

వర్షాలకు చేలన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయి. కనీస దిగుబడులు రాక నష్టపోతున్నాం. ఈ సమయంలో మద్దతు ధరలతో కొనుగోలు చేస్తే రైతులకు మేలు చేసినట్లు అవుతుంది. గ్రామాల్లో వ్యాపారులు ధరలు తగ్గించి కొంటున్నారు.
- వి.రాముసుబ్బారెడ్డి, పత్తి రైతు

ఉమాగౌరీశా..శరణు

గంపలగూడెం, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా మండలంలోని కొత్తపల్లి సమీప కట్లేరులోని గోపాలస్వామి మడుగు ఒడ్డున ఉన్న ఉమాగౌరీశంకరుని ఆలయంలో శివలింగాన్ని ఆదివారం అర్చకులు పి.కోటేశ్వరరావు శోభాయమానంగా అలంకరించారు. భక్తులు శివలింగం దర్శించుకుని పూజలు చేశారు.

పీపీపీ విధానంతో పేదలకు అన్యాయం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఏపీలో కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను పీపీపీ విధానం చేయడం వల్ల పేదలైన వారికి వైద్య విద్య, వైద్యంలో అన్యాయం జరుగుతుందని సీపీఎం మండల కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. ఆదివారం రెడ్డిగూడెం సీపీఎం కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సమావేశం సిహెచ్. విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పి.వి.ఆంజనేయులు మాట్లాడుతూ.. ఈ నెల 7 తేదీన విజయవాడలో రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు ద్వారా ప్రజాస్వామ్య బలాన్ని తెలియజేసేందుకు ప్రజలు తరలిరావాలని కోరారు. నాయకులు ఎం.మాధవరెడ్డి, వి.కృష్ణారెడ్డి, కాంతారావు, రాజు, వెంకటేశ్వరరావు, అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కల్తీ మద్యం పాపం జోగి రమేష్‌దే'

మైలవరం, న్యూస్‌టుడే: కల్తీ మద్యం పాపం జోగి రమేష్‌దేనని, అక్రమ మార్గాలకు పాల్పడిన ఆయనను అరెస్టు చేస్తే, వైకాపా రాజకీయాలంటూ వైకాపా చేస్తున్న విమర్శలు సిగ్గుచేటని ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఉయ్యూరు నరసింహారావు, తెదేపా సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, శోభన్‌బాబు అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక తెదేపా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పూర్తి ఆధారాలతో అధికారులు అరెస్టు చేశారని, నిందితుడిగా ఉండి, రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్‌పై నోరు జారడం మంచిది కాదని హితవు పలికారు. మండల అధ్యక్షులు గోపాలస్వామి, వెంకటేశ్వరరావు, వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైలవరం తెదేపా కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

కొండపల్లి, న్యూస్‌టుడే: జోగి రమేష్ అరెస్టు విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని పుర ఛైర్మన్ చిట్టిబాబు అన్నారు. కొండపల్లి పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సిట్ అధికారుల విచారణలో వైకాపా నేత జోగి రమేష్ పాత్ర నిర్ధారణ అయినందువల్లే ఆయనను అరెస్టు చేశారన్నారు. విచారణలో ప్రధాన నిందితుడు జనార్దనరావు జోగి పేరును ప్రస్తావించి ఆయన ప్రోద్బలంతోనే చేస్తున్నానని చెప్పారన్నారు. వైస్ ఛైర్మన్ శ్రీను, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

కొండపల్లిలో ఛైర్మన్ చిట్టిబాబు, కౌన్సిలర్లు, నాయకులు

ఎన్టీఆర్ ఆశయాలు నెరవేరుద్దాం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండలంలో విస్సన్నపేటలో నూతనంగా నిర్మించిన తెదేపా కార్యాలయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఏపీ ఆర్గానిక్ సర్టిఫికెట్ అథారిటీ ఛైర్మన్ శావల దేవదత్, ఎన్టీఆర్ జిల్లా తెలుగు రైతు విభాగం అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకుడు నెక్కలపు వెంకటేశ్వరరావు, గోటేటి సుబ్రహ్మణ్యం, ఏఎంసీ వైస్ ఛైర్మన్ కుక్కడపు నాగేశ్వరరావు, ఎన్నారై గరిబాలు, మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు ముఖ్య అతిథులుగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆశయాలను నెరవేర్చేందుకు కృషిచేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించి, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో పాల్గొన్న కూటమి శ్రేణులు

కిడ్నీ వ్యాధితో మరొకరి బలి

మంగ్యా (పాత చిత్రం)

కృష్ణారావుపాలెం(జి.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని కృష్ణారావుపాలెం శివారు దీప్లానగర్ తండాకు చెందిన జరుపుల మంగ్యా (45) మూత్రపిండాల వ్యాధితో శనివారం రాత్రి మృతి చెందాడు. గత ఐదేళ్లుగా అతను కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా వైద్యం కోసం తమకున్న కొద్దిపాటి సాగు భూమి కూడా విక్రయించామని కుటుంబ సభ్యులు వాపోయారు. తెదేపా, సీపీఎం నాయకులు పి.శ్రీనివాసరావు, పి.ఆనందరావు, అప్పిరెడ్డి తదితరులు ఆదివారం మంగ్యా మృతదేహానికి నివాళులర్పించారు. అతని కుటుంబానికి వీఆర్వో రాణి ప్రభుత్వం నుంచి రూ.10వేలు, వైకాపా నాయకుడు పర్వతనేని చంద్రం రూ.10వేలు ఆర్థికసాయం అందించారు.

అడుగడుగునా గుంతలే

స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి మునగపాడు వెళ్లే బైపాస్ రహదారిలో అడుగడుగునా గుంతలతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. మోకాలి లోతు గుంతల్లో రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. భారీ వాహనాలు సైతం నిత్యం ఇటుగానే ప్రయాణిస్తుండడంతో గుంతలు మరింత పెరిగి అటుగా ప్రయాణించ లేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలకు మరమ్మతులు చేపట్టి అవస్థలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, జి.కొండూరు

పాఠశాల బస్సు నంబర్ ప్లేటు సైతం రోడ్డుకు తగులుతోందిలా

అక్కడక్కడా రోడ్డు ఉంది అంతే..!

విజయవాడ వయా రెడ్డిగూడెం నుంచి విస్సన్నపేట వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి ప్రమాదకరంగా తయారైంది. అటుగా రాకపోకలు సాగించాలంటే వాహనదారులు భయపడుతున్నారు. రంగాపురం, బూరుగగూడెం, రాఘవాపురం, కొత్తరెడ్డిగూడెం, మద్దులపర్వ గ్రామాల వరకు గుంతలే. మొంథా తుపాను ధాటికి వాటిల్లో నీరు చేరి ఏ గుంత ఎంత లోతు ఉందో తెలియక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. బైకుల్లోనే కాక ఆటోలు, బస్సుల్లో వెళ్లాలన్నా ఒల్లు గుల్ల అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం మరమ్మతులైనా చేయించాలని ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

కొత్తరెడ్డిగూడెం వడ్డెర కాలనీలో ఇలా

దేవాలయం ఎదురుగా భారీ గోతులు

ఎర్రన్నాయుడు సేవలు మరువలేనివి

గొల్లపూడి: చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి దేవినేని

గంపలగూడెం మండలం గోసవీడులో..

గొల్లపూడి, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర ప్రజలకు కేంద్ర మాజీ మంత్రి ఎర్రన్నాయుడు అందించిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఎర్రన్నాయుడి వర్ధంతిని గొల్లపూడిలోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. . తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని దేశ రాజధాని స్థాయిలో బలంగా వినిపించారన్నారు. అనంతరం ఆయన చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు.

మైలవరం, న్యూస్‌టుడే: కేంద్ర మాజీ ఎంపీ కింజరాపు ఎర్రన్నాయుడి వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి, సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు లితీష్, గోపాలస్వామి, బాలకృష్ణ, షహనబేగం తదితరులు పాల్గొన్నారు.

మైలవరంలో తెదేపా నాయకులు

గోసవీడు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని గోసవీడులో తెదేపా నాయకుల ఆధ్వర్యంలో ఎర్రన్నాయుడు చిత్రపటానికి నివాళులర్పించారు. తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి కె.రజనీకాంత్, జి.కిషోర్, కె.వెంకటేశ్వరరావు, ఎస్.బాబురావు, యాకూబ్, కృష్ణారావు, సురేష్, పుల్లారావు తదితరులు నివాళులర్పించారు.

చట్టబద్ధంగా ఎదుర్కొంటాం: జోగి రాజీవ్

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: తన తండ్రి జోగి రమేష్ అరెస్టు అన్యాయమని, తప్పుడు కేసులను చట్టబద్ధంగా ఎదుర్కొంటామని జోగి రాజీవ్ అన్నారు. మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై తప్పుడు కేసు పెట్టారని.. ఇప్పుడు మద్యం గురించి రాష్ట్ర ప్రజలకు తెలియజేసి నిరంతరం ప్రభుత్వానికి ఊపిరి ఆడకుండా ప్రశ్నల వర్షం కురిపిస్తునందు వల్లే నా తండ్రిని కూడా అరెస్టు చేశారన్నారు. భవిష్యత్తులో తప్పుడు కేసులు పెట్టిన వారు మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

జోగి ఇంటి ముందు బైఠాయించిన వైకాపా శ్రేణులు

✤ కాశీబుగ్గ ఘటన నుంచి రాష్ట్ర ప్రజల దృష్టిని మరల్చడానికే జోగి అరెస్టు అని జడ్పీ వైస్ ఛైర్మన్ శ్రీదేవి, కొండపల్లి కౌన్సిలర్లు అన్నారు. ఆదివారం ఉదయం మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టు సమయంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఆయన ఇంటి ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కౌన్సిలర్లు గుంజాశ్రీను, దయా తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని తోటమూల సమీప కట్లేరు వంతెన వద్ద విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ ఎస్‌కే. సైదాతో దురుసుగా ప్రవర్తించిన వినగడపకు చెందిన పి.నాగేశ్వరరావుపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు పీఎస్సై శశిధర్ తెలిపారు. వంతెన వద్ద మళ్లింపు రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న సందర్భంలో నిందితుడు తన విధులను ఆటంకం కలిగించినట్లు కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.

గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్నవారిపై..: మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని ఎదురుబీడెం నుంచి అక్రమంగా గ్రావెల్ రవాణా చేస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున దాడి చేసి, గ్రావెల్ రవాణాకు ఉపయోగించిన టిప్పర్, జేసీబీలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

జూదరులపై..: జి.కొండూరు, న్యూస్‌టుడే: పినపాక గ్రామం శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం అందుకున్న జి.కొండూరు ఎస్సై సతీష్‌కుమార్ ఆదివారం సాయంత్రం తన సిబ్బందితో దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,700 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రమేష్ సేవలు ప్రశంసనీయం

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: తిరువూరు సహకార బ్యాంక్ మేనేజర్‌గా ఉద్యోగ విరమణ చేసిన దేవరపల్లి రామేశం(రమేష్)ను ఆయన స్వస్థలమైన మండలంలోని పెనుగొలనులో ఆదివారం సత్కరించారు. సహకార శాఖలో ఆయన 39 ఏళ్ల పాటు ప్రశంసనీయమైన సేవలు అందించారని వక్తలు కొనియాడారు. తెలుగు రైతు జిల్లాధ్యక్షుడు సీహెచ్.రాజేశ్వరరావు, కేడీసీసీబి సీఈవో ఎ.శ్యామ్‌మనోహర్, జీఎం సీహెచ్.చంద్రశేఖర్, ఏఎంసీ ఛైర్‌పర్సన్ ఆర్.లక్ష్మీఅనిత, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎన్.మురళి, తెదేపా మాజీ మండలాధ్యక్షుడు ఆర్.వీరారెడ్డి, వైకాపా నాయకుడు జి.చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రమేష్ దంపతులను సత్కరించిన కేడీసీసీబీ అధికారులు, తెదేపా నాయకులు

(c) eenadu

విజయవాడ తూర్పు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80085 74652

3వ డివిజన్ విజయలక్ష్మి కాలనీ, ఆటోనగర్ కలిసే రోడ్డులో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పొంగుతున్నాయని స్థానిక నివాసి దుర్గారావు, 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా ఈనాడు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన యంత్ర సాయంతో పూడిక తీయించారు.

★ మూడో డివిజన్ గుణదల ఈఎస్ఐ ఆస్పత్రి రోడ్డులో దోమలు ఎక్కువగా ఉన్నాయని స్థానిక నివాసి రంగనాయకమ్మ.. మలేరియా అధికారి హెచ్.శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందిని పంపి దోమల నివారణ చర్యలు తీసుకున్నారు.

★ 21వ డివిజన్ కల్యాణ్ బ్రిండర్స్ రోడ్డు 21-106/77 విద్యుత్తు స్తంభానికున్న వీధి దీపం వెలగడంలేదని స్థానిక నివాసి రత్నమాల.. ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బందితో కొత్త దీపం ఏర్పాటు చేయించారు. - న్యూస్‌టుడే, కరెన్సీనగర్

గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు

పటమట, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సర్వోత్తమ గ్రంథాలయ ఆధ్వర్యంలో నగరంలోని వివిధ పాఠశాల విద్యార్థులకు నవంబర్ 3, 6 తేదీల్లో చిత్రలేఖనం, కథలు చెప్పడం, పుస్తక సమీక్ష, జ్ఞాపకశక్తి, పద్య పఠనం, క్విజ్ తదితర అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి రావి శారద ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి విభాగంలో ప్రథమ ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు అందజేస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 79953 13148 సంప్రదించాలని సూచించారు.

కాలనీల్లో సమస్యల తిష్ట

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

కాలువ కట్టపై వ్యర్థాలు

19వ డివిజన్‌లోని పకీర్‌గూడెం, రెహ్మత్ కాలనీ, బాయ్ కాలనీ, ఆర్‌అండ్‌బీ క్వార్టర్స్ ప్రాంతాల్లో సుమారు ఐదు వేల మందికి పైగా జనాభా నివసిస్తున్నారు. వారు వివిధ సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ రెండు కాలనీలకు వెళ్లే విద్యుత్తు లైనుకు చెట్ల కొమ్మలు తగులుతున్నాయి. గాలులు వీచినప్పుడు వాటి రాపిడికి తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు తెలిపారు. ఈ సమస్యను పలు పర్యాయాలు విద్యుత్తు శాఖ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అదేవిధంగా ఈ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించడం లేదని పేర్కొంటున్నారు.

★ వైవీరావు ఆస్పత్రి రహదారి నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు పుల్లేరు కాలువ కట్టపై పిచ్చిమొక్కలు, దట్టంగా పొదలు నెలకొన్నాయి. వీటిలో నుంచి పాములు వస్తున్నాయని ఆర్‌అండ్‌బీ క్వార్టర్స్, లక్ష్మీపేట ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు కాలువ కట్టపై వ్యర్థాలు వేస్తుండడం వల్ల దుర్గంధం వస్తోంది. వీటిని తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



భాయ్ సెంటర్‌లో విద్యుత్తు లైనుకు తగులుతున్న కొమ్మలు

ప్రజాసమస్యల పరిష్కార వేదిక నేడు

విజయవాడ నగరపాలక సంస్థ: నగర ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, మూడు సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కారవేదిక నిర్వహిస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో వెల్లడించారు. నగరవాసులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి సకాలంలో పరిష్కరించుకోవాలని తెలిపారు. పారిశుద్ధ్యం, రహదార్లు, డ్రెయిన్లు, వీధిదీపాలు, తాగునీరు, ఆక్రమణలు, ఇతర పనులు తదితర సమస్యలను అధికారుల దృష్టికి తేవాలని సూచించారు.

హోరా.. హోరీగా పికిల్ బాల్ టోర్నీ

విజయవాడ క్రీడలు: పడల్ టీచర్ పికిల్ బాల్ కోర్టులో శనివారం నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి ఓపెన్ పికిల్ బాల్ టోర్నీలో భాగంగా ఆదివారం సాయంత్రం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో పలువురు క్రీడాకారులు హోరా.. హోరీగా తలపడ్డారు. రాష్ట్రంలోని పలు పట్టణాల నుంచి 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారని నిర్వాహకుడు రాహుల్ మద్దెల, సతీష్‌రెడ్డి తెలిపారు. రాత్రి జరిగిన క్వార్టర్ ఫైనల్స్ డబుల్స్ విభాగంలో హర్ష, రవితేజ జోడీ 15-13 స్కోర్ తేడాతో కార్తీక్, రేవంత్ జోడీపై, వసంత్, జీత్ జోడీ 15-3 స్కోర్ తేడాతో ప్రణీత్, ఉమేష్ జోడీపై, రోహిత్, నిహాల్ జోడీ 15-13 స్కోర్ తేడాతో అంకిత్, అవినాష్ జోడీపై విజయం సాధించి సెమీ ఫైనల్‌లో ప్రవేశించారు.

ఎర్రన్నాయుడి సేవలు ఎనలేనివి

చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ శివనాథ్, బుద్దా వెంకన్న

పటమట, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీకి, బీసీల అభ్యున్నతికి కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు ఎనలేని సేవలు అందించారని, ఆయన లేని లోటు ఎన్నటికీ తీరనిదని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఆదివారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఎర్రన్నాయుడు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి ఎంపీ శివనాథ్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన కొన్ని వేల గ్రామాలకు మంచినీటి, రోడ్ల సౌకర్యం కల్పించారని కొనియాడారు. నాయకులు బొప్పన భవకుమార్, నరసింహ చౌదరి, కె.జగన్‌మోహన్, మాదిగాని గురునాథం, సంకే విశ్వనాథం పాల్గొన్నారు.

ఆటోనగర్, న్యూస్‌టుడే: ఆటోనగర్‌లోని తెదేపా జిల్లా కార్యాలయంలో ఆదివారం కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు వర్ధంతి ఘనంగా నిర్వహించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్(అన్న), రాష్ట్ర బీసీ గౌడ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్‌లు.. ఎర్రన్నాయుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. నాయకులు పీతా గోపీచంద్, మరక శ్రీనివాస్ యాదవ్, పామర్తి కిషోర్‌బాబు, గుమ్మడి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శివారెడ్డి సేవలు అభినందనీయం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: అమరావతి రాజధాని పరిరక్షణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన రెరా ఛైర్మన్ శివారెడ్డి సేవలు అభినందనీయమని క్రెడాయ్ ఛైర్మన్ సి.సతీష్‌బాబు అన్నారు.



రెరా ఛైర్మన్ దంపతులను సత్కరిస్తున్న క్రెడాయ్ సంఘ ప్రతినిధులు

ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (ఏపీ రెరా) ఛైర్మన్ శివారెడ్డి దంపతుల సన్మాన కార్యక్రమం క్రెడాయ్ కార్యాలయంలో ఆదివారం జరిగింది. మూడు రాజధానుల నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడి అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా, ఏపీసీ సమన్వయకర్తగా పలు నిరసనలు, ఆందోళనలు చేపట్టారని పలువురు మాట్లాడారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద రాజధాని రైతులతో కలిసి ధర్నా నిర్వహించి ఉద్యమాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లారని, అప్పటి ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా వెనకడుగు వేయకుండా తన పోరాటాన్ని కొనసాగించారని పేర్కొన్నారు. క్రెడాయ్ అధ్యక్షులు జీఎస్ఆర్ మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి కె.రఘురామ్, కోశాధికారి జి. సత్యసాయిరామ్, సభ్యులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: దైనందిన జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించుకోవాలంటే రోజూ కొద్దిసేపు యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం చేయాలని నోబెల్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొ. ఎస్.వేణుగోపాలరావు అన్నారు. ఆధ్యాత్మిక విశ్వగురువు, ది స్పైరిట్ పిక్ సెయింట్ గురు విశ్వస్ఫూర్తి ఆశీస్సులతో స్ఫూర్తి కుటుంబ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రస్తావ సాధన పేరుతో ఆసన, ప్రాణాయామ, ధ్యాన సాధన ఉచిత శిక్షణ తరగతులు నగరంలోని కేవీరావు భవన్‌లో ఆదివారం ప్రారంభమయ్యాయి. వేణుగోపాలరావు మాట్లాడుతూ గురు విశ్వస్ఫూర్తి బోధనలను అనుసరించి ఆరోగ్య పరిరక్షణతో పాటు సమాజాభ్యున్నతికి సహకారం అందించాలని సూచించారు. స్ఫూర్తి కుటుంబ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉచిత ధ్యాన తరగతులను ఈ నెల 4 వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గలవారు 94450 21599 నంబరును సంప్రదించాలని కోరారు. యోగా శిక్షకులు ప్రతాప్‌రెడ్డి, సీహెచ్ ప్రగతి హాజరై ధ్యానం, యోగా సాధన చేయించారు. వివిధ ప్రాంతాల నుంచి గురు విశ్వస్ఫూర్తి అనుచరులు, ట్రస్ట్ సభ్యులు ఆన్‌లైన్ ద్వారా హాజరయ్యారు.

యోగాసనాలు వేస్తున్న శిక్షకులు

కమ్మ విద్యార్థులకు ఉపకార వేతనాలు

నందిగామ: కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఆ సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఆదివారం స్థానిక కమ్మ కల్యాణ మండపంలో సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ మండపాన్ని దివంగత చిరుమామిళ్ల శేషాద్రి నాయుడు ప్రాంగణంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయన పేరుతో ఆర్చి నిర్మించనున్నారు. కమ్మ పేద విద్యార్థుల స్కాలర్ షిప్పుల కోసం మైలవరం ఎమ్మెల్యే వెంకటకృష్ణ ప్రసాద్ రూ.5 లక్షలు, అలాగే సంఘం తరఫున మరో రూ.5 లక్షలు కలిపి రూ.10 లక్షలు ఇవ్వనున్నట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 12వ తేదీలోపు విద్యార్థులు కమ్మ సంఘానికి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. 16న నిర్వహించే సంఘం కార్తిక వన సమారాధన రోజున ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నారు. ఎన్ఎస్పీ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు, కంచికచర్ల యార్డ్ ఛైర్మన్ కోగంటి బాబు, కౌన్సిలర్ కామసాని సత్యవతి, ఆసుపత్రి ఛైర్మన్ వేపూరి నాగేశ్వరరావు, కమ్మ సంఘం కమిటీ ప్రతినిధులు వాసిరెడ్డి సత్యనారాయణ ప్రసాద్, పాలేటి సతీష్, వాసిరెడ్డి ప్రసాద్, కోయ వాసుదేవరావు, పెంట్యాల వీరభద్రరావు, ఎర్రంరెడ్డి బాబూరావు, నాయకుడు నర్వనేని మురళీ, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నీటి వృథాకు అడ్డుకట్ట వేయండి

నాలుగో డివిజన్ గురునానక్ కాలనీ తిమ్మరుసు వీధిలో గత కొద్ది రోజులుగా తాగునీటి పైపు పగిలి నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల రోడ్డు అంచులు తవ్వి తారు పరుస్తుండగా పైపులు పగిలాయి. దీంతో మురుగంతా కుళాయిల్లో చేరి రంగుమారిన నీరు వస్తోంది. అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, కరెన్సీనగర్**

రక్షణ గోడ నిర్మించరూ..

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: మూడో డివిజన్ కరెన్సీనగర్ నుంచి హైవే సర్వీస్ రోడ్డుకు వెళ్లే మలుపు వద్ద రిటైనింగ్ వాల్ ధ్వంసమై ప్రమాద భరింతగా ఉంది. మలుపు వద్ద ఉండడంతో రామవరప్పాడు రింగ్ వైపు నుంచి వచ్చే వాహనాలు గుంతలో పడే ప్రమాదం ఉంది. రక్షణ గోడ కట్టించాలని ఎన్నాళ్ల నుంచో కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

7న ఉద్యోగ మేళా

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : ఈ నెల 7వ తేదీన మాచవరం లోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించే మెగా ఉద్యోగ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కూటమి నాయకులు కోరారు. దాదాపు 40 నుంచి 50 కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఆదివారం అజిత్‌సింగ్‌నగర్‌లోని తెదేపా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్‌లు మాట్లాడారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మెరుగైన భవిష్యత్తు అందించడమే లక్ష్యమని చెప్పారు.

15 నుంచి టైలరింగ్‌లో శిక్షణ

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : ఈ నెల 15వ తేదీ నుంచి ఎంబీ విజ్ఞాన కేంద్రంలో టైలరింగ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తామని ఎంబీవీకే మహిళా శిక్షణా విభాగం నిర్వాహకురాలు పి.విజయ తెలిపారు. ఆసక్తిగల వారు 10వ తేదీలోగా కార్యాలయంలో కలిసి, పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

కరాటే సాధనతో క్రమశిక్షణ.. ఆరోగ్యం

బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులతో రాజేష్, రవిబాబు, సాగరిక, తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కరాటే సాధనతో క్రమశిక్షణ, ఆత్మరక్షణతో పాటు ఆరోగ్యం మెరుగవుతుందని ప్రముఖ ఈఎన్‌టీ వైద్యుడు రాజేష్ వేపూరి పేర్కొన్నారు. పటమటలోని కిడ్జీ ప్రీ స్కూల్‌లో ఆదివారం జపాన్ కరాటే సంఘం(జేకేఏ) అంతర్ జిల్లాల క్యూ లెవెల్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులను, జేకేఏ రాష్ట్ర చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కొడాలి రవిబాబు, జోనల్ ఇన్‌స్ట్రక్టర్ కొడాలి సాగరిక, ఒంగోలు ఇన్‌స్ట్రక్టర్ చెన్నారెడ్డి ప్రదీప్‌కుమార్‌లను అభినందించారు. కిడ్జీ ప్రీ స్కూల్ డోజో విద్యార్థులు జ్ఞానేష్ కార్తీక్, చద్వీర్ హరిదాసు జూనియర్ రెడ్ బెల్ట్ 9వ క్యూ, అజిత్‌సింగ్‌నగర్‌లోని శ్రీరామ్ హైస్కూల్ విద్యార్థులు పర్ణిత, దిలీప్, నీరజ్, అకిల్, శ్వేత 9వ క్యూ, గుంటూరు జిల్లా పాతూరులోని ఏఐఎంఈఈ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థిని ప్రన్విత కాసరనేని గ్రీన్ బెల్ట్ 7వ క్యూ, నూతక్కి విజ్ఞాన్ విహార్ విద్యార్థులు విన్సీ, కౌశిక్, విషాన్‌చౌదరి, నిహాల్ యాదవ్, మనుదీప్ సాయి, ధర్మ విజ్జేష్, అభినవ్‌రామ్, పర్ణిక, ప్రజ్వల్ విజయ వినాయక్, గౌతమ్ జూనియర్ రెడ్ 9వ క్యూ, ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన చెన్నారెడ్డి చయాంక్ ప్రద్యుమ్న పర్పుల్ బెల్ట్ 4వ క్యూ, కాదూరి లోహేందర్‌రెడ్డి 9వ క్యూ సాధించారు.

కంటి సమస్యలు నిర్లక్ష్యం చేయొద్దు

వైద్య శిబిరంలో క్రాంతికుమార్ తదితరులు

కృష్ణలంక, న్యూస్‌టుడే: దైనందిన జీవితంలో కంటి చూపు అత్యంత కీలకమైనందున నేత్ర వైద్య శిబిరాల నిర్వహణ కీలకంగా తెదేపా యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ అన్నారు. స్పృహాప్తి ట్రస్ట్, అమరావతి ఐ హాస్పిటల్ సంయుక్త సహకారంతో కృష్ణలంక నవభారత్ పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విలువైన కంటి చూపును నిర్లక్ష్యం చేయకుండా మొదట్లోనే గుర్తించి చికిత్స పొందాలన్నారు. వైద్యులు, నిర్వాహకులను క్రాంతికుమార్ అభినందించారు. ఉచితంగా మందులు అందజేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తించారు. ట్రస్ట్ వ్యవస్థాపకురాలు వీరంకి భారతీదేవి, నవభారత్ పాఠశాల ప్రిన్సిపల్ పి.శ్రీహరిరావు, గల్లా శ్రీనివాస్, డి.పద్మ, టి.మాధురి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు అర్హత

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీ ఎంసీ స్టేడియంలో జరుగుతున్న 42వ జాతీయ సబ్ జూనియర్(అండర్-18) బాలబాలికల ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా ఆదివారం జరిగిన కాంపౌండ్ రౌండ్‌లో రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి 30 మంది బాలురు, 15 మంది బాలికలు ఉత్సాహంగా పోటీపడ్డారు. వీరందరికీ డబుల్ ఫిఫ్టీ(50+50)లో 72 యారోస్ ర్యాంకింగ్ రౌండ్‌లో తొలి 16 మంది చొప్పున వ్యక్తిగత ఒలింపిక్ రౌండ్‌కు సాంకేతిక కమిటీ ఎంపిక చేసిందని రాష్ట్ర విలువిద్య సంఘం ప్రధాన కార్యదర్శి బెవర వెంకటరమణ తెలిపారు. ఒలింపిక్ రౌండ్‌లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన ఆర్చర్లను రాష్ట్ర కాంపౌండ్ జట్లకు ఎంపిక చేశామన్నారు. బాలికల విభాగంలో కేఎస్ లేహ్యారెడ్డి, ఎ.కన్షిక, కె.రిషి కీర్తన, ఎం.సూర్య హంసిని, బాలుర విభాగంలో పి.చరణ్‌శ్రీకర్, కె.బుద్ధేశ్వరరావు, ఎం.సుహాస్, ఇ.సాయి రాధాకృష్ణమూర్తి తొలి నాలుగు స్థానాల్లో నిలిచి రాష్ట్ర జట్లలో స్థానం సాధించారు. విజేతలకు రాష్ట్ర విలువిద్య సంఘం ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, కోశాధికారి కృష్ణకుమారి, ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ అతిథులుగా హాజరై పతకాలు బహూకరించారు. సాంకేతిక కమిటీ సభ్యులు విజయభరద్వాజ, ధనుంజయ, వంశీ, సాహిత్, ఎం.జయలక్ష్మి, చంద్రిక, ధనుష్, దామోదర్ పాల్గొని విజేతలను అభినందించారు.

విజేతలతో సత్యనారాయణ, కృష్ణకుమారి, వెంకటరమణ, శ్రావణ్‌కుమార్, సాంకేతిక కమిటీ సభ్యులు

ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జరిగే 23వ ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో తలపడేందుకు జిల్లా నుంచి పలువురు అథ్లెట్లు అర్హత సాధించారని ఉమ్మడి కృష్ణా జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ఎం.హరిగోపాల్ తెలిపారు. ఆదివారం స్థానిక ఐజీ ఎంసీ స్టేడియంలోని జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అథ్లెట్లకు శుభాకాంక్షలు తెలిపారు. పురుషుల విభాగంలో కంది గంగాధరరావు, ఎం.మల్లికార్జునరావు, ఎల్.రవీంద్రరావు, జి.శ్రీనివాస నాయక్, పి.రామకృష్ణ, మహిళల విభాగంలో ఏవీ సుబ్బలక్ష్మి, ఎం.అరుణ భారత మాస్టర్స్ అథ్లెటిక్స్ జట్టులో స్థానం సాధించారు. ఇటీవల పట్నాలో జరిగిన జాతీయ లేజర్ రన్ ఛాంపియన్‌షిప్‌లో రెండు పసిడి పతకాలు కైవసం చేసుకోవడమే కాకుండా వచ్చే నెలలో దక్షిణాఫ్రికాలో జరిగే ప్రపంచ లేజర్ రన్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైన మాస్టర్ అథ్లెట్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ జి.శ్రీనివాస నాయక్(హెచ్‌సీ-433)ను.. జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘం ఛైర్మన్ జీవీఎస్ శర్మ సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. జిల్లా సంఘం అధ్యక్షుడు పి.జ్యోతి ప్రకాష్, కోశాధికారి మరీదు హరిగోపాల్ పలువురు మాస్టర్స్ అథ్లెట్లు పాల్గొన్నారు.

శ్రీనివాస నాయక్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న జీవీఎస్ శర్మ, తదితరులు

అంబేడ్కర్ స్మృతివనం కార్మికుల దీక్ష విరమణ

కార్మికులకు జీతాల నగదు అందిస్తున్న కాశీనాథ్

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ అంబేడ్కర్ స్మృతివనం కార్మికులు నెల రోజులుగా చేస్తున్న దీక్షలను ఆదివారం విరమించారు. గుత్తేదారు సంస్థ ఆరు నెలలు జీతాలు చెల్లించింది. మిగిలిన మూడు నెలల జీతాలను నెల రోజుల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దీంతో సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు కార్మికులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ తదితరులు మాట్లాడారు. జీతాలు ఇవ్వాలని కోరుతూ పలు రకాలుగా కార్మికులు చేసిన పోరాటానికి అధికారులు స్పందించారని తెలిపారు. 9 నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతుంటే ప్రజా సంఘాలు వారికి అండగా నిలిచి పోరాటం చేశాయని వివరించారు. ప్రభుత్వం దిగి వచ్చి గుత్తేదారుతో జీతాలు ఇప్పించిందన్నారు. ఈ సందర్భంగా నాయకుల చేతుల మీదుగా కార్మికులకు జీతాలు ఇప్పించారు. ఈ కార్యక్రమంలో కె.దుర్గారావు, క్రాంతికుమార్, ఎం.బాబూరావు, వై.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి

మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. నాలుగో డివిజన్ ఏపీఐఐసీ కాలనీలో డీఎంఎస్ విజయం సంఘం, విజయవాడ గ్రాండ్ బజార్‌కు ఆదివారం విచ్చేశారు. గద్దె మాట్లాడుతూ 1995లోనే డ్వాక్రా వ్యవస్థను అమలు చేశారన్నారు. డ్వాక్రా వ్యవస్థతో బ్యాంకులు బిజీగా మారాయన్నారు. ఇంట్లో ఒక మహిళ చదువుకుంటే కుటుంబమంతా చదువుకున్నట్లేనన్నారు. మహిళలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు సుముఖంగా ఉన్నాయన్నారు. డీఎంఎస్ విజయం సంఘం అధ్యక్షురాలు పి.నళిని, గ్రాండ్ బజార్ కార్యదర్శి సుబ్బలక్ష్మి, కోశాధికారి స్వప్న, గ్రోత్ అధికారి వీవీఎన్ లక్ష్మి, ట్రైనింగ్ అధికారి నీలిమలు పాల్గొన్నారు.

దొంగలు దొరికిపోయారు..!

సీసీ ఫుటేజీ ఆధారంగా కేసుల ఛేదన

సత్యనారాయణపురం (గాంధీనగర్), న్యూస్‌టుడే : దొంగతనాలు చేసి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు దొంగలను సీసీ కెమెరాల సాయంతో సత్యనారాయణపురం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. విజయవాడ నార్త్ ఏసీపీ స్రవంతిరాయ్ ఆదివారం సత్యనారాయణ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లాకు చెందిన రామనబోయిన శ్రీను గత నెల 27న సత్యనారాయణపురం దాసాంజనేయ స్వామి ఆలయంలోని హుండీలో డబ్బులు దొంగిలించాడు. వాటిని విజయవాడ రైల్వేస్టేషన్ సమీపంలోని బొగ్గులైను రైల్వే కాలనీలోని పొదల్లో దాచాడు. కొంత నగదు దాచి, మిగతా నగదు తీసుకొని కర్నూలు బస్సు ఎక్కాడు. వివిధ ప్రాంతాలకు తిరుగుతూ జల్సాలు చేశాడు. డబ్బు ఖర్చు అయిపోవడంతో తిరిగి విజయవాడలోని బొగ్గులైను కాలనీకి వచ్చాడు.

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ స్రవంతిరాయ్. పక్కన సీఐ లక్ష్మీనారాయణ తదితరులు

సీఐ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో నిఘా పెట్టిన ప్రత్యేక బృందం.. సీసీ ఫుటేజీలను విశ్లేషించింది. వలపన్ని నిందితుడిని పట్టుకుంది. అతడి నుంచి రూ.18వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. సీపీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు వెస్ట్ డీసీపీ జి.రామకృష్ణ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టినట్లు ఏసీపీ వివరించారు.

❖ ఎనికేపాడుకు చెందిన పెనుగోతు మురళి ఈ ఏడాది జూన్ 2వ తేదీ, సెప్టెంబరు 5వ తేదీల్లో గాంధీనగర్‌లో ద్విచక్ర వాహనం, ఆటో దొంగిలించాడు. అప్పటి నుంచి తప్పించుకొని తిరుగుతున్నాడు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. పసుపుతోటలో తిరుగుతుండగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి ఆటో, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ స్రవంతిరాయ్ వెల్లడించారు.

జోగి రమేష్ కుటుంబానికి అండగా ఉంటాం: వైకాపా

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: జోగి రమేష్ కుటుంబానికి వైకాపా అండగా ఉంటుందని ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. కల్తీ మద్యం కేసులో ఎటువంటి ఆధారాలు లేకుండానే అరెస్టు చేయడం సరికాదన్నారు. వెలంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేస్తే వైకాపా అంత బలపడుతుందన్నారు. ఎమ్మెల్సీ రుహుల్లా మాట్లాడుతూ బీసీల్లో జోగి రమేష్‌కున్న ప్రాబల్యాన్ని తగ్గించేందుకే అక్రమ అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. నకిలీ మద్యం కేసులో ఆదివారం ఉదయం అరెస్టు అయిన జోగి రమేష్ సోదరులను కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలోని విజయవాడ తూర్పు ఎక్సైజ్ కార్యాలయానికి తీసుకొచ్చారు. వైకాపా సానుభూతిపరులు తరలి వచ్చారు. ఇబ్రహీంపట్నంకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు పోలీసులతో గొడవపడ్డారు.

రైతులకు నష్టపరిహారం అందించండి

మాట్లాడుతున్న శోభనాద్రీశ్వరరావు, పక్కన కేశవరావు, ప్రసాద్, సుధీర్, హరినాథ్, జమలయ్య తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : మొంథా తుపాను వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విజయవాడ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. రైతులకు పెట్టుబడి రాయితీ.. ఆహార పంటలకు రూ.25వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు, ఉద్యాన పంటలకు రూ.75వేల చొప్పున అందించాలని కోరారు. రైతు, కౌలు రైతులకు పంటల బీమా పరిహారం వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు వ్యతిరేకిస్తూ ఈ నెల 26న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు. ఏపీ రైతు సంఘం నాయకుడు వై.కేశవరావు మాట్లాడుతూ.. విద్యుత్తు సవరణ చట్టాన్ని ఉపసంహరించాలని, ఉచిత విద్యుత్తు, రాయితీలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్ మాట్లాడుతూ.. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు కారుచౌకగా అప్పగించే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని కోరారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్, కిసాన్ సభ రాష్ట్ర నాయకుడు డి.హరినాథ్ మాట్లాడుతూ.. పీపీపీ విధానంలో వైద్య కళాశాలలను ప్రైవేటుకు అప్పగించడం సరికాదన్నారు. ఈ నెల 26న తలపెట్టిన నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు ప్రభాకరరావు, చుండూరు రంగారావు, పి.జమలయ్య, మరీదు ప్రసాద్‌బాబు, కొల్లా రాజమోహన్, ఎం.రామకృష్ణ, కె.గనిరాజు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

✦ నందిగామ శివారు అనాసాగరంలో కాలనీ లేఅవుట్ లోకి వెళ్లే దారిలో వీధి దీపాలు వెలగట్లేదు. దీనివల్ల రాత్రి వేళ చీకట్లో దారిలో వెళ్లడం ఇబ్బంది అవుతోందని స్థానికులు కమిషనర్ లోవరాజు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన.. ఇంజినీరింగ్ శాఖ సిబ్బందితో వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు. ✦ నందిగామలోని ఏడు, ఎనిమిదో వార్డుల్లో దోమలు ఎక్కువగా ఉండడం వల్ల ఇబ్బందికరంగా ఉందని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి ఆయా వార్డుల్లో ఫాగింగ్ చేయించారు. ✦ స్థానిక తొమ్మిది, పది వార్డుల్లో కొన్ని రహదారుల వెంటనే పిచ్చి మొక్కలు పెరిగాయని, కాలువలు అధ్వానంగా ఉన్నాయని స్థానికులు మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. ✦ నందిగామలో గాంధీ సెంటర్ నుంచి చందర్లపాడు రోడ్డులో కేవీఆర్ కళాశాల వరకు రహదారుల పక్కన వాహనాలు పార్కింగ్ చేస్తుండడం వల్ల రాకపోకలకు అసౌకర్యంగా ఉందని నివాసులు.. సీఐ లచ్చునాయుడు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. – న్యూస్‌టుడే, నందిగామ

✦ పట్టణంలోని ప్రధాన వీధిలో రైతుబజార్ ఎదురుగా సెంటర్ పార్కింగ్ స్థలంలో పెద్ద గుంతలు ఉన్నాయని వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా కమిషనర్ రామకృష్ణ దృష్టికి తీసుకురాగా.. ఆయన స్పందించి కార్మికులను పంపించి గుంతలు పూడ్చి వేయించారు. – న్యూస్‌టుడే, జగ్గయ్యపేట

24 నుంచి సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవాలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామలోని సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో ఈనెల 24వ తేదీ నుంచి స్వామివారి కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు ఆదివారం రాత్రి తెలిపారు. 24న సాయంత్రం 6 గంటలకు విష్వక్సేనారాధన, అంకురారోపణం, 25న ఉదయం 9.30 గంటలకు అభిషేకం, అలంకరణ, పెండ్లి కుమారునిగా అలంకరణ చేస్తామన్నారు. 26న ఉదయం 9గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం, అన్నప్రసాద వితరణ, నిత్యహోమం, 27న పూర్ణాహుతి, స్వామివారి కల్యాణమూర్తుల ఊరేగింపు, 28న సాయంత్రం 6గంటలకు దీపోత్సవం, ఊంజల్ సేవ నిర్వహిస్తామని వివరించారు.

గ్రావెల్ ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్థులు

వత్సవాయి, న్యూస్‌టుడే: వత్సవాయి మండలం మంగొల్లు క్వారీ నుంచి పెనుగంచిప్రోలుకు అనుమతులు లేకుండా ఏడు ట్రాక్టర్లతో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు గ్రావెల్ ట్రాక్టర్లను అడ్డుకున్నారు. పెనుగంచిప్రోలు నుంచి వచ్చిన ట్రాక్టర్ల యజమానులు అడ్డువచ్చిన వారిని పక్కకు నెట్టి ట్రాక్టర్లను తీసుకెళ్లారు.

మొంథా గాయం.. కావాలి సాయం

నియోజకవర్గంలో 8029 హెక్టార్లలో పంటలకు నష్టం ● వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా

నందిగామ గ్రామీణం, చందర్లపాడు, వీరులపాడు, న్యూస్‌టుడే

నందిగామ నియోజకవర్గంలో పంటలకు మొంథా తుపాను తీవ్ర నష్టం మిగిల్చింది. ఎడతెరిపిలేని వర్షాలు, మునేరు, నల్లవాగు వరదలతో ఆయకట్టులోని పంట పొలాలు మునిగి రైతులు నష్టపోయారు. చేతికందే దశలో వరి, నూర్పిడి దశలో మొక్కజొన్న, తొలితీత దశలో పత్తి వర్షానికి తడిసింది. ఉద్యాన పంటలకు కూడా నష్టం వాటిల్లింది. వరి పంట నేలవాలి రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. సాగు కోసం పెట్టిన పెట్టుబడి చేతికందే పరిస్థితి లేదు. వరి, మొక్కజొన్న, పత్తి సాగుకు ఎకరానికి రూ.35 వేలు పెట్టుబడి పెట్టారు. పత్తికాయలు తడిసి మొలకలొస్తున్నాయి. నేలవాలిన వరి పంట చేతికందే పరిస్థితిలేదు. నూర్పిడి చేసిన మొక్కజొన్నను ఆరబోసుకుంటున్నారు. నష్టపోయిన రైతులు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

మండలం	పంట నష్టం (హెక్టార్లలో)
నందిగామ	2589
చందర్లపాడు	3255
కంచికచర్ల	1202
వీరులపాడు	983

కమ్మవారిపాలెంలో మొక్కజొన్న ఆరబోస్తున్న రైతు

మొలకెత్తుతున్న పత్తికాయ

నందిగామ నియోజకవర్గంలో పత్తి 12453 హెక్టార్లు, మొక్కజొన్న 3840 హెక్టార్లలో సాగు చేశారు. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా ప్రకారం 8029 హెక్టార్లలో పంటలకు నష్టం ఏర్పడింది. గ్రామాల్లో వ్యవసాయశాఖ సిబ్బంది డ్రోన్లతో పంట నష్టాన్ని పరిశీలించారు. రెవెన్యూ సర్వే నంబర్ల ప్రకారం పంట నష్టం అంచనావేసి పరిహారం వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు. ఎక్కువ శాతం రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించలేదు. ప్రభుత్వం పంటల బీమాతో పనిలేకుండా పరిహారం ప్రకటించాలని కోరుతున్నారు.

కొనుగోలు చేసేవారు కరవు

గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేవారు కరవయ్యారు. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు తెరిస్తే మొక్కజొన్నకు క్వింటాకు రూ.2400 మద్దతు ధర వస్తుంది. తొలిసారి తీసిన పత్తిని దళారులు క్వింటా రూ.6 వేలకే కొనుగోలు చేస్తున్నారు. నందిగామలో సీసీఐ కొనుగోలు కేంద్రం తెరిస్తే క్వింటాకు రూ.8110 మద్దతు ధర వస్తుంది. సీసీఐ నిబంధనల ప్రకారం పత్తిలో 8 శాతం లోపు తేమ ఉండాలి. వర్షాలకు పత్తి తడిసి తేమ ఎక్కువగా ఉందని రైతులు వాపోతున్నారు. సీసీఐ నిబంధనలు సడలించి తేమ శాతంతో పనిలేకుండా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

కమ్మ విద్యార్థులకు ఉపకార వేతనాలు

మాట్లాడుతున్న కోట వీరబాబు, వేదికపై కోగంటి బాబు తదితరులు

నందిగామ, న్యూస్‌టుడే: కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఆ సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఆదివారం స్థానిక కమ్మ కల్యాణ మండపంలో సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ మండపాన్ని దివంగత చిరుమామిళ్ల శేషాద్రి నాయుడు ప్రాంగణంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయన పేరుతో ఆర్చి నిర్మించనున్నారు. కమ్మ పేద విద్యార్థుల స్కాలర్‌షిప్పుల కోసం మైలవరం ఎమ్మెల్యే వెంకటకృష్ణ ప్రసాద్ రూ.5 లక్షలు, అలాగే సంఘం తరఫున మరో రూ.5 లక్షలు కలిపి రూ.10 లక్షలు ఇవ్వనున్నట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 12వ తేదీ లోపు విద్యార్థులు కమ్మ సంఘానికి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. 16న నిర్వహించే సంఘం కార్తిక వన సమారాధన రోజున ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నారు. ఏఎంసీ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు, కంచికచర్ల మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కోగంటి బాబు, కౌన్సిలర్ కాయపాని సత్యవతి, ఆసుపత్రి ఛైర్మన్ వేపూరి నాగేశ్వరరావు, కమ్మ సంఘం కమిటీ ప్రతినిధులు వారిరెడ్డి సత్యనారాయణ ప్రసాద్, పాలేటి సతీష్, వాసిరెడ్డి ప్రసాద్, కోయ వాసుదేవరావు, పెంట్యాల వీరభద్రరావు, ఎర్రంరెడ్డి బాబూరావు, నాయకుడు నర్వసేన మురళి, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తితో సామూహిక సత్య వ్రతం

చందర్లపాడు, న్యూస్‌టుడే: కాండ్రపాడులోని శ్రీమహా పంచ ముఖేశ్వరాలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతం వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన దంపతులు పాల్గొని వ్రతం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం అన్నదానం చేశారు. 25 సంవత్సరాలుగా ఆలయ ఛైర్మన్ బాధ్యతలు నిర్వహిస్తూ వయో భారంతో వైదొలుగుతున్న మంగునూరు పిచ్చిరెడ్డిని గ్రామస్థులు సన్మానించి వీడ్కోలు పలికారు. కమిటీ సభ్యులు రామినేని పున్నరెడ్డి, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఇందూరి రామిరెడ్డి, కమతం సీతారామిరెడ్డి, సరాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శైవక్షేత్రాల్లో ద్వాదశి పూజలు

పల్లగిరిపై పుష్పాలంకరణలో వాయులింగం

కంచికచర్లలో వసంత వేణుగోపాలస్వామి

నందిగామ గ్రామీణం: నందిగామ శివాలయంలో ఆదివారం ద్వాదశిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. రామలింగేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం చేశారు. పల్లగిరిపై భవానీశంకరుని వాయులింగానికి రుద్రాభిషేకం చేశారు. రాఘవాపురంలోని రామలింగేశ్వరస్వామి, గోళ్లమూడిలో శంభులింగేశ్వర స్వామి, దాములూరు శివార కూడలిలో సంగమేశ్వరస్వామికి రుద్రాభిషేకాలు నిర్వహించారు.

కంచికచర్ల, న్యూస్‌టుడే: మండలంలోని పలు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొట్టుముక్కల వసంత వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కంచికచర్ల శివాలయం, పాత శివాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

ఆలయ భద్రతపై ఆరా

శివాలయాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు సురేష్‌బాబు, ఎస్సైలు శాతకర్ణి, సూర్యవంశీ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని తొక్కిసలాటలో పలువురు భక్తులు మృతి చెందిన నేపథ్యంలో ప్రభుత్వం అన్ని దేవాలయాల్లో భద్రతాపరమైన చర్యలకు ఆదేశించింది. ఇందులో భాగంగా నందిగామ శివాలయంలో భక్తులకు భద్రతాపరమైన ఏర్పాట్లు ఎలా ఉన్నాయో తహసీల్దారు ఎన్.సురేష్‌బాబు, ఎస్సైలు శాతకర్ణి, సూర్యవంశీ ఆలయ అధికారులతో పరిశీలించారు. 3న సోమవారం, 5న పౌర్ణమి పురస్కరించుకుని రామలింగేశ్వరస్వామి దర్శనానికి భక్తులు భారీగా తరలి వస్తారు. భక్తులతో రద్దీ ఏర్పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈవో కంచర్ల సురేష్‌తో మాట్లాడారు. ముఖ్యమైన శివాలయాల్లో భక్తులు ఇబ్బందిపడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.

లోక కల్యాణానికి రుద్రహోమం

క్రతువులో సాంబమూర్తి అవధాని, భక్తులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: లోక కల్యాణం కోరుతూ కాశీలో హోమాలు, శివ లింగాల ప్రతిష్ఠ చేస్తున్నామని నందిగామకు చెందిన తితిదే వేదపండితులు దుర్భాకుల సాంబమూర్తి అవధాని ఆదివారం తెలిపారు. లక్ష మారేడు దళాలతో హోమం, పూర్ణాహుతి చేశామన్నారు. రుద్రహోమం నిర్వహించామని, దంపతులతో 16 శివ లింగాలను ప్రతిష్ఠిస్తున్నామని చెప్పారు. ధర్మరక్షణ ట్రస్టు, తితిదే సహకారంతో దేశం బాగుండాలని ఈ క్రతువులు చేస్తున్నామని వివరించారు.

మఠం శివాలయంలో లక్ష బిల్వార్చన

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట పాలేటి ఒడ్డున కృష్ణశిలతో నిర్మిస్తున్న మఠం శివాలయంలో ఆదివారం శివనామ స్మరణతో హోరెత్తింది. ఆలయంలో లక్ష బిల్వార్చన వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కుకుట్ల వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యుల వితరణతో చేపట్టిన కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గాయత్రి ఆశ్రమ వ్యవస్థాపకుడు చిట్టా లక్ష్మీనరసింహశాస్త్రి, తెదేపా నాయకులు శ్రీరాంచినబాబు తదితర ప్రముఖులు పాల్గొని అన్నసమారాధన ప్రారంభించారు. పాలేటి వరదను తట్టుకునేలా పూర్తిగా కృష్ణశిలలతో నిర్మిస్తున్న ఆలయాన్ని భక్తులు విశేషంగా సందర్శించారు.

శాస్త్రోక్తంగా తులసి దామోదర కల్యాణం

జగ్గయ్యపేట: పట్టణంలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో కార్తిక క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకొని తులసి, దామోదర కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు శ్రీరంగం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం నుంచి ఆలయంలో విశేష పూజలు నిర్వహించి అనంతరం తులసి, ఉసిరి వృక్షాలకు వైభవంగా కల్యాణం జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సేవాతత్పరతకు సత్కారం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: అన్నపూర్ణ సేవాసమితి ఏర్పాటు చేసి యువతతో కలిసి దశాబ్దానికి పైగా విందులు, వేడుకల్లో మిగిలిన ఆహార పదార్థాల వృథాను నివారిస్తున్న మహంకాళి జయప్రకాష్‌ని శ్రీగురుధామ్ ధర్మక్షేత్రంలో ఆదివారం ఆత్మీయంగా సత్కరించారు. జగ్గయ్యపేటలోని పురాతన చంద్రమౌళీశ్వర దేవాలయానికి నూతన ఛైర్మన్‌గా నియమితులైన నేపథ్యంలో ఆయన్ను తాత్వికులు గెంటేల వెంకటరమణ, వసంతలక్ష్మి దంపతులు అభినందించారు. యువతతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

ఆలయాల్లో అన్నసమారాధన

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: విమలాభాను ఫౌండేషన్ ఛైర్మన్ సామినేని విమలాదేవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సామినేని ఉదయభాను కుటుంబ సభ్యులు, అభిమానులు పట్టణంలోని ఆలయాల్లో చేపట్టిన అన్నసమారాధనను మున్సిపల్ కౌన్సిలర్ సామినేని వెంకట కృష్ణప్రసాద్ ప్రారంభించారు. ఇందులో భాగంగా అయ్యప్ప దీక్షాపరులకు భిక్ష కార్యక్రమం నిర్వహించారు.

ఆకట్టుకున్న నమూనాలు

ప్రాజెక్టు గురించి వివరిస్తున్న చిన్నారులు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని నారాయణ పాఠశాలలో చిన్నారులు వివిధ అంశాలపై రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. భాష, భావప్రకటన, వ్యక్తీకరణ నైపుణ్యాలతో పాటు పలు వైజ్ఞానిక అంశాలపై నమూనాలు రూపొందించి ప్రదర్శించారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ పవన్‌కుమార్, ఇన్‌ఛార్జి హెడ్ వాణి, క్లస్టర్ ప్రిన్సిపల్ శివరామకృష్ణ, సమన్వయకర్త రోజ రాణి ప్రారంభించారు.

చెడునడత వీడితేనే కుటుంబాలకు గౌరవం

చెడు ప్రవర్తన కలిగిన వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకుంటేనే.. వారి కుటుంబాలకు సమాజంలో గౌరవం ఉంటుందని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. జగ్గయ్యపేట, చిల్లకల్లు పోలీస్ స్టేషన్లలో రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చట్టాలు కఠినతరమైన నేపథ్యంలో చిన్నచిన్న నేరాలకు సైతం తీవ్రమైన శిక్షలు ఉంటాయని, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నేరప్రవృత్తి నుంచి బయటకు రావాలని సూచించారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

నడిగూడెం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై శీతలపానీయంలో ఎలుకల మందు కలుపుకొని తాగిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రామాపురంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై బి.అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన గోపితో అదే జిల్లాకు చెందిన ఈశ్వరమ్మ(24)కు 2017లో వివాహం జరిగింది. కొంతకాలం తర్వాత వారి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. తరచూ గొడవలు జరుగుతుండేవి. గత నెల 24న ఈశ్వరమ్మ తన అమ్మమ్మగారి గ్రామమైన రామాపురానికి వచ్చింది. మనస్తాపంతో 26న మందు తాగడంతో చికిత్స నిమిత్తం కోదాడకు, తర్వాత ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. తల్లి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవపంచనామా నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్లు, కాలువలకు మహర్దశ

పురపాలికలో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు

నందిగామ, న్యూస్‌టుడే

నందిగామ పురపాలక సంఘం పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడం రహదారులు, మురుగు కాలువలు అధ్వానంగా మారాయి. దీనివల్ల పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే వీటిపై దృష్టి సారించింది. ఎన్నికల అనంతరం మున్సిపల్ పాలకవర్గం తెదేపా కైవసం చేసుకోవడంతో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చారు. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆదేశాల మేరకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, పాలకవర్గం, కమిషనర్ లోవరాజు, ఏఈ ఫణి శ్రీనివాసరావులు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి సకాలంలో పూర్తయ్యేలా పర్యవేక్షిస్తున్నారు. సకాలంలో ఈ పనులను పూర్తి చేస్తే పట్టణ ప్రజలకు కీలక సమస్యలు తీరతాయి.

రామన్నపేట రోడ్డులో నిర్మాణంలో డ్రెయిన్

☛ నందిగామతో పాటు శివారు ప్రాంతాలైన హనుమంతుపాలెం, అనాసాగరం గ్రామాల్లోని 20 వార్డుల్లో నిధులు కేటాయించారు. ఏపీ సీఆర్టీపీ నుంచి రూ.మూడు కోట్లు, 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.రెండు కోట్లు మంజూరు చేశారు. గత ప్రభుత్వం స్థానిక గాంధీ సెంటర్ నుంచి రామన్నపేట వైపు వెళ్లే రహదారిని సీఎస్ఆర్ నిధులతో విస్తరించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపం వల్ల రోడ్డంతా గుంతలు పడ్డాయి. డ్రెయిన్లు దెబ్బతిన్నాయి. మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో దుర్గంధం వస్తోంది. వర్షం వస్తే బీసీ కాలనీలోకి వరద నీరు చేరి ఆయా ప్రాంతాల ఇళ్లల్లోకి చేరుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని పరిస్థితుల్లో రామన్నపేట రోడ్డు పక్కన డ్రెయిన్ నిర్మాణానికి నిధులు కేటాయించగా ప్రస్తుతం ఒక వైపు పెద్ద డ్రెయిన్ నిర్మిస్తున్నారు.

☛ స్థానిక 13వ వార్డులో విద్యుత్తు సబ్‌స్టేషన్ వెనుక వైపు రహదారి, శ్రీసాయి అయ్యప్ప దేవాలయం వద్ద, కేవీఆర్ కళాశాల వెనుక వైపు, కుమారస్వామి నగర్‌లో సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్నారు. ఐదో వార్డులో రామాలయం వద్ద కాలువ, రహదారి నిర్మించారు.

☛ మహాలక్ష్మమ్మ అమ్మవారి దేవాలయం వద్ద సిమెంట్ రోడ్డు నిర్మించారు. మున్సిపల్ పరిధిలో 14 సిమెంట్ రోడ్లు, తొమ్మిది డ్రెయిన్లకు నిధులు మంజూరు చేయగా.. ఇప్పటికే కొన్ని పనులు పూర్తయ్యాయి. పట్టణంలో మురుగు కాలువలను పూర్తి స్థాయిలో శుభ్రం చేయించారు.

☛ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి మాట్లాడుతూ పురపాలక పరిధిలో రహదారులు, డ్రెయిన్ల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని, స్థానిక ఎమ్మెల్యే సౌమ్య, పాలకవర్గం సూచనల మేరకు పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అన్ని ప్రాంతాల్లో ప్రాధాన్య క్రమంలో రోడ్లు, కాలువలను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

ఎర్రన్నాయుడికి నివాళి

నందిగామ: కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు వర్ధంతి ఆదివారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెదేపా నాయకులు వీరంకి వీరాస్వామి, తోట నాగమల్లేశ్వరరావు, పిచ్చయ్య, సతీష్, రామిరెడ్డి సుబ్బారావు, సురేష్, గోపి పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ నేడు

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం, ముచ్చనపల్లి గ్రామాల్లో వడ్డె ఓబన్న విగ్రహం ఏర్పాటుకు సోమవారం భూమి పూజ చేస్తారని ఆ సంఘం నాయకులు బండారు సత్యనారాయణ, వేముల బాబులు తెలిపారు.

ఆనందసాయి గుడిలో దీక్ష సంపూర్ణం

పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆనంద సాయి ఆలయంలో జులైలో తొలి ఏకాదశి రోజు ప్రారంభించిన చాతుర్మాస దీక్షను ఆదివారం క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకొని సంపూర్ణం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతిహోమానికి పూర్ణాహుతి చేశారు. ఆనంద సాయిబాబాకి లక్ష తులసి పూజ నిర్వహించారు. అనంతరం ఆలయంలో పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

కుండపోత వర్షం.. రోడ్లు జలమయం

మాగల్లులో రహదారిపై ప్రవహిస్తున్న నీరు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఏటిపట్టు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. రహదారులు జలమయం అయ్యాయి. నందిగామ-మధిర ఆర్అండ్‌బీ రహదారిలో మాగల్లు, రామిరెడ్డిపల్లి గ్రామాల వద్ద నీరు నిలిచి వాహనచోదకులు రాకపోకలకు అసౌకర్యానికి గురయ్యారు. మాగల్లు తదితర గ్రామాల్లో సిమెంటు రహదారులు కాలువలను తలపించాయి. పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న పంటల్లో నీరు నిలిచింది. ఇటీవల మొంథా తుపాన్‌తో నష్టపోయిన రైతులు ఈ వర్షంతో మరింత ఆందోళన చెందుతున్నారు. వర్షానికి గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు అర్హత

విజేతలతో సత్యనారాయణ, కృష్ణకుమారి, వెంకటరమణ, శ్రావణ్‌కుమార్, సాంకేతిక కమిటీ సభ్యులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో జరుగుతున్న 42వ జాతీయ సబ్ జూనియర్(అండర్-18) బాలబాలికల ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా ఆదివారం జరిగిన కాంపౌండ్ రౌండ్‌లో రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి 30 మంది బాలురు, 15 మంది బాలికలు ఉత్సాహంగా పోటీ పడ్డారు. వీరందరికీ డబుల్ ఫిఫ్టీ(50+50)లో 72 యారోస్ ర్యాంకింగ్ రౌండ్‌లో తొలి 16 మంది చొప్పున వ్యక్తిగత ఒలింపిక్ రౌండ్‌కు సాంకేతిక కమిటీ ఎంపిక చేసిందని రాష్ట్ర విలువిద్య సంఘం ప్రధాన కార్యదర్శి బెవర వెంకటరమణ తెలిపారు. ఒలింపిక్ రౌండ్‌లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన ఆర్చర్లను రాష్ట్ర కాంపౌండ్ జట్లకు ఎంపిక చేశామన్నారు. బాలికల విభాగంలో కేఏఎస్ లేహ్యా రెడ్డి, ఎ.కన్నిక, కె.రిషి కీర్తన, ఎం.సూర్య హంసిని, బాలుర విభాగంలో పి.చరణ్‌శ్రీకర్, కె.బుద్ధేశ్వరరావు, ఎం.సుహాస్, ఇ.సాయి రాధాకృష్ణమూర్తి తొలి నాలుగు స్థానాల్లో నిలిచి రాష్ట్ర జట్లలో స్థానం సాధించారు. విజేతలకు రాష్ట్ర విలువిద్య సంఘం ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, కోశాధికారి కృష్ణకుమారి, ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ అతిథులుగా హాజరై పతకాలు బహూకరించారు. సాంకేతిక కమిటీ సభ్యులు విజయభరద్వాజ, ధనుంజయ, వంశీ, సాహిత్, ఎం.జయలక్ష్మి, చంద్రిక, ధనుష్, దామోదర్ పాల్గొని విజేతలను అభినందించారు.

ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

శ్రీనివాస నాయక్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న జీవీఎస్ శర్మ, చిత్రంలో ప్రకాష్, హరిగోపాల్, గంగాధరరావు, సుబ్బలక్ష్మి తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: చెన్నైలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జరిగే 23వ ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో తలపడేందుకు జిల్లా నుంచి పలువురు అథ్లెట్లు అర్హత సాధించారని ఉమ్మడి కృష్ణా జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ఎం.హరిగోపాల్ తెలిపారు. ఆదివారం స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అథ్లెట్లకు శుభాకాంక్షలు తెలిపారు. పురుషుల విభాగంలో కంది గంగాధరరావు, ఎం.మల్లికార్జునరావు, ఎల్.రవీంద్రరావు, జి.శ్రీనివాస నాయక్, పి.రామకృష్ణ, మహిళల విభాగంలో ఏవీ సుబ్బలక్ష్మి, ఎం.అరుణ భారత మాస్టర్స్ అథ్లెటిక్స్ జట్టులో స్థానం సాధించారు. ఇటీవల పట్నాలో జరిగిన జాతీయ లేజర్ రన్ ఛాంపియన్‌షిప్‌లో రెండు పసిడి పతకాలు కైవసం చేసుకోవడమే కాకుండా వచ్చే నెలలో దక్షిణాఫ్రికాలో జరిగే ప్రపంచ లేజర్ రన్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైన మాస్టర్ అథ్లెట్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ జి.శ్రీనివాస నాయక్(హెచ్‌సీ-433)ను.. జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘం ఛైర్మన్ జీవీఎస్ శర్మ సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. జిల్లా సంఘం అధ్యక్షుడు పి.జ్యోతి ప్రకాష్, కోశాధికారి మరీదు హరిగోపాల్ పలువురు మాస్టర్స్ అథ్లెట్లు పాల్గొన్నారు.

హోరా.. హోరీగా పికిల్ బాల్ టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని పడల్ థీయర్ పికిల్ బాల్ కోర్టులో శుక్రవారం నుంచి జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఓపెన్ పికిల్ బాల్ టోర్నీలో భాగంగా ఆదివారం సాయంత్రం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో పలువురు క్రీడాకారులు హోరా.. హోరీగా తలపడ్డారు. రాష్ట్రంలోని పలు పట్టణాల నుంచి 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారని నిర్వాహకులు రాహుల్ మద్దెల, సతీష్‌రెడ్డి తెలిపారు. రాత్రి జరిగిన క్వార్టర్ ఫైనల్స్ డబుల్స్ విభాగంలో హర్ష, రవితేజ జోడీ 15-13 స్కోర్ తేడాతో కార్తీక్, రేవంత్ జోడీపై, బసంత్, జీత్ జోడీ 15-3 స్కోర్ తేడాతో ప్రణీత్, ఉమేష్ జోడీపై, రోహిత్, నిహాల్ జోడీ 15-13 స్కోర్ తేడాతో అంజేష్, అవినాష్ జోడీపై విజయం సాధించి సెమీ ఫైనల్‌లో ప్రవేశించారు.

ప్రకటన

కమ్మ సంఘం
నందిగామ

నిరుపేదలైన కమ్మ విద్యార్థినీ విద్యార్థులకు ఆర్థిక సహాయం

కొరకు ఇంటర్మీడియట్ మరియు ఆపై చదువులు చదువుచున్నవారు ఈ నెల 12వ తేదీలోగా అర్హత కలిగినవారు జిరాక్స్ కాపీలతో అర్జీ పెట్టుకోవలెను. ఇది పూర్తిగా కమ్మవారిలో నిరుపేద కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన వారికి ఆర్థిక సహాయం అందించాలనే సంకల్పంతో దాతల సహకారంతో ఏర్పాటు చేయడమైనది.

అప్లికేషన్ల కొరకు కమ్మ సంఘం ఆఫీసునందు సంప్రదించగలరు.

వివరములకు: 95155 00738

(c) eenadu

విజయవాడ పశ్చిమ

ఆలయ అభివృద్ధికి విరాళం

దాత నరేష్, శ్రావ్య దంపతులకు విరాళం రసీదు అందజేస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి పనులకు హైదరాబాద్ మనికొండకు చెందిన నరేష్, శ్రావ్య దంపతులు ఆదివారం రూ.5 లక్షలు విరాళం అందజేశారు. దాత కుటుంబానికి దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు వారికి ఆశీర్వచనం చేశారు. ఆలయ ఈవో శీనానాయక్ వారికి విరాళం రసీదు, అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

? పాతబస్తీ రథం సెంటర్లో రోడ్డు పక్కనున్న చెత్తను తరలించడం లేదు. - **రవిచంద్ర, స్థానికుడు** ✔ చెత్తను సత్వరమే అక్కడి నుంచి తరలిస్తాం. - **యోగేంద్ర, స్థానిక శానిటరీ అధికారి**

? కొత్తపేట కుమ్మరి వీధుల్లోని మొదటి లైన్లో కుక్కల బెడద అధికంగా ఉంది. - **రాజేంద్ర, స్థానికుడు** ✔ పరిశీలించి వాటిని పడతాం. - **సోమశేఖర్, వెటర్నరీ విభాగం అధికారి**

? ఎర్రకట్ట మైదానం మార్గంలో రోడ్డుపై గుంతలు దర్శనమిస్తున్నాయి. - **శశికళ, స్థానికురాలు** ✔ పరిశీలించి వాటిని పూడ్చివేస్తాం. - **శ్రీనివాస్, ఈఈ, సర్కిల్-1**

☛ కేబుల్‌రావు నగర్‌లోని పలు వీధుల్లో కుక్కల బెడద అధికంగా ఉందని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. వాటిని పట్టి సమస్య పరిష్కరించారు.

☛ టీచర్స్ కాలనీ ఆర్జలోడ్డులో పలువురు మందుబాబులు మద్యం తాగుతున్నారని అందిన ఫిర్యాదు మేరకు 2వ పట్టణ పోలీసులు స్పందించారు. వారిని పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. - **న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

స్పందనకు వందనం

పలు పనులకు శంకుస్థాపన నేడు

భవానీపురం: నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సుజనాచౌదరి సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. కేదారేశ్వరపేటలోని మామిడి మార్కెట్ నుంచి ఆంజనేయ స్వామి గుడి వరకు రూ.87 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి, విద్యాధరపురం క్యారీ వీధి, కె.సి. ఆర్.కె.పార్కు రహదారుల వెంబడి రూ.48 లక్షల వ్యయంతో చేపట్టనున్న పేవర్ బ్లాక్స్ నిర్మాణానికి శంకుస్థాపన, కబేళా వద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లైబ్రరీని ప్రారంభిస్తారు. అనంతరం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తారు.

జగన్మాత సేవలో సీపీ దంపతులు

సీపీ రాజశేఖర్‌బాబుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాస్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను సీపీ రాజశేఖర్‌బాబు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. తొలుత దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించిన అనంతరం ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం సూపరింటెండెంట్ చందు శ్రీనివాస్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తడంతో ఆదివారం క్యూలైన్లు కిటకిటలాడాయి. కెనాల్ రోడ్డు, రథం సెంటర్, ఘాట్ రోడ్డు మార్గం భక్తుల వాహనాలతో నిండిపోయింది. మల్లికార్జున మహామండపం మెట్లమార్గం, ఘాట్ రోడ్డు మార్గాల్లో 50 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని దేవస్థానం అధికారులు తెలిపారు.

క్యూలైన్లో బారులుదీరి..

భవనం నిర్మించి.. కేటాయింపు మరిచి..!

ఇప్పటికీ అందుబాటులోకి రాని చేపల మార్కెట్

భవానీపురం, న్యూస్‌టుడే

జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీలో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన చేపల మార్కెట్ నిరుపయోగంగా మారింది. నగరానికి సమీపంలో ఎనిమిదేళ్ల కిందట.. జాతీయ మత్స్య సంపద అభివృద్ధి సంస్థ (ఎన్ఎఫ్‌డీబీ) నిధులు రూ.53 లక్షలతో విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు దీనిని నిర్మించారు. 2017 డిసెంబరు 24న అప్పటి మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, అప్పటి ఎంపీ కేశినేని నాని ప్రారంభించారు. అత్యాధునికంగా నిర్మాణం చేపట్టిన దుకాణాలను కేటాయించేందుకు అధికారులు చర్యలు చేపట్టకపోవటంతో నేటికీ వినియోగంలోకి రాలేదు.

జక్కంపూడి కాలనీలో నిర్మించిన భవనం..

లోపల ఇలా..

అధ్వానంగా మారుతోంది...

ఈ కాలనీలో 15 వేల మందికి పైగా ప్రజలు నివాసం ఉంటున్నారు. దుకాణాలను మత్స్యకారులకు కేటాయించాలనే ప్రతిపాదన వచ్చినప్పటికీ అమలుకు నోచుకోలేదు. మత్స్యకారులు, నిరుద్యోగ యువతకు దుకాణాలు కేటాయిస్తే వారికి ఉపాధి లభించే అవకాశం ఉంది. గత కృష్ణా పుష్కరాల సమయంలో కృష్ణానది ఒడ్డున నివాసం ఉండే మత్స్యకారుల ఇళ్లను నగరపాలక సంస్థ అధికారులు తొలగించారు. వారికి జక్కంపూడి కాలనీలో నివాసాలు కేటాయించారు. ప్రస్తుతం వారంతా అక్కడే నివాసం ఉండి.. కాలనీలోని రోడ్లపై చేపల విక్రయిస్తున్నారు. దుకాణాలు కేటాయింపు లేకపోవడంతో ఆ భవనం అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారింది. దీంతో పాటు పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా మారింది.

ఇప్పటికైనా స్పందించాలి..

చేపల మార్కెట్ లోపల ఆకట్టుకునేలా టైల్స్ వేసి.. ప్రత్యేకంగా స్టాల్స్‌ను నిర్మించారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

దారంతా గుంతలమయం

భవానీపురం, న్యూస్‌టుడే

భవానీపురం ప్రాంతంలోని పలు రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే ముంపునకు గురవుతున్నాయి. వాననీరు ఎటూ వెళ్లే పరిస్థితి ఉండడం లేదు. దీంతో ఆ నీరంతా రహదారులపైనే నిలిచిపోతుంది. ఆ మార్గంలో వెళ్లే పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఊర్మిళానగర్ నుంచి కబేళా ప్రాంతానికి వెళ్లే రహదారి గతుకులమయంగా ఉంది. గతంలో ఆ రహదారిని బాగుచేస్తాం.. డ్రైనేజీ పనులు కోసం తవ్వి వదిలేశారు. ఆ తర్వాత పట్టించుకోవడం మానేశారు. నిత్యం వందలాది వాహనాలు ఆ మార్గంలో వెళ్తుంటాయి. ప్రధానంగా ఇన్నర్ రింగ్‌రోడ్డు మీదకు వెళ్లే వాహనాలన్నీ కూడా ఈ వైపే రాకపోకలు సాగిస్తాయి. అంతటి ప్రాధాన్యం ఉన్నప్పటికీ గత కొన్ని నెలలుగా అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. హెచ్‌బీకాలనీ ప్రాంతంలోని పలు రహదారులు ధ్వంసమయ్యాయి. సంబంధిత నగరపాలక సంస్థ అధికారులు స్పందించి రహదారులను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కబేళా రహదారి ఇలా..

ఊర్మిళానగర్‌లో ..

నేత్రపర్వంగా ఊంజల్ సేవ

ఇంద్రకీలాద్రి: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆది దంపతులకు నేత్రపర్వంగా ఊంజల్ సేవ నిర్వహించారు. సహస్రదీపాలంకృత స్టాండ్‌లో భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు. గంగా, పార్వతీ సమేత దుర్గామల్లేశ్వర స్వామివార్ల ఉత్సవ మూర్తులను అలంకరించిన ఉయ్యాలలో పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ ఊంజల్ సేవ చేశారు. మల్లేశ్వరస్వామికి సహస్ర లింగార్చన, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.

సేవలో దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ

పాత శివాలయంలో.. : వన్‌టౌన్‌లోని శ్రీభ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారిని గౌరీదేవిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన మహిళలు అమ్మవారికి కుంకుమార్చన చేశారు. మల్లేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన పూజలను రుత్వికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో నటరాజన్ షణ్ముకం, ఆలయ అర్చకులు మురళీధరన్ నంబూద్రి, నాగరాజు శర్మ పాల్గొన్నారు.

గౌరీదేవి అలంకారంలో భ్రమరాంబ దేవి

ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు

చిట్టినగర్, న్యూస్‌టుడే: రౌడీయిజానికి స్వస్తి పలికి సమాజంలో మంచి నడవడికతో మెలగాలని పశ్చిమ ఏసీపీ దుర్గారావు రౌడీషీటర్లకు సూచించారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీ, సస్పెక్టు షీటర్లకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏసీపీ మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా మంచి ప్రవర్తనతో మెలిగి.. కుటుంబాన్ని పోషించుకోవాలని అన్నారు. మద్యం, గంజాయి తాగి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా గంజాయి విక్రయించినట్లు తెలిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని వారికి సూచించారు. సీఐలు చిన కొండలరావు, గురుప్రకాష్ పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ దుర్గారావు, పక్కన సీఐలు చిన కొండలరావు, గురుప్రకాష్

ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా రాకేశ్

విద్యాధరపురం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షునిగా డూండీ రాకేశ్‌ను నియమిస్తూ ఫెడరేషన్ ఛైర్మన్ గంజి రాజమౌళి గుప్తా నియామక పత్రాన్ని అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాకేశ్‌కు ఈ గౌరవం దక్కడంపై ఆ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఫెడరేషన్ నాయకులు శ్రీనివాసగుప్తా, కోన శ్రీనివాస్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రం అందుకుంటూ..

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి: దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో ముగ్గురు అధికారులను అంతర్గతంగా బదిలీ చేస్తూ ఈవో శీనానాయక్ ఆదివారం ఉత్తర్వులు ఇచ్చారు. ఏఈవో రమేష్‌బాబుకు లీజియస్ విభాగంతో పాటు అదనంగా సెక్యూరిటీ విభాగానికి సంబంధించిన విధులు కేటాయించారు.. సూపరింటెండెంట్ కొర్రెల శ్రీనివాసరావును ప్రొటోకాల్ విభాగం నుంచి ప్రసాదం తయారీ విభాగానికి మార్చారు. ప్రసాదాల కేంద్రంతో పాటు డౌన్ హిల్ కౌంటర్ల విభాగాలకు పర్యవేక్షణ విధులు అప్పగించారు. ప్రసాదాల తయారీ విభాగం విధులు పర్యవేక్షించే సూపరింటెండెంట్ ఎం.శ్రీనివాసరావును ప్రొటోకాల్ విభాగంతోపాటు అప్ హిల్ కౌంటర్ల పర్యవేక్షణ విధులు కేటాయించారు.

'పూర్వ' కలయిక

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ 1989-90వ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. సుమారు 150 మంది పూర్వ విద్యార్థులు పాల్గొని గత జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు.

రైల్వే ప్రాంగణంలో పార్కింగ్ కష్టాలు

ఎక్కడ పడితే అక్కడ వాహనాల నిలిపివేత

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే

రైల్వే ప్రాంగణాల్లో ఉద్యోగులకు పార్కింగ్ కష్టాలు తప్పడం లేదు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో పని చేసే పలు విభాగాలకు చెందిన ఉద్యోగులు పనుల నిమిత్తం రోజూ డీఆర్ఎం కార్యాలయానికి వస్తుంటారు. సరైన పార్కింగ్ ప్రదేశం లేకపోవడంతో రహదారులపైనే వాహనాలు నిలుపుతున్నారు. దీనికి తోడు డీఆర్ఎం కార్యాలయం సమీపంలో ఉన్న బ్యాంకు ఖాతాదారులు కూడా తమ వాహనాలను నిలిపేందుకు చోటు దొరకడం లేదు. ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయడం వల్ల వాహనాలు చోరీకి గురవుతున్నాయి. గడిచిన నెల రోజుల్లో సుమారు 10 వాహనాలు చోరీకి గురయ్యాయి.

డీఆర్ఎం కార్యాలయం ముందు ఇలా..

సీసీఎస్ కార్యాలయం వరకు ఇదే పరిస్థితి..

డీఆర్ఎం కార్యాలయం, జాక్ అండ్ జిల్ పాఠశాల, రన్నింగ్ రూమ్, సికింద్రాబాద్ సీసీఎస్ కార్యాలయం వరకు ఇదే పరిస్థితి నెలకొంది. ఎక్కడా పార్కింగ్ చేసేందుకు వీలులేదు. గతంలో ఓ రైల్వే న్యాయమూర్తి వాహనాలను ఎక్కడ పడితే అక్కడ పార్క్ చేసి ఉండడాన్ని చూసి జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు స్పందించి సరైన పార్కింగ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. చిన్నారులకు ప్రాణ సంకటం

అధికారుల నిర్లక్ష్యం చిన్నారులకు ప్రాణ సంకటంగా మారే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లంబాడీపేట అడ్డరోడ్డు వాటర్ ట్యాంకు వీధిలోని పైపులైన్ల ఇంటర్ లింకు వద్ద వాల్వ్ పిట్ (సంపు మాదిరి) సుమారు 4 అడుగుల లోతులో నిర్మించారు. దాదాపు దానిని నిర్మించి నెలరోజులు గడుస్తున్నా.. దానిపై ఇనుప మెష్, సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేయడంలో అధికారులు అశ్రద్ధ వహిస్తున్నారు. రహదారిలో ఉండటంతో పిల్లలు దానిపై ఎక్కి దూకడం, తొంగి చూడటం వంటివి చేస్తున్నారు. ఏమాత్రం అదుపుతప్పిన దాంట్లో పడిపోయే ప్రమాదం ఉంది. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. - **న్యూస్‌టుడే, చిట్టినగర్**

వాల్వ్ పిట్ అంచున నిల్చున్న బాలుడు

కల్వర్టుకు మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన

కలరా ఆసుపత్రి సమీపంలోని కేఎల్‌రావు పార్కు ఆర్చి ఎదురుగా షరీఫ్ వీధిలోని కల్వర్టు దిగువ భాగంలో పైపులు అడ్డుగా ఉండటంతో మురుగు ముందుకు పారడం లేదని 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర స్పందించారు. ఆ కల్వర్టును స్వయంగా పరిశీలించారు. దానిని పగలగొట్టి కాలువలో అడ్డుగా ఉన్న పైపులైన్లను తొలగించి.. మురుగునీరు సాఫీగా ప్రవహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు పనులు జరుగుతున్నాయి. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - **న్యూస్‌టుడే, చిట్టినగర్**

అంధకారంలో పోలీసుస్టేషన్ పరిసరాలు

భవానీపురం పోలీసుస్టేషన్ పరిసరాల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. రాత్రి అయితే చాలు స్టేషన్ పరిసరాల్లో అంధకారం నెలకొంటుంది. స్టేషన్ లోపల తప్పితే బయట విద్యుత్తు దీపాలు వెలగని పరిస్థితి. ముఖ్యంగా సాయంత్రం సమయంలోనే ఎక్కువ మంది ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. - **న్యూస్‌టుడే, భవానీపురం**

చిరంజీవి.. పవన్‌కల్యాణ్ అభిమానుల వనసమారాధన

భవానీపురం: చిరంజీవి, పవన్‌కల్యాణ్ అభిమానుల వనసమారాధన కార్యక్రమాన్ని కొత్తూరు తాడేపల్లిలోని తోటల్లో ఆదివారం నిర్వహించారు. మెగా అభిమానుల వనభోజన మహోత్సవం పేరుతో ఆ కార్యక్రమం నిర్వహించారు. విజయవాడ తూర్పు, మధ్య నియోజకవర్గాల శాసనసభ్యులు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, భాజపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం, పశ్చిమ శాసనసభ్యుడు సుజనాచౌదరి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, మూడు సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కారవేదిక నిర్వహిస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర ఒక ప్రకటనలో వెల్లడించారు. నగరవాసులు తమ సమస్యలను అధికారుల దృష్టికితెచ్చి సకాలంలో పరిష్కరించుకోవాలని తెలిపారు. పారిశుద్ధ్యం, రహదార్లు, డ్రెయిన్లు, వీధి దీపాలు, తాగునీరు, ఆక్రమణలు, ఇతర వసతుల కల్పనలో ఇబ్బందులు తదితర సమస్యలను వినతుల రూపంలో అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

కరాటే విద్యను మహిళలు ఆయుధంగా భావించాలి

పాయకాపురం, న్యూస్‌టుడే: మహిళలు కరాటే విద్యను ఆయుధంగా చేసుకోవాలని వక్తలు అన్నారు. ఆదివారం శాంతినగర్‌లోని కరాటే అకాడమీలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. సుమారు 200 మంది కరాటే విద్యార్థులు పాల్గొని తలబడ్డారు. కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జగదీశ్వరి, శ్రీవిద్య కళాశాల ప్రిన్సిపల్ దామోదర్‌రావు, కరాటే మాస్టర్లు దుర్గారావు, మురళి, కరుణాకర్ పాల్గొన్నారు.

కమ్మ విద్యార్థులకు ఉపకార వేతనాలు

నందిగామ: కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఆ సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఆదివారం స్థానిక కమ్మ కల్యాణ మండపంలో సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ మండపాన్ని దివంగత చిరుమామిళ్ల శేషాద్రి నాయుడు ప్రాంగణంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయన పేరుతో ఆర్చి నిర్మించనున్నారు. కమ్మ పేద విద్యార్థుల స్కాలర్ షిప్పుల కోసం మైలవరం ఎమ్మెల్యే వెంకటకృష్ణ ప్రసాద్ రూ.5 లక్షలు, అలాగే సంఘం తరపున మరో రూ.5 లక్షలు కలిపి రూ.10 లక్షలు ఇవ్వనున్నట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 12వ తేదీలోపు విద్యార్థులు కమ్మ సంఘానికి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. 16న నిర్వహించే సంఘం కార్తిక వన సమారాధన రోజున ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నారు. ఎన్ఎస్పీ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు, కంచికచర్ల యార్డ్ ఛైర్మన్ కోగంటి బాబు, కౌన్సిలర్ కామసాని సత్యవతి, ఆసుపత్రి ఛైర్మన్ వేపూరి నాగేశ్వరరావు, కమ్మ సంఘం కమిటీ ప్రతినిధులు వాసిరెడ్డి సత్యనారాయణ ప్రసాద్, పాలేటి సతీష్, వాసిరెడ్డి ప్రసాద్, కోయ వాసుదేవరావు, పెంట్యాల వీరభద్రరావు, ఎర్రంరెడ్డి బాబూరావు, నాయకుడు నర్వనేని మురళీ, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కోట వీరబాబు, వేదికపై కోగంటి బాబు తదితరులు

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచన మానుకోవాలి

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని మాజీ ఎమ్మెల్యే, వైకాపా పశ్చిమ ఇన్‌ఛార్జి వెలంపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. చెరువు సెంటరు సమీపంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైకాపా నాయకులు ఆదివారం సంతకాల సేకరణ చేపట్టారు. వెలంపల్లి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి జిల్లాకు మెడికల్ కళాశాల ఉండాలని 17 కళాశాలలకు గత ప్రభుత్వం స్థలం కేటాయిస్తే కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ఆలోచన చేస్తుందన్నారు. ప్రైవేటీకరణ చేస్తే విద్యార్థులు మెడికల్ సీటు కోసం రూ.కోట్లు ఖర్చుపెట్టాల్సి వస్తుందన్నారు. వైకాపా నాయకులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణలో వెలంపల్లి శ్రీనివాసరావు తదితరులు

'రాష్ట్రాన్ని కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్నారు'

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు రాష్ట్రాన్ని దోచిపెడుతోందని ఎంసీపీఐయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.కె.ఖాదర్‌బాషా విమర్శించారు. ఆదివారం పంజాసెంటర్‌లో ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దగ్ధం చేసేందుకు ప్రయత్నించగా.. 2వ పట్టణ పోలీసులు అడ్డుకున్నారు. శాంతి భద్రతలకు, నగర ప్రజల రాకపోకలకు విఘాతం కలిగించినందుకు వారిని అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆ పార్టీ నాయకులు రచపూడి శ్రీను, అజాజ్, సుభాని, తదితరులు పాల్గొన్నారు.

శివారెడ్డి సేవలు అభినందనీయం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: అమరావతి రాజధాని పరిరక్షణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన రెరా ఛైర్మన్ శివారెడ్డి బాటలో నడవాలని క్రెడాయ్ ఛైర్మన్ సి.సతీష్‌బాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (ఏపీ రెరా) ఛైర్మన్ శివారెడ్డి దంపతుల సన్మాన కార్యక్రమం క్రెడాయ్ కార్యాలయంలో ఆదివారం జరిగింది. మూడు రాజధానుల నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడి అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా, ఏఏసీ సమన్వయ కర్తగా పలు నిరసనలు, ఆందోళనలు చేపట్టారని పలువురు మాట్లాడారు. దిల్లీ జంతర్ మంతర్ వద్ద రాజధాని రైతులతో కలిసి ధర్నా నిర్వహించి ఉద్యమాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లారని, అప్పటి ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా వెనకడుగు వేయకుండా తన పోరాటాన్ని కొనసాగించారని పేర్కొన్నారు. క్రెడాయ్ అధ్యక్షులు జీఎస్ఆర్ మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి కె.రఘురామ్, కోశాధికారి జి.సత్యసాయిరామ్, సభ్యులు పాల్గొన్నారు.

ఎర్రన్నాయుడికి ఘన నివాళి

పటమట, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీకి, బీసీల అభ్యున్నతికి కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు ఎనలేని సేవలు అందించారని, ఆయన లేని లోటు ఎన్నటికీ తీరనిదని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఆదివారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఎర్రన్నాయుడు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి ఎంపీ శివనాథ్, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్నలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన కొన్ని వేల గ్రామాలకు మంచినీటి, రోడ్ల సౌకర్యం కల్పించారని కొనియాడారు.

పట్టికలు లేవు.. పట్టించుకోరూ!

విజయవాడ బస్ స్టేషన్, న్యూస్‌టుడే

పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో దుకాణాలు నిర్వహించే గుత్తేదారులు కొందరు తమ దుకాణాల వద్ద ధరల పట్టికలు ఏర్పాటు చేయకుండా తాత్సారం చేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ధరల పట్టిక లేకపోవడంతో దుకాణంలో తినుబండారాల ధరలు ఎంతో తెలియడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. కొత్తగా దుకాణం ఏర్పాటు చేస్తే గుత్తేదారుకు ధరల పట్టిక ఏర్పాటు చేసుకునేందుకు వారం రోజుల వరకు సమయం ఉంటుందని తరువాత ఏర్పాటు చేయకపోతే నోటీసు ఇస్తామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల సౌకర్యార్థం బస్ స్టేషన్‌లోని అన్ని దుకాణాల వద్ద ఆర్టీసీ ఫిర్యాదు నంబరును అతికించారు. కొందరు దుకాణదారులు అతికించిన నంబరు స్టిక్కరులను నంబరు కనిపించకుండా చింపివేస్తున్నారు. బస్ స్టేషన్‌లో డిపాశ్చర్, ఎరైవల్, సిటీ బస్ పోర్టుల్లో సుమారు 157 వరకు దుకాణాలు ఉన్నాయి. బస్ స్టేషన్ నుంచి నిత్యం సుమారు లక్షన్నర మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. పండగలు, సెలవు రోజుల్లో ఈ సంఖ్య రెట్టింపు ఉంటుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ధరల పట్టికలు లేని దుకాణాలు

ఆర్టీసీ ఫిర్యాదుల నంబరు స్టిక్కరు చించేసి..

అత్తింటి వేధింపులపై కేసు

చిట్టినగర్, న్యూస్‌టుడే: అత్తింటి వేధింపులు భరించలేక ఓ మహిళ కొత్తపేట పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైఎస్ఆర్ కాలనీలో నివాసం ఉండే బురుగట్ల పూజ, దుర్గారావు దంపతులకు 4 ఏళ్ల కిందట వివాహమైంది. ఒక బాబు సంతానం. భర్త పూల మార్కెట్‌లో పని చేస్తాడు. మనస్పర్థలు చోటు చేసుకోవడంతో భర్త మానసికంగా వేధిస్తున్నాడని. అత్త, ఆడపడుచు, బావ కూడా అతన్ని ప్రోత్సహించడంతో తిట్టడం, కొట్టడం చేస్తున్నాడని ఆమె ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అత్తింటి వారిపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

దావా సమన్లు

మహారాజశ్రీ విజయవాడ 6వ అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
ఓ.యస్.నెం.55/2022

బిట్వీన్:
సింగు బ్రహ్మేశ్వర రావు. ...వాది
మరియు
చంద్ర భూలక్ష్మీ వగైరాలు. ...ప్రతివాదులు

టు,
D-5:కటికల శ్యామ్ బాబు, తండ్రి.శ్యామ్ సుందర్ రావు, నివాసం డోర్ నెం.5-7/4-18, 4వ లైను, RCM చర్చిదగ్గర, చిట్టినగర్, విజయవాడ, యన్.టి.ఆర్. జిల్లా.

పై నెంబరు దావాలో 5వ ప్రతివాది అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని సార్లు సమన్లు పంపించినను మీకు ముట్టనందున ఈ పేపరు ప్రకటన ద్వారా సమన్లు తెలియజేయమని శ్రీ కోర్టు వారు **డి.17-11-2025**కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు **ఉ.గం. 10-30ని.**లకు పై కోర్టు వారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా తేది: **17-11-2025**

షేక్ బాజి, వాది తరపు అడ్వకేట్, విజయవాడ-1. సెల్. 8341139575

విజయవాడ మధ్య

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
సీతారాంపురం–63036 11232, పాయకాపురం– 90631 44761

స్పందనకు వందనం

❖ డిస్నీ ల్యాండ్ ఖాళీ స్థలాల్లో పలువురు యువకులు రాత్రివేళ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై శనివారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. నున్న పోలీసులు స్పందించి.. ఆదివారం నిఘా ఏర్పాటు చేశారు. పలువురు అనుమానితులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ❖ అజిత్‌సింగ్‌నగర్ పైవంతెన కింద ఆర్‌యూబీలో వర్షపు నీరు నిలుస్తోంది. సమస్యను స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా'కు తెలియజేశారు. దీనిపై వచ్చిన వార్తకు స్పందించిన కార్పొరేషన్ అధికారులు.. నీటిని తోడించారు. **- న్యూస్‌టుడే, పాయకాపురం**

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : విద్యుత్తు లైన్ల మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఉదయం 8 గంటల నుంచి 10వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి. రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడంకి వారి వీధి, రామాలయం వీధి, గడియారం వీధి, అబ్బూరి వారి వీధి, వ్యాకరణం వీధి, ముదిగొండ వారి వీధి, తిరుమలశెట్టి వారి వీధుల్లో విద్యుత్తు ఉండదని ఆయన వివరించారు.

చిరస్మరణీయులు.. ఎర్రన్నాయుడు

నివాళులర్పిస్తున్న విప్ ఉమామహేశ్వరరావు తదితరులు

మధురానగర్: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి చివరి శ్వాస వరకు కృషి చేసిన నాయకుడు.. కింజరాపు ఎర్రన్నాయుడు అని, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కొనియాడారు. ఆదివారం 30వ డివిజన్ విజయదుర్గానగర్ కమ్యూనిటీ హాలులో తాండ్ర పాపారాయుడు రేచెర్ల బ్రహ్మనాయుడు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎర్రన్నాయుడి వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమా మాట్లాడుతూ.. ప్రజల పట్ల ఆయనకున్న అంకితభావం గొప్పదన్నారు. తన పదవిని సేవకు ఒక సాధనంగా ఉపయోగించుకున్నారని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గం నేటి యువతకు, నాయకులకు ఆదర్శప్రాయమని ప్రశంసించారు. పేదలకు దుప్పట్లు, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ట్రస్టు సభ్యులు మర్రిచర్ల వెంకటేశ్వరరావు, అల్లు మురళి, రెడ్డి శంకర్, బిల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల జీతాలు అందజేత

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ అంబేడ్కర్ స్మృతి వనం కార్మికులు నెల రోజులుగా చేస్తున్న దీక్షలను ఆదివారం విరమించారు. గుత్తేదారు సంస్థ ఆరు నెలలు జీతాలు చెల్లించింది. మిగిలిన మూడు నెలల జీతాలను నెల రోజుల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దీంతో సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు కార్మికులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ తదితరులు మాట్లాడారు. జీతాలు ఇవ్వాలని కోరుతూ పలు రకాలుగా కార్మికులు చేసిన పోరాటానికి అధికారులు స్పందించారని తెలిపారు. 9 నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతుంటే ప్రజా సంఘాలు వారికి అండగా నిలిచి పోరాటం చేశాయని వివరించారు. ప్రభుత్వం దిగి వచ్చి గుత్తేదారుతో జీతాలు ఇప్పించిందన్నారు. ఈ సందర్భంగా నాయకుల చేతుల మీదుగా కార్మికులకు జీతాలు ఇప్పించారు. ఈ కార్యక్రమంలో కె. దుర్గారావు, క్రాంతికుమార్, ఎం.బాబూరావు, వై. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు జీతాల నగదు అందిస్తున్న కాశీనాథ్

అలరించిన ఘంటసాల సినిమా

రామారావు దంపతులను సత్కరిస్తున్న వక్తలు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఘంటసాల సినిమాను వీక్షించిన ప్రతి ఒక్కరికీ నిర్మాత, దర్శకుడు సి. హెచ్. రామారావు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం బెంజిసర్కిల్‌లోని ట్రెండ్‌సెట్ మాల్‌లో ఘంటసాల సినిమాను ప్రదర్శించారు. నవ్యాంధ్ర చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి, చింతకాయల చిట్టిబాబు తదితరులు రామారావుని శాలువాతో సత్కరించారు. వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ఘంటసాల పాత్రలో గాయకుడు కృష్ణ చైతన్య అద్భుతంగా నటించారన్నారు. ఘంటసాల ఇతర గాయకులతో పాడిన పాటలు మహోన్నతమైన సినీ స్వర్ణ యుగాన్ని సృష్టించాయని కొనియాడారు. కార్యక్రమంలో కె.డేవిడ్‌రాజు. గోళ్ళ నారాయణరావు, వీరబద్రరావు, ప్రసూన రామన్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్లకు తుప్పు.. ఆరోగ్యానికి ముప్పు

రంగు మారిన మంచినీరు సరఫరా

పాయకాపురం, న్యూస్‌టుడే

★★ వాంబేకాలనీకి చెందిన రామకృష్ణ మూడో అంతస్తులో నివసిస్తున్నారు. కిందకు దిగి మంచినీరు పట్టుకోవాలి. కార్పొరేషన్ సరఫరా చేసే మంచినీరు రంగు మారి వస్తున్నాయి. ఒక్కోసారి వాసన వస్తున్నాయి. ప్రైవేటు ప్లాంట్‌లను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

★★ సుందరయ్యనగర్‌కు చెందిన సావిత్రమ్మ.. కుళాయి వద్ద నీరు పట్టుకోగా అవి తాగడానికి వీలుగా లేవు. పైపులైను మురుగు కాలువల పక్కనే ఉన్నాయి. అవి తుప్పుపట్టి ఉండడంతో.. ఎక్కడైనా లీకేజీ అయ్యి.. మురుగుతో కలిసి సరఫరా అవుతున్నాయని భావించారు. దీంతో కుళాయి నీటిని తాగడం లేదు.

నగరపాలక సంస్థ ప్రజలకు సరఫరా చేసే తాగునీరు రంగు మారి వస్తుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైపులు తుప్పు పట్టిఉండడం, ఎక్కువగా మురుగు కాలువల్లో ఉండడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతోందని చెబుతున్నారు. పైగా అవన్నీ సుమారు 15ఏళ్ల కిందట ఏర్పాటు చేసినవి. పాడైపోయాయి. అక్కడక్కడ నాచు పట్టి దర్శనం ఇస్తున్నాయి. వీటివల్ల నీరు కలుషితం అయ్యే అవకాశాలు ఉన్నాయి. సమస్యపై ఇప్పటికే పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు.

ప్రశాంతినగర్‌లో మురుగు కాలువ వద్దనే పైపులైను

సమస్యాత్మక డివిజన్‌లు	61, 62, 63, 64
జనాభా	30వేల మంది
తుప్పు పట్టిన పైపులైన్లు	సుమారు 800

శివారులోనే అధికం

నగర శివారు ప్రాంతాలు... వాంబేకాలనీ, రాధానగర్, శాంతినగర్, సుందర్యనగర్, ప్రశాంతినగర్, ఉడాకాలనీ, కండ్రికలోనే అధికంగా ఈ సమస్య తలెత్తుతోంది. ఇప్పటికే ఉన్న మంచి నీటి పైపులైన్లను మార్చివేసి.. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. భవనాలకు ఆనుకుని.. ఎత్తు భాగంలో ప్లాస్టిక్ పైపులైన్లను ఏర్పాటు చేసే దిశగా అధికారులు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మూడు రోజులు నీరే రావు..

వాంబేకాలనీ, రాధానగర్, కండ్రికలోని జీ+3 గృహాల్లో అధికశాతం పేద ప్రజలే నివసిస్తున్నారు. ఈ మూడు ప్రాంతాల్లో సుమారు పది వేల మంది నివాసం ఉంటున్నారు. వీరందరికీ భవనం కింద పెద్ద సంపు ఒకటి ఏర్పాటు చేశారు. కార్పొరేషన్ వారు సరఫరా చేసే నీరంతా దానిలోకి వెళుతుంది. వాటిని బాత్‌రూమ్‌లు, ఇతర అవసరాలకు వాడుతున్నారు. ఎంత పై అంతస్తులో ఉన్నా సరే అందరూ కిందకు దిగి.. కుళాయి వద్దనే పట్టుకోవాల్సి వస్తోంది. పైగా వారంలో కనీసం మూడు రోజులు మంచినీటి సరఫరా ఉండదని స్థానికులు వాపోతున్నారు. నేరుగా ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేలా చూడాలని కోరుతున్నారు.

వాంబేకాలనీలోని జీ+3 గృహ సముదాయం

7న ఉద్యోగ మేళా

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : ఈ నెల 7వ తేదీన మాచవరంలోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించే మెగా ఉద్యోగ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కూటమి నాయకులు కోరారు. దాదాపు 40 నుంచి 50 కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఆదివారం అజిత్‌సింగ్‌నగర్‌లోని తెదేపా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్‌లు మాట్లాడారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మెరుగైన భవిష్యత్తు అందించడమే లక్ష్యమని చెప్పారు.

15 నుంచి టైలరింగ్‌లో శిక్షణ

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : ఈ నెల 15వ తేదీ నుంచి ఎంబీ విజ్ఞాన కేంద్రంలో టైలరింగ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తామని ఎంబీవీకే మహిళా శిక్షణా విభాగం నిర్వాహకురాలు పి.విజయ తెలిపారు. ఆసక్తిగల వారు 10వ తేదీలోగా కార్యాలయంలో కలిసి, పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

నేరాలకు పాల్పడితే రౌడీషీట్లు

సత్యనారాయణపురం(గాంధీనగర్): నేరాలకు పాల్పడితే రౌడీషీట్లు తెరిచేందుకు వెనుకాడబోమని నార్త్ ఏసీపీ స్రవంతిరాయ్ హెచ్చరించారు. ఆదివారం పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆమె కౌన్సెలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తన కలిగి ఉంటే రౌడీషీట్లు తొలగిస్తామని, లేని పక్షంలో నగర బహిష్కరణ వేటు తప్పదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సైలు గోళ్ల సౌజన్య, షబ్బీర్, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుకి దూరంగా ఉండండి

పాయకాపురం, న్యూస్‌టుడే : మత్తు పదార్థాలకు, మద్యానికి ప్రజలు, బాలలు దూరంగా ఉండాలని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జగదీశ్వరి కోరారు. ఆదివారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. పాయకాపురం, శాంతినగర్ ప్రాంతాల్లో కలియతిరిగారు. ఎన్ఎస్ఎస్ ఇన్‌ఛార్జి పి. హేమంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

సామూహిక వ్రతాలు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : కార్తిక మాసం సందర్భంగా గవర్నర్‌పేటలోని కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఈవో సీతారామయ్య ఏర్పాట్లు చేశారు. గొట్టాపు అనిల్‌కుమార్, అన్నపూర్ణ దంపతులు.. పూజా సామగ్రి, స్వామి వారి వెండి రూపు భక్తులకు అందించారు. 158 జంటలు వ్రతాల్లో పాల్గొన్నారు. కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామికి ఆలయ పాలకమండలి సభ్యులు చింతా దుర్గారావు తదితరులు స్వాగతం పలికారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

స్వామిని దర్శించుకుంటున్న బాలస్వామి, దుర్గారావు

సత్యనారాయణపురం (గాంధీనగర్), న్యూస్‌టుడే : స్థానిక ముత్యాలంపాడులోని శిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం నిర్వహించిన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అర్చకుడు సత్యనారాయణ.. వ్రతాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రమా సత్యనారాయణ వ్రతం ఆచరించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని చెప్పారు. కష్టాలు తీరతాయని మందిర కమిటీ గౌరవాధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలంపాడు పూజలో పాల్గొన్న భక్తులు

ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ దోహదం

విజయవాడ క్రీడలు: బాలికలు తమను తామే రక్షించుకోవడానికి మార్షల్ ఆర్ట్స్ దోహదపడతాయని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. అజిత్‌సింగ్‌నగర్ పైపులరోడ్డులోని రవీంద్ర కన్వెన్షన్‌లో ఆదివారం 'అస్మా' (ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్) నేతృత్వంలో నిర్వహించిన కుంగ్-ఫు మాస్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఉమా మాట్లాడుతూ.. కరాటే వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం లభిస్తుందన్నారు. ఆత్మ రక్షణకు ఉపయోగపడుతుందని చెప్పారు. తెదేపా నాయకులు బొండా సిద్ధార్థ, రవితేజ విజేతలను అభినందించారు. గ్రాండ్‌మాస్టర్ జి.ప్రకాష్ రావు, జి.రూపస్ పాల్, కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ గౌస్ బాషా, తెలుగు యువత అధ్యక్షుడు బెజ్జం జైపాల్, వేల్పుల రాజేష్, శిక్షకులు పాల్గొన్నారు.

నాన్ చాక్ ప్రదర్శనలో మహిళ

పాయకాపురం: మహిళలు కరాటే విద్యను ఆయుధంగా చేసుకోవాలని బొండా సిద్ధార్థ అన్నారు. ఆదివారం శాంతినగర్‌లోని కరాటే అకాడమీలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. సుమారు 200 మంది కరాటే విద్యార్థులు వచ్చారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జగదీశ్వరి, శ్రీవిద్య కళాశాల ప్రిన్సిపల్ దామోదర్‌రావు, కరాటే మాస్టర్లు దుర్గారావు, మురళి, కరుణాకర్ పాల్గొన్నారు.

రోషాగ్ని సినిమాను ఆదరించండి

విజయవాడ సాంస్కృతికం: ఈ 9న విడుదల కానున్న రోషాగ్ని సినిమాను ఆదరించాలని నిర్మాత, దర్శకుడు, హీరో రాజవీర విజ్ఞప్తి చేశారు. ఆదివారం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానంద కళావేదికపై చిత్ర బృందం, సాంస్కృతిక సంస్థల నిర్వాహకుల ఆధ్వర్యంలో సినిమా ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో మాట్లాడుతూ.. తక్కువ బడ్జెట్‌తో సినిమా నిర్మించామని తెలిపారు. పరుచూరి విజయలక్ష్మి, నారాయణరావు, ప్రసూనరామన్, వీరభద్రరావు, చిట్టిబాబు, వెంకటరెడ్డి, పాల్గొన్నారు.

వైకాపా పాపం.. విద్యార్థులకు శాపం

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే

అసంపూర్తిగా నాడు-నేడు పనులు

పాఠశాలల అభివృద్ధి పేరుతో గత వైకాపా ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు పనుల్లో డొల్లతనం బయటపడింది. అసంపూర్తిగా వదిలేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు నానా ఇబ్బందులు పడుతున్నారు. సత్యనారాయణపురంలోని ఏకేటీపీఎం పాఠశాలలో అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.కోటి వరకు నిధులు మంజూరు చేశారు. ఇందులో భాగంగా కొత్తగా భవనాలు, అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలి. కానీ మధ్యలోనే గుత్తేదారు చేతులు ఎత్తేయడంతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. చిన్నపాటి వర్షం కురిసినా.. భవనం పెచ్చులు ఊడి విద్యార్థులపై పడుతున్నాయి. మొత్తం చిందరవందరగా మారుతోంది. భవనం పైకప్పు నుంచి వాన నీరు కారడంతో.. పుస్తకాలు తడిచిపోతున్నాయి. మరుగుదొడ్లు సరిగా లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉపాధ్యాయులకు అసలు మరుగుదొడ్లే లేవు. కార్యాలయ గదిలో కూర్చోవడానికి కుర్చీలు సరిగా లేవు.

ఉత్తమ ఫలితాలు సాధన

ఏటా పదో తరగతి పరీక్షల్లో ఈ పాఠశాల విద్యార్థులే అత్యధిక మార్కులు సాధిస్తారు. నగరంలోనే పేరుగాంచిన పాఠశాల ఇది. ఫలితాల్లో గత మూడేళ్లుగా జిల్లాలో ప్రథమ స్థానంలో నిలుస్తోంది. ఎంతో చరిత్ర ఉన్న ఈ బడికి పూర్వవైభవం తేవాల్సిన అవసరం ఉంది. ప్రధానోపాధ్యాయుడు ఉమర్ అలీ ఇక్కడి సమస్యలను ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. అభివృద్ధి పనుల్లో కదలిక వచ్చింది. మున్సిపల్ కమిషనర్ స్పందిస్తే నిధులు వెంటనే విడుదలయ్యే అవకాశం ఉంది.

నిర్మాణాలకు కావాల్సిన నిధులు	సుమారు రూ.50.05 లక్షలు
మొత్తం విద్యార్థులు	1300 మంది

శిథిలావస్థకు చేరిన పాత భవనం

నిలిచిపోయిన నూతన భవన నిర్మాణ పనులు

మున్సిపల్ కమిషనర్‌కు లేఖ రాశాం

పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఇప్పటికే మున్సిపల్ కమిషనర్‌కు లేఖ రాశాం. గత ఐదేళ్ల వైకాపా పాలనలో పాఠశాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. విద్యార్థులు, ఉపాధ్యాయుల అవస్థలను దృష్టిలో పెట్టుకొని త్వరగా నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటా. నియోజకవర్గంలో పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాం.
- బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే

గ్యాస్ యంత్రానికి మరమ్మతులు

స్పందనకు వందనం

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : వాంబే కాలనీలో మూడు శ్మశానవాటికలపై నగరపాలక సంస్థ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. క్రైస్తవ, హిందూ శ్మశాన వాటికల నిర్వహణపై నిర్లక్ష్యం చూపుతున్నారు. మృతదేహాలను దహనం చేసే గ్యాస్ యంత్రం పనిచేయడం లేదు. దహన సంస్కారాలకు ఇక్కడి వారు చేతివాటం చూపుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వీటిపై సెప్టెంబరు 26వ తేదీన 'ఖననానికి రూ.6 వేలు.. దహనానికి రూ.8వేలు' శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. వీఎంసీ స్ట్రీట్ లైట్ ఏఈ బాలసుబ్రహ్మణ్యం స్పందించారు. గ్యాస్ యంత్రానికి మరమ్మతులు చేయిస్తున్నారు. స్థానిక నిర్వాహకులు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి

మాట్లాడుతున్న శోభనాద్రీశ్వరరావు. చిత్రంలో కేశవరావు, ప్రసాద్, సుధీర్, హరినాథ్, జమలయ్య తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ముంథా తుపాను వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విజయవాడ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. రైతులకు పెట్టుబడి రాయితీ.. ఆహార పంటలకు రూ.25వేలు, వాణిజ్య పంటలకు రూ.50వేలు, ఉద్యాన పంటలకు రూ.75వేల చొప్పున అందించాలని కోరారు. రైతు, కౌలు రైతులకు పంటల బీమా పరిహారం వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు వ్యతిరేకిస్తూ ఈ నెల 26న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు. ఏపీ రైతు సంఘం నాయకుడు వై.కేశవరావు మాట్లాడుతూ.. విద్యుత్తు సవరణ చట్టాన్ని ఉపసంహరించాలని, ఉచిత విద్యుత్తు, రాయితీలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్ మాట్లాడుతూ.. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు కారుచౌకగా అప్పగించే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని కోరారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్, కిసాన్ సభ రాష్ట్ర నాయకుడు డి.హరినాథ్ మాట్లాడుతూ.. పీపీపీ విధానంలో వైద్య కళాశాలలను ప్రైవేటుకు అప్పగించడం సరికాదన్నారు. ఈ నెల 26న తలపెట్టిన నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు ప్రభాకరరావు, చుండూరు రంగారావు, పి.జమలయ్య, మరీదు ప్రసాద్‌బాబు, కొల్లా రాజమోహన్, ఎం.రామకృష్ణ, కె.గనిరాజు తదితరులు పాల్గొన్నారు.

చెస్‌లో చిన్నారుల ప్రతిభ

క్రీడాకారులతో రేణుక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : స్థానిక ఎస్సార్‌ఆర్ చెస్ కోచింగ్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఇద్దరు చిన్నారులు చెస్ అంతర్జాతీయ ర్యాపిడ్ రేటింగ్ సాధించారని డైరెక్టర్ పి.రేణుక తెలిపారు. గత నెల 16, 17వ తేదీల్లో కర్నూలులో నిర్వహించిన అంతర్జాతీయ ర్యాపిడ్ రేటింగ్ చెస్ టోర్నీలో చెరుకూరి శౌర్య, ఇ. సృష్టి ప్రతిభచాటారు. ఫిడే వెల్లడించిన రేటింగ్ జాబితాలో స్థానం సాధించారని పేర్కొన్నారు. శౌర్య (1430 ఎల్లో రేటింగ్ పాయింట్లు), సృష్టి (1532 పాయింట్లు)లు రేటింగ్ సాధించారని వివరించారు. ఆదివారం వారిని అభినందించారు.

ఉచిత శిక్షణ అభినందనీయం

సత్కార కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : కాలనీ వాసులకు అన్నే కుసుమ ఉచితంగా యోగా శిక్షణ ఇవ్వడం అభినందనీయమని విజయకృష్ణా సూపర్‌బజార్ ఛైర్మన్ వెలగా సురేష్ అన్నారు. ఇటీవల గవర్నర్‌పేట కాశీవిశ్వేశ్వర స్వామి వారి ఆలయానికి ట్రస్టు బోర్డు సభ్యురాలిగా నియమితులైన ఆమెను ఆదివారం లోటస్ ల్యాండ్ మార్క్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లయన్స్ సభ్యురాలిగానూ ఆమె సేవా కార్యక్రమాలు నిర్వహించారని, పేదలకు చేయూత ఇవ్వడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భక్తుల ప్రాణాలకు రక్షణ అవసరం

సూర్యారావుపేట: కాశీబుగ్గ తొక్కిసలాటలో మరణించిన భక్తుల ఆత్మకు శాంతి కలగాలని వైకాపా నాయకులు పేర్కొన్నారు. భక్తుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివారం అంబేడ్కర్ స్మృతివనం వద్ద ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, రుహుల్లా, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, నాయకుడు దేవినేని అవినాష్ తదితరులు కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. బాధితులకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. పోతిన వెంకట మహేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో వైకాపా నాయకుల నిరసన

శ్రీరాములు త్యాగం అజరామరం

పొట్టి శ్రీరాములు చిత్రపటానికి బాలల నివాళి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకు పొట్టి శ్రీరాములు చేసిన కృషి మరువలేనిదని, ఆయన మద్రాసులో 58 రోజుల పాటు దీక్ష చేసి అమరుడయ్యారని ఠాగూర్ గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి పేర్కొన్నారు. ప్రతి ఆదివారం ఠాగూర్ గ్రంథాలయంలో నిర్వహించే 'చదవటం మాకిష్టం..' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చరిత్ర గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకతను ఆమె వివరించారు. పొట్టిశ్రీరాములు త్యాగ ఫలితంగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని చెప్పారు. చరిత్ర ప్రాధాన్యతను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయురాలు వి.సుమతి, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటలక్ష్మి సేవలు నిరుపమానం

వెంకటలక్ష్మి, ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న డిల్లీరావు

గాంధీనగర్, న్యూస్‌టుడే : ప్రభుత్వానికి ప్రజలకు వారధి అయిన సమాచార, పౌర సంబంధాల శాఖలో సమర్థంగా విధులు నిర్వర్తించి అధికారుల మన్ననలు అందుకున్న జాస్తి వెంకటలక్ష్మిని ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. తాడేపల్లిలో ఆదివారం నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. దాదాపు 40ఏళ్ల పాటు ఎలాంటి రిమార్కు లేకుండా విధులు నిర్వహించడం గర్వకారణమన్నారు. వెంకటలక్ష్మి, వీవీ ప్రసాద్ దంపతులను డిల్లీరావుతో పాటు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సత్యనారాయణ రెడ్డి, పి.రమేష్, సీవీఆర్ ప్రసాద్, నజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సౌరశక్తి పథకంపై ప్రచారం

మాట్లాడుతున్న బొండా సిద్ధార్థ

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : సౌరశక్తి పథకం వల్ల ప్రయోజనాల గురించి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తెదేపా నాయకుడు బొండా సిద్ధార్థ కోరారు. ఆదివారం 33వ డివిజన్‌లో తెదేపా ఇన్‌ఛార్జి గార్లపాటి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 16 నెలల కాలంలో డివిజన్‌లో లక్షలాది రూపాయిలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్న మెగా ఉద్యోగ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొండా రవితేజ, నాళం కోటేశ్వరరావు, పొట్లూరి కృష్ణప్రసాద్, చిలువేరు శ్రీనివాస్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దొంగలు దొరికిపోయారు..!

సీసీ ఫుటేజీ ఆధారంగా కేసుల ఛేదన

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : దొంగతనాలు చేసి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు దొంగలను సీసీ కెమెరాల సాయంతో సత్యనారాయణపురం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. విజయవాడ నార్త్ ఏసీపీ స్రవంతిరాయ్ ఆదివారం సత్యనారాయణ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లాకు చెందిన రామనబోయిన శ్రీను గత నెల 27న సత్యనారాయణపురం దాసాంజనేయ స్వామి ఆలయంలోని హుండీలో డబ్బులు దొంగిలించాడు. వాటిని విజయవాడ రైల్వేస్టేషన్ సమీపంలోని బొగ్గులైను రైల్వే కాలనీలోని పొదల్లో దాచాడు. కొంత నగదు దాచి, మిగతా నగదు తీసుకొని కర్నూలు బస్సు ఎక్కాడు. వివిధ ప్రాంతాలకు తిరుగుతూ జల్సాలు చేశాడు. డబ్బు అయిపోవడంతో తిరిగి విజయవాడలోని బొగ్గులైను కాలనీకి వచ్చాడు. సీఐ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో నిఘా పెట్టిన ప్రత్యేక బృందం.. సీసీ ఫుటేజీలను విశ్లేషించింది. వలపన్ని నిందితుడిని పట్టుకుంది. అతడి నుంచి రూ.18వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. సీపీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు వెస్ట్ డీసీపీ రామకృష్ణ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టినట్లు ఏసీపీ వివరించారు.

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ స్రవంతిరాయ్. పక్కన సీఐ లక్ష్మీనారాయణ తదితరులు

☛ ఎనికేపాడుకు చెందిన పెనుగోతు మురళి ఈ ఏడాది జూన్ 2వ తేదీ, సెప్టెంబరు 5వ తేదీల్లో గాంధీనగర్‌లో ద్విచక్ర వాహనం, ఆటో దొంగిలించాడు. అప్పటి నుంచి తప్పించుకొని తిరుగుతున్నాడు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. పసుపుతోటలో తిరుగుతుండగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి ఆటో, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు స్రవంతిరాయ్ వెల్లడించారు.

(c) eenadu

శ్రీవారి కల్యాణం నేడు

నాలుగు వేలమంది వీక్షించేలా ఏర్పాట్లు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి నర్సీపట్నంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం ముస్తాబైంది. తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం ప్రాజెక్టు ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు హరికథాగానం, 5 నుంచి 6 గంటల వరకు అన్నమాచార్య సంకీర్తనలు, 6 నుంచి రాత్రి 8 గంటల వరకు కల్యాణం జరగనుంది. 150 మంది శ్రీవారి సేవకుల భక్తులకు సేవలందించనున్నారు. సభాపతి అయ్యన్నపాత్రుడు ఆదివారం ఉదయం ఏర్పాట్లను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. శ్రీవారి కల్యాణం చూసేందుకు తిరుమల వెళ్లలేం. తితిదే ఆధ్వర్యంలో నర్సీపట్నంలో కల్యాణం నిర్వహించడం హర్షణీయం. నాలుగు వేల మంది కూర్చుని వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. తహసీల్దారు కార్యాలయ ఆవరణ, ఐఐఐ మార్గాయల మార్కెట్లోను వాహనాల పార్కింగ్‌కు కేటాయించినట్లు చెప్పారు. సాయంత్రం 5 గంటల నుంచి కల్యాణం ముగిసే వరకు పాల్గాట్ కూడలి నుంచి అబీద్‌కూడలి వరకు వాహనాలకు నో ఎంట్రీ విధానం అమలు చేయనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

శూలాల ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాకలో సాంబమూర్తి దేవుని శూలాల ఉత్సవం సోమవారం జరగనుంది. కార్తిక మాసం రెండో సోమవారం ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయి. భక్తులు శూలాలు ధరించి దేవుని గుమ్మటంతో వీధుల్లో తిరుగుతూ మంగళవారం ఉదయం ఆలయానికి చేరుకోవడంతో ఉత్సవం ముగుస్తుంది. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

బకాయిలు చెల్లించి బీఎన్ రోడ్డు నిర్మాణం

ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర హామీ

చోడవరం, న్యూస్‌టుడే: మొంథా తుపాను మిగిల్చిన నష్టాలపై రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేయిస్తోందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. నియోజకవర్గ స్థాయిలో నివేదికలు తెప్పించుకుని పరిహారం అందజేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుతో కలిసి చోడవరం మండలం రాయపురాజుపేటలో ఊటగెడ్డ, ఎర్రిగెడ్డపై వంతెనలు నిర్మించాల్సిన ప్రాంతాలను ఆదివారం సందర్శించారు. భోగాపురం వద్ద కోతకు గురైన శారదా నది గట్టును పరిశీలించారు. వరద నష్టం పరిశీలనకు కేంద్రం నుంచి అధికారుల బృందం రానుందన్నారు. బీఎన్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి గుత్తేదారుతో మాట్లాడినట్లు చెప్పారు. బిల్లుల బకాయిలు చెల్లించి రెండు నెల్లలో పనులు ప్రారంభమయ్యేలా చొరవ చూపుతామని హామీ ఇచ్చారు. కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాట ఘటన దురదృష్టకరమన్నారు. సర్పంచులు బొడ్డేడ రాము, గంగాధర్ శ్రీనివాసరావు, కూటమి నాయకులు గూనూరు మల్లునాయుడు, పుతి కోటేశ్వరరావు, బొడ్డేడ గంగాధర్, దొడ్డి రాము, బంగారునాయుడు, బీశెట్టి త్రిమూర్తులు, పల్లా అర్జున, మత్స్యరాజు, పెదబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

భోగాపురం వద్ద కోతకు గురైన శారదా నది గట్టును పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే రాజు

అందిపుచ్చుకుంటే అద్భుతం

యువ ఏఐ గ్లోబెల్ యూత్ ఛాలెంజ్

నెలాఖరు వరకు దరఖాస్తుకు అవకాశం

అచ్యుతాపురం, నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే

గ్లోబల్ ఆలోచనలకు కేంద్ర బిందువుగా భారత్‌ను నిలపాలనే లక్ష్యంతో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. విద్యార్థులకు భాగస్వామ్యం కల్పిస్తూ భావి భారత్ ఆవిష్కరణకు బాటలు వేస్తోంది. యువతలో కృత్రిమ మేధస్సు (ఏఐ)పై అవిష్కరణాత్మక ఆలోచన, పారిశ్రామిక దృక్పథాన్ని పెంపొందించేందుకు అంతర్జాతీయ స్థాయిలో సమాలోచనలు చేస్తోంది. ఇప్పటికే అటల్ టింకరింగ్ ల్యాబ్స్, అటల్ ఇన్నోవేషన్ మిషన్ (ఏఐఎం) 1.0, ఇన్‌స్పైర్, ప్రయాస్, ఉన్నతి వంటి ఎన్నో వినూత్న కార్యక్రమాలను రూపొందించింది. తాజాగా యువ ఏఐ గ్లోబెల్ యూత్ ఏఐ ఛాలెంజ్‌ను ప్రకటించింది. ఈ పోటీలో పాల్గొనే విద్యార్థులు నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలకు ఏఐ ఆధారిత పరిష్కారాలు చూపాల్సి ఉంటుంది. ఎంపికైన ప్రాజెక్టులను వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న గ్లోబెల్ ఏఐ సమ్మిట్‌లో ప్రదర్శించేందుకు అవకాశం కల్పిస్తారు.

- యువ ఏఐ గ్లోబెల్ యూత్ ఏఐ ఛాలెంజ్‌లో పాల్గొనేందుకు 13 - 21 ఏళ్లలోపు యువతీయువకులు అర్హులు. కృత్రిమ మేధ పరిజ్ఞానం, సృజనాత్మకత ఆలోచనలు, బాధ్యతాయుత వినియోగ పద్ధతులకు సంబంధించిన ఆలోచనలు చేస్తే.. రూ.85 లక్షల వరకు నగదు బహుమతి అందుకోవచ్చు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, దిల్లీ ఆధ్వర్యంలో జరిగే ఏఐ నిపుణుల వర్క్‌షాపులో పాల్గొనే అవకాశాన్ని సొంతం చేసుకోవచ్చు.
- వ్యక్తిగతంగా/ ఇద్దరు కలిసి బృందంగా దరఖాస్తు చేసుకునేందుకు వీలుంది. ప్రజలు, సామాజిక సాధికారత, ప్రాథమిక రంగాలు (వ్యవసాయం, పరిశ్రమలు, రవాణా), స్మార్ట్ ఎకో సిస్టమ్స్, గ్రీన్ ఎనర్జీ, సుస్థిర నగరాలు, ఓపెన్ ఇన్నోవేషన్ అంశాల్లో ప్రాజెక్టులు తయారు చేయాల్సి ఉంటుంది. ప్రాథమిక ఎంపిక, ప్రాజెక్టు మెరుగుదల, ఇంటర్వ్యూ ద్వారా విజేతలను ఎంపిక చేస్తారు.
- ప్రథమ బహుమతిగా మూడు బృందాలకు రూ.15 లక్షలు, ద్వితీయ బహుమతిగా మూడు బృందాలకు రూ.10 లక్షలు, ప్రత్యేక బహుమతిగా రెండు బృందాలకు రూ.5 లక్షల చొప్పున అందజేస్తారు. 13-17 ఏళ్లలోపు వారికి తల్లిదండ్రుల ఖాతాలో, 18 - 21 ఏళ్ల వారికి బృంద సారథి ఖాతాలో నగదు బహుమతి మొత్తం జమ చేస్తారు.
- సమ్మిట్‌కు హాజరయ్యే వారికి ప్రయాణం, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. ప్రాజెక్టు నిపుణులు అంగీకరిస్తే ప్రభుత్వం దత్తత తీసుకునే అవకాశం ఉంటుంది. యువ ఏఐ గ్లోబెల్ యూత్ ఛాలెంజ్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 30లోగా ఆన్‌లైన్‌లో https:/// impact.indiaai.gov.in దరఖాస్తు చేయవచ్చు.

ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం ప్రాజెక్టు...

ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం ప్రత్యేక ప్రాజెక్టు రూపొందించాం. అడ్డురోడ్డుకు చెందిన విద్యార్థిని బొలిశెట్టి వర్షిత పేరుతో యువ ఏఐ గ్లోబెల్ యూత్ ఛాలెంజ్‌కు దరఖాస్తు చేశాం. ప్రత్యేక అవసరాలున్న పిల్లలు, బుద్ధిమాంద్యం ఉన్న వారిని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును ఎంచుకున్నాం. మిక్స్‌డ్ రియాలిటీ సాంకేతికతతో పనిచేసే హెడ్ సెట్‌ను తయారుచేశాం. దీన్ని పెట్టుకుంటే అంతా ప్రత్యక్షంగా కళ్ల ముందున్నట్లు కనిపించడంతో వారి ఆలోచనలు, కదలికల్లో మార్పునకు అవకాశం ఉంటుంది. - ధర్మిరెడ్డి ప్రసాద్, ఛైర్మన్, ప్రశాంతి విద్యా సంస్థలు, అచ్యుతాపురం

పంటలకు పరిహారం పెంపు

అన్నదాతకు అండగా ప్రభుత్వం

పాయకరావుపేట, న్యూస్‌టుడే

ఆపత్కాలంలో పంట నష్టపరిహారం పెంచి కూటమి ప్రభుత్వం అన్నదాతలకు దన్నుగా నిలిచింది. మొంథా తుపాను కారణంగా ఈదురుగాలులకు కొన్ని మండలాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలో సుమారు 1.5 లక్షల ఎకరాల్లో వరి సాగు ఉండగా 3,452 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. సుమారు 200కుపైగా ఎకరాల్లో అరటి, తమలపాకు తదితర పంటలు దెబ్బతిన్నట్లు చెబుతున్నారు. రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం గతంలో కన్నా పరిహారాన్ని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా పంటలకు సుమారు రూ.7 వేల నుంచి రూ. 15 వేల వరకు అదనం పరిహారం అందనుంది.

మంగవరం వద్ద నేలవాలిన అరటితోట

- ‘అనకాపల్లి, ఎలమంచిలి, రాంబిల్లి, ఎస్.రాయవరం, బుచ్చెయ్యపేట, మునగపాక, కశింకోట, నర్సీపట్నం, కె.కోటపాడు తదితర మండలాల్లో వరి నీట మునిగింది. అరటి తదితర పంటలకు నష్టం వాటిల్లింది. నివేదికలను పరిశీలించి రైతులకు పరిహారం అందజేస్తామ’ని ఏడీఏ ఉమాప్రసాద్ పేర్కొన్నారు.

హెక్టారుకు రూ..లలో

పంట	గతంలో	ప్రస్తుతం
వరి	17,000	25,000
అరటి	25,000	35,000
మిరప	17,000	35,000
బొప్పాయి	17,000	25,000
కూరగాయలు	17,000	25,000
పసుపు	17,000	35,000
చెరకు	17,000	25,000
ప్రత్తి	17,000	25,000
మినుము	10,000	15,000
వేరుశెనగ	17,000	25,000
నువ్వులు	8,500	15,000

పుస్తకాలతో గురువుల కుస్తీ

టెట్‌కు సన్నద్ధమవుతున్న ఉపాధ్యాయులు

పాయకరావుపేట, న్యూస్‌టుడే

పాఠ్యాంశాల బోధన, విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయడంలో ఉపాధ్యాయులు నిమగ్నమయ్యే తరుణమిది. అటు గురువులకు, ఇటు విద్యార్థులకు నవంబరు, డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెలలు అత్యంత కీలకం. ఈ తరుణంలో పాఠాలు బోధించే గురువులు పాఠ్యాంశాలను వల్లె వేయాల్సి వస్తోంది.

✦ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ఉత్తీర్ణత తప్పనిసరి చేయడంతో పరీక్ష నిర్వహణకు ప్రభుత్వం షెడ్యూల్ ఖరారు చేసింది. 23లోగా దరఖాస్తు చేయాల్సి ఉంది. డిసెంబరు 10న పరీక్ష ఉండటంతో పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు.

✦ రాష్ట్ర వ్యాప్తంగా 1,94,602 మంది ఉపాధ్యాయులుండగా, అనకాపల్లి జిల్లాలో 6,457, అల్లూరి జిల్లాలో 8,586, విశాఖ జిల్లాలో 3,531 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వీరిలో సగం మందికిపైగా టెట్ రాయాల్సిందే. 2012, 2014, 2018, 2025 నుంచి టెట్‌లో ఉత్తీర్ణులైన వారినే డీఎస్సీకి ఎంపిక చేస్తున్నారు.

✦ విద్యాహక్కు చట్టంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో పని చేస్తున్న వారంతా టెట్ ఉత్తీర్ణులు కావాల్సిందే. 2012కు ముందు ఉద్యోగాల్లో చేరిన వారంతా తప్పనిసరిగా టెట్ రాయాలి. ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, ఆదర్శ, గురుకుల, మున్సిపల్ పాఠశాలల్లోనూ, గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న వారికి ఇదో పెద్ద పరీక్షలా మారింది.

✦ ఐదేళ్లలోపు పదవీ విరమణ చేయనున్న వారికి మినహాయింపునిచ్చారు. ఉపాధ్యాయ సంఘాలు టెట్ అర్హతపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. కొన్ని సంఘాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేశాయి. ఇన్‌సర్వీస్ టీచర్లకు మినహాయింపు కోరుతూ కొంత మంది ఎమ్మెల్సీలు మంత్రి లోకేశ్‌ను కలిశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

రసానికి అనువైన రకాల గుర్తింపు

రసంకు అనువైన చెరకు తోట

అనకాపల్లి, న్యూస్‌టుడే

చెరకుతో పంచదార, బెల్లం తయారీ కంటే రసంగా విక్రయించడం లాభదాయకమని వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఏడేళ్లుగా చెరకు రసానికి అనువైన రకాలపై పరిశోధనలు చేస్తున్నారు. వీటిలో ఐదు రకాలు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించినట్లు చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.ఆదిలక్ష్మి చెబుతున్నారు.

రూపాయి ఖర్చుకు ఆదాయం ఇలా..

ఉత్పత్తి	రూ.
పంచదార	0.92
బెల్లం దిమ్మల రూపంలో	1.17
బెల్లం ముక్కల రూపంలో	1.60
రసం	1.73

రసం శాతం, దిగుబడి (హెక్టారుకు టన్నుల్లో) ఇలా..

రకం	రసం శాతం	దిగుబడి
2003వి46 (భరణి)	56	125
2009ఏ107	59.1	137
2009ఏ252	52	130
2006ఏ223	56	–
87ఏ298	54.7	112.5

పోషక విలువలు అధికం...

చెరకు రసంలో 70 నుంచి 85 శాతం నీరు, 10 నుంచి 15 శాతం ఫైబర్, 15 నుంచి 21 శాతం సుక్రోజ్ ఉన్నాయి. విటమిన్ బి6, విటమిన్ సి, ఫోలేట్ బి9, కాల్షియం, ఇనుము, మెగ్నీషియం, భాస్వరం, పొటాషియం, సోడియం, జింకు ఉంటాయి.

కస్తూర్బాల్లో అతిథి ఉపాధ్యాయుల నియామకం

నక్కపల్లి, న్యూస్‌టుడే

కస్తూర్బా పాఠశాలల్లో విద్యార్థినులకు బోధనా ఇబ్బందులు తీర్చేలా సమగ్రశిక్షా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇటీవల డీఎస్సీలో ఉద్యోగాలు సాధించి కొందరు కేజీబీవీల నుంచి వెళ్లిపోవడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల, వేములపూడి, రోలుగుంట, మాకవరపాలెం, చోడవరం, కె.కోటపాడు, రావికమతం, మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లి తదితర చోట్ల 20 పాఠశాలలుండగా, వీటిలో ఆరు నుంచి ఇంటర్ వరకు విద్యార్థినులకు బోధనతో వసతి కల్పిస్తున్నారు. వీటిలో ఉపాధ్యాయినులతోపాటు అధ్యాపకులు పనిచేస్తున్నారు.

✦ డీఎస్సీలో బోధనా సిబ్బంది 18 మంది ఉద్యోగాలు సాధించి ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లిపోయారు. నక్కపల్లి నుంచి ముగ్గురు, రోలుగుంట, చోడవరం, రాంబిల్లి, మాకవరపాలెం, వేములపూడి, కోటవురట్ల, మునగపాక, దేవరాపల్లి, బుచ్చెయ్యపేట, చీడికాడ, అచ్యుతాపురం, కశింకోట, వి.మాడుగులలో ఒకరిద్దరు చొప్పున ఉండటంతో ఆయా చోట్ల ఖాళీలున్నాయి. ఫలితంగా నెలరోజులుగా బోటనీ, గణితం, తెలుగు, ఆంగ్లం, కెమిస్ట్రీ పాఠ్యాంశాలకు సంబంధించి సిలబస్ పెండింగ్ పడింది. కేజీబీవీల్లో ఉన్న వారితోనే సమస్యను అధిగమించే ప్రయత్నం చేస్తున్నారు. ఇంటర్, పది పరీక్షలు సమీపిస్తుండటంతో ఫలితాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని గుర్తించిన ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఉన్నతాధికారులు అతిథి బోధకులను నియమించేలా ఆదేశాలిచ్చారు.

రెండు రోజుల్లో పూర్తి : డీఎస్సీతో ఏర్పడిన ఖాళీలతో బోధనకు ఇబ్బంది లేకుండా పీఈటీలు మినహా మిగిలిన సబ్జెక్టులకు అతిథి ఉపాధ్యాయులను నియమించేలా చర్యలు చేపట్టాం. నిబంధనలు అనుసరించి అర్హత ఉన్న వారిని బోధకులుగా నియమించుకోవాలి. గంటకు రూ.250 చొప్పున నెలకు రూ.12 వేలకు మించకుండా చెల్లిస్తారు. రెండు రోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తి చేస్తాం.
– డాక్టర్ ఆర్.జయప్రకాశ్, ఏపీసీ సమగ్రశిక్షా

పనుల ప్రారంభం లాంఛనమే..

మిత్తల్ ఉక్కుకు పర్యావరణ అనుమతులు

నక్కపల్లి, న్యూస్‌టుడే

రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి తలమానికంగా నిలవనున్న ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం అలుపెరగని కృషి చేస్తోంది. దాదాపు రూ.లక్షన్నర కోట్లతో ఏర్పాటవుతున్న ఈ పరిశ్రమకు సంబంధించి కేంద్ర పర్యావరణ శాఖ తాజాగా అనుమతులు జారీ చేసింది. 14 నెలల కాలంలోనే అన్ని అనుమతులు రావడం గమనార్హం. పనుల ప్రారంభానికి పునాదిరాయి వేయడం లాంఛనం కానుంది.

- నక్కపల్లి మండలంలో పరిశ్రమల ఏర్పాటుకు సేకరించిన 4300 ఎకరాల్లో వేంపాడు, డీఎల్‌పురం, చందనాడ తదితర రెవెన్యూల పరిధిలో మిత్తల్ ఉక్కు కోసం తొలి విడతగా 2020 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ప్రజాభిప్రాయ సేకరణ ఇప్పటికే పూర్తయింది. ఈ పరిశ్రమను రెండు విడతల్లో కలిపి సుమారు ఐదు వేల ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నారు. మిగిలిన భూమి కోసం వేంపాడు, నెల్లిపూడి, ఉద్దండపురం తదితర ప్రాంతాల్లో గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

స్టీల్‌ప్లాంటు ఏర్పాటు చేసే ప్రాంతంలో రోడ్ల నిర్మాణం

- డీఎల్‌పురంలో తీరాన్ని ఆనుకుని సరకు రవాణా, దిగుమతుల కోసం క్యాప్టివ్ పోర్టు, ఉద్యోగుల నిమిత్తం 500 ఎకరాల్లో టౌన్‌షిప్ నిర్మించనున్నారు. గుల్లిపాడు రైల్వేస్టేషన్ నుంచి కంపెనీకి ప్రత్యేక రైల్వేలైను ఏర్పాటుకు అనుమతులు వచ్చాయి. భూములు కేటాయించిన ప్రాంతాల్లో మౌలిక వసతుల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రోడ్లు, కాలువల నిర్మాణంతోపాటు అవసరమైన నీటిని సరఫరా చేసేందుకు భారీ పైపులైను నిర్మాణాలు చేస్తున్నారు. తాజాగా పర్యావరణ అనుమతులు రావడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.
- తొలివిడతలో ఏడాదికి 80 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటుకానున్న ఈ పరిశ్రమను మూడేళ్లలో సిద్ధం చేయాలన్న సంకల్పంతో యాజమాన్యం చర్యలు చేపడుతోంది. విస్తరణ ద్వారా ఉక్కు ఉత్పత్తి స్థాయి గరిష్ఠంగా 2.4 కోట్ల టన్నులకు పెరగనుంది. తద్వారా అనుబంధ పరిశ్రమలు వస్తాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ఈలోగా నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తే స్థానిక యువతకు మేలు జరుగుతుంది. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖ వేదికగా జరిగే భాగస్వామ్య సదస్సులో మిత్తల్ ఉక్కుకు భూమి పూజ చేసేందుకు సమాయత్తమవుతున్నారు.

55,045

ఈ-కేవైసీ చేయించుకోని ఉపాధి శ్రామికులు

ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనుల్లో పారదర్శకత పెంచి.. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు చేపట్టిన ఈ-కేవైసీ శత శాతం పూర్తి కాలేదు. జిల్లాలో 55,045 మంది చేయించుకోలేదు. 24 మండలాల పరిధిలో 4,34,392 మంది ఉపాధి శ్రామికులున్నారు. 3,60,700 మంది రోజూ పనులకు హాజరవుతున్నారు. వీరిలో 3,05,655 మంది (84.75%) ఈ-కేవైసీ చేయించుకోగా మిగతా వారంతా దూరంగా ఉండిపోయారు. ప్రభుత్వం ఇచ్చిన గడువు అక్టోబరు 26తో ముగిసింది. జాబ్ కార్డులున్న వారి ఇళ్లకు సిబ్బందిని పంపినా.. శ్రామికులు సహకరించకపోవడంతో శత శతం పూర్తి చేయలేకపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఉపాధి హామీ పథకంలో చేసిన పనులకు సకాలంలో కూలి డబ్బులు బ్యాంకు ఖాతాకు జమకావడంలో ప్రతి ఒక్కరూ ఈకైవేసీ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాల్సిందే. ‘జిల్లాలో అత్యధికంగా కె.కోటపాడు మండలంలో 12,935 మంది శ్రామికులకు 11,608 మందికి ఈ-కేవైసీ పూర్తయింది. అత్యల్పంగా పాయకరావుపేటలో 10,600 మందికి 8,423 మంది చేయించుకున్నార’ని డ్వామా పీడీ పూర్ణిమాదేవి పేర్కొన్నారు.
-న్యూస్‌టుడే, కలెక్టరేట్

నేడూ ‘వందేభారత్’ ఆలస్యం

విశాఖపట్నం, న్యూస్‌టుడే : లింకు రైలు అందుబాటులో లేకపోవడంతో సోమవారం ఉదయం 5.45 గంటలకు బయలుదేరాల్సిన విశాఖ- సికింద్రాబాద్ (20833) వందేభారత్ రైలు మధ్యాహ్నం 12.15 గంటలకు బయలుదేరేలా మార్పు చేసినట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరాల్సిన సికింద్రాబాద్-విశాఖ (20834) వందేభారత్ రైలు రాత్రి 10 గంటలకు బయలుదేరడంతో సోమవారం రైలు ఆలస్యం కానుంది.

హిమపాతమా.. ఇల కైలాసమా!

మన్యంలో మంచు అందాలు కనువిందు చేస్తున్నాయి. ధారాలమ్మ ఘాటీలో ఆదివారం ఉదయం పాలసముద్రం దర్శనమిచ్చింది. ధారాలమ్మ అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఈ దృశ్యాలను చరవాణుల్లో బంధించారు.
– న్యూస్‌టుడే, సీలేరు

ముప్పుందని తెలుసు.. అయినా అలుసు!

ప్రశ్నార్థకంగా రావణాపల్లి జలాశయం భద్రత

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకుతోడు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో రావణాపల్లి జలాశయం నిండుకుండలా మారింది. నీటితో తొణికిసలాడుతున్న జలాశయాన్ని చూసేందుకు వచ్చిన కొమిర గ్రామానికి చెందిన రైతులు గట్టు కుంగడం గమనించి జలవనరుల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న అధికారులు యుద్ధప్రాతిపదికన కంకరతో గట్టును బలోపేతం చేశారు. ముప్పు తప్పించేందుకు తాత్కాలికంగా ఇసుక బస్తాలు వేయించారు. రైతులు గమనించకపోతే పెను ప్రమాదం జరిగేది. గట్టుకు గండిపడి నీరంతా గెడ్డకు, అక్కడి నుంచి కాలువల మీదుగా పొలాలను ముంచెత్తేది. నదిలో ప్రవాహం పెరిగితే పరిస్థితి ఎలా ఉండేదో ఊహించలేం.

- ఏడాది కిందట రావణాపల్లి ఆయకట్టు రైతులు మదుం వద్ద నీటి సవ్వడిని గమనించి గట్టు కోతకు గురవుతోందని గమనించి అధికారులను అప్రమత్తం చేశారు. సభాపతి అయ్యన్నపాత్రుడూ గట్టు పరిశీలనకు వచ్చారు. కలెక్టర్‌తో మాట్లాడి తాత్కాలిక మరమ్మతులకు నిధులు ఇప్పించారు. ఈ నిధులతో ఇసుక బస్తాలు, కంకరతో పనులు చేపట్టారు. పూడికతీత, కాలువల మరమ్మతు పనులకు రూ.లక్షల్లో ఖర్చు చేసిన అధికారులు రాతికట్టును విస్మరించారు.
- ఖరీఫ్ ముగిసిన తర్వాత శాశ్వత మరమ్మతులు చేపట్టకపోతే భవిష్యత్తులో పెను ప్రమాదం వాటిల్లే ఆస్కారముంది. గట్టు ఎలా ఉందో పరిశీలించేందుకు వీల్లేకుండా తూటుకాడ పెరిగింది. ఈ జలాశయం 1954లో నిర్మితమైంది. నర్సీపట్నం, గొలుగొండ మండలాల్లోని 14 గ్రామాలకు చెందిన 2600 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రధాన మదుం రాతిగట్టుకు రంధ్రాలు పడి నీరు ఉబికి వస్తోంది. పొర్లుకట్టకు పలుచోట్ల పెచ్చులూడుతున్నాయి.

మొంథా తుపాన్‌కు దెబ్బతిన్న గట్టుకు ఇసుక బస్తాలతో తాత్కాలిక మరమ్మతు

- గొలుగొండ మండలంలోని విప్పలపాలెం ఆనకట్ట కింద 800 ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. దీని గట్టు కొంతమేర కుంగినట్లు గుర్తించారు. రావికమతం, కోటవురట్ల, మాకవరపాలెం, నర్సీపట్నం, గొలుగొండ మండలాల్లోని పలు ఆనకట్టలు, కాలువలు వర్షాలకు దెబ్బతిన్నాయి. ఈ విషయాన్ని జలవనరులశాఖ ఈఈ బాలసూర్యం దృష్టికి తీసుకువెళ్లగా తాత్కాలిక మరమ్మతులకు కలెక్టర్ రూ.7.5 లక్షలు మంజూరు చేశారన్నారు. శాశ్వత మరమ్మతులకు అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపుతామని చెప్పారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ జట్ల ఎంపిక

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: తుమ్మపాల పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక ఆదివారం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో బాలబాలికలు హాజరయ్యారు. కబడ్డీలో ప్రతిభ చూపిన 14 మంది చొప్పున బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. కర్నూలు జిల్లా మంత్రాలయంలో ఈనెల 7 నుంచి జరగనున్న సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్షురాలు కె.శాంతకుమారి చెప్పారు. జిల్లా కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్, కోశాధికారి మహారాజ్, పీఈటీలు వీరునాయుడు, రాజు, నూకరాజు పాల్గొన్నారు.

ఎంపికైన జట్టుతో అసోసియేషన్ సభ్యులు

(c) eenadu

పెళ్లి సంబంధాల కోసం వెతుకుతున్నారా..!

నేడు కమ్మ అవివాహితులకు 'ఈనాడు పెళ్లిపందిరి' ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదికైన 'ఈనాడు పెళ్లిపందిరి' కమ్మ అవివాహితుల కోసం ఉచిత ప్రొఫైల్, రిజిస్ట్రేషన్ నిర్వహిస్తోంది. అక్కయ్యపాలెంలోని 'ఈనాడు' కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమం జరుగుతోంది.

★ వివాహం కోసం ఎదురు చూస్తున్న అవివాహితులతో పాటు సంబంధిత కుటుంబీకులు **నేడు (సోమవారం, నవంబరు 3న)** ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పాల్గొని ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

★ మరిన్ని వివరాలకు **9154918858, 8008001616** ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు. ఫోన్ లేదా యాప్ ద్వారా కూడా ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. బయోడేటా, ఫొటోలను పైన తెలియజేసిన వాట్సప్ నంబర్లకు పంపవచ్చు.

– న్యూస్‌టుడే, విశాఖపట్నం

వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లో అభిమానుల విజయోత్సాహం

తిరుగులేని 'అమ్మాయిలు'.. అభిమానుల సంబరాలు

మహిళల వన్డే క్రికెట్ వరల్డ్ కప్‌లో భారత జట్టు అమ్మాయిలు చెలరేగారు. ఫైనల్స్‌లో దక్షిణాఫ్రికాను మట్టి కరిపించి చిరకాలంగా ఊరిస్తున్న ప్రపంచ కప్‌ను ముద్దాడారు. దీంతో నగరంలో క్రికెట్ అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఆదివారం పలు ప్రాంతాల్లో భారీ తెరలు ఏర్పాటు చేసి మ్యాచ్‌ను ఆద్యంతం వీక్షించారు. భారత్ గెలిచిన అనంతరం మువ్వన్నెల జెండాలు చేతపట్టి నృత్యాలు చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ విజయం మహిళా క్రికెట్‌కు మేలిమలుపని పలువురు క్రీడాకారులు హర్షం ప్రకటించారు.

–న్యూస్‌టుడే, విశాఖక్రీడలు

నిధులు జేబుల్లో.. దోమలు ఇళ్లల్లో..!

ఫాగింగ్ యంత్రాల డీజిల్ పక్కదారి

జీవీఎంసీలో యథేచ్ఛగా స్వాహాపర్వం

ఈనాడు–విశాఖపట్నం: జీవీఎంసీ పరిధిలో దోమల సంహారం పేరుతో స్వాహా పర్వానికి తెర లేపారు. మెకానికల్ విభాగంలో కొందరు సిబ్బంది... క్షేత్రస్థాయిలో పలువురు వార్డు స్థాయి నేతలు జత కలిసి మాయ చేస్తున్నారు. కాకి లెక్కలతో జేబులు నింపేసుకుంటున్నారు. వర్షాలతో దోమల బెడద పెరిగి నగరవాసులు ఇబ్బందులు పడుతుంటే... ఫాగింగ్ ప్రక్రియ నామమాత్రంగా జరుగుతున్నట్లు విమర్శలున్నాయి.

మెకానికల్‌లో మాయ: ఫాగింగ్ యంత్రాలు, వాహనాలకు పెట్రోలు బంకుల్లో డిజిటల్ కార్డులతో ఆయిల్ కొట్టించే బాధ్యతను జీవీఎంసీ మెకానికల్ విభాగం చూస్తోంది. ఇంత వరకు బాగానే ఉన్నా కొన్ని పెట్రోలు బంకుల యజమానులతో కొందరు అధికారులు కుమ్మక్కై డీజిల్‌ను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వాహనాలకు రోజుకు వంద లీటర్ల డీజిల్ కొట్టిస్తున్నట్లు లెక్కల్లో చూపిస్తుండగా, వారానికి ఒక్కసారి కూడా వార్డుల్లో ఫాగింగ్ వాహనాలు తిరిగిన జాడ కనిపించడం లేదు. ప్రతి నెలా ఈ వాహనాల ద్వారానే రూ.10లక్షల మేర నిధులు స్వాహా చేస్తున్నట్లు అంచనా.

■ అధికారుల సమర్పించిన లెక్కలపై గతంలో ఫిర్యాదులు అందడంతో అప్పటి కమిషనరు ఆదేశాలతో విచారణ సైతం జరిగింది. ప్రస్తుతం మళ్లీ అదే పరిస్థితి కొనసాగుతోంది. విచిత్రమేమంటే 8 ఫాగింగ్ వాహనాల్లో కొన్ని మరమ్మతులకు గురై జీవీఎంసీ కార్యాలయంలోనే ఉన్నా.. లెక్కల్లో మాత్రం ఆ వాహనాలు నగరంలో తిరుగుతూ ఫాగింగ్ చేస్తున్నట్లు చూపిస్తున్నారు.

మా వాహనాలకు నింపండి..

వార్డుల్లో హ్యాండ్ మిషన్‌లతో ప్రతి రోజూ ఫాగింగ్ చేయాలి. ఫాగింగ్ చేసినట్లు కార్పొరేటర్ సంతకం పెడితేనే బిల్లులు మంజూరు చేస్తారు. ఇక్కడే అసలు కథ మొదలవుతోంది. కొందరు కార్పొరేటర్లు, చోటా నాయకులు వార్డుల్లో ఫాగింగ్ పక్కన పెట్టి, ఆ డీజిల్‌ను సొంతానికి ఉపయోగించుకుంటున్నారు. 'ఈ రోజు నా వార్డులో ఫాగింగ్ అవసరం లేదు. నా కారుకు కొట్టండి' అంటూ కొందరు ప్రజాప్రతినిధులు డీజిల్‌ను వాడేస్తున్న ఘటనలు ఇప్పటికే వెలుగులోకి వచ్చాయి.

సీజనల్ సిబ్బంది ఎక్కడ?

దోమల నివారణకు సీజనల్ వర్కర్స్ పేరుతో రెండు నెలల కోసం 400 మంది సిబ్బందిని జీవీఎంసీ పరిధిలో నియమించుకున్నారు. ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున వేతనం ఇస్తున్నారు. వీరిలో అధికశాతం ముఖ ఆధారిత హాజరు కాగానే క్షేత్రస్థాయిలో కనిపించడం లేదనే ఆరోపణలున్నాయి. కొందరు కార్పొరేటర్లు తమ అనుచరగణానికే ఈ పోస్టులు ఇప్పించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

జీవీఎంసీలో..

ఫాగింగ్ వాహనాలు: 8 — రోజుకు ఇచ్చే ఆయిల్ (ఒక్కో దానికి): 100 లీటర్ల డీజిల్, 10 లీటర్ల పెట్రోలు

చిన్న యంత్రాలు (హ్యాండ్ మిషన్లు): 50 — రోజుకు ఇచ్చే ఆయిల్ (ఒక్కోదానికి): 15 లీటర్ల డీజిల్, 2లీటర్ల పెట్రోలు

సింహగిరిపై వైభవంగా క్షీరాబ్ది ద్వాదశి వేడుక

సింహాద్రినాథుడికి చిమ్మిలి నివేదన

చెరకు గడలతో చిమ్మిలి దంచుతున్న అర్చకులు

సింహాచలం, న్యూస్‌టుడే: కార్తిక శుద్ధ ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సింహాద్రి అప్పన్న స్వామి దేవాలయంలో ఆదివారం సాయంత్రం క్షీరాబ్ధి ద్వాదశి ఉత్సవం సంప్రదాయబద్ధంగా జరిగింది. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు నేతృత్వంలో అర్చక పరివారం ఉత్సవాన్ని జరిపించారు. తొలుత స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని దేవేరులు, శయన బేరం వేణుగోపాల స్వామి, ఆళ్వారాచార్యులు సహితంగా శోభాయమానంగా అలంకరించి ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై ఆశీనులను చేశారు. స్వామి ఎదుట రోలు, రోకలి అధిష్ఠింపజేసి ఆవాహన పూజలు, ఆరాధనలు చేశారు. రోటిలో పాలు, బెల్లం, నువ్వుల పప్పు వేసి వేదమంత్రాల నడుమ తొలుత చెరకు గడలతో దంచారు. అనంతరం రోకళ్లతో చిమ్మిలి దంచి స్వామికి నివేదించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని తిలకించారు. అనకాపల్లి ప్రాంతానికి చెందిన ఆడారి కుటుంబీకులు ఆనవాయితీ ప్రకారం చిమ్మిలి నివేదనకు అవసరమైన ద్రవ్యాలను సమర్పించారు. కుటుంబంతో సహా ఉత్సవంలో పాల్గొని స్వామిని సేవించారు.

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు

ఎన్ఎస్‌టీఎల్‌కు చెందిన డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌వీ హరప్రసాద్ ఆదివారం సతీసమేతంగా సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

★ రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదివారం సాయంత్రం సింహాద్రినాథుడికి సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, వైదికులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో యథావిధిగా పీజీఆర్ఎస్

కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నామని కలెక్టర్ విజయకృష్ణన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. అన్ని మండల, డివిజన్ కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మీ కోసం వెబ్‌సైట్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చన్నారు. 1100 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి అర్జీల స్థితిగతులను తెలుసుకోచ్చని తెలిపారు.

డిసెంబరులో జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థుల సమావేశం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల (కాకినాడ) పూర్వ విద్యార్థుల సమావేశం డిసెంబరు 7వ తేదీన ఎంవీపీ కాలనీ ఐఏఎం కళాశాలలో నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపకులు ఎ.ఎస్.ఎన్.ప్రసాదరావు, సంఘం ప్రెసిడెంట్ ఒ.ఆర్.ఎం.రావు, జాయింట్ సెక్రటరీ బి.అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు ఎంవీపీకాలనీలోని ఐ.ఐ.ఎ.ఎం. కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు సమావేశమయ్యారు. ఆ రోజు పూర్వ విద్యార్థులందరూ తప్పక హాజరు కావాలని కోరారు. సంఘం కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర సహాయ మంత్రి రాక

విశాఖపట్నం, న్యూస్‌టుడే : కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ సోమవారం విశాఖ రానున్నారు. ఉదయం 8.45 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని, అక్కడ నుంచి అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెం వెళ్తారు. స్థానిక కార్యక్రమాలు పాల్గొని, మధ్యాహ్నం 1.30 గంటలకు బయలుదేరి 3.10 గంటలకు నగరంలోని రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకుంటారు. ఆ తర్వాత ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొని, రాత్రి 8.50 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్ష

విశాఖపట్నం: యూపీఎస్సీ పరీక్ష ఆదివారం నగరంలో ప్రశాంతంగా ముగిసింది. మొత్తం ఏడు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 3,268 మంది అభ్యర్థుల కోసం ఏర్పాట్లు చేయగా, కేవలం 1058 మంది మాత్రమే హాజరయ్యారని అధికారులు తెలిపారు.

పటిష్ఠ కార్యాచరణతో గంజాయికి అడ్డుకట్ట

చిత్ర ప్రదర్శనను వీక్షిస్తున్న డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా, కమిషనర్ శంఖబ్రతబాగ్చీ, కలెక్టర్ హరేంధిరప్రసాద్ తదితరులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పట్టుబడిన సుమారు 10 వేల కిలోల గంజాయిని ఆదివారం కాపులుప్పాడ డంపింగ్ యార్డు వద్ద దహనం చేశారు. ముఖ్య అతిథిగా డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా హాజరయ్యారు. ఆయా స్టేషన్ల పరిధిలో ఏయే ప్రాంతాల్లో గంజాయి స్వాధీనం చేసుకున్నారో ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శన, పవర్ ప్రజెంటేషన్‌ను వీక్షించారు. సీపీ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ మొత్తం 533 గంజాయి కేసుల్లో నిందితుల నుంచి 96 ద్విచక్రవాహనాలు, 16 ఆటో రిక్షాలు, 39 కార్లు, 2 లారీలు స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి రహిత నగరంగా తీర్చిదిద్దే సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. 15 డ్రోన్‌లతో పాటు 14 వేలకు పైగా సీసీ కెమెరాలను విశాఖ జిల్లాలో ఏర్పాటు చేసి నిరంత నిఘా ఉంచుతున్నామన్నారు. కొన్ని ప్రధాన ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. రైల్వేస్టేషన్లు, బస్‌కాంప్లెక్స్‌లు తదితర ప్రాంతాల్లో ఉమ్మడి తనిఖీలు నిర్వహిస్తున్నామని, నగర పరిధిలో 866 మంది మాదకద్రవ్యాలు సేవించే వారిని గుర్తించి వారికి చికిత్స అందిస్తున్నామన్నారు. నవసమాజ నిర్మాణం, ప్రజలతో ముఖాముఖి, సుప్ర వాహనాల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈగల్ టీంలతో పాఠశాలలు, కళాశాలల్లో చైతన్యసదస్సులు నిర్వహిస్తున్నామని డీజీపీకి వివరించారు.

★ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న 80 వేల కిలోల గంజాయిని దహనం చేశామని ఈగల్ టీం ఐజీ రవికృష్ణ తెలిపారు. ఈగల్‌కి ప్రతి తల్లి ఒక బ్రాండ్ అంబాసిడర్ అని.. పిల్లల ప్రవర్తన, నడవడిక గమనించాలని, ఏదైనా అనుమానాలు కలిగితే వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 1972కు ఫోన్ చేయాలని సూచించారు. ఇటీవల ఎన్‌సీబీ సమావేశానికి వెళ్లగా పోలీసు పనితీరును ప్రశంసించారన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు..

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా గంజాయి నిర్మూలనను ముందుకు తీసుకెళ్తోందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అన్నారు. యువతలో గంజాయి తాగాలనే ఆలోచనను ముందు తగలబెట్టి గంజాయి వద్దు బ్రో అని చెప్పాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నాయన్నారు. విశాఖ పరిధిలో కేజీహెచ్, మానసిక ఆసుపత్రుల్లో టెలిమానస్ కేంద్రాలున్నాయన్నారు. అంతేకాక గ్రీన్‌వ్యాలీ వంటి పలు స్వచ్ఛంద సంస్థలను సైతం భాగస్వాములను చేస్తూ వారి సేవలను వినియోగించుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీసీపీలు మేరీ ప్రశాంతి, కె.లతామాధురి, ఏసీపీలు ఎస్.అప్పలరాజు, లక్ష్మణమూర్తి, అన్నెపు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆరుద్ర రచనలు స్ఫూర్తిదాయకం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఆరుద్ర రచనలు ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని తెలకపల్లి రవి అన్నారు. డాబాగార్డెన్స్ దరి అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సాహితీ స్రవంతి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆరుద్ర జయంతి ముగింపు వేడుకల్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న తెలకపల్లి రవి మాట్లాడుతూ తెలుగు సాహిత్యం, సినీ గీతాలు, అనువాదాలు, నాటక రచనల్లో ఆరుద్ర తన ప్రత్యేకత చాటుకున్నారన్నారు. అనంతరం 'తిమిరాన్ని తరిమేస్తాం' పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్. శర్మ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీకటి దివాకర్, అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పొలమరశెట్టి ఫ్రాన్సిస్, ఇతర సభ్యులు సత్యాజీ, రామకృష్ణ, చలసాని కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

సమావేశంలో వక్తలు

విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

ఉపాధ్యాయ సంఘ నేతలతో చిరంజీవిరావు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు పేర్కొన్నారు. అనకాపల్లిలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ నేతలు, ఉపాధ్యాయులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సీనియర్ ఉపాధ్యాయులు టెట్ పరీక్ష రాయాలని సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను నిలిపి వేయడానికి ఉన్న అవకాశాలను మంత్రి నారా లోకేశ్ పరిశీలిస్తున్నారన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని పట్టభద్రుల ఎమ్మెల్సీలంతా కలిసి వెళ్లి మంత్రి లోకేష్‌కు సమస్య వివరించి, సుదీర్ఘ కాలంగా విధుల్లో ఉపాధ్యాయులను మినహాయించాలని కోరామన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛన్‌దారులకు జీతాలు, పింఛన్లు చెల్లించి వారి ఆత్మాభిమానాన్ని కాపాడాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయమన్నారు. ఇటీవల అందరు ఉద్యోగ, ఉపాధ్యాయ నేతలతో నేరుగా ముఖ్యమంత్రి మాట్లాడి ఒక డీఏను ప్రకటించడంతో పాటు వెంటనే అమల్లోకి తీసుకువచ్చారన్నారు. నిబంధనలు పాటించని అధికారులపై చర్యలు తప్పవని, ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకువచ్చే అధికారులను ఊపేక్షించేది లేదన్నారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంపాల వెంకటరమణ, రాష్ట్ర కార్యదర్శి రాజు, నాయకులు కోట్ని రాంబాబు, ఎం ఉమామహేశ్వరరావు, నూకేష్, సన్యాసిరావు కృష్ణ మోహన్, బాబ్జీ పాల్గొన్నారు.

గండి పూడ్చివేత పనులు వేగవంతం చేయాలి

రాంబిల్లి, న్యూస్‌టుడే: మేజర్‌శారదా నది గండి పూడ్చివేత పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ జలవనరులశాఖ అధికారులను ఆదేశించారు. వై.లోవ-రజాల మధ్య మేజర్‌శారదా నది గండి పూడ్చివేత పనులను ఆదివారం ఉదయం ఆయన పరిశీలించారు. ఇక్కడ పూడ్చివేతకు కూటమి నాయకులు వి.దిన్నుబాబు, పప్పల నూకన్నదొర, కర్రి సింహగిరిప్రసాద్ అధికారులకు సహకరిస్తున్నారు. దిమిలిలో సిద్ధం చేసిన ఇసుక బస్తాలను గండి వద్దకు ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. రెండు రోజుల్లో గండిని పూర్తిగా పూడ్చుతామని డీఈ సాయిప్రశాంతి, ఏఈ శివాజీ చెప్పారు.

పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మూగజీవిపై మురిసిన మానవత్వం

శస్త్రచికిత్స నిర్వహించిన పశువైద్యులు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: తుపాన్ సమయంలో గాయపడిన ఆవుకు వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. గొర్లె ధర్మవరం శివారు మెట్టధర్మవరానికి చెందిన పెంకె మారేష్‌కు చెందిన పాడి ఆవుపై పశువులపాక పడిపోవడంతో ముందు కాలు విరిగిపోయింది. అప్పటి నుంచి గాయంతో నడవలేని పరిస్థితి ఎదురవుతోంది. ఆదివారం అనకాపల్లి నుంచి వచ్చిన వైద్య నిపుణులు శివకుమార్, శివప్రసాద్ ఆవుకు శస్త్రచికిత్స నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో సంస్మరణ దినోత్సవం

ప్రసంగిస్తున్న విశాఖ అగ్రపీఠాధిపతి ఉడుమల బాల

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ప్రతి కుటుంబంలో మృతి చెందిన వారి ఆత్మలకు నిత్య విశ్రాంతి కలిగేలా ఏటా నవంబరు మాసంలో ప్రత్యేక ప్రార్థనలు చేయాలని విశాఖ అగ్రపీఠాధిపతి ఉడుమల బాల పేర్కొన్నారు. సకల ఆత్మల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం సమీప శ్మశానవాటికలో ఆదివారం దివ్య పూజబలి నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రపీఠాధిపతి ఉడుమల బాల మాట్లాడుతూ... మరణించిన వారు చేసిన తప్పుల్ని మన్నించి, వారి ఆత్మలు దేవుని రాజ్యం చేరాలని అనుదిన ప్రార్థనల్లో గుర్తు చేసుకోవాలన్నారు. ముందుగా విశ్వాసులు పునీత పేతురు ప్రధాన దేవాలయం నుంచి శ్మశానవాటిక వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం ప్రతి సమాధి వద్ద దేవాలయం ఫాదర్ జొన్నాడ ప్రకాశ్, సహాయక విచారణకర్తలు ఫాదర్ ప్రేమ్‌కుమార్, ఫాదర్ థామస్, తదితరులు ప్రార్థనలు చేశారు. క్రైస్తవ విశ్వాసులు తమ కుటుంబీకుల సమాధులను పూలతో అలంకరించి, కొవ్వొత్తులు వెలిగించారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ☏ 9848488066, 7799223330.

REAL ESTATE

FLAT FOR SALE

SEETHAMMADHARA

GENERAL

HOUSE FOR SALE

GENERAL

SECOND SALE

JOBS

MARKETING/ SALES

MEDICAL

SECURITY GUARDS

JOB OPPORTUNITY

Interviews on 03-11-2025 ... GORLE RAMARAO, GM DOCTORS COLONY, VIZAG ☏ 9553529529, 9133366051

నిజాయతీతో విధి నిర్వహణ

వాక్‌థాన్‌లో బ్యాంకు ఉద్యోగులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: బ్యాంకు ఉద్యోగులు విధుల్లో నిజాయతీగా ఉంటూ, బాధ్యతగా వ్యవహరించాలని యూనియన్ బ్యాంకు జోనల్ హెడ్ షాలిని అన్నారు. నిఘా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ద్వారకానగర్‌లోని జోనల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా ఎల్ఐసీ కూడలి వరకు అవగాహన వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఉద్యోగులు వృత్తిపరమైన జీవితంతో పాటు, వ్యక్తిగత జీవితంలోనూ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జోనల్ విజిలెన్స్ అధికారి ఐవీ.కృష్ణ మాట్లాడుతూ... పారదర్శకత, నైతిక విలువలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రీజనల్ హెడ్ జె.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

విషాదం నింపిన కడలి కెరటం

సముద్రంలో స్నానానికి వెళ్లి విద్యార్థి మృతి

భానుప్రసాద్ (పాత చిత్రం)

రావికమతం, న్యూస్‌టుడే: చిన్నతనంలోనే తల్లి చనిపోయింది. అమ్మమ్మ లాలనలో పెరిగాడు. పదో తరగతి చదువుతున్న మనుమడిని మృత్యువు కడలి రూపంలో కబళించిందని అమ్మమ్మ, తాతయ్య కన్నీరుమున్నీరయ్యారు. స్నేహితులతో సరదాగా గడిపేందుకు సముద్ర తీరానికి వెళ్లిన విద్యార్థి అలల ధాటికి గల్లంతై మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం తీరంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంకు చెందిన సూరెడ్డి భాను ప్రసాద్ (15) తల్లి మాణిక్యమ్మ మరణంతో రావికమతం మండలం తోటకూరపాలెంలోని అమ్మమ్మ లాలం దేముడమ్మ వద్ద ఉంటున్నాడు. పరవాడ మండలం తానాంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఉంటూ అక్కడి జడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు శనివారం డుమ్మా కొట్టి ఐదుగురు స్నేహితులతో కలిసి ముత్యాలమ్మపాలెం తీరానికి వెళ్లారు. సముద్రంలో స్నానం చేస్తుండగా కెరటానికి అందరూ కొట్టుకుపోయారు. ఆ సమయంలో అక్కడ ఉన్న మత్స్యకారులు కొట్టుకుపోతున్న వారిలో నలుగుర్ని రక్షించారు. భానుప్రసాద్ కోసం గాలించినా ఆచూకీ దొరకలేదు. సీఐ మల్లికార్జునరావు ఘటనా స్థలానికి చేరుకుని డ్రోన్ సహాయంతో వెతికించారు. ఆదివారం ఉదయం భానుప్రసాద్ మృతదేహం తీరానికి కొట్టుకురాగా పోలీసులు బంధువులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. విద్యార్థి మృతితో తోటకూరపాలెంలో విషాదం నెలకొంది.

వరిలో కేళీలు.. దిగుబడులపై ప్రభావం

కేళీలు వచ్చిన వరి పంట

అనకాపల్లి, న్యూస్‌టుడే: ఈ ఏడాది వరిలో కేళీల బెడద ఎక్కువైంది. సాధారణంగా రైతులు సొంతంగా తయారు చేసుకున్న విత్తనాల్లో ఎక్కువగా ఈ సమస్య వస్తుంది. ఈసారి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ అందజేసిన వరి రకాల్లోనూ కేళీలు ఉన్నాయని రైతులు వాపోతున్నారు. కేళీలు ఎక్కువగా ఉంటే ధాన్యం దిగుబడి, నాణ్యతపై ప్రభావం ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వరి సాగులో కేళీలు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వరి నాట్లు వేశాక వచ్చే వీటి విషయంలో ఆచరించాల్సిన యాజమాన్య పద్ధతులను అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కేవీ రమణమూర్తి వివరిస్తున్నారిలా..

★ వరి సాగు చేసే రైతులు సొంతంగా విత్తనం అభివృద్ధి చేసుకుంటే మంచిది. విత్తనంగా సేకరించే పంట విషయంలో ముందు నుంచీ జాగ్రత్తలు తీసుకోవాలి. దీర్ఘకాలిక రకాలు అయితే నాట్లు వేసిన 60 రోజుల వరకు, స్వల్పకాలిక రకాలైతే 45 రోజుల వరకు పంటను జాగ్రత్తగా గమనించాలి. ఎగుడు దిగుడుగా మొక్కలు ఉంటే ప్రధాన రకంలో ఇతర రకాలు కలిసినట్లు లెక్క.

★ పిలక, పొట్ట దశలో కేళీలను తొలగించాలి. పైరు ఎదుగుదల ఒకేలా ఉంటే కేళీలను గుర్తించడం కష్టం. శ్రీకాకుళం సన్నాలు, ఇంద్ర, అమర రకాలు పంట ఎత్తుగా ఒకే విధంగా పెరుగుతాయి. ఒక రకంలో మరో రకం కలిసినా పంట దశలో తెలియదు. కోత అనంతరం తేడాగా ఉన్న ధాన్యం గింజలను వేరు చేయాలి. నూర్పు సమయంలో నేలపై టార్పాలిన్ వేసుకోవాలి. లేకపోతే గతంలో నూర్పు చేసిన వరి రకం గింజలు కలిసిపోయే ప్రమాదముంది.

★ ఒకే రకం పంట కాకుండా ఇతర రకాలు కలిస్తే వాటిని కేళీలు అంటారు. కేళీలు, ప్రధాన పంట ఒకేసారి పక్వదశకు వస్తే పర్వాలేదు. రెండూ పక్వ దశల సమయాలు వేర్వేరుగా ఉంటే దిగుబడులు తగ్గుతాయి. ప్రధాన పంట కంటే కేళీలు ముందుగా పక్వానికి వస్తే.. వాటి ధాన్యం గింజలన్నీ రాలిపోతాయి. అలస్యంగా వస్తే గింజ కట్టకుండా పొల్లుగా మిగిలిపోతాయి. కేళీలు ఉంటే ధాన్యాన్ని బియ్యంగా మర ఆడించే సమయంలో నూకలు ఎక్కువగా వస్తాయి. ఇలాంటి ధాన్యం కొనుగోలుకు వ్యాపారులు ఆసక్తి చూపారు.

★ విత్తనం వేసే ముందే పరీక్ష చేయించుకోవాలి. ప్రభుత్వం విత్తన పరీక్షలను వ్యవసాయ శాఖ ద్వారా ఉచితంగా చేస్తోంది. నాణ్యమైన విత్తనం వేసుకుంటేనే ఆశించిన దిగుబడులు, నాణ్యమైన పంట వస్తుంది.

యువకుడిపై హత్యాయత్నం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని తాకాశివీధిలో యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన ఒకరిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు విషయంపై గతనెల 31న హర్షవర్ధన్, వినయ్ యువకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఇక్కడ ఉన్నవారు వీరిని విడిపించారు. అనంతరం హర్షవర్ధన్‌పై వినయ్ కత్తితో దాడిచేసి గాయపరిచాడు. బాధితుడు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. దీనిపై బాధితుడి తండ్రి చంద్రరావు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై భాస్కరరావు తెలిపారు.

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	111	105
లైవ్	138	125
డ్రెస్డ్	200	220
స్కిన్‌లెస్	228	230

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: మాస్ జాతర, సత్యనారాయణ (స్క్రీన్-2): డ్యూడ్, పరిస్వామి: కె-ర్యాంప్, షిరిస్వామి: బైసన్, రామచంద్ర: కర్మణ్యే వాధికారస్తే, సత్యనారాయణ (స్క్రీన్-1): బాహుబలి, వెంకటేశ్వర: కాంతార చాప్టర్-1, అచ్యుతాపురం: ఎస్‌టీబీఎల్ సినీవరల్డ్ స్క్రీన్-1 బాహుబలి స్క్రీన్-2: మాస్ జాతర

నేడు మంత్రి అనిత వినతుల స్వీకరణ

నక్కపల్లి, న్యూస్‌టుడే: హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత నక్కపల్లిలో సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని తెదేపా నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ వెల్లడించారు. నక్కపల్లి పార్టీ కార్యాలయంలో మండల శాఖ అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు తదితరులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటల నుంచి వినతులను అందజేయవచ్చన్నారు.

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

50వ రోజుకు చేరిన ఆందోళన

నక్కపల్లి, న్యూస్‌టుడే: బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా రాజయ్యపేట వాసులు చేపట్టిన ఆందోళన ఆదివారంతో 50వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మత్స్యకార నాయకులు మాట్లాడుతూ ఇక్కడ పార్కు ఏర్పాటు చేయొద్దంటూ కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా తమ సమస్య పరిష్కరించాలని నాయకులు కోరారు. నాయకులు బి.బాబ్జి, తాతీలు, సూరిబాబు, మాధవ, కాశీరావు, సోము తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొన్న నాయకులు

చెరువులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు స్థలాల్లోకి నీరు చేరింది. దీంతో నిండి తటాకాలను మైమరిపిస్తున్నాయి. పాయకరావుపేటలోని పెదిరెడ్డినగర్, లక్ష్మీనగర్, బృందావనం, చక్కానగర్ తదితర కాలనీల్లోనూ, పి.ఎల్.పురంలోని దొరనగర్‌లోనూ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. వర్షపు నీరు, మురుగు పోయేందుకు వీలుండటం లేదు. దీంతో ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల్లోకి నీరంతా చేరుతోంది. దీంతో కాలనీ వాసులు ఇబ్బందులు తప్పడం లేదు. దుర్వాసన ఒక వైపు, దోమల దండయాత్రలు మరోవైపు ఉండటంతో సతమతమవుతున్నారు. దీనివల్ల రోగాలు ప్రబలే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి మోటార్ల ద్వారా నీటిని తోడించాలని స్థానికులు కోరుతున్నారు.


ఇళ్ల మధ్య చేరిన నీరు

దారులిలా.. చేరుకునేదెలా?

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లి-ఆనందపురం రహదారి నుంచి బొజ్జన్నకొండకు వెళ్లే మార్గంలో రహదారి మరమ్మతులకు గురైంది. కార్తీకమాసం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి ఈ ప్రాంతానికి అధిక సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. ఎక్కువ మంది ఈ మార్గంలోనే ప్రయాణిస్తారు. రోడ్డుపై పడిన గోతులతో ప్రమాదాలు ఎదురవుతున్నాయి.

బొజ్జన్నకొండ రహదారి దుస్థితి

అచ్యుతాపురం, కోటవురట్ల, న్యూస్‌టుడే: ప్రధాన రహదారులు గుంతలతో అధ్వానంగా మారాయి. వర్షాలకు దెబ్బతిని రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయి. నర్సీపట్నం నుంచి అడ్డు రోడ్డు మార్గంలో కైలాసపట్నం, గొట్టివాడ, రామచంద్రపురం సమీపంలో ఇందేశమ్మవాక వద్ద భారీ గుంతలు పడ్డాయి. రాజుపేట రహదారి గుంతలతో మారడంతో వర్షం నీరు వీటిలో చేరి ప్రమాదాలకు దారితీస్తోంది.

✦ తుపాన్ ప్రభావంలో అచ్యుతాపురం మండలం అప్పన్నపాలెం-చీమలాపల్లి రోడ్డు అధ్వానంగా మారింది. మండల కేంద్రానికి రావడానికి చీమలపల్లి, బంగారయ్యపాలెం గ్రామస్థులు ఈ రోడ్డుపై ఆధారపడుతున్నారు. వర్షాలకు బురద, గోతులతో ప్రమాదకరంగా మారింది. పిల్లల ఆటోలు, బస్సులు బురదలో చిక్కుకుపోతున్నాయి. కనీసం గ్రావెల్ వేసి చదును చేయించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల అభివృద్ధికి చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

గోతులతో అప్పన్నపాలెం-చీమలాపల్లి రోడ్డు

పోలవరం కాలువకు జలకళ

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పోలవరం ఎడమ కాలువ జలకళతో ఉట్టిపడుతోంది. పాయకరావుపేట నుంచి తాళ్లపాలెం వరకు కాలువ తవ్వకం పనులు చేపట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే మండలంలోని పి.ఎల్.పురం, సీతారాంపురం, నక్కపల్లి మండలంలోని దేవవరం, ఎస్.రాయవరం మండలాల పరిధిలో దాదాపు కాలువ తవ్వకం పనులు పూర్తయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కాలువల్లోకి భారీ వరద నీరు చేరింది. దీంతో నీటితో కళకళలాడుతోంది. కాలువలో నీటిని మోటార్ల ద్వారా పొలాలకు మళ్లించి ఈ ప్రాంతంలో కూరగాయలు, వరి పండిస్తుంటారు. తాజాగా నీరు చేరడంతో పి.ఎల్.పురం, సీతారాంపురం తదితర గ్రామాల పరిధిలో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. రబీ సీజన్‌కు ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొంటున్నారు.

పి.ఎల్.పురం వద్ద కాలువలో నీరు

మొదలైన పనులు

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: తుపాన్ కారణంగా వారం రోజులుగా నిలిచిపోయిన పోలవరం ఎడమ కాలువ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. పాయకరావుపేట శివారు దుర్గాకాలనీ, రెల్లికాలనీ, రేఖవానిపాలెం తదితర ప్రాంతాల్లో యంత్రాల ద్వారా కొండవాలు ప్రదేశంలో మట్టి తవ్వకాలు చేసి చదును చేస్తున్నారు. డిసెంబర్ నెలాఖరు నాటికి దుర్గాకాలనీ నుంచి శిలువ కొండ వెనుక కాలువను పూర్తి చేసేందుకు పనులు జోరందుకున్నాయి

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: మండలంలో వెదురువాడ, గొర్లె, లంక, మెట్ట ధర్మవరాలు, మార్టూరు, అచ్యుతాపురం తదితర గ్రామాలకు సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కల్లుగీత కార్మికులకు ఆర్థిక సాయం

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: చెట్టుపై నుంచి జారిపడి మరణించిన, మంచానికి పరిమితమైన కల్లుగీత కార్మికులకు రాష్ట్ర శెటిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆర్థిక సాయం చేస్తారని సీహెచ్‌పురం కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు గుత్తుర్తి పాండురంగ తెలిపారు. గుర్రాజుపేటలో ఆదివారం సంఘ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ధ్రువపత్రాలను శెట్టిబలిజ కార్పొరేషన్ కార్యాలయానికి పోస్టల్ ద్వారా, స్వయంగా అందజేయాలని సూచించారు. నాయకులు దమ్ము అప్పారావు, దుంగా అప్పలరాజు, పోలవరపు శ్రీను, మునసా సత్తిబాబు, పిల్లి ముసలయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సాయం అందించాలి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పూడిమడకలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సాయం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శంకరరావు కోరారు. అచ్యుతాపురంలో ఆదివారం సీపీఎం నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అచ్యుతాపురం కూడలిలో ఫ్లైఓవర్ నిర్మాణం పనులను అస్తవ్యస్తంగా నిర్వహిస్తున్నారన్నారు. ట్రాఫిక్ మళ్లింపుతో దిబ్బపాలెం, వెదురువాడ పరిధిలో రోడ్లు ధ్వంసం అయ్యాయన్నారు. నాయకులు కర్రి అప్పారావు, రొంగలి రాము, సోమునాయుడు, బొడ్డే రామ్‌కుమార్, చేపల తాతయ్య పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో 15 మందికి గాయాలు

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలోని వేల్పులవీధిలో పిచ్చి కుక్క స్వైరవిహారం చేసింది. రెండు రోజుల్లో 15 మందిని గాయపరిచింది. బాధితులు ఎన్టీఆర్ ఆసుపత్రికి క్యూకట్టారు. వీరిలో చిన్నారులు, మహిళలు, వృద్ధులు ఉన్నారు. జీవీఎంసీ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించలేదని బాధితులు చెబుతున్నారు.

కోడి పందేలపై దాడి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: వెంకుపాలెం శివారులో ఆదివారం సాయంత్రం కోడి పందేల శిబిరంపై గ్రామీణ పోలీసులు దాడి చేశారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రెండు కోళ్లు, రూ. 1100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు గ్రామీణ ఎస్సై రవికుమార్ తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎలమంచిలి: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు కోరారు. ఆదివారం ఎలమంచిలిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్మికులందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. వరదల కారణంగా ప్రజల సేవలకు ఇబ్బంది లేకుండా సమ్మెను వాయిదా వేశామని, ఆరోగ్య బీమా అమలు చేయాలన్నారు. నాయకులు వై.నూకరాజు, సీహెచ్ వెంకటరమణ, డి.మహేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా శారదానది

ఎలమంచిలి: మైనర్ శారదానది ప్రమాదకరంగా మారింది. గ్రామాల కంటే పలుచోట్ల ఎత్తులో ప్రవహిస్తోంది. గట్లు కూడా అంతంత మాత్రంగా ఉండటంతో నీరు లీకవుతోంది. వర్షాలు తగ్గినా రహదారులపైకి నీరు ప్రవహిస్తోంది. ఈ నీటిలోనే వాహన చోదకులు ప్రయాణాలు సాగిస్తున్నారు. ఎలమంచిలి పరిధిలోని సోమలింగపాలెం నుంచి నారాయణపురం రోడ్డు నది గట్టు పక్క నుంచే ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని వరదగట్లకు రెండువైపులా రాతి పేర్పు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బురదగా మారిన సోమలింగపాలెం రోడ్డు

కూలిన విద్యుత్తు స్తంభం

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: గుంటపల్లి గ్రామంలో విద్యుత్తు స్తంభం కూలిపోయింది. ఆ ప్రదేశంలో ఎవరూ లేకపోవడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన శనివారం రాత్రి జరిగింది. దీంతో గ్రామంలో అంధకారం నెలకొంది. జనసేన నాయకులు గెడ్డం బుజ్జి విద్యుత్తు అధికారులకు ఈ సమాచారం అందజేయడంతో సిబ్బంది గ్రామానికి చేరుకుని కొత్త స్తంభం ఏర్పాటు చేసి సరఫరా పునరుద్ధరించారు. ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. దీనిపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముంపు నుంచి కాపాడిన మడ అడవులు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: తుపాన్ ప్రభావంతో పోటెత్తిన ఉప్పుటేరు నుంచి పూడిమడక గ్రామాన్ని మడ అడవులు కాపాడాయి. నీటిప్రవాహం గ్రామంలోకి వెళ్లకుండా అడ్డుకుని రక్షణగా నిలిచాయి. పూడిమడక చుట్టూ విస్తరిస్తున్న మడ అడవులు కాకినాడ కోరంగిని గుర్తుచేస్తున్నాయి.

పూడిమడకకు రక్షణగా..

ముమ్మరంగా మొక్కల పెంపకం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి గ్రీన్ క్లబ్, పౌర్ణమి సేవా సంస్థల సంయుక్త నిర్వహణలో ఆదివారం మొక్కలు నాటారు. అనకాపల్లి పట్టణాన్ని ఆనుకొని ఉన్న శారదానది గట్టు, పరుశురామ్‌పేట ప్రాంతాల్లో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఆళ్ల రామచంద్రరావు, పౌర్ణమి సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీపీ నారాయణరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రీన్ క్లబ్ అధ్యక్షుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, విశ్రాంత ఎస్ఐ గోపాలరావు, నాయుడు, ఆడారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న గ్రీన్‌క్లబ్ సభ్యులు

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతతో గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొక్కిరాపల్లి కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం గ్రామజ్యోతి యువతీ, యువకులు రోడ్డుకిరువైపులా ఉన్న తుప్పలను తొలగించారు. రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గోతులను పూడ్చారు.

పేదల ఆరోగ్యానికి సీఎం సహాయ నిధితో భరోసా

అనకాపల్లి గ్రామీణం, కొత్తూరు, కశింకోట, న్యూస్‌టుడే: సీఎం సహాయ నిధి పేదల ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తోందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. అనకాపల్లి మండలం రేబాక, గోపాలపురం, గొలగాం, అక్కిరెడ్డిపాలెం, శంకరం, వేటజంగాలపాలెం, సుందరయ్యపేట, కశింకోట మండలం కశింకోట, బయ్యవరం, జమాదులపాలెం, సుందరయ్యపేట, కన్నూరుపాలెం, తీడ, ఏనుగుతుని గ్రామాల్లో ఆదివారం సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. తెదేపా అధ్యక్షుడు కర్రి వెంకట సన్యాసినాయుడు, ఏఎంసీ ఛైర్మన్ రాము, ఎంపీటీసీ సభ్యుడు గణేష్ పాల్గొన్నారు. ఆదివారం సీఎం సహాయనిధి చెక్కులను ఇంటింటికి వెళ్లి అందజేశారు.

✦ కోడూరు భూపతిపాలెంకు చెందిన జనసేన కార్యకర్త రాకోటి అర్జునరావు మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ అందజేశారు. పార్టీ ఎల్లప్పుడు కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. అనంతరం సీఎం సహాయ నిధి చెక్కులను బాధితులకు అందజేశారు.

జంగాలపాలెంలో చెక్కు అందజేస్తున్న పీలా గోవింద

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

అచ్యుతాపురం, పాయకరావుపేట గ్రామీణం, ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: కష్టాల్లో ఉన్న ప్రజలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదుకుంటున్నారని జనసేన కార్యదర్శి మోటూరు శ్రీవేణి తెలిపారు. మడుతూరులో ప్రభుత్వం సమకూర్చిన బియ్యాన్ని ఆదివారం పేదలకు ఆమె పంపిణీ చేశారు. నాయకులు ఇందల సూరిబాబు, సంతోష్, శ్రీనివాసరావు, చిన్న, సన్యాసినాయుడు, వెంకటరమణ పాల్గొన్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన నిత్యావసర సరకులను ఎస్.రాయవరంలో 11 మంది బాధితులకు సోమిరెడ్డి రాజు, వెంకటనగరంలో తెదేపా సంప్రదాయ మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షులు వంకా రమణ అందజేశారు.

మత్స్యకారులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న తెదేపా నాయకులు

కార్మికులకు కరవు భత్యం పెంచండి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: గత ఆరు నెలల కరవు భత్యం పెంపులో కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకరరావు, జిల్లా అధ్యక్షుడు వీవీ శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు గంటా శ్రీరామ్ ఆరోపించారు. అనకాపల్లి సీఐటీయూ భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కంపెనీల యజమానులు భరించాల్సిన భారాన్ని కూడా రద్దు చేసి కార్మికులకు అన్యాయం చేశారన్నారు. దీనిపై ప్రభుత్వం కార్మికులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

రాంబిల్లి: కార్మికులకు కరవు భత్యం పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దేముడునాయుడు డిమాండు చేశారు. ప్రతి ఆరు నెలలకు కరవు భత్యం ఏమేరకు పెంచాలని ప్రభుత్వం విడుదల చేసేదని, ఈసారి కూటమి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా పెంచకుండా 50 లక్షల మంది కార్మికులకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. ఆదివారం రాంబిల్లి తుపాను రక్షిత భవనం వద్ద కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనలో నాయకులు శ్రీను, రమణ, నాగేశ్, శంకరరావు, నూకరాజు, భాస్కరరావు పాల్గొన్నారు.

కాశీబుగ్గలో తొక్కిసలాట దురదృష్టకరం

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట దురదృష్టకరమని మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎలమంచిలి తెదేపా కార్యాలయంలో ఆదివారం రాత్రి విలేకర్లతో మాట్లాడుతూ ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారన్నారు. ఈ ఘటన ప్రభుత్వానికి సంబంధం లేకపోయినా వైకాపా నాయకులు శవ రాజకీయం చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూడటం బాధకరమన్నారు. తెదేపా పట్టణ, అధ్యక్ష, కార్యదర్శులు గొర్లె నానాజీ, ఆడారి ఆదిమూర్తి, గొర్లె బాబూరావు, మజ్జి రామకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు, చలపతిరావు

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లి రెల్లి కాలనీలో రామాలయ పునర్నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, వీసం రామకృష్ణ, వీసం నానాజీ, కోసూరి శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు.

మునగపాక, న్యూస్‌టుడే: తోటాడ, గవర్ల అనకాపల్లిలో చేపట్టిన మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి మళ్ల ఈశ్వరరావు, దేవి దంపతుల కుమారులు, కుమార్తె రూ. 30 వేలు విరాళం ప్రకటించారు. ఈ విరాళాన్ని కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు.

తొలిసారి హేమగిరి ప్రదర్శన

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక వేత్తలు, భక్తులు, ప్రజాప్రతినిధుల సూచనల మేరకు తొలిసారిగా హేమగిరి ప్రదర్శనకు నిర్ణయించామని సత్యనారాయణపురం సత్యదేవుని ఆలయ కమిటీ ఛైర్మన్ అప్పికొండ గణేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉదయం 6 గంటలకు కొత్తూరు శారదా నగర్ డీఎస్పీ కార్యాలయం ఎదురుగా సత్యదేవుని ఆర్చి ముఖద్వారం నుంచి గిరి ప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు. కొండ చుట్టూ మూడు కిలోమీటర్ల ప్రదర్శన అనంతరం కొండపై, కింద ఉన్న ఆలయాల్లో దర్శనాలకు ఏర్పాటు చేశామన్నారు. ఈ గిరి ప్రదర్శనలో భక్తులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ధర్మకర్తలు పొలమరశెట్టి నూకరాజు, సత్యవతి, అప్పారావు, నాగు, రాంబాబు, ఛాయాలత, స్వాతి, లలిత పాల్గొన్నారు.

కొండపై ఉన్న ఆలయం

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

మునగపాక, న్యూస్‌టుడే: వాడ్రాపల్లి దక్షిణేశ్వరస్వామిని వందలాది మంది భక్తులు దర్శించుకొన్నారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామికి పాలాభిషేకం, జలాభిషేకం చేశారు. ఆలయ ట్రస్టీ సూరిశెట్టి పరమేశ్వరరావు ఇక్కడి ఏర్పాట్లు పర్యవేక్షించారు. వెంకటాపురంలోని నీలకంఠేశ్వరస్వామిని వేలాది మంది భక్తులు దర్శించుకొన్నారు. సర్పంచి సుందరపు తాతాజీ పర్యవేక్షణలో భారీ ఎత్తున అన్నసమారాధన చేశారు. మునగపాకలో నూతనంగా ప్రతిష్ఠించిన త్రిమూర్తులు ఆలయ ప్రాంగణంలో వేలాది మందికి అన్నసమారాధన చేశారు.

అనకాపల్లి చౌడేశ్వరి ఆలయంలో పాల్గొన్న గాయకులు

భక్తిశ్రద్ధలతో శ్రీభగీరథీ అమ్మవారి పండగ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: హరిపాలెం-అందలాపల్లి శ్రీభగీరథీ అమ్మవారి నెల పండగ ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. అందలాపల్లికి చెందిన చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు ఘటాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. కోలాటం కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది.

హరిపాలెంలో ఘటాలతో మహిళలు

పాయకరావుపేటలో..

అనకాపల్లి, న్యూస్‌టుడే: గవరపాలెం శ్రీభోగలింగేశ్వర స్వామి దేవాలయంలో గోపూజ నిర్వహించారు. దేవస్థానం ఛైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పీలా లక్ష్మి సౌజన్య, ఈవో బి.మురళికృష్ణ పాల్గొన్నారు.

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి చినరాజుపేటలోని శ్రీ చౌడేశ్వరి సాంబశివ ఆలయంలో సంకీర్తనలు, కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. . వస్త్ర వ్యాపారి యర్రా విరూపాక్షేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ రెడ్డి వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల గజ్జె పూజ

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని కనకదుర్గ ఆలయంలో చిన్నారులు గజ్జె పూజ నిర్వహించారు. శాస్త్రీయ నృత్యంలో గజ్జె పూజ చేశారు. ఈ కార్యక్రమంలో నృత్యగురువు ఎం.శశికళ, సత్తిబాబు, దేవి, పావని పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722 | పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ?: అనకాపల్లి-మామిడిపాలెం రహదారిలో గోతులు పడ్డాయి. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. – అప్పలకొండ, అనకాపల్లి, ✓: పనులు జరుగుతున్నాయి. వీటిని వేగవంతం చేస్తాం. – ప్రభు, ఆర్‌అండ్‌బీ జేఈ

అనకాపల్లి, న్యూస్‌టుడే: ?: గాంధీనగరం ఉద్యానంలో పిల్లలు ఆడుకునేందుకు ఆటవస్తువులు లేవు. – బొడ్డు ప్రసాద్, అనకాపల్లి, ✓: ఆటవస్తువులు ఏర్పాటు చేస్తాం. – కె.చక్రవర్తి, జోనల్ కమిషనర్, అనకాపల్లి

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: పాయకరావుపేట సరయ్య చెరువు చుట్టూ తుప్పలు పెరిగిపోయాయి. – నాగరాజు, స్థానికుడు, ✓: పిచ్చిమొక్కలు తొలగించేందుకు చర్యలు చేపడతాం. – కె.డేవిడ్, ఈవో

?: పాయకరావుపేట న్యూకాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. చీకటిలో రాకపోకలు సాగించలేకపోతున్నాం. – జె.రాజు, పాయకరావుపేట, ✓: కాలనీలో కొత్తగా దీపాలు ఏర్పాటు చేస్తాం. – కె.డేవిడ్, ఈవో

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: పాయకరావుపేట చేపల మార్కెట్ బురద మారింది. లోపలికి అడుగుపెట్టేందుకు వీలుండటం లేదు. సౌకర్యాలు కల్పించాలి. – పి.గణేష్, స్థానికుడు, ✓: మార్కెట్‌లో గ్రావెల్ వేయిస్తాం. బురద లేకుండా చర్యలు చేపడతాం. – కె.డేవిడ్, ఈవో

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ?: అరట్లకోటలో ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు లేవు. రాత్రి వేళ వాహనాలు అదుపుతప్పితే కాలువలోకి దూసుకుపోతున్నాయి. అధికారులు రక్షణ చర్యలు తీసుకోవాలి. – మునిలి, అరట్లకోట, ✓: సంబంధిత అధికారులకు సమస్య వివరించి రక్షణ గోడలు నిర్మించేలా కృషి చేస్తాం. – డేవిడ్, డిప్యూటీ ఎంపీడీవో

?: పీఎల్ పురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఇక్కడ నుంచి పశువుల అక్రమ రవాణ జరుగుతోంది. అధికారులు కెమెరాల అమర్చి అక్రమ రవాణ నిరోధించాలి. – నాగరాజు, పాయకరావుపేట, ✓: పాలకవర్గంతో చర్చించి కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. – అప్పన్న, సీఐ

కోటవురట్ల, న్యూస్‌టుడే: ?: కోటవురట్ల ప్రధాన రహదారి పక్కన చెత్త కారణంగా దుర్వాసన వెదజల్లుతోంది. – అప్పారావు, కోటవురట్ల, ✓: చెత్తను తొలగించే చర్యలు తీసుకుంటాం. – చంద్రశేఖర్, ఎంపీడీఓ

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ?: ఎలమంచిలిలో వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉంది. వీటి బారిన పడి చాలా మంది గాయపడుతున్నారు. – ఎం.రమణ, ఎలమంచిలి, ✓: కుక్కలతో వీధుల్లో ఇబ్బందులు లేకుండా చేస్తాం. – ప్రసాదరాజు, కమిషనర్

అచ్యుతాపురం: ?: తంతడి-వాడపాలెం తీరంలో కొందరు రహస్యంగా ఇసుకను తవ్వుతున్నారు. – శ్రీనివాసరావు, వాడపాలెం, ✓: రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేసి తవ్వకాలు నిలుపుదలకు చర్యలు తీసుకుంటాం. – సత్యనారాయణ, తహసీల్దార్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ?: పూడిమడకలో చెత్తను నిరంతరం తొలగించకపోవడం వల్ల ఈమధ్య కురిసిన వర్షాలకు దుర్గంధం వస్తుంది. వెంటనే చెత్తను తొలగించాలి. – కోదండరావు, పూడిమడక, ✓: వీధుల్లో నిరంతరం చెత్తను తొలగిస్తున్నాం. పంచాయతీ బడ్జెట్‌లో ఎక్కువశాతం పారిశుద్ధ్య నిర్వహణకే ఖర్చుచేస్తున్నాం. – సరస్వతి, పంచాయతీ కార్యదర్శి

కింతాడలో తుప్పలు తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఉత్సాహం

కె.కోటపాడు, న్యూస్‌టుడే: అయ్యన్న డిగ్రీ, జూనియర్ కళాశాలల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కింతాడ జోగన్నపాలెం గ్రామాల్లో స్వచ్ఛందంగా చేపట్టిన సేవా కార్యక్రమాలతో రెండు గ్రామాలు చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా తయారవుతున్నాయి. ఆరోగ్యకేంద్రం, రహదారులు, నీటి పథకం తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అయ్యన్న విద్యాసంస్థల అధినేత ఖాసీం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు గాడి అప్పారావు, సీమసిరి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: గవరపాలెం దిబ్బవీధిలో ఆదివారం జరిగిన ఉచిత వైద్య శిబిరంలో 200 మంది రోగులకు పరీక్షలు చేశారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేసి 17 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. వీరికి శస్త్రచికిత్సలు ఉచితంగా చేస్తామని వైద్య శిబిర నిర్వాహకులు దొడ్డి వెంకటసత్యనారాయణ, యల్లపు సత్యనారాయణ పేర్కొన్నారు.

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: దిబ్బపాలెం సెజ్ కాలనీలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వీరిలో 20 మందిని శస్త్రచికిత్సల కోసం విశాఖ తరలించారు. మిగిలిన వారికి కళ్లద్దాలు, మందులు అందించారు. ప్రతినిధులు అనురాధ, స్వామినాయుడు, వైద్యులు అరుణ, క్యాంపు మేనేజర్ అరుణ్‌కుమార్, లక్ష్మి పాల్గొన్నారు.

రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆటలపైనా ఆసక్తి తప్పనిసరి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు ఆటలపైనా ఆసక్తి చూపాలని మున్సిపల్ కమిషనర్ బాకూరి ప్రసాదరాజు అన్నారు. ఆదివారం ఎలమంచిలి కాకివాని వీధిలో హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు కమిషనర్ బహుమతులు అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం మున్సిపాలిటీ పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆటల ద్వారా వ్యాయామం జరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. వైస్ ఛైర్మన్ ఆరెపు గుప్తా, కౌన్సిలర్ కట్టమూరి సుజాత, సాయి ప్రసన్న, నాయకులు చిన్నారావు, హరి పాల్గొన్నారు.

విద్యార్థినికి బహుమతి అందిస్తున్న కమిషనర్ ప్రసాదరాజు

(c) eenadu

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

పట్టించుకోకుంటే ప్రమాదమే...

గొలుగొండ, న్యూస్‌టుడే: చోద్యం నుంచి కృష్ణదేవిపేట మధ్య లింగంపేట వద్ద ప్రధాన రహదారిలో ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. మూడేళ్ల కిందట ఇక్కడ సిమెంటు తూరలతో నిర్మించిన కల్వర్టు అడుగుభాగంలో మట్టి కొట్టుకుపోయింది. దీంతో ఇక్కడి అప్రోచ్ క్రమంగా దిగిపోతోంది. దీనికితోడు పై నుంచి 20, 30 టన్నుల బరువుతో భారీ వాహనాలు తిరగడంతో ఈ పరిస్థితి నెలకొన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇక్కడి గుంత వద్ద ప్రమాదసూచికగా ఎర్రజెండా ఏర్పాటు చేశారు. ర.భ.శా. అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టక పోతే కల్వర్టు కూలిపోయే అవకాశం ఉందని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెండు తలలతో లేగదూడ జననం

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: జుత్తాడ గ్రామంలో రెండు తలలతో దూడ పుట్టింది. గ్రామంలో మళ్ల శ్రీను అనే రైతు ఆవులను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వాటిలో ఒక ఆవు రెండు తలలతో ఉన్న దూడకు జన్మనిచ్చింది. లేగదూడ ఆరోగ్యంగానే ఉందని రైతు శ్రీను తెలిపారు. ఈ దూడను చూసేందుకు పరిసర ప్రాంతాల నుంచి జనం తరలివచ్చి ఆసక్తిగా తిలకించారు.

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: బాహుబలి, ఆడి2: మాస్ జాతర ఆడి3: డ్యూడ్ బంగార్రాజు: మాస్ జాతర, రాజు: బాహుబలి
చోడవరం: శ్రీసాయిలక్ష్మి: కె. ర్యాంప్ సాయిలక్ష్మి: బాహుబలి, పూర్ణ: మాస్ జాతర

నిలబెట్టాలి... ప్రమాదాలను అరికట్టాలి!

మలుపులు, రద్దీ కూడళ్లు, ఇరుకు వంతెనలు వద్ద వాహనచోదకులను తగినంత దూరంలోనే అప్రమత్తం చేసేందుకు ఏర్పాటు చేసిన సౌరశక్తి ఆధారిత బ్లింకర్లు పలుచోట్ల నేలవాలుతున్నాయి. నర్సీపట్నం నుంచి తుని, తాళ్లపాలెం, చింతపల్లి, అడ్డురోడ్డు, కొత్తకోట వెళ్లే మార్గాల్లో దాదాపు ఎనిమిదేళ్ల క్రితం 40కిపైగా ఏర్పాటు చేశారు. వీటిలో 30శాతం బ్లింకర్లు ప్రస్తుతం నేలవాలడం, సౌరఫలకలు చోరీకి గురి కావడమో, లైట్లు వెలగకపోవడమో జరుగుతోంది. ప్రమాదాల నివారణకు ఉపయోగపడే వీటిని పునరుద్ధరించేందుకు ర.భ. అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు. ఈ విషయమై ఆ శాఖ ఏఈఈ నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా రోడ్డు నిర్వహణ పనులన్నీ పూర్తి చేయాలన్నది లక్ష్యమన్నారు. ఈ పనులు జరిగేటప్పుడు బ్లింకర్లు అన్నీ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. – న్యూస్‌టుడే, నర్సీపట్నం అర్బన్

నర్సీపట్నం అబీద్‌కూడలిలో వాలిపోయి..

చిరు ధాన్యాల సాగు.. రాబడి బాగు

నర్సీపట్నంలో రాగుల విత్తనాల ప్రదర్శన క్షేత్రం

కాలంతోపాటు జీవనశైలి మారిపోయి రోగాలు వెంటాడుతున్నాయి. ఫలితంగా జనంలో ఆరోగ్య స్పృహ పెరుగుతోంది. ఒకప్పుడు పల్లెలకే పరిమితమైన పేదల ఆహారమైన చిరుధాన్యాలపై ఇప్పుడు అందరూ మోజు చూపుతున్నారు. వీటి సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహన్ని అందిస్తోంది. జాతీయ ఆహార భద్రత పోషకాహార మిషన్ (ఎన్ఎఫ్ఎస్ఎం) 2025-26 ఏడాదికి ఈ చిరుధాన్యాల సేద్యం పెంచేందుకు నిర్ణయించింది. జిల్లాలో వ్యవసాయాధికారులు ప్రదర్శనా క్షేత్రాలు ఏర్పాటు చేసి అధిక దిగుబడుల సాధనకు చేయూతనిస్తున్నారు. – న్యూస్‌టుడే, నర్సీపట్నం

✦ ఈ ధాన్యాల సుస్థిర దిగుబడి సాధన లక్ష్యంగా కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు. మెరుగైన సాగు పద్ధతులకు తోడు యూనిట్ విధానంలో రైతులను సంఘటితం చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ తక్కువ నీరు, పెట్టుబడులతో అధిక పోషక విలువలతో కూడిన ఈ పంటలను సాగుచేయవచ్చు. ఈ నేపథ్యంలో మేలైన దిగుబడులతో రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రత్యేకంగా రాగుల విస్తీర్ణం పెంపునకు కృషి చేయనున్నారు.

✦ ఎంతో లాభదాయకమైన వీటి సాగుకు రైతులంతా ముందుకు రావాలని జిల్లా వ్యవసాయాధికారి రామోహనరావు కోరారు. రాయితీలను వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో అవకాశం ఉన్న ఒక్కో మండలానికి వంద ఎకరాల విస్తీర్ణంలో ఇవి సాగు చేసుకోవచ్చన్నారు. వంద టన్నుల వరకు ఉన్నట్లయితే మార్క్‌ఫెడ్ ద్వారా ధాన్యం సేకరణకు సైతం ప్రభుత్వం ఏర్పాట్లు చేపట్టనుందని తెలిపారు.

✦ చిరుధాన్యాలైన రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు తదితర వాటికి ఇప్పుడు మార్కెట్టులో డిమాండ్ అధికంగా ఉంది. సాగు విస్తీర్ణం పెంచేలా ప్రభుత్వం సహకరిస్తున్న దృష్ట్యా వీటితో రైతులకు మంచి రాబడి సమకూరనుంది. జిల్లాలో ఈ ఏడాది రబీ సీజన్లో ఈ ధాన్యాల సేద్యానికి లక్ష్యాలు నిర్దేశించే దిశగా సన్నాహలు చేస్తున్నారు. రైతులకు 50 శాతం రాయితీతో విత్తనాలు, విత్తన శుద్ధి రసాయనాలు, సూక్ష్మ పోషకాలు, కలుపు మందులు అందజేయనున్నారు. మినుములకు హెక్టారుకు రూ.9 వేలు, రాగులకు రూ.7,500 చొప్పున లబ్ధి చేకూరే అవకాశం ఉంది.

దాతృత్వం చాటిన సద్భావన బృందం

చోడవరం, న్యూస్‌టుడే: చెట్టుపై నుంచి గాయాలపాలైన బొత్సా శ్రీనివాసరావు కుటుంబానికి చోడవరం పట్టణానికి చెందిన సద్భావన బృందం సభ్యులు చేయూతనందించారు. శ్రీనివాసరావు భార్యకు నిత్యావసర సరకులను బృందం సభ్యులైన సబ్‌రిజిస్ట్రార్ గీతాలక్ష్మి, దేవరపల్లి కుమారి, పిఎస్ఎన్.మూర్తి ఆదివారం అందజేశారు. మెడకు ఫిజియోథెరపీ చేయించేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు.

తుపానులోనూ నిరుపేదలకు న్యాయం

నాతవరం, న్యూస్‌టుడే: తుపానులో నిరుపేదలకు ప్రభుత్వం న్యాయం చేసిందని జనసేన నియోజకవర్గ బాధ్యుడు ఆర్.సూర్యచంద్ర పేర్కొన్నారు. ఆయన ఆదివారం మండల నాయకుల సమావేశంలో మాట్లాడారు. అత్యంత ప్రభావాన్ని చూపించిన తుపానును ప్రభుత్వం సమగ్రంగా ఎదుర్కొంటున్నారు. సహాయక శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. ఈ సందర్భంగా అధికారులను ఆయన అభినందించారు. తమ వంతుగా జనసేన పార్టీ నుంచి పలు సేవాకార్యక్రమాలు చేపట్టినట్టు పేర్కొన్నారు.

అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన దేవరాపల్లి

దేవరాపల్లి, న్యూస్‌టుడే : అయ్యప్ప నామస్మరణతో దేవరాపల్లి శనివారం రాత్రి మార్మోగింది. స్వామి మాలధారణ చేసిన మెడికల్‌స్టోర్ యజమాని కారినాయుడు దంపతుల సహకారంతో అంబలం పూజ రామాలయ ప్రాంగణంలో జరిగింది. గురుస్వామి మోరా అప్పలకొండ, అర్చకులు లక్ష్మీపతి శర్మ, సంతోష్ పంతులు తదితరుల ప్రోత్సాహంతో జరిగిన ఈ కార్యక్రమానికి అధికసంఖ్యలో అయ్యప్ప, శివయ్య, హనుమాన్ మాలధారులు భక్తులు తరలివచ్చారు.

అంబలం పూజలో మాలధారులు

జ్ఞాపిక అందుకుంటున్న శ్రీరామ్మూర్తి

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాలు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: విశాఖలో ఆదివారం మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో కె.కోటపాడుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పూడి శ్రీరామ్మూర్తి జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో, షాట్‌పుట్ విభాగాల్లో ప్రథమస్థానంలో నిలిచారు. విశాఖ అనకాపల్లి జిల్లాలకు చెందిన 30 ఏళ్ల వయస్సు పైబడిన వారికి ఈ పోటీలను నిర్వహించారు. 65ఏళ్ల వయస్సు విభాగంలో పతకాలు సాధించిన శ్రీరామ్మూర్తికి నిర్వాహకులు కేఎస్ఆర్ రాజ్ బహుమతులు, జ్ఞాపికను అందజేశారు.

వివాహ విందుకు ప్రముఖుల హాజరు

బుచ్చెయ్యపేట: హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు కుమారుడు వంశీ, పూజిత వివాహ రిసెప్షన్ ఆదివారం వడ్డాదిలో ఏర్పాటైంది. హోంమంత్రి అనిత, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, కేఎస్ఎన్ఎస్ రాజు, సుందరపు విజయకుమార్, ఎమ్మెల్సీ ... చైర్‌పర్సన్ పీలా గోవింద సత్యనారాయణ, పీవీజీ కుమార్, కోళ్ల బాలాజీ, డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు, మాజీ మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, అవంతి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ప్రముఖుల రాక సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వివాహ వేడుకలో హోంమంత్రి అనిత తదితరులు

కరుణ చూపని వరుణుడు.. కడుపు నిండని బతుకులు

చోడవరం, న్యూస్‌టుడే

మొంథా తుపాను, గత నెల రోజులుగా తరచూ కురుస్తున్న వర్షాలు కుమ్మరుల పాలిట శాపంగా మారాయి. అసలే అంతంతమాత్రంగా ఉన్న వృత్తికి వర్షాల రూపంలో పనిలేక అలమటిస్తుంటే ఈ వర్షాల కారణంగా ఉన్న కొద్దోగొప్పో ఉపాధి కూడా లేకుండా పోతోందని గగ్గోలు పెడుతున్నారు. ఒకప్పుడు ఏ గ్రామానికి వెళ్లినా మన్ను అంటిన దేహంతో కుమ్మరివారు తిప్పుతూ ఎందరో కనిపించేవారు. ప్రస్తుతం మారుతున్న కాలంతోపాటు ఈ దృశ్యాలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. మట్టిపాత్రలకు ప్రాధాన్యం క్రమంగా తగ్గిపోవడంతో వీరంతా ఇటుక బట్టీల్లో కూలీలుగా మారుతున్నారు.

◆ చోడవరం పంచాయతీ శివారు రేవళ్లు గ్రామమైన పకీరుసాహెబ్‌పేటలో 20కు పైగా కుటుంబాలు సంతతిగా ఇంకా పూర్వం నుంచి ఇదే జీవనం సాగిస్తున్నారు. డిమాండ్ పెద్దగా లేకపోయినా ఇంకా మట్టి పాత్రలు, వస్తువులను తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వర్షాల కారణంగా తయారుచేసినవి పాడైపోతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికే తయారు చేసిన వస్తువులను సైతం కొలిమిలో కాల్చలేక పోతున్నామని చెబుతున్నారు.

ఓ ఇంట్లో దాచిన తయారు చేసిన మట్టి పరికరాలు

◆ సంతల్లో మట్టి పాత్రల అమ్మకాలు, దానికితోడు ఇంట్లో జరిగే వివిధ కార్యక్రమాలకు మట్టికుండలు తదితరాలు అవసరమయ్యేవి. తద్వారా ఏదో విధంగా ఉపాధి ఉండేది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా తయారుచేసిన మట్టి పాత్రలను కాల్చేందుకు నిర్మించిన రామ్‌ల చెరువులో కలిశాయి. గతంలో రామ్‌లకు ప్రభుత్వం స్థలం కాస్తా చెరువు గర్భంలో ఉండటం గ్రామపెద్దలు చెబుతుండటంతో కలిసిన మట్టిగిన్నెలు నిర్మించేందని వాపోయారు.

పని కోసం ఎదురు చూస్తున్న కుమ్మరులు

పాలకులు ఆదుకోవాలి...

వర్షాలు కారణంగా ఇంట్లోనే ఉండాల్సి వస్తుంది. ప్రభుత్వం షెడ్లు నిర్మాణం చేయడంతో పాటు వడ్డీలేని రుణాలు ఇచ్చి మా వృత్తిని ప్రోత్సహించాలి. అందరికీ అందిస్తున్నట్లే మాకు ఆర్థికసాయం చేయాలి. కార్యాలయాల్లో మట్టి కూజాలు, మట్టి గ్లాసులు వాడేలా చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం చేయడానికి పనుల్లేక యువకులు ఇటుకబట్టీల్లో పనికి వెళుతున్నారు. – చూరుకొండ వీరబాబు, గాంధీ, పొట్నూరి చెల్లారావు, శ్రీకాకుళం లోవరాజు, ఫకీరుసాహెబ్ పేట, చోడవరం

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

ప్రసన్నగౌరి

పరవాడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగం సాధించలేనేమోనన్న భయంతో మనస్తాపం చెంది వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం పరవాడలో ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక గండి వెంకటశివ రాఘవకు, నర్సీపట్నం దరి కొత్తవీధికి చెందిన ప్రసన్నగౌరి(29)తో ఈ ఏడాది ఆగస్టులో వివాహం జరిగింది. అప్పటి నుంచి భార్యాభర్తలు అన్యోన్యంగా ఉంటున్నారు. రాఘవ ఫుట్‌వేర్ దుకాణం నిర్వహిస్తుంటాడు. ప్రసన్న గౌరీ బీఎస్సీ, బీఈడీ పూర్తి చేసి టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్‌కు (టెట్) ప్రిపేర్ అవుతోంది. పెళ్లి అయిన తర్వాత తాను అనుకున్న విధంగా చదవలేకపోతున్నానని, టీచర్ ఉద్యోగం సాధించగలనో.. లేదో అని కొద్ది రోజులుగా తల్లికి చెబుతూ బాధ పడుతుండేది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం అల్పాహారం చేసి మొదటి అంతస్తులో ఉన్న గదిలో చదువుకునేందుకు వెళ్లింది. మధ్యాహ్నం భోజనం సమయం అయినప్పటికీ కిందకు రాకపోవడంతో భర్త వెళ్లి తలుపు కొట్టినా ఎంతకీ తెరవకపోవడంతో విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పాడు. తలుపులు పగులగొట్టి చూసేసరికి ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని వేలాడుతూ కనిపించింది. మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి వృథా అరికట్టరూ..

రామాయలం వద్ద వృథాగా పోతున్న తాగునీరు

మాకవరపాలెం, న్యూస్‌టుడే : మాకవరపాలెంలో జల్‌జీవన్ పథకంలో ఇంటింటి కుళాయిల ఏర్పాటు అధ్వానంగా మారింది. నివాసాలు లేనిచోట్ల, ఒకే ఇంటి వద్ద రెండు నుంచి మూడు కుళాయిలు, ఇంటికి దూరంగా కుళాయిలు ఏర్పాటు చేశారు. బీసీ కాలనీలో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేసి పాతవి తొలగించకపోవడంతో రెండింటి ద్వారా నీరు సరఫరా అవుతోంది. దీంతో తాగునీరు వృథాగా అవుతోంది. ఈ కారణంగా దిగువ ప్రాంతంలో ఉన్నవారు నీరందక ఇబ్బందులు పడుతునారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దూరప్రాంతాల నుంచి తెచ్చుకోలేకపోతున్నామని ఆయాప్రాంతాల మహిళలు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఉత్సాహం

కె.కోటపాడు, న్యూస్‌టుడే: అయ్యన్న డిగ్రీ, జూనియర్ కళాశాలల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కింతాడ జోగన్నపాలెం గ్రామాల్లో స్వచ్ఛందంగా చేపట్టిన సేవా కార్యక్రమాలతో రెండు గ్రామాలు చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా తయారవుతున్నాయి. ఆరోగ్య కేంద్రం, రహదారులు, నీటిపథకం తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అయ్యన్న విద్యాసంస్థల అధినేత ఖాసీం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు గాడి అప్పారావు, సీమసిరి రమణ తదితరులు పాల్గొన్నారు.

కింతాడలో తుప్పలు తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

శ్రమదానంతో తుప్పల తొలగింపు

తుప్పలు తొలగిస్తున్న ఎరుకుమాంబ యూత్ సభ్యులు

దేవరాపల్లి, న్యూస్‌టుడే : ఎ.కొత్తపల్లి శివారు అచ్చియ్యపాలెంకి చెందిన ఎరుకుమాంబ యూత్ రోడ్డుకి ఇరుపక్కల ఎదిగిన తుప్పలు, డొంకలను శ్రమదానంతో ఆదివారం తొలగించారు. దేవరాపల్లి-విశాఖ ప్రధాన తారురోడ్డు నుంచి గ్రామాన్ని కలుపుతూ వేసిన తారురోడ్డుకు ఇరువైపులా తుప్పలు, డొంకలు పెరిగిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీన్ని గుర్తించిన యువత కర్రలు, కత్తులు పట్టుకుని సుమారు 2కి.మీ రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుప్పలు, డొంకలు తొలగించి ప్రమాదాల నివారణకు తమ వంతు కృషి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చింతల సత్య వెంకటరమణ, ఉపసర్పంచి సరువునాయుడు, పెద్దాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్తిక వన సమారాధన

దేవరాపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని మారేపల్లి దొగ్గవారి కళ్లాల్లో చింతాలమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వనసమారాధన జరిగింది. ఈ సందర్భంగా ఉసిరిచెట్టు వద్ద భక్తులు పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన మహిళల కోలాటం అందరినీ ఆకట్టుకుంది. మధ్యాహ్నం నుంచి జరిగిన ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో జనం తరలివచ్చారు. చింతాలమ్మ సేవా సంఘ సభ్యులతో కలిసి మాజీ సర్పంచి అవుగడ్డ రామ్మూర్తినాయుడు, కోటిపల్లి నాయుడు, భాజపా మండలశాఖ అధ్యక్షురాలు అవుగడ్డ సత్యవేణి (నాయుడమ్మ) తదితరులు భోజనాలు వడ్డించారు.

భోజనాలు వడ్డిస్తున్న సంఘ సభ్యులు

గౌరీ పరమేశ్వరుల ప్రతిమ ఊరేగింపు

ఘనంగా గౌరీ పరమేశ్వరుల నిమజ్జనోత్సవం

చీడికాడ, న్యూస్‌టుడే : మండల కేంద్రం చీడికాడలో గౌరీ పరమేశ్వరుల నిమజ్జనోత్సం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముందు గౌరీ పరమేశ్వరుల ప్రతిమ గ్రామంలో ఊరేగించగా భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి.

ఘనంగా భూలోకమాంబ జాతర

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: రాయపురాజుపేట గ్రామంలో ఆదివారం భూలోకమాంబ జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి దూపదీప నైవేద్యాలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే రాజు, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, సర్పంచి రామునాయుడు, గంగాధర్, పూతి కోటేశ్వరరావు తదితరులు దర్శించుకున్నారు. మంత్రిని తెదేపా నాయకులు శాలువతో సత్కరించారు.

వలిసె సొగసు చూడతరమా!

ప్రకృతి అందాలకు నిలయమైన మన్యంలో కొండలమధ్య సాగు చేసిన వలిసె పూల సోయగాలు కనువిందు చేస్తున్నాయి. పసుపు రంగు తివాచీ పరిచినట్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కిలగాడ, దారెల, జర్రెల, జైపూర్ కూడలి, జలవిహారి ప్రాంతాల్లో గిరి రైతులు సాగు చేసిన వలిసెల అందాలను తిలకించేందుకు పర్యాటకులు పరుగులు తీస్తున్నారు. వంట నూనె కోసం సాగు చేసిన ఈ పూలు డిసెంబరు వరకు ఇక్కడ దర్శనమిస్తుంటాయి.

– ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

తాగునీటికి కటకట

రావికమతం, న్యూస్‌టుడే: ఆ గిరిజన గ్రామాల ప్రజలకు వర్షాకాలంలోనూ తాగునీటికి అవస్థలు తప్పడంలేదు. చీమలపాడు శివారు అజేయపురం, కల్యాణపులోవ, టి.అర్జాపురం శివారు పాత కొట్నాబిల్లి గిరిజనుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు జల్‌జీవన్‌మిషన్‌లో రూ.లక్షలు వెచ్చించి మంచినీటి ట్యాంకులు నిర్మించినా వాటిని వినియోగంలోకి తీసుకురాకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో అక్కడి గిరిజనం తీవ్ర తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

▼ ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా గిరిజన మహిళలు ఓచేత్తో బిందెలు, మరో చేత్తో గొడుగులు పట్టుకొని తాగునీటి కోసం కొండ గెడ్డలు వద్దకు వెళుతున్నారు. అక్కడి నుంచి నానా అవస్థలు పడుతూ నీళ్ల బిందెలు మోసుకొచ్చి అవసరాలు తీర్చుకుంటున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు, చంద్రయ్య, వాసు, రాజు, ప్రసాదు డిమాండు చేశారు.

▼ మంచినీటి ట్యాంకులను వినియోగంలోకి తీసుకురావాలని కొన్నాళ్లుగా గిరిజనులు కోరుతూ వస్తున్నారు. అజేయపురం, పాత కొట్నాబిల్లిలో మంచినీటి ట్యాంకులు వద్ద ఖాళీ బిందెలతో నిరసనలు చేపట్టారు. అయినా అధికారులు స్పందించలేదు. ఇప్పటికీ రక్షిత మంచినీటి పథకాలను వినియోగంలోకి తీసుకురాలేదు. జల్‌జీవన్‌మిషన్‌లో నిర్మించిన వాటర్ ట్యాంకులను పూర్తిచేసి గ్రామ పంచాయతీలకు అప్పగించలేదని అందుచేతనే తాము ట్యాంకులను నిర్వహించలేకపోతున్నట్లు పంచాయతీ అధికారులు చెబుతున్నట్లు గిరిజనులు వాపోతున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, గ్రామ పంచాయతీలు ఎవరికి వారుగా పట్టించుకోకుండా తాగునీటి సమస్యకు పరిష్కారం చూపలేదు.

గొడుగులేసుకొని నీరు తెచ్చుకోడానికి గెడ్డలకు వెళ్తున్న మహిళలు

చదువుతోనే జీవితాల్లో మార్పు

ఉద్యోగాలు సాధించిన వారిని సత్కరించిన ముద్రు ముత్యాలనాయుడు తదితరులు

చీడికాడ, న్యూస్‌టుడే: చదువుతోనే బతుకులు మారతాయనేదానికి ఇటీవల ఉద్యోగాలు సాధించిన వారి విజయ గాథలే నిదర్శనమని ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయ విశ్రాంత ఉపకులపతి ముద్రు ముత్యాలనాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయ, పోలీసు ఉద్యోగాల నియామకాల్లో చీడికాడ మండలం చుక్కపల్లికి చెందిన శ్రీను, సత్యనారాయణ, తులసి, అవతారం, గణేష్, నరసింహమూర్తిని ఉద్యోగాలు సాధించారు. గ్రామ ఉపాధ్యాయుడు బాయిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం రాత్రి చుక్కపల్లిలో వారికి పౌరసన్మానం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ముత్యాలనాయుడుతోపాటు గ్రామస్థులంతా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముత్యాల నాయుడు మాట్లాడుతూ మారుమాల పల్లె యువతంతా ఇటువంటి వారి విజయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఉద్యోగులు గ్రామాభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. గ్రామపెద్దలు పేరాపు అప్పారావు, పాలసంఘ అధ్యక్షుడు తాతారావు, మాజీ సర్పంచి నానాజీ, అప్పారావు, కృష్ణ పాల్గొన్నారు.

తొలిసారి హేమగిరి ప్రదర్శన

కొత్తూరు (అనకాపల్లి): ఆధ్యాత్మిక వేత్తలు, భక్తులు, ప్రజాప్రతినిధుల సూచనల మేరకు తొలిసారిగా హేమగిరి ప్రదర్శనకు నిర్ణయించామని సత్యనారాయణపురం సత్యదేవుని ఆలయ కమిటీ ఛైర్మన్ అప్పికొండ గణేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉదయం 6 గంటలకు కొత్తూరు శారదానగర్ డీఎస్పీ కార్యాలయం ఎదురుగా సత్యదేవుని ఆర్చి ముఖద్వారం నుంచి గిరి ప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు. కొండ చుట్టూ మూడు కిలోమీటర్ల ప్రదర్శన అనంతరం కొండపై, కింద ఉన్న ఆలయాల్లో దర్శనాలకు ఏర్పాటు చేశామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743	చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74740	చీడికాడ - 80085 74742

రోలుగుంట, న్యూస్‌టుడే: ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు రోలుగుంట నుంచి సరఫరా అయ్యే మెరుగైన తాగునీటిని అందించే రెగ్యులేటింగ్ విధానం కొండపాలెం సమీపంలో అధ్వానంగా తయారైంది. దీనివల్ల నీరు కలుషితమయ్యే ప్రమాదముంది. – నాగేశ్వరరావు, కొండపాలెం ✔: ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు మెరుగైన నీటిని అందించేందుకు సుమారు 8కి.మీ మేర పైపులైను అమర్చారు. తరచూ అవి పాడైనప్పుడు వీటిని తనిఖీ చేయాల్సి వస్తోంది. దీనిపై దృష్టిసారించి చర్యలు తీసుకుంటాం. – రమేష్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, రోలుగుంట

సీఐటీయూ మహాసభల కరపత్రం విడుదల

నర్సీపట్నం, న్యూస్‌టుడే: సీఐటీయూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు అడిగర్ల రాజు కోరారు. స్థానిక కలాసీల కాలనీలో ఆదివారం భవననిర్మాణ కార్మికుల సర్వసభ్య సమావేశంలో మహాసభల కరపత్రాలను ప్రదర్శించారు. వచ్చే జనవరి నెల 4న, విశాఖలోని ఆర్‌కే బీచ్ వద్ద సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వరహాలబాబు, పెంటయ్య, వరబాబు భద్రం తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ప్రదర్శిస్తున్న కార్మికులు

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పీడీఎస్ఓ నాయకులు

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: మత్తు వదులుదాం... మంచి సమాజం కోసం పోరాడదామంటూ ఈ నెల 4తేదీన చోడవరంలో నిర్వహించనున్న జిల్లా సదస్సును విజయవంతం చేయాలని రాష్ట్ర పీడీఎస్ఓ అధ్యక్షుడు భాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం గోవాడ సాంఘిక సంక్షేమ వసతిగృహం వద్ద కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ లక్ష్మీపురం రోడ్డులో వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో సదస్సు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ఓ నాయకులు సూరిబాబు, మల్లేశ్వరరావు, మోహన్, రాజు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కరవు భత్యం పెంచండి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: గత ఆరు నెలల కరువు భత్యం పెంపులో కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకరరావు, జిల్లా అధ్యక్షుడు వీవీ శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు గంటా శ్రీరామ్ ఆరోపించారు. అనకాపల్లి సీఐటీయూ భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కంపెనీల యజమానులు భరించాల్సిన భారాన్ని కూడా రద్దు చేసి కార్మికులకు అన్యాయం చేశారన్నారు. దీనిపై ప్రభుత్వం కార్మికులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు

లక్ష్మీకాంత్ స్క్రీన్-1
మాస్ జాతర

స్క్రీన్-2
కె ర్యాంప్

7న సీఐటీయూ కవాతు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 7న డాబా గార్డెన్స్ సరస్వతీ పార్కు నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు కవాతు నిర్వహిస్తామని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ.కుమార్ తెలిపారు. ఆదివారం జగదాంబ సిటూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖలో సీఐటీయూ 18వ మహాసభలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో 7న సీఐటీయూ అనుబంధ సంఘాల కార్మికులంతా ఎరుపురంగు దుస్తులు ధరించి కవాతులో పాల్గొంటారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సాయినగర్ ఎస్సీ, బీసీ కాలనీలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన భరించలేకపోతున్నాం. – డి.నర్సింగరావు ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – డిప్యూటీ ఎంపీడీవో, సబ్బవరం.

?: సబ్బవరం కోమటి వీధిలో వ్యర్థాలు పేరుకుపోయి కంపు కొడుతున్నాయి. – పి.నాగేశ్వరరావు. ✓: వ్యర్థాలను తొలగించే ఏర్పాటు చేస్తాం. – డి.ప్రసాదరావు, గ్రామ సర్పంచి, సబ్బవరం.

వేపగుంట, న్యూస్‌టుడే: ?: 93వ వార్డు విరాట్‌నగర్ చౌకదుకాణాల సమీపంలోని వీధి దీపాలు వెలగడం లేదు. – రామారావు ✓: వెలగని దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. – హరిబహదూర్, జీవీఎంసీ ఏఈ, జోన్–8

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలం నాయుడుపాలెం పంచాయతీ పరిధి వెంకటపతిపాలెంలోని సామాజిక భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో స్లాబ్ పెచ్చులూడి పడిపోతున్నాయి. – శ్రీను ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – రమేశ్ నాయుడు, ఎంపీడీవో, పరవాడ.

బాలుడిపై కోతి దాడి

కాలికైన గాయం

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి రాతిచెరువు ప్రాంతంలో ఆదివారం ఓ బాలుడిపై కోతి దాడి చేయడంతో తీవ్ర గాయమైంది. బాలుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. రాజుచెరువు ప్రాంతంలోని ఓ వ్యక్తి కుక్కలు, కోతులు పెంచుతున్నారు. కాలనీకి చెందిన బాలుడు ధనుంజయ్‌కుమార్ గుడికి వెళ్లి తిరిగి వస్తుండగా హఠాత్తుగా కోతి దాడి చేసింది. దీంతో కాలుకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు బాలుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. జనావాసాల మధ్య జంతువుల పెంపకాన్ని అరికట్టాలని బాలుడి తండ్రి సతీశ్‌కుమార్ అధికారులను కోరారు.

చేతి బోరు ప్రారంభం

సరిపల్లి (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి మండలం సరిపల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మీ గణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చేతి బోరును ఆదివారం ప్రారంభించారు. సర్పంచి గొర్లె రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు గొల్లవిల్లి వెంకటరమణ ముఖ్య అతిథులుగా పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో రమేశ్, సంతోష్ కుమార్, సన్నిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

ప్రసన్నగౌరి

పరవాడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగం సాధించలేనేమోనన్న భయంతో మనస్తాపం చెంది వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం పరవాడలో ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక గండి వెంకటశివ రాఘవకు, నర్సీపట్నం దరి కొత్తవీధికి చెందిన ప్రసన్నగౌరి(29)తో ఈ ఏడాది ఆగస్టులో వివాహం జరిగింది. అప్పటి నుంచి భార్యాభర్తలు అన్యోన్యంగా ఉంటున్నారు. రాఘవ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ప్రసన్న గౌరి బీఎస్సీ, బీఈడీ పూర్తి చేసి టీచర్ ఎలిజిబిలిటీ టెస్టుకు (టెట్) ప్రిపేర్ అవుతోంది. పెళ్లి అయిన తర్వాత తాను అనుకున్న విధంగా చదవలేకపోతున్నానని, టీచర్ ఉద్యోగం సాధించలేనేమోనని కొద్ది రోజులుగా తల్లికి చెబుతూ బాధ పడుతుండేది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం అల్పాహారం చేసి మొదటి అంతస్తులో ఉన్న గదిలో చదువుకునేందుకు వెళ్లింది. మధ్యాహ్నం భోజనం సమయం అయినప్పటికీ కిందకు రాకపోవడంతో భర్త వెళ్లి తలుపు కొట్టినా ఎంతకీ తెరవలేదు. దీంతో విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పారు. తలుపులు పగులగొట్టి చూసేసరికి ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని వేలాడుతూ కనిపించింది. మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి వర లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 60ఏళ్ల పైబడిన క్రీడాకారులకు నిర్వహించిన వివిధ పోటీల్లో నగరానికి చెందిన క్రీడాకారిణి బి.విజయలక్ష్మి మొదటి స్థానంలో నిలిచారు. ఆదివారం సూర్యాబాగ్ పోలీస్ బ్యారెక్స్ మైదానంలో 100 మీటర్ల పరుగును 20.4 సెకన్లలో పూర్తి చేసిన ఆమె, డిస్కస్‌త్రోను 14.30 మీటర్ల దూరం విసిరి ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో అతిథుల చేతుల మీదుగా బహుమతి అందించారు.

బహుమతి అందుకుంటున్న విజయలక్ష్మి

స్పెయిన్ పర్యటనకు జీవీఎంసీ కమిషనర్

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: మహా విశాఖ నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ సోమవారం స్పెయిన్ పర్యటనకు వెళ్తున్నారు. అక్కడి బార్సిలోనాలో నిర్వహించే స్మార్ట్‌సిటీ కాంగ్రెస్ ఎక్స్‌పో కార్యక్రమంలో పాల్గొని, 8న తిరిగి నగరానికి చేరుకుంటారని ప్రజా సంబంధాల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజారోగ్య విభాగంలో బినామీ డ్రైవర్లు

- ఇష్టానుసారంగా సిబ్బంది విధుల నిర్వహణ
- పట్టించుకోని అధికారులు, పాలకులు

వేపగుంట, న్యూస్‌టుడే: ప్రజారోగ్య విభాగంలో బినామీ డ్రైవర్లు పెరిగిపోతున్నారు. అనధికారికంగా కొందరు వీరిని నియమించుకొని వారే జీతాలు చెల్లిస్తున్నారు. దీనిపై జోనల్ కార్యాలయం అంతా జోరుగా చర్చ నడుస్తోంది. జోనల్ కార్యాలయం అధికారులు, జీవీఎంసీ ఉన్నతాధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారు కాకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత అని ప్రశ్నిస్తున్నారు.

వేపగుంట జోనల్ కార్యాలయం

ఇదీ బాగోతం..

వీధుల్లో చెత్తను తరలించేందుకు, వాహనాల్లో నింపేందుకు వేర్వేరుగా ప్రజారోగ్య విభాగంలో వాహనాలు ఉన్నాయి. కొన్ని వాహనాల డ్రైవర్లకు గుత్తేదారులు జీతాలు చెల్లిస్తున్నారు. మరి కొన్ని వాహనాల డ్రైవర్లకు జీవీఎంసీ చెల్లిస్తుంది. అయితే జీవీఎంసీ నుంచి జీతాలు తీసుకునే కొందరు డ్రైవర్లు వారి స్థానంలో అనధికారికంగా వారికి తెలిసిన వారిని డ్రైవర్లుగా పెట్టుకుంటున్నారు. వారికి వచ్చిన జీతంలో కొంత మొత్తాన్ని స్వయంగా వారే చెల్లించేస్తున్నారు. అనధికారికంగా పనిచేస్తున్న డ్రైవర్ల నైపుణ్యం కలిగిన

వినియోగంలో ఉన్న వాహనాలు

జోన్‌లో వినియోగంలో ఉన్న వాహనాల్లో గుత్తేదారుడు జీతాలు చెల్లిస్తున్న వాటిలో 73 క్లాప్ వాహనాలు, 2 బాబ్ క్యాట్లు ఉన్నాయి. 10 మ్యాక్సీక్యాబ్‌లు, 5 టిప్పర్లు, 3 పొక్లెయిన్‌లకు డ్రైవర్లుగా పని చేస్తున్న వారికి జీవీఎంసీ జీతాలు చెల్లిస్తుంది. జీవీఎంసీ నియమించిన డ్రైవర్లలో కొందరు పనిచేసేందుకు ఇష్టం లేక.. బినామీలను పెట్టుకుని.. వారు వేరే ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్నారు. స్వీపర్లుగా పనిచేస్తున్న కొందరు వాహనాలకు డ్రైవర్లుగా పనిచేస్తున్నారని పలువురు కార్మికులు చెబుతున్నారు. దీంతో వీధుల్లో చెత్త ఎత్తేందుకు సిబ్బంది సరిపోవడం లేదని వాపోతున్నారు.

ఎక్కడ నుంచైనా హాజరు..

డంపింగ్ యార్డు వద్ద వాహనం బయలుదేరే సమయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ కార్యదర్శుల పర్యవేక్షణలో విధులకు హాజరైనట్లు ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్ ద్వారా హాజరు వేసుకోవాలి. విధులు ముగించుకుని వచ్చినప్పుడు ఆ తరువాత హాజరు నమోదు చేసుకుని వాహనాన్ని అప్పగించేయాలి. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఇది ఎక్కడా జరగడం లేదు. ఇన్‌స్పెక్టర్లు వారి లాగిన్‌ను డ్రైవర్లకు ఇచ్చేస్తున్నారు. దీంతో డ్రైవర్లు ఎక్కడ నుంచైనా విధుల్లో చేరినట్లు హాజరు వేసుకునే అవకాశం ఉంటుంది. సమయానికి ఫొటో తీసి ఇన్‌స్పెక్టర్లకు, కార్యదర్శులకు పంపించేస్తున్నారు. అలా డ్రైవర్లు విధులకు వెళ్లకుండా అధికారులకు కాసులు చెల్లించి అనుకూలంగా మార్చుకుంటున్నారన్న వాదన వినిపిస్తోంది.

సమాధానం చెప్పలేక..

ఈ విషయమై ప్రజారోగ్య విభాగం అధికారులను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. వివరాలను తెలిపేందుకు వారి మొహం చాటేస్తున్నారు. ఏదో ఒక కారణం చెప్పి తప్పించుకు తిరుగుతున్నారు. దీనిపై వెంటనే సంబంధిత అధికారులు స్పందించి బినామీ డ్రైవర్లకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా కార్తిక దీపారాధన

భజనలు చేస్తున్న ఏకాహం భజన బృందం

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట సమీప రవినగర్ శేషాద్రి కొండపై కొలువైన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 24 గంటల ఏకాహం కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. రాత్రంతా ఆలయ ప్రాంగణంలో భక్తులు భజనలు చేసుకుంటూ స్వామిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్తిక దీపారాధన కార్యక్రమంలో భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస స్వామి ఏకాహం భజన బృందం సభ్యులను స్వామి వారి శాలువతో సత్కరించారు.

సరిపల్లి శివాలయంలో..

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, నాయకులు

సరిపల్లి (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆదివారం సరిపల్లి గ్రామంలోని స్వయంభూ మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఎమ్మెల్యే గోత్ర నామాలతో పరమ శివుడికి పంచామృతాభిషేకం జరిపారు. వేదమంత్రాలతో ఆశీర్వదించి శేష వస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేదారేశ్వరుడికి ఉసిరికాయల అభిషేకం

సుజాతనగర్‌లో..

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: కార్తిక శుద్ధ ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని సుజాతనగర్ హరిహర క్షేత్రంలో కొలువైన కేదారేశ్వర స్వామికి ఆదివారం ఉసిరికాయల అభిషేకం జరిగింది. అర్చకులు తొలుత పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం వేద మంత్రాల నడుమ ఉసిరి కాయలతో అభిషేకించి విశేష అలంకరణ చేశారు.

కిటకిటలాడిన జూ

పులుల ఎన్‌క్లోజర్ వద్ద సందర్శకులు

ఎండాడ, న్యూస్‌టుడే: కార్తిక మాసం రెండో వారం పురస్కరించుకుని ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో తరలి వచ్చారు. నెమలి నాట్యాలు.. చింపాజీల వయ్యారాలు.. వ్యాఘ్రాల గాండ్రిపులు వింటూ సందడి చేశారు. వన్యప్రాణులతో పలువురు ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సందడిగా గడిపారు. జూకు 3213 మంది రాగా రూ.2.68 లక్షల ఆదాయం వచ్చినట్లు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. సమీప కంబాల కొండ పార్కుకు 350 మంది రాగా రూ.25 వేలు ఆదాయం వచ్చిందని రేంజ్ అధికారి శాస్త్రి వెల్లడించారు.

మురుగు పారే మార్గమేది..?

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి అమ్మా భగవాన్ ఆలయం సమీపంలోని ఓ వీధిలో మురుగు తిష్ఠ వేసింది. ఈ ప్రాంతంలో సరైన మురుగు నీటి వ్యవస్థ లేకపోవడంతో వీధిలోని ఓ బహుళ అంతస్తుల భవనంలోని నివాసాల నుంచి వచ్చే మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. కచ్చా రోడ్డు కావడంతో మురుగంతా నిలిచిపోయి తీవ్రమైన దుర్వాసన వస్తోందని నివాసితులు వాపోతున్నారు. మురుగు కారణంగా దోమలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

చోరీలు పునరావృతం చేస్తే చర్యలు..

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి నేర విభాగం పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీలు, ఇళ్ల దొంగతనాలు, గొలుసు దొంగతనాలు తదితర నేరాలు పునరావృతం చేస్తే కఠిన చర్యలు తప్పవని నేర విభాగం ఎస్సై డి.సూరిబాబు హెచ్చరించారు. ఆదివారం స్టేషన్ పరిధిలోని 30మంది సస్పెక్ట్ షీట్ హోల్డర్లకు కౌన్సెలింగ్ జరిగింది. ఎస్సై మాట్లాడుతూ నేరాలు కొనసాగిస్తే పీడీ చట్టం నమోదు చేసి నగర బహిష్కరణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెందుర్తి శాంతి భద్రతల విభాగంలో సీఐ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ జరిగింది.

కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న నేర విభాగం ఎస్సై సూరిబాబు

అనాథాశ్రమంలో రగ్గుల పంపిణీ

బాలలకు రగ్గులు పంపిణీ చేసిన సత్యసాయి భజన మండలి ప్రతినిధులు

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: సత్యసాయి శత జయంతి సందర్భంగా జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్‌లోని సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం రగ్గులు పంపిణీ చేశారు. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం కొత్త సుంకరపాలెంలోని హోయినా అనాథాశ్రమంలో బాలలకు వీటిని అందించారు. తొలుత సుజాతనగర్‌లోని సత్యసాయి భవనం వద్ద ఆటో డ్రైవర్లకు సత్యసాయి చిత్ర పటాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భజన మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రికెట్ అభిమానుల సందడి

పరవాడ, న్యూస్‌టుడే: మహిళల వన్డే ప్రపంచ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం భారత్- దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగిన సందర్భంగా పరవాడలో పండగ వాతావరణం నెలకొంది. యువత జాతీయ పతాకాలను పట్టుకొని సందడి చేశారు. పరవాడ సామాజిక భవనం వద్ద స్థానిక తెదేపా నాయకులు వర్రి చంద్రశేఖర్, పైలా కృష్ణ, బుజ్జి, చిన అక్కునాయుడు ఆధ్వర్యంలో మ్యాచ్‌ను వీక్షించేందుకు భారీ తెరను ఏర్పాటు చేశారు. యువత పెద్ద ఎత్తున ఇక్కడకు చేరుకొని మ్యాచ్‌ను వీక్షించారు.

సంతబయలులో మ్యాచ్‌ను వీక్షిస్తున్న అభిమానులు

రాష్ట్రస్థాయి పాటల పోటీలు ప్రారంభం

మెగా కల్చరల్ షోను ప్రారంభిస్తున్న క్లబ్ అధ్యక్షులు, ఉక్కు జీఎం ఎం.మధుసూదనరావు

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే : స్టీల్ క్లబ్ ఆడిటోరియంలో ఆదివారం రాష్ట్రస్థాయి పాటల పోటీలు ఘనంగా నిర్వహించారు. స్టీల్ క్లబ్ అధ్యక్షులు, ఉక్కు జీఎం ఎం.మధుసూదనరావు ఈ కార్యక్రమం ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి 31 మంది ఇందులో పాల్గొని పాటలు పాడారు. కార్యక్రమంలో జీఎం వి.చిట్టిబాబు, క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి వై.రవికుమార్, కోశాధికారి వేణుగోపాల్, కె.రంగనాథం, బి.వి.రమణ, కె.రమేష్‌కుమార్, ఎ.రమేష్, వి.ఎన్.బి.రాజు, ఎం.భువన్ కుమార్, కె.ఎల్.నరసింహం, ఎం.కృష్ణ, వెంకటరాజు పాల్గొన్నారు.

సైనికునికి ఘన స్వాగతం

అగనంపూడి, న్యూస్‌టుడే: భారత సైన్యంలో హవల్దారుగా 17 ఏళ్లపాటు సేవలందించిన సైనికుడికి ఆదివారం స్వగ్రామంలో ఘన స్వాగతం లభించింది. అగనంపూడి పరిధి పెదమడక కాలనీకి చెందిన బంధం పెంటారావు మద్రాస్ ఇంజినీర్ రెజిమెంట్‌లో విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేశారు. విశ్రాంత సైనికునిగా తొలిసారిగా ఇంటికి వచ్చిన ఆయనను పెదమడక యూత్ ఆధ్వర్యంలో కాలనీలో ఊరేగించారు. పూలు చల్లుతూ దేశభక్తి గీతాలతో ఘనంగా స్వాగతం పలికారు.

ఏపీఐఐసీ నిర్వాసితులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

అక్కిరెడ్డిపాలెం(ఆటోనగర్), న్యూస్‌టుడే : జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో ఆదివారం సాయంత్రం ఏపీఐఐసీ నిర్వాసితుల సమావేశం జరిగింది. వివిధ కులసంఘాల నాయకులు, గ్రామాభివృద్ధి సంఘం ప్రతినిధులు, నిర్వాసితుల సంఘం ప్రతినిధులు, నిర్వాసితులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి మాట్లాడుతూ ఏపీఐఐసీ నిర్వాసితులకు ప్రభుత్వం వెంటనే ఇండ్ల స్థలాలు కేటాయించాలన్నారు. నిర్వాసిత సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం దీనిని తాత్సారం చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు కొల్లి అప్పలరెడ్డి, నావన సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

దానపృతల్లి అమ్మవారి పండగ

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: ఉక్కు నిర్వాసిత కాలనీ దుగ్గపువానిపాలెంలో వేంచేసిన దానపృతల్లి అమ్మవారి పండగ గోడపత్రికను ఆలయ కమిటీ ఆదివారం ఆవిష్కరించింది. 8న అమ్మవారి సారె, ముర్రాట పండగ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బొడ్డ గోవింద్, డీవీ అప్పారావు, బొడ్డ సన్యాసిరావు, ప్రగడ శ్రీనివాసరావు, దుగ్గపు నర్సింహమూర్తి, పిన్నింటి సంతోష్, పి.శంకర్రావు, పూడి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

మన ఆలయాలు భద్రమేనా..?

- ప్రయివేటు ఆలయాలపై కొరవడిన పర్యవేక్షణ
- పటిష్ఠ ఏర్పాట్లతోనే ప్రమాదాల నివారణ

పెందుర్తి, న్యూస్‌టుడే

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో శనివారం చోటు చేసుకున్న తొక్కిసలాటలో 9మంది భక్తులు దుర్మరణం చెందిన నేపథ్యంలో ఆలయాల్లో భక్తులు రద్దీని తట్టుకునేందుకు చేస్తున్న ఏర్పాట్లపై చర్చ జరుగుతోంది. విశాఖ జిల్లాలో వేలాది ఆలయాలుండగా అందులో దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఆలయాలు అతి స్వల్పమేనని చెప్పవచ్చు. పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆలయాలపై ఆశాఖ పర్యవేక్షణ లేకపోవడంతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఆలయాల నిర్మాణం, నిర్వహణ, పర్యవేక్షణపై ఒక స్పష్టమైన విధానం లేకపోవడంతో ఆలయ కమిటీల ఇష్టారాజ్యం జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వేంకటాద్రిపై ఏర్పాటు చేసిన క్యూలైన్లలో భక్తులు

పెందుర్తి మండలంలో పెద్ద ఆలయాలు.. పెందుర్తి మండలంలో అనేక దేవాలయాలుండగా భక్తుల రద్దీ అధికంగా ఉండే పెద్ద ఆలయాలు కూడా ఉన్నాయి. వేంకటాద్రిపై కొలువుదీరిన శ్రీనివాసుడి ఆలయానికి నిత్యం భక్తుల రద్దీ ఉంటుంది. శని, ఆదివారాల్లో పదివేలకు పైగా దర్శనం చేసుకుంటారు. పండగలు, పర్వదినాల్లో ఆ సంఖ్య 30 వేలకు చేరుతోంది. గత ఏడాది వైకుంఠ ఏకాదశి నాడు 50 వేల వరకు భక్తులు దర్శనం చేసుకున్నారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఉన్న ఈ ఆలయంలో భక్తుల రద్దీని తట్టుకునేందుకు శాశ్వత ఏర్పాట్లు లేవు. క్యూలైన్లు, వాహనాల పార్కింగ్, ఎండావానలకు నీడ వంటి సదుపాయాలు పూర్తిస్థాయిలో లేవు. భక్తుల రద్దీ సమయంలో భక్త బృందాల సభ్యులే సేవలందిస్తుంటారు. పెందుర్తి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఆ దిశగా దేవాదాయశాఖ కార్యాచరణ రూపొందించాలి.

కమిటీలు దృష్టి సారించాలి..

కొన్ని ప్రయివేటు ఆలయాల్లో ఇష్టారాజ్యం నడుస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయ కమిటీలు పండగలు, పర్వదినాల సమయంలో అధిక ధరలకు టికెట్లు విక్రయించి భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నాయి. కార్తికమాసం నేపథ్యంలో సోమవారాల్లో శివాలయాలకు వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. వారంతా దర్శనాల కోసం క్యూలైన్లలో వేచి ఉంటున్నారు. ముందుగా దర్శనాలు చేసుకోవాలన్న తలంపుతో కొన్నిసార్లు తోపులాటలు జరుగుతున్నాయి. భక్తుల క్రమబద్ధీకరణపై ఆలయ కమిటీలు దృష్టి సారించాల్సి ఉంది.

నిబంధనల అమలుతోనే భద్రత

ఆలయాల నిర్మాణం చేయాలంటే దేవాదాయశాఖ నుంచి అనుమతులు తీసుకోవాలన్న నిబంధన అమలు చేసినప్పుడే భక్తులకు భద్రత లభిస్తుందని పలువురు నిపుణులు సూచిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాలు, నీటి వనరుల్లో ఆలయాలు నిర్మించడంతో పాటు పూజలు, సేవలు, దర్శనాల పేరిట భక్తుల నుంచి వసూళ్లను కూడా నియంత్రించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయాలని పేర్కొన్నారు.

ఉద్యానవనం .. ఆహ్లాదానికి దూరం

ఫోకస్

పెందుర్తి, న్యూస్‌టుడే: సువిశాలమైన ప్రాంగణం. చుట్టూ నిర్మించిన ప్రహరీ. ఇదేదో అందమైన ఉద్యానవనం అనుకుంటే పొరపాటు పడినట్టే. బయట నుంచి చూస్తే ఎత్తైన చెట్లు.. చల్లని నీడతో ఆహ్లాదంగా ఆకట్టుకుంటుంది. ప్రహరీ దాటి లోపలికి వెళ్తే అవాక్కవడం ఖాయం. అధ్వానంగా ఉన్న పరిసరాలు ముక్కు మూసుకునేలా చేస్తున్నాయి. ఇదీ జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి జనచైతన్య లేఅవుట్‌లోని పార్కు దుస్థితి.

నిర్వహణ లేక పరిసరాలు అధ్వానం

జన చైతన్య లేఅవుట్‌లో దశాబ్దాల క్రితం పార్కుకు కేటాయించిన ప్రదేశంలో ప్రహరీ నిర్మాణం, నడక మార్గాలు, కూర్చునేందుకు బెంచీలు, పార్కు మధ్యలో కుటీరం నిర్మించారు. అనంతరం పట్టించుకునే నాథుడు లేకపోవడంతో పార్కు ఆవరణ అధ్వానంగా మారింది. భారీ చెట్లు ఎక్కడపడితే అక్కడ ఉన్నాయి. మధ్యలో తుప్పలు పెరిగిపోయాయి. ప్రవేశ ద్వారం నుంచి ఎడమ వైపు ప్రాంతం చిట్టడవిని తలపిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు పార్కులోని కుటీరం వైపు ఉన్న పల్లపు ప్రాంతం నీటితో నిండిపోయి చెరువులా మారింది. దుర్వాసన, దోమలతో ఆవరణ అంతా అపరిశుభ్రత నెలకొంది. వినియోగానికి అనుకూలంగా లేకపోవడంతో నిర్మానుష్యంగా మారింది. దీంతో ఆకతాయిలకు ఆవాసంగా మారింది.

నిరుపయోగంగా వాకింగ్ ట్రాక్, బెంచీ

పార్కులో పెద్దఎత్తున నిలిచిపోయిన వర్షం నీరు

అభివృద్ధి చేస్తే ప్రయోజనం

పలు కాలనీల్లో పార్కు స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. కానీ ఇక్కడ ప్రహరీ నిర్మించి ప్రాథమిక పనులు పూర్తయినా అభివృద్ధికి మాత్రం నోచుకోలేదు. ఏళ్లుగా నిరుపయోగంగా ఉండిపోయింది. దీంతో చుట్టు పక్కల కాలనీ వాసులు ఆహ్లాదానికి దూరమవుతున్నారు. ఇప్పటికైనా దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి ఉద్యానవనాన్ని అభివృద్ధి చేస్తే కాలనీ వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కనులపండువగా నరహరి నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి దేవాలయంలో ఆదివారం నిత్య కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేద మంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు.

స్వామి, అమ్మవార్లు

నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తజనం

దాతకు ధ్రువపత్రం అందిస్తున్న పర్యవేక్షకుడు సునీల్‌కుమార్

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి సింహాచలం దరి రాజీవ్‌కాలనీకి చెందిన లంకా జయ మౌర్యసాయి ఆదివారం రూ. 1,00,116 విరాళంగా సమర్పించారు. విరాళాన్ని దాత ప్రతినిధి నగదు రూపంలో ప్రొటోకాల్ పర్యవేక్షకుడు పి.సునీల్‌కుమార్‌కు అందజేశారు. అధికారులు స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

(c) eenadu

అడ్డుకునేదెవరు..

నదులు, వాగుల్లో భారీగా ఇసుక తవ్వకాలు

తరలించేయ్

ట్రాక్టరులో ఇసుక తరలింపు

న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం, కుందుర్పి

జిల్లాలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. నదులు, వాగులు, వంకలను తవ్వేస్తున్నారు. ఇసుకను ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా తెలిసినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. నిత్యం వందల ట్రాక్టర్లలో జిల్లా కేంద్రం, కర్ణాటకతోపాటు ఇతర ప్రాంతాలకు టన్నులకొద్దీ ఇసుక తరలిపోతోంది.

దూరాన్ని బట్టి ధర నిర్ణయం

కళ్యాణదుర్గం నియోజకవర్గం సరిహద్దు గ్రామాలైన మానిరేవు, ఓబుళాపురం, కాలువపల్లి, ఆత్మకూరు, బాలవెంకటాపురం, నూతిమడుగుతండా గ్రామాల మధ్య పెన్నా పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమంగా లక్షల క్యూబిక్ మీటర్ల మేర తవ్వేస్తున్నారు. దూరాన్ని బట్టి ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.4,200 నుంచి రూ.4,800 వరకు విక్రయిస్తున్నారు. ఇటీవల వర్షాలు కురిసి పెన్నాలో నీరు చేరినా ఇతసుక తోడకం మాత్రం ఆగడం లేదు.

కుందుర్పి మండలం కొలిమిపాళ్యం సమీపంలోని పెద్ద వంకలో ఇసుక తోడేయడంతో ఏర్పడిన గొయ్యి

తవ్వకాలు ఇలాగే జరిగితే వ్యవసాయ క్షేత్రాల్లోని బోరు బావుల్లో నీటిమట్టం తగ్గిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇసుక తవ్వకాలపై ప్రశ్నించి, అడ్డుకుంటే తమపై అక్రమార్కులు దాడులకు తెగబడుతున్నారని రైతులు, ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఆయా ప్రాంతాల్లో ఇసుకను తోడేయడంతో భారీ స్థాయిలో గుంతలు ఏర్పడ్డాయి.

సెలవు రోజుల్లో తెగింపు

కుందుర్పి మండలంలోని కొలిమిపాళ్యం, అల్లాపురం, బసాపురం, యర్రగుంట, తూముకుంట తదితర గ్రామాల సమీపాల్లోని వాగులు, వంకల్లో ఇసుకను తవ్వి కర్ణాటక సరిహద్దు గ్రామాలకు తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.3,200 నుంచి రూ.3,800 వరకు విక్రయిస్తున్నారు. కొందరు నాయకులు ఇదే పనిని వృత్తిగా మార్చుకున్నారు. రాత్రివేళ, సెలవు రోజుల్లో ఎవరు ఉండరనే ఉద్దేశంతో తవ్వకాలు చేస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

నిఘా ఉంచి అడ్డుకుంటాం

వసంత్‌బాబు, కళ్యాణదుర్గం ఆర్డీవో

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవు. ఏ ప్రాంతంలోనూ తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదు. ప్రత్యేక నిఘా ఉంచి అధికారులతో దాడులు చేయిస్తాం. ఇసుక తరలించే వాహనాలను సీజ్‌చేసి, బాధ్యులపై కేసులు నమోదు చేస్తాం.

సప్తగిరి కూడలిలో తెరపై ఆటను వీక్షిస్తున్న క్రికెట్ అభిమానులు

నగరవాసుల విజయదరహాసం

యువత ఆనందోత్సాహం

అమ్మాయిల గెలుపు.. ఆనందం రెట్టింపు

మహిళల వన్డే ప్రపంచకప్ పోటీలో భారత జట్టు విజయం సాధించడంతో ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా సంబరాలు మిన్నంటాయి. అర్ధరాత్రి ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో గెలుపు వరించడంతో ఆనందంతో వీధుల్లోకి వచ్చి కేరింతలు కొట్టారు. అంతకు ముందు పలు పట్టణాల్లో భారీ సంఖ్యలో ఎల్‌ఈడీ తెరల్లో క్రికెట్‌ను వీక్షించే ఏర్పాట్లు చేపట్టారు. గెలుపొందిన అనంతరం అనంతపురం టవర్ క్లాక్ వద్దకు భారీ సంఖ్యలో క్రికెట్ అభిమానులు చేరుకొని జాతీయ జెండాలతో సంబరం జరుపుకొన్నారు. వేడుకల్లో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొనడం విశేషం. - ఈనాడు, అనంతపురం

లేపాక్షి ఆలయ సందర్శన

ఆలయ ప్రాంగణంలో కమిటీ ఛైర్మన్ రమానందన్‌తో శిక్షణా న్యాయమూర్తులు

లేపాక్షి, న్యూస్‌టుడే: లేపాక్షి దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయాన్ని ఆదివారం సాయంత్రం దేశ వ్యాప్తంగా ఉన్న 40 మంది శిక్షణా న్యాయమూర్తులు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలోని పురాతన కట్టడాలు, చారిత్రక నిర్మాణాలు, వేలాడే స్తంభం, ఏడు శిరస్సుల నాగేంద్రుడు, సీతమ్మపాదం, ఏకశిలా నంది విగ్రహం తదితర ఆలయ చరిత్రను వివరించారు. వీరభద్రస్వామి, దుర్గాదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అర్చకులు వారిని ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ, ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. వారి వెంట ఆర్ఐ ప్రమీల, తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్‌లోనే 'ప్రజావేదిక' నేడు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటదాకా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం ద్వారా అర్జీల స్వీకరణ ఉంటుందని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. తనతోపాటు జేసీ, ఇతర అన్ని జిల్లాల అధికారులు ఇందులో పాల్గొంటారని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. అర్జీల ఇవ్వడానికి వచ్చే బాధితులు గతంలో ఇచ్చిన వాటికి రసీదులు వెంట తీసుకుని రావాలన్నారు.

నకిలీ పొజిషన్ సర్టిఫికెట్ల సృష్టిపై కేసు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: పాపంపేట భూములపై తమకు యాజమాన్య హక్కులు ఉన్నాయంటూ ఇటీవల ప్రకటించిన రాచూరి వెంకట కిరణ్‌పై రూరల్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పాపంపేటలో ఆరు సర్వే నంబర్లకు సంబంధించిన భూములకు గతంలో పనిచేసిన వీఆర్వో రఘుయాదవ్ తమకు మంజూరు చేశాడని వెంకట కిరణ్ ఇటీవల మీడియా ముందు వెల్లడించారు. దీనిపై జిల్లా రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. వెంకట కిరణ్ చెబుతున్నట్లు తాను ఎలాంటి పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వలేదనీ, తన పేరును ఫోర్జరీ చేశారనీ విచారణలో తేలింది. నకిలీ పొజిషన్ ధ్రువీకరణ పత్రాలు సృష్టించినట్లు విచారణలో తేలడంతో ఆర్డీవో కేశవనాయుడు ఫిర్యాదు మేరకు నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దుకాణాలకు సరకులు చేరలేదప్పా!

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలో రేషన్ దుకాణాలకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో నిత్యావసర సరకులు చేరలేదు. నాలుగు నెలల కిందటే స్టేజ్-2 గుత్తేదారుల సరఫరా గడువు ముగిసింది. కొత్తగా టెండర్లు పిలిచి సరకులు పంపిణీ చేయాలి. పౌరసరఫరాల శాఖ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడమే ప్రధాన కారణం. గుత్తేదారు గడువు ముగిస్తే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సి ఉన్నా.. అవేవీ పట్టించుకోలేదు. సరకులు అందుతాయా? లేదా అని 65 ఏళ్లు పైబడిన వద్ధులు, కార్డుదారులు ఎదురుచూస్తున్నారు.

65 ఏళ్లుపైబడిన వారికి 27 శాతం పంపిణీ

జిల్లాలో 65 ఏళ్ల పైబడిన దివ్యాంగులు, వృద్ధులు, రోగులకు ప్రతి నెలా 26వ తేదీ నుంచి రేషన్ సరకులు పంపిణీ చేయాలి. వారం గడిచినా కేవలం 27 శాతం మాత్రమే పంపిణీ చేసినట్లు పౌరసరఫరాలశాఖ గణాంకాలు చెబుతున్నాయి. మొత్తం 63,949 కార్డుదారులు ఉండగా ఇప్పటి వరకు కేవలం 17,676 కార్డులకు సరకులు పంపిణీ చేశారు. అక్టోబరు 31వ తేదీ వరకు పంపిణీ పరిశీలిస్తే. కళ్యాణదుర్గం మండలంలో 9.98 శాతం, శెట్టూరులో 11.57, అనంతపురం అర్బన్‌లో 13.95, విడపనకల్లులో 14.97, బ్రహ్మసముద్రంలో 17.84, కణేకల్లులో 19.10, గుమ్మఘట్టలో 19.23, అనంతపురం గ్రామీణంలో 20.22, నార్పలలో 20.25 శాతం పంపిణీ చేశారు.

కార్డుదారుల ఎదురుచూపు

- ఎంఎల్ఎస్ పాయింట్లు : 12
- రేషన్ దుకాణాలు: 1,645
- కార్డుదారులు : 6,62,014
- సరకుల కేటాయింపు: 11,145 మెట్రిక్ టన్నులు
- ఇప్పటివరకు 1,201 దుకాణాలకు సరఫరా: 6,521.77 మెట్రిక్ టన్నులు
- ఇంకా 444 దుకాణాలకు చేరాల్సిన సరకులు: 3,623.63 మెట్రిక్ టన్నులు

రవాణాకు చర్యలు

- రమేశ్‌రెడ్డి, జిల్లా మేనేజర్ (పౌరసరఫరాల సంస్థ)

ఈనెల రేషన్ సరకుల సరఫరా ఆలస్యమైంది. గడువు ముగిసిందని, పాఠశాలలకు సరకులు సరఫరా చేయలేమని స్టేజ్-2 గుత్తేదారులు ఆపేశారు. జిల్లాలో ఇంకా 444 రేషన్ దుకాణాలకు సరకులు రవాణా చేయాల్సి ఉంది. అందుకు తగ్గట్టుగా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం.

విద్యార్థులతో విద్యాలయ ప్రత్యేక అధికారిణి మాధవి తదితరులు

రాష్ట్రస్థాయి జూడో ఛాంపియన్ పోటీలకు ఎంపిక

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం కేజీబీవీ విద్యాలయం విద్యార్థినులు ఇద్దరు జిల్లాస్థాయి జూడో పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు విద్యాలయం ప్రత్యేక అధికారిణి మాధవి తెలిపారు. రెండు రోజుల కింద అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి జోడో పోటీల్లో విద్యాలయం తరఫున ఎస్.మషేరా, డి.సానియా, గౌతమి, అనూష పాల్గొన్నారని వీరిలో ఎస్.మషేరా, డి.సానియా ప్రతిభ కనబరచి బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ నెల 6, 7 తేదీల్లో కాకినాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు జిల్లా తరఫున పాల్గొంటారన్నారు.

రైల్వే గేటు వద్ద ఆగిన వాహనాలు

అనంతపురం దారిలో అసంపూర్తిగా రైల్వే వంతెన

అనుసంధానానికి ఎన్నేళ్లో?

రైల్వే గేట్లవద్ద నిలుస్తున్న ట్రాఫిక్

న్యూస్‌టుడే, రాయదుర్గం

ఏళ్ల తరబడి రైల్వే వంతెనలకు అనుసంధాన దారులు నిర్మించకపోవటంతో రైల్వేగేట్ల వద్ద తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం మేర నిధులతో వంతెనలు, అనుసంధాన రోడ్లను నిర్మించాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం అనుసంధాన రోడ్లను నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం చెబుతుండగా, రాష్ట్ర ప్రభుత్వం తమవద్ద నిధులు లేవని రైల్వే శాఖనే అనుసంధాన దారులు నిర్మించాలని పేర్కొంటుండటంతో నిర్మాణాల్లో జాప్యం ఏర్పడుతుంది. దీంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్‌జామ్‌తోపాటు ప్రమాదాలు జరుగుతున్న విషయం విదితమే.

చోదకులు సంయమనం పాటించాలి

- ఉమామహేశ్వర్, రాయదుర్గం స్టేషన్ మాస్టర్

రైల్వే గేట్లవద్ద గేటు వేసిన తర్వాత రైళ్లు వెళ్లేదాకా ప్రజలు సహనంతో సంయమనం పాటించాలి. అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలి. సకాలంలో రైళ్లు గమ్యస్థానాలకు చేరేందుకు గేట్లు తప్పనిసరిగా వేయాల్సి ఉంటుంది.

తరచూ ప్రమాదాలు

- వారం కిందట ముదిగుబ్బలో పాతూరు రైల్వే గేటును మినీ బస్సు ఢీకొన్న ఘటనతో ప్రమాదం చోటుచేసుకుంది.
- రాయదుర్గం పట్టణం అనంతపురం రోడ్డులోని రైల్వే గేటు వద్ద పట్టణానికి చెందిన ఓ ఆటో రైల్వే గేటు వద్ద లిఫ్టింగ్ బ్యారర్(బూమ్‌ని) ఢీకొట్టడంతో అది విరిగింది. దీంతో సకాలంలో గేట్లు వేయక, సిగ్నల్ పనిచేయక రైళ్ల రాకపోకల్లో ఆలస్యం జరిగింది.
- డి.హిరేహాళ్ మండలం హిర్దేహాళ్ వద్ద కాపలా లేని రైల్వే గేటు వద్ద స్థానిక ఆర్టీసీ బస్సును రైలు ఢీకొన్న ప్రమాదంలో పలువురు మృత్యువాతపడ్డారు.
- గతంలో కణేకల్లు రోడ్డులో గేటు సక్రమంగా పడకపోవటంతో రాకపోకలు నిలిపి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఇటీవల కొత్తగా నిర్మిస్తున్న రైల్వే లైన్లలో గేట్లు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.
- రాయదుర్గం నుంచి కదిరిదేవరపల్లి వరకు ఎక్కడా రైల్వే గేట్లు లేవు.

కూలిన హెచ్చెల్సీ నీటి మళ్లింపు గేట్లు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: తుంగభద్ర ఎగువ కాలువకు ప్రమాదం జరిగినప్పుడు హెచ్చెల్సీ ప్రధాన కాలువ నీటిని వాగుకు మళ్లించడానికి నాగలాపురం 116-399 కిలోమీటరు వద్ద ఏర్పాటు చేసిన నాలుగు గేట్ల(షెట్టర్ల)లో మూడు ఆదివారం రాత్రి కూలిపోయాయి. వీటిని 1965లో హెచ్చెల్సీ కాలువ నిర్మించిన సమయంలో ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా మరమ్మతులు లేకపోవడంతో తుప్పుపట్టి ఒక్కసారిగా కూలిపోయాయి. బొమ్మనహాళ్ హెచ్చెల్సీ ఏఈఈ అల్తాఫ్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ ఘటన వల్ల నీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం ఉందన్నారు. కాలువకు నీటి సరఫరా నిలిపివేశాక మరమ్మతులు చేస్తామన్నారు. హెచ్చెల్సీకి జలాశయం వద్ద నీటి పంపిణీ 1,800 క్యూసెక్కుల నుంచి 1600 క్యూసెక్కులకు తగ్గించడంతో సరిహద్దులో నీటి మట్టం కూడా తగ్గిందని ఇన్‌ఛార్జి ఎస్ఈ సుధాకర్‌రావు పేర్కొన్నారు.

కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

స్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

సుబ్రహ్మణ్యేశ్వరుడి దర్శనానికి 4 గంటల సమయం

పంపనూరుకు పోటెత్తిన భక్తజనం

స్వర్ణ కవచ అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో కార్తికమాస పూజలు శోభాయమానంగా సాగాయి. స్వామి వారికి విశేషంగా అర్చనలు, ఆకు పూజ, నైవేద్యం, అభిషేకాలు, పంచామృతాభిషేకాలు జరిగాయి. కార్తిక మాసం రెండవ ఆదివారం సందర్భంగా వేలాదిమంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్తిక దీపాలను వెలిగించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి రావడంతో దర్శనం పూర్తి అయ్యేందుకు 4 గంటల సమయం పట్టింది. యాగ మండపంలో హోమాల్లో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. రద్దీకి అనుగుణంగా అధికారులు ప్రత్యేకంగా సెక్యూరిటీ సిబ్బంది ఏర్పాటు చేయాల్సి ఉంది.

జ్యోతిర్లింగాల దర్శనం సంతోషదాయకం: మంత్రి

సోమందేపల్లి, న్యూస్‌టుడే: పవిత్రమైన కార్తిక మాసంలో ఎన్నో వ్యయప్రయాసాలతో ప్రజల కోసం ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్య దర్శన భాగ్యం కలిగించడం సంతోషకరమని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో స్థానిక అంబాభవాని ఆలయ కల్యాణ మండపంలో శనివారం ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్య దర్శనంతో పాటు చైతన్యదేవి అమ్మవారు, స్వామివారి విశేష అలంకరణ చేపట్టారు. ఆదివారం మంత్రి సవిత దర్శించుకొని ఘనంగా పూజలు చేపట్టారు. కార్తిక మాసంలో ప్రజలు, మహిళలు, శివ భక్తులకు ఒకేచోట ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్య దర్శనం ఏర్పాటు చేయడం మంచి పుణ్య కార్యమని, ఇందుకు కృషి చేసిన బ్రహ్మకుమారీలు సుగంధీ దీదీ, హేమలత, లీలావతి, శాంత తదితరులను మంత్రి అభినందించారు. నవ దుర్గామాతల వేషధారణలో చిన్నారుల ప్రదర్శన, నృత్యం ప్రజలందరినీ మంత్ర ముగ్ధులను చేసింది. తెదేపా నాయకులు ఆంజనేయులు, సిద్ధలింగప్ప, రామకృష్ణ, నరసింహులు, సూరి, శ్రీరాములు, రామాంజనేయులు పాల్గొన్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకొంటున్న మంత్రి సవిత, తెదేపా నాయకులు

నేడు డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ

అనంతపురం (విద్యుత్తు), న్యూస్‌టుడే: విద్యుత్తు సమస్యలు ఎదుర్కొంటున్న వినియోగదారులు నేరుగా ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్‌కు ఫోన్ చేసి తెలియ జేయవచ్చునని అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల విద్యుత్తుశాఖ ఎస్ఈలు శేషాద్రిశేఖర్, సంపత్‌కుమార్ తెలిపారు. తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని వెల్లడించారు. విద్యుత్తు సేవలకు సంబంధించిన ఎలాంటి ఫిర్యాదులైనా నిర్దేశిత సమయంలో 8977716661 నంబరుకు వినియోగదారులు ఫోన్ చేసి సీఎండీకి చెప్పవచ్చన్నారు. అలాగే 9133331912 నంబరుకు చాట్ చేసి కూడా విద్యుత్తు అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లవచ్చునని వివరించారు. వినియోగదారుల సౌకర్యార్థం కల్పించిన ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నేత్రపర్వం.. తెప్పోత్సవం

శింగనమల (బుక్కరాయసముద్రం), న్యూస్‌టుడే : శింగనమల మండల కేంద్రంలోని శ్రీ రంగరాయలు చెరువులో ఆదివారం సాయంత్రం తెప్పోత్సవ కార్యక్రమాన్ని గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. 600 ఏళ్ల నుంచి నుంచి కొనసాగుతున్న తెప్పోత్సవంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ముందుగా ఆమె చెరువు వద్ద సొంత నిధులతో నిర్మించిన దుర్గాఘాట్‌ను ప్రారంభించారు. తెప్పపై వెంకటరమణ స్వామి, కాలవగట్టు పార్వతీపరమేశ్వరులు, నగరేశ్వరస్వామి ప్రతిమలను కొలువుదీర్చిన అర్చకులు చెరువులో విహరించారు.

చెరువులో సాగుతున్న ఉత్సవం.. అంతరచిత్రంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ తదితరులు

సంతల జోరు.. వసూళ్లలో హుషారు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంత జిల్లాలోనే అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు పెద్దది. రుసుం వసూళ్లు కూడా ఎక్కువే. గత ఏడాది కంటే ఈసారి ఆదాయం మరింత పెరిగింది. ఇక్కడ నిత్యం చీనీ సంత జరుగుతుంది. శనివారం గొర్రెలు, మేకల సంత, ఆదివారం పశువుల సంత నిర్వహిస్తారు. యార్డుకు ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.5.10 కోట్లు ఆదాయ లక్ష్యం కాగా గత అక్టోబరు నాటికి రూ.3 కోట్లు వసూలైంది.

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని సంతలో చీనీ రాసులు

నెల	చీనీ (టన్నులు)	రుసుం (రూ.ల్లో)
జనవరి	454	82,550
ఫిబ్రవరి	1,650	2,04,150
మార్చి	15,041	19,80,250
ఏప్రిల్	26,837	36,83,900
మే	19,015	32,19,320
జూన్	16,004	24,41,000
జులై	28,115	28,82,600
ఆగస్టు	18,992	20,82,500
సెప్టెంబరు	12,991	13,47,550
అక్టోబరు	1,260	1,24,894

1,40,359 టన్నుల విక్రయాలు

అనంతలో చీనీ మార్కెట్ ఏటా జనవరి నుంచి సెప్టెంబరు వరకు జరుగుతుంది. అడపాదడపా అక్టోబరులో కూడా మార్కెట్‌కు కొద్దిగా చీనీకాయలు వస్తాయి. కేవలం రెండు నెలలు మాత్రమే సంత మూతపడుతుంది. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకు మొత్తం 1,40,359 టన్నుల చీనీ కాయలు విక్రయించారు. రూ.180.48 కోట్ల వ్యాపారం జరిగింది. ఇప్పటివరకు యార్డుకు రుసుం రూపేణా రూ.3 కోట్లు వసూలైంది. అందులో చీనీ సంతలో రూ.1,80,48,714, గొర్రెలు, మేకల సంతలో రూ.65,83,632, పశువుల సంతలో రూ.46,04,030, ఇతర రూ.7,63,626 ఆదాయం వచ్చింది.

లక్ష్యానికి చేరువలో అనంత మార్కెట్ యార్డు

లక్ష్యాన్ని అధిగమిస్తాం

- రాఘవేంద్రకుమార్, ఇన్‌ఛార్జి ఎంపికశ్రేణి కార్యదర్శి (అనంతపురం)

అనంత మార్కెట్‌యార్డుకు ఈ ఆర్థిక సంవత్సరం రూ.5.10 కోట్లు రుసుం వసూళ్లు లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటికే రూ.3 కోట్లు వసూలైంది. పశువుల సంతల్లో కొంత ఆదాయం తగ్గినా.. చీనీ, గొర్రెల సంతలతో బాగుంది. ఇంకా 5 నెలల్లో రూ.2.10 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఉద్యోగులు, సిబ్బంది సహకారంతో పూర్తి లక్ష్యాన్ని అధిగమిస్తాం.

అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి
మీ ఉన్నతికై శ్రమించిన, మీ కుటుంబ సభ్యుల/ఆత్మీయుల అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి ప్రకటనలు ఈనాడులో తక్కువ ఖర్చుతో ప్రకటనలు ప్రచురణ కొరకు
పూర్తి వివరములకు:
8008709784

(c) eenadu

ఆధ్యాత్మిక సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామికి నేటి (సోమవారం) ఉదయం 10.45 గంటలకు ఆలయంలోని కల్యాణ మండపంలో ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం ఆరుగంటలకు సాధారణ దర్శనం, నిత్య పూజా కైంకర్యాలు జరుగుతాయి. 7 నుంచి 9 గంటల మధ్య అభిషేకం, సర్వదర్శన సేవలుంటాయి. 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు స్వామి వారి సర్వదర్శనం ఉంటుంది.

సంతల ఆదాయం రూ.3.24 లక్షలు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే : అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని వారం సంతల్లో మొత్తం రూ. 3,24,950 ఆదాయం వచ్చింది. అందులో శనివారం గొర్రెలు, మేకల సంతలో రూ. 1,91,650, ఆదివారం పశువుల సంతలో రూ. 1,33,300 ఆదాయం వచ్చింది.

అందుకో యువతా.. క్వాంటందే భవిత

◆ జేఎన్‌టీయూలో టెక్నాలజీ ప్రయోగశాల ◆ డిసెంబరు నుంచి శిక్షణ

జేఎన్‌టీయూలో ఏర్పాటు చేయనున్న క్వాంటం ప్రయోగశాల భవనం

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: సాంకేతిక రంగంలో క్వాంటం టెక్నాలజీకి రోజురోజుకూ ప్రాధాన్యం పెరుగుతోంది. ఇందులో నైపుణ్యం సాధించిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం క్వాంటం టెక్నాలజీ అన్ని రంగాల్లో విస్తరణ చేయడానికి ప్రత్యేక చొరవ చూపుతోంది. ఈ క్రమంలో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి జేఎన్‌టీయూ అధికారులు క్వాంటమ్ ప్రయోగశాల ఏర్పాటు చేయడం శుభపరిణామం. నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం, రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. వాటితోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ ప్రయోగశాలలు విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల అధ్యాపకులకు క్వాంటం టెక్నాలజీపై ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. (అడ్వాన్స్‌డ్ గ్లోబల్ ఫౌండేషన్) ఏజీఎఫ్ సంస్థ ఫ్యూచర్ స్కిల్స్ ప్రయోగశాలలకు సహకారం అందించడానికి ముందుకొస్తున్నారు. ఈసీటీ సంస్థ, ఎంఎస్ఐటీ విశ్వవిద్యాలయం క్వాంటమ్ టెక్నాలజీలో ఆన్‌లైన్ శిక్షణలు ఇస్తున్నారు. ఆ తరహాలో ప్రయోగశాలలో జేఎన్‌టీయూలో ఆన్‌లైన్ శిక్షణ ఇస్తారు. ఈ ప్రయోగశాల కార్యకలాపాలు నిర్వహణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు.

నూతన ఆవిష్కరణలే లక్ష్యం

ఈ ప్రయోగశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ సంబంధించిన అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. ఇంజినీరింగ్, సాధారణ డిగ్రీ విద్యార్థులకు కూడా ఇందులో శిక్షణ పొందవచ్చు. విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు చేపట్టడమే లక్ష్యంగా ప్రయోగశాల ప్రారంభిస్తున్నట్లు జేఎన్‌టీయూ అధికారులు తెలిపారు. అమరావతి క్వాంటం టెక్నాలజీ వారు క్వాంటం టెక్నాలజీ పోటీలు ఇటీవల జేఎన్‌టీయూ నిర్వహించారు. ఇలాంటి పోటీలు మరిన్ని నిర్వహించడానికి ఈ ప్రయోగశాల వేదిక కానుంది.

త్వరలో అందుబాటులోకి తెస్తాం

వివిధ సాఫ్ట్‌వేర్‌సంస్థలు, పారిశ్రామికసంస్థల సహకారంతో క్వాంటం ప్రయోగశాల ఏర్పాటు చేస్తున్నాం. నూతనంగా నిర్మించిన భవనంలోనే ఈ ల్యాబ్ ఉంటుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ రంగాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తాం. ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

- ఆచార్య సుదర్శనరావు, ఉపకులపతి, జేఎన్‌టీయూ

ఆలయానికి వెండి కానుకల వితరణ

వెండి కవచాలు, మకరతోరణాలను అందజేస్తున్న దాతలు

గుంతకల్లు పట్టణం: గుంతకల్లులోని కోదండరామ స్వామి దేవాలయానికి వెండి కవచాలు, మకరతోరణాలను దాతలు అందజేసినట్లు ఈవో మల్లికార్జున తెలిపారు. ఆలయంలో శ్రీరాముడు, సీతమ్మ, లక్ష్మణ ఆంజనేయ కోసం కొంత మంది భక్తులందరూ కలిసి 8 కిలోల వెండితో తయారీ చేసిన కవచాలు, మకర తోరణాలను ఆలయంలో సంప్రోక్షణ నిర్వహించి స్వాములను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. దాతలు పద్మావతమ్మ, ప్రశాంత, శంకరనారాయణ, సత్యనారాయణ జగదీశ్ గుప్తా, వంకదారు రామకృష్ణయ్య శ్రేష్ఠి, ప్రసాద్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, కంధారి తిమ్మయ్య, పోలా రాము, భగవత్ గీత భక్తమండలి, వెల్లారి నరసింహులు, మండారు ఉష తదితరులు ఆలయానికి అందజేశారని ఈవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ శ్రీనాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

నెట్టికంటయ్య సన్నిధిలో రైల్వే భద్రతా కమిషనర్

ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భద్రతా కమిషనర్ శ్రీనివాస్, డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, న్యూస్‌టుడే : భారత రైల్వేలోని దక్షిణ రైల్వే జోన్ (ముంబయి) రైల్వే భద్రతా కమిషనర్ శ్రీనివాస్ ఆదివారం గుంతకల్లుకు వచ్చారు. ఆయన వచ్చిన సందర్భంగా డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాతో పాటు ఇతర శాఖల అధికారులు పుష్ప గుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. కమిషనర్‌తో పాటు డీఆర్ఎం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి చెందిన అధికారులు, వేదపండితులు వేదమంత్రాలతో స్వాగతం చెప్పారు.

వ్యాపారాభివృద్ధికి ఎగ్జిబిషన్‌తో తోడ్పాటు

మాట్లాడుతున్న ఏపీ బులియన్ సంఘం అధ్యక్షుడు విజయ్‌కుమార్

ధర్మవరం, న్యూస్‌టుడే: బంగారు నగల వ్యాపారులు వ్యాపారంలో మరింత రాణించేందుకు, సరికొత్త డిజైన్లు విక్రయించడానికి విజయవాడలో వచ్చే నెలలో భారీ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు ఏపీ బులియన్ వ్యాపారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని విష్ణుప్రియ రెసిడెన్సీలో స్థానిక బంగారు నగల వ్యాపారుల సంఘం అధ్యక్షుడు ఖలీల్ రెహిమాన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని బంగారు వ్యాపారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ కార్పొరేట్ బంగారు సంస్థలకు దీటుగా వినియోగదారులకు సరికొత్త డిజైన్ల నగలు అందుబాటులో ఉంచినప్పుడే స్థానిక వ్యాపారులు రాణిస్తారన్నారు. అనంతరం వ్యాపారులు ఎగ్జిబిషన్‌లో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నంబూరి శంకరనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శులు జయం విశ్వనాథ్, మల్లేశ్వరరావు, స్టేట్ అడ్వైజర్ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ రావు, రాజేంద్రప్రసాద్, ఈసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఎంపికైన బాలికలతో పీడీలు, ఉపాధ్యాయులు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: క్రీడలు మానసికోల్లాసం కలిగించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు దోహదం చేస్తాయని వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో కబడ్డీ సబ్-జూనియర్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు పోటీపడ్డారు. ప్రతిభ చూపిన బాలబాలికలను సత్యసాయి జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శిక్షకులు మాట్లాడుతూ 7 నుంచి 9వ తేదీ వరకు కర్నూరు జిల్లా మంత్రాలయంలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఈ రెండు జట్లు తలపడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి సుహాసిని, శాప్ కబడ్డీ శిక్షకులు పృథ్వీ, అనిల్, పలువురు పీఈటీలు పాల్గొన్నారు. దాత పోతకుంట రాజశేఖర్ క్రీడాకారులు, నిర్వాహకులకు భోజన వసతి కల్పించారు.

బాలుర జట్టు: మహమ్మద్ ఆసిఫ్, జాకీర్, యేసురాజు నవరత్న, నవదీప్, నూర్ మహమ్మద్, జి.మహమ్మద్, కుమార్, హర్షవర్ధన్, హేమంత్‌కుమార్, రాజు, విజయ్‌ప్రసాద్, యశ్వంత్, మహమ్మద్‌గౌస్.

బాలికల జట్టు: నవ్య, లిఖిత, జానీ మహేశ్వరి, భాను మహేశ్వరి, సుచరిత, హిమబిందు, శాంతి, జీఎస్ సాజియా, హర్షవలి, శిరీషా, మంజుల, రాధిక, నాగ లావణ్య, ఎస్.లిఖిత.

భారీ స్కోరు దిశగా పుదుచ్చేరి జట్టు

శతకం చేసిన నెయన్ కంగయాన్

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: అంతర్రాష్ట్ర అండర్-23 కల్నల్ సీకే నాయుడు నాలుగు రోజుల క్రికెట్ పోటీలో పుదుచ్చేరి జట్టు భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. తొలిరోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి ఆ జట్టు ఆంధ్ర జట్టుపై మొదటి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 268 పరుగులు చేసింది. అనంత క్రికెట్ మైదానంలో ఉదయం టాస్ గెలిచిన ఆంధ్ర జట్టు ప్రత్యర్థి జట్టును తొలి బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన పుదుచ్చేరి జట్టు 12 పరుగులకే తొలి వికెట్ కోల్పోయింది. రెండో వికెట్ 72 పరుగుల వద్ద కోల్పోయింది. జట్టును కెప్టెన్ నెయన్ కంగయాన్ (131, 21×4) అద్భుతమైన బ్యాటింగ్‌తో ఆదుకున్నాడు. నాలుగో వికెట్ 224 పరుగుల వద్ద కోల్పోయిన తర్వాత బ్యాటర్లు మరింత జాగ్రత్తగా ఆడి వికెట్లను కాపాడుకున్నారు. ఆంధ్ర బౌలర్లలో ఎస్.కామిల్, ఆదిత్యరెడ్డి, హేమంత్‌రెడ్డి, సుమిత్ చెరో వికెట్ కూల్చారు. ఈ పోటీని ఆంధ్ర క్రికెట్ సంఘం జీఎం డి.శివకుమార్, ఆపరేషన్స్ మేనేజరు ఆదిత్యవర్మ, ఏఎల్‌సీట పి.శ్రీనిరంజన్, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి వి.భీమలింగారెడ్డి, సంయుక్త కార్యదర్శి వి.భీమలింగారెడ్డి, అడ్మిన్ మేనేజరు పీకే సాగర్‌చౌదరి ప్రారంభించారు.

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు ప్రారంభం

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 69వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ సెపక్‌తక్రా పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా జాతీయ జెండాకు వందనం చేసి జ్యోతిప్రజ్వలన గావించారు. ఆల్ ఇండియా సెపక్‌తక్రా ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పరిశీలకులు రమేష్, విశాల్‌లు మాట్లాడుతూ సెపక్‌తక్రాలో అత్యుత్తమ ప్రదర్శన చూపాలని సూచించారు. 13 జిల్లాల నుంచి 220 బాలురు, బాలికలు పాల్గొన్నారు. తొలిరోజు వివిధ జిల్లాల క్రీడాకారులు పోటీల్లో హోరాహోరీగా తలపడ్డారు.

పోటీల్లో తలపడుతున్న జట్లు

4న టేబుల్ టెన్నిస్ జిల్లా జట్ల ఎంపిక

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: విశాఖలో జరగనున్న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా అండర్-15, సీనియర్స్ మహిళల, పురుషుల జట్లను ఈ నెల 4న ఎంపిక చేయనున్నట్లు టీటీ సంఘం కార్యదర్శి ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు అనంతపురం క్లబ్‌లో ఎంపిక పోటీలు నిర్వహించి అందులో ప్రతిభా పాటవాలు చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయి పోటీలు 17 నుంచి 20వరకు విశాఖలో జరుగుతాయి. ఆసక్తిగల జిల్లా క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొని ప్రతిభను నిరూపించుకోవాలని ఆయన సూచించారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

JOBS

Wanted: Telecallers, Custodians (Ladies) Montessori Elite EM School, Gollapalli, Rapthadu, ATP. Call: 8886654850, 9100281294.

ప్రముఖ కంపెనీలో స్కానింగ్ కోసం అభ్యర్థులు అవసరం. అర్హత: ఇంటర్/ఏదైనా, డిగ్రీ, ధర్మవరం. Ph: 7639430742.

అనంతపురం పట్టణం నందుప్రముఖ Company నందు టెలికాలర్స్‌గా పనిచేయుటకుఆసక్తిగల తెలుగు, కన్నడ యువతులు కావలెను. జీతం: 9,000 - 12,000. ఇన్సెంటివ్స్ సెల్: 9398063479

FACULTY/ TEACHERS

Wanted Experienced Female Staff for Science and English Subject (3 to 5 Classes) to Work in Blossoms School, Aravind Nagar, ATP. Mob: 9030777676

SECURITY GUARDS

సెక్యూరిటీగార్డ్స్, ASOలు ధర్మవరం, హైదరాబాద్‌లో పనిచేయుటకు కావలెను. జీతం: 15,000-20,000/-రూం & భోజనం ఫ్రీ. సంప్ర: 6302549622, 9573095856

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU THE CLASSIFIEDS MART
5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే
తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...
వివరాలకు
8008709784
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

ఈ- శ్రమ్ కార్డులు.. భద్రతకు భరోసా

కార్మికులకు అందజేసే ఈ-శ్రమ్ కార్డు

ముకోసం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేసే వారితోపాటు వలస కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తూ, సంక్షేమ పథకాలు అందించాలనే సుప్రీకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం 2021 ఆగస్టు 26న 'ఈ- శ్రమ్' పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో పేర్లు, వివరాలు నమోదు చేసుకున్న కార్మికులకు ఉచితంగా యూఏఎన్ గుర్తింపు కార్డులను జారీ చేస్తారు. దేశంలో ఎక్కడైనా ఈ కార్డు చెల్లుబాటు అయ్యేలా యూనివర్సల్ అకౌంట్ నంబరు(యూఏఎన్)ను అందజేస్తున్నారు. అనంతపురం జిల్లావ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత రంగాల్లో సుమారు 10 లక్షల కార్మికులున్నారు. ఈ-శ్రమ్ కోసం ఇప్పటి వరకు 8 లక్షల మంది దరఖాస్తులు చేసుకోగా.. కార్డులు సైతం జారీ చేశారు. పుట్టపర్తి జిల్లావ్యాప్తంగా మొత్తంగా 3.10 లక్షల మంది కార్మికుల్లో కేవలం 1.10 లక్షల మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోగా.. వారికే కార్డులు అందాయి.

నమోదు ఎలాగంటే..?

సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనులు చేసే కార్మికులు 21 సంవత్సరాల నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగిన వారు భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా లేదా సమీపాల్లోని కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా, సచివాలయాల్లో, కార్మిక శాఖ అధికారులు, చరవాణిలో సెల్ఫ్ రిజిస్ట్రేషన్ కోసం నమోదు చేసుకోవచ్చు. దీనికి ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నంబరు, నామిని ఖాతా, చరవాణి నంబరు తప్పనిసరి. గత వైకాపా ప్రభుత్వం 'ఈ- శ్రమ్' కార్డుల పంపిణీని 2023లో నిలిపివేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దీనిని పునరుద్ధరించింది.

అనేక ప్రయోజనాలు

ఈ-శ్రమ్ ద్వారా నమోదు చేసుకొన్న కార్మికుడికి 12 అంకెల గల యూఏఎన్ గుర్తింపు కార్డు అందజేస్తారు. ఈ కార్డు ఉన్న వారికి ప్రభుత్వం అందించే సంక్షేమ, సామాజిక భద్రత పథకాలు వర్తిస్తాయి. కార్డుదారులు ప్రమాదంలో మృతిచెందితే ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకం ద్వారా రూ.2 లక్షలు, గాయపడినా, వైకల్యానికి గురైనా రూ.లక్ష పరిహారం వస్తుంది.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

'ఈ-శ్రమ్' పథకం నమోదులో రాష్ట్రంలోనే ఉమ్మడి అనంత జిల్లా రెండో స్థానంలో ఉంది. ప్రతి కార్మికుడు నమోదు చేసుకుంటే ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు. వీటిపై అవగాహన కల్పిస్తూ నమోదు చేస్తున్నాం.

- లక్ష్మీనరసయ్య, ఉపకార్మిక శాఖ కమిషనర్

సమరశీల పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం: సీఐటీయూ

మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: సమరశీల పోరాటాలతోనే సమస్యలను పరిష్కరించుకుందాని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్.నర్సింగరావు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు జడ్పీ శ్రీనివాసులు అధ్యక్షతన స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం ప్రారంభమైన 10వ జిల్లా మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న కార్మిక వ్యతిరేక విధానాలను మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిలో పనిచేసే ప్రధాన నాయకులు, కార్యకర్తలు ఎదురొడ్డి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బహిరంగసభకు హాజరైన వందలాది కార్మికుల సమక్షంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి వేదికపై ఉన్న రాష్ట్ర, జిల్లా, అనుబంధ సంఘాల నాయకులు చేతులెత్తి ఐక్యత చాటారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ప్రవీణ్‌కుమార్, శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి దిల్షాద్ పాల్గొనగా, సీఐటీయూ జిల్లా, స్థానిక నాయకులు సాంబశివ, నరసింహులు, లక్ష్మీనారాయణ, రాము, రామకృష్ణ, అంగన్‌వాడీ, ఆశా, మున్సిపల్ వర్కర్స్, వివిధ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

ఏఈవో సంఘం అధ్యక్షుడిగా మురళీకృష్ణ

కొత్తగా ఎన్నికైన సభ్యులను సన్మానిస్తున్న రాష్ట్ర నాయకులు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారులు సంఘం (ఏఈవో) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం అనంతపురం ఉద్యాన ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ఎన్నికల అధికారులుగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వర రెడ్డి, సహాయ అధికారిగా నరసింహ వ్యవహరించారు. అన్ని పోస్టులకు నామినేషన్లు స్వీకరించగా, ఒక్కో పోస్టుకు ఒక్కో నామినేషన్ వేశారు. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైందని ఎన్నికల అధికారులు ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా మురళీకృష్ణ, సహాధ్యక్షుడిగా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా ఆదినారాయణ, కోశాధికారిగా శ్వేత, ఉపాధ్యక్షులుగా జోత్స్న, సుజిత, దిలీప్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా మనోజ్‌కుమార్, భరత్ రాజ్, భాగ్యశ్రీ, సంయుక్త కార్యదర్శిగా రామన్న, ప్రచార కార్యదర్శిగా మణికంఠ కుమార్, ఎనిమిది మంది సభ్యులను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి నాగేశ్వరరెడ్డి ప్రకటించారు. అనంతరం కొత్తగా ఎన్నికైన సభ్యులను జిల్లా వ్యవసాయాధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్‌కుమార్, తోటి ఉద్యోగులంతా శాలువా కప్పి పూలదండతో సన్మానించారు. అనంతరం అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఏఈవోలను రాష్ట్ర సంఘం నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

తెదేపా నాయకులపై దాడి

బుక్కపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని యర్లంపల్లి గ్రామానికి చెందిన తెదేపా నాయకులపై ఆదివారం రాత్రి దాడి జరిగింది. బాధితుల తెలిపిన వివరాల మేరకు... తెదేపా నాయకులు ఆదినారాయణ, చంద్ర రాత్రి 9 గంటలకు తమ ఇళ్లలో నిద్రిస్తుండగా బయట కేకలు, అరుపులు వినిపించాయి. ఏం జరిగిందోనన్న ఆత్రుతతో తలుపులు తెరిచి బయటకు రాగా, ఒక్కసారిగా వైకాపా నాయకులు మహేశ్, నగేశ్, అంజితో పాటు మరికొందరు వారిపై కర్రలతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఆదినారాయణకు బలమైన దెబ్బలు తగిలాయి. ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తర్వాత చికిత్స నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. సమాచారం అందుకున్న ఎస్సై కృష్ణమూర్తి గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా ఇరువర్గాల నడుమ కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి.

తుదిశ్వాసలోనూ వీడని బంధం

చిన్నపాపమ్మ, వెంకటరమణ దంపతులు

అమడగూరు (ఓబుళదేవరచెరువు), న్యూస్‌టుడే: అన్యోన్య దాంపత్యానికి అర్థంగా నిలిచిన ఆ భార్యాభర్తలు మరణంలోనూ ఒకరి వెంట ఒకరు నడిచారు. కొద్ది గంటల తేడాలో తుదిశ్వాస విడిచారు. ఈ విషాదాంతం అమడగూరు మండలం జౌకులకొత్తపల్లిలో చోటుచేసుకుంది. మృతుల కుమారులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దండు చిన్నపాపమ్మ(68), దండు వెంకటరమణ(75) దంపతులు. వారిది 50 ఏళ్ల వైవాహిక జీవితం. బిడ్డలతో కలిసి ఉంటున్నారు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నపాపమ్మ శనివారం రాత్రి 7 గంటలకు మృతి చెందారు. భార్య ఎడబాటును తట్టుకోలేక తీవ్ర మనోవేదనకు గురైన వెంకటరమణ ఆదివారం వేకువజామున 4 గంటల సమయంలో చనిపోయారు. గ్రామంలోనే అంత్యక్రియలు ముగిశాయి. మృత్యువులోనూ వీడని ఏడడుగుల బంధం వారిదంటూ గ్రామస్థులు అనుకోవడం వినిపించింది. మృతులకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని ఒకరి దుర్మరణం

సోమశేఖర్

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన సీకేపల్లి మండల కేంద్రానికి సమీపాన కోన క్రాస్ 44వ జాతీయ రహదారి కూడలి వద్ద ఆదివారం చోటు చేసుకుంది. సీకేపల్లి మండలం హర్యాయాన్ చెరువు గ్రామానికి చెందిన సోమశేఖర్ (36), పెనుకొండ మండలం వెంకటగిరి పాళ్యం గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో కోన క్రాస్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీ కొన్నాడు. ఘటనా స్థలిలోనే దుర్మరణం చెందాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు లారీని ఠాణాకు తరలించారు. మృతునికి భార్య మహాదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కారును ఢీకొన్న లారీ.. నలుగురికి గాయాలు

నుజ్జయిన కారు

కనగానపల్లి, న్యూస్‌టుడే: లారీ వాహన చోదకుడి నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడిన ఘటన కనగానపల్లి మండలం ముక్తాపురం కూడలిలో ఆదివారం చోటుచేసుకుంది. బెంగళూరు నగరానికి చెందిన వినయ్, సచిన్, అనిల్, గురుతోపాటు డ్రైవర్ మహబూబతో కలిసి కారులో ఈనెల 1వ తారీఖున దైవ దర్శనార్థం బెంగళూరు నుంచి మంత్రాలయం వెళ్లారు. అక్కడ రాఘవేంద్ర స్వామి దర్శనం ముగిసిన తర్వాత తిరిగి బెంగళూరుకు వెళుతున్నారు. ముక్తాపురం వద్దకు రాగానే బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళుతున్న లారీ వాహన చోదకుడు తన వెళుతున్న రహదారిని వదిలి పెట్టి పక్క రహదారిలోకి వెళ్లి ఎదురుగా వస్తున్న కారును వేగంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురు గాయపడ్డారు. వీరిని అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించి వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

తండ్రీకొడుకుల ఆత్మహత్యాయత్నం!

రక్షించిన రైల్వే, పోలీసు అధికారులు

బాధితుడు శివ

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్తూరు గ్రామంలో ఇటీవల జరిగిన ఘర్షణతో సంబంధం లేకున్నా తమను ఇరికించారనే మనస్తాపంతో కుమారుడితోపాటు తెదేపా కార్యకర్త ఆదివారం కళ్యాణదుర్గం రైల్వే స్టేషన్‌లో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఘర్షణతో సంబంధం లేకున్నా తనను అందులో ఇరికించారని శెట్టూరు మండలం మాలేపల్లికి చెందిన తెదేపా కార్యకర్త శివ(ఆర్ఎంపీ వైద్యుడు) కుమారుడు జ్ఞానేశ్వర్(6)తో కలిసి ఓ సెల్ఫీ వీడియో తీసి సామాజిక మాధ్యంలో పోస్టు చేశాడు. దీనిని గుర్తించిన రైల్వే మేనేజర్ ధర్మతేజ సిబ్బందితో అక్కడికి వెళ్లి పురుగుమందుల డబ్బాను లాక్కొన్నాడు. ఇంతలో కానిస్టేబుళ్లు లింగరాజు, వీరయ్య సంఘటనా స్థలానికి చేరుకుని తండ్రికుమారుడిని రక్షించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

తెదేపా, వైకాపా వర్గీయుల ఘర్షణ

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని పోరాట కాలనీ కాలనీలో తెదేపా, వైకాపా వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు మూడు రోజులుగా తెదేపా కౌన్సిలర్లు మనం.. మన తాడిపత్రి కార్యక్రమాన్ని పట్టణంలో నిర్వహిస్తున్నారు. ఆదివారం పోరాట కాలనీలో ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకుంటూ ఉండగా అదే సమయంలో కాలనీలో మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయకూడదని వైకాపా శ్రేణులు కోటి సంతకాల కార్యక్రమం చేపట్టారు. ఇరుపార్టీల వారు ఎదురెదురు పడి వాగ్వాదానికి దిగారు. అనంతరం రాళ్లు రువ్వుకోవడంతో వైకాపా వర్గీయులకు చెందిన రెండు వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈవిషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాల వారిని చెదరకొట్టడంతో సమస్య సద్దుమణిగింది. ఇరుపార్టీల ఫిర్యాదు మేరకు తగు చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని కడప రోడ్డు పరిసరాల్లో గంజాయి విక్రేతను అరెస్టు చేసినట్లు గ్రామీణ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని తెచ్చి యువతకు అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి గఫూర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఒక్కొక్కటి నాలుగు గ్రాముల బరువు ఉన్న 16 ప్యాకెట్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. ఆయన వెంట ఎస్సై ధరణిబాబు తదితరులు ఉన్నారు.

30 మందిపై రౌడీషీట్లు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: హత్య, హత్యాయత్నం, గంజాయి విక్రయం వంటి తీవ్ర నేరాలకు పాల్పడిన 30 మంది పాత నేరస్థులపై రౌడీషీట్లు తెరిచినట్లు కదిరి అర్బన్ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. కదిరి అర్బన్ సర్కిల్ పరిధిలో తీవ్ర నేరాలు చేసి జైలుశిక్ష అనుభవించిన వారిలో మార్పు కనిపించకపోగా తిరిగి నేరాలు చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తుండంతో ఈ చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. రౌడీషీటర్లు తీవ్రమైన నేరాల్లో పాల్గొన్నట్లు తేలితే వారిని పీడీయాక్టు కింద అరెస్టు చేసి జైలుకు పంపుతామన్నారు.

(c) eenadu

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

బికొత్తూరులో తాగునీటి ఎద్దడి

కుందుర్పి, న్యూస్‌టుడే: మండలంలోని బికొత్తూరులో తాగునీటి ఎద్దడితో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నామని.. పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ తాగునీటి పథకం బోరుబావి నిలిచిపోవడంతో 25 రోజులుగా మహిళలు, గ్రామస్థులు పొలాల వద్దకు వెళ్లి తాగునీటిని తీసుకొస్తున్నట్లు పలువురు వాపోయారు. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని గ్రామానికి తాగునీటి సరఫరా చేయించాలని కోరుతున్నారు.

జీపుయాత్ర జయప్రదానికి పిలుపు: ఎస్ఎఫ్ఐ

ఉరవకొండ: విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ చేపట్టిన జీపుయాత్రను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హరూన్‌రషీద్ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వజ్రకరూర్‌లో జూ.కళాశాలను ఏర్పాటు చేయాలని, ఫీజు రియంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 7 వరకు కొనసాగే జీపుయాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాజేష్, అభిషేక్, పవన్, అరవింద్ పాల్గొన్నారు.

నేడు సచివాలయం ప్రారంభం

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బిఎన్‌హళ్లిలో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సోమవారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో కొండన్న, తెదేపా మండల కన్వీనర్ హనుమంతు తెలిపారు. వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

యాదవ సంఘం జిల్లా కమిటీ ఎంపిక

రుద్రంపేట: యాదవ సంఘం జిల్లా నూతన కమిటీ ఆదివారం రుద్రంపేట పంచాయతీ పరిధి యాదవ్ కల్యాణ మంటపంలో యాదవ సంఘం జాతీయ నాయకులు రాజశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా రామకృష్ణ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా గోపాల్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రభాకర్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా ధనుంజయ యాదవ్, పరంధామ యాదవ్‌వులను ఎన్నుకున్నారు

స్థల విషయంలో ఘర్షణ... మహిళకు గాయాలు

శెట్టూరు, న్యూస్‌టుడే: శెట్టూరు మండలం యాటకల్లులో ఆదివారం సాయంత్రం స్థలం విషయంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో సునీత అనే మహిళ గాయపడింది. ఇంటివద్ద బండలు నాటే విషయంలో శ్రీనివాసులు, రామకృష్ణ కుటుంబాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తన భర్త లేని సమయంలో రామకృష్ణ అనే వ్యక్తి తనపై దాడిచేసి గాయపచినట్లు బాధితురాలు వాపోయారు. క్షతగాత్రురాలిని కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఈ స్థల వివాదంపై రెండు రోజుల కిందటే స్థానిక పోలీస్‌స్టేషనులో ఫిర్యాదులు అందడం గమనార్హం.

అసంపూర్తి ఉప కేంద్రాలకు మహర్దశ

న్యూస్‌టుడే, రాయదుర్గం

రాయదుర్గం నియోజకవర్గంలో కొత్త ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలకు, గతంలో నిధులు చాలక నిలిచిన వాటి పూర్తికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ఇన్ ప్రాస్ట్రక్షర్ మిషన్(పీఎంఅబీమ్), 15వ ఆర్థిక సంఘం, నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమాల కింద ప్రభుత్వం రూ.7.80 కోట్ల నిధులు విడుదల చేసింది. వీటితో డి.హీరేహాళ్, పులకుర్తి, బొల్లనగుడ్డం, గోవిందవాడ, ఉద్దేహాళ్, కణేకల్లులో రెండు ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలకు రూ.2.94 కోట్లు విడుదలయ్యాయి.

రూ.7.80 కోట్లు మంజూరు

నిలిచిన భవనాల పూర్తికి చర్యలు

వైకాపా ప్రభుత్వ హయాంలో అర్ధాంతరంగా నిర్మాణ పనులు నలిచిపోయిన భవనాల పూర్తికి కూటమి ప్రభుత్వం రూ.3.42 కోట్లు మంజూరు చేసింది. వాటితో భవనాల పనులు మధ్యలో నిలిచిన వాటితోపాటు కంపచెట్లకు, తలుపులు కిటికీలు, ప్లాస్టింగ్‌లు ఇతరత్రాలు చేపట్టనున్నారు.

త్వరలో పనులు ప్రారంభం

పీఎంఅబీబ్, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న 11 భవనాల నిర్మాణాలకు టెండర్లు పిలిచాం. ఈ ప్రక్రియ పూర్తవగానే పనులు ప్రారంభిస్తాం. గత ప్రభుత్వ హయాంలో నిలిచిన భవనాలను నామినేషన్ పద్ధతిలో పూర్తి చేయిస్తాం.

- సుధాకర్ నాయక్, డీ.ఈ

కణేకల్లులో మధ్యలో ఆగిన నిర్మాణం

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: రాయదుర్గం పట్టణంలోని గాంధీ పాఠశాల సమీపంలో నాలుగు రోజులుగా వీధి దీపం వెలగడం లేదు. **-రాజు, స్థానికుడు**

సమాధానం: సిబ్బందిని పంపి దీపానికి మరమ్మతులు చేయిస్తాం. **-జగన్నాథ్, ఫిట్టర్**

సమస్య: పట్టణంలోని కొలిమి వీధిలో బాలుర వసతి గృహం సమీపంలో మురుగు కదలకపోవడంతో దుర్వాసన వస్తోంది. మురుగు తొలగించండి. **-తిప్పేస్వామి, స్థానికుడు**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపి మురుగు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **-రవీంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

సమస్య: పట్టణంలోని వాల్మీకి నగర్‌లో సీసీ రోడ్లు, మురుగు కాలువలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. **-శ్రీనివాసులు, కాలనీ వాసి**

సమాధానం: మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటాం. **-దివాకర్‌రెడ్డి, కమిషనర్** – న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

సమస్య: మండలంలోని కొత్త చెరువులో పలు వీధుల్లో అపరిశుభ్రత నెలకొంది. వెంటనే శుభ్రం చేయించండి. **-రాము, స్థానికుడు**

సమస్య: మండలంలోని ఐపార్శపల్లి గ్రామంలో తాగునీటి కొరత ఏర్పడటంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. **-గంగప్ప, గ్రామస్థులు**

సమాధానం: పైరెండు గ్రామాలను పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. **-సురేశ్, కార్యదర్శి** – న్యూస్‌టుడే, కంబదూరు

బాధితులకు అండగా ఉంటాం

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: తెదేపా కుటుంబ సభ్యులకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తెదేపా కార్యకర్తల కుటుంబ సభ్యులకు బీమా మంజూరు పత్రాలు అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. డి.హీరేహాళ్ మండలం కూడ్లూరు గ్రామానికి చెందిన లక్ష్మన్న, మండల కేంద్రానికి చెందిన నవీన్ మృతిచెందడంతో రెండు కుటుంబాలకు బీమా రూ.5 లక్షల పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు లక్ష్మీనారాయణమ్మ, లావణ్య, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీమా పత్రం అందిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

మంత్రి పర్యటన విజయవంతం చేద్దాం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కంబదూరు బైపాస్‌లో కనకదాస విగ్రహ ఆవిష్కరణకు రానున్న మంత్రి నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. ఈనెల 8న జరిగే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై ఆయన ప్రజావేదికలో చర్చించారు. కురుబలతోపాటు ప్రతిఒక్కరు తరలివచ్చేలా చూడాలని తెలిపారు. ప్రపంచ మహిళా క్రికెట్ మ్యాచ్‌ను ఆదివారం ప్రజావేదికలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వీక్షించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

శిబిరంలో పాల్గొన్న ప్రిన్సిపల్ విజయలక్ష్మి, వాలంటీర్లు

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థుల చిన్నప్పటి నుంచి సమాజ సేవకు ఉపయోగపడేలా సేవా దృక్పథం అలవర్చుకోవాలని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. 74ఉడేగోళంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏడోరోజు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ముగింపు సభలో ఆమె పాల్గొని మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో 74ఉడేగోళం సర్పంచి దురుగమ్మ, పీఏపీఎస్ మాజీ అధ్యక్షుడు జయన్న, మద్దనేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త బసవరాజు, అప్పాజి, దరజిన్, ఉలిగప్ప, గోవిందప్ప, రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు వీరేష్, శ్రీనివాసులు, ఎర్రన్న, సుబ్రహ్మణ్యం స్వామి, ఎన్ఎస్ఎస్ అధికారి ఓబులేష పాల్గొన్నారు.

అంతా కలిశారు... శుభ్రం చేసుకున్నారు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో శ్మశానవాటికకు వెళ్లే దారి పక్కన ఏపుగా పెరిగిన చెత్తాచెదారం, ఎరువు దిబ్బలను తెదేపా నాయకులు శ్రమదానంతో తొలగించి, గుంతల్లో మట్టిని తోలి చదును చేసుకున్నారు. ఆదివారం తెదేపా మండల కన్వీనర్ బలరామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు తిప్పేస్వామి, సింగల్‌బీడ్ అధ్యక్షుడు ఎర్రిస్వామి, మాజీ సర్పంచి గోవింద రెడ్డి ఆధ్వర్యంలో చెత్త, ఎరువుల దిబ్బలను తొలగించారు. తదుపరి ఉన్నత పాఠశాల వద్ద కాలువపై ట్రాక్టర్ సాయంతో ఎర్రమట్టి తోలి చదును చేయించడంతో రాకపోకల ఇబ్బందులు తొలిగాయి. కార్యక్రమంలో తెదేపా నాయకులు చంద్ర, లింగప్ప, పోతప్ప, గాదిలింగ, ఓంకార్, బండారు మల్లికార్జున, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీధరఘట్ట శ్మశాన వాటిక దారిని మట్టితో చదును

జూదరుల అరెస్ట్

కళ్యాణదుర్గం గ్రామీణం: బోరంపల్లి శివారులో జూద శిబిరంపై కళ్యాణదుర్గం గ్రామీణ సీఐ నీలకంఠేశ్వర, శిక్షణ ఎస్సై నరసింహరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. నలుగురి అరెస్టుతోపాటు రూ.5,100లు నగదు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు.

అడుగుకో గుంత.. అవస్థల ప్రయాణం

బొమ్మనహాళ్ మండలంలోని కురువళ్లి- బొమ్మనహాళ్ రోడ్డుపై అడుగుకో గుంత పడి వాహనదారుల ముప్పుతిప్పలు పడుతున్నారు. ఈ దారిలో జిందాల్‌సా కర్మాగారం, కురువళ్లి, చంద్రగిరి, శిద్దరాంపురం గ్రామాలకు నిత్యం జనసంచారం ఎక్కువగా ఉంటుంది. కనీసం ద్విచక్రవాహనాలు, ఎద్దుల బండ్లు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయంపై మండల ఇంజినీరు జగదీశ్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, బొమ్మనహాళ్

ఎన్నాళ్లో నీటి వృథా...!

కొన్ని రోజులుగా మంచి నీరు వృథాగా పోతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు వాపోతున్నారు. ఉరవకొండ మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ఆవరణలో భక్తుల తాగునీటి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ట్యాంకు కుళాయి విరిగిపోవడంతో నీరు వృథాగా పోతుంది. వెంటనే కుళాయి బిగించి నీటి వృథాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, ఉరవకొండ**

ఒరిగిన స్తంభం.. పొంచి ఉన్న ప్రమాదం

కణేకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే దారిలో ఇనుప స్తంభం రోడ్డు వైపునకు ఒరిగింది. దీని స్థానంలో కొత్త స్తంభం పాతి లైను మార్చిన సిబ్బంది పాతది మాత్రం తొలగించడం లేదని విద్యుత్తు సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈదురు గాలులకు ఇనుప స్తంభం పడిపోయే ప్రమాదం ఉన్నా.. సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

- **న్యూస్‌టుడే, కణేకల్లు**



సిమెంట్ రోడ్డుపై మురుగు పరుగు

వజ్రకరూరు మండలం బోడిసానిపల్లి తండాలో సిమెంటు రోడ్డుపై మురుగు ప్రవహిస్తుండటంతో అపరిశుభ్రంగా మారింది. పాదచారులు అటుగా వెళ్లినపుడు మురుగు దాటడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనివల్ల దోమల ఉధృతి పెరుగుతోంది, నివారణకు సైడు కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి మల్లయ్య 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ కాలువ నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని, నిధులు రాగానే తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

- **న్యూస్‌టుడే, వజ్రకరూరు**

పచ్చదనం పెంపొందిద్దాం

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణాన్ని కాపాడుదామని ఎన్ఎస్ఎస్ క్యాంపు అధికారి డి.నారాయణ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని 75వీరాపురం గ్రామంలో సర్పంచి నాగరాజుతో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలోని ఇంటింటికి తిరిగి ఒక్కొక్క మొక్క చొప్పున పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు మొక్కనాటి పరిరక్షించేలా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారి దీప, ఎన్ఎస్ఎస్ సిబ్బంది, అధ్యాపకులు కిరణ్, విజయ్‌కుమార్, లక్ష్మీనారాయణ, నాగరాజురెడ్డి, చంద్రశేఖర్, ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

దాడి ఘటనపై కేసు నమోదు

శెట్టూరు, న్యూస్‌టుడే: శెట్టూరుకు చెందిన రవితేజ అనే యువకుడిపై ఇదే మండలం అయ్యగార్లపల్లికి చెందిన సురేష్ చేసిన దాడికి సంబంధించిన ఘటనలో ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామ్‌భూపాల్ తెలిపారు. డబ్బు విషయంలో ఇద్దరు గొడవపడి ఆవేశంతో దాడులు చేసుకున్నారు.

దారికి అడ్డుగా.. ప్రమాదానికి నెలవుగా..

డి.హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురం చెక్‌పోస్టు సమీపంలో బళ్లారి- రాయదుర్గం ప్రధాన రోడ్డుకు అడ్డుగా ముళ్ల పొదలు పెరగడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పక్కనే ఉన్న పెట్రోల్ బంకు నుంచి వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఒక్కసారిగా రోడ్డుపైకి వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇటీవల ఈ ప్రాంతంలో ఒక వ్యక్తి రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొని మృతిచెందిన విషయం తెలిసిందే. రోడ్డుపైకి ముళ్లపొదలు రావడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, డి.హీరేహాళ్**

సిబ్బంది కొరతతో ఇబ్బంది

పనుల కోసం లబ్ధిదారుల పడిగాపులు

న్యూస్‌టుడే, బొమ్మనహాళ్

బొమ్మనహాళ్ రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది కొరతతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు భూ సమస్యలతో రెవెన్యూ కార్యాలయానికి వచ్చి పనులు కాకపోవడంతో నిరాశతో తిరిగి వెళ్తున్నారు. పలు గ్రామాల నుంచి ప్రజలు పట్టాదార్ పాస్ పుస్తకాలు, 1-బీ, ఆడంగల్ తప్పులు, మార్పులు చేర్పులు, రీసర్వే తదితర పనులపై వస్తున్నారు. స్థానికంగా తహసీల్దార్ పోస్టు, ఆర్ఐ-2, జూనియర్ సహాయకులు, సీఎస్‌డీటీ, కంప్యూటర్ ఆపరేటర్ తదితర కీలకమైన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే మండలంలో 10 మంది వీఆర్‌వోలు మాత్రమే ఉన్నారు. ఉంతకల్లు, ఏళంజి, శ్రీధరఘట్ట, శింగానహళ్లి, దర్గాహొన్నూరు తదితర గ్రామాలకు వీఆర్‌వోలు లేరు. ఇన్‌ఛార్జిలతోనే నెట్టుకు రావాల్సి వస్తోంది. కంప్యూటర్ ఆపరేటర్ లేకపోవడంతో పట్టాదార్ పాస్‌పుస్తకాల మ్యుటేషన్, ఆడంగల్ కరెక్షన్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, కులం, ఆదాయం తదితర పనులు నిలిచిపోతున్నాయి.

తక్షణం పరిష్కరించాలని...

రీసర్వే ప్రాంతాలైన కురువళ్లి, కొలగానహళ్లి, నేమకల్లు, హరేసముద్రం, బండూరు, ఉంతకల్లు తదితర గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు రాజ్యమేలుతున్నాయి. అలాగే కొలగానహళ్లి, ఉంతకల్లు గ్రామాల్లో ఎక్కువగా ఇనామ్ భూములున్నాయి. డిపట్టా భూములు ఆన్‌లైన్‌లో కనిపించకపోవడంతో ఆరేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కొలగానహళ్లికి చెందిన పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని వెంటనే రెవెన్యూ సిబ్బందిని నియమించి సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ మునివేలు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఖాళీ పోస్టుల భర్తీ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో పరిష్కరించనున్నట్లు తెలిపారు.

పత్రాల కోసం వచ్చిన లబ్ధిదారులు

వంతెన వద్ద నీటి లీకేజీలు పరిశీలిస్తున్న అధికారులు

హెచ్చెల్సీ వేదవతి హగరి వంతెన వద్ద గస్తీ

న్యూస్‌టుడే, కణేకల్లు: కణేకల్లు సమీపంలోని హెచ్చెల్సీ వేదవతి హగరి వంతెనపై రెండు రోజులపాటు గస్తీ కొనసాగిస్తామని డీఈ దివాకర్‌రెడ్డి, జేఈ నరేంద్ర మారుతి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కళేకుర్తికి వెళ్లే దారి మలుపు వద్ద రక్షణ గోడల నుంచి నీటి లీకేజీ వల్ల ఎర్రటి బురద వస్తోందన్న స్థానికుల సమాచారంతో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రక్షణ గోడలు పటిష్ఠంగానే ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అయినప్పటికీ వంతెన భద్రత దృష్ట్యా అత్యవసరంగా గస్తీ నిర్వహించి పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.

పుస్తకం చదివితే జ్ఞానం పదిలం

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: పుస్తకం చదివితే బాగు గుర్తుంటాయని పలువురు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన 'చదవడం మా కిష్టం' కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వాటిని చరవాణి ద్వారా చూడటం కంటే పుస్తకం చూసి చదివితే జ్ఞాపకం పదిలంగా ఉంటుందన్నారు. జ్ఞాపకశక్తి ఉండాలంటే చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. చిన్నారులతో పుస్తకాలు చదివించి అనంతరం విశ్లేషణ చేయించారు. డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, సహాయ గ్రంథాలయ అధికారి గోవిందు, విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

వజ్రకరూరు, న్యూస్‌టుడే: యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం వజ్రకరూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా శ్రీనివాసగుప్తా, అధ్యక్షుడిగా రాంబాబు, సహాధ్యక్షులుగా శ్రీదేవి, సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా ప్రసన్నకుమార్, కోశాధికారిగా వేణుగోపాల్, కార్యదర్శులుగా రామచంద్రానాయక్, మోహన్, రామచంద్ర, షాలెం, మధుబాబు, అంజనేయులు, ధనుంజయవర్మ, భాగ్యరేఖ, శివ, మాబూభాష తదితరులు ఎన్నికయ్యారు.

ప్రతిజ్ఞ చేస్తున్న కార్యవర్గ సభ్యులు

రోగులకివ్వాల్సిన మందులు కాల్చివేస్తే ఎలా?

శెట్టూరు, న్యూస్‌టుడే: ప్రజలకు ఉపయోగపడాల్సిన మాత్రలు, మందులు సిబ్బంది నిర్లక్ష్యంతో ఇలా కాల్చిపడేస్తే ఎలా? చికిత్సలకు వచ్చిన వారికి ఏమిస్తారు? అంటూ వైద్య సిబ్బంది తీరుపై శెట్టూరు మండలం కైరేవు గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ఆయుష్మాన్ భారత్ విలేజ్ క్లినిక్ మాత్రలు, మందులను ఆదివారం గ్రామం వెలుపల పొలాల్లో పడేసి కాల్చి వేసినట్లు గ్రామస్థులు గుర్తించారు. వీటిని ఎవరు కాల్చారు? ఎందుకు కాల్చారో? సంబంధిత అధికారులు తేల్చాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కాల్చిన మాత్రలు గడువు తీరినవా? అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై పీహెచ్‌సీ డాక్టరు నిఖిత 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఆ మందులు గడువు తీరినవేనని, ఉపకేంద్రం శుభ్రం చేసే క్రమంలో వాటిని పడేసి కాల్చివేసినట్లు పేర్కొన్నారు.

కమనీయం లలిత సుందరేశ్వర కల్యాణం

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: లలితాసుందరేశ్వరస్వామి వార్ల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం ముదిగల్లులో శ్రీ గుహరామలింగేశ్వరస్వామి ఆలయంలో 25వ వార్షిక కార్తికపూజ, వనభోజన మహోత్సవం, శ్రీలలితా సుందరేశ్వరస్వామి వార్ల కల్యాణం నిర్వహించారు. మేడా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆధ్వర్యంలో శ్రీలలితా సుందరేశ్వరస్వామి వార్ల కల్యాణ మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో మేడా, మేడం వంశోద్భవులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అలంకరణలో గుహ రామలింగేశ్వరస్వామి

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలో తులసి దామోదరం కల్యాణోత్సవం ఆదివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు కొనసాగించారు.

శ్రీఅశ్వర్థనారాయణ స్వామి..

విడపనకల్లు: శ్రీఅశ్వర్థనారయణ స్వామి కల్యాణోత్సవం విడపనకల్లులో వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఏర్పాట్లు

కణేకల్లు: మాల్యం గ్రామ కల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఏర్పాటు ఉత్సవాలు ఘనంగా సాగాయి. గణా, వాస్తు, నవగ్రహ, దుర్గా తదితర హోమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

గంగపూజలో భక్తులు

(c) eenadu

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

అశ్వర్థనారాయణుడికి విశేష పూజలు

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: మండలంలోని ప్రసిద్ధి చెందిన అశ్వర్థ ఆలయంలో ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అశ్వర్థనారాయణ స్వామి, చక్రభీమలింగేశ్వరస్వామికి వేద పండితులు అభిషేక పూజలు నిర్వహించి పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు పెన్నానదిలో పుణ్యస్నానాలు చేసి స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చారు.

నెట్టికంటి సన్నిధిలో న్యాయమూర్తి

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం అనంతపురం జిల్లా స్పెషల్ మెజిస్ట్రేట్ డాక్టర్ శివశంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యాయమూర్తి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాన్ని సందర్శించడంతో ఆలయ అధికారులు, వేదపండితులు స్వాగతం పలికారు. న్యాయమూర్తి స్వామికి పూజలు నిర్వహించారు.

పూజల్లో పాల్గొన్న జిల్లా స్పెషల్ మెజిస్ట్రేట్ జడ్జి డాక్టర్ శివశంకర్, కుటుంబ సభ్యులు

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య: గుంతకల్లులో బెస్తకాలనీలో గుట్టపై ఉన్న ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్య ఉంది. **- జబీనా**

సమస్య: బెస్త కాలనీ నుంచి గుట్టపైన ఇందిరమ్మ కాలనీలోకి వెళ్లేటప్పుడు మిట్ట ఉంది. ఇది ఎక్కువగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- నూర్జహాన్**

సమాధానం: సమస్యను పరిశీలించి చర్యలు

సమస్య: పెద్దవడుగూరులోని లక్షుంపల్లిలో ఇళ్ల నుంచి వచ్చిన డ్రైనేజీ కాలువ అధ్వానంగా ఉంది.
- గ్రామస్థులు, పెద్దవడుగూరు
-న్యూస్‌టుడే,గుంతకల్లు పట్టణం

సమాధానం: క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం.
- పుష్పవతి, పంచాయతీ కార్యదర్శి

సమస్య: కడదరగుట్టపల్లి వద్ద గ్రామానికి సరఫరా అయ్యే తాగునీటి పైప్‌లైను లీకేజీ కారణంగా తాగునీరు కలుషితమవుతోంది.
- చంద్రయ్య, కడదరగుట్టపల్లి

సమాధానం: నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటాం. **- ఆంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరు, పెద్దవడుగూరు**
–న్యూస్‌టుడే, పెద్దవడుగూరు

పచ్చడి మెతుకులూ కష్టమే!

అమాంతంగా పెరిగిన కూరగాయల ధరలు

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో తీవ్ర తుపాను వల్ల ఇటు రైతులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుపాన్ వల్ల రైతులు సాగు చేసిన కూరగాయల ఉత్పత్తులకు నష్టం వాటిల్లింది. దీంతో మార్కెట్లలో ధరలు అమాంతం పెరిగాయి. ఏ కూర చేసుకున్నా అందులోకి పచ్చిమిరప, ఉల్లి తప్పనిసరి. ఆకు కూరల ధరలు అదేస్థాయిలో పెరిగాయి.

గుత్తి మార్కెట్‌లో ధరలు(కి.రూ)

వంకాయ	80
బంగాళదుంప	50
కాకరకాయ	80
మిరప	60
బెండ	60
చిక్కుడ	80
క్యారెట్	100
ముల్లంగి	100
దోసకాయలు	50

గుత్తికి గుంతకల్లు, పామిడి, గుత్తి గ్రామీణ, పెద్దవడుగూరు, యాడికి మండలాల నుంచి కూరగాయల ఉత్పత్తులు వస్తుంటాయి.

సరఫరా తగ్గడంలోనే..

గుత్తి కూరగాయల మార్కెట్‌లో ధరలు గత వారం రోజుల నుంచి భారీగా పెరిగాయి. రూ.100లు తీసుకెళ్తే కేవలం రెండు రకాల కూరగాయలు కొనలేని పరిస్థితి ఉంది. ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి కావడంతో ధరల పెరుగుదలకు కారణమవుతోంది.

గుత్తిలోని కూరగాయల మార్కెట్

పేదలకు ఇబ్బందే

ప్రస్తుతం కూరగాయల ధరలు పూర్తిగా పెరిగిపోయాయి. సామాన్య ప్రజలు మార్కెట్‌కు వెళ్లాలంటేనే భయపడాల్సి వస్తోంది. ఏ కూరగాయలను ముట్టుకున్నా మండిపోతున్నాయి. ఇలాగే కొనసాగితే పేద ప్రజలు కూరగాయలు కొనలేక పచ్చడి మెతుకులకు ఇబ్బంది పడాల్సి వస్తుంది. **-శారద, గుత్తి**

మరువ వంకలో పూడిక తీయరూ!

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న చిక్కవడియార్ చెరువు మరువవంకలో కొన్ని నెలలుగా పూడిక తీయకపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. మరువ వంక గ్రామ నడిబొడ్డున ఉండటంతో గ్రామంలోని మురుగంతా కాలవల ద్వారా వంకలోకి చేరుతోంది. ఈక్రమంలో పెద్దఎత్తున పూడిక చేరడం, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో మురుగు ముందుకు కదలడం లేదు.

పిచ్చిమొక్కలతో నిండిపోయిన మరువ వంక

ప్రధాన కార్యాలయాలన్నీ అక్కడే!

వంక పక్కనే తహసీల్దారు, ఎంపీడీవో, పశు వైద్యశాల, ఎంఈవో, ప్రభుత్వ వైద్యశాల కార్యాలయాలు ఉన్నాయి. వంక నుంచి దుర్గంధం వస్తుండటంతో అధికారులు, కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు మురుగుపై వాలిన దోమలు గ్రామ ప్రజలపై దాడులు చేయడంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని మరువ వంకలో పూడిక తీయించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్తు తీగలు.. ప్రమాద ఘంటికలు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : మండలంలోని తెలికిలో ఇళ్ల మధ్యన విద్యుత్తుతీగలు వెళ్లడంతో ఎప్పుడు ఏం ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామస్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇదివరకు గ్రామంలో విద్యుత్తుతీగలు వెళ్లగా అప్పుడు ఇళ్లు చిన్నవిగా ఉండేవి ప్రస్తుతం ప్రభుత్వాలు మంజూరు చేసిన పక్కా గృహాలను నిర్మించుకోగా గ్రామస్థులకు విద్యుత్తు తీగలు మృత్యుపాశాలుగా మారాయి. ఈతీగలను మర్చాలని ఎన్నో మార్లు అధికారులను వేడుకున్నా స్పందించడంలేదని గ్రామస్థులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్యలో ప్రమాదకరంగా మారిన తీగలను సరిచేసి ఎవరికీ ఎలాంటి ప్రమాదం లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు అధికారులను కోరారు.

తెలికిలో ఇళ్లమధ్య వెళ్లిన తీగలు

సీసీ రహదారి నిర్మించరూ

గుత్తి మండలంలోని జక్కలచెరువు గ్రామానికి వెళ్లే రోడ్డును అసంపూర్తిగా వదిలేశారు. గతంలో 67వ జాతీయ రహదారి నుంచి గ్రామానికి రోడ్డు వేశారు. మధ్యలో రైల్వే వంతెన ఉండటంతో దాదాపు వంద మీటర్లు రోడ్డు వేయకుండా వదిలేశారు. దీంతో వర్షం కురిసినప్పుడు వంతెన దాటేందుకు ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సీసీ రోడ్డు నిర్మించాలని జక్కలచెరువు, గాజులపల్లి, గొందిపల్లి గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గుత్తి గ్రామీణం

పేద కుటుంబానికి ఆర్థికసాయం

నగదు అందజేస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయ సేవా సంస్థ సభ్యులు

తాడిపత్రి, న్యూస్‌టుడే : ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఓ పేద కుటుంబానికి ఉద్యోగ ఉపాధ్యాయ సేవా సంస్థ సభ్యులు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ పుట్లూరు మండలంలోని గోపురాజుపల్లికి చెందిన దినసరి కూలి జయరంగారెడ్డి రోడ్డు ప్రమాదానికి గురై మంచాన పడ్డారని తెలిపారు. వైద్య ఖర్చుల నిమిత్తం తమ వంతుగా రూ.20వేలు అందించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సభ్యులు గుర్రప్ప, రామేశ్వరరెడ్డి, శ్రీహరి, శంకర్, రంగయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయుడికి వెండి కిరీటం

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తికి చెందిన విశ్వనాథరెడ్డి తన కుమార్తె చార్విరెడ్డి పేరుతో పంచముఖ ఆంజనేయస్వామికి వెండి కిరీటం వితరణ చేశారు. పామిడిలోని ఆంజనేయస్వామికి ఆయన 250 గ్రాముల వెండితో తయారు చేయించిన కిరీటాన్ని ఆదివారం ఆలయ పూజారి తరుణ్‌తేజకు అందజేశారు. స్వామి వారి మొక్కును తీర్చుకున్నారు.

మార్కెట్ యార్డులో వైద్యశిబిరం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లు మార్కెట్ యార్డులో ఆదివారం నారాయణ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య వైద్యశిబిరం జరిగింది. ట్రస్టు అధ్యక్షుడు నారాయణ నాయక్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మాతృనాయక్ పాల్గొన్నారు.

గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కార్తిక పూజలు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే : కోటంక గ్రామ సమీపంలో కొండల మధ్య వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కార్తిక మాసం రెండో ఆదివారం సందర్భంగా స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, మహామంగళహారతి కార్యక్రమాలు జరిగాయి. అర్చకులు రామాచార్యులు ఉదయం అర్చనలు, క్షీరాభిషేకాలు, ఆకుల పూజలు జరిపి స్వామిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆలయానికి వచ్చి భక్తిశ్రద్ధలతో స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ప్రత్యేకాలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

ఘనంగా వనభోజనాలు

పామిడి, న్యూస్‌టుడే : పామిడికి చెందిన మాడి వెంకటస్వామి తోటలో ఆదివారం కొత్తూరు రామ్మోహన్, అనురాధ కుటుంబ సభ్యుల సహకారంతో ఆర్యవైశ్య సంఘం కార్తిక వనభోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉసిరి వృక్షానికి, తులసి మొక్కకు పూజలు చేశారు. కార్తిక మాసం ద్వాదశి సందర్భంగా ధాత్రి, దామోదర పూజలు చేశారు. చెట్టు కింద శివాభిషేకం, దీపారాధనలు చేశారు. అనంతరం వివిధ క్రీడా పోటీలను నిర్వహించి గెలిపొందిన వారికి బహుమతులు అందించారు. నూతనంగా ఏర్పాటైన ఆర్యవైశ్య యువజన సంఘం వారు ఆర్యవైశ్య పాలక మండలి వారిని సత్కరించారు.

ఉసిరి, తులసి మొక్కలకు పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు

కార్తిక వనభోజనాలకు విచ్చేసిన పలు కుటుంబాలు

పశువులకు వైద్య సేవలు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: పాడిపశువుల సంరక్షణ తమ బాధ్యత అని మండల పశువైద్యుడు రమేష్ పేర్కొన్నారు. శనివారం అర్ధరాత్రి విరుపాపురం గ్రామానికి చెందిన రైతుల కోడెదూడలు అకస్మాత్తుగా కిందపడిపోయాయని సమాచారం అందించగా వెంటనే స్పందించిన వైద్యుడు రమేష్ తన సిబ్బందితో వెళ్లి వైద్యచికిత్సలు అందించారు. బూజుపట్టిన మేత తినడం వల్ల ఇలా జరిగిందని వైద్యుడు తెలిపారు. వైద్యచికిత్సల అనంతరం కోడెదూడలు రెండు బాగున్నాయని వివరించారు.

బస్టాండ్ ప్రాంగణం శిథిలం

గుత్తిలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోని సీసీ రహదారి పూర్తిగా శిథిలమైంది. దీంతో బస్సు డ్రైవర్లు అవస్థ పడుతున్నారు. వర్షం కురిసినపుడు గుంతల్లో వర్షనీరు నిల్వ ఉండటంతో అందులో బస్సు టైర్లు దిగి దెబ్బ తింటున్నాయి. రెండేళ్ల నుంచి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం శిథిలమైనా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. –న్యూస్‌టుడే, గుత్తి గ్రామీణం

ప్రమాదకర ప్రయాణం

బుక్కరాయసముద్రం మండల పరిధిలో తరచూ వాహన ప్రమాదాలు జరుగుతున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు. మండల పరిధిలో రెండు జాతీయ రహదారులు ఉన్నాయి. సరకు రవాణా వాహనాల్లో ప్రయాణికులు, కార్మికులు నిత్యం అత్యంత ప్రమాదకరంగా ప్రయాణాలు చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలు చేసే వాహన చోదకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం

వారపు సంత.. సమస్యల చింత

గుంతకల్లులోని మున్సిపల్ కూరగాయల మార్కెట్ రోజురోజుకీ ఇరుకుగా మారుతోంది. ఆదివారం జరిగే వారపు సంతలో కూరగాయల కొనుగోలు కోసం వేలాది మంది మార్కెట్‌కు వస్తుంటారు. కొందరు వ్యాపారులు రోడ్లపైకి వచ్చి వ్యాపారాలు చేస్తుండటంతో ప్రజలు నడవడానికి స్థలం ఉండటం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

ప్రధాన రహదారిపై గుంతలు

పామిడిలోని కొత్తబస్టాండ్, గుప్తాకాలనీ సమీపంలోని ప్రధాన బీటీ రోడ్డుపై గుంతలు పడి రోజులు గడుస్తున్నా పట్టించుకునేవారే కరవయ్యారు. ప్రధాన రహదారి కావడంతో నిత్యం చుట్టూ పక్కల గ్రామాల నుంచి ఆటోలు, ద్విచక్ర వాహనాలతో పాటు బస్సుల రాకపోకలు సాగుతున్నాయి. దీంతో పాటు ఈ మార్గంలో కళాశాల, పాఠశాలలు ఉండటంతో సాయంత్రం వేళల్లో సందడిగా ఉంటోంది. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. –న్యూస్‌టుడే, పామిడి

అపరిశుభ్రంగా మార్కెట్ యార్డు

మండల పరిధిలోని కల్లూరు గ్రామం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న ప్లాట్‌ఫాంలు అపరిశుభ్రంగా ఉన్నాయి. ఇవి కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. బోర్లకింద సాగుచేసిన వరి పంటల కోతలు ప్రారంభమయ్యాయి. కల్లూరులో రైస్‌మిల్లులు ఉండడంతో రైతులు ధాన్యాన్ని ఆరబోయడానికి స్థలాలు లేక కల్లూరు వద్ద జాతీయ రహదారిపై ఆరబోస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో మార్కెట్ యార్డులోని ప్లాట్‌ఫాంలకు మరమ్మతులు చేసి అన్నదాతలకు ఉపయోగపడేలా చూడాలని వారు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, గార్లదిన్నె గ్రామీణం

'పెద్దారెడ్డి వస్తే అడ్డుకుంటాం'

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి పట్టణంలో వైకాపా నిర్వహించే కోటి సంతకాల కార్యక్రమంలో పెద్దారెడ్డి పాల్గొంటే పెద్దఎత్తున తెదేపా నాయకులతో కార్యక్రమాన్ని అడ్డుకుంటామని కౌన్సిలర్ మల్లికార్జున హెచ్చరించారు. ఆదివారం ఆయన సామాజిక మాధ్యమాలతో మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వంలో తెదేపా నాయకులు ఏ కార్యక్రమం చేసినా పెద్దారెడ్డి వాటిని అడ్డుకుని కేసులు కూడా పెట్టించారని గుర్తు చేశారు. ఆయన చేసిన అక్రమాలకు నిరసనగా కోటి సంతకాల కార్యక్రమాన్ని అడ్డుకోవడమే కాకుండా ఆందోళనలు కూడా చేస్తామన్నారు.

పూర్వవిద్యార్థికి చేయూత

శింగనమల(బుక్కరాయసముద్రం), న్యూస్‌టుడే: ప్రమాదకర క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న శింగనమల ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థి మల్లికార్జునకు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు కొండారెడ్డి, మల్లేశ్వరరెడ్డి, వెంకటరమణారెడ్డి, గాయత్రి రూ.25 వేలు ఆర్థిక సాయం చేశారు. అనంతపురం వైద్యశాలలో మల్లికార్జునను పరామర్శించారు. మల్లికార్జునతోపాటు చదువుకున్న వారు రూ.40 వేలు, స్నేహితుడు భరత్(చిట్టి) రూ.20 వేల సాయం అందించారు.

జీఎస్టీపై ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ప్రచారం

గుంతకల్లు, న్యూస్‌టుడే : పలురకాల వస్తువులపై ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడం, కొన్ని వస్తువులపై రద్దు చేయడం జరిగిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి నారాయణ అన్నారు. కసాపురం గ్రామంలో వారం రోజుల పాటు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా ఆదివారం గ్రామంలో వాలంటీర్లు గ్రామ ప్రజలకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి జీఎస్టీకి చెందిన కరపత్రాలు అందజేశారు. కసాపురానికి దగ్గరలో ఉన్న మద్దికెర గ్రామంలోనూ ప్రచారం చేశారు.

అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

రైలు పట్టాలపై పడి యువకుడికి గాయాలు

గార్లదిన్నె, న్యూస్‌టుడే : మండల పరిధిలోని కల్లూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు చెన్నవీరా అనే యువకుడు జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడిన యువకుడు రాయచూర్ జిల్లా గబ్బూర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు సమాచారం.

శత వసంతాల కార్యాలయం

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే : గుత్తి పాత తహసీల్దార్ కార్యాలయానికి 125 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. ఇప్పటికీ కార్యాలయం చెక్కు చెదరకుండా చూపరులను కనువిందు చేస్తోంది. గుత్తి నియోజకవర్గంగా కొనసాగుతున్న సమయంలో గుత్తి, పామిడి, గుంతకల్లు, ఉరవకొండ మండలాలు దీని పరిధిలో ఉన్నాయి. దాదాపు 100 ఏళ్లకు పైగా తహసీల్దార్ కార్యాలయంగా కొనసాగడం విశేషం. 2018 సంవత్సరంలో పక్కనే నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని నిర్మించారు. ఇప్పటికీ నాటి తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలు, ఉప ఖజానా కార్యాలయం కొనసాగుతోంది.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలోని అనంతపురం రోడ్డులో రూ.లక్షలు విలువైన నివాస స్థలాన్ని పరిరక్షించాలని జైనుబ్బీ కోరారు. తనకు 1995 జూన్ 2న అప్పటి రెవెన్యూ అధికారులు సర్వేనంబర్ 593లో రెండు సెంట్ల స్థలాన్ని ఇచ్చినట్లు తెలిపారు. తనకు చెందిన నివాస స్థలాన్ని ఆదివారం కొందరు ఆక్రమించుకుంటున్నట్లు ఆమె వాపోయారు. తన స్థలాన్ని చదును చేస్తున్నట్లు చెప్పారు. ఆక్రమణదారులపై రెవెన్యూ, పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

మట్కా నిర్వాహకుల అరెస్ట్

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలో మట్కా నిర్వహిస్తున్నట్లు ముగ్గురు నిర్వాహకులను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ఆరోహనరావు తెలిపారు. బంకమడి వీధికి చెందిన మహమ్మద్‌రజాక్, విజయనగర్ కాలనీకి చెందిన వెంకటరమణ, నందలపాడుకు చెందిన రాములను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద ఉన్న రూ.60,100లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఇందులో ఎస్సై గౌస్ బాషా తదితర సిబ్బంది పాల్గొన్నారు.

అదనంగా రైళ్లు ఆపాలి

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి పోర్టు రైల్వేస్టేషన్‌లో ఇప్పుడు ఆపుతున్న రెండు రైళ్లకు తోడు మరో రెండు రైళ్లను అదనంగా నిలపాలని ప్రజలు కోరుతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం మరో రెండు రైళ్లను నిలపాలన్నారు. ఇప్పటికే ప్రయాణికుల రద్దీ ఉందన్నారు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

శివారు కాలనీలు.. సమస్యల జోరు

సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం
-నాగేంద్రప్రసాద్, మున్సిపల్ ఏఈ

తాడిపత్రి పురపాలిక పరిధిలోని జయనగర్, చేనేత కాలనీ, బిందెల కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. మురుగు సమస్యకు పరిష్కారం, సీసీరోడ్లు ఏర్పాటు చేసి కాలనీ వాసుల సమస్యలను పరిష్కరిస్తాం. గ్రామీణ పరిధిలోని సమస్యలను ఆయా అధికారులకు తెలియజేస్తాం.

తీవ్ర ఇబ్బందుల్లో కాలనీవాసులు

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని పలు శివారు కాలనీల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. సంవత్సరాల తరబడి ఆయా కాలనీలు అభివృద్ధికి నోచుకోలేదు. ప్రధానంగా మురుగుకాలువలు, సీసీరోడ్లు, తాగునీరు కూడా సరిగా అందని పరిస్థితి కొనసాగుతోంది.

● తాడిపత్రి పురపాలికలోని చేనేత, జయనగర్ కాలనీల్లోని శివారు వీధుల్లో మురుగు నీటి పారుదల వ్యవస్థ దారుణంగా ఉంది. ఇక్కడి తాగునీటి ట్యాంకుల చుట్టూ మురుగు చేరడంతో ప్రజలు అవస్థ పడుతున్నారు. గన్నెవారిపల్లి కాలనీ శివారుల్లోనూ ఇళ్ల మధ్యనే ఏళ్ల తరబడి మురుగు ఉంటోంది. ఫలితంగా పరిసరాల్లో దోమలు, దుర్వాసన అధికంగా వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

తాగునీటి ట్యాంకు వద్ద మురుగు

సీసీ రహదారులు కరవు

కాలనీల్లో సీసీరోడ్లు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రధానంగా మ్యాన్‌హోళ్లు భూమి కంటే ఎక్కువ ఎత్తు ఉండటంతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

● శివారుల్లో ఉన్న వీధుల్లోకి తాగునీరు సరిగా రాకపోవడంతో వీధి చివర్లో ఉన్న ఉన్న నీటి ట్యాంకు నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. మురుగు కాలువలు లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ మురుగు నిల్వ ఉండటం, ఇళ్ల మధ్యలోనే అపరిశుభ్రత ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : మహిళలు అన్నిరంగాల్లో రాణించినప్పుడే మహిళా సాధికారత సాధ్యపడుతుందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. ఆదివారం భారత్- దక్షిణాఫ్రికా దేశాల మధ్య మహిళా ప్రపంచ క్రికెట్ కప్ తుది పోరును ప్రజలందరూ చూసేలా బుక్కరాయసముద్రంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో డిజిటల్ తెరను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు పాఠశాల స్థాయి నుంచే ఆటల్లో రాణించేలా ఉపాధ్యాయులతో ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అనంతపం ప్రజలతో కలిసి క్రికెట్‌ను వీక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీకి శ్రీనిత్‌రెడ్డి ఎంపిక

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: రాజధాని అమరావతిలో జరగబోయే మాక్ అసెంబ్లీకి రాప్తాడు ఆదర్శ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి శ్రీనిత్‌రెడ్డి ఎంపిక కావడం పట్ల ఎమ్మెల్యే పరిటాల సునీత సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో విద్యార్థి శ్రీనిత్‌రెడ్డికి ఎమ్మెల్యే శాలువా కప్పి అభినందించారు. రాప్తాడు ఆదర్శ పాఠశాలలో భారత రాజ్యాంగం అనే అంశంపై నియోజకవర్గ వక్తృత్వపు, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అందులో ఆరు మండలాల విద్యార్థులు హాజరు కాగా అందులో ఆరుగురు విద్యార్థులు ప్రతిభ చూపారు. వారికి తిరిగి క్విజ్ పోటీలు నిర్వహించగా విద్యార్థి శ్రీనిత్‌రెడ్డి ఎంపిక కావడంపై ఎమ్మెల్యే, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

కావలెను
గుత్తి నందు పనిచేయుటకు
ల్యాబ్ టెక్నీషియన్ DmLT..
కావలెను సంప్రదించగలరు
9490981449

(c) eenadu

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

శివకోటి ఆలయంలో కార్తిక పౌర్ణమి పూజలు

అనంత సాంస్కృతికం: నగరంలోని బెంగళూరు రోడ్డు శివకోటి ఆలయంలో ఈనెల 5న బుధవారం కార్తిక పౌర్ణమి పూజలు వైభవంగా జరుపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం రుద్రాభిషేకాలు, విశేష ఆరాధనలు, 9 గంటలకు సత్యనారాయణస్వామి వ్రతం, సాయంత్రం ఆరు గంటలకు అమృత రుద్రాభిషేకాలు, సహస్ర దీపాలంకరణ, జ్వాలాతోరణం జరుగుతుందన్నారు. మరింత సమాచారానికి ఆలయంలోని కమిటీ వారిని లేదా 85008 50016, 70366 76676 చరవాణిలో సంప్రదించాలని సూచించారు.

పుస్తకం చదివితే జ్ఞానం పదిలం

పుస్తక పఠనానికి వచ్చిన చిన్నారులతో గ్రంథాలయం సిబ్బంది, రచయితలు

అనంత సంక్షేమం: పుస్తకం చదివితే బాగా గుర్తుంటాయని పలువురు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదవడం మా కిష్టం కార్యక్రమం నిర్వహించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వాటిని చరవాణి ద్వారా చూడటం కంటే పుస్తకం చూసి చదివితే జ్ఞాపకం పదిలంగా ఉంటుందన్నారు. పుస్తకాలు చదివించి అనంతరం విశ్లేషణ చేయించారు. డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, సహాయ గ్రంథాలయ అధికారి గోవిందు పాల్గొన్నారు.

డిజైన్లకు చిరునామా కమలానగర్

అనంతపురం (కమలానగర్), న్యూస్‌టుడే : మారుతున్న కాలానికి అనుగుణంగా అభిరుచుల్లో మార్పు సహజం. ఈ ధోరణి మహిళల విషయాల్లో అయితే మరీ వేగవంతంగా ఉంటోంది. ఏ శుభకార్యానికైనా మహిళలను ఆకట్టుకునేలాగా చీరలు, అందులోకి మ్యాచింగ్ బ్లౌజులు, గాజులు, కమ్మలు, నుదుట స్టిక్కర్, చెప్పులు ఇలా వివిధ రకాల వస్తువులు రూపకల్పనలో పోటీ మొదలైంది. చీరకు కొత్త డిజైన్, దానికి తగ్గ మ్యాచింగ్ బ్లౌజులకు ఆకర్షించే డిజైన్ల వరకు నగరంలోనే తయారు చేస్తు ఎంతోమంది ఉపాధి పొందుతున్నారు. కమలానగర్ ఎక్కువగా దుకాణ దారులు ఈ విషయంలో ముందు వరుసలో ఉన్నారు. మహిళలతో పాటు పురుషులు కూడా ఈ ట్రెండ్‌ను అందిపుచ్చుకుంటూ డిజైన్ల రూపకల్పనలో తర్ఫీదు పొంది ఉపాధి మార్గాలుగా మలుచుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న మహిళా టైలర్లు కమలానగర్‌కు వచ్చి వారికి కావలసిన డిజైన్ల వస్తువులను తీసుకెళుతున్నారు.

- **నయా ట్రెండ్ వేటిలో:** చీరలు, బ్లౌజులు
- **ఆకర్షణీయత జోడింపు:** కుందన్లు, వివిధ రకాల పూసలు
- **రూపొందిస్తున్నది ఎక్కడెక్కడ? :** కమలానగర్, శ్రీనివాస్‌నగర్, ఆజాద్ నగర్, రహమత్‌నగర్, లక్ష్మీనగర్
- **దుకాణాలు ఎన్నింటాయి? :** సుమారు 250
- **ఉపాధి:** సగటున ఒక్కో దుకాణంలో ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు

శుభకార్యాలకు తగ్గట్టుగా

హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలతో పోటీ పడటానికి అనంతపురం ఏ మాత్రం తీసిపోదు. రూ. 1000 డిజైన్ బ్లౌజు నుంచి రూ. 10 వేల బ్లౌజులు తయారు చేయటానికి సిద్ధంగా ఉన్నాం. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు తగ్గట్టు కావలసిన డిజైన్లను అందిస్తున్నాం. డిజైన్లను బట్టి ధరలను కేటాయిస్తాం. అన్ని రకాల డిజైన్లకు కమలానగర్‌లో కావలసిన వస్తువులు తీసికొచ్చి తయారు చేసి ఇస్తున్నారు. **- ఉమాదేవి, డిజైనర్**

రూ.10 వేలవరకు ఉపాధి

మొదటలో మాములుగా టైలరింగ్ చేసే దాన్ని ప్రస్తుతం కొత్త చీరలు, బ్లౌజులు కొన్నవారు వాటిపై మంచి డిజైన్ కావాలని అడుగుతున్నారు. ఇలా నేను డిజైన్‌కు కావలసిన వస్తువులను కమలానగర్‌లో దుకాణాల్లో సేకరించి తయారు చేస్తున్నాను. మొదట్లో కుట్టుమిషన్ ద్వారా నెలకు రూ. 5 వేలు వచ్చేది. కొత్త డిజైన్లు నేర్చుకున్న తర్వాత రూ. 10 వేల నుంచి రూ. 15 వేల వరకు సంపాదిస్తున్నాను. **- యశోద, టైలర్, లక్ష్మీనగర్.**

మాక్ అసెంబ్లీకి శ్రీనిత్‌రెడ్డి ఎంపికపై హర్షం

రాంనగర్, కమలానగర్, న్యూస్‌టుడే: రాజధాని అమరావతిలో జరగబోయే మాక్ అసెంబ్లీకి రాప్తాడు ఆదర్శ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి శ్రీనిత్‌రెడ్డి ఎంపిక కావడం పట్ల ఎమ్మెల్యే పరిటాల సునీత సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో విద్యార్థి శ్రీనిత్‌రెడ్డికి ఎమ్మెల్యే శాలువా కప్పి అభినందించారు. రాప్తాడు ఆదర్శ పాఠశాలలో భారత రాజ్యాంగం అనే అంశంపై నియోజకవర్గ వక్తృత్వపు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అందులో ఆరు మండలాల విద్యార్థులు హాజరు కాగా వారిలో ఆరుగురు విద్యార్థులు ప్రతిభ చూపారు. వారికి తిరిగి క్విజ్ పోటీలు నిర్వహించగా విద్యార్థి శ్రీనిత్ రెడ్డి ఎంపిక కావడంపై ఎమ్మెల్యే, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

నేడు ఉచిత ఉసిరి మొక్కల పంపిణీ

మొక్కలను సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

అనంత సాంస్కృతికం: నగరంలోని శ్రీనివాస నగర్ సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో కార్తిక రెండో సోమవారం పురస్కరించుకుని భక్తులకు ఉచిత ఉసిరి మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రాము తెలిపారు. సోమవారం ఉదయం 10.30కు మొక్కల దాత హనుమంతు చేతులమీదుగా 300 పైగా మొక్కలు ఉచితంగా ఇవ్వనున్నామన్నారు. పరమేశ్వరుడికి ప్రీతిపాత్రమైన ఉసిరి చెట్లు కార్తిక మాసంలో పంపిణీ చేయడం ఆనవాయితీ. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ధర్మకర్త రాము విజ్ఞప్తి చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అశోక్‌నగర్ : 9440247485
తపోవనం: 8008573010
రుద్రంపేట: 8008550310

సమస్య: హౌసింగ్‌బోర్డు ఎల్‌ఐజీ 29 వద్ద చెత్తదిబ్బలుగా పడి ఉంది. **- జి.వి.బాబు**
సమాధానం: చెత్తను శుభ్రం చేయిస్తాం
సమస్య: ఖాజానగర్ గౌరీ థియేటర్ వీధిలో కాలువ తవ్వి నిర్మించకుండా వదిలేయడంతో మురుగు వెళ్లక ఇబ్బందిగా ఉంది. **- మహబూబ్ బాషా**
సమాధానం: మురుగు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం.
(పై ప్రశ్నలకు నగరపాలక ఇన్‌ఛార్జి ప్రజారోగ్య అధికారి నరసింహ సమాధానాలు ఇచ్చారు.) - న్యూస్‌టుడే, అశోక్‌నగర్

సమస్య: ఆత్మకూరు మండలం మదిగుబ్బ గ్రామంలోని సచివాలయ నిర్మాణం అసంపూర్తిగా ఉంది. కమ్యూనిటీ భవనంలో నిర్వహిస్తున్న సేవలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. **- నాగరాజు, మదిగుబ్బ**
సమాధానం: గతంలో నిధుల సమస్య కారణంగా పనులు ఆగిపోయాయి. ఉన్నతాధికారులతో చర్చించి తిరిగి నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేయిస్తాం. **- పార్థసారథి, పంచాయతీరాజ్ ఇంజినీర్, ఆత్మకూరు**
సమస్య: మండలంలో ఎంతోమంది గృహ నిర్మాణాలకు దరఖాస్తు చేసుకున్నా నేటి వరకూ మంజూరు అవ్వలేదు. **- తిరుపాలు, ఆత్మకూరు**
సమాధానం: ఆత్మకూరు మండల వ్యాప్తంగా గృహనిర్మాణం కావాల్సిన వారి వివరాలను సేకరిస్తున్నాం. త్వరలోనే నిర్మాణాలకు అనుమతులు మంజూరు అవుతాయి. **- జమీల్ అహ్మద్, హౌసింగ్ ఏఈ, ఆత్మకూరు**
- న్యూస్‌టుడే, ఆత్మకూరు

అపరిశుభ్రం చేయొద్దన్నందుకు దాడి

క్రైం కార్నర్

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అరటికాయల మండీలో అపరిశుభ్రం చేయొద్దని వారించినందుకు ఓ వ్యక్తిపై కొందరు దాడి చేశారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రుద్రంపేటకు చెందిన నారాయణరెడ్డి నగరంలోని సంగమేశ్ కూడలి సమీపంలో ఓ వైన్‌షాపు [illegible] ఆదివారం సాయంత్రం వేళలో సాదిక్ మద్యం మత్తులో అరటికాయల మండీకి చెందిన స్థలంలోకి వెళ్లి మూత్ర విసర్జన చేయడానికి ప్రయత్నించారు. గమనించిన బాధితుడు వారించాడు. మండీ స్థలాన్ని అపరిశుభ్రం చేయొద్దని కోరాడు. మైకంలో నిందితుడు మరో నలుగురిని వెంట బెట్టుకుని కాసేపటికి మండీ వద్దకు వెళ్లి ఘర్షణకు దిగారు. గదిలో కూర్చుని ఉన్న నారాయణరెడ్డిపై దాడి చేశారు. భయంతో పరుగులు తీసి వారి బారి నుంచి తప్పించుకున్నారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: రాప్తాడు కూడలి వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతున్న ఓ యువకుడు ఆదివారం మృతి చెందాడు. నగరంలోని జీసస్‌నగర్‌కు చెందిన కార్తిక్, మిత్రుడు అభిషేక్ (18) ఓ బైకుపై.. మరో ఇద్దరు సోహెల్, గౌస్‌లు మరో బైకులో బాబ్ చెఫ్ హోటల్‌కు భోజనానికి వెళ్లారు. భోజనం చేసిన తర్వాత ఇంటికి వచ్చే క్రమంలో పెట్రోలు అయిపోయినట్లు గమనించారు. పెట్రోలు పోయించుకోవాలని ఇరువురు రాప్తాడు కూడలికి బయలుదేరారు. స్థానిక పండమేరు వంతెనపై వెళ్తుండగా అనంతపురం వైపు నుంచి బెంగళూరు వైపునకు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక వైపున కూర్చున్న అభిషేక్‌కు తీవ్రగాయాలవగా చికిత్స కోసం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయాడు. బైకును నడుపుతున్న కార్తిక్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. రాప్తాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం గ్రామీణంలోని ఇండస్ట్రియల్ ఎస్టేటు ప్రాంతంలో నిర్వహిస్తున్న జూదస్థావరంపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. చెట్ల పొదల్లో జూదమాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 55,250ల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.



పార్టీ కండువాలు కప్పుకున్న నాయకులతో ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్

'అనంత అక్రమ ఆస్తులు బయట పెడతాం'

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: అనంతపురం నగర మేయర్ వసీం.. మాజీ ఎంపీ అనంత వెంకట్రామిరెడ్డి ఏం చెబితే అది మాట్లాడుతున్నారని, 450 ఎకరాలు సంపాదించారంటే.. కాదు 86 ఎకరాలని చెబుతున్నారని.. ఇప్పటికే సర్వే నంబర్లు సహా అన్ని ఆధారాలు సిద్ధం చేశామని, వాటిని త్వరలో ప్రజల ముందు ఉంచుతామని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం 41 డివిజన్‌లోని జనశక్తినగర్‌కు చెందిన వంద కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో తెదేపా చేరారు. ముందుగా ఎమ్మెల్యే వారందరికీ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గత మున్సిపల్ ఎన్నికల్లో తెదేపాకు చెందిన వారిని నామినేషన్లు వేయకుండా దౌర్జన్యంగా అడ్డుకున్నారన్నారు. కానీ 16 నెలల్లో చేసిన అభివృద్ధితో వచ్చే ఎన్నికల్లో అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని 50 డివిజన్లు, నాలుగు పంచాయతీలలో తెదేపా జెండా ఎగర వేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలకు ఎంతో నమ్మకం ఉందని, అందుకే సూపర్‌సిక్స్ సభను సూపర్ హిట్ చేశారన్నారు. తెదేపా చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారన్నారు. అనంతపురం నగరాభివృద్ధికి ఎమ్మెల్యేతో కలిసి కృషి చేస్తామని పార్టీలో చేరిన నాయకులు తెలియజేశారు.

'ఎమ్మెల్యే వ్యాఖ్యలన్నీ అసత్యాలే'

అనంత నగరపాలిక, న్యూస్‌టుడే: నిజాలు నిలకడగా ఉంటాయని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పదే పదే అబద్ధాలు మాట్లాడుతున్నారని వైకాపా ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు విమర్శించారు. ఆదివారం వైకాపా జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డికి 450 ఎకరాలు ఉందంటూ ఏదో తోచిన సర్వే నంబర్లు చెబుతూ ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సేవలో ఎమ్మెల్యే

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని సుబ్రహ్మణ్యేశ్వరునికి, మంజునాథ స్వామి, పార్వతీదేవి అమ్మవారికి పట్టుస్త్రాలను అందించి పూజలు చేశారు. అనంతరం ఆలయంలో అధికారులతో సమావేశాన్ని నిర్వహించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయం అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చొరవ చూపుతున్నామని.. త్వరలోనే నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు.

మురుగు వెళ్లేదెట్లా?

నగరంలోని మున్నానగర్‌లోని పిండి మిషన్ పక్కనే చెట్టు ముందా కాలువ ముందా అన్న పరిస్థితి నెలకొంది. మురుగు కాలువకు పక్కనే గతంలో చిన్న చెట్టు ఉండేది. అది రాను రానూ వృక్షంగా మారి మొదలు భాగం అంతా కాలువకు అడ్డంగా ఉంది. చెట్టు పెరిగే కొద్దీ మొదలు భాగం లావుగా కావడంతో కాలువను చీల్చుకొని పెరుగుతోంది. చిన్న కాలువ కావడంతో అడ్డంగా ఉండటంతో కేవలం అర్ధ అడుగు మాత్రమే ఉంది. కొద్దిపాటి నీరు ఎక్కువైనా మురుగంతా ఇళ్ల ముందు నిలబడుతోంది. నిత్యం సమస్యగా మారింది. ఏదైనా అడ్డం పడితే ముందుకు వెళ్లే వీలు లేక మురుగు చెట్టు వద్దే ఆగి దుర్వాసన ఎక్కువగా వస్తోంది. **- న్యూస్‌టుడే, అశోక్‌నగర్**

నాణ్యతాలోపాలు బహిర్గతం

రాంనగర్ ఫ్లైఓవర్ వంతెనపై గుంతలు ఏర్పడి ఇనుప కడ్డీలు పైకి తేలడంతో వాహన రాకపోకలు సాగుతున్నప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం వేలాది వాహనాలు తిరుగాడే వంతెనపై ఇంటి పరిస్థితి ఏంటని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఏమాత్రం అప్రమత్తత లేకుండా ప్రయాణించినా పెనుముప్పు సంభవించడం ఖాయం. వంతెన నిర్మించి దశాబ్ద కాలం గడవకనే గుంతలు ఏర్పడి కడ్డీలు పైకి కనిపిస్తున్నందున నాణ్యత లోపాలు బహిర్గతమవడంపైనా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. త్వరగా మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రుద్రంపేట**

వైభవం.. కల్యాణోత్సవం

వేడుక నిర్వహిస్తున్న అర్చకబృందం

అనంత సాంస్కృతికం: నగరంలోని శివ శక్తి సాయి దేవాలయంలో ఆదివారం తులసీ దామోదరస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. విజయసాయి ట్రస్టు వ్యవస్థాపకుడు సాయికుమార్ ఆధ్వర్యంలో దేవరకొండ బాలాజీశర్మ అర్చక బృందం నిర్వహించిన వేద మంత్రోచ్చారణ హోరెత్తించింది. గోపూజతో ఉత్సవం ప్రారంభమై విష్వక్సేన ఆరాధన అనంతరం కల్యాణ వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి వంద మంది భక్తులు హాజరయ్యారు. బీఎస్ఎన్ఎల్ విశ్రాంత అధికారి మనూరు నాగరాజు దంపతులు, నారాయణ, రాఘవేంద్ర కల్యాణ వేడుకలను పర్యవేక్షించారు.

సంబరం

మహిళల ప్రపంచకప్ క్రికెట్‌లో భారత జట్టు గెలిచిన అనంతరం టవర్ క్లాక్ వద్ద నిర్వహించిన సంబరాల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. జాతీయ జెండా చేతబూని యువతలో ఉత్సాహం నింపారు. జయహో భారత్ అంటూ నినదించారు.
- ఈనాడు అనంతపురం

భక్తుల రక్షణ బాధ్యత పాలకులదే

ర్యాలీలో వైకాపా నేతలు

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: ఏ దేవాలయంలో అయినా భక్తులు నమ్మకంతో భారీగా మొక్కులు తీర్చుకోవడానికి వెళితే వారికి భద్రత కల్పించాల్సిన బాధ్యత పాలకులదే అని వైకాపా శ్రేణులు నినదించారు. శనివారం శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 9మంది మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలంటూ ఆదివారం రాత్రి వైకాపా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. నగరంలోని గడియార స్తంభం మీదుగా ర్యాలీ సాగింది. భక్తుల విశ్వాసాలను కాపాడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. ర్యాలీలో మేయర్ వసీం, ఉపమేయర్లు వాసంతి సాహిత్య, విజయభాస్కర్‌రెడ్డి, వైకాపా నగర అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

యాదవ సంఘం ప్రచార కార్యదర్శి నియామకం

రామగిరి, న్యూస్‌టుడే: అఖిల భారతీయ యాదవ సంఘం ఆంధ్రప్రదేశ్ ప్రచార కార్యదర్శిగా పరంధామయాదవ్‌ను నియమించినట్లు ఆయన తెలిపారు. ఆదివారం అనంతపురం నగరంలో నిర్వహించిన మహాసభలో రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు ఆధ్వర్యంలో తనను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. యాదవుల అభివృద్ధి, ఐక్యత కోసం తాను కృషి చేస్తానని తనకు అవకాశం ఇచ్చిన జిల్లా యాదవ సంఘం నాయకులు, ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్ఎస్‌యూఐ విద్యార్థుల ఆందోళన

మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

ఉమానగర్, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పాఠ్య పుస్తకాల్లో గాంధీజీ హత్య, ఆర్ఎస్ఎస్ రద్దు అనే పాఠ్యాంశాలను తొలగించడం దారుణమని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్, జిల్లా అధ్యక్షుడు ఓబులేసు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠ్యాంశాల తొలగింపునకు వ్యతిరేకంగా ఆదివారం టవర్‌క్లాక్ సమీపంలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఎన్‌సీఈఆర్‌టీ తీసుకొన్న నిర్ణయం సబబు కాదన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహాత్ముని చరిత్ర విద్యార్థులకు తెలియకుండా చేయడం దారుణమని మండిపడ్డారు. నాయకులు వినోద్‌కుమార్, చైతన్య, భాగ్యరాజు పాల్గొన్నారు.

అట్టహాసంగా వాల్మీకి జయంతి ముగింపు

రుద్రంపేట, న్యూస్‌టుడే: వాల్మీకి ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రుద్రంపేట పంచాయతీ పరిధి వాల్మీకి భవన్‌లో ఆదివారం నిర్వహించి వాల్మీకి జయంతి అట్టహాసంగా ముగిశాయి. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొని వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళి అర్పించారు. సాంస్కృతిక ప్రదర్శనతో అలరించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తించి విశ్రాంతి పొందిన ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు గంగాధర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, నారాయణస్వామి పాల్గొన్నారు.

విశ్రాంత మహిళా ఉద్యోగిని సత్కరించిన వాల్మీకి ఉద్యోగులు

యాదవ సంఘం జిల్లా కమిటీ ఎంపిక

యాదవ సంఘం జిల్లా నూతన కమిటీ సభ్యులను సత్కరించిన యాదవులు

రుద్రంపేట, న్యూస్‌టుడే: యాదవ సంఘం జిల్లా నూతన కమిటీ ఆదివారం రుద్రంపేట పంచాయతీ పరిధి యాదవ్ కల్యాణ మంటపంలో యాదవ సంఘం జాతీయ నాయకులు రాజశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా రామకృష్ణ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా గోపాల్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రభాకర్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా ధనుంజయ యాదవ్, పరంధామ యాదవ్‌లను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను కమిటీ సభ్యులు, యాదవులు పూలమాలలతో సత్కరించారు. రాష్ట్ర నాయకులు నరసింహులు యాదవ్, నారాయణ స్వామి యాదవ్, జైపాల్ యాదవ్ పాల్గొన్నారు.

ఒంటరి వృద్ధ మహిళకు సాయం

కమలానగర్, న్యూస్‌టుడే: నగర శివారులో నివాసం ఉంటున్న రమణమ్మ ఇటీవల ప్రమాదవశాత్తు కిందపడి చేయి విరిగింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఆమె పరిస్థితిని గమనించి రూ.10 వేలు విలువ చేసే 32 రకాల వస్తువులను నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల సాకారంతో ఆదివారం అందించినట్లు పుట్టినిల్లు ఆశ్రమం ఛైర్‌పర్సన్ నిర్మల మురళి తెలిపారు.

'ఎంఈఓపై సస్పెన్షన్ ఎత్తేయాలి'

రుద్రంపేట, న్యూస్‌టుడే: మండల విద్యాశాఖ అధికారి రామచంద్రపై సస్పెన్షన్ ఎత్తివేయాలని ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జాతీయ నాయకులు రవిశంకర్ పేర్కొన్నారు. ఆదివారం ఎన్జీఓ హోమ్‌లో ఆయన మాట్లాడుతూ.. జిల్లా సమగ్ర శిక్షా కార్యాలయంలో సెక్టోరల్ ఉద్యోగాల భర్తీలో జరిగిన అవకతవకలపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని ప్రశ్నించినందుకు ఏకపక్షంగా మండల విద్యాధికారి రామచంద్రను సస్పెండ్ చేయడం రాజ్యాంగ విరుద్ధమని, తీవ్ర కులవివక్షత చూపడం తప్ప మరొకటి కాదని ప్రభుత్వానికి తెలియజేశారు.

వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఎన్ఎస్ఎస్ వైద్యశిబిరం

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్-2, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కురుగుంట గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు 6 రోజులుగా ఆ గ్రామంలో ప్రత్యేక శిబిరం ద్వారా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రిన్సిపల్ పద్మశ్రీ, విశ్రాంత ప్రిన్సిపల్ రమేష్ నారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జాతీయసేవా పథకం విద్యార్థులు సేవాగుణం అలవరచుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి విష్ణుప్రియ, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ రమేష్, వైద్యులు బాలాజీ, వేణుగోపాల్‌రెడ్డి, నాగేంద్ర, శిరీష, మంజులవాణి పాల్గొన్నారు.

రేపు చెకుముకి సంబరాలు

కమలానగర్, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక రాప్తాడు మండల కమిటీ ఆధ్వర్యంలో రేపు (4న) మాంటిస్సోరి ఎలైట్ పాఠశాలలో చెకుముకి సంబరాలు నిర్వహించనున్నట్లు జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరరాజు, మండల బాధ్యుడు భాస్కర్ పేర్కొన్నారు. ఎస్కేయూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ వెంకటనాయుడు పాల్గొంటారన్నారు. మొత్తం 10 బృందాల విద్యార్థులు ఈ సంబరాల్లో పాల్గొని ఆసక్తి అంశాలను వివరిస్తారన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆత్మలపండగ

కనగానపల్లి, న్యూస్‌టుడే: కనగానపల్లి మండలం సీఎస్ కోటలో ఆదివారం ఆత్మల పండగను క్రైస్తవులు నిర్వహించారు. మరణించిన ఆత్మీయులు, పూర్వీకులతోపాటు, బంధువర్గాల సమాధులకు రంగులు వేయించి పూలతో అలంకరించారు. సమాధులు నిర్మించిన ప్రదేశంలో విచారణ గురువుల సారథ్యంలో ప్రార్థనలు నిర్వహించి వారి ఆత్మలను మోక్ష మార్గంలోకి అనుమతించాలని ఏసు ప్రభువును ఆరాధించినట్లు చెప్పారు.

గుల్జార్‌పేట.. సమస్యల మేట

ప్రమాదకరంగా కల్వర్టు

అధ్వానంగా కాలువ.. పక్కనే స్తంభాలు

బళ్లారి రోడ్డు, న్యూస్‌టుడే: గుల్జార్‌పేట కాలనీలో అడుగడుగునా సమస్యలు తాండవిస్తున్నాయి. ఏళ్లు గడిచినా కాలనీ దుస్థితి మాత్రం మారటం లేదు. నిత్యం జన సంచారం అధికంగా ఉన్న ఈ కాలనీలో కాలువలు అధ్వానంగా ఉన్నాయి. విద్యుత్తు స్తంభాలు కాలువల సమీపంలోనే రోడ్డుపై ఉండటంతో.. వాహనాలు రాకపోకలు ఇబ్బందులు వస్తున్నాయి. కాలనీల్లో ఉండే దుకాణాలకు వెళ్లాలన్నా బండరాళ్ల సహాయంతో వెళ్లాల్సి వస్తోంది. హోల్‌సేల్ ధరలకు కోడిగుడ్ల అమ్మకం, గిఫ్ట్ కొనుగోలు దుకాణాలు, టైపింగ్ దుకాణాలు అధికం. అమ్మవారిశాల, మసీదులకు పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. మురుగు కాలువల సమస్యతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. కాలువల్లో పందులు ఎక్కువ. వర్షం కురిసిన సమయాల్లో అనంత నగరంలో ఎక్కడా లేని విధంగా దుర్భర పరిస్థితి ఉంటోంది. వాహనాలు నీరు మునిగిపోయే అంత లోతుగా వర్షం నీరు నిలుస్తోంది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి కాలనీలో కాలువలు నిర్మాణం చేపట్టాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

IN THE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT : ANANTHAPURAM
O.S. No. 1181 of 2025
Between:
Namala Nirmala & Others ..Plaintiffs
And
1. The Divisional Co-Operative Officer
2. All Concerned .. Defendants
NOTICE
పై దావాలోని వాది ఓబులేసు యొక్క legal heirs గా certificate కోరుతూ Divisional Co-Operative Officer మరియు All Concerned ని ప్రతివాదిగా చెయ్యడం జరిగింది. 2వ ప్రతివాది అయిన All Concerned అనగా ఎవ్వరికైనా అభ్యంతరాలు ఉన్న ఎడల, కోర్టు వారి సూచనలు మేరకు 27-11-2025వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు పైన తెల్పిన కోర్ట్ యందు 2వ ప్రతివాది ఎవ్వరైననూ, మీరు గాని లేదా మీ తరఫున Advocate గారు గాని హాజరు అయి మీ అభ్యంతరాలను తెలియజేయవలెను. లేని పక్షంలో కోర్ట్ వారు మీకు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడం జరుగుతుంది.
కోర్ట్ వారి సూచనలు మేరకు
K.Mallikarjun, Advocate
Hyderabad. 500068

(c) eenadu

లాహిరి.. లాహిరి.. రక్షణ మరిచిరి!

సోమశిల వెనుక జలాల్లో రక్షణ లేని పడవ ప్రయాణం ఆందోళన కలిగిస్తోంది. ప్రకృతి ఒడిలో సేద తీరాలని ఎంతోమంది వెనుక జలాల చెంతకు పరుగులు తీస్తున్నారు. ఉమ్మడి కడప జిల్లాలో ఉన్న పెన్నా నదిలో కలిసే కుందూ, చిత్రావతి, పాపఘ్ని, సగిలేరు, చెయ్యేరు, గుంజనేరులు ఏకమై సోమశిలకు చేరాయి. కుడమలూరు అంకాలమ్మ ఆలయం సమీపంలో నిల్వ ఉన్న జలనిధి చెంతకే వాహనాలు వెళ్తున్నాయి. వారంతపు ఆదివారం సెలవు కావడంతో ఎంతోమంది ఇక్కడికి వస్తున్నారు. మత్స్యకారులు చేపల వేటకు వినియోగిస్తున్న నాటు పడవలు, బుట్టల్లో పర్యాటకులు కుటుంబ సమేతంగా విహరిస్తున్నారు. లైఫ్ జాకెట్లు లేకుండా ఇలా ప్రయాణించడం ప్రమాదకరమే. ప్రభుత్వం జల విహారానికి తగిన రక్షణ ఏర్పాట్లు చేస్తే బాగుంటుందని పర్యాటకులు సూచిస్తున్నారు. - న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

కార్తికం.. శివ రూపం

రాజంపేట పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకొని శ్రీహనుమాన్ బృందం ఆధ్వర్యంలో దీపాలను భక్తులు వెలిగించారు. పరమేశ్వరునికి, ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగం రూపంలో వెలిగించిన దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. - న్యూస్‌టుడే, రాజంపేట

పరువు గోవింద.. తిరుపతికి వేరే దారుందా!

అధ్వానంగా ఉన్న కడప- రేణిగుంట జాతీయ రహదారి

ఈనాడు, కడప

వివిధ రాష్ట్రాల ప్రజలు ఎక్కువగా ప్రయాణించే కడప-రేణిగుంట జాతీయ రహదారి (716) మరింత అధ్వానంగా మారింది. ఈ మార్గంలో వాహనాలు నడపలేక చాలా మంది కడప నుంచి రాయచోటి మీదుగా తిరుపతికి చేరుకుంటున్నారు. తిరుపతికి ప్రత్యామ్నాయ దారులు ఏమైనా ఉన్నాయా అని అంతర్జాలంలో వెతికే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. కొందరైతే రోడ్డు దుస్థితిపై వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారు. దీంతో రాష్ట్రం పరువు మంటగలుస్తోంది. మరో వైపు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణ గుత్తేదారు నిర్లక్ష్యం కారణంగా పనులకు ఆలస్యం అవుతోంది. ఈలోపు ఇప్పుడున్న పాత రోడ్డును బాగు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

- వాహన చోదకుల ప్రధాన సమస్యలివీ

- ఈ రహదారి కొన్ని చోట్ల భారీ గోతులేర్పడ్డాయి. వీటిని దాటుకోలేక కారు, ద్విచక్ర వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితి. గుంతలు తప్పించడానికి ముప్పుతిప్పలు పడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు.
- వర్షమొస్తే నీరు.. ఎండకాస్తే దుమ్ముతో సమీప గ్రామాలు ఇక్కట్లు పడుతున్నాయి.
- కడప- రేణిగుంట మధ్య ప్రయాణ సమయం 2.30 గంటలు కాగా 4.30 గంటల వరకు పడుతోంది. వాహనాలు మరమ్మతుకు లోనుకావడం, ప్రమాదాలకు గురికావడం జరుగుతోంది.

హెచ్‌ఏఎం విధానంలో నిర్మాణం

హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్‌ఏఎం)ను కేంద్ర ప్రభుత్వం 2016 జనవరిలో ప్రవేశపెట్టింది. భారీ పెట్టుబడులు అవసరయ్యే మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో ఆర్థిక భారాన్ని ప్రభుత్వ- ప్రైవేటు డెవలపర్ల మధ్య పంచుకోవడమే దీని ప్రధాన ఉద్దేశం. ఈ మోడల్ ప్రాజెక్టు నిర్మాణ దశలో మొత్తం వ్యయంలో 40 శాతం కేంద్ర ప్రభుత్వం, మరో 60 శాతం ప్రైవేటు భాగస్వామ్యం కింద గుత్తేదారు భరించాల్సి ఉంటుంది. నిర్మాణం పూర్తయిన తర్వాత 15 ఏళ్ల నిర్వహణ సమయంలో దశలవారీగా బిల్లులు చెల్లిస్తుంది. రూ.3,150 కోట్ల వ్యయంతో చేపట్టే ప్రాజెక్టులో 60 శాతం గుత్తేదారు భరించాల్సి ఉండటంతో ఆర్థిక వనరులు సమకూర్చుకోవడానికి తలెత్తిన ఇబ్బందులతో పనులు చేపట్టడానికి ఆలస్యమైంది. త్వరలో సమస్యకు పరిష్కారమతుందని ఎన్‌హెచ్ అధికారులు చెబుతున్నారు.

గ్రీన్‌ఫీల్డ్ నిర్మాణం మరింత ఆలస్యం

రైల్వేకోడూరు- భాకరాపేట మధ్య జరుగుతున్న రహదారి పనులు

15 రోజుల్లో మరమ్మతులు

వర్షాల అడ్డంకి లేకపోతే 15 రోజుల్లో గుంతలు పూడుస్తామని జాతీయ రహదారుల విభాగం అధికారులు చెబుతున్నారు. ఆదివారం ప్రారంభించిన రోడ్డు రెన్యువల్ పనులు ఆరు నెలల్లో పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. రైల్వేకోడూరు నుంచి భాకరాపేట వరకు 72 కి.మీ మేర రెన్యువల్ చేస్తారు. రైల్వేకోడూరు- రేణిగుంట మధ్య ఉన్న రోడ్డు గ్రీన్‌ఫీల్డ్‌లో కలుస్తుంది. ఇక్కడ త్వరలో చేపట్టే పనుల్లో గుంతలు మాత్రమే పూడుస్తారు.

నిర్మాణ ప్యాకేజీలివి...

- రేణిగుంట- కడప జాతీయ రహదారి (ఎన్‌హెచ్-716)ను నాలుగు లేన్లుగా విస్తరించే ఈ ప్రాజెక్టును రెండు ప్యాకేజీలుగా విభజించారు. ఇది హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్‌ఏఎం) కింద నిర్మాణం జరగనుంది.
- ప్యాకేజ్-1 కడప- చిన్న ఓరంపాడు సెక్షన్ (64.2 కి.మీ)
- ప్యాకేజ్-2 చిన్న ఓరంపాడు- రేణిగుంట సెక్షన్ (57.35)
- ఈ రెండు ప్యాకేజీలను లక్ష్మీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలపర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు 2023 మార్చి 24న అప్పగించారు.

పాపఘ్ని... వరదాయిని

పాపఘ్ని నది ఇరు జిల్లాలకు వరదాయినిగా మారింది. ఈ నది ప్రవహించే మార్గంలోని గ్రామాల్లో తాగు, సాగునీటికి ఇబ్బందులు లేకుండా సస్యశ్యామలం చేస్తోంది. కర్ణాటక రాష్ట్రంలో పుట్టి పీటీఎం వద్ద అన్నమయ్య జిల్లాలో ప్రవేశిస్తోంది. ఈ నదిపై గాలివీడు మండలం వెలిగల్లు వద్ద జలాశయం నిర్మించారు. అక్కడి నుంచి లక్కిరెడ్డిపల్లె, చక్రాయపేట, వేంపల్లె మీదుగా వల్లూరు మండలంలో పెన్నానదిలో కలుస్తుంది. అయిదేళ్లుగా వర్షాలు సక్రమంగా కురవక పాపఘ్ని నది ఎడారిని తలపించింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాపఘ్ని నదిలో జలకళ సంతరించుకుంది. పాలకొండలను చీల్చుతూ పచ్చదనాన్ని పెంచుతూ వేంపల్లె మండలం 'గండి' వద్ద సాగిపోతున్న నదిని చిత్రంలో చూడవచ్చు. - న్యూస్‌టుడే, వేంపల్లె

జాతీయ రహదారిపై గ్రామస్థుల నిరసన

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: 'కడప-రేణిగుంట రహదారి గుంతలు తేలింది.. వాహనాల రాకపోకలతో వచ్చే దుమ్ము, ధూళిని భరించలేక పోతున్నాం.. ఎన్నాళ్లు మాకీ నరకం' అంటూ రైల్వేకోడూరు మండల పరిధిలోని మాధవరంపోడు గ్రామస్థులు రోడ్డెక్కి నిరసనకు దిగారు. ఆదివారం జాతీయ రహదారిపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. వాహనాల రాకపోకలను అడ్డుకోవడంతో రెండు కిలోమీటర్ల మేర వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని గ్రామస్థులకు సర్దిచెప్పారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామని చెప్పడంతో వారు శాంతించారు.

పోలీసులతో తమ ఆవేదన వెల్లగక్కుతున్న మాధవరంపోడు గ్రామస్థులు

మదనపల్లె ఆసుపత్రికి తప్పిన పెను ప్రమాదం

మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో పెను ప్రమాదం తప్పింది. ఆదివారం ఉదయం ప్రభుత్వాసుపత్రికి లిక్విడ్ ఆక్సిజన్ నింపే ట్యాంకర్ వచ్చింది. అందులో నుంచి ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన 6కేఎల్ ట్యాంకులోకి నింపడం మొదలుపెట్టారు. 4.5 నుంచి 5 పాయింట్లలోపు మాత్రమే నింపాల్సి ఉండగా 13 పాయింట్లు నింపేశారు. దీంతో ఒక్కసారిగా రీడింగ్ సూచిక పెరిగిపోవడంతో ఆసుపత్రి సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఒత్తిడిని పైపు ద్వారా బయటకు వదిలేయడంతో సమస్య తీరింది. ఈ ఒత్తిడి అలాగే 15 పాయింట్లకు పెరిగితే ఆక్సిజన్ సిలిండర్ పేలి ఆసుపత్రిలో పెద్ద ప్రాణనష్టం జరిగేది. అధికారులు స్పందించి మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని రోగులు కోరారు. - న్యూస్‌టుడే, మదనపల్లె వైద్యం

తెలుగు జనం మెచ్చిన శాస్త్రి

మారుతీనగర్ (కడప), న్యూస్‌టుడే: చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ ఆంగ్లేయుడు అయినప్పటికీ తెలుగు మీద మమకారంతో ఎన్నో సాహిత్య గ్రంథాలను సేకరించి వాటిని తెలుగులోకి అనువాదం చేశారని, తెలుగు భాషా సాహిత్యాలు ఈ రోజు ఇంత దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయంటే దానికి మూల కారణం సీపీ బ్రౌన్ అని, అలాంటి తెలుగు సూర్యుడు సీపీ బ్రౌన్ పేరిట స్మారక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి దేశ వ్యాప్తంగా లక్షలాది మందికి పరిచయం చేసి సాహితీ పరిమళాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి అని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు కొనియాడారు. హనుమచ్ఛాస్త్రి శత జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన జానమద్ది స్మారక పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కడప చరిత్రపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, కలెక్టర్ శ్రీధర్, ఇతర అధికారులు

ముందుగా గ్రంథాలయంలోని తాళ పత్ర, తామ్ర పత్రాలను, ఇతర గ్రంథాలను పరిశీలించారు. సీపీ బ్రౌన్, జానమద్ది హనుమచ్ఛాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాతృభాష పరిరక్షణకు కేవలం పుస్తకాలు రాయడం, అవార్డులు ఇవ్వడం, కార్యక్రమాలు నిర్వహించడంతోనే సాధ్యం కాదని, అది ప్రజా ఉద్యమంగా రూపుదాల్చాలన్నారు. మాతృభాషకు సేవలందించిన వారికి పురస్కారాలు అందించడం ఆనందంగా ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఉన్నతాధికారులు, అధికారులు సమావేశాల్లో నేటికీ ఆంగ్లంలో మాట్లాడుతుండడం బాధాకరమన్నారు. వారంతా తెలుగు భాషలోనే మాట్లాడాలని, అధికారికంగా ఇచ్చే ఉత్తర్వులు తెలుగులోనే ఇవ్వాలని సూచించారు. జానమద్ది హనుమచ్ఛాస్త్రి చేపట్టిన గ్రంథాలయ యజ్ఞం మహోన్నతమైనదని, వారసత్వం అంటే ఆస్తులు, పదవులు పంచుకోవడం కాదని, ఇలాంటి మంచి కార్యాలు చేపట్టడమే నిజమైన వారసత్వం అని కొనియాడారు. ప్రతి గ్రామంలో గ్రంథాలయం, దేవాలయం, సేవాలయం ఏర్పాటు చేయాలన్నది తమ ఆకాంక్ష అని ప్రజలు ఆ దిశగా చొరవ తీసుకోవాలన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి ఎంతో చిత్తశుద్ధితో కృషి చేశారని జానమద్ది హనుమచ్ఛాస్త్రి కుమారుడు జనమద్ది విజయ భాస్కర్‌ను అభినందించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, ప్రముఖ సాహితీవేత్త ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, కలెక్టర్ చేరుకూరి శ్రీధర్, వైవీయూ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య పద్మ, నగర ప్రముఖులు, జానమద్ది కుటుంబ సభ్యులు, భాషా ప్రేమికులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

భారత నారీ జయహో.. శ్రీచరణి అదరహో!

సత్తా చాటిన కడప బిడ్డ

అసలే వరల్డ్ కప్.. భారత మహిళల క్రికెట్ జట్టు ఏకంగా ఫైనల్స్ చేరింది. ఆపై మన కడప బిడ్డ శ్రీచరణి అందులో ఆడుతోంది. ఆదివారం దక్షిణాఫ్రికాతో ఫైనల్స్ పోటీ వీక్షించేందుకు జిల్లావ్యాప్తంగా పలుచోట్ల బిగ్ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారత మహిళల జట్టు విశ్వ విజేతగా నిలవాలని, శ్రీచరణి ఫైనల్స్‌లో రాణించాలని ఆకాంక్షిస్తూ బ్యానర్లు ఏర్పాటు చేయించారు. జిల్లాలోని మహిళ క్రికెటర్లు ఆలయాల్లో పూజలు చేశారు. పెద్ద స్క్రీన్‌పై వరల్డ్ కప్ ఫైనల్స్ చూడడం ఒక ఎత్తైతే అందులో భారత నారులు విశ్వవిజేతలుగా నిలవడంతో సంబరాలు అంబరాన్నంటాయి. శ్రీచరణి తల్లిదండ్రులు ఇంట్లోనే టీవీకి అతుక్కుపోయి బిడ్డ ఆటను ఆస్వాదించారు. ఆయా చిత్రాలివి. - న్యూస్‌టుడే, కడప క్రీడలు

టీవీలో మ్యాచ్ వీక్షిస్తున్న శ్రీచరణి తల్లిదండ్రులు

ఒంటిమిట్టకు తితిదే జేఈవో రాక

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయం అభివృద్ధి పనులు, వచ్చే ఏడాది మార్చి నెల ప్రారంభం కానున్న శ్రీరామ నవమి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై పరిశీలనకు తితిదే సంయుక్త కార్యనిర్వహణాధికారి వీరబ్రహ్మం సోమవారం ఒంటిమిట్టకు రానున్నారు. అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం బోయనపల్లిలో తితిదే నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం కార్యక్రమానికి జేఈవో హాజరుకానున్నారు. అనంతరం రామయ్య క్షేత్రానికి విచ్చేస్తారని సీనియర్ అధికారి తెలిపారు.

విద్యార్థులూ.. తస్మాత్ జాగ్రత్త!

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే: ఎడతెరపి లేని వర్షాలు, మొంథా తుపాను తీవ్రత తగ్గడంతో పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ పాఠశాల యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు కొన్ని సూచనలు చేసింది. ● పాఠశాల ఆవరణంలో శిథిల భవనాలు, పైకప్పు ఉరుస్తున్న భవనాల్లోకి విద్యార్థులు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అందులో తరగతులు నిర్వహించరాదు. ● పాఠశాల ఆవరణంలో భవన నిర్మాణ పనులు జరుగుతుంటే అక్కడ తీసిన గుంతల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి. గుంతల వైపు పిల్లలు వెళ్లకుండా సూచనలు ఇవ్వాలి. వెంటనే వాటిని పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలి. ● పాఠశాలల పరిసరాల్లో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, ఫ్యూజ్ బాక్సులు ఉంటే వాటి వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ● ముఖ్యంగా వసతి గృహాల్లోని విద్యార్థులు స్విచ్ బోర్డులు, విద్యుత్తు తీగల వద్దకు వెళ్లకుండా చూడాలి. ● పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యుత్తుకు సంబంధించిన మరమ్మతులు చేపట్టాలి. ● విద్యార్థులు బడికి వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు మార్గంలో వాగులు, వంకలు, కాలువలు దాటి వెళ్లాల్సిన పరిస్థితి ఉంటే, అక్కడ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ● కుళాయిలు, చేతి పంపుల నుంచి వచ్చే తాగు నీరు వర్షానికి కలుషితమయ్యే అవకాశం ఉంది. కారణంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజన సమయంలో కాచి చల్లార్చిన నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలి. ● పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలు తొలగించాలి. పిచ్చి మొక్కలు ఎక్కువగా ఉంటే పాములు వచ్చే అవకాశం ఉంది. పాఠశాల తరగతి గదిలో పురుగులు, పాములు ఉంటాయనే ఉద్దేశ్యంతో గదులను జాగ్రత్తగా శుభ్రం చేయాలి. ● పాఠశాల ఆవరణంలో నీటి నిల్వలు లేకుండా చూడాలి. నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది, వాటి వల్ల విద్యార్థులకు జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. నీరు నిల్వ ఉంటే బ్లీచింగ్, దోమల మందు పిచికారీ చేయాలి. ● మురుగు కాలవలు పొంగి, ప్రవహిస్తున్నందున, వాటికి దూరంగా నడవాలని ఉపాధ్యాయులు సూచించాలి. ● వర్షాకాలంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి.

కంభంవారిపల్లె బాలుర వసతిగృహం ఆవరణంలో ఉన్న విద్యుత్తు స్తంభం

ఈ నెలా ఉడకలేదు!

చౌక దుకాణాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేసే రేషనులో ఈ నెల బియ్యం, అరకిలో పంచదారతోనే సరిపెడుతున్నారు. ఏ నెలకు ఆ నెల కందిపప్పు వస్తుందని పేదలు ఎదురుచూపులతోనే కాలం వెళ్లదీస్తున్నారు. గత నెలలో అరకొరగా రాగులు అందించారు. ఈ సారి అవీ కూడా లేవు. రేషను దుకాణాల్లో నిత్యావసరాల సరకులు అందజేస్తేనే తమకు మేలని పేదలు చెబుతున్నారు. అసలే కూరగాయల ధరలు పెరిగిపోయాయి. కందిపప్పు కొందామంటే కిలో రూ.120 నుంచి రూ.140 వరకు బహిరంగ మార్కెట్‌లో పలుకుతోంది. అదే రేషనులో ఇస్తే కేవలం రూ.67లకే వచ్చేది. నలుగురున్న చిన్న కుటుంబం నాలుగు రోజులు పప్పుతో భోజనం చేసేందుకు వీలుండేది. కానీ ప్రభుత్వం నుంచి సరఫరా ఆగిపోవడంతో డీలర్లు ఇవ్వలేకపోతున్నారు. దుకాణానికి వచ్చే ప్రతి లబ్ధిదారుడు కందిపప్పు రాలేదా? అని అడుగుతూ నిరాశగా వెళుతున్నారు. చౌక దుకాణాల ద్వారా బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు, పామాయిల్, గోధుమ పిండి, రాగులు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఎన్‌ఫోర్స్‌మెంటు ఉప తహసీల్దారు వెంకటరెడ్డిని వివరణ కోరగా కందిపప్పు సరఫరా రాలేదన్నారు. ప్రభుత్వం నుంచి వస్తే పంపిణీ చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, చిన్నమండెం

జిల్లాలో మండలాలు	రేషన్ కార్డుల సంఖ్య	పంపిణీ స్మార్ట్ కార్డులు	చౌక దుకాణాలు
30	5 లక్షలకు పైగా	4.46 లక్షలు (గత నెల 25 వరకు)	1123

కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిలోని కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం జరుగుతుందని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను మాత్రమే కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్‌ఎస్‌కు తీసుకురావాలని ఆయన తెలియజేశారు. ప్రజలు వ్యయ ప్రయాసలకు ఓర్చి జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదని స్థానికంగా తహసీల్దారు, రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో కూడా అర్జీలు సమర్పించవచ్చని చెప్పారు. వాటిని పరిశీలించి నిర్ణీత గడువు లోపు పరిష్కరించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు.

దేవుడా.. నీవే దిక్కు!

కోవెల.. కారాదు కన్నీళ్లకు దారిలా

రాయచోటి, రాజంపేట గ్రామీణ, ములకలచెరువు, న్యూస్‌టుడే: ఆలయం భక్తుల్లో ఆధ్యాత్మిక చింతన పెంచుతోంది. గుడి ప్రజలను భక్తి మార్గం వైపు నడిపిస్తోంది. మునుపటి కంటే ఇష్ట దైవం దర్శన భాగ్యం కోసం రానురాను భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. దేవదాయశాఖ, తితిదే, ప్రైవేటు ధార్మిక సంస్థల పర్యవేక్షణలో నడుస్తున్న ఆలయాల్లో గట్టి భద్రతను ఏర్పాటు చేయడం లేదు. అసౌకర్యాలు వెక్కిరిస్తున్నాయి. సరైన వసతులు కల్పించడం లేదు. ముందుచూపు కొరవడింది. పండగలు, ఉత్సవాలు, ఊరేగింపు వేడుకల సమయంలో ఇష్ట దైవాన్ని కనులారా దర్శించి మనసారా పారవశం పొందాలని వస్తున్న వారికి ఆయా కోవెలలో సరైన వసతుల్లేక కన్నీళ్లు తెప్పిస్తోంది. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఏకాదశి వేళ తోపులాటలో తొమ్మిది మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఈ ఘటనతోనైనా జిల్లా యంత్రాంగం నిద్రావస్థను వీడి భద్రతపై దృష్టి సారించాలని జనం కోరుతున్నారు.

● ఎక్కడెక్కడ ఎలా ఉందంటే.. : ● రాయచోటిలో వెలసిన శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామిని ఏటా కార్తిక మాసంలో దర్శించుకోవడానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక కన్నడ, తమిళ, ఉత్తరాది భక్తులు తరలి వస్తుంటారు. కార్తికంలో ఆలయ ప్రాంగణంలోని అఘోర లింగేశ్వరుని ఎదుట దీపాలు వెలిగిస్తుంటారు. దీపారాధనకు స్టాండ్లు ఏర్పాటు చేస్తే ఇబ్బంది ఉండదు. దీంతో ఇరుకిరుకుగా కూర్చొని దీపాలు వెలిగిస్తున్నారు. దీపాలన్నీ ఒకేచోట వెలిగించడం వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. ● తంబళ్లపల్లెలోని మల్లయ్యకొండకు కార్తిక మాసంలో భక్తులు పోటెత్తుతారు. కొండపై స్వామి వారిని దర్శించుకునే సమయంలో ఇరుకైన గదిలోకి ఒకేసారి వేలాది మంది వెళ్తుంటారు. రాకపోకలకు అదే దారి కావడం, క్యూలైన్లు లేకపోవడం తొక్కిసలాటకు ఆస్కారం ఇస్తోంది. ● రాజంపేట మండలంలోని అత్తిరాల మడుగులో కార్తిక స్నానాలకు భక్తులు భారీగా తరలి వస్తారు. తెల్లవారుజాము నుంచే మహిళలు, పిల్లలు, వృద్ధులు నీటిలో దిగుతున్నారు. ఎలాంటి రక్షణ లేక గతంలో భక్తులు నీట మునిగి ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలున్నాయి. ● చిట్వేలి మండలంలోని గుండాలకోన, ఓబులవారిపల్లి మండలంలోని వైకోటల్లో శివాలయాలు దట్టమైన అటవీ ప్రాంతంలో వెలిశాయి. భక్తులు తెల్లవారుజామునే రక్షణ లేకుండా వెళ్తున్నారు. గత ఏడాది వైకోటలోని శివాలయానికి వెళ్లిన భక్తులపై ఏనుగులు దాడి చేయడంతో అయిదుగురి ప్రాణాలు గాలిలో కలిశాయి. గుండాల కోనకు వెళ్లే భక్తులకు మార్గ మధ్యలో ఎలాంటి రక్షణ చర్యలు లేవు.

రాయచోటిలోని వీరభద్రస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటే 112కు సమాచారం ఇవ్వండి | జిల్లాలో ఆలయాల సంఖ్య : 2,730

డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ నేడు

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి తెలిపారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన వినియోగదారులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వినియోగదారులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చరవాణి నంబరు: 89777 16661కు ఫోన్ చేసి సమస్య తెలియజేయవచ్చన్నారు. చరవాణి నంబరు: 91333 31912కు చాట్ ద్వారా కూడా సమస్య తెలుపవచ్చని ఆయన పేర్కొన్నారు.

(c) eenadu

సందర్శకుల తాకిడి

వీరబల్లి, న్యూస్‌టుడే : మండలంలోని వంగిమళ్ల గ్రామం పుల్లగూరగండిలో ఆదివారం సెలవు దినం కావడంతో సందర్శకుల తాకిడి అధికమైంది. ఒక వైపు పాలకొండలు, శేషాచలకొండల నడుమ మాండవ్యనదిలో నీరు ప్రవహిస్తుండటంతో చుట్టుపక్కల వారు, రాయచోటి ప్రాంతం నుంచి జనాలు అధిక సంఖ్యలో విచ్చేశారు. అక్కడే భోజనం చేసి నదిలో స్నానం ఆచరించి వెళ్లారు. అక్కడే సమీపంలోనే వంతెన, ఆంజనేయస్వామి ఆలయం ఉండటంతో పూజలు కూడా చేశారు. ఆ వాతావరణం, కొండల అందాలు ఆస్వాదిస్తూ సాయంత్రం వరకు గడిపి వెళ్లారు.

పుల్లగూరగండిలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

ఇంటి నుంచే విద్యుత్తు సేవలు

● అందుబాటులో ఏపీఎస్పీడీసీఎల్ యాప్

విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఏపీఎస్పీడీసీఎల్ ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టింది. ఆండ్రాయిడ్ చరవాణిల్లో ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీనిద్వారా వచ్చిన సమస్యలను విద్యుత్తు శాఖ అధికారులు పరిశీలించి సత్వరం పరిష్కరిస్తారు.

\- న్యూస్‌టుడే, రాయచోటి, ప్రొద్దుటూరు గ్రామీణ

జిల్లా	అన్నమయ్య	వైఎస్సార్
కనెక్షన్లు	8,32,872	8,10,992
ప్రతినెలా బిల్లు (రూ. కోట్లు)	52	67.08

బిల్లు చెల్లించొచ్చు: విద్యుత్తు బిల్లులు చెల్లించేందుకు బిల్‌పే ద్వారా సర్వీసు నంబరు, చరవాణి నంబరు పొందుపరిస్తే సంబంధించిన వివరాలు ప్రత్యక్షమవుతాయి.

నూతన కనెక్షన్ : నూతన కనెక్షన్ కోసం సమగ్ర వివరాలను యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. అధికారులు పరిశీలించి కనెక్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటారు.

మొబైల్ లింకింగ్ : విద్యుత్తు వినియోగదారులు తమ విద్యుత్తు కనెక్షన్‌కు సంబంధించి చరవాణి నంబరును అనుసంధానిస్తే విద్యుత్తు బిల్లుల సమాచారం చరవాణికి అందుతుంది.

ఎనర్జీ కాలిక్యులేటర్ : ఏ ఉపకరణానికి ఎంత విద్యుత్తు ఖర్చవుతుందో దీని ద్వారా తెలుసుకోవచ్చు. నెలవారీ విద్యుత్తు వినియోగానికి సంబంధించిన మీటరు రీడింగ్ వివరాలు పొందుపరిస్తే బిల్లు సమాచారం కనిపిస్తుంది.

కస్టమర్ కేర్: వినియోగదారులు తమ సమస్యలను ఇందులో పొందుపరచొచ్చు. అందిన సప్లై వివరాలు, అవసరమైన అన్ని లింకులు ఇందులో పొందుపరిచి ఉంటాయి.

ఫీడ్ బ్యాక్: విద్యుత్తు శాఖ అందిస్తున్న సేవలపై అభిప్రాయాలు పంచుకోవచ్చు.

కన్‌జంప్షన్: వినియోగదారులు వాడిన యూనిట్లు.. చెల్లించాల్సిన నగదు.. బిల్ లెడ్జర్ వివరాలు అందుబాటులో ఉంటాయి.

పేమెంట్ హిస్టరీ : వినియోగదారులు నెలవారీగా చెల్లించిన విద్యుత్తు బిల్లుల సమాచారం ఇందులో ఉంటుంది.

ఎనర్జీ సేవింగ్స్ టిప్స్ : విద్యుత్తు ఉపకరణాలు వాడుతున్నప్పుడు ఆచరించాల్సిన పొదుపు సూచనలు విపులంగా ఉంటాయి.

పే బిల్: సర్వీసు నంబరు నమోదు చేసుకుని నెలవారీ విద్యుత్తు బిల్లులకు సంబంధించిన నగదు చెల్లించొచ్చు.

అధికారుల వివరాలు : వినియోగదారుల పరిధిలోని అధికారుల ఫోన్ నంబర్లు లభ్యమవుతాయి. ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

టారిఫ్ : వినియోగదారులకు సంబంధించిన టారిఫ్ వివరాలు ఇందులో పొందుపరిచి ఉంటాయి.

క్విక్‌పే : సర్వీసు నంబరు, చరవాణి నంబరును నమోదు చేస్తే సంబంధిత బిల్లు వివరాలు వస్తాయి. అక్కడినుంచి బిల్లు చెల్లించొచ్చు.

మనం సంస్థ సేవలు ప్రశంసనీయం

రాయచోటి, న్యూస్‌టుడే : మనం ఎస్ఎస్‌సీ 1983 సేవా సంస్థ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం డైట్ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికాలోని సేవా ఇంటర్నేషనల్ 10 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను మనం సంస్థకు అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, జీవనోపాధితోపాటు పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపడుతూ మెరుగైన సమాజం కోసం మనం సంస్థ కృషి చేస్తోందన్నారు. సామాజిక సేవకు అంకితమైన పూర్వ విద్యార్థులు పలువురికి ఆదర్శనీయమన్నారు. మనం సభ్యుడు దాసరి ఫణీద్ర్‌తో అమెరికాకు చెందిన సేవా సంస్థ విద్య, వైద్య రంగాలకు చేయూత ఇవ్వడం శుభ పరిణామమన్నారు. అనారోగ్యానికి గురైన నిరుపేదలకు అత్యవసర పరిస్థితుల్లో ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎం.నరసింహారెడ్డి మాట్లాడారు. డైట్ కేంద్రానికి కుర్చీలు వితరణ చేశారు. కార్యక్రమంలో మనం సంస్థ అధ్యక్షుడు దేవేంద్రారెడ్డి, సభ్యులు పద్మావతి, వెంకట్రామిరెడ్డి, జ్యోషి, శ్రీనివాసులు, ఆంజనేయులు, గంగిరెడ్డి, విశ్వనాథరెడ్డి, వాణి, తమిళనాడుకు చెందిన అండాళ్ సేవా సమితికి చెందిన సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మనం సంస్థకు ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను అందజేత

సెలవొచ్చిందంటే మట్టి తవ్వేస్తాం

● చెరువులు, గుట్టలను కొల్లగొడుతున్న అక్రమార్కులు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: రియల్టర్లతో పాటు వ్యాపారాల నిమిత్తం అవసరమైన ప్రభుత్వ గుట్టలు, చెరువుల్లో మట్టిని అనుమతులు లేకుండా తవ్వి.. ట్రాక్టర్ల ద్వారా తరలించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డుకట్ట వేయల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలున్నాయి. మదనపల్లె పరిధిలోని గుట్టలు, చెరువుల్లోని మట్టిని అక్రమార్కులు తోడేస్తున్నారు. చెరువు మట్టికట్ట సమీపంలోనే తవ్వకాలు చేస్తున్నారు. ఇప్పటికే చెట్లు, ముళ్ల కంపలతో అధ్వానంగా ఉండటంతో మట్టికట్టలు తవ్వకాలతో దెబ్బతినే ప్రమాదముంది.

బసినికొండ పెద్దచెరువులో తవ్వుతున్న యంత్రం

★ సెలవు రోజులు వచ్చాయంటే అక్రమార్కులకు పండుగగా మారుతోంది. మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ నిమ్మనపల్లె రోడ్డులో ఉన్న పెద్దచెరువుకు ప్రస్తుతం కురిసిన వర్షాలకు ఎటువంటి నీరు రాక ఒట్టిపోయింది. పట్టణానికి, బైపాసు రహదారికి సమీపంలో ఉండటంతో చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రతి శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు మట్టిని జేసీబీలతో తవ్వేయడం, ట్రాక్టర్లతో తరలించడం. రియల్టర్లు తమ భూములు చదును చేసుకునేందుకు వినియోగిస్తున్నారు. ట్రాక్టర్ మట్టి రూ.3 వేల నుంచి రూ.4 వేలకు విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు.

★ వేంపల్లె పంచాయతీ పరిధిలోని రెడ్ల చెరువును ఇప్పటికే తవ్వేశారు. అక్కడక్కడ గుంతలు చేసి అందులో ఇసుకను తోడేశారు. దీంతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షపునీరు నిలిచే పరిస్థితి లేదు. ఇదే తరహాలో మండలంలోని పలు వంకలు, కాలువల్లో మట్టిని ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వేస్తున్నారు. చెరువు మట్టికట్టల సమీపంలోనే తవ్వేస్తుండటంతో మట్టికట్ట దెబ్బతిని వర్షాలు కురిసి నీరు చేరితే గండిపడే అవకాశాలున్నాయని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతోపాటు మట్టి తీసేయడంతో ఇసుక తవ్వకాలకు అవకాశముంది. అధికారులు చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో తాగు, సాగునీటికి కష్టాలు తప్పవని ప్రజలు చెబుతున్నారు.

అడ్డుకట్ట వేస్తాం

మట్టి అక్రమ తవ్వకాలపై ఇప్పటికే పలుమార్లు హెచ్చరించాం. బసినికొండ పెద్దచెరువును, రెడ్లచెరువును క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి అక్రమ తవ్వకాలు చేపట్టకుండా అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకుంటాం.

\- బాబురాజేంద్రప్రసాద్, జలవనరులశాఖ ఏఈ

నీటి ప్రవాహంతో ఆగిన పునరుద్ధరణ పనులు

సుండుపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని రాచపల్లి - చిన్న బిడికి మధ్య పింఛా నదిపై ఉన్న లోలెవల్ వంతెన పునరుద్ధరణ పనులకు ఆదివారం అంతరాయం ఏర్పడింది. రహదారుల శాఖ పరిధిలోని ఈ వంతెనపై శుక్ర, శనివారాల్లో 5 వరసలుగా 15 పైపులు వేసి పునరుద్ధరణ పనులు చేపట్టారు. పైపులు వేసిన మేరకు ఎర్రమట్టి తోలారు. అయితే కొంత భాగంలో నీటి ప్రవాహం ఎక్కువ ఉన్న కారణంగా పునరుద్ధరణ పనులు ఆదివారం అంతరాయం ఏర్పడింది. ఉదయం 1600 క్యూసెక్కులుగా ఉన్న నీటి ప్రవాహం సాయంత్రానికి 900 క్యూసెక్కులకు తగ్గింది. సోమవారం మరికొంత ప్రవాహం తగ్గితే పునరుద్ధరణ పనులు పూర్తి చేయించి రాకపోకలకు అనువుగా మార్చనున్నామని రహదారుల శాఖ ఏఈ కుమార్‌బాబు తెలిపారు.

రాచపల్లి - చిన్నబిడికి మధ్య పింఛా నదిపై ఉన్న లోలెవల్ వంతెనపై నీటి ప్రవాహంతో ఆగిన పునరుద్ధరణ పనులు

430 టన్నుల దాణా మంజూరు : జేడీ

చిన్నమండెం, న్యూస్‌టుడే : జిల్లాకు రెండో విడత కింద 430 టన్నుల పశువుల దాణా మంజూరైనట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ కె.గుణశేఖరపిళ్లై తెలిపారు. మదనపల్లె, బి.కొత్తకోట, పెద్దమండ్యం, తంబళ్లపల్లె, గుర్రంకొండ, వాల్మీకిపురం, నందలూరు, చిట్వేల్, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు, చిన్నమండెం, పీలేరు, సుండుపల్లి, వీరబల్లి మండలాలకు కేటాయించినట్లు వివరించారు. ఒక్కో రైతుకు 50 కిలోల బస్తా ఒకటి మాత్రమే పంపిణీ చేస్తారన్నారు. కిలో రూ.22.50 ధర అని, 50 శాతం రాయితీపై సరఫరా ఉంటుందన్నారు.

ప్రతి నెలా పౌర హక్కుల దినోత్సవం జరపాలి

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: దళితులు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలు, ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించే విధంగా ప్రతి నెలా పౌర హక్కుల దినోత్సవం జరపాలని రాష్ట్ర మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఇమ్మానుయేలు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 5వ తేదీ బుధవారం అంబేడ్కర్ విగ్రహం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ అధికారులకు వినతిపత్రం అందజేస్తామన్నారు. అంబేడ్కర్ ఆశయాల కోసం తలపెట్టిన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్, చెస్ జిల్లా జట్ల ఎంపిక 4న

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: మదనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 4న ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్ 14, 17 అథ్లెటిక్స్, అండర్ 14, 17, 19 చెస్ జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల ఎస్జీఎఫ్ కార్యదర్శులు బాబు, శారద, నాగరాజు, ఝాన్సీరాణి, కిషోర్, భార్గవి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ఎంపికలు జరుగుతాయని ఇందుకు వచ్చే క్రీడాకారులు స్కూల్ గేమ్స్ అర్హతకు సంబంధించిన పత్రాన్ని తప్పక తీసుకురావాలన్నారు.

వసతి విద్యార్థులపై వివక్ష చూపితే చర్యలు

పులివెందుల, న్యూస్‌టుడే: పేద విద్యార్థులంటే అంత అలుసా.. వారిపై ఎందుకంత వివక్ష అని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఏపీ గిరిజన సమీకృత బాలికల వసతి గృహం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పులివెందులలోని నగరిగుట్టలో ఉన్న గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహాన్ని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా చూసి వసతి గృహం అధికారులు సుజాత, శిరీషలను ప్రశ్నించారు. రికార్డులలో ఉన్నదానికి నిల్వ ఉన్న సరకులకు వ్యత్యాసం ఉండడం, విద్యార్థినుల గదుల్లోకి మరుగుదొడ్ల నుంచి నీరు వస్తుండటాన్ని ఆయన గమనించారు. భోజనం సరిగా పెట్టడంలేదని ఫిర్యాదులందాయని.. తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవన్నారు. మోపూరి దేవస్థాన ఛైర్మన్ రమణారెడ్డి, కడప పార్లమెంటరీ కార్యదర్శి మైసూరారెడ్డి, జ్ఞానేశ్వరనాయుడు పాల్గొన్నారు.

అప్పుల బాధ పడలేక.. కారుణ్య మరణానికి విన్నపం

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే : తాను కోర్టు ద్వారా ఐపీ దాఖలు చేసినా రుణదాతల వేధింపులు తగ్గడం లేదని, తనకు జిల్లా కలెక్టరు కారుణ్య మరణానికి అనుమతించాలంటూ రైల్వేకోడూరుకు చెందిన పాత ఇనుప సామాన్ల దుకాణం యజమాని తాటికొట్ల మోహన్‌రాజు ఆదివారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో వ్యాపారం ఆశాజనకంగా సాగక పోయిన తను 2021లో ఐపీ దాఖలు చేశానని, తర్వాత కొందరు రుణదాతలకు అప్పులు చెల్లించిన తన వద్ద రాయించుకున్న బాండ్లు, చెక్కులు ఇవ్వకుండా ఇంకా డబ్బులు కట్టాలని వేధిస్తున్నారని ఆతను వాపోయారు. వారి నుంచి తనను కాపాడాలని కోరుకుంటున్నట్లు దుకాణం బయట పెద్ద బోర్డు ఏర్పాటు చేశారు.

తన దుకాణం వద్ద సూచిక ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం చేస్తున్న మోహన్‌రాజు

హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల సందడి

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: హార్సిలీహిల్స్‌కు సందర్శకుల తాకిడి పెరిగింది. బెంగళూరుతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులతో కొండపై ఆదివారం సందడి నెలకొంది. ఇటీవల కురిసిన వర్షాలకు హార్సిలీహిల్స్ అటవీ ప్రాంతం పచ్చదనంతో కళకళలాడుతోంది. మానస సరోవరం, గంగోత్రి చెరువు, కుంటలు, చెక్‌డ్యాంలు నిండిపోయి మొరవలు పారుతున్నాయి. ఈ క్రమంలో కొండపై ఉన్న కొత్త, పాత వ్యూపాయింట్లతో పాటు గాలిబండపై నుంచి ప్రకృతి అందాలను వీక్షించారు. పర్యాటకులు కాండ్లమడుగు నుంచి కొండపైకి కాలినడకన ఉత్సాహంగా వెళ్లారు. హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల రద్దీ గత కొన్నిరోజులుగా ఆశాజనకంగా ఉందని పర్యాటకశాఖ మేనేజరు శ్రీధర్ తెలిపారు.

హార్సిలీహిల్స్ గాలిబండపై సందర్శకులు

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



విజేతలతో ఎస్పీ ధీరజ్

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : పోటీ ప్రపంచంలో యువత విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్పీ ధీరజ్ అన్నారు. ఆదివారం స్థానిక జీవీఎస్‌సీఎస్ క్రీడా మైదానంలో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఇందులో రాయచోటి హెడ్ క్వార్టర్, మదనపల్లె డివిజన్ జట్లు తలపడ్డాయి. ఇందులో రాయచోటి జట్టుకు సారథ్యం వహించిన ఎస్పీ జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, క్రికెట్ కోచ్ సునీల్‌కుమార్‌లు ఎస్పీని సత్కరించారు. అనంతరం స్థానిక పోలీసుస్టేషన్, సర్కిల్ కార్యాలయాలను ఎస్పీ తనిఖీ చేశారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కారమయ్యే విధంగా చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. మదనపల్లె డీఎస్పీ మహేంద్ర, సీఐలు రాజారమేష్, రాఘవరెడ్డి, ఎస్సైలు చంద్రశేఖర్, జహీర్, అన్సర్‌ఖాన్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

4.01 టీఎంసీలకు చేరిన వెలిగల్లు నీటిమట్టం

గాలివీడు, న్యూస్‌టుడే : వెలిగల్లు జలాశయం గరిష్ఠ నీటి సామర్థ్యం 4.64 టీఎంసీలు కాగా ఆదివారం 4.01 టీఎంసీలకు చేరింది. ఇటీవల కురిసిన వర్షానికి 1.5 టీఎంసీల నీటి మట్టం పెరిగింది. పాపాఘ్ని నది ఎగువ నుంచి 350 క్యూసెక్కుల నీటి ప్రవాహం చేరుతోంది. కుడి కాలువకు 110 క్యూసెక్కులు, రాయచోటి, గాలివీడు నీటి పథకాలకు ఆరు క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం భద్రత దృష్ట్యా సిబ్బందితో రాత్రుల్లో గస్తీ ఏర్పాటు చేసినట్లు డీఈఈ భాస్కర్‌బాబు తెలిపారు.

వెలిగల్లులో జలకళ

ఎర్రచందనం దొంగ అరెస్ట్

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే : బోయనపల్లి పంచాయతీ అన్నమయ్య నగర్ కాలనీకి చెందిన రవికుమార్ ఎర్రచందనం తరలించేందుకు యత్నిస్తుండగా మన్నూరు పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకుని విచారించారు. ఆకేపాడుగ్రామం రేణింతల పరిధిలోని పొలాల్లో దాచిన నాలుగు ఎర్రచందనం దుంగలను మన్నూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా జానమద్ది సాహితీ పీఠం పురస్కారాల ప్రదానం

కడప (మారుతీ నగర్), న్యూస్‌టుడే: ప్రముఖ సాహితీ వేత్త, బ్రౌన్ గ్రంథాలయ రూపశిల్పి దివంగత డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి జయంతిని పురస్కరించుకుని కడపలోని సీపీ బ్రౌన్ కార్యాలయంలో ఆదివారం జానమద్ది సాహితీపీఠం పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జానమద్ది సాహితీ పీఠం పురస్కారాలను తెలుగు రాష్ట్రాలకు చెందిన డాక్టర్ మేడసాని మోహన్ (తిరుపతి), డాక్టర్ రేవూరు అనంత పద్మనాభరావు (హైదరాబాద్), ఏపీ రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ(హైదరాబాద్)కు, గ్రంథాలయ సేవా పురస్కారాన్ని మరో అంకెగౌడ (కర్ణాటక)కు ప్రదానం చేశారు. పురస్కారం కింద రూ.10 వేల నగదు, శాలువాతో అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ పాల్గొన్నారు.

పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి నుంచి సత్కారం అందుకున్న అవధాని మేడసాని మోహన్, డాక్టర్ గుమ్మడి గోపాలకృష్ణ, రేవూరు అనంతపద్మనాభరావు, అంకే గౌడ

తాళ్లపాకను గాలికొదిలేశారు

● అన్నమయ్య విగ్రహానికి పూలమాల కూడా వేయని తితిదే అధికారులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే : తొలి తెలుగు వాగ్గేయకారుడు, పద కవితా పితామహుడు, శ్రీవారి పరమ భక్తుడు తాళ్లపాక అన్నమాచార్యులు స్వగ్రామం తాళ్లపాకను తితిదే అధికారులు గాలికి వదిలేశారు. శ్రీవారి ఆలయ ప్రారంభోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని గొప్పలు చెబుతున్న తితిదే అధికారులు కనీసం తాళ్లపాక గ్రామంలోని అన్నమయ్య విగ్రహానికి పూలమాల వేసిన దాఖలాలు లేవు. అన్నమయ్య ధ్యాన మందిరం వద్ద ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తితిదే అధికారులు, బోయనపల్లి వద్ద జరిగే కార్యక్రమాలకు పూలు సేకరించడం, భక్తులకు అన్నప్రసాదాలు అందించేందుకు దాతలు సహకారం తీసుకుంటున్నారు. హుండీ ద్వారా రూ.లక్షల కోట్ల తితిదేకు ఆదాయం వస్తోంది. కనీసం అన్నదానం కూడా చేయలేని విధంగా అధికారులు ఎలా నిర్ణయాలు తీసుకుంటారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

★ రాజంపేట నియోజకవర్గంలో శ్రీవారి ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా సబ్ కలెక్టర్, ఏఎస్పీ, రెవెన్యూ ఇతర ప్రభుత్వ అధికారులకు కనీసం సమాచారం అందించలేదు. ఉత్సవాలు కూడా నామమాత్రంగా చేస్తున్నారు. ఉత్సవ ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు కూడా గంట ముందు రావడం మరలా తిరిగి వెళ్లిపోవడం జరుగుతోంది.

ధ్యాన మందిరం వద్ద దుస్థితి

EENADU e Classifieds

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS

రవికిరణ్ ఎంటర్ ప్రైజెస్ పెన్నార్ మినరల్ వాటర్ బాటిల్స్ 1 లీటరు, Half లీటరు బాటిల్స్ జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేయుటకు డిస్ట్రిబ్యూటర్స్, డీలర్స్ కావలెను. సంప్ర: 94915 90112.

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

JOBS

Wanted Experienced Drivers and Security persons for a Reputed Educational Institution in Rayachoty. Contact: 8217200025, 7093473533.

కడప ఆర్టీ ఇంగ్లీషు మీడియం స్కూల్ నందు ఫిజిక్స్, బయాలజీ ప్రైమరీ పిల్లలకు బోధించుటకు టీచర్లు & PET (మహిళ) కావలెను. సంప్ర॥ 94933 71898, 83319 51098.

HOSPITALITY

కడప నగరం, హిమాలయ ఆసుపత్రి నందు పనిచేయుటకు నర్సింగ్ స్టాఫ్, వార్డుబాయిలు, ఆయమ్మలు కావలెను. సెల్: 9100745905.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే

Contact: KDP: 9989997626 8008514248 PDTR: 8008597620

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

నూతన ఉపాధ్యాయులకు ట్రెజరీ ఐడీలు కేటాయించాలి : అపస్

వీరబల్లి, న్యూస్‌టుడే : నూతన ఉపాధ్యాయులకు ట్రెజరీ ఐడీ త్వరితగతిన చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల సంఘం (అపస్) గౌరవాధ్యక్షులు పరశురాం డిమాండు చేశారు. ఆదివారం వీరబల్లిలో నిర్వహించిన అపస్ సమావేశంలో ఆయన, జిల్లా అధ్యక్షుడు నరసింహులు మాట్లాడారు. క్లస్టర్ పోస్టుల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని కోరారు. ఇటీవల కాలంలో బదిలీ అయిన వారిని వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. అపస్ జిల్లా సహాయ అధ్యక్షుడు నాగేంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం టెట్‌పై కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి ఉపాధ్యాయులకు సత్వరం ఉపశమనం కల్పించాలని కోరారు. అనంతరం అపస్ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. వీరబల్లి గౌరవ అధ్యక్షుడిగా మధుసూదన్‌రాజు, గౌరవ సలహాదారుడిగా విజయ్‌కుమార్‌రెడ్డి, మండల అధ్యక్షుడిగా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా సి.హెచ్.రమణ, అదనపు ప్రధాన కార్యదర్శిగా చెన్నకేశవ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రామ్మోహన్, ఆర్థిక కార్యదర్శిగా మల్లికార్జునశెట్టి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అపస్ (ఏపీయుఎస్) జిల్లా కార్యదర్శి బాలాజీ, నాయకులు నాగేంద్రప్రసాద్, వెంకటయ్య, శ్రీనివాసులు, సుబ్బయ్య, రామ్మోహన్, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లిలో అపస్ గౌరవాధ్యక్షుడు పరశురాంతో ఆ సంఘం ప్రతినిధులు

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మదనపల్లె మండలంలో ఆదివారం ఉదయం వెలుగు చూసింది. పోతబోలు పంచాయతీ సిద్దమ్మగారిపల్లెకు చెందిన ఉపేంద్ర (30) బెంగళూరులో పని చేసేవాడు. ఇతను మద్యానికి బానిసకావడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. దీంతో కొద్ది రోజుల కిందట మదనపల్లెకు వచ్చాడు. ఈ నేపథ్యంలో నోముల పండుగ సందర్భంగా అందుకు అవసరమైన స్వీట్లు చేసుకుని వచ్చేందుకు భార్య కృష్ణవేణిని శనివారం ఆమె పుట్టింటికి పంపాడు. ఆమె ఆదివారం ఇంటికి వచ్చేసరికి ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. భర్తను గమనించి ఆమె కేకలేయడంతో స్థానికులు వచ్చి మృతదేహాన్ని కిందకు దించారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆసుపత్రి శవాగారానికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

ఉపేంద్ర (పాతచిత్రం)

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటన చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలో ఆదివారం జరిగింది. చౌడేపల్లె మండలం కాటిపేరి గ్రామానికి చెందిన గంగప్ప (60) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈయన పుంగనూరు నుంచి చౌడేపల్లెకు ద్విచక్రవాహనంపై వస్తుండగా మేలిపట్ల వద్ద ఎదురుగా వచ్చిన మరో బైకు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గంగప్పను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని ఆసుపత్రి శవాగారానికి తరలించారు.

మంత్ర తంత్రాలకు పూడ్చేసిన మృతదేహం వెలికితీత

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : అనారోగ్యంతో మృతి చెందిన యువకుడి మృతదేహాన్ని ఓ వ్యక్తి మంత్రతంత్రాల కోసం పట్ట పగలే వెలికి తీసిన ఘటన ఆదివారం జరిగింది. మదనపల్లె పట్టణానికి చెందిన దిలీప్ రావ్ (23) అనారోగ్యంతో ఈ నెల 1న బెంగళూరులో మృతి చెందాడు. అదే రోజు సాయంత్రం కుటుంబ సభ్యులు మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె మార్గంలోని శ్మశాన వాటికలో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఆదివారం ఉదయాన్నే ఓ వ్యక్తి మృతదేహాన్ని వెలికి తీస్తుండగా పశువుల కాపర్లు గుర్తించి మందలించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో అతను మళ్లీ శ్మశానానికి వచ్చి మృతదేహాన్ని పూడ్చిన ప్రాంతంలో మట్టిని తవ్వుతుండగా.. ఈ సమయంలో మృతుడికుటుంబ సభ్యులు వచ్చి అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేశారు. మృతదేహం ఎందుకు బయటకు తీస్తున్నావని ప్రశ్నించినా అతను సమాధానం చెప్పకపోవడంతో గట్టిగా నిలదీశారు. దీంతో తనపేరు గోవిందు అని తాను జైపూర్ నుంచి వచ్చి మదనపల్లెలో ఉంటున్నట్లు హిందీలో తెలిపాడు. తన చిన్నాన్న మహేష్ చనిపోయాడని అతనితో మాట్లాడేందుకు యువకుడి మృతదేహంతో మంత్ర తంత్రాలు చేసేందుకు వెలికి తీసినట్లు ఒప్పుకున్నాడు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ కళా వెంకటరమణ తమ సిబ్బందిని పంపి అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు

(c) eenadu

మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

పెద్దేరు ప్రాజెక్టుకు జలకళ

ములకలచెరువు, న్యూస్‌టుడే: తంబళ్లపల్లె మండలంలోని పెద్దేరు ప్రాజెక్ట్ వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో కడప, శ్రీసత్యసాయి జిల్లాలతో పాటు కర్ణాటక రాష్ట్రాల నుంచి పర్యాటకులు పెద్దేరు ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చారు. మొరవ పారుతుండడంతో జలకళ సంతరించుకుంది. యువతీ యువకులు కేరింతలు కొడుతున్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం బలోపేతానికి చర్యలు

కలికిరి, న్యూస్‌టుడే: విశ్రాంత ఉద్యోగుల సంఘం బలోపేతానికి సభ్యులు సహకరించాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కలికిరిలో విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారమే సంఘం లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆదినారాయణరెడ్డి, జబ్బార్ ఖాన్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి సురేంద్రరెడ్డి

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు వారి సమస్యలను ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు విన్నవించారు. ఆదివారం ఎమ్మెల్యే తన నివాసంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పింఛన్లు మంజూరు చేయాలని కొందరు, ఇళ్లు మంజూరు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని మరికొందరు ఎమ్మెల్యేకు విన్నవించారు. నీరుగట్టువారిపల్లెకు చెందిన వెంకటరమణ చీటీలు నిర్వహిస్తూ ఆత్మహత్య చేసుకున్నాడు. అతని వద్ద చీటీలు వేసిన బాధితులు ఎమ్మెల్యే వద్దకు వచ్చి తమ సమస్యను విన్నవించారు. అతని మృతిపై అనుమానాలున్నాయని దీనిపై విచారణ చేయించాలని బాధితులు ఎమ్మెల్యేను కోరారు. ఈ ఘటనపై తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సంబంధిత అధికారులతో విచారణ చేయిస్తానని వారికి భరోసా ఇచ్చారు.

రహదారులు అధ్వానం.. పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

మదనపల్లె శివారు ప్రాంతాల్లో దుస్థితి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: మదనపల్లె మండలంలోని ఈశ్వరమ్మ కాలనీ (కొత్తపల్లె-2) పంచాయతీలో మౌలిక వసతులు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పంచాయతీ ఆవిర్భావం తర్వాత కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. కొత్తపల్లె పంచాయతీ పునర్విభజనలో భాగంగా కొత్తపల్లె-2, ఈశ్వరమ్మకాలనీ పంచాయతీలు ఏర్పడ్డాయి. అప్పటి నుంచి మౌలిక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈశ్వరమ్మకాలనీ, పెంచుపాడురోడ్డు, రెహ్మత్‌నగర్ ప్రాంతాలు దీని పరిధిలోకి వస్తాయి. చాలా ప్రాంతాల్లో సీసీ రహదారుల నిర్మాణాలు చేపట్టలేదు. పదేళ్ల కిందట నిర్మించిన రహదారులు దెబ్బతినడంతో కొద్దిపాటి వర్షం కురిస్తే కాలనీలోని మార్గాలు బురదమయంగా మారుతున్నాయి. రెహ్మత్‌నగర్‌లో కాలువలు, రహదారుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. మురుగు రామసముద్రం రహదారిపై ప్రవహిస్తోంది. వాహనాల రాకపోకలతో గుంతలుగా మారి ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి కిందపడుతున్నారు. ఇళ్ల నుంచి వచ్చే మురుగు రహదారిపై, ఇళ్ల మధ్య నిలవడంతో దుర్వాసన వస్తోంది. ఇళ్ల నుంచి రోజువారీగా చెత్త సేకరణ లేకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోయాయి. చెంబుకూరురోడ్డులోని కాలువలో చెత్తవేస్తుండటంతో మురుగు ప్రవహించడం లేదు. స్తంభాలకు విద్యుత్తు తీగలతో పాటు, ప్రైవేటు కేబుల్ వైర్లు వేలాడుతున్నాయి. వర్షాల సమయాల్లో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో కుక్కలు, పాములబెడదతో మహిళలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

ఈశ్వరమ్మకాలనీలో పేరుకుపోయిన చెత్త

రెహ్మత్ నగర్‌లో రహదారి బురదమయం

చర్యలు తీసుకుంటాం

పారిశుద్ధ్య పనులు చేయించేలా చర్యలు తీసుకుంటాం. వీధి దీపాలను మరమ్మతులు చేసేలా పంచాయతీ అధికారులను ఆదేశిస్తాం. రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపి నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టి సమస్యలను పరిష్కరిస్తాం.

- తాజ్‌మస్రూర్, ఎంపీడీవో, మదనపల్లె

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)

మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 7989663199

?: మదనపల్లె పట్టణంలోని రెడ్డప్పనాయుడు కాలనీలో కాలువలు పూడిపోయాయి. కాలువలు నిర్వహణ లేక అధ్వానంగా ఉన్నాయి. **- సుధాకర్, రెడ్డెప్పనాయుడు కాలనీ**

✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- ప్రమీల, పురపాలక సంఘం కమిషనర్, మదనపల్లె**

?: బకావానితోట, హెచ్‌పీగ్యాస్ కార్యాలయం ఎదుట వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళ మహిళలు, విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. **- మధు, బాకావానితోట**

✓: సిబ్బందితో వీధిదీపాలకు మరమ్మతులు చేయిస్తాం. **- శ్రావణి, పురపాలక సంఘం డీఈ, మదనపల్లె**

?: ఇందిరానగర్, ప్రశాంత్‌నగర్‌లలో గతంలో నిర్మించిన సిమెంట్‌రోడ్లు, తారురోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. **- నరసింహస్వామి, ప్రశాంత్‌నగర్**

✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రతిపాదనలు పెట్టి సమస్యను పరిష్కరిస్తాం. **- ప్రమీల, పుర కమిషనర్, మదనపల్లె**

?: మేకలవాండ్లపల్లె వెళ్లే మార్గంలోని గుడి వద్ద విద్యుత్తు స్తంభం వాలిపోయి పడిపోయే విధంగా ఉంది. ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళన నెలకొంది. సమస్యను పరిష్కరించాలి. **- విజయ్‌కుమార్, మేకలవాండ్లపల్లె**

✓: క్షేత్రస్థాయిలో తనిఖీచేసి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. **- రమేశ్, ఏఈ, విద్యుత్తుశాఖ**

?: బసినికొండ పంచాయతీ సచివాలయం రోడ్డులో ఇళ్ల వద్ద విద్యుత్తు స్తంభాలపైకి తీగ మొక్కలు అల్లుకున్నాయి. ప్రమాదకరంగా ఉన్న తీగలను తొలగించాలి. **- రామకృష్ణ, బసినికొండ**

✓: విద్యుత్తు స్తంభం చుట్టూ తీగమొక్కలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- నవాజ్, బసినికొండ కార్యదర్శి**

?: పట్టణంలోని ఎన్వీఆర్ వీధి విస్తరణ మలుపులో చెత్తదిబ్బలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దోమలకు నిలయంగా మారింది. **- అమ్మాజీ, ఎన్వీఆర్‌వీధి**

✓: పారిశుద్ధ్య పనులు చేయించేలా చర్యలు తీసుకుంటాం. **- శ్రావణి, పురపాలక సంఘం డీఈ, మదనపల్లె**

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

చెర్లోపల్లె రెడ్డెమ్మ దేవతకు పూజలు

గుర్రంకొండ, న్యూస్‌టుడే: సంతాన ప్రదాతగా పేరొంది.. చెర్లోపల్లెలో వెలిసిన రెడ్డెమ్మదేవతకు వైభవంగా పూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారిని పట్టువస్త్రాలు, ప్రత్యేకాభరణాలతో అలంకరించారు. అభిషేకం, అర్చన తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. సంతాన ప్రదాతకు ప్రత్యేకంగా మహిళలు వరపడు పూజ చేశారు. కార్యక్రమంలో ఛైర్మన్ లంకిపల్లె రాజన్ననాయుడు, ఈవో మంజుల ఆలయ అర్చకులు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో రెడ్డెమ్మదేవత

పీలేరులో కంచి విజయేంద్ర సరస్వతి

పీలేరు, న్యూస్‌టుడే: కంచి కామకోటి పీఠాధిపతి శ్రీవిజయేంద్రసరస్వతి ఆదివారం కడప నుంచి తిరుపతికి వెళ్లే బైపాస్ రోడ్డు వద్ద కొంత సమయం కారు నుంచే భక్తులకు దర్శనం ఇచ్చారు. పీలేరు బ్రాహ్మణ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు తెనాలి శేషగిరిరావు, ఉద్యా ఫణీంద్రశర్మ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోట మండలం బీరంగిలోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గోపూజతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. అనంతరం చెక్క భజనలతో కోలాటాలు వేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మేకల వెంకటేశు, భక్తులు పాల్గొన్నారు.

బీరంగి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పీలేరు రెవెన్యూ డివిజన్ సాధనకు రిలే దీక్షలు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: పీలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయడానికి అన్ని అర్హతలున్నాయని మదనపల్లె జిల్లా సాధన సమితి అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ అన్నారు. పీలేరు రెవెన్యూ డివిజన్ సాధన సమితి అధ్యక్షుడు సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో రిలే దీక్షలు ఆదివారం కొనసాగాయి. ఈ దీక్షకు పీటీఎం శివప్రసాద్ మద్దతు ప్రకటించారు. మదనపల్లెను జిల్లా కేంద్రంగా, పీలేరును రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో సుంకర చక్రధర్, షబ్బీర్, బోడేషావలి, పాలకుంట శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీటీఎం శివప్రసాద్ చిత్రంలో నాయకులు

రూ.25 లక్షలు పరిహారమివ్వండి

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వర ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షల పరిహారం అందించి ఆదుకోవాలని పీలేరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి టీఎల్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పీలేరులో ఆయన మాట్లాడుతూ ఈ ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం దీనికి బాధ్యత వహించి భవిష్యత్తులో పుణ్య క్షేత్రాల్లో ఇలాంటి ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

జనసేన పార్టీలో యువకుల చేరిక

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : జనసేనపార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఏపీఐఐసీ డైరెక్టర్ డాక్టర్ మైఫోర్స్‌మహేశ్ ఆధ్వర్యంలో యువకులు ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి విలువలతో కూడిన రాజకీయం జనసేనపార్టీ అధినేత పవన్‌కల్యాణ్ నాయకత్వంతోనే సాధ్యమని నమ్మి వందల మంది యువకులు పార్టీలోకి రావడం చాలా సంతోషమన్నారు. పార్టీని బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో నిశిల్, హేమంత్, ప్రవీణ్‌నాయుడు, శివ, నోయల్, సమీర్ తదితరులున్నారు.

పార్టీలో చేరిన వారితో మైఫోర్స్ మహేశ్

ఆదమరిస్తే అంతే సంగతులు

మదనపల్లె మండలం గుడిసివారిపల్లె పంచాయతీ పరిధిలో మదనపల్లె-సీటీఎం రహదారి తెట్టువంక వద్ద ప్రమాదకరంగా మారింది. దాదాపు 10 నుంచి 20 అడుగుల లోతున్న ఈ వంకపై నిర్మించిన వంతెన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండింది. ఈ రహదారిపై అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రివేళ కల్వర్టు కనిపించక ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇచ్చే క్రమంలో అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశముంది. అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ**

నీటి వృథా.. తప్పని వ్యథ

పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ పెద్దగొండ్లపల్లె వద్ద తారు రోడ్డు పక్కన తాగునీటి పథకం నీరు వృథాగా పోతోంది. ఇక్కడి నుంచి గ్రామానికి గొట్టాల ద్వారా నీరు సరఫరా అవుతోంది. మోటారు వద్ద ఉన్న గొట్టాల నుంచి నీరు వృథాగా పోతున్నా ఎవరూ పట్టించుకోలేదు. **- న్యూస్‌టుడే, పీలేరు**

శునకాల వీరంగం.. ప్రజలకు భయం

నిమ్మనపల్లె పట్టణంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రధానంగా నిమ్మనపల్లె బస్టాండులో సంచారం ఎక్కువగా ఉంది. విద్యార్థులు పగలు పాఠశాలలు, రాత్రివేళ ట్యూషన్‌లకు వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. అలాగే రాకపోకలు సాగించేవారిపై దాడి చేస్తున్నారు. కుక్కల నివారణకు పంచాయతీ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నిమ్మనపల్లె**

గుంత.. వాహనదారులకు చింత

కలికిరి-కలకడ ప్రధాన రహదారి మహల్ తపాలా కార్యాలయం సమీపంలో అడుక్కో గుంత పడి వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. ఓ గుంతను తప్పించే యత్నంలో మరో గుంత ఉన్న కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి గుంతలు పూడ్చేలా చర్యలు చేపట్టి ప్రమాదాలు నివారించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మహల్(కలికిరి)**

పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : మండలంలోని మూగలమర్రి పంచాయతీ తూర్పుపల్లె ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి గ్రామానికి చెందిన యర్థా పుల్లారెడ్డి, విశ్వనాథరెడ్డిల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.6 లక్షలు వెచ్చించి పాఠశాల భవనంతో పాటు మౌలిక వసతులు కల్పించారు. అమెరికాలో స్థిరపడిన యర్థా కుటుంబ సభ్యులు ఆదివారం గ్రామానికి వచ్చారు. ఈ నేపథ్యంలో పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన యర్థా కుటుంబ సభ్యులను పాఠశాలకు పిలిపించిన ఉపాధ్యాయులు గ్రామస్థుల సమక్షంలో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలాజీ, వనజ, అనురాధ, అనీల్, బసంత్‌కుమార్, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో దాత కుటుంబ సభ్యులు

జంగముల సంక్షేమాభివృద్ధే లక్ష్యం

కలికిరి, న్యూస్‌టుడే: గోదావరి జిల్లాల జంగముల ఆతిథ్యం అద్వితీయం.. అనిర్వచనీయమని రాష్ట్ర జంగమ సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ వాసునూరి చంద్రశేఖర్ అన్నారు. రాజమహేంద్రవరం జంగమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్తిక వన మహోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జంగముల సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించి వారి సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జంగముల సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్

ఉప్పొంగుతున్న పాతాళగంగ

రామసముద్రం మండలం అజ్జమరెడ్డిపల్లెలోని పాయిచెరువు వద్ద రైతుల బోరుబావుల్లో పాతాళగంగ ఉప్పొంగుతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువుకు నీరు పుష్కలంగా చేరింది. దీంతో ఈ ప్రాంతంలో భూగర్భజలాల మట్టం పెరగడంతో ఇలా జలం పైకి వస్తోంది.

- న్యూస్‌టుడే, రామసముద్రం

స్థలం విషయమై ఘర్షణ

మదనపల్లె నేరవార్తలు : స్థలం విషయమై జరిగిన గొడవలో తల్లీకుమారులపై దాడి చేసి గాయపరిచిన ఘటన తంబళ్లపల్లె మండలంలో ఆదివారం జరిగింది. కోసువారిపల్లెకు చెందిన మస్తాన్‌వల్లికి అతని సోదరి మహబూబ్‌జాన్‌కు మధ్య ఇంటి స్థలం విషయమై వివాదం ఉంది. ఈ విషయమై మహబూబ్‌జాన్‌కు మస్తాన్‌వల్లి భార్య బషీరున్‌బీకి మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో బషిరున్‌బీ, ఆమె కుమారులు మురాషావల్లి, నూరుల్లాలపై మహబూబ్‌జాన్, కుటుంబ సభ్యులు దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన తల్లీకుమారులను కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి అవుట్ పోస్టు సిబ్బంది సమాచారాన్ని తంబళ్లపల్లె పోలీసులకు తెలియజేశారు.

ఆటో బోల్తా.. మహిళకు గాయాలు

కలకడ, న్యూస్‌టుడే : కలకడ సమీపంలోని బాటవారిపల్లె ఉన్నత పాఠశాల సమీపంలోని చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడటంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వైఎస్సార్ కడప జిల్లా చెన్నూరుకు చెందిన నరసమ్మ ఆదివారం ఆటోలో పీలేరుకు చేపలు విక్రయించడానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బాటవారిపల్లె సమీపంలోకి రాగానే ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో నరసమ్మకు తీవ్రగాయాలయ్యాయి. కలకడ 108 సిబ్బంది బాధితురాలికి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భూతగాదా.. కేసు నమోదు

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: భూతగాదాలో దాడి చేసిన ఘటనకు సంబంధించి కేసునమోదు చేసినట్లు ఎస్.ఐ తిప్పేస్వామి తెలిపారు. ఎస్.ఐ వివరాల మేరకు.. నిమ్మనపల్లె మండలం తవలం పంచాయతీ నల్లంవారిపల్లెకు చెందిన పుంగనూరు భువనేశ్వరి భర్త శ్రీనివాసులుకు కొంత వారసత్వ ఆస్తి ఉంది. భువనేశ్వరి మామ రాజన్న మృతి చెందిన తర్వాత ఇదే గ్రామానికి చెందిన కొందరు తమ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తూ తరచూ గొడవలకు దిగుతున్నారని భువనేశ్వరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత నెల 31న భువనేశ్వరి, శ్రీనివాసులు భూమి చదును చేస్తుండగా వారు దాడి చేసినట్లు వివరించారు. ఈ మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్.ఐ తెలిపారు.

జూదరుల అరెస్టు.. ఏడు వాహనాలు జప్తు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోట పట్టణ శివార్లలోని డేగానిపల్లె వద్ద జూదం ఆడుతున్న నలుగురిని ఆదివారం అరెస్టు చేసినట్లు స్థానిక సీఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. నిందితులకు సంబంధించిన ఏడు వాహనాలతో పాటు రూ.1690 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

వైకాపా పెత్తనం.. ఇసుకాసురుల ఆగడం

ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే : తంబళ్లపల్లె నియోజకవర్గంలో అధికారం కోల్పోయినా వైకాపా నాయకుల పెత్తనం కొనసాగుతోంది. పెద్దతిప్పసముద్రం మండలంలోని టి.సదుం పంచాయతీలోని పాపాఘ్ని నదిలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

● రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా తంబళ్లపల్లె నియోజకవర్గంలో వైకాపా హవా సాగుతోందని తెదేపా నాయకులు ఆరోపిస్తున్నారు. పీటీఎం మండలంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పోలీస్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని చెంద్రాయునిపల్లి, సదుం వాసులు చెబుతున్నారు. గృహ అవసరాలకు తరలించే వారి నుంచి అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అయితే ఇక్కడి నుంచి కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు టిప్పర్లతో ఇసుక తరలిస్తున్న వారిని మాత్రం అధికారులు పట్టించుకోవడం లేదు. పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన సంఘమేశ్వరస్వామి ఆలయానికి రైతులు పట్టా భూముల్లో రోడ్డును ఏర్పాటు చేశారు. ఇసుక ట్రాక్టర్లు తిరిగి రోడ్డు గుంతలమయం కావడంతో ట్రాక్టర్ల రాకపోకలు సాగించకుండా ముళ్లకంపలు వేశారు. అయితే కర్ణాటక సరిహద్దులో ఉన్న సదుం పంచాయతీలోని వివిధ ప్రాంతాల నుంచి ఇసుకను జోరుగా తరలిస్తున్నారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్న అక్రమార్కులు

పగలు డంప్ చేస్తూ..

కర్ణాటక సరిహద్దు ప్రాంతంగా పీటీఎం మండలం టి.సదుం ఉంది. అయితే ఉచిత ఇసుక కావడంతో పాపాఘ్ని నది నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా చౌడేశ్వరిదేవి ఆలయం వద్ద కర్ణాటక సరిహద్దు గ్రామం అంకాలమడుగు సమీపంలో వ్యవసాయ పొలాల్లో ఇసుక డంప్ చేసి రాత్రి వేళల్లో టిప్పర్ల ద్వారా కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల కర్ణాటక రాష్ట్ర చేలూరులో ఇసుక తరలిస్తున్న టిప్పర్ వాహనాన్ని జప్తు చేశారు. అక్కడ రాజకీయ నాయకులతో ఒత్తిడి తెప్పించి మామూళ్లు అందజేసి వాహనాన్ని విడిపించుకున్నారని గ్రామస్థులు చెబుతున్నారు.

మూతపడిన అంకాలమడుగు చెక్‌పోస్ట్

మూతపడిన చెక్‌పోస్టు

గత జులై నెలలో సిబ్బందిని కేటాయించి పునఃప్రారంభించిన చెక్‌పోస్టు మూతపడడంతో పగలే అంకాలమడుగు సమీపంలో ఇసుక డంప్ చేసి రాత్రివేళల్లో తరలిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రానికి కూతవేటు దూరంలో ఉన్న చెక్‌పోస్టు సిబ్బంది లేకపోవడంతో పట్టపగలే ఇసుకను తరలిస్తున్నారు.

ఎన్నికల హామీల అమలుకు డిమాండ్



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. ఆదివారం బి.కొత్తకోటలో భవన నిర్మాణ కార్మికుల మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలవుతున్నా ఇప్పటివరకు సంక్షేమ బోర్డు విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాపీమేస్త్రీ కార్మికుల మండల కమిటీ అధ్యక్షుడిగా ఎ.కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా తంబయ్యశెట్టి, బి.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా రామాంజులు, సహాయ కార్యదర్శులుగా శివశంకర్, వెంకటయ్య, కోశాధికారిగా వెంకటరమణలను ఎన్నుకున్నారు. ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బి.వేణుగోపాల్‌రెడ్డి,మండల నాయకులు బాలకృష్ణ, ఖాదర్ బాషా, నాగమ్మ, రెడ్డెప్ప, రాములు పాల్గొన్నారు.

పురపాలక సంఘం అత్యవసర సమావేశం నేడు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : మదనపల్లె పురపాలకసంఘం కౌన్సిల్ అత్యవసర సమావేశం సోమవారం సాయంత్రం 3 గంటలకు జరుగుతుందని ఛైర్‌పర్సన్ వి.మనూజ ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు హాజరు కావాలని సూచించారు. ప్రజల సమస్యలను కౌన్సిలర్లు, అధికారులు చర్చించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80080 01768
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ప్రారంభం

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే : రైతులకు ప్రకృతి వ్యవసాయ ఎరువులు, విత్తనాలు అందుబాటులోకి తెచ్చామని ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ తెలిపారు. ఆదివారం మండలంలోని గాండ్లపల్లెలో శ్రీరాం డీఆర్సీ బయో రీసెర్చ్ ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ, ఖరీఫ్ సీజన్‌లకు ప్రధాన పంటలు ఆర్డీఎస్ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ విత్తనాలు నాణ్యతగా ఉంటాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ విత్తనాలతో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ మాస్టర్ ట్రైనర్ వెంకటరమణ, సరస్వతి, చంద్రమోహన్‌రెడ్డి, గంగిరెడ్డి, లక్ష్మీదేవి, నాగమణి, రైతులు పాల్గొన్నారు.

భవానీ శంకరుడికి ఉన్నితో అలంకరణ

చిట్వేలి (పుల్లంపేట), న్యూస్‌టుడే : చిట్వేలి మండల పరిధిలోని నక్కలపల్లెలో వెలిసిన భవానీశంకర్ స్వామి ఆలయంలో కార్తికమాసోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి ఉన్ని అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత స్వామి వారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆది దంపతుల విగ్రహాలతో ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ఉన్నితో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

అలంకరణలో భవానీ శంకరుడు

భవనంపై చెట్ల తొలగింపు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే : పాడి పరిశ్రమ అధికంగా ఉన్న తాళ్లపాక, మాదన గోపాలపురం, హేమాద్రివారిపల్లి గ్రామాల్లో పశువులకు వైద్య సేవలందించడానికి తాళ్లపాక గ్రామంలో పశువైద్యశాల ఏర్పాటు చేశారు. దాదాపు 20 ఏళ్ల కిందట నిర్మించిన ఈ భవనంపై పిచ్చిమొక్కలు, వేప చెట్లు పెరిగిపోవడంతో భవనం పడిపోయే స్థితికి చేరింది. దీనిపై 'ఈనాడు'లో అక్టోబరు 29న 'భవనం మాయమైంది.. భవనం ముక్కలైంది' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో పశుసంవర్ధకశాఖ అధికారులు స్పందించారు. భవనంపై పెరిగిన పిచ్చి మొక్కలు, వేపచెట్లను తొలగించి మరమ్మతులు చేయించారు.

రహదారిపై బురద శుభ్రం

సుండుపల్లి, న్యూస్‌టుడే : సుండుపల్లి మేకల వీధిలోని ఓ ప్రాంతంలో రహదారిపై మురుగు తొలగించకపోవడంతో బురద చేరింది.దీంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా మారింది. గత నెల 29న 'బురద ఇలా.. అడుగు వేసేదెలా..' శీర్షిక వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన పారిశుద్ధ్య సిబ్బంది బురదను తొలగించారు. వీధిని శుభ్రం చేయడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చెరువులు ఇలా.. కరవులు పోయేదెలా!

❖ మరమ్మతులకు ఎదురు చూపులు
❖ ఆయకట్టు రైతులకు తప్పని ఆందోళన

ఊరికి చెరువే ఆదరువు.. చెరువుంటే కరవన్నది కనిపించదు.. జల వనరు నిండుందంటే రెండేళ్లు సాగు, తాగునీటికి ఇబ్బందులు ఉండవు. భూగర్భ జలాలతో పాటు పాడి, పశు సంపద వృద్ధి చెందుతుంది. ఊళ్లో ప్రతి ఎకరాలో పంట.. చేతికి పని ఉంటుంది. అందుకే రాజుల కాలం నాటి నుంచే చెరువుల తవ్వకంపై ప్రత్యేక దృష్టి సారించి ఇబ్బందులను రూపుమాపారు. నేటి కాలంలో చెరువులు నిర్మించుకున్నా రాజుల కాలం నాడు నిర్మించిన జల వనరులను రక్షించుకోకపోతే ఉపాధి దూరమై, కరవులు పిలిస్తే పలుకుతాయి. భవిష్యత్తు తరాలకు ముప్పు తప్పదు. జిల్లాలో అనేక చెరువులు మరమ్మతుల కోసం ఎదురు చూస్తున్నాయి. ఇటీవల మొంథా తుపాను దెబ్బకు పలు చెరువుల కరకట్టలు దెబ్బతిన్నాయి. బలహీనంగా ఉన్న చెరువులకు మరమ్మతులు చేయించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రాయచోటి, సుండుపల్లి, రామాపురం**

ఈ చిత్రం సుండుపల్లి మండలం బాగంపల్లి గ్రామంలోని పెదకుంట కట్ట. ఈ పురాతన కుంట కట్టకు మరమ్మతు పనులు చేపట్టలేదు. కట్ట పైభాగం నెర్రెలు బారింది. మట్టికట్ట దెబ్బతినడంతో నీరు లీకై వృథాగా పోతోంది. శాశ్వత మరమ్మతులు చేయించకపోతే మాత్రం వరద నీరు వచ్చినా కట్ట తెగిపోయే ప్రమాదం పొంచి ఉంది.

ఈ చిత్రం రామాపురం మండలం మేదరపల్లి వద్ద ఉన్న గుండ్లచెరువు. ఈ చెరువు రెండు రోజులుగా కురిసిన వర్షానికి పాలకొండల నుంచి వచ్చే నీరంతా చెరువుకు చేరింది. కట్ట బలహీనం కావడంతో తెగిపోయే ప్రమాదాన్ని గుర్తించి అధికారులు కట్ట ఎత్తు పెంచేందుకు మట్టి తోలించారు. కట్ట శాశ్వత మరమ్మతులు చేయిస్తేనే నీటి నిల్వకు అవకాశం ఉంటుందని అక్కడి రైతులు అధికారులు కోరుతున్నారు.

ఈ చిత్రం రాయచోటి మండలం ఎగువ అబ్బవరంలోని కంచాలమ్మ గండి చెరువు. చెరువు కింద ఆరు ప్రధాన కాలువలుండగా 450 ఎకరాల ఆయకట్టు ఉంది. కట్ట బలహీనపడడం, అలుగు శిథిలావస్థకు చేరడంతో అధికారులు గుర్తించి తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. ఈ చెరువుకు మాండవ్య నది నుంచే నీరు చేరుతుంది. నది ఏమాత్రం ఉద్ధృతంగా ప్రవహించిన కట్ట పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటుందని రైతులు అంటున్నారు.

ఘనంగా పూర్ణాహుతి

శ్రీవారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తున్న వేద పండితులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే : బోయనపల్లి 108 అడుగుల అన్నమయ్య థీమ్ పార్క్ ఆవరణంలో నూతనంగా నిర్మించిన శ్రీవారి ఆలయంలో తితిదే వేదపండితులు శ్రీవారి ఉత్సవ విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక హోమశాలలో ఉదయం భగవత్ పుణ్యాహం, విమానగోపుర, ధ్వజ ప్రసాదం, ఛాయాధివాసం, కర్మాంగస్నపనము, నేత్రోన్మీలనం, మూర్తి హోమం, వేదాది పారాయణం, పూర్ణాహుతి, మహార్నివేదన, శాత్తు మొర, సాయంత్రం జీవాధితత్వన్యాస హోమం, పంచసూక్త హోమం, పుర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు శ్రీవారి కల్యాణం, విగ్రహ ప్రతిష్ఠ : బోయనపల్లి వద్ద నూతనంగా నిర్మించిన శ్రీవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం ఉదయం ఐదు గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ తెలిపారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా శ్రీవారి కల్యాణం సాయంత్రం అన్నమయ్య విగ్రహం వద్ద జరుగుతుందని చెప్పారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

సుండుపల్లి: మండలంలోని ముడుంపాడు పంచాయతీ కురవపల్లికి ఉత్తర దిశాన దాతల సహకారంతో ఏర్పాటు చేసిన భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ పూజలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయని ఆలయ నిర్వహణాధికారి కొండారెడ్డి తెలిపారు. కలశ హోమంతో ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. భక్తులు పాల్గొని మహోత్సవాలు జయప్రదం చేయాలని ఆయన కోరారు.

లండన్‌లో సీఎంకు స్వాగతం

సీఎంతో వీరప్రసాద్‌యాదవ్

సంబేపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, భువనేశ్వరి దంపతులకు మండల వాసులైన కూనాసి వీరప్రసాద్ యాదవ్, రాళ్లపల్లి రాహుల్‌నాయుడులు లండన్ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. ఉద్యోగరీత్యా వారు లండన్‌లో స్థిరపడ్డారు. లండన్ పర్యటనలో ఉన్న సీఎం దంపతులకు వారు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఏ కంపెనీలో పనిచేస్తున్నారని సీఎం ఆరా తీశారు. రాష్ట్ర అభివృద్ధిలో ఎన్ఆర్ఐల పాత్ర కీలకమన్నారు.

తైక్వాండో పోటీలకు ఎంపిక

సారాను అభినందిస్తున్న కోచ్ షేక్ మౌలా

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే : ఈనెల 1, 2వ తేదీలలో ఏలూరులో అండర్ - 17 రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు జరిగాయని పట్టణానికి చెందిన ఎస్‌కే స్పోర్ట్స్ అకాడమీ కోచ్ షేక్ మౌలా ఆదివారం తెలిపారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో తమ అకాడమీకి చెందిన ఎస్‌కే సారా అనే విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించిందన్నారు. త్వరలో అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో విద్యార్థిని పాల్గొంటుందని తెలిపారు.

బెస్తపల్లి వాసికి కువైట్‌లో సత్కారం

సుండుపల్లి : కువైట్‌లో ప్రవాస కార్మిక కార్యాలయంలో కువైట్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సదస్సులో సుండుపల్లి మండలం బెస్తపల్లికి చెందిన షేక్ బాషామహమ్మద్ ప్రవాస కార్మికుల చట్టాల గురించి వివరించారు. దీంతో ఆయనకు కె.టి.యు.ఎఫ్. ప్రతినిధులు ప్రశంసా పత్రంతో సన్మానించారు. కువైట్‌లోని భారతీయ సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో తిరుపతి అమెరికన్ ఐ హాస్పిటల్ వారి సహకారంతో పట్టణంలోని స్థానిక భరత్ హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీఎస్ హరినాథరెడ్డి తెలిపారు. వైద్యశిబిరంలో పలువురికి పరీక్షలు చేశారు. కంటి సమస్య తీవ్రంగా ఉన్న 20 మందికి శస్త్రచికిత్సల నిమిత్తం తిరుపతిలోని అమెరికన్ ఐ హాస్పిటల్‌కు పంపినట్లు ఆయన వివరించారు. వీరికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శ్యామ్, సభ్యులు ఇందాద్ అహమ్మద్, మనోహర్, నారాయణ రెడ్డి, సుందర్ రాజ తదితరులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

సీతారామాపురం గ్రామం వద్ద రోడ్డు పనులు ప్రారంభిస్తున్న తెదేపా బాధ్యుడు జగన్‌మోహన్‌రాజు, కూటమి నాయకులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే : నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని రాజంపేట తెదేపా బాధ్యుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. రాజంపేట మండలం సీతారామాపురం ఎస్సీ కాలనీ నుంచి కుప్పావారిపల్లి వరకు రూ.10 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అమరావతమ్మ, సుబ్బరాయుడు జ్ఞాపకార్థం వారి కుమారుడు చైతన్య ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుబ్బనరసయ్యనాయుడు, తెదేపా మండల అధ్యక్షుడు రవినాయుడు, ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జి వెంకటేశ్వర్లునాయుడు, నాయకులు సుబ్రహ్మణ్యంనాయుడు, పోలి చెరువు నీటి సంఘం అధ్యక్షుడు నాగేశ్వర్‌నాయుడు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నందలూరు: మండలంలోని కన్యకా చెరువు అలుగు పారుతుండడంతో తెదేపా నాయకులతో కలసి రాజంపేట తెదేపా ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు ఆదివారం మధ్యాహ్నం జల హారతి ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బరాయుడు, సుబ్బయ్య, విజయసాగర్, ప్రవీణ్, వేణుగోపాల్, వెంకట సుబ్బయ్య, ఆజం బాషా, పల్లె సుబ్రహ్మణ్యం, గంగాధర్, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి : తాటిగుంటపల్లి ఉప్పరపల్లికి చెందిన తెదేపా కార్యకర్త మధుసూదన్‌రాజు మృతికి రాజంపేట ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు సంతాపం తెలిపారు. మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి

నవగ్రహ హోమాన్ని నిర్వహిస్తున్న పండితులు, భక్తులు

రాజంపేట: రాజంపేట పట్టణం పాతబస్టాండు కూడలి ప్రాంతంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి జయంతి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. గర్భాలయంలోని గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామికి అభిషేకాలు, గణపతి పూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నవగ్రహ హోమాలు, అష్ట దిక్పాలకుల హోమాన్ని వేదపండితులు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. స్వామి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

అమ్మ వారికి పూజలు చేస్తున్న అర్చకులు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే : మండల పరిధిలోని అనంతపురంలో వెలిసిన గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు చెల్లు సురేంద్ర, గంగన్న అమ్మ వారిని అలంకరించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వచ్చిన భక్తులకు ఆలయ సిబ్బంది తీర్థప్రసాదాలు అందజేశారు.

రహదారి ఇలా.. అడుగు వేసేదెలా!

రాయచోటి పురపాలకలో మురుగు నీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా ఉంది. పట్టణంలోని స్థానిక విజయవాణి పాఠశాల వెనుక వీధిలో రహదారిపై మురుగు నిలవడంతో పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెంది స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి మురుగు తొలగించాలని, సీసీ రోడ్డు నిర్మించాలని చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ**

ఎట్టకేలకు గ్యాస్ సిలిండర్ల సరఫరా

వెలిగల్లు (గాలివీడు), న్యూస్‌టుడే : మండలంలోని వెలిగల్లు పునరావాస కాలనీలో ఎట్టకేలకు ఆదివారం గ్యాస్ సిలిండర్ల సరఫరా పునరుద్ధరించారు. వారం రోజుల సమస్య తీరింది. గాలివీడులో ఉన్న ఓ ఏజెన్సీకి 7 కి.మీ. దూరంలో కదిరి ప్రధాన రహదారిలో ఉన్న పునరావాస కాలనీలో సుమారు 400 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. పది రోజుల కిందట సిలిండర్లు సరఫరా చేసే సమయంలో వాహన సిబ్బందికి వినియోగదారులకు బిల్లుల చెల్లింపు విషయంలో వాదోపవాదాలు, స్వల్ప ఘర్షణ జరిగింది. దీంతో సిలిండర్ల సరఫరా నిలిపివేశారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ప్రాంతాల వారీగా గ్యాస్ సిలిండరు ధర ఉంటుందన్నారు. అదనంగా బిల్లులు వసూలు చేయకూడదని స్పష్టం చేశారు. అధికారుల స్పందనతో గ్యాస్ సిలిండర్ల సరఫరా యథా విధిగా కొనసాగిస్తున్నారు.

భవనం శిథిలం.. సేవలు గగనం

మండలంలోని చిట్లూరు ఆరోగ్య ఉప కేంద్రం భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో విధులు నిర్వర్తించే సిబ్బంది ఆ భవనాలకు తాళం వేసేశారు. స్థానికులకు వైద్య సేవలందక ఇబ్బందులు పడుతున్నారు. గతంలోని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి వైద్యం చేయించుకునేవారు. ప్రస్తుతం వైద్యం కోసం రాయచోటి, కడప, రామాపురం ప్రాంతాలకు వెళ్తున్నారు. . అధికారులు స్పందించి ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రామాపురం**

నేడు అంబళం పూజ

సుండుపల్లి, న్యూస్‌టుడే : కార్తిక మాసం సందర్భంగా సోమవారం సుండపల్లిలోని విరూపాక్షస్వామి ఆలయంలో అంబళం పూజ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అయ్యప్ప భక్తులు పాల్గొనాలని కోరారు. ఆదివారం అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజలు చేశారు.

CHANGE OF NAME

I, SHAIK MUDAM TASLEEM BASHA (OLD NAME), R/o D.No.4/427, DBN PALLI, RAJAMPET, ANNAMAYYA DISTRICT, A.P., HAVE CHANGED MY NAME AS MUDAM THASLEEM (NEW NAME), S/o MUDAM MOULA SAHEB.

పోలీసులపై తిరగబడిన ఏడుగురిపై కేసు నమోదు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే : బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణకు వెళ్లిన పోలీసులపై తిరగబడిన ఏడుగురిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీంద్రాబు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. రామాపురం మండలం నీలకంఠారావుపేట ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థినిపై లక్కిరెడ్డిపల్లెకు చెందిన ఓ యువకుడు దాడి చేసినట్లు శనివారం రామాపురం పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. దీంతో పోక్సో కేసు నమోదు చేశారు. ఈ మేరకు నిందితుడిది లక్కిరెడ్డిపల్లె కావడంతో లక్కిరెడ్డిపల్లె పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు ఆదివారం పోలీసులు విచారణకు రావాలని ఆ యువకుడి కుటుంబ సభ్యులకు తెలపడంతో పోలీసులతో దురుసుగా ప్రవర్తించడమే కాకుండా దాడికి దిగారని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ మేరకు యువకుడు, యువకుని తండ్రితో కలిపి ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా మండలంలోని బాటమాదిగపల్లెకు చెందిన వారు కూడా ఆ యువకుడి కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేశారని ఎస్ఐ పేర్కొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

పుల్లంపేట, న్యూస్‌టుడే : పుల్లంపేట పుల్లంగేరుపై ఉన్న వంతెనపై రెండు కార్లు ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పింది. ఆదివారం రాత్రి రాజంపేట నుంచి తిరుపతి వైపు వెళ్తున్న ముందు లారీ వంతెనపై ఉన్న గుంతలో హఠాత్తుగా ఆగి నెమ్మదించింది. దీంతో లారీ వెనుకనే వస్తున్న కారు గమనించి నెమ్మదించింది. అయితే వెనుక వేగంగా వస్తున్న మరోకారు ముందున్న కారును ఢీకొంది. ఈ ఘటనలో వాహనాలు మాత్రమే దెబ్బతిన్నాయి. ఎవరూ గాయపడలేదని పోలీసులు తెలిపారు. వాహనాల రాకపోకలు అరగంట సేపు ఆగిపోయాయి. పోలీసుల వచ్చి రాకపోకలను పునరుద్ధరించారు.

జూదరుల అరెస్టు

చిన్నమండెం, న్యూస్‌టుడే : మండలంలోని పడమటికోన గ్రామ సమీపంలో 9 మంది జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.26,790 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. సిబ్బందితో కలిసి వెళ్లి పట్టుకున్నట్లు వివరించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

వాహనం నుంచి పొగలు

చిన్నమండెం, న్యూస్‌టుడే : చిన్నమండెం ఆర్టీసీ బస్టాండులో కారులో పొగలు రావడంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. చిన్నమండెం చెందిన వ్యక్తి కారును బస్టాండులో ఓ అంచున పెట్టి వెళ్లాడు. ఉన్నట్టుండి కారు నుంచి పొగలు రావడం గమనించిన పలువురు నీరు పోయడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. బ్యాటరీ దగ్గర షార్ట్ సర్క్యూట్ అయినట్లు చెబుతున్నారు. అనంతరం కారు యజమాని వచ్చి మరో వాహనానికి కట్టుకుని అక్కడి నుంచి తీసుకెళ్లి పోయాడు.

హామీలు నెరవేర్చాలి: కాంగ్రెస్

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే : ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన రాయచోటిలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయన్ను సన్మానించారు. తులసిరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి పూర్వ వైభవం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి షేక్ అల్లాబకష్, నాయకులు రవీ, ఖాదర్, అజ్మతుల్లా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తులసిరెడ్డిని సన్మానిస్తున్న రాయచోటి కాంగ్రెస్ నాయకులు

రక్తదానం అభినందనీయం

సుండుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలోని యువకుల రక్తదానం

సుండుపల్లి, న్యూస్‌టుడే : సంఘ సేవకుడు సయ్యద్ అహమ్మద్ ఆధ్వర్యంలో ఆదివారం సుండుపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురి యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొరియోగ్రాఫర్ షేక్ రేష్మా మాట్లాడుతూ రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవీంద్రనాథ్‌రెడ్డి, జనసేన నాయకులు రెడ్డి రాణి, ఫిజికల్ డైరెక్టర్ నాగార్జున, అభిషేక్, మజహర్, నదీమ్, నవీన్, షోయబ్, అశోక్, జగదీశ్, సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతి ఆలయ అభివృద్ధికి సహకారం

సిద్దవటం, న్యూస్‌టుడే: శ్రీశైలం దేవస్థానానికి దక్షిణముఖ ద్వార కోవెలగా ప్రసిద్ధి చెందిన సిద్దవటం మండలం జ్యోతి సిద్దవటేశ్వరస్వామి కోవెల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని అన్నమయ్య జిల్లా భాజపా అధ్యక్షుడు సాయిలోకేశ్ తెలిపారు. పురాతనమైన జ్యోతి సిద్దవటేశ్వరస్వామి కోవెలను ఆదివారం ఆయన సందర్శించారు. జిల్లా ఉపాధ్యక్షుడు సురేశ్, తెదేపా మాజీ మండల మోహన్‌రెడ్డి, ఒంటిమిట్ట అధ్యక్షుడు భానుచందర్, భాజపా నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై సంతకాల సేకరణ

గాలివీడులో కరపత్రాలు విడుదల చేసిన మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు

గాలివీడు, న్యూస్‌టుడే : వెలిగల్లు జలాశయాన్ని వైఎస్ఆర్ పాలనలో నిర్మించారని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై చేపట్టిన రచ్చబండ - కోటి సంతకాల సేకరణ ఉద్యమంగా ముందుకు సాగుతోందన్నారు. ఆదివారం మండలంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్‌కే కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడారు. రాబోయేది జగనన్న ప్రభుత్వమని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి లక్ష్మీదేవి, మల్లికార్జుననాయుడు, పార్టీ మండల కన్వీనర్ మిట్టపల్లె యదుభూషణ్‌రెడ్డి, మండల పరిషత్తు మాజీ ఉపాధ్యక్షుడు కె.రమేశ్‌రెడ్డి, నాయకులు ఎస్ ఖాదర్‌మొహిద్దీన్, నజురుల్లాఖాన్, మాజీ సర్పంచి మధుసూదన్‌రెడ్డి, గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట : కోటి సంతకాల సేకరణలో భాగంగా ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయొద్దని కోరుతూ వైకాపా వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్ ఆదివారం రాజంపేట పట్టణంలో సంతకాలు సేకరించారు. కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తే చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆయన అన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

ఒంటిమిట్ట : మండలంలోని చింతరాజుపల్లె పంచాయతీ ఏరికలపాళెంలోని పేద కుటుంబాలకు సిద్దవటానికి చెందిన ఆశాకిరణం సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు టి.గురునాథరెడ్డి, కార్యదర్శి ఎన్.వెంకటసుబ్బయ్య, కోశాధికారి కె.గంగాధర్ తెలిపారు. ఉపాధ్యక్షులు కె.గంగన్న, టీఎస్ నరసింహారెడ్డి, జి.మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

కాశీబుగ్గ మృతులకు నివాళులు

రాయచోటి: కాశీబుగ్గ మృతులకు పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలోని వైకాపా కార్యాలయంలో వైకాపా నాయకులు నివాళులర్పించారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని వారు డిమాండు చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో భక్తులకు భద్రత కరవైందని వారు విమర్శించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఎస్.ఫయాజ్‌బాషా, కౌన్సిలర్లు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సుండుపల్లె రోడ్, రాయచోటి టౌన్ బ్రాంచ్, అన్నమయ్య జిల్లా.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రాయచోటి టౌన్ బ్రాంచ్ 11 సంవత్సరాలుగా ఖాతాదారులకు, ప్రజలకు విశేష సేవలందిస్తూ నేడు 12వ సంవత్సరంలోకి అడుగిడుచున్న శుభసందర్భంగా చీఫ్ మేనేజర్ శ్రీ ఉప్పల వెంకటరాజకుమార్ గారికి, వారి సిబ్బందికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు.
శ్రీ ఉప్పల వెంకటరాజకుమార్ గారు, చీఫ్ మేనేజర్, భారతీయ స్టేట్ బ్యాంక్, రాయచోటి టౌన్ బ్రాంచ్.
ప్రొ॥ షేక్ జాఫర్ అలి
అతిక ట్రేడర్స్ (కోకనట్ మర్చంట్)
D.No. 60/125, గాంధీ బజార్, రాయచోటి, సెల్ : 9440022727

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సుండుపల్లె రోడ్, రాయచోటి టౌన్ బ్రాంచి, అన్నమయ్య జిల్లా.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రాయచోటి టౌన్ బ్రాంచి 11 సంవత్సరాలుగా ఖాతాదారులకు, ప్రజలకు విశేష సేవలందిస్తూ నేడు 12వ సంవత్సరంలోకి అడుగిడుచున్న శుభసందర్భంగా చీఫ్ మేనేజర్ శ్రీ ఉప్పల వెంకట రాజకుమార్ గారికి, వారి సిబ్బందికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు.
శ్రీ ఉప్పల వెంకట రాజకుమార్ గారు, చీఫ్ మేనేజర్, భారతీయ స్టేట్ బ్యాంక్, రాయచోటి టౌన్ బ్రాంచి.
ప్రొ॥ క్రిష్ణం గిరీష్
శ్రీ లక్ష్మి నరసింహా మెడికల్ ఏజెన్సీ, బ్రాహ్మణ వీధి, రాయచోటి.

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సుండుపల్లె రోడ్, రాయచోటి టౌన్ బ్రాంచ్, అన్నమయ్య జిల్లా.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రాయచోటి టౌన్ బ్రాంచ్ 11 సంవత్సరాలుగా ఖాతాదారులకు, ప్రజలకు విశేష సేవలందిస్తూ నేడు 12వ సంవత్సరంలోకి అడుగిడుచున్న శుభసందర్భంగా చీఫ్ మేనేజర్ శ్రీ ఉప్పల వెంకటరాజకుమార్ గారికి, వారి సిబ్బందికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు.
శ్రీ ఉప్పల వెంకటరాజకుమార్ గారు, చీఫ్ మేనేజర్, భారతీయ స్టేట్ బ్యాంక్, రాయచోటి టౌన్ బ్రాంచ్.
KALEEM ENTERPRISES
GANDHI BAZAAR, RAYACHOTY.
CELL : 9440222685

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సుండుపల్లె రోడ్, రాయచోటి టౌన్ బ్రాంచి, అన్నమయ్య జిల్లా.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాయచోటి టౌన్ బ్రాంచ్ 11 సంవత్సరాలుగా ఖాతాదారులకు, ప్రజలకు విశేష సేవలందిస్తూ నేడు 12వ సంవత్సరంలోకి అడుగిడుచున్న శుభసందర్భంగా Cheif Manager శ్రీ ఉప్పల వెంకట రాజకుమార్ గారికి, వారి సిబ్బందికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు.
శ్రీ ఉప్పల వెంకట రాజకుమార్ గారు, Cheif Manager, భారతీయ స్టేట్ బ్యాంక్, రాయచోటి టౌన్ బ్రాంచి
TATA CEMENT · TATA TISCON · UltraTech Cement · Zuari Cement
మా వద్ద అన్నిరకాల సిమెంట్స్, TATA TISCON కడ్డీలు సరసమైన ధరలలో లభించును.
రాయవరం విశ్వనాథరెడ్డి
ప్రొ॥ విజయ్ ట్రేడర్స్ & వినాయక ట్రేడర్స్
చెన్నముక్కపల్లె, సుండుపల్లె రోడ్, రాయచోటి, సెల్ : 9866454006

(c) eenadu

ఈనాడు బాపట్ల
సోమవారం నవంబరు 3, 2025

పేరుంది.. ఊరేలేదు!

పేరుంది.. ఊరేలేదు.. ఇదేదో విచిత్రంగా ఉంది కదూ.. ఆ కథ చూద్దాం.. వేటపాలెం మండలంలో పుల్లరిపాలెం పంచాయతీ ఉంది. ఈ పంచాయతీ చుట్టుపక్కల బ్రిటీష్ కాలంలో అటవీ భూములు ఉండేవి. వీటిల్లో ఎవరైనా అక్రమంగా ప్రవేశించినా, పశువులను మేపినా వారిపై విధించే పన్నును ఆ రోజుల్లో 'పుల్లరి' అని పిలిచేవారు. ఆ పేరుతోనే గ్రామానికి పుల్లరిపాలెంగా వచ్చినట్లు ఆనాటి పెద్దలు చెబుతున్నారు. ఈ పంచాయతీలో కొత్తరెడ్డిపాలెం, పాతరెడ్డిపాలెం, రామచంద్రాపురం, ఊటుకూరి సుబ్బయ్యపాలెం, సాయినగర్ గ్రామాలు ఉన్నా... పుల్లరిపాలెం అనే గ్రామం లేకపోవడం గమనార్హం. దాదాపు వందేళ్ల చరిత్ర పంచాయతీకి ఉంది. పుల్లరిపాలెం పంచాయతీ కార్యాలయం కొత్తరెడ్డిపాలెంలో ఉంది. ఇటీవల సచివాలయాలు రావడంతో దీన్ని సచివాలయంగా మార్పు చేశారు. జనాబా 2800 మంది. - న్యూస్‌టుడే, వేటపాలెం

పంటలు సంరక్షించుకుందాం

ఈనాడు మీతోడు | వీసీతో ఫోన్‌ఇన్ నేడు

గుంటూరు: మొంథా తుపానుకు జిల్లాలో పంటలు దెబ్బతిన్నాయి. వరి, పత్తి నేలవాలాయి. మిర్చి, అపరాలు, కూరగాయలు, ఉద్యాన పంటలు నీటిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో 'ఈనాడు' ఫోన్ ఇన్ కార్యక్రమంలో ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి, శాస్త్రవేత్తలు పంటల సంరక్షణకు సూచనలు తెలియజేయనున్నారు. రైతులు చేయాల్సిందల్లా కింది నంబరుకు ఫోన్ చేసి సందేహాలు తెలియజేయడమే.

సమయం: ఉదయం 10 నుంచి 11 వరకు

98491 76527

తేదీ: సోమవారం (03.11.2025)

ఎగుమతులు లేక.. పలకలు కదలక

ఓ పరిశ్రమలో నిల్వలు ఇలా..

మార్టూరు, యద్దనపూడి, న్యూస్‌టుడే

ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రానైట్ పరిశ్రమ కష్టాల కొలిమిలో కొనసాగుతోంది. నాణ్యమైన ముడిరాయి లభించక ధరలు దిగజారడం.. ఇప్పటికే చేసిన పలకలు ఎగుమతి కాకపోవడంతో పరిశ్రమ తీవ్ర అవస్థలు ఎదుర్కొంటోంది. కొద్ది నెలలుగా పెద్దఎత్తున సరుకు ఫ్యాక్టరీల్లోనే ఉండిపోయింది. దీంతో నెలవారీ విద్యుత్తు బిల్లులు, బ్యాంకు రుణాల చెల్లింపులు పెనుభారంగా మారాయి. అప్పులు తెచ్చి పరిశ్రమను నడిపించాల్సిన దుస్థితి. ఈ పరిస్థితి ఎన్నాళ్లు కొనసాగుతుందో తెలియక యజమానులు ఆందోళన చెందుతున్నారు.

ప్రకాశం, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో సుమారు 1100కు పైగా గ్రానైట్ పలకలు ఉత్పత్తి చేసే పరిశ్రమలు ఉన్నాయి. వీటిని మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, హరియాణా, దిల్లీ, తమిళనాడు, కేరళ, కర్ణాటక వంటి రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు మనప్రాంతంలో పలకలు కొని, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. చీమకుర్తి గెలాక్సీ ప్రపంచంలోనే ప్రఖ్యాతిగాంచింది. మన ప్రాంతంలో లభించే పలకలు రైల్వే, విమానాశ్రయాలు, బహుళ అంతస్తుల భవనాల పనుల్లో పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. ఈ పరిశ్రమల్లో ముడిరాయి నాణ్యత కొరవడటం, ఇతర ప్రాంతాల వ్యాపారుల [illegible] ఎగుమతులపై ప్రభావం చూపుతోంది. దీనికితోడు ప్రభుత్వం మైనింగ్ వసూలును ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టడంతో పారిశ్రామిక వర్గాలు అయోమయంలో మునిగాయి. పలు [illegible] సమస్యల పరిష్కారానికి సమావేశాలు నిర్వహించినా ఫలితం ఒనగూరలేదు.

పేరుకుపోయిన నిల్వలు

గ్రానైట్ పరిశ్రమల్లో గ్రానైట్ పలకల నిల్వలు పేరుకుపోయాయి. ఇతర రాష్ట్రాలకు నిత్యం 175 లారీల్లో సరుకు ఎగుమతయ్యేవి. [illegible] రాష్ట్ర సరిహద్దు వద్ద నెలకొన్న పరిస్థితులు, ప్రైవేటు సంస్థ గ్రానైట్ మైనింగ్ వసూలును [illegible] చేయడం వంటి అంశాలు వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఎగుమతులు 80 శాతం క్షీణించడంతో పరిశ్రమల్లో పలకల నిల్వలు పేరుకుపోయాయి. దీంతో యజమానులు విద్యుత్తు బిల్లులు, బ్యాంకు రుణాలు, ముడిరాయి చెల్లింపులు సకాలంలో చేయలేని దుస్థితి నెలకొంది. వేలాది మంది ఉపాధి పొందే ఇతర రాష్ట్ర కార్మికులకు జీతాలు చెల్లించలేని దుస్థితి యాజమాన్యాలను వేధిస్తోంది.

కిలో వంకాయలు రూ.140

న్యూస్‌టుడే, బాపట్ల

కొండెక్కిన కూరగాయల ధరలు

కూరగాయల ధరలు కొండెక్కాయి. మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీవర్షాలకు జిల్లాలో ఐదు వేల ఎకరాల్లో పైగా ఉద్యానపంటలు దెబ్బతిన్నాయి. కూరగాయల తోటలు ముంపు బారినపడ్డాయి. మార్కెట్‌కు తక్కువ వస్తున్నాయని వ్యాపారులు అమాంతంగా ధరలు పెంచేశారు. బాపట్ల మార్కెట్లో కిలో వంకాయలు ఆదివారం రూ.140 ధర పలికాయి. బీరకాయల ధర సెంచరీ కొట్టింది. ఆకుకూర కట్టను రూ.25 వసూలు చేశారు. కాకర, దోస, చిక్కుడు, బెండకాయల ధర సైతం పెరిగింది. రూ.500 ఖర్చు చేసినా సంచి నిండటం లేదని సామాన్య, మధ్యతరగతి వర్గాల వారు వాపోతున్నారు. పచ్చిమిర్చి ధర మాత్రమే అదుపులో ఉంది. మిగతావన్నీ చుక్కలనంటుతున్నాయి. వర్షాలకు అన్ని ప్రాంతాల్లో తోటలు మునిగిపోయి పంటలు దెబ్బతిన్నాయని, రైతుల వద్దే గోంగూరకట్ట తాము రూ.15కు కొనుగోలు చేస్తున్నామని వ్యాపారులు అంటున్నారు. వరద ముంపునకు గురైన ఆకుకూరలు తోటలు కుళ్లిపోయాయి.

బాపట్లలో కూరగాయలు	కిలో ధర (రూ.లలో)
టమాట	60
బీరకాయ	100
బంగాళాదుంప	80
చిక్కుడుకాయ	100
కాకరకాయ	80
గుత్తివంకాయ	160
బెండకాయ	80
వంకాయ	140
దోసకాయ	80
క్యారెట్	100
పచ్చిమిర్చి	50

బీచ్‌ల్లో కార్తిక స్నానాలకు బ్రేక్

భద్రతా కారణాలతో 4వ తేదీ వరకు నిషేధం

న్యూస్‌టుడే, బాపట్ల

నిర్మానుష్యంగా సూర్యలంక బీచ్

ప్రతికూల పరిస్థితులు కార్తిక మాసంలో భక్తులు సముద్ర స్నానాలు చేయటానికి అవకాశం లేకుండా చేస్తున్నాయి. మొంథా తుపాను కారణంగా జిల్లాలో గత నెల 26 నుంచి బీచ్‌లలో ప్రవేశంపై నిషేధం విధించారు. విహారం నిమిత్తం ఆదివారం వేలల్లో వచ్చిన పర్యాటకులు, భక్తులను పోలీసులు అనుమతించలేదు. సముద్ర తీరంలో గోతులు ఏర్పడటంతో లోపలికి దిగి స్నానాలు చేయటం ప్రమాదకరమని నిపుణులు హెచ్చరించారు. భద్రతా కారణాల దృష్ట్యా ఈ నెల 4 వరకు నిషేధం కొనసాగించాలని అధికారులు నిర్ణయించారు.

☛ కార్తిక మాసంలో ప్రతి సోమవారం సముద్రంలో భక్తులు స్నానాలు ఆచరించి సైకత శివలింగాలకు పూజలు చేస్తారు. శని, ఆదివారాలు వీరితో పాటు సందర్శకులు వేల సంఖ్యలో తరలివచ్చి వనసమారాధనలో పాల్గొని సామూహిక భోజనాలు చేస్తుంటారు. ఈ క్రమంలోనే సూర్యలంక, వాడరేవు, రామాపురం బీచ్‌లు కిటకిటలాడతాయి. మొంథా తుపాను వల్ల పరిస్థితులన్నీ తల్లకిందులయ్యాయి. ప్రమాదాలు పొంచి ఉన్న నేపథ్యంలో ఎనిమిది రోజులుగా తీరానికి ఎవరినీ అనుమతించటం లేదు. బీచ్‌లు నిర్మానుష్యంగా మారాయి.

☛ బీచ్‌లో మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు దిగి తీరంలో మూడు, నాలుగు అడుగుల లోతు గోతులు గుర్తించారు. వీటి వల్ల సుడిగుండాలు ఏర్పడి సముద్ర స్నానాలు చేసే వారి ప్రాణాలకు ప్రమాదమని హెచ్చరించారు. ఈ క్రమంలో బీచ్‌ల్లో ప్రవేశ నిషేధాన్ని సోమ, మంగళవారాలు కూడా అమలు చేస్తున్నామని బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు ఆదేశాలు జారీ చేశారు. పోలీసు అధికారులు సైతం ఇదే విషయాన్ని ప్రకటించారు. నెల్లూరు జిల్లా మైపాడు బీచ్‌లో సముద్ర స్నానం చేస్తూ ముగ్గురు విద్యార్థులు ఆదివారం మృతి చెందిన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

❖ కార్తిక పౌర్ణమి ఈ నెల 5న వస్తోంది. బంగాళాఖాతంలో ఈ నెల 4న అల్పపీడనం ఏర్పడే పరిస్థితులు ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేసింది. కార్తిక పౌర్ణమికి భక్తులను సముద్ర తీరం వద్దకు అనుమతించాలా వద్దా అన్న విషయమై ఆ రోజు నిర్ణయం తీసుకుంటామని అధికారవర్గాలు అంటున్నాయి. నిపుణులు మాత్రం మరో వారం బీచ్‌లలో ప్రవేశంపై నిషేధం కొనసాగించాలని సూచించారు. భక్తుల భద్రత దృష్ట్యా సముద్ర స్నానాలకు ప్రస్తుతం ఎవరినీ అనుమతించటం లేదని డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు.

జయ స్తంభం.. విజయ చిహ్నం

యద్దనపూడి మండలం యనమదల గ్రామంలోని శ్రీ సీతారామ ప్రతాపాంజనేయ స్వామి కోవెలలో ఉన్న జయ స్తంభం ఆకట్టుకుంటోంది. పూర్తిగా రాతితో చెక్కబడి 75 అడుగుల ఎత్తయిన ఏకశిల జయ స్తంభం నేటికీ చెక్కు చెదరకుండా పూజలందుకుంటోంది. ప్రాచీన కాలంలో ఈ ప్రాంతాన్ని పాలించిన రాజులు తమ విజయానికి చిహ్నంగా ఈ జయస్తంభాన్ని ఏర్పాటు చేశారని, అరుదైన ఈ రాతి ధ్వజం ఇక్కడ ప్రత్యేకత సంతరించుకుందని ఆలయ పురోహితుడు శ్రీనివాస్ తెలిపారు.

- ఈనాడు, బాపట్ల, న్యూస్‌టుడే, యద్దనపూడి

నవోదయం @ చిలకలూరిపేట

ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి చిలకలూరిపేట మండలం మద్దిరాలలో 1987లో జవహర్ నవోదయ విద్యాలయ ఏర్పాటు చేశారు. ఈ విద్యాలయలో ఆరో తరగతి ప్రవేశానికి గ్రామీణ, అర్బన్ ప్రాంతాల నుంచి ఏటా 80 మందిని ఎంపిక చేస్తారు. 30 ఏళ్ల క్రితమే చిలకలూరిపేటలో నవోదయ ప్రవేశ పరీక్షకు శిక్షణ ఇచ్చే కేంద్రాలను నెలకొల్పారు. ఇక్కడకు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల నుంచి విద్యార్థులు వచ్చేవారు. గడిచిన 30 ఏళ్లలో శిక్షణ కేంద్రాలలో చదువుకున్న 3 వేలకు పైగా విద్యార్థులు జవహర్ నవోదయలో సీట్లు సాధించారు. విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న ఎంతోమంది దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. - న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ

నోరూరించే.. గురజాల జిలేబి

గురజాలలో తయారు చేసే జిలేబికి ప్రత్యేకత ఉంది. 65 ఏళ్లుగా తోపుడు బండ్లపై వేడి వేడిగా తయారు చేసి విక్రయిస్తున్నారు. గురజాలలో 1960లోనే కోర్టులు ఏర్పాటయ్యాయి. మాచర్ల, గురజాల, సత్తెనపల్లి తదితర ప్రాంతాల నుంచి కోర్టులకు హాజరయ్యేవారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు వేచి ఉండాల్సి వచ్చేది. అప్పట్లో హోటళ్లు, భోజనం, టిఫిన్ అందుబాటులో లేవు. దీంతో తక్కువ ధరకు జిలేబిని అందుబాటులోకి తెచ్చారు. కాలం మారినా.. వివిధ మిఠాయిలు అందుబాటులోకి వచ్చినా జిలేబికి డిమాండు తగ్గలేదు. వివిధ పనుల నిమిత్తం గురజాలకు వచ్చే వారు జిలేబిని కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. విదేశాల్లోని తమ బంధువులకు పార్శిల్ చేసి పంపుతున్నారు. - న్యూస్‌టుడే, గురజాల

పుర కార్మికులకు ఆర్థిక భరోసా

విధుల్లో పారిశుద్ధ్య కార్మికులు

బాపట్ల, సత్తెనపల్లి: తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పట్టణాలను పరిశుభ్రంగా మార్చే పారిశుద్ధ్య కార్మికులకు భరోసా కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఆప్కాస్ పరిధిలోని ఒప్పంద, పొరుగు సేవల కార్మికులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించేందుకు యాక్సిస్ బ్యాంకు ముందుకు రావడంతో ప్రభుత్వం సమ్మతించింది. పురపాలక శాఖ యాక్సిస్ బ్యాంకుతో ఎంవోయూ కుదుర్చుకోవడంతో కార్మికుల జీతభత్యాలను ఆ బ్యాంకు నుంచే చెల్లిస్తున్నారు. ఇప్పటివరకు వివిధ బ్యాంకుల్లో ఉన్న ఖాతాల్ని ఇందులోకి మార్చారు. దీనిపై ఆయా పురపాలక సంఘాల కార్యాలయాల్లో కార్మికులకు అధికారులు, బ్యాంకు సిబ్బంది అవగాహన కల్పించారు.

ప్రయోజనాలు ఇలా..

❖ కార్మికులకు రూ.4 లక్షల వరకు బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తారు. ❖ కార్మికులు సహజ మరణానికి పురపాలిక రూ.2 లక్షలు ఇస్తుండగా.. ఇప్పుడు బ్యాంకు మరో రూ.2 లక్షలు ఇవ్వనుంది. ❖ ఉద్యోగం చేస్తూ చనిపోతే.. ఆ కుటుంబాల్లోని పిల్లల చదువుకు ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున ఇద్దరికి రూ.8 లక్షలు అందిస్తారు. ❖ ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.20 లక్షల పరిహారం అందజేస్తారు.

పట్టణం	కార్మికులు
బాపట్ల	186
చీరాల	220
రేపల్లె	146
అద్దంకి	90

సమస్యలపై ఆన్‌లైన్లో అర్జీల స్వీకరణ

బాపట్ల, న్యూస్‌టుడే: ప్రజలు తమ సమస్యలపై మీకోసం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్లోనూ అర్జీలు అందజేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారులు అందజేసిన అర్జీలు పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించి సమాచారం తెలుసుకోవటానికి 1100 నంబరుకు కాల్ చేయవచ్చన్నారు. కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ డివిజన్, తహసీల్దారు కార్యాలయాల్లోనూ సోమవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

నవంబర్ 1వతేదీ శనివారం.. ఐదు బోగీలతో ఉన్న ఓ రైలు దొనకొండ స్టేషన్ వద్దకు వచ్చి ఆగింది.. అందులో నుంచి తెల్ల దుస్తులతో ఉన్న వైద్యులు, సిబ్బంది ప్లాట్‌ఫామ్‌పై దిగారు..కాసేపటికి రైల్వే యూనిఫాంలో ఉన్న కొందరు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆ బోగీల్లోకి వెళ్లారు..వారికి వైద్య పరీక్షలు నిర్వహించడం, మందులు అందించడం..చకచకా జరిగిపోతున్నాయి..ఒక్క దొనకొండలోనే కాదు.. ఆ తర్వాత గజ్జుల, మార్కాపురం రోడ్, తర్లుపాడు, కంభం, జంగంబొట్ల కృష్ణాపురం, సోమిదేవిపల్లి, గిద్దలూరులోనూ ఇవే దృశ్యాలు కనిపించాయి. ఇంతకీ ఈ రైలు ఏమిటి.. ఇందులో వచ్చిన ఆ వైద్యులు, సిబ్బంది ఎక్కడి వారు..వారి అందించే చికిత్స.. ఈ కథనంలో తెలుసుకుందాం..!!

చక్రాలపై వైద్యం.. చెంతకే ఆరోగ్యం!

ఈనాడు, అమరావతి

'హెల్త్ ఆన్ వీల్స్'.. రెండు నెలల క్రితం గుంటూరు రైల్వే డివిజన్‌లో ప్రారంభమైన కార్యక్రమం. గతేడాది కొంతకాలం పాటు ఇది సాగినా.. అనివార్య కారణాలతో ఆగింది. అయితే, గుంటూరు రైల్వే డీఆర్ఎంగా సుధేష్ణ సేన్ బాధ్యతలు స్వీకరించాక ఈ కార్యక్రమంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. గత రెండు నెలల్లో ఐదు దఫాలుగా ప్రత్యేక రైలును వివిధ మార్గాల్లో నడుపుతున్నారు. ఇందులో రైల్వే ఆసుపత్రి వైద్యులు, పారా మెడికల్ సిబ్బందితోపాటు రెఫరల్ ఆసుపత్రి వైద్యులు ఉంటారు. వీరికి కేటాయించిన మార్గం, తేదీల్లో ఆ ప్రత్యేక రైలులో వెళ్లడం..సూచించిన స్టేషన్లలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. రైలు బోగీలోనే దీన్ని ఏర్పాటు చేస్తుండగా..ఆ స్టేషన్, పరిసర ప్రాంతాలకు చెందిన రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు అందులో వైద్యపరీక్షలు, చికిత్సలు చేస్తున్నారు. ఒకవేళ తీవ్ర అనారోగ్య సమస్యలుంటే రెఫరల్ ఆసుపత్రికి వెళ్లాలని సూచిస్తుండడం గమనార్హం.

అనేక మార్గాల్లో సేవలు.. ఇప్పటివరకు అనేక మార్గాల్లో ఈ సేవలు అందినట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు. సెప్టెంబర్ 20న గుంటూరు-దొనకొండ స్టేషన్ల మధ్య 140 మంది ఈ తరహాలో వైద్య సేవలు పొందగా.. అక్టోబర్ 17న నడికుడి-నల్గొండ సెక్షన్‌లో 162 మంది లబ్ధి పొందారు. గుంటూరు టు రేపల్లె, మంగళగిరి, నడికుడి మార్గాల్లోనూ ఈ సేవలు అందించారు. వారానికి లేదా రెండు వారాలకు ఒకసారి ఈ ప్రత్యేక రైలు పట్టాలపై పరుగులు తీస్తోంది. గిద్దలూరు టూ నంద్యాల, నల్గొండ మార్గాల్లో ప్రస్తుతం ఈ సేవలు అందించాల్సి ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

ప్రత్యేక రైలులో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు వైద్యపరీక్షలు

ఔరా.. సౌర!

ఒక ఆలోచన.. అటు వాహనాలకు నీడకు.. ఇటు సౌర విద్యుత్తు ఉత్పత్తికి ఆదరువుగా మారింది. ప్రత్తిపాడు మండలం ఈదురుపాలెం కాటూరి వైద్య కళాశాల యాజమాన్యం 300 వాహనాల పార్కింగ్‌కు సరిపడా 26 వేల చదరపు అడుగుల స్థలాన్ని కేటాయించింది. షెడ్‌గా పూర్తిగా సౌరపలకలను అమర్చింది. అటు వాహనాలకు నీడ ఇవ్వడంతోపాటు ఇటు ఒక మెగావాట్ విద్యుత్తు ఉత్పత్తికీ ఉపయోగపడుతోంది. సగానికిపైగా కరెంటు బిల్లు ఆదా అవుతోందని కళాశాల ప్రతినిధులు చెప్పారు. - ఈనాడు, గుంటూరు

విద్యుత్తు వాహనాలకు ఛార్జింగ్ చిక్కు

బాపట్ల జిల్లా పర్యాటకంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. హైదరాబాద్, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో పర్యాటకులు తరలివస్తున్నారు. వారాంతంలో సూర్యలంక, రామాపురం, వాడరేవు బీచ్‌లు కిటకిటలాడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల ప్రజలే కాకుండా ఉత్తర భారతీయులూ కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి విహారానికి వస్తున్నారు. వీరిలో పలువురు విద్యుత్తు వాహనాలు వినియోగిస్తున్నారు. తమ వాహనాల ఛార్జింగ్‌కు తగిన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. - న్యూస్‌టుడే, బాపట్ల

జిల్లాలో 11 మాత్రమే..

జిల్లాలో 174 పెట్రోలు బంకులు ఉండగా.. విద్యుత్తు ఛార్జింగ్ కేంద్రాలు 11 మాత్రమే ఉన్నాయి. జిల్లా కేంద్రం బాపట్లలోని విద్యుత్తు శాఖ ఈఈ కార్యాలయం వద్ద ఒకటి ఉంది. దీంతోపాటు మిగతా కేంద్రాల గురించి సమాచారం లేనందున పర్యాటకులు వాహనాల ఛార్జింగ్‌కు ఎక్కడికి వెళ్లాలో తెలియడం లేదు. కాలుష్య నివారణలో భాగంగా పెట్రోలు, డీజిల్ స్థానంలో సీఎన్‌జీ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నారు. అలాగే ఈవీ వాహనాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. రానున్న రోజుల్లో పర్యాటకుల సంఖ్య రెండింతలు పెరిగే అవకాశం ఉందని పర్యాటక శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

నిర్వహణ లేక.. మురుగు తిష్ఠ

చిలకలూరిపేట - మార్టూరు ప్రధాన రహదారిపై మురుగు ప్రవహిస్తుండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రహదారి పక్కనే ఉన్న కాలువలు పూడికతో నిండిపోవడం, నిర్వహణ లేకపోవడంతో మురుగు వెళ్లే దారిలేక రోజుల తరబడి నిలిచిపోతోంది. నీరు రంగు మారి దుర్గంధం వెదజల్లుతోంది. కాలువల్లో ప్రవహించాల్సిన మురుగు నిత్యం రహదారులపై ప్రవహిస్తుండటంతో దారంతా పాచిపట్టి వాహనదారులు జారి పడిపోతున్నారు. - ఈనాడు, బాపట్ల, న్యూస్‌టుడే మార్టూరు

వైద్య విద్యలో బంగారు కొండలు

సంకల్ప బలం ఉంటే చాలు... కొండనైనా పిండి చేయొచ్చంటారు. చదువంటే భారం కాదు... ఆసక్తి సాధన చేస్తే అద్భుతాలు సృష్టించొచ్చని నిరూపిస్తున్నారు ఇద్దరు అక్కాచెల్లెళ్లు. సాధారణ కుటుంబ నుంచి వచ్చి.. ప్రజ్ఞ చాటి.. వైద్యవిద్యలో బంగారు పతకాలు అందుకున్న సాయి శ్రీనిజ, సాయి శ్రీనిఖిత గురించి తెలుసుకుందామా....

తెనాలి టౌన్, న్యూస్‌టుడే

తెనాలికి చెందిన ప్రైవేటు ఉపాధ్యాయులు శంకరసాయిశర్మ, రాజరాజేశ్వరి దంపతుల కుమార్తెలు శ్రీనిజ, శ్రీనిఖిత. తల్లిదండ్రుల మార్గనిర్దేశకత్వంలో లక్ష్యాలను నిర్దేశించుకున్న వీరిద్దరూ చక్కని ప్రణాళికతో విద్యతోపాటు వారికి ఆసక్తి ఉన్న అంశాల్లోనూ రాణిస్తున్నారు.

తల్లిదండ్రులతో సాయిశ్రీనిజ, సాయిశ్రీనిఖిత

❖ పదో తరగతిలో పది జీపీఏ, ఇంటరులో 96 శాతం మార్కులతో ఉత్తీర్ణురాలైన **సాయిశ్రీనిజ** నీట్‌లో 2,590 ర్యాంకు సాధించి విజయవాడలోని నోరి రామశాస్త్రి ఆయుర్వేదిక్ కళాశాలలో బీఏఎంఎస్ వైద్య విద్య చేసింది. అత్యధిక మార్కులు సాధించి రాష్ట్రంలోనే తొలిస్థానంలో నిలిచింది. బెస్ట్ అవుట్‌గోయింగ్ స్టూడెంట్ ఆఫ్ ది యూనివర్సిటీగా గత సెప్టెంబరు 9న విజయవాడలో నిర్వహించిన స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా మూడు బంగారు, ఒక వెండి పతకం అందుకుంది. ప్రస్తుతం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర ఆయుర్వేదిక్ కళాశాలలో ఎండీ (కౌమార భృత్యం) చేస్తున్నారు.

❖ పదో తరగతిలో 93 శాతం (సీబీఎస్ఈ), ఇంటరులో 97.3 శాతం మార్కులు తెచ్చుకున్న **సాయిశ్రీనిఖిత** నీట్‌లో 1,400 ర్యాంకుతో విశాఖలోని శ్రీగాయత్రీ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చేసింది. కళాశాల ప్రథమురాలిగా.. బెస్ట్ అవుట్‌గోయింగ్ స్టూడెంట్‌గా నిలిచి ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన స్నాతకోత్సవంలో విశ్రాంత ఐఏఎస్ పూనం మాలకొండయ్య చేతుల మీదుగా బంగారు పతకాలతో పట్టా అందుకుంది. ప్రస్తుతం అక్కడే హౌస్ సర్జన్ చేస్తున్నారు.

❖ ఇద్దరూ హిందీలో ప్రవీణ పట్టా అందుకున్నారు. శాస్త్రీయ సంగీతం, నృత్యంలోనూ పట్టాలు సాధించారు. వివిధ ఆలయాల్లో ప్రదర్శనలిచ్చారు. శ్రీసత్యసాయి యువజన విభాగంలో సభ్యులుగా కొవిడ్ సమయంలో పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో తల్లిదండ్రులతో కలిసి సేవలందించారు. పేదలకు ఉచిత వైద్యం అందించాలన్నదే ధ్యేయమని సోదరీమణులు తెలిపారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
పదవీ విరమణ శుభాకాంక్షలు
జన్మదిన శుభాకాంక్షలు
అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
జి.ఎస్.టి. 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి: 80085 10541

(c) eenadu

ఆవిరైన ఆశలు.. అన్నదాతకు కష్టాలు

అనంతవరంలో నాసిరకం వరి విత్తనాల సాగుతో ఆందోళన

కొల్లూరు, న్యూస్‌టుడే: కొల్లూరు మండలంలోని అనంతవరానికి చెందిన 80 మంది రైతులు 1200 ఎకరాల్లో ఓ అగ్రిటెక్ కంపెనీకి చెందిన 5204 రకం వరి విత్తనాన్ని ఖరీఫ్‌లో విత్తారు. అక్కడక్కడా కొంత వరి కాల వ్యవధి కన్నా 20 రోజులు ముందుగానే ఈనింది. ఈ కంకుల్ని పరిశీలించి, నాసి రకం విత్తనం (బెరుకులు) అని తేలడంతో రైతులు లబోదిబో మంటున్నారు. ఇప్పటికే వీరు ఎకరానికి సుమారు రూ.25 వేలు వెచ్చించారు. నూర్పిడికి రూ. 10 వేలు వెచ్చిస్తే పంట చేతికి వచ్చేస్తుందని భావించారు. పచ్చి వడ్ల దిగుబడి కనీసం ఎకరానికి 40 బస్తాలు (76కిలోలు) వస్తుందని అంచనా వేశారు. బస్తా కనిష్ఠంగా రూ. 1500 ధర పలికినా తద్వారా రూ. 60 వేలు చేతికి వస్తే ఎకరానికి రూ. 25 వేల మిగులుతుందని ఆశించారు. ఈ మిగులు రెండో పంటకు పెట్టుబడిగా ఉపయోగ పడుతుందనేది వీరి ఆలోచన. నాసి రకం విత్తనాల దెబ్బతో అన్నదాతల ఆశలు ఆవిరై, అంచనాలు తల్లకిందులయ్యాయి. దిగుబడి తగ్గి ఎకరానికి రూ.30 వేలకు పైగా నష్టం వచ్చేలా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాసి రకం వరి విత్తిన పొలంలోని పంట

తాలు కంకులు

పరిహారం కోసం పాట్లు: బాధిత రైతులు గత నెల 7న ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నాసిరకం విత్తనాల విషయమై ఫిర్యాదు చేశారు. దీంతో సదరు కంపెనీ ప్రతినిధులు పంటను పరిశీలించి, విత్తనాల్లోని లోపం ఉందని అంగీకరించారు. పరిహారం అందిస్తామంటూ కాలం గడిపి చేతులెత్తేశారు. దీంతో ఈ నెల 14న బాధిత రైతులు మండల వ్యవసాయాధికారిని ఆశ్రయించడంతో శాస్త్రవేత్తలను వెంటనే పిలిపించి వారి నివేదిక ఆధారంగా పరిహారం ఇప్పించే ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎట్టకేలకు 17 రోజులు గడచిన తరువాత ఈ నెల 1న వ్యవసాయశాఖకు చెందిన శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు. సకాలంలో న్యాయం జరుగుతుందో లేదో తెలియక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండో పంట విత్తే సమయానికి అందజేయాలి

నేను వడ్డీకి అప్పు తెచ్చి 17 ఎకరాల్లో సదరు కంపెనీ వరి విత్తనాలు విత్తాను. పొలంలో సగానికి పైగా తాలు కంకులే ఉన్నాయి. దీని వల్ల దిగుబడి దారుణంగా తగ్గి రూ. 5 లక్షలు నష్టం వచ్చేలా ఉంది. రెండో పంట విత్తుకునే సమయానికి పరిహారం చేతి కందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి **- అల్లంనేని శివప్రసాద్, కౌలు రైతు, అనంతవరం**

నాగరాజు సమయస్ఫూర్తి.. విద్యార్థులకు రక్ష

ఇంకొల్లు, న్యూస్‌టుడే: బస్సు డ్రైవర్ నాగరాజు సమయస్ఫూర్తితో వ్యవహరించి విద్యార్థులను ప్రాణాపాయం నుంచి రక్షించి తాను మృత్యుఒడిలోకి చేరిన సంఘటన ఇంకొల్లులో జరిగింది. ఇంకొల్లుకు చెందిన చెట్టిపల్లి నాగరాజు ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. కొంతకాలంగా ఓ ప్రైవేటు పాఠశాల బస్సు డ్రైవరుగా పనిచేస్తున్నారు. శనివారం సాయంత్రం విద్యార్థులను గృహాలకు చేరవేసే సమయంలో గుండెపోటు చిహ్నాలు కనిపించడంతో బస్సును పక్కన పెట్టి, యాజమాన్యానికి సమాచారం ఇచ్చి, అపస్మారక స్థితిలోకి వెళ్లారు. యాజమాన్యం వేరే డ్రైవరుతో విద్యార్థులను గృహాలకు చేరవేసి, నాగరాజును ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. నాగరాజుకు పాఠశాల యాజమాన్యం నివాళులర్పించింది.

నాగరాజు (పాతచిత్రం)

బీచ్‌లలో అధికారుల పరిశీలన

బాపట్ల, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో సముద్రంలో భారీ గోతులు ఏర్పడటం వల్ల సోమ, మంగళవారాలు బీచ్‌ల్లో ఎవరినీ అనుమతించడం లేదని ఆర్డీవో గ్లోరియా తెలిపారు. సూర్యలంక బీచ్ వద్ద పరిస్థితులను డీపీవో ప్రభాకర్‌తో కలిసి ఆమె ఆదివారం పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ రెండ్రోజుల పాటు సముద్రతీరానికి పర్యాటకులు, భక్తులు రావద్దన్నారు. ప్రజల భద్రత కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని సహకరించాలని కోరారు. తదుపరి పరిశీలన చేసి అనుమతి ప్రకటన ఇచ్చే వరకు బీచ్‌లను మూసివేస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ పాల్గొన్నారు.

సూర్యలంక బీచ్ వద్ద పరిస్థితులు గమనిస్తున్న ఆర్డీవో గ్లోరియా, డీపీవో ప్రభాకర్

★ రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు సూర్యలంక, పాండురంగాపురం, రామచంద్రాపురం, కొత్తఓడరేవు, అడవిపల్లెపాలెం బీచ్‌ల్లో ప్రవేశంపై ఈ నెల 4 వరకు నిషేధం విధించినట్లు డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. బాపట్ల గ్రామీణ పోలీస్‌స్టేషన్లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్తిక సోమవారం సందర్భంగా భక్తులెవరూ సముద్ర స్నానం చేయటానికి తీరానికి రావద్దని చెప్పారు. గ్రామీణ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

బాపట్ల: ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం నిర్వహించారు. పరుగు పందేలు, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, లాంగ్‌జంప్, హైజంప్ పోటీల్లో వెటరన్ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ చూపిన 120 మంది క్రీడాకారులను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేసినట్లు మాస్టర్ అథ్లెట్ల సంఘం జిల్లా కార్యదర్శి నజీర్ తెలిపారు. బాపట్లలో డిసెంబరు 13, 14న రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎందుకిచ్చారో.. ఎక్కడున్నాయో?

ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే

గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయం, సాంకేతిక విద్య పేరుతో అమలు చేసిన విద్యా విధానాలు అనేక ఇబ్బందులు తీసుకొచ్చాయి. డిజిటల్ విద్య పేరుతో బైజూస్ లాంటి కొన్ని కంపెనీలకు మేలు చేసేలా ఒప్పందం చేసుకుని విద్యార్థులకు అప్పట్లో ట్యాబ్‌లు పంపిణీ చేశారు. వాటిపై సరైన అవగాహన లేకుండా, సక్రమంగా శిక్షణ ఇవ్వకుండా విద్యార్థులకు అందించారు. ట్యాబ్‌లను బడుల్లోని డిజిటల్ తెరలకు అనుసంధానం చేసే చర్యలు చేపట్టలేదు. ఎంతో ప్రచారం చేసి రూ.కోట్లతో విద్యార్థులకు అందించిన ఆ ట్యాబ్‌లు ప్రస్తుతం ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి.

విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్ (పాతచిత్రం)

నెరవేరని లక్ష్యం..: వైకాపా ప్రభుత్వం 2022-23, 23-24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు, వారికి బోధించే ఉపాధ్యాయులకు ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేసింది. నిబంధనల ప్రకారం అన్ని సబ్జెక్టులు దానిలో అప్‌లోడ్ చేయాల్సి ఉన్నా కొన్నే చేశారు. నిక్షిప్తం చేసిన వాటిలో చాలా అంశాలు పొందుపరచలేదు. తెలుగు, హిందీ వంటి సబ్జెక్టులు పూర్తిగా ట్యాబ్‌లో లేవు. ఆయా కారణాలతో డిజిటల్ బోధన అనుకున్న లక్ష్యం నెరవేరలేదు. కొన్నాళ్లకు అవి పనిచేయకపోవడంతో అవి కాస్తా అటకెక్కించారు. పాఠశాల నుంచి వచ్చాక విద్యార్థులు పుస్తకాలు పక్కన పెట్టి ఆ ట్యాబ్‌ల్లో వీడియో గేమ్స్, సినిమాలు చూస్తూ సమయాన్ని దుర్వినియోగం చేసుకున్నారు. బాపట్ల, వేమూరు, రేపల్లె నియోజకవర్గాల పరిధిలో రెండు విడతల్లో కలిపి సుమారు 10వేల మంది విద్యార్థులు, వెయ్యి మంది ఉపాధ్యాయులకు వీటిని పంపిణీ చేశారు.

ట్యాబ్‌లు తీసుకున్నాం

ఉపాధ్యాయులు, విద్యార్థుల వద్ద ఉన్న ట్యాబ్‌లను తీసుకున్నాం. ఇప్పటి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా చేయాలని ఆలోచనలో ఉన్నాం. **- రాజారత్నం, ఎంఈవో, పీవీపాలెం**

వరద నీటిలోనే వరి పొలాలు

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాంలోని వరి పొలాలను వరద నీరు అయిదు రోజులుగా చుట్టుముట్టే ఉంది. కళ్ల ముందు మునిగిన పంట పొలాలను చూసుకొని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు మూడు నెలల పైరు అయినా ఒకటి రెండు రోజులు ముంపులో ఉంటే కొంతమేర కాపాడుకోవచ్చని, అదే అయిదు రోజుల పాటు ఉంటే కష్టమని రైతులు తిరుపతిరావు, శ్రీనివాసరావు, సుబ్బారావు, పోలయ్యలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 7,150 ఎకరాల్లో నాట్లు వేయగా, 4,740 ఎకరాల్లో నీట మునిగిందని మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం నాటికి 1,450 ఎకరాలకు సంబంధించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని చెప్పారు.

కొమ్మమూరు కాలువ పక్కన అయిదు రోజులుగా నీటిలో మునిగే ఉన్న పొలాలు

నేడు సీతారామస్వామి ఆలయానికి శంకుస్థాపన

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం అన్నపూర్ణ థియేటర్ పక్కన నూతనంగా నిర్మించనున్న శ్రీసీతారామస్వామి ఆలయానికి శంకుస్థాపన పూజలు జరుగుతాయని ధర్మకర్త మోటుమర్రి రామసుబ్బారావు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వలివేటి వెంకట రామానుజం తెలిపారు. ఉదయం 10.43 గంటలకు శంకుస్థాపన ఉంటుందని చెప్పారు. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పర్చూరు శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు హాజరుకానున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ప్రజలు హాజరై విజయవంతం చేయాలని, 11.30 గంటలకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు.

డ్రోన్‌తో పొలాల సర్వే

చినగంజాం, న్యూస్‌టుడే: పెదగంజాం, చినగంజాం ప్రాంతాల్లో వరద ముంపునకు గురైన వరి పొలాలను డ్రోన్ సాయంతో ఆదివారం సర్వే చేసినట్లు తహసీల్దార్ కె.ప్రభాకరరావు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి ప్రశాంత్, ఏవో చంద్రశేఖర్, సర్వేయర్ లోకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలకు ఎమ్మెల్యే ఏలూరి అభినందనలు

మార్టూరు: భారత అంతరిక్ష రంగంలో మరో చరిత్రాత్మక ఘట్టాన్ని సృష్టించిన ఇస్రో శాస్త్రవేత్తలకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదివారం అభినందనలు తెలిపారు. శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి సీఎంఎస్-03 కమ్యూనికేషన్ ఉపగ్రహం విజయవంతంగా ప్రయోగించడం దేశానికే గర్వకారణమని పేర్కొన్నారు.

హనుమోజిపాలెం, బూదవాడలో నేత్రదానం

ఇంకొల్లు, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో రెండు నేత్రదానాలు జరిగాయి. హనుమోజిపాలేనికి చెందిన బత్తిన హనుమంతరావు(58), బూదవాడకు చెందిన అలవల నారాయణరెడ్డి(95) ఆదివారం మృతిచెందారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు రోటరీ అవయవ నేత్రదాన సలహా కేంద్రం ప్రతినిధులు జెట్టి స్వామి, ఎస్.రామమోహనరావులు పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి సిబ్బందిని పిలిపించి, మృతుల కార్నియాలను సేకరించారు. నేత్రదాతల కుటుంబ సభ్యులను రోటరీ ప్రతినిధులు కోటేశ్వరరావు, రాఘవరెడ్డి, నాగేశ్వరరావు అభినందించారు.

డీసీసీబీ అక్రమాలపై సమావేశం నేడు

గుంటూరు: వైకాపా ప్రభుత్వంలో డీసీసీబీలో అక్రమాలపై అసెంబ్లీ హౌస్ కమిటీని నియమించింది. సచివాలయంలో సోమవారం నిర్వహించే సమావేశంలో సహకార శాఖ అధికారులు, బ్యాంకు సీఈవోలు పాల్గొననున్నారు.

పెళ్లి సంబంధాల కోసం చూస్తున్నారా
అన్ని కులాల సాఫ్ట్‌వేర్ ఉద్యోగ వధూవరులకు సువర్ణావకాశం

నేడు అన్ని కులాల సాఫ్ట్‌వేర్ ఉద్యోగ వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి అన్ని కులాల సాఫ్ట్‌వేర్ ఉద్యోగ అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు **నేడు (3 నవంబరు 2025)** ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ★ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్లో యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు క్రింద తెలిపిన ఫోన్ నెంబర్లను సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

మరిన్ని వివరాలకు
95501 28306 & 83744 45190
ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

రహదారికి గ్రామస్థుల మరమ్మతులు

విజనంపాడు (యద్దనపూడి), న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు సౌకర్యానికి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామీణులు ప్రత్యేక చొరవ చూపారు. మండలంలోని విజనంపాడు, చిలుకూరి వారిపాలెం గ్రామాలకు ఇటీవల చిలకలూరిపేట ఆర్టీసీ డిపో నూతన సర్వీసును నడుపుతోంది. గ్రావెల్, కంకరుతో కూడిన భారీ వాహనాలు నిత్యం పెద్దసంఖ్యలో రాకపోకలు సాగించడంతో గుంతలమయమైంది. దీంతో బస్సు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడంతో విజనంపాడు గ్రామస్థులు మరమ్మతులకు సొంత నిధులతో డస్ట్‌తో గుంతలు పూడ్చారు. తెదేపా నాయకులు సాధినేని సుధీర్‌బాబు, ఉప సర్పంచి రంగారావు, కోడూరి నాగరాజు, వెంకటేష్‌లు పనులను పర్యవేక్షించారు.

రోడ్డు గుంతలు పూడుస్తున్న ప్రజలు

తీరంలోకి భక్తులు రాకుండా జాగ్రత్తలు

చీరాల అర్బన్, చినగంజాం, మార్టూరు, పర్చూరు, కారంచేడు, యద్దనపూడి, మేదరమెట్ల, బల్లికురవ, న్యూస్‌టుడే: మొంథా తుపాను కారణంగా చీరాల, వేటపాలెం, చినగంజాం తీరంలో అక్కడక్కడ గుంతలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో కార్తిక పుణ్యస్నానాలు చేయడానికి అనుకూల పరిస్థితులు లేవు. కలెక్టరు, ఎస్పీ ఆదేశాల మేరకు స్నానాలు నిలుపుదల చేసినట్లు ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, డీఎస్పీ మహ్మద్ మొయిన్ తెలిపారు. గజ ఈతగాళ్లతో పరిశీలించిన తరువాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సాధారణ పరిస్థితులు ఏర్పడిన తరువాత అనుమతి ఇస్తామన్నారు. భక్తులెవరూ స్నానాలు చేయడానికి రావొద్దని.. పోలీసు పహారా కొనసాగుతోందని మార్టూరు, అద్దంకి రూరల్ సీఐలు ఎం.శేషగిరిరావు, మల్లికార్జునరావు, ఎస్సైలు శీలం రమేష్, జీవీ చౌదరి, షేక్ ఖాదర్‌బాషా, డి.రత్నకుమారి, నాగరాజు తెలిపారు. బీచ్‌లలోకి రాకుండా బారికేడ్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రామాపురంలో రోడ్డును మూసివేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

పాత ఒప్పందం అమలు కోరుతూ ఆందోళన

యడవల్లి(చిలకలూరిపేట (గ్రామీణ), న్యూస్‌టుడే : పాత ఒప్పందం ప్రకారం ఏఎంఆర్ సంస్థ విధి విధానాలు అమలు చేయాలని కోరుతూ పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన గ్రానైట్, క్రషర్స్ యజమానులు, కార్మికులు చిలకలూరిపేట మండలం యడవల్లిలో ఆ సంస్థ చెక్ పోస్టు వద్ద ఆందోళనకు దిగారు. ఆదివారం రెండోరోజూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. పాత పద్ధతిలోనే విధివిధానాలు అమలుచేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఏఎంఆర్ సంస్థ యాజమాన్యం అసోసియేషన్‌తో చర్చలు జరిపి అనుకూలంగా స్పందిస్తేనే చెక్ పోస్టులు పనిచేస్తాయన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. గ్రానైట్ పరిశ్రమలో వ్యర్థాలుగా ఉన్న రాళ్లను దేవస్థానాలకు శిల్పాలు చెక్కడానికి తీసుకెళ్లే వారి వద్ద కూడా ఏఎంఆర్ సంస్థ రశీదులు లేకుండా అక్రమ వసూళ్లు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సమస్య తీవ్రతను గుర్తించి గ్రానైట్ పరిశ్రమలు, క్రషర్లు మూతపడకుండా అనుకూల విధానాలను నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు ర్యాలీ చేశారు. మూడు జిల్లాల అసోసియేషన్ నాయకులు ప్రత్తిపాటి సురేష్, ఒంటిపులి ఆంజనేయులు డి.ప్రసాద్, చిటిపోతు మస్తానయ్య, చెరుకూరి నాగరాజు, పోపూరి శ్రీను, తాళ్లూరి వెంకటేశ్వర్లు, తుమ్మల బెనర్జీ, బుగ్గవరపు లక్ష్మణ్, తోట వెంకట కోటేశ్వరరావు, గరిపాటి సుబ్బారావు, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆచూకీ లభ్యం

అధికారుల సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగింత

అద్దంకి, న్యూస్‌టుడే: వసతి గృహం నుంచి బయటకు వెళ్లిన ఇద్దరు పదోతరగతి విద్యార్థుల ఆచూకీ లభ్యమైంది. వారిని 24 గంటల వ్యవధిలోనే పోలీసులు గుర్తించి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాంఘిక సంక్షేమ వసతి గృహం, రెవెన్యూ అధికారుల సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ సుబ్బరాజు అందించిన సమాచారం మేరకు.. ఎస్సీ-1 వసతి గృహం నుంచి పదో తరగతి విద్యార్థులు ధనుష్, సుబ్బారెడ్డి పాఠశాలకు వెళ్తున్నామని చెప్పి వెళ్లారు. సాయంత్రానికి వసతి గృహానికి చేరలేదు. ఈ విషయమై వార్డెన్ వీరాస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సంగతి పాఠకులకు విదితమే. విద్యార్థుల ఆచూకీ కోసం చీరాల డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐ ఆరు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో గాలింపు చేపట్టారు. నిఘా కెమెరాల పరిశీలనతో పాటు ప్రయాణికులు ఎక్కువగా ఉండే బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్‌లో పరిశీలించారు. ఆదివారం ఉదయం మేదరమెట్ల బస్టాండ్ వద్ద విద్యార్థులను గుర్తించి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తల్లిదండ్రులు మందలించారని వసతి గృహం నుంచి వెళ్లిపోయినట్లు విచారణలో తేలిందన్నారు. బాలుర ఆచూకీ కనుగొనడంతో జిల్లా ఎస్పీ అద్దంకి పోలీసుల్ని అభినందించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూప్, VJA, వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/ వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 95537 86677/96404 96677.

REAL ESTATE

HOUSE FOR SALE

GENERAL

గుంటూరు సిటీ SVNకాలనీ నందనవనంలో 466గ॥ ఇల్లు పడమర,దక్షిణం రోడ్లతో అమ్మకానికి కలదు. నోబ్రోకర్స్, డైరెక్ట్ 9849502430, 8341342696.

TO LET

COMMERCIAL

బాపట్ల జిల్లా, నగరం నందు శ్రీకృష్ణ మందిరం దగ్గర వ్యాపారసంస్థలకు దక్షిణముఖ 229 చ॥గ॥లో 2 స్టేర్ హౌస్ (1300 Sft) అద్దెకు. ✆ 94908 48822.

JOBS

Immediate openings for Customer Service Executive & Branch Manager Positions in Cherukuri Group, Located in Eluru, Tanuku, Guntur & Vijayawada. Qual: Min Inter. ✆ 9885206666, E-mail: hr@cherukurigroup.org.

Wanted female nurse for home patient. Exp: BSc nursing & food and Nutrition. Timings: morning 6am to 6pm pls send ur Biodata with photo to following mail ID (staffbala5@gmail.com)

Sri Balaji Hospitals required HR manager, pharmacy sales executive, tally operator. Experience 2 years. Ph: 83095 46242.

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్ HDFC/ AXIS బ్యాంక్, క్లర్క్,లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆ 82976 75825.

WANTED
HDFC BANK కొరకు
గుంటూరు & ప్రకాశంజిల్లాలో పనిచేయుటకు
కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
DRA సర్టిఫికేట్ కలిగినవారికి తొలి ప్రాధాన్యత. వెంటనే సంప్రదించండి.
లలితా ఫైనాన్స్ లింక్స్
కాంగ్రెస్ ఆఫీస్ రోడ్, విజయవాడ.
✆9951001348

7 HILLS ఆఫీస్ నందు కంప్యూటర్ ఆపరేటర్-1, Tallyఅకౌంటెంట్-1, స్టాఫ్(Female) కావలెను. 35 సం॥లోపు. భారత్‌పేట, గుంటూరు. 72888 77785.

చైతన్య సాయి పేపర్‌మిల్స్ గుంటూరు ఆఫీస్ నందు పనిచేయుటకు అనుభవమున్న సీనియర్ అకౌంటెంట్ మరియు యడవల్లి నందు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 90595 14555.

సెక్యూరిటీ గార్డులు చందోలులో పనిచేయుటకు కావలెను వ॥ 40Y, చదువు: 10th, డ్యూటి : 12 గం॥, జీతం: 16,800/-. ✆ 95506 06916.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

బెన్ ఎలక్ట్రిక్‌బైక్ షోరూమ్ గుంటూరులో పనిచేయుటకు ★సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ ★ టెక్నీషియన్స్ కావలెను. అనుభవం గలవారు సంప్రదించండి. ✆ 99516 66619

హైదరాబాద్ హోంకేర్‌లో ఏజెంట్లకు మంచి అవకాశం. వర్కర్స్‌ని పంపితే ప్రతినెలా 2వేలు కమీషన్. వర్కర్స్ జీ: 18k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 89775 47749.

పబ్లికేషన్స్ బుక్‌వర్క్‌లో 2 సం॥ల పైబడి అనుభవం కల్గిన పేజ్‌మేకర్, ఇన్ డిజైన్ వచ్చిన "ఆపరేటర్లు" కావలెను. ఆ॥జీతం. ✆ 74169 52459.

R.K ఇంజనీరింగ్ కాలేజీ నందు పనిచేయుటకు ఎలక్ట్రీషియన్స్ కావలెను. అనుభవమును బట్టి జీతం+భోజనం+ఉచిత వసతి కల్పించబడును. కేతనకొండ, ఇబ్రహీంపట్నం మండలం, విజయవాడ, 97014 73399.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బులు వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి

అద్దంకి, యద్దనపూడి, న్యూస్‌టుడే: పట్టణంలోని కాకానిపాలెం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం స్వామి జయంతి నిర్వహించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు పొన్నపల్లి బ్రహ్మానందం, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నుపల్లి శ్రీనివాసాచారి, జాగర్లమూడి శ్రీనివాసరావు, ఆంజనేయరాజు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కాకాని అశోక్, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, ఉండవల్లి కృష్ణారావు, కనపర్తి రమ్యకృష్ణ, కొండముది గోపి పాల్గొన్నారు. ❖ యద్దనపూడి-మార్టూరు గ్రామాల మధ్య గల శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి గుడిలో జయంతి నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో నగరేశ్వరస్వామి కల్యాణం

వేటపాలెం: కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం వైశ్యసంఘం ఆధ్వర్యంలో వింధ్యవాసిని గంగాదేవి సమేత శ్రీనగరేశ్వరస్వామి లీలా కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామిని పురవీధుల్లో ఊరేగించారు. సోమవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరగనున్నాయి. మధ్యాహ్నం కార్తిక సమారాధన జరుగుతోందని ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు ప్రత్తి ముత్తుకుమరన్, శ్రీరాం గోవర్ధన్‌లు తెలిపారు.

స్థల వివాదంలో ఉపాధ్యాయుడిపై దాడి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: స్థల వివాదంలో ఉపాధ్యాయుడిపై దాడి జరిగింది. కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామానికి చెందిన కొమ్మనబోయిన పిచ్చియ్య ఉపాధ్యాయుడు. అదే ప్రాంతానికి చెందిన బంధువుల మధ్య స్థల విషయంలో వివాదం ఉంది. ఈ నేపథ్యంలో ముత్తయ్య అనే వ్యక్తి పిచ్చియ్యపై కర్రతో తలపై దాడిచేయడంతో గాయమైంది. బాధితుడు చికిత్స కోసం ఏరియా వైద్యశాలలో చేరారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి పట్టణం, ధర్మవరం సమీపంలో ఆదివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది అందించిన సమాచారం మేరకు.. పట్టణంలోని బంగ్లా రోడ్డులో అల్పాహారశాల నిర్వహిస్తున్న దంపతులు మధు-అపర్ణ ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా పాత బస్టాండ్ వద్ద పాల ఆటో ఢీకొట్టింది. వీరికి గాయాలయ్యాయి. ధర్మవరం-శంఖవరప్పాడు మధ్య రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో శంఖవరప్పాడు గ్రామానికి చెందిన చిరంజీవి తలకు గాయాలయ్యాయి. పై సంఘటనల్లో క్షతగాత్రులను తొలుత అద్దంకి, అనంతరం ఒంగోలు వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

గాయపడ్డ దంపతులు

మేదరమెట్ల, న్యూస్‌టుడే: ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి మరో బైక్ ఢీకొట్టడంతో దంపతులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన కొరిశపాడు మండలం తిమ్మనపాలెం సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొరిశపాడు మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన దంపతులు మేదరమెట్ల వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తున్నారు. ఈ క్రమంలోనే వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఒంగోలు వైపు నుంచి వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దంపతులు అదుపుతప్పి కిందపడటంతో గాయాలయ్యాయి.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కారంచేడు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి ఈత కొలను పోటీలకు కారంచేడులోని యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం ఒంగోలులోని ఏఎంబీ స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన పోటీల్లో అండర్-14 విభాగంలో ఎబినెజర్, వెంకటేష్, వెంకటగోపి, అండర్-17 విభాగంలో శక్తి, నాని, సాంబశివరావులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయిని షేక్.మస్తానీ తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం సామ్రాజ్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎంపికైన విద్యార్థులు, పక్కన పీఈటీ మస్తాని

ఉత్తమ అధ్యక్షుడిగా పోలుదాసు

చీరాల: ఎన్ఆర్‌పీఎం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ ఉత్తమ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరులో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం.ప్రభావతి చేతుల మీదుగా రామకృష్ణ అవార్డు అందుకున్నారు.

చీరాల సభ్యుల సమక్షంలో అవార్డు అందుకుంటున్న రామకృష్ణ

ఎల్ఎస్ఆర్ మాస్టర్ మృతికి నివాళి

వేటపాలెం, న్యూస్‌టుడే: బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యుడు, 1952లో స్థాపించిన లలిత కళాసమితి వ్యవస్థాపక కార్యదర్శి లొల్లా శ్రీరామమూర్తి(94) ఆదివారం విజయవాడలో కన్నుమూశారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు. మాస్టర్ మృతి విషయం తెలిసిన వెంటనే కళాసమితి సభ్యులు, పూర్వ విద్యార్థులు విజయవాడ చేరుకుని మృతదేహాన్ని సందర్శించి, నివాళులు అర్పించారు. హైదరాబాద్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, రిటైల్ ధర - 148, చికెన్ విత్‌స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్ - 244.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 252 చికెన్ స్కిన్‌లెస్ - 262.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 575 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.96/-.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

సముద్ర స్నానాలకు అనుమతి లేదు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: నిజాంపట్నం, పరిశావారి పాలెం (దిండి), నక్షత్ర నగర్ బీచ్‌ల్లో సముద్ర స్నానాలు ఆచరించేందుకు అనుమతి లేదని రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. మొంథా తుపాను దృష్ట్యా సముద్ర తీర ప్రాంతం కోతకు గురై ప్రమాదకరంగా మారిందన్నారు. కార్తికమాసం సందర్భంగా సముద్ర స్నానం చేసేందుకు వచ్చే రేపల్లె డివిజన్ ప్రజలు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

భాజపా మండల అధ్యక్షుడిగా జయరామకృష్ణ

నిజాంపట్నం (నగరం), న్యూస్‌టుడే: నిజాంపట్నం మండల భాజపా అధ్యక్షుడిగా బొర్రా జయరామకృష్ణ ఎన్నికైనట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు బంగారు బాబు ఆదివారం తెలిపారు. నిజాంపట్నంలో పార్టీ మండల కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

? విజయలక్ష్మీపురం రెండో లైన్ సాయిబాబా మందిరం వద్ద కాలువల్లో పూడిక తీయకపోవడం వల్ల మురుగు నిలిచి దుర్వాసన వస్తోంది. **- రామారావు, కాలనీవాసి**

✔ పారిశుద్ధ్య కార్మికులను పంపి కాలువలో పూడిక తీయిస్తాం. **-రఘునాథరెడ్డి, పురపాలక కమిషనర్**

? కర్లపాలెం రోడ్డులో శ్రీనివాసనగర్ కాలనీ మొదటి లైన్ ఎదురు వీధికి ఎన్‌హెచ్ నుంచి అప్రోచ్ లేకపోవటం వల్ల వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. **- శ్రీనివాసరావు, కాలనీవాసి**

✔ సాధ్యమైనంత త్వరలో అప్రోచ్ నిర్మించి సమస్య పరిష్కరిస్తాం. **- కృష్ణారెడ్డి, పురపాలక డీఈ -న్యూస్‌టుడే, బాపట్ల**

? కుచ్చెళ్లపాడు నుంచి చదలవాడ వెళ్లే మార్గంలో కాకర్లమూడి వద్ద రోడ్డు పక్కన చెత్త వేస్తున్నారు. **- స్థానికుడు, కాకర్లమూడి**

✔ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి చెత్త వేయకుండా చర్యలు చేపడతాం. **- రవి, ఎంపీడీవో, -న్యూస్‌టుడే, వేమూరు**

? పెదగొల్లపాలెం పంచాయతీ యారం వారిపాలెంలో పలు విద్యుత్తు స్తంభాలతో పాటు తీగలకు పిచ్చి మొక్కలు అల్లుకున్నాయి. వర్షం పడి గాలి వీచినప్పుడు మంటలొస్తున్నాయి. **- స్థానికులు**

✔ అల్లుకున్న పిచ్చి మొక్కలు వెంటనే తొలగింపజేస్తాం. **-దుర్గా ప్రసాద్, ఇన్‌ఛార్జి ఏఈ, విద్యుత్తు శాఖ -న్యూస్‌టుడే, కర్లపాలెం**

? స్థానిక బస్టాండు సెంటరులో వేగ నియంత్రిక వద్ద రోడ్డు మధ్యలో గుంత పడింది. వాహనాలు దెబ్బతింటున్నాయి. **- వాసు, భట్టిప్రోలు**

✔ ఇటుక రాయి ముక్కలు వేసి గుంతను పూడ్చిస్తాం. **- నాయక్, పంచాయతీ కార్యదర్శి, భట్టిప్రోలు -న్యూస్‌టుడే, భట్టిప్రోలు**

మహాదేవిగా బండ్లమ్మ

చందోలు (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే : చందోలు బండ్లమ్మ అమ్మవారికి కార్తికమాసం రెండో ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని సువర్ణమాతృకా బంగారు కాసులహారం, రజత కవచంతో అలంకరించగా మహాదేవిగా దర్శనమిచ్చారు. జిల్లా ఏఎస్పీ డీఎస్పీ విజయసారథి దంపతులు అమ్మవారిని దర్శించి పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో నరసింహమూర్తి వారికి అమ్మవారి చిత్రపటం అందజేశారు. పిట్టలవానిపాలెం, గోకర్ణం సత్రిభోగవానిపాలెం లోని బండ్లమ్మ అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.

మహాశక్తి దేవతగా అల్లూరమ్మ

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే : మండలంలోని అల్లూరు గ్రామ దేవత అల్లూరమ్మ అమ్మవారికి కార్తికమాసం రెండో ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారు 'మహాశక్తి దేవత'గా భక్తులకు దర్శనమిచ్చారు.

నేటి నుంచి ఆలయ శతాబ్ది ఉత్సవాలు

విద్యుద్దీపాల అలంకరణలో రామలింగేశ్వరస్వామి ఆలయం

బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎస్ఎన్‌పీ అగ్రహారంలో గంగా పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరాలయంలో శతాబ్ది ఉత్సవాలు సోమవారం నుంచి ఐదురోజులు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఆదూరి హరినారాయణ తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా సాముహిక కోటి కుంకుమార్చన, మహాకుంభాభిషేకం, లక్ష దీపార్చాన, రుద్రాభిషేకం, విశేష అభిషేకాలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

డబ్బు జమ కావాలంటే.. ఈకేవైసీ చేయించాల్సిందే

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే

ఉపాధి హామీలో 44,070 మంది ముఖ ఆధారితకు దూరం

గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించి సొంత ఊర్లోనే చేతి నిండా పని కల్పించాలనే సదాశయంతో కేంద్రప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. దీనిలో క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొరవడి అక్రమాలు అడ్డగోలుగా జరుగుతున్నాయి. కొందరు సిబ్బంది ఇష్టానుసారం దొంగ మస్తర్లు వేసి ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారు. వీటికి అడ్డుకట్ట వేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి. పని పత్రం పొందిన శ్రామికుల ముఖ ఆధారిత చిత్రంతో(ఈకేవైసీ) చేయాలని ఆదేశించారు. రేపల్లె, వేమూరు నియోజకవర్గాల పరిధిలో 44,070 మంది వేతనదారులు ముఖ ఆధారిత చిత్రానికి దూరంగా ఉన్నారు.

వివరాలు ఇలా..		
మండలం	వేతనదారులు	ఈకేవైసీ పూర్తి
రేపల్లె	23,816	16,455
నగరం	21,280	14,476
చెరుకుపల్లి	17,243	12,704
నిజాంపట్నం	20,684	15,567
కొల్లూరు	17,631	11,555
వేమూరు	13,244	9,368
భట్టిప్రోలు	15,133	10,807
చుండూరు	13,230	10,362
అమృతలూరు	14,245	11,142

స్పందన అంతంతమాత్రమే..

రెండు నియోజకవర్గాల్లో ఈకేవైసీ మొదలు పెట్టిన నాటి నుంచి స్పందన అంతంతమాత్రంగానే ఉంది. ఉపాధి హామీ పథకం సిబ్బంది జాబ్ కార్డుదారులకు విన్నవిస్తున్నా పట్టించుకోని పరిస్థితి. కొంతమంది సిబ్బంది ఓ అడుగు ముందుకేసి ఇంటికెళ్లి మరీ ఈకేవైసీ చేయిస్తున్నారు. నూరుశాతం లక్ష్యానికి చేరుకోవాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తున్నా క్షేత్రస్థాయిలో వేతనదారులు సహకరించకపోవడంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. జాబ్‌కార్డు పొందిన కొందరు ఇతర ప్రాంతాల్లో పని చేస్తూ అందుబాటులో లేకపోవడం మరో కారణంగా చెబుతున్నారు. మొత్తం 1,56,506 మందికి గాను ఇప్పటి వరకూ 112436 మంది ఈకేవైసీ పూర్తి చేసుకున్నారు.

ముఖ ఆధారిత చిత్రం నమోదు చేస్తున్న ఉపాధి సిబ్బంది

తప్పని సరిగా చేయించుకోవాలి

చేసిన పనికి సకాలంలో డబ్బులు పడాలంటే ఈకేవైసీ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలి. రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో ఇంకా 44070 మంది వేతనదారులు దూరంగా ఉన్నారు. వీరందరికీ అవగాహన కల్పించి జాబ్‌కార్డు పొందిన ప్రతి ఒక్కరితో నమోదు చేయించాలని సిబ్బందికి సూచించాం.

- శివన్నారాయణ, ఏపీడీ, బాపట్ల

నాటక రంగానికి ప్రోత్సాహం

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాటక అకాడమీ ఛైర్మన్ ఆంద్రేయ, నేతలు ధర్మారావు, కిరణ్

బాపట్ల, న్యూస్‌టుడే: నాటక రంగాన్ని, కళాకారులను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ మందపాటి ఆంద్రేయ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ సేవా సమాజం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు జాతీయ కళాకారుల సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రచురించిన గర్జించిన కొదమ సింహాలు సాంఘిక నాటక పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఆంద్రేయ మాట్లాడుతూ పేద కళాకారులకు పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. నాటక రంగ కార్యాలయానికి స్థలం కేటాయించటానికి కృషి చేస్తానని తెలిపారు. పురపాలక మాజీ వైస్‌ఛైర్మన్ ధర్మారావు, అంబేడ్కర్ సేవా సమాజం అధ్యక్షుడు కిరణ్, రుతలె వినయ్‌రాజు, బాబూరావు, మీరయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్తికమాస పూజలు

చెరుకుపల్లి: అలంకరణలో స్వామి

చెరుకుపల్లి న్యూస్‌టుడే : క్షీరాబ్ది ద్వాదశి పర్వదినం సందర్భంగా మండలంలోని శివాలయాలు ఆదివారం భక్తులతో కళకళలాడాయి. చెరుకుపల్లి బాలకోటేశ్వరస్వామి, గుళ్లపల్లి శ్రీ ఆనందీశ్వరస్వామి వార్ల ఆలయాల్లో అర్చకులు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించి స్వామి వార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించారు.

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే : పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలోని గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించి, తీర్థప్రసాదాలు అందుకున్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

చెరుకుపల్లి, న్యూస్‌టుడే : ఆరుంబాక ఎస్సీ కాలనీకి చెందిన తెదేపా కార్యకర్త వేము పరిశుద్ధ రావు మృతిపై మంత్రి అనగాని విచారం వ్యక్తం చేస్తూ మృతుని కుటుంబ సభ్యులకు రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని స్థానిక నాయకుల ద్వారా అందించారు.

నిలిచిన నీరు.. జనం బేజారు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంచాయతీ పరిధిలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానిక కూరగాయల మార్కెట్ వెనుక జెండా చెట్టు ప్రాంతంలో వర్షపు నీరు గృహాల్లోకి చేరింది. మురుగు కాలువలు పూడుకుపోవడంతో వర్షపు నీరు బయటకు పోవడం లేదు. వారం రోజులుగా ఆ గృహాల్లో ఉండలేక ఆ ప్రాంతవాసులు బాధ పడుతున్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు తమకు కష్టాలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు నిలవడంతో దోమలకు అల్లాడుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా మురుగు నీటిని బయటకు తరలించాలని కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి నాయక్ మాట్లాడుతూ ఆ ప్రాంతంలో డ్రైనేజీలు పూడిక తీయిస్తామన్నారు. అవసరమైతే మోటార్ల ద్వారా అయినా నీరు తోడిస్తామని తెలిపారు.

జెండా చెట్టు ప్రాంతంలో ఓ ఇంటి వద్ద వర్షపు నీరు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో కూడా వర్షం నీరు నిలిచాయి. ఈ ప్రాంగణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. తుపాను విపత్తు తొలగి నాలుగు రోజులైనా నేటికీ నీటిని బయటకు పంపేలా చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారని విద్యార్థులు, గురువులు విమర్శిస్తున్నారు. నీటిలోనే విద్యాలయాలకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి నీటిని తొలగించాలని దృష్టి సారించాలని కోరుతున్నారు.

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే: మండల పరిధిలోని భర్తిపూడి పంచాయతీ బాబు జగ్జీవన్‌రామ్ ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్యం పై చర్యలు లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కురిసిన వర్షాలకు రోడ్లపై నీళ్లు నిలిచాయి. కాలనీలో రోడ్లను చెట్లు అల్లుకుపోయి ఉన్నాయి. సైడ్ కాలువలు లేక అవస్థలు పడుతున్నామని, కనీసం బ్లీచింగ్ కూడా చల్లలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

తీరంలో సందడిగా 4కే రన్

4కే రన్‌లో శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: ఫిట్ ఇండియా అనే నినాదంతో శ్రీ చైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో వేటపాలెం మండలం వాకావారిపాలెం నుంచి వాడరేవు తీరం వరకు ఆదివారం 4కే రన్ నిర్వహించారు. దీనిలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధానాచార్యుడు కె.హరిబాబు పాల్గొన్నారు.

ఆరేళ్లుగా అలాగే వదిలేశారు

మండలంలోని చందోలు ఆరీఫ్ వీధిలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు 2019లో ప్రారంభించారు. నిర్మాణానికి రూ.6 లక్షలు మంజూరయ్యాయి. పైకప్పు వేసి తలుపులు, కిటికీలు ఏర్పాటు చేశారు. గోడలకు ప్లాస్టింగ్, కింద ఫ్లోరింగ్ చేయకపోవటంతో చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. అనంతరం అధికారంలోని వచ్చిన వైకాపా ఐదేళ్ల పాలనలో దీని గురించి పట్టించుకునే నాథుడే లేడు. అధికారులు స్పందించి కూటమి ప్రభుత్వమైనా భవనాన్ని పూర్తి చేసి చిన్నారులకు సమస్యలు లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, చందోలు (పిట్టలవానిపాలెం)

కుంగింది.. ప్రమాదం పొంచి ఉంది

చదలవాడలో క్రైస్తవ శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో నిర్మించిన సిమెంటు రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కుంగిపోయింది. ఈ రహదారిపై వెళ్లేవారు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఈ మార్గం గుండానే రైతులు వెళ్లి 200 ఎకరాల్లో వ్యవసాయ పనులు చేయాల్సి ఉంది. ఇంకో 20రోజుల్లో వరి కోతలు ప్రారంభం కానున్నాయి. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ రాజ్ శాఖ ఏఈ బదరీనాథ్ మాట్లాడుతూ పరిశీలించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. **-న్యూస్‌టుడే, వేమూరు**

వేర్లు కుళ్లి.. మొక్కలు చనిపోతూ..

దెబ్బతిన్న మిరప పైరు

మండల పరిధిలోని నందిరాజుతోట, కొండుబోట్లవారిపాలెం గ్రామాల్లో తుపాను దెబ్బకు పొలాల్లో నీళ్ల నిలిచి మిరప పైర్లు దెబ్బతిన్నాయి. పైరుకు నీటి తడులు ఉండటం వల్ల భూమిలోనే వేర్లు కుళ్లి పోయి మొక్కలు చనిపోతున్నాయి. రెండు గ్రామాల్లో 400 ఎకరాల్లో మిరప సాగు ఉంది. ఎకరాకు మొక్క నాటే సమయానికే సుమారు రూ.30 వేలు ఖర్చు అవుతుందని రైతులు తెలిపారు. దెబ్బతిన్న పొలాల రైతులను ప్రభుత్వం పారదర్శకంగా గుర్తించి వారిని ఆదుకోవాలని కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, బాపట్ల టౌన్

ప్రాణాలు పోకముందే పట్టించుకోరూ

రేపల్లె వ్యవసాయ మార్కెట్ యార్డులో షెడ్డు ప్రమాదకరంగా మారింది. ఇటీవల సంభవించిన తుపాను గాలులకు కొన్ని రేకులు ఛిద్రమై ఊడిపడేలా ఉన్నాయి. ఈ రేకుల షెడ్డులో తరచూ నియోజకవర్గంలోని వ్యవసాయశాఖ సిబ్బంది అధికారులు సమావేశాలు నిర్వహిస్తుంటారు. ప్రతి ఆదివారం జరిగే సంతకు అధిక సంఖ్యలో వినియోగదారులు వస్తుంటారు. ఈ క్రమంలో ఇనుప రేకులు మీద పడితే ప్రాణాపాయం తప్పదని భయాందోళన చెందుతున్నారు. ప్రమాదం జరగకముందే పాడైన రేకులు తొలగించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. **-న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్**

ఆదమరిస్తే అంతే..

బాపట్ల- గుంటూరు రహదారిలో తుపానుకు భారీ చెట్టు నేలకూలింది. దానిని పూర్తిగా తొలగించకుండా రోడ్డుపైకి వచ్చిన కొమ్మలు విరిచారు. అటుగా వెళ్లే వాహనాలు కొంచెం అదుపు తప్పినా జరగరాని ప్రమాదం చోటుచేసుకుంటుంది. ఆ రోడ్డులో నిత్యం భారీ వాహనాలు తిరుగుతాయి. అధికారులు కూలిన చెట్టును పూర్తిగా తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, బాపట్ల టౌన్**

సేవారత్న అవార్డులు

పర్చూరు, మార్టూరు, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళా నిలయంలో శనివారం జరిగిన విశ్వజననీ ఫౌండేషన్ వార్షికోత్సవంలో పర్చూరు, మార్టూరు మండలానికి సంబంధించి ఇద్దరికి సేవారత్న అవార్డులను నిర్వాహకులు అందజేశారు. మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తూ, ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తున్న పర్చూరు ఎంఈవో ఎ.శివకోటేశ్వరరావుకు, మార్టూరులో అమ్మ ఆశ్రమం నెలకొల్పి వృద్ధులకు అన్నదానం, మహిళలకు జీవనోపాధి కల్పిస్తున్న జి.చందుకు సేవారత్న అవార్డులు దక్కాయి.

ద్విచక్ర వాహనాలు ఢీ: ఇద్దరికి గాయాలు

చందోలు (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే : మండలంలోని చందోలు వద్ద 216 జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో ఇద్దరు యువకులు గాయపడినట్లు చందోలు ఎస్సై శివకుమార్ తెలిపారు. చెరుకుపల్లి నుంచి స్వగ్రామం బుద్దాం వెళ్తున్న పమిడి రామరాజును వెనుక నుంచి వస్తున్న మండేవారిపాలేనికి చెందిన ఈమని హర్ష ఢీ కొట్టడంతో ఇద్దరు గాయపడ్డారని, వారిని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

అప్రమత్తతతోనే ఆరోగ్యం

కనగాల, గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే

తుపానుతో తీరంలో తడి వాతావరణం

కనగాలలో ఓ ఇంటి వద్ద నిలిచిన మురుగు

తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు తీరం తడిచి ముద్దైంది. పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచి ఇంకా పోలేదు. రహదారులు బురదగా మారాయి. ఇళ్ల ముందు మురుగు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. వాతావరణ మార్పులతో గ్రామాల్లో సన్న దోమ పెరుగుతోంది. చల్లదనంతో జలుబు, దగ్గు..దోమ పోటుతో జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కొద్దిపాటి జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రజలు అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు.

కాచిచల్లార్చిన నీరే ఉత్తమం.. మనిషికి వ్యాధులు మూడొంతులు నీటి ద్వారానే వస్తాయి. తాగే నీరు మంచిగా, సురక్షితంగా లేకుంటే తీవ్ర అనారోగ్య పాలవుతారు. వర్షాలు కురిసినప్పుడు, తుపానులు వచ్చిన వేళ తాగునీరు కొత్త నీటితో కలిసి కలుషితమయ్యే అవకాశం ఉంది. ఈ సమయంలో రక్షిత మంచి నీటినే వినియోగించాలి. తాగబోయే ముందు తప్పనిసరిగా ఆ నీటిని కాచి చల్లార్చిన తరువాతే తాగాలని వైద్యులు సూచిస్తున్నారు.

దోమ తెరలు వాడాలి

చేతి పంపు, ఇంటి చుట్టూ పక్కల ఎక్కడ వాననీరు, మురుగు నిల్వ లేకుండా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పశువుల వ్యర్థాలు నీటితో కలిస్తే దోమలు వృద్ధి చెందుతాయని, అందులో బైక్ ఆయిల్ వేయడం ద్వారా దోమలు పెరగవని చెబుతున్నారు. దోమతెరలు వాడటం ద్వారా దోమకాటుకు గురికాకుండా ఉండవచ్చంటున్నారు.

సర్వే చేస్తున్నాం

తుపాను సమయంలో పునరావాస కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను సమర్థంగా నిర్వహించారు. ఇప్పుడు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నాం. ఇంటిలో ఎవ్వరికైనా జ్వరం..ఇతర అనారోగ్య సమస్యలు ఉంటే నమోదు చేసుకుని వారికి చికిత్స అందిస్తున్నాం.

- డాక్టర్ జీవలత, పీహెచ్‌సీ, కనగాల

పారిశుద్ధ్య చర్యలు తీసుకుంటున్నాం

మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నాం. దోమలు పెరగకుండా మురుగు నీటిలో ఎబేట్ ద్రావణం పిచికారీ చేయిస్తున్నాం. అన్ని గ్రామాల్లో సాయంత్రం వేళ ఫాగింగ్ నిర్వహిస్తున్నారు. మురుగు ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించి చర్యలు తీసుకుంటున్నాం.

- షేక్ మహబూబ్ సుభాని, ఎంపీడీవో, చెరుకుపల్లి

దారుల్లో అగాధాలు.. అవస్థల ప్రయాణాలు

నగరంలో రహదారి దుస్థితి ఇలా

బాపట్ల, అమృతలూరు, నగరం, న్యూస్‌టుడే: బాపట్ల, చెరుకుపల్లి, అమృతలూరు, నగరం మండలాల్లోని పలు రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. వాహనదారులు ప్రయాణించాలంటేనే భయపడుతున్న పరిస్థితులు ఉన్నాయి.

❖ బాపట్ల మండలంలోని మర్రిప్రోలు వారి పాలెం నుంచి కర్లపాలెం మండలం పేరలి వరకు ఉన్న 7 కిలోమీటర్ల రహదారికి మరమ్మతులు చేసేందుకు నాలుగు నెలల క్రితం తవ్వారు. సకాలంలో రోడ్డు నిర్మించకపోవడంతో పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

❖ అమృతలూరు మండలంలోని గోవాడ గ్రామం నుంచి శైవ క్షేత్రానికి వెళ్లే రహదారి గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దేవస్థానానికి భక్తులు, రైతులు పొలాలకు ఇటుగానే వెళ్తుంటారు. ప్రస్తుతం కార్తిక మాసం పూజలకు భక్తులు నిత్యం వెళుతున్నారు. కొద్దిపాటి వర్షానికి గుంతలో నీరు చేరి ఇబ్బందిగా ఉంటుందని అంటున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

❖ నగరం- పిట్టలవానిపాలెం ఆర్అండ్‌బీ రోడ్డు ఛిద్రమై ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. నగరం శివారు బాలయేసు ఉన్నత పాఠశాల, ఈదుపల్లి, సిరిపూడి, తాడివాకవారిపాలెం సమీపాల్లో ప్రధాన రహదారిలో భారీ గుంతలు పడ్డాయి. ఇటీవల చినమట్లపూడి గ్రామానికి చెందిన యువకుడు గుంతలో పడి గాయపడ్డారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ రహదారికి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. అయినా ఇంత వరకు పనులు ప్రారంభించలేదు. పెద్ద ప్రమాదాలు జరగకముందే పనులు ప్రారంభించాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రవాహానికి తూటుకాడ అడ్డు

పర్చూరు- బాపట్ల మండలాల సరిహద్దులో సాకి వాగులో తూటుకాడ, గుర్రపుడెక్క పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డుపడుతోంది. కొమ్మమూరు కాలువ అండర్ టన్నెల్ వద్ద తూటుకాడ ఇరుక్కుని వాగులో నుంచి వరద నీరు వేగంగా వెళ్లటం లేదు. కొమ్మమూరు కాలువలో సైతం నీటి ప్రవాహానికి అడ్డంకులు సృష్టిస్తోంది. మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు 450 ఎకరాల్లో వరి పంట ముంపు బారినపడి ఐదు రోజులవుతున్నా పొలంలో నుంచి ఇంకా నీరు పూర్తిగా పోలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట కుళ్లిపోతోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి తూటుకాడ, గుర్రపుడెక్క తొలగించి నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించి పంటలకు ముంపు సమస్య పరిష్కరించాలని నరసాయపాలెం, చెరుకూరు రైతులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, బాపట్ల**

చెత్త చేరి నిలిచిన మురుగు

స్థానిక వెంకటేశ్వర థియేటర్ వద్ద రహదారి పక్కన రోజుల తరబడి చెత్త తొలగించక పోవడంతో పేరుకు పోయింది. వీటిలో కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తుండడంతో పక్కనే ఉన్న కాలవలోకి ఇది వ్యాపించి మురుగు నీరు నిలిచి పోతోంది. దీంతో దుర్గంధం వెలువడి చుట్టు పక్కల ఉన్న నివాసాల్లోకి వ్యాపిస్తుండడంతో వ్యాధులు ప్రబలుతాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఈ చెత్తను ఇక్కడ నుంచి తొలగించి, బ్లీచింగ్ చల్లి ఇక ముందు ఇక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, కొల్లూరు**

అల్లుకున్న నిర్లక్ష్యం

పట్టణంలోని శారదాపురి కాలనీ ఆసుపత్రి రోడ్డులో విద్యుత్తు స్తంభాలకు, దీపాలకు పిచ్చి చెట్ల తీగలు అల్లుకొని వెలుతురు కనిపించడంలేదు. విద్యుత్తు సిబ్బందికి తీగలు తొలగించమని నివేదించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇక్కడే కాదు మరికొన్ని చోట్లా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రమాదాలు చోటుచేసుకోకముందే అధికారులు పిచ్చి తీగలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, బాపట్ల టౌన్**

సమష్టితత్వంతోనే విజయం

చీరాల, న్యూస్‌టుడే: మొంథా తుపాను సమయంలో పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయడంతోనే సహాయ చర్యలు వేగం అయ్యాయని, నష్టం తగ్గిందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. సమష్టితత్వంతోనే ఈ విజయం సాధించామన్నారు. తెదేపా నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశం ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్తులోనూ నాయకులు, కార్యకర్తలు ఇదే ఐక్యతతో పనిచేసి ఎన్నికల్లోనూ ఘన విజయం సాధిద్దామన్నారు.

అభినందనల వెల్లువ: సీఎం చంద్రబాబు నుంచి పురస్కారం అందుకున్న ఎమ్మెల్యేకు నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

(c) eenadu

ఆవిరైన ఆశలు.. అన్నదాతకు కష్టాలు

అనంతవరంలో నాసిరకం వరి విత్తనాల సాగుతో ఆందోళన

కొల్లూరు, న్యూస్‌టుడే: కొల్లూరు మండలంలోని అనంతవరానికి చెందిన 80 మంది రైతులు 1200 ఎకరాల్లో ఓ అగ్రిటెక్ కంపెనీకి చెందిన 5204 రకం వరి విత్తనాన్ని ఖరీఫ్‌లో విత్తారు. అక్కడక్కడా కొంత వరి కాల వ్యవధి కన్నా 20 రోజులు ముందుగానే ఈనింది. ఈ కంకుల్ని పరిశీలించి, నాసి రకం విత్తనం (బెరు కులు) అని తేలడంతో రైతులు లబోదిబో మంటున్నారు. ఇప్పటికే వీరు ఎకరానికి సుమారు రూ.25 వేలు వెచ్చించారు. నూర్పిడికి రూ. 10 వేలు వెచ్చిస్తే పంట చేతికి వచ్చేస్తుందని భావించారు. పచ్చి వడ్ల దిగుబడి కనీసం ఎకరానికి 40 బస్తాలు (76కిలోలు) వస్తుందని అంచనా వేశారు. బస్తా కనిష్ఠంగా రూ. 1500 ధర పలికినా తద్వారా రూ. 60 వేలు చేతికి వస్తే ఎకరానికి రూ. 25 వేల మిగులుతుందని ఆశించారు. ఈ మిగులు రెండో పంటకు పెట్టుబడిగా ఉపయోగ పడుతుందనేది వీరి ఆలోచన. నాసి రకం విత్తనాల దెబ్బతో అన్నదాతల ఆశలు ఆవిరై, అంచనాలు తల్లకిందులయ్యాయి. దిగుబడి తగ్గి ఎకరానికి రూ.30 వేలకు పైగా నష్టం వచ్చేలా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాసి రకం వరి విత్తిన పొలంలోని పంట

తాలు కంకులు

పరిహారం కోసం పాట్లు: బాధిత రైతులు గత నెల 7న ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నాసిరకం విత్తనాల విషయమై ఫిర్యాదు చేశారు. దీంతో సదరు కంపెనీ ప్రతినిధులు పంటను పరిశీలించి, విత్తనాల్లోని లోపం ఉందని అంగీకరించారు. పరిహారం అందిస్తామంటూ కాలం గడిపి చేతులెత్తేశారు. దీంతో ఈ నెల 14న బాధిత రైతులు మండల వ్యవసాయాధికారిని ఆశ్రయించడంతో శాస్త్రవేత్తలను వెంటనే పిలిపించి వారి నివేదిక ఆధారంగా పరిహారం ఇప్పించే ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎట్టకేలకు 17 రోజులు గడచిన తరువాత ఈ నెల 1న వ్యవసాయశాఖకు చెందిన శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు. సకాలంలో న్యాయం జరుగుతుందో లేదో తెలియక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండో పంట విత్తే సమయానికి అందజేయాలి

నేను వడ్డీకి అప్పు తెచ్చి 17 ఎకరాల్లో సదరు కంపెనీ వరి విత్తనాలు విత్తాను. పొలంలో సగానికి పైగా తాలు కంకులే ఉన్నాయి. దీని వల్ల దిగుబడి దారుణంగా తగ్గి రూ. 5 లక్షలు నష్టం వచ్చేలా ఉంది. రెండో పంట విత్తుకునే సమయానికి పరిహారం చేతికందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి - **అల్లంనేని శివప్రసాద్, కౌలు రైతు, అనంతవరం**

నాగరాజు సమయస్ఫూర్తి.. విద్యార్థులకు రక్ష

ఇంకొల్లు, న్యూస్‌టుడే: బస్సు డ్రైవర్ నాగరాజు సమయస్ఫూర్తితో వ్యవహరించి విద్యార్థులను ప్రాణాపాయం నుంచి రక్షించి తాను మృత్యుఒడిలోకి చేరిన సంఘటన ఇంకొల్లులో జరిగింది. ఇంకొల్లుకు చెందిన చెట్టిపల్లి నాగరాజు ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. కొంతకాలంగా ఓ ప్రైవేటు పాఠశాల బస్సు డ్రైవరుగా పనిచేస్తున్నారు. శనివారం సాయంత్రం విద్యార్థులను గృహాలకు చేరవేసే సమయంలో గుండెపోటు చిహ్నాలు కనిపించడంతో బస్సును పక్కన పెట్టి, యాజమాన్యానికి సమాచారం ఇచ్చి, అపస్మారక స్థితిలోకి వెళ్లారు. యాజమాన్యం వేరే డ్రైవరుతో విద్యార్థులను గృహాలకు చేరవేసి, నాగరాజును ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. నాగరాజుకు పాఠశాల యాజమాన్యం నివాళులర్పించింది.

నాగరాజు (పాతచిత్రం)



ద్వితీయ వర్ధంతి

ప్రేమా ఆప్యాయతానురాగాలను
మాకు పంచి కుటుంబ అత్యున్నతికి
అహర్నిశలు కృషిచేసిన స్వర్గీయ
మా నాన్న గారు స్వర్గీయ
పావులూరి వెంకటకృష్ణారావు గారు
భౌతికంగా మానుండి దూరమై
2 సంవత్సరాల కాలం గడిచిననూ సదా
మీ మధురస్మృతులు స్మరించుకుంటూ...
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ...
బాధాతప్త హృదయాలతో
అంజలి ఘటిస్తూ...

స్వర్గీయ పావులూరి వెంకటకృష్ణారావు గారు
మాజీ అధ్యక్షులు: శ్రీ విఘ్నేశ్వర కూరగాయల వర్తక సంఘం
మాజీ అధ్యక్షులు : రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు
జననం: 1-7-1963, మరణం: 3-11-2023

భార్య: పావులూరి విమలాదేవి
కుమారులు - కోడళ్ళు: పావులూరి మారుతీ శివరామ్ ప్రసాద్ - లక్ష్మీ
పావులూరి సాయి చాముండేశ్వరి దుర్గాప్రసాద్ - వందిత
మనుమరాలు : ఇషాని కృష్ణ
కుటుంబసభ్యులు, బంధుమిత్రులు మరియు శ్రేయోభిలాషులు

ఎందుకిచ్చారో.. ఎక్కడున్నాయో?

ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే

గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయం, సాంకేతిక విద్య పేరుతో అమలు చేసిన విద్యా విధానాలు అనేక ఇబ్బందులు తీసుకొచ్చాయి. డిజిటల్ విద్య పేరుతో బైజూస్ లాంటి కొన్ని కంపెనీలకు మేలు చేసేలా ఒప్పందం చేసుకుని విద్యార్థులకు అప్పట్లో ట్యాబ్‌లు పంపిణీ చేశారు. వాటిపై సరైన అవగాహన లేకుండా, సక్రమంగా శిక్షణ ఇవ్వకుండా విద్యార్థులకు అందించారు. ట్యాబ్‌లను బడుల్లోని డిజిటల్ తెరలకు అనుసంధానం చేసే చర్యలు చేపట్టలేదు. ఎంతో ప్రచారం చేసి రూ.కోట్లతో విద్యార్థులకు అందించిన ఆ ట్యాబ్‌లు ప్రస్తుతం ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి.

విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్ (పాతచిత్రం)

నెరవేరని లక్ష్యం..: వైకాపా ప్రభుత్వం 2022-23, 23-24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు, వారికి బోధించే ఉపాధ్యాయులకు ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేసింది. నిబంధనల ప్రకారం అన్ని సబ్జెక్టులు దానిలో అప్‌లోడ్ చేయాల్సి ఉన్నా కొన్నే చేశారు. నిక్షిప్తం చేసిన వాటిలో చాలా అంశాలు పొందుపరచలేదు. తెలుగు, హిందీ వంటి సబ్జెక్టులు పూర్తిగా ట్యాబ్‌లో లేవు. ఆయా కారణాలతో డిజిటల్ బోధన అనుకున్న లక్ష్యం నెరవేరలేదు. కొన్నాళ్లకు అవి పనిచేయకపోవడంతో అవి కాస్తా అటకెక్కించారు. పాఠశాల నుంచి వచ్చాక విద్యార్థులు పుస్తకాలు పక్కన పెట్టి ఆ ట్యాబ్‌ల్లో వీడియో గేమ్స్, సినిమాలు చూస్తూ సమయాన్ని దుర్వినియోగం చేసుకున్నారు. బాపట్ల, వేమూరు, రేపల్లె నియోజకవర్గాల పరిధిలో రెండు విడతల్లో కలిపి సుమారు 10వేల మంది విద్యార్థులు, వెయ్యి మంది ఉపాధ్యాయులకు వీటిని పంపిణీ చేశారు.

ట్యాబ్‌లు తీసుకున్నాం

ఉపాధ్యాయులు, విద్యార్థుల వద్ద ఉన్న ట్యాబ్‌లను తీసుకున్నాం. ఇప్పటి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా చేయాలని ఆలోచనలో ఉన్నాం. - **రాజారత్నం, ఎంఈవో, పీవీపాలెం**

పెళ్లి సంబంధాల కోసం చూస్తున్నారా
అన్ని కులాల సాఫ్ట్‌వేర్ ఉద్యోగ వధూవరులకు సువర్ణావకాశం

నేడు అన్ని కులాల సాఫ్ట్‌వేర్ ఉద్యోగ వధూవరులకు
ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి అన్ని కులాల సాఫ్ట్‌వేర్ ఉద్యోగ అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు **నేడు (3 నవంబరు 2025)** ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ★ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్లో యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు క్రింద తెలిపిన ఫోన్ నెంబర్లను సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

మరిన్ని వివరాలకు
95501 28306 & 83744 45190
ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

వరద నీటిలోనే వరి పొలాలు

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాంలోని వరి పొలాలను వరద నీరు అయిదు రోజులుగా చుట్టుముట్టే ఉంది. కళ్ల ముందు మునిగిన పంట పొలాలను చూసుకొని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు మూడు నెలల పైరు అయినా ఒకటి రెండు రోజులు ముంపులో ఉంటే కొంతమేర కాపాడుకోవచ్చని, అదే అయిదు రోజుల పాటు ఉంటే కష్టమని రైతులు తిరుపతిరావు, శ్రీనివాసరావు, సుబ్బారావు, పోలయ్యలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 7,150 ఎకరాల్లో నాట్లు వేయగా, 4,740 ఎకరాల్లో నీటి మునిగిందని మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం నాటికి 1,450 ఎకరాలకు సంబంధించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని చెప్పారు.

కొమ్మమూరు కాలువ పక్కన అయిదు రోజులుగా నీటిలో మునిగే ఉన్న పొలాలు

నేడు సీతారామస్వామి ఆలయానికి శంకుస్థాపన

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం అన్నపూర్ణ థియేటర్ పక్కన నూతనంగా నిర్మించనున్న శ్రీసీతారామస్వామి ఆలయానికి శంకుస్థాపన పూజలు జరుగుతాయని ధర్మకర్త మోటుమర్రి రామసుబ్బారావు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వలివేటి వెంకట రామానుజం తెలిపారు. ఉదయం 10.43 గంటలకు శంకుస్థాపన ఉంటుందని చెప్పారు. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పర్చూరు శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు హాజరుకానున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ప్రజలు హాజరై విజయవంతం చేయాలని, 11.30 గంటలకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు.

డ్రోన్‌తో పొలాల సర్వే

చినగంజాం, న్యూస్‌టుడే: పెదగంజాం, చినగంజాం ప్రాంతాల్లో వరద ముంపునకు గురైన వరి పొలాలను డ్రోన్ సాయంతో ఆదివారం సర్వే చేసినట్లు తహసీల్దార్ కె.ప్రభాకరరావు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి ప్రశాంత్, ఏవో చంద్రశేఖర్, సర్వేయర్ లోకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలకు ఎమ్మెల్యే ఏలూరి అభినందనలు

మార్టూరు: భారత అంతరిక్ష రంగంలో మరో చరిత్రాత్మక ఘట్టాన్ని సృష్టించిన ఇస్రో శాస్త్రవేత్తలకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదివారం అభినందనలు తెలిపారు. శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి సీఎంఎస్-03 కమ్యూనికేషన్ ఉపగ్రహం విజయవంతంగా ప్రయోగించడం దేశానికే గర్వకారణమని పేర్కొన్నారు.

హనుమోజిపాలెం, బూదవాడలో నేత్రదానం

ఇంకొల్లు, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో రెండు నేత్రదానాలు జరిగాయి. హనుమోజిపాలేనికి చెందిన బత్తిన హనుమంతరావు(58), బూదవాడకు చెందిన అలవల నారాయణరెడ్డి(95) ఆదివారం మృతిచెందారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు రోటరీ అవయవ నేత్రదాన సలహా కేంద్రం ప్రతినిధులు జెట్టి స్వామి, ఎస్.రామమోహనరావులు పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి సిబ్బందిని పిలిపించి, మృతుల కార్నియాలను సేకరించారు. నేత్రదాతల కుటుంబ సభ్యులను రోటరీ ప్రతినిధులు కోటేశ్వరరావు, రాఘవరెడ్డి, నాగేశ్వరరావు అభినందించారు.

డీసీసీబీ అక్రమాలపై సమావేశం నేడు

గుంటూరు: వైకాపా ప్రభుత్వంలో డీసీసీబీలో అక్రమాలపై అసెంబ్లీ హౌస్ కమిటీని నియమించింది. సచివాలయంలో సోమవారం నిర్వహించే సమావేశంలో సహకార శాఖ అధికారులు, బ్యాంకు సీఈవోలు పాల్గొననున్నారు.

రహదారికి గ్రామస్థుల మరమ్మతులు

విజనంపాడు (యద్దనపూడి), న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు సౌకర్యానికి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామీణులు ప్రత్యేక చొరవ చూపారు. మండలంలోని విజనంపాడు, చిలుకూరివారిపాలెం గ్రామాలకు ఇటీవల చిలకలూరిపేట ఆర్టీసీ డిపో నూతన సర్వీసును నడుపుతోంది. గ్రావెల్, కంకరుతో కూడిన భారీ వాహనాలు నిత్యం పెద్దసంఖ్యలో రాకపోకలు సాగించడంతో గుంతలమయమైంది. దీంతో బస్సు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడంతో విజనంపాడు గ్రామస్థులు మరమ్మతులకు సొంత నిధులతో డస్ట్‌తో గుంతలు పూడ్చారు. తెదేపా నాయకులు సాధినేని సుధీర్‌బాబు, ఉప సర్పంచి రంగారావు, కోడూరి నాగరాజు, వెంకటేష్‌లు పనులను పర్యవేక్షించారు.

రోడ్డు గుంతలు పూడుస్తున్న ప్రజలు

తీరంలోకి భక్తులు రాకుండా జాగ్రత్తలు

చీరాల అర్బన్, చినగంజాం, మార్టూరు, పర్చూరు, కారంచేడు, యద్దనపూడి, మేదరమెట్ల, బల్లికురవ, న్యూస్‌టుడే: మొంథా తుపాను కారణంగా చీరాల, వేటపాలెం, చినగంజాం తీరంలో అక్కడక్కడ గుంతలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో కార్తిక పుణ్యస్నానాలు చేయడానికి అనుకూల పరిస్థితులు లేవు. కలెక్టరు, ఎస్పీ ఆదేశాల మేరకు స్నానాలు నిలుపుదల చేసినట్లు ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, డీఎస్పీ మహ్మద్ మొయిన్ తెలిపారు. గజ ఈతగాళ్లతో పరిశీలించిన తరువాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సాధారణ పరిస్థితులు ఏర్పడిన తరువాత అనుమతి ఇస్తామన్నారు. భక్తులెవరూ స్నానాలు చేయడానికి రావొద్దని.. పోలీసు పహారా కొనసాగుతోందని మార్టూరు, అద్దంకి రూరల్ సీఐలు ఎం.శేషగిరిరావు, మల్లికార్జునరావు, ఎస్సైలు శీలం రమేష్, జీవీ చౌదరి, షేక్ ఖాదర్‌బాషా, డి.రత్నకుమారి, నాగరాజు తెలిపారు. బీచ్‌లలోకి రాకుండా బారికేడ్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రామాపురంలో రోడ్డును మూసివేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

పాత ఒప్పందం అమలు కోరుతూ ఆందోళన

యడవల్లి(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : పాత ఒప్పందం ప్రకారం ఏఎంఆర్ సంస్థ విధి విధానాలు అమలు చేయాలని కోరుతూ పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన గ్రానైట్, క్రషర్స్ యజమానులు, కార్మికులు చిలకలూరిపేట మండలం యడవల్లిలో ఆ సంస్థ చెక్ పోస్టు వద్ద ఆందోళనకు దిగారు. ఆదివారం రెండోరోజూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. పాత పద్ధతిలోనే విధివిధానాలు అమలుచేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఏఎంఆర్ సంస్థ యాజమాన్యం అసోసియేషన్‌తో చర్చలు జరిపి అనుకూలంగా స్పందిస్తేనే చెక్ పోస్టులు పనిచేస్తాయన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. గ్రానైట్ పరిశ్రమలో వ్యర్థాలుగా ఉన్న రాళ్లను దేవస్థానాలకు శిల్పాలు చెక్కడానికి తీసుకెళ్లే వారి వద్ద కూడా ఏఎంఆర్ సంస్థ రశీదులు లేకుండా అక్రమ వసూళ్లు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సమస్య తీవ్రతను గుర్తించి గ్రానైట్ పరిశ్రమలు, క్రషర్లు మూతపడకుండా అనుకూల విధానాలను నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు ర్యాలీ చేశారు. మూడు జిల్లాల అసోసియేషన్ నాయకులు ప్రత్తిపాటి సురేష్, ఒంటిపులి ఆంజనేయులు డి.ప్రసాద్, చిటిపోతు మస్తానయ్య, చెరుకూరి నాగరాజు, పోపూరి శ్రీను, తాళ్లూరి వెంకటేశ్వర్లు, తుమ్మల బెనర్జీ, బుగ్గవరపు లక్ష్మణ్, తోట వెంకట కోటేశ్వరరావు, గరిపాటి సుబ్బారావు, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆచూకీ లభ్యం

అధికారుల సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగింత

అద్దంకి, న్యూస్‌టుడే: వసతి గృహం నుంచి బయటకు వెళ్లిన ఇద్దరు పదోతరగతి విద్యార్థుల ఆచూకీ లభ్యమైంది. వారిని 24 గంటల వ్యవధిలోనే పోలీసులు గుర్తించి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాంఘిక సంక్షేమ వసతి గృహం, రెవెన్యూ అధికారుల సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ సుబ్బరాజు అందించిన సమాచారం మేరకు.. ఎస్సీ-1 వసతి గృహం నుంచి పదో తరగతి విద్యార్థులు ధనుష్, సుబ్బారెడ్డి పాఠశాలకు వెళ్తున్నామని చెప్పి వెళ్లారు. సాయంత్రానికి వసతి గృహానికి చేరలేదు. ఈ విషయమై వార్డెన్ వీరాస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సంగతి పాఠకులకు విదితమే. విద్యార్థుల ఆచూకీ కోసం చీరాల డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐ ఆరు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో గాలింపు చేపట్టారు. నిఘా కెమెరాల పరిశీలనతో పాటు ప్రయాణికులు ఎక్కువగా ఉండే బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్‌లో పరిశీలించారు. ఆదివారం ఉదయం మేదరమెట్ల బస్టాండ్ వద్ద విద్యార్థులను గుర్తించి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తల్లిదండ్రులు మందలించారని వసతి గృహం నుంచి వెళ్లిపోయినట్లు విచారణలో తేలిందన్నారు. బాలుర ఆచూకీ కనుగొనడంతో జిల్లా ఎస్పీ అద్దంకి పోలీసుల్ని అభినందించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూప్, VJA, వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/ వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 95537 86677/96404 96677.

REAL ESTATE

HOUSE FOR SALE

GENERAL

గుంటూరు సిటీ SVNకాలనీ సందనవనంలో 466గ॥ ఇల్లు పడమర,దక్షిణం రోడ్లతో అమ్మకానికి కలదు. నోబ్రోకర్స్, డైరెక్ట్ 9849502430, 8341342696.

TO LET

COMMERCIAL

బాపట్ల జిల్లా, నగరం నందు శ్రీకృష్ణ మందిరం దగ్గర వ్యాపారసంస్థలకు దక్షిణముఖ 229 చ॥గ॥లో 2 స్టేర్ హౌస్ (1300 Sft) అద్దెకు. ✆ 94908 48822.

JOBS

Immediate openings for Customer Service Executive & Branch Manager Positions in Cherukuri Group, Located in Eluru, Tanuku, Guntur & Vijayawada. Qual: Min Inter. ✆ 9885206666, E-mail: hr@cherukurigroup.org.

Wanted female nurse for home patient. Exp: BSc nursing & food and Nutrition. Timings: morning 6am to 6pm pls send ur Biodata with photo to following mail ID (staffbala5@gmail.com)

Sri Balaji Hospitals required HR manager, pharmacy sales executive, tally operator. Experience 2 years. Ph: 83095 46242.

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్ HDFC/ AXIS బ్యాంక్, క్లర్క్‌లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆ 82976 75825.

WANTED
HDFC BANK కొరకు
గుంటూరు & ప్రకాశంజిల్లాలో పనిచేయుటకు
కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
DRA సర్టిఫికెట్ కలిగినవారికి తొలి ప్రాధాన్యత. వెంటనే సంప్రదించండి.
లలితా ఫైనాన్స్ లింక్స్
కాంగ్రెస్ ఆఫీస్ రోడ్, విజయవాడ.
✆9951001348

7 HILLS ఆఫీస్ నందు కంప్యూటర్ ఆపరేటర్-1, Tallyఅకౌంటెంట్-1, స్టాఫ్(Female) కావలెను. 35 సం॥లోపు. భారత్‌పేట, గుంటూరు. 72888 77785.

చైతన్య సాయి పేపర్‌మిల్స్ గుంటూరు ఆఫీస్ నందు పనిచేయుటకు అనుభవమున్న సీనియర్ అకౌంటెంట్ మరియు యడవల్లి నందు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 90595 14555.

సెక్యూరిటీ గార్డులు చందోలులో పనిచేయుటకు కావలెను వ॥ 40Y, చదువు: 10th, డ్యూటి : 12 గం॥, జీతం: 16,800/-. ✆ 95506 06916.

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

బెన్ ఎలక్ట్రిక్‌బైక్ షోరూమ్ గుంటూరులో పనిచేయుటకు ★సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ ★ టెక్నీషియన్స్ కావలెను. అనుభవం గలవారు సంప్రదించండి. ✆ 99516 66619

హైదరాబాద్ హోంకేర్‌లో ఏజెంట్లకు మంచి అవకాశం. వర్కర్స్‌ని పంపితే ప్రతినెలా 2వేలు కమీషన్. వర్కర్స్ జీ: 18k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 89775 47749.

పబ్లికేషన్స్ బుక్‌వర్క్‌లో 2 సం॥ల పైబడి అనుభవం కల్గిన పేజ్‌మేకర్, ఇన్ డిజైన్ వచ్చిన "ఆపరేటర్లు" కావలెను. ఆ॥జీతం. ✆ 74169 52459.

R.K ఇంజనీరింగ్ కాలేజీ నందు పనిచేయుటకు ఎలక్ట్రీషియన్స్ కావలెను. అనుభవమును బట్టి జీతం+భోజనం+ఉచిత వసతి కల్పించబడును. కేతనకొండ, ఇబ్రహీంపట్నం మండలం, విజయవాడ, 97014 73399.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి

అద్దంకి, యద్దనపూడి, న్యూస్‌టుడే: పట్టణంలోని కాకానిపాలెం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం స్వామి జయంతి నిర్వహించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు పొన్నపల్లి బ్రహ్మానందం, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నుపల్లి శ్రీనివాసాచారి, జాగర్లమూడి శ్రీనివాసరావు, ఆంజనేయరాజు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కాకాని అశోక్, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, ఉండవల్లి కృష్ణారావు, కనపర్తి రమ్యకృష్ణ, కొండముది గోపి పాల్గొన్నారు. ❖ యద్దనపూడి-మార్టూరు గ్రామాల మధ్య గల శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి గుడిలో జయంతి నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో నగరేశ్వరస్వామి కల్యాణం

వేటపాలెం: కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం వైశ్యసంఘం ఆధ్వర్యంలో వింధ్యవాసిని గంగాదేవి సమేత శ్రీనగరేశ్వరస్వామి లీలా కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామిని పురవీధుల్లో ఊరేగించారు. సోమవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరగనున్నాయి. మధ్యాహ్నం కార్తిక సమారాధన జరుగుతోందని ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు ప్రత్తి ముత్తుకుమరన్, శ్రీరాం గోవర్ధన్‌లు తెలిపారు.

ఉత్తమ అధ్యక్షుడిగా పోలుదాసు

చీరాల: ఎన్ఆర్‌పీఎం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ ఉత్తమ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరులో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం.ప్రభావతి చేతుల మీదుగా రామకృష్ణ అవార్డు అందుకున్నారు.

చీరాల సభ్యుల సమక్షంలో అవార్డు అందుకుంటున్న రామకృష్ణ

స్థల వివాదంలో ఉపాధ్యాయుడిపై దాడి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: స్థల వివాదంలో ఉపాధ్యాయుడిపై దాడి జరిగింది. కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామానికి చెందిన కొమ్మనబోయిన పిచ్చియ్య ఉపాధ్యాయుడు. అదే ప్రాంతానికి చెందిన బంధువుల మధ్య స్థల విషయంలో వివాదం ఉంది. ఈ నేపథ్యంలో ముత్తయ్య అనే వ్యక్తి పిచ్చియ్యపై కర్రతో తలపై దాడిచేయడంతో గాయమైంది. బాధితుడు చికిత్స కోసం ఏరియా వైద్యశాలలో చేరారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి పట్టణం, ధర్మవరం సమీపంలో ఆదివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది అందించిన సమాచారం మేరకు.. పట్టణంలోని బంగ్లా రోడ్డులో అల్పాహారశాల నిర్వహిస్తున్న దంపతులు మధు-అపర్ణ ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా పాత బస్టాండ్ వద్ద పాల ఆటో ఢీకొట్టింది. వీరికి గాయాలయ్యాయి. ధర్మవరం-శంఖవరప్పాడు మధ్య రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో శంఖవరప్పాడు గ్రామానికి చెందిన చిరంజీవి తలకు గాయాలయ్యాయి. పై సంఘటనల్లో క్షతగాత్రులను తొలుత అద్దంకి, అనంతరం ఒంగోలు వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

గాయపడ్డ దంపతులు

మేదరమెట్ల, న్యూస్‌టుడే: ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి మరో బైక్ ఢీకొట్టడంతో దంపతులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన కొరిశపాడు మండలం తిమ్మనపాలెం సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొరిశపాడు మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన దంపతులు మేదరమెట్ల వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తున్నారు. ఈ క్రమంలోనే వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఒంగోలు వైపు నుంచి వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దంపతులు అదుపుతప్పి కిందపడటంతో గాయాలయ్యాయి.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కారంచేడు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి ఈత కొలను పోటీలకు కారంచేడులోని యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం ఒంగోలులోని ఏఎంబీ స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన పోటీల్లో అండర్-14 విభాగంలో ఎబినేజర్, వెంకటేష్, వెంకటగోపి, అండర్-17 విభాగంలో శక్తి, నాని, సాంబశివరావులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయిని షేక్.మస్తానీ తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం సామ్రాజ్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎంపికైన విద్యార్థులు, పక్కన పీఈటీ మస్తాని

ఎల్ఎస్ఆర్ మాస్టర్ మృతికి నివాళి

వేటపాలెం, న్యూస్‌టుడే: బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యుడు, 1952లో స్థాపించిన లలిత కళాసమితి వ్యవస్థాపక కార్యదర్శి లొల్లా శ్రీరామమూర్తి(94) ఆదివారం విజయవాడలో కన్నుమూశారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు. మాస్టర్ మృతి విషయం తెలిసిన వెంటనే కళాసమితి సభ్యులు, పూర్వ విద్యార్థులు విజయవాడ చేరుకుని మృతదేహాన్ని సందర్శించి, నివాళులు అర్పించారు. హైదరాబాద్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, రిటైల్ ధర - 148, చికెన్ విత్‌స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్ - 244.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 252 చికెన్ స్కిన్‌లెస్ - 262.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 575 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.96/-.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? కస్తూర్బా బాలికోన్నత పాఠశాల పక్కన ఉన్న మున్సిపల్ మూత్రశాల ఎప్పుడు చూసినా అధ్వానంగా ఉండటంతో పాటు దుర్వాసన వస్తోంది. ఎవరైనా అత్యవసరమైతే వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. **- ఏబీ రావు, స్థానికుడు**
✔ వెంటనే సిబ్బందిని పంపి బాగుచేయిస్తా. **- ప్రవీణ్, శానిటరీ ఇన్‌స్పెక్టరు, చీరాల పురపాలక సంఘం.**
– చీరాల అర్బన్, న్యూస్‌టుడే

? పర్చూరు-చీరాల రహదారిలోని నాగులపాలెంలో సైడ్ కాలువల్లో మురుగు పారుదల లేక ఎక్కడికక్కడ నిలిచిపోతుంది. వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. **- స్థానికుడు**
✔ రెండ్రోజుల్లో నాగులపాలెంలోని సైడ్ కాలువలను శుభ్రపరిచి, బ్లీచింగ్ చల్లించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. **- బి.హరిప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో, పర్చూరు.** –న్యూస్‌టుడే, పర్చూరు

చెత్తను తొలగించారు

స్పందనకు వందనం

పర్చూరు: పర్చూరు సీహెచ్‌సీలోని చెత్తకుండీలో చెత్తాచెదారం పేరుకుపోయి ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఈనెల ఒకటిన 'మేమున్నాం..మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ అధికారులు ఆదివారం చెత్తాచెదారం తొలగించి, బ్లీచింగ్ చల్లించారు. దీంతో వైద్యశాలకు వచ్చే రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వెలిగిన వీధి దీపం

పెదగంజాం (చినగంజాం): పెదగంజాం పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్‌నగర్ సెవంత్‌డే చర్చి వెనుక వీధి దీపాలు వెలగడం లేదు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానికులు గతనెల 27న 'మేమున్నాం... మీకు తోడుగా' దృష్టికి తెచ్చారు. దీనికి స్పందించిన ఇన్‌ఛార్జి గ్రామ కార్యదర్శి కె.కృపారావు, ఒప్పంద కార్మిక సిబ్బందిని పంపి వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.

? అద్దంకిలో ఐదు రోజులుగా మంచినీటి సరఫరా జరగడం లేదు. ట్యాంకర్లతో జరిగే నీటి సరఫరా సరిపోవడం లేదు. మంచినీటి సరఫరా పునరుద్ధరించాలి **- నాగార్జున, అద్దంకి**
✔ రామ్‌నగర్ ట్యాంక్ నుంచి నీటి సరఫరా జరుగుతోంది. కాకానిపాలెం ట్యాంక్ సోమవారం నుంచి అందిస్తాం. అవసరమైన వారికి ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నాం **- జి.లోకేష్, ఏఈ, అద్దంకి పురపాలక సంఘం –** న్యూస్‌టుడే, అద్దంకి

? కుర్రవానిపాలెంలోని దేవుని నామాలు ప్రదేశంలో వర్షపు నీరు నిలిచింది. ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయించగలరు. **- స్థానికులు, కుర్రవానిపాలెం** ✔ సమస్యను వెంటనే పరిష్కరిస్తాం. **- అజయ్‌బాబు,** పంచాయతీ కార్యదర్శి, కుర్రవానిపాలెం **– న్యూస్‌టుడే, మేదరమెట్ల**

సేవారత్న అవార్డులు

పర్చూరు, మార్టూరు, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళా నిలయంలో శనివారం జరిగిన విశ్వజననీ ఫౌండేషన్ వార్షికోత్సవంలో పర్చూరు, మార్టూరు మండలానికి సంబంధించి ఇద్దరికి సేవారత్న అవార్డులను నిర్వాహకులు అందజేశారు. మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తూ, ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తున్న పర్చూరు ఎంఈవో ఎ.శివకోటేశ్వరరావుకు, మార్టూరులో అమ్మ ఆశ్రమం నెలకొల్పి వృద్ధులకు అన్నదానం, మహిళలకు జీవనోపాధి కల్పిస్తున్న జి.చందుకు సేవారత్న అవార్డులు దక్కాయి.

క్షీరాబ్ది ద్వాదశి వేడుకలు

అద్దంకి, బల్లికురవ, న్యూస్‌టుడే: అద్దంకిలోని ధన్వంతరి దత్తపాదుకాక్షేత్రంలో ఆదివారం క్షీరాబ్ది ద్వాదశ వేడుకలు వైభవంగా జరిగాయి. దత్తాత్రేయుడికి తులసి ధాత్రి సమేత లక్ష్మీనారాయణ పూజ నిర్వహించారు. బల్లికురవ మండలం కొణిదెనలోని బ్రహ్మగుండం వద్ద వైభవంగా పూజలు చేశారు.

ముక్కు మూసుకోవాల్సిందే!

కారంచేడు, న్యూస్‌టుడే: కారంచేడు-పర్చూరు రహదారిలో వైఎన్ ఉన్నత పాఠశాల ఎదుట చెత్తాచెదారం పడేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఆ చెత్త నుంచి దుర్గంధం వెదజల్లుతుండటంతో ఈ మార్గంలో ప్రయాణించాలంటే ముక్కుమూసుకుని వెళ్లాల్సి వస్తోందని వాహన చోదకులు ఆవేదన చెందుతున్నారు. దోమలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చెత్తాచెదారం తొలగించి, బ్లీచింగ్ చల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు

రోడ్డు వెంబడి పడేసిన చెత్తాచెదారం

ఆశల సాగు ఆవిరి

పర్చూరు, కారంచేడు, జె.పంగులూరు, మేదరమెట్ల, న్యూస్‌టుడే

అకాల వర్షాలు, తుపాను కారణంగా కర్షకులు పీకల్లోతు కష్టాల్లో మునిగిపోయారు. ఎప్పటికప్పుడు పంటపై ఆశలు పెట్టుకుని సాగు చేస్తున్న రైతన్నకు ఈ సంవత్సరం నిరాశే మిగిలింది. మొంథా తుపానుతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నష్టం వాటిల్లిన పంటలకు అధికారులు అంచనాలు తయారు చేస్తున్నారు.

పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ వ్యాప్తంగా పర్చూరు, కారంచేడు, యద్దనపూడి, ఇంకొల్లు మండలాల్లో సుమారు 21 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలను వరద నీరు ముంచెత్తింది. పొలాల్లో నీరు వెళ్లేం పోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. దుకు మార్గాలు లేక కారంచేడు మండలంలో 15 వేల ఎకరాల్లో వరి దెబ్బతినగా ఒక్క కారంచేడు పరిధిలోనే సుమారు 7500 ఎకరాల మేర పైరును వరద ముంచేసిందని రైతులు తెలిపారు. ఎకరానికి సుమారు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టగా, కొద్ది రోజుల్లో పాలుపోసుకుంటుందనే తరుణంలో పూర్తిగా పాడై కుళ్లిపోతుందని కర్షకులు చెబుతున్నారు. పర్చూరు మండలంలో 5230 ఎకరాల్లో పంటలు నష్టపోయారని అధికారులు తెలిపారు.

జె.పంగులూరు: నేలవాలిన మొక్కజొన్న

కారంచేడు: నీటిలో నానుతున్న వరి పొలాలు

పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్‌లో వరి 20 వేలు, కంది 200, పత్తి 1185, మినుము 182 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు అంచనా.

మండలం	మినుము విస్తీర్ణం	మొక్కజొన్న
జె.పంగులూరు	2500	216
కొరిశపాడు	2500	600
అద్దంకి	150	3125
బల్లికురవ	–	700



★ తాను పదెకరాల్లో మినుము సాగు చేశానని, కొడవలి పెట్టి ఒక కర్ర కోయలేదని, పూర్తిగా తడిచి మొలకెత్తడంతో నష్టపోయానని **జె.పంగులూరు మండలం కొండమూరు** గ్రామానికి చెందిన రైతు **వీరయ్య** ఆవేదన వ్యక్తం చేశారు. భూమిలో కలియదున్నడం, పశువులు, గొర్రెలకు మేతగా ఇవ్వడం తప్ప మరోమార్గం లేదని వాపోయారు.

★ తాను ఆరెకరాల్లో మొక్కజొన్న సాగు చేశానని, ఇప్పటి వరకు రూ.2.50 లక్షలు ఖర్చు చేయగా, పంట నూర్పిడి చేద్దామని అనుకునే సరికి రాకాసి వాన నిండా ముంచిందని **కొరిశపాడు మండలం మేదరమెట్ల**కు చెందిన **కొట్టె సురేష్** ఆవేదన వ్యక్తంచేశారు. పంట నేల వాలడంతో కండె తడిచి ఫంగస్ సోకిందని, ఇక మొలకెత్తిన పంటను బయటకు తీయాలంటే ఎకరాకు రూ.20 వేలు అదనపు ఖర్చవుతుందని వాపోయారు. ప్రభుత్వ సాయం అందించాలని వేడుకొంటున్నారు.

సమష్టితత్వంతోనే విజయం

చీరాల, న్యూస్‌టుడే: మొంథా తుపాను సమయంలో పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయడంతోనే సహాయ చర్యలు వేగం అయ్యాయని, నష్టం తగ్గిందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. సమష్టితత్వంతోనే ఈ విజయం సాధించామన్నారు. తెదేపా నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశం ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్తులోనూ నాయకులు, కార్యకర్తలు ఇదే ఐక్యతతో పనిచేసి ఎన్నికల్లోనూ ఘనవిజయం సాధిద్దామన్నారు.

అభినందనల వెల్లువ: సీఎం చంద్రబాబు నుంచి పురస్కారం అందుకున్న ఎమ్మెల్యేకు నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు. పురపాలక సంఘం ఛైర్మన్ ఎం.సాంబశివరావు, ఏఎంసీ ఛైర్మన్ కె.జనార్దన్, కె.రజని, పురుషోత్తం, బుచ్చేశ్వరరావు, కోటి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొండయ్యను సత్కరిస్తున్న గడియార స్తంభం ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అండగా ప్రభుత్వం

స్వర్ణ (కారంచేడు), న్యూస్‌టుడే: పునరావాస కేంద్రాల్లోని ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ తిరుమలశెట్టి శ్రీహరి, ఏఎంసీ వైస్‌ఛైర్మన్ శంకరశెట్టి చిరంజీవి తెలిపారు. ఆదివారం స్వర్ణలోని పునరావాస కేంద్రంలో 54మందికి నిత్యావసర సరకులు పంపిణీ చేశారు.

జాతీయ రహదారిపై గుంతలు
వాహన చోదకుల ఇబ్బందులు

జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలు చోదకులకు చుక్కలు చూపిస్తున్నాయి. కొరిశపాడు మండలం తిమ్మనపాలెం సమీపంలో రెండు వరసల్లో గుంతలు ఏర్పడ్డాయి. వేగంగా వచ్చే వాహన చోదకులకు ఇవి కనిపించడం లేదు. వాహనం గుంతలో పడటంతో ఒక్కసారిగా కుదుపులకు గురి అవుతుంది. ద్విచక్రవాహన చోదకులు కింద పడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి వీటికి మరమ్మతులు చేయించాల్సి ఉంది. **– న్యూస్‌టుడే, మేదరమెట్ల**

ఒరిగిన స్తంభం... ప్రమాదానికి సంకేతం

విద్యుత్తు ఉపకేంద్రం సమీపంలో ఒరిగిన స్తంభాలు ప్రమాదాలకు సంకేతంగా మారాయి. ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్తు సదుపాయం కల్పించే నిమిత్తం చెరువు కట్టపై వీటిని ఏర్పాటు చేశారు. ఇటీవల వీచిన గాలులు, వానలకు ఒరిగాయి. అధికారులు త్వరితగతిన మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. **– న్యూస్‌టుడే, యద్దనపూడి**

తీరంలో సందడిగా 4కే రన్

పరుగులో విద్యార్థులు, ఉపాధ్యాయులు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: ఫిట్ ఇండియా అనే నినాదంతో శ్రీ చైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో వేటపాలెం మండలం వాకావారిపాలెం నుంచి వాడరేవు తీరం వరకు ఆదివారం 4కే రన్ నిర్వహించారు. దీనిలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధానాచార్యుడు కె.హరిబాబు పాల్గొన్నారు.

హెచ్చరిక ప్రకటన

సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా తెలియజేయునదేమనగా నా క్లయింటు మెసర్స్ శ్రీ హనుమాన్ ట్రేడర్స్, నలత్‌వాడ, ముద్దేబిహాల్ తాలుకా, విజయపుర జిల్లా వారు దిగువ తెలిపిన ఆస్తుల జప్తు మరియు ప్రకటన నిమిత్తం ఓఎస్ నెం. 184/2025 ద్వారా గౌరవనీయ సీనియర్ సివిల్ జడ్జి యొక్క న్యాయస్థానం మరియు జెఎంఎఫ్‌సి, ముద్దేబిహాల్ సమక్షమున శ్రీ గొట్టిపాటి వెంకటేశ్వర్లు s/o శ్రీ లేట్ జి.సుబ్బారావు, అలపలపాడు గ్రామవాస్తవ్యులు, జనకవరం పంగులూరు మండలం, బాపట్ల జిల్లా, ఆంధ్రప్రదేశ్ వారిపై ఒక మని రికవరి దావాను దాఖలు చేయడమైనది.

క్రమసంఖ్య	ఎల్‌పి నెం.	పాత సర్వే నెం.	ఎల్‌పి విసీర్ణం (ఎక-సెంట్లు)
ఎ	2035	388	0.035
బి	2045	382-1	0.554
సి	2075	383	0.487
డి	2089	384, 385/4	0.635
ఇ	2443	254-3	0.498
ఎఫ్	ఇంటి నెం. 3/102	220	169.45 చ.గజాలు

కావున, పైన తెలిపిన సదరు ఆస్తులతో ఏవిధమైన లావాదేవీలను సాధారణ ప్రజానీకం జరపరాదు. ఈ ప్రకటన అనంతరం కూడా ఎవరైన ఏవేని లావాదేవీలు జరిపిన పక్షంలో అవి వారి స్వంత వ్యయప్రయాసలపై అలా చేసిన వారవుతారు.

ప్రదేశం : ముద్దేబిహాల్ సం/- శివానంద్ ఆర్.సజ్జన్, న్యాయవాది, రోల్ నెం. KAR/92/97
తేది : 2-11-2025 ముద్దేబిహాల్. సెల్. 94489 46530

(c) eenadu

ఈనాడు
చిత్తూరు
సోమవారం నవంబరు 3, 2025 5

మగువా.. జయహో!

మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా శ్రీశ్రీనివాస క్రీడా సముదాయంలో ఆదివారం ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. అన్ని జిల్లా కేంద్రాల్లో వాటిని ఏర్పాటు చేసినట్లు శాప్ ఛైర్మన్ రవి నాయుడు తెలిపారు. జట్టు విజయంతో పెద్దఎత్తున సంబరాల్లో పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, తిరుపతి (క్రీడలు)

బుల్లెట్ రైళ్లు దూసుకెళ్లేలా..!

- కొత్త రైల్వే లైన్లకు గ్రీన్ సిగ్నల్
- డిసెంబరు ఆఖరుకు డీపీఆర్‌ల పూర్తి

పుత్తూరు, న్యూస్‌టుడే: కొత్త రైల్వే ప్రాజెక్టులపై కేంద్రం దృష్టి సారించింది. హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ కారిడార్ ఏర్పాటు లక్ష్యంగా పనులు సాగుతున్నాయి. ఇప్పటికే చెన్నై నుంచి రేణిగుంట వరకు ఒకటి రెండు మినహా లెవల్ క్రాసింగ్‌ల వద్ద నిర్మాణాలు పూర్తి చేశారు. త్వరలో బుల్లెట్ రైళ్లు నడిపే ఆలోచన ఉన్న నేపథ్యంలో రైల్వే లైన్ల సంఖ్య పెంచాలని చూస్తున్నారు.

పుత్తూరు రైల్వేస్టేషన్ ముఖచిత్రం

ఉమ్మడి చిత్తూరుకు మూడు..

ఒకే మార్గంలో సరకు రవాణా, హైస్పీడ్ రైళ్లు వెళ్లే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో కొత్త లైన్లు ఏర్పాటుకు అనుగుణంగా డీపీఆర్‌లు సిద్ధం చేయాలని ఉన్నతాధికారులకు రైల్వేశాఖ ఆదేశాలు జారీ చేసింది. డిసెంబరు ఆఖరు నాటికి డీపీఆర్‌లు పూర్తి చేయాలని గడువు విధించింది. దీనిలో భాగంగా రాష్ట్రానికి కొత్తగా 26 ప్రాజెక్టులు రాగా, ఉమ్మడి చిత్తూరు జిల్లాకు మూడు కేటాయించారు.

ఎక్కువగా వీఐపీల రాక..

మార్గం: చెన్నై- తిరుపతి
ప్రతిపాదనలు: అరక్కోణం- రేణిగుంట
దూరం: 43 కిలోమీటర్లు **లైన్లు:** 3 లేదా 4

● చెన్నై- తిరుపతికి నిత్యం రైళ్ల రాకపోకలు ఉంటాయి. శ్రీవారి దర్శనానికి పలువురు వీఐపీలు వస్తుంటారు. రేణిగుంట- చెన్నై మార్గంలో అరక్కోణం వరకు సింగిల్ ట్రాక్ మాత్రమే ఉంది. యూనిట్, సరకు రవాణా రైళ్లు ఈ మార్గంలోనే నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో లైన్లు పెంచనున్నారు.

55 కిలోమీటర్ల మేర..

మార్గం: చెన్నై- గూడూరు
ప్రతిపాదనలు: గుమ్మడి పూండి- సూళ్లూరుపేట
దూరం: 18.40 కిలోమీటర్లు

ప్రతిపాదనలు: సూళ్లూరుపేట- గూడూరు
దూరం: 55 కిలోమీటర్లు
లైన్లు: 3 లేదా 4

బాలలూ.. వద్దురయ్

- ⏩ లైసెన్సులు లేకున్నా వాహనాలపై సవారీ
- ⏩ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

⏩ తవణంపల్లె పరిధిలో ఇద్దరు బాలలు ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వాహనం నడుపుతున్న బాలుడు మృతి చెందాడు.

⏩ చిత్తూరులో వాహనాలు నడిపే బాలలపై పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పదుల సంఖ్యలో కేసులు నమోదు చేసినా ఫలితం లేదు.

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: రోజురోజుకు రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. బాలలు వాహనాలు నడుపుతూ ప్రమాదానికి గురైన ఘటనలే అధికంగా ఉంటున్నాయి. పోలీసులు ఆపలేకపోతున్నారు. తల్లిదండ్రులు పిల్లలపై ఉన్న ప్రేమ.. గారాబంతో అడిగిన బైకులు కొనిస్తూ రోడ్డు ప్రమాదాలకు కారకులుగా నిలుస్తున్నారు.

ఉత్తుత్తి తనిఖీలు

పోలీసులు తనిఖీ చేస్తున్నా వాహనాలు నడిపే బాలలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టలేకపోతున్నారు.

గుర్తింపు కోసం..

పిల్లలకు వాహనాలు నడిపే వయసు రాకున్నా.. లైసెన్సు లేదని తెలిసినా.. నలుగురిలో గుర్తింపు కోసం తల్లిదండ్రులు ఖరీదైన వాహనాలు కొనిస్తున్నారు. జరగరాని ఘటన జరిగితే.. తల్లిదండ్రులు రోదించే పరిస్థితి ఎదురవుతోంది.

ఇవీ కారణాలు..

- ● నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ఇతరులకు ఆటంకంగా మారుతున్నారు.
- ● ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం.
- ● ఎక్కువ శాతం యువత శిరస్త్రాణం ధరించరు.. వేగ నియంత్రణ పాటించరు.
- ● మలుపుల్లో వాహనాల వేగం నియంత్రించక కింద పడుతున్నారు.
- ● సాధారణ రోడ్లలో కూడా ఎక్కువ సీసీ బైకులతో స్పీడుగా వెళ్లడం.

కేసుల వివరాలు ఇలా	సంవత్సరం	ఈ-చలానాలు	జరిమానా మొత్తం
	2024	1,323	రూ.7,07,805

రెండేళ్లలో తొమ్మిది మంది బాలలు మరణించారు.

ఐసర్.. ఉడుతాభక్తిగా

ఉడుతల పరిరక్షణకు చేపట్టాల్సిన ప్రణాళికలపై తిరుపతి భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ(ఐసర్)లో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు తూర్పు కనుమల సింపోజియం-2025 నిర్వహిస్తోంది. జీవావరణ శాస్త్రం, పరిరక్షణ, భూగర్భశాస్త్రం, జీవనోపాధి, మానవ చరిత్ర విభాగం ఆధ్వర్యంలో వివిధ అంశాలపై చర్చించేందుకు దేశంలోని పరిశోధకులు, పరిరక్షణ నిపుణులు, ఎన్‌జీవోలతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ ప్రాంతంలోని ఉడుతలు, పక్షుల పరిరక్షణ వ్యూహాలు, వాటి అభివృద్ధిపై చర్చించనున్నారు. ఇందుకుగాను ఈనెల 9వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఐసర్ నిర్వాహకులు కోరారు. **- న్యూస్‌టుడే, ఏర్పేడు**

నేడు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పర్యటన

కుప్పం, న్యూస్‌టుడే: స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ సోమ, మంగళ వారాల్లో జిల్లాలో పర్యటించనున్నారు. సోమవారం ఉదయం చిత్తూరుకు చేరుకుంటారు. స్థానిక మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్యం విభాగం సిబ్బందితో సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. పారిశుద్ధ్యం అమలుపై సమీక్షిస్తారు. మంగళవారం పుంగనూరులో పర్యటించి, పురపాలిక అధికారులతో సమీక్షించనున్నారు.

నింగినంటిన.. హు షార్

షార్‌లోని నమూనాల వద్ద సెల్ఫీ.. ప్రయోగం వీక్షిస్తున్న నౌకాదళ ఉన్నతాధికారులు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: సీఎంఎస్-03 ఉపగ్రహంతో షార్‌లో సందడి నెలకొంది. రాకెట్ ప్రయోగానికి ముందే శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచే పోలీసులను పెద్దఎత్తున మోహరించారు. పోలీసు, సీఐఎస్‌ఎఫ్ దళాలతో ప్రధాన గేటు వద్ద రెండంచెల భద్రత ఏర్పాటు చేశారు. వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేసి పాసులు ఉన్నవారినే లోపలకు పంపించారు. ప్రయోగాన్ని వీక్షించేందుకు పలు ప్రాంతాల నుంచి సందర్శకులు భారీగా తరలివచ్చారు.

● ఎల్‌వీఎం ఎనిమిదోసారి విజయవంతంగా ఉపగ్రహాన్ని తీసుకెళ్లింది. ఈ విజయం ఇస్రో బృంద స్ఫూర్తికి నిదర్శనం. **- వి.జోసెఫ్, ఎల్వీఎం డైరెక్టర్**

● ఉపగ్రహం నేటి నుంచి కార్యకలాపాలు ప్రారంభించేందుకు సమాయత్తమైంది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా బహుళ బ్యాండ్‌లో పలు వినూత్న సాంకేతికతలతో ఇది రూపుదిద్దుకుంది. **- రాజేంద్ర కుమార్, సీఎంఎస్03 డైరెక్టర్**

ఇప్పటి వరకు ప్రయోగాలు : 103 ఎల్‌వీఎంలు : 8

ఏఐపై పుస్తకం.. గెలుపు సంతకం

పుత్తూరు, న్యూస్‌టుడే: ఏఐ గురించి ఓ పుస్తకం రాసి పలు దేశాల ఐటీ నిపుణులను ఆకట్టుకున్నారు పుత్తూరు కుర్రోడు సాయిరోహిత్. తండ్రి తుమ్మరకోటి వెంకట రమేష్ విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు. తల్లి భారతి తెలుగు ఉపాధ్యాయురాలు. రోహిత్ పుత్తూరులో ప్రాథమిక విద్య అనంతరం తమిళనాడులో బీటెక్ చేశారు. అమెరికాలో ఎంఎస్ చేసి సాఫ్ట్‌వేర్‌గా స్థిరపడ్డారు.

ముందస్తు అంచనాలతో..

సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా కొనసాగుతూనే.. కృత్రిమమేధపై పట్టు సాధించారు. ఏఐపై ఆ రంగ నిపుణులకు అవగాహన కల్పించేలా పుస్తకాన్ని అందుబాటులోకి తెచ్చారు. తొలుత ఆశించినంత గుర్తింపులేని ఆ పుస్తకం ఏఐకి ప్రాచుర్యం లభించడంతో ప్రస్తుతం పలు దేశాల్లో గుర్తింపు సాధించింది. ఈ పుస్తకం అమెరికాలోని టెక్సాస్ ఏఅండ్‌ఎం యూనివర్సిటీ, కింగ్స్‌విల్లే, ఇతర విశ్వవిద్యాలయాల్లోని గ్రంథాలయాల్లో చేరింది.

అవార్డులు

రోహిత్ ఏఐ ఆధారిత క్లౌడ్ కంప్యూటింగ్‌లో పుస్తకం రాసి సుమారు 3 వేల కాపీలు విక్రయించారు. టైటాన్, టైటాన్ హెల్త్, ఇండియన్ అచీవర్స్, గ్లోబల్ రికగ్నైజేషన్, ఏషియన్ ఆఫ్రికన్ అవార్డులు పొందారు. ఆరు సెమినార్లలో పాల్గొని ప్రశంసలు పొందారు.

ప్రయోగాలకు త్రీడీ ముద్ర

- పద్మావతి మహిళా వర్సిటీ ఫార్మసీ విద్యార్థినుల వినూత్న అడుగులు

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: దీర్ఘకాల అనారోగ్య సమస్యలతో బాధపడే వారికి ఉపశమనం కలిగించే పరిశోధనలు చేస్తున్నారు శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఫార్మసీ విభాగం విద్యార్థినులు. మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి వివిధ వ్యాధులపై పరిశోధకురాలు హర్షిణి ప్రయోగాలు చేయగా.. శరీరంపై గాయాలను నయం చేయడానికి స్కాఫ్‌ఫోల్డ్స్ టిష్యూలను రూపొందించారు ఎం.ఫార్మసీ విద్యార్థిని కృష్ణతేజశ్విని. వీటి తయారీకి ఒకరు బయోసిరమిక్, బయోమెటీరియల్స్‌ను వినియోగిస్తే, మరొకరు గండపురా (వింటర్ గ్రీన్‌ప్లాంటు) మొక్క ఆకుల నుంచి తీసిన ఆయిల్‌ను వినియోగించారు. వీరి పరిశోధనలను వివరించారిలా..



విద్యార్థినులు తయారు చేసిన స్కాఫ్‌ఫోల్డ్

త్రీడీ ప్రింటింగ్ ద్వారా పరిశోధనలు చేస్తున్న విద్యార్థిని

పుండ్లను నయం చేసేలా..

పుండ్లు, కాలిన గాయాలు నయం కావడానికి కొంత సమయం పడుతుంది. మధుమేహ బాధితులకు చాలా సమయం కావాలి. ఇవి పెద్దవైనప్పుడు నయం చేయడానికి మన శరీరం నుంచి కానీ, ఇతరుల శరీరం నుంచి కానీ కావాల్సిన చర్మాన్ని తీసి గాయాలపై అమరుస్తారు. ఇదెంతో ఖర్చుతో కూడుకున్న పని. కొన్నిసార్లు దుష్ప్రభావాలు ఎదురవుతాయి. దీని పరిష్కారానికి బయోసిరమిక్, బయోమెటీరియల్లను వినియోగించి త్రీడీ ప్రింటింగ్‌తో స్కాఫ్‌ఫోల్డ్స్ టిష్యూ రూపొందించా. ఇప్పటివరకు విరిగిన ఎముకలు అతుక్కోవడానికే వీటిని వినియోగించేవారు. మన శరీరంలో ఉండే కొలాజిన్ ప్రొటీన్ చర్మం, ఎముకలు, కండరాలు, నరాలను బలోపేతం చేస్తుంది. మధుమేహం బాధితుల్లో కొలాజిన్ అంత శక్తిమంతంగా పని చేయదు. గాయాలను స్కాఫ్‌ఫోల్డ్ త్వరగా నయం చేస్తుంది. ఎలుకలపై చేసిన ఈ ప్రయోగం విజయవంతం కావడంతో దీనిపై పేటెంట్ పొందేందుకు దరఖాస్తు చేసుకున్నా.

- ఎం.హర్షిణి, పరిశోధక విద్యార్థిని

వింటర్ గ్రీన్ ఆయిల్‌తో..

పుండ్లు, గాయాలు నయం చేయడానికి రకరకాల పూత మందులు వినియోగిస్తుంటాం. వీటివల్ల పలు దుష్ప్రభావాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే సహజసిద్ధంగా దొరికే ఔషధ మొక్కలతో స్కాఫ్‌ఫోల్డ్స్‌ను తయారు చేయాలనుకున్నా. ఇందులో భాగంగా గండపురా (వింటర్ గ్రీన్ ప్లాంట్) మొక్క ఆకుల నుంచి తీసిన ఆయిల్‌ను వినియోగిస్తూ త్రీడీ ప్రింటింగ్‌తో ఒక స్కాఫ్‌ఫోల్డ్‌ను తయారు చేశా. దీన్ని పుండ్లు, గాయాలపై ఉంచితే ఇందులోని ఔషధ గుణాలు గాయాన్ని త్వరగా నయం చేస్తాయి. ఈ పరిశోధనపై పేటెంట్‌కు దరఖాస్తు చేశా.

- ఎ.కృష్ణతేజశ్విని, ఫార్మసీ విద్యార్థిని

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం శ్రీవారిని 72,860 మంది దర్శించుకున్నారు. రూ.2.98 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

● **18 వేల టోకెన్ల జారీ :** శ్రీవారి సర్వదర్శనానికి సంబంధించి తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద ఆదివారం 18 వేల టోకెన్లు జారీ చేశారు. వీరికి సోమవారం వేకువజామున 3 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం జరుగనుంది. శ్రీవారి మెట్టు మార్గం భక్తులకు 2 వేల టోకెన్లు జారీ చేశారు.

నేడు డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి తెలిపారు.

● **ఎవరికి?:** తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, వైఎస్‌ఆర్ కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వినియోగదారులు

● **సమయం:** ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

చరవాణి నంబరు: 89777 16661
చాట్ ద్వారా తెలిపే నంబరు: 91333 31912

నేడు చిత్తూరులో గ్రీవెన్స్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అర్జీలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఏఆర్ కార్యాలయంలో ఉదయం పది నుంచి ఒంటి గంట వరకు వినతులు స్వీకరించనున్నారు.

దిగుబడులు.. దాచుకునేదెలా?

టార్పాలిన్ పట్టలు

- ● ప్రతిపాదనల్లోనే 74వేల పట్టల పంపిణీ

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే : వర్షాల సమయంలో చేతికొచ్చిన పంట దిగుబడులు తడిసి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఖరీఫ్‌లో జిల్లాలో 35-40 వేల హెక్టార్లలో వివిధరకాల వ్యవసాయ పంటలు సాగయ్యాయి. వరి, వేరుసెనగ, మొక్కజొన్న, మినుము వంటి పంట ఉత్పత్తులు నూర్పిడి చేసి పొలాలు, కల్లాల్లో ఆరబోసుకోవాల్సి ఉంటుంది. వర్షాల సమయంలో ఉత్పత్తులు తడిసిపోకుండా టార్పాలిన్ పట్టలు ఎంతగానో ఉపయోగపడతాయి.

● వ్యాపారులు రూ.3-5 వేలవరకు విక్రయిస్తున్నారు. అంత ఖర్చు చేయలేని సన్న, చిన్నకారు రైతులు అవస్థలు పడుతున్నారు.

● 2014-19 మధ్య గత తెదేపా ప్రభుత్వ పాలనలో ఏటా 50 శాతంతో పంపిణీ చేశారు. వైకాపా ప్రభుత్వం 2019-24 మధ్య పట్టించుకోలేదు.

● కూటమి ప్రభుత్వం గతేడాది రాయితీపై వ్యక్తిగతంగా యాంత్రీకరణ పరికరాలు అందజేసింది. జిల్లాకు 74వేల రాయితీ టార్పాలిన్ పట్టలు అవసరమని, సరఫరా చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ.. రాష్ట్ర ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపింది.

● వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ప్రతిపాదనలు పంపామని ప్రభుత్వం సరఫరా చేయగానే రైతులకు అందజేస్తామని తెలిపారు.

అమ్మానాన్నా.. క్షమించండి

- ● డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

పెనుమూరు, న్యూస్‌టుడే: 'అమ్మ నాన్నా సారీ.. నేను మిమ్మల్ని విడిచి వెళ్లిపోతున్నా.. నన్ను క్షమించండి.. డాడీ నాకు బతకాలని లేదు.. నావల్ల నువ్వు చాలా బాధపడ్డావ్.. ఆ పిల్ల నన్ను నమ్మించింది.. నాతోనే ఉంటానని చెప్పి మోసం చేసింది.. మీ కోసం బతకాలని ఉన్నా నావల్ల కావడం లేదు.. సారీ డాడీ.. అందరినీ వదిలి వెళ్లిపోతున్నా..' అంటూ రాసిపెట్టి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఓ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థి (17) పెనుమూరులోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడు. చంద్రగిరి నియోజకవర్గం మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి(18) అదే కళాశాలలో చదువుతోంది. వీరిద్దరూ ఇటీవల ఎవరికీ చెప్పకుండా విజయవాడ వెళ్లిపోయారు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు వారిని తీసుకువచ్చారు. ఆ సమయంలో యువతి తాను తల్లిదండ్రులతోనే వెళ్తానని చెప్పడంతో వారితో పంపేశారు. దీంతో మనోవేదనకు గురైన ఆ విద్యార్థి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆత్మహత్య లేఖ రాసి ఉంచి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కైగల్.. జిగేల్

ఎత్తయిన కొండలు.. పచ్చని అందాల మధ్య నుంచి పాల నురగలా పరవళ్లు తొక్కుతూ పారుతోన్న కైగల్ జలపాతం సందర్శకులను ఆకర్షిస్తోంది. ఇటీవల వర్షాలతో ప్రవాహం పెరిగింది. పర్యాటకులు తరలివస్తున్నారు. **- ఈనాడు, చిత్తూరు, న్యూస్‌టుడే, బైరెడ్డిపల్లె**

జిల్లాస్థాయి అథ్లెటిక్స్, చదరంగం జట్ల ఎంపిక 4న

మదనపల్లె విద్య : మదనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 4న ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్ 14, 17 అథ్లెటిక్స్, అండర్ 14, 17, 19 చదరంగం జిల్లా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు బాబు, శారద, నాగరాజు, ఝాన్సీరాణి, కిషోర్, భార్గవి తెలిపారు. అర్హత పత్రాలు తప్పక తీసుకురావాలన్నారు.

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

కార్యక్రమంలో యువతుల నృత్యం.. 5కే రన్‌లో శాప్ ఛైర్మన్ రవినాయుడు, అదనపు ఎస్పీ రవి మనోహరాచారి తదితరులు

డ్రగ్ వ్యసనం.. భవిష్యత్తు నాశనం

యువత డ్రగ్ వ్యసనాలకు లోనై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సంస్థ ఐఎంసీ - పవర్ స్టైడ్ ఆధ్వర్యంలో 'సే నో టు డ్రగ్స్' పేరిట 5కే రన్ కార్యక్రమాన్ని ఆదివారం నగరంలో నిర్వహించారు. భారీ సంఖ్యలో ప్రజలు, పోలీసులు, ఈగల్ సెల్ సభ్యులు పాల్గొన్నారు. గంగమ్మ గుడి ఛైర్మన్ మహేష్ యాదవ్, కార్పొరేటర్లు నరేంద్ర, నరసింహాచారి, ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణాచారి, ఎస్వీయూ సీఐ రామయ్య తదితరులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం)**

6వరకు ఆధార్ బయోమెట్రిక్‌కు గడువు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు ఆధార్ బయోమెట్రిక్ ద్వారా అప్‌డేషన్ చేసుకునేందుకు ఈ నెల ఆరో తేదీ వరకు గడువు ఉందని డీఈవో వరలక్ష్మి ఆదివారం తెలిపారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న విద్యార్థులు సంబంధిత ఎంపీడీవో సహకారంతో ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవాలన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థుల నామినల్ రోల్స్ యూడైస్ ద్వారా తీసుకోనున్నట్లు చెప్పారు. సంబంధిత విద్యార్థులు అపార్ ఐడీ, బయోమెట్రిక్ అప్‌డేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని డీఈవో సూచించారు.

(c) eenadu

ఆలయ దర్శిని

కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయంలో సేవలు

సుప్రభాతసేవ, గోపూజ: వేకువజామున 4.00
బిందుతీర్థ అభిషేకం: 4.30 గంటలు
పంచామృతాభిషేకాలు: ఉదయం 5.30 (ప్రథమ కాల), 9.00 (ద్వితీయకాల), 11.00 (తృతీయకాల)
క్షీరాభిషేకం: ఉదయం 7.30, సాయంత్రం 5.45
ప్రమాణం: సాయంత్రం 5.00 గంటలు.
నిత్య కల్యాణం: 11.30 గంటలకు
హోమాలు: ఉదయం 7 నుంచి 10 గంటల వరకు

నిజరూప దర్శనం: ఉ. 7-7.30, 8.30-9.00, 10.30-11.00
సాయంత్రం: 4.30- 5.00
సర్వదర్శనం: ఉ. 6-7,8-8.30, 9.30 -10.30
మ. 12.00, సా. 4.30, రా. 7-9

– న్యూస్‌టుడే, కాణిపాకం



శ్రీవారి ఆలయంలో

నిత్యోత్సవాలు తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతం, మంగళ, బుధ, గురువారాలు ఉ.3.45కు తోమాలసేవ, 4.45 గంటలకు అర్చన, మ.12కు కల్యాణోత్సవం, 2కు డోలోత్సవం, 3కు ఆర్జిత బ్రహ్మోత్సవం, సాయంత్రం 5కు సహస్ర దీపాలంకారసేవ. ● 7వ తేదీ శ్రీవారి పౌర్ణమి గరుడసేవ జరగనుంది.

సర్వదర్శనం: తెల్లవారి 3.30-5.45, ఉ.8-9.30కు, మధ్యాహ్నం 12 నుంచి రాత్రి వరకు సర్వదర్శనానికి అనుమతిస్తారు. గురువారం, శుక్రవారాల్లో ఉదయం 9 నుంచి సర్వదర్శనం.

వారోత్సవాలు: ప్రతి సోమవారం విశేషపూజ (ఏకాంతం), మంగళవారం అష్టదళ పాదపద్మారాధన సేవను ఉదయం 9కి నిర్వహిస్తారు. బుధవారం సహస్రకలశాభిషేకాన్ని తితిదే రద్దు చేసింది. గురువారం ఉదయం 6.30 గంటలకు తిరుప్పావడ సేవ, శుక్రవారం ఉదయం 4 గంటలకు శ్రీవారికి అభిషేకం నిర్వహిస్తారు.

– న్యూస్‌టుడే, తిరుమల

ముక్కంటి ఆలయంలో

ఉదయం: 5.30: సుప్రభాత సేవ. 5.45: గోమాత పూజ 6.30: ప్రథమ కాలాభిషేకం 7.30: ద్వితీయ కాలాభిషేకం 11.00: నిత్యోత్సవం, చండీ, రుద్రహోమాలు 11.30: నిత్య కల్యాణం
సాయంత్రం: 3.30: ప్రదోష కాలాభిషేకం **రాత్రి :** 7.00: నీరాజన మంత్రపుష్పం 9.00: ఏకాంతసేవ
సర్వదర్శనం: ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు.

రాహు, కేతు పూజలు: ఉదయం 6 నుంచి సాయంత్రం 5. వరకు. **అభిషేకాలు:** మృత్యుంజయ శివలింగానికి (సోమవారం), కాలభైరవునికి (మంగళ), శ్రీమేధాదక్షిణామూర్తికి (గురు), శనిభగవానునికి (శని), సూర్యనారాయణుడికి (ఆది). మనోన్మణికి ఊంజల్‌సేవ(శుక్రవారం). సోమవారం ఉత్సవమూర్తుల ఊరేగింపు. రాత్రి వైష్ణవ పుష్కరిణిలో కార్తిక దీపోత్సవం.

– న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

వరసిద్ధుడి దర్శనానికి మూడు గంటలు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దర్శనానికి భక్తులు ఆదివారం ఆలయానికి పోటెత్తారు. భారీగా తరలిరావడంతో దర్శనం చేసుకునేందుకు మూడు గంటల సమయం పట్టింది. భక్తులకు కావాల్సిన వసతులను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

వరుసల్లో నిల్చొన్న భక్తులు

◗ తిరుమల ఆలయం ఆవరణలో మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు కుటుంబం ◗ కాణిపాకం: రోహిత్ దంపతులకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్, ఛైర్మన్ మణినాయుడు◗ ఆలయ ఆవరణలో జస్టిస్ నర్సింగ్‌రావు

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీవారిని ఆదివారం ఉదయం ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు, తమిళనాడు మంత్రి రామచంద్రన్, తెలంగాణ మంత్రి వి.శ్రీహరి, సినీనటుడు నారా రోహిత్ దంపతులు, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సతీష్ దర్శించుకున్నారు. వీరికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. ● కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామిని సినీనటుడు నారా రోహిత్ దంపతులు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ ఛైర్మన్ మణినాయుడు, అధికారులు వారికి స్వాగతం పలికారు.

వేంకన్న సేవలో న్యాయమూర్తి..

వడమాలపేట: అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నర్సింగ్‌రావు ఆదివారం దర్శించుకున్నారు. అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అర్చకులు ఆలయ చరిత్ర గురించి ఆయనకు వివరించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయాధికారి వేణుగోపాల్‌రాజు, అర్చకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కష్టమైనా.. ఇష్టమే

☛ లాన్ టెన్నిస్‌లో రాణింపు ☛ తల్లిదండ్రుల ప్రోత్సాహం

శ్రీకాళహస్తి, తొట్టంబేడు, న్యూస్‌టుడే: లాన్ టెన్నిస్ ఖరీదైన క్రీడ. రాణించాలంటే క్రమం తప్పని శిక్షణ అవసరం. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులకు కష్టతరమే అయినా పిల్లల బాగోగులే లక్ష్యంగా ప్రోత్సహిస్తున్నారు. శ్రీకాళహస్తి వేదికగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో క్రీడాకారులు రాణిస్తూ సత్తా చాటుతున్నారు.

పేరు: సంహిత **ఊరు:** అనంతపురం
తల్లిదండ్రులు: లావణ్య, కృష్ణారెడ్డి (లైబ్రేరియన్)
పాఠశాల: కేంద్రీయ విద్యాలయం (8వ తరగతి)
విభాగం: అండర్-14,
విజయ పరంపర: స్కూల్‌గేమ్స్‌లో సత్తా
లక్ష్యం: జాతీయ స్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించడం



జీవన్ – తిరుచానూరు
రోజా, లోకనాథం (ఎలక్ట్రీషియన్)
సీకాం కళాశాల, జూనియర్ ఇంటర్
అండర్-19 – స్కూల్‌గేమ్స్‌లో రాణింపు
క్రీడల ద్వారా ప్రభుత్వ ఉద్యోగం.

ఊర్మిళ – శ్రీకాకుళం
లక్ష్మి, బాబురావు (ప్రైవేటు ఉద్యోగి)
సెయింట్ జోసెఫ్(9వ తరగతి)
అండర్-14 – 2023 స్కూల్‌గేమ్స్‌లో బంగారు పతకం
టెన్నిస్‌లో జాతీయ పోటీలకు ఎంపిక కావడం, క్రీడా కోటాలో గ్రూప్ ఉద్యోగం

అక్షయ – శ్రీకాకుళం
విను, లక్ష్మణరావు (ప్రైవేటు ఉద్యోగి)
సెయింట్ జోసెఫ్ (8వ తరగతి)
అండర్-14 – కాకినాడలో రాష్ట్రస్థాయి పోటీల్లో నాలుగో ర్యాంకు
జాతీయస్థాయి పోటీల్లో గుర్తింపు



జయసాయి – శ్రీకాళహస్తి
వాణిశ్రీ, వరదరాజులు (ఆటోడ్రైవర్)
విక్రం జూనియర్ కళాశాల, ఇంటర్ ప్రథమ సంవత్సరం
అండర్-17 – ఐటా పోటీల్లో రాణింపు
క్రీడాకోటాలో పోలీసు ఉద్యోగం

దుర్గమ్మ ఆలయం వద్ద కొబ్బరి కాయలు కొడుతున్న తెలుగు మహిళలు

ఫలించిన పూజలు

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: మహిళల ప్రపంచకప్ క్రికెట్ ఫైనల్‌లో భారత్ మహిళల జట్టు విజయం సాధించాలని కోరుతూ ఎమ్మెల్యే జగన్మోహన్ ఆధ్వర్యంలో తెదేపా నాయకులు, తెలుగు మహిళలు ఆదివారం గిరింపేటలోని దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్క్రీన్‌పై క్రికెట్ తుది పోరు వీక్షించారు. నాయకులు నరేష్, పచ్చప్ప, తెలుగు మహిళలు వరలక్ష్మి, అనురాధ, అరుణ, నళిని, లీలావతి, రాణి పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని సవరించాలి

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డి

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ఇప్పటికే పనిచేస్తున్న ఉపాధ్యాయులు సైతం టెట్ రాయాలని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో విద్యాహక్కు చట్టం-2009ని సవరించాలని పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డి డిమాండు చేశారు. స్థానిక గిరింపేట పురపాలకోన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పింఛను విధానాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. డీవైఈవోలుగా పూర్తి అదనపు బాధ్యతలతో నియమించినప్పుడు జడ్పీ ప్రధానోపాధ్యాయులకు అవకాశం ఇవ్వాలని, ఏకీకృత సర్వీస్ నిబంధనలకు సంబంధించి కోర్టు కేసు పరిష్కరించి, డీఈవో, డీవైఈవో, ఎస్‌సీఈఆర్‌టీ, డైట్ కళాశాల, జూనియర్ అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కన్నన్, విజయభాస్కర్ రెడ్డి, గౌరవాధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భానుమతి.. సినీ జగతికి కీర్తి కిరీటం

పురస్కారాలు అందుకున్న ప్రముఖులతో దేవేంద్రరావు

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: విశ్వనటి దివంగత భానుమతి భారతీయ చలనచిత్ర రంగానికి కీర్తి కిరీటమని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య జాతీయ గౌరవాధ్యక్షుడు దేవేంద్రరావు అన్నారు. భారతీయ తెలుగు రచయితల సమాఖ్య, ఎంవీ కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో భానుమతి శత జయంతి ఉత్సవాలను ఆదివారం చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లెలోని బ్రెయిన్ బాక్స్ అకాడమీలో నిర్వహించారు. సినీ రంగంలో నటన, గానం, రచన, దర్శకత్వ, నిర్మాణ విభాగాల్లో విలక్షణీయతను కనబరిచిన ఆమె తెలుగింటి ఆడపడుచు కావడం మనకు గర్వకారణమన్నారు. సాహిత్యం, సామాజిక సేవ రంగాల్లో ప్రత్యేకతను చాటుతున్న పలువురికి భానుమతి జాతీయ పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీధర్ రెడ్డి, నారాయణస్వామి, చక్రపాణి, గోవిందన్, వెంకటరత్నం, శ్రీరాజు, లావణ్య, శాంతకుమారి, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్కాన్ చేయండి.. విరాళాలు అందించండి

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు ఆలయంలో జరిగే అన్నదానం, అభివృద్ధి పనులు, గోసంరక్షణ ట్రస్టుకు విరాళాలు అందించేందుకు వీలుగా అధునాతన కియోస్క్ యంత్రాన్ని ఆలయ అధికారులు ఇటీవల అందుబాటులోకి తెచ్చారు. విరాళాలు చెల్లించాలనుకున్న భక్తులు మొదట భాషను ఎంచుకోవాలి. విరాళం చెల్లించాల్సిన పథకాన్ని ఎంచుకుని పేరు, ఫోన్ నంబరు, చెల్లిందలచిన నగదు ఎంచుకుంటే స్క్రీన్‌పై క్యూఆర్ కోడ్ వస్తుంది. అందులో నగదు నమోదు చేసి ఓకే నొక్కితే విరాళం స్వీకరించి.. భక్తులకు రసీదు అందిస్తుంది. భక్తులు సులభ పద్ధతిలో విరాళాలు చెల్లించొచ్చు. ఈ విరాళాల స్వీకరణ కేంద్రం, అన్నదాన భవనం, వినాయక సదన్ వద్ద భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. **- న్యూస్‌టుడే, కాణిపాకం**

మేత భూమిని.. మేసేశారు

ఆక్రమణలకు గురైనట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్న భూమి

చిత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: అక్రమార్కుల కొండలు, గుట్టలతో పాటు ఖాళీ స్థలాలను సైతం ఆక్రమించేస్తున్నారు. వారికి అధికారులు అండగా నిలుస్తుండటంతో కబ్జాలు యథేచ్ఛగా చేస్తున్నారు.

చదునుచేసి.. మొక్కలు నాటేసి..

పెద్దిశెట్టిపల్లె రెవెన్యూలో ఎకరా రూ.24 లక్షల పైమాటే. దీంతో ఓ పార్టీకి చెందిన స్థానిక నేత ఆక్రమణకు తెరలేపారు. దిగువూరు పశువుల మేత భూమిపై కన్నువేశారు. అప్పటి వైకాపా నాయకులు, పూర్వ వీఆర్‌ఏ, తహసీల్దారు అండదండలతో 1.68 ఎకరాల భూమి సొంతం చేసుకున్నారు. ఆ భూమిలో మామిడి మొక్కలు నాటేశారు. ఇటీవల గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదు.

తప్పుడు దస్త్రాలతో మార్పు..

భూ ఆక్రమణలే కాకుండా తమిళనాడుకు చెందిన ఓ మహిళ చిత్తూరు మండలంలో నివాసం ఉన్నట్లు ఆధార్‌కార్డు సృష్టించి తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించారు. అనంతరం పెద్దిశెట్టిపల్లె రెవెన్యూ దిగువూరులో 2.30 ఎకరాల మేత భూమిని ఆ మహిళ పేరున మార్చారు. రూ.లక్షల విలువైన భూమి ఆక్రమించినా అధికారులు మాత్రం స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఆక్రమణలు తొలగిస్తాం..

పెద్దిశెట్టిపల్లె దిగువూరులో పశువుల మేత భూమి ఆక్రమణ, గత ప్రభుత్వంలో తప్పుడు దస్త్రాలు తీసుకున్న అంశం మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే తహసీల్దారు, ఆర్‌ఐకు విచారణ చేపట్టాలని ఆదేశించాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాసులు, ఆర్డీవో, చిత్తూరు**

వరసిద్ధుని సేవలో ఎస్పీ



ఎస్పీ తుషార్ డూడికి జ్ఞాపిక అందజేస్తున్న ఏఈవో రవీంద్రబాబు

కాణిపాకం, న్యూస్‌టుడే: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వారిని ఎస్పీ తుషార్ డూడి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు, అర్చకులు రాజగోపురం వద్ద వారికి స్వాగతం పలికారు. మూలవిరాట్టు దర్శన అనంతరం వారికి స్వామివారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు ఉన్నారు.

మద్యం దుకాణాల వద్ద ఘర్షణ

విజయపురం, న్యూస్‌టుడే: మండలంలో మద్యం దుకాణాల వద్ద తరచూ ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయని మందుబాబులు ఆరోపిస్తున్నారు. ఆదివారం మండలంలోని తమిళనాడు సరిహద్దులోని గాండ్లకండ్రిగ మద్యం దుకాణం వద్ద బీరుసీసా కూలింగ్ లేదని ధరపై స్టిక్కర్ వేసి అధిక ధరకు విక్రయిస్తున్నారని ఆ సీసా పగులగొట్టి ఘర్షణకు దిగడంతో గాయాలయ్యాయి. తమిళనాడు ప్రాంతానికి చెందిన రాజేష్, పత్ర మద్యం కొనుగోలు చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకోగా, దీనిపై ఎస్సై మహేష్ బాబు విచారణ నిర్వహిస్తున్నట్లు సమాచారం. పన్నూరు సబ్‌స్టేషన్, తమిళనాడు సరిహద్దులోని గాండ్లకండ్రిగ, కనకమ్మసత్రం వద్ద మొత్తం నాలుగు దుకాణాలు ఉన్నాయి. వీటి వద్ద తరచూ వివాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆ కుటుంబాల్లో తీరని విషాదం

వేర్వేరు ఘటనల్లో ఏడుగురు మృతి

జిల్లాలో వేర్వేరు ఘటనల్లో ఒకేరోజు ఏడుగురు మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మనస్తాపంతో ఇద్దరు ఆత్మహత్యలకు పాల్పడగా, రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు, చెరువుల్లో పడి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మరొకరు ఆత్మహత్యకు యత్నించి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

మనస్పర్థలతో వివాహిత ఆత్మహత్య

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మనస్పర్థలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. మర్రిమాకులపల్లికి చెందిన మంజునాథ్, మంజుల (28) దంపతులకు ఇద్దరు కుమార్తెలు న్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో ఆదివారం రాత్రి ఆమె ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు పేర్కొన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ద్విచక్రవాహనం

● చక్కెర పరిశ్రమ సహాయ మేనేజరు మృత్యువాత

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ప్రైవేటు చక్కెర కర్మాగారం సహాయ మేనేజరు మృతి చెందగా ఇద్దరు మహిళలు గాయపడ్డారు. నగరి మండలం కావేటిపురానికి చెందిన కాశయ్య(52) ఎస్.ఆర్.పురం మండలం నెళవాయిలో ఉన్న ఎస్ఎన్‌జే సాగర్ చక్కెర కర్మాగారంలో సహాయ మేనేజరుగా పని చేస్తున్నారు. ఆదివారం అన్న కుమార్తె మీనాక్షికి దీపావళి సారె తీసుకొని ద్విచక్ర వాహనంపై వేడు గ్రామానికి వెళ్లారు. అక్కడి నుంచి అత్త లలితాంబాళ్(75), మీనాక్షి (28)ని తీసుకొని తిరిగి వస్తుండగా పళ్లిపట్టు సమీపంలోని జంగమ్మ ఆలయం వద్ద ఆగి ఉన్న ట్రాక్టరును ఢీకొన్నారు. ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు పొద్దటూర్‌పేట ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కాశయ్య మృతి చెందారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులు మందలించారని..

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ చల్లావారిపల్లెకు చెందిన బాలిక (17) పలమనేరు పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శనివారం కళాశాలకు వెళ్లలేదు. దీంతో తల్లిదండ్రులు ఆదివారం ఉదయం ఆమెను నిలదీశారు. మనస్తాపానికి గురై గ్రామ సమీపంలోని మునీశ్వరస్వామి కొండపై చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు పెద్దపంజాణి ఎస్సై మారప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: తుంబకుప్పం గ్రామానికి చెందిన ఉమాశంకర్(25) గత నెల 29న చిత్తూరు వెళ్తుండగా కాటప్పగారిపల్లె వద్ద ద్విచక్ర వాహనం అదుపు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడని, కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

ప్రమాదంలో గాయపడి ఒకరు..

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో వృద్ధుడు మృతిచెందిన ఘటన మేలుపట్లలో ఆదివారం జరిగింది. చౌడేపల్లి మండలం కాటిపేరికి చెందిన గంగప్ప(60) మేలుపట్ల వద్ద పెట్రోలు బంకులో ఆదివారం ఇంధనం నింపుకొని వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. గాయపడ్డ గంగప్పను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేసి మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై హరిప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి వృద్ధుడి దుర్మరణం

చౌడేపల్లె, న్యూస్‌టుడే: చేపల వేటకు వెళ్లిన వృద్ధుడు మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. 29ఎ.చింతమాకులపల్లెకు చెందిన మునస్వామి (65) పుంగనూరు- చౌడేపల్లె ప్రధాన మార్గం పక్కనున్న వ్యవసాయ క్షేత్రంలో నివాసం ఉంటున్నారు. చింతమాకులపల్లె చెరువులో చేపలు పట్టేందుకు శనివారం వెళ్లారు. ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన మహిళలకు నీటిలో మృతదేహం కనిపించింది. వారు గ్రామస్థులకు తెలియజేయడంతో మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

చెరువులో పడి ఇంటి పెద్ద..

యాదమరి, న్యూస్‌టుడే: ఎగువ పాతపాళ్యానికి చెందిన ఏకాంబరం(55) చెరువులో పడి మృతిచెందారు. శనివారం రాత్రి గ్రామ సమీపంలో బహిర్భూమికి వెళ్లిన అతను ఇంటికి తిరిగి రాలేదు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు పరిసరాల్లో వెతికారు. కూటాల వంక కరకట్టపై పాదరక్షలు ఉండటంతో అనుమానంతో చెరువులో వెదకగా శవమై కనిపించాడు. మృతుడి భార్య పెద్ద లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని పాతపేటకు చెందిన శీనప్ప (శ్రీనివాసులు) పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అంతకుముందు ఆయన చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఆయనను పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా పాతపేటకు చెందిన ఓ మహిళతో శీనప్ప వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు రెండు రోజుల క్రితం ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో శీనప్పను పోలీసులు శనివారం విచారించారు. గ్రామపెద్దలతో చర్చిస్తామని కొందరు ఆయనను ఠాణా నుంచి తీసుకెళ్లారు. ఆదివారం శీనప్ప ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో వైకాపా నాయకులు శీనప్పను రెచ్చగొట్టి ప్రేరేపించారని తెదేపా మండల కార్యదర్శి సుబ్రహ్మణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భక్తిశ్రద్ధలతో సమాధుల పండుగ

అలంకరణలో పితృదేవతల సమాధులు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: సమాధుల పండుగ సందర్భంగా ఆదివారం చిత్తూరు నగరం సీబీరోడ్‌లోని బరియల్ గ్రౌండ్స్‌లో క్రైస్తవులు తమ పితృదేవతల సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అక్కడి సమాధుల్ని వివిధ పుష్పాలతో అలంకరించి.. కొవ్వొత్తులు వెలిగించి మొక్కుకున్నారు. వారికి ఇష్టమైన తినుబండారాలను సమాధుల వద్ద ఉంచి పెద్దల ఆత్మశాంతి కోసం ప్రార్థనలు చేశారు.

హోరాహోరీగా టెన్నిస్ పోటీలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి వేదికగా జరుగుతున్న 69వ లాన్‌టెన్నిస్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పాల్గొన్న క్రీడాకారులతో రాష్ట్రస్థాయి జట్టును ఎంపిక చేయడంలో నిర్వాహకులు తలమునకలయ్యారు. విక్రం టెన్నిస్ అకాడమీ, రిపబ్లిక్ క్లబ్, శుకబ్రహ్మాశ్రమం వద్ద ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. అండర్-14, 17, 19 విభాగాల నుంచి రాష్ట్రస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు దిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

బెట్టింగ్ మోసగాడిపై పీడీ చట్టం

చంద్రబాబు

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: యువతను ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ఊబిలోకి లాగి మోసం చేసి ఎంతో మంది ఆత్మహత్యలకు కారణమైన పెద్దపంజాణి మండలం రాయలపేట గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు కె.చంద్రబాబుపై పోలీసులు పీడీ చట్టం ప్రయోగించారు. ఈ మేరకు ఆదివారం ఎస్పీ తుషార్‌డూడి ఓ ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ సిఫార్సుతో పీడీ చట్టం కింద అతడిని అరెస్టు చేసి కడప కేంద్ర కారాగారానికి తరలించామని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రధానంగా క్రికెట్ బెట్టింగ్ ఆడిస్తూ, దాని కోసం అప్పులు ఇచ్చి వారిని బానిసలుగా మార్చి, చెల్లించే సమయంలో ఒత్తిడి చేస్తున్నాడని, ఇలా చాలామంది అప్పుల పాలై బెట్టింగ్ డబ్బులు చెల్లించలేక ఆస్తులు అమ్ముకోవడం, కొందరు ఆత్మహత్యలకు పాల్పడిన దాఖలాలు ఉన్నాయన్నారు. బెట్టింగ్ మాత్రమే కాక పలు నేరపూరిత కార్యకలాపాల్లో పాల్గొనడంతో పంజాణి, పలమనేరు పరిధిలో పలు కేసులు ఉన్నాయి. అయినా అతడు నేరప్రవృత్తి మానుకోక, బెట్టింగ్ ఆడిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తుండటంతో పీడీ చట్టం ప్రయోగించి, అరెస్టు చేశామని ఎస్పీ వివరించారు.

EENADU Classifieds

HEALTH & CARE

PAEDIATRIC
శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పుట్టిన బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL
INVESTMENT PLOTS/ Farm House Plots/ Villa Plots for Sale: Lucky Ventures (India's No-1 Real Estate Company). ✆ 91145 61456.

JOBS
TELE CALLERS Female Qua: Any Degree & Basic System Knowledge. N. Sreenatha Reddy Recovery Agency, Bairagipatteda, Tirupati. ✆ 90328 01545.
PART TIME Jobs for Teachers with Experience and Fresher Wisdom Academy, SV Nagar, Tirupati. ✆ 98660 87500, 83415 54014.
Study Power (Education Loans)నందు పనిచేయుటకు Branch & Relationship Managers కావలెను. ✆ 9154133491.
తిరుపతి వరదరాజస్వామి గుడి వద్దనున్న IOC పెట్రోల్ బంకు నందు పనిచేయుటకు పంపు బాయ్స్/ గర్ల్స్ కావలెను. ✆ 94922 35378, 98662 33003.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

THE EENADU CLASSIFIEDS WAY
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

చిత్తూరు

● చిత్తూరు ● పూతలపట్టు ● గంగాధరనెల్లూరు ● నగరి

నేడు విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: చిత్తూరులోని జీవీఆర్‌ఎస్ అన్నదాన సమాజం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన 100 మంది మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాల రూపంలో రూ.2.25 లక్షలు అందించనున్నట్లు ఈవో తిమ్మారెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం 3 గంటలకు సత్రంలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు.

పుత్తూరులో ఉచిత వైద్య శిబిరం

పుత్తూరు, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సొసైటీ జీవితకాల సభ్యుడు, ఎస్‌ఏ మునిక్రిష్ణయ్య ఆదివారం తెలిపారు. పీజీఆర్‌ఎస్ అర్జీదారులు, ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వేడుకగా యోగేశ్వర ద్వాదశి

చిత్తూరు గ్రామీణ: బీఎన్‌ఆర్‌పేట కోదండరామ వీరాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం యోగేశ్వర ద్వాదశి వేడుక నేత్రానందంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు బాలజీశ్రీనివాసన్ స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) చిత్తూరు నగరం: 80085 74598 నగరి: 9866112017 గంగాధరనెల్లూరు: 80085 74605 పూతలపట్టు: 9505557466

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం: సమస్య: సంతపేట దొంగలబావి వీధిలో నివాసాల మధ్య కాలువలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. - స్థానికులు

సమాధానం: కాలువలో పూడికతీత పనులు చేపడతాం. - లోకేష్, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ

న్యూస్‌టుడే, బంగారుపాళ్యం: సమస్య: కాటప్పగారిపల్లె గ్రామానికి వెళ్లే మార్గంలో రహదారి పక్కన విద్యుత్తు స్తంభం వాలిపోయి ప్రమాదకరంగా ఉంది. - రాంప్రసాద్, కాటప్పగారిపల్లె

సమాధానం: వాలిన స్తంభాన్ని సరిచేసి సమస్య పరిష్కరిస్తాం -కొండయ్య, ఏఈఈ

? గుడిపాల- చిత్తూరు మార్గంలో పాపసముద్రం ఎస్సీ కాలనీ రోడ్డుపై మురుగు పారుతోంది. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. - శివకుమార్ ● సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం. - రవికుమార్, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, గుడిపాల

? కలవకుంట- పైపల్లె మార్గంలో విద్యుత్తు స్తంభానికి తీగలు అల్లుకున్నాయి. - స్థానికులు ● లతలు తొలగిస్తాం. - తులసీప్రసాద్, ట్రాన్స్‌కో ఏఈ - న్యూస్‌టుడే, పెనుమూరు

? పాలసముద్రం మండలంలోని నరసింహాపురం పంచాయతీ టీవీఎస్‌ఆర్‌పురం ఆదిఆంధ్రవాడలో మురుగు కాలువ శుభ్రం చేయాలి. - రమేష్ ● మురుగు కాలువ శుభ్రం చేయిస్తాం. - సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో - న్యూస్‌టుడే, పాలసముద్రం

? పుత్తూరు పురంలో కార్వేటినగరం రోడ్డు విష్ణుమహల్ థియేటర్ వద్ద చెత్త రెండు రోజులుగా పేరుకుపోయి ఉంది. - ప్రకాష్ ● చెత్త సేకరణ పూర్తి చేస్తాం. - మోహనకృష్ణ, పారిశుద్ధ్య అధికారి - న్యూస్‌టుడే, పుత్తూరు

? పొన్నేపల్లి వీధుల్లో వర్షం నీరు నిలిచిపోతోంది. వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నాం. - స్థానికులు ● అధికారులతో మాట్లాడి వర్షం నీరు నిలవకుండా చర్యలు చేపడతాం. - హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో - న్యూస్‌టుడే, తవణంపల్లె

న్యూస్‌టుడే, కార్వేటినగరం: సమస్య: స్థానిక పాత సంతవీధిలో మురుగునీటి కాలువ అధ్వానంగా మారి దోమల బెడద ఎక్కువగా ఉంది. - నారాయణస్వామి, స్థానికుడు

సమాధానం: కాలువలో నిల్వ ఉన్న మురుగునీటిని వెంటనే తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. - ధనంజయవర్మ, సర్పంచి

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం: సమస్య: స్థానిక గాయత్రినగర్ కాలనీలోని కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. -స్థానికులు

సమాధానం: కాలువల్లో పూడికతీత పనులు పూర్తి చేస్తాం. - లోకేష్, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ

వ్యాపారవేత్త రామచంద్రరాజుతో కలిసి సీసీరోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

దాతలు ముందుకు రావాలి

వడమాలపేట, న్యూస్‌టుడే: ఎన్నారైలు, పారిశ్రామిక, వ్యాపారవేత్తలు తమ గ్రామాభివృద్ధికి ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని తిరుమండ్యం రోడ్డు నుంచి టీఆర్‌కండ్రిగ వరకు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వ్యాపారవేత్త ఎం.రామచంద్రరాజు రూ.10 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు, ప్రభుత్వ నిధులతో టీఆర్‌కండ్రిగ ఏడీబ్ల్యూ, రాజులకండ్రిగ గ్రామాల్లో రూ.16 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను ఆయన ప్రారంభించారు. ఏడాదిలో మండలంలో ప్రజా సంక్షేమం కోసం రూ.20 కోట్లు ఖర్చు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం వ్యాపారవేత్త ఎం.రామచంద్రరాజును ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. నాయకులు శ్రీధర్‌రాజు, ధనంజయులునాయుడు, దాము యాదవ్, శివరామ్, జానా వెంకటయ్య, హేమావతి పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు ఇవ్వాలి

నజీర్

నవీన్

పుత్తూరు: తోపుడుబండ్ల వ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అక్రమ గేటు వసూలు చేయరాదని హాకర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుజ్జి పేర్కొన్నారు. పుత్తూరులో ఆదివారం తోపుడుబండ్ల యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన కమిటీ ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా నజీర్, ప్రధాన కార్యదర్శిగా నవీన్, కోశాధికారిగా భువనేశ్వరి, ఉపాధ్యక్షులుగా అంకయ్య, అజిత్, సహాయ కార్యదర్శులుగా అనుబాబు, తిరుమలయ్య, కమిటీ సభ్యులుగా హరికృష్ణ, గురవయ్య, రాధను ఎన్నుకున్నారు. భవన నిర్మాణ రంగం యూనియన్ జిల్లా అధ్యక్షుడు మునిరాజ, శ్రీనివాసులు, సీఐటీయూ నాయకులు విజయ్, నరసింహులు, శివకుమార్ పాల్గొన్నారు.

సొసైటీతో విస్తృత సేవలు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ద్వారా భవిష్యత్తులో విస్తృత సేవలు అందించనున్నామని సొసైటీ అధ్యక్షుడు తాండవమూర్తి తెలిపారు. స్థానిక మిట్టూరులోని రామాలయంలో ఆదివారం సొసైటీ సమావేశం నిర్వహించారు. చిత్తూరు నగర దిమానంద్‌పై కవిత రాసిన రెడ్డెప్పకు రూ.2 వేలు నగదు పురస్కారాన్ని అందజేశారు. సొసైటీ కార్యదర్శి గోపినాయక్, సత్యనారాయణ, మురళి, శోభారాణి, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రచయితకు నగదు పురస్కారం అందిస్తున్న తాండమూర్తి

● నగర జనాభా: 2.2 లక్షలు ● డివిజన్లు: 50 ● పారిశుద్ధ్య విభాగ డివిజన్లు: నాలుగు ● మూలనపడినవి: సుమారు 50(అన్నీ కలిపి)

మన సొమ్ము కాదుగా..

● నిరుపయోగంగా చెత్త సేకరణ వాహనాలు ● రూ.లక్షల్లో ప్రజాధనం వృథా ● కొరవడిన నగరపాలిక నిర్వహణ

షెడ్డులో మూలన పడిన డంపర్ బిన్లు

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా నగరపాలిక వివిధ ఆర్థిక సంఘాలు, నగరపాలక సాధారణ నిధులతో చెత్త తరలింపు వాహనాలు, యంత్రాలు కొనుగోలు చేశారు. వాటిల్లో ఎక్కువగా మరమ్మతుకు గురైన నగరపాలక వాహనాలు షెడ్డులో మూలన పడి ఉన్నాయి. కొన్నేళ్ల క్రితం స్వచ్ఛాంధ్ర మిషన్ ద్వారా రూ.లక్షలు చెల్లించి కొనుగోలు చేసిన వాహనాల పరిస్థితి సైతం అంతే. ఇవి మూలకు చేరాయి. రూ.లక్షల విలువైన వాహనాలను సమకూర్చినా వీటి వినియోగంలో అధికారులు విఫలమయ్యారు. రోడ్లపై మట్టి తొలగించడానికి స్వీపింగ్ యంత్రాలను కేటాయించగా వీటి వినియోగానికి చమురు వాడకం ఎక్కువగా ఉంటోంది. వీటిని పూర్తిస్థాయిలో వినియోగిస్తున్నట్లు చెబుతున్నా రహదారులపై మట్టి అలానే ఉంటోంది.

ప్రస్తుతం ఉన్న వాహనాల సంఖ్య	
ట్రాక్టర్లు	11
కంపాక్టర్లు పెద్దవి 3, చిన్నవి	4
డంపర్ ప్లేసర్	1
డోజర్	1
మినీ జేసీబీ	2
టిప్పర్లు	3
ఆటోలు	3
స్వీపింగ్ యంత్రాలు	2
క్లాప్ మినీ ఆటోలు	11

చిత్తూరు నగరంలో చెత్త, వ్యర్థాల సేకరణకు ప్రభుత్వం కేటాయించిన వాహనాలు, యంత్రాలు నిరుపయోగంగా పడిఉన్నాయి. నిర్వహణ కొరవడటంతో ఆయా వాహనాలను తక్కువ కాల వ్యవధిలో వినియోగించి మూలన పడేశారు. స్వచ్ఛాంధ్ర మిషన్ ద్వారా రూ.లక్షలు వ్యయం చేసి కొనుగోలు చేసిన వాహనాలు ఎందుకు పనికిరాకుండా పోవడంతో ఏటా వాటిని కిలోల లెక్కన తుక్కుగా విక్రయించాల్సిన దుస్థితి.

చేయక షెడ్డులోనే ఉంచారు. ప్లాస్టిక్ చేతి సంచుల రీసైక్లింగ్‌కు చిన్నపాటి యంత్రాన్ని కొనుగోలు చేసినా వాటిని నేటికీ వినియోగించలేదు. వీధుల్లో చెత్త సేకరణకు ఏర్పాటు చేసే డంపర్‌బిన్లు పదుల సంఖ్యలో షెడ్డులో మూలన పడిఉన్నాయి. లారీలు, ఆటోల ఎంత విలువో ఎవరికీ తెలియదు. రూ.లక్షలు పోసి కొవిడ్ సీజన్‌లో కొనుగోలు చేసిన శానిటైజర్ స్ప్రేయర్లను ప్రత్యామ్నాయంగా వినియోగించకుండా షెడ్డులోనే పడేయటం గమనార్హం.

ఎండకు ఎండి.. వానకు తడిసి..

నిత్యం నగరంలో ఇంటింటా చెత్త, వ్యర్థాలు సేకరించాక నగరపాలక షెడ్డుకు వాహనాలు తరలిస్తారు. ఆపై వాటిని నీటితో కడుక్కోవాల్సిన అవసరం కనిపించదు. వాటికి ఆయిల్ సర్వీస్ సకాలంలో చేపట్టకపోవడంతో ఇంజిన్లలో సమస్యలు తలెత్తి కొన్ని నెలలకే కొత్త వాహనాలు మరమ్మతుకు గురయ్యాయి. అధునాతన వాహనాలు సమకూర్చినేత ఖర్చు తగ్గదు. కార్మికుల్ని ఇతర పనులకు వినియోగించే వెసులుబాటు ఉండదు. రూ.లక్షల విలువ చేసే వాహనాలు ఉన్నా అద్దె వాహనాలు, అదనపు సిబ్బంది సేవలు నగరపాలక సంస్థకు తప్పడం లేదు. ఫలితంగా వాహనాల వినియోగం నాణ్యత కొరవడి మూలన పడేయాల్సిన దుస్థితి నెలకొంది.

మరమ్మతులు కరవు..

రెడ్డిగుంట సమీపంలో ఒక మినీ కంపాక్టర్ అగ్నిప్రమాదానికి ఆహుతైంది. దీనికి మరమ్మతులు

గతంలో కాలిపోయిన కంపాక్టర్

చర్యలు చేపడతాం..

చెత్త సేకరణ వాహనాల నిర్వహణపై దృష్టి సారిస్తాం. మరమ్మతుకు గురైన వెంటనే వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు చేపడతాం. - లోకేష్, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ

విద్యతోనే అభివృద్ధి

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఏపీ విద్య, సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల శ్రీనివాస్ తెలిపారు. ఆయన కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన సందర్భంగా ఆదివారం స్థానిక మ్యాంగో భవన్‌లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో సత్కార సభ నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి సంబంధించిన కార్పొరేషన్ డైరెక్టర్ పదవి లభించడం సంతోషంగా ఉందని, పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. జనసేన జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర హస్త కళలు, చేనేత కార్పొరేషన్ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తీశ్వర ఆలయ ఛైర్మన్ కొట్టె సాయి, జనసేన నాయకులు కిరణ్‌రాయల్, చెన్నకేశవులు, రాందాస్‌చౌదరి, చైతన్య, తదితర నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉయ్యాల శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న నాయకులు

'వైకాపా తీరు ప్రమాదకరం'

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: కులాల మధ్య చిచ్చుపెడుతూ వైకాపా ప్రమాదకరంగా మారిందని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో దురదృష్టవశాత్తు జరిగిన తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, వెంటనే ప్రభుత్వం సహాయ చర్యలు చేపట్టిందన్నారు. ప్రమాదం చోటుచేసుకున్న ఆలయం ప్రభుత్వ ఆధీనంలో లేదని, దేవాదాయ శాఖ పరిధిలోనూ లేదని, అయినా ఈ ఘటనకు ప్రభుత్వమే కారణమని వైకాపా విమర్శలు చేస్తూ, అసత్య ప్రచారాలు చేయడాన్ని ఆయన ఖండించారు.

మార్గం సుగమం

పెనుమూరు- చిత్తూరు మార్గంలో నీవా నదిపై రోడ్డును దాతలు బాగు చేశారు. ఎన్టీఆర్ జలాశయం కింది భాగంలో ఉన్న రోడ్డు 2021లో వరద దాటికి కొట్టుకుపోయింది. తర్వాత రోడ్డు వెడల్పు తగ్గింది లోతూ పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడేవారు. మాజీ ఎంపీపీ హరిబాబునాయుడు ట్రాక్టర్లతో వ్యర్థాలు తీసుకొచ్చి, కంకర్రితో వేసి బాగు చేయించారు. దీంతో రాకపోకలకు మార్గం సుగమమైంది. - న్యూస్‌టుడే, పెనుమూరు

పక్కకు వెళ్తే ప్రమాదమే..

ఇటీవల భారీ వర్షాలకు రూరాపలుకు చారావరకు కోతకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో పెనుమూరు-పాకాల రోడ్డులో ఇదే పరిస్థితి నెలకొంది. పెనుమూరు సమీపంలో రోడ్డు కోతకు గురైంది. సింగిల్ రోడ్డు కావడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సమయంలో పక్కకు వెళ్తే ప్రమాదం తప్పని పరిస్థితి. రాత్రివేళ ద్విచక్ర వాహనదారులు వేగంగా వస్తే ఈ గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. -న్యూస్‌టుడే, పెనుమూరు

ప్రాజెక్టు కదలక.. మరమ్మతు చేయక..

తడుకు పంచాయతీ పరిధిలోని వేణుగోపాలపురం వద్ద గాలేరు-నగరి ప్రాజెక్టులో భాగంగా వేణుగోపాలపురం గర్ నిర్మాణ పనులు తెదేపా హయాంలో 10 శాతం పూర్తిచేశారు. ఆపై వైకాపా హయాంలో ప్రాజెక్టు గురించి పట్టించుకోలేదు. దీని పక్కనే వేణుగోపాలపురం నుంచి సదాశివ ఎస్సీ కాలనీ, టీఆర్ కండ్రిగ ఆదిఆంధ్రవాడ, బీసీఎస్‌పురం గ్రామాలకు వెళ్లే రోడ్డు ముంపు బారిన పడుతుంది. రోడ్డు మరమ్మతులు నిలిపివేశారు. తాజా వర్షాలకు రోడ్డు చిద్రమై స్థానికులు నిత్యం తిప్పలు పడుతున్నారు. - న్యూస్‌టుడే, పుత్తూరు

అల్లుకుంటున్న నిర్లక్ష్యం

అరగొండ-చిత్తూరు ప్రధాన రహదారి పక్కన అరగొండ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కలుపు తీగలు అల్లుకుంటున్నాయి. ఈ మొక్కలు విద్యుత్తు సరఫరా జరిగే రహదారి పక్కన ఉండటంతో ప్రమాదం జరిగే అవకాశముంది. అల్లుకుంటున్న కలుపు మొక్కలు తొలగించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తవణంపల్లె



యువోత్సాహం

ప్రతిభతో పతకాల కైవసం

న్యూస్‌టుడే, చిత్తూరు(క్రీడలు)

కళల్లో ప్రతిభ గల యువతను యువజన సర్వీసుల శాఖ(సెట్విన్) గుర్తించేందుకు వేదిక కల్పించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న యువత.. జిల్లా యువజనోత్సవాల్లో సత్తా చాటి పతకాలు సాధించి శెభాష్ అనిపించారు.. భవిష్యత్ పోటీల్లో గెలుపే లక్ష్యంగా నైపుణ్యాలకు పదును పెడుతున్నారు.

కథతో ఆలోచింపజేసి..

సామాజిక సందేశంతో వచ్చే కథలు ప్రజల్ని కదిలిస్తాయి. చైతన్యం తీసుకొస్తాయి. ప్రజల జీవనం, సమాజంలో అంతరాల గురించి యువజనోత్సవాల్లో కథను రాసి ప్రథమ పతకాన్ని సాధించడం ప్రియ. చిత్తూరుకు చెందిన ఈ బీటెక్ విద్యార్థిని చక్కటి ప్రతిభ చూపుతోంది. రచయిత్రిగా సేవలు అందిస్తానని చెబుతోంది.

మాటలతో పతకం గెలిచి..

ఆకట్టుకునేలా, ఆలోచన రేకెత్తించేలా మాట్లాడగలిగే వారికి గుర్తింపు ఉంటుంది. దేశం నాకేమిచ్చింది అని కాకుండా.. దేశం కోసం మనమేం చేయాలనే భావనను వ్యక్తపరిచి స్వర్ణ పతకాన్ని సాధించాడు నితిన్. చిత్తూరుకు చెందిన ఈ యువకుడు బీటెక్ చదువుతున్నాడు. దేశచరిత్ర, దేశాభివృద్ధిలో యువత పాత్ర, వివిధ రంగాల్లో అవకాశాలపై వివరించి పతకం సాధించాడు నితిన్.

జానపదం.. జీవపదం

భారతీయ సంస్కృతిలో ప్రత్యేక జానపదాలది ప్రత్యేక స్థానం. పల్లె ఆచారాలు, సంప్రదాయాలను చక్కగా ప్రతిబింబించే జానపదాలు. నగరికి చెందిన డిగ్రీ విద్యార్థిని సుభాషిణి బృందం.. జానపద గీతాలకు నృత్యం చేసి మెప్పించడంతో పాటు స్వర్ణ పతకాన్ని సాధించారు. జానపదాలను భావితరాలకు తెలియజేసేందుకు తమ వంతు కృషిచేస్తామని అంటున్నారు ఈ బృందంలోని విద్యార్థినులు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

వాసు

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: రాగిమానుపెంట జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి వాసు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్‌ఎం నాగమణి తెలిపారు. గత నెల 30న అన్నమయ్య జిల్లా వాయల్పాడు మండలం కొత్తమందూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపి అండర్-17 నెట్‌బాల్ పోటీల్లో అర్హత సాధించాడు. ఈ నెల ఎనిమిదో తేదీన విజయవాడ పటమటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు. ఈ విద్యార్థిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

సమావేశమైన స్కౌట్స్ అండ్ గైడ్స్

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

పుత్తూరు: సేవా కార్యక్రమాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ భాగస్వాములు కావాలని జిల్లా కార్యదర్శి విజయకుమార్ పేర్కొన్నారు. పుత్తూరు కామ్‌రాజ్ నగర్‌లోని స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యాలయ ఆవరణలో ఫౌండేషన్ డేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో పలు జిల్లాలో ప్రాంతాల వారీగా అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో ఫ్లాగ్‌డే నిర్వహించాలని సూచిస్తున్నామని తెలిపారు. జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు, స్కౌట్ మాస్టర్లు జయప్రకాష్, హరి, అశోక్‌కుమార్, జయకుమార్, రేంజర్స్ లీడర్స్ శైలజ, యువశ్రీ, మేఘన, స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: కల్లూరుపల్లెకు చెందిన మొగిలీశ్వర్ జేకేసత్రం నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా పలమనేరు నుంచి చిత్తూరు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనదారుడు చిత్తూరు-పలమనేరు లోని జేకేసత్రం సమీపంలో మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో మొగిలీశ్వర్‌కు తీవ్రగాయాలవడంతో వేలూరు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లు

నగరి, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయ రైతులకు అవసరమైన పప్పుదినుసుల కిట్లు సిద్ధం చేస్తున్నామని నియోజకవర్గ ప్రకృతి వ్యవసాయ శిక్షకుడు చంద్రశేఖర్ తెలిపారు. ఒక మండలంలో 145 మంది రైతులకు కిట్లు అందిస్తున్నామని, ఈ కిట్‌లో మినుములు, సజ్జలు, రాగులు, పెసర, అలసందలు, కొర్రలు, మొక్కజొన్న, కూరగాయల విత్తనాలు, జనుము, జీలుగ వెరసి 25 రకాలు ఉంటాయన్నారు. ప్రస్తుతం వేరుసెనగ, నువ్వులు సాగు చేసే రైతులు అంతర పంటలుగా సాగు చేయవచ్చని వివరించారు.

సాంబశివాచారి మృతికి పలువురి సంతాపం

కార్వేటినగరం: ఆర్‌కేవీబీపేటకు చెందిన పాత్రికేయుడు సాంబశివాచారి(48) మృతికి పలువురు ప్రముఖులు ఆదివారం సంతాపం వ్యక్తం చేశారు. మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, మాజీ ఎంపీపీ జగ్గన్నరాజు, తెదేపా మండల అధ్యక్షుడు భరణియాదవ్, తెదేపా నాయకులు నిధి, రాజేంద్రరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యులు దేవకి ఆయన మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బరిలో నిలిచి.. సత్తా చాటి

● ఆట ఏదైనా వారిదే పైచేయి ● జాతీయ స్థాయిలో రాణింపే లక్ష్యం

న్యూస్‌టుడే, చిత్తూరు గ్రామీణ

గెలుపునకు పేదరికం అడ్డుకాదు.. అలుపెరగని పయనమే ముఖ్యమనే మనసు వారిది.. జీవితంలో ముందుకు సాగాలంటే అంకిత దీక్షతో చదువు, క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే తపన, మనోధైర్యం వారి సొంతం.. అదే స్ఫూర్తితో చదువుల్లో రాణిస్తూ క్రీడల్లో పతకాల వేట సాగిస్తున్నారు.. వారే తుమ్మింద ఉన్నత పాఠశాల విద్యార్థులు.

దేశ గౌరవం నిలబెడతా..



మాది తుమ్మింద గ్రామం. అమ్మ, నాన్న పడే కష్టాలు చూసి ఎదిగాను. ఏదైనా సాధించాలనే ఉద్దేశంతో పరుగు పందెం అంటే ఇష్టం. గెలుపోటములతో పని లేకుండా పాఠశాలలో జరిగే అన్ని పోటీల్లో పాల్గొనేదాన్ని. హెచ్‌ఎం సుజాత, పీడీ కృష్ణ చొరవతో పరుగు పందెం, లెజరన్ క్రీడల్లో శిక్షణ తీసుకున్నా. పాఠశాల, జిల్లా స్థాయిలో లెజరన్, పరుగు పోటీల్లో బహుమతులు గెలిచా. ప్రస్తుతం పతకాలు అందుకున్నా. ఇటీవల రాష్ట్ర స్థాయి లెజరన్ పోటీల్లో వెండి పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యా. దేశ గౌరవాన్ని నిలబెట్టడమే ఆశయం.

- పవిత్ర, పదో తరగతి

పోలీసు కావాలనేది నా కల..

మాది తుమ్మింద పంచాయతీ చెన్నసముద్రం. చిన్నతనంలోనే నాన్న మరణించారు. అమ్మ రాజేశ్వరి కూలీ, కష్టపడి చదివిస్తున్నారు. పరుగు పందెం, స్కేటింగ్, సాఫ్ట్‌బాల్ అంటే ఇష్టం. పాఠశాల, మండల, జిల్లా స్థాయి పరుగు పందెం, స్కేటింగ్, సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రశంసాపత్రాలు, బహుమతులు అందుకున్నా. జిల్లా స్థాయి లెజరన్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికై చక్కటి ప్రతిభ చూపి పతకం సాధించా. బాగా చదివి పోలీసు ఉద్యోగం సాధించి అమ్మను బాగా చూసుకుంటా.

- ధనుష్, తొమ్మిదో తరగతి

ఇంజినీరుగా ఎదగాలి..

మాది తుమ్మింద పంచాయతీ చెన్నసముద్రం. అమ్మ సుమలత, నాన్న బాలకృష్ణ దినసరి కూలీలు. బాగా చదివి వారి కళ్లలో ఆనందం చూసేందుకు ప్రాథమిక దశ నుంచే కష్టపడి చదువుతున్నా. చదువు, పరుగు పందెం, జూడో కరాటేలో సాధన చేస్తున్నా. నియోజకవర్గం, జిల్లా స్థాయి పరుగు పందెం, జూడో కరాటే పోటీల్లో ప్రశంసాపత్రాలు అందుకున్నా. ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి జూడో కరాటే పోటీల్లో ప్రతిభ చూపా. ఇంజినీరు కావాలనేది లక్ష్యం.

- సౌమ్య, పదో తరగతి

జాతీయ క్రీడాకారిణి అవుతా..



మాది తుమ్మింద. నాన్న దండపాణి మెకానిక్, అమ్మ సుగుణ కూలీ. పరుగు పందెం, హైజంప్, జూడో కరాటే ఇష్టం. పాఠశాల, మండల, జిల్లా స్థాయి పోటీల్లో పరుగు పందెం, బహుమతులు సాధించా. హైజంప్‌లో ప్రశంసాపత్రాలు అందుకున్నా. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి జూడో కరాటే పోటీల్లో రాణించి బహుమతి అందుకున్నా. గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపా. జాతీయ స్థాయిలో క్రీడాకారిణిగా రాణించాలనేదే లక్ష్యం.

- ఇందుప్రియ, తొమ్మిదో తరగతి

'పుత్తూరును అభివృద్ధి చేసిన ఘనత రోజాదే'

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరును అభివృద్ధి చేసిన ఘనత మాజీ మంత్రి రోజాకే దక్కుతుందని మున్సిపల్ ఛైర్మన్ హరి, వైస్ ఛైర్మన్ జయప్రకాష్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పురపాలికలో ఏడు సమావేశాల్లో సభ్యులు ఆమోదించిన రూ.90 లక్షల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే భానుప్రకాష్ ఆదేశాలతోనే కమిషనర్ మంజునాథగౌడ్ అడ్డుకున్నారన్నారు. బీడీఎస్, ఎల్ఆర్‌ఎస్ ద్వారా వచ్చిన రూ.2 కోట్ల నిధులు తెదేపా నాయకులు జేబులు నింపుకోవడానికేనని, దీన్ని తమ పాలకవర్గం అడ్డుకుందన్నారు. మాజీ మంత్రి రోజా మున్సిపల్ కార్యాలయ భవనం, మున్సిపల్ పార్క్, పార్కు, పౌరమహల్, ఎలక్ట్రిక్ క్రిమేషన్ షెడ్డు, పాలిటెక్నిక్ కళాశాల, రెండు అర్బన్ హెల్త్‌కేంద్రాలు నిర్మించారన్నారు. భానుప్రకాష్.. ఎమ్మెల్యేగా గెలిచాక తన తండ్రి ముద్దుకృష్ణమ నాయుడి విగ్రహం ఏర్పాటు తప్ప మరొకటి చేయలేదన్నారు. కౌన్సిలర్లు భువనబ్రహ్మణ్యం, ఏకాంబరం, బాలాజీ, వైకాపా నాయకులు గాంధీ, భరత్, దిలీప్ పాల్గొన్నారు.

ఈ-ఆటో సద్వినియోగం చేసుకోవాలి

పాలసముద్రం: పీఎంఏవై పథకం కింద గ్రామ పంచాయతీకి అందించిన ఈ-ఆటోతో చెత్త తరలింపును అవకాశంగా పరిశుభ్రంగా చూసుకోవాలని ఉంచి పరిశుభ్రంగా చూసుకోవాలని ఎంపీడీవో సతీష్‌రాజు తెలిపారు. తిరుమలరాజులపురం పంచాయతీకి ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామ యోజన పథకం కింద ఈ-ఆటోను అందించారు. ఈ-ఆటోను డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ సర్పంచి భాస్కర్‌కు అందజేశారు.

పాఠశాలల బస్సులు తనిఖీ చేయించుకోండి

నగరి, న్యూస్‌టుడే: ఈ నెల 10వ తేదీ లోగా పాఠశాలలు, కళాశాలల బస్సులు తనిఖీ చేయించుకోవాలని మోటార్ వాహనాల ఇన్‌స్పెక్టర్ వాసుదేవరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ప్రైవేటు విద్యాసంస్థ విధిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని, ప్రమాదరహిత రవాణా లక్ష్యంగా విద్యార్థులను తరలించే బస్సులు సీజ్ చేస్తామని, పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

స్పందించారు.. పరిష్కరించారు

నగరి, న్యూస్‌టుడే: మాంగాడులో తాగునీటి సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరిప్రసాద్ స్పందించారు. గ్రామానికి వెళ్లి గేట్‌వాల్వ్ ఏర్పాటు చేయించారు.

శుభ్రత పనులు

కుశస్థలి నది ఒడ్డున ఉన్న పార్కు చుట్టూ పనికిరాని మొక్కలు పెరిగిపోయిన సమస్యపై అధికారులు స్పందించి పొక్లెయిన్ సాయంతో శుభ్రం చేయించారు.

చెత్తకుప్ప తొలగింపు

ఎన్టీఆర్ కాలనీ ఎక్స్‌టెన్షన్‌లో చెత్తకుప్ప తొలగించాలని స్థానికుల సమాచారంతో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ మంజునాథగౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మోహనకృష్ణ తమ సిబ్బందితో వాటిని తొలగింపజేశారు. ● కేవీనాయుడు లేఅవుట్ పక్కన పుత్తూరు-నగరి మార్గంలో పిచ్చి మొక్కలు తొలగించకపోవడంతో వాహనదారులకు కదలని సమస్యపై స్పందించి మున్సిపల్ కమిషనర్ మంజునాథగౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మోహనకృష్ణ జేసీబీ సాయంతో తొలగింపజేశారు. - న్యూస్‌టుడే, పుత్తూరు

ప్రమాదకర గుంత పూడ్చివేత

చిత్తూరు-బలిజకండ్రిగ ప్రధాన రహదారి ఎల్‌ఎన్‌పురం గ్రామం వద్ద కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న గుంతను జేసీబీతో ఆర్‌అండ్‌బీ ఏఈ ఆదికేశవులు నాయుడ్ ఆదేశాల మేరకు సరిచేశారు. నగరి ఆర్డీవో భవానీ, ఎంపీడీవో సతీష్‌రాజు, ఆర్‌అండ్‌బీ ఏఈ దృష్టికి సమస్య తీసుకెళ్లగా స్పందించి యంత్రాల సాయంతో గుంత పూడ్చించారు. - న్యూస్‌టుడే, పాలసముద్రం

(c) eenadu

పలమనేరు
•పలమనేరు •కుప్పం •పుంగనూరు

పతకాలు, ప్రశంసా పత్రాలతో విద్యార్థినులు

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన విద్యార్థులు పవిత్ర, శ్రేష్ఠ, జుహ పాతిమాలు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభను ప్రదర్శించారని కరాటే మాస్టరు, కరాటే అసోసియేషన్ ప్రెసిడెంట్ మహేష్ తెలిపారు. ఆదివారం బెంగళూరులో జరిగిన చాముండి ఇండోర్ స్టేడియంలో జరిగిన 28వ అఖిల భారత షిటోరియో కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించారన్నారు. విజేతలను రాష్ట్ర కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్ కుమార్ అభినందించారు.

అలరించిన నృత్య ప్రదర్శన

శాంతిపురం, న్యూస్‌టుడే: స్థానిక పరమహంస యోగానంద విద్యాలయంలో ఆదివారం నృత్య పోటీలను నిర్వహించారు. బైరెడ్డిపల్లెకు చెందిన కళా తరంగిణి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారికి వారికి ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్ బహుమతులు అందజేశారు.

బాలికల నృత్య ప్రదర్శన

పాఠశాల అభివృద్ధికి చర్యలు

రొంపిచెర్ల, న్యూస్‌టుడే: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని పుంగనూరు తెదేపా ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పాఠశాలను సందర్శించారు. సమస్యలు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పాఠశాల కమిటీ సభ్యులు, సర్పంచి ఇబ్రహీంఖాన్‌తో చర్చించారు. వారు పాఠశాల ఆవరణలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి నీరు లీకవుతోందని ఆయన దృష్టికి తెచ్చారు. పారిశ్రామికవేత్త సురేంద్రబాబు, పలువురు మండల తెదేపా నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల కమిటీ సభ్యులు, సర్పంచితో చర్చిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

కుప్పం ప్రజల అభ్యున్నతే సీఎం లక్ష్యం

రామకుప్పం, న్యూస్‌టుడే: కుప్పం ప్రజల అభ్యున్నతే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, గ్రంథాలయ రాష్ట్ర డైరెక్టర్ మునస్వామి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఆనిగానూరు, బల్ల, ఉన్సిగానిపల్లి, విజలాపురం గ్రామపంచాయతీల్లో సమన్వయ కమిటీలతో సమావేశాలు నిర్వహించారు. నియోజకవర్గంలో ఎప్పుడూ లేని విధంగా చంద్రబాబు ఒక సంక్షేమం, మరోవైపు అభివృద్ధి చేపడుతున్నారన్నారు. వెంకటరమణ, ఆంజనేయరెడ్డి, ఆనందరెడ్డి, నేతలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

శస్త్రచికిత్సకు ఎంపికైన వారితో మహతి ఫౌండేషన్ నిర్వాహకులు

48 మందికి నేత్ర పరీక్షలు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం మహతి ఫౌండేషన్ సహకారంతో కుప్పం పీఈఎస్ ఆసుపత్రి వైద్య నిపుణుల ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్య నిపుణులు శృతి, శ్రీనివాస్ 48 మందికి నేత్ర పరీక్షలు చేసి, 14 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. సంస్థ అధ్యక్షుడు నాగరాజు ఉచిత భోజన వసతి కల్పించారు. శాంతమ్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వర్షం కురిసినా.. నిండని చెరువులు

✦ ప్రశ్నార్థకంగా మారిన సాగు

పుంగనూరు, న్యూస్‌టుడే: వర్షాలు కురిసినా నియోజకవర్గంలో కుంటలు, చెరువులు నిండని మండలాలే ఎక్కువగా ఉన్నాయి. పుంగనూరు, చౌడేపల్లె, పులిచెర్ల, రొంపిచెర్ల, సోమల, సదుం మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైనా పాతిక శాతం చెరువులే నిండాయని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

మారిన రూపురేఖలు

మెట్ట ప్రాంతమైన పుంగనూరు నియోజకవర్గంలో తుపానుతోనే చెరువులు, కుంటల్లోకి కొద్దిపాటి నీరు చేరింది. నియోజకవర్గంలో 2015 నవంబరులో మాత్రమే వంద శాతం చెరువులు నిండాయి. ఆ తర్వాత నియోజకవర్గంలో పాతిక శాతం చెరువులు, కుంటల్లో నీరు చేరలేదు. రానున్న వేసవిలో తాగు నీటి ఎద్దడి నెలకొనే అవకాశం ఉంది. చెరువులు, కుంటలు, కాలువలు ముళ్లపొదలతో అడవులుగా దర్శనమిస్తున్నాయి. పలు చెరువులు, కుంటలు రూపురేఖలు మారిపోయాయి. సప్లయ్ ఛానల్స్ రూపుకోల్పోయాయి. కుప్పం నియోజకవర్గంలో హంద్రీ-నీవా కాలువ ద్వారా చెరువులు నింపుతున్నారు. పలమనేరులో వర్షాలతో సింహభాగం చెరువులు నిండిపోయాయి. పుంగనూరు నియోజకవర్గంలో 1,277 చెరువులు, కుంటల కింద 17,900 హెక్టార్లు సాగు కావాల్సి ఉంది. అక్కడక్కడ చిన్న కుంటలు నిండటం, బోర్లు ఉన్న రైతన్నలు సుమారు 2220 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు.

మేలుపట్ల చెరువులోకి నామమాత్రంగా చేరిన నీరు

నియోజకవర్గంలో వివిధ స్థాయిల్లో నిండిన చెరువుల వివరాలు ఇలా ఉన్నాయి.

వివరాలిలా (% శాతం)..

మండలం	మొత్తం	100%	75%	50%	25%
పుంగనూరు	229	40	50	89	50
చౌడేపల్లె	246	65	60	70	51
సోమల	173	60	50	50	13
సదుం	296	70	75	92	59
పులిచర్ల	193	70	80	35	8
రొంపిచెర్ల	140	45	55	20	20

ఎప్పటికప్పుడు వివరాల సేకరణ

నియోజకవర్గంలో కుంటలు, చెరువులు గండి పడకుండా, తెగిపోకుండా అప్రమత్తంగా ఉన్నాం. స్థానిక సాగునీటి సంఘాలు, ఆయకట్టు ద్వారా ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తున్నాం. వంకలు, వాగులు లేని చెరువులకు కృష్ణా జలాలు వదిలాం.

- రాయల్ రాజేంద్ర బాబు, డీఈఈ, జలవనరుల శాఖ, పుంగనూరు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే : సమస్య: మాగాండ్లపల్లి పంచాయతీ ఏడూరు గ్రామంలోని కాలువలు శుభ్రం చేయాలి. – సుబ్రహ్మణ్యం ఏడూరు

సమాధానం: కాలువలను శుభ్రం చేసి మురుగు తొలగిస్తాం. – బాషా, పంచాయతీ కార్యదర్శి

పలమనేరు, న్యూస్‌టుడే: సమస్య: బయప్పగారిపల్లె గ్రామంలో మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. – కోటేశ్వరన్, బయప్పగారిపల్లె

సమాధానం: పంచాయతీ సిబ్బందిని పంపి కాలువలను శుభ్రం చేయిస్తాం. – భాస్కర్, ఎంపీడీవో, పలమనేరు

సమస్య: బొరుగుల బట్టి వీధిలో రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు పెరిగి దోమలు పెరిగిపోయాయి. – ప్రదీప్, పలమనేరు

సమాధానం: సిబ్బందిని పంపి పిచ్చి మొక్కలను తొలగిస్తాం. – ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్

శాంతిపురం, న్యూస్‌టుడే: సమస్య: కొలమడుగు పంచాయతీ రెడ్లపల్లెలో వీధి కుళాయిలు దెబ్బతినడంతో తాగునీరు వృథా అవుతోంది. – శివప్ప, స్థానికుడు

సమాధానం: కొత్తగా కుళాయిలను ఏర్పాటు చేసి నీటి వృథా అరికడతాం. – ఈశ్వరన్, డిప్యూటీ ఎంపీడీవో

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: కుప్పం ఆర్టీసీ డిపోలో ప్రయాణికులు సంప్రదించేందుకు ఏర్పాటు చేసిన ల్యాండ్ లైన్ పని చేయడం లేదు. – కుమార్, కుప్పం

సమాధానం: సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. – టీకే స్వామి, డిపో మేనేజర్

ఆలయం వద్ద విజయ సంకేతం చూపుతున్న మహిళలు, తెదేపా నాయకులు

కప్పు కొట్టాలని పూజలు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ప్రపంచకప్ కొట్టాలని కుప్పం గ్రామదేవత శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయంలో తెలుగు మహిళల ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో ఉదయం పూజలు చేశారు. ఆర్టీసీ రాష్ట్ర వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం, నాయకులు సత్యేంద్రశేఖర్, సుగుణమ్మ, తిరుమగల్, లయన్స్ క్లబ్ సలహాదారు మహేష్, క్రీడాకారుడు నితిన్, విద్యార్థులు ఉన్నారు.

మ్యాచ్ వీక్షణకు తెరల ఏర్పాటు

పుంగనూరు, న్యూస్‌టుడే: మహిళల ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌ను తిలకించేందుకు ఆదివారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. తెదేపా నాయకులు సీవీరెడ్డి, గిరిబాబు, మాధవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న వ్యక్తిగత, సామాజిక సమస్యలను పరిష్కరించడమే సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) లక్ష్యమని నియోజకవర్గ కార్యదర్శి ఆసిఫ్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్ధిక్, అన్వర్‌బాషా, మహ్మద్ చాంద్ బాషా, ఫయాజ్ పాల్గొన్నారు.

విలువలు లేని విద్య నిష్ప్రయోజనం

పలమనేరు, న్యూస్‌టుడే: విలువలు లేని విద్య నిష్ప్రయోజనమని విశ్వశ్రీ సాహితీ సమాఖ్య అధ్యక్షులు ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు అన్నారు. ఆదివారం పట్టణంలోని కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి 13వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో విలువలతో కూడిన రచనలు ఉంటాయన్నారు. తెలుగు సాహిత్యానికి సేవ చేస్తున్న తులసినాథం నాయుడు, పుష్పలను ఈ సందర్భంగా ఆహుతులు సన్మానించారు. వందకు పైగా పద్యాలు చెప్పిన 60 మంది విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. పైనేని మురళి, సీతారామయ్య, లత, చాణక్య, దామోదర నాయుడు పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో దామోదర నాయుడు

మైనార్టీ నేతల సత్కారం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: కడపసత్తం గ్రామానికి చెందిన హాజీ సయ్యద్ ఫక్రుద్దీన్, మైనార్టీ, తెదేపా నాయకులు ఆదివారం తెదేపా మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడను సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం కడపసత్తానికి చెందిన సయ్యద్ ఫక్రుద్దీన్‌ను వక్ఫ్ బోర్డు సభ్యునిగా నియమించడంతో మైనార్టీ నాయకులు, వక్ఫ్‌బోర్డు పెద్దలు కృతజ్ఞతలు తెలియజేశారు. సల్మాన్, బాదర్‌ఖాన్, ఇమామ్‌సాబ్, అరుణ్, మురళీధర్, దామోదర్ పాల్గొన్నారు.

కిశోర్‌గౌడను సత్కరిస్తున్న హాజీ సయ్యద్ ఫక్రుద్దీన్, మైనార్టీ నాయకులు

తాగునీటి వృథాకు అడ్డుకట్ట

స్పందనకు వందనం

సోమల, న్యూస్‌టుడే: కందూరు బస్టాండు ప్రాంతంలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయడానికి పలుచోట్ల గుంతలు తవ్వడంతో నీటి పైప్‌లైన్ పగిలి వృథాగా పోతుండటంతో మేమున్నాం మీకు తోడుగా ద్వారా ఆదివారం సమస్య ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి జయశంకర్ పైప్‌లైన్ మరమ్మతులకు చర్యలు తీసుకున్నారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

వాసు

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: రాగిమానుపెంట జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి వాసు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం నాగమణి తెలిపారు. గత నెల 30న అన్నమయ్య జిల్లా వాయల్పాడు మండలం కొత్తమందాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపి అండర్-17 నెట్‌బాల్ పోటీల్లో అర్హత సాధించారు. ఈ నెల ఎనిమిది తేదీన విజయవాడ పటమటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ విద్యార్థిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

కూలేందుకు సిద్ధం

కుప్పం- పలమనేరు జాతీయ రహదారి పక్కన ఎండిపోయిన చెట్టు రూపంలో ప్రమాదం పొంచి ఉందంటు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుడుపల్లె మండలం శెట్టిపల్లె సమీపంలో రోడ్డు పక్కన ఎండిన చెట్టు కూలేందుకు సిద్ధంగా ఉంది. రహదారి పక్కన హెచ్‌టీ, ఎల్‌టీ విద్యుత్తు లైన్లపై చెట్టు కూలితే ప్రమాద తీవ్రత ఊహకందని పరిస్థితి.

– న్యూస్‌టుడే, కుప్పం

ఇరుకు రోడ్డు.. ఆపై మట్టి దిబ్బలు

పట్టణంలోని మదనపల్లె రోడ్డు - కొత్తపేట రహదారి వరకు బాట ఇరుకుగా ఉంది. దీనికి తోడు రోడ్డుపై భవన శిథిలాలు వేయడంతో మరింత ఇరుకుగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఎదురుగా భారీ వాహనం వస్తే ఇంక అంతే సంగతులు. అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న రాళ్లు, మట్టి దిబ్బలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– న్యూస్‌టుడే, పుంగనూరు

కమ్మేసి.. మలుపుల్లో ఏమార్చి

పులిచెర్ల మండలంలో కల్లూరు- చిత్తూరుకు వెళ్లే జాతీయ రహదారి, కొమ్మిరెడ్డిగారిపల్లె, తానికొండవారిపల్లె- రాయవారిపల్లె రోడ్డు, కేకేపేట- భీమవరం మీదుగా తిరుపతికి వెళ్లే ప్రధాన రహదారి మార్గాల్లో పిచ్చి మొక్కలు రోడ్డును పూర్తిగా కమ్మేశాయి. తానికొండవారిపల్లె- రాయవారిపల్లె రోడ్డులోనూ ఇదే పరిస్థితి. మలుపుల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది.

– న్యూస్‌టుడే, కల్లూరు

ట్యాంకర్ల నీరే ఆధారం

పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో నీటికి స్థానికులు అవస్థలు పడుతున్నారు. దళవాయికొత్తపల్లె చెరువు నుంచి సరఫరా అవుతున్న నీరు వీధి కుళాయిలకు రావడం లేదు. మూడు రోజులకోసారి వచ్చే ట్యాంకర్ల నీటిని పట్టుకుంటున్నట్లు మహిళలు వాపోతున్నారు. దీనిపై కమిషనర్ శ్రీనివాసరావును వివరణ కోరగా, నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, కుప్పం పట్టణం



పక్కనున్న వాహనాలు వెళ్లేదెలా?

జాతీయ రహదారుల మీద భారీ వాహనాలు ఆపడానికి ప్రత్యేక స్థలాన్ని అక్కడక్కడ ఏర్పాటు చేసినా చోదకులు మాత్రం తమకు అనుకూలంగా ఉండే ప్రదేశాల్లో ఆపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. పలమనేరు- చిత్తూరు జాతీయ రహదారిలో బలిజపల్లె వద్ద ఇలా వాహనాలు రోడ్డు పక్కన నిత్యం కనిపిస్తున్నాయి. దీంతో మిగిలిన వాహనాలు వెళ్లడానికి స్థలం చాలడం లేదు.

– న్యూస్‌టుడే, పలమనేరు

కోటపల్లెలో ఏనుగుల దాడులు

కల్లూరు: పాకాల పంచాయతీలోని కోటపల్లెకు పొలాలపై 17 ఏనుగుల గుంపు దాడులు చేశాయి. కోటపల్లెకు చెందిన రఘు, వెంకట్రామయ్య, దామోదర్ నాయుడు, నరసింహుల మామిడి తోటల్లో పడ్డ ఏనుగుల గుంపు కొమ్మలను విరిచేసి బీభత్సం సృష్టించాయి. దీంతో చేతికొచ్చిన పంట నాశనం అయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మామిడి కొమ్మలు విరిచేసిన ఏనుగులు

పార్టీ బలోపేతానికి కమిటీల ఏర్పాటు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: వార్డు స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు హాఫీజ్ అన్నారు. పురపాలక పరిధిలోని శీగలపల్లెలో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. 1, 2, 3, 8వ వార్డు అధ్యక్షులుగా మునెప్ప, సంపత్, ప్రభాకర్, మూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మునిరాజు, మోహన్‌రామ్, మణి, రాజ్‌కుమార్ నాగరాజు ఉన్నారు.

మాట్లాడుతున్న మధుసూదన్ రాయల్

నిందారోపణలు తగవు

పుంగనూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఏ చిన్న ఘటన జరిగినా ప్రభుత్వంపై మోపడం, కూటమి నాయకులపై నిందారోపణలు చేయడం వైకాపా వారికి తగదని నియోజకవర్గ తెదేపా నాయకుడు మధుసూదన్ రాయల్ అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాట ఘటనను కూటమి ప్రభుత్వంపై మోపడం సమంజసం కాదన్నారు.

బోయకొండపై జంతు బలులు నివారించాలి

బోయకొండ(చౌడేపల్లె), న్యూస్‌టుడే: బోయకొండపై జంతు బలులు నివారించాలని భాజపా నాయకులు ఆదివారం ఆలయ ఈవో ఏకాంబరానికి వినతి పత్రం ఇచ్చారు. కొండపై జంతు బలులను హిందూ సాంప్రదాయ ప్రకారమే నిర్వహించాలని కోరారు. భాజపా జిల్లా కార్యదర్శి మాదాసు లోకేశ్, మండల అధ్యక్షుడు కడియాల మనోహర్, రాష్ట్ర కౌన్సిలర్ గంధోడి ప్రవీణ్, మల్లికా, సోమల, సదుం, పుంగనూరు మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

హరిబాబు (పాత చిత్రం)

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: వ్యవసాయ బోరు వద్ద విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన సంఘటన నేలపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నారాయణప్ప కుమారుడు హరిబాబు(36) ఆదివారం ఉదయం బోరు వద్దకు వెళ్లి మోటారు ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య హరిత ఫిర్యాదు మేరకు ఎస్సై మారప్ప కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సొసైటీతో సేవలు విస్తృతం

చిత్తూరు(సంతపేట): చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ద్వారా భవిష్యత్తులో విస్తృత సేవలు అందించనున్నామని సొసైటీ అధ్యక్షుడు తాండవమూర్తి తెలిపారు. స్థానిక మిట్టూరులోని రామాలయంలో ఆదివారం సొసైటీ సమావేశం నిర్వహించారు.

నాసిరకం పైపులు.. నిత్యం లీకులు

మండలంలోని దిగువపల్లె పంచాయతీ యానాదిపాళ్యంలో ట్యాంకు నుంచి ఇళ్లకు సరఫరా చేస్తూ వేసిన ప్రధాన పైపు లైన్ నాసిరకంగా అమర్చడంతో నిత్యం లీకేజీ సమస్య తలెత్తుతోంది. దీంతో కాలనీలు జలమయం అవుతున్నాయి. అధికారుల స్పందించి లీకేజీలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– న్యూస్‌టుడే, చౌడేపల్లె

బొడుక్కుంటలో వృద్ధురాలి ..

క్రైం కార్నర్

చౌడేపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని బొడుక్కుంటలో అనాథ వృద్ధురాలు మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు పెద్దకొండామరికి చెందిన లక్ష్మమ్మ(70) గత పదేళ్లుగా ఒంటరిగా జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం గ్రామం పక్కనే ఉన్న బొడుక్కుంటలో శవమై తేలింది. సమాచారం అందుకున్న సర్పంచి జయసుధ, భర్త నాగభూషణరెడ్డిలు పోలీసుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు.

అద్దెకు తీసుకున్నారు.. నిరుపయోగంగా మార్చారు

✦ శిథిలావస్థకు చేరిన పర్యాటక భవనం

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలో ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి గుత్తేదారులు పెద్ద భవనాన్ని అద్దెకు తీసుకొని నిరుపయోగంగా మార్చారు. గత వైకాపా ప్రభుత్వంలో హోటల్ నిర్వహించడానికి భవనాన్ని టెండరు ద్వారా దక్కించుకున్నారు.

నిరుపయోగంగా పర్యాటక భవనం

అక్కడ అలా.. ఇక్కడ ఇలా

భవనానికి మరమ్మతులు చేసి అత్యాధునికంగా మార్చి వ్యాపారాభివృద్ధి చేయాలనుకున్నారు. ప్రభుత్వం మారడంతో కొన్ని కారణాల వల్ల పనులు అర్ధాంతరంగా ఆపేశారు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరుతోంది. గతంలో గుత్తేదారులు కుప్పంలో కూడా కాంట్రాక్టు పొందారు. అక్కడ కూడా పనులు చేయకుండా వదిలేయడంతో స్థానిక నాయకుల ఒత్తిడితో ప్రస్తుతం ఆధునీకరణ పనులు చేస్తున్నారు. నగరిలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

ఆదాయానికి గండి

పలమనేరు పరిసరాల్లో కైగల్, కళ్యాణరేవుల వంటి జలపాతాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కుంకీ ఏనుగులను తెప్పించి ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. వీటిని చూడటానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వస్తున్నారు. పట్టణానికి సమీపంలోని హోటల్ భవనాన్ని ఆధునికీకరించి యాత్రికులకు గదులను అద్దెకు ఇస్తే ప్రభుత్వానికి మంచి ఆదాయం వస్తుంది. 2.5 ఎకరాల స్థలంలో ఉన్న హోటల్ వద్ద కల్యాణ మండపం కూడా నిర్మించాలనే ప్రతిపాదన ఉంది. ఇప్పుడు ఒక పెద్ద హాలు, 5 ప్రత్యేక గదులు ఎందుకు ఉపయోగం లేకుండా మారడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. గుత్తేదారులపై ఒత్తిడి తీసుకొచ్చి పనులు చేయిస్తే భవనం వినియోగంలోకి వచ్చి పర్యాటక కేంద్రంగా మారుతుంది.

పనులు చేయిస్తాం

ఇటీవల పర్యటించి భవనాన్ని పరిశీలించాం. గుత్తేదారులతో పనులు చేయించడానికి ప్రయత్నిస్తున్నాం.

- నరేంద్ర, జిల్లా టూరిజం కార్పొరేషన్ మేనేజర్

కళ్లెదుటే చెత్త.. కానరాని పరిశుభ్రత

రామకుప్పం మండలం ఉన్సిగానిపల్లె పంచాయతీ గోవిందపల్లెలో చెత్త సమస్య స్థానికులకు అసౌకర్యాన్ని కలిగిస్తోంది. విజలాపురం-కుప్పం ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్త దిబ్బల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకులు, అధికారులు వెంటనే స్పందించి పారిశుద్ధ్యంను మెరుగుపరచాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కుప్పం.

నేడు విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: చిత్తూరులోని జీవకారుణ్య అన్నదాన సమాజం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన 100 మంది మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాల రూపంలో రూ. 2.25 లక్షలు అందించనున్నట్లు ఈవో తిమ్మారెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం 3 గంటలకు సత్రంలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: కల్లూరుపల్లెకు చెందిన మొగిలీశ్వర కేజీసత్రం నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా పలమనేరు నుంచి చిత్తూరు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనదారుడు చిత్తూరు-పలమనేరులోని కేజీసత్రం సమీపంలో మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో మొగిలీశ్వరాకు తీవ్రగాయాలవడంతో వేలూరు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

బాలిక అపహరణపై కేసు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: బాలిక అపహరణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం మేరకు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను రేవంత్‌రెడ్డి గత నెల 29న కిడ్నాప్ చేశారు. బాలిక ఆచూకీ కోసం తలిదండ్రులు గాలించగా బెంగళూరులో ఉన్నట్లు గుర్తించారు. నిందితుడిని వారు పోలీసులకు అప్పగించారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

(c) eenadu

తెప్పోత్సవం.. వెంకన్న వైభవం

గోదావరిలో హంస వాహనంపై విహరిస్తున్న వెంకటేశ్వరుడు

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా ఆదివారం కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరుని తెప్పోత్సవం గౌతమి గోదావరిలో వైభవంగా సాగింది. ప్రధానాలయం నుంచి స్వామి, అమ్మవార్లను పల్లకీపై మేళతాళాల, బాణాసంచా కాల్పుల నడుమ నది వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉత్సవమూర్తులను సుందరంగా తీర్చిదిద్దిన వేదికపై ఆశీనులను చేసి అర్చకస్వాములు పూజలు చేశారు. తర్వాత గోదావరిలో హంస వాహనంపై విహరింప చేశారు. భక్తుల గోవింద నామస్మరణతో పరిసరాలు మార్మోగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు కార్యక్రమాన్ని తిలకించి పులకించారు. స్వామివారికి ఈవో నల్లం సూర్యచక్రధరరావు పట్టు వస్త్రాలు సమర్పించారు. దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంతులీనిన రత్నగిరి

స్వామి, అమ్మవార్లకు పూజలు

అన్నవరం: అన్నవరం సత్యనారాయణ స్వామి అనంత లక్ష్మీ సమేతుడై హంసవాహనంలో విహరించారు. స్వామివారి తెప్పోత్సవం ఆదివారం రాత్రి వేడుకగా జరిగింది. ఉత్సవమూర్తులను పల్లకీలో మెట్లమార్గంలో పంపా సరోవరం చెంతకు తెచ్చారు. వైదిక బృందం ఆధ్వర్యంలో తులసీధాత్రి పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు విద్యుత్తు కాంతులతో సుందరంగా తీర్చిదిద్దిన హంస వాహనంలో ఆశీనులను చేసి ఊరేగించారు.

గోదావరికి మళ్లీ వరద

పి.గన్నవరం, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా గోదావరి నదిలో మళ్లీ వరదనీరు ప్రవహిస్తోంది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్రంలోకి 3,17,612 క్యూసెక్కులు విడిచిపెట్టారు. దీంతో దిగువన వశిష్ఠ, గౌతమి, వృద్ధగౌతమి నదీపాయల్లో వరద ఉరవడి పెరిగింది. పి.గన్నవరం మండలం బూరుగులంక, బెల్లంపూడి రేవుల్లో నీటిమట్టాలు పెరగడంతో బూరుగులంక, అరిగెలవారిపేట, ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, ఆనగార్లంక, పెదమల్లంక గ్రామాల ప్రజలు నాటు, మరపడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. డొక్కా సీతమ్మ, కాటన్ అక్విడక్టుల మధ్య వైనతేయలో వరదనీరు ప్రవహిస్తోంది.

బూరుగులంకరేవులో నాటుపడవలో లంకగ్రామాల ప్రజల రాకపోకలు

సముద్రంలోకి ఇలా..

ధవళేశ్వరం ఆర్మ్ నుంచి 1,90,184, ర్యాలి నుంచి 52,407, మద్దూరు నుంచి 27,738, విజ్జేశ్వరం నుంచి 47,283 క్యూసెక్కులు సముద్రంలోకి విడిచిపెట్టారు. గత ఏడాది ఇదే రోజున 32,861 క్యూసెక్కులు విడిచిపెట్టారు.

తూర్పుడెల్టాకు..

మొంథా తుపాను కారణంగా ఖరీఫ్ వరిచేలు ముంపుబారిన పడకుండా గత నెల 26 నుంచి డెల్టాకు సాగునీటి సరఫరా పూర్తిగా నిలుపుదల చేశారు. ఆదివారం తూర్పుడెల్టాకు 2 వేలు క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టామని హెడ్‌వర్క్స్ జె.ఇ. డి.రాధాకృష్ణ తెలిపారు. మధ్య, పశ్చిమ డెల్టాలకు నిలిపివేత కొనసాగుతోందన్నారు.

'లెక్క' లేని ఖర్చు..!

పక్కదారి పట్టిన రూ.123.35 కోట్లు

ఈనాడు, అమలాపురం, న్యూస్‌టుడే, ముమ్మిడివరం: గ్రామ పాలనకు పునాదులు పంచాయతీలు. సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు చేర్చడంలో వీటి పాత్రే కీలకం. పంచాయతీకి ఆదాయం సమకూర్చాలన్నా.. నిధులు ఖర్చు చేసి వసతులు కల్పించాలన్నా నిర్ణయం చేసేది ఇక్కడే. కానీ కొందరు సిబ్బంది పని తీరుతో ప్రజల నుంచి వసూళ్లు చేస్తున్న పన్నుల్లో రూ.100 కోట్లకుపైగా పక్కదారి పట్టినట్లు ఆడిట్ శాఖ అభ్యంతరాలు ఎత్తిచూపుతున్నా ఎవరికీ పట్టడం లేదు.

గత అయిదేళ్లలో అభ్యంతరాలు ఇలా.. (నిధులు రూ.కోట్లలో..)

	పంచాయతీ		మండల పరిషత్తు	
సంవత్సరం	అభ్యంతరాలు	నిధులు	అభ్యంతరాలు	నిధులు
2019–20	7,919	12.30	384	4.78
2020–21	9,469	30.43	372	5.71
2021–22	9,236	20.31	360	3.43
2022–23	9,790	13.46	413	4.13
2023–24	11,649	26.53	482	2.26

పర్యవేక్షణ కొరవడి..

డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 385 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆర్థిక సంఘం నిధులతో పాటు ప్రజల నుంచి పన్నుల ద్వారా రూ.కోట్లలో వీటికి సమకూరుతాయి. ఈ నిధులను తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్తు తదితర అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సి ఉంది. దీనికి భిన్నంగా కొందరు సొంతానికి వినియోగించుకున్నట్లు ఆడిట్ శాఖ గుర్తించింది. పంచాయతీపై సమగ్ర పర్యవేక్షణ, అభ్యంతరాలపై విచారణ లేకపోవడంతో అక్రమార్కుల ఆటలు సాగుతూనే ఉన్నాయి.

మచ్చుకు కొన్ని..

- గత ఆర్థిక సంవత్సరంలో 385 పంచాయతీల్లో 11,649 అభ్యంతరాలు గుర్తించి రూ.26.52 కోట్లకు సరైన లెక్కలు లేవని తేల్చారు. అయిదేళ్లలో రూ.103.02 కోట్లు దుర్వినియోగమైనట్లు గుర్తించారు.
- మండల పరిషత్తుల్లో 2011 అభ్యంతరాలకుగాను 20.31 కోట్లు మేర చూపిన లెక్కలకు సరైన ఆధారాలు లేవు.
- కాట్రేనికోన మండలం చెయ్యేరు పంచాయతీలో 2023-24లో రూ.10 లక్షలు మేర సరైన లెక్కలు చూపలేదు. ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి ఖర్చులకు బిల్లులు లేవు.
- ఆలమూరు మండలం చొప్పెల్ల పంచాయతీలో రూ.6 లక్షలు మేర అక్రమాలు చోటు చేసుకున్నాయి. పన్నేతర నిధులు, లైసెన్సు ఫీజులకు సంబంధించి వసూళ్ల దస్త్రాల్లో లేవు.
- అంబాజీపేట మండలం కె.పెదపూడిలో రూ.3.50 లక్షలు నిధులు ఖర్చులకు సరైన ఆధారాలు లేవు.

గూడు గోడు విన్నారు..!

న్యూస్‌టుడే, పి.గన్నవరం

పేదలకు పక్కాఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పీఎంఏవై (ప్రధాన మంత్రి ఆవాస్ యోజన) అర్బన్, గ్రామీణ పథకాలుగా పక్కాఇళ్ల నిర్మాణాలు చేపట్టనుంది. ప్రస్తుతం జిల్లాలో 22 మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో సర్వే కొనసాగుతోంది. ఈ నెల 5తో సర్వే పూర్తికావాల్సి ఉండగా సిబ్బంది తుపాను విధుల్లో పాల్గొనడంతో అంతరాయం ఏర్పడింది. పట్టణాలకు సంబంధించి అమలాపురంలో 150, మండపేటలో 59, రామచంద్రాపురంలో 77, ముమ్మిడివరం నగరపంచాయతీలో 189 చొప్పున మొత్తం 475 మంది లబ్ధిదారులను గుర్తించారు. వీరికి త్వరలో మంజూరు ఉత్తర్వులు ఇవ్వనున్నారు. ఒక్కో ఇంటికి కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష చొప్పున మొత్తం రూ.2.50 లక్షలు ఇస్తాయి. దీంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

పరిశీలన

కె.ఏనుగుపల్లిలో పూరింటిని పరిశీలిస్తున్న పీడీ నర్సింహారావు

జియో ట్యాగింగ్..

గ్రామీణ ప్రాంతానికి సంబంధించి రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ వెబ్‌సైట్‌లో జిల్లాలో 14,477 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఎంతమంది ఇళ్లు నిర్మించుకుంటారు, వారికి నివేశన స్థలాలు ఉన్నాయా లేదా అనే అంశాలపై సర్వే చేస్తున్నారు. ప్రస్తుతం ఉంటున్న నివాసంతోపాటు, కొత్తగా నిర్మించుకునే ఇంటికి సంబంధించి స్థలాన్ని జియో ట్యాగింగ్ చేస్తున్నారు. వీరికి పీఎంఏవై గ్రామీణ కింద పక్కా ఇళ్లు మంజూరు చేస్తారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.1.50 లక్షలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా కొంత మొత్తం కలిపి యూనిట్ విలువను నిర్ణయిస్తుంది.

నియోజకవర్గాల వారీ వివరాలు..

నియోజకవర్గం	దరఖాస్తు దారులు	పూర్తయిన సర్వే
అమలాపురం	2,812	248
రాజోలు	1,493	707
ముమ్మిడివరం	2,805	293
పి.గన్నవరం	2,868	254
కొత్తపేట	2,442	163
మండపేట	735	447
రామచంద్రపురం	1,332	93

త్వరలో పూర్తి..

పీఎంఏవై అర్బన్ పథకానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది. గ్రామీణ పథకానికి సంబంధించి సర్వే త్వరలోనే పూర్తవుతుంది. లబ్ధిదారుల వివరాలను కేంద్ర ప్రభుత్వ పీఎంఏవై వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నాం.

- ఏవీ నర్సింహారావు, ప్రాజెక్టు డైరెక్టర్, బలహీన వర్గాల గృహనిర్మాణ సంస్థ

బీమా నీడలో ఉన్నారా..?

తక్కువ ప్రీమియంతో కుటుంబానికి అండ

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ఇంట్లో పెద్దకు అనుకోని ప్రమాదం జరిగినా.. ఆకస్మిక మరణం సంభవించినా.. ఆ కుటుంబం రోడ్డున పడుతుంది. కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన(పీఎంజేజేవై), ప్రధాన మంత్రి సురక్ష యోజన బీమా (పీఎంఎస్‌బీవై) పథకాలు పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయి. వీటిని సద్వినియోగం చేసుకోవడంలో జిల్లాలో వెనకబాటు కనిపిస్తోంది.

- ముమ్మిడివరం మండలం అన్నంపల్లి వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృత్యువాత పడ్డారు. ఆమె ఓ బ్యాంకులో వార్షిక ప్రీమియం రూ.500 చెల్లించడంతో బీమా సౌకర్యం వర్తించింది. కుటుంబ సభ్యులకు రూ.10 లక్షలు బీమా పరిహారం అందజేశారు.
- ముమ్మిడివరానికి చెందిన ఓ వ్యక్తి రోజువారీ కూలి పనులకు వెళ్లి ఐ.పోలవరం మండలం ఎదుర్లంక వద్ద రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. అతనికి బ్యాంకు ఖాతా ఉన్నా.. బీమా సౌకర్యం లేదు. ఆ కుటుంబానికి బీమా పరిహారం అందలేదు.

జిల్లాలో బ్యాంకు శాఖలు: 307

జన్‌ధన్ ఖాతాల సంఖ్య: 6,05,313

ఆధార్ అనుసంధానమైవి: 4,74,029

బీపీఎల్ కుటుంబాలకు ఆసరా..

జిల్లాలో సుమారు 5.64 లక్షల కుటుంబాల్లో 12.50 లక్షలకు పైగా అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారు. గతంలో చంద్రన్న బీమా పేరుతో తెదేపా ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించి సాధారణ మరణానికి రూ.లక్ష, ప్రమాదాల్లో మృతి చెందిన వారికి రూ.5 లక్షలు పరిహారం అందజేసేవారు. వైకాపా పాలనలో దీనిని రద్దు చేశారు.

వయసుల వారీగా

కేంద్రం గతంలో జన్‌ధన్ ఖాతాలను తీసుకువచ్చింది. జిల్లాలో 6.05 లక్షలు జన్‌ధన్ ఖాతాలు ఉండగా. వీటిలో నేటికీ 1.50 లక్షల ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాలేదు. పీఎంజేజేవై పథకంలో ఏడాదికి రూ.436 ప్రీమియంతో బీమా సౌకర్యం కల్పిస్తోంది. 18-70 ఏళ్ల వయసు కలిగిన వారికి సాధారణ, ప్రమాద మరణాలకు రూ.2 లక్షలు పరిహారం అందజేస్తారు. అసంఘటిత రంగ కార్మికులకు రూ.20తో పీఎఎస్‌బీవైలో రూ.2 లక్షలు ప్రమాద బీమాకు అవకాశం కల్పిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..

బ్యాంకుల్లో ఖాతాదారులకు బీమా సౌకర్యాలపై అవగాహన కల్పిస్తున్నారు. అసంఘటిత రంగ కార్మికులకు పీఎంఎస్‌బీవైలో రూ.20కే బీమా ప్రమాద సౌకర్యం ఉంది. కార్మికులు వినియోగించుకోవాలి. బీమా పథకంలో నమోదైన వారు పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటాం. **-కేశవవర్మ, ఎల్‌డీఎం, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా**

బీమా వివరాలు ఇలా..

బీమా పథకం	నమోదైనవారు	పునరుద్ధరణ
పీఎంజేజేబీవై	3,35,702	2,60,337
పీఎంఎస్‌బీవై	8,63,132	8,12,204

ఆహా ఏమి రుచి.. తినరా మైమరిచి..!

ఉభయ రాష్ట్రాల్లోనూ పొట్టిక్కల ఫలహారశాలలు

మన ప్రత్యేకం

న్యూస్‌టుడే, అంబాజీపేట

వేడి వేడి పొట్టిక్కలను కొబ్బరి, కారంపోడి, నెయ్యితో కలిపి తింటే ఆ రుచే వేరు. ఒకప్పుడు అంబాజీపేటకే పరిమితమైన ఇవి ఇప్పుడు ఉభయ రాష్ట్రాల్లోనూ ప్రత్యేకత చాటుతున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట పొట్టిక్కలకు పుట్టిల్లు. ☛ 60 ఏళ్ల కిందట పోలాలమ్మతల్లికి పనస ఆకులతో నైవేద్యంగా సమర్పించారు. దీంతో అప్పటి నుంచి క్రమక్రమంగా ఇది పొట్టిక్కలుగా ఖ్యాతినొందింది. ఉభయ గోదావరి జిల్లాలో వీటికి ప్రత్యేక స్థానం ఉంది.

పనస ఆకుల్లో పొట్టిక్కలు

జోరుగా ఎగుమతులు

కోనసీమ, అల్లూరి జిల్లాల్లో విరివిగా దొరికే పనసచెట్టు ఆకులను సేకరించి తెలుగురాష్ట్రాలకు కూడా ఎగుమతులు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకించి పొట్టిక్కల ఫలహారశాలలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇడ్లీ పిండిని పనస ఆకుల్లో బుట్టలుగా తయారు చేసి ఇడ్లీపాత్రలో ఆవిరిపై ఉడికిస్తారు. వివాహాదీ శుభకార్యక్రమాలతో పాటు మిగిలిన వేడుకల్లోనూ ఉభయగోదావరి జిల్లాలో అల్పాహారంగా ఉండి తీరాల్సిందే.

ఆసక్తి చూపుతున్న ప్రముఖులు

అంబాజీపేటకు వచ్చిన సినీ, రాజకీయ ప్రముఖులు ఇక్కడి పొట్టిక్కలను రుచి చూడకుండా వెళ్లరు. ప్రముఖనటుడు తనికెళ్ల భరణి అంబాజీపేట వైపు వస్తే తప్పని సరిగా వీటిని అడుగుతారు.

ఆరోగ్యానికి దోహదం

పనస ఆకుల్లో పొట్టిక్కలు ఆరోగ్యపరంగా మంచివి. మధుమేహ నియంత్రణకు ఇది ఉపయోగపడుతుంది. గాయాలైనప్పుడు ఈ ఆకుల రసాలను రాస్తే తగ్గుతుంది. క్యాన్సర్ కణాలను తగ్గించేందుకు ఇవి ఉపకరిస్తాయి. రోగనిరోధకశక్తిని పెంచుతుంది. బ్యాక్టీరియా, ఫంగస్ వల్ల వ్యాధులను నివారించేందుకు ఉపయోగపడతాయి. చర్మవ్యాధులను కూడా నియంత్రించేందుకు ఉపయోగపడుతుంది.

- బి.శ్యామ్ సుందర్, ఆయుర్వేద వైద్యుడు, అంబాజీపేట

సంధ్యరంగుల కుంచె.. మది పులకించె

సంధ్యా సమయంలో పచ్చనికొబ్బరి చెట్లు వెనుక ఆకాశం ఎరుపెక్కింది. అరుణకాంతుల మధ్య సూర్యబింబం పడమటి నుదుటున బొట్టులా దర్శనమిచ్చింది. అయినవిల్లి మండలం నేదునూరులో ఆదివారం సాయంత్రం 6.20 గంటలకు కనువిందు చేసిన దృశ్యమిది. **-న్యూస్‌టుడే, కోనసీమ**

ట్రావెల్ బస్ సీజ్

ముమ్మిడివరం: భద్రతా ప్రమాణాలు పాటించని ప్రైవేటు ట్రావెల్ బస్సులను సీజ్ చేస్తామని జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు హెచ్చరించారు. ముమ్మిడివరం మండలం అన్నంపల్లి టోల్ ప్లాజా వద్ద ప్రైవేటు ట్రావెల్ బస్సులను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జయంతి ట్రావెల్ బస్సును సీజ్‌చేసి ఫిట్‌నెస్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. జిల్లాలో గత నెలలో 57 బస్సులను తనిఖీ చేసి భద్రతా ప్రమాణాలు పాటించని 8 బస్సులను సీజ్ చేసి వాటి ఫిట్‌నెస్ రద్దు చేశామన్నారు. ప్రతి ట్రావెల్ బస్సు భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. సాధారణ వేగంతో ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చాలని ఆయన డ్రైవర్లకు సూచించారు. తనిఖీల్లో ఎంవీఐలు రవికుమార్, జ్యోతిసురేష్, కౌశిక్ పాల్గొన్నారు.

బండ పీత..!



కాకినాడ కుంభాభిషేకం రేవులో ఆదివారం పలు రకాల చేపలతో పాటు మండ పీతలు అమ్మకానికి వచ్చాయి. తుపాను కారణంగా రేవులో అయిదు రోజులపాటు అమ్మకాలు నిలిచిపోయాయి. రెండు రోజులుగా మళ్లీ చేపల అమ్మకాలు జోరందుకున్నాయి. అర కేజీ నుంచి కేజీకిపైగా బరువున్న మండ పీతలు రాగా ఆదివారం ఆయా పీతలు రూ.1000 నుంచి రూ.1500 వరకు ధర పలికాయని మత్స్యకారులు తెలిపారు. **- న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)**

బ్యారేజీ వద్ద బురద తొలగింపు ప్రక్రియ వాయిదా

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఎగువన భారీ వర్షాలు కురవడంతో గోదావరికి వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ కారణంగా కాటన్ బ్యారేజీ వద్ద సోమవారం చేపట్టాల్సిన బురద తొలగింపు ప్రక్రియను అధికారులు వాయిదా వేశారు. వాస్తవంగా 3న పశ్చిమ డెల్టా, 4న మధ్య డెల్టా, 5న తూర్పు డెల్టా గేట్ల వద్ద ఫ్లషింగ్ కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది. వరద నీరు తగ్గిన తరువాత ఈ ప్రక్రియ ఎప్పుడు నిర్వహించేదీ తెలియజేస్తామని గోదావరి ప్రధాన పనుల విభాగం ఏఈ డి.రాధాకృష్ణ తెలిపారు.

ముసురుకున్న జ్వరాలు

ఆసుపత్రుల్లో పెరుగుతున్న రోగులు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

మొంథా తుపాను ప్రభావం ప్రజారోగ్యంపై పడింది. భారీ వర్షాలకు గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తి ప్రజల జ్వరాలు, ఇతర సమస్యల బారిన పడుతున్నారు. వారం రోజులుగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య పెరిగింది. తుపాను ప్రభావంతో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. చలిగాలులు.. తర్వాత ఎండల పెరగడం.. రాత్రి సమయాల్లో మంచు.. ఇలా భిన్న వాతావరణం నెలకొనడంతో ప్రజలు జ్వరం, గొంతునొప్పి వంటి సమస్యలతో బాధపడుతున్నారు.

ముమ్మిడివరంలో ఫీవర్ సర్వే

ఇదీ పరిస్థితి..

జిల్లాలో పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, ప్రాంతీయ ఆసుపత్రుల్లో జ్వరాల బారిన పడిన వారి సంఖ్య పెరిగింది. సాధారణంగా పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో రోజుకు 70-80 మంది అవుట్ పేషెంట్లు వచ్చేవారు. తుపాను తర్వాత రోగుల సంఖ్య పెరిగింది. వాటిలో జ్వరం, దగ్గు, గొంతునొప్పి వంటి వ్యాధుల బారినపడిన వారే అధికంగా ఉంటున్నారు.

జిల్లాలో ఇలా..

- రోజువారీ నమోదవుతున్న జ్వర పీడితులు: 2000
- ప్రైవేటు ఆసుపత్రుల్లో: సుమారు 4500
- పీహెచ్‌సీలు: 47
- యూపీహెచ్‌సీలు: 07
- ప్రాంతీయ ఆసుపత్రులు: 02

గ్రామాల్లో సర్వే..

జిల్లాలో తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలు.. బాధితులు పునరావాస కేంద్రాల్లో ఉండి.. ఇళ్లకు వెళ్లడం.. వాతావరణ మార్పుల నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో ఆశ, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, హెల్త్ అసిస్టెంట్లతో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఫీవర్ సర్వేను నిర్వహిస్తున్నారు. ఐడీఎస్‌పీ పోర్టల్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. ఇక్కడ గుర్తించిన జ్వరపీడితులకు స్థానిక పీహెచ్‌సీల్లో వైద్య సేవలు అందిస్తున్నారు.

ఈ ప్రాంతాల్లో..

తీర ప్రాంత మండలాలైన ఐ.పోలవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, మలికిపురం, రాజోలు, సఖినేటిపల్లి, అమలాపురం, పి.గన్నవరం తదితర మండలాలపై ప్రధానంగా దృష్టి సారించినట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రోజూ 1500-2000 మంది జర్వ పీడితులు ఐడీఎస్‌పీ పోర్టల్‌లో నమోదవుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

తుపాను ప్రభావంతో వాతావరణ మార్పులు ఇతర కారణాల వల్ల వ్యాధులు బారిన పడకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం.దుర్గారావు దొర సూచించారు. కాచి చల్లార్చిన తర్వాతే నీరు తాగాలని సూచించారు. నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తినకూడదన్నారు. ఇళ్లల్లో నిల్వ ఉండి పాడైన ఆహార పదార్థాలు బయటపడేయాలని సూచించారు. శీతల పానియాలు, బయట దొరికే ఆహార పదార్థాలు, ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచిన వాటి జోలికి వెళ్లకపోవడమే మంచిదన్నారు. గొంతు, తలనొప్పి, జ్వర లక్షణాలు ఉన్నవారు దగ్గరలోని పీహెచ్‌సీల్లో వైద్యులను సంప్రదించాలని సూచించారు.

గలగల.. సౌర దీపాలతో తళతళ

పి.గన్నవరం వద్ద వైనతేయ గోదావరి నదిపై గల డొక్కా సీతమ్మ అక్విడక్టు రోడ్డు బ్రిడ్జిపై ఇటీవల రూ.12.50 లక్షలతో సౌర దీపాలు ఏర్పాటు చేశారు. దీంతో వాహనచోదకులు, పాదచారులకు ఇబ్బంది లేకుండా ప్రయాణం సాగిపోతోంది. ఆదివారం రాత్రి 8 గంటలకు దీపపు కాంతులతో అక్విడక్టు ఇలా దేదీప్యమానంగా కనిపించింది. **- న్యూస్‌టుడే, పి.గన్నవరం**

వీధుల్లో విజయోత్సాహం



భారత్, దక్షిణాఫ్రికా మధ్య మహిళల వన్డే ప్రపంచ కప్ క్రికెట్ తుదిపోరు సందర్భంగా ఆదివారం పలుచోట్ల భారీ తెరలు ఏర్పాటు చేశారు. పి.గన్నవరంలో క్రికెట్ అభిమానులు ఇలా తెరలు ఏర్పాటు చేసి పోరును ఆస్వాదించారు. భారత్ విజయం సాధించడంతో అభిమానులు సందడి చేశారు. **- న్యూస్‌టుడే, పి.గన్నవరం**

అదుపులో హత్యకేసు నిందితులు..?

అమలాపురం పట్టణం : కొంకాపల్లికి చెందిన కంచిపల్లి శ్రీనివాస్ హత్య కేసులో నిందితులు పోలీసులకు చిక్కారనే సమాచారం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. ఈ కేసులో గంగుమళ్ల షణ్ముకేశ్వరరావు(కాసుబాబు), అడబాల శంకర్, సలాది వీరబాబు(అప్పన్న), భాస్కర్ల ప్రసాద్, అనిల్ నిందితులుగా ఉన్నారు. శనివారం రాత్రి ఇద్దరిని కాశీలో, ఒకరిని చెన్నై ప్రాంతంలో పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. కర్ణాటక రాష్ట్రంలోని అటవీ ప్రాంతంలో తలదాచుకుంటున్న ప్రధాన నిందితుడు కాసుబాబుని ఆదివారం ప్రత్యేక బృందం అరెస్ట్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. శంకర్ మినహా మిగతా నలుగురిని పట్టుకున్నట్లు సమాచారం. దీనిపై పట్టణ సీఐ వీరబాబు మాట్లాడుతూ అరెస్టులపై సమాచారం లేదని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పేర్కొన్నారు.

- శ్రీనివాస్ భార్య లక్ష్మికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఫోన్ చేసి మాట్లాడారు. నిందితులను అరెస్ట్ చేసి శిక్ష పడేలా చూస్తానని తెలిపారు.

ఖాళీ వల.. విలవిల

మత్స్యకారులను వెంటాడుతున్న విపత్తులు

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

కడలి కెరటాలకు ఎదురెళ్తూ వేట సాగిస్తేనే గంగపుత్రుల ఆకలి తీరేది. కొన్ని రోజులుగా వేటనిషేధం, మరికొంత కాలం విపత్తులు వీరిని వెంటాడుతున్నాయి. మొంథా తుపాను వీరి బతుకులు మరింత దుర్భరంగా మార్చింది. సముద్రంలో వేట సాగించిన ఉత్పత్తులను మత్స్యకారులు అంతర్వేది పల్లిపాలెంలోని హార్బర్, ఓడలరేవులో ఉన్న జెట్టీల వద్ద అమ్మకాలు చేస్తుంటారు. ఎగుమతులు కూడా చేస్తుంటారు. ఈ ఏడాది వేటనిషేధం ముగిసిన తరువాత ఇప్పటివరకు ఎగుమతులు ప్రారంభం కాలేదు.

జిల్లా వివరాలు

- తీర ప్రాంతం: 93 కి.మీ.
- మండలాలు: 8
- మత్స్యకార గ్రామాలు: 34
- జనాభా: 17 వేలు
- సముద్రంలో వేటసాగించే బోట్లు: 1,925

జులై నుంచి అక్టోబరు వరకు..

ఏటా జులై నుంచి అక్టోబరు వరకు సముద్రంలో మత్స్యసంపద ఎక్కువగా లభిస్తుంది. గత రెండు నెలలుగా ఒడ్డునే ఉంటున్నాయి. సోనాబోట్లపై 10 నుంచి 15 మంది వరకు వెళతారు. డీజిల్ ఖర్చులకు కూడా రాకపోవడంతో అనేకమంది దూరంగా ఉంటున్నారు. మొంథా తుపానుతో ఉపాధి కోల్పోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం 50 కేజీల బియ్యం అందిస్తుందని జిల్లా మత్స్యశాఖ అధికారి పీవీ శ్రీనివాసరావు తెలిపారు.

అంతర్వేది పల్లిపాలెంలో నిలిపిన బోట్లు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

(c) eenadu

ఇంటి నుంచే విద్యుత్తు సేవలు

● అందుబాటులో ఏపీఈపీడీసీఎల్ యాప్

విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఏపీఈపీడీసీఎల్ ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టింది. ఆండ్రాయిడ్ చరవాణుల్లో ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీనిద్వారా వచ్చిన సమస్యలను విద్యుత్తు శాఖ అధికారులు పరిశీలించి సత్వరం పరిష్కరిస్తారు.
–న్యూస్‌టుడే, గురుద్వారా



డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో	
కనెక్షన్లు	5,43,089
ప్రతినెలా బిల్లు (రూ. కోట్లు)	రూ. 71.95

బిల్లు చెల్లించొచ్చు: విద్యుత్తు బిల్లులు చెల్లించేందుకు బిల్‌పే ద్వారా సర్వీసు నంబరు, చరవాణి నంబరు పొందుపరిస్తే సంబంధించిన వివరాలు ప్రత్యక్షమవుతాయి.

సప్లయి పొజిషన్: వినియోగదారుడు సర్వీసుకు సంబంధించి విద్యుత్తు సరఫరా తీరును ఎప్పటికప్పుడు లైవ్‌లో చూసుకునే సదుపాయం కలదు.

మొబైల్ లింకింగ్ : విద్యుత్తు వినియోగదారులు తమ విద్యుత్తు కనెక్షన్‌కు సంబంధించి చరవాణి నంబరును అనుసంధానిస్తే విద్యుత్తు బిల్లుల సమాచారం చరవాణికి అందుతుంది.

ఎనర్జీ కాలిక్యులేటర్ : ఏప ఉపకరణానికి ఎంత విద్యుత్తు ఖర్చవుతుందో దీని ద్వారా తెలుసుకోవచ్చు. నెలవారీ విద్యుత్తు వినియోగానికి సంబంధించిన మీటరు రీడింగ్ వివరాలు పొందుపరిస్తే బిల్లు సమాచారం కనిపిస్తుంది.

కస్టమర్ కేర్: వినియోగదారులు తమ సమస్యలను ఇందులో పొందుపరచొచ్చు. అందిన సప్లై వివరాలు, అవసరమైన అన్ని లింకులు ఇందులో పొందుపరిచి ఉంటాయి.

లింక్ ఆధార్: వినియోగదారుడు విద్యుత్తు సర్వీస్‌కు తమ ఆధార్ వివరాలను జత చేసుకోవచ్చు.

కన్‌జంప్షన్: వినియోగదారులు వాడిన యూనిట్లు.. చెల్లించాల్సిన నగదు.. బిల్ లెడ్జర్ వివరాలు అందుబాటులో ఉంటాయి.

లాడ్జ్ కంప్లెంట్: విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు వంటి ఫిర్యాదులను వినియోగదారుడు నేరుగా ఫిర్యాదు చేయడమే గాక కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్య పరిష్కారం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు.

పే బిల్: సర్వీసు నంబరు నమోదు చేసుకుని నెలవారీ విద్యుత్తు బిల్లులకు సంబంధించిన నగదు చెల్లించొచ్చు.

అధికారుల వివరాలు : వినియోగదారుల పరిధిలోని అధికారుల ఫోన్ నంబర్లు లభ్యమవుతాయి. ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

టారిఫ్ : వినియోగదారులకు సంబంధించిన టారిఫ్ వివరాలు ఇందులో పొందుపరిచి ఉంటాయి.

క్విక్‌పే : సర్వీసు నంబరు, చరవాణి నంబరును నమోదు చేస్తే సంబంధిత బిల్లు వివరాలు వస్తాయి. అక్కడి నుంచి బిల్లు చెల్లించొచ్చు.

గౌడ/శెట్టిబలిజ కుల అవివాహితులకు సువర్ణావకాశం

నేడు గౌడ/ శెట్టిబలిజ కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, గౌడ/ శెట్టిబలిజ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. **రాజమండ్రి ఈనాడు కార్యాలయంలో (1వ అంతస్తు, భాను టవర్స్, శ్యామల థియేటర్ ఎదురు)** ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు నేడు (03 నవంబర్ 2025, సోమవారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

● మరిన్ని వివరాలకు **8008621414 & 9154918858** ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

● ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ మరియు యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన తెలిపిన ఫోన్ నంబర్లకు సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

వాడపల్లి క్షేత్రంలో నేటి పూజలు

● కోనసీమ తిరుమల వాడపల్లిలో సోమవారం ఉదయం 5 గంటలకు ప్రభాతసేవ, మేలుకొలుపు, వేంకటేశ్వర సహిత లక్ష్మీ ఐశ్వర్య హోమం, ద్రవిడ వేదపారాయణం, నివేదన. ● 6 గంటలకు గోపూజ, అష్టోత్తర నామార్చన పూజలు, దర్శనాలు ప్రారంభం. 11 గంటలకు నిత్య కల్యాణం, మధ్యాహ్నం 12 గంటలకు అర్చన. ● మధ్యాహ్నం 1 గంట నుంచి విరామం, సాయంత్రం 4 నుంచి మళ్లీ దర్శనాలు ప్రారంభం ● 6 గంటలకు అర్చన, రాత్రి 7.30 గంటలకు నైవేద్యం. ● 8 గంటలకు పవళింపు సేవ. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

ముచ్చట తీరా.. ఊయల ఊగి

మలికిపురంలో కాపు సామాజికవర్గం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్తిక వన సమారాధనలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరదాగా ఊయల ఊగి ముచ్చట తీర్చుకున్నారు. – న్యూస్‌టుడే, మలికిపురం

బోద.. ఉండదిక బాధ

● పూర్తి నిర్మూలన దశలో మహమ్మారి

న్యూస్‌టుడే, చాగల్లు : దేశ వ్యాప్తంగా బోద వ్యాధి నియంత్రణలో భాగంగా 2030 నాటికి కేసులు లేకుండా చేయాలని కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా పరీక్షలతోపాటు మాత్రలు పంపిణీ చేస్తోంది. నియంత్రణ తప్ప నివారణ లేని ఈ వ్యాధి. . సోకిన కుటుంబాల్లో కన్నీటి సుడులకు కారణమయ్యేది. క్యూలెక్స్ దోమ కాటుతో విస్తరించే ఈ మహమ్మారి కాళ్లతోపాటు చేతులు, ఛాతిభాగం, వృషణాలు, తదితర అవయవాలకూ సోకుతుంది. వ్యాధిగ్రస్తుడిని కుట్టిన దోమ మరొకరిని కాటేస్తే వారిలోను లక్షణాలు కనిపిస్తాయి. పూర్తిగా బయట పడేందుకు సుమారు 10 నుంచి 15 ఏళ్ల సమయం పడుతుంది. అనంతరం ప్రభావిత ప్రాంతం భారీగా ఉబ్బుతుంది. బతుకంతా వ్యధను నింపే ఈ వ్యాధి నిర్మూలనకు వైద్యారోగ్యశాఖ కృషి ప్రస్తుతం ఫలిస్తోందని అధికారులు అంటున్నారు. తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో కేసులు నమోదు కాకపోవడమే ఇందుకు నిదర్శనంగా పేర్కొంటున్నారు.

రోగులను పరీక్షిస్తున్న ఫైలేరియా అధికారి రవి

వేధిస్తున్న మందుల కొరత..

రాజమహేంద్రవరంలోని ప్రధాన కార్యాలయంలో మందుల కొరత వేధిస్తోంది. రోగులకు కావల్సిన సోఫ్రామైసిన్, డీఈసీ(డై ఇథైల్ కార్బోమెజైన్ సిట్రేట్), ఆల్‌బెండాజోల్, యాంటీ ఫంగల్ ఆయింట్‌మెంట్లు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. వీటితోపాటు రోగులకు అందించే తువ్వాల్లు వంటి వాటి సరఫరాకు కొరత ఉంది.

ఇప్పటి వరకు ఇలా..

జిల్లా	కేసులు
తూర్పు గోదావరి :	2,924
కాకినాడ :	6,229
కోనసీమ :	7,598

పూర్తిస్థాయి అదుపులో వ్యాధి..

బోద వ్యాధి నాలుగు జిల్లాల్లో పూర్తిస్థాయిలో అదుపులో ఉంది. పర్యవేక్షణ బృందాలు ఎప్పటికప్పుడు తమ ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఎక్కడా ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. మందుల కొరతపై ఇప్పటికే ఉన్నతాధికారులకు వివరించి, ప్రతిపాదనలు పంపాం. ప్రతి శుక్రవారం రాజమహేంద్రవరంలోని కేంద్రంలో చికిత్సలు, మందులు ఉచితంగా ఇస్తున్నాం. రోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఫైలేరియా అధికారి రవి తెలిపారు.

మూడు జిల్లాల్లో 11 యూనిట్లు..

వ్యాధి నివారణకు తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాలో మూడేసి చొప్పున, కోనసీమ జిల్లాలో 5 యూనిట్లు ఈ వ్యాధి నివారణకు కృషి చేస్తున్నాయి. వారానికి ఒక చోట క్లీనిక్, ఏరియా నైట్ సర్వే నిర్వహిస్తూ వ్యాధి పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు. ఒక్కో జిల్లాలో మెడికల్ అధికారితోపాటు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు 11 మంది, ల్యాబ్ టెక్నీషియన్లు ముగ్గురు, హెల్త్ అసిస్టెంట్లు 21 మంది, ఫీల్డ్ వర్కర్స్ సుమారు 150 మంది వరకు పని చేస్తున్నారు.

టాస్ ప్రోగ్రామ్..

ట్రాన్స్‌మిషన్ అసెస్‌మెంట్ సర్వే(టీఏఎస్) అని పిలిచే ఈ కార్యక్రమంతో 6 నుంచి 7 ఏళ్ల పిల్లలకు సైతం నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, వ్యాధిని గుర్తించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఇందుకు జ్వరం, వివిధ అనుమానిత లక్షణాలు ఉన్న ఒక్కో జిల్లా నుంచి 1,685 మంది విద్యార్థులను ఎంపిక చేస్తారు. గతేడాది నిర్వహించిన ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లాలో ఇద్దరు, కాకినాడలో ముగ్గురు, కోనసీమలో ఆరుగురు మొత్తం 11 మందిలో ఈ లక్షణాలు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఒక్కొక్క జిల్లాలో కనీసం 20 కేసులు లోపు గుర్తిస్తే వ్యాధి పూర్తిస్థాయిలో అదుపులో ఉన్నట్లే అని అధికారులు చెబుతున్నారు.



దేదీప్యమానం.. భీమేశ్వరాలయం

కార్తికమాసం పర్వదినాల్లో పంచారామ క్షేత్రం భీమేశ్వరాలయం విద్యుద్దీపాల వెలుగులతో కాంతులీనుతోంది. ఈ మాసంలో తొలి సోమవారం తుపాను తాకిడి వల్ల విద్యుద్దీపాలంకరణ ఉన్నా జనం చూసే అవకాశం లేకపోయింది. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఆలయానికి ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల వెలుగులు సప్తగోదావరిలో ప్రతిబింబిస్తూ భక్తులను ఆకట్టుకొంటోంది. – న్యూస్‌టుడే, ద్రాక్షారామ

అద్దాల గదిలో దర్శనమిస్తున్న సహస్రలింగం

ఏకలింగం.. సహస్రలింగ దర్శనం

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ద్రాక్షారామ బ్రహ్మకుమారీస్ ఆశ్రమం (ఈశ్వరీయ విశ్వవిద్యాలయం)లో ఏర్పాటు చేసిన సహస్రలింగం భక్తులను ఆకట్టుకొంటోంది. ఇక్కడ ఒక అద్దాల గదిని నిర్మించి దానిలో శివలింగాన్ని ఉంచి చుట్టూ విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. ఒక లింగమే ఉన్నా.. చూసే భక్తులకు వేయి లింగాలుగా దర్శనమిస్తోంది. కార్తికమాసం నెల రోజులు దర్శనానికి ఉంచుతామని, ప్రతిభక్తుడు చూసి తరించాలని బ్రహ్మకుమారి రాజీ తెలిపారు.

నేటి నుంచి రావులపాలెంలో గైడ్ కెప్టెన్లకు శిక్షణ

రాయవరం, న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని పీఎంశ్రీ పాఠశాలలకు చెందిన 88 మంది గైడ్ కెప్టెన్లకు ప్రాథమిక, అడ్వాన్స్ కోర్సుల్లో శిక్షణను రావులపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు సమగ్రశిక్షా జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంవో), ది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి పిల్లి రాంబాబు తెలిపారు. ఆదివారం రాయవరంలో ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. డీఈవో, స్కౌట్స్ కమిషనర్ డా.సలీంబాషా, సమగ్రశిక్షా ఏపీసీ జి.మమ్మీ పర్యవేక్షణలో శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. అడ్వాన్స్ కోర్సులో శిక్షణ పొందే కెప్టెన్లు ప్రాథమిక(బేసిక్) శిక్షణ ధ్రువీకరణపత్రాన్ని, ప్రాథమిక శిక్షణకు హాజరయ్యేవారంతా పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను క్యాంప్ కేంద్రం వద్ద ఇవ్వాల్సి ఉంటుందన్నారు. శిక్షణకు వచ్చే వారంతా సమయపాలన పాటించాలని కోరారు.

అంగరంగ వైభవం.. నృసింహుడి తెప్పోత్సవం

అంతర్వేది, న్యూస్‌టుడే: క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి తెప్పోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా ఆలయం నుంచి ఉత్సవమూర్తులను పల్లకిలో తీసుకొచ్చి గరుడ పుష్పక వాహనంపై ఆసీనులను చేసి అలంకారోత్సవం నిర్వహించారు. అనంతరం బాణసంచా, కేరళ వాయిద్యాలు, బ్యాండ్‌మేళాలతో ఊరేగింపుగా పల్లిపాలెం పుష్కరాల రేవుకు తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై కొలువుదీర్చి వశిష్ఠ గోదావరిలో గొంది గ్రామం వరకు ఉత్సవం నిర్వహించారు. తిరిగి ద్వాదశి మండపంలోకి తీసుకొచ్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమూల్య, ఆలయ ఏసీ నాగవరప్రసాద్, సీఐ నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

వశిష్ఠ గోదావరిలో స్వామివారి తెప్పోత్సవం

గరుడ పుష్పక వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహుడు

కోడలే కొడుకై..

● అత్త అంత్యక్రియలు నిర్వహణ

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: సీహెచ్ గున్నేపల్లిలో అత్తకు కోడలు అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామానికి చెందిన పాపిరెడ్డి ఆదిలక్ష్మి(70) ఆదివారం మృతి చెందారు. మృతురాలి భర్త, కుమారుడు కొంతకాలం క్రితమే మృతి చెందారు. దివ్యాంగురాలైన అత్త ఆదిలక్ష్మి, పిల్లల బాగోగులను శ్రీదేవి చూస్తున్నారు. ఆదిలక్ష్మి మృతితో శ్రీదేవి కొడుకులా మారి పాడె మోసి తలకొరివి పెట్టారు. గ్రామస్థుల సాయంతో అంత్యక్రియలు పూర్తి చేశారు.

అంత్యక్రియలు నిర్వహిస్తున్న కోడలు శ్రీదేవి

కూటమి ప్రభుత్వంలో బీసీలకు రాజ్యాధికారం

● 16న అమలాపురంలో శెట్టిబలిజ వనసమారాధన
● కార్మిక శాఖ మంత్రి సుభాష్

సర్పవరం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమని, దీనికి తానే ఒక ఉదాహరణ అని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కాకినాడ గ్రామీణం రమణయ్యపేట గైగోలుపాడులో శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తిక వనసమారాధనలో ముఖ్యఅతిథిగా మంత్రి సుభాష్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు, నియోజకవర్గం కోర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శెట్టిబలిజలంతా ఐక్యంగా ఉండాలన్నారు. ఈనెల 16న అమలాపురంలో జరిగే భారీ శెట్టిబలిజ వనసమారాధనలో పార్టీలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్పొరేషన్ డైరెక్టర్లు డా.చప్పిడి వెంకటేశ్వరరావు, కడలి ఈశ్వరి, సంఘం జిల్లా అధ్యక్షుడు చొల్లంగి వేణుగోపాల్, నాయకులు పెంకె శ్రీనివాసబాబా, నులుకుర్తి వెంకటేశ్వరావు, వాసంశెట్టి ఆంజనేయులు, గుబ్బల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మంచు.. ప్రమాదాలతో ముంచు

తెల్లవారుజామున రోడ్లను కమ్మేస్తున్న వైనం

గండేపల్లి, తుని పట్టణం, న్యూస్‌టుడే: కొన్ని రోజులుగా జాతీయ రహదారిపై రాత్రి, తెల్లవారుజామున పొగమంచు దట్టంగా రోడ్డును కమ్మేస్తోంది. ఈ మంచుతో రహదారిపై ప్రయాణించే వాహనాలు కనిపించని స్థితి. రానున్న మూడు మాసాలు పొగమంచు దట్టంగా పడే అవకాశాలు ఎక్కువ. దీంతో రాకపోకలు సాగించేవారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ఎన్‌హెచ్‌పై దట్టంగా..

కొన్ని రోజులుగా రాజమహేంద్రవరం నుంచి తుని వరకు అర్ధరాత్రి దాటాక పొగమంచు కమ్మేస్తోంది. దీంతో తెల్లవారుజామున ప్రమాదాలు ఎక్కువగా జరిగిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి. గత అనుభవాల దృష్ట్యా లారీ డ్రైవర్లు, వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండాలి. కార్తిక మాసం దృష్ట్యా అన్నవరం, వాడపల్లి, చిన్న తిరుపతి, లోవ, మురారి తదితర ఆలయాలకు భక్తుల రద్దీ ఎక్కువ. నడకమార్గాన్ని అనుసరించే భక్తులు రోడ్డుపైకి వచ్చాక ఏమరుపాటు పనికి రాదు.

రాజానగరం గండేపల్లి మధ్య పరుచుకున్న పొగమంచు

జాగ్రత్తలివీ.. పాటిస్తే మేలు

మంచు దృష్ట్యా రాత్రి వేళల్లో రోడ్డు పక్కన వాహనాలు నిలపరాదు. చోదకులకు తగినంత విశ్రాంతి అవసరం. రాత్రి మొత్తం ప్రయాణించాల్సి ఉంటే డ్రైవర్లు మారుతూ ఉండాలి. గంట, రెండు గంటలకోసారి నీళ్లతో ముఖాన్ని కడుక్కోవాలి. నిద్ర వస్తుందనిపిస్తే వాహనాన్ని సురక్షిత ప్రదేశంలో నిలిపి నిద్రపోవాలి. వాహనాల వేగం నియంత్రణలో ఉండాలి. పొగమంచు ఎక్కువగా ఉన్నప్పుడు, కూడళ్ల వద్ద ప్రయాణం సురక్షితం కాదని గమనించాలి. వాహనాలకు కాంతివంతంగా ఉండే లైట్లు ఏర్పాటు చేసుకోవాలి.

ఫేస్‌వాష్ అండ్ గో కార్యక్రమం

క్రాసింగ్ రోడ్లు దాటే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి. పొగమంచు ఎక్కువగా ఉన్నట్లయితే ఫేస్‌వాష్ అండ్ గో కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లు ముఖం కడుక్కునేలా చర్యలు తీసుకుంటున్నాం. మంచు ఎక్కువగా ఉంటే వాహనాలు నిలిపివేయాలి. లేదంటే వేగాన్ని తగ్గించి వెళ్తే ప్రమాదాలు సంభవించే అవకాశాలు తక్కువ.
- శ్రీహరిరాజు, డీఎస్పీ,పెద్దాపురం

జిల్లాలో ఎన్‌హెచ్-16 ఇలా..	
అనుకుని ఉన్న మండలాలు:	10
మురారి- తుని వరకు కి.మీ.:	78
బ్లాక్‌స్పాట్లు:	58
సీసీ కెమెరాలు:	112

నాడు ఇలా..

నూతనంగా నిర్మించిన మార్గం

కష్టాలు కడతేరి.. రాజమార్గంగా మారి

కాట్రేనికోన నుంచి రామస్వామితోట వరకు హైస్కూల్ రహదారి నాలుగైదేళ్ల క్రితం నుంచి అధ్వానంగా ఉండేది. ఎక్కడికక్కడ గుంతలుపడి నీరు నిలిచి రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. జడ్పీ పాఠశాలకు వచ్చి వెళ్లేందుకు 500 మంది పిల్లలకు ఇదే మార్గం. వారంతా నిత్యం నరకం చూసేవారు. గత ప్రభుత్వం ఈ రోడ్డువైపు కన్నెత్తి చూడలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఈ రోడ్డుపై ప్రత్యేక దృష్టి సారించారు. రూ.64 లక్షల నిధులు మంజూరు చేయించి ఇటీవల కిలోమీటరు మేర సీసీ రోడ్డు నిర్మించారు. –న్యూస్‌టుడే, కాట్రేనికోన

వధూవరులకు హైకోర్టు జడ్జి ఆశీర్వాదం

రాజోలు: రాజోలు మండలం బి.సావరానికి చెందిన తెదేపా నాయకుడు జగడం సత్యనారాయణ కుమారుడి వివాహానికి రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ జగడం సుమతి దంపతులు హాజరయ్యారు. వధూవరులు వరుణ్- విజయరాణిలను ఆశీర్వదించారు. ఆదివారం రాత్రి శివకోటిలోని కల్యాణ మండపంలో జరిగిన వివాహ వేడుకకు కుటుంబ సభ్యులతో కలిసి ఆమె హాజరయ్యారు.

వధూవరులతో హైకోర్టు జడ్జి జస్టిస్ సుమతి దంపతులు

అతివేగం.. తీసింది ప్రాణం

● స్పోర్ట్స్ బైక్‌పై వెళుతూ యువకుడి మృత్యువాత

పి.గన్నవరం, న్యూస్‌టుడే: రాజవరం-పొదలాడ ర.భ. శాఖ రాష్ట్ర రహదారిలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై బి.శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. రాజోలు మండలం కడలికి చెందిన నెల్లి హర్షవర్ధన్(23), వల్లూరి తేజ ఇంటివద్ద రావులపాలెం వెళుతున్నామని చెప్పి రాత్రిపూట స్పోర్ట్స్ బైక్‌పై బయలుదేరారు. అతివేగంతో మొండెపులంక లాకు వద్ద విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టడంతో బైక్ నడుపుతున్న హర్షవర్ధన్ అక్కడికక్కడే మృతిచెందాడు. గాయాలపాలైన తేజను తొలుత పి.గన్నవరం సామాజిక ఆసుపత్రికి.. అక్కడి నుంచి అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అవివాహితుడైన హర్షవర్ధన్ ఉపాధి నిమిత్తం దుబాయ్‌లో ఉంటున్నాడు. మూడు నెలల క్రితం స్వగ్రామం వచ్చాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తె కోసం వస్తూ.. గోదావరిలో పడి మృతి

యానాం, పామర్రు, న్యూస్‌టుడే: కె.గంగవరం మండలం కోటిపల్లికి చెందిన మత్స్యకారుడు పెమ్మాడి నూకరాజు(41) పడవ నుంచి గోదావరిలో జారిపడి శనివారం గల్లంతవగా ఆదివారం గిరియాంపేట దీవి వద్ద మృతదేహం లభించింది. ఎస్సైలు పునీత్‌రాజ్, కట్టా సుబ్బరాజు అందించిన వివరాల ప్రకారం.. భార్య సీత, అల్లుడితో కలిసి నూకరాజు నెలరోజులుగా గిరియాంపేట సమీపంలో చీరమేను వేట సాగిస్తున్నాడు. శనివారం వేటలో ఉండగా అతడి కుమార్తె అనారోగ్యానికి గురైనట్లు సమాచారం అందింది. తీవ్రంగా కడుపు నొప్పి వస్తోందని.. తట్టుకోలేకపోతున్నానంటూ ఆమె ఫోన్ చేసింది. అతడు ఫోన్‌లో మాట్లాడుతూ పడవపై వేగంగా వస్తూ జారి పడిపోయి గల్లంతయ్యాడు. ఎంత వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో దరియాలతిప్ప ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం తిరిగి గాలింపు నిర్వహించగా గిరియాంపేట అయిదో నంబరు దీవి వద్ద నూకరాజు మృతదేహం దొరికింది.

సముద్రంలో..

కాకినాడ నగరం: వేటకు వెళ్లి తిరిగొస్తుండగా కుంభాభిషేకం రేవు సమీపంలో మత్స్యకార యువకుడు సముద్రంలో పడి మృతిచెందిన ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. బంధువుల వివరాల ప్రకారం.. కాకినాడ దుమ్ములపేటకు చెందిన జామి సాయి(26) శనివారం సహచరులతో కలిసి సముద్రంలో వేటకు వెళ్లాడు. ఆదివారం తెల్లవారుజామున కుంభాభిషేకం రేవు వద్ద ఒడ్డుకు చేరుకున్నారు. బోటు దిగుతున్నప్పుడు అకస్మాత్తుగా సముద్రంలో పడిపోయాడు. వెంటనే అక్కడి మత్స్యకారులు గాలింపు చేపట్టగా విగతజీవిగా దొరికినట్లు స్థానికులు తెలిపారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పోర్టు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేసి భౌతికకాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

BUSINESS SERVICES
బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

FINANCIAL SERVICES

TO LET
COMMERCIAL

JOBS
Dew Foams Pvt. Ltd, Mandapeta Invites applications for the Post of General Manager (GM) Minimum Exp: 8-10Years is a must. Experience in the manufacturing industry will be an added advantage. Email: hodewfoams@gmail.com Contact: 78913 16373.

EENADU for Advertisement Contact: 8008597607

EENADU Classifieds
Immediate openings for Customer Service Executive & Branch Manager Positions in Cherukuri Group, Located in Eluru, Tanuku, Guntur & Vijayawada. Qual: Min Inter. Ⓒ 9885206666, E-mail: hr@cherukurigroup.org.

RJYలో FMCG ఉత్పత్తుల డిస్ట్రిబ్యూషన్ కొరకు సేల్స్‌మెన్ కావలెను.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి)	22,000
పాతకాయ గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ గండేరా	28,000
గటగట	26,000
[illegible]	22,000-24,000
[illegible]	23,000-24,000
[illegible]	6,000
[illegible]	400

వెంకోబ్ చికెన్ ధర

[illegible]	115-00
[illegible]	142-00
[illegible]	206-00
[illegible]	234-00

గమనిక

92.7FM Rajamahendravaram ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మూడ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

(c) eenadu

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

మహాశాంతి హోమం ఏర్పాట్ల పరిశీలన

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 4న జరగబోయే మహాశాంతి హోమం ఏర్పాట్లను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆదివారం పరిశీలించారు. పెద్దఎత్తున భక్తులు తరలిరానున్న దృష్ట్యా ప్రతి గ్రామం నుంచి కొందరిని సేవా వాలంటీర్లుగా ఎంపిక చేశారు. ఆలయం ఎదురుగా ఉన్న కల్యాణ మండపం వద్ద హోమ శాల నిర్మించారు. ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో తెదేపా రాజోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమూల్య, ఆలయ ఏసీ నాగవరప్రసాద్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పెదకాపు, గెద్దం మహాలక్ష్మీప్రసాద్, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

అతివలు అన్ని రంగాల్లో రాణించాలి

మహిళలతో కలిసి క్రికెట్ మ్యాచ్‌ను వీక్షిస్తున్న ఎమ్మెల్యే బండారు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మహిళల క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్ సందర్భంగా రావులపాలెంలోని తెదేపా క్యాంపు కార్యాలయంలో పెద్ద తెర ఏర్పాటు చేశారు. స్థానిక మహిళలతో కలిసి ఎమ్మెల్యే బండారు క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించారు. మహిళలు ఏ అంశంలోనూ తక్కువ కాదని భారత మహిళా క్రికెట్ జట్టు నిరూపించిందన్నారు. నియోజకవర్గ తెలుగు మహిళాధ్యక్షురాలు యల్లమిల్లి చంద్రకుమారి తదితరులు పాల్గొన్నారు.

భారత జట్టు విజయానికి పూజలు

కొత్తపేట, న్యూస్‌టుడే: భారతదేశ మహిళా క్రికెట్ జట్టు దక్షిణాఫ్రికాపై విజయం సాధించి ప్రపంచ కప్పు విజేతలుగా నిలవాలని ఆకాంక్షిస్తూ పలివెల ఉమా కొప్పులింగేశ్వర స్వామికి మహిళలు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు యల్లమిల్లి చంద్రకుమారి, తదితరులు పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు

రావులపాలెంలో ఆదివారం ఉదయం పొగమంచు దట్టంగా కమ్ముకుంది. రహదారులపై వేకువజామున రాకపోకలు సాగించే రైతులు, అరటి కూలీలు రాకపోకలకు కొంతమేర ఇబ్బందులు పడ్డారు. దట్టంగా ఉన్న పొగమంచును చూసి ప్రకృతి ప్రేమికులు పరవశించారు. – న్యూస్‌టుడే, రావులపాలెం గ్రామీణం

ముంపు భయం.. రోగాలతో జనం

– న్యూస్‌టుడే, మలికిపురం, సఖినేటిపల్లి

రాజోలు నియోజకవర్గంలోని తీర గ్రామాలతో పాటు పలు పల్లపు ప్రాంతాల ప్రజలు ముంపుబారిన పడి అల్లాడుతున్నారు. ఏడాదిలో సగం రోజుల పాటు ఇదే పరిస్థితి. ప్రధానంగా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపల్లిపాలెం నుంచి అంతర్వేదికర, మలికిపురం మండలం శంకరగుప్తం, పడమటిపాలెం, కేశనపల్లి, తూర్పుపాలెం, గొల్లపాలెం, మామిడికుదురు మండలం కరవాక వరకు ముంపులో నానుతున్నాయి.

చింతలమోరి-శంకరగుప్తం సరిహద్దు దాసులపుంతలో నిత్యం ఇలానే.

పల్లపు ప్రాంతాల్లో ఇబ్బందులు..

పల్లపు ప్రాంతాల్లో వర్షంనీరు ఇళ్లచుట్టూ చేరి తిష్ఠ వేస్తోంది. కేశవదాసుపాలెం, అంతర్వేదిదేవస్థానం, చింతలమోరి తదితర గ్రామాల్లో నివాస ప్రాంతాలు ఎప్పుడూ ముంపులోనే ఉంటున్నాయి. ఇటీవల నెల రోజుల నుంచి ఏకధాటిగా కురిసిన వర్షాలకు జల మయమయ్యాయి. రోజుల తరబడి నిల్వ ఉండటంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. దోమలు పెరిగిపోతున్నాయి. ఇళ్లల్లోకి పాములు వస్తున్నాయి.

నీటిని బయటకు మళ్లించే డ్రెయినేజీ వ్యవస్థలు సక్రమంగా పనిచేయడం లేదు. నెలల తరబడి ముంపుతో పంటలు పండటం లేదు. ఈ కారణంగా సఖినేటిపల్లి మండలంలో 6 వేల ఎకరాల వరి పండించే విస్తీర్ణం ఉండగా నాలుగైదు వందల ఎకరాల్లో మాత్రమే నాట్లు వేస్తున్నారు. మలికిపురం మండలంలో కేవలం ఐదారు వందల ఎకరాల్లో మాత్రమే నాట్లు వేస్తున్న పరిస్థితి. కేశనపల్లి తదితర తీర గ్రామాల్లో ఉప్పునీటితో వేలాది కొబ్బరి చెట్లు చనిపోతున్నాయి. సరుగుడు చెట్లు ఇవకేస్తున్నాయి. మొలలోతు ముంపులో కనీసం పొలాల్లోకి వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయని రైతులు చెబుతున్నారు.

పంటలకు సైతం..

నీటి మళ్లింపునకు ప్రణాళికలు

తీర గ్రామాల్లో ముంపునీటిని మళ్లించేందుకు, పంటలను సంరక్షించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రధాన కారణమైన శంకరగుప్తం మేజరు డ్రెయినును ప్రక్షాళనకు చర్యలు చేపట్టాం. డ్రెడ్జింగుతో తవ్వకాలు చేపట్టడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. మిగతా మీడియం, మైనరు డ్రెయిన్లను బాగుచేయడానికి చర్యలు తీసుకుంటాం.

– దేవ వరప్రసాద్, ఎమ్మెల్యే, రాజోలు

నిత్యాన్నదాన పథకానికి విరాళం

మామిడికుదురు, ఆత్రేయపురం, న్యూస్‌టుడే: అప్పనపల్లి బాల బాలాజీస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరం గ్రామీణం కడియం మండలం పొట్టిలంక గ్రామానికి చెందిన సురింది వీరవెంకటరావు, కుమారి దంపతులు రూ.1.01 లక్షల విరాళాన్ని ఆదివారం సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకులు వేదాశీర్వచనం, స్వామివారి చిత్రపటం అందజేశారు. ● కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ నిత్యాన్నదాన ట్రస్టుకు ఏలూరు జిల్లా భీమడోలుకు చెందిన మహాదేవుని వెంకటభీమేష్‌వర్మ కుటుంబ సభ్యులు రూ.50,116 విరాళాన్ని సమర్పించారు. వీరికి స్వామివారి చిత్రపటం అందజేసి దేవస్థానం ప్రతినిధి శ్రీనివాస్ అభినందించారు.

స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అధికారులు

కార్తిక వన సమారాధనలతో ఐక్యత

మలికిపురం, న్యూస్‌టుడే: కార్తిక వన సమారాధనలతో వర్గీయుల మధ్య సంఘీభావం పెంపొందుతుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురంలో కాపు సామాజికవర్గం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత మహిళలు ఉసిరి చెట్టు వద్ద పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి, సర్పంచి గెడ్డం రాజ్యలక్ష్మి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు పాల్గొన్నారు.

ఉసిరి చెట్టుకు మహిళల పూజలు

కనుల పండువగా తెప్పోత్సవం

పి.గన్నవరం, న్యూస్‌టుడే: క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా లంకలగన్నవరంలో కొలువైన భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, రుక్మిణీసత్యభామా సమేత రాజగోపాలస్వామి వార్ల తెప్పోత్సవం, దీపోత్సవం ఆదివారం రాత్రి కనుల పండువగా సాగింది. మేళతాళాలు, బాణసంచా కాల్పులతో తొలుత గ్రామోత్సవం జరిపి వైనతేయ గోదావరి నదిలో పడవల్లో ఉత్సవమూర్తులను ఉంచి వేడుక జరిపారు. భక్తజనం వందలాది దీపాలను విడిచిపెట్టారు. వరద ఉరవడి ఎక్కువగా ఉండటంతో ఏఎస్సై పట్టాభి రామయ్య పర్యవేక్షించారు. ఈవో ఎన్.వి.ప్రసాదరాజు, గనిశెట్టి కేదారేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి

క్షీరాబ్ది ద్వాదశి పూజలు

అంబాజీపేట, అయినవిల్లి, న్యూస్‌టుడే: అంబాజీపేట మండలం మాచవరం పార్వతీరాజేశ్వర స్వామి ఆలయంలో క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా ఆదివారం లక్ష పత్రి పూజ నిర్వహించారు. మహిళలు ఉసిరి చెట్టుకు పూజలు చేసి దీపాలు వెలిగించారు. ఆలయాలు శివనామస్మరణతో మారుమోగాయి.

ముక్తేశ్వరంలో ..

బాలాత్రిపురసుందరీ సమేత ఆనందరామేశ్వరస్వామి

సామూహిక లక్ష బిల్వార్చన

ముక్తేశ్వరంలోని ముక్తికాంతా సమేత క్షణముక్తేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సామూహిక లక్ష బిల్వార్చన జరిగింది. ఈ సందర్భంగా శ్రీరుద్రాభిషేకం, కుంకుమార్చన, రుద్ర హోమం, శాంతికల్యాణం, దీపోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అధిక సంఖ్య భక్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మలికిపురం, న్యూస్‌టుడే: మలికిపురం మండలం కేశనపల్లి గ్రామానికి చెందిన దీపాటి అమ్మాజీకి పలువురు దాతలు ఆర్థిక సాయం అందించారు. తాడి సహదేవ్ ఆధ్వర్యంలో దేవ రామదాస్, కొల్లాబత్తుల ఏడుకొండలు, దేవ ప్రసాద్, తాడి చిట్టిబాబు, బొండాడ మునేశ్వరరావు, లక్కవరం సీసీఎఫ్ సొసైటీ అధ్యక్షుడు సమకూర్చిన రూ.32 వేల నగదును ఆదివారం అందజేశారు.

చిత్రపటాల ఆవిష్కరణ

ఆలమూరు (రావులపాలెం గ్రామీణం), న్యూస్‌టుడే: ఆలమూరులోని శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామివారికి సంబంధించిన వంద చిత్రపటాలను కొత్తూరు సెంటర్‌లోని భాస్కర హోటల్ యజమాని పసుపులేటి దుర్గాప్రసాద్, పార్వతి దంపతులు రూ.50 వేలు వెచ్చించి తయారు చేయించారు. వీటిని ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ ఛైర్మన్ బైరిశెట్టి రాంబాబు ఆధ్వర్యంలో మండపేట విద్యుత్తు ఏడీఈ సిహెచ్.శ్రీధర్ ఆవిష్కరించారు.

శిథిలం.. తుపాను ఆశ్రయ భవనం

రాజోలు మధ్యలంకలోని తుపాను ఆశ్రయ భవనం శిథిల స్థితికి చేరింది. స్లాబు పెచ్చులు ఊడి తలుపులు, కిటికీలు పాడయ్యాయి. స్థానిక రైతులు పశువుల దాణా, ఎండుగడ్డి నిల్వ ఉంచేందుకు ఉపయోగిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ భాస్కర్‌ను వివరణ కోరగా భవనం పాడవ్వడంతో పూర్తిగా తొలగిస్తామన్నారు. – న్యూస్‌టుడే, రాజోలు

ప్రమాదకరంగా గుంత

రావులపాడు నుంచి రావులపాలెం వెళ్లే కాలువగట్టు రోడ్డులో దూడలరేవు వద్ద రహదారిపై పెద్ద గుంత కారణంగా ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ద్విచక్ర వాహనాలు గోతిలోపడి అదుపు తప్పడంతో పలువురు చోదకులు గాయాలపాలయ్యారు. వాడపల్లి వెళ్లే భక్తులు ఈ రహదారిపైనే అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. గుంతలను పూడ్చి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ తెలిపారు. – న్యూస్‌టుడే, రావులపాలెం గ్రామీణం

దుర్గంధం.. పుష్కర రేవు

పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి చెందిన దిండి గ్రామంలోని పుష్కర రేవు సమీపంలో వశిష్ఠ గోదావరి ఒడ్డున పెద్దపెద్ద దుంగలు, చెత్తాచెదారం పేరుకుపోతోంది. సమీప ప్రాంతాల నుంచి తీసుకువచ్చి ఇక్కడ వేస్తున్నారు. దుర్వాసన వ్యాపించి పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై స్థానిక పంచాయతీ కార్యదర్శి కొండా సురేశ్‌ను వివరణ కోరగా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, మలికిపురం

వీడని నీరు.. రైతుకు భారం

మొంథా తుపానుతో కురిసిన వర్షాలకు పొలాలను ముంపునీరు ముంచెత్తింది. అరటి, కొబ్బరి, వరి, ఉద్యాన పంటల్లో రోజుల తరబడి నిల్వ ఉండిపోయింది. తీవ్రనష్టం ఏర్పడుతుందని అన్నదాతలు వాపోతున్నారు. చేసేదిలేక ఆయిల్ ఇంజిన్లతో బయటకు తోడిస్తున్నారు. అదనపు భారం అవుతోందని వాపోతున్నారు. మాచవరం గ్రామంలో అరటి తోట నుంచి నీటిని మళ్లిస్తున్న తీరును చిత్రంలో చూడొచ్చు. – న్యూస్‌టుడే, అంబాజీపేట



పదవీ బాధ్యతల స్వీకరణ శుభాకాంక్షలు

రాజోలు నియోజకవర్గం గౌరవశాసన సభ్యులు శ్రీ దేవ వర ప్రసాద్ గారి ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నేడు పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీ గుబ్బల ఫణికుమార్ గార్కి ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలు.

శ్రీ గుబ్బల ఫణికుమార్ గారు
రాష్ట్ర BC కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్, రాజోలు నియోజకవర్గం

	మేడిచర్ల సత్యవాణి రాము MPP, మలికిపురం
జక్కంపూడి శ్రీదేవి MPTC, మలికిపురం	రేవూరి రాజేశ్వరి ఏసు నరసింహ రాజా సర్పంచ్, సఖినేటిపల్లిలంక
పోతు దేవి దుర్గా తాతయ్య నాయుడు సర్పంచ్, టేకిశెట్టిపాలెం	మేడిది సరోజ సర్పంచ్, కేశవదాసుపాలెం
ఉండవల్లి సాయికుమారి అంజి ఎంపీటీసీ, కేశవదాసుపాలెం	బోనం సీతా మహాలక్ష్మి సర్పంచ్, బట్టేలంక
పొన్నం నాగదుర్గ ఎంపీటీసీ, మెరకపాలెం	కుడిపూడి మల్లీశ్వరి గణేశ్వరరావు ఎంపీటీసీ, కూనవరం
అల్లు విజయలక్ష్మి సురేష్ సర్పంచ్, గోగన్నమఠం	ఆకుల మాధవి చిన వెంకన్న నాయుడు సర్పంచ్, పడమటిపాలెం
రావి అంజనాదేవి జనసేన వీర మహిళ, శృంగవరప్పాడు	మేడిచర్ల సత్య జనసేన వీర మహిళ, బట్టేలంక
దార్ల కుమారి లక్ష్మి ఎంపీటీసీ, రాజోలు	ఉల్లిశెట్టి అన్నపూర్ణ అభివృద్ధి కమిటీ సభ్యులు, రాజోలు ప్రభుత్వ ఆసుపత్రి
ఆవుపాటి శివజ్యోతి ఎంపీటీసీ, బట్టేలంక	అడబాల సత్యామణి జనసేన వీర మహిళ, మలికిపురం
మెండు ప్రియాంజన జనసేన వీర మహిళ, కేశవదాసుపాలెం	నారిన పోచమ్మ వీర మహిళ, మలికిపురం
మెండు జ్యోతి వీర మహిళ, వివిమెరక	బొల్లం విజయ వీర మహిళ, మలికిపురం
మాగాపు విజయదుర్గ వీర మహిళ, గొల్లపాలెం	రావూరి భాను వీర మహిళ, అప్పనరామునిలంక
అడబాల రత్నజ్యోతి పంచాయతీ వార్డ్ మెంబర్, లక్కవరం	కల్వకొలను భార్గవి వీర మహిళ, గొంది
బోడపాటి కనక మహాలక్ష్మి వీర మహిళ, వివిమెరక	అడబాల నాగలక్ష్మి వీర మహిళ, మలికిపురం
రావూరి జయ వీర మహిళ, గొంది	దొడ్డా విజయ వీర మహిళ, చింతలమోరి
ఆదిమూలం సుజాత వీర మహిళ, మలికిపురం	కల్వకొలను యమున వీర మహిళ, కత్తిమండ

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట:90323 93884

చెత్త ఇక్కట్లు తీరాయి

స్పందనకు వందనం

ఆత్రేయపురం: కట్టుంగలో చెత్త పేరుకుపోవడంతో ఇబ్బంది పడుతున్నామంటూ స్థానికులు తెలిపిన సమస్యను గ్రామ కార్యదర్శి చంద్రశేఖర్ వద్ద ప్రస్తావించగా చెత్త తొలగించి శుభ్రం చేయించారు.

రావులపాలెం గ్రామీణం: గోపాలపురంలో ప్రధాన రహదారి చెంతన వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని పంచాయతీ కార్యదర్శి సాయిపట్టాభిరామయ్య దృష్టికి తీసుకువెళ్లగా వ్యర్థాలను తీయించారు.

పొదలు, ఫ్లెక్సీల తొలగింపు

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేట ఉన్నత పాఠశాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై తుప్పలు, పిచ్చి మొక్కలు, పొదలు ఏపుగా పెరిగిపోయాయి. ఈ విషయాన్ని ఏఈ పి.కవితకు తెలియజేయగా తక్షణం స్పందించి సిబ్బందితో తొలగించారు.

అంబాజీపేట, న్యూస్‌టుడే: ముక్కామల లాకు కూడలిలో ఉన్న ఫ్లెక్సీలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించి సిబ్బందితో తొలగించారు.

విద్యార్థుల స్వచ్ఛ సంకల్పం

మామిడికుదురు: మామిడికుదురు దీప్తి డిగ్రీ, జూనియర్ కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మాకనపాలెం, కొమరాడ గ్రామాల్లో ఆదివారం స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టారు. రహదారుల పక్కన చెత్తకుప్పలు, పిచ్చి మొక్కలను తొలగించారు. విద్యాసంస్థల ఛైర్మన్ డీవీ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ నిర్వాహక అధ్యాపకులు పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు.. స్వాములకు గాయాలు

కొత్తపేట: అంతర్వేది, అప్పనపల్లి ఆలయాల దర్శనానికి వచ్చిన అయ్యప్ప మాలధారులు ప్రయాణిస్తున్న కారు ఆదివారం గంటి గ్రామంలోని కాలువలోకి దూసుకుపోయింది. ఏలూరు మండలం రాఘవపురానికి చెందిన 14 మంది అయ్యప్పస్వాములు, 8 మంది మహిళలు ఆలయాల దర్శనానంతరం తిరిగి వెళ్తుండగా వాహనం అదుపుతప్పి కాలువలోకి దూసుకుపోయింది. ఐదుగురికి తీవ్ర గాయాలవ్వగా మిగిలిన వారు సురక్షితంగా ఉన్నారు. గాయపడిన వారిని కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. దీనిపై ఏవిధమైన ఫిర్యాదు అందలేదని కొత్తపేట ఎస్సై సురేంద్ర తెలిపారు.

బాధితులకు ప్రభుత్వం చేయూత

సరకులు, నగదు అందజేస్తున్న శ్రీనివాస్, ఎంపీపీ శ్రీదుర్గ

రాజోలు: తుపాను బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ కడలి శ్రీదుర్గ అన్నారు. పొన్నమండలో ఆదివారం నిత్యావసరాలు, పరిహారం అందజేశారు. బాధిత కుటుంబాలకు 25 కేజీల బియ్యం, రూ.3 వేలు చొప్పున అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కుక్కల బేబీకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు మోకా ఉష, దాకే ఏడుకొండలు, కడలి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం గొలుసు దుకాణంపై దాడి

కొత్తపేట, న్యూస్‌టుడే: కొత్తపేట ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని ఆధ్వర్యంలో కొత్తపేట, రావులపాలెం మండలాల్లోని నాటుసారా తయారీ కేంద్రాలు, గొలుసు దుకాణాలపై ఆదివారం దాడులు నిర్వహించారు. రావులపాలెం మండలం దేవరపల్లిలో 6 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, 500 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేశారు. అప్పారి శ్రీనును అదుపులోకి తీసుకున్నారు. కొత్తపేట మండలం పలివెలలో గొలుసు దుకాణంపై దాడి చేసి 180 ఎంఎల్ ఏడు మద్యం సీసాలతోపాటు పిల్లా వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యేలకు అభినందన

దేవ వరప్రసాద్‌ను సత్కరిస్తున్న తహసీల్దార్లు

మలికిపురం, ఆలమూరు, న్యూస్‌టుడే: మొంథా సైక్లోన్ ఫైటర్ అవార్డు అందుకున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను ఆదివారం విశ్వేశ్వరాయపురంలోని క్యాంపు కార్యాలయంలో మలికిపురం, సఖినేటిపల్లి తహసీల్దార్లు టి.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వరరావు సన్మానించి అభినందించారు. తీర గ్రామాల్లో పర్యటిస్తూ అధికారులను, ప్రజలను అప్రమత్తం చేసి తుపాను సహాయక చర్యలను అనుక్షణం పర్యవేక్షించారని ప్రశంసించారు. ఆర్ఐ జి.వేణు, పి.హరికిషన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● ముఖ్యమంత్రి చేతుల మీదుగా పురస్కారం అందుకున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావును ఆలమూరు మండల యూటీఎఫ్ ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. మండల అధ్యక్షుడు అద్దరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి లోకేష్, నాయకులు వై.వి.రమణ, జి.ఎస్.ఎన్.మూర్తిలు ఎమ్మెల్యేను సత్కరించి వెంకటేశ్వరస్వామి చిత్రపటం అందించారు.

సత్యానందరావుతో ఉపాధ్యాయులు

ఏఈ ప్రసాద్‌కి ప్రశంస

మలికిపురం, న్యూస్‌టుడే: మొంథా సైక్లోన్ ఫైటర్ అవార్డు అందుకోవడానికి నిరాకరించిన ఏపీఈపీడీసీఎల్ మలికిపురం ఇన్‌ఛార్జి ఏఈ బొలిశెట్టి ప్రసాద్‌ను ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కె.రాంబాబు ప్రశంసించారు. తుపాను సమయంలో అందించిన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అందుకోవడానికి వెళ్లలేదు. విధి నిర్వహణలో ఉండగా సఖినేటిపల్లి మండలానికి చెందిన విద్యుత్తు సిబ్బంది ఒకరు ప్రమాదవశాత్తు మృతి చెందడంతో కలత చెంది ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏఈ మానవత్వాన్ని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ప్రశంసించారు.

106వ జన్మదినోత్సవ శుభాకాంక్షలు

శ్రీ బోళ్ళ కృష్ణమూర్తి గారు
CPI నాయకులు, శివకోటి

✦ సమస్త జీవరాశుల సృష్టి, కాలమాన వైరుధ్యాలు, చావుబ్రతుకులు, వానలు, వరదలు ఇవి ప్రకృతి పరమైనవి (వీటినే గ్రహస్థితి అన్నారు). వీటిని మించి దేవుడు అనే పరాశక్తి ఉన్నట్లు మన పురాణాలు వ్రాయలేదు. అది మరచి దేవునిపై భారం అనాలోచన కాదా?
✦ దేవునికి రూప, నామ, క్రియలు లేవు. మానవుని అకృత్యాల నుండి పరమార్థి చేయాలన్నదే దేవాలయ బూచి.
✦ మన రాజ్యాంగమే పెట్టుబడిదారీ వ్యవస్థను పోషిస్తున్నది. ఇది ప్రజాస్వామ్యమునకు మంచిది కాదు.
✦ దేశ సంపద జాతీయముతోనే, సర్వమానవ సౌభ్రాతృత్వము వర్ధిల్లగలదు.

భార్య: సత్యవతి (లేటు)
కుమార్తెలు: ఆరుమిల్లి కమల, వేగుళ్ళ కుసుమ, నున్న నాగలక్ష్మి, బండా వనజకుమారి
అల్లుళ్లు : సుబ్బారాయుడు (లేటు), Rtd. Co-op-Dept., V.V.V.A.సత్యనారాయణ (లేటు) Rtd. A.E., PR, దత్తాత్రేయుడు, Rtd. LDC, రమేష్‌బాబు, Rtd. ఆంధ్రా షుగర్స్
కుమారులు: బోళ్ళ రఘు, Rtd. PET; బోళ్ళ మధు, Rtd. Co-Dt.,; బోళ్ళ ప్రతాప్ (లేటు), Oil Company, కువైట్
కోడళ్లు : విమలకుమారి, విజయ, వీరలక్ష్మి
మనుమలు: వేగుళ్ళ రవికుమార్, ఫైనాన్షియర్ - కళ్యాణి
వేగుళ్ళ అనిల్‌కుమార్, Software, London - భవాని, Softwere. Engineer
ఆరుమిల్లి భానుసుధాకర్, TDP నాయకులు - నాగదేవి, B.Sc. Computers
నున్న మనోహర్, సివిల్ కాంట్రాక్టర్ - పరిమళ, SA, Eng, Madicherlapalem
బోళ్ళ రాజాఅశోక్, Sr.Manager - Chime Bank - భానుతేజ, Software, Deloitte, USA
బోళ్ళ సాయిగౌతమ్, M.S., Canada - రోజ్‌మేరీ, M.S., Canada
బండా రూపేష్, M.S., Cyber Security (Australia) - హేమ మాధురి (Software)
బండా రాకేష్, Senior Manager (AU Finance Bank)
మనుమరాండ్రు: అడుసుమిల్లి శోభ - శ్రీధర్, GM., (U World, India, Pvt.Ltd.)
ఉండవల్లి రోహిణి, GHM, Kunavaram - శ్రీనివాస్, B.Com., B.Ed., శివకోటి
మార్ని ఉమ, PET, ద్రాక్షారామం - రమేష్, B.Sc., B.Ed., G.వేమవరం
గారపాటి శేషుక్రాంతి - సత్యనారాయణ, ఆంధ్రా షుగర్స్
మేకా కృష్ణదీప్తి - శ్రీనివాస్, STATRAN Company, Dubai

మునిమనుమలు, మునిమనుమరాండ్రు, కుటుంబసభ్యులు & బంధుమిత్రులు

(c) eenadu

అమలాపురం
• అమలాపురం • ముమ్మిడివరం

పతకాలు సాధించిన కరాటే క్రీడాకారులు

కరాటే పోటీల్లో సత్తా

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: పవర్ కిక్ షోటోకాన్ కరాటే సంఘం నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో పవర్ కిక్ విద్యార్థులు పతకాలు సాధించారని చీఫ్ కోచ్ పడాల అంజి తెలిపారు. స్థానిక కరాటే క్రీడా కార్యాలయంలో క్రీడాకారులకు పతకాలు అందజేశారు. బ్లూస్టార్స్ చీఫ్ మధు రామకృష్ణ, డాక్టర్ శ్రీమన్నారయణలు కరాటే బెల్టులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

అమలాపురం గ్రామీణం: ఎ.వేమవరంలోని అభయ ఆంజనేయ స్వామి ఆలయ 14వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాథుర్ ముఖ్య అతిథిగా హాజరై స్వామిని దర్శించుకున్నారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, లింగోలు పండు, బొర్రా ఈశ్వరరావు, దున్నాల దుర్గ, దెందుకూరి సత్తిబాబురాజు తదితరులు పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న ఎంపీ హరీష్‌మాథుర్, మెట్ల రమణబాబు

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: వర్షాల తీవ్రతతో కాట్రేనికోనలోని గచ్చకాయలపోర పరిసర ప్రాంతాల్లో దోమలవ్యాప్తి ఎక్కువగా ఉంది. అధికారులు స్పందించి బ్లీచింగ్ చల్లించేలా చర్యలు చేపట్టాలి.
– ప్రసాద్, స్థానికుడు

పరిష్కారం: సమస్యను సర్పంచి గంటి సుధాకర్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. గ్రామంలో బ్లీచింగ్ చల్లించేలా చర్యలు తీసుకున్నారు.

సమస్య: కాట్రేనికోనలో తాగు నీటి ట్యాంకులోపల నాచు ఏర్పడింది. సంబంధిత అధికారులు స్పందించి ట్యాంకును శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాలి
– గ్రామస్థులు

పరిష్కారం: ఈ సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బందితో ట్యాంకును శుభ్రం చేయించారు.

– న్యూస్‌టుడే, కాట్రేనికోన

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
అమలాపురం పట్టణం: 79939 35935, గ్రామీణం: 91000 20948
అల్లవరం: 91548 46718 ముమ్మిడివరం: 80085 74166
కాట్రేనికోన: 79950 67044 ఉప్పలగుప్తం: 91548 46716

ఆ దారిలో వెళ్లాలంటే వణుకు

అధ్వానంగా ఓడలరేవు రోడ్డు ● సీఎం హామీపై ఆశలు

న్యూస్‌టుడే, అల్లవరం

ఓడలరేవు వద్ద ఓఎన్జీసీ సంస్థ అతిపెద్ద చమురు క్షేత్రాన్ని నిర్వహిస్తోంది. ఆన్‌షోర్, ఆఫ్‌షోర్ కార్యకలాపాలు ఏకబిగువున 365 రోజులూ జరుగుతూనే ఉంటాయి. రూ.వేల కోట్ల విలువైన చమురు, సహజవాయువు ఉత్పత్తులను ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. ఆ గ్రామానికి వెళ్లేందుకు సరైన రహదారి లేక జనం నరకం చూస్తున్నారు. ఇటీవల తుపాను బాధితులను పరామర్శించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి కాన్వాయ్ సైతం ఈ మార్గంలోనే వెళ్లింది. ఈ సందర్భంగా స్థానికులు ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

నిలిచిన 1.5 కి.మీ. నిర్మాణం

బెండమూర్లంక నుంచి ఓడలరేవు ఓఎన్జీసీ చమురు సంస్థ వరకు 3 కి.మీ. మేర 23 అడుగుల వెడల్పుతో రహదారి నిర్మించేందుకు ఓఎన్జీసీ చమురు సంస్థ మూడేళ్ల క్రితం రూ.7 కోట్లు విడుదల చేసింది. బెండమూర్లంక ఓఎన్జీసీ టెర్మినల్ నుంచి పంచనది డ్రెయిన్ వంతెన వరకు రహదారి నిర్మించారు. అక్కడి నుంచి ఓఎన్జీసీ ప్లాంట్ వరకు మరో 1.5 కి.మీ. మేర నిర్మాణం నిలిచి పోయింది. పంచనది డ్రెయిన్ నుంచి ప్లాంట్ వరకు 15 అడుగుల వెడల్పుతో గతంలో రహదారి నిర్మించారు. ఆధునికీకరణలో భాగంగా దీనిని 23 అడుగులకు విస్తరించాలంటే 1.5 కి.మీ. పరిధిలో సుమారు ఎకరం మేర భూమి రైతుల నుంచి సేకరించాల్సి వస్తోంది. దీనికి పరిహారం అందించేందుకు ఓఎన్జీసీ చమురు సంస్థ సుముఖంగా లేకపోవడంతో నిర్మాణం అర్ధాంతరంగా నిలిచి పోయింది. ఇటీవల గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రి ఈ రహదారి దుస్థితిని చూసి అధికారులపై అసహనం వ్యక్తం చేశారు.

ఇటీవల గుంతల రహదారిలో వెళుతున్న సీఎం కాన్వాయ్

● బెండమూడిలంక- ఓఎన్జీసీ టెర్మినల్ 3.0 కి.మీ
● పంచనది డ్రెయిన్- ఓఎన్జీసీ టెర్మినల్ 1.5 కి.మీ
● ఆధునికీకరణకు అవసరమైన భూమి ఎకరం

సమస్యలు తిష్ఠ

ఓడలరేవు గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయి. గ్రామాన్ని ముంపు నీరు చుట్టుముడుతోంది. మురుగు పారే వ్యవస్థ లేదు. స్థానికులకు 60 శాతం ఉద్యోగాలు కల్పించాలనే నిబంధన ఉన్నా.. అమలు కావడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. స్థానిక నాయకులు తమ పబ్బం గడుపుకునేందుకు సమస్యలను తెరపైకి తీసుకువస్తున్నారే తప్ప చిత్తశుద్ధితో పరిష్కరించేందుకు ప్రయత్నించడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇటీవల తమ గ్రామ అభివృద్ధికి సహకరించాలని 70 రోజుల పాటు ప్లాంట్ వద్ద నిరసనకు దిగారు. చివరకు ప్లాంట్‌ను ముట్టడించి ఆందోళన తీవ్రం చేయడంతో సంస్థ అధికారులు చర్చలకు వచ్చి కంటితుడుపుగా కొన్ని హామీలు అమలుకు అంగీకరించారు. తాజాగా సంస్థ ఇచ్చిన హామీలపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పంటకాలువలోకి మురుగు ప్రవాహం

అమలాపురం గ్రామీణం: ఎ.వేమవరంలోని పంటకాలువలోకి మురుగు చేరుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదంతా వరిచేలల్లోకి వెళ్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికే పంటకాలువలు తూడుతో నిండిపోయి అధ్వానంగా మారాయన్నారు. ఈ సమస్య చాలా కాలంగా ఉన్నప్పటికీ నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారన్నారు. అధికారులు చొరవ తీసుకుని సాగునీటి సమస్యను చక్కదిద్దాలని కోరుతున్నారు.

బాధితులకు అండగా ప్రభుత్వం

కాట్రేనికోన, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంలో బాధితులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెదేపా రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి ప్రభుత్వం ప్రకటించిన 25 కేజీల బియ్యం, నిత్యావసరాలను అధికారులు అందించారు. తుపాను బాధితులకు స్థానిక నాయకులు అందించారు. చెల్లి సురేష్, నడింపల్లి సుబ్బరాజు, ఆకాశం శ్రీను, వెంకటేశ్వర్లు, బాబురావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: రెడ్డిపల్లిలో ఇటీవల తుపాను ప్రభావంతో నష్టపోయిన 12 కుటుంబాలకు రూ.3వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని సర్పంచి కరాటం ప్రసన్న, ప్రవీణ్ అందజేశారు. బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు, బియ్యం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.గణపతి, వీఆర్వో దొరబాబు, నల్లా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

యూజీసీ నియమావళి అమలు చేయాలి

నిరసన తెలుపుతున్న అసోసియేట్ ప్రొఫెసర్లు

యానాం: యూజీసీ నిర్దేశించిన విధంగా పదోన్నతులు, వేతనాలు అందించాలని డిమాండ్ చేస్తూ యానాం ఎస్సార్కే ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో పనిచేస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్లు ఆదివారం విద్యాసంస్థ ప్రాంగణంలో నిరసన తెలిపారు. పుదుచ్చేరి జేఏసీ పిలుపు మేరకు ఈ ఆందోళన నిర్వహిస్తున్నామని జాక్ సభ్యులు డాక్టర్ యోగేంద్రసింగ్, శ్రీదేవి, ఉమాదేవి తెలిపారు. అనంతరం పరిపాలనాధికారి అంకిత్‌కుమార్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, టి.ముత్యాలు, చెల్లె నరేష తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌కు కవితా పురస్కారం

యానాం: ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ సౌజన్యంతో మల్లెతీగ సాహిత్యసంస్థ నిర్వహించిన కవితల పోటీలో యానాం కవి పొనుగుమట్ల అశోక్‌కుమార్ కవిత ప్రోత్సాహక బహుమతికి ఎంపికైంది. ఈ నెల 22, 23లలో విజయవాడలో నిర్వహించే జాతీయ సాంస్కృతిక ఉత్సవాలలో మొమెంటో, నగదు పురస్కారం అందజేయనున్నట్లు అశోక్‌కుమార్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అశోక్‌కుమార్ రాసిన దీర్ఘకవిత పలువురి ప్రసంశలు అందుకుంది.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

అమలాపురం పట్టణం: జిల్లాలో రౌడీషీటర్లు నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్పీ రాహుల్‌మీనా పేర్కొన్నారు. ఆదివారం రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వారితో సమావేశం నిర్వహించారు. రౌడీషీటర్ల కదలికలు, కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంటుందన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఐ.పోలవరం: అత్యాచారానికి గురైన మైనర్ బాలిక కుటుంబాన్ని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు పుణ్యమంతుల రజని ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తనూజ, వెంకటరమణ, ఈతకోట గౌరి తదితరులు పాల్గొన్నారు.

చేతికందే ఎత్తులో ప్రమాదం



బోడసకుర్రు పంచాయతీ పరిధిలో శివాలం ఎదురుగా ఉన్న విద్యుత్తు తీగలు చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఇక్కడి నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తుశాఖ అధికారులు చెట్ల కొమ్మలు తొలగించే సమయంలో ఫిర్యాదు చేసినా వీటిని సరిచేయలేదని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వీటిని సరి చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అల్లవరం

రహదారే డంపింగ్ యార్డు..!

అమలాపురం మండలం భట్నవిల్లి నుంచి పేరూరు వరకు ఉండే బైపాస్ రహదారిలో దుర్వాసన వస్తోంది. కామనగరువు, రోళ్లపాలెం సమీపంలోని ప్రధాన రహదారి ఆనుకుని చెత్తకుప్పలను వేస్తున్నారు. అటుగా వెళ్లేవారికి అవస్థలు తప్పడం లేదు. వర్షాలు పడుతుండటంతో వ్యాధులు వ్యాప్తిచెందే ప్రమాదం ఉందని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. చెత్తకుప్పలను వేరే ప్రాంతానికి తరలించాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

తుప్పలతో తిప్పలు



దొంతికుర్రు నుంచి పల్లం వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారికి ఇరువైపులా తుప్పలు ఏపుగా పెరగడంతో ఇబ్బంది పడుతున్నామని వాహనచోదకులు వాపోతున్నారు. దొంతికుర్రు నుంచి డ్యామ్‌సెంటర్ వరకు రోడ్డుపక్కన తుప్పలు పెరగడంతో వెళ్లినప్పుడు కళ్లకు తగులుతున్నాయన్నారు. నాలుగు చక్రాల వాహనాలు వచ్చినప్పుడు తప్పుకోవడానికి ఇబ్బందిగా ఉందంటున్నారు. అధికారులు స్పందించి వాటిని తొలగించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కాట్రేనికోన

కాలువే.. ఇలా మారింది..

ఉప్పలగుప్తం మండలం చల్లపల్లిలోని రాచకోడ డ్రెయిన్ పరిస్థితి ఇది. పూడికతో నిండిపోయి పచ్చని పచ్చిక బయలును తలపిస్తోంది. ఈ డ్రెయిన్ ద్వారా వందల ఎకరాల ముంపునీరు దిగాల్సి ఉంది. అధికారులు పట్టించుకుని శుభ్రం చేయించాలని రైతులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

తెరపై క్రికెట్‌ను వీక్షిస్తున్న ప్రజలు

క్రికెట్ అభిమానుల సందడి

అమలాపురం పట్టణం: మహిళల క్రికెట్ వరల్డ్‌కప్ సందర్భంగా అమలాపురం తెదేపా కార్యాలయం ప్రాంగణంలో ఆదివారం ప్రత్యేక తెరను ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో అభిమానులు వీక్షించారు. చివరకు భారత్ జట్టు విజయం సాధించడంతో అభిమానులు సందడి చేశారు.

మంద కృష్ణమాదిగపై చర్యలకు డిమాండ్

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఇటీవల ఓ సమావేశంలో రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్‌ను చులకనగా.. ఏకవచనంతో మాట్లాడడం దారుణమని ఐ.పోలవరం మండల మాలమహానాడులో నాయకులు పేర్కొన్నారు. మండల మాల మహానాడు అధ్యక్షుడు రేవు శ్రీను అధ్యక్షతన పాత ఇంజరం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం సమావేశం జరిగింది. అనంతరం మంద కృష్ణమాదిగపై చర్యలు తీసుకోవాలని ఐ.పోలవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వడ్డి గౌతమ్, జనిపల్లి విప్లవకుమార్, మట్ట గగనవీరుడు, పండు విజయ్‌కుమార్, బీర సత్యనారాయణ, గుత్తాల ప్రసాద్, దుక్కిపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు.. చెత్త నిల్వలు

హౌసింగ్‌బోర్డు కాలనీలో ఖాళీస్థలం పరిస్థితి

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

అమలాపురం పట్టణంలోని హౌసింగ్ బోర్డుకాలనీ, కె.అగ్రహారం, సావరం, విద్యుత్తునగర్, వడ్డిగూడెం, కార్మికనగర్‌లలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. మురుగు వెళ్లేదారిలేక రోడ్లపై ప్రవహిస్తోంది. ఏ కాలమైనా సరే దోమలు విజృంభిస్తున్నాయి. పట్టణంలోని పారిశుద్ధ్య పరిస్థితులకు తోడు ఖాళీ స్థలాలు దోమలు, పురుగులకు నిలయంగా మారుతున్నాయి. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికి పట్టణంలో పలు మురుగుకాలువలు నిండి రోడ్డుపై మురుగు ప్రవహిస్తోంది. ప్రజాప్రతినిధుల, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా వార్డుల్లోని ఖాళీ స్థలాలు ప్రజల పాలిట శాపంగా మారుతున్నాయి. పురపాలక సంఘంలో శాశ్వత ప్రాతిపదికన 30 మంది, ఒప్పంద పద్ధతిలో 130 మంది ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్నారు. నెలకు వీరికి సుమారు రూ.50 లక్షలు జీతాలు చెల్లిస్తున్నారు.

డ్రెయిన్లు నిర్మించాలి

ప్రధాన డ్రైన్లను నిర్మించాలి. మురుగు కాలువల కంటే రహదారులు ఎత్తుగా ఉండేలా చూడాలి. సావరం, విద్యుత్తునగర్, కార్మికనగర్‌లో నీరు వెళ్లేందుకు నల్లవంతెన బైపాస్‌రోడ్డు కాలువను శుభ్రం చేయాలి. ఖాళీ స్థలాలను అపరిశుభ్రంగా వదిలేస్తున్నారు. వాటిపై దృష్టి సారించాలి. – బాబు, సావరం రోడ్డు

ప్రత్యేక కార్యాచరణ అమలు

పట్టణంలో మురుగుకాలువలో పూడికలు తొలగించే పనులు జరుగుతున్నాయ్. ప్రజలకు ఇచ్చిన డబ్బాలలో చెత్త, వ్యర్థాలను మున్సిపల్ సిబ్బందికి ఇవ్వాలి. సచివాలయాల వారీగా ఉన్న ఖాళీస్థలాల వివరాలను సేకరించి యజమానులతో వాటిని శుభ్రం చేయించేలా చర్యలు తీసుకుంటాం. మురుగు కాలువలో దోమల మందు పిచికారి చేయించాలి. ప్రజారోగ్యం దృష్ట్యా ఖాళీ స్థలాల యజమానులు సహకరించాలి. – వి.నిర్మల్‌కుమార్, అమలాపురం మున్సిపల్ కమిషనర్

శెట్టిబలిజ సంఘం నూతన కార్యవర్గం

ఉన్నత విద్యతోనే సామాజిక మార్పు

యానాం, న్యూస్‌టుడే: ఉన్నత విద్యను అభ్యసించిన కుటుంబాలు ఉన్నత స్థాయికి ఎదిగాయని, విద్య ప్రాధాన్యాన్ని గుర్తించాలని విశ్రాంత ఉపాధ్యాయుడు దంగేటి త్రిమూర్తులు అన్నారు. యానాం శెట్టిబలిజ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా స్థానిక గాజుల మినీ కల్యాణ మండపంలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నూతన అధ్యక్షుడు చీకట్ల సత్యనారాయణ, సభ్యులు కాకి నాగేశ్వరరావు, చింతాకుల రామకృష్ణ, నక్కల భువనేశ్వర్, చీకట్ల రామకృష్ణ, గెద్దాడ శ్యాంకుమార్, సూరంపూడి గిరీష్, బొక్కా వెంకన్నబాబులను సంఘీయులు సత్కరించారు. సభలో ముమ్మిడివరం మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, విశ్రాంత ఈఈ పితాని భాస్కరరావు, పిల్లి త్రిమూర్తులు, గుత్తుల రామారావు తదితరులు ప్రసంగించారు. ఈ నెల 15న కార్తిక వన సమారాధన నిర్వహించాలని నిర్ణయించారు.

అమలాపురంలో యోగా విద్యార్థులు

యోగా పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: యోగా పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విభాగాల్లో ఒకటో తరగతి నుంచి అయిదో తరగతి విద్యార్థులను ఎంపిక చేసినట్లు యోగా గురువు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. అమలాపురం కూచిమంచి అగ్రహారంలోని శ్రీస్వామి వివేకానంద యోగా ఆశ్రమంలో రోటరీ క్లబ్ సహకారంతో విద్యార్థులకు జిల్లా యోగా పోటీలను ఆదివారం నిర్వహించారు. రావులపాలెం సీఆర్సీలో డిసెంబరులో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని అన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: తుపాను పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి అండగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సాయం విడుదల చేశారని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. రాణేలంకలో తుపాను బాధితులకు స్థానిక సహకార సంఘ కార్యాలయం వద్ద ఆదివారం సాయం పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలో 106 మంది తుపాను బాధితులకు బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు, పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందిన కుటుంబాలకు రూ.2.86 లక్షలు ఆర్థిక సాయం ఎమ్మెల్యే అందజేశారు. తహసీల్దారు టి.సుభాష్, మండల తెదేపా అధ్యక్షుడు అర్ధాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, గుద్దటి జమ్మి, గోదశి పుండరీష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

ఐ.పోలవరం: ఐ.పోలవరం మండలం జి.మూలపొలం, కేశనకుర్రు గ్రామాల్లో తుపాను బాధితులకు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆదివారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. జి.మూలపొలంలో 521, కేశనకుర్రులో 666 మంది తుపాను బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. సాగిరాజు సూరిబాబురాజు, చిలువూరి సుబ్బరాజు, పెంట రవిప్రసాద్, బీర సత్యకుమారి, మద్దింశెట్టి పురుషోత్తం, గాదిరాజు విశ్వనాథరాజు, కాకర్లపూడి రాజేష్ తదతరులు పాల్గొన్నారు.

బాధితులకు బియ్యం, నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

నిఘా జాగృతి వారోత్సవాలు

యానాం: అవినీతి, లంచగొండితనాలను అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నిఘా జాగృతి వారోత్సవాలలో భాగంగా విశాఖపట్నం సీబీఐ అధికారుల బృందం యానాంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించింది. ఆదివారం సీబీఐ డీఎస్పీ చిత్తరంజన్‌దాస్ నేతృత్వంలో 14 మంది సీబీఐ అధికారుల బృందం అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులతో వాకథాన్ నిర్వహించింది. పరిపాలనాధికారి అంకిత్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు, ఉద్యోగులు వాకథాన్‌లో పాల్గొన్నారు. అనంతరం పరిపాలనాధికారి కార్యాలయం వద్ద ఉద్యోగులంతా అవినీతి నిరోధక ప్రతిజ్ఞ చేశారు. డాక్టర్ ఎస్సార్కే ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల కాన్ఫరెన్స్‌హాల్లో ఉద్యోగులకు కార్యశాల నిర్వహించారు. సీబీఐ ఇన్‌స్పెక్టర్లు పి.శ్రీనివాస్, ఎ.నరేష్‌కుమార్, సుధీర్ కుమార్, హరిబాబు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

గ్రంథాలయ కమిటీ ప్రమాణ స్వీకారం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరంలోని శాఖా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం స్థానిక గ్రంథాలయం వద్ద నిర్వహించారు. అధ్యక్షుడిగా విళ్ల వీరాస్వామినాయుడు, ఉపాధ్యక్షుడిగా జాగు రాంబాబు, కార్యదర్శిగా శీలం వెంకటరమణ, సంయుక్త కార్యదర్శిగా పి.నాగేశ్వరరావు, కార్యదర్శి, కన్వీనర్‌గా శీలం నాగరాజు, ఇతర సభ్యులు ప్రమాణం చేశారు.

ప్రమాణ చేస్తున్న గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్, సభ్యులు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతి దంపతులకు సన్మానం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జగడం సుమతి దంపతులను సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు అధ్యక్షతన స్థానిక కోర్టు కాంప్లెక్స్ వద్ద ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సన్మానం చేశారు. ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా, అమలాపురం స్పెషల్ కోర్టు జడ్జి పీవీ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ కార్యదర్శి మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఏజీపీ కాశీ సిద్ధార్ధకుమార్, రెడ్డి మిత్ర, తిరుకోటి శాంతి సుధ, న్యాయవాదులు పాల్గొన్నారు.

జస్టిస్ సుమతి దంపతులకు జ్ఞాపిక అందజేత

చెట్టునుంచి జారిపడి వ్యక్తి మృతి

యానాం, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఆదివారం ఉదయం విరిగిన చెట్టుకొమ్మను నరికే క్రమంలో పైనుంచి కిందపడి చాపల దుర్గారావు (36) మృతి చెందినట్లు ఎస్సై కట్టా సుబ్బరాజు తెలిపారు. కె.గంగవరం మండలం పేకేరుకు చెందిన అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆబోతును ఢీకొని తీవ్రగాయాలు

అమలాపురం పట్టణం: కొంకాపల్లి ప్రధాన రహదారిలో ఆదివారం రాత్రి ఆబోతుని ఢీకొట్టి ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డు మీద రెండు ఆబోతులు పోట్లాడుతుండగా అందులో ఒకటి వాహనంపై వెళ్తున్న వ్యక్తిని గాయపర్చింది. అతడిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

కార్తిక దీపారాధన

ముమ్మిడివరం: చినకొత్తలంకలోని పట్టాభిరామ స్వామి ఆలయం వద్ద కార్తిక దీపాలంకరణ జరిగింది. అఖండ దీపారాధనతో శివలింగాన్ని ఏర్పాటు చేశారు. ● ముమ్మిడివరంలోని బాలయోగీశ్వరుల ఆశ్రమం వద్ద చిన్నారులు కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఉప్పలగుప్తం: విలసవిల్లి శ్రీరామాలయంలో మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన నిర్వహించారు.

ముమ్మిడివరంలో చిన్నారుల వన సమారాధన

365 శివలింగాలకు పూజ

సమస్యలపై పోరాటం చేస్తాం

మాట్లాడుతున్న సత్యనారాయణ

అమలాపురం పట్టణం: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సత్యనారాయణ తెలిపారు. అమలాపురం మండలం ఈదరపల్లి గ్రామంలో జనహిత కార్యాలయంలో ఆదివారం ఏపీయూఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, పీఎఫ్ చెల్లింపులు చేయాలని కోరారు. బోధనేతర పనులు అప్పజెప్పకూడదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓలేటి శాస్త్రి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాడ్రేవు శ్రీనివాస్, పి.నరేష్ డి.గిరిజ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

అమలాపురం పట్టణం: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మృతి చెందిన భక్తుల ఆత్మకు శాంతి కలగాలని ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణరావు, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కోరారు. అమలాపురం పట్టణంలో నియోజకవర్గ సమన్వయకర్త పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు పాలనలో భక్తులకు భద్రత కొరవడిందని ఆరోపించారు. మున్సిపల్ ఛైర్మన్ రెడ్డి నాగేంద్రమణి, పాముల రాజేశ్వరి, వైకాపా కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైకాపా నాయకులు

(c) eenadu

మండపేట

•మండపేట •రామచంద్రపురం

కపిలేశ్వరపురం పుష్కరాల రేవులో ఇలా..

గోదావరికి పెరిగిన వరద

అంగర: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నదికి వరద పెరిగింది. కపిలేశ్వరపురం మండలంలోని తాతపూడి, కేదార్లంక, కపిలేశ్వరపురం పుష్కరాల రేవుల్లోని మెట్లు కొంతమేర మునిగిపోయాయి. కార్తిక మాసం సందర్భంగా కపిలేశ్వరపురం పుష్కరాల రేవులో మహిళల కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన దుస్తులు మార్చుకునే గదిని వరద ముంచెత్తింది. తెల్లవారుజామున నదిస్నానాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పని పరిస్థితి ఏర్పడింది.

వృత్తి విద్యతో 'ఉపాధి' అవకాశాలు మెండు

మండపేట, న్యూస్‌టుడే: వృత్తి విద్య నేర్చుకునే వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని వొకేషనల్ ఉపాధ్యాయుడు వైఎస్ రాజు అన్నారు. పారిశ్రామిక సందర్శనలో భాగంగా శ్రీగౌతమి మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు స్థానిక మోడరన్ కేర్ కార్ సర్వీస్ సెంటరులో వివిధ రకాల కార్లు, విడిభాగాలు, వాటి పనితీరు గురించి వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుంప శ్రీనివాస్, ఉపాధ్యాయులు టి.బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశ్రామిక సందర్శనలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
మండపేట: 80085 74183
రామచంద్రపురం: 80085 74191
ఉ. 10 - మ. 1

స్పందనకు వందనం

వ్యర్థాలు తొలగించారు..

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కేశవరం పంచాయతీ పరిధి దేవుడితల్లి కాలనీ రెండో వీధిలో రహదారి పక్కన వ్యర్థాలు పోయడంతో దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని గ్రామస్థుడు జి.భూషణం తెలిపిన సమస్యపై పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు తెలియజేయగా స్పందించారు. సిబ్బందిని పంపించి రహదారి పక్కన వ్యర్థాలను తీయించారు.

పన్నుల వడ్డనకు రంగం సిద్ధం

కౌన్సిల్‌లో చర్చ అనంతరం మార్పులు

మండపేట, న్యూస్‌టుడే: పట్టణవాసులపై ధరల పెంపును వర్తింపజేయాలని మున్సిపల్ అధికారులు రంగం సిద్ధం చేశారు. కొళాయి పన్ను నెలకు రూ.75 చొప్పున వసూలు చేస్తుండగా సంవత్సరానికి రూ. 34 లక్షల ఆదాయం వస్తోంది. కొళాయి పన్ను రూ.120కి పెంచాలన్న విషయంపై ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అభ్యంతరం తెలపగా కౌన్సిల్ సభ్యులు ఆయనకు మద్దతు పలికారు. ప్రజలపై అంతభారం మోపడం భావ్యం కాదంటూ రూ.5 మాత్రమే పెంచడానికి ఆమోదించారు. కొళాయి పన్ను నెలకు రూ.80 చేయడం వల్ల సుమారు రూ.1.90 లక్షల ఆదాయం అదనంగా పెరిగే అవకాశం ఉంది.

ప్రకటనలకు సంబంధించి..

పట్టణంలోని వివిధ కూడళ్లలో వ్యాపార ప్రకటనలకు సంబంధించి వ్యాపారుల నుంచి రెండు సంవత్సరాల క్రితం ఏడాదికి రూ.2 లక్షలు ఆదాయం సమకూరేది. ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉండే ప్రకటనల బోర్డులు, ఫ్లెక్సీలు తొలగించడంతో రూ.90 వేలకు తగ్గింది. కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయం ప్రకారం ఈ ధరలను రెట్టింపు చేయాలని నిర్ణయించారు. ఉదాహరణకు ఒక చదరపు మీటరు పరిమాణంలో దీపాలంకరణ ప్రకటన బోర్డులకు గతంలో సంవత్సరానికి రూ.90 ఉండగా, ఇప్పుడు రూ.180 చొప్పున వసూలు చేస్తారు. చదరపు మీటర్ల కొలత పెరిగేకొద్దీ ధర కూడా పెరుగుతుంది. వాహనాలపై ప్రకటన బోర్డులకు రూ.900 నుంచి రూ.1800కి పెంచారు. ఇలా దాదాపు 11 రకాల ప్రకటనల బోర్డులపై రెట్టింపు పన్ను విధించనున్నారు.

చిన్న, పెద్ద వ్యాపారులపై భారం..

చిన్న, పెద్ద వ్యాపారాలు నిర్వహించేవారిపై కూడా ట్రేడ్ లైసెన్సు ఫీజు భారాన్ని మోపనున్నారు. తోపుడుబండ్లు, వ్యాపార సంస్థల నుంచి ట్రేడ్ లైసెన్సు ఫీజుగా మున్సిపాలిటీకి ఇప్పటికే ఏడాదికి రూ. 8 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. ఎండుచేపలు, రొయ్యలు, పచ్చిచేపలు అమ్ముకునేవారు, వెదురుబుట్టలు తయారుచేసేవారు, టీ దుకాణాలు నిర్వహించేవారు, సాయంత్రం సమయాల్లో నిర్వహించే అల్పాహార శాలలు తదితర వ్యాపారాలు చేసుకునే వారితోపాటు పెద్ద వ్యాపారులపై కూడా ట్రేడ్ లైసెన్సు ఫీజు రెట్టింపు చేయాలని నిర్ణయించారు. పెంచిన ధరల పట్టిక విడుదల చేయకపోవడం, కౌన్సిల్ సభ్యులు పరిశీలించే అవకాశం లేకపోవడంతో ఎమ్మెల్యే సూచనతో ఈ అంశాన్ని వచ్చే సమావేశానికి వాయిదా వేశారు.

ఉన్నతాధికారుల ఆదేశాలతో సమీక్ష..

గతంలో ఎప్పుడో పెంచిన మార్కెట్ ఫీజులు, ట్రేడ్ లైసెన్సుల ఫీజులపై సమీక్షించి పెంపు చేయాలని మున్సిపల్ పరిపాలన శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు తప్పనిసరి పరిస్థితుల్లో పెంపుదల చేస్తూ అంశాన్ని కౌన్సిల్ దృష్టికి తీసుకువెళ్లాం. కౌన్సిల్‌లో ఆమోదం పొందిన అనంతరమే కొత్త ఫీజులు, ధరలు అమల్లోకి వస్తాయి.

– టి.వి.రంగారావు, మున్సిపల్ కమిషనర్, మండపేట

మహా శాంతిహోమం ఏర్పాట్ల పరిశీలన

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 4న జరగబోయే మహా శాంతిహోమం ఏర్పాట్లను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆదివారం పరిశీలించారు. పెద్దఎత్తున భక్తులు తరలిరానున్న దృష్ట్యా ప్రతి గ్రామం నుంచి కొందరిని సేవా వాలంటీర్లుగా ఎంపిక చేశారు. ఆలయ ఎదురుగా ఉన్న కళ్యాణ మండపం వద్ద హోమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమూల్య, ఆలయ ఏసీ నాగవరప్రసాద్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పెదకాపు, గెద్దం మహాలక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

భారత్ ఖ్యాతి నిలిపిన మహిళా క్రికెటర్లు

భారీ తెర వద్ద జెండాలతో నాయకులు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: భారత్, దక్షిణాఫ్రికా మధ్య క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను అభిమానులు వీక్షించేందుకు ఆదివారం రాత్రి పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ అక్కల రిష్వంతరాయ్ ఆధ్వర్యంలో పెద్ద తెర ఏర్పాటు చేశారు. కార్మిక శాఖ మంత్రి సుభాష్, నాయకులు వాసంశెట్టి సత్యం, రిష్వంతరాయ్ తదితరులు అభిమానులతో కలసి మ్యాచ్‌ను తిలకించారు. ఇండియా కప్ గెలవాలంటూ స్క్రీన్ వద్ద మంత్రి, కూటమి నాయకులు జాతీయ పతాకాలను ప్రదర్శించారు. మహిళా క్రికెటర్లు భారత్ ఖ్యాతిని నిలిపారని కొనియాడారు. జనసేన పట్టణ అధ్యక్షుడు గొల్లపల్లి కృష్ణ, కృత్తివెంటి విద్యాట్రస్టు ఛైర్మన్ నాయుడుమాస్టారు, గన్నమని చక్రవర్తి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, న్యూస్‌టుడే: ఇటీవల వివిధ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు చేయించుకున్న ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 7.07 లక్షలు మంజూరుకాగా ఆ చెక్కులను రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదివారం అందజేశారు. కపిలేశ్వరపురం మండలం వల్లూరుకు చెందిన వల్లూరి రాజేష్‌కు రూ.6.10 లక్షలు, రాయవరం మండలం మాచవరం గ్రామానికి చెందిన కొప్పూరి వెంకటరెడ్డికి రూ.37,100, మండపేట మండలం ఏడిదకు చెందిన గుణ్ణం వెంకటలక్ష్మికి రూ.60,000 చొప్పున అందజేశారు. ఆదివారం తెదేపా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, రామచంద్రపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ అధ్యక్షుడు నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, మేడపాటి రవీంద్రరెడ్డి, మేక జేజిబాబు తదితరులు పాల్గొన్నారు.

తెప్పోత్సవాలు.. దీపాలంకరణలు

మండపేట, మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: నవజనార్దనుల్లో ఒకరైన మండపేటలోని భోగజనార్దనస్వామివారి తెప్పోత్సవం స్థానిక బుద్ధుని చెరువు వద్ద ఆదివారం కనులపండువగా జరిగింది. రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెప్పోత్సవాన్ని ప్రారంభించారు. రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ, సొసైటీ మాజీ అధ్యక్షుడు మల్లిపూడి గణేశ్వరరావు, భాజపా నాయకుడు కోన సత్యనారాయణ, అన్నవరం దేవస్థానం మాజీ డైరెక్టర్ అవసరాల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. వివిధ కళాకారుల భజనలు, జానపద నృత్యాలు, కళాకారుల పౌరాణిక ప్రదర్శనలు అలరించాయి. చెరువు చుట్టూ విద్యుత్ దీపాలంకరణ ఎంతో ఆకర్షణీయంగా ఉంది. తెప్పోత్సవం సమయంలో బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ● కార్తికమాసం క్షీరాబ్ది ద్వాదశి మహా పర్వదినం సందర్భంగా ద్వారపూడి బస్ కాంప్లెక్స్ సెంటర్ వద్ద ఉన్న శ్రీవిజయదుర్గ అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. కార్తిక పురాణ పఠనం చేశారు. భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మండపేటలో జనార్దన స్వామి తెప్పోత్సవం

ద్రాక్షారామ: నరసాపురపుపేటలో వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి సహస్ర దీపాలంకరణ వైభవంగా నిర్వహించారు. ఉదయం తులసీధాత్రి సహిత లక్ష్మీనారాయణ పూజ, సాయంత్రం సుదర్శనస్వామిని అలంకరించి 1001 దీపాలతో పూజ చేశారు. గత 21 సంవత్సరాలుగా కార్తిక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు అర్చకుడు వేణుగోపాలాచార్యులు తెలిపారు. ఈవో విత్తనాల శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

ద్వారపూడిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

నరసాపురపుపేట వేణుగోపాలస్వామి ఆలయంలో..

క్షీరాబ్ది ద్వాదశి పూజలు

వెదురుపాక విజయదుర్గ పీఠంలో పూజలు

రాయవరం, న్యూస్‌టుడే: వెదురుపాక విజయదుర్గ పీఠంలో ఆదివారం క్షీరాబ్ది ద్వాదశి పూజలు నిర్వహించారు. పీఠాధిపతి కుమారుడు గాదె సత్యవెంకట కామేశ్వర, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ ఆధ్వర్యంలో తులసి, ఉసిరి చెట్ల వద్ద తులసీధాత్రి సమేత లక్ష్మీనారాయణస్వామి, గౌరీశంకర ప్రతిమలకు పూజలు చేశారు. నక్షత్రహారతి, నీరాజన మంత్రపుష్పాలు, మహానివేదన సమర్పించారు. వెదురుపాకలో శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలోనూ పూజలు జరిగాయి. పలు గ్రామాల్లో భక్తులు క్షీరాబ్ది ద్వాదశి పూజలు నిర్వహించారు.

భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ

ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో క్యూలైన్లలో భక్తులు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: పంచారామ క్షేత్రం ద్రాక్షారామంలోని భీమేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్తికమాసంలో వారాంతపు సెలవు కావడంతో దూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సాయంత్రం పంచారామ యాత్ర బస్సులు అధిక సంఖ్యలో వచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్యూలైన్లు కిక్కిరిశాయి. తిరిగి సాయంత్రం భక్తుల రద్దీ ఎక్కువైంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ఆలయ సత్రంలో ఉచిత అన్నదానం కొనసాగింది. యాత్రికులకు కావలసిన ఏర్పాట్లను ఈవో ఏవీ దుర్గాభవాని పర్యవేక్షించారు.

ఇళ్ల వద్ద మురుగుతో ఇబ్బందులు

ద్వారపూడి డ్రైవర్స్ కాలనీలో భూగర్భ డ్రెయినేజీ నిండిపోయి మురుగు రహదారిపైకి పొంగి ప్రవహిస్తోంది. ఇళ్ల వద్దకు చేరి నిలిచిపోవడంతో నివాసితులు దుర్వాసన, దోమల బెడదతో ఇక్కట్ల పాలవుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి మురుగు రహదారిపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఆకుల రమణను వివరణ కోరగా డ్రెయినేజీలో పూడిక తొలగించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం

మైదానం ఇలా.. ఆటలు ఎలా..?

పట్టణంలోని ఎస్‌వీఎస్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడా మైదానం అధ్వానంగా మారింది. ఇటీవల క్రీడా పోటీల నిర్వహణకు అవస్థలు పడ్డారు. బాస్కెట్‌బాల్ కోర్టు పూర్తిగా బురద నీటితో నిండిపోయింది. ప్రతి సంవత్సరం క్రీడల పోటీల సమయంలో ఇటువంటి పరిస్థితి ఏర్పడుతోంది. మైదానాన్ని మెరక చేయించాలని క్రీడాకారులు కోరుతున్నారు. క్రీడా ప్రాంగణం పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రధానోపాధ్యాయుడు కె.నాగకుమార్ తెలిపారు. - న్యూస్‌టుడే, మండపేట

రాజగోపాల్ సెంటర్లో ట్రాఫిక్ పోలీసు ఎక్కడ..?

రామచంద్రపురం పట్టణంలోని రాజగోపాల్ సెంటర్లో ట్రాఫిక్ పోలీసు లేని సమయాల్లో ట్రాఫిక్ ఇబందులు తప్పట్లేదు. వాహనాలు అడ్డదిడ్డంగా రాకపోకలు సాగిస్తుండటంతో తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. ప్రతిరోజూ రాజగోపాల్ సెంటర్లో ట్రాఫిక్ పోలీసులను తప్పక ఉంచాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఎస్.ఐ నాగేశ్వరరావును వివరణ కోరగా, కార్తిక సోమవారం బందోబస్తుకు సిబ్బంది ద్రాక్షారామ వెళ్లడం వల్ల కొరత వచ్చిందన్నారు. సోమవారం యథావిధిగా ట్రాఫిక్ పోలీసును ఏర్పాటు చేస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, రామచంద్రపురం

మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా, వేదికపై జస్టిస్ సుమతి తదితరులు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతికి సన్మానం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జగడం సుమతి దంపతులను సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు అధ్యక్షతన స్థానిక కోర్టు కాంప్లెక్స్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సన్మానం చేశారు. కార్యక్రమంలో ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా, అమలాపురం స్పెషల్ కోర్టు జడ్జి పీవీ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ కార్యదర్శి మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఏజీపీ కాశీ సిద్ధార్థకుమార్, రెడ్డి మిత్ర, తిరుకోటి శాంతి సుధ, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి ఎర్రన్నాయుడి సేవలు శ్లాఘనీయం

నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యేలు జోగేశ్వరరావు, రామకృష్ణారెడ్డి

రాయవరం, న్యూస్‌టుడే: కేంద్ర మాజీ మంత్రి, దివంగత కింజరాపు ఎర్రన్నాయుడి వర్ధంతి సందర్భంగా ఆదివారం రాయవరం తుల్యభాగ డ్రెయిన్ వద్ద ఆయన విగ్రహానికి మండపేట, అనపర్తి ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి ఎర్రన్నాయుడు చేసిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. కూటమి నాయకులు, రాయవరం, బిక్కవోలు, అనపర్తి మండలాల వెలమ సంఘీయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం అందజేత

పామర్రు: కోటిపల్లి రేవులో అగ్నిప్రమాద బాధితుడు వల్లెం భాస్కరరావు కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని తెదేపా నాయకుడు పప్పుల శ్రీనుబాబు అన్నారు. ఆదివారం ఆయన బాధిత కుటుంబానికి రూ.5 వేలు నగదు, మరో రూ.5 వేల విలువైన నిత్యావసర సరకులు, దుస్తులు, రగ్గులు అందజేశారు. మండలాధ్యక్షురాలు పంపన నాగమణి, భాజపా అనకాపల్లి పార్లమెంటరీ ఇన్‌ఛార్జి కర్రి చిట్టిబాబు కూడా ఈ కుటుంబాన్ని పరామర్శించారు. కూటమి నాయకులు పెమ్మాడి బేబీసత్తిబాబు, మానే చిన్న, ఎం.అమరనాథ్, అడపా కృష్ణ, అయినవిల్లి సూరిబాబు, వి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ ఘటన విచారకరం

మండపేట: కాశీబుగ్గ ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 9 మంది మృతి చెందడం విచారకర సంఘటన అని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు చోటుచేసుకోకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు.

చెట్టునుంచి జారిపడి వ్యక్తి మృతి

యానాం, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఆదివారం ఉదయం విరిగిన చెట్టుకొమ్మను నరికే క్రమంలో పైనుంచి కిందపడి చాపల దుర్గారావు (36) మృతి చెందినట్లు ఎస్సై కట్టా సుబ్బరాజు తెలిపారు. కె.గంగవరం మండలం పేకేరుకు చెందిన దుర్గారావు పాలిటెక్నిక్ కళాశాల కార్యాలయం ప్రక్కనున్న నిద్రగన్నేరు చెట్టు కొమ్మను రంపంతో కోస్తుండగా అది విరిగి అతడిపై పడింది. అతడు చెట్టు పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. దుర్గారావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో కార్మికులకు మేలు: మంత్రి సుభాష్

మాట్లాడుతున్న సుభాష్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను నా కుటుంబ సభ్యులుగా భావించి వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురం ఎన్.వి.ఆర్. ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన ఏపీ భవన నిర్మాణ కార్మికుల ఆత్మగౌరవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జీఎస్టీ తగ్గింపుతో నిర్మాణ రంగానికి, భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం మేలు చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ తగ్గించి భవన నిర్మాణ వ్యయం తగ్గించాయన్నారు. సిమెంటుపై 10 శాతం, ఫ్లోరింగ్‌పై 7 శాతం, మార్బుల్స్, గ్రానైట్, ఇసుక, ఇటుకలపై 7 శాతం జీఎస్టీ తగ్గించిందన్నారు. తద్వారా ద్వితీయ శ్రేణి నగరాల్లో 1000 చదరపు అడుగుల ఫ్లాట్ నిర్మాణ వ్యయం రూ.30 లక్షలయితే జీఎస్టీ తగ్గింపు కారణంగా నిర్మాణదారులకు రూ.1.5 లక్షల వరకు ఖర్చు తగ్గుతుందన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో ఇసుక బంగారమై కార్మికులకు వంద రోజులు కూడా పని దొరకలేదన్నారు. డూప్లికేషన్ పేరుతో పథకాలు నిలిపివేసిందని విమర్శించారు. కార్మికుల పనిదినాలు పెంచేందుకు పైలట్ ప్రాజెక్టుగా లేబర్ అటాచ్‌ను ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి సుభాష్ తెలిపారు. 1214 జీవోతో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్‌లను భవన నిర్మాణ కార్మికులు తిరిగి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు అప్పారి శ్రీనివాస్, గానాల సత్యసాయి, రామోజీ శ్రీనివాస్, ధర్మాసనం రామకృష్ణ, తదితరులు మాట్లాడుతూ 50 సంవత్సరాల వయసు దాటిన ప్రతీ కార్మికునికి పెన్షన్ ఇచ్చే సదుపాయం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెద్దలు కె.సూర్యనారాయణ, అధిక సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

వనసమారాధనలు ఐక్యతకు ప్రతీకలు

మాట్లాడుతున్న రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ లీలాకృష్ణ

రాయవరం, న్యూస్‌టుడే: కార్తిక వనసమారాధనలు సుహృద్భావం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ అన్నారు. ఆదివారం చెల్లూరులో కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తిక వనసమారాధనలో ఆయన మాట్లాడుతూ తీరికలేని జీవనంలో వనసమారాధనలు ఆటవిడుపు, మానసికోల్లాసాన్ని అందిస్తాయన్నారు. తొలుత ఉసిరి చెట్టు కింద కార్తిక దామోదరుడికి మండపేట పురపాలక సంఘం మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. పసలపూడిలో పద్మశాలీ సామాజిక వర్గీయులు నిర్వహించిన వనసమారాధనలో చేనేత వృత్తిలో పేరుగాంచిన కార్మికులు బేతా ముత్యాలరావు, తాడి చంద్రరావు, పందిరి గంగరాజు, పసగాడి పాండురంగారావు, నామాల చిన అప్పారావును సత్కరించారు. వనసమారాధనలో చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

కార్తికం.. పంచ శివలింగాల దర్శనం

న్యూస్‌టుడే – మండపేట గ్రామీణం

అగస్త్య మహర్షి ప్రతిష్ఠించినట్టు చెబుతున్న అయిదు శివలింగాలు మండపేట పట్టణం, మండలంలోని అర్తమూరు, తాపేశ్వరం, రాయవరం మండలం చెల్లూరు, కపిలేశ్వరపురం మండలం వల్లూరు గ్రామాల్లో ఉన్నాయి. వీటిని పంచ అగస్త్యేశ్వర ఆలయ కూటమిగా పిలుస్తారు. ఈ శివలింగాలకు కార్తికమాసంలో పూజలు చేసిన వారికి సకల దోషాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం. పంచ అగస్త్యేశ్వర ఆలయాలున్న ప్రాంతాలను కలిపి చూస్తే నంది ఆకారంలో కనిపిస్తాయని చెబుతారు.

● మండపేటలో బాలాత్రిపురసుందరీ సమేత అగస్త్యేశ్వర కైలాసేశ్వరస్వామి ఆలయంగా ప్రసిద్ధి చెందింది. దీనిని రథం గుడి అని పిలుస్తారు. ఈ ఆలయ ప్రాంగణంలో అగస్త్యేశ్వర స్వామి, శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి, రమాసమేత సత్యనారాయణ, సీతారామచంద్రమూర్తి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి.



● తాపేశ్వరంలో ఉమాసమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయం ఉంది. గర్భగుడిలో స్వామి విగ్రహం పక్కన పార్వతి అమ్మవారు కొలువై ఉంటారు. ఇక్కడ స్వామి వారు పశ్చిమ ముఖంగా దర్శనమివ్వడం విశేషం. తుల్యభాగ నది ఉత్తర ముఖంగా ప్రవహిస్తుండటంతో కాశీ క్షేత్రాన్ని దర్శిస్తే కలిగే పుణ్యఫలం ఈ క్షేత్రాన్ని దర్శిస్తే కలుగుతుందని భక్తులు నమ్ముతారు.

● అర్తమూరులో ఉమా సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి, సిద్ధి బుద్ధి సమేత విఘ్నేశ్వరాలయం, వేంకటేశ్వర స్వామి, ఆంజనేయస్వామి ఆలయాలు ఉన్నాయి. స్వామికి నిత్య అర్చనలు జరుగుతాయి.

● చెల్లూరులో బాలాత్రిపురసుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయానికి మూడు అంతస్తు గాలి గోపురం ఉంటుంది. ఆలయ ప్రాంగణంలో నీలకంఠేశ్వర లింగం, చండీశ్వరాలయం, నవగ్రహ మండపం ఉంటాయి. నిత్య అర్చనలు జరుగుతాయి.

● వల్లూరులో పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయానికి మూడు అంతస్తుల గాలి గోపురం ఉంది. ఆలయ ప్రాంగణంలో మహిషాసుర మర్దిని ఉపాలయం ఉంది. శివాలయంలో చండీశ్వరాలయం, అంతరాలయంలో గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, గర్భాలయంలో పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి కొలువై ఉన్నారు.

తుపాను బాధితుల్ని ప్రభుత్వం ఆదుకుంది

నిత్యావసర సామగ్రి పంపిణీ చేస్తున్న చౌదరి తదితరులు

పామర్రు, న్యూస్‌టుడే: మొంథా తుపానును ప్రభుత్వ యంత్రాంగం సమర్థంగా ఎదుర్కొందని, బాధితులకు అండగా నిలిచిందని కోనసీమ రైస్ మిల్లర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చుండ్రు వీవీఎస్ చౌదరి అన్నారు. ఆదివారం ఆయన కె.గంగవరం మండలం యండగండి గ్రామంలో తుపాను పునరావాస కేంద్రాల్లోని బాధిత కుటుంబాలకు నగదు, 25 కిలోల బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. మండలంలో 32 తుపాను పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసి 502 మందికి ఆశ్రయం కల్పించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. వీరికి మొత్తం రూ.10,80,000 ఆర్థికసాయం అందజేశామన్నారు. 1,726 మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి నిమిత్తం 50 కిలోల బియ్యం పంపిణీ చేసినట్లు చెప్పారు. నాయకులు మార్ని శ్రీధర్, వాసంశెట్టి సాయిబాబా, వీఆర్వో పామర్తి రామారావు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

నేడు 'ఈటీవీ' కార్తిక దీపోత్సవం

శివకేశవులు ఇద్దరికీ ఎంతో ప్రీతికరమైన కార్తిక మాసం. దీంతో సమానమైన మాసం, గంగతో సమానమైన తీర్థం లేదని పురాణోక్తి. విశేష పుణ్య సంపదను ప్రసాదించే ఈ మాసంలో దీపారాధనకు ఉన్న ప్రాధాన్యం అసమానమైనది. 'ఈటీవీ ఆంధ్రప్రదేశ్', ఈటీవీ తెలంగాణ, ఈటీవీ లైఫ్' ఛానళ్ల ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ దీపోత్సవంలో పాల్గొనే మహిళలకు పూజ సామగ్రి నిర్వాహకులే సమకూరుస్తారు. ఎంట్రీ పాసులు కావాల్సిన వారు సోమవారం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 మధ్యలో రాజమహేంద్రవరం మున్సిపల్ స్టేడియంలో సంప్రదించవచ్చు. పరిమిత సంఖ్యలోనే పాసులు ఉంటాయి. చిన్నపిల్లలకు అనుమతిలేదు. నేలపై కూర్చోగలిగే వారు మాత్రమే హాజరు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు. -ఈనాడు, రాజమహేంద్రవరం

పరిమిత సంఖ్యలో నేడు ఎంట్రీ పాసుల పంపిణీ

సమయం: ఈరోజు (సోమవారం) సాయంత్రం 5 గంటలకు
స్థలం: మున్సిపల్ స్టేడియం, రాజమహేంద్రవరం

ఈ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం నేటి సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు.

ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | Life

బ్యారేజీ వద్ద బురద తొలగింపు వాయిదా

ఆత్రేయపురం: బ్యారేజీ వద్ద సోమవారం చేపట్టాల్సిన బురద తొలగింపు ప్రక్రియ వాయిదా వేశారు. 3న పశ్చిమ డెల్టా, 4న మధ్య డెల్టా, 5న తూర్పు డెల్టా గేట్ల వద్ద ఫ్లషింగ్ నిర్వహించాల్సి ఉంది. వరద తగ్గిన తరువాత తెలియజేస్తామని ఏఈ రాధాకృష్ణ తెలిపారు.

రెక్కలు కట్టుకుని.. ఏడుకొండలకు

కోరుకొండ, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం విమానాశ్రయానికి అక్టోబరు మాసం ఆర్థిక శోభ సంతరించింది. కొత్తగా అందుబాటులోకి వచ్చిన తిరుపతి విమాన సర్వీసుకు ప్రయాణికుల నుంచి విశేష స్పందన వస్తోంది. ప్రతి మంగళ, గురు, శనివారాల్లో(వారానికి 3 రోజులు) అలయన్స్ ఎయిర్ విమానయాన సంస్థ తిరుపతికి విమానం నిర్వహిస్తోంది. ప్రారంభం నుంచే ఈ సర్వీసును ప్రయాణికులు ఆదరిస్తున్నారు.

963 మంది రాకపోకలు..

రాజమహేంద్రవరం- తిరుపతి నెల వ్యవధిలో 13 సర్వీసుల ద్వారా 548 మంది ప్రయాణించారు. వీరితో పాటు మరో 11 మంది చిన్నారులు ఉన్నారు. తిరుపతి నుంచి రాజమహేంద్రవరానికి 13 సర్వీసుల ద్వారా 415 మంది ప్రయాణించారు.

టికెట్ ధర అందుబాటులో..

అలయన్స్ ఎయిర్ విమానయాన సంస్థ ప్రయాణికులను ఆకట్టుకునేందుకు ప్రారంభంలో రూ.1,499, ఆ తర్వాత మూడు నెలలపాటు 50 శాతం టికెట్లు రూ.1,999కే అందుబాటులో ఉంచారు. మిగిలిన టిక్కెట్లు సుమారు రూ.4వేలుగా నిర్ణయించారు. ఇక్కడ నుంచి బయలుదేరిన సర్వీసు తిరుపతిలో 25 నిమిషాల వ్యవధిలో అదే విమానం హైదరాబాద్‌కు వెళ్తుంది. ఇదే సర్వీసుకు 100 మంది ప్రయాణికులు హైదరాబాద్‌కు నేరుగా ప్రయాణించడం విశేషం.

తిరుపతి విమాన సర్వీసు వివరాలు (అక్టోబరు నెల)

సర్వీసు పేరు	సర్వీసులు	ప్రయాణికులు
తిరుపతి- రాజమహేంద్రవరం	13	415
రాజమహేంద్రవరం- తిరుపతి	13	548

తక్కువ ధరలకు..

మధ్య తరగతి వారికి కూడా అందుబాటులో ఉండేలా విమాన టికెట్లు కేటాయించారు. దీంతో తిరుపతి, అటుగా హైదరాబాద్‌కు ప్రయాణికుల నుంచి స్పందన బాగుంది. - **మీసాల నరసింగ్ రావు, అలయన్స్ ఎయిర్ విమాన సంస్థ స్థానిక మేనేజరు**

నీళ్లలో పల్లెలు.. ఆనవాళ్లు లేని కాలువలు..!

ఆక్రమణలతో జటిలమవుతున్న ముంపు సమస్య ● బురద, ఊర కాలువల నిర్వహణను వదిలేసిన వైకాపా సర్కారు

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, గోకవరం : అవి ముంపు గ్రామాలు కావు..లోతట్టు ప్రాంతాలు అసలే లేవు.. అయినా ఏటా ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిస్తే ముంపు బాధలు తప్పని దుస్థితి. వైకాపా పాలనలో కనీస నిర్వహణకు నోచుకోకపోవడం వల్ల కాలువలు కుచించుకుపోయాయి. కొందరు రైతులు సైతం కాలువ ఆక్రమించి సాగు చేస్తుండటంతో సమస్య తీవ్రంగా మారుతోంది. కోరుకొండ మండలంలోని శ్రీరంగపట్నం,గోకవరంలోని అచ్యుతాపురంలో ఈ సమస్య తీవ్రంగా ఉంది.

బురద కాలువ జలాలు రోడ్లపైకి రాకుండా రక్షణగా ఏర్పాటు చేసిన ఇసుక బస్తాలు

ఏటా తప్పని అవస్థలు

సూరంపాలెం ప్రాజెక్టు నిర్మించినా అదనపు జలాలు వెళ్లేందుకు ప్రత్యేక కాలువలు నిర్మించకపోవడం వల్ల ఏటా ఇబ్బందులు ఎదురవుతున్నాయని శ్రీరంగపట్నానికి చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మూడు చోట్ల గండ్లు పడ్డాయి. గ్రామాల్లోని రోడ్లపైకి నీళ్లు రాకుండా ఇసుక బస్తాలు వేసి రక్షణ చర్యలు చేపట్టారు. 22 కిమీ పొడవు ఉన్న కాలువ వెడల్పు గతంలో దాదాపు 60 మీటర్లు ఉండేది. ప్రస్తుతం సగటున 15 మీటర్లు కూడా లేకపోవడం గమనార్హం.

ఊర కాలువ ఉప్పొంగడంతో ముంపునకు గురైన అచ్చియ్యపేట

మేట వేయడంతో

కొన్ని చోట్ల మేటలు వేయడం వల్ల దాదాపు 500 ఎకరాలు సాగుకు పనికిరాకుండా పోయిందని గ్రామానికి రైతు తనకాల నాగేశ్వరరావు వాపోయారు. నెల్లిపూడి నుంచి తొర్రిగెడ్డ లాకుల వరకు సుమారు రూ.32 కోట్లతో ప్రత్యేక కాలువలు నిర్మించాలని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. తాత్కాలికంగా పరిష్కరించాలంటే రాళ్లకాలువల నుంచి తొర్రిగెడ్డ లాకుల వరకు కాలువ నిర్మించాల్సి ఉంది.

అనధికార కల్వర్టులు, ప్రహరీ నిర్మాణాలతో..

గోకవరంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అచ్చియపేట, సాయిప్రియాంక కాలనీ, దేవీపట్నం పునరావాస కాలనీలను వరద నీరు ముంచెత్తింది. ఇక్కడున్న ఊర కాలువ ఆక్రమణకు గురవడం ఒక కారణమైతే.. కాలువకు ఆనుకుని పొలాల్లో లేఔట్లు, అడ్డుగా ప్రహరీ నిర్మించడం వల్ల అచ్చియపేటకు ముంపు సమస్య ఏర్పడుతోంది. గోకవరంలోని కాలువలపైనా అనధికారికంగా కల్వర్టులు నిర్మించి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నారు. స్థానికంగా ఓ లేఔట్ ప్రహరీ నిర్మించడంతో నీరంతా గ్రామంలోకి చేరుతోంది.

నీట మునిగిన పంట

15 ఎకరాలు కౌలుకు చేస్తున్నా.. 10 ఎకరాలు నేలవాలితే.. బురదకాలువ ఉప్పొంగి 5 ఎకరాలు నీట మునిగింది. ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టా. ఏటా కౌలు రూ.30 వేలకుపైగా చెల్లించాలి. ఇప్పటికీ నష్టం వివరాలు నమోదు చేయలేదు. - **కర్రి త్రిమూర్తులు, కోటికేశవరం**

కాంతులీనిన రత్నగిరి.. మురిసిన భక్తసిరి

స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న వైదిక బృందం

అన్నవరం, న్యూస్‌టుడే : అన్నవరం సత్యనారాయణ స్వామి అనంతలక్ష్మీ సమేతుడై హంసవాహనంలో విహరించిన కమనీయ సన్నివేశాన్ని భక్తులు కనులారా వీక్షించి పునీతులయ్యారు. స్వామివారి తెప్పోత్సవం ఆదివారం రాత్రి వేడుకగా జరిగింది. సాయంత్రం 4 గంటలకు సత్యదేవుడు, అనంత లక్ష్మీ అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో మెట్లమార్గంలో కొండదిగువున పంపా సరోవరం చెంతకు తెచ్చారు. వివిధ రకాల పుష్పాలతో పంపా సరోవరం చెంతనే (పవర్ హౌస్ వద్ద) సుందరంగా తీర్చిదిద్దిన వేదికపై స్వామి, అమ్మవార్లను ఆశీనులను చేసి అలంకరించారు. వైదిక బృందం ఆధ్వర్యంలో తులసీధాత్రి పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు వేద మంత్రోచ్ఛరణ, మంగళవాయిద్యాలతో ఉత్సవమూర్తులను తోడ్కొని వచ్చి విద్యుత్తు కాంతులతో సుందరంగా తీర్చిదిద్దిన హంసవాహనంలో ఆశీనులను చేసి పంపా రిజర్వాయర్‌లో ఊరేగించారు. అనంతరం పల్లకీలో కొండపైకి తీసుకువెళ్లారు. ప్రత్యేక కౌంటర్ల వద్ద ప్రసాదం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సత్యప్రభ, ఛైర్మన్ రోహిత్, ఈవో సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యుత్తు దీపాలంకరణలో ఆలయం

బండ పీత..!

కాకినాడ కుంభాభిషేకం రేవులో ఆదివారం పలు రకాల చేపలతోపాటు మండ పీతలు అమ్మకానికి వచ్చాయి. తుపాను కారణంగా రేవులో అమ్మకాలు నిలిచిపోయాయి. రెండు రోజులుగా మళ్లీ జోరందుకున్నాయి. అర కేజీ నుంచి కేజీపైగా బరువున్న మండ పీతలు ఆదివారం రాగా రూ.1000 నుంచి రూ.1500 వరకు ధర పలికాయని మత్స్యకారులు తెలిపారు. - న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్ (కాకినాడ)

ఆ ఒక్కటి అడగొద్దు

ఆడిట్ అభ్యంతరాలపై కాలయాపన

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జిల్లాలో ఆడిట్ అభ్యంతరాలు పేరుకుపోతున్నాయి. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో సుమారు రూ.30 లక్షలకు పైగా ఖర్చుతో పూర్తి చేసిన రహదారి నిర్మాణంలో లోపాలు, బిల్లుల విషయంలో అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. కొన్నేళ్లుగా ఆ బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. మిగిలిన పురపాలికల్లోనూ ఇదే పరిస్థితి ఎదురవుతోంది. అభ్యంతరాలు విషయంలో ఎటూ తేల్చకపోవడంతో కొలిక్కి రావట్లేదు.

ఇదీ పరిస్థితి..

- రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో 1658 అంశాల్లో రూ.10.63 కోట్ల విలువైన పనులకు ఆడిట్ పూర్తి కావాలి.
- కొవ్వూరులో 254 అంశాల్లో రూ.86 లక్షలు, నిడదవోలులో 128 అంశాల్లో రూ.64 లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నాయి.

పర్యవేక్షణ లేక కాలయాపన..

పురపాలికల్లో పూర్తి చేసిన పనులకు సంబంధించి ఆడిట్ విషయంలో అభ్యంతరాలు తలెత్తిన సందర్భంలో విచారణ పేరుతో పక్కన పెడుతున్నారు. సంబంధిత ఫైళ్లు ముందుకు కదలట్లేదు. బిల్లులు భారీగా పెండింగ్‌లో ఉంటున్నాయి. అయిదేళ్లకు పైగా అభ్యంతరాలు పేరుకుపోయిన పరిస్థితులు ఉన్నాయి. టెండర్ల విషయంలో మతలబులు, జరిగిన పనులకు సంబంధించి నాణ్యత లోపాలు, పూర్తి చేసిన విధానం, అటు తర్వాత జత చేసిన బిల్లుల్లో తప్పుల తడకలు ఇవన్నీ పరిగణనలోకి తీసుకుని అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై విచారణకు ఆదేశిస్తారు. పొరపాట్లను గుర్తిస్తే చర్యలు తీసుకొనేందుకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తారు. ప్రస్తావించిన అంశాలను పరిష్కరించి తిరిగి జత చేస్తేనే పరిష్కారం లభ్యమవుతుంది. తద్వారా బిల్లులు తిరిగి మంజూరయ్యేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. ప్రస్తుతం అభ్యంతరాలపై ఉన్నత స్థాయిలో విచారణ జరగట్లేదు. అభ్యంతరాలపై నివేదిక కోరకపోవడంతో కాలయాపన జరుగుతుంది.

లోపిస్తున్న నాణ్యత..

పురపాలికల్లో రోడ్లు, కాలువల విస్తరణ, మౌలిక వసతులపైనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించిన నిధులు వినియోగిస్తారు. నిధుల వినియోగం, టెండర్ల ప్రక్రియలో కొంత మంది ఉద్యోగుల పాత్ర ఉందనే విమర్శలు వస్తున్నాయి. కమీషన్ల కక్కుర్తితో పనుల్లో నాణ్యత లోపిస్తోందనే వాదన ఉంది. వీటిపై విచారణ పూర్తికాక ఏళ్లు గడిచిపోతున్నాయి.

ఆహా ఏమి రుచి.. తినరా మైమరిచి..!

ఉభయ రాష్ట్రాల్లోనూ పొట్టిక్కల ఫలహారశాలలు

న్యూస్‌టుడే, అంబాజీపేట

వేడి వేడి పొట్టిక్కలను కొబ్బరి, కారంపోడి, నెయ్యితో కలిపి తింటే ఆ రుచే వేరు. ఒకప్పుడు అంబాజీపేటకే పరిమితమైన ఇవి ఇప్పుడు ఉభయ రాష్ట్రాల్లోనూ ప్రత్యేకత చాటుతున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట పొట్టిక్కలకు పుట్టిల్లు. ☛ 60 ఏళ్ల కిందట పోలాలమ్మతల్లికి పనస ఆకులతో నైవేద్యంగా సమర్పించారు. దీంతో అప్పటి నుంచి క్రమక్రమంగా ఇది పొట్టిక్కలుగా ఖ్యాతినొందింది. ఉభయ గోదావరి జిల్లాలో వీటికి ప్రత్యేక స్థానం ఉంది.

పనస ఆకుల్లో పొట్టిక్కలు

జోరుగా ఎగుమతులు

కోనసీమ, అల్లూరి జిల్లాల్లో విరివిగా దొరికే పనసచెట్టు ఆకులను సేకరించి తెలుగురాష్ట్రాలకు కూడా ఎగుమతులు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకించి పొట్టిక్కల ఫలహారశాలలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇడ్లీ పిండిని పనస ఆకుల్లో బుట్టలుగా తయారు చేసి ఇడ్లీపాత్రలో ఆవిరిపై ఉడికిస్తారు. వివాహాది శుభకార్యక్రమాలతో పాటు మిగిలిన వేడుకల్లోనూ ఉభయగోదావరి జిల్లాలో అల్పాహారంగా ఉండి తీరాల్సిందే.

ఆసక్తి చూపుతున్న ప్రముఖులు

అంబాజీపేటకు వచ్చిన సినీ, రాజకీయ ప్రముఖులు ఇక్కడి పొట్టిక్కలను రుచి చూడకుండా వెళ్లరు. ప్రముఖనటుడు తనికెళ్ల భరణి అంబాజీపేట వైపు వస్తే తప్పని సరిగా వీటిని అడుగుతారు.

మన ప్రత్యేకం

ఆరోగ్యానికి దోహదం

పనస ఆకుల్లో పొట్టిక్కలు ఆరోగ్యపరంగా మంచివి. మధుమేహ నియంత్రణకు ఇది ఉపయోగపడుతుంది. గాయాలైనప్పుడు ఈ ఆకుల రసాలను రాస్తే తగ్గుతుంది. క్యాన్సర్ కణాలను తగ్గించేందుకు ఇవి ఉపకరిస్తాయి. రోగనిరోధకశక్తిని పెంచుతుంది. బ్యాక్టీరియా, ఫంగస్ వల్ల వ్యాధులను నివారించేందుకు ఉపయోగపడతాయి. చర్మవ్యాధులను కూడా నియంత్రించేందుకు ఉపయోగపడుతుంది.

- **బి.శ్యామ్ సుందర్, ఆయుర్వేద వైద్యుడు, అంబాజీపేట**

అమ్మాయిలు గెలిచిన వేళ ఆనందాల హేల

ప్రతి గుండె ఆనందంతో నిండిన క్షణాన.. ఏళ్లనాటి కల నెరవేరిన వేళ.. అంతా సంబరాలు చేసుకున్నారు. జెండాలు పట్టుకుని వీధుల్లో తిరుగుతూ ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. మహిళల ప్రపంచ కప్ వీక్షించేందుకు జిల్లాలో పలుచోట్ల తెరలు ఏర్పాటు చేయగా ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించారు. రాజమహేంద్రవరంలోని గోకవరం బస్టాండ్ దగ్గర సుబ్రహ్మణ్య మైదానంలో ఏర్పాటు చేసిన భారీ తెరలో అభిమానులు ఫైనల్స్ వీక్షించారు. ఆఖరి బంతి వరకు ఉత్కంఠగా తిలకించారు. గెలుపు సొంతం కాగానే మిఠాయిలు పంచుకున్నారు.

- న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు, కోటగుమ్మం

ప్రారంభించకుండానే శిథిలం

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం :

రూ.లక్షలు వెచ్చించి రాజమహేంద్రవరం కార్మిక ప్రభుత్వ బీమా ఆసుపత్రి(ఈఎస్ఐ) ఆధునిక భవనంపై ఏర్పాటు చేసిన సౌర వేడి నీటి వ్యవస్థ (సోలార్ వాటర్ హీటింగ్ సిస్టం) నిరుపయోగంగా మారింది. వినియోగంలోకి రాకుండానే ఆసుపత్రి భవనంపై ఉన్న సోలార్ ప్యానల్స్ ధ్వంసమవుతున్నాయి. నిర్వహణ, సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణమని ఆసుపత్రి సిబ్బంది చెబుతున్నారు.

ధ్వంసమైన సోలార్ ప్యానల్

నిరుపయోగంగా...

రోగులకు వేడినీటి సరఫరా కోసం భవనంపై సూర్యరశ్మిని గ్రహించే ప్యానల్స్, ఇన్సులేటెడ్ మెటాలిక్ బాక్సులు, పైపింగ్, వేడినీటి నిల్వ ట్యాంక్‌లు ఏర్పాటు చేసి ఇప్పటివరకు వినియోగంలోకి తీసుకురాలేదు. ఇక్కడి ప్రాంగణంలోని ప్రత్యామ్నాయ భవనాల నుంచి కొత్త భవనంలోకి వైద్య సేవలను మార్పుచేసి ఈ ఏడాది జులై 29 నుంచి దీనిలోనే ఓపీ, ఐపీ సేవలు కొనసాగిస్తూ వస్తున్నారు. అప్పుడే మూడు నెలలు గడిచినప్పటికీ సౌర వేడినీటి వ్యవస్థను ఇంకా ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా మారింది.

తుపాను బాధిత కుటుంబాలకు ప్రత్యేక ఆర్థిక సాయం

కలెక్టరేట్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: మొంథా తుపాను బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సాయం అందిస్తుంది. జిల్లా పరిధిలో తుపానుతో నష్టపోయిన 1,185 బాధిత కుటుంబాలకు రూ.23.26 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. రాజమహేంద్రవరం డివిజన్‌లో మొత్తం 583 కుటుంబాలకు రూ.11.39 లక్షలు, కొవ్వూరు డివిజన్‌లో 602 కుటుంబాలకు రూ.11.87 లక్షల ఆర్థికసాయంగా అందిస్తున్నట్లు తెలిపారు. మండలాల వారీగా బాధిత కుటుంబాలు, ప్రభుత్వం తరపున అందించిన ఆర్థికసాయం వివరాలను ఆదివారం ఒక ప్రకటనలో ఆమె వెల్లడించారు.

రాజానగరంలో బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజమహేంద్రవరం డివిజనల్‌లో...

మండలం	కుటుంబాలు	సొమ్ము (రూ.లక్షల్లో)
అనపర్తి	166	3.45
బిక్కవోలు	38	0.74
గోకవరం	2	0.6
కడియం	122	2.06
కోరుకొండ	19	0.41
రాజమహేంద్రవరం	120	2.67
గ్రామీణంలో	89	1.55
రాజానగరం	27	0.45

కొవ్వూరు డివిజన్‌లో..

చాగల్లు	19	0.50
దేవరపల్లి	64	1.21
గోపాలపురం	58	1.15
కొవ్వూరు	53	1.17
నల్లజర్ల	65	1.48
నిడదవోలు	177	3.13
పెరవలి	85	1.42
తాళ్లపూడి	31	0.64
ఉండ్రాజవరం	50	1.17

ఆనవాయితీ.. ఆరని జ్యోతి

కరప మండలం వాకాడలో ఏటా కార్తిక దీపోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. దశాబ్దాల నుంచి వాకాడ గ్రామస్థులు రామాలయం ఎదుటనున్న ఖాళీ స్థలంలో ఏటా కార్తిక మాసంలో వచ్చే మూడో సోమవారం కోటి దీపోత్సవంలో భాగంగా ఆనవాయితీగా దీపాల సంబరం జరుపుతున్నారు. పొడవాటి సరుగుడు రాటలను నాలుగు పక్కలా పాతుతారు. వాటికి వెదురుబద్దలతో అరకలుగా తయారు చేసి అందులో ప్రమిదలు ఉంచి కార్తిక దామోదరుడికి దీపోత్సవం చేస్తారు. వేలాది మంది భక్తులు దీపాలు వెలిగించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తారు. దీపోత్సవరం రోజున ఇక్కడ నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరిస్తాయి. కూరాడ, కరపలలో ఇది అత్యంత ప్రత్యేకం. - న్యూస్‌టుడే, కరప

జీజీహెచ్‌లో నిలిచిన అంతర్జాల సేవలు

రోగులకు తప్పని ఇబ్బందులు

- న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం వైద్యం

రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఇంటర్‌నెట్(అంతర్జాల) సేవలు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఓపీ, ఐపీ నమోదుకు తీవ్ర జాప్యం ఏర్పడటంతో రోగులు అవస్థలు పడ్డారు. జీజీహెచ్‌లో గత నెల 31న చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. కొన్ని కొమ్మలు ఇంటర్‌నెట్ తీగలపై పడి అవి తెగిపోవడంతో ఆసుపత్రి మొత్తం సేవలు నిలిచిపోయాయి. దీంతో శనివారం ఉదయం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు అంతర్జాలం సేవలు లేక ఆయుష్మాన్ భారత్ పోర్టల్‌లో వివరాలు నమోదవ్వలేదు. ఆఫ్‌లైన్‌లో ఓపీ చీటీలు ఇచ్చినా ఇన్‌పేషంట్ (ఐపీ) నమోదుకు అంతరాయం ఏర్పడింది. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికొచ్చిన వారికి కూడా ఐపీ నమోదు చేసేందుకు వీలు లేక.. ఎవరిని అడగాలో తెలియక రోగులు సతమతమయ్యారు. హిమోఫీలియా ఫ్యాక్టర్-8తో బాధపడే వారికి జీజీహెచ్‌లో ఇంజిక్షన్లు వేస్తారు. ఇవి ఖరీదైనవి కాబట్టి ఐపీ ఉంటేనే వారికి ఆ మందు ఇస్తుంటారు. శని, ఆదివారాలు ఐపీ నమోదవక వారికి ఎదురుచూపులు తప్పలేదు. ఆదివారం సాయంత్రానికి అంతర్జాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఆసుపత్రి అధికారులు వెంటనే స్పందించి ఉంటే రోగులకు ఇబ్బంది తప్పేదని విమర్శలొస్తున్నాయి.

గోదావరికి మళ్లీ వరద

పి.గన్నవరం, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా గోదావరి నదిలో మళ్లీ వరదనీరు ప్రవహిస్తోంది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్రంలోకి 3,17,612 క్యూసెక్కులు విడిచిపెట్టారు. దీంతో దిగువన వశిష్ఠ, గౌతమి, వృద్ధగౌతమి నదీపాయల్లో వరద ఉరవడి పెరిగింది. పి.గన్నవరం మండలం బూరుగులంక, బెల్లంపూడి రేవుల్లో నీటిమట్టాలు పెరగడంతో బూరుగులంక, అరిగెలవారిపేట, ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, ఆనగార్లంక, పెదమల్లంక గ్రామాల ప్రజలు నాటు, మరపడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. డొక్కా సీతమ్మ, కాటన్ అక్విడక్టుల మధ్య వైనతేయలో వరదనీరు ప్రవహిస్తోంది.

బూరుగులంకరేవులో నాటుపడవలో లంకగ్రామాల ప్రజల రాకపోకలు

సముద్రంలోకి ఇలా..

ధవళేశ్వరం ఆర్మ్ నుంచి 1,90,184, ర్యాలి నుంచి 52,407, మద్దూరు నుంచి 27,738, విజ్జేశ్వరం నుంచి 47,283 క్యూసెక్కులు సముద్రంలోకి విడిచిపెట్టారు. గత ఏడాది ఇదే రోజున 32,861 క్యూసెక్కులు విడిచిపెట్టారు.

తూర్పుడెల్టాకు..

మొంథా తుపాను కారణంగా ఖరీఫ్ వరి చేలు ముంపుబారిన పడకుండా గత నెల 26 నుంచి డెల్టాకు సాగునీటి సరఫరా పూర్తిగా నిలుపుదల చేశారు. ఆదివారం తూర్పుడెల్టాకు 2 వేలు క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టామని హెడ్‌వర్క్స్ జె.ఇ. డి.రాధాకృష్ణ తెలిపారు. మధ్య, పశ్చిమ డెల్టాలకు నిలిపివేత కొనసాగుతోందన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక నేడు

కలెక్టరేట్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) సోమవారం జిల్లాలో యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ కీర్తి చేకూరి ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగే జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మున్సిపల్, మండల కార్యాలయాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు. కార్యాలయాల వరకు రాకుండా కూడా 1100 టోల్‌ఫ్రీ నంబరు లేదా మీకోసం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ అర్జీలు స్వీకరించవచ్చని తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

VEERAVALLI COLLEGE OF LAW
Prakash Nagar, Rajahmundry
ADMISSION NOTICE
Candidates interested to join
LLB 5 years | LLB 3 years | LLM 2 years
Course in our law college for 2025-2026 are advised to contact college office.
5 years LLB Candidates who wish to change their options to our college from other law colleges may also contact.
Note: candidates with or without lawcet are eligible for admissions.
Principal: 8332041479,9491606933

(c) eenadu

ఇంటి నుంచే విద్యుత్తు సేవలు

● అందుబాటులో ఏపీఈపీడీసీఎల్ యాప్



విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఏపీఈపీడీసీఎల్ ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టింది. ఆండ్రాయిడ్ చరవాణుల్లో ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీనిద్వారా వచ్చిన సమస్యలను విద్యుత్తు శాఖ అధికారులు పరిశీలించి సత్వరం పరిష్కరిస్తారు.

–న్యూస్‌టుడే, విశాఖపట్నం

జిల్లా	తూర్పు గోదావరి
కనెక్షన్లు	6,46,736
ప్రతినెలా బిల్లు (రూ. కోట్లు)	రూ. 48.39 కోట్లు

బిల్లు చెల్లించొచ్చు: విద్యుత్తు బిల్లులు చెల్లించేందుకు బిల్‌పే ద్వారా సర్వీసు నంబరు, చరవాణి నంబరు పొందుపరిస్తే సంబంధించిన వివరాలు ప్రత్యక్షమవుతాయి.

సప్లయి పొజిషన్: వినియోగదారుడు సర్వీసుకు సంబంధించి విద్యుత్తు సరఫరా తీరును ఎప్పటికప్పుడు లైవ్‌లో చూసుకునే సదుపాయం కలదు.

మొబైల్ లింకింగ్ : విద్యుత్తు వినియోగదారులు తమ విద్యుత్తు కనెక్షన్‌కు సంబంధించి చరవాణి నంబరును అనుసంధానిస్తే విద్యుత్తు బిల్లుల సమాచారం చరవాణికి అందుతుంది.

ఎనర్జీ కాలిక్యులేటర్ : ఏపీ ఉపకరణానికి ఎంత విద్యుత్తు ఖర్చవుతుందో దీని ద్వారా తెలుసుకోవచ్చు. నెలవారీ విద్యుత్తు వినియోగానికి సంబంధించిన మీటరు రీడింగ్ వివరాలు పొందుపరిస్తే బిల్లు సమాచారం కనిపిస్తుంది.

కస్టమర్ కేర్: వినియోగదారులు తమ సమస్యలను ఇందులో పొందుపరచొచ్చు. అందిన సప్లై వివరాలు, అవసరమైన అన్ని లింకులు ఇందులో పొందుపరిచి ఉంటాయి.

లింక్ ఆధార్: వినియోగదారుడు విద్యుత్తు సర్వీస్‌కు తమ ఆధార్ వివరాలను జత చేసుకోవచ్చు.

కన్‌జంప్షన్: వినియోగదారులు వాడిన యూనిట్లు.. చెల్లించాల్సిన నగదు.. బిల్ లెడ్జర్ వివరాలు అందుబాటులో ఉంటాయి.

లాడ్జ్ కంప్లెంట్: విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు వంటి ఫిర్యాదులను వినియోగదారుడు నేరుగా ఫిర్యాదు చేయడమే గాక కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్య పరిష్కారం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు.

పే బిల్: సర్వీసు నంబరు నమోదు చేసుకుని నెలవారీ విద్యుత్తు బిల్లులకు సంబంధించిన నగదు చెల్లించొచ్చు.

అధికారుల వివరాలు : వినియోగదారుల పరిధిలోని అధికారుల ఫోన్ నంబర్లు లభ్యమవుతాయి. ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

టారిఫ్ : వినియోగదారులకు సంబంధించిన టారిఫ్ వివరాలు ఇందులో పొందుపరిచి ఉంటాయి.

క్విక్‌పే : సర్వీసు నంబరు, చరవాణి నంబరును నమోదు చేస్తే సంబంధిత బిల్లు వివరాలు వస్తాయి. అక్కడి నుంచి బిల్లు చెల్లించొచ్చు.

గౌడ/శెట్టిబలిజ కుల అవివాహితులకు సువర్ణావకాశం



నేడు గౌడ/ శెట్టిబలిజ కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, గౌడ/ శెట్టిబలిజ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. **రాజమండ్రి ఈనాడు కార్యాలయంలో (1వ అంతస్తు, భాను టవర్స్, శ్యామల థియేటర్ ఎదురు)** ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు నేడు (03 నవంబర్ 2025, సోమవారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

● మరిన్ని వివరాలకు **8008621414** & **9154918858** ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

● ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ మరియు యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన తెలిపిన ఫోన్ నంబర్లకు సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

నేటి నుంచి రావులపాలెంలో గైడ్ కెప్టెన్లకు శిక్షణ

రాయవరం, న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని పీఎంశ్రీ పాఠశాలలకు చెందిన 88 మంది గైడ్ కెప్టెన్లకు ప్రాథమిక, అడ్వాన్స్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు సమగ్రశిక్షా జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంఓ), ది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి పిల్లి రాంబాబు తెలిపారు. ఆదివారం రాయవరంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. డీఈవో, స్కౌట్స్ జిల్లా కమిషనర్ డా.సలీం బాషా, సమగ్రశిక్ష ఏపీసీ జి.మమ్మీ పర్యవేక్షణలో శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. అడ్వాన్స్ కోర్సుల్లో శిక్షణ పొందే కెప్టెన్లు ప్రాథమిక (బేసిక్) శిక్షణ ధ్రువీకరణ పత్రాన్ని, ప్రాథమిక శిక్షణకు హాజరయ్యే వారంతా పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో హాజరవ్వాలని కోరారు. క్యాంప్ కేంద్రం వద్ద వాటిని నిర్వాహకులకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. శిక్షణకు వచ్చే వారంతా సమయపాలన పాటించాలని కోరారు.

బోద.. ఉండదిక బాధ

● పూర్తి నిర్మూలన దశలో మహమ్మారి

న్యూస్‌టుడే, చాగల్లు : దేశ వ్యాప్తంగా బోద వ్యాధి నియంత్రణలో భాగంగా 2030 నాటికి కేసులు లేకుండా చేయాలని కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా పరీక్షలతోపాటు మాత్రలు పంపిణీ చేస్తోంది. నియంత్రణ తప్ప నివారణ లేని ఈ వ్యాధి.. సోకిన దోమలు కుట్టడం వల్ల వ్యాపిస్తుంది. క్యూలెక్స్ దోమ కాటుతో విస్తరించే ఈ మహమ్మారి కాళ్లతోపాటు చేతులు, ఛాతిభాగం, వృషణాలు, తదితర అవయవాలకూ సోకుతుంది. వ్యాధిగ్రస్తుడిని కుట్టిన దోమ మరొకరిని కాటేస్తే వారిలోనూ లక్షణాలు కనిపిస్తాయి. పూర్తిగా బయట పడేందుకు సుమారు 10 నుంచి 15 ఏళ్ల సమయం పడుతుంది. అనంతరం ప్రభావిత ప్రాంతం భారీగా ఉబ్బుతుంది. జీవితాంతం వృథాగా నిండే ఈ వ్యాధి నిర్మూలనకు వైద్యారోగ్యశాఖ కృషి చేస్తోంది.

రోగులను పరీక్షిస్తున్న ఫైలేరియా అధికారి రవి

ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని అధికారులు అంటున్నారు. తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో కేసులు నమోదు కాకపోవడమే ఇందుకు నిదర్శనంగా పేర్కొంటున్నారు.

వేధిస్తున్న మందుల కొరత..

రాజమహేంద్రవరంలోని ప్రధాన కార్యాలయంలో మందుల కొరత వేధిస్తోంది. రోగులకు కావల్సిన సోఫ్రామైసిన్, డీఈసీ(డై ఇథైల్ కార్బోమెజైన్ సిట్రేట్), ఆల్‌బెండజోల్, యాంటీ ఫంగల్ ఆయింట్‌మెంట్లు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. వీటితోపాటు రోగులకు అందించే తువ్వాల్లు వంటి వాటి సరఫరాకు కొరత ఉంది.

ఇప్పటి వరకు ఇలా..

జిల్లా	కేసులు
తూర్పు గోదావరి :	2,924
కాకినాడ :	6,229
కోనసీమ :	7,598

పూర్తిస్థాయి అదుపులో వ్యాధి..

బోద వ్యాధి నాలుగు జిల్లాల్లో పూర్తిస్థాయిలో అదుపులో ఉంది. ప్రత్యేక బృందాలు ఎప్పటికప్పుడు తమ ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఎక్కడా ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. మందుల కొరతపై ఇప్పటికే ఉన్నతాధికారులకు వివరించి, ప్రతిపాదనలు పంపాం. ప్రతి శుక్రవారం రాజమహేంద్రవరంలోని కేంద్రంలో చికిత్సలు, మందులు ఉచితంగా ఇస్తున్నాం. రోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఫైలేరియా అధికారి రవి తెలిపారు.

మూడు జిల్లాల్లో 11 యూనిట్లు..

వ్యాధి నివారణకు తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాలో మూడేసి చొప్పున, కోనసీమ జిల్లాలో 5 యూనిట్లు ఈ వ్యాధి నివారణకు కృషి చేస్తున్నాయి. వారానికి ఒక చోట క్లీనిక్, ఏరియా నైట్ సర్వే నిర్వహిస్తూ వ్యాధి పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు. ఒక్కో జిల్లాలో మెడికల్ అధికారితోపాటు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు 11 మంది, ల్యాబ్ టెక్నీషియన్లు ముగ్గురు, హెల్త్ అసిస్టెంట్లు 21 మంది, ఫీల్డ్ వర్కర్లు సుమారు 150 మంది వరకు పని చేస్తున్నారు.

టాస్ ప్రోగ్రామ్..

ట్రాన్స్‌మిషన్ అసెస్‌మెంట్ సర్వే(టీఏఎస్) అని పిలిచే ఈ కార్యక్రమంతో 6 నుంచి 7 ఏళ్ల పిల్లలకు సైతం నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, వ్యాధిని గుర్తించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఇందుకు జ్వరం, వివిధ అనుమానిత లక్షణాలు ఉన్న ఒక్కో జిల్లా నుంచి 1,685 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. గతేడాది నిర్వహించిన ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లాలో ఇద్దరు, కాకినాడలో ముగ్గురు, కోనసీమలో ఆరుగురు మొత్తం 11 మందిలో ఈ లక్షణాలు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఒక్కొక్క జిల్లాలో కనీసం 20 కేసులు లోపు గుర్తిస్తే వ్యాధి పూర్తిస్థాయిలో అదుపులో ఉన్నట్లే అని అధికారులు చెబుతున్నారు.

అందెలు మోగాయి.. పాదాలు కదిలాయి

అనపర్తిలో కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తిక వనసమారాధనలో చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పలు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు రంగులరాట్నాలు, గుర్రపు స్వారీలు, చిలక జోస్యాలు అలరించాయి. టెడ్డీలు, బసవన్నలు, మంగళవాయిద్యాలతో పెద్దలకు స్వాగతం పలికారు. – న్యూస్‌టుడే, అనపర్తి గ్రామీణం

‘తటాకంలో శివుడు’

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామంలో కొలువై ఉన్న రామలింగేశ్వరస్వామి పుణ్య క్షేత్రానికి దూరప్రాంతాల నుంచి యాత్రికులు విచ్చేస్తుంటారు.

సీతమ్మ వారు చేసిన శివలింగం : ఈ ఆలయానికి ప్రత్యేక చరిత్ర ఉంది. పండితులు, శాసనం ద్వారా తెలిసిన వివరాల ప్రకారం ఆలయ చరిత్ర ఈ విధంగా ఉంది. త్రేతా యుగంలో శ్రీరాములు వారు పట్టాభిషేకం అనంతరం సతీ సమేతంగా యాత్రలు చేసిన సందర్భంగా ఈ ప్రాంతానికి విచ్చేశారు. పాలంగి గ్రామానికి కిలోమీటరు దూరంలో ఉన్న గోస్త నది(అంతర్ వాహిని)కి దక్షిణ దిశన గల శ్మశానవాటికకు పక్కన చేరి ఉన్న తటాకములో సీతమ్మ వారు ఇసుకతో లింగాకృతి చేయగా శ్రీరాములు వారు పశ్చిమాభిముఖంగా ఆ లింగమును ప్రతిష్ఠ చేసినందుకు ‘రామలింగేశ్వర స్వామి’గా పిలుస్తున్నారు.

నిత్యం నీటిలో నీలకంఠుడు: ఈ క్షేత్రంలో పరమేశ్వరుడు (బాణం) ఉగ్రరూపంలో ఉండడంతో లింగము నిత్యం నీటిలో మునిగే ఉంటుంది. ఈ క్షేత్రాన్ని దర్శించి, స్వామివారిని చూసిన వారికి కాశీ క్షేత్ర దర్శన ఫలితం లభిస్తుందని స్థానికుల నమ్మకం. స్వామివారి ధూపదీప నైవేద్యాల నిమిత్తం నూజివీడు జమీందారు వెంకట్రామయ్య అప్పారావు బహుదూర్ 34.78 ఎకరాలను ఆలయానికి విరాళంగా ఇచ్చారు.

కొలువైన రామలింగేశ్వరస్వామి

వైభోగం.. నారసింహుని తెప్పోత్సవం

ప్రసిద్ధి గాంచిన కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామివారి తెప్పోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. విద్యుత్తు దీపాలంకరణ చేసిన హంస వాహనంపై స్వామివారిని ఉంచి దేవుని కోనేరులో తెప్పోత్సవం నిర్వహించారు. గోవింద నామస్మరణతో, భక్తుల కరతాల ధ్వనుల మధ్య సాగిన ఈ ఉత్సవం కనువిందు చేసింది. అంతకుముందు పెద్ద సంఖ్యలో భక్తులు గిరి ప్రదక్షిణగా స్వామివారి వెంట కోనేరు వద్దకు వచ్చారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, వెంకటలక్ష్మి దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త ఎస్పీ రంగరాజభట్టర్‌స్వామి పర్యవేక్షణలో

అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. డీఎస్పీ వై.శ్రీకాంత్, సీఐ వై.సత్యకిషోర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అన్నవరం దేవస్థానం అధికారి వెంకటరమణ తదితర వివిధ శాఖల అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, కోరుకొండ

తెప్పోత్సవంలో పాల్గొన్న అహోబిల రామానుజ జీయర్‌స్వామి

ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలి

గోకవరం: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలని అహోబిల రామానుజజీయర్ స్వామి అన్నారు. గుమ్మళ్లదొడ్డి గ్రామంలో శ్రీరామగిరిని ఆదివారం సాయంత్రం ఆయన సందర్శించి అక్కడ నూతనంగా నిర్మించిన పుష్కరిణిని ప్రారంభించారు. అనంతరం హంసవాహనంపై తెప్పోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మంచి పనులకు గట్టి సంకల్పం ఉంటే ఏవిధమైన ఆటంకాలైన తొలగుతాయన్నారు. గుమ్మళ్లదొడ్డి గ్రామంలో ఆలయ అభివృద్ధికి కమిటీగా ఏర్పడి చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. శ్రీరామగిరి ఆలయం, వెంకన్న పుట్టలను దర్శించుకొని ఆయన పూజలు నిర్వహించారు.

వన భోజనాలతో బంధాలు బలోపేతం

పద్మశాలీ సమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

కర్ణభక్త వన సమారాధనలో ఎమ్మెల్యే గోరంట్ల, ఎమ్మెల్సీ సోము వీర్రాజు

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: పిల్లలు, పెద్దలు కలిసి ఆనందంగా ఆడిపాడారు. కేరింతలు కొట్టారు. నృత్యాలు చేశారు. వివిధ రకాల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రాజమహేంద్రవరం నగరం, గ్రామీణం పరిధిలో కార్తిక వన సమారాధనలు ఆదివారం ఎంతో సందడిగా జరిగాయి. వక్తలు మాట్లాడుతూ వన భోజనాలు వంటి కార్యక్రమాలతో బంధాలు బలోపేతం అవుతాయన్నారు. సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. జాతీయ రహదారిపై చెరుకూరి వీర్రాజు కొబ్బరితోటలో పద్మశాలీ సేవా సంఘం 44వ వార్షిక కార్తిక వన సమారాధన జరిగింది. సుమారు ఆరువేల మంది పాల్గొన్నారు. రాజమహేంద్రవరం నగరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పాల్గొని మాట్లాడారు. ఆర్యాపురం బ్యాంకు ఛైర్మన్ చల్లా శంకరరావు, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్లు తంగెళ్ల హరికిషోర్, మత్సేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ● రాజమహేంద్రవరం పరిధి జేఎన్‌రోడ్డులోని తోటలో ది రాజమహేంద్రవరం కర్ణభక్త అభివృద్ధి సంక్షేమ సంఘం 38వ కార్తిక వన సమారాధన జరిగింది. జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున హాజరయ్యారు. గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు హాజరయ్యారు.

మంచు.. ప్రమాదాలలో ముంచు

తెల్లవారుజామున రోడ్లను కమ్మేస్తున్న వైనం

గండేపల్లి, తుని పట్టణం, న్యూస్‌టుడే: కొన్ని రోజులుగా జాతీయ రహదారిపై రాత్రి, తెల్లవారుజామున పొగమంచు దట్టంగా రోడ్డును కమ్మేస్తోంది. ఈ మంచుతో రహదారిపై ప్రయాణించే వాహనాలు కనిపించని స్థితి. రానున్న మూడు మాసాలు పొగమంచు దట్టంగా పడే అవకాశాలు ఎక్కువ. దీంతో రాకపోకలు సాగించేవారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ఎన్‌హెచ్‌పై దట్టంగా..

కొన్ని రోజులుగా రాజమహేంద్రవరం నుంచి తుని వరకు అర్ధరాత్రి దాటాక పొగమంచు కమ్మేస్తోంది. దీంతో తెల్లవారుజామున ప్రమాదాలు ఎక్కువగా జరిగిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి. గత అనుభవాల దృష్ట్యా లారీ డ్రైవర్లు, వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండాలి. కార్తిక మాసం దృష్ట్యా అన్నవరం, వాడపల్లి, చిన్న తిరుపతి, లోవ, మురారి తదితర ఆలయాలకు భక్తుల రద్దీ ఎక్కువ. నడకమార్గాన్ని అనుసరించే భక్తులు రోడ్డుపైకి వచ్చాక ఏమరుపాటు పనికి రాదు.

రాజానగరం గండేపల్లి మధ్య పరుచుకున్న పొగమంచు

జాగ్రత్తలివీ.. పాటిస్తే మేలు

మంచు దృష్ట్యా రాత్రి వేళల్లో రోడ్డు పక్కన వాహనాలు నిలపరాదు. చోదకులకు తగినంత విశ్రాంతి అవసరం. రాత్రి మొత్తం ప్రయాణించాల్సి ఉంటే డ్రైవర్లు మారుతూ ఉండాలి. గంట, రెండు గంటలకోసారి నీళ్లతో ముఖాన్ని కడుక్కోవాలి. నిద్ర వస్తుందనిపిస్తే వాహనాన్ని సురక్షిత ప్రదేశంలో నిలిపి నిద్రపోవాలి. వాహనాల వేగం నియంత్రణలో ఉండాలి. పొగమంచు ఎక్కువగా ఉన్నప్పుడు, కూడళ్ల వద్ద ప్రయాణం సురక్షితం కాదని గమనించాలి. వాహనాలకు కాంతివంతంగా ఉండే లైట్లు ఏర్పాటు చేసుకోవాలి.

వాష్ అండ్ గో కార్యక్రమం

క్రాసింగ్ రోడ్లు దాటే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి. పొగమంచు ఎక్కువగా ఉన్నట్లయితే ఫేస్‌వాష్ అండ్ గో కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లు ముఖం కడుక్కునేలా చర్యలు తీసుకుంటున్నాం. మంచు ఎక్కువగా ఉంటే వాహనాలు నిలిపివేయాలి. లేదంటే వేగాన్ని తగ్గించి వెళ్తే ప్రమాదాలు సంభవించే అవకాశాలు తక్కువ.

- శ్రీహరిరాజు, డీఎస్పీ,పెద్దాపురం

జిల్లాలో ఎన్‌హెచ్-16 ఇలా..	
ఆనుకుని ఉన్న మండలాలు:	10
మురారి- తుని వరకు కి.మీ.:	78
బ్లాక్‌స్పాట్లు:	58
సీసీ కెమెరాలు:	112

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నది విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభవాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ, ✆ 73862 01191.

TO LET

COMMERCIAL

బ్యాంక్స్, ఆఫీస్, డెంటల్ హాస్పిటళ్లకు అనుకూలంగా రాజమండ్రి, దానవాయిపేటలో 1st. ఫ్లోర్, సెల్లార్ పార్కింగ్ (లిఫ్ట్ సౌకర్యం)తో అద్దెకు కలదు. వివరములకు: 9490 811 769.

JOBS

Dew Foams Pvt. Ltd, Mandapeta Invites applications for the Post of General Manager (GM) Minimum Exp: 8-10Years is a must. Experience in the manufacturing industry will be an added advantage. Email: hodewfoams@gmail.com. Contact: 78913 18373.

EENADU for Advertisement Contact: **8008597607**

EENADU Classifieds

Immediate openings for Customer Service Executive & Branch Manager Positions in Cherukuri Group, Located in Eluru, Tanuku, Guntur & Vijayawada. Qual: Min Inter. ✆ 9885206666, E-mail: hr@cherukurigroup.org.

30/70Yrs బ్యాంక్ అనుబంధ సంస్థలో జీతం+ INC 30 వేలు టీం మేనేజర్స్, ఎగ్జిక్యూటివ్స్. Q: 10th రిటైర్డ్, బిజినెస్, ఇన్సూరెన్స్ ఏజెంట్స్, మ్యూచ్యువల్ ఫండ్స్, మార్కెటింగ్. నో టార్గెట్ ✆ 90524 70111.

రాజమండ్రి, బొమ్మూరు, కొవ్వూరుల్లో ప్ర|| కం. షోరూమ్స్, కాలేజీల్లో సె|| గార్డ్స్, సె|| సూపర్‌వైజర్స్ కావలెను. జీతం: 12 to 15 వేలు రూం + బో. రాజ్ సెక్యూరిటీ, దేవీచౌక్, రాజమండ్రి. ✆ 93922 69369.

రామకృష్ణ గ్రూప్, Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటిపని, వంటపని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు కావలెను. బో+ వ+, జీతం: 16-18K. ✆ 97040 51122, 90106 80011.

రాజమండ్రిలో కాంట్రాక్టర్ వద్ద పని చేయుటకు B.Tech., కంప్యూటర్‌లో అనుభవం కలిగి హిందీ, ఇంగ్లీష్ మాట్లాడ గలిగే యువకులు కావలెను. ✆ 78935 97577.

హైదరాబాద్ హోంకేర్‌లో ఏజెంట్లకు మంచి అవకాశం. వర్కర్స్‌ని పంపితే ప్రతినెలా 2 వేలు కమీషన్. వర్కర్స్ జీ: 18k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 89775 47749.

RJYలో FMCG ఉత్పత్తుల డిస్ట్రిబ్యూషన్ కొరకు సేల్స్‌మెన్ & డెలివరీ బాయ్స్ కావలెను. సంప్ర: టైం: 9 a.m.-6 p.m. ✆ 95507 32122.

వాటర్‌వాష్ బాయిస్ & హెల్పర్లు కావలెను. జీతం: రూ.15,000/-. Cont: శ్రీదేవి హోండా, ఆథరైజ్డ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్‌స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ. ✆ 94909 98888.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. **5-80** పైః

అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	22,000
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	22,000-23,000
కొత్త (పచ్చి) కాయ	23,000-24,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	115-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

ఉత్సాహంగా అంతర్ జిల్లా వాలీబాల్ పోటీలు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు ప్రావీణ్యం సాధించాలనే సంకల్పంతో ప్రభుత్వం పాఠశాల స్థాయి క్రీడలను ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఎస్‌జీఎఫ్ వాలీబాల్ అంతర్ జిల్లాల ఛాంపియన్‌షిప్ పోటీలు రెండో రోజు ఆదివారం హోరాహోరీగా సాగాయి. కొవ్వూరులోని అల్లూరి వెంకటేశ్వరరావు క్రీడా మైదానంలో 13 ఉమ్మడి జిల్లాల పరిధిలోని అండర్-17 విభాగానికి చెందిన క్రీడాకారులు ఉదయం నుంచి రాత్రి వరకు పోటీల్లో సత్తాచాటారు. ఎనిమిది బాలుర జట్లు, మరో 8 బాలికల జట్లు సెమీ ఫైనల్స్‌లో తలపడ్డాయి.

● భారత్, దక్షిణాఫ్రికా ప్రపంచ కప్ మహిళా క్రికెట్ పోటీల వీక్షణకు ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, నాయకులు ఎల్‌ఈడీ తెర ఏర్పాటు చేయించారు. వాటిని తిలకించారు. రీజినల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్ మెహబూబ్‌బాషా, గౌతమి వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పరిమి హరిచరణ్, సూరపనేని చిన్ని, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఏవీడీ ప్రసాద్, వ్యాయామోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు నాగరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్. సురేష్, వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి కొయ్యల ప్రసాద్ పోటీలను పర్యవేక్షించారు. కొవ్వూరు, పరిసర ప్రాంతాల నుంచి క్రీడాకారులు, స్థానికులు పోటీలు వీక్షించారు.

వాలీబాల్ ఆడుతున్న బాలికల జట్లు

వరల్డ్ కప్ మహిళా క్రికెట్ పోటీలను చూసేందుకు ఏర్పాటైన ఎల్‌ఈడీ తెర వద్ద ఎమ్మెల్యే ముప్పిడి, నాయకులు

రాష్ట్రస్థాయి పోటీలకు టీటీ క్రీడాకారులు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీలో ఆదివారం జరిగాయి. ఈ పోటీలకు 80 క్రీడాకారులు హాజరవ్వగా వారిలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఎంపిక చేశారు. తొలుత ఈ పోటీలను డీసీసీబీ మాజీ ఛైర్మన్ ఆకుల వీర్రాజు ప్రారంభించారు. ఎంపికైన జిల్లా జట్టు ఈనెల 17నుంచి 20వరకు విశాఖపట్నం గీతం వర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటుందని సంఘ అధ్యక్షులు జేవీవీ అప్పారెడ్డి తెలిపారు.

పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

చిన్నారుల అపహరణ కలకలం..

● పది నిమిషాల్లోనే గుర్తించిన పోలీసులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని వీఎల్‌పురం పరిధిలో ఇద్దరు చిన్నారులు అపహరణ గురయ్యారంటూ వచ్చిన ప్రచారం ఆదివారం తీవ్ర కలకలం రేపింది. ఎస్పీ నరసింహకిషోర్ పర్యవేక్షణలో పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి సీసీ కెమెరాల సాయంతో పరిశీలించారు. పది నిమిషాల్లోనే చిన్నారులు పక్క వీధిలోనే ఆడుకుంటున్నట్లు గుర్తించడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. బొమ్మూరు పోలీసుస్టేషన్ పరిధిలోని వీఎల్‌పురం పిరమిడ్ హౌస్ వెనుక ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న కోసూరి నాగమణి, మహేష్ దంపతులకు ఇద్దరు చిన్నారులు భానుప్రసాద్(7), మోహనశ్రీ(5) ఉన్నారు. వీరిని ఎవరో అపహరించారని సాయంత్రం 5 గంటలకు 112కు ఫోన్ వచ్చింది. వెంటనే బొమ్మూరు సీఐ పి.కాశీవిశ్వనాథం, సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని.. ఆటోలో ఓ మహిళ ముసుగేసుకుని పిల్లలను తీసుకెళ్లిపోయిందని స్థానికులు తెలిపారు. వెంటనే చిన్నారుల ఇంటికి 100 మీటర్ల దూరంలో ఉన్న సీసీ కెమెరాలను తనిఖీ చేశారు. మధ్యాహ్నం 03:15 గంటలకే పిల్లలు ఇంటి నుంచి బయటికెళ్లినట్లు గుర్తించారు. ఆ ప్రాంతంలోని ఆరు వీధులను జల్లెడపట్టడంతో మూడు ఇళ్ల దూరంలో పక్క వీధిలో ఆడుకుంటున్నట్లు గుర్తించి తీసుకొచ్చారు. తూర్పు మండల డీఎస్పీ విద్య ఆధ్వర్యంలో పోలీసులు ఇద్దరు చిన్నారులను తల్లికి అప్పగించారు. 05:00 గంటలకు 112కు ఫోన్ వస్తే కేవలం 05:15 గంటల్లోపు చిన్నారులను పోలీసులు గుర్తించడంతో బొమ్మూరు, ప్రకాశంనగర్ పోలీసులను ఉన్నతాధికారులు, స్థానికులు అభినందించారు.

చిన్నారులతో డీఎస్పీ విద్య, సీఐ కాశీవిశ్వనాథం

తల్లిదండ్రులకు పాపను అప్పగిస్తున్న సీఐ

పోలీసుల చొరవతో పాప క్షేమం

మసీదు సెంటర్: తప్పిపోయిన పాపను తక్కువ వ్యవధిలోనే కాకినాడ టూటౌన్ పోలీసులు ఆమె తల్లిదండ్రులకు ఆదివారం అప్పగించారు. సీఐ అప్పలనాయుడు వివరాల ప్రకారం.. బసివిరెడ్డివారివీధికి చెందిన సానా బాలకృష్ణ మూడేళ్ల కుమార్తె ధన్వికాసిరి ఇంటివద్ద ఆడుకుంటూ కనిపించకుండా పోయింది. రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా వెతికి 45 నిమిషాల్లోనే స్థానిక రామకృష్ణారావుపేటలో బాలికను గుర్తించారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో తల్లిదండ్రులకు అప్పగించారు.

(c) eenadu

రాజమహేంద్రవరం

ఉద్యానం.. అధ్వానం

న్యూస్‌టుడే, కోటగుమ్మం, కంబాలచెరువు: నగరంలోని పలు ఉద్యానాల్లో ఆహ్లాదం కరవైంది. ఎటు చూసినా సమస్యలతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. నడకదారులు సరిగా లేకపోవడం, పిల్లల ఆట పరికరాలు మూలకు చేరడం, మరుగుదొడ్లు లేక సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆహ్లాదం సంగతి అటుంచితే కనీస వసతులే లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గాంధీపురం ఉద్యానంలో పెరిగిన గడ్డి

సమస్యలతో ఆహ్వానం

నగరంలోని ఏబీ నాగేశ్వరరావు ఉద్యానంలో కనీస నిర్వహణ చేపట్టడం లేదు. వాకింగ్ ట్రాక్‌లో వర్షపునీరు నిలిచి బురదమయంగా మారడంతో నడకదారుల్లో జారిపోతున్నారు. మరుగుదొడ్లకు నీటి వసతి, నిర్వహణ లేకపోవడంతో తిప్పలు తప్పట్లేదు. నగరంలోని పలు ప్రాంతాల్లోని మురుగునీరు ఉద్యానంలోని చెరువులోకి చేరుతోంది. ఇది నాచుపట్టి తీవ్ర దుర్వాసన వస్తోంది. పార్కులోని పశువులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి.

ఏబీ నాగేశ్వరరావు పార్కులో జారుడుబల్లపై రంధ్రాలు

కనీస వసతుల్లేవ్..

గాంధీపురం నగరపాలక సంస్థ ఉద్యానంలో పిచ్చి మొక్కలు, కలుపు పెరిగిపోయాయి. ఆహ్లాదంగా కాసేపు వృద్ధులు, చిన్నారులతో వచ్చే తల్లిదండ్రులు కాసేపు కూర్చోవాలన్నా గుబురు మొక్కలతో ఆందోళన చెందుతున్నారు. దానవాయిపేట గాంధీ పార్కు వద్ద పార్కింగ్ సమస్యతో తిప్పలు పడుతున్నారు. పుష్కరఘాట్ దగ్గర్లోని పుష్కరప్లాజా ఉద్యానంలోనూ సమస్యలు వేధిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి పార్కుల నిర్వహణ మెరుగుపర్చాలని సందర్శకులు, నగరవాసులు కోరుతున్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

దేవీచౌక్, న్యూస్‌టుడే: అత్యవసర మరమ్మతుల నిమిత్తం సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొంతమూరులోని కల్యాణ్‌నగర్, ఆదర్శనగర్, జంగాలకాలనీ, ఉద్యోగుల కాలనీ, నాలుగో వంతెన ప్రాంతం, శేషాద్రి లేఔట్, క్వారీ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

రహదారులకు గుంతలు.. పనులకు తూట్లు..

ప్రధానంగా ఈ మార్గాల్లో..

✦ ప్రధానంగా కంబాలచెరువు నుంచి సీతంపేట వెళ్లే రోడ్డులో గుంతలు ఏర్పడి, కంకర తేలిపోయింది. ✦ అక్కడ నుంచి నందం గనిరాజు సెంటర్‌కు వెళ్లే మార్గంలో అక్కడక్కడ గుంతలు పడ్డాయి. ✦ గోరక్షణ పేట నుంచి శీలం నూకరాజు కాంప్లెక్స్‌కు వెళ్లే రహదారిదీ అదే పరిస్థితి. ✦ లాలా చెరువు జంక్షన్ నుంచి క్వారీ మార్కెట్ వెళ్లే కూడలిలో భారీ గుంతలు పడ్డాయి. ✦ దానవాయిపేటలో చిన గాంధీబొమ్మ వద్ద రెండు వీధుల్లో పూర్తిగా కంకర తేలిపోయింది. ✦ ప్రకాశంనగర్ వద్ద రౌండ్ పార్కును ఆనుకుని ఎదురుగా ఉన్న దారి వర్షాలకు గుంతలు ఏర్పడ్డాయి.

రాజమహేంద్రవరంలో పలు రహదారులు గుంతలు పడి అధ్వానంగా మారాయి. భారీ వర్షాలకు బీటీ రోడ్లు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. ఆయా మార్గాల్లో ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. వాహనాలు సైతం తరచూ మరమతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. రోడ్లను బాగు చేయాలని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

తవ్వి వదిలేశారు ఇలా..

గోరక్షణ పేట నుంచి శీలం నూకరాజు కాంప్లెక్స్‌కు వెళ్లే రోడ్డులో ఇటీవల పైపులైన్ పనులు చేశారు. ఆ సందర్భంగా రోడ్డు తవ్వి వదిలేశారు. రహదారికి ఎలాంటి మరమ్మతులు చేయలేదు. పైపులైన్ మార్చడం కోసం రోడ్డును తవ్వి కేవలం మట్టితో కప్పేశారు. దీంతో వర్షానికి మట్టి తొలగిపోయి రోడ్డంతా గుంతలు పడి ప్రమాదకరంగా ఉంది. వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నారు. అదే రోడ్డు షెల్టాన్ వరకు ఓవైపు పైపులైన్ కోసం తవ్వేసి, అసంపూర్తిగా కప్పి వదిలేయడంతో ఇబ్బందులు తప్పట్లేదు.

నగరంలో 480 గుర్తింపు..

వాస్తవానికి సీజన్ ఆరంభంలోనే వర్షాలకు కొన్ని రోడ్లు పాడయ్యాయి. వర్షపు నీటికి బీటీ రోడ్లు గుంతలు పడుతున్నాయి. రహదారి నిర్మాణంలో లోపాల కారణంగా త్వరగా పాడైపోతున్నాయి. నిర్మాణ సమయంలో తారు శాతం తక్కువగా ఉండటంతో వర్షపు నీటికి తారు, కంకర విడిపోతుంది. దీంతో రోడ్డు ముక్కలుగా విడిపోతుంది. దీనిపై సచివాలయం సిబ్బంది సర్వే చేసింది. రెండు నెలల క్రితం వానలకు నగరంలో 480 గుంతలు ఏర్పడినట్లు గుర్తించారు. మరమ్మతుల నిమిత్తం సుమారు రూ.80 లక్షలు అవుతుందని అంచనా వేశారు. ప్రస్తుత తుపానుకు నగరంలో 10 నుంచి 12 రోడ్లు పాడైనట్లు గుర్తించారు. నష్ట నివారణ అంచనా వేస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

మార్కండేయుని కల్యాణ వేడుక

రాజమహేంద్రవరం సాంస్కృతికం: క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా గోదావరి గట్టున ఉన్న శ్రీఉమా మార్కండేయస్వామి ఆలయంలో మార్కండేయుని కల్యాణ వేడుక వైభవంగా జరిగింది. ఆదివారం సాయంత్రం ఆలయ ఆవరణలోని వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు.

వంతెనపై ట్రాఫిక్

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి ఎర్రకాలువ వంతెనపై ఆదివారం సాయంత్రం సుమారు గంటన్నరపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. రెండు కార్లు ఒకదానికొకటి అడ్డంగా రావడం, పక్కనే వాహనాలు ఉండడంతో ఎటూ వెళ్లలేని పరిస్థితిలో ట్రాఫిక్ నిలిచిపోయింది. అనపర్తి- పొలమూరు రహదారి వైపు, అనపర్తి- ద్వారపూడి వైపు, అనపర్తి- బలభద్రపురం వైపు వాహనాలు రోడ్డుపై రెండు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతరం పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థులకు బహుమతులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం నామవరం రోడ్డులోని ఆదిత్య తక్ష్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో రెండు రోజులపాటు నిర్వహించిన 'విజ్ కిడ్' క్విజ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. రెండోరోజు ఆదివారం సాయంత్రం జరిగిన క్విజ్ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సత్తి గౌతమ్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందించారు. ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ శృతిరెడ్డి, ప్రిన్సిపల్ లిసా కుమార్ బర్ధన్ నిర్వహణలో జరిగింది. ల్యాప్‌టాప్‌లు, సైకిళ్లు, నగదు బహుమతులు అందించారు. క్విజ్ మాస్టర్‌గా టి.రమేష్ వ్యవహరించారు.

నేడు, రేపు జిల్లా జట్ల ఎంపికలు

దేవరపల్లి: దేవరపల్లిలోని అంబటి సత్యనారాయణరావు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్-17, అండర్-14 ఫుట్‌బాల్, నెట్‌బాల్ జట్ల ఎంపికల పోటీలు మంగళవారం జరగనున్నాయి. అలాగే రామన్నపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో తూర్పుగోదావరి జిల్లా బాలబాలికల టెన్నీకాయిట్ జట్ల ఎంపికల పోటీలు సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నూతన కమిటీ సభ్యులు

పుష్కరాలకు అనుగుణంగా కమిటీల బలోపేతం

టి.నగర్, న్యూస్‌టుడే: రానున్న పుష్కరాలకు అనుగుణంగా దేవాదాయ శాఖలో ప్రాధాన్యం ప్రకారం నూతన కమిటీలను నియమిస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఆదివారం ఎమ్మెల్యేను కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న పుష్కరాల నేపథ్యంలో ఆలయాల్లో కమిటీలను బలోపేతం చేస్తున్నామన్నారు. తద్వారా పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. పుష్కరాలకు పూర్తిస్థాయిలో కమిటీ వేసి, తద్వారా పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. నూతన ఛైర్మన్ మదన్‌సింగ్‌రాజ్ పురోహిత్, సభ్యులు పెండ్యాల నాగేశ్వరరావు, రాజా పురోహిత్ రూపసింగ్, బి.రవికుమార్, బ్రింగిమళ్ల పద్మావతి, శనపతి సత్తిబాబు, గ్రంధి సువర్చల, పుచ్చల లీలావతి, బంగారు దీపిక, గొంగాడ సురేష్, బి.గౌతమి తదితరులు నియమితులయ్యారు.

రోటరీ యువ సేవా మహోత్సవం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమండ్రి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నెల పాటు నిర్వహించిన యువ సేవా మహోత్సవం ఆదివారం సాయంత్రంతో ముగిసింది. వైజంక్షన్‌లోని ఆనంరోటరీ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా 3020 గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ రోటరీ క్లబ్ యువ సేవల విభాగం ద్వారా చేపట్టిన సాంస్కృతిక పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీతత్వం పెంచడం, నాయకత్వ లక్షణాలు అలవరచడం కోసం క్లబ్ సేవలు అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. రొటేరియన్ చిట్టూరి సూర్యనారాయణమూర్తి, ఇల్లా సాయినాథ్, రొటేరియన్ పట్టపగలు వెంకటరావు, సుంకర రవికుమార్, కె.కె.సంజీవరావు, సి.ఎస్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న రోటరీ జిల్లా గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి తదితరులు

శివస్వామిని సత్కరిస్తున్న సంఘు ప్రతినిధులు

బ్రాహ్మణ కార్తిక సమారాధన

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా బ్రాహ్మణ మిత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో రాజమండ్రి బ్రాహ్మణ కార్తిక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఆదివారం జేఎన్‌రోడ్డులోని ఆంధ్రకేసరి జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సంఘీయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ బ్రాహ్మణ యువజన అధ్యక్షుడు సూరంపూడి కామేష్, జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాస్, నగర అధ్యక్షుడు దూర్వాసుల సత్యనారాయణ, జిల్లా బ్రాహ్మణ మహిళా సంఘం అధ్యక్షురాలు ముదునూరి వాణిశ్రీ, కొండూరి రాజేశ్వరి తదితరుల సమక్షంలో వారాహి మాత ఉపాసకుడు శివస్వామిని సత్కరించారు.

తగ్గిన ఎర్రకాలువ వరదనీరు

నిడదవోలు: నిడదవోలు మండలం కంసాలిపాలెం-తాడేపల్లిగూడెం మండలం మాధవరం మధ్య వంతెన వద్ద రహదారిపై వరద తగ్గింది. ఇటీవల వర్షాల కారణంగా నీరు రహదారిపైకి చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం తగ్గడంతో యుథావిధిగా సాగుతున్నాయి.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరం గ్రామీణం కడియం మండలం పొట్టిలంక గ్రామానికి చెందిన సురింది వీరవెంకటరావు, కుమారి దంపతులు రూ.1.01 లక్షల విరాళాన్ని ఆదివారం సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకులు వేదాశీర్వచనం, స్వామివారి చిత్రపటం అందజేశారు.

దాతకు స్వామివారి చిత్రపటం అంజేస్తున్న అధికారులు

దెబ్బతిన్న పలకలు..

నగరంలోని పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై స్లాబులు దెబ్బతినడంతో పాదచారులు నడిచేందుకు అవకాశం లేకుండా పోయింది. స్థానిక కోరుకొండ రోడ్డు సీటీ ఆర్‌ఐ క్వార్టర్స్ ఎదురుగా ప్రధాన డ్రైనేజీపై చాల భాగం శ్లాబులు లేవు. వర్షాలు పడినప్పుడు చాలామంది రహదారిపై కాకుండా కాలినడక భాగంలోనే ప్రయాణిస్తారు. పడిపోయే ప్రమాదం ఉంది. దెబ్బతిన్న ప్రాంతాల్లో శ్లాబులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, దేవీచౌక్

మధ్యలో వదిలేశారు..

అన్నపూర్ణమ్మపేట రైల్వేగేటు సమీపంలో ఇరువైపులా సీసీ రోడ్డు నిర్మించి మధ్యలో కల్వర్టు నిర్మాణం వదిలేయడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. రోడ్డు నిర్మించి సుమారు మూడు నెలలు కావస్తున్నా కల్వర్టు నిర్మాణం మాత్రం ఇంకా చేపట్టలేదని స్థానికులు పేర్కొంటున్నారు. రోడ్డు మధ్యలో గొయ్యిలా ఉండటంతో వాహనదారులు దగ్గరకు వచ్చే వరకు కనిపించట్లేదు. వెంటనే కల్వర్టు నిర్మించి ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, దేవీచౌక్

అడుగడుగునా ఇబ్బందే..

ప్రధాన రైల్వేస్టేషన్ వద్ద నిత్యం అవస్థలు తప్పట్లేదు. నగరం, పరిసర ప్రాంతాలు, కోనసీమకు వెళ్లేవారు ఇక్కడే రైలు దిగుతారు. రైళ్లు వచ్చే సమయంలో ప్రధాన రహదారిపై ఆటోలు, వాహనాలు రోడ్డుకు ఇరువైపులా నిలిపేస్తున్నారు. అధికారులు, పోలీసుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో రోజూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. - న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

ఒరిగిన స్తంభం

సుమారు ఆరు నెలల క్రితం ఐఎల్‌టీడీ కూడలి రోడ్డులో వ్యాన్ ఢీకొని ఓ స్తంభం ఒరిగిపోయింది. ప్రమాదం జరిగి నెలలు గడుస్తున్నా అధికారులు స్పందించలేదని స్థానికులు వాపోతున్నారు. అసలే వర్షాలు, బలంగా ఈదురు గాలులు వీస్తుండటంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని భయపడుతున్నారు. చక్కదిద్దాలని నగరవాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

ఆదమరిస్తే ప్రమాదమే..

మోరంపూడి కూడలిలో తెరిచి ఉన్న డ్రైనేజీ పాదచారులను భయాందోళనకు గురిచేస్తుంది. ఈ కూడలిలో పైవంతెన నిర్మాణం పూర్తయినా, సర్వీస్ రోడ్డు, ఫుట్‌పాత్‌లు బాగుపడలేదు. రద్దీగా ఉండే మార్గంలో కాలువపై పలకలు లేకపోవడంతో ప్రమాదకరంగా ఉంది. అధికారులు స్పందించి వాటిని మూయాలని, హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

దీపాలు వెలిగాయి..

ఏవీఏ రోడ్డు: నగరంలో నిత్యం రద్దీగా ఉండే సాయికృష్ణ థియేటర్ రోడ్డులో వీధి దీపాలు సరిగా వెలగకపోవడంతో రాత్రి వేళల్లో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ పరిస్థితిపై గత నెల 29న 'ఈనాడు'లో 'వీధుల్లో అంధకారం' శీర్షికన ప్రచురితమైన చిత్ర కథనానికి సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టారు.

సమస్య: స్థానిక అభయ ఆసుపత్రి వద్ద జేఎన్‌రోడ్డులో నుంచి ఏవీఏ రోడ్డులోకి వెళ్లే అడ్డవీధి మార్గంలో పది రోజులుగా వీధిదీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి వేళ అంధకారంగా ఉండటంతో నిలిపి ఉంచిన వాహనాల్లో బ్యాటరీ చోరీలు జరుగుతున్నాయి.
- సూర్యకుమార్, స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపించి వీధిదీపాలకు మరమ్మతులు చేయిస్తాం.
- విమల, ఎలక్ట్రికల్ ఏఈ, ఆర్‌ఎంసీ

సమస్య: స్థానిక ఎస్వీజీ మార్కెట్ రోడ్డులో చెత్త పేరుకుపోయింది. మార్కెట్ నుంచి వంద అడుగుల ఆవరోడ్డులోకి కలిసే మార్గంలో చెత్త, కుళ్లిపోయిన ఉల్లిపాయలు పోస్తుండడంతో దుర్వాసన వస్తోంది. దీంతో అటుగా రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడుతున్నారు. తొలగింపునకు చర్యలు తీసుకోవాలి.
- జయలక్ష్మి, స్థానికురాలు

సమాధానం: చెత్త తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.
- వినూత్న, ఎంహెచ్‌వో

- న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

మీ ప్రాంతంలో ప్రజా సమస్యలు ఇబ్బంది పెడుతున్నాయా? ప్రభుత్వం నుంచి సక్రమంగా అందాల్సిన లబ్ధి మీకు చేరలేదా? సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. చిత్రాలను, వివరాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం. సంప్రదించాల్సిన నంబర్లు...

83282 39927, 80089 02897

వైకాపా నాయకుల ఆందోళన

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: కాశీబుగ్గ తొక్కిసలాట ఘటనపై సమగ్ర విచారణ జరపాలని వైకాపా నాయకులు డిమాండ్ చేశారు. తొక్కిసలాట ఘటనలో మృతిచెందిన భక్తులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ ఆదివారం రాత్రి స్థానిక కోటిపల్లి బస్టాండ్ వద్ద వైకాపా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు, మాజీ ఎంపీ భరత్‌రామ్, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. కాశీబుగ్గ తొక్కిసలాట ఘటన దురదృష్టకరమన్నారు. మాజీ ఎమ్మెల్యే తలారి వెంకటరావు, రౌతుసూర్యప్రకాశరావు, షర్మిలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మధు

పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించాలి

వి.ఎల్.పురం: పేదలకు ఇళ్లస్థలాల కోసం సీపీఐ పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మధు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక తాడితోటలో సీపీఐ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ శాఖ సమావేశం జరిగింది. శాఖ కార్యదర్శి రెడ్డి రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మధు మాట్లాడారు. పార్టీ అనుబంధ శాఖలు బలంగా ఉంటేనే పార్టీ పటిష్టంగా ఉంటుందన్నారు. శాఖ సమావేశాలు క్రమం తప్పకుండా జరగాలన్నారు. పేదలకు ఇళ్లస్థలాల కోసం గతంలో దరఖాస్తులు అందించినప్పటికీ ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదన్నారు. ఇళ్లస్థలాల మంజూరులో ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు. నగరంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుని పేదలకు పంచేలా సీపీఐ తరపున పోరాడుతామన్నారు. అనంతరం శాఖ కార్యదర్శి భవిష్యత్తు కార్యక్రమాలను ప్రవేశపెట్టారు. సీపీఐ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, నాయకులు దుర్గమ్మ, గిరి, శారద, పోలమ్మ, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఆటకు బీటలు..!

మైదానాలు లేని పాఠశాలలు

కోటగుమ్మం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయి. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. కానీ పలు పాఠశాలల్లో సరైన మైదానాలు లేక పోవడంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. నిబంధనల ప్రకారం విద్యాలయాల్లో క్రీడలకు ప్రత్యేక సమయం కేటాయించినా.. మైదానాలు, పీఈటీలు లేకపోవడంతో ఆటలు అటకెక్కుతున్నాయి.

ఆసక్తి ఉన్నా..

ప్రస్తుతం వివిధ క్రీడా పోటీల్లో నగరానికి చెందిన విద్యార్థులు మెరుస్తున్నారు. కానీ వీరికి తర్ఫీదు ఇవ్వడానికి సరైన మైదానాలు మాత్రం లేవు. ● నగరంలోని 17 క్లస్టర్లలో 80 ఉన్నత పాఠశాలలు (ప్రైవేటువి కలిపి) ఉన్నాయి. వీటిలో ఆరు పాఠశాలలలో మినహా ఎక్కడా సరైన మైదానాలు లేవు. ఒక మాదిరి క్రీడా మైదానాలు ఉన్న చోట వ్యాయామ ఉపాధ్యాయులు లేరు.

● నన్నయ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో 427 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ పీఈటీలు లేరు. ● పట్టణ ఉన్నత పాఠశాలలో 377 మంది విద్యార్థులు ఉన్నా.. వ్యాయామ ఉపాధ్యాయులు లేరు.

మైదానం లేని నగరపాలక సంస్థ టౌన్ ఉన్నత పాఠశాల..

నిత్యహారతి వేడుక

రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లో నిర్వహిస్తున్న నిత్యహారతి వేడుక వైభవంగా జరిగింది. ఆదివారం సాయంత్రం వేదపండితులు శాస్త్రోక్తంగా 14 రకాల హారతులను నదీమతల్లికి భక్తితో సమర్పించారు. సెలవు రోజు కావడంతో పెద్ద సంఖ్యలో నగరవాసులు హాజరై తిలకించారు.
- న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

శైవక్షేత్రాల్లో ద్వాదశ దీపాల పూజలు

హరిహర మహాక్షేత్రంలో దీపాలంకరణ

కడియం న్యూస్‌టుడే: మండలంలోని శైవక్షేత్రాల్లో ఆదివారం సాయంత్రం దీపాలంకరణ వైభవంగా జరిగింది. కడియపులంక శ్రీహరిహర మహాక్షేత్రం, కడియంలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయాల్లో ఆవరణలో ఉసిరిచెట్టు వద్ద భక్తులు ప్రత్యేక పూజలు ఆచరించారు. దీపాలతో ఆలయ ఆవరణంతా శోభాయామనంగా కనువిందు చేసింది.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో కాతేరులో ప్రత్యేక సేవా శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో గ్రామస్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఆదివారం ఉదయం గ్రామంలో మొక్కలు నాటారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రతి ఒక్కరు ఇంటి ముందు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కాతేరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ జాహ్నవి, పర్యావరణవేత్త ఎం.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారులు ఎం.కాస్మా, కె.వీరలక్ష్మి, దుర్గాప్రసాద్, ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న రాజ్యలక్ష్మి కళాశాల వాలంటీర్లు

'కల్తీ మద్యంతో రూ.కోట్ల వ్యాపారం'

టి.నగర్, న్యూస్‌టుడే: నకిలీ మద్యం కేసులో జోగి రమేష్ అరెస్టు సక్రమమేనని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటనలో విడుదల చేశారు. అయిదేళ్ల అధికారాన్ని అడ్డం పెట్టుకుని కల్తీ మద్యం వ్యాపారం చేసి రూ.వేల కోట్లు ప్రజాధనాన్ని కొల్లగొట్టారన్నారు. అనేకమంది ప్రాణాలు పోయాయన్నారు. బీసీల కోసం మాట్లాడే అర్హత ఆ పార్టీ నేతలకు లేదన్నారు.

బీరు సీసాతో దాడి.. కేసు నమోదు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: కాతేరుకు చెందిన కంకిపాటి రాజు అనే వ్యక్తిపై అదే ప్రాంతానికి చెందిన మహేష్ బీరు సీసాతో దాడి చేసిన ఘటనకు సంబంధించి ఆదివారం మూడోపట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఇద్దరూ కలిసి మద్యం తాగుతున్నప్పుడు రాజు అనే వ్యక్తిని నిందితుడు డబ్బులు అడిగాడు. తన వద్ద లేవని అతను చెప్పడంతో వివాదం తలెత్తింది. గతంలోనూ వీరి మధ్య వివాదాలు ఉండడంతో ఈనెల 2న తెల్లవారుజామున బీరుసీసాతో దాడి చేయడంతో పొట్టపై ఘాటు పడింది. బాధితుడి ఫిర్యాదు మేరకు దీనిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

బాలిక అదృశ్యంపై కేసు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): కాకినాడకు చెందిన బాలిక(16) రాజమహేంద్రవరంలో కనిపించకుండా పోయిన ఘటనపై మూడోపట్టణ పోలీసుస్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన బాలిక 10వ తరగతి పూర్తి చేసి రాజమహేంద్రవరంలోని తన అమ్మమ్మ ఇంటి వద్ద ఈ ఏడాది జులై నుంచి ఉంటోంది. ఆదివారం మధ్యాహ్నం ఇంటి బయట ఆడుకోవడానికి వెళ్లి తిరిగి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

విజేతలకు బహుమతుల అందజేత

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, న్యూస్‌టుడే: మండలంలోని పరిజల్లిపేటలో గల యోగిరాజ్ పండిత రామలాల్‌జీ మహరాజ్ ఆశ్రమంలో భజన పోటీలు నిర్వహించారు. వీటిలో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదివారం బహుమతులు అందజేశారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొని వడ్డన చేశారు. ఆశ్రమ నిర్వాహకులు ఎమ్మెల్యేను సత్కరించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

దాతకు స్వామివారి చిత్రపటం అంజేస్తున్న అధికారులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరం గ్రామీణం కడియం మండలం పొట్టిలంక గ్రామానికి చెందిన సురింది వీరవెంకటరావు, కుమారి దంపతులు రూ.1.01 లక్షల విరాళాన్ని ఆదివారం సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకులు వేదాశీర్వచనం, స్వామివారి చిత్రపటం అందజేశారు.

అనపోతారెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

ఉత్సాహంగా కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘ వనసమారాధన

ఎమ్మెల్యే నల్లమిల్లిని సత్కరిస్తున్న రెడ్డి సంక్షేమసంఘం సభ్యులు

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరాన్ని పాలించిన అనపోతారెడ్డి పేరుతో అనపర్తి ఏర్పడిందని, ఆయన విగ్రహాన్ని అనపర్తిలో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తిలో కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. అనపర్తి రైల్వేస్టేషన్‌కు జన్మభూమి హాల్ట్ తీసుకువచ్చినందుకు విశాఖపట్నం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని సత్కరించారు. కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతిని ఆరాధిస్తూ, దాని విశిష్టతను తెలియజెప్పేందుకు కార్తికమాసాన్ని మన సంస్కృతిలో భాగం చేశారన్నారు. అనపర్తి ప్రాంతానికి చెందిన దానకర్ణుడు కొవ్వూరి బసివిరెడ్డి చరిత్ర భావితరాలకు అందజేయాలన్నారు. రాజంపేట ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ అనపర్తి రెడ్డిల గురించి రాయలసీమలో కూడా మాట్లాడుకుంటారన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకే ఉండాలన్నారు. పార్టీలతీతంగా ఉండి ప్రాంతాలభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎమ్మెల్సీ రామచంద్రరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సూర్యనారాయణరెడ్డి, నల్లమిల్లి శేషారెడ్డి, ప్రకాష్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, వైద్యులు పాల్గొన్నారు.

కార్తిక వనసమారాధనకు హాజరైన జనం

సంపతనగరంలో సంప్రదాయబద్ధంగా..

రింగ్ ఆడుతున్న విద్యార్థులు

రాజానగరం: సంపతనగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూలు ప్రాంగణంలో సంస్థ ఛైర్మన్ టీకే విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన ఆదివారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ముందుగా గణపతి, గోమాత, ఆంజనేయ స్వామి పూజలు చేశారు. అనంతరం ఉసిరి చెట్టు వద్ద స్వరూపరెడ్డి, సత్యసౌందర్య దంపతులు పూజలు చేశారు. వివిధ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి, కడప ఎమ్మెల్సీ, ఏపీ ప్రైవేట్ స్కూల్స్ రాష్ట్ర ఛైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆకుల వీర్రాజు, మార్టిన్ లూథర్, హరిబాబు, దేశిరెడ్డి బలరాం నాయుడు, ప్రిన్సిపల్ టీవీడీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటల్లో అదుర్స్

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక

ఎంపికైన చిన్నారులతో ఉపాధ్యాయిని

రాజానగరం, కోరుకొండ, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్జీఎఫ్ఐ)లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆయా కేంద్రాల్లో జరుగుతున్న వివిధ విభాగాల క్రీడా పోటీల్లో పలువురు విద్యార్థినులు ప్రతిభను చాటుతున్నారు. పాఠశాల స్థాయి నుంచి డివిజన్, జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

క్రీడా కోటాలో ఉద్యోగం సాధించాలి..

సీతానగరం మండలం వెదుళ్లపల్లి ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాను. వాలీబాల్ అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. పలు మార్లు టోర్నమెంట్లలో ప్రతిభ కనబరిచి అందరి మన్ననలు పొందాను. క్రీడా కోటాలో పోలీసు ఉద్యోగం సాధించాలి. - షేక్ నజీమా, వెదుళ్లపల్లి

జాతీయ స్థాయిలో రాణించాలి..

గాడాల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాను. మూడుసార్లు కష్టపడి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాను. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో రాణించి తల్లిదండ్రులకు, తర్ఫీదు ఇస్తున్న గురువులకు పేరు తీసుకురావాలి. - ములగలేటి రోజిలి, గాడాల

ఆనందంగా ఉంది..

రాజానగరం మండలం పల్లకడియం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్నాం. బేస్ బాల్ అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాం. చదువుతో పాటు క్రీడల్లో రాణించడం ఆనందంగా ఉంది. - ప్రవల్లిక(ఏడో తరగతి), సిరి(ఎనిమిదో తరగతి)

ముంపు సమస్య నివారణకు కార్యాచరణ

మాట్లాడుతున్న ఎంపీపీ సత్యప్రసాద్

కడియం: దుళ్లలో దీర్ఘకాలికంగా ఉన్న ముంపు సమస్య పరిష్కారానికి రూ.6 లక్షలతో ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన దుళ్లలోని వీవర్స్ కాలనీలో మాట్లాడారు. కొద్దిపాటి వర్షాలకే వీధులన్నీ మురుగుతో నిండిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత తెదేపా హయాంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి నేతృత్వంలో ప్రణాళికలు సిద్ధం చేశామని, తదనంతరం వచ్చిన వైకాపా పాలనలో వాటిని పక్కనబెట్టారని విమర్శించారు. ప్రస్తుతం యుద్ధప్రాతిపదికన సమస్య నివారణకు ఆదివారం ఉదయం రూ.50వేల నిధులతో విద్యుత్తు మోటారును సమకూర్చినట్లు తెలిపారు. దీంతో మురుగు నిల్వలేకుండా ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో సంపు ఏర్పాట్లు, ఇతర పనులు వేగంగా జరిగేలా కూటమి నాయకులతో కలిసి చర్యలు చేపడతామని వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి గుర్రపు సత్యనారాయణ, భరత్, ప్రత్తిపాటి రామారావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరమ్మ గ్రామోత్సవం

బిక్కవోలు, న్యూస్‌టుడే: ఊలపల్లిలో ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహించే గౌరీదేవి సంబరం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గత నెల 6న అమ్మవారిని దేవాలయంలో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అమ్మవారికి రోజూ అలంకరణతో పాటు పూజలు చేస్తున్నారు. ఆదివారం ఉదయం కేరళ డప్పులు, బ్యాండ్ మేళాలు, కోలాటాలు మధ్య అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గ్రామంలోని పెద్ద గౌరమ్మ, చిన గౌరమ్మ ఆలయాల్లో అమ్మవార్లను దర్శించుకున్నారు.

శైవక్షేత్రాల్లో ద్వాదశ దీపాల పూజలు

కడియం: హరిహర మహాక్షేత్రంలో దీపాలంకరణ చేస్తూ..

కడియం, బిక్కవోలు, న్యూస్‌టుడే: మండలంలోని శైవక్షేత్రాల్లో ఆదివారం సాయంత్రం దీపాలంకరణ వైభవంగా జరిగింది. కడియపులంక శ్రీహరిహర మహాక్షేత్రం, కడియంలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వస్వామి ఆలయాల్లో ఆవరణలో ఉసిరిచెట్టు వద్ద భక్తులు ప్రత్యేక పూజలు ఆచరించారు. దీపాలతో ఆలయ ఆవరణంతా శోభాయామనంగా కనువిందు చేసింది. ● బిక్కవోలులో వైష్ణవ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి తులసికి, శ్రీకృష్ణునికి కల్యాణం జరిపారు. తులసి కోట వద్ద కొబ్బరి ఆకులతో పందిరి వేసి శ్రీకృష్ణుని విగ్రహం ఏర్పాటు చేసి పూజలు చేశారు.

మార్కండేయుని కల్యాణ వేడుక

రాజమహేంద్రవరం సాంస్కృతికం: క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా గోదావరి గట్టున ఉన్న శ్రీఉమా మార్కండేయస్వామి ఆలయంలో మార్కండేయుని కల్యాణ వేడుక వైభవంగా జరిగింది. ఆదివారం సాయంత్రం ఆలయ ఆవరణలోని వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు.

బీమాను మరవకండి

బిక్కవోలు: బీమా ఉన్న తెదేపా కార్యకర్తలు ప్రమాదవశాత్తు మరణిస్తే ముందుగా పోలీసులకు తెలపాలని, అలా తెలపని పక్షంలో బీమా సొమ్ము రాదని బలభద్రపురం సొసైటీ అధ్యక్షులు నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. బలభద్రపురంలో ఆదివారం నిర్వహించిన పార్టీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రమాదం జరిగిన వెంటనే ముందుగా పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించాలన్నారు. సభ్యత్వం ఉన్న ప్రతి కార్యకర్తకు ప్రమాదబీమా ఉంటుందని పేర్కొన్నారు.

పటేల్ జయంతి ఉత్సవాలు

రంగంపేట, న్యూస్‌టుడే: ఉక్కు మనిషిగా పేరొందిన సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి ఉత్సవాలు రంగంపేట మండలంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్నాయి. ఆదివారం వడిశలేరులో పటేల్ చిత్రపటానికి రాజకీయ విశ్లేషకుడు మరిడయ్య, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు పోతుల వెంకట్రాజు, మాజీ ఎంపీపీ పోతుల బులివీర్రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

మొక్క నాటుతున్న రాజ్యలక్ష్మి కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో కాతేరులో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో గ్రామస్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఆదివారం ఉదయం గ్రామంలో మొక్కలు నాటారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రతి ఒక్కరు ఇంటి ముందు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కాతేరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ జాహ్నవి, పర్యావరణవేత్త ఎం.వీర్రాజు, ఎన్ఎస్ఎస్ అధికారులు ఎం.కాస్మా, కె.వీరలక్ష్మి, దుర్గాప్రసాద్, ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

వంతెనపై నిలిచిన ట్రాఫిక్

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి ఎర్రకాలువ వంతెనపై ఆదివారం సాయంత్రం సుమారు గంటన్నరపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. రెండు కార్లు ఒకదానికొకటి అడ్డంగా రావడం, పక్కనే వాహనాలు ఉండడంతో ఎటు వెళ్లలేని పరిస్థితిలో ట్రాఫిక్ రోడ్డుపై నిలిచిపోయింది. అనపర్తి- పొలమూరు రహదారి వైపు, అనపర్తి- ద్వారపూడి వైపు, అనపర్తి- బలభద్రపురం వైపు వాహనాలు రోడ్డుపై రెండు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతరం పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

నిరుపయోగం.. సంపద కేంద్రం

కడియం మండలం వీరవరం గ్రామ శివారు ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రం నిరుపయోగంగా మారింది. గ్రామాల్లో వచ్చిన వ్యర్థాలతో పంచాయతీలకు ఆదాయం సృష్టించేందుకు వీటిని ఏర్పాటు చేశారు. కాని ఆ వైపుగా ప్రయత్నాలు జరగడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంపీడీవో రమేశ్‌ను వివరణ కోరగా పంచాయతీ అధికారులకు సూచనలు జారీ చేసి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, కడియం

రహదారిపై వ్యర్థాలు

శాటిలైట్ సిటీ బి-బ్లాక్‌లో ప్రధాన రహదారి పక్కనే వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. అందులో ఉన్న ఆహార పదార్థాల కోసం కుక్కలు అటూఇటూ పరిగెడుతున్నాయి. వ్యర్థాలను రోడ్డుపైకి లాగేస్తున్నాయి. దీంతో వాహనచోదకులు జారి పడిపోతున్నారు. పశువులు వీటిలో ఉన్న ప్లాస్టిక్‌ను తిని అనారోగ్యాల బారిన పడుతున్నాయి. వర్షాలకు ఈ వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సిబ్బందితో వీటిని ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మోరంపూడి

తుప్పలు తొలగించరూ..?

శాటిలైట్ సిటీ బీ బ్లాక్‌లో ఉన్న మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పిచ్చి తుప్పలు పెరిగిపోయి ఉన్నాయి. పాఠశాల ఆవరణతో పాటు, బయట దట్టమైన పొదలు అలుముకుని ఉన్నాయి. దీంతో విషసర్పాలు తిరుగుతున్నాయని చిన్నారులు భయాందోళన చెందుతున్నారు. భోజన సమయంలో చేతులు శుభ్రం చేసుకోవడానికి ఈ ప్రాంతంలోకే వస్తుంటారు. అధికారులు స్పందించి ఈ తుప్పల్ని తొలగించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మోరంపూడి

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

దేవీచౌక్: అత్యవసర మరమ్మతుల నిమిత్తం సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొంతమూరులోని కల్యాణ్‌నగర్, ఆదర్శనగర్, జంగాలకాలనీ, ఉద్యోగుల కాలనీ, నాలుగో వంతెన ప్రాంతం, శేషాద్రి రెడ్డి బెవరేజ్, క్వారీ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 95333 66637

ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభం

సమస్య: రంగంపేట విద్యుత్తు ఉపకేంద్రం సమీపంలోని విద్యుత్తు స్తంభానికి పాదులు అలముకున్నాయి. దీంతో విద్యుత్తు సరఫరాకు తరచూ ఆటంకం కలుగుతుంది. వీటిని తొలగించాలి. **- శ్రీను, స్థానికుడు**

సమాధానం: ఈ స్తంభాన్ని అలముకున్న పాదులను తొలగించేందుకు చర్యలు చేపడతాం. విద్యుత్తు సరఫరాకు ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుంటాం. **- తోట శిరీష, విద్యుత్తు ఏఈ** – న్యూస్‌టుడే, రంగంపేట

చెత్తను తొలగించండి

సమస్య: శాటిలైట్ సిటీ బీ బ్లాక్‌లో డ్రెయినేజీలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో మురుగు ముందుకు సాగక రోడ్లపైకి వస్తోంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

- ప్రభావతి, స్థానికురాలు

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపించి కాలువలో వ్యర్థాలను తొలగించే చర్యలు చేపడతాం.

- టి.కృష్ణ, శాటిలైట్ సిటీ పంచాయతీ కార్యదర్శి

వీధి దీపాలు లేవు

సమస్య: కొంతమూరు, డాక్టర్స్ కాలనీలో వీధి దీపాలు లేవు. రాత్రిపూట విషసర్పాలు సంచరిస్తున్నాయి. ఏదైనా ప్రమాదం వాటిల్లక ముందే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. **- ఖాన్, స్థానికుడు**

సమాధానం: ప్రతీచోట దీపాలు వేయించాం. కొన్ని చోట్ల స్తంభాలకు మూడవ లైన్ లేనందున దీపాలు ఏర్పాటు చేయలేకపోతున్నాం. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టాం. త్వరలోనే పరిష్కరిస్తాం.

- డి.శ్రీనివాసరావు, కొలమూరు పంచాయతీ కార్యదర్శి

– న్యూస్‌టుడే, మోరంపూడి

పగలూ వెలుగులే

సమస్య: బలభద్రపురం బస్ స్టాండ్ సమీపంలో విద్యుత్తు దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. రాత్రిపూట మాత్రమే వెలిగేలా చర్యలు తీసుకోవాలి.

సమాధానం: సమస్యను పరిశీలించి త్వరగా పరిష్కరిస్తాం.

- అచ్చియ్య చౌదరి, పంచాయతీ కార్యదర్శి, బలభద్రపురం

దాడి కేసులో అయిదుగురి అరెస్టు

రంగంపేట, న్యూస్‌టుడే: రంగంపేట మండలం ఈలకొలనులోని పొలం పనులు చేసుకుంటున్న వ్యక్తిపై దాడికి ప్రయత్నించిన అయిదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై శివప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వేళంగికి చెందిన టేకుమూడి వీర వెంకట సత్యనారాయణ తన కుమార్తెకు చెందిన ఆయిల్‌పామ్ తోటలో గెలలు కోస్తుండగా దొండపాటి దుర్గ, కొవ్వూరి సత్యనారాయణ, కె.బాబి, యాళ్ల రామారావు, మరికొందరు అడ్డుకుని దాడి చేశారు. ఈ తోటకు సంబంధించి చాలాకాలంగా బంధువుల మధ్య వివాదం కొనసాగుతోంది. దీనిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామని, దాడికి పాల్పడిన మరికొందరిని అరెస్టు చేయాల్సి ఉందని ఎస్సై పేర్కొన్నారు.

బీరు సీసాతో దాడి.. కేసు నమోదు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: కాతేరుకు చెందిన కంకిపాటి రాజు అనే వ్యక్తిపై అదే ప్రాంతానికి చెందిన మహేష్ అనే వ్యక్తి బీరు సీసాతో దాడి చేసిన ఘటనకు సంబంధించి ఆదివారం మూడోపట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఇద్దరూ కలిసి మద్యం తాగుతున్నప్పుడు రాజు అనే వ్యక్తిని నిందితుడు డబ్బులు అడగడం, అతను తన వద్ద లేవని చెప్పడంతో వివాదం తలెత్తింది. గతంలోనూ వీరి మధ్య వివాదాలు ఉండడంతో ఈనెల 2న తెల్లవారుజామున బీరుసీసాతో దాడి చేయడంతో పొట్టపై గాటు పడింది. బాధితుడి ఫిర్యాదు మేరకు దీనిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

పశు వైద్యశాల ప్రారంభం

కోరుకొండ(సీతానగరం): మిర్తిపాడులో పశు సామాజిక వైద్యశాలను ఆదివారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రారంభించారు. పంచాయతీకి సంబంధించి నూతన ట్రాక్టరును స్వయంగా నడిపి ప్రారంభించారు. చినకొండేపూడిలో మొంథా తుపానుతో జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం తరపున బియ్యం, నిత్యావసరాలు, శ్రీరంగపట్నంలో 19 కుటుంబాలకు నష్టపరిహారం అందజేశారు. రూ.32 కోట్లతో ముంపు నివారణకు ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు.

సర్కారు భవనం.. శిథిలావస్థతో భయం

కోరుకొండ పీహెచ్‌సీ నేత్ర వైద్య విభాగం భవనం దుస్థితి

అధ్వానంగా చినకొండేపూడి పశువుల ఆసుపత్రి భవనం

రాజానగరం, కోరుకొండ (సీతానగరం), న్యూస్‌టుడే: ప్రజలకు సేవలందించే సర్కారు భవనాలు శిథిలావస్థతతో భయం గొలుపుతున్నాయి. ఎప్పుడు కూలుతాయోనన్న ఆందోళన నెలకొంది. అధికారులు, సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లోని ఆయా ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి.

ఆందోళనలో ఉద్యోగులు..

● కోరుకొండ మండలంలోని తహసీల్దార్ కార్యాలయం, పోలీసు స్టేషను, పీహెచ్‌సీ నేత్ర వైద్య విభాగ భవనం, కాపవరంలోని బాలికల వసతి గృహం శిథిలస్థితికి చేరాయి. ● సీతానగరం మండలంలోని సీతానగరం పోలీసు స్టేషను, చినకొండేపూడిలోని పశువుల ఆసుపత్రి భవనం, సీతానగరం పీహెచ్‌సీ భవనాలు శిథిలమై విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ● రాజానగరంలోని బాలుర వసతి గృహం భవనం పెచ్చులూడుతుండటంతో వారికి రక్షణ లేకుండా పోయింది.

నిర్మాణాలపై దృష్టి..

నియోజకవర్గంలో పలు ప్రభుత్వ భవనాలు శిథిలస్థితికి చేరాయి. గత వైకాపా ప్రభుత్వ హయాం నుంచి ఇవి పాడైపోయినా పట్టించుకోలేదు. అన్ని శాఖలకు అవసరమైన నూతన కార్యాలయాల భవనాలు, శిథిల స్థితికి చేరిన భవనాలను తొలగించి వాటి స్థానంలో కొత్త నిర్మాణాలు చేపట్టేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటాం.

- బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్యే, రాజానగరం

శ్రద్ధాంజలి

మాకు ఆత్మీయ ఆప్తులు, అందరి శ్రేయోభిలాషి శ్రీ వాకచర్ల శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు) గారి మృతికి చింతిస్తూ, వారి కుటుంబసభ్యులందరికీ మా ప్రగాఢ సానుభూతిని తెలియపరుస్తున్నాం.

కీ॥శే॥ శ్రీ వాకచర్ల శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు) గారు, గోకవరం

కంచర్ల సూర్యప్రకాష్, కార్యదర్శి: రాజమండ్రి ఏరియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్
ప్రొ: లక్ష్మీశ్రీ మోడ్రన్ రైస్‌మిల్లు, గోకవరం, ఛైర్మన్: జ్ఞానసరస్వతి విద్యానికేతన్
అధ్యక్షులు: గోకవరం ఆర్యవైశ్య సేవాసంఘం మరియు సంఘ సభ్యులు

శ్రద్ధాంజలి

కీ॥శే॥ శ్రీ వాకచర్ల శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు) గారు, గోకవరం

మంచితనం, ప్రేమ, ఆప్యాయతతో మా అందరి మనస్సులలో చిరస్థాయిగా నిలిచిన శ్రీ వాకచర్ల శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు) గారి మృతికి చింతిస్తూ, వారి కుటుంబసభ్యులు అందరికీ మా ప్రగాఢ సానుభూతిని తెలియపరుస్తున్నాం.

ఆదిత్య హాస్పిటల్ మేనేజ్‌మెంట్, డాక్టర్స్ & స్టాఫ్
LIC ఆఫీస్ ఎదుట, గోకవరం

శ్రద్ధాంజలి

కీ॥శే॥ శ్రీ వాకచర్ల శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు) గారు
జననం: 06-04-1950 మరణం: 24-10-2025
గోకవరం

మంచితనం, ప్రేమ, ఆప్యాయతతో మా అందరి మనస్సులలో చిరస్థాయిగా నిలిచి, నిరంతరం అందరి శ్రేయస్సు కోరుకునే మంచిమనిషి, మా కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన మా ఇంటిదైవం శ్రీ వాకచర్ల శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు) గారి మరణం మాకు తీరనిలోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య: శ్రీమతి పుత్రీలక్ష్మి
కుమారులు: వాకచర్ల విజయ్‌కుమార్ - వాకచర్ల సురేష్‌కుమార్ కోడలు: శ్రీమతి భార్గవి
కుమార్తె: అచ్యుతరాణి అల్లుడు: భూపేష్ గుప్తా
మనవరాళ్లు: లాలిత్య, హారిణి మరియు కుటుంబసభ్యులు

పెద్దకార్యం: ది.3-11-2025 సోమవారం, గోకవరంలో మా స్వగృహమునందు జరుగును

(c) eenadu

కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

నేడు, రేపు జిల్లా జట్ల ఎంపికలు

దేవరపల్లి, న్యూస్‌టుడే: దేవరపల్లిలోని అంబటి సత్యనారాయణ రావు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్-17, అండర్-14 ఫుట్‌బాల్, నెట్‌బాల్ జట్ల ఎంపికల పోటీలు మంగళవారం జరగనున్నాయి. అలాగే రామన్నపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో తూర్పుగోదావరి జిల్లా బాలబాలికల టెన్నీకాయిట్ జట్ల ఎంపికల పోటీలు సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు ఆధార్ జిరాక్స్, పాఠశాల, కళాశాల పత్రాలు తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

దేవరపల్లి, న్యూస్‌టుడే: పల్లంట్ల విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని 11కేవీ గ్రామీణ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ నారాయణ అప్పారావు ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ విద్యుత్తు ఉదయం 5 నుంచి 9 గంటల వరకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 6 గంటల వరకు ఉంటుందన్నారు.

మార్కండేయుని కల్యాణ వేడుక

రాజమహేంద్రవరం సాంస్కృతికం: క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా గోదావరి గట్టున ఉన్న శ్రీఉమా మార్కండేయస్వామి ఆలయంలో మార్కండేయుని కల్యాణ వేడుక వైభవంగా జరిగింది. ఆదివారం సాయంత్రం ఆలయ ఆవరణలోని వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు.

ప్రత్యేక పూజలు.. సామూహిక దీపారాధనలు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: కార్తిక మాసం ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా తాడిపర్రు తదితర గ్రామాల్లో ఏకాహం, భజనలు ఆదివారం నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సామూహిక దీపారాధనలు చేశారు. ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులు తిలకించారు.

పోతవరంలో ఉమా రామలింగేశ్వరస్వామి

ఉమామహేశ్వరస్వామికి లక్షపత్రి, పుష్పాలతో అలంకరణ

నల్లజర్ల: పోతవరం శివారు ఎర్రకాలువ వద్ద ఉన్న ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కార్తికమాస మహోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం, క్షీరాబ్ది ద్వాదశి పూజ, సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తాడిపర్రులో భజన చేస్తున్న మహిళలు

విశ్వేశ్వరస్వామికి అన్నాభిషేకం

తాళ్లపూడి: ప్రక్కిలంక శివాలయంలో అర్చకుడు విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో అన్నాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో వీక్షించారు. స్వామివార్లను పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తాళ్లపూడిలోని పార్వతి సమేత ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో లక్షపత్రి పూజ జరిపించారు. ఉమామహేశ్వరస్వామికి పుష్పాలు అర్పించారు.

భయపెడుతున్న వంతెనలు

పరిశీలన

నిడదవోలు, గోపాలపురం, తాళ్లపూడి న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వంతెనలు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణికులకు ప్రధాన మార్గాలు కావడంతో నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకొని సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

● నిడదవోలు మండలం సమిశ్రగూడెం వద్ద పశ్చిమడెల్టా ప్రధాన కాలువపై నిర్మించిన వంతెన ప్రమాదభరితంగా ఉంది. భారీ వాహనాలు నిలువరించేందుకు అధికారులు వంతెనకు అటుఇటు గడ్డర్‌లు ఏర్పాటు చేసినా ప్రయోజనం మాత్రం నామమాత్రంగానే ఉంది. ఈ వంతెనపై నుంచి కేవలం 10 టన్నుల బరువు, 15 కి.మీ వేగంలో మాత్రమే వాహనాలు వెళ్లాల్సి ఉంది. అవేమి లెక్కచేయకుండా వాహనదారులు రాత్రి సమయంలో ఇష్టానుసారంగా భారీ వాహనాలతో రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో ఇక్కడే ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరిపై అడ్డుకమ్మి పడటంతో గాయాలపాలయ్యారు. ఇలా ప్రమాదాల బారినపడి స్వల్పగాయాలతో బయటపడినవారు మరెందరో ఉన్నారు.

సమిశ్రగూడెం వద్ద రాత్రి సమయంలో భారీ వాహనం ఇలా..

● తాళ్లపూడి మండలం పైడిమెట్ట నుంచి గజ్జరం వెళ్లే మార్గంలో కొవ్వాడకాలువపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

● ఉండ్రాజవరం మండలం శివటం గ్రామ ప్రధాన మురుగు కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరడంతో ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ వంతెనకు మరమ్మతు పనులు చేయాల్సి ఉంది.

కొవ్వూరుపాడు-సాగిపాడు మధ్య అధ్వానంగా..

● గోపాలపురం మండలం కొవ్వూరుపాడు-సాగిపాడు మధ్య ప్రధాన రహదారిపై ఉన్న కాజ్వే ఉంది. సుమారు 10గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఎటువంటి రక్షణ గోడ లేకపోవడంతో వర్షాలు వస్తే వంతెన మీదగా నీరు ప్రవహిస్తోంది. రాత్రి సమయాల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఆరోగ్య సేవలకు ఆర్థిక భరోసా

చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: అత్యవసర స్థితిలో ఉన్న నిరుపేదల ఆరోగ్య సేవలకు కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు పట్టణం, గ్రామీణానికి చెందిన ఏడుగురికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.2.67 లక్షల విలువైన చెక్కులను ఆదివారం ఆయన అందించారు. తెదేపా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, చావా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు సాయం

కొవ్వూరు పట్టణం: మొంథా తుపాను బాధితులకు ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలిచిందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని శ్రీనివాసపురం, చిగురులంక, పల్లిపాలేనికి చెందిన 53 కుటుంబాలకు రూ.1.17 లక్షల నగదును ఆదివారం ఆయన పంపిణీ చేశారు. బ్రిడ్జిపేటలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విపత్తును ఎదుర్కోవడంలో ప్రభుత్వ ముందస్తు ప్రణాళిక అభినందనీయమన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ, సూరపనేని చిన్ని, కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాసరవీంద్ర, సూర్యదేవర రంజిత్, అర్జెల్లి రామకృష్ణ, తహసీల్దారు ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాయం చేస్తున్న తహసీల్దార్, కూటమి నాయకులు

తాళ్లపూడి: తుపాను ప్రభావంతో నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థికసాయం అందించిందని తహసీల్దార్ లక్ష్మీలావణ్య తెలిపారు. మండలంలోని అన్నదేవరపేట, ప్రక్కిలంకలోని పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఆదివారం ఆమె నగదు అందించారు. ప్రక్కిలంకలో 21 కుటుంబాలకు రూ.44 వేలు, అన్నదేవరపేటలోని 10 కుటుంబాలకు 20 వేలు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కూచిపూడి గణపతి, కొరారు వెంకట్రావు, చేవ్వూరి రాము, పల్లి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు మండలం కోరుమామిడిలో శ్రీకాకతీయ కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సమైక్య వనసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు, పట్టణ తెదేపా అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాయిపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణను సత్కరించారు.

వనసమారాధనల సందడి

కోరుమామిడిలో నిర్వహించిన వనసమారాధనలో శేషారావు

అందుబాటులో టీకాలు

చాగల్లు: మొంథా తుపాను అనంతరం మరొకటి వస్తోందని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో పశువులకు అవసరమైన టీకాలు, అత్యవసర చికిత్స నిమిత్తం టీకాలు అందుబాటులో ఉంచినట్లు చాగల్లు మండల పశువైద్యాధికారి యు.ముఖేష్ తెలిపారు. పాడి రైతులు పశువుల షెడ్లలో వర్షపునీరు నిలిచిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పశు వ్యాధులు వ్యాప్తిచెందకుండా సకాలంలో టీకాలు వేయించాలన్నారు.

తగ్గిన ఎర్రకాలువ వరద

నిడదవోలు: కంసాలిపాలెం-తాడేపల్లిగూడెం మండలం మాధవరం మధ్య వంతెన వద్ద రహదారిపై వరదనీరు తగ్గింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నీరు రహదారిపైకి చేరడంతో గత కొద్ది రోజులుగా ఈ రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం నీరు లాగడంతో రాకపోకలు యుథావిధిగా సాగుతున్నాయి.

పేదల ఇళ్ల స్థలాల కోసం పోరాటం

వి.ఎల్.పురం: పేదలకు ఇళ్లస్థలాల కోసం సీపీఐ పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మధు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక తాడితోటలో సీపీఐ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ శాఖ సమావేశం జరిగింది. శాఖ కార్యదర్శి రెడ్డి రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మధు మాట్లాడారు. పార్టీ అనుబంధ శాఖలు బలంగా ఉంటేనే పార్టీ పటిష్ఠంగా ఉంటుందన్నారు. శాఖ సమావేశాలు క్రమం తప్పకుండా జరగాలన్నారు. పేదలకు ఇళ్లస్థలాల కోసం గతంలో దరఖాస్తులు అందించినప్పటికీ ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదన్నారు. ఇళ్లస్థలాల మంజూరులో ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు. నగరంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుని పేదలకు పంచేలా సీపీఐ తరపున పోరాడుతామన్నారు. అనంతరం శాఖ కార్యదర్శి భవిష్యత్తు కార్యక్రమాలను ప్రవేశపెట్టారు. సీపీఐ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, నాయకులు దుర్గమ్మ, గిరి, శారద, పోలమ్మ, బాలు తదితరులు పాల్గొన్నారు.

'కల్తీ మద్యంతో రూ.కోట్ల వ్యాపారం'

టి.నగర్: నకిలీ మద్యం కేసులో జోగి రమేష్ అరెస్టు సక్రమమేనని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అయిదేళ్ల అధికారాన్ని అడ్డం పెట్టుకుని కల్తీ మద్యం వ్యాపారం చేసి రూ.వేల కోట్లు ప్రజాధనాన్ని కొల్లగొట్టారన్నారు. కల్తీ మద్యం తయారీ కారకులపై చర్యలు తీసుకొంటే ఎందుకు ఇంత ఉలికిపాటు అని ప్రశ్నించారు. వైకాపా నేతలు చేస్తున్న గోల అర్థరహితమన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తాళ్లపూడి: 80085 74498, ఉండ్రాజవరం: 80085 74503, నల్లజర్ల: 97011 37112

దుర్వాసనతో అవస్థలు

సమస్య: గుండేపల్లి ప్రధాన రహదారి పక్కన ఉన్న డ్రెయిన్ మట్టితో పూడి మురుగు ముందుకు పారక ఆ ప్రాంతమంతా దుర్వాసన వస్తోంది.

సమాధానం: మురుగు పారేలా చర్యలు తీసుకుంటాం. సమస్యను పరిష్కరిస్తాం.
- మహాదేవి, పంచాయతీ కార్యదర్శి, గుండేపల్లి

- న్యూస్‌టుడే, నల్లజర్ల

పచ్చని పైరు కాదు వాన నీరే..

గోపాలపురంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో కనిపిస్తున్న చిత్రం ఇది. పాఠశాల రక్షణ గోడ పక్కన ఉన్న మురుగు కాలువలో పూడిపోవడంతో వాన నీరు ఆవరణలోకి చేరి రోజుల తరబడి ఉండిపోతోంది. దుర్వాసన రావడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దోమలు పెరిగే అవకాశమూ ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి అనురాధను వివరణ కోరగా సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, గోపాలపురం

పొంచి ఉన్న ప్రమాదం

ఉండ్రాజవరం నుంచి పాలంగి మీదుగా తణుకు వెళ్లే రహదారి దెబ్బతింది. పలుచోట్ల సిమెంటు రోడ్డు బీటలు తీసింది. ఇరుపక్కల గ్రావెల్ లేకపోవటంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. మరమ్మతులు చేపట్టాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పరిశీలించి అభివృద్ధి చేయిస్తామని ఆర్అండ్‌బీ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. - న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

అల్లుకున్న నిర్లక్ష్యం

కొవ్వూరు పట్టణంలోని శివానంద ఉద్యానవనం సమీపంలోని విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. ఫ్యూజ్ బాక్సుతో పాటు విద్యుత్తు తీగలకు సైతం పాదులు అల్లుకుని పరిసరాలు ప్రమాదకరంగా మారాయి. సమస్యను సీసీహెచ్‌ఎస్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా పాదులు తొలగించే పనులను చేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడి దుర్మరణం

దేవరపల్లి, న్యూస్‌టుడే: అతివేగంగా వచ్చిన లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొని వాహనదారుడు దుర్మరణం చెందిన ఘటన దేవరపల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. దేవరపల్లి మండలం బందపురం పంచాయతీ రంగరాయకాలనీకి చెందిన షేక్ ఇమామ్(57) కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంటారు. ఆతనికి నలుగురు కుమార్తెలు ఉండగా ముగ్గురికి వివాహాలు చేశాడు. మరో కుమార్తె చిన్నతనం నుంచి దివ్యాంగురాలు కావడంతో ఇంటి వద్దనే ఉంటుంది. ఆదివారం సాయంత్రం ద్విచక్రవాహనంపై దేవరపల్లి వెళ్లి జాతీయ రహదారిపై గ్రామానికి తిరిగి వస్తుండగా అదే సమయంలో అతివేగంగా వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌కి వాహనదారుడి తల తగలడంతో అధిక రక్తస్రావం అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మృతుడు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

నిడదవోలులో కొవ్వొత్తుల ప్రదర్శన

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు తదితరులు

నిడదవోలు, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ నిడదవోలు మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిడదవోలులో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. నియోజకవర్గ పరిశీలకుడు గిరిజాల బాబు, వైకాపా పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి సత్యనారాయణ, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

విజయంతో సంబరాలు

ఉండ్రాజవరం: ప్రపంచ కప్ చివరి మ్యాచ్‌లో భారత్ జట్టు విజయం సాధిస్తుందని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. భారత్, దక్షిణాఫ్రికా మహిళల ప్రపంచ కప్ తుది పోరును వేలివెన్ను ప్రధాన కూడలిలో పెద్ద తెరను ఆదివారం ఏర్పాటు చేశారు. ఆయనతో పాటు క్రీడాకారులు, యువకులు మ్యాచ్ తిలకించారు. భారత్ విజయాన్ని కైవసం చేసుకోగా సంబరాలు చేసుకున్నారు.

వేలివెన్నులో తెరపై క్రికెట్ మ్యాచ్ తిలకిస్తున్న శేషారావు, యువకులు

ఆటో బోల్తా.. ముగ్గురికి స్వల్ప గాయాలు

దేవరపల్లి: కూలీలతో వెలుతున్న ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడి ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలైన ఘటన దేవరపల్లి మండలం దుద్దుకూరులో చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం....తూర్పుగోదావరి జిల్లా చాగల్లుకి చెందిన ఐదుగురు మహిళలు గోపాలపురం మండలం వాదాలకుంట కూలిపనికి ఆదివారం ఉదయం ఆటోలో బయలుదేరారు. దేవరపల్లి మండలం దుద్దుకూరు జాతీయ రహదారి వద్దకు వచ్చే సరికి బ్రేక్‌లు సరిగా పట్టకపోవడంతో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఐదుగురులో లక్ష్మీ, ఆపర్ణ, ఆదిలక్ష్మీలకు స్వల్పగాయాలు కావడంతో గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

మరో ఇద్దరికి..

నిడదవోలు: నిడదవోలు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి ఎదురుగా శనివారం అర్ధరాత్రి జరిగిన రహదారి ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలైనట్లు నిడదవోలు ఎస్సై జగన్‌మోహనరావు తెలిపారు. తణుకు మండలం అల్లంపురం వెళ్తున్న కారు నిడదవోలులో అదుపు తప్పి ఇద్దరిని ఢీకొంది. ఈ సంఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలు కావడంతో వారిని వైద్య సేవల నిమిత్తం నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కొవ్వూరు పట్టణం: మిల్లులో పనిచేసే కార్మికుడు అదృశ్యమైనట్లు పట్టణ స్టేషన్లో ఫిర్యాదు అందింది. వివరాల ప్రకారం విజయనగరం జిల్లా, మెరకమూడిదం మండలం, నాయుడు వలస సమీప ప్రాంతాలకు చెందిన 18 మంది బంగారంపేటలోని ధాన్యం మిల్లులో పనుల కోసం వచ్చారు. గత నెల 25న చల్లా భాస్కరరావు పనికి వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. సొంతూరైన నాయుడు వలసకు సైతం రాలేదని బంధువులు చెప్పారు. ఈ నేపథ్యంలో తోటి కార్మికుడు పక్కి సత్యనారాయణ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదుపై పట్టణ మహిళా హెడ్‌కానిస్టేబుల్ లలిత కేసు నమోదు చేశారు.

నిత్యహారతి వేడుక

రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లో నిర్వహిస్తున్న నిత్యహారతి వేడుక వైభవంగా జరిగింది. ఆదివారం సాయంత్రం వేదపండితులు శాస్త్రోక్తంగా 14 రకాల హారతులను నదీమతల్లికి భక్తితో సమర్పించారు. సెలవు రోజు కావడంతో పెద్ద సంఖ్యలో నగరవాసులు హాజరై తిలకించారు.
– న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

క్విజ్ పోటీల్లో విద్యార్థులకు బహుమతులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమహేంద్రవరం నామవరం రోడ్డులోని ఆదిత్య తక్ష్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో రెండు రోజులపాటు నిర్వహించిన 'విజ్ కిడ్' క్విజ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. రెండో రోజు ఆదివారం సాయంత్రం జరిగిన క్విజ్ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సత్తి గౌతమ్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందించారు. ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ శృతిరెడ్డి, ప్రిన్సిపల్ లిసా కుమార్ బర్ధన్ నిర్వహణలో జరిగింది. ల్యాప్‌టాప్‌లు, సైకిళ్లు, నగదు బహుమతులు అందించారు. క్విజ్ మాస్టర్‌గా టి.రమేష్ వ్యవహరించారు.

స్ఫూర్తి ప్రదాతలు

చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ, అత్యవసర సమయాల్లో రక్తదానం, ఆహారం, ఆర్థిక సాయం అందజేస్తూ. సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న వివిధ సేవా సంస్థలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి.

బాల వికాస కేంద్రాల ద్వారా..

నల్లజర్ల: నిద్రలేచింది మొదలు.. పడుకునే వరకూ పిల్లల చేతుల్లో చరవాణి ఉంటున్న రోజులివి.. దీనివల్ల చిన్నారుల మానసిక ఎదుగుదల దెబ్బతింటోంది. ఈ సమస్యను గుర్తించిన సమరసత సేవా ఫౌండేషన్ పూర్వపు పశ్చిమ గోదావరిజిల్లాలో 32 చోట్ల బాలవికాస్ కేంద్రాలు ఏర్పాటు చేసి 12 ఏళ్ల పిల్లలకు సాయంత్రం వేళల్లో చదువు చెప్పడంతో పాటు బయట వాస్తవ ప్రపంచం, నైతిక విలువలు ఆధ్యాత్మికత, వ్యాయామం తదితర అంశాలను నేర్పిస్తున్నారు. ఈ కేంద్రాల్లో విద్యాబుద్ధులను నేర్పించడానికిగాను మాతీజీలను (వాలంటీర్లు) ఏర్పాటు చేశారు. కొవ్వూరు డివిజన్‌లో ప్రచారక్ ఉప్పలపాటి మాధవరావు ఆధ్వర్యంలో పుల్లలపాడు వేములమ్మ ఆలయం వద్ద ఓ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.

పుల్లలపాడులో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పడి..

గోపాలపురం మండలంలోని దొండపూడి గ్రామంలో హెల్పింగ్ హ్యాండ్స్ పేరుతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. నియోజకవర్గం పరిధిలోని మూడు మండలాల్లో సుమారు రెండు వేల మందికి పైగా సభ్యులు ఉన్నారు. ఆ గ్రామ పరిసర ప్రాంతాల్లో ఎవరికి సహాయం కావాలన్నా ఆ సభ్యులకు లేదా వాట్సాప్ గ్రూప్‌లో సమాచారం అందజేస్తే వెంటనే స్పందించి ఆర్థిక సాయంతో పాటు, అవసరమైన నిత్యావసరాలు, రక్తదానం వంటివి అందజేస్తారు.

మానవత్వం.. సేవాదళం..

గోపాలపురం, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ వివిధ గ్రామాలకు చెందిన యువకులు, ఉద్యోగులు కలిసి స్వచ్ఛంద సేవా బృందంగా ఏర్పడి 15 ఏళ్లగా నిరంతరంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆహార పంపిణీ, విద్యా సహాయం, రక్తదానం, విపత్తు సమయంలో సహాయక చర్యలు వంటి పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. మృతి చెందిన వారికి అంత్యక్రియలకు తీసుకెళ్లడానికి అవసరమైన శాంతిరథం వంటివి ఏర్పాటు, ప్రతి ఏట పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం వంటివి సొంత డబ్బులతో సాయం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

నగదు సాయం చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

'ప్రైవేటీకరణను వ్యతిరేకించండి'

నిడదవోలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలల ప్రైవేటీకరణ చేయాలనే నిర్ణయాన్ని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని నిడదవోలు మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిడదవోలు పట్టణంలోని 16, 17, 18, 19, 20వ వార్డుల్లో ఆదివారం నిర్వహించారు.

CHANGE OF NAME

I **TALARI PRADEEP**, S/o Talari Chantiyya, Resident of D.No.3-40, Patapeta SC Area, Chinnayagudem, Devarapalli Mandal, East Godavari Dist., A.P. I have Changed my Name from **THALARI PRADEEP** (Old Name) to **TALARI PRADEEP** (New Name). Henceforth I am being Called as **TALARI PRADEEP** (New Name) for all purposes.

(c) eenadu

రేపు 'ఈటీవీ' కార్తిక దీపోత్సవం

కార్తికమాసం ఇల్లిల్లుకి ఎంతో ప్రీతికరమైన కార్తిక మాసం. దీంతో సమానమైన మాసం, గంగతో సమానమైన తీర్థం లేదని పురాణోక్తి. విశేష పుణ్య సంపదను ప్రసాదించే ఈ మాసంలో దీపారాధనకు ఉన్న ప్రాధాన్యం అసమానమైనది. 'ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ, ఈటీవీ లైఫ్' ఛానళ్ల ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే మహిళలకు పూజ సామగ్రి నిర్వాహకులే సమకూరుస్తారు. ఎంట్రీ పాసులు ఒక రోజు ముందుగా అంటే సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్యలో తణుకు పట్టణంలోని నూలి గ్రౌండ్స్, జ్యూయల్ హోమ్స్ పక్కన, ఎస్ఎన్వీటీ జూనియర్ కాలేజ్ వద్ద పంపిణీ చేస్తారు. పరిమిత సంఖ్యలోనే పాసులు ఉంటాయి. చిన్నపిల్లలకు అనుమతి లేదు. నేరుగా కార్యక్రమానికి వారు మాత్రమే హాజరు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.
-ఈనాడు, తణుకు

నేడు ఎంట్రీ పాసుల పంపిణీ

సమయం: ఈ నెల 4న (మంగళవారం) సాయంత్రం 5 గంటలకు
స్థలం: నూలి గ్రౌండ్, జ్యూయల్ హోమ్స్ పక్కన, ఎస్ఎన్వీటీ జూనియర్ కాలేజ్ వద్ద, తణుకు
ఈ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం 4న సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు.
ఆంధ్రప్రదేశ్ తెలంగాణ Life

భక్తులకు మెరుగైన సేవలందించాలి: కలెక్టర్

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ఆలయంలో భక్తుల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని ఆమె ఆదివారం సందర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి, భక్తులతో మాట్లాడారు. వకుళమాత అన్నదాన భవనంలోని వంటశాల, అన్నప్రసాదం వడ్డించే తీరు పరిశీలించారు. స్వామివారి దర్శనానికి వచ్చిన సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.కె.మహేశ్వరిని ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.

బీచ్ రోడ్డుపై ఇసుక మేట

మొగల్తూరు, న్యూస్‌టుడే: కేపీపాలెం సౌత్‌లోని బీచ్ రహదారిపై ఇసుక మేట వేసింది. ఇక్కడి బీచ్‌లో సుమారు ఆరు కిలోమీటర్ల మేర గతంలో రెండు వరుసల రహదారి నిర్మించి మధ్యలో విభాజకానికి ఖాళీ వదిలారు. ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో సముద్రం పోటెత్తడంతో అలలతో పాటు కొట్టుకొచ్చిన ఇసుక ఒక వరుస రహదారిపై మేట వేసింది. బీచ్‌లో పర్యాటకులను అనుమతిస్తే వారి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఈ అంశాన్ని 'న్యూస్‌టుడే' ఎంపీడీవో త్రిశూలపాణి దృష్టికి తీసుకెళ్లగా బీచ్‌రోడ్డులో ఇసుక మేటల తొలగింపునకు చర్యలు చేపడతామని చెప్పారు.

5న ఉద్యోగ మేళా

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక కేఓస్కేటీ ఉన్నత పాఠశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన ఎమ్మెల్యే బడేటి చంటి సహకారంతో ఈ నెల 5న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జితేంద్రబాబు తెలిపారు. సుమారు 17 సంస్థల ప్రతినిధులు పాల్గొని 1,205 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఫార్మసీ, ఎంబీఏ, పీజీ, ఇంజినీరింగ్ తదితర కోర్సులు అభ్యసించి.. 18-35 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులన్నారు. ఇతర వివరాలకు 94934 82414 నంబరును సంప్రదించాలని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బతికి సాధించు.. బతుకునిచ్చి చూపించు!



ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే

పురుషులతో సమానంగా మహిళలు దూసుకెళ్తున్నారు. అన్ని రంగాల్లోనూ రాణిస్తూ.. తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. అయినా, కొన్నిచోట్ల ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. మెట్టినింట్లోనూ భద్రత లేకుండా పోయింది. అతివలకు అండగా ఉండాల్సిన అత్తింటి వారే వేధింపులు, భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. కట్టుకున్నోడే కన్నెర్ర చేస్తుండడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ తరహా ఘటనలు పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది.

ఏలూరు రెండో పట్టణానికి చెందిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగినిని భర్త నిత్యం వేధించేవాడు. అదనపు కట్నం తేవాలని ఒత్తిడి చేసేవాడు. ఆ బాధ తాళలేక ఆమె నాలుగు నెలల కిందట ఉరేసుకుని ఉసురు తీసుకుంది.

నరకం అనుభవిస్తూ.. భర్త, ఆయన కుటుంబ సభ్యులు చూపుతున్న నిరాదరణను తట్టుకోలేక.. శారీరక, మానసిక హింసలు భరించలేక కొందరు మహిళలు తనువు చాలిస్తున్నారు. అర్ధాంతరంగా జీవితాన్ని ముగించుకుంటున్నారు. కొందరు ధైర్యం చేసి పోలీసుస్టేషన్ గుమ్మం తొక్కి న్యాయ పోరాటం చేస్తున్నారు.

మొదట్లో సజావుగానే.. ప్రేమ వివాహాలు.. పెద్దలు కుదిర్చిన సంబంధాలు.. కులాంతర పెళ్లిళ్లన్నీ మొదట్లో బాగానే ఉంటున్నాయి. కాలం గడిచే కొద్దీ కొన్ని కుటుంబాల్లో ఇబ్బందులు మొదలవుతున్నాయి.

ఉభయ జిల్లాల్లో కేసుల వివరాలిలా.. (ఇప్పటి వరకు)

కారణాలు	2023	2024	2025
వరకట్న మరణాలు	12	09	06
ఆత్మహత్యలు	111	106	115
వేధింపులు	315	296	255
వరకట్న వేధింపులు	155	139	93

కట్నం తేలేదని, ఇష్టాన్నన్న చెల్లింపులు సరిగా లేదని, ప్రేమ వివాహంతో ఆస్తి దక్కకుండా పోయిందని.. ఇలా అనేక కారణాలతో అగ్నిసాక్షిగా మనువాడిన భార్యనే వేధిస్తున్నారు.

మరోవైపు కట్నం, హారం కర్పూరంలా కరిగిపోవడంతో, మద్యానికి బానిసైన భర్తలు.. తమ అర్ధాంగులను పుట్టింటి నుంచి డబ్బులు తేవాలని శారీరకంగా, మానసికంగా ఇబ్బంది పెడుతున్నారు.

- వరకట్న వేధింపులతో సతమతం
- మెట్టినింట్లో అతివలకు రక్షణ కరువు

'గృహ హింస, అదనపు కట్నం, తదితర వేధింపులకు గురైతే పోలీసుల దృష్టికి తీసుకురావాలి. బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే చర్యలు తీసుకుంటాం. తొలుత భర్త, అతడి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తాం. మారకపోతే తగిన గుణపాఠం చెబుతాం. బాధిత మహిళలకు అన్నివిధాలా న్యాయం చేస్తాం. అత్యవసరమైతే టోల్‌ఫ్రీ నంబరు 122కు ఫోన్ చేయొచ్చు' అని ఏలూరు మహిళా పోలీసుస్టేషన్ సీఐ సుబ్బారావు తెలిపారు.

గౌడ/శెట్టిబలిజ కుల అవివాహితులకు సువర్ణావకాశం

నేడు గౌడ/శెట్టిబలిజ కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, గౌడ/శెట్టిబలిజ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు నేడు (03 నవంబరు 2025, సోమవారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.
మరిన్ని వివరాలకు 80086 21414 & 91549 18858 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చును.
ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫోటోలు పైన తెలిపిన ఫోన్ నెంబర్లకు సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

నేడు యథావిధిగా మీ కోసం

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటలకు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'(మీ కోసం) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. మండల, పురపాలక, డివిజనల్ కార్యాలయాల్లోనూ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు. 'మీ కోసం' వినతుల పరిష్కార స్థితి తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నంబరు 1100ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

నేత్ర పర్వంగా శోభనాచలుడి గిరి ప్రదక్షిణ

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి శోభనగిరిపై ఉన్న శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి వారి శోభనగిరి ప్రదక్షిణ ఆదివారం కనుల పండువగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాలు, కృత్తిక దీపోత్సవ కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు ఆదివారం కార్తిక శుద్ధ ద్వాదశి సందర్భంగా శ్రీవారి శోభన గిరి(కొండ చుట్టూ) ప్రదక్షిణ, స్వామికి విశేష అర్చన, నిత్యహోమం, లక్ష్మీ నృసింహ సుదర్శన మూల మంత్ర శాంతి హోమం నిర్వహించారు. వాసవీ మహిళా మండలి వారిచే విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, కోలాటం చేపట్టారు. నీరాజన మంత్ర పుష్పం, లక్ష్మీ సహస్ర నామార్చన, పారమాత్మికోపనిషత్తు పూర్వక మహా శాంతి హోమం కార్యక్రమాలను ఆలయ ఈవో సీహెచ్ సాయి పర్యవేక్షణలో అర్చకులు వేదాంతం శేషబాబు, అనంత కృష్ణలు వైభవంగా నిర్వహించారు.

రాట్నాలమ్మా నమస్తుభ్యం

రాట్నాల కుంట(పెదవేగి), న్యూస్‌టుడే: రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకం, అర్చన చేసి.. పట్టువస్త్రాలు, ఆభరణాలు, పుష్పాలతో అలంకరించారు. మహిళలు రాట్నాలమ్మకు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. పూజా ద్రవ్యాలు, ప్రసాదాల విక్రయాలతో రూ. 96,375 ఆదాయం సమకూరిందని ఆలయ పాలకమండలి ఛైర్మన్ మన్నే శ్రీనివాసరావు తెలిపారు. ఏర్పాట్లను ఈవో ఎన్.సతీశ్‌కుమార్, మండలి సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

చెంగట నల్లదివో.. శేషాచలము

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: క్షీరాబ్ది ద్వాదశి నాడు ద్వారకాతిరుమల శ్రీవారి తెప్పోత్సవం ఆదివారం రాత్రి కనులపండువగా జరిగింది. తొలుత హంస ఆకారంలో తెప్పను విద్యుద్దీపాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఆలయం వద్ద నుంచి తొళక్కం వాహనంపై ఊరేగింపుగా నృసింహ సాగర్(పుష్కరిణి) వద్దకు తోడ్కొని వచ్చారు. క్షేత్రంలో ఊరేగుతూ వస్తున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు నీరాజనాలు పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లను తెప్పపై కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త నివృతరావు, ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు శ్రీవారికి హారతులు పట్టి తెప్పోత్సవాన్ని ప్రారంభించారు.

నిరీక్షణ ఫలించి.. ప్రయోజనాలు కల్పించి!

➡ ఉద్యోగోన్నతులు, ఈహెచ్ఎస్ వర్తింపుపై హర్షం ➡ ఆర్టీసీ సిబ్బంది సంక్షేమానికి చొరవ



ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఉద్యోగుల అభ్యున్నతి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సుమారు ఆరేళ్లుగా ఉద్యోగోన్నతులకు ఎదురు చూస్తుండగా.. ఇటీవల ఆ కలను సాకారం చేసింది. వెనువెంటనే మరో వరమిచ్చింది. సంస్థ ప్రభుత్వంలో విలీనమయ్యాక.. ఉద్యోగులు పలు రకాల సదుపాయాలు పొందలేకపోయారు. ఆ లోటును సర్కారు సరి చేస్తూ.. విస్తృత ప్రయోజనాలు కల్పిస్తుంది. తాజాగా విశ్రాంత ఉద్యోగులకు కూడా ఈహెచ్ఎస్ వర్తింపచేలా ఉత్తర్వులు జారీ చేసింది. 2020 జనవరి 1న ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం కాగా.. ఆ తర్వాత ఉద్యోగ విరమణ పొందిన వారికి వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. వీరికి ఇకపై ఈహెచ్ఎస్ పథకం ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం పొందే అవకాశం కలగనుంది.

ఉభయ జిల్లాల వివరాలిలా..

జిల్లా	ఉద్యోగులు	విశ్రాంత ఉద్యోగులు
ఏలూరు	1,600	1,300
పశ్చిమ	1,400	1,200

ఒకసారి చెల్లిస్తే చాలు.. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు ఒకసారి ప్రీమియం చెల్లిస్తే జీవితాంతం వైద్యం పొందొచ్చు. విశ్రాంత ఉద్యోగి భార్యకూ ఉచిత వైద్యం అందిస్తారు. నెట్‌వర్క్ వైద్యశాలలతోపాటు ఆర్టీసీ ఆసుపత్రుల్లోనూ ఉచిత వైద్యం, మందులు అందజేస్తారు. ఆర్టీసీ ఆసుపత్రుల సిఫార్సు మేరకు ఈహెచ్ఎస్ వైద్యశాలల్లో చికిత్స అందిస్తారు. రెగ్యులర్ ఉద్యోగుల తరహాలో మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం ప్రభుత్వం కల్పించింది. పర్యవేక్షకుడి విభాగం వరకు రూ. 38,572 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. సహాయ మేనేజరు, ఆపై ర్యాంకున్న వారు రూ. 51,429 చెల్లించాలి.

గుట్టుగా పాపాలు!

- పశువులకు యథేచ్ఛగా ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు
- నిషేధమున్నా.. మార్కెట్లో జోరుగా విక్రయాలు

● ఏలూరు శివారు గ్రామానికి చెందిన ఓ పాడి రైతు పశు వైద్యుడిని సంప్రదించకుండానే గేదెకు ఆక్సిటోసిన్ ఇంజెక్షన్ వేయించారు. ఆ తర్వాత గేదె చూలు కట్టడం మానేసింది. చివరకు అనారోగ్యానికి గురై మృత్యువాత పడింది.

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో వ్యవసాయం తర్వాత పాడి సంపద పైనే ఎక్కువ మంది ఆధారపడి జీవిస్తున్నారు. ఇటీవల పాల వినియోగం విపరీతంగా పెరిగింది. దీన్ని ఆసరాగా తీసుకొని కొందరు వ్యాపారులు పాడి పశువుల్లో చేపు కలిగించేందుకు, అధిక పాల ఉత్పత్తి పొందేందుకు నిషేధిత ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు విరివిగా వాడుతున్నారు. ఒకప్పుడు ప్రత్యేక పరిస్థితుల్లో పశువుల్లో హార్మోన్ల అసమతుల్యతను అరికట్టి పాల దిగుబడి పెంచేందుకు వైద్యుల సూచనల మేరకు ఇంజెక్షన్లు వేసేవారు. ఇవి ప్రమాదకరమని ప్రభుత్వాలు నిషేధించాయి. కానీ, కొందరు చాటుగా ఇంజెక్షన్లు వేసేస్తున్నారు. ఫలితంగా పశువులు అనారోగ్యానికి గురవడంతో పాటు వాటి పాలు వినియోగిస్తున్న వారి ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతోంది.

కొరవడిన నిఘా.. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పలువురు పాడి రైతులు సమీప పట్టణాలకొచ్చి సూది మందులు తీసుకెళ్తున్నారు. ఔషధ నియంత్రణాధికారుల నిఘా కొరవడంతో యథేచ్ఛగా ఈ నిషేధిత ఆక్సిటోసిన్ ఇంజెక్షన్ల విక్రయాలు సాగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఔషధ నియంత్రణాధికారులు ఇంజెక్షన్లపై గట్టి నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు. 'ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లను ప్రభుత్వం నిషేధించింది. ఇవి పాడి పశువుల్లో చేపు కలిగించేందుకు మాత్రమే ఉపయోగపడతాయి. పాల ఉత్పత్తి పెరుగుతుందన్న అపోహ వీడాలి. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడైనా వాడితే చర్యలు తీసుకుంటాం' అని పశుసంవర్ధక శాఖ జేడీ బి.ప్రసాద్‌రావు తెలిపారు.

అనర్థాలివి.. ● ఆక్సిటోసిన్ వినియోగంతో పశువుల్లో హార్మోన్లు అధికంగా ఉత్పత్తి అయి చేపు పెరుగుతుంది. ఆ తర్వాత పశువులు ఎదకొచ్చినా చూలు కట్టవు. ● పశువుల్లో హార్మోన్లు దెబ్బతిని.. రోగాల బారిన పడి చనిపోయే పరిస్థితి ఉంటోంది. ● ఈ సూది మందు వేసిన పశువుల పాలు తాగడం ద్వారా అనారోగ్యానికి గురవుతున్నారు. గర్భిణులపై ప్రభావం ఎక్కువ ఉంటోంది. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సైతం వచ్చే ప్రమాదముంది.

జిల్లా వివరాలిలా.. ❖ ఆవులు, గేదెలు: 5.5లక్షలు ❖ రోజూ పాల ఉత్పత్తి: 6లక్షల లీటర్లు

గురుకులంలో భోజనాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తులు మేరీగ్రేస్, రత్నప్రసాద్

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

భీమడోలు, న్యూస్‌టుడే: సైబర్ మోసాలపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని, సామాజిక మాధ్యమాలకు వీలైనంత దూరంగా ఉండాలని ఉమ్మడి జిల్లా ప్రజాప్రయోజన సేవల శాశ్వత లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్ అన్నారు. ఈ నెల 9న జాతీయ న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవం సందర్భంగా.. పోలసానిపల్లి బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అధ్యక్షత వహించారు. మేరీగ్రేస్ మాట్లాడుతూ.. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దని సూచించారు. ఉచిత న్యాయ సహాయానికి న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని, లేనిపక్షంలో టోల్‌ఫ్రీ నంబరు 15100కు ఫోన్ చేయాలని ఆమె కోరారు. అంతకు ముందు గురుకుల పాఠశాలలోని బాలికల డార్మెట్రీ, వంటశాలను న్యాయమూర్తులు పరిశీలించారు. అక్కడి సదుపాయాలపై ఆరా తీశారు. ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు.

భక్తిశ్రద్ధలతో సమాధుల పండగ

ఏలూరు వన్‌టౌన్, దెందులూరు, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సమాధుల పండగను క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. ఏలూరు శివారు తంగెళ్లమూడి వద్దనున్న సమాధుల తోట, వంగాయగూడెం, దెందులూరు తదితర ప్రాంతాల్లోని శ్మశానవాటికల్లో సమాధులను రెండ్రోజులు ముందుగానే ముస్తాబు చేశారు. ఫ్లాస్ బృందం, వంగాయగూడెం యువత ఆధ్వర్యంలో సమాధుల వద్ద పిచ్చి మొక్కలు తొలగించారు. ఆ ప్రాంతమంతా శుభ్రం చేసి పూలు, రంగులతో అలంకరించారు. తెల్లవారుజామున నుంచే ఆయా శ్మశానవాటికల్లో తమ పూర్వికులను స్మరించుకుంటూ.. వారి ఆత్మలకు శాంతి కలగాలని కొవ్వొత్తులు వెలిగించారు. ఆర్సీఎం సంస్థ ఫాదర్ జిజ్జువరపు మైఖేల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఏలూరు శ్మశానవాటికలో క్రైస్తవుల సందడి

కార్తికం.. సమైక్య జీవన సందేశం!

6లో లాంచీ ఎక్కాలి.. గోదారి దాటాలి..

బడి సంచి బరువు తగ్గించి

వేగంగా రెండో సెమిస్టర్ పుస్తకాల అందజేత

చింతలపూడి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎక్కువ పుస్తకాలతో బరువైన సంచి మోయడంతో అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. నిపుణుల సూచన మేరకు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు పుస్తకాల సంఖ్య తగ్గించాలని ప్రభుత్వం సెమిస్టర్ విధానం అమలు చేస్తోంది. ఏడాదికి రెండు సెమిస్టర్లు అందుబాటులోకి తెచ్చింది. మొదటి విడత పుస్తకాలు పాఠశాలల పునఃప్రారంభం రోజునే అందజేశారు. అప్పట్లో ప్రకటించినట్లే అక్టోబరులో రెండో విడత పుస్తకాలను అందజేశారు. అన్ని పాఠశాలల్లో వీటిని పంపిణీ చేస్తున్నారు. ✦ జిల్లాలో మొత్తం పాఠశాలలు 1,710 ఉండగా.. 1,04,963 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాల పంపిణీ వేగంగా జరుగుతోంది. మొత్తం 2 లక్షలకు పైగా పుస్తకాలను ఆయా మండల కేంద్రాలకు పంపించారు.

మూడు సబ్జెక్టులు కలిపి రూపొందించిన ఆరో తరగతి పాఠ్య పుస్తకం

సెమిస్టర్ విధానంలో..
● 1, 2 తరగతులకు తెలుగు, ఆంగ్లం, గణితం కలిపి ఒక పుస్తకం, వర్క్‌బుక్ ఒకటి ఇచ్చారు. ● 3, 4, 5 తరగతులకు తెలుగు, ఆంగ్లం కలిపి ఒకటి, గణితం, పరిసరాల విజ్ఞానం కలిపి మరో పుస్తకం ఇచ్చారు. ● 6, 7, 8, 9 తరగతులకు తెలుగు, ఆంగ్లం, హిందీ కలిపి ఒకటి, జీవ, భౌతిక, రసాయన శాస్త్రాలు కలిపి మరొకటి, భూగోళం, చరిత్ర, అర్థ, పౌరశాస్త్రాలు కలిపి ఇంకో పుస్తకం ముద్రించారు. గతంలో ఈ పుస్తకాలు నాలుగు ఉండేవి. ● పదో తరగతి విద్యార్థులకు ఒకటే సెమిస్టర్ విధానాన్ని కొనసాగిస్తున్నారు.

విద్యార్థులకు మేలు.. పుస్తకాల సంఖ్య తగ్గడంతో విద్యార్థులకు సంచి బరువు తగ్గుతుంది. రెండు, మూడు సబ్జెక్టులు కలిపి పుస్తకాలు రూపొందించడంతో విద్యార్థులకు మేలు.
- సుధాకర్, డీవైఈవో

ఆనందమానందమాయె

➡ ఫలించిన 18 ఏళ్ల ఎదురుచూపులు
➡ పునరావాసంతో శాశ్వత జీవనం

కుక్కునూరు, న్యూస్‌టుడే: త్యాగ రాజులుగా కీర్తించిన ప్రభుత్వాలు, వారి కష్టనష్టాలను పట్టించుకోలేదు. ఫలితంగా 18 ఏళ్లుగా ఎదుగుబొదుగు లేని జీవనం కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తయితే ఊరు మునిగి, కష్టపడి కట్టుకున్న ఇల్లు కనుమరుగవుతుందనే భయంతో ఎప్పుడో పూర్వీకులు కట్టిన చాలీచాలని ఇళ్లలో నెట్టుకొస్తున్న కుటుంబాలు వేనవేలు. అవస్థల నడుమ జీవనంలోనే అనేకమంది తనువు చాలించారు. అత్యంత హృదయ విదారకమైన పోలవరం నిర్వాసితుల కష్టాలివి. ప్రస్తుతం పునరావాసం అందుతుండటంతో ఆయా కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

మరో ఏడు నెలల్లో ఖాళీ కాబోతున్న కుక్కునూరులోని ఏ బ్లాక్

2026 జూన్ లోపు.. నత్తనడకన కొనసాగిన పునరావాసం ఓ కొలిక్కి వస్తోంది. ముందుగా 41.15 కాంటూరుతో పాటు మొదటి ప్రాధాన్యత గ్రామాలకు 2026 జూన్ కల్లా పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. వచ్చే గోదావరి వరదల కంటే ముందుగానే 8,545 కుటుంబాలకు ఈ వనవాసం నుంచి విముక్తి లభిస్తుంది. ఇక మిగిలేది 45.72 కాంటూరు పరిధిలోని కుటుంబాలకు 2027-28 కల్లా పునరావాసం చూపనున్నారు.

ఎన్నో కష్టాలు పడ్డా.. 18 ఏళ్లుగా ఎన్నో కష్టాలు అనుభవించా. కూటమి ప్రభుత్వం వచ్చాక 2025లో నాకు, నా కుమార్తెకు పరిహారం అందింది. అమ్మాయి పెళ్లి చేశా. ఇప్పుడు ఇంటి విలువ కింద రూ. 5.59 లక్షలు ఇచ్చారు. దీంతోపాటు చల్లావారిగూడెంలో ఇల్లు ఇచ్చారు.
- కొత్రా రాంబాబు, కుక్కునూరు

కూటమి ప్రభుత్వం కొత్త చర్యలు.. పోలవరం నిర్వాసితులు దగాకు గురికాకుండా, కూటమి ప్రభుత్వం కొత్త చర్యలు తీసుకోబోతోంది. దళారులు ప్రభుత్వం ఇచ్చే పరిహారం తమ కృషే అని చెబుతూ.. నిలువు దోపిడీ చేస్తున్నారు. ఇటువంటి చర్యలను అడ్డుకొనేందుకు ప్రభుత్వం టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేయబోతోంది. దీంతోపాటు అపరిష్కృతంగా ఉన్న నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేందుకు గ్రీవెన్స్ కూడా ఏర్పాటు చేయబోతోంది. ఎవరైనా మోసగిస్తే వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామనే హెచ్చరికలు కూడా చేసింది.

ఉపశమనంగా ఉంది.. ఎదురుచూస్తున్న పరిహారం జమ కావడం ఎంతో ఉపశమనంగా ఉంది. ఇప్పుడొచ్చిన వ్యక్తిగత, స్థిరాస్తి విలువల పరిహారంతో పునరావాస ప్రాంతంలో జీవనం కోసం పెట్టుబడులు పెట్టుకుంటాం.
- బుయ్యన శ్రీను, దామరచర్ల

వరద తగ్గుముఖం

పోలవరం, న్యూస్‌టుడే: గోదావరికి వరద తగ్గుముఖం పట్టడంతో రైతులు ఊరట చెందుతున్నారు. పలు రకాల పంటలు వేసి రూ.వేలల్లో పెట్టుబడి పెట్టిన నది పరీవాహక ప్రాంతాల రైతులు ఈ ఏడాది ఊహించని విధంగా ఇబ్బందులు పడ్డారు. అక్టోబర్‌తో వరదలు వెళ్లిపోతాయని భావించినా.. నవంబర్‌లోనూ కొనసాగడంతో కర్షకులు ఆందోళన చెందారు. చివరికి గోదారమ్మ శాంతించడంతో ఊపిరి పీల్చుకున్నారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద ఆదివారం సాయంత్రానికి నీటిమట్టం 29.26 మీటర్లకు చేరింది. 48 గేట్ల ద్వారా 3.66 లక్షల క్యూసెక్కులు దిగువకు వెళ్తోంది.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

(c) eenadu

మంత్రి చొరవతో దివ్యాంగులకు పింఛను

నగదు అందజేస్తున్న మంత్రి పార్థసారథి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండలం వడ్లమానుకు చెందిన గుర్రం వెంకట దుర్గారావు, సాధం స్వామి దివ్యాంగులు. పింఛను అందక అవస్థలు పడుతున్నారు. దాంతో పీ4 కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగిరిపల్లి వచ్చినప్పుడు సర్పంచి జె. లక్ష్మీకుమారి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వంశీకృష్ణ సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో స్పందించిన సీఎం పింఛను మంజూరు చేయించాలని మంత్రి పార్థసారథికి సూచించారు. ఆ పింఛను ఒక్కొక్కరికి రూ.6 వేలు చొప్పున మంజూరు కావడంతో ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి కె.పార్థసారథికి ధన్యవాదాలు తెలిపారు.

క్రీడాకారులకు ప్రోత్సాహకాలు

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశానుసారం జిల్లాలోని అర్హులైన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు డీఎస్‌డీవో ఎస్‌ఏ అజీజ్ తెలిపారు. ఔత్సాహికులు ఈ నెల 4లోపు http:///sports.ap.in/#egis-trattion/player-registration వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అవకాశాన్ని జిల్లాలోని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని.. మరిన్ని వివరాలకు 95735 52108, 82473 02497 నంబర్లను సంప్రదించాలని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అంధ ఉపాధ్యాయులను మినహాయించండి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: అంధ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని ఏపీ దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనరు కె.వీర్రాజు విజ్ఞప్తి చేశారు. 2010కు ముందు డీఎస్సీలో ఉపాధ్యాయ కొలువు సాధించి.. విధులు నిర్వర్తిస్తున్న గురువులనూ టెట్ నుంచి మినహాయించాలన్నారు. డీఎస్సీలో ప్రతిభ కనబరిచి ఉద్యోగంలో కొనసాగుతున్న అంధులు కంప్యూటర్ ఆధారిత పరీక్ష రాయడానికి ఇబ్బందులు పడే అవకాశముందన్నారు. అంధ ఉపాధ్యాయులను ముఖ ఆధారిత హాజరు నుంచి మినహాయించాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇంటి నుంచే విద్యుత్తు సేవలు

● అందుబాటులో ఏపీఈపీడీసీఎల్ యాప్



విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఏపీఈపీడీసీఎల్ ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టింది. ఆండ్రాయిడ్ చరవాణుల్లో ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీని ద్వారా వచ్చిన సమస్యలను విద్యుత్తు శాఖ అధికారులు పరిశీలించి సత్వరం పరిష్కరిస్తారు. – న్యూస్‌టుడే, విశాఖపట్నం, ఏలూరు టూటౌన్

జిల్లా	ఏలూరు
కనెక్షన్లు	5,40,000
ప్రతినెలా బిల్లు (రూ. కోట్లు)	రూ.110.20 కోట్లు

బిల్లు చెల్లించొచ్చు: విద్యుత్తు బిల్లులు చెల్లించేందుకు బిల్‌పే ద్వారా సర్వీసు నంబరు, చరవాణి నంబరు పొందుపరిస్తే సంబంధించిన వివరాలు ప్రత్యక్షమవుతాయి.

సప్లయి పొజిషన్: వినియోగదారుడు సర్వీసుకు సంబంధించి విద్యుత్తు సరఫరా తీరును ఎప్పటికప్పుడు లైవ్‌లో చూసుకునే సదుపాయం కలదు.

మొబైల్ లింకింగ్: విద్యుత్తు వినియోగదారులు తమ విద్యుత్తు కనెక్షన్‌కు సంబంధించి చరవాణి నంబరును అనుసంధానిస్తే విద్యుత్తు బిల్లుల సమాచారం చరవాణికి అందుతుంది.

ఎనర్జీ కాలిక్యులేటర్: ఏ ఉపకరణానికి ఎంత విద్యుత్తు ఖర్చవుతుందో దీని ద్వారా తెలుసుకోవచ్చు. నెలవారీ విద్యుత్తు వినియోగానికి సంబంధించిన మీటరు రీడింగ్ వివరాలు పొందుపరిస్తే బిల్లు సమాచారం కనిపిస్తుంది.

కస్టమర్ కేర్: వినియోగదారులు తమ సమస్యలను ఇందులో పొందుపరచొచ్చు. అందిన సప్లై వివరాలు, అవసరమైన అన్ని లింకులు ఇందులో పొందుపరిచి ఉంటాయి.

లింక్ ఆధార్: వినియోగదారుడు విద్యుత్తు సర్వీస్‌కు తమ ఆధార్ వివరాలను జత చేసుకోవచ్చు.

కన్‌జంప్షన్: వినియోగదారులు వాడిన యూనిట్లు.. చెల్లించాల్సిన నగదు.. బిల్ లెడ్జర్ వివరాలు అందుబాటులో ఉంటాయి.

లాడ్జ్ కంప్లైంట్: విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు వంటి ఫిర్యాదులను వినియోగదారుడు నేరుగా ఫిర్యాదు చేయడమే గాక కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్య పరిష్కారం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు.

పే బిల్: సర్వీసు నంబరు నమోదు చేసుకుని నెలవారీ విద్యుత్తు బిల్లులకు సంబంధించిన నగదు చెల్లించొచ్చు.

అధికారుల వివరాలు: వినియోగదారుల పరిధిలోని అధికారుల ఫోన్ నంబర్లు లభ్యమవుతాయి. ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

టారిఫ్: వినియోగదారులకు సంబంధించిన టారిఫ్ వివరాలు ఇందులో పొందుపరిచి ఉంటాయి.

క్విక్‌పే: సర్వీసు నంబరు, చరవాణి నంబరును నమోదు చేస్తే సంబంధిత బిల్లు వివరాలు వస్తాయి. అక్కడి నుంచి బిల్లు చెల్లించొచ్చు.

కార్తికం.. సమైక్య జీవన సందేశం!

సందడిగా వన సమారాధనలు **సామాజిక స్పృహ మేళవింపుతో సార్థకత**

పాలకొల్లు, న్యూస్‌టుడే: కార్తికమాసం అంటే ఎంతో ప్రత్యేకం. ఈ నెలలో నిర్వహించే ప్రత్యేక పూజలు, వ్రతాలు, దీక్షలు ఆధ్యాత్మిక వైభవానికి, వన సమారాధనలు సమైక్య జీవనానికి ప్రతీకలుగా నిలుస్తాయి. నియమ నిష్ఠలు, క్రమబద్ధమైన జీవన విధానాలు పాటించే ఈ రోజుల్లో సామాజిక స్పృహతో మెలిగితే భవిష్యత్తుకు ఉపకరించే మార్పులకు బాటలు వేసినట్లే. వనసమారాధనలు, ఇతర కార్యక్రమాలు కేవలం విందు వినోదాలకే పరిమితం కాకుండా పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారిస్తే భావితరాలకు ఎంతో మేలు చేసినట్లే.

మొక్కలతోనే మనుగడ

జిల్లా విస్తీర్ణంలో 33 శాతం ఉండాల్సిన పచ్చదనం పశ్చిమలో కేవలం 11 శాతానికే పరిమితమైంది. ఏలూరు జిల్లాలో 6,603 ఎకరాల్లో అటవీ భూములున్నా వనాల పెంపకంలో నిర్లక్ష్యం నెలకొంది. వన సమారాధనల్లో ఉసిరి చెట్లకు పూజలు చేసి వదిలేయకుండా ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటేలా ప్రోత్సహిస్తే పరిస్థితిలో మార్పు వస్తుంది.

పాలిథీన్‌ను పాతేద్దాం

గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2 నుంచి ఏక వినియోగ ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో పెద్దగా ఫలితాలు కనబడటం లేదు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సగటున రోజుకు 80 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు వన సమారాధనలు వేదికలు కావాల్సిన ఆవశ్యకత ఉంది. ఈ వేడుకల్లో ఏ రూపంలోనూ పాలిథీన్‌ను వినియోగించకుండా జాగ్రత్త వహించాలి. పాలిథీన్‌తో తలెత్తే అనర్థాలను పిల్లలకు తెలియజేస్తే సత్ఫలితాలు వస్తాయి.

ఉసిరి చెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

చీకట్లు తొలగాలి..

'పవిత్రమైన కార్తిక మాసంలో ఆచరించే పద్ధతులను తర్వాత కూడా కొనసాగిస్తే ఉత్తమ ఫలితాలుంటాయి. పేద, ధనిక అనే తేడా లేకుండా అంతా ఒక్కటేననే భావనను నింపే వేదికలే కార్తిక వన సమారాధనలు. కార్తిక దీపాలు మనసులో చీకట్లను తొలగించి వెలుగును నింపుకోవాలనే భావనకు ప్రతీక. కార్తిక మాస ఉపవాసాల్లో ఆరోగ్యకమైన జీవనానికి సరిపడా మితాహారం తీసుకోవాలనే సందేశం ఇమిడి ఉంది.' అని ఆచంట మండలం కొడమంచిలికి చెందిన ఆధ్యాత్మిక గురువు మానేపల్లి రామలింగేశ్వరశర్మ చెప్పారు.

శోభాయమానంగా గ్రామోత్సవం

స్వామి, అమ్మవార్లు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి గ్రామోత్సవం ఆదివారం సాయంత్రం శోభాయమానంగా నిర్వహించారు. ఆలయం నుంచి గురవాయిగూడెం, చక్రదేవరపల్లి గ్రామాల్లోని ప్రధాన వీధుల మీదుగా సాగిన గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో సువర్చలాదేవి సమేతంగా ఆసీనులైన స్వామికి మహిళలు హారతులు పట్టారు.

విజ్ఞాన సర్వస్వం.. ట్రిపుల్ ఐటీ గ్రంథాలయం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు ట్రిపుల్ ఐటీలోని గ్రంథాయం చదువుల బాట పట్టే విద్యార్థులకు, ఉద్యోగ సాధనే లక్ష్యంగా ముందుకు వెళ్లే యువతకు మార్గదర్శిగా ఉంటోంది. ఇక్కడ పీయూసీ, ఎన్‌సీఈఆర్టీ, ఇంజినీరింగ్, గేట్, స్టేట్, సెంట్రల్ పోటీ పరీక్షలకు అవసరమైన 80 వేలకుపైగా పుస్తకాలతో పాటు వివిధ తెలుగు, ఆంగ్ల దిన పత్రికలు, పలు మ్యాగజైన్లు అందుబాటులో ఉంచుతున్నారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను సమకూర్చేందుకు ఇక్కడ ఒక బృందం ప్రత్యేకంగా పని చేస్తోంది. ఒక గ్రంథపాలకుడితో పాటు ఏడుగురు సహాయకులను నియమించారు. నిత్యం 800 నుంచి 1000 మందికి పైగా విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకుంటున్నారు. రూ. 17 కోట్లు ఖర్చు చేసి మూడు అంతస్తుల్లో ఈ భవనం నిర్మించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఇక్కడ వైఫై సౌకర్యం కల్పించారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు గేట్ ర్యాంకులతో పాటు ఉన్నతమైన కంపెనీల్లో ఉద్యోగాలను సాధించడం గమనార్హం.

పుస్తక పఠనంలో విద్యార్థినులు

గేట్‌లో 907వ ర్యాంకు సాధించా.. గ్రంథాలయంలో పుస్తకాలు చదువుకుని గేట్‌లో 907వ ర్యాంకు సాధించాను. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు గ్రంథాలయం తెరిచి ఉంచితే మరింతగా ఉపయోగపడుతుంది. సివిల్ సర్వీస్ పరీక్షలు రాసి మంచి ఉద్యోగం సాధించాలన్నదే లక్ష్యం. **- యనమల యుగంధర్, గేట్ ర్యాంకర్**

పుస్తకాల కొనుగోలుకు నిధుల కేటాయింపు

పుస్తకాల కొనుగోలు ఇతర అవసరాల నిమిత్తం ప్రస్తుతం రూ.3 లక్షలు కేటాయించామని నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సంధ్ర అమరేంద్రకుమార్ తెలిపారు. విద్యార్థులకు అవసరమైన ప్రతి పుస్తకం అందుబాటులో ఉంచుతున్నామన్నారు.

బాలిక జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ తదితరులు

క్రీడా స్ఫూర్తి పెంపొందించుకోండి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని డీఈవో వెంకట లక్ష్మమ్మ అన్నారు. శనివారపుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన రెండ్రోజులపాటు కొనసాగిన అండర్-17 బాలబాలికల తైక్వాండో అంతర్ జిల్లాల పోటీలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు డీఈవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలబాలికలు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. బాలికల విభాగంలో విజయనగరం, బాలుర విభాగంలో చిత్తూరు జిల్లాలు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్నాయి. ఆయా జట్లకు వెంకట లక్ష్మమ్మ ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. అంతర్ జిల్లాల స్థాయిలో గెలుపొందిన జట్లు అరుణాచల్ ప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాయని ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. ఎంఈవో అరుణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు ప్రకాశ్, ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

లాంచీ ఎక్కాలి.. గోదారి దాటాలి..

కార్తికంలో వీరభద్రుడి దర్శనం ప్రత్యేకం

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం మండలం పట్టిసీమ వద్ద గోదావరి మధ్యలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో వీరభద్రుడు స్వయంభూగా అవతరించాడు. దక్ష ప్రజాపతి తలపెట్టిన దక్షయజ్ఞానికి పరమశివుడిని పిలవకపోవడం, పుట్టింటిపై మమకారంతో వెళ్లిన సతీదేవికి తీరని అవమానం జరగడంతో సహించలేక ఆత్మహుతికి యత్నిస్తుంది. దానిని చూసి పరమశివుడు ఉగ్రుడై ప్రళయతాండవం చేసి తన జటాజూటం నేలకేసి కొట్టడంతో వీరభద్రుడు అవతరించాడు. ఆయనకు పరమశివుడు పట్టసం అనే ఆయుధం ఇచ్చి దక్షుడి శిరస్సు ఖండించమని ఆదేశించాడు. దీంతో వీరభద్రుడు దక్షయజ్ఞం ధ్వంసం చేసి దక్షుడి శిరస్సు ఖండించి దేవకూటద్రి పర్వతంపై చేసిన ప్రళయ తాండవానికి భూమి అదిరింది. దానిని చూడలేక దేవతలు అగస్త్యమహామునిని వేడుకోగా.. ఆయన వచ్చి వీరభద్రుడ్ని ఆలింగనం చేసుకుని శాంతింపజేశారు. అనంతరం వీరభద్రుడు అక్కడే స్వయంభూగా వెలిసినట్లు స్కంధ పురాణంలో పేర్కొన్నారు. పరమశివుడు ఇచ్చిన ఆయుధం పట్టసం కావడంతో పూర్వం పట్టసంగా పిలువబడిన గ్రామం కాలక్రమంలో పట్టిసీమగా పేరుగాంచింది.

వీరేశ్వరస్వామి



కార్తికం.. దర్శనీయం

కార్తికమాసం నెలరోజులు.. కార్తిక మాసంలో శని, ఆది, సోమవారం పర్వదినాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని అభిషేకాలు, లక్షబిల్వార్చన పూజలు నిర్వహిస్తున్నారు.

ఇలా చేరుకోవచ్చు.. రాజమహేంద్రవరం, నిడదవోలు నుంచి పట్టిసీమ 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడ నుంచి పట్టిసీమకు బస్సు సౌకర్యం ఉంది. నది దాటేందుకు రేవులో లాంచి ఉంటుంది. జంగారెడ్డిగూడెం వైపు నుంచి వచ్చే వారు జంగారెడ్డిగూడెంలో దిగి అక్కడ పోలవరం బస్సు ఎక్కాలి. కన్నాపురం కూడలిలో దిగి ఆటోలపై కిలోమీటరు దూరంలోని పట్టిసీమ చేరుకోవాలి. అక్కడ ఆటోలు ఎప్పుడూ అందుబాటులో ఉంటాయి.

సాఫ్ట్ బాల్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

కామవరపుకోట, న్యూస్‌టుడే: సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించినట్లు సభ్యుడు మళ్ల రాజు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8, 9 తేదీల్లో గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఇందులో పీఈటీలు టి.శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు, ఎం.నాగేశ్వరరావు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఈత పోటీలకు..

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: స్థానిక అల్లూరి సీతారామ రాజు సమీప బిశ్వనాథ్ భర్తియా ఈత కొలనులో ఆదివారం జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఉభయ జిల్లాల వ్యాప్తంగా సుమారు 70 మంది క్రీడాకారులు తరలివచ్చారు. ఫ్రీ స్టైల్, బ్రెస్ట్ స్ట్రోక్, బ్యాక్ స్ట్రోక్, బటర్‌ఫ్లై తదితర అంశాల్లో పోటీలు నిర్వహించగా.. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖ వేదికగా జరగనున్న పోటీల్లో క్రీడాకారులు ఉమ్మడి జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని సంఘ కార్యదర్శి ఐ.మల్లికార్జున్ తెలిపారు.

ముప్పు.. ఏదీ కనువిప్పు..

ప్రమాదభరితంగా అప్పారావుపేట పాఠశాల


తరగతి గదిలో నిలిచిన నీరు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పెయ్యేరు శివారు అప్పారావుపేట ప్రాథమిక పాఠశాల ప్రమాద భరితంగా మారి దినదినగండం నూరేళ్ల ఆయుస్సు చందంగా ఉంది. చిన్నపాటి వర్షం కురిసినా పాఠశాల శ్లాబు నుంచి నీరు కారుతోంది. పైకప్పు నుంచి పెచ్చులూడి పడుతుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయాందోళనలు చెందుతున్నారు. 1963లో ఈ పాఠశాలను నిర్మించారు. పురాతనమైన ఈ భవనానికి పిల్లర్లు లేకుండా గోడలపైనే నిర్మించడంతో కూలుతుందని భయపడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల అంతా నీరు కారడంతో వరండాలోనే చదువులు కొనసాగించారు. 12 మంది విద్యార్థులు ఉన్నారు. వర్షం నీరు కారి పుస్తకాలు, రికార్డులు తడిసిపోగా, మూడు ఫ్యాన్లు కాలిపోయాయి. గాలిలేక విద్యార్థులు పుస్తకాలతో విసురుకుంటున్నారు. ప్రధానోపాధ్యాయురాలు రెడ్డి కల్యాణిని సంప్రదించగా.. శ్లాబ్ నుంచి నీరు కారుతుండటంతో ఎప్పుడు పెచ్చులూడుతాయో, ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉందన్నారు. ఇప్పటికే ఉన్నతాధికారులకు విషయాన్ని తెలియజేశానని, వర్షాల వల్ల తడవడంతో ఎక్కడ పడతాయోనని వరండాలోనే తరగతులు నిర్వహిస్తున్నామని వివరించారు.

పెచ్చులూడుతున్న శ్లాబు

శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ ఆదివారం కొనసాగింది. కార్తిక మాసం, సెలవు రోజు కావడంతో భక్తులు వేల సంఖ్యలో తరలి వచ్చారు. అయ్యప్ప స్వామి మాలధారులు సైతం శ్రీవారి ఆలయాన్ని సందర్శించారు.

కార్యక్రమంలో పాల్గొన్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో గార్మి షరీఫ్

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: గన్‌బజార్ ఫెన్షన్ మహల్ హజరత్ మహబూబ్ సుభాని మహాత్ములవారి జెండా చెట్టు వద్ద అహలే సున్నత్ వల్ జమాత్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గార్మి షరీఫ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్ములవారికి గంధం సమర్పించారు. జనాబ్ ముఫ్తి అబ్దుల్ అజీజ్ సాహెబ్ ప్రసంగించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జమాత్ గౌరవాధ్యక్షుడు ఎస్.ఎం.అక్బర్, అధ్యక్షుడు సాబీర్ హుస్సేన్, వ్యవహారాల కమిటీ అధ్యక్షుడు రాజా అహ్మద్, అంజుమన్ అధ్యక్షుడు ఎం.డి.ఆరీఫ్, ముస్లిం మైనార్టీ నాయకుడు కాలేషా తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

బాలికల ఆత్మరక్షణకు కరాటే

జిల్లాలో 232 పాఠశాలలు ఎంపిక

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: బాలికల ఆత్మరక్షణ కోసం కరాటేలో శిక్షణ ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. బాలికల్లో మనోధైర్యం పెంపొందించడం, శరీర దారుఢ్యం, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, అవసరమైనప్పుడు తాము రక్షించుకునే నైపుణ్యాలు సాధించడమే లక్ష్యంగా 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రాశిక్షణ్' పేరుతో ఈ నూతన పథకం ప్రారంభిస్తున్నారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో బాలికలకు కరాటేలో శిక్షణ ఇచ్చే కార్యక్రమం పాఠశాలల్లో అమలు చేశారు. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం కరాటే శిక్షణను నిలిపివేసింది. ఈ మేరకు ఏలూరు జిల్లాలో మొత్తం 232 పాఠశాలలను ఎంపిక చేసి ఆయా పాఠశాలల్లోని బాలికలకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

20 తరగతులు.. ఆరు నుంచి ఇంటర్ చదువుతున్న బాలికలకు కరాటేలో రెండు నెలలు పాటు 20 తరగతులు నిర్వహించనున్నారు.

కరాటే శిక్షణ పొందుతున్న బాలికలు

ఒక్కో తరగతి 90 నిమిషాలు చొప్పున జరగనుంది. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా ఏలూరు జిల్లాలో ఎస్ఆర్ఆర్ ప్రాజెక్టు ద్వారా 55 పాఠశాలలు, రాణి రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఫౌండేషన్ ద్వారా 177 పాఠశాలలు బాలికలకు కరాటేలో శిక్షణ ఇవ్వనున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 208 పాఠశాలను ఎంపిక చేయగా.. ఎస్ఆర్ఆర్ ప్రాజెక్టు ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు. దీనిపై ఏలూరు జిల్లా బాలికాభివృద్ధి అధికారిణి నవీన మాట్లాడుతూ.. పాఠశాలల ఎంపిక పూర్తయిందని, త్వరలోనే బాలికలకు కరాటేలో శిక్షణ ఇస్తామన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడి దుర్మరణం

ఉండి, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ఢీకొని మోపెడ్‌పై వెళ్తున్న వృద్ధుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఉండి ఎస్సై ఎండీ నసీరుల్లా అందించిన వివరాల మేరకు.. ఆకివీడులోని మాదివాడకు చెందిన గంధం రాఘవులు (72) వ్యవసాయం చేస్తుంటారు. మధుమేహంతో బాధపడుతున్న ఆయన భీమవరంలోని ఆయుర్వేద ఆసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్నాడు. ఆదివారం ఉదయం భీమవరం వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకొని మధ్యాహ్నం తన మోపెడ్‌పై తిరుగు ప్రయాణమయ్యాడు. ఉండి నక్కరాజుగుంట ప్రాంతానికి వచ్చేసరికి 165 జాతీయ రహదారిపై వెనుక నుంచి ఏలూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా ఢీకొట్టి ప్రమాదానికి గురిచేశాడని ఎస్సై నసీరుల్లా తెలిపారు. సంఘటనా స్థలిలోనే రాఘవులు ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆదిప్రసాద్

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనలతో ప్రజలను మోసం చేసి డబ్బులు దొంగలిస్తున్న కర్నాటకకు చెందిన శరణప్ప గంగప్ప, కార్తిక్ ఉమాపతి, శశికుమార్, రుద్రప్ప, సతవాడ సందీప్‌లను అరెస్టు చేశామని సీఐ ఆదిప్రసాద్ వివరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నిందితులు రాష్ట్రంలోని వివిధ పట్టణాల లాడ్జిల్లో రిజిస్టర్లు దొంగిలించి వాటిలోని ఫోన్ నంబర్లు సేకరిస్తారు. తరువాత ఆ నంబర్లకు ఫోన్ చేసి సగం ధరకు బంగారం అమ్ముతాం అని చెప్పి, ప్రజలను ఒంటరి ప్రదేశాలకు రప్పించి నకిలీ బంగారం చూపి, తర్వాత వారిని చాకుతో బెదిరించి డబ్బులు తీసుకుని పారిపోతారని సీఐ తెలిపారు. ఈ ముఠా ఇటీవల పట్టణంలోని ఎంవీఆర్ లాడ్జి మేనేజర్ వీరాబత్తుల వెంకటరత్నాన్ని నమ్మించి రూ.నలభై వేలు తీసుకొని కత్తితో బెదిరించి పారిపోయారు. ఈ ఘటనలో దర్యాప్తు చేపట్టగా నిట్ సమీపంలో జాతీయ రహదారిపై ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,510 నగదు, చాకు, కారు, రిజిస్టర్లు స్వాధీనం చేసుకున్నామని, వారిని విచారించి మరో ఇద్దరు నిందితులను గుర్తించి అరెస్టు చేశామని సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, డీఎస్పీ డి.విశ్వనాథ్ ఎస్సైలు నాగరాజు, బాదం శ్రీను, సిబ్బందిని అభినందించారు.

ద్వారకాతిరుమలలో సినీ ఫక్కీలో చోరీ

నిద్రిస్తున్న వారిపై మత్తు మందు చల్లి.. బంగారు వస్తువుల అపహరణ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమలలోని ఓ ఇంట్లో సినీ ఫక్కీలో చోరీ జరిగింది. ఇంటిలో నిద్రిస్తున్న వారిపై మత్తు మందు స్ప్రే చేసి సుమారు 8 కాసుల బంగారు వస్తువులను దొంగిలించారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పోలుబోయిన లక్ష్మయ్య కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నారు. వారంతా శనివారం రాత్రి భోజనం చేసి నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి నిద్రపోతున్న వారిపై మత్తు మందు చల్లారు. వారు తీవ్ర మత్తులోకి వెళ్లగానే.. బీరువాలోని సుమారు 8 కాసుల బంగారు వస్తువులను చోరీ చేశారు. లక్ష్మయ్య, అతని భార్య ఉదయం నిద్రలేచేసరికి.. ఇంటి తలుపులు తీసి ఉండటం.. వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్ తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు.. స్వాములకు గాయాలు

కొత్తపేట, న్యూస్‌టుడే: అంతర్వేది, అప్పనపల్లి ఆలయాల దర్శనానికి వచ్చిన అయ్యప్ప మాలధారులు ప్రయాణిస్తున్న కారు ఆదివారం అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం గంటి గ్రామంలోని కాలువలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో పలువురు స్వాములకు గాయాలయ్యాయి. ఏలూరు మండలం రాఘవపురానికి చెందిన 14 మంది అయ్యప్ప స్వాములు, 8 మంది మహిళలు ఆలయాల దర్శనానంతరం బొలెరో వాహనంలో తిరిగి వెళ్తుండగా వాహనం అదుపుతప్పి కాలువలోకి దూసుకుపోయింది. ఐదుగురికి తీవ్ర గాయాలవగా మిగిలిన వారు సురక్షితంగా ఉన్నారు. గాయపడిన వారిని కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. దీనిపై ఏవిధమైన ఫిర్యాదు అందలేదని కొత్తపేట ఎస్సై సురేంద్ర తెలిపారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

SECOND SALE

హైదరాబాద్ హోంకేర్‌లో ఏజెంట్లకు మంచి అవకాశం, వృద్ధులు, పేషెంట్ల సంరక్షణ ట్రెయినింగ్ 2వేలు జీతము, వర్కర్స్ జీ: 18k, ఫ్రీ వసతి, ఫుడ్. 89775 47749.

వాషింగ్‌మిషన్స్, LED TV లు, ఫ్రిజ్‌లు, ఇన్వర్టర్స్, AC లు బెస్ట్ మోడల్స్ తక్కువ వాడి ఫుల్ కండిషన్‌లో తక్కువ ధరకే అమ్మబడును. 87121 68544.

భీమవరంలో పద్మప్రియ హైట్సులో పరపతి పని సౌకర్యము ...టీవీ డిజైనర్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 93924 88877, 99851 61166.

REAL ESTATE

HOUSE FOR SALE

ఏలూరు కొత్తపేట అమీనాపేట వీధిలో ఆర్కే స్వర్ణ పేట 125 గజాల్లో RCC బిల్డింగ్ అమ్మకమునకు కలదు. సంప్రదించండి. 81850 62325.

JOBS

Immediate openings for Customer Service Executive & Branch Manager Positions in Cherukuri Group, Located in Eluru, Tanuku, Guntur & Vijayawada. Qual: Min Inter. 9885206866, E-mail: hr@cherukurigroup.org.

TO LET

COMMERCIAL

ఈతుకు పట్టణం ... 9642223242.

వామకుంట గ్రామం ... DTCP ... 16-18K ... 9704051122, 9010680011.

రామకృష్ణ గ్రూప్ Hyd. ...

గమనిక

Cont: 88863 44499.

నెక్ మూపింపు కోడిగుడ్ల ధర ... 5.80 ... 08819-224254

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్ఎం కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

(c) eenadu

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

విద్యతో ఉన్నత శిఖరాలు: బడేటి

విద్యార్థినికి నగదు ఇస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: పేద పిల్లలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే బడేటి చంటి సూచించారు. ఆర్యవైశ్య సంఘం నగరాధ్యక్షుడు డి.జయబాబు, మరికొందరు దాతలు పలువురు పేద విద్యార్థులకు కళాశాల రుసుము సమకూర్చారు. ఆ మొత్తాన్ని బడేటి విడిది కార్యాలయంలో ఎమ్మెల్యే చేతులమీదుగా విద్యార్థులు బి.మౌనిక, ఎన్.ప్రణీత్, ఏ.సాయి గణేశ్‌కు అందజేశారు. దాతల సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు.

శాంతిభద్రతల్లో లోపాలున్నాయా?

నిడమర్రు సీఐతో ఫోన్ ఇన్ రేపు

గణపవరం, న్యూస్‌టుడే: నిడమర్రు పోలీసు సర్కిల్‌లో శాంతి భద్రత సమస్యలున్నాయా.. జూద క్రీడలు పెరిగిపోయాయా.. మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోయిందా.. అతివలపై ఆకతాయిల వేధింపులు ఎదురవుతున్నాయా.. ఆయా ఇబ్బందులకు పరిష్కార మార్గం చూపనుంది 'ఈనాడు'. పోలీసు శాఖ పరంగా గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు మండలాల్లో ఎదురవుతున్న సమస్యలను నిడమర్రు సీఐ రజినీకుమార్ దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కారం పొందవచ్చు. మీరు చేయాల్సిందల్లా ఇక్కడ పేర్కొన్న తేదీన, నిర్ణీత సమయానికి ఫోన్ చేయడమే!

తేదీ: 4.11.20125 (మంగళవారం) | సమయం: సాయంత్రం 3 నుంచి 4 గంటల మధ్య | ఫోన్ నంబరు: 70939 81613

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణం:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ? శాంతినగర్ 8వ రోడ్డు నుంచి 3వ రోడ్డుకెళ్లే దారిలో డ్రెయిన్‌ను ఆక్రమించి చప్టా నిర్మించారు. ఈ మార్గంలో రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది. అధికారులు సమస్య పరిష్కరించాలి. **- మోహనరావు, వాహనదారుడు**

✔ సమస్య నా దృష్టికి రాలేదు. డ్రెయిను ఆక్రమణ తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **- భానుప్రతాప్, కమిషనర్**

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ? తంగెళ్లమూడి వంతెన సమీప తమ్మిలేరులో చెత్తాచెదారం పడేస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన వ్యర్థాలు సైతం ఇక్కడే పారబోస్తున్నారు. తమ్మిలేరు కాలుష్య కాసారంగా మారుతోంది. **- ప్రసాద్**

✔ తంగెళ్లమూడి సమీప తమ్మిలేరులో చెత్త, వ్యర్థాలు వేయకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటాం. **శివారెడ్డి, ఉప కమిషనర్**

దెందులూరు, న్యూస్‌టుడే: ? గోపన్నపాలెం- పెదవేగి మార్గంలోని మద్యం దుకాణం వద్ద మందుబాబులు సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు పడేస్తున్నారు. దాంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా తయారవుతోంది. **- కృష్ణారావు, స్థానికుడు**

✔ రోడ్డు పక్కన పేరుకుపోయిన వ్యర్థాలు తొలగిస్తాం. మందుబాబులు ప్లాస్టిక్ గ్లాసులు వేయకుండా చర్యలు తీసుకుంటాం. **- స్టానిష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి**

స్పందించారు.. శుభ్రం చేశారు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఏలూరు గవరవరం న్యూ హేలాపురి లయన్స్ క్లబ్‌కు వెళ్లే దారిలో విద్యుత్తు పరివర్తకం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలను సిబ్బంది తొలగించారు. 'నిర్లక్ష్యం కమ్ముకుని.. తీగలు అల్లుకుని' శీర్షికన ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి విద్యుత్తు ఏఈ సాదిక్ స్పందించారు. సిబ్బందిని పంపి పరివర్తకానికి అల్లుకుపోయిన పాదులను తొలగింపజేశారు.

పేదల కాలనీ.. సమస్యల కహానీ!

నా పేరు కుమారి. పేదల కాలనీలో పారిశుద్ధ్యం లోపించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దోమలు, అపరిశుభ్రత కారణంగా తరచూ జ్వరాల బారిన పడుతున్నాం. పలువురు డెంగీ, మలేరియా జ్వరాలతో సతమతమవుతున్నారు. సొంతిల్లు వదిలి వెళ్లలేకపోతున్నాం. అధికారులు స్పందించి సదుపాయాలు కల్పించాలి.

నా పేరు అపర్ణ. రూ.12 లక్షలు అప్పులు చేసి.. శనివారపుపేట పేదల కాలనీలో ఇల్లు నిర్మించుకున్నా. గత ప్రభుత్వం కేవలం రూ.1.80 లక్షలే అందజేసింది. స్థానికంగా సౌకర్యాలు కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. రోడ్లు, డ్రెయిన్లు నిర్మించలేదు. చిన్నపాటి వర్షానికే కాలనీ ముంపునకు గురవుతోంది.

తంగెళ్లమూడి(ఏలూరు టూటౌన్), న్యూస్‌టుడే

నగర శివారు శనివారపుపేటలోని పేదల కాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇక్కడ కనీస సదుపాయాల్లేకపోవడంతో.. స్థానికులు నరకం చూస్తున్నారు. బురద దారులు, అధ్వాన డ్రెయిన్లు, వెలగని దీపాలు, ఇళ్ల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలతో అల్లాడిపోతున్నారు. ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కాలనీలో పారిశుద్ధ్యం మరింత లోపించింది.

పారిశుద్ధ్య లోపంతో వ్యాధుల ముప్పు

ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

600 మందికి.. గత వైకాపా హయాంలో 2020-21 ఆర్థిక సంవత్సరాన శనివారపుపేటలో సుమారు 600 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1.80 లక్షలు లబ్ధిదారులకు ఆర్థిక సాయం చేయగా.. మిగతా సొమ్ములు అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. స్థానికంగా కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో.. సొంతింట్లో ఉంటున్నామన్న సంతోషం లేకుండా పోయింది.

మోస్తరు వర్షానికే.. కాలనీలో ఎక్కడా సీసీ రోడ్లు నిర్మించలేదు. నామమాత్రంగా సిమెంటు కాలువలు ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంతం కావడంతో.. మోస్తరు వర్షానికే కాలనీ ముంపునకు గురవుతోంది. పిచ్చిమొక్కలు, ముళ్ల చెట్లు పెరిగిపోయి సర్పాలు, విష పురుగులకు నిలయాలుగా మారాయి. రోజుల తరబడి వర్షపునీరు, మురుగు నిలిచిపోవడంతో దుర్వాసన రావడంతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి. వాతావరణం మారినప్పుడల్లా స్థానికులు టైఫాయిడ్, డెంగీ, మలేరియా బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి కాలనీలో వసతులు కల్పించాలని కోరుతున్నారు. పేదల కాలనీలో సీసీ రోడ్లు, మురుగు కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు.

నేటి నుంచి విద్యుత్తు సరఫరాలో అంతరాయం

పెదవేగి, న్యూస్‌టుడే: పెదవేగి, గార్లమడుగు విద్యుత్తు ఉపకేంద్రాల్లో మరమ్మతుల దృష్ట్యా ఈ నెల 3 నుంచి 8 వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ అంబేడ్కర్ తెలిపారు. ఆయా ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ బోర్లకు తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 9 గంటల వరకు, రాత్రి 10 నుంచి 12 గంటల వరకు రెండు విడతలు విద్యుత్తు సరఫరా చేస్తామని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

5న అవగాహన సదస్సు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 5న ఉద్యాన పంటల క్లస్టర్ల అభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఉప సంచాలకుడు షాజా నాయక్ తెలిపారు. ఈ సదస్సులో ఉద్యాన పంటల సాగు, మద్దతు ధర, ఇతరత్రా అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో అనుభవమున్న రైతులు, అభ్యుదయ పారిశ్రామికవేత్తలు, రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ప్రతినిధులు హాజరు కావాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

ఎర్రన్నాయుడి సేవలు ఎనలేనివి

విగ్రహానికి పూలమాల వేస్తున్న వీరాంజనేయులు

కైకరం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: కైకరంలో కేంద్ర మాజీ మంత్రి, దివంగత తెదేపా నేత ఎర్రన్నాయుడి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన విగ్రహానికి ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎర్రన్నాయుడు ఎనలేని సేవలందించారని కొనియాడారు.

పోరాటాలతోనే హక్కుల సాధన: ఇఫ్టూ

మాట్లాడుతున్న ప్రసాద్

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవచ్చని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ అన్నారు. స్థానిక మర్చంట్ ఛాంబర్ కల్యాణ మండపంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర రాజకీయ తరగతులు రెండో రోజు ఆదివారం కొనసాగాయి. రాష్ట్ర కార్యదర్శి కె.పోలారి అధ్యక్షత వహించారు. మార్క్సిజం- సులభ పరిచయంపై ప్రసాద్ ప్రసంగించారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలే మానవాళి విముక్తికి మార్గమన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దోపిడీ రహిత సమాజ స్థాపనకు ఐఎఫ్‌టీయూ పోరాడుతోందని తెలిపారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఏలూరు జిల్లా భీమడోలుకు చెందిన మహాదేవుని వెంకటభీమేష్‌వర్మ కుటుంబ సభ్యులు రూ.50,116 విరాళాన్ని ఆదివారం సమర్పించారు. వీరికి స్వామివారి చిత్రపటం అందజేసి దేవస్థానం ప్రతినిధి శ్రీనివాస్ అభినందించారు.

ఘనంగా క్షీరాబ్ది ద్వాదశి ఉత్సవం

భీమడోలు: గుండుగొలనులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పవిత్ర కార్తిక క్షీరాబ్ది ద్వాదశి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి శేష వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగించారు. **దెందులూరు:** వైష్ణవ ఆలయంలో కార్తిక ద్వాదశి భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకం, అర్చన చేసి.. అలంకరించి దర్శనభాగ్యం కల్పించారు.

నడవమంటారా.. జారమంటారా

నిడమర్రు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు వెళ్లే దారిలో బురద పేరుకుపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ మార్గం అధ్వానంగా తయారైంది. ఫలితంగా పాఠశాలకు రాకపోకలు సాగించేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ జారిపడతామోనని బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. **- న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం**

శిథిలమై.. ప్రమాదభరితమై

పెదవేగి మండలం పెదవంగూరు లక్ష్మీపురంలో దశాబ్దాల కిందట నిర్మించిన మంచినీటి ట్యాంకు శిథిలావస్థకు చేరింది. మెట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వలి సిబ్బంది ట్యాంకు పైకెక్కి శుభ్రం చేసేందుకు వెనకడుగు వేస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో గ్రామస్థులు క్లోరినేషన్ చేయని నీటినే తాగుతున్నారు. **- న్యూస్‌టుడే, పెదవేగి**

పూర్తి చేస్తారా.. పునాదిలో వదిలేస్తారా

నిడమర్రు మండలం క్రొవ్విడిలోని పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరింది. గ్రామంలో సచివాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టగా.. గత ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో గుత్తేదారు పునాది దశలో నిలిపివేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో సచివాలయ సిబ్బంది శిథిల పంచాయతీ భవనంలోనే విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. **- న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం**

మలుపు.. జాగ్రత్తగా నడుపు!

ఏలూరు నగరం గాంధీ మైదానం కూడలిలో రహదారి మధ్య భారీ గొయ్యి ఏర్పడి వాహనాలకు పరీక్ష పెడుతోంది. ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి మలుపు వద్ద గుంత ఏర్పడింది. దాన్ని తప్పించే క్రమంలో చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి గొయ్యి పూడ్చాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు వన్‌టౌన్**

నిలిచేనా.. కూలేనా

ఏలూరు వెన్నవెల్లివారిపేటలోని జడ్పీఎం చర్చి సమీపంలో ప్రధాన రహదారి పక్కన టెలిఫోన్ స్తంభం ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఈ మార్గంలో నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. స్తంభం ఏ క్షణాన ఒరిగిపోతుందోనని.. ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు నగరం**

ఏలూరు సినిమాలు

అంబిక డీలక్స్	బాహుబలి ఎపిక్
అంబిక మినీ	కాంతార - 2
సాయిబాలాజీ	తెలుసు కదా
బాలాజీ	బాహుబలి ఎపిక్
సత్యనారాయణ స్క్రీన్ 1	ధామా
సత్యనారాయణ స్క్రీన్ 2	డ్యూడ్
సత్యనారాయణ స్క్రీన్ 3	మాస్ జాతర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	విద్రోహి
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	మైసన్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	కర్మణ్యే వాధికారస్తే
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	మాస్ జాతర
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	తెలుసు కదా
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	మిత్ర మండలి
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	బాహుబలి ఎపిక్

కొనలేం.. తినలేం!

అమాంతం పెరిగిన కూరగాయల ధరలు

'వారం రోజుల వ్యవధిలోనే కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. కిలో రూ.15 నుంచి రూ.25 వరకు అదనంగా వెచ్చించాల్సి వస్తోంది. కార్తిక మాసం కావడంతో.. శాకాహారులు పెరిగారు. కూరగాయలు, ఆకుకూరల ధరలు ఆకాశాన్నంటుండటంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది' అని ఏలూరుకు చెందిన లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు.

'కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరగడంతో.. రోజువారీ ఖర్చులో అధిక మొత్తం వెచ్చించాల్సి వస్తోంది. కొందరు వ్యాపారులు తుపానును ఆసరాగా తీసుకొని.. ధరలు పెంచడంతో పేదలపై అదనపు భారం పడుతోంది' అని నగరానికి చెందిన జి.రాజేశ్వరరావు వాపోయారు.

పవరుపేట(ఏలూరు వన్‌టౌన్), న్యూస్‌టుడే: విపణిలో కూరగాయలు, ఆకుకూరల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. కార్తిక మాసం ఆరంభం కావడం.. మొంథా తుపాను కారణంగా దిగుబడి తగ్గిపోవడంతో.. కాయగూరలు కొండెక్కి కూర్చున్నాయి. వారం వ్యవధిలోనే కొన్ని రకాల ధరలు రెట్టింపు కావడంతో సామాన్యులు అల్లాడిపోతున్నారు. క్యాప్సికం, బీన్స్ రెట్లు సెంచరీ దాటేశాయి.

తుపాను ప్రభావంతో.. తుపాను తీవ్రతకు ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతుల్లేకపోవడంతో.. కూరగాయలకు గిరాకీ ఏర్పడింది. ఉల్లి, టమాటా, మిర్చి ధరల్లో మాత్రం పెద్దగా మార్పు లేకపోవడం కాస్త ఉపశమనమిచ్చింది. రైతు బజార్లలోనూ ధరలు బాగా పెరిగిపోయాయని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక పప్పులు, ఇతర నిత్యావసర సరకులదీ ఇదే పరిస్థితి. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ధరలను నియంత్రించాలని వారు కోరుతున్నారు.

ధరల వివరాలిలా(రూ.ల్లో)

	గత వారం	ప్రస్తుతం
బీర	40	52
వంగ	40	64
దొండ	30	48
బెండ	30	56
చిక్కుడు	80	108
క్యారెట్	40	70
క్యాప్సికం	60	100
బీన్స్	50	100
ఆనబ	20	30

మల్లేశ్వరుడికి లక్ష బిల్వార్చన

భీమడోలు, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా గుండుగొలనులోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక ఉత్సవాలు, పూజలు చేశారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, మహన్యాసం, పంచామృత, ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వ పత్రార్చన తదితరాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

హరిహర సుతుడికి అభిషేకాలు..పెదపాడు: అయ్యప్ప స్వామి నామ స్మరణతో మండల కేంద్రం పెదపాడు శనివారం మార్మోగింది. విఘ్నేశ్వరస్వామి, కుమారస్వామి, అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహాలకు పంచామృత అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివార్లకు మహన్న నివేదన చేపట్టారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

ఏలూరు నేరవార్తలు: రెండో పట్టణం నూకాలమ్మగుడి సమీపంలో రవి, మల్లిక దంపతులు నివసిస్తున్నారు. భర్త జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో పని చేస్తున్నారు. వివాహ సమయంలో ఇచ్చిన కట్నం సరిపోదని.. అదనపు కట్నం కావాలని కొన్నాళ్లుగా భార్యను వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదుతో రెండో పట్టణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు.

మరో ఘటనలో భర్త, కుటుంబ సభ్యులపై.. ఏలూరు నేరవార్తలు: స్థానిక బావిశెట్టివారిపేటకు చెందిన బేబి రమ్యశ్రీకి గుంటూరు జిల్లాకు చెందిన రామ్‌లోకేశ్‌తో 2021లో వివాహమైంది. అప్పట్లో రూ.22 లక్షలు, బంగారు నగలు కట్నంగా ఇచ్చారు. ఈ క్రమంలో వారికి పాప జన్మించింది. ఆడ బిడ్డ పుట్టిందని.. ఆమె పేరిట పొలం రాయించుకొని రావాలని భర్త, అతడి కుటుంబ సభ్యులు రమ్యశ్రీని వేధించేవారు. ఇటీవల పుట్టింటికొచ్చిన బాధితురాలు ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు.

యువకుడి అదృశ్యం.. ఏలూరు నేరవార్తలు: స్థానిక తంగెళ్లమూడి గవరపేటకు చెందిన రంజిత్ కుమార్ తన స్నేహితులతో కలిసి గత నెల 28 రాత్రి ఇంటి నుంచి బయటకెళ్లారు. తిరిగి రాకపోవడంతో యువకుడి తల్లి రామలక్ష్మి రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదం.. పెదవేగి: ముండూరుకు చెందిన కొప్పుల ప్రదీప్ గత నెల 29న మిత్రులతో కలిసి ఆటోలో వేగివాడ వెళ్లారు. అక్కడ కూలి పనులు ముగించుకొని.. సొంతూరు ముండూరు వచ్చారు. రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. గాయపడిన ప్రదీప్‌ను ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడి సిబ్బంది సమాచారంతో కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ఫల్గుణ తెలిపారు.

జూద స్థావరాలపై దాడి.. భీమడోలు: అన్నేవారిగూడెంలో జూద స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. అయిదుగురు జూదరులను అదుపులోకి తీసుకొని.. రూ.10,400 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మదీనాబాషా తెలిపారు.

పెదవేగి: బాపిరాజుగూడెంలో ఆదివారం నిర్వహిస్తున్న జూద స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ ఫల్గుణ తెలిపారు.

బాబూరావు మృతి తీరని లోటు

చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: సీపీఎం జిల్లా పూర్వ కార్యదర్శి చింతకాయల బాబూరావు మృతి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గానికి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డీఎన్‌వీడీ ప్రసాద్ అన్నారు. స్థానిక ఉద్దరాజు రామం భవనంలో ఆదివారం సంతాప సభ నిర్వహించారు. బాబూరావు చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రసాద్ మాట్లాడుతూ.. 40 ఏళ్లపాటు సీపీఎం చేపట్టిన అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారని కొనియాడారు. పార్టీ నగర కార్యదర్శి రవికుమార్, నాయకులు రామకృష్ణ, రవికిశోర్, కనకారావు, ప్రసాద్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శునకాన్ని కాపాడారు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: స్థానిక శనివారపుపేటలోని సుమారు 40 అడుగులున్న నేల బావిలో ఆదివారం శునకం పడిపోయింది. నిస్సహాయ స్థితిలో అరుస్తున్న శునకాన్ని స్థానికులు గమనించి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఆ శాఖ జిల్లా సహాయాధికారి రామకృష్ణ తమ సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకొని తాళ్ల సాయంతో శునకాన్ని పైకి లాగి రక్షించారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఉంగుటూరు, ఏలూరు టూటౌన్- న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు డిమాండ్ చేశారు. రావులపర్రులో కాశీబుగ్గ తొక్కిసలాట మృతులకు సంతాపం తెలియజేస్తూ ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఏలూరు నగరంలో వైకాపా జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, నియోజకవర్గ కన్వీనర్ జయప్రకాశ్ ఆధ్వర్యాన శ్రేణులు పెద్దఎత్తున కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టాయి.

శాకాహారంతో ఆరోగ్యకర జీవనం

ప్రదర్శన నిర్వహిస్తున్న పిరమిడ్ సొసైటీ సభ్యులు

భీమడోలు, న్యూస్‌టుడే: రోజూ శాకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరంగా జీవించవచ్చని పిరమిడ్ సొసైటీ శిక్షకులు అన్నారు. భీమడోలులో శాకాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ.. ప్రదర్శన చేపట్టారు. స్థానిక సాయిబాబా ఆలయ కూడలి నుంచి సంత మార్కెట్ మీదుగా బస్టాండు కూడలి వరకు ర్యాలీ సాగింది. ప్రతిరోజు శాకాహారం తినాలని.. జంతువులతో ప్రేమగా మెలగాలని ప్లకార్డులు ప్రదర్శించారు. శిక్షకులు వరలక్ష్మి, శ్రీనివాసు, శ్రీనివాసరాజు, జి.రాంబాబు, శేషగిరిరావు, రామారావు, ధర్మారావు, సారథి పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. అడుగడుగునా చింత!

అధ్వాన రహదారులతో జనం బెంబేలు

గణపవరం, న్యూస్‌టుడే: మండలంలోని పలు రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. అడుగుకో గుంత, గజానికో గొయ్యి చందాన మారాయి. ఆయా దారుల్లో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. పిప్పర- గణపవరం మార్గంలో ప్రయాణమంటేనే ప్రజలు హడలిపోతున్నారు. రాత్రివేళ గుంతలను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

మండల కేంద్రం గణపవరం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రం భీమవరాన్ని కలిపే రహదారి దెబ్బతింది. ముఖ్యంగా సరిపల్లె వద్ద మరింత ఛిద్రమైంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు.

మూడేళ్ల ముచ్చట.. మండలంలోని పలు రోడ్లు నిర్మించి మూడేళ్లకు పైగా అవుతోంది. ప్రస్తుతం ఆ రహదారులన్నీ గుంతలమయంగా మారాయి. సరిపల్లె నుంచి కొత్తపల్లి మీదుగా వరదరాజపురం వెళ్లే మార్గం కంకర తేలడంతో.. పాఠశాలల విద్యార్థులు పడుతూ లేస్తూ వెళ్తున్నారు. వల్లూరు- వీరేశ్వరపురం, వెంకట్రాజపురం- ముప్పర్తిపాడు, కేశవరం- వెంకట్రాజపురం, జల్లి కాకినాడ- కేశవరం, శీతాలం కొండేపాడు- యండగండి, కేశవరం- శీతాలం కొండేపాడు రహదారులు దుస్థితికి చేరాయి.

ఇంటికొచ్చే వరకూ ఆందోళనే.. ఇంటి నుంచి బయటకెళ్లిన వారు తిరిగి ఇంటికొచ్చే వరకూ కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. గోతులమయమైన మార్గాల్లో ఎప్పుడు ఏ ప్రమాదానికి గురవుతారోనని మదన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. 'రహదారుల దుస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. కొన్ని రోడ్ల మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేశాం. నిధులు విడుదలైన వెంటనే పనులు చేపడతాం' అని ర.భ.శా. తాడేపల్లిగూడెం ఏఈ రవిబాబు తెలిపారు.

విస్తృతంగా వాహనాల తనిఖీలు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. మితిమీరిన వేగంతో ప్రయాణించవద్దని, శిరస్త్రాణం ధరించాలని, కారు ప్రయాణికులు సీటు బెల్ట్ పెట్టుకోవాలని, వాహన దస్త్రాలు సక్రమంగా ఉంచుకోవాలని సూచనలు చేశారు. పత్రాలు సరిగా లేని పలువురికి అపరాధ రుసుం విధించారు.

పెదవేగి: కొప్పాకలో పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. పెదపాడు మండలం పాతముప్పర్రుకు చెందిన రాపాకుల ఈశ్వర్ మద్యం తాగి ద్విచక్ర వాహనం నడుపుతుండగా.. అతడిపై కేసు నమోదు చేశారు.

పెదపాడు: కలపర్రు వద్ద ఎస్సై శారదా సతీశ్ నేతృత్వంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని వారికి ఈ చలానాలు విధించారు.

"మొంథా" తుఫాను విపత్తు వేళ ఏలూరు జిల్లా విద్యుత్ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించి విశిష్ట సేవలు అందించినందుకు గాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి మాన్యశ్రీ నారా చంద్రబాబునాయుడు గారి చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు స్వీకరించిన విద్యుత్ శాఖ SE శ్రీ పి.సాల్మన్‌రాజు గార్కి మా హృదయపూర్వక హార్దిక శుభాకాంక్షలు.

SC/ST EWA వారి ఆధ్వర్యంలో..

K.మధుకుమార్ EE/O/APEPDCL (నర్సాపురం డివిజన్)	T.వెంకటరావు Dy EE/O/APEPDCL, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ (పశ్చిమగోదావరి)
Ch. సాయిబాబా APEPDCL, కంపెనీ సెక్రటరీ	నీతిపూడి వెంకటరావు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి (SC/ST EWA)
G.V.A. ఫాల్ జిల్లా అధ్యక్షులు (ఏలూరు) (SC/ST EWA)	B. కుటుంబరావు పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు (SC/ST EWA)
I. వెంకటేశ్వర్లు SLI మరియు జిల్లా కార్యదర్శి (ఏలూరు) (SC/ST EWA)	K.V. సుబ్బారావు డివిజన్ అధ్యక్షులు నిడదవోలు (SC/ST/ EWA
P. బంగార్రాజు డివిజన్ కార్యదర్శి నిడదవోలు (SC/ST EWA)	B. నరేంద్ర శ్రీనివాస్ డివిజన్ అధ్యక్షులు నర్సాపురం (SC/ST EWA
కప్పల సురేష్ డివిజన్ కార్యదర్శి నర్సాపురం (SC/ST EWA)	మండా సురేష్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ & D.S. (W.G జిల్లా SC/ST EWA)
P. అశోక్‌కుమార్ డివిజన్ కార్యదర్శి ఏలూరు (SC/ST EWA)	Ch. శ్రీను జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ (ఏలూరు) (SC/ST EWA)
చెబత్తిన బసవయ్య డివిజన్ అధ్యక్షులు (ఏలూరు) (SC/ST EWA)	మండా రాజు LI/O/Tadepalligudem (జిల్లా వైస్ ప్రెసిడెంట్) W.G. Dt (SC/ST EWA)
కోట రత్నంరాజు జిల్లా అసిస్టెంట్ సెక్రటరీ (తణుకు) W.G. Dt (SC/ST EWA)	D.Ch. బాలాజీ డివిజన్ అధ్యక్షులు తాడేపల్లిగూడెం (SC/ST EWA)

(c) eenadu

పోలవరం

•పోలవరం • చింతలపూడి

మద్ది క్షేత్రంలో విశేష పూజలు

జంగారెడ్డిగూడెం (గ్రామీణ), న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమద్ హోమం, సువర్చల హనుమద్ కల్యాణం వైభవంగా నిర్వహించారు. అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా జరిపిన ఈ పూజాదికాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆదివారం ఒక్కరోజే వివిధ సేవల రూపేణా రూ.2,47,129 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఆర్వీ చందన తెలిపారు.

గుబ్బల మంగమ్మకు.. బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం కామవరం అడవిలోని గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం అధిక సంఖ్యలో అయ్యప్ప స్వామి మాలధారులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సాధారణ భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

గొంతెమ్మ ఉత్సవాలు ముగింపు.. టి.నరసాపురం, న్యూస్‌టుడే: వెలగపాడులో వారం రోజుల పాటు నిర్వహించిన గొంతెమ్మ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

వీరేశ్వరస్వామి ఆలయం కిటకిట

పోలవరం, న్యూస్‌టుడే: కార్తిక మాసం ఆదివారం కావడంతో పట్టిసీమ వద్ద గోదావరి మధ్యలోని భద్రకాళీసమేత వీరేశ్వరస్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయాల వద్ద జరుగుతున్న పనుల నేపథ్యంలో ఎస్సై పవన్‌కుమార్ రేవులో లాంచీ ఎక్కే చోట, ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు పర్యవేక్షించారు.

చంద్రశేఖరుడిగా శివయ్య

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: అంకాలగూడెంలోని ఉమా సమేత భోగలింగేశ్వరుడిని చంద్రశేఖరుడిగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

భోగలింగేశ్వరుడికి రుద్రాభిషేకం

పోలవరం, న్యూస్‌టుడే: గుంజవరం సమీపంలోని ఉమా సహిత భోగలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చిన్నారుల కోలాటం భక్తులను అలరించింది.

గీత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని వినతి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం గ్రామాల్లో కల్లుగీతపై ఆధారపడి జీవిస్తున్న శెట్టిబలిజ కులస్థులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు జారీ చేయాలని రెడ్డిగణపవరం శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాండ్ర రవి కోరారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను జంగారెడ్డిగూడెంలో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. తమ గ్రామంలో సామాజిక భవనం మంజూరు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

ఆరు నెలలుగా.. నెట్టుకొస్తున్నారు!

• వైద్యులు లేక పిల్లల వైద్యం పడక • జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రిలో ఇదీ పరిస్థితి

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే

జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రిలో పీడియాట్రీషియన్ (చిన్నపిల్లల) వైద్య విభాగం ఖాళీ అయ్యింది. ఆసుపత్రి సివిల్ అసిస్టెంట్ సర్జన్ సల్మా మే నెలలో బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఎవరినీ నియమించలేదు. సివిల్ సర్జన్ పోస్టు ఉన్నా.. ఏళ్లుగా భర్తీ కాలేదు. దీంతో ఈ విభాగంలో ఒక్కరూ లేకపోవడంతో చిన్న పిల్లల వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది. ప్రతి రోజు 40 నుంచి 50 వరకు ఓపీ ఉంటుంది. ప్రతి నెలా 100కుపైగా ప్రసవాలు, సిజేరియన్లు జరుగుతున్నాయి. వీరంతా వైద్యానికి ఇబ్బంది పడుతున్నారు.

ఖాళీగా ఓపీ విభాగం

పీడియాట్రీషియన్ ఓపీని ఆర్ఎంఓ రాంబాబు కానీ, ఇతర వైద్యులు గాని చూస్తున్నారు. అయితే శనివారం మాత్రం ఈ విభాగంలో ఎవరూ లేరు. కొద్ది సేపు సూపరింటెండెంట్ జేబీ కమల ఓపీ చూసినట్లు చెబుతున్నారు.

బయటకు రిఫర్ చేస్తూ..

6 నెలలుగా డాక్టర్ లేకున్నా.. ఇతర వైద్యులతో ఓపీ నిర్వహిస్తూ.. నెట్టుకొస్తున్నారు. జ్వరం, సాధారణ సమస్యల వంటివాటికి ఇక్కడే వైద్యం అందిస్తున్నారు. అవకాశం లేని కేసులను బయటకు రిఫర్ చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రైవేటు వైద్యులకు డబ్బులిచ్చి చికిత్స చేయిస్తున్నారు. ఇన్ని ఇబ్బందులు పడుతున్నా.. ఇక్కడ పిల్లల వైద్యులను నియమించడంలో తగిన శ్రద్ధ వహించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిరుపయోగంగా పరికరాలు

మూతపడిన ఎన్‌బీఎస్‌యూ..

నవజాత శిశువుల ఎన్‌బీఎస్‌యూ ఉన్నా.. నిరుపయోగం. ఇందులో వార్మర్లు, ఫొటోథెరపీ పరికరాలు వెక్కిరిస్తున్నాయి. అప్పుడే పుట్టిన పిల్లల్లో ఉమ్మనీరు తాగడం, ఆక్సిజన్ సమస్యలున్నట్లే వార్మర్లలో ఉంచుతారు. నవజాత శిశువులకు కామెర్లు వస్తుంటాయి. ఇటువంటి వారికి ఫొటోథెరపీ యంత్రం ఉపయోగపడుతుంది. వైద్యులు లేక ఈ సేవలకు పిల్లలను బయటకు పంపుతున్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీలు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. మితిమీరిన వేగంతో ప్రయాణించవద్దని, శిరస్త్రాణం ధరించాలని, కారు ప్రయాణికులు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు.

5న అవగాహన సదస్సు

ఏలూరు (గ్రామీణ), న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 5న ఉద్యాన పంటల క్లస్టర్ల అభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఉప సంచాలకుడు షాజా నాయక్ తెలిపారు. ఈ సదస్సులో ఉద్యాన పంటల సాగు, మద్దతు ధర, ఇతరత్రా అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో అనుభవమున్న వారు హాజరు కావాలని ఆయన కోరారు.

10 AM to 1 PM మీ మెసేజ్.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం: 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి: 76759 19086

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: ? చింతలపూడి పట్టణం ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఉన్న కాలువలో డ్రెయినేజీ నీరు పారే మార్గం లేదు. ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. **- నాగేశ్వరరావు**
✔ డ్రెయిన్లు పరిశీలించి అవసరమైన ప్రాంతాల్లో మూతలు ఏర్పాటు చేస్తాం. **- రాంబాబు, కమిషనర్**
? చింతలపూడి మండలం సీతానగరం వద్దగూడెంలో డ్రెయిన్లు లేక ఇబ్బంది పడుతున్నాం. మురుగు నీరు నివాసాల మధ్యనే నిలిచిపోతున్నాయి. **- కార్తిక్**
✔ డ్రెయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతాం. మురుగు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటాం. **- కామేశ్వర, ఎంపీడీవో**

చింతలపూడి, న్యూస్‌టుడే: ? మెరక వీధికి వెళ్లే దారిలో పెద్ద గొయ్యి ఉండటంతో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం అక్కడే పడేస్తున్నారు. దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నాం. **- రమేశ్, స్థానికుడు**
✔ గొయ్యిని పూడ్చే ఏర్పాట్లు చేస్తాం. చెత్త వేయకుండా చర్యలు చేపడతాం. **- అంబటి రాంబాబు, కమిషనర్**
? పట్టణంలో సాయిబాబా గుడి వద్ద నుంచి కొత్త బస్టాండు వరకు రహదారి పక్కన మట్టి, ఇసుక పేరుకుపోయింది. **- సత్యనారాయణ, స్థానికుడు**
✔ పొక్లెయిన్ సాయంతో వెంటనే తొలగిస్తాం. **- అంబటి రాంబాబు, కమిషనర్**

లింగపాలెం, న్యూస్‌టుడే: ? మండలంలోని అసనగూడెం వారిగూడెంలో ఇటీవల కురిసిన వర్షాలకు నివాసాల మధ్య నీరు నిలిచి దోమలకు ఆవాసాలుగా మారి, వృద్ధి చెందుతున్నాయి. **- వెంకటేశ్వరరావు**
✔ పరిశీలించి చర్యలు చేపడతాం. **- అశోక్, పంచాయతీ కార్యదర్శి**

పిల్లలను చదివించి వృద్ధిలోకి తీసుకురావాలి: మంత్రి

జంగారెడ్డిగూడెం పట్టణం, చింతలపూడి, పోలవరం, న్యూస్‌టుడే: సమాజంలో రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా బలపడాలంటే విద్య ద్వారానే సాధ్యమని, శెట్టిబలిజ సంఘీయులు వారి పిల్లలను బాగా చదివించి వృద్ధిలోకి తీసుకురావాలని రాష్ట్ర కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో ఆదివారం నిర్వహించిన శెట్టిబలిజ సంఘీయుల వన భోజన మహోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. పట్టణానికి చెందిన 9 ఏళ్ల పల్లూల జాష్వా కిడ్నీ సమస్యతో బాధపడుతుండగా.. వాసంశెట్టి సుభాష్ రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, రెడ్డి సుబ్రహ్మణ్యం, జంగారెడ్డిగూడెం పురపాలక ఛైర్మన్ బత్తిన నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ సత్తిబాబు తెదేపా గీత కార్మికులకు అందిస్తున్న మేలు, ఇతర అంశాలు చెబుతున్న సమయంలో పట్టణానికి చెందిన పలువురు వైకాపా నాయకులు ఆయన ప్రసంగాన్ని అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. కొద్ది సేపటికి పరిస్థితి చక్కబడింది.

మంత్రి సుభాష్‌ను సత్కరిస్తున్న నాయకులు

★ పోలవరంలోని గోదావరి ఒడ్డున రిసార్ట్స్‌లో నిర్వహించిన కార్తిక వన సమారాధనలో చాపర్ల ఇంటిపేరుతో ఉన్న కుటుంబాలు ఆదివారం కలుసుకున్నాయి. ప్రగడపల్లి, రాజాపాలెం గ్రామాలకు చెందిన చాపర్ల వెంకటగిరి, వెంకట్రావు, వెంకటాచలం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అయిదు తరాలకు సంబంధించిన కుటుంబాలు పాల్గొన్నాయి.

ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

★ జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఆలపాటి గంగాభవాని కల్యాణ మండపంలో దేవతిబలిజ సంక్షేమ సంఘం 21వ కార్తిక వన సమారాధన కార్యక్రమంలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చింతలపూడి మండలం కాంతంపాలెంలోని ముత్యాలమ్మ అమ్మవారి సన్నిధిలో ఆదివారం జరిగిన సామూహిక వనభోజనాల కార్యక్రమంలోనూ ఎమ్మెల్యే రోషన్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లా మహాసభల విజయవంతానికి పిలుపు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: టి.నరసాపురం మండలంలో ఈనెల 5, 6 తేదీల్లో జరిగే ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ మండల కార్యదర్శి ఏ.ప్రభాకరరావు అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో మండల కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాయకులు పిల్లి పోతురాజు, బాలయ్య, ఎం.బాలరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

బయో గ్యాస్ ప్లాంట్ పరిశీలన

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: సంప్రదాయేతర వనరులను సమర్థవంతంగా వినియోగిస్తున్న ఆలయ అధికారులను కలెక్టర్ వెట్రిసెల్వి అభినందించారు. ద్వారకాతిరుమలలో శ్రీవారి గోశాల, బయో గ్యాస్ ప్లాంట్ వినియోగాన్ని ఆమె ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. శ్రీవారి దేవాలయంలో గోవర్ధన ప్రాజెక్ట్‌లో భాగంగా 1 టీపీడీ(టన్ పర్ డే) సామర్థ్యం కలిగిన బయో గ్యాస్ ప్లాంటును ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గోశాలలోని ఆవు పేడ, అన్నదానం నుంచి వచ్చే వ్యర్థాలతో బయో గ్యాస్ ఉత్పత్తి అవుతుందన్నారు. దేవాలయంలో పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ అభినందించారు. ఆలయంలో బయో గ్యాస్ 4 టీపీడీ సామర్థ్యానికి సరిపడా ముడి సరకు అందుబాటులో ఉంటుందని, ఆలయానికి 4 టీపీడీ సామర్థ్యం కలిగిన ప్లాంట్ మంజూరుకు సిఫార్సు చేయాలని ఆలయ డీఈ సూర్యనారాయణ కలెక్టర్‌ను కోరారు.

వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఆపదలో అండగా కూటమి ప్రభుత్వం

వేలేరుపాడు (గ్రామీణ), న్యూస్‌టుడే: ఆపదలో బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని జనసేన మండలాధ్యక్షుడు ఆదినారాయణ అన్నారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రుద్రంకోటకు చెందిన రామచంద్రరావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా మంజూరైన రూ.4 లక్షల చెక్కును ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆదివారం అందించినట్లు ఆయన తెలిపారు.

అడుగుకో గుంత

కనకాద్రిపురం నుంచి యర్రంపేటకు వెళ్లే ప్రధాన రహదారి 4.2 కి.మీల పొడవునా ఛిద్రమైంది. రహదారిలో భాగంగా ఉన్న పెద్ద చెరువు గట్టు పలుచోట్ల కుంగుతోంది. అంచులు కోతకు గురవడంతో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మధ్యలో రెండు చోట్ల చెరువులకు సంబంధించిన కల్వర్టులకు అప్రోచ్ రోడ్లు మెరుగు పరచాల్సి ఉంది. ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ సురేశ్ మాట్లాడుతూ. . ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామన్నారు.

- న్యూస్‌టుడే, కొయ్యలగూడెం గ్రామీణ

మురుగు పారక.. అవస్థలు తీరక

వేలేరుపాడులోని ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న డ్రెయినేజీ కాలువల పరిస్థితి అధ్వానంగా తయారైంది. కాలువల్లో పిచ్చి మొక్కలు, వ్యర్థాలతో మురుగు నీరు పారడం లేదు.

దీంతో దుర్వాసన, దోమల బెడద అధికంగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా.. పట్టించుకోవట్లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి కాలువలు బాగుచేయాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, వేలేరుపాడు గ్రామీణ

దేవుడికి పెట్టాల్సిన దండం.. దారికి పెడుతూ..

గుంజవరం సమీపంలో ఉమాసహిత భోగలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారి.. అధ్వానంగా మారింది. పోలవరం నుంచి ఇటుకల కోట వరకు గోతులతో దర్శనమిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గోతుల్లో నీరు నిలిచి ప్రమాదాలు జరుగుతున్నాయని భక్తులు ఆందోళన చెందుతున్నారు. దీంతో కార్తిక మాసం సందర్భంగా.. పూజలు చేసేందుకు ఆలయానికి వెళ్తున్న భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం గోతులు అయినా పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పోలవరం**

ప్రాథమిక అనారోగ్య కేంద్రం

నిత్యం వందలాది మంది రోగులతో కిటకిటలాడే వేలేరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. 40 ఏళ్ల కిందట నిర్మించిన ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు 2022 జులైలో వచ్చిన గోదావరి వరదలకు నీట మునిగి ఎందుకూ పనికి రాకుండా పోయింది. దీంతో ఖాళీగా ఉంటున్న సాంఘీక సంక్షేమ బాలుర వసతిగృహంలో ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి చాలీచాలని ఇరుకు గదుల్లో సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండగా.. ఆసుపత్రి చుట్టూ పొదలు పెరిగిపోవడంతో పాటు అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఈ విషయమై స్థానిక వైద్యాధికారి అకీబ్‌షరీఫ్ మాట్లాడుతూ.. వెంటనే పొదలు తొలగించడంతో పాటు పారిశుద్ధ్య పనులు చేయిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, వేలేరుపాడు**

స్వచ్ఛందంగా రోడ్డుకు మరమ్మతులు

ఏలూరు- జంగారెడ్డిగూడెం రహదారిలో తడికలపూడి నుంచి వీరిశెట్టిగూడెం అడ్డ రోడ్డు వరకు ఉన్న భారీ గుంతలను స్థానిక తెదేపా నాయకులు చొరవ తీసుకుని భారీ యంత్రాల సాయంతో ఆదివారం పూడ్చి వేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గోతులు మరింత ప్రమాదకరంగా మారాయి. ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో తడికలపూడి సహకార సంఘం ఛైర్మన్ తూతా బాలాజి కుమార్, నాయకులు బొంతు వెంకటేశ్వరరావు, మేరుగు సుందరరావు తదితర నాయకులతో కలిసి రెండు పొక్లెయిన్లు ఏర్పాటు చేయించి పనులు చేయించారు. మాజీ ఎమ్మెల్యే గంటా మురళీరామకృష్ణ పనులను పరిశీలించి నాయకులను అభినందించారు.

- న్యూస్‌టుడే, కామవరపుకోట

ఎర్రన్నాయుడి సేవలు చిరస్మరణీయం

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: తెలుగువాడి గొంతును దిల్లీలో బలంగా వినిపించిన ప్రజా నేత కింజరాపు ఎర్రన్నాయుడు అని వెలమ సంక్షేమ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు రాజాన సత్యనారాయణ అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని తాండ్ర పాపారాయుడు సెంటర్ వద్ద వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎర్రన్నాయుడు వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

కాశీబుగ్గ మృతులకు నివాళి

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన వారికి కొయ్యలగూడెంలో ఆదివారం నివాళులర్పించారు. వైకాపా పట్టణ అధ్యక్షుడు నూకల రాము ఆధ్వర్యంలో వినాయకుడి గుడి కూడలిలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి మౌనం పాటించారు.

ఆయుధ డిపో నిర్మాణం ఉపసంహరించుకోవాలి

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: వంకవారిగూడెం పంచాయతీ పరిధిలో నిర్మించ తలపెట్టిన ఆయుధ డిపోను ఉపసంహరించుకోవాలని ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు కోరారు. ఆయన నేతృత్వంలో నాయకుల బృందం దాట్లవారిగూడెం, కొత్తచీమలవారిగూడెం గ్రామాల్లో ఆదివారం పర్యటించింది. స్థానికులతో మాట్లాడి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

మలుపులు.. ప్రమాదాల పిలుపులు

వేలేరుపాడు గ్రామీణ, పోలవరం న్యూస్‌టుడే

పోలవరం, వేలేరుపాడు మండలాల నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే రహదారుల్లో భారీ మలుపులు ఉండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నా.. అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మలుపుల్లో దట్టంగా మొక్కలు పెరిగి.. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి మలుపుల్లో సూచికలు ఏర్పాటు చేస్తే.. కొంత మేర ప్రమాదాలను నివారించొచ్చని ప్రజలు చెబుతున్నారు.

హెచ్చరిక సూచికలు లేక ఇబ్బందులు

వేలేరుపాడు మండలం భూదేవిపేట- చాగరపల్లి, కోయమాధారం- మేడేపల్లి, రుద్రంకోట- వేలేరుపాడు గ్రామాల మధ్యలోని ప్రధాన రహదారుల్లో ఎక్కువ మలుపులు ఉన్నాయి. గతేడాది చాగరపల్లి- భూదేవిపేట మార్గంలో వేలేరుపాడుకు చెందిన రాజేశ్ అనే యువకుడు ద్విచక్ర వాహనంపై మలుపు వద్ద అదుపుతప్పి పడిపోయి మృతి చెందారు. ఇటీవల రామవరానికి చెందిన ప్రకాశ్ ద్విచక్రవాహనం అదుపుతప్పి నాగులగూడెం మలుపు వద్ద జరిగిన ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉండటంతో కూలీలు ఆటోలపై ప్రయాణాలు సాగిస్తున్నారు. తుప్పలు అధికంగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

రామన్నపాలెం- గుంజవరం గ్రామాల మధ్య ఇలా..

పోలవరం మండలం గార్లగొయ్యి- గుంజవరం వెళ్లే ప్రధాన రహదారిలో మలుపుల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు భవనాల శాఖ పరిధిలోని ఈ రహదారి ఇరువైపులా తుప్పలు పెరగడంతో వాహనాలు దగ్గరికి వచ్చే వరకు కనిపించడం లేదు. మలుపుల్లో ఎక్కడా ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఇంకొన్ని చోట్ల సూచికలను తుప్పలు కప్పేశాయి. 'మలుపుల వద్ద ఏర్పడిన తుప్పలు తొలగిస్తాం. ఆయా ప్రాంతాల్లో త్వరలోనే సూచికలు ఏర్పాటు చేయిస్తాం.' అని జంగారెడ్డిగూడెం ర.భ శాఖ డీఈ హరికృష్ణ తెలిపారు

ద్వారకాతిరుమలలో వరుస చోరీలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమలలో శనివారం రాత్రి వరుస దొంగతనాలు జరిగాయి. గ్రామానికి చెందిన కె.కాశిగుప్తా ఇంటిలో రూ.2.50 లక్షల నగదు, రెండున్నర కాసుల బంగారు వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. కె.కాశీ గుప్తా కుటుంబ సమేతంగా బంధువుల ఇంటిలో శుభకార్యానికి శనివారం ఊరు వెళ్లారు. ఆ రోజు రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు బీరువాను పగలగొట్టి.. అందులోని నగదు, బంగారు వస్తువులను దొంగిలించారు. కాశీ గుప్తా ఆదివారం ఉదయం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తలుపులు తీసి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి.. పోలీసులను ఆశ్రయించారు. ★ అదే రాత్రి గ్రామానికి చెందిన నరసింహారావు తన ఇంటి బయట నిలిపిన ద్విచక్ర వాహనాన్ని సైతం దొంగిలించారు.

అమ్మవారి విగ్రహం స్వల్పంగా ధ్వంసంపై ఫిర్యాదు

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: కొయ్యలగూడెంలో జాతీయ రహదారి పక్కనున్న నీలాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని శనివారం రాత్రి దుండగులు స్వల్పంగా ధ్వంసం చేశారని ఆర్ఎస్ఎస్ నాయకులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమ్మవారి విగ్రహ కళ్లను ధ్వంసం చేశారని ఆర్ఎస్ఎస్ నాయకుడు బొమ్మా బాబు పేర్కొన్నారు.

గొలుసు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: అక్రమంగా మద్యం నిల్వ చేసి అమ్మకాలు జరిపే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఆయన కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గత అక్టోబరు నెలలో అక్రమంగా మద్యం అమ్ముతున్న 9 మందిని అదుపులోకి తీసుకుని 74 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

శాకాహారంతో ఆరోగ్యకర జీవనం

భీమడోలు, న్యూస్‌టుడే: రోజూ శాకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరంగా జీవించవచ్చని పిరమిడ్ సొసైటీ శిక్షకులు అన్నారు. భీమడోలులో శాకాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ.. ప్రదర్శన చేపట్టారు. స్థానిక సాయిబాబా ఆలయ కూడలి నుంచి సంత మార్కెట్ మీదుగా బస్టాండు కూడలి వరకు ర్యాలీ సాగింది. జంతువులతో ప్రేమగా మెలగాలని ప్లకార్డులు ప్రదర్శించారు.

ప్రతి ఒక్కరూ ముందస్తు పరీక్షలు చేయించుకోండి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ అవగాహనతో ముందస్తుగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడంతో దాని బారిన పడకుండా అప్రమత్తంగా ఉండేందుకు వీలవుతుందని బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (హైదరాబాద్) వైద్యుడు రవిశంకర్ సూచించారు. బుట్టాయగూడెం విద్యారోహిణి డిజిటల్ స్కూల్, జంగారెడ్డిగూడెం ఏజెన్సీ లయన్స్ క్లబ్, భాజపా సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక విద్యారోహిణి పాఠశాలలో ఆదివారం క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. భాజపా ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షురాలు వంకా కాంచనమాల శిబిరాన్ని ప్రారంభించారు. 150 మందికి నిర్ధారణ పరీక్షలు చేసినట్లు భాజపా నియోజకవర్గ కన్వీనర్ కొండేపాటి రామకృష్ణ తెలిపారు.

శిబిరాన్ని ప్రారంభిస్తున్న కాంచనమాల

క్యాన్సర్ నిర్ధారణ ఉచిత వైద్య శిబిరం నేడు.. కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం ఏజెన్సీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కొయ్యలగూడెం వీఎస్ఎన్ జూనియర్ కళాశాల వద్ద సోమవారం క్యాన్సర్ నిర్ధారణ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వీఎస్ఎన్ స్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరంలో వైద్యులు సేవలందిస్తారన్నారు.

రహదారులకు మోక్షం

నిర్మాణానికి నిధుల మంజూరు

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధిపై గత ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడంతో ప్రధాన, అంతర్గత రహదారులు మొత్తం అధ్వానంగా మారాయి. చింతలపూడి నుంచి జంగారెడ్డిగూడెం, ఏలూరు- తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి, చింతలపూడి- కామవరపుకోట వైపు వెళ్లే ప్రధాన రహదారులు మొత్తం పెద్ద పెద్ద గుంతలతో నరక మార్గాలను తలపిస్తున్నాయి. గత ప్రభుత్వం రహదారులపై తట్టెడు మట్టి కూడా వేయలేదు. దీంతో వాహనాలపై బయటకు వెళ్లాలంటే గంటల సమయంతో పాటు దుమ్ము, ధూళితో అనారోగ్యం బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

చింతలపూడి-టి.నరసాపురం రోడ్డు దుస్థితి

కూటమి ప్రభుత్వ చర్యలు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారులపై ప్రత్యేక దృష్టి పెడుతోంది. దీనిలో భాగంగా గత పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు ర.భ శాఖ అధికారులు తెలిపారు. చింతలపూడి- టి.నరసాపురం రహదారి నిర్మాణానికి రూ.2 కోట్లు, చింతలపూడి- అల్లిపల్లికి రూ.2 కోట్లు, చింతలపూడి- కామవరపుకోటకు రూ.1.40 కోట్ల నిధులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. వీటిలో చింతలపూడి- టి.నరసాపురం రహదారి నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన వాటికి త్వరలో టెండర్లు వేయనున్నట్లు ర.భ శాఖ డీఈ శ్రీకర్ పేర్కొన్నారు.

(c) eenadu

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

నిరుద్యోగ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

అడవినెక్కలం(ఆగిరిపల్లి), న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండలం అడవినెక్కలంలోని 'సుదీక్షణ్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు పిరుదుపాటి విమల తెలిపారు. ఎం.ఎస్.ఆఫీస్ విత్ ఏఐ, డీటీపీ, టాలీ విత్ జీఎస్టీ కోర్సుల్లో 100 రోజుల శిక్షణ ఇస్తామని, అనంతరం ధ్రువపత్రం అందజేస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్, విద్యార్హత నకళ్లతో సుదీక్షణ్ ఫౌండేషన్ కార్యాలయంలో నేరుగా సంప్రదించవచ్చని, వివరాలకు చరవాణి 9642486811 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

కోర్కెలు తీర్చే కరుణామయీ శరణు.. శరణు..

కైకలూరు, న్యూస్‌టుడే: కోరిన కోర్కెలు తీర్చే కరుణామయీ శరణు.. శరణు.. అంటూ కొల్లేటి ప్రజల ఇలవేల్పు పెద్దింట్లమ్మ అమ్మవారిని భక్తులు వేడుకొన్నారు. కైకలూరు మండలం కొల్లేటికోట పెద్దింట్లమ్మ దర్శనానికి ఆదివారం పలు జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. సాధారణ భక్తులతో పాటు అమ్మవారి మాలధారులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి దర్శించుకున్నారు. ప్రధాన అర్చకుడు పరమేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కలశపూజ, సహస్ర నామార్చన, పంచ హారతులు, ధూప సేవలను ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు :80085 74698	ఆగిరిపల్లి: 9121229090
ముసునూరు :93983 81268	చాట్రాయి: 8008574700
కైకలూరు :73060 88555	మండవల్లి: 8106099008
కలిదిండి :90594 84862	ముదినేపల్లి: 8008574693

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు కొత్తపేటలో 7వ నంబరు విద్యుత్తు స్తంభం వద్ద పంచాయతీ వీధి దీపం కొన్ని రోజులుగా వెలగడం లేదని స్థానికుడు ఖాసీం 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ ఈవో వై.ప్రసాద్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన కొత్త దీపం ఏర్పాటు చేయించారు.

* కైకలూరు 2వ వార్డు సబ్ జైలుకు వెళ్లే మార్గంలో చెత్త కుండీ నిండి రోజులు గడుస్తున్నా వ్యర్థాలను తొలగించడం లేదని గ్రామస్థుడు రాజు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ ఈవో వై.ప్రసాద్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన చెత్త తొలగింపజేశారు.

కరదీపిక.. ప్రగతి వీచిక..!

సత్ఫలితాలు ఇస్తున్న సంస్కరణలు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తోంది. నూతన సంస్కరణలతో సత్ఫలితాలు తీసుకొస్తోంది. సర్కారు బడుల్లో చేపడుతున్న మార్పులు విద్యాభివృద్ధికి దోహదపడుతున్నాయి. తొలిసారిగా ఉపాధ్యాయులకు కరదీపిక (హ్యాండ్ బుక్) పేరిట పుస్తకాలు అందజేసింది. ఎస్సీఈఆర్టీ సహకారంతో సమగ్ర శిక్షా ద్వారా 'సామర్థ్య ఆధారిత బోధన - ఉపాధ్యాయ వనరు' పేరుతో రూపొందించింది. బోధనలో కొత్తదనం ప్రోత్సహించేలా, మూస విధానాన్ని స్వస్తి పలికేలా వీటిని రూపొందిద్దింది.

సబ్జెక్టుల వారీగా.. నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల్లో 268 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 17,891 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు సబ్జెక్టుల వారీగా కరదీపికలు రూపొందించారు. ఒక్కో ఉపాధ్యాయుడు వారి తరగతుల ఆధారంగా ప్రతి పీరియడ్‌లోనూ బోధన సమయం, ఉపయోగించిన టీఎంఎల్, అభ్యసన కృత్యాలు, రిమార్కులను వీటిలో పేర్కొంటున్నారు. అకడమిక్ క్యాలెండర్‌లోని పని దినాలతో దీన్ని అనుసంధానం చేశారు. ఏరోజు ఏయే సబ్జెక్టులు, అంశాలు ఎలా చెప్పాలో వీటిలో తేటతెల్లం చేశారు. విద్యా ప్రగతికి కరదీపికలు ఎంతో దోహదపడతాయని నూజివీడు డివైఈవో పీఎస్ సుధాకర్ తెలిపారు.

నియోజకవర్గ సమాచారం..

మండలం	ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థులు
నూజివీడు	93	7,186
ఆగిరిపల్లి	50	3,907
ముసునూరు	62	3,426
చాట్రాయి	63	3,372

వాసవీ మాతకు లక్ష బిల్వార్చన

కైకలూరు, న్యూస్‌టుడే: కార్తిక మాసోత్సవాలను పురస్కరించుకుని కైకలూరు వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆదివారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకుల ఆధ్వర్యంలో వైభవోపేతంగా లక్ష బిల్వార్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛారణలతో ఆలయ ప్రాంగణంలో రుద్రహోమం జరిపారు.

వైభవం.. దీపోత్సవం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: కార్తిక మాసం పురస్కరించుకుని పెద రామాలయంలో ఆదివారం దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలు ఆలయ ఆవరణలో భక్తి శ్రద్ధలతో దీపాలు వెలిగించారు. త్రిశూలం, శివలింగం, ఓం, పద్మం, శంఖు, చక్రాలు, మూడు నామాలు, నాగపాము ఆకారంలో దీపాలు వెలిగించి పూజలు చేశారు.

ద్వాదశి పూజలు.. ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లిలోని గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి, దుర్గా పార్వతీ సమేత మల్లికార్జున స్వామి ఆలయాల్లో కార్తిక మాస శుద్ధ ద్వాదశి సందర్భంగా ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పంచామృత, ఫలామృత అభిషేకాలు ఆలయ ఈవో సీహెచ్ సాయి పర్యవేక్షణలో అర్చకులు బేతపూడి శ్రీనివాసమూర్తి వైభవంగా నిర్వహించారు. ఆకాశ దీపం వెలిగించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు.. ముదినేపల్లి, న్యూస్‌టుడే: సింగరాయపాలెం- చేవూరుపాలెం సెంటరులోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కార్తిక మాసం స్వామివారికి ప్రీతికరమైన ఆదివారం కావడంతో భక్తులు పెద్దఎత్తున దర్శనానికి తరలివచ్చారు. పుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. అభిషేకాలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఏసీ ఆర్. గంగా శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక వ్రతాలు.. మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం లోకుమూడి గంగానమ్మ ఆలయం వద్ద కార్తిక మాసాన్ని పురస్కరించుకుని సామూహిక వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఇందులో పెద్దఎత్తున మహిళలు, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. లక్ష బిల్వార్చన, లలిత సహస్ర నామార్చనలు, కుంకుమ పూజలు చేసి చల్లగా కాపాడాలని వేడుకున్నారు.

శిరస్త్రాణం ధరించండి.. సురక్షితంగా గమ్యం చేరండి

అవగాహన కల్పిస్తున్న ఎస్సై శుభశేఖర్

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించడం ద్వారా సురక్షితంగా గమ్యం చేరుకోవచ్చని ఎస్సై శుభశేఖర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం నూజివీడు - విజయవాడ ప్రధాన రహదారిలో ఆగిరిపల్లి మండలం వడ్లమాను వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. ప్రతి ఒక్కరు రహదారి నిబంధనలు పాటించాలని, మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని, మద్యం తాగి, మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యం

చాట్రాయి, న్యూస్‌టుడే: రైతుల శ్రేయస్సు లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని తెదేపా జిల్లా నాయకుడు మరిడి వెంకటేశ్వరరావు తెలిపారు. పోలవరం సహకార సంఘ సభ్యుడు పిల్లి వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందగా సంఘం ఛైర్మన్ ప్రసాదరావు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం ఆయన కుటుంబానికి అందించారు. నాయకులు బలుసు జయరాజు, వజ్జిర చెన్నారావు, రైతులు పాల్గొన్నారు.

సందడిగా ఆర్యవైశ్య వన సమారాధన

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండలం ఆర్యవైశ్యుల కార్తిక వనసమారాధన ఆదివారం మామిడి తోటలో సందడిగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు, యువత, చిన్నారులు చేరి ఆటపాటలతో సందడి చేశారు. చెట్లకు పూజలు చేశారు. రాష్ట్ర వాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమ సేవా సంఘం ఆవిర్భావ సంబరాలు వ్యవస్థాపక సభ్యుడు జూలూరు కోటేశ్వరరావు, తవ్వా మురళీధర్, టీవీఎస్ కిరణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఇద్దరికి రూ.12వేలు అందించిన మంత్రి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పీ4 కార్యక్రమంలో భాగంగా ఆగిరిపల్లి మండలంలోని వడ్లమానుకు చెందిన ఇద్దరికి మంత్రి కొలుసు పార్థసారథి రూ.12 వేలు అందించారు. ఆదివారం నూజివీడులో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ నగదు ఇచ్చారు. గ్రామ నాయకులు జె.వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండల సర్వ సభ్య సమావేశం ఈ నెల 4న మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోళ్ల అనూష అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.భార్గవి తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె సూచించారు.

ప్రకృతి వ్యవసాయాన్ని అందిపుచ్చుకోండి

కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న శిక్షకుడు

మండవల్లి, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయాన్ని అందిపుచ్చుకుని తక్కువ వ్యయంతో మెరుగైన ఫలితాలు సాధించాలని మాస్టర్ ట్రైనర్ గౌతమ్ పేర్కొన్నారు. మండవల్లి మండలం అల్లినగరంలో ఆకు ముడత, లద్దె పురుగు నివారణకు బ్రహ్మాస్త్రం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో గో ఆధారిత ఎరువులు, కషాయాలు ఎంతో సమర్థంగా పనిచేస్తున్నాయని వివరించారు. ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబిస్తే రైతుల ఆరోగ్యంతో పాటు భూమి, కుటుంబాల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారని వివరించారు. ఇందులో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

వణుదుర్రులో కార్తిక దామోదర మహావ్రతం

గోపూజ

ముదినేపల్లి, న్యూస్‌టుడే: వణుదుర్రులోని రాధాకృష్ణ క్షేత్రంలో 42వ వార్షికోత్సవం సందర్భంగా కార్తిక దామోదర మహావ్రతం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గోపూజ, రాధాకృష్ణ కల్యాణం, భగవద్గీత పారాయణం నిర్వహించారు. భక్తులు, గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొని తిలకించారు. అనంతరం నిర్వహించిన కార్తిక వన సమారాధనలో పెద్దఎత్తున భక్తులు పాల్గొని సహపంక్తి భోజనాలు చేశారు. పుత్తూరు జగన్నాథ సేవా ఆశ్రమ పీఠాధిపతి శివానందగిరి స్వామి, ఆశ్రమ నిర్వాహకులు పురుషోత్తమానందగిరి స్వామి పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణం పరిశీలన

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పట్టణంలో హనుమాన్ జంక్షన్ రహదారిలో జరుగుతున్న డ్రెయిన్ నిర్మాణ పనులను ఆదివారం మంత్రి కొలుసు పార్థసారథి పరిశీలించారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, మాజీ కౌన్సిలర్ అన్నే జయచంద్ర శ్రీనివాస్‌లు డ్రెయిన్ పరిస్థితిని మంత్రికి వివరించారు. రహదారిపై ఎట్టి పరిస్థితిలో నీరు నిల్వ ఉండకుండా డ్రెయిన్, రహదారి నిర్మాణం ఉండాలన్నారు. ఒక వైపున ఫుట్‌పాత్ ఏర్పాటు చేస్తే ఏ విధంగా ఉంటుందో పరిశీలించాలని సూచించారు. పట్టణ అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీశ్, పార్టీ మండల అధ్యక్షులు యనమదల వాసు తదితరులు పాల్గొన్నారు. మొఘల్ చెరువు కట్ట దిగువున ఆక్రమించి నిర్మించిన షాపుల గురించి మాట్లాడకపోవడంపై స్థానికులు గుసగుసలాడారు.

పనులు పూర్తి చేయకపోతే టెండర్లు రద్దు.. పురపాలక సంఘంలో గుత్తేదారులు డిసెంబరు 10లోపు పనులు చేయకపోతే టెండర్లు రద్దు చేస్తామని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. కౌన్సిలర్లు, గుత్తేదారులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. రెండు గంటల పాటు పనులు తదితరాల పై సమీక్ష చేశారు. అభివృద్ధి పనుల్లో అవకతవకలను క్షమించేది లేదన్నారు. గతంలో జరిగిన పనులకు సంబంధించి ఎంబుక్‌లను ఆడిట్ సరైన సమాధానం చెప్పని ఇంజినీరింగ్ సిబ్బందిని ప్రభుత్వానికి సరెండర్ చేస్తానని హెచ్చరించారు. జనరల్ ఫండ్ నిధులను ఆయా వార్డుల్లో అభివృద్ధి పనులకు సమానంగా కేటాయించాలన్నారు. ఆర్థిక క్రింద చేసిన పనుల చెల్లింపులు జగనరెడ్డి మంత్రికి గుత్తేదారులు వివరించారు. రూ.15 కోట్లతో ఏ పనులు జరగకుండా పక్కాగా రికార్డులను అందించాలన్నారు. మరో రూ.8 కోట్లు అవసరమని పురపాలక శాఖ మంత్రికి విన్నవించానన్నారు. పారిశుద్ధ్య సమస్యలపై సచివాలయ శానిటేషన్ సెక్రటరీని ప్రశ్నించారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు మల్లిశెట్టి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి డీఈ, కమిషనర్ గైర్హాజరయ్యారు.

మంత్రి పార్థసారథికి వివరిస్తున్న దుర్గాప్రసాద్

పట్టు జారితే ప్రమాదమే

కైకలూరు, న్యూస్‌టుడే: వాహన ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించాలని పోలీసు, రవాణా శాఖ అధికారులు మొత్తుకుంటున్నా కొందరికి తలకెక్కడం లేదు. ప్రమాదకరంగా రవాణా వాహనాల్లో ప్రయాణాలు చేయడం పరిపాటిగా మారింది. ఇక ఆదివారం ఓ వ్యక్తి ఇటువంటి ప్రమాదకర ప్రయాణమే సాగించాడు. మండలంలోని రామవరం-ఉప్పుటేరు ప్రధాన రోడ్డు మార్గంలో కొబ్బరికాయలు రవాణా చేస్తున్న ఓ ట్రక్కు వ్యాన్ వెనుక ఇనుప కడ్డీపై నిలబడి ప్రమాదకర ప్రయాణం చేశాడు. 50-60 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్న వాహనం నుంచి ఊతంగా పట్టుకున్న చేయి ఏమాత్రం పట్టు కోల్పోయినా రోడ్డుపై పడితే ప్రాణాల మీదకు రావడం ఖాయం.

అమ్మో కొచ్చర్ల.. వైవాక రహదారి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: కలిదిండి మండలం కొచ్చర్ల నుంచి ముదినేపల్లి మండలం వైవాక వెళ్లే రహదారి గోతులు పడి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు కిలోమీటర్ల మేర రహదారి ధ్వంసమై పక్కనే ఉన్న కాలువ నీరు రహదారిపైకి చేరుతోంది. ఏ గుంత లోతు ఎంతో తెలియక అవస్థలు పడుతున్నారు. వాహనదారులు తప్పించుకోలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ ఏఈ సత్య అరవింద్‌ను సంప్రదించగా మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.

నేలపై చదువులు.. చిన్నారుల అవస్థలు..

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం పెరికెగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు నేలపై కూర్చుని విద్యనభ్యసించాల్సి వస్తోంది. గతంలో ఈ పాఠశాల 8వ తరగతి వరకు మాత్రమే ఉండేది. ప్రస్తుతం 150 మంది ఉన్న ఈ పాఠశాలను పదో తరగతి వరకు వర్గోన్నతి కల్పించారు. కానీ అందుకు తగ్గ వసతులు మాత్రం కల్పించలేదు. నూతనంగా నిర్మిస్తున్న గదుల్లో నేలపై కూర్చొని రోజంతా చదవాల్సి వస్తోంది. దీనిపై ఉపాధ్యాయులను సంప్రదించగా మరో రెండురోజుల్లో కిటికీలు, తలుపులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పగిలిన పైపులు.. పారుతున్న నీరు.

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండల కేంద్రంలో జాతీయ రహదారి 165 కింద ఉన్న తాగునీటి పైపులు పగిలి పోవడంతో నీరు రోడ్డుపై పారుతోంది. రోడ్డు విస్తరణ సమయంలో నాసి రకమైన పైపులు వేయడంతోనే ఎప్పటికప్పుడు అవి పగిలి పోతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మరో పక్క ఇప్పటికే పలు మార్లు పగిలి పోవడంతో ప్రజలకు పూర్తి స్థాయిలో నీరు అందడం లేదని వాపోతున్నారు. డ్రెయినేజీ నీరు పైపుల్లోకి చేరి ఆ నీరే కుళాయిల ద్వారా రావడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వాపోతున్నారు. దీనిపై కార్యదర్శి గిరిజను వివరణ కోరగా . . పైపులకు మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

ఎరక్కపోయి వెళ్తే.. ఇరుక్కుపోవడమే!

మండవల్లి, న్యూస్‌టుడే: ఎరక్కపోయి ఇంగిలిపాకలంక -పెనుమాకలంక రోడ్డులోకి వాహనాలతో వెళ్తే.. ఇరుక్కుపోతున్నామని వాహనదారులు లబోదిబోమంటున్నారు. తుపాను కారణంగా కురిసిన వర్షాలకు రోడ్డు మొత్తం బురదతో దారుణంగా తయారైంది. ఇక చినుకు పడితే వాహనాలు ముందుకు వెళ్లే పరిస్థితి లేదు. వర్షం ధాటికి గుంతల్లో నీరు చేరి చేపల చెరువులను తలపిస్తున్నాయి. పెనుమాకలంక రోడ్డు పెదఎడ్లగాడివైపు కొల్లేరు వరదలో ఉంది. రాత్రిపూట ఏదైనా అత్యవసరంగా ఈ రోడ్డులో వెళ్లాలంటేనే నరకం కనిపిస్తోంది.

ఉద్యాన రాయితీలనేకం.. చేసుకోవాలి సద్వినియోగం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతు ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తోంది. ఉద్యాన పంటలను సాగు చేసే రైతుల కోసం పలు రాయితీలందిస్తూ ప్రోత్సహిస్తోంది. రైతన్నలు సద్వినియోగం చేసుకుంటే ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఏలూరు జిల్లా సహాయ ఉద్యాన సంచాలకులు కె.సంతోష్ తెలిపారు. జిల్లా పరిధిలో 2.76లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయన్నారు. ఆయిల్‌పామ్, కొబ్బరి, కోకో, మామిడి, అరటి, కూరగాయ పంటల సాగు ఇందులో కీలకమన్నారు. నూజివీడు వచ్చిన ఆయన 'న్యూస్‌టుడే' అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

కె.సంతోష్, ఏడీ, ఉద్యానశాఖ

? న్యూ: జిల్లాలో ఏ పంటలు సాగుకు అనుకూలంగా ఉన్నాయి.

» ఉ: ఆయిల్‌పామ్, కొబ్బరి, కోకో, మామిడి, అరటి, జామ, కూరగాయల సాగుకు అనుకూలం. రైతు సేవా కేంద్రంలో ఉద్యాన పంటలు రాయితీల వివరాలు పొందవచ్చు.

? కోకో రైతులకు సోలార్ డ్రయ్యర్లు అందుబాటులోకి వచ్చాయా?

» డ్రయ్యర్లకు రూ.1.40 లక్షలు రాయితీ ఉంది. కావాల్సిన వారు సంప్రదించవచ్చు.

? మొంథా తుపాను నష్టం ఉద్యాన పంటలపై ఏ విధంగా ఉంది.

» రెండు మూడు రోజులు తరువాతే ఏ పంటకు ఎంత మేర నష్టం జరిగింది అన్న వివరాలు తెలుస్తాయి. ఇప్పటికే ఉద్యానాధికారులు, ఆర్ఎస్‌కేలో ఉండే ఉద్యాన, వ్యవసాయ సహాయకులను వివరాలను సేకరించాలని అప్రమత్తం చేశాం.

? మామిడి రైతులు తోటలను నరికి వేస్తున్నారు. మామిడి రైతు అభివృద్ధికి ఏ కార్యక్రమం చేపట్టారు.

» మామిడి తోటల పునరుద్ధరణ పథకంలో 125 ఎకరాలు ఇప్పటికే కొత్త మొక్కలు నాటాం. ముందుకు వచ్చే ప్రతి రైతుకు అవకాశం ఉంది.

? ఆయిల్ పామ్, కోకో రైతులకు ఏ విధమైన ప్రోత్సాకాలు అందుబాటులో ఉన్నాయి.

» ఆయిల్ పామ్‌కు హెక్టారుకు రూ.71 వేలు, కోకోకు రూ.30వేలు రాయితీ ఉంది. మినీ ట్రాక్టరుకు రూ.2 లక్షలు, మట్టలు కోసే మిషన్ రూ.68 వేలు కాగా 50శాతం రాయితీ ఉంది. కోకో గింజలు క్వాలిటీ కోసం ప్యాక్ హౌస్‌కు జీడిమామిడి, కోకో ప్రాసెసింగ్ ప్లాంట్లకు రాయితీ లభిస్తుంది.

జూదరుల అరెస్టు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలెంలో గుట్టు చప్పుడు కాకుండా జూద శిబిరం నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై వీరభద్రరావు, సిబ్బందితో కలిసి ఆదివారం సాయంత్రం దాడి చేశారు. జూదమాడుతున్న పది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.4,100 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పెదపాలపర్రులో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మురమళ్ల సీతారత్నం కుటుంబ సభ్యులను ఆదివారం వైద్యుడు అంబుల మనోజ్ పరామర్శించారు. నిరుపేద కుటుంబం కావడంతో కార్యక్రమం నిర్వహించడానికి రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి తరఫున ఆమె తండ్రి మనోజ్ వారికి అందించారు.

అపూర్వ కలయిక

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: వారంతా 1984-85 సంవత్సరంలో ఎస్ఆర్ఆర్ పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు.. నలభై ఏళ్ల తరువాత కలిసినా ఆనాడు తరగతి గదిలో చేసిన అల్లరి పనులు అందరి మదిలో మెదిలాయి. ఒకరిపై ఒకరు జోకులేసుకుంటూ నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు పాదం సత్యనారాయణ తోటలో ఆదివారం హాయిగా గడిపేశారు. సరదా కబుర్లతో పాటు కుటుంబ సభ్యుల వివరాలను తెలుసుకున్నారు. కల్మషం లేకుండా గడిపిన ఆనాటి రోజులతో ఇప్పటి రోజులను పోల్చుకుని సరదా మాటలతో మురిసిపోయారు. ఇటీవల మృతి చెందిన మిత్రులకు వారి కుటుంబ సభ్యులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పసందైన విందు భోజనం స్వీకరించి పలు జ్ఞాపకాలను కూడబెట్టుకొని ఇళ్లకు పయనమయ్యారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ వాకా రాజకుమార్, మాజీ కౌన్సిలర్ పాదం సత్యనారాయణ, వ్యాపారవేత్తలు కె.రాజేశ్ ప్రసాద్, అన్వర్ బాషా, అచ్యుత్, శ్రీధర్, పలగాని శ్రీనివాస్, వ్యవసాయశాఖ ఏడీ సునీల్, డాక్టర్ దేవ, విద్యుత్తు శాఖ నుంచి ఆర్వీ రామారావు, ఎన్ఆర్ఐ విజయ్‌రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు పరిమి సాగర్, ఎన్నెస్పీ సతీశ్, పీఈటీ సూర్యారావు, రెవెన్యూ నుంచి రాజబాబు, ఎల్ఐసీ సీనియర్ మేనేజర్ సుధాకర్, సర్దార్ ఖాన్, పలు సంస్థల్లో పని చేస్తున్న ఇతర మిత్రులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ పాఠశాలలో 1984-85 బ్యాచ్ విద్యార్థులు

సాంకేతికత, నైపుణ్యాభివృద్ధికి వేదిక

ఎంపికైన విద్యార్థులకు పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో నిర్వహించే హ్యాకథాన్ లాంటి సాంకేతిక పోటీలతో విద్యార్థులు సాంకేతిక, సృజనాత్మక నైపుణ్యాలను ప్రదర్శించడానికి, వినూత్న సమస్యలు, ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి ఒక వేదికగా నిలుస్తాయని ఎన్ఆర్ఐ ఛైర్మన్ డా.రావి వెంకటరావు, నెక్స్ట్‌వేవ్ ప్లేస్‌మెంట్స్ హెడ్ గిరీశ్, హెచ్‌సీఎల్ డైరెక్టర్ రామకృష్ణలు తెలిపారు. ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న 'బిల్డ్ థాన్-2025' ఆదివారం ముగిసింది. ఏపీ, తెలంగాణలకు చెందిన 250 మంది విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలను సాంకేతిక పరిజ్ఞానం ప్రదర్శించగా 13 మంది జాతీయ స్థాయికి ఎంపికయ్యారని వారు తెలిపారు. వారికి ఫైనలిస్ట్ పురస్కారాలు అందించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

రమేశ్(పాతచిత్రం)

ముసునూరు, న్యూస్‌టుడే: పురుగుల మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన ముసునూరు మండలం సూరేపల్లిలో జరిగింది. ఎస్సై ఎం.చిరంజీవి కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఆముదాల రమేశ్ (52) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మద్యానికి బానిసై కొంతకాలం నుంచి పనులు చేయకుండా ఇంటి వద్దే ఖాళీగా ఉంటున్నారు. ద్విచక్రవాహనం కొనుక్కోవాలని, రూ.లక్ష బ్యాంకుకు వెళ్లి తీసుకురమ్మని భార్య శ్యామలకు చెప్పారు. ఈ నెల 1న ఆమె బ్యాంకుకు వెళ్లి రూ.50 వేలు మాత్రమే తీసుకు రావడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన రమేశ్ వ్యవసాయ పనులకు ఉపయోగించే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వైద్యం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో విజయవాడకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

మురుగు బోదెలు కనుమరుగు

అడుగడుగునా ఆక్రమణలు.. నీరెళ్లే దారిలేక ఇక్కట్లు

కైకలూరు, మండవల్లి, న్యూస్‌టుడే: ఆక్వా రంగంలో రాష్ట్రానికే తలమానికంగా ఉన్న కైకలూరు నియోజకవర్గంలో డ్రెయిన్లు, కాలువ గట్లను ఆక్రమించడంతో ముంపు తప్పడం లేదు. కొందరు రైతుల స్వార్థంతో వందలాది మంది రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరువుల్లో నీరు నింపుకోవాలన్నా వ్యర్థ నీటిని బయటకు పంపాలన్నా కచ్చితంగా చెరువుల చెంత పంట, మురుగు బోదెలు ఉండాల్సిందే. కానీ నియోజకవర్గంలో 85 వేల ఎకరాల్లో ఆక్వా చెరువులు ఉండగా సుమారు 35 వేల ఎకరాల్లో మురుగు బోదెలు లేని దుస్థితి.

అంతా ఆక్రమణే

ఇష్టానుసారంగా చెరువుల తవ్వకాలు చేస్తూ కంచె చేను మేసిన చందంగా పంట, మురుగు బోదెలను కనుమరుగు చేస్తున్నారు. ఇక రోడ్డు వెంబడి ఉన్న బోదెల్లో తూములు ఏర్పాటు చేయకుండా లారీలు చెరువుల వద్దకు చేరేలా సమాంతరంగా పూడ్చేస్తున్నారు. చెరువుల్లో నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో మోటార్లతో రాత్రి వేళల్లో నీటిని రోడ్లపై తోడుతున్నారు. వరహాపట్నం-ఉప్పుటేరు రోడ్డు 20 రోజుల నుంచి నేటికీ నీటిలో నానుతుంది. ప్రజాధనంతో నిర్మించిన రోడ్లు ఏడాదిలోనే పాడై గుంతల మార్గాల్లో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు.

■ పుల్లవా మురుగు కాలువ వెంబడి ఆక్వా చెరువుల బోదెలను కొందరు రైతులు ఆక్రమించేశారు. ఈ కాలువ వెంబడి చెరువులకు, కాలువకు కలిపి ఒకటే గట్టు ఉంది.

■ వరహాపట్నం - సీతనపల్లి ప్రధాన రోడ్డు మార్గం వెంబడి ఆక్వా చెరువుల చెంతన ఉండే మురుగు బోదెలను కొందరు పూడ్చేసి వ్యర్థ నీటిని రోడ్లపై వదులుతున్నారు.

■ మండవల్లి మండలం పెరికెగూడెం నుంచి మొదలైన శ్యాంప్ డ్రెయిన్ 14 కిలో మీటర్ల తర్వాత కొల్లేరులో కలిసే వరకు ఇరువైపుల గట్లను ఆక్రమించడంతో వర్షకాలంలో చెరువులు, పొలాలు ముంపు బారిన పడుతున్నాయి.

ఆక్వాచెరువుల నీటిని రోడ్లపైకి తోడటంతో 20 రోజులుగా వరహాపట్నం-సీతనపల్లి ప్రధాన రోడ్డు దుస్థితి

కేసులు నమోదు చేస్తాం

ఇష్టారాజ్యంగా నీటిని రోడ్లపై వదిలితే సహించేది లేదు. బోదెలను సొంతగా మరమ్మతులు చేసుకుని అవసరమైన తూములు ఏర్పాటు చేసుకోవాలి. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేయిస్తాం.

\- కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	కె ర్యాంప్
సత్యనారాయణ మినీ	కర్మణ్యే వాధికారస్తే
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	బాహుబలి ది ఎపిక్
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	మాస్ జాతర
ద్వారక సినిమాస్ స్క్రీన్ 3	----
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	తెలుసు కదా
కైకలూరు: విజయలక్ష్మి జీ3	బాహుబలి ది ఎపిక్
మాగంటి సినిమాస్	బైసన్
శ్రీవెంకటరమణ సినిమాస్	మాస్ జాతర
ముదినేపల్లి: పూర్ణిమ	మాస్ జాతర

(c) eenadu

తుపాను వేళ..

ప్రస్తుతం ఇలా..

కడలి.. వెడలి..!

మొంథా తుపానులో రెండు రోజుల కిందట వరకు సముద్రంలో ఎగసిపడిన అలలు ప్రస్తుతం శాంతించాయి. ప్రస్తుతం సముద్రంలో ప్రశాంత వాతావరణం నెలకొంది.. దీంతో మొన్నటివరకు ముందుకొచ్చిన సముద్రపు అలలు వెనక్కి వెళ్లాయి. తీర ప్రాంత ప్రజలు భయం గుప్పిట నుంచి క్రమంగా బయటపడుతున్నారు. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ వద్ద నాడు, నేడు చిత్రాలే అందుకు నిదర్శనం. - ఈనాడు, కాకినాడ

బ్యారేజీ వద్ద బురద తొలగింపు ప్రక్రియ వాయిదా

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఎగువన భారీ వర్షాలు కురవడంతో గోదావరికి వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ కారణంగా కాటన్ బ్యారేజీ వద్ద సోమవారం చేపట్టాల్సిన బురద తొలగింపు ప్రక్రియను అధికారులు వాయిదా వేశారు. వాస్తవంగా 3న పశ్చిమ డెల్టా, 4న మధ్య డెల్టా, 5న తూర్పు డెల్టా గేట్ల వద్ద ఫ్లషింగ్ కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది. వరద నీరు తగ్గిన తరువాత ఈ ప్రక్రియ ఎప్పుడు నిర్వహించేదీ తెలియజేస్తామని గోదావరి ప్రధాన పనుల విభాగం ఏఈ డి.రాధాకృష్ణ తెలిపారు.

పీత ప్రియం..!

కాకినాడ కుంభాభిషేకం రేవులో ఆదివారం పలు రకాల చేపలతోపాటు మండ పీతలు అమ్మకానికి వచ్చాయి. తుపాను కారణంగా రేవులో అయిదు రోజులపాటు అమ్మకాలు నిలిచిపోయాయి. రెండు రోజులుగా మళ్లీ చేపల అమ్మకాలు జోరందుకున్నాయి. అర కేజీ నుంచి కేజీకిపైగా బరువున్న మండ పీతలు రాగా ఆదివారం ఆయా పీతలు రూ.1000 నుంచి రూ.1500 వరకు ధర పలికాయని మత్స్యకారులు తెలిపారు. - న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

అలరించె తెప్ప.. అదిగదిగో మలయప్ప..

క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా ఆదివారం కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరుని తెప్పోత్సవం గౌతమి గోదావరిలో వైభవంగా సాగింది. స్వామివారికి ఈవో నల్లం సూర్యచక్రధరరావు పట్టువస్త్రాలు సమర్పించారు. - న్యూస్‌టుడే, వాడపల్లి(ఆత్రేయపురం)

మహిళా మార్ట్.. ఫలితం ఫట్..!

పర్యవేక్షణ కరవై నష్టాలు

– న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

నిర్మాణం అలా..

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల డ్వాక్రా మహిళలు చేయూత మహిళా మార్ట్‌ల పేరుతో వ్యాపార రంగంలోకి అడుగు పెట్టారు. రూ.200 చొప్పున వాటా చెల్లించారు. చేయూత మహిళా మార్ట్ మ్యూచువల్ కోఆపరేటివ్ సొసైటీ(మాక్స్)ను రిజిస్టర్ చేశారు. మండల మార్ట్ కమిటీ ఏర్పాటు చేసి డ్వాక్రా సభ్యులే అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి, డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. డీఆర్‌డీఏ-సెర్ప్‌కు చెందిన మండల ఏపీఎం పర్యవేక్షణ చేసేలా కార్యాచరణ రూపొందించారు.

ఏర్పాటు ఇలా..

యు.కొత్తపల్లిలో 2023లో తొలుత మార్ట్ ఏర్పాటు చేశారు. దశలవారీగా కిర్లంపూడి, తాళ్లరేవు(కోరంగి), తొండంగి(ఎ.కొత్తపల్లి)లో నెలకొల్పి నిర్వహించారు. 2024లో ఎన్నికల కోడ్ వచ్చే వరకు ఇవి బహిరంగ మార్కెట్‌కు పోటీగా పనిచేశాయి. డ్వాక్రా సభ్యులే కాకుండా, ఇతరులూ సరకులు కొనేవారు.

ఎన్నికల నియమావళి(కోడ్)తో వీటి నిర్వహణ బాధ్యతలు అప్పటివరకు రోజుకు ఒక్కో మార్ట్‌లో సరాసరి రూ.60 వేల వరకు విక్రయాలు జరిగేవి. ఎన్నికల అనంతరం వీటి పర్యవేక్షణను గాలికొదిలేయడంతో అమ్మకాలు కనిష్ఠ స్థాయికి పడిపోయి దివాళా తీసే స్థితికి చేరాయి. ఈ ఏడాది ఏప్రిల్

తొండంగి మండలం ఎ.కొత్తపల్లిలోని దుకాణం

ఆ తరువాత ఏమైంది..

నుంచి డీఆర్‌డీఏ పీడీగా వచ్చిన శ్రీనివాసరావు వీటిని గాడిలో పెట్టేందుకు ప్రయత్నించారు. క్రమేపీ ఒక్కో మార్ట్‌లో రోజువారీ అమ్మకాలు రూ.70 వేల వరకు పెరిగాయి. సిబ్బంది సహకారం లేకపోవడంతో, నిర్వహణ గాడి తప్పి ప్రస్తుతం రోజుకు రూ.30 వేలకు పడిపోయాయి.

● ఒక్కో మార్ట్‌కు రూ.40 లక్షలతో ఏర్పాటు చేశారు. రెండు చోట్ల అద్దె, మరో రెండు చోట్ల సొంత భవనాల్లో నిర్వహిస్తున్నారు. డీఆర్‌డీఏ సిబ్బంది సక్రమంగా పనిచేయకపోవడం, కొన్నిచోట్ల చేతివాటం ప్రదర్శించడంతో నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. ఎన్నికలప్పుడు రూ.4 లక్షల సరుకులు పనికి రాకుండా పోయాయి. ● తాళ్లరేవు మార్ట్‌లో రూ.15.81 లక్షల మేర అవకతవకలు జరిగాయని గుర్తించిన అధికారులు నలుగురిని విధుల నుంచి తప్పించారు.

ముంచేశారు..?

విచారణ చేయగా.. సరుకులు అప్పుగా ఇచ్చామని సిబ్బంది చెప్పుకొచ్చారు. కిర్లంపూడి మార్ట్‌లో రూ.6 లక్షల వరకు లెక్క తేలలేదు. రూ.3.50 లక్షలు రికవరీ చేశారు. ● యు.కొత్తపల్లిలో రూ.44 లక్షలతో పెట్టిన మార్ట్ సిబ్బంది నిర్వాకంతో నష్టాల్లో వెళ్లింది. ఇక్కడ రూ.30 లక్షలతో ఫర్నీచర్, ఇతర సామగ్రి కొన్నామని చెబుతున్నా.. అవి అంత ఖరీదు ఉండవనే ఆరోపణలున్నాయి. సామాజిక భవనంలో మార్ట్ నిర్వహిస్తున్నా.. నెలకు రూ.50 వేలు అద్దె చెల్లిస్తున్నట్లు చూపుతున్నారు. ఇక్కడ జరిగిన అవకతవకలపై పెద్ద దుమారం రేగినా ఇప్పటికీ చర్యల్లేవు.

విచారణ చేస్తున్నాం

మహిళా మార్ట్‌లలో జరిగిన అవకతవకలపై విచారణ చేస్తున్నాం. తాళ్లరేవులో రూ.11 లక్షలు రికవరీ చేస్తున్నాం. యు.కొత్తపల్లి, కిర్లంపూడి మార్ట్‌లలో విచారణకు ఆదేశించాం. డీఆర్‌డీఏ ఏపీడీ జిలానీని విచారణ అధికారిగా నియమించారు. అక్రమాలు తేలితే సిబ్బందిపై చర్యలు తప్పవు. మార్ట్‌లను ఇకపై బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లకు అప్పగిస్తాం. ఖర్చు ఆడిట్ డీఆర్‌డీఏ-సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తాం. - జి.శ్రీనివాసరావు, పీడీ, డీఆర్‌డీఏ-సెర్ప్, కాకినాడ

20,177 కుటుంబాలకు సరకుల పంపిణీ

కాకినాడ కలెక్టరేట్: జిల్లాలో తుపాను బాధిత కుటుంబాలకు నిత్యావసర సరకుల పంపిణీ ఆదివారం సాయంత్రం 6 గంటల నాటికి 49 శాతం పూర్తయ్యింది. 1,060 చౌక దుకాణాల పరిధిలో 41,932 కుటుంబాలకు బియ్యం, పంచదార, కందిపప్పు, వంట నూనె, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికి 811 చౌక దుకాణాల పరిధిలో 20,177 కుటుంబాలకు లబ్ధి చేకూరింది. బియ్యం, పంచదార అన్ని దుకాణాల్లో అందుబాటులో ఉన్నా.. కొన్ని చోట్ల మిగతా సరకులేవు. ఉన్నచోటే బాధిత కుటుంబాలకు డీలర్లు ఈ-పోస్ యంత్రాల్లో వేలిముద్రలు తీసుకుని ఇస్తున్నారు. ఇప్పటికి 589.381 టన్నుల బియ్యం, 35.484 టన్నుల పంచదార, 120.60 టన్నుల కందిపప్పు, 12,179 లీటర్ల వంట నూనె పంపిణీ చేశారు. బంగాళాదుంపలు, టమాటాలు కుటుంబానికి కేజీ చొప్పున కేటాయించినా అందుబాటులో లేవు. పది మండలాల్లో కందిపప్పు, 13 మండలాల్లో వంట నూనె ప్యాకెట్లు లేక, వీటిలో మిగతా సరకులు ఇస్తున్నారు. దీనిపై పౌరసరఫరాలశాఖ అధికారులను 'న్యూస్‌టుడే' సంప్రదించగా సరకులు దశలవారీగా జిల్లాకు చేరుతున్నాయని, అన్ని కుటుంబాలకు అందిస్తామన్నారు.

సత్యదేవుని తెప్పోత్సవం... భక్తజన పునీతం

అన్నవరం, న్యూస్‌టుడే : అన్నవరం సత్యనారాయణ స్వామి అనంతలక్ష్మీ సమేతుడై హంసవాహనంలో విహరించిన కమనీయ సన్నివేశాన్ని భక్తులు కనులారా వీక్షించి పునీతుయ్యారు. స్వామివారి తెప్పోత్సవం ఆదివారం రాత్రి వేడుకగా జరిగింది. సాయంత్రం 4 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో మెట్లమార్గంలో కొండదిగువన పంపా సరోవరం చెంతకు తెచ్చారు. రాత్రి 7 గంటలకు ఉత్సవమూర్తులను హంసవాహనంలో ఆశీనులను చేసి పంపా రిజర్వాయర్‌లో ఊరేగించారు. అనంతరం పల్లకీలో కొండపైకి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే సత్యప్రభ, ఛైర్మన్ రోహిత్, ఈవో సుబ్బారావు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

● ఈవో కుటుంబసభ్యులను మాత్రం హంసవాహనంలోకి అనుమతించడం చర్చనీయాంశమైంది.

విద్యుత్తు దీపాలంకరణలో ఆలయం

స్వామి, అమ్మవార్లకు పూజలు

ఆహా ఏమి రుచి.. తినరా మైమరిచి..!

ఉభయ రాష్ట్రాల్లోనూ ప్రత్యేకంగా నిలుస్తున్న అల్పాహారం

వేడి వేడి పొట్టిక్కలను కొబ్బరి, కారంపోడి, నెయ్యితో కలిపి తింటే ఆ రుచే వేరు. ఒకప్పుడు అంబాజీపేటకే పరిమితమైన వీటిని ఇప్పుడు ఉభయ రాష్ట్రాల్లోనూ ప్రజలు ఇష్టపడుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట పొట్టిక్కలకు పుట్టిల్లు. ✦ 60 ఏళ్ల కిందట పోలాలమ్మతల్లికి ఇష్టమైన పనస ఆకులతో తయారు చేసి వంటకాన్ని నైవేద్యంగా సమర్పించారు. అప్పటి నుంచి క్రమక్రమంగా ఇది పొట్టిక్కలుగా ఖ్యాతి నొందింది.
– న్యూస్‌టుడే, అంబాజీపేట

పనస ఆకుల్లోని పొట్టిక్కలు

ఇలా తయారు చేస్తారు..

పనస ఆకులను బుట్టలుగా తయారు చేసి వాటిలో పిండి నింపుతారు. పాత్రలో ఆవిరిపై ఉడికిస్తారు. వివాహాదీ శుభకార్యాలతో పాటు మిగిలిన వేడుకల్లోనూ ఉభయగోదావరి జిల్లాల్లో అల్పాహారంగా తింటారు. పొట్టిక్కల ఫలహారశాలలు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రముఖులకు ఆతిథ్యంగా..

అంబాజీపేటకు వచ్చిన సినీ, రాజకీయ ప్రముఖులు ఇక్కడి పొట్టిక్కలను రుచి చూడకుండా వెళ్లరు. ప్రముఖనటుడు తనికెళ్ల భరణి అంబాజీపేట వైపు వస్తే తప్పని సరిగా వీటిని అడుగుతారు.

ఆరోగ్యానికి దోహదం

పనస ఆకుల్లో పొట్టిక్కలు ఆరోగ్యపరంగా మంచివి. ఈ ఆహారం మధుమేహ నియంత్రణకు ఇది ఉపకరిస్తుంది. క్యాన్సర్ కణాలను తగ్గించేందుకు ఇవి ఉపకరిస్తాయి. చర్మవ్యాధులను కూడా నియంత్రించేందుకు ఉపయోగపడుతుంది.
- బి.శ్యామ్‌సుందర్, ఆయుర్వేద వైద్యుడు, అంబాజీపేట

రూ.కోట్లు పణం.. రుజువే ఈ జలం!

ఇది కాకినాడ జగన్నాథపురం ఎన్టీఆర్‌నగర్ పరిధిలోని యాళ్లవారి గరువు నగరపాలిక ఉన్నత పాఠశాల. ఈ పాఠశాలలో 600 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలను గత వైకాపా హయాంలో రూ.2 కోట్లతో 'నాడు-నేడు' నిధులతో అభివృద్ధి చేశామన్నా.. ఆ మేరకు ఫలితం కనిపించడం లేదు. ఆవరణ మరీ పల్లంగా ఉండటంతో కొద్దిపాటి వర్షానికే చెరువుగా మారుతోంది. నాడు నిధుల వ్యయం.. నేడు దయనీయంలా మారింది ఈ బడి పరిస్థితి. ఈ పనులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా చర్యల్లేవని స్థానికులు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, కాకినాడ నగరం

పంట మునిగింది.. లెక్క తేలింది..

మొంథా నష్టం 48,133 ఎకరాలు

– న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

జిల్లాలో మొంథా తుపాను ప్రభావంతో దెబ్బతిన్న వ్యవసాయ పంటల నష్టాల గణన పూర్తయ్యింది. వ్యవసాయ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం 52,216.275 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మినుము, పత్తి, రాగులు పంటలకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. వాస్తవ నష్టాల గణనకు జిల్లాలోని 385 బృందాలు నాలుగు రోజులుగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేశారు.

సామర్లకోట మండలంలోని ఒక సచివాలయంలో పంట నష్టపోయిన రైతుల వివరాలు ప్రదర్శిస్తున్న సిబ్బంది

జిల్లాలో పరిశీలన అనంతరం 48,133 ఎకరాల్లో పంటలకు 33 శాతం కన్నా ఎక్కువ నష్టం సంభవించినట్లు నిర్ధారించారు. దీనిలో 90 శాతం వరి పంట ఉంది. వ్యవసాయ సహాయకులు యాప్‌లో నమోదు చేసిన వివరాలను వీఆర్వోల లాగిన్‌లకు పంపించారు.

నిర్ధారించింది ఇదీ..

ఆదివారం సాయంత్రం నాటికి 41,048.25 ఎకరాల్లో పంట నష్టాలు ఆమోదించారు. 147.5 ఎకరాల్లో పంట నష్టాలను తిరస్కరించారు. ఇంకా 6,937.25 ఎకరాల్లో నష్టాలను వీఆర్వోల లాగిన్‌లలో ఆమోదించాల్సి ఉంది. సోమవారం లోగా ఈ ప్రక్రియ పూర్తికానుంది.

పరిహారం ఇలా..

నిబంధనల ప్రకారం 33 శాతం కన్నా ఎక్కువగా దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వ ఉత్తర్వు అనుసరించి నష్ట పరిహారం చెల్లించనున్నారు. వరి ఎకరాకు రూ.10 వేలు, మినుము, మొక్కజొన్న, రాగులు ఎకరాకు రూ.5 వేలు, పత్తి ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ఇవ్వనున్నారు. వీఆర్వోల లాగిన్‌లలో పంట నష్టాల ఆమోదం తర్వాత పరిహారం జాబితాను జిల్లా వ్యవసాయ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నారు. 20 మండలాల పరిధిలో 42,488 మంది రైతులు పంట నష్టపోయినట్లు తేల్చారు. వీఆర్వోల లాగిన్‌లలో ఆమోదం పొందిన 41,048.25 ఎకరాలకు సంబంధించిన వివరాలను ఆదివారం అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శించినట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయ్‌కుమార్ 'న్యూస్‌టుడే'కు చెప్పారు. వీటిపై అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. ఇంకా ఎక్కడైనా పంట నష్టపోయినట్లుంటే.. సంబంధిత రైతులు సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. వాస్తవాలు పరిశీలించి, గణన చేపట్టి, వాటిని పంటనష్టాల జాబితాలో చేర్చుతామని చెప్పారు.

విద్యార్థులూ.. వీరగాథ చెబుదామా

– న్యూస్‌టుడే, కాకినాడ నగరం

మీ కోసం

వీరగాథ పోటీలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయుడు

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడంతోపాటు వారిలో దేశభక్తిని రగిలించేందుకు కేంద్ర మానవ వనరులు, రక్షణ శాఖలు సంయుక్తంగా కృషి చేస్తున్నాయి. అందులో భాగంగా 'వీరగాథ ప్రాజెక్టు 5.0' పేరిట పోటీలు నిర్వహించనున్నాయి. మండల, జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిల్లో జరగనున్న ఈ పోటీలకు ఈ నెల 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

అంశం: స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికుల వీరగాథలు

విధానం: చిత్రలేఖనం, వక్తృత్వం, పద్యాలు, మల్టీమీడియా వీడియోల ప్రజెంటేషన్ ఇవ్వాల్సి ఉంటుంది.

ఎవరు అర్హులంటే..: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మూడో తరగతి నుంచి ఇంటర్ రెండో సంవత్సరం చదివేవారు.

ఎలా పంపాలి: విద్యార్థులు తమ ఎంట్రీలను https://www.mygov.in/campaigns/veer-gatha/ చిరునామా కలిగిన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి.

బహుమతులు..: ఎంపికైన జిల్లా ప్రాజెక్టుకు రూ.5 వేలు, రాష్ట్ర రూ.20 వేలు, జాతీయ స్థాయికి రూ.1.20 లక్షల నగదు ఇస్తారు.

చొరవతో మేలు..: పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకుని విద్యార్థులను ప్రోత్సహించాలి. పోటీలకు అన్ని పాఠశాలల నుంచి ఎంట్రీలు వెళ్లేలా కృషి చేయాలి.
- వి.జగన్మోహన్, ఏఎంవో, సమగ్ర శిక్షా, కాకినాడ

రెక్కలు కట్టుకుని.. ఏడుకొండలకు

– న్యూస్‌టుడే, కోరుకొండ

రాజమహేంద్రవరం విమానాశ్రయానికి అక్టోబరు మాసం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కొత్తగా అందుబాటులోకి వచ్చిన తిరుపతి విమాన సర్వీసుకు ప్రయాణికుల నెలరోజుల వ్యవధిలో విశేష స్పందన వస్తోంది. ప్రతీ మంగళ, గురు, శనివారాల్లో(వారానికి 3 రోజులు) అలయన్స్ ఎయిర్ విమానయాన సంస్థ తిరుపతికి విమానం నిర్వహిస్తోంది. ప్రారంభం నుంచీ ఈ సర్వీసును ప్రయాణికులు ఆదరిస్తున్నారు. దాదాపుగా ఏడుకొండలకు వెళ్లే భక్తుల సౌలభ్యం కోసం అందుబాటులోకి రావడంతో వారంతా సద్వినియోగం చేసుకుంటున్నారు.

963 మంది రాకపోకలు..

రాజమహేంద్రవరం- తిరుపతి విమాన సర్వీసు దాదాపుగా రద్దీగా ప్రయాణిస్తోంది. నెల వ్యవధిలో 13 సర్వీసులు ద్వారా 548 మంది ప్రయాణించారు. వీరితో పాటు మరో 11 మంది చిన్నారులు ఉన్నారు. తిరుపతి నుంచి రాజమహేంద్రవరానికి 13 సర్వీసుల ద్వారా 415 మంది ప్రయాణించారు.

టికెట్ ధర అందుబాటులో..

అలయన్స్ ఎయిర్ విమానయాన సంస్థ ప్రయాణికులను ఆకట్టుకునేందుకు ప్రారంభంలో రూ.1,499, ఆ తర్వాత మూడు నెలలకు 50శాతం టిక్కెట్లు రూ.1,999లకే అందుబాటులో ఉంచారు. మిగిలిన టిక్కెట్లు సుమారు రూ.4వేలుగా నిర్ణయించారు. ఇక్కడ నుంచి బయలుదేరిన సర్వీసు తిరుపతిలో 25 నిమిషాల వ్యవధిలో ఇదే విమానం హైదరాబాద్‌కు చేరుకుంటుంది. దీంతో టికెట్టు ధర అందుబాటులో ఉండటంతో ఇదే సర్వీసుకు 100 మంది ప్రయాణికులు హైదరాబాద్‌కు నేరుగా టికెట్లు తీసుకుని ప్రయాణించడం విశేషం.

తిరుపతి విమాన సర్వీసు వివరాలు(అక్టోబరు నెల)

సర్వీసు పేరు	సర్వీసులు	ప్రయాణికులు
తిరుపతి- రాజమహేంద్రవరం	13	415
రాజమహేంద్రవరం- తిరుపతి	13	548

తక్కువ ధరలకు..

మధ్య తరగతి వారికి కూడా అందుబాటులో ఉండేలా విమాన టికెట్లు కేటాయించాం. దీంతో తిరుపతి, అటుగా హైదరాబాద్‌కు ప్రయాణికుల నుంచి స్పందన బాగుంది. అన్ని వర్గాల వారు ప్రయాణం చేసేలా టిక్కెట్ ధరలు నిర్ణయించాం.
- మీసాల నరసింగ్ రావు, అలయన్స్ ఎయిర్ విమాన సంస్థ స్థానిక మేనేజరు

భారత వనిత.. విశ్వ వినుత

ఒకటే ఉత్కంఠ. భారత మహిళల జట్టు ఐసీసీ వరల్డ్ కప్ సాధించాలి. మన సత్తా చాటాలి. ప్రతి నోటా ఇదే ఆకాంక్ష. ఫైనల్ మ్యాచ్‌పై ఆసక్తే కాదు. స్వయంగా వీక్షించాలని కోరుకోనివారు లేరు. అలాంటి వారికి బిగ్ స్క్రీన్ లభిస్తే ఆ ఆనందమే వేరు. అలాంటి వారికోసం ఆదివారం కాకినాడలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆదేశాల మేరకు ఈస్ట్‌గోదావరి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న ఉమెన్స్ వరల్డ్ కప్-2025 ఫైనల్ మ్యాచ్ వీక్షణకు ఏర్పాటు చేశారు. నగరంలోని లావణ్య స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో స్క్రీన్‌పై 200 మంది విద్యార్థినులు, నగరవాసులు, ముఖ్యంగా మహిళలు చాలామంది మ్యాచ్ చూశారని సంఘ కార్యదర్శి నక్కా వెంకటేష్ తెలిపారు. చివరికి భారత్ విజయం సాధిచడంతో కేరింతలు కొట్టారు. సంఘ కోశాధికారి అప్పారావు, కోచ్‌లు ఇజ్రాయెల్‌రాజు, చార్లీ, అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారిణులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. – న్యూస్‌టుడే, మసీదుసెంటర్(కాకినాడ)

తరుణిల విధి.. తరగని 'నిధి'..!

ఆధ్యాత్మిక తోవలోనే మహిళలు ఉపాధికి బాటలు వేసుకుంటున్నారు. ఏటా కార్తిక మాసం ఆరంభానికి ముందు నుంచే గొల్లప్రోలులో ఒత్తులు తయారుచేసే పనిలో నిమగ్నమవుతారు. మహిళలు తయారు చేసే ఒత్తులను ప్యాకెట్లుగా చేసి విక్రయించే పనులతో యువకులూ ఉపాధి పొందుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు కార్తిక మాస, ఇతర పూజలకు గొల్లప్రోలు నుంచే ఒత్తులు సరఫరా చేస్తుండడం విశేషం. ఏటా రూ.2 కోట్ల మేర వ్యాపారం నిర్వహిస్తుండడం గమనార్హం.

గొల్లప్రోలు కేంద్రంగా ఇతర పనులకు వెళ్లలేని 200 కుటుంబాలకు చెందిన మహిళలు పత్తితో ఒత్తులు తయారు చేస్తారు. మహిళా సంఘాల సభ్యులు కూడా బ్యాంకు రుణాలతో పత్తి కొనుగోలు చేస్తూ సొంతంగా ఒత్తులు చేసి విక్రయిస్తున్నారు. వీటిలో కాడ, పువ్వు, 365, లక్ష, కోటి వంటి రకరకాల ఒత్తులతో ప్రత్యేక కుందులను ఆర్డర్లపై తయారు చేస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ, యానాం వంటి ప్రాంతాల్లో ఏటా నిర్వహించే భారీ పూజలకు గొల్లప్రోలు నుంచే కుందులు వెళ్తాయి. దాంతో ఇక్కడి వారికి నమ్మకంగా ఉపాధి లభిస్తోంది. స్థానికంగా, ఇతర ప్రాంతాల్లో మెప్మా బజారులో మహిళలు విక్రయాలు సాగిస్తుండడంతో డ్వాక్రా సంఘాల్లో సభ్యుల లాభార్జనకు ఇది మార్గంగా ఉందని గొల్లప్రోలు మెప్మా టీఎంసీ శ్రీదేవి తెలిపారు.
– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

వెలుగుతున్న లక్ష ఒత్తులు

ఒత్తులు తయారు చేస్తున్న మహిళలు

ఆధ్యాత్మికపురం.. ఈ సోమవరం

గ్రామంలో ఒక్కచోటనే తొమ్మిది ఆలయాలు ఇలా..

కిర్లంపూడి మండలం సోమవరం గ్రామం జాతీయ రహదారిని ఆనుకుని ఉంది. ఈ గ్రామానికి పేరే ప్రత్యేకత అంటే ఇక్కడ ఆలయాల సమూహం మరో విశేషం. కాట్రావులపల్లి జమిందారీ సంస్థానం పరిధిలో సోమవరం, కృష్ణవరం గ్రామాలు ఉండేవి. అప్పట్లో వీటిని జమిందారీ గ్రామాలుగా పిలిచేవారు. తరువాత కిర్లంపూడి మండలంలో ఈ రెండు గ్రామాలను కలిపారు. ఈ ఊరిలో ఆంజనేయస్వామి ఆలయం, పరమశివుడి విగ్రహం, శివలింగం, కనకదుర్గాదేవి ఆలయం, ఉమా సోమేశ్వరస్వామి ఆలయం, షిర్డీసాయిబాబా ఆలయం, పద్మావతి అలివేలుమంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం, మహావిష్ణువు ఆలయం, వేణుగోపాలస్వామి ఆలయం, అలివేలు మంగతాయారు ఆలయాలను గ్రామస్థులు ఒకే ప్రదేశంలో నిర్మించారు. దాంతో ఈ ప్రదేశం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది. రోజూ ఏదో ఒక ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతుండడంతో గ్రామస్థులు, భక్తులతో సందడిగా ఉంటోంది. – న్యూస్‌టుడే, కిర్లంపూడి

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

(c) eenadu

ఇంటి నుంచే విద్యుత్తు సేవలు

• అందుబాటులో ఏపీఈపీడీసీఎల్ యాప్



విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఏపీఈపీడీసీఎల్ ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టింది. ఆండ్రాయిడ్ చరవాణుల్లో ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీనిద్వారా వచ్చిన సమస్యలను విద్యుత్తు శాఖ అధికారులు పరిశీలించి సత్వరం పరిష్కరిస్తారు. –న్యూస్‌టుడే, విశాఖపట్నం

జిల్లా	కాకినాడ
కనెక్షన్లు	6,69,259
ప్రతినెలా బిల్లు (రూ. కోట్లు)	రూ.48,56 కోట్లు

బిల్లు చెల్లించొచ్చు: విద్యుత్తు బిల్లులు చెల్లించేందుకు బిల్‌పే ద్వారా సర్వీసు నంబరు, చరవాణి నంబరు పొందుపరిస్తే సంబంధించిన వివరాలు ప్రత్యక్షమవుతాయి.

సప్లయి పొజిషన్: వినియోగదారుడు సర్వీసుకు సంబంధించి విద్యుత్తు సరఫరా తీరును ఎప్పటికప్పుడు లైవ్‌లో చూసుకునే సదుపాయం కలదు.

మొబైల్ లింకింగ్ : విద్యుత్తు వినియోగదారులు తమ విద్యుత్తు కనెక్షన్‌కు సంబంధించి చరవాణి నంబరును అనుసంధానిస్తే విద్యుత్తు బిల్లుల సమాచారం చరవాణికి అందుతుంది.

ఎనర్జీ కాలిక్యులేటర్ : ఏప ఉపకరణానికి ఎంత విద్యుత్తు ఖర్చవుతుందో దీని ద్వారా తెలుసుకోవచ్చు. నెలవారీ విద్యుత్తు వినియోగానికి సంబంధించిన మీటరు రీడింగ్ వివరాలు పొందుపరిస్తే బిల్లు సమాచారం కనిపిస్తుంది.

కస్టమర్ కేర్: వినియోగదారులు తమ సమస్యలను ఇందులో పొందుపరచొచ్చు. అందిన సప్లై వివరాలు, అవసరమైన అన్ని లింకులు ఇందులో పొందుపరిచి ఉంటాయి.

లింక్ ఆధార్: వినియోగదారుడు విద్యుత్తు సర్వీస్‌కు తమ ఆధార్ వివరాలను జత చేసుకోవచ్చు.

కన్‌జంప్షన్: వినియోగదారులు వాడిన యూనిట్లు.. చెల్లించాల్సిన నగదు.. బిల్ లెడ్జర్ వివరాలు అందుబాటులో ఉంటాయి.

లాడ్జ్ కంప్లెంట్: విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు వంటి ఫిర్యాదులను వినియోగదారుడు నేరుగా ఫిర్యాదు చేయడమే గాక కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్య పరిష్కారం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు.

పే బిల్: సర్వీసు నంబరు నమోదు చేసుకుని నెలవారీ విద్యుత్తు బిల్లులకు సంబంధించిన నగదు చెల్లించొచ్చు.

అధికారుల వివరాలు : వినియోగదారుల పరిధిలోని అధికారుల ఫోన్ నంబర్లు లభ్యమవుతాయి. ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

టారిఫ్ : వినియోగదారులకు సంబంధించిన టారిఫ్ వివరాలు ఇందులో పొందుపరిచి ఉంటాయి.

క్విక్‌పే : సర్వీసు నంబరు, చరవాణి నంబరును నమోదు చేస్తే సంబంధిత బిల్లు వివరాలు వస్తాయి. అక్కడి నుంచి బిల్లు చెల్లించొచ్చు.

గౌడ/శెట్టిబలిజ కుల అవివాహితులకు సువర్ణావకాశం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, గౌడ/శెట్టిబలిజ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. **రాజమండ్రి ఈనాడు కార్యాలయంలో (1వ అంతస్తు, భాను టవర్స్, శ్యామల థియేటర్ ఎదురు)** ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు నేడు (03 నవంబర్ 2025, సోమవారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

నేడు గౌడ/ శెట్టిబలిజ కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

● మరిన్ని వివరాలకు **8008621414 & 9154918858** ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

● ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ మరియు యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన తెలిపిన ఫోన్ నంబర్లకు సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

అలరించిన కళాకారులు

ఎస్వీ రంగారావు కళాస్రవంతి ఆధ్వర్యంలో దంటు కళాక్షేత్రంలో జరుగుతున్న ఉభయతెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు ఆహూతులను అలరించాయి. ఆదివారం కళాస్రవంతి అధ్యక్షుడు పీజే చంటిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.వెంకన్నబాబు ప్రారంభించగా స్వర్ణసూర్య డ్రామా లవర్స్ హైదరాబాద్ వారి సాహితీసూక్తం నాటిక ప్రదర్శించారు. దీనికి రచన, దర్శకత్వం ఉదయ్ భాగవతుల, అభ్యుదయ ఆర్ట్స్ విజయవాడ వారి ఆ విధంగా నాటిక ప్రదర్శించగా.. రచన, దర్శకత్వం అనంత హృదయరాజ్ వహించారు. రాత్రి ఎస్వీ రంగారావు కళాస్రవంతి కాకినాడ వారి చౌకీదార్ నాటికను వెంకన్నబాబు రచన, దర్శకత్వంలో ప్రదర్శించారు. సంస్థ గౌరవాధ్యక్షుడు పేపకాయల రామకృష్ణ, జి.పద్మారావు, సూర్యనారాయణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, గాంధీనగర్

ఆ విధంగా నాటికలోని సన్నివేశాలు

కూటమి ప్రభుత్వంలో బీసీలకు రాజ్యాధికారం సాధ్యం

• 16న అమలాపురంలో భారీ శెట్టిబలిజ వనసమారాధన • కార్మిక శాఖ మంత్రి సుభాష్

సర్పవరం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమని, దీనికి నేనే ఒక ఉదాహరణ అని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కాకినాడ గ్రామీణం రమణయ్యపేట గైగోలుపాడులో శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తిక వనసమారాధనలో ముఖ్య అతిథిగా మంత్రి సుభాష్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు, నియోజకవర్గం కోర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శెట్టిబలిజలంతా ఐక్యంగా ఉండాలన్నారు. ఈనెల 16న అమలాపురంలో జరిగే భారీ శెట్టిబలిజ వనసమారాధనలో పార్టీలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్పొరేషన్ డైరెక్టర్లు డా.చప్పిడి వెంకటేశ్వరరావు, కడలి ఈశ్వరి, సంఘం జిల్లా అధ్యక్షుడు చొల్లంగి వేణుగోపాల్, నాయకులు పెంకే శ్రీనివాసబాబా, నులుకుర్తి వెంకటేశ్వరావు, వాసంశెట్టి ఆంజనేయులు, గుబ్బల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వనసమారాధనలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

నేటి నుంచి రావులపాలెంలో గైడ్ కెప్టెన్లకు శిక్షణ

రాయవరం, న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని పీఎంశ్రీ పాఠశాలలకు చెందిన 88 మంది గైడ్ కెప్టెన్లకు ప్రాథమిక, అడ్వాన్స్ కోర్సుల్లో శిక్షణను రావులపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు సమగ్రశిక్షా జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంవో), ది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి పిల్లి రాంబాబు తెలిపారు. ఆదివారం రాయవరంలో ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభవుతుందని చెప్పారు. డీఈవో, స్కౌట్స్ కమిషనర్ డా.సలీం బాషా, సమగ్రశిక్షా ఏపీసీ జి.మమ్మీ పర్యవేక్షణలో శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. అడ్వాన్స్ కోర్సులో శిక్షణ పొందే కెప్టెన్లు ప్రాథమిక(బేసిక్) శిక్షణ ధ్రువీకరణపత్రాన్ని, ప్రాథమిక శిక్షణకు హాజరయ్యేవారంతా పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను క్యాంప్ కేంద్రం వద్ద ఇవ్వాల్సి ఉంటుందన్నారు. శిక్షణకు వచ్చే వారంతా సమయపాలన పాటించాలని కోరారు.

లోవకు భక్తుల తాకిడి

తుని గ్రామీణం: తలుపులమ్మ లోవ దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు ఆలయ ప్రాంగణంలోని చెట్లకింద వంటావార్పు చేసుకొని సామూహిక భోజనాలు చేశారు. ఈ ఒక్కరోజే సుమారు నాలుగు వేలకు పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో దేవస్థానానికి రూ.1.50 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయాధికారులు తెలిపారు.

లోవలో భక్తులతో నిండిన మహామండపం

కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజును ఆహ్వానిస్తున్న ముద్రగడ

ముద్రగడను కలిసిన కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు

కిర్లంపూడి, న్యూస్‌టుడే: అనారోగ్యానికి గురై కోలుకుని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న మాజీమంత్రి ముద్రగడ పద్మనాభరెడ్డిని కిర్లంపూడిలోని ఆయన నివాసంలో కేంద్ర మాజీమంత్రి ఎం.ఎం.పళ్లంరాజు ఆదివారం పరామర్శించారు. తన నివాసానికి వచ్చిన పళ్లంరాజును ముద్రగడ, ఆయన కుమారుడు గిరిబాబు సాదరంగా ఆహ్వానించారు. ముద్రగడ ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మల్లిపూడి శ్రీరామచంద్రమూర్తి, గౌతు స్వామి తదితరులు పాల్గొన్నారు.

మంచు.. ప్రమాదాలతో ముంచు

తెల్లవారుజామున రోడ్లను కమ్మేస్తున్న వైనం

గండేపల్లి, తుని పట్టణం, న్యూస్‌టుడే: కొన్ని రోజులుగా జాతీయ రహదారిపై రాత్రి, తెల్లవారుజామున పొగమంచు దట్టంగా రోడ్లను కమ్మేస్తోంది. ఈ మంచుతో రహదారిపై ప్రయాణించే వాహనాలు కనిపించని స్థితి. రానున్న మూడు మాసాలు పొగమంచు దట్టంగా పడే అవకాశాలు ఎక్కువ. దీంతో రాకపోకలు సాగించేవారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

జాతీయ రహదారిపై దట్టంగా..

కొన్ని రోజులుగా రాజమహేంద్రవరం నుంచి తుని వరకు అర్ధరాత్రి దాటాక పొగమంచు కమ్మేస్తోంది. దీంతో తెల్లవారుజామున ప్రమాదాలు ఎక్కువగా జరిగిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి. గత అనుభవాల దృష్ట్యా లారీ డ్రైవర్లు, వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండాలి. కార్తిక మాసం దృష్ట్యా అన్నవరం, పాదగయ, దివ్య తిరుపతి, లోవ, మురారి తదితర ఆలయాలకు భక్తుల రద్దీ ఎక్కువ. నడకమార్గాన్ని అనుసరించే భక్తులు రోడ్డుపైకి వెళ్లే సమయంలో ఏమరుపాటు పనికి రాదు.

రాజానగరం గండేపల్లి మధ్య పరుచుకున్న పొగమంచు

జాగ్రత్తలివీ.. పాటిస్తే మేలు

మంచు దృష్ట్యా రాత్రి వేళల్లో రోడ్డు పక్కన వాహనాలు నిలపరాదు. చోదకులకు తగినంత విశ్రాంతి అవసరం. రాత్రి మొత్తం ప్రయాణించాల్సి ఉంటే డ్రైవర్లు మారుతూ ఉండాలి. గంట, రెండు గంటలకోసారి నీళ్లతో ముఖాన్ని కడుక్కోవాలి. నిద్ర వస్తుందనిపిస్తే వాహనాన్ని సురక్షిత ప్రదేశంలో నిలిపి నిద్రపోవాలి. వాహనాల వేగం నియంత్రణలో ఉంచాలి. పొగమంచు ఎక్కువగా ఉన్నప్పుడు, కూడళ్ల వద్ద ప్రయాణం సురక్షితం కాదని గమనించాలి. వాహనాలకు లైటింగ్ రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలి.

ఫేస్‌వాష్ అండ్ గో కార్యక్రమం

క్రాసింగ్ రోడ్లు దాటే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి. పొగమంచు ఎక్కువగా ఉన్నప్పుడే ఫేస్‌వాష్ అండ్ గో కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లు ముఖం కడుక్కొనే చర్యలు తీసుకుంటున్నాం. మంచు ఎక్కువగా ఉంటే వాహనాలు నిలిపివేయాలి. లేదంటే వేగాన్ని తగ్గించి వెళ్తే ప్రమాదాలు సంభవించే అవకాశాలు తక్కువ. - శ్రీహరిరాజు, డీఎస్పీ,పెద్దాపురం

జిల్లాలో ఎన్‌హెచ్-16 ఇలా.. ఆనుకుని ఉన్న మండలాలు: 10 | మురారి- తుని వరకు కి.మీ.: 78 | బ్లాక్‌స్పాట్లు: 58 | సీసీ కెమెరాలు: 112

ఏలేరుకు తగ్గుతున్న వరద

ఎగువ నుంచి ఏలేశ్వరంలోని ఏలేరు జలాశయంలోకి వస్తున్న వరద నీరు ఆదివారం కాస్త నెమ్మదించింది. శనివారం ఉదయం ఆరు గంటలకు జలాశయంలోకి ఎగువ ప్రాంతం నుంచి 4806 క్యూసెక్కుల వంతున ప్రవాహం వచ్చింది. సాయంత్రం 4 గంటలకు క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 1687 క్యూసెక్కుల వంతున జలాలు రిజర్వాయర్‌కి చేరుతున్నాయని అధికారులు చెప్పారు. ఇంకా అప్రమత్తంగానే ఉంటున్నామని, ఎప్పటికప్పుడు వరద నీటి రాకపై అంచనా వేస్తున్నామని వారు తెలిపారు. ఏలేరు పూర్తి స్థాయి నీటి మట్టం 86.56 మీటర్లు (24.11 టీఎంసీలు.). ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 85.64 మీటర్ల స్థాయిలో 22.24 టీఎంసీల జలాలు నిల్వ ఉన్నాయి. దిగువ ప్రాంతానికి 3 వేల క్యూసెక్కుల వంతున వరద నీటిని దిగువకు తరలిస్తున్నారు. ఎడమ ప్రధాన కాలువ ద్వారా విశాఖ అవసరాలకు 175 క్యూసెక్కుల వంతున నీటిని సరఫరా చేస్తున్నామని అధికారులు వెల్లడించారు. –న్యూస్‌టుడే, ఏలేశ్వరం

ఉత్సాహంగా జిల్లా స్థాయి ఈత పోటీలు

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక డీఎస్‌ఏలోని కొలనులో బాలబాలికలకు 5 గ్రూపుల్లో జిల్లా స్థాయి ఈత పోటీలు ఉత్సాహంగా జరిగాయని జిల్లా సంఘ కార్యదర్శి ఐ.రాజు ఆదివారం తెలిపారు. ముఖ్యఅతిథిగా డీఎస్‌ఏ డీఎస్‌డీవో సతీష్‌కుమార్, జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్, సంఘ ముఖ్యసలహాదారు మంగా వెంకట శివరామకృష్ణ హాజరై పోటీలను ప్రారంభించారు. ఎంపికలకు సుమారు 85 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. మొదటి మూడు గ్రూప్‌లలో ప్రతిభచాటిన వారు విశాఖపట్నంలో ఈ నెల 22, 23 తేదీల్లో జరిగే 10వ వింటర్ సబ్‌జూనియర్, జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. గ్రూప్ 4, 5లో రాణించినవారు ఈ నెల 16న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఈత కొలనులో డైవ్ చేస్తున్న క్రీడాకారులు

ముంపు నివారణపై ప్రత్యేక దృష్టి

పిఠాపురం, న్యూస్‌టుడే: వరదల కారణంగా పొలాలు ముంపునకు గురికాకుండా నివారణ కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్ తెలిపారు. ఆదివారం పలు ప్రాంతాల్లో కాలువగట్లను పరిశీలించారు. రెగ్యులేటర్లు, వంతెనలు, స్లూయిజ్‌ల వద్ద వాటర్ లెవెల్ గేజ్‌లు ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. పీబీసీ కెనాల్‌కు సామర్లకోట లాకుల నుంచి గోదావరి జలాలు, 2ఆర్ రెగ్యులేటర్, గొల్లప్రోలు కళింగలు ద్వారా ఏలేరు జలాల్లో కలుస్తున్నందు వల్ల అధిక నీటి మట్టం ఏర్పడుతుందన్నారు. గట్లు బలహీనంగా ఉన్న చోట ఇసుక బస్తాలు ఏర్పాటు చేశామన్నారు.

బోద.. ఉండదిక బాధ

• పూర్తి నిర్మూలన దశలో మహమ్మారి

న్యూస్‌టుడే, చాగల్లు : దేశ వ్యాప్తంగా బోద వ్యాధి నియంత్రణలో భాగంగా 2030 నాటికి కేసులు లేకుండా చేయాలని కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా పరీక్షలతోపాటు మాత్రలు పంపిణీ చేస్తోంది. నియంత్రణ తప్ప నివారణ లేని ఈ వ్యాధి. . సోకిన కుటుంబాల్లో కన్నీటి సుడులకు కారణమయ్యేది. క్యూలెక్స్ దోమ కాటుతో విస్తరించే ఈ మహమ్మారి కాళ్లతోపాటు చేతులు, ఛాతిభాగం, వృషణాలు, తదితర అవయవాలకూ సోకుతుంది. వ్యాధిగ్రసుడిని కుట్టిన దోమ మరొకరిని కాటేస్తే వారిలోను లక్షణాలు కనిపిస్తాయి. పూర్తిగా బయట పడేందుకు సుమారు 10 నుంచి 15 ఏళ్ల సమయం పడుతుంది. అనంతరం ప్రభావిత ప్రాంతం భారీగా ఉబ్బుతుంది. బతుకంతా వ్యధను నింపే ఈ వ్యాధి నిర్మూలనకు వైద్యారోగ్యశాఖ కృషి ప్రస్తుతం ఫలిస్తోందని అధికారులు అంటున్నారు. తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో కేసులు నమోదు కాకపోవడమే ఇందుకు నిదర్శనంగా పేర్కొంటున్నారు.

రోగులను పరీక్షిస్తున్న ఫైలేరియా అధికారి రవి

వేధిస్తున్న మందుల కొరత..

రాజమహేంద్రవరంలోని ప్రధాన కార్యాలయంలో మందుల కొరత వేధిస్తోంది. రోగులకు కావల్సిన సోఫ్రామైసిన్, డీఈసీ(డై ఇథైల్ కార్బోమెజైన్ సిట్రేట్), ఆల్‌బెండాజోల్, యాంటీ ఫంగల్ ఆయింట్‌మెంట్లు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. వీటితోపాటు రోగులకు అందించే తువ్వాల్లు వంటి వాటి సరఫరాకు కొరత ఉంది.

ఇప్పటి వరకు ఇలా..

జిల్లా	కేసులు
తూర్పు గోదావరి :	2,924
కాకినాడ :	6,229
కోనసీమ :	7,598

పూర్తిస్థాయి అదుపులో వ్యాధి..

బోద వ్యాధి నాలుగు జిల్లాల్లో పూర్తిస్థాయిలో అదుపులో ఉంది. పర్యవేక్షణ బృందాలు ఎప్పటికప్పుడు తమ ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఎక్కడా ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. మందుల కొరతపై ఇప్పటికే ఉన్నతాధికారులకు వివరించి, ప్రతిపాదనలు పంపాం. ప్రతి శుక్రవారం రాజమహేంద్రవరంలోని కేంద్రంలో చికిత్సలు, మందులు ఉచితంగా ఇస్తున్నాం. రోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఫైలేరియా అధికారి రవి తెలిపారు.

మూడు జిల్లాల్లో 11 యూనిట్లు..

వ్యాధి నివారణకు తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల్లో మూడేసి చొప్పున, కోనసీమ జిల్లాలో 5 యూనిట్లు ఈ వ్యాధి నివారణకు కృషి చేస్తున్నాయి. వారానికి ఒక చోట క్లినిక్, ఏరియా నైట్ సర్వే నిర్వహిస్తూ వ్యాధి పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు. ఒక్కో జిల్లాలో మెడికల్ అధికారితోపాటు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు 11 మంది, ల్యాబ్ టెక్నీషియన్లు ముగ్గురు, హెల్త్ అసిస్టెంట్లు 21 మంది, ఫీల్డ్ వర్కర్స్ సుమారు 150 మంది వరకు పని చేస్తున్నారు.

టాస్ ప్రోగ్రామ్..

ట్రాన్స్‌మిషన్ అసెస్‌మెంట్ సర్వే(టీఏఎస్) అని పిలిచే ఈ కార్యక్రమంతో 6 నుంచి 7 ఏళ్ల పిల్లలకు సైతం నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, వ్యాధిని గుర్తించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఇందుకు జ్వరం, వివిధ అనుమానిత లక్షణాలు ఉన్న ఒక్కో జిల్లా నుంచి 1,685 మంది విద్యార్థులను ఎంపిక చేస్తారు. గతేడాది నిర్వహించిన ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లాలో ఇద్దరు, కాకినాడలో ముగ్గురు, కోనసీమలో ఆరుగురు మొత్తం 11 మందిలో ఈ లక్షణాలు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఒక్కోక్క జిల్లాలో కనీసం 20 కేసులు లోపు గుర్తిస్తే వ్యాధి పూర్తిస్థాయిలో అదుపులో ఉన్నట్లే అని అధికారులు చెబుతున్నారు.

సబ్ జూనియర్ కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

సామర్లకోట, న్యూస్‌టుడే: సామర్లకోట బచ్చు ఫౌండేషన్ పురపాలక ఉన్నత పాఠశాల మైదానంలో 35వ సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్లు ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించారు. కబడ్డీ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సబ్‌జూనియర్ బాలురు, బాలికల జిల్లా జట్ల ఎంపికలకు అన్ని మండలాల నుంచి బాలురు 60, బాలికలు 65 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో 14 మంది చొప్పున ఎంపిక చేశారు. నవంబరు 7 నుంచి 9 వరకు కర్నూలు జిల్లాలో నిర్వహించే పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. ఇంటర్నేషనల్ కోచ్ సాయిప్రసాద్, ప్రోకబడ్డీ రిఫరీ మురళీకుమార్, ఇంటర్నేషనల్ రిఫరి వాసు, వ్యాయామ ఉపాధ్యాయులు వైకుంఠం, సుబ్బారావు, ఉమామహేశ్వరావు, వీరబాబు, రవి, ఇంటర్నేషనల్ కబడ్డీ క్రీడాకారిణి శ్వేత, కాకినాడ జిల్లా అసోసియేషన్ ట్రెజరర్ కిరణ్ పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన బాలికల జట్టు

వధూవరులకు హైకోర్టు జడ్జి ఆశీర్వాదం

రాజోలు: రాజోలు మండలం బి.సావరానికి చెందిన తెదేపా నాయకుడు జగడం సత్యనారాయణ కుమారుడి వివాహానికి రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ జగడం సుమతి దంపతులు హాజరయ్యారు. వధూవరులు వరుణ్- విజయరాణిలను ఆశీర్వదించారు. ఆదివారం రాత్రి శివకోటిలోని కల్యాణ మండపంలో జరిగిన వివాహ వేడుకకు కుటుంబ సభ్యులతో కలిసి ఆమె హాజరయ్యారు.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభవాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ, ✆ 73862 01191.

TO LET

COMMERCIAL

బ్యాంక్స్, ఆఫీస్, డెంటల్ హాస్పిటల్సుకు అనుకూలంగా రాజమండ్రి, దానవాయిపేటలో 1st ఫ్లోర్, సెల్లార్ పార్కింగ్ (లిఫ్ట్ సౌకర్యం)తో అద్దెకు కలదు. వివరములకు: 9490 811 769.

JOBS

Dew Foams Pvt. Ltd, Mandapeta Invites applications for the Post of General Manager (GM) Minimum Exp: 8-10Years is a must. Experience in the manufacturing industry will be an added advantage. Email: hodewfoams@gmail.com. Contact: 78913 18373.

EENADU for Advertisement Contact: 8008597607

EENADU Classifieds

Immediate openings for Customer Service Executive & Branch Manager Positions in Cherukuri Group, Located in Eluru, Tanuku, Guntur & Vijayawada. Qual: Min Inter. ✆ 9885206666, E-mail: hr@cherukurigroup.org.

30/70Yrs బ్యాంక్ అనుబంధ సంస్థలో జీతం+ INC 30 వేలు టీం మేనేజర్స్, ఎగ్జిక్యూటివ్స్. Q: 10th రిటైర్డ్, బిజినెస్, ఇన్సూరెన్స్ ఏజెంట్స్, మ్యూచ్యువల్ ఫండ్స్, మార్కెటింగ్. నో టార్గెట్ ✆ 90524 70111.

రాజమండ్రి, బొమ్మూరు, కొవ్వూరుల్లో ప్ర॥ కం, షోరూమ్స్, కాలేజీల్లో సె॥ గార్డ్స్, సె॥ సూపర్‌వైజర్స్ కావలెను. జీతం: 12 to 15 వేలు రూం + భో. రాజ్ సెక్యూరిటీ, దేవీచౌక్, రాజమండ్రి. ✆ 93922 69369.

రామకృష్ణ గ్రూప్, Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటిపని, వంటపని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు కావలెను. భో+ వ+, జీతం: 16-18K. ✆ 97040 51122, 90106 80011.

రాజమండ్రిలో కాంట్రాక్టర్ వద్ద పని చేయుటకు B.Tech., కంప్యూటర్‌లో అనుభవం కలిగి హిందీ, ఇంగ్లీష్ మాట్లాడ గలిగే యువకులు కావలెను. ✆ 78935 97577.

హైదరాబాద్ హోంకేర్‌లో ఏజెంట్లకు మంచి అవకాశం. వర్కర్స్‌ని పంపితే ప్రతినెలా 2 వేలు కమీషన్. వర్కర్స్ జీ: 18k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 89775 47749.

RJYలో FMCG ఉత్పత్తుల డిస్ట్రిబ్యూషన్ కొరకు సేల్స్‌మెన్ & డెలివరీ బాయ్స్ కావలెను. సంప్ర: టైం: 9 a.m.-6 p.m. ✆ 95507 32122.

వాటర్‌వాష్ బాయిస్ & హెల్పర్లు కావలెను. జీతం: రూ.15,000/-. Cont: శ్రీదేవి హోండా, ఆథరైజ్డ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్‌స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ. ✆ 94909 98888.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. **5-80** పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)		ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):		22,000
పాతకాయ:	గండేరా	29,000
	గటగట	27,000
కొత్తకాయ:	గండేరా	28,000
	గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):		
పాత (ముక్కుడు) కాయ		22,000-23,000
కొత్త (పచ్చి) కాయ		23,000-24,000
కొబ్బరినూనె మార్కెట్:		
15 కిలోలు		6,000
కిలో		400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	115-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

92.7FM Rajamahendravaram

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

కాండ్రకోటలో దబ్బకాలువ వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన

కూటమి ప్రభుత్వంలో నిర్మించిన శాశ్వత వంతెన

వైకాపాలో తాత్కాలికం.. కూటమి ప్రభుత్వంలో శాశ్వతం

పెద్దాపురం మండలం కాండ్రకోట దబ్బకాలువ పాత వంతెన 2020లో ఏలేరు నీటి ఉద్ధృతికి కొట్టుకుపోయింది. ఆ తర్వాత వైకాపా హయాంలో తూరలు వేసి రెండుసార్లు తాత్కాలిక వంతెనల నిర్మాణం చేశారు. అవి కూడా కొట్టుకుపోయాయి. జిల్లాస్థాయి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి చూసి వెళ్లడం తప్ప.. శాశ్వత వంతెన నిర్మాణానికి పూనుకోలేదు. కాండ్రకోట, తూర్పుపాకలు, జె.తిమ్మాపురం గ్రామాలకు చెందిన సుమారు 1200 ఎకరాలు వంతెనకు అటుగా ఉండేవి. దీంతో ప్రజలు, రైతులు చుట్టుమర్లావ, తూర్పుపాకలు తిరిగి సుమారు ఆరు కిలోమీటర్లు వెళ్లి సాగుచేసిన పంటలను తెచ్చుకోవలసిన దుస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సుమారు రూ.కోటి నిధులు కేటాయించి శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టారు. – న్యూస్‌టుడే, పెద్దాపురం

తల్లిదండ్రులకు పాపను అప్పగిస్తున్న సీఐ

పోలీసుల చొరవతో పాప క్షేమం

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: తప్పిపోయిన పాపను తక్కువ వ్యవధిలోనే కాకినాడ టూటౌన్ పోలీసులు ఆమె తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. సీఐ అప్పలనాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ బసివిరెడ్డివారివీధికి చెందిన సానా బాలకృష్ణ మూడేళ్ల కుమార్తె ధన్వికసిరి ఇంటివద్ద ఆడుకుంటూ కనిపించకుండా పోయింది. రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా వెతికి 45 నిమిషాల్లోనే స్థానిక రామకృష్ణారావుపేటలో బాలికను గుర్తించారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో తల్లిదండ్రులకు అప్పగించారు.

(c) eenadu

కాకినాడ

రైతుబజార్లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్: టమాటా- 18, వంకాయలు- 38, 46, 60, బెండకాయలు- 50, పచ్చిమిర్చి- 24, 28, కాకరకాయ- 36, బీర- 54, క్యాలీఫ్లవర్- 25, 30, క్యాబేజీ- 38, క్యారెట్- 60, దొండకాయలు- 38, బంగాళాదుంపలు- 23, 27, ఉల్లి- 22, 28, గోరుచిక్కుళ్లు- 36, దోసకాయలు- 35, చిక్కుళ్లు- 110, చేమదుంపలు- 34, బీట్‌రూట్- 50, కీరదోస- 50, బీన్స్‌కాయలు- 80, అల్లం- 72, క్యాప్సికం- 78, బొబ్బర్లు- 50, చిలకడదుంపలు- 44, ఒకటి చొప్పున ఆనపకాయ- 35, 40, పొట్లకాయ- 18, 20, అరటికాయ- 6, 8, మునగకాడ- 7, 8, మామిడికాయ- 12, 16, నిమ్మకాయలు(డజన్) - 24, 30.

నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్- బాహుబలి ది ఎపిక్, కె ర్యాంప్, మాస్ జాతర, బైసన్, దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్- మాస్ జాతర, బైసన్, థామా, లక్ష్మి- బాహుబలి ది ఎపిక్, సత్యగౌరి- మాస్ జాతర, తిరుమల- డ్యూడ్, సీఐండస్ 1- మాస్ జాతర, సీఐండస్ 2- కె ర్యాంప్, శ్రీప్రియ- మాస్ జాతర, పద్మప్రియ- బాహుబలి ది ఎపిక్, సూర్య1(వాకలపూడి)- మాస్ జాతర, సూర్య 2- మాస్ జాతర.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ఉ. 10 - మ. 1
కాకినాడ నగరం: 80085 74157
సాంబమూర్తినగర్: 91548 46719, మసీదుసెంటర్: 91541 18210
గాంధీనగర్: 80085 74159, బాలాజీచెరువు: 80085 74154

రాళ్ల గుట్ట తొలగించారు..

మూడో డివిజన్ పరిధిలోని సిద్ధార్థనగర్ రోడ్ నంబరు 6లో మూడు రోడ్ల కూడలి వద్ద రాళ్లు అడ్డుగా ఉండి ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళల్లో మలుపు తిరిగే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. రాళ్ల గుట్టను తొలగించారు.

కుంగి భయపెడుతున్న ఇనుప చట్రం

సిద్ధార్థనగర్‌లోని ఉద్యాన స్థలం సమీపంలో కూడలి వద్ద మ్యాన్‌హోల్‌పై ఏర్పాటు చేసిన ఇనుప పటకం కిందకు కుంగి ప్రమాదకరంగా మారింది. రాత్రిళ్లు రాకపోకల సమయంలో ప్రమాదాలకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా ఫ్యూజు బాక్సు

జగన్నాథపురం జె.రామారావుపేట దారిలో మూడురోడ్ల కూడలి వద్ద ఓ విద్యుత్తు స్తంభానికి ఉన్న ఫ్యూజు బాక్సు ప్రమాదకరంగా ఉంది. వాటికి ఎలాంటి రక్షణ తలుపులు లేకపోవడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

పర్యావరణ పరిరక్షణకు కృషి

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పీఎస్‌ఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సంధ్య సూచించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థినులు ఆదివారం శిబిరం తరువాత వలసపాకల తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రోగ్రాం అధికారి ఈఆర్ఎస్ కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్క చొప్పున నాటితే కాలుష్యాన్ని అరికట్టవచ్చన్నారు. అనంతరం 'పచ్చదనం మన జీవనాధారం', నీటిని ఆదా చేయండి-భూమిని కాపాడండి' అంటూ ప్లకార్డులు చేతబూని ర్యాలీ నిర్వహించారు.

ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

పేదింటి బిడ్డా.. ప్రతిభకు అడ్డా..!

- న్యూస్‌టుడే, గాంధీనగర్

గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పట్టుదలతో మంచి మార్కులతో ఇంజినీరింగ్‌లో చేరిన ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తిస్తూ.. ఉపకార వేతనాలతో వారిని ప్రోత్సహిస్తున్న హైదరాబాద్‌కు చెందిన ఎంప్లీజ్ ఇంపాక్ట్ ఫౌండేషన్ సేవలు స్ఫూర్తిదాయకమని జేఎన్‌టీయూకే వీసీ ప్రసాద్ అన్నారు. ఆదివారం వర్సిటీ వీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎంప్లీజ్ ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన 20 మంది విద్యార్థులకు ఎంపిక చేశారు. వారికి చదువు పూర్తయ్యేవరకు ఒక్కొక్కరికి రూ. 3 లక్షల ఉపకార వేతనం అందజేయనున్నామన్నారు. వీసీ చేతుల మీదుగా సంబంధిత పత్రాలిచ్చారు. ఫౌండేషన్ ఛైర్మన్ మదునూరు కిరణ్ మాట్లాడుతూ నెదర్లాండ్స్‌కు చెందిన ఫిలిప్స్ గ్రూప్ హైదరాబాద్‌లో 11 ఏళ్ల క్రితం స్టార్ట్ ఆన్ కంపెనీ ప్రారంభించారు. రూ.వేల కోట్ల ఆదాయం ఆర్జించడంతో దాని వ్యవస్థాపకుల సహకారంతో తెలుగు రాష్ట్రాల్లోని పేద ప్రతిభావంతులను ప్రోత్సహించాలనే ఈ ఫౌండేషన్ ప్రారంభించారన్నారు. ఉభయ తెలుగురాష్ట్రాల్లో 20 మంది ఇంజినీరింగ్ విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. క్రియ ఫౌండేషన్ ప్రతినిధి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిభను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ ప్రతినిధి రాధిక, క్రియ కార్యదర్శి జగన్నాధరావు, గణేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఉపకార వేతనాలు జేఎన్‌టీయూకే వీసీ ప్రసాద్ చేతుల మీదుగా అందిస్తున్న సంస్థ ప్రతినిధులు, క్రియ సభ్యులు

నేను ప్రోత్సహించుకుంటున్నా...

నా పేరు హర్షిణి, నాన్న మల్లికార్జునరెడ్డి రైతు, అమ్మ పద్మావతి గృహిణి. నేను ప్రకాశం జిల్లాలోని మార్కాపురం దగ్గర జవహర్ నవోదయలో పదో తరగతి చదివా. ఉత్తమ మార్కులు సాధించడంతో ఇంటర్‌లో ఒంగోలులోని జూనియర్ కళాశాలలో చదివి ఈఏపీసెట్‌లో మంచి ర్యాంకుతో ఇంజినీరింగ్ జేఎన్‌టీయూకేలో చేరా. నాకు లభించిన ఉపకార వేతనం ఇంటర్న్‌షిప్ తదితరాలకు ఉపయోగపడుతుంది. అమ్మనాన్నలకు ఆర్థిక భారం తప్పింది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడ్డాక నేనూ పేద విద్యార్థులను ప్రోత్సహిస్తా. - బండి హర్షిణి

భవిష్యత్తులో స్టార్టప్ ప్రారంభిస్తా..

మాది విజయనగరం జిల్లా వేపాడ మండలం బొద్దాం. పదో తరగతి వరకు అక్కడే ప్రభుత్వ పాఠశాలల్లో చదివా. నాన్న గణపతిరావు వ్యవసాయ కూలీ. అమ్మ ఈశ్వరమ్మ ప్రోత్సాహంతో ఈఏపీసెట్‌లో మంచి ర్యాంకు సాధించి విశాఖలోని గాయత్రి ఇంజినీరింగ్ కళాశాలలో చేరా. ఈ స్కాలర్‌షిప్‌తో బాగా చదివి స్టార్టప్ ప్రారంభించాలనేది నా లక్ష్యం. - అరిగి శ్రీనివాసరావు

అనుబంధ కోర్సులకు ఖర్చు చేస్తా...

నాన్న లక్ష్మణరావు రైతు, అమ్మ సీతారాణి కూలీ. మాది పల్నాడు జిల్లా జానపాడు. పదో తరగతి వరకు అక్కడే ప్రభుత్వ పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించడంతో ఇంటర్‌లో కార్పొరేట్ కళాశాలలో చేర్పించారు. ఈఏపీసెట్‌లో మంచి ర్యాంకు రావడంతో జేఎన్‌టీయూకేలో చేరా. స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. అనుబంధ కోర్సులకు ఉపకార వేతన డబ్బు ఉపయోగించుకుంటా. ఐఏఎస్ అధికారి కావాలని కుంటున్నా. - బలరామకృష్ణ, జేఎన్‌టీయూకే విద్యార్థి

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కమిటీ ఛైర్మన్ కృష్ణకల్యాణ్, సభ్యులు

5 నుంచి అయ్యప్ప ఆలయ పునఃప్రతిష్ఠోత్సవాలు

గాంధీనగర్: నగరంలో ప్రసిద్ధి చెందిన భానుగుడి రిజర్వ్‌పోలీస్ లైన్‌లోని అయ్యప్పస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ ఉత్సవాలను ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కమిటీ ఛైర్మన్ పిల్లి కృష్ణకల్యాణ్, సభ్యులు శివరామకృష్ణ, సుబ్రహ్మణ్యం ఆదివారం సమావేశంలో వెల్లడించారు. ఆలయాన్ని శబరిమలలోని ఆలయంలా రాతితో పునర్నిర్మాణం చేశామన్నారు. ఆవరణలో వారాహి అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠిస్తున్నారు. ఈ నెల 7న మధ్యాహ్నం అభిజిత్ లగ్నంలో శబరిమల ఆలయ తంత్రి రాజీవర్ చేతుల మీదుగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠోత్సవం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా తొలిసారి మహాపుష్ప కలశాభిషేకం, 12 ఏళ్లకోసారి నిర్వహించే మహా కుంభాభిషేకం జరుగుతాయని పేర్కొన్నారు. కుంభాభిషేకం అనంతరం మహాన్నదానం ఉంటుందన్నారు. సురేష్, మెహర్‌రెడ్డి, వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా చూశారు.. ఉత్సాహంగా మురిశారు..

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: మహిళల వరల్డ్ కప్ క్రికెట్ పోటీల్లో భారత జట్టు విజయం సాధించాలని కోరుతూ నగరానికి చెందిన పలువురు నాయకులు ఆదివారం చర్చిలు, మసీదులు, దేవాలయాల్లో ప్రార్థనలు, పూజలు చేశారు. నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ప్రోత్సాహంతో తెదేపాకు చెందిన క్రైస్తవ, మైనారిటీ, సాధారణ పార్టీ విభాగాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు కార్యక్రమాలు నిర్వహించారు. వరల్డ్ కప్ సాధించటం ద్వారా భారత్‌కు ప్రపంచవ్యాప్త కీర్తి తేవాలని ఆకాంక్షించారు. ఎస్‌కే రహీం, అంబటి చిన్నా, ఎండీ ఖాన్, గుమ్మళ్ల చిన్నా, ఎండీ అన్వర్, బుల్లోజు మహేశ్వరరావు, అస్రిఫ్ ఆలీ, ముడే రాజబాబు, షేక్ అన్వర్, పోలసపల్లి జగన్ తదితరులు పాల్గొన్నారు.

మసీదులో ప్రార్థనల అనంతరం మాట్లాడుతున్న తెదేపా మైనారిటీ విభాగం నాయకులు

సాంబమూర్తినగర్: ఐసీసీ ఉమెన్స్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత మహిళా క్రికెట్ జట్టు విజయం సాధించాలని కోరుతూ కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో రేచర్లపేటలో ఆ డివిజన్ తెదేపా ఇన్‌ఛార్జి అంబటి చిన్నా, స్థానికులు, క్రీడాభిమానులు ఆదివారం రాత్రి ఏసు మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కాకినాడ నగరం: భారత మహిళా క్రికెట్ జట్టు ఆడుతున్న వరల్డ్ కప్ మ్యాచ్‌ను తిలకించేందుకు భానుగుడి సెంటర్ వద్ద స్క్రీన్ ఏర్పాటు చేశారు. నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సౌజన్యంతో ఏర్పాటు చేయగా నగరానికి చెందిన మహిళలు తిలకించారు. పోరులో మన జట్టు విజయం సాధించడంతో జాతీయ జెండాలు చేతపట్టి కేరింతలు కొట్టారు.

వైభవంగా క్షీరాబ్ది ద్వాదశి దీపోత్సవం

గాంధీనగర్: నగరంలోని వైష్ణవ ఆలయాల్లో క్షీరాబ్ది ద్వాదశి పూజలు, దీపోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉసిరి, తులసి చెట్లకు పూజ చేయడం ద్వారా విష్ణుమూర్తి కరుణాకటాక్షాలు లభిస్తాయని అర్చకులు మాధవాచార్యులు తెలిపారు. దేవాలయం వీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో వేడుకలు నిర్వహించారు. గొడారిగుంట మూడుగుళ్ల సెంటర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు, ఆలయ భక్తులు తరలివచ్చారు. జగన్నాథపురం, గాంధీనగర్, వెంకట్‌నగర్, టూటౌన్ తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో దీపోత్సవాలు ఆకట్టుకున్నాయి.

వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో దీపార్చన

లోక కల్యాణార్థం హోమాలు

భీమేశ్వరస్వామికి అభిషేకాలు చేయిస్తున్న సభ్యులు

గాంధీనగర్: వాత్సల్య భారతి, భారతమాత తత్వప్రచార వేదిక ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం ఆదివారం దేవాలయం వీధిలోని పెద్ద శివాలయంలో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాత్సల్యభారతి సంస్థాపన కార్యదర్శి మల్లాది శ్రీనివాసరావు, కార్యదర్శి సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ దేశభక్తితో కూడిన దైవికభక్తి ఆవశ్యకత ఉందని, సమాజాన్ని జాగృతం చేసేందుకు, దేశక్షేమం కోరుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం పండితులను సత్కరించారు. వాత్సల్య భారతి కార్యదర్శి వేదాంతం రామం, క్రరా శ్రీరామమూర్తి, కందాళ శ్రీనివాసు, పి.వెంకటరమణ, శ్రీనివాసకుమార్, కనకారావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన మురుగు..

నగరంలోని 41వ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ ఓలేటి వారి వీధిలో గంగాటవర్స్ అపార్ట్‌మెంట్ వద్ద కాలువలో మురుగు రోడ్డుపై పారడంతో రాకపోకలు సాగించేవారు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ శిథిలమవ్వడంతో తరచూ మురుగు సమస్య తలెత్తుతోందని స్థానికులు అడపా వెంకట నారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సమస్యను పరిష్కరించడంతోపాటు కాలువ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, భానుగుడిసెంటర్

అల్లుకున్న నిర్లక్ష్యం..

కాకినాడ జగన్నాథపురంలోని ఏఎస్‌డీ కళాశాల రహదారిలో మలుపు వద్ద ఉన్న ఓ విద్యుత్తు స్తంభంపై పిచ్చి జాతి మొక్క తీగలు అల్లుకున్నాయి. గాలి వీచినప్పుడల్లా నిప్పురవ్వలు ఎగసిపడుతున్నాయని, అప్పుడప్పుడూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాటిని తొలగించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, భానుగుడిసెంటర్

వ్యర్థాలను తొలగించరూ..

కాకినాడ శాంతినగర్‌లో ప్రధాన రహదారి పక్కన కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయింది. దాంతో కాలువలో మురుగు పారే వీలులేకుండా ఉందని స్థానికులు చెబుతున్నారు. దుర్వాసన వ్యాపిస్తోందని, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు, పూడిక తొలగించి మురుగు పారేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మసీదుసెంటర్

అలముకున్న అంధకారం

వెలగని దీపం

కాకినాడ శాంతినగర్‌లోని ఓ వీధిలో రహదారి పక్కన వీధి దీపం వెలగడం లేదు. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఆ దారిపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. దాంతో కుక్కల బెడద ఎక్కువవుతోందని స్థానికులు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మసీదుసెంటర్

అధ్వానంగా రహదారి..

దుమ్ములపేట బైపాస్ రోడ్డుపక్కన చెత్తాచెదారం, వ్యర్థాలు గుట్టల్లా పేరుకుపోయాయి. చెత్తాచెదారం, ఎండిన చెట్టుకొమ్మలు, ఖాళీ కొబ్బరి బోండాలు, ఇతర వ్యర్థాలు రహదారి చెంతనే వేసేయడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాసనొస్తోందని, గాలికి ధూళి ఎగసి కళ్లలో పడుతోందని వాహనదారులు వాపోతున్నారు. రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉందంటున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మసీదుసెంటర్

అమరవీరుల సంస్మరణ సభ విజయవంతానికి పిలుపు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రాజబాబు తదితరులు

గాంధీనగర్: కాకినాడ కచేరిపేటలోని యూటీఎఫ్ భవనంలో ఈ నెల 15న జరిగే విప్లవ అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు పిలుపునిచ్చారు. ఆదివారం అచ్యుతాపురం రైల్వేగేటు వద్దనున్న పైళ్లమ్మతల్లి భవన నిర్మాణ కార్మిక సంఘ సర్వసభ్య సమావేశం రాయుడు గోవిందు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యం, ఏపీ రైతుకూలీ సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు కార్మికుల సమక్షంలో సభ కరపత్రాలు ఆవిష్కరించారు. వెంకటరమణ, ప్రభాకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పార్కులను ప్రైవేటుపరం చేయొద్దు

వివేకానంద పార్కులో నిరసనలో ప్రజాసంఘాల నాయకులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: కాకినాడ నగరంలో ప్రజాధనంతో అభివృద్ధి చేసిన పార్కులను ప్రైవేటుపరం చేయొద్దని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం రాజా ట్యాంకు(వివేకానంద పార్కు) వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తిరాజు, ఆల్ఇండియా లాయర్స్ యూనియన్ నాయకురాలు నాగజ్యోతి, సీపీఎం నగర కార్యదర్శి పలివెల వీరబాబు మాట్లాడుతూ ఆదాయం సమకూర్చే పేరుతో ఇప్పటికే అభివృద్ధి చెందిన పార్కులను ప్రైవేటుకు అప్పగించడం సమంజసం కాదన్నారు. సామాన్య, మధ్య తరగతికి ఉద్యానాలే ఆహ్లాదానికి ఆధారమని, పెన్షనర్ల ప్యారడైజ్‌గా పేరుగాంచిన నగరంలో వృద్ధులు, పెన్షన్‌దారులకు సామూహిక సంబంధాలకు ఉద్యానాలే కేంద్రాలుగా నిలుస్తున్నాయన్నారు. నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారిగా ఉన్న కలెక్టర్ పార్కుల ప్రైవేటీకరణ ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. నాయకులు ప్రభాకరవర్మ, రమణ, సత్యం, లోవరాజు, భూలక్ష్మి, భారతి, మలక వెంకటరమణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ఆర్యవైశ్యుల కార్తిక వనసమారాధన

కాకినాడ నగరం: స్థానిక మెక్లారిన్ పాఠశాల ఆవరణలో ఆదివారం ఆర్యవైశ్య కార్తిక వనసమారాధన జరిగింది. నగర పరిధిలోని ఆర్యవైశ్యులు కుటుంబ సభ్యులతో కలిసి పెద్దఎత్తున పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని సంఘ నాయకులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలకు ప్రత్యేక పోటీలు నిర్వహించి సందడి చేశారు. కార్యక్రమంలో నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ఆర్యవైశ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో ఉత్సాహంగా వాక్‌థాన్

ఓఎన్‌జీసీ కార్యాలయం వద్ద వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న అసెట్ మేనేజర్ ప్రభల్‌సేన్‌గుప్తా

సర్పవరం, న్యూస్‌టుడే: ఓఎన్‌జీసీ విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ 2025 పురస్కరించుకుని కాకినాడ గ్రామీణం రమణయ్యపేట కార్యాలయం నుంచి ఆదివారం నాగమల్లితోట కూడలి వరకు వాక్‌థాన్ నిర్వహించారు. ఓఎన్‌జీసీ కాకినాడ అసెట్ మేనేజర్ ప్రభల్‌సేన్‌గుప్తా, విజిలెన్స్ ఇన్‌ఛార్జి కె.సోమశేఖర్ ఇతర అధికారులు జెండా ఊపి ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో అధికారులు, కుటుంబ సభ్యులు, సిబ్బంది, ఏఎస్‌డీ ప్రభుత్వ కళాశాల, పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సముద్రంలో మత్స్యకార యువకుడి మృతి

మృతుడు సాయి

మసీదు సెంటర్, నగరం(కాకినాడ): వేటకు వెళ్లి తిరిగొస్తుండగా కుంభాభిషేకం రేవు సమీపంలో మత్స్యకార యువకుడు సముద్రంలో పడి మృతిచెందిన ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. బంధువుల వివరాల ప్రకారం.. కాకినాడ దుమ్ములపేటకు చెందిన జామి సాయి(26) శనివారం సహచరులతో కలిసి సముద్రంలో వేటకు వెళ్లాడు. ఆదివారం తెల్లవారుజామున కుంభాభిషేకం రేవుకు వస్తూ.. మూడు కిలోమీటర్ల దూరంలో ఫిట్స్ రావడంతో అకస్మాత్తుగా సముద్రంలో పడిపోయాడు. వెంటనే అక్కడి మత్స్యకారులు గాలింపు చేపట్టగా విగతజీవిగా దొరికినట్లు స్థానికులు తెలిపారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పోర్టు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేసి భౌతికకాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

ఇంటిపై నుంచి పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృత్యువాత

మసీదుసెంటర్(కాకినాడ): పిఠాపురం మండలం బి.కొత్తూరుకు చెందిన కె.కొండరాజులు(49) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. కొండరాజులు తాపీ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటాడు. గత నెల 31న కాకినాడలోని డెయిరీఫారం సెంటర్‌లోని ఓ ఇంటి మొదటి అంతస్తులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం మేస్త్రి జీజీహెచ్‌లో చేర్చారు. ఘటనపై ఫిర్యాదు మేరకు కాకినాడ మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

కాలువలే.. కంగారు పెడుతున్నాయ్..

న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

ఆకర్షణీయ నగరం కాకినాడలోని పలు ప్రాంతాల్లో ప్రధాన మురుగు కాలువలు ప్రమాదకరంగా ఉండి ఆందోళన కలిగిస్తున్నాయి. గతంలో దుమ్ములపేట ప్రాంతంలోని ప్రధాన కాలువలో పడి ఓ బాలుడు మృతిచెందిన ఘటన ఆ ఇంట విషాదం నింపిన సంగతి తెలిసిందే. ఇక పశువులు కూడా ఓపెన్ డ్రెయిన్లలో పడిన ఘటనలు సంభవిస్తున్నాయి. స్థానికుల సహాయంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది కాలువలో పడిన పశువులను బయటకు తీసి ప్రాణాలు కాపాడుతున్నారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా.. నగరపాలక సంస్థ అధికారులు రక్షణ చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఎక్కడెక్కడ సమస్యలంటే..

నగరంలో చాలా ప్రాంతాల్లో ఈ ఓపెన్ డ్రెయిన్ల సమస్య నెలకొంది. ఎక్కడా స్లాబురాళ్లు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. ● జగన్నాథపురం జె.రామారావుపేట, మహాలక్ష్మీనగర్ ప్రాంతాల్లో ప్రధాన మురుగు కాలువలు ఉన్నాయి. కాలువలు కోతకు గురవడంతోపాటు పూడిక తీతకు నోచుకోకపోవడంతో వర్షాల సమయంలో నిండుగా ప్రవహిస్తున్నాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అందులో పడే ప్రమాదం ఉంది.

● సాంబమూర్తినగర్, అయోధ్యనగర్, రేచర్లపేట ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతాల్లో ఉన్న ఓపెన్ డ్రెయిన్‌లలో పశువులు పడిపోతున్నాయి. గౌతమినగర్‌లోని ఉద్యానం దారిలో కాలువపై కొంతమేర రక్షణగా రబ్బర్ గొట్టాలు ఏర్పాటు చేశారు. ఇక రామకృష్ణారావుపేట, దుమ్ములపేట, రాగంపేట స్టేషన్ దారిలో డ్రెయిన్‌లపై ఎక్కడా మూతలు లేవు. అధికారులు స్పందించి శిథిలమైనవాటి స్థానంలో కొత్త కాలువలు నిర్మించడంతోపాటు మూతలు ఏర్పాటు చేయాలని ఆయా ప్రాంత వాసులు కోరుతున్నారు.

రామకృష్ణారావుపేట ఇళ్ల ముందు తీరిది..

మహాలక్ష్మినగర్ దారిలో ప్రమాదకరంగా..

వృథా తీరు.. పట్టించుకోండి సారూ

అసలే వర్షాలు, తుపానుల కారణంగా వాతావరణ మార్పులతో వ్యాధుల బారినపడుతున్న నగరవాసులను మంచినీటి పైపులైన్‌ల లీకేజీలతో సరఫరా అవుతున్న కలుషిత నీరు మరింత భయపెడుతోంది. టూటౌన్ శిర్డిసాయి ఆలయ సమీపంలో మంచినీటి పైపులైన్ పగిలి నీరంతా వృథాగాపోతోంది. నెల రోజులుగా ఇదే పరిస్థితి ఉందని, బాగు చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గాంధీనగర్

(c) eenadu

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

కాజులూరు, న్యూస్‌టుడే: ఒంటిమిడి గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామస్థులతో కలిసి గ్రామంలో రాస్తారోకో చేసి ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. పది రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తున్నారని, అవి తాగడానికి పనికిరావడంలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పందించి తాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దున్నా ఆదినారాయణ, దండంగి సమర్పరాజు, పువ్వల భైరవమూర్తి, దండంగి సుగుణ, బిళ్లా అనంత, కొల్లు లోవకుమారి తదితరులు పాల్గొన్నారు.

రోజంతా సందడే..

పిఠాపురం మండలం నరసింగపురం రోడ్డులోని దంగేటి వారి మామిడితోటలో యాదవ సామాజికవర్గ కార్తిక వనసమారాధన ఆదివారం జరిగింది. యాదవులు అంతా పాల్గొని పోటాపోటీగా సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటలపాటలతో వన భోజనాల్లో పాల్గొనడంతో సందడి వాతావరణం నెలకొంది. మాధవపురం రోడ్డులో బ్రాహ్మణ సేవా పరిషత్ ఆధ్వర్యంలో వన భోజనాలు నిర్వహించారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325
ఉ॥ 10 - మ॥ 1 పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: వలసపాకల గ్రామం మత్స్యకార కాలనీలో మురుగుకాలువ పూడిక తీయడం లేదు. – సత్యవతి

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి వెంకటరత్నం దృష్టికి తీసుకెళ్లగా శుభ్రం చేయించారు. – న్యూస్‌టుడే, సర్పవరం

సమస్య: కరపమండలం పెద్దాపురప్పాడు శివారు వై.సావారం ఎస్సీ పేటలో వీధిదీపాలు సరిగా వెలగడం లేదు. – సత్యనారాయణ

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి పి.వీరభద్రరావు దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయించారు. – న్యూస్‌టుడే, కరప

సమస్య: స్థానిక సుబ్బయమ్మపేటలో మురుగు కాలువ శుభ్రం చేయక దుర్వాసన వస్తోంది. శుభ్రం చేయడానికి చర్యలు తీసుకోవాలి. – వెంకట్రావు, పెద్దాపురం

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణకు తెలుపగా కాలువ శుభ్రం చేయించారు. – న్యూస్‌టుడే, పెద్దాపురం

సమస్య: పిఠాపురం మండలం రాపర్తి వంతెన నుంచి జములపల్లి వైపు వెళ్లే మార్గంలో గతంలో గండి పడడంతో పూడ్చారు. మళ్లీ కోతకు గురవుతోంది. – నారాయణరెడ్డి

పరిష్కారం: జలవనరులశాఖ ఏఈ ప్రసన్నకుమార్‌కు చెప్పగా గండి పడకుండా పటిష్టంగా ఇసుక బస్తాలు సిద్ధం చేశారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

సమస్య: ఉప్పాడ పంచాయతీ పల్లిపేటలో కాలువ పూడికతో నిండి ప్రవాహం నిలిచిపోయింది. – స్థానికులు

పరిష్కారం: కార్యదర్శి శ్రీనివాసరావు సిబ్బందిని పంపి పూడిక తీయించారు. – న్యూస్‌టుడే, కొత్తపల్లి

సమస్య: చేబ్రోలు ప్రధాన రహదారి పక్కన కాలువలో వ్యర్థాలు నిండి మురుగునీరు ప్రవహించక దుర్వాసన వస్తోంది. – స్థానికులు

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి రాజు సిబ్బందితో కాలువలో వ్యర్థాలను తొలగింపజేశారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

నిండా ముంచేసిన మొంథా

పిఠాపురం, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావానికి రైతులు కుదేలయ్యారు. కోతకొచ్చిన దశలో ఉన్న పంటలు నీట మునిగి పంటలు నేలవాలడం, ముంపునకు గురికావడంతో నష్టం వాటిల్లింది. పలుచోట్ల ఏలేరు, పీబీసీ కాలువలకు గండ్లు పడడంతో సమీప పొలాల్లో నీరు చేరి పంట దెబ్బతింది. బలమైన గాలుల ఉద్ధృతికి గింజదశలో ఉన్న పంట నేలవాలింది. ఈ నేపథ్యంలో మండలాల వారీగా వ్యవసాయశాఖాధికారులు పంట నష్టం సర్వే మొదలు పెట్టారు. జలవనరులశాఖ అధికారులు గండ్లు పూడ్చే పనిలో నిమగ్నమయ్యారు.

మాధవపురంలో నీట మునిగిన పొలాల్లో వరి దుబ్బులు చూపిస్తున్న రైతులు

పంట నష్టం వివరాలు హెక్టార్లలో

మండలం	వరి
గొల్లప్రోలు	282
పిఠాపురం	282
కొత్తపల్లి	655
పెద్దాపురం	400
సామర్లకోట	3100
కాకినాడ గ్రామీణం	260
కరప	1133

గొల్లప్రోలు (మం) పత్తి 190, మొక్కజొన్న 32 హెక్టార్లలో నష్టం వాటిల్లింది.

గండ్లుతో ప్రమాదం

ఏలేరు గట్టుకు గతంలో ఏర్పడిన గండ్లు సక్రమంగా పూడ్చలేదు. రాపర్తి గొర్రిఖండి కాలువపై భారీ గండి పూడ్చారు. ప్రస్తుతం దాని కింద నుంచి పొలాల్లోకి నీరు చేరి పంటలు కుళ్లిపోయి, నష్టం ఏర్పడుతోంది. వరదలు, తుపానులకు రైతులకు పెట్టుబడి కూడా రావడం లేదు. – ఎం.సూరిబాబు, రైతు, రాపర్తి

వరి నేలవాలింది

మంచి దిగుబడి సాధిస్తామనుకున్న సమయంలో వరిపంట నేలవాలింది. బలమైన ఈదురు గాలులకు వెన్నువిరిగి పడిపోయింది. ఇప్పుడు దిగుబడి తగ్గిపోయి, పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. నేను ఏలేరు ఆయకట్టు కింద నాలుగు ఎకరాలు కౌలుకి చేస్తున్నాను. ఎకరాకు రూ.25వేలు చొప్పున కారు పెట్టుబడి పెట్టాను. అధికారులు న్యాయం చేయాలి. – పత్తిపాటి గోవిందరాజు, రైతు, వద్దమూరు

ఎకరాకు రూ.50 వేలు పెట్టాను..



తుపాను కారణంగా వీచిన బలమైన గాలులకు వరితోపాటు, మొక్కజొన్న, బొప్పాయి, పత్తి, అపరాల పంటలు దెబ్బతిన్నాయి. నేను 4 ఎకరాల్లో మొక్కజొన్న, 3 ఎకరాల్లో బొప్పాయి సాగు చేశాను. పంట నేలవాలడంతో ఎకరాకు రూ.50 వేలు పెట్టుబడి పోయింది. ప్రభుత్వమే ఆదుకోవాలి. – గాది సూరిబాబు, రైతు, దుర్గాడ

అలల ఉద్ధృతికి ఇళ్లు దెబ్బతిన్నాయి

తుపాను కారణంగా సముద్రం అలల ఉద్ధృతికి తీర ప్రాంతం కోతకు గురైంది. పలుఇళ్లు దెబ్బతిన్నాయి. రోడ్లు ధ్వంసమయ్యాయి. తుపాను వస్తే ఇళ్లు వదిలి పునరావాస కేంద్రాలకు పారిపోవాలసి వస్తోంది. కోతకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చూపిస్తే మత్స్యకారులు జీవనం సాగించగలరు. – భూలోకమ్మ, మాయాపట్నం

మహిళల విజయంతో వాడవాడలా సందడి

సామర్లకోట, న్యూస్‌టుడే: భారత్, దక్షిణాఫ్రికా మధ్య ఆదివారం జరిగిన మహిళల ప్రపంచ కప్ ఫైనల్ క్రికెట్ పోటీలో భారత జట్టు విజయం సాధించడంతో వాడవాడలా సంబరాలు చేసుకున్నారు. ఆదివారం సామర్లకోట మేహార్‌కాంప్లెక్స్‌లో వినాయకుని ఆలయంలో తెదేపా నాయకుడు నిమ్మకాయల రంగనాగ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని తెదేపా కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. క్రికెట్ పోటీని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప వీక్షించారు. కార్యక్రమంలో నాయకులు బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్, అడబాల కుమారస్వామి, బలుసు శ్రీనివాసు, వల్లూరి దొరబాబు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీని స్క్రీన్‌పై వీక్షిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

నా జీవితం ప్రజాసేవకే అంకితం: వర్మ

పిఠాపురం, న్యూస్‌టుడే: తనకు అధికారం, పదవి ఉన్నాలేకున్నా జీవితం ప్రజాసేవకే అంకితమని మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా సైక్లోన్ ఫైటర్ అవార్డు తీసుకుని పిఠాపురం తెదేపా కార్యాలయానికి వచ్చిన వర్మను తెదేపా నాయకులు ఘనంగా సత్కరించారు. మొంథా తుపాను మత్స్యకారులు ఇబ్బందులు పడకుండా సహాయం అందించడం, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ బాధితులకు అండగా నిలిచామన్నారు. పునరావాస కేంద్రాల్లో కూడా వసతులు, భోజనం ఇబ్బందులు లేకుండా చూశామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి తన ధ్యేయమని వర్మ పేర్కొన్నారు. నాయకులు సకుమళ్ల గంగాధర్, బొజ్జా సతీష్, కొండేపూడి ప్రకాష్, బర్ల అప్పారావు, మడికి ప్రసాద్, అనిశెట్టి సత్యానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్మను సత్కరిస్తున్న తెదేపా నేతలు

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

పిఠాపురం: పిఠాపురంలోని పాడా కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ఈ నెల 3వ తేదీ యథావిధిగా జరుగుతుందని పీడీ చైత్రవర్షిణి ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండు వారాలుగా దీపావళి, తుపాను కారణంగా పీజీఆర్ఎస్ నిర్వహించలేదు. ఉదయం 10.30 గంటలకు ఉదయం ఒంటి గంట వరకు అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు.

మండలస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

పిఠాపురం: పిఠాపురం మండలం విరవ జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పోటీల నిర్వాహకుడు పీఈటీ రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఖోఖో, కబడ్డీ పోటీలు జరుగుతాయని చెప్పారు. మండలంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని పేర్కొన్నారు.

కోరింగలో విద్యార్థుల పర్యటన

తాళ్లరేవు: కోరింగ అభయారణ్యంలోని చొల్లంగి పర్యాటక కేంద్రం ఆదివారం సందడిగా మారింది. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చి చెక్కల వంతెనపై నడుస్తూ మడఅడవుల అందాలను తిలకించారు.

సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాలి

మాట్లాడుతున్న పదాల రఘు

కరప: ప్రతి హిందువు ధర్మాన్ని ఆచరిస్తూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించేందుకు కృషి చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రసారక్ పదాల రఘు కోరారు. కరపమండలం పెనుగుదురులో ఆదివారం ఆయన ఆ సంస్థ సభ్యులతో ధార్మిక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 2 నుంచి 9వ తేదీ వరకు గృహ సంపర్క సమావేశాలు జరపాలన్నారు. విశ్వనాథం, చంటిబాబు, సత్యనారాయణ, లక్ష్మీకాంతం, వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత

గొల్లప్రోలు: గ్రామాల్లో 24 గంటలు త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా కోసం కొత్తగా లైన్లు ఏర్పాటు చేసే పనులు నిర్వహిస్తున్నట్లు ఈఈ ప్రభాకర్ తెలిపారు. ఇందులో భాగంగా కొత్తగా లైన్లు ఏర్పాటుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చేబ్రోలు పరిశ్రమల ప్రాంతం, తాటిపర్తి, చినజగ్గంపేటలో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

గుర్రపుడెక్క తొలగింపు

స్పందనకు వందనం

గొల్లప్రోలు గాంధీనగర్‌లోని ప్రధాన కాలువలో గుర్రపుడెక్క తొలగింపు పనులు పొక్లెయిన్‌తో నిర్వహిస్తున్నారు. గతనెల 17న 'ఈనాడు'లో కాలువ మూసుకుపోయి ఇక్కట్లు శీర్షికతో వచ్చిన చిత్రకథనానికి నగర పంచాయతీ అధికారులు స్పందించి ఆదివారం పనులు చేపట్టారు. ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ పనులను పర్యవేక్షించారు. కాలువలో గుర్రపుడెక్క తొలగించడంతో మురుగునీరు ప్రవాహానికి అడ్డంకి తొలగింది. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

ఆలయాల్లో భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

సామర్లకోట, న్యూస్‌టుడే: దర్శనాల నిమిత్తం వచ్చే భక్తులకు ఆలయాల్లో తొక్కిసలాట జరగకుండా తగు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని మానవహక్కుల పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ అన్నారు. ఆదివారం సామర్లకోట భీమేశ్వరాలయానికి విచ్చేసి ఈఓ నీలకంఠంకు వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో జరిగిన ఘటనను దృష్టిలో పెట్టుకుని ఆలయాల్లో రద్దీ లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు కుంచె నానిబాబు, జుత్తుక అప్పారావు, వల్లీబాషా, మున్వర్ ఉన్నారు.

రోడ్డు మధ్యలో స్తంభం

గొల్లప్రోలు పెదవీధిలో రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఇనుప విద్యుత్తు స్తంభం ఉండటంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. స్తంభం పొట్టిగా ఉండి విద్యుత్తు తీగలు కిందికి వేలాడుతుండడంతో లోడు వాహనాలు వెళ్లే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాన్ని తొలగించి మరో స్తంభాన్ని ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు. పరిశీలించి చర్యలు చేపడతామని ఏఈ రామచంద్రరావు తెలిపారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

ప్రమాదకరంగా విద్యుత్తు పెట్టె

పెద్దాపురం పురపాలికలోని ఒకటో వార్డు పరిధి గుడివాడ ప్రాంతంలోని పురపాలిక సంఘ ప్రాథమిక పాఠశాల గోడకు ఉన్న విద్యుత్తు పెట్టె ప్రమాదకరంగా ఉంది. దానికి తలుపు లేకపోవడంతో విద్యార్థులు ముట్టుకుంటే ప్రమాదం సంభవించడానికి అవకాశం ఉంది. కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి వివరణ కోరగా, విద్యుత్తు సిబ్బందిని పంపి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తానన్నారు. – న్యూస్‌టుడే, పెద్దాపురం

పారిశ్రామికవాడలో రహదారులు ముంపు

కాకినాడ గ్రామీణం రమణయ్యపేట ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో తుపాను కారణంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారులు ముంపునకు గురయ్యాయి. పారిశ్రామికవేత్తలు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ పద్మజ దేవి మాట్లాడుతూ వెంటనే మురుగునీటిని తోడించి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, రమణయ్యపేట

చెత్తతో స్వాగతం

సామర్లకోట గ్రామాలు, పట్టణాల లోనికి వెళ్లే ప్రజలు, ప్రయాణికులకు స్వాగతం బోర్డులు, పచ్చదనం బదులుగా చెత్త, ప్లాస్టిక్‌తో స్వాగతం పలుకుతాయి. సామర్లకోట పట్టణానికి వచ్చే ప్రజలకు మాత్రం చెత్త కుప్పలతో స్వాగతం పలుకుతున్నట్లుగా చెత్తపోగులు దర్శనమిస్తున్నాయి. వ్యర్థాలు వేయడంతో దుర్వాసనతో ఆ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని చెత్తను తొలగించాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సామర్లకోట

కల్వర్టు లేక కడగండ్లు

గొల్లప్రోలు రాయవరం రోడ్డు నుంచి తాటిపర్తి రోడ్డుకు వెళ్లే మార్గంలోని ప్రధాన కాలువపై కల్వర్టు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వేసిన సిమెంటు తూరలు మూసుకుపోయి మురుగునీరు ప్రవహించక చెరువులా మారింది. కల్వర్టు నిర్మించక వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టు నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తామని ఇన్‌ఛార్జి కమిషనర్ అలీషా తెలిపారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

వైభవంగా తెప్పోత్సవం.. కల్యాణోత్సవాలు

గొల్లప్రోలు: గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని కోటలంకవారి చెరువులో సీతారాముల తెప్పోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక సీతారామస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు అనంతరం పల్లకిలో ఊరేగించారు. విద్యుత్తు దీపాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన పడవలో తెప్పోత్సవం చేశారు. ★ గొల్లప్రోలు శివాలయం, రైల్వేస్టేషన్‌లో వెంకటేశ్వరస్వామి ఆలయం, గ్రామదేవత పాదాలమ్మ అమ్మవారి ఆలయంలో దీపోత్సవం చేశారు.

పిఠాపురం: పిఠాపురంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం స్వామి, అమ్మవార్లను శేష వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

చేబ్రోలు కోటలంకవారి చెరువులో సీతారాముల తెప్పోత్సవం

శేషవాహనంపై వేణుగోపాలస్వామి

దివ్య శివలింగ దర్శనం

గొల్లప్రోలు: గొల్లప్రోలు గాంధీనగర్‌లోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో 25 అడుగుల మహాశివుని దివ్య శివలింగ దర్శనం ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యింది. దర్శన కార్యక్రమాన్ని బ్రహ్మకుమారీ కాకినాడ జోన్ ఇన్‌ఛార్జి రజని, నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ మంగతాయారు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.

గొల్లప్రోలు: సాంస్కృతిక ప్రదర్శనిస్తున్న చిన్నారులు

నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

గొల్లప్రోలు: గొల్లప్రోలులో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నవరాత్రి మహోత్సవాలు ఆదివారం కలశస్థాపన పూజలతో ప్రారంభమయ్యాయి. ఉదయం ట్రాక్టర్‌పై స్వామిని వీధుల్లో ఊరేగించారు. ఈనెల 8న పంచాక్షరీ దీపారాధన, 9న దివ్య కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు.

పెదపూడి: సంపర బాలాత్రిపురసుందరి ముక్తేశ్వరాలయంలో ఆదివారం 32వ వనసమారాధన నిర్వహించారు.

తుపాను బాధితులకు కూటమి ప్రభుత్వం అండ

సర్పవరం: తుపాను బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. కాకినాడ గ్రామీణం వాకలపూడి హార్బర్ పేట, తూరంగి పగడాల పేట ప్రాంతాల్లో తహసీల్దార్ కుమారి ఆధ్వర్యంలో తుపాన్ బాధితులకు సరుకులను పంతం నానాజీ, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే చిక్కాల రామచంద్రరావుతో కలిసి మత్స్యకారులకు బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు.

వాకలపూడి హార్బర్‌పేటలో సరుకులు అందిస్తున్న ఎమ్మెల్యే నానాజీ, ఎమ్మెల్సీ పద్మశ్రీ

600 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ

గొల్లప్రోలు: చేబ్రోలులో ఓరుగంటి నాగేశ్వరరావు, వీరలక్ష్మి దంపతులు, వారి కుమారులు ఆదివారం 600 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ★ గొల్లప్రోలు కరణంగారితోటలోని కనకదుర్గ ఆలయం దగ్గర ఆదివారం అన్నదానం నిర్వహించారు. 500 మంది పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీచేశారు. మర్రెడ్డి శ్రీనివాసరావు, కమిటీ ఛైర్మన్ గరగ తాతాజీ, కమిటీ సభ్యులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో ఉత్సాహంగా వాక్‌థాన్

సర్పవరం, న్యూస్‌టుడే: ఓఎన్‌జీసీ విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ 2025 పురస్కరించుకుని కాకినాడ గ్రామీణం రమణయ్యపేట కార్యాలయం నుంచి ఆదివారం నాగమల్లితోట కూడలి వరకు వాక్‌థాన్ నిర్వహించారు. ఓఎన్‌జీసీ కాకినాడ అసెట్ మేనేజర్ ప్రభులేసన్‌గుప్తా, విజిలెన్స్ ఇన్‌ఛార్జి కె.సోమశేఖర్ ఇతర అధికారులు జెండా ఊపి ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో అధికారులు, కుటుంబ సభ్యులు, సిబ్బంది, ఎస్ఏడీ ప్రభుత్వ కళాశాల, పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వాక్‌థాన్ ప్రారంభిస్తున్న అసెట్ మేనేజర్ ప్రభులేసన్‌గుప్తా

పురస్కార గ్రహీతకు అభినందన

కరప, న్యూస్‌టుడే: కరప మండలం గురజనాపల్లిలోని మానవత్వం స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ జొన్నలగడ్డ రాజు పేదలకు చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను గుర్తించి విశ్వజనని ఫౌండేషన్ ప్రతిభావంతులు ఉత్తమ సేవారత్న పురస్కారాన్ని అందజేశారు. హైదరాబాద్ నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కావేరికలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సినీనటులు గౌతమ్‌రాజు, పసునూరి శ్రీనివాసులు తదితరులు చేతులమీదుగా ఈ పురస్కారాన్ని రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా సామాజిక సేవావేత్త నారాయ తదితరులు హర్షం వ్యక్తం చేసి రాజును అభినందించారు.

పెదపూడి పాఠశాల హెచ్ఎం సస్పెన్షన్

పెదపూడి: పెదపూడి గాంధీస్మారకోన్నత ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో-1గా పనిచేస్తున్న కె.సత్యనారాయణను సస్పెండ్ చేస్తూ ఆర్జేడీ కాకినాడ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ జోన్-2 (ఆర్జేడీ) జి.నాగమణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరులో సత్యనారాయణ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులతో పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఓ ఉపాధ్యాయురాలు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అదేనెల 18వ తేదీన కాకినాడ విద్యాశాఖ నుంచి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో విచారణ చేపట్టారు. అక్టోబరు 30న డీఈవో వివరణ ఇవ్వాలని సత్యనారాయణ సస్పెండ్ చేసినట్లు ఆదేశాలు అందాయి.

ఎకరానికి రూ.25వేలు ఇవ్వాలి

తాళ్లరేవు: నీట మునిగిన పంట నష్ట పోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు నష్ట పరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజుబాబు డిమాండ్ చేశారు. ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తే క్వింటాకు రూ.500 బోనస్‌ను ఇవ్వాలన్నారు. పోలేకుర్రు, పి.మల్లవరం, జార్జిపేట, నీలపల్లి, జి.వేమవరం, కోరంగి గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. దంగేటి గణేశ్వరరావు, మందపాటి చినబ్బాయి, దడాల శ్రీను, దడాల కొండ, పొనుగుమట్ల సింహాద్రి పాల్గొన్నారు.

రహదారిపై గుంతలు పూడ్చివేత

సర్పవరం, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణం ఇంద్రపాలెం గ్రామంలోని రహదారులపై ఏర్పడిన గుంతలు కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి స్పందించి మన ఊరు మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆదివారం సొంత డబ్బుతో గుంతలు పూడ్చారు. గొల్లపల్లి కల్యాణమండపం, శివాజీ థియేటర్, బ్రాహ్మణ అగ్రహారం ప్రాంతాల్లో పూడిక చేశారు. ప్రతినిధులు అచ్చారావు, రామ్మోహన్, గంగాధర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మసీదుసెంటర్(కాకినాడ): పిఠాపురం మండలం బి.కొత్తూరుకు చెందిన కె.కొండరాజులు(49) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. కొండరాజులు బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గత నెల 31న కాకినాడలోని డెయిరీఫారం సెంటర్‌లోని ఓ ఇంటి మేడిపై అంతస్తులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయారు. తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం మెరుగైన జీజీహెచ్‌లో చేర్చారు. ఘటనపై ఫిర్యాదు మేరకు కాకినాడ మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యంపై కేసు

కరప, న్యూస్‌టుడే: కరప మండలం పెనుగుదురుకు చెందిన దేగల నానిబాబుకు ప్రమీలతో సుమారు ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక బాలిక, బాలుడు సంతానం. ఆమె గతనెల 31న రాత్రి నిద్ర క్షమించండి, పిల్లలను జాగ్రత్తగా చూసుకోండని ఉత్తరం రాసి ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. తన భార్యను వెతికి తనకి అప్పగించాలని నానిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాతృత్వ వందన.. గర్భిణులకు సాంత్వన

పెద్దాపురం, న్యూస్‌టుడే: గర్భిణులకు పౌష్టికాహార లోపం లేకుండా వేతనం ఇవ్వాలని పుట్టబోయే బిడ్డకు పోషణ ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన (పీఎంఎంవీవై) ఎంతో అండగా నిలుస్తోంది. అర్హులైన లబ్ధిదారులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లయితే నగదు చేయూత లభిస్తుంది. మొదటి కాన్పులో రూ.5 వేలు, రెండో కాన్పులో ఆడ బిడ్డ అయితే రూ.6 వేలు ఆర్థిక సాయం అందిస్తారు. ఆర్థిక చేయూతతోపాటుగా వీరికి పోషకాహారం, వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుంది. పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పెద్దాపురం, సామర్లకోట పట్టణాలు, గ్రామీణంలో ఈ పథకం లబ్ధి పొందుతున్నారు.

పెద్దాపురంలో వైద్యపరీక్షలకు వచ్చిన గర్భిణులు

మండలం	కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు
పెద్దాపురం	124	637	582
సామర్లకోట	165	704	617

బాధ్యతలు అంగన్‌వాడీలకు బదలాయింపు

గతంలో పథకం నిర్వహణ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అమలు జరిగేది. ఐటీవలి ఆ బాధ్యతలను అంగన్‌వాడీ కేంద్రాలకు అప్పగించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణుల పేర్లు నమోదు చేస్తారు. కార్యకర్త లాగిన్ నుంచి పర్యవేక్షకురాలికి పంపిస్తారు. అక్కడ అవసరమైన మార్పులు చేయాల్సి ఉంటే ప్రాజెక్టు అధికారికి తెలియజేస్తారు. ఇక్కడ నుంచి జిల్లా ప్రాజెక్టు అధికారికి వెళ్తుంది.

రెండు విడతలుగా సాయం..

గర్భిణులు, బాలింతలకు ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం వర్తిస్తుంది. గతంలో రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని మూడు విడతలుగా పంపిణీ చేసేవారు. ఇకమీదట రెండు విడతలుగా ఇస్తారు. గర్భం దాల్చిన సత్వరం పేరు నమోదు చేసుకుంటే రూ.3వేలు, ప్రసవం అనంతరం మూడు టీకాలు వేసుకున్నాక మిగతా రూ.2 వేలు ఇస్తారు. రెండో కాన్పులో ఆడబిడ్డ జన్మిస్తే మూడు టీకాలు వేసుకున్న అనంతరం ఒకేసారి రూ.6 వేలు లబ్ధిదారుల ఖాతాలో జమచేస్తారు. ఈ పథకానికి అర్హులైన గర్భిణులు ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కేంద్రాలకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలి. – ఉషా, సీడీపీవో, పెద్దాపురం

(c) eenadu

వేదికపై పాటలు పాడుతున్న విద్యార్థులు

అలరించిన పాటల పోటీలు

తుని, న్యూస్‌టుడే: రోటరీ యువజనోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పాటల తుది పోటీలు ఆదివారం సాయంత్రం జరిగాయి. వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ చూపారు. చక్కటి స్వరంతో వేదికపై పాడి సభికులను అలరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పి. నాగిరెడ్డి, ప్రసన్నకుమార్, స్మూజ్ నరేష్, దండెం మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

తుని

•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

తెలుగు జానపద గీతాల్లో ప్రథమ స్థానం

తుని: జాతీయ బృందగాన పోటీల్లో తుని విద్యార్థులు ప్రతిభకనబరిచారని భారత్ వికాస్ పరిషత్ తుని శాఖ అధ్యక్షుడు గాజుల వేణుగోపాలస్వామి తెలిపారు. తిరుపతిలో ఆదివారం జరిగిన సౌత్ రీజినల్ స్థాయి పోటీల్లో పలు రాష్ట్రాల బృందాలతో పోటీపడి శాఖ, ప్రాంత స్థాయిల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. ప్రకాష్ విద్యానికేతన్ విద్యార్థులు తెలుగు జానపద గీతాల్లో ప్రథమ, హిందీ, సంస్కృత పాటల పోటీల్లో ద్వితీయ బహుమతులు దక్కించుకున్నారు.

తిరుపతిలో జరిగిన పోటీల్లో విద్యార్థులు

ఇంకెన్నాళ్లిలా ఉంచుతారు..?



ప్రత్తిపాడు మండలంలోని చినశంకర్లపూడి గ్రామంలో ఇళ్ల మధ్య జన సంచారం అధికంగా ఉండే ప్రదేశంలో 1980లో నిర్మించిన జీఎల్ఆర్ (గ్రౌండ్ లెవెల్ రిజర్వాయర్) నిరుపయోగంగా ఉంటోంది. ఏళ్ల గడుస్తున్నా ఈ నిర్మాణాన్ని కూల్చడంలో స్థానిక అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. దాని సమీపాన ఉండే బోరు మూసుకుపోయింది. రోజూ పెచ్చులూడుతూ స్థానికులను భయపెడుతోంది. సంబంధిత అధికారులు వెంటనే ఈ శిథిల జల భాండాగారాన్ని కూల్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

రైతు కష్టం.. తీవ్ర నష్టం..

వేల ఎకరాల్లో నేలవాలిన పంటలు

కిర్లంపూడి, తుని గ్రామీణం, న్యూస్‌టుడే: మొంథా తుపాను రైతులను నిండాముంచింది. వరి, అరటి, కూరగాయల సాగుదారులకు తీవ్రనష్టం వాటిల్లింది. వరి పంట ఈనిక, గింజ గట్టిపడే దశలోఉండగా భారీ వర్షాలు, ఈదురు గాలులకు నేలకొరిగింది. ముఖ్యంగా స్వల్ప రకం వరి నేలనంటింది. కిర్లంపూడి, జగ్గంపేట, గండేపల్లి, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, తుని, తొండంగి, రౌతులపూడి తదితర మండలాల్లో ఖరీఫ్‌లో స్వర్ణ, సాంబ, స్వల్ప అనుబంధ రకాలను సాగు చేశారు. పంట సాగులో పెట్టుబడి పూర్తయ్యింది. ఎకరాకు రూ.30 నుంచి 35 వేల వరకు ఖర్చుపెట్టారు.

అరటిలోనూ ఇదే తీరు..

తుపాను గాలులకు అరటి పంటకు అపారనష్టం వాటిల్లింది. ఎనిమిది నెలలుగా పెట్టుబడి పెట్టి సాగుచేస్తూ వచ్చిన అరటితోట గెలలతోసహా మరో నెలరోజుల్లో చేతికి వచ్చే పరిస్థితి. ఈ సమయంలో మొంథా తుపాను రైతులకు పెనుభారంగా మారింది. ఎకరాకు రూ. 50 వేలు నుంచి రూ.70 వేల వరకు పెట్టుబడి పెట్టారు. నేలవాలిన పంట గెలలు పనికిరాని పరిస్థితి. ఈ దశలో ప్రభుత్వం ఇచ్చే రూ. 14 వేల పరిహారం ఏ మూలకు సరిపోని పరిస్థితి. పడిపోయిన చెట్లను తొలగించి మళ్లీ శుభ్రం చేసుకోవడం రైతుకు పెద్దపని.

9 ఎకరాలకు రూ.మూడులక్షలు పెట్టా..

తొమ్మిది ఎకరాలు కౌలుకు తీసుకుని స్వర్ణ రకం వరి సాగు చేశాను. రూ.మూడు లక్షల వరకు పెట్టుబడి అయ్యింది. పంట గింజగట్టిపడే దశలో ఉంది. ఈ సమయంలో జరిగిన పంట నష్టం తీవ్ర కుంగుబాటుకు గురిచేసింది. ఇంకా నెలరోజులపాటు పంటను కాపాడుకుంటూ రావాలి. ఈపరిస్థితులు రైతులకు ఎప్పుడూ రాకూడదు. – అనపర్తి వెంకటసూరి, కౌలురైతు, ముక్కొల్లు

కోలుకోలేని దెబ్బ

మూడెకరాల పొలంలో అరటి సాగు చేశా. ఎకరాకు రూ.అరవై వేలు పైబడి అయ్యింది. గాలులకు ఎకరం పొలంలో పంట పూర్తిగా పోయింది. గెలలతో సహా చెట్లను తొలగించి మరో పంట వేసుకోవాల్సిన పరిస్థితి. ప్రభుత్వం ఇచ్చే పరిహారం చెట్లను తొలగించేందుకూ సరిపోదు. నష్టాలను తట్టుకోలేక అరటిపంట సాగు చేసే రైతులు ఏటా తగ్గుతున్నారు. ప్రభుత్వం పంటనష్టపరిహారాన్ని పెంచి అరటి రైతులను ఆదుకోవాలి – నీలం సాంభమూర్తి, అరటి రైతు, గోనేడ.

కిర్లంపూడిలో నేలవాలిన వరిపంట

పత్తి పంట పెట్టుబడి మట్టిపాలు

తుపాను కారణంగా నాలుగురోజుల పాటు కురిసిన వర్షానికి పత్తి పంట మొత్తం కుళ్లిపోయింది. దీంతో పొలంలోని పత్తికాయలు రాలిపోతున్నాయి. కనీసం ఒక సారి కోత కోయలేదు. ఎకరాలకు రూ.40 వేలు వరకు పెట్టుబడి పెట్టా. మొత్తం పెట్టుబడి మట్టిపాలైపోయింది. ఈ పరిస్థితుల్లో పత్తిరైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నా. – రెడ్డి విజయబాబు, రైతు, తిమ్మాపురం, తుని మండలం

పంపా వరదతో వరికి నష్టం

పంపా వరద నీరు కాలువగట్లపై నుంచి ఉధృతంగా ప్రవహించి పంటపొలాలను ముంచెత్తింది. దీంతో తిమ్మాపురం గ్రామ పరిధిలోని సుమారు 30 ఎకరాలకు పైబడి వరిపంట మొత్తం నీటిలో మునిగిపోయింది. రోజులు గడుస్తున్నా పొలాల్లోంచి నీరు వెళ్లేదారి లేక పంటకు నష్టం వాటిల్లుతుంది. – పకుర్తి లోవరాజు, రైతు, తిమ్మాపురం, తుని మండలం.

శిశుమందిర్‌లో సప్తశక్తి సంగం

తుని పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని బ్యాంకుకాలనీ శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో ఆదివారం సప్తశక్తి సంగం నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో శిశుమందిర్ ప్రతినిధులు వాడ్రేవు కల్యాణి, ఈరంకి వల్లీ కామేశ్వరి మాట్లాడారు. శిశుమందిర్ ప్రధానాచార్య స్వామి ఆజాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

ప్రతి ఇంటా ఆర్ఎస్ఎస్ జెండా ఎగరాలి

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: రానున్న రోజుల్లో ప్రతి ఇంటా ఆర్ఎస్ఎస్ జెండా ఎగరాలని సంఘ్ ప్రముఖ్ తోట రామారావు అన్నారు. రాష్ట్రీయ స్వయక్ సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో మండలంలోని యర్రవరంలో గృహ సంపర్క్‌ను ఆదివారం నిర్వహించారు. ప్రతి గృహానికి వెళ్లి ఆర్ఎస్ఎస్ లక్ష్యాలు, ఆవశ్యకత, త్యాగాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను ఆయన అందజేశారు.

తిమ్మాపురం విష్ణు ఆలయంలో..

క్షీరాబ్ది ద్వాదశ పూజలు

కిర్లంపూడి, తుని గ్రామీణం న్యూస్‌టుడే: క్షీరాబ్ది ద్వాదశ సందర్భంగా వైకుంఠనారాయణునికి, తులసీమాతకు కల్యాణోత్సవ కార్యక్రమాన్ని చిల్లంగిలో అష్టలక్ష్మీసమేత లక్ష్మీనారాయణుని ఆలయంలో ఆదివారం నిర్వహించారు. తులసీచెట్టుకు పట్టుచీరకట్టి, స్వామివారిని పెండ్లికుమారుడిగా అలంకరించారు. ● తిమ్మాపురంలో కొలువుదీరిన మహావిష్ణు ఆలయంలో ఆదివారం రాత్రి స్వామిఅమ్మవార్ల తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు పోల్నాటి శేషగిరిరావు దంపతులు స్వామికి పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు ఉత్సవాన్ని తిలకించారు.

పున్నమి వెలుగుల్లో తెప్పోత్సవం

రౌతులపూడి, న్యూస్‌టుడే: ఈ నెల 5న శ్రీకోదండరాముని తెప్పోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ములగపూడిలోని శ్రీరామగిరిపై కొలువైన కోదండ రాముని తెప్పోత్సవానికి స్థానిక పెద్దలు, యువత చొరవ తీసుకున్నారు. ఏటా కార్తిక పౌర్ణమి రోజున స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం నిర్వహిస్తున్నారు. ఆలయానికి దిగువన ఉన్న వేములమ్మ సరోవరంలో స్వామి, అమ్మవార్లు ఆనందవిహారం చేస్తారు. మరో భద్రాద్రిగా పేరొందిన ఈ పురాతన ఆలయంలోని సీతారాములను ఉప ప్రణాళిక, మైదాన ప్రాంతవాసులు విశిష్టంగా కొలుస్తారు.

ఆలయ చరిత్ర ఇదీ..

సీతారాముల ఏకశిలా విగ్రహంతో మరో భద్రాద్రిగా స్వామి వారి ఆలయం పేరొందింది. 14వ శతాబ్దానికి చెందినదిగా భావిస్తున్న ఆలయ సమీపంలో కూర్మనాథస్వామి ప్రతిమ, రాతి నీటి తొట్టెలు, హోమ గుండాలు వంటి పురాతన ఆనవాళ్లు ఉన్నాయి. భక్తులు, దాతల సహకారంతో మెట్ల మార్గం, ఘాట్ రోడ్ అభివృద్ధి చెందాయి. ఆ మార్గాల్లో 27 అడుగుల ఎత్తులో ఆంజనేయస్వామి, గరుత్మంతుడు విగ్రహాలు నిర్మాణంలో ఉన్నాయి.

ఏకశిలపై సీతారాముల విగ్రహం

కార్యక్రమాలు

5న సాయంత్రం పెద్ద చెరువు (వేములమ్మ సరోవరం)లో తెప్పోత్సవాన్ని నిర్వహిస్తారు. కోటి వత్తులతో శ్రీరామ అఖండ జ్యోతి, జ్వాలా తోరణం, గంగా హారతి, భక్తి పాటల విభావరి, భజనలు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి గ్రామానికి చేరుకునేందుకు బస్సు సౌకర్యం ఉంది.

కనులపండువగా సత్యదేవుని వేడుక

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యనారాయణ స్వామి తెప్పోత్సవం ఘనంగా ఆదివారం రాత్రి జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి ఉత్సవాన్ని తిలకించడానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పంపా సరోవరం చెంతనే ఉత్సవ ప్రాంగణం, ఘాట్‌రోడ్డు భక్తులతో కిక్కిరిసింది. ఇబ్బందులు లేకుండా గ్యాలరీలు ఏర్పాటుతోపాటు, గజ ఈతగాళ్లు, వైద్య సిబ్బంది, అగ్నిమాపక, 108 వాహనాలను అందుబాటులో ఉంచారు. పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. ఉదయం సత్యజ్యోతి ఊరేగించారు. గ్రామంలోని సుబ్బరాయపురం వినాయకుని ఆలయం నుంచి కొండపైకి తీసుకువచ్చి కళా మందిరంపై పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తునికి చెందిన వెంకటలక్ష్మి భక్తబృందం కోలాటం అలరించింది. స్వామివారి రథసేవ ఘనంగా జరిగింది. ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులను చేసి వేద మంత్రోచ్ఛరణ, మంగళవాయిద్యాలతో ఆలయ ప్రాకారం చుట్టూ మూడుసార్లు ఊరేగించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం

సత్యజ్యోతి ఊరేగింపు

పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు

అన్నవరం, న్యూస్‌టుడే: కార్తికమాసం రద్దీ నేపథ్యంలో అన్నవరంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కాశీబుగ్గ తొక్కిసలాట ఘటనతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అప్రమత్తమయ్యారు. రావిచెట్టు వద్ద దీపారాధన సమయంలో ఇబ్బందులు లేకుండా ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాటు, భద్రతా సిబ్బందిని నియమిస్తున్నారు. సోమ, బుధవారాల్లో రద్దీ అధికంగా ఉండనుంది. బుధవారం పౌర్ణమి, గిరిప్రదక్షిణకు భారీగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. దీనిపై దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ నేడు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఆదివారం రద్దీ నెలకొంది. 6,500 వ్రతాలు జరిగాయి.

రావిచెట్టు వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లు

చెత్తను దాచుకున్న చెరువు గర్భం

పచ్చని మైదానంలా కనిపిస్తున్న ఈ ప్రాంతం సాక్షాత్తు చెరువుగర్భమే. లోవకొత్తూరు సాగునీటికి వినియోగించే పెద్ద చెరువులో నీళ్ల కలుషితం కావడంతో ఇలా ఆకుపచ్చని తేటతో ఇలా మైదానంలా ఉంది. గ్రామంలోని సేకరించిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు చెరువుగట్లపై వేయడంతో చెరువు కాస్తా కలుషితమైనట్లు ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులోని వ్యర్థాలు తొలగించాలని అన్నదాతలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తుని గ్రామీణం

పడకేసిన పారిశుద్ధ్యం

'స్వచ్ఛంధ్ర స్వర్ణాంధ్ర సాధన' కింద గతంలో పంచాయతీలకు చెత్త సేకరణ కోసం ఇచ్చిన వాహనాలు మూలకు చేరాయి. లోవకొత్తూరు, డి.పోలవరం, వి.కొత్తూరు, దొండవాక తదితర గ్రామాల పరిధిలోని చెత్తసేకరణ కోసం కేటాయించిన ట్రాక్టర్లు,ఆటోలు మూలకు చేరాయి. చెత్తసేకరణ సరిగ్గా జరగక గ్రామాలు అపరిశుభ్రంగా మారాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. – న్యూస్‌టుడే, తుని గ్రామీణం

వ్యాపార కేంద్రం కాదిది.. బస్‌షెల్టరే..!

అద్దరిపేట బస్ షెల్టర్ వ్యాపార కేంద్రంగా మారింది. స్త్రీ శక్తితో మహిళా ప్రయాణికులతో బస్సుల్లో రద్దీ నెలకొంటోంది. తుని, కాకినాడ వెళ్లేందుకు అద్దరిపేట ప్రధాన కూడలి. అక్కడి బస్‌షెల్టర్‌లో సామగ్రి పెట్టుకుని వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో బస్సు వచ్చేవరకు మహిళలు ఎండలో నిలవాల్సివస్తోంది. . అధికారులు బస్‌షెల్టర్‌ను వినియోగంలోకి తేవాలని మహిళలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తొండంగి

పశువుల ఆసుపత్రే ఇలా..!

చినుకు పడితే కొన్ని కార్యాలయాలు అధ్వానంగా ఉంటాయి. ఆ కోవలోకి చెందినదే గండేపల్లి మండలం మురారి పశువుల ఆసుపత్రి. ఆసుపత్రి భవనం శిథిలావస్థలో ఉంది. వైద్యులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఆపై వానొస్తే ఆవరణలో నీరు నిల్వ ఉండి ఇబ్బందిగా ఉంటోంది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గండేపల్లి

బడి చెంత.. ప్రమాదకరంగా స్తంభం

జగ్గంపేట గ్రామీణ మండలం రాజపూడి ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఆనుకుని ఉన్న విద్యుత్తు స్తంభం ప్రమాదాన్ని తలపిస్తుంది. స్తంభం ఒకవైపు ఒరిగి ఎప్పుడు కూలుతుందా అన్నట్లు కనిపిస్తుంది. స్తంభానికి సర్వీసు వైర్లతో పాటు కేబుల్ వైర్లను కట్టడంతో ప్రమాదకర పరిస్థితి నెలకొంది. కేబుల్ వైర్లను రెండో అంతస్తు కిటికీలకు కట్టారు. అధికారులు దృష్టిసారించి ముందస్తు చర్యలు తీసుకోవాలి.–న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

మత్స్యకారులకు అండగా కూటమి ప్రభుత్వం

తొండంగి, న్యూస్‌టుడే: మత్స్యకారులకు అండగా కూటమి ప్రభుత్వం నిలిచిందని తెదేపా మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు అన్నారు. ప్రభుత్వం మత్స్యకారులకు 50 కిలోల బియ్యం, నిత్యావసర సరకులను సరఫరా చేస్తుంది. వాటిని ఆదివారం తెదేపా నాయకులు కాలిబోయిన చంద్రరావు, గంటా లక్ష్మణ్, చవల రాజేంద్ర, యాదాల రామకృష్ణ, కొయ్యా చంటిలతో కలిసి అందించారు.

సరకులు అందజేస్తున్న తెదేపా నాయకులు

మహిళల ప్రపంచకప్ విజయం సంబరం

ఏలేశ్వరం, తుని పట్టణం, శంఖవరం, న్యూస్‌టుడే: భారత్ మహిళా ప్రపంచకప్ గెలవాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. సీతంపేట గ్రామంలోని దుర్గామీనాక్షి అమ్మవారి దేవస్థానంలో వేదపండితులచే పూజలు నిర్వహించారు. మహిళల ప్రపంచ కప్ తుది పోరు వీక్షణకు ఏలేశ్వరంలో కౌన్సిలర్, తెదేపా నాయకుడు బొదిరెడ్డి గోపాల కృష్ణ ఆదివారం ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే సత్యప్రభ ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయం వద్ద భారీ తెరను ఏర్పాటుచేశామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మూది నారాయణస్వామి, యండగొండి నాగబాబు, రాయుడు చిన్న, ప్రభుత్వ హైస్కూల్ ఛైర్మన్ క్రోత్తు గాంధీ, నాయకులు సామంతుల గోపీ, పడవాడ రమేష్ పాల్గొన్నారు. యర్రవరంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు జ్యోతుల పెదబాబు, భద్రవరంలో తెదేపా నాయకుడు జిగటాపు సూరిబాబు ఆధ్వర్యంలో శ్రేణులు పూజలు చేశాయి. రాష్ట్ర రోడ్డు కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా ఈశ్వరుడు, పర్వత సురేష్, అప్పారావు, కీర్తి సుభాష్, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్, గాబు సుభాష్, బొమ్మిడి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

తునిలో స్క్రీన్‌పై మ్యాచ్ చూస్తున్న కూటమి నాయకులు

సీతంపేటలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

● ప్రపంచకప్‌ను మహిళా క్రికెట్ జట్టు విజయం సాధించడంపై కూటమి నాయకులు, క్రీడాభిమానులు సంబరాలు చేసుకున్నారు. తుని పట్టణంలోని గాంధీసత్రం ప్రాంగణంలో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య ఆదేశాలతో ప్రత్యేకంగా భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. నాయకులు యనమల రాజేష్, లక్ష్మణరావు, చింతంనీడి అబ్బాయి, మోతుకూరి వెంకటేష్, దూలం మురళి తదితరులు పాల్గొన్నారు. మిఠాయిలు పంపిణీ చేశారు.

కాశీబుగ్గ మృతులకు నివాళి

తుని, జగ్గంపేట, జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కాశీబుగ్గలో జరిగిన దురదృష్టకర సంఘటనలో మృతి చెందిన వారికి వైకాపా నాయకులు, కార్యకర్తలు నివాళి అర్పించారు. పట్టణంలో జీఎన్‌టీ రోడ్డులో ఉన్న రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం రాత్రి కొవ్వొత్తులు చేతపట్టి మృతులకు నివాళి అర్పించారు.● కాశీబుగ్గ తొక్కిసలాట అత్యంత బాధాకరమని మాజీ మంత్రి తోట నరసింహం పేర్కొన్నారు. వైకాపా శ్రేణులు జగ్గంపేట వైయస్ఆర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు.

మృతులకు కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న వైకాపా శ్రేణులు

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

సమస్య: తొండంగి మండలం ఎ.కొత్తపల్లి ప్రధాన మార్గంలో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. దీంతో పందులు, కుక్కలు పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. – రాజేష్, గ్రామస్థుడు

సమాధానం: పంచాయతీ సిబ్బందిని పంపి వెంటనే చెత్తకుప్పలు తొలగించే ఏర్పాట్లు చేస్తాం – రాము, పంచాయతీ కార్యదర్శి

కొళాయిల ద్వారా తాగునీరు అందించాలి

సమస్య: కత్తిపూడి మూడో వార్డులో కొళాయిల ద్వారా తాగునీరు అందించే ఏర్పాటు చేయాలి. – నాని, స్థానికుడు.

సమాధానం: పరిశీలించి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం. – మధుశేఖర్, కార్యదర్శి, కత్తిపూడి.

ట్యాంకు శుభ్రం చేయించరూ..!

సమస్య: మండలంలోని తిరుమాలి కాలనీలో ఉన్న తాగునీటి ట్యాంక్ అపరిశుభ్రంగా ఉంది. కొళాయిలు, చప్టా వద్ద నాచు పట్టింది. తాగునీరు తీసుకెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది. – లక్ష్మి, తిరుమాలి కాలనీ

సమాధానం: తిరుమాలి వద్ద ఉన్న జీఎల్ఆర్ పథకం, పరిసరాలను శుభ్రం చేసేందుకు సిబ్బందిని పంపిస్తాం. – సూతి కృష్ణ ప్రసాద్, సర్పంచి, తిరుమాలి

– న్యూస్‌టుడే, తొండంగి, శంఖవరం, ఏలేశ్వరం

నీటి వృథాను అరికట్టారు..

స్పందనకు వందనం

గండేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని నీలాద్రిరావుపేట గ్రామం నీళ్ల ట్యాంక్ వద్ద కుళాయి మరమ్మతులకు గురై నీరు వృథాగా పోతుంది. సమస్యను పంచాయతీ కార్యదర్శి వీరేంద్రకు తెలిపాం. వెంటనే ఆయన సిబ్బందిని పంపి మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికట్టారు.

ఉప్పలపాడులో అన్నసమారాధన

గండేపల్లి, న్యూస్‌టుడే: కార్తికమాసం సందర్భంగా గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలో ఆదివారం ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచి అడబాల ఆంజనేయులు దంపతులు పీటలపై కూర్చొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

అవినీతి నిరోధక వారోత్సవాలు ముగింపు

తుని, న్యూస్‌టుడే: జీవిత బీమా సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న 'అవినీతి నిరోధక వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వెలమకొత్తూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎల్ఐసీ తుని సీనియర్ బ్రాంచి మేనేజర్ జి.సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎక్కడా అవినీతికి తావులేకుండా పాలసీదార్లకు నిత్యం సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి కెఎన్‌వి సత్యనారాయణ, శర్మ తదితరులు పాల్గొన్నారు.

మోడు వారె.. నీడ కరవై..

పురవీధుల్లో పచ్చదనం కనుమరుగు

రాజా రాజబాబు పార్కు సమీపంలో ఇలా..

పచ్చదనం పెంపొందించాలనే ఉద్దేశంతో తుని పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో దశాబ్దాలుగా అనేక రకాల చెట్లు పర్యావరణాన్ని పరిరక్షిస్తున్నాయి. ఎండాకాలంలో నీడనిస్తూ, వందలాది పక్షులకు ఆవాసాలుగా మారాయి. విద్యుత్తు తీగల కింద, రక్షిత తాగునీటి గొట్టాలున్న చోట ఉండటమే చెట్లకు శాపంగా మారింది. తరచూ ఈదురుగాలులు, వర్షాలకు చెట్టుకొమ్మలు విద్యుత్తు తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లపై పడుతున్నాయి. మరో పక్క భూమిలో వేర్లు పెరిగి తాగునీటి పైప్‌లైన్లు పగులుతున్నాయి. దీంతో గత ఏడాదిలో వివిధ వార్డుల్లోని భారీ వృక్షాలను నరికేశారు. ఇటీవల మొంథాతో అనేక చెట్లు, కొమ్మలు నేలకొరిగాయి. వాటిని కూడా యంత్రాలతో కత్తిరించి తొలగించారు. ఇప్పటికే పురవీధుల్లో పచ్చదనం కరవై ఎండలు మండుతున్నాయి. కొత్తగా మొక్కలు నాటి వాటిని సంరక్షించడం మాని, ఇలా పదుల సంఖ్యలో చెట్లను యథేచ్ఛగా నరికివేయడంపై పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో పురపాలక, ట్రాన్స్ అధికారులతోపాటు ప్రజలు కూడా అవగాహనతో మెలగాల్సిన అవసరం ఉందంటున్నారు. – న్యూస్‌టుడే, తుని

తూములు మూసి..కాలువలు చెరిపేసి..

ప్రత్తిపాడులో ముంపునకు కారణం

న్యూస్‌టుడే–ప్రత్తిపాడు

ఊళ్లో ఎక్కడ వర్షం కురిసినా నీటిని చెరువులకు చేర్చేలా కాలువలు ఉండేవి. వాటిని చెరిపేసి.. ఆక్రమించి.. తూములు పూడ్చేసి అస్తవ్యస్తం చేశారు. దీంతో మునుపెన్నడూ లేని ముంపునకు కారణం అవుతోంది. వాన కురిస్తే నీళ్లు పోయే దారి లేక రోడ్లు దెబ్బతింటున్నాయి. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో ఈ పరిస్థితి అంతకంతకూ పెరుగుతోంది. ప్రభుత్వ భూమి, కాలువలపై కన్నేసి కాజేయడం వల్ల వాన నీరు పోయే మార్గం లేదు. ఇటీవల వర్షాలకు మరోమారు అనుభవానికి వచ్చినా యంత్రాంగం పరిష్కారం వైపు దృష్టి సారించడం లేదు. ప్రత్తిపాడు ఊరు మధ్య గోవిందరాజులు చెరువుకు ఎగువన ఉన్న పుత్రచెరువు నుంచి 8 అడుగుల వెడల్పున 800 మీటర్ల కాలువ పూర్వ జీటీ రోడ్డుగా పిలిచే ప్రత్తిపాడు ప్రధాన రహదారి వెంబడి ఉండేది. కొండ ప్రదేశం, సమీప కాలనీల నుంచి వచ్చే నీరు రోడ్డు దాటేలా రోడ్డుకు ఫైర్ ఆఫీస్ సమీపంలో, పంచాయతీ వద్ద, కొండ మలుపులో చెరువు మలుపులో కల్వర్టులు ఉండేవి. చెరువుకు వచ్చే కాలువ బక్కచిక్కింది. తూములు మూసేశారు. రహదారి పక్కన దుకాణాలు విస్తరించి ఊరి మధ్య చెరువుకు నీరు రాకుండా చేశారు. ఈపరిస్థితి వల్ల వర్షం కురిసినపుడల్లా ప్రత్తిపాడులోని ఏనిమిది ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. రెండు దశాబ్దాల క్రితం ప్రత్తిపాడులో ఎంత వాన కురిసినా చుక్క నీరు నిలిచేది కాదు. పూర్వపు నీటి నడకను చెరిపేయడం వల్ల ముంపు సమస్యలు ఎదురవుతున్నాయి. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమస్య పరిష్కారానికి కృషి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రత్తిపాడు ర.భ రహదారిపై కల్వర్టు మూసుకుపోయి జలమయం

(c) eenadu

ఈనాడు కర్ణాటక

సోమవారం నవంబరు 3, 2025

పచ్చటి వనంలో ఎర్రటి రెక్కల రెపరెపలు..

రెక్కలు తొడిగిన గాలిపటం!

కార్వార, న్యూస్‌టుడే : చూడగానే సీతాకోక చిలుకను తలపించే అట్లాస్ మోత్ (అట్టాకస్ అట్లాస్) కర్ణాటక తీరనగరి కార్వార సమీప గుడ్డేహళ్లిలో సందడి చేసింది. ఈ కీటకం లెపిడాప్టెరా వర్గానికి చెందిన ఒక ప్రత్యేక గాలిపటాన్ని తలపిస్తుంది. ఈ కీటకానికి నోరు, జీర్ణ వ్యవస్థ ఉండదు. ఠక్కున చూస్తే ఎగిరే పాములా కనిపిస్తుంది. శత్రువు దగ్గరకు వచ్చిన సమయంలో రెక్కలు విప్పితే పాము పడగ విప్పినట్లు అనిపిస్తుంది. కర్ణాటకలోని పశ్చిమ కనుమలు, తీరప్రాంత జిల్లాల్లోని చెట్లు దీని ఆవాసం. తల్లి కీటకం పెట్టే గుడ్ల (కకూన్) నుంచి బయటకు వచ్చిన అనంతరం ఆకులను తిని అది శక్తిని కూడదీసుకుంటుంది. నోరు, జీర్ణవ్యవస్థ లేకపోవడంతో పురుగు రూపంలో తిన్న ఆహారపు శక్తినే కూడగట్టుకుని సీతాకోక చిలుకగా మారుతుంది. సంతానోత్పత్తి అనంతరం ఆడ, మగ కీటకాలు మరణిస్తాయి. వీటి జీవిత అవధి 14 నుంచి 18 రోజులు. బెంగళూరు నగరానికి చెందిన ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్ రవి గౌడ ఈ కీటకం చిత్రం తీశారు. దీని రెక్కల పొడవు 24 సెం.మీ. ఉంటాయి. సాధారణంగా 12 సెంమీ రెక్కలు ఉండే కీటకాలే కనిపిస్తాయి. వర్షాలు కురుస్తున్న సమయంలో దట్టమైన అడవి మధ్యలో ఈ కీటకాలు కనిపిస్తాయని ఉత్తర కన్నడ జిల్లా అటవీ శాఖాధికారి గోపాలకృష్ణ చెప్పారు.

విన్యాసం.. విశ్వరూపం

బెంగళూరు ఉత్తర లోక్‌సభ పరిధిలోని మల్లేశ్వరంలో జరిగిన సంసద్ క్రీడోత్సవాల సందర్భంగా ఆదివారం క్రీడాకారులు, విద్యార్థులు చేసిన మల్లకంబ పిరమిడ్ ఆద్యంతం ఉత్కంఠ రేకెత్తించింది. హుబ్బళ్లి, ధార్వాడ, బళ్లారి ప్రాంతాల్లో ఈ విన్యాసాలు చేస్తుంటారు. స్తంభానికి నూనె పూసి ఒకరినొకరు పట్టుకొని ఆడే క్రీడ ఇది. నగరంలోని రామనగర్ క్రీడా పాఠశాలకు చెందిన 19 మంది విద్యార్థులు ఈ విన్యాసాల్లో పాల్గొని ఆహూతులను అబ్బురపరిచారు.

-న్యూస్‌టుడే, (బెంగళూరు)క్రీడలు

పొరబడకండి..



- సర్పాలపై లియానా సేవా సంస్థ అధ్యయనం
- అవగాహన పెంచేందుకు శ్రీకారం..

ఈనాడు, బెంగళూరు

మన ఇంటి ముందు ఏదైనా పాము కనబడితే వెంటనే కర్రతో కొడతాం లేదా పాముల సంరక్షకులను పిలుస్తాం..మరీ కాదంటే పగబట్టిందని సర్పదోష నివారణ చేయించుటాం. ఇవేమీ చేయొద్దని చెబుతోంది మైసూరు జిల్లా హుణసూరులో ఏర్పాటైన లియానా సేవా సంస్థ. ఈ సంస్థ ఇటీవలే దక్షిణ భారతదేశంలో రెండో అతిపెద్ద సర్పాల అధ్యయన కేంద్రాన్ని (సెర్పంటేరియం) ప్రారంభించింది. ఈ సంస్థ కేవలం సర్పాలపై అధ్యయనం చేయటమే కాదు ఏటేటా పెరుగుతున్న పాము కాట్లను నివారించటం, పాములపై సమాజంలో ఉన్న దుష్ప్రచారాలు, మూఢ నమ్మకాలను తొలగించే ప్రయత్నం చేస్తోంది.

ఏడాది	పాము కాట్లు	మరణాలు	చంపుతున్న పాములు
2021-3	340	21	8,390
2022-3	439	17	9,001
2023-6	596	19	12,092
2024-13	235	100	15,768
2025 (అక్టోబరు వరకు)	13,890	89	18,990

ఆరోగ్య, అటవీశాఖల నివేదిక ఆధారం అవగాహన ఇలా

లియానా సంస్థ నేతృత్వంలో హ్యూమనే వరల్డ్ ఫర్ యానిమల్స్ ఇండియా, ఆరోగ్య, అటవీశాఖలు సంయుక్తంగా ప్రతినెలా పాము కాటు, వాటి సంరక్షణపై అవగాహన కల్పిస్తాయి. ఇలా నాలుగు నెలల్లో 300 కమ్యూనిటీ ఆస్పత్రుల సిబ్బందికి పాము కాటుకు ప్రథమ చికిత్స, విరుగుడు మందు, పాముల పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. ఈ కార్యక్రమాల్లో అత్యంత విషపూరిత పాములు, సాధారణ పాములపై అవగాహన కల్పిస్తారు. ఆపై జిల్లా, రాష్ట్ర స్థాయిలో అత్యవసర చికిత్సల గురించి సమాచారం ఇస్తారు.

2025లో జిల్లాల వారీగా అత్యధిక కేసులు

- శివమొగ్గ-270
- దక్షిణ కన్నడ-210
- మండ్య-198
- మైసూరు-191
- బెంగళూరు-170

పాములు పగబట్టవండి

సహాయవాణి

లియానా సంస్థ, ది హ్యూమన్ సొసైటీ ఇంటర్నేషనల్‌తో కలిసి పాము కాట్లు, మానవ, పాముల సంఘర్షణను నివారించేలా అవగాహన కల్పిస్తారు. వాట్సప్‌తో పాటు ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా గ్రూపులు సృష్టించి ఉచితంగా పాము కాటు చికిత్స కిట్లు, ప్రత్యేక పాదరక్షలు, లాంతర్లు ఉచితంగా పంపిణీ చేస్తుంది. ఇదే సమయంలో ప్రత్యేక యూట్యూబ్ చానెల్స్ ద్వారా అవగాహన, సహాయవాణి సమాచారాన్ని చేరవేస్తుంటారు.

పరిశోధన ఇలా..

విషాన్ని సంగ్రహిస్తున్న నిపుణుడు

అధ్యయన కేంద్రంలో పశ్చిమ కనుమల్లో సంచరించే 400 జాతుల పాములపై అధ్యయనం చేస్తారు. ఇక్కడి పాములు, వాటి డీఎన్ఏ, విష ప్రభావం, వాటి జీవన విధానంపై అధ్యయనం చేస్తారు. అత్యంత విషకారి సర్పాలైన నల్లతాచు, రక్తపింజరి, కట్లపాము, నాగుపాముల నుంచి విషాన్ని సేకరించి వాటిని ఐఐఎస్‌సీలోని ఎవొల్యూటరీ వినోమిక్స్ ప్రయోగశాలకు పంపుతారు. డబ్ల్యూహెచ్‌వో ఆదేశాల ప్రకారం ప్రయోగశాలలకూ ఉచితంగా విషాన్ని సరఫరా చేస్తామని సంస్థ వ్యవస్థాపకుడు గెరార్డ్ మార్టిన్ 'ఈనాడు'తో చెప్పారు.

ప్రమాద ప్రాంతం నుంచే ఇక ఫిర్యాదు సులువు (పాతచిత్రం)

ఆపదలో యాపన్నఅస్త్రం

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదం సంభవించినప్పుడు సాధారణంగా.. ఠాణాకు వెళ్లి లేదా పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవలసి ఉంటుంది. ఈ సమస్యను తప్పించేందుకు తమ 'అస్త్రం' యాప్‌లోనే ఫిర్యాదు చేసే సదుపాయాన్ని నగర పోలీసులు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ-యాక్సిడెంట్ విభాగంలో ఫొటో, ఘటన జరిగిన ప్రాంతం, వివరాలను నమోదు చేయడం ద్వారా విచారణను వేగంగా చేసేందుకు అవకాశం ఉంటుందని పోలీసు అధికారులు తెలిపారు. గత ఏడాది (2024) నగరంలో సంభవించిన ప్రమాదాల్లో 893 మంది మరణించారు. మరో 1500 మంది గాయాల పాలయ్యారు. ప్రమాద ప్రాంతానికి పోలీసులు చేరుకునేలోగా వాహనదారులు, బాధితులు, స్థానికులు ఫొటోలు తీసి, యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని అదనపు పోలీసు కమిషనర్ (ట్రాఫిక్) కార్తిక్ రెడ్డి తెలిపారు.

వహ్వా.. ఇది కేలరీల కేఫ్

అమ్మమ్మల హోటల్‌లో పోషకాహారం

దోసె వేస్తున్న గాయత్రి మృత్యుంజయ

ఈనాడు, బెంగళూరు: నగరంలో సైన్స్ గ్యాలరీ బెంగళూరు (ఎస్‌జీబీ) గురించి తెలియని వారుండరు. హెబ్బాళ్‌లో ఉండే ఈ గ్యాలరీలో అడుగుపెడితే సైన్స్ మాలాలేమిటో చెప్పేందుకు అక్కడి సిబ్బంది క్యూ కడతారు. ఈ గ్యాలరీలో అడుగుపెట్టగానే మనం సైన్స్‌పై ఇంతలా ఆధారపడి ఉన్నామా? అనే సందేహంతో పాటు ప్రాథమిక సైన్స్‌పై అవగాహన పెంచుకుని వెళ్తారు. ఇదే ఆవరణలో ఓ చోట 'స్మాజ్ టై హెంచ' అనే పేరుతో ఓ కేఫ్ కనిపిస్తుంది. దీన్ని క్యాలరీ కేఫ్ అని సందర్శకులు పిలుస్తుంటారు. ఇందుకు కారణం మన శరీరానికి అవసరమైన కేలరీలు, కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్స్, విటమిన్లు, ఫైబర్లను లెక్కగట్టి మరీ అవి లభించే ఆహారాన్ని వడ్డిస్తారండోయ్. గాయత్రి మృత్యుంజయ, ఆమె కుమారుడు నడిపే ఈ కేఫ్‌లో చిరుధాన్యాలు, సేంద్రియ వంటకాలు అందుబాటులో ఉంటాయి. అదీ వంటల్లో ఆరితేరిన అమ్మమ్మలు మాత్రమే వండి వడ్డిస్తారు మరి.

అవసరమైన ఆహారం.. వేడి వేడిగా

వయసు చెబితే ఆహారం వడ్డిస్తారు

ఈ కేఫ్‌కు వెళ్లగానే మన వయసు, ఆరోగ్య సమస్యలు (రక్తపోటు, మధుమేహం లాంటివి) ఉన్నాయా అని అడిగి అనుగుణమైన ఆహారం వడ్డిస్తారు. జొన్న, రాగి రొట్టెలతో పాటు పండ్లు, మజ్జిగ, నూనెలు లేని వంటకాలు ఇక్కడ లభిస్తాయి. ముందు పోషకాలు..ఆపై రుచి అనే శ్రీకర్‌తో నడిపే ఈ కేఫ్‌కు అనుమతి ఇచ్చే ముందు అధ్యయనం చేసినట్లు గ్యాలరీ డైరెక్టర్ జాహ్నవి ఫాల్కే చెప్పారు. ఇటీవల కేఫ్‌ను సందర్శించిన బయోకాన్ ఎండీ కిరణ్ మజుందార్ షా సైతం మెచ్చుకున్నారు.

ఊరంతా.. యోగానందం!

అదో చిరు గ్రామం. ఐదొందల జనాభా. అందరికీ యోగాభ్యాసం.. ఓ జీవనయానంగా మారింది. అక్కడి వారంతా యోగా ఉపాధ్యాయులుగా ఖ్యాతి పొందుతున్నారు! ఉదయం- సాయంత్రం వేళల్లో ఆ గ్రామవాసులు క్రమం తప్పకుండా యోగా చేస్తూ ఆరోగ్యాన్ని సంరక్షించుకుంటున్నారు.

బాలిక యోగా విన్యాసం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కర్ణాటకలోని గదగ పట్టణం నుంచి 15 కిలోమీటర్లు ప్రయాణిస్తే పాపనాశి గ్రామం చేరుకోవచ్చు. అక్కడి ప్రజలందరికీ యోగాభ్యాసమంటే ఎనలేని ఇష్టం. గండభేరుండాసనం, వృశ్చికాసనం, హనుమాసనం, మయూరాసనం.. ఇలా ఎన్నెన్నో కఠిన సాధనలను అలవోకగా ప్రదర్శిస్తారు. యోగా.. అంటేనే సులభమని అక్కడివారి గట్టి విశ్వాసం. గ్రామ విద్యార్థులు రాష్ట్ర స్థాయి వివిధ పోటీలకు హాజరై యోగా మెరుపులతో పతకాలను సాధించడం పరిపాటి. ఇలా మెరుపులు మెరిపించిన ఐదుగురు విద్యార్థులకు ఆళ్వాస్ విద్యాసంస్థ ఉచిత విద్యాభ్యాస భాగ్యం కల్పించింది. ప్రతి ఇంటా ఈ సాధనను చాటే పతకాలు, చాంపియన్‌షిప్‌లు కనిపిస్తాయి. కొందరు ప్రత్యేక ఆసనాలపై వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేసుకుని, పలు వేదికలను చిత్రీకరించి ప్రసారం చేస్తున్నారు. మహిళలు ఉదయం- సాయంత్రం పూట పొలాల ఆవరణ, ఖాళీ ప్రదేశాలు, రహదారులపైనా అభ్యాసం కొనసాగిస్తుంటారు. ఇక్కడి ఆయుర్వేద ఆసుపత్రి వైద్యులు నెలకోసారి ఆరోగ్యం, జీవనశైలి అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆయుర్వేద, యోగా పద్ధతులను గ్రామీణులకు నేర్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఆయుష్మాన్ భారత్, జాతీయ ఆయుష్ అభియాన్ పథకాలను పాపనాశి గ్రామస్థులు ఉపయోగించుకున్నారు. యోగా శిక్షకుడు

యోగా శిక్షకులు అశోక్ మత్తిగట్టి, సుధా పాటిల్

డాక్టర్ అశోక్ మత్తిగట్టి పదేళ్ల నుంచి సేవలందించి, ప్రజలందరినీ యోగాసనాలకు చేరువ చేస్తున్నారు. మధుమేహం, రక్తపోటు తదితరాలు అదుపులో ఉండటానికి చిట్కాలు నేర్పుతుంటారు. ఎక్కడ యోగా పోటీలు నిర్వహించినా పాపనాశి వాసులు పోటీలో పై.. అంటుంటారని డాక్టర్ అశోక్ ఉత్సాహంగా వివరించారు. మరో గురువు సుధాపాటిల్ బాలలకు ప్రాణాయామం, మయూరాసనం, శశాంకాసనం, మకరాసనం, వజ్రాసనం, పద్మాసనం తదితరాలు నేర్పిస్తున్నారు. ఈ గ్రామవాసులు కరోనా కాలాన్ని బాగా ఉపయోగించుకుని ఎన్నో మెలకువలు నేర్చుకున్నారని సుధా పాటిల్ వివరించారు. చిన్నగ్రామానికి చెందిన శ్రీ అద్నూర అనే విద్యార్థిని తన ప్రతిభతోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసే అవకాశం దక్కించుకోవడాన్ని గుర్తుచేశారు.

పూర్ణశలభాసనంలో సంజనా కులకర్ణి

పచ్చి, ఎండు ఫలాలు, పూల రేకుల అలంకరణలో అమ్మవారు

చేయందించేలోపే.. చేజారిపోయారు

మండ్య, న్యూస్‌టుడే: దుస్తులు శుభ్రం చేసుకునేందుకు కాలువలో దిగి, కాలుజారి పడిన ఆఫ్రిన్ (13) అనే బాలికను రక్షించే ప్రయత్నంలో మరో నలుగురూ నీట మునిగి మరణించారు. ఆఫ్రిన్, ఆయేషా (13) అనే బాలికలతో పాటు హనీ (14) అనే బాలుడి మృతదేహాన్ని వెలికితీశారు. అల్ఫియా, దర్భిమ్ (13) కోసం గాలింపు చేపట్టారు. మహ్మద్ గౌస్ అనే బాలుడ్ని రక్షించారు. అరకెరె పోలీసుల కథనం మేరకు.. మైసూరు శాంతినగరలోని మదర్సా నుంచి 15 మంది బాలలు, ముగ్గురు సిబ్బందితో కలిసి శనివారం పర్యటనకు వచ్చారు. సాయంత్రం శ్రీరంగపట్టణ తాలూకా మండ్యకొప్పలు గ్రామం వద్ద కాలువ వద్ద దుస్తులు శుభ్రం చేసుకునేందుకు నీటిలో దిగిన ఆఫ్రిన్ కొట్టుకుపోతుండడంతో అక్కడే ఉన్న నలుగురు బాలలు ఆమెను రక్షించే ప్రయత్నంలో నీటిలో గల్లంతయ్యారు.

బనశంకరి.. శుభంకరీ!

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే: తులసి పండగను పురస్కరించుకుని బనశంకరి అమ్మవారిని ఆదివారం ప్రత్యేకంగా అలంకరించారు. ఎండు ఫలాలు, పండ్లు, పూల రేకులు, తామరపూలు, తామర గింజలు, కనకాంబరాలు, అరటి పండ్లు, తదితరాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తుల తరలివచ్చారు. అలంకరణ తొలగించిన అనంతరం ఫలాలను భక్తులకు ప్రసాదంగా వితరణ చేస్తామని ఆలయ నిర్వహణ సమితి అధ్యక్షుడు బసవరాజు తెలిపారు.

జల మందిరం.. సడలని విశ్వాసం

నీటిలో చర్చి ప్రతిబింబం

హాసన, న్యూస్‌టుడే: బ్రిటిష్ పాలనలో దేశంలో స్థిరపడిన ఫ్రెంచ్ మిషనరీలు శెట్టిహళ్లి వద్ద 1860లో రోజరీ చర్చిని నిర్మించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరమూ క్రైస్తవులతో పాటు క్రీస్తుపై విశ్వాసం ఉన్న వారు అక్కడికి వెళ్లి ప్రార్థనలు చేసుకునేవారు. గోథిక్ శైలిలో నిర్మించిన ఈ చర్చి క్రీస్తు శిలువ వేసుకున్న తరహా (క్రూసిఫాం)లో నిర్మించారు. విదేశాల నుంచి తెప్పించిన గాజుతో చేసిన అద్దాలు, కొంత ఇస్లామిక్ ఆర్కిటెక్చర్‌తో ఉన్న ఈ చర్చిని నిర్మించేందుకు గుడ్లు, బెల్లంతో మిశ్రమాన్ని తయారు చేశారు. హేమావతి నదిపై గోరూరు వద్ద 1960లో రిజర్వాయరును నిర్మించిన అనంతరం 28 ముంపు గ్రామాల్లో శెట్టిహళ్లి కూడా చేరింది. అక్కడి వారిని ముందుగా పునరావాస ప్రాంతాలకు తరలించారు. చర్చి మాత్రం నీట మునిగిపోయింది. జలాశయంలో నిండుగా నీరు ఉన్నప్పుడు రోజరీ చర్చి గోపురం మాత్రమే బయటకు కనిపిస్తుంది. వేసవి సమయంలో జలాశయంలో నీరు తగ్గుముఖం పట్టినప్పుడు శిథిలమైన చర్చిని వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. సాధారణంగా ఫిబ్రవరి నుంచి ఆగస్టు వరకు సగం వరకు నీట మునిగి ఉంటుంది. డిసెంబరు నుంచి మే మధ్యలో చర్చివరకు వెళ్లేందుకు మార్గం ఏర్పడుతుంది. ఆ సమయంలో పర్యాటకులు, ఔత్సాహికులు అక్కడకు పెద్ద సంఖ్యలో వెళ్లి వస్తుంటారు. హాసన నుంచి పాతిక కి.మీ. దూరంలో ఉన్న శెట్టిహళ్లి పరిధిలో ఈ చర్చి ఉంది. గోరూరు జలాశయానికి అనుబంధంగా హేమావతి ఆనకట్ట నిర్మించిన అనంతరం దీని పైకప్పు పూర్తిగా ధ్వంసమైంది.

నీటమునిగిన రోజరీ చర్చి

నోటిస్తే ఆశీర్వాదం.. నాణెమిస్తే తిరస్కారం

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శిల్పకళా కాణాచి హంపీ పర్యాటకంగా కాకుండా ధార్మికంగానూ ఎంతో వాసికెక్కింది. ఇక్కడి ఆదిదేవుడు విరూపాక్ష త్రికాల పూజలందుకుంటుండటంతో హంపీని దక్షిణకాశీగా పిలుస్తారు. విరూపాక్ష ఆలయంలో ఉన్న ఏనుగు లక్ష్మీకి ఓ ప్రత్యేకత ఉంది. స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు, తప్పకుండా లక్ష్మీ నుంచి ఆశీర్వాదం తీసుకుంటారు. దేశ, విదేశాల పర్యాటకులు, జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులూ లక్ష్మీ ఆశీర్వాదం పొందకుండా వెనుదిరుగరు. లక్ష్మీ చాలా బుద్ధిమంతురాలు. అందరికీ తొండమెత్తి దీవించకపోవడం దీని ప్రత్యేకత. ఎందుకంటే.. ఆలయ ప్రవేశద్వారం వద్ద లక్ష్మీకి ఓ ప్రత్యేక మంటపం ఉందండోయ్. ఎల్లప్పుడూ మావటి సమేతంగా ఏనుగు ఆ మంటపంలో ఉంటుంది మరి. విరూపాక్షుని దర్శించుకుని వెళ్లేవారు దానికి అరటిపళ్లు, కొబ్బరికాయలు ఇస్తారు. వాటిని అరగిస్తుందేగాని ఎంతవేచి ఉన్నా ఆశీర్వదించదు. అదేంటి.. తొండమెత్తి ఆశీర్వదించాలంటే కరెన్సీ నోటు ఇవ్వాల్సిందే. ముఖ విలువ ఎంతైనా, నోటు ఇస్తేనే దీవెన దక్కుతుంది. నాణెం ఇస్తే, తొండంతో తీసుకుని మావటికి ఇస్తుందంతే. లక్ష్మీని పరీక్షించాలని నోటు సైజులో ఉన్న కాగితం ముక్క ఇచ్చినా, వారికే తిరిగి ఇచ్చేస్తుందండోయ్. దీని ప్రత్యేకతపై విదేశీయులు సైతం ఆశ్చపోతారు. సుమారు 32 ఏళ్ల ఈ ఏనుగును జాతరలో ప్రత్యేకంగా అలంకరిస్తారు. - న్యూస్‌టుడే, హొసపేటె

భక్తులను తొండంతో ఆశీర్వదిస్తున్న ఏనుగు లక్ష్మీ

గనినాడు గాన కోకిల

✧ ఆర్.ఆర్.ఆర్ సినిమా పాటతో మెరిసిన యువతేజం

బళ్లారి, న్యూస్‌టుడే: కొమ్మ ఉయ్యాలా కోన జంపాలా.. అమ్మ ఒళ్లో నేను రోజూ ఊగాల...రోజూ ఊగాల...కొమ్మ సాటున పాడే కొయిలా కు అంటే కు అంటూ నాతో ఉండాల...నాతో ఉండాల...జక్కన్న రాజమౌళి, ఎం.ఎం.కీరవాణి సినిమా ఆర్.ఆర్.ఆర్.తో ఈ యువతేజం మెరిసింది. ఆమె ఎవరో కాదు బళ్లారికి చెందిన గాన కోకిల ప్రకృతి రెడ్డి. సిరుగుప్ప తాలూకా తాళూరు గ్రామానికి చెందిన హరివర్ధన్‌రెడ్డి, శ్రీదేవిల ముద్దల బిడ్డ. వృత్తి రీత్యా వీరిది వ్యవసాయ కుటుంబం...పిల్లల చదువుల కోసం బళ్లారిలో స్థిరపడ్డారు. ప్రకృతిరెడ్డికి చిన్నప్పటి నుంచి టీవీల్లో వచ్చే పాటలు విని వాటిని అదే విధంగా ఇంట్లో పాడుతూ తల్లిదండ్రులను మెప్పించేది. జ్ఞాపకశక్తి మెండు హిందుస్థానీ, కర్ణాటక సంగీతం నేర్చుకుంది. ప్రస్తుతం ప్రముఖ సంగీత దర్శకులు తమన్ వద్ద అసిస్టెంట్‌గా ఉంటూ సంగీతం నేర్చుకుంటోంది. ప్రకృతి రెడ్డి ఎనిమిదేళ్లకు 'ఈటీవీ' పాడుతా తీయగా కార్యక్రమానికి హాజరై గాన గాంధర్వుడు బాలసుబ్రహ్మణ్యం వద్ద పాడింది. కర్నూలులో జరిగిన పాడుతా తీయగా మహాసంగ్రామంలో తుది పోటీల్లో తన సత్తా చాటి ప్రముఖుల ప్రశంసలు అందుకుంది.

హంపీ ఉత్సవం సందర్భంగా సంగీత కచేరిలో..

ఎనిమిదేళ్ల వయస్సులో బాలు సమక్షంలో పాడుతా తీయగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రకృతిరెడ్డి

అభివృద్ధి పనుల్లోనూ రాజకీయమా?

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: తిరిగి అధికారాన్ని పొందేందుకే భాజపా నాయకులు అభివృద్ధి పనులకు సంబంధించి రాజకీయాలు చేస్తున్నారని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరోపించారు. సొరంగ మార్గం నిర్మాణంతో వాహన రద్దీ సమస్యకు ఒక పరిష్కారం దక్కుతుందన్నారు. పనుల సమయంలో లాల్‌బాగ్‌లో కొంత భాగాన్ని వినియోగించుకుంటామని చెబుతుంటే, ఇక ఉద్యానవనమే ఉండదన్నట్లు భాజపా నాయకులు ధర్నాలు, తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. వాహన రద్దీ సమస్యలకు పరిష్కారాన్ని చూపిస్తే పరిశీలించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఆదివారం ఇక్కడ తనను కలుసుకున్న విలేకరులతో మాట్లాడారు. సొరంగ మార్గాన్ని ప్రజలు వ్యతిరేకించడం లేదని గుర్తుచేశారు. భాజపా నాయకుల ప్రశ్నలు అన్నింటికీ ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బదులిచ్చారని తెలిపారు.

ఉద్యాననగరమా.. వాహనాల వనమా!

ఉద్యాననగరిలో వాహనాల కిరికిరి ఎక్కువ. నిత్యం మూడువేల వాహనాలు రిజిస్ట్రేషన్ అవుతుండగా వేయి వాహనాలు రహదారిపైకి వస్తున్నాయి. ప్రతి ఐదుగురిలో ముగ్గురికి సొంత వాహనాలు ఉన్నాయి. ద్విచక్ర వాహనాలు మొదటి స్థానంలో ఉండగా కార్లు రెండో స్థానంలో ఉన్నాయి. ప్రజా రవాణా వ్యవస్థ బస్సులు సంఖ్యతక్కువ. ప్రస్తుతం ఉన్న రహదారుల సామర్థ్యం కేవలం 70 లక్షలు మాత్రమే. అంతర్జాతీయ స్థాయిలో వాహనసంచార రద్దీ నగరాల్లో బెంగళూరు ఆరో స్థానంలో ఉండటం విశేషం.

నగర జనాభా:	1.42 కోట్లు
వాహనాల సంఖ్య:	1.36 కోట్లు
ద్విచక్రవాహనాలు:	82.88 లక్షలు
కార్లు:	25.37 లక్షలు
బస్సులు:	12 వేలు
లారీలు, టెంపోలు:	18 వేలు

- బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే

మైసూరు పాకం.. రాజులే దాసోహం

మైసూరు, న్యూస్‌టుడే: నోట్లో ఆ ముక్క పెట్టుకుంటే నాలుకపైనే కరిగిపోయి మధురమైన తీపిని పంచే మిఠాయి అది.. రికార్డులకెక్కిన మైసూరు పాకం కథాకమామీషు తెలుసుకుందామా. నాలుగో కృష్ణరాజ ఒడెయరు మైసూరు పాలకునిగా ఉన్న సమయంలో కాకాసుర మాదప్ప ప్రధాన వంట మనిషి. రాజుకు రాత్రి భోజనం అనంతరం తీపి తినడం అలవాటు. ఇలా రోజుకో రకం మిఠాయిని మాదప్ప తయారు చేసి ఇచ్చేవారు. ఓ రోజు 'ఇప్పటి వరకు తినని పదార్థాన్ని చేసి ఇవ్వాలి' అని రాజు సూచించారు. రాత్రి వరకు అంబా ప్యాలెస్‌లోని ఆలోచించాక ఆ నలభీముడు పంచదారను కరిగించి, అందులో వేయించిన శనగపిండిని వేసి నేతిని దట్టించారు. తయారైన పాకాన్ని రుచి చూసిన మహారాజు 'ఇదేమి మిఠాయి' అని అడిగారు. కాకాసుర మాదప్ప 'మైసూరు పాకం' అని చెప్పారు. అదే క్రమేణా మైసూరు పాక్ అయింది. ప్రస్తుతం 11 రకాల మైసూరు పాక్‌ను మాదప్ప కుటుంబ సభ్యులు తయారు చేసి విక్రయిస్తున్నారు. అదీ మైసూరు పాక్ కథ..

(c) eenadu

కాళ్లకు చక్రాలు.. కదిలొచ్చిన పతకాలు

■ అంతర్జాతీయ స్కేటింగ్‌లో త్రిషా జడాల సత్తా

అంతర్జాతీయ పోటీల్లో సాధించిన పతకాలతో త్రిషా జడాల

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: కర్ణాటక స్కేటింగ్ క్రీడలో ధార్వాడ జిల్లా హుబ్బళ్లి కేశ్వాపురకు చెందిన త్రిషా జడాల అంతర్జాతీయ స్థాయిలో శరవేగంతో దూసుకెళ్తోంది. బోలెడన్ని పతకాలను సాధించి ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ఈ ఏడాది జులై దక్షిణ కొరియాలో జరిగిన ఏషియన్ పోటీల్లో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించిన త్రిషా వెండిపతకాన్ని సొంతం చేసుకొంది. గతేడాది ఇటలీలో జరిగిన ప్రపంచ స్కేట్ గేమ్స్‌లో పాల్గొన్న ఈ అమ్మాయి కాంస్య పతకాన్ని సాధించింది. ఈ సాధనతో ఆమెకు సొంతగడ్డలో బ్రహ్మరథం పట్టారు. తండ్రి ప్రవీణ్‌మూర్తి జడాల, తల్లి సుశీల జడాల ప్రోత్సాహంతో స్పీడ్‌స్కేటింగ్, రోలర్‌హాకీ, రోలర్ డర్బీలో ప్రఖ్యాతిగాంచిన త్రిషా ఎన్‌సీసీ కేడెట్ సీ ధ్రువీకరణ పత్రం పొందింది. కేఎల్‌ఈ జేజీ కళాశాల విద్యార్థిని అయిన త్రిషా తొమ్మిదేళ్ల వయస్సులోనే స్కేటింగ్ క్రీడకు అంకితమైంది. 13వ ఏట తొలి జాతీయ స్థాయి పోటీలో కర్ణాటక తరపున ప్రాతినిధ్యం వహించడం గమనార్హం. నాలుగు సార్లు జాతీయ పతక విజేతగా నిలిచిన త్రిషా పదేళ్లలో 45 బంగారు, 13 రజత, 5 కాంస్య పతకాలతో సత్తా చాటింది. తొమ్మిది సార్లు జిల్లా ఛాంపియన్‌గా వ్యక్తిగత ప్రశస్తి అందుకోవడం విశేషం. జాతీయ స్థాయి పోటీలో దాదాపు ఏడుసార్లకు పైగా పాల్గొన్న త్రిషా ధార్వాడ జిల్లా తొలి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారిణిగా గుర్తింపు పొందింది. అంతర్జాతీయ యోగా పోటీల సందర్భంలో హుబ్లీ నుంచి ధార్వాడ వరకు స్కేటింగ్ చేసిన ఈ క్రీడాకారిణి కార్వార నుంచి బెంగళూరులోని విధానసౌధ వరకు 610 కిలోమీటర్ల దూరం స్కేటింగ్ చేసి రికార్డు సృష్టించింది. రోడ్డు భద్రత, ఆడపిల్లల రక్షణ కోసం నిరంతరం స్కేటింగ్ సైక్లోత్సవంలో పాల్గొంది. కేబినెట్ మంత్రి హాలప్పబసప్ప ఆచార్‌తో ప్రశంలందుకున్న త్రిషా కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి, ఎమ్మెల్యేలు మహేష్‌తెంగినకాయి అరవిందబల్లాళ్, అభయప్రసాద్, మేయర్ రామప్పబడిగార్ ఇలా అనేక ప్రముఖులతో సన్మానం అందుకొంది. 2024లో కర్ణాటక రాజ్యోత్సవం అవార్డును పొందిన త్రిషా గతేడాది దిల్లీలో కేంద్ర యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ డా. మన్సుక్‌మండవీయతోనూ ప్రశంసలందుకొంది. ప్రస్తుతం శిక్షణలో ఉన్న త్రిషా భవిష్యత్తులో భారత్ పేరును నిలబెట్టే ఆశయంతో సాధన చేస్తోంది.

జాతీయ పతాకంతో త్రిషా జడాల

7 నుంచి ఇండియన్ ఫార్మా ప్రదర్శన

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: దక్షిణాదిలో అతి పెద్ద ఔషధ ఇండియన్ ఫార్మా ప్రదర్శన-2025 ఈనెల 7 నుంచి నగరంలోని రాజప్రస్థానం మైదానంలో ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు ఆదివారం ఇక్కడ పరిశీలించారు. ప్రదర్శనను కర్ణాటక కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ సమాఖ్య అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏజీఎస్ ప్రారంభిస్తారు. రెండు రోజులపాటు జరిగే ఈ ప్రదర్శనలో దేశంలోని 70కిపైగా ప్రముఖ ఔషధ ఉత్పత్తి కంపెనీలు, విక్రయసంస్థలు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. ఔషధాలు, పౌష్టికాహారం, ఆయుర్వేదం, హెర్బల్ ఉత్పత్తులతో పాటు పశు వైద్య చికిత్స విధానాలు, మందులు, తదితర వస్తువులను ప్రదర్శనలో ఉంచుతామని ప్రదర్శన విభాగం డైరెక్టర్ బి.ఎస్.భండారి తెలిపారు. ప్రజలు, వైద్యులు, వైద్యవిద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగకరమైన ప్రదర్శన అన్నారు.

రాజప్రస్థానం మైదానంలో ముందస్తు ప్రదర్శన ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

తుషార్ కాంతిబెహరాకు జీవన సాఫల్య పురస్కారం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: హెసరుఘట్ట భారతీయ ఉద్యానవనాల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ తుషార్ కాంతి బెహరాకు బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఆదివారం ఇక్కడ జీకేవీకేలో ఆవరణలో సాగుతున్న విజ్ఞానం, మొక్కల అభివృద్ధి, వాతావరణం అనుగుణంగా పంటల సాగు అనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనకు పురస్కారాన్ని ఉపకులపతి డాక్టర్ ఎస్.వి. సురేష్ అందజేశారు. ఉద్యానవనాల పంటల అభివృద్ధికి డాక్టర్ తుషార్‌కాంతి బెహరా అనేక కార్యక్రమాలను చేపట్టి అభివృద్ధి చేసినందుకు ఈ పురస్కారం ప్రదానం చేశారు.

డాక్టర్ తుషార్ కాంతిబెహరాకు పురస్కారాన్ని అందిస్తున్న ఉపకులపతి డాక్టర్ ఎస్.వి.సురేష్ తదితరులు

శృంగేరికి ఆరు ఏనుగులు

చిక్కమగళూరు, న్యూస్‌టుడే: శృంగేరి తాలూకా కెరెకట్ట గ్రామంలో రైతు సోదరులు హరీశ్, ఉమేశ్‌లపై దాడి చేసిన మదగజాన్ని బంధించేందుకు ఆరు కుమ్కి ఏనుగులు గ్రామానికి చేరుకున్నాయి. ఏకలవ్య, ధనుంజయ, ప్రశాంత, హర్ష తదితర ఏనుగులతో నేటి (సోమ) నుంచి కూంబింగ్ ప్రారంభించనున్నారు. మృతుల కుటుంబాలకు తన వ్యక్తిగత ఖాతా నుంచి మంత్రి కేజే జార్జ్ తలా రూ. 5 లక్షలు, శృంగేరి ఎమ్మెల్యే టీడీ రాజేగౌడ తలా రూ.ఒక లక్ష పరిహారాన్ని ఇప్పించారు. ప్రభుత్వం నుంచి పరిహారాన్ని ఇప్పిస్తామని వారి కుటుంబాలకు మంత్రి భరోసా ఇచ్చారు. గత కొద్ది వారాలుగా కెరెకట్టె గ్రామ పరిధిలో ఒంటరి ఏనుగు తోటలను ధ్వంసం చేస్తూ, కనిపిస్తున్న ప్రజలపై దాడికి ప్రయత్నిస్తూ వస్తోందని జార్జ్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు.

లారీలో వస్తున్న ఏనుగులు

భత్యాన్ని నిరాకరించడం కుదరదు

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగిని సస్పెండ్ చేసినా, విధుల నుంచి తప్పించినా, అప్పటి వరకు చేసిన సేవలకు అందించాల్సిన భత్యం నిలిపి వేయడం సరికాదని జస్టిస్ ఎం.నాగప్రసన్న పేర్కొన్నారు. విడుదల చేయవలసిన బకాయిలను నిలిపివేస్తే అది ఆర్థిక బహిష్కరణకు సమానమని తెలిపారు. తనను సేవలను నుంచి తప్పించడం, బకాయిలు విడుదల చేయకపోవడాన్ని ప్రశ్నిస్తూ బసవరాజ పుండలీక అనే వ్యక్తి వేసుకున్న అర్జీపై విచారణను న్యాయమూర్తి పూర్తి చేశారు. లోకాయుక్త న్యాయస్థానంలో నేరం రుజువు కాకుండానే సస్పెండ్ చేయడం సరికాదని బసవరాజపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేసి, ఆయనకు రావలసిన భత్యం, వేతన బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

త్వరలో అక్కదళం ప్రారంభిస్తాం

ఉడుపి, న్యూస్‌టుడే: సమస్యలు ఎదుర్కొంటున్న బాలలు, మహిళలకు సాయం చేసేందుకు 'అక్క' దళాన్ని ప్రారంభిస్తామని మహిళా, శిశు శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ వెల్లడించారు. బెంగళూరులో ఈ నెల 19న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ దళాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఆపదలో చిక్కుకున్న వారి నుంచి పోలీసులు, కంట్రోల్ రూమ్‌కు వచ్చే ఫోన్ కాల్ ఆధారంగా సంఘటన జరిగిన స్థలానికి అక్క దళం సభ్యులు వెళ్లి, వారిని రక్షించేందుకు చర్యలు తీసుకుంటారని వివరించారు. కర్ణాటకలో అంగన్‌వాడీలను ప్రారంభించి 50 ఏళ్లయిన నేపథ్యంలో అదే రోజు సువర్ణ మహోత్సవాన్ని బెంగళూరులో ఘనంగా ఆచరిస్తామని తెలిపారు.

'సంఘ పరివార్‌కు గులాములు'

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: ప్రజా సేవ చేసేందుకు కాకుండా, సంఘ పరివార్‌కు గులాములుగా ఉండేందుకే భాజపా రాజకీయాల్లోకి వచ్చిందని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే ఎద్దేవా చేశారు. కర్ణాటక, జాతీయ భాజపా అధ్యక్షుల నియామకాలను పూర్తి చేసేందుకు ఆర్ఎస్ఎస్ అనుమతి ఇచ్చేంత వరకు వేచి చూడాల్సిన పరిస్థితిని కమలనాథులు ఎదుర్కొంటున్నారని ఎద్దేవా చేశారు. ఇద్దరి అధికార అవధి పూర్తయినా ఇప్పటి వరకు వారికి సరైన నాయకుడే దొరకలేదా అని ప్రశ్నించారు. ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా మాట్లాడితే, తదుపరి ఎన్నికల్లో తమకు టిక్కెట్టు దక్కదన్న భయం ఆ పార్టీ నాయకుల్లో ఉందన్నారు. సంఘ పరివార్ ప్రారంభమై వందేళ్లయినా ఇప్పటి వరకు పేరు ఎందుకు నమోదు చేయించుకోలేదని ప్రశ్నించారు. దేశంలోని ఎక్కువ శాఖ ప్రజలు ఆ సంఘటనను ఆమోదించలేదన్నారు. ఇప్పటి వరకు సంఘ పరివార్ నాయకులు ఏ యుద్ధంలో పాల్గొన్నారు, ఎక్కడ సహాయ కార్యక్రమాలు చేస్తున్నారో కూడా దాఖలాలు విడుదల చేయడంలో విఫలమయ్యారని ఎద్దేవా చేశారు.

ఖర్గే

సొరంగ మార్గంపై శివాలెత్తిన నిరసన

లాల్‌బాగ్ ఉద్యానవనంలోని బెట్టపై ఉద్యానవన శాఖాధికారికి వినతిపత్రాన్ని అందిస్తున్న భాజపా శ్రేణులు

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే: ఉద్యాననగరికి సొరంగ మార్గం అవసరం లేదని, లాల్‌బాగ్ జాతీయ ఉద్యానవనం, స్యాంకీ చెరువుకు ముప్పు వస్తుందని విపక్ష నేత ఆర్.అశోక్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఉద్యానవనాన్ని కాపాడాలని కోరుతూ బెంగళూరు దక్షిణ లోక్‌సభ సభ్యుడు తేజస్వి సూర్య, ఎమ్మెల్యేలు ఉదయ్ గరుడాచార్, సీకే రామమూర్తి, వందలాది కార్యకర్తలు, వివిధ మోర్చాల ప్రతినిధులతో లాల్‌బాగ్ ఉద్యానంలో ఆదివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. మూడువేల మిలియన్ ఏళ్ల క్రితం ఏర్పడిన ఏక శిలా బెట్ట, లావా పొరల్లో దొరికిన శిలాజంతో పాటు వేలాది జాతుల మొక్కలు ఉన్న లాల్‌బాగ్‌లో ఆరున్నర ఎకరాలను సొరంగ మార్గం నిర్మాణ సమయంలో వినియోగించుకోవాలని నిర్ణయించడం సరికాదని ప్రభుత్వానికి హితవు పలికారు. 'బెంగళూరును రక్షించండి- లాల్‌బాగ్‌ను కాపాడండి' అనే నినాదంతో చేపట్టిన నిరసనకు ఉద్యానవనంలో ఉదయం నడకకు వచ్చే వారు కూడా మద్దతు పలికారు. సొరంగ మార్గం నిర్మాణానికి సంబంధించి ఒక సమితిని ఏర్పాటు చేసి, దానికి విపక్ష నేతను అధ్యక్షునిగా చేస్తానని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ చేసిన సూచనలను అశోక్ ఖండించారు. ఈ ప్రాజెక్టు నాది గాని, ఇతర నాయకులదిగాని కాదన్నారు. సొరంగ మార్గంలో వెళ్లేందుకు రుసుము చెల్లించడం శ్రీమంతులకే సాధ్యమవుతుందన్నారు. కూడళ్లలో చిన్న వంతెనలు, బిలమార్గాలను నిర్మించడం ద్వారా వాహన రద్దీని సాధారణ స్థాయికి తీసుకురావచ్చని వివరించారు. నగర వ్యాప్తంగా సబర్బన్ రైలు వ్యవస్థకు కేంద్ర నిధులు ఇస్తున్న సమయంలో ఈ తరహా భారీ ప్రాజెక్టును ఎందుకు నిర్మించాలని ప్రశ్నించారు. రహదారులపై గుంతలు పూడ్చడం, మెట్రోను విస్తరించడం, ప్రజా రవాణా వ్యవస్థ సేవల అవధిని పెంచడం తదితరాలతో రద్దీ నియంత్రణకు వస్తుందని సూచించారు. సొరంగ మార్గంలో ద్విచక్ర వాహనాలకు అనుమతి ఉండదని, నగరంలోని 1.20 కోట్ల వాహనాల్లో 70 శాతం ద్విచక్ర వాహనాలు ఉన్నాయని గుర్తు చేశారు. రూ.17,800 కోట్లతో నిర్మించే సొరంగంతో సామాన్యులకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. భూమికి దిగువ 130 అడుగుల దిగువన నిర్మించే సొరంగానికి సంబంధించి ఎలాంటి అధ్యయనమూ చేయలేదన్నారు. అభివృద్ధికి భాజపా ఎన్నడూ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ధర్నా అనంతరం అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు.

నిందితుడు ఎజాజ్ అహ్మద్‌తో హెచ్‌న్యూ పోలీసులు

సివిల్ కాంట్రాక్టర్ ముసుగులో డ్రగ్స్ దందా!

ఈనాడు, హైదరాబాద్: కర్ణాటక, తెలంగాణాలో మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర నిందితుడు ఎజాజ్ అహ్మద్(28)ను అరెస్ట్ చేసినట్లు ఆదివారం హెచ్‌న్యూ డీసీపీ వై.వి.ఎస్ సుధీంద్ర తెలిపారు. ఇతడి నుంచి 11 గ్రాముల ఎండీఎంఏ, 35 గ్రాముల కొకైన్, 5 గ్రాముల ఓజీ, 15 ఎక్సటసీపిల్స్, రెండు చరవాణులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.12 లక్షల ఉంటుందని అంచనా వేశారు. బిహార్‌కు చెందిన ఎజాజ్ అహ్మద్ కుటుంబం 1998లో కర్ణాటకలోని కార్వార్‌కు చేరింది. అతడి తండ్రి సివిల్ కాంట్రాక్టర్. ఎజాజ్ బీటెక్ మధ్యలో మానేశాడు. కొంతకాలం సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేశాడు. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు డ్రగ్ పెడ్లర్‌గా మారాడు. కర్ణాటకలోని నైజీరియన్లతో ప్రత్యక్ష సంబంధాలు ఏర్పాటు చేసుకొని.. వారి వద్ద పెద్దఎత్తున కొకైన్, హెరాయిన్ కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించడం ప్రారంభించాడు. తక్కువ సమయంలోనే 100 మందికి పైగా కొనుగోలుదారులకు సరఫరా చేసేంతగా ఎదిగాడు. పెద్దఎత్తున సొమ్ము చేతికి అందడంతో విలాస జీవితానికి అలవాటయ్యాడు. బెంగళూరులో ఖరీదైన భవనంలో యువతితో కలసి జీవిస్తున్నాడు. అక్కడి నైజీరియన్లు డ్రగ్స్ సరఫరా చేసేందుకు డెడ్‌డ్రాప్ పద్ధతిని ఉపయోగిస్తారు. ఇతడికి మాత్రం నేరుగా సరుకు ఇచ్చి నగదు తీసుకొని వెళ్లేవారు. హైదరాబాద్‌లోని కొనుగోలుదారులకు కొరియర్, పోర్టర్ ద్వారా చేరవేసేవాడు. ఎక్కువ సరకు అందజేసేందుకు తానే ఇక్కడకు వచ్చి వెళ్తుంటాడు. హెచ్‌న్యూ ఇన్‌స్పెక్టర్ డానియేల్, ఎస్సై వెంకటరాములు, మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ బృందం నిఘా ఉంచింది. నిందితుడు శనివారం నగరానికి వచ్చినట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద డ్రగ్స్ స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడికి డ్రగ్స్ సరఫరా చేస్తున్న నైజీరియన్ కోసం గాలిస్తున్నారు.

అంబులెన్సే మృత్యుశకటమై..!

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: కూడలి వద్ద రెడ్‌సిగ్నల్ ఉన్నా వెనక నుంచి అతివేగంగా వస్తున్న అంబులెన్స్ ముందు ఆగిన ద్విచక్రవాహనాన్ని ఢీకొనటంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం అర్ధరాత్రి నగరంలోని శాంతినగర డబుల్ రోడ్డు సంగీత సిగ్నల్ వద్ద జరిగింది. ప్రమాదంలో ఇస్మాయిల్(40) ఆయన భార్య సమీనా బాను(37) అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన ముగ్గురిని చికిత్స కోసం స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. రిచ్‌మెండ్ సర్కిల్ నుంచి వేగంగా సంచరిస్తున్న అంబులెన్స్ ముందు ఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొని ఆ వాహనాన్ని రెండు మీటర్ల దూరంలో ఉన్న పోలీసు సిగ్నల్ కంట్రోల్ యూనిట్ వరకు లాక్కుపోయింది. ప్రైవేట్ ఆసుపత్రికి చెందిన అంబులెన్స్‌లో రోగులు లేరు. అయిన డ్రైవర్ అతివేగంగా వాహనాన్ని నడిపినట్లు పోలీసులు గుర్తించారు. విషయం తెలిసిన వెంటనే స్థానికులు వచ్చి అంబులెన్స్ తమ కోపాన్ని ప్రదర్శించి ధ్వంసం చేశారు. కేసు నమోదు చేసుకున్న విల్సన్‌గార్డన్ సంచార పోలీసులు పరారైన డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

రోడ్డుపాలైన పురిటిబిడ్డ

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: హొసకోట సమీపంలోని దొడ్డకెరె వద్ద రహదారిలో పురిటి బిడ్డ మృతదేహాన్ని ఆదివారం ఇక్కడ స్థానిక పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆడ బిడ్డ అనే కారణంతో కొందరు వ్యక్తులు బిడ్డ తెచ్చి రహదారి పక్కన వేసి పరారైనట్లు గుర్తించారు. మృతదేహాన్ని హొసకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సముద్రంలో మునిగి ముగ్గురి మృతి

మంగళూరు, న్యూస్‌టుడే: బెంగళూరు నుంచి కేరళకు వెళ్లిన ఎనిమిది మంది వైద్య విద్యార్థుల బృందం కన్నూరు వద్ద సముద్రంలో ఈతకు దిగిన సమయంలో నీట మునిగి ముగ్గురు మరణించారు. అఫ్నాన్, హరనుద్దీన్, అఫ్రాస్‌లను మృతులుగా గుర్తించారు. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో అరేబియా సముద్రంలోకి దిగిన సమయంలో దృఢమైన అలల తాకిడికి వారు లోతుకు కొట్టుకువెళ్లారు. సముద్రం ఒడ్డున ఈతగాళ్లు వారి ప్రాణాలను కాపాడేందుకు విఫల యత్నం చేశారు. కన్నూరులో మరణోత్తర పరీక్షలు చేయించి, మంగళూరుకు మృతదేహాలను పంపించారు. అక్కడి నుంచి బెంగళూరుకు మృతదేహాలను పంపిస్తున్నామని పోలీసులు తెలిపారు.

నీటి కుంటలో తల్లీ కుమారుల మృతదేహాలు

కోలారు: కోలారు తాలూకా హొగరి గొల్లహళ్లి గ్రామంలోని నీటి కుంట నుంచి మాలాశ్రీ (27), ఆమె కుమారుడు చక్రవర్తి (5) మృతదేహాలను వెలికితీశారు. నీటి వద్ద చక్రవర్తి ఆడుకుంటూ మునిగిపోతుండడంతో రక్షించే ప్రయత్నంలో మాలాశ్రీ కూడా మరణించిందా లేదా కుమారునితో కలిసి ఆమె ఆత్మహత్య చేసుకుందా అనే విషయాన్ని గుర్తించవలసి ఉందని కోలారు గ్రామీణ ఠాణా పోలీసులు తెలిపారు.

నాలుగేళ్ల బాలిక విషాదాంతం

మంగళూరు: పుత్తూరు తాలూకా కుంబ్ర సమీపంలోని పర్పుంజ వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో శజ్వా ఫాతిమా అనే నాలుగున్నరేళ్ల బాలిక మరణించింది. పాప తండ్రి హనీఫ్‌తో పాటు ఆమె తల్లి, అమ్మమ్మ కూడా గాయపడ్డారు. పుత్తూరు నుంచి కుంబళాడికి వెళుతున్న కారును ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. క్షతగాత్రులను మంగళూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్తు లేక తీరని కష్టాలు

రూ.2 బిందె నీళ్లు రూ.20

బళ్లారి, న్యూస్‌టుడే: తాలూకాలోని కుడతిని అంధకారంలో మగ్గుతోంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణానికి విద్యుత్తు సరఫరా చేస్తున్న ఉప కేంద్రం 11కె.వి.లోని టి.సి శనివారం ఉదయం కాలిపోయింది. దాంతో రెండు రోజులుగా విద్యుత్తు లేక సమస్యలపాలవుతున్నారు. సోమవారం సాయంత్రానికి మరమ్మతులు చేస్తామని జెస్కాం అధికారులు తెలిపారు.

తాగునీటి కోసం ఇక్కట్లు

పట్టణవాసులు మొత్తం కుళాయి నీరు, బోరుబావులపై ఆధారపడ్డారు. శనివారం ఉదయం నుంచి విద్యుత్తు సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో నీటి సరఫరా కూడా పూర్తిగా ఆగిపోయింది. తాగునీటి కేంద్రాలు కూడా పని చేయక పోవడంతో వేర్వేరు గ్రామాల నుంచి శుద్ధనీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. బిందె నీరు రూ. 2లకు విక్రయించే వారు ఇదే అదునుగా భావించి బిందె నీటిని రూ.10 నుంచి రూ.20లకు విక్రయిస్తున్నారు. ట్యాంకర్ల వద్ద కుడితిని వాసులు గుమిగూడారు. ఒకరికి లభిస్తే మరికొందరికి లభించడం లేదు. చరవాణి బ్యాటరీలు ఛార్జింగ్ పూర్తి కాక అవీ పనిచేయడం లేదు.

ట్యాంకర్ వద్ద నీటి కోసం గుమిగూడిన జనం

EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

2454 sft plot is on sale in Kranthi nagar society layout, Sarjapur. Genuine buyers can contact: 79896 97569.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్ళారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

భక్తిశ్రద్ధలతో మహాపురాణ ముగింపు

స్వామికి విశేష అలంకరణ

అగ్నిగుండంలో నడుచుకుంటూ వెళ్తున్న హిరగాసి కళాకారుడు

కురుగోడు (బళ్లారి), న్యూస్‌టుడే: తాలూకా బాదనహట్టి వీరభద్రేశ్వర దేవస్థానంలో నాయకనహట్టి తిప్పే రుద్రస్వామి మహాపురాణ ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మహాపురాణ ముగింపు కార్యక్రమం సందర్భంగా వీరభద్రేశ్వర స్వామికి విశేష అలంకరణ నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. కురుగోడు తాలూకా నుంచే కాకుండా వేర్వేరు తాలూకాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శనం చేసుకున్నారు. హిరగాసి, తదితర కళాకారులు దేవస్థానం ముందు వేసిన అగ్నిగుండంలో నడుచుకుంటూ వెళ్లారు. స్వామికి రుద్రాభిషేకం, వివిధ రకాల పుష్పాలంకరణ చేశారు. తరలివచ్చిన భక్తులకు ప్రసాదం వితరణ చేశారు.

వైభవంగా తులసి పూజలు

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా క్షీరాబ్ధి ద్వాదశి తులసి పూజలు ఆదివారం సాయంత్రం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజల సందర్భంగా బెంగళూరు రహదారి రద్దీగా కనిపించింది. ఉసిరి కాయలు కాసిన కొమ్మలను తులసి చెట్టు వద్ద ఉంచి పూజలు చేస్తే చాలా మంచిదని భక్తుల విశ్వాసం. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉసిరి కొమ్మలు, అరటి కొమ్మలు విక్రయాలకు జనం తరలిరావడంతో సందడి కనిపించింది. ఈ నెల 5న కార్తిక పౌర్ణిమ కావడంతో వివిధ దేవతామూర్తుల ఆకారంలో తయారు చేసిన వాటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపారు.

పూలు కొంటున్న వినియోగదారుడు

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: గృహాలలో తులసీ పూజలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ఇంటింటా తులసి మొక్కల పూల కుండీలను వివిధ రకాల పూలు, ఉసిరి కాయల రెమ్మలతో అందంగా అలంకరించి పూజలను నిర్వహించారు.

ఓటర్లతోనే తగిన గుణపాఠం

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా నుంచి ప్రత్యర్థి పార్టీల మద్దతుదార్ల ఓట్లను అక్రమంగా తొలగించడం ద్వారా దొడ్డిదారిన అధికారం చేపట్టే ప్రయత్నాలు ఎంతో కాలం సాగబోవని మాజీ మంత్రి హెచ్ ఆంజనేయ పేర్కొన్నారు. ఆదివారం హొళల్కెరలో ఓట్ చోరీ..గద్దె చోడ్ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా ప్రతిఒక్కరికీ లభించిన ఓటు హక్కును బలవంతంగా లాక్కోవడం ద్వారా రాజ్యాంగానికే తీరని అవమానం చేస్తున్నారన్నారు. అలాంటి వారికి రానున్న ఎన్నికలలో ఓటర్లు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ మాజీ అధ్యక్షుడు శివకుమార్, మాజీ జడ్పీ సభ్యులు శివమూర్తి, బ్లాక్ యువకాంగ్రెస్ అధ్యక్షుడు చేతన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆంజనేయ

మహిళ దారుణ హత్య

బెంగళూరు(యశ్వంతపుర): తాళికట్టి తనను వివాహం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్న మహిళను ఓ వ్యక్తి ఎనిమిది సార్లు కత్తితో పొడిచి హత్య చేసిన ఘటన శనివారం రాత్రి కేజీహళ్లి పోలీసుఠాణా పరిధిలో జరిగింది. కేజీహళ్లి పిళ్లణ్ణగార్డన్ నివాసి రేణుకా(35) హత్యకు గురికాగా, హత్యకు పాల్పడిన అంబేడ్కర్ అలియాస్ కుట్టిని స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. హత్యకు గురైన మహిళకు కుమార్తె ఉంది. భర్త నుంచి విడాకులు తీసుకుని ఒంటరిగా జీవిస్తున్నారు. అదే ప్రాంతంలో ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్న అంబేడ్కర్‌తో ఆమెకు పరిచయమై అది కాస్త ప్రేమగా మారింది. ఇద్దరు కలిసి జీవించడం ప్రారంభించారు. తనను పెళ్లి చేసుకోవాలని గత కొన్ని రోజులుగా ఆమె అతడిపై ఒత్తిడి తేవడం ప్రారంభించారు. రాత్రి ఇద్దరు పెళ్లి అంశంపై గొడవపడ్డారు. కోపం పట్టలేక వంటగదిలో కూరగాయలు కోసే కత్తితో అతడు రేణుకాపై దాడి చేసి పొడిచి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువతి ..

బెంగళూరు(యలహంక), న్యూస్‌టుడే: సుబ్రహ్మణ్యనగర పోలీసు ఠాణా పరిధిలోని మిల్క్ కాలనీలో నివసిస్తున్న దావణగెరెనివాసి సుప్రియా(25) అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎంబీఏ డిగ్రీ చేసిన యువతి బైక్ రైడింగ్‌లో శిక్షణ పొందారు. రెండేళ్ల నుంచి సుబ్రహ్మణ్యనగరలో అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. రెండు రోజుల నుంచి తల్లిదండ్రులు ఫోన్ చేసినా స్పందించక పోవడంతో ఇంటి యజమానికి ఫోన్ చేసి వాకబు చేశారు. యజమాని ఇంటి కిటికీ తలుపు తీసి చూడగా ఆమె ఫ్యాన్‌కు ఉరేసుకున్న దృశ్యం కనబడిన వెంటనే ఆయన స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఐదుగురికి కత్తిపోట్లు

బెళగావి, న్యూస్‌టుడే: కన్నడ రాజ్యోత్సవాల్లో భాగంగా కుందానగరిలో శనివారం రాత్రి నిర్వహిస్తున్న ఊరేగింపులో వెళ్తున్న వారిలో ఐదుగురు కత్తిపోట్లకు గురయ్యారు. ఊరేగింపు సదాశివనగర లక్ష్మీ కాంప్లెక్స్ వద్దకు చేరుకున్న సమయంలో ఊరేగింపులో చొరబడిన ఆగంతకులు దాడి చేసి పరారయ్యారు. మరోవైపు జేబు దొంగలు 300మందికిపైగా వ్యక్తుల చరవాణులు, కొందరి నగదు కొట్టేశారు. కత్తిపోట్లకు గురైన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో బిమ్స్‌లో చేర్పించారు. ఘటనకు సంబంధించి పాతిక మందికి పైగా అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. కత్తిపోట్లకు గురైన వారిని రాఘవేంద్ర వక్కుంద (35), సచిన్ కాంబ్లె (32), లోకేశ్ బేటగేరి (35), ప్రభాకర్ ప్రేమయ్య రావూరి (33), నజీర్ పఠాణ (24)గా గుర్తించారు. నిందితుల దాడికి కారణాలను గుర్తించాలని పోలీసులు తెలిపారు.

సైబర్ నేరాలపై తస్మాత్ జాగ్రత్త

కురుగోడు(బళ్లారి), న్యూస్‌టుడే: గుర్తుతెలియని చరవాణి నంబర్లు స్వీకరించడం, సందేశాలను క్లిక్ చేయడం, నూతన యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడే ప్రమాదముందని ఎస్.ఐ సుప్రిత్ హెచ్చరించారు. కురుగోడు పోలీసుస్టేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో సైబర్ నేరాల నియంత్రణపై ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలు దేశానికి పెద్ద సవాలుగా మారాయి. తమ పోలీసుస్టేషన్ పరిధిలో వందలమంది అమాయకులు సుమారు రూ.90 లక్షల వరకు మోసపోయారు. ముఖ్యంగా యువతి, యువకులు, విద్యార్థులు తమ తల్లిదండ్రులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరం చోటుచేసుకున్న వెంటనే 1930 సహాయవాణికి సమాచారం ఇవ్వాలన్నారు. అధ్యాపకులు హెచ్.ఎం.చెన్నబసయ్య ఈ నేరాల నియంత్రణకు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో శశికాంత్, తిప్పేరుద్రప్ప, ఎ.కె.రాము తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.ఐ.సుప్రిత్, చిత్రంలో అధ్యాపకులు

(c) eenadu

బళ్లారి

● బళ్లారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

నేడు కంప్లి బంద్‌కు పిలుపు

కంప్లి, న్యూస్‌టుడే: రెండో పంటకు నీరు వదలాలని డిమాండు చేస్తూ రైతు సంఘం, హసిరు సేన నేతృత్వంలో నేడు (సోమవారం) కంప్లి పట్టణ బంద్ నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వి.గౌడ తెలిపారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధిక వర్షం, వాతావరణం అనుకూలించక తొలకరి పంట దెబ్బతింది. ప్రస్తుతం జలాశయంలో 80 టీఎంసీల నీటి నిల్వ ఉంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వల్ల క్రస్ట్‌గేట్ల ఏర్పాటు పెద్ద సమస్య కాదు. అందువల్ల జలాశయంలో నీటిని వృథా చేయకుండా రెండో పంటకు నీరు విడుదల చేయాలని డిమాండు చేస్తూ కంప్లి బంద్ చేపడుతున్నాం.. వ్యాపారులు, సంఘ సంస్థల నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. నాయకులు చల్లా వెంకటనాయుడు, వి.వీరేశ్, తిమ్మప్ప నాయక్, కొట్టూరు రమేశ్, మురారి, గంగణ్ణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

శంభులింగేశ్వర ఆలయంలో కార్తికమాస ఆచరణ

సిరుగుప్ప, న్యూస్‌టుడే: శంభులింగేశ్వర ఆలయంలో కార్తికమాసం ఆచరిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు అమరేశప్ప పేర్కొన్నారు. తుంగభద్ర నది తీరాన గల ఆలయంలో ఆదివారం పూజలు నిర్వహించి, బసవమఠం బసవభూషణ స్వామి సారథ్యంలో ఆలయ కమిటీ సభ్యులు చన్ననగౌడ, మల్లికార్జున, శంభులింగయ్య గాణదాళ్, ఇతర సభ్యులు కార్తికమాస చివరి సోమవారం నిర్వహించే 11111 దీపోత్సవం, ఇతర కార్యక్రమ వివరాలతో గోడపత్రికను ఆవిష్కరించారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న స్వామీజీ, కమిటీ సభ్యులు

బాలల పుష్టిపై కేఎంఈఆర్‌సీ దృష్టి

నేటి నుంచి పౌష్టికాహారం పంపిణీ

వివిధ పౌష్టికాహార పదార్థాలు

బళ్లారి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గనుల ప్రభావిత జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో నెలకొన్న పౌష్టికాహార లోపాలను నివారించడానికి కర్ణాటక పర్యావరణ సంస్థ(కె.ఎం.ఇ.ఆర్.సి) నడుం కట్టింది. పౌష్టికాహారం అందజేయడానికి సిద్ధమైంది. తమ సొంత నిధులతో నాలుగు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా నాలుగు తాలూకాలను ఎంపిక చేసింది. ఈ తాలూకాల్లో విజయవంతమైతే మిగిలిన తాలూకాల్లోనూ ప్రారంభించనుంది. కె.ఎం.ఇ.ఆర్.సి ఆదేశాలతో నేటి (సోమవారం) నుంచి అందజేయనున్నారు.

ఎంపిక చేసిన తాలూకాలు

రాష్ట్రంలో గని ప్రభావిత జిల్లాల్లో బళ్లారి, విజయనగర, చిత్రదుర్గం, తుమకూరు ఉన్నాయి. వీటిలో బళ్లారి జిల్లా నుంచి సండూరుకు రూ.13.38 కోట్లు, విజయనగర జిల్లా నుంచి హొసపేటకు రూ.14.42 కోట్లు, చిత్రదుర్గం జిల్లాలో మొలకాల్మూరు రూ.రూ.8.978 కోట్లు, తుమకూరు జిల్లాలోని గుబ్బి తాలూకాకు రూ.8.36 కోట్లు నిధులు ఖర్చు చేయనున్నారు. ప్రారంభంలో విద్యార్థులకు కోడి గుడ్డ పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ నుంచి కోడి గుడ్లు వితరణ చేస్తున్నారు. వేరుసెనగ విత్తనాలు, పెసలు, బత్తాయి, సపోటాలతో తయారీ చేసిన బర్ఫీలు అందజేయాలని నిర్ణయించారు. మూడేళ్లకు సరిపడే పౌష్టికాహారం, వంట పాత్రలు కొనుగోలు చేయనున్నారు. వంట తయారీదారులకు గౌరవవేతనం ఇస్తారు.

నాణ్యత ప్రమాణాలు కాపాడాలి

విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం, ధాన్యాల నాణ్యతా ప్రమాణాలు కాపాడాలని కె.ఎం.ఇ.ఆర్.సి అధికారులు సూచించారు. ఈ పథకాన్ని జిల్లా పంచాయతీ, విద్యాశాఖ ఉప నిర్దేశకులు స్థానిక సంస్థల అధికారులు సిబ్బంది ప్రత్యేక నిఘా పెట్టాలని నిబంధనలను విడుదల చేసింది. గని ప్రభావిత ప్రాంతాల్లో గనులు తవ్వకాలు, వాహనాల రాకపోకతో దుమ్ము, ధూళి వంటి అనారోగ్య సమస్యల నుంచి కాపాడటానికి పౌష్టికాహారం దోహదపడుతుందని పేర్కొన్నారు.

ఈ తాలూకాల్లో మంచి ఫలితాలు వస్తే..

కె.ఎం.ఇ.ఆర్.సి.నుంచి ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ పథకం ఈ తాలూకాల్లో మంచి ఫలితాలు సాధిస్తే మిగిలిన 10 తాలూకాలకు విస్తరిస్తాం. దీనిపై జిల్లా, తాలూకా స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంటుంది. **- సంజయ్ బిజ్జూరు, వ్యవస్థాపక నిర్దేశకుడు కె.ఎం.ఇ.ఆర్.సి.**

రెండో పంటకు నీటిని విడుదల చేయాలి

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న రైతుమోర్చా సభ్యులు

బళ్లారి, న్యూస్‌టుడే: తుంగభద్ర ఆయకట్టు రైతులకు రెండో పంటకు నీటిని విడుదల చేయాలని కోరుతూ భాజపా రైతు మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో ఆందోళన నిర్వహించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా, ఎమ్మెల్సీ సతీష్ ఏచరెడ్డి మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, రైతు మోర్చా జిల్లా అధ్యక్షుడు గణపాల ఐనాథరెడ్డి నేతలు, కార్యకర్తలు, రైతులు స్థానిక గడిగి చెన్నప్ప కూడలికి చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొప్పళ జిల్లా బాధ్య మంత్రి, తుంగభద్ర నీటిపారుదల సలహా సమితి అధ్యక్షుడు శివరాజ్ తంగడగి, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి, నీటిపారుదలశాఖ మంత్రి డి.కె.శివకుమార్‌కు వ్యతిరేకంగా ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. నీటిపారుదలపై మంత్రి శివరాజ తంగడగికి కనీస పరిజ్ఞానం లేదని మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి ఆరోపించారు. రెండో పంటకు నీటిని విడుదల చేయకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. ఆందోళనలో భాజపా నగర అధ్యక్షుడు గుర్రం వెంకటరమణ, హనుమంతప్ప, తాళూరు పార్థసారథి, బసవరాజు, కార్పొరేటర్లు, రైతులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 6 నుంచి అంతర్జాతీయ యోగా సదస్సు

కరపత్రాలను విడుదల చేస్తున్న వెంకటలక్ష్మి, హిరేమఠ్, రమేశ్ తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: గాంధీనగరలోని ఎం.బి.ఎస్.ఎల్. తెలుగు, కన్నడ మాధ్యమ ఉన్నత పాఠశాల్లో డిసెంబరు 6 నుంచి రెండు రోజులు నిర్వహించే అంతర్జాతీయ యోగా సదస్సు (జీవైఎస్) కార్యక్రమం విజయవంతం చేయాలని పాఠశాల మండలి అధ్యక్షురాలు వెంకటలక్ష్మి కోరారు. సదస్సు నిర్వహణపై ఆదివారం పాఠశాల్లో సమీక్ష నిర్వహించారు. హాజరయ్యే యోగా సాధకులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేయాలి. యోగా ప్రాముఖ్యతపై సమాజంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో యోగా సదస్సు అధ్యక్షుడు హిరేమఠ్, తాలూకా అధ్యక్షుడు చిదంబర్‌రావ్, సభ్యులు రాఘవేంద్ర, రమేశ్, ముఖ్య గురువు శ్రీనివాసులు, సండూరు, గంగావతి, సిరుగుప్ప, కంప్లి తాలూకాల నుంచి యోగా సమితి సభ్యులు పాల్గొన్నారు.

సిలిండర్ పేలుడు బాధితులకు ఇంటి నిర్మాణం

హొసపేటె, న్యూస్‌టుడే: గాదిగనూరు సిలిండర్ పేలుడు ఘటనలో బాధిత కుటుంబానికి ఇచ్చిన హామీ మేరకు జిల్లా బాధ్యమంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ ఇంటి నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాదిలో విజయనగర జిల్లాలో చోటుచేసుకున్న దారుణ ఘటనంటూ విచారం వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో మొత్తం నలుగురు మృతి చెందగా, మరో ఐదుగురు బెంగళూరు విక్టోరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు, వారికెలాంటి ప్రాణాపాయం లేదని స్పష్టం చేశారు. సిలిండర్ పేలుడుకు ఇంటిపైకప్పు, గోడలు కూడా కుప్పకూలాయి. ఈ నేపథ్యంలో సొంత ఖర్చుతో ఇల్లు నిర్మించి ఇస్తున్నామని తెలిపారు. తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న నలుగురికి తలా రూ.4 లక్షల ఆర్థిక సాయం అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాలనాధికారి కవితా మన్నికేరి తదితరులు పాల్గొన్నారు.

గాదిగనూరులో భూమిపూజ చేస్తున్న మంత్రి

ప్రేమ,త్యాగమే మన మార్గం

హుణసగి, (మాన్వి) : తెలుగు ప్రజలు విషయ పరిజ్ఞానాన్ని అవలోకనం చేసుకోవాలని ప్రవచనకారుడు వై.రవిచంద్ పేర్కొన్నారు. ఆదివారం కల్యాణ కర్ణాటక కమ్మవారి సంఘం హుణసగి ఆధ్వర్యంలో మద్దినమని క్యాంపులో నిర్వహించిన కార్తికమాసం వనభోజన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కమ్మ సముదాయం ప్రజలు అన్ని రంగాల్లోనూ ఆరితేరారన్నారు. ఆకలి కడుపులను నింపిన ఎన్‌టీఆర్ ఇప్పటికీ అన్నగారుగా చరిత్రపుటల్లో నిలిచారని, జలాశయాల కోసం వేల ఎకరాలు విరాళంగా ఇచ్చిన త్యాగశీలురు కమ్మవారన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. సురపుర్, కెంబావి, దేవిపుర క్రాస్, సాయినగర్ క్యాంపుల నుంచి తెలుగు ప్రజలు అధికంగా వచ్చి వనభోజనాల్లో పాల్గొన్నారు. వేదికపై మురళీధర్‌శాస్త్రి, రవిచంద్‌లను కమ్మవారి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సంఘం అధ్యక్షుడు రాయపాటి వెంకటరావు, కార్యదర్శి వి.సురేష్, ఉపాధ్యక్షుడు టి.సుబ్రహ్మణ్యేశ్వర, కోశాధికారి కె.కేశవరావు, సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రవిచంద్

సమాజాభివృద్ధే మఠాల అభిమతం

మాన్వి, న్యూస్‌టుడే : మఠాలు ప్రజల్లో ధార్మిక, సామాజిక జాగృతి కల్పించేవిగా ఉండాలని బాళెహొన్నూరు రంభాపురి వీరసింహానాధీశ్వర జగద్గురు డాక్టర్ వీరసోమేశ్వర రాజదేశికేంద్ర శివాచార్య పేర్కొన్నారు. తాలూకాలోని కరేగుడ్డ మహాంతేశ్వర మఠంలో ఏర్పాటు చేసిన ధర్మసభను ప్రారంభించి ఆయన మాట్లాడారు. ధర్మం ద్వారానే విశ్వానికి శాంతి సాధ్యమన్నారు. ఇప్పుడు ధర్మం, జాతి మధ్య సంఘర్షణలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ప్రజలు శాంతంగా సంతోషంగా జీవించాలన్నారు. కరేగుడ్డ మఠం మహాంలింగస్వామీ మఠం ద్వారా చేస్తున్న ధార్మిక, సామాజికరంగాలకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. దేశవ్యాప్తంగా పంచ పీఠాలున్నాయని రంభాపురి పీఠానికి దేశంలో 12 వేల శాఖలున్నాయన్నారు. వీరశైవ ధర్మం అత్యంత ప్రాచీనమైందన్నారు. తదుపరి దసరా ఉత్సవాన్ని తమ ఆధ్వర్యంలో జమఖండిలో నిర్వహిస్తామని ప్రకటించారు. వేదికపై వివిధ మఠాలకు చెందిన మఠాధిపతులు, స్వాములు, ఎమ్మెల్యే హంపయ్యనాయక్, మాజీ ఎమ్మెల్యేలు బసనగౌడ, రాజా వెంకటప్పనాయక్, ముడా అధ్యక్షుడు గఫూర్, టీఏపీసీఎంఎస్ అధ్యక్షుడు తిమ్మారెడ్డి భోగావతి, యువకాంగ్రెస్ నాయకుడు రవిబోసురాజ్, సంఘ సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న స్వామీజీ, మఠాధిపతులు, నాయకులు

కాంగ్రెస్ సంతకాల సేకరణ షురూ

కంప్లి, న్యూస్‌టుడే: న్యాయసమ్మతంగా ఎన్నికలు జరిగితే ఏ రాష్ట్రంలోనూ భాజపా అధికారంలోకి రాదని కంప్లి ఎమ్మెల్యే గణేశ్ తెలిపారు. కంప్లి అంబేడ్కర్ కూడలిలో బ్లాక్ కాంగ్రెస్ చేపట్టిన 'ఓట్ చోర్ గద్ది చోడ్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ విషయంలో రాహుల్‌గాంధీ చెప్తున్న మాటలు నిజం. కంప్లిలో సైతం పక్క రాష్ట్రం నుంచి వచ్చి ఓటు వేస్తున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అంతకుముందు పురసభ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ప్రదర్శన నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.శ్రీనివాస రావు, పురసభ అధ్యక్షుడు భట్టా ప్రసాద్, హబీబ్ రహమాన్, వీరాంజనేయులు, సి.ఆర్.హనుమంత, కడప మస్తాన్ వలీ, హొసకోటె జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కూడలిలో ఎమ్మెల్యే గణేశ్ ఇతర కాంగ్రెస్ నాయకులు

ప్రతిభ, నైపుణ్య పోటీలు

రాయచూరు, న్యూస్‌టుడే : బాలలు, యువకుల్లోని ప్రతిభ, నైపుణ్యాలను గుర్తించేందుకు నగరంలోని కన్నడ భవన్‌లో పోటీలను నిర్వహిస్తామని కన్నడ, సాంస్కృతిక శాఖ సహాయక నిర్దేశకురాలు ఉత్తరాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు వరుసగా 8 నుంచి 14 ఏళ్లు, 14 నుంచి 18 ఏళ్లు, 18 నుంచి 30 ఏళ్ల లోపు వారు అర్హులు. ఆసక్తి గలవారు తమ పేర్లను రాయచూరులోని కార్యాలయంలో నవంబరు 5 లోపు నమోదు చేయించాలని ఆమె సూచించారు.

ప్రశాంతంగా ముగిసిన కె-సెట్

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సహాయక అధ్యాపకుల అర్హత పరీక్ష(కె-సెట్) ఆదివారం నగరంలో ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షను బళ్లారి ప్రభుత్వ మున్సిపల్ పదవీ పూర్వ కళాశాల, ప్రభుత్వ బాలికల పదవీ పూర్వ కళాశాల, వార్డ్లు పదవీ పూర్వ కళాశాల, బీపీఎస్.కళాశాల తదితర 20 కేంద్రాల్లో నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించగా 10,224 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 11,253 మంది అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోగా, వారిలో 1029 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని జిల్లా పదవీ పూర్వ శిక్షణశాఖ ఉపనిర్దేశకులు తెలిపారు. పరీక్షకు హాజరైన మహిళల నుంచి ముక్కుపుడక, చెవుల రింగులు, కమ్మలు, ఉంగరాలు, మెడలో వేసుకున్న గొలుసులు తదితరాల్ని తీసివేయించిన తర్వాతే హాల్లోకి అనుమతించారు. పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. వివిధ శాఖాధికారులు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఏ విధమైన ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా పరీక్ష ముగిసినట్లు తెలిపారు.

పరీక్ష కేంద్రం వద్ద క్షుణ్ణంగా అభ్యర్థుల తనిఖీలు

ముక్కుపుడకను తొలగిస్తున్న సిబ్బంది

ఆలయ ఆవరణలో వన భోజనాలు

సాలుంచిమర క్యాంపు (కారటగి), న్యూస్‌టుడే: తాలూకాలోని సాలుంచిమర క్యాంపు శిర్డీ సాయిబాబా ఆలయ ఆవరణలో ఆదివారం కార్తిక వన భోజనాలు నిర్వహించారు. ఉదయం కాగడా హారతి, మహాన్యాస పూర్వక పంచామృత అభిషేకం, అలంకరణ అనంతరం భజనలు చేపట్టారు. మధ్యాహ్నం వన భోజనాలు ఏర్పాటు చేశారు. బసవణ్ణ క్యాంపు ఎ.రామలక్ష్మి సత్యనారాయణ దంపతులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో శిర్డీ సాయిబాబా

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

02-11-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1626.06	1632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	12,738	11,667
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	12,431	11,427
నీటి నిల్వ (టి.ఎం.సి)	80.003	101.773

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

'ఇది రైతు వ్యతిరేక సర్కారు'

సింధనూరు, న్యూస్‌టుడే: తుంగభద్ర జలాశయం పరిధిలోని రైతులకు రెండోపంటకు నీటి సరఫరా విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి శోచనీయం, ఇది రైతు వ్యతిరేక నిర్ణయం అని మాజీ మంత్రి నాడగౌడ (జేడీఎస్), మాజీ ఎంపీ కె.విరుపాక్షప్ప దుయ్యబట్టారు. ఎడమకాలువ రైతులు తొలకరి నష్టపోయి దుఃఖంలో ఉన్నారు. వాళ్లకు రెండోపంటకు సహకరించి ఆదుకోవాల్సిన ప్రభుత్వం రైతుల పొట్టకొట్టేలా నడుచుకోవడం, జలాశయం నిండుగా నీళ్లున్నా..సరఫరా చేయం అని చెప్పడం దారుణమని దయ్యబట్టారు. ఆదివారం స్థానిక సర్క్యూట్ హౌస్‌లో విలేకరులతో మాట్లాడిన నాడగౌడ, కేవీ తుంగభద్ర జలాశయం గణాంకాలు, గేట్లు అమర్చే విషయాలను వివరించారు. గేట్లు అమర్చడానికి, రెండో పంటకు నీటి సరఫరా అడ్డంకి కాదని నాయకులు తేల్చి చెప్పారు.

సమావేశంలో గణాంకాలు చూపుతున్న నాడగౌడ, కేవీ

4 నుంచి ప్రత్యేక పూజలు

అమృతేశ్వరస్వామి దేవస్థానం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి తాలూకా బాలాజీనగర్ క్యాంపులో వెలసిన అమృతేశ్వర దేవస్థానంలో ఈ నెల 4 నుంచి రెండు రోజుల పాటు కార్తికమాసం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు కోరపాటి సాయి తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 నుంచి 6 గంట వరకు శివపార్వతీ కల్యాణ మండపంలో తెప్పోత్సవం, వివిధ పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5న బుధవారం ఉదయం 6గంటలకు స్వామికి ప్రత్యేకంగా శత రుద్రాభిషేకం నిర్వహిస్తారన్నారు. కుటుంబ సమేతంగా పాల్గొని స్వామిని దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్తికమాసం పూజలో శ్రీశారద లక్ష్మీనరసింహ పీఠం పరమపూజ్య శ్రీ శ్రీ స్వయం ప్రకాశ సచ్చిదానంద సరస్వతి మహాస్వామి తదితర స్వాములు పాల్గొనున్నారు.

నిధుల సక్రమ వినియోగంతో సమగ్రాభివృద్ధి

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో మంజూరయిన నిధులను సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా సర్వతోముఖాభివృద్ధిని సాధించొచ్చని రాష్ట్ర గ్రామీణ తాగునీరు, పరిసరాల పరిశుభ్రత శాఖ ఉపకార్యదర్శి జాఫర్ షరీఫ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన తాలూకాలోని రేణుకాపురంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చేపట్టిన కాయక గ్రామ కార్యక్రమాలను జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ప్రస్తుత బడ్జెట్‌లో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించిన కాయక గ్రామ పథకం కింద రేణుకాపురాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ తాగునీరు శాఖ ఏఈఈ దయానందస్వామి, జె.ఇ. రమ్య, జలజీవన్ మిషన్ జిల్లా మేనేజర్ మంజునాథ్, జీపీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

రేణుకాపురంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఉపకార్యదర్శి జాఫర్ షరీఫ్

భక్తిశ్రద్ధలతో దేవల మహర్షి జయంతి

కంప్లి, న్యూస్‌టుడే: స్థానిక చౌడేశ్వరి దేవి ఆలయంలో దేవాంగ కుల గురువు దేవల మహర్షి జయంతి ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవికి అభిషేకం చేసిన అనంతరం దేవల మహర్షి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. వివిధ ధార్మిక కార్యక్రమాలు ఆచరించారు. సాహితీ రంగంలో జిల్లా స్థాయి పురస్కారం అందుకున్న బంగి దొడ్డ మంజునాథను సత్కరించారు. తాలూకాలోని 10.ముద్దాపురలో సైతం దేవల మహర్షి జయంతి నిర్వహించారు. దేవాంగ సముదాయ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కారటగిలో: చౌడేశ్వరి ఆలయంలో దేవల మహర్షి చిత్రపటానికి పూల మాల వేసి పూజలు జరిపారు. వస్త్ర దానం చేశారు. ప్రసాదం పంచారు. కార్యక్రమంలో దేవాంగ సముదాయ నాయకులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

కంప్లి: కార్యక్రమంలో పాల్గొన్న దేవాంగ సముదాయ ప్రజలు

హోరెత్తిన సాంస్కృతికోత్సవం

చిన్నారుల నృత్య సందడి

బళ్లారి, న్యూస్‌టుడే: చిన్నారుల కేరింతలు.. ముద్దులొలికే మాటలు.. కమ్మనైన పాటలు.. మన సంప్రదాయక కట్టుబొట్టుతో.. అదిరే స్టెప్పులతో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకొన్నాయి. కర్ణాటక రాజ్యోత్సవం సందర్భంగా శనివారం రాత్రి బళ్లారి డాక్టర్ జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను కన్నడ సంస్కృతిశాఖ సహాయక అధికారి నాగరాజు, విద్యాశాఖ వ్యాయామ అధికారి కొట్రేష్ తదితర ఉపాధ్యాయులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం అధికారి నాగరాజు మాట్లాడుతూ ఈ తరహా ఉత్సవాలు విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయడానికి ఎంతో ఉపకరిస్తాయన్నారు. విద్యార్థులు పోటాపోటీగా తమ ప్రతిభ, సృజనాత్మకతకు పదును పెడుతూ భళా అనిపించారు. మాతృభాష కన్నడతో పాటు తెలుగు పాటలకు చిన్నారులు చేసిన జానపద నృత్యాలు ఔరా అనిపించాయి. జానపద, శాస్త్రీయ నృత్యాలతో వేదికను హోరెత్తించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు వితరణ

విద్యార్థుల నృత్య ప్రదర్శన

వేగంగా రైల్వేస్టేషన్ పనులు

రాయచూరు, న్యూస్‌టుడే : స్థానిక రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను ఆదివారం గుంతకల్లు రైల్వే అధికారులు జితేంద్రకుమార్, జగదీష్ పరిశీలించారు. అనంతరం రైల్వే సలహా సమితి ప్రతినిధులు, ప్రయాణికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాయచూరు లోక్‌సభ నియోజకర్గంలోని రాయచూరు, యాదగిరి స్టేషన్లలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, నాయకులు, ప్రజల సలహాలిస్తే వాటిని పరిగణలోకి తీసుకుంటామన్నారు. సమితి ప్రతినిధులు మారెప్ప, చంద్రశేఖర్ మాట్లాడుతూ లిఫ్టులు పనిచేయని కారణంగా ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. 10 రోజుల్లో లిఫ్టులను అందుబాటులోకి తెస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కరోనా వేళ నిలిపి వేసిన కలబురగి-గుంతకల్లు ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని, రాయచూరు-కాచిగూడ డెమో రైళ్ల వేళలను ప్రయాణికులకు అనుకూలంగా ఉండేలా మార్చాలని ప్రతినిధులు కోరారు. ఈ విషయాలను గుంతకల్లు విభాగం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాయచూరు స్టేషన్ కమర్షియల్ అధికారి హేమరాజ గౌడ, ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S.No. 2/2024

Between:
కాలువ రాజేష్‌బాబు మరియు ఇతరులు. ..... **వాదులు**
మరియు
జయమ్ చిన్న సుంకయ్య మరియు ఇతరులు.
..... **ప్రతివాదులు**

To 1) జయం గోపినాథ్ S/o లేట్ జయం అచ్చయ్య, Door No: 4/16, అంగడి మల్లప్ప కాంపౌండ్, రాఘవేంద్ర టాకీసు వెనుక, బళ్ళారి.
2) జయం కృష్ణ S/o లేట్ జయం అచ్చయ్య, Door No: 4/16, అంగడి మల్లప్ప కాంపౌండ్, రాఘవేంద్ర టాకీసు వెనుక, బళ్ళారి.

ప్రతివాదులు No.5 మరియు 6 లకు సమన్లు

పై దావాలోని వాదులు దావా స్థిరాస్తిపై తమ హక్కును తీర్మానించమని మరియు ఇతర రిలీఫ్‌ల కోసం మీపైన పై దావాను దాఖలు చేసియున్నారు. పై దావాను కోర్టువారు మీ యొక్క హాజరు కొరకు వాయిదా తేది 10-11-2025న వేసినారు. పై దావా నందు మీకేమైనా అభ్యంతరాలు ఉన్న యెడల పై కోర్టు నందు పై తేదీన ఉదయం 10.30 గంటలకు స్వతహాగా గాని వకీలు ద్వారా గాని హాజరై తెలుపుకొనవచ్చును. లేని యెడల పై దావాను కోర్టువారు మీ పరోక్షములో తీర్మానము చేయుదురు.

జి.లక్ష్మీపతి, అడ్వకేట్, గుంతకల్లు.

(c) eenadu

కాళ్లకు చక్రాలు.. కదిలొచ్చిన పతకాలు

■ అంతర్జాతీయ స్కేటింగ్‌లో త్రిషా జడాల సత్తా

అంతర్జాతీయ పోటీల్లో సాధించిన పతకాలతో త్రిషా జడాల

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: కర్ణాటక స్కేటింగ్ క్రీడలో ధార్వాడ జిల్లా హుబ్బళ్లి కేశ్వాపురకు చెందిన త్రిషా జడాల అంతర్జాతీయ స్థాయిలో శరవేగంతో దూసుకెళ్తోంది. బోలెడన్ని పతకాలను సాధించి ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ఈ ఏడాది జులై దక్షిణ కొరియాలో జరిగిన ఏషియన్ పోటీల్లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించిన త్రిషా వెండిపతకాన్ని సొంతం చేసుకొంది. గత ఏడాది ఇటలీలో జరిగిన ప్రపంచ స్కేట్ గేమ్స్‌లో పాల్గొన్న ఈ అమ్మాయి కాంస్య పతకాన్ని సాధించింది. ఈ సాధనతో ఆమెకు సొంతగడ్డలో బ్రహ్మరథం పట్టారు. తండ్రి ప్రవీణ్‌మూర్తి జడాల, తల్లి సుశీల జడాల ప్రోత్సాహంతో స్పీడ్‌స్కేటింగ్, రోలర్‌స్కేటింగ్, రోలర్ డర్బీలలో ప్రావీణ్యం సాధించిన త్రిషా ఎన్‌సీసీ కేడెట్ సీ ధ్రువీకరణ పత్రం పొందింది. కేఎల్‌ఈ జేజీ కళాశాల విద్యార్థిని అయిన త్రిషా తొమ్మిదేళ్ల వయస్సులోనే స్కేటింగ్ క్రీడకు అంకితమైంది. 13వ ఏట తొలి జాతీయ స్థాయి పోటీలో కర్ణాటక తరఫున ప్రాతినిధ్యం వహించడం గమనార్హం. నాలుగు సార్లు జాతీయ పతక విజేతగా నిలిచిన త్రిషా పతకాల్లో 45 బంగారు, 13 రజత, 5 కాంస్య పతకాలతో సత్తా చాటింది. తొమ్మిది సార్లు జిల్లా ఛాంపియన్‌గా వ్యక్తిగత ప్రశస్తి అందుకోవడం విశేషం. జాతీయ స్థాయి పోటీలో దాదాపు ఏడుసార్లకు పైగా పాల్గొన్న కారణంగా ధార్వాడ జిల్లా తొలి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారిణిగా గుర్తింపు పొందింది. అంతర్జాతీయ యోగా పోటీల సందర్భంలో హుబ్లీ నుంచి ధార్వాడ వరకు స్కేటింగ్ చేసిన ఈ క్రీడాకారిణి కార్యాలయం నుంచి బెంగళూరులోని విధానసౌధ వరకు 610 కిలోమీటర్ల దూరంలో స్కేటింగ్ చేసి రికార్డు సృష్టించింది. రోడ్డు భద్రత, ఆడపిల్లల రక్షణ కోసం నిరంతరం స్కేటింగ్ సైక్లోత్సవంలో పాల్గొంది. కేబినెట్ మంత్రి హాలప్పబసప్ప ఆచార్‌తో ప్రశంసలందుకున్న త్రిషా కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి, ఎమ్మెల్యేలు మహేష్‌తెంగినకాయి అరవిందబెల్లద్, అభయప్రసాద్, మేయర్ రామప్పబడిగేర్ ఇలా అనేక ప్రముఖులతో సన్మానం అందుకొంది. 2024లో కర్ణాటక రాజ్యోత్సవ అవార్డును పొందిన త్రిషా గత ఏడాది దిల్లీలో కేంద్ర యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ డా. మన్సుక్‌మండవీయతోనూ ప్రశంసలందుకొంది. ప్రస్తుతం శిక్షణలో ఉన్న త్రిషా భవిష్యత్తులో భారత్ పేరును నిలబెట్టే ఆశయంతో సాధన చేస్తోంది.

జాతీయ పతాకంతో త్రిషా జడాల

సముద్రంలో మునిగి ముగ్గురి మృతి

మంగళూరు, న్యూస్‌టుడే: బెంగళూరు నుంచి కేరళకు వెళ్లిన ఎనిమిది మంది వైద్య విద్యార్థుల బృందం కన్నూరు వద్ద సముద్రంలో ఈతకు దిగిన సమయంలో నీట మునిగి ముగ్గురు మరణించారు. అఫ్నాన్, హరనుద్దీన్, అఫ్రాస్‌లను మృతులుగా గుర్తించారు. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో అరేబియా సముద్రంలోకి దిగిన సమయంలో దృఢమైన అలల తాకిడికి వారు లోతుకు కొట్టుకువెళ్లారు. సముద్రం ఒడ్డున ఈతగాళ్లు వారి ప్రాణాలను కాపాడేందుకు విఫల యత్నం చేశారు. కన్నూరులో మరణోత్తర పరీక్షలు చేయించి, మంగళూరుకు మృతదేహాలను పంపించారు. అక్కడి నుంచి బెంగళూరుకు మృతదేహాలు పంపిస్తున్నామని పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువతి..

బెంగళూరు(యలహంక), న్యూస్‌టుడే: సుబ్రహ్మణ్యనగర పోలీసుఠాణా పరిధిలోని మిల్క్ కాలనీలో నివసిస్తున్న దావణగెరెనివాసి సుప్రియా(25) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎంబీఏ డిగ్రీ చేసిన యువతి బైక్ రైడింగ్‌లో శిక్షణ పొందారు. రెండేళ్ల నుంచి సుబ్రహ్మణ్యనగరలో అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. రెండు రోజుల నుంచి తల్లిదండ్రులు ఫోన్ చేసినా స్పందించక పోవడంతో ఇంటి యజమానికి ఫోన్ చేసి వాకబు చేశారు. యజమాని ఇంటి కిటికీ తలుపు తీసి చూడగా ఆమె ఫ్యాన్‌కు ఉరేసుకున్న దృశ్యం కనబడిన వెంటనే ఆయన స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

7 నుంచి ఇండియన్ ఫార్మా ప్రదర్శన

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: దక్షిణాదిలో అతి పెద్ద ఔషధ ఇండియన్ ఫార్మా ప్రదర్శన-2025 ఈనెల 7 నుంచి నగరంలోని రాజప్రస్థానం మైదానంలో ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు ఆదివారం ఇక్కడ పరిశీలించారు. ప్రదర్శనను కర్ణాటక కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ సమాఖ్య అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏకేజీవన్ ప్రారంభిస్తారు. రెండు రోజులపాటు జరిగే ఈ ప్రదర్శనలో దేశంలోని 70కిపైగా ప్రముఖ ఔషధ ఉత్పత్తి కంపెనీలు, విక్రయసంస్థలు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. ఔషధాలు, పౌష్టికాహారం, ఆయుర్వేదం, హెర్బల్ ఉత్పత్తులతోపాటు పశు వైద్య చికిత్స విధానాలు, మందులు, తదితర వస్తువులను ప్రదర్శనలో ఉంచుతామని ప్రదర్శన విభాగం డైరెక్టర్ బి.ఎస్.భండారి తెలిపారు. ప్రజలు, వైద్యులు, వైద్యవిద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగకరమైన ప్రదర్శన అన్నారు.



రాజప్రస్థానం మైదానంలో ముందస్తు ప్రదర్శన ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

తుషార్ కాంతిబెహరాకు జీవన సాఫల్య పురస్కారం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: హెసరుఘట్ట భారతీయ ఉద్యానవనాల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ తుషార్ కాంతి బెహరాకు బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేసింది. ఆదివారం ఇక్కడ జీకేవీకే ఆవరణలో సాగుతున్న విజ్ఞానం, మొక్కల అభివృద్ధి, వాతావరణం అనుగుణంగా పంటల సాగు అనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనకు పురస్కారాన్ని ఉపకులపతి డాక్టర్ ఎస్.వి. సురేష్ అందజేశారు. ఉద్యానవనాల పంటల అభివృద్ధికి డాక్టర్ తుషార్‌కాంతి బెహరా అనేక కార్యక్రమాలను చేపట్టి అభివృద్ధి చేసినందుకు ఈ పురస్కారం ప్రదానం చేశారు.

డాక్టర్ తుషార్ కాంతిబెహరాకు పురస్కారాన్ని అందిస్తున్న ఉపకులపతి డాక్టర్ ఎస్.వి.సురేష్ తదితరులు

అంబులెన్సే మృత్యుశకటమై..!

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: కూడలి వద్ద రెడ్‌సిగ్నల్ ఉన్నా వెనక నుంచి అతివేగంగా వస్తున్న అంబులెన్స్ ముందు ఆగిన ద్విచక్రవాహనాన్ని ఢీకొనటంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం అర్ధరాత్రి నగరంలోని శాంతినగర డబుల్ రోడ్డు సంగీత సిగ్నల్ వద్ద జరిగింది. ప్రమాదంలో ఇస్మాయిల్(40) ఆయన భార్య సమీనా బాను(37) అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన ముగ్గురిని చికిత్స కోసం స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. రిచ్‌మెండ్ సర్కిల్ నుంచి వేగంగా సంచరిస్తున్న అంబులెన్స్ ముందు ఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొని ఆ వాహనాన్ని రెండు మీటర్ల దూరంలో ఉన్న పోలీసు సిగ్నల్ కంట్రోల్ యూనిట్ వరకు లాక్కుపోయింది. ప్రైవేట్ ఆసుపత్రికి చెందిన అంబులెన్స్‌లో రోగులు లేరు. అయిన డ్రైవర్ అతివేగంగా వాహనాన్ని నడిపినట్లు పోలీసులు గుర్తించారు. విషయం తెలిసిన వెంటనే స్థానికులు వచ్చి అంబులెన్స్ తమ కోపాన్ని ప్రదర్శించి ధ్వంసం చేశారు. కేసు నమోదు చేసుకున్న విల్సన్‌గార్డన్ సంచార పోలీసులు పరారైన డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

నీటి కుంటలో తల్లీ కుమారుల మృతదేహాలు

కోలారు, న్యూస్‌టుడే: కోలారు తాలూకా హోగరి గొల్లహళ్లి గ్రామంలోని నీటి కుంట నుంచి మాలాశ్రీ (27), ఆమె కుమారుడు చక్రవర్తి (5) మృతదేహాలను వెలికితీశారు. నీటి వద్ద చక్రవర్తి ఆడుకుంటూ మునిగిపోతుండడంతో రక్షించే ప్రయత్నంలో మాలాశ్రీ కూడా మరణించిందా లేదా కుమారునితో కలిసి ఆమె ఆత్మహత్య చేసుకుందా అనే విషయాన్ని గుర్తించవలసి ఉందని కోలారు గ్రామీణ ఠాణా పోలీసులు తెలిపారు.

నాలుగేళ్ల బాలిక విషాదాంతం

మంగళూరు, న్యూస్‌టుడే: పుత్తూరు తాలూకా కుంబ్ర సమీపంలోని పర్పుంజ వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో శజ్వా ఫాతిమా అనే నాలుగున్నరేళ్ల బాలిక మరణించింది. పాప తండ్రి హనీఫ్‌తో పాటు ఆమె తల్లి, అమ్మమ్మ కూడా గాయపడ్డారు. పుత్తూరు నుంచి కుంబళాడికి వెళుతున్న కారును ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. గాయపడిన బాధితులను చికిత్స కోసం మంగళూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పుత్తూరు గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

శృంగేరికి ఆరు ఏనుగులు

చిక్కమగళూరు, న్యూస్‌టుడే: శృంగేరి తాలూకా కరెకెట్ట గ్రామంలో రైతు సోదరులు హరీశ్, ఉమేశ్‌లపై దాడి చేసిన మదగజాన్ని బంధించేందుకు ఆరు కుమ్కీ ఏనుగులు గ్రామానికి చేరుకున్నాయి. ఏకలవ్య, ధనుంజయ, ప్రశాంత, హర్ష తదితర ఏనుగులతో నేటి (సోమ) నుంచి కూంబింగ్ ప్రారంభించనున్నారు. మృతుల కుటుంబాలకు తన వ్యక్తిగత ఖాతా నుంచి మంత్రి కేజే జార్జ్ తలా రూ. 5 లక్షలు, శృంగేరి ఎమ్మెల్యే టీడీ రాజేగౌడ తలా రూ.ఒక లక్ష పరిహారాన్ని ఇప్పించారు. ప్రభుత్వం నుంచి పరిహారాన్ని ఇప్పిస్తామని వారి కుటుంబాలకు మంత్రి భరోసా ఇచ్చారు. గత కొద్ది వారాలుగా కెరెకట్టె గ్రామ పరిధిలో ఒంటరి ఏనుగు తోటలను ధ్వంసం చేస్తూ, కనిపిస్తున్న ప్రజలపై దాడికి ప్రయత్నిస్తూ వస్తోందని జార్జ్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు.

లారీలో వస్తున్న ఏనుగులు

భత్యాన్ని నిరాకరించడం కుదరదు

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగిని సస్పెండ్ చేసినా, విధుల నుంచి తప్పించినా, అప్పటి వరకు చేసిన సేవలకు అందించాల్సిన భత్యం నిలిపి వేయడం సరికాదని జస్టిస్ ఎం.నాగప్రసన్న పేర్కొన్నారు. విడుదల చేయవలసిన బకాయిలను నిలిపివేస్తే అది ఆర్థిక బహిష్కరణకు సమానమని తెలిపారు. తనను సేవలను నుంచి తప్పించడం, బకాయిలు విడుదల చేయకపోవడాన్ని ప్రశ్నిస్తూ బసవరాజ పుండలీక అనే వ్యక్తి వేసుకున్న అర్జీపై విచారణను న్యాయమూర్తి పూర్తి చేశారు. లోకాయుక్త న్యాయస్థానంలో నేరం రుజువు కాకుండానే సస్పెండ్ చేయడం సరికాదని బసవరాజపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేసి, ఆయనకు రావలసిన భత్యం, వేతన బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

త్వరలో 'అక్క' దళం ప్రారంభిస్తాం

ఉడుపి, న్యూస్‌టుడే: సమస్యలు ఎదుర్కొంటున్న బాలలు, మహిళలకు సాయం చేసేందుకు 'అక్క' దళాన్ని ప్రారంభిస్తామని మహిళా, శిశు శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ వెల్లడించారు. బెంగళూరులో ఈ నెల 19న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ దళాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఆపదలో చిక్కుకున్న వారి నుంచి పోలీసులు, కంట్రోల్ రూమ్‌కు వచ్చే ఫోన్ కాల్ ఆధారంగా సంఘటన జరిగిన స్థలానికి అక్క దళం సభ్యులు వెళ్లి, వారిని రక్షించేందుకు చర్యలు తీసుకుంటారని వివరించారు. కర్ణాటకలో అంగన్‌వాడీలను ప్రారంభించి 50 ఏళ్లయిన నేపథ్యంలో అదే రోజు సువర్ణ మహోత్సవాన్ని బెంగళూరులో ఘనంగా ఆచరిస్తామని తెలిపారు.

'సంఘ పరివార్‌కు గులాములు'

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: ప్రజా సేవ చేసేందుకు కాకుండా, సంఘ పరివార్‌కు గులాములుగా ఉండేందుకే భాజపా రాజకీయాల్లోకి వచ్చిందని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే ఎద్దేవా చేశారు. కర్ణాటక, జాతీయ భాజపా అధ్యక్షుల నియామకాలను పూర్తి చేసేందుకు ఆర్ఎస్ఎస్ అనుమతి ఇచ్చేంత వరకు వేచి చూడాల్సిన పరిస్థితిని కమలనాథులు ఎదుర్కొంటున్నారని ఎద్దేవా చేశారు. ఇద్దరి అధికార అవధి పూర్తయినా ఇప్పటి వరకు వారికి సరైన నాయకుడే దొరకలేదా అని ప్రశ్నించారు. ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా మాట్లాడితే, తదుపరి ఎన్నికల్లో తమకు టిక్కెట్టు దక్కదన్న భయం ఆ పార్టీ నాయకుల్లో ఉందన్నారు. సంఘ పరివార్ ప్రారంభమై వందేళ్లయినా ఇప్పటి వరకు పేరు ఎందుకు నమోదు చేయించుకోలేదని ప్రశ్నించారు. దేశంలోని ఎక్కువ శాఖ ప్రజలు ఆ సంఘటనను ఆమోదించలేదన్నారు. ఇప్పటి వరకు సంఘ పరివార్ నాయకులు ఏ యుద్ధంలో పాల్గొన్నారు, ఎక్కడ సహాయ కార్యక్రమాలు చేస్తున్నారో కూడా దాఖలాలు విడుదల చేయడంలో విఫలమయ్యారని ఎద్దేవా చేశారు.

ప్రియాంక్ ఖర్గే

మహిళ దారుణహత్య

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: తాళికట్టి తనను వివాహం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్న మహిళను ఓ వ్యక్తి ఎనిమిది సార్లు కత్తితో పొడిచి హత్య చేసిన సంఘటన శనివారం రాత్రి కేజీహళ్లి పోలీసుఠాణా పరిధిలో జరిగింది. కేజీహళ్లి పిళ్లణ్ణగార్డన్ నివాసి రేణుకా(35) హత్యకు గురికాగా, హత్యకు పాల్పడిన అంబేద్కర్ అలియాస్ కుట్టిని స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. హత్యకు గురైన మహిళకు కుమార్తె ఉంది. భర్త నుంచి విడాకులు తీసుకుని ఒంటరిగా జీవిస్తున్నారు. అదే ప్రాంతంలో ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్న అంబేద్కర్‌తో ఆమెకు పరిచయమై అది కాస్త ప్రేమగా మారింది. ఇద్దరు కలిసి జీవించడం ప్రారంభించారు. తనను పెళ్లి చేసుకోవాలని గత కొన్ని రోజులుగా ఆమె అతడిపై ఒత్తిడి తేవడం ప్రారంభించారు. రాత్రి ఇద్దరు పెళ్లి అంశంపై గొడవపడ్డారు. కోపం పట్టలేక వంటగదిలో కూరగాయలు కోసే కత్తితో అతడు రేణుకాపై దాడి చేసి పొడిచి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుపాలైన పురిటిబిడ్డ

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: హొసకోట సమీపంలోని దొడ్డకెరె వద్ద రహదారిలో పురిటి బిడ్డ మృతదేహాన్ని ఆదివారం ఇక్కడ స్థానిక పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆడ బిడ్డ అనే కారణంతో కొందరు వ్యక్తులు బిడ్డ తెచ్చి రహదారి పక్కన వేసి పరారైనట్లు గుర్తించారు. మృతదేహాన్ని హొసకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సొరంగ మార్గంపై శివాలెత్తిన నిరసన

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే: ఉద్యాననగరికి సొరంగ మార్గం అవసరం లేదని, లాల్‌బాగ్ జాతీయ ఉద్యానం, స్యాంకీ చెరువుకు ముప్పు వస్తుందని విపక్ష నేత ఆర్.అశోక్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఉద్యానవనాన్ని కాపాడాలని కోరుతూ బెంగళూరు దక్షిణ లోక్‌సభ సభ్యుడు తేజస్వి సూర్య, ఎమ్మెల్యేలు ఉదయ్ గరుడాచార్, సీకే రామమూర్తి, వందలాది కార్యకర్తలు, వివిధ మోర్చాల ప్రతినిధులతో లాల్‌బాగ్ ఉద్యానవనంలో ఆదివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. మూడు వేల మిలియన్ ఏళ్ల క్రితం ఏర్పడిన ఏకశిలా బెట్ట, లావా పొరల్లో దొరికిన శిలాజంతో పాటు వేలాది జాతుల మొక్కలు ఉన్న లాల్‌బాగ్‌లో ఆరున్నర ఎకరాలను సొరంగ మార్గం నిర్మాణ సమయంలో వినియోగించుకోవాలని నిర్ణయించడం సరికాదని ప్రభుత్వానికి హితవు పలికారు. 'బెంగళూరును రక్షించండి- లాల్‌బాగ్‌ను కాపాడండి' అనే నినాదంతో చేపట్టిన నిరసనకు ఉద్యానవనంలో ఉదయం నడకకు వచ్చే వారు కూడా మద్దతు పలికారు. సొరంగ మార్గం నిర్మాణానికి సంబంధించి ఒక సమితిని ఏర్పాటు చేసి, దానికి విపక్ష నేతను అధ్యక్షునిగా చేస్తానని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ చేసిన సూచనలను అశోక్ ఖండించారు. ఈ ప్రాజెక్టు నాది గాని, ఇతర నాయకులదిగాని కాదన్నారు. సొరంగ మార్గంలో వెళ్లేందుకు రుసుము చెల్లించడం శ్రీమంతులకే సాధ్యమవుతుందన్నారు. కూడళ్లలో చిన్న వంతెనలు, బిలమార్గాలను నిర్మించడం ద్వారా వాహన రద్దీని సాధారణ స్థాయికి తీసుకురావచ్చని వివరించారు. నగర వ్యాప్తంగా సబర్బన్ రైలు వ్యవస్థకు కేంద్ర నిధులు ఇస్తున్న సమయంలో ఈ తరహా భారీ ప్రాజెక్టును ఎందుకు నిర్మించాలని ప్రశ్నించారు. రహదారులపై గుంతలు పూడ్చడం, మెట్రోను విస్తరించడం, ప్రజా రవాణా వ్యవస్థ సేవల అవధిని పెంచడం తదితరాలతో రద్దీ నియంత్రణకు వస్తుందని సూచించారు. సొరంగ మార్గంలో ద్విచక్ర వాహనాలకు అనుమతి ఉండదని, నగరంలోని 1.20 కోట్ల వాహనాల్లో 70 శాతం ద్విచక్ర వాహనాలు ఉన్నాయని గుర్తు చేశారు. రూ.17,800 కోట్లతో నిర్మించే సొరంగంతో సామాన్యులకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. భూమికి దిగువ 130 అడుగుల దిగువన నిర్మించే సొరంగానికి సంబంధించి ఎలాంటి అధ్యయనమూ చేయలేదన్నారు. అభివృద్ధికి భాజపా ఎన్నడూ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ధర్నా అనంతరం ఉద్యానశాఖ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు.

లాల్‌బాగ్ ఉద్యానవనంలోని బెట్టపై భాజపా నాయకులు, ఉద్యానశాఖ అధికారికి వినతిపత్రాన్ని అందిస్తూ..

సివిల్ కాంట్రాక్టర్ ముసుగులో డ్రగ్స్ దందా!

ఈనాడు, హైదరాబాద్: కర్ణాటక, తెలంగాణాలో మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర నిందితుడు ఎజాజ్ అహ్మద్(28)ను అరెస్ట్ చేసినట్లు ఆదివారం హెచ్‌న్యూ డీసీపీ వై.వి.ఎస్ సుధీంద్ర తెలిపారు. ఇతడి నుంచి 11 గ్రాముల ఎండీఎంఏ, 35 గ్రాముల కొకైన్, 5 గ్రాముల ఓజీ, 15 ఎక్సటసీపిల్స్, రెండు చరవాణులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.12 లక్షల ఉంటుందని అంచనా వేశారు. బిహార్‌కు చెందిన ఎజాజ్ అహ్మద్ కుటుంబం 1998లో కర్ణాటకలోని కార్వార్‌కు చేరింది. అతడి తండ్రి సివిల్ కాంట్రాక్టర్. ఎజాజ్ బీటెక్ మధ్యలో మానేశాడు. కొంతకాలం సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేశాడు. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు డ్రగ్ పెడ్లర్‌గా మారాడు. కర్ణాటకలోని నైజీరియన్లతో ప్రత్యక్ష సంబంధాలు ఏర్పాటు చేసుకొని.. వారి వద్ద పెద్ద ఎత్తున కొకైన్, హెరాయిన్ కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించడం ప్రారంభించాడు. తక్కువ సమయంలోనే 100 మందికి పైగా కొనుగోలుదారులకు సరఫరా చేసేంతగా ఎదిగాడు. పెద్దఎత్తున సొమ్ము చేతికి అందడంతో విలాస జీవితానికి అలవాటయ్యాడు. బెంగళూరులో ఖరీదైన భవనంలో యువతితో కలసి జీవిస్తున్నాడు. అక్కడి నైజీరియన్లు డ్రగ్స్ సరఫరా చేసేందుకు డెడ్‌డ్రాప్ పద్ధతిని ఉపయోగిస్తారు. ఇతడికి మాత్రం నేరుగా సరుకు ఇచ్చి నగదు తీసుకొని వెళ్లేవారు. హైదరాబాద్‌లోని కొనుగోలుదారులకు కొరియర్, పోర్టర్ ద్వారా చేరవేసేవాడు. ఎక్కువ సరకు అందజేసేందుకు తానే ఇక్కడకు వచ్చి వెళ్తుంటాడు. హెచ్‌న్యూ ఇన్‌స్పెక్టర్ డానియేల్, ఎస్సై వెంకటరాములు, మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ బృందం నిఘా ఉంచింది. నిందితుడు శనివారం నగరానికి వచ్చినట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద డ్రగ్స్ స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడికి డ్రగ్స్ సరఫరా చేస్తున్న నైజీరియన్ కోసం గాలిస్తున్నారు.



నిందితుడు ఎజాజ్ అహ్మద్‌తో హెచ్‌న్యూ పోలీసులు

ఐదుగురికి కత్తిపోట్లు

బెళగావి, న్యూస్‌టుడే: కన్నడ రాజ్యోత్సవాల్లో భాగంగా కుందానగరిలో శనివారం రాత్రి నిర్వహిస్తున్న ఊరేగింపులో వెళ్తున్న వారిలో ఐదుగురు కత్తిపోట్లకు గురయ్యారు. ఊరేగింపు సదాశివనగర లక్ష్మీ కాంప్లెక్స్ వద్దకు చేరుకున్న సమయంలో ఊరేగింపులో చొరబడిన ఆగంతకులు దాడి చేసి పరాయ్యారు. మరోవైపు జేబు దొంగలు 300మందికిపైగా వ్యక్తుల చరవాణులు, కొందరి నగదు కొట్టేశారు. కత్తిపోట్లకు గురైన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో బిమ్స్‌లో చేర్పించారు. ఘటనకు సంబంధించి పాతిక మందికి పైగా అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. కత్తిపోట్లకు గురైన వారిని రాఘవేంద్ర వక్కుంద (35), సచిన్ కాంబ్లె (32), లోకేశ్ బేటగేరి (35), ప్రభాకర్ ప్రేమయ్య రావూరి (33), నజీర్ పఠాణ (24)గా గుర్తించారు. నిందితుల దాడికి కారణాలను గుర్తించాలని పోలీసులు తెలిపారు.

వీధి కుక్కపై అఘాయిత్యం

బెంగళూరు(ఆడుగోడి),న్యూస్‌టుడే: కర్ణాటకలో అమానుష సంఘటన చోటుచేసుకుంది. కొందరు కామాంధులు ప్రాణులపైనా అఘాయిత్యాలకు పాల్పడుతుండటం సభ్యసమాజం తలదించుకునేలా చేస్తోంది. పోలీసుల వివరాల ప్రకారం.. బెంగళూరు నగరం బెళ్లందూరు పోలీసుఠాణా పరిధిలోని సర్జాపుర రహదారుల్లో సంచరిస్తున్న వీధి కుక్కపై నలుగురు యువకులు అత్యాచారానికి పాల్పడిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఆ వీధి కుక్కను కనిపెట్టేందుకు స్థానిక పోలీసులు 25 సీసీ కెమెరాలను పరిశీలించి ఆఖరికి దానికి వైద్య పరీక్షల నిమిత్తం పశువైద్యశాలకు తరలించారు. ఓ వీధిలో నిద్రిస్తున్న కుక్కను నిందితులు బలవంతంగా ఎత్తుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారని ఓ మహిళ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

2454 sft plot is on sale in Kranthi nagar society layout, Sarjapur. Genuine buyers can contact: 79896 97569.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్లారి : 9121167525

బెంగళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

సామాజిక సందేశాత్మక చిత్రం హేప్రభు

సామాజిక సందేశాత్మకమైన చిత్రం 'హేప్రభు' ఈనెలౖనే రాష్ట్రవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రజల జీవితాలతో ఆడుకుంటున్న మందులు కంపెనీలు, నకిలీ మందులు విక్రయాలు, మందులు పట్ల ప్రజలకు ఉన్న అవగాహన, ప్రజలకు వస్తున్న రోగాలు వాటి ఆధారంగా లాభాలు గడిస్తున్న కార్పొరేట్ కంపెనీల భాగోతాన్ని కళ్లకు కట్టినట్లు చిత్రం ద్వారా ప్రజలకు వివరించామని దర్శకుడు వెంకట్‌భరద్వాజ్ తెలిపారు. మందులు పట్ల ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు చిత్రాన్ని నిర్మించినట్లు చెప్పారు. యమునా శ్రీనిధి, జయవర్ధన్, సంహితావిన్యా, గజానన హెగ్డే, లక్ష్మణశివశంకర్, డాక్టర్ సుధాకర్‌శెట్టి, డాక్టర్ ప్రమోద్, డాక్టర్ ఆదర్శగౌడ,హరిధనుంజయ తదితరులు నటిస్తున్నారు. డ్యాని అండర్సన్ సంగీతం అందిస్తున్నారు.

హే ప్రభు చిత్రంలో యమునాశ్రీనిధి, జయవర్ధన్

ఓఎల్‌సీ (ఆపరేషన్ లండన్‌కెఫె) 28న రాక

విభిన్నకథాచిత్రం 'ఓఎల్‌సీ(ఆపరేషన్ లండన్ కెఫె) చిత్రం ఈనెల 28న రాష్ట్రవ్యాప్తంగా విడుదల చేస్తారు. ఏక కాలంలో కన్నడ, మరాఠీ భాషల్లో చిత్రాన్ని విడుదల చేస్తామని దర్శకుడు సడగర రాఘవేంద్ర చొచ్చల తెలిపారు. కన్నడ, మరాఠీ నటులు కలిసి తొలిసినిమాగా గుర్తింపు పొందింది. మేఘశెట్టి, శివానిసుర్వే, విరాట్ మడ్కె, అర్జున్ కాపికాడ్, బి.సురేష్, ధరేంద్ర అరసు, కృష్ణ హెబ్బాళ్, నీనాసం అశ్వత్, అశ్విని తదితరులు నటిస్తున్నారు.

ఓ.ఎల్.సి చిత్రంలో మేఘశెట్టి

సాలగారర సహకార సంఘద పాటలు వచ్చేశాయ్

అప్పులు తీసుకున్న వ్యక్తులు పడే బాధలతో కూడిన హాస్యభరితమైన 'సాలగారర సహకార సంఘద' చిత్రం పాటలను ఇటీవల విడుదల చేశారు. బెంగళూరు, తీర్థహళ్లి, చిక్కమగళూరు తదితర ప్రాంతాల్లో 45రోజులు పాటు వివిధ దృశ్యాలను చిత్రీకరించినట్లు దర్శకుడు విక్రమ్ ధనంజయ్ తెలిపారు. నిరుద్యోగులైన కొందరు యువకులు కారణం లేకుండా అప్పు చేస్తారు. దాన్ని తీర్చేందుకు పడే బాధలను హాస్యభరితంగా చిత్రీకరించినట్లు తెలియజేశారు. లోకేశ్, ప్రవీణ్‌కుమార్, రంగాయణరఘు, హొన్నవళ్లి కృష్ణ, లక్ష్మీసిద్ధయ్య తదితరులు నటిస్తున్నారు.

సాలగారర సహకార సంఘద చిత్రబృందం

నూతన నటులతో ఆల్ఫామెన్‌లవ్ వైలెన్స్

సమాజంలో జరుగుతున్న సంఘటనలు ఆధారంగా నూతన నటులతో నిర్మిస్తున్న 'ఆల్ఫామెన్‌లవ్ వైలెన్స్' చిత్రం చిత్రీకరణ పూర్తి చేసి ఇతర పనుల్లో చిత్రబృందం నిమగ్నమయ్యారు. బెంగళూరు, మంగళూరు, మాలూరు ప్రాంతాల్లో 70 రోజులపాటు వివిధ దృశ్యాలను చిత్రీకరించినట్లు దర్శకుడు విజయ్ తెలిపారు. చిత్రం ద్వారా కన్నడ సినీ పరిశ్రమకు హీరో హేమంత్‌కుమార్ పరిచయమవుతున్నారు. నాగార్జున శర్మ రాసిన ఐదు పాటలను వివిధ ప్రాంతాల్లో చిత్రీకరించారు. కార్తిక్‌మహేశ్, అవినాశ్, అచ్యుత్ కుమార్, రమేష్‌ఇందిరా, బాలునాగేంద్ర, మానసి సుధీర్, గిరిరాజ్, రాఘుశివమొగ్గ తదితరులు నటిస్తున్నారు.



ఆల్ఫామెన్‌లవ్ వైలెన్స్ చిత్రంలో హీరో హేమంత్‌కుమార్

న్యూస్‌టుడే, బెంగళూరు (యశ్వంతపుర)

మంగళాదేవి ఆలయ ప్రాంగణంలో తులసి పూజలు

నగరంలోని సనాతన చరిత్ర కలిగిన గవిగంగాధర దేవస్థానంలో ఆదివారం గంగాధరేశ్వరుడికి హరిద్ర, కుంకుమ, చందనాలతో వైభవంగా అభిషేకాలను నిర్వహించారు. ఈ సుందర సందర్భంలో భక్తులు అసంఖ్యాకంగా హాజరైనట్లు ప్రధాన అర్చకుడు శ్రీకంఠదీక్షిత్ తెలిపారు. రేవునగరి, భార్గవ క్షేత్రమైన మంగళూరులో వెలసిన మంగళాదేవి దేవస్థానం ప్రాంగణంలో ఉదయాన్నే క్షీరాబ్ధిద్వాదశి సందర్భంగా తులసి పూజలు నిర్వహించారు. - న్యూస్‌టుడే, బెంగళూరు (సాంస్కృతికం)

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

ఆసక్తికరంగా సంసద్ క్రీడోత్సవాలు

బెంగళూరు (క్రీడలు) న్యూస్‌టుడే : బెంగళూరు ఉత్తర లోక్‌సభ పరిధిలోని మల్లేశ్వరంలో నిర్వహించిన సంసద్ క్రీడోత్సవాలను కేంద్ర మంత్రి శోభాకరంద్లాజే, ఎమ్మెల్యే సి.ఎన్.అశ్వత్థనారాయణ, రాజ్యసభ సభ్యుడు జగదీష్ తదితరులు ప్రారంభించారు. క్రీడాకారులు గిరీశ్ హాసనగర రాజేగౌడ, అర్జున్ దేవయ్య, అంజు బి.జార్జ్, రజినీ రామానుజం, శ్రీహరి నటరాజ్, కె.వై.వెంకటేశ్‌లను సత్కరించారు. కార్యక్రమంలో భాజపా నాయకులు, అధికారులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

అశ్వత్తనారాయణ, శోభాకరంద్లాజే తదితరులతో క్రీడాకారులకు సన్మానం

హోసూరు కబుర్లు

రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం

తళి (డెంకనీకోట) న్యూస్‌టుడే : తళి శివారు మరగారదొడ్డి నుంచి జవళగిరి కిను, జవళగిరి నుంచి తళి వరకు రూ.4.34 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను ఆదివారం తళి ఎమ్మెల్యే రామచంద్రన్ పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త శివశంకర్, నాయకులు కుమార్, ప్రశాంత్, చెన్నీరప్ప, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రామచంద్రన్

సెల్‌టవర్ ఎక్కిన విద్యార్థి

బర్గూరు (డెంకణీకోట) న్యూస్‌టుడే : బర్గూరులో ఒక పాలిటెక్నిక్ కళాశాలలో చదివే విద్యార్థి..అదే కళాశాలకు చెందిన విద్యార్థినిని ప్రేమించాడు. తన ప్రేమను ఆమె అంగీకరించకపోవడంతో ఆ విద్యార్థి ఆదివారం బి.ఎస్.ఎన్.ఎల్ సెల్ టవర్ మీద ఎక్కి బెదిరించాడు. విషయాన్ని స్థానికులు బర్గూరు పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు, కృష్ణగిరి అగ్నిమాపక సిబ్బంది వచ్చి విద్యార్థిని కిందకు దించారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

తళి (డెంకనీకోట) న్యూస్‌టుడే : తళి శివారు కలుకొండపల్లి వద్ద జూదం ఆడుతున్న కర్ణాటక రాష్ట్రం గుండూరుకు చెందిన వెంకటేశ్, మురుగేశన్, మునిరాజు తదితరులను పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద ఉన్న 12 చరవాణులు, రూ.1.48 లక్షల స్వాధీనం చేసుకున్నారు.

వాహనం అదుపు తప్పి ఒకరి మృతి

వేపనపల్లి (డెంకణీకోట) న్యూస్‌టుడే : వేపనపల్లి శివారు గొల్లపల్లి గ్రామానికి చెందిన ముత్తప్ప (65) ద్విచక్ర వాహనంలో తోటకు వెళుతుడగా వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని కృష్ణగిరి..అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సేలంకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వేపనపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ప్రమాదంలో యువకుడు..

వేపనపల్లికి చెందిన రైతు మల్లికార్జునన్ (28) ఉపనపల్లి శివారు తిప్పనల్లి నుంచి డి.మాదినాయనపల్లికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఇందిరా నగర్ వద్ద వాహనం బోల్తాపడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే చనిపోయాడు. మహారాజగడై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు కార్పొరేషన్ పరిధిలోని టీవీఎస్ పరిశ్రమ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కృష్ణగిరి సమీపంలోని హరూర్‌కు చెందిన అంబాలగన్ దుర్మరణం పాలయ్యాడు. నలుగురు స్నేహితులు రహదారి పక్క నడిచి వెళుతుండగా వేగంగా వచ్చిన కారు వారిని ఢీకొనింది. ఈ ప్రమాదంలో అంబాలగన్ అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హోసూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మత్తిగిరి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సామూహిక భవనం ప్రారంభం

ముళబాగిలు, న్యూస్‌టుడే : కేజీఎఫ్ పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయ ప్రాంగణంలో రూ.52 లక్షలతో నిర్మించిన సామూహిక భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే రూపశశిధర్ ప్రారంభించారు. ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలని, వారి రక్షణకు పోలీసులు కృషి చేయాలని ఆమె సూచించారు. ఎస్పీ శివాంశు రాజ్‌పుత్, టీసీపీ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రూపశశిధర్ తదితరులు

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ముళబాగిలు, న్యూస్‌టుడే : ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులను కాపాడుకోవాలని ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ సూచించారు. తాలూకాలోని బల్ల గ్రామంలో ఆదివారం హైమాస్ట్ లైట్లు, వివిధ అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభించారు. సీనియర్ నాయకులు కె.వి.శంకరప్ప, ఎం.ఆర్.మురళి, రఘుపతిరెడ్డి, యడహళ్లి సోమణ్ణ, లక్ష్మీనారాయణ, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరిహారం

ముళబాగిలు, న్యూస్‌టుడే : మాలూరు తాలూకా కడదనహళ్లి పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థి సురేంద్ర నీటి తొట్టిలో పడి మృతి చెందాడు. మాలూరు ఎమ్మెల్యే నంజేగౌడ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి బాలుడి తల్లి గీతకు రూ.25 వేలు అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పరిహారం, ఉద్యోగం, ఇల్లు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తహసీల్దార్ ఎం.వి.రూప, ఈవో కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

చెన్నండ హాకీ పోటీలకు కోటి రూపాయలు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : కొడుగు అంటే హాకీ, హాకీ అంటే కొడుగు. హాకీ క్రీడలో ప్రఖ్యాతి గాంచిన కొడుగు కుటుంబాలు నిర్వహించే ప్రతిష్ఠాత్మక చెన్నడ హాకీ పోటీలకు రూ.కోటి నిధులను అందిస్తామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హామీ ఇచ్చారు. ఆదివారం సీఎం నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిద్ధరామయ్య చెన్నడ హాకీ పోటీల లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో హాకీ క్రీడాకారులు భారత జట్టు తరపున పాల్గొని కర్ణాటక ఘనతను నిలబెట్టారన్నారు. ఏసియన్ గేమ్స్ వంటి ప్రముఖ పోటీల్లో దేశం గర్వించే సాధనలు చేశారని కొడుగు క్రీడాకారులను కొనియాడారు. కొడవ సంస్కృతి తనదైన ఘనతను కొనసాగిస్తోందన్నారు. ఇది మన సంస్కృతికి గర్వకారణమన్నారు. 2026 మేలో జరిగే ఈ పోటీలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. తాను కూడా పోటీలను వీక్షించేందుకు విచ్చేస్తానని నిర్వాహకులకు చెప్పారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి న్యాయ సలహాదారుడు పొన్నణ్ణ, మంత్రులు బోసరాజు, భైరతిసురేష్, శివరాజతంగడి, రాఘవేంద్ర హిట్నాళ్, కొడుగు సముదాయం ప్రముఖులు పాల్గొన్నారు.

లోగో ఆవిష్కరిస్తున్న సిద్ధరామయ్య, బోసురాజు, భైరతి సురేశ్ తదితరులు

కొడుగు సంప్రదాయం దుస్తులతో మహిళలు

అటు సొరంగ మార్గం..ఇటు టామ్ రవాణా

సంచార రద్దీ నియంత్రణకు తర్జన భర్జన

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నగర సంచార రద్దీ నియంత్రణకు సొరంగ మార్గమే పరిష్కారమని ప్రభుత్వం భావించి అందుకు సంబంధించిన కార్యాచరణ పథకాన్ని సిద్ధం చేస్తున్న సమయంలో..ప్రత్యామ్నాయంగా టామ్ రవాణా వ్యవస్థ మళ్లీ తెరపైకి వచ్చింది. దాంతో పాటు మెట్రో ఉపరితల వంతెనల కింద పాదచారి మార్గాలను అభివృద్ధి చేయనున్నారు. హెబ్బాళ్ నుంచి సిల్క్ బోర్డు కూడలి వరకు 16 కిలోమీటర్ల రూ.22 వేల కోట్లు అంచనా వ్యయంతో సొరంగ మార్గాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. సొరంగ మార్గం వల్ల పరిసరాలు నాశనంతో పాటు ఆమార్గం సురక్షితం కాదని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆమార్గంలో టామ్ రవాణా వ్యవస్థ అమలు చేస్తే వ్యయం చాల తక్కువవుతుందని, పరిసరాలు నాశనం కావని ఇంజినీరింగ్ నిపుణులు సూచించారు. వారి వాదనలకు ఎంపీ తేజస్వి సూర్య మద్దతు ఇస్తున్నారు. దీంతో టామ్ రవాణా చర్చకు వచ్చింది. సొరంగ మార్గం వల్ల వ్యయం ఎక్కువ కావడంతో పాటు నీరు, పచ్చదనం తదితర వాటికి నష్టం జరుగుతాయని పరిసరవాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్లలో సంచరించే వారి కోసమే సొరంగ మార్గాన్ని నిర్మిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. హెబ్బాళ్ నుంచి బసవేశ్వర కూడలి వరకు 4.5 కిలోమీటర్ల స్టీల్ బ్రిడ్జి నిర్మాణానికి వ్యతిరేకత రావడంతో ఆ పథకం మూలపడింది. ఇప్పుడు కూడా సొరంగ మార్గానికి అదే పరిస్థితి వస్తుందా? అనే అనుమానాలను నగరవాసులు వ్యక్తం చేస్తున్నారు.

టామ్ రవాణా వ్యవస్థ ఇలా

మెట్రో ఉపరితల వంతెన కింద పాదచారి నడక మార్గం

ఏమిటీ వ్యవస్థ

రహదారి పక్కన, మధ్యలో పట్టాలు నిర్మించి రెండు, మూడు బోగీలు కూడిన విద్యుత్తు, బ్యాటరీ ఆధారంగా సంచరించే బస్సు వ్యవస్థను అమలు చేస్తే నగర సంచార రద్దీ అదుపులోకి వస్తుందని సంచార ఇంజినీరింగ్ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల కిందట ఇలాంటి వ్యవస్థకు సంబంధించిన నగరాభివృద్ధిశాఖ అధికారులు నివేదిక సిద్ధం చేశారు. ఎస్ఎం కృష్ణ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు కొన్ని రహదారుల్లో ఈ వ్యవస్థ అమలు చేయాలని ప్రయత్నించారు. కొన్ని కారణాలతో ఈ పథకాన్ని అమలు చేయలేదు. ఇప్పుడు మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ వ్యవస్థ అమలుకు భూస్వాధీనం అవసరం లేదు. చెట్ల తొలగించరు. బావులు, బోరుబావులు మూతపడవు. పరిసరాలు నాశనం కావు. వాయుమాలిన్యం ఉండదు. ఖర్చు తక్కువ. కేవలం రహదారి పక్కన మీటర్ గేజ్ పట్టాలు వేస్తే చాలు. విద్యుత్తు ఆధారిత బస్సులు నడపవచ్చు. మూడు బోగీల్లో వంద మందికి పైగా సంచరించవచ్చు. ఇలాంటి రవాణా వ్యవస్థ బెంగళూరు నగరానికి అవసరమని గతంలో పలు సంస్థలు సూచించాయి. ఇప్పుడు దానిపై అధికారులు తర్జన భర్జన పడుతున్నారు.

సాహితీ వేత్తలకు జానమద్ది సాహితీ పీఠం పురస్కారాలు

కడప (మారుతీ నగర్), న్యూస్‌టుడే: ప్రముఖ సాహితీ వేత్త, బ్రౌన్ గ్రంథాలయ రూపశిల్పి దివంగత డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి జయంతిని పురస్కరించుకుని కడపలోని సీపీ బ్రౌన్ కార్యాలయంలో ఆదివారం జానమద్ది సాహితీపీఠం పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రంథాలయ సేవా పురస్కారాన్ని మరె అంకెగౌడ (కర్ణాటక)కు ప్రదానం చేశారు. పురస్కారం కింద రూ.10 వేల నగదు, శాలువాతో అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ తెలిపారు.

వెంకయ్యనాయుడు, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప నుంచి సత్కారం అందుకున్న అంకే గౌడ

మైమరపించిన నూపుర నాదాలు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : సేవాసదన్‌లో జరిగిన నృత్యోత్సవంలో నృత్యాంగనల నూపుర నాదాలు ప్రేక్షకులకు కన్నుల పండగ చేసి రస హృదయాలను మైమరపించాయి. నగరంలోని కూచిపూడి నృత్య శిక్షణా సంస్థ నిర్వహించిన కూచిపూడి నాట్యోత్సవం వేడుకలకు అసంఖ్యాక నృత్యాభిమానులు, నృత్య గురువులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కళాకారిణులు సంయుక్తా మత్స హైదరాబాద్‌కు చెందిన ఆకుండి శ్రీసౌమ్య నృత్య యుగళ ప్రదర్శన, కేరళకు చెందిన డాక్టర్ స్నేహా శశికుమర్, డాక్టర్ స్మృతి విష్ణులు కూచిపూడి ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. హైదరాబాద్‌కు చెందిన ఆరతి శంకర్, ఈమె శిష్యురాళ్ల కథక్ నాట్య విన్యాసాలు... తనూ తలికల మెరుపు విరుపులు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. విశాఖపట్టణానికి చెందిన కూచిపూడి నాట్య గురువు డాక్టర్ పశుమర్తి వెంకటరమణ, బెంగుళూరుకు చెందిన భరతనాట్య విదుషి అనూరాధా వెంకటరామన్‌లకు సంస్థ వ్యవస్థాపకురాలు దీపా శశీంద్రన్ ఘనంగా సత్కారించారు. ముఖ్య అతిథులుగా కర్ణాటక నృత్య అకాడమీ అధ్యక్షురాలు డాక్టర్ శుభా ధనంజయ్, భరతనాట్య విదుషి జయంతి ఈశ్వరపుటి హాజరై కళాకారులను అభినందించారు.

కథక్ నృత్యాంగనల నాట్య హొయలు

శారీరక దృఢత్వంపై దృష్టి సారించాలి

మైసూరు, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ ఆరోగ్యం, దృఢత్వంపై దృష్టి సారిస్తే జీవితాంతం సంతోషంగా ఉండవచ్చని నటి శిల్పాశెట్టి పేర్కొన్నారు. జీవితంలో సంపాదన ఎంత ముఖ్యమో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అంతే అవసరమని చెప్పారు. మైసూరు మహారాజ కళాశాల మైదానంలో జీతో మహిళా సంఘం నిర్వహించిన రెండు రోజుల జాతీయ మహిళా చర్చాగోష్ఠిలో ఆమె మాట్లాడారు. నటీనటులను అనుకరించడం కన్నా, యువత తనలోని ప్రతిభను ప్రపంచానికి చూపించేందుకు ప్రయత్నించాలని హితవు పలికారు. సమావేశంలో వేర్వేరు సంస్థలకు చెందిన ప్రతినిధులు తమ స్టాళ్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జీతో ప్రతినిధులు ప్రవీణ్, దిలీప్ జైన్, పింకీ జైన్, మహిళా విభాగం అధ్యక్షురాలు మోనా భతేర్వ, కార్యదర్శి రజని దగాలియా తదితరులు పాల్గొన్నారు.

చర్చాగోష్ఠిలో ప్రసంగిస్తున్న శిల్పాశెట్టి

పుస్తక మేళాకు చక్కని స్పందన

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే : చామరాజపేట కేశవ శిల్పలో 'రాష్ట్రోత్థాన సాహిత్య' ఏర్పాటు చేసిన ఐదో కన్నడ పుస్తక మేళాకు చక్కని స్పందన లభిస్తోంది. ఆరు దశాబ్దాల్లో ఈ వేదిక చేసిన సాహిత్య, ప్రజా సేవలకు వెల కట్టలేమని మైసూరు లోక్‌సభ సభ్యుడు యదువీర్ కృష్ణదత్త ఒడెయరు పేర్కొన్నారు. దేశ చరిత్ర, సంప్రదాయపు విలువలు బోధించే పుస్తకాలను విద్యార్థుల వద్దకు తీసుకువెళ్లేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రయత్నించాలని సూచించారు. డిసెంబరు 7 వరకు కొనసాగే పుస్తక ఉత్సవాల్లో కొత్త పుస్తకాల విడుదల, నిత్యం సంగీతం, నృత్య కార్యక్రమాలు, కొనుగోలుదారులకు పలు పుస్తకాలపై రాయితీ తదితరాలు ఇస్తున్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

జ్యోతి వెలిగిస్తున్న యదువీర్

సహోద్యోగి హత్య

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కార్యాలయంలో లైట్ ఆఫ్ చేసే అంశంపై ఇద్దరి మధ్య జరిగిన గొడవ హత్యకు దారి తీసిన సంఘటన ఆదివారం తెల్లవారు జామున గోవిందరాజనగర పోలీసుఠాణా పరిధిలో జరిగింది. చిత్రదుర్గ నివాసి భీమేశ్‌బాబు (41) హత్యకు గురి కాగా హత్య చేసిన నిందితుడు విజయవాడ నివాసి సోమల వంశీ (24)ని పోలీసులు అరెస్టు చేశారు. సహోద్యోగిని డంబెల్స్‌తో కొట్టి హత్య చేసి నిందితుడు పోలీసు ఠాణాకు వెళ్లి లొంగిపోయాడు. సినిమాలు చిత్రీకరించే వీడియో కంపెనీలో ఇద్దరు పని చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రెండు ఏనుగుల మృతి

బెళగావి : ఖానాపుర తాలూకా సుళేగాళి గ్రామంలో విద్యుదాఘాతంతో రెండు ఏనుగులు మరణించాయి. దేవరాయి గ్రామ సమీపంలోని గణపతి సాతేరి గురవ, ఇతర రైతులు తమ పొలాలకు రక్షణగా సౌర విద్యుత్తుతో పని చేసే కంచెలు వేసుకున్నారు. ఆహారం కోసం అడవి నుంచి దేవరాయి, సుళేగాళి గ్రామాల వైపు వచ్చిన ఈ రెండు ఏనుగులు తీగలను తాకి మృతి చెందాయి.

హార్డ్‌డిస్క్ చోరుని అరెస్టు

బెంగళూరు (గాంధీనగర) : విడుదలకు సిద్ధంగా ఉన్న 'ఐ యామ్ గాడ్' సినిమా ఉన్న హార్డ్‌డిస్కును దొంగిలించిన జయశీలన్ అనే వ్యక్తిని విజయనగర ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. అతని కుమారుడు పరారీలో ఉన్నాడు. సినిమా నిర్మాత, ఆతని కుమారుడు రవి గౌడ విజయనగరలో కారు నిలిపి పనిపై వెళ్లి వచ్చే సరికి అద్దాలు పగలగొట్టి ఉన్నాయి. కారులోని హార్డ్ డిస్క్, ఒక ట్యాబ్, ఖరీదైన సంచి, రూ.75 వేల నగదు దొంగతనమయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులు తమిళనాడులో ఉన్నట్లు తెలుసుకుని, అక్కడికి వెళ్లి జయశీలన్‌ను అరెస్టు చేశారు. నిందితుని నుంచి హార్డ్‌డిస్క్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు.

నేపాలీ వ్యక్తి మృతి

బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే : రామమూర్తినగర కూడలిలోని సిగ్నల్ వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో నేపాల్‌కు చెందిన నరేశ్ కుమార్ (32) మరణించారు. హూడిలో ఉంటూ, ఒక ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్న బాధితుడు విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎదురుగా వచ్చిన గూడ్సు ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. బాధితుడ్ని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేలోగా మార్గమధ్యంలో మరణించారు. బాణసవాడి ట్రాఫిక్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కన్నడ సినిమాల విడుదలకు ఓటీటీ వేదిక

చిత్రదుర్గం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో కన్నడ సినిమాలు, జానపద కళలు, గిరిజనుల సంస్కృతి, సీరియళ్లు తదితర కన్నడ బాష, సాంస్కృతిక విషయాలకు సంబంధించిన అంశాలను అంతర్జాతీయ స్థాయిలో ప్రసారం చేయడానికి ప్రభుత్వం కొత్తగా ఒక ఓటీటీ వేదికను ప్రారంభించడానికి ప్రయత్నిస్తున్నట్లు ప్రభుత్వ రంగ సంస్థ కంఠీరవ స్టూడియో అధ్యక్షుడు మహబూబ్‌బాషా తెలిపారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. అమెజాన్, నెట్‌ఫ్లిక్స్ లాంటి ప్రైవేటు ఓటీటీ వేదికలలో కేవలం కొన్ని కన్నడ సినిమాల ప్రదర్శనకు మాత్రమే అవకాశం ఉందన్నారు. 4 వేల కన్నడ చలన చిత్రాల ప్రదర్శనకు చిత్ర మందిరాలు, ఓటీటీ లేకపోవడంతో నిర్మాతలు, కళాకారులు, డిస్ట్రిబ్యూటర్లు ఇబ్బందిపడుతున్నట్లు పేర్కొన్నారు. కంఠీరవ స్టూడియో ఏర్పాటు చేసి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రూ.కోటి వ్యయంతో వజ్రోత్సవాలను ఘనంగా ఆచరించడానికి చర్యలను తీసుకుంటున్నట్లు వివరించారు. సమావేశంలో చిత్రదుర్గం పట్టణాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు తాజ్ పీర్, జిల్లా గ్యారంటీ పథకాల సమితి అధ్యక్షుడు శివణ్ణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మహబూబ్‌భాషా, తదితరులు

ముగ్గులతో చెత్తకు పరిష్కారం

బెంగళూరు బానసవాడి ప్రాంతంలోని టెలిఫోన్ భవనం ముందున్న చెత్తను పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేసి రంగులతో కూడిన ముగ్గులు వేసి చెత్త వేయకూడదని తమ వంత ప్రయత్నం చేశారు. నిత్యం ఈ స్థలంలో శుభ్రం చేస్తున్నా..వాహనాల్లో వెళ్లే వారు ఇళ్లలోని చెత్తను ఇక్కడ వేస్తున్నారు. ఇక్కడ చెత్త వేయకూడదని ఆ ప్రాంతంలో చక్కగా ముగ్గులతో తీర్చిదిద్దారు. ఇది చెత్త వేసేవారికి సంస్కారం నేర్పుతుందేమో చూద్దాం. - న్యూస్‌టుడే, బెంగళూరు (కెంగేరి)

ఎనిమిది మందికి గాయాలు

దావణగెరె, న్యూస్‌టుడే : జగళూరు తాలూకా జాతీయ రహదారి 50పై కాననకట్టి గ్రామం వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో 8మంది గాయపడ్డారు. వారిలో ఖాదర్ జిలాని, నూర్, షమీవుల్లా, గురురాజ్‌ల పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు. వీరు కొప్పళ జిల్లా గంగావతికి చెందినవారు. బెంగళూరు నుంచి గంగావతికి వెళుతున్న సమయంలో ప్రమాదం సంభవించింది.

కాంగ్రెస్ నాయకుడి కన్నుమూత

పావగడ : తాలూకాలోని బూదిబెట్ట గ్రామ పంచాయతీ సార్వాటపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, ఎమ్మెల్యే హెచ్.వి.వెంటేశ్ ప్రధాన అనుచరుడు ప్రభాకరరెడ్డి (54) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. బెంగళూరులో జరిగిన శుభ కార్యక్రమానికి వెళ్లిన ఆయన పక్షవాతానికి గురై అక్కడే అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆయన సోదరుడు జేడీఎస్ నాయకుడు గోవిందబాబు తెలిపారు. మాజీ మంత్రి వెంకటరమణప్ప, ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేశ్, తాలూకాలోని కాంగ్రెస్, జేడీఎస్ నాయకులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. ఆయనకు భార్య మంజుల, కుమారుడు దీక్షిత్‌రెడ్డి, కుమార్తె శ్రీలక్ష్మి ఉన్నారు. ఆదివారం ఆయన స్వగ్రామంలో అంత్యక్రియలు జరిగాయి.

ప్రభాకరరెడ్డి (పాతచిత్రం)

బిహారీలను పంపిస్తున్నారని ఆరోపణ

బెంగళూరు (రాజాజీనగర): బిహారు అసెంబ్లీకి జరుగుతున్న ఎన్నికలకు ఇక్కడ ఉంటున్న ఆ రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ నేతలు డబ్బులు ఇచ్చి పంపిస్తున్నారని భాజపా ఆరోపించింది. నగరంలో ఎనిమిది లక్షల మంది బిహారీలు ఉపాధి కోసం ఇక్కడకు రాగా, వారిలో 24 వేల మంది కార్మిక శాఖలో పేర్లు నమోదు చేయించుకున్నారు. ఓటు వేసి వచ్చేందుకు వారికి ఖర్చులతో పాటు, నిత్యావసరాలు, నగదు పంపిణీ చేస్తోందని భాజపా కర్ణాటక శాఖ ఆరోపించింది.

కరాటే పోటీలకు ఎంపికైన చైత్రశ్రీ

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : డాక్టర్ అంబేడ్కర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని, అంతర్జాతీయ కరాటే క్రీడాకారిణి ఎన్.చైత్రశ్రీ వీటీయు రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకాలను సాధించింది. ఈ సాధనతో చైత్రశ్రీ సౌత్-వెస్ట్ అంతర విశ్వవిద్యాలయం కరాటే పోటీలకు ఎంపికైంది. ఆర్‌వీ ఇంజినీరింగ్ కళాశాల నిర్వహించిన వీటీయూ పోటీలో చైత్రశ్రీ కటా, కుముటే విభాగాల్లో పసిడి పతకాలు దక్కించుకుంది.

బహుమతి అందుకుంటున్న చైత్రశ్రీ

'కన్నడ భాషను గౌరవించాలి'

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : కన్నడ డిజిటల్ రంగంలో సాధించిన ప్రగతితో ముందుకు సాగుతోందని ప్రముఖ కన్నడ కవయిత్రి సాహితీ ప్రతిభా నందకుమార్ పేర్కొన్నారు. రాజ్యోత్సవ సందర్భంగా అనికేతన కన్నడ సంఘం ఆధ్వర్యంలో బీఎంఎస్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. రెండు వేల సంవత్సరాల చరిత్ర కలిగిన కన్నడ భాషకు నేటి ప్రపంచీకరణ కారణంగా సామాజిక మాధ్యమాల ఒరవడిలో కన్నడకు ముప్పు వాటిల్లుతోందన్నారు. కన్నడ పురోగమనంలో గణనీయంగా విజయం సాధించిందన్నారు. కన్నడ భాషా, సాహిత్య, సంస్కృతులను పరిరక్షించే శక్తి, యుక్తి కన్నడిగులకు ఉందని వక్కాణించారు. ఈ సందర్భంగా ప్రతిభను ను సంస్థ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పంకజ్ చౌదరి, అమృతారాజ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రారంభ వేడుకల్లో ప్రతిభా నందకుమార్, అతిథులు

6.13 కోట్ల మంది వివరాల సేకరణ

బెంగళూరు (యశ్వంతపుర) : రాష్ట్ర వ్యాప్తంగా గత సెప్టెంబరు 22 నుంచి చేపట్టిన ఆర్థిక సామాజిక విద్య సమీక్ష-2025 కులగణన ప్రక్రియ అక్టోబరు 31 నాటికి పూర్తయిందని, రాష్ట్రంలో 6,68,38,000 మంది ఉండగా 6,13,83,908 మంది వివరాలు అందించారని కర్ణాటక రాష్ట్ర వెనుకబడిన వర్గాల శాశ్వత కమిషన్ ప్రకటించింది. 4,22,258 మంది కులగణన వివరాలు ఇచ్చేందుకు నిరాకరించారని, 3,449,681 మంది తమ ఇళ్లకు తాళాలు వేసి ఉన్నట్లు వివరించారు. కులగణన ప్రక్రియలో 1.60 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈనెల 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసేందుకు అవకాశం కల్పించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముఖ్యమంత్రి ఆదేశాలు బేఖాతర్

ఎక్కడి సమస్యలు అక్కడే

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : బెంగళూరు నగర రహదారులను అక్టోబరు ఆఖరిలోగా గుంతలు రహితంగా చేస్తామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించిన గడువు పూర్తయినా నేటికీ సమస్య అదుపులోకి రాలేదు. గుంతలు పూర్తిగా పూడ్చలేదని విధించిన గడువు పూర్తయిన సమస్య అదుపులోకి రాలేదని పాత్రికేయులు ముఖ్యమంత్రిని ప్రశ్నించగా చిరాకుపడిన ఆయన ఆవిషయాన్ని డీకే శివకుమార్‌ను ప్రశ్నించాలని ఘాటుగా సమాధానం ఇచ్చిన విషయం తెల్సిందే. వాస్తవంగా నగర రహదారుల్లో ఏర్పడిన గుంతలను గ్రేటర్ బెంగళూరు ప్రాధికార అధికారులు పూడ్చుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో పరిష్కారం లభించలేదు. అనేక రహదారుల్లో గుంతలు దర్శనమిస్తున్నాయి. పాడైన రహదారులను గురించి ఐటీ బీటీ నిపుణులు నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ఆప్రదేశాలపై అధికారులు దృష్టి సారించారు. పూర్తిగా పాడైన రహదారులను సిమెంట్ దారులుగా మార్చుతున్నారు. గుంతలు పూడ్చుతున్నారు. మిగతా రహదారుల్లో పడిన గుంతలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నెల రోజుల్లో 12 వేలు గుంతలు పూడ్చినట్లు తెలిపారు. ఇంకా ఐదువేలు గుంతలు ఉన్నట్లు గుర్తించారు. వాటిని పూడ్చాలంటే కనీసం రెండు వారాలు సమయం పడుతుందని అధికారులు అంచనా వేశారు. వర్షాలు కురుస్తున్నందు వల్ల మళ్లీ రహదారుల్లో కొత్తగుంతలు పడుతున్నాయని అవి పెద్దసమస్యగా మారుతున్నట్లు చెపుతున్నారు. శివార్లలో సమస్య ఎక్కువగా ఉందని ఆయా ప్రాంతాల్లో గుంతలు పూడ్చుతున్నట్లు తెలిపారు.

కలాసీపాళ్య బస్టాండ్ దుస్థితి

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE: KANDUKUR

CREDITOR I.P.NO. 12/2023

Kandukuri Satyanarayana & Others.. Petitioners

Versus

Jonnalagadda NageswaraRao & Others

... Respondents

To,

R4, **Jonnalagadda Supraja kumari**
W/o M.V.N.Kesava Rao
House Wife
Badamanavartekaval
Chikkalasandrapirvil
Manjunadha Nagar, 1st Main
4th Cross, No.21, Bangalore-500061
Karnataka State

పై నంబరున పిటిషనర్లు మీ మీద పై నంబరు పిటిషన్ పరిహారముల నిమిత్తం పిటిషన్ దాఖలు చేసినందుకు మీకు నోటీసు నిమిత్తం తేది: 10-11-2025కి వాయిదా వేసియున్నారు. వాయిదా రోజు ఉదయం గం॥ 10-30ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: 10-11-2025

కందుకూరు

పిటీషనర్ తరుపు అడ్వకేట్

వై.సాంబశివరావు, యం.కాం., బి.ఎల్.,
కందుకూరు- 523 105, ఓల్డ్ ప్రకాశం జిల్లా
యస్.పి.యస్.ఆర్.నెల్లూరు జిల్లా, ఏ.పి.,

నేడు విచారణపై నిర్ణయం

బెంగళూరు (మాలసూరు), న్యూస్‌టుడే: చిత్రదుర్గకు చెందిన రేణుకా స్వామి హత్య కేసులో నటులు దర్శన్, పవిత్రాగౌడ, ఇతర నిందితులపై ప్రత్యేక దర్యాప్తు దళం దాఖలు చేసిన అభియోగపత్రంపై విచారణ ప్రారంభించాలా లేదా అని 57వ సీసీహెచ్ న్యాయస్థానం నేడు (సోమ) నిర్ణయించనుంది. విచారణ ప్రారంభించాలని నిర్ణయిస్తే తదుపరి తేదీని కూడా న్యాయమూర్తి ప్రకటించనున్నారు. నిందితులు అందరినీ నేడు న్యాయస్థానం ముందు హాజరు పరచనున్నారు. దర్శన్ ఈ కేసు నుంచి బయటపడాలని కోరుకుంటూ ఆయన భార్య విజయలక్ష్మి ఆలయాలను చుట్టి వస్తున్నారు. తాను నమ్ముకున్న దేవుడు తనకు న్యాయం కల్పిస్తాడని ఆమె తన సామాజిక మాధ్యమం ద్వారా ధీమా వ్యక్తం చేశారు.

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

బనశంకరి..శుభంకరీ!

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే: తులసీ పండగను పురస్కరించుకుని బనశంకరి అమ్మవారిని ఆదివారం ప్రత్యేకంగా అలంకరించారు. ఎండు ఫలాలు, పండ్లు, పూల రేకులు, తామరపూలు, తామర గింజలు, కనకాంబరాలు, అరటి పండ్లు తదితరాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. అలంకరణ తీసిన అనంతరం వాటిని భక్తులకు ప్రసాదంగా వితరణ చేస్తామని ఆలయ నిర్వహణ సమితి అధ్యక్షుడు బసవరాజు తెలిపారు.

పచ్చి, ఎండు ఫలాలు, పూల రేకుల అలంకరణలో అమ్మవారు

వేగంగా రైల్వేస్టేషన్ పనులు

రాయచూరు, న్యూస్‌టుడే: స్థానిక రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను ఆదివారం గుంతకల్ రైల్వే అధికారులు జితేంద్ర కుమార్, జగదీష్ పరిశీలించారు. అనంతరం రైల్వే సలహా సమితి ప్రతినిధులు, ప్రయాణికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాయచూరు లోక్‌సభ నియోజకవర్గంలోని రాయచూరు, యాదగిరి స్టేషన్లలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, నాయకులు, ప్రజల సలహాలిస్తే వాటిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. సమితి ప్రతినిధులు మారెప్ప, చంద్రశేఖర్ మాట్లాడుతూ లిఫ్టులు పనిచేయని కారణంగా ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. 10 రోజుల్లో లిఫ్టులను అందుబాటులోకి తెస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కరోనా వేళ నిలిపి వేసిన కలబురగి-గుంతకల్లు ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని, రాయచూరు-కాచిగూడ డెమో రైళ్ల వేళలను ప్రయాణికులకు అనుకూలంగా ఉండేలా మార్చాలని ప్రతినిధులు కోరారు. ఈ విషయాలను గుంతకల్లు విభాగం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాయచూరు స్టేషన్ కమర్షియల్ అధికారి హేమరాజ గౌడ, ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ ప్రగతి మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

రాజ్యోత్సవ ప్రశస్తుల స్వీకరణ

రాయచూరు, న్యూస్‌టుడే : బహుముఖ కళాకారుడు జాఫర్ మొహియుద్దీన్, కళామతల్లి ముద్దుబిడ్డ రత్నమ్మ దేశాయి రాజ్యోత్సవాల పురస్కారాలను స్వీకరించారు. బెంగళూరులోని కన్నడ కంఠీరవ క్రీడా మైదానంలో శనివారం జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేతుల మీదుగా ప్రశస్తులను స్వీకరించారు. జాఫర్ సన్నాయి వాయిద్య కారు.., రత్నమ్మ సిరివార నివాసి. విభిన్న రంగాల్లో ఇతడు చేసిన కృషిని, వృత్తి రంగ భూమిలో ఆమె 50 ఏళ్ల సేవలను గుర్తించి పురస్కారాలకు ఎంపిక చేశారు. వీరి ధ్వని జిల్లా ప్రజా ప్రతినిధులు, కన్నడ సంఘాలు అభినందించాయి. జిల్లా కీర్తిని రాష్ట్ర స్థాయిలో ఇనుమడింప చేశారని కొనియాడారు.

పురస్కారాలు అందుకున్న జాఫర్, రత్నమ్మ

నీటి కుంటలో తల్లీ కుమారుల మృతదేహాలు

కోలారు: కోలారు తాలూకా హొగరి గొల్లహళ్లి గ్రామంలోని నీటి కుంట నుంచి మాలాశ్రీ (27), ఆమె కుమారుడు చక్రవర్తి (5) మృతదేహాలను వెలికితీశారు. నీటి వద్ద చక్రవర్తి ఆడుకుంటూ మునిగిపోతుండడంతో రక్షించే ప్రయత్నంలో మాలాశ్రీ కూడా మరణించిందా లేదా కుమారునితో కలిసి ఆమె ఆత్మహత్య చేసుకుందా అనే విషయాన్ని గుర్తించవలసి ఉందని కోలారు గ్రామీణ ఠాణా పోలీసులు తెలిపారు.

వినిపించని కృష్ణమ్మ గలగలలు

రాయచూరు: నాలుగు మాసాలు (జులై నుంచి అక్టోబరు వరకు) ఉరకలెత్తి పారిన కృష్ణానది శాంతించింది. అన్నదాతలు, తీర ప్రాంత ప్రజలను వణికించిన కృష్ణవేణమ్మ ప్రశాంతంగా మారింది. కొన్ని రోజులుగా నదిలో బండరాళ్లు కన్పిస్తుండటం మందగించిన ప్రవాహ ఉధృతికి నిదర్శనం. అతివృష్టి, ఉపనదుల కారణంగా ఈ ఏడాది విస్తారంగా వానలు కురిసినందునే దసరా తర్వాత కూడా నది నిండుకుండలా ప్రవహించింది. ఆలమట్టి జలాశయం గరిష్ఠ సామర్థ్యం 123.081 టీఎంసీలు చేరుకోడం, నారాయణపుర కుడి, ఎడమ కాల్వలకు వేలలో క్యూసెక్కులు నీటిని విడుదల చేయడం గత కొన్నేళ్లలో ఇదే తొలిసారి. అన్నదాతలకు అవసరాల మించి సాగునీరు సరఫరా చేశారు. కొన్ని రోజులుగా ప్రవాహం సన్నగిల్లడంతో తీర ప్రాంత రైతులు వరి కోతల పనుల్లో నిమగ్నమయ్యారు. కొందరు రెండో సాగు పంటకు సన్నద్ధమవుతున్నారు. రాయచూరు తాలూకా దేవసూగూరుకు సమీపంలోని కృష్ణానది వద్ద నిర్మిస్తున్న నూతన వంతెన పనులు ఇక ఊపందుకోనున్నాయి. ప్రవాహం వల్ల ఇన్నాళ్లు పనులను వేగంగా చేయలేకపోయారు. నదిఒడ్డున ఉన్న నారదగడ్డ, దత్తాత్రేయ దేవస్థానాలకు భక్తుల సందడి పెరగనుంది.

నదిలో తేలిన బండరాళ్లు

5న నిత్యోత్సవ సాంస్కృతిక ప్రదర్శనలు

విలేకరులకు వివరిస్తున్న సిద్ధేశ్

రాయచూరు, న్యూస్‌టుడే : కన్నడ రాజ్యోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 5వ తేదీ సాయంత్రం ఇక్కడి రంగమందిరంలో నిత్యోత్సవ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని రంగ కుసుమ సాంస్కృతిక కళా సంఘం అధ్యక్షుడు సిద్ధేశ్ విరక్తిమఠ తెలిపారు. ఆదివారం పత్రికా భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కామిడీ కిలాడీలుగా పేరొందిన నయనా, రాఘవేంద్ర, హితేష్, సూరజ్ బృందం హాస్య కార్యక్రమం, జూనియర్ కళాకారుల మనోరంజన ప్రదర్శనలు, పాటలు, నాటకం, నృత్యాలు, మిమిక్రీ ఉంటాయని వివరించారు. స్వామీజీలు శాంతమల్ల శివాచార్యులు, గురు శంభులింగ, పలువురు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించినట్లు వివరించారు. ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రతిభ, నైపుణ్యం కోసం పోటీలు

రాయచూరు: బాలలు, యువకుల్లోని ప్రతిభ, నైపుణ్యాలను గుర్తించేందుకు నగరంలోని కన్నడ భవన్‌లో పోటీలను నిర్వహిస్తామని కన్నడ, సాంస్కృతిక శాఖ సహాయక నిర్దేశకురాలు ఉత్తరాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు వరుసగా 8 నుంచి 14 ఏళ్లు, 14 నుంచి 18 ఏళ్లు, 18 నుంచి 30 ఏళ్ల లోపు వారు అర్హులు. ఆసక్తి గలవారు తమ పేర్లను రాయచూరులోని కార్యాలయంలో నవంబరు 5 లోపు నమోదు చేయించాలని ఆమె సూచించారు.

సమాజాభివృద్ధి మఠాల అభిమతం కావాలి

మాన్వి, న్యూస్‌టుడే : మఠాలు ప్రజల్లో ధార్మిక, సమాజిక జాగృతి కల్పించేవిగా ఉండాలని బాళెహొన్నూరు రంభాపురి వీరసింహనాధీశ్వర జగద్గురు డాక్టర్ వీరసోమేశ్వర రాజదేశికేంద్ర శివాచార్య పేర్కొన్నారు. తాలూకాలోని కరేగుడ్డ మహంతేశ్వర మఠంలో ఏర్పాటు చేసిన ధర్మసభను ప్రారంభించి ఆయన మాట్లాడారు. ధర్మం ద్వారానే విశ్వానికి శాంతి సాధ్యమన్నారు. ఇప్పుడు ధర్మం, జాతి మధ్య సంఘర్షణలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ప్రజలు శాంతంగా సంతోషంగా జీవించాలన్నారు. కరేగుడ్డ మఠం మహంలింగ స్వామీజీ మఠం ద్వారా చేస్తున్న ధార్మిక, సమాజి రంగాలకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. దేశవ్యాప్తంగా పంచ పీఠాలున్నాయని రంభాపురి పీఠానికి దేశంలో 12 వేల శాఖలున్నాయన్నారు. వీరశైవ ధర్మం అత్యంత ప్రాచీనమైందన్నారు. తదుపరి దసరా ఉత్సవాన్ని తమ ఆధ్వర్యంలో జమఖండిలో నిర్వహిస్తామని ప్రకటించారు. వేదికపై వివిధ మఠాలకు చెందిన మఠాధిపతులు, స్వామీజీలు, ఎమ్మెల్యే హంపయ్యానాయక్, మాజీ ఎమ్మెల్యేలు బసనగౌడ, రాజా వెంకటప్పనాయక్, ముడా అధ్యక్షుడు గఫూర్, టీఏపీసీఎంఎస్ అధ్యక్షుడు తిమ్మారెడ్డి భోగావతి, యువకాంగ్రెస్ నాయకుడు రవిబోసురాజ్, సంఘ సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న స్వామీజీ, మఠాధిపతులు, నాయకులు

నినాదాలు చేస్తున్న ప్రతినిధులు

ఎయిమ్స్‌తో అసమానతల రూపుమాపు

రాయచూరు, న్యూస్‌టుడే : ప్రాంతీయ అసమానతలను రూపుమాపేందుకు జిల్లాకు ఎయిమ్స్ మంజూరు చేయాలని సాధనా పోరాట సమితి సంచాలకుడు బసవరాజ కళస కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. వైద్య విజ్ఞాన సంస్థను కేటాయించాలని కోరుతూ రాయచూరులో చేపట్టిన నిరవధిక ఉద్యమం ఆదివారానికి 1270 రోజులకు చేరుకుంది. ఆందోళనలో కళస ప్రసంగిస్తూ ఈ ప్రాంతానికి కేటాయించిన ఐఐటీని ధారవాడకు తరలించి అన్యాయం చేసినందున ఎయిమ్స్ స్థాపించాలని కోరుతున్నామన్నారు. ఇక్కడ సంస్థను నెలకొల్పేందుకు అవసరమైన మౌలిక వసతులు ఉన్నాయని వివరించారు. కేంద్రం న్యాయ సమ్మతంగా యోచించి జిల్లాకు మేలు చేసే నిర్ణయాన్ని త్వరగా ప్రకటించాలన్నారు. సమితి ప్రతినిధులు తిమ్మారెడ్డి, హనుమంతప్ప, మారెప్ప, హేమరాజ్, అమరేగౌడ పాటిల్ పాల్గొన్నారు.

ప్రేమ త్యాగం కమ్మవారి మార్గం కావాలి

హుణసగి, (మాన్వి) : తెలుగు ప్రజలు విషయ పరిజ్ఞానాన్ని అవలోకనం చేసుకోవాలని ప్రవచనకారుడు వై.రవిచంద్ పేర్కొన్నారు. ఆదివారం కల్యాణ కర్ణాటక కమ్మవారి సంఘం హుణసగి ఆధ్వర్యంలో మద్దినమని క్యాంపులో నిర్వహించిన కార్తికమాసం వనభోజన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కమ్మ సముదాయం ప్రజలు అన్ని రంగాల్లోనూ ఆరితేరారన్నారు. ఆకలి కడుపులను నింపిన ఎన్‌టీఆర్ ఇప్పటికీ అన్నగారుగా చరిత్ర పుటల్లో నిలిచారని, జలాశయాల కోసం వేల ఎకరాలు విరాళంగా ఇచ్చిన త్యాగశీలులు కమ్మవారన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. సురపుర, కెంబావి, దేవిపుర క్రాస్, సాయినగర్ క్యాంపుల నుంచి తెలుగు ప్రజలు అధికంగా వచ్చి వనభోజనాల్లో పాల్గొన్నారు. వేదికపై మురళీధర్ శాస్త్రి, రవిచంద్‌లను కమ్మవారి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సంఘం అధ్యక్షుడు రాయపాటి వెంకటరావు, కార్యదర్శి వి. సురేష్, ఉపాధ్యక్షుడు టి.సుబ్రహ్మణ్యేశ్వర, కోశాధికారి కె.కేశవరావు, సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రవిచంద్

రోడ్డుపాలైన పురిటిబిడ్డ

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: హొసకోట సమీపంలోని దొడ్డ కెరె వద్ద రహదారిలో పురిటి బిడ్డ మృతదేహాన్ని ఆదివారం ఇక్కడ స్థానిక పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆడ బిడ్డ అనే కారణంతో కొందరు వ్యక్తులు బిడ్డ తెచ్చి రహదారి పక్కన వేసి పరారైనట్లు గుర్తించారు. మృతదేహాన్ని హొసకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

దీపాలతో శోభిల్లుతున్న రామాలయం

కాళ్లకు చక్రాలు.. కదిలొచ్చిన పతకాలు

■ అంతర్జాతీయ స్కేటింగ్‌లో త్రిషా జడాల సత్తా

అంతర్జాతీయ పోటీల్లో సాధించిన పతకాలతో త్రిషా జడాల

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: కర్ణాటక స్కేటింగ్ క్రీడలో ధార్వాడ జిల్లా హుబ్బళ్లి కేశ్వాపురకు చెందిన త్రిషా జడాల అంతర్జాతీయ స్థాయిలో శరవేగంతో దూసుకెళ్తోంది. బోలెడన్ని పతకాలను సాధించి ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ఈ ఏడాది జులై దక్షిణ కొరియాలో జరిగిన ఏషియన్ పోటీల్లో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించిన త్రిషా వెండిపతకాన్ని సొంతం చేసుకొంది. గతేడాది ఇటలీలో జరిగిన ప్రపంచ స్కేట్ గేమ్స్‌లో పాల్గొన్న ఈ అమ్మాయి కాంస్య పతకాన్ని సాధించింది. ఈ సాధనతో ఆమెకు సొంతగడ్డలో బ్రహ్మరథం పట్టారు. తండ్రి ప్రవీణ్‌మూర్తి జడాల, తల్లి సుశీల జడాల ప్రోత్సాహంతో స్పీడ్‌స్కేటింగ్, రోలర్‌హాకీ, రోలర్ డర్బీలలో ప్రఖ్యాతిగాంచిన త్రిషా ఎన్‌సీసీ కేడెట్ సీ ధ్రువీకరణ పత్రం పొందింది. కేఎల్‌ఈ జేజీ కళాశాల విద్యార్థిని అయిన త్రిషా తొమ్మిదేళ్ల వయస్సులోనే స్కేటింగ్ క్రీడకు అంకితమైంది. 13వ ఏట తొలి జాతీయ స్థాయి పోటీలో కర్ణాటక తరపున ప్రాతినిధ్యం వహించడం గమనార్హం. నాలుగు సార్లు జాతీయ పతక విజేతగా నిలిచిన త్రిషా పదేళ్లలో 45 బంగారు, 13 రజత, 5 కాంస్య పతకాలతో సత్తా చాటింది. తొమ్మిది సార్లు జిల్లా ఛాంపియన్‌గా వ్యక్తిగత ప్రశస్తి అందుకోవడం విశేషం. జాతీయ స్థాయి పోటీలో దాదాపు ఏడుసార్లకు పైగా పాల్గొన్న త్రిషా ధార్వాడ జిల్లా తొలి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారిణిగా గుర్తింపు పొందింది. అంతర్జాతీయ యోగా పోటీల సందర్భంలో హుబ్లీ నుంచి ధార్వాడ వరకు స్కేటింగ్ చేసిన ఈ క్రీడాకారిణి కార్వార నుంచి బెంగళూరులోని విధానసౌధ వరకు 610 కిలోమీటర్ల దూరంలో స్కేటింగ్ చేసి రికార్డు సృష్టించింది. రోడ్డు భద్రత, ఆడపిల్లల రక్షణ కోసం నిరంతరం స్కేటింగ్ సైక్లోత్సవంలో పాల్గొంది. కేబినెట్ మంత్రి హాలప్పబసప్ప ఆచార్‌తో ప్రశంలందుకున్న త్రిషా కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి, ఎమ్మెల్యేలు మహేష్‌తెంగినకాయి అరవిందబెల్లాళ్, అభయప్రసాద్, మేయర్ రామప్పబడిగార్ ఇలా అనేక ప్రముఖులతో సన్మానం అందుకొంది. 2024లో కర్ణాటక రాజ్యోత్సవం అవార్డును పొందిన త్రిషా గతేడాది దిల్లీలో కేంద్ర యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ డా.మన్సుక్‌మండవీయతోనూ ప్రశంసలందుకొంది. ప్రస్తుతం శిక్షణలో ఉన్న త్రిషా భవిష్యత్తులో భారత్ పేరును నిలబెట్టే ఆశయంతో సాధన చేస్తోంది.

జాతీయ పతాకంతో త్రిషా జడాల

భక్తిశ్రద్ధలతో కార్తిక మాస పూజలు

మాన్వి, న్యూస్‌టుడే : తాలూకాలో కార్తిక మాస పూజలు ఘనంగా జరుగుతున్నాయి. భాగ్యనగర్ క్యాంపు కోదండరామాలయం వద్ద భక్తులు కార్తిక దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిన్నా పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ కార్తిక దీపాలను వెలిగించారు. దీపాలతో ఆలయం శోభిల్లింది. నీర్‌మాన్వి క్యాంపులో క్షీరాబ్ధి ద్వాదశి పర్వదినం సందర్భంగా క్యాంపు ఆలయంలో తులసీధాత్రి సమేత లక్ష్మీనారాయణ కార్తిక దామోదరస్వామి కల్యాణాన్ని కనుల పండువగా జరిపారు. రాత్రి నిర్వహించిన కార్యక్రమానికి భక్తులు అధికంగా హాజరై పూజలు చేసి దీపాలు వెలిగించారు.

తులసీదామోదర స్వామి కల్యాణం

7 నుంచి ఇండియన్ ఫార్మా ప్రదర్శన

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: దక్షిణాదిలో అతి పెద్ద ఔషధ ఇండియన్ ఫార్మా ప్రదర్శన-2025 ఈనెల 7 నుంచి నగరంలోని రాజప్రస్థానం మైదానంలో ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు ఆదివారం ఇక్కడ పరిశీలించారు. ప్రదర్శనను కర్ణాటక కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ సమాఖ్య అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏకేజీవన్ ప్రారంభిస్తారు. రెండు రోజులపాటు జరిగే ఈ ప్రదర్శనలో దేశంలోని 70కిపైగా ప్రముఖ ఔషధ ఉత్పత్తి కంపెనీలు, విక్రయసంస్థలు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. ఔషధాలు, పౌష్టికాహారం, ఆయుర్వేదం, హెర్బల్ ఉత్పత్తులతో పాటు పశు వైద్య చికిత్స విధానాలు, మందులు, తదితర వస్తువులను ప్రదర్శనలో ఉంచుతామని ప్రదర్శన విభాగం డైరెక్టర్ బి.ఎస్.భండారి తెలిపారు. ప్రజలు, వైద్యులు, వైద్యవిద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగకరమైన ప్రదర్శన అన్నారు.

రాజప్రస్థానం మైదానంలో ముందస్తు ప్రదర్శన ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

తుషార్ కాంతిబెహరాకు జీవన సాఫల్య పురస్కారం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: హెసరుఘట్ట భారతీయ ఉద్యానవనాల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ తుషార్ కాంతి బెహరాకు బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేసింది. ఆదివారం ఇక్కడ జీకేవీకే ఆవరణలో సాగుతున్న విజ్ఞానం, మొక్కల అభివృద్ధి, వాతావరణం అనుగుణంగా పంటల సాగు అనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనకు పురస్కారాన్ని ఉపకులపతి డాక్టర్ ఎస్.వి. సురేష్ అందజేశారు. ఉద్యానవనాల పంటల అభివృద్ధికి డాక్టర్ తుషార్‌కాంతి బెహరా అనేక కార్యక్రమాలను చేపట్టి అభివృద్ధి చేసినందుకు ఈ పురస్కారం ప్రదానం చేశారు.

డాక్టర్ తుషార్ కాంతిబెహరాకు పురస్కారాన్ని అందిస్తున్న ఉపకులపతి డాక్టర్ ఎస్.వి.సురేష్ తదితరులు

సివిల్ కాంట్రాక్టర్ ముసుగులో డ్రగ్స్ దందా!

ఈనాడు, హైదరాబాద్: కర్ణాటక, తెలంగాణాలో మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న అంతరాష్ట్ర నిందితుడు ఎజాజ్ అహ్మద్(28)ను అరెస్ట్ చేసినట్లు ఆదివారం హెచ్‌న్యూ డీసీపీ వై.వి.ఎస్ సుధీంద్ర తెలిపారు. ఇతడి నుంచి 11 గ్రాముల ఎండీఎంఏ, 35 గ్రాముల కొకైన్, 5 గ్రాముల ఓజీ, 15 ఎక్సటసీపిల్స్, రెండు చరవాణులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.12 లక్షల ఉంటుందని అంచనా వేశారు. బిహార్‌కు చెందిన ఎజాజ్ అహ్మద్ కుటుంబం 1998లో కర్ణాటకలోని కార్వార్‌కు చేరింది. అతడి తండ్రి సివిల్ కాంట్రాక్టర్. ఎజాజ్ బీటెక్ మధ్యలో మానేశాడు. కొంతకాలం సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేశాడు. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు డ్రగ్ పెడ్లర్‌గా మారాడు. కర్ణాటకలోని నైజీరియన్లతో ప్రత్యక్ష సంబంధాలు ఏర్పాటు చేసుకొని.. వారి వద్ద పెద్దఎత్తున కొకైన్, హెరాయిన్ కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించడం ప్రారంభించాడు. తక్కువ సమయంలోనే 100 మందికి పైగా కొనుగోలుదారులకు సరఫరా చేసేంతగా ఎదిగాడు. పెద్దఎత్తున సొమ్ము చేతికి అందడంతో విలాస జీవితానికి అలవాటయ్యాడు. బెంగళూరులో ఖరీదైన భవనంలో యువతితో కలసి జీవిస్తున్నాడు. అక్కడి నైజీరియన్లు డ్రగ్స్ సరఫరా చేసేందుకు డెడ్‌డ్రాప్ పద్ధతిని ఉపయోగిస్తారు. ఇతడికి మాత్రం నేరుగా సరుకు ఇచ్చి నగదు తీసుకొని వెళ్లేవారు. హైదరాబాద్‌లోని కొనుగోలుదారులకు కొరియర్, పోర్టర్ ద్వారా చేరవేసేవాడు. ఎక్కువ సరకు అందజేసేందుకు తానే ఇక్కడకు వచ్చి వెళ్తుంటాడు. హెచ్‌న్యూ ఇన్‌స్పెక్టర్ డానియేల్, ఎస్సై వెంకటరాములు, మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ బృందం నిఘా ఉంచింది. నిందితుడు శనివారం నగరానికి వచ్చినట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద డ్రగ్స్ స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడికి డ్రగ్స్ సరఫరా చేస్తున్న నైజీరియన్ కోసం గాలిస్తున్నారు.

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S.No. 2/2024

Between:
కాలువ రాజేష్‌బాబు మరియు ఇతరులు. ..... వాదులు
మరియు
జయమ్ చిన్న సుంకయ్య మరియు ఇతరులు.
..... ప్రతివాదులు

To 1) జయం గోపినాథ్ S/o లేట్ జయం అచ్చయ్య, Door No: 4/16, అంగడి మారెప్ప కాంపౌండ్, రాఘవేంద్ర టాకీసు వెనుక, బళ్ళారి.
2) జయం కృష్ణ S/o లేట్ జయం అచ్చయ్య, Door No: 4/16, అంగడి మారెప్ప కాంపౌండ్, రాఘవేంద్ర టాకీసు వెనుక, బళ్ళారి.

ప్రతివాదులు No.5 మరియు 6 లకు సమన్సు

పై దావాలోని వాదులు దావా స్థిరాస్తిపై తమ హక్కును తీర్మానించమని మరియు ఇతర రిలీఫ్‌ల కోసం మీపైన పై దావాను దాఖలు చేసియున్నారు. పై దావాను కోర్టువారు మీ యొక్క హాజరు కొరకు వాయిదా తేది 10-11-2025న వేసినారు. పై దావా నందు మీకేమైనా అభ్యంతరాలు ఉన్న యెడల పై కోర్టు నందు పై తేదీన ఉదయం 10.30 గంటలకు స్వతహాగా గాని వకీలు ద్వారా గాని హాజరై తెలుపుకొనవచ్చును. లేని యెడల పై దావాను కోర్టువారు మీ పరోక్షములో తీర్మానము చేయుదురు.

జి.లక్ష్మీపతి, అడ్వకేట్, గుంతకల్లు.

శృంగేరికి ఆరు ఏనుగులు

చిక్కమగళూరు, న్యూస్‌టుడే: శృంగేరి తాలూకా కరెకెట్ట గ్రామంలో రైతు సోదరులు హరీశ్, ఉమేశ్‌లపై దాడి చేసిన మదగజాన్ని బంధించేందుకు ఆరు కుమ్కీ ఏనుగులు గ్రామానికి చేరుకున్నాయి. ఏకలవ్య, ధనుంజయ, ప్రశాంత, హర్ష తదితర ఏనుగులతో నేటి (సోమ) నుంచి కూంబింగ్ ప్రారంభించనున్నారు. మృతుల కుటుంబాలకు తన వ్యక్తిగత ఖాతా నుంచి మంత్రి కేజే జార్జ్ తలా రూ. 5 లక్షలు, శృంగేరి ఎమ్మెల్యే టీడీ రాజేగౌడ తలా రూ.లక్ష పరిహారాన్ని ఇప్పించారు. ప్రభుత్వం నుంచి పరిహారాన్ని ఇప్పిస్తామని వారి కుటుంబాలకు మంత్రి భరోసా ఇచ్చారు. గత కొద్ది వారాలుగా కెరెకట్టె గ్రామ పరిధిలో ఒంటరి ఏనుగు తోటలను ధ్వంసం చేస్తూ, కనిపిస్తున్న ప్రజలపై దాడికి ప్రయత్నిస్తూ వస్తోందని జార్జ్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు.

లారీలో వస్తున్న ఏనుగులు

అభివృద్ధి పనుల్లోనూ రాజకీయమా?

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: తిరిగి అధికారాన్ని పొందేందుకే భాజపా నాయకులు అభివృద్ధి పనులకు సంబంధించి రాజకీయాలు చేస్తున్నారని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరోపించారు. సొరంగ మార్గం నిర్మాణంతో వాహన రద్దీ సమస్యకు ఒక పరిష్కారం దక్కుతుందన్నారు. పనుల సమయంలో లాల్‌బాగ్‌లో కొంత భాగాన్ని వినియోగించుకుంటామని చెబుతుంటే, ఇక ఉద్యానమే ఉండదన్నట్లు భాజపా నాయకులు ధర్నాలు, తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. వాహన రద్దీ సమస్యలకు పరిష్కారాన్ని చూపిస్తే పరిశీలించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఆదివారం ఇక్కడ తనను కలుసుకున్న విలేకరులతో మాట్లాడారు. సొరంగ మార్గాన్ని ప్రజలు వ్యతిరేకించడం లేదని గుర్తు చేశారు. భాజపా నాయకుల ప్రశ్నలు అన్నింటికీ ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బదులిచ్చారని తెలిపారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

02-11-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1626.06	1632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	12,738	11,667
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	12,431	11,427
నీటి నిల్వ (టి.ఎం.సి)	80.003	101.773

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

'సంఘ పరివార్‌కు గులాములు'

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: ప్రజా సేవ చేసేందుకు కాకుండా, సంఘ పరివార్‌కు గులాములుగా ఉండేందుకే భాజపా రాజకీయాల్లోకి వచ్చిందని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే ఎద్దేవా చేశారు. కర్ణాటక, జాతీయ భాజపా అధ్యక్షుల నియామకాలను పూర్తి చేసేందుకు ఆర్‌ఎస్‌ఎస్ అనుమతి ఇచ్చేంత వరకు వేచి చూడాల్సిన పరిస్థితిని కమలనాథులు ఎదుర్కొంటున్నారని ఎద్దేవా చేశారు. ఇద్దరి అధికార అవధి పూర్తయినా ఇప్పటి వరకు వారికి సరైన నాయకుడే దొరకలేదా అని ప్రశ్నించారు. ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, ఆర్‌ఎస్‌ఎస్‌కు వ్యతిరేకంగా మాట్లాడితే, తదుపరి ఎన్నికల్లో తమకు టిక్కెట్టు దక్కదన్న భయం ఆ పార్టీ నాయకుల్లో ఉందన్నారు. సంఘ పరివార్ ప్రారంభమై వందేళ్లయినా ఇప్పటి వరకు పేరు ఎందుకు నమోదు చేయించుకోలేదని ప్రశ్నించారు. దేశంలోని ఎక్కువ శాఖ ప్రజలు ఆ సంఘటనను ఆమోదించలేదన్నారు. ఇప్పటి వరకు సంఘ పరివార్ నాయకులు ఏ యుద్ధంలో పాల్గొన్నారు, ఎక్కడ సహాయ కార్యక్రమాలు చేస్తున్నారో కూడా దాఖలాలు విడుదల చేయడంలో విఫలమయ్యారని ఎద్దేవా చేశారు.

ప్రియాంక్ ఖర్గే

మహిమ చూపి.. విశ్వవిజేతలుగా నిలిచి

నగరంలో తెరపై క్రికెట్‌ను ఆసక్తిగా చూస్తున్న జనం

భారత మహిళా క్రికెటర్లు అద్భుతం చేశారు. దక్షిణాఫ్రికాతో ఆదివారం జరిగిన ప్రపంచ కప్ ఫైనల్‌లో సత్తా చాటారు. అన్ని అంశాల్లో ప్రతిభ చాటి విశ్వవిజేతలుగా నిలిచారు. దీంతో జిల్లావ్యాప్తంగా జనం సంబరాలు చేసుకున్నారు. కర్నూలు నగరంలో బాణసంచా కాల్చారు. జాతీయ పతాకాన్ని చేతబూని ప్రదర్శన జరిపారు.

– న్యూస్‌టుడే, కర్నూలు బీక్యాంపు

జాతీయ పతాకాలతో సందడి

ఈ-పంట నమోదు గడువు పొడిగింపు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఈ-పంట నమోదుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. రెండోసారి గడువు పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. పూర్తిస్థాయిలో ఈ-పంట నమోదు చేసేందుకు ఈనెల 12 వరకు గడువు పొడిగించారు. ఈనెల 8వ తేదీ నాటికి పంట నమోదు పూర్తి చేయాలని, 9 నుంచి 12 వరకు రైతు సేవాకేంద్రాల్లో ఈ-పంట నమోదు జాబితాను ప్రదర్శించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. రైతులకు అభ్యంతరాలుంటే రైతు సేవా కేంద్రాల్లో వినతులు తీసుకుని పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. ఖరీఫ్ 2025 ఈ-పంట నమోదు తుది జాబితాను ఈనెల 15న ప్రకటించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారులు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటిపట్టునే కొలువు

● కొనసాగుతున్న కౌశలం సర్వే

డిగ్రీలు, పీజీలు, ఇంజినీరింగ్ చదివిన యువతులు ఉద్యోగాలు చేస్తూ వివాహమైన తర్వాత అత్త వారి ఇంటికి వెళ్తున్నారు. అక్కడ ఉద్యోగం చేసే అవకాశం లేక చాలా మంది ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఇలాంటివారు ఇంటివద్దే ఉద్యోగం చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వారి విద్యార్హతలను గుర్తించేందుకు కౌశలం సర్వే చేపట్టింది. సమగ్ర వివరాలు సేకరించేలా తగిన ఆదేశాలు ఇచ్చింది.

1,20,321 మంది వివరాల సేకరణ

ఉమ్మడి జిల్లాలో వర్క్‌ఫ్రం హోం కింద 2,00,037 మంది వివరాలు సేకరించాలని నిర్ణయించారు. సచివాలయ సిబ్బంది ఆగస్టులో కౌశలం సర్వే చేపట్టారు. మూడు నెలల్లో 1,20,321 మందిని సర్వే చేసి వారి విద్యార్హత ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేశారు. ఇంకా 79,716 మందిని సర్వే చేయాల్సి ఉంది. తాము ఇంటి నుంచే పనిచేస్తామని మరో 48,269 మంది ముందుకొచ్చారు. ఆ వివరాలను సిబ్బంది సేకరించాల్సి ఉంది.



ఎలాంటి ఉద్యోగాలు చూపుతారు

● పది, ఇంటర్, డిగ్రీ, పీజీ తదితర విద్యార్హతలు కలిగిన 18- 50 ఏళ్లలోపు వయస్సువారిని అర్హులుగా గుర్తిస్తారు. పది, ఇంటర్ చదివిన వారికి సంబంధించి ఎలాంటి ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదు. ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ.. ఆపై చదువులు చదివినవారి నుంచి విద్యార్హతల ధ్రువపత్రాలను స్కాన్ చేసి కౌశలం యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు.

● కౌశలం సర్వే పూర్తైన తర్వాత నిరుద్యోగ యువతీ యువకుల నైపుణ్యాలు గుర్తించేందుకు పరీక్ష నిర్వహించనున్నారు. దీని ఆధారంగా ఎంపిక చేస్తారు. వారికి డిజిటల్ మార్కెటింగ్, ఈ-కామర్స్, ఐటీ తదితర రంగాల్లో శిక్షణ ఇస్తారు. ప్రత్యేకంగా వివిధ ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేసి అవగాహన కల్పిస్తారు. అనంతరం ఇంటి నుంచి పనులు చేసేలా అవకాశం కల్పిస్తారు. ఇలా ప్రభుత్వం వారి భవిష్యత్తుకు భరోసా ఇస్తుంది.

అధికారుల పర్యవేక్షణ కరవు..

ఉమ్మడి జిల్లాలో 1,188 సచివాలయాలు ఉన్నాయి. ఒక్కో సచివాలయం పరిధిలో మూడు నెలలకు వంద మందిని మాత్రమే సర్వే చేశారు. అంటే నెలకు 33 మంది వివరాలే సేకరించారు. గ్రామ, వార్డు సచివాలయ అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు దృష్టి సారించకపోవడంతో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో మూడు నెలల్లో సర్వే వివరాలు..

జిల్లా	ఇంటి నుంచి పనికి అంగీకరించినవారు	వివరాలు సేకరించింది	పెండింగ్‌లో ఉన్నవారు
కర్నూలు	1,05,453	55,299	50,154
నంద్యాల	94,584	65,022	29,562

వెంగమ్మ పేణి.. తినాలి మైమరచి

బనగానపల్లి పట్టణంలో వెంగమ్మ పేణీలకు ఓ ప్రత్యేకత ఉంది. ఈ ప్రాంతంలో ఏ శుభ కార్యం జరిగినా నోరూరించేలా పేణీలు ఉండాల్సిందే. దశాబ్దాల కిందట వెంగమ్మ అనే మహిళ పేణీలు తయారుచేసి అమ్మేవారు. అలా ఆమె పేరుతో స్థిరపడిపోయింది. 1974లో ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ బనగానపల్లి మీదుగా వెళ్లే సమయంలో అప్పటి నేతలు పెండేకంటి వెంకటసుబ్బయ్య, బలరామిరెడ్డిలు ఆమెకు వీటిని అందించారు. రుచి చూసిన ఆమె పరవశించిపోయారు. యాగంటి, బెలుం గుహలు తదితర వాటిని సందర్శించేవారితోపాటు ఇతర ప్రాంతాలవారు ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తుంటారు. 1965 నుంచి పేణి అమ్మకాలు సాగుతున్నాయి. కిలోకు 20 వరకు వస్తాయి. – న్యూస్‌టుడే, బనగానపల్లి

చిరుత వేగం.. పతకాల యోగం

ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నరసింహులు పరుగు పందెం పోటీల్లో రాణిస్తున్నారు. ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు ఏకాగ్రతతో నిత్యం సాధన చేసి పతకాలు సాధిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి అందరి మన్ననలు పొందుతున్నారు.

● ఏలూరులో గత నెలలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో 800 మీటర్ల పరుగులో నిమిషంలో గమ్యస్థానాన్ని చేరుకొని బంగారు పతకం అందుకున్నారు. 1,500 మీటర్ల 4×400 రిలేలో ప్రథమ స్థానంలో నిలిచారు. త్వరలో హరియాణాలో జరిగే అథ్లెటిక్స్ పోటీలకు రాష్ట్రం నుంచి అతను ఎంపికవడం విశేషం.

● నరసింహులు ప్రతిరోజూ తెల్లవారుజామున సాధన చేస్తున్నారు. శిక్షకుడు మల్లికార్జున అవసరమైన మెలకువలు నేర్పుతూ అతని భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

నవనందులు.. కార్తిక వెలుగులు

నల్లమల.. కార్తిక శోభతో అలరారుతోంది. మహానంది క్షేత్రంతో పాటు నంద్యాల చుట్టూ నవ నందులు వెలిశాయి. కార్తిక మాసంలో ప్రతి సోమవారం, కార్తిక పౌర్ణమి రోజున భక్తులు సూర్యాస్తమయంలోపు పాదయాత్రగా వెళ్లి నవ నందీశ్వరులను దర్శించడం ఆనవాయితీ. ముందుగా నంద్యాల గుడిపాడిగడ్డలోని భ్రమరాంబాదేవి సమేత మల్లికార్జునస్వామి ఆలయంలోని సాక్షి గణపతిని దర్శించుకుంటారు. అన్ని నందులను దర్శించి తిరిగి గుడిపాడిగడ్డలోని స్వామిని దర్శించుకుంటేనే యాత్ర సఫలమవుతుందని భావిస్తారు.

– న్యూస్‌టుడే, నంద్యాల గాంధీచౌక్, మహానంది

ప్రథమ నంది

నంద్యాల పట్టణంలోని చామకాల్వ గట్టున ప్రథమ నందీశ్వరాలయం ఉంది. గర్భాలయంలో కొలువుదీరిన కేదారేశ్వరలింగం భక్తులకు దర్శనమిస్తుంది. స్వామివారి ఆశీస్సులు అందుకోవడం ద్వారా కేదార్‌నాథ్‌లోని కేదారేశ్వరస్వామిని దర్శించుకున్నంత ఫలం లభిస్తుందని భక్తులు నమ్ముతారు. ఇక్కడే మరోపక్క కేదారేశ్వరీమాత కొలువుదీరి ఉంటారు.

శివనంది (రుద్రనంది)

బండిఆత్మకూరు మండలం కడమలకాల్వ గ్రామాన్ని ఆనుకొని ఉంది. ఈ క్షేత్రాన్ని శివనంది లేదా రుద్ర నందీశ్వరాలయంగా పిలుస్తారు. ఇక్కడి శివలింగం మిగతా క్షేత్రాల్లోని శివలింగాల కంటే ఎత్తుగా ఉంటుంది. నంద్యాల పట్టణానికి 15 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది.

సూర్యనంది

మహానంది-నంద్యాల ప్రధాన రహదారిలోని తమడపల్లె నుంచి దక్షిణం వైపు రెండు కిలోమీటర్ల దూరంలో సూర్యనంది క్షేత్రం ఉంది.

నాగనంది

నంద్యాల ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో నాగనంది ఉంది. కార్తిక మాసంలో విశేష పూజలు జరుగుతాయి.

గరుడనంది

మహానంది క్షేత్రంలోని ఆలయానికి పడమటి దిశలో ప్రధాన రహదారికి వంద గజాల దూరంలో ఉంది. ఈ ఆలయానికి విమాన గోపురాన్ని ఇటీవల కాలంలో నిర్మించారు. ఇక్కడే గోర్లయ్య మఠం ఉంది.

మహానంది

ఈ పుణ్యక్షేత్రంలో పరమశివుడు గోవుపాద రూపంలో వెలిశారు. అందుకే మహానందీశ్వరుడిని గోపాద లింగేశ్వరుడిగా పిలుస్తారు. స్వామివారు ఇక్కడ స్వయంభువుగా వెలిశారు. ఆలయం కిందిభాగం నుంచే జలాలు నిత్యం ప్రవహిస్తూ ఉంటాయి. ఈ నీటితో సుమారు రెండు వేల ఎకరాల భూములు సాగవుతుంటాయి.

సోమనంది

నంద్యాల పట్టణం.. ఆత్మకూరు బస్టాండు సమీపంలో సోమ నందీశ్వరాలయం ఉంది. చంద్రుడు మహేశ్వర లింగాన్ని ప్రతిష్ఠించడంతో ఈ పేరు వచ్చిందని ప్రతీతి.

వినాయకనంది

ఈ క్షేత్రం సైతం మహానందిలోని ఆలయాల్లో అంతర్భాగంగా నిర్మితమైంది. మహానందీశ్వర స్వామివారి ఆలయానికి దక్షిణం వైపున స్వామివారు వినాయక నందీశ్వరుడిగా వెలిశారు. ఇక్కడ పరమశివుడి కోసం వినాయకుడు తపస్సు చేసి ప్రతిష్ఠించడంతోనే వినాయక నందీశ్వరాలయంగా గుర్తింపు పొందింది.

కృష్ణనంది (విష్ణునంది)

ఈ క్షేత్రం నల్లమల అడవిలో.. ప్రకృతి రమణీయతతో అలరారుతోంది. కడమలకాల్వ గ్రామం నుంచి.. అటు మహానంది మండల కేంద్రం తిమ్మాపురం నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

సేవలందే మార్గమిదే

ఉమ్మడి కర్నూలు జిల్లా మీదుగా రెండు జాతీయ రహదారులు వెళ్తున్నాయి. ఎన్‌హెచ్-40 పరిధిలో చాగలమర్రి, నంద్యాల, నన్నూరు శివారు, ఎన్‌హెచ్ 44 పరిధిలో అమకతాడు వద్ద టోల్‌ప్లాజాలున్నాయి. ఆయా మార్గాల్లో ప్రతిరోజూ 30 వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. టోల్ చెల్లిస్తున్న నేపథ్యంలో వాహనదారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. అత్యవసర సేవలు సైతం పొందొచ్చు. ఏదేని ఇబ్బందులు కలిగితే ఎన్‌హెచ్ఏఐ అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు.

1033తో సత్వర సాయం

జాతీయ రహదారులపై వాహనం ఆగిపోయినా.. పెట్రోల్, డీజిల్ అయిపోయినా 1033 నంబరుకు ఫోన్ చేస్తే చాలు.. తక్షణ సాయం అందుతుంది.

బటన్ నొక్కితే చాలు..

జాతీయ రహదారిపై ప్రతి కి.మీ. నుంచి 2 కి.మీ. మధ్యలో రోడ్డు పక్కన స్తంభాలకు ఎస్‌వోఎస్ పెట్టెలుంటాయి. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు లేదా ఇతర అత్యవసర సమయాల్లో తక్షణ సాయం కావాలంటే ఈ పెట్టెపై ఉన్న బటన్ నొక్కి మనం ఉండే ప్రదేశం చెబితే వెంటనే టోల్ సిబ్బంది అక్కడికి చేరుకుని అవసరమైన సాయం అందిస్తారు.

చిత్రం తీయ్.. రివార్డు అందుకో

- రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని టోల్‌ప్లాజాల వద్ద మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్న చిత్రం తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి.
- ఫొటోతోపాటు పంపినవారి పేరు, వాహనం, రిజిస్ట్రేషన్ నంబరు, లొకేషన్ తదితర వివరాలు నమోదు చేయాలి.
- రోజూ వచ్చిన చిత్రాల్లో అర్హత ఉన్న వాటిని ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఎంపిక చేస్తారు.
- ఫిర్యాదుదారుడి వాహన రిజిస్ట్రేషన్ నంబరుకు అనుసంధానమైన ఫాస్టాగ్‌కు రూ.1,000 రీఛార్జి రూపంలో రివార్డు అందిస్తారు.

– న్యూస్‌టుడే, డోన్, నంద్యాల రైతునగరం

గౌరమ్మకు చక్కెర హారతులు

జిల్లాలో పశ్చిమ ప్రాంతమైన ఆదోని డివిజన్ పరిధిలో ప్రజలు గౌరమ్మ పండగను ఘనంగా జరుపుకొంటారు. ఈనెల 5వ తేదీన పండగను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆదోని పట్టణంతోపాటు పలు ప్రాంతాల్లో చక్కెర హారతులు (బొమ్మలు) విక్రయానికి ఉంచారు. ప్రజలు వీటిని కొనుగోలు చేసి గౌరమ్మ వద్దకు తీసుకెళ్లి హారతులు ఇస్తారు. అనంతరం నోములు నోస్తారు.. ఈ చక్కెర హారతులు కిలో రూ.120 నుంచి రూ.140 వరకు పలుకుతోంది.

– న్యూస్‌టుడే, ఆదోని సాంస్కృతికం

కల్యాణ వేదిక.. గుత్తేదారుల వేడుక

కర్నూలు నగరం, బేతంచెర్ల, న్యూస్‌టుడే : ప్రైవేటు కల్యాణ మండపాల అద్దెలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇంటి వద్ద వసతి లేని సామాన్యులు ప్రైవేటు ఫంక్షన్ హాళ్లలో వివాహాలు, శుభకార్యాలు జరిపించడం భారంగా మారింది. ఈ పరిస్థితిని గుర్తించిన ఎన్టీ రామారావు.. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కల్యాణ మండపాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దశాబ్దాల పాటు ప్రజలకు సేవలు అందించిన వీటిని గత వైకాపా ప్రభుత్వం గుత్తేదారులకు ధారాదత్తం చేసింది.

బేతంచెర్లలోని తితిదే కల్యాణ మండపం

లీజు పేరుతో..

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 10 తితిదే కల్యాణ మండపాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో అత్యధిక కల్యాణ మండపాలను లీజుకు ఇచ్చారు. వీటిని దక్కించుకున్న గుత్తేదారులు.. నిర్వాహకుల నుంచి భారీగా సొమ్ము వసూలు చేస్తున్నారే తప్ప వసతులు మాత్రం సమకూర్చడం లేదు.

అడిగినంత ఇవ్వాల్సిందే..

● బేతంచెర్ల సమీపంలో నిర్మించిన తితిదే కల్యాణ మండపం శిథిలావస్థకు చేరుకుంది. నాలుగేళ్ల కిందట దీనిని ఓ వ్యక్తికి లీజుకు ఇచ్చారు. ఒక వివాహానికి రోజుకు రూ.6 వేలతో పాటు సామగ్రి, విద్యుత్తు, లేబర్ ఛార్జీల పేరుతో రూ.30,500 వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

● పత్తికొండ, ఆదోని, నందికొట్కూరు, బండిఆత్మకూరు మండలం పార్నపల్లి (నంద్యాల సమీపంలో), ఎర్రగుంట్ల, కోవెలకుంట్ల, బేతంచెర్లలోని ఫంక్షన్ హాళ్లను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. కర్నూలు, నంద్యాల, ఎమ్మిగనూరులోని కల్యాణ మండపాల్లో చేపట్టిన ఆధునికీకరణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

రూ.15 కోట్లకు వ్యాపారి కుచ్చుటోపీ!

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఎక్కువ వడ్డీ ఆశ చూపి పలువురి వద్ద అప్పులు తీసుకున్నాడు. ఆ సొమ్ముతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశాడు. అనంతరం ఎవరికీ తెలియకుండా తన స్థిరాస్తులను అమ్మేసుకుని వెళ్లిపోయాడు. అతని జాడ కానరాకపోవడంతో జనం ఆందోళన చెందుతున్నారు. సుమారు రూ.15 కోట్లతో ఉడాయించినట్లు బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ ఘటన డోన్ పట్టణంలో చోటుచేసుకుంది. కర్నూలు జిల్లా మద్దికెర మండలానికి చెందిన ఓ వ్యక్తి డోన్‌లో ధాన్యం కొనుగోళ్లతోపాటు స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నాడు. పట్టణ శివారులో ఇళ్లను నిర్మించి పలువురికి విక్రయించాడు. ఇతనికి సొంతింటితోపాటు ఓ దుకాణ సముదాయం ఉంది.

ఆస్తులు అమ్మేసుకుని..: డోన్ పట్టణంతోపాటు సొంతూరులోని పలువురి వద్ద భారీ మొత్తంలో అప్పులు చేశాడు. పనిమనిషి వద్ద రూ.8 లక్షలు, ఓ పూజారి వద్ద రూ.5 లక్షలు తీసుకున్నాడు. అప్పులు ఇచ్చినవారు ఒత్తిడి చేయడంతో ఐదు రోజుల కిందట కుటుంబంతో సహా పరారయ్యాడు. అంతకుముందే తన పొలాలు, స్థిరాస్తులను అమ్మేయడం గమనార్హం. క్రిప్టో కరెన్సీలో భారీగా పెట్టుబడులు పెట్టి నష్టపోయినట్లు సమాచారం. దీనిపై తమకు సమాచారం లేదని.. ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు.

భక్తులు అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కార్తిక మాసంలో దేవాలయాలు, నదుల వద్దకు వెళ్లే భక్తులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఓర్వకల్లు కాల్వబుగ్గ రామేశ్వరాలయం, బ్రహ్మగుండేశ్వరం, ఇతర శివాలయాలకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. నదీ స్నానం చేసే సమయంలో, నీళ్లలో దీపాలు వదిలే సమయాల్లో మహిళలు స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఐక్యతతోనే కురువల అభ్యున్నతి సాధ్యం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఐక్యతతోనే కురువల అభ్యున్నతి సాధ్యమవుతుందని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, హిందూపురం, కర్నూలు ఎంపీలు పార్థసారథి, బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని పెద్దపాడు సమీపంలో ఉన్న బీరప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం కార్తిక వనభోజన మహోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా కురువలు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం, వసతిగృహం కోసం ఎంపీ నిధుల నుంచి రూ.90 లక్షలు ఇస్తానని ఆర్.కృష్ణయ్య హామీ ఇచ్చారు. నగరంలో కురువ సామూహిక భవన నిర్మాణానికి రూ.25 లక్షలు ఇస్తానని హిందూపురం ఎంపీ పార్థసారథి ప్రకటించారు. జాతీయ బీసీ విద్యార్థి సంఘం సమన్వయకర్త డా.ఆర్.అరుణ్‌కుమార్, కురువ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివన్న, జిల్లా కురువ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, రంగస్వామి, ఐఆర్ఎస్ అధికారి యాదగిరి, డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున, కల్లూరు తహసీల్దారు ఆంజనేయులు, అమీలియో ఆసుపత్రి అధినేత డా.ప్రసాద్, శ్రీనివాసులు, శేఖర్, కార్పొరేటర్ సత్యనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య. వేదికపై హిందూపురం, కర్నూలు ఎంపీలు పార్థసారథి, బస్తిపాటి నాగరాజు

మంత్రాలయం.. భక్త జనసంద్రం

మంత్రాలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మఠం అధికారులు చర్యలు చేపట్టారు. మంచాలమ్మ ఆలయం పక్కన ఉన్న కారిడార్‌లో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఏకాదశి సందర్భంగా మఠంలో నిత్య పూజలకు విరామం ఇవ్వడంతో భక్తులు నిజ బృందావనాన్ని దర్శించుకున్నారు. – న్యూస్‌టుడే, మంత్రాలయం

ధర పండుతోంది.. దిగుబడి తగ్గుతోంది

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే : పత్తికొండ మార్కెట్‌లో టమాటా ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. గత రెండు వారాలుగా ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. పండు నాణ్యతను బట్టి కిలో రూ.8కి పైగా.. రూ.20 లోపు పలుకుతోంది. ధరలు బాగానే ఉండటంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు సరకును విపణికి అమ్మకానికి తీసుకొస్తున్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 6 వేల హెక్టార్లలో టమాటా సాగైంది. మొదట్లో కురిసిన వర్షాలకు కొంత మేర పంట దెబ్బతింది. దిగుబడులు బాగా వస్తున్న క్రమంలో ఇటీవల భారీ వర్షాలు కురిశాయి. ఫలితంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో టమాటా పంట దెబ్బతింది. ఆ ప్రభావం దిగుబడులపై పడింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సరకు రావడం తగ్గుముఖం పట్టిందని యార్డు అధికారి వెల్లడించారు.

అక్టోబరు, నవంబరు నెలల్లో మార్కెట్‌కు వచ్చిన సరకు వివరాలు

తేదీ	దిగుబడులు (క్వింటాళ్లలో)	కనిష్ఠం (రూ.లలో)	గరిష్ఠం (రూ.లలో)
27	243	1,200	2,000
28	273	1,000	1,800
30	197	800	1,500
31	144	1,000	1,800
2	181	1,100	1,900

మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

(c) eenadu

మహానంది క్షేత్రం కళకళ

మహానంది, న్యూస్‌టుడే: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం మహానంది ఆదివారం సెలవురోజు, కార్తికమాసం కావడంతో భక్తుల రాకపోకలతో సందడిగా కనిపించింది. క్షేత్రంలోని పవిత్ర రుద్ర గుండం, చిన్నకోనేర్లలో భక్తులు పుణ్యస్నానాలు చేశారు. అనంతరం గంగా కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వరస్వామివార్లను, సీతా కోదండ రామయ్యవారిని, గోవులను దర్శించుకొని అభిషేకాలు, అర్చనల పూజలు చేసుకున్నారు. రెండవ సోమవారం సందర్భంగా భక్తులు సులభంగా దైవదర్శనాలు కల్పించేలా, సత్వరమే సహాయక చర్యలు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందని దేవస్థానం వర్గాలు తెలిపాయి. దేవస్థానంతోపాటు మండపాలు, ఆలయాలు, విద్యుత్తు కాంతుల్లో వెలిగిపోతూ ఆకర్షిస్తున్నాయి.

రాజగోపురం ముందు భజనలు చేస్తున్న భక్తులు

అహోబిలంలో ఏకాదశి పూజలు

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం ఏకాదశి పూజలు నిర్వహించారు. ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవారిని ఆలయ ముఖద్వార మండపంలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించారు. పసుపు, చందనం, కర్పూరం వంటి లేపనాలు సమర్పించి ధూపదీపాలతో మహామంగళహారతి అందించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం విశేష అలంకరణలో స్వామి, అమ్మవారి పల్లకిపై తిరువీధుల్లో ఊరేగారు. ఆలయ ప్రధానార్చకులు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

స్వామి, అమ్మవారిని పూజిస్తున్న అర్చకులు

యాగంటిలో కార్తిక దీపాలు

యాగంటి(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలొచ్చారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి కార్తిక దీపాలు వెలిగించారు. ఆలయంలోని కోనేరు, నంది, గుహలు వద్ద భక్తులు సందడి చేశారు.

ఓంకార క్షేత్రంలో భక్తుల సందడి

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: నల్లమల అభయారణ్యంలో వెలసిన ఓంకార పుణ్యక్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి అధికంగా ఆలయానికి చేరుకున్నారు. పంచభుగ్గ కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి ఓంకార సిద్ధేశ్వరుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి చక్రపాణి శర్మ స్వామి, అమ్మవార్లకు పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తిక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కాశిరెడ్డి నాయన అన్నసత్రం నిర్వాహకులు భోజన వసతి కల్పించారు.

దర్శనానికి వెళ్తున్న భక్తులు

చిన్నారుల బడి.. నైపుణ్యాల జడి

ప్రత్యేక కిట్లతో వినూత్న బోధన

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పిల్లల్లో విద్యా నైపుణ్యాలు, సామాజిక, భావోద్వేగ, అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ 'జాదుయీ పిటారా(మాయా పెట్టె)' కిట్ల కార్యక్రమాన్ని ప్రారంభించింది. పిల్లలు సరదాగా అభ్యసించేందుకు, ప్రోత్సహించేందుకు రూపొందించిన ఒక ఆట ఆధారిత అభ్యాస సామగ్రి ఇది. ఈ పెట్టెలో 62 రకాల వస్తువులు ఉంటాయి. ఎన్సీఈఆర్టీ, రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అందిస్తోంది.

విద్యావిధానం అనుసరించి..

ప్రాథమిక దశలోని పిల్లలకు ఆటల ద్వారా అభ్యసనను అందించడం కార్యక్రమ లక్ష్యం. పజిల్స్, పలు రకాల ఆట వస్తువులు, తోలుబొమ్మలు, పోస్టర్లు, ఫ్లాష్ కార్డులు, కథల పుస్తకాలు, వర్క్ షీట్లు, ప్లేబుక్ తదితరాలు ఉంటాయి. కొత్త జాతీయ విద్యావిధానం ప్రకారం అభ్యాస సామగ్రిని రూపొందించారు.

ప్రాథమిక పాఠశాలలకు మంజూరు

కర్నూలు జిల్లాలో వెయ్యికి పైగా ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 928 ప్రాథమిక పాఠశాలలు ఉండగా.. అందులో బాలురు 19,698 మంది, బాలికలు 22,670 మంది కాగా మొత్తం మీద 42,368 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ఎక్కువ హాజరున్న ప్రాథమిక పాఠశాలలకు విద్యా సాధనాలు అందించింది. నంద్యాల జిల్లాలో 575 ప్రాథమిక పాఠశాలలకు రూ.54.50 లక్షల విలువ చేసే కిట్లు వచ్చినట్లు విద్యాధికారులు పేర్కొన్నారు. వాటిని 29 మండలాల్లోని ప్రాథమిక పాఠశాలలకు జిల్లా డీఈవో జనార్దన్‌రెడ్డి అందజేశారు.

ప్రయోజనం ఇలా..

◆ ఇది పిల్లల్లో జ్ఞాపకశక్తి, భాషాభివృద్ధి, సంఖ్యా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ఉపకరిస్తుంది. అభ్యాస, బోధనా వాతావరణాన్ని సుసంపన్నం చేసేందుకు, విద్యార్థి కేంద్రీకృత, ఆనందదాయకంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేసింది.

◆ పిల్లల ఆసక్తికర అభ్యాసానికి అనుగుణంగా ఉండేలా బొమ్మలు, పజిల్స్ ఉపయోగపడతాయి. కథలు చెప్పడం ద్వారా పిల్లల ఊహాశక్తిని, భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు తోలుబొమ్మలు, కథల పుస్తకాలు దోహదం చేస్తాయి.

◆ ఫ్లాష్‌కార్డులు గుర్తింపునకు, నామకరణం వంటి ప్రాథమిక భావనలను నేర్పించడంలో సాయపడతాయి. పోస్టర్లు, వర్క్ షీట్లు వివిధ అభ్యాస కార్యకలాపాలకు ఉపయోగపడతాయి.

జిల్లా అభివృద్ధిపై సీఎం ప్రత్యేక శ్రద్ధ

ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని సత్కరిస్తున్న కళాక్షేత్ర సభ్యులు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ పెట్టారని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి చెప్పారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో జరుగుతున్న కర్నూలు ఉత్సవ్ కార్యక్రమాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లా కీర్తిని దశదిశలా చాటేందుకు ఎందరో రాజకీయ నేతలు, కళాకారులు, కవులు కృషి చేశారని తెలిపారు. ఉమ్మడి జిల్లా విశిష్టతను తెలిపేలా వారం రోజుల పాటు కర్నూలు ఉత్సవ్‌ను నిర్వహించడం సంతోషకరమన్నారు. కళాకారులకు ఇళ్ల స్థలాలు, పింఛన్లు మంజూరు చేయించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే చరితారెడ్డిని కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సభ్యులు యాగంటీశ్వరయ్య, సంగా ఆంజనేయులు, శ్రీనివాస రెడ్డి, మహ్మద్‌మియ్యా, గాండ్ల లక్ష్మన్న తదితరులు సత్కరించారు.

కళాకారులకు సత్కారం

నాటక రంగానికి సేవలందించిన పత్తికొండ రంగారెడ్డి, హుసేనాపురం మల్లారెడ్డి, ఎం.ఆర్.రాధిక, ఆళ్లగడ్డ సిద్ధయ్య, తుడిచెర్ల సాయిబాబా, చంద్రప్ప, రంగస్థల నటి శారదాంబ, శ్రీనివాసులను ఎమ్మెల్యే సత్కరించి, ప్రశంసాపత్రాలు అందజేశారు.

పొదుపు సంఘాల పనితీరు అద్భుతం

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: ఓర్వకల్లు పొదుపు లక్ష్మి ఐక్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొదుపు సంఘాల పనితీరు అద్భుతమని ఐఏఎస్ అధికారులు దీపేందర్, విపిన్‌వర్మ, కుమార్ ప్రియమ్, పుల్‌కిత్ గులాటి, ఐఎస్ఎస్ అధికారి సుభాంకర్ బిస్వాస్ ప్రశంసించారు. హుసేనాపురం గ్రామంలో ఆదివారం పొదుపు సంఘాల మహిళలతో భారత సివిల్ సర్వీసు అధికారుల బృందం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో పొదుపు సంఘాల ద్వారా ఏర్పాటు చేసుకున్న పలు జీవనోపాధులను పరిశీలించారు. పొదుపు సంఘాల పని తీరు అమోఘమన్నారు. కార్యక్రమంలో పొదుపు మహిళలు పాల్గొన్నారు.

హుసేనాపురంలో పొదుపు మహిళలతో చర్చిస్తున్న సివిల్ సర్వీసు అధికారుల బృందం

పిల్లలను దత్తత తీసుకోవచ్చు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: పుట్టగానే తల్లిదండ్రులను కోల్పోయిన వారు, ఉన్నా ఆదరణకు నోచుకోక పొదల్లో పడేసిన వారు.. ఇలా ఎంతో మంది చిన్నారులు అనాథలుగా మారుతున్నారు. ఇలాంటి వారి కోసం ప్రభుత్వం ప్రత్యేక దత్తత కేంద్రాలు నడుపుతోంది. వీటిలో వసతి పొందుతున్న పిల్లలను చట్టబద్ధంగా దత్తత ఇస్తున్నారు. పిల్లలు లేని తల్లిదండ్రులకు ఇది ఒక వరం. చాలామంది దీనిపై అవగాహన లేక సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఇద్దరిని దత్తతగా తీసుకెళ్లినట్లు అధికారులు తెలిపారు.

◆ నంద్యాల పట్టణం పొన్నాపురం కాలనీలో ప్రత్యేక దత్తత కేంద్రం ఉంది. ఇందులో 0-5 ఏళ్లలోపు చిన్నారులు ముగ్గురు ఉన్నారు.

మీ కోసం

అర్హతలు ఇవి..

◆ దత్తత తీసుకునేవారు శారీరక, మానసికంగా ఆరోగ్యవంతులుగా ఉండి బిడ్డను ఉత్తమంగా తీర్చిదిద్దే ప్రేరణ ఉన్నవారై ఉండాలి.

◆ ఆర్థికంగా బిడ్డను పోషించే స్థితిలో ఉండాలి.

◆ దంపతులిద్దరి అంగీకారం తప్పనిసరి. ◆ ఒంటరిగా నివసించే మగ వ్యక్తికి బాలికను దత్తతకు ఇవ్వరు.

ప్రక్రియ ఇలా..

పిల్లలను దత్తత తీసుకోవాలంటే నంద్యాల పట్టణంలోని ప్రత్యేక దత్తత కేంద్రాన్ని సంప్రదించాలి. లేదా వారి వివరాలను సీఏఆర్ఏ.డబ్ల్యూసీడీ.ఇన్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. 1098 నంబరుకు ఫోన్ కూడా చేయవచ్చు. మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులను సంప్రదించి దత్తత పొందవచ్చు.

◆ పిల్లలను రెండు రకాలుగా దత్తత తీసుకోవచ్చు.

పోస్ట్ కేర్: 6నుంచి 18ఏళ్ల పాటు బాగోగులు చూసుకోవడానికి పిల్లలను ఇస్తారు. అనంతరం సంరక్షకులు వారి తల్లిదండ్రులకు పిల్లలను అప్పజెప్పాలి.

పోస్టర్ అడాప్షన్: ఆరేళ్ల పైబడిన పిల్లలను దత్తత ఇస్తారు. రెండేళ్లపాటు బిడ్డను బాగా చూసుకొని పిల్లలపై ప్రేమ పెరిగితే వారికి పోస్టర్ అడాప్షన్ కింద శాశ్వతంగా దత్తత ఇస్తారు.

◆ పసి పిల్లలను పొదల్లో పడేయడంతో వారి శరీర అవయవాలకు గాయాలవుతున్నాయి. ఇలా జరగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. పిల్లలు అవసరం లేని వారు వారిని వదిలి వెళ్లడానికి పట్టణంలోని ప్రత్యేక దత్తత కేంద్రంలో, ప్రభుత్వ ఆసుపత్రిలో, ప్రైమరీ హెల్త్ సెంటర్లలో ఊయలలు ఏర్పాటు చేశారు.

అధికారులను సంప్రదించవచ్చు

- స్వప్న ప్రియదర్శిని, డీసీపీవో, నంద్యాల

పిల్లలను దత్తతకు తీసుకోవాలంటే మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులను సంప్రదించాలి. పిల్లలు వద్దనుకునేవారి కోసం ప్రత్యేక ఊయలలు ఏర్పాటు చేశాం. వాటిలో పిల్లలను విడిచి పెట్టి వెళ్లాలి.

డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ నేడు

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి తెలిపారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు 89777 16661కు ఫోన్ చేసి సమస్య తెలియజేయవచ్చన్నారు. 91333 31912 నంబరుకు చాట్ ద్వారా కూడా సమస్య తెలుపవచ్చని ఆయన పేర్కొన్నారు.

చేతి కష్టం.. మేతపాలు

ఉల్లి సాగు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. రూ.లక్షలు ఖర్చు చేసి సాగు చేసిన ఉల్లికి మద్దతు ధర లేకపోవడంతో పాటు కోత కోసిన కూలీల ఖర్చులు లేవని రైతులు పశువులకు మేతగా వదిలేస్తున్నారు. గోనెగండ్లలో కౌలు రైతు కురువ సుంకన్న ఐదు ఎకరాల్లో రూ.5లక్షలు ఖర్చు చేసి సాగు చేసిన ఉల్లిని గొర్రెలకు మేతగా వదిలేశారు. ఐదు ఎకరాలకు రూ.2 లక్షల కౌలు, ఎకరానికి రూ.లక్ష చొప్పున ఐదు ఎకరాలకు రూ.5లక్షలు ఖర్చు చేసినట్లు వివరించారు. పెట్టుబడి ఖర్చులు రూ.7 లక్షలతో పాటు కుటుంబ సభ్యులు చేసిన చేతుల కష్టం కూడా నేలపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు కనీస మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని కోరారు. -న్యూస్‌టుడే, గోనెగండ్ల

అడ్డుకట్ట వేయకపోతే.. అపాయమే

హాలహర్వి మండలం చింతకుంట గ్రామ శివారులో దిగువ కాల్వ పారుతోంది. 133/900 కి.మీ. కాల్వకు ఓ వైపు నుంచి నీరు లీకవుతూ.. కింది భాగంలోని వాగులో కలుస్తోంది. రాతి కట్టడం నుంచి నీరు వృథాగా వెళ్తుండటంతో భవిష్యత్తులో మరింత ప్రమాదం సంభవిస్తుందని స్థానిక రైతులు వాపోతున్నారు. కొన్ని నెలలుగా లీకేజీ ఉందని కాల్వ సిబ్బందికి, అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొన్నారు. ఇప్పటికైనా టీబీ బోర్డు అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే చర్యలు చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, హాలహర్వి

కానిస్టేబుల్ కొట్టాడని యువకుడి ఆత్మహత్యాయత్నం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : పోలీసు కానిస్టేబుల్ కొట్టారన్న మనస్తాపంతో తెలంగాణ రాష్ట్రం మానవపాడు మండలం కొరివిపాడుకు చెందిన యువకుడు కోటేశ్వరరావు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన వివాదాస్పదంగా మారింది. కర్నూలు నగరానికి చెందిన పదో తరగతి చదువుతున్న ఓ బాలిక అక్టోబరు 28వ తేదీన అదృశ్యమైంది. తల్లిదండ్రులు పలుచోట్ల వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. తమ కుమార్తెను రామ్‌నాయక్ అనే యువకుడు ప్రేమించాడని, అతనిపై అనుమానం ఉందంటూ వారు 29వ తేదీన కర్నూలు నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. నగరంలో మెకానిక్‌గా పనిచేస్తున్న కోటేశ్వరరావు రామ్‌నాయక్ స్నేహితుడని తెలిసింది. దీంతో రెండు రోజుల కిందట ఆ యువకుడిని పోలీసుస్టేషన్‌కు పిలిపించి విచారించారు. ఆ సమయంలో ఓ కానిస్టేబుల్ అతన్ని కొట్టినట్లు బాధితుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీంతో మనస్తాపం చెందిన కోటేశ్వరరావు శనివారం సాయంత్రం కర్నూలు శివారులోని రిలయన్స్ గోదాము వెనుక క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గుర్తించి 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోటేశ్వరరావు పరిస్థితిపై అతని కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆసుపత్రిలో కోటేశ్వరరావు

ఎట్టకేలకు ఎంపీడీవోలకు పోస్టింగ్స్

కర్నూలు జడ్పీ, న్యూస్‌టుడే : పదోన్నతి పొందిన ఎంపీడీవోలకు స్థానాలు కేటాయిస్తూ ఎట్టకేలకు ఆదివారం నియామక ఉత్తర్వులు విడుదలయ్యాయి. రెండు నెలల కిందట ఏవోలకు ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పించి నంద్యాల జిల్లాకు కేటాయిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారు. జడ్పీ పాలకవర్గం వారికి పోస్టింగులు ఇవ్వలేదు. రెండు నెలల నుంచి ఎదురు చూస్తున్న ముగ్గురు ఎంపీడీవోలతోపాటు మరో ఇద్దరికి తాజాగా మండలాలు కేటాయిస్తూ సీఈవో నాసరరెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. దస్తగిరిబాబును కొలిమిగుండ్ల ఎంపీడీవోగా నియమించారు. నాగరాజు-బనగానపల్లి, రామకృష్ణవేణి-అవుకు, ఎస్ఎం బాషా కోసిగి, నాగఅనసూయను ఓర్వకల్లు ఎంపీడీవోగా నియమించారు.

నేడు పోలీసు విచారణకు హాజరవనున్న శ్యామల

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : బస్సు ప్రమాదంపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేశారన్న కేసులో నిందితురాలైన సినిమా నటి, వైకాపా మహిళా అధికార ప్రతినిధి ఆరె శ్యామల సోమవారం కర్నూలులో విచారణకు హాజరుకానున్నారు. బస్సు ప్రమాద దుర్ఘటనపై అవాస్తవాలతో దుష్ప్రచారం చేశారన్న ఆరోపణలపై కర్నూలు పోలీసుస్టేషన్‌లో 27మందిపై కేసు నమోదు చేశారు. వారిలో శ్యామల ఏ3 నిందితురాలు. మూడు రోజుల్లో విచారణకు హాజరుకావాలని హైదరాబాద్‌లో ఉంటున్న ఆమెకు నోటీసులు జారీ చేశారు. ఈమేరకు ఆమె సోమవారం కర్నూలు మండలం బి.తాండ్రపాడులోని కర్నూలు తాలూకా పోలీసుస్టేషన్‌లో విచారణకు హాజరుకానున్నారు. కర్నూలు డీఎస్పీ బాబూప్రసాద్ ఆమెను విచారించనున్నట్లు తెలిసింది.

జిల్లా బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా బాలబాలికల కబడ్డీ జట్టును ఎన్నుకున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం తెలిపారు. పాణ్యంలోని విజయానికేతన్ పాఠశాలలో ఆదివారం నంద్యాల జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక పోటీలను పాఠశాల కరస్పాండెంట్ విజయ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. జిల్లా నుంచి 250 మంది పాల్గొనగా బాలికలు 18, బాలురు 18 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన బాలికలకు పాణ్యం విజయానికేతన్ పాఠశాలలో, బాలుర జట్టుకు కొలిమిగుండ్ల మండలం చింతలాయపల్లెలో ఈ నెల 6వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు మంత్రాలయంలో అంతర్‌జిల్లాల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు. అసోసియేషన్ సభ్యులు రామేశ్వర రెడ్డి, సురేష్‌నాయుడు, రమణ, హరికృష్ణ, మనోహర్, కళాశాల ప్రిన్సిపల్ మురళీధర్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

7న ఎన్‌హెచ్‌ఏఐ ఛైర్మన్ రాక

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ సంతోష్‌కుమార్‌యాదవ్, కమిటీ సభ్యులు ఈనెల 7వ తేదీన కర్నూలుకు రానున్నారు. అక్టోబరు 24వ తేదీన 19 మంది సజీవ దహనమైన ప్రమాద స్థలాన్ని వారు పరిశీలించనున్నారు. ప్రమాద ఘటనపై విచారణ చేపట్టనున్నారు. పోలీసు, రవాణాశాఖ ఉన్నతాధికారులతో చర్చించి వివరాలు సేకరిస్తారు.

అన్నదమ్ములు.. ఆటల్లో అదుర్స్!

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: పిల్లలను కేవలం చదువుకు మాత్రమే పరిమితం చేయకుండా వారికి ఇష్టమైన ఇతర రంగాల్లోనూ ప్రోత్సహిస్తే చక్కటి గుర్తింపు తెచ్చుకొని ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు వేస్తారు. ఇదే మార్గంలోనే ఆ విద్యార్థుల తల్లిదండ్రులు ముందుకు సాగుతున్నారు. తమ ఇద్దరి కుమారులను చదువుతోపాటు వారికి ఇష్టమైన తైక్వాండో, యంగ్ మూడో ఆటల్లో ప్రోత్సహిస్తున్నారు.

అంతర్జాతీయ స్థాయి పతకాలే లక్ష్యంగా..

కోవెలకుంట్లలోని యూనియన్ బ్యాంకులో సహాయ మేనేజర్‌గా పనిచేస్తున్న సోమశేఖర్ రెడ్డి, సురేఖ దంపతులకు హర్షిత్‌రెడ్డి, హేమచంద్రారెడ్డి సంతానం. స్థానిక ప్రైవేటు పాఠశాలలో హర్షిత్‌రెడ్డి నాలుగు, హేమచంద్రారెడ్డి ఐదో తరగతి చదువుతున్నారు. తల్లిదండ్రులు వీరిని చదువుతోపాటు ఇతర రంగాల్లో ప్రోత్సహిస్తున్నారు. ఒకవైపు చక్కగా చదువుకుంటూ ఆటల్లోనూ సత్తాచాటి వివిధ స్థాయుల్లో ప్రతిభను ప్రదర్శించి విజయాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఆడి పతకాలు సాధించాలని లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు ఈ అన్నదమ్ములు.

హేమచంద్రారెడ్డి సాధించిన విజయాలు

◆ 2021లో కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి తైక్వాండోలో స్వర్ణ పతకం సాధించాడు.

◆ 2022లో విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచాడు.

◆ 2023లో ఆదోనిలో జరిగిన రాష్ట్రస్థాయి యంగ్‌మూడోలో బంగారు పతకం కైవసం చేసుకున్నాడు.

హర్షిత్‌రెడ్డిని వరించిన పతకాలు

◆ 2024 నవంబర్‌లో కోవెలకుంట్లలో జరిగిన రాష్ట్రస్థాయి యంగ్‌మూడో పోటీల్లో బంగారు పతకం సాధించాడు.

◆ 2024 డిసెంబర్‌లో ముంబయిలో జరిగిన జాతీయస్థాయి యంగ్‌మూడోలో ద్వితీయ స్థానంలో నిలిచాడు.

◆ 2025 జనవరిలో తిరుపతిలో జరిగిన అంతరాష్ట్ర యంగ్‌మూడో పోటీల్లో స్వర్ణ పతకం పొందాడు.

మనస్తాపంతో రైతు ఆత్మహత్య

ఇందిరేశ్వరం(ఆత్మకూరు పట్టణం), న్యూస్‌టుడే: మండలంలోని ఇందిరేశ్వరం గ్రామానికి చెందిన రైతు శంకరయ్య(60) మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. శంకరయ్య గ్రామంలో తనకున్న నాలుగెకరాల పొలంలో వరి సాగు చేస్తున్నారు. మొంథా తుపాను కారణంగా పంట నేలకొరిగింది. రూ.లక్షలు పెట్టుబడి పెట్టానని.. అప్పులపాలవుతాననే దిగులు చెందేవాడన్నారు. ఈ క్రమంలో ఈ నెల 1వ తేదీన పురుగుల మందు తాగగా.. కుటుంబ సభ్యులు ఆయన్ను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. మృతుడి కుమారుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ రాము వెల్లడించారు.

అన్నదాత బలవన్మరణం

అవుకు, న్యూస్‌టుడే: అప్పుల బాధతో ఉరేసుకొని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన కొండమనాయునిపల్లెలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కె.వెంకటన్న(60) వ్యవసాయం, మేకల పెంపకం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సుమారు రూ.3 లక్షల వరకు అప్పులు చేశారు. అప్పులను తీర్చే మార్గం లేక గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకున్నారు. స్థానికులు గమనించి అవుకు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

నదిలో మునిగి యువకుడి మృతి

తుంగభద్ర(మంత్రాలయం), న్యూస్‌టుడే: తుంగభద్ర నదిలో స్నానానికి వెళ్లిన వీరేంద్ర గౌడు(25) నీటిలో మునిగి మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. మాధవరం ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. తుంగభద్ర గ్రామానికి చెందిన అమరేష్ గౌడు, లక్ష్మీ ఈశ్వరమ్మల మూడో కుమారుడు వీరేంద్ర గౌడు ఆదివారం తుంగభద్రలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి నదిలో పడిపోయాడు. పశువుల కాపరులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నదిలో వెతకగా, రాంపురం గ్రామ శివారులో మృతదేహం లభించింది. తండ్రి అమరేశ్ గౌడు కొంతకాలం క్రితం మృతి చెందారు. వీరికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. తల్లి లక్ష్మీ ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వీరేంద్ర గౌడు (పాత చిత్రం)

అనుమానాస్పదంగా వ్యక్తి..

వెలుగోడు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడిని వెలుగోడు పట్టణానికి చెదిన బట్టు కిరణ్ (38)గా గుర్తించారు. కిరణ్ ఈ నెల 1వ తేదీ రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించామని మృతుని సోదరుడు చెన్నయ్య తెలిపారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS

రవికిరణ్ ఎంటర్ ప్రైజెస్ పెన్నార్ మినరల్ వాటర్ బాటిల్స్ 1 లీటరు, Half లీటరు బాటిల్స్ జిల్లా వ్యాప్తంగా పంపిణి చేయుటకు డిస్ట్రిబ్యూటర్స్, డీలర్స్ కావలెను. సంప్ర: 94915 90112.

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

MARRIAGE SERVICES

మనోజ్ఞ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. మా ప్రత్యేకత రెడ్డి కులాల వారికి పెళ్లి సంబంధాలు చూడబడును. ఆసక్తి గల వారు సంప్ర: 94900 04404.

JOBS

వాంటెడ్ సిస్టర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్, డ్యూటీ డాక్టర్స్, ఫార్మసిస్ట్, హాస్పిటల్ మేనేజర్, రిసెప్షనిస్టు కావలెను. శ్రీ గాయత్రి హాస్పిటల్స్, కొత్తబస్టాండు దగ్గర, కర్నూలు. ✆ 08518-256664.

FACULTY/ TEACHERS

Wanted Science & Computer Science Teachers with B.Ed. Qualification for well known Upper Primary School. English Fluency is Must. ✆ 83095 95455, 96662 84139. Kurnool.

SECURITY GUARDS

ఉలిందకొండలోని హోటల్ నందు పనిచేయుటకు అనుభవం గల సెక్యూరిటీ గార్డులు కావలెను. 12 గం॥ డ్యూటీ, 16,500/- జీతం, వయస్సు 25-50. సంప్ర: 91829 64173.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటన కర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ఆదోని
ఆదోని • ఆలూరు • పత్తికొండ

ఆదోని జిల్లా సాధనకు పోరాటం

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని జిల్లా సాధన కోసం త్వరలో ఆదోని బంద్‌కు పిలుపునిస్తున్నట్లు జిల్లా సాధన సమితి నాయకులు తెలిపారు. స్థానిక జిల్లా సాధన సమితి కార్యాలయంలో ఆదివారం కన్వీనర్ నూర్‌అహ్మద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడారు. జిల్లా సాధన పోరాటంలో అందరూ కలిసిరావాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద మసీదు ఖతీబ్ సాబ్ జునైద్‌హష్మీ, ప్రజా, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు షకీల్, సద్దాంహుస్సేన్, హఫీజ్, పరమేశ్, శాంతకుమార్, తిరుమలేశ్, ఉదయ్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

డబ్బిస్తేనే.. దస్త్రం కదులుతుంది

☛ పురపాలక సిబ్బంది తీరుపై ఫిర్యాదు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని మున్సిపల్ కార్యాలయంలోని ఓ విభాగంలోని సిబ్బంది ఒకరు తనకు రావాల్సిన బిల్లు చెల్లించేందుకు లంచం అడుగుతున్నారని ఆదోని తెదేపా నాయకుడు బుద్ధారెడ్డి ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథికి ఫిర్యాదు చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారింది. శనివారం ఆదోని మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రజావేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యే వెళ్తున్న సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. డబ్బులిస్తేనే తన బిల్లు చేస్తానని చెబుతున్నారని, దీనిపై అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తానని బుద్ధారెడ్డి పురపాలక కమిషనరుతో పేర్కొన్నారు.

వసతులు కల్పించి.. సమస్యలు పరిష్కరిస్తాం

■ ప్రాధాన్య క్రమంలో పనులు ■ 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో 40వ వార్డులో పర్యటించిన పురపాలక ఛైర్‌పర్సన్ లోకేశ్వరి

?: ఇంటి నెంబరు 137 వద్దనుంచి తాగునీరు సరిగా రావడం లేదు. లైన్‌మెన్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇబ్బందులు పడుతున్నాం. – ఖుద్దూస్

✔: పట్టణంలో ప్రణాళిక బద్ధంగా తాగునీరు సరఫరా చేస్తున్నాం. నీటి సరఫరా విభాగం సిబ్బందిని పంపించి, సమస్య పరిష్కరిస్తాం.

?: నిజాముద్దీన్ కాలనీ ఇంటి సంఖ్య ముందు 6-745-9-1 నీటి లీకేజీ మరమ్మతుల కోసం రహదారి తవ్వారు. గుంత అసంపూర్తిగా వదిలేయడంతో, ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానికులమంతా కలిసి మట్టితో చదును చేశాం. నేటికీ ప్రమాదాలు జరుగుతున్నాయి. దానిపై సీసీ పనులు చేపట్టాలి. – ఈరమ్మ, ఆదోని

?: జాజీగడ్డ మీద కొత్తగా కుళాయి పైప్ లైన్ నిర్మించాలి. నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. నీళ్ల కోసం పనులు మానుకోవాల్సి వస్తోంది. – మాబున్ని

✔: నీటి సరఫరా విభాగం సిబ్బందికి సూచించి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే తమ ధ్యేయమని పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ లోకేశ్వరి అన్నారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో వార్డు కౌన్సిలర్ పయాజ్‌అహ్మద్‌తో పాటు ఆదివారం 40వ వార్డులో ఆమె పర్యటించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, కాలనీపెద్దలు రైల్వే ఖాదర్, సాంబ, రామాంజి, పీర, హైమద్, భాజపా నాయకుడు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

?: నిజాముద్దీన్ కాలనీలో సామూహిక మరుగుదొడ్డి ఉండేది. అది కూలిపోయి ఏడాది దాటింది. ఇంతవరకు కొత్తది నిర్మించలేదు. రూ. 15 లక్షలతో కొత్త నిర్మాణానికి టెండరు పూర్తయినా పనులు జరగడం లేదు. మహిళలు బహిరంగ ప్రదేశాలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. – శంకరమ్మ, లక్ష్మి, మీనాక్షి, మంగమ్మ

✔: కొన్ని సాంకేతిక పరమైన సమస్యలతో పనులు నిలిచిపోయాయి. అధికారులకు సూచించి, నిర్మాణ పనులపై దృష్టిసారిస్తాం.

?: నాకు గతంలో వృద్ధాప్య పింఛను వచ్చేది. ఆధార్‌లో వయసు తక్కువగా ఉందని తొలగించారు. నాకు 60ఏళ్లు దాటాయి. ఓ కాలు కూడా సరిగా పనిచేయడం లేదు. – బుడాన్‌సాబ్

?: నాకు వృద్ధాప్య పింఛను రావడం లేదు. జీవనం భారంగా మారింది. పింఛను వస్తే.. ఇబ్బందులు తొలగుతాయి. – నూర్జహాన్, కమేలా ప్రాంతం

✔: పింఛను చెల్లింపుల్లో లోపాలపై విచారణ సాగుతోంది. ఇందులో భాగంగా అర్హులకు న్యాయం జరిగేలా చూస్తాం.

?: ఎన్టీఆర్ నగరలో మురుగుతో ఇబ్బందులు పడుతున్నాం. దోమలు వేయాలి. – నాగరత్న

?: నిజాముద్దీన్ కాలనీలో ఒక్క వైపు మురుగు కాలువ వేశారు. మరో వైపు వదిలేశారు. దీని వల్ల వర్షం నీరు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. మురుగు నీరు వెళ్లేలా కొత్తగా కాలువ నిర్మించాలి. – మహబూబ్

?: మా ఇంటి సంఖ్య 106, ఇంటి వెనుక భాగంలో మురుగు కాలువ అస్తవ్యస్తంగా ఉంది. అర్ధంగా నిర్మాణం చేపట్టారు. విష పురుగులు ఇళ్లల్లోకి వస్తున్నాయి. – చిన్నలక్ష్మి

✔: పారిశుద్ధ్య విభాగం సిబ్బందితో క్షేత్రస్థాయిలో పరిస్థితి తెలుసుకొని, సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం.

?: నిజాముద్దీన్ కాలనీలో ఇంటి నెంబరు 113 ప్రాంతంలో మురుగు కాల్వ అస్తవ్యస్తంగా ఉంది. దీని వల్ల మురుగు సమస్యలతో రోగాలు వ్యాపిస్తున్నాయి. కొత్తగా కాల్వల నిర్మాణం చేపట్టాలి. – పద్మ

?: వెంకటేశ్వర కాలనీలో రూ.పది లక్షలతో కొత్తగా మురుగు కాల్వల నిర్మాణానికి టెండర్లు పూర్తయినా.. ఇంతవరకు పనులు ప్రారంభించలేదు. వర్షం వస్తే మురుగంతా ఇళ్ల వైపు వచ్చి అపరిశుభ్రంగా మారుతోంది. – సరోజ, ఆదోని

✔: అధికారులతో చర్చించి, పనులు చేపడతాం.

అభివృద్ధి పనులు చేపడతాం

- లోకేశ్వరి, పురపాలక ఛైర్‌పర్సన్, ఆదోని

వార్డులో నెలకొన్న సమస్యలన్నింటికీ పరిష్కారం చూపుతాం. ప్రాధాన్య క్రమంలో పనులు చేపడతాం. రూ.15 లక్షలతో కొత్తగా సామూహిక మరుగుదొడ్డి, వెంకటేశ్వరకాలనీలో రూ.10 లక్షలతో సీసీ రహదారి, నిజాముద్దీన్ కాలనీలో రూ.11 లక్షలతో మురుగు కాల్వల నిర్మాణాలకు టెండర్లు పూర్తయ్యాయి. చేపట్టని వాటిపై సమీక్షించి, పూర్తయ్యేలా చొరవ చూపుతాం.

సమస్యలు తెలుసుకుంటున్న ఛైర్‌పర్సన్ లోకేశ్వరి

?: ఎన్టీఆర్ నగర్‌లో 52-47 విద్యుత్తు స్తంభం పూర్తిగా దెబ్బతింది. గాలులకు వేలాడుతోంది. ఎప్పుడు ఎవరి మీద పడుతుందో అర్థం కావడం లేదు. – ఉరుకుందమ్మ

✔: విద్యుత్తు విభాగం సిబ్బందికి సూచించి, కొత్తది ఏర్పాటు చేసేలా చూస్తాం.

విద్యారంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: నానాటికీ కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల ప్రభావం పెరిగిపోతున్న తరుణంలో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉపాధ్యాయులపై ఉందని ఎస్టీయూ రాష్ట్ర నాయకులు షణ్ముర్తి, తిమ్మన్న పేర్కొన్నారు. పత్తికొండలో ఆదివారం ఎస్టీయూ నూతన కమిటీ ఎన్నిక సమావేశానికి వారు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. ఎస్టీయూ సంఘంలో యువ నాయకత్వం మరింత బాధ్యాతయుతంగా పనిచేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.సత్యానారాయణ, కె.నారాయణ, చంద్రశేఖర్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఎస్టీయూ సీనియర్ నాయకులు నాగేంద్రప్ప పరిశీలకుడిగా వ్యవహరించిన ఈ ఎన్నికల్లో మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ఆవుల నాగరాజు, మారుతి, ఆర్థిక కార్యదర్శిగా మండ్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా నాగార్జున, శేషగిరి, కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శులుగా తిరుమలేశ్, కిరణ్‌కుమార్, శేఖర్, జగదీశ్, వెంకటేశ్ నాయక్, మహిళా కమిటీ కన్వీనర్‌గా సరస్వతమ్మ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో ఎన్నికల పరిశీలకుడు నాగేంద్రప్ప ప్రతిజ్ఞ చేయించారు.

ప్రమాదంపై కూర్చొని ప్రయాణం

ఆదోని పట్టణ శివారులో ఓ ద్విచక్ర వాహనదారుడు ప్రమాదంపై కూర్చొని ప్రయాణం సాగించారు. మార్కెట్ యార్డు వైపు వాహనాన్ని వేగంగా తీసుకెళ్లారు. వీరిని చూసిన జనం నోరెళ్లబెట్టారు. ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలతో ఇద్దరి ప్రాణాలకూ ముప్పేనని, ఎదుటి వారిని సైతం ఇబ్బందుల్లో పడేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సర్కస్ ఫీట్లు చేయడం సరికాదని పలువురు అభిప్రాయపడ్డారు. – న్యూస్‌టుడే, ఆదోని పాతపట్టణం

నీటి పొదుపు.. పొలాలు తడుపు

భూగర్భ జలాలు పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు చేపడుతున్నాయి. హాలహర్వి మండల కేంద్రంలో వాటర్ షెడ్ పథకం అమలు చేస్తున్నారు. వాగుల్లో చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టారు. హాలహర్వి నడుమ వంకలో ఎనిమిది చెక్‌డ్యాంలు నిర్మించడంతో ఎక్కడికక్కడే నీటి నిల్వలు చేరాయి. దీంతో కొంత మంది రైతులు పంట పొలాలకు మళ్లించుకున్నారు. ప్రస్తుతం వివిధ అవసరాలకు, మందు పిచికారీ చేసేందుకు అన్నదాతలకు ఉపయోగపడుతున్నాయి. భూగర్భ జలాలు పెరిగే అవకాశం మెండుగా ఉంది. – న్యూస్‌టుడే, హాలహర్వి

తెల్లబంగారం నల్లబారకుండా

రైతులు పత్తి దిగుబడిని కాపాడుకొనేందుకు చాలా ఇబ్బంది పడుతున్నారు. మొంథా తుపాను ప్రభావంతో తడిసిన పత్తి నల్లగా రకుండా మారకుండా పంట పొలాలు, ఖాళీ మైదానాల్లో ఆరబోసి, మంచి ధరకు విక్రయించాలని నానా అవస్థలు పడుతున్నారు. ఆదివారం ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో టార్పలిన్ పట్టలు కప్పి పత్తిని కాపాడుకుంటున్నారు.

– న్యూస్‌టుడే, హొళగుంద

స్పందనకు వందనం

మారిన రూపురేఖలు

దేవనకొండ, న్యూస్‌టుడే: దేవనకొండ బస్టాండు సమీపంలోని కాలనీలో బురదమయంగా ఉండటంతో సమస్యపై 31వ తేదీన 'ఈనాడు'లో ప్రచురితమైన 'మూడు దశబ్దాలు.. మారని తీరు' అనే చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. ఆదివారం పొక్లెయిన్‌తో మట్టిని చదును చేశారు. రూ.5 లక్షలతో సీసీ రహదారి పనులు చేపట్టనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

పొక్లెయిన్‌తో మట్టిని చదును చేస్తూ..

హమ్మయ్యా.. గుంత పూడ్చారు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని ప్రశాంతినగర్ ప్రధాన రహదారిపై తవ్విన గుంత ప్రమాదకరంగా ఉందని.. గత వారం 'ఈనాడు'లో ప్రచురితమైన 'దారి అంచున పొంచి ఉన్న ప్రమాదం' అనే చిత్ర కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన సంబంధిత శాఖ అధికారులు సిబ్బందిని పంపి గుంతన పూడ్చివేశారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఆదోని ప్రశాంతినగర్‌లో పూడ్చేసిన గుంత

సంక్షిప్త సమాచారం

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మొంథా తుపాను, కాశీబుగ్గ ఘటనల వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే కూటమి ప్రభుత్వం మాజీ మంత్రి జోగి రమేశ్‌ను అరెస్టు చేసిందని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి విమర్శించారు. ఆలూరులోని రోడ్డు భవనాల అతిథి గృహంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆలూరు ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న వేదవతి, నగరడోణ ప్రాజెక్టులను పూర్తిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అంజిబాబు డిమాండ్ చేశారు. ఆలూరులోని జ్యోతిబసు భవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరుతూ.. ఈ నెల 9, 10వ తేదీలలో ఆలూరు నుంచి ఆదోని వరకు పాదయాత్రగా వెళ్లి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపడతామన్నారు.

మద్దికెర, న్యూస్‌టుడే: పీఎంఏవై పథకం కింద గృహాలు నిర్మించుకునేందుకు వెయ్యి దరఖాస్తులు అందాయని ఆ శాఖ ఏఈ ఉమాకాంత్ తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఇల్లు లేని నిరుపేదలు ఈ నెల ఐదో తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

నర్సాపురం(వెల్దుర్తి), న్యూస్‌టుడే: నర్సాపురం గ్రామంలోని అంజనేయస్వామి ఆలయంలో బాలిక రేవతి(8)కి ప్రమాదవశాత్తు దీపంతో నిప్పు అంటుకుంది. కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాలిక అక్టోబరు 27న గ్రామంలోని ఆలయానికి వెళ్లింది. గుడిలో ఉన్న దీపం ప్రమాదవశాత్తు బట్టలకు అంటుకోవడంతో మంటలు వ్యాపించి గాయపడింది. చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది.

అన్నదమ్ములపై కేసు

పెండేకల్లు(తుగ్గలి), న్యూస్‌టుడే: పెండేకల్లు గ్రామంలో ఇంటి గోడ నిర్మాణం విషయమై అన్నదమ్ములు వెంకటేశ్వర్లు, చిన్న రంగన్న పరస్పర దాడులకు పాల్పడినట్లు తుగ్గలి ఎస్సై బాల నరసింహులు ఆదివారం తెలిపారు. దాడిలో ఇద్దరు సోదరులు గాయపడటం, పరస్పరం ఫిర్యాదుల మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మట్కాబీటరు అరెస్టు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని కొత్త బస్టాండు సమీపంలో మట్కా నిర్వహిస్తున్న బీటరు బోగేశ్‌ను ఆదివారం అరెస్టు చేసినట్లు రెండో పట్టణ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. అతని నుంచి రూ. 2,100, మట్కా చీటీలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

చిత్రాలు గీసి.. బహుమతులు గెలిచి

☛ ఈనాడు- ఈటీవీ ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే వివిధ పోటీల్లో పాల్గొని, ఉజ్వల భవిష్యత్తుకు సోపానాలుగా మార్చుకోవాలని పత్తికొండ యశోద గార్డెన్ స్కూల్ ప్రిన్సిపల్ అతిర కృష్ణన్ అన్నారు. ఈనాడు- ఈటీవీ ఆధ్వర్యంలో పాఠశాలలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మీకు నచ్చిన పండగలు అనే అంశంపై రంగుల చిత్రాలు గీశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థినులు రక్షిత, పూజిత, హారికలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ కె.నారాయణ, పాఠశాల ఏజీఎం సురేశ్, ఆర్ఐ రంగారెడ్డి, డీన్ సుధాకర్, ఉపాధ్యాయ బృందం వెంకటరాముడు, సుదర్శన్ రెడ్డి, రాముడు, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రాలు గీస్తున్న విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ అతిర కృష్ణన్ తదితరులు

ఆలూరు ప్రజల దాహం తీర్చేందుకు చర్యలు

ఆలూరు, న్యూస్‌టుడే: ఆలూరు పట్టణంలో తాగు నీటి సమస్యకు పరిష్కారం చూపాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ ఆదేశించారు. కలెక్టరు ఆదేశాలతో ఆలూరు గ్రామీణ నీటి సరఫరా విభాగం కార్యాలయంలో ఆదివారం ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు, నీటి సరఫరా సిబ్బందితో వారు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ.. హాలహర్వి మండలం బాపురం నుంచి నీటి సరఫరా సక్రమంగా కొనసాగుతున్నా.. పట్టణంలోని అన్ని వీధులకు అందడం ఆలస్యమవుతోందన్నారు. కొంతమంది పెద్ద పెద్ద సంపులు నిర్మించుకోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాంటి వారికి తాఖీదులు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఐదు రోజులకోసారి సరఫరా జరిగేలా చూడాలన్నారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా అరికట్టాల్సిన బాధ్యత సిబ్బందేనని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, డీఈ మల్లికార్జునయ్య, ఏఈ రాంనీల, డిప్యూటీ ఎంపీడీవో హారూన్ రషీద్, పంచాయతీ కార్యదర్శి జిలాన్ బాషా, గుత్తేదారుడు రవికుమర్‌రెడ్డి పాల్గొన్నారు.

అధికారులు, నీటి సిబ్బందితో సమావేశమైన ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, డీపీవో

గెలుపు క్షణం.. ఆనంద వీక్షణం

ఆదోని క్రీడలు, పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: భారత - దక్షిణాఫ్రికా మహిళా క్రికెట్ జట్ల మధ్య ఆదివారం జరిగిన ప్రపంచ కప్ మహిళా క్రికెట్ తుది పోరును ఆదివారం ఆదోని కస్తూర్బా బాలికల పాఠశాల విద్యార్థినులు టీవీల్లో వీక్షించారు. కూటమి ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడంతో పాటు భారత మహిళా క్రికెట్ జట్టుకు మద్దతు తెలుపుతూ.. ఈ సౌకర్యం కల్పించిందని తెదేపా బాధ్యుడు మీనాక్షినాయుడు తెలిపారు.

● పత్తికొండ పట్టణంలోని తేరుబజారులో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు చొరవతో ప్రత్యేకంగా డిజిటల్ తెర ఏర్పాటు చేసి, క్రీడాభిమానులు క్రికెట్ వీక్షించారు. భారత్ గెలుపుతో ఆనందం వ్యక్తం చేశారు.

ఆదోని పట్టణంలోని కస్తూర్బా బాలికల మైనార్టీ పాఠశాలలో క్రికెట్ వీక్షిస్తూ..

పత్తికొండ తేరుబజారులో పట్టణ వాసుల ఆసక్తి

ఆరేళ్ల చిన్నారికి డెంగీ

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తిలోని రాణితోట వీధిలో నివాసముంటున్న ఆరేళ్ల చిన్నారి మానసకు డెంగీ జ్వరం సోకింది. తల్లిదండ్రులు చిన్నారిని కర్నూలులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. దోమల వల్ల ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్నాయని కాలనీవాసులు పేర్కొంటున్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పొలాల్లో తోడేలు పాద ముద్రలు

ఆస్పరి, న్యూస్‌టుడే: ఆస్పరి గ్రామ పొలాల్లో చిరుత సంచరిస్తుందన్న సమాచారంపై ఆదివారం అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. అటవీ శాఖ రేంజ్ అధికారిణి తేజశ్వి, ఆలూరు సెక్షన్ అధికారి శ్రీనివాసులు, బీటు అధికారులు బాలకృష్ణ, మధుమోహన్ ఆస్పరి గ్రామంలోని పొలాల్లో పర్యటించారు. పొలంలో తోడేలు పాదముద్రల్లా ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.

మిత్రుడికి ఆర్థిక చేయూత

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న తమ స్నేహితుడికి 2000-2001 బ్యాచ్ మిత్ర బృందం అండగా నిలిచింది. ఆరోగ్య ఖర్చులకు రూ.24 వేల ఆర్థిక సాయాన్ని ఆ కుటుంబానికి అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఆలూరు మండలం అగ్రహారం గ్రామానికి చెందిన తమ స్నేహితుడు వన్నూరుస్వామి గత మూడేళ్ల నుంచి పేగు క్యాన్సర్‌తో బాధపడుతున్నారన్నారు. అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

కుటుంబ సభ్యులకు నగదును అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

తల్లడిల్లిన ఉల్లి రైతులు

■ వీడని వర్షాలు.. వెంటాడిన నష్టాలు ■ రెండో పంటా ప్రశ్నార్థకమే

నెల రోజులుగా పొలంలోనే..

మద్దికెరలో ఓ రైతు నెల రోజుల కిందట పంట కోత చేపట్టినా.. ధర లేక, అధిక వర్షాలకు జడిసి పొలంలోనే వదిలేశారు. సగం మంది రైతులది ఇదే పరిస్థితి. కొందరు ఉల్లి పంటను దున్నేసి అందులో శనగ, ఇతర పంటలు సాగు చేశారు. ఆ పంటలు కూడా అరకొరగానే మొలకెత్తాయని వారు ఆవేదన చెందుతున్నారు.

ధరలేక దుక్కిదున్ని..

హొళగుంద, న్యూస్‌టుడే: మండల పరిధిలోని హెబ్బటం గ్రామానికి చెందిన బేగారి మల్లికార్జున తనకున్న రెండున్నర ఎకరాల్లో ఉల్లి సాగుచేశారు. సుమారు రూ.2 లక్షల పెట్టుబడి పెట్టారు. ధర లేకపోవడంతో ఆదివారం దుక్కిదున్ని తొలగించారు.

పత్తికొండ, మద్దికెర, న్యూస్‌టుడే: ధరల పతనం ఓ వైపు, అధిక వర్షాలు మరో వైపు ఉల్లి రైతులను నిలువునా ముంచాయి. సాగు చేసిన పంట చేతి కందినా.. అమ్ముకోలేక, నిల్వ చేయలేక పొలాల్లోనే వదిలేసిన దయనీయ పరిస్థితి అన్నదాతది. రేయింబవళ్లు కష్టపడి పండించిన పంట చేతికందినా.. కోత కోయలేని పరిస్థితి, కోసినా మార్కెట్‌కు తరలించలేకపోయారు. ఇలా పలు కారణాలతో ఈ సారి ఉల్లి రైతు నట్టేట మునిగాడు. సెప్టెంబరు వరకు ధరల పతనం వెంటాడగా, అక్టోబరు నుంచి తుపాన్లు నీటిపాలు చేశాయి. ఎంతో మంది రైతులు పొలాన్ని దున్నేసి అందులో శనగ సాగు చేశారు. అయినా ఫలితం లేదు. రెండో సారి పెట్టిన పెట్టుబడి కూడా భూమిలో కలిసిపోయిందంటూ వారు నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు.

మద్దికెరలో ఉల్లి పంటను దున్నేసి.. సాగుచేసిన శనగ

ఎకరా ఉల్లి సాగు కోసం రూ.60 వేల నుంచి రూ.80వేల ఖర్చవుతోంది. మార్కెట్లో వాటిని కొనే వారు లేరు. రోజుల తరబడి పొలాల్లోనే ఉండటంతో కుళ్లిపోయిన వాటిని తొలగించి, గ్రేడింగ్ చేస్తూ కుంగిపోతున్నారు.

రవాణా ఖర్చు కూడా దక్కక

పత్తికొండ సబ్ డివిజన్‌లో 23,692 ఎకరాల్లో ఈ ఏడాది ఉల్లి పంట సాగు చేశారు. మద్దికెరలో 3,080 ఎకరాలు, తుగ్గలి 2,171, పత్తికొండ 9,279 ఎకరాలు, వెల్దుర్తి 2,041, కృష్ణగిరి 2,654, దేవనకొండలో 4,459 ఎకరాల్లో సాగు చేశారు. ఈ సారి పంట చేతికందిన సమయం నుంచి ధరలు పూర్తిగా పతనమయ్యాయి. గతంలో ఎన్నడూ లేనంతగా పడిపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. ఉల్లికి కేంద్రంగా ఉన్న తాడేపల్లి గూడెంలో క్వింటా రూ.800లోపే ధర పలుకుతోంది. అక్కడికి వెళ్లేందుకు అయ్యే రవాణా ఖర్చు కూడా దక్కడడం లేదు. అధిక శాతం మంది రైతులు తమ పంట ఉత్పత్తులను పొలాల్లోనే వదిలేస్తున్నారు. కొందరైతే రబీలో మరో పంటైనా సాగు చేసుకోవచ్చనే ఆశతో కోత కోయకుండానే దున్నేస్తున్నారు.

కాశీబుగ్గ మృతులకు కొవ్వొత్తులతో నివాళి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో మృతిచెందిన భక్తులకు సంతాపం తెలుపుతూ పత్తికొండలో వైకాపా ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీరంగడు, నాయకులు నారాయణదాసు, సోమశేఖర్, గాంధీరెడ్డి, టీఎండీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ తొక్కిసలాట మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని వైకాపా నాయకులు డిమాండు చేశారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ కోట్ల కూడలిలో ఆదివారం రాత్రి వైకాపా నాయకులు కొవ్వొత్తులు వెలిగించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు దేవ, నాయకులు బాబు, ఇర్ఫాన్, చంద్రశేఖర్, తాయన్న, లక్ష్మణ, షాషావలి, రంగస్వామి, సురేష్ పాల్గొన్నారు.

వైకుంఠ సమారాధన

మంచికి మానవత్వానికి మారుపేరుగా నిలిచి అందరి మన్ననలు పొంది కుటుంబశ్రేయస్సుకు ఎంతో శ్రమించిన మా అమ్మగారైన కీ॥శే॥ శ్రీమతి కె.రత్నమ్మ గారి మరణం మాకు తీరని లోటు... వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ...

జననం: 01/01/1966 మరణం: 26/10/2025

కీ॥శే॥ శ్రీమతి కె.రత్నమ్మ గారు, ఆదోని
W/o. కె.నరసింగప్ప Retd.Supv, AGMC, Adoni

కుటుంబసభ్యులు మరియు బంధుమిత్రులు

గమనిక: వైకుంఠ సమారాధన తేదీ: 3/11/2025 సోమవారం సా॥ 7.00 గం॥లకు మా స్వగృహం కార్వన్ పేట, ఆదోని నందు కార్యక్రమం జరుగును. సెల్: 96420 25448, 98851 42431.

(c) eenadu

బీవీ మోహన్‌రెడ్డి ఆశయాలను నెరవేర్చుదాం

ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి, దివంగత బీవీ మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ నడుం బిగిద్దామని తెదేపా పట్టణ అధ్యక్షుడు మహేష్ అన్నారు. బీవీ జయంతి సందర్భంగా ఆదివారం

బీవీ మోహన్‌రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించిన తెదేపా నాయకులు

తెదేపా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మహేష్ మాట్లాడుతూ.. ఎమ్మిగనూరులో సీసీ రోడ్లు, తాగునీటి పథకం, బస్టాండు నిర్మాణం, ప్రతి గ్రామానికి ప్రధాన రహదారులు అభివృద్ధి చేసిన ఘనత బీవీకే దక్కిందన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు దామా నరసింహులు, రంగన్న, అంజి, సుందరరాజు, ఉమామహేశ్వర్, వహిద్ పాల్గొన్నారు.

◆ గోనెగండ్ల మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు బి.వి.మోహన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రహ్మతుల్లా, బజారి, రామాంజనేయులు, మురళీనాయుడు, రంగముని పాల్గొన్నారు. నందవరంలో బీవీ మోహన్ రెడ్డి చిత్రపటానికి తెదేపా మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ పుష్పవతి, మండల కన్వీనర్ కాశీంవలి పూలమాల వేసి నివాళులర్పించారు.

సూర్యఘర్ పథకంతో విద్యుత్తు ఆదా

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్తు ఏఈ ప్రసన్నాంజనేయ కోరారు. ఎమ్మిగనూరు పట్టణంలో ఆదివారం కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఏఈ మాట్లాడుతూ విద్యుత్తు వినియోగదారులు సోలార్ ప్యానల్ అమర్చుకుంటే విద్యుత్తు బిల్లుల భారం పూర్తిగా తగ్గుతుందన్నారు. గృహ వినియోగదారుల కోసం ప్రభుత్వం రాయితీ కింద ఇస్తున్నారు.

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.5,929

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.5,929 మధ్యస్థ ధర రూ.5,800 కనిష్ఠ ధర రూ.3,090లకు వ్యాపారులు కొన్నారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ.5,930 మధ్యస్థ ధర రూ.5,924 కనిష్ఠ ధర రూ.4,769 పలికింది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఎమ్మిగనూరు గ్రామీణం 80085 73794 కోసిగి 9550434095

గూడూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: ?: పట్టణంలో ఎమ్మిగనూరుకు వెళ్లే రహదారిలో కాల్వల నుంచి మురుగు తీసి.. దుర్వాసనతో తరలించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. -రవి, సానికుడు

?: పట్టణంలోని తూర్పు బీసీ కాలనీలో కాల్వల్లో మురుగు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోంది. -మల్లికార్జున, స్థానికుడు

✔: కాలనీకి వెంటనే పారిశుద్ధ్య కార్మికులను పంపి మురుగును తరలించేలా చర్యలు తీసుకుంటాం. -రాఘవేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: ఎస్సీ కాలనీలో పార్కు లేక ఇబ్బందులు పడుతున్నాం. కొత్త పార్కు నిర్మించండి. -జాన్, కాలనీవాసి

✔: కాలనీలో కొత్త పార్కు కోసం ప్రతిపాదనలు పెట్టాం. -గంగిరెడ్డి, పురపాలక కమిషనర్

?: లక్ష్మణ్ టాకీస్ వెనుక భాగంలో ఉన్న సాయిగణేష్ కాలనీలో రోడ్లపై నీరు నిలిచింది. సమస్య పరిష్కరించండి. - హరినాథ్, కాలనీవాసి

✔: కాలనీలో కొత్త రహదారులకు ప్రతిపాదనలు తయారు చేస్తాం. -నిరంజ, డీఈ

?: పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో చెత్త కుండి నిండిపోయి రోడ్డుపై పడుతోంది. రహదారిపై చేరిన చెత్తను తొలగించండి. -రంగన్న, కాలనీవాసి

✔: చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. -శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

నందవరం, న్యూస్‌టుడే: ?: మండల పరిధిలోని గురజాల గ్రామ ఎస్సీ కాలనీలో వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. అధికారులు స్పందించి గ్రామంలో వీధి దీపాలు వెలిగేలా చూడాలి. -రాజేశ్, గురజాల (గ్రామస్థుడు)

✔: ఎస్సీ కాలనీలో వెంటనే వీధి దీపాలు వెలిగేలా చూస్తాం. - నాగేంద్ర, ఏఈ, నందవరం

కోడుమూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: ?: పట్టణంలోని కర్నూలు, బళ్లారి ప్రధాన దారిలో వాహనాలు వేగంగా దూసుకెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి దాటలేక ఇబ్బందులు పడుతున్నాం. వేగ నిరోధకాలు, సూచికలు ఏర్పాటు చేయాలి. -నాగేశ్వరరావు, కోడుమూరు

✔: సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. వేగ నిరోధకాలు అవసరమైతే త్వరలో చర్యలు తీసుకుంటాం. -రవిచంద్ర, డీఈఈ, ఆర్‌అండ్‌బీ.

సి.బెళగల్, న్యూస్‌టుడే: ?: సి.బెళగల్ గ్రామంలో వినాయక డిగ్రీ కళాశాల సమీపాన కాలనీవాసులకు మౌలిక సదుపాయాలు కల్పించండి. -సి.సంజీవన్న, కాలనీవాసి

✔: కోడుమూరు పంచాయతీ రాజ్ శాఖ డీఈతో క్రెన్న దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతాం. -వెంకటప్రకాష్, మండల ఏఈ

?: సి.బెళగల్: గ్రామంలో కస్తూర్బా పాఠశాలకు పీజీపై ఆర్‌అండ్‌బీ మట్టి దారిని బీటీ రహదారిగా మార్చండి. -రాజ్, పలుకుదొడ్డి

✔: సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతాం. -రాణెమ్మ, ఎంపీడీవో

గుక్కెడు నీళ్లు కరవు

☛ పలు కాలనీల్లో తాగునీటికి ఇబ్బందులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: తాగునీటి కోసం కాలనీ ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. పైపులైన్లలో నీరు రాకపోవడంతో కాలనీ ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. అరకొరగా విడుదల చేసే నీటికి కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలు సైతం అధికారులకు తెలిపేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ప్రధానంగా తాగునీటి పైపులైన్లకు నీరు ఎక్కకపోవడంతో కాలనీవాసులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మిగనూరు పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యపై ప్రత్యేక కథనం.

ప్రజలకు తీవ్ర నీటి ఎద్దడి

ఎమ్మిగనూరు పట్టణంలో ప్రతి రోజూ తాగునీరు సరఫరా చేస్తున్నారు. నల్లబె ఎక్కనాలి తాగునీటి పైపులైన్లతో కొన్ని కాలనీలకు తాగునీటి సమస్య తీవ్రమవుతోంది. నీటి సమస్య తీర్చేందుకు గతంలో తాగునీటి పథకం మంజూరు చేయగా పనులు చేపట్టకుండా వదిలేశారు. దీంతో పట్టణ ప్రజలు తాగునీటి కోసం నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఎత్తుగా ఉన్న ప్రాంతాల్లో కుళాయిలకు సరఫరా కావడం లేదు. ఇంటికి మూడు బిందెల నీరు తాగడానికి కోసం పట్టుకొని, బోరు నీటిని తెచ్చుకుంటున్నారు. దాదాపు మూడు వందల కుళాయిలకు సరిగా నీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజూ ఆయా కాలనీవాసులు ఇతర ప్రాంతాలకు సైకిళ్లు, ఇతర వాహనాలపై వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి అని కాలనీ ప్రజలు వాపోతున్నారు.

నీళ్లు రాక ఇబ్బందిపడుతున్న ముంతాజ్

జనాభా: 1.35లక్షలు, గృహాలు : 24,042
ఇంటి కుళాయిలు: 14950
వీధి కుళాయిలు : 990
నీటి విడుదల చేసేది: 10.60 ఎంఎల్‌డీ
తాగునీటి పైపులైన్లు : 186 కిలోమీటర్లు
నీటి పన్ను నెలకు: రూ.120
ఏడాదికి నీటి పన్ను వసూళ్లు: రూ.2.69కోట్లు
సమస్యలున్న ప్రాంతాలు: వెంకటాపురం, ఎల్లమ్మవీధి, సోమప్పనగర్, కొత్త ఎన్నికల కాలనీ, అబ్బాసినగర్, రాఘవేంద్రనగర్, ముగతిపేట ఐదులైన్లు, మల్లారెడ్డి ఒక లైన్, శాంతినగర్ రెండు లైన్లు, మునెప్ప నగర్, రాధాకృష్ణకాలనీ, కొండమీద ప్రాంతంతో పాటు ఇతర కాలనీల్లో దాదాపు 300లకు పైగానే కుళాయిలకు నీరు సరఫరా కావడం లేదు.

మూడు బిందెల నీరే వస్తోంది

-శారద, ముగతిపేట ఐదోలైన్, ఎమ్మిగనూరు

తాగునీటి కోసం మూడు బిందెల నీళ్లు వస్తున్నాయి. రోజూ నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. విద్యుత్తు సరఫరా ఉన్నప్పుడు కొందరు మోటార్లతో తోడుకోవడంతో నీళ్లు రావడం లేదు. ఇతర అవసరాలకు బోరు నీళ్లు తెచ్చుకుంటున్నాం.

చర్యలు తీసుకుంటాం

- గంగిరెడ్డి, పురపాలక కమిషనర్, ఎమ్మిగనూరు

పట్టణ ప్రజలకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటాం. కొన్ని ప్రాంతాల్లో కుళాయిలు రాని చోట నేరుగా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నాం. త్వరలో కొత్త పైపులైన్లు ఏర్పాటు చేసి నీటి సమస్య తీరుస్తాం.

ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు | స్తంభంపై దీపం వెలిగిస్తున్న అర్చకులు

ఉరుకుందలో కార్తిక శోభ

కౌతాళం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద శ్రీ నరసింహ ఈరన్న స్వామి ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా భక్తుల రద్దీ పెరిగింది. స్వామివారిని దర్శించుకోవడానికి ఆదివారం రాత్రి ఉరుకుందకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలోనే రాత్రి బస చేసి సోమవారం తెల్లవారుజామున స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు. ఆదివారం రాత్రి భక్తులు ఆలయ వద్ద దీపాలు వెలిగించారు. ఆలయంలోని స్తంభంపై అర్చకులు దీపం వెలిగించారు.

భక్తులకు నిజ బృందావన దర్శనం

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఏకాదశి సందర్భంగా శ్రీమఠంలో నిత్య పూజలకు విరామం ఇవ్వడంతో, నిజ బృందావన రూపంలో భక్తులకు రాఘవేంద్రస్వామి దర్శనం ఇచ్చారు. ఆదివారం శ్రీమఠంలో నిత్య పూజలకు విరామం ఇచ్చారు. నిర్మాల్యం మాత్రమే చేసి కాషాయ వస్త్రాలు, తులసి మాలతో బృందావనాన్ని అలంకరించి హారతి ఇచ్చారు.

ఘనంగా సూర్య, సరస్వతి హోమం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: విశ్వశాంతి మహాయాగ హోమానికి ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పట్టణంలో వీవర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలు హోమాలు, పూజలు జరిపారు. ఉదయం సూర్య, సరస్వతి హోమాల్లో వివిధ గ్రామాల నుంచి వచ్చిన దంపతులు కూర్చొని పూజలు జరిపారు. రాత్రి వర సిద్ధి వినాయక కల్యాణోత్సవాన్ని స్వామిజీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డితో పాటు వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన బ్రాహ్మణులు హోమాలు జరిపారు. కమిటీ సభ్యులు పదివేల మంది భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ ఛైర్మన్ మల్లయ్య, తెదేపా నాయకులు శేఖర్, మాచాని శివశంకర్, మహేష్, బుడిగ నాగరాజు, మహేంద్రబాబు పాల్గొన్నారు.

హోమం నిర్వహిస్తున్న బ్రాహ్మణులు, ఎమ్మెల్యే బీవీ

భక్తిశ్రద్ధలతో కైశిక ద్వాదశి వేడుకలు

కోడుమూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: భక్తిశ్రద్ధలతో మంగళ కైశిక ద్వాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వర్కూరు ఎస్సీ వీధిలోని శ్రీరామాలయంలో ఆదివారం తితిదే హిందూ ధర్మ ప్రచార మండలి ఆధ్వర్యంలో మూల విరాట్‌కు అభిషేకం చేశారు. మండలి సభ్యులు ఎద్దుల మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాజపా నాయకులు సురేంద్ర, మహేష్‌నాయుడు, వీహెచ్‌పీ కిరణ్, నటరాజ్, తాయప్ప, పక్కీరప్ప, చిన్నబాలు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న సభ్యులు మహేశ్వరరెడ్డి

కంకర తేలి.. కష్టాల దారి

20 ఏళ్ల క్రితం వేసిన సీసీ రహదారి కంకర రాళ్లు తేలి కాలనీ ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో ముగతిపేట ఐదోలైన్‌లో సిమెంట్ దారిని 2002లో నిర్మించారు. వేసిన సిమెంట్ దారి కంకర రాళ్లు తేలాయి. కాలనీలో దాదాపు వెయ్యి కుటుంబాలు రహదారిలో నడవాలంటే నరకం కనిపిస్తోంది. రోజు కాలనీ ప్రజలు రహదారిలో నడవలేక వెనుక దారి నుంచి వెళ్లాల్సిన పరిస్థితి. రహదారి నిర్మించాలని గతంలో ఎమ్మెల్యేలకు సమస్యలు విన్నవించినా స్పందించిన దాఖలాలు లేవని కాలనీ ప్రజలు వాపోయారు. కూటమి సర్కార్ స్పందించి రహదారి నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

దారంతా పాచి.. దోమలతో సావాసం

గోనెగండ్లలోని చదువుల రామయ్య కాలనీలోని వీధిలో రోడ్డు దుస్థితి ఇది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీరు పారే దారిలేక ఇలా నిలిచిపోయి పాచిపట్టింది. దీంతో ఆ వీధిలో అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. నీటి నిల్వతో దోమల బెడద, భరించరాని దుర్వాసన ఎక్కువైందని రోగాల బారినపడుతున్నామని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. మురుగు నీటిలో రాళ్లు వేసుకొని అవస్థలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్కా రహదారి నిర్మించాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, గోనెగండ్ల

నిర్మించి.. నిరుపయోగంగా మారి

మండలంలోని చనుగొండ్ల గ్రామంలో రూ.లక్షల వ్యయంతో రైతుసేవా కేంద్రం-2 నిర్మాణం చేపట్టారు. తూతూ మంత్రంగా భవన నిర్మాణ పనులు పూర్తి చేశారు. కానీ భవనానికి అవసరమైన విద్యుత్తు, తదితర పనులు పూర్తికాక పోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో భవనం చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. ఇది అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, చనుగొండ్ల(గూడూరు గ్రామీణం)

కల్వర్టు కుంగి.. ప్రమాదకరంగా మారి

మండలంలోని ఆర్.ఖానాపురం గ్రామం నుంచి రేమటకు వెళ్లే రహదారిలో కల్వర్టు దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. దీంతో ఆ దారిలో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో అటుగా వెళ్లే వ్యక్తులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, ఆర్.ఖానాపురం(గూడూరు గ్రామీణం)

సంక్షిప్త సమాచారం

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నగర పంచాయతీలోని సంజీవయ్య నగర్ కాలనీలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో సోమవారం స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం సాయంత్రం పట్టణంలో పల్లకి సేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నాగరాజు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరై వినతులను పరిష్కరించాలన్నారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీమణికంఠ అయ్యప్పస్వామి ఆలయానికి కర్నూలుకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి రూ. 10,016లు విరాళంగా అందజేశారు.

సి.బెళగల్, న్యూస్‌టుడే: సి.బెళగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారి మిథున్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గర్భిణులకు ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సీహెచ్‌సీ ఉమామల్లేశ్వరీ తెలిపారు. గ్రామాల్లో ఉప ఆరోగ్యకేంద్రాల గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

సి.బెళగల్, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు వెంకటలక్ష్మీ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఉప తహసీల్దారు పురుషోత్తమ్ తెలిపారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే వినతులు అందించి పరిష్కరించుకోవాలని కోరారు.

పోలకల్(సి.బెళగల్), న్యూస్‌టుడే: గ్రామంలో శైవ క్షేత్రమైన సోమేశ్వరస్వామి ఆలయంలో కార్తిక సోమవారం సందర్భంగా పురోహితుడు రామయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేక పూజలు జరుపుతున్నట్లు ఆలయం ధర్మకర్త పద్మనాభరెడ్డి తెలిపారు.

కౌతాళం, న్యూస్‌టుడే: కౌతాళం మండలంలోని హాల్వి గ్రామంలో వెలసిన గరిబల్లా దర్గా ప్రారంభోత్సవంలో వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, నేతలు బసవప్రభు, చన్నప్ప ధణి పాల్గొన్నారు. దర్గాలో ప్రత్యేక పాతెహ నిర్వహించారు. బసవప్రభు సొంత డబ్బులతో నిర్మించారని దర్గా నిర్వాహకులు బగ్దావలి, గరిబల్లా, మౌలా అన్నారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల చనుగొండ్ల గ్రామానికి చెందిన విద్యార్థిని స్నేహ అనారోగ్యంతో మృతి చెందింది. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గూడూరు మండల యూటీఎఫ్ అధ్యక్షుడు కాంతరావు పేర్కొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఉద్యమాలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను విస్మరించారని ఆ సంఘం రాష్ట్ర నాయకులు నాగరాజు ఆరోపించారు. యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మిగనూరులో సమావేశం నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ కార్మికులకు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయలేదన్నారు. కార్మిక చట్టం ప్రకారం పనికి తగిన వేతనం మంజూరు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వ కార్మికుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. రాబోయే రోజుల్లో ఉద్యమాలు చేస్తామని ప్రకటించారు. ఈనెల 6వ తేదీన జరిగే మూడో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు గోవిందు, రాముడు, సల్మాన్, లక్ష్మన్న, తిక్కయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: దివ్యాంగులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం

సమావేశంలో పాల్గొన్న దివ్యాంగులు

చేసుకోవాలని వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయుడు తెలిపారు. వెలుగు కార్యాలయం ఆవరణలో ఆదివారం నిర్వహించిన దివ్యాంగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూడీ ఐడీ కార్డును ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం దివ్యాంగులకు ఇంటి స్థలాలు, అంత్యోదయ కార్డులను మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు రుబేదా, సోమేశ్వరి, పుల్లన్న, వీరమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైగా బాధ్యతల స్వీకరణ

సి.బెళగల్, న్యూస్‌టుడే: సి.బెళగల్ ఠాణాలో ఆదివారం ఎస్సైగా వేణుగోపాల్ రాజు పదవీ బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలోని మంత్రాలయం, నందవరం, కర్నూలులో ఎస్సైగా విధులు నిర్వహించినట్లు తెలిపారు. కర్నూలు స్పెషల్ బ్రాంచి నుంచి బదిలీపై సి. బెళగల్ ఠాణాకు వచ్చారు.

నిబంధనలు పాటించని వాహనాలు

మంత్రాలయం, న్యూస్‌టుడే: మంత్రాలయం 167 ప్రధాన జాతీయ రహదారిపై వాహనాలు నిలపొద్దని సూచికలు ఏర్పాటు చేసినా.. కర్ణాటక ప్రైవేటు బస్సులు నిలుపుతూ ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. దీంతో వాహనదారులకు, భక్తులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నా పట్టించుకున్న నాథుడే లేరు. మంత్రాలయానికి కర్ణాటక నుంచి దాదాపు 40 వరకు ప్రైవేటు బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. శని, ఆదివారాల్లో వీటి సంఖ్య పెరుగుతుంది. ప్రత్యేక స్టాప్ పాయింట్ లేకపోవడంతో ప్రధాన జాతీయ రహదారిపైనే నిలిపి భక్తులను ఎక్కించుకుంటున్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా సగం రోడ్డును ఆక్రమించుకొని గంటలు కొద్దీ నిలపడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

సంతలో రైతులకు అవస్థలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలో పశువుల అమ్మకానికి వచ్చే రైతులు సంతలో బురదతో అవస్థలు పడుతున్నారు. ఆదివారం పశువుల సంత

పశువుల సంతలో ఉన్న మురుగు కుంట

మధ్యనే మురుగు నిలయంగా మారింది. ఇక్కడ అమ్మకానికి దాదాపు 2 వేలకు పైగానే పశువులు తీసుకొస్తారు. వీటిలో తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పశువులను తీసుకొస్తారు. పశువుల అమ్మకానికి వచ్చిన రైతులు సౌకర్యాలు లేక పోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. సంతలో మురుగు నీటిని తొలగించాలని స్థానికులు కోరారు.

నష్టాలు పెరిగి.. కష్టాల్లో రైతు

బురాన్‌దొడ్డి (సి.బెళగల్), న్యూస్‌టుడే: భారీ వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముందుగా వేసిన ఉల్లితో తీవ్రంగా నష్టపోయారు. దీంతో ఉల్లి తొలగించి.. పత్తి వేశారు. అందులోనూ నష్టం వచ్చింది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వరుస నష్టాలతో అప్పులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలో పంటలు సాగు చేసినా ప్రకృతి వైపరీత్యాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పంట దిగుబడులు పెరిగినా.. మార్కెట్‌లో ధర ఉండటం లేదు. గ్రామానికి చెందిన రైతు రాజశేఖరరెడ్డి గత ఏడాది ఐదు ఎకరాల్లో ఆయిల్ పామ్‌లో అంతర పంటగా పత్తి సాగు చేశారు. దిగుబడులు బాగా రావడం, ధరలు కూడా ఎక్కువగా ఉండటంతో ఆదాయం వచ్చింది.

బురాన్‌దొడ్డిలో ఉల్లిని ట్రాక్టరుతో దున్నిస్తున్న రైతు రాజశేఖరరెడ్డి

దీంతో ఈ ఏడాది ఐదు ఎకరాల్లో సీడ్ పత్తి సాగు కోసం రూ.50,000 వెచ్చించారు. తీరా కంపెనీ వారు ఎకరానికి 2 క్వింటాలు మాత్రమే పత్తి కొనుగోలు చేస్తామని చెప్పారు. దీంతో 3 ఎకరాల పత్తిని ట్రాక్టరుతో దున్నించి రూ.1,50,000 వెచ్చించి ఉల్లి పంట సాగు చేశారు. ధరలు కలిసి రాక కర్నూలు మార్కెట్‌లో క్వింటా రూ.500 ప్రకారం 80 క్వింటాలు అమ్మారు. ప్రభుత్వం రూ.1200 ప్రకారం రైతులకు అందజేస్తామని తెలిపినా.. ఇంతవరకు రైతుల ఖాతాలో నగదు చేయలేదు. మరో రెండు ఎకరాల్లో ఉల్లి వేసి పెట్టుబడులు పెట్టాడు. గతనెలలో భారీ వర్షాలతో సాగుచేసిన ఉల్లి ఊరడం లేదు. దీంతో లాభం లేదని రెండు ఎకరాల్లో సాగుచేసిన ఉల్లి పంటను ట్రాక్టరుతో దున్నేశారు. రబీలో మొక్కజొన్న పంట సాగుకు సిద్ధమవుతున్నట్లు రైతు రాజశేఖరరెడ్డి తెలిపారు.

మారెమ్మ ఆలయానికి విరాళం

సంగాల(సి.బెళగల్), న్యూస్‌టుడే: మండలంలోని సంగాల గ్రామంలో గ్రామస్థులు చేయిచేయి కలిపి రూ.25 లక్షలతో మారెమ్మ దేవాలయ నిర్మాణం చేపట్టారు. గ్రామంలో 500 ఎకరాల పొలం విస్తీర్ణం ఉంది. రైతులు ఎకరానికి రూ.5వేల చొప్పున విరాళాలు సేకరించారు. ఆ మొత్తంతో ఆలయ నిర్మాణం చేపట్టారు. రాతి కట్టడంతో చేపట్టిన నిర్మాణం వచ్చే నెలలో పూర్తి చేసి మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన చేయాలని గ్రామస్థులు సంకల్పించారు. ఆదివారం క్రేన్‌తో రాతి పైకప్పు పూర్తి చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

సంగాలలో జరుగుతున్న నిర్మాణం పనులు

ఆధార్ నవీకరణ.. అంతులేని వేదన

◆ సచివాలయాల్లో సక్రమంగా అందని సేవలు
◆ ప్రైవేటు కేంద్రాలను ఆశ్రయిస్తున్న ప్రజలు

కోడుమూరు, కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఆధార్ నమోదు, తప్పుల సవరణ, నవీకరణ కోసం ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. 5, 15 ఏళ్లు నిండిన విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్‌ను తప్పనిసరిగా నవీకరించుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది. ఇందుకోసం వార్డు సచివాలయాల్లో ఉచితంగా ఆధార్ సేవలు అందించేందుకు కిట్లు సరఫరా చేసింది. ఆయా కేంద్రాలకు వెళ్లిన ప్రజలకు నిరాశే మిగులుతోంది. ఆధార్ కిట్లు సరిగా పనిచేయకపోవడంతో సచివాలయాలు అరకొర సేవలకే పరిమితమయ్యాయి. దీంతో చాలామంది ప్రైవేటు మీసేవ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. వారు రూ.200 నుంచి రూ.500, రూ.వెయ్యి వరకు వసూలు చేస్తున్నారు. సచివాలయాల్లో సేవలను చక్కదిద్ది కష్టాలు తొలగించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

మండలం	ఆధార్ అప్‌డేషన్ లక్ష్యం	పూర్తయింది	పెండింగ్‌లో ఉన్నది
సి.బెళగల్	5,706	1,794	3,912
కోడుమూరు	7,270	2,203	5,067
గూడూరు రూరల్	2,859	983	1,876
గూడూరు అర్బన్	1,958	253	1,705

తపాలా కార్యాలయంలోని ఆధార్ కేంద్రంలో వేచి ఉన్న ప్రజలు

గ్రామీణ ప్రాంతాల్లో అవస్థలే..

నగరపాలక సంస్థ, కర్నూలు డివిజన్‌లోని రూరల్ మండలాల్లో ఆధార్ సేవలు అధ్వానంగా ఉన్నాయి. ఒక నగరపాలక, ఒక నగర పంచాయతీ, ఆరు గ్రామీణ మండలాల్లో కలిపి మొత్తం 31 ఆధార్ కిట్లను సచివాలయాల్లో ఏర్పాటు చేశారు. వీటిలో 15 ఆధార్ కిట్లు మాత్రమే అరకొరగా సేవలందిస్తున్నాయి. సి.బెళగల్ మండలంలో ముడుమాల, పొలకల్-3 సచివాలయాల్లో, గూడూరు మండలంలో గుడిపాడులో, కోడుమూరు మండలంలో వర్కూరు, కోడుమూరు-1 సచివాలయాల్లో మాత్రమే ఆధార్ కిట్లు ఉన్నాయి. వీటిలో నెలలో 15 రోజులు మాత్రమే సేవలు అందుతున్నాయి. మిగతా రోజులు కిట్లు నిరుపయోగంగా ఉంటున్నాయి. దీంతో ప్రజలు ప్రైవేటు మీసేవ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కోడుమూరు, న్యూస్‌టుడే: కోడుమూరు శివారులోని కర్నూలు-బళ్లారి ప్రధాన రహదారిలో జరిగిన ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కోడుమూరు మండలం ముడుమలగుర్తి గ్రామానికి చెందిన పులిదాసు రంగడు, ఆయన భార్యతో కలిసి కర్నూలు నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తున్నారు. కోడుమూరు పట్టణ సమయంలో ముందు వెళ్తున్న ఎడ్లబండిని ఢీకొట్టారు. దీంతో రంగడు కాలికి తీవ్ర గాయమైంది. హైవే పోలీసులు క్షతగాత్రుడిని స్థానిక కోడుమూరు సీహెచ్‌సీలో వైద్యం చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు సర్వజన ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి..

గూడూరు గ్రామీణం,న్యూస్‌టుడే: మండలంలోని పోన్నకల్లు గ్రామం సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. గోల్లలదొడ్డి గ్రామానికి చెందిన కురువ లింగన్న, ముడుమాల గ్రామానికి చెందిన కురువ మద్దిలేటి ఒకే ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. గాయపడిన ఇద్దరిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

(c) eenadu

కర్నూలు

•కర్నూలు • పాణ్యం

టెట్ మినహాయింపునకు కృషి చేయండి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ఉపాధ్యాయులకు

ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

టెట్ నుంచి మినహాయింపు ఇచ్చేలా కృషి చేయాలని ఎంపీ బస్తిపాటి నాగరాజుకు విన్నవించినట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు తెలిపారు. నగరంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం వారు ఎంపీని కలిసి సమస్యలు విన్నవించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి 2010 డీఎస్సీకంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులకు మినహాయింపు ఇచ్చేలా చూడాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్, రాష్ట్ర ఎన్నికల కమిటీ సభ్యుడు రామకృష్ణయ్య, జిల్లా అదనపు కార్యదర్శి శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: ఎస్బీఐ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం తెలిపారు. నగరవాసులు నేరుగా తమ సమస్యలను విన్నవించుకోవచ్చన్నారు. వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632,
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలక సంస్థ : ?: కల్లూరు చెన్నమ్మకూడలి, వై.జంక్షన్ సమీపంలో రహదారులపై పశువులు సంచరించకుండా చూడాలి. - సునీల్

?: వీకర్‌సెక్షన్ కాలనీలో మురుగు కాలువలు వ్యర్థాలతో పూడిపోయాయి. శుభ్రం చేయాలి. - రమేష్

✔: సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు చేపతాం. - నగరపాలక అధికారులు

బీసీ విద్యార్థి సంక్షేమ సంఘం కమిటీ ఎంపిక

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : నగరంలోని బిర్లా కాంపౌండ్‌లో ఉన్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు సమక్షంలో ఆదివారం నూతన కమిటీని ప్రకటించారు. బీసీ విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కటారుకొండ సాయికుమార్, రాష్ట్ర కార్యదర్శిగా కడుమూరు గిరీష్, రాయలసీమ జోనల్ అధ్యక్షుడిగా కురువ సురేంద్ర, కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా పోతులపాడు నాగరాజు, ఉపాధ్యక్షుడిగా కురువ రంగన్న, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఖాజాహుసేన్‌ను ఎంపిక చేశారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా పూర్ణ, పత్తికొండ అధ్యక్షుడిగా సూర్యనారాయణ, మంత్రాలయం అధ్యక్షుడి వడ్డే గురుస్వామి, కోడుమూరు అధ్యక్షుడిగా బాలరాజు, పాణ్యం అధ్యక్షుడిగా అరుణ్‌కుమార్, ఆలూరు అధ్యక్షుడిగా విజయ్‌కుమార్, కర్నూలు నియోజకవర్గ అధ్యక్షుడిగా రాకేష్‌కుమార్‌లను నియమించారు.

ఆధార్ నవీకరణ.. అంతులేని వేదన

★ సచివాలయాల్లో సక్రమంగా అందని సేవలు
★ ప్రైవేటు కేంద్రాలను ఆశ్రయిస్తున్న ప్రజలు

తపాలా కార్యాలయంలోని ఆధార్ కేంద్రంలో వేచి ఉన్న ప్రజలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కర్నూలు నగర ప్రజలు ఆధార్ నమోదు, తప్పుల సవరణ, నవీకరణ కోసం నానా తంటాలు పడుతున్నారు. 5, 15 ఏళ్లు నిండిన విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్‌ను తప్పనిసరిగా నవీకరించుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది. ఇందుకోసం వార్డు సచివాలయాల్లో ఉచితంగా ఆధార్ సేవలు అందించేందుకు కిట్లు సరఫరా చేసింది. ఆయా కేంద్రాలకు వెళ్లిన ప్రజలకు నిరాశే మిగులుతోంది. ఆధార్ కిట్లు సరిగా పనిచేయకపోవడంతో సచివాలయాలు అరకొర సేవలకే పరిమితమయ్యాయి. దీంతో చాలామంది కొండారెడ్డి బురుజు సమీపంలోని ప్రధాన తపాలా కార్యాలయం, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాల్లోని ఆధార్ కేంద్రాలకు వెళ్తున్నారు. ఆ కేంద్రాలు నిత్యం కిటకిటలాడుతున్నాయి. అక్కడ రద్దీ ఎక్కువ కావడంతో గత్యంతరం లేక చాలా మంది ప్రైవేటు మీసేవ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. వారు రూ.200 నుంచి రూ.500, రూ. వెయ్యి వరకు వసూలు చేస్తున్నారు. సచివాలయాల్లో సేవలను చక్కదిద్ది కష్టాలు తొలగించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

మండలం	ఆధార్ అప్‌డేషన్ లక్ష్యం	పూర్తయింది	పెండింగ్‌లో ఉన్నది
కర్నూలు నగరపాలక	38,501	6,273	32,228
కర్నూలు రూరల్	7,143	3,376	3,767
కల్లూరు	3,882	1,500	2,382
ఓర్వకల్లు	3,751	1,207	2,544
కోడుమూరు	7,270	2,203	5,067

నెలలో 15 రోజులే..

● నగరపాలక సంస్థ, కర్నూలు డివిజన్‌లోని రూరల్ మండలాల్లో ఆధార్ సేవలు అధ్వానంగా ఉన్నాయి. ఒక నగరపాలక, ఒక నగర పంచాయతీ, ఆరు గ్రామీణ మండలాల్లో కలిపి మొత్తం 31 ఆధార్ కిట్లను సచివాలయాల్లో ఏర్పాటు చేశారు. వీటిలో 15 ఆధార్ కిట్లు మాత్రమే అరకొరగా సేవలందిస్తున్నాయి.

● కల్లూరు మండలంలో పర్ల-1, బస్తిపాడు, ఉలిందకొండ-2, కర్నూలు రూరల్ మండలంలో ఉల్చాల-1, నందనపల్లె, గొందిపర్ల-2 సచివాలయాల్లో మాత్రమే ఆధార్ కిట్లు ఉన్నాయి. వీటిలో సగమే పనిచేస్తున్నాయి.

● కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 136 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 20 సచివాలయాల్లో మాత్రమే ఆధార్ కిట్లను ఏర్పాటు చేశారు. వీటిద్వారా నెలలో 15 రోజులు మాత్రమే ఆధార్ సేవలు అందిస్తున్నారు. మిగిలిన పక్షం రోజులు ఆధార్ కిట్లు ఖాళీగా ఉంటున్నాయి.

చిత్రలేఖనం.. ప్రతిభకు సోపానం

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : చిత్రలేఖన పోటీలు విద్యార్థుల ప్రతిభకు బాటలు వేస్తాయని ప్రిన్సిపల్ రంగయ్య పేర్కొన్నారు. నగరంలోని గణేశ్‌నగర్‌లో ఉన్న మాస్టర్ జూనియర్ కళాశాలలో 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్ని ప్రకృతి అందాలపై చిత్రాలు గీశారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన సుమతి, యశ్విత, గురుతేజకు ప్రిన్సిపల్, అధ్యాపకులు బహుమతులు అందజేశారు.

విజేతలతో అధ్యాపకులు

చెన్నకేశవస్వామి ఆలయాభివృద్ధికి కృషి

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: ఓర్వకల్లులోని చెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. చెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. ఆలయ కమిటీ ఛైర్మన్‌గా కాశిరెడ్డి వెంకట్రామిరెడ్డి, ధర్మకర్తలుగా

ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చెన్నూరు వెంకటరమణారెడ్డి, అక్కెం రేణుక, గంగాచరణ్, రవిశంకర్, మల్లేశ్వరి, లక్ష్మీదేవి, బోయ లక్ష్మీదేవి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ గోవిందరెడ్డి, తెదేపా వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు విశ్వేశ్వరరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, లక్ష్మికాంతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రలతో మనో వికాసం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : విద్యార్థులను విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్లడం ద్వారా మనో వికాసం

కొండారెడ్డి బురుజు వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

పెరుగుతుందని డీఈవో శామ్యూల్‌పాల్ పేర్కొన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పీఎంశ్రీ కింద ఎంపికైన పలు పాఠశాలల విద్యార్థులను విజ్ఞానయాత్రలకు తీసుకెళ్లాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. వారికి చారిత్రాత్మక కట్టడాలను చూపించి వాటి గురించి వివరించాలని చెప్పారు. నంద్యాల జిల్లాలోని ఐ.కొత్తపేటకు చెందిన జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల 9, 10వ తరగతి విద్యార్థులు విజ్ఞాన యాత్రలో భాగంగా ఆదివారం కొండారెడ్డి బురుజును సందర్శించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కురువ సంఘం కార్యాలయం ప్రారంభం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : నగరంలోని కొత్తబస్టాండు సమీపంలో కురువ, కురబ, మాదాసి కురువ, మాదారి కురవ సంఘం జిల్లా కార్యాలయాన్ని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు, ఏపీ రాష్ట్ర కురువ, కురబ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కురువ సంఘ నాయకులు పాల్గొన్నారు.

మైనారిటీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న మైనారిటీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు ఆల్ మైనారిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్‌మేవా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజద్‌బాషా పేర్కొన్నారు. నగరంలోని జిల్లా పరిషత్తులో ఉన్న ఎంపీపీ హాల్‌లో ఆదివారం సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం

సమావేశమైన ఆల్‌మేవా సభ్యులు

దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. అమరావతిలో ఆల్ మేవా కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రధానమంత్రి 15 సూత్రాల పథకాన్ని అన్ని జిల్లాల్లో అమలు చేయాలన్నారు. ముస్లిం విద్యార్థుల కోసం స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ హుస్సైన్, రాష్ట్ర అధ్యక్షుడు ఇమ్రాన్, కర్నూలు జిల్లా కార్యదర్శి రియాజ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుతోటలో సాహితీ సదస్సు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : స్థానిక మద్దూరు నగర్‌లోని తెలుగుతోటలో గాడిచెర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ కల్కూర

ప్రధానోపాధ్యాయురాలు దామగట్ల సరోజను సత్కరిస్తున్న డా.పార్వతి, చంద్రమౌళిని తదితరులు

అధ్యక్షతన ఆదివారం సాహితీ సదస్సు జరిగింది. మహాభారతంలో 'కర్ణుడు' అనే అంశంపై ప్రధానోపాధ్యాయురాలు దామగట్ల సరోజ ప్రసంగించారు. అనంతరం ఆమెను మహిళా రచయితలు డా.పార్వతి, డా.చంద్రమౌళిని, సుబ్బలక్ష్మమ్మ, సునీత తదితరులు సత్కరించారు. అంతకుముందు మేడూరి దీక్షితుల వెంకటసుబ్బయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విజయవాడకు ఇంటర్ సిటీ రైలు నడపాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : కర్నూలు, నంద్యాల తదితర ప్రాంతాల ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కర్నూలు నుంచి విజయవాడకు ఇంటర్‌సిటీ రైలు నడిపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల డిమాండ్ చేశారు. ఇంటర్ సిటీ రైలు నడపాలని కోరుతూ కర్నూలు రైల్వే స్టేషన్ వద్ద సీపీఎం నాయకులు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం రెండోరోజుకు చేరాయి. ఈసందర్భంగా ఆమె దీక్షలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు, జిల్లా కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు ఎండీ ఆనంద్‌బాబు, జిల్లా కమిటీ సభ్యుడు నగేష్, నగర కార్యదర్శి సీహెచ్ సాయిబాబు, సుధాకరప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిలిచే రచనలు అవసరం

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : ప్రజలు సమస్యలు వెలుగులోకి తీసుకురావడంతో పాటు వారికి న్యాయం జరిగేలా జనం పక్షాన నిలబడే రచనలు అవసరమని సాహితీవేత్త వి.కల్యాణరామారావు పేర్కొన్నారు. స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో 'రావిశాస్త్రి సాహిత్యం-ఒక పరిశీలన' అనే అంశంపై చర్చా కార్యక్రమం జరిగింది.

కార్యక్రమంలో మాట్లాడుతున్న సాహితీవేత్త కల్యాణ రామారావు

సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ రావిశాస్త్రి నేటితరం రచయితలకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. జంధ్యాల రఘుబాబు, చంద్రశేఖర్‌శర్మ, పాణి, నాగేశ్వరాచారి, ఆవుల చక్రపాణియాదవ్, వెంకటేశ్వరరెడ్డి, మధుసూదనశర్మ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

పెద్దటేకూరు (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే : రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండు చేశారు. పెద్దటేకూరు గ్రామంలో ఆదివారం వారు సమావేశం నిర్వహించారు. రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలన్నారు. డా.స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలన్నారు. నాయకులు మహేష్, పుల్లన్న, బాషా, కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నగర స్వచ్ఛత.. ప్రతి పౌరుని బాధ్యత

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర స్వచ్ఛత ప్రతి పౌరుని బాధ్యతని కమిషనర్ పి.విశ్వనాథ్ పేర్కొన్నారు. కర్నూలు నగరంలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ కోసం నగరపాలక అధికారులు చర్యలు చేపట్టారన్నారు. ఇందులో భాగంగా నగరంలోని వీధుల్లో పారిశుద్ధ్య సిబ్బంది వివరాలు, ఫోన్ నంబర్లు, చెత్త సేకరణ సమయాల వివరాలను గోడలపై రాయిస్తున్నామన్నారు. ప్రజలు ఈ సమాచారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ వైకాపా నాయకులు ఆదివారం రాత్రి కర్నూలులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఎస్టీబీసీ కళాశాల నుంచి బంగారుపేట ఆంజనేయస్వామి ఆలయం వరకు ర్యాలీ చేశారు.

మాట్లాడుతున్న బనవాసి కేవీకే శాస్త్రవేత్త డా.నిరంజన్‌రెడ్డి

అంతర పంటల సాగుతో ఆదాయం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : పండ్ల తోటల్లో అంతర పంటలుగా కూరగాయలు, పప్పు ధాన్యాలు సాగు చేయడం వల్ల నేల ఆరోగ్యం మెరుగవడంతో పాటు రైతులకు ఆదాయం పెరుగుతుందని బనవాసి కేవీకే శాస్త్రవేత్త డా.నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో ఆత్మ ఆధ్వర్యంలో ఆదివారం దేశీ కార్యక్రమం కింద ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే స్థిరమైన ఆదాయం పొందవచ్చన్నారు. వ్యవసాయంతో పాటు పాడి, కోళ్లు, గొర్రెలు, చేపల పెంపకం చేపట్టాలన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పెద్దటేకూరు (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే : సివిల్ సర్వీసుల శిక్షణ అధికారులు ఆదివారం కల్లూరు మండలంలోని పెద్దటేకూరు, తడకనపల్లె గ్రామాల్లో

పెద్దటేకూరులో ఉపాధిహామీ పనులు శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న శిక్షణ అధికారులు

పర్యటించారు. శిక్షణ ఐపీఎస్ మయాంక్ మాధవ్, ఐఎఫ్ఎస్‌లు తన్మయ్ కౌశిక్, హితేశ్, జేమ్స్ క్లైమిన్‌తాంగ్ జౌ, ఐసీఎస్ జోవియల్ ప్రభాత్ గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి శాఖల వారీగా తెలుసుకున్నారు. ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తడకనపల్లె గ్రామంలో పొదుపు మహిళల జీవనోపాధులను అధ్యయనం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీఎన్ఎస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : గైనిక్ వైద్యులు నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని పుణెకు చెందిన గైనిక్ వైద్యనిపుణుడు డాక్టర్ వినాయక్ మహాజన్ ప్రధాన్ సూచించారు. నగరంలోని అశ్విని హాస్పిటల్‌లో ఆదివారం గైనిక్ వైద్యులకు హిస్టెరోస్కోపీపై శిక్షణ శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మహాజన్ శస్త్రచికిత్స నిర్వహిస్తూ ఆధునిక పరికరాల వినియోగం, సురక్షిత శస్త్రచికిత్స పద్ధతులపై అవగాహన కల్పించారు. అశ్విని హాస్పిటల్

శిక్షణ శిబిరంలో డాక్టర్ వినాయక్ మహాజన్, గైనిక్ వైద్యులు

గైనిక్ వైద్యురాలు డాక్టర్ ప్రమీల మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం ఆధునిక శస్త్రచికిత్స పద్ధతులు నేర్చుకోవడం అవసరమన్నారు.

బీమా వివాదం పరిష్కారం

కర్నూలు గాయత్రీఎస్టేట్, న్యూస్‌టుడే: కర్నూలులోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు యాజమాన్యం ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఇఫ్కో టోక్యో బీమా కంపెనీలో మెడికల్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించింది. సదరు బ్యాంకు డీజీఎంగా పనిచేస్తున్న ఉమామహేశ్వరరెడ్డి తన కుమార్తె కంటికి శస్త్రచికిత్స చేయించి ఆ ఖర్చు మొత్తం రూ.1.2 లక్షలకు క్లయిమ్ చేశారు. బీమా సంస్థ రూ.60 వేలు మాత్రమే మంజూరు చేయడంతో ఆయన జిల్లా వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. కేసును పరిశీలించిన ఫోరం ఆయనకు మెడికల్ క్లయిమ్ కింద అదనంగా రూ.30 వేలు, మానసిక వేదనకు గురిచేసినందుకు మరో రూ.10 వేలు, కోర్టు ఖర్చు కింద రూ.5 వేలు చెల్లించాలని బీమా సంస్థను ఆదేశించింది.

తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : నగరంలోని కొణిజేటి రోశయ్య యోగా హాల్‌లో తైక్వాండో క్రీడాకారులకు ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ

బెల్ట్‌లు సాధించిన చిన్నారులతో అతిథులు

చూపిన క్రీడాకారులకు బెల్ట్‌లు అందజేశారు. తైక్వాండో సంఘం నాయకులు టి.వెంకటేశ్వర్లు, టి.అజయ్, నాగరాజు, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్షుడిగా కుబేర్‌నాయుడు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : నగరంలోని ఎ.క్యాంపు మాంటిస్సోరి విద్యా సంస్థల ఆవరణలో ఆదివారం సాఫ్ట్‌బాల్ సంఘం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడిగా కుబేర్‌నాయుడు, ఉపాధ్యక్షుడిగా రంగముని, కార్యదర్శిగా విజయ్‌కుమార్, కోశాధికారిగా ఉమామహేశ్వరి, సంయుక్త కార్యదర్శిగా అయ్యన్నగౌడ్, కార్యవర్గ సభ్యులుగా మాధవి, శాంతరాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకులు వెంకటేష్, వంశీకృష్ణ ప్రకటించారు.

అక్కాచెల్లెళ్లు.. కత్తియుద్ధంలో విజేతలు

★ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్‌లో రాణిస్తున్న విద్యార్థినులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : నగరానికి చెందిన అక్కాచెల్లెళ్లు కావ్యశ్రీ, మేఘన ఫెన్సింగ్ క్రీడలో ప్రతిభ చూపుతున్నారు. ఆసక్తితో ఆట నేర్చుకుని. శిక్షణ తీసుకుంటూ నైపుణ్యం మెరుగుపర్చుకున్నారు. తల్లిదండ్రులు, శిక్షకుడి ప్రోత్సాహంతో పోటీల్లో రాణిస్తూ విజయపథంలో సాగుతున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో జరిగిన పలు పోటీల్లో సత్తాచాటి విజేతలుగా నిలిచారు. జాతీయస్థాయిలో స్వర్ణ పతకాలు సాధించాలన్న పట్టుదలతో కఠోర సాధన చేస్తున్నట్లు చెబుతున్నారు ఈ అక్కాచెల్లెళ్లు.

కావ్యశ్రీ.. స్వర్ణాలపైనే గురి

నగరంలోని శరీన్‌నగర్‌కు చెందిన రేణుక, శ్రీనివాసులు దంపతుల పెద్ద కుమార్తె కావ్యశ్రీ. పదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఫెన్సింగ్‌లో శిక్షణ తీసుకుని రాణిస్తోంది. ● 2022 జులైలో నంద్యాల డీఎస్ఏ స్టేడియంలో జరిగిన జూనియర్ జిల్లాస్థాయి పోటీల్లో బంగారు పతకం అందుకుంది. ● 2022 ఆగస్టులో పశ్చిమగోదావరిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో రజతం గెలుపొందింది. ● అదే ఏడాది సెప్టెంబరులో కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ జిల్లాస్థాయి పోటీల్లో రజతం సాధించింది. ● 2023 నవంబరులో కాకినాడలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి అండర్-14 పోటీల్లో బంగారు పతకం అందుకుంది. ● 2024 ఆగస్టులో కర్నూలులో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించింది. అదే ఏడాది అక్టోబరులో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో అండర్-14 విభాగంలో స్వర్ణం గెలుచుకుంది. ● గతనెల కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్-14 పోటీల్లో బంగారు పతకం అందుకుంది. త్వరలో నెల్లూరులో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది.

విజయ పథాన.. మేఘన

కావ్యశ్రీ చెల్లెలు మేఘన కూడా అక్క స్ఫూర్తితో ఫెన్సింగ్‌లో ప్రతిభ చూపుతోంది. తొమ్మిదో తరగతి చదువుతున్న ఈ విద్యార్థిని పలు పోటీల్లో విజేతగా నిలిచింది. ● 2022 జులైలో నంద్యాల డీఎస్ఏ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో రజత పతకం అందుకుంది. ● అదే ఏడాది ఆగస్టులో పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్యం, సెప్టెంబరులో కర్నూలులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ జిల్లాస్థాయి పోటీల్లో స్వర్ణ పతకం గెలుపొందింది. ● 2023 నవంబరులో కాకినాడలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం అందుకుంది. ● 2024 ఆగస్టులో కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో స్వర్ణం గెలుచుకుంది. ● 2024 అక్టోబరులో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించింది. ● 2025 సెప్టెంబరు 22న పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణం పతకం అందుకుంది. ● గతనెలలో కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 పోటీల్లో సైతం స్వర్ణం గెలుచుకుని త్వరలో కోనసీమ జిల్లాలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది.

సమాధుల తోటలో ప్రత్యేక ప్రార్థనలు

సమాధుల వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కర్నూలు నగరంలో ఆదివారం క్రైస్తవులు సమాధుల పండగను ఘనంగా జరుపుకొన్నారు. సమాధుల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో బిషప్‌లు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు నగరంలోని లక్ష్మీనగర్‌కు చెందిన ఓ యువతి (20) అదృశ్యమయ్యారు. ఇంటర్ పూర్తిచేసిన ఆమె ప్రస్తుతం నీట్ కోచింగ్ పొందుతున్నారు. గతనెల 30న ఇంట్లో కోచింగ్ సెంటర్‌కు వెళ్తున్నట్లు చెప్పి వెళ్లిన ఆమె తర్వాత తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో ఆ యువతి తల్లి కర్నూలు మూడో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



(c) eenadu

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

వయోజనులకు రెండో విడత తరగతులు

ఆళ్లగడ్డ, న్యూస్టుడే: ప్రతి మహిళను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం 'ఉల్లాస్' కార్యక్రమాన్ని అమలుచేస్తోంది. పొదుపు, వీవోలు, టీపీఎస్ సంస్థ రూపొందించింది. వీటిపై అవగాహన కల్పించేందుకు టీసీఎస్ ప్రతినిధులు అభ్యసన తరగతులతో పాల్గొని స్వచ్ఛంద ఉపాధ్యాయుల లక్ష శిక్షణ ఇచ్చారు. వంద శాతం అక్షరాస్యత సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రాథమిక, డిజిటల్, ఆర్థిక విద్యను మహిళలకు అందించడం పథక ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా రెండో విడత తరగతులు చురుగ్గా సాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 2.64 లక్షల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు.

మొదటి విడత ఫలితాలు	
హాజరైనవారు	56,657
పరీక్ష రాసినవారు	51,069
ఉత్తీర్ణులు	48,481

20వ తేదీ వరకు బోధన

కేంద్ర ప్రభుత్వం 'ఉల్లాస్' పేరుతో తొలివిడత నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం 'అక్షర ఆంధ్ర' పేరును జోడించి ముందుకు తీసుకెళ్లింది. 15-59 ఏళ్ల మధ్యనున్న ప్రతి ఒక్కరిని అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే రెండో విడత కింద 2,640 మంది వాలంటీర్లను ఎంపిక చేసి శిక్షణ పూర్తి చేశారు. వారు వాడవాడలా వయోజనులకు పాఠాలు బోధిస్తున్నారు. రెండో విడతలో భాగంగా నవంబరు 20వ తేదీ వరకు పాఠాలు చెబుతారు.

జాగ్రత్తగా నడిపితే.. గట్టున పడినట్లే

బనగానపల్లి పట్టణంలో భాగ్యనగర్ మైదానం వైపుగల కాల్వ పనులు జరుగుతుండటంతో కోవెలకుంట్ల, అవుకు తదితర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను పట్టణ శివారులో ఎస్పీఆర్సీ మీదుగా ఆర్టీసీ బస్టాండుకు వెళ్లేలా అధికారులు దారి మళ్లించారు. ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. కాల్వకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడం.. దీనిని ఆనుకునే వాహనాలు వెళుతుండటంతో జనం భయాందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – న్యూస్టుడే, బనగానపల్లి గ్రామీణం

శ్రీశైలం జలాశయం నీటిమట్టం 884.10 అడుగులు

సున్నిపెంట సర్కిల్, న్యూస్టుడే: శ్రీశైలం జలాశయం నీటిమట్టం ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి 884.10 అడుగులు, నీటి నిల్వ 210.5133 టీఎంసీలుగా నమోదైంది. జూరాల, సుంకేసుల నుంచి 24,514 క్యూసెక్కుల వరద నీరు జలాశయానికి వస్తోంది. శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 62,181 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

నిల్వల్లేవిక్కడ.. బయట కొనేదెక్కడ

- ఆర్ఎస్‌కేల్లో కానరాని యూరియా

ఉమ్మడి జిల్లాలో యూరియా కొరత ఏర్పడింది. రబీలోని పంటలకు అందుబాటులో లేదు. ఇటీవల కురిసిన వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో వరి, పత్తి, మిర్చి పంటలు నీట మునగడంతో యూరియా అవసరం ఉంది. రెండు జిల్లాల్లో నిల్వలు లేకపోవడం.. ప్రైవేటు వ్యాపారులకు వరంగా మారింది. – న్యూస్టుడే, నంద్యాల పట్టణం, పాణ్యం

జిల్లాలో రబీలో వివిధ పంటల సాగు అంచనా	
పంట	ఎకరాలు (వేలల్లో..)
మొక్కజొన్న	35
జొన్న	60
మినుము	30
శనగ	60

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రబీలో 3 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అంచనా. ఇప్పటికే రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి జిల్లాల్లోని రైతుసేవా కేంద్రాల్లో యూరియా నిల్వలు లేవు. సెప్టెంబరులో కొంతమేర వచ్చింది. ఆ తర్వాత 50 రోజులుగా సరఫరా లేదు. మరోవైపు కోతకు చివరి దశలో ఉన్న వరికి సైతం యూరియా అవసరం ఉంది. నంద్యాల జిల్లాలో మెట్ట ప్రాంతాలైన గడివేముల, పాణ్యం, మిడుతూరు, నందికొట్కూరు, కోవెలకుంట్ల, డోన్, కొలిమిగుండ్ల తదితర మండలాల్లో శనగ, జొన్న, మొక్కజొన్న వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. కర్నూలు జిల్లాలో వెల్దుర్తి, పత్తికొండ, దేవనకొండ, పెద్దకడబూరు, నందవరం, తుగ్గలి, ఎమ్మిగనూరు తదితర మండలాల్లో శనగ సాగవనుంది. యూరియా లభించకపోవడంతో అన్నదాతలు రైతు సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు.

20 వేల టన్నులు అవసరం కాగా...

రబీతోపాటు ఖరీఫ్‌లో వరి కోతలు పూర్తైన తర్వాత డిసెంబరులో రెండో కారుగా వరి వేసేందుకు రైతులు సిద్ధమవుతారు. దీనికీ యూరియా అవసరం ఉంది. ప్రస్తుత అవసరాలకు తోడు.. మరో నెల తర్వాత అవసరమయ్యే యూరియా కోసం అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉండగా.. పట్టించుకోలేదు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 20 వేల టన్నుల యూరియా అవసరమవుతుందని అంచనా.

బయట అధిక ధరలకు విక్రయిస్తూ..

రైతుసేవా కేంద్రాల్లో నిల్వలు లేకపోవడంతో రైతులు వ్యాపారులపై ఆధారపడుతున్నారు. ఇదే అవకాశంగా ఒక్కో బస్తాను రూ.320 నుంచి రూ.350కుపైగా విక్రయిస్తున్నారు. వ్యాపారులు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయడం లేదు. అయినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

వెంగమ్మ పేణి.. తినాలి మైమరచి

బనగానపల్లి పట్టణంలో వెంగమ్మ పేణీలకు ఓ ప్రత్యేకత ఉంది. ఈ ప్రాంతంలో ఏ శుభకార్యం జరిగినా నోరూరించేలా పేణీలు ఉండాల్సిందే. దశాబ్దాల కిందట వెంగమ్మ అనే మహిళ పేణీలు తయారుచేసి అమ్మేవారు. అలా ఆమె పేరుతో స్థిరపడిపోయింది. 1974లో ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ బనగానపల్లి మీదుగా వెళ్లే సమయంలో అప్పటి నేతలు పెండేకంటి వెంకటసుబ్బయ్య, బలరామిరెడ్డిలు ఆమెకు వీటిని అందించారు. రుచి చూసిన ఆమె పరవశించిపోయారు. యాగంటి, బెలుం గుహలు తదితర వాటిని సందర్శించేవారితోపాటు ఇతర ప్రాంతాలవారు ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తుంటారు. 1965 నుంచి పేణి అమ్మకాలు సాగుతున్నాయి. కిలోకు 20 వరకు వస్తాయి. – న్యూస్‌టుడే, బనగానపల్లి

చిరుత వేగం.. పతకాల యోగం

ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నరసింహులు పరుగు పందెం పోటీల్లో రాణిస్తున్నారు. ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు ఏకాగ్రతతో నిత్యం సాధన చేసి పతకాలు సాధిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి అందరి మన్ననలు పొందుతున్నారు.

- ఏలూరులో గత నెలలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో 800 మీటర్ల పరుగులో నిమిషంలో గమ్యస్థానాన్ని చేరుకొని బంగారు పతకం అందుకున్నారు. 1,500 మీటర్ల 4×400 రిలేలో ప్రథమ స్థానంలో నిలిచారు. త్వరలో హరియాణాలో జరిగే అథ్లెటిక్స్ పోటీలకు రాష్ట్రం నుంచి అతను ఎంపికవడం విశేషం.
- నరసింహులు ప్రతిరోజూ తెల్లవారుజామున సాధన చేస్తున్నారు. శిక్షకుడు మల్లికార్జున అవసరమైన మెలకువలు నేర్పుతూ అతని భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

నవనందులు.. కార్తిక వెలుగులు

నల్లమల.. కార్తిక శోభతో అలరారుతోంది. మహానంది క్షేత్రంతో పాటు నంద్యాల చుట్టూ నవ నందులు వెలిశాయి. కార్తిక మాసంలో ప్రతి సోమవారం, కార్తిక పౌర్ణమి రోజున భక్తులు సూర్యాస్తమయంలోపు పాదయాత్రగా వెళ్లి నవ నందీశ్వరులను దర్శించడం ఆనవాయితీ. ముందుగా నంద్యాల గుడిపాడిగడ్డలోని భ్రమరాంబాదేవి సమేత మల్లికార్జునస్వామి ఆలయంలోని సాక్షి గణపతిని దర్శించుకుంటారు. అన్ని నందులను దర్శించి తిరిగి గుడిపాడిగడ్డలోని స్వామిని దర్శించుకుంటేనే యాత్ర సఫలమవుతుందని భావిస్తారు. – న్యూస్‌టుడే, నంద్యాల గాంధీచౌక్, మహానంది

ప్రథమ నంది

నంద్యాల పట్టణంలోని చామకాల్వ గట్టున ప్రథమ నందీశ్వరాలయం ఉంది. గర్భాలయంలో కొలువుదీరిన కేదారేశ్వరలింగం భక్తులకు దర్శనమిస్తుంది. స్వామివారి ఆశీస్సులు అందుకోవడం ద్వారా కేదార్‌నాథ్‌లోని కేదారేశ్వరస్వామిని దర్శించుకున్నంత ఫలం లభిస్తుందని భక్తులు నమ్ముతారు. ఇక్కడే మరోపక్క కేదారేశ్వరిమాత కొలువుదీరి ఉంటారు.

శివనంది (రుద్రనంది)

బండిఆత్మకూరు మండలం కడమలకాల్వ గ్రామాన్ని ఆనుకొని ఉంది. ఈ క్షేత్రాన్ని శివనంది లేదా రుద్ర నందీశ్వరాలయంగా పిలుస్తారు. ఇక్కడి శివలింగం మిగతా క్షేత్రాల్లోని శివలింగాల కంటే ఎత్తుగా ఉంటుంది. నంద్యాల పట్టణానికి 15 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది.

సూర్యనంది

మహానంది-నంద్యాల ప్రధాన రహదారిలోని తమడపల్లె నుంచి దక్షిణం వైపు రెండు కిలోమీటర్ల దూరంలో సూర్యనంది క్షేత్రం ఉంది.

నాగనంది

నంద్యాల ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో నాగనంది ఉంది. కార్తిక మాసంలో విశేష పూజలు జరుగుతాయి.

గరుడనంది

మహానంది క్షేత్రంలోని ఆలయానికి పడమటి దిశలో ప్రధాన రహదారికి వంద గజాల దూరంలో ఉంది. ఈ ఆలయానికి విమాన గోపురాన్ని ఇటీవల కాలంలో నిర్మించారు. ఇక్కడే గోర్లయ్య మఠం ఉంది.

మహానంది

ఈ పుణ్యక్షేత్రంలో పరమశివుడు గోవుపాద రూపంలో వెలిశారు. అందుకే మహానందీశ్వరుడిని గోపాద లింగేశ్వరుడిగా పిలుస్తారు. స్వామివారు ఇక్కడ స్వయంభువుగా వెలిశారు. ఆలయం కిందిభాగం నుంచే జలాలు నిత్యం ప్రవహిస్తూ ఉంటాయి. ఈ నీటితో సుమారు రెండు వేల ఎకరాల భూములు సాగవుతుంటాయి.

సోమనంది

నంద్యాల పట్టణం.. ఆత్మకూరు బస్టాండు సమీపంలో సోమ నందీశ్వరాలయం ఉంది. చంద్రుడు మహేశ్వర లింగాన్ని ప్రతిష్ఠించడంతో ఈ పేరు వచ్చిందని ప్రతీతి.

వినాయకనంది

ఈ క్షేత్రం సైతం మహానందిలోని ఆలయాల్లో అంతర్భాగంగా నిర్మితమైంది. మహానందీశ్వర స్వామివారి ఆలయానికి దక్షిణం వైపున స్వామివారు వినాయక నందీశ్వరుడిగా వెలిశారు. ఇక్కడ పరమశివుడి కోసం వినాయకుడు తపస్సు చేసి ప్రతిష్ఠించడంతోనే వినాయక నందీశ్వరాలయంగా గుర్తింపు పొందింది.

కృష్ణనంది (విష్ణునంది)

ఈ క్షేత్రం నల్లమల అడవిలో.. ప్రకృతి రమణీయతతో అలరారుతోంది. కడమలకాల్వ గ్రామం నుంచి.. అటు మహానంది మండల కేంద్రం తిమ్మాపురం నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

సేవలందే మార్గమిదే



ఉమ్మడి కర్నూలు జిల్లా మీదుగా రెండు జాతీయ రహదారులు వెళ్తున్నాయి. ఎన్‌హెచ్-40 పరిధిలో చాగలమర్రి, నంద్యాల, నన్నూరు శివారు, ఎన్‌హెచ్ 44 పరిధిలో అమకతాడు వద్ద టోల్‌ప్లాజాలున్నాయి. ఆయా మార్గాల్లో ప్రతిరోజూ 30 వేలకుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. టోల్ చెల్లిస్తున్న నేపథ్యంలో వాహనదారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. అత్యవసర సేవలు సైతం పొందొచ్చు. ఏదేని ఇబ్బందులు కలిగితే ఎన్‌హెచ్ఏఐ అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు.

1033తో సత్వర సాయం

జాతీయ రహదారులపై వాహనం ఆగిపోయినా.. పెట్రోల్, డీజిల్ అయిపోయినా 1033 నంబరుకు ఫోన్ చేస్తే చాలు.. తక్షణ సాయం అందుతుంది.

బటన్ నొక్కితే చాలు..

జాతీయ రహదారిపై ప్రతి కి.మీ. నుంచి 2 కి.మీ. మధ్యలో రోడ్డు పక్కన స్తంభాలకు ఎస్‌వోఎస్ పెట్టెలుంటాయి. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు లేదా ఇతర అత్యవసర సమయాల్లో తక్షణ సాయం కావాలంటే ఈ పెట్టెపై ఉన్న బటన్ నొక్కి మనం ఉండే ప్రదేశం చెబితే వెంటనే టోల్ సిబ్బంది అక్కడికి చేరుకుని అవసరమైన సాయం అందిస్తారు.

చిత్రం తీయ్.. రివార్డు అందుకో

- రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని టోల్‌ప్లాజాల వద్ద మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్న చిత్రం తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి.
- ఫొటోతోపాటు పంపినవారి పేరు, వాహనం, రిజిస్ట్రేషన్ నంబరు, లొకేషన్ తదితర వివరాలు నమోదు చేయాలి.
- రోజూ వచ్చిన చిత్రాల్లో అర్హత ఉన్న వాటిని ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఎంపిక చేస్తారు.
- ఫిర్యాదుదారుడి వాహన రిజిస్ట్రేషన్ నంబరుకు అనుసంధానమైన ఫాస్టాగ్‌కు రూ.1,000 రీఛార్జి రూపంలో రివార్డు అందిస్తారు.

– న్యూస్‌టుడే, డోన్, నంద్యాల రైతునగరం

రూ.15 కోట్లకు వ్యాపారి కుచ్చుటోపీ!

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఎక్కువ వడ్డీ ఆశ చూపి పలువురి వద్ద అప్పులు తీసుకున్నాడు. ఆ సొమ్ముతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశాడు. అనంతరం ఎవరికీ తెలియకుండా తన స్థిరాస్తులను అమ్మేసుకుని వెళ్లిపోయాడు. అతని జాడ కానరాకపోవడంతో జనం ఆందోళన చెందుతున్నారు. సుమారు రూ.15 కోట్లతో ఉడాయించినట్లు బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ ఘటన డోన్ పట్టణంలో చోటుచేసుకుంది. కర్నూలు జిల్లా మద్దికెర మండలానికి చెందిన ఓ వ్యక్తి డోన్‌లో చాలాకాలంగా ధాన్యం కొనుగోళ్లతోపాటు స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నాడు. పట్టణ శివారులో ఇళ్లను నిర్మించి పలువురికి విక్రయించాడు. ఇతనికి సొంతింటితోపాటు ఓ దుకాణ సముదాయం ఉంది.

ఆస్తులు అమ్మేసుకొని..

డోన్ పట్టణంతోపాటు సొంతూరులోని పలువురి వద్ద అతను భారీ మొత్తంలో అప్పులు చేశాడు. పనిమనిషి వద్ద రూ.8 లక్షలు, ఓ పూజారి వద్ద రూ.5 లక్షలు తీసుకున్నాడు. ఈ క్రమంలో అప్పులు ఇచ్చినవారు ఒత్తిడి చేయడంతో ఐదు రోజుల కిందట కుటుంబంతో సహా పరారయ్యాడు. ఇది తెలిసిన బాధితులు అతని కోసం గాలించినా ప్రయోజనం లేకపోయింది. అంతకుముందే తన పొలాలు, స్థిరాస్తులను ఎవరికీ తెలియకుండా అతను అమ్మేయడం గమనార్హం. క్రిప్టో కరెన్సీలో భారీగా పెట్టుబడులు పెట్టి నష్టపోయినట్లు సమాచారం. దీనిపై తమకు సమాచారం లేదని.. ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు.

ఇంటిపట్టునే కొలువు

- కొనసాగుతున్న కౌశలం సర్వే

డిగ్రీలు, పీజీలు, ఇంజినీరింగ్ చదివిన యువతులు ఉద్యోగాలు చేస్తూ వివాహమైన తర్వాత అత్తవారి ఇంటికి వెళ్తున్నారు. అక్కడ ఉద్యోగం చేసే అవకాశం లేక చాలామంది ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఇలాంటివారు ఇంటివద్దే ఉద్యోగం చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వారి విద్యార్హతలను గుర్తించేందుకు కౌశలం సర్వే చేపట్టింది.

1,20,321 మంది వివరాల సేకరణ

ఉమ్మడి జిల్లాలో వర్క్‌ఫ్రం హోం కింద 2,00,037 మంది వివరాలు సేకరించాలని నిర్ణయించారు. సచివాలయ సిబ్బంది ఆగస్టులో కౌశలం సర్వే చేపట్టారు. మూడు నెలల్లో 1,20,321 మందిని సర్వే చేసి వారి విద్యార్హత ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేశారు. ఇంకా 79,716 మందిని సర్వే చేయాల్సి ఉంది. తాము ఇంటి నుంచే పనిచేస్తామని మరో 48,269 మంది ముందుకొచ్చారు. ఆ వివరాలను సిబ్బంది సేకరించాల్సి ఉంది.



అధికారుల పర్యవేక్షణ కరవు..

ఉమ్మడి జిల్లాలో 1,188 సచివాలయాలు ఉన్నాయి. ఒక్కో సచివాలయం పరిధిలో మూడు నెలలకు వంద మందిని మాత్రమే సర్వే చేశారు. అంటే నెలకు 33 మంది వివరాలే సేకరించారు. గ్రామ, వార్డు సచివాలయ అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు దృష్టి సారించకపోవడంతో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో మూడు నెలల్లో సర్వే వివరాలు..			
జిల్లా	ఇంటి నుంచి పనికి అంగీకరించినవారు	వివరాలు సేకరించింది	పెండింగ్‌లో ఉన్నవారు
కర్నూలు	1,05,453	55,299	50,154
నంద్యాల	94,584	65,022	29,562

ఎలాంటి ఉద్యోగాలు చూపుతారు

- పది, ఇంటర్, డిగ్రీ, పీజీ తదితర విద్యార్హతలు కలిగిన 18- 50 ఏళ్లలోపు వయస్సువారిని అర్హులుగా గుర్తిస్తారు. పది, ఇంటర్ చదివిన వారికి సంబంధించి ఎలాంటి ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదు. ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ.. ఆపై చదువులు చదివినవారి నుంచి విద్యార్హతల ధ్రువపత్రాలను స్కాన్ చేసి కౌశలం యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు.
- కౌశలం సర్వే పూర్తైన తర్వాత నిరుద్యోగ యువతీ యువకుల నైపుణ్యాలు గుర్తించేందుకు పరీక్ష నిర్వహించనున్నారు. దీని ఆధారంగా ఎంపిక చేస్తారు. వారికి డిజిటల్ మార్కెటింగ్, ఈ-కామర్స్, ఐటీ తదితర రంగాల్లో శిక్షణ ఇస్తారు. ప్రత్యేకంగా వివిధ ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేసి అవగాహన కల్పిస్తారు. అనంతరం ఇంటి నుంచి పనులు చేసేలా అవకాశం కల్పిస్తారు.

బాధితులకు అండగా ఉంటాం

బనగానపల్లి, బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజల నుంచి వచ్చే వినతులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మంత్రి మాట్లాడుతూ సమస్య తీవ్రంగా ఉంటే క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కారం చూపాలన్నారు. ఉద్యోగ, ఉపాధి కోసం అర్జీలు పెట్టుకున్న నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని.. బాధితులకు అండగా ఉంటామని మంత్రి చెప్పారు.

- ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ కింద విడుదలైన రూ.42,01,708 లక్షల విలువైన చెక్కులను 50 మంది బాధితులకు అందజేశారు.

సమస్య తెలుసుకుంటున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

నృత్యాభినయం

శ్రీశైల మహాక్షేత్రంలో నిర్వహిస్తున్న కళారాధనలో భాగంగా ఆదివారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కర్నూలుకు చెందిన గీతాంజలి బృంద సభ్యులు సంప్రదాయ నృత్యాలు చేశారు. దేవస్థానం అధికారులు ప్రశంసా పత్రాలు, ప్రసాదాలు అందించారు. – న్యూస్‌టుడే, శ్రీశైలం, నంది సర్కిల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నట్లు ఆదివారం తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు డివిజన్, మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లోనూ వినతులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తులు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకొనేందుకు టోల్‌ఫ్రీ నంబరు 1100ను సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు.

అలుగు పారితే అడుగు పడదు

- జాతీయ రహదారిపై తప్పని ఇబ్బందులు

ఆగిపోయిన లారీలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: నల్లమల అటవీ ప్రాంతంలో కర్నూలు-గుంటూరు ఎన్‌హెచ్-340సీపై ప్రయాణానికి సిద్ధాపురం చెరువు తరచూ ఆటంకం కలిగిస్తోంది. భారీ వర్షాలతో అలుగు ఉప్పొంగితే రాకపోకలు ఆగిపోతున్నాయి. లోలెవెల్ వంతెన నిర్మిస్తే రాకపోకలకు ఇబ్బందులు ఉండవు.

దూరాభారమే

ఆత్మకూరు-దోర్నాల మధ్య 60 కి.మీ.దూరాన్ని 2 గంటల్లో చేరుకోవచ్చు. వాహనాలను నంద్యాల వైపు మళ్లిస్తే.. నంద్యాల-గిద్దలూరు మీదుగా దోర్నాలకు 190 కి.మీ. మేర ప్రయాణించాల్సి ఉంటుంది.

- కర్ణాటక నుంచి కోల్‌కతాకు లారీల్లో సరకును సమయానికి చేర్చితే డ్రైవర్‌కు రూ.5-10 వేలు ఎక్కువ ఇస్తారు. ఆలస్యమైతే డ్రైవర్ బత్తాలో కొంత కోత విధిస్తారు.

అటవీ మార్గంలో అనుమతుల్లేవ్

కర్నూలు-గుంటూరు ఎన్‌హెచ్ విస్తరణకు గతంలో సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారు. 2016 నుంచి 2018 వరకు సర్వేలు జరిగాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం దీనిని పట్టించుకోలేదు. ప్రస్తుతం వెంకటాపురం వరకు మాత్రమే విస్తరణ పనులు జరుగుతున్నాయి. అటవీ మార్గంలో 38.8 కి.మీ. మేర విస్తరణకు సంబంధించి అనుమతుల్లేవు. ఇటీవల శ్రీశైలం పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అనుమతులు సాధిస్తామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఆలస్యమైతే బత్తాలో కోత

–మహబూబ్‌బాషా, లారీ డ్రైవర్, ఆత్మకూరు



కర్ణాటక నుంచి కోల్‌కతాకు క్యాబేజీ లోడును 48 గంటలు, ఇతర లోడును 50 గంటల్లో చేర్చాల్సి ఉంటుంది. సమయానికి చేర్చితే అదనపు నగదు ఇస్తారు. ఆలస్యమైతే మా బత్తాలో కోత విధిస్తారు.

(c) eenadu

మహానంది క్షేత్రం కళకళ

మహానంది, న్యూస్‌టుడే: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం మహానందిలో ఆదివారం సెలవురోజు, కార్తికమాసం కావడంతో భక్తుల రాకపోకలతో సందడిగా కనిపించింది. క్షేత్రంలోని పవిత్ర రుద్ర గుండం, చిన్నకోనేర్లలో భక్తులు పుణ్యస్నానాలు చేశారు. అనంతరం గంగా కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వరస్వామివార్లను, సీతా కోదండ రామలవారిని, గోవులను దర్శించుకొని అభిషేకాలు, అర్చనల పూజలు చేసుకున్నారు. రెండవ సోమవారం సందర్భంగా భక్తులకు సులభంగా దైవదర్శనాలు కల్పించేలా, సత్వరమే సహాయక చర్యలు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందని దేవస్థానం వర్గాలు తెలిపాయి. దేవస్థానంతోపాటు మండపాలు, ఆలయాలు, విద్యుత్తు కాంతుల్లో వెలిగిపోతూ ఆకర్షిస్తున్నాయి.

రాజగోపురం ముందు భజనలు చేస్తున్న భక్తులు

అహోబిలంలో ఏకాదశి పూజలు

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం ఏకాదశి పూజలు నిర్వహించారు. ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ఆలయ ముఖద్వార మండపంలో కొలువుదీర్చి పంచామృతాలతో అభిషేకించారు. పసుపు, చందనం, కర్పూరం వంటి లేపనాలు సమర్పించి ధూపదీపాలతో మహామంగళహారతి అందించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం విశేష అలంకరణలో స్వామి, అమ్మవారి పల్లకిపై తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

స్వామి, అమ్మవారిని పూజిస్తున్న అర్చకులు

యాగంటిలో కార్తిక దీపాలు

యాగంటి(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి కార్తిక దీపాలు వెలిగించారు. ఆలయంలోని కోనేరు, నంది, గుహలు వద్ద భక్తులు సందడి చేశారు.

ఓంకార క్షేత్రంలో భక్తుల సందడి

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: నల్లమల అభయారణ్యంలో వెలసిన ఓంకార పుణ్యక్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి అధికంగా ఆలయానికి చేరుకున్నారు. పంచబుగ్గల కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి ఓంకార సిద్ధేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి చక్రపాణి శర్మ స్వామి, అమ్మవార్లకు పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కాశిరెడ్డి నాయన అన్నసత్రం నిర్వాహకులు భోజన వసతి కల్పించారు.

దర్శనానికి వెళ్తున్న భక్తులు

చిన్నారుల బడి.. నైపుణ్యాల జడి

ప్రత్యేక కిట్లతో వినూత్న బోధన

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పిల్లల్లో విద్యా నైపుణ్యాలు, సామాజిక, భావోద్వేగ, అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ 'జాదుయి పిటారా(మాయా పెట్టె)' కిట్ల కార్యక్రమాన్ని ప్రారంభించింది. పిల్లలు సరదాగా అభ్యసించేందుకు, ప్రోత్సహించేందుకు రూపొందించిన ఒక ఆట ఆధారిత అభ్యాస సామగ్రి ఇది. ఈ పెట్టెలో 62 రకాల వస్తువులు ఉంటాయి. ఎన్‌సీఈఆర్టీ, రాష్ట్ర ప్రభుత్వ చొరవతో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అందిస్తోంది.

ప్రాథమిక పాఠశాలలకు మంజూరు

కర్నూలు జిల్లాలో వెయ్యికి పైగా ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 928 ప్రాథమిక పాఠశాలలు ఉండగా.. అందులో బాలురు 19,698 మంది, బాలికలు 22,670 మంది కాగా మొత్తం మీద 42,368 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ఎక్కువ హాజరున్న ప్రాథమిక పాఠశాలలకు విద్యా సాధనాలను అందించింది. నంద్యాల జిల్లాలో 575 ప్రాథమిక పాఠశాలలకు రూ.54.50 లక్షల విలువ చేసే కిట్లు వచ్చినట్లు విద్యాధికారులు పేర్కొన్నారు. వాటిని 29 మండలాల్లోని ప్రాథమిక పాఠశాలలకు ఇటీవల డీఈవో జనార్దన్‌రెడ్డి అందజేశారు.

ప్రయోజనం ఇలా..

- ఇది పిల్లల్లో జ్ఞానశక్తి, భాషాభివృద్ధి, సంఖ్యా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ఉపకరిస్తుంది. అభ్యాస, బోధనా వాతావరణాన్ని సుసంపన్నం చేసేందుకు, విద్యార్థి కేంద్రీకృత, ఆనందదాయకంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేసింది.
- పిల్లల ఆసక్తికర అభ్యాసానికి అనుగుణంగా ఉండేలా బొమ్మలు, పజిల్స్ ఉపయోగపడతాయి. కథలు చెప్పడం ద్వారా పిల్లల ఊహాశక్తిని, భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు తోలుబొమ్మలు, కథల పుస్తకాలు దోహదం చేస్తాయి.
- ఫ్లాష్‌కార్డులు గుర్తింపునకు, నామకరణం వంటి ప్రాథమిక భావనలను నేర్పించడంలో సాయపడతాయి. పోస్టర్లు, వర్క్ షీట్లు వివిధ అభ్యాస కార్యకలాపాలకు ఉపయోగపడతాయి.

విద్యావిధానం అనుసరించి..

ప్రాథమిక దశలోని పిల్లలకు ఆటల ద్వారా అభ్యసనను అందించడం కార్యక్రమ లక్ష్యం. పజిల్స్, పలు రకాల ఆట వస్తువులు, తోలుబొమ్మలు, పోస్టర్లు, ఫ్లాష్ కార్డులు, కథల పుస్తకాలు, వర్క్ షీట్లు, ప్లేబుక్ తదితరాలు ఉంటాయి. కొత్త జాతీయ విద్యావిధానం ప్రకారం అభ్యాస సామగ్రిని రూపొందించారు.

జిల్లా బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక

పాణ్యం (గ్రామీణం), న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా బాలబాలికల కబడ్డీ జట్లను ఎన్నుకున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మోహనరావు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం తెలిపారు. పాణ్యంలోని విజయానికేతన్ పాఠశాలలో ఆదివారం నంద్యాల జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ విజయ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. జిల్లా నుంచి 250 మంది పాల్గొనగా బాలికలు 18, బాలురు 18 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన బాలికలకు పాణ్యం విజయానికేతన్ పాఠశాలలో, బాలుర జట్టుకు కొలిమిగుండ్ల మండలం చింతలాయపల్లెలో ఈ నెల 6వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు మంత్రాలయంలో అంతర్‌జిల్లాల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు. అసోసియేషన్ సభ్యులు రామేశ్వరరెడ్డి, సురేష్ నాయుడు, రమణ, హరికృష్ణ, మనోహర్, కళాశాల ప్రిన్సిపల్ మురళీధర్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన బాలికల జట్టుతో కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

వీర సైనికుడికి ఘన స్వాగతం

శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

బుగ్గానిపల్లె(బేతంచెర్ల), న్యూస్‌టుడే: మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామానికి చెందిన సైనికుడికి ఆదివారం ఘన స్వాగతం పలికారు. గ్రామానికి చెందిన గుమ్మ శ్రీనివాస్ దేశసేవలో హవల్దారుగా 17 ఏళ్ల సేవలు అందించారు. జమ్మూ కశ్మీర్, బరోడా, పుణె, ఒడిశా తదితర ప్రాంతాల్లో పనిచేశారు. ఆపరేషన్ సిందూర్‌లోనూ పాల్గొన్నారు. ఒడిశాలోని గోపాల్‌పూర్ ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ సెంటరులో అక్టోబర్ 31న పదవీ విరమణ పొందారు. పదవీ విరమణ అనంతరం సొంతూరికి రావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఊరేగించి సన్మానించారు. ఆయన అందించిన సేవలను పలువురు కొనియాడారు.

పిల్లలను దత్తత తీసుకోవచ్చు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: పుట్టగానే తల్లిదండ్రులను కోల్పోయిన వారు, ఉన్నా ఆదరణకు నోచుకోక పొదల్లో పడేసిన వారు.. ఇలా ఎంతో మంది చిన్నారులు అనాథలుగా మారుతున్నారు. ఇలాంటి వారి కోసం ప్రభుత్వం ప్రత్యేక దత్తత కేంద్రాలు నడుపుతోంది. వీటిలో వసతి పొందుతున్న పిల్లలను చట్టబద్ధంగా దత్తత ఇస్తున్నారు. పిల్లలు లేని తల్లిదండ్రులకు ఇది ఒక వరం. చాలామంది దీనిపై అవగాహన లేక సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఇద్దరిని దత్తతగా తీసుకెళ్లినట్లు అధికారులు తెలిపారు.

◆ నంద్యాల పట్టణం పొన్నాపురం కాలనీలో ప్రత్యేక దత్తత కేంద్రం ఉంది. ఇందులో 0-5 ఏళ్లలోపు చిన్నారులు ముగ్గురు ఉన్నారు.

మీ కోసం

అర్హతలు ఇవి..

◆ దత్తత తీసుకునేవారు శారీరక, మానసికంగా ఆరోగ్యవంతులుగా ఉండి బిడ్డను ఉత్తమంగా తీర్చిదిద్దే ప్రేరణ ఉన్నవారై ఉండాలి.
◆ ఆర్థికంగా బిడ్డను పోషించే స్థితిలో ఉండాలి.
◆ దంపతులిద్దరి అంగీకారం తప్పనిసరి. ◆ ఒంటరిగా నివసించే మగ వ్యక్తికి బాలికను దత్తతకు ఇవ్వరు.

ప్రక్రియ ఇలా..

పిల్లలను దత్తత తీసుకోవాలంటే నంద్యాల పట్టణంలోని ప్రత్యేక దత్తత కేంద్రాన్ని సంప్రదించాలి. లేదా వారి వివరాలను సీఏఆర్ఏ.డబ్ల్యూసీడీ.ఇన్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. 1098 నంబరుకు ఫోన్ కూడా చేయవచ్చు. మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులను సంప్రదించి దత్తత పొందవచ్చు.
◆ పిల్లలను రెండు రకాలుగా దత్తత తీసుకోవచ్చు.

పోస్ట్ కేర్: 6నుంచి 18ఏళ్ల పాటు బాగోగులు చూసుకోవడానికి పిల్లలను ఇస్తారు. అనంతరం సంరక్షకులు వారి తల్లిదండ్రులకు పిల్లలను అప్పజెప్పాలి.

పోస్టర్ అడాప్షన్: ఆరేళ్ల పైబడిన పిల్లలను దత్తత ఇస్తారు. రెండేళ్లపాటు బిడ్డను బాగా చూసుకొని పిల్లలపై ప్రేమ పెరిగితే వారికి పోస్టర్ అడాప్షన్ కింద శాశ్వతంగా దత్తత ఇస్తారు.

◆ పసి పిల్లలను పొదల్లో పడేయడంతో వారి శరీర అవయవాలకు గాయాలవుతున్నాయి. ఇలా జరగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. పిల్లలు అవసరం లేని వారు వారిని వదిలి వెళ్లడానికి పట్టణంలోని ప్రత్యేక దత్తత కేంద్రంలో, ప్రభుత్వ ఆసుపత్రిలో, ప్రైమరీ హెల్త్ సెంటర్లలో ఊయలలు ఏర్పాటు చేశారు.

అధికారులను సంప్రదించవచ్చు

- స్వప్న ప్రియదర్శిని, డీసీపీవో, నంద్యాల

పిల్లలను దత్తతకు తీసుకోవాలంటే మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులను సంప్రదించాలి. పిల్లలు వద్దనుకునేవారి కోసం ప్రత్యేక ఊయలలు ఏర్పాటు చేశాం. వాటిలో పిల్లలను విడిచి పెట్టి వెళ్లాలి.

112తో అత్యవసర సాయం: ఎస్పీ సునీల్ షొరాణ్

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : అత్యవసర సమయాల్లో పోలీసుల సాయం కోసం 112 టోల్‌ఫ్రీ నంబరును సంప్రదించాలని ఎస్పీ సునీల్ షొరాణ్ తెలిపారు. నంద్యాల మూడో పట్టణ, ఆత్మకూరు పట్టణం, బ్రాహ్మణకొట్కూరు పోలీసుస్టేషన్ల పరిధిలో నాకాబందీ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. నేరాల నివారణే లక్ష్యంగా అనుమానిత ప్రాంతాలు, రౌడీషీటర్ల ఇళ్లలో ఆదివారం పోలీసు సిబ్బంది విస్తృత సోదాలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 13 ద్విచక్ర వాహనాలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

వీరబ్రహ్మేంద్ర స్వామికి పట్టువస్త్రాల సమర్పణ

మహానంది, న్యూస్‌టుడే: కడప జిల్లాలోని వీరబ్రహ్మేంద్ర స్వామికి మహానంది దేవస్థానం ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డితో పాటు ఉప ప్రధానార్చకులు వనిపెంట జనార్దనశర్మ, వేదపండితులు హనుమంతరాయ శర్మ, అర్చకులు సుబ్బయ్య పట్టువస్త్రాలు సమర్పించారు. బ్రహ్మంగారి జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఆలయ సంప్రదాయం ప్రకారం పట్టువస్త్రాలను తీసుకెళ్లారు. అక్కడి మఠం ప్రతినిధి ఈశ్వరాచారి స్వాగతం పలికారు. అనంతరం స్వామికి వస్త్రాలను అలంకరించారు. మహానంది ఈవోను సత్కరించారు.

భూషణ వికాస.. శ్రీధర్మపుర నివాస

అలరించిన నృత్య ప్రదర్శన

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ, అంతర్జాతీయ స్థాయి నవనారసింహుల నృత్య ఉత్సవాలు అలరించాయి. కేంద్ర సాంస్కృతిక, రాష్ట్ర భాష, సాంస్కృతికశాఖ సహకారంతో శ్రీసాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు 250 మంది కళాకారులు నృసింహ స్వామిని స్తుతిస్తూ ఆదివారం నాట్య ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, ఉత్సవ డైరెక్టర్ డా.పల్లెంశెట్టి సురేష్, అహోబిలం కృష్ణదేవరాయ, బలిజ, కాపు, తెలగ అన్నదాన సత్రం అధ్యక్షుడు శెట్టి విజయ్‌కుమార్, కథాకళి నాట్య గురువు అంఘసుమన్ గుప్తా, హైదరాబాద్ కూచిపూడి నాట్య గురువులు శ్రీనివాస్ వరప్రసాద్, సంధ్యాదేవి జంపన, మహేశ్ మంద, వేణుగోపాల్ జోస్యుల(యూఎస్ఏ), సత్యశ్రీ, సూరజ్ పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం)

మార్నీళ్ల చెలిమకు కార్తిక శోభ

బనగానపల్లి మండలంలో ప్రముఖ శైవక్షేత్రం యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయానికి కిలోమీటరు దూరంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో పచ్చని చెట్ల మధ్య మార్నీళ్ల చెలిమలో పురాతన శివాలయం కొలువై ఉంది. ఇక్కడ ప్రాధాన్యమున్న పురాతన కొలను నిర్మితమై ఉంది. ఈ కొలను అన్ని కాలాల్లోనూ ఇంకిపోకుండా భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. సాక్షాత్తూ పార్వతిదేవి అమ్మవారు స్నానమాచరించినట్లు పెద్దలు చెబుతుంటారు. యాగంటి క్షేత్రానికి వచ్చే భక్తులు మార్నీళ్ల చెలిమను సందర్శిస్తుంటారు. కార్తికమాసం, శివరాత్రి సమయంలో అన్నదానం ఉంటుంది. ప్రస్తుతం కార్తిక మాస పూజలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. - న్యూస్‌టుడే, యాగంటి (బనగానపల్లి గ్రామీణం)

పార్వతిదేవి అమ్మవారు

పురాతన కోనేరు

తెదేపాతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర సగర కార్పొరేషన్ ఛైర్మన్ వెంకట రమణప్ప పేర్కొన్నారు. పట్టణంలోని సగర సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పరి సురేష్ కుమార్ ఇంటికి ఆయన శుక్రవారం వచ్చారు. సగర సంఘం నాయకులు వెంకట రమణప్పను సన్మానించి అనంతరం వినతిపత్రం అందజేశారు.

వెంకట రమణప్పకు వినతిపత్రం అందజేస్తున్న సగర సంఘం నాయకులు

ఆయన మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. నంద్యాలలో భగీరథ మహర్షి విగ్రహ ఏర్పాటు, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. సగర కులస్థులకు కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించి ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బాలాజీ, హరికిరణ్, చిన్నయ్య, శివకాంత్, గురుప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పనిచేయండి

బేతంచెర్ల, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలందరూ ఐక్యమత్యంగా పనిచేయాలని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వైకాపా కార్యాలయంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ ఛైర్మన్ చలంరెడ్డితో పాటు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు, నాయకులకు వివిధ సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం పట్టణంలోని కోటపేట, చాకలిపేట, తహసీల్‌పేట కాలనీల్లో పర్యటించారు. కాలనీల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు మూర్తుజావలి, బుగ్గన చంద్రారెడ్డి, కోడె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

కాలనీ వాసులతో మాట్లాడుతున్న బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

అంధుల పాఠశాలకు బియ్యం వితరణ

బనగానపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాదులో ప్రముఖ కంటి వైద్యుడు పద్మశ్రీ సాయిబాబా గౌడు నిర్వహిస్తున్న దేవనార్ అంధుల పాఠశాలకు 200 బియ్యం బస్తాలు, వైఎస్సార్ కడప జిల్లా సిద్ధవటం లోని పరమాత్మ సేవా తపోవనం అనాథ ఆశ్రమానికి 20 బియ్యం బస్తాలు విరాళంగా ఇస్తున్నట్లు బనగానపల్లి మాజీ సర్పంచి బీసీ రాజారెడ్డి తెలిపారు. రాజారెడ్డి మాట్లాడుతూ..తన తల్లిదండ్రులు బీసీ గుర్రెడ్డి, లక్ష్మమ్మ జ్ఞాపకార్థంగా రూ. 6.20 లక్షలు విలువ చేసే బియ్యాన్ని లారీలో ఆయా ఆశ్రమాలకు తరలించినట్లు తెలిపారు. డాక్టర్ సాయిబాబాగౌడు 32 ఏళ్ల నుంచి అంధులను చేరదీస్తున్నారన్నారు. ఆయన చేస్తున్న సేవలను గుర్తించి తాను ఈ బియ్యాన్ని ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు టంగుటూరి శీనయ్య, వంగల పరమేశ్వరరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, బురానుద్దీన్ పాల్గొన్నారు.

జెండా ఊపి లారీని పంపుతున్న బీసీ రాజారెడ్డి

ఎట్టకేలకు ఎంపీడీవోలకు పోస్టింగ్స్

కర్నూలు జడ్పీ, న్యూస్‌టుడే : ఎంపీడీవోలకు స్థానాలు కేటాయిస్తూ ఆదివారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. రెండు నెలల క్రితం ఏవోలకు ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పించారు. పాలకవర్గం పోస్టింగులు ఇవ్వలేదు. ముగ్గురు ఎంపీడీవోలతోపాటు మరో ఇద్దరికి తాజాగా మండలాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దస్తగిరిబాబును కొలిమిగుండ్లకు, నాగరాజును బనగానపల్లికి, రామకృష్ణవేణిని అవుకు, ఎస్ఎం బాషాను కోసిగికి, నాగఅనసూయను ఓర్వకల్లు ఎంపీడీవోగా నియమించారు.

అన్నదమ్ములు.. ఆటల్లో అదుర్స్!

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: పిల్లలను కేవలం చదువుకు మాత్రమే పరిమితం చేయకుండా వారికి ఇష్టమైన ఇతర రంగాల్లోనూ ప్రోత్సహిస్తే చక్కటి గుర్తింపు తెచ్చుకొని ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు వేస్తారు. ఇదే మార్గంలోనే ఆ విద్యార్థుల తల్లిదండ్రులు ముందుకు సాగుతున్నారు. తమ ఇద్దరి కుమారులను చదువుతోపాటు వారికి ఇష్టమైన తైక్వాండో, యంగ్ మూడో ఆటల్లో ప్రోత్సహిస్తున్నారు.

అంతర్జాతీయ స్థాయి పతకాలే లక్ష్యంగా..

కోవెలకుంట్లలోని యూనియన్ బ్యాంకులో సహాయ మేనేజర్‌గా పనిచేస్తున్న సోమశేఖర్ రెడ్డి, సురేఖ దంపతులకు హర్షిత్‌రెడ్డి, హేమచంద్రారెడ్డి సంతానం. స్థానిక ప్రైవేటు పాఠశాలలో హర్షిత్‌రెడ్డి నాలుగు, హేమచంద్రారెడ్డి ఐదో తరగతి చదువుతున్నారు. తల్లిదండ్రులు వీరిని చదువుతోపాటు ఇతర రంగాల్లో ప్రోత్సహిస్తున్నారు. ఒకవైపు చక్కగా చదువుకుంటూ ఆటల్లోనూ సత్తాచాటి వివిధ స్థాయిల్లో ప్రతిభను ప్రదర్శించి విజయాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఆడి పతకాలు సాధించాలని లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు ఈ అన్నదమ్ములు.

హేమచంద్రారెడ్డి సాధించిన విజయాలు

- 2021లో కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి తైక్వాండోలో స్వర్ణ పతకం సాధించాడు.
- 2022లో విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచాడు.
- 2023లో ఆదోనిలో జరిగిన రాష్ట్రస్థాయి యంగ్‌మూడోలో బంగారు పతకం కైవసం చేసుకున్నాడు.

హర్షిత్‌రెడ్డిని వరించిన పతకాలు

- 2024 నవంబర్‌లో కోవెలకుంట్లలో జరిగిన రాష్ట్రస్థాయి యంగ్‌మూడో పోటీల్లో బంగారు పతకం సాధించాడు.
- 2024 డిసెంబర్‌లో ముంబయిలో జరిగిన జాతీయస్థాయి యంగ్‌మూడోలో ద్వితీయ స్థానంలో నిలిచాడు.
- 2025 జనవరిలో తిరుపతిలో జరిగిన అంతరాష్ట్ర యంగ్‌మూడో పోటీల్లో స్వర్ణ పతకం పొందాడు.

మనస్తాపంతో రైతు ఆత్మహత్య

ఇందిరేశ్వరం(ఆత్మకూరు పట్టణం), న్యూస్‌టుడే: మండలంలోని ఇందిరేశ్వరం గ్రామానికి చెందిన రైతు శంకరయ్య(60) మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. శంకరయ్య గ్రామంలో తనకున్న నాలుగెకరాల పొలంలో వరి సాగు చేస్తున్నారు. మొంథా తుపాను కారణంగా పంట నేలకొరిగింది. రూ.లక్షలు పెట్టుబడి పెట్టానని.. అప్పులపాలవుతాననే దిగులు చెందేవాడన్నారు. ఈ క్రమంలో ఈ నెల 1వ తేదీన పురుగుల మందు తాగగా.. కుటుంబ సభ్యులు ఆయన్ను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. మృతుడి కుమారుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ రాము వెల్లడించారు.

అన్నదాత బలవన్మరణం

అవుకు, న్యూస్‌టుడే: అప్పుల బాధతో ఉరేసుకొని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన కొండమనాయునిపల్లెలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..గ్రామానికి చెందిన కె.వెంకటన్న(60) వ్యవసాయం, మేకల పెంపకం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సుమారు రూ.3 లక్షల వరకు అప్పులు చేశారు. అప్పులను తీర్చే మార్గం లేక గ్రామం శివారులో చెట్టుకు ఉరేసుకున్నారు. స్థానికులు గమనించి అవుకు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

వెలుగోడు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడిని వెలుగోడు పట్టణానికి చెందిన బట్టు కిరణ్ (38)గా గుర్తించారు. కిరణ్ ఈ నెల 1వ తేదీ రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించామని మృతుని సోదరుడు చెన్నయ్య తెలిపారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు.

నల్లమల అడవిలో లారీ, బస్సు ఢీ

గాజులపల్లె (మహానంది), న్యూస్‌టుడే: మహానంది మండలం నల్లమల అడవిలోని ఘాట్‌రోడ్డులో ఆదివారం ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు, లారీ ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. ఆర్టీసీ బస్సు నంద్యాల వైపు నుంచి ప్రకాశం జిల్లా గిద్దలూరుకు వెళుతుండగా.. లారీ గిద్దలూరు నుంచి నంద్యాల వైపునకు లోడుతో వస్తోంది. ఈ ఘటనలో బస్సు వెనుకభాగం దెబ్బతింది. వెనుక సీటులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న రహదారి భద్రతా విభాగం, మహానంది పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దెబ్బతిన్న బస్సు వెనుక భాగం

EENADU Classifieds

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS

రవికిరణ్ ఎంటర్ ప్రైజెస్ పెన్నార్ మినరల్ వాటర్ బాటిల్స్ 1 లీటరు, Half లీటరు బాటిల్స్ జిల్లా వ్యాప్తంగా పంపిణి చేయుటకు డిస్ట్రిబ్యూటర్స్, డీలర్స్ కావలెను. సంప్ర: 94915 90112.

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

MARRIAGE SERVICES

మనోజ్ఞ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. మా ప్రత్యేకత రెడ్డి కులాల వారికి పెళ్లి సంబంధాలు చూడబడును. ఆసక్తి గల వారు సంప్ర: 94900 04404.

JOBS

వాంటెడ్ సిస్టర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్, డ్యూటీ డాక్టర్స్, ఫార్మసిస్ట్, హాస్పిటల్ మేనేజర్, రిసెప్షనిస్టు కావలెను. శ్రీ గాయత్రి హాస్పిటల్స్, కొత్తబస్టాండు దగ్గర, కర్నూలు. ✆ 08518-256664.

FACULTY/ TEACHERS

Wanted Science & Computer Science Teachers with B.Ed. Qualification for well known Upper Primary School. English Fluency is Must. ✆ 83095 95455, 96662 84139. Kurnool.

SECURITY GUARDS

ఉలిందకొండలోని హోటల్ నందు పనిచేయుటకు అనుభవం గల సెక్యూరిటీ గార్డులు కావలెను. 12 గం॥ డ్యూటీ, 16,500/- జీతం, వయస్సు 25-50. సంప్ర: 91829 64173.

EENADU THE WAY CLASSIFIEDS
అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ఉసిరి భక్తి

కార్తిక మాసాన్ని పురస్కరించుకొని నంద్యాలకు చెందిన చిత్రకారుడు ఉసిరి కాయలపై గీసిన ఆధ్యాత్మిక చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. మైక్రో ఆర్టిస్ట్ రెండు గంటల సమయంలో వీటిని వేసినట్లు తెలిపారు. ఉసిరి చెట్టు కింద దీపాలు వెలిగించి భక్తులు పూజ చేస్తున్నట్లు, శివలింగం, శివాలయం, మహిళలు కార్తిక దీపాలు నదిలో వదిలి మొక్కుతున్నట్లు గీసినట్లు చెప్పారు. వీటిపై దీపాలు వెలిగించారు.
– న్యూస్‌టుడే, నంద్యాల పాతపట్టణం

నంద్యాల

•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

ఆలయంలో పూజలు

పాణ్యం గ్రామీణం: మండలంలోని ఎస్.కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు దీపాలు వెలిగించారు. కోవెలకుంట్లకు చెందిన చంద్రశేఖర్, తులశమ్మ దంపతుల కుమారులు సాయి సుబ్రహ్మణ్యం, సుమంత్ అన్నదాన సత్రానికి రూ.40 వేలు విరాళంగా అందజేసినట్లు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ?: రఘునాథ్ కేంద్రం నుంచి సంతమార్కెట్‌కు వెళ్లే మార్గంలో పైపు లైను వాల్వ్ లీకై రహదారి బురదమయమవుతోంది. **- షాకీర్, స్థానికుడు**

?: ఇస్లాంపేటలో పెద్ద కబేళాకు వెళ్లే మార్గంలో ఉన్న వీధి దీపం వెలగటం లేదు. రాత్రి సమయంలో చీకటిలో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. **- ముర్తుజా, వ్యాపారి**

✔: వాల్వ్, వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. **- షాహీర్‌బాషా, పురపాలక ఏఈ**

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: ?:పట్టణంలోని ఉప్పరిపేటలోని కాలువ వ్యర్థాలతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. **- సురేష్, స్థానికుడు**

?:సుంకులమ్మ వీధిలో దోమల బెడద అధికమైంది. **- శివ**

?: తెలుగుపేటలో కాలువలు సరిగా శుభ్రం చేయడం లేదు. దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. **- మంజు**

?: భగత్‌సింగ్ కాలనీలో కుక్కల బెడద అధికమైంది. **- శ్రీనివాసులు**

✔: సిబ్బందిని పంపి కాలువలు శుభ్రం చేయించి, స్ప్రే, ఫాగింగ్ చేయిస్తాం. త్వరలోనే కుక్కలను పట్టించి సమస్య పరిష్కరిస్తాం. **- లక్ష్మీనారాయణ శర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పాణ్యం గ్రామీణం: ?: పాణ్యం బస్టాండు సమీపంలో బనగానపల్లె రహదారిలో మురుగు కాల్వలు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నాం. **- రాజేశ్వరి, స్థానికురాలు**

✔:మురుగు కాల్వల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. **- ఆనందరావు, పంచాయతీ కార్యదర్శి, పాణ్యం**

పోటీ పరీక్షలతో విద్యార్థుల సృజనకు పదును

చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న కేశవరెడ్డి పాఠశాల విద్యార్థులు

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రసాద్

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: పోటీ పరీక్షలు విద్యార్థుల సృజనకు పదును పెడతాయని కేశవరెడ్డి విద్యాసంస్థల అధినేత ఎన్.కేశవరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్‌లోని కేశవరెడ్డి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని బొమ్మలు గీశారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన మెహిత్, విశ్వదీప్‌రెడ్డి, సుష్మలకు పాఠశాల ఏవో ఎంఆర్ ప్రసాద్ బహుమతులు అందజేశారు.

కోట జడ్పీ పరిషత్ ఉన్నత పాఠశాలలో చిత్రాలు గీస్తున్న విద్యార్థులు

బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు

నందికొట్కూరు: కోట జడ్పీ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని చిత్రాలు గీశారు. రామచరణ్ నాయుడు, అలేఖ్య, షహెదా ధులు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వారికి ప్రధానోపాధ్యాయిని కౌసల్య, ఉపాధ్యాయులు సాలమ్మ, మల్లికార్జునరెడ్డి, సరిత, వెంకటేశ్వర్లు, ఈశ్వరయ్య, పీడీ శ్రీనాథ్‌లు బహుమతులు అందజేశారు.

కాల్వల కబ్జా

★ నంద్యాల పట్టణంలో ప్రజల ఇబ్బందులు

సంజీవనగర్ గేట్ వద్ద కాల్వను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో మురుగు కాల్వల ఆక్రమణలు పెరిగిపోయాయి. అన్ని ప్రధాన కాల్వలను దుకాణదారులు, వ్యాపారులు ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా కాల్వల్లోని మురుగు, చెత్త రహదారులను ముంచెత్తుతోంది. ఇళ్లు, దుకాణాల్లో చేరుతుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధాన కాల్వలపై బండలు, సిమెంటు కాంక్రీటు వేసి మూసివేయడంతో ఈ ఇబ్బంది ఎదురవుతోంది.

● నంద్యాల పట్టణంలో ప్రధాన కాల్వలు 16 కి.మీ., మధ్య తరహావి 24 కి.మీ., చిన్నవి 126 కి.మీ. మేర ఉన్నాయి. వీటిలో 80 శాతంపైగా కబ్జాకు గురయ్యాయి. భవన, దుకాణ యజమానులు కాల్వలపై నుంచి మెట్లు, ర్యాంపులు వంటివి సిమెంటుతో నిర్మిస్తున్నారు.

చర్యలు చేపట్టని అధికారులు

పట్టణంలో ప్రధాన కాల్వలన్నీ ఆక్రమణకు గురయ్యాయి. వీటిపై గతంలో నోటీసులిచ్చినా రాజకీయ నాయకుల జోక్యంతో పురపాలక అధికారులు చర్యలు తీసుకోలేదు. అనుమతులు లేకుండా పేదలు ఇళ్ల నిర్మాణాలకు పునాదులు వేస్తే అడ్డుకుంటున్న పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు.. ప్రధాన కాల్వలపై ఉన్న ఆక్రమణలను మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ప్రజలు తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చినా, వెంటనే స్పందించి వాటిపై చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఈ ప్రాంతాల్లో..

పట్టణంలోని పద్మావతినగర్, సంజీవనగర్, శ్రీనివాస సెంటర్, గాంధీచౌక్, బైర్మల్ వీధి, బంగారు అంగళ్లవీధి, టెక్కె, సాయిబాబానగర్, ఎస్బీఐ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, బొమ్మలసత్రం తదితర ప్రాంతాల్లో కాల్వలను ఇష్టానుసారం ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. చిన్నపాటి వర్షానికి ఈ ప్రాంతాలను మురుగు ముంచెత్తుతోంది. ఈ ప్రాంతాల్లో ఆటో స్పేర్స్, గార్మెంట్స్, పెయింట్స్, గిఫ్ట్స్ ఫర్నిచర్, నిత్యావసరాలు, చీరల దుకాణాలు ఉండడంతో వ్యాపారులు రూ.లక్షల్లో నష్టపోతున్నారు. కాల్వల్లో అడ్డంకులు ఏర్పడి మురుగు రోడ్లపైకి పొంగి ప్రజల ఆరోగ్యాన్ని సైతం దెబ్బతీస్తోంది. కాల్వలపై నిర్మించిన ఆక్రమణలు తొలగించి, కొత్త కాల్వలను నిర్మించడంతోపాటు సరైన నిర్మాణ పద్ధతులు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పూజలో పాల్గొన్న పండితులు

మహానందీశునికి నిత్యకల్యాణ సేవ

మహానంది: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం మహానందిలో దేవస్థానం ఆధ్వర్యంలో గంగా కామేశ్వరీ దేవి సమేత మహానందీశ్వర స్వామి వార్లకు నిత్యకల్యాణ సేవను ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, అర్చకులు జనార్దన్‌లు గణపతిపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, మాంగల్యధారణ, తలంబ్రాల వంటి కార్యక్రమాలు జరిపించారు.

జిల్లా స్థాయి పోటీలు నేడు

నంద్యాల పాత పట్టణం: ఉమ్మడి జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్, చదరంగం అండర్-14, 17 పోటీలు సోమవారం స్థానిక నంది బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా కార్యదర్శులు విశ్వనాథ్, ఆశాజ్యోతి ఆదివారం తెలిపారు. బ్యాడ్మింటన్‌లో జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 5 నుంచి తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. చదరంగం పోటీలు 7న జోగంపేట మన్యంలో నిర్వహిస్తారన్నారు.

రోడ్డు పక్కనే గుంత.. వాహనదారుల చింత

నంద్యాల పట్టణంలో నుంచి నందమూరినగర్‌కు వెళ్లే దారిలో కాలువలు లేక రోడ్డుపైనే నీరు నిలిచింది. నందమూరినగర్, వైఎస్సార్‌నగర్ నుంచి నీరు కుందూ నదిలోకి వెళ్లేలా ప్రధాన రహదారి పక్కనే గుంత తీశారు. కాలువ తీసిన చోట ఎలాంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదు. రద్దీ రహదారి కావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

పైపులైన్ లీకేజీ.. తాగునీటి వృథా

నంద్యాల పట్టణం నౌమాన్‌నగర్ నుంచి కేంద్ర ప్రభుత్వ గిడ్డంగులకు వెళ్లే ప్రధాన రహదారిలో పైపులైన్ లీకేజీ కారణంగా నీరు వృథా అవుతోంది. రెండు నెలలుగా పైపులైన్ లీకై రహదారిపై పారుతోంది. దీంతో ఈ దారిలో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

నీరు నిలిచి.. ప్రమాదకరంగా మారి

నంద్యాల పట్టణం తిటిదే రోడ్డు నుంచి నేషనల్ కళాశాలకు వెళ్లే దారి గుంతలు తేలి ప్రమాదకరంగా మారింది. వర్షాలు కురవడంతో నీరు నిలిచి గుంతల లోతు తెలియడం లేదు. ఈ దారిలో ప్రయాణిస్తూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

సిమెంటు దారి.. రెండుగా చీలి

పట్టణ శివారులో దుద్యాల రస్తా నుంచి ఆర్డీటీ కాలనీకి వెళ్లే సిమెంటు రహదారి మధ్యలో రెండుగా చీలిపోయింది. నిర్మాణ సమయంలో నిబంధనలు పాటించకపోవడంతో నాణ్యత లోపించింది. దారి ఆరంభం నుంచి చివరి వరకు చీలిక ఏర్పడింది. ఈ మార్గంలో ఆర్డీటీ కాలనీ, డిగ్రీ కళాశాల విద్యార్థులు, దుద్యాల లే అవుట్ కాలనీ ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పలువురు ద్విచక్ర వాహనదారులు కిందపడిన ఘటనలు ఉన్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆత్మకూరు పట్టణం

సంక్షిప్త సమాచారం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై ఎస్‌డీపీఐ పార్టీ పోరాడుతుందని ఆ పార్టీ 6 వార్డు బ్రాంచ్ అధ్యక్షుడు హుస్సేన్, ప్రధాన కార్యదర్శి వసీం అక్రమ్ అన్నారు. పట్టణంలోని 6వ వార్డు జగజ్జననీనగర్‌లో ఆదివారం ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో 'మన వార్డు-మన బాధ్యత' కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ప్రజలు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: పట్టణంలో పలు ఆలయాల్లో తులసీ దామోదర కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సంజీవనగర్ రామాలయంలో భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో తులసీ దామోదర కల్యాణం జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: నంద్యాల విజయ పాల డైరీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని ఆళ్లగడ్డ తాలుకా పాల సొసైటీల అధ్యక్షులు, రైతులు ధర్నా చేపట్టారు. ఆదివారం నంద్యాలలోని విజయ పాల డైరీ వద్ద పెద్దఎత్తున రైతులతో కలిసి నిరసనకు దిగారు. డైరీలో ఛైర్మన్, డైరెక్టర్లు తమకు నచ్చినట్లు వ్యవహరిస్తున్నారని, వీరిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఆళ్లగడ్డ ఏరియాలో సొసైటీలను రద్దు చేసి వారికి నచ్చిన సొసైటీలకు మాత్రమే ఎన్నికలు జరపాలని చూస్తున్నారన్నారు. డిసెంబర్‌లో జరగబోయే ఎన్నికలు న్యాయబద్ధంగా జరపాలని కోరారు.

నందిపల్లె (మహానంది), న్యూస్‌టుడే: మహానంది మండలం నందిపల్లె గ్రామానికి చెందిన దివ్యాంగుడు డక్కా పెద్దహుస్సేనికి మండల జనసేన నాయకులు రూ.10 వేల విలువైన నిత్యావసర వస్తువులను అందజేశారు.

శ్రీశైలం అభివృద్ధికి సహకరిస్తాం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: శ్రీశైలం దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. ఇటీవల శ్రీశైలం దేవస్థానం బోర్డు సభ్యుడిగా నియమితులైన చిట్టిబొట్ల భరద్వాజశర్మ ఆదివారం మంత్రిని మర్యాదపూర్వకంగా ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి సన్మానించారు. ఇరువురు క్షేత్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై చర్చించారు.

మంత్రి ఫరూక్‌ను సన్మానిస్తున్న భరద్వాజశర్మ

ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా శ్రీశైలంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ ఆదివారం చర్యలు చేపట్టారు. శ్రీశైలం మహాక్షేత్రానికి ఆది, సోమ వారాల్లో భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఈ నేపథ్యంలో వారికి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. సాక్షి గణపతి ఆలయం నుంచి శ్రీశైలంలోని పలు ప్రాంతాల్లో పోలీసులకు విధులను కేటాయించి వాహనాలను పార్కింగ్ ప్రదేశాల్లో నిలుపుదల చేసేలా వారికి సూచనలు చేశారు. ఆయన వెంట సున్నిపెంట సీఐ చంద్రబాబు ఉన్నారు.

పోలీసులకు సూచనలిస్తున్న డీఎస్పీ రామాంజినాయక్

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

నంద్యాల విద్య, న్యూస్‌టుడే: సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యుడు సాంబశివుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. నాయకులు గోపాల్‌రావు, జయరాం, పుల్లయ్య, రవి, మునిస్వామి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేస్తే చర్యలు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడితే రూ.5వేలు జరిమానా విధిస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలో ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 30మంది మైనర్లను గుర్తించి వారికి రూ.5వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. అనంతరం వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు చెప్పారు.

కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా

చదరంగంతో ఏకాగ్రత

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: చదరంగం ఏకాగ్రతను పెంచుతోందని జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డా.రవికృష్ణ అన్నారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం జిల్లాస్థాయి ఓపెన్ చదరంగం టోర్నమెంట్ నిర్వహించారు. వైద్యుడు డా.గెలివి సహదేవుడు, టోర్నమెంట్ నిర్వాహకులు ఆత్మకూరు సుదర్శనంశెట్టి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ..విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, కళల్లో రాణిస్తే వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తాతిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కోశాధికారి జనార్దన్, సభ్యులు వెంకటరావు, చంద్రశేఖర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న డా.రవికృష్ణ

పెట్రోలు కల్తీ చేశారని ఆందోళన

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని భారత్ పెట్రోలు బంకు వద్ద వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం రాత్రి నుంచి పెట్రోలులో నీళ్లు కలిశాయని, తాము యజమాని దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఆదివారం ఉదయం పెద్దఎత్తున వినియోగదారులు పెట్రోలు బంకు వద్దకు చేరుకున్నారు. నీళ్లు కలిసిన పెట్రోలు కారణంగా తమ వాహనాలు మరమ్మతులకు గురయ్యాయని వాపోయారు. విషయం తెలుసుకున్న ఆత్మకూరు అర్బన్ సీఐ రాము పెట్రోలు బంకు యజమాని మోమిన్ షర్ఫుద్దీన్‌ను పోలీసు స్టేషనుకు పిలిపించి వివరాలు తెలుసుకున్నారు. మరమ్మతులకు గురైన ద్విచక్ర వాహనాలకు బాగు చేయించాలని బంకు యజమానికి సూచించారు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ తెలిపారు.

ముమ్మరంగా పంట నష్టం నమోదు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: పంట నష్టం నమోదు ప్రక్రియను ముమ్మరంగా చేపట్టినట్లు ఏవో పవన్‌కుమార్ తెలిపారు. మొంథా తుపాను కారణంగా మండలంలో 4125 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించామన్నారు. కలెక్టరు రాజకుమారి గణియా ఆదేశాల మేరకు.. ఇప్పటివరకు 3,121 ఎకరాలను నమోదు చేసినట్లు చెప్పారు.

తండ్రి అడుగు జాడల్లోనే పిల్లలు

☛ నాన్న తెలుగు మాస్టారు, పిల్లలు ఉర్దూ ఉపాధ్యాయులు

పిల్లలతో బాలస్వామి

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆయన ఓ ప్రభుత్వ ఉద్యోగి. తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. వృత్తిని దైవంగా భావించారు. తన పిల్లలనూ అదే వృత్తిలో రాణించాలనుకున్నారు. వృత్తిపై వారిలో మనోధైర్యం నింపారు. వారిని ప్రాథమిక విద్య నుంచే మానసికంగా సిద్ధం చేశారు. తాను తెలుగు ఉపాధ్యాయుడైనప్పటికీ పిల్లలకు ఉర్దూ భాషను ఎంపిక చేశారు. అందులోనే శిక్షణ ఇప్పించారు. వారికి వెన్నుదన్నుగా నిలిచారు. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దారు.

● ఆత్మకూరు పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన వంగలి బాలస్వామి. స్థానిక సెంట్రల్ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. తన ముగ్గురు పిల్లలకు నాలుగో తరగతి నుంచే ఉర్దూ భాషలో శిక్షణ ఇప్పించారు. ప్రారంభంలో వారు అక్షరాలు, పదాలు నేర్చుకోవడానికి ఇబ్బంది పడ్డారు. వారిలో స్ఫూర్తి నింపారు. పట్టువీడని విక్రమార్కుడిలా పిల్లలను ఉర్దూలోనే టీటీసీ పూర్తి చేయించారు.

ఒకే పాఠశాలలో అక్క, తమ్ముడు

ముగ్గురు పిల్లలు తండ్రి నమ్మకాన్ని వమ్ము చేయలేదు. పట్టుదలతో ముందుకు సాగారు. చివరికి ఎస్జీటీ విభాగంలో కొలువులు సాధించారు. చిన్న వయసులోనే ముగ్గురు ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. పెద్ద కుమార్తె మౌనిక 2018లో ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం ఆత్మకూరు మండలంలోని అమలాపురం ఉర్దూ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. రెండో కుమార్తె సారా పింకి, కుమారుడు సామేల్ రాజ్ ఇటీవల డీఎస్సీతో ఉద్యోగులుగా నియమితులయ్యారు. ఇద్దరు తుగ్గలి మండలంలోని హుసేనాపురం ఉర్దూ పాఠశాలలో పని చేస్తున్నారు.

సమాధుల వద్ద ప్రార్థనలు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: తమ పెద్దలను స్మరించుకుంటూ సమాధులను పూలతో అలంకరించి క్రైస్తవులు పూజలు నిర్వహించారు. ఆదివారం నందికొట్కూరు సీఎస్ఐ పునరుత్థాన ఆలయం ఫాదర్ సమాధుల వద్ద పేర్లను స్మరిస్తూ, వారి పవిత్ర ఆత్మ దేవుని సన్నిధిలో ఉంటుందని పూజలు చేయించారు. సీఎస్ఐ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నంద్యాల గాంధీచౌక్: నంద్యాల పట్టణంలోని సీఎస్ఐ, ఆర్‌సీఎం, ఇతర చర్చిల ఆధ్వర్యంలో ఆదివారం సమాధుల పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సమాధుల తోటకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నంద్యాలలో సమాధుల వద్ద క్రైస్తవులు

జీవితాన్ని వ్రతంలా సాగించాలి

మాట్లాడుతున్న ఇస్కాన్ టెంపుల్ ధర్మ ప్రచారకులు కీర్తిరాజదాస్ స్వామి, పక్కన తితిదే ధర్మ ప్రచారకులు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: జీవితాన్ని ఒక వ్రతంలా కొనసాగించినప్పుడే జీవితం ఆనంద నందనవనం అవుతుందని ఇస్కాన్ టెంపుల్ ధర్మ ప్రచారకుడు కీర్తిరాజదాస్ స్వామి పేర్కొన్నారు. ధార్మిక సప్తాహంలో భాగంగా పట్టణంలోని కోటా వీధిలోని మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం ద్వాదశి విశిష్టత, చాతుర్మాస్య ప్రభావం గురించి భక్తులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ.. యాంత్రికమైన జీవనంతో మనిషి రోగాల పాలవుతాడని, జీవనాన్ని కూడా ఒక వ్రతంలా సాగించాలన్నారు. కార్యక్రమంలో తితిదే ధర్మ ప్రచారకులు మల్లు వెంకటరెడ్డి, భక్తులు, వక్తలు పాల్గొన్నారు.

రెవెన్యూ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

నూతన కార్యవర్గ సభ్యులు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ అసోసియేషన్ ఎన్నిక ఆత్మకూరు రెవెన్యూ కార్యాలయం వద్ద ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడిగా డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, ఉపాధ్యక్షుడు, కార్యదర్శులుగా డిప్యూటీ తహసీల్దార్లు అరుణ, సత్యనారాయణ, ఆంజనేయులు, ఇతర సభ్యులను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. డివిజన్‌లోని ప్రతి ఉద్యోగికి అండగా ఉంటామని అసోసియేషన్ అధ్యక్షుడు తెలిపారు. ఎన్నికల అధికారులుగా నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పాములపాడు తహసీల్దార్లు శ్రీనివాసులు, చంద్రశేఖర్‌నాయక్, సుభద్రమ్మలు వ్యవహరించారు.

అభివృద్ధికి నోచుకోని పల్లెలు

☛ పట్టించుకోని అధికారులు

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని గ్రామాల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా కనీస మౌలిక వసతులు సమకూరడం లేదు. ఎంత మంది పాలకులు, అధికారులు మారుతున్నా పల్లెల్లో తమ సమస్యలు తీరడం లేదని పల్లె ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బురదమయంగా ఎం.లింగాపురం రహదారి

కనీస సౌకర్యాల్లేవు

కొత్తపల్లి మండలంలోని పలు పంచాయతీల్లో నేటికీ సరైన రోడ్లు, కాలువలు లేవు. ఐదేళ్ల వైకాపా పాలనలో ఒక్క దీర్ఘకాలిక సమస్య పరిష్కారం కాలేదని ప్రజల నుంచి విమర్శలొస్తున్నాయి.

● కొత్తపల్లి మండల కేంద్రం బీసీ కాలనీలోని ఎం.లింగాపురం రహదారిలో మురుగు రోడ్డుపై పారుతోంది. మండల నలుమూలల నుంచి ప్రజలు ఈ మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి సమస్య ఉన్నా కనీసం పట్టించుకున్న వారు లేరని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● శివపురం వద్ద వంతెన నిర్మించకపోవడంతో వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికే 10 గ్రామాల ప్రజలకు ఆత్మకూరు పట్టణానికి రాకపోకలు ఆగిపోతాయి. విద్యార్థులు పాఠశాల, కళాశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెన నిర్మించి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

● ఎదురుపాడు గ్రామంలో మురుగు కాలువలు లేక మురుగు రహదారిపైనే పారుతోంది.

● ముసలిమడుగు, సింగరాజుపల్లి, గువ్వలకుంట్ల, నందికుంట, కొత్తమాడుగుల, పాతమాడుగుల గ్రామాలకు సీసీ రోడ్లు లేవు.

● మిట్టకందాల గ్రామంలోనూ నిత్యం రహదారిపై మురుగు పారుతోంది. ఆ గ్రామంతోపాటు మరో నాలుగు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● కోల్స్ ఆనందాపురంలోకి వెళ్లే వంతెన శిథిలావస్థకు చేరడంతో గ్రామస్థులు రాకపోకలు సాగించేందుకు ఇక్కట్లు పడుతున్నారు.

● ఇస్కాల సమీపంలో భవనాసి వాగు పొంగితే ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి.

● కొత్త సిద్ధేశ్వరం గ్రామానికి నేటికి బస్సు సౌకర్యం లేదు. గ్రామంలో సీసీ రహదారులు లేక రాకపోకలకు గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు.

● పోతులపాడు, చాబోలు గ్రామాలకు వెళ్లే దారి అధ్వానంగా మారడంతో ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నారు.

● పారుమంచాలలో ఇసుక వాగు పొంగితే ఆ గ్రామానికి రాకపోకలు ఆగిపోతున్నాయి. హై లెవెల్ వంతెన నిర్మాణం నత్తనడకన సాగుతోంది.

● అల్లూరు నుంచి వడ్డెమాను వెళ్లే దారిలో వంతెన శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

● మల్యాల, కొణిదేల, శాతనకోట గ్రామాల్లో కాలువలు నిర్మించాల్సి ఉంది.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

భరత్

మహానంది, న్యూస్‌టుడే: మహానంది మండలం గోపవరం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదైంది. ఎస్సై ఎన్.రామమోహన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన యువకుడు తిరువాయిపాటి భరత్ (25) గత నెల 31న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారు. ఆయన తండ్రి వెంకటశేషయ్య ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అగ్నిప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణ శివారులోని క్రాంతినగర్‌లో ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకోవడంతో పక్కనే ఉన్న పొయ్యి నుంచి మంటలు వ్యాప్తి చెంది, ముగ్గురికి గాయాలైనట్లు తాలుకా పోలీసులు తెలిపారు. భాస్కర్ అనే వ్యక్తి శనివారం రాత్రి క్రాంతినగర్‌లోని అక్క మహాలక్ష్మి, బావ తిరుపతయ్య ఇంటికి వచ్చాడు. డబ్బులు ఇవ్వాలని గొడవ పడే సమయంలో భాస్కర్ పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంటానని బెదిరించాడు. పక్కనే వంట చేస్తున్న పొయ్యి నుంచి మంట చెలరేగడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు మంటలను అదుపు చేసి, వారిని జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

(c) eenadu

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రభాకర్‌ను సన్మానిస్తున్న డ్రాయింగ్ టీచర్లు

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, హెల్త్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రతను కల్పించాలని ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, హెల్త్ ఎడ్యుకేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు విజయకుమారి ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, హెల్త్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. విజయకుమారి మాట్లాడుతూ.. 60 ఏళ్ల వయస్సు వచ్చేంత వరకు ఉద్యోగంలో నుంచి తొలగించకుండా కొనసాగించాలని కోరారు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, హెల్త్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. కార్యక్రమంలో సరస్వతి, రామాంజనేయులు, రంగస్వామి, వీరాంజనేయులు, రాజేంద్ర పాల్గొన్నారు.

కౌలు రైతుల ఉద్యమాలను బలపరచాలి

డోన్, న్యూస్‌టుడే: కౌలు రైతుల ఉద్యమాలను బలపరచాలని, ఇందుకోసం ఈనెల 3వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో పెద్దఎత్తున పాల్గొనాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు అన్నారు. ఆదివారం కౌలు రైతుల ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు పాత కౌలు చట్టాన్ని రద్దు చేస్తామని, కౌలు రైతులను ఆదుకుంటామని, కొత్తచట్టం తెస్తామని హామీ ఇచ్చినా పట్టించుకోవటం లేదన్నారు. కౌలురైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ప్రతి రైతుకు అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివరాం, నక్కిశ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో అన్యాయం

బనగానపల్లి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి, రాష్ట్ర నాయకుడు సత్యమన్న విచారం వ్యక్తం చేశారు. అవుకు మెట్ట వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించిన అనంతరం నిరసన చేశారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణను రద్దు చేసి మాలలకు న్యాయం చేయాలన్నారు. రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన 20శాతం రిజర్వేషన్లు ఎస్సీలకు కల్పించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో నాయకులు మద్దిలేటి, మారం నాగరాజు, శివుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరసన చేస్తున్న మాల మహానాడు నాయకులు

నూతన జిల్లా కమిటీ ఎన్నిక

చాగలమర్రి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేయడం జరుగుతుందని సమగ్రశిక్ష జేఏసీ నూతన ఉపాధ్యక్షుడు కొండయ్య తెలియజేశారు. నంద్యాల జిల్లా కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా జేఏసీ ఉపాధ్యక్షులుగా చాగలమర్రి సీఆర్పీ కొండయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని వివరించారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కొండయ్యతో కమిటీ సభ్యులు

కల్వర్టులు.. కలవరపెడుతున్నాయ్!

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక పరిధిలో కాల్వలపై రాకపోకలు సాగించే వీలుగా కల్వర్టులను నిర్మించారు. పలు చోట్ల నాసిరకంగా నిర్మించడంతో కంకర తేలి రంధ్రాలు కన్పిస్తున్నాయి. దీంతో వాహనదారులు కల్వర్టులపై వాహనాలు నడిపేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఏ మాత్రం ఆదమరిచినా కల్వర్టు రంధ్రాల్లో పడి గాయాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. దెబ్బతిన్న కల్వర్టులను మరమ్మతులు చేయడంలో మున్సిపల్ యంత్రాంగం విఫలమైంది.

డోన్ పట్టణంలో వీధుల్లో మున్సిపల్ అధికారులు రూ.లక్షలు వెచ్చించి కాల్వలపై కల్వర్టుల నిర్మాణాలు చేపట్టారు. పలు చోట్ల కంకర తొలగిపోయి ఇనుప చువ్వలు బయటకు తేలి ప్రమాదకరంగా మారాయి. వీటిపై గ్రిల్స్ సైతం ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోతోంది. మరి కొన్ని చోట్ల కాల్వలపై రంధ్రాలుగా ఏర్పడ్డాయి. దీంతో ఆయా కాలనీ ప్రజలు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

కొండపేటలో రంధ్రం పడిన కల్వర్టు

మరమ్మతులు కరవు

◆ కొండపేటలో ప్రధాన రహదారిలో కాల్వపై వేసిన కల్వర్టు అధ్వానస్థితికి చేరింది. నాసిరకంగా పనులు చేపట్టడంతోనే దెబ్బతిని రంధ్రం ఏర్పడింది. మరమ్మతులు చేపట్టేవారే కరవయ్యారు.

◆ తారకరామానగర్‌లో ప్రధాన రహదారిలో కాల్వపై వేసిన కల్వర్టు దెబ్బతింది. చిగురమానుపేట, టీచర్స్‌కాలనీలో పలు చోట్ల కాల్వలపై వేసిన కల్వర్టులు దెబ్బతిని రంధ్రాలు ఏర్పడ్డాయి. మరమ్మతులు చేపట్టాలని ప్రజలు మున్సిపల్ అధికారులకు తెలియజేస్తున్నా ఫలితం లేకుండా పోతోంది.

వాహనదారుల అవస్థలు

◆ పాతపేటలో రైల్వే గేట్ల సమీపంలో ప్రధాన రహదారిలో కల్వర్టుపై గ్రిల్స్ ఏర్పాటు చేసినా కొన్ని నెలలకే దెబ్బతిన్నాయి. గ్రిల్స్ పక్కన రంధ్రాలు ఉండటంతో ద్విచక్ర వాహనదారులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. నెహ్రూనగర్, చిగురమానుపేట తదితర కాలనీల్లోనూ ఇదే స్థితి నెలకొంది.

◆ రైల్వే స్టేషన్ రహదారి పక్కన కాల్వపై ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్‌పై గ్రిల్ ఏర్పాటు చేయలేదు. వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచినా రంధ్రంలో పడే ప్రమాదముంది.

చర్యలు తీసుకుంటాం – ప్రసాద్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్

పట్టణంలో దెబ్బతిన్న కల్వర్టులను గుర్తించి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇంకా ఎక్కడున్నాయో వాటిని సిబ్బందితో గుర్తించి మరమ్మతులు చేయిస్తాం. కొత్త కల్వర్టుల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

చదరంగం పోటీలో విద్యార్థి ప్రతిభ

బోడెమ్మనూరు(ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: నంద్యాల మున్సిపల్ పాఠశాల ఆవరణలో శనివారం నంద్యాల డివిజన్ స్థాయిలో అండర్-14 విభాగంలో చదరంగం పోటీలు జరిగాయి. పోటీల్లో బోడెమ్మనూరు జడ్పీ పాఠశాల విద్యార్థి గణుమహేంద్ర ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శరభారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు వినోద్‌కుమార్ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

బనగానపల్లె గ్రామీణం, న్యూస్‌టుడే: ?: మండలంలోని కృష్ణగిరి మెట్ట సమీపంలో నీటి తొట్టి వద్ద మురుగు చేరి అపరిశుభ్రంగా ఉంది. - భరత్, కాలనీవాసి.

✔: సమస్యను గుర్తించి పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. - బాలాంజనేయులు, ఎంపీడీవో, బనగానపల్లి.

అవుకు, న్యూస్‌టుడే: ?: అవుకులోని మార్కెట్ యార్డ్ వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. - రామాంజనేయులు, అవుకు.

✔: పరిశీలించి అవసరమైన చర్యలు చేపడతాం. - పక్కీరయ్య, ఏఈ, అవుకు.

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ?: అహోబిలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెళ్లే దారిలో మురుగు నిల్వ ఉంది. - నరసింహ, అహోబిలం.

✔: మురుగు తొలగించి, పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. - నూరహాన్, ఎంపీడీవో.

బాచేపల్లె(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ?: ఆళ్లగడ్డ మండలంలోని బాచేపల్లె గ్రామంలో చెత్త సంపద సృష్టి కేంద్రం పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొంది. - బాషా, బాచేపల్లె.

✔: పరిశీలించి పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. - నూరహాన్, ఎంపీడీవో.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ?: పాతపేటలో కార్మిక కార్యాలయం వద్ద మురుగు కాల్వ అధ్వానంగా ఉంది. - శ్రీనివాసులు, పాతపేట.

✔: కాల్వను సరి చేసి పరిశుభ్రం చేయిస్తాం. - సునీల్, ఇన్‌ఛార్జి శానిటరీ అధికారి.

?: పట్టణంలోని నెహ్రూనగర్‌లో ప్రాథమిక పాఠశాల ఎదుట రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. - వెంకటరాముడు, నెహ్రూనగర్.

✔: నిధులు మంజూరైతే మరమ్మతు పనులు చేపడతాం. - సురేష్, మున్సిపల్ ఏఈ.

బనగానపల్లె గ్రామీణం, న్యూస్‌టుడే: ?: మండలంలోని నందివర్గం గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో పారిశుద్ధ్యం లోపించింది. రోగాల బారిన పడుతున్నాం. - రమణ, నందివర్గం.

✔: గ్రామంలోని సమస్యను గుర్తించి చర్యలు తీసుకుంటాం. - గురుప్రసాద్, పంచాయతీ అధికారి, నందివర్గం.

రహదారిపై ధాన్యం.. రాకపోకలకు కష్టం

బనగానపల్లి నుంచి యాగంటి మీదుగా డోన్ పట్టణానికి వచ్చే రహదారిలో మొక్కజొన్న దిగుబడులను రైతులు ఆరబెట్టారు. ఇటీవల వరుసగా కురిసిన వర్షాలకు మొక్కజొన్న పంట కోతకోయటంతో వర్షాలకు తడిచిన ధాన్యాన్ని రహదారిపైనే ఆరబెట్టారు. దారులపైనే రాళ్లను అడ్డుగా పెట్టేస్తున్నారు. రహదారులపై ధాన్యాన్ని ఆరబెట్టడంతో రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గతంలోనూ ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. – న్యూస్‌టుడే, డోన్, బనగానపల్లి

ప్రారంభానికి నోచుకోని కార్యాలయం

కొలిమిగుండ్ల మండలంలోని బెలుంశింగవరం గ్రామంలో ఆరేళ్ల క్రితం రూ.30 లక్షలతో నిర్మించిన పంచాయతీ కార్యాలయం ప్రారంభానికి నోచుకోలేదు. పనులు చేపట్టిన గుత్తేదారుడు చాలా ఆలస్యంగా పనులను పూర్తి చేశాడు. కార్యాలయం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి కార్యాలయాన్ని ప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కొలిమిగుండ్ల

వృథాగా చెత్త సంపద సృష్టి కేంద్రం

ఉయ్యాలవాడ మండలంలోని కాకరవాడ గ్రామమంలో ఉపాధి నిధులతో నిర్మించిన చెత్త సంపద సృష్టి కేంద్రం వినియోగంలో లేక వృథాగా మారింది. గ్రామ శివారులో 2021లో రూ.3.48లక్షలు వ్యయంతో నిర్మించారు. ఇప్పటి వరకు అధికారులు పట్టించుకోలేదు. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తాచెదారాన్ని పంచాయతీ సిబ్బంది రహదారుల వెంట పడేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా కేంద్రాన్ని వినియోగంలోనికి తెచ్చేలా చొరవ చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కాకరవాడ(ఉయ్యాలవాడ)

రహదారికి కోత.. ప్రయాణ చింత

సంజామల మండలంలోని రామభద్రునిపల్లె సమీపంలో రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు తారు రోడ్డు పక్కనే ఉన్న మట్టి కోతకు గురై నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. దీంతో కిలోమీటర్ల మేర రహదారికి గోతులు ఏర్పడ్డాయి. గోతుల ప్రదేశాల్లో వాహనాలు ఎదురుపడితే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సంజామల

ఇసుక మాఫియాను అడ్డుకుంటాం

సమావేశంలో మాట్లాడుతున్న హరికుమార్‌రెడ్డి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లా నుంచి అక్రమంగా ఇసుకను ఆళ్లగడ్డకు తీసుకుని వచ్చి అధిక ధరలకు విక్రయించే బయటి వ్యక్తులు ఆళ్లగడ్డపై విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని తెదేపా మండల కన్వీనరు హరికుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డలో బయటి వ్యక్తులు ట్రాక్టరు ఇసుకను రూ.9 నుంచి రూ.10 వేలకు విక్రయిస్తూ ప్రత్యక్ష దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ఆళ్లగడ్డలోనే ఇసుక డంపులో ట్రాక్టరు ఇసుక రూ.7 వేలకు విక్రయిస్తున్నారని, ప్రజలు ఇక్కడే ఇసుకను కొనుగోలు చేయాలన్నారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు వాసులు ఇక్కడ అక్రమాలకు పాల్పడితే సహించబోమన్నారు. ఆళ్లగడ్డలో ఎక్కువ ధరకు ఇసుక అమ్మితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం పోలీసులు చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు నాగాంజనేయులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ డోన్‌లో ఈ నెల 9వ తేదీన ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి సూర్యప్రతాప్ పేర్కొన్నారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ మండల ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండు చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, ధనుష్, అస్లాం, అక్రమ్, సుశీల్, భరత్, మధు, యశ్వంత్, మహేష్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నృసింహ క్షేత్రం.. సౌకర్యాలు మృగ్యం

కుంగిన ప్రధాన ఆలయం ముందు భాగం

శిరివెళ్ల, న్యూస్‌టుడే: నల్లమల అటవీ ప్రాంతంలో చెంచులక్ష్మి, మహాలక్ష్మి సమేత సర్వ నరసింహ స్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. విజయనగర రాజుల కాలంలో ఆలయ నిర్మాణం జరిగింది. ప్రతి పౌర్ణమికి, స్వాతి రోజున స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరిపించడం ఇక్కడి ఆనవాయితీ. ప్రతి శనివారం ఆలయానికి ఉమ్మడి కర్నూలు జిల్లాతోపాటు వైఎస్సార్ కడప, ప్రకాశం, చిత్తూరు జిల్లాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. 2016, 2018లో కురిసిన వర్షాలకు ఆలయ ముందుభాగంలో రాతి కట్టడం, ధ్వజస్తంభం కూలిపోవడంతో ఉత్సవాలు నిలిచిపోయింది.

21 ఎకరాల మాన్యం ఉన్నా..

ఆలయానికి 21 ఎకరాల మాన్యం ఉంది. కౌలు, దుకాణాల వేలాలు, తలనీలాల సేకరణ, హుండీ లెక్కింపు తదితరాల ద్వారా ఆలయానికి సుమారు రూ.90 లక్షలకు పైగానే ఆదాయం వస్తోంది. మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీరు ఇతర వసతులు లేకపోవడంతో భక్తులు అవస్థలు పడుతున్నారు. గడువు ముగిసినప్పటికీ దేవస్థాన అధికారులు వేలం పాటలు నిర్వహించకపోవడంతో ఆలయానికి ఆదాయం తగ్గే అవకాశం ఉందని భక్తులు చెబుతున్నారు.

నిలిచిన అభివృద్ధి, నిర్మాణ పనులు

❍ ఆలయ అభివృద్ధికి దేవాదాయ శాఖ రూ.20 లక్షల నిధులు విడుదల చేసింది. భక్తులు, ప్రజాప్రతినిధుల వినతి మేరకు తితిదే అభివృద్ధి పనులకు రూ.1.60 కోట్ల నిధులను 2022లో మంజూరు చేయగా అదే ఏడాది జూన్‌లో పనులు ప్రారంభమయ్యాయి. రక్షణ గోడ ఇతర నిర్మాణ పనుల్లో నాణ్యత లేకపోవడంతో ఇటీవల కూలిపోయింది.

❍ మరోమారు రక్షణగోడ నిర్మాణానికి తితిదే చర్యలు చేపట్టగా అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో పనులు నిలిచిపోయాయి. మూడేళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాలేదని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఆలయంలో సదుపాయాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్తా

– సాయి జయచంద్రారెడ్డి, ఇన్‌ఛార్జి ఈవో

అధిక వర్షాల కారణంగా రాతికట్టడం, ధ్వజస్తంభం కూలిపోవడంతో గతంలో అధికారులు కల్యాణం నిలిపివేశారు. తితిదే చేసిన రూ.1.60 కోట్ల నిధులను మంజూరు చేసింది. అటవీశాఖ అనుమతి లేకపోవడంతో అభివృద్ధి పనులు ఆగిపోయాయి. వసతుల కల్పనపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

కార్తిక మాసం.. పరమ పవిత్రం

ఆళ్లగడ్డ గ్రామీణం: రామతీర్థంలో దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఆర్.కృష్ణాపురం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ఆర్.కృష్ణాపురం గ్రామంలో రామతీర్థం పుట్టాలమ్మ ఆలయంలో ఆదివారం కార్తిక మాసం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి పుట్టాలమ్మ, పరశురామలింగేశ్వర, శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. కార్తికదీపాలు వెలిగించారు.

ఆళ్లగడ్డ, రుద్రవరం, న్యూస్‌టుడే: మంగళ కైశిక ద్వాదశిని ఆదర్శ అభ్యుదయ కాలనీలోని శ్రీరామాలయంలో ఘనంగా నిర్వహించారు. తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డా.మల్లు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. రుద్రవరం శివారులోని గుట్టకొండ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆళ్లగడ్డ: స్వామి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణంలో కార్తిక మాసం సందర్భంగా మహిళలు తులసమ్మకు ఘనంగా పూజలు నిర్వహించారు.

ఆధ్యాత్మికం

దొర్నిపాడు, న్యూస్‌టుడే: డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో మూల పెద్దమ్మ తల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వాహనాల్లో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

చింతలచెరువు(చాగలమర్రి), న్యూస్‌టుడే: నల్లమలలో వెలసిన భైరవగుండాల క్షేత్రం కార్తిక పౌర్ణమి వేడుకలకు ముస్తాబవుతోంది. ఈనెల 5న వివిధ పూజలు, అభిషేకాలు, ఉత్సవాలు నిర్వహిస్తారు. అనంతరం శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

అవుకు, న్యూస్‌టుడే: స్థానిక కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో ఈనెల 5న ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని ఆలయ నిర్వాహకులు వెల్లడించారు.

సంజామల, న్యూస్‌టుడే: సంజామలలోని ఎస్టీ కాలనీలో వెలసిన బృందావనం 9వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

డోన్, న్యూస్‌టుడే: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంత చేకూరుతుందని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. ఉడుములపాడు గ్రామ సమీపంలో ఆదివారం శనేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు.

కమనీయం వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి ఉత్సవాలు రవ్వలకొండ, నేలమఠం, చింతమానుమఠాల్లో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నేలమఠంలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాన్ని భక్తులు కమనీయంగా నిర్వహించారు.

కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి

భోజనాలు వడ్డిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బనగానపల్లి పట్టణంలో కుర్ని దైవాచార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వనభోజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ రాజారెడ్డి హాజరై కలిసికట్టుగా ఉండాలని సూచించారు. అలాగే శాలివాహన సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల డీఎస్సీలో ఉద్యోగం సాధించిన పలువురిని సన్మానించారు.

వన భోజనాలకు తరలిరండి

డోన్, న్యూస్‌టుడే: వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన భోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు నాగరాజు అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన కార్తిక వనభోజనాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వడ్డెర సంఘాల నాయకులు హాజరు అవుతారన్నారు. కార్యక్రమంలో సురేష్, వెంకటరాముడు, మహరాజ్, లక్ష్మన్న, రంగస్వామి, రమణబాబు పాల్గొన్నారు. ఈనెల 16న వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో దొరపల్లె గుట్టవద్ద ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద కార్తిక వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు ఈశ్వరనాయుడు పేర్కొన్నారు. కార్యక్రమానికి వాల్మీకులంతా హాజరవ్వాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు మళ్లీ నేరాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై రమేష్ బాబు హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ ఇచ్చారు. నేరప్రవృత్తిని మానుకోవాలని, వివాదాలు, ఘర్షణలకు పాల్పడవద్దని సూచించారు. సారా తయారీ, మట్కా, జూదానికి దూరంగా ఉండాలన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు రౌడీషీటర్లపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టామన్నారు. కార్యక్రమంలో ఎస్సై కేసీతిరుపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కేకే కొట్టాల(బేతంచెర్ల), న్యూస్‌టుడే: కనుమకింది కొట్టాల గ్రామానికి చెందిన జె.అనిల్‌కుమార్(29) అక్టోబర్ 31న శుక్రవారం ఇంట్లో ఘర్షణ పడి పొలంలో పురుగుల మందు తాగాడు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఏఎస్సై షేక్ అబ్దుల్‌నబీ తెలిపారు. మృతుడి భార్య గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై చెప్పారు.

సంక్షిప్త సమాచారం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: అన్ని దానాల్లో అన్నదానం మిన్న అని పించనర్ల సంఘం కోశాధికారి జి.గోపాల్ పేర్కొన్నారు. పట్టణం సమీపంలోని అంధులు, లెప్రసీ కాలనీల్లోని నిరుపేదలకు ఆదివారం అన్నదానం నిర్వహించారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పెద్దన్న వీధిలో ఆదివారం ఒక బేకరీలో గ్యాస్ సిలిండర్ లీకేజీ అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తలపెట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ పేర్కొన్నారు. ఒకటో వార్డులో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు.

డోన్, న్యూస్‌టుడే: మల్లెంపల్లె గ్రామంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కోటిసంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. నాయకులు దేశం సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డోన్, న్యూస్‌టుడే: పేదల ఆకలి తీర్చటంలో దాతల సాయం గొప్పదని ప్రార్థన సమయం నిర్వాహకులు జానప్రభాకర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఆదివారం దాత చిదంబరం సహకారంతో రోగులకు పౌష్టికాహారం అందజేశారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: న్యాయవాదులపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు అమలు చేయాలని న్యాయవాదులు నందిపల్లె నారాయణ, శాస్త్రి పేర్కొన్నారు.

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బనగానపల్లి నియోజకవర్గం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా రమణగౌడ్ ఎంపికయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో ఎంపిక చేసినట్లు చెప్పారు.

బనగానపల్లి గ్రామీణం, కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: బనగానపల్లి, కోవెలకుంట్ల పట్టణాల్లో క్రైస్తవులు సమాధుల పండగను ఘనంగా నిర్వహించారు.

సంజామల, న్యూస్‌టుడే: అక్కంపల్లెలో కుళ్లాయిరెడ్డి అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై రమణయ్య తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో భక్తులు మృతి చెందడం బాధాకరమని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. డోన్‌లో ఆదివారం మృతులకు నివాళి అర్పించారు.

రుద్రవరం, న్యూస్‌టుడే: అక్రమంగా 25 మద్యం సీసాలు తరలిస్తున్న తిమ్మయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహమ్మద్‌రఫి తెలిపారు.

పేదలకు భరోసా.. ఆర్థిక రక్ష

బాధితులకు చెక్కులను అందజేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

నియోజకవర్గంలో 366 మందికి లబ్ధి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బనగానపల్లి నియోజకవర్గంలో 366 మంది లబ్ధిదారులకు రూ.3,25,17,559 ఆర్థిక సాయాన్ని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి బాధితులకు అందజేశారు. ఈ నిధులను బాధితులు తమ అవసరాలకు సద్వినియోగం చేసుకున్నారు.

బనగానపల్లి, కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు, అనారోగ్యం పాలైనప్పుడు చేతిలో చిల్లిగవ్వ లేని సమయంలో ప్రజలు పడే ఇబ్బందులు అన్నిఇన్ని కావు. కొందరు స్థాయికి మించి అప్పులు చేసి ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకొని ప్రాణాలు కాపాడుకుంటారు. అప్పులు తీర్చలేక పొలాలు, స్థలాలు అమ్ముకున్న పరిస్థితులు కనిపిస్తుంటాయి.

ఇలాంటి అభాగ్యులు, నిరుపేద రోగులకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తూ అండగా నిలుస్తోంది. బనగానపల్లి నియోజకవర్గంలో లబ్ధి పొందిన బాధిత కుటుంబాలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

దరఖాస్తు చేసుకోండిలా..

- ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ముందుగా మంత్రి బీసీ క్యాంపు కార్యాలయంలో సంప్రదించాలి. మంత్రి బీసీ బాధితుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ఇద్దరు సిబ్బందిని నియమించారు. వీరు బాధితులకు అర్థమయ్యేలా అన్ని విషయాలు చెబుతారు.
- దరఖాస్తుతో పాటు, ఆధార్ కార్డు, ఫోన్ నంబరు, ఫొటో, రేషన్‌కార్డు, ఆసుపత్రి రిపోర్టులు, ఆసుపత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఫైనల్‌బిల్లు, బ్యాంకు పాసుపుస్తకం తదితరాల నకళ్లను అందజేయాలి. దరఖాస్తు తీసుకెళ్లి ఆసుపత్రిలో వైద్యుడు సంతకం చేయించాలి.
- మొత్తం ఖర్చుతో పాటు అందుకు సంబంధించిన బిల్లులు ఉండాలి. బాధితుడు చనిపోతే మరణ ధ్రువీకరణ పత్రం జతచేయాలి. వీటన్నింటిని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో అందజేయాలి. వీటిని పరిశీలించి నెల రోజుల వ్యవధిలో మంత్రి బీసీ పరిశీలన తర్వాత అమరావతిలోని ముఖ్యమంత్రి సహాయ నిధి కార్యాలయానికి పంపుతారు. వైద్యం పొందిన నెల రోజుల వ్యవధిలో దరఖాస్తు చేసుకోవాలి. జాప్యం చేస్తే చెల్లుబాటు కాదు. అర్హులైతేనే రెండు నెలల్లో బాధితులకు చెక్కులు అందజేస్తారు.

(c) eenadu

కశ్మీర్ యువతుల నృత్యం

ఛత్తీస్‌గఢ్ కళాకారుల సమర నాట్యం

భిన్న సంస్కృతుల మేలిమి కలయిక భారత్

అధికారులతో కలిసి వేడుకలు తిలకిస్తున్న హరిబాబు దంపతులు

గవర్నర్ కంభంపాటి హరిబాబు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భిన్న సంస్కృతుల మేలిమి కలయిక అఖండ భారత్ అని, సమైక్యత, అఖండత, శాంతి, సమత, మమతలను చాటే కార్యక్రమాలతో రాష్ట్రాలు విరాజిల్లుతున్నాయని గవర్నరు కంభంపాటి హరిబాబు చెప్పారు. శనివారం రాత్రి భువనేశ్వర్ రాజ్‌భవన్‌లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, పంజాబ్, జమ్ముకశ్మీర్, దిల్లీ, అండమాన్-నికోబార్, చండీగఢ్, ఛత్తీస్‌గఢ్, లక్షద్వీప్, పుదుచ్చేరి, లడాఖ్ రాష్ట్రాల ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన అతిథులతో గవర్నరు మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వాన్ని బోధిస్తున్న భారతీయ భాషలు, సంస్కృతులు దేశ విశిష్టత చాటుతున్నాయన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 'మేరా భారత్ మహాన్' ధ్యేయంగా సమగ్రాభివృద్ధికి చిత్తశుద్ధిగా విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో మనమంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజా, డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియా, రవాణా, పట్టణాభివృద్ధి శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శి ఉషాపాడి, శాస్త్ర, విజ్ఞాన, సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి చిత్ర అర్ముగం, విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎన్.తిరుమల నాయక్, ఐ.ఎఫ్.ఎస్. అధికారులు కె.మురుగేషన్, మనోజ్.వి. నాయక్, గవర్నర్ ప్రిన్సిపల్ కార్యదర్శి రూపారోషన్ సాహు తదితర అధికారులు, ఇతర అతిథులు పాల్గొన్నారు. ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు తమ గాన, నృత్యాలతో అలరించారు.

స్టార్టప్‌లు ప్రారంభించే స్థాయికి మహిళలు

● 'సుభద్రశక్తి' మేళా ప్రారంభించిన సీఎం

ప్రదర్శన ప్రారంభిస్తున్న సీఎం మోహన్. పక్కన మంత్రి సంపద్, అధికారులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మహిళాభ్యుదయం ప్రభుత్వ ధ్యేయమని, నారీమణులు సామాజికంగా, ఆర్థికంగా నిలదొక్కుకొనే వరకు కార్యక్రమాలు కొనసాగిస్తామని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి చెప్పారు. శనివారం రాత్రి భువనేశ్వర్‌లోని ఇడ్కో ప్రదర్శనా మైదానంలో 12 రోజులు సుభద్ర శక్తి మేళాను ఆయన ప్రారంభించారు. ఇక్కడ 25 రాష్ట్రాలకు చెందిన స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలు 300 లకుపైగా ఉత్పత్తులు ప్రదర్శిస్తున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలు 'లక్షపతి' దీదీలుగా రాణిస్తున్నారని, వారి ఉత్పత్తులకు ఆదరణ పెరుగుతోందని, స్టార్టప్‌లు ప్రారంభించే స్థాయికి చేరుకున్నారని పేర్కొన్నారు. సుభద్ర మహిళలకు డబుల్ ఇంజిన్ పాలనలో కలిసొస్తుందని, సమీప భవిష్యత్తులో సంఘాల సంఖ్య పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడ, పరిశ్రమల శాఖ మంత్రి సంపద్ స్వాయిన్, అభివృద్ధి కమిషనర్ అనూగార్గ్, మహిళా శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శోభాశర్మ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శనా స్టాళ్లు తిలకించిన అతిథులు సామగ్రి కొనుగోలు చేశారు.

వలిసె... మనసు మురిసె

పొట్టంగి సమీపంలో కళకళలాడుతున్న పంట

కొరాపుట్ జిల్లా వివిధ పంటలు పండేందుకు అనుకూలమైన వాతావరణం. సీజన్ పరంగా పండించే పంటల్లో భాగంగా అక్టోబరు నుంచి జనవరి వరకు ప్రతి ఏటా గిరిజనులు వలిసె పంట వేస్తారు. ఈ పువ్వులు పసుపు రంగులో చూపరులను ఆకట్టుకుంటాయి. యువత ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపుతున్నారు. తెలుగు చిత్రపరిశ్రమ సైతం చిత్రీకరణ కోసం ఈ సీజన్లో ఇక్కడికి వస్తుండటం విశేషం. గిరిజన గ్రామాల్లో ఎక్కడ చూసినా ఈ పంట కళకళలాడుతూ ఎంతో ఉల్లాసం కలిగిస్తుంది. జనవరి వరకు ఈ పంట అందాలు ప్రతిఒక్కరిని కనువిందు చేస్తాయి.

– న్యూస్‌టుడే, సిమిలిగుడ

కటజోడి నదిలో ఇద్దరు బాలుర గల్లంతు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్ కటజోడి నదిలో ఆదివారం మధ్యాహ్నం స్నానాలు చేస్తున్న ఇద్దరు బాలురు గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక జవానులు చేరుకుని ఘటనా స్థలంలో గాలింపు చేపట్టారు. గల్లంతైన చిన్నారులు ఓం ఆయుష్ బారిక్ (12), ఓం ప్రకాష్ బారిక్ (15)గా గుర్తించారు. వీరు కటక్‌కు చెందిన భగత్‌పూర్‌లోని బగీచా ప్రాంతానికి చెందినవారు. పొంచక వ్రతాల నేపథ్యంలో వీరు నదిలో స్నానం చేసేందుకు వెళ్లి కాలు జారి పడి గల్లంతయ్యారు. స్థానికులు గమనించి నీటిలోకి దిగి అన్వేషించారు. ఇంతలో కొందరు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది చేరుకుని గాలిస్తున్నారు.

రైలు ఢీకొని ఏనుగు మృతి

రాయగడ పట్టణం, భువనేశ్వర్, న్యూస్‌టుడే: మయూర్‌భంజ్ జిల్లా బైసింగా పోలీసుస్టేషన్ పరిధిలో రైలు ఢీకొనడంతో ఏనుగు మృతిచెందిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. అటవీవర్గాల సమాచారం మేరకు చెట్నోటి రేంజ్ శ్రవణ్ గ్రామ సమీపంలో రాత్రి 11.30 గంటల సమయంలో 20 ఏనుగుల గుంపు రైలు పట్టాలు దాటుతున్న సమయంలో ఈ మార్గంలో వెళుతున్న షాలిమార్ ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో ఓ గజరాజు మృతిచెందింది. రైలును కొంతసేపు సిబ్బంది అక్కడే నిలిపారు. అటవీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

శంకర్ పృష్టి అరెస్టు

శంకర్ పృష్టి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఎస్.ఐ. రాత పరీక్షలో అక్రమాలకు పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడు శంకర్ పృష్టిని క్రైంబ్రాంచ్ అధికారులు శనివారం రాత్రి ఉత్తరాఖండ్, నేపాల్ సరిహద్దులో అరెస్టు చేసి ఆదివారం రాష్ట్రానికి తీసుకొచ్చారు. రాత పరీక్ష అవినీతి గుట్టు రట్టయిన తర్వాత శంకర్ పరారైన సంగతి తెలిసిందే. ఆయన కోసం ముమ్మరంగా గాలించిన దర్యాప్తు సంస్థ చివరకు కస్టడీలోకి తీసుకుంది. ఆదివారం కటక్‌లోని క్రైంబ్రాంచ్ ప్రధాన కార్యాలయంలో శంకర్ నుంచి అధికారులు వివరాలు రాబడుతున్నారు. ఈ కేసులో మరో ముఖ్య నిందితుడు మున్నా మహరణ బ్రహ్మపుర కారాగారంలో ఉన్నారు. ఆయనను అయిదు రోజుల రిమాండ్‌లోకి తీసుకున్న క్రైంబ్రాంచ్ కటక్ తీసుకెళ్లి ఈ కేసులో ఎవరి ప్రమేయం ఉందన్న విషయమై విచారిస్తున్నారు.

ప్రద్యుమ్నబల్ స్మారక అవార్డుల ప్రకటన

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రముఖ జర్నలిస్టు ప్రద్యుమ్నబల్ స్మారక అవార్డు ఈ ఏడాదిలో అంతర్జాతీయ సోవానియా ఉద్యమ సంచాలకురాలు అరుంధతీ దేవి అందుకోనున్నారు. వివిధ రంగాల్లో సేవలు చేస్తున్నవారికి ఏటా ఈ అవార్డులను ప్రద్యుమ్న స్మారక అవార్డుల సంఘం ప్రకటిస్తోంది. ఈ ఏడాది రాష్ట్ర స్థాయి ప్రద్యుమ్న జయంతి వేడుకల సంఘం ప్రతినిధులు ఆదివారం వివరాలు వెల్లడించారు. సామాజిక కార్యకర్త ఎస్.ఎం.ఫరూక్, పర్యావరణవేత్త గోపినాథ్ సింగ్, బౌద్ధ చరిత్ర పరిశోధకుడు డాక్టర్ హరిశ్చంద్ర పృష్టి, దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధి సుమంత్ మహరణ, విద్యావేత్త పూజశ్విని నాయక్‌లున్నారు. బాలేశ్వర్ జిల్లా ప్రగతివాది ఒడియా పత్రిక విలేకరి శిశిర్‌కుమార్‌దాస్ ఈ ఏడాది ఉత్తమ జర్నలిస్టు అవార్డుకు ఎంపిక కాగా, నవంబరు 8న 93వ ప్రద్యుమ్న జయంతి వేడుక జరగనుంది. మాజీ ఎమ్మెల్యే, మత్తు పానీయాల నివారణ అభియాన్ ప్రతినిధి పద్మచరణ్ నాయక్ ఉత్సవాల అధ్యక్షునిగా వ్యవహరిస్తారు.

అరుదైన అవతారంలో స్వామి

శ్రీ లక్ష్మీనారాయణ అవతారంలో జగన్నాథుడు

పూరీ ధామంలో 'పొంచుక' ప్రారంభం

గోపాలపూర్, న్యూస్‌టుడే: 'అచ్యుతం, కేశవం, లక్ష్మీనారాయణం, జగన్నాథం భజే' అన్న ప్రార్థనలతో పూరీ శ్రీక్షేత్రం మార్మోగింది. కార్తిక ఏకాదశి యుక్త ద్వాదశి తిథి పురస్కరించుకుని ఆదివారం జగన్నాథుడు శ్రీ లక్ష్మీనారాయణ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. పొంచక వ్రతాల్లో భాగంగా ఏడాదికోసారి గర్భగుడిలో స్వామి ఈ దివ్యరూపంతో సాక్షాత్కరిస్తాడు. హబిషార్థులు (కార్తిక దీక్షాధారులు) స్వామి సన్నిధిలో వ్రతాలు చేశారు. శ్రీక్షేత్ర పాలనాధికారి అరవిందపాడి, పూరీ జిల్లా పాలనాధికారి దివ్యజ్యోతి పరిడ తదితర అధికారులు దర్శనం చేసుకున్నారు. పుణ్య మాసం వ్రతాల నేపథ్యంలో 3 లక్షల మంది భక్తులు స్వామి సన్నిధికి వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. 40 ప్లటూన్ల పోలీసు బలగాలతో ఆలయం లోపల, వెలుపల గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మరీచి కోట్ నుంచి బారికేడ్లు ఏర్పాటు కాగా, సింహ ద్వారం మీదుగా ఆలయ ప్రవేశానికి అనుమతించిన యంత్రాంగం మరో 3 ద్వారాల మీదుగా వెలుపలకు వచ్చే వెసులుబాటు కల్పించింది. గర్భగుడిలో తొక్కిసలాట జరగకుండా బందోబస్తు చేశారు. పూరీ తీరంలో పవిత్ర సముద్ర స్నానాలు చేసుకుంటున్నందున, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా లైఫ్‌గార్డులు, అగ్నిమాపక జవానులను తీర ఘాట్‌ల వద్ద నియమించారు.

బహుమతులతో విజేత బాలబాలికలు. చిత్రంలో అతిథులు, నిర్వాహకులు

పాఠశాలల చదరంగం పోటీల విజేతలు వీరే

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగిన 69వ రాష్ట్ర పాఠశాలల అండర్-17 బాలబాలికల చదరంగం పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. ఖుర్దాలోని బీజేబీ ఉన్నత పాఠశాలలో ఏడు రౌండ్ల వారీగా నిర్వహించిన పోటీల్లో బాలురు విభాగంలో భువనేశ్వర్‌కు చెందిన క్షేత్రబర మాఝి, చెమురు హేంబ్రమ్ మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. బాలికల విభాగంలో భువనేశ్వర్‌కు చెందిన నిర్మలా కులు ఏడు పాయింట్లతో ఛాంపియన్‌గా నిలవగా, గంజాంకు చెందిన ప్రత్యూష రాణి ఆరు పాయింట్లతో ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. ముగింపు కార్యక్రమంలో అతిథులుగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ వ్యాయామ విద్యాశాఖ సహ సంచాలకుడు జ్యోతి ప్రసాద్ పరిడా, రాష్ట్ర చదరంగ సంఘం సంచాలకుడు దేబాశిష్ పాణిగ్రహి, రాష్ట్ర మాధ్యమిక విద్యాపరిషత్ సంచాలకుడు బీరేంద్ర కొర్కొరా, ఖుర్దా జిల్లా విద్యాధికారి సొనామిక రాయ్ తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు. రెండు విభాగాల్లో మంచి ఆటతో ఉత్తమ స్థానాల్లో నిలిచిన అయిదుగురు చొప్పున బాలబాలికలను రానున్న రోజుల్లో అగర్తలలో జరగనున్న జాతీయ పాఠశాలల చదరంగం పోటీలకు పంపనున్నట్లు గంజాం జిల్లా వ్యాయామ విద్యాధికారి భగీరథ స్వాయిన్ ఆదివారం మధ్యాహ్నం 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

నేటి నుంచి ఛత్రపురంలో అథ్లెటిక్స్ పోటీలు

గంజాం జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యంలో నేటి నుంచి జిల్లా పాఠశాలల అథ్లెటిక్స్, యోగాసనాల పోటీలు జరగనున్నాయి. ఛత్రపురంలోని పీఎంశ్రీ ఆన్‌స్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజులు నిర్వహించనున్న ఇందులో వివిధ సమితుల పాఠశాలలకు చెందిన అండర్-14, 17 బాలబాలికలు పోటీపడతారని జిల్లా వ్యాయామ విద్యాధికారి భగీరథ స్వాయిన్ చెప్పారు.

15 ఏళ్ల నిర్లక్ష్యం.. గోడలకే పరిమితం

జయపురం, న్యూస్‌టుడే: దాదాపు 15 ఏళ్లు గడిచినా నేటికీ కమ్యూనిటీ కేంద్రం పనులు పూర్తికాలేదని, త్వరగా పూర్తి చేయాలని జయపురం సమితి కంగ పంచాయతీ పూజారిగూడ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు కేంద్రం పనులు పూర్తి చేయాలని పాలనాధికారిని ఉద్దేశిస్తూ వినతిపత్రాలు అందజేసినా, సమితి కార్యాలయం వద్ద ఆందోళన చేసినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. త్వరగా కేంద్రం పనులు పూర్తి చేస్తే తమకు ఉపయోగపడుతుందని కోరుతున్నారు. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' బీడీఓ శక్తిమహాపాత్రను వివరణ కోరగా సంబంధిత అధికారులతో చర్చించి భవన నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు.

మొండిగోడలతో నిర్మాణం

భాజపా అభ్యర్థి తరఫున ప్రచారంలో బైజయంత్, ఇతర నాయకులు

త్రిముఖం... పోటాపోటీ ప్రచారం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: నువాపడ అసెంబ్లీ ఉప ఎన్నిక ప్రచారం జాతరను తలపిస్తోంది. పోలింగ్ తేదీ దగ్గరపడటంతో ప్రధాన పార్టీలు ప్రచారం ముమ్మరం చేశాయి. ఇక్కడ భాజపా అభ్యర్థిగా జయడోల్కియా, బిజద తరఫున స్నేహాంగిని చురియా, కాంగ్రెస్ అభ్యర్థిగా ఘసిరామ్ మాఝి తలపడుతున్న సంగతి తెలిసిందే. ముక్కోణ పోటీ నువ్వా? నేనా? అన్నరీతిలో కనిపిస్తుండటంతో ప్రధాన పార్టీల అగ్రనేతలంతా ప్రచారానికి దిగారు. భాజపా తరఫున ఆదివారం ఆ పార్టీ కేంద్ర శాఖ ఉపాధ్యక్షుడు బైజయంత్ పండా, రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, కలహండి ఎంపీ మాళవిక దేవి ప్రచారం చేశారు. సోమవారం బిజద అధినేత నవీన్‌పట్నాయక్ ప్రచారానికి నువాపడ రానుండటంతో అందరి దృష్టి ఆయనపైనే ఉంది. పీసీసీ అధ్యక్షుడు భక్తచరణ్ దాస్, కాంగ్రెస్ సభాపక్షం నేత రామచంద్ర కదం, ఇతర నాయకులు పాదయాత్రలు, సభలు నిర్వహిస్తున్నారు. త్వరలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నారని భక్తచరణ్ విలేకర్లకు చెప్పారు. ప్రధాన పార్టీల నాయకులంతా నువాపడలో మకాం వేసిన నేపథ్యంలో వసతి కొరత ఏర్పడింది. వ్యాపారాలు పుంజుకున్నాయి.

మహిళ ఆశీస్సులు అందుకుంటున్న ఘసిరామ్

నువాపడ బిజద అభ్యర్థిని రోడ్ షో

చంటిపిల్లలకు తల్లిపాలే దివ్యౌషధం

● గవర్నర్ హరిబాబు పిలుపు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: చంటిపిల్లలకు తొలి 1000 రోజులు ముఖ్యమైనవని, వారికి తల్లిపాలు దివ్య ఔషధంగా పనిచేస్తాయని, శారీరక పుష్టి, మానసిక పరిపక్వతలకు ఉపయోగపడతాయని గవర్నరు కంభంపాటి హరిబాబు చెప్పారు. ఆదివారం భువనేశ్వర్‌లో హ్యూమన్ మిల్క్ బ్యాంక్ (హెచ్‌ఎంబీ), ఇన్‌ఫాంట్ అండ్ యంగ్ చైల్డ్ ఫీడింగ్ (ఐవైసీఎఫ్)ల సంయుక్త సారథ్యంలో సదస్సు నిర్వహించాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గవర్నరు మాట్లాడుతూ బాల్యంలో బిడ్డల గురించి కనీస జాగ్రత్తలు తీసుకోవాలని, పౌష్టికాహారం తినిపించాలన్నారు. కేంద్ర ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఈ దిశగా విస్తృత కార్యక్రమాలు అమలుపరుస్తూ జన చైతన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ పిడియాట్రిక్స్ రాష్ట్రశాఖ పర్యవేక్షణలో జరిగిన సదస్సులో హెచ్‌ఎంబీ కార్యదర్శి డా॥ కన్య ముఖోపాధ్యాయ్, ఐవైసీఎఫ్ కార్యదర్శి డాక్టర్ జాయ్‌సింగ్, సదస్సు అధ్యక్షుడు డా॥ బ్రజకిశోర్ బెహర, ఆర్గనైజింగ్ కార్యదర్శి డా॥ పార్థిక్ డే తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న హరిబాబు

శోకతప్త హృదయాలతో అంతిమ వీడ్కోలు

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట మృతురాలు రూప అంత్యక్రియలు

శ్మశానంలో అంత్యక్రియలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ఊరు.. ఊరంతా కదలివచ్చింది. పాడెపై ఉన్న రంగాల రూప (21) పార్థివదేహాన్ని చూసి భోరున రోదించింది. గంజాం జిల్లా పాత్రపురం సమితిలోని గుడిపాదర గ్రామంలో ఆదివారం ఈ దృశ్యం హృదయాల్ని కలచివేసింది. శ్రీకాకుళం జిల్లా (ఆంధ్రప్రదేశ్) కాశీబుగ్గలోని వేంకటేశ్వర స్వామి మందిరంలో శనివారం జరిగిన తొక్కిసలాటలో రూప అనే యువతి మృతి చెందింది. పలాసలో ఆమె మృతదేహానికి పరీక్షల అనంతరం అంబులెన్స్‌లో రాత్రి గ్రామానికి భౌతికకాయం చేరుకోగానే అంతటా శోకఛాయలు అలముకున్నాయి. ఆదివారం ఉదయం బంధుమిత్రులు, గ్రామస్థులు రూప భౌతికకాయం వెంట గ్రామ శివారులోని శ్మశానానికి వెళ్లారు. అక్కడ ఆమె భౌతికకాయంపై పూలు చల్లి శ్రద్ధాంజలి ఘటించి అంతిమ వీడ్కోలు పలికారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలోని మధ్య వీధికి చెందిన రంగాల డిల్లేశు దంపతుల ఏకైక కుమార్తె రూప నర్సింగ్‌లో శిక్షణ పొందుతోంది. ఆమె తల్లి రెండేళ్ల కిందట కన్నుమూసింది. తనకు అన్నీ తానైన కుమార్తె ఇక లేదన్న నిజాన్ని డిల్లేశు జీర్ణించుకోలేకపోతున్నారు. కార్తిక శుద్ధ ఏకాదశి రోజున వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే అంతా మంచి జరుగుతుందన్న ఆశతో అదే గ్రామంలోని రోహిణి అనే మహిళతో కాశీబుగ్గలోని స్వామి దర్శనానికి వెళ్లిన రూప, అక్కడ జరిగిన తొక్కిసలాటలో స్వామి సన్నిధికి చేరుకుంది.



రూప పార్థివదేహం వద్ద భోరుమంటున్న గ్రామస్థులు

డిసెంబరు వరకు ఈకేవైసీ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఈకేవైసీ చేయించుకోని వారికి నవంబరు నుంచి నిత్యావసర సరకులు నిలిపివేస్తామని ఇంతకు ముందు తెలిపిన ప్రభుత్వం తాజాగా ఈ వ్యవధిని డిసెంబరు వరకు పెంచింది. ఈమేరకు ఆదివారం ఆహార, పౌరసరఫరాల శాఖ అధికారవర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. రాష్ట్రంలో 15 లక్షల మంది ఈకేవైసీ చేయించుకోలేదు, డిసెంబరు 31లోగా వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నాయి.

అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో

తన్వికి కాంస్యం

కాంస్య పతకం, జ్ఞాపికతో తన్విపత్రి

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: మంగళూరులోని ఉర్వ ఇండోర్ స్టేడియంలో శనివారం జరిగిన మంగళూరు ఇండియా అంతర్జాతీయ ఛాలెంజ్-2025 బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారిణి తన్విపత్రి కాంస్య పతకం గెలుచుకుంది. సెమీఫైనల్ మ్యాచులో సింగిల్స్‌లో ఇషికా జైయస్వాల్ (యూఎస్‌ఏ)తో ఆడి ఓటమి పాలైన తన్వి తృతీయ స్థానంలో నిలిచి ఆ పతకం కైవసం చేసుకున్నట్లు రాష్ట్ర క్రీడా ఎక్స్ వేదికగా పోస్టు చేసింది.

పూరీ జగన్నాథ సన్నిధి

1996 కార్తిక పొంచుక వ్రతాల సమయంలో జరిగింది. అప్పట్లో ఏకాదశి పర్వదినాన గర్భగుడిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందారు. 12 మందికి గాయాలయ్యాయి.

ఈ ఏడాది గుండిచా మందిరం నుంచి ముగ్గురు మూర్తుల రథాలు శ్రీక్షేత్రానికి లాక్కొచ్చే సమయంలో జరిగిన తొక్కిసలాటలో నలుగురు ప్రాణాలొదిలారు.

శ్రీక్షేత్రం ఎంత సురక్షితం?

అసౌకర్యాలు చవిచూస్తున్న భక్తులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: విశ్వప్రసిద్ధ పూరీ శ్రీక్షేత్రం ఎంత సురక్షితం. భక్తుల భద్రత దిశగా యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకుంటోందన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని శ్రీ వేంకటేశ్వరాలయంలో శనివారం జరిగిన తొక్కిసలాట ఘటన యావన్మందిని ఆవేదనకు గురిచేసింది. పూరీలోనూ ఇలాంటి ఘటన తర్వాత పర్వదినాల్లో తొక్కిసలాట జరుగుతోంది. ఊపిరాడక భక్తులు సొమ్మసిల్లి పడిపోతున్న ఘటనలు అనేకం.

రూ.కోట్లు ఖర్చవుతున్నా తీరని అసౌకర్యాలు

2015లో జగన్నాథుని నవకళేబర యాత్ర జరిగింది. లక్షలాది మంది వస్తారన్న అంచనాతో నాటి నవీన్‌పట్నాయక్ ప్రభుత్వం రూ.900 కోట్ల వ్యయంతో రోడ్ల విస్తరణ, పూరీ-భువనేశ్వర్ ప్రత్యేక రహదారి, ఇతర సౌకర్యాలు కల్పించింది. మళ్లీ 2018లో పూరీ శ్రీక్షేత్ర ప్రదక్షిణ మార్గం (శ్రీజగన్నాథ్ కారిడార్) ప్రాజెక్టు రూ.వెయ్యి కోట్ల వ్యయంతో చేపట్టింది. భక్తుల సౌకర్యాలకు పెద్దపీట అంటూ బొడొదండొలో ప్రైవేటు స్థలాలు సేకరించారు. 8 మఠాలు తొలగించారు. ఈ ప్రాజెక్టుకు తొలినాళ్లలో కొవిడ్ అడ్డంకి కాగా, ఎట్టకేలకు 2023లో శుభారంభం జరిగినా, నిర్మాణాలు అరకొరగా మిగిలున్నాయి. వాహనాల పార్కింగ్, వసతి గృహాలు, మరుగుదొడ్లు అసంపూర్తిగా ఉన్నాయి. కీలకమైన గర్భగుడిలో భక్తుల భద్రత తీసికట్టుగానే ఉంది.

సేవలకు అంతరాయం కలగకూడదు

మోహన్‌చరణ్ మాఝి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 1200 మంది జవానులతో ప్రత్యేక సురక్షావాహిని ఏర్పాటైంది. శ్రీక్షేత్రం పరిధిలో 'వజ్ర' రూఫ్‌టాప్ వాహనం, ఆలయం లోపల 200 సీసీ కెమెరాలు అమర్చారు. పండగల్లో ప్రత్యేక పోలీసు బలగాలను నియమిస్తున్నారు. ఆలయం లోపల (గర్భగుడిలో) తరచూ తొక్కిసలాట ఘటనలు జరుగుతున్నందున నియంత్రించడానికి ప్రత్యేక వ్యవస్థ చేపట్టేలా ప్లాన్(డీపీఆర్) సిద్ధం చేశారు. దివ్యాంగులు, వృద్ధులు, తల్లుల దర్శనానికి ఒక మార్గం, ఇతర భక్తుల కోసం మరో మార్గం ఏర్పాటుతో రద్దీ నియంత్రణ సాధ్యమవుతుందని నిపుణులు పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా 8 నెలలుగా పనులు ప్రారంభమైనా ఇంతవరకు కొలిక్కి రాలేదు.

కార్తికం తర్వాత ఇబ్బందులుండవు

ఆదివారం పూరీ వచ్చిన న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ విలేకర్లతో మాట్లాడుతూ కార్తికం ఈ నెల 5తో ముగియనుందని, ఆ తర్వాత భక్తుల రద్దీ తగ్గుతుందని, నిలిచిపోయిన పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయిస్తామన్నారు. స్వామి ఆభరణాల లెక్కింపు కూడా చేపడతామన్నారు.

బొడొదండొలో దర్శనాలకు బారికేడ్లు

(c) eenadu

ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు రాష్ట్ర క్రీడాకారులు

పోటీలకు ఎంపికైన క్రీడాకారులు (కూర్చున్నవారు). చిత్రంలో క్రీడాశాఖ సంచాలకుడు విజయ్ ఎద్దుల, సంఘం ప్రతినిధులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: చెన్నైలో ఈ నెల 5 నుంచి 9వ తేదీవరకు జరగనున్న ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు రాష్ట్ర వెటరన్ క్రీడాకారులు సిద్ధమయ్యారు. ఈమేరకు ఒడిశా మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘం భువనేశ్వర్‌లోని కళింగ మైదానంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం ఓ సమావేశం ఏర్పాటు చేసింది. ఇందులో హాజరైన రాష్ట్ర క్రీడాశాఖ సంచాలకుడు విజయ్ ఎద్దుల పోటీలకు వెళ్లనున్న క్రీడాకారుల్ని పుష్పగుచ్ఛాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆసియా పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు ఉత్తమ ఆటతో పోటీపడి పతకాలు గెలుచుకోవాలని ఆకాంక్షించారు. ఒడిశా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు సమీర్ కుమార్ మహంతి, ఓఎంఏఏ అధ్యక్షుడు సురేష్ కుమార్ రౌత్రాయ్ పాల్గొన్నారు. అయిదు రోజులు జరగనున్న పోటీల్లో గంజాం, ఖుర్దా, కటక్ తదితర జిల్లాలకు చెందిన 35 మంది క్రీడాకారులు పోటీపడనున్నారు.

నాణ్యత లేని భవనం నిర్మించొద్దు

నిర్మాణం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నాణ్యత లేని తరగతి గదులను నిర్మించి పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని నవరంగపూర్ జిల్లా జొరిగావ్ సమితి బెల్గావ్ పంచాయతీ మహండి గ్రామస్థులు కోరుతున్నారు. ఈ పాఠశాలలో కేవలం రెండు గదులే ఉన్నాయని అందులో ఒకటి ప్రధానోపాధ్యాయుడు గది, మరొక గదిలో 1-5 తరగతులకు గాను 118 మంది విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారు. దీనిని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా రెండు అదనపు గదుల నిర్మాణానికి రూ.8 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఆరంభంలోనే నిర్మించిన శ్లాబ్(పైకప్పు) ఒకసారి కూలిపోయింది. కాంట్రాక్టర్ నాసిరకం ఇసుక, సిమెంట్‌ను ఉపయోగించి నిర్మిస్తున్నారని, దీనిపై అధికారులు దృష్టిసారించాలని లేకుంటే నిర్మించనివ్వబోమని హెచ్చరించారు.

ప్రజా సమస్యలపై పోరాటం

సమావేశంలో పాల్గొన్న సీపీఐ నాయకులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: నిరుద్యోగం, మహిళలపై పెరుగుతున్న నేరాలు, గూడు లేని వారికి ఇళ్లు, ఇతర ప్రజా సమస్యలపై ముమ్మర పోరాటాలు చేద్దామని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. ఆ పార్టీ బ్రహ్మపుర ప్రాంతీయ కమిటీ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. మధ్యాహ్నం స్థానిక పార్కు వీధిలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన దీనికి కాళీకింకర పాత్ర్ అధ్యక్షత వహించారు. ఇందులో ఆ పార్టీ గంజాం జిల్లా కార్యదర్శి శ్రీహర్ష రథ్, సీనియరు నాయకులు ప్రశాంత పట్టజోషి, ప్రకాష్ పాత్ర్, ప్రబీణ్ దాస్, ప్రదీప్ సెఠి, రమేష్‌చంద్ర పాఢి, జోనల్ కార్యదర్శి కామదేవ్ నాహక్ తదితరులు పాల్గొన్నారు. అక్టోబరులో చండీగఢ్ (పంజాబ్)లో జరిగిన పార్టీ మహా సమావేశాలకు సంబంధించిన అంశాలను వారు సభ్యులకు వివరించారు. అంతకుముందు పార్టీ కార్యాలయం బయట పతాకాన్ని ఎగురవేశారు.

'వజ్ర కవచం' అలంకరణలో శ్రీనివాసుడు

స్వామివారి అర్చనకు తులసి సిద్ధం చేస్తున్న మహిళా భక్తులు

బ్రహ్మపురలోని పురాతన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న '67వ వార్షిక అష్టోత్తర శత సహస్ర నామార్చనా మహోత్సవాల్లో' ఈ ఏడాది తొలిసారిగా స్వామికి విశేష అలంకరణలు చేస్తున్నారు. ఆదివారం వేకువన శ్రీభూ సమేత శ్రీవేంకటేశ్వరునికి 'వజ్ర కవచం'తో అలంకరించి స్వామి నిజ పాద దర్శనానికి భక్తుల్ని అనుమతించారు. అలంకారభూషితుడైన శ్రీనివాసుడ్ని దర్శించుకున్న భక్తులు 'జయ జయ గోవిందా' అంటూ ఎలుగెత్తి ప్రార్థించారు. దేవస్థానం ఆవరణలోని శ్రీ మహాలక్ష్మిని కూడా ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం దేవతామూర్తులకు తులసీ దళాలతో అర్చించారు. - న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

విశేష అలంకరణలో శ్రీ వేంకటేశ్వరుని నిజ పాద దర్శనం

శ్రీ మహాలక్ష్మీ దేవికి అలంకరణ

రక్షణగోడకు మరమ్మతులు: కలెక్టర్

సముద్రతీర రక్షణగోడను పరిశీలిస్తున్న రఘురాం తదితరులు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: కేంద్రపడ జిల్లా రాజ్‌నగర్ సమితి పెంఠ సమీపంలోని సముద్రతీర రక్షణగోడ మొంథా తుపాను కారణంగా కొట్టుకుపోయింది. దీనిని కలెక్టర్ రఘురాం ఆర్.అయ్యర్ శనివారం పరిశీలించారు. సముద్రతీర ప్రాంతాల రక్షణ కోసం త్వరితగతిన దీని మరమ్మతులు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు అయ్యర్ మీడియాకు తెలిపారు. 2016లో రూ.39 కోట్ల వ్యయంతో నిర్మించిన దీనికి 2019లో రూ.4 కోట్లతో రాళ్ల కరకట్టలు నిర్మించామని స్వయి వెల్లడించారు.

పూర్వ విద్యార్థుల సత్యనారాయణ స్వామి వ్రతాలు

సామూహిక వ్రతాల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బ్రహ్మపుర నగరం, కాశీనగర్, న్యూస్‌టుడే: బ్రహ్మపుర సిటీ హైస్కూల్లో 1977వ సంవత్సరం మెట్రిక్యులేషన్ చదువుకున్న పూర్వ విద్యార్థులు వారి సహధర్మచారిణులతో కలిసి ఆదివారం సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. స్థానిక ఖస్పావీధిలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానం ఆవరణలోని కల్యాణ మండపంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఇవి జరిగాయి. పూర్వ విద్యార్థి కొంచాడ శంభు ప్రసాద్ సుబుద్ధి తదితరులు పర్యవేక్షించారు. ● కాశీనగర్ సమితిలోని పలు గ్రామాల్లో కార్తిక మాస ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి.

కాశీనగర్‌లో హరినామ సంకీర్తన చేస్తున్న భజన బృందం

నాల్కోకు ఎక్సలెన్స్ అవార్డు

అవార్డు అందుకుంటున్న నాల్కో అధికారులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: నాల్కో కర్మాగారానికి ఎక్విప్‌మెంట్ టైమ్స్ మైనింగ్ అండ్ మినరల్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. కోల్‌కతాలో శనివారం రాత్రి జరిగిన 11వ ఆసియన్ మైనింగ్ కాంగ్రెస్ కార్యక్రమం సందర్భంగా గనుల రంగంలో విశిష్ట సేవలు అందించే సంస్థలకు, కర్మాగారాలకు అవార్డులను అందజేశారు. అందులో నాల్కో కర్మాగారం గనులు తవ్వకాలు, బాక్సైట్ రవాణా, నాణ్యత పాటించినందుకు 2025 సంవత్సరానికి ఉత్తమ పీఎస్‌యూ సెక్టార్‌గా ఎంపిక చేసి ఎక్విప్‌మెంట్ టైమ్స్ మైనింగ్ అండ్ మినరల్ ఎక్సలెన్స్ అవార్డును అందజేశారు. కార్యనిర్వాహక సంచాలకులు సచ్చిదానంద జెనా తన బృందంతో ఈ అవార్డును అందుకున్నారు.

పొదుపుతో భవితకు ఆసరా

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ మధుమిత

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండిలోని కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ భవనం కలెక్టర్ మధుమిత అధ్యక్షతన శనివారం సాయంత్రం ప్రపంచ పొదుపు దినోత్సవం జరిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి చిన్నతనం నుంచి పొదుపు అలవాటు చేసుకోవడంతో పాటు దుబారా ఖర్చులు తగ్గించుకుంటే భవిష్యత్‌లో అత్యవసర సమయంలో ధైర్యంగా ఉండవచ్చునని అన్నారు. పలు పాఠశాలల విద్యార్థులకు పోటీలు పెట్టి విజేతలకు బహుమతులు అందజేశారు. అదనపు కలెక్టర్ ఫాల్గుణమాఝి, అదనపు జడ్పీ కార్యనిర్వహణ అధికారి పృథ్వీరాజ్ మండల్, రాణా అధికారి ప్రశాంత్ భూపతి పాల్గొన్నారు.

అంతర కళాశాలల వాలీబాల్ పోటీలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర విశ్వవిద్యాలయం క్రీడల మండలి ఆధ్వర్యంలో భంజవిహార్ క్రీడామైదానంలో జరుగుతున్న అంతర కళాశాలల వాలీబాల్ పోటీల్లో వివిధ కళాశాల జట్లు పోటీపడుతున్నాయి. ఇందులో ఎమ్కేసీజీ కళాశాల, భంజనగర్, కాశీనగర్, ఫుల్బాణీ, బలిగుడ, దిగపొహండి, కళ్లికోట ఆర్‌సీఎం సైన్స్ కళాశాల, చాందిపుట్, బుగుడా తదితర కళాశాలల జట్లు తలపడుతున్నాయి. విశ్వవిద్యాలయం క్రీడల అధికారి రబిచరణ్ మిశ్ర, క్రీడల మండలి ప్రతినిధి రాజేష్ కుమార్ మహంతి, ధనేశ్వర్ దాస్, జగన్నాథ చౌదురి తదితరులు ఆయా మ్యాచులు పర్యవేక్షిస్తున్నారు.

మ్యాచులో విద్యార్థుల ఆట

స్పందించారు.. వీల్‌ఛైర్లు ఏర్పాటు చేశారు

స్పందనకు వందనం

జయపురం, న్యూస్‌టుడే: జయపురం జిల్లా ప్రధానాసుపత్రిలో వీల్‌ఛైర్లు, స్ట్రెచర్ల కొరతతో రోగులు, బంధువులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజు సుమారు 1400 మంది రోగులు ఆసుపత్రికి వస్తున్నారు. అక్టోబరు 31న 'డీహెచ్‌హెచ్‌లో వీల్‌ఛైర్ల కొరత' అనే శీర్షిక 'ఈనాడు'లో ప్రచురితమైంది. స్పందించిన డీఎంఓ డా. దిలీప్‌కుమార్ బిశ్వాల్ అదనంగా 6 వీల్‌ఛైర్లు, 4 స్ట్రెచర్లు ఏర్పాటు చేసి, కొన్ని మరమ్మతులు చేసి అందుబాటులోకి తెచ్చారు.

మారథాన్‌కు అనూహ్య స్పందన

విజేతకు చెక్కు అందజేస్తున్న స్వాతి తదితరులు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: సైబర్ భద్రత అవగాహన సదస్సులో భాగంగా జిల్లా పోలీసు యంత్రాంగం నిర్వహించిన మారథాన్‌కు అనూహ్య స్పందన లభించింది. ఆదివారం స్థానిక కొరాపుట్ కూడలి వద్ద మొదలైన మారథాన్‌ను ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. సెరిగూడ వరకు కొనసాగిన ఈ మారథాన్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు నగదు బహుమతిని అందజేశారు. మారథాన్‌లో పోలీసు సిబ్బంది, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నువాపడలో జయపురం నేతల ప్రచారం

నువాపడలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

జయపురం, న్యూస్‌టుడే: కలహండి జిల్లా నువాపడలో జరుగనున్న ఉప ఎన్నిక కోసం కాంగ్రెస్ జోరుగా ప్రచారం చేస్తోంది. ఆదివారం జయపురానికి చెందిన రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీనాక్షి వాహినిపతి, ఎమ్మెల్యే తారాప్రసాద్ వాహినిపతి, అఖిల భారతీయ కాంగ్రెస్ కమిటీ ప్రచారకుడు అజయ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు భక్తచరణ్‌దాస్ తదితరులు కాంగ్రెస్ తరఫున ప్రచారం చేసి అభ్యర్థి ఘసిరామ్ మాఝిని గెలిపించాలని కోరారు.

తహసీల్దారు కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పవిత్ర

సిమిలిగుడ, న్యూస్‌టుడే: తహసీల్దారు కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత అన్నారు. లక్ష్మీపూర్‌లో శనివారం రాత్రి తహసీల్దారు కార్యాలయాన్ని ఎమ్మెల్యే పవిత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నియోజకవర్గంలో 4 తహసీల్దారు కార్యాలయాలను ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి వీసీ ద్వారా ప్రారంభించారన్నారు. ఇకపై ఆయా కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

నవరంగపూర్, న్యూస్‌టుడే: జిల్లాలోని ఉమ్మర్‌కోట్-అధికారిగాం రహదారిపై ప్రభుత్వ స్థలంలో ఆక్రమించి నిర్మించిన దుకాణాలు, ఇళ్లను రెవెన్యూ అధికారులు ఆదివారం తొలగించారు. ఈ మార్గంలో విశాఖపట్నం-రాయపూర్ భారత్‌మాల రహదారి పనులు జరుగుతున్నాయి. గతంలో ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశామని, వాటిని ఉల్లంఘించటంతో కోర్టు ఆదేశాల మేరకు తొలగిస్తున్నట్లు తహసీల్దార్ యేఘబన్ తెలిపారు. అదనపు తహసీల్దార్ నీలంబర్ పూజారి, ఎస్‌డీపీఓ సుబేందు కుమార్ సాహు, ఐఐసీ రమాకాంత్ సాయి నేతృత్వంలో తొలగింపు ప్రక్రియ జరిగింది.

మిస్ రాయగడ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్ ఆవిష్కరణలో రెడ్డి, గోపీ, మధు, శీతల్ తదితరులు

రాయగడ, న్యూస్‌టుడే: మిస్ రాయగడ వంటి పోటీలు మహిళల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించి ధైర్యంగా ముందుకు సాగేందుకు దోహదపడతాయని ముంబయి నుంచి వచ్చిన మిస్ ఇండియా శీతల్ సాహు అన్నారు. ఆదివారం స్థానిక వంశీ కృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మిస్ రాయగడ పోటీల పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొని మాట్లాడారు. వంశీ ఆర్గనైజేషన్ డైరెక్టర్ మధు రవాణి, భాజపా జిల్లా అధ్యక్షుడు గోపీ ఆనంద్, ఎలైట్ సంస్థ డైరెక్టర్ సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి క్రీడాపోటీలు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన జిల్లాస్థాయి క్రీడాపోటీలు ఆదివారం ముగిశాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలు ఈనెల 11న బాలేశ్వర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా విద్యాశాఖాధికారి కరుణాకర్‌భుయ తెలిపారు. 25 మంది క్రీడాకారులు రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్నట్లు జిల్లా ఫిజికల్ ఎడ్యుకేషన్ అధికారి లలాటేంద్రపూజారి తెలిపారు.

పరుగుపందెం విజేతలతో అధికారులు

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

నష్టపోయిన పంటను పరిశీలిస్తున్న సస్మిత

సిమిలిగుడ, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కొరాపుట్ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మిత మెలకా డిమాండ్ చేశారు. ఒడిశా-ఆంధ్రా సరిహద్దులో బందుగాం సమితిలో ఆమె ఆదివారం పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికను పంపించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

ఆర్ఎస్ఎస్ శత వారోత్సవాలు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణంలో ఆర్ఎస్ఎస్(రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం జిల్లా కార్యవాహ సన్‌సాయి గదువా నేతృత్వంలో ప్రధాన కూడళ్లలో ర్యాలీ నిర్వహించారు. ★ జయపురం పట్టణంలో పోలీసుశాఖ తరఫున ఆదివారం అవినీతి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పోలీసు సిబ్బంది, స్థానిక యువకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

జిల్లాస్థాయిలో ఖోఖో, కబడ్డీ పోటీలు

కబడ్డీ ఆడుతున్న బాలికలు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లాలో పీఎంశ్రీ రాజా చైతన్య నోడల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లాస్థాయి అండర్-14, అండర్-17 ఖోఖో, కబడ్డీ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. 10 సమితులకు గాను 583 మంది బాలబాలికలు పోటీల్లో పాల్గొనగా 57 మంది క్రీడా ఉపాధ్యాయులు పర్యవేక్షించనున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఛత్రపతి సాహు, అదనపు పాలనాధికారి తపన్‌కుమార్ ఖుంటియా, జిల్లా క్రీడాధికారి సుశాంత్‌కుమార్ నాయక్ పాల్గొన్నారు.

46 మంది విశ్రాంత ఉపాధ్యాయులకు సత్కారం

విశ్రాంత ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న అతిథులు

రాయగడ, న్యూస్‌టుడే: రాయగడ పట్టణ పరిధి ఆర్‌ఎస్‌ఈడబ్ల్యూసీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సమావేశ భవనంలో జిల్లా విద్యాశాఖ ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన 46 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. ఆదివారం ఉపాధ్యాయులు టి.ఈశ్వరరావు, నీలాంచల్ మిశ్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు విద్యాధికారి భజన్‌లాల్ మాఝి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శశిభూషణ్ పట్నాయక్, విశ్రాంత డీఈఓ వి.వి.భాస్కరరావు హాజరయ్యారు.

ఆచార్య సుమన్‌చక్రవర్తికి విశిష్ట పురస్కారం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఖరగ్‌పూర్ ఐఐటీ డైరెక్టర్ ఆచార్య సుమన్ చక్రవర్తి విద్యారంగానికి చేసిన అత్యుత్తమ సేవలకు గాను ఉపాధ్యాయ సేవా పురస్కారం-2025 లభించింది. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయనకు ఈ గౌరవం దక్కింది.

పురస్కారాన్ని అందుకుంటున్న ఆచార్య సుమన్ చక్రవర్తి

ఇంద్రజాల పోటీల్లో రాణిస్తున్న చిన్నారులు

ఆదితి వాజా, కావ్య

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఇంద్రజాల పోటీల్లో ఆదితి వాజా, కావ్య మున్ని ప్రథమ స్థానంలో నిలుస్తూ ఖరగ్‌పూర్ పేరును ఉజ్వలం చేస్తున్నారని శిక్షకుడు బోలా నాథ్ హల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

బొరిగుమ్మలో ఎలుగుల హల్‌చల్

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా బొరిగుమ్మ సమితిలో గత కొద్ది రోజులుగా భల్లూకాలు హల్‌చల్ చేయడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. శనివారం రాత్రి మల్దా హనుమాన్ ఆలయంలో మూడు ఎలుగులు ప్రజలను భయపెట్టాయి. అటవీశాఖ దీనిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

నేడు వినతుల స్వీకరణ రద్దు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండిలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వినతుల స్వీకరణ కార్యక్రమం రద్దయింది. కార్తిక మాసం చివరి సోమవారం పురస్కరించుకుని గజపతి జిల్లాకు సెలవు దినం కావడంతో మంగళవారం కార్యక్రమం కొనసాగుతుందని ఓ ప్రకటన విడుదల చేశారు.

నదిలో గల్లంతైన యువకుడి మృతి

కె.సాయి (పాతచిత్రం)

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: మహేంద్రతనయ నదిలో కార్తిక స్నానాలకు వెళ్లి గల్లంతైన యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పర్లాఖెముండి పట్టణంలోని ఆరో వార్డు శేరిమాదిక వీధికి చెందిన కె.సాయి(16) కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని మహేంద్రతనయ నది సమీపంలో ఉన్న శ్రీ నీలకంఠేశ్వర స్వామి ఆలయ దర్శనానికి వెళ్లారు. అనంతరం నదిలో స్నానం చేస్తుండగా యువకుడు గల్లంతయ్యాడు. వెంటనే స్థానికులు రక్షించి యువకుడిని పర్లాఖెముండిలోని జిల్లా ప్రధానాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి పరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులు అందజేశారు.

యువకుడి మృతదేహం లభ్యం

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి సమితి తమసా పంచాయతీ ఎం.వి. 7 గ్రామంలో ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. మల్కాన్‌గిరి సమితి పద్మగిరి పంచాయతీ ఎం.వి.86 గ్రామానికి చెందిన సుకరంజన్ రాయ్ కొడుకు సుజన్‌రాయ్ (24) గత కొన్ని నెలలుగా మల్కాన్‌గిరి పట్టణం నుంచి రెండు కిలోమీటర్ల దూరం ఎం.వి. 42 గ్రామంలో ఓ అద్దె ఇంట్లో ఉండేవాడు. శనివారం ఎం.వి. 23 గ్రామంలో జరుగుతున్న జాతర చూడటానికి వెళ్లారు. ఆదివారం ఉదయం ఎం.వి. 7 గ్రామ సమీపంలో ఉన్న ఓ కాలువ వద్ద చెట్టుకు వేలాడుతూ ఉండటం గ్రామస్థులు చూసి పోలీసులకు సమాచారం అందజేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యభిచారం ముఠా గుట్టురట్టు

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి పట్టణంలో ఓ వ్యభిచార ముఠా గుట్టురట్టు చేశారు మల్కాన్‌గిరి పోలీసులు. శనివారం రాత్రి మల్కాన్‌గిరి పట్టణం పాత్రగుడ వీధిలో ఓ అద్దె ఇంట్లో వ్యభిచారం జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేశారు. ఈ సంఘటనపై మల్కాన్‌గిరి ఠాణా అధికారి రిగాన్ కిండో తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికులు దీనిపై సమాచారం ఇవ్వడంతో ఆ ఇంటిపై దాడి చేసి ఇద్దరు యువతులు, నడిపిస్తున్న మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ ముగ్గురు జగత్సింగ్‌పూర్, భద్రక్ ప్రాంతానికి చెందినవారు. వాళ్లతో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

సెక్స్ రాకెట్ నిర్వాహకుడి అరెస్టు

కాశీనగర్, న్యూస్‌టుడే: కాశీనగర్ పట్టణంలోని ఓ గృహంలో గుట్టు చప్పుడు కాకుండా నడుస్తున్న సెక్స్ రాకెట్‌ను శనివారం రాత్రి పోలీసులు గుట్టురట్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఓ గృహంలో వ్యభిచారం నడుపుతున్నట్లు సమాచారంపై ఎస్సై అలోక్ జగ్దల్ బృందం ఆ ప్రాంతంలో గస్తీ నిర్వహించి వ్యభిచారం చేస్తున్న ఇద్దరు మహిళలతో పాటు సెక్స్ రాకెట్ సూత్రధారైన చీపురు వాసును అదుపులోకి తీసుకున్నారు. పట్టణానికి చెందిన వాసు వివిధ ప్రాంతాల నుంచి అమ్మాయిలను తీసుకువచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. వ్యభిచార గృహంలో మూడు బీరు సీసాలు తదితరాలు గుర్తించారు. తహసీల్దార్ సుధీర్‌నంద సమక్షంలో అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఐఐసీ సునీల్‌కుమార్ బెహరా తెలిపారు.

పేటఘాటీపై ట్రక్కు బోల్తా

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా లమతాపుట్ నుంచి తెలంగాణలోని భద్రాచలానికి కలప రవాణా చేస్తున్న ట్రక్కు ఆదివారం బొయిపరిగూడ సమితి మహూలి పంచాయతీ పేటఘాటీపై అదుపు తప్పి 300 అడుగుల లోతులో పడిపోయింది. వాహన చోదకుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్వల్పంగా గాయపడిన ఆయనను స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

బ్రౌన్ షుగర్ స్వాధీనం

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ జిల్లా పిపిలి వద్ద పోలీసు స్క్వాడ్ ఆదివారం మెరుపుదాడి చేసి 151 గ్రాముల బ్రౌన్ షుగర్‌ను స్వాధీనం చేసుకుంది. నలుగురు నిందితుల్ని అరెస్టు చేసిన అధికారులు వారి నుంచి రూ.7 లక్షల నగదు, 7 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. బ్రౌన్ షుగర్ విలువ రూ.15లక్షలుగా అంచనా. పిపిలి పరిధిలో నిందితులు మత్తు పదార్థం తెచ్చారన్న సమాచారంతో ఒక ఇంటిపై దాడి చేసి వార్ని కస్టడీలోకి తీసుకుని, దీనిపై దర్యాప్తు చేస్తున్నారు.

మోసం కేసులో ఇద్దరి అరెస్టు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలోని గుసానినువాగాం ఠాణా పరిధిలోని హిల్‌పట్నా మూడో లైనులో భూ అమ్మకాలకు కార్యాలయం నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులు ఒకరి నుంచి రూ.45.51 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకుని మోసం చేశారన్న ఆరోపణలపై కేసు నమోదైంది. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇదే ఠాణా పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన దిలీప్ కుమార్ పశుపాల్ (55), ఆయన వ్యాపార భాగస్వామి ప్రదీప్ పాణిగ్రహి (62)లను అరెస్టు చేశారు. శనివారం ఇద్దరినీ న్యాయస్థానానికి తరలించామని బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. ఒక ప్రకటనలో తెలిపారు.

గంజాయి రవాణా కేసులో యువకుడి అరెస్టు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ నుంచి రైలులో గంజాయి అక్రమంగా తరలిస్తున్న యువకుడిని జీఆర్పీ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఆయన పశ్చిమబెంగాల్ ముసిదబాద్ జిల్లా సోకపడ గ్రామానికి చెందిన అస్రుబలి మూల(24)గా గుర్తించారు. రాయగడ రైల్వేస్టేషన్‌లో ఉండగా పోలీసులకు పట్టుకుని, మూల దగ్గర ఉన్న 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ ప్రశాంత కుమార త్రిపాఠి తెలిపారు.

గ్యాస్ సిలిండర్ల ట్రక్కుకు అగ్నిప్రమాదం

మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళుతున్న ట్రక్కులో మంటలు చెలరేగిన ఘటన సోన్‌పూర్ జిల్లాలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. అగ్నిమాపక శాఖ వర్గాల సమాచారం మేరకు రెయిరఖోల్ నుంచి వీర్‌మహారాజ్‌పూర్ వైపు గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళుతున్న ట్రక్కులో అగ్నిప్రమాదం సంభవించింది. జతెసింగ హరిహర్ వంతెన సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అగ్నిప్రమాద సమాచారం అందిన వెంటనే హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మంటలు చెలరేగడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని ఆ శాఖ వర్గాలు వెల్లడించాయి.

సతీగూడ సాగరం వద్ద చోరీ

జయపురం: జయపురం పట్టణంలో ఉన్న సతీగూడ సాగరం వద్ద 43 ఇనుప హ్యాంగర్లు శనివారం రాత్రి చోరీకి గురయ్యాయి. సాగరం ప్రహరీ చుట్టూ ఇనుప కంచె నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఓసీసీ కాలనీలో పనులు జరుగుతుండగా, హ్యాంగర్లు చోరీకి గురైనట్లు కాంట్రాక్టు సంస్థ సిబ్బంది గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

సారాబట్టీలపై ఆబ్కారీ దాడులు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం సమితి బాలియా పంచాయతీ నీలగూడ ప్రాంతంలో అక్రమంగా నడుపుతున్న ఆరు సారా బట్టీలపై ఆదివారం ఆబ్కారీ అధికారులు దాడులు నిర్వహించారు. ఓఐసీ సుబ్రత్ కేసరి నేతృత్వంలో బృందం దాడులు జరపగా 2,740 లీటర్ల సారాను ధ్వంసం చేసి సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అధికారుల రాకను గమనించిన బట్టి యజమానులు పరారయ్యారు.

(c) eenadu

పెచ్చులూడుతున్నాయి.. భయపెడుతున్నాయి

సాలూరు మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరమ్మతులు చేపట్టక పెచ్చులూడుతున్నాయి. వర్షం పడితే కారుతున్నాయి. ఎప్పుడు ఎవరి మీద పడతాయోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. వేరే దిక్కులేక అక్కడే బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు. దీనిపై ఎంఈవో-2 వెంకటరమణ మాట్లాడుతూ కొత్త భవన నిర్మాణాలకు ప్రతిపాదించామని, నిధులు మంజూరైతే పనులు చేస్తామని తెలిపారు.
– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

నిధులున్నా.. పనులు చేయరే?

పార్వతీపురం మండలం బందలుప్పి ర.భ రోడ్డు నుంచి పులిగుమ్మి మీదుగా సీతానగరం మండలానికి వెళ్లే మార్గంలో భారీ గోతులు ఏర్పడ్డాయి. దీనికితోడు ఇరువైపులా తుప్పలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలకు అవకాశం ఏర్పడుతోంది. దీంతో పార్వతీపురం, సీతానగరం, మక్కువ మండలాలకు చెందిన 50 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరైనట్లు చెబుతున్నా.. పనులు చేపట్టడం లేదు. త్వరలో పనులు ప్రారంభం అవుతాయని డీఈఈ నాగేశ్వరరావు చెప్పారు.
– న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

వంతెన నిర్మించరూ..

మండలంలోని కుసిమి సమీపంలో ప్రధాన రహదారిపై వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. వాగు నీరు రహదారిపై ప్రవహిస్తుందని, వర్షాల కారణంగా ఈ గెడ్డ పొంగితే కుసిమి, శంభాం, ముత్యాలు, కడగండి తదితర ప్రాంతాల్లోని సుమారు 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుందని ఆ దిశగా పాలకులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సీతంపేట

నిరుపయోగం.. పరులపరం

సాలూరు మండలం నార్లవలస పంచాయతీ కేంద్రంలోని చేతి బోరు నిరుపయోగంగా మారింది. దీంతో పక్కనే ఉన్న ఓ వ్యక్తి దానికి మోటారు అమర్చుకున్నారు. లోపలి పైపులైన్ ద్వారా ఇంటికి నీరు పట్టుకుంటున్నారు. మరోపక్క స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అనుమతి లేకుండా ప్రభుత్వానికి చెందిన బోరు ఏళ్లుగా ఇలా వాడుకుంటున్నా చర్యలు తీసుకోలేదు. దీనిపై ఎంపీడీవో పార్వతిని వివరణ కోరగా, నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామని చెప్పారు.
– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

నమ్మండి.. ఇది రహదారే!

కురుపాం మండలం కిచ్చాడ పంచాయతీ కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. శివారు రహదారి, కాలువలు వ్యర్థాలతో నిండిపోయాయి. చెత్తాచెదారం పడేయడంతో మార్గం సగానికిపైగా మూసుకుపోయింది. ఏడాది నుంచి కాలువలో పూడిక తీయలేదని స్థానికులు చెబుతున్నారు. దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి అన్నారు.
– న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

560 లీటర్ల నాటుసారా స్వాధీనం

కొమరాడ, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలంలో నాటుసారా రవాణా, తయారీపై ఆబ్కారీ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సింహాద్రి ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. గుమడ గ్రామంలో 28 క్యాన్లలో నిల్వ చేసిన 560 లీటర్ల నాటుసారాను పట్టుకున్నారు. వీటితోపాటు మూడు ద్విచక్ర వాహనాలు, ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నారు. ఆబ్కారీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆమె సేవలు బంగారం

మెంటాడ, న్యూస్‌టుడే: ఇటీవల తుపాను సమయంలో అందించిన సేవలకు గానూ మెంటాడ మండలంలోని లక్ష్మీపురానికి చెందిన ఆశా కార్యకర్త వై.బంగారమ్మ ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నారు. అమరావతిలో జరిగిన కార్యక్రమంలో వీటిని అందించారు. మెంటాడ పీహెచ్‌సీ పరిధిలోని లక్ష్మీపురానికి చెందిన మీసాల పార్వతి మొంథా తుపాను సమయంలో ప్రసవ వేదనతో బాధపడింది. సమాచారం తెలుసుకున్న బంగారమ్మ గర్భిణి ఇంటికెళ్లి ఆమెను ఆసుపత్రికి తరలించేందుకు యత్నించింది. ఓవైపు జోరువాన, మరోవైపు ఆసుపత్రికి వెళ్లే దారిలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న చంపావతి నది. పరిస్థితిని పీహెచ్‌సీ వైద్యులు లోకప్రియ, కల్పనలకు ఫోనులో వివరించింది. స్థానికుల సాయంతో సమీపంలోని జలాశయ గట్టు పైనుంచి ఆటోలో గర్భిణిని ఉంచి నెట్టుకొంటూ ఆంధ్ర గ్రామానికి చేర్చారు. అప్పటికే అవతలి ఒడ్డున 108 వాహనంతో వేచి ఉన్న వైద్య సిబ్బంది పార్వతికి ప్రాథమిక చికిత్స అందించి, గజపతినగరం ప్రాంతీయాసుపత్రికి తరలించారు. శస్త్రచికిత్స చేయడంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. బంగారమ్మ సేవలను కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో సీఎం ప్రశంసాపత్రం, జ్ఞాపికను ఆమెకు అందజేశారు.

బంగారమ్మ

సీఎం ఇచ్చిన ప్రశంసా పత్రం

ఘనంగా ద్వాదశి పూజలు

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలంలోని పలు విష్ణు, శివాలయాల్లో భక్తులు ఆదివారం ద్వాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. బాతుపురం-పెదవంక గ్రామస్థుల ఆధ్వర్యంలో శివసాగర తీరంలో నీలకంఠేశ్వర ఆలయ ప్రాంగణం, రిట్టపాడులోని వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

శివసాగర తీరంలో నీలకంఠేశ్వర ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన

దేదీప్యమానం..దీపకాంతుల శివలింగం..

గోవిందపురం శివాలయంలో ఆదివారం రాత్రి మహిళలు వెయ్యి దీపాలతో శివలింగం, ఓంకారం, ఇతర ఆకృతులను అలంకరించి భక్తులను ఆకట్టుకున్నారు. గుడి చుట్టూ దీపాలంకరణ చేశారు. ఆదివారం తెల్లవారుజామున స్థానిక వంశధార కాలువలో అరటి దొప్పలపై దీపాలు పెట్టి వదిలారు.
– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

తొక్కిసలాట మృతులకు నివాళులు

ఇచ్ఛాపురం, సోంపేట, న్యూస్‌టుడే: కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం జరిగిన తొక్కిసలాటలో అమరులైన భక్తులకు తెదేపా ఇచ్ఛాపురం నాయకులు స్థానిక బస్టాండు వద్ద నివాళులర్పించారు. జరిగిన దుర్ఘటన బాధాకరమని, ప్రభుత్వం బాధిత కుటుంబాలకు సహాయం అందించడంతోపాటు క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించిందని పేర్కొన్నారు. నాయకులు సాలిన ఢిల్లీ, దక్కత ఢిల్లీరావు, ఆశి లీలారాణి, కోటి, కామేశ్వరరావు, పద్మనాభం, నాగరాజు పాత్రో, శ్రీను, జాని, సంతోష్ పాల్గొన్నారు. ★ కాశీబుగ్గ ఆలయ ప్రమాదంలో మృతి చెందిన బెంకిలి విద్యార్థి లొట్ల నిఖిల్ కుటుంబసభ్యులను ఎంపీపీ ఎన్.దాసు, జడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, జనసేన నాయకుడు లోళ్ల రాజేష్ ఆదివారం పరామర్శించారు. కుటుంబాన్ని ఆదుకోవడానికి తమ వంతు సహకారం అందజేస్తామని వారు హామీ ఇచ్చారు.

మృతులకు నివాళులు అర్పిస్తున్న తెదేపా నాయకులు

బాధితునికి రూ.1.70 లక్షల సాయం

పార్వతీపురం పురపాలక, పట్టణం, న్యూస్‌టుడే: పార్వతీపురం ఆర్టీసీ బస్టాండులో జరిగిన పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడ్డ కళాసీ రెడ్డి రమేష్‌కు తూర్పుకాపు సంక్షేమ సంఘం ఆర్థిక సాయం అందించింది. సంఘ పెద్దలు రాగాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సేకరించిన రూ.1.70 లక్షల నగదును ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మూడు నెలలకు సరిపడా సరకులు అందించారు. బి.సీతారాం, ఎం.కృష్ణమోహన్, ఎం.రాజా, కె.బాలకృష్ణ, జి.మాధవ, యడ్ల త్రినాథ, కె.లక్ష్మి తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న తూర్పు కాపు సంఘ సభ్యులు

బాధితురాలికి ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం గ్రామీణం, వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు మండలం పరిధి కేశుపురానికి చెందిన దూడ మోహినమ్మ పూరింటి మట్టి గోడ కూలింది. విషయమై తెలుసుకున్న కాళీమాత సేవా సమితి ప్రతినిధులు బాధితురాలి ఇంటి మరమ్మతులకు రూ.50 వేలు ఆర్థిక సాయం ఆదివారం అందించారు. ★ పూండి చెరువు గట్టుపై నివాసముంటున్న బుద్దెమ్మ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరింది. విషయం తెలుసుకున్న స్థానిక యువతరం సేవాసమితి ఆర్థికసాయం అందజేసింది. సంఘ అధ్యక్షుడు చింత మురళి నేతృత్వంలో బాధితురాలికి రూ.10 వేలు అందించారు.

బాధితురాలికి ఆర్థిక సాయం అందిస్తున్న కాళీ మాత సేవా సమితి ప్రతినిధులు

రక్తదానంతో ప్రాణాలు నిలుపుదాం

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: రక్తదానంతో ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడొచ్చని వక్తలు పేర్కొన్నారు. కొఠారి గ్రామంలో ఆదివారం జీవీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రాణ దాత బ్లడ్‌బ్యాంకు సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో 40 మంది యువత రక్తదానం చేశారు. పి.గిరిబాబు, సాయి, జీవీస్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీసాలతో తెచ్చుకో.. దాహం తీర్చుకో

బడుల్లో మూలకు చేరిన ఆర్వో ప్లాంట్లు

విజయనగరం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే

కళ్లముందే ఆర్వోప్లాంట్లు ఉన్నా.. నీరు తాగలేకున్నారు విద్యార్థులు. గత వైకాపా ప్రభుత్వం హయాంలో విజయనగరం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు కింద ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు మూలకు చేరడంతో ఈ దుస్థితి ఏర్పడింది. పాడైనవి బాగు చేసేందుకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. దీంతో తాగునీటికి అవస్థలు పడుతున్నారు.

స్పందించరూ.. బాగు చేయరు

కంటోన్మెంట్ ఉన్నత పాఠశాలలో 400 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఆర్వో ప్లాంటు కొంతకాలంగా పనిచేయడం లేదు. మెయింటెనెన్స్ యాప్, టెక్నీషియన్స్ ద్వారా మరమ్మతులు చేసేవారు. ప్రస్తుతం ఎవరూ స్పందించడం లేదని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. దీని బాగుకు రూ.30 వేలు వ్యయం అవుతుందన్నారు. ● ఎరుకల పేట, జొన్నగుడ్డిలోనూ ఇదే పరిస్థితి. ఇక్కడ నగర పాలక సంస్థ కుళాయి ఉండడంతో దాంతో నెట్టుకొస్తున్నారు. ఎంపీపీఎస్ కణపాక, మహారాజపేట, ఆనందగజపతి, సిటీ బాలుర ఉన్నత, హిందూ ఎలిమెంటరీ, కాట వీధి, కంటోన్మెంట్, కొత్తపుల్లిపేట, ఎంజేబీ, ఎంపీపీఎస్ హరిజన, సరస్వతి, ఎంపీఎల్‌పీఎస్ తారక, బీటీఆర్, నెయ్యిలపేట, ఎంపీపీఎస్ గుంకలాం, ఇందిరానగర్, ఎంపీపీఎస్ జమ్ము, పూల్‌బాగ్, ద్వారపూడి, రామజోగిపేట, ప్రదీప్‌నగర్, ప్రశాంత్‌నగర్, సుంకరిపేట, చెల్లూరు, రాకోడులో ప్లాంట్లు పాడయ్యాయి. ఇలా నియోజకవర్గంలో 122 పాఠశాలకు గానూ 52 చోట్ల పని చేయడం లేదు.

బోరు నీరే దిక్కు..

బడుల్లో ప్లాంటు పాడవడంతో ఇంటి నుంచే సీసాల ద్వారా తెచ్చుకుంటున్నారు. నగర పాలక సంస్థ కుళాయిల నీరు, మధ్యాహ్న భోజన నిర్వాహకుల ద్వారా తెప్పించుకుంటున్నారు. కొన్నిచోట్ల బోరు నీరే దిక్కవుతోంది. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో కలుషిత నీరు సరఫరా అయ్యే అవకాశం ఉంది. దీనివల్ల అస్వస్థతకు గురయ్యే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అధికారులు మరోమారు ఆర్వో ప్లాంటు ఉందా.. లేదా? తాగునీటి కోసం ఏ పద్ధతులు అవలంబిస్తున్నారు? తదితరాలపై వివరాలు సేకరిస్తున్నారు.

పాడైనవి గుర్తిస్తున్నాం.. నియోజకవర్గ పరిధిలో పనిచేయని వాటి వివరాలు సేకరిస్తున్నాం. 52 పాడైనట్లు గుర్తించాం. ప్లాంట్లు ఏర్పాటు చేసినప్పుడు టెక్నీషియన్స్ నంబర్లు ఇచ్చారు. కొంతమంది స్పందిస్తున్నారు.
– లలితకుమారి, ఎంఈవో

విద్యార్థులూ.. చిక్కుకుంటే చిక్కులే!

● జిల్లాలో ఏటా పదుల సంఖ్యలో పోలీసు కేసులు

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

● పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్సులో పేలుడు ఘటనలో బాంబులు విక్రయాలకు సంబంధించి పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. అందులో ఒకరు డిగ్రీ చదువుతున్న విద్యార్థి.

● కొత్తవలస కిందకు రాత్రి 10 గంటల సమయంలో పశువులను అక్రమ రవాణా చేసేందుకు వాహనంలోకి ఎక్కిస్తున్న ఇద్దరు విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు.

● కొన్నాళ్ల కిందట వైకుంఠపురంలో పాటు మరో రెండు చోట్ల రాత్రి వేళ దుకాణాల తాళాలు పగులగొట్టి, చోరీలకు పాల్పడిన ఇద్దరు యువకులను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వీరు వీరఘట్టానికి చెందిన విద్యార్థులు.

ఈ మూడే కాదు.. జిల్లాలో చోటుచేసుకుంటున్న పలు సంఘటనలపై తరచూ పోలీసుస్టేషన్లలో నమోదవుతున్న కేసుల్లో విద్యార్థులు, మైనర్లు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ కేసుల్లో చిక్కుకున్న వారిలో ఎక్కువ మంది జల్సాలు, చెడు వ్యసనాలకు అలవాటు పడినవారే. ఉన్నత పాఠశాలల్లో చదువుతున్నవారు, వసతి గృహ విద్యార్థులు పట్టుమని 15 ఏళ్లు కూడా లేని వారు మద్యం, గంజాయి వంటి వాటికి అలవాటు పడుతున్నారు. ఉపాధ్యాయులు, వార్డెన్లు గుర్తించి ప్రశ్నిస్తున్నా.. వారిపై దాడులకు తెగబడుతున్నారు. దీంతో కొందరు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తు పోతుండడంతో మానవీయ కోణంతో పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి వదిలిపెడుతున్నారు.

చెడు అలవాట్లు వద్దని అవగాహన

మత్తు పదార్థాల వినియోగం, మద్యం తాగడం వల్ల అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. విద్యాలయాలు, వసతి గృహాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నాం. తల్లిదండ్రులు పిల్లలపై ఓ కన్నేసి ఉంచాలి. – మురళీధర్, సీఐ, పార్వతీపురం

మంచిచెడు వివరించాలి

ఉమ్మడి కుటుంబ వ్యవస్థలేక పిల్లలను గమనించే వారు కరవవుతున్నారు. తల్లిదండ్రులు ఉద్యోగాలు, వృత్తి పనుల్లో పడి పిల్లలను పట్టించుకోవడం లేదు. వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలి. లేకుంటే విద్యార్థుల విలువైన భవిష్యత్తు నాశనమవుతుంది.
– చంద్రశేఖర్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు

ఈ మార్గంలోనే రాకపోకలు

కేదారిపురం నుంచి అదే గ్రామంలోని జగనన్న కాలనీకి వెళ్లే రహదారి దారుణంగా ఉంది. గోతులు ఏర్పడటంతో చిన్నపాటి వర్షం పడినా నీరు నిల్వ ఉండిపోతోంది. దీని కారణంగా ఆ మార్గంలో నడవడానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సీసీ రోడ్డు వేయాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి ఆశ దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే రోడ్డు నిర్మించి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

కాలువ రోడ్డులో కలిసింది

ఇచ్ఛాపురం పుర పరిధి కేపీ కాలనీలో కచ్చాకాలువ ధ్వంసమైంది. పాలకులు పట్టించుకోకపోవడంతో స్థానికులే రాళ్లను పేర్చి దీనిని నిర్మించుకున్నారు. మట్టిరోడ్డు పైనేరాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో మూడు రోజుల కిందట కురిసిన వర్షాలకు కాలువ గట్టుగా ఉండే రాళ్లన్నీ కదిలిపోయాయి. అవి రోడ్డుపైకి చేరాయి. సమస్యను పరిశీలించి, జన ఇక్కట్లు తొలగించే చర్యలు చేపడతామని కమిషనర్ రమేష్ తెలిపారు. న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పొంచి ఉన్న ప్రమాదం

మాణిక్యపురం వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డులో మొంథా తుపాను కారణంగా కురిసిన వర్షాలు, ఈదురుగాలులకు ఒకవైపు తాటి, మరోవైపు కొబ్బరి చెట్లు వాలి ప్రమాదకరంగా ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యుత్తు శాఖ ఏఈ యు.శ్రీనివాసరావును వివరణ కోరగా వెంటనే తొలగించి ప్రమాదం జరగకుండా చూస్తామని తెలిపారు.
– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

జగన్నాథస్వామి ఆలయానికి వితరణ

బారువ జగన్నాథస్వామి ఆలయంలో విద్యుత్తు ఇన్వెర్టర్, స్టీలు తలుపులు ఏర్పాటు చేసేందుకు గుడియా శకుంతల అనే భక్తురాలు రూ.61 వేలను ఆలయ నిర్వాహకులకు ఆదివారం అందజేశారు. శకుంతల భర్త గుడియా అప్పన్న జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని అందజేసినట్లు ఆలయ నిర్వహణ కమిటీ ప్రతినిధులు తెలిపారు. – న్యూస్‌టుడే, సోంపేట

గంజాయి ద్రవం స్వాధీనం

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: జిల్లాలోని చిత్రకొండ థాణా పోలీసులు గంజాయి ద్రవం స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ వినోద్‌పాటిల్ తెలిపిన వివరాల ప్రకారం.. చిత్రకొండ పోలీసులు ఉదయం 11 గంటల సమయంలో చిత్రకొండలో పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో చిత్రకొండ నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఎస్సార్ కంపెనీ వద్ద ఓ చెట్టు కింద 8 మంది ద్విచక్ర వాహనాలతో ఉన్నట్లు సమాచారం తెలుసుకొని పోలీసులు వెళ్లారు. పోలీసులను చూసి నిందితులు ద్విచక్ర వాహనాన్ని వదిలి పరారయ్యారు. పోలీసులు 8 ద్విచక్ర వాహనాలతోపాటు రెండు బస్తాలు స్వాధీనం చేసుకున్నారు. ఆ రెండు బస్తాల్లో 60 కిలోల గంజాయి ద్రవం గుర్తించారు. దీని విలువ సుమారు రూ.8 కోట్లు ఉంటుందని చెప్పారు.

స్వాధీనం చేసుకున్న ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

వనానికి వెళ్దాం.. విందారగిద్దాం

ఆహ్వానం పలుకుతున్న పిక్నిక్ స్పాట్లు

న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట, తాటిపూడి (గంట్యాడ)

ఎత్తైన కొండలు.. చేతికందేటట్లు మేఘాలు.. కనుచూపుమేరలో గోస్తనీ నది.. నదిలో దూసుకుపోయే బోట్లు.. ఇదీ ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో మనసుకు ఆహ్లాదం పంచే వాతావరణం. కార్తికమాసం నేపథ్యంలో వనవిహారానికి సందర్శకులను ఆహ్వానిస్తున్నాయి.

గిరిపై వెంకన్న ఆలయం

అడవిలో ఉన్న అనుభూతి

నెల్లిమర్ల మండలం సారిపల్లిలో 150 ఎకరాల్లో నగరవనం ఆకట్టుకుంటోంది. ఇందులో పది ఎకరాలు ఆహ్లాదంగా తీర్చిదిద్దారు. పిల్లలను ఆకట్టుకునేలా వివిధ రకాల జంతువుల బొమ్మల ప్రదర్శనగా పెట్టారు. వనంలో విశ్రాంత గదులు, యోగా మందిరం, వ్యాయామశాల, పిల్లల పార్కులు ఉన్నాయి. సుమారు 500 మీటర్ల మేర ట్రెక్కింగ్‌కు అవకాశం ఉందని రేంజ్ అధికారి బి.రామ్ నరేష్ చెబుతున్నారు. ప్రవేశానికి పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10 రుసుము పెట్టారు. శుభకార్యాలు, పార్టీలు, ప్రీ వెడ్డింగ్ షూట్‌లకు అవకాశం కల్పిస్తారు. విజయనగరం నుంచి రవాణా సౌకర్యం అందుబాటులో ఉంది.

వైకుంఠగిరి.. ఆహ్లాదసిరి

గంట్యాడ మండలం ఎగువ కొండపర్తి గిరిజన గ్రామం సముద్రమట్టానికి 3360 అడుగుల ఎత్తులో ఉంది. అనంత వేంకటేశ్వరుడు కొలువుదీరి ఉండడంతో వైకుంఠగిరిగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడకు వెళ్లాలంటే అనంతగిరి మండలం కాశీపట్నం నుంచి 18 కిలోమీటర్లు ఘాట్‌రోడ్డుపై ప్రయాణించాలి. మధ్యలో ఎన్ఆర్ పురం జలపాతం ప్రకృతి ప్రేమికులను అబ్బురపరుస్తోంది. విజయనగరం నుంచి 22 కిలోమీటర్ల దూరంలో ఉన్న తాటిపూడికి గంటకొక బస్సు ఉంది. ఆటోలూ అందుబాటులో ఉన్నాయి.

వెదురుతో నిర్మించిన బెంచ్

తాటిపూడి.. మన్యం అందాలకు ముఖద్వారం

ప్రసిద్ధి చెందిన అరకు, అనంతగిరి, బొర్రా, లంబసింగి, వంజంగి, చింతపల్లి ప్రాంతాలకు తాటిపూడి కొండలు ముఖద్వారంగా ఉన్నాయి. ఇక్కడ బోటు షికారు మరచిపోలేని అనుభూతినిస్తుంది. జలాశయానికి అవతల కొండపై అటవీశాఖ ఆధ్వర్యంలో ఎకో టూరిజం కేంద్రం ఉంది. పది కాటేజీలు అద్దెకు అందుబాటులో ఉన్నాయి. ఆహార పదార్థాలూ అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం బోట్లు తాటిపూడిలోనే తిరుగుతున్నాయి.

సందర్శకుల బోటు షికారు

జలపాతం దరి వెదురు సోయగం

సాలూరు గ్రామీణం: శిఖపరువు జలపాతం వద్ద పర్యాటకులను ఆకట్టుకునేందుకు అధికారులు స్థానికుల సహకారంతో వెదురుతో నిర్మాణాలు చేపట్టి కొత్త అందాలను తీసుకొస్తున్నారు. రాళ్ల మధ్య వెదురు కర్రలతో చేసిన చిన్నపాటి వంతెనలు.. వ్యూపాయింటు, కుర్చీలు, బల్లలు, ఆర్చీలు, దుస్తులు మార్చుకునే గది ఆకర్షిస్తున్నాయి. దుకాణాలూ ఏర్పాటు చేశారు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి
పుట్టినరోజు శుభాకాంక్షలు · ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు · జన్మదిన శుభాకాంక్షలు · ఈనాడు క్లాసిఫైడ్స్ · లీగల్ ప్రకటనలు · జయంతి, వర్ధంతి · అంత్యక్రియలు
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80085 97609

త్రికోటేశ్వరుడికి అభిషేకాలు

త్రికోటేశ్వరస్వామి

అభిషేక పూజల్లో భక్తులు

ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ భక్తులతో సందడిగా మారింది. కార్తిక మాసం ఆదివారం కావడంతో పెద్దసంఖ్యలో తరలివచ్చారు. స్వామికి అభిషేకాలు చేయించారు. రావిచెట్టు, నందీశ్వరుడి విగ్రహం వద్ద మహిళలు దీపారాధనలు చేశారు. నాగేంద్ర స్వామికి పూజలు నిర్వహించారు. 128 అభిషేకాలు జరిగినట్లు ఈవో చంద్రశేఖరరావు తెలిపారు. 954 మంది ప్రత్యేక దర్శనం ద్వారా, 318 మంది శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా స్వామిని దర్శించుకున్నారు. టిక్కెట్ల విక్రయాలతో రూ.223000 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. - న్యూస్‌టుడే, నరసరావుపేట అర్బన్

పంటలు సంరక్షించుకుందాం

ఈనాడు ఫోన్ఇన్ / వీసీతో ఫోన్ఇన్ నేడు

గుంటూరు: మొంథా తుపానుకు జిల్లాలో పంటలు దెబ్బతిన్నాయి. వరి, పత్తి నేలవాలాయి. మిర్చి, అపరాలు, కూరగాయలు, ఉద్యాన పంటలు నీటిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో 'ఈనాడు' ఫోన్ ఇన్ కార్యక్రమంలో ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి, శాస్త్రవేత్తలు పంటల సంరక్షణకు సూచనలు తెలియజేయనున్నారు. రైతులు చేయాల్సిందల్లా కింది నంబరుకు ఫోన్ చేసి సందేహాలు తెలియజేయడమే.

సమయం: ఉదయం 10 నుంచి 11 వరకు
98491 76527
తేదీ: సోమవారం (03.11.2025)

ఖజానాకు గండి.. నిఘా లేదండి

మార్కెటింగ్‌శాఖ చెక్‌పోస్టుల్లో సిబ్బంది కొరత

సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో సత్తెనపల్లి పట్టణం, నందిగామ అడ్డరోడ్డు, గోళ్లపాడు వద్ద చెక్‌పోస్టులు ఉన్నాయి. ఒక్కో చెక్‌పోస్టులో నలుగురు చొప్పున 12 మంది పనిచేయాల్సి ఉండగా ఆరుగురే సేవలందిస్తున్నారు. మూడుచోట్ల సీసీ కెమెరాలు కూడా లేవు.

సిబ్బంది లేని గోళ్లపాడు చెక్‌పోస్టు

సత్తెనపల్లి, దాచేపల్లి, మాచర్ల, న్యూస్‌టుడే

మార్కెటింగ్ శాఖకు ఆదాయ వనరుల్లో కీలకమైన చెక్‌పోస్టుల నిర్వహణ గాడి తప్పుతోంది. అక్రమ రవాణాను అడ్డుకోవడం, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడం వీటి లక్ష్యం కాగా, అందుకు భిన్నంగా సేవలుంటున్నాయి. ప్రస్తుతం చిన్నపాటి దుకాణాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అలాంటిది రూ.కోట్ల ఆదాయాన్ని తెచ్చిపెట్టే చెక్‌పోస్టుల వద్ద నిఘా లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. దాచేపల్లి, మాచర్ల, వినుకొండ, చిలకలూరిపేట, నరసరావుపేట, సత్తెనపల్లి తదితర ప్రాంతాల్లో నిఘా కొరవడింది. సీసీ కెమెరాలు ఉంటే వాహనాల రాకపోకలు రికార్డు అవుతాయి. సిబ్బంది జవాబుదారీతనంతో పనిచేసేందుకు వీలుంటుంది. పోలీసు, మైనింగ్, జీఎస్టీతోపాటు ఇతర శాఖలు కూడా సీసీ టీవీల ఫుటేజీలు ఉపకరిస్తాయి.

12 జిల్లాలో వ్యవసాయ మార్కెట్ యార్డులు
24 చెక్‌పోస్టులు
80 శాతం వస్తున్న ఆదాయం
రూ.32.42 కోట్లు ఏడాదికి నిర్దేశిత ఆదాయ లక్ష్యం
70 శాతం సిబ్బంది ఖాళీలు

ఒప్పంద ఉద్యోగులే ఎక్కువ : చెక్‌పోస్టుల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. ప్రతి 12 గంటలకు ఇద్దరు చొప్పున రోజుకు నలుగురు పనిచేయాల్సి ఉంది. ఉద్యోగులు లేక కొన్ని ఉదయం.. మరికొన్ని రాత్రిళ్లు మూతపడుతున్నాయి. సిబ్బందిలోనూ సింహభాగం ఒప్పంద విధానంలో పనిచేసే వారే. గతంలో తెదేపా ప్రభుత్వంలో సరకు రవాణాకు కంప్యూటర్ కేంద్రం ద్వారా ఈ-పర్మిట్ నమోదు చేసుకుని ఆ రశీదును తనిఖీ కేంద్రాల్లో చూపిస్తే సరిపోయేది. దీంతో నేరుగా మార్కెటింగ్ శాఖకు నగదు జమయ్యేది. వైకాపా ప్రభుత్వం ఆ విధానాన్ని రద్దు చేయడంతో ఖజానాకు గండి పడింది.

పకడ్బందీగా నిర్వహిస్తాం : జిల్లాలోని మార్కెటింగ్‌శాఖ చెక్‌పోస్టుల్లో సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వహిస్తున్నారని ఆ శాఖ ఏడీ ఉపేంద్రకుమార్ 'న్యూస్‌టుడే'తో చెప్పారు. ప్రధాన చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే ఆలోచన ఉందన్నారు. నిర్వహణపరంగా లోపాలు ఉంటే గుర్తించి, వాటిని చక్కదిద్దుతామన్నారు.

కత్వాను కప్పేసి.. ఆపదలోకి నెట్టేసి

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, నరసరావుపేట అర్బన్, సెంట్రల్

మొంథాతో మునక.. కబ్జాల ఫలితమే

దాదాపు పదేళ్ల తర్వాత కత్వా వాగుకు వరద వచ్చింది. నరసరావుపేట సమీప కాలనీలను ముంచేసింది. సత్తెనపల్లి పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ పరిస్థితికి కారణం ఆక్రమణలే. కొన్నేళ్లుగా వాగు పూర్తిగా కబ్జాలకు గురవుతున్నా పట్టించుకునే వారే లేరు. పాలకులు తమ ఓట్ల రాజకీయంతో చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ఫలితంగా మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలతో పట్టణం మునిగే పరిస్థితి వచ్చింది.

కత్వా వాగుపై ఆక్రమణలు

10 సెం.మీ. వానకే ఇలా.. : మొంథా తుపానుతో నరసరావుపేట పట్టణంలో ఒక్క రాత్రిలో 10 సెం.మీ. వాన కురిసింది. దీనికే కత్వా వాగుకు వరదొచ్చి సత్తెనపల్లి రోడ్డు మూసుకుపోయింది. వెంటనే వాన తగ్గుముఖం పట్టడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పదేళ్ల కిందట జలాలే వచ్చినా పాలకులకు పట్టలేదు.

'ఈనాడు' ముందే చెప్పినా.. : కత్వా వాగు ఆక్రమణలకు గురవుతోందని, కొందరు రాజకీయ నేతల కనుసన్నల్లో ఇవి సాగుతున్నాయని 'ఈనాడు' కథనాలు ప్రచురించింది. మేలో 'వరద ముప్పు పట్టించుకోరే', అక్టోబరు 10న 'కత్వాను కప్పేస్తున్నారు' అంటూ కథనాలు ఇచ్చినా పట్టించుకోలేదు.

30వేల మందికి అవస్థలు : వాగుతో పట్టణంలో 8 వార్డుల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో 30 వేలకు పైగా ప్రజలు ఉంటున్నారు. వల్లప్ప చెరువు నిండి ఆ నీరు పీటీ కాలనీ మీదుగా స్టేడియం పక్కన ప్రవహించి కత్వా చెరువు అలుగు ద్వారా గుంటూరు రోడ్డుకు చేరి ఓగేరు వాగులో కలుస్తుంది. కాగా మధ్యలో స్టేడియం పక్కన చాకిరాలమిట్ట ప్రాంతాల్లో కాలువను సగానికి పైగా ఆక్రమించి ఇళ్లు కట్టుకున్నారు. స్టేడియం వద్ద చప్టా ప్రాంతంలో నాచు, వ్యర్థాల కారణంగా నీరు వెళ్లే పైపులు పూడిపోయాయి. వాగు వెడల్పు 50 మీటర్ల నుంచి 25 మీటర్లకు తగ్గిపోయింది.

వైకాపా పాపమే.. : తెదేపా హయాంలో (2014-19) రూ.10 కోట్లతో స్టేడియం వద్ద పైవంతెన నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు చేశారు. నిధులు కూడా మంజూరయ్యాయి. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆ పనులను రద్దు చేసింది. వంతెనతో పాటు కత్వా వాగును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు రూ.19 కోట్లతో పనులు చేస్తామని ప్రకటించిన నేతలు మిన్నకున్నారు.

వాగు రెండు వైపులా ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి తొలగిస్తామని కమిషనర్ జస్వంత్ రావు చెప్పారు. సత్తెనపల్లి, గుంటూరు రోడ్డులోని రెండు లోలెవల్ చప్టాలపై పైవంతెనలు నిర్మించడానికి రూ.8 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని, ఆమోదం రావాల్సి ఉందని ఆర్ అండ్‌బీ డీఈ రవీందర్‌రెడ్డి తెలిపారు.

మాచర్ల ముందుకు.. రొంపిచర్ల వెనక్కి

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు విషయంలో అధికారుల చొరవ ఏపాటిదో అర్థమైపోయింది. జిల్లాకు రెండు విద్యాలయాలు మంజూరు కాగా.. ఒకటి మాచర్ల.. మరొకటి రొంపిచర్లకు కేటాయించారు. మాచర్లలో తాత్కాలిక భవనంలో తరగతుల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తుండగా.. రొంపిచర్లకు సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. మాచర్ల మండలం తాళ్లపల్లి, రొంపిచర్లలో మట్టి నమూనాలు పరీక్షించగా భవన నిర్మాణాలకు అనువుగా లేవని, మరోచోట స్థలం చూడాలని కేంద్రం జిల్లా అధికారులకు సూచించింది. ఈ క్రమంలోనే మాచర్లలోని పీడబ్ల్యూడీ కాలనీ జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో వచ్చే సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. తాత్కాలిక భవనం ఏర్పాటు, అక్కడ సౌకర్యాలపై కలెక్టర్ కృతికా శుక్లా తాజాగా కేంద్రానికి నివేదిక పంపారు. తాళ్లపల్లికి బదులు రింగ్‌రోడ్డు వద్ద 4.56 ఎకరాల స్థలంలో శాశ్వత భవన నిర్మాణం త్వరలో చేపట్టనున్నారు. రొంపిచర్లకు సంబంధించి ప్రత్యామ్నాయ స్థలం కూడా ఖరారు కాలేదు. తాత్కాలిక భవనం గుర్తించడంలోనూ నిర్లక్ష్యం వహిస్తున్నారు.

సాగర్ ఇన్‌ఫ్లో 72,272 క్యూసెక్కులు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయం నాలుగు క్రస్టు గేట్లు అయిదు అడుగులు ఎత్తి 32232 క్యూసెక్కుల నీటిని ఆదివారం విడుదల చేశారు. శ్రీశైలం నుంచి 72,272 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 33,008, కుడి కాలువకు 7033 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయ నీటిమట్టం 589.60 అడుగులకు చేరింది. ఇది 310.8498 టీఎంసీలకు సమానం.
రెంటచింతల: ఎగువ సాగర్ జలాశయం నుంచి వరద నీటి ప్రవాహం సత్రశాల టెయిల్‌పాండ్‌కు కొనసాగుతోంది. సాగర్ నుంచి 65,118 క్యూసెక్కులు రాగా.. ఆరు గేట్లు ఎత్తి దిగువ పులిచింతల ప్రాజెక్టుకు 48,244 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తికి 4,288 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు జెన్‌కో ఎస్‌ఈ వెంకటరమణ తెలిపారు. రిజర్వాయరులో 7.080 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

జాతీయ రహదారి విస్తరణ వేగవంతం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

పల్నాట ప్రయాణ కష్టాలు తీర్చేందుకు పేరేచర్ల-కొండమోడు 167 ఏజీ జాతీయ రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు వేగం అందుకుంటున్నాయి. సత్తెనపల్లి నుంచి కొండమోడు వరకు 23 కిలోమీటర్ల మేర 30 మీటర్ల వెడల్పు చేసి, ప్రమాదాల్ని నిలువరించాలని ఇటీవల కలెక్టర్ కృతికా శుక్లా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, గుత్తేదారుకు ఆదేశాలు చేశారు. తొలుత ప్రమాదాలకు అవకాశం ఉన్న చోట విస్తరణ పనుల్ని త్వరితగతిన పూర్తి చేస్తున్నారు. సత్తెనపల్లి, కొండమోడు వద్ద బైపాస్ రోడ్ల పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సుమారు రూ.50 కోట్ల వ్యయంతో మట్టితోలి చదును చేసే పనులు పూర్తి చేస్తున్నారు.

సత్తెనపల్లి - కొండమోడు రోడ్డు పనులు

- నిర్దేశిత లక్ష్యంలోపు పనులు పూర్తి చేయాలనే ఆలోచనలతో సత్తెనపల్లి బైపాస్‌లో మిక్సింగ్ ప్లాంట్, యంత్ర పరికరాలు, సామగ్రిని సమకూర్చుని, శిబిరాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. మేడికొండూరు వద్ద కూడా మిక్సింగ్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుంటున్నారు.
- కల్వర్టుల నిర్మాణాల్ని కూడా చేపడుతున్నారు. మొత్తం 35 కల్వర్టులకు గాను 15 చోట్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. నాలుగు వరుసల పనుల్లో భాగంగా ఇరువైపులా మట్టితో చదును చేస్తున్నారు.
- పేరేచర్ల నుంచి కొండమోడు వరకు 49.917 కిలోమీటర్లు నాలుగు వరుసలుగా రోడ్డును విస్తరించాల్సి ఉంది. మొంథా తుపాను ప్రభావంతో పనుల్లో మొన్నటివరకు కొంత జాప్యం జరిగింది. వర్షాలు తగ్గడంతో పనులు త్వరితగతిన పూర్తి చేస్తున్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ ఏఈఈ ప్రకాశం చెప్పారు.

సౌర కాంతులు.. పచ్చని పంటలు

మండలంలో సౌర విద్యుత్తు సాయంతో పంటల సాగు పెరుగుతోంది. కమ్మవారిపాలెం గ్రామం వద్ద పొలాలకు విద్యుత్తు సదుపాయం కల్పించే మార్గం లేదు. సుమారు 10మంది రైతులు సౌర విద్యుత్తు సాయంతో 20 ఎకరాల్లో కరివేపాకు పంట సాగు చేస్తున్నారు. రెండెకరాలకు 5 కె.వి చొప్పున విద్యుత్తు అందించే సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో సమయానికి అనుగుణంగా పంటకు నీరందించడం వీలవుతోందని, నిరంతరం పంట పచ్చగా కళకళలాడుతోందని రైతులు సంతోషం వెలిబుచ్చారు. - న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ

నవోదయం @ చిలకలూరిపేట

ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి చిలకలూరిపేట మండలం మద్దిరాలలో 1987లో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేశారు. ఈ విద్యాలయలో ఆరో తరగతి ప్రవేశానికి గ్రామీణ, అర్బన్ ప్రాంతాల నుంచి ఏటా 80 మందిని ఎంపిక చేస్తారు. 30 ఏళ్ల క్రితమే చిలకలూరిపేటలో నవోదయ ప్రవేశ పరీక్షకు శిక్షణ ఇచ్చే కేంద్రాలను నెలకొల్పారు. ఇక్కడకు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల నుంచి విద్యార్థులు వచ్చేవారు. గడిచిన 30 ఏళ్లలో శిక్షణ కేంద్రాలలో చదువుకున్న 3 వేలకు పైగా విద్యార్థులు జవహర్ నవోదయలో సీట్లు సాధించారు. విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న ఎంతోమంది దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. - న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ

వెయ్యేళ్ల ఆలయం

చెక్కుచెదరని నిర్మాణం

కోదండ రామాలయం, ఏకశిలపై సీతారామ, లక్ష్మణులు

వినుకొండలో కొండ పక్కనే చోళుల కాలంలో 11వ శతాబ్దంలో రాతితో నిర్మించిన రామాలయం ఇప్పటికీ చెక్కుచెదరలేదు. 800 ఏళ్ల క్రితం దక్షిణాభిముఖంగా అప్పట్లో గర్భగుడి నిర్మిస్తే ఆ తర్వాత 1484లో రాయల వంశీకులు రాతి స్తంభాలతో ముఖ మండపం నిర్మించి కోదండ రామాలయంగా ప్రతిష్ఠించారు. ప్రధాన ద్వారానికి ఇరువైపులా చక్రపాణి, పేర్నిదేవి బొమ్మలతో పాటు వారి పేర్లను శిలాక్షరాలతో చెక్కి ఉంచడమే దీనికి నిదర్శనం. నాటి పాలనకు గుర్తుగా ఆలయంలో రాతి స్తంభంపై మత్స్య అవతారం చెక్కి ఉంది. గర్భగుడిలో సీత, రామ, లక్ష్మణులను ఏకశిలపై ప్రతిష్ఠించడం విశేషం. కాలక్రమంలో గుడిపైన గోపురం నిర్మించి మండపానికి గేట్లు ఏర్పాటు చేశారు. సాధారణంగా అన్ని రామాలయాల్లో శ్రీరామనవమికి సీతారాముల కల్యాణం నిర్వహించడం తెలిసిందే. ఇక్కడ చాలా ఏళ్లుగా ఈ ఆచారం లేదని, కారణం కూడా తనకు తెలియదని ఆలయ పూజారి నారాయణం రామమోహనాచార్యులు తెలిపారు. ఇటీవల భక్తుల విరాళాలతో కొత్త ధ్వజ స్తంభంతో పాటు గాలి గోపురం నిర్మించామన్నారు. ఏడాది కాలంగా ప్రతి నెల శ్రీరాముడి జన్మనక్షత్రం పునర్వసు నాడు అభిషేకం, కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. - న్యూస్‌టుడే, వినుకొండ

నోరూరించే.. గురజాల జిలేబి

గురజాలలో తయారు చేసే జిలేబికి ప్రత్యేకత ఉంది. 65 ఏళ్లుగా తోపుడు బండ్లపై వేడి వేడిగా తయారు చేసి విక్రయిస్తున్నారు. గురజాలలో 1960లోనే కోర్టులు ఏర్పాటయ్యాయి. మాచర్ల, గురజాల, సత్తెనపల్లి తదితర ప్రాంతాల నుంచి కోర్టులకు హాజరయ్యేవారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు వేచి ఉండాల్సి వచ్చేది. అప్పట్లో హోటళ్లు, భోజనం, టిఫిన్ అందుబాటులో లేవు. దీంతో తక్కువ ధరకు జిలేబిని అందుబాటులోకి తీసుకొచ్చారు. అది తిని కడుపు నింపుకొనేవారు. కాలం మారినా.. వివిధ మిఠాయిలు అందుబాటులోకి వచ్చినా జిలేబికి డిమాండు తగ్గలేదు. వివిధ పనుల నిమిత్తం గురజాలకు వచ్చే వారు జిలేబిని కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. విదేశాల్లోని తమ బంధువులకు పార్శిల్ చేసి పంపుతున్నారు. కిలో రూ.100 నుంచి రూ.125 వరకు అమ్ముతున్నారు. - న్యూస్‌టుడే, గురజాల

యూరియా కావాలయ్యా!

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే

> పదెకరాల్లో మిరప, వరి పంటలు సాగు చేశా. తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలతో పొలాల్లో తేమ శాతం ఎక్కువగా ఉంది. ఎకరాకు ఒకటి చొప్పున యూరియా బస్తా అవసరం. రైతు సేవా కేంద్రం వద్దకు వెళితే యూరియా రాలేదు. ఎప్పుడొస్తుందో తెలియదన్నారు. బహిరంగ మార్కెట్లో కొందామంటే అధిక ధర చెబుతున్నారు. - ఓ రైతు ఆవేదన

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల్లో నీరు చేరింది. పంటల సస్యరక్షణపై అన్నదాతలు దృష్టి సారించారు. పొలాల నుంచి నీరు బయటకు పంపుతున్నారు. భూమిలో తేమ త్వరగా ఆరాలంటే యూరియా చల్లాలని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. పంటలను కాపాడుకునేందుకు యూరియా వాడాల్సిన పరిస్థితులు ఏర్పడటంతో ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. రైతుసేవా కేంద్రాలు, సొసైటీలు, జీడీసీఎంఎస్ కేంద్రాల్లో యూరియా రూ.266.50కు ప్రభుత్వం అందిస్తుంది. ప్రస్తుతం పరిమితంగా సరఫరా చేస్తుండటం, కొన్ని చోట్ల నిల్వలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే అదనుగా కొందరు వ్యాపారులు అధిక ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్రోమోర్ కేంద్రాల్లో యూరియాకు ఇతర ఎరువులను ముడిపెట్టి ఇస్తున్నారని రైతులు చెబుతున్నారు.

జిల్లాలో ఖరీఫ్‌లో సాగైన పంటల వివరాలు (హెక్టార్లలో)

పంట	సాగు	నష్టం
పత్తి	85,817	21,658
వరి	53,000	2,101
మిరప	41,811	219
మొక్కజొన్న	1500	366

వెయ్యి మెట్రిక్ టన్నులు పంపాం

ఈ విషయమై జిల్లా వ్యవసాయాధికారి జగ్గారావును సంప్రదించగా ప్రస్తుతం పంటలు ఉరకెత్తకుండా పొలాల్లో చల్లేందుకు 2వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం అవుతుంది. ప్రస్తుతం వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియాను రైతు సేవా కేంద్రాలు, సొసైటీలు, జీడీసీఎంఎస్ కేంద్రాలకు పంపించాం. ఇంకా 500 మెట్రిక్ టన్నులు వ్యాగన్ల వద్ద నుంచి రవాణా చేయాల్సి ఉంది. మిగతా 500 మెట్రిక్ టన్నులు వీలైనంత త్వరలో తెప్పించి రైతులకు అందిస్తామన్నారు.

చక్రాలపై వైద్యం.. చెంతకే ఆరోగ్యం

ఈనాడు, అమరావతి

గుంటూరు రైల్వే డివిజన్‌లో విజయవంతంగా 'హెల్త్ ఆన్ వీల్స్'

నవంబర్ 1వతేదీ శనివారం.. ఐదు బోగీలతో ఉన్న ఓ రైలు దొనకొండ స్టేషన్ వద్దకు వచ్చి ఆగింది.. అందులో నుంచి తెల్ల దుస్తులతో ఉన్న వైద్యులు, సిబ్బంది ప్లాట్‌ఫామ్‌పై దిగారు.. కాసేపటికి రైల్వే యూనిఫాంలో ఉన్న కొందరు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆ బోగీల్లోకి వెళ్లారు.. వారికి వైద్య పరీక్షలు నిర్వహించడం, మందులు అందించడం.. చకచకా జరిగిపోతున్నాయి.. ఒక్క దొనకొండలోనే కాదు.. ఆ తర్వాత గజ్జుల, మార్కాపురం రోడ్, తర్లుపాడు, కంభం, జంగంబొట్ల కృష్ణాపురం, సోమిదేవిపల్లి, గిద్దలూరులోనూ ఇవే దృశ్యాలు కనిపించాయి. ఇంతకీ ఈ రైలు ఏమిటి.. ఇందులో వచ్చిన ఆ వైద్యులు, సిబ్బంది ఎక్కడి వారు.. వారి అందించే చికిత్స.. ఈ కథనంలో తెలుసుకుందాం..!!

పరీక్షలు చేస్తున్న వైద్యుడు

'హెల్త్ ఆన్ వీల్స్'.. రెండు నెలల క్రితం గుంటూరు రైల్వే డివిజన్‌లో ప్రారంభమైన కార్యక్రమం. గతేడాది కొంతకాలం పాటు ఇది సాగినా.. అనివార్య కారణాలతో ఆగింది. గుంటూరు రైల్వే డీఆర్‌ఎంగా సుధేష్ణసేన్ బాధ్యతలు స్వీకరించాక ఈ కార్యక్రమంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. గత రెండు నెలల్లో ఐదు దఫాలుగా ప్రత్యేక రైలును వివిధ మార్గాల్లో నడుపుతున్నారు. ఇందులో రైల్వే ఆసుపత్రి వైద్యులు, పారా మెడికల్ సిబ్బందితోపాటు రెఫరల్ ఆసుపత్రి వైద్యులు ఉంటారు. వీరికి కేటాయించిన మార్గం, తేదీల్లో ఆ ప్రత్యేక రైలులో వెళ్లడం..సూచించిన స్టేషన్లలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. రైలు బోగీలోనే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు, చికిత్సలు చేస్తున్నారు.

అనేక మార్గాల్లో సేవలు : ఇప్పటి వరకు అనేక మార్గాల్లో ఈ సేవలు అందినట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు. సెప్టెంబరు 20న గుంటూరు-దొనకొండ స్టేషన్ల మధ్య 140 మంది ఈ తరహాలో వైద్య సేవలు పొందగా.. అక్టోబరు 17న నడికుడి-నల్గొండ సెక్షన్‌లో 162 మంది లబ్ధి పొందారు. గుంటూరు టు రేపల్లె, మంగళగిరి, నడికుడి మార్గాల్లోనూ ఈ సేవలు అందించారు. వారానికి లేదా రెండు వారాలకు ఒకసారి ప్రత్యేక రైలు పట్టాలపై పరుగులు తీస్తోంది. గిద్దలూరు - నంద్యాల, నల్గొండ మార్గాల్లో ప్రస్తుతం ఈ సేవలు అందించాల్సి ఉన్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.

విద్యుత్తు వాహనాలకు ఛార్జింగ్ చిక్కు

బాపట్ల, న్యూస్‌టుడే : బాపట్ల జిల్లా పర్యాటకంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. హైదరాబాద్, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో పర్యాటకులు తరలివస్తున్నారు. వారాంతంలో సూర్యలంక, రామాపురం, వాడరేవు బీచ్‌లు కిటకిటలాడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల ప్రజలే కాకుండా ఉత్తర భారతీయులూ కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి విహారానికి వస్తున్నారు. వీరిలో పలువురు విద్యుత్తు వాహనాలు వినియోగిస్తున్నారు. తమ వాహనాల ఛార్జింగ్‌కు తగిన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో 11 మాత్రమే..: జిల్లాలో 174 పెట్రోలు బంకులు ఉండగా.. విద్యుత్తు ఛార్జింగ్ కేంద్రాలు 11 మాత్రమే ఉన్నాయి. జిల్లా కేంద్రం బాపట్లలోని విద్యుత్తు శాఖ ఈఈ కార్యాలయం వద్ద ఒకటి ఉంది. దీంతో పాటు మిగతా కేంద్రాల గురించి సమాచారం లేనందున పర్యాటకులు వాహనాల ఛార్జింగ్‌కు ఎక్కడికి వెళ్లాలో తెలియడం లేదు. కాలుష్య నివారణలో భాగంగా పెట్రోలు, డీజిల్ స్థానంలో సీఎన్‌జీ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నారు. అలాగే ఈవీ వాహనాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. రానున్న రోజుల్లో పర్యాటకుల సంఖ్య రెండింతలు పెరిగే అవకాశం ఉందని పర్యాటక శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకనుగుణంగా తీర ప్రాంతంతోపాటు ప్రధాన రహదారుల్లోని పెట్రోలు బంకుల్లో ఈవీ ఛార్జింగ్, సీఎన్‌జీ కేంద్రాలు ఏర్పాటు చేసేలా జిల్లా అధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

బీచ్‌ల్లో కార్తిక స్నానాలకు బ్రేక్

న్యూస్‌టుడే, బాపట్ల

ప్రతికూల పరిస్థితులు కార్తిక మాసంలో భక్తులు సముద్ర స్నానాలు చేయటానికి అవకాశం లేకుండా చేస్తున్నాయి. మొంథా తుపాను కారణంగా జిల్లాలో గత నెల 26 నుంచి బీచ్‌లలో ప్రవేశంపై నిషేధం విధించారు. విహారం నిమిత్తం ఆదివారం వేలల్లో వచ్చిన పర్యాటకులు, భక్తులను పోలీసులు అనుమతించలేదు. సముద్ర తీరంలో గోతులు ఏర్పడటంతో లోపలికి దిగి స్నానాలు చేయటం ప్రమాదకరమని నిపుణులు హెచ్చరించారు. భద్రతా కారణాల దృష్ట్యా ఈ నెల 4 వరకు నిషేధం కొనసాగించాలని అధికారులు నిర్ణయించారు.

నిర్మానుష్యంగా సూర్యలంక బీచ్

- కార్తిక మాసంలో ప్రతి సోమవారం సముద్రంలో భక్తులు స్నానాలు ఆచరించి సైకత శివలింగాలకు పూజలు చేస్తారు. శని, ఆదివారాలు వీరితో పాటు సందర్శకులు వేల సంఖ్యలో తరలివచ్చి వనసమారాధనలో పాల్గొని సామూహిక భోజనాలు చేస్తుంటారు. ఈ క్రమంలోనే సూర్యలంక, వాడరేవు, రామాపురం బీచ్‌లు కిటకిటలాడతాయి. మొంథా తుపాను వల్ల పరిస్థితులన్నీ తల్లకిందులయ్యాయి. ప్రమాదాలు పొంచి ఉన్న నేపథ్యంలో ఎనిమిది రోజులుగా తీరానికి ఎవరినీ అనుమతించటం లేదు. బీచ్‌లు నిర్మానుష్యంగా మారాయి. పర్యాటకుల నుంచి బుకింగ్స్ తీసుకోవద్దని రిసార్ట్స్, హోటళ్ల యజమానులకు పోలీసు, రెవెన్యూ అధికారులు గట్టి ఆదేశాలు జారీ చేశారు. తుపాను నేపథ్యంలో ఈ ఏడాది కార్తిక మాసం మొదటి సోమవారం కూడా భక్తులను సముద్ర స్నానాలకు అధికారులు రానివ్వలేదు.
- బీచ్‌లలో మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు దిగి పరిశీలించారు. సముద్ర తీరంలో మూడు, నాలుగు అడుగుల లోతు గోతులను గుర్తించారు. వీటి వల్ల సుడిగుండాలు ఏర్పడి సముద్ర స్నానాలు చేసే వారి ప్రాణాలకు ప్రమాదమని హెచ్చరించారు. ఈ క్రమంలో బీచ్‌ల్లో ప్రవేశ నిషేధాన్ని సోమ, మంగళవారాలు కూడా అమలు చేస్తున్నామని బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు ఆదేశాలు జారీ చేశారు. పోలీసు అధికారులు సైతం ఇదే విషయాన్ని ప్రకటించారు. నెల్లూరు జిల్లా మైపాడు బీచ్‌లో సముద్ర స్నానం చేస్తూ ముగ్గురు విద్యార్థులు ఆదివారం మృతి చెందిన నేపథ్యంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉండరాదని ఉన్నతాధికారులు నిర్ణయించారు.
- కార్తిక పౌర్ణమి ఈ నెల 5న వస్తోంది. బంగాళాఖాతంలో ఈ నెల 4న అల్పపీడనం ఏర్పడే పరిస్థితులు ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేసింది. కార్తిక పౌర్ణమికి భక్తులను సముద్ర తీరం వద్దకు అనుమతించాలా వద్దా అన్న విషయమై ఆ రోజు నిర్ణయం తీసుకుంటామని అధికారవర్గాలు అంటున్నాయి. నిపుణులు మాత్రం మరో వారం బీచ్‌లలో ప్రవేశంపై నిషేధం కొనసాగించాలని సూచించారు. భక్తుల భద్రత దృష్ట్యా సముద్ర స్నానాలకు ప్రస్తుతం ఎవరినీ అనుమతించటం లేదని డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80085 10541

(c) eenadu

33 శాతం నిబంధన.. అన్నదాత ఆవేదన..!

పెదకూరపాడు, క్రోసూరు, న్యూస్‌టుడే

క్రోసూరు: ఎర్రబాలెంలో నేలవాలిన పత్తిపంట

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు పత్తి, మిరప, మొక్కజొన్న, వరి పంటలు దెబ్బతిన్నాయి. కాయ దశలో ఉన్న పత్తి, మొక్కజొన్న పంట నేలకొరిగింది. నష్టం వాటిల్లిన పంటలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి జాబితాలు సిద్ధం చేస్తున్నారు. అయితే వ్యవసాయశాఖ నిబంధనలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వ్యవసాయశాఖ నిబంధనల ప్రకారం రైతు సాగు చేసిన పంట మొత్తంలో 33శాతం దెబ్బతింటేనే నష్ట పరిహారం అందుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో పరిహారం వస్తుందన్న నమ్మకంతో ఉన్న రైతులు నిరాశకు గురవుతున్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మొత్తం 13,118 హెక్టార్లలో పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనా సిద్ధం చేశారు. పత్తి మొక్కలు పూర్తిగా నేలకొరిగాయి. వాటికి పరిహారం ఎలా ఇస్తారు అనేది అధికారుల నుంచి స్పష్టత లేదు. పడిపోయిన పత్తి మొక్కలను పైకి లేపేందుకు ఎకరాకు అదనంగా రూ.2500 ఖర్చు అవుతోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదిస్తాం

నష్టపోయిన పంట వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నాం. అమరావతి మండలంలో 4020, పెదకూరపాడు మండలం 3821, అచ్చంపేట 3820, బెల్లంకొండ మండలం 957, క్రోసూరు మండలంలో 500 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశాం. క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తాం. నిబంధనల మేరకు రైతులకు పరిహారం అందేలా కృషిచేస్తాం.

- కృష్ణయ్య, వ్యవసాయాధికారి, పెదకూరపాడు మండలం

మొంథాతో ముక్కలైంది

లింగంగుంట్ల నుంచి ఎన్టీఆర్‌నగర్‌కు వెళ్లే మార్గంలో దెబ్బతిన్న మట్టి రోడ్డు

నరసరావుపేట సెంట్రల్: మండలంలో ఉప్పలపాడు సమీపంలోని ఎన్టీఆర్ నగర్‌కు చేరుకోవాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లింగంగుంట్ల నుంచి ఎన్టీఆర్ నగర్‌కు వెళ్లేందుకు మట్టి రోడ్డు ఉంది. ఈ రోడ్డులో ప్రయాణించి ఎన్టీఆర్‌నగర్, యానాది కాలనీలకు చేరుకోవచ్చు. మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు ఈ రహదారి పక్కన మురుగు కాలువకు వరద పోటెత్తి రోడ్డును అడ్డంగా కోసేసింది. ఎన్టీఆర్‌నగర్‌లో మొత్తం 1500 ఇళ్ల స్థలాలు ఇచ్చారు. వీటిలో 350 ఇళ్ల స్థలాలకు ఇదే ప్రధానమార్గం. దీంతో నిర్మాణంలో ఉన్న ఇళ్ల వద్దకు సామగ్రి తీసుకెళ్లడం వ్యయప్రయాస అవుతోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించడంతో పాటు తారురోడ్డు నిర్మించాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో కృష్ణకుమారి దృష్టికి తీసుకెళ్లగా పంచాయతీరాజ్ అధికారులతో సంప్రదించి ప్రతిపాదనలు తయారు చేయించి మరమ్మతులకు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పెళ్లి సంబంధాల కోసం చూస్తున్నారా
అన్ని కులాల సాఫ్ట్‌వేర్ ఉద్యోగ వధూవరులకు సువర్ణావకాశం
నేడు అన్ని కులాల సాఫ్ట్‌వేర్ ఉద్యోగ వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి అన్ని కులాల సాఫ్ట్‌వేర్ ఉద్యోగ అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు **నేడు (3 నవంబరు 2025)** ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ★ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్లో యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు క్రింద తెలిపిన ఫోన్ నెంబర్లను సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

మరిన్ని వివరాలకు
95501 28306 & 83744 45190
ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

పాత ఒప్పందం అమలు కోరుతూ ఆందోళన

గ్రానైట్ అసోసియేషన్ సభ్యుల నిరసన

యడవల్లి (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : పాత ఒప్పందం ప్రకారం ఏఎంఆర్ సంస్థ విధి విధానాలు అమలు చేయాలని కోరుతూ పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన గ్రానైట్, క్రషర్స్ యజమానులు, కార్మికులు చిలకలూరిపేట మండలం యడవల్లిలో ఆ సంస్థ చెక్‌పోస్టు వద్ద ఆందోళనకు దిగారు. ఆదివారం రెండోరోజూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. పాత పద్ధతిలోనే విధివిధానాలు అమలుచేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఏఎంఆర్ సంస్థ యాజమాన్యం అసోసియేషన్‌తో చర్చలు జరిపి అనుకూలంగా స్పందిస్తేనే చెక్‌పోస్టులు పనిచేస్తాయన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. గ్రానైట్ పరిశ్రమలో వ్యర్థాలుగా ఉన్న రాళ్లను దేవస్థానాలకు శిల్పాలు చెక్కడానికి తీసుకెళ్లే వారి వద్ద కూడా ఏఎంఆర్ సంస్థ రశీదులు లేకుండా అక్రమ వసూళ్లు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సమస్య తీవ్రతను గుర్తించి గ్రానైట్ పరిశ్రమలు, క్రషర్లు మూతపడకుండా అనుకూల విధానాలను నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు ర్యాలీ చేశారు. మూడు జిల్లాల అసోసియేషన్ నాయకులు ప్రత్తిపాటి సురేష్, ఒంటిపులి ఆంజనేయులు డి.ప్రసాద్, చిటిపోతు మస్తానయ్య, చెరుకూరి నాగరాజు, పోపూరి శ్రీను, తాళ్లూరి వెంకటేశ్వర్లు, తుమ్మల బెనర్జీ, బుగ్గవరపు లక్ష్మణ్, తోట వెంకట కోటేశ్వరరావు, గరిపాటి సుబ్బారావు, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అవసరం

అరండల్‌పేట(గుంటూరు), న్యూస్‌టుడే: బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలే తెదేపా లక్ష్యమని మాజీ మంత్రి, తెదేపా సీనియర్ నాయకుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని వైన్ డీలర్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో బీసీ రాష్ట్ర స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది. మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ దేశం సమగ్రాభివృద్ధి సాధించాలంటే చట్టసభలు, స్థానిక సంస్థల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్‌యాదవ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ రిజర్వేషన్ల సవరణకు, సామాజిక రక్షణ చట్టం అమలుకు, శాఖలవారీగా సబ్‌ప్లాన్ నిధుల కేటాయింపులకు, ప్రత్యేకంగా బీసీల అభివృద్ధికి శాసనసభ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి డాక్టర్ ఏపనగండ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ 63 వేల బీసీ, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు, కెనరా బ్యాంకు ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సి.బాలకృష్ణ, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓర్సు ప్రేమరాజు మాట్లాడుతూ రిజర్వేషన్ల సాధనకు రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, సంఘాల ప్రతినిధులతో జాతీయ స్థాయి ఐకాస ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రతినిధులు, సంఘం జిల్లా అధ్యక్షుడు ఏడుకొండలు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం

మృతుల్లో రైతు, వృద్ధాశ్రమ నిర్వాహకుడు

శ్రీనివాసరావు (పాత చిత్రం)

నరసరావుపేట సెంట్రల్: మండలంలో ఉప్పలపాడు గ్రామానికి చెందిన రైతు కన్నదార శ్రీనివాసరావు (55) లారీ ఢీకొని ఆదివారం మృతి చెందారు. గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆయన వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై నరసరావుపేటకు బయల్దేరారు. గ్రామ శివారులోకి వెళ్లేసరికి వినుకొండ వైపు నుంచి గుంటూరు వెళుతున్న లారీ వెనుకగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు. మృతుడికి భార్య పద్మావతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈయన గ్రామంలో తెదేపా కార్యకర్తగా ఉన్నారు. సౌమ్యుడిగా పేరుపొందారు. ఆయన మృతికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు.

బస్సు ఢీకొని..

విజయవాడ: ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వృద్ధాశ్రమ నిర్వాహకుడు మృతి చెందిన సంఘటన కృష్ణలంకలో ఆదివారం చోటుచేసుకుంది. కృష్ణలంక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . కట్ట గురవయ్య(55) వృద్ధాశ్రమ నిర్వాహకుడు కాగా.. పల్నాడు జిల్లా నరసరావుపేట ఎస్కేవీఎన్ నగర్‌లో కుటుంబంతో ఉంటున్నారు. ఇబ్రహీంపట్నంలో ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లేందుకు ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి భార్యతో ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. విజయవాడ వచ్చి బీసెంట్ రోడ్డులో షాపింగ్ ముగించుకున్న అనంతరం కుమార్తె వద్దకు వెళ్లేందుకు సాయంత్రం సుమారు 5గంటల సమయంలో వీఎంసీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో మితిమీరిన వేగంతో వెనుక నుంచి వచ్చిన గవర్నర్‌పేట-1 డిపోకు చెందిన నూతక్కి-రైల్వేస్టేషన్, 217సీ నంబరు ఆర్టీసీ బస్సు వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో గురవయ్య కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. సమీపంలోని వారు అతడిని ఆసుపత్రికి తరలించగా కొద్ది సేపటికి మృతిచెందారు. ఘటనాస్థలానికి చేరుకున్న కృష్ణలంక పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని యువకులు..

వినుకొండ రూరల్: ఆగి ఉన్న లారీని వెనుక నుండి ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కర్నూలు గుంటూరు జాతీయ రహదారిపై వినుకొండ మండలం పసుపులేరు సమీపంలో డాలర్ సిటీ వద్ద ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వినుకొండ నుండి మార్కాపురం వైపు వెళ్తున్న లారీని డాలర్ సిటీ వద్ద ఆపి చోదకుడు టీ తాగేందుకు వెళ్లాడు. అదే సమయంలో వెనుకగా వచ్చిన ద్విచక్ర వాహనం ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. వారిని ప్రకాశం జిల్లా కురిచేడు మండలం మునియ్య కాలనీ వాసులు గోసుల ముంజయ్య (22), గోసుల ఆనంద్ (15)గా గుర్తించారు. వినుకొండ మండలం ఉప్పరపాలెం వద్ద బంధువుల వద్దకు వచ్చి తిరిగి వెళుతుండగా ప్రమాదానికి గురైనట్లు సమాచారం. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

నిర్ణయించిన రుసుమే వసూలు చేయాలి

మాట్లాడుతున్న కొంకా రాధ, మార్కెట్‌యార్డు ఛైర్మన్

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: రైల్వే స్టేషన్ ఆవరణలో పార్కింగ్ స్థలం పరిధి వరకే వాహనాలకు పార్కింగ్ ఫీజు వసూలు చేయాలని జోనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల సభ్యురాలు కొంకా రాధ రైల్వే పోలీసులకు సూచించారు. ఆదివారం పట్టణంలోని రైల్వేస్టేషన్ ఆవరణాన్ని కొంకా రాధ, మార్కెట్‌యార్డు ఛైర్మన్ తురకా వీరాస్వామి, తెదేపా జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు గొంట్ల శ్రీనివాసరావులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె రైల్వే పోలీసులు, స్టేషన్‌మాస్టర్‌తో మాట్లాడారు. రైల్వే అధికారులు నిర్ణయించిన ఫీజునే వసూలు చేయాలని సూచించారు. పట్టణ తెదేపా అధ్యక్షుడు పిల్లి చెన్నారావు, జిల్లా ఉపాధ్యక్షుడు మేకల సాంబశివరావు, జనసేనపార్టీ మండల కన్వీనర్ కామిశెట్టి రమేష్, భాజపా జిల్లా నాయకులు వడ్లమూడి వెంకయ్య చౌదరి తదితరులు ఉన్నారు.

ఆనవాళ్లు కోల్పోయి.. రాకపోకలు నిలిచి..

దెబ్బతిన్న కమ్మవారిపాలెం రహదారి

నూజండ్ల, న్యూస్‌టుడే: మొంథా తుపాను ధాటికి మండలంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ రహదారులు పూర్తిస్థాయిలో ధ్వంసం అయ్యాయి. కొన్ని చోట్ల నామరూపాలు లేకుండా పోయాయి. నాలుగు కల్వర్టులు కొట్టుకు పోయాయి. మరికొన్ని దెబ్బతిన్నాయి. వినుకొండ- జంగాలపల్లి మీదుగా గొల్లపాలెం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి పూర్తి స్థాయిలో దెబ్బతింది. కొన్ని చోట్ల రోడ్డు ఆనవాళ్లు కోల్పోయింది. పెద్దవాగు ఉధృతికి చప్టాతో సహా రోడ్డు మొత్తం కొట్టుకుపోయింది. రవాణా నిలిచింది. నూజండ్ల టు నూజండ్ల రింగ్ రోడ్డులో కమ్మవారిపాలెం, నూజండ్ల మధ్యలో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. చింతలచెరువు టు చింతలచెరువు రోడ్డు గోతుల మయమైంది. కొండలరాయునిపాలెం రోడ్డు కల్వర్టులు దెబ్బతిని రోడ్డు పూర్తిస్థాయిలో పాడైంది. లింకు రోడ్డు అధ్వానంగా మారింది. పంచాయతీరాజ్ రోడ్ల తాత్కాలిక మరమ్మతులకు రూ.55 లక్షలు అవసరం అవుతుందని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే పనులు చేపడతామని ఏఈ నవ్య పేర్కొన్నారు. తాత్కాలిక, పూర్తిస్థాయి మరమ్మతుల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామని తెలిపారు. రవాణా పునరుద్ధరణకు చర్యలు చేపట్టామన్నారు.

కరవుసీమలో చెరువులకు జలకళ

నిండుకుండలా గండిగనుమల చెరువు

బొల్లాపల్లి, న్యూస్‌టుడే: దాహం వేసినప్పుడు అందుబాటులో లేని నీరు.. పొలంలో పైరు ఎండిపోతున్నప్పుడు నీళ్లు అందించని వ్యవసాయ బోరు వంటివి మాత్రమే బొల్లాపల్లి మండల ప్రజలకు తెలుసు. ఈ ఏడాది అటువంటి ఇబ్బందులు కొంతమేర తగ్గుతాయని మండలంలో మెట్ట ప్రాంత రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మెత్తం 33 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 15 పంచాయతీలు సాగర్ ఆయకట్టు పరిధిలో ఉండగా మిగతా గ్రామాలు వ్యవసాయ బోర్ల ఆధారంగా పంటలు సాగు చేస్తారు. గడిచిన 10 సంవత్సరాలు పెద్దగా చెరువులు నిండిన పరిస్థితి లేదు. దీంతో ఏటా జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే బోర్లు ఎండిపోయి తాగు, సాగునీటి కష్టాలు ఎదుర్కోవడం పరిపాటిగా మారింది. ఈ గ్రామాల్లో మైనర్ ఇరిగేషన్ పరిధిలో 10 చెరువులు ఉన్నాయి. చాలా ఏళ్లుగా నిర్వహణ లోపంతో గండ్లు పడి వర్షపు నీరంతా వృథాగా పోయేది. ఈ ఏడాది గండ్లు పూడ్చారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గండిగనుమల, షోళయపాలెం, రావులాపురం గ్రామాల చెరువులు వర్షపు నీటితో నిండాయి. గ్రామాల్లో బోర్ల నుండి నీరు పుష్కలంగా లభించడంతో పాటు గండిగనుమల గ్రామంలో 30 బోర్ల నుండి నీరు ఉబికి వస్తుంది. మిగతా గ్రామాలైన బొల్లాపల్లి, రేమిడిచర్ల, మేళ్లవాగు గ్రామాల్లో చెరువులకు కొంత మేర నీరు చేరింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పావురాలకు స్నేహితుడు

పావురాలకు గింజలు వేస్తున్న షేక్ మాబువలి

రొంపిచర్ల, న్యూస్‌టుడే: ఆ యువకుడు కనిపిస్తే చాలు పావురాలు అరుస్తూ స్వాగతం పలుకుతాయి. బయటకు వదిలితే రెక్కలు కొట్టుకుంటూ అతని చుట్టూ చేరి అభిమానం చాటుతాయి. అతని చేతుల్లో ఒదిగి ఆప్యాయత చూపుతాయి. అతను అందించే ఆహారమో.. ఆప్యాయతో తెలియదు గానీ ఆరు నెలలుగా ఆ బంధం అలా అల్లుకుంది. రొంపిచర్లకు చెందిన షేక్ మాబువలి మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆరు నెలల క్రితం 30 పావురాలను కొని పెంచుతున్నాడు. వీటిని తన ఇంట్లో ప్రత్యేకంగా తయారు చేసిన బోనులో ఉంచి వాటికి అనువుగా సౌకర్యాలు కల్పించాడు. అంతేకాక క్రమం తప్పకుండా ఆహారం, వాటికి అవసరమైన మందులు అందిస్తున్నాడు. మేత వేసేటప్పుడు, వాటిని బయటకు వదిలిన సమయంలో పక్షులు ఆ యువకుడిపై చూపే ప్రేమ చూపరులను ఆకట్టుకుంటోంది.

రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు ఎంపికలు పూర్తి

పోటీలో క్రీడాకారులు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాల ఈత కొలనులో వివిధ కేటగిరీలకు సంబంధించి జిల్లా స్థాయి ఈత జట్ల ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించినట్లు అధ్యక్షుడు ఏవీవీ రామలింగారెడ్డి, జిల్లా కార్యదర్శి వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఎంపిక పోటీలకు 58 మంది ఈత క్రీడాకారులు హాజరుకాగా వారిలో ప్రతిభ చూపిన 28 మంది మూడు విభాగాలకు ఎంపికయ్యారు. సబ్ జూనియర్ విభాగానికి ఎంపికైన వారు ఈనెల 16న విజయవాడలో జరిగే రాష్ట్ర సబ్ జూనియర్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో, వింటర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ కేటగిరికీ ఎంపికైన 15 మంది ఈనెల 22, 23 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్‌లో, మాస్టర్స్ కేటగిరికి ఎంపికైన ముగ్గురు ఈనెల 9న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని వారు తెలిపారు. జట్ల ఎంపికను కోచ్ జి.సురేష్ సమక్షంలో నిర్వహించారు.

శిక్షణ ఇచ్చి.. మిషన్లు మరిచి

జిల్లాలో 2వేల మంది మహిళల ఎదురు చూపు

రెండో విడతకు ప్రతిబంధకం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

సత్తెనపల్లి నియోజకవర్గంలో ముప్పాళ్ల, సత్తెనపల్లి మండలాల్లోని నందిగామ, నకరికల్లులో ఉచిత కుట్టు శిక్షణ శిబిరాల్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 270 మంది మూడు నెలలపాటు శిక్షణ పొందారు. వారికి కుట్టు మిషన్లు ఇవ్వాల్సి ఉండగా అవి రాలేదు. ఇటీవలే ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను మహిళలు కలసి మిషన్లు అందేలా చూడాలని విన్నవించారు. అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మహిళల ఆర్థిక స్వావలంబనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వైకాపా ప్రభుత్వంలో అయిదేళ్లపాటు స్వయం ఉపాధి శిక్షణను మరచిపోయారు. కూటమి అధికారంలోకి రాగానే కుట్టు శిక్షణ శిబిరాల్ని బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఉచిత శిక్షణ పొందేందుకు జిల్లావ్యాప్తంగా 7,345 మంది వివరాల్ని నమోదు చేసుకోగా వారిలో 30 శాతం మంది పక్కాగా శిక్షణ పొందారు.

ముప్పాళ్లలో కుట్టు శిక్షణలో మహిళలు

ముఖ ఆధారిత హాజరు.. : మూడు నెలలు పూర్తిగా శిక్షణ పూర్తయితేనే ఉచిత కుట్టు మిషన్ ఇస్తామనే నిబంధన ఉంది. దీనికితోడు అన్ని కేంద్రాల్లో ముఖ ఆధారిత హాజరు ఏర్పాటు చేశారు. జిల్లాలో 23 శిక్షణ శిబిరాల్ని ఏర్పాటు చేయగా వాటిని ఇద్దరు గుత్తేదారులకు అప్పగించారు. ఒక్కో మహిళకు రూ.25 వేలు చొప్పున ప్రభుత్వం వ్యయం చేసేలా మార్గదర్శకాలు, కేంద్రానికి ఇద్దరు శిక్షకుల్ని నియమించారు. వారికి నెలకు రూ.10 వేలు చొప్పున మూడు నెలలకు ప్రోత్సాహ నగదు రావాల్సి ఉండగా ఇప్పటివరకు విడుదల చేయలేదు.

రెండోవిడత శిక్షణలో జాప్యం.. : వచ్చే మూడేళ్లపాటు మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చి మిషన్లు అందించాలన్నది ప్రభుత్వ ప్రణాళిక. తొలివిడత మిషన్ల పంపిణీని అక్టోబరు 31లోపు పూర్తిచేసి నవంబరు 1 నుంచి రెండోవిడత శిక్షణ ప్రారంభించాలని భావించినా నిధులు విడుదల కాకపోవడంతో ప్రతిబంధకం ఏర్పడింది. జిల్లాలోని 23 కేంద్రాల్లో ఇప్పటికే 2 వేల మంది పూర్తిస్థాయిలో శిక్షణ పొందారు. వారికి కుట్టు మిషన్లు అందించాల్సి ఉంది. అర్హులైన మహిళలకు ఉచిత కుట్టు మిషన్లను త్వరలోనే అందిస్తామని బీసీ సంక్షేమశాఖ అధికారులు తెలిపారు. రెండోవిడత శిక్షణను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రారంభిస్తామని చెప్పారు.

డీసీసీబీ అక్రమాలపై సమావేశం నేడు

గుంటూరు: వైకాపా ప్రభుత్వంలో డీసీసీబీలో అక్రమాలపై అసెంబ్లీ హౌస్ కమిటీని నియమించింది. సచివాలయంలో సోమవారం నిర్వహించే సమావేశంలో సహకార శాఖ అధికారులు, బ్యాంకు సీఈవోలు పాల్గొననున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో / కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, రిటైల్ ధర - 148, చికెన్ విత్‌స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్ - 244.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 252 చికెన్ స్కిన్‌లెస్ - 262.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 575 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.96/-.

చిలకలూరిపేట పట్టణం : గిరిజన పాఠశాలలు, కళాశాలల్లో జన్ జాతీయ గౌరవ్ దివస్‌ను రాష్ట్రంలోని అన్ని

15న జన్ జాతీయ గౌరవ్ దివస్

జిల్లాల్లో ఈనెల 15న నిర్వహిస్తున్నారని ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీనునాయక్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ నవంబరు 15న స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జయంతి దేశ వ్యాప్తంగా జరుగుతుందన్నారు. ఆయన జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక నేడు

నరసరావుపేట క్రీడలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అండర్-19 హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు పట్టణంలోని చరితరెడ్డి డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీలో సోమవారం నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఈ పోటీల్లో పాల్గొనాలన్నారు.

వైకాపా కొవ్వొత్తుల ర్యాలీ

నరసరావుపేట వ్యవసాయం: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి కలగాలని చిలకలూరిపేట నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త విడదల రజిని అన్నారు. ఆదివారం రాత్రి నరసరావుపేటలో పట్టణ వైకాపా నేతలు, కార్యకర్తలతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గుంటూరు రోడ్డులోని వైకాపా పార్టీ కార్యాలయం నుంచి గడియార స్తంభం సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆలయాల వద్ద తొక్కిసలాట జరిగి 23 మంది మృతి చెందారన్నారు.

91.9FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

EENADU Classifieds

BUSINESS SERVICES
బంగారం బ్యాంకులో / ఫైనాన్స్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.
బంగారం కొనబడును: బ్యాంకులలో ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166

TO LET
COMMERCIAL
బాపట్ల జిల్లా, నగరం నందు [illegible] వ్యాపారసముదాయ భవనం 229 గజములు 2 ఫ్లోర్ హాల్ (1300 Sft) అద్దెకు. ✆ 94908 48822.

WANTED HDFC BANK
కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్
[illegible]
లలితా ఫైనాన్స్ [illegible]
9951001348

JOBS
Immediate openings for Customer Service Executive & Branch Manager Positions in Cherukuri Group, Located in Eluru, Tanuku, Guntur & Vijayawada. Qual: Min Inter. ✆ 9885206666, E-mail: hr@cherukurigroup.org.
Wanted female nurse for home patient. Exp: BSc nursing & food and Nutrition. Timings: morning 6am to 6pm pls send ur Biodata with photo to following mail ID (staffbala5@gmail.com)
Sri Balaji Hospitals required HR manager, pharmacy sales executive, tally operator. Experience 2 years. Ph: 83095 46242.

PEOPLE CARE
OLD AGE HOME
శ్రీనివాస గ్రూప్, VJA, [illegible] ✆ 95537 86677/96404 96677.

REAL ESTATE
HOUSE FOR SALE
GENERAL
గుంటూరు సిటీ [illegible] 9849502430, 8341342696.

బెన్ ఎలక్ట్రిక్‌బైక్ షోరూమ్ గుంటూరులో పనిచేయుటకు ★సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ ★ టెక్నీషియన్స్ కావలెను. అనుభవం గలవారు సంప్రదించండి. ✆ 99516 66619
హైదరాబాద్ హోంకేర్‌లో ఏజెంట్లకు [illegible] ✆ 89775 47749.
[illegible] ✆ 74169 52459.
R.K ఇంజనీరింగ్ [illegible] ✆ 97014 73399.
7 HILLS [illegible] (Female) [illegible] 72888 77785.
చైతన్య సాయి [illegible] 90595 14555.
సెక్యూరిటీ గార్డులు [illegible] ✆ 95506 06916.
[illegible] HDFC/ AXIS [illegible] ✆ 82976 75825.
గమనిక [illegible]

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జీ.ఎస్.టీ అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వండి
పూర్తి వివరాలకు సంప్రదించండి 8008510541

(c) eenadu

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

నూజండ్ల, న్యూస్‌టుడే: తుపాను తాకిడికి నీరు కలుషితం అయినందున శుభ్రం చేసిన తర్వాతే తాగాలని డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. రక్షిత నీటి పథకాలన్నింటినీ క్లోరినేషన్ చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. నూజండ్లలోని రక్షిత నీటి పథకాన్ని ఆదివారం క్లోరినేషన్ చేయించారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరు తాగితే మంచిదన్నారు. తాగునీటి ద్వారానే ఎక్కువ వ్యాధులు రావడానికి అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏ గ్రామంలోనైనా క్లోరినేషన్ చేయకుండా నీటి సరఫరా చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సర్పంచి వెంకటస్వామి, కార్యదర్శి నాగులు సిబ్బంది ఉన్నారు.

నిరుపయోగం

చిలకలూరిపేట పట్టణం కమ్మరిపాలెంలో మర్రి చెన్నారెడ్డి పురపాలక సంఘ ప్రాథమిక పాఠశాలలో 120 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. నాడు- నేడు పథకం కింద రూ.లక్షలు వెచ్చించి శుద్ధ జల కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అది నిరుపయోగంగా మారింది. పాఠశాల భవనంపై ఉన్న ట్యాంకులో పట్టిన నీటిని శుద్ధి చేయకుండా నేరుగా వినియోగించడంతో తరచూ వ్యాధుల బారిన పడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. సమస్యను ప్రధానోపాధ్యాయుడు ఉసా సుబ్బారావు దృష్టికి తీసుకెళ్లగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయించి విద్యార్థులకు శుద్ధ జలం అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. - న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008146652 వినుకొండ గ్రామీణ : 9440009293

? చిలకలూరిపేట - నరసరావుపేట మార్గంలో కొండ్రపాడు వద్ద రోడ్డుపై విద్యుత్తు సర్వీసు వైర్లు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. లోడు లారీ వస్తే తీగలు తెగిపోయే ప్రమాదం ఉంది. - **శ్రీరాములు** ✔ పరిశీలించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు సర్వీసు తీగలు సరిచేస్తాం. - **లావణ్య, ఏఈ, విద్యుత్తుశాఖ** - న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

పాసుపుస్తకాల పంపిణీ ఎప్పటికో..!

ఎదురు చూస్తున్న అన్నదాతలు

న్యూస్‌టుడే, రావిపాడు (నరసరావుపేట సెంట్రల్)

రెవెన్యూ దస్త్రాల్లో నమోదైన పంట భూముల వివరాలతో రైతులకు అందించే పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ ఎప్పటికి జరుగుతుందో అర్థం కాక అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. కొత్త పాసు పుస్తకాలు వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటికీ పంపిణీకి నోచుకోలేదు. పంట, బంగారంపై రుణాలు పొందేందుకు పట్టాదారు పాసుపుస్తకాల అవసరం ఉంది. ఇలాంటి సమయంలో పుస్తకాలు లేకపోవటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



మండలానికి 15వేలు..

గత ప్రభుత్వం భూసమస్యల పరిష్కారమే లక్ష్యమని భూములకు సంబంధించిన సమస్యలు లేకుండా చేస్తామంటూ రీసర్వే ప్రారంభించింది. రీ సర్వే పూర్తయిన చోట్ల భూములకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలపై రాజముద్రకు బదులు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రం ముద్రించడంపై రైతులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. అయినా వైకాపా ప్రభుత్వం వెనక్కు తగ్గలేదు. ఇదిలా ఉంటే ఒకరి పొలం మరొకరి పేరుతో అడంగల్‌లో నమోదు కావడం, భూముల కొలతల్లో భారీ తేడాలు రావడం వంటి ఇబ్బందులు రైతులు ఎదుర్కొన్నారు. 2024లో ఎన్నికల సందర్భంగా రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలు ఇస్తామని కూటమి పార్టీల నేతలు హామీ ఇచ్చారు. అనంతరం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రీ సర్వే జరిగిన గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ ఆధారంగా కొత్త పాసుపుస్తకాలు అందజేసేందుకు పచ్చజెండా ఊపింది. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితమే నరసరావుపేట మండలానికి మొత్తం 15వేల పాసుపుస్తకాలు రెవెన్యూ కార్యాలయానికి వచ్చాయి. అయితే వీటిని ఇప్పటి వరకు పంపిణీ చేయకపోవటంతో రైతులు పాసు పుస్తకాలు ఎప్పుడు పంపిణీ చేస్తారోనని ఎదురు చూస్తున్నారు. ఈ విషయమై తహసీల్దారు వేణుగోపాలరావును సంప్రదించగా ప్రభుత్వం రాజముద్రతో కూడిన పాసుపుస్తకాలు ముద్రించింది. నరసరావుపేట మండలానికి సంబంధించి మొత్తం 15వేల పాసు పుస్తకాలు వచ్చాయి. ప్రభుత్వ నుంచి ఆదేశాలు రాగానే రైతులకు అందజేస్తామన్నారు.

వైద్య సేవలు

మండలంలోని కావూరులో కాటూరి వైద్య కళాశాల సహకారంతో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 400 మందికి రక్తపోటు, మధుమేహం, ఈసీజీ తదితర వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు కోడె మణిప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటైన శిబిరాన్ని కొమరవల్లిపాడు సొసైటీ అధ్యక్షుడు కోడె హనుమంతరావు ప్రారంభించారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తెదేపా బాధ్యతగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో తెదేపా సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, కావూరు (చిలకలూరిపేట గ్రామీణ)

నీటి కష్టాలకు చెల్లు

మండలంలో వెల్లూరు శివారు వెంపవారిపాలెంలో జల్‌జీవన్ మిషన్ కింద నిర్మాణం చేపట్టిన మంచినీటి పథకం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. మొత్తం రూ.81 లక్షలతో నూతనంగా ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం, వెల్లూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద నుంచి పైపులైను, గ్రామంలో ఇంటింటికి కుళాయి ఏర్పాటు వంటి పనులు చేపట్టారు. వీటిలో కేంద్ర ప్రభుత్వం రూ.40.50లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.40.50లక్షలు నిధులు అందచేశారు. ఈ గ్రామానికి పక్కనే అద్దంకి బ్రాంచి కెనాల్ ఉన్నప్పటికీ ఇంతవరకు గ్రామానికి మంచినీటి పథకం లేదు. ప్రస్తుతం పథకం ఏర్పాటుపై గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కుమారరాజా మాట్లాడుతూ రోజుల వ్యవధిలో స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. - న్యూస్‌టుడే, వెంపవారిపాలెం (శావల్యాపురం)

కూరగాయ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: మండలంలో వందలాది ఎకరాల్లో కూరగాయల పంటలు సాగు చేసిన రైతులు మొంథా తుపానుతో నష్టపోయారని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని పీడీఎస్ నాయకుడు వై.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విఠంరాజుపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న కూరగాయ పంటలను ఆదివారం పరిశీలించారు. ఈ గ్రామాల్లో ఎక్కువగా కూరగాయలు పండిస్తారని మిర్చితో పాటు వర్షపు నీటిలో మొక్కలు నాని కూరగాయలు కుళ్లిపోయాయన్నారు. గోరుచిక్కుడు, దోస, గుమ్మడి, సొరకాయ, కంది పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఇంత జరిగినా వ్యవసాయాధికారులు దెబ్బతిన్న పొలాలను పరిశీలించలేదని రైతులు వాపోయారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.35 వేలు చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రైతులు కంటా రంగారావు, వెంకటేశ్వర్లు, పగడాల చిన్న కోటిరెడ్డి, యాదాల శంకర్, భవనం కోటిరెడ్డి, సుందరరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చిల్కు ద్వాదశి

నూజండ్ల, న్యూస్‌టుడే : రవ్వారం శ్రీ వేంకటేశ్వర జగన్మాత పీఠంలో ఆదివారం చిల్కు ద్వాదశి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ధాత్రి నారాయణుడికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం తులసి బృందావనంలో ఉసిరి వృక్షం, తులసిమాతకు ధాత్రినారాయణ స్వరూపానికి కల్యాణం జరిపించారు.

పూజలందుకున్న తులసిమాత, ధాత్రి నారాయణుడు

ఘనంగా వీరబ్రహ్మేంద్రుడి జయంతి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలో శ్రీరాంపురంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం స్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవం చేపట్టారు.

ప్రసన్నాంజనేయుడికి పంచామృత అభిషేకం

చౌత్రాసెంటర్ వీరాంజనేయుడు

బొప్పూడి (చిలకలూరిపేట గ్రామీణ), చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : కార్తిక మాసంతో పాటు స్వామివారి జన్మ నక్షత్రం పూర్వభాద్ర పురస్కరించుకుని బొప్పూడి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పంచామృతాలతో ఆదివారం అభిషేకం నిర్వహించారు. ఆవు పాలు, ఆవు పెరుగు, తేనె, నెయ్యి, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో అర్చక బృందం దివి పవనాచార్యులు, చక్రవర్తి, ఆంజనేయ శాస్త్రి, చరణ్ ఆధ్వర్యంలో అభిషేకాలు చేశారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ చేశారు.✦ చిలకలూరిపేట పట్టణం చౌత్రా సెంటర్ వీరాంజనేయస్వామి, చిలకలూరిపేట - నరసరావుపేట రోడ్డు పోలిరెడ్డిపాలెం వద్ద ఆంజనేయ ఆలయాల్లో స్వామికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేక పూజలు నిర్వహించారు.

బొప్పూడిలో స్వామికి అభిషేకం

కార్తిక వన సమారాధనలు.. ఐక్యతకు చిహ్నాలు

నరసరావుపేట సెంట్రల్, నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: కార్తిక వనసమారాధన కార్యక్రమాలు ఐక్యతను చాటుతాయని ఎమ్మెల్యే అరవిందబాబు అన్నారు. మండలంలోని కోటప్పకొండలో ఆదివారం పద్మశాలీయ సంక్షేమ సంఘం తృతీయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్తిక వన సమారాధనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పద్మశాలీలు రాష్ట్రంలో వస్త్ర పరిశ్రమ, వ్యవసాయం, చిన్న తరహా వ్యాపారాలు నిర్వహిస్తున్నారని వారి అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. కార్తిక వనసమారాధన పేరిట అందరూ ఒక చోట కలుసుకోవటం ఆనందంగా ఉందన్నారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవిందబాబు

కుంకుమార్చన చేస్తున్న మహిళలు

బాలికల నృత్యప్రదర్శన

✦ శ్రీసర్వేపల్లి బ్రాహ్మణ ఉద్యోగ సేవా సమితి ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎన్ కళాశాల ప్రాంగణంలో బ్రాహ్మణ కార్తిక వనసమారాధన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సహస్రలింగార్చన, సామూహిక కుంకుమార్చన తదితర కార్యక్రమాలు చేపట్టారు. భోజనం తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. బాలికల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉద్యోగ విరమణ చేసిన, పురస్కారాలు సాధించిన సంఘం సభ్యులను సత్కరించారు. సంఘం నేతలు పర్యవేక్షించారు.

మైదానంలో నీరు.. క్రీడాకారుల బేజారు

వినుకొండలోని జూనియర్ కళాశాల క్రీడా మైదానం వర్షపు నీటితో నిండింది. గతంలో వర్షాలు కురిసినప్పుడు ఈ మైదానం నిండినా నెమ్మదిగా నీరు బయటకు పోయేది. ప్రస్తుతం మైదానం చుట్టూ మట్టి తోలి ఎత్తుగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. దీంతో మైదానం మొత్తం పల్లంగా ఉండటంతో నీరు బయటకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. ట్రాక్ కింద నుంచి పైపులు ఏర్పాటు చేసి బయటకు నీరు పంపొచ్చని కొందరు తెలిపారు. ఇక్కడ కళాశాలతో పాటు బాలుర జడ్పీ పాఠశాల కూడా ఉంది. దీనిపై పురపాలక కమిషనర్ సుభాష్‌చంద్రబోస్‌ను సంప్రదించగా పైపులైను పని జరుగుతుందని రెండ్రోజుల్లో నీటిని బయటకు పంపనున్నట్లు వివరించారు. - న్యూస్‌టుడే, వినుకొండ రూరల్

ఉరకెత్తి.. పశువులకు మేతగా మారి..

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి పొగాకు నారుమడులు ఉరకెత్తాయి. వృథాగా ఉన్న నారుమడుల్లో పశువులను తోలి మేపుతున్నారు. మండలంలో చాట్రగడ్డపాడు సమీపంలోని ఓ పొలంలో గొర్రెలను తోలారు. వర్షం పొగాకు నారుమడులను నిలువునా ముంచిందని లేకపోతే లాభాలు వచ్చేవని రైతులు తెలిపారు. చీకటీగలపాలెం, కొత్తపాలెం, శివాపురం, నడిగడ్డ, పార్వతీపురం తదితర గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇటీవల పోసిన నారుమడులు మాత్రం బాగానే ఉన్నాయని తెలిపారు. - న్యూస్‌టుడే వినుకొండ రూరల్

సిబ్బంది కొరతతో సేవలు దూరం

గ్రామసచివాలయాల వద్ద తప్పని పడిగాపులు

న్యూస్‌టుడే, కారుమంచి, వేల్పూరు (శావల్యాపురం)

ప్రజలకు పంచాయతీ స్థాయిలోనే సేవలు అందించేందుకు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసినప్పటికీ తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో 11 సచివాలయాలు ఉండగా ఇటీవల రేషనలైజేషన్ కారణంగా శావల్యాపురం, మతుకుమల్లి, వేల్పూరు-2, కారుమంచి, పోట్లూరు సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు లేకపోవడంతో వాటి పరిధిలో ప్రజలు వివిధ రకాల ప్రభుత్వ సేవలు పొందలేకపోతున్నారు. వీరిలో మతుకుమల్లి డిజిటల్ అసిస్టెంట్‌ను డిప్యుటేషన్‌పై పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయానికి పంపించారు. దీంతో ఆ గ్రామంలో ప్రజలు దరఖాస్తు సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మండల కేంద్రమైన శావల్యాపురం సచివాలయానికి కూడా డీఏ లేకపోవడంతో గ్రామస్థులు 1బి, అడంగల్, కుల, ఆదాయ, నివాస, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ ధ్రువ పత్రాల దరఖాస్తు సమయంలో పక్కనే ఉన్న కనమర్లపూడి, కొత్తలూరు సచివాలయాల వద్దకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలో పెద్ద పంచాయతీ అయిన వేల్పూరు-2 సచివాలయంలోనూ చాలినంతమంది సిబ్బంది లేరు. అంతేకాక తహసీల్దారు కార్యాలయంలో ఆమోదం పొందిన తరువాత ధ్రువపత్రాలు తీసుకోవడానికి కూడా పక్క గ్రామాలకు వెళ్లాల్సిన దుస్థితి వచ్చిందని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా మండలస్థాయి అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వ సేవలు పొందడానికి సిబ్బందిని నియమించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం మండలంలోని 11 సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్ ఉన్న సచివాలయానికి డీఏ ఉండరన్నారు. డీఏ ఉన్న చోట వెల్ఫేర్ అసిస్టెంట్‌ను నియమించలేదని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు.

ఉద్యోగాల కార్ఖానాగా వ్యాయామ కళాశాల

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: ధనలక్ష్మి వ్యాయామ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ చదివిన విద్యార్థులు సుమారు 80 మంది ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో పీఈటీలు, పీడీలుగా ఉద్యోగాలు సాధించటం ఎంతో గర్వంగా ఉందని ఛైర్మన్ రామశేషగిరిరావు అన్నారు. ఈ కళాశాలలో చదివి ఉద్యోగాలు సాధించిన వారిని స్థానిక ఎంఏఎం కళాశాలలో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన, విలువలతో కూడిన ఫిజికల్ ఎడ్యుకేషన్‌ను అందించటంతోనే ఇది సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య పృథ్వీరాజ్, వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మరుగుదొడ్లకు రోటరీ సాయం

వినుకొండ, న్యూస్‌టుడే: భక్తుల సౌకర్యార్థం రోటరీ క్లబ్ సహకారంతో చర్చి ఆవరణలో మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్లు చర్చి బాధ్యుడు చాట్ల రామయ్య తెలిపారు. నరసరావుపేట రోడ్డులోని ఇవాంజికల్ తెలుగు బాప్టిస్ట్ చర్చి ప్రాంగణంలో నిర్మిస్తున్న మరుగుదొడ్లకు ఆర్థిక సాయం అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు నిర్మాణాలను ఆదివారం పరిశీలించారు. నెల రోజుల్లోపు పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు రావాలని కోరారు. నిర్మాణ వ్యయంలో పాలు పంచుకుంటున్న ప్రధాన దాతలు గుమ్మా శ్రీకాంత్‌రెడ్డి, మస్తాన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వెంకట నారాయణ, ఆలా శ్రీనివాసరావు, నాగేంద్రుడు, చర్చి పెద్దలు పాల్గొన్నారు.

మహిళల్లో క్రీడా స్ఫూర్తి పెరగాలి

నరసరావుపేట క్రీడలు, వినుకొండ, న్యూస్‌టుడే: కమాన్ హర్మన్ సేన.. దేశమంతా మీ వెనకే అంటూ ప్రతి ఒక్కరూ భారత మహిళల క్రికెట్ జట్టుకు మద్దతు తెలిపారు. మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రజలంతా చూసేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు ఆదివారం డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో డిజిటల్ లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాటు చేశామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి తెలిపారు. ✦ భారత మహిళల క్రికెట్ జట్టు ప్రపంచ కప్ సాధించాలని కోరుతూ కూటమి నాయకులు, కార్యకర్తలు వినుకొండ పట్టణంలోని గుంటి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ప్రధాన మసీదులో ముస్లిం మత పెద్దలు, చర్చిల్లో పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. మహిళల్లో క్రీడా స్ఫూర్తి పెంచేందుకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రికెట్ వీక్షించడానికి ఎంపీడీవో కార్యాలయం వద్ద పెద్ద తెర ఏర్పాటు చేశారు.

వినుకొండ: మసీదులో ప్రార్థనలు

మతుకుమల్లి రాత మారేదెన్నడో?

మండలంలోని మతుకుమల్లి గ్రామంలో ప్రధాన రహదారి గుంతలు, బురదతో నిండి రాకపోకలకు గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 20 ఏళ్ల క్రితం నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్డు సరైన నిర్వహణకు నోచుకోక ప్రస్తుతం వర్షం కురిస్తే నడిచేందుకు కూడా వీలులేనంత అధ్వానంగా మారింది. ఈ మార్గం నుంచే గ్రామానికి చెందిన విద్యార్థులు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్తుంటారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురుగు కాలువలు పూడిపోయి వర్షపు నీరంతా రోడ్డుపైపే పారుతుందని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి చింతా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా పాలకవర్గంతో చర్చించి రహదారి అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, మతుకుమల్లి (శావల్యాపురం)

బడిలో బండలు సరిచేశారు

ఈనాడు కథనానికి స్పందన

యడ్లపాడు, న్యూస్‌టుడే: మండలంలోని తుర్లపాడు ప్రాథమిక పాఠశాలలో ఫ్లోరింగ్‌కు వేసిన నాపరాళ్లు పగిలి పోవటంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో 'పగిలిన నాపరాళ్లు.. విద్యార్థుల అవస్థలు' శీర్షికన అక్టోబరు 24న కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. ఎంఈవో నాగరత్నం ఆదేశాల మేరకు హెచ్‌ఎం షర్మిలాబేగం ఫ్లోరింగ్ పనులు చేయించారు. గ్రామ తెదేపా నేత పోలినేని గిరిధర్ రూ.5 వేలు వితరణ చేశారు.

తుప్పు పట్టి.. తల విరిగి..

మండలంలో గోవిందపురం ఎస్సీ కాలనీ వద్ద బోరు పంపు తుప్పు పట్టి పాడైంది. దీంతో అయిదు నెలలుగా నీటికి అవస్థలు తప్పడం లేదని స్థానిక 40 కుటుంబాల వారు వాపోతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యతేజ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి బాగు చేయిస్తామన్నారు.
- న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ

కర్రలే ప్రమాద సూచికలు!

వినుకొండ రూరల్, రొంపిచర్ల, న్యూస్‌టుడే: మొంథా తుపానుతో కురిసిన వర్షాలకు గుండ్లకమ్మ నదికి తీవ్రస్థాయిలో వరద రావడంతో నీటి ప్రవాహానికి వినుకొండ - నూజండ్ల మార్గంలో వంతెన అంచున మట్టి కోతకు గురై తారురోడ్డు ఒకవైపు కుంగి గొయ్యి ఏర్పడింది. 20 అడుగుల లోతులో గొయ్యికి మరమ్మతు చేయకుంటే పెద్దదిగా మారే అవకాశం ఉంది. ఈదారిలో నిత్యం వాహనాలు తిరుగుతూ ఉంటాయి. గొయ్యి ఏర్పడినచోట కర్రకు పట్ట కట్టి రెండు రాళ్లు పెట్టారు. ఇవి చీకట్లో వేగంగా వచ్చే వారికి అర్థంకాక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గొయ్యి ఉన్నట్లు ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. దీనిపై ఆర్‌అండ్‌బి ఏఈ నవ్యను సంప్రదించగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ◆ రొంపిచర్ల మండలం విప్పర్లపల్లి వద్ద భారీ వర్షాలకు ఏడు మంగళం వాగు అప్రోచ్‌పై ఉద్ధృతిగా ప్రవహించటంతో పెద్ద గుంత పడింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గుంతలో కర్ర ముక్క పెట్టి దానికి ఓ జెండా పెట్టి వదిలేశారు. ప్రమాదం సంభవించక ముందే అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

రొంపిచర్ల: విప్పర్లపల్లి వద్ద..

వినుకొండ: కర్ర పెట్టి ఇలా..

నేడు కార్తిక వన భోజనాలు

శావల్యాపురం, న్యూస్‌టుడే : కార్తిక మాసం పురస్కరించుకుని మండల కేంద్రం శావల్యాపురంలోని శ్రీ కోదండరామ స్వామి దేవాలయంలో సోమవారం వన భోజనాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉదయాన్నే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సామూహిక భోజనాలు ప్రారంభిస్తామన్నారు.

15మంది కోడిపందేల నిర్వాహకుల అరెస్టు

నాదెండ్ల(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : నాదెండ్ల మండలం ఎండుగుంపాలెం నుంచి కోమటినేనివారిపాలెం వెళ్లే దారిలో రోడ్డు పక్కన నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై నాదెండ్ల ఎస్సై పుల్లారావు ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం దాడి చేశారు. 15 మంది నిర్వాహకులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారి నుంచి 26 ద్విచక్రవాహనాలు, రూ.19,400 నగదు, నాలుగు కోళ్లు, కోడి కత్తులు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

పనిచేయకుండానే పాడవుతున్నాయ్

మండల పరిధిలోని గ్రామాల్లో చెత్త సేకరణకు కొనుగోలు చేసిన ఆటోలు, రిక్షాలు పనిచేయకుండానే తుప్పు పట్టి మూలకు చేరాయి. గత తెదేపా హయాంలో ఘన వ్యర్థ నిర్వహణ కేంద్రాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి చెత్త సేకరణ చేయడంతో పాటు వర్మీకంపోస్టు ఎరువు తయారు చేసి పంచాయతీలకు ఆదాయం సమకూర్చారు. వైకాపా పాలనలో వాటిని పట్టించుకోలేదు. చెత్త సేకరణ సంగతి సరే చెత్తపైనా పన్ను వేశారు. అంతేకాక చెత్త సేకరణకు ఆటోలు, రిక్షాలు కొని డంపింగ్ యార్డులకు చేర్చారు. వాటిని ఒక్కరోజూ వినియోగించలేదు. అలాగే వదిలి వేయడంతో తుప్పు పట్టి పనికి రాకుండా పోయాయి. దీంతో రూ.లక్షల్లో ప్రజాధనం దుర్వినియోగమైంది. కూటమి ప్రభుత్వంలో అయినా వాటిని వినియోగంలోకి తెస్తే కొంత మేర మేలు జరగడానికి అవకాశం ఉంది. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణను వివరణ అడగ్గా చెత్త సేకరణ వాహనాలు ఇప్పటికే పూర్తిగా పాడయ్యాయి. వీటిని అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రస్తుతం కొత్త రిక్షాలు కొని చెత్త సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. - న్యూస్‌టుడే, నూజండ్ల

(c) eenadu

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

అమరేశ్వరునికి ప్రత్యేక పూజలు

అమరావతి, న్యూస్‌టుడే: పంచారామ క్షేత్రమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరాలయానికి కార్తిక ఆదివారం సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చారు. వేకువ జాము నుంచే వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి అమరేశ్వరున్ని దర్శించుకున్నారు. అమరేశ్వర ఘాట్‌లోని కృష్ణానదిలో స్నానాలు చేసిన భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు. ప్రత్యేక అభిషేక మండపంలో భక్తులు అభిషేకాలు చేయించుకున్నారు. మహిళలు కృష్ణానదికి పూజలు చేసి నదిలో అరటి బొత్తల్లో కార్తిక దీపాలు వదిలారు.

అమరేశ్వరఘాట్ వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు

తెరపై ఆట.. మహిళల కేరింత

సత్తెనపల్లి, పిడుగురాళ్ల, పెదకూరపాడు, మాచర్ల న్యూస్‌టుడే: సత్తెనపల్లి, పిడుగురాళ్ల, పెదకూరపాడు నియోజక వర్గాల్లోని పలు ప్రాంతాల్లో భారత్, దక్షిణాఫ్రికా ప్రపంచకప్ క్రికెట్ మ్యాచ్‌కు తెరలు ఏర్పాటు చేశారు. ఎల్ఈడీ తెరలపై మహిళల క్రికెట్ చూడటానికి గ్రామాల్లోనూ వయసుతోతేడాలేకుండా ఆడవారు ఒకచోట చేరి ఆసక్తిగా క్రికెట్ ఆటను తిలకించారు. తొలుత భారత జట్టు బ్యాటింగ్ చేయడంతో సందడి చేశారు. ఇండియా గెలవడంతో కేరింతలు కొట్టి సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచుకుని సంతోషం వ్యక్తం చేశారు.

పెదకూరపాడు: క్రికెట్ చూస్తున్న మహిళలు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

చెత్త కుప్పల తొలగింపు

స్పందనకు వందనం

దుర్గి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని అడిగొప్పల మండల పరిషత్తు ప్రాథమికపాఠశాల వద్ద పిచ్చిమొక్కలు మొలిచి ఉండడంతో స్థానికులు వ్యర్థాలు అక్కడే వేస్తున్నారు. అక్కడ విషపురుగులు చేరుతున్నాయని, దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోయారు. దీనిపై ఆదివారం ఈనాడులో ప్రచురితమవగా స్పందించిన ఈవోపీఆర్డీ రాజు, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ జేసీబీతో చెత్తకుప్పలు, ముళ్ల చెట్లను తొలగించారు. పాఠశాల విద్యార్థులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

కందిపోయిన రైతు

> మొంథా తుపానుకు దెబ్బతిన్న పంట
> ఆందోళన చెందుతున్న కర్షకులు

పిడుగురాళ్ల(జూలకల్లు), న్యూస్‌టుడే

మొంథా తుపాను కారణంగా కురిసిన వర్షాలకు పిడుగురాళ్ల, గురజాల, పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. పిడుగురాళ్ల పరిధిలోని పొలాల్లో నీరు నిలబడి కంది మొక్కలు ఎండిపోతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జూన్, జులై మాసాల్లో సాధారణ వర్షపాతం కంటే చాలా తక్కువగా నమోదైంది. ఆగస్టు నుంచి అక్టోబరు వరకు అధిక వర్షపాతం నమోదైంది. ఆగస్టులో కొందరు రైతులు కందిసాగు చేశారు. వర్షాలకు దెబ్బ తినడంతో సెప్టెంబరులో మరోసారి సాగు చేయగా మొంథా తుపాను ముంచేసింది.

14,347 హెక్టార్లలో సాగు

పిడుగురాళ్ల వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 14,347 హెక్టార్లలో కంది సాగు చేపట్టారు. అందులో పిడుగురాళ్ల మండలంలో 5,880, దాచేపల్లి 1,250, మాచవరం 4,335, నకరికల్లు 217, కారంపూడి 2,645 హెక్టార్లు ఉంది. రేగడి, పల్లం ప్రాంతాల్లో సాగుచేసిన కందిపైరు వర్షాలకు దెబ్బతిన్నది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దెబ్బతిన్న కందిపంటను అధికారులు పరిశీలించాలని రైతులు కోరుతున్నారు.

వర్షాలకు నీళ్లు నిలిచి దెబ్బతిన్న పైరు

మూడుసార్లు సాగుచేశా..

ఎకరాకు రూ.10వేలు చొప్పున కౌలుకు తీసుకొని మూడు ఎకరాల్లో కంది సాగు చేశా. ఖరీఫ్ నుంచి ఇప్పటి వరకు మూడు సార్లు విత్తనాలు వేశా. అధిక వర్షాల కారణంగా పైరులో నీళ్లు నిలిచి వాడిపోయింది. విత్తనాలు, ఇతర ఖర్చులు రూ.15వేలు అయ్యాయి. ఇప్పుడు మరోసారి సాగు చేయాలంటే ఆమేరకు భారం పడుతుంది. ప్రభుత్వం పరిహారం ఇస్తే రైతుకు కొంత ఉపశమనం లభిస్తుంది. **- సంకుల మురళి, కరాలపాడు**

రూ.1.35 లక్షలు ఖర్చు

తొమ్మిది ఎకరాల్లో కందిసాగు చేశా. ఆరు ఎకరాలు సొంతపొలం, మూడు ఎకరాలు కౌలుకు తీసుకున్నా. అధిక వర్షాల మూలంగా మూడుసార్లు కందిపైరు దెబ్బ తింది. మొంథా తుపాను కారణంగా మరోసారి సాగు చేయాలి. ఇప్పటి వరకు రూ.1.35 లక్షలు ఖర్చు అయ్యింది. పంట నష్టాలను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి పరిహారం వచ్చేలా చేయాలి. **- కృష్ణారెడ్డి, రైతు**

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు

పెదకూరపాడు, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలు, నాయకులనుంచి అనుసంధాన రహదారులు, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలంటూ ఇచ్చిన అర్జీలు స్వీకరించారు. త్వరలో పల్లె పండుగ 2.0 ద్వారా గ్రామాల్లో దీర్ఘకాలికంగా ఉన్న మురుగు పారుదల వ్యవస్థ, అంతర్గత రహదారుల అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామాల్లో పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేసేందుకు ప్రత్యేక కార్యక్రమం రూపొందించినట్లు ఎమ్మెల్యే చెప్పారు.



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

ఖోఖో జిల్లా జట్టుకు ఎంపిక

క్రోసూరు (అచ్చంపేట), న్యూస్‌టుడే: ఖోఖో జిల్లా జట్టుకు ముగ్గురు క్రోసూరు జడ్పీ పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు హెచ్‌ఎం డి.బాబురావు ఆదివారం తెలిపారు. అండర్-17 బాలికల సత్తెనపల్లి డివిజన్‌స్థాయి ఖోఖో పోటీలలో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. ఎంపికైన క్రీడాకారిణులు సీహెచ్ సలోమి, ఎస్ హెప్సీ మనోజ్ఞ, జి.సలోమిలను పీడీ నరసింహారావు, సీఆర్‌పీ సత్తార్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థినులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : వచ్చే నెల 13న పట్టణంలోని నాలుగు కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార కమిటీ ఛైర్మన్, సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) వి.విజయ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాజీపడదగిన కేసుల్ని లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తామన్నారు.

ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తే చర్యలు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: మాచర్ల పట్టణంలో పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కఠిన చర్యలు చేపడుతున్నట్లు సీఐ వెంకటరమణ పేర్కొన్నారు. ఆదివారం పలు దుకాణాలు, కూడళ్లు, వ్యాపార సముదాయాల మధ్య ఉంచిన వాహనాలను వాహనంలో స్టేషన్‌కు తరలించారు. రోడ్లకు అడ్డుగా వాహనాలను నిలిపటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాహనదారులను చైతన్య పరుస్తున్నామని, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మాట్లాడుతున్న సీఐ వెంకటరమణ

వాలంటీర్ ఉపాధ్యాయులకు తోడ్పాటు

రెంటచింతల, న్యూస్‌టుడే: విద్యే బాలల భవిష్యత్తుకు పునాదని కృష్ణా జిల్లా డీఆర్వో కట్టమూరి చంద్రశేఖరరావు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థిగా ఆదివారం పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థినులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఉపాధ్యాయుల కొరత ఉందని ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ వెల్లడించగా ఇద్దరు వాలంటీర్ ఉపాధ్యాయులకు రూ.6వేలు చొప్పున ప్రతి నెలా పంపిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జునరెడ్డి, ఈశ్వరరెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా ఆత్మల పండగ

రెంటచింతల, అచ్చంపేట, న్యూస్‌టుడే: స్థానిక కానుకమాత చర్చిలో ఆదివారం రాత్రి ఆత్మల పండగ నిర్వహించారు. వందలాది సమాధులను పూలు, విద్యుత్తు దీపాలతో అందంగా అలంకరించారు. 850 మంది విశ్వాసులు ప్రత్యేక పూజలు చేయించారు. గీతాలాపన, ఆత్మల గురించి ఫాదర్ మర్రెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో ఫాదర్లు బాలశౌరెడ్డి, ఏలీషారాజు, గోవిందు బాలస్వామి, ప్రసన్నకుమార్, మరియదాస్, ఫ్రాన్సిస్ సందేశం వినిపించారు.

◆ చెరుకొంపాలెం ఆర్సీఎం చర్చి సమాధుల ఆవరణలో పూర్వికులు, బంధువులు సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

శిథిలావస్థలో శిక్షణ కేంద్ర భవనం

అచ్చంపేట, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని సాంకేతిక శిక్షణ కేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకుంది. 1992లో నిర్మించిన ఈ భవనంలో కొంతకాలం శిక్షణ కేంద్రం నడిపారు. తర్వాత కొంతకాలం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు వినియోగించారు. తర్వాత కొంతకాలం జూనియర్ కళాశాల తరగతులు నిర్వహించారు. ప్రస్తుతం దెబ్బతిని నిరుపయోగంగా ఉన్న ఆ భవనం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. బాగుచేసి వినియోగంలోకి తేవాలని, లేకుంటే తొలగిస్తే ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆటస్థలంగా ఉపయోగించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

వీధి మధ్యలో స్తంభం

75త్యాళ్లూరు(పెదకూరపాడు), న్యూస్‌టుడే: లక్షలు వెచ్చించి అంతర్గత రహదారులు, సీసీ రహదారులు నిర్మిస్తున్న అధికారులు మధ్యలో ఉన్న విద్యుత్తు స్తంభాలను తొలగించడం లేదు. 75త్యాళ్లూరులోని బీసీ కాలనీలో నడిరోడ్డుపై ఏర్పాటు చేసిన స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. తీగలు కిందకు జారాయి. అవి వాహనదారులు, స్థానికులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. స్తంభాలు మార్చాలని విద్యుత్తుశాఖ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కోట్లు పోశారు.. మన్నిక మరిచారు..!

అమరావతి - బెల్లంకొండ రహదారి పనులు గత ప్రభుత్వంలో అసంపూర్తిగా వదిలేశారు. రూ.కోట్లు పోసి కల్వర్టుల వరకు సీసీ రోడ్డు వేసి మిగితా రోడ్డుకు మొక్కుబడిగా తారు వేశారు. ఇటీవల వర్షాలకు రోడ్డు అధ్వానంగా తయారైంది. రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. వాగుల సమీపంలో కూడా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. మన్నికను పట్టించుకోకుండా నిర్మాణం చేయడం, అసంపూర్తి పనుల కారణంగానే గుంతలమయంగా మారిందని వాహనచోదకులు అంటున్నారు. అధికారులు వాగుల వద్ద వేస్తున్న రహదారిని అంచనాలు మార్చి సీసీ రోడ్డు ఏర్పాటు దిశగా ఆలోచించాలని కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పనులు ప్రారంభం అయ్యాయని, గ్రామాలలో సీసీ రహదారులు నిర్మించి మిగితా చోట్ల తారు రోడ్డు వేస్తున్నామని అధికారులు తెలిపారు. **- న్యూస్‌టుడే, అమరావతి**

తీగల ఎత్తు సరిచేయరూ..!

ముప్పాళ్ల, న్యూస్‌టుడే : మండలంలోని బొల్లవరంలో చేతికందేలా విద్యుత్తు తీగలు ఉంటడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలోని పోలేరమ్మ దేవాలయం, ఎస్సీ కాలని వద్ద ప్రమాదకరంగా తీగలు ఉన్నాయి. నూతన రోడ్డు నిర్మాణంతో తీగల ఎత్తు తగ్గింది. ప్రమాదాలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్తు శాఖ అధికారులను గ్రామస్థులు కోరుకుంటున్నారు.

కబడ్డీ క్రీడాకారుడికి సత్కారం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఏషియన్ జూనియర్ గేమ్స్‌లో మన దేశం తరపున ప్రాతినిధ్యం వహించి కబడ్డీలో బంగారు పతకం సాధించిన ఆంధ్ర కబడ్డీ జట్టు కెప్టెన్ హరీష్‌ను స్థానిక వాసవి యువశక్తి బాధ్యులు ఆదివారం సత్కరించారు. రూ.10 వేలు నగదు అందజేశారు. అలానే ఆర్యవైశ్య సంఘాల్లో కీలక పదవులు పొందిన దివ్వెల శ్రీనివాసరావు, అన్నం మురళీలను సన్మానించారు. స్థానిక గోశాలలో సభ్యులు గోసేవ చేశారు. సంఘ బాధ్యులు నరసింహరావు, రామకృష్ణ, సుబ్బారావు, రాధాకృష్ణ, సుబ్రమణ్యం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హరీష్‌ను సన్మానిస్తున్న వాసవి యువశక్తి బాధ్యులు

పార్కు స్నేహితుల సందడి

కంటెపూడి(సత్తెనపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని సత్తెనపల్లిలోని పొట్టి శ్రీరాములు పార్కు స్నేహితులు కంటెపూడిలోని ఒక రిసార్టులో వన సమారాధన నిర్వహించారు. తొలుత గ్రామంలోని భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. వన సమారాధన విశిష్టత, దేశ సంస్కృతి సంప్రదాయాలు, ఇతర అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. వారిలో విశ్రాంత అధికారులు, న్యాయవాదులు, వైద్యులు, వ్యాపారులు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు, పట్టణ ప్రముఖులు ఉన్నారు. వారంతా పరస్పరం గౌరవించుకుంటూ విందుతోపాటు సందడి చేశారు. చలువాది చినసత్యనారాయణ, రాజారపు శివనాగేశ్వరరావు, పి.ఎల్.శివన్నారాయణ, గంగూరి అజయ్‌కుమార్, ఎం.వి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వనసమారాధనలో పార్కు స్నేహితుల బృందం

శ్మశాన వాటికలో స్వచ్ఛసేవ

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: మాచర్లలోని హిందూ శ్మశాన వాటికలో రామకృష్ణా సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. సేవా సమితి సభ్యులు ప్రదర్శనగా శ్మశాన వాటికకు చేరుకొని చీపురులతో ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. పరిసరాలను శుభ్రం చేశారు. అధ్యక్షుడు గోవిందారెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మొక్కలు పెంచుతామన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, హరిబాబు, శ్రీనివాసరావు, చంద్రయ్య, పాపిరెడ్డి, రుక్మిణి, ప్రభావతి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

చీపుర్లతో రామకృష్ణా సేవా సమితి సభ్యులు

జూద శిబిరంపై దాడి

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: మండలంలోని బయ్యావరం గ్రామ పొలిమేరలో శనివారం రాత్రి పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురి నుంచి రూ.79 వేల నగదు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్సై రవిబాబు తెలిపారు.

గ్రామ వ్యవస్థాపకుడికి నివాళి

కారంపూడి, న్యూస్‌టుడే : వలసదారుల గ్రామమైన కారంపూడి మండలంలోని లక్ష్మీపురం గ్రామాన్ని ఏర్పాటు చేసిన అవుతు కోటిరెడ్డి (95) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. 1964లో అప్పటి తెనాలి తాలూక మున్నంగి నుంచి వలస వచ్చిన కోటిరెడ్డి కుటుంబం మొట్టమొదటిగా పాకలు వేసుకొని వ్యవసాయం చేశారు. అనంతర కాలంలో నాగార్జునసాగర్ కుడికాలువ, రామాపురం మేజరు రావటంతో ఈప్రాంతం వ్యవసాయానికి అనుకూలంగా మారింది. దీంతో పలు ప్రాంతాల నుంచి వలసదారులు వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. కుడికాలువ నీరు రావటం, పంటలు పండుతుండటంతో గ్రామానికి లక్ష్మీపురం పేరు పెట్టారు. ప్రస్తుతం ఈగ్రామంలో 300 కుటుంబాలు నివసిస్తూ కుడికాలువ నీటి ద్వారా రెండు పంటలను పండిస్తున్నారు. కోటిరెడ్డి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. ప్రతి ఒక్కరూ కోటిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సత్రశాలకు పోటెత్తిన భక్తులు

రెంటచింతల, న్యూస్‌టుడే: సత్రశాల ఆలయంలో ఆదివారం కార్తిక సందడి నెలకొంది. ఉద్యోగులు, వ్యాపారులకు సెలవు కావటం, అన్నదాతలకు వర్షాల వల్ల పొలం పనులకు వెళ్లకపోవటంతో మల్లయ్య-భ్రమరాంబ దేవతామూర్తుల దర్శనానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక అభిషేకాలు, అయ్యప్ప మాలధారుల భజనలు ఊరేగింపులతో ప్రాంగణం మారుమోగింది. నీల మల్లయ్య, కొరముట్ల భవాని శంకర్, పూర్ణయ్య దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ శివయ్య, ఈవో రామిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అన్నదానం కోసం వేచి ఉన్న భక్తులు

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

రాజుపాలెం, న్యూస్‌టుడే: వడ్డెంపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజుపాలెం మండల గణపవరం గ్రామంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. ప్రాథమిక పాఠశాల వద్ద శంకర కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన శిబిరాన్ని మాజీ జడ్పీటీసీ సభ్యులు వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. 200మందికి పైగా నేత్ర సంబంధిత వ్యాధితో బాధపడుతున్నవారికి శంకర కంటి వైద్య బృందం పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. శుక్లాలు ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు డాక్టర్ వడ్డెంపూడి పవన్ అన్నారు. కూటమి నేతలు పాల్గొన్నారు.

వృద్ధురాలకి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న శంకరకంటి ఆసుపత్రి వైద్యులు

ఖాళీ స్థలాలు.. దోమలకు ఆవాసాలు

పెదకూరపాడు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో జనావాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో వర్షపునీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. పిచ్చిమొక్కలు పెరిగి ఇళ్లలోకి కీటకాలు, విషపురుగులు వస్తున్నాయి. మురుగు కాలువలు సక్రమంగా లేకపోవటంతో రహదారిపైకి మురుగు చేరుతోంది. దోమల నివారణపై యంత్రాంగం సమావేశాలు నిర్వహిస్తూ కింది స్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్నా ఆచరణలో మాత్రం విఫలమవుతున్నారు. ప్రజాప్రతినిధులకు అనుకూలంగా ఉన్న వీధుల్లో పారిశుద్ధ్యం పనులు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. తమ బాధలు పట్టించుకునేవారు లేరని కాలనీ వాసులు వాపోతున్నారు.

పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలి

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: తెదేపా కార్యకర్తలు, నాయకులు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని, పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని మండల తెదేపా అధ్యక్షుడు మొగల్జాన్ కోరారు. ఆదివారం ఆయన క్రోసురులో జరిగిన నూతన కమిటీ నియామకం సమావేశంలో మాట్లాడారు. వివిధ గ్రామాల్లో సమస్యలను మండల కమిటీల ముందుకు గ్రామ నేతలు తీసుకొచ్చారు. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేయాలని కోరారు.

తెదేపా కార్యకర్తకు ఆర్థిక సాయం

పల్లెగుంత (గురజాల గ్రామీణ) న్యూస్‌టుడే: మండల పరిధిలోని పల్లెగుంతకు చెందిన పాటిబండ్ల పేరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. గురజాల శాసనసభ్యులు యరపతినేని ఆదేశాల మేరకు మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో రూ.10 వేలు పేరమ్మ కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో ప్రకాష్, వీరనారాయణ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

బయటకొచ్చాను వెతకొద్దు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: నరసరావుపేటలోని ఇంటి దగ్గర అదృశ్యమైన నాగేంద్రచారి కోసం కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. గతంలో బ్యాంకులో గోల్డ్ అప్రైజర్‌గా పనిచేసిన నాగేంద్రచారి శనివారం ఇంటి నుంచి వెళ్లి రాకపోవడంతో కుటుంబసభ్యులు పిడుగురాళ్లలోని బ్యాంకు దగ్గర ఆందోళన చేశారు. ఇంతలో నాగేంద్రచారి భార్యకు ఫోన్ చేసి 'బయటకెళ్లాను వెతకవద్దు' అని చెప్పటంతో ఊపిరి పీల్చుకున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీసనారి వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమంలో ఆదివారం బ్రహ్మంగారి జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ, ఈశ్వరమ్మలకు ప్రత్యేక పూజలు, మహా నివేదన సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

6న మున్సిపల్ సమావేశం

పిడుగురాళ్ల: పురపాలకసంఘం కౌన్సిల్ సమావేశపు మందిరంలో గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం ఛైర్మన్ కొత్త చిన సుబ్బారావు అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ ఐ.శ్రీనివాసులు తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

వాగులు.. తెగుతున్న సంబంధాలు..!

చర్లగుడిపాడు (గురజాల గ్రామీణ), న్యూస్‌టుడే: చిన్నపాటి వర్షం వస్తే చాలు అక్కడి గ్రామాలతో సంబంధాలు తెగిపోతున్నాయి. వాగులన్నీ చప్టాలను ముంచెత్తడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. అత్యవసర వైద్యం కూడా అందని పరిస్థితి. గురజాల-కారంపూడి దారిలోని చర్లగుడిపాడు వద్ద ఎర్రవాగు, నల్లవాగు, మాడుగుల- గురజాల రహదారిలోని ఎద్దులవాగు, గాడిదలవాగు, పిడుగురాళ్ల మండలంలోని జూలకల్లు - గుత్తికొండ, దాచేపల్లి - కేశానుపల్లి కాటేరువాగు, మాచవరంలోని పీలురువాగు వర్షాలకు పొంగి పొర్లుతున్నాయి. చప్టాలపై నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. గతంలో మాడుగుల ఎద్దులవాగు వద్ద రెండు మూగజీవాలు కొట్టుకునిపోయాయి. ఒకరిని కాపాడారు. గర్భిణులు, బాలింతలు, రోగులు వాగులు దాటలేక సకాలంలో వైద్యశాలకు వెళ్లి చికిత్స తీసుకోలేకపోతున్నారు.

చర్లగుడిపాడులో పొంగిపొర్లుతున్న నల్లవాగు

పంట పొలాలకు నష్టం

శ్యామరాజపురం - గురజాల రహదారిలో నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మాడుగులలోని ఎద్దుల వాగు, గాడిదలవాగులపై సరైన వంతెనలు లేకపోవడంతో వర్షం కురిసిన ప్రతిసారీ నీరు రోడ్డుకు అడ్డంగా పారుతోంది. పంటపొలాల్లోకి నీరు చేరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వర్షాలు, వరదలు తగ్గినా రెండురోజులు వర్షపునీరు పోయే దారిలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంటలు మునిగి దిగుబడిపై ప్రభావం చూపుతోందని వాపోతున్నారు.

ఏళ్లుగా అవస్థలు

చిన్నపాటి వర్షానికి వాగులు పొంగిపొర్లడంతో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉంది. చర్లగుడిపాడు వద్ద ఎర్రవాగు, నల్లవాగులు పొంగి పంటపొలాలను ముంచేస్తున్నాయి. అధికారులు స్పందించి వంతెనల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. వర్షపునీరు పోయేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలి. **- కొండ్రకుంట శ్రీనివాసరావు, చర్లగుడిపాడు**

రహదారులు ఛిద్రం.. ఎలా భద్రం

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: సత్తెనపల్లి మండలంలో కొన్ని రహదారులు అధ్వానంగా మారాయి. సత్తెనపల్లి-అమరావతి రోడ్డును అధికారులు నెలలుగా పట్టించుకోకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. నందిగామ వద్ద చప్టాపై గొయ్యి ఏర్పడి నాలుగు నెలలు గడిచినా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టలేదు. వర్షాలకు గుడిపూడి వద్ద రోడ్డు కోతపడింది. కొరారు చెరువు మలుపు వద్ద తారు లేచి గుంతలు పడగా, పెదమక్కెన సమీపంలో రహదారి కుంగిపోయి పక్కన కందకంలోకి జారింది. అక్కడ రోడ్డుకు పెద్ద గుంతలు ఉన్నాయి. ఈ రెండు చోట్ల మరమ్మతులు మాటెలా ఉన్నా కనీసం ప్రమాదాలను నివారించే విధంగా బోర్డులు ఏర్పాటు చేయలేదు. మండలంలోని మిగిలిన రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే లక్కరాజుగార్లపాడు రోడ్డుకు తట్టెడు మట్టి, తారు పోసిన దాఖలాలు లేవు. ఎగుడు దిగుడు, గుంతలమయంగా ఉన్న రహదారిలో తరచూ ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

సత్తెనపల్లి-అమరావతి మార్గంలో పెదమక్కెన వద్ద కుంగిన రోడ్డు

మొంథా ప్రభావంతో...

సత్తెనపల్లి-మాదిపాడు రోడ్డు తుపాను ప్రభావంతో ఛిద్రమైంది. పాకాలపాడు గ్రామంలో అడుగుకోగుంత పడింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మరమ్మతులు చేపట్టినా గుంతలు అలానే దర్శనమిస్తున్నాయి. సత్తెనపల్లి-బయ్యవరం రోడ్డులో అబ్బూరు చెరువు వద్ద, పణిదం పొలిమేరలో, పణిదం-భట్లూరు వరకు రోడ్డు కుంగిపోయి వాహనాల్లో ప్రయాణికులు కుదుపులకు లోనవుతున్నారు. రహదారులు భవనాల శాఖ అధికారులు ఈ రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించాలని స్థానికులు, వాహన చోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు. ● గుడిపూడి, పెదమక్కెన వద్ద కోతకు గురైన చోట్ల మరమ్మతులకు నిధులు విడుదల చేసినట్లు రోడ్డుభవనాల శాఖ జేఈ జగదీష్ తెలిపారు. లక్కరాజుగార్లపాడు రోడ్డుకు సత్వరమే మరమ్మతులు చేపడుతామని, పాకాలపాడు గ్రామం పరిధిలో సీసీరోడ్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని చెప్పారు.

(c) eenadu

పెళ్లి సంబంధాల కోసం వెతుకుతున్నారా

కాపు/ తెలగ అవివాహితులకు సువర్ణావకాశం

నేడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, కాపు/తెలగ అవివాహితులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. 'ఈనాడు' కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు వివాహం కోసం ఎదురుచూస్తున్న అవివాహితులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (03 నవంబరు 2025 సోమవారం) ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

★ వివరాలకు 91549 18858, 80080 01686ను సంప్రదించవచ్చు. ఫోన్/యాప్ ద్వారా కూడా రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయో డేటా, ఫొటోలు పైన తెలియజేసిన వాట్సప్ నంబర్లకు పంపవచ్చు.

జనసమూహం కట్టడికి చర్యలు

పార్వతీపురం, న్యూస్‌టుడే: ప్రార్థనా స్థలాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు హాజరయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టరు **ప్రభాకరరెడ్డి** ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో జరిగిన విషాదకర ఘటన నేపథ్యంలో మన్యం జిల్లాలో పోలీసు శాఖను అప్రమత్తం చేశారు. మూడు వేలకుపైగా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు భావిస్తే సబ్‌కలెక్టర్లు ముందుగానే.. ఎస్‌డీపీవో, తహసీల్దార్లు, నిర్వాహకులు, గ్రామ పెద్దలతో సమీక్షించాలని సూచించారు. భక్తుల నియంత్రణ, బారికేడ్ల ఏర్పాట్లు, లోనికి వెళ్లి, వచ్చేందుకు వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇలాంటి సందర్భాల్లో సరిపడినంత మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు విధుల్లో నియమించాలని ఎస్పీకి కలెక్టరు లేఖ రాశారు.

వీళ్లు.. విమానంలో దిల్లీ వెళ్తున్నారు..

రూపాయి ఖర్చులేకుండా

క్వాంటం టెక్నాలజీ గురించి వివరిస్తున్న రోహిత్

ఈ విద్యార్థి పేరు ఎ.రోహిత్. పార్వతీపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి సైన్సు సదస్సులో ప్రథమ స్థానం సాధించాడు. రాష్ట్రస్థాయి పోటీలకు హాజరయ్యాడు. గతంలో జరిగిన ఇన్‌స్పైర్ పోటీలు, సైన్సు ప్రదర్శనలో జిల్లా స్థాయిలో సత్తాచాటాడు. విద్యార్థికి తండ్రి లేరు. తల్లి కేజీబీవీలో వృత్తివిద్య బోధకురాలు.

విద్యార్థిని నిహారిక భామిని మోడల్ పాఠశాలలో పదోతరగతి చదువుతోంది. తండ్రి భగవాన్ స్వీట్స్ దుకాణంలో పనిచేస్తున్నారు. తల్లి అరుణజ్యోతి గృహిణి. చిన్నతనం నుంచి చదువులో చురుకైన విద్యార్థినిగా గుర్తింపు తెచ్చుకుంది. స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో జాతీయ స్థాయిలో టాప్ 1000లో 180వ స్థానం కైవసం చేసుకుంది. గతేడాది విశాఖలో జరిగిన సైన్స్ టూర్‌కు ఎంపికైంది.

సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన వీరిద్దరూ విజ్ఞాన ప్రతిభతో అవకాశాలను ఒడిసి పట్టుకుంటున్నారు. త్వరలో దిల్లీలో ఇస్రో నిర్వహిస్తున్న స్పేస్ వర్క్‌షాప్‌నకు ఎంపికయ్యారు. ఇద్దరూ ప్రభుత్వ బడుల్లో చదువుతున్నారు. రూపాయి ఖర్చు లేకుండా విమానంలో దిల్లీ వెళ్తున్నారు. ఎలా అంటే.. ఇస్రో ఈనెల 6 నుంచి మూడు రోజుల పాటు స్పేస్ వర్క్‌షాప్ దిల్లీలో నిర్వహిస్తుంది. దానికి రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు హాజరయ్యేలా సమగ్ర శిక్షా, సైన్సు సిటీ సంయుక్తంగా కృషి చేస్తున్నాయి. ఈ అవకాశాన్ని వీరిద్దరూ దక్కించుకున్నారు. ఇదో గొప్ప అవకాశం అని డీఈవో రాజ్‌కుమార్ అన్నారు. దిల్లీలో వీరు రష్యన్ సెంటర్ ఫర్ సైన్సు అండ్ కల్చర్, నేషనల్ మ్యూజియం, నెహ్రూ ప్లానిటోరియం సందర్శిస్తారని జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, భామిని

అడిగితే ఒట్టు.. మిగలని చెరువు గట్టు

కబ్జాలతో కుచించుకు పోతున్న సాగునీటి వనరులు

నీటి వనరులు, కాలువ గట్లు అనే తేడా లేకుండా అక్రమార్కులు అందినంత ఆక్రమించేస్తున్నారు. కళ్లముందే ఇదంతా జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా చిన్నపాటి వర్షాలకు ఓ వైపు ముంపు ఏర్పడుతుండగా.. మరోవైపు చెరువులు సాగునీటి నిల్వ సామర్థ్యం కోల్పోయి పొలాలు ఎండుతున్నాయి. ఫిర్యాదులపై యంత్రాంగం స్పందనలేకపోవడంతో ఆవాసంగా మారుతున్నాయి.

– న్యూస్‌టుడే, పార్వతీపురం, సాలూరు, పాలకొండ

సాలూరులో పేరసాగరం ఆక్రమణల తీరిది. మూడువైపులా కొందరు నిర్మాణాలు చేపట్టి స్వరూపాన్నే మార్చేశారు

జిల్లాలో 2,398 చెరువుల పరిధిలో 59 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. పార్వతీపురంలో 51 ఎకరాల విస్తీర్ణంలో ఉండే లంకెల చెరువు ఆక్రమణలతో రూపు కోల్పోయింది. భారీ భవంతులతో నిండిపోయింది. గత ప్రభుత్వ హయాంలో మట్టితెచ్చి చెరువును పూడ్చి విక్రయించేందుకు కొందరు స్థిరాస్తి వ్యాపారులు సిద్ధమయ్యారు. ఆయకట్టు రైతులు ఫిర్యాదు చేసినా ఫలితంలేదు.

నాయకుల అండదండలతో..

జిల్లా కేంద్రం నడిబొడ్డున 11.54 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న నెల్లి చెరువు ప్రస్తుతం అయిదెకరాలకే పరిమితమైంది. ఆక్రమణలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రజాప్రతినిధుల అండదండలు ఉంటే చాలనుకుంటున్నారు. కోదువానిబంద, దేవుని, రాయిబందలు ఉనికి కోల్పోయాయి.

పట్టాలు పుట్టించారు!

పాలకొండలో కొందరు దస్త్రాలు మార్చి అధికారులను ఏమార్చి చెరువులు, స్థలాలు కబ్జా చేస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది సహకరిస్తుండడంతో తంతు కొనసాగుతోంది. పీతవానిబంద 10 సెంట్లకు పరిమితమైంది. బంగారమ్మ కోనేరు ఆక్రమించి, పట్టాలు తెచ్చుకున్నారు. మరికొందరు తప్పుడు సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్లు చేశారన్న ఆరోపణలున్నాయి. పోతులగెడ్డ కాలువ పొడవుగా గట్టు ఆక్రమణలే.

విలువ రూ.40 కోట్లపైనే..

సాలూరు పరిధిలో 44 చెరువులున్నాయి. అయిదు పూర్తిగా మాయమయ్యాయి. దాదాపు ఎనిమిది ఎకరాలు ఆక్రమించేశారు. ఇక్కడ సెంటు రూ.5 లక్షలు పలుకుతోంది. ఆ లెక్కన పట్టణంలో చెరువుల ఆక్రమణల విలువ రూ.40 కోట్లకు పైనే ఉంటుంది. పేరసాగరం, రాణిగారిచెరువు, వడ్డాదికోనేరు, నాయుడుబంద రికార్డులకే పరిమితమయ్యాయి.

చెరువు గర్భంలో కాలనీ...

కురుపాం నడిబొడ్డున ఉన్న లంకెల చెరువు స్థిరాస్తి వ్యాపారుల పంట పండిస్తోంది. గట్టు చుట్టూ దుకాణాలు ఏర్పాటయ్యాయి. స్థానిక నేతలే విక్రేతలుగా మారారు. గర్భంలో కాలనీ నిర్మించేలా తయారైంది. గుమ్మిడి గెడ్డ కాలువ గట్టుపై అక్రమ నిర్మాణాలు చేశారు.

పరిరక్షణకు చర్యలు..

గట్లపై మొక్కలు పెంచి చెరువుల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నాం. ఉపాధి పథకంలో పనులు చేస్తున్నాం. ఆక్రమణదారులపై చర్యలకు తహసీల్దార్లను ఆదేశించాం.

– కె.హేమలత, డీఆర్వో

అడుగుకో గండం.. ఈ దారికో దండం!

పాలకొండ-సీతంపేట ప్రధాన రహదారి అడుగుకో గుంతతో ప్రయాణం గండంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ దారిలో ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా అంతే సంగతి. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదు. తరచూ మరమ్మతులు చేస్తున్నా ప్రయోజనం లేదు. కల్వర్టుల నిర్మాణం చేయాల్సి ఉన్నప్పటికీ చర్యలు తీసుకోవడం లేదు. 11 కి.మీ. మార్గంలో 15 చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. సీతంపేటలో జరిగిన కార్యక్రమానికి మంత్రి సంధ్యారాణి వస్తున్న కారణంగా శనివారం కొన్ని చోట్ల గుంతల్లో బుగ్గి వేశారు. శాశ్వత చర్యలు తీసుకోవాలని చోదకులు కోరుతున్నారు. పరిశీలించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ జేఈ టి.కిరణ్ తెలిపారు.

– న్యూస్‌టుడే, పాలకొండ

పార్వతీపురం ఏఎస్పీగా మనీషారెడ్డి



పార్వతీపురం, పట్టణం, న్యూస్‌టుడే: పార్వతీపురం సబ్‌డివిజన్ ఏఎస్పీగా మనీషారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండరుగా పనిచేస్తున్న ఈమెకు శాంతిభద్రత విభాగంలో ఇదే మొదటి పోస్టింగ్. సాధారణ రైతు కుటుంబానికి చెందిన ఈమె స్వస్థలం నంద్యాల. పదో తరగతి వరకు స్థానికంగా, ఇంటర్, డిగ్రీ హైదరాబాద్‌లో పూర్తిచేశారు. రెండో ప్రయత్నంలో సివిల్స్‌లో ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ఇక్కడ ఏఎస్పీగా పనిచేసిన అంకితా సురానాను సత్యసాయి జిల్లా ఏఎస్పీగా బదిలీ చేశారు.

5న శ్రీనివాస కల్యాణోత్సవం

సీతంపేట: తితిదే శ్రీనివాస కల్యాణం ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈ నెల 5(బుధవారం)న సీతంపేట బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల మైదానంలో శ్రీనివాస కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తితిదే అధికారులు చెప్పారు. ఆ రోజు హరికథ, అన్నమయ్య కీర్తనలు, స్వామి కల్యాణం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

క్యాలీఫ్లవర్ చూపిస్తున్న మహిళా రైతు

రెక్కల కష్టం మట్టిపాలు!

మొంథా తుపాను జిల్లాలోని కూరగాయల రైతులను నిండా ముంచేసింది.. ఇటీవల వర్షాలకు క్యాలీఫ్లవర్, టమాటా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక్క వీరఘట్టం మండలంలోనే సుమారు 250 ఎకరాల్లో పంటలు వర్షార్పణమయ్యాయి. పట్టణానికి దగ్గరలో అర ఎకరాలో రూ.15వేల పెట్టుబడితో క్యాలీఫ్లవర్ పండించగా, చేతికందే సమయంలో విపత్తు ముంచేసిందని, 70 శాతం పంట నష్టపోయానని రైతు జామి గోవింద వాపోతున్నారు. 2.5 ఎకరాల్లో క్యాలీఫ్లవర్, అర ఎకరాలో టమాటా ముంపునకు గురై నష్టపోయానని రైతు కర్రి మన్మథరావు వాపోతున్నాడు. మండలంలోని బూరుగ, కొట్టుగుమ్మడ, దశుమంతపురం, చిదిమి, వీరఘట్టం తదితర గ్రామాల్లోనూ కూరగాయల పంటలది ఇదే పరిస్థితి. ఆదుకోవాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, వీరఘట్టం

పాడైన పంట

పవిత్ర ప్రాంతం.. వ్యర్థాలకు నిలయం

శిథిల స్థితిలో దీపాల సన్నిధి

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని కొత్తపేట కుమ్మరవీధి సమీపంలో ఉన్న గ్రంధి కిత్తయ్య కోనేరు అధ్వానంగా దర్శనమిస్తోంది. నిర్వహణ లేకపోవడంతో వ్యర్థాలకు నిలయంగా మారింది. చుట్టూ ఆక్రమణలతో కనుమరుగవుతోంది. ఒకప్పుడు ఇది ఆధ్యాత్మిక కేంద్రంగా ఉండేది. పరిసర ప్రాంతాల వారు స్నానాలకు ఈ నీటిని వినియోగించేవారు. మధ్యలో ఉన్న దీపాల సన్నిధి వద్దకు చేరుకుని పూజలు చేసేవారు. మధ్యలో నేల బావులు ఉండేవి. ఇవి పరిసర ప్రాంతాల్లోని చేతిపంపులు ఎండిపోకుండా కాపాడేవి. వైఎస్సార్ నగర్‌కు వెళ్లే దారిలోని శ్మశానవాటికకు వెళ్లేవారు ఇక్కడే స్నానపానాలు ఆచరించేవారు. రానురానూ పరిస్థితి మారిపోయింది. గట్టుపై సైతం కొందరు ఇళ్లు కట్టేశారు. కొన్ని నిర్మాణాలు ఇంకా కొనసాగుతున్నాయి. చుట్టూ ప్లాస్టిక్ పేరుకుపోతోంది. నీటి రంగు మారిపోయింది. తీవ్ర దుర్వాసన వస్తోంది. ఇటీవల గండి ఈ చెరువుకు పడడంతో పక్కనున్న ప్రధాన దారి మీదుగా నీరు పారుతోంది. అధికారులు స్పందించాలని బాగు చేయాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం రింగురోడ్డు

విజయనగరంలో వ్యర్థాలతో నిండిన గ్రంధి కిత్తయ్య కోనేరు

తవ్వకం ముగిసింది.. మృత్యువు కాసింది

గంట్యాడ మండలంలోని పెణసాం నుంచి కిర్తుబర్తి, గొడియాడ వెళ్లే మార్గాల్లో మృత్యువు పొంచి చూస్తోంది. ప్రధాన రహదారికి ఆనుకుని 30 నుంచి 40 అడుగుల లోతున క్వారీ గుంతలున్నాయి. గతంలో ఇక్కడ తవ్వకాలు సాగాయి. కొన్నేళ్లుగా ఆగిపోయాయి. ప్రస్తుతం భారీ లోయల్లా కనిపిస్తున్నాయి. వర్షాల సమయంలో నిండా నీరు చేరి, పశువులు, మనుషుల ప్రాణాలు తీస్తున్నాయి. ఇక్కడ ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ముప్పు తప్పదు. గతంలో పెణసాం వద్ద ట్రాక్టర్ బోల్తా పడగా ఇద్దరు మరణించారు. గొడియాడ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి ఓ బస్సు పల్టీలు కొట్టింది. ఈ ఘటన జరిగిన కొన్ని రోజుల్లోనే మరో బస్సు బోల్తా పడింది. పక్కనే లోయ ఉండడం గమనార్హం. అప్పట్లో చోదకులు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. ఇటుగా నిత్యం 20 గ్రామాల వారు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. పరిశీలించి, చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ ఏఈ విక్రమ్ తెలిపారు.

– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

ప్రధాన రహదారి పక్కనే తవ్వకాలు ఇలా..

భద్రగిరి పీటీజీ బాలికల పాఠశాలలో మ్యాచ్ చూస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి తదితరులు

శివంగుల్లా కదిలారు.. శిఖరాన చేరారు

విజయనగరంలో..

భారత్, దక్షిణాఫ్రికా మధ్య ఆదివారం జరిగిన మహిళల క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి పీటీజీ బాలికల పాఠశాలలో విద్యార్థులతో కలిసి టీవీలో వీక్షించారు. భారత్ బ్యాటింగ్ చేసినప్పుడు ఫోర్లు, సిక్స్‌లు కొట్టిన సమయంలో ఆనందాన్ని పంచుకున్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు వస్తుందన్నారు. ప్రిన్సిపల్ సత్యవతి, తెదేపా మండల కన్వీనర్ నరేష్ పాల్గొన్నారు. ❖ క్రీడా శాఖ ఆధ్వర్యంలో విజయనగరంలోని రాజీవ్ మైదానంలో ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ❖ అశోక్ బంగ్లాలో తెదేపా ఆధ్వర్యంలో స్క్రీన్ ఏర్పాటైంది. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు వీక్షించారు. మ్యాచ్ గెలిచాక నగరంలో సంబరాలు జరిగాయి. – న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం, విజయనగరం క్రీడావిభాగం

భైరవ కొండపై బౌద్ధారామం

నీలావతి సమీపంలోని కొండపై బౌద్ధస్తూపం

రాతి మెట్ల దారి

గంట్యాడ మండలం నీలావతి గ్రామ సమీపంలోని భైరవ కొండపై ఉన్న బౌద్ధారామం ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. ఎత్తయిన కొండలపై 29 ఎకరాల విస్తీర్ణంలో బౌద్ధుల స్థూపాలు, దుర్గాభైరవుని ఏక శిలా విగ్రహం, పూజా ప్రాంతాలు కనిపిస్తాయి. ఇక్కడే రాములోరి పాదముద్రికలు, నిత్యం నీటితో కళకళలాడే 16 అడుగుల లోతున్న కొలను, పలు ఆకారాల్లో స్థూపాలు, రాతి మెట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కార్తికమాసంతో పాటు ఏటా మహా శివరాత్రి రోజున వేల మంది దర్శించుకుంటారు. వనభోజనాలు పెద్దఎత్తున జరుగుతుంటాయి. పురావస్తుశాఖ దీనిని పర్యవేక్షిస్తోంది. ఇప్పటికే పలు చోట్ల అభివృద్ధి పనులు చేపట్టింది. సందర్శకుల కోసం ఓ కాపలాదారును నియమించింది. విజయనగరం జిల్లా కేంద్రం నుంచి నేరుగా 7 కిలోమీటర్ల దూరంలో నరవ గ్రామానికి చేరుకుని, అక్కడి నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నీలావతి గ్రామానికి వెళ్లాలి. అక్కడి నుంచి ఆటోలు, ద్విచక్ర వాహనాల మీదుగా నేరుగా భైరవ శిఖరానికి చేరుకోవచ్చు.

– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

ప్రాంతం విజయనగరం పరిధి శ్రీకాకుళం

జీఆర్పీ స్టేషన్ పరిస్థితి ఇదీ..

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: విజయనగరం నడిబొడ్డున రైల్వే స్టేషన్ ఉంటుంది. సీఎంఆర్ కూడలి సమీపంలో పట్టాలు రెండు పాయలుగా విడిపోతాయి. ఎడమ వైపు పార్వతీపురం, కుడి వైపునకు వెళితే శ్రీకాకుళం చేరుకోవచ్చు. ఈ లైన్లలో ఏ ప్రమాదం జరిగినా పోరుగు జిల్లా పోలీసులే పర్యవేక్షించడం గమనార్హం. దీంతో మృతదేహాల గుర్తింపు, బాధిత కుటుంబ సభ్యులకు అప్పగింత, కేసుల నమోదు, ట్రాన్స్‌ఫర్ తదితర అంశాల్లో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

139 నంబరుపై అవగాహన

విజయనగరం జీఆర్పీ పరిధి ఇలా..

లైన్	దూరం (కిలోమీటర్లలో)
విజయనగరం- కొత్తవలస	34
కొత్తవలస- గోరాపూర్	114
విజయనగరం- కూనేరు	100
బొబ్బిలి- సాలూరు	16

✦ 264 కిలోమీటర్లు.. ఈస్టుకోస్టు పరిధిలోని విజయనగరం రైల్వే స్టేషన్ ముఖ్యమైన వాణిజ్య కేంద్రంగా గుర్తింపు పొందింది. దీనికి అనుబంధంగా ఉన్న కొత్తవలస, ఎస్.కోట, విజయనగరం, గజపతినగరం, చీపురుపల్లి, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం స్టేషన్లు కీలకమయ్యాయి. వీటితో పాటు ఒడిశా సరిహద్దులోని గోరాపూర్ వరకు విజయనగరం పరిధిలోకే వస్తుంది. ఈ లైన్ల మధ్య ఏం జరిగినా జీఆర్పీ స్టేషనే చూసుకుంటుంది. అయితే జిల్లా కేంద్రంలోని సీఎంఆర్ మాల్, వెంకటలక్ష్మి కూడలి దాటాక శ్రీకాకుళం జీఆర్పీ పరిధిలో ఉంది. ఏదైనా జరిగితే 69 కిలోమీటర్ల దూరం నుంచి అక్కడి పోలీసులు రావాల్సి వస్తోంది.

గుర్తు తెలియకపోతే అంతే..

ఉమ్మడి జిల్లా మీదుగా వెళ్లే రైళ్ల ద్వారా ఒడిశా, బిహార్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల వారు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు మరణిస్తే శ్రీకాకుళం పోలీసులు వచ్చే వరకు ఆగాల్సి వస్తోంది. ప్రమాదాలు జరిగినా అదే పరిస్థితి. గత ఆయిదేళ్లలో 108 మృతదేహాలకు రైల్వే పోలీసులే అంత్యక్రియలు నిర్వహించారు. మరో 274 మంది పట్టాలు దాటుతూ మరణించారు. ప్రమాదవశాత్తూ 117 మంది మృత్యువాత పడగా.. 90 మంది వరకు ఆత్మహత్యలు చేసుకున్నారు.

నేరాలకు అడ్డా..

అటు ఒడిశా, ఇటు విశాఖ మన్యానికి విజయనగరం మధ్యలో ఉండడంతో పెద్దఎత్తున గంజాయి సరఫరా సాగుతోంది. గత రెండేళ్లలో 388 కిలోలను స్వాధీనం చేసుకుని, 35 మందిని అరెస్టు చేశారు. 20 మంది దొంగలను కూడా అదుపులోకి తీసుకున్నారు. అయితే కొందరు కేటుగాళ్లు జీఆర్పీ పరిధి దాటి ఎక్కుతూ స్థానిక అధికారుల కళ్లుగప్పుతున్నారు. విస్తీర్ణం పెద్దది కావడం వల్లే పరిధిని విడదీశారని, సమస్యలను గుర్తించి ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు ఓ అధికారి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. రైల్వే పరంగా ఎలాంటి సమస్య ఉన్నా 139ను సంప్రదించాలని కోరారు.

పుస్తకాలు చదివేలా.. చిత్రాలు గీసేలా!!

14 నుంచి గ్రంథాలయాల వారోత్సవాలు

కేంద్ర గ్రంథాలయంలో పుస్తకాలు

– న్యూస్‌టుడే, మయూరికూడలి

విద్యార్థులు, పాఠకుల్లో ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించేందుకు గ్రంథాలయాలు సిద్ధమవుతున్నాయి. పుస్తకాల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు 58వ వారోత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా విజయనగరంలోని కేంద్ర గ్రంథాలయంతో పాటు ఉమ్మడి జిల్లాలోని 41 శాఖల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. శాఖతో పాటు స్వచ్ఛంద సంస్థల సహకారంతో వారం రోజుల పాటు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

బోలెడు ఆటలు..

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 1 నుంచి పదో తరగతి విద్యార్థులకు జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో పాటలు, నృత్యం, వక్తృత్వ, క్విజ్, రచనలు, చిత్రలేఖనం, కథల పోటీలు, వివిధ రకాల ఆటలు నిర్వహిస్తారు. కంప్యూటర్ శిక్షణ, పుస్తక పఠనం ఉంటాయి. సమాచారం లేకుండానే హాజరు కావొచ్చు. ముగింపు రోజున జ్ఞాపికలు, బహుమతులు, ప్రశంసాపత్రాలు అందిస్తామని కేంద్ర గ్రంథాలయ ఇన్‌ఛార్జి లక్ష్మి తెలిపారు.

కార్యక్రమాలు ఇలా..

తేదీ	అంశాలు
14న	బాలల దినోత్సవం విశిష్టత, ఉత్సవాలు ప్రారంభం
15	పుస్తక ప్రదర్శన, మత్తు పదార్థాల నివారణపై అవగాహన, పుస్తక పఠనం
16	గ్రంథాలయ అభివృద్ధికి కృషిచేసిన వారి చరిత్ర
17	కవి సమ్మేళనం, కవులు, రచయితల పరిచయం
18	చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, ఇన్‌డోర్ క్రీడలు
19	దిశ చట్టంపై అవగాహన, మహిళాభివృద్ధిపై సదస్సులు
చివరి రోజు	డిజిటల్ గ్రంథాలయాలు, నచ్చిన పుస్తకం చదవడం, ముగింపు కార్యక్రమం

గుంత మారదు.. చింత తీరదు

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలకు పలుచోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. బీటీ దారులు సైతం పాడయ్యాయి. పైడితల్లి పండగ సందర్భంగా వేసిన ప్యాచ్ వర్కులు లేచిపోయాయి. ఇక్కడ నగర పాలక సంస్థ, ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్‌కు చెందిన దారులున్నాయి. అన్నింటిదీ ఇదే పరిస్థితి. ధర్మపురి నీళ్ల ట్యాంకు సమీపంలోని విల్లాల రోడ్డు అధ్వానంగా దర్శనమిస్తోంది. గజానికో గుంత ఏర్పడడంతో చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిశీలించి బాగు చేస్తామని కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

నాగావళి ఉగ్ర రూపం..

మొంథా ప్రభావం, ఎగువున కురిసిన వర్షాలకు నాగావళి నది నిండుగా ప్రవహిస్తోంది. తీర గ్రామాల్లోని ప్రజలు స్నానాలకు వెళ్లొద్దని ఇప్పటికే అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. కార్తికమాసం నేపథ్యంలో పలు చోట్ల కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. పాలకొండ సమీపంలో ఆదివారం ఇలా ఉద్ధృతంగా ప్రవహిస్తూ కనిపించింది. – న్యూస్‌టుడే, పాలకొండ

మిత్రమా.. కుశలమా..!

కొత్తవలస జడ్పీ ఉన్నత పాఠశాలలో 1980- 81లో పదో తరగతి చదువుకున్న వీరంతా ఆదివారం తుమ్మికాపల్లి సమీపంలో సమావేశమయ్యారు. చదువు అనంతరం వీరిలో చాలామంది ఉపాధి, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో చేరారు. దాదాపు 45 ఏళ్ల తర్వాత కలిసిన మిత్రులతో ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ.. ఆనందంగా గడిపారు. విద్య నేర్పిన ఉపాధ్యాయుల్ని ఆహ్వానించి సత్కరించాలని, పాఠశాలకు తమ వంతుగా సాయపడాలని నిర్ణయించినట్లు విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ఉద్యోగి, జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు గవర సూరిబాబు, పూర్వ విద్యార్థులు కాళేశ్వరరావు, సత్యనారాయణ తెలిపారు.

– న్యూస్‌టుడే, కొత్తవలస

తుమ్మికాపల్లిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

నేడు గుత్తేదారుల ధర్నా

విజయనగరం పట్టణం: గత రెండేళ్లలో పూర్తి చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నామని ది విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ప్రస్తుతం చేపడుతున్న పనులు ఆపేసి, సోమవారం ధర్నా చేయనున్నామన్నారు. ఇప్పటికే కమిషనరు పి.నల్లనయ్యకు నోటీసు అందజేసినట్లు అధ్యక్ష, కార్యదర్శులు బి.బంగారురాజు, ఆర్.రాజ్‌కుమార్, టి.సురేష్‌బాబు తెలిపారు.

బాధిత కుటుంబాలకు అండ

ప్రవీణ్ తల్లిదండ్రులకు నగదు ఇస్తున్న స్నేహితులు

సాలూరు, న్యూస్‌టుడే: సాలూరు పట్టణంలోని సారికవీధికి చెందిన బి.పార్థసారథి కుమారుడు ప్రవీణ్ లండన్‌లో ఉంటూ తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. రెండు కిడ్నీలు పాడయ్యాయని వైద్యులు పేర్కొన్నారు. దీంతో పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తూ వైద్య పరీక్షలు చేయించుకుంటున్నాడు. ఈక్రమంలో విషయం తెలుసుకున్న అతడి మిత్రులు స్పందించారు. రూ.1.50 లక్షలు సేకరించి ఆదివారం బాధిత కుటుంబానికి అందించారు. స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెదేపా నేత విక్రం మరణ, స్థానికుడు సారిక ఉదయ్ తెలిపారు.

పార్వతీపురం పురపాలక, పట్టణం, న్యూస్‌టుడే: పార్వతీపురం ఆర్టీసీ బస్టాండులో జరిగిన పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడిన కళాసీ రెడ్డి రమేష్‌కు తూర్పుకాపు సంక్షేమ సంఘం ఆర్థిక సాయం అందించింది. రాగాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సేకరించిన రూ.1.70 లక్షల నగదును ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మూడు నెలలకు సరిపడా సరకులు ఇచ్చారు. బి.సీతారాం, ఎం.కృష్ణమోహన్, ఎం.రాజా, కె.బాలకృష్ణ పాల్గొన్నారు.

EENADU eClassifieds

EDUCATION

HOME TUITIONS

8th క్లాస్ స్టూడెంట్‌కు అన్ని Subjects క్లాసు చెప్పుటకు విజయనగరం ఉడా కాలనీ నందు హోమ్ ట్యూటర్ (M/F) కావలెను. C: 7207307421.

REAL ESTATE

WANTED

Wanted 200-400 Sq.Y. Site development based Ayyanapeta, Kamakshi Nagar, Vizianagaram & Visakhapatnam ✆ 9052451919.

JOBS

గజపతినగరం శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేయుటకు మార్కెటింగ్ అనుభవం కలిగిన యువతి,యువకులు కావలెను. C:7659990665, 9492218996

Solar Companyలో పనిచేయుటకు M/F Accountant కావలెను. Tally Compulsary రావలెను. C: 9492731212, 9494703452.

E-KARTలో అర్జెంటుగా స్త్రీ/పు కావలెను. Q: Inter, Any డిగ్రీ, జీ: 15,000/-. Online are available. 9381912123, 7731816950.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

వారు కట్టరు.. వీరు ఆగరు

కొండగూడెం సమీపంలో ప్రమాదానికి గురైన ట్రాక్టరు

సంతకవిటి మండలం కొండగూడెం గ్రామ సమీపంలోని ఆర్అండ్‌బీ రహదారిలో సాయన్న గెడ్డపై ఉన్న వంతెన శిథిలమై నాలుగు నెలల కిందట కూలిపోయింది. అప్పటి నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. ఆదివారం ఓ వ్యక్తి ట్రాక్టర్ తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా.. ట్రక్కు బోల్తా పడింది. చోదకుడికి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. నాలుగునెలలైనా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని ఆర్అండ్‌బీ ఏఈ సతీష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా.. ప్రయాణాలు చేయొద్దని హెచ్చరిక బోర్డులు పెట్టినా పట్టించుకోకుండా వెళ్తున్నారన్నారు. కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సంతకవిటి

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

శివాజీ (పాతచిత్రం)

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కవిటి మండలం జగతి గ్రామ సమీపంలోని మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం పెదమానాపురానికి చెందిన జి.శివాజీ(25) భారత్ గ్యాస్ ఏజెన్సీలో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. రెండు రోజుల కిందట ఇద్దరు కార్మికులతో కలిసి కవిటిలోని వివిధ గ్రామాల్లో గ్యాస్‌లైన్ పైపు నాణ్యత, వాడే విధానాన్ని పరిశీలించాడు. శనివారం రాత్రి వేరే టెక్నీషియన్ వద్ద ద్విచక్రవాహనం తీసుకుని సోంపేట వెళ్తుండగా జగతి వద్ద అదుపుతప్పి కిందపడి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవివర్మ తెలిపారు.

బస్సు కింద పడి..

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గంట్యాడ మండలంలోని వసాది గ్రామ కూడలిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్న ప్రమాదంలో సీహెచ్.దాలినాయుడు(70) దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తవెలగాడకు చెందిన దాలినాయుడు కొన్నేళ్లుగా విశాఖపట్నంలో కుమారుడు వద్ద ఉంటున్నారు. పింఛను కోసం శనివారం స్వగ్రామానికి వచ్చారు. తిరిగి విశాఖపట్నం వెళ్లేందుకు ఆదివారం కోడలు ప్రియాంకతో వసాది- కె.వెలగాడ కూడలిలో బస్సు కోసం ఉన్నారు. విజయనగరం నుంచి ఎస్.కోట వెళ్తున్న బస్సు ప్రయాణికులతో రద్దీగా ఉండడంతో వేరే సర్వీసు ఎక్కేందుకు ముందుగా వెళ్తుండగా గమనించని ఆర్టీసీ చోదకుడు వాహనాన్ని ముందుకు పోనివ్వడంతో కిందపడి అక్కడికక్కడే మృతిచెందారు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

ఉపాధికి వచ్చి..

కొత్తవలస, న్యూస్‌టుడే: ఉపాధి కోసం వలసొచ్చిన యువకుడు బస్సు కింద పడి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ షణ్ముఖరావు వివరాల ప్రకారం.. అసోంకు చెందిన దీపక్ బౌమిక్(33) ఉపాధి కోసం కొత్తవలస వచ్చారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద విశాఖ వెళ్తున్న బస్సు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తూ జారి పడ్డాడు. వెనక చక్రం ఆయన పైనుంచి వెళ్లడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆధార్ కార్డు ఆధారంగా దీపక్‌ది అసోంగా గుర్తించారు. కుటుంబీకులకు సమాచారం ఇచ్చామని, వారు వచ్చిన తర్వాత కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

కొత్తవలస, న్యూస్‌టుడే: అప్పుల బాధ, అనారోగ్యం తాళలేక ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై జనార్దనరావు వివరాల మేరకు.. అడ్డూరువానిపాలెం రాయల్‌సిటీకి చెందిన యల్లపు హేమ సింహ రాఘవేంద్రరావు(35) కాంట్రాక్టు పనులు చేసేవారు. శనివారం మధ్యాహ్నం పంకాకు ఉరేసుకున్నారు. కుటుంబ సభ్యులు గమనించి, పెందుర్తి ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. అప్పుల బాధతో పాటు అనారోగ్యం కారణంగా ప్రాణాలు తీసుకున్నాడని ఆయన తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు సీఐ షణ్ముఖరావు తెలిపారు.

వెంకన్న ఆలయంలో చోరీ

సీతానగరం, న్యూస్‌టుడే: లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం ఆవరణలోని వెంకన్న ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆదివారం ఉదయం వెళ్లేసరికి తాళం పగులగొట్టి ఉండటంతో అర్చకులు పరిశీలించారు. రెండున్నర తులాల బంగారం, 5 కిలోల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. డీఎస్పీ రాంబాబు, సీఐ రంగనాథ్, ఎస్సై సింహాచలం చేరుకుని దర్యాప్తు నిర్వహించారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97609

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80081 11237

వేదికపై పుస్తకాలతో విద్యాధర్, బిక్కి కృష్ణ, గంటేడ గౌరునాయుడు, జీఎస్.చలం, జైపాల్‌రావు తదితరులు

'స్వేచ్ఛ నా సందేశం' పుస్తకావిష్కరణ

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: విజయనగరానికి చెందిన జీవీఎస్.జైపాల్‌రావు రచించిన 'స్వేచ్ఛ నా సందేశం' పుస్తకాన్ని ఆదివారం విజయనగరంలోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. విమల సాహితీ సంస్థ అధ్యక్షుడు విద్యాధర్, కవి, సినీ గీతాల రచయిత బిక్కి కృష్ణ, అరసం అధ్యక్షుడు జి.ఎస్.చలం, కార్యదర్శి రత్నాల బాలకృష్ణ, రచయిత గంటేడ గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాధర్ మాట్లాడుతూ.. గ్రామీణ, సామాజిక సమస్యలపై తనదైన శైలిలో రచనలు చేశారని కొనియాడారు. ప్రతిఒక్కరూ చదవాల్సిన పుస్తకమని చెప్పారు. సామాజిక స్పృహే రచయితల ప్రతిభకు కొలమానమన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	125	220	230

(c) eenadu

చినుకుపడితే వణుకు

పాలకొండ పట్టణంలోని గారమ్మ కాలనీ వాసులకు అవస్థలు తప్పడం లేదు. వర్షం కురిస్తే వీధులు జలమయమవుతున్నాయి. కాలనీకి ఆనుకుని ఉన్న పోతులగెడ్డ పూడికతో నిండిపోవడంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన నీరు వీధులను ముంచుతోంది. వీధి కాలువలు సైతం పూడికతో నిండాయి. ఆదివారం కురిసిన భారీ వర్షానికి వీధుల్లో నీరు నిలిచిపోయింది. కాలనీలోకి నీరు చొరబడకుండా పక్కా చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజ్ తెలిపారు. –న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

భవనాలు పాడై.. తిప్పలు

బలిజిపేట మండలం గళావల్లి, చిలకలపల్లి, పలగర తదితర గ్రామాల్లో 15 ఏళ్ల క్రితం నిర్మించిన గ్రామీణ పశు వైద్యశాలలు శిథిలావస్థకు చేరాయి. గళావల్లి గ్రామంలోని కేంద్రం భవనం పైకప్పు వర్షాకాలంలో కారుతోంది. దీంతో విలువైన మందులు తడిసిపోతున్నాయి. ఇక్కడి సిబ్బంది విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. చిలకలపల్లి, పలగర భవనాలదీ ఇదే పరిస్థితి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు చేపడతామని మండల పశువైద్యాధికారి జి.గణేష్ చెప్పారు. – న్యూస్‌టుడే, బలిజిపేట

చెరువు నిండా తామరే

పాలకొండ మండలంలోని వెలగవాడ గ్రామ చెరువు ఇది. గతంలో ఉపాధిహామీ పథకంలో అమృత్ సరోవర్‌గా ఎంపిక చేశారు. కానీ నిర్వహణను వదిలేయడంతో అధ్వానంగా మారింది. ప్రస్తుతం చెరువు మొత్తం తామరతో నిండిపోయింది. చుట్టూ తుప్పలు పెరిగి, వినియోగానికి దూరమైంది. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఎంవీ రంగారావు తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ

దారంతా బురద.. మురుగే!

గంగాడ గ్రామ ప్రధాన వీధి బురద, మురుగుతో నిండిపోయింది. 15 ఏళ్ల క్రితం ఇక్కడ తారు రోడ్డు నిర్మించారు. అప్పటి నుంచి నేటివరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో తారంతా ఊడిపోయి, గోతులమయంగా మారింది. దీనికితోడు రహదారి పక్కన కాలువల్ని ఎత్తులో నిర్మించారు. దీంతో వరద నీరు రోడ్డుపైనే నిలుస్తోంది. ఉన్న కాలువలు కూడా పూడికతో నిండి, నీరు కదలడం లేదు. రహదారి బాగుకు చర్యలు చేపడతామని ర.భ శాఖ జేఈ నాగభూషణరావు చెప్పారు. – న్యూస్‌టుడే, బలిజిపేట

చలమల నీరే దిక్కు

భాసూరులో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. గ్రామంలో ఏనిమిదేళ్ల కిందట నిర్మించిన రక్షిత పథకం పాడైంది. దీంతో ఉన్న చేతి పంపులు, గ్రామ శివారున ఉన్న గెడ్డలో చలమలను ఆశ్రయిస్తున్నారు. ఆ నీరే తాగుతున్నట్లు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా బోరు వేస్తున్నామని, ఈ పనులు పూర్తయితే మంచినీటి ట్యాంకు వినియోగంలోకి వస్తుందని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ ప్రవల్లిక తెలిపారు. వీధుల్లోని చేతి పంపుల నీటినే తాగాలని చెబుతున్నామన్నారు. –న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? మొండెంఖల్లు గ్రామంలో ఉన్న ప్రధాన రక్షిత తాగునీటి పథకం చుట్టూ, పరిసరాల్లో పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగాయి. క్లోరినేషన్ చేయకపోవడంతో తాగునీరు కలుషితం అవుతోంది. - **రామకృష్ణ, స్థానికుడు** ★ తుప్పలు తొలగిస్తాం. క్లోరినేషన్ చేయిస్తాం. **- వేణుగోపాల్, జేఈ** – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

? వెంగాపురం గ్రామానికి సమీపంలోని పెదకలాం కాలువపై కల్వర్టు గోడలు విరిగిపోయాయి. మరమ్మతులు చేపట్టండి. **- అసిరినాయుడు, రైతు** ★ జైకా నిధులతో మరమ్మతులు చేయిస్తాం. **- గౌరునాయుడు, పెదకలాం ఛైర్మన్** – న్యూస్‌టుడే, బలిజిపేట

? వీరఘట్టం మండలం విశ్వగ్రం చెరువు నుంచి నాగావళి ఎడమ కాలువ బ్రాంచి ఛానల్ వరకు రహదారి పక్కన విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలి. **- స్థానికులు** ★ దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. **- బి.కోటేశ్వరరావు, కార్యదర్శి** –న్యూస్‌టుడే, వీరఘట్టం

ఏళ్లుగా ఇంతే.. వందల ఊర్లకు చింతే

★ మారని రహదారుల తీరు
★ ఎక్కడికక్కడ నిలిచిపోయిన పనులు

గత వైకాపా ప్రభుత్వంలో రహదారుల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు. ఫలితంగా జిల్లాలో చాలా రోడ్లు సగంలో నిలిచాయి. గుత్తేదారులకు బిల్లులు చెల్లించక ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా చాలా పనులు ఆగాయి. మరికొన్ని దారుల అభివృద్ధికి అసలు చర్యల్లేవు. దీంతో వేల మంది ప్రజలు నిత్యం నరకం చూస్తున్నారు. అంతేకాదు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అయినా కదలిక తేవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం

గోతులతో నిండిన అర్తాం రోడ్డు

అడుగడుగునా జాప్యమే..!

★ సాలూరు-మక్కువ రహదారి 19.6 కి.మీ మేర ఉంది. దీని బాగుకు గత ప్రభుత్వంలో న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు(ఎన్‌డీబీ) నిధులు రూ.56 కోట్లు కేటాయించారు. పనులు కాక.. సొమ్ము వెనక్కి వెళ్లిపోవడంతో 6.9 కి.మీ మేర బాగు చేయడానికి వీలుగా రూ.11 కోట్లకు బడ్జెట్ కుదించారు. ఆపై మిన్నకుండిపోయారు. దీంతో దాదాపు 25 గ్రామాల పరిధిలోని 10 వేల మంది రోజూ ఇబ్బంది పడుతున్నారు. సాలూరు-మక్కువ రోడ్డుకు అదనపు ప్రణాళికలో రూ.3 కోట్లు మంజూరయ్యాయని, దీంతో 5 కి.మీ పనులు చేయొచ్చని ర.భ ఇంజినీరింగు అధికారి రాధాకృష్ణ 'న్యూస్‌టుడే'తో అన్నారు. మిగిలిన పనులు పూర్తికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ దారిలో నిత్య పోరాటం

చిలకపాలెం-కూనేరు మధ్య రాష్ట్ర ప్రధాన రహదారి 130 కి.మీ ఉంది. రాయపూర్, ఒడిశాకు ఇదే మార్గం. మన్యం జిల్లాలో పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల్లో ఇదే ప్రధాన రోడ్డు. జిల్లా కేంద్రం మీదుగా వెళ్తుంది. పార్వతీపురం నుంచి కూనేరు వరకు ఉన్న 25 కి.మీ పరిస్థితి గోతులతో అధ్వానంగా ఉంది. స్థానికంగా చూసినా.. సుమారు 35 గ్రామాలకు చెందిన దాదాపు 25 వేల మందికిపైగా నిత్యం రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వ పాలనలో ఒడిశా లారీ యజమానులు ఈ రహదారిపై గుంతలు కప్పిన సందర్భాలు ఉన్నాయి. రోడ్డు పూర్తిస్థాయి అభివృద్ధికి ప్రజా ప్రభుత్వ భాగస్వామ్యంలో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించారు. అప్పటివరకు గోతులు పూడ్చడానికి రూ.4 కోట్లు ర.భ.శాఖ మంజూరు చేసిందని, పనులు ప్రారంభిస్తామని ఇంజినీరింగు అధికారులు చెబుతున్నారు.

★ పార్వతీపురం-కొరాపుట్ రహదారి 13 కి.మీ మేర పార్వతీపురం మండలంలో ఉంది. గత ప్రభుత్వంలో దీనికి తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి నిధుల నుంచి రూ.12 కోట్లు కేటాయించారు. గుత్తేదారులు ముందుకు వచ్చి, పనులు చేయగా చెల్లింపులు లేకపోవడంతో ఆపేశారు. అప్పటినుంచి 110 గ్రామాల పరిధిలోని సుమారు 50 వేల మంది తిప్పలు పడుతున్నారు. ★ వెంకంపేట-పార్వతీపురం రహదారి పనులు కూడా మధ్యలో ఆగాయి. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే పనులు ప్రారంభిస్తామని ర.భ.శాఖ అధికారులు చెబుతున్నారు.

మధ్యలో ఆగిన పార్వతీపురం-కొరాపుట్ మార్గం పనులు

అమృత్ వెలుగులు

అమృత్ భారత్ పథకంలో రైల్వే స్టేషన్లల్లో సుందరీకరణ పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పార్వతీపురం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు సాగుతున్నాయి. ప్లాట్‌ఫాం విద్యుత్తు వెలుగులతో నిండిపోయింది. స్టేషన్‌కు ఇరువైపుల బుకింగ్ కార్యాలయాలు, ఆకలి తీర్చేలా రెస్టారెంట్, నడక వంతెన, లిఫ్టు, విశ్రాంతి గదులు, వీవీఐపీలకు ప్రత్యేక గదులు తదితర నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటికి మొదటి విడతలో రూ.11 కోట్లు కేటాయించినట్లు సంబంధిత అధికారులు చెప్పారు. – న్యూస్‌టుడే, కలెక్టరేట్ ప్రాంగణం

రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం

మాట్లాడుతున్న విజయచంద్ర

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని మారుమూల పల్లె ప్రాంతాలకు రహదారుల నిర్మాణానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే బి.విజయచంద్ర అన్నారు. ఆదివారం బందలుప్పి ర.భ రోడ్డు నుంచి పులిగుమ్మి మీదుగా చిన్నారాయుడుపేట వరకు పక్కా రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు. పులిగుమ్మి సర్పంచి బాలా కుమారి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. రూ.3.10 కోట్లతో రోడ్ల పనులు జరుగుతాయన్నారు. సీఎం చంద్రబాబు విశాఖను పారిశ్రామిక హబ్‌గా తయారు చేయడానికి ప్రణాళిక రూపొందించారని చెప్పారు. డీఈఈ నాగేశ్వరరావు, జీవీ నాయుడు, చంటి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేశారు

సాలూరు, న్యూస్‌టుడే: సాలూరులోని ప్రధాన రహదారి నుంచి తహసీల్దారు కార్యాలయానికి వెళ్లే దారిని ఎట్టకేలకు బాగు చేశారు. గత నెల 28న 'ఈనాడు'లో 'అధికారులెళ్లే దారే.. అయినా బేజారే' శీర్షికన ప్రచురితమైన చిత్ర కథనానికి తహసీల్దార్ నీలకంఠరావు స్పందించారు. ఆదివారం గోతుల్లో రాతి బుగ్గి వేయించారు. త్వరలో శాశ్వత పనులకు చర్యలు చేపడతామన్నారు.

స్పందనకు వందనం

అతివేగం వద్దు.. ప్రమాదంలో పడొద్దు

కొమరాడ, న్యూస్‌టుడే: అతి వేగంతో ప్రయాణం.. ప్రమాదానికి చిరునామా అవుతుందని ఎస్సై నీలకంఠం అన్నారు. ఆదివారం కొమరాడలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు శిరస్త్రాణం ధరించాలన్నారు. నిబంధనలు పాటిస్తూ ముందుకు వెళితే ఇబ్బందులు రావని పేర్కొన్నారు. అనంతరం సైబర్ క్రైం మోసాల గురించి వివరించారు. సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్సై నీలకంఠం

బాసటగా నిలుస్తున్నాం

వీరఘట్టం, న్యూస్‌టుడే: తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి సీఎం సహాయ నిధితో పేద వారికి బాసటగా నిలుస్తోందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. ఈ మేరకు వీరఘట్టంలోని తన క్యాంపు కార్యాలయంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి ఆదివారం సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. పాలకొండ మండలం అంపిలికి చెందిన చింత దుర్గారావుకు రూ.1,48,427, ఆర్‌బీఆర్‌పేటకు చెందిన తాడేల గోవిందరావుకు రూ.46,084 విలువైన చెక్కులు అందించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

హరినామ సంకీర్తనలో ఎమ్మెల్యేలు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కురుపాం మండలం మొండెంఖల్లు గ్రామంలో ఉన్న జగన్నాథ స్వామి ఆలయం వద్ద ఆదివారం అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కురుపాం ఎమ్మెల్యే టి.జగదీశ్వరితోపాటు బొబ్బిలి, పాలకొండ ఎమ్మెల్యేలు బేబీనాయన, జయకృష్ణ పాల్గొని జగన్నాథస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు, కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం నేరడవలసలోని శ్రీమాలతమ్మను దర్శించుకుని పూజలు చేశారు. రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్‌కుమార్, ఏఎంసీ ఛైర్మన్ కళావతి, నాయకులు కొండయ్య, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద జగదీశ్వరి, బేబీనాయన తదితరులు

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం పట్టణం: పీజీ ప్రవేశ పరీక్ష రాయకుండా నేరుగా మాస్టర్ ఆఫ్ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్(ఎంజేఎంసీ) కోర్సు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వివరాలకు 83095 19615 నంబరులో సంప్రదించాలని కోరింది.

7 నుంచి నాటిక పోటీలు

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: మేరంగి నాటక పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలను విజయవంతం చేయాలని మాజీ ఉపముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి, వైకాపా జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు కోరారు. ఈ మేరకు ఆదివారం చినమేరంగి కోటలో నాటిక పోటీల గోడపత్రికను విడుదల చేశారు. ఆర్.అజయ్, బి.వెంకటరమణ, వి.నారాయణరావు, ఎం.కిషోర్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సేవలు మెరుగుపర్చాలి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: గిరిజన గర్ల్స్ బాలుర వసతి గృహంలో సేవలు మెరుగుపర్చాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బి.లక్ష్మి డిమాండు చేశారు. గుమ్మలక్ష్మీపురం ప్రైవేట్‌లో నిర్వహిస్తున్న గర్ల్స్ వసతిగృహాన్ని ఆదివారం సందర్శించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శాశ్వత ప్రాతిపదికన సిబ్బందిని నియమించి మెరుగైన సేవలందించాలని, ఇప్పటికే విధులు నిర్వహిస్తున్న తాత్కాలిక సిబ్బందికి వేతనాలు చెల్లించి రెగ్యులర్ చేయాలన్నారు. ఆ సంఘం నాయకులు కె.లక్ష్మి, మాలతి, దివ్య, భారతి తదితరులు ఉన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించనున్నట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజనులు తమ వ్యక్తిగత, గ్రామ సమస్యలపై వినతులు అందించాలని పేర్కొన్నారు.

ప్రతిభా పాటవ పరీక్షకు స్పందన

వీరఘట్టం, న్యూస్‌టుడే: వీరఘట్టం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం మండల స్థాయిలో నిర్వహించిన గణిత ప్రతిభా పాటవ పరీక్షలకు 8, 9, 10 తరగతుల నుంచి 213 మంది విద్యార్థులు హాజరయ్యారు. 8వ తరగతి నుంచి బి.మనోజ్(తెట్టంగి జడ్పీహెచ్), జి.సూర్య(నడుకూరు ఎంపీయూపీ), జి.శరణ్య(ఎస్.నర్సిపురం), 9వ తరగతి నుంచి వీరఘట్టం, నీలానగరం పాఠశాలకు చెందిన పి.జశ్వంత్, టి.జగదీష్, బి.వెంకటేశ్వరరావు, 10వ తరగతి నుంచి కత్తులకవిటి, బిటివాడ, నీలానగరం పాఠశాలలకు చెందిన జి.చైతన్య, బి.విజయ, వి.కుమారస్వామి మొదటి మూడు స్థానాలు దక్కించుకున్నారు. సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో ఎంఈవో ఆనందరావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

లక్ష దీపోత్సవం

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కార్తిక మాసోత్సవాల్లో భాగంగా పొట్లిలో శనివారం రాత్రి లక్ష దీపోత్సవం నిర్వహించారు. షిర్డీసాయి బాబా ఆలయ ప్రాంగణంలో మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఇదే సందర్భంగా ఆలయ మండప అభివృద్ధికి ధర్మకర్త ఎస్.నారాయణరావు రూ.లక్ష విరాళం అందజేశారు.



శివలింగాకారంలో జ్యోతులు

రామయ్యకు పూజలు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: క్షీరాబ్ది ద్వాదశి వేడుకలు పాలకొండ పట్టణంలోని సీతారామస్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి స్వామివారికి క్షీరాభిషేకాలు, తులసి దళాలతో సహస్ర నామార్చనలు చేశారు. భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

రెండు నెలల శిశువు మృతి

కొమరాడ, న్యూస్‌టుడే: విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ రెండు నెలల పసికందు ఆదివారం మృతిచెందింది. కొమరాడ మండలం ఉలిపిరి పంచాయతీ అల్లువాడకు చెందిన పద్మశ్రీ సెప్టెంబరులో రామభద్రపురం పీహెచ్‌సీలో సాధారణ ప్రసవంతో ఆడపిల్లకు జన్మనిచ్చింది. గతనెల 15న చిన్నారికి ఆయాసంగా ఉండటంతో రామభద్రపురం పీహెచ్‌సీ, అక్కడి నుంచి జిల్లా ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం రాత్రి విశాఖ కేజీహెచ్‌లో చేర్పించారు. శ్వాస సంబంధిత సమస్యతో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లిదండ్రులు విలపిస్తున్నారు. అత్యవసర వాహనం ఏర్పాటు చేయాలని కేజీహెచ్ సిబ్బందిని కోరినా స్పందించలేదని కుటుంబీకులు సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తికి సమాచారం ఇచ్చారు. ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడటంతో వాహనాన్ని ఏర్పాటు చేశారు.

నాటుసారా స్వాధీనం.. కొమరాడ: గుమడలో 560 లీటర్ల నాటుసారాను పట్టుకున్నట్లు అబ్కారీ సీఐ సింహాద్రి తెలిపారు. మూడు ద్విచక్ర వాహనాలతో ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

ప్రాంగణంలో పెంపకం.. కేంద్రంలో బోధన

కూరగాయల ప్రాముఖ్యతను పిల్లలకు తెలుపుతున్న కార్యకర్త

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పార్వతీపురం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది ప్రాంగణాల్లో కూరగాయలు, ఆకు కూరలు పండిస్తున్నారు. సంగంవలస-2 కేంద్ర పరిసరాల్లో పండిన వాటితోనే పిల్లలకు ఆహారం వండుతున్నారు. కార్యకర్త మనీషా చిన్నారులకు పోషక విలువల గురించి బోధిస్తున్నారు. ఈ తరహా పాఠాలు చెప్పడంలో పిల్లలు కూడా ఆసక్తి చూపుతున్నారు. కేంద్రంలో 18 మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు. అధికారుల ఆదేశాల మేరకు ఉన్నంతలో సేంద్రియ పద్ధతుల్లో పండించి, వంటలు చేస్తున్నామని తెలిపారు. ఇటీవల సంగంవలస వచ్చిన ఎమ్మెల్యే విజయచంద్ర, ఐసీడీఎస్ పీవోలు పరిశీలించి, సిబ్బందిని అభినందించారు. మండలంలో 84 అంగన్‌వాడీలు, 31 మిని అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో 20 చోట్ల పెరటి తోటల పెంపకం చేపట్టారు. వీరికి ఆకు, కూరగాయల విత్తనాలు ఐసీడీఎస్ అధికారులు అందించారు. క్షేత్రస్థాయిలో అన్ని కేంద్రాలు పరిశీలించి, పెరటి తోటల పెంపకానికి మరింత ప్రోత్సాహం అందిస్తామని ఐసీడీఎస్ పీవో రేఖారాణి అన్నారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

సంగంవలస అంగన్‌వాడీ కేంద్రంలో కూరగాయల పెంపకం

జాతీయ స్థాయి పోటీలకు యువకుడు

పాలకొండ గ్రామీణం: జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు పాలకొండ కస్పా వీధికి చెందిన యామల **అభిషేక్** ఎంపికయ్యారు. చిత్తూరు జిల్లా పలమనేరులో జరుగుతున్న రాష్ట్రస్థాయి స్కూల్ ఫెడరేషన్ పోటీల్లో సత్తాచాటి బంగారు పతకం సాధించారు. మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు.

ఎర్రన్నకు నివాళి

పాలకొండ, సీతంపేట: కేంద్ర మాజీ మంత్రి కె.ఎర్రన్నాయుడు వర్ధంతి సందర్భంగా పాలకొండ, సీతంపేటలో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తూర్పు కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రామినాయుడు, సుమంత్‌నాయుడు, సీఎల్‌నాయుడు, మోహనరావు, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పట్టణ పోలీసు స్టేషన్‌లో హెచ్‌సీగా విధులు నిర్వహిస్తున్న కె.కృష్ణమూర్తి.. బ్రెయిన్ ట్యూమర్‌తో చికిత్స పొందుతున్న వేమకోటివారి వీధికి చెందిన జి.ఈశ్వర్ భగవాన్ కుటుంబ సభ్యులకు రూ.5 వేలు, ఆర్టీసీ బస్టాండు పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఆర్.రమేష్‌కి రూ.5 వేలు ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు.

చెట్లు నరికేశారు?

కొమరాడ, న్యూస్‌టుడే: గుణదతీలేసు పంచాయతీ కొరిశిల గ్రామ సమీపంలోని ఎకరా భూమిలో సాగు చేస్తున్న అరటి, పామాయిల్ చెట్లను నరికేశారని ఇద్దరు రైతులు ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. పాత గొడవల నేపథ్యంలో కొందరు కావాలనే చెట్లను నరికారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇంతవరకు పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయలేదు.

మహిళకు తీవ్ర గాయాలు

పార్వతీపురం పట్టణం, కురుపాం గ్రామీణం: ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన కురుపాం మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం జోగిపాడుకు చెందిన భార్యాభర్తలు నీలకంఠాపురంలోని బంధువుల ఇంటికెళ్లారు. ఊర్లో ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టడంతో మాలతి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. జిల్లా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

ముగ్గురికి 14 రోజుల రిమాండ్

భామిని, న్యూస్‌టుడే: సొలికిరి గ్రామానికి చెందిన బర్ల ఆనందరావుపై గత నెల 26న దాడి చేసిన కేసులో కొత్తకోట గోవిందరావు, వేణమ్మ, వెంకటరావులను అరెస్టు చేసి కొత్తూరు మేజిస్ట్రేట్ వద్ద హాజరుపరిచినట్లు బత్తిలి ఎస్సై అప్పారావు తెలిపారు. వీరికి 14 రోజుల రిమాండ్ విధించగా అంపోలులోని జిల్లా జైలుకు తరలించామన్నారు.

Before the Honourable Deputy Registrar of Chits/Arbitration at Vizianagaram. (Application for reference of a dispute for arbitration)

A.C.P. 54/2024

Between:
Gowri Shankar Chits represented by its Manager/Foreman K.Lakshmana Gupta, S/o Gaddayya, Hindu, aged 58 years, R/o D.No. 12-12-10, Laxmi Ganapathi Colony, Phoolbaugh, Vizianagaram town cum district. ..Disputant

And:
Kora Muralidhar & Others ..Opponents

Ist Opponent: Sri Kora Muralidhar, S/o Krishnamurthy, Panchayat Engineer, Bhadragiri road, Elvinpeta village, Gummalaxmipuram mandal, Parvathipuram Manyam District-535523

Please take notice that the above A.C.P. filed by the disputant for recovery of amount due under GSC-10, Ticket No.4 tands posted to 13.11.2025 for your appearance and you should appear before the above and said authority, on that day at about 10-30 A.M. through your advocate or agent or in person without fail. If you failed to appear before the Court, the matter will be decided exparte in your presence.

(As per the orders dated 01.11.2025 of the Honourable Authority)

Sd/-xxx
Vizianagaram, Chintapalli Appa Rao,
Date; 02-11-2025 Advocate for the disputant

ప్రైవేటీకరణ ఆలోచన మానుకోండి

ప్రసంగిస్తున్న రమణ

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరణ చేయడం సరికాదని, ఆలోచనను విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ డిమాండు చేశారు. గుమ్మలక్ష్మీపురం గిరిజన సంఘ భవనంలో ఆదివారం మధ్యాహ్న భోజన నిర్వాహకులతో సమావేశమై, మాట్లాడారు. కొత్త నిర్ణయంతో వంట చేస్తున్న వేలాది మంది మహిళలకు ఉపాధి పోతుందన్నారు. నాయకులు గౌరీశ్వరరావు, ఎం.రమణ, కల్పన, హైమావతి, లక్ష్మి తదితరులు ఉన్నారు.

ముగిసిన రిలే దీక్షలు

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ డివిజన్‌ను జిల్లాగా చేయాలని కోరుతూ మూడు రోజులపాటు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారంతో ముగిశాయి. జనసేన ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లాల విషయమై.. ఏడుగురు మంత్రులతో కూడిన ఉపసంఘాన్ని నియమించిందన్నారు. సమితి నాయకుడు సుడా ఛైర్మన్ కె.రవికుమార్‌కు వినతిపత్రం అందించారు. దీక్షల్లో పాల్గొన్న లుంబూరు సర్పంచి ఉపేంద్ర తదితరులకు సాయంత్రం సాధన సమితి నాయకులు అప్పలనాయుడు, చౌదరినాయుడు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.

'వైకాపా శవ రాజకీయాలను తిప్పికొట్టాలి'

మాట్లాడుతున్న భూదేవి

సీతంపేట, న్యూస్‌టుడే: వైకాపా శవ రాజకీయాలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. కాశీబుగ్గ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన ఘటనలో 9 మంది మృతి చెందడం, పలువురు గాయపడడం బాధాకరమన్నారు. ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం బాధితులకు అండగా నిలిచిందని, అయినా వైకాపా నేతలు విమర్శలు చేయడం సరికాదన్నారు. తోట ముఖలింగం, రాజబాబు, కుంపి, సూర్యం, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో భద్రత పెంచాలి

వైకాపా నాయకుల ప్రదర్శన

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: దేవాలయాల్లో జరుగుతున్న వరుస ప్రమాదాల్లో భక్తులు మృతి చెందడానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో జరిగిన ఘటనలో చనిపోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆదివారం రాత్రి పాలకొండ ఏలాం కూడలి సమీపంలో కొవ్వొత్తుల ప్రదర్శనను నిర్వహించారు. పర్వదినాల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆలయాల్లో భద్రత కల్పించాలన్నారు. మన్మథరావు, పాపినాయుడు, బాబీ, ధవళేశ్వరరావు, బాబీ, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

స్వచ్ఛ సైనికులకు సలామ్

- తుపాను ముప్పు తగ్గించేందుకు రేయింబవళ్లు శ్రమ
- నేడు వారిని సత్కరించనున్న నగర పాలకవర్గం

రెండున్నరేళ్ల క్రితం... భారీ వర్షం పడింది. పోతురాజు పొంగి ఒంగోలు నగరంలో జనజీవనం స్తంభించింది. శివారు, లోతట్టు కాలనీల్లో పది రోజులకు పైగా ప్రభావం కనిపించింది. తరువాత నివాసితులు ఇళ్లకు చేరినా... వరద, బురద నుంచి కోలుకునేందుకు నెలరోజులకు పైనే పట్టింది. పేర్నమిట్ట, డెయిరీ సమీపంలో రెండు వారాలకు పైగా నీరు నిలిచి రాకపోకలకు వాహనదారులు నానా అవస్థలు పడ్డారు.

అయిదు రోజుల కిందట... మొంథా ముంచెత్తింది. అప్పటితో పోలిస్తే మూడు రెట్లకు పైగా వర్షం పడింది. దీనికితోడు సంతనూతలపాడు, పేర్నమిట్ట చెరువులు పొంగి... ఆ వరద నగరానికి పోటెత్తింది. మామూలుగా అయితే ఒంగోలు అతలాకుతలం కావాల్సిందే. కానీ... తుపాను తీవ్రత తగ్గిన ఒక్క రోజులోనే జనజీవనం సాధారణ స్థితికి రావడం చూసి నగరవాసులే ఆశ్చర్యపోయారు.

...ఈ మార్పు వెనుక రేయింబవళ్లు యంత్రాంగం చేసిన కసరత్తు దాగుంది. పక్కా ప్రణాళికతో అందరినీ సమన్వయం చేసుకుంటూ సాగించిన యుద్ధం ఉంది. అన్నిటికీ మించి... ప్రాణాపాయం పొంచి ఉన్న ప్రాంతాల్లోకి చొచ్చుకెళ్లి పనులు చేపట్టిన స్వచ్ఛ కార్మికులు స్ఫూర్తి దాగుంది. – ఈనాడు, ఒంగోలు

నగరంలో పారిశుద్ధ్య పనులు చేపడుతున్న కార్మికులు

పక్కా ప్రణాళికతో అడుగులు..: అప్పటికే భారీ వర్షాలు పడడం... మరోవైపు మొంథా తుపాను హెచ్చరికలు రావడంతో నగర పాలక సంస్థ యంత్రాంగం అప్రమత్తమైంది. మొత్తం 900 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తుండగా... వారందరికీ వివిధ ప్రాంతాల్లో బాధ్యతలు కేటాయించింది. ఆయా ప్రాంతాల్లో అప్పటికే ఉన్న చెత్తను సిబ్బంది తరలించారు. ప్రధాన కాలువల అవుట్‌లెట్‌లను శుభ్రం చేశారు. మంగళవారం నాటికి వర్షం తీవ్రత పెరిగినా పనులు ఆపలేదు. ఎక్కడికక్కడ కాలువలు, కల్వర్టుల్లో వ్యర్థాలు తొలగిస్తూ ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూశారు. తరువాతి రెండు రోజులూ అదే స్ఫూర్తి చాటారు. ఒక విధంగా చెప్పాలంటే ప్రాణాలు తెగించి విధులు నిర్వహించారనే చెప్పాలి. తుపాను ప్రభావం తగ్గిన వెంటనే... గురువారం బృందాలుగా ఏర్పడి యుద్ధ ప్రాతిపదికన వీధులు శుభ్రం చేశారు. రాత్రివేళా అందుబాటులో ఉంటూ నగరవాసులకు కష్టం లేకుండా చూశారు. ఆ స్వచ్ఛ సైనికుల సేవలను గుర్తిస్తూ కార్పొరేషన్ పాలకవర్గం సోమవారం వారిని ఘనంగా సత్కరించాలని నిర్ణయించింది.

కబడ్డీ... కబడ్డీ

సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఒంగోలులోని డాక్టర్ ఆనంద్ మినీ స్టేడియంలో ఆదివారం సందడిగా సాగాయి. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల క్రీడాకారులు హాజరై ప్రతిభ చాటారు. – న్యూస్‌టుడే, ఒంగోలు క్రీడావిభాగం

బెబ్బులి లెక్క.. గణిస్తారు పక్కా!

- ఎన్ఎస్‌టీఆర్‌లో ఏర్పాట్లు... మార్గదర్శకాలపై సిబ్బందికి 5న కార్యశాల



రాజసానికి పెట్టింది పేరు... మన జాతీయ జంతువు... పెద్ద పులి. వాటి గణన చేపట్టేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. పశ్చిమ ప్రాంతానికి సరిహద్దుగా ఉన్న నల్లమల అటవీ ప్రాంతం వాటి ప్రధాన స్థావరం కావడంతో ఇక్కడా ఆ ప్రక్రియ ప్రారంభం కానుంది. అందులో భాగంగా నాగార్జున సాగర్ - శ్రీశైలం టైగర్ రిజర్వు (ఎన్ఎస్‌టీఆర్) సిబ్బందికి గణనలో అనుసరించాల్సిన విధానాలపై ఈ నెల 5న కార్యశాల నిర్వహిస్తున్నారు. –న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

రాష్ట్రంలో నాగార్జున సాగర్ - శ్రీశైలం టైగర్ రిజర్వు విస్తీర్ణం: 3,296.31చ.కి.మీ.

విస్తరించిన జిల్లాలు: ప్రకాశం, నంద్యాల, పల్నాడు

శేషాచలం వైపు అడుగులు... నల్లమల పులుల జీవనానికి అనుకూలంగా ఉంటుంది. జాతీయ పులుల సంరక్షణ కేంద్రం చేపట్టిన చర్యలతో వాటి సంఖ్య క్రమంగా పెరుగుతుండడంతో... ఆవాస విస్తీర్ణాన్నీ పెంచుతున్నారు. అందులో భాగంగా నల్లమలను ఆనుకుని ఉన్న కడప, నెల్లూరు, జిల్లాల అటవీ ప్రాంతం మీదుగా ఉమ్మడి చిత్తూరులోని శేషాచలం అడవుల్లోకి అవి ప్రవేశించేలా ప్రత్యేకంగా కారిడార్ ఏర్పాటు చేశారు. ఈ కారణంగానే కడపలోని లంకమల్లేశ్వర అభయారణ్యం, నెల్లూరులోని పెంచల నరసింహస్వామి కొండ ప్రాంతంలో పులుల సంచారం పెరిగింది. తాజా గణనలో వీటి సంఖ్యా తేలనుంది.

ఆరోసారి గణన... పెద్ద పులులు అంతరించే దశకు చేరడంతో సంరక్షణకు కేంద్రం పలు చర్యలు చేపడుతోంది. అవి ఎంతమేర ఫలితాలనిచ్చాయో తెలుసుకునేందుకు... 2006 నుంచి ప్రతి నాలుగేళ్లకోసారి గణన చేపడుతోంది. ఈ ప్రక్రియను ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్‌గా పిలుస్తారు. గుర్తించిన సంఖ్య ఆధారంగా వాటి అభివృద్ధికి తీసుకోవాల్సిన కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తారు. వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ), నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీలు సంయుక్తంగా దీనిని నిర్వహిస్తాయి. ఇప్పటి వరకు అయిదు సార్లు గణన చేశారు. తాజాగా ఆరోసారి ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ ఆఫ్ ఇండియా-2026 చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లోని వాతావరణ పరిస్థితుల ఆధారంగా నవంబర్ - మార్చి నెలల మధ్య ఈ సర్వే పూర్తి చేయనున్నారు.

గణనలో పెద్ద పులులతో పాటు.. చిరుతలు, దుప్పులు, జింకలు, తోడేళ్లు, అడవి కుక్కలతో పాటు మాంసాహార, శాకాహార జంతువుల పెరుగుదలను సైతం పరిశీలిస్తారు. అటవీ విస్తీర్ణంలో ఏదైనా మార్పు వచ్చిందా, పచ్చదనం తీరు ఎలా ఉందన్న వివరాలూ సేకరిస్తారు.

రాష్ట్ర విభజన తర్వాత ఈ పరిధిలో పెద్ద పులుల సంఖ్య... 2014లో 48, 2018లో 62, 2022లో 73గా ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం 86కు పైగా ఉంటాయని అంచనా. వాటి సంతతి క్రమేణా పెరుగుతుండడం ఆశాజనక పరిణామంగా అధికారులు చెబుతున్నారు.

నాలుగు దశల్లో లెక్కింపు.. దేశవ్యాప్తంగా పెద్ద పులుల సంఖ్య తేల్చేందుకు పది నెలల సమయం పడుతుంది. మొత్తం నాలుగు దశల్లో ఈ ప్రక్రియ జరుగుతుంది. తొలి దశలో అడవిలో సంచరించే పెద్ద పులుల పాదముద్రలను సేకరిస్తారు. వాటి పెంటికలు, చెట్లపై అవి గీసిన చారలు ఇలా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు నమోదు చేస్తారు. వారం రోజుల పాటు ఈ ప్రక్రియ సాగుతుంది. రెండో దశలో శాటిలైట్ల సాయంతో అటవీ ప్రాంతంలో ఫొటోలు తీస్తారు. తరువాతి దశలో అవి సంచరించే ప్రదేశాల్లో ప్రతి నాలుగు చ.కి.మీ. పరిధిలో ఎదురెదురు చెట్లకు రెండు ట్రాప్ కెమెరాలు చొప్పున బిగించి... వాటిలో నమోదైన చిత్రాలు సేకరిస్తారు. ఇలా మూడు స్థాయిల్లో గుర్తించిన అంశాలను... నాలుగో దశలో విశ్లేషించి వాస్తవ సంఖ్యను లెక్కకడతారు.

కరవు తీరా ఎరువు

సమృద్ధిగా వర్షాలు కురవడం, రబీ సీజన్‌కు రైతులు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో ఎరువుల కొరత తలెత్తకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. అందులో భాగంగా పెద్ద ఎత్తున యూరియా, మిశ్రమ ఎరువులు గూడ్సు రైల్లో ఒంగోలు స్టేషన్‌కు చేరాయి. వాటిని వందలాది లారీల్లో స్టాక్ పాయింట్లకు... అక్కడి నుంచి ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. – ఈనాడు, ఒంగోలు; న్యూస్‌టుడే, ఒంగోలు వ్యవసాయం

చెన్నయ్య తెప్పోత్సవం... చూసిన కనులదే భాగ్యం

కార్తికమాసం క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా ఆదివారం రాత్రి... మార్కాపురంలో నిర్వహించిన శ్రీ చెన్నకేశవస్వామి వారి తెప్పోత్సవం కనులపండువగా సాగింది. బాణసంచా కాల్పులు, వేలాదిగా తరలివచ్చిన భక్తుల జయజయధ్వానాలతో పుష్కరిణి ప్రాంతం మార్మోగింది. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఈవో జి.శ్రీనివాసరెడ్డి, శాశ్వత ఉభయదాత సి.కనకయ్య, ప్రధాన అర్చకులు అప్పనాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. – న్యూస్‌టుడే, మార్కాపురం పట్టణం

ఆగిన బండి.. బువ్వకు కష్టమండి!

భారీ వర్షాల కారణంగా నల్లమల లోతట్టులో ఉన్న పాలుట్ల దారిలో... నాలుగు చోట్ల వాగులు పొంగి రహదారి పూర్తిగా దెబ్బతింది. పది రోజులుగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అటుగా ఉన్న గిరిజన కుటుంబాలకు ఇబ్బంది లేకుండా అత్యవసరంగా రేషన్ సరకులు తరలిస్తున్న ట్రాక్టర్... పెద్దమ్మ బేస్‌క్యాంపు సమీపంలోని వాగులో ఇలా చిక్కుకుపోయింది. దీంతో అవతలి నుంచి మరో ట్రాక్టర్‌ను రప్పించి... అతి కష్టం మీద సరకులన్నీ దాంట్లోకి మార్చారు. ఇందుకోసం గిరిజన యువకులు అర్ధరాత్రి వరకు శ్రమించాల్సి వచ్చింది. – న్యూస్‌టుడే, యర్రగొండపాలెం, యర్రగొండపాలెం పట్టణం

దారిచూపిన వరుణుడు... ఫ్లోరైడ్‌కు విరుగుడు

కాలంతో సంబంధం లేకుండా తాగు నీటి ఎద్దడి ఉండే ప్రాంతం... కనిగిరి. మొన్నటి వరకు 500 నుంచి 600 అడుగుల లోతున తవ్వితేగానీ నీటి చుక్క తగలని పరిస్థితి. అవి పది నుంచి పన్నెండు పీపీఎంతో కూడిన ఫ్లోరైడ్ జలాలే కావడంతో వినియోగానికి పనికి రాని దుస్థితి. ఈ నేపథ్యంలో వాన నీటి సద్వినియోగంతో సమస్యను అధిగమించే ప్రయత్నం చేశారు కొందరు. పట్టణానికి చెందిన చిట్టాలెక్క పిచ్చిరెడ్డి అనే వ్యక్తి తొలిగా రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ప్లాంట్‌ను తమ ఇంట్లో ఏర్పాటు చేశారు. మంచి ఫలితాలు రావడంతో ఆయనను చూసి ఒక్కరిగా పట్టణంలో వంద మందికి పైగా ఈ నిర్మాణాలు చేపట్టారు.

మేడపై పడే వర్షపు నీటి నిల్వకు ప్రత్యేకంగా నిర్మించిన ట్యాంకు

శుద్ధి జలాల నిల్వకు ఏర్పాటు చేసిన సంపును చూపుతున్న మహిళ

ఏడాది పొడవునా వినియోగం...: ప్లాంట్ ఏర్పాటు ఆలోచనను గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు చెబితే అన్ని వివరాలు మార్గదర్శనం చేశారు. ప్రస్తుతం ఏడాది పొడవునా ఆ జలాలనే తాగునీటిగా వినియోగిస్తున్నట్లు విశ్రాంత ఉపాధ్యాయుడు వి.మాలకొండారెడ్డి, మరో పట్టణవాసి బి.కోటిరెడ్డి తెలిపారు.

నిర్మాణం ఇలా...: మేడపై పడే వర్షపు నీరంతా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్యాంకులోకి వెళ్లేలా పైపులు ఏర్పాటు చేస్తారు. అలా చేరిన జలాలు శుద్ధి అయ్యేలా... వివిధ పరిమాణంలోని రాళ్లు, ఇసుక, బొగ్గు పొడి వంటి వాటిని ముందుగానే పొరలుగా వేసి ఉంచుతారు. ఇలా బయటకు వచ్చే నీటిని ప్రత్యేకంగా నిల్వ చేసి అవసరాలకు వినియోగిస్తారు. – న్యూస్‌టుడే, కనిగిరి

రూ.లక్షలు పక్కదారి.. చేతలు నీరుగారి!

- కొందరు పంచాయతీ కార్యదర్శుల చేతివాటం
- నిజం నిగ్గుతేలినా చర్యలకు మీనమేషాలు

2021–24 మధ్య జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగమయ్యాయి. స్థానికుల ఫిర్యాదులతో విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు రూ.లక్షల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఎవరికి అందిన మొత్తం వారు జేబులో వేసుకున్నట్లు తేల్చారు. నేటికీ పలు ఖాతాల్లో మొత్తం పక్కదారి పడుతున్న ఘటనలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. జమా ఖర్చులకు సంబంధించిన దస్త్రాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం... ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. –న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

కానరాని దస్త్రాల నిర్వహణ... జిల్లాలో 729 గ్రామ పంచాయతీలున్నాయి. ఆర్థిక సంఘం, సాధారణ నిధులే వీటికి ప్రధాన ఆదాయ వనరు. వీటిని ప్రాధాన్యత పనులకు మాత్రమే ఖర్చు చేయాలి. అయినప్పటికీ ఇష్టారాజ్యంగా డ్రా చేస్తున్నారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గ్రామాల్లో కనీసం 36 దస్త్రాలు నిర్వహించాల్సి ఉన్నా... అయిదు దస్త్రాలైనా నిర్వహిస్తున్న దాఖలాలు లేవు. దీంతో చాలా పంచాయతీల్లో నిబంధనలకు విరుద్ధంగా నిధులు డ్రా చేస్తున్నారు. ఫిర్యాదుల్లో వెలుగులోకి వస్తున్నాయి. లేదంటే మరుగున పడిపోతున్నాయి. ఆడిట్ అభ్యంతరాలు సైతం పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉండడం సమస్య తీవ్రతకు దర్పణం పడుతోంది. విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా... నిధుల దుర్వినియోగంపై విచారణ జరుగుతోందని, త్వరలోనే బాధ్యులపై చర్యలు ఉంటాయని తెలిపారు.

- గత ప్రభుత్వ హయాంలో సింగరాయకొండ పంచాయతీ సాధారణ నిధులు రూ.13,91,071, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.32,77,732 కలిపి మొత్తం రూ.46,68,803 దుర్వినియోగమయ్యాయి. స్థానికుల ఫిర్యాదుతో డీఎల్‌పీవో విచారణ అనంతరం... బాధ్యులైన గ్రామ కార్యదర్శి, జూనియర్ సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు. అంతకు ముందు ఇదే పంచాయతీలో రూ.30 లక్షలకు పైగా అవకతవకలకు పాల్పడిన కార్యదర్శిని సస్పెండ్ చేశారు. తరువాత వీరందరినీ విధుల్లోకి తీసుకున్నా... దారిమళ్లిన నిధులను మాత్రం నేటికీ రికవరీ చేయలేదు.

- నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరులో రూ.42.70 లక్షలు దుర్వినియోగమయ్యాయి. రాజుపాలెం (దర్శి)లో రూ.29.47 లక్షలు; పర్చూరు మండలం వీరాపాలెంలో రూ.13.09 లక్షలు; బయ్యవరంలో రూ.10.75 లక్షలు; కొండపి మండలం పెద కండ్లగుంటలో రూ.31.45 లక్షల మేర నిధులు దారి మళ్లాయి. బాధ్యులైన గ్రామ కార్యదర్శులపై నివేదికలు సిద్ధం చేసినా ఇంత వరకు చర్యలు లేవు.

ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, డీఎల్‌పీవోలు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పంచాయతీల దస్త్రాలను తనిఖీ చేయాలి. ఆయా గ్రామాలను సందర్శించేందుకు ఎంపీడీవోలకు కారు అద్దె కింద నెలకు రూ.35 వేలు చొప్పున ఇస్తున్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత పేరిట ఇతర కార్యక్రమాలకు వెళ్తున్నా... దస్త్రాల తనిఖీని మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే కొందరు కార్యదర్శులకు అలుసుగా మారుతోంది.

భక్తులూ... తొందర పడొద్దు!

- కార్తిక సోమవారం నేపథ్యంలో పోలీసుల సూచన

ఒంగోలు, న్యూస్‌టుడే: కార్తిక సోమవారం, పౌర్ణమి నేపథ్యంలో జిల్లాలోని సముద్ర తీరప్రాంతాలతో పాటు ఆలయాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు తెలిపారు. క్యూలైన్లలో తోపులాటలకు తావులేకుండా ఓపికతో వ్యవహరించాలని భక్తులకు సూచించారు. పిల్లలు, వృద్ధుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సముద్రంలో అలల తీవ్రత ఎక్కువగా ఉందని; నదులు, చెరువులు సైతం పూర్తిస్థాయిలో నిండి ఉన్నందున... పుణ్యస్నానాలు ఆచరించే సమయంలో ఎక్కువ లోతుకు వెళ్లరాదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా బందోబస్తు ఏర్పాటు చేశామని... భద్రతా సిబ్బంది సూచనలు పాటిస్తూ ప్రశాంతంగా దైవ దర్శనం చేసుకోవాలని తెలిపారు.

తుదిదశకు పొగాకు అమ్మకాలు

పొదిలి, న్యూస్‌టుడే: జిల్లాలోని వేలం కేంద్రాల్లో పొగాకు అమ్మకాలు తుది దశకు చేరాయి. ఇప్పటికే నెల్లూరు జిల్లా డీసీపల్లి, కలిగిరి కేంద్రాల్లో విక్రయాలు పూర్తయ్యాయి. జిల్లాలోని ఒంగోలు-2, కనిగిరి, వెల్లంపల్లి కేంద్రాల్లో మరో వారం రోజుల్లో; కొండపి, పొదిలి కేంద్రాల్లో ఈ నెలాఖరు కల్లా పూర్తికానున్నాయి. వారం రోజులుగా బ్రైట్ రకం బేళ్లకు ధర పెరిగింది. లోగ్రేడ్‌ను వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో సమస్య నెలకొంది. పొదిలి, కనిగిరి కేంద్రాలకు ఈ బేళ్లు అధికంగా వస్తున్నాయి. ప్రతి రోజూ సగటున 35 శాతం తిరస్కరణకు గురవుతున్నాయి. దీంతో అమ్మకాలు ఆలస్యమవుతున్నాయి. వర్షాల నేపథ్యంలో బేళ్లను తెచ్చి, వెనక్కు తీసుకెళ్లడం రైతులకు అదనపు భారంగా మారింది. పొదిలి కేంద్రంలో ఇప్పటి వరకు 13.19 మిలియన్ కిలోల అమ్మకాలు జరిగాయి. గరిష్ఠ ధర కిలోకు రూ.346, కనిష్ఠం రూ.20 చొప్పున పలికింది. సగటున రూ.215 లభించింది.

కొందరి స్వార్థం... లక్ష గొంతులకు కష్టం!

- మొంథా ముంచినా నిండని మార్కాపురం చెరువు

న్యూస్‌టుడే – మార్కాపురం

మొంథా ముంచెత్తింది. వాగూ వంకా ఏకమై జలవనరులు పొంగి పొర్లాయి. కీలకమైన మార్కాపురం చెరువులో మాత్రం మోకాలి లోతునా నీరు చేరకపోవడం గమనార్హం. కొందరు స్థిరాస్తి వ్యాపారుల స్వార్థమే ఈ పరిస్థితికి కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వృథాగా సముద్రంలోకి...

మార్కాపురం పట్టణం సర్వే నంబరు 549లో దాదాపు 1,200 ఎకరాల్లో పెద్ద చెరువు విస్తరించి ఉంది. గుండ్లకమ్మ నది ద్వారా ఇందులోకి నీరు చేరాలి. మాల్యవంతునిపాడు సమీపంలోని చెక్‌డ్యాం నుంచి సప్లయ్ ఛానల్ ద్వారానూ ఇన్‌ఫ్లో ఉంటుంది. తుపాను ప్రభావంతో నిన్నటి వరకు గుండ్లకమ్మ నది ఉగ్రరూపం దాల్చింది. గత పాతికేళ్లలో ఎన్నడూ లేనంత ఉద్ధృతంగా ప్రవహించింది. జలవనరుల శాఖ అధికారులు పట్టించుకోక ఆ జలాలన్నీ వృథాగా సముద్రంలో కలిశాయే తప్ప చెరువులోకి పెద్దగా చేరలేదు. సప్లయ్ ఛానల్ నీటిని మళ్లించడంలోనూ అదే నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వారి లబ్ధి కోసమేనా...!: చెరువును ఆనుకుని కొందరు స్థిరాస్తి వ్యాపారులు వెంచర్లు వేశారు. ఒకవేళ చెరువు నిండి అలుగు పారితే ఆయా లేఅవుట్లలోకి నీరు చేరి నష్టం వాటిల్లుతుంది. ఈ నేపథ్యంలో వారి ఒత్తిడి మేరకు చెరువుకు జలాలు తరలించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై మార్కాపురం జలవనరుల శాఖ ఏఈ వినోద్‌ను వివరణ కోరగా... చెరువుకు నీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.

- మార్కాపురంలో ట్యాంకర్ల ద్వారా సరఫరాకు ఏటా రూ.కోటి వరకు వెచ్చిస్తున్నారు. చెరువు నిండితే వేసవిలో నీటి కష్టాలు తీరడంతో పాటు... భూగర్భ జలాలు పెరిగి పట్టణంలోని బోర్లకూ పుష్కలంగా నీరందుతుంది. అయినప్పటికీ ఆ దిశగా అధికారులు ఆలోచన చేయకపోవడం గమనార్హం.

మార్కాపురం పెద్ద చెరువులో గడ్డి సైతం మునగని వైనం

కోనలో కేరింత

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భైరవకోనకు ఆదివారం భక్తులు పోటెత్తారు. వరద ఉద్ధృతి కారణంగా మొన్నటి వరకు ఎవరినీ అనుమతించలేదు. ప్రస్తుతం ఆ తీవ్రత తగ్గడంతో దర్శనాలకు అవకాశం కల్పించారు. కార్తిక మాసం కావడంతో జలపాతం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. – న్యూస్‌టుడే, సి.ఎస్.పురం

ఉద్యాన రైతులకు ఊతం

- నూతనంగా క్లస్టర్ విధానం అమలు
- 4న ఔత్సాహికులతో సమావేశం

ఉద్యాన పంట ఉత్పత్తులకు విలువ జోడింపు ద్వారా అధిక ఆదాయం వచ్చేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్లస్టర్ అభివృద్ధి విధానం ప్రవేశపెట్టాయి. ఈ ఏడాది నుంచే అమలు చేయనున్నారు. స్థానికంగా ఎక్కువగా పండించే ఉత్పత్తులను ఎంపిక చేసి... పారిశ్రామిక వేత్తలు, రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య, కంపెనీలు, సహకార సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రాజెక్టు నిర్వహిస్తారు. వచ్చే మూడు నెలల్లో ఔత్సాహికుల ఎంపిక పూర్తి చేసి వారితో నేషనల్ హార్టీకల్చర్ బోర్డుకు దరఖాస్తు చేయించాలని రాష్ట్ర ఉద్యానశాఖ కమిషనర్ ఆదేశాలిచ్చారు. ఈ మేరకు నాలుగో తేదీన ఉద్యాన శాఖ అధికారి కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నారు. కోల్డ్‌స్టోరేజీలు, ప్రాసెసింగ్ యూనిట్లు నిర్వహిస్తున్న వారితో పాటు మొత్తం 30 మందిని గుర్తించి ఆహ్వానించారు. – న్యూస్‌టుడే, ఒంగోలు వ్యవసాయం

షేడ్‌నెట్‌లో పూల సాగు

ప్రయోజనం ఇలా... మిర్చి, నిమ్మ, బత్తాయి, దానిమ్మ, బొప్పాయి వంటి ఉత్పత్తులను రైతులు మార్కెట్‌లో వచ్చిన ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది. క్లస్టర్ నిర్వహణ సంస్థ ద్వారా యూనిట్ నెలకొల్పితే రైతుల ఉత్పత్తులను వారే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తారు. వాటని ప్రాసెస్ చేయడం ద్వారా విలువ జోడించి ఎగుమతులు చేస్తారు. క్లస్టర్ పరిధిలో సుమారు రెండు వేల ఎకరాలు, వంద మంది రైతులు ఉంటారు. నిబంధనల ప్రకారం వారికి రాయితీలు అందుతాయి. క్లస్టర్ నిర్వహించే వారు చెప్పిన విధంగా యాజమాన్యపద్ధతులు అనుసరించాల్సి ఉంటుంది. ఉదాహరణకు మేదరమెట్లలో మిర్చి ప్రాసెసింగ్ కర్మాగారం ఉంది. వారి పరిధిలోని రైతులకు సాగులో సూచనలు ఇచ్చి... ఉత్పత్తులు వారే కొనుగోలు చేస్తారు.

60 వేల మందికి మేలు

జిల్లాలో ఇరవై వేల హెక్టార్లలో మిర్చి, పది వేల హెక్టార్లలో నిమ్మ, బత్తాయి, మరో పది వేల హెక్టార్లలో ఇతర ఉద్యాన పంటలు ఉండగా... మొత్తం అరవై వేల మంది సాగుచేస్తున్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తయితే ఈ విస్తీర్ణం మరింత పెరగనుంది. క్లస్టర్ నిర్వాహకులు ఉంటే వీరందరికీ ప్రయోజనం చేకూరుతుంది. ఈ విషయమై జిల్లా ఉద్యానశాఖ అధికారి గోపీచంద్ మాట్లాడుతూ... సుమారు రూ.వంద కోట్లు పెట్టుబడి వ్యయం పెట్టగల ఔత్సాహికులను గుర్తించి దరఖాస్తు చేయిస్తామన్నారు. ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం వరకు రాయితీ వస్తుందన్నారు. నగరంలో సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పండించే వారితోనూ క్లస్టర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారన్నారు. ఈ వివరాలకు 79950 86778 నంబరులో సంప్రదించవచ్చని సూచించారు.

(c) eenadu

మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

టెట్ నుంచి మినహాయించేందుకు కృషి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపుదల కోసం కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఏకేవీకే కళాశాలలో కె.మల్లికార్జునరావు అధ్యక్షతన జిల్లా కార్యనిర్వాహక వర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథి రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం టెట్‌కు షెడ్యూలు ఇచ్చిందన్నారు. దీనిపై అన్ని జిల్లాల కలెక్టర్ల ద్వారా ప్రధానమంత్రికి వినతి పత్రాలు పంపినట్లు తెలిపారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు సమస్య తీవ్రతను వివరించామన్నారు. త్వరలో వారి సహకారంతో పార్లమెంట్‌లో చట్ట సవరణ కోరతామన్నారు. రాష్ట్ర సంఘటన కార్యదర్శి సీహెచ్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ హైస్కూలు ప్లస్‌లో పీజీటీలు లేక ఇంటర్ బోధన కుంటుపడుతోందన్నారు. పోస్టులను భర్తీ చేయాలని కోరారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ జీవో 223 రద్దుచేసి 302 జీవో పునరుద్ధరించి జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర సహ అధ్యక్షుడు చక్రపాణి, గుణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆడేందుకు ఉత్సాహం.. ఏదీ ప్రోత్సాహం?

20 పీడీ పోస్టులకు కేవలం ఇద్దరే దిక్కు

విద్యార్థులకు చదువుతో పాటు, ఆటలు అవసరం. జిల్లాలో హైస్కూల్ స్థాయి వరకూ ఏదో రకంగా నెట్టుకొస్తున్నా కళాశాలలకు వచ్చే సరికి ఆటలు ఆడించేందుకు వ్యాయామ గురువుల కొరత తీవ్ర లోపంగా మారింది. దీంతో క్రీడలపై ఆసక్తి ఉన్నా, శిక్షణ ఇచ్చే వారు లేక ఏదో తమకు తోచిన విధానంలో ఆడుతూ కొద్దిమంది పతకాలు సాధిస్తుంటే అధిక శాతం నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది. - న్యూస్‌టుడే, కంభం

తురిమెళ్ల క్రీడా ప్రాంగణం

దశాబ్దాలుగా ఖాళీలు భర్తీచేయడంలేదు

జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకుల (ఫిజికల్ డైరెక్టర్, పీడీ) పోస్టులు 98 శాతం ఖాళీగానే ఉన్నాయి. దాదాపు 25 ఏళ్లుగా కొత్తగా నియామకాలు చేపట్టకపోవడం, ఉద్యోగోన్నతులు లేకపోవడంతో వ్యాయామ అధ్యాపకుల కొరత వేధిస్తోంది. జిల్లాలో కేవలం మద్దిపాడు, సింగరాయకొండ జూనియర్ కాలేజీల్లో మాత్రమే పీడీ పోస్టులు ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన పెద్దారవీడు, ఒంగోలు కళాశాలలకు ఆ పోస్టులే మంజూరు చేయలేదు. జిల్లాలో రెండు ఎయిడెడ్ కాలేజీలు ఉండగా, వాటిల్లోనూ పీడీలు రిటైర్ అయ్యారు. తురిమెళ్ల తదితర కళాశాలల్లో ఆట స్థలాలు కూడా సక్రమంగా లేవు. ● జిల్లాలోని కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులో పనిచేస్తున్న అధ్యాపకుడు రిటైర్ అయితే ఆ పోస్టును మార్చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల భవిష్యత్తు పీడీ పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉండదు.

ఉన్నతాధికారులకు తెలియజేస్తాం

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఏళ్లుగా ఖాళీగా ఉన్నాయి. రిటైర్ అయిన పోస్టులను కన్వర్టు చేయడమనేది ప్రభుత్వ పాలసీ. పోస్టులు భర్తీ చేయాలని పీడీ అసోసియేషన్ సభ్యులు కమిషనర్‌కు విన్నవించారు. త్వరలో ఉన్నతాధికారులతో నిర్వహించే సమావేశంలో పీడీ పోస్టులపై వారికి తెలియజేస్తాం.

- ఆంజనేయులు, ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాధికారి, ఒంగోలు

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు - 24	క్రీడా ప్రాంగణాలున్నవి - 21	ఎయిడెడ్ కళాశాలలు: 02	ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులు : 4,667	వ్యాయామ అధ్యాపక పోస్టుల ఖాళీలు : 20	పనిచేస్తున్న పీడీలు : 02

మాట్లాడుతున్న డాక్టర్ రమేష్, వేదికపై రాష్ట్ర నాయకులు

వైద్య కళాశాలలు ప్రైవేటుపరం తగదు

మార్కాపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వం వైద్య కళాశాలలను పీపీపీ పేరుతో ప్రైవేటుపరం చేసేందుకు ప్రయత్నిస్తోందని, దీన్ని వెంటనే విరమించుకోవాలని ఏపీ ప్రభుత్వ పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ ఛైర్మన్ డాక్టర్ పి.వి.రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పూలసుబ్బయ్య శాంతిభవన్‌లో మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైద్యాన్ని పూర్తిగా వ్యాపారంగా మార్చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ వైద్య ఖర్చులతో ప్రజలు అప్పుల పాలవుతున్నారన్నారు. ఇది జీవించే హక్కుకు భంగకరమని విమర్శించారు. రూ.లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాలల కోసం కొంత మొత్తం కూడా వెచ్చించలేరా అని ప్రశ్నించారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వ జీవోను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య కళాశాలల పరిరక్షణ కమిటీ నాయకులు పాశం వెంకటేశ్వర్లు, డాక్టర్ వసుంధర, శ్రీదేవి, టి.సురేష్, కె.వి.కృష్ణగౌడ్, జిల్లా నాయకులు అందె నాసరయ్య, సోమయ్య, షేక్ ఖాశిం, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీసే సైన్స్ సంబరాలు

మార్కాపురం, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సురేష్ పేర్కొన్నారు. ఆదివారం మార్కాపురంలోని సీతారామశాస్త్రి వైద్యశాలలో జన విజ్ఞాన వేదిక డివిజన్ కమిటీ సమావేశం జరిగింది. దీన్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ సంబరాలు దోహదం చేస్తాయన్నారు. ప్రతి మండలంలో జరిగే విధంగా చూడాలన్నారు. అనంతరం జన విజ్ఞాన వేదిక మాజీ నాయకుడు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ బి.సీతారామశాస్త్రి మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథంతో ఉన్నత స్థాయిలో నిలబెట్టేలా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించాలన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా తయారయ్యే దిశగా సైన్స్ సంబరాలు ప్రతి సంవత్సరం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య కన్వీనర్ డాక్టర్ బి.శరత్, జిల్లా అధ్యక్షుడు యు.వెంకట్రావ్, నాయకులు ఏనుగుల రవికుమార్, ముక్తేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాల్గొన్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్

జిల్లా కబడ్డీ జట్లకు ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ జట్ల ఎంపికకు విశేషస్పందన

ఒంగోలు క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక ఒంగోలులోని డాక్టర్ పర్వతరెడ్డి ఆనంద్ మినీ స్టేడియంలో ఆదివారం జరిగింది. దీనికి ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 300మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. వారికి పోటీలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా జట్లను ఎంపిక చేశారు. వీరు ఈ నెల ఏడోతేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు కర్నూలులో జరిగే 35వ సబ్ జూనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ విషయాన్ని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కుర్రా భాస్కర్‌రావు, పూర్ణచంద్రరావు, డీఎస్‌డీఓ గుంటి రాజారాజేశ్వరి తెలిపారు.

పొగాకు నారు.. మొంథాతో కనుమరుగు!

మొంథా తుపాను వల్ల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని నాగులుప్పలపాడు, జరుగుమల్లి, కొండపి, టంగుటూరు తదితర ప్రాంతాల్లో పొగాకు నారుమళ్లు దెబ్బతిన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 2 వేల ఎకరాల విస్తీర్ణంలో నారు సాగు చేశారు. గత నెల 21 నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడుతుండటంతో, దీనికి గాలుల తీవ్రత కారణంగా నర్సరీలలోని మొక్కలకు తెగుళ్లు సోకాయి. అందుకు రైతులు ఇప్పటికే శ్రమిస్తున్నారు. పలు రకాల మందులు పిచికారీ చేస్తున్నారు. తుపాను దాటికి గుండ్లకమ్మ నది, ముసి, పాలేరు వాగుల ఉద్ధృతం కారణంగా వరదనీరు నర్సరీల్లోకి వచ్చింది. జిల్లా వ్యాప్తంగా సుమారు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో పొగాకు నారుమళ్లు దెబ్బతిన్నాయి. సరాసరి ఎకరానికి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. -న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం, టంగుటూరు

చోడవరం వద్ద పొగాకు నర్సరీలో చేరిన నీరు

ఆ రెండు కేంద్రాల పరిధిలో 184.5 హెక్టార్లలో సాగు

2025-26 పంట కాలానికి కొండపి, టంగుటూరు పొగాకు వేలం కేంద్రాల పరిధిలో 36 గ్రామాల్లో 184.5 హెక్టార్లలో ఈ ఏడాది పొగాకు నర్సరీలను రైతులు సాగు చేశారు. కొండపి పరిధిలో పెరిదేపి, చోడవరం, పైడిపాడు, పొలిరెడ్డిపాలెం గ్రామాల్లో అధికంగా సాగు చేయగా.. టంగుటూరు బోర్డు పరిధిలో వావిలేటిపాడు, వల్లికూరపాడు, మల్లెపాడు, జరుగుమల్లి, గొల్లమిట్ట గ్రామాల్లోనూ నారు పెంచారు.

జరుగుమల్లి మండలం చతుకుపాడు వద్ద పూర్తిగా దెబ్బతిన్న నారుమడి

ధరలు కొండెక్కుతాయని రైతుల ఆందోళన..

కొండపి వేలం కేంద్రం పరిధిలో 139.5 హెక్టార్లలో పొగనారు దొడ్డు వేయగా.. 71.1 హెక్టార్లలో నీట చేరి దెబ్బతింది. 30 హెక్టార్లలో పూర్తిగా మొక్కలు చనిపోయాయి. ఓ వైపు పొగాకు బేళ్ల కొనుగోలు చివరి అంచుకు చేరడంతో కట్టావారిపాలెం, దర్శవరం, జర్రిగుంట, ప్రాంతాల్లో 13 హెక్టార్లలో పంట కూడా వేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు వాటి మొక్కలు కూడా దెబ్బతిన్నాయి. టంగుటూరు బోర్డు పరిధిలో 15 హెక్టార్లలో నారుమళ్లకు నష్టం వాటిల్లింది. ఈ సమయంలో నారు లభ్యంకాక ధరలు కొండెక్కి, కూర్చుంటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కనుల పండువగా రుద్రాభిషేకం

గిద్దలూరు పట్టణం: కార్తీకమాసం సందర్భంగా పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం మహా రుద్రాభిషేకాన్ని కనుల పండువగా నిర్వహించారు. పిరంగిపురం కోటిలింగాల దేవస్థాన నిర్వాహకులు [illegible] బాలిరెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.



చెత్త వేసే వారి వివరాలిస్తే రూ.10 వేల నగదు

కనిగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని జాతీయ రహదారిపై ఇటీవల కాలంలో గృహ నిర్మాణ వ్యర్థాలను రోడ్డుకిరువైపులా వేస్తున్నారు. ఇలా చేయడం వల్ల కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం జాతీయ రహదారి కారులో వెళ్తుండగా పట్టణంలోని బోయపాలెం సమీపంలో వ్యర్థాలు కనిపించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.కోట్లు ఖర్చు చేసి రోడ్లు నిర్మిస్తే, చెత్త, ఇసుక రాళ్లను వేయడం బాధాకరమన్నారు. ఇలా చెత్త వేసే వారి వివరాలు, ఫొటోలు, వీడియోలు తీసి తనకు అందజేస్తే, అట్టివారికి రూ.10 వేల నగదు బహుమతిని అందజేస్తామని తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

[illegible]

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 121, రిటైల్ లైవ్ - 148, చికెన్ విత్ స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్- 244

క్రికెట్ మ్యాచ్ వీక్షణకు తెర ఏర్పాటు

దర్శి, న్యూస్‌టుడే: మహిళల క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌ను దర్శి ప్రజలు వీక్షించేందుకు అనువుగా గడియారస్తంభం కూడలిలో పెద్ద ఎల్ఈడీ తెర ఏర్పాటు చేశారు. దర్శి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెరపై ఆదివారం మధ్యాహ్నం నుంచి లైవ్ ప్రసారం చేశారు. ఇండియా-దక్షిణాఫ్రికా మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ ప్రసారాన్ని ప్రజలతో కలిసి లక్ష్మి వీక్షించారు. ఆమె మాట్లాడుతూ మహిళల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకే తెర ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్సై మురళి, నాయకులు సుబ్బయ్య, శ్రీను పాల్గొన్నారు.

దర్శిలో ఎల్ఈడీ తెరపై క్రికెట్ మ్యాచ్ చూస్తున్న అభిమానులు

పదోతరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో కిరణ్‌కుమార్

ప్రణాళికతోనే పదిలో ఉత్తమ ఫలితాలు

దర్శి, న్యూస్‌టుడే: పదో తరగతిలో మంచి ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో కిరణ్‌కుమార్ ఆదేశించారు. దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి స్టడీ అవర్‌లో ఉన్న విద్యార్థులతో ఆదివారం మాట్లాడారు. సిలబస్ ఎంత వరకు పూర్తయింది, వాటిలో ఏ మేరకు చదివారు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ నుంచి అమలు చేస్తున్న స్టడీ ప్రణాళిక గురించి వివరించారు. దీనిని కచ్చితంగా అమలు చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఇన్‌ఛార్జి హెచ్ఎం రంగారావు, ఉపాధ్యాయులు నారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అంతకు ముందు దూరవిద్య పరీక్షలు, సెంటర్ల గురించి సమీక్ష చేశారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని ఇద్దరి మృతి

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా వినుకొండ మండలంలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై పసుపులేరు సమీపంలో డాలర్ సిటీ వద్ద ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వినుకొండ నుంచి మార్కాపురం వైపు వెళ్తున్న లారీని డాలర్ సిటీ వద్ద నిలిపి.. చోదకుడు టీ తాగేందుకు వెళ్లాడు. అదే సమయంలో వెనుకగా వచ్చిన ద్విచక్ర వాహనం లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. వారిని కురిచేడు మండలం మునియ్య కాలనీ వాసులు గోసుల ముంజయ్య (22), గోసుల ఆనంద్ (15)గా గుర్తించారు. వినుకొండ మండలం ఉప్పరపాలెం వద్ద బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళుతుండగా ప్రమాదానికి గురైనట్లు సమాచారం. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

● కాలువలో పడి.. : ఒంగోలు నేర విభాగం: ప్రమాదవశాత్తూ కాలువలోపడి వాచ్‌మన్ మృతిచెందిన సంఘటన ఒంగోలు దక్షిణ బైపాస్‌లోని ప్రగతికాలనీ వద్ద ఆదివారం జరిగింది. ఈ ఘటనలో నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామానికి చెందిన స్వర్ణ శ్రీనివాసరావు (45) దుర్మరణం పాలయ్యాడు. శ్రీనివాసరావు ఒంగోలులోని పలు కల్యాణ మండపాల వద్ద శుభకార్యాల సమయంలో వాచ్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తుంటారు. ఈ క్రమంలో శనివారం స్థానిక ఐటీపీ కల్యాణ మండపం వద్ద విధులు నిర్వహించినట్లు పోలీసు విచారణలో తేలింది. విధుల అనంతరం బహిర్భూమికి వెళ్లి కాలువలో పడిపోయి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఆదివారం ఉదయం ప్రగతికాలనీ వద్ద కాలువలో పడిఉన్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై ఫిరోజ్ ఆధ్వర్యంలోని బృందం ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. అతని జేబులో కుటుంబీకుల వివరాలు, ఫోన్ నంబర్లు ఉన్న కార్డు ఆధారంగా గుర్తించారు. మృతదేహాన్ని వెలికితీసి కుటుంబీకులకు సమాచారం ఇచ్చి జీజీహెచ్ శవాగారానికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్సై ఫిరోజ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాద పరిష్కారానికి వచ్చి.. విగతజీవిగా మారి!

పల్లపు వంశీ

టంగుటూరు, న్యూస్‌టుడే: భార్యాభర్తల మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించే క్రమంలో జరిగిన తోపులాటలో చివరికి భర్త మృతిచెందిన సంఘటన టంగుటూరులో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక శ్రీనివాసనగర్‌కు చెందిన పల్లపు వంశీ (30)కి అదే కాలనీకి చెందిన తన్నీరు దివ్యకీర్తితో ఆరేళ్ల కిందట పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల కుమార్తె, రెండేళ్ల బాబు ఉన్నారు. వంశీ కుటుంబ సభ్యులు 30 ఏళ్ల కిందట హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. అప్పుడప్పుడు స్వగ్రామం వస్తుంటారు. వంశీ కూడా హైదరాబాద్‌లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. దంపతుల మధ్య ఆరు నెలల క్రితం గొడవ జరిగింది. దీంతో పిల్లలను తీసుకొని పుట్టింటికి వచ్చిన దివ్యకీర్తి తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. ఈ క్రమంలో పెద్దల సమక్షంలో ఇరు కుటుంబాలు సమస్య పరిష్కారం చేసుకుందామని ఇటీవల నిర్ణయించుకున్నారు. దీంతో తల్లిదండ్రులతో కలిసి వంశీ ఆదివారం టంగుటూరు వచ్చారు. పిల్లల్ని చూసి వస్తానని చెప్పి అత్తారింటికి వెళ్లారు. ముందుగా భార్యతో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో మామ తన్నీరు సుబ్రహ్మణ్యం, బావమరిది జయప్రకాష్‌లతో తోపులాట జరిగింది. ఈ క్రమంలో కిందపడి స్పృహ కోల్పోయిన వంశీని ఒంగోలు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందాడని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కి తరలించారు. వంశీ తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

సమన్వయ లోపం..

● అధికారుల పొరపాట్లతో ఇళ్లవద్దే వెదురు మొక్కలు

ఉపాధి వెలుగుకు గ్రహణం

జిల్లాలోని ఇరుశాఖల మధ్య అవగాహన లోపంతో లబ్ధిదారుల గృహాల వద్ద వెదురు మొక్కలు ఉంచుకొని నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రజాధనం వృథా అవుతోంది. వెదురు సాగు చేపట్టే రైతులకు ఉపాధిహామీ పథకం ద్వారా మొక్కలు నాటుకొనేందుకు, 2 సంవత్సరాల పాటు సంరక్షించుకొనేందుకు నగదు జమ చేయాల్సి ఉంది. ఇందు కోసం ఉపాధిహామీ సిబ్బంది అంచనా వేయాల్సి ఉంది. ఆ తరువాత కలెక్టర్ అనుమతితో లబ్ధిదారులకు మొక్కలు అందజేసి పొలాల్లో నాటించాలి.

- న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక

గిద్దలూరు, అర్థవీడు, రాచర్ల మండలాల్లో డీఆర్‌డీఏ అధికారులు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి 300 మంది చిన్న సన్న కారు రైతులతో వెదురు సాగు చేసేందుకు ప్రతిపాదించారు. జిల్లా డీఆర్‌డీఏ అధికారులు ఉపాధి హామీ సిబ్బందితో ప్రతిపాదనలు సిద్ధం చేసి అనుమతి మంజూరు కాకముందే హడావుడిగా గత నెల 14వ తేదీన తమిళనాడు నుంచి వెదురు మొక్కలు తెప్పించి, ఒక్కో రైతుకు 60 మొక్కలు పంపిణీ చేశారు. ● ఒక్కో వెదురు మొక్కకు రవాణా ఖర్చుల పేరుతో డీఆర్‌డీఏ సిబ్బంది రూ.21 వసూలు చేశారు. ప్రతిపాదనలు, అనుమతులు రాకముందే వెదురు మొక్కలు నాటుకుంటే ఉపాధి హామీ పథకం ద్వారా నగదు చెల్లించేందుకు అవకాశం ఉండదని సిబ్బంది తెలిపారు. దీంతో 17 రోజులుగా గిద్దలూరు మండలంలోని 10కిపైగా గ్రామాల్లోని రైతులు గృహాల వద్దే వెదురు మొక్కలు పెట్టుకొని నీటిని అందిస్తూ కాపాడుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రైతులకు అందజేసిన వెదురు మొక్కలను పొలంలో నాటించేలా చర్యలు తీసుకోవాల్సి అవసరం ఎంతైనా ఉంది.

రాచర్ల మండలం ఫారం గ్రామంలో ఇంటి ముందు నిల్వ చేసుకున్న వెదురు మొక్కలు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9701112824
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008535779

కనిగిరిలో మహిళపై కత్తితో దాడి

కనిగిరి, న్యూస్‌టుడే: ఇంట్లో పూజ చేసుకుంటున్న మహిళను మతిస్థిమితం లేని వ్యక్తి దాడి చేసిన సంఘటన ఆదివారం కనిగిరిలో జరిగింది. ఎస్సై శ్రీరామ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సాయిబాబా థియేటర్ ప్రాంతానికి చెందిన పేరయ్య భార్య సుబ్బులు తోపుడు బండిపై పండ్లు విక్రయించుకుని జీవనం సాగిస్తున్నారు. ఇదే ప్రాంతానికి చెందిన శివ అనే వ్యక్తి మతి స్థిమితం లేకుండా వీధుల్లో తిరుగుతున్నాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న సుబ్బులును పండ్లు కోసే కత్తి తీసుకెళ్లి పిచ్చిపిచ్చిగా మాట్లాడుతూ వీపు, తలపై మూడు చోట్ల పొడిచాడు. బాధితురాలు పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గాయపడిన మహిళను స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో చేర్పించగా చికిత్స పొందుతుంది. బాధితురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

REAL ESTATE

FLAT FOR SALE

ఒంగోలు లాయర్‌పేటలో SBI ఎదురుగా నూతనంగా నిర్మించిన అపార్ట్‌మెంట్ 2BHK (1225 sq.ft) ఫ్లాట్ అమ్మకానికి కలదు. Ph: 91215 85925

JOBS

VEEDOL ENGINE OIL కంపెనీకి ఆథరైజ్డ్ డిస్ట్రిబ్యూటర్స్ అయిన శ్రీ ఆటోమోటివ్స్‌లో ఒంగోలు ఆఫీసునందు పనిచేయుటకు లేడీ అకౌంటెంట్ కావలెను. ✆ 93346 69999.

WANTED
HDFC BANK కొరకు
గుంటూరు & ప్రకాశంజిల్లాలో పనిచేయుటకు
కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
DRA సర్టిఫికెట్ కలిగినవారికి తొలి ప్రాధాన్యత. వెంటనే సంప్రదించండి.
లలితా ఫైనాన్స్ లింక్స్
కాంగ్రెస్ ఆఫీస్ రోడ్, విజయవాడ.
✆ 9951001348

సెక్యూరిటీ గార్డులు చందోలులో పనిచేయుటకు కావలెను వ|| 40Y, చదువు: 10th, డ్యూటీ : 12 గం||, జీతం: 16,800/-. ✆ 95506 06916.

పొదిలిలోని BITS కాలేజీలో పనిచేయుటకు ఫార్మసీ టీచర్స్, స్టాఫ్ కావలెను. అర్హత ఎం.ఫార్మసీ, బి. ఫార్మసీ, ఫ్రెషర్స్ కూడా సంప్ర. సెల్: 99484 38441, 88868 68344.

హైదరాబాద్ హోంకేర్‌లో ఏజెంట్లకు మంచి అవకాశం. వర్కర్స్‌ని పంపితే ప్రతినెలా 2వేలు కమీషన్. వర్కర్స్ జీ: 18k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 89775 47749.

ఏ బాదరా బందీలేని ఒంటరి మహిళ వంట మనిషి కావలెను. వసతి మరియు ఆకర్షణీయమైన జీతం కలదు. Cell: 99596 56999.

క్వినోవా & మిల్లెట్స్ మార్కెటింగ్ చేయుటకు అర్హత: డిగ్రీ. యువతీ, యువకులు కావలెను. నెలకు 30 వేలు. సంప్ర: రాజేష్: 91548 40175.

ఒంగోలులోని ప్రముఖ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ నందు పనిచేయుటకు ఏదైనా డిగ్రీ కలిగిన అన్‌మ్యారీడ్ లేడీ టెలీకాలర్స్ కావలెను. ✆ 98499 83684.

SECURITY GUARDS

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. వయస్సు 20 to 45. జీతం : 22,000/- మాజీ సైనికులకు 28,000/-, 30,000/-. 10th పాస్. రూం, భో. ఫ్రీ. ✆ 9052724024

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అధిక స్పందనలు పొందండి.
వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు...
B/W 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే
వివరాలకు..
97011 12824
ఒంగోలు
80087 09902
మార్కాపురం
80081 11050
మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 500
Colour : రూ. 700
ప్రకటనలపై 5% GST వర్తించును

మార్కాపురం
•మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

పుష్కరం తర్వాత నీటి కష్టాలు దూరం

న్యూస్‌టుడే, పొదిలి

పొదిలి చిన్నచెరువుకు చేరిన నీరు

చెరువు నిండా చిల్లచెట్లే (అంతర చిత్రం)

తుపాను ప్రభావంతో పొదిలి పెద్దచెరువు, చిన్నచెరువులకు నీరుచేరింది. పల్లెకంటేరు వాగు ఉద్ధృతంగా ప్రవహించడంతో ఆ నీరు చేరి కళకళలాడుతున్నాయి. దాదాపు పుష్కరం దాటిన తర్వాత ఈ జల వనరులు నిండాయని పొదిలి పట్టణ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పొదిలి పెద్దచెరువు జిల్లాలోనే ప్రసిద్ధి గాంచింది. దీని విస్తీర్ణం 700 ఎకరాలు, చిన్నచెరువు విస్తీర్ణం 101 ఎకరాలు. గత కొన్నేళ్లుగా ఇవి ఎండిపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. ఆయకట్టు భూముల్లో వరి సాగు నిలిపివేశారు. అరకొరగా బోర్ల కింద సాగు చేశారు. పట్టణంలోని బోర్లలో సైతం భూగర్భ జలాలు పడిపోవడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం చేరిన నీటితో పట్టణంలో ఏడాది పాటు బోర్లలో నీరు కొరత ఉండదని అధికారులు అంచనా వేస్తున్నారు. చెరువుల గర్భం చిల్లచెట్లతో మూసుకుపోయి చిట్టడవిని తలపిస్తున్నాయి. పొదిలి ఇరిగేషన్ డివిజన్‌లో అయిదు మైనర్ ఇరిగేషన్, 17 పీఆర్ చెరువులున్నాయి. జంగిల్ క్లియరెన్స్ చేపట్టాల్సిన అవసరం ఉంది. తీగదుర్తిపాడు, రామాపురం, దొండ్లేరు చెరువులకు సైతం సగానికి పైగా నీరుచేరిందని ఏఈ నవీన్‌కుమార్ తెలిపారు. ఆయా చెరువు కట్టలపై ఉన్న చిల్లచెట్లను తొలగించేందుకు ప్రతిపాదనలు తయారు చేయనున్నట్లు ఆయన చెప్పారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దంపతులు తదితరులు

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత చేకూరుతుందని గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ దేవాలయాల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఒంగోలు - కర్నూలు రహదారిలో ఏర్పాటుచేసిన శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మాట్లాడారు. అనంతరం ప్రాంగణంలో కోటి దీపోత్సవం చేపట్టి భక్తాదులకు అల్పాహారం అందజేశారు.

వారం తర్వాత నల్లమలకు పరుగులు

అర్ధవీడు, న్యూస్‌టుడే: మొంథా తుపానుతో పెద్దవాగు పరవళ్లు తొక్కింది. దీంతో లోయ గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఈ కారణంగా వారం రోజులుగా బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. కాకర్ల ఆనకట్ట సమీపంలో మరో తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేయడంతో ఆదివారం నుంచి ఆర్టీసీ బస్సులు నల్లమలదారుల్లో లోయకు పరుగులు తీశాయి.

శ్రీశైలవాసా.. దారి చూపవయా..!

వానొస్తే నల్లమలలో రోడ్లన్నీ జలమయం

చిరు జల్లు పడితే చాలు ఆ రాచమార్గంలో రాకపోకలు రోజుల తరబడి నిలిచిపోతున్నాయి. గత అయిదు దశాబ్దాలుగా ఇదే దుస్థితి నెలకొనడం భక్తులకు వేదనకు గురిచేస్తోంది. మొంథా తుపాను వేళ..ద్వాదశ జ్యోతిర్లింగమైన శ్రీశైలానికి వెళ్లే నల్లమల రహదారిలో ఒకరోజు, పెద్దదోర్నాల-ఆత్మకూరు రహదారిలో రెండు రోజుల పాటు వాహనాలు నిలిచిపోవడంతో వారికి దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. –న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

పెద్దదోర్నాల-ఆత్మకూరు మార్గంలో దొంగల వాగు ఉద్ధృతి

నల్లమలలోని ప్రధాన మార్గంలోని వాగులపై చిన్నపాటి చప్టాలు మాత్రమే ఉండటంతో భక్తులకు అగ్ని పరీక్ష తప్పడం లేదు. అయిదు దశాబ్దాల క్రితం నిర్మించిన చప్టాలే నేటికీ ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో వంతెనలు నిర్మించాల్సి ఉండగా అధికారులు ఆ దిశగా దృష్టి సారించడం లేదు. దీంతో భారీ వర్షాలు కురిస్తే నీరు రహదారులను ముంచెత్తడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. కొండ చరియలు విరిగిపడుతున్నాయి.

శ్రీశైలం రహదారిలో జారిన కొండరాళ్లు

వాగులు ముంచెత్తి...

- చింతల, తుమ్మలబైలు, జంగిల్ సఫారీ, చిన్నారుట్ల చెంచు గిరిజన గూడేల సమీప ప్రాంతాల్లో వాగులున్నాయి. వాటిపై నేల చప్టాలు మాత్రమే ఉన్నాయి. అవి తరచూ జలమయమవుతున్నాయి. వారధులు నిర్మిస్తే అక్కడ ప్రయాణానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. చింతల నుంచి తుమ్మలబైలు వరకు ఒకవైపు కొండ, మరోవైపు లోయ ఉంటుంది. కొండ రాళ్లు వచ్చి రహదారిపై పడుతున్నాయి. అక్కడ ఎలాంటి ఇనుప వలలు ఏర్పాటు చేయడం లేదు.
- పెద్దదోర్నాల-ఆత్మకూరు రహదారిలో కొత్తూరు, మోట్ల మల్లికార్జునపురం, చెంచుకుంట, కొర్రప్రోలు, పెద్దమంథనాల తదితర ప్రాంతాల్లో వాగులపై ఎత్తులేని చప్టాలున్నాయి. వాగులు పొంగిన వేళ అక్కడ చిక్కుకుపోతున్నారు. నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలంలోని కొన్ని ప్రాంతంలో ఈ పరిస్థితి నెలకొంది. అధికారులు చప్టాల స్థానంలో వంతెనల నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నోటీసుల జారీ

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టే నిరాధార వార్తలు, విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు, ప్రసంగాలు, సున్నిత అంశాల ప్రస్తావన, కలహాలకు కారణమయ్యే కంటెంట్‌లను నియంత్రించడం గ్రూపు అడ్మిన్లదే బాధ్యత. వాట్సాప్ గ్రూపుల్లో ఇలాంటి చర్చలు ఎక్కువగానే ఉంటాయి. అలాంటి కంటెంట్‌లను నియంత్రించాలంటూ అడ్మిన్లకు పశ్చిమ పోలీసులు నోటీసులు జారీ చేస్తున్నారు. బీఎన్ఎస్ సెక్షన్ 196, 299, 353 ప్రకారం అలాంటివారు శిక్షార్హులని పేర్కొంటున్నారు. అటువంటి గ్రూపుల సమాచారాన్ని వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఇప్పటికే చాలామంది ఈ నోటీసులు అందుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం : 8008574135
యర్రగొండపాలెం : 8008552658

బేస్తవారపేట, న్యూస్‌టుడే:

?: స్థానిక పంచాయతీలోని రాణీపేటతో పాటు పలు ప్రాంతాల్లో పక్క కాలువలు లేకపోవడంతో మురుగంతా ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దీంతో గత్యంతరం లేక ఇళ్ల ముందు ఎవరికివారే ఇంకుడు గుంతలు తీసుకుని మురుగునీటిని మళ్లించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. –బి.అమృతరాజు, బేస్తవారపేట.

✓: సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. నిధులు మంజూరైన వెంటనే ఆయా ప్రాంతాల్లో పక్క కాలువల నిర్మాణాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. –రామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, బేస్తవారపేట.

కొనకనమిట్ల, న్యూస్‌టుడే:

?: కొనకనమిట్ల మండలంలోని పెదారికట్లలో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉంది. వారం రోజుల్లో ఇద్దరిపై దాడిచేసి గాయపరిచాయి. –గ్రామస్థులు

✓: త్వరలో వీధి కుక్కలను పట్టించి సమస్య పరిష్కరిస్తాం. –శ్రీదేవి, ఈవోఆర్డీ

కొనకనమిట్ల, న్యూస్‌టుడే:

?: ఎదురాళ్లపాడు ఎస్సీ కాలనీ రోడ్డుపైకి మురుగు నీరు చేరడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. – రమేష్, స్థానికుడు

✓: రోడ్డుపైకి మురుగు నీరు రాకుండా ఏర్పాట్లు చేస్తాం. –శ్రీదేవి. ఈవోఆర్డీ

వాసవీ అమ్మవారికి సామూహిక పూజలు

పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న దంపతులు

త్రిపురాంతకం గ్రామీణం: త్రిపురాంతకం మండల కేంద్రంలోని శ్రీ వాసవీ అమ్మవారి ఆలయంలో కార్తిక మాసం పురస్కరించుకుని ఆదివారం సామూహిక పూజ, వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అనంతయ్య కార్తిక మాస ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. అనంతరం కార్యక్రమంలో 35 మంది దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ తీర్థ ప్రసాదాలు అందించింది. ఆర్యవైశ్య పట్టణ, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోటా సత్యమాంబకు...

కంభం, న్యూస్‌టుడే : పట్టణ సమీపంలోని కోటా సత్యమాంబదేవికి ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని పసుపు, చందనం, పుష్పాలు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమబండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీచక్రం, శివుడు, వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, పుట్టలమ్మ వద్ద పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి వేడుకలు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని యక్కల వారి వీధిలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఆదివారం స్వామివారి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

బ్రహ్మంగారి దేవాలయం వద్ద భక్తులు

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఉద్యోగోన్నతి, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం భాస్కర్‌రెడ్డి కల్యాణ మండపంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు డీఏ అందజేసిందని, మెగా డీఎస్సీ నిర్వహించి పాఠశాలల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తోందన్నారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి వారిని దుశ్శాలువాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సంఘం నాయకులు డా.మొర్రి పిచ్చయ్య, ఈ.వి.వెంకటేశ్వర్లు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.రవీంద్రనాథరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సిద్దేశ్వరశర్మ, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు పి.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతా ముఖ్యమే

కళాశాలలో విద్యార్థినుల నృత్య సందడి

మార్కాపురం, న్యూస్‌టుడే: విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక బాధ్యత కూడా ముఖ్యమేనని మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అభిప్రాయపడ్డారు. మార్కాపురం జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఆగమన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాంకేతిక విద్య నేటి విద్యార్థులకు సవాలుతో కూడుకున్నదని, అయితే కష్టించి చదివితే తలరాతలు మార్చుకోవచ్చన్నారు. అనంతరం ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ఎం.సాంబయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఓ లక్ష్యం ఏర్పరచుకుని ముందడుగు వేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రాజబాబు, అధ్యాపకులు మస్తానయ్య, సయ్యద్ ఖాశిం, డాక్టర్ డానియేల్, విజయబాబు, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నెర్రలిచ్చి.. శిథిలావస్థకు చేరి..

తురిమెళ్ల ప్రాథమిక పాఠశాల ఆవరణలోని మంచినీటి ట్యాంకు శిథిలావస్థకు చేరింది. నలభై ఏళ్ల క్రితం నిర్మించిన ట్యాంకు కావడంతో పెచ్చులు పగుళ్లు వచ్చాయి. గ్రామంలోని అయిదు వేల మంది నీటి అవసరాలు తీర్చే ఈ పథకంపై నిర్లక్ష్యం వీడాలని స్థానికులు కోరుతున్నారు. మంచినీటి పథకానికి రంగులు వేయించి, మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రవీంద్రారెడ్డి తెలిపారు. – న్యూస్‌టుడే, కంభం

పొలానికెళ్లే మార్గమేదీ..!

జంగంవారిపల్లె నుంచి పొలాలకు వెళ్లే రహదారి ఇలా బురదమయంగా మారింది. కంపచెట్లు బురదమయం కావడంతో అడుగు తీసి అడుగు వేయడానికి వీల్లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాలకు క్రిమిసంహారక మందులు తీసుకెళ్లడం..పంట ఉత్పత్తులు ఇంటికి తీసుకురావడం సాధ్యం కావడం లేదని వారంటున్నారు. అధికారులు స్పందించి గ్రావెల్ తోలించాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, యర్రగొండపాలెం

నాలుగు రోడ్ల కూడలిలో..

పొదిలి విశ్వనాథపురం రెండో లైన్‌లో చప్టా లేకపోవడంతో ఆ ప్రాంతమంతా మురుగు కూపంలా మారింది. అక్కడి నీరు కిందికి పోయేమార్గం లేక నాలుగురోడ్ల కూడలిలో నిలిచిపోతోంది. ఓ మోస్తరు వర్షం పడితే ఆ ప్రాంతంలో మురుగు, వర్షపునీరు కలిసిపోయి రోడ్డుపైకి చేరుతున్నాయి. వందలాదిమంది రాకపోకలు సాగించే ఈ మార్గంలో కల్వర్టు ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, పొదిలి

చెరువు బాగుకు కదిలిన రైతులు

పంటలు, మూగజీవాలకు జీవనాధారమైన చెరువును బాగుచేసుకునేందుకు రైతులే ముందడుగు వేశారు. నరజాముల తండా పెద్ద చెరువు ఇటీవల వర్షాలకు నిండి ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో కట్టపై పెద్దఎత్తున చిల్లచెట్లు పెరిగిపోయాయి. గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆ చెట్లను తొలగించే పనిని ఆదివారం చేపట్టారు.

–న్యూస్‌టుడే: పుల్లలచెరువు(యర్రగొండపాలెం)

దివ్యాంగునికి లయన్స్ చేయూత

మూడు చక్రాల బండి అందిస్తున్న దృశ్యం

కంభం, న్యూస్‌టుడే : స్థానిక అర్బన్ కాలనీనికి చెందిన దివ్యాంగుడు లోకేశ్వరరావుకు మూడు చక్రాల బండిని ఆదివారం అందజేశారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ కోశాధికారి పేర్లి వేంకటేశ్వర్లు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మురళీకృష్ణ దీనికి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తన్నీరు బాలరంగారావు, కార్యదర్శి వెంకటరావు, కోశాధికారి పేర్లి గుండయ్య, జిల్లా ఛైర్మన్ పులి శ్రీనివాసప్రసాద్, సయ్యద్ జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

వాగు నుంచి సురక్షితంగా..

పెద్దవాగులో చిక్కుకున్న వారిని కాపాడిన స్థానికులు

అర్ధవీడు, న్యూస్‌టుడే: పెద్ద వాగులో చిక్కుకుపోయిన నలుగురిని స్థానికులు క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. ఈ సంఘటన కాకర్ల సమీపంలోని వెలిగొండ ప్రాజెక్ట్ ఆనకట్ట వెనుక వాగులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు..గిద్దలూరుకు చెందిన నలుగురు వ్యక్తులు గ్రామ పంచాయతీలకు బ్లీచింగ్ సరఫరా చేసేందుకు లోయలోని పల్లెలకు ఆటోలో వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణంలో వాగు వైపు వచ్చారు. అక్కడ చీకటిలో ఏమీ కనిపించకపోవడంతో ఆటోతో సహా నలుగురు వ్యక్తులు చిక్కుకుపోయారు. సమాచారం తెలుసుకున్న గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో వారిని సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చారు. నీటిలో చిక్కుకున్న ఆటోను జేసీబీ సాయంతో ఆదివారం ఉదయం బయటకు తీశారు.

కష్టాల కహానీ.. దశ మారని కాలనీ

మా ఊరి సమస్య

మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే:

అధ్వానంగా ఉన్న రహదారి

రాయవరం పంచాయతీ పరిధిలోని కనకదుర్గమ్మ కాలనీలో మౌలిక వసతులు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. 1996లో సుమారు మూడొందల మందికి అక్కడ ఇంటి పట్టాలు మంజూరు చేయగా..దాదాపు రెండు వందలమంది గృహాలు నిర్మించుకుని నివాసముంటున్నారు. ఏళ్లు గడస్తున్నా తమ కాలనీలో వసతులు సమకూరడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ మొత్తంలో ఎనిమిది వీధులుండగా..ఒక్క వీధిలో మాత్రమే సిమెంటు రోడ్డు ఉంది. మిగిలినచోట్ల మట్టి దారులే దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి వర్షం పడినా వీధులన్నీ బురదమయంగా మారి అడుగు పెట్టలేని విధంగా తయారవుతున్నాయి. వర్షం నీరంతా ఇళ్లలోకి చేరుతున్నాయని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం కష్టాలు భరించలేక పలువురు కాలనీని వీడి పట్టణంలోని వేరే ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. కాలనీలో కేవలం రెండు మాత్రమే డీప్ బోర్లు ఉండటంతో నీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదు.

మౌలిక వసతులు లేవు..

కాలనీలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. బోర్లు మరమ్మతులకు గురై నీటి సమస్య తలెత్తుతోంది. వీధి దీపాలు వెలగడం లేదు. మా కష్టాలు తీర్చేవారు కరవయ్యారు. – వెంకటేశ్వర్లు, స్థానికుడు

నిధులు రాక.. పనులు సాగక..

నిలిచిపోయిన వెలుగు సమాఖ్య భవనం

పొదిలి, న్యూస్‌టుడే: ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు అందకపోవడంతో గుత్తేదారులు పనులను నిలిపేశారు. దీంతో ఆయాశాఖల అధికారులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. పొదిలిలో గతంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ భవనం పనులు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ప్రారంభించారు. స్లాబు వరకు పూర్తయ్యాక నిధులు అందకపోవడంతో గుత్తేదారు పనులు ఆపేశారు. ప్రస్తుతం ఉన్న కార్యాలయం ఇరుకుగా ఉండటంతో అంగన్‌వాడీ కేంద్రాల క్లస్టర్ల సమావేశాలు అరకొరగా నిర్మించిన భవనంలోనే కొనసాగిస్తున్నారు. పొదిలి, కొనకనమిట్ల మండలాల నుంచి కార్యకర్తలు కార్యాలయానికి వస్తుంటారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వెలుగు పథం మండల సమాఖ్య భవన నిర్మాణానికి సుమారు రూ.60 లక్షలు మంజూరయ్యాయి. రెండంతస్తుల భవన నిర్మాణ పనులు మధ్యలో ఆగాయి. దీంతో మండల సమాఖ్య కార్యాలయం అద్దె భవనంలోనే అరకొర సౌకర్యాల మధ్య కొనసాగుతోంది. గత ప్రభుత్వ పాలనలో నిధులు మంజూరు కాకపోవడంతో లక్ష్యం నెరవేరలేదు. దీంతో నెలవారీ సమీక్షా సమావేశాలకు హాజరయ్యే స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవస్థలు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి భవన నిర్మాణాలను పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

అసలే అంధకారం.. ఆపై మృత్యుమార్గం

- ఇటీవల తర్లుపాడు మండలానికి చెందిన ఓ యువకుడు రైల్వే వంతెనపై అదుపుతప్పి ప్రాణాలు కోల్పోయాడు.
- అయిదు నెలల క్రితం ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వెళుతూ రైల్వే వంతెనపై ఫుట్‌పాత్‌ను ఢీకొట్టగా, నికరంపల్లికి చెందిన వ్యక్తి మృతి చెందాడు.

రైల్వే వంతెనపై అలముకున్న చీకట్లు

మార్కాపురం, మార్కాపురం అర్బన్ న్యూస్‌టుడే:

పశ్చిమ ప్రాంతానికి గుండెకాయ లాంటి మార్కాపురానికి నిత్యం వేలాదిమంది వస్తుంటారు. వారు వచ్చే మార్గంలో రాయవరం ప్రాంతం మృత్యు నిలయంగా మారింది. అక్కడి రైల్వేస్టేషన్ వంతెనపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుని పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. అక్కడి మలుపుల్లో వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయి. కనీసం ప్రమాద సూచికలు కూడా లేకపోవడం గమనార్హం. గత పదేళ్లలో సుమారు పదిమంది ప్రాణాలు కోల్పోగా, 30 మంది గాయాల పాలయ్యారు.

రక్తమోడుతున్న రైల్వేవంతెన రోడ్డు

ఎక్కడికక్కడే ఛిద్రమైన రహదారి

వీధి దీపాల ఏర్పాటు మరిచి..

రైల్వే వంతెనపై ఎక్కువగా రాత్రి పూటే దుర్ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. వంతెన నిర్మించి ఏళ్లు గడుస్తున్నా నేటికీ వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు. దీంతో చిమ్మచీకట్లో ప్రయాణిస్తూ ఫుట్‌పాత్‌ను ఢీకొని విలువైన ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఇది మార్కాపురం - ఒంగోలు ప్రధాన రహదారిలో ఉండటంతో వాహనాల తాకిడి ఎక్కువగా ఉంటోంది. ఇటీవల కురిసిన వర్షాలకు వంతెనపై భారీ గుంతలు పడి పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. రైల్వే వంతెనపై ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేయాలని గతంలో రాయవరం గ్రామస్థులు వినతిపత్రాలు అందజేసినా ..అధికారుల్లో స్పందన కరవైంది. తక్షణం సూచికలు ఏర్పాటు చేసి రేడియం స్టిక్కర్లు అతికించాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు.

ఉపాధ్యాయుల క్రీడలు ప్రారంభం

క్రికెట్ ఆడేందుకు సిద్ధమైన ఉపాధ్యాయులు

కంభం : ఉపాధ్యాయులకు క్రీడలు నిర్వహించడం హర్షణీయమని ఎంఈవో -1 అబ్దుల్ సత్తార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆటస్థలంలో ఆదివారం ఉపాధ్యాయుల క్రీడలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆటలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని చెప్పారు. పోటీలు, మండల, డివిజన్, జిల్లా, రాష్ట్రస్థాయిలో జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆదిల్, ఖాసింపీరా, సునీల్, గోపీ, సుధాకర్, రవికిశోర్‌రెడ్డి, ఖాసింవలీ పాల్గొన్నారు.

గాండ్ల సంక్షేమ సంఘం సమావేశం

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి సాయిబాలాజీ కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం పొదిలి యూనిట్ గాండ్ల సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. అధ్యక్షుడు చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి డి.గురుస్వామి మాట్లాడుతూ గాండ్ల, తెలికుల సామాజిక వర్గానికి కమ్యూనిటీ భవనం ఏర్పాటుకు ప్రభుత్వం సహకరించాలన్నారు. ఈ నెల 16న పొదిలి గోశాలలో కార్తిక వనభోజనాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీనివాసరావు, శివయ్య, అఖిల్‌సాయి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

ప్రకాశం జిల్లా, యర్రగొండపాలెం మండలం, మొగుళ్ళపల్లె గ్రామ కాపురస్తుడు నాగరాజు వెంకటయ్య తండ్రి పాలంకయ్య అను నేను ప్రయాణం చేస్తుండగా నా యొక్క డాక్యుమెంట్ నెంబర్ 184/1984గా గల డాక్యుమెంట్ పోయినది. కావున దొరికిన వారు క్రింది నెంబరుకు తెలుపగలరు.

9014007393

(c) eenadu

కనిగిరి

• కనిగిరి • దర్శి • కొండపి

సామూహిక సత్యవ్రతాలు

సాయిబాబా మందిరంలో వ్రతాలు చేస్తున్న భక్తులు

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: కొండపి సాయి బాబా మందిరంలో కార్తిక మాసం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సత్యవ్రతాలు నిర్వహించారు. సీహెచ్ సతీష్‌కుమార్ భక్తులతో వ్రతాలు చేయించారు. ముందుగా సాయిబాబాకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 70 మంది భక్తులు పాల్గొన్నట్లు మందిర కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఇటీవల తుపాను ప్రభావం కారణంగా కుండ పోతగా వర్షాలు కురిసినందువల్ల ఎక్కడికక్కడ నీళ్లు, చెత్త నిలిచిపోయాయి. ఎంపీడీవో పి. అజిత సూచనలతో లక్కవరంలో పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. ప్రధాన వీధుల్లో, మురుగునీటి కాలువల వద్ద బ్లీచింగ్ చల్లించారు.

కనువిందు చేసిన ఇంద్రధనస్సు

టంగుటూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రం టంగుటూరులో ఆదివారం ఇంద్రధనస్సు కనువిందు చేసింది. వాతావరణంలో మార్పుల కారణంగా ఉదయం సమయంలో చిన్నపాటి వర్షం కురిసింది. అనంతరం మధ్యాహ్నం వేళ ఎండలు, ఆ తర్వాత దట్టంగా మేఘాలు ఏర్పడడంతో ఆకాశంలో హరివిల్లు కనిపించింది. దీనిని స్థానికులు ఆసక్తిగా తిలకించి ఆనందం వ్యక్తం చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం

కనిగిరి పట్టణంలోని పామూరు బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఫ్యూజులు, వైర్లు చేతికందే ఎత్తులోనే ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. ఇదే ప్రాంతంలో ఆర్టీసీ బస్టాప్ ఉండడంతో ప్రయాణికులు తిరుగుతుంటారు. ఎవరైనా ఆదమరిస్తే ప్రమాదం జరిగినట్లే. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్తు ఏఈ పవన్‌కుమార్‌ను వివరణ కోరగా తీగల ఎత్తు పెంచుతామని తెలిపారు. –న్యూస్‌టుడే, కనిగిరి

పక్కకు తప్పితే.. పడినట్లే!

తుపాను కారణంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగులు, కుంటలు, చెరువులు పొంగడంతో వర్షపునీరు రోడ్లపైకి ప్రవహించింది. మండలంలోని వావిలేటిపాడు సమీపంలో ఉన్న అడ్డరోడ్డు అంచులో పెద్ద గుంత ఏర్పడింది. దీంతో రాత్రి సమయంలో ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనదారులు పక్కకు జరిగితే ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈఈ మాధవరావును వివరణ కోరగా.. వర్షాల కారణంగా మట్టి కోసుకుపోవడంతో అంచు వద్ద గుంత ఏర్పడిందన్నారు. ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా తక్షణమే గొయ్యిని పూడ్చిస్తామని తెలిపారు. –న్యూస్‌టుడే, జరుగుమల్లి

సాగునీరు వృథా.. అన్నదాతల వ్యథ

హనుమంతునిపాడు మండలం హాజీపురం పెద్దచెరువు తూము తలుపులు నిర్వహణకు నోచుకోకపోవడంతో నీరంతా వృథాగా పోతుంది. దీంతో ఆయకట్టు కింద వరి పంట వేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జలవనరుల శాఖ అధికారులకు తెలియపరిచినా స్పందించ లేదన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులోకి అయిదడుగుల మేర నీరు చేరింది. తూము తలుపులు మూసుకుపోయి తెరుచుకోవడం లేదని రైతులు చెబుతున్నారు. ఈ విషయం ఎంపీడీవో రంగసుబ్బారాయుడికి తెలపగా ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చి చర్యలు తీసుకుంటామని తెలిపారు. –న్యూస్‌టుడే, హనుమంతునిపాడు

దారి పక్కనే దుర్వాసన

మండల కేంద్రమైన కొండపిలోని జాళ్లపాలెం రోడ్డులో ఉన్న నాగార్పమ్మ ఆలయం ఎదుట వ్యర్థాలతోపాటు బురద చేరింది. దీంతో కుక్కలు, పందులు చేరి చిందరవందర చేయడంతో అటువైపు రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు గురవుతున్నారు. పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకొని అక్కడ ఎవరూ వ్యర్థాలు వేయకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్‌ను వివరణ కోరగా.. మాంసపు దుకాణాల యజమానులకు హెచ్చరిస్తామని, వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. –న్యూస్‌టుడే, కొండపి గ్రామీణం

బహుమతులు అందుకున్న కాటంరాజు జూనియర్ కళాశాల విద్యార్థులతో అధ్యాపకులు

చిత్ర కళా.. ప్రతిభ భళా!

దర్శి, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు ఆదివారం దర్శి కాటంరాజు (పొట్టిశ్రీరాములు) జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 'ప్రకృతి అందాలు' అనే అంశంపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో ఆకర్షణీయంగా బొమ్మలు గీసి ప్రతిభ చాటారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన ఎస్కే.కౌసర్, కె.శిరీష, ఎంపీ.సుప్రజకు ప్రిన్సిపల్ పెద్దిరాజు చేతులమీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు నారాయణ, కళ్యాణరావు, వెంకటేశ్వర్లు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

▸సింగరాయకొండ గ్రామీణం: మండలంలోని ఊళ్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రకృతి అందాలతో పాటు, తమకు ఇష్టమైన పండగలు అనే అంశంపై విద్యార్థులు అందమైన బొమ్మలు గీసి ప్రతిభ కనబరిచారు. ఎస్.శ్రీవల్లి, ఎ.మనీశ్వరి, పి. చందనలు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు, ఉపాధ్యాయులు చిట్టిగిరిబాబు, ఉమ, జాలారావు, వెంకటేశ్వర్లు చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

విజేతలతో ఊళ్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

కార్యాలయాల చెంత.. శుభ్రత లేక చింత

న్యూస్‌టుడే, కనిగిరి

'ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలి. ఇళ్ల వద్ద ఎలాంటి నీటి నిల్వలు ఉండకూడదు. దోమలు వృద్ధి చెందకుండా అప్రమత్తంగా ఉండాలి.' ప్రతి సారీ అధికారులు చెబుతున్న మాటలివి. మరోవైపు స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర పేరుతో ఏకంగా ర్యాలీలు చేపట్టి ప్రజల్లో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఎవరైతే జాగ్రత్తలు చెబుతున్నారో.. ఆ అధికారులు పనిచేసే కార్యాలయాల వద్దే అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. ఎక్కడికక్కడే వ్యర్థాలు, చెత్త పేరుకుపోయాయి. పిచ్చిమొక్కలు, చిల్లచెట్లు ఆవరించాయి. దీనికితోడు ఇటీవల తుపాను వల్ల కురిసిన వర్షాలకు అటువైపు వెళ్లే ముక్కుమూసుకోక తప్పడం లేదు. రెవెన్యూ డివిజనల్ కేంద్రంలోని వివిధ కార్యాలయాల వద్ద పరిస్థితి ఇది.

కమ్యూనిటీ వైద్యశాల వద్ద కుప్పగా ఉన్న వ్యర్థాలు

ఎక్కడ చూసినా పిచ్చి మొక్కలే

క్షయ నివారణ కేంద్రం వద్ద ఇలా..

కనిగిరి పట్టణంలోని వ్యవసాయ శాఖ, వెలుగు, ఐసీడీఎస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఉద్యాన, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు, పశువైద్యశాల, ఆర్టీసీ డిపో, ఆర్‌అండ్‌బీ, జలవనరుల శాఖ భవనాలు, కమ్యూనిటీ వైద్యశాల.. ఇలా ఒకటేమిటి 90 శాతం ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలు చిల్లచెట్లు, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. వీటితో పాటు ఆయా కార్యాలయాల వద్ద వ్యర్థాలు పేరుకుపోయి అధ్వానంగా తయారయ్యాయి. రెవెన్యూ డివిజన్ కావడంతో నిత్యం ఆయా గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో కనిగిరిలోని ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారు. వ్యర్థాలు, పిచ్చి మొక్కలు చెత్తా చెదారం ఎక్కడ పడితే అక్కడ పేరుకు పోవడంతో స్వచ్ఛత కనుమరుగవుతుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ మొక్కలు మరింత దట్టంగా పెరిగిపోయాయి. కార్యాలయాలకు వెళ్లాలంటే.. అక్కడ పేరుకు పోయిన వ్యర్థాలు కుళ్లి తీవ్ర దుర్వాసన రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల విద్యుత్తు డివిజనల్ కార్యాలయంలో చిల్లచెట్ల వల్ల లోపలకు నాగు పాము రావడంతో ఉద్యోగులు ఆందోళన చెందారు. మిగతా చోట్ల సైతం విష సర్పాల బెడద పొంచి ఉంది. ఈ పరిస్థితులపై అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్‌ను వివరణ కోరగా.. ఏ కార్యాలయంలో పరిశుభ్రతను అక్కడి అధికారుల పర్యవేక్షణలోనే నిర్వహించాలన్నారు. పురపాలక సంఘం తరఫున వారికి ఒకసారి పరిస్థితిని తెలియజేసి.. పిచ్చి మొక్కల తొలగింపు, వ్యర్థాల తరలింపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భైరవకోనలో ట్రాఫిక్ ఇబ్బందులు రానీయం

ఆలయం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసరావు తదితరులు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శైవ పుణ్యక్షేత్రం భైరవకోనలో కార్తిక పౌర్ణమి, సోమవారాల్లో ట్రాఫిక్‌కు ఎలాంటి ఆంతరాయం తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పామూరు సీఐ మాకినేని శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన భైరవకోను సందర్శించారు. ఈ నెల 5న కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు కోనను సందర్శిస్తారని చెప్పారు. ద్విచక్ర వాహనాలు, కార్లకు కొండపైకి ప్రవేశం లేదని భక్తులు, పర్యాటకులు గమనించి సహకరించాలని పేర్కొన్నారు. వాహనదారులు తమ వాహనాలను కొండ కింద పార్కింగ్ ప్రదేశంలో నిలుపుకోవాలన్నారు. జలపాతం వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జలపాతాన్ని, ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈవో డి.వంశీకృష్ణారెడ్డి, ఎస్సై ఎం.వెంకటేశ్వర నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల సందర్శన

దుర్గాంబ ఆలయ సన్నిధిలో భక్తులు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శైవ పుణ్యక్షేత్రం భైరవకోనను ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు సందర్శించారు. కార్తిక మాసం కావడంతోపాటు, జలపాతం ఉండడం వల్ల భక్తులు, యాత్రికుల సంఖ్య పెరిగింది. జలపాతం వద్ద స్నానాలు ఆచరించారు. కాలభైరవేశ్వరస్వామి, త్రిముఖ దుర్గాంబ, శివలింగాలను దర్శించుకుని పూజలు నిర్వహించారు. కోనను అయ్యప్ప, శివ మాలధారులు సందర్శించి పూజలు చేశారు. ఈవో వంశీకృష్ణారెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

కనిగిరి : 8008574114, (10 AM TO 1 PM)
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

?: పీసీపల్లి మండలం పాలేటిపల్లికి వెళ్లే రోడ్డు మట్టి రహదారి కావడంతో వర్షం పడిన సమయంలో గుంతల్లో నీరు నిలిచి బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. వాహనాలు వెళ్లలేని దుస్థితి. – స్థానికులు

✓: అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చొరవచూపుతాం. – తిరుపతమ్మ, సర్పంచి

?: కురిచేడు మండలంలోని పడమర గంగవరం పంచాయతీలోని రెడ్డెన్నపల్లెలోని వీధుల్లో పక్కా కాలువలు లేకపోవడంతో నివాసాల్లో నుంచి వచ్చే మురుగునీరు రహదారి పక్కన చేరి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.
– రమణారెడ్డి, స్థానికుడు

✓: పక్కా కాలువలు నిర్మించాలని ప్రతిపాదనలు చేశాం. అనుమతులతోపాటు నిధులు రాగానే పనులు చేపడతాం.
– జ్యోత్స్న, పంచాయతీ కార్యదర్శి

?: హనుమంతునిపాడు మండలం హాజీపురంలో మురుగు కాలువలు ఏర్పాటు చేయకపోగా నీరంతా ఇళ్లలోకి వస్తుంది.
–బ్రహ్మచారి, గ్రామస్థుడు

✓: సర్పంచి, పంచాయతీ కార్యదర్శికి సూచనలిచ్చి సమస్య పరిష్కరిస్తాం. –రంగసుబ్బారాయుడు, ఎంపీడీవో

?: మర్రిపూడి మండలం ధర్మవరం బీసీ కాలనీలో బోరు మరమ్మతులకు గురికావడంతో నీటికి ఇబ్బందిగా ఉంది.
–కోటేశ్వరరావు, స్థానికుడు

✓: మెకానిక్‌ను పంపి వెంటనే మరమ్మతులు చేయిస్తాం.
–జగదీష్, ఎంపీడీవో - న్యూస్‌టుడే, పీసీపల్లి, కురిచేడు, హనుమంతునిపాడు, మర్రిపూడి

కొండ చిలువ కలకలం

కనిగిరి: పట్టణంలోని కాశీనాయన గుడి సమీపంలో ఆదివారం కొండ చిలువ కలకలం రేపింది. ఓ ఇంటిముందు కదలాడుతున్న సర్పాన్ని స్థానికులు చూసి భయాందోళనకు గురై అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆ సిబ్బంది వచ్చి పట్టుకుని సమీపంలోని అడవిలో వదిలేశారు.

పోలీస్‌స్టేషన్ ముట్టడి

టంగుటూరు: కమ్యూనిటీ స్థలం వ్యవహారంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి దురుసుగా ప్రవర్తిస్తున్నారంటూ మండలంలోని కాకుటూరిపాలెం ఎస్సీకాలనీ వాసులు పెద్ద సంఖ్యలో ఆదివారం రాత్రి టంగుటూరు పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. గ్రామంలోని 531-1 సర్వే నంబరులోని అంబేడ్కర్ సభా ప్రాంగణ స్థలంలో విద్యుత్తు స్తంభం ఏర్పాటులో తలెత్తిన వివాదంపై కాలనీ యువకులపై కార్యదర్శి బాషా ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు యువకులు మంత్రి స్వామి, తహసీల్దార్‌కు వినతి పత్రాలు అందించి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై విచారించేందుకు ఎస్సై నాగమల్లేశ్వరరావు యువకులను స్టేషన్‌కు పిలిపించడంతో కాలనీకి చెందిన 150 మంది తరలివచ్చి స్టేషన్‌ను ముట్టడించారు.

పోలీస్‌స్టేషన్ వద్ద కాకుటూరిపాలెం ఎస్సీ కాలనీవాసులు

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

తెదేపా అనుబంధ సంఘాల అధ్యక్షులతో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి నియోజకవర్గ తెదేపా అనుబంధ సంఘాల అధ్యక్షుల నియామకాన్ని ఆదివారం రాత్రి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి స్థానిక అమరావతి మైదానంలో ప్రకటించారు. బీసీ సెల్ అధ్యక్షుడిగా గంజిగుంట శ్రీనివాసులు, క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడిగా కుంచం జక్రయ్య, కల్చరల్ అధ్యక్షుడిగా షేక్ గయాజ్ బాషా, డాక్టర్స్ సెల్ అధ్యక్షుడిగా సయ్యద్ ఇస్మాయేల్, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా బలసాని కోటయ్య, తెలుగు మహిళా అధ్యక్షురాలిగా కరాటపు స్వప్న, తెలుగురైతు అధ్యక్షుడిగా అక్కి శ్రీనివాసులు, తెలుగు యువత అధ్యక్షుడిగా దొడ్డా వెంకట సురేష్‌రెడ్డి తదితరులను నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడాలన్నారు. రాబోయే స్థానికసంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేసేవారికి అన్ని వేళలా అండగా ఉంటామని తెలిపారు.

తెదేపాలో చేరిక : దర్శి, న్యూస్‌టుడే: మండలంలోని బొట్లపాలెం గ్రామానికి చెందిన కొర్రపాటి సుబ్బులు, యేసేబు, ఏలూరి పేరయ్యలకు చెందిన మూడు కుటుంబాలు వైకాపాను వీడి తెదేపాలో చేరాయి. దర్శిలోని తన నివాసంలో తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి పార్టీ కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ తెదేపా నాయకులు అచ్చిరెడ్డి, సుబ్బు, ఆంజనేయులు, తిమోతి పాల్గొన్నారు. ఇదే గ్రామానికి చెందిన ఆటూరి పేరయ్యకు రూ.13,800, గల్లె పోగు యోహానుకు రూ.41 వేల సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు.

పార్టీలో చేరిన బొట్లపాలెం గ్రామస్థులతో గొట్టిపాటి లక్ష్మి, నాయకులు

సేవలు అభినందనీయం

దర్శి, న్యూస్‌టుడే: మండల విద్యాశాఖాధికారి రఘురామయ్య గత నెల 31న ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం దర్శిలో ఎంఈవో దంపతులకు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఘన సత్కారం నిర్వహించారు. తెదేపా దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ.. ఆయన సేవలు అభినందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్యే పాపారావు, ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి, డీఈవో కిరణ్‌కుమార్ తదితరులు ఎంఈవో సేవలను కొనియాడి, ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

చదువులో క్రమశిక్షణ అవసరం

ముండ్లమూరు, న్యూస్‌టుడే: ముండ్లమూరులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని డీఈవో కిరణ్‌కుమార్ ఆదివారం సందర్శించారు. వసతి గృహాన్ని, వంట గది, సరకులు, రికార్డులు, పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. క్రమశిక్షణతో చదివి ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థుల్లో సామర్థ్యాలను పరీక్షించారు. వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆ సమయంలో ఎస్‌వో సునీత లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

సాగర్ కాలువల్లో తగ్గిన నీటి ప్రవాహం

దర్శి, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసినందువల్ల సాగర్ కాలువలకు నీటి ప్రవాహం తగ్గించారు. కేవలం అడుగు మేర మాత్రమే నీళ్లు కనిపిస్తున్నాయి. ఎన్నెస్పీ అధికారులను వివరణ కోరగా ఇప్పటికే విడుదల చేశామని, రెండు రోజుల వ్యవధిలో దర్శికి చేరుతాయని తెలిపారు. ఆదివారానికి సాగర్ ప్రధాన కాలువ 1.461 కిలో మీటరు వద్ద 7,033 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు వివరించారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి

పామూరులో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామివారు

పామూరు, న్యూస్‌టుడే: పామూరులోని విరాట్ నగర్‌లో ఆదివారం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి జయంతి మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చండీ హోమం చేయగా.. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

❖ **దొనకొండ:** దొనకొండ సమీపంలో ఉన్న ఆనంద ఆశ్రమంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని పూలు, పండ్లతో అలంకరించారు. ఉదయం నుంచి గణపతి పూజ, సహస్రనామార్చన, క్షీరాభిషేకం తదితర ప్రత్యేకార్చనలను భైరవానంద స్వామి చేయించారు. వచ్చిన భక్తులకు బొరిగొర్ల మురళి, ఉషారాణి దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు.

అమ్మవార్లకు విశేష పూజలు

ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని సోమవరప్పాడు పరిధి గుంటిగంగలో కొలువుదీరిన గంగాభవానీ అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. దేవాలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు.

❖ **ముండ్లమూరు:** ముండ్లమూరులోని వీర్ల అంకమ్మతల్లికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు సమర్పించారు. మారెళ్ల, బొప్పూడివారిపాలెం, కెల్లంపల్లి, నూజెళ్లపల్లి, పూరిమెట్ల పోలేరమ్మ దేవాలయాల్లో రద్దీ నెలకొంది.

గోపూజ చేస్తున్న అర్చకులు పాల్గొన్న భక్తులు

నారాయణ స్వామి ఆలయంలో రద్దీ

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షలతో స్వామి వారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నారాయణస్వామి మూలవిరాట్టును వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. దేవస్థానంలో అర్చకులు గోపూజ చేశారు. ఆలయంలో నారాయణస్వామికి అభిషేకం, మహానివేదన, హారతి పూజలు జరిగాయి. నారాయణస్వామి పల్లకీసేవ, రథోత్సవం జరిగాయి. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎస్.నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ కె.చినఆదినారాయణ, ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సింగరాయకొండలో జూదరుల అరెస్టు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరాయకొండ సుందరనగర్‌లో ఆదివారం పోలీసులు జూద శిబిరంపై దాడి చేసి 5 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై మహేంద్ర వెల్లడించిన వివరాల మేరకు.. స్థానిక గిరిజన కాలనీలో కొందరు జూద శిబిరం నిర్వహిస్తూ మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారనే సమాచారం అందింది. వెంటనే సిబ్బందితో వెళ్లి శిబిరంపై దాడి చేసి, అయిదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.1,640 స్వాధీన పరచుకుని పోలీసుస్టేషనుకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

సింగరాయకొండ గ్రామీణం: మద్యం తాగి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు చేపడతామని సీఐ హజరత్తయ్య హెచ్చరించారు. సింగరాయకొండ ప్రధాన రహదారి, గ్రామ శివారు, పరిసర ప్రాంతాల్లో ఆదివారం పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. సుమారు వంద ద్విచక్ర వాహనాలు, కార్లు నిలుపుదల చేసి చోదకులను పరిశీలించారు. 20 మంది మందుబాబులను గుర్తించి జరిమానా విధించారు. సీఐ మాట్లాడుతూ.. వాహనదారులు ప్రతి ఒక్కరూ సరైన ధ్రువపత్రాలు, శిరస్త్రాణం తప్పనిసరిగా కలిగి ఉండాలని, లేని ఎడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మద్యం దుకాణాల వద్ద బహిరంగంగా తాగితే అనుమతులు రద్దు చేస్తామన్నారు. ఎస్సైలు మహేంద్ర, శ్రీనివాసరావు, మాచర్ల, పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, నాయకులు

ముండ్లమూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని పూరిమెట్ల గ్రామంలో ఆదివారం దెబ్బ తిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొంథా తుపాను ప్రభావంతో అన్ని పంటలకు నష్టం జరిగిందన్నారు. పంట నష్టం అంచనా వేస్తున్నారని, ప్రతి రైతును ఆదుకుంటామని చెప్పారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన విద్యుత్తు పరివర్తకాన్ని ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యుడు చింత వెంకటేశ్వరరావు, నాయకులు నాగులపాటి నాగేశ్వరరావు, బోడపాటి హనుమంతరావు, నిడిగంటి నారాయణ, రమణాల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరకులు

టంగుటూరు: మండలంలోని కొణిజేడులో తుపాను బాధితులకు నిత్యావసర సరకులను ఆదివారం పంపిణీ చేశారు. రూ.3 వేల నగదు, 25 కేజీల బియ్యం, వంటనూనె, కందిపప్పు, చక్కెర, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు ఇతర వస్తువులను తెదేపా నాయకుడు రామా గోపీ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తుపాను ప్రభావంపై ముందస్తు చర్యలు తీసుకోవడంతో ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదన్నారు. గ్రామ తెదేపా అధ్యక్షుడు పొనుగుమాటి కల్యాణ్, నాయకులు యానాది, రామా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సరకులు అందిస్తున్న తెదేపా నాయకులు

(c) eenadu

ఒంగోలు

●ఒంగోలు ● సంతనూతలపాడు

'విశ్వబ్రాహ్మణులకు అండగా ఉంటాం'

ఎమ్మెల్యే జనార్దన్‌ను సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: విశ్వబ్రాహ్మణులకు అన్ని విధాలా అండగా ఉంటామని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హామీ ఇచ్చారు. స్థానిక దక్షిణ బైపాస్‌లోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో ఆదివారం విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సేవా సంఘం కార్తిక మాస వన సమారాధన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశ్వబ్రాహ్మణులకు ఇంటి స్థలాల జాబితా తయారు చేయండి, అందరికీ రెండు సెంట్లు చొప్పున పట్టా ఇస్తామని తెలిపారు. ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తుపాను సమయంలో కూడా అందరి సమష్టి కృషితో ఒంగోలు నగరంలోని లోతట్టు కాలనీల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు వివరించారు. తుపాను తర్వాత పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణతో పాటు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జనార్దన్‌ను ఘనంగా సన్మానించారు. సమావేశంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ కె.పార్వతమ్మ, ఏపీపీ కిరణ్‌కుమార్, ఏఎంసీ ఛైర్మన్ రాచగర్ల వెంకటరావు, విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు రావూరి లక్ష్మయ్య, నాయకులు విశ్వరూపాచారి తదితరులు పాల్గొన్నారు.

తుపాను నష్టంపై పారదర్శక అంచనా అవసరం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: తుపాను మిగిల్చిన నష్టంపై పారదర్శకంగా అంచనా వేసి బాధితులకు తక్షణ సాయం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం సీపీఎం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తుపాను సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 25,685 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచనా వేసినా; వాస్తవానికి ఇంకా ఎక్కువ విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి రైతుకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒంగోలు నగరానికి ముప్పుగా మారిన పోతురాజు, నల్ల కాలువను అభివృద్ధి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు పునాటి ఆంజనేయులు, సయ్యద్ హనీఫ్, జీవీ కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు, ఎం.రమేష్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి తోడ్పడాలి

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న తెదేపా మైనార్టీ సెల్ నేతలు

సంతనూతలపాడు: తెదేపా మైనార్టీ సెల్ నియోజక వర్గ అధ్యక్షులుగా ఎంపికైన ఎస్.డి.రఫీ ఆదివారం ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తనకు నియోజక వర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులుగా అప్పగించినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి తోడ్పడాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు మైనార్టీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై చర్చిస్తారా.. కొలిక్కి తెస్తారా..

● 75 అంశాలతో నేడు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం

నగరపాలక సంస్థ కార్యాలయం

న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

ప్రజా సమస్యలపై ప్రజా ప్రతినిధులు, సభ్యులు ఒకేచోట చేరి చర్చించే అవకాశం నగర, మున్సిపల్ సమావేశాల్లో కలుగుతుంది. వీటిని సద్వినియోగం చేసుకుంటే ప్రజలు ఎంతో మేలు కలుగుతుంది. తాజాగా ఒంగోలు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం సోమవారం సాయంత్రం 3 గంటలకు మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన జరగనుంది. గత నెలలో జరుప తలపెట్టిన సమావేశాన్ని తుపాను మూలంగా వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ సమావేశానికి ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయకుమార్ హాజరవుతారు. పేరుకున్న సమస్యలను కొలిక్కి తేవాలని నియోజకవర్గ, నగర ప్రజలు కోరుతున్నారు.

ట్రంక్ రోడ్డు విస్తరణే కీలకం

మొత్తం 75 అంశాలను ఆమోదం కోసం పెట్టారు. ప్రధానంగా ట్రంక్‌రోడ్డు విస్తరణ 80 అడుగులకు విస్తరింపజేయడంపై చర్చ జరగనుంది. మాస్టర్ ప్లాన్ ప్రకారం తొలుత వంద అడుగులకు విస్తరించాలని ప్రతిపాదించారు. దుకాణదారులతో ఎమ్మెల్యే చర్చల అనంతరం దానిలో 20 అడుగులు తగ్గించారు. కౌన్సిల్ ఆమోదం అనంతరం మరోసారి దుకాణదారులకు నోటీసులు అందజేస్తారు. ఈ పనులు పూర్తిచేశాక రెండో దశలో మస్తాన్‌దర్గా వద్ద నుంచి కొత్తపట్నం బస్టాండ్ వరకు 80 అడుగులు విస్తరణపై నిర్ణయం తీసుకుంటారు.

వరద నీరు తరలింపుపైనా..

తుపాను సమయంలో సమర్థంగా పనిచేసిన సిబ్బందిని సత్కరిస్తారు. గడిచిన మూడు నెలల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఆమోదం కోసం అజెండాలో చేర్చారు. భారీవర్షాల సమయంలో వరదనీరు తరలి పోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తారు. వచ్చే ఏడాది మార్చి నెలతో కౌన్సిల్ పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో రానున్న నాలుగు మాసాల్లో నగరంలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై చర్చించనున్నారు. నగరపాలక సంస్థ ఆదాయ వనరులు పెంచుకోడానికి చేపట్టబోయే ప్రతిపాదనలపై సభ్యుల అభిప్రాయాలు తీసుకుంటారు.

వాకర్స్‌కు ఉచిత వైద్య శిబిరం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరంలోని శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం వాకర్స్ కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక దేవుడుచెరువు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 187 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, ఎముకల పటుత్వ పరీక్ష, ఊపిరితిత్తుల సాంద్రత, పాదాల, నరాల స్పర్శ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీరామ్ ఆసుపత్రి అధినేత, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ చాపల వంశీకృష్ణ, ఇతర వైద్యనిపుణులు సేవలందించారు.

1,547 మందికి వైద్య పరీక్షలు

ఒంగోలు గ్రామీణం: దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక నెల్లూరు బస్టాండ్ సమీపంలోని తితిదే కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన ఉచిత వైద్య శిబిరంలో 1,547 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు జి.శివన్నారాయణ, జాన్ రిచర్డ్స్, బి.హరిబాబు, చాపల వంశీకృష్ణ, శాంతకుమారి, ధీరజ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దోమలున్నాయి.. జాగ్రత్త!

☛ ఫాగింగ్ యంత్రాలు నిరుపయోగం

మద్దిపాడులో మురుగు కాలువ పరిస్థితి

న్యూస్‌టుడే, మద్దిపాడు, నాగులుప్పలపాడు

ఓవైపు వర్షాలు, మరోవైపు పారిశుద్ధ్య లోప చర్యలతో గ్రామాల్లో దోమల బెడద హడలెత్తిస్తోంది. మురుగు కాలువలు అధ్వానం, ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు సంతనూతలపాడు, ఒంగోలు నియోజక వర్గాల్లోని గ్రామాల్లో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడం, ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అధికారులు కొంత మేర మాత్రమే పారిశుద్ధ్య చర్యలు చేపట్టి తరువాత పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు.

ప్రతి గ్రామ పంచాయతీకి ఒక యంత్రం..

ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ఫాగింగ్ యంత్రం చొప్పున పంపిణీ చేసినా వాటిని వినియోగించడంలో కార్యదర్శులు దృష్టి సారించడంలేదు.

◗ సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహణ లేమితో దోమలు వృద్ధి చెందుతున్నాయి. మద్దిపాడు మండలంలో కాలువల్లో మలాథియాన్ బంతులు వేయడం, ఫాగింగ్ నామ మాత్రంగా చేస్తున్నట్లు విమర్శలొస్తున్నాయి. ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేసి ఇప్పటికీ సీల్ తీయనివి కొన్ని అయితే ఒకటి రెండు సార్లు వాడి మరమ్మతులతో మూలనబడినవి మరికొన్ని.

◗ సంతనూతలపాడు నియోజకవర్గంలో 2,000 మంది జనాభా కలిగిన గ్రామానికి పారిశుద్ధ్య పనులకు నెలకు వేల రూపాయల్లో వ్యయం అవుతోంది. గత ప్రభుత్వం పంచాయతీ సొమ్ములను సైతం స్వాహా చేసిన నేపథ్యంలో ఫాగింగ్ యంత్రాలను అటకెక్కించారు. ◗ నాగులుప్పలపాడు ఇన్‌ఛార్జి డిప్యూటీ ఎంపీడీవో మురళీ మోహన్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలతో నీరు నిల్వ ఉండి దోమల వ్యాప్తి అధికమవుతోంది. కాబట్టి వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో తప్పనిసరిగా ఫాగింగ్ నిర్వహించాలన్నారు.

నేడు పైడి తెరేష్‌బాబు జయంతి స్మారక సభ

చీమకుర్తి: దళిత సాంస్కృతిక వీరుడు పైడి తెరేష్‌బాబు జయంతి స్మారక సభను సోమవారం ఒంగోలులో నిర్వహిస్తున్నట్లు దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరరావు తెలిపారు. ఒంగోలులోని ఎంసీఏ భవనంలో సాయంత్రం 5 గంటలకు జరుగుతుందని, హిందీ యూనివర్సిటీ హైదరాబాద్ హెచ్‌వోడీ జి.వి.రత్నాకర్, నాటక ప్రయోక్త రచయిత దెంచనాల శ్రీనివాస్, పలువురు కవులు పాల్గొంటారని తెలిపారు. స్మారక సంచికను వెలువరిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఫీజు బకాయిలు తక్షణం చెల్లించండి

మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నజర్ జీ

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల దీర్ఘకాలిక సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నజర్ జీ డిమాండ్ చేశారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గత నెల 22న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బస్సు యాత్ర ఆదివారం ఒంగోలుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్ వద్ద నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల హామీ మేరకు పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం విద్యార్థులకు శాస్త్రీయ విద్యను దూరం చేస్తూ మూఢ విశ్వాసాలను ప్రోత్సహించే విద్యావిధానం అమలు చేస్తోందంటూ విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న వైద్య శాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం దుర్మార్గమన్నారు. ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు చేపట్టిన బస్సు యాత్ర ద్వారా విద్యార్థులను చైతన్య పరిచి భవిష్యత్తులో ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల వలరాజు, నాయకులు ఎం.సాయికుమార్, నాగభూషణం, రామాంజీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: 'మొంథా' తుపాను దృష్ట్యా ఒంగోలు లోతట్టు కాలనీల్లోని 706 కుటుంబాలకు చెందిన 1905 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వరద బాధిత కుటుంబాలకు 25 కిలోల బియ్యంతోపాటు, ఇతర నిత్యావసర సరకులు అందజేయనున్నారు. మనిషికి రూ.1000 చొప్పున కుటుంబానికి గరిష్ఠంగా రూ.3 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తహసీల్దార్ పి.మధుసూదనరావు తెలిపారు.

● మద్దిపాడు, న్యూస్‌టుడే: కొలచనకోట గ్రామంలోని 25 మత్స్యకార కుటుంబాలకు గ్రామ సచివాలయంలో మద్దిపాడు మండల తెలుగుదేశం క్లస్టర్ ఇన్‌ఛార్జి దేవభక్తుని ప్రసాద్ ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు గంటా శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి మీరా పాల్గొన్నారు.

మత్స్యకారులకు సాయం అందిస్తున్న కొలచనకోట ఉప సర్పంచి ప్రసాద్

సరకులు పంపిణీ చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

● పేర్నమిట్ట (సంతనూతలపాడు), న్యూస్‌టుడే: పేర్నమిట్టలోని 39వ డివిజన్‌లో తెదేపా డివిజన్ అధ్యక్షులు కొల్లా మహేష్, సీనియర్ నాయకులు కల్లూరి వెంకటేశ్వర్లు, బూత్ ఇన్‌ఛార్జి పసుపులేటి మాధవరావులు వరద బాధితులకు సాయం అందజేశారు.

● ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు నగరంలోని శివారు కాలనీలకు చెందిన 100 మంది తుపాను వరద బాధిత కుటుంబాలకు ప్రీతం వర్షిత హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక పండరీపురంలో ఆదివారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు కొమ్మి రమణయ్య, రాజేశ్వరి, నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, సూర్యశ్రీ దివ్యాంగుల ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు షేక్ సర్దార్ బాషా, షహనాజ్, మారెళ్ల రాజేశ్వరి, వంకాయలపాటి సత్యవతి, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

మద్దిపాడు, న్యూస్‌టుడే

?: మద్దిపాడు మండలం వెల్లంపల్లి గ్రామ పంచాయతీలో బీసీ కాలనీలో విద్యుత్ వీధి దీపాలు పగలు రాత్రి తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. **–ముచ్చు రమణయ్య, వెల్లంపల్లి**

✓: మా సిబ్బందిని పంపించి తక్షణమే విద్యుత్ వీధి దీపాలు పగలు వెలగకుండా చర్యలు తీసుకుంటాం.
– చెన్నారెడ్డి, ఏఈ మద్దిపాడు విద్యుత్ శాఖ

?: మద్దిపాడు మండలం గుండ్లాపల్లి గ్రామ పంచాయతీ కొత్తూరు నుంచి జగనన్న కాలనీలోకి వెళ్లే మార్గంలో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. వెంటనే నీటిని తొలగించండి. **– కొప్పోలు సుబ్బారావు, మద్దిపాడు**

✓: పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి తక్షణమే ఆ మార్గంలో ఉన్న నీటిని తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.
– సురేష్, ఇన్‌ఛార్జి కార్యదర్శి, గుండ్లాపల్లి గ్రామ పంచాయతీ

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే:

?: హౌసింగ్ బోర్డు కాలనీ ఎల్ఐజీ 102 నంబర్ ఇంటికి ఎదుట నాలుగు ఇళ్లు శిథిలమైపోయాయి. ఎవరూ ఉండటంలేదు. ముళ్ల చెట్లు, మురుగుచేరి పాములు తిరుగుతున్నాయి. అధికారులు వెంటనే చర్యలు తీసుకోగలరు. **– సుబ్బారావు, ఒంగోలు**

✓: శానిటరీ విభాగం సిబ్బందిని పంపించి పరిశీలించాక తగు చర్యలు తీసుకుంటాం. చెట్లు, మురుగు తొలగించి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం. **– కె.వెంకటేశ్వరరావు, కమిషనర్**

?: విరాట్‌నగర్ రెండో అడ్డరోడ్డు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి నీరు పోవడం లేదు. దీంతో దోమలు పెరిగిపోతున్నాయి.
– అప్పారావు, ఒంగోలు.

✓: సమస్య పరిష్కారానికి సిబ్బందిని పంపిస్తాం. పూర్తిగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టి ఎలాంటి అసౌకర్యం లేకుండా చూస్తాం.
– షేక్ బాబ్జి, శానిటరీ సూపర్‌వైజర్ –2



ఇలా నిలిపితే.. వెళ్లేదెలా?

చీమకుర్తి పట్టణంలోని పలు వీధుల్లో లారీలు, ఆటోలు, ఇష్టానుసారంగా తిరుగుతుండటంతో ఇతర వాహనాలు తిరగలేకపోతున్నాయి. స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని పలు వీధుల్లో వివిధ రకాల హోల్‌సేల్ దుకాణాలున్నాయి. వీటికి సరకులు తెచ్చే లారీలను రోడ్డుకు అడ్డంగా గంటల కొద్దీ నిలిపివేస్తుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, చీమకుర్తి**

దొంగలు దొరికిపోయారు..!

● సీసీ ఫుటేజీ ఆధారంగా కేసుల ఛేదన

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ స్రవంతిరాయ్. పక్కన సీఐ లక్ష్మీనారాయణ తదితరులు

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే: దొంగతనాలు చేసి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు దొంగలను సీసీ కెమెరాల సాయంతో సత్యనారాయణపురం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. విజయవాడ నార్త్ ఏసీపీ స్రవంతిరాయ్ ఆదివారం సత్యనారాయణ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు.

కాలనీలోని పొదల్లో దాచాడు..

ప్రకాశం జిల్లాకు చెందిన రామనబోయిన శ్రీను గత నెల 27న సత్యనారాయణపురం దాసాంజనేయ స్వామి ఆలయంలోని హుండీలో డబ్బులు దొంగిలించాడు. వాటిని విజయవాడ రైల్వేస్టేషన్ సమీపంలోని బొగ్గులైను రైల్వే కాలనీలోని పొదల్లో దాచాడు. కొంత నగదు దాచి, మిగతా నగదు తీసుకొని కర్నూలు బస్సు ఎక్కాడు. వివిధ ప్రాంతాలకు తిరుగుతూ జల్సాలు చేశాడు. డబ్బు ఖర్చు అయిపోవడంతో తిరిగి విజయవాడలోని బొగ్గులైను కాలనీకి వచ్చాడు. సీఐ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో నిఘా పెట్టిన ప్రత్యేక బృందం.. సీసీ ఫుటేజీలను విశ్లేషించింది. వలపన్ని నిందితుడిని పట్టుకుంది. అతడి నుంచి రూ.18వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. సీపీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు వెస్ట్ డీసీపీ జి.రామకృష్ణ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టినట్లు ఏసీపీ వివరించారు.

◗ ఎనికేపాడుకు చెందిన పెనుగోతు మురళి ఈ ఏడాది జూన్ 2వ తేదీ, సెప్టెంబరు 5వ తేదీల్లో గాంధీనగర్‌లో ద్విచక్ర వాహనం, ఆటో దొంగిలించాడు. అప్పటి నుంచి తప్పించుకొని తిరుగుతున్నాడు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. పసుపుతోటలో తిరుగుతుండగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి ఆటో, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ స్రవంతిరాయ్ వెల్లడించారు.

విద్యార్థుల ఆరోగ్య రక్షణకు నెట్‌ల ఏర్పాటు

వసతి గృహంలో కిటికీలకు నెట్‌లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

మద్దులూరు (సంతనూతలపాడు), న్యూస్‌టుడే: విద్యార్థులు రోగాలకు దూరంగా ఉంచేందుకు మద్దులూరు బీసీ వసతి, సంతనూతలపాడు ఎస్సీ వసతి గృహాల్లో ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఎంఈవో వెంకారెడ్డి పర్యవేక్షణలో వసతి గృహంలో దోమలు రాకుండా కిటీలకు నెటలు ఏర్పాటు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. కాచి చల్లార్చిన 30 లీటర్ల నీటిని విద్యార్థులకు సిద్ధం చేశారు. పరిసరాల్లో బ్లీచింగ్ చల్లి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఎంఈవో రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో వార్డెన్‌లు శ్రీనివాసరావు, రవిలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖాజీగా మౌలానా ఆరిఫ్ నియామకం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు రెవెన్యూ డివిజన్ ప్రభుత్వ ఖాజీగా మౌలానా ఆరిఫ్ నియమితులయ్యారు. ఆయన పదేళ్లపాటు విధుల్లో కొనసాగిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేతుల మీదుగా ఆదివారం ఆయన నివాసంలో నియామకపత్రం అందుకున్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే జనార్దన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో తెదేపా మైనార్టీ విభాగం నాయకులు షేక్ కపిల్‌బాషా, పఠాన్ హనీఫ్‌ఖాన్, పఠాన్ నాయబ్, షేక్ మస్తాన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సర్వేయర్ల సంఘం ఒంగోలు డివిజన్ కార్యవర్గం ఎన్నిక

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ ఒంగోలు డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమానికి ఎన్.గురవయ్య ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షునిగా సీహెచ్ కాటంరాజు, ఉపాధ్యక్షురాలుగా వి.సాహితి, కార్యదర్శిగా ఎస్.సుశీల్, జాయింట్ సెక్రటరీగా ఎస్కే సంధాని బాషా, కోశాధికారిగా ముక్తియార్ అహ్మద్, సభ్యులుగా జి.మాధవీదేవి, ఎస్.సుశాంత్, గౌస్‌బాషా, పి.కోటేశ్వరరావు, డి.ముసలయ్య, పి.అరుణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారితో ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రతినిధి పరిశుద్ధరావు, జిల్లా కార్యదర్శి బాబూరావు, నగరపాలక సంస్థ సర్వేయర్ ఆవుల శ్రీను, వి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

హోమియో వైద్యశాలను బాగు చేయండి

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: అమ్మనబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోని హోమియో వైద్యశాల భవనం పూర్తిగా దెబ్బతిని శిథిలావస్థకు చేరుకొంది. ఏళ్లనాటి భవనం కావడంతో గోడలు పూర్తి దెబ్బతిని కొద్దిపాటి వర్షం పడినా నీటి చెమ్మ వస్తోంది. దీంతోపాటు గోడలు పాచి పట్టి అపరిశుభ్రంగా ఉన్నాయి. వర్షాకాలం కావడంతో భవనం పూర్తిగా తడిసి ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన కలుగుతోందని స్థానికులు పేర్కొన్నారు. వర్షం పడినప్పుడు భవనం వరండా మొత్తం ఉరుస్తుంది. భవనం పైభాగంలో పిచ్చి మొక్కలు పెరిగి దెబ్బతింది. వైద్యశాల ఆవరణలో వర్షపు నీరు నిలిచి వచ్చే వారికి రాకపోకలకు ఇబ్బంది తలెత్తుతోంది. ప్రతి శనివారం వైద్యశాలకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి హోమియో వైద్యం కోసం ప్రజలు వస్తుంటారు. వారికి కనీస మౌలిక వసతులు లేకపోవడంతో నానా పాట్లు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి ఎవరైనా వచ్చినా ఇక్కడ ఉండే వీలులేకుండా పోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

డైఫీ జెండావిష్కరణలో పాల్గొన్న సంఘం నాయకులు

అమరుల త్యాగాల బాటలో పయనిద్దాం

ఒంగోలు గ్రామీణం: ఒంగోలు గాంధీనగర్‌లోని భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం ఆవరణలో ఆదివారం రాత్రి డైఫీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డైఫీ జిల్లా కార్యదర్శి కె.ఎఫ్.బాబు మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధులు, యువతకు స్ఫూర్తి ప్రదాతలు భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు వంటి అమరుల త్యాగాల బాటలో పయనిద్దామని పిలుపునిచ్చారు. అధికారంలోకి వస్తే ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోదీ... ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయకపోగా, చిన్న తరహా పరిశ్రమలు మూత పడే విధానాలు తీసుకొచ్చారని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు టి.దాసు, కె.గురవయ్య, టి.సురేష్, హుస్సేన్ పాల్గొన్నారు.

రాళ్లు తేలాయి.. రూపురేఖలు మారాయి

☛ తుపాను ధాటికి పూర్తిగా దెబ్బతిన్న రోడ్లు

మొంథా తుపాను ప్రభావంతో వాగులు, వంకలు పొంగిపొర్లి ఎస్.ఎన్.పాడు డివిజన్లో రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. గుంతల రోడ్లలపై వాహదారులు వెళ్లలేక నానా పాట్లు పడుతున్నారు. అధికారులు వీటి విషయంలో వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, సంతనూతలపాడు

ఎనికపాడు-గుమ్మళంపాడు మధ్య పూర్తిగా దెబ్బతిన్న రహదారి

ఇనకలేరు వాగు పొంగడంతో..

ఎనికపాడు-గుమ్మళంపాడు మధ్యనున్న ఇనకలేరు వాగు పారడంతో వంతెన వద్ద రహదారి పూర్తిగా కోసుకుపోయింది. రహదారి పక్కన నాలుగు అడుగుల గుంత ఏర్పడింది. ఎనికపాడు-ఏలూరివారిపాలెం మధ్య రహదారి కొట్టుకుపోయింది. రైతులు పంట పొలాలకు, ఏలూరివారిపాలెంలకు వెళ్లేందుకు సైతం వీలుకాని పరిస్థితి నెలకొంది. ◗ మద్దులూరు-మాచవరం మధ్య సగం రోడ్డు వరకు దెబ్బతింది. తుపాను ముగిసిన రెండు రోజుల వరకు బాగు చేయలేదు. దీనితో కొండపి-సంతనూతలపాడు మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచాయి. అయిదు రోజులుగా ఆర్టీసీ, ఆటోలు, కార్లు ఇలా ప్రతి వాహనం నిలిచిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు రహదారి పనులను చేపట్టారు. జేసీబీ సహాయంతో పనులను చేస్తున్నారు. దెబ్బతిన్న ప్రాంతంలో పైపులు ఏర్పాటు చేసి వాహన దారులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. ఆదివారం పనులను తెదేపా నాయకులు నువ్వుల మీరయ్య, ధర్మవరపు శ్రీనివాసరావు, పలువురు నాయకులు, పరిశీలించారు.

◗ సంతనూతలపాడు వద్ద చెరువు అలుగు పారడంతో కర్నూల్ రోడ్డుపై నీరు పారింది. దీంతో వంతెన వద్ద రెండు వైపులా కోసుకు పోయింది. పోలీసులు గ్రానైట్ కంకరను పోసి ప్రమాదాలు జరగకుండా బోర్డులు ఏర్పాటు చేశారు.

ఏలూరివారిపాలెం మధ్య ఇలా..

పంట నష్టం అంచనా

ఇలపావులూరులో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

చీమకుర్తి, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో చీమకుర్తి మండలంలో కురిసిన భారీ వర్షాల కారణంగా పలు పంటలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. మండలంలో ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంట నష్టాలపై వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమిక అంచనాలను ప్రభుత్వానికి పంపారు. మండలంలోని పాటిమీదపాలెం, దేవరపాలెం, ఊబచెత్తపాలెం, తదితర గ్రామాల్లో కంకి దశలో నున్న వరి పంట సుమారు 100 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. వివిధ గ్రామాల్లో మొక్కజొన్న పంట సుమారు 300 ఎకరాల్లోను, సజ్జ 40 ఎకరాల్లోను, కూరగాయల పంటలకు 50 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాలను తయారు చేసి ప్రభుత్వానికి పంపారు.

(c) eenadu

ఈనాడు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం నవంబరు 3, 2025

హుషార్..

గ్యాలరీలో వీక్షకుల సందడి



సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: సీఎంఎస్-03 ఉపగ్రహంతో షార్‌లో సందడి నెలకొంది. రాకెట్ ప్రయోగానికి ముందే శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం నుంచే పోలీసులు పెద్దఎత్తున మోహరించారు. పోలీసు, సీఐఎస్ఎఫ్ దళాలతో ప్రధాన గేటు వద్ద రెండంచెల భద్రత ఏర్పాటు చేశారు. వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేసి పాసులు ఉన్నవారినే లోపలకు పంపించారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు అడుగడుగునా పోలీసులు కనిపించారు.

గ్యాలరీలు కిటకిట.. ప్రయోగాన్ని వీక్షించేందుకు పలుప్రాంతాల నుంచి సందర్శకులు భారీగా తరలి వచ్చారు. విద్యార్థులు, ప్రజలతో గ్యాలరీలు కిటకిటలాడాయి. రాకెట్ ప్రయోగాన్ని ఆద్యంతం ఆసక్తిగా తిలకించారు. చరవాణుల్లో చిత్రీకరించేందుకు పోటీ పడ్డారు.

కలలు కల్లలై.. మూడు కుటుంబాల్లో విషాదం

కన్నీరు అలలై

సముద్రంలో మునిగి ముగ్గురు స్నేహితుల మృతి

తాజీమ్, సమీద్, హుమాయూన్ (పాతచిత్రాలు)

న్యూస్‌టుడే, నెల్లూరు (నేర విభాగం), ఇందుకూరుపేట

చిన్నప్పుడే చిగురించిన ఆ ముగ్గురి స్నేహం.. వీడలేమంటూ.. వీడిపోమంటూ అనేలా సాగుతోంది. ఎక్కడికైనా కలిసే వెళ్తుంటారు.. ఏడో తరగతిలో ప్రారంభమైన వారి స్నేహం పదో తరగతి వరకు సాగింది. ఇంటర్మీడియట్‌లో ఇద్దరు ఒకే కళాశాలలో, ఇంకొకరు మరో కాలేజీలో చేరినా రోజూ ఎక్కడో ఒకచోట కలిసేవారు.. విధి ఆడిన వింత నాటకంలో ముగ్గురు ఒకేసారి మృతి చెందారు. ఆదివారం మైపాడు బీచ్‌లో వారు సముద్రంలో మునిగి మృతి చెందడం మూడు కుటుంబాల్లో విషాదం నింపింది.

ఒక్కో కుటుంబానిది ఒక్కో గాథ

నగరంలోని కోటమిట్టకు చెందిన సమీద్(18), హుమాయూన్(18), తాజీమ్(18) స్నేహితులు. తాజీమ్ కుటుంబం కొన్ని నెలల క్రితం నారాయణ రెడ్డిపేటకు వెళ్లింది. వీరు కోటమిట్టలో పదో తరగతి వరకు చదువుకున్నారు. సమీద్ ఓ ప్రైవేటు కళాశాలలో, హుమాయూన్, తాజీమ్ మరో ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతున్నారు. ఆదివారం కావడంతో ముగ్గురు స్నేహితులు మైపాడు బీచ్‌కు వెళ్లారు. అక్కడ సరదాగా గడుపుతూ ప్రమాదవశాత్తు సముద్రంలో మునిగి మృతి చెందారు. మధ్యాహ్నం అవుతున్నా.. పిల్లలు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వారికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. పోలీసులు ఫోను చేసి ముగ్గురు మైపాడ్ బీచ్‌లో మృతి చెందారని చెప్పడంతో కుటుంబ సభ్యులు కుప్పకూలిపోయారు. హుటాహుటిన బీచ్ దగ్గరకు, జిల్లా ప్రభుత్వాస్పత్రి వద్దకు వెళ్లి విగత జీవులుగా పడి ఉన్న పిల్లలను చూసి కన్నీరు మున్నీరయ్యారు.

తండ్రి చిన్నప్పుడే చనిపోగా..

సమీద్ తండ్రి చిన్నప్పుడే మృతి చెందడంతో తాత రసూల్ సాహెబ్, తల్లి జబీన కష్టపడి చదివిస్తున్నారు. ఉన్నత చదువులు చదివిస్తే తమను ఆదుకుంటాడనే ఆశతో ఉండగా.. ఇంతలో ఘోరం జరగడంతో వారు కోలుకోలేకపోతున్నారు. సమీద్‌కి పదో తరగతి చదువుతున్న తమ్ముడు ఉన్నాడు.

రెక్కలు ముక్కలు చేసుకుని..

బంగారం పని చేస్తున్న నాయబ్ రసూల్, మున్ని దంపతుల పెద్ద కుమారుడు హుమాయూన్. తండ్రి రెక్కలు ముక్కలు చేసి కుమారుడిని చదివిస్తున్నారు. కొలువు సాధించి కష్టాలు తీరుస్తాడనుకుంటే కలలు కల్లలయ్యాయంటూ విలపించడం అందరినీ కంటతడి పెట్టించింది. ఇతనికి పదో తరగతి చదివే చెల్లెలు ఉంది. ● తాజీమ్ తండ్రి రహమత్ కూడా బంగారం పనిచేస్తుంటారు. ప్రస్తుతం వీరు నారాయణ రెడ్డిపేటలో నివాసం ఉంటున్నారు.

అతివకు అభయం.. సఖి

వన్‌స్టాప్ సెంటర్లతో సేవలు

న్యూస్‌టుడే, నెల్లూరు (వేదాయపాళెం)

తల్లిదండ్రులు మందలించారని కొందరు.. ఇంటి నుంచి వచ్చేస్తున్నారు. కొన్ని పరిస్థితుల కారణంగా మహిళలు బయటకు వస్తున్నారు. తప్పిపోయిన, మతిస్థిమితం లేని, అపహరణకు గురైన వారు అసాంఘిక శక్తుల బారిన పడకుండా అండగా సఖి వన్‌స్టాప్ సెంటరు నిలుస్తోంది. నగరంలోని జిల్లా ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం.. ఎంతో మంది బాధితులకు అండగా నిలుస్తోంది. తాజాగా లైంగిక వేధింపులపై ప్రత్యేక దృష్టి పెట్టింది. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే కేంద్రంలో 13 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.

2022 నుంచి 2025 వరకు పరిష్కరించిన కేసులు

గృహహింస	468
అత్యాచారం	61
లైంగిక వేధింపులు	55
మహిళల అక్రమ రవాణా	14
పిల్లలపై లైంగిక వేధింపులు	6
బాల్య వివాహాలు	25
తప్పిపోయిన వారు	186
కట్న వేధింపులు	6
ఇతర కేసులు	557

సేవలు ఇలా..

ఇక్కడ బాధితులకు వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం, పోలీసు రక్షణ, ప్రోత్సాహకం, వైద్యం, న్యాయ సహాయం, ఎఫ్ఐఆర్ నమోదుకు సహకారం, ఆహారం, కౌన్సెలింగ్ చికిత్స, తాత్కాలిక వసతి, పునరావాసం, పిల్లల స్నేహ పూర్వక కోర్టు, అత్యవసర స్పందన వంటి సేవలు అందుబాటులో ఉన్నాయి. కేంద్రం ముఖ్యంగా అయిదు సూత్రాలపై పనిచేస్తోంది.

● కౌన్సెలింగ్: వరకట్న వేధింపులకు గురైన బాధితులకు, భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చిన వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం ప్రత్యేకత.

● పోలీస్ డెస్క్: పోలీసు శాఖాపరమైన సాయం చేయడం, బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేయించేలా చేస్తారు.

● లీగల్ ఎయిడ్: న్యాయపరమైన సలహాలు ఇప్పిస్తారు. అవసరమైతే న్యాయవాదులతో మాట్లాడి కేసులు నమోదు చేయిస్తారు.

● మెడికల్ ఎయిడ్: అత్యాచార యత్నానికి, అత్యాచారానికి గురైన బాధితులకు వెంటనే వైద్యం అందిస్తారు.

● షెల్టరు: అవసరమైన బాలికలు, మహిళలకు అయిదు రోజులు వసతి కల్పిస్తారు. అంతకంటే ఎక్కువ రోజులు వసతి కావాలంటే సర్వీస్ హోంకు పంపుతారు.

టోల్ ఫ్రీ నంబరు – 181
చైల్డ్ హెల్ప్‌లైన్ – 1098
అత్యవసరం – 100,112
సఖి సెంటరు – 0861 2372990

కార్యాలయాల్లో ప్రత్యేక కమిటీలు

మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేస్తున్నాం. ఉపాధి ప్రదేశాలైన కార్యాలయాలు, ప్రైవేటు కంపెనీల్లో కమిటీలు ఏర్పాటు చేయాలని సూచిస్తున్నాం. స్వయంగా పరిశీలన చేసి అక్కడ పనిచేస్తున్న మహిళా సిబ్బందితో మాట్లాడుతున్నాం. – హేనాసుజన్, పీడీ, ఐసీడీఎస్

అభాగ్యులకు అండగా

కుటుంబం, సమాజం, పని స్థలాల్లో ప్రైవేటు, పబ్లిక్ ప్రదేశాల్లో హింసకు గురైన మహిళలు, బాలికలకు అండగా నిలుస్తున్నాం. మానసిక, సామాజిక సహాయం, కౌన్సెలింగ్, చట్టపరమైన సలహాలు, తాత్కాలిక ఆశ్రయం, ఆహారం వంటివి కల్పిస్తాం. ఆ తర్వాత కుటుంబ సభ్యుల వద్దకు లేదా వసతి గృహాలకు పంపిస్తాం. – షహనాజ్, అడ్మిన్, సఖి వన్‌స్టాప్ సెంటరు

నేడు డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి, నెల్లూరు (విద్యుత్), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన వినియోగదారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వినియోగదారులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చరవాణి నంబరు: 89777 16661కు ఫోన్ చేసి సమస్య తెలియజేయవచ్చన్నారు. చరవాణి నంబరు: 91333 31912కు చాట్ ద్వారా కూడా సమస్య తెలపవచ్చని ఆయన పేర్కొన్నారు.

విహంగ వీక్షణం.. ఆనంద క్షణం



సంగం వద్ద పెన్నానదికి అడ్డంగా నిర్మించిన బ్యారేజి నుంచి వరద దిగువకు భారీగా వెళుతోంది. విహంగవీక్షణలో నీటిమధ్యలో ఉన్న వంతెన సముద్రంలో నిర్మించిన సేతువులా కనువిందు చేస్తోంది. ఆనకట్ట, బ్యారేజి మధ్య జల సోయగం ఆకట్టుకోవడంతో తిలకించేందుకు సందర్శకులు భారీగా తరలి వస్తున్నారు.

– న్యూస్‌టుడే, సంగం

పుష్కరకాల సమస్యకు

పరిష్కారం

నిషేధిత జాబితా నుంచి తొలగించిన ఎన్‌జీవో కాలనీ

నిషేధిత జాబితా నుంచి తొలగింపుతో ఊరట

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఏళ్లుగా నిషేధిత జాబితాలో ఉన్న జనార్దన స్వామి మాన్యం భూములకు కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు పరిష్కారం చూపింది. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమస్యను దేవాదాయ, మున్సిపల్ శాఖల మంత్రులతో పాటు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సుమారు 201 ఎకరాలకు మోక్షం కలిగించారు. 330 ఎకరాల్లో టీఆర్ఆర్ కళాశాల, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు భూములు మినహా మిగిలిన వాటిని ఎన్‌వోసీ వచ్చింది. ● పట్టణంలోని ఉప్పుచెరువు, జనార్దనకాలనీ ప్రాంతాల్లో జనార్దనస్వామి ఆలయానికి సంబంధించిన సర్వేనంబర్ 297లో సుమారు 620 ఎకరాల భూములున్నాయి. వీటిలో దాదాపు 330 ఎకరాలు వివిధ అవసరాల కోసం వినియోగించారు. అందులో 50 ఎకరాలు టీఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలకు, పట్టణానికి తాగునీటి అవసరాల కోసం మరో 156.40 ఎకరాలను ప్రభుత్వం కొనుగోలు చేసింది. అందులో 60 ఎకరాల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం చేపట్టగా, మిగిలిన భూములను మున్సిపాలిటీకి అప్పగించారు. ఇంకా ఉన్న భూముల్లో టిడ్కో నివాసాలు, వరాలసాయినగర్, జగనన్న కాలనీ, ఎంఐజీ లేఅవుట్ ఏర్పాటుచేశారు. ఉప్పుచెరువు ప్రాంతంలో 33.46 ఎకరాలు, జనార్దనకాలనీలో 56 ఎకరాలు ప్రభుత్వం కొనుగోలు చేసి వాటిల్లో పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. మరోవైపు నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం (ఎన్‌జీవో) తరఫున 15 ఎకరాలు కొనుగోలు చేసి లేఅవుట్ ఏర్పాటుచేశారు. వీటిల్లో సుమారు 350 మంది స్థలాలు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు.

2013 నుంచి సమస్య

ఆర్ఎస్ఆర్ ప్రకారం ఆ భూములన్నీ దేవాదాయ శాఖకు చెందినవిగా ఉండటంతో.. 2013లో నిషేధిత జాబితాలో చేర్చారు. రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి ఎన్‌జీవో కాలనీలో క్రయవిక్రయాలు జరగలేదు. వైకాపా ప్రభుత్వంలో నిషేధిత జాబితా నుంచి తొలగించకుండానే 26 ఎకరాల్లో ఎంఐజీ లేఅవుట్ ఏర్పాటుచేశారు. టిడ్కో ఇళ్లకూ రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సమస్యపై దృష్టిసారించింది. నిషేధిత జాబితా నుంచి తొలగిస్తున్నట్లు 10 రోజుల క్రితం దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ కలెక్టర్‌కు లేఖ(ఎన్‌వోసీ) పంపారు.

గుత్తేదారులతో కలివిడి

పర్యవేక్షణ కొరవడి..

అభివృద్ధి పనుల్లో డొల్లతనం

ప్రభుత్వ చర్యలతో అధికారుల్లో గుబులు

రాళ్లు తేలిన మాగుంట లేఅవుట్‌లోని సిమెంటు రోడ్డు

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు దుర్వినియోగమవుతున్నాయి. పనులు పర్యవేక్షించాల్సిన నెల్లూరు నగరపాలకసంస్థ ఇంజినీరింగ్ విభాగం అధికారులు గుత్తేదారులతో కుమ్మక్కవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్) పథకం కింద చేపట్టిన పనులు నాసిరకంగా జరగడంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని విచారణ చేపట్టింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈఈ ఎ.శేషగిరిరావు, డీఈఈ ఎ.శ్రీనివాసరావు, అప్పటి ఏఈలు ఎస్కే ఖాదర్‌మస్తాన్, షేక్ ఫాజిల్‌ను విచారించేందుకు అధికారిగా ఏపీ టిడ్కో చీఫ్ ఇంజినీరు కేవీఎస్ రామమూర్తి నియమించడం సంచలనంగా మారింది. నాసిరకంగా చేపట్టిన పనుల దస్త్రాలను విచారణాధికారి తెప్పించుకుని పరిశీలిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. పనుల్లో అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయితే సంబంధిత అధికారులపై వేటు పడే అవకాశం ఉంది.

విభజించి.. అప్పగించి..

నెల్లూరు నగరంలో 2019లో ఎస్‌డీఎఫ్ నిధులతో సిమెంటు రోడ్లు, కాలువలు, కల్వర్టులు చేపట్టారు. పనులన్నీ అప్పటి ప్రజా ప్రతినిధుల అనుచరులకు రూ.5లక్షల వంతున విభజించి నామినేషన్ పద్ధతిలో కేటాయించారు. దాదాపు రూ.50 కోట్లతో పనులు చేపట్టినట్లు సమాచారం. వీటితో పాటు ఏటా రూ.100 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరిగాయి. కాలువలు, రహదారుల నిర్మాణాలు చేపట్టే సమయంలో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. పనులు జరిగే సమయంలో పర్యవేక్షణ లేక గుత్తేదారులు ఇష్టారాజ్యంగా చేపట్టారు. ప్రభుత్వం పనుల నాణ్యతను పరిశీలించగా డొల్లతనం బయటపడింది. నిర్మాణంలో వినియోగించిన మిశ్రమంలో ఇసుక, కంకర, సిమెంటు తగిన పాళ్లలో కలపకపోవడంతో నిర్మించిన నెలల వ్యవధిలోనే కంకర బయటపడింది. దీంతో ప్రభుత్వం పనులను పర్యవేక్షించిన అధికారులపై విచారణకు ఆదేశించింది.

ప్రత్యేకాధికారి నియామకం

నగరంలో 2019లో ఎస్‌డీఎఫ్ నిధులతో పనులు చేపట్టారు. వాటిపై విజిలెన్స్ అధికారులు విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ప్రభుత్వం ప్రత్యేకాధికారిని నియమించింది. ఆయన విచారణ చేపట్టి మూడు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు.

– రామమోహనరావు, ఎస్ఈ

పేరులో ప్రత్యేకత..

వ్యాపార ఘనత

బ్రిటీషు పాలకులు దేశ సంపదను దోచుకున్నా.. అప్పటి అధికారుల్లో కొందరు ప్రజోపకర పనులు చేసి ఆదరణ చూరగొన్నారు. 1835 సంవత్సరంలో బ్రిటీష్ పాలనలో తూర్పు నెల్లూరుగా పిలిచే స్టోన్‌హౌస్‌పేట ప్రాంతానికి 'టీవీ స్టోన్‌హౌస్' కలెక్టర్‌గా నియమితులయ్యారు. అప్పట్లో ప్రస్తుత స్టోన్‌హౌస్‌పేట వ్యాపారానికి కేంద్ర బిందువుగా ఉండేది. దూర ప్రాంతాలు వారు వ్యాపారం నిమిత్తం వచ్చి.. రోజుల తరబడి ఉండిపోయేవారు. నెల్లూరు, చుట్టుపక్కల ప్రాంతాల్లో దొంగల భయం ఎక్కువగా ఉండడంతో వ్యాపారులు, ప్రజలు భయభ్రాంతులకు గురయ్యేవారు. వారికి రక్షణగా కలెక్టర్ టీవీ స్టోన్‌హౌస్.. రాత్రివేళ ప్రత్యేకంగా రక్షకభటులను నియమించడం, వీధుల్లో నూనె దీపాల ఏర్పాట్లు వంటి చర్యలు తీసుకున్నారు. అలాగే ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తూ.. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉత్తమ అధికారిగా పేరు తెచ్చుకున్నారు. అందుకు గుర్తుగా ఈ ప్రాంతానికి ఆయన పేరు పెట్టారు.

రోజూ రూ.15 కోట్ల వ్యాపారం.. ఇక్కడ అన్ని రకాల వస్తువులు విక్రయించే దుకాణాలు, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు ఉన్నాయి. వస్తువుల ఎగుమతులు, దిగుమతులు జరుగుతూ నిత్యం రద్దీగా ఉంటోంది. రోజువారీ రూ.15 కోట్లకు పైగా వ్యాపార లావాదేవీలు జరుగుతుంటాయని వ్యాపారులు చెబుతున్నారు.

–న్యూస్‌టుడే, నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)

లాభసాటి సేద్యం చేద్దాం రారండోయ్

వ్యవసాయ పరిశోధన కళాశాల విద్యార్థినుల పిలుపు

న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్), పొదలకూరు

నేటి యువత సాఫ్ట్‌వేర్.. వైద్య.. ఉద్యోగాల వైపు ఆకర్షితులవుతున్నారు. లేకుంటే వ్యాపారాలు చేస్తున్నారు. పొదలకూరు పాలిటెక్నిక్ వ్యవసాయ పరిశోధన కళాశాల విద్యార్థినులు మాత్రం సేద్యం చేద్దాం రండంటూ పిలుపునిస్తున్నారు. కళాశాలలో మొదటి, రెండో సంవత్సరం 30 మంది వంతున విద్యార్థినులు వ్యవసాయంపై విద్యను అభ్యసిస్తున్నారు. చదువుతో పాటు 25 ఎకరాల పొలంలో విద్యార్థుల చేత ప్రయోగాలు చేయిస్తారు. భూమిని దున్నడం, విత్తనాలు విత్తడం, కలుపు తీయడం, రసాయన ఎరువులు లేకుండా పంటలు పండించడం.. అధిక దిగుబడిని ఇచ్చే విత్తనాలు తయారు చేయడం వంటి పలు పరిశోధనల్లో భాగస్వాములను చేస్తున్నారు.

మినుములో ఆధునిక వ్యవసాయ పద్ధతులు నేర్చుకుంటున్న విద్యార్థినులు

గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి..

కళాశాలలో చదివే విద్యార్థినులు ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారే.. 80 శాతం మందికి పొలాలు ఉన్నాయి. తండ్రులు వ్యవసాయం చేసి నష్టపోతున్నారని, శాస్త్రీయంగా చేయడం లేదని, పంట మార్పిడి, యాంత్రీకరణ లేదని చెబుతున్నారు. విత్తనాలు ఎంపికలోనే లోపాలున్నాయని, పంటలు పండించినా అమ్ముకునే ఆన్‌లైన్ విధానం తెలియడం లేదని.. ఇందులో మార్పులు చేస్తే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకన్నా వ్యవసాయమే లాభసాటని విద్యార్థినులు చెబుతున్నారు. వ్యవసాయాన్ని వారసత్వంగా అందిపుచ్చుకునేందుకు ఈ కోర్సుల్లో చేరామని పేర్కొంటున్నారు. పెసర, మినుము, వేరుసెనగ సాగు వల్ల ఖర్చు తక్కువ, లాభాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. వ్యవసాయంలో తల్లిదండ్రులకు సహకరించడంతో పాటు శాస్త్రవేత్తలుగా తయారవుతామంటున్నారు.

మా నాన్న పాత పద్ధతిలోనే వ్యవసాయం చేస్తున్నారు. కళాశాలలో నేర్చుకున్న నూతన పద్ధతులను ఆయనకు చెప్పి మార్పు తీసుకొస్తా... అంటున్నారు.. జిల్లాకు చెందిన వైష్ణవి.

● మాకు ఎనిమిది ఎకరాల పొలం ఉంది. పాత విధానంతోనే వ్యవసాయం చేస్తున్నారు. నేను నేర్చుకున్న వ్యవసాయ పద్ధతులను మా కుటుంబం, బంధువులతో పాటు గ్రామంలోని రైతులకు అవగాహన కల్పిస్తానంటున్నారు.. ప్రకాశం జిల్లా జమ్మలమడకకు చెందిన కృష్ణవేణి.

రబీకి ఎరువులు, విత్తనాలు సిద్ధం

'న్యూస్‌టుడే'తో వ్యవసాయశాఖ జేడీ సత్యవాణి

ముఖాముఖి

న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతి సెంటర్)

రబీలో రైతులు విత్తనాలు, ఎరువులకు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయశాఖ జిల్లా అధికారిణి సత్యవాణి పేర్కొన్నారు. అన్నదాతలు సాగుకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో వ్యవసాయశాఖ తీసుకుంటున్న చర్యలను జేడీ 'న్యూస్‌టుడే'కి వివరించారు. సోమశిల, కండలేరు జలాశయాల్లో నీరు సమృద్ధిగా ఉండటంతో రైతులు 4.50 లక్షల ఎకరాల్లో వరి సాగుకు సిద్ధమవుతున్నారు. 1.12 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం చేశాం. అవసరమైన నాణ్యమైన విత్తనాలు రైతుసేవా కేంద్రాలు, ఏపీసీడ్స్, ప్రైవేటు వ్యాపారుల వద్ద నిల్వలు ఉంచాం. గతంలో జిల్లాలో బీపీటీ 5204 రకం సాగు అధికంగా చేసేవారు. మంచి దిగుబడులు వస్తుండంతో మూడు సంవత్సరాల నుంచి తెలంగాణ రకాలైన కేఎన్ఎం1638, ఆర్ఎన్ఆర్15048 రకాలు ఎక్కువ సాగు చేస్తున్నారు. జిల్లా అంతటా 14 వరి విత్తన ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడి నుంచి రైతులకు నాణ్యమైన విత్తనం అందించేందుకు ముందుగానే విత్తన పరీక్షలు చేయించాం.

రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతాం..

రైతులకు ఎరువుల సమస్య తలెత్తకుండా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతాం. వరి పండించే వారికి ఎకరానికి మూడు బస్తాలు, మినుము, ఉద్యాన పంటలు సాగుచేసే వారికి బస్తా యూరియా ఇస్తాం. కాంప్లెక్స్ ఎరువులకు నిబంధనలు లేవు. ఎరువుల వినియోగం తగ్గించేందుకు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

రైతులు ఎరువుల వినియోగం తగ్గించి పచ్చిరొట్ట విత్తనాలపై దృష్టి పెట్టాలి. అందుకు ప్రభుత్వం జీలుగ, జనుము విత్తనాలు 8,500 క్వింటాళ్లు అందుబాటులో ఉంచింది. రైతుకు ఐదు ఎకరాల వరకు 50 శాతం రాయితీతో విత్తనాలు ఇస్తాం. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అందుకు తగ్గట్టు జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు చేపడుతున్నాం' అని ఆమె తెలిపారు.

రేవు ఇసుక.. ఎవరికెరుక!

నిల్వ ఉన్న ఇసుకను ట్రాక్టర్లకు నింపుతున్న పొక్లెయిన్లు

కందుకూరు, గుడ్లూరు, న్యూస్‌టుడే: ఆదివారం.. అందులోనూ అధికారులు అందుబాటులో ఉండరని తెలుసు. ఇదే సమయమనుకొని ఇసుకాసురులు ప్రభుత్వ ఇసుక రేవు నుంచి తెచ్చి నిల్వ ఉంచిన ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు.. ఆ ప్రాంతమంతా ట్రాక్టర్ల సంతలా మారింది. వివరాల్లోకి వెళితే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఉచితంగా ఇసుకను అందించేందుకు గుడ్లూరు మండలం రాళ్లపాడు సమీపంలో ఇసుక రేవును ఏర్పాటు చేసింది. ఆ సమయంలో వందలాది ట్రాక్టర్ల ద్వారా గుండ్లపాలెం అడ్డరోడ్డు సమీపంలోని పొలాల్లో ఇసుక నిల్వ ఉంచారు. కొన్ని రోజులు సజావుగా జరిగిన తర్వాత నిర్వాహకులు నిల్వ ఉంచిన ఇసుకను వదిలి వెళ్లిపోయారు. ఏడాది తర్వాత ఆదివారం పొక్లెయిన్ల సాయంతో పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. ఎందుకు, ఎవరు తరలిస్తున్నారో తెలియడం లేదంటూ స్థానికులు తెలిపారు. ఇక్కడి నుంచి తీసుకెళ్లి గుడ్లూరులో ట్రాక్టరు ఇసుక రూ.1000, కావలిలో రూ.3వేల నుంచి రూ.4వేలకు అమ్ముతున్నారు. ఇంత జరుగుతున్నా.. అధికారులు అటువైపు రాకపోవడం గమనార్హం.

విచారించి చర్యలు తీసుకుంటాం

నిల్వ ఉంచిన ఇసుకను ఎవరు తరలిస్తున్నారో విచారిస్తాం. గనుల శాఖ అధికారులకు తెలిపి.. అక్రమమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాసులరెడ్డి, తహసీల్దారు, గుడ్లూరు

(c) eenadu

కండలేరు దారి.. గండాల మారి

కండలేరు జలాశయం కట్ట కింద సుమారు 11 కిలోమీటర్ల దూరం గల తారు రోడ్డు దారుణంగా దెబ్బ తింది. ఈ మార్గంలో రోజూ స్కూల్ బస్సులు, ఎత్తిపోతల పథకం, లో లెవల్, హైలెవల్ స్లూయిసులు ఉన్నాయి. తెలుగు గంగ అధికారులతో పాటు పులికల్లు, వావింట పర్తి, అంకుపల్లి, పర్వతాపురం, వెంకటాపురం గ్రామాల్లోని పొలాలకు వెళ్లాలంటే అన్నదాతలు నరకయాతన పడుతున్నారు. వర్షం పడితే అవస్థలు తప్పడం లేదని ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు వేయాలని పలువురు విన్నవిస్తున్నారు. - న్యూస్‌టుడే, పొదలకూరు

ఆహ్లాదం.. అదెక్కడ

పొదలకూరు మేజర్ పంచాయతీలో శ్రీనివాస లేఅవుట్‌లో నిర్మించిన పార్కు అడవిని తలపిస్తోంది. గతంలో ఆదివారం, సెలవు రోజుల్లో ప్రజలతో ఆహ్లాదకరంగా ఉండేది. గత వైకాపా పాలనలో కనీస వసతులు కల్పించకపోవడంతో మూలన పడింది. లేఅవుట్ల నుంచి నుడా, పన్నుల ద్వారా పంచాయతీకి కోట్ల రూపాయలు సమకూరుతున్నా పొదలకూరులో ఒక్క పార్కుకు దిక్కులేదని పలువురు వాపోతున్నారు. ప్రస్తుతం ప్రాంగణమంతా ముళ్ల చెట్లతో అధ్వానంగా మారింది. అధికారులు స్పందించి మెరుగైన వసతులు కల్పించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

మందుబాబులకు అడ్డా..!

కోవూరు బజారు కూడలి నిత్యం రాకపోకలతో రద్దీగా ఉంటుంది. అక్కడ ఉన్న బస్‌షెల్టర్‌ కొన్నేళ్లుగా ప్రయాణికులు వెళ్లాలంటే భయపడుతున్నారు. సమీపంలో మద్యం దుకాణం ఉండటంతో మందుబాబులకు అడ్డాగా మారింది. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, చిన్నారులు నెల్లూరుకు వెళ్లాలంటే వానలో తడుస్తూ రోడ్డుపై నిరీక్షిస్తున్నారు. గత వైకాపా పాలనలో పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వంలోనైనా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్పందించి ఏసీ బస్‌షెల్టర్‌గా మార్చి ప్రయాణికులకు కూర్చునేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోవూరు

బీరాపేరు.. ముంచెత్తిన నీరు

బీరాపేరులో వరద కొనసాగుతుండటం, పెన్నానది ప్రవాహం ఉద్ధృతంగా ఉండటంతో మండలంలో సంగం, పెరమన, కోరిమెర్ల, నీలాయపాళెం గ్రామాల్లో నారుమడులకు నష్టం వాటిల్లింది. వర్షాలు ఆగినా వరద ప్రవాహం ఆగక పొలాలు ముంపుకు గురయ్యాయి. పదిరోజులకుపైగా నీటిలో మునగడంతో నారుమడులు పూర్తిగా పాడవుతాయని, తిరిగి సిద్ధం చేసుకోవాల్సిందేనని సాగుదారులు చెబుతున్నారు. వ్యవసాయ శాఖ వరి విత్తనాలు అందించాలని వేడుకుంటున్నారు. -న్యూస్‌టుడే, సంగం

నేటి నుంచే వీపీఆర్ నేత్ర

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీపీఆర్ నేత్ర కార్యక్రమం సోమవారం ప్రారంభమవుతుంది. నేత్ర సమస్యలతో బాధపడుతున్న వారి కోసం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తమ వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. వరికుంటపాడు మండలంలోని రామాపురంలో తొలిగా ప్రారంభిస్తున్నారు. వైద్య పరికరాలతో ప్రత్యేక బస్సును తయారు చేయించారు. కంటి పరీక్షల నుంచి కళ్లజోళ్ల వరకు బస్సులోనే వాటిని తయారు చేయించి ఉచితంగా ఇస్తారు. దీన్ని దశల వారీగా నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో నిర్వహిస్తారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: నెల్లూరు కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీల స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, వికలాంగులకు ప్రత్యేక సౌకర్యాలు, అర్జీల పర్యవేక్షణ తదితర ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

శిథిల భవనాలు.. సురక్షితమేనా!

వెంకన్నపాలెంలో శిథిలావస్థలో తుపాను రక్షిత భవనం

తుపాను వస్తుందంటే హడావుడి చేసి విస్మరిస్తున్న అధికారులు

న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు, కోవూరు

తుపాను వచ్చిందంటే తీర ప్రాంత ప్రజలు హడలిపోతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు చెంతనే రక్షిత భవనం ఉందన్న భరోసా లేకుండా పోయింది.. విపత్తుల సమయంలో ఉపయోగపడే తుపాను రక్షిత భవనాలు నిర్వహణ లేక దెబ్బతిన్నాయి. .. కొన్ని మరమ్మతులు చేయక శిథిలావస్థకు చేరగా... మరికొన్ని కూల్చేసినా కొన్నేళ్లుగా కొత్తవి నిర్మించలేదు.

జిల్లా పరిధిలో వివరాలు..	
తీర ప్రాంత మండలాలు	10
గ్రామాలు	97
జనాభా	83,257
తుపాను రక్షిత భవనాలు	80
కనీస వసతుల్లేనివి	50

జిల్లాలో తోటపల్లిగూడూరు, మనుబోలు, ముత్తుకూరు, ఇందుకూరుపేట, విడవలూరు, బోగోలు, అల్లూరు, కావలి, ఉలవపాడు, గుడ్లూరు మండలాలు తీర ప్రాంతంలో ఉండటంతో ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ఎక్కువ మందికి పక్కాగృహాలు లేవు. విపత్తుల సమయంలో వీచే గాలులకు రేకులు, పూరి గుడిసెల పైకప్పులు ధ్వంసమవుతుండటంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వలలు, బోట్లకు రక్షణ కష్టమవుతోంది. ప్రాణనష్టం నివారించేందుకు ప్రభుత్వం తుపాను రక్షిత భవనాలు నిర్మించగా, నిర్వహణ లేక మూలనపడ్డాయి. తుపాను హెచ్చరికల సమయంలో అధికారులు హడావుడి చేస్తున్నారే తప్ప తరువాత వాటి గురించి పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. కనీసం విద్యుత్తు సౌకర్యం లేక విపత్తుల సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాల నుంచి వీరిని తీసుకొచ్చేందుకు అధికారులు ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రత్యామ్నాయ చర్యలేవీ.. టి.పి.గూడూరు మండలం వెంకన్నపాలెం పట్టపుపాలెం వద్ద తుపాను షెల్టరు అధ్వానంగా ఉంది. నడింపాళెం, కాటేపల్లి తదితర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. జిల్లాలోని పది మండలాల పరిధిలో శిథిలావస్థలో ఉన్నవి తొలగించి.. కొత్తవి నిర్మించాలని పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదించినా ఎలాంటి పురోగతి లేదు.

తహసీల్దారు సుధీర్ మాట్లాడుతూ... తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రక్షిత భవనాలు పరిశీలించి వసతులు కల్పించాల్సిందిగా స్థానిక అధికారులకు సూచించామన్నారు. అందుబాటులో ఉన్న పాఠశాలలు, వసతి గృహాల్లో వసతి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

పంటల నష్టం సేకరణ

33 శాతానికి మించిన వాటిపై గణన

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: మొంథా తుపాను కారణంగా 33 శాతం కంటే ఎక్కువ నష్టం జరిగిన పంటల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. జిల్లాలో ఎడగారు సీజన్‌లో 79,333 హెక్టార్లలో వరి సాగు జరుగ్గా.. వేరుసెనగ, కందులు, మినుము తదితర పంటలు 83,652 హెక్టార్లలో ఉన్నాయి. 90 శాతానికి పైగా వరి కోతలు పూర్తయ్యాయి. మిగిలినవి కోత దశలో ఉంది. అనంతసాగరం, ఆత్మకూరు, కలువాయి తదితర 17 మండలాల పరిధిలో వరికి ఎక్కువగా నష్టం జరిగింది. అన్ని పంటలు కలిపి 1320.73 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనాలను అధికారులు తయారు చేశారు. 13 మండలాల పరిధిలో బొప్పాయి, పచ్చిమిర్చి, వివిధ కూరగాయలు తదితరాలు 41.10 హెక్టార్లలో నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాలను తయారు చేశారు. ఇప్పటివరకు జిల్లాలో 17 మండలాల్లో 959 మంది రైతులకు సంబంధించిన వరి, వేరుసెనగ, మొక్కజొన్న తదితర పంటలు 596.85 హెక్టార్లలో 33 శాతం కంటే ఎక్కువ నష్టం జరిగినట్లు యాప్‌లో, రైతు సేవా కేంద్రం ఇన్‌ఛార్జుల ద్వారా నమోదు చేశారు. ఈ వివరాలను సామాజిక తనిఖీకి ఆయా రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శనకు ఉంచుతారు.

నష్టం వివరాలు	
పంట	హెక్టార్లల్లో
వరి	1282.63
వేరుసెనగ	11.4
మొక్కజొన్న	21.7
సజ్జలు	5

రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలి

– సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారిణి

33 శాతం కన్నా ఎక్కువ పంట నష్టం జరిగిన రైతులు ఎవరైనా ఉంటే రైతు సేవా కేంద్రం ఇన్‌ఛార్జులను కలవాలి. వారు పరిశీలించి ఏపీఏఐఎంఎస్ యాప్‌లో నమోదు చేస్తారు. నష్ట పరిహారం పొందాలంటే ప్రతి రైతు ఈక్రాప్‌లో పంట నమోదు చేసుకుని ఉండాలి. తమ ఆధార్‌కు బ్యాంక్ ఎన్‌పీసీఐ లింక్ చేసుకుని ఉండాలి. రైతులకు సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

సమాచార స్రవంతి

బంగారం ధరలు	
గ్రాముధర:	రూ. 11,613
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 92,904
వెండి గ్రాము :	రూ. 158.70

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు	
బ్రాయిలర్	137
లేయర్	120
బ్రాయిలర్స్	246
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	270
లేయర్ మాంసం	204

గౌతమ్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి: మేకపాటి

నివాళులర్పిస్తున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి

నెల్లూరు (టౌన్), ఆత్మకూరు, న్యూస్‌టుడే: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతి వేడుకలు ఆదివారం నెల్లూరులోని ఆయన నివాసంలో కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి తల్లిదండ్రులు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి దంపతులు, ఉదయగిరి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, పృథ్వీరెడ్డి, అభినవ్‌రెడ్డి నివాళులర్పించారు. అనంతరం రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ గౌతమ్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. మాజీమంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళి, నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, కొడవలూరు ధనుంజయరెడ్డి, కిలివేటి సంజీవయ్య, జంకె వెంకటరెడ్డి, పేర్నాటి కోటేశ్వరరెడ్డి తదితరులు నివాళులర్పించారు. ఆత్మకూరు పురపాలక బస్టాండ్‌లో వైకాపా పట్టణాధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో గౌతమ్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ ఆదిశేషయ్య, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మహ్మదాపురం విద్యార్థిని ప్రతిభ

హైందవిని అభినందిస్తున్న ఎంఈవో రేణుక, ఉపాధ్యాయులు

పొదలకూరు, న్యూస్‌టుడే: రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన మహ్మదాపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని హైందవి అసెంబ్లీకి వెళ్లే అవకాశం దక్కించుకుంది. శుక్ర, శని వారాల్లో జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పోటీలు నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో ముందంజలో నిలిచిన వారికి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆలోచన మేరకు అసెంబ్లీకి పంపాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు వచ్చాయి. సర్వేపల్లి నియోజకవర్గం నుంచి అవకాశం దక్కిన హైందవిని ఎంఈవోలు రేణుక, శోభనాద్రి, ప్రధానోపాధ్యాయులు గిరీశ్, ఉపాధ్యాయులు అనిల్, రాజ్యలక్ష్మి అభినందించారు.

SRI PENUSILA LAKSHMI NARASIMHA SWAMYVARI TEMPLE
PENCHALAKONA KSHETRAM - RAPUR(M), SPSR NELLORE DISTRICT
E-Procurement Tender Notice
Rc.No.SPLNST/Engg/18 to 19/2025 Date: 03/11/2025
The Executive Officer, Sri Penusila Lakshmi Narasimha Swamy Vari Temple, Penchalakona Kshetram, invites Tenders through e-procurement from eligible contractors for the two works, each work estimate value Rs. 9,95,000/- Tender ID:860402 & 860411 Publishing Date: 03/11/2025 Bid Submission Start Date: 03/11/2025 (11:00 AM) Bid Submission End Date: 18/11/2025 (Up to hrs 04:30 PM) Opening of Bids: 18/11/2025 (at hrs 06:00 PM) Tender schedules and conditions can be viewed and downloaded from the e-procurement portal (https://tender.apeprocurement.gov.in) The Executive Officer reserves the right to accept or reject any or all tenders without assigning any reasons.
Place : Penchalakona (Poreddy Srinivasulu Reddy)
Date: 03/11/2025 Deputy Commissioner & Executive Officer

జిల్లా అంధత్వ నివారణ సంస్థ - శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా
ఎ.సి.ఎస్.ఆర్. ప్రభుత్వ ప్రధాన వైద్యశాల ప్రాంగణం, నెల్లూరు
ఆర్.సి.నెం. స్పెషల్ / డి.బి.సి.ఎస్./ నెల్లూరు /2025/తేది 28.10.2025
జిల్లా అంధత్వ నివారణ సంస్థ, నెల్లూరు జిల్లా వారు స్కూల్ విద్యార్థుల కార్యక్రమములో దృష్టి లోపంతో బాధపడుతున్న సుమారు 4500 మంది విద్యార్థులకు ఉచిత కళ్ళజోళ్ళ పంపిణీ కొరకు సకాలంలో మంచి నాణ్యతగల కళ్ళ జోళ్ళు అందించగల నెల్లూరు జిల్లా పరిధిలోని సంస్థల నుండి టెండర్లు ఆహ్వానించడమైనది. నాణ్యమైన TR-90 Polycarbonate spring type full frame, CR-39 Plastic Lenses, Cleaning Cloth, Spectacle box with school children power details sticker తో సరఫరా చేయవలయును.
టెండర్ దరఖాస్తు ఫారను Rs 500-00 చెల్లించి జిల్లా అంధత్వ నివారణ సంస్థ నుండి పనిదినములలో 10.30 am నుండి 5.00 pm వరకు పొందగలరు.
1. టెండరు షెడ్యూలు జారీ ప్రారంభపు తేది : 03.11.2025
2. టెండరు షెడ్యూలు ఆఖరు తేది : 10.11.2025 సాయంత్రం గం॥ 4.00 వరకు.
ఆసక్తి కలిగిన టెండరుదారులు తమ యొక్క కనిష్ట ధరను సీల్డు కవర్లో ఉంచి నమూనా ప్రేములతో 10.11.25 సాయంత్రం 4.00 గం.లోగ పై అడ్రసుకు పంపవలసినదిగా కోరడమైనది. టెండరుదారులు ధరావతు సైకము రు 6000/- (Non refundable) District Program Manager, District Blindness Control Society, Nellore వారి పేరుమీద DD తీసి సమర్పించవలయును. మీకు తెలియపరిచిన రోజు మరియు సమయమునకు జిల్లా పర్చేజింగ్ కమిటీ ముందు హాజరు కాగలరు. ఇతర వివరములకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆఫీసు పనిదినములలో సంప్రదించగలరు.
డిస్ట్రిక్ట్ ప్రోగాం మేనేజర్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ – శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

సింహపురి టు ఆస్ట్రేలియా..!

కూటమి ప్రభుత్వ చర్యలతో సాగుదారులకు భరోసా

న్యూస్‌టుడే, ఇందుకూరుపేట

కొంత కాలంగా ఆక్వా రంగం సాగులో ఒడిదొడుకులు ఎదురైనా మన రొయ్య బలంగానే నిలబడింది. ఎక్కువ శాతం అమెరికాకు ఎగుమతి అయ్యేవి. అధ్యక్షుడు ట్రంప్ సుంకాల మోతతో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్కెట్లను అన్వేషించడంతో సత్ఫలితాలు వస్తున్నాయి. మంత్రి లోకేశ్ సైతం ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనలో మన రొయ్య నాణ్యత, ఎగుమతులకున్న అవకాశాలను వివరించడంతో సాగుదారులకు భరోసా నెలకొంది.

స్థిరంగా ధరలు...

రెండు నెలలుగా రొయ్యల ధరలు నిలకడగానే ఉన్నాయి. 100 కౌంట్ రూ. 230 కొనుగోలు చేస్తుండగా.. 40 కౌంట్ రూ. 360, 30 కౌంట్ రూ. 420 వరకు పలుకుతోంది. ధరలకనుగుణంగా ప్రభుత్వం మార్కెట్ విస్తరణపై దృష్టి సాధించడం మంచి పరిణామమని జిల్లా మత్స్యశాఖ అధికారి శాంతి పేర్కొన్నారు.

మనదే అగ్రస్థానం...

ఆక్వా ఉత్పత్తుల్లో దేశంలోనే మన రాష్ట్రం అగ్రగామిగా ఉంది. ఉభయ గోదావరి జిల్లాల తరువాత నెల్లూరులోనే అధికంగా సాగవుతోంది. ప్రత్యామ్నాయ మార్కెట్లను అన్వేషణకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విన్నవించింది. వారు కూడా వివిధ దేశాలతో చర్చించారు. దిగుమతులకు రష్యా సానుకూలంగా స్పందించడంతో ఇప్పటికే ఎగుమతులు ప్రారంభమయ్యాయి. అదే బాటలో ఆస్ట్రేలియా చేరింది. రెండేళ్ల పాటు కొనుగోలుకు అనుమతులిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో సాగుదారులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అరబ్ దేశాలకు కూడా ఎగుమతులు పెరిగితే మనకు విదేశీ మారకద్రవ్యం సమకూరుతోంది.

తిప్ప చుట్టూ అనకొండలు

చిట్టేపల్లి కాలనీ స్థలాల్లో గ్రావెల్‌ను కొల్లగొడుతున్నా పట్టని అధికారులు

న్యూస్‌టుడే, పొదలకూరు

తిప్ప వద్ద గ్రావెల్ తవ్వకాలతో ఇలా..

పొదలకూరుకు కిలోమీటరు దూరంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు.. కొందరు గృహాలు నిర్మిస్తున్నారు.. అయితే అక్రమార్కుల కన్ను తిప్పపై పడింది.. ఇంకేముంది... రాత్రి వేళల్లో భారీ యంత్రాలు పెట్టి గ్రావెల్ తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.. గృహ నిర్మాణ శాఖ అధికారులు గుర్తించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో.. అడిగేదెవరు.. ఆపేదెవరని చెలరేగిపోతున్నారు. తిప్ప చుట్టూ భారీ గుంతలు ఏర్పడటంతో లబ్ధిదారులు తాము ఉండలేమని వాపోతున్నారు.

● పొదలకూరు మేజరు పంచాయతీ పరిధిలోని 707 సర్వే నంబరులో సుమారు 21 ఎకరాలు పేదలకు ఇళ్ల స్థలాలకు కేటాయించారు. 1500 మందికి ఇంటి స్థలాలు మంజూరయ్యాయి. 606 మందికి ఆప్షన్-3 కింద పక్కాగృహాల నిర్మాణం చేపట్టారు. దీనిలో అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారులు విచారిస్తున్నారు.. ఈక్రమంలో అక్రమార్కులు ఇంటి నిర్మాణాల కోసం వేసిన పునాదుల చుట్టూ యంత్రాలతో తవ్వేసి మట్టి తరలిస్తున్నారు. కాలనీ కోసం వేసిన విద్యుత్తు స్తంభాల చుట్టూ మట్టి తవ్వేయడంతో బలమైన గాలులు వీస్తే స్తంభాలు కూలేలా ఉన్నాయి. కాలనీ చుట్టూ భారీ గోతులు ఏర్పడి ప్రమాదకరంగా ఉంది.

● గృహనిర్మాణ శాఖ ఏఈ మహేశ్ మాట్లాడుతూ... కాలనీ వద్ద తవ్వకాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారుతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. తిప్ప వద్ద తవ్వకాలతో గృహాలు నిర్మించేందుకు వేసిన పునాదులు కూడా గుంతల్లో కలిసిపోయాయన్నారు.

EENADU e Classifieds

BUILDING CONSTRUCTION
Building Contract for Structural, architectural vasthu plan, quality construction with material, renovation work and interior, any work. Contact: 94912 77325

EDUCATION
DISTANCE EDUCATION
10th/Inter, BA, B.Com, B.Sc, BBA, BCA, BLIS, MA, M.Com, M.Sc, MCA, MBA, MLIS, Dip, B.Tech, M.Tech, M.Phil, Ph.D., BNYS, BPT ✆ 9030030125

REAL ESTATE
PLOT FOR SALE
ఆత్మకూరు బస్టాండ్ Opp: అల్లీపురం కొత్తకాల్వ సెంటర్ 3వ మైలు, పొదలకూరు దగ్గర నుడా అప్రూవ్డ్ ప్లాట్స్. అం. లక్ష, స్పాట్ రిజి, బ్యాంకులోన్. ✆ 9121459131

TO LET
COMMERCIAL
నెల్లూరు ధనలక్ష్మీపురంలో 2000 s.ft (2nd ఫ్లోర్) ఆఫీస్, కమర్షియల్‌కు ఫర్నిచర్‌తో సహా అద్దెకు కలదు. సంప్ర: 94254 01476

JOBS
ప్రముఖ కంపెనీలో స్కానింగ్ కోసం అభ్యర్థులు అవసరం. అర్హత: ఇంటర్/ ఏదైనా, డిగ్రీ, కందుకూరు Ph: 9710545012.
ఫోర్స్ మోటార్స్ కంపెనీ షోరూంలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ & రిసెప్షనిస్ట్ కావలెను. అమృత మోటార్స్, బుజబుజనెల్లూరు ✆ 9581299916, 9492934103
ప్రముఖ ఆయుర్వేదిక్ కంపెనీ తరపున పనిచేయుటకు మార్కెటింగ్ మేనేజర్ & ఎగ్జిక్యూటివ్స్ & బిజినెస్ ప్రమోట్ చేయగలిగిన లేడీ టెలికాలర్స్ కావలెను. 7286808808
రియల్ ఎస్టేట్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు గ్రాడ్యుయేట్స్ & పోస్ట్ గ్రాడ్యుయేట్స్, రిటైర్డ్ పర్సన్స్ & లేడీ టెలికాలర్స్ కావలెను. జీతం + ఇన్సెంటివ్స్ ✆ 93469 48665
నాయుడుపేట దగ్గర మేనకూరు కంపెనీలో అంబులెన్స్‌కి డ్రైవర్ కావలెను. సంప్రదించవలసిన నెంబరు ✆ 8099103103
మా ఇస్కపల్లి షెడ్‌లో పనిచేయడానికి సూపర్‌వైజర్లు కావాలి. ✆ సంప్ర॥ 7207203393, ఇమెయిల్: jobfinderhub.hr@gmail.com

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే వివరాలకు.. నెల్లూరు 80080 01790
మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.

B&W : రూ. 600 Colour : రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయ రాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పేదల భూములు విక్రయించడం దారుణం

వెంకటాచలం, న్యూస్‌టుడే: పేదలు మూడు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములకు దొంగ పత్రాలు సృష్టించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయడం తగదని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు సుబ్బారావు అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని తిక్కవరప్పాడులోని 50 ఎకరాల్లో జెండాలు పాతారు. భూములు తిరిగి సాగుదారులకు అప్పగించకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకమరాజు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధి వేగవంతం కావాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి వేగవంతం కావాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని మాగుంట లేఅవుట్‌లోని తన నివాసంలో పరిశ్రమల శాఖ అధికారులు ఆదివారం ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశాలతో జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళదామన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు'

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : సెలవు రోజుల్లో ప్రైవేటు విద్యాసంస్థలు తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్ ఆరోపించారు. ఆదివారం నగరంలోని రామచంద్రారెడ్డి భవన్‌లో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బస్సుల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరి

నెల్లూరు (పద్మావతి సెంటర్): బస్సుల నిర్వహణలో విద్యా సంస్థలు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ బి.చందర్ స్పష్టంచేశారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలోని భక్తవత్సల్‌నగర్‌లోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ప్రైవేటు విద్యా సంస్థల ప్రతినిధులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాద మృతులకు సంతాపంగా మౌనం పాటించారు. కార్యక్రమంలో ఆర్టీవో మదాని, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

చెట్టు కొమ్మ విరిగి పడి వ్యక్తి మృతి

ఇందుకూరుపేట: సపోటా చెట్టు ఎక్కి కోస్తుండగా ప్రమాదవశాత్తు కొమ్మ విరగడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన ఇందుకూరుపేట మండల పరిధిలో ఆదివారం జరిగింది. ఎస్సై నాగార్జున్‌రెడ్డి వివరాల మేరకు.. లేబూరు పంచాయతీలోని నాగరాజుతోపు గ్రామానికి చెందిన శ్రీనివాసులు(51) పలు రకాల తోటల్లోని పండ్లను కోసి నెల్లూరుకు తరలించి మార్కెట్‌లో విక్రయిస్తారు. స్వగ్రామంలోని తోటలో సపోట చెట్టు ఎక్కి చిటారు కొమ్మకు ఉన్నవి కోసే సమయంలో విరగడంతో కిందిపడి ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సూక్ష్మం.. శివ రూపం

మనుబోలు, న్యూస్‌టుడే: కార్తిక మాసం రెండో సోమవారం పురస్కరించుకుని మనుబోలు పంచాయతీ యాచవరం గ్రామానికి చెందిన ఆలూరు రాము ఆచారి ఆదివారం సూక్ష్మ శివలింగం తీర్చిదిద్ది అబ్బురపరిచారు. పచ్చ కర్పూరంతో గోరుపై ఇమిడిపోయే సూక్ష్మ రూపంలో ఉన్న శివలింగాన్ని రూపొందించడంతో పలువురు అభినందించారు.

ఎస్ఈఐఎల్‌కు సామాజిక సేవా అవార్డు

అవార్డు అందుకుంటున్న సంస్థ ప్రతినిధులు

ముత్తుకూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్ఈఐఎల్ ఎనర్జీకి ఉత్తమ 'సామాజిక సేవా అవార్డు' లభించింది. బెంగళూరులో జరిగిన యూబీఎస్ ఫోరం నిర్వహించిన 15వ వార్షిక కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సమ్మిట్, అవార్డ్స్ 2025 కార్యక్రమంలో సంస్థ సీఎస్సార్ హెడ్ డేవిడ్ పీటర్, సీనియర్ మేనేజర్ కామేశ్వరరావులు అవార్డు అందుకున్నట్లు సంస్థ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అవార్డు దక్కడంపై హర్షం వ్యక్తం చేసిన సంస్థ సీఈవో జనమేజయ మహాపాత్ర... జిల్లాలో గ్రామీణ ఆరోగ్య సదుపాయాలు మెరుగుపరచడంలో తమ సంస్థ చేసిన కృషికి అవార్డు లభించినట్లు పేర్కొన్నారు.

జలాశయానికి 27,626 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయంలో ఆదివారం రాత్రికి ఎగువ ప్రాంతాల నుంచి 27,626 క్యూసెక్కులు వరద నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయంలో 77.988కి 69.324 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 326.096 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. 6వ క్రస్ట్‌గేట్ ద్వారా 10,000, -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 50, పవర్ టన్నెల్ ద్వారా 2,600 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు.

జలకళ.. సాగుకు వేళ

నిండుకుండల్లా జలాశయాలు

సౌత్ మోపూరు చెరువు నిండుగా నీరు

న్యూస్‌టుడే, నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)

రుతుపవనాల నేపథ్యంలో కురిసిన వర్షాలకు ప్రాజెక్టులు, చెరువులు జలకళ సంతరించుకోగా.. మొంథా తుపానుతో నిండుకుండల్లా మారాయి. జిల్లాలో సోమశిల జలాశయంతో పాటు నెల్లూరు, కొడవలూరు మినహా మిగతా 36 మండలాల పరిధిలో 68 మేజర్, 86 మీడియం, 853 మైనర్ చెరువులున్నాయి. తుపాను కారణంగా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. ఐదు రోజులుగా నిలిచిపోయినా.. సోమశిల జలాశయానికి భారీగా వరద చేరుతోంది. ప్రస్తుతం 69.324 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువ నుంచి 76.626 క్యూసెక్కుల నీరు వస్తోంది.

పూర్తిగా నిండిన 663 చెరువులు

భారీ వర్షాలు, తుపానుల సమయంలో పెన్నాకు వరద వచ్చి జలాశయం నిండుతోంది. చెరువులు పూర్తిస్థాయిలో నిండడం ఐదేళ్ల కాలంలో ఇదే మొదటిసారి అని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని పెద్ద, మధ్య, చిన్న తరహా చెరువులు 1007లో 25శాతం నీటి నిల్వలతో 707 చెరువులు, 50శాతం లోపు 174, 75శాతంలోపు 83, 100శాతం లోపు 43 చెరువులు ఉన్నాయి. ఒక్క చెరువులో కూడా వంద శాతం నీటి నిల్వలు లేవు. మొత్తంగా కలిపి 16,891 ఘనపు అడుగుల నీరు ఉంది. మొంథా తుపాను అనంతరం 25శాతం లోపు నీటి నిల్వలు ఉన్న చెరువులు 29, 50శాతం లోపు 42, 75శాతం లోపు 116, 100 శాతం లోపు 157 చెరువులు ఉండగా పూర్తిస్థాయిలో వంద శాతం నీటితో 663 చెరువులు ఉన్నాయని అధికారులు తెలిపారు. అన్నింటిలో 23,620.39 ఘనపు అడుగుల నీటి నిల్వలు ఉన్నాయి. రబీ సీజన్‌తో పాటు అనంతరం సాగునీటికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రబీ సీజన్‌కు సంబంధించి సాగు పనులు చేపడుతున్నారు.

(c) eenadu

కావలి

•కావలి • ఉదయగిరి • కందుకూరు

ఎమ్మెల్యేతో సోమిరెడ్డి భేటీ

సోమిరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి

కావలి, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని ఎమ్మెల్యే ఇంటికి వచ్చిన సోమిరెడ్డి.. తాజా రాజకీయ పరిమాణాలపై చర్చించనట్లు సమాచారం. సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ ఛైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు, నాయకులు తిరివీధి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఈ- పంట నమోదుకు గడువు పెంపు

ఉదయగిరి, న్యూస్‌టుడే: ఈ- పంట నమోదుకు ఈనెల 8వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఉదయగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు చెన్నారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి నమోదు చేసుకోవాలన్నారు. ఈ- పంటతోనే ప్రభుత్వ రాయితీ పథకాలు వర్తిస్తాయన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: మండల పరిధిలోని కొండారెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఓవర్‌హెడ్ ట్యాంకుకు సీపీ డబ్ల్యూ పథకం నుంచి తాగునీరు సరఫరా కావడం లేదు. **- కోటయ్య, స్థానికుడు**

సమాధానం: విషయం నా దృష్టికి రాలేదు. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- నాయబ్ రసూల్,ఆర్‌డబ్ల్యూఎస్, జేఈ, వలేటివారిపాలెం**

? దగదర్తిలోని దళిత కాలనీలో ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు నీరు చేరడంతో దోమల ఉద్ధృతి పెరిగింది. దుర్వాసన వస్తోంది. **- వెంకట్, కాలనీవాసి**

✓ మురుగు నీరు లేకుండా చూస్తాం. దోమల నియంత్రణకుచర్యలు చేపడతాం. **- మయూరి, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, దగదర్తి**

? కలిగిరిలోని ర.భ అతిథిగృహం వెనుక వైపు ప్రాంతంలో వర్షపు నీరు నిల్వ ఉండడంతో దోమలకు కేంద్రాలుగా మారాయి. **- కొండయ్య**

✓ పరిశీలించి చర్యలు చేపడతాం. **- రవిచంద్ర, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, కలిగిరి**

? స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్గంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళల్లో ఇబ్బందిగా ఉంటోంది. **– హనూక్, స్థానికుడు**

✓ పరిశీలించి వెలిగించే ఏర్పాటు చేయిస్తాం. **- నరేశ్, పంచాయతీ కార్యదర్శి, గుడ్లూరు**

? గుడ్లూరులో సరఫరా అవుతున్న రక్షిత నీరు కలుషితమై వస్తోంది. **- జాహ్నవి, స్థానికురాలు**

✓ ట్యాంకుల్లో బ్లీచింగు, క్లోరినేషన్ చేయించేలా చర్యలు తీసుకుంటాం. **- వెంకటేశ్వరరావు, ఎంపీడీవో**

? జాతీయ రహదారి నుంచి రామదేవులపాడు వెళ్లే రోడ్డు కంపచెట్లతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. **- కొండయ్య, స్థానికుడు**

✓ సర్పంచికి తెలిపి తొలగించేలా చూస్తాం. **- మనోహర్, పీఆర్ ఏఈ- న్యూస్‌టుడే, వరికుంటపాడు**

? జలదంకిలో ఉన్న కల్యాణ మండపం సమీపంలో ర.భ శాఖ రోడ్డుపై గుంతలు పడ్డాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. **- శ్రీనివాసులు, స్థానికుడు**

✓ పరిశీలించి గుంతలను పూడ్చేలా చర్యలు తీసుకుంటాం. **- అహ్మద్‌బాషా, ఏఈ ర.భ శాఖ - న్యూస్‌టుడే, జలదంకి**

? పట్టణంలోని సుల్తాన్ మొహిద్దీన్‌నగర్‌లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. శని, ఆదివారం ముగ్గురిపై దాడి చేశాయి. **- ఖాదర్ బాషా**

✓ కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. **- కె.అనూష, మున్సిపల్ కమిషనర్ - న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం**

వేడుకగా గిరి ప్రదక్షిణ

గిరి ప్రదక్షిణలో సమరసత సేవా ఫౌండేషన్ ప్రముఖులు, భక్తులు

బిట్రగుంట, న్యూస్‌టుడే: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తొమ్మిదో నగర సంకీర్తనలో భాగంగా బిలకూటక్షేత్రం కొండబిట్రగుంట శ్రీప్రసన్నవెంకటేశ్వరస్వామి కొండదిగువన గిరిప్రదక్షిణ వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దేవస్థాన ప్రాంగణంలో ఏర్పాటైన సత్సంగంలో శ్రీశక్తి పీఠాదీశ్వరి మహేశ్వరి మాతాజీ, దక్షిణ మధ్య క్షేత్రధర్మజాగరణ ప్రముఖ్ అమర లింగన్నలు ప్రసంగించారు. ఆర్ఎస్ఎస్, ప్రాంత సహ బౌద్ధిక్‌ప్రముఖుడు కొత్త రామకృష్ణ, ఈవో రాధాకృష్ణ, కడియాల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కావలి: పట్టణంలోని ముసునూరు అయ్యప్ప స్వామి ఆలయంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కార్తికదీపాలను వెలిగించారు. అనంతరం కార్తిక వనభోజన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ఉదయగిరి జడ్జి

వరికుంటపాడు : వరికుంటపాడు పద్మావతి గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి జి.అంజయ్య దంపతులు ఆదివారం శ్రీవారిని దర్శించుకున్నారు. కార్తిక దామోదర స్వామి ఆరాధనను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు.

జడ్జి అంజయ్య దంపతులకు వెంకన్న చిత్ర పటాన్ని అందజేస్తున్న కమిటీ సభ్యులు

మలుపులు.. మృత్యు పిలుపులు

గుంపర్లపాడు మార్గంలో ప్రమాదకర మలుపు

న్యూస్‌టుడే, కలిగిరి: పర్యవేక్షణ లేమి.. నిర్వహణ లోపాల కారణంగా రహదారుల్లోని మలుపులు దారుణంగా మారాయి. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అప్రమత్తం కావడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. రహదారులకు రెండు వైపులా అల్లుకున్న ముళ్ల పొదలను తొలగించకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

ఉదయగిరి నియోజకవర్గంలో ప్రధాన మార్గాల్లో అనేక చోట్ల ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. వేగం నియంత్రణ కాకపోవడం, ఎదురు వాహనం కనబడగానే డ్రైవర్లు తడబడటంతో గాయాలపాలవుతున్నారు. మరోవైపు రహదారులపై గోతులు ఉండడంతో అదుపుతప్పి బోల్తా పడుతున్నారు.

ఎక్కడెక్కడంటే..

❖ కమ్మవారిపాలెం సమీపంలోని మలుపులో పలువురు మృత్యువాతపడ్డారు. వందల మంది గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. ❖ కలిగిరి మండలంలోని పాతనాపురం నుంచి కొత్తపేట మీదుగా ఆత్మకూరు నియోజకవర్గంలోని ఏఎస్‌పేటకు వెళ్లే రోడ్డు రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. పాతనాపురం నుంచి అనంతపురం మీదగా గుడ్లదొన మార్గంలోనూ ఇదే విధంగా ఉంది. ❖ కలిగిరి- కొండాపురం మార్గంలో కలిగిరికి సమీపంలో ఒకటి, కృష్ణారెడ్డిపాలెం వద్ద రెండు, కుడుములదిన్నెపాడు, చినఅన్నలూరు ప్రాంతాల్లోని మలుపుల్లో ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. ❖ తెల్లపాడు నుంచి గంగిరెడ్డిపాలెం మీదుగా వింజమూరు మార్గంలో, పెదఅన్నలూరు, ఏపినాపి మార్గాల్లో మలుపుల వద్ద హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేయలేదు. ❖ నాగిరెడ్డిపాలెం నుంచి నాగసముద్రం, గుడిపాడు మీదుగా ఏఎస్‌పేట వెళ్లే రోడ్డులో వేగనిరోధకాలు ఏర్పాటు చేయాలని ఎన్నోమార్లు ప్రయాణికులు ర.భ అధికారులకు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేకుండా పోయింది. ❖ వరికుంటపాడు- తూర్పుబోయమడుగుల వెళ్లే మార్గంలో మలుపుల వద్ద కంపచెట్లు పెరిగి రోడ్డుపైకి వచ్చాయి. ఎదురు వచ్చే వాహనాలు కానరావడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మలుపుల్లో హెచ్చరిక బోర్డులు, వేగనిరోధకాలు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది.

❖ ఈ విషయంపై ర.భ ఏఈ అహ్మద్ బాషాను వివరణ కోరగా హెచ్చరిక బోర్డుల ఏర్పాటుపై ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

తరువు చాటున.. తగునా ఈ వంతున

బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ మూడు రోడ్ల కూడలిలో 11 కేవీ విద్యుత్తు తీగలపై చెట్ల కొమ్మలు వాలి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. తీగలతో పాటు స్తంభాలు నేలవాలే పరిస్థితి నెలకొంది. జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతం కావడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. డిస్కం ఏఈ జడరాయ మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, బిట్రగుంట

అసంపూర్తిగా వంట గది

పట్టణంలోని పెంకులకర్మాగార సంఘం వద్ద పురపాలక పాఠశాలలో గతంలో నాడు-నేడు కింద వంట గది నిర్మాణం చేపట్టారు. నిధుల కొరత కారణంగా మధ్యలోనే పనులు ఆపేయడంతో అసంపూర్తిగా మారింది. దాంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. మండల విద్యాధికారి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.–న్యూస్‌టుడే, కావలి

ఈ మార్గం.. గులకరాళ్లమయం

మండల కేంద్రం నుంచి పైడేరుకు వెళ్లే రోడ్డు రాళ్లు తేలి అధ్వానంగా ఉంది. పలు చోట్ల గుంతలతో ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. రాకపోకలు సాగించాలంటే స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలువురు అదుపుతప్పి గాయాల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అల్లూరు

నిండుగా పైడేరు

అల్లూరు డెల్టాలోని పైడేరు నిండుకుండలా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల వరదనీరు పోటెత్తుతుండటంతో రిజర్వాయరు నుంచి సుమారు రెండు వేల క్యూసెక్కులు విడుదల చేశారు. ఇప్పటికే కురిసిన వర్షాలకు చెక్‌డ్యాంలలో నీరు ఉండటంతో ఈ పరిస్థితి నెలకొంది. - న్యూస్‌టుడే, అల్లూరు

కాలనీలు.. తప్పని అవస్థలు

దివ్యాంగుల కాలనీలో నిలిచిన వరద నీరు

కావలి, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలకు కావలి పురపాలక సంఘంలోని పలు ప్రాంతాలు బురదనీటిలోనే దర్శనమిస్తున్నాయి. ఏటా ఇదే పరిస్థితి ఉంటోందని ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏటా సమస్య

కావలి పట్టణంలో అనపగుంత సమస్య ఎడతెగని రీతిలో ఏటా ఇబ్బంది పెడుతోంది. కొద్ది నెలల క్రితం రూ.30 లక్షల వరకు వెచ్చించి పూడికతీత పనులు చేశారు. అయినా ఫలితం లేకుండా పోయింది. మొంథా తుపాను వల్ల వచ్చిన వరద ప్రవాహం పలు ప్రాంతాలను నీట ముంచింది. పట్టణంలోని పశ్చిమ ప్రాంతం నుంచి వచ్చే వరదనీటిని కావలి పెద్ద చెరువుకు తరలించేలా చేస్తే.. అనపగుంత వల్ల ఎదురవుతున్న సమస్యకు పరిష్కారం లభిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

◗ ఇందిరమ్మ కాలనీ ఏర్పడి 20 ఏళ్లవుతోంది. ఇంతవరకు మౌలిక సదుపాయాలు ఊసేలేదు. కూటమి ప్రభుత్వంలో రూ.1.6కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇటీవల ఒక్క చోట మాత్రమే వేశారు. మిగిలిన అన్నిప్రాంతాల్లోనూ సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం కచ్చాకాలువలను తవ్వడంతో వివిధ అడ్డరోడ్లలో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే.. ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతోంది.

◗ ఇటీవల అధికారులు దివ్యాంగులకాలనీలో కొంతవరకు మాత్రమే వరదనీటిని వెలుపలకు వెళ్లేలా చేశారు. పూర్తిగా సమస్య పరిష్కరించకుండా వదిలేయడంతో నీటిలోనే రాకపోకలు చేయాల్సి వస్తోంది. మద్దూరుపాడు టిడ్కో సముదాయం వద్దకు పక్కనే ఉన్న ఆనెమడుగు చెరువు బ్యాక్ వాటర్ వచ్చి చేరుతుంది. రోజుల తరబడి మోకాలులోతు నీరు నిలుస్తోందని అక్కడి వారు చెబుతున్నారు. ఈ విషయమై పురపాలక డీఈఈ సాయిరాం స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామన్నారు.

కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపాలి

ప్రదర్శన నిర్వహిస్తున్న మాలధారులు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: కందుకూరునుప్రకాశం జిల్లాలో కలపాలని మాజీ ఎమ్మెల్యే, కందుకూరు అభివృద్ధి సలహామండలి అధ్యక్షుడు డాక్టర్ దివిశివరామ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రం ఒంగోలుకు కూతవేటు దూరంలో ఉన్న కందుకూరును 2022లో అప్పటి వైకాపా ప్రభుత్వం నెల్లూరులో కలపడంతో అన్ని రంగాల్లో తీవ్రంగా నష్టపోయిందన్నారు. కొండపి నియోజకవర్గంలోని మండలాలను కలిపి డివిజన్‌ను పునర్నిర్మించాలన్నారు. **ఉలవపాడు :** కందుకూరును ప్రకాశం జిల్లాలో కలిపి ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఆదివారం కరేడులో అయ్యప్ప మాలధారులు ప్రదర్శన నిర్వహించారు. బీసీ నాయకులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొందరు నాయకులు కందుకూరును నెల్లూరులోనే ఉండే విధంగా ప్రయత్నిస్తున్నారన్నారు. ఇటువంటివి అంగీకరించమని మరలా ఉద్యమం చేయడానికైన సిద్ధమని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్టీయూ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం కందుకూరు పట్టణంలో జోన్ సమావేశం నిర్వహించారు. 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటుచేయాలని, వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా లింగసముద్రం మండల ఎస్టీయూ అధ్యక్షుడిగా రావి మల్లికార్జునను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు సీహెచ్.ఆదినారాయణ, జి.వెంకటేశ్వర్లు, పి.కృష్ణయ్య, వెంకట్రావు, జాన్సన్ పాల్గొన్నారు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

బస్సు షెల్టర్లు లేక అవస్థలు

నేకునాంపురం వద్ద షెల్టరు లేక ఫ్లెక్సీ నీడన ప్రయాణికులు

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: మండలంలో ప్రయాణికులకు బస్సు షెల్టర్ల సౌకర్యం లేకపోవడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం నిత్యం నిరీక్షించాల్సి వస్తోంది. విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, పట్టణాలకు పని కోసం వెళుతున్న రోజువారీ కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

తిరిగి ఏర్పాటు చేయలేదు

మండలంలో జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పలు గ్రామాల్లో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన షెల్టర్లను గుత్తేదారుడు తొలగించారు. రహదారి నిర్మాణం పూర్తి చేసుకున్నా అధికారుల ఉదాసీనత కారణంగా పంచాయతీలకు నష్టపరిహారాన్ని ఇవ్వలేదు. కనీసం షెల్టర్లను కూడా నిర్మించలేదని సర్పంచులు చెబుతున్నారు. చెర్లోపాలెం, బొంతవారిపాలెం, బడేవారిపాలెం ఎస్సీ కాలనీ, నూకవరం, పోకూరు, శామీరపాలెం, అయ్యవారిపల్లె, మాలకొండ, తదితర గ్రామాలలో తిరిగి ఒక్కటీ కూడా ఏర్పాటు చేయలేదు.

భక్తులు, వృద్ధులకు ఇబ్బంది

ఆయా గ్రామాల నుంచి కందుకూరుకు, వలేటివారిపాలెం మండల కేంద్రానికి నిత్యం అనేక మంది రాకపోకలు చేస్తుంటారు. ప్రతి శుక్రవారం రాత్రి, శనివారం మాలకొండ పుణ్యక్షేత్రానికి వేలాదిగా భక్తులు వస్తుంటారు. వారంతా బస్సుల కోసం రోడ్డు మార్జిన్‌లో వేచి చూడాల్సి వస్తోంది. ఆ సమయంలో చంటి బిడ్డలతో మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు స్పందించి నీడ పట్టున కూర్చునేందుకు వీలుగా వసతి కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అధికారులతో మాట్లాడతాం

– వెంకటనారాయణ, ఈవోపీఆర్డీ

జాతీయ రహదారి నిర్మాణంలో తొలగించిన బస్సు షెల్టర్లకు నష్టపరిహారం పంచాయతీలకు చెల్లించారో లేదో తెలియదు. ఇటీవలే బాధ్యతలు తీసుకున్నాను. పరిశీలించి నష్టపరిహారం రాకపోతే సంబంధిత అధికారులతో మాట్లాడతాం. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా నీడ వసతి కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

శ్రమ జీవుల శ్రేయస్సే ధ్యేయం

కావలి : శ్రమజీవుల శ్రేయస్సు తమ ధ్యేయమని ఎప్పుడూ పోరాట బాటలోనే కొనసాగుతామని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగేంద్రసాయి అన్నారు. ఆదివారం నాయకులు సుబ్బరాయుడు తదితరులు ఏఐటీయూసీ అనుబంధ పురకార్మిక కార్యాలయాన్ని కావలి పట్టణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవచూపాలన్నారు.

శైవక్షేత్రాలకు బస్సు నడపాలి

సీతారామపురం, న్యూస్‌టుడే: కార్తికమాసం సందర్భంగా మండలంలోని ప్రాచీనశైవక్షేత్రం ఘటికసిద్ధేశ్వరానికి, సీతారామపురం సమీపంలోని పురాతన శైవక్షేత్రం భైరవకోనకు బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను భక్తులు కోరుతున్నారు. బస్సులు లేకపోవడంతో ప్రైవేటు వాహనాల్లో వెళ్లాల్సి వస్తోందని అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

23 అడుగులకు చేరిన జలాశయ నీటిమట్టం

ఉదయగిరి, న్యూస్‌టుడే: మండలంలోని పొన్నెబోయిన చెంచురామయ్య గండిపాళెం జలాశయ నీటిమట్టం 23 అడుగులకు చేరినట్లు జలవనరుల శాఖ డీఈఈ చంద్రమౌళి ఆదివారం తెలిపారు. జలాశయ నీటి సామర్థ్యం 35 అడుగులు కాగా.. ప్రస్తుతం 23కు చేరిందన్నారు. పిల్లాపేరు, దున్నపోతుల వాగులతో పాటు పలు చెరువుల అలుగులు పారుతుండటంతో 276 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోందన్నారు. నీటిమట్టం పెరిగే అవకాశముందన్నారు.

వైద్యశాలల ప్రైవేటీకరణ తగదు

కావలి, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల్ని పీ4 పేరుతో ప్రైవేటీకరణ చేసే ప్రయత్నాలు దారుణమని వైకాపా నాయకుడు వేమిరెడ్డి విజయకుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 26వ వార్డు దక్షిణ జనతాపేట, వడ్డిపాలెం 31వ వార్డులో ఇంటింటా తిరుగుతూ సంతకాల సేకరణ చేపట్టారు. కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదంటూ ఆరోపించారు.

ఆసుపత్రి పరిసరాలు అపరిశుభ్రం



కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పరిసరాల్లో అపరిశుభ్రం నెలకొంది. భవనాల వెనుక వైపు లోతట్టుగా ఉండటంతో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిలిచింది. దీంతో పిచ్చిమొక్కలు, దోమలకు నిలయంగా మారింది. దాంతో వైద్యానికి వచ్చే రోగులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రి పరిసరాల్లో ఇలాగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

జాతీయ రహదారి ఛిద్రం

ఉలవపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని 16వ నంబరు జాతీయ రహదారి కరేడు ర్యాంపు, రుద్రకోటల మధ్య పలు చోట్ల ఛిద్రమై గుంతలతో దర్శనమిస్తోంది. సుమారు ఇరవై కి.మీ మేర ఇదే దుస్థితి నెలకొందని ప్రయాణికులు చెబుతున్నారు. రాత్రివేళల్లో అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

కమ్మేసిన చెట్లు.. రాకపోకలకు ఇక్కట్లు

దగదర్తి, న్యూస్‌టుడే: సున్నపుబట్టి - కౌరుగుంట మార్గంలో ఇరువైపులా చెట్లు పెరిగి రోడ్డుపైకి వచ్చాయి. దీంతో నిత్యం రాకపోకలు చేసే ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు రోడ్డు గుంతలు పడి ఉండడంతో వర్షం పడిన ప్రతిసారి నీరు నిలుస్తోంది. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గ్రామంలో పారిశ్రామిక పార్క్ ఉండటంతో ఈ మార్గంలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శిరోమణి మాట్లాడుతూ పరిశీలించి పిచ్చి మొక్కలు తొలిగిస్తామన్నారు.

కూరగాయల ధరలకు రెక్కలు

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గత పదిరోజులుగా కురిసిన వర్షాలతోపాటు మొంథా తుపాను ధాటికి కందుకూరులో కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. తోటలు దెబ్బతినటంతో పాటు, కోతలు సాగకపోవటంతో దిగుబడులు తగ్గాయి. ప్రస్తుతం దూర ప్రాంతాల నుంచి తీసుకువస్తుండడంతో అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారు. కార్తిక మాసం కూడా పెరుగుదలకు మరొక కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

❖ గత నెలతో పోలిస్తే.. అన్నీ కూరగాయాలు కిలోకు రూ.10 నుంచి రూ.25 వరకు పెరిగాయి. గతంలో మార్టూరు నుంచి కొన్ని రకాలు వస్తుంటే రవాణా ఖర్చులు తక్కువగా ఉండేవి. ప్రస్తుతం మైదుకూరు, మదనపల్లి నుంచి మిర్చి, వంకాయ, బెండకాయలు, కాకరకాయలు, బీరకాయలను కందుకూరు రైతుబజారుకు దిగుమతి చేసుకుంటున్నారు. ఇక్కడ ఉండే హోల్‌సేల్ వ్యాపారులు రవాణా భారం, ఇతర వ్యయాలు కలుపుకొని అధికంగా అమ్మకాలు చేస్తున్నారు. కందుకూరు నియోజకవర్గంలో సాగు చేసిన ఆకుకూరలు సైతం కట్ట రూ.10 పలుకుతోంది. ఉలవపాడు మండలం కరేడు, ఒంగోలు సమీప గ్రామాల నుంచి ఇక్కడకు ఆకుకూరలు తీసుకువస్తున్నారు. వాటిని విడదీసి, ధరలు పెంచి అమ్మకాలు చేస్తున్నారని పలువురు వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు. రైతుబజారు కంటే బయట ప్రాంతాల్లో రూ.10-రూ.20 అదనంగా విక్రయిస్తున్నారని చెబుతున్నారు.

రైతుబజార్‌లో ధరలు ఇలా..

కూరగాయలు (కిలో)	అక్టోబరు 25న	నవంబరు 2న (రూ.లలో)
వంకాయ	40	60
బెండకాయ	30	55
కాకర	35	60
బీర	45	60
క్యారెట్	65	80
పెద్దచిక్కుడు	80	135

వర్షాల కారణంగానే

స్వరూపారాణి, రైతుబజారు ఎస్టేట్ అధికారి

వర్షాల వల్ల ధరలు కొంత వరకు పెరిగాయి. గతంలో దగ్గర ప్రాంతాల్లో కూరగాయలు వచ్చేవి. ప్రస్తుతం దూరప్రాంతాల నుంచి వస్తుండటంతో రవాణా ఛార్జీలు ఎక్కువగా ఉంటున్నాయి. స్థానికంగా ఇప్పుడే వంకాయ, బెండకాయలు వస్తున్నాయి. టమాటాలు, మిర్చి ధరలు తగ్గాయి. త్వరలోనే మిగిలినవి తగ్గే అవకాశం ఉంది.

బోగోలులో సమాధుల పండగ

బిట్రగుంట : బోగోలులో క్రిస్టియన్ సోదరులు ఆదివారం సమాధుల పండగను ఘనంగా జరుపుకొన్నారు. తాళ్లూరు, జక్కేపల్లిగూడూరు రోడ్ల జంక్షన్ సమీపంలో చెంచులక్ష్మీపురంలో ఉన్న పూర్వీకుల సమాధులను రంగులు వేసి అందంగా తీర్చిదిద్దుకున్నారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆరోగ్య కేంద్రాల మంజూరు

ఉదయగిరి : నియోజకవర్గంలో 15వ ఆర్థిక సంఘం నిధుల కింద పెద్దిరెడ్డిపల్లి, జి.కొండారెడ్డిపల్లి, సాయిపేట గ్రామాలకు రూ.78 లక్షలతో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాలు మంజూరయినట్లు పంచాయతీరాజ్ డీఈఈ మణికుమార్ పేర్కొన్నారు. అంతేకాకుండా రహదారులు, పంచాయతీ భవన నిర్మాణాల విషయమై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. గుడినరవ, కొత్తపల్లి, నల్లబోతులవారి కాలనీ, రేణమాల, పొట్టిపల్లి, భీమవరప్పాడు, లింగరాజుఅగ్రహారం, గమళ్లపాళెం, తెడ్డుపాడులో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.20 కోట్లతో, దాసరిపల్లి, ఏ.కిస్తీపురం, శెట్టిపాళెం, కుమ్మరకొండూరు, రామవరప్పాడు, వేములపాడు, బ్రహ్మేశ్వరం గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల నిర్మాణానికి రూ.2.24 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు.

పూడికతీతకు సమయం.. ఆక్రమణలు ప్రతిబంధకం

మిట్టకాలువ మధ్యలో దుకాణం

అల్లూరు, న్యూస్‌టుడే: అల్లూరులో పంట కాలువలు, పూడిక తీసిన మట్టి స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. దుకాణాలను యథేచ్ఛగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం మొదట పంట సాగుకు రైతులు నార్లు పోసుకుంటున్నారు. మరో వైపు పూడికతీత కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు. అవి కార్యరూపం దాలిస్తే పనులు చేయడానికి సాగునీటి సంఘాల ప్రతినిధులు సిద్ధంగా ఉన్నారు.

ఈ సమయంలో ప్రతిబంధకంగా ఉన్న ఆక్రమణలు తొలగించాలని రైతులు వేడుకుంటున్నారు. వీటి సమస్య పరిష్కారం కాకపోతే సాగునీటి సరఫరా సాధ్యంకాదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పంటకాలువలను ఆక్రమించారు. ప్రస్తుతం కాలువ మధ్యలోనే బస్తాలు వేసి దుకాణాలు ఏర్పాటు చేశారు. అల్లూరులో మిట్టకాలువ వద్దే అదే పరిస్థితి ఉంది. అక్కడ దుకాణాన్ని తొలగించేందుకు అధికారుల ప్రయత్నం విఫలం అయింది. ప్రధాన రహదారి పక్కన ఉన్న నాగాలమ్మ కాలువ పూర్తిగా కబ్జాకు గురయింది. అడ్డుగా దుకాణాలను నిర్మించారు. దీంతో పూడిక తీయడం సవాలుగా మారింది.

పొలాలకు చేరుతున్న ప్లాస్టిక్

పంటకాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త వేస్తుండడంతో పొలాల్లోకి చేరుతున్నాయి. సుమారు 20 వేల ఎకరాలకు ఈ దుస్థితి ఏర్పడింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆక్రమణలను తొలగించి పూడికతీత పనులు చేపట్టి వ్యర్థాలు సరఫరా కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు. ఈ విషయమై జలవనరులశాఖ ఏఈ సుధీర్‌ను వివరణ కోరగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

(c) eenadu

కోవూరు

● కోవూరు ● సర్వేపల్లి ● ఆత్మకూరు

ముగిసిన విజిలెన్స్ వారోత్సవాలు

విడవలూరు, న్యూస్‌టుడే: విడవలూరులోని పీఆర్ఆర్ అండ్ వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అక్టోబర్ 27వ తేదీ నుంచి నవంబర్ 2 వరకు విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. ప్రతి రోజూ గ్రామాల్లోని సచివాలయాలు, పాఠశాలలకు వెళ్లి అవగాహన ప్రదర్శనలు నిర్వహించినట్లు అధ్యాపకులు డా.ప్రసాద్ తెలిపారు. సమస్య, ప్రమాదం వచ్చినప్పుడు అప్రమత్తంగా ఎలా ఉండాలని ఆదివారం ముగింపు సందర్భంగా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

నేత్రదానం

విడవలూరు: విడవలూరు రాంనగర్ కాలనీకి చెందిన దేవదానం (35) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన నేత్రాలను మనసేవా సంస్థ సహకారంతో నెల్లూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు కుటుంబ సభ్యులు దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ సునీల్ మృతుడి నేత్రాలను సేకరించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శన

ముత్తుకూరు, న్యూస్‌టుడే: ముత్తుకూరు మండలం పిడతాపోలూరులోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఆదివారం ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. డీన్ అరవింద్, ప్రిన్సిపల్ అమరేందర్, ఏజీఎం వెంకటేశ్వర్లు నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు: 79950 67034, సర్వేపల్లి: 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: సంగం మండలం సిద్ధీపురంలో నివేశన స్థలాలకు కేటాయించిన భూమి పల్లంలో ఉండటంతో వర్షపునీటితో మునుపనకు గురైంది. – శ్రీనివాసులు, సిద్ధీపురం

సమాధానం: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మెరక చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. – సోమ్లనాయక్, తహసీల్దారు

? అనంతసాగరం మండల పరిధిలోని శంకరనగరంలో ప్రధాన రహదారి పక్కనే వ్యర్థాలు వేస్తున్నారు. స్థానికంగా నివాసముండే వారు దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. – పెంచలయ్య, గ్రామస్థుడు

✓ సిబ్బందిని పంపించి వ్యర్థాలు తొలగిస్తాం. – రమణారావు, పంచాయతీ కార్యదర్శి

? విడవలూరు మండల కేంద్రంలోని కామాక్షి నగర్‌లో తాగునీరు సరిగా రావడం లేదు. ఇబ్బందులు పడుతున్నాం. – స్థానికులు

✓ పరిశీలించి తాగునీరు సరిగా వచ్చేలా చూస్తాం. – జగదీష్, పంచాయతీ కార్యదర్శి

? కోవూరు పట్టణం పడుగుపాడు బండారు మాన్యంలో డ్రైనేజీ కాలువ పూడిక తీయక దుర్వాసన వస్తోంది. – స్థానికులు

✓ పూడిక తీయిస్తాం. – శ్రీహరి, ఎంపీడీవో

? పొదలకూరు మండలం కొత్తపాలెం గ్రామ సమీపంలో వరవ కాలువ ఆక్రమించి దుకాణం నిర్మించడంతో నీరంతా ఇళ్లలోకి చేరి ముంచెత్తుతోంది. ఆక్రమణలు తొలగించి తూములు ఏర్పాటు చేసి నీరువెళ్లే సదుపాయం కల్పించాలి. – మస్తాన్‌సాహెబ్

✓ ఆక్రమణలు తొలగించి నీరుపోయేలా ఏర్పాటు చేయిస్తాం. – శివకృష్ణయ్య, తహసీల్దారు

? పొదలకూరు రూరల్ పరిధిలోని మారుతీనగర్ మొదటి వీధిలో సైడు కాలువ ధ్వంసమై మురుగు కదలడం లేదు. దోమలతో సతమతమవుతున్నాం. – ప్రసన్న కుమార్, స్థానికుడు

✓ సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం.
– యశ్వంత్ సింగ్..పంచాయతీ కార్యదర్శి

? తోటపల్లిగూడూరు మండలం కొత్తపాలెంలో మురుగు కాలువలు అపరిశుభ్రంగా ఉన్నాయి. దీంతో దోమలు వ్యాపిస్తున్నాయి. కాలువలు శుభ్రం చేయించాలి. – చంద్రశేఖర్, స్థానికుడు

✓ సమస్య పరిశీలించి మురుగు కాలువలు శుభ్రం చేయిస్తాం. పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. – పద్మావతి, సర్పంచి

? తోటపల్లిగూడూరు ఇస్కపాలెం గ్రామం వద్ద దొరువు పక్కన వ్యర్థాలు పడేస్తున్నారు. దీని వల్ల దుర్గంధం వెదజల్లుతోంది. చెత్త నిల్వ చేరకుండా చూడాలి – మోహన్, స్థానికుడు

✓ సమస్య పరిశీలించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తాం. – చైతన్య, సర్పంచి

? పొదలకూరు రూరల్ పరిధిలోని ఉలవరపల్లిలో విద్యుత్తు దీపాలు మరమ్మతులకు గురై వెలగడం లేదు. – శ్రీనివాసులు, స్థానికుడు

✓ సిబ్బందికి చెప్పి సరిచేయిస్తాం.
– మధుసూదన్, పంచాయతీ కార్యదర్శి

? చేజర్ల మండలం వావిలేరులో ప్రధాన రహదారిపై నీరు నిలిచి దెబ్బతింది. – గ్రామస్థులు

✓ గుంతలు పూడ్చేస్తాం. – అన్వేశ్, ర.భ ఏఈ

చిత్రలేఖనంలో ప్రతిభావంతులు

విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: బుచ్చి పురపాలక పరిధిలోని డీఎల్ఎన్ఆర్ జూనియర్ కళాశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'ప్రకృతి అందాలు' అనే అంశంపై జరిగిన పోటీల్లో వినయ్ (ప్రథమ), శివకుమార్ (ద్వితీయ), సుదర్శన(తృతీయ) బహుమతులు కైవసం చేసుకున్నారు. విజేతలకు ప్రిన్సిపల్ రాఘవయ్య, అధ్యాపకులు సుబ్బారావు బహుమతులు అందించారు.

రోడ్లు ఛిద్రం.. వాహనదారులకు కష్టం

వర్షాలకు దెబ్బతిన్న వెంకన్నపాలెం రోడ్డు

న్యూస్‌టుడే, పొదలకూరు, తోటపల్లిగూడూరు, విడవలూరు, సైదాపురం, కలువాయి, రాపూరు

మొంథా తుపానుతో మెట్టప్రాంత ప్రజలకు అపార నష్టం వాటిల్లింది. పలు చోట్ల గ్రామాల్లో వాగులు పొంగి రోడ్లు తెగిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. కలువాయి, రాపూరు మండలాల్లో పంట నీటమునిగి రైతులు నష్టపోయారు. జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయడంతో ఎక్కడా ప్రాణనష్టం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

● పొదలకూరు మండలం నావూరు పెద్దవాగు పొంగి ప్రవహించడంతో నావూరు, బోగసముద్రం, చెన్నారెడ్డిపల్లి, కొండలరాయుడు కండ్రిగ గ్రామాల ప్రజలకు నాలుగు రోజులు రాకపోకలు నిలిచిపోయాయి. కలువాయి కట్టకింద ఉన్న గిరిజనులు, నరసింహకండ్రిక గ్రామంలో ఇళ్లలోకి నీరు చేరి నష్టపోయారు. ● విడవలూరు మండలం పార్లపల్లిలోని గిరిజన కాలనీలో కొన్ని గృహాలు కూలాయి. శిథిలావస్థకు చేరుకుంటే వర్షాలలో ఉరుస్తున్నాయని, ఎప్పుడు కూలిపోతాయోనని భయాందోళనలో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. ● తోటపల్లిగూడూరు మండలంలోని మహాలక్ష్మీపురం నుంచి వెంకన్నపాలెం, పాతకోడూరు తదితర గ్రామాల్లో రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. ఈదూరు ఎస్సీ కాలనీ, కోడూరు, విలుకానిపల్లి, నరుకూరు తదితర పంచాయతీల్లోని గిరిజన కాలనీల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

● సైదాపురం మండలం గులించర్ల, కృష్ణారెడ్డిపల్లి, పెరుమాళ్లపాడు, సముద్రాల వారికండ్రిగ, చాగణంరాజుపాళెం, దేవరవేమూరు, కుర్రపల్లి చెల్లెపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారాయి.

● రాపూరు మండలంలోని తెగచెర్లలో వరి పంట నీట మునిగింది. కొన్ని గ్రామాల్లో ధాన్యం తడవడంతో పుట్టి రూ.17 వేలు ఉండగా 14 వేలకు కొనుగోలు చేశారు. పంగిలి దైవ రూర్ రోడ్డు రెండు సార్లు కొట్టుకుపోయింది. వీరయ్యపాలెం, కోటూరుపాడు, గరిమెనపెంట మార్గాల్లో అడుగులోతు గుంతలు ఏర్పడింది. రాపూరు-పెంచలకోన రోడ్డు మార్గంలోని పడమరవీధిలో నీరు భారీగా చేరింది. వర్షాల తరువాత పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉందని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

● కలువాయి మండలం కుల్లూరు, వెంకటరెడ్డిపల్లి గ్రామాల్లో 450 ఎకరాలు కోతకు వచ్చిన పంట నేల వాలి నీట మునగడంతో మొలకలు వచ్చాయి. సోమశిల, నెల్లూరు ప్రధాన రోడ్డు అధ్వానంగా మారింది.

మొంథా తుపానుతో చేనేతలకు నష్టం

సంగం, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో వచ్చిన వరదలకు జిల్లా వ్యాప్తంగా చేనేత కార్మికులకు ఒక్కో కుటుంబానికి రూ.20 వేల వంతున నష్టం జరిగిందని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బాలాజీ అన్నారు. సంగంలో ఆదివారం ఆయన చేనేత కార్మికుల నివాసాలకు వచ్చి మగ్గం గుంతల్లో నీటి నిల్వ పరిశీలించి వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం కార్మికులకు పని లేదని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయన కోరారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. నాయకులు రామసుబ్బయ్య, గోపాల్, రవి, శీనయ్య తదితరులు హాజరయ్యారు.

కార్మికులతో మాట్లాడుతున్న సంఘం నాయకులు

ఎవరో వస్తారని ఎదురు చూడకుండా..!

పొక్లెయిన్‌తో గుంతలు పూడుస్తున్నారిలా...

సైదాపురం, న్యూస్‌టుడే: ఆ రోడ్డులో ప్రయాణాలు సాగించాలంటే వాహనదారులు నరకయాతన పడ్డారు... పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా.. ఒక వ్యక్తి స్పందించారు. మండల పరిధిలోని ఆదూరుపల్లి గ్రామానికి చెందిన బాలకృష్ణ సొంత నిధులతో పొక్లెయిన్ ఏర్పాటు చేసి తురిమెర్ల నుంచి డేగపూడి వరకు ఏర్పడిన గుంతలు పూడ్చారు. దీంతో కొంతమేర అవస్థలు తప్పాయని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కోనలో వన భోజనాలు

రాపూరు, న్యూస్‌టుడే: మండలంలోని పెంచలకోనలో ఆదివారం క్షీరాతి ద్వాదశి సందర్భంగా నందనవనంలో కార్తిక వనభోజనాలు, బంగారు గరుడ సేవ నిర్వహించారు. వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పెనుశిల లక్ష్మీ నృసింహస్వామి, ఆదిలక్ష్మితో పాటు ఆంజనేయస్వామి, గొల్లబోయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఉప కమిషనర్ శ్రీనివాసులు రెడ్డి భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు

నిత్యాన్నదాన పథకానికి రూ. లక్ష విరాళం

రాపూరు, న్యూస్‌టుడే: మండలంలోని పెంచలకోనలో ఆదివారం ఆలయ నిత్యాన్నదాన సత్ర నిర్వహణకు తిరుపతిలోని కోర్లగుంట వాస్తవ్యులైన నాగినేని శ్రీహరినాయుడు దంపతులు వారి కుమారుడు ఆర్యన్ష్ జన్మదినం సందర్భంగా లక్ష రూపాయల విరాళాన్ని ఉప కమిషనర్ పి.శ్రీనివాసులు రెడ్డికి అందజేశారు. అనంతరం వారు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మాతూరి కుటుంబానికి అండగా ఉంటాం

సంతాపం తెలుపుతున్న ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ దినేశ్‌రెడ్డి

విడవలూరు, న్యూస్‌టుడే: విడవలూరుకు చెందిన తెదేపా సీనియర్ నాయకులు మాతూరు శ్రీనివాసులురెడ్డి గుండెపోటుతో హఠాన్మరణం చెందడం బాధాకరమని ఏపీఈఎంసీఎల్ ఛైర్మన్ పోలంరెడ్డి దినేశ్‌రెడ్డి అన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. విడవలూరులో మాతూరు నివాసంలో ఆదివారం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణచైతన్య, ఏటూరు హరిరెడ్డి, సత్యంరెడ్డి, చెముకుల శ్రీనివాసులు, అమరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

కంటి వైద్య సేవలు సద్వినియోగం చేసుకోండి

శిబిరాన్ని ప్రారంభిస్తున్న సోమిరెడ్డి

వెంకటాచలం, మనుబోలు, న్యూస్‌టుడే: మండలంలోని టోల్‌ప్లాజా సమీపంలో ఫార్మసీ కళాశాలలో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సూచించారు. చెన్నై శంకర్ నేత్రాలయ కంటి వైద్యశాల, కాటంరెడ్డి ప్రసాద్ రెడ్డి, శోభారెడ్డి (యూఎస్ఏ) సంయుక్త ఆధ్వర్యంలో పది రోజుల పాటు నిర్వహించనున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం సోమిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. శంకర్ నేత్రాలయం ఆధ్వర్యంలో ఉచితంగా నేత్ర వైద్యసేవలు అందించడం అభినందనీయమన్నారు. అవసరమైన వారికి ప్రత్యేక వసతులతో కూడిన మొబైల్ సర్జికల్ యూనిట్‌లో ఇక్కడికక్కడే శస్త్రచికిత్సలు చేయడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యులు, కళాశాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ● మనుబోలులోని గమళ్లపాళేనికి చెందిన తెదేపా కార్యకర్త, కల్లుగీత కార్మికుడు కోసూరు శ్రీనివాసులు (55) పొలం పనులు చేస్తుండగా గుండెపోటుతో మృతిచెందారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి మృతుడి బంధువులను పరామర్శించి సంతాపం తెలిపారు.

ఎట్టకేలకు పూడికతీత

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు పట్టణంలోని సీహెచ్‌సీ ఎదుట అధ్వానంగా ఉన్న పంట కాలువలో ఎట్టకేలకు పూడిక తీశారు. కొన్ని నెలలుగా కాలువలో చెత్త, వ్యర్థాలతో నిండి వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి కాలువ పూడిక తీయించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కోవూరు సీహెచ్‌సీ వద్ద పూడిక తీసిన కాలువ

దుర్వాసనతో సతమతం

కోవూరు పట్టణ పరిధిలోని శాంతి నగర్ సొసైటీ వీధి పరిసరాల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన భరించలేకున్నామని స్థానికులు వాపోతున్నారు. డ్రైనేజీ కాలువల్లో మరుగుదొడ్ల పైపులు ఏర్పాటు చేయడంతో దుర్వాసన వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని పలువురు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, కోవూరు

జాతీయ రహదారిపై గుంతలు

కొడవలూరు మండల పరిధిలోని టపాతోపు సమీపంలో కోల్‌కతా- చెన్నై జాతీయ రహదారిపై ఉన్న వంతెన వద్ద రోడ్డు గుంతలమయంగా మారి అధ్వానంగా ఉంది. నిత్యం వేలాది వాహనాలు ఈ మార్గంలో వెళుతుంటాయి. గుంతల్లో ద్విచక్రవాహనాలు పడితే నియంత్రణ చేయలేక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి గుంతలు పూడ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, కొడవలూరు

రెండేళ్లుగా నిరుపయోగం

పొదలకూరు మండలం బిరదవోలు పంచాయతీ కళ్యాణపురం గిరిజన కాలనీలో మంచి నీటిని సరఫరా చేసే ట్యాంకు ధ్వంసమై సుమారు రెండేళ్లుగా నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం ట్యాంకు నుంచి నీటిని పట్టుకునేందుకు ఏర్పాటు చేసిన కుళాయిలు సైతం ధ్వంసమయ్యాయి. కాలనీలో ఉన్న ఏకైక ట్యాంకు వృథాగా ఉందని, అధికారులకు విన్నవించినా కనీసం పరిశీలించ లేదని స్థానికులు వాపోతున్నారు.
– న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

ముళ్ల చెట్లు..రాకపోకలకు ఇక్కట్లు

రామాపురం నుంచి దుగ్గుంట వెళ్లే రోడ్డు మలుపు వద్ద ముళ్ల చెట్లు పెరిగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చెట్లతో రోడ్డు ఇరుకుగా మారడంతో ఎదురెదురుగా వాహనాలు వాటిని అధిగమించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. విష సర్పాల సంచారంతో హడలిపోతున్నారు. అధికారులు స్పందించి ముళ్ల చెట్లను తొలగించాలని విన్నవిస్తున్నారు.
– న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

మురుగు కాలువలు అధ్వానం

కోవూరు జాతీయ రహదారి వద్ద సాయిబాబా ఆలయ సమీపంలో ఎన్ఎస్సార్ కాలనీలో మురుగు కాలువలు ధ్వంసమై అధ్వానంగా ఉన్నాయి. కొన్ని నెలలుగా వర్షం పడితే నీరంతా రోడ్లపైకి చేరుతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు పరిశీలించి కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, కోవూరు

'యూరియా కోసం మరోసారి జైలుకెళతా'

పొదలకూరు, న్యూస్‌టుడే: రైతులకు యూరియా అందించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వహిస్తే పోరాటం చేసి మరోసారి జైలుకు వెళ్లడానికైనా సిద్ధంగా ఉన్నానని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పొదలకూరు బస్టాండులో మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణను నిరసిస్తూ వైకాపా కోటి సంతకాల సేకరణలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

అన్ని రంగాల్లో రాణించాలి

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : జిల్లాలో వడ్డెరలు అత్యున్నత స్థానాలకు చేరుకోవాలని ఒంగోలు నీటిపారుదల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాపూరు వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. ఆదివారం నగరంలోని టూరిజం హోటల్‌లో జిల్లా వడ్డెర సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సభ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెరలు ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్ వన్ అధికారులుగా రాణించాలని పిలుపునిచ్చారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్లుగా ముగ్గురిని నియమించడం అభినందనీయమన్నారు. డీఎస్సీలో జిల్లా నుంచి 20 మంది ఉపాధ్యాయులుగా ఎన్నికయ్యారన్నారు. వీరిని సన్మానించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఉప్పు భాస్కర్, వెంకటేశ్వర్లు, మునుస్వామి, బత్తల కృష్ణయ్య, దేవుళ్ల భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా శ్రీనివాసులు

మనుబోలు, న్యూస్‌టుడే: మనుబోలు మండల డిప్యూటీ ఎంపీడీవోగా శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం లగడపాడు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి డిప్యూటీ ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు కృషి చేస్తామని తెలిపారు. పలువురు పంచాయతీ కార్యదర్శులు, అధికారులు ఆయన్ను కలిసి అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ వాణిశ్రీ తెలిపారు. జనరల్ విభాగంలో ఉర్దూ, ఇంగ్లీషు బోధించేందుకు జూనియర్ అధ్యాపకులను నియమిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 6 లోగా ఆత్మకూరు జూనియర్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18వ తేదీ ఆత్మకూరు జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నిఘా నేత్రాలతో నేరాలకు అడ్డుకట్ట

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

● ఫిబ్రవరి 27న పొదలకూరు శ్మశాన వాటికలో యాచకుడిపై బండరాయితో మోది హత్య చేసి నిందితుడు పరారయ్యాడు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా ప్రకాశం జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించి అరెస్టు చేశారు.

● జులై 27న ఎస్బీఐ ఏటీఎంలో చేజర్లకు చెందిన రైతు నగదు డ్రా చేసేందుకు యువకుడిని ఆశ్రయించగా.. రైతును మోసం చేసి రూ.40 వేలు కాజేశారు.. స్థానిక పోలీసులకు సమాచారమివ్వడంతో నిఘానేత్రాల ఆధారంగా పట్టుకున్నారు.

ఇటీవల గ్రామాల్లో చోరీలు, రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్నాయి. పోలీసు శాఖలో సిబ్బంది కొరత కారణంగా పలు కేసుల్లో నిందితులను పట్టుకోవడం కష్టతరంగా మారింది. పొదలకూరు మండల పరిధిలో ప్రధాన రహదారులు, కూడలి ప్రాంతాలు, వ్యాపార సముదాయాలు, మలుపులు, సమస్యాత్మక గ్రామాలను గుర్తించి 128 నిఘా నేత్రాలను ఏర్పాటు చేశారు. వీటిని నేరుగా పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేసి నిత్యం గమనిస్తున్నారు. ఆరు నెలల్లో పోలిస్తే నేరాలు కొంత మేరకు తగ్గాయి. ప్రతి గ్రామ ముఖ ద్వారం వద్ద నిఘానేత్రాలు ఏర్పాటు చేయడంతో కొత్త వ్యక్తులు మండలంలోకి ప్రవేశిస్తే వారి కదలికలు, నేరం చేసి పరారైన వ్యక్తి ఏ మార్గంలో వెళ్లిన అక్కడి నిఘా నేత్రాల ద్వారా సులువుగా గుర్తిస్తున్నారు. శివారు ప్రాంతాల్లో గృహాల వద్ద ఏర్పాటు చేసుకుంటే నేరాలకు అడ్డుకట్ట పడుతుందని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.● ఎస్సై హనీఫ్ మాట్లాడుతూ... ప్రతి గ్రామంలోని కూడలి ప్రాంతాల్లో నిఘా నేత్రాలు ఏర్పాటు చేశామని, అవసరమైన చోట త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు కూడా సహకరించాలని పేర్కొన్నారు.

బిరదవోలులో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు

క్రీడలతో మానసికోల్లాసం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వానికి, మేధాశక్తికి దోహదపడతాయని, క్రీడాకారులు ఆటల్లో రాణిస్తే గుర్తింపు సైతం లభిస్తుందని ఉప విద్యాశాఖాధికారి జానకిరామయ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో డివిజన్ స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. విజేతలుగా నిలిచిన వారిని డివిజన్ స్థాయి నుంచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. డివిజన్ స్థాయి కోఆర్డినేటర్ మహేశ్, విద్యాశాఖాధికారులు తిరుపతయ్య, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థినులతో అధికారులు, ఉపాధ్యాయులు

ఆ మూడు మండలాలు ఎటు వైపు..!

న్యూస్‌టుడే, సైదాపురం

జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు, గ్రామాల ఏర్పాటు, సరిహద్దులు పేర్ల మార్పులపై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం ఇటీవల సచివాలయంలో భేటీ అనంతరం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మీడియా సమావేశంలో కొన్ని కీలక విషయాలపై మాట్లాడారు. నియోజకవర్గంలోని మండలాలన్నీ ఒకే రెవెన్యూ డివిజన్‌లో ఉండేలా చూస్తామని, అలా చేయడంతో పరిపాలన సౌలభ్యం ఉంటుందని, అందుకనుగుణంగా రాష్ట్రమంతా మార్పులు, చేర్పులు చేస్తామని వివరించారు. ● వెంకటగిరి నియోజకవర్గం ప్రస్తుతం రెండు జిల్లాల పరిధిలో ఉంది. వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాలు తిరుపతి జిల్లాలో.. రాపూరు, సైదాపురం, కలువాయి మండలాలు నెల్లూరు జిల్లాలో ఉన్నాయి. తాజా ప్రకటనతో ఏ జిల్లా పరిధిలోకి ఉంటుందోనని ఆసక్తి నెలకొంది.. మండలాలన్నీ ఒకే రెవెన్యూ డివిజన్‌లోకి చేర్చాలనే ఆలోచనలో భాగంగా మార్పులు జరుగుతాయని అధికారులు చెబుతున్నారు..! గతంలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి, సైదాపురం మండలాలు నెల్లూరు జిల్లాలోని గూడూరు డివిజన్ పరిధిలో ఉండేవి. రాపూరు మండలం పోలీసు డివిజన్ గూడూరు కాగా, రెవెన్యూ డివిజన్ నెల్లూరు పరిధిలో ఉండేది. కలువాయి మండలం ఎక్కువగా ఆత్మకూరు డివిజన్ పరిధిలోనే కొనసాగింది. ప్రస్తుతం జిల్లాలో పూర్తిగా వెనుకబడిన వాటిల్లో ఈ మూడు మండలాలే ఉన్నాయి. జిల్లా కేంద్రానికి దూరంగా ఉండటంతో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా తక్కువగా ఉంది.

ఊరన్నారు.. చిట్టడవిలా మార్చారు..!

చేజర్లలో కనీస వసతులకు నోచుకోని కాలనీ

చేజర్ల, న్యూస్‌టుడే: ఇళ్లు కాదు. . ఊళ్లు నిర్మించామని నాటి వైకాపా పాలనలో నాయకులు పదే పదే తమ ప్రసంగాల్లో చెప్పేవారు. చేజర్లలో లబ్ధిదారులకు గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న తిప్పపై కాలనీ నిర్మాణం చేపట్టారు. ఇందులో ఒకటిన్నర సెంట్ చొప్పున మూడు వందలకుపైగా ప్లాట్లు సిద్ధం చేసి 200 మందికి పట్టాలు పంపిణీ చేశారు. 127 మంది నుంచి నివేశన స్థలాల పత్రాలు తీసుకొని గృహాలు మంజూరు చేశారు. రూ.కోట్లు ఖర్చు చేసి విద్యుదీకరణ, రహదారుల పనులు చేశారు.

◆ కీలకమైన గృహాల నిర్మాణాలు గుత్తేదారులకు అప్పగించారు. తమ ఇంటి పక్కన ఖాళీ స్థలంలో ఇల్లు ఇవ్వమంటే ఎక్కడో నాలుగు కిలోమీటర్ల దూరంలో స్థలం మాకెందుకని లబ్ధిదారులు కాలనీ వైపు కన్నెత్తి చూడలేదు. గుత్తేదారులే ఆరు మాత్రమే పూర్తి చేయగా, 21 స్లాబ్ దశలో 91 పునాదుల్లో ఆగిపోయాయి. ప్రభుత్వం మారడంతో గుత్తేదారులు నిర్మించే కాలనీలపై విజిలెన్సు విచారణ మొదలవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. ప్రస్తుతం కాలనీ చిట్టడవిలా మారింది. ఉపాధి హామీ పథకం నుంచి పునాదుల కోసం లబ్ధిదారుల ఖాతా జమైన నగదు ఇవ్వాలని గుత్తేదారులు కోరారు. దీనికి లబ్ధిదారులు ససేమిరా అంటున్నారు. ◆ కాలనీలో పునాదులు వేసిన కారణంగా 127 లబ్ధిదారులు మరోచోట పక్కా ఇళ్లు నిర్మించుకునే అవకాశాన్ని కోల్పోయారు. గృహనిర్మాణ శాఖ ఏఈ ప్రకాష్ మాట్లాడుతూ విజిలెన్స్ విచారణ అనంతరం తదుపరి కార్యాచరణ ఉంటుందన్నారు.

తొలగని జలం.. దోమలకు ఆవాసం

ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు, కార్యాలయాలు జలమయమయ్యాయి. విడవలూరులోని పశువైద్యశాల ఆవరణలో వర్షపు నీరు ఇంకా తొలగలేదు. ఆవరణ బురదమయంగా ఉండటంతో దుర్వాసన వస్తోందని స్థానికులు, పశుపోషకులు వాపోతున్నారు. ఆవరణలో పిచ్చి మొక్కలు పేరుకుపోవడంతో విషసర్పాలు సంచరిస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, విడవలూరు

ఇలాగైతే వ్యాధులు రావా..!

పొదలకూరు- కలువాయి మార్గంలో ఉన్న లింగంపల్లి తోపు ప్రధాన రహదారి వద్ద రోడ్డుపై చెత్తను వేయడంతో గుట్టలుగా పేరుకుపోయాయి. చెత్త నుంచి దుర్వాసనతో స్థానికులు సతమతమవుతున్నారు. వ్యర్థాల కోసం నిత్యం పశువులు, పందులు వస్తున్నాయి. గాలి వీచినపుడు చెత్త నుంచి దుమ్ము ఎగిరిపడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి నిల్వ ఉన్న వ్యర్థాలను అక్కడి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

ఆటో బోల్తా..డ్రైవర్‌కు గాయాలు

సంగం, న్యూస్‌టుడే: సిద్ధీపురం పంచాయతీ అనుబంధ గ్రామమైన అనసూయనగర్ నుంచి కూరగాయలను విక్రయించేందుకు ఆదివారం సంగంకు వస్తున్న ఆటో తరుణవాయి సమీపంలో అదుపుతప్పి జాతీయరహదారిపై నుంచి పల్టీలు కొడుతూ పొలాల వైపు బోల్తా పడింది. డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఎస్సై రాజేశ్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

(c) eenadu

నెల్లూరు

•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

నరసింహకొండపై వైభవంగా పవిత్రోత్సవాలు

నెల్లూరు(గ్రామీణం, న్యూస్‌టుడే: నగర శివారులోని నరసింహ కొండ ఉన్న వేదగిరి లక్ష్మీనరసింహకొండపై మూడో రోజైన ఆదివారం పవిత్రోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కుంభారాధన, నివేదన, స్నపన తిరుమంజనం, పవిత్ర సమర్పణ తదితర పూజలు జరిగాయి. సాయంత్రం గిరి ప్రదక్షిణ, పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి ఛైర్మన్ అచ్యుత శంకర్‌రెడ్డి, ఈవో గోపి తదితరులు పాల్గొన్నారు.

వాకర్ల అసోసియేషన్లకు అవార్డులు

నెల్లూరు (క్రీడా విభాగం), న్యూస్‌టుడే: నగరంలోని పలు వాకర్ల అసోసియేషన్లకు అవార్డులు వరించాయి. ఆదివారం గుంటూరులో జరిగిన డిస్ట్రిక్ట్ 203 కాన్ఫరెన్స్ కార్యక్రమంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్, వివేకానంద వాకర్స్ అసోసియేషన్‌కు ఆరు అవార్డుల వంతున వచ్చాయి. ఉత్తమ అధ్యక్షుడు, కార్యదర్శి, వైద్య శిబిరాల నిర్వహణ, వేసవి క్రీడా శిబిరాల నిర్వహణ తదితరాలకు అవార్డులు సొంతం చేసుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా! (10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: నవాబుపేట కుమ్మరి వీధిలోని ఎన్-8/86 స్తంభానికి విద్యుద్దీపం వెలగడం లేదు. రాత్రయితే చీకటిగా ఉంటుంది. ఇబ్బందులు పడుతున్నాం. **- మహేంద్ర, స్థానికుడు**

సమాధానం: విద్యుద్దీపాన్ని ఏర్పాటుచేస్తాం. **- ముజాహిద్దీన్, డీఈ, నగరపాలకసంస్థ**

? నవాబుపేట మసీదు వీధిలో కాలువలు పూడికతో నిండిపోయాయి. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. **- హబీబున్నీసా**

✓ సిబ్బందితోకాలువలను శుభ్రం చేయిస్తాం. **- డాక్టర్ కనకాద్రి, ఆరోగ్యాధికారి**

- నెల్లూరు (నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే

వంతెన నిర్మించే వరకు పోరాటం



మాట్లాడుతున్న విఠపు బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: నగర శివారులోని చింతారెడ్డిపాలెం వద్ద జాతీయరహదారి కూడలిలో వంతెన నిర్మించే వరకు పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆదివారం వంతెన సాధన కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ హైవే దాటే క్రమంలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నాయని వాపోయారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల దృష్టికి ఎన్నిసార్లు ఈ సమస్యను తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఆ సాధన కమిటీ కన్వీనర్ కాయం శ్రీనివాసులు మాట్లాడుతూ ఇక్కడ వంతెన నిర్మించే వరకు నిరసన కార్యక్రమాలు చేస్తామన్నారు. అందులో భాగంగా ఈ నెల 16వ తేదీ మానవహారం చేపట్టనున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కట్టా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇదేనా ప్లాస్టిక్‌పై సమరం

మూన్నాళ్లముచ్చటగా బాటిల్ క్రషింగ్ యంత్రాలు

నెల్లూరు (నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశుద్ధ్యం మెరుగుకు ప్రాధాన్యమిస్తున్నాయి. ఇందుకు స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా ప్లాస్టిక్‌పై సమరాన్ని ప్రకటించాయి. ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఆశయానికి తూట్లు పడుతున్నాయి. అందుకు నిదర్శనమే నగరంలో ప్లాస్టిక్ బాటిళ్ల వ్యర్థాల నియంత్రణకు ఏర్పాటుచేసిన యంత్రాలు. ఇవి మూన్నాళ్లముచ్చటగా మారాయి.

గాంధీ బొమ్మ కూడలిలో నిరుపయోగంగా యంత్రం

నగరంలో శీతలపానీయాలు, వాటర్ బాటిళ్లు, కొబ్బరి నీళ్లు కూడా ప్లాస్టిక్ బాటిళ్లలోనే విక్రయిస్తున్నారు. నిత్యం లక్ష వరకు ఇవి చెత్తలో చేరుతున్నాయి. వీటిని నిర్మూలించేందుకు మూడేళ్ల క్రితం నగరంలో ప్లాస్టిక్ క్రషర్ యంత్రాలను ఏర్పాటుచేశారు. జెలినో కంపెనీ సీఎస్సార్ నిధులతో ఒక్కో యంత్రం రూ.4 లక్షల వంతున మూడింటిని రూ.12 లక్షలతో కొనుగోలు చేసి నగరపాలకసంస్థకు అందించింది. వీటిని అధికారులు రద్దీ ప్రాంతాలైన ఆర్టీసీ బస్టాండు, గాంధీ బొమ్మ కూడలి, ఆత్మకూరు బస్టాండు ప్రాంతాల్లో ఏర్పాటుచేశారు.

నీరుగారిన ఆశయం

నగరపాలకసంస్థ అధికారులు ఈ యంత్రాలను ఏర్పాటుచేసి చేతులు దులుపుకొన్నారు. వారం రోజుల పాటు మాత్రమే ప్రజలు వీటిని వినియోగించుకున్నారు. ప్రారంభ సమయంలో ప్లాస్టిక్ బాటిళ్లను యంత్రంలో వేస్తే టోకెన్ వస్తోందని, దాన్ని తీసుకెళ్లి నగరంలోని షోరూంలలో దుస్తులు కొనుగోలు చేస్తే అయిదు శాతం రాయితీ ఇస్తారని ప్రచారం చేశారు. కానీ అది ఆరంభశూరత్వంగా మారిపోయింది. ప్రస్తుతం ఈ యంత్రాలు మరమ్మతులకు గురయ్యాయి. వీటిని బాగు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

సామాజిక రక్షణ చట్టం ఏర్పాటుచేయాలి

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం రజకులకు సామాజిక రక్షణ చట్టాన్ని ఏర్పాటుచేస్తామని చెప్పి చేయకపోవడం దారుణమని ఆ వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య ఆరోపించారు. ఆదివారం నగరంలోని జెట్టి శేషారెడ్డి భవన్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి నేతలు రజకుల సంక్షేమానికి .రూ.10 వేల కోట్లు కేటాయించి వృత్తిదారులకు అత్యాధునిక పరికరాలు అందిస్తామని చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంకయ్య, రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, సుబ్బారావు, చెక్కవరపు వెంకటరెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవాంగ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ మండలం శ్రీవేదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో కార్తిక వన భోజన మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా తెదేపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి హాజరయ్యారు. నూతన కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ మన్నెం సతీష్, ప్రధాన కార్యదర్శిగా కొండా మాధవయ్య, కోశాధికారిగా రాజేంద్రప్రసాద్ తదితరులు ఎన్నికవగా వారితో ప్రమాణ స్వీకారం చేయించారు.

చిత్రకారుడికి సత్కారం

నెల్లూరు(జడ్పీ): విజయవాడలో ఆర్ట్ అసోసియేషన్స్ గిల్డ్ ఆధ్వర్యంలో మన సంస్కృతి అనే అంశంపై రాష్ట్ర స్థాయి చిత్ర కళా ప్రదర్శన ఆదివారం నిర్వహించారు. ఇందులో నెల్లూరుకు చెందిన చిత్ర కళాకారుడు ప్రదర్శించిన వారణాసి చిత్రం ప్రశంసలు అందుకుంది. ఆయన్ను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, తెలుగు సాంస్కృతిక అకాడమీ ఛైర్మన్ శరత్‌చంద్ర ఘనంగా సత్కరించారు.

తీరని సమస్య

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: నగరంలోని వెంకటేశ్వరపురంలో నిర్మిస్తున్న నూతన ఫ్లైఓవరు నిర్మాణం సందర్భంగా అధికారుల నిర్లక్ష్యం.. ప్రజాప్రతినిధుల ద్వంద వైఖరితో ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీస్తోంది. గత కొన్ని నెలల క్రితం నూతన బ్రిడ్జి నిర్మాణం కోసం స్థానికంగా ఉంటున్న వారికి పరిహారం అందజేశారు. నిర్మాణాన్ని బట్టి పరిహారం, వేరే ప్రాంతంలో స్థలాన్ని కేటాయించారు. కొందరు సొంతంగా నిర్మాణాలను కూల్చివేసుకోగా, కొన్నింటిని అధికారులే తొలగించారు. అధికారుల తీరుతో ఇప్పటికీ కొన్ని నిర్మాణాలు పూర్తిగా ధ్వంసం చేయలేదు. సగం తొలగించి మిగిలినవి అలాగే వదిలేశారు. పరిహారం తీసుకున్న వారే మళ్లీ అక్కడే ఆక్రమించేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో స్థానికంగా ఉంటున్న వారితో గొడవలకు దిగుతున్నారు. సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సగం తొలగించిన నిర్మాణాలు

వడ్డెరలు అన్నిరంగాల్లో రాణించాలి

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : జిల్లాలో వడ్డెరలు అత్యున్నత స్థానాలకు చేరుకోవాలని ఒంగోలు నీటిపారుదల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాపూరు వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. ఆదివారం నగరంలోని టూరిజం హోటల్‌లో జిల్లా వడ్డెర సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సభ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెరలు ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్ వన్ అధికారులుగా రాణించాలని పిలుపునిచ్చారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్లుగా ముగ్గురిని నియమించడం అభినందనీయమన్నారు. డీఎస్సీలో జిల్లా నుంచి 20 మంది ఉపాధ్యాయులుగా ఎన్నికయ్యారన్నారు. వీరిని సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఉప్పు భాస్కర్, ఐక్యవేదిక నాయకులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, డైరెక్టర్లుగా ఎంపికైన ఒలిపి మునుస్వామి, బత్తల కృష్ణయ్య, దేవుళ్ల భాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా వన భోజనాలు

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి 417వ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని విరాట్‌నగర్ సమీపంలో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో జరిగిన ఈ వేడుకల్లో గోవిందమాంబ సమేతంగా ఉన్న స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు వైభవంగా చేశారు. అనంతరం వన భోజన కార్యక్రమాలు జరిగాయి. కార్పొరేటర్ రామకృష్ణ ఆచారి, విశ్వబ్రాహ్మణ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై వ్యర్థాలు.. ప్రజలకు కష్టాలు

నగరంలోని భక్తవత్సలనగర్‌లో రోడ్డు అంచున చెట్ల కొమ్మల వ్యర్థాలు ఉన్నాయి. సాయిబాబా మందిరం సమీపంలో ఉండడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. **- న్యూస్‌టుడే, నెల్లూరు (విద్య)**

దారి అధ్వానం.. రాకపోకలు గగనం

నగరంలోని ఇరుగాళమ్మ సంఘం ఎస్‌కేవీ నగర్‌లో చర్చి రోడ్డు అధ్వానంగా తయారైంది. మట్టి రోడ్డు కావడంతో వర్షాలకు దారుణంగా మారింది. కనీసం నడిచేందుకు కూడా వీలు కావడం లేదని, ఎన్నికలప్పుడు వచ్చిన పాలకులు తరువాత ముఖం చాటేశారని, పన్నులు వసూలు చేసే అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని స్థానికులు వాపోతున్నారు. **- న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్)**

శునకాలతో హడల్

నగరంలో కుక్కలతో ప్రజలు హడలిపోతున్నారు. పలు వీధుల్లో ఒంటరిగా బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. రేయింబవళ్లు తేడా లేకుండా రోడ్లపై గుంపులుగా తిరుగుతున్నాయి. స్కూళ్లకు వెళ్లే చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. కోటమిట్ట, మెక్లిన్స్ రోడ్డు, హబీబుల్లా వీధి, వీబీఎస్ కల్యాణ మండపం, ఖతీజా మసీదు వీధుల్లో వీటి బెడద ఎక్కువగా ఉంది. **- న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్)**

క్రైస్తవుల ప్రార్థనలు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : నగరంలోని సుబేదారుపేటలోని సమాధుల తోటలో క్రైస్తవ సోదరులు వారి కుటుంబాల్లో మరణించిన వారి సమాధుల చెంత ఆదివారం ప్రార్థనలు చేశారు. సమాధుల పండగను పురస్కరించుకొని ఈప్రార్థనలు జరిగాయి. కార్యక్రమంలో విచారణ గురువు వైడీ హృదయరాజ్, సహాయ గురువులు పాల్గొన్నారు.

శిథిల గూళ్లు

నెల్లూరునగరం మూలాపేట ఇరుగాళమ్మ ఆలయం వద్ద గల రాజీవ్ స్వగృహకల్పలో ఇళ్లు శిథిలమవుతున్నాయి. మెట్ల మార్గాలు ధ్వంసమై పడిపోయాయి. ఇళ్లపై మొక్కలు పెరిగాయి. కిటికీలకు రక్షణ లేదు. ఈదురుగాలుల నుంచి రక్షణగా ఖాళీ బియ్యం సంచులు, పాత దుస్తులు కిటికీలకు కట్టుకున్నారు. ఈ ప్రాంతం చెత్తతో నిండిపోయింది. **-ఈనాడు, నెల్లూరు**

సంబరాలు చేసుకుంటున్న ఉద్యోగులు

గ్రీన్ హోమ్ సీఎండీ జన్మదిన వేడుకలు

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: నగరంలోని శ్రీహరినగర్‌లోని గ్రీన్ హోమ్ రియల్ ఎస్టేట్ కార్యాలయంలో ఆ సంస్థ సీఎండీ బొల్లినేని హజరత్‌నాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కోసి గ్రీన్ హోమ్ డైరెక్టర్ ఆనంద్‌నాయుడుకు మార్కెటింగ్ డైరెక్టర్ బొల్లినేని వెంకటరామారావు తినిపించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ టీమ్ సభ్యులు పి.మధుసూదన్, బీవీ శేషు, ఆర్.రామ్మోహన్‌రావు, ఎం.శ్రీనివాసరావు, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించకపోవడం బాధాకరం

నెల్లూరు(టౌన్) : రాష్ట్రంలో భక్తులకు రక్షణ కల్పించలేకపోవడం బాధాకరమని వైకాపా జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆదివారం మాగుంట లేఅవుట్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదుట కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కాకాణి పూజిత పాల్గొన్నారు.

జోగి రమేష్ అరెస్టు మంచి పద్ధతి కాదు

నెల్లూరు(టౌన్): తప్పు చేసినట్లు సాక్ష్యాలు లేకపోయినా అరెస్టు చేయడం మంచి పద్ధతి కాదని నెల్లూరు పార్లమెంటు మాజీ సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నెల్లూరులోని తన నివాసంలో మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టుపై మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ సీబీఐ విచారణ చేయమని అడిగిన ఆయన్ను తెల్లవారు జామున అరెస్టు చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు.

తెరపై ఈనాడు

ఎం.1 సినిమాస్.: స్క్రీన్. 1 బాహుబలి ది ఎపిక్ (తెలుగు), స్క్రీన్ .2. మాస్ జాతర (తెలుగు), స్క్రీన్..3. కె.ర్యాంప్ (తెలుగు), **స్పైస్.సినిమాస్:** స్క్రీన్ 3.. కె.ర్యాంప్ (తెలుగు, స్క్రీన్ 4...బాహుబలి ది ఎపిక్ (తెలుగు), స్క్రీన్.5..మాస్ జాతర (తెలుగు), **రెయిన్ సినిమా :** స్క్రీన్..1. చైన్సా మ్యాన్ ది మూవీ: రెజ్ ఆర్క్ (జపనీస్), మాస్ జాతర (తెలుగు) , స్క్రీన్..2.. బాహుబలి ది ఎపిక్ (తెలుగు), . కె.ర్యాంప్ (తెలుగు), స్క్రీన్..3.. బాహుబలి ది ఎపిక్ , మాస్ జాతర (తెలుగు), స్క్రీన్.. 4.. . కె.ర్యాంప్, బైసన్ (తెలుగు)

రహదారులు లేక.. నడవలేక

నెల్లూరు (పద్మావతి సెంటర్), న్యూస్‌టుడే

నగర శివారు వైఎస్సార్‌నగర్‌లో మట్టి రోడ్లతో వర్షాకాలంలో అక్కడి ప్రజలు రాకపోకలకు పడరాని పాట్లు పడుతున్నారు. ఈప్రాంతంలో 20 వీధులు ఉన్నాయి. అయిదు వీధుల్లో మాత్రమే రోడ్లు వేశారు. మిగిలిన వాటిలో వేయకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా మారాయి. ఇందులో నడిచి ఇంట్లోకి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పదిహేను సంవత్సరాల నుంచి ఉందని, అధికారులు.ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని స్థానికులు మండిపడుతున్నారు. నగర పాలక సంస్థ అధికారులు తాగునీటి పైపులైన్లు వేయకపోవడం విచిత్రంగా ఉంది. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇవి సరిపోక నిత్యావసరాలకు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో వర్షాకాలం వస్తే నరకయాతన అనుభవిస్తున్నామని వారు చెబుతున్నారు. దోమలతో నిద్ర పోలేకున్నామని వాపోతున్నారు. నగర కార్పొరేషన్ అధికారులు దోమల మందు పిచికారీ చేసిన పాపాన పోలేదన్నారు. కరెంటు కూడా సక్రమంగా ఉండకపోవడంతో రాత్రిళ్లు నిద్ర పోలేకపోతున్నామంటున్నారు. భక్తవత్సల్‌నగర్‌లోని ఎల్.ఐ.సి. కాలనీలో కూడా మట్టి రోడ్లు ఉండడంతో అక్కడి ప్రజలు అనేక కష్టాలు పడుతున్నారు.

వైఎస్సార్ నగర్‌లో రోడ్డు దుస్థితి

ఇబ్బందులకు గురిచేయడం తగదు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : నగరంలోని రోడ్డు మార్జిన్ వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయరాదని రోడ్డు మార్జిన్ వ్యాపారుల సంక్షేమ సంఘం, సీఐటీయూ గ్రామీణ అధ్యక్షులు సుధాకర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని అపోలో ఆసుపత్రి ప్రాంతంలో సమావేశం జరిగింది. ఇందులో డిసెంబరు 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న సీఐటీయూ మహాసభలపై కరపత్రాలను ఆ సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ప్రసాద్ పాల్గొన్నారు.

వేధింపులపై ఫిర్యాదు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్న భర్తతో పాటు అతని కుటుంబ సభ్యులపై పోలీసులు వేధింపుల కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మద్రాసు బస్టాండ్ సమీపంలోని ఓ అపార్టుమెంటులో సల్మా, రియాజ్ అహ్మద్ దంపతుల నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా భర్త, అత్తింటి వారు సల్మాను కట్నం కోసం వేధిస్తున్నారు. ఈ మేరకు బాధితురాలు ఆదివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇంటింటి కార్యక్రమానికి శ్రీకారం

నెల్లూరు (వేదాయపాలెం), న్యూస్‌టుడే: డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు స్థానిక సమస్యలను గుర్తించేందుకు సోమవారం నుంచి ఇంటింటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు 54వ డివిజన్ నాయకులు జహీర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి గోడ పత్రికలను ఆదివారం క్లస్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు షాహీద్ తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి మహా కార్తిక దీపోత్సవం

నెల్లూరు (జడ్పీ), న్యూస్‌టుడే: ఈనెల అయిదు నుంచి ఏడో తేదీ వరకు మహా కార్తిక దీపోత్సవం నిర్వహిస్తున్నామని సింహపురి గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు ప్రకటించారు. బుధవారం సాయంత్రం కోలాటాలు, పండరి భజన, దీపాలతో ర్యాలీ, కాశీపండితులతో గంగాహారతి, సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ ఉపన్యాసం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సమితి సభ్యులు ఆదివారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆరో తేదీ అన్నవరంలోని సత్యనారాయణ స్వామి దేవస్థానం ఉత్సవమూర్తులతో, అక్కడి ఆలయ అర్చకుల ద్వారా సామూహిక వ్రతం చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనేవారు నాలుగో తేదీ లోపు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఏడో తేదీ కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. స్వర్ణభారత్ ట్రస్టు ట్రస్టీ దీపా వెంకట్ సహకారంతో జరిగే ఈకార్యక్రమాలకు వివిధ ఆశ్రమాల ప్రముఖులు వస్తారన్నారు. సమావేశంలో సింహపురి గణేశ్ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షులు పి.సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

కనులపండువగా రుద్రాభిషేకం

మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి. పక్కన నుడా ఛైర్మన్ కోటంరెడ్డి, నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, భువనేశ్వరిప్రసాద్ తదితరులు

నెల్లూరు(జడ్పీ),న్యూస్‌టుడే: సింహపురి ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం శివుడికి మహారుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. బాలాజీనగర్‌లోని త్యాగరాజ కల్యాణమండపంలో ఆ ధార్మిక సంస్థ అధ్యక్షులు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉచ్చి భువనేశ్వరిప్రసాద్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమాలు జరిగాయి. కుర్తాళం సిద్ధేశ్వరి పీఠం పండితులు మాచవోలు రమేశ్ శర్మ నేతృత్వంలో ఈ కార్యక్రమం చేశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి దంపతులు, ఉపమేయర్ రూప్‌కుమార్ ఈకార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు పాలన దిగ్విజయంగా సాగాలని, జిల్లా అభివృద్ధి వైపు పరుగులు తీయాలని వేడుకున్నామన్నారు. కమిటీ సభ్యులు తానే మస్తాన్, ఎ.శ్రీనివాసులునాయుడు, ఎ.హనుమంతరావు, ఎ.ప్రభాకర్, ఎన్.శ్రీకృష్ణ, సుభాన్‌బాషా, యలమందారెడ్డి, భీమిరెడ్డి, తదితరులు భక్తులకు సేవలు అందించారు.

రోజుల తరబడి పనులు.. ఇక్కట్లు

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

నెల్లూరు నగరంలో అభివృద్ధి పనులు ఆలస్యంగా జరగడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ట్రంకురోడ్డు సమీపాన ఉన్న బృందావనంలో నూతన కాలువల నిర్మాణంలో జాప్యం కారణంగా ప్రయాణికులు, పాదచారులకు సమస్యలు తప్పడం లేదు. ఈ ప్రాంతం ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఇక్కడి నుంచి పలు వీధుల్లోకి వెళ్తుంటారు. అలాంటి ప్రాంతంలో నెలరోజులుగా కాలువ పనుల పేరుతో, పక్కవీధుల్లో సిమెంట్ రోడ్డు నిర్మాణల పేరుతో తవ్వేశారు. రోజుల తరబడి పనులు జాప్యం చేస్తున్నారని ప్రయాణికులు, పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. వివిధ సంస్థల కార్యాలయాల ముందు కాలువలు నిర్మించినా పనులు పూర్తి చేయడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధచూపకపోవడంతో ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు. స్థానికంగా ఉన్న వైద్యశాలలకు వెళ్లే అంబులెన్స్‌లు ఆలస్యంగా నడుస్తూ రోగుల బాధలు వర్ణనాతీతం.

బృందావనంలో కాలువపై కర్రల సాయంతో రాకపోకలు

నిబంధనల అమలు ఎక్కడ?

బృందావనంలో ఎల్ఐసీ కార్యాలయం ప్రాంతంలో ఉన్న బ్యాంకులకు వచ్చే ఖాతాదారులు, స్థానిక ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చే రోగులు, మెస్‌లకు వచ్చే వారు వాహనాలు నిలిపేందుకు స్థలం లేదు. ముందుగా ఉంచిన వారు ఎవరైనా వాహనం తీస్తారేమో అని నిరీక్షిస్తుంటారు. వాహనాలు నిలిపే స్థలం కోసం అవస్థలు పడుతున్నారు. వివిధ సంస్థల కార్యాలయాలు పనిచేసే సమయంలో పరిస్థితి అగమ్యగోచరంగా ఉంటోంది. ఇక్కడ వేలాది రూపాయలకు వ్యాపార భవనాలు అద్దెకు ఇస్తున్నారేగానీ, నిబంధనల ప్రకారం వారు పార్కింగ్ స్థలం చూపాల్సి ఉన్నా.. పట్టించుకునేవారు లేరు. ఇటీవల సమీపంలో ఏర్పాటు చేసిన వస్త్ర దుకాణానికి వచ్చేవారికి పార్కింగ్ సౌకర్యం పూర్తిస్థాయిలో లేక ఆ రోడ్డంతా వాహనాలు నిలుపుతున్నారు. దీంతో రద్దీ మరింతగా పెరిగి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేసి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పనులు వేగంగా జరిగేలా చూస్తాం

ప్రస్తుతం జరుగుతున్న పనులు వెంటనే జరిగేలా, వీలైతే రాత్రి సమయంలో చేయించేలా అధికారులకు ఆదేశాలు ఇస్తామని ఎస్ఈ రామోహన్‌రావు తెలిపారు. ఇక్కడి మిగిలిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

శత వసంతాల జయంతి నివాళి

మరపురాని స్మృతి పథములో...

100 Years 100 Years

శ్రీ A.P. జయరామ్ గారు
Rtd. DSP

మీ పుట్టినరోజు మాకు పండుగరోజు... మీ జీవితం మాకు స్ఫూర్తిదాయకం...
విధినిర్వహణ, క్రమశిక్షణ, కర్తవ్యపాలనలో అంకితభావం చూపి అజాతశత్రువుగా
లోకాన్ని విడిచి భౌతికంగా మానుండి దూరమై మా అందరి హృదయాలలో చిరస్థాయిగా
నిలిచిపోయిన మహామనిషి.. మీకు మా శతజయంతి నివాళులు

కుమార్తె - మనమళ్లు
గాదిరెడ్డి పద్మావతి లేట్ శ్రీ గాదిరెడ్డి చంద్రశేఖరరావు సతీమణి
మాధవకృష్ణ, మహేష్‌బాబు - జ్యోతి, రామకృష్ణ - కృష్ణప్రీతి
కుమారులు - కోడళ్లు
అచ్యుత రవిచంద్ర, ఐపీఎస్ రిటైర్డ్ - రాజ్యలక్ష్మి
ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్
అచ్యుత పార్థసారథి, రిటైర్డ్ జిల్లా జడ్జి - వైదేహి

ముని మనుమరాలు
ముని మనుమడు :
చందన, గగన్
మనుమళ్లు, మనుమరాళ్లు :
కార్తీక్, మానస
మోహనవైష్ణవి, ముకుంద హర్ష

(c) eenadu

ఈనాడు శ్రీ సత్యసాయి
సోమవారం నవంబరు 3, 2025 5

సప్తగిరి కూడలిలో తెరపై ఆటను వీక్షిస్తున్న క్రికెట్ అభిమానులు

జాతీయ జెండాతో యువత సంబరాలు

అమ్మాయిల గెలుపు
ఆనందం రెట్టింపు

నగరవాసుల విజయదరహాసం

మహిళల వన్డే ప్రపంచకప్ పోటీలో భారత జట్టు విజయం సాధించడంతో ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా సంబరాలు మిన్నంటాయి. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో గెలుపు వరించడంతో ఆనందంతో వీధుల్లోకి వచ్చి కేరింతలు కొట్టారు. అంతకు ముందు పలు పట్టణాల్లో భారీ సంఖ్యలో ఎల్ఈడీ తెరల్లో క్రికెట్ వీక్షించే ఏర్పాట్లు చేపట్టారు. గెలుపొందిన అనంతరం అనంతపురం టవర్ క్లాక్ వద్దకు భారీ సంఖ్యలో క్రికెట్ అభిమానులు చేరుకొని జాతీయ జెండాలతో సంబరాలు జరుపుకొన్నారు. వేడుకల్లో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొనడం విశేషం. - ఈనాడు, అనంతపురం

నకిలీ పొజిషన్ సర్టిఫికెట్ల సృష్టిపై కేసు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: పాపంపేట భూములపై తమకు యాజమాన్య హక్కులు ఉన్నాయంటూ ఇటీవల ప్రకటించిన రాధారెడ్డి వెంకట కిరణ్‌పై రూరల్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పాపంపేటలో ఆరు సర్వే నంబర్లకు సంబంధించిన భూములకు గతంలో పనిచేసిన వీఆర్వో రమయాదవ్ తమకు మంజూరు చేశాడని వెంకట కిరణ్ ఇటీవల మీడియా ముందు వెల్లడించారు. దీనిపై జిల్లా రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. వెంకట కిరణ్ చెబుతున్నట్లు తాను ఎలాంటి పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వలేదని, తన పేరును ఫోర్జరీ చేశారని విచారణలో తేలింది. నకిలీ పొజిషన్ ధ్రువీకరణ పత్రాలు సృష్టించినట్లు విచారణలో తేలడంతో ఆర్వో కేశవనాయుడు ఫిర్యాదు మేరకు నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పుట్టపర్తి, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరిస్తామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. కదిరి, పెనుకొండ, ధర్మవరం ఆర్డీవో కార్యాలయాలతో పాటు మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లోనూ సంబంధిత అధికారులు వినతులు స్వీకరిస్తున్నారు. వాటిని కూడా పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలుగానే పరిగణించి పరిష్కరిస్తామన్నారు. మరింత సమాచారం కోసం కాల్ సెంటర్ నంబరు 1100కు సంప్రదించవచ్చన్నారు. ఫిర్యాదుదారుడు తప్పనిసరిగా ఆధార్‌కార్డు తీసుకురావాలని కోరారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లేపాక్షి ఆలయ సందర్శన

లేపాక్షి, న్యూస్‌టుడే: లేపాక్షి దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయాన్ని ఆదివారం సాయంత్రం దేశ వ్యాప్తంగా ఉన్న 40 మంది శిక్షణ న్యాయమూర్తులు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలోని పురాతన కట్టడాలు, చారిత్రక నిర్మాణాలు, వేలాడే స్తంభం, ఏడు శిరస్సుల నాగేంద్రుడు, సీతమ్మ పాదం, ఏకశిలా నంది విగ్రహం తదితర ఆలయ చరిత్రను వివరించారు. వీరభద్రస్వామి, దుర్గాదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అర్చకులు వారిని ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ, ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. వారి వెంట ఆర్ఐ ప్రమీల, తదితరులు ఉన్నారు.

ఆలయ ప్రాంగణంలో కమిటీ ఛైర్మన్ రమానందన్‌తో శిక్షణ న్యాయమూర్తులు

కాలుష్య కోరల్లో తటాకాలు

■ జలాలు మురుగుమయం
■ రైతులకు తీరని నష్టం

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం పట్టణంలో అంతర్భాగమైన శ్రీకంఠపురం, కొట్నూరు చెరువులు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. పట్టణంలోని మురుగునీరు నిత్యం అందులోకి చేరుతోంది. వీటి బాగోగులు చూడాల్సిన అధికారులు, పాలకులు పట్టించుకోవటం లేదు. గతంలో ఈ చెరువుల కింద ఆయకట్టు రైతులు వందల ఎకరాల్లో వివిధ పంటలు పండించేవారు. ఓ వైపు తటాకాలు ఆక్రమణకు గురి కావడం.. మరోవైపు నీరు కలుషితమై పంటల సాగుకు ఆమోదయోగ్యం కాక అన్నదాతలు నష్టపోతున్నారు. బోర్ల ద్వారా కలుషిత నీరు వస్తుండటంతో రైతులు భూములను బీడుగా వదిలేస్తున్నారు.

కొట్నూరు చెరువు ఆయకట్టు : 700 ఎకరాలు
రైతులు : 1,000 మంది

శ్రీకంఠపురం చెరువు ఆయకట్టు : 300 ఎకరాలు
రైతులు : 350 మంది

మురుగుతో నిండిన శ్రీకంఠపురం చెరువు

కాలువ సైతం.. పెన్నారకుముద్వతీ ప్రాజెక్టు నుంచి కొట్నూరు చెరువుకు వర్షాకాలంలో వరద నీటిని మళ్లించేందుకు యాబై ఏళ్ల కిందట 8 కిలోమీటర్ల మేర కుడికాలువ నిర్మించారు. ప్రస్తుతం ఈ కాలువలో మురుగు నీరు ప్రవహించి కొట్నూరు చెరువులో కలుస్తున్నాయి. శ్రీకంఠపురం చెరువుది ఇదే స్థితి. లక్ష్మీపురం, మోడల్‌కాలనీ, శ్రీకంఠపురం ప్రాంతాల నుంచి వచ్చే మురుగు మొత్తం శ్రీకంఠపురం చెరువులోకి చేరుతోంది.

మురుగు శుద్ధిప్లాంటు ఏర్పాటు ఎప్పుడు?

హిందూపురం పట్టణంలోని మురుగునీటిని శుద్ధిచేసేందుకు ప్లాంటు మంజూరైందని గతంలో సంబంధిత అధికారులు తెలిపారు. అయితే ఇప్పటి వరకు దీనికి సంబంధించిన ఎలాంటి పనులు ప్రారంభం కాకపోవటం గమనార్హం.

అధికారులకు సూచించాం
- శైలేష్, డీఈ ఇరిగేషన్, హిందూపురం

పట్టణంలోని మురుగునీరు చెరువులకు చేరకుండా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే మున్సిపల్ అధికారులను కోరాం. మరోసారి వారి దృష్టికి తీసుకెళ్తాం. చెరువుల్లో జలాలు కలుషితం కాకుండా తగిన చర్యలు చేపడతాం.

జ్యోతిర్లింగాల దర్శనం సంతోషదాయకం : మంత్రి

సోమందేపల్లి, న్యూస్‌టుడే: పవిత్రమైన కార్తిక మాసంలో ఎన్నో వ్యయప్రయాసలతో ప్రజల కోసం ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్య దర్శన భాగ్యం కల్పించడం సంతోషకరమని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో స్థానిక అంబాభవాని ఆలయ కల్యాణ మండపంలో శనివారం ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్య దర్శనంతో పాటు చైతన్యదేవి అమ్మవారు, స్వామివారి విశేష అలంకరణ చేపట్టారు. ఆదివారం మంత్రి సవిత దర్శించుకొని మొక్కుబడి పూజలు చేపట్టారు. కార్తిక మాసంలో ప్రజలు, మహిళలు, శివ భక్తులు ఒకేచోట ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్య దర్శనం ఏర్పాటు చేయడం మంచి పుణ్య కార్యమని, ఇందుకు కృషి చేసిన బ్రహ్మకుమారీలు సుగంధీ దీదీ, హేమలత, లీలావతి, శాంత తదితరులను మంత్రి అభినందించారు. నవ దుర్గామాత వేషధారణలో చిన్నారుల ప్రదర్శన, నృత్యం ప్రజలందరినీ మంత్రముగ్ధులను చేసింది. తెదేపా నాయకులు ఆంజనేయులు, సిద్ధలింగప్ప, రామకృష్ణ, నరసింహులు, సూరి, శ్రీరాములు, రామాంజనేయులు పాల్గొన్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకొంటున్న మంత్రి సవిత, తెదేపా నాయకులు

పేదలకు ఆవాస యోగం

● జిల్లావ్యాప్తంగా 47,341 దరఖాస్తులు

పుట్టపర్తి, లేపాక్షి, కదిరి, న్యూస్‌టుడే: పట్టణాల్లో సొంతిల్లు లేని పేదలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ (పీఎంఏవై-జీ) ఫేజ్ ప్రకటించింది. గ్రామీణ ప్రాంతాల్లో గృహం లేని నిరుపేదలను గుర్తించడానికి రెండు నెలల కిందట అధికారులు సమగ్ర సర్వే చేశారు. రాష్ట్రంలో నేటికి సొంతిల్లు లేని నిరుపేదలు ఉన్నారని సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు. ఆ మేరకు పీఎంఏవైజీ 2-0 కింద ఇళ్ల నిర్మాణానికి అవకాశం కల్పించింది. గతంలో దరఖాస్తు చేసుకోని వారు నవంబర్ 5వ తేదీ వరకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. స్థలం ఉన్న వారందరికీ ఇళ్లు మంజూరు చేయనున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 47,341 దరఖాస్తులు అందాయి. వీటిలో అత్యధికంగా మడకశిర నియోజకవర్గం నుంచి 15,663 దరఖాస్తులు రాగా అత్యల్పంగా హిందూపురం నుంచి 2,984 మాత్రమే అందాయి.

ఇళ్ల మంజూరుకు మ్యాప్‌ను పరిశీలిస్తున్న పీడీ వెంకటనారాయణ, సిబ్బంది

నియోజకవర్గాల వారీగా దరఖాస్తులు	
పుట్టపర్తి	4,214
ధర్మవరం	5,689
హిందూపురం	2,984
కదిరి	7,922
మడకశిర	15,663
పెనుకొండ	6,714
రాప్తాడు	4,155

అర్హులందరికీ ఇళ్లు మంజూరు

పల్లెల్లో అర్హులందరికి పీఎంఏవైజీలో దరఖాస్తు చేసుకుంటే, పరిశీలించి మంజూరు చేస్తాం. ఇప్పటికే 47 వేల దరఖాస్తులు అందాయి. ఈ నెల 5వతేదీ వరకు అవకాశం ఉంది. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
- వెంకటనారాయణ, హౌసింగ్ పీడీ

ఇవి ఉంటేనే..

సొంత స్థలం ఉండాలి. స్థలం పట్టా, రిజిస్ట్రేషన్, పొజిషన్ పత్రాల్లో ఏదైనా ఒకటి ఇవ్వాలి. రేషన్‌కార్డు, భార్య, భర్త ఆధార్ జిరాక్స్ దరఖాస్తుకు జతపరచాలి.

కూలిన హెచ్చెల్సీ నీటి మళ్లింపు గేట్లు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: తుంగభద్ర ఎగువ కాలువకు ప్రమాదం జరిగినప్పుడు హెచ్చెల్సీ ప్రధాన కాలువ నీటిని వాగుకు మళ్లించడానికి నాగలాపురం 116-399 కిలోమీటరు వద్ద ఏర్పాటు చేసిన నాలుగు గేట్ల(షట్టర్ల)లో మూడు ఆదివారం రాత్రి కూలిపోయాయి. వీటిని 1965లో హెచ్చెల్సీ కాలువ నిర్మించిన సమయంలో ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా మరమ్మతులు లేకపోవడంతో తుప్పపట్టి ఒక్కసారిగా కూలిపోయాయి. బొమ్మనహాళ్ హెచ్చెల్సీ ఏఈఈ అల్లాప్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ ఘటన వల్ల నీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం ఉండదన్నారు. కాలువకు నీటి సరఫరా నిలిపివేశాక మరమ్మతులు చేస్తామన్నారు. హెచ్చెల్సీకి జలాశయం వద్ద నీటి పంపిణీ 1,800 క్యూసెక్కుల నుంచి 1600 క్యూసెక్కులకు తగ్గించడంతో సరిహద్దులో నీటి మట్టం కూడా తగ్గిందని ఇన్‌ఛార్జి ఏఈఈ సుధాకర్‌రావు పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ

అనంతపురం (విద్యుత్తు), న్యూస్‌టుడే: విద్యుత్తు సమస్యలు ఎదుర్కొంటున్న వినియోగదారులు నేరుగా ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్‌కు ఫోన్ చేసి తెలియ జేయవచ్చునని అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల విద్యుత్తుశాఖ ఎస్ఈలు శేషాద్రిశేఖర్, సంపత్‌కుమార్ తెలిపారు. తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని వెల్లడించారు. విద్యుత్తు సేవలకు సంబంధించిన ఎలాంటి ఫిర్యాదులైనా నిర్దేశిత సమయంలో 8977716661 నంబరుకు వినియోగదారులు ఫోన్ చేసి సీఎండీకి చెప్పవచ్చన్నారు. అలాగే 9133331912 నంబరుకు చాట్ చేసి కూడా విద్యుత్తు అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లవచ్చునని వివరించారు. వినియోగదారుల సౌకర్యార్థం కల్పించిన ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పొదుపు రుణం.. కష్టతరం!

■ రూ.కోట్లల్లో బకాయిలు
■ కొత్తవి అందక సభ్యుల పాట్లు

జిల్లాలో గ్రామైక్య సంఘాలు:	1,311
స్వయం సహాయ సంఘాలు:	33,400
మహిళా సంఘాల సభ్యులు :	3,51,922

ఒక్క మండలంలోనే రూ.20 లక్షలకు పైగా

కొత్తచెరువు, న్యూస్‌టుడే: డ్వాక్రా సంఘాల్లో రాజకీయ జోక్యం, సిబ్బంది అక్రమాలతో లావాదేవీలు అస్తవ్యస్తంగా మారి గందరగోళానికి దారి తీస్తున్నాయి. గ్రామస్థాయిలో సంఘాలపై పర్యవేక్షణ కొరవడి కొంత మంది లీడర్లు సభ్యులు చెల్లించిన కంతు మొత్తాన్ని స్వాహా చేయడం వెలుగులోకి వచ్చాయి. కొందరు యానిమేటర్లు, సీసీలు స్త్రీనిధి రుణాల్లో స్వాహా పర్వానికి పాల్పడి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ నమోదుల్లో వ్యత్యాసాలు వెలుగు చూసినా నేటికి చర్యలు శూన్యం. ఈ నేపథ్యంలో కొందరు బకాయిలు చెల్లించక పోవడంతో ఆయా మండలాలను ఎన్‌పీఏ కింద చేర్చారు. దీంతో రెండు నుంచి నాలుగేళ్లుగా స్త్రీనిధి రుణాలు మంజూరు కావడం లేదు. బయట అధిక వడ్డీలకు అప్పులు చేయలేక.. రుణాల కోసం ఎదురు చూస్తున్నామని మహిళలు వాపోతున్నారు.

స్త్రీనిధి రుణాల చెల్లింపుల్లో జిల్లా ఎన్‌పీఏ నివేదిక మేరకు 9 మండలాలున్నాయి. ఒక్కో మండలంలో రూ.20 లక్షలకుపైగా మొండి బకాయిలు పేరుకున్నాయి. చెల్లింపులు 90 రోజులు దాటిన మొండి బకాయి మొత్తం రూ.3.57 కోట్లు ఉంది. అలాగే రూ.10 లక్షల చొప్పున బకాయిలు పేరుకున్న మండలాలు 14 ఉండగా వీటిలో రూ.2.29 కోట్లు మొత్తం రూ.5.86 కోట్లు మొండి బకాయిలు పేరుకున్నాయి. బుక్కపట్నం రూ.95.91 లక్షలు, ముదిగుబ్బ రూ.68.62, నల్లచెరువు రూ.37.60, కొత్తచెరువు రూ.33.11, మడకశిర రూ.31.67, కదిరి రూ.23.95, నల్లమాడ రూ.23.51 లక్షల మేర మొండి బకాయిలు పేరుకున్నాయి.

ఎన్‌పీఏ పరిమితి పెంచాం - నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

స్త్రీనిధి రుణాల చెల్లింపుల్లో జాప్యం కారణంగా రూ.20 లక్షలకు పైగా మొండి బకాయిలు పేరుకుపోయిన 15 మండలాలు ఎన్‌పీఏ కింద నిలిచిపోయాయి. దీంతో ఆ మండలాల్లోని సంఘాలకు రుణాలు మంజూరు లేదు. ప్రస్తుతం మారిన నిబంధనల మేరకు ఎన్‌పీఏ పరిమితిని రూ.35 లక్షలకు పెంచాం. జిల్లాలో ఒకటి, రెండు మండలాలు తప్ప ఇతర మండలాలకు స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తాం.

రాష్ట్రస్థాయి జూడో ఛాంపియన్ పోటీలకు ఎంపిక

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం కేజీబీవీ విద్యాలయం విద్యార్థినులు ఇద్దరు జిల్లాస్థాయి జూడో పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు విద్యాలయ ప్రత్యేక అధికారిణి మాధవి తెలిపారు. రెండు రోజుల కిందట అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి జూడో పోటీల్లో విద్యాలయం తరఫున ఎస్.మషేరా, డి.సానియా, గౌతమి, అనూష పాల్గొన్నారని వీరిలో ఎస్.మషేరా, డి.సానియా ప్రతిభ కనబరచి బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ నెల 6, 7 తేదీల్లో కాకినాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు జిల్లా తరఫున పాల్గొంటారన్నారు.

విద్యార్థులతో విద్యాలయ ప్రత్యేక అధికారిణి మాధవి తదితరులు

కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

స్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

సుబ్రహ్మణ్యేశ్వరుడి దర్శనానికి 4 గంటల సమయం

పంపనూరుకు పోటెత్తిన భక్తజనం

స్వర్ణ కవచ అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో కార్తికమాస పూజలు శోభాయమానంగా సాగాయి. స్వామి వారికి విశేష అర్చనలు, ఆకు పూజ, నైవేద్యం, అభిషేకాలు, పంచామృతాభిషేకాలు జరిగాయి. కార్తిక మాసం రెండవ ఆదివారం సందర్భంగా వేలాదిమంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్తిక దీపాలను వెలిగించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి రావడంతో దర్శనం పూర్తి అయ్యేందుకు 4 గంటల సమయం పట్టింది. యాగమండపంలో హోమాల్లో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. రద్దీకి అనుగుణంగా అధికారులు ప్రత్యేకంగా సెక్యూరిటీ సిబ్బంది ఏర్పాటు చేయాల్సి ఉంది.

సంతల జోరు.. వసూళ్లలో హుషారు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంత జిల్లాలోనే అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు పెద్దది. రుసుం వసూళ్లు కూడా ఎక్కువే. గత ఏడాది కంటే ఈసారి ఆదాయం మరింత పెరిగింది. ఇక్కడ నిత్యం చీనీ సంత జరుగుతుంది. శనివారం గొర్రెలు, మేకల సంత, ఆదివారం పశువుల సంత నిర్వహిస్తారు. యార్డుకు ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.5.10 కోట్లు ఆదాయ లక్ష్యం కాగా గత ఏడాది నాటికి రూ.3 కోట్లు వసూలైంది.

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని సంతలో చీనీ రాసులు

1,40,359 టన్నుల విక్రయాలు

అనంతలో చీనీ మార్కెట్ ఏటా జనవరి నుంచి సెప్టెంబరు వరకు జరుగుతుంది. అడపాదడపా అక్టోబరులో కూడా మార్కెట్‌కు కొద్దిగా దిగుబడులు వస్తాయి. కేవలం రెండు నెలలు మాత్రమే సంత మూతపడుతుంది. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకు మొత్తం 1,40,359 టన్నుల చీనీ

నెల	చీనీ (టన్నుల్లో)	రుసుం (రూ.ల్లో)
జనవరి	454	82,550
ఫిబ్రవరి	1,650	2,04,150
మార్చి	15,041	19,80,250
ఏప్రిల్	26,837	36,83,900
మే	19,015	32,19,320
జూన్	16,004	24,41,000
జులై	28,115	28,82,600
ఆగస్టు	18,992	20,82,500
సెప్టెంబరు	12,991	13,47,550
అక్టోబరు	1,260	1,24,894

లక్ష్యానికి చేరువలో అనంత మార్కెట్ యార్డు

కాయలు విక్రయించారు. రూ.180.48 కోట్ల వ్యాపారం జరిగింది. ఇప్పటివరకు యార్డుకు రుసుం రూపేణా రూ.3 కోట్లు వసూలైంది. అందులో చీనీ సంతలో రూ.1,80,48,714, గొర్రెలు, మేకల సంతలో రూ.65,83,632, పశువుల సంతలో రూ.46,04,030, ఇతర రూ.7,63,626 ఆదాయం వచ్చింది.

లక్ష్యాన్ని అధిగమిస్తాం
- రాఘవేంద్రకుమార్, ఇన్‌ఛార్జి ఎంపికశ్రేణి కార్యదర్శి (అనంతపురం)

అనంత మార్కెట్‌యార్డుకు ఈ ఆర్థిక సంవత్సరం రూ.5.10 కోట్లు రుసుం వసూళ్ల లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటికే రూ.3 కోట్ల ఆదాయం వచ్చింది. పశువుల సంతతో కొంత ఆదాయం తగ్గినా.. చీనీ, గొర్రెల సంతలతో బాగుంది. ఇంకా 5 నెలల్లో రూ.2.10 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఉద్యోగులు, సిబ్బంది సహకారంతో పూర్తి లక్ష్యాన్ని అధిగమిస్తాం.

నేత్రపర్వం.. తెప్పోత్సవం

శింగనమల (బుక్కరాయసముద్రం), న్యూస్‌టుడే : శింగనమల మండల కేంద్రంలోని శ్రీ రంగరాయలు చెరువులో ఆదివారం సాయంత్రం తెప్పోత్సవ కార్యక్రమాన్ని గ్రామపెద్దలు ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. 600 ఏళ్ల నుంచి నుంచి కొనసాగుతున్న తెప్పోత్సవంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ముందుగా ఆమె చెరువు వద్ద సొంత నిధులతో నిర్మించిన దర్శామటం ప్రారంభించారు. తెప్పపై వెంకటరమణస్వామి, కాలవగట్టు పార్వతీపరమేశ్వరులు, నరసింహస్వామి ప్రతిమలను కొలువుదీర్చిన అర్చకులు చెరువులో విహరింపచేశారు.

చెరువులో సాగుతున్న ఉత్సవం.. అంతర్చిత్రంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ తదితరులు

అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి

మీ ఉన్నతికై శ్రమించిన, మీ కుటుంబ సభ్యుల/ఆత్మీయుల అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి ప్రకటనలు ఈనాడులో తక్కువ ఖర్చుతో ప్రకటనలు ప్రచురణ కొరకు
పూర్తి వివరములకు:
8008709784

(c) eenadu

ఆధ్యాత్మిక సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామికి నేడు (సోమవారం) ఉదయం 10.45 గంటలకు ఆలయంలోని కల్యాణ మండపంలో ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం ఆరుగంటలకు సాధారణ దర్శనం, నిత్య పూజా కైంకర్యాలు జరుగుతాయి. 7 నుంచి 9 గంటల మధ్య అభిషేకం, స్వర్ణకవచ సేవలుంటాయి. 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు స్వామి వారి సర్వదర్శనం ఉంటుంది.

సంతల ఆదాయం రూ.3.24 లక్షలు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని వారం సంతల్లో మొత్తం రూ.3,24,950 ఆదాయం వచ్చింది. అందులో శనివారం గొర్రెలు, మేకల సంతలో రూ.1,91,650, ఆదివారం పశువుల సంతలో రూ.1,33,300 ఆదాయం వచ్చింది.

అందుకో యువతా.. క్వాంటందే భవిత

జేఎన్‌టీయూలో ఏర్పాటు చేయనున్న క్వాంటం ప్రయోగశాల భవనం

జేఎన్‌టీయూలో టెక్నాలజీ ప్రయోగశాల ♦ డిసెంబరు నుంచి శిక్షణ

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: సాంకేతిక రంగంలో క్వాంటం టెక్నాలజీకి రోజురోజుకూ ప్రాధాన్యం పెరుగుతోంది. ఇందులో నైపుణ్యం సాధించిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం క్వాంటం టెక్నాలజీ అన్ని రంగాల్లో విస్తృతం చేయడానికి ప్రత్యేక చొరవ చూపుతోంది. ఈ క్రమంలో విద్యార్థుల భవిష్య త్తును తీర్చిదిద్దడానికి జేఎన్‌టీయూ అధికారులు క్వాంటమ్ ప్రయోగశాల ఏర్పాటు చేయడం శుభపరిణామం. నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం, రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. వాటితోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ ప్రయోగశాలలు విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల అధ్యాపకులకు క్వాంటం టెక్నాలజీపై ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. (అడ్వాన్స్‌డ్ గ్లోబల్ ఫౌండేషన్) ఏజీఎఫ్ సంస్థ ఫ్యూచర్ స్కిల్స్ ప్రయోగశాలలకు సహకారం అందించడానికి ముందుకొస్తున్నారు. ఈసీటీ సంస్థ, ఎంఎన్‌ఐటీ విశ్వవి ద్యాలయం క్వాంటమ్ టెక్నాలజీలో ఆన్‌లైన్ శిక్షణలు ఇస్తున్నారు. ఆ తరహాలో ప్రయోగశాలలో జేఎన్‌టీయూలో ఆన్‌లైన్ శిక్షణ ఇస్తారు. ఈ ప్రయోగశాల కార్యకలాపాలు నిర్వహణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు.

నూతన ఆవిష్కరణలే లక్ష్యం

ఈ ప్రయోగశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ సంబంధించిన అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. ఇంజినీరింగ్, సాధారణ డిగ్రీ విద్యార్థులకు కూడా ఇందులో శిక్షణ పొందవచ్చు. విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు చేపట్టడమే లక్ష్యంగా ప్రయోగశాల ప్రారంభిస్తున్నట్లు జేఎన్‌టీయూ అధికారులు చెబుతున్నారు. అమరావతి ప్రభుత్వ టెక్నాలజీ వారు క్వాంటం టెక్నాలజీ పోటీలు ఇటీవల జేఎన్‌టీయూ నిర్వహించారు. ఇలాంటి పోటీలు మరిన్ని నిర్వహించడానికి ఈ ప్రయోగశాల వేదిక కానుంది.

త్వరలో అందుబాటులోకి తెస్తాం

వివిధ సాఫ్ట్‌వేర్‌సంస్థలు, పారిశ్రామికసంస్థల సహకారంతో క్వాంటం ప్రయోగశాల ఏర్పాటు చేస్తున్నారు. నూతనంగా నిర్మించిన భవనంలోనే ఈ ల్యాబ్ ఉంటుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ రంగాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తాం. ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

- ఆచార్య సుదర్శనరావు, ఉపకులపతి, జేఎన్‌టీయూ

ఆలయానికి వెండి కానుకల వితరణ

వెండి కవచాలు, మకరతోరణాలు అందజేస్తున్న దాతలు

గుంతకల్లు పట్టణం: గుంతకల్లు పట్టణంలోని కోదండరామ స్వామి దేవాలయానికి వెండి కవచాలు, మకరతోరణాలను దాతలు అందజేసినట్లు ఈవో మల్లికార్జున తెలిపారు. ఆలయంలో శ్రీరాముడు, సీతమ్మ, లక్ష్మణుల అలంకరణ కోసం కొంత మంది భక్తులందరూ కలిసి 8 కిలోల వెండితో తయారీ చేసిన కవచాలు, మకర తోరణాలను ఆలయంలో సంప్రోక్షణ నిర్వహించి స్వాములను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. దాతలు పద్మావతమ్మ, ప్రశాంత, శంకరనారాయణ, సత్యనారాయణ, జగదీష్ గుప్త, వంకదార రామకృష్ణయ్య శ్రేష్ఠి, ప్రసాద్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, కందూరి తిమ్మయ్య, పోలా రాము, భగవత్ గీత భక్తమండలి, వెల్లూరి నరసింహులు, వంకదార ఉష తదితరులు ఆలయానికి అందజేశారని ఈవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ శ్రీనాథ్‌గౌడ పాల్గొన్నారు.

నెట్టికంటయ్య సన్నిధిలో రైల్వే భద్రతా కమిషనర్

ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భద్రతా కమిషనర్ శ్రీనివాస్, డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, న్యూస్‌టుడే: భారత రైల్వేలోని దక్షిణ రైల్వే జోన్ (ముంబయి) రైల్వే భద్రతా కమిషనర్ శ్రీనివాస్ ఆదివారం గుంతకల్లుకు వచ్చారు. ఆయన వచ్చిన సందర్భంగా డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాతో పాటు ఇతర శాఖల అధికారులు పుష్ప గుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. కమిషనర్‌తో పాటు డీఆర్ఎం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి చెందిన అధికారులు, వేదపండితులు వేదమంత్రాలతో స్వాగతం చెప్పారు.

వ్యాపారాభివృద్ధికి ఎగ్జిబిషన్‌తో తోడ్పాటు

మాట్లాడుతున్న ఏపీ బులియన్ సంఘం అధ్యక్షుడు విజయ్‌కుమార్

ధర్మవరం, న్యూస్‌టుడే: బంగారు నగల వ్యాపారులు వ్యాపారంలో మరింత రాణించేందుకు, సరికొత్త డిజైన్లు విక్రయించడానికి విజయవాడలో వచ్చే నెలలో భారీ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు ఏపీ బులియన్ వ్యాపారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని విష్ణుప్రియ రెసిడెన్సీలో స్థానిక బంగారు నగల వ్యాపారుల సంఘం అధ్యక్షుడు శీలి రెహమాన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి వ్యాపారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ కార్పొరేట్ బంగారు సంస్థలకు దీటుగా వినియోగదారులకు సరికొత్త డిజైన్ల నగలు అందుబాటులో ఉంచినప్పుడే స్థానిక వ్యాపారులు రాణిస్తారన్నారు. అనంతరం వ్యాపారులు ఎగ్జిబిషన్‌లో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నంబూరి శంకరనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శులు జయం విశ్వనాథ్, మల్లేశ్వరరావు, స్టేట్ అడ్వైజర్ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ రావు, రాజేంద్రప్రసాద్, ఈసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఎంపికైన బాలికలతో పీడీలు, ఉపాధ్యాయులు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: క్రీడలు మానసికోల్లాసం కలిగించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు దోహదం చేస్తాయని వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో కబడ్డీ సబ్-జూనియర్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు పోటీపడ్డారు. ప్రతిభ చూపిన బాలబాలికలను సత్యసాయి జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శిక్షకులు మాట్లాడుతూ 7 నుంచి 9వ తేదీ వరకు కర్నూలు జిల్లా మంత్రాలయంలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఈ రెండు జట్లు తలపడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి సుహాసిని, శాప్ కబడ్డీ శిక్షకులు ప్రవీణ్, అనిల్, పలువురు పీఈటీలు పాల్గొన్నారు. దాత పోతకుంట రాజశేఖర్ క్రీడాకారులు, నిర్వాహకులకు భోజన వసతి కల్పించారు.

బాలుర జట్టు: మహమ్మద్ ఆసిఫ్, జాకీర్, యేసు రాజు, నవరత్న, నవదీప్, నూర్ మహమ్మద్, జి.మహమ్మద్, కుమార్, హర్షవర్ధన్, హేమంత్‌కుమార్, రాజు, విజయ్‌ప్రసాద్, యశ్వంత్, మహమ్మద్‌గౌస్.

బాలికల జట్టు: నవ్య, లిఖిత, జానీ మహేశ్వరి, భాను మహేశ్వరి, సుచరిత, హిమబిందు, శాంతి, జీవన్ సాజియా, హర్షవలి, శిరీషా, మంజుల, రాధిక, నాగ లావణ్య, ఎస్.లిఖిత.

భారీ స్కోరు దిశగా పుదుచ్చేరి జట్టు

శతకం చేసిన నెయన్ కంగయన్

అనంతపురం (క్రీడలు), న్యూస్‌టుడే: అనంతపురం ఆంధ్రప్రదేశ్ అండర్-23 కల్నల్ సీకే నాయుడు నాలుగు రోజుల క్రికెట్ పోటీలో పుదుచ్చేరి జట్టు భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. తొలిరోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి ఆ జట్టు ఆంధ్ర జట్టుపై మొదటి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 268 పరుగులు చేసింది. అనంత క్రికెట్ మైదానంలో ఉదయం టాస్ గెలిచిన ఆంధ్ర జట్టు ప్రత్యర్థి జట్టును తొలి బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన పుదుచ్చేరి జట్టు 12 పరుగులకే తొలి వికెట్ కోల్పోయింది. రెండో వికెట్ 72 పరుగుల వద్ద కోల్పోయింది. జట్టుకు కెప్టెన్ నెయన్ కంగయాన్ (131, 21×4) అద్భుతమైన బ్యాటింగ్‌తో ఆదుకున్నాడు. నాలుగో వికెట్ 224 పరుగుల వద్ద కోల్పోయిన తర్వాత బ్యాటర్లు మరింత జాగ్రత్తగా ఆడి వికెట్లను కాపాడుకున్నారు. ఆంధ్ర బౌలర్లలో ఎస్.కామిల్, ఆదిత్యరెడ్డి, హేమంత్‌రెడ్డి, సుమిత్ చెరో వికెట్ కూల్చారు. ఈ పోటీని ఆంధ్ర క్రికెట్ సంఘం జీఎం డి. శివకుమార్, ఆపరేషన్స్ మేనేజరు ఆదిత్యవర్మ, ఏఎల్‌సీఏ పి.శ్రీనిరంజన్, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి వి.భీమలింగారెడ్డి, సంయుక్త కార్యదర్శి వి.భీమలింగారెడ్డి, అడ్మిన్ మేనేజరు పీకే సాగర్‌చౌదరి ప్రారంభించారు.

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు ప్రారంభం

పోటీల్లో తలపడుతున్న జట్లు

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 69వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ సెపక్‌తక్రా పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా జాతీయ జెండాకు వందనం చేసి జ్యోతిప్రజ్వలన గావించారు. ఆల్ ఇండియా సెపక్‌తక్రా ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పరిశీలకులు రమేష్, విశాల్‌లు మాట్లాడుతూ సెపక్‌తక్రాలో అత్యుత్తమ ప్రదర్శన చూపాలని సూచించారు. 13 జిల్లాల నుంచి 220 బాలురు, బాలికలు పాల్గొన్నారు. తొలిరోజు వివిధ జిల్లాల క్రీడాకారులు పోటీల్లో హోరాహోరీగా తలపడ్డారు.

4న టేబుల్ టెన్నిస్ జిల్లా జట్ల ఎంపిక

అనంతపురం (క్రీడలు), న్యూస్‌టుడే: విశాఖలో జరగనున్న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా అండర్-15, సీనియర్ మహిళల, పురుషుల జట్లను ఈ నెల 4న ఎంపిక చేయనున్నట్లు టీటీ సంఘం కార్యదర్శి ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు అనంతపురం క్లబ్‌లో ఎంపిక పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ పాటవాలు చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయి పోటీలు 17 నుంచి 20వరకు విశాఖలో జరుగుతాయి. ఆసక్తిగల జిల్లా క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొని ప్రతిభను నిరూపించుకోవాలని ఆయన సూచించారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నచో మా దృష్టికి తెచ్చినచో కొంటాము స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం ☎ 7382114647.

JOBS

Wanted: Telecallers, Custodians (Ladies) Montessori Elite EM School, Gollapalli, Rapthadu, ATP. Call: 8886654850, 9100281294.

ప్రముఖ కంపెనీలో స్పానింగ్ కోసం అభ్యర్థులు ఆవసరం. అర్హత: ఇంటర్/ఏదైనా డిగ్రీ. ధర్మవరం. Ph: 7639430742.

అనంతపురం పట్టణం సందుపేటలోని Company నందు టెలికాల్లర్స్ పనిచేయుటకుతక్షణం తెలుగు, కన్నడ యువతులు కావలెను. జీతం: 9,000 - 12,000. ఇన్సెంటివ్స్ సెల్: 9398063479

FACULTY/ TEACHERS

Wanted Experienced Female Staff for Science and English Subject (3 to 5 Classes) to Work in Blossoms School, Aravind Nagar, ATP. Mob: 9030777676

SECURITY GUARDS

సెక్యూరిటీగార్డ్స్, ASOలు ధర్మవరం, హైదరాబాద్‌లో పనిచేయుటకు కావలెను. జీతం: 15,000-20,000/-రూం & భోజనం ఫ్రీ. సంప్ర: 6302549622, 9573095856

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో ఉ్లంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేస్తున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. ప్రకటనలోని ఏవైనా పాఠకుల సంబంధిత నష్టాలకు ఈనాడు ఎలాంటి బాధ్యత వహించదు. ప్రకటనదారులు/ఏజెంట్లు/మరో వ్యక్తి/సంస్థ సేవల వివరాలను ధృవీకరించవలసిందిగా రీడర్లకు సూచన. చివరలో వస్తే ప్రకటనను ప్రచురించుటకు బాధ్యత వహించే అధికారము ఈనాడుకు ఉంటుంది. యాజమాన్యానికి కలదు.

Eenadu Classifieds 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రకటన క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి... అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ప్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, భవనాలు అద్దెకు వంటి అన్నిరకాల వాణిజ్య వ్యాపారాలు

వివరాలకు: 8008709784

ప్రకటనలు ఇ.ఎన్.కె. విస్తృతంగాను

ఈ- శ్రమ్ కార్డులు.. భద్రతకు భరోసా

కార్మికులకు అందజేసే ఈ-శ్రమ్ కార్డు

కళ్యాణదుర్గం (గ్రామీణం), న్యూస్‌టుడే: సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేసే వారితోపాటు వలస కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తూ, సంక్షేమ పథకాలు అందించాలనే సదుద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం 2021 ఆగస్టు 26న 'ఈ -శ్రమ్' పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో పేర్లు, వివరాలు నమోదు చేసుకున్న కార్మికులకు ఉచితంగా యూఏఎన్ గుర్తింపు కార్డులను జారీ చేస్తారు. దేశంలో ఎక్కడైనా ఈ కార్డు చెల్లుబాటయ్యేలా యూనివర్సల్ అకౌంట్ నంబర్(యూఏఎన్)ను అందజేస్తున్నారు. అనంతపురం జిల్లావ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత రంగాల్లో సుమారు 10 లక్షల కార్మికులున్నారు. ఈ-శ్రమ్ కోసం ఇప్పటి వరకు 8 లక్షల మంది దరఖాస్తు చేసుకొంటారు. కార్డులు సైతం జారీ చేశారు. పుట్టపర్తి జిల్లావ్యాప్తంగా మొత్తంగా 3.10 లక్షల మంది కార్మికుల్లో కేవలం 1.10 లక్షల మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోగా.. వారికే కార్డులు అందాయి.

నమోదు ఎలాగంటే..?

కార్మిక శాఖ అధికారులు, చరవాణిలో సెల్ఫ్ రిజిస్ట్రేషన్ కోసం నమోదు చేసుకోవచ్చు. దీనికి ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నంబరు, నామినీ ఖాతా, చరవాణి నంబరు తప్పనిసరి. గత వైకాపా ప్రభుత్వం 'ఈ -శ్రమ్' కార్డుల పంపిణీని 2023లో నిలిపివేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దీనిని పునరుద్ధరించింది. అసంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికులు 21 సంవత్సరాల నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగిన వారు భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా లేదా సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా, సచివాలయాల్లో,

అనేక ప్రయోజనాలు

ఈ-శ్రమ్ ద్వారా నమోదు చేసుకొన్న కార్మికునికి 12 అంకెల గల యూఏఎన్ గుర్తింపు కార్డు అందజేస్తారు. ఈ కార్డు ఉన్న వారికి ప్రభుత్వం అందించే సంక్షేమ, సామాజిక భద్రత పథకాలు వర్తిస్తాయి. కార్మికులు ప్రమాదంలో మృతిచెందితే ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకం ద్వారా రూ.2 లక్షలు, గాయపడితే, వైకల్యానికి గురైనా రూ.లక్ష పరిహారం వస్తుంది.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

'ఈ-శ్రమ్' పథకం నమోదులో రాష్ట్రంలోనే ఉమ్మడి అనంత జిల్లా రెండో స్థానంలో ఉంది. ప్రతి కార్మికుడు నమోదు చేసుకుంటే ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు. వీటిపై అవగాహన కల్పిస్తూ నమోదు చేస్తున్నాం.

- లక్ష్మీనరసయ్య, ఉపకార్మిక శాఖ కమిషనర్

సమరశీల పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం: సీఐటీయూ

మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

హిందూపురం (గ్రామీణం), న్యూస్‌టుడే: సమరశీల పోరాటాలతోనే సమస్యలను పరిష్కరించుకుందామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్.నర్సింగరావు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు జడ్పీ శ్రీనివాసులు అధ్యక్షతన స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం ప్రారంభమైన 10వ జిల్లా మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న కార్మిక వ్యతిరేక విధానాలను మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిలో పనిచేసే ప్రధాన నాయకులు, కార్యకర్తలు ఎదురొడ్డి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బహిరంగసభకు హాజరైన పలువురు కార్మికుల సమక్షంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి వేదికపై ఉన్న రాష్ట్ర, జిల్లా, అనుబంధ సంఘాల నాయకులు చేయూతతో ఐక్యత చాటారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ప్రవీణ్‌కుమార్, శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి దిల్షాద్ పాల్గొనగా, సీఐటీయూ జిల్లా, స్థానిక నాయకులు సాంబశివ, నరసింహులు, లక్ష్మీదేవి, నారాయణ, రాము, రామకృష్ణ, అంగన్‌వాడీ, ఆశా, మున్సిపల్ వర్కర్స్, వివిధ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

ఏఈవో సంఘం అధ్యక్షుడిగా మురళీకృష్ణ

కొత్తగా ఎన్నికైన సభ్యులను సన్మానిస్తున్న రాష్ట్ర నాయకులు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారులు సంఘం (ఏఈవో) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం అనంతపురం ఉద్యాన ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ఎన్నికల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వర రెడ్డి, సహాయ అధికారిగా నరసింహ వ్యవహరించారు. అన్ని పోస్టులకు నామినేషన్లు స్వీకరించగా, ఒక్కో పోస్టుకు ఒక్కో నామినేషన్ వేశారు. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైందని ఎన్నికల అధికారులు ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా మురళీకృష్ణ, సహాధ్యక్షుడిగా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా ఆదినారాయణ, కోశాధికారిగా శ్వేత, ఉపాధ్యక్షులుగా జోత్స్న, సుజిత, దిలీప్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా మనోజ్‌కుమార్, భరత్ రాజ్, భాగ్యశ్రీ, సంయుక్త కార్యదర్శిగా ప్రచార కార్యదర్శిగా మణికంఠ కుమార్, ఎనిమిది మంది సభ్యులను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి నాగేశ్వరరెడ్డి ప్రకటించారు. అనంతరం కొత్తగా ఎన్నికైన సభ్యులను జిల్లా వ్యవసాయాధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటకుమార్, సుబ్బారావు, సాలూర్‌ఖాన్ తదితరులు ఘనంగా సన్మానించారు. అనంతరం అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఏఈవోలు ఎదుర్కొంటున్న సమస్యల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

తెదేపా నాయకులపై దాడి

బుక్కపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని యర్లంపల్లి గ్రామానికి చెందిన తెదేపా నాయకులపై ఆదివారం రాత్రి దాడి జరిగింది. బాధితుల తెలిపిన వివరాల మేరకు.. తెదేపా నాయకులు ఆదినారాయణ, చంద్ర రాత్రి 9 గంటలకు తమ ఇళ్లలో నిద్రిస్తుండగా బయట కేకలు, అరుపులు వినిపించాయి. ఏం జరిగిందోనన్న ఆత్రుతతో తలుపులు తెరిచి బయటకు రాగా, ఒక్కసారిగా వైకాపా నాయకులు మహేశ్, నగేశ్, అంజిత్ పాటు మరికొందరు వారిపై కర్రలతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఆదినారాయణకు బలమైన దెబ్బలు తగిలాయి. ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తర్వాత చికిత్స నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. సమాచారం అందుకున్న ఎస్సై కృష్ణమూర్తి గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా ఇరువర్గాల నడుమ కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి.

తుదిశ్వాసలోనూ వీడని బంధం

చిన్నపాపమ్మ, వెంకటరమణ దంపతులు

అమడగూరు (ఓబుళదేవరచెరువు), న్యూస్‌టుడే: అన్యోన్య దాంపత్యానికి అర్థంగా నిలిచిన ఆ భార్యాభర్తలు మరణంలోనూ ఒకరి వెంట ఒకరు నడిచారు. కొద్ది గంటల తేడాలో తుదిశ్వాస విడిచారు. ఈ విషాదకర ఘటన అమడగూరు మండలం జౌకలకొత్తపల్లిలో చోటుచేసుకుంది. మృతుల కుమారులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చిన్నపాపమ్మ(68), దండు వెంకటరమణ(75) దంపతులు. వారిది 50 ఏళ్ల వైవాహిక జీవితం. బిడ్డలతో కలిసి ఉంటున్నారు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నపాపమ్మ శనివారం రాత్రి 7 గంటలకు మృతి చెందారు. భార్య ఎడబాటును తట్టుకోలేక తీవ్ర మనోవేదనకు గురైన వెంకటరమణ ఆదివారం వేకువజామున 4 గంటల సమయంలో చనిపోయారు. గ్రామంలోనే అంత్యక్రియలు ముగిసాయి. మృత్యువులోనూ వీడని వీరి బంధం వారిద్దరినీ అనుకోవడం గ్రామస్థులను కలచివేసింది. మృతులకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని ఒకరి దుర్మరణం

సోమశేఖర్

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన సీకేపల్లి మండల కేంద్రానికి సమీపాన కొన క్రాస్ 44వ జాతీయ రహదారి కూడలి వద్ద ఆదివారం చోటు చేసుకుంది. సీకేపల్లి మండలం హర్యానాయక్ చెరువు గ్రామానికి చెందిన సోమశేఖర్ (36), పెనుకొండ మండలం వెంకటగిరి పాళ్యం గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో కొన క్రాస్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనక నుంచి బలంగా ఢీ కొన్నాడు. ఘటనా స్థలిలోనే దుర్మరణం చెందాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు లారీని ఠాణాకు తరలించారు. మృతునికి భార్య మహాదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కారును ఢీకొన్న లారీ.. నలుగురికి గాయాలు

నుజ్జునుజ్జైన కారు

కనగానపల్లి, న్యూస్‌టుడే: లారీ వాహన చోదకుడి నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడిన ఘటన కనగానపల్లి మండల కేంద్రంలోని మాముడూరు కూడలి వద్ద ఆదివారం చోటుచేసుకుంది. బెంగళూరు నగరానికి చెందిన వినయ్, సచిన్, అనిల్, గురుతోపాటు డ్రైవర్ మహబూబ్‌తో కలిసి కారులో ఈనెల 1వ తేదీన మంత్రాలయం దైవ దర్శనార్థం బెంగళూరు నుంచి వెళ్లారు. అక్కడ రాఘవేంద్ర స్వామి దర్శనం ముగిసిన తర్వాత తిరిగి బెంగళూరుకు వెళుతున్నారు. ముక్కాపురం వద్దకు వచ్చేసరికి బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళుతున్న లారీ వాహన చోదకుడు వేగంగా వచ్చి రహదారిని దాటి పెట్టి పక్క రహదారిలోకి వెళ్లి ఎదురుగా వస్తున్న కారును బలంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురు గాయపడ్డారు. వీరిని అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించి వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

తండ్రీకొడుకుల ఆత్మహత్యాయత్నం!

రక్షించిన రైల్వే, పోలీసు అధికారులు

బాధితుడు శివ

కళ్యాణదుర్గం (గ్రామీణం), న్యూస్‌టుడే: కొత్తూరు గ్రామంలో ఇటీవల జరిగిన పర్యవేక్షణ సంబంధం లేకున్నా తమను ఇరికించారనే మనస్తాపంతో కుమారుడితోపాటు తెదేపా కార్యకర్త ఆదివారం కళ్యాణదుర్గం రైల్వే స్టేషన్‌లో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి యత్నించారు. పర్యటించిన సంబంధం లేకున్నా తనను బంధుల్లో తీసి కించపరిచి శెట్టూరు మండలం మాలేపల్లికి చెందిన తెదేపా కార్యకర్త శివ(ఆర్ఎంపీ వైద్యుడు) కుమారుడు జ్యోతీశ్వర్(6)తో కలిసి ఓ సెల్ఫీ వీడియో తీసి సామాజిక మాధ్యమంలో పోస్టు చేశాడు. దీనిని గుర్తించిన రైల్వే మేనేజర్ దుర్గాసింగ్ సిబ్బందితో అక్కడికి వెళ్లి పురుగుమందు డబ్బాను లాక్కొన్నాడు. ఇంతలో కానిస్టేబుల్లు లింగరాజు, వీరయ్య సంఘటనా స్థలానికి వచ్చి వారిద్దరినీ స్టేషన్‌కు తరలించారు. తర్వాత స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

తెదేపా, వైకాపా వర్గీయుల ఘర్షణ

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని పోరాట కాలనీ కాలనీలో తెదేపా, వైకాపా వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు మూడు రోజులుగా తెదేపా కౌన్సిలర్ జి.మల్లికార్జున ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహిస్తున్నారు. ఆదివారం పోరాట కాలనీలో ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకుంటూ ఉండగా అదే సమయంలో కాలనీలో మెకిల్ కాశాలలను ప్రైవేట్ సంస్థ చేయకూడదని వైకాపా శ్రేణులు కోటి సంతకాల కార్యక్రమం చేపట్టారు. ఈ నేపథ్యంలో వారు ఎదురెదురు పడటంతో వాగ్వాదం జరిగింది. వారి ఇరు పార్టీల వారు తోపులాటకు దిగారు. అనంతరం రాళ్లు రువ్వుకోవడంతో వైకాపా వర్గీయులకు చెందిన రెండు వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈవిషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాల వారిని చెదరగొట్టడంతో సమస్య సద్దుమణిగింది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని కడప రోడ్డు పరిసరాల్లో గంజాయి విక్రేతను అరెస్టు చేసినట్లు గ్రామీణ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని తెచ్చి యువతకు అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి గుత్తి రోడ్డు వైపు పట్టుకున్నట్లు తెలిపారు. ఒక్కొక్కటి నాలుగు గ్రాముల బరువు ఉన్న 16 ప్యాకెట్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. ఆయన వెంట ఎస్సై ధరణిబాబు తదితరులు ఉన్నారు.

30 మందిపై రౌడీషీట్లు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: హత్య, హత్యాయత్నం, గంజాయి విక్రయం వంటి తీవ్ర నేరాలకు పాల్పడిన 30 మంది పాత నేరస్థులపై రౌడీషీట్లు తెరిచినట్లు కదిరి అర్బన్ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. కదిరి అర్బన్ సర్కిల్ పరిధిలో తీవ్ర నేరాలకు పాల్పడిన వారిలో మార్పు కనిపించకపోగా తిరిగి నేరాలు చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తుండటంతో ఈ చర్యలు తీసుకున్నామని వివరించారు. రౌడీషీటర్లు తీవ్రమైన నేరాల్లో పాల్గొన్నట్లు తేలితే వారిని పీడీయాక్టు కింద అరెస్టు చేసి జైలుకు పంపుతామన్నారు.

(c) eenadu

హిందూపురం
• హిందూపురం • పెనుకొండ • మడకశిర

ఘనంగా లక్ష్మీదేవి విగ్రహ ప్రతిష్ఠాపన

ప్రతిష్ఠించిన లక్ష్మీదేవి విగ్రహం

గుడిబండ, న్యూస్‌టుడే: మరుబరపల్లిలో శ్రీలక్ష్మీదేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. హోమాది కార్యక్రమాలు చేసి విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టారు. కార్యక్రమంలో హోసదుర్గ కుంచిటి క్షేత్రం పీఠాధిపతి శాంతవీర మహాస్వామి, పూజారముద్దనహళ్లి సిద్ధరామ శివానంద మందిర క్షేత్రం పీఠాధ్యక్షులు చిదానందభారతి స్వామీజీ ప్రవచనాలు చేశారు. వక్కలిగ సంఘం నాయకుడు ఆర్. నాగరాజు, స్థానిక నాయకులు, జలదేనవ గోత్రం వారు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షికి ప్రత్యేక పూజలు

పరిగి, న్యూస్‌టుడే: ధనాపురంలో ఆదివారం వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, భాజపా నాయకుడు పరిగి వేణుగోపాలరావు పాల్గొని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ధనాపురం, శిరేకోళం గ్రామాలకు చెందిన వాల్మీకి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, వేణుగోపాలరావు, వాల్మీకులు

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: దొమ్మరహట్టిలో తాగునీటి బోరు మరమ్మతుకు గురైంది. **-లక్ష్మమ్మ**
సమాధానం: ట్యాంకర్లతో నీరు అందిస్తున్నాం. త్వరలో మరమ్మతు చేయిస్తాం. **-కరియమ్మ, సర్పంచి**
సమస్య: బండ్లపల్లి గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదు. **-రమేశ్**
సమాధానం: కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. **-నరసింహప్ప, సర్పంచి, ఎమ్.రాయపురం.**
సమస్య: బైరాపురంలో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. **-హరీశ్**
సమాధానం: మూడు రోజుల్లో ఏర్పాటు చేయిస్తాం. **-వసుంధర, సర్పంచి, కల్లూరు.**
సమస్య: నాగేపల్లిలో కాలువలు సరిగ్గా లేక మురుగు రోడ్డుపై పారుతోంది. **-సుశీలమ్మ**
సమాధానం: రహదారిపైకి రాకుండా శుభ్రం చేయిస్తాం. **-మంజునాథ్, సర్పంచి, కొడిపల్లి.**
సమస్య: తాళికెర ఎస్సీ కాలనీలో వీధి దీపాలు లేక అంధకారంలో ఉంటున్నాం. **-కరియన్న**
సమాధానం: వెంటనే ఏర్పాటు చేస్తాం. **-రంగస్వామి, సర్పంచి, తాళికెర**
సమస్య: కల్లుకుప్ప ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య నెలకొంది. **-మహదేవ్**
సమాధానం: తాగునీటి సమస్య పరిష్కరిస్తాం. **-పరిష్కారాధాగారి, పంచాయతీ కార్యదర్శి, రాళ్లపల్లి**
-న్యూస్‌టుడే, రొళ్ల, లేపాక్షి, గుడిబండ

సమస్యల పరిష్కారం

లేపాక్షి, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను 'ఈనాడు'లో ప్రచురితమయ్యే 'మేమున్నాం... మీకు తోడుగా' దృష్టికి తీసుకు రావడంతో సంబంధిత బాధ్యులు స్పందించి వాటిని పరిష్కరించారు. మల్లిరెడ్డిపల్లిలో మురుగునీరు రహదారిపైకి రాకుండా సర్పంచి వసుంధర నేతృత్వంలో పారిశుద్ధ్య కార్మికులు పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. మైదుగోళంలో సర్పంచి రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని వీధి దీపాలు ఏర్పాటు చేయించి అంధకారాన్ని తొలగించారు.

వంకలు ప్రవహిస్తే.. రాకపోకలకు అవస్థలే

గ్రామీణ రహదారుల్లో చోదకులకు తప్పని ఇబ్బందులు

వంకపై వెళ్లే వైబీహళ్లి రోడ్డు, ఇక్కడ వంతెన నిర్మిస్తే రాకపోకలకు ఇబ్బందులుండవు

మడకశిర గ్రామీణం, గుడిబండ, న్యూస్‌టుడే: వర్షాలు కురిసి వంకలు, వాగులు ప్రవహిస్తే ప్రజల రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. వంక దాటితే వెళ్లే గ్రామానికి కిలోమీటర్లు చుట్టుకుని చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. నియోజకవర్గ వ్యాప్తంగా కొన్ని గ్రామాలకు ఆనుకుని వంకలు ప్రవహిస్తున్నాయి. ప్రత్యామ్నాయ మార్గాలు లేవు. ఉన్న ఒక్క మార్గం నీటి ప్రవాహంలో మునిగితే ఆ గ్రామాలకు రాకపోకలు స్తంభిస్తాయి. వర్షాకాలంలో వంకల ప్రవాహం కారణంగా దాదాపు 30వేల మంది రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

కొన్ని చోట్ల దుస్థితి

● మడకశిర మండలం వైబీహళ్లికి వెళ్లాలంటే ఉన్నది ఒకే దారి.. ఆ దారి మూసుకుపోతే ప్రజలకు రాకపోకలు స్తంభిస్తాయి. గ్రామం పక్కనే ఉన్న వంకదాటుకుని రాకపోకలు సాగించాలి. మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు నెల రోజులు వంక ప్రవహించింది. ఆ సమయంలో గ్రామస్థులు పడిన ఇబ్బందులు వర్ణనాతీతం. వారం రోజుల పాటు బయటకు రాలేక, రవాణా సౌకర్యం లేక ప్రజల జీవనం అస్తవ్యస్తంగా మారింది.

● భక్తరపల్లి, జిల్లడగుంట మధ్యన పెద్ద వంక ప్రవహిస్తుంది. ఈ గ్రామాల మధ్య కిలోమీటరు దూరం ఉంది. భక్తరపల్లి ప్రజలు వర్షాకాలంలో జిల్లడగుంటకు చేరుకోవాలంటే మడకశిర మీదుగా బుళ్లసముద్రం, ఉప్పార్లపల్లి, మీదుగా వెళ్లాలి. సుమారు 8 కిలోమీటర్లు చుట్టుకుని గ్రామానికి చేరుకోవాలి. జిల్లడగుంట ప్రజలు భక్తరపల్లికి వెళ్లాలంటే మడకశిర మీదుగా పది కిలోమీటర్లు చుట్టుకుని వెళ్లాల్సి వస్తుంది.

● గుడిబండ మండలం ఫళారం గ్రామ సమీపంలో ఉన్న వీరకెంచమ్మ వంక ప్రవహిస్తే రెండు నెలల పాటు రొళ్ల, గుడిబండ, మడకశిరకు వెళ్లే మార్గాల్లో ఐదు కిలోమీటర్లు చుట్టుకుని వెళ్లాల్సి వస్తుంది. కొంకల్లు చెరువు మరువ నీరు పారితే మడకశిర, మందలపల్లికి వెళ్లే రోడ్డుకు వెళ్లాలంటే చుట్టుకుని దిన్నేహట్టి, జమ్మలబండ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. వద్రహట్టి వంక పారితే కురుబరపల్లితండా గ్రామాలకు వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్లు చుట్టుకుని వెళ్లాల్సి ఉంటుంది.

వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం

ప్రత్యామ్నాయ మార్గం లేక ఇబ్బంది వస్తోంది. వంకలపై బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాము. నిధులు విడుదలైన వెంటనే పనులు చేపడతాం.
- లక్ష్మీనారాయణ, ఆర్అండ్‌బీ డీఈ, మడకశిర

విలువలతో కూడిన విద్య అభ్యసించండి

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: విద్యార్థినులు విలువలతో కూడిన విద్యనభ్యసిస్తూ, సేవాభావాన్ని పెంపొందించుకొని, ఉన్నత స్థాయిలో స్థిరపడాలని మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు వారం రోజుల నుంచి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో శుభ్రతా కార్యక్రమాలు చేపట్టారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథతులుగా విచ్చేసిన ఛైర్మన్, ఎంఈఓ గంగప్పలు పాల్గొని ప్రసంగించారు. సేవలందించిన విద్యార్థినులు తమకు కలిగిన అనుభవాలను గురించి మాట్లాడారు. కళాశాల అధ్యాపకులు రమేశ్, ఉపేంద్ర, సంజీవరాయప్ప, భవిత కేంద్రం కోఆర్డినేటర్ లలిత, ఎన్ఎస్ఎస్ అధికారి రంగనాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ రమేశ్‌కుమార్

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

పెనుకొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ముందుండాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. ఆదివారం స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా ఆరో రోజు పట్టణంలోని తోటగిరిలో ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అటుగా వెళుతున్న మంత్రి సవిత విద్యార్థులను పలకరించారు. ప్రజలను ప్రభుత్వ పథకాల్లో భాగస్వామ్యం చేయడానికి విద్యార్థులు చేస్తున్న కృషిని అభినందించారు. ఎన్ఎస్ఎస్ అధికారి ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో ర్యాలీలో పాల్గొన్న మంత్రి సవిత

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

మండల నూతన కార్యవర్గం సభ్యులు

గోరంట్ల, న్యూస్‌టుడే: ఏపీటీఎఫ్ గోరంట్ల మండలశాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఆశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రా పర్యవేక్షణలో ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా రామచంద్రప్ప, అధ్యక్షుడిగా సుధాకరరెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, ఓబులేసు, చంద్రశేఖర్, నంజప్ప, బాషా, ఉషారాణి, జిల్లా కౌన్సిలర్లుగా బాలకృష్ణ, ఆదినారాయణ, సిరాజుద్దీన్, సూర్యనారాయణరెడ్డి, సుధాకర్, రవీంద్రారెడ్డి, సుజాత, కార్యదర్శులుగా మరికొందరిని ఎన్నుకున్నారు.

భగవద్గీత పఠనంలో చిన్నారుల ప్రతిభ

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని డీబీ కాలనీలోని చిన్మయ విద్యాలయంలో వారం క్రితం చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో భగవద్గీత పఠనం పోటీలు నిర్వహించారు. స్థానిక వేద మాలిక కళానిలయం నిర్వాహకురాలు నాగవేణి పర్యవేక్షణలో చిన్నారులు పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. జిల్లా స్థాయికి దారుణ్, నిత్య, వాగ్మి, లిఖిత్, రాష్ట్ర స్థాయిలో ధరుష్, జోష్నిక ఎంపికయ్యారు. వీరు ఈనెల 9న కడపలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలతో చిన్నారులు

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: ఇందిరానగర్‌లోని గాయత్రీ ఆలయంలో ఆదివారం రాత్రి అమ్మవారికి కుంకుమార్చన, హోమాలు, కలశస్థాపన, పుష్పార్చన చేశారు. ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికలో లక్ష్మీ సమేతుడైన నరసింహస్వామి ఉత్సవమూర్తులను అందంగా అలంకరించిన పూలపల్లకిలో ఉంచి కల్యాణం జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నరసింహయ్య, భక్తులు పాల్గొన్నారు.

కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

మల్లిరెడ్డిపల్లిలో గాయత్రీ హోమం

లేపాక్షి, న్యూస్‌టుడే: మండలంలోని మల్లిరెడ్డిపల్లిలో ఆదివారం సత్యసాయి బాబా రథోత్సవాన్ని భజన మండలి సభ్యులు వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం సామూహిక గాయత్రీ హోమాన్ని సభ్యులచే చేయించారు. అనంతరం వివిధ రకా పుష్పాలతో అలంకరించిన బాబా చిత్రపటాన్ని వీధుల్లో ఊరేగించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

సత్యసాయి చిత్రపటానికి పూజలు చేస్తున్న మండలి సభ్యులు

కార్తిక మాసంలో బృందావనం పూజలు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని సత్యనారాయణ గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం రాత్రిమహిళలు కార్తిక దీపాలు వెలిగించి బృందావనం పూజను ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తిగీతాలను ఆలపించారు. ఆలయ అధ్యక్షుడు ఆదినారాయణగుప్త, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఆలయంలో బృందావనం పూజలు నిర్వహిస్తున్న మహిళలు

వైభవంగా తొలిశాంబాదేవి రథోత్సవం

లేపాక్షి, న్యూస్‌టుడే: మండలంలోని గొందివరపల్లిలో తొలిశాంబాదేవి రథోత్సవాన్ని ఆదివారం భక్త జనసందోహం నడుమ వైభవంగా నిర్వహించారు. మహిళల వీరగాసె నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచి నేత్రావతి, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు శ్రీనివాసరావు, తెదేపా మండల కన్వీనర్ అభిలాష్, నాయకులు పాల్గొన్నారు.

జనవాహిని నడుమ సాగుతున్న రథోత్సవం

రాజీవ్‌కాలనీలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

గోరంట్ల, న్యూస్‌టుడే: స్థానిక ఎస్వీవీఎం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో గోరంట్లలోని రాజీవ్‌కాలనీలో ఆదివారం ఏర్పాటుచేసిన ప్రత్యేక శిబిరంలో భాగంగా పరిసరాలు పరిశుభ్రతపై కాలనీవాసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు చీపుర్లతో వీధులు శుభ్రం చేశారు. తడి, పొడిచెత్తను వేరుచేసి పంచాయతీ కార్మికులను సహరించాలని తెలిపారు. అధ్యాపకులు ఆజాద్, బాలమోహన్, హరీష్, వాలంటీర్లు పాల్గొన్నారు.

కారుబోల్తా..

పెనుకొండ : మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై పుట్టపర్తి కూడలి సమీపంలో ఆదివారం సాయంత్రం బెంగళూరు వైపు నుంచి హైదరాబాద్ వెళుతున్న ఓ కారు బోల్తాపడింది. జాతీయ రహదారిమీద నుంచి పక్కనున్న లోతట్టు ప్రాంతలోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. ప్రమాదంలో కారులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

శ్మశానవాటికకు రహదారి సౌకర్యం

హిందూపురం, చిలమత్తూరు, న్యూస్‌టుడే: చిలమత్తూరు మండలం కొర్లకుంటలోని ఎస్సీ కాలనీ శ్మశాన వాటికకు అధికారులు, నాయకుల చొరవతో రహదారి అందుబాటులోకి వచ్చింది. గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ వాసులు శనివారం శ్మశాన వాటికకు రహదారి చూపాలని ఆందోళన చేపట్టారు. గ్రామస్థులతో చర్చించి శ్మశాన వాటికకు రహదారి సౌకర్యం కల్పిస్తామని తహసీల్దార్ వెంకటేశ్ హామీ ఇవ్వటంతో వారు నిరసన విరమించారు. ఈ విషయంపై ఆదివారం గ్రామీణ సీఐ జనార్దన్, తహసీల్దార్ జనార్దన్, ఎస్ఐ మునీర్‌అహ్మద్, సీపీఐ నాయకులు వినోద్‌కుమార్ గ్రామంలోని సంబంధిత రైతులతో మాట్లాడి శ్మశానవాటికకు పది అడుగుల రహదారి వదిలేలా ఒప్పించటంతో సమస్య సానుకూలంగా పరిష్కారమైంది.

గ్రామస్థులతో మాట్లాడుతున్న గ్రామీణ సీఐ జనార్దన్, సీపీఐ నాయకులు

నిధులున్నా పనులు పూర్తి చేయరు

పెనుకొండలోని సెంట్రల్ ఉన్నత పాఠశాలలో నిలిచిపోయిన అదనపు తరగతి గదులు

పెనుకొండ, న్యూస్‌టుడే: గత ఐదేళ్ల వైకాపా పాలనలో నాడు నేడు పథకం కింద పాఠశాలల్లో ప్రారంభించిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. స్థానిక జడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం 146మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. గదుల కొరత కారణంగా చెట్లుకింద, వరండాలో తరగతులు నిర్వహిస్తున్నారు. పదోతరగతి విద్యార్థులకు పాఠాలు చెప్పే సమయంలో బోర్డు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంట గది నిర్మాణం పూర్తిపాఠశాలలో మొత్తం 9 తరగతి గదులున్నాయి. వీటిలో వంట సరకులు నిల్వ చేయడానికి, స్టాఫ్‌రూం, కార్యాలయం, సిమెంటు ఇతర సామగ్రి నిల్వకోసం రెండు, మొత్తం 5గదులు పోగా మిగిలిన నాలుగింటిలో తరగతులు నిర్వహించాలి. గదుల కొరత ఉండడంతో రూ.కోటి నిధులతో గతంలో నాలుగు అదనపు తరగతి గదులు, ఓ నూతన వంటగది, మరుగుదొడ్లు మంజూరు చేశారు. కాని వాటిని పూర్తి చేయలేదు.

పాఠశాల ఖాతాలో రూ.10 లక్షలు

ప్రస్తుతం 80, 90శాతం పనులు పూర్తయ్యాయి. పాఠశాల ఖాతాలో రూ.10లక్షలు నిధులున్నా, ప్రభుత్వ అనుమతులు లేకపోవడంతో మిగిలిన పనులు పూర్తికాలేదు. అనుమతులు వస్తే కనీసం అత్యవసరమైన తరగతి గదులు నిర్మాణం చేస్తే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పనులు

మన బడి మనభష్యత్తులో పాఠశాలల అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పనులు పూర్తి చేయిస్తాం. పాఠశాలకు సంబంధించిన సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే విధంగా కృషి చేస్తాం. **-జాన్‌రెడ్డప్ప, డీవైఈవో, పెనుకొండ**

బురద దారితో గ్రామస్థుల అవస్థలు

కల్లుకుంట నుంచి రొద్దానికి వెళ్లే ప్రధాన రహదారి వద్దకు చేరుకునేందుకు రెండు కిలోమీటర్ల దూరం ఉంది.. ఈ మట్టి దారి బురదగా మారింది. గ్రామస్థులు వివిధ పనుల నిమిత్తం గ్రామ సచివాలయం, మండల కేంద్రమైన రొద్దానికి చేరుకునేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండల ఇంజినీరు వెంకటనారాయణను వివరణ కోరగా ప్రతిపాదనలు పంపించామన్నారు. **-న్యూస్‌టుడే, రొద్దం**

ఇలా ఉంటే రోగాలు రావా!

హిందూపురం పట్టణంలోని ఎస్వీడీ రోడ్డులో ఉన్న ప్రధాన తపాలా కార్యాలయం నుంచి సూరప్పకుంట వెళ్లే రహదారిలో మురుగు నీరు ముందుకు కదలడం లేదు. పందులు చేరి స్వైరవిహారం చేస్తుండటంతో దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్‌ను వివరణ కోరగా పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తామన్నారు. **-న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్**

సీసీ రోడ్డు నిర్మించండి

తిమ్మలాపురం బీసీ కాలనీలో రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారింది. మురుగు నీరు ప్రవహిస్తూ రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సిమెంటు రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు సిద్దేశ్, మారన్న, నాగరాజు తదితరులు కోరారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీఓ నాగరాజునాయక్ మాట్లాడుతూ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. **-న్యూస్‌టుడే, గుడిబండ**

ప్రమాదపుటంచున ప్రయాణం

కొడగార్లగుట్ట గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డుపై ఉన్న కల్వర్టు శిథిలవస్థకు చేరుకుంది. అటవీ ప్రాంతం నుంచి రొళ్ల చెరువుకు నీరు చేరేందుకు 15 ఏళ్ల క్రితం ప్రధాన కాలువను నిర్మించారు. ఆ కాలువపై ఏర్పాటు చేసిన కల్వర్టు దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. ఎంపీడీవో నాగేశ్వర శాస్త్రిని వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతు చేయిస్తామన్నారు. **-న్యూస్‌టుడే, రొళ్ల**

అసంపూర్తి భవనం.. ఆకతాయిలకు నిలయం

అలుకూరు సచివాలయ భవన నిర్మాణం 90శాతం పూర్తయింది. వాకిళ్లు, ఫ్లోరింగ్ పనులు పూర్తయితే వినియోగంలోకి వస్తుంది. ఈభవనం పాఠశాల ఆవరణలో ఉండటంతో అప్పట్లో నిర్మాణం పనులు నిలిపేశారు. ప్రస్తుతం ఆకతాయిలకు అడ్డాగా మారింది. ఈ విషయమై ఎంపీడీవో రామారావును వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. **-న్యూస్‌టుడే, అమరాపురం**

నాడు ప్రజాప్రతినిధులు- నేడు ఉపాధికి బాటలు

నేడు టైలరింగ్ శిక్షణ కేంద్రం నిర్వాహకురాలిగా

గోరంట్ల, న్యూస్‌టుడే: సాధారణంగా అయిదేళ్లపాటు ప్రజాప్రతినిధిగా కొనసాగిన వ్యక్తులు పదవి పూర్తయిన అనంతరం ఏపని చేయాలన్నా సంకోచిస్తారు. అందులోనూ పంచాయతీ మొదటి పౌరులుగా కొనసాగితే చిన్నచిన్న పనులు చేయాలంటే మనసు రాదు. అయితే గోరంట్ల మండలానికి చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు ఒకరు మాజీ సర్పంచి, మరొకరు ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఉపాధి బాటలో పయనిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. నిజాయితీగా కష్టపడి ఏపని చేసినా తప్పులేదంటున్నారు ఇద్దరూ. వారి విజయబాట వారి మాటల్లోనే..

ఎంతోమందికి టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చా..

-సుశీలాబాయి, మాజీ సర్పంచి

నేను గోరంట్ల మండలం వడిగేపల్లి పంచాయతీ సర్పంచిగా 2013-18 మధ్య కొనసాగాను. అప్పట్లో పంచాయతీ అభివృద్ధి కోసం ప్రతి సమావేశంలో పోరాటం చేశాను. పదవి పూర్తికాగానే టైలరింగ్‌లో అనుభవం ఉండడంతో ఆ దిశగా అడుగులు వేసి పాలసముద్రంలో మహిళలకు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశాను. ఓవైపు టైలరింగ్ పనిచేసుకుంటూ ఎంతో మందికి శిక్షణ ఇస్తూ ఉపాధి పొందుతున్నాను. ఏపనిచేసినా న్యాయబద్ధంగా, ఎదుటి వారికి ఉపయోగపడే విధంగా ఉండాలన్నదే నా ఆశయం.

బ్యాంకువద్ద సెక్యూరిటీగా పనిచేస్తున్నా..

-గంగాద్రి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు

నేడు సెక్యూరిటీ గార్డుగా..

మాది గోరంట్ల మండలం పుట్టగుండ్లపల్లి. నేను పదో తరగతి వరకు చదివాను. ఉపాధి కోసం బెంగళూరులో ఉండేవాన్ని. 2014 ఎంపీటీసీ ఎన్నికల సమయంలో మందలపల్లి-2 ఎంపీటీసీ స్థానం ఎస్సీలకు రిజర్వు కావడంతో పోటీచేసి గెలిచాను. ప్రజాప్రతినిధిగా నాప్రాంత సమస్యలపై పోరాడాను. పదవీకాలం పూర్తవగానే గోరంట్లలోని ఓ ప్రైవేటు బ్యాంకు వద్ద సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాను. కష్టపడి ఏపనిచేసి ఉపాధి పొందినా తప్పుకాదన్నది నా అభిప్రాయం.

మహిళల క్రికెట్ మ్యాచ్ వీక్షణకు ఏర్పాట్లు

పెనుకొండ, న్యూస్‌టుడే: ముంబయి వేదికగా జరుగుతున్న మహిళల క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌ను తిలకించేందుకు పెనుకొండలోని తెదేపా కార్యాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కూటమి శ్రేణులతో కలిసి పార్టీ కార్యాలయంలో మ్యాచ్‌ను వీక్షించారు. ఆదివారం ఉదయం పార్టీ శ్రేణులు భారత్ విజయం సాధించాలని కోరుతూ స్థానిక ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

క్రికెట్‌ను వీక్షిస్తున్న మంత్రి సవిత

గిరి ప్రదక్షిణలో మార్పు

హిందూపురం అర్బన్ : పట్టణంలో గుడ్డం రంగనాథస్వామి ఆలయంలో ప్రతి నెలా మూడో వారంలో గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈనెల కార్తిక పౌర్ణమి సందర్భంగా 5వ తేదీనే(బుధవారం) ఆలయంలో 11మార్లు గిరిప్రదక్షిణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి నాగేంద్రుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

పది గ్రామాలకు తొలగిన దారి సమస్య

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని జూలుకుంట-సుద్దకుంటపల్లి గ్రామాల మధ్య బీటీ రహదారి సదుపాయం ఏర్పడింది. దీంతో చుట్టుపక్కల పది గ్రామాల ప్రజలు, వాహన చోదకుల ఇబ్బందులు ఎట్టకేలకు తొలగిపోయాయి. 20 ఏళ్లగా ఈ గ్రామాల మధ్య మట్టిదారికి ఇరువైపులా కంపచెట్లు, అడుగడుగునా గుంతలు.. ఇది చాలదన్నట్లుగా వర్షాలు వస్తే బురదమయంగా మారి తీవ్ర ఇబ్బందుల మధ్య నడుమ పాదచారులు, వాహన చోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఎనిమిదేళ్ల కిందట కేతగానిచెరువు నుంచి సుద్దకుంటపల్లి గ్రామం బయట వరకు అప్పటి ఎమ్మెల్యే బీకే పార్థసారథి కృషితో బీటీ రహదారి సదుపాయం కల్పించారు. అయితే జూలుకుంట నుంచి మూడు కిలోమీటర్లను మంత్రి సవిత రూ. 1.50 కోట్ల నిధులతో చక్కని బీటీ రహదారి సౌకర్యం కల్పించారు. ఈ రహదారి మీదుగా హిందూపురం రాకపోకలకు దూరం తగ్గి..తమకు ఎంతో అనుకూలంగా ఉందని, ఇందుకు కృషి చేసిన మంత్రికి పది గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

కొత్తగా వేసిన బీటీ రహదారి

(c) eenadu

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

ఆకట్టుకున్న బాలికల క్రీడా పోటీలు

నల్లమాడ, న్యూస్‌టుడే: నల్లమాడలోని ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి బాలికల క్రీడలు పోటాపోటీగా జరిగాయి. ఖోఖో, కబడ్డీ అండర్-17 విభాగంలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాల విజేతగా, దొన్నికోట జడ్పీహెచ్‌ఎస్ రన్నరప్‌గా నిలిచాయి. ఖోఖో అండర్-14లో దొన్నికోట జడ్పీహెచ్‌ఎస్ ప్రథమ, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ ద్వితీయ స్థానం సాధించాయి. కబడ్డీలో దొన్నికోట గెలవగా, కస్తూరిబా పాఠశాల రెండో స్థానంతో సంతృప్తి చెందింది. వాలీబాల్ అండర్-14 విభాగంలో జడ్పీహెచ్‌ఎస్ రెడ్డిపల్లి విజేతగా, నల్లమాడ జడ్పీహెచ్‌ఎస్ రన్నరప్‌గా నిలిచాయి. పోటీలను ప్రధానోపాధ్యాయుడు ఎస్.భాస్కర్‌రెడ్డి, పీఈటీలు పర్యవేక్షించారు.

శ్రమదానం సేవా భావమే

సామాజిక సేవలో శ్రమదానం ఒక భాగమని ప్రిన్సిపల్ స్మిత, ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రాం ఆఫీసర్ యాసిన్‌బేగ్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో వాలంటీర్లు ఆదివారం శ్రమదానం చేశారు. కటారుపల్లిలోని ముస్లిం పల్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణ, పరిసరాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తను శుభ్రం చేశారు. పరిశుభ్రతతో కలిగే ప్రయోజనాలను స్థానికులకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, కదిరి

14 కిలోమీటర్లు.. 100 గుంతలు

● ధర్మవరం పట్టణంలో రహదారులు అధ్వానం ● రాకపోకలకు నరకయాతన

ధర్మవరం పట్టణం: ధర్మవరం చేనేత వస్త్రాలకు ప్రసిద్ధి. పట్టణం రోజురోజుకు వేగంగా అభివృద్ధి చెందుతోంది. అయితే రహదారులు మాత్రం బాగుపడటం లేదు. ఎప్పుడో వేసిన కావడంతో గుంతలు పడి అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు అవి మరింత దారుణంగా మారాయి. రాకపోకలకు పురజనులు నరకయాతన అనుభవిస్తున్నారు. సంబంధిత అధికారులు గుంతల్లో తాత్కాలికంగా మట్టి, తారు పోస్తూ మమ అనిపిస్తున్నారు. శాశ్వత పరిష్కారం చూపడం లేదు. పట్టణమంతా 14 కి.మీల రహదారులుంటే.. వంద దాకా గుంతలు పడ్డాయి. వీటిని పూడ్చాలని నాయకులు, అధికారులను కోరుతున్నా స్పందన లేదని ప్రజలు వాపోతున్నారు.

కదిరిగేట్ వద్ద ఛిద్రమైన రోడ్డు

కదిరిగేట్ దారంటే హడల్

పట్టణంలోకి ఎక్కువ రాకపోకలు సాగించే ప్రధాన మార్గం ధర్మవరం-బత్తలపల్లి రోడ్డు. ఈ దారి గుండా వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. కదిరిగేట్ వద్దకు రాగానే చోదకులు హడలిపోతున్నారు. ఇక్కడ మోకాళ్లోతు గుంతలు పడ్డాయి. ఎంతోమంది కింద పడి గాయాలపాలయ్యారు. పురపాలక శాఖ కార్యాలయం బత్తలపల్లి రోడ్డుకే ఉండటంతో పనుల నిమిత్తం వచ్చేవారు విసుగెత్తిపోతున్నారు. చాలా మంది కి.మీ దూరం తిరిగి మరోదారి గుండా వెళ్తున్నారు.

● గాంధీనగర్ సర్కిల్ ప్రధాన రహదారిపై గుంతల వద్ద ప్రజలు, ద్విచక్ర వాహనదారులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు.

● పోతుకుంట కాలనీ సమీపంలోనూ రోడ్డు దారుణంగా తయారైంది.

● బెంగళూరు వెళ్లే దారిలో ఇందిరమ్మకాలనీ వద్ద రోడ్డు ఎగుడు దిగుడుగా ఉండటంతో చోదకులు బేజారుపడుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

వర్షాలకు కొన్ని దారుల్లో గుంతలు పడినట్లు మా దృష్టికి వచ్చింది. వాటిని పరిశీలించాం. గుంతలను పూడ్చేందుకు నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించాం. మంజూరు కాగానే గుంతలు పూడ్చివేస్తాం. పట్టణవాసులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తాం. - **నాగపుల్లంరావు, ర.భ.శా డీఈ**

జీఎస్టీ తగ్గింపుతో ఊరట

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: కేంద్రం జీఎస్టీని తగ్గించడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో ఊరట లభించిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో కలిసి గొట్లూరులో జీఎస్టీ 2.0పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కేంద్రం అమలు చేస్తున్న జన్‌ధన్ యోజన ఖాతా, పీఎంజీఆర్‌వై, సుకన్య సమృద్ధి యోజన, వ్యక్తిగత, కుటుంబ బీమా పథకాలతో కలిగే ప్రయోజనాల గురించి గ్రామస్థులకు వివరించారు. అనంతరం గ్రామంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో సమావేశాన్ని నిర్వహించారు. సర్పంచి నరసమ్మ, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి గోపాల్‌నాయక్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర శిబిరానికి స్పందన

ధర్మవరం న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. బెంగళూరు నేత్రజ్యోతి ఆసుపత్రి నేత్ర వైద్యులు రోగుల కళ్లను పరీక్షించి, శస్త్రచికిత్సకు అవసరమైన వారిని ఎంపిక చేశారు. దాత గంజికుంట శ్రీధర్ బాబు, కుటుంబ సభ్యుల సహకారంతో శిబిరం పెట్టామని ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శీలా నాగేంద్ర, జయరామ్ తెలిపారు. శిబిరాన్ని ఫౌండేషన్ ప్రతినిధులు జయరామ్, మోహన్, సుకుమార్, రమేష్‌బాబు, రామచంద్ర గుప్తా తదితరులు పర్యవేక్షించారు.

రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు, చిత్రంలో యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

నేడు, రేపు తాగునీటి సరఫరా బంద్

కదిరి: పట్టణంలో సోమ, మంగళవారాల్లో తాగునీటి సరఫరా ఉండదని పురపాలిక కమిషనర్ కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్నపల్లి నుంచి నీటి సరఫరా అయ్యే పైపులైను మలకవేముల పంపుహౌస్ వద్ద పాడైందన్నారు. మరమ్మతులకు రెండు రోజుల సమయం పడుతుందని, పట్టణవాసులు సహకరించాలని ఆయన కోరారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE DHARMAVARAM
E.P. No. 05/2022 in O.S. No:67/2015

Between:
Arveti Bhagavan, residing at D.No.4-797, Shiva Nagar, Dharmavaram Town Sri Satyasai Dist. ...Petitioner/D.Hr
V/s
S.Jaffar S/o late S.Nabirasool, D.No.8-488, Gandhi Nagar, Dharmavaram, Sri Satyasai Dist. ...Respondent/J.Dr

వేలం ప్రకటన

అర్జీదారుడు ఇ.పి. మొత్తమును రాబట్టుటకు J.Drకు సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చియున్నారు. వేలములో పాల్గొనదలచిన వారు 21-11-2025వ తేది ఉదయం 10.30 గంలకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలంలో పాల్గొనవచ్చును.

SCHEDULE

Properties situated Hindupur RD and Dharmavaram SRD, Dharmavaram Municipal Limits, 8th Ward, D.No 8-539, Gandhi Nagar Street, the scheduled property purchased through Doc.No. 1231/1997 Assessment No.1002010510, following are the measurements
East to West: 13 Sq. Feet or 3.96 meters, **North to South:** 31 Sq. feet or 9.44 meters Boundaries for the above described property:
East: Road, **South:** Beebijan House, **West:** Posa Subbarayudu's hut, **North:** R.Alivelamma House Within the boundaries full extent of house and open site and total an extent of 403 Sq. Feet or 44.78 Sq. Yards or 0.92 Cents. The above said house Property is in Survey No. 412-1

అమీన వాల్యు రూ. 7,50,000/-
Sub-Registrar Value: 10,44,140/-
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

K.L.Nagarjuna Gupta, Advocate, Anantapuramu.

రహదారిపై గుంతల పూడ్చివేత

పనులు చేయిస్తున్న సేవాదళ్ సభ్యులు

ఓబుళంపల్లి (చెన్నేకొత్తపల్లి), న్యూస్‌టుడే: సీకేపల్లి మండలం ఓబుళంపల్లి గ్రామానికి చెందిన సత్యసాయి సేవాదళ్ సభ్యులు పెద్దన్న, మల్లికార్జున రహదారిపై ఏర్పడిన గుంతలను ఆదివారం పూడ్చారు. అమిదాలకుంట నుంచి ఒంటికొండ వరకు ఐదు కి.మీ పరిధిలోని దారిపై ఏర్పడిన గుంతల వల్ల వాహనదారులు, ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యేవారు. ఇబ్బందులను గమనించిన సేవాదళ్ సభ్యులు ఇద్దరూ సమన్వయంతో పొక్లయిన్ ఏర్పాటు చేసి మట్టివేసి పూడ్చడంతోపాటు దారి పక్కనున్న ముళ్లకంపలు సైతం తొలగించారు. వెంకటాంపల్లి, ఓబుళంపల్లి గ్రామాల్లో వైద్యసేవలు అందించేందుకు సత్యసాయి వాహనాలు వస్తాయన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

అధికారులతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం న్యూస్‌టుడే: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ కోరారు. ఆయన ఆదివారం లక్ష్మీచెన్నకేశవపురం వద్దనున్న క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎంపీడీవోలు, పురపాలక అధికారులతో సమావేశమై మాట్లాడారు. తాను చేపట్టిన 'మీ సమస్య-మా పరిష్కారం' కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అధికారులకు అందజేశామని, వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టాల్సిన పనులపై వారితో చర్చించారు. పట్టణ వార్డుల్లో నెలకొన్న సమస్యలను తీర్చాలని పురపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ సాయికృష్ణను కోరారు. సమావేశంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కమతం కాటమయ్య, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జి మహేష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: చిత్రావతి రోడ్డులో అరిటాకు హోటల్ పక్కన చెత్త తొలగించిన తర్వాత బ్లీచింగ్ పొడి చల్లకపోవడంతో దుర్వాసన వేస్తోంది. - **నరసింహులు, సాయినరేష్, స్థానికులు**

పరిష్కారం: అక్కడ వెంటనే బ్లీచింగ్ పొడి చల్లించి సమస్య పునరావృతం కాకుండా చూస్తాం. -**శివయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పుట్టపర్తి పురపాలిక**

-న్యూస్‌టుడే, పుట్టపర్తి పట్టణం

మట్టి పోసి.. చదును చేసి

మండలంలోని ధనియానిచెరువు గ్రామంలో కదిరి-రాయచోటి ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతల్లో తెదేపా నాయకుడు హరిప్రసాద్ మట్టి తరలించి చదును చేయించారు. గుంతల రోడ్డుతో ప్రయాణికులు, స్థానికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి మట్టితో చదును చేసినట్లు తెలిపారు. గుంతల్లో వర్షపు నీరు నిలుస్తుండటంతో 30 ట్రాక్టర్ల మట్టిని తెచ్చి పూడ్చినట్లు ఆయన వెల్లడించారు. దీనిపై ప్రయాణికులు, స్థానికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

- న్యూస్‌టుడే, నంబూలపూలకుంట

అలరించిన కార్తిక వనభోజనం

ధర్మవరం న్యూస్‌టుడే: పట్టణంలోని సీఎన్‌బీ కల్యాణమండపంలో ఆదివారం అఖిల గాండ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన భోజనం నిర్వహించారు. సంఘం పట్టణాధ్యక్షుడు చెన్నంశెట్టి జగదీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గాండ్ల కులస్థులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ అందరూ కలిసి వన భోజనం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆర్‌అండ్‌బీ ఈఈ సంజీవయ్య, ఎక్సైజ్ సీఐ చంద్రమణి, సంఘం జిల్లా అధ్యక్షుడు గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న గాండ్ల సంఘం నాయకులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నల్లమాడలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1989-93 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పాత స్నేహితులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని అలనాటి అల్లరిని గుర్తు చేసుకున్నారు. తమకు పాఠాలు చెప్పిన అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని పూర్వ వ్యాయామ ఉపాధ్యాయుడు వి.నాగభూషణం జ్ఞాపకార్థం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

- న్యూస్‌టుడే, నల్లమాడ

IN THE COURT OF THE HON'BLE CIVIL (SENIOR DIVISON):: DHARMAVARAM
E.P. No.04/2022 in 0.S.No:63/2015

Between:
Arveti Lakshmidevi W/o A.Bhagavan, residing at D.No.4-797, Shiva Nagar, Dharmavaram Town Sri Satyasai Dist. . .Petitioner/ D.Hr
V/s
1) S.Beebi Jaan (Died), 2) S.Jaffar,
3) S.Dada Khalander,
4) S.Jameel Basha, 5) S.Gouse
All 2 to 5 are Sons of Late S.Beebi Jaan and are residing at D.No.8-488, Gandhi Nagar, Dharmavaram Town
6) S.Shameem W/o S.Shaikshavali (D/o Late S.Beebi Jaan) 12-110, Sai Nagar Ananthapuramu Town
7) S.Jabeena W/o Karimulla (D/o Late S.Beebi Jaan) Residing at D.No.13-1-772, Revenue Colony, Ananthapuramu Town.
..Respondents /J.Drs

వేలం ప్రకటన

అర్జీదారుడు ఇ.పి. మొత్తమును రాబట్టుటకు J.Drs.కు సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖల ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చియున్నారు. వేలములో పాల్గొనదలచిన వారు 21-11-2025వ తేది ఉదయం 10.30 గంllలకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలంలో పాల్గనవచ్చును.

SCHEDULE

Properties situated Hindupur RD and Dharmavaram SRD, Dharmavaram Municipal Limits, 8th Ward, D.No 8-540, Gandhi Nagar Street, the schedule property purchased through Doc.No. 2103/1983 Assessment No.1002010511, the following measurements of the house are
East to West: 9.6 Sq. Feet or 2.924 meters, **North to South:** 30 Sq. feet or 9.14 meters including the open site and a house constructed. Boundaries for the above described property:
East: Road, **South:** Udumula Subbamma House, **West:** Posa Subbarayudu's Open Site, **North:** Vellapu Sanjeevaiah's Open Site
Within the boundaries full extent of house and open site and total an extent of 288 Sq. Feet or 32.0 Sq. Yards or 0.66 Cents the above said house Property is in Survey No. 412-1.

అమీన వాల్యు రూ. 5,30,000/- ,
Sub-Registrar Value: 7,46,240/-
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

K.L.Nagarjuna Gupta, Advocate, Ananthapuramu.

BEFORE DEBTS RECOVERY TRIBUNAL - II
Triveni complex at Hyderabad
O.A.No. 848 of 2025

Between:
State Bank of India, Kadiri Main Branch, Kadiri, Sri Satyasai District. Rep by its Chief Manager ... **Applicant**
And
Mr. Kadiri Vinesh Kumar ... **Defendant**

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

To,
Mr. Kadiri Vinesh Kumar, S/o Late Mr. K.Narayana, aged 29 year, Occ: Business, R/o H.No. 10-1098-500 42A, Nizam Vali Colony, Kadiri, Sri Sathyasai District, AP 515591 ... **DEFENDANTS**

Please take the summons in the above O.A. No. 848/2025 filed by the applicant for recovery of money of Rs. 46,32,696/- against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in **2** daily newspapers telugu & english and posted the matter to 04/12/2025.

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;
(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) to disclose particulars of properties or assest other than properties and assests specified by the applicant under serial number 3A of the original application.
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest in created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are directed to appear before Debts Recovery Tribunal - II, Ist Floor, Triveni Complex, Abids, Hyderabad - 500001 in person or through an Advocate and file written statement on 04/12/2025 at 10.30 a.m. and show cause as to why the relief prayed for should not be granted.

Take Notice that in case of default the Application will be heard and determined in your absence.

Given under my hand and seal of this Tribunal on this day 29th October, 2025.

(By order of the DRT II, Hyderabad)
Signature of the Officer Authorized to issue summons

స్థల వివాదంతో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కదిరి గ్రామీణ మండలం కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ ముష్టిపల్లిలో ఇంటి స్థల వివాదం నేపథ్యంలో లక్ష్మీదేవమ్మ అనే వృద్ధురాలు, శ్రీనివాసులు అనే యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. లక్ష్మీదేవమ్మ, శ్రీనివాసులు పక్కపక్క ఇళ్లలో ఉంటున్నారు. ఇంటి సరిహద్దు విషయంగా రెండు కుటుంబాల మధ్య తరచు గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో ఆదివారం లక్ష్మీదేవమ్మ కదిరి పట్టణంలో పురుగు మందు కొనుగోలు చేసి స్వగ్రామానికి వచ్చింది. శ్రీనివాసులు ఎదుట కొంత పురుగు మందు తాగి డబ్బా పక్కన పడేసింది. వెంటనే ఆ డబ్బాలోని పురుగు మందును శ్రీనివాసులు తాగాడు. స్పందించిన స్థానికులు వారిద్దరిని చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వాసుపత్రితో చేర్పించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజనా సుపత్రికి తరలించారు.

క్రైం కార్నర్

అనారోగ్యంతో నర్సింగ్ విద్యార్థిని..

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరికి చెందిన బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని అనారోగ్య సమస్యలతో మనస్తాపానికి గురై ఆదివారం తమ నివాసంలో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. అపస్మారక స్థితికి చేరిన ఆమెను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనతో మెరుగైన వైద్యానికి అనంతపురం తరలించారు.

తండ్రి డబ్బులు తిరిగివ్వలేదని కుమార్తె..

కదిరి గ్రామీణం: మండలంలోని కుమ్మరవాండ్లపల్లికి చెందిన కల్పన అనే వివాహిత ఆదివారం ఆత్మహత్యకు యత్నించింది. కొన్నేళ్ల క్రితం కుటుంబ పోషణ నిమిత్తం ఆమె కువైట్ వెళ్లింది. అక్కడ సంపాదించిన సుమారు రూ.8లక్షలు హైదరాబాద్‌లో ఉంటున్న తండ్రి రాజుకు పంపింది. మూడు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చిన కల్పన డబ్బు ఇవ్వాలని తండ్రిని పలుమార్లు అడిగినా స్పందించకపోవడంతో ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం కదిరి ప్రాంతీయ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికితరలించారు.

కుటుంబ సమస్యలతో ఒకరు..:

కదిరి గ్రామీణ మండలం యర్రదొడ్డి పంచాయతీ బోడే నాయక్ తండాకు చెందిన మహేంద్ర నాయక్ అనే వ్యక్తి కుటుంబ సమస్యలతో ఆదివారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

దురలవాట్లకు బానిసలు కావొద్దు

బుక్కపట్నం, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై కృష్ణమూర్తి హెచ్చరించారు. ఆయన ఆదివారం మండలంలోని రాశింపల్లి, గూనిపల్లి గ్రామాల్లో ఆయన సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామస్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. దురలవాట్లకు దూరంగా ఉండాలని, గ్రూపు రాజకీయాలు, ఫ్యాక్షన్ జోలికి వెళ్లవద్దని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులు సమాచారం ఇవ్వాలని కోరారు.

అర్చకుల సేవలు కొనసాగాలి

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆలయాల్లో బ్రాహ్మణ అర్చకుల సేవలను గౌరవిస్తూ కొనసాగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామేశ్వరప్రసాద్ అన్నారు. ఆయన ఆదివారం మండలంలోని కుమ్మర వాండ్లపల్లి చౌడేశ్వరి ఆలయంలో నిర్వహించిన బ్రాహ్మణ సేవా సంఘం సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం సత్యసాయి జిల్లా నూతన అధ్యక్షుడిగా శివకుమార్‌శర్మతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ఆత్మలపండగ

కనగానపల్లి, న్యూస్‌టుడే: కనగానపల్లి మండలం సీఎన్ కోటలో ఆదివారం ఆత్మల పండగను క్రైస్తవులు నిర్వహించారు. మరణించిన ఆత్మీయులు, పూర్వీకులతోపాటు, బంధువర్గాల సమాధులకు రంగులు వేయించి పూలతో అలంకరించారు. సమాధులు నిర్మించిన ప్రదేశంలో విచారణ గురువుల సారథ్యంలో ప్రార్థనలు నిర్వహించి వారి ఆత్మలను మోక్ష మార్గంలోకి అనుమతించాలని ఏసు ప్రభువును ఆరాధించినట్లు చెప్పారు.

ఘనంగా ఓడీసీ బాబా ఆరాధనోత్సవం

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే: హజరత్ ఓడీసీ బాబా పదో ఆరాధనోత్సవాలు రెండు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం దర్గా సన్నిధిలో వందలాది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. తొలుత భక్తులు దర్గాలో బాబా సమాధిని దర్శించుకుని ప్రార్థనలు చేశారు. .

8న భక్త కనకదాసు జయంతి

ధర్మవరం: భక్త కనకదాసు జయంతిని 8న పట్టణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కమతం కాటమయ్య, కురుబ కల్యాణమండపం అధ్యక్షుడు మాలగుండ్ల మల్లికార్జున తెలిపారు. ఆరోజు కల్యాణ మండపం నుంచి కళాజ్యోతి కూడలి వద్దనున్న భక్త కనకదాసు విగ్రహం వరకు ద్విచక్రవాహనాల ర్యాలీ ఉంటుందన్నారు.

ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్రగాయాలు

గాండ్లపెంట, న్యూస్‌టుడే: బస్సు ఎక్కడానికి వచ్చి ప్రమాదవశాత్తు దాని చక్రం కిందపడి వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు. . కదిరి డిపో బస్సు తిమ్మమ్మమర్రిమాను నుంచి కదిరికి బయలుదేరింది. రెక్కమాను వద్ద బస్సు కదులుతుండగా పాయకట్టుకు చెందిన వృద్ధురాలు లక్ష్మమ్మ ఎక్కే ప్రయత్నం చేసింది. ఈక్రమంలో కాలుజారి కిందపడింది. గమనించని డ్రైవర్ బస్సును కదిలించడంతో ముందర టైరు ఆమె కాళ్లపై వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. ఆమెను చికిత్స నిమిత్తం కదిరి ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వెంకటరాముడు తెలిపారు.

ఎల్3 కాలనీలో చోరీ

ధర్మవరం న్యూస్‌టుడే: పట్టణంలోని ఎల్3 కాలనీలో శనివారం రాత్రి నాగేంద్ర అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. ఆదివారం ఉదయం గుర్తించిన బాధితుడు చోరులు 4 గ్రాముల బంగారు ఉంగరం, రెండు వెండి గొలుసులు, ఆరు పట్టుచీరలు ఎత్తుకెళ్లారని పోలీసులు ఫిర్యాదు చేశాడు.

అట్టహాసంగా వాల్మీకి జయంతి ముగింపు

రుద్రంపేట, న్యూస్‌టుడే: వాల్మీకి ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రుద్రంపేట పంచాయతీ పరిధి వాల్మీకి భవన్‌లో ఆదివారం నిర్వహించి వాల్మీకి జయంతి అట్టహాసంగా ముగిశాయి. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొని వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళి అర్పించారు. సాంస్కృతిక ప్రదర్శనతో అలరించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తించి విశ్రాంతి పొందిన ఉద్యోగులను ఘనంగా సత్కరించారు.



BEFORE DEBTS RECOVERY TRIBUNAL - II
Triveni complex at Hyderabad
O.A.No. 850 of 2025

Between:
State Bank of India, Kadiri Main Branch, Kadiri, Sri Satyasai District. Rep by its Chief Manager ... **Applicant**
And
Ms. Kadiri Malleswari ... **Defendant**

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

To,
Ms. Kadiri Malleswari D/o Late Mr. K.Narayana W/o Mr. Srinivas PV, aged 33 year, Occ: Business, R/o. H.No. 10-1098-500 42A, Nizam Vali Colony, Kadiri, Sri Sathyasai District, AP 515591 ... **DEFENDANTS**

Please take the summons in the above O.A. No. 850/2025 filed by the applicant for recovery of money of Rs. 47,33,285/- against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in **2** daily newspapers telugu & english and posted the matter to 04/12/2025.

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;
(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) to disclose particulars of properties or assest other than properties and assest specified by the applicant under serial number 3A of the original application.
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest in created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are directed to appear before Debts Recovery Tribunal - II, Ist Floor, Triveni Complex, Abids, Hyderabad - 500001 in person or through an Advocate and file written statement on 04/12/2025 at 10.30 a.m. and show cause as to why the relief prayed for should not be granted.

Take Notice that in case of default the Application will be heard and determined in your absence.

Given under my hand and seal of this Tribunal on this day 29th October, 2025.

(By order of the DRT II, Hyderabad)
Signature of the Officer Authorized to issue summons

BEFORE DEBTS RECOVERY TRIBUNAL - II
Triveni complex at Hyderabad
O.A.No. 849 of 2025

Between:
State Bank of India, Kadiri Main Branch, Kadiri, Sri Satyasai District. Rep by its Chief Manager ... **Applicant**
And
Mr. Kasipogula Suresh ... **Defendant**

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

To,
Mr. Kasipogula Suresh S/o Late Mr. Roshappa, aged 36 year, Occ: Business, R/o Dinnamedapalli Street, Gowkanapalle Village, Sri Sathyasai District, AP 515581 ... **DEFENDANTS**

Please take the summons in the above O.A. No. 849/2025 filed by the applicant for recovery of money of Rs. 45,14,804/- against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in **2** daily newspapers telugu & english and posted the matter to 04/12/2025.

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;
(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) to disclose particulars of properties or assest other than properties and assets specified by the applicant under serial number 3A of the original application.
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest in created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are directed to appear before Debts Recovery Tribunal - II, Ist Floor, Triveni Complex, Abids, Hyderabad - 500001 in person or through an Advocate and file written statement on 04/12/2025 at 10.30 a.m. and show cause as to why the relief prayed for should not be granted.

Take Notice that in case of default the Application will be heard and determined in your absence.

Given under my hand and seal of this Tribunal on this day 29th October, 2025.

(By order of the DRT II, Hyderabad)
Signature of the Officer Authorized to issue summons

(c) eenadu

సదా.. మీ అడుగు జాడలో..

కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో ఆదివారం కేంద్ర మాజీ మంత్రి, దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు వర్ధంతి జరిగింది. ఆయన ఘాట్ వద్ద కుమారుడు, కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, సోదరుడు, రాష్ట్ర మంత్రి కె.అచ్చెన్నాయుడు, కుటుంబ సభ్యులు అంజలి ఘటించారు. ఎర్రన్నా.. అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ, బగ్గు రమణమూర్తి, మాజీ మంత్రి గౌతు శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి, టెక్కలి

పెళ్లి సంబంధాల కోసం వెతుకుతున్నారా

కాపు/ తెలగ అవివాహితులకు సువర్ణావకాశం

నేడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, కాపు/తెలగ అవివాహితులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. ఈనాడు కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు వివాహం కోసం ఎదురుచూస్తున్న అవివాహితలతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (03 నవంబరు 2025 సోమవారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

★ వివరాలకు 91549 18858, 80080 01686ను సంప్రదించవచ్చు. ఫోన్/యాప్ ద్వారా కూడా రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయో డేటా, ఫొటోలు పైన తెలియచేసిన వాట్సాప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు.

అలాగే చూస్తుండండి.. ఇలాగే తవ్వేస్తాం..!

ఆమదాలవలసలో ఇసుక దందాకు అద్దం పడుతోందీ చిత్రం. మండలంలోని వెవ్వావలపేట రేవు నుంచి కొందరు ట్రాక్టర్లతో పట్టపగలే ఇసుక తవ్వి ఇలా తరలిస్తున్నారు. చిట్టివలస కొండ, రామచంద్రాపురం సాగరం చెరువులు, జగనన్న కాలనీల వద్ద నిల్వ చేసి రాత్రి వేళల్లో లారీలపై ఇతర ప్రాంతాలకు రవాణా చేసి జేబులు నింపుకొంటున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రాంబాబు తెలిపారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

తెప్పపై భాస్కరుడి విహారం..!

ఇంద్రపుష్కరిణిలో దీపాలు వెలిగించి తెప్పలు విడిచిపెడుతున్న భక్తులు

ఆదిత్యుని క్షేత్రం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆదివారం క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా అరసవల్లిలోని ఇంద్రపుష్కరిణిలో జరిగిన తెప్పోత్సవం కనుల పండువగా సాగింది. ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. హంస వాహనంపై ఇంద్రపుష్కరిణిలో స్వామి 12 సార్లు విహరించారు. మహిళలు తెప్పలు వదిలారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెప్పోత్సవం అనంతరం తిరువీధి నిర్వహించారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

స్వర్ణాభరణాల అలంకరణలో దర్శనమిస్తున్న దేవతామూర్తులు

తీర ప్రాంతాల్లో గస్తీ పెంపు

ఈనాడు కథనానికి స్పందన

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా జిల్లాలోని తీర ప్రాంతాలు పర్యాటకులతో రద్దీగా ఉంటాయి. భద్రతా పరంగా అక్కడ నెలకొన్న లోటుపాట్లు, ఇతర సమస్యలపై 'ఈనాడు'లో ఈ నెల 1న 'ఆహ్లాదం అడగొద్దు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దానిపై అధికారులు స్పందించారు. అక్కుపల్లి పర్యాటక తీరంలో ఆదివారం భావనపాడు మెరైన్ పోలీసుస్టేషన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇతర తీరాల్లోనూ గస్తీ పెంచినట్లు మెరైన్ సీఐ రాము తెలిపారు.

అంతే అందంగా.. ముద్ద మందారంలా..!

ఈ చిత్రంలో కనిపిస్తున్నవి మందార పువ్వులనుకుంటే మీరు పొరబడినట్లే.. ఇచ్ఛాపురం మండలం హరిపురానికి చెందిన వడ్డీన కుమారి ఇంట్లోని గోంగూర మొక్కకు పూసిన పూలు ఇవి. చూడటానికి ఎర్రని రంగులో అందంగా మందారాన్ని పోలి ఉండటంతో అంతా ఆసక్తిగా తిలకిస్తున్నారు. గోంగూర, మందారం (మాల్వేసి ఫ్యామిలీ) ఒకే కుటుంబానికి చెందినవని ఆమదాలవలస వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డా.ఎం.శ్రీనివాస్ (ప్లాంట్ బ్రీడింగ్) తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

అక్రమాలకు సపోర్టు..!

సంతబొమ్మాళిలో స్థిరాస్తి వ్యాపారుల దందా

చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

'పోర్టు పక్కనే కదా.. ఈ బిట్ తీసుకోండి.. భవిష్యత్తులో ధర ఇంకా పెరుగుతుంది.. మీరు తిరిగి చూసుకోవాల్సిన పనుండదు' – ఇవి సంతబొమ్మాళి మండలంలో అక్రమ లేఅవుట్లలోని స్థలాలను అంటగట్టేందుకు స్థిరాస్తి వ్యాపారులు చెబుతున్న మాటలు..

'అనుమతుల్లేని లే అవుట్‌లో ఇల్లు కట్టుకుంటే బ్యాంకు రుణాలు మంజూరు కావు. సౌకర్యాల కల్పన జరగదు. అధికారులు గుర్తిస్తే ఆ సర్వే నంబరును నిషేధిత జాబితాలో చేరుస్తారు. అత్యవసర పరిస్థితుల్లో ఆ స్థలం అమ్ముకోవాలన్నా వీలు కాదు.' – ఇవి స్థలాల కొనుగోలు విషయంలో అధికారులు చేస్తున్న సూచనలు..

– న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

మూలపేట పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సంతబొమ్మాళి మండలంలో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇదే అదనుగా గ్రామాల్లో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. క్షేత్రస్థాయిలో అనధికారికంగా వందకుపైగా వెంచర్లు ఉంటే.. వాటిలో కేవలం ఆరింటికి మాత్రమే ప్రభుత్వ అనుమతులున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

నౌపడలో అనుమతుల్లేకుండా ఏర్పాటు చేసిన లేఅవుట్

● నౌపడ పరిసర ప్రాంతాల్లో 30 లేఅవుట్లు వెలిశాయి. వాటిల్లో రెండింటికి మాత్రమే సుడా, డీటీసీపీ అనుమతులున్నాయి. ఇక్కడ పోర్టు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం సెంటు భూమికి రూ.26 వేల చొప్పున రైతులకు చెల్లించగా.. స్థిరాస్తి వ్యాపారులు వ్యవసాయ భూముల్ని కొని రెండు సెంట్ల బిట్‌ను రూ.10 లక్షలకు విక్రయిస్తున్నారు.

● నౌపడ, దండుగోపాలపురం రోడ్డు సమీపంలో ఓ లేఅవుట్ వేసి ప్లాట్లు అమ్మేశారు. కనీసం రోడ్డు, విద్యుత్తు, తాగునీటి సదుపాయాలు కల్పించకుండానే అమ్మేశారు. వాటిని కొనుగులు చేసిన 30 మందికి పంచాయతీ ప్లాన్లు ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

ఏం జరుగుతోంది...

★ వ్యవసాయ భూములను నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లుగా మార్చేస్తున్నారు.

★ సంబంధిత శాఖ అనుమతి తీసుకోకుండా, నిరభ్యంతర పత్రాలు పొందకుండానే వెంచర్లు వేస్తున్నారు.

★ కనీస సౌకర్యాలు కల్పించకుండానే విక్రయించి.. కొనుగోలు దారులను చిక్కుల్లో పడేస్తున్నారు.

ఎక్కువ సమస్య ఇక్కడే..

బోరుభద్ర, నౌపడ, సంతబొమ్మాళి, ఇజ్జువరం, దండుగోపాలపురం, పాలతలగం

డబ్బులిస్తే.. నంబర్లు..

ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీ పాలకవర్గాలే భారీ మొత్తంలో వసూలు చేసి వ్యాపారులకు సహకారం అందిస్తున్నారని ఆరోపణలున్నాయి. కొందరు నేతల ఒత్తిడితో సిబ్బంది డబ్బులు తీసుకుని అక్రమ లేఅవుట్లలో ఇళ్లకు నంబర్లు కూడా కేటాయిస్తున్నారు. 'డివిజన్ పరిధిలో సుడా అనుమతి లేకుండా వెంచర్ వేయకూడదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి.. అక్రమ లేఅవుట్లను గుర్తించి చర్యలు తీసుకుంటాం' అని టెక్కలి డీఎల్‌పీవో ఐ.వి.రమణ తెలిపారు.

కోలుకుంటున్న క్షతగాత్రులు

పలాస, కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కాశీబుగ్గ వేంకటేశ్వరాలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో గాయపడినవారు కోలుకుంటున్నారు. పలాస, టెక్కలి, శ్రీకాకుళం ఆసుపత్రుల్లో వారికి మెరుగైన వైద్య సేవలందిస్తున్నారు. పలాస సామాజికాసుపత్రిలో 11 మందికి చికిత్స చేస్తున్నారు. సరియాపల్లికి చెందిన సీహెచ్ శాంతమ్మను శ్రీకాకుళం గ్రామీణ మండలం రాగోలులోని జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. నలుగురు కోలుకోవడంతో ఆదివారం ఇంటికి పంపారు. మృతి చెందినవారి కుటుంబ సభ్యులకు ఆదివారం రూ.15 లక్షలు చొప్పున నష్ట పరిహారం చెక్కులను అందజేశారు.

పలాస సామాజికాసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

★ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం కాశీబుగ్గలో పర్యటించారు. ఘటన జరిగిన వేంకటేశ్వరస్వామి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే గౌతు శిరీష, దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ పాల్గొన్నారు.

కాశీబుగ్గలో ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే శిరీష తదితరులు

పక్కదారి పట్టిస్తే పట్టేస్తారు..!

● రేషన్ డిపోల్లో అక్రమాల అడ్డుకట్టకు యాప్

– న్యూస్‌టుడే, లావేరు

కూటమి ప్రభుత్వం పౌర సరఫరాల వ్యవస్థను ప్రక్షాళన చేస్తోంది. ఇప్పటికే క్యూఆర్ కోడ్, రాజముద్ర, కుటుంబ సభ్యుల వివరాలతో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసింది. బియ్యం అక్రమ రవాణాను అరికట్టడానికి రసాయన కిట్లు అందుబాటులోకి తీసుకొచ్చింది. దుకాణాల్లో సరకులు పక్కదారి పట్టకుండా నియంత్రించడానికి 'ఎఫ్‌పీ షాప్ ఇన్‌స్పెక్షన్' (రేషన్ దుకాణాల తనిఖీ) పేరిట యాప్‌ను ప్రవేశపెట్టింది.

సరుబుజ్జిలి మండలం రొట్టవలస డిపోలో సరకుల వివరాలు యాప్‌లో తనిఖీ చేస్తున్న డీఎస్‌వో సూర్యప్రకాశరావు

వ్యత్యాసం ఉంటే చర్యలు

★ పౌర సరఫరాల శాఖ గోదాంల నుంచి డిపోలకు సరఫరా చేస్తున్న సరకుల వివరాలు, కార్డుదారుల సమాచారం యాప్‌లో నమోదు చేసి ఉంటాయి.

★ అధికారులు తనిఖీకి వెళ్లినప్పుడు డిపోల్లో నిల్వలకు సంబంధించి వ్యత్యాసం ఉంటే డీలర్‌పై చర్యలు తీసుకుంటారు. కార్డుదారులతో సరకుల పంపిణీపై ఆరా తీస్తారు. ఫిర్యాదులొచ్చినా కేసు నమోదు చేస్తారు.

★ ప్రతి నెలా డీఎస్‌వో, ఆర్డీవోలు, తహసీల్దారులు, సీఎస్‌డీటీలు, ఇతర అధికారులు తప్పనిసరిగా 250 రేషన్ డిపోలు తనిఖీ చేయాలి.

★ గుర్తించిన అంశాలు, అక్రమాలపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాలి.

★ జులై నుంచి ఇప్పటివరకు 1,000 రేషన్ దుకాణాలు తనిఖీ చేసి 6ఏ కేసులు 10 నమోదు చేసినట్లు పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

ఫిర్యాదులు తగ్గాయి..: రేషన్ సరకులు లబ్ధిదారులకు పక్కాగా అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం యాప్‌ను ప్రవేశపెట్టింది. జిల్లాలో ఇది అందుబాటులోకి వచ్చిన తర్వాత కార్డుదారుల నుంచి ఫిర్యాదులు తగ్గాయి. తనిఖీల్లో ఎలాంటి లోటుపాట్లు ఉన్నా పరిష్కరించడానికి అవకాశం ఉంటుంది. పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం.
– జి.సూర్యప్రకాశరావు, డీఎస్‌వో, శ్రీకాకుళం

జిల్లాలో రేషన్ డిపోలు	కార్డులు	లబ్ధిదారులు	నెలకు పంపిణీ చేస్తున్న బియ్యం	పంచదార
1,603	6,60,739	24 లక్షలు	8,935 మెట్రిక్ టన్నులు	281 మెట్రిక్ టన్నులు

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వినతులు నమోదు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 1100కి కాల్ చేయొచ్చని స్పష్టం చేశారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: పంచారామాలకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరినట్లు శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ హనుమంతు అమరసింహుడు తెలిపారు. ఆదివారం ఆయన జెండా ఊపి బస్సును ప్రారంభించారు. కార్తిక మాసంలో ప్రతి ఆదివారం పంచారామాలకు ప్రత్యేక బస్సులు బయల్దేరుతాయని తెలిపారు. ఈ సర్వీసులలో టికెట్లు బుక్ చేసుకున్న భక్తులు అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలోని శివక్షేత్రాలను దర్శించుకొని మంగళవారం ఉదయం కాంప్లెక్స్‌కు చేరుకుంటారని వివరించారు. మరిన్ని వివరాలకు శ్రీకాకుళం 1వ డిపో 9959225608, 2వ డిపో 9959225609, పలాస డిపో 9959225610, టెక్కలి డిపో 9959225611 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

గ్రామాల్లో పాలన.. గాడిన పడేలా..!

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

పల్లె పాలనలో కీలక పాత్ర వహించే పంచాయతీరాజ్ వ్యవస్థ వైకాపా హయాంలో నిర్లక్ష్యానికి గురైంది. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి అటకెక్కింది. ఈ విషయాన్ని గుర్తించిన కూటమి సర్కారు సంస్కరణలపై దృష్టి పెట్టింది. గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుతో పాటు నిరంతరం పర్యవేక్షణకు డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి(డీడీవో) వ్యవస్థను తీసుకొచ్చింది. ఆ మేరకు ఉమ్మడి జిల్లా పరిధిలోని నాలుగు రెవెన్యూ డివిజన్ల పరిధిలో కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో 4 డీడీవో కార్యాలయాలు

జడ్పీ కార్యాలయంలో డీడీవో కార్యాలయానికి కేటాయించిన గది

అదనపు విభాగాలు.. ప్రత్యేక పోస్టులు..

★ డీడీవో కార్యాలయ పరిధిలోనే డివిజనల్ పంచాయతీ అధికారి(డీఎల్‌డీవో), డ్వామా ఏపీడీ విభాగాలు పని చేస్తాయి.

★ కార్యాలయ పాలనా వ్యవహారాలు చూసేందుకు సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ సహాయకులు, అటెండర్ పోస్టులను కేటాయించారు.

★ జడ్పీ డిప్యూటీ సీఈవో హోదా కలిగినవారికి డీడీవోలకు ప్రత్యేకాధికారాలు అప్పగిస్తారు.

★ ఇప్పటికే కార్యాలయాల ఏర్పాటు ప్రక్రియను జిల్లా పరిషత్తు అధికారులు దాదాపు పూర్తి చేశారు.

★ అందుబాటులోకి తీసుకువచ్చి వాటి ద్వారా ఈ నెల నుంచే ప్రజలకు సేవలందించేలా చర్యలు చేపడుతున్నట్లు ఇన్‌చార్జి జడ్పీ సీఈవో డి.సత్యనారాయణ తెలిపారు.

రెవెన్యూ డివిజన్	ప్రాంతం
శ్రీకాకుళం	జడ్పీ కార్యాలయం
టెక్కలి	పాత ఎంపీడీవో ఆఫీస్
పలాస	స్త్రీ శక్తి భవనం
పాలకొండ	ఎస్టీ బాలుర వసతి గృహం

(c) eenadu

రండి.. సొమ్ము తీసుకోండి..!

డీఈఏఎఫ్ ఖాతాలపై కేంద్రం మార్గదర్శకాలు

తిరిగి చెల్లించేందుకు బ్యాంకర్ల కసరత్తు

–న్యూస్‌టుడే, పాతశ్రీకాకుళం, రణస్థలం

పదేళ్లు అంతకు మించి లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లో సొమ్మును బ్యాంకులు తిరిగి ఇచ్చేయనున్నాయి. ఈ మేరకు కేంద్రం బ్యాంకులకు ఆదేశాలు ఇచ్చింది. అన్ని బ్యాంకుల నుంచి అలాంటి ఖాతాలు, నగదు వివరాలు తెప్పించుకుని, సంబంధిత ఖాతాదారులకు ఏవిధంగా సొమ్ము అందజేయాలో జిల్లా స్థాయి అధికారులకు మార్గదర్శకాలను జారీ చేసింది. జిల్లాలో 29 బ్యాంకులు ఉండగా, వాటి పరిధిలో 320 శాఖలు ఉన్నాయి. ఇలా ఏళ్ల తరబడి నిర్వహణ లేని వాటిని డీఈఏఎఫ్(డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎవేర్‌నెస్ ఫండ్) ఖాతాలు అని అంటారు.

మీ డబ్బు.. మీ హక్కు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ బ్యాంకు ప్రాంతీయ మేనేజర్ పైడి రాజా, ఎల్‌డీఎం శ్రీనివాస్ తదితరులు

★ బ్యాంకు మేనేజర్లు తమ పరిధిలోని ఖాతాదారుడికి ఫోన్, మెసేజ్, రిజిస్టర్డ్ పోస్టు ద్వారా వివరాలు తెలియజేసి, నగదు తీసుకోవాలని సమాచారం ఇవ్వాలి. అప్పటికీ అటు నుంచి స్పందన లేని పక్షంలో సచివాలయ సిబ్బందికి వివరాలు అందజేస్తే వారు స్వయంగా ఖాతాదారుడిని కలిసి విషయం చెబుతారు. డిసెంబర్ నెలాఖరు నాటికి ఈ ప్రక్రియ పూర్తి కావాలి. కలెక్టర్ ప్రతి వారం బ్యాంకర్లతో దీనిపై సమీక్ష నిర్వహిస్తారు.

4.07 లక్షల ఖాతాలు.. రూ.87.11 కోట్లు

జిల్లాలో 4,07,437 లక్షల డీఈఏఎఫ్ ఖాతాలు ఉన్నాయి. ఇందులో రూ.87.11 కోట్లు ఉంది. అత్యధికంగా స్టేట్‌బ్యాంకు పరిధిలో 93,898 ఖాతాలు, అందులో రూ.34.24 కోట్లు మూలుగుతున్నాయి. తరువాత స్థానంలో యూనియన్ బ్యాంకు ఉంది. ఫిక్స్‌డ్ డిపాజిట్, సేవింగ్స్, కరెంట్ ఖాతాలకు ఈ అవకాశం వర్తిస్తుంది. ఖాతాదారుడు బ్యాంకుకు వెళితే.. క్లెయిం ఫాం నింపి, అనంతరం కేవైసీకి సంబంధించిన పత్రాలు అందిస్తే సొమ్ము తిరిగి ఇచ్చేస్తారు. మృతి చెందిన వారైతే కుటుంబ సభ్యులు మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. ఖాతాదారులు సొమ్మును పొందేందుకు ఇదే మంచి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పేడాడ శ్రీనివాస్ తెలిపారు.

ప్రభుత్వ స్థలం.. పరాధీనం..!

మంత్రి ఆదేశాలతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం

–న్యూస్‌టుడే, టెక్కలి

టెక్కలిలో విలువైన స్థలాలు పరాధీనమవుతున్నాయి. అవన్నీ ప్రభుత్వ స్థలాలు కావడం, అధికారులు లేదా ప్రభుత్వం మారినప్పుడు ఆక్రమణలకు గురవడం, పలువురు పాగా వేయడం జరిగిపోతున్నాయి. ఇలా టెక్కలి నలుదిక్కులా ఉన్న స్థలాల్లో వెలిసిన భవనాలు, ఇళ్లు చాలా ఉన్నాయి.

◆ తెలినీలాపురం పంచాయతీ దర్శనీలాపురం పరిధిలో సర్వేనంబరు 14లో సాంఘిక సంక్షేమశాఖకు చెందిన 2.66 ఎకరాలు ఉన్నాయి. ఎల్పీఎం సంఖ్య 324గా దస్త్రాల్లో ఉంది. ఈ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఫిర్యాదులు వస్తున్నాయి. గతంలో రెవెన్యూ అధికారులే అవసరమైన ధ్రువపత్రాలు ఇవ్వడంతో లేఅవుట్ వెలిసి విక్రయాలు సైతం జరిగిపోయాయి. చింతలగార రెవెన్యూ పరిధిలో సర్వేనంబరు 7లో 20 ఎకరాల భూమి ల్యాండ్ సీలింగ్‌లో టెక్కలి రాజులనుంచి ప్రభుత్వం దఖలుపడినట్లు రెవెన్యూ యంత్రాంగం చెబుతోంది. దీనిలో 2020లో అప్పటి ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు లేఅవుట్ కూడా వేసింది. అప్పట్లో రాజ వంశీయులు హైకోర్టును ఆశ్రయించి ఉత్తర్వులు తెచ్చుకోవడంతో పంపిణీ ఆగిపోయింది. తాజాగా దీనిపై న్యాయస్థానంలో సంప్రదింపులు జరిపి ఈ భూమి ప్రభుత్వానికి అందేటట్లు చేయాలన్నది ప్రణాళిక.

ప్రభుత్వ భూమిగా చెబుతున్న మిస్సమ్మ బంగ్లా

◆ టెక్కలి పాతస్టాండు, టెక్కలి- చెట్లతాండ్ర మార్గానికి మధ్యలో సర్వేనంబరు 395/3లో 2.81 ఎకరాల భూమిలో ఉత్తర విశాఖ సర్వోదయసమితికి చెందిన కార్యకలాపాలు సాగాయి. అందులో కొంతకాలం భవనం నిర్మించి భారతీయ స్టేట్‌బ్యాంకుకు అద్దెకిచ్చారు. మరో 50 సెంట్లు ఓ ప్రైవేటు వ్యాపారికి లీజుకిచ్చారు. ఈ స్థలం అదే సర్వేనంబరులో 52 మంది రిజిస్ట్రేషన్లు పొంది ఇళ్లు నిర్మించుకున్నారు. తాజాగా ఎస్ఎల్ఆర్‌లో ఇది పోరంబోకు స్థలంగా ఉందని రెవెన్యూ యంత్రాంగం చెబుతోంది. ప్రస్తుతం ఈ భూమిని ప్రభుత్వపరం చేసేందుకు కసరత్తు ప్రారంభమైంది.

◆ ఇతరుల పరమవుతున్న ప్రభుత్వ స్థలాల గురించి ఇటీవల తెలుసుకున్న మంత్రి అచ్చెన్నాయుడు అసహనం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులతో జిల్లా అధికారిక సమీక్ష నిర్వహించి, ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రభుత్వ స్థలాలు సంరక్షించాలని ఆదేశించారు. విలువైన ప్రభుత్వ భూములు వైరిపార్టీ హయాంలో చేతులు మారాయని, అంతకుముందు కూడా న్యాయస్థానాల్లో తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించి వివాదాలు సృష్టించారన్నారు. వీటన్నింటిపై స్పష్టమైన ఆధారాలతో ముందుకు వెళ్లి, ప్రభుత్వ ఆస్తుల్ని కాపాడాలని పేర్కొన్నారు. తాజాగా భూముల సంరక్షణకోసం రెవెన్యూ యంత్రాంగం ప్రారంభించిన ప్రయత్నంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

నేత్రపర్వం కూర్మనాథుని తెప్పోత్సవం

దేవతామూర్తుల పల్లకి సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

గార (శ్రీకూర్మం), న్యూస్‌టుడే: గార మండలం శ్రీకూర్మంలోని కూర్మనాథ క్షేత్రం శ్వేతపుష్కరిణిలో కార్తిక శుద్ధ ద్వాదశి సందర్భంగా ఆదివారం స్వామి తెప్పోత్సవం కనులపండువగా జరిగింది. ఆలయ ఈవో నరసింహనాయుడు, ప్రధాన అర్చకుడు చామర్ల సీతారామనృసింహాచార్యులు నేతృత్వంలో వైదిక సిబ్బంది ఉదయం స్వామివారి దైనందిన కార్యక్రమాలు అనంతరం విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం సుందర పెరుమాళ్లు, శయన బేరం విగ్రహాలను పుష్పకంలో శోభాయాత్ర నిర్వహించి ముందుగా సిద్ధం చేసిన తెప్పలపై ఉత్సవాన్ని నిర్వహించారు. పుష్కరిణిలో ఉగ్రనరసింహస్వామి మండపం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి ఆలయానికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. కాశీబుగ్గ ఘటన నేపథ్యంలో శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష, డీఎస్పీ వివేకానంద ఉత్సవ ఏర్పాట్లు పరిశీలించారు. సీఐలు పైడపునాయుడు, సత్యనారాయణ పర్యవేక్షణలో 90 మంది పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

తెప్పోత్సవం వీక్షిస్తున్న భక్తులు

కాస్త ఉండు.. దాటుతోంది వానర దండు..!

ఇచ్ఛాపురంలో కోతులు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఎక్కడికక్క గుంపులుగా కనిపించి గందరగోళం సృష్టిస్తున్నాయి. మార్కెట్ రోడ్డులో కనిపించిన దృశ్యంలో వానర దండు రహదారిని దాటుతుండటంతో వాటిని గమనించిన వాహనదారులు, పాదచారులు ఎక్కడి వారు అక్కడే ఆగిపోయారు. ఇక్కడే కాదు.. పట్టణ వ్యాప్తంగా ఉదయం వేళలో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో నెలకు కనీసం 20 మంది కోతుల దాడి బాధితులు చికిత్స పొందుతున్నారు. రాష్ట్రం నుంచి అనుమతి వచ్చాక చర్యలు తీసుకుంటామని కమిషనర్ నల్లి రమేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఘనంగా లక్ష తులసీ దళార్చన

జలుమూరు మండలం అబ్బాయిపేటలోని శ్రీమురళీకృష్ణ స్వామి ఆలయం వద్ద ద్వాదశి సందర్భంగా ఆదివారం లక్ష తులసీ దళార్చన ఘనంగా నిర్వహించారు. అర్చకుడు దివాకర్ ఆధ్వర్యంలో ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం జరిపారు. అనంతరం లక్ష తులసీ దళాలతో ఓం నమో భగవతే వాసుదేవాయ నమః అంటూ పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అబ్బాయిపేట, గంగాధరపేట, కూనలచ్చున్నాయుడుపేట గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, జలుమూరు

ఆదిత్యుని ఆదాయం రూ.10.50 లక్షలు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణస్వామిని ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. కేశఖండనశాలలో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు మహిళా భక్తులు ఇంద్ర పుష్కరిణిలో స్నానాలు ఆచరించి గోశాలలో పూజలు నిర్వహించారు. విరాళాలు, టిక్కెట్లు, ప్రసాదాల విక్రయాలు ద్వారా రూ.10.50లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాదరావు తెలిపారు.

దర్శనానికి వరుసలో వేచి ఉన్న భక్తులు

ఇంధనమే కాదు.. ఇవీ ఉంటాయక్కడ..!

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు, కాశీబుగ్గ

జిల్లాలోని పెట్రోల్ బంకులు: 138

బంకులకు వెళ్లి పెట్రోల్, డీజిల్ పోయించుకునే వాహనదారులకు అక్కడ కొన్ని సౌకర్యాలు ఉంటాయని వాటిని ఉపయోగించుకోవచ్చని చాలామందికి తెలియదు. పౌరులు ఉచితంగానే వీటిని పొందొచ్చు. ఆయా బంకుల యాజమాన్యాలు సైతం ఆ దిశగా చర్యలు తీసుకుని వసతులు కల్పించాలి.

● **అత్యవసర ఫోన్ కాల్ :** అత్యవసర సమయంలో ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు స్నేహితుడికి లేదా కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు పెట్రోల్ బంకు నుంచి ఉచిత ఫోన్ కాల్ చేయొచ్చు. మీ చరవాణిలో ఛార్జింగ్ లేకపోయినా ఏదైనా సమస్య తలెత్తినప్పుడు ఫోన్ కాల్ సదుపాయం పొందే వీలు ఉంది.

● **ప్రాథమిక చికిత్స పెట్టె:** రహదారుల్లో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతుంటారు. ఆ సమయంలో సమీపంలో పెట్రోల్ బంకు కనిపిస్తే అక్కడ ప్రాథమిక చికిత్సకు సంబంధించి పెట్టె సిద్ధంగా ఉంటుంది. అందులోని ఔషధాలు, బ్యాండేజీ వినియోగించొచ్చు. దీంతోపాటు ఉచితంగా గాలి కొడతారు. తాగునీరు, మరుగు దొడ్ల సౌకర్యం సైతం ఉంటుంది.

● **నాణ్యత తెలుసుకో :** పెట్రోల్ లేదా డీజిల్ తక్కువగా వస్తుందని, కల్తీ అవుతుందని చాలా మంది ఫిర్యాదు చేస్తుంటారు. కానీ ఇంధనం నాణ్యత అక్కడికక్కడే తెలుసుకోవచ్చు. అడిగితే ఫిల్టర్ పేపర్ ఇస్తారు. దానిపై రెండు చుక్కలు వేయగానే మచ్చలు ఏర్పడితే నాసిరకమని గుర్తించాలి. మచ్చలు లేకపోతే నాణ్యత ఉన్న ఇంధనమే.

● పెట్రోల్ బంకుల్లో నీరు, వాహనాలకు గాలి, మరుగుదొడ్లు ఇతర ప్రజా సౌకర్యాలు ఉన్నాయా లేదా అన్నది ఆయా ఆయిల్ కంపెనీల సేల్స్ ఆఫీసర్లే పర్యవేక్షించాలి. మార్గదర్శకాల ప్రకారం లేని పక్షంలో నిర్వాహకులపై జరిమానా విధించాలి. ఇప్పటికీ కొంతమంది యజమానులు నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. పలుమార్లు తనిఖీల్లో దొరికితే డీలర్‌షిప్ రద్దు చేస్తాం. నాణ్యత, పరిమాణం పరీక్షలతో పాటు మిగతా సేవలు విషయం రాజీ పడకూడదు. అన్నింటిని ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి సూర్య ప్రకాశరావు తెలిపారు.

నదిలో మునిగి విద్యార్థి మృత్యువాత

సాయితేజ (పాత చిత్రం)

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని శ్రీనీలకంఠేశ్వరస్వామి ఆలయ సమీపంలోని మహేంద్రతనయ నదిలో కె.సాయితేజ (16) అనే విద్యార్థి మునిగి మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పర్లాఖెముండి శేరిమాదిక వీధికి చెందిన సదరు బాలుడు ఆదివారం ఉదయం నదికి స్నానానికి వచ్చారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ప్రమాదవశాత్తు కొట్టుకుపోయి, మునిగిపోయారు. స్థానికులు బయటకు తీసుకొచ్చి, పర్లాఖెముండి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొనడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సాయితేజ పాతపట్నంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నారు.

చెరువులో పడి వృద్ధుడు..

మెట్టు చిన్నారావు (పాత చిత్రం)

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలం గంగువాడ పంచాయతీ పరిధిలోని గొల్లపేట గ్రామానికి చెందిన మెట్టు చిన్నారావు(59) చెరువులో పడి మృతి చెందారు. ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బి.గోపాలపురం సమీపంలోని కృష్ణసాగరం చెరువు వద్దకు స్నానానికి వెళ్లిన చిన్నారావు ప్రమాదవశాత్తు చెరువు లోపలికి వెళ్లిపోయారు. ఈత రాకపోవడంతో మునిగిపోయి, ఊపిరందక మృతి చెందారు. భార్య చిన్నమ్మడు, ఇద్దరు కుమార్తెలున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వాహనం అదుపు తప్పింది.. ఆయువు తీరింది..!

జి.శివాజీ (పాత చిత్రం)

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కవిటి మండలం జగతి గ్రామానికి సమీపంలో మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం పెద్దమానాపురానికి చెందిన గోడివాటి శివాజీ (25) భారత్ గ్యాస్ ఏజెన్సీలో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. రెండు రోజుల కిందట ముగ్గురు టెక్నీషియన్లు కవిటిలో వివిధ గ్రామాల్లో గ్యాస్‌లైన్ పైపు నాణ్యత, వాడే విధానంపై పరిశీలించారు. శనివారం రాత్రి వేరే టెక్నీషియన్ వద్ద ద్విచక్రవాహనం తీసుకుని సోంపేట వెళ్తుండగా జగతి గ్రామం వద్ద మలుపులో అదుపుతప్పి కింద పడి మృతి చెందాడు. మృతుడి బాబాయి జి.చిన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవివర్మ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాస మండలం శాసనాం జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు కాశీబుగ్గ ఏఎస్సై గణపతి తెలిపారు. మృతదేహం నుజ్జయిందని, వయసు 45 సంవత్సరాలు ఉంటాయన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	145	245	265

భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలి

కమిషనర్ రామచంద్రమోహన్‌కు స్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ ఈవో ప్రసాద్

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయంలో భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈవో కె.ఎన్.వి.డి.ప్రసాద్‌ను రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదేశించారు. ఆదివారం ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ మండపంలో ప్రస్తుతం ఉన్న రంగులు తొలగించి భక్తులకు ఆహ్లాదం కలిగించే రంగులతో వేయాలన్నారు. క్యూలైన్లు వచ్చే భక్తులు ఆలయంలోకి ప్రవేశించిన తరువాత దూరం నుంచి స్వామి మూలవిరాట్ కనిపించేలా ఏర్పాట్లు చేయాలని, అడ్డుగా ఉన్న బారికేడ్లు, గేట్లును తొలగించి, రథసప్తమి ఉత్సవాలకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ వేద ఆశీర్వచనాలు, స్వామి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ఈవో కె.ఎన్.వి.డి.విప్రసాద్ స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

గట్టు తెగింది.. కన్నీరు మిగిలింది

ధర్మలక్ష్మీపురం పంచాయతీ దాసుపురం రెవెన్యూ పరిధిలో 25 సంవత్సరాల కిందట ఐటీడీఏ నిధులతో నిర్మించిన బగదల మూల చెరువు గట్టు వరదనీటి ఉధృతికి శనివారం రాత్రి కొట్టుకుపోయింది. దీంతో చెరువు కింద 15 ఎకరాల్లోని వరిచేను పూర్తిగా నేలకొరిగింది. పంట కోత దశకు వచ్చిన సమయంలో ఇలా జరగడంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. పొలంలోని రాళ్లు, ఇసుక, మట్టి తొలగించాలంటే రూ.లక్ష వరకు ఖర్చవుతుందని, అధికారులు స్పందించి అన్నదాతలకు న్యాయం చేయాలని సర్పంచి జె.అనిరుద్రుడు కోరారు. తహసీల్దార్ విజయలక్ష్మి వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. -న్యూస్‌టుడే, సారవకోట,

కఠిన సమయంలో సేవలు.. వెల్లువెత్తిన ప్రశంసలు

రాహుల్ సింగ్ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ధర్మాల నూకరాజు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: సిక్కింలోని 2023లో అక్టోబరులో మంచు కరిగి వరదలా పోటెత్తింది. సంగ్రోట్యాంక్ డ్యామ్‌కు గండి పడి జలప్రళయంలా నీరు ముంచెత్తడంతో గ్రామాలు, వంతెనలు కొట్టుకుపోయాయి. ఆ సమయంలో ఇచ్ఛాపురం పట్టణం బెల్లుపడకు చెందిన ఆర్మీ నాయక్ ధర్మాల నూకరాజు అక్కడ పొక్లెయిన్ ఆపరేటర్‌గా విధులు నిర్వహించారు. ఆయనతోపాటు 200 మంది జవాన్లు ఆపరేషన్ ఆఫ్ ఎక్స్‌క్లేషన్ ఆఫ్ మిషనరీ (ఓసీఎం)లో పాల్గొని సహాయ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన సేవలను గుర్తించిన అధికారులు ఆదివారం సిక్కింలో జరిగిన కార్యక్రమంలో ప్రశంసాపత్రం అందించడంతోపాటు పతకం ఇచ్చారు. కమాండెంట్ అధికారి రాహుల్ సింగ్ వీటిని అందజేసి అభినందించినట్లు నూకరాజు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

EENADU Classifieds

JOBS

SBI లైఫ్ శ్రీకాకుళం బ్రాంచ్‌లో అడ్వైజర్స్ కావలెను. నిరుద్యోగులు, Rtd. ఎంప్లాయిస్, గృహిణి, పోస్టల్, రియల్ ఎస్టేట్ మరియు 2nd income కోసం చూస్తున్న వారు వెంటనే సంప్ర|| మేనేజర్: 9701553222.

E-KARTలో అర్జెంటుగా స్త్రీ/పు కావలెను. Q: Inter, Any డిగ్రీ జీ: 15,000/-. Online are available. 9381912123, 7731816950.

సూర'S బిల్డ్ మార్ట్ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను అర్హత: డిగ్రీ ఇంగ్లీష్ మాట్లాడాలి, వీడియో ఎడిటింగ్ తెలిసి ఉండాలి, కారు డ్రైవింగ్ వచ్చి ఉండాలి, జీతం ఫిక్స్‌డ్ శాలరీతో పాటు పనిశైలి ఆధారంగా బోనస్‌తో 30వేలు పైన. సంప్ర|| 9567919746.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

జాతీయస్థాయి విలువిద్య పోటీలకు కల్యాణ్ ఎంపిక

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి విలువిద్య పోటీలకు శ్రీకాకుళం నగరం హడ్కో కాలనీలకు చెందిన ఆరంగ కల్యాణ్ ఎంపికయ్యాడు. విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో రికర్వ్ విభాగంలో మంచి ప్రతిభతో రాణించాడు. 22 నుంచి అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఇటానగర్‌లో నిర్వహించే 42వ జాతీయ సబ్ జూనియర్ ఆర్చరీ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొననున్నారు.

క్రీడా సందడి..!

జిల్లా కేంద్రంలో ఆదివారం క్రీడా వాతావరణం నెలకొంది. రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసేందుకు నిర్వహించిన పోటీలతో మైదానాలు, ఇండోర్ ఆడిటోరియాలు కళకళలాడాయి. జాతీయస్థాయి పోటీలకు వెళ్తున్న క్రీడాకారుడిని శిక్షకులు, పలువురు అభినందించారు.

పట్టు బిగిసింది... జట్టు కుదిరింది

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం శాంతినగర్ కాలనీ ఇండోర్ మైదానంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర కబడ్డీ పోటీల జట్ల ఎంపికల్లో బాలుర విభాగానికి 129, బాలికల విభాగానికి 74 మంది పోటీపడ్డారు. ప్రతిభ చూపిన బాలలను తుది ఎంపిక చేశారు. ఈ నెల 7 నుంచి 9 తేదీ వరకు కర్నూలులో జరిగే 35వ రాష్ట్ర సబ్ జూనియర్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలకు జిల్లా తరపున వీరంతా ఆడనున్నారు.

గోవింద పురంలో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి అండర్-14 స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలు ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.హరిబాబు పేర్కొన్నారు.

జూడోలో ..

ఎంపికైన ఆటగాళ్లతో పీడీ, పీఈటీ, శిక్షకులు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా పోటీల్లో జూడోకు సంబంధించి జిల్లా స్థాయి ఎంపికలు ఆదివారం శ్రీకాకుళం కోడి రామ్మూర్తి క్రీడామైదానంలో నిర్వహించారు. జిల్లాకు చెందిన బాలబాలికలు 70 మంది వరకు పాల్గొన్నారు. అండర్-14,17,19 విభాగాల్లో 18 మంది ఎంపికయ్యారు. వీరంతా కాకినాడలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా పోటీల్లో పాల్గొననున్నారు.

అడవి బిడ్డలకు.. పరేషాన్

న్యూస్‌టుడే, కొత్తూరు

కూటమి ప్రభుత్వం రేషన్ డిపోల ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేస్తోంది. చాలా వరకూ మేలు జరుగుతున్నా.. గిరిజనులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. ఒక పంచాయతీ పరిధిలోని ఎక్కడో ఒక చోట రేషన్ దుకాణం ఏర్పాటు చేస్తున్నారు. దీంతో కిలోమీటర్ల దూరంలో, శిఖరాగ్రంపై ఉండే గ్రామాల ప్రజలు దుకాణం వరకు వచ్చేందుకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

★ పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరు, హిరమండలం, మెళియాపుట్టి మండలాల్లోని ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఆయా మండలాల పరిధిలో ఉన్న గ్రామాలు పంచాయతీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డిపోలకు కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. దీంతో సరుకులు తీసుకోవాలంటే రాకపోకలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తూరు మండలంలో అడ్డంగి, గొట్టిపల్లి, లబ్బ, అల్తి పంచాయతీల్లోని 32 గ్రామాల ప్రజలు రేషన్ తీసుకునేందుకు కాలినడకన వస్తున్నారు. రవాణా వ్యవస్థ అంతగా లేకపోవడంతో సుమారు 5 నుంచి 10 కిలోమీటర్ల వరకు నడిచి రావాలి. మెళియాపుట్టి మండలంలోని డబారు, నేలబొంతు, బందపల్లి డిపోలు 20 కి.మీ దూరంలో ఉండటంతో లబ్ధిదారుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మందస మండలంలోని డబారుసింగి డిపోకు పాతకోట, మహల్పడ, కురడా గ్రామాలు 4 కిలోమీటర్ల దూరం. భోగాపురం, చీపి డిపోలకు సైతం కొన్ని గ్రామాలకు కిలోమీటర్ల దూరంలో ఉంది. ★ హిరమండలం మండలంలోని పెద్దగూడ, మర్రిగూడ రేషన్ దుకాణాల పరిధిలోని ఇదే దుస్థితి నెలకొంది.

గొట్టిపల్లిలో రేషనుదుకాణం నుంచి సరకులను తీసుకెళ్తున్న గిరిజనులు

★ రేషనుడిపోల్లో పోర్టబిలిటీ అవకాశం ఉన్న గిరిజన ప్రాంతాల్లో డిపోలు అందుబాటులో లేకపోవడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలకు ఈ సౌకర్యం అందని ద్రాక్షగానే మిగిలింది. ప్రజాప్రతినిధులు స్పందించి, తమ కష్టాలను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. 'కొండపైనున్న గ్రామాల్లో 20 సబ్ డిపోల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.' అని జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి సూర్య ప్రకాశ్ తెలిపారు.

★ ప్రజల సౌకర్యార్థం కొత్త డిపోలకు ప్రభుత్వం ప్రతిపాదిస్తే కొంత మేర ఇబ్బందులు తీరుతాయి.

(c) eenadu

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

కోలుకునేంత వరకు అండగా ఉంటాం

కాశీబుగ్గలో మృతురాలి కుటుంబీకులకు చెక్కు అందజేస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శిరీష

పలాస, వజ్రపుకొత్తూరు గ్రామీణం, సోంపేట, న్యూస్‌టుడే: క్షతగాత్రులు కోలుకునేంత వరకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కాశీబుగ్గ వేంకటేశ్వర ఆలయంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని క్షతగాత్రులకు చెక్కులు అందజేశారు. కాశీబుగ్గలో డొక్కర అమ్మడమ్మ, వజ్రపుకొత్తూరు మండలం దుక్కవానిపేటలో మురిపింటి నీలమ్మ కుటుంబాలకు రూ.15లక్షల చెక్కులు అందజేశారు. సోంపేట మండలం బెంకిలిలో లొట్ల నిఖిల్ కుటుంబసభ్యులకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ప్రభుత్వం మంజూరు చెక్కుతోపాటు కలెక్టర్ మంజూరు చేసిన రూ.లక్ష సాయాన్ని అందజేశారు. ఎమ్మెల్యే గౌతు శిరీష, టీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు, తెదేపా నాయకులు కామేశ్వరరావు, కృష్ణారావు, శ్రీకాంత్, నరేంద్రబాబు, అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ ఈశ్వరరావు, జనసేన ఇచ్ఛాపురం నియోజకవర్గం బాధ్యుడు దాసరి రాజు, తహసీల్దార్ అప్పలస్వామి పాల్గొన్నారు.

నిఖిల్ తండ్రికి చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ అశోక్, జనసేన బాధ్యుడు రాజు

దేదీప్యమానం.. దీపకాంతుల శివలింగం..

గోవిందపురం శివాలయంలో ఆదివారం రాత్రి మహిళలు వెయ్యి దీపాలతో శివలింగం, ఓంకారం, ఇతర ఆకృతులను అలంకరించి భక్తులను ఆకట్టుకున్నారు. గుడి చుట్టూ దీపాలంకరణ చేశారు. ఆదివారం తెల్లవారుజామున స్థానిక వంశధార కెనాల్‌లో అరటి దొప్పలపై దీపాలు పెట్టి వదిలారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

బాధితులకు పరామర్శ

పలాసలో వైద్యసిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి

పలాస, సోంపేట, కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కాశీబుగ్గ వేంకటేశ్వరాలయంలో గాయాలపాలై పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆదివారం కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కాశీబుగ్గలో తొక్కిసలాట జరిగిన ఆలయాన్ని కూటమి నాయకులు పరిశీలించారు. తెదేపా పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి, అధికార ప్రతినిధి పి. తిరుపతిరావు, మాజీ అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పి. వైకుంఠరావు, మంగి లక్ష్మీ రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు పైడి సిందూర, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త దుర్గారావు పాల్గొన్నారు. ● బెంకిలిలో మృతుడు లొట్ల నిఖిల్ కుటుంబసభ్యులను ఎంపీపీ ఎన్. దాసు, జడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, జనసేన నాయకుడు లోళ్ల రాజేష్ పరామర్శించారు. కుటుంబాన్ని ఆదుకోవడానికి తమ వంతు సహకారం అందజేస్తామని వారు హామీ ఇచ్చారు.

పండుతోందనుకుంటే.. కుళ్లుతోంది..

మొంథా ప్రభావంతో లబోదిబోమంటున్న రత్తకన్న రైతులు

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

'ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉన్నా, విద్యుత్తు సరఫరా మెరుగ్గా ఉండటంతో బోర్ల సాయంతో పంట సాగుచేసుకున్నాం. చక్కగా పండుతోంది... మరో 15, 20 రోజుల్లో కోతలు ప్రారంభించాలనుకున్నాం. అంతలోనే భీమసముద్రం గెడ్డ వరదనీరు ముంచెత్తిందని' రత్తకన్న రైతులు లబోదిబోమంటున్నారు. ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో వచ్చిన వరదలకు ఇచ్ఛాపురంలో 1118 హెక్టార్ల పంట నీటమునిగింది. అందులో రత్తకన్న భూములే అత్యధికం.

నీట మునిగిన వరిపంటను చూపుతున్న అన్నదాతలు

● ఈ గెడ్డ పంట సాగుకు ఉపయోగపడకపోగా.. పంట చేతికందే సమయంలో కన్నీరు తెప్పిస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం తగ్గిన తర్వాత కూడా పంట నీటిలోనే ఉండటంతో చేతికి ఫలసాయం వచ్చేలా లేదని వాపోయారు. మొత్తం 500కు పైగా ఎకరాల పంట భూమి నీట మునగడంతో, నీరు వెళ్లేలా కాలువలు తవ్వుతున్నారు. ఆదివారం మళ్లీ వర్షం కురవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చెందుతున్నారు.

● పంటభూములు పల్లపు ప్రాంతంలో ఉండటం, గెడ్డలో నీరు ఉండటం వలన పంట భూముల నుంచి నీరు నెమ్మదిగా కదులుతోంది. పంటను ముంచెత్తేంత వేగంగా, బయటకు నీరు వెళ్లడం లేదని రైతులు చెబుతున్నారు. పొక్లెయిన్‌లతో గెడ్డలోని చెత్తను తొలగించకుంటే, మరింత ప్రమాదం సంభవించేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా భీమసముద్రం గెడ్డపై అధ్యయనం చేసి, తొలి నుంచి బాహుదానదికి చేరే వరకు గెడ్డను అభివృద్ధి చేయాలని, నీటిని చెరువులకు మళ్లించే పిల్లకాలువలను తవ్వించాలని కోరుతున్నారు.

కళ్ల ముందే మునిగింది..

మంగళవారం సాధారణ స్థాయిలోనే గెడ్డలో నీరు చేరడంతో ఊరట చెందాం. తీరా మర్నాడే ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి వచ్చి చేరిన నీటితో కలిసి రత్తకన్న, తేలుకుంచి, మండపల్లి ప్రాంతాల్లోని పంటను ముంచేసింది. ఒక్కరోజులోనే.. కళ్ల ముందే ఇలా జరిగింది.

– లాది పాపారావు, రైతు, రత్తకన్న

నీరు తోడించాలి..

పంటభూమిలోకి చేరిన నీటిని కాలువలు, మోటార్ల ద్వారా బయటకు పంపాలి. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది ఉండదు. నీరు తోడించాక, తమ సూచనల ప్రకారం సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నీరు వెళ్లిన తర్వాత పరిశీలించి, పంట నష్టాన్ని అంచనా వేస్తాం.

– పీవీవీ అజయ్‌కుమార్, వ్యవసాయాధికారి, ఇచ్ఛాపురం

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9502198883 8008552704

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం

?: స్వేచ్ఛానగర్ ప్రాంతంలో విద్యుత్తు నియంత్రిక రోడ్డుకు ఆనుకుని, చేతికి అందే ఎత్తులో ప్రమాదకరంగా ఉంది.

– నారాయణ మహాపాత్ర్, ఇచ్ఛాపురం

❖: పరిశీలించి, రక్షణ కంచె ఏర్పాటు చేస్తాం.

– కేవీ గోవిందరావు, ఏఈ, ఇచ్ఛాపురం

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

మట్టితో పూడ్చారు

స్పందనకు వందనం

తేలుకుంచి సమీపంలో తారు రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీనిపై ఈనెల 1న 'గండి.. భద్రం సుమండీ' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి ఆర్అండ్‌బీ జేఈ విక్రమ్ స్పందించారు. కోతకు గురైన ప్రాంతంలో మట్టిని పూడ్చి సమస్య పరిష్కరించారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

హుండీ ఆదాయం లెక్కింపు.. కంచిలి, న్యూస్‌టుడే: కంచిలి కంచమ్మతల్లి హుండీ ఆదాయాన్ని ఆదివారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టారు. అక్టోబరులో రూ.38,631 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

మార్చుతారా.. మరుస్తారా..

బి.గొనపపుట్టుగ, లొల్లపుట్టుగ, దూగానపుట్టుగ తదితర గ్రామాల్లో పురాతన విద్యుత్తు స్తంభాల స్థానంలో కొత్తవి వేసేందుకు విద్యుత్తుశాఖ అధికారులు దుగానపుట్టుగ వద్ద స్తంభాలు ఉంచారు. ఆరు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు అలానే వదిలేశారు. దీనిపై విద్యుత్తుశాఖ ఏఈ శ్రీనివాసరావును వివరణ కోరగా త్వరలోనే స్తంభాలు మార్పుచేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

సగం సగం పనులు

తుపాను ప్రభావంతో బాలకృష్ణాపురం సమీప రహదారి రోడ్డు పై చెట్టు కూలింది. సగ భాగం తీసి మిగిలింది రోడ్డుపై వదిలేశారు. దీంతో జెనుగానిపేట, కేదారిపురం, ముచ్చింద్ర గ్రామాల ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి కామేష్‌ను వివరణ కోరగా త్వరలోనే సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

తీరని వ్యథ.. మారని కథ

మండపల్లి నుంచి బుడ్డెపుపేట, లక్ష్మీపురం ప్రాంతాలు వెళ్లే కూడలి కాలువలపై పలకలు శిథిలమయ్యాయి. కాలువ చివరి భాగంలో పలకలు శిథిలమవ్వగా మధ్య భాగంలో ఉన్న పలకలకు రంధ్రం ఏర్పడింది. దీని ద్వారా రోడ్డుపైకి మురుగు వస్తోంది. దీంతో ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఎంపీడీవో ప్రభాకరరావును వివరణ కోరగా త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

కీలక కార్యాలయం.. అడుగుపెట్టలేం

ఇచ్ఛాపురం తహసీల్దారు కార్యాలయ ప్రాంగణ రహదారి ఇది. చిన్నపాటి చినుకులకే చెరువులను తలపిస్తోంది.. బురదమయంగా మారుతోంది. ఇక్కడే ఉపఖజానా కార్యాలయం, డీసీసీ బ్యాంకు, పీఏసీఎస్ కార్యాలయం, కలెక్టర్ ఐసెక్టర్లతోపాటు గ్రంథాలయం ఉన్నాయి. ఇటీవల ఇక్కడకు వచ్చిన సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ రోడ్డు దుస్థితిని చూసి ఆర్డీవోతో మాట్లాడినట్లు సమాచారం. దీనిపై తహసీల్దారు వెంకటరావును వివరణ కోరగా ఉన్నతాధికారులకు నివేదించి, సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పూర్తవుతుందా..?

కవిటి మండలం లండారిపుట్టుగలో వైకాపా హయాంలో నిర్మించిన రైతు సేవా కేంద్రం అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో ఇక్కడి వ్యవసాయ, పశుసంవర్ధక సిబ్బంది సచివాలయంలోనే విధులు నిర్వహిస్తుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సోంపేట ఏడీఏ భవానీ శంకర్‌ను వివరణ కోరగా నిధులు రాగానే భవనం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

వైకాపా శవ రాజకీయాలు మానుకోవాలి

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కాశీబుగ్గలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం జరిగిన తొక్కిసలాట దురదృష్టకరమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో అక్కడ పరిస్థితిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి రెవెన్యూ, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది క్యూలైన్లను క్రమబద్ధీకరించి, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిందని పేర్కొన్నారు. వైకాపా శవ రాజకీయాలు చేయడం విచారకరమన్నారు.

కాశీబుగ్గ ఘటన దురదృష్టకరం

కవిటి గ్రామీణం: కాశీబుగ్గ వేంకటేశ్వరాలయంలో శనివారం జరిగిన సంఘటన దురదృష్టకరమని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పూడి కిరణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా మరణించిన కుటుంబాలకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. ఆ కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి విపత్తులు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

సంతాప సభ.. పలాస గ్రామీణం: బొడ్డపాడులో వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బొడ్డు అప్పారావు, బచ్చల సూర్యనారాయణ సంతాప సభ ఆదివారం నిర్వహించారు. మైత్రి రజక సేవా సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో, జగదీశ్వర సంఘం ఆధ్వర్యంలో అండమాన్‌లోనూ వీరిద్దరి సంతాప సభలు నిర్వహించారు.

తొక్కిసలాట మృతులకు నివాళులు

కవిటి గ్రామీణం, ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: కాశీబుగ్గ వేంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట సందర్భంగా మృతి చెందిన మృతులకు తెదేపా నాయకులు నివాళులర్పించారు.

కవిటి బస్టాండ్ వద్ద కాశీబుగ్గ మృతులకు నివాళులర్పిస్తున్న కూటమి నాయకులు

ఇచ్ఛాపురంలో మౌనం పాటిస్తున్న తెదేపా నాయకులు

కవిటి బస్టాండ్ వద్ద మండల పార్టీ అధ్యక్షుడు పొందల కృష్ణారావు ఆధ్వర్యంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఇచ్ఛాపురం బస్టాండ్ వద్ద స్థానిక నాయకులు సాలిన డిల్లీ, దక్షిణ ఢిల్లీరావు, ఆశి లీలారాణి, కోటి, కామేశ్వరరావు, పద్మనాభం, నాగరాజు పాత్రో, శ్రీను, జాని, సంతోష్ తదితరులు నివాళులర్పించారు.

కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న వైకాపా నాయకులు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం బస్టాండు నుంచి బజారుకూడలి వరకు వైకాపా నాయకులు ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి, నివాళులర్పించారు. బస్టాండు వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. వైకాపా నాయకులు నర్తు నరేంద్రయాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు, గాయపడిన వారికి రూ.5 లక్షల పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉలాల భారతీదివ్య, ప్రేమ్‌కుమార్, దేవదాసురెడ్డి, అన్వేష్, స్వర్ణమణి, రాజశేఖర్, జగన్నాథరెడ్డి, దేవరాజు, వరప్రసాద్ పాల్గొన్నారు.

మందసలో ఎర్రన్నాయుడి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న తెదేపా శ్రేణులు

జనహృదయ నేత ఎర్రన్నాయుడు

ఉద్దానం వాసులతో పాటుగా కేంద్ర, రాష్ట్ర ప్రజలకు ఆదర్శప్రాయుడిగా ఎర్రన్నాయుడు నిలిచారని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం ఎర్రన్నాయుడి వర్ధంతి సందర్భంగా పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో కూటమి నాయకులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు. పలాస తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే శిరీష తోపాటు ఆదివారం నివాళులర్పించారు. – న్యూస్‌టుడే, పలాస/గ్రామీణం, ఇచ్ఛాపురం, సోంపేట, కవిటి గ్రామీణం, కంచిలి, మందస

ఎర్రన్నాయుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే శిరీష

ఉత్సవాల్లో భక్తుల భద్రత ముఖ్యం

ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు, కంచిలి: ఆలయాల్లో జరిగే ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే క్రమంలో వారి భద్రతకు యాజమాన్యం, కమిటీ ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు, కంచిలి తహసీల్దారులు వెంకటరావు, సీతారామయ్య, రమేష్ కుమార్ సూచించారు. కాశీబుగ్గ తొక్కిసలాట ఘటన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్తిక సోమవారం ఉత్సవాలు జరిగే ఆలయాలను ఆదివారం సందర్శించి, ఆయా కమిటీలు, అర్చకులకు సూచనలు చేశారు. బారికేడ్లు నిర్మించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని హెచ్చరించారు.

శ్రమదానంతో ఇసుక మేటల తొలగింపు

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: డోకులపాడు సముద్ర తీరానికి వెళ్లే సీసీ రహదారిపై ఏర్పడిన ఇసుక మేటలను ఆదివారం స్థానిక యువకులు శ్రమదానం చేసి తొలగించారు. ఇటీవల తుపాను కారణంగా వరదలు పోటెత్తడంతో రహదారిపై ఇసుక నిల్వలు పేరుకుపోయాయి.

రక్తదానంతోనే ప్రాణాలు నిలుపుదాం

ఇచ్ఛాపురం గ్రామీణం: రక్తదానంతో ఆపదలో ఉన్నవారి ప్రాణాలు నిలపొచ్చని వక్తులు పేర్కొన్నారు. కొఠారిలో ఆదివారం జీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రాణ దాత బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో 40మంది యువత రక్తదానం చేశారు.

చిన్నారికి కుక్కకాటు

పలాస, కాశీబుగ్గ: అబుసోలికి చెందిన రెండున్నరేళ్ల చిన్నారి ప్రవాన్స్ కుక్కకాటుకు గురయ్యాడు. తల్లిదండ్రులు పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చి టీకాలు వేయించారు.

తాత్కాలిక రహదారి ఏర్పాటు.. వజ్రపుకొత్తూరు: మొంథా తుపాను ప్రభావంతో ఏర్పడిన వరదల వల్ల పెద్దబాడం సమీప రహదారి కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడకుండా పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరు విభాగం అధికారులు తాత్కాలిక కల్వర్టు రహదారిని నిర్మించారు. శాశ్వత వంతెన ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా ద్వాదశి పూజలు

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలంలోని పలు విష్ణు, శివాలయాల్లో భక్తులు ఆదివారం ద్వాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. బాతుపురం-పెదవంక గ్రామస్థుల ఆధ్వర్యంలో శివసాగర తీరంలో నీలకంఠేశ్వర ఆలయ ప్రాంగణం, రిట్టపాడులోని వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద అన్న సమారాధన ఏర్పాటు చేశారు. నువ్వలరేవు రామాలయంలో నాలుగు భజన బృందాలతో 24 గంటల నామసంకీర్తన భజనలు చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బాహుదానదిలో ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: అనుమతి లేకుండా ఇచ్ఛాపురం బాహుదానదిలో ఇసుక తవ్వకాలు చేపట్టి, అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనపరుచుకున్నట్లు తహసీల్దార్ ఎన్.వెంకటరావు తెలిపారు. నదిలో ఇసుక తవ్వకాలు, రవాణాను పూర్తిస్థాయిలో అడ్డుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆదేశించిన మేరకు ఆదివారం మండల రెవెన్యూ అధికారి సాహు ఆధ్వర్యంలో వీఆర్వో కృష్ణ, ఇతర సిబ్బంది నదీ తీర ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో వంతెనకు సమీపంలోనే ఇసుకు తవ్వి, ట్రాక్టర్‌లో ఎత్తుకుని వెళ్తున్న కొందరిని గుర్తించారు. ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకుని తహసీల్దారు కార్యాలయానికి తరలించారు. ఈ విషయమై తహసీల్దారు మాట్లాడుతూ పోలీసులు సహకారమందిస్తే తమ సిబ్బంది నదీతీరంలో రాత్రివేళ కూడా తనిఖీలు చేపడతారని తెలిపారు.

పీఆర్‌టీయూ విభాగం ఆవిర్భావం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘ పురపాలక విభాగం ఆవిర్భవించింది. ఈ విభాగానికి నూతన కార్యవర్గ నియామకాన్ని ఆదివారం చేపట్టారు. కాదా లక్ష్మీకాంతమ్మ పుర బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఈ సమావేశం జరిగింది. పుర విభాగ అధ్యక్షుడిగా పనస చంద్రశేఖర్, గౌరవాధ్యక్షుడిగా బల్ల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ముప్పన ఈశ్వరి ఎన్నికయ్యారు. వారితో జిల్లా ప్రధాన కార్యదర్శి దానేటి కేశవరావు ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం మెగా డీఎస్సీలో నియమితులైన పుర ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్ అందించారు.

మృత్యు కూడళ్లు

న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో పలు కూడళ్లు ప్రమాదకరంగా మారాయి. ఆయా ప్రాంతాల్లో పలు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ ఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా.. చాలా మంది తీవ్రగాయాల పాలై దివ్యాంగులుగా మారుతున్నాయి. దీంతో ఆయా కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. ఇచ్ఛాపురం మండలం బెల్లుపడ, ఈదుపురం, కంచిలి మండలం బూరగాం, బలియాపుట్టుగ, మకరాంపురం, పలాస మండలం రంగోయి, కొబ్బరిచెట్లూరు కూడళ్ల వద్ద ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ ప్రాంతాల వద్ద పై వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

● కంచిలి మండలం బలియాపుట్టుగ కూడలి వద్ద గతేడాది సెప్టెంబరులో రహదారి ప్రమాదంలో మూలి స్వాతి(6) ప్రాణాలు కోల్పోగా తండ్రి ప్రదీప్‌కు కాలు విరిగింది.

● మకరాంపురం కూడలి వద్ద గతేడాది ఆగస్టులో వారాంతపు సంతరోజు ఒరియా నారాయణపురానికి చెందిన పి. చిన్న (52) రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని మృతిచెందారు. ఇదే కూడలి వద్ద గతంలో బెల్లుపడకు చెందిన వ్యక్తి మకరాంపురంలో శిరిడి సాయిబాబా ఆలయానికి దర్శనానికి వచ్చి తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా వ్యాన్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారు. గతంలో జాడుపూడికి చెందిన ఓ మహిళ ఇక్కడే రహదారి ప్రమాదంలో ప్రాణాలు విడిచింది. ఈ కూడలి వద్ద ఆదివారం వారాంతపు సంత జరుగుతుంది.

మకరాంపురం కూడలిలో పరిస్థితి..

● ఇటీవల రంగోయి కూడలిలో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న అడ్డి దేశయ్య సరకులతో రోడ్డు దాటుతుండగా వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. రెండేళ్ల కిందట ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాజేశ్వరరావు పాణిగ్రాహి ఇదే కూడలి వద్ద ప్రమాదానికి గురయ్యారు. ఇక్కడే జరిగిన మరో ప్రమాదంలో మందస మండలం మకరజోలకు చెందిన బమ్మిడి కూర్మారావుకు రెండు కాళ్లు విరిగిపోవడంతో మంచానికే పరిమితమయ్యాడు.

పరిశీలనలో ఉంది...

మకరాంపురం, ఈదుపురం కూడళ్ల వద్ద పై వంతెనతోపాటు బలియాపుట్టుగ, బూరగాం కూడళ్ల వద్ద అండర్ పాసేజ్‌ల నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, జాతీయ రహదారుల సంస్థ అధికార్ల దృష్టికి తీసుకువెళ్లాం. ఈ అంశం ప్రస్తుతం అధికారుల పరిశీలనలో ఉంది.

– ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఇచ్ఛాపురం

జగన్నాథస్వామి ఆలయానికి వితరణ

బారువ జగన్నాథస్వామి ఆలయంలో విద్యుత్తు ఇన్వెర్టర్, స్టీలు తలుపులు ఏర్పాటు చేసేందుకు గుడియా శకుంతల అనే భక్తురాలు రూ.61 వేలను ఆలయ నిర్వాహకులకు ఆదివారం అందజేశారు. శకుంతల భర్త గుడియా అప్పన్న జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని అందజేసినట్లు ఆలయ నిర్వహణ కమిటీ ప్రతినిధులు తెలిపారు. – న్యూస్‌టుడే, సోంపేట

బాధితురాలికి ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం గ్రామీణం, వజ్రపుకొత్తూరు గ్రామీణం, పలాస గ్రామీణం: తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు కేశుపురానికి చెందిన దూడ మోహినమ్మ పూరిల్లు మట్టి గోడ కూలింది. విషయమై తెలుసుకున్న కాళీమాత సేవా సమితి ప్రతినిధులు బాధితురాలి ఇంటి మరమ్మతులకు రూ.50 వేలు ఆర్థిక సాయం ఆదివారం అందించారు. ● పూండి చెరువు గట్టుపై నివాసముంటున్న బుద్దెమ్మకు స్థానిక యువతరం సేవాసమితి రూ.10 వేలు అందించారు. నీలావతిలోని గ్రంథాలయం, విద్యాకేంద్రానికి నెఫ్రాలజిస్ట్ వైద్యుడు గిరిబాబు పోటీపరీక్షల పుస్తకాలను ఆదివారం వితరణ చేశారు.



PUBLIC NOTICE

Notice is hereby given that my client, **Tankala Nagabhushana Gupta, M/s Sri Seshirekha Cashew industries, Ananthapuram,** Palasa-Kasibugga Municipality, has lost Original Regd Sale deed, vide No. 2016/2007 of SRO, Kasibugga and he intends to obtain loan against the schedule mentioned property from Bank. All persons, claiming any interest in the said property or any part thereof by way of sale, gift, lease, inheritance, exchange, lien, trust, possession, easement, attachment or otherwise, howsoever, are hereby required to make the same to the knowledge of the under signed, within Fifteen days from the date hereof, failing which, the Loan process will be completed, without any reference to such claim and the same, if any, shall be considered as waived.

SCHEDULE OF THE PROPERTY

As per Regd Sale deed, No.2016/2007 of SRO, Kasibugga, the property is an extent of 750 Sq meters, ad measuring East to West: 30 Meters; North to South: 25 Meters, situated in Plot No.38, Survey No.266, Industrial Park, Ananthapuram, within the limits of Palasa-Kasibugga Municipality, Srikakulam District. Bounded by

East : Plot No.46 **South:** 18.30 Meters width Road
West : 12.20 Meters width Road **North :** Plot No.37

D.V.VIVEKANANDA
Advocate & Notary (Govt. of India)
Mobile No: 9440436751

(c) eenadu

టెక్కలి

●టెక్కలి ●నరసన్నపేట ●పాతపట్నం

ఉత్సాహంగా ప్రతిభా పరీక్షలు

కొత్తూరులో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కొత్తూరు, సారవకోట, జలుమూరు, పాతపట్నం, నరసన్నపేట, మెళియాపుట్టి, న్యూస్‌టుడే: సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్షలు ఆదివారం నిర్వహించారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయని, వీటిలో సత్తా చాటిన వారు తరువాత స్థాయికి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. పలువురు గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష దీపారాధన

కుద్దాంలో పూజల్లో పాల్గొన్న మహిళలు

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ద్వాదశి సందర్భంగా కుద్దాంలోని భవానీ సమేత సోమేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం లక్ష దీపారాధన ఘనంగా నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచి మొయ్యి లక్ష్మణనాయుడు పాల్గొన్నారు.

ప్రజల మనిషి ఎర్రన్నాయుడు

పాతపట్నంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు, నాయకులు

నరసన్నపేట జూట్ కార్మిక యూనియన్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే రమణమూర్తి ఆధ్వర్యంలో...

నరసన్నపేట, నరసన్నపేట గ్రామీణం, పోలాకి, పాతపట్నం, టెక్కలి, హిరమండలం, మెళియాపుట్టి, ఎల్ఎన్‌పేట, కొత్తూరు, నందిగాం, సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: దివంగత నేత ఎర్రన్నాయుడు ప్రజల మనిషిగా వారి సంక్షేమం కోసం నిరంతరం తపించారని ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఆయన వర్ధంతి సందర్భంగా టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా నివాళులర్పించారు. ఎర్రన్న ఆశయాలకు అనుగుణంగా తెదేపా శ్రేణులు నడవాలని పిలుపునిచ్చారు.

సంతబొమ్మాళిలో అంజలి ఘటిస్తున్న తెదేపా శ్రేణులు

పాఠం వినండి.. అప్పుడప్పుడు పైకి చూడండి

శిథిల భవనాల్లో బిక్కుబిక్కుమంటూ చదువులు

– న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం, నరసన్నపేట, జలుమూరు, సారవకోట, పోలాకి

నరసన్నపేట నియోజకవర్గ పరిధిలోని పలు పాఠశాలల్లో దశాబ్దాల కిందట నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవస్థలు తప్పడం లేదు. గత పాలకులు నాడు- నేడులో భాగంగా పాఠశాలల రూపురేఖలు మారుస్తామని గొప్పలు చెప్పారు. రెండు విడతల్లో పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని, సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మారని తీరు.. తీరని అవస్థలు

నరసన్నపేట మండలం కొత్తపోలవలస ప్రాథమిక పాఠశాల భవనం గోడలు బీటలు వారడంతో పాటు పైకప్పు పూర్తిగా శిథిలమైంది. వర్షాలు కురుస్తుండటంతో పంచాయతీ భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. మామిడివలసలో గచ్చులు కుంగడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. బుచ్చిపేటలో రెండు గదులకు ఒకటి పూర్తిగా అధ్వానంగా మారి వినియోగానికి దూరంగా ఉంది. పాక్షికంగా శిథిలమైన రెండో గదిలోనే 45 మందికి పాఠాలు చెబుతుండటంతో గందరగోళం నెలకొంటోంది. మండల కేంద్రంలోని వంశధార కాలనీ పాఠశాలలో మూడు గదులు నిరుపయోగంగా మారడంతో స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో 38 మందికి బోధన జరుగుతోంది.

మట్టవానిపేటలో పెచ్చులూడుతున్న పైకప్పు, గోడ

మామిడివలస ప్రాథమిక పాఠశాలలో కుంగిన గచ్చు

జలుమూరు మండలంలో మట్టవానిపేట, వాసుదేవపురం, గంగన్నపేట ప్రాథమిక పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

సారవకోట మండలం బురద కొత్తూరు ప్రాథమిక పాఠశాల పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. పుష్కర కాలం కిందట అదనపు భవనం నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. ఇటీవల పనులు పునఃప్రారంభించారు. రైవాడ, కురిడింగి, రేగులపాడు, గొర్రిబంద ప్రాథమిక పాఠశాలల గోడలు బీటలు వారాయి.

పోలాకి మండలంలో కింజరాపువానిపేట, అంబీరుపేట, కొవిరిపేట, గుప్పిడిపేట ప్రాథమిక పాఠశాలల్లో పరిస్థితి ఇలాగే ఉంది.

నియోజకవర్గం వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
నరసన్నపేట	82	4,600
జలుమూరు	81	3,324
సారవకోట	79	3,100
పోలాకి	95	4,192

ఉన్నతాధికారులకు నివేదించాం

తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్న విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టి, అవస్థలు లేకుండా చూస్తాం. **- ఉప్పాడ వాసుదేవరావు, బమ్మిడి మాధవరావు, మద్దు వెంకటరమణ, శ్రీనివాస్ నాయక్, ఎంఈవోలు**

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

?: సంతబొమ్మాళి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న పలు వీధుల్లో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. **- రామకృష్ణ, గ్రామస్థుడు** ★ సిబ్బందికి తెలియజేసి, కొత్త దీపాలు ఏర్పాటు చేయిస్తాం. **- దుంపల శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో, సంతబొమ్మాళి మండలం** – న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

?: నందిగామ మండలం వల్లభరాయపాడు గ్రామంలోని బీసీ కాలనీలో 45 ఇళ్లు ఉన్నాయి. ఇంత వరకు విద్యుత్తు స్తంభాలు వేయలేదు. గ్రామంలోని ఇతర వీధుల నుంచి లైన్లు తీసుకోవాల్సి వస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. **- చమల్ల మురళీ, స్థానికుడు** ★ క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- నేతాజీ, జేఈ, విద్యుత్తు శాఖ, నందిగాం** – న్యూస్‌టుడే, నందిగాం

శ్రీముఖలింగేశ్వరస్వామి ఆలయంలో రద్దీ

జలుమూరు, న్యూస్‌టుడే: శ్రీముఖలింగేశ్వరస్వామి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా నుంచి తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయకపోవడంతో వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు అవస్థలు ఎదుర్కొన్నారు. రెండో సోమవారం ఇబ్బందులు తలెత్తకుండా ముందే ఏర్పాట్లు చేశామని ఈవో ఏడుకొండలు తెలిపారు. నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ అశోక్‌బాబు పేర్కొన్నారు.

పాత పించను విధానం పునరుద్ధరించాలి

టెక్కలి, న్యూస్‌టుడే: పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరరావు అన్నారు. ఆదివారం టెక్కలిలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. నాలుగు లక్షల మంది ఉద్యోగుల భవిష్యత్తుపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు చల్లా సింహాచలం, అంపోలు షణ్ముఖరావు, కృష్ణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నిర్మించారు.. నిర్వహణ మరిచారు

ఉపాధిహామీ పథకం నిధులతో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు తొట్టెలు నిర్మించారు. వీటిలో నీరు నింపేందుకు కుళాయిలు సైతం ఏర్పాటు చేశారు. హిరమండలం పరిధిలో 15 చోట్ల ఏర్పాటు చేశారు. ఒక్కో దానికి రూ.30 వేలు వెచ్చించారు. ఎక్కడా వీటిని వినియోగిస్తున్న దాఖలాలు లేవు. కల్లట గ్రామంలో పరిస్థితిని చిత్రంలో చూడొచ్చు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, తొట్టెలు వినియోగించేలా చూస్తామని ఎంపీడీవో ఆర్.కాళీప్రసాదరావు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, హిరమండలం

గుంతలతో గజగజ..!

ఎల్ఎన్‌పేట మండలంలో ఏబీ రహదారి నుంచి ఎల్ఎన్‌పేట, మిరియాపల్లి, వాడవలస, దబ్బపాడు, తురకపేట గ్రామాలకు వెళ్లే మార్గం గుంతలమయంగా మారింది. దబ్బపాడు- తురకపేట గ్రామాల మధ్య కడపల గెడ్డపై వంతెన నిర్మాణం చేపడుతుండటంతో ఏర్పాటు చేసిన తాత్కాలిక మార్గం వరద నీటికి కొట్టుకుపోయింది. దీంతో ఈ మార్గాన్నే ప్రయాణికులు వినియోగిస్తున్నారు. చర్యలు తీసుకుంటామని ర.భ.శాఖ జేఈ గోపాల్ చెప్పారు. – న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పేట

ఎట్టకేలకు నిధుల విడుదల

జలుమూరు, న్యూస్‌టుడే: పాగోడు- గొటివాడ రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఈ మార్గం అభివృద్ధికి ఉపాధిహామీ పథకం ద్వారా రూ.1.6 కోట్ల నిధులు విడుదల చేశారు. గతంలో ఈ రోడ్డు అధ్వాన పరిస్థితిపై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు రావడంతో పంచాయతీరాజ్ శాఖ జేఈ కె.శ్రీధర్ స్పందించారు.

ఇబ్బందులు తీర్చారు

స్పందనకు వందనం

పాతపట్నం, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో వరద నీటికి పాతపట్నం- మెళియాపుట్టి మార్గంలో తిడ్డిమి వద్ద కల్వర్టు అధ్వానంగా మారింది. రాళ్లు తేలడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడే వారు. దీనిపై 'ఈనాడు'లో గత నెల 31న 'వరదకు కొట్టుకుపోయింది' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీంతో ర.భ.శాఖ జేఈ యోగి స్పందించి, తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

ముంపు నుంచి కాపాడండి

టెక్కలి, న్యూస్‌టుడే: దాలిచెరువు ముంపు నుంచి పంట పొలాలను కాపాడాలని జయకృష్ణాపురం రైతులు కోరారు. సీపీఎం నేతలు నంబూరు షణ్ముఖరావు, బమ్మిడి సోమేశ్వరరావుతో పాటు మాజీ సర్పంచి బమ్మిడి అప్పలనాయుడుతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. వందల ఎకరాల్లో పంట నాశనమవుతుందని, అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

యువజన కార్యదర్శిగా నియామకం

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: కోటపాడు గ్రామానికి చెందిన వైకాపా కోత సతీష్‌ను వైకాపా రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. తనపై నమ్మకంతో పార్టీ ఇచ్చిన బాధ్యతను నెరవేరుస్తామని సతీష్ ఆదివారం పేర్కొన్నారు. నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

టెక్కలి: చెక్కు అందిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు

టెక్కలి, నందిగాం, న్యూస్‌టుడే: కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో భక్తులు మృతి చెందడం బాధాకరమని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు అన్నారు. ఘటనలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఆదివారం రూ.15 లక్షలు చొప్పున పరిహారాన్ని అందజేశారు. టెక్కలి మండలం పిట్టలసరియ గ్రామంలో రాపాక విజయ భర్తకు, రామేశ్వరం గ్రామంలో ఏదురు చిన్నమ్మి, నందిగాం మండలం శివరాంపురంలో చిన్ని యశోదమ్మ కుటుంబ సభ్యులకు చెక్కులు ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షలు పరిహారం మరికొద్ది రోజుల్లో అధికారులు అందజేస్తారని, అదే విధంగా టెక్కలి నియోజకవర్గానికి చెందిన మృతులు ముగ్గురికి తెదేపా సభ్యత్వం ఉన్నందున పార్టీ తరపున ఒక్కొక్కరికి రూ.5 లక్షలు చొప్పున బీమా అందుతుందని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, ఏఎంసీ ఛైర్మన్ బగాది శేషగిరిరావు, నాయకులు మెండ దాసునాయుడు, హనుమంతు రామకృష్ణ, పినకాన అజయ్‌కుమార్, సబ్బి జానకిరాం, మళ్ల బాలకృష్ణ, పోలాకి చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి

హిరమండలం, న్యూస్‌టుడే: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతిని ఆదివారం గొట్టా బ్యారేజీ కూడలిలో ఘనంగా నిర్వహించారు. హిరమండలం విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులు మాట్లాడుతూ.. ఈనెల 4 వరకు మండపం వద్ద పూజలు జరుగుతాయని 5న నిమజ్జనం చేపడతామన్నారు.

కాశీబుగ్గ ఘటన దురదృష్టకరం

కోటబొమ్మాళి, సారవకోట, న్యూస్‌టుడే: కాశీబుగ్గ ఘటన దురదృష్టకరమని రాష్ట్ర సాధు పరిషత్తు అధ్యక్షుడు శ్రీనివాసానందసరస్వతి అన్నారు. ఊడికలపాడులో ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక సత్సంగ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. భక్తిలో మూఢత్వం వద్దని హితవు పలికారు. ప్రవచన కారులు సనపల కరుణ్‌కుమార్ ఉన్నారు. ★ ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అనుసరించాలని సాధుపరిషత్తు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి పేర్కొన్నారు. సారవకోట మండలం కిన్నెరవాడలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆలయంలో జరిగిన వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్చకుడు కె.సిద్ధయ్యస్వామి పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ (1938) నేతలు కోరారు. ఆదివారం గోపీనాథపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో జిల్లా సబ్‌కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సర్వీసు ఉపాధ్యాయులు టెట్ పరీక్ష రాయాలన్న నిబంధనపై చర్చించారు. ఉపాధ్యాయులను బోధనేతర పనులకు దూరంగా ఉంచాలన్నారు. సంఘ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడు భుజంగరావు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: దివంగత నేత ఎర్రన్నాయుడు వర్ధంతి సందర్భంగా తిలారులో శిమ్మి నాయుడు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు నేత్ర పరీక్షలు నిర్వహించి 25 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ, వైద్యాధికారిణి అమృత పాల్గొన్నారు.

పరిహారం అందజేయాలి

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలకు సంతబొమ్మాళి మండలంలో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నా అధికారులకు కనిపించడం లేదని కాంగ్రెస్ నాయకుడు కోత మధుసూదనరావు మండిపడ్డారు. కోటపాడు, కాకరపల్లి, అంట్లవరం, నౌపడా, వడ్డివాడ, హనుమంతునాయుడుపేట ఆదివారం ఆయన పర్యటించారు. పరిహారం అందజేయాలని కోరారు.

రైతులను ఆదుకోవాలి

జలుమూరు, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మామిడి సత్యనారాయణ అన్నారు. జలుమూరు వద్ద నేలకొరిగిన పంట పొలాలను ఆదివారం ఆయన పరిశీలించారు. నాయకుడు బేరి వెంకటరమణ పాల్గొన్నారు.

జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: ద్వాదశి నేపథ్యంలో లక్ష్మీనర్సుపేట గ్రామంలోని జగన్నాథ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. కృష్ణాపురం, కరకవలస, ఎంబరాం కూడలి, శ్యామలాపురం కాలనీలో ఆధ్యాత్మిక సందడి కనిపించింది.

మంత్రుల పర్యటనకు ఏర్పాట్లు

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు సోమవారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించనున్నారు. ఈమేరకు ఆదివారం ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, పాతపట్నం ఎమ్మెల్యే గోవిందరావు ఏర్పాట్లను పరిశీలించారు. ఏకలవ్య పాఠశాల ఆవరణలో పనికిరాని మొక్కలు తొలగించక పోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో నర్సింహ ప్రసాద్‌ను ఆదేశించారు.

నిర్లక్ష్యంతోనే నిండు ప్రాణాలు బలి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కాశీబుగ్గలోని వెంకటేశ్వర ఆలయంలో నిండు ప్రాణాలు బలయ్యాయని వైకాపా టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఆరోపించారు. ఆదివారం స్థానిక ఇందిరా కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున పరిహారం అందించాలని డిమాండు చేశారు. నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, టెక్కలి, సంతబొమ్మాళి జడ్పీటీసీ సభ్యులు దువ్వాడ వాణి, పాల వసంతరెడ్డి పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైకాపా నేతలు

శాసనసభ సందర్శనకు అవకాశం

హిరమండలం, న్యూస్‌టుడే: పాతపట్నం నియోజకవర్గం స్థాయిలో జరిగిన పోటీల్లో గులుమూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి జర్జాన ప్రవీణ్‌కుమార్ తృతీయ స్థానం సాధించాడు. ఈనెల 1న పాతపట్నం మోడల్ స్కూల్‌లో జరిగిన రాజ్యాంగ దినోత్సవ పోటీల్లో ప్రతిభ చూపాడు. దీంతో శాసనసభ సందర్శనకు విద్యార్థి ఎంపికైనట్లు ఎంఈవో కె.రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అన్నదాతలకు భరోసా

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: తెదేపా అన్నదాతలకు అండగా ఉంటుందని, మొంథా ప్రభావంతో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని తెదేపా నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి భరోసా ఇచ్చారు. మెళియాపుట్టి మండలం పడ్డ పంచాయతీ పరిధి పాలెం గ్రామాన్ని సందర్శించి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. నాయకులు వసంతరావు, రామ్మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Notice is hereby given that my client, **Tankala Nagabhushana Gupta, M/s Sri Seshirekha Cashew industries, Ananthapuram,** Palasa-Kasibugga Municipality, has lost Original Regd Sale deed, vide No. 2016/2007 of SRO, Kasibugga and he intends to obtain loan against the schedule mentioned property from Bank. All persons, claiming any interest in the said property or any part thereof by way of sale, gift, lease, inheritance, exchange, lien, trust, possession, easement, attachment or otherwise, howsoever, are hereby required to make the same to the knowledge of the under signed, within Fifteen days from the date hereof, failing which, the Loan process will be completed, without any reference to such claim and the same, if any, shall be considered as waived.

SCHEDULE OF THE PROPERTY

As per Regd Sale deed, No.2016/2007 of SRO, Kasibugga, the property is an extent of 750 Sq meters, ad measuring East to West: 30 Meters; North to South: 25 Meters, situated in Plot No.38, Survey No.266, Industrial Park, Ananthapuram, within the limits of Palasa-Kasibugga Municipality, Srikakulam District. Bounded by

East : Plot No.46 **South:** 18.30 Meters width Road
West : 12.20 Meters width Road **North :** Plot No.37

D.V.VIVEKANANDA
Advocate & Notary (Govt. of India)
Mobile No: 9440436751

(c) eenadu

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

ఇంత దారుణమా?

ఆమదాలవలస మండలం పొన్నాపేట, రామచంద్రాపురం వెళ్లే దారి చెరువును తలపిస్తోంది. గత ప్రభుత్వంలో ఇసుక రవాణా కారణంగా సుమారు 5 కిలోమీటర్ల పొడవునా దారి అధ్వానంగా మారింది. వర్షాలు కురిస్తే గుంతల్లో నీరు చేరి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. 'రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం' అని ఆర్అండ్‌బీ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

ఆదిత్యుడికి బంగారు ఆభరణాలు బహూకరణ

అరసవల్లి సూర్యనారాయణస్వామికి శ్రీకాకుళం నగరానికి చెందిన పొడుగు వెంకటసూర్యప్రభాకరరావు, వెంకట రాజేష్‌కన్నా, కరుణాకరరావు 29.820 గ్రాముల బంగారు ఆభరణాలు బహూకరించారు. ఆదివారం స్వామిని దర్శించుకున్న అనంతరం ఆలయ అనివెట్టి మండపంలో ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాదరావుకు అందజేశారు. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

ఎర్రన్న ఆశయ సాధనకు కృషి చేద్దాం

ప్రజా సదన్ వద్ద ఎర్రన్నాయుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్

నిమ్మాడలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్, నాయకులు

రణస్థలంలో శ్రద్ధాంజలి ఘటిస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, సీఎం రమేష్, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు

కేంద్ర మాజీ మంత్రి, దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు ఆశయ సాధనకు కృషి చేద్దామని కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఎర్రన్న వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాల వ్యాప్తంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఆయన చేసిన సేవలు గుర్తుచేసుకున్నారు. – న్యూస్‌టుడే, సరుబుజ్జిలి, ఆమదాలవలస పట్టణం, రణస్థలం

ప్రభుత్వం అండగా ఉంటుంది: కూన రవి

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: కాశీబుగ్గలోని వేంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట ఘటన జరిగి మృతి చెందిన వారి కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించిందని, రాష్ట్ర మంత్రులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఘటనకు గల కారణాలు తెలుసుకున్నారన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పరిహారం అందజేసినట్లు పేర్కొన్నారు.

పాడి రైతులకు ప్రోత్సాహం

న్యూస్‌టుడే, సరుబుజ్జిలి, పొందూరు, ఆమదాలవలస గ్రామీణం

గడ్డి పెంపకంపై అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారులు, విద్యార్థులు, సిబ్బంది

వ్యవసాయ సాగు తర్వాత పశుపోషణకు అన్నదాతలు అధిక ప్రాధాన్యం ఇస్తారు. పాడి దిగుబడిపై వచ్చే ఆదాయంతో ఎన్నో కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ తరుణంలో ఆ పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రద్ధ చూపుతోంది. పశువులకు అవసరమైన పచ్చగడ్డి పెంచుకునేందుకు రాయితీలిస్తూ చేయూతనిస్తోంది. ఉపాధి హామీ పథకం కింద పశుగ్రాసం పెంచే వారికి అవసరమైన నిధులు ఇచ్చే ప్రణాళికపై పశు సంవర్ధకశాఖ పోషకులకు అవగాహన కల్పిస్తోంది.

● ఆమదాలవలస నియోజకవర్గం పరిధిలో 44.09 ఎకరాల్లో పశుగ్రాసాన్ని పెంచాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. పశు సంవర్ధకశాఖ డిసెంబరు ఆఖరు వరకు దరఖాస్తులను స్వీకరించనుంది.

● 50 సెంట్ల భూమికి కూలీల వేతనం, సామగ్రి కలిపి రూ. 32,992 ఖర్చవుతోంది. 40 సెంట్లకు రూ. 26,394, 30కి రూ. 19,790, 20కి రూ. 13,195, 10కి రూ. 6,559 చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనుంది.

● అయిదెకరాల లోపు భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ, చిన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులు. ఒక్కో రైతుకు గరిష్ఠంగా 50 సెంట్ల వరకు పశుగ్రాసం సాగుకు అనుమతి ఉంటుంది. జాబ్ కార్డు ఉన్న రైతులకు మాత్రమే రాయితీ వర్తిస్తుంది. రైతు సేవా కేంద్రం, మండలంలోని పశు వైద్యాధికారిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు ఆ భూమిని పరిశీలించి నీటి వసతి కలిగిన రైతులను ఎంపిక చేస్తారు.

సద్వినియోగం చేసుకోండి..

బహువార్షిక గడ్డి రకాలతో అయిదేళ్ల పాటు గ్రాసం బాగుంటుంది. రైతులకు వ్యవసాయ, విత్తన, ఎరువుల ఖర్చులకు ప్రభుత్వం పూర్తి రాయితీ ఇస్తోంది. ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – ఆనందరావు, నారాయణరావు, జి.రఘునాథ్, ఆనందరావు, నాలుగు మండలాల పశు సంవర్ధకశాఖ ఏడీలు

ఆమదాలవలస నియోజకవర్గ వివరాలు

మండలం	రైతులు	విస్తీర్ణం ఎకరాల్లో
సరుబుజ్జిలి	17	5.32
ఆమదాలవలస	20	11.05
పొందూరు	71	21.72
బూర్జ	10	6.0

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9502198883 8008552704

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

సమస్య: పుర పరిధిలోని సప్తపురాల్లో మురుగు కాలువలు పూడికతో నిండి దుర్వాసన వ్యాపిస్తోంది. – స్థానికులు

సమాధానం: రోజూ పారిశుద్ధ్య పనులు జరిగేలా చర్యలు తీసుకుంటాం. – టి.రవి, పుర కమిషనర్, ఆమదాలవలస. ? తిమ్మాపురంలో తాగునీరు సకాలంలో రావడం లేదు. – రాము, స్థానికుడు. ● చర్యలు తీసుకుంటాం. – జాన్సన్, పుర ఏఈ ? ప్రధాన కూడళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో రాత్రి సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నాం. – స్థానికులు ● చర్యలు తీసుకుంటాం. – బాలరాజు, ఎస్సై – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

శవరాజకీయాలు సరికాదు: గొండు శంకర్

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: కాశీబుగ్గలోని తొక్కిసలాట ఘటన బాధాకరమని వైకాపా నాయకులు అక్కడికి వెళ్లి అనవసరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శవ రాజకీయాలు చేయడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీకాకుళంలోని విశాఖ ఏ కాలనీలో విలేకరులతో మాట్లాడారు. పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు వైకాపా నేతలు తప్పుగా ప్రచారం చేస్తున్నారన్నారు. నిర్వాహకుల వైఫల్యమే అయినా.. ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.

కళాకారులను ఆదుకోండి

ఆమదాలవలస పట్టణం: కళాకారులను ఆదుకుంటేనే కళలు సజీవంగా ఉంటాయని ఆ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పేడాడ ధనంజయరావు అన్నారు. సంఘమేశ్వర స్వామి ఆలయ ఆవరణలో కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం మహిళ కళాకారులకు జలుమూరు వెంకటేశ్వరరావు చీరలు పంపిణీ చేశారు.

మండల స్థాయి గణిత ప్రతిభా పోటీలు

పొందూరు గ్రామీణం: పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్షా పోటీలు నిర్వహించారు. వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 132 మంది విద్యార్థులు హాజరై 21 మంది ప్రతిభ చాటారు.

ట్రాఫిక్ సమస్యలు పట్టవా?

రణస్థలం మండలం కోస్ట పైవంతెన కింద ఇరువైపులా కూరగాయల దుకాణాలతో ట్రాఫిక్ నిలిచిపోతుంది. కూరగాయలు కొనుగోలు చేసేవారు వాహనాలను అక్కడ నిలపడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. ఉదయం, సాయంత్ర వేళల్లో రద్దీ నెలకొంటోందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎస్సై చిరంజీవి వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, రణస్థలం

నిర్లక్ష్యంగా వదిలేశారు..

జి.సిగడాం మండల కేంద్రంలో వైకాపా హయాంలో ప్రయాణికులు విశ్రాంతి భవనాన్ని రూ.4.5 లక్షలతో నిర్మించారు. దాని నిర్వహణను పట్టించుకోకపోవడంతో కొంతమంది వ్యాపారులు అక్కడ దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ప్రయాణికులకు బస్సుల కోసం రోడ్లపై వేచి ఉండాల్సి దుస్థితి నెలకొంది. ఈ విషయంపై ఎంపీడీవో రామకృష్ణ వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, జి.సిగడాం

గొయ్యి ఉంది.. చూసుకొని వెళ్లండి

గార మండలం దీపావళి-గొంటి ర.భ. రహదారి నుంచి రాళ్లపేట వెళ్లే పీఆర్ దారిలో ఓ బియ్యం మిల్లు సమీపంలో ఉన్న కల్వర్టు ఇటీవలి కురిసిన వర్షాలకు శిథిలమై మధ్యలో గొయ్యి పడింది. అప్రమత్తంగా లేకుంటే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ దారిలో నిత్యం వాహనాలు రాకపోకలు ఉంటాయి. అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పి.ఆర్. ఏఈ మహంతి వద్ద ప్రస్తావించగా పరిశీలించామని, చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, గార(గొంటి)

పాఠకులకు దూరం..

పొందూరు నెహ్రూపార్కు ఆవరణలో ఉన్న గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. లోపలికి వెళ్లేందుకు మార్గం ఇరుకుగా ఉండటంతో పాఠకులు ఇక్కడికి రావడానికి సుముఖత చూపించడం లేదు. కనీసం సౌకర్యాలు లేవని, నిరుద్యోగులకు ఉపయుక్తంగా ఉండేలా మరోచోటుకు గ్రంథాలయం మార్చాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై గ్రంథాలయాధికారి వెంకటేశ్ వద్ద ప్రస్తావించగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. – న్యూస్‌టుడే, పొందూరు

పొంచి ఉన్న ప్రమాదం

జి.సిగడాం మండలం దాలెమ్మ రాజువలసకు వెళ్లే రహదారి పక్కన నియంత్రిక ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. పనికిరాని మొక్కలు అల్లుకోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై విద్యుత్తుశాఖ ఏఈ దుర్గాప్రసాద్ వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, జి.సిగడాం

రీసర్వే సక్రమంగా చేపట్టాలి

సమావేశంలో మాట్లాడుతున్న సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ ప్రాంతీయ సంచాలకుడు కుమార్

శ్రీకాకుళం నగరం, రణస్థలం, న్యూస్‌టుడే: జిల్లాలో రీ సర్వేకు సంబంధించి అన్ని దస్త్రాలు సక్రమంగా పరిశీలించి రీ సర్వే చేపట్టాలని అధికారులను సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ ప్రాంతీయ సంచాలకుడు సీహెచ్ వి.ఎస్.ఎన్.కుమార్ ఆదేశించారు. శనివారం జడ్పీ సమావేశ ఆలయంలో రీ సర్వేపై డిప్యూటీ తహసీల్దారులు, మండల సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. భూ యజమానులకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా శతశాతం కచ్చితత్వంతో రీసర్వే చేపట్టాలన్నారు. గడువులోగా కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. రీసర్వేకు రైతులంతా సహకరించాలని కుమార్ అన్నారు. రణస్థలం మండలం కృష్ణాపురం పంచాయతీ నారాయణపట్నంలో జరుగుతున్న రీసర్వేను పరిశీలించారు. తహసీల్దారు ఎస్.కిరణ్‌కుమార్, మండల సర్వేయరు రవి, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఐక్యకార్యాచరణ సమితి కార్యవర్గ ఎన్నిక

శ్రీకాకుళం నగరం: రాష్ట్ర బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంఘాల ఐక్యకార్యాచరణ సమితి జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక శ్రీకాకుళం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సమావేశ మందిరంలో జరిగింది. అధ్యక్షుడిగా సీహెచ్.రాజశేఖరరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా వై.పోలినాయుడు, ప్రధాన కార్యదర్శిగా బి.మల్లేశ్వరరావులను ఎన్నుకున్నారు.

వినతుల స్వీకరణ

రణస్థలం: విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు రణస్థలంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం వినతులు స్వీకరించారు. పలు సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించి సమస్యలపై సంబంధిత అధికార్లతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు.

వాకర్స్ ప్రతినిధులకు అభినందన సత్కారం

శ్రీకాకుళం సాంస్కృతికం: నగరంలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఆవరణలో విజయనగరం వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులకు సత్కార కార్యక్రమం జరిగింది. గవర్నర్ ఆరిక తిరుపతి రావు ముఖ్యఅతిథిగా పాల్గొని నడక ఆవశ్యకతను వివరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ కొంక్యాన మురళీ మోహన్, మాజీ గవర్నర్ ఏ.ఎస్. ప్రకాశరావు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నమూనా పరీక్షకు విశేష స్పందన

పాతబస్టాండ్: కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రవేశపెట్టిన 'ఎర్రన్న విద్యా సంకల్పం'లో భాగంగా ఆదివారం నిర్వహించిన ఆర్‌ఆర్‌బీ గ్రూప్-డి పోటీ పరీక్ష మాక్ టెస్ట్‌కు విశేషంగా అభ్యర్థులు హాజరయ్యారు. శ్రీకాకుళం నగరంలోని కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ నమూనా పరీక్షకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, మన్యం జిల్లాల నుంచి 358 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

ఎచ్చెర్ల: శ్రీకాకుళంలో సోమవారం నుంచి ఈ నెల 6వ తేదీ వరకు జరగనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎచ్చెర్లలోని ఆర్జీయూకేటీ విద్యార్థి సాయి గణేష్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా క్యాంపస్ డైరెక్టర్ కె.వి.జి.డి.బాలాజీ, శివానీ క్యాంపస్ ఇన్‌ఛార్జి సాగర్, పీడీ టి.దిలీప్‌కుమార్, కృష్ణంరాజు, అధ్యాపకులు అభినందించారు.

వైభవంగా ద్వాదశి పూజలు

బలగ అయ్యప్ప ఆలయంలో స్వామికి అలంకరణ

ఉమారుద్రకోటేశ్వర ఆలయంలో..

శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: పవిత్ర కార్తిక మాస ద్వాదశి సందర్భంగా నగరంలో కలెక్టర్ బంగ్లా దరి కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం నాగావళి నదిలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. ★ బలగ ఆదివారం పేట దరి అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్పస్వామి తెప్పోత్సవం అయ్యప్ప శరణుఘోష మధ్య వైభవంగా జరిగింది. ఉమారుద్రకోటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయండి

కొవ్వొత్తుల ప్రదర్శనలో వైకాపా నాయకులు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: కాశీబుగ్గ వేంకటేశ్వర ఆలయం తొక్కిసలాట ఘటనలో మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం చెల్లించి ప్రభుత్వం న్యాయం చేయాలని వైకాపా జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ డిమాండ్ చేశారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలివద్ద ఆదివారం రాత్రి మృతుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ వైకాపా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఘటనకు నిర్వాహకుడిని బాధ్యుడ్ని చేయడం సరికాదన్నారు. సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, వైకాపా నాయకులు చింతాడ రవికుమార్, సత్యనారాయణ, దుంపల లక్ష్మణరావు, మండవిల్లి రవి, సుగుణా రెడ్డి పాల్గొన్నారు.

తెరవే సాహితీ సమ్మేళనం

శ్రీకాకుళం సాంస్కృతికం: నగరంలో శాంతినికేతన్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో సాహితీ సమ్మేళనం జరిగింది. తెరవే అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావిల్లి నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తిల ఆధ్వర్యంలో జరిగిన సాహితీసమ్మేళనంలో ముఖ్యఅతిథిగా సెట్‌శ్రీ పూర్వ సీఈవో సురంగి మోహనరావు, విశ్రాంత విద్యాశాఖాధికారి బలివాడ మల్లేశ్వరరావులు, 17 మంది కవులు, రచయితలు పాల్గొని తమ కవితలను చదివారు.

చెరువు కాదు.. కళాశాల మార్గం

శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రధాన ద్వారం వద్ద చినుకు పడితే చెరువుగా మారుతోంది. విద్యార్థులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. మోటార్లతో నీరు తోడించాలని కోరారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వై.పోలినాయుడు దృష్టికి తీసుకెళ్లగా మున్సిపల్ అధికారులకు పరిస్థితి వివరించామని తెలిపారు. –న్యూస్‌టుడే, కలెక్టరేట్ (శ్రీకాకుళం)

మహిళల ఆర్థికాభ్యున్నతే ధ్యేయం

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామీణ మహిళలను ఆర్థికంగా బలోపేతమే చేయడమే నాబార్డు ప్రధాన లక్ష్యమని నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి కె.రమేష్ కృష్ణ అన్నారు. గవ్వల హస్తకళలో శిక్షణ పొందిన మహిళలకు బ్యాంకు రుణ సదుపాయాలు, యూనిట్ల నిర్వహణకు తోడ్పాటు, మార్కెటింగ్ సదుపాయాలు, ఆర్టిసన్ ఐడీ కార్డులు, ఎగ్జిబిషన్ సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. నాబార్డు సహకారంతో, యూత్ క్లబ్ బెజ్జిపురం ఆధ్వర్యంలో శ్రీకాకుళం గ్రామీణ మండలం పెద్దగనగళ్లవానిపేట గ్రామంలో 15 రోజుల పాటు 30 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు నిర్వహించిన సముద్రపు గవ్వల హస్తకళా శిక్షణ కార్యక్రమం శనివారంతో విజయవంతంగా ముగిసిందని తెలిపారు.

సదస్సు విజయవంతం చేయండి

ఈ నెల 16న కులనిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని నిర్వహించే రాజ్యాంగం- రాజ్యాంగం వ్యవస్థల కాషాయికరణ సదస్సు కరపత్రాన్ని కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణయ్య తదితరులు ఆదివారం ఆవిష్కరించారు. నగరంలోని ఆదివారంపేట అంబేడ్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కృష్ణయ్య మాట్లాడుతూ సదస్సులో అన్ని వర్గాలు వారు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

ధరలకనుగుణంగా వీడీఏ పాయింట్లు పెంచాలి

శ్యామ్‌పిస్టన్స్ పరిశ్రమ ఆవరణలో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: కార్మికులకు న్యాయం జరిగేలా పెరిగిన ధరలనకుగుణంగా వీడీఏ పాయింట్లు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కార్యదర్శి ఎన్.వి.రమణ డిమాండ్ చేశారు. ఎచ్చెర్ల మండలం అరిణాంఅక్కివలస పంచాయతీ పరిధిలోని శ్యామ్‌పిస్టన్స్ పరిశ్రమ ఆవరణలో ఆదివారం వీడీఏ పాయింట్లు పెంచాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణరావు మృతి తీరని లోటు

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా ఉద్యమ కారుడు, న్యాయవాది చౌదరి లక్ష్మణరావు మృతి తీరని లోటు అని సిటిజన్ ఫోరం గౌరవాధ్యక్షుడు బి.మోహనరావు అన్నారు. ఆదివారం పట్టణంలో లక్ష్మణరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సభ్యులు ధనంజయరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం కనుమరుగు

★ అధ్వానంగా ఉద్యానాలు
★ పట్టించుకోని నగర పాలకులు

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

ఎల్‌బీఎస్ పార్కులో నిలిచిన మురుగు

రోజూ ఉరుకుల పరుగుల జీవితంలో గడిపే నగరవాసులు సాయంత్రం వేళల్లో కాస్త సేదతీరేందుకు, కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడిపేందుకు సమయం కేటాయిస్తుంటారు. పిల్లల్ని ఆడించేందుకు స్థానికంగా ఉండే ఉద్యానాలకు తీసుకెళ్తుంటారు. కానీ అందుకు తగినట్లు పార్కుల్లో సౌకర్యాలు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా నిర్వహణను పట్టించుకోకపోవడంతో ఆహ్లాదానికి దూరం అవుతున్నారు.

★ నగరంలో విద్యుత్తు కాంతులు, ఫౌంటెయిన్లతో పచ్చని చెట్లు, పిల్లల ఆట వస్తువులతో ఆహ్లాదకరంగా ఉండే పాలకొండ రహదారిలోని గాంధీ పార్కు, ఏడురోడ్ల కూడలి వద్ద గల రివర్‌వ్యూ, కృష్ణా, న్యూకాలనీలోని డైమండ్ పార్కుల నిర్వహణను కొంతకాలంగా నగరపాలక సంస్థ అధికారులు విస్మరించారు. దీంతో ఆయా ఉద్యానాల్లో పచ్చదనం కనుమరుగైంది.

★ గూనపాలెం, హడ్కోకాలనీలో గతంలో ఉండే పార్కులు నేడు పూర్తిగా కనుమరుగై ఆనవాళ్లు కోల్పోయాయి. ఎల్‌బీఎస్, ఇందిరాప్రియదర్శిని పార్కుల్లో బెంచీలు విరిగిపోయి, చెత్త, వ్యర్థాలతో అధ్వానంగా తయారయ్యాయి. పుట్టలు పెరిగిపోతున్నా వాటిని తొలగించేవారు కరవయ్యారు. వర్షపునీరు రోజుల తరబడి నిలుస్తున్నా పట్టించుకునేవారే లేరు.

★ జడ్పీ ఎదురుగా ఉన్న హౌసింగ్‌బోర్డు కాలనీ కార్గిల్ పార్కులో వైకాపా ప్రభుత్వం ఎన్నికల ముందు చేపట్టిన పార్కు పునరుద్ధరణ పనులు నేటికీ పూర్తికాక అసంపూర్తిగా నిలిచిపోయాయి. క్యాంటీన్, మురుగుదొడ్లు, విద్యుత్తు వంటి సౌకర్యాలతో పాతహౌసింగ్‌బోర్డు కాలనీలో నాగావళి ఒడ్డున వీఎంఆర్‌డీఏ నిర్మించిన పార్కు నిర్వహణను పూర్తిగా విస్మరించడంతో నిరుపయోగంగా మారింది.

★ రాష్ట్ర గ్రీన్ కార్పొరేషన్ నగరపాలక సంస్థకు సరఫరా చేసే రూ.50 లక్షల పిల్లల ఆటవస్తువులు, పార్కుల్లో ఏర్పాటు చేసే ఓపెన్ జిమ్ పరికరాలను సైతం కార్గిల్, మరికొన్ని పార్కులకు తరలించి పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు.

అభివృద్ధికి చర్యలు..

నగరంలో దశలవారీగా పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. ఇందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. – పి.వి.వి.డి.ప్రసాదరావు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం కొత్తకోట పంచాయితీ బట్టుపాలేం గ్రామం కాపురస్తురాలు అయిన బొడ్డు లేటు రాములు భార్య అప్పమ్మ ఇచ్చిన భోగట్టాపైని యీ ప్రకటన ఇవ్వడమైనది.

నా క్లయింటు అయిన బొడ్డు అప్పమ్మ తన హక్కు అనుభవములలో ఉన్నటువంటి ఈ క్రింది షెడ్యూల్ ఆస్థిపైని కాకి సన్యాసికి ఎట్టి హక్కు అనుభవములు లేనప్పటికీ సదరు షెడ్యూల్ ఆస్థిపైకి దౌర్జన్యముగా చొరబడే ఉద్దేశ్యముతో ఉండగా నా క్లయింటు సదరు కాకి సన్యాసి పైని శ్రీకాకుళం Iవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో O.S. 158/2020 నెంబరు గల దావా మరియు I.A 85/2020 నెంబరు గల ఇంజంక్షను పిటీషను కూడా దాఖలు చేసియుంటిరి. ఇంజంక్షన్ పిటీషన్ మరియు దావా పెండింగ్‌లో ఉన్నది. ఇట్లుండగా సదరు కాకి సన్యాసి దురుద్దేశ్యంతో సదరు దావా షెడ్యూల్ ఆస్థిని అన్యాక్రాంతం చేయుటకు ప్రయత్నించుచున్నట్లుగా నా క్లయింట్‌కి భోగట్టా తెలిసినది. సదరు ఆస్థిని ఎవరూ ఎట్టి కొనుగోలు, వగైరాలు చేసిననూ అది చట్టరీత్యా చెల్లదనియూ, కొనుగోలు చేసినవారు నష్టపోవుదురనియూ నా క్లయింటుకు బంధింపజాలవనియూ, దీనికి నా క్లయింటు చట్టరీత్యా తీసుకొనే సివిల్ మరియు క్రిమినల్ కేసులకు బాధ్యులగుదురనియు ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

షెడ్యూలు ఆస్థి వివరములు : శ్రీకాకుళం జిల్లా, లావేరు మండలం, రణస్థలం సబ్‌రిజిస్ట్రార్ యిలాకా, కొత్తకోట రెవెన్యూ గ్రామం R.S. No. 213/5 Part య.0.17 సెంట్లు మరియు R.S. No. 213/15 య.0.17 సెంట్లు, రెండు R.S. నెంబర్లు అత్తియున్నవి.

ఇందుకు హద్దులు
తూర్పు : ఇప్పిలి సిమ్మయ్య వగైరాల భూమి
దక్షిణ : బర్నేల వారి చెరువుకు పోయే భూమి
పడమర : కొత్తకోట గురుగుబెల్లి రోడ్
ఉత్తర : దేవాడ సూరయ్య, మేడబోయిన ధర్మారావు మరియు ఇతరుల భూమి

శ్రీకాకుళం
తేది 02-11-2025

బలగ గణపతి పట్నాయక్
అడ్వకేట్
బలగ, శ్రీకాకుళం, సెల్ : 9492762514

సమాధుల పండుగ సందర్భంగా ఆదివారం చెన్నై కీల్పాక్ శ్మశానవాటికలో తమవారి సమాధులను పువ్వులతో అలంకరించి, కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు - న్యూస్‌టుడే, విల్లివాక్కం

8 వరకు రాష్ట్రంలో వర్షాలకు అవకాశం

ప్యారిస్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఈ నెల 8వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. మయన్మార్ సముద్ర తీరంలో అల్పపీడనం ఏర్పడిందని, అది ఉత్తర లేదా వాయవ్య దిశలో మయన్మార్, బంగ్లాదేశ్ సముద్రతీరం వైపు పయనిస్తుందని పేర్కొంది. అదేవిధంగా తమిళనాడు వైపు వీచే తూర్పు దిశ గాలిలో వేగం మార్పు కారణంగా సోమవారం రాష్ట్రంలో ఒకటి రెండు చోట్ల, 4వ తేదీ రాష్ట్రంలో కొన్నిచోట్ల, దక్షిణ తమిళనాడులో ఒకటి రెండు చోట్ల, 5, 6 తేదీల్లో రాష్ట్రంలో కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. 7వ తేదీ ఉత్తర తమిళనాడులో కొన్ని చోట్ల, దక్షిణ తమిళనాడులో ఒకటి రెండు చోట్ల, 8వ తేదీ ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వివరించింది. చెన్నైలో ఆకాశం మేఘావృతమై కొన్నిచోట్ల తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

కేంద్ర ప్రభుత్వ పాచికగా ఎన్నికల సంఘం

☛ 'సర్'కు వ్యతిరేకంగా అఖిలపక్ష సమావేశం ☛ విడనాడాలని నిర్ణయం

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) పనులను విడనాడకుంటే సుప్రీంకోర్టును ఆశ్రయించడమే మార్గమని అఖిలపక్ష సమావేశం నిర్ణయించింది. చెన్నై త్యాగరాయనగర్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో ఆదివారం అఖిలపక్ష సమావేశం జరిగింది. ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే, భాజపా తదితర పార్టీలు మినహా 64 పార్టీలకు ఆహ్వానం పంపగా 49 పార్టీల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. టీవీకే, పీఎంకే, ఎన్టీకే తదితర పార్టీలు సమావేశానికి గైర్హాజరయ్యాయి. తమిళనాడులో 'సర్' పనుల అమలు వ్యవహారంపై పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. దేశంలోని రాజకీయ పార్టీలు చాలావరకు 'సర్'ను మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నా కేంద్ర ప్రభుత్వ పాచికగా ఎన్నికల కమిషన్ మారిందని సమావేశం తీవ్రంగా ఖండించింది. బిహార్‌లో జరిగిన లోపాలను చక్కదిద్దకుండా తమిళనాడు తదితర 12 రాష్ట్రాల్లో 'సర్'ను అమలు చేయడం ప్రజల ఓటుహక్కును హరించడం, ప్రజాస్వామ్యాన్ని భూస్థాపితం చేయడమేనని తెలిపింది. కేంద్ర ప్రభుత్వ రాజపత్రంలో ప్రకటన విడుదల చేసిన తర్వాతే ఓటరు జాబితాలో సవరణలు చేయాలని, దానికి భిన్నంగా ఎన్నికల కమిషన్ ప్రకటించడం రాజ్యాంగానికి, ప్రజాప్రాతినిధ్య చట్టానికి వ్యతిరేకమని పేర్కొంది. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణల్లో నిజాయతీ లేదని, పారదర్శకత లేదని ఆరోపించింది.

ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం జరుగుతున్న దృశ్యం

అది సమయం కాదు

ఎన్నికల కమిషన్ తొందరపాటు ఎక్కువ అనుమానాన్ని కలిగిస్తోందని, ఎన్యూమరేషన్ కాలంగా నిర్ణయించిన ఈ నెల 4 నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు ఉద్ధృతంగా ఉండే సమయమని, ఆ సమయంలో భారీవర్షాలు, దారుణమైన వాతావరణ పరిస్థితులు ఉంటాయని తెలిపింది. రాష్ట్ర ఓటర్లలో ఎక్కువమంది గ్రామీణులు, రైతులు కావడంతో ఎన్యూమరేషన్ ఫారాలు పొంది వాటిని భర్తీ చేసి సమర్పించడానికి సాధ్యపడదని, దీంతో అర్హత కలిగిన పలువురు ఓటర్లు తొలగింపునకు గురవుతారనే న్యాయమైన భయం ఉందని పేర్కొంది. డ్రాఫ్టు ఓటరు జాబితా విడుదలకు ముందు క్రిస్మస్, పొంగల్ వంటి పండగలు ఉన్నాయని, ఇది కూడా పలువురి ఓటుహక్కును కోల్పోయే పరిస్థితిని కల్పిస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. బిహార్ రాష్ట్ర 'సర్' కేసు సుప్రీంకోర్టులో ఉన్న నేపథ్యంలో, ఆ కేసులో తుది తీర్పు రాని పరిస్థితుల్లో తమిళనాడులో ఎన్నికలు జరగడానికి కొన్ని నెలలే ఉన్న నేపథ్యంలో 'సర్'ను ఎన్నికల కమిషన్ తీసుకురావడాన్ని ఆమోదించలేమని తెలిపింది. అందువల్ల వెంటనే దానిని విడనాడాలని కోరింది.

ఎన్నికల తర్వాత నిర్వహించాలి

ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్‌లో ఉన్న కొరతలు నివృత్తి చేసి, సుప్రీం కోర్టు మార్గదర్శకాలను పారదర్శకంగా పాటించి, తగిన గడువు కల్పించి, 2026 ఎన్నికలకు తర్వాత నిర్వహించాలని కోరింది. ఈ అభిప్రాయాలను ఎన్నికల కమిషన్ ఆమోదించకుంటే సుప్రీంకోర్టును ఆశ్రయించడం తప్ప వేరే మార్గంలేదని తెలిపింది. ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేయాలని నిర్ణయించింది. సమావేశంలో డీఎంకే కోశాధికారి, ఎంపీ టీఆర్‌బాలు, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై, ద్రావిడర్ కళగం అధ్యక్షుడు వీరమణి, ఎండీఎంకే ప్రధానకార్యదర్శి వైగో, మక్కళ్ నీది మయ్యం అధ్యక్షుడు ఎంపీ కమల్‌హాసన్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వీరపాండియన్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొన్న పార్టీలకు చెందిన నేతలకు ముఖ్యమంత్రి తన 'ఎక్స్' పేజీ ద్వారా కృతజ్ఞతలు తెలిపారు.

సమావేశంలో పాల్గొన్న పళనిసామి తదితరులు

జాగ్రత్తగా అమలు చేయాలి

ట్రిప్లికేన్: రాష్ట్రంలో 'సర్'ను జాగ్రత్తగా అమలు చేయాలని ప్రతిపక్షనేత, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి పేర్కొన్నారు. చెన్నై రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం జిల్లా ఇన్‌ఛార్జులతో సమావేశమైన ఆయన మాట్లాడారు. 'సర్' పనులను పర్యవేక్షించాలని పార్టీ వర్గాలకు సూచించారు. **- ఈపీఎస్, ప్రతిపక్షనేత, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి**

ఓటమికి భయపడే పార్టీలే పాల్గొన్నాయి

ట్రిప్లికేన్: అఖిలపక్ష సమావేశంలో ఓటమికి భయపడే పార్టీలు మాత్రమే పాల్గొన్నాయని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఆరోపించారు. ఆయన తన 'ఎక్స్'లో... ప్రజా సమస్యల పరిష్కారానికి అఖిలపక్ష సమావేశాన్ని ఎప్పుడూ ఏర్పాటుచేయని ముఖ్యమంత్రి 'సర్'కు వ్యతిరేకంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. 'సర్' అనేది ప్రజాస్వామ్య దేశంలో పౌరుల ఓటు హక్కును పరిరక్షించడానికి చాలా ఏళ్లుగా కొనసాగుతున్న ప్రక్రియగా తెలిపారు.

- నయినార్ నాగేంద్రన్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు

వారంతా పిరికివారు

అఖిలపక్ష సమావేశానికి హాజరుకాని వారి గురించి చింతించాల్సిన పనిలేదు. వారు పిరికివారు, భాజపాను వ్యతిరేకించడానికి భయపడుతున్నారు. హాజరైనవారికి ప్రజాస్వామ్య బాధ్యత ఉంది. 'సర్' వ్యవహారంలో సుప్రీంకోర్టుపై నమ్మకం ఉంది.

- ఆర్.ఎస్.భారతి, డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి

ఇది ప్రజాస్వామ్యానికి ముప్పు

ఓటరు జాబితాలో సవరణలు అవసరమే అయినా తొందరపాటు ఎందుకు?. తమిళనాడు సహా 12 రాష్ట్రాల్లో ప్రత్యేక ముమ్మర సవరణలు చేపట్టడానికి వేరే ఉద్దేశం ఉందా? కేంద్ర ఎన్నికల కమిషన్‌పై నమ్మకం బాగా తగ్గింది. ఇది ప్రజాస్వామ్యానికి ముప్పు. 'సర్'ను 2026 శాసనసభ ఎన్నికలు తర్వాత నిర్వహించాలి **- ఎంపీ కమల్‌హాసన్, మక్కళ్ నీది మయ్యం అధ్యక్షుడు**

ప్రమాదకర పరిస్థితి తలెత్తవచ్చు

ప్రజాస్వామ్యం మూలాలను తెగకోసే చర్యల్లో కేంద్ర ఎన్నికల కమిషన్ నిమగ్నమైంది. 'సర్' కారణంగా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన 75లక్షల మంది తమిళనాడులో ఓటు వేసే ప్రమాదకర పరిస్థితి ఏర్పడవచ్చు.

- వైగో, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి

శాసనసభ ఎన్నికలను దెబ్బతీసే కుట్ర

ఎన్నికల కమిషన్ కోరిన పత్రాలు సంచార ప్రజల వద్ద ఉండే అవకాశం లేదు. ఎన్నికల కమిషన్ చర్యల కారణంగా రాష్ట్రంలో సుమారు కోటి మంది పేర్లు ఓటర్ల జాబితా నుంచి గల్లంతయ్యే అవకాశం ఉంది. ఇది తమిళనాడు శాసనసభ ఎన్నికలను దెబ్బతీసే కుట్రగా భావించాల్సి ఉంది.

- తిరుమావళవన్, వీసీకే అధ్యక్షుడు

ఉదయనిధికి అర్థం కాలేదు

ట్రిప్లికేన్: ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ అంటే ఏంటో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు తెలియదని భాజపా సీనియర్ నాయకురాలు తమిళిసై సౌందరరాజన్ ఎద్దేవా చేశారు. ఆమె తన 'ఎక్స్'లో.. ఉదయనిధి స్టాలిన్ ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను 'స్పెషల్ ఇంటెన్సివ్ రిజిస్ట్రేషన్'గా తప్పుగా పేర్కొన్నారని, దీన్ని బట్టే ఆయనకు 'సర్' అంటే ఏం అర్థమైందో తెలుస్తోందన్నారు.

- తమిళిసై సౌందరరాజన్, భాజపా సీనియర్ నాయకురాలు

'సీబీఎస్ఈ' పదో తరగతి వార్షిక పరీక్షల తేదీలు ఖరారు

2026 ఫిబ్రవరి 17 నుంచి ప్రారంభం

వడపళని, న్యూస్‌టుడే: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) పదో తరగతి వార్షిక పరీక్షల తేదీలను బోర్డు ప్రకటించింది. ఆ మేరకు తమిళం, సైన్స్ పరీక్షల మధ్య ఒకరోజు మాత్రమే వ్యవధి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తిలో ఉన్నారు. హిందీ, సంస్కృతం భాషల్లో ఒకదానిని రెండో భాషగా ఎంచుకున్న విద్యార్థులకు పరీక్షలను ఆలస్యంగా నిర్వహిస్తున్నారు. సైన్స్ సబ్జెక్టు కేవలం ఒక సబ్జెక్టుతో ముడిపడి ఉండదని, వేర్వేరు సబ్జెక్టులతో కూడింది కావున తమిళం రెండో భాషగా తీసుకున్న విద్యార్థులకు ఒత్తిడి బాగా ఉంటుందని పలువురు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టైమ్ టేబుల్

తేదీ	సబ్జెక్టు
ఫిబ్రవరి	
17	మేథమేటిక్స్ స్టాండర్డ్
21	ఇంగ్లిషు
23	తమిళం
25	సైన్స్
27	ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్
28	సంస్కృతం
మార్చి	
2	హిందీ
7	సోషల్ సైన్స్

నటుడు అజిత్ వ్యాఖ్యలు ప్రశంసనీయం: ఉదయనిధి స్టాలిన్

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: కరూర్ తొక్కిసలాట దుర్ఘటన గురించి ప్రముఖ సినీ నటుడు అజిత్‌కుమార్ చేసిన వ్యాఖ్యలపై స్పందించకూడదు అనుకున్నానని, అయినా ఆయన వ్యాఖ్యలు ప్రశంసనీయమని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పేర్కొన్నారు. ఎంఆర్‌టీ-1 నిర్వహించిన 'చార్జ్ బీ చెన్నై రన్స్-2025' మారథాన్ పోటీని చెన్నై నేపియర్ వంతెన వద్ద ఆయన ఆదివారం ప్రారంభించారు. పోటీలో 12వేల మందికి పైగా పాల్గొన్నారు. పోటీ ద్వారా పల్లావరం ఎంఎంఏ ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాలకు కొత్త తరగతి గదులు, పర్నీచర్ వంటి మౌలిక వసతులు కల్పిస్తామని నిర్వాహకులు తెలిపారు. తర్వాత ఉదయనిధి విలేకరులతో మాట్లాడుతూ.. కరూర్ ఘటనపై ఎవరిని ప్రశ్నించాలో ఆయన్ను ఇంకా అడగలేదని చెప్పారు. అందుకు సంబంధించి సీబీఐ దర్యాప్తు జరుగుతోందని, కావున తాను దానిపై మాట్లాడదలచుకోలేదన్నారు. నటుడు అజిత్ అభిప్రాయం ఆయన వ్యక్తిగతమని, అయినా ఆయన వ్యాఖ్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.

మారథాన్ ప్రారంభిస్తున్న ఉదయనిధి స్టాలిన్

స్వాగతిస్తున్నా: ఎంపీ దురై వైగో

ప్యారిస్: కరూర్ తొక్కిసలాట గురించి నటుడు అజిత్ కుమార్ చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తున్నట్లు ఎంపీ దురై వైగో పేర్కొన్నారు. మదురైలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... నటుడు అజిత్ వ్యాఖ్యలనే తాను కూడా ఇంతకుముందు చెప్పినట్లు తెలిపారు. ప్రజలు బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. టీవీకే ప్రచార సభకు పిల్లలు, గర్భిణులను తీసుకురావద్దని పార్టీ నేతలే చెప్పారని, అది ఉల్లంఘించి చాలా మంది వెళ్లారన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేవారు అదనపు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. రాజకీయ కార్యక్రమాలే కాకుండా పలు కార్యక్రమాల్లో ఇలాంటి తొక్కిసలాటలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. కావున ప్రజలకు అవగాహన ఉండాలన్నారు. ఈ సూచనలే అజిత్ చెప్పారని, ఆయన వ్యాఖ్యలను స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో ఏనుగుల మార్గాలపై

ఫిబ్రవరిలో నివేదిక

హైకోర్టులో తెలిపిన అటవీశాఖ

ప్యారిస్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఉన్న ఏనుగు మార్గాలను గుర్తించి ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు అటవీశాఖ మద్రాసు హైకోర్టులో తెలిపింది. రాష్ట్రంలో ఏనుగుల మార్గాలను పరిరక్షించే విషయమై జంతు సంక్షేమ కార్యకర్త మురళీధరన్ దాఖలు చేసిన పిటిషన్ జస్టిస్ సతీష్‌కుమార్, జస్టిస్ భరతచక్రవర్తిల ప్రత్యేక ధర్మాసనంలో శనివారం విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా అటవీశాఖ తరపున. . ఇంటిగ్రేటెడ్ ఏనుగుల మార్గాలను గుర్తించి, వివరాలను దాఖలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏనుగుల మార్గాలుగా ప్రకటించిన ప్రాంతాల గురించి అధికారులు చర్చించి ఆ ప్రాంతంలో పర్యావరణ ప్రభావాన్ని అంచనావేయడానికి నవంబరు, డిసెంబరులో ప్రజల వద్ద అభిప్రాయ సేకరణ సమావేశాలను ప్రభుత్వం నిర్వహించనుందని తెలిపారు. ఆ తర్వాత ఏనుగుల మార్గాల గురించి తుది నివేదిక వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో న్యాయమూర్తులు.. ఈ విషయమై తదుపరి చర్యల గురించి నివేదిక దాఖలు చేయాలని ఉత్తర్వులు ఇచ్చి విచారణను 28కి వాయిదా వేశారు.

టీవీకే వాలంటీర్ విభాగానికి శిక్షణ

చెన్నై, న్యూస్‌టుడే: టీవీకే వాలంటీరు విభాగానికి ఆదివారం శిక్షణ ఇచ్చారు. కరూర్ తొక్కిసలాట దుర్ఘటన నేపథ్యంలో టీవీకేపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. ఘటన తర్వాత పార్టీ కార్యకర్తలు, నిర్వాహకులు ఘటనా స్థలి నుంచి ఉడాయించారని, భారీ సభను నిర్వహించినా పార్టీ వాలంటీర్లు లేరనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దుర్ఘటన తర్వాత మిగతా ప్రచారసభలను విజయ్ వాయిదా వేసిన నేపథ్యంలో మరో పది రోజుల తర్వాత ప్రచారసభలను మళ్లీ నిర్వహించడానికి సన్నాహాలు చేపట్టారు. ప్రచారసభల్లో ప్రజల భద్రతను ధ్రువీకరించేలా 486 మందితో వాలంటీరు విభాగాన్ని ఏర్పాటు చేశారు. వారికి పనైయూర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం శిక్షణ అందించారు. ఇందులో ప్రధానకార్యదర్శి బుస్సి ఆనంద్, ఎన్నికల ప్రచార విభాగం ప్రధానకార్యదర్శి ఆదవ్ అర్జున తదితరులు పాల్గొన్నారు.

కార్తికకు రూ.10కోట్ల ప్రోత్సాహక నిధి అందించాలి

మన్సూర్ అలీఖాన్ డిమాండ్

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై నగరానికి చెందిన క్రీడాకారిణి కార్తికకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు ప్రోత్సాహక నిధి అందించాలని నటుడు మన్సూర్ అలీఖాన్ డిమాండ్ చేశారు. ఆసియా యూత్ గేమ్స్‌లో స్వర్ణ పతకం గెలిచిన భారత మహిళా కబడ్డీ జట్టులోని కార్తికను పలువురు ప్రముఖులు అభినందిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమెకు రూ.10కోట్ల ప్రోత్సాహకం, ఓ ఇంటిని రాష్ట్ర ప్రభుత్వం అందజేయాలని మన్సూర్ అలీఖాన్ డిమాండ్ చేశారు.

కార్తిక దీపోత్సవాలకు 4,764 ప్రత్యేక బస్సులు

అరక్కోణం, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయంలో డిసెంబరు 3వ తేదీ నుంచి కార్తిక దీపోత్సవాలు జరగనున్నాయి. రాష్ట్రంలోని నలుమూలల నుంచేకాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసే విషయమై రాష్ట్రంలోని అన్ని జోన్ల రవాణా సంస్థల డిపో మేనేజర్లతో తిరువణ్ణామలై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక సమావేశం జరిగింది. కలెక్టర్ తర్పగరాజ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. కార్తిక దీపోత్సవాలు జరిగే రోజుల్లో పట్టణం వెలుపల తొమ్మిది ప్రదేశాల్లో తాత్కాలిక బస్టాండ్లు ఏర్పాటు చేయాలని, మార్కెటింగ్ కమిటీ, దిండివనం రోడ్డు, సర్వేయర్ నగర్, వెట్టవలం రోడ్డు, మున్సిపల్ బాలుర హయ్యర్ సెకండరీ స్కూలు ఎదురుగా, తిరుకోవిలూరు రోడ్డు, మనలూరుపేట రోడ్డు, విటో డిజిటల్ ప్లస్, అతియంతల్ సింగం రోడ్డు, అన్నాత్రాన్ డోమ్‌కామ్ రోడ్డు, వేలూరు రోడ్డు, కియాపట్టు జంక్షన్, అవలూరుపేట రోడ్డులో ఈ బస్టాపులు ఉండాలని సూచించారు. 4,764 ప్రత్యేక బస్సులను నడపనున్నామని, దీంతో పాటు తిరువణ్ణామలై ప్రాంతీయ రవాణా కార్యాలయం తరపున 70 మినీ బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్లు కలెక్టర్‌కు వివరించారు.

మోదీ పాలనలో తగ్గిన పేదరిక శాతం : గవర్నర్

పురస్కారం ప్రదానం చేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

చెన్నై, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వంలో దేశంలోని పేదరికం శాతం గణనీయంగా తగ్గిందని గవర్నర్ ఆర్.ఎన్.రవి తెలిపారు. పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అవతరణ దినోత్సవాలను గిండిలోని రాజ్‌భవన్‌లో శనివారం రాత్రి నిర్వహించారు. ఇందులో గవర్నర్ ఆర్.ఎన్.రవి పాల్గొని వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న పలువురిని పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం పదేళ్లుగా అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. పదేళ్ల కిందట పేదరికం 30శాతం కన్నా ఎక్కువగా ఉండేదని, ప్రస్తుతం 6శాతం కన్నా తక్కువగా ఉన్నట్లు పలు సంస్థల సర్వేల్లో తేలిందని తెలిపారు. గాంధీ తర్వాత దేశాన్ని చక్కగా అర్థం చేసుకున్న వ్యక్తి నరేంద్ర మోదీ మాత్రమేనని తాను గట్టిగా నమ్ముతున్నట్లు పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత భాషల ఆధారంగా ప్రజల మధ్య అవరోధాలు రూపొందించడం దురదృష్టకరమని తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సంబరాలు ఆ రాష్ట్రాల సంస్కృతి వేడుకలను నిర్వహించడానికి ఓ అవకాశమని తెలిపారు.

ఆత్మగౌరవం గురించి మాట్లాడే అర్హత ఆ పార్టీలకు లేదు: సీమాన్

చెన్నై, న్యూస్‌టుడే: ఆత్మగౌరవం గురించి మాట్లాడే అర్హత డీఎంకే, అన్నాడీఎంకేలకు లేదని ఎన్టీకే చీఫ్ కన్వీనర్ సీమాన్ తెలిపారు. అంబత్తూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఆత్మగౌరవం అనే మాటను చెప్పడానికి డీఎంకే, అన్నాడీఎంకేలకు అర్హత లేదన్నారు. ఉప ముఖ్యమంత్రి కాళ్లపై అదే వయసు ఉన్న ఒకరు పడటమే ఆత్మగౌరవమా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పదవిలోకి రావడం కోసం శశికళ కాళ్లకు ఎడప్పాడి పళనిసామి మొక్కడమే ఆత్మగౌరవమా? అని ప్రశ్నించారు. ద్రావిడం అంటే ఆర్యానికి వ్యతిరేక విధానమని, అలాంటప్పుడు ద్రావిడ పార్టీయైన అన్నాడీఎంకేకు ఆర్యులైన జయలలిత ఎలా నాయకురాలు అయ్యారని ప్రశ్నించారు. జయలలిత ఎదుట అందరూ వంగి మాట్లాడతారని, తన మామ కాళిముత్తు మాత్రం నిలబడి మాట్లాడేవారని తెలిపారు. ప్రవాస తమిళుల గురించి ఎలాంటి వివరాలు రాష్ట్ర ప్రభుత్వం వద్ద లేవన్నారు. భాజపా అధికారంలో లేని రాష్ట్రాల్లో 'సర్'ను ముమ్మరంగా అమలు చేస్తున్నారని, తన ఓటర్లకు తమిళనాడులో భాజపా ఆవాసం కల్పిస్తుందని ఆరోపించారు.

విజయ్‌కు ప్రజలపై అక్కరలేదు: నటుడు కరుణాస్

చెన్నై, న్యూస్‌టుడే: టీవీకే అధ్యక్షుడు విజయ్‌కు ప్రజలపై అక్కరలేదని ముక్కులత్తోర్ పులిపడై అధ్యక్షుడు, నటుడు కరుణాస్ ఆరోపించారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికలు సమీపించిన సమయంలో ఎన్నికల కమిషన్ చేపట్టిన 'సర్' చర్యలు పూర్తిగా తమిళనాడుకు, తమిళులకు వ్యతిరేకమని తెలిపారు. దొడ్డిదారిలో ఓటుహక్కును హరించడం ద్వారా మైనారిటీలను, ఇతరులను పౌరసత్వంలేనివారిగా చేయాలన్నదే 'సర్' వెనుక ఉద్దేశమని ఆరోపించారు. దీనికి ఎట్టిపరిస్థితుల్లోనూ చోటివ్వకూడదని తెలిపారు. ఈ వ్యవహారమై ముఖ్యమంత్రి నేతృత్వంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో టీవీకే అధ్యక్షుడు విజయ్ పాల్గొనకపోవడం, ఆ పార్టీ నుంచి ప్రతినిధులను పంపకపోవడం సబబుగా లేదని విమర్శించారు. ఇది ప్రజలపై ఆయనకు అక్కర లేదనే విషయాన్ని వెల్లడిస్తుందని తెలిపారు. భాజపా ఎలాంటి పథకాన్ని తీసుకొచ్చినా దానిని ఎడప్పాడి పళనిసామి ఆమోదిస్తారని విమర్శించారు.

వ్యాపారుల సాక్ష్యం నమోదు

కరూర్ ఘటనపై కొనసాగుతున్న సీబీఐ దర్యాప్తు

సాక్ష్యం చెప్పడానికి పర్యాటక భవనానికి చేరుకున్న వ్యాపారులు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కరూర్‌లో తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ ప్రచార సభలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో 41 మంది మృతి చెందిన ఘటనపై సీబీఐ అధికారులు మూడో రోజుగా ఆదివారం దర్యాప్తు చేపట్టారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న పర్యాటక భవనంలో 10మంది వ్యాపారులు సాక్ష్యం చెప్పడానికి హాజరయ్యారు. సుమారు రెండు గంటలపాటు సీబీఐ అధికారులు దర్యాప్తు చేశారు. ప్రచార సభకు విజయ్ రాకముందు ఎంతమంది ఉన్నారు? విజయ్ మాట్లాడక ముందు ఎంతమంది చేరారని వ్యాపారులను ప్రశ్నించారు. మరికొన్ని రోజులలో టీవీకే ప్రధానకార్యదర్శి బుస్సి ఆనంద్, ఉమ్మడి ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్, కరూర్ జిల్లా కార్యదర్శి మతియళగన్‌లకు పంపిన సమన్ల ఆధారంగా దర్యాప్తు చేపట్టనున్నట్టు సమాచారం.

నామక్కల్‌లోని ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్‌లో ఆహారాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కలుషితాహారం.. కనిపెట్టకుంటే కష్టం

☛ నామక్కల్ ఘటనతో ఉలిక్కిపడ్డ రాష్ట్రం ☛ రాష్ట్రవ్యాప్తంగా అధికారుల తనిఖీ

☛ క్షేత్రస్థాయిలో వెక్కిరిస్తున్న లోపాలు ☛ కేంద్ర ప్రభుత్వ నివేదికల్లోనూ స్పష్టం

విషాహారం ప్రజల ప్రాణాలను హరించేస్తోంది. రాష్ట్రంలో ప్రతీ మూలా కలుషిత ఆహారంతో ప్రమాదాలు జరుగుతున్నా.. అరికట్టేందుకు పూర్తి స్థాయి ప్రణాళికలు చేపట్టడంలేదు. మరోవైపు అత్యధిక ఆహార ఉల్లంఘనలు రాష్ట్రంలోనే బయటపడుతుండటం ఆందోళనకు గురిచేస్తోంది.

- ఈనాడు-చెన్నై

■ తాజాగా నామక్కల్‌లోని ఓ ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్‌లో కలుషిత ఆహారం, కలుషిత నీరు తీసుకున్న 128మంది విద్యార్థులు ఆసుపత్రిపాలయ్యారు. చాలామందిలో కడుపునొప్పి, ఇతరత్రా లక్షణాలు కనిపించాయి. వారు తాగిన నీటిలో ఇ. కొలి అనే బ్యాక్టీరియా ఉన్నట్లుగా గుర్తించారు. ఆహార పరిశుభ్రత పాటించడంలో యజమాన్యం విఫలమయినట్లుగా అధికారులు తేల్చారు.

■ గతనెలలో కళ్లకురిచ్చి జిల్లా తిరుక్కోయిలూర్‌లోని ఓ కాలేజీ క్యాంటీన్‌లో సాంబార్‌లో ఎలుక పడిన ఘటన కలకలం రేపింది. విద్యార్థుల నుంచి ఫిర్యాదులు రావడంలో అక్కడికెళ్లిన అధికారులు తనిఖీలు నిర్వహించి యజమాన్యానికి జరిమానా విధించారు.

■ కోయంబత్తూరులోని ఓ ఈ-కామర్స్ వేర్‌హౌస్‌లో గడువు ముసిగిన పదార్థాల్ని ఈ మధ్యే పెద్ద ఎత్తున పట్టుకున్నారు. ఇందులోభాగంగా ఏకంగా 248 కిలోల ఖర్జూర ఉత్పత్తుల్ని స్వాధీనం చేసుకున్నారు. ఇవన్నీ ఎఫ్ఎస్ఎస్ఈఐ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు తనిఖీల్లో తేలింది. ఇలాంటివి ఆన్‌లైన్ అమ్మకాలు చేపట్టడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు.

భారీగా ఉల్లంఘనలు.. తమిళనాడు రాష్ట్రంలో సేకరించిన ఆహార నమూనాల్లో దేశంలోనే అత్యధికంగా ఉల్లంఘనలు బయటపడ్డాయి. 2020-21 నుంచి 2024-25 మధ్య సేకరించిన నమూనాల్లో 19,622 ఉల్లంఘనలు జరిగినట్లు తేలింది. ఈ స్థాయిలో మరే రాష్ట్రంలోనూ బయటపడలేదు. రెండోస్థానంలో ఉన్న కేరళలో 6,246 కేసులే బయటపడ్డాయి. దీన్నిబట్టి తమిళనాడులో ఉల్లంఘనలు ఎంత తీవ్రంగా ఉన్నాయో స్పష్టత వస్తోంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రమాణాలకు లోబడి ఆహార ఉత్పత్తులుండాలి. కానీ రాష్ట్రంలో సేకరించిన నమూనాల్లో ఉల్లంఘనలు భారీగా బయటపడుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదలచేసిన నివేదిక చెబుతోంది.

ఎన్నో రకాల దారుణాలు

రాష్ట్రంలో సేకరించిన నమూనాల్లో చాలావరకు లోపాలు బయటపడ్డాయి. వీటిలో పలురకాల కలుషితాలు, పురుగుమందు అవశేషాలు, సూక్ష్మజీవుల ఆనవాళ్లు లాంటివి ఎక్కువగా కనిపించాయి. దీంతో పాటు ఆహార ఉత్పత్తుల మీద తప్పుడు సమాచారంతో లేబుల్‌లను తయారుచేస్తున్నట్లుగా గుర్తించారు. మార్కెట్లు, రెస్టరెంట్లు, ఉత్పత్తుల తయారీ కేంద్రాలు, వసతిగృహాలు తదితరచోట్ల నమూనాల్ని సేకరించారు. కొన్ని కేసుల్లో జరిమానాలు వేయగా, కొన్ని కేసుల్లో లైసెన్సులు రద్దుచేయడం, సస్పెండ్ చేయడం, నేరారోపణ మోపడం లాంటివి చేస్తున్నారు.

ఐదేళ్లలో 11,692 కేసులు.. జరిమానాలు..

పరీక్షల నిర్వాహణలో దేశంలోనే రాష్ట్రం ముందుంది. 2024-25లో ఏకంగా 18,071 నమూనాల్ని సేకరించి ల్యాబ్‌లకు పంపారు. లోపాలున్న ఆహార నమూనాల శాతం తగ్గుతూ వస్తున్నట్లుగా కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. 2022-23ల 32.8శాతం నమూనాల్లో లోపాలున్నట్లుగా గుర్తించగా, 2024-25లో అదికాస్తా 12.4శాతానికి చేరింది. గత ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 11,692 కేసుల్లో జరిమానాలు రాబట్టారు. కేసులెక్కువ గుర్తిస్తున్నా.. క్షేత్రస్థాయిలో లోపాలు సైతం అదే స్థాయిలో బయటపడుతుండటం ఆందోళనకు గురిచేస్తోంది.

సవాళ్లు చాలానే.. కలుషిత ఆహార ఉత్పత్తుల మీద నిఘా కొరవడిందనే చెప్పాలి. పట్టుకున్న కేసుల్లో చాలావాటికి జరిమానాలు వేసి వదిలేస్తున్నారు తప్పితే కఠిన శిక్షలు అమలుచేయడంలేదని సామాజిక కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఆహార తనిఖీల విభాగాల్లో సిబ్బంది కొరత, క్షేత్రస్థాయిపై పూర్తి స్థాయి పట్టులేకపోవడం, అవినీతి తదితరాలు వేధిస్తున్నాయి. వీటిపై లోతైన అధ్యయనం చేసి సరైన పరిష్కారమార్గాలు చూపాలని డిమాండ్ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సేకరించిన నమూనాల్లో 90.8శాతం కేసులు శిక్షలకు గురిచేసేవిగా తేలాయి. కానీ తమిళనాడులో ఈ తరహా ప్రభావం లేకపోవడం ఆరోపణలకు దారితీస్తోంది.

(c) eenadu

మారథాన్‌లో పాల్గొన్న వైమానిక దళ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు

వైమానిక దళ స్టేషన్లలో మారథాన్ పోటీలు

వడపళని, న్యూస్‌టుడే: తాంబరం, ఆవడిలోని భారత వైమానిక దళ స్టేషన్లలో ఆదివారం ఉదయం 'నెహ్రూ ఇండియా ఎయిర్‌ఫోర్స్ మారథాన్' జరిగింది. భారత వైమానిక దళం 93వ వార్షిక వేడుకల్లో భాగంగా నిర్వహించినట్లు పీఐబీ ఓ ప్రకటనలో పేర్కొంది. 'ఎస్ సోర్ ఇన్‌స్పైర్' పేరిట 21 కి.మీ, 10, 5 కి.మీ వరకు మారథాన్ జరిగింది. తాంబరం ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్ ఎయిర్ కమోడోర్ తపన్ శర్మ ప్రారంభించారు. 787 మంది వైమానిక దళ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, పారామిలిటరీ దళాలు, స్థానికులు ఆసక్తిగా పాల్గొన్నారు. ఆవడిలో ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్ ఎయిర్ కమోడోర్ ప్రదీప్ శర్మ మారథాన్‌కు జెండా ఊపారు. విజేతలను శర్మ, ఎయిర్‌ఫోర్స్ ఫ్యామిలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు, గ్రూప్ కెప్టెన్ రచనా శర్మ (రిటైర్డ్) సత్కరించారు. తంజావూరు, సూలూరు ఎయిర్‌ఫోర్స్ స్టేషన్లలో కూడా మారథాన్ జరిగింది.

మీ భవనం భద్రమేనా?

- చెన్నైలో భూగర్భ జలాల కోసం తవ్వకాలు
- దెబ్బతింటున్న భవంతులు
- 'ఎన్ఎస్‌జే' అధ్యయనాల్లో వెల్లడి

బహుళ అంతస్తుల భవనాలు

- న్యూస్‌టుడే, వడపళని

చెన్నై నగరంలో భూగర్భ జలాల కోసం అధికంగా తవ్వడం వల్ల లక్ష భవనాల వరకు దెబ్బతిన్నాయి. నగరంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో ఎక్కువ మంది నివాసాలు ఏర్పరుచుకున్నారు. ఆ భవనాలు ముప్పులో ఉన్నాయి. భూగర్భ జలాలను అధికంగా తీసుకోవడం, నేల స్వభావం కారణంగా భూమి కుంగిపోవడం వల్ల భవనాలు దెబ్బతినే ప్రమాదం ఉందని 'నేచర్ సస్టైనబులిటీ జర్నల్(ఎన్ఎస్‌జే)' తాజాగా ప్రచురించిన కొత్త అధ్యయనం మేరకు పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. చెన్నైలోని వలసరవాక్కం, కోడంబాక్కం, ఆలందూరు, తండియార్‌పేట, అడయార్ నది, కోర్ సిటీ ప్రాంతాలు వేగంగా వరదలతో ముంచెత్తుతున్నట్టు అధ్యయనంలో గమనించారు. ఒండ్రు నిక్షేపాల సంపీడనం వల్ల జరిగినట్టు పేర్కొన్నప్పటికీ, అడయార్ నది ప్రాంతాన్ని ఇసుకబంకమట్టి, సిల్ట్, ఇసుకతో వర్గీకరించింది. భూగర్భ జలాల వెలికితీత కారణంగా కేకే నగర్, తండియార్‌పేటలో భూగర్భ మట్టాలు తగ్గుతున్నాయని పేర్కొంది.

ఐదు మెట్రో నగరాల్లో..

2015-2023 మధ్య కాలంలో చెన్నై, న్యూఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, బెంగళూరు లాంటి ఐదు మెట్రో నగరాల్లో భవన నష్టాలు, భూమిలో క్షీణత మధ్య ఉన్న సంబంధాన్ని ఉపగ్రహ రాడార్ పరిశీలనల ద్వారా పరిశోధకులు అధ్యయనం చేశారు. ఈ నగరాల్లో 1.3 కోట్లకు పైగా భవనాలున్నాయి. ఇందులో ఎనిమిది కోట్లకు పైగా జనాభా ఉన్నారు. నగరాల్లో 878 చదరపు కిలోమీటర్ల భూమి కుంగిపోతుందని, 1.9 కోట్ల భవనాలు సంవత్సరానికి 4 మి.మీ కంటే ఎక్కువ కుంగిపోతున్నాయని అధ్యయనం వెల్లడించింది. అన్ని నగరాల్లో విస్తృతంగా కుంగుతున్నట్టు గ్రహించింది. గరిష్ఠంగా ఏడాదికి 51 మి.మీ, 31.7, 26.1, 16.4 మి.మీ ఢిల్లీ, చెన్నై, ముంబయి, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో వరుసగా గరిష్ఠంగా 6.7 మి.మీ చొప్పున కుంగిపోతున్నాయి. ఈ ఐదు నగరాలతో పోలిస్తే చెన్నై నగరం రెండో అత్యంత వేగంగా కుంగిపోతున్న నగరంగా గుర్తించారు. అంతేకాకుండా ఢిల్లీలో 2,264, ముంబయి 110, చెన్నైలో 32 భవనాలు ప్రమాదకరంగా ఉన్నట్టు పేర్కొంది. భవిష్యత్తులో ఢిల్లీలో 3,169, చెన్నైలో 958, ముంబయిలో 262 భవనాలు నష్టాన్ని కలిగించే ప్రమాదం ఉన్నట్టు వర్గీకరించారు. చెన్నైలో మాత్రం 97,946 భవనాలు సుదూర భవిష్యత్తులో (50 సంవత్సరాలు) అధిక నష్టానికి గురికాగలవని అధ్యయనం పేర్కొంది.

జీవన్మృతుడి అవయవాల దానం

ప్యారిస్, న్యూస్‌టుడే: తేనికి చెందిన ఈశ్వరన్(55) రైతు. ఈయన గత నెల 29న రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను కుటుంబ సభ్యులు మదురై ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ జీవన్మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన అవయవాలను దానం చేయడానికి కుటుంబీకులు ముందుకొచ్చారు. ఆ మేరకు వైద్యులు గుండె, ఊపిరితిత్తులను తొలగించి చెన్నైలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి ప్రత్యేక విమానంలో తరలించారు. తిరుచ్చిలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి కాలేయం, కిడ్నీలు, ఐరిస్‌ను తరలించారు.

ఓటర్లను తొలగించడానికే 'ఎస్ఐఆర్'

- ఎంపీ జ్యోతిమణి

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఓటర్లను తొలగించాలన్న ఉద్దేశంతోనే 'ఎస్ఐఆర్' నిర్వహిస్తున్నట్టు కరూర్ ఎంపీ జ్యోతిమణి ఆరోపించారు. కరూర్‌లో ఆదివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితాలో ప్రత్యేక సవరణ)ను ఇండియా కూటమి వ్యతిరేకిస్తోందన్నారు. ఇంతకు ముందు ఓటర్ల జాబితా సవరణ అంటే జాబితాను అప్డేట్ చేసేవారని, కానీ, ప్రస్తుత విధానాన్ని అర్థం చేసుకోలేకపోతున్నట్టు చెప్పారు. బిహార్‌లో ఎస్ఐఆర్ ద్వారా 65లక్షల ఓట్లు తొలగించినట్టు కేసు దాఖలు చేశారని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ భాజపా కీలుబొమ్మగా వ్యవహరిస్తోందని, విశ్వసనీయతను విచ్ఛిన్నం చేస్తోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. తమిళనాడు సహా 12 రాష్ట్రాలలో ఓటర్లను తొలగించే చర్యలను ఇండియా కూటమి తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు.

రూ.కోటి విలువైన మత్తుపదార్థాలు ధ్వంసం

గంజాయిని మంటల్లో వేస్తున్న విజయేంద్ర బిడారి

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెన్నై నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పరిధుల్లో నమోదైన 197 కేసుల్లో స్వాధీనం చేసుకున్న సుమారు రూ.కోటి విలువైన గంజాయి, మత్తుపదార్థాలను ధ్వంసం చేసే కార్యక్రమం శనివారం రాత్రి నిర్వహించారు. ఔషధ వ్యర్థాలను ధ్వంసం చేసే ప్రైవేటు కేంద్రంలో చెన్నై పోలీస్ హెడ్ క్వార్టర్స్ అదనపు కమిషనర్ విజయేంద్ర బిడారి 1,022 కిలోల గంజాయి, మత్తు పదార్థాలను మంటల్లో వేసి ధ్వంసం చేశారు.

6 నుంచి కోవైలో 'సీఐటీయూ' రాష్ట్ర సమావేశాలు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: సీఐటీయూ 16వ రాష్ట్ర సమావేశాలు కోయంబత్తూరులోని నవ ఇండియా ప్రాంతంలోని ఎస్ఎన్ఆర్ కలై అరంగంలో ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు జరుగనున్నాయి. ఇందుకు సంబంధించి కోయంబత్తూరు ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రన్, రిసెప్షన్ కమిటీ అధ్యక్షుడు పద్మనాభన్, కోయంబత్తూరు జిల్లా అధ్యక్షుడు మనోహరన్, జిల్లా కోశాధికారి వేలుసామి పాల్గొన్నారు. సమావేశాల్లో భాగంగా అమరవీరుల జ్యోతి వెలిగించడం, వారికి నివాళి అర్పించడం తదితర కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఐదో రోజు చారిత్రక ప్రదర్శనను సీఐటీయూ అఖిల భారత అధ్యక్షుడు, మాజీ ఎంపీ తపంసన్, కార్యనిర్వాహకురాలు హేమలత ప్రారంభిస్తారని చెప్పారు. బహిరంగ సభ ప్రారంభమయ్యే ముందు ఎర్ర చొక్కాల ర్యాలీ కూడా జరుగుతుందని పేర్కొన్నారు

బాలింతతో మాట్లాడుతున్న మంత్రి సుబ్రమణియన్

ప్రభుత్వ ఆస్పత్రిలో మంత్రి తనిఖీ

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నామక్కల్ జిల్లాలో పలు కార్యక్రమాలలో పాల్గొనడానికి ఆరోగ్యశాఖ మంత్రి మా సుబ్రమణియన్ ఆదివారం నామక్కల్ చేరుకున్నారు. కొల్లిమలై నుంచి కారవల్లి వరకు సుమారు 25 కి.మీ దూరం నడిచారు. అనంతరం ఆయన సేందమంగళం ప్రభుత్వ ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. అనంతరం నామక్కల్ నగరపాలక సంస్థలోని పాత ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.కోటి వ్యయంతో నిర్మించిన సిద్ధ వైద్య ఆస్పత్రిని ప్రారంభించారు. పుదుచత్తిరం, పరమత్తివేలూర్, తిరుచెంగోడు బ్లాక్‌లలో రూ.2.28 కోట్లతో నిర్మించిన 3 కొత్త ప్రజారోగ్య సముదాయాలు, 2 ఉప ఆరోగ్య కేంద్రాలు, మానసిక దివ్యాంగుల అత్యవసర చికిత్స, పునరుద్ధరణ కేంద్రాన్ని కూడా ప్రారంభించారు.

జాలర్లపై శ్రీలంక నావికా దళం దాష్టీకం

ప్యారిస్, న్యూస్‌టుడే: నడి సముద్రంలో చేపలు పడుతున్న రాష్ట్ర జాలర్లను శ్రీలంక నావికా దళం తుపాకీతో బెదిరించి తరిమికొట్టింది. రామేశ్వరం నుంచి శనివారం 500కు పైగా పడవల్లో 2,500 మందికి పైగా జాలర్లు మత్స్యశాఖ అధికారుల అనుమతితో సముద్రానికి చేపల వేటకు వెళ్లారు. ఆదివారం తెల్లవారు జామున కచ్చతీవు వద్ద చేపలు పడుతున్న వారిని శ్రీలంక నావికా దళం తుపాకీతో బెదిరించి తరిమికొట్టింది. మత్స్యకారులు వెనుదిరిగినా రాళ్లు రువ్వింది. వలలను ధ్వంసం చేసి సముద్రంలో విసిరేసింది.

శిల్ప కళాశాల అభివృద్ధికి నిధుల కేటాయింపు

శిక్షణ పొందుతున్న విద్యార్థులు

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలో కళలు, సాంస్కృతికశాఖ తరఫున శిల్ప కళాశాలను 1957లో స్థాపించారు. 1970లో స్థాయి పెంచారు. ఇక్కడ సిమెంట్, రాయి, చెక్క, లోహాలతో విగ్రహాలను తయారు చేసే డిప్లొమా కోర్సులను నిర్వహిస్తున్నారు. నాలుగేళ్ల కోర్సుల్లో 12వ తరగతి చదివిన విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నారు. దక్షిణ ఆసియాలో ఏకైక ప్రభుత్వ శిల్ప కళాశాల ఇదే కావడం గమనార్హం. ఇక్కడ సుమారు 30ఏళ్ల క్రితం నిర్మించిన తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అదే సమయంలో మహాబలిపురం వాసులు కళాశాలలో వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఆ మేరకు రెండు నెలల క్రితం తమిళాభివృద్ధి శాఖ మంత్రి సామినాథన్ అధికారులతో కలిసి కళాశాలలో తనిఖీలు చేపట్టి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మౌలిక వసతులు కల్పించడానికి ప్రణాళిక అందజేయాలని ప్రజాపనుల శాఖ అధికారులను ఆదేశించారు. అధికారులు సమర్పించిన ప్రణాళిక మేరకు కళాశాల అభివృద్ధికి రూ.11 కోట్ల నిధులు కేటాయించడంతో పనులు చేపట్టడానికి టెండర్లను ఆహ్వానించామని, టెండర్ల ప్రక్రియ ముగియగానే పనులను ప్రారంభించి నిర్ణీత సమయంలోగా ముగిస్తామని అధికారులు తెలిపారు.

అన్నాడీఎంకే ఓటమి తథ్యం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వీరపాండియన్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: అన్నాడీఎంకేలో చీలికలు ఏర్పడినా, ఏర్పడకున్నా రానున్న శాసనసభ ఎన్నికలలో ఓడిపోవడం ఖాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వీరపాండియన్ జోస్యం చెప్పారు. సీపీఐ ఈరోడ్ జిల్లా కమిటీ సమావేశం ఆదివారం సత్యమంగళంలో జరిగింది. సమావేశానికి వీరపాండియన్ అధ్యక్షత వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రానున్న శాసనసభ ఎన్నికలలో డీఎంకే ఘనవిజయం సాధిస్తుందని అభిప్రాయపడ్డారు. అన్నాడీఎంకే భాజపాతో కలిసినందున ఓటమి తప్పదన్నారు. ఎన్నికలలో అదనపు సీట్లను కోరడం కూటమి ధర్మానికి వ్యతిరేకం కాదన్నారు. టీవీకే అధ్యక్షుడు విజయ్‌ను తాము గౌరవిస్తున్నట్టు చెప్పారు. ఓటర్ల జాబితాలో ప్రత్యేక సవరణలను తాము వ్యతిరేకించలేదన్నారు. డీఎంకే కూటమి బలంగా ఉందన్నారు.

భారీగా పెరిగిన పువ్వుల ధరలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కోయంబేడు మార్కెట్‌లో అన్ని రకాల పువ్వుల ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఆదివారం సమాధుల రోజు, సోమవారం ముహూర్తపు రోజు కావడంతో అన్ని పువ్వుల ధరలు పెరిగాయని, వ్యాపారం కూడా ఊపందుకున్నట్టు రైతులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కిలో మల్లెపువ్వులు రూ.900 నుంచి రూ.1,200, ఐస్‌మల్లి రూ.600 నుంచి రూ.800 పలుకుతున్నాయి. అదేవిధంగా ముల్లై రూ.300 నుంచి రూ.400, కనకాంబరం రూ.300 నుంచి రూ.2,000కు పెరిగాయి.

అభివృద్ధి పనుల పరిశీలన

మహాత్మాగాంధీ నగర్‌లో రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి పి.కె.శేఖర్‌బాబు

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై తిరు.వి.క నగర్ జోన్, 65వ డివిజన్‌లోని శివశక్తి నగర్, మహాత్మాగాంధీ నగర్, కన్నగి నగర్, వినోబా నగర్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు నిర్మాణం, తాగునీటి వసతి, వాననీటి కాలువలు, డ్రైనేజీ కాలువల నిర్మాణం, వీధి దీపాలు అదనంగా ఏర్పాటు చేయడం తదితర పనులను శనివారం రాత్రి మంత్రి పి.కె.శేఖర్‌బాబు పరిశీలించారు. వెంట జీసీసీ కమిషనరు కుమరగురుభరన్, మధ్య ప్రాంతీయ డిప్యూటీ కమిషనరు కౌశిక్, జోన్ కమిటీ ఛైర్మన్ సరితా మహేశ్‌కుమార్, చెన్నై తాగునీటి చీఫ్ ఇంజినీరు రాధాకృష్ణన్, విద్యుత్తు బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు (ఉత్తర) పళనివేలన్, జీసీసీ కౌన్సిలరు నాగరాజన్ తదితరులు ఉన్నారు.

'పీయూ' ఉపకులపతికి జీవిత సాఫల్య పురస్కారం

పురస్కారం అందుకుంటున్న వీసీ ప్రకాశ్‌బాబు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పాండిచ్చేరి విశ్వవిద్యాలయం ఉపకులపతి పి.ప్రకాశ్‌బాబుకు జీవిత సాఫల్య పురస్కారం దక్కింది. వర్సిటీలోని బయోఇన్ఫర్మేటిక్స్ విభాగం, డ్రగ్ డిస్కవరీ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం కార్యశాల జరిగింది. ఇందులో న్యూరోసైన్స్, డ్రగ్ డిస్కవరీ రంగంలో విద్య, శాస్త్రీయ నాయకత్వం, పరిశోధనలలో ఆయన చేసిన అత్యుత్తమ కృషికి గుర్తింపుగా బయోఇన్ఫర్మేటిక్స్ అండ్ డ్రగ్ డిస్కవరీ సొసైటీ (బీఐడీడీఎస్) పురస్కారంతో గౌరవించింది. కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ చికిత్సలపై బయోఇన్ఫర్మేటిక్స్ విభాగం ప్రొఫెసర్ దినకరరావు, డాక్టర్ వి.అముద సంకలనం చేసిన పుస్తకాన్ని విడుదల చేశారు.

● 'హల్దర్ నాగ్' గ్రంథావళి ఆవిష్కరణ

వర్సిటీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో డా.సి.జయశంకర్‌బాబు సంపాదకత్వంలో వెలువడిన 'హల్దర్ నాగ్ గ్రంథావళి'ని ఉపకులపతి ప్రకాశ్‌బాబు ఆవిష్కరించారు. 900 పుటల సమగ్ర గ్రంథావళి ఒడిశా రాష్ట్రానికి చెందిన కవి పద్మశ్రీ గ్రహీత హల్దర్ నాగ్ సంబల్పురి- కోసలి భాషలో రాశారు. ప్రతి పాఠ్యాన్ని జాగ్రత్తగా సవరించి, భాషా, సాహిత్య, సాంస్కృతిక వ్యాఖ్యానాలతో సమృద్ధిగా అందించారు సంపాదకుడు డా.సి.జయశంకర్‌బాబు.

జనావాసాల్లో ఏనుగు సంచారం

ఏనుగును చూసి మొరుగుతున్న శునకాలు

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోయంబత్తూరు జిల్లా పన్నిమడైలో సురేశ్ అనే వ్యక్తి ఇంట్లోకి శనివారం రాత్రి ఓ అడవి ఏనుగు ప్రవేశించింది. వీధి శునకాలు దానిని చూసి మొరిగాయి. ఆగ్రహించిన ఏనుగు వాటిపై దాడికి యత్నించింది. తర్వాత అక్కడి గోశాలలోకి ప్రవేశించి పశువుల కోసం ఉంచిన మేత తినేసింది. ఆ దృశ్యాలు ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల్లో నమోదై ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఏనుగు అరటి తోటలలో చొరబడి ధ్వంసం చేస్తోందని, పశువులకు ఉంచే మేతను తింటోందని, అటవీశాఖ వారు దానిని బంధించి దూరంగా విడిచిపెట్టాలని రైతులు కోరుతున్నారు.

పోలీసుపై యువకులు దాడి చేశారంటూ వదంతులు

కొట్టిపారేసిన ఉన్నతాధికారులు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విళుపురం జిల్లా కాణై ప్రభుత్వ పాఠశాల సమీపంలో కొందరు యువకులు గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు కానిస్టేబుల్ రాజేంద్రన్ మఫ్టీలో ఆదివారం ఆ ప్రాంతానికి వెళ్లారు. అప్పుడు అక్కడున్న కొంతమంది యువకులు, కానిస్టేబుల్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ దృశ్యాలను అక్కడున్న వారు సెల్‌ఫోన్లలో వీడియో తీసి గంజాయి మత్తులో యువకులు కానిస్టేబుల్‌పై దాడి చేస్తున్నారని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. వీడియో వైరల్ కావడంతో పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. యువకులు గంజాయి మత్తులో కానిస్టేబుల్‌పై దాడి చేయలేదని, మఫ్టీలో పోలీసు అక్కడికి వెళ్లినందుకే వారి మధ్య వాగ్వాదం జరిగిందని, ఆ యువకులను క్షమించి వదిలేశామని వివరణ ఇచ్చారు.

గున్న ఏనుగు కళేబరం లభ్యం

కళేబరం వద్ద అటవీశాఖ సిబ్బంది

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు జిల్లా పేర్నాంపట్టు సమీపం అరపట్ల కొండపైన పేరంపట్టు ప్రాంతంలో అటవీశాఖ సిబ్బంది శనివారం గస్తీలో ఉండగా ఓ గున్న ఏనుగు కళేబరాన్ని గుర్తించారు. సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు, వెటర్నరీ వైద్యుడు అక్కడకు చేరుకొని కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. అది ఏడేళ్ల వయసున్న ఆడ ఏనుగుగా గుర్తించారు. కొండపై నడుస్తూ ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడటంతో గాయపడి మరణించి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

విక్రవాండి రైల్వే స్టేషన్‌లో నిలిచిన రైళ్లు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విళుపురం జిల్లా విక్రవాండి రైల్వే స్టేషన్ సమీపం ముండియంబాక్కం ప్రాంతంలో శనివారం మధ్యాహ్నం 3.45 గంటల నుంచి రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో హైవోల్టేజీ విద్యుత్తు సరఫరాను నిలిపేశారు. ఈ క్రమంలో చెన్నై నుంచి మదురైకు బయలుదేరిన వైగై సూపర్ ఫాస్ట్ రైలు 3.45 గంటలకు విక్రవాండి రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. విద్యుత్తు సరఫరా లేకపోవడంతో ఆ స్టేషన్‌లోనే ఆగిపోయింది. దీంతో అందులోని ప్రయాణికులు అవస్థ పడ్డారు. సాయంత్రం 4.30 గంటలకు సరఫరా పునరుద్ధరించడంతో చెన్నై నుంచి తిరునెల్వేలి వైపు వెళుతున్న వందేభారత్ రైలుకు మొదటిగా సిగ్నల్ ఇచ్చారు. దాని తర్వాత వైగై ఎక్స్‌ప్రెస్ రైలు బయల్దేరింది.

సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురండి

ప్రసంగిస్తున్న మంత్రి రాజేంద్రన్

టీనగర్, న్యూస్‌టుడే: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర మంత్రి రాజేంద్రన్ సేలం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పార్టీ శ్రేణులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. వాటిని పరిష్కరించడంతో పాటు ఎన్నికల్లో వారు చేపట్టాల్సిన పనులపై సూచనలు చేస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఓమలూరు తూర్పు పంచాయతీ యూనియన్ పరిధిలోని కోటమేట్టుపట్టిలో పర్యటించారు. పార్టీ ముఖ్య నాయకులు, స్థానికులను కలిసి మాట్లాడారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి వాటిపై సత్వర చర్యలు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. అదేవిధంగా ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించడంలో దృష్టి సారించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

లింక్ కాలువలో నీటి ప్రవాహం

పూండి చెరువు నీటి విడుదల

ఊత్తుకోట, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెన్నై నగర తాగునీటి అవసరాలు తీరుస్తున్న పూండి చెరువు పూర్తిగా నిండింది. దీంతో అక్టోబరు 14న అదనపు నీటిని దిగువకు కుశస్థలి నదిలోకి వదిలారు. దీంతో పూండి చెరువు నుంచి పుళల్, చెంబరంబాక్కం చెరువులకు నీటి విడుదలను నిలిపేశారు. ప్రస్తుతం వర్షాలు పూర్తిగా తగ్గడంతో పూండి చెరువుకు నీటి రాక తగ్గింది. ఈ క్రమంలో పుళల్, చోళవరం చెరువులకు లింక్ కాలువ ద్వారా ఆదివారం నీటిని వదిలారు. పుళల్‌కు 200 క్యూసెక్‌లు, చెంబరంబాక్కానికి 400 క్యూసెక్‌ల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. పూండి చెరువు ఎత్తు 35 అడుగులుకాగా ఆదివారం ఉదయం 33.50 అడుగుల నీటిమట్టం నమోదైంది. 2.671 టీఎంసీల నీరుంది.

రోడ్లపై సంచరిస్తున్న పశువులు గోశాలకు తరలింపు

పశువులను లారీలో ఎక్కిస్తున్న దృశ్యం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా రెడ్‌హిల్స్ సమీపం ఎరుమైవెట్టిపాళ్యంలో రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. గ్రామానికి చెందిన కొందరు రైతులు ఆవులను కట్టేయకుండా వదిలేస్తుండటంతో పంట పొలాలను నాశనం చేస్తున్నాయి. అదేవిధంగా రోడ్లపై సంచరిస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించి అధికారులు సదరు రైతులను హెచ్చరించినా వారు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో రోడ్లపై సంచరిస్తున్న 24 పశువులను ఆదివారం పట్టుకొని వాయలూరులోని గోశాలకు తరలించారు.

స్నానం సరదా.. తెచ్చును ఆపద

చెక్‌డ్యామ్ వద్ద స్నానం చేస్తున్న యువకులు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో తిరువళ్లూరు జిల్లాలో ఇటీవల భారీ వర్షాలు కురిశాయి. చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు పూర్తిగా నిండాయి. తిరువళ్లూరు సమీపం పింజివాక్కంలో కుశస్థలి నదిపై ఉన్న చెక్‌డ్యామ్ పొంగిపొర్లుతోంది. యువకులు కొందరు చెక్‌డ్యామ్ నుంచి వెలువడుతున్న వరద నీటిలో ప్రమాదకరంగా స్నానం చేస్తున్నారు. 2023లో ఇలా స్నానం చేస్తూ ముగ్గురు యువకులు ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా స్నానానికి నిషేధం విధిస్తూ పోలీసులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పాలక్కోడులో కొత్త ట్రాక్ నిర్మాణ పనులు ముమ్మరం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ధర్మపురి-బెంగళూరు రైలు మార్గంలో కొత్తగా మార్చిన ట్రాక్ సమాంతరం చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నైరుతి రైల్వేలోని సేలం-ధర్మపురి-బెంగళూరు మార్గంలో కొత్త ట్రాక్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ధర్మపురి జిల్లాలోని పాలక్కోడు, ధర్మపురి మధ్య కొత్త ట్రాక్ వేశారు. వీటిని బ్యాలెన్సింగ్ యంత్రం ద్వారా లెవల్ చేసే పనులు శనివారం ప్రారంభమయ్యాయి. పనులు ఈ నెల 5వ తేదీ వరకు రైళ్లు నడవని సమయాల్లో జరుపుతామని రైల్వే అధికారులు తెలిపారు.

శబరిమల యాత్రికులకు వీక్లీ ప్రత్యేక రైళ్లు

వడపళని, న్యూస్‌టుడే: శబరిమల యాత్రికుల సౌకర్యార్థం వీక్లీ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ రైల్వే ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ● **06111** చెన్నై ఎగ్మూరులో నవంబరు 14 నుంచి జనవరి 16వ తేదీ వరకు (శుక్రవారం) 23.55కు బయలుదేరి మరుసటి రోజు 16.30కి కొల్లం చేరుతుంది. ● **06112** కొల్లంలో నవంబరు 15 నుంచి జనవరి 17 వరకు (శనివారం) 19.35కి బయలుదేరి మరుసటి రోజు 12.00కు చెన్నై ఎగ్మూరు చేరుకుంటుంది. ● **06113** చెన్నై సెంట్రల్‌లో నవంబరు 16 నుంచి జనవరి 18వ తేదీ వరకు (ఆదివారం) 23.50కి బయలుదేరి మరుసటి రోజు 16.30కి కొల్లం వెళ్తుంది. ● **06114** కొల్లంలో నవంబరు 17 నుంచి జనవరి 19 వరకు (సోమవారం) 18.30కి బయలుదేరి మరుసటి రోజు 11.30కి చెన్నై సెంట్రల్ వస్తుంది.

తిరుత్తణి ఆలయానికి పోటెత్తిన భక్తులు

అలంకరణలో శ్రీ వల్లీ దేవసేన సమేత స్వామివారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు

తిరుత్తణి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని ప్రసిద్ధ మురుగన్ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉచిత, ప్రత్యేక దర్శనాల క్యూలలో రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా ఉదయం మూలమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించారు. కొండ దిగువన ఉన్న శరవణ పొయిగై కోనేరులో పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు. . మెట్ల మార్గం, కొండ దారిలో కొండపైన ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం పెళ్లిళ్లు కూడా అధికంగానే జరిగాయి.

4, 5 తేదీల్లో అన్నాభిషేక ఉత్సవాలు

కాంచీపురం, న్యూస్‌టుడే: ఐప్పసి మాసం పౌర్ణమి రోజున శివాలయాల్లో స్వామివారికి అన్నాభిషేకాలను నిర్వహించనున్నారు. ఆ మేరకు 4, 5 తేదీల్లో సాయంత్రం కాంచీపురం నగరంలోని ప్రముఖ కచ్ఛపేశ్వర ఆలయం, కామరాజర్ వీధిలో ఉన్న సిద్ధీశ్వరుడు, పిళ్లయార్‌పాళ్యం వీధిలోని తెన్‌కోడి రుద్ర కోటీశ్వరుడి ఆలయం, సర్వతీర్థ కొలను ప్రాంతంలో ఉన్న హనుమంతీశ్వరాలయాల్లో అన్నాభిషేక మహోత్సవాలను నిర్వహించనున్నారు.

కర్పగ వినాయక ఆలయంలో కుంభాభిషేకానికి ఏర్పాట్లు

యాగ పూజ నిర్వహిస్తున్న రుత్వికులు

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై పట్టణంలోని తిరువూడల్ వీధిలో ఉన్న కర్పగ వినాయక ఆలయ మహా కుంభాభిషేకం సోమవారం ఉదయం జరుగనుంది. ఈ సందర్భంగా ఆలయం వద్ద యాగశాల ఏర్పాటు చేసి అనుజ్ఞ, గణపతి హోమం, మహాలక్ష్మి యాగం, నవగ్రహ హోమం, పూర్ణాహుతి, దీపారాధనలు నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు కుంభాభిషేక క్రతువు జరుగుతుంది.

(c) eenadu

కుంకీ-2 ఫస్ట్ సింగిల్ విడుదల

పాటలోని ఓ సన్నివేశం

చెన్నై, న్యూస్‌టుడే: ప్రభు సాలమన్ దర్శకత్వంలో వర్ధమాన నటుడు మతి కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'కుంకీ-2'. ఇది 13ఏళ్ల కిందట విడుదలైన 'కుంకీ'కి రెండో భాగం. ఇందులో ఆండ్రూస్, అర్జున్ దాస్, ఆకాశ్, హరీశ్, శ్రీనాథ్ తదితరులు ఇతర ముఖ్యపాత్రల్లో నటించారు. చిత్రంలోని ఫస్ట్ సింగిల్ 'పొత్తి పొత్తి ఉన్న వచ్చు' పాటను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పాటను గేయరచయిత మోహన్‌రాజ్ రాయగా నివాస్ కె.ప్రసన్న సంగీతం అందించారు. ఈ పాట హీరో, ఏనుగుకు మధ్య ఉన్న అనుబంధాన్ని వర్ణించేలా రూపొందింది.

ఆరోమలేకు యు/ఏ ధ్రువపత్రం

చెన్నై: కిషన్ దాస్, హర్షత్ ఖాన్ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం 'ఆరోమలే'. మినీ స్టూడియోస్ పతాకంపై ఈ చిత్రాన్ని దర్శకుడు సారంగ్ త్యాగు రూపొందించగా సిద్ధు కుమార్ సంగీతం అందించారు. ఈ నెల 7న చిత్రం విడుదలకానున్న నేపథ్యంలో చిత్రానికి యు/ఏ ధ్రువపత్రాన్ని సెన్సార్ బోర్డు అందించింది. విడుదల తేదీ దగ్గరపడటంతో ప్రమోషన్ పనుల్లో చిత్రబృందం తలమునకలైంది.

ప్రతిభావంతులకు ఇళయరాజా ఆహ్వానం

చెన్నై: తన కుమార్తె భవతారిణి పేరిట బాలికల ఆర్కెస్ట్రాను ఏర్పాటు చేయనున్నట్లు ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా గతంలో వెల్లడించారు. ఇందులో 15ఏళ్లలోపు చిన్నారులు ఉంటారని తెలిపారు. ఆ మేరకు ప్రస్తుతం భవత గర్ల్స్ ఆర్కెస్ట్రాను ప్రారంభించారు. ఆసక్తి కలిగిన గాయనీలు, సంగీత కళాకారులు ఈ బృందంలో చోటు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి, ప్రతిభ కలిగినవారు స్వీయ వివరాలు, ఫోన్ నెంబరు తదితర వివరాలను allgirlsorchestra@gmail.com అనే ఈ-మెయిల్ చిరునామాకు పంపాలని కోరారు. ఇందుకు సంబంధించిన ఆయన సామాజిక మాధ్యమాల్లో ఓ పోస్టరును విడుదల చేశారు. భవతారిణి గత ఏడాది జనవరి 24న క్యాన్సర్‌తో మరణించారు.



ఇళయరాజా విడుదల చేసిన పోస్టరు

రాళ్ల క్వారీ నిర్వహణలో రూ.కోట్లలో అవినీతి

● ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఉద్రిక్తత

టీనగర్, న్యూస్‌టుడే: తిరునెల్వేలిలోని 6 రాళ్ల క్వారీల్లో రూ.కోట్లలో అవినీతి జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో దానిపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. తిరునెల్వేలిలో 'అరప్పోర్ ఇయక్కం' అనే స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాళ్ల క్వారీల వల్ల ప్రజలు ఏవిధంగా నష్టపోతున్నారో డాక్యుమెంట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇందులో మద్రాసు హైకోర్టు సీనియర్ న్యాయవాది సురేష్ పాల్గొని వివరాలు సేకరించారు. ఆ సమయంలో అనుకూలంగా ఓ మూక అక్కడికి చేరుకుని ఆయనపై దాడికి దిగింది. అక్కడి కుర్చీలను ధ్వంసం చేసి పరారైంది. దీనిపై అరప్పోర్ ఇయక్కం నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దోపిడీ ముఠా తమ ప్రయత్నాలను అడ్డుకోవాలని చూస్తే ఊరుకోబోమని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. రాళ్ల క్వారీ అవినీతిపై ఇదివరకే పోలీసులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం వ్యవహరించారని ఆరోపించారు.

సెంగోట్టైయన్ కార్యాలయం ముందు మారిన బ్యానరు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: గోబిచెట్టిపాళయం పట్టణంలోని కరట్టూర్ ప్రాంతంలో మాజీ మంత్రి సెంగోట్టైయన్ కార్యాలయం ముందున్న ఫ్లెక్సీ మారింది. శనివారం సెంగోట్టైయన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిసామి చిత్రపటాన్ని మూసి జయలలిత చిత్రాన్ని అంటించిన నేపథ్యంలో ప్రస్తుతం ఫ్లెక్సీని పూర్తిగా మార్చేశారు. పాత దానిలో అన్నాడీఎంకే ఈరోడ్ వెస్ట్ జిల్లా కార్యాలయం అని ఉండగా కొత్తగా ఏర్పాటు చేసిన దానిలో అన్నాడీఎంకే ఎమ్మెల్యే అని సూచించారు. అలాగే మాజీ ముఖ్యమంత్రులు అన్నా, ఎంజీఆర్ చిత్రాలు మాత్రమే చోటుచేసుకున్నాయి.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి సర్వదర్శనానికి టోకెన్లు లేని భక్తులకు 12 గంటలు, రూ.300 ఎస్‌ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల సమయం పడుతోంది. శనివారం స్వామివారిని 72,860 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.2.98 కోట్లు హుండీ కానుకలు లభించాయి.

18 వేల టోకెన్లు జారీ

తిరుపతి (తితిదే): శ్రీ వేంకటేశ్వరుని సర్వదర్శనానికి సంబంధించి తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు ఆదివారం 18 వేల సర్వదర్శన టోకెన్లు జారీ చేశారు. వీరికి సోమవారం వేకువ జామున మూడు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం లభించనుంది. అదేవిధంగా శ్రీవారి మెట్టు మార్గం భక్తులకు మరో రెండు వేల టోకెన్లు జారీ చేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆకుల ప్రకాష్, గూడపాటి జగన్‌మోహన్ రావు

కార్తిక వనభోజన మహోత్సవం

టీనగర్, న్యూస్‌టుడే: చెన్నై కాపు సేవా సమితి ఆధ్వర్యంలో కార్తిక వనభోజన మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. తిరువళ్లూరు జిల్లాలోని మప్పేడు సమీపంలో మూర్తి గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో సుమారు వంద మందికిపైగా పాల్గొన్నారు. మహిళలు ఉసిరి చెట్టుకు, గోవులకు పూజలు నిర్వహించారు. సమితి నిర్వాహక కమిటీ అధ్యక్షుడు గూడపాటి జగన్‌మోహన్ రావు, నిర్వాహకులు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. పిల్లలు, పెద్దలకు ఆటలు, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

21ఏళ్లుగా పోలియో రహిత రాష్ట్రంగా తమిళనాడు

– న్యూస్‌టుడే, ఆర్కేనగర్

తమిళనాడులో గత 21ఏళ్లుగా ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదని రాష్ట్ర ఆరోగ్యశాఖ తెలిపింది. వైరస్ ప్రభావంతో ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో వ్యాధి సంక్రమిస్తుంది. వ్యాధి సోకిన పిల్లల్లో మొదట ప్రత్యేకంగా ఎలాంటి లక్షణాలు కనిపించవు. జ్వరం, తలనొప్పి, వాంతులు తదితర సమస్యలు తలెత్తుతాయి. మరింత క్లిష్టమైన సందర్భాల్లో బాధితుల నాడీ వ్యవస్థలోకి ప్రవేశించే వైరస్ గంటల్లోనే బాల్య పక్షవాతానికి కారణమవుతుంది. 200మందిలో ఒకరు శాశ్వత పక్షవాతం, కాళ్ల పక్షవాతంతో బాధపడుతున్నారు. దీని వల్ల దాదాపు 10శాతం మరణాలు సంభవిస్తాయని ప్రపంచ ఆరోగ్యసంస్థ నివేదించింది. ప్రపంచం నుంచి పోలియోను నిర్మూలించడానికి ప్రపంచ ఆరోగ్యసంస్థ నోటి ద్వారా పోలియో చుక్కలు వేయాలని నిర్ణయించింది. ఈ శిబిరాల ద్వారా 99శాతం పోలియో కేసులు తగ్గాయి.

చివరిగా నెల్లైలో నిర్ధారణ

తమిళనాడులో తిరునెల్వేలిలో 2004లో పోలియో కేసు నిర్ధారణైంది. భారతదేశంలో 2011లో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని హౌరా జిల్లాలో చివరిగా గుర్తించారు. 2012లో ప్రపంచ ఆరోగ్యసంస్థ పోలియో నిర్మూలనకు ఏకైక మార్గం రోగనిరోధక శక్తిని ఇవ్వడమేనని పేర్కొంది. ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సున్న ప్రతి బిడ్డకు పోలియో వ్యాక్సిన్ ఇవ్వడం ప్రారంభించారు. 2012లో ప్రపంచ ఆరోగ్యసంస్థ భారతదేశాన్ని పోలియో వైరస్ ఉన్న దేశాల జాబితా నుంచి తొలగించి 2014 మార్చి 27న పోలియో రహిత దేశంగా ధ్రువీకరరించింది. దీని కారణంగా గత 11ఏళ్లుగా భారతదేశం పోలియో రహిత దేశంగా కొనసాగుతోంది.

శాశ్వత నిర్మూలనకు ఆరోగ్యశాఖ చర్యలు

గతేడాది 59.20లక్షల మందికి టీకాలు

దీని గురించి ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ... 2004 నుంచి 2016 వరకు తమిళనాడులో సంవత్సరానికి రెండుసార్లు జాతీయ పోలియో చుక్కల శిబిరాలు నిర్వహిస్తున్నారు.

వైరస్ వ్యాప్తి ఇలా..

వైరస్ నోటి ద్వారా ఓ వ్యక్తి నుంచి మరో వ్యక్తికి వ్యాపిస్తుంది. ఇంకా వ్యాధిగ్రస్తుడి మలం, మూత్రం ద్వారా కూడా సోకుతుంది. కలుషితమైన నీరు, ఆహారం ద్వారానూ వ్యాపిస్తుంది. ఈ విధంగా శరీరంలోకి ప్రవేశించే వైరస్ చిన్న ప్రేగులో పెరిగి నాడీ వ్యవస్థలోకి ప్రవేశించి వ్యాధిని కలిగిస్తుంది. వ్యాధి సోకిన వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు విడుదలయ్యే తుంపర్ల ద్వారా కూడా వ్యాప్తి చెందుతుంది.

తమిళనాడులో గత 29ఏళ్లుగా పోలియో చుక్కల శిబిరాలు జరుగుతున్నాయి. ఈ ప్రయత్నాల కారణంగా రాష్ట్రం గత 21ఏళ్లుగా పోలియో రహితంగా ఉంది. గతేడాది నిర్వహించిన శిబిరాల ద్వారా 59.20లక్షల మంది పిల్లలకు చుక్కలు వేశారు. నేషనల్ సర్టిఫికేషన్ కమిటీ ఫర్ పోలియో ఎరాడికేషన్ (ఎన్‌సీసీపీఈ) 21 రాష్ట్రాల్లోని 269 జిల్లాలను అధిక కేసులు నమోదవుతున్న ప్రాంతాలుగా గుర్తించింది. అందులో తమిళనాడులో చెంగల్పట్టు, మైలాడుదురై, శివగంగై, తంజావూర్, తిరునెల్వేలి, విరుదునగర్ జిల్లాలు ఉన్నాయి. ఈ ఆరు జిల్లాల్లో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పోషకాహార కేంద్రాలు, పాఠశాలలు, ముఖ్యమైన ప్రదేశాలలో శిబిరాలు నిర్వహించి పోలియో చుక్కలు వేశారు.

ప్రదీప్‌కు నగలు అప్పగిస్తున్న పోలీసులు

ఆభరణాలు దొరికినా ఆశపడలేదు

● రోడ్డుపై దొరికిన నగలు పోలీసులకు అప్పగింత

ప్యారిస్, న్యూస్‌టుడే: రోడ్డుపై దొరికిన బంగారు ఆభరణాలను పోలీసులకు అందజేసి ఓ వ్యక్తి నిజాయతీ చాటుకున్నారు. చెన్నై కొట్టూర్‌పురానికి చెందిన శివకుమార్ గత నెల 31వ తేదీ తన ఇంటి ముందు రోడ్డుపై పడి ఉన్న ఓ ప్లాస్టిక్ సంచిని గమనించారు. అందులో బంగారు నగలు ఉన్నట్లు గుర్తించి వెంటనే కొట్టూర్‌పురం పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. అనంతరం పోలీసులు నగల గురించి దర్యాప్తు చేసి జారవిడుచుకున్న ప్రదీప్ అనే వ్యక్తికి సమాచారం అందించారు. ఆదివారం స్టేషన్‌కు చేరుకున్న ప్రదీప్‌కు నగలు అప్పగించారు. సుమారు రూ.7 లక్షల విలువైన నగలను పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన శివకుమార్‌కు, పోలీసులకి ప్రదీప్ కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సమాధుల పండుగ

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు జిల్లా వేలూరు నగరంలోని టోల్‌గేట్ వద్ద ఉన్న సీఎస్ఐ శ్మశానవాటిక, ఓల్డ్ టౌన్ శ్మశానవాటిక సహా అన్ని శ్మశాన వాటికల్లో క్రైస్తవులు కుటుంబాలతో కలిసి ప్రార్థనలు చేశారు. తమ పూర్వీకుల సమాధులను అలంకరించి కొవ్వొత్తులను వెలిగించి ప్రార్థనలు చేసి నివాళి అర్పించారు.

ఓల్డ్ టౌన్ శ్మశానంలో సమాధిని పువ్వులతో అలంకరిస్తున్న దృశ్యం

స్కాన్ చేయండి.. విరాళాలు అందించండి

కాణిపాకం, న్యూస్‌టుడే: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దర్శనానికి వచ్చే భక్తులు ఆలయంలో జరిగే అన్నదానం, అభివృద్ధి పనులు, గో సంరక్షణ ట్రస్టుకు విరాళాలు అందించేందుకు వీలుగా అధునాత కియోస్క్‌ని ఆలయ అధికారులు ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చారు. విరాళాలు ఇవ్వదలచిన భక్తులు మొదట భాషను ఎంచుకోవాలి. తర్వాత పథకాన్ని ఎంచుకొని పేరు, ఫోన్ నెంబరు, చెల్లించే నగదును ఎంచుకుంటే తెరపై క్యూఆర్ కోడ్ వస్తుంది. దానిని స్కాన్ చేసి యూపీఏ చెల్లింపు జరిపితే విరాళం స్వీకరించి.. భక్తులకు రసీదు వస్తుంది. విరాళాల స్వీకరణ కేంద్రం, అన్నదాన భవనం, వినాయక సదన్ వద్ద ఈ కియోస్క్‌లు అందుబాటులో ఉంచారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం

చక్కెర పరిశ్రమ సహాయ మేనేజరు మృతి ● ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలు

కాశయ్య (పాతచిత్రం)

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ప్రయివేటు చక్కెర కర్మాగారం సహాయ మేనేజరు మృతి చెందగా ఇద్దరు మహిళలు గాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, చిత్తూరు జిల్లా నగరి మండలం కావేటిపురం గ్రామానికి చెందిన కాశయ్య(52) ఎస్.ఆర్.పురం మండలం నెళవాయి గ్రామంలో ఉన్న ఎస్ఎన్‌జే సాగర్ చక్కెర కర్మాగారంలో సహాయ మేనేజరుగా పనిచేస్తున్నారు. ఆదివారం అన్న కుమార్తె మీనాక్షికి దీపావళి సారె తీసుకొని ద్విచక్ర వాహనంపై పళ్లిపట్టు సమీపం వేడు గ్రామానికి వెళ్లారు. అక్కడి నుంచి అత్త లలితాంబాళ్(75), మీనాక్షి (28)ని తీసుకొని తిరుగు పయనమయ్యారు. పళ్లిపట్టు సమీపంలో జంగమ్మ ఆలయం వెళ్తుండగా అదుపుతప్పి రోడ్డుపై ఆగి ఉన్న ట్రాక్టరును ఢీకొన్నారు. ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు పొద్దటూర్‌పేట ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో కాశయ్య మృతి చెందారు. ఇద్దరు మహిళలకు అక్కడ ప్రథమ చికిత్స అందించి తిరుత్తణి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పక్కీర్‌సామి, రామాయి, రాజేష్‌కుమార్ (పాతచిత్రాలు)

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న వ్యాను..

భార్యాభర్తలు, కుమారుడి మృతి

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని వ్యాను ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు... కడలూర్ జిల్లా ముత్తునగర్ సమీపం కొడిక్కాల్‌కుప్పం ప్రాంతానికి చెందిన పక్కీర్‌సామి(65), రామాయి(62) దంపతులు. వీరికి కుమారుడు రాజేష్‌కుమార్(36) ఉన్నాడు. వీరంతా కూలీలు. ఇదిలా ఉండగా వీరి బంధువు మృతి చెందడంతో ముగ్గురు శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. వాహనాన్ని రాజేష్‌కుమార్ నడిపాడు. కడలూర్-నెల్లికుప్పం రోడ్డులో వెళ్తుండగా కొండూర్ వద్ద ఎదురుగా వచ్చిన ఏటీఎం యంత్రంలో డబ్బులు నింపే వ్యాను ఢీకొంది. ప్రమాదంలో పక్కీర్‌సామి, రాజేష్‌కుమార్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన రామాయిని స్థానికులు కడలూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఘటనపై పుదునగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

కొలనులో మునిగి ఇద్దరు చిన్నారులు...

రెడ్‌హిల్స్: తిరువళ్లూరు జిల్లా తిరువేర్కాడు సమీపం అయనంబాక్కం పొన్నియమ్మన్ ఆలయ వీధికి చెందిన తమీమ్ అన్సారీ ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసే తినుబండారాలను ఇళ్లకు సరఫరా చేసే వృత్తి చేస్తున్నారు. ఈయనకు భార్య వసంతి, కుమారులు రియాజ్(5), రిజ్వాన్(3) ఉన్నారు. ఆదివారం ఉదయం చిన్నారులు ఇద్దరూ ఆడుకుంటూ సమీపంలోని కొలనులో ప్రమాదవశాత్తు పడి గల్లంతై మృతి చెందారు. తిరువేర్కాడు పోలీసులు మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

ముఖ్యమంత్రి విచారం

చెన్నై: దుర్ఘటనపై ముఖ్యమంత్రి స్టాలిన్ దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. మృతుల తల్లిదండ్రులు, బంధువులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. మృతుల తల్లిదండ్రులకు రూ.3లక్షల చొప్పున సీఎం పబ్లిక్ రిలీఫ్ ఫండ్ నుంచి అందించాలని అధికారులను ఆదేశించారు.

ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఇద్దరు యువకులు...

శ్రీపెరుంబుదూర్: చెంగల్పట్టు జిల్లా తిరుకచ్చూర్ గ్రామానికి చెందిన సంతోష్(21), విళుపురం జిల్లా పెరుంగపూర్ గ్రామానికి చెందిన కలైసెల్వన్(22) ఒరగడంలోని ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. శనివారం రాత్రి 11 గంటలకు ఇద్దరూ పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై తిరుకచ్చూర్ బయలుదేరారు. వడక్కుపట్టు ప్రాంతంలో వెళుతుండగా ఎదురుగా వచ్చిన కంటైనర్ లారీ అదుపుతప్పి వారి బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో సంతోష్, కలైసెల్వన్ అక్కడికక్కడే మృతిచెందారు. ఒరగడం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో కండక్టరు...

ట్రిప్లికేన్: కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చికి చెందిన ధనశేఖర్(26) అనే వ్యక్తి పొల్లాచ్చి-ఆనైమలై రూట్‌లో నడిచే ప్రభుత్వ బస్సులో కండక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈయన మూడు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇదిలా ఉండగా పొల్లాచ్చిలో ఉన్న భార్యను చూడటానికి ఆదివారం ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. అంబరపాళ్యం వద్ద అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ప్రభుత్వ బస్సును ఢీకొన్నారు. ప్రమాదంలో ధనశేఖర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆనైమలై పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో రైతు...

విల్లివాక్కం: కృష్ణగిరి జిల్లా వేప్పనహళ్లికి చెందిన మల్లికార్జునన్(28) రైతు. ఈయన శనివారం ద్విచక్ర వాహనంపై తిప్పన్నహళ్లి నుంచి మాదినాయకన్‌పళ్లికి బయలుదేరాడు. ఇందిరానగర్ ప్రాంతంలో అదుపుతప్పి కింద పడటంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

వేడినీళ్లలో పడి ఏడు నెలల శిశువు...

ప్యారిస్: మదురై పట్టణం మడక్కుళంకి చెందిన సేతుపతి, విజయలక్ష్మి దంపతులకు ఏడు నెలల ఆడ శిశువు ఉంది. ఇదిలా ఉండగా విజయలక్ష్మి కుమార్తెను మంచంలో నిద్రపుచ్చి, స్నానానికి నీళ్లను వేడి చేసేందుకు వాటర్ హీటర్ పెట్టింది. అనంతరం వంట గదిలో పని చేయడానికి వెళ్లింది. అప్పుడు మంచంలో ఉన్న శిశువు దొర్లుకుంటూ వచ్చి వేడి నీళ్లలో పడింది. శిశువు కేకలు విన్న తల్లి పరుగున వచ్చి బయటకుతీసి ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన శిశువు చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది.

హోటల్ గదిలో దంపతులు సహా ముగ్గురి ఆత్మహత్య

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: హోటల్ గదిలో దంపతులు సహా ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నాగపట్నంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... తిరువారూర్ జిల్లా విరుపాచ్చిపురానికి చెందిన కలియపెరుమాల్ (49), విజయకుమారి(44) దంపతులు. వీరిద్దరు స్నేహితుడు లోకనాథన్(45)తో కలిసి అక్టోబర్ 30వ తేదీ వేలాంగణ్ణికి వచ్చారు. అక్కడ ఓ హోటల్‌లో గది తీసుకున్నారు. ఇదిలా ఉండగా శనివారం రాత్రి పక్క గదిలో ఉన్నవారు కిటికీలోంచి కలియపెరుమాల్ గదిలోకి చూడగా ఆయన ఉరికి వేలాడుతూ కనిపించాడు. హోటల్ మేనేజర్ సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గదిలో పరిశీలించారు. లోకనాథన్, విజయకుమారి విషం తాగి విగతజీవులుగా పడి ఉండగా, కలియపెరుమాల్ ఉరికి వేలాడుతున్నాడు. అక్కడ ఓ ఉత్తరాన్ని స్వాధీనం చేసుకున్నారు. అందులో... తాము పలు ఫైనాన్స్ సంస్థల నుంచి రుణాలు తీసుకున్నామని, తిరిగి చెల్లించకపోవడంతో సంస్థ ప్రతినిధులు వేధిస్తున్నారని, వేరే దారి లేక ముగ్గురం ఆత్మహత్య చేసుకుంటున్నామని ఉంది. దర్యాప్తు కొనసాగుతోంది.

తల్లిదండ్రుల మరణాన్ని జీర్ణించుకోలేక యువతి...

రెడ్‌హిల్స్: తిరువళ్లూరు సమీపం నయపాక్కానికి చెందిన భారతి(19) తల్లిదండ్రులు ఇటీవల మృతి చెందారు. అప్పటి నుంచి మనోవేదనతో ఉన్న ఆమె శనివారం రాత్రి మోతాదుకు మించి నిద్ర మాత్రలు మింగడంతో అపస్మారక స్థితికి చేరింది. కుటుంబీకులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మనవాళనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాను బోల్తాపడి 16మందికి గాయాలు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ జిల్లా నైవేలి తాలూకాకు చెందిన శేఖర్(60) నేషనల్ లిగ్నైట్ కార్పొరేషన్ ఉద్యోగి. శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా అదేరోజు సాయంత్రం వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో బంధువులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శనివారం చెన్నై మాడంబాక్కం నుంచి వచ్చిన 16మంది బంధువులు చిదంబరం సమీపం పిచ్చావరానికి విహారయాత్రకు వెళ్లడానికి కురింజిపాడిలో వ్యాను మాట్లాడుకొని బయలుదేరారు. కురింజిపాడి తాలూకా వడకుత్తు ప్రాంతానికి చెందిన భాగ్యచంద్రన్(35) డ్రైవరు. వాహనం కురింజిపాడి తాలూకా పొట్టవేలి ప్రాంతంలో వెళ్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కనున్న తాటి చెట్టును ఢీకొని బోల్తాపడింది. ఘటనలో చెన్నై మాడంబాక్కానికి చెందిన బాలచందర్, అతని కుమార్తె ప్రణిషా, సుందరం, ఇతని కుమారుడు మణితరుణ్, వ్యాను డ్రైవర్ సహా 16మంది గాయపడ్డారు. స్థానికులు వారిని కురిజిపాడి ఆసుపత్రిలో చేర్చారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కడలూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కురింజిపాడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

వేళచ్చేరి: కడలూర్ జిల్లా భువనగిరి సమీపం సాక్కాంగుడి ప్రాంతానికి చెందిన రాజ్(34) రెండు రోజుల క్రితం మద్యం తాగి స్థానికంగా ఓ ఇంట్లో ఒంటరిగా ఉన్న 14ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో కుమార్తెను ఆసుపత్రిలో చేర్పించి సేత్తియాతోపు మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు జరిపి రాజ్‌ను పోక్సో చట్టం కింద అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు.

మత్తుపదార్థంతో ఉన్న ఇద్దరు...


ఫెరోజ్‌ఖాన్


జయంతి

ప్యారిస్: చెన్నై పుళియంతోప్పు పోలీసులకి అందిన సమాచారం మేరకు శనివారం స్థానికంగా గస్తీ నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన మహిళ సహా ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. వారి వద్ద సోదా చేసి మెథాంఫెటమైన్ అనే మత్తుపదార్థాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులు ఫెరోజ్‌ఖాన్, జయంతిని అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కి తరలించారు.

నగదు మోసం కేసులో తండ్రి, కుమారుడు...


గుణశేఖర్, విజయ్

ప్యారిస్: చెన్నై మడిప్పాక్కానికి చెందిన రమేష్‌కుమార్, సుగంధి దంపతులు. 2019లో తన భర్త అక్క సరళాదేవి, ఆమె భర్త గుణశేఖర్, వారి కుమారుడు విజయ్ హోటల్ ప్రారంభించేందుకు రూ.కోటి అప్పు కావాలని అడగడంతో సుగంధి తిరువాన్మియూర్‌లో ఉన్న ఇంటిని విక్రయించి వారికి రూ.కోటి నగదు ఇచ్చింది. రెండేళ్లయినా ఇవ్వకపోవడంతో అడిగిన తనని వారు అసభ్యపదజాలంతో దూషించి బెదిరించినట్లు మడిప్పాక్కం పోలీసులకి సుగంధి ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసులు దర్యాప్తు చేసి గుణశేఖర్, అతని కుమారుడు విజయ్‌ని శనివారం అరెస్టు చేశారు.

ద్విచక్ర వాహనాల చోరులు...


స్వాధీనం చేసుకున్న బైకులు, అరెస్టు చేసిన నిందితులను చూపుతున్న పోలీసులు

అరక్కోణం: రాణిపేట జిల్లా అరక్కోణం కొత్త బస్టాండ్ వద్ద శనివారం రాత్రి అరక్కోణం పట్టణ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అప్పుడు ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చిన ఇద్దరు యువకులను ఆపడానికి యత్నించారు. వారు ఆగకుండా వేగంగా వెళ్లడంతో వెంబడించి పట్టుకున్నారు. అదుపులోకి తీసుకుని విచారించగా ఆ వాహనంతోపాటు మొత్తం తొమ్మిది ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు పేర్నాంపట్టుకు చెందిన రాఘవేంద్రన్, చంద్రూ చెప్పారు. దీంతో ఇద్దరిని అరెస్టు చేసి తొమ్మిది బైకులను స్వాధీనం చేసుకున్నారు. ● **వేలూరు:** వేలూరు సమీపంలోని సత్తువాచ్చారికి చెందిన ప్రసాద్(36) గత అక్టోబరు 29వ తేదీ తన ఇంటి ముందు నిలిపిన ద్విచక్రవాహనం చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు జరిపి పల్లికొండ చావడి వీధికి చెందిన జయకుమార్(22), హేమంత్‌కుమార్(23), ఇళవరసన్(25)ని అరెస్టు చేశారు. వారి నుంచి 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

జైల్లోని భర్త కోసం గంజాయి తీసుకెళ్లిన మహిళ...

టీనగర్: తూత్తుకుడికి చెందిన వేల్‌శంకర్ అనే వ్యక్తి ఓ కేసులో అరెస్టయ్యి తిరునెల్వేలి జిల్లా పాళయంగోట్టయ్ కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు. శనివారం అతని భార్య సరోజిని (24) భర్తను కలవడానికి అనుమతి తీసుకుని కొన్ని వస్తువులతో జైలుకు వచ్చింది. జైలు గార్డులు ఆమె తెచ్చిన వస్తువులను తనిఖీ చేస్తుండగా తినుబండారాల మధ్య చిన్న పొట్లంలో గంజాయి కనిపించింది. వెంటనే అధికారులు సరోజినిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి జైలులో ఉంచారు.

రూ.1.9 కోట్ల విలువైన బంగారం స్వాధీనం

వడపళని, న్యూస్‌టుడే: చెన్నైకి చెందిన ఓ వ్యక్తి పర్యాటక వీసాతో బ్యాంకాక్ వెళ్లి చెన్నై విమానాశ్రయానికి తిరిగొచ్చాడు. అతని వద్ద సోదా చేసిన కస్టమ్స్ అధికారులు లోదుస్తుల్లో దాచి తెచ్చిన 750 గ్రాముల బంగారం ముద్దను గుర్తించారు. దాని విలువ రూ.90లక్షల వరకు ఉంటుందన్నారు. బంగారాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు. అలాగే శనివారం ఉదయం చెన్నైకి చెందిన మరో వ్యక్తి కౌలాలంపూర్ నుంచి చెన్నై విమానాశ్రయానికి వచ్చాడు. అతని వద్ద సోదా చేసి రూ.కోటి విలువైన 820 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

చోరీకి గురైన వాహనాలు...

స్వాధీనం చేసుకున్న వాహనాలు

పొన్నేరి: తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపం మీంజూరు, అత్తిపట్టు తదితర ప్రాంతాల్లో ఇళ్ల ఎదుట నిలిపిన వాహనాలు, వాహనాల్లో ఉన్న బ్యాటరీలు ఇటీవలి కాలంలో చోరీకి గురయ్యాయి. దొంగలను పట్టుకునేందుకు జిల్లా ఎస్పీ వివేకానంద శుక్లా ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. పోలీసులు ఆదివారం ఉదయం అత్తిపట్టు రైల్వేస్టేషన్ ప్రాంతంలో గస్తీ నిర్వహించారు. రోడ్డు పక్కన ఆగిఉన్న వ్యానులో 129 బ్యాటరీలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తు చేపట్టి తిరువెళ్లైవాయల్‌కు చెందిన నాగరాజ్, మణిమారన్, శ్రీనివాసన్ అనే వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి 3 వ్యాన్లు స్వాధీనం చేసుకున్నారు.

వెయ్యి కిలోల పొగాకు ఉత్పత్తులు...

రెడ్‌హిల్స్: తిరువళ్లూరు సమీపం తిరుముల్లైవాయల్ బాలాజీ నగర్‌లో కొందరు పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు ఆదివారం జోసఫ్ అనే వ్యక్తి ఇంట్లో తనిఖీ చేసి వెయ్యి కిలోల పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నారు. జోసఫ్‌ను అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగలు, నగదు చోరీ

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకా కర్లంబాక్కం గ్రామానికి చెందిన డాక్యుమెంట్ రైటర్ పళని, రజని దంపతులు. శనివారం పళని బంధువుల పెళ్లిలో పాల్గొనడానికి తిరుపతి వెళ్లారు. భార్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పుత్తూరులోని కుమార్తె ఇంటికి వెళ్లింది. అర్ధరాత్రి వీరి ఇంట్లో దొంగలు చొరబడి 13 సవర్ల బంగారు నగలు, 900 గ్రాముల వెండి నగలు, రూ.85 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఆదివారం పళని పళ్లిపట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

మగువా.. జయహో!

మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా శ్రీశ్రీనివాస క్రీడా సముదాయంలో ఆదివారం ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. అన్ని జిల్లా కేంద్రాల్లో వాటిని ఏర్పాటు చేసినట్లు శాప్ ఛైర్మన్ రవి నాయుడు తెలిపారు. జట్టు విజయంతో పెద్దఎత్తున సంబరాల్లో పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, తిరుపతి (క్రీడలు)

బుల్లెట్ రైళ్లూ దూసుకెళ్లేలా..!

- కొత్త రైల్వే లైన్లకు గ్రీన్ సిగ్నల్
- డిసెంబరు ఆఖరుకు డీపీఆర్ల పూర్తి

పుత్తూరు, న్యూస్‌టుడే: కొత్త రైల్వే ప్రాజెక్టులపై కేంద్రం దృష్టి సారించింది. హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ కారిడార్ ఏర్పాటు లక్ష్యంగా పనులు సాగుతున్నాయి. ఇప్పటికే చెన్నై నుంచి రేణిగుంట వరకు ఒకటి రెండు మినహా లెవల్ క్రాసింగ్‌ల వద్ద నిర్మాణాలు పూర్తి చేశారు. త్వరలో బుల్లెట్ రైళ్లు నడిపే ఆలోచన ఉన్న నేపథ్యంలో రైల్వే లైన్ల సంఖ్య పెంచాలని చూస్తున్నారు.

పుత్తూరు రైల్వేస్టేషన్ ముఖచిత్రం

ఉమ్మడి చిత్తూరుకు మూడు..

ఒకే మార్గంలో సరకు రవాణా, హైస్పీడ్ రైళ్లు నడిపే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో కొత్త లైన్ల ఏర్పాటుకు అనుగుణంగా డీపీఆర్లు సిద్ధం చేయాలని ఉన్నతాధికారులకు రైల్వేశాఖ ఆదేశాలు జారీ చేసింది. డిసెంబరు ఆఖరు నాటికి డీపీఆర్లు పూర్తి చేయాలని గడువు విధించింది. దీనిలో భాగంగా రాష్ట్రానికి కొత్తగా 26 ప్రాజెక్టులు రాగా, ఉమ్మడి చిత్తూరు జిల్లాకు మూడు కేటాయించారు.

ఎక్కువగా వీవీపీల రాక..

మార్గం: చెన్నై- తిరుపతి
దూరం: 43 కిలోమీటర్లు **లైన్లు:** 3 లేదా 4
ప్రతిపాదనలు: అరక్కోణం- రేణిగుంట

- చెన్నై- తిరుపతి నిత్యం రైళ్ల రాకపోకలు ఉంటాయి. శ్రీవారి దర్శనానికి పలువురు వీవీపీలు వస్తుంటారు. రేణిగుంట- చెన్నై మార్గంలో అరక్కోణం వరకు సింగిల్ ట్రాక్ మాత్రమే ఉంది. యూనిట్, సరకు రవాణా రైళ్లు ఈ మార్గంలోనే నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో లైన్లు పెంచనున్నారు.

55 కిలోమీటర్ల మేర..

మార్గం: చెన్నై- గూడూరు
ప్రతిపాదనలు: గుమ్మిడి పూండి- సూళ్లూరు పేట
దూరం: 18.40 కిలోమీటర్లు

ప్రతిపాదనలు: సూళ్లూరుపేట- గూడూరు
దూరం: 55 కిలోమీటర్లు
లైన్లు: 3 లేదా 4

బాలలూ.. వద్దురయ్

లైసెన్సులు లేకున్నా వాహనాలపై సవారీ
పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

- తవణంపల్లె పరిధిలో ఇద్దరు బాలలు ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వాహనం నడుపుతున్న బాలుడు మృతి చెందాడు.
- చిత్తూరులో వాహనాలు నడిపే బాలలపై పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పదుల సంఖ్యలో కేసులు నమోదు చేసినా ఫలితం లేదు.

తిరుపతి (నేరవార్తలు), న్యూస్‌టుడే: రోజురోజుకు రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. వాహనాలు నడుపుతూ ప్రమాదానికి గురైన ఘటనల్లో అధికంగా బాలలు ఉంటున్నారు. పోలీసులు ఆపలేకపోతున్నారు. తల్లిదండ్రులు పిల్లలపై ఉన్న ప్రేమ.. గారాబంతో అడిగిన వాహనం కొనిస్తూ రోడ్డు ప్రమాదాలకు కారకులుగా నిలుస్తున్నారు.

ఉత్తుత్తి తనిఖీలు

పోలీసులు తనిఖీ చేస్తున్నా వాహనాలు నడిపే బాలలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టలేకపోతున్నారు.

గుర్తింపు కోసం..

పిల్లలకు వాహనాలు నడిపే వయసు రాకున్నా.. లైసెన్సు లేదని తెలిసినా.. నలుగురిలో గుర్తింపు కోసం తల్లిదండ్రులు ఖరీదైన వాహనాలు కొనిస్తున్నారు. జరగరాని ఘటన జరిగితే.. తల్లిదండ్రులు రోదించే పరిస్థితి ఎదురవుతోంది.

ఇవీ కారణాలు..

- నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ఇతరులకు ఆటంకంగా మారుతున్నారు.
- ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం.
- ఎక్కువ శాతం యువత శిరస్త్రాణం ధరించరు.. వేగ నియంత్రణ పాటించరు.
- మలుపుల్లో వాహనాల వేగం నియంత్రించక కింద పడుతున్నారు.
- సాధారణ రోడ్లలో కూడా ఎక్కువ సీసీ బైకులతో స్పీడుగా వెళ్లడం.

కేసుల వివరాలు ఇలా	సంవత్సరం	ఈ-చలానాలు	జరిమానా మొత్తం
	2024	5,223	రూ.2,84,0526
	2025	3,861	రూ.3,14,0260

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం శ్రీవారిని 72,860 మంది దర్శించుకున్నారు. రూ.2.98 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

- **18 వేల టోకెన్ల జారీ :** శ్రీవారి సర్వదర్శనానికి సంబంధించి తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద ఆదివారం 18 వేల టోకెన్లు జారీ చేశారు. వీరికి సోమవారం వేకువజామున 3 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం జరుగనుంది. శ్రీవారి మెట్టు మార్గం భక్తులకు 2 వేల టోకెన్లు జారీ చేశారు.

నేడు డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి తెలిపారు.

- **ఎవరికి?:** తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వినియోగదారులు
- **సమయం:** ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

చరవాణి నంబరు: **89777 16661**
చాట్ ద్వారా తెలిపే నంబరు: **91333 31912**

అథ్లెటిక్స్, చదరంగం ఎంపికలు 4న

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మదనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 4న ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్ 14, 17 అథ్లెటిక్స్, అండర్ 14, 17, 19 చదరంగం జిల్లా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు బాబు, శారద, నాగరాజు, ఝాన్సీరాణి, కిషోర్, భార్గవి తెలిపారు. ఉదయం 9 నుంచి ఎంపికలు జరుగుతాయని, క్రీడాకారులు స్కూల్‌గేమ్స్ అర్హతకు సంబంధించిన పత్రాలు తప్పక తీసుకురావాలన్నారు.

6 వరకు ఆధార్ నమోదు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు ఆధార్ బయోమెట్రిక్ ద్వారా అప్‌డేషన్ చేసుకునేందుకు ఈ నెల ఆరో తేదీ వరకు గడువు ఉందని డీఈవో వరలక్ష్మి ఆదివారం తెలిపారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న విద్యార్థులు సంబంధిత ఎంపీడీవో సహకారంతో ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవాలన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థుల నామినల్ రోల్స్ యూడైస్ ద్వారా తీసుకోనున్నట్లు చెప్పారు. సంబంధిత విద్యార్థులు అపార్ ఐడీ, బయోమెట్రిక్ అప్‌డేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని డీఈవో సూచించారు.

కైగల్.. జిగేల్

ఎత్తయిన కొండలు.. పచ్చని అందాల మధ్య నుంచి పాల నురగలా పరవళ్లు తొక్కుతూ పారుతోన్న కైగల్ జలపాతం సందర్శకులను ఆకర్షిస్తోంది. ఇటీవల వర్షాలతో బైరెడ్డిపల్లెలోని జలపాతంలో ప్రవాహం పెరిగింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు సమీపంలో ఉండటంతో పర్యాటకులు తరలివస్తున్నారు.

- ఈనాడు, చిత్తూరు, న్యూస్‌టుడే, బైరెడ్డిపల్లె

నింగినంటిన.. హు షార్

షార్‌లోని నమూనాల వద్ద సెల్ఫీ.. ప్రయోగం వీక్షిస్తున్న నౌకాదళ ఉన్నతాధికారులు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: సీఎంఎస్-03 ఉపగ్రహంతో షార్‌లో సందడి నెలకొంది. రాకెట్ ప్రయోగానికి ముందే శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచే పోలీసులను పెద్దఎత్తున మోహరించారు. పోలీసు, సీఐఎస్ఎఫ్ దళాలతో ప్రధాన గేటు వద్ద రెండంచెల భద్రత ఏర్పాటు చేశారు. వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేసి పాసులు ఉన్నవారినే లోపలకు పంపించారు. ప్రయోగాన్ని వీక్షించేందుకు పలు ప్రాంతాల నుంచి సందర్శకులు భారీగా తరలివచ్చారు.

- ఎల్‌వీఎం ఎనిమిదోసారి విజయవంతంగా ఉపగ్రహాన్ని తీసుకెళ్లింది. ఈ విజయం ఇస్రో బృంద స్ఫూర్తికి నిదర్శనం. - వి.జోసెఫ్, ఎల్వీఎం డైరెక్టర్
- ఉపగ్రహం నేటి నుంచి కార్యకలాపాలు ప్రారంభించేందుకు సమాయత్తమైంది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా బహుళ బ్యాండ్‌లో పలు వినూత్న సాంకేతికతలతో ఇది రూపుదిద్దుకుంది. - రాజేంద్ర కుమార్, సీఎంఎస్03 డైరెక్టర్

ఇప్పటి వరకు ప్రయోగాలు : **103** ఎల్‌వీఎంలు : **8**

ఏఐపై పుస్తకం.. గెలుపు సంతకం

పుత్తూరు, న్యూస్‌టుడే: ఏఐ గురించి ఓ పుస్తకం రాసి పలు దేశాల ఐటీ నిపుణులను ఆకట్టుకున్నారు పుత్తూరు కుర్రోడు సాయిరోహిత్. తండ్రి తుమ్మరకోటి వెంకట రమేష్ విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు. తల్లి భారతి తెలుగు ఉపాధ్యాయురాలు. రోహిత్ పుత్తూరులో ప్రాథమిక విద్య అనంతరం తమిళనాడులో బీటెక్ చేశారు. అమెరికాలో ఎంఎస్ చేసి సాఫ్ట్‌వేర్‌గా స్థిరపడ్డారు.

ముందస్తు అంచనాలతో..

సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా కొనసాగుతూనే.. కృత్రిమమేధపై పట్టు సాధించారు. ఏఐపై ఆ రంగ నిపుణులకు అవగాహన కల్పించేలా పుస్తకాన్ని అందుబాటులోకి తెచ్చారు. తొలుత ఆశించినంత గుర్తింపులేని ఆ పుస్తకం ఏఐకి ప్రాచుర్యం లభించడంతో ప్రస్తుతం పలు దేశాల్లో గుర్తింపు సాధించింది. ఈ పుస్తకం అమెరికాలోని టెక్సాస్ ఏఅండ్ఎం యూనివర్సిటీ, కింగ్స్‌విల్లే, ఇతర విశ్వవిద్యాలయాల్లోని గ్రంథాలయాల్లో చేరింది.

అవార్డులు

రోహిత్ ఏఐ ఆధారిత క్లౌడ్ కంప్యూటింగ్‌లో పుస్తకం రాసి సుమారు 3 వేల కాపీలు విక్రయించారు. టైటాన్, టైటాన్ హెల్త్, ఇండియన్ అచీవర్స్, గ్లోబల్ రికగ్నైజేషన్, ఏషియన్ ఆఫ్రికన్ అవార్డులు పొందారు. ఆరు సెమినార్లలో పాల్గొని ప్రశంసలు పొందారు.

ప్రయోగాలకు త్రీడీ ముద్ర

- పద్మావతి మహిళా వర్సిటీ ఫార్మసీ విద్యార్థినుల వినూత్న అడుగులు

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: దీర్ఘకాల అనారోగ్య సమస్యలతో బాధపడే వారికి ఉపశమనం కలిగించే పరిశోధనలు చేస్తున్నారు శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఫార్మసీ విభాగం విద్యార్థినులు. మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి వివిధ వ్యాధులపై పరిశోధకురాలు హర్షిణి ప్రయోగాలు చేయగా.. శరీరంపై గాయాలను నయం చేయడానికి స్కాఫ్‌ఫోల్డ్స్ టిష్యూలను రూపొందించారు ఎం.ఫార్మసీ విద్యార్థిని కృష్ణతేజస్విని. వీటి తయారీకి ఒకరు బయోసిరమిక్, బయోమెటీరియల్స్‌ను వినియోగిస్తే, మరొకరు గండపురా (వింటర్ గ్రీన్‌ప్లాంటు) మొక్క ఆకుల నుంచి తీసిన ఆయిల్‌ను వినియోగించారు. వీరి పరిశోధనలను వివరించారిలా..

విద్యార్థినులు తయారు చేసిన స్కాఫ్‌ఫోల్డ్

త్రీడీ ప్రింటింగ్ ద్వారా పరిశోధనలు చేస్తున్న విద్యార్థిని

పుండ్లను నయం చేసేలా..

పుండ్లు, కాలిన గాయాలు నయం కావడానికి కొంత సమయం పడుతుంది. మధుమేహ బాధితులకు చాలా సమయం కావాలి. ఇవి పెద్దవైనప్పుడు నయం చేయడానికి మన శరీరం నుంచి కానీ, ఇతరుల శరీరం నుంచి కానీ కావాల్సిన చర్మాన్ని తీసి గాయాలపై అమరుస్తారు. ఇదెంతో ఖర్చుతో కూడుకున్న పని. కొన్నిసార్లు దుష్ప్రభావాలు ఎదురవుతాయి. దీని పరిష్కారానికి బయోసిరమిక్, బయోమెటీరియల్లను వినియోగించి త్రీడీ ప్రింటింగ్‌తో స్కాఫ్‌ఫోల్డ్స్ టిష్యూ రూపొందించా. ఇప్పటివరకు విరిగిన ఎముకలు అతుక్కోవడానికే వీటిని వినియోగించేవారు. మన శరీరంలో ఉండే కొలాజిన్ ప్రొటీన్ చర్మం, ఎముకలు, కండరాలు, నరాలను బలోపేతం చేస్తుంది. మధుమేహం బాధితుల్లో కొలాజిన్ అంత శక్తిమంతంగా పని చేయదు. గాయాలను స్కాఫ్‌ఫోల్డ్ త్వరగా నయం చేస్తుంది. ఎలుకలపై చేసిన ఈ ప్రయోగం విజయవంతం కావడంతో దీనిపై పేటెంట్ పొందేందుకు దరఖాస్తు చేసుకున్నా.

- ఎం.హర్షిణి, పరిశోధక విద్యార్థిని

వింటర్ గ్రీన్ ఆయిల్‌తో..

పుండ్లు, గాయాలు నయం చేయడానికి రకరకాల పూత మందులు వినియోగిస్తుంటాం. వీటివల్ల పలు దుష్ప్రభావాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే సహజసిద్ధంగా దొరికే ఔషధ మొక్కలతో స్కాఫ్‌ఫోల్డ్‌ను తయారు చేయాలనుకున్నా. ఇందులో భాగంగా గండపురా (వింటర్ గ్రీన్ ప్లాంట్) మొక్క ఆకుల నుంచి తీసిన ఆయిల్‌ను వినియోగిస్తూ త్రీడీ ప్రింటింగ్‌తో ఒక స్కాఫ్‌ఫోల్డ్‌ను తయారు చేశా. దీన్ని పుండ్లు, గాయాలపై ఉంచితే ఇందులోని ఔషధ గుణాలు గాయాన్ని త్వరగా నయం చేస్తాయి. ఈ పరిశోధనపై పేటెంట్‌కు దరఖాస్తు చేశా.

- ఎ.కృష్ణతేజస్విని, ఫార్మసీ విద్యార్థిని

సచివాలయాల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారి

- త్వరలో మండలానికో డిప్యూటీ ఎంపీడీవో నియామకం

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయాల పనితీరుపై వస్తున్న ఫిర్యాదులను అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. సచివాలయాల ఉద్యోగులు జవాబుదారీతనంతో ప్రజలకు సేవ చేసేలా ప్రత్యేక వ్యవస్థకు చర్యలు తీసుకుంటోంది. ఇకపై ప్రతి మండలానికి ఒక డిప్యూటీ ఎంపీడీవోను నియమించి వారు గ్రామ, వార్డు సచివాలయాలను పర్యవేక్షించేలా ఉత్తర్వులు ఇవ్వనుంది. ఇందుకోసం పంచాయతీరాజ్ శాఖలో ఎన్నడూ లేనివిధంగా సమూలమైన మార్పులు తీసుకురానుంది. పంచాయతీరాజ్ శాఖలో గ్రేడ్-1 ఉద్యోగుల్లో అర్హులకు ఉద్యోగోన్నతులు కల్పిస్తూ వారిని డిప్యూటీ ఎంపీడీవోలుగా నియమించేందుకు రాష్ట్ర ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. త్వరలో ఉద్యోగోన్నతులు పొంది డిప్యూటీ ఎంపీడీవోలుగా జిల్లాలోని అన్ని మండలాలకు రానున్నారు.

ఉద్యోగోన్నతులు ఇలా:

జిల్లా పంచాయతీ కార్యాలయం, డీఎల్‌పీవో, జిల్లా పరిషత్తు కార్యాలయాల్లో పనిచేస్తున్న సీనియర్ సహాయకులు, గ్రేడ్-1 పంచాయతీల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల్లో అర్హులను గుర్తించి వారికి డిప్యూటీ ఎంపీడీవోగా ఉద్యోగోన్నతులు ఇవ్వనున్నట్లు జిల్లా డీపీవో సుశీలా దేవి తెలిపారు.

మండలాలు	వార్డు సచివాలయాలు	గ్రామ సచివాలయాలు	పనిచేస్తున్న ఉద్యోగులు
-33	-210	- 481	- 5400

అమ్మానాన్నా.. క్షమించండి

- డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

పెనుమూరు, న్యూస్‌టుడే: 'అమ్మ నాన్నా సారీ.. నేను మిమ్మల్ని విడిచి వెళ్లిపోతున్నా.. నన్ను క్షమించండి.. డాడీ నాకు బతకాలని లేదు.. నావల్ల నువ్వు చాలా బాధపడ్డావ్.. ఆ పిల్ల నన్ను నమ్మించింది.. నాతోనే ఉంటానని చెప్పి మోసం చేసింది.. మీ కోసం బతకాలని ఉన్నా నావల్ల కావడం లేదు.. సారీ డాడీ.. అందరినీ వదిలి వెళ్లిపోతున్నా..' అంటూ రాసిపెట్టి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఓ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థి (17) పెనుమూరులోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడు. చంద్రగిరి నియోజకవర్గం మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి(18) అదే కళాశాలలో చదువుతోంది. వీరిద్దరూ ఇటీవల ఎవరికీ చెప్పకుండా విజయవాడ వెళ్లిపోయారు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు వారిని తీసుకువచ్చారు. ఆ సమయంలో యువతి తాను తల్లిదండ్రులతోనే వెళ్తానని చెప్పడంతో వారితో పంపేశారు. దీంతో మనోవేదనకు గురైన ఆ విద్యార్థి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆత్మహత్య లేఖ రాసి ఉంచి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐసర్.. ఉడుతాభక్తిగా



ఉడుతల పరిరక్షణకు చేపట్టాల్సిన ప్రణాళికలపై తిరుపతి భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ(ఐసర్)లో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు తూర్పు కనుమల సింపోజియం-2025 నిర్వహిస్తోంది. జీవావరణ శాస్త్రం, పరిరక్షణ, భూగర్భశాస్త్రం, జీవనోపాధి, మానవ చరిత్ర విభాగం ఆధ్వర్యంలో వివిధ అంశాలపై చర్చించేందుకు దేశంలోని పరిశోధకులు, పరిరక్షణ నిపుణులు, ఎన్‌జీవోలతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ ప్రాంతంలోని ఉడుతలు, పక్షుల పరిరక్షణ వ్యూహాలు, వాటి అభివృద్ధిపై చర్చించనున్నారు. ఇందుకుగాను ఈనెల 9వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఐసర్ నిర్వాహకులు కోరారు. **- న్యూస్‌టుడే, ఏర్పేడు**

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
THE EENADU WAY CLASSIFIEDS
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
పదవీ విరమణ శుభాకాంక్షలు
జన్మదిన శుభాకాంక్షలు
అంత్యక్రియలు, వర్థంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
జి.ఎస్.టి. 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

104FM Tirupati
104 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

బాల.. భళా

శ్రీగోవిందరాజస్వామి డిగ్రీ కళాశాలలో జరుగుతున్న బాలోత్సవం ఆదివారం అట్టహాసంగా ముగిసింది. - తిరుపతి(విద్య)

పాతొక రోత.. ఖజానాకు కోత

- ముక్కంటి సన్నిధిలో అత్యుత్సాహం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయం పరిధిలో ఫర్నిచర్ ఏడాపెడా కొనేస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ ఏదైనా వస్తువు కొత్తగా కొనుగోలు చేయడమంటే ఎంత సరదానో! ఈవో బదిలీ అయి కొత్తగా వచ్చినా.. ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ మారినా పరిపాలనా భవనం పరిధిలో గదులు మార్చడం, ఇదివరకు ఉన్న ఫర్నిచర్, సోఫాలు పక్కన పడేసి కొత్తగా కొనుగోలు చేయడం పరిపాటిగా మారింది.

రూ.లక్షలతో కొనుగోళ్లు

తాజాగా ట్రస్టుబోర్డు బాధ్యతలు చేపట్టింది. ఇదివరకు గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న ఛైర్మన్ కార్యాలయాన్ని మూడో అంతస్తుకు మార్చారు. అప్పట్లో రూ.లక్షల వ్యయంతో ఫర్నిచర్ కొనుగోలు చేయడం, గదికి రంగులు ఇతరత్రా ఖర్చులకు రూ.5 లక్షలుపైగా ఖర్చు చేశారు. తాజాగా ఈ కార్యాలయాన్ని త్రినేత్ర అతిథిగృహంలోకి మార్చారు. ఇప్పటికే రూ.లక్షకు పైగా ఖర్చుచేసి ఫర్నిచర్ కొనుగోలు చేశారు. గదుల సుందరీకరణకు ఇంకెంత ఖర్చు చేస్తారో చూడాలిమరి. గతేడాది ఈవోగా బాధ్యతలు చేపట్టిన అప్పటివరకు ఈవో కార్యాలయం మొదటి అంతస్తులో ఉండేది. కొత్త ఈవో గ్రౌండ్‌ఫ్లోర్‌కు మారగా రూ.2 లక్షలతో ఫర్నిచర్ కొనుగోలు చేశారు. ఇదివరకు పాత వస్తువులన్నీ ఏం చేస్తున్నారన్నది ప్రశ్నార్థకమే. వాటికి ఖర్చు పెట్టి కొత్తగా మార్చుకొనే అవకాశం ఉన్నా ఆ దిశగా ఆలోచించడం లేదు.

(c) eenadu

ఆలయ దర్శిని

కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయంలో సేవలు

సుప్రభాతసేవ, గోపూజ: వేకువజామున 4.00
బిందుతీర్థ అభిషేకం: 4.30 గంటలు
పంచామృతాభిషేకాలు: ఉదయం 5.30 (ప్రథమ కాల), 9.00 (ద్వితీయకాల), 11.00 (తృతీయకాల)
క్షీరాభిషేకం: ఉదయం 7.30, సాయంత్రం 5.45
ప్రమాణం: సాయంత్రం 5.00 గంటలు.
నిత్య కల్యాణం: 11.30 గంటలకు
హోమాలు: ఉదయం 7 నుంచి 10 గంటల వరకు

నిజరూప దర్శనం: ఉ. 7-7.30, 8.30-9.00, 10.30-11.00
సాయంత్రం: 4.30- 5.00
సర్వదర్శనం: ఉ. 6-7,8-8.30, 9.30 -10.30
మ. 12.00, సా. 4.30, రా. 7-9

– న్యూస్‌టుడే, కాణిపాకం

శ్రీవారి ఆలయంలో

నిత్యోత్సవాలు తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతం, మంగళ, బుధ, గురువారాలు ఉ.3.45కు తోమాలసేవ, 4.45 గంటలకు అర్చన, మ.12కు కల్యాణోత్సవం, 2కు డోలోత్సవం, 3కు ఆర్జిత బ్రహ్మోత్సవం, సాయంత్రం 5కు సహస్ర దీపాలంకారసేవ. ● 7వ తేదీ శ్రీవారి పౌర్ణమి గరుడసేవ జరగనుంది.

సర్వదర్శనం: తెల్లవారి 3.30-5.45, ఉ.8-9.30కు, మధ్యాహ్నం 12 నుంచి రాత్రి వరకు సర్వదర్శనానికి అనుమతిస్తారు. గురువారం, శుక్రవారాల్లో ఉదయం 9 నుంచి సర్వదర్శనం.

వారోత్సవాలు: ప్రతి సోమవారం విశేషపూజ (ఏకాంతం), మంగళవారం అష్టదళ పాదపద్మారాధన సేవను ఉదయం 9కి నిర్వహిస్తారు. బుధవారం సహస్రకలశాభిషేకాన్ని తితిదే రద్దు చేసింది. గురువారం ఉదయం 6.30 గంటలకు తిరుప్పావడ సేవ, శుక్రవారం ఉదయం 4 గంటలకు శ్రీవారికి అభిషేకం నిర్వహిస్తారు.

– న్యూస్‌టుడే, తిరుమల

ముక్కంటి ఆలయంలో

ఉదయం: 5.30: సుప్రభాత సేవ. 5.45: గోమాత పూజ
6.30: ప్రథమ కాలాభిషేకం
7.30: ద్వితీయ కాలాభిషేకం
11.00: నిత్యోత్సవం, చండీ, రుద్రహోమాలు
11.30: నిత్య కల్యాణం
సాయంత్రం: 3.30: ప్రదోష కాలాభిషేకం **రాత్రి :** 7.00: నీరాజన మంత్రపుష్పం
9.00: ఏకాంతసేవ
సర్వదర్శనం: ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు.

రాహు, కేతు పూజలు: ఉదయం 6 నుంచి సాయంత్రం 5. వరకు. **అభిషేకాలు:** మృత్యుంజయ శివలింగానికి (సోమవారం), కాలభైరవునికి (మంగళ), శ్రీమేధాదక్షిణామూర్తికి (గురు), శనిభగవానునికి (శని), సూర్యనారాయణుడికి (ఆది). మనోన్మణికి ఊంజల్‌సేవ(శుక్రవారం). సోమవారం ఉత్సవమూర్తుల ఊరేగింపు. రాత్రి వైష్ణవ పుష్కరిణిలో కార్తిక దీపోత్సవం.

– న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

వరసిద్ధుడి దర్శనానికి మూడు గంటలు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దర్శనానికి భక్తులు ఆదివారం ఆలయానికి పోటెత్తారు. స్వామివారి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. భక్తులకు కావాల్సిన వసతులను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

దర్శనానికి క్యూలైన్లలో వేచిఉన్న భక్తులు

హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు కుటుంబం ▸ సినీ హీరో నారా రోహిత్ దంపతులు ▸ ఆలయ ఆవరణలో జస్టిస్ నర్సింగ్‌రావు

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని ఆదివారం ఉదయం ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు, తమిళనాడు మంత్రి రామచంద్రన్, తెలంగాణ మంత్రి వి.శ్రీహరి, సినీనటుడు నారా రోహిత్ దంపతులు, తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సానా సతీష్ దర్శించుకున్నారు. వీరికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ సూచనలతో తిరుమలకు చేరుకుని భారత మహిళా క్రికెట్ జట్టు విజయం కోసం ప్రార్థించానన్నారు.

ప్రసన్న వేంకన్న సేవలో జస్టిస్ నర్సింగ్‌రావు

వడమాలపేట, న్యూస్‌టుడే: అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నర్సింగ్‌రావు ఆదివారం దర్శించుకున్నారు. అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అర్చకులు ఆలయ చరిత్ర గురించి ఆయనకు వివరించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయాధికారి వేణుగోపాల్‌రాజు, అర్చకులు పాల్గొన్నారు.

కష్టమైనా.. ఇష్టమే

☛ లాన్ టెన్నిస్‌లో రాణింపు ☛ తల్లిదండ్రుల ప్రోత్సాహం

రాష్ట్ర స్థాయి పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

శ్రీకాళహస్తి, తొట్టంబేడు, న్యూస్‌టుడే: లాన్ టెన్నిస్ ఖరీదైన క్రీడ. రాణించాలంటే క్రమం తప్పని శిక్షణ అవసరం. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులకు కష్టతరమే అయినా పిల్లల బాగోగులే లక్ష్యంగా ప్రోత్సహిస్తున్నారు. శ్రీకాళహస్తి వేదికగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో క్రీడాకారులు రాణిస్తూ సత్తా చాటుతున్నారు.

పేరు: సంహిత **ఊరు:** అనంతపురం
తల్లిదండ్రులు: లావణ్య, కృష్ణారెడ్డి (లైబ్రేరియన్)
పాఠశాల: కేంద్రీయ విద్యాలయం (8వ తరగతి)
విభాగం: అండర్-14,
విజయ పరంపర: స్కూల్‌గేమ్స్‌లో సత్తా
లక్ష్యం: జాతీయ స్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించడం



జీవన్ తిరుచానూరు
రోజా, లోకనాథం (ఎలక్ట్రీషియన్)
సీకాం కళాశాల, జూనియర్ ఇంటర్
అండర్-19 స్కూల్‌గేమ్స్‌లో రాణింపు
క్రీడల ద్వారా ప్రభుత్వ ఉద్యోగం.

ఊర్మిళ శ్రీకాకుళం
లక్ష్మి, బాబురావు (ప్రైవేటు ఉద్యోగి)
సెయింట్ జోసెఫ్(9వ తరగతి)
అండర్-14 2023 స్కూల్‌గేమ్స్‌లో బంగారు పతకం
టెన్నిస్‌లో జాతీయ పోటీలకు ఎంపిక కావడం, క్రీడా కోటాలో గ్రూప్ ఉద్యోగం

అక్షయ శ్రీకాకుళం
విను, లక్ష్మణరావు (ప్రైవేటు ఉద్యోగి)
సెయింట్ జోసెఫ్ (8వ తరగతి)
అండర్-14 కాకినాడలో రాష్ట్రస్థాయి పోటీల్లో నాలుగో ర్యాంకు
జాతీయస్థాయి పోటీల్లో గుర్తింపు

జయసాయి శ్రీకాళహస్తి
వాణిశ్రీ, వరదరాజులు (ఆటోడ్రైవర్)
విక్రం జూనియర్ కళాశాల, ఇంటర్ ప్రథమ సంవత్సరం
అండర్-17 ఐటా పోటీల్లో రాణింపు
క్రీడాకోటాలో పోలీసు ఉద్యోగం

హోరాహోరీగా టెన్నిస్ పోటీలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి వేదికగా జరుగుతున్న 69వ లాన్‌టెన్నిస్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పాల్గొన్న క్రీడాకారులతో రాష్ట్రస్థాయి జట్టును ఎంపిక చేయడంలో నిర్వాహకులు తలమునకలయ్యారు. విక్రం టెన్నిస్ అకాడమీ, రిపబ్లిక్ క్లబ్, శుకబ్రహ్మాశ్రమం వద్ద ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. అండర్-14, 17, 19 విభాగాల నుంచి రాష్ట్రస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు దిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ పోటీల్లో అర్హత సాధించి గుర్తింపు పొందేందుకు క్రీడాకారుల మధ్య పోరు రసవత్తరంగా సాగుతోంది. ముగింపు సందర్భంగా సోమవారం నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా వస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు కిషోర్, భార్గవిలు సంయుక్తంగా తెలిపారు.

విద్యాహక్కు చట్టం సవరించాలి

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ఇప్పటికే పనిచేస్తున్న ఉపాధ్యాయులు సైతం టెట్ రాయాలని నిర్బంధం చేస్తున్న నేపథ్యంలో విద్యాహక్కు చట్టం-2009 సవరించాలని పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డి డిమాండు చేశారు. స్థానిక గిరింపేట పురపాలకోన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పింఛను విధానాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. డీవైఈవోలుగా పూర్తి అదనపు బాధ్యతలతో నియమించిన పుడు జడ్పీ ప్రధానోపాధ్యాయులకు అవకాశం ఇవ్వాలని, ఏకీకృత సర్వీస్ నిబంధనలకు సంబంధించి కోర్టు కేసు పరిష్కరించి, డీఈవో, డీవైఈవో, ఎస్‌సీఈఆర్‌టీ, డైట్ కళాశాల, జూనియర్ అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ పీఆర్సీ, డీఏ, ఇతర భత్యాలను ప్రభుత్వం విడుదల చేయాలని చెప్పారు. హైస్కూల్ ప్లస్‌లలో శాశ్వత పోస్టుల్లో ఉపాధ్యాయులను భర్తీ చేయాలన్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కన్నన్, విజయభాస్కర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్ వ్యసనం.. భవిష్యత్తు నాశనం

యువత డ్రగ్ వ్యసనాలకు లోనై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సంస్థ ఐఎంసీ - పవర్‌స్లైడ్ ఆధ్వర్యంలో 'సే నో టు డ్రగ్స్' పేరిట 5కే రన్ కార్యక్రమాన్ని ఆదివారం నగరంలో నిర్వహించారు. భారీ సంఖ్యలో ప్రజలు, పోలీసులు, ఈగల్ సెల్ సభ్యులు పాల్గొన్నారు. గంగమ్మ గుడి ఛైర్మన్ మహేష్ యాదవ్, కార్పొరేటర్లు నరేంద్ర, నరసింహాచారి, ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణాచారి, ఎస్వీయూ సీఐ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం

స్కాన్ చేయండి.. విరాళాలు అందించండి

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు ఆలయంలో జరిగే అన్నదానం, అభివృద్ధి పనులు, గోసంరక్షణ ట్రస్టుకు విరాళాలు అందించేందుకు వీలుగా అధునాతన కియోస్క్ యంత్రాన్ని ఆలయ అధికారులు ఇటీవల అందుబాటులోకి తెచ్చారు. విరాళాలు చెల్లించాలనుకున్న భక్తులు మొదట భాషను ఎంచుకోవాలి. విరాళం చెల్లించాల్సిన పథకాన్ని ఎంచుకుని పేరు, ఫోన్ నంబరు, చెల్లించదలచిన నగదు ఎంచుకుంటే స్క్రీన్‌పై క్యూఆర్ కోడ్ వస్తుంది. అందులో నగదు నమోదు చేసి ఓకే నొక్కితే విరాళం స్వీకరించి.. భక్తులకు రసీదు అందిస్తుంది. భక్తులు సులభ పద్ధతిలో విరాళాలు చెల్లించొచ్చు. ఈ విరాళాల స్వీకరణ కేంద్రం, అన్నదాన భవనం, వినాయక సదన్ వద్ద భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. -న్యూస్‌టుడే, కాణిపాకం

మేడసానికి.. జానమద్ది పురస్కారం

పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప నుంచి సత్కారం అందుకున్న అవధాని మేడసాని మోహన్

కడప (మారుతీ నగర్), న్యూస్‌టుడే: ప్రముఖ సాహితీ వేత్త, బ్రౌన్ గ్రంథాలయ రూపశిల్పి దివంగత డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి జయంతిని పురస్కరించుకుని కడపలోని సీపీ బ్రౌన్ కార్యాలయంలో ఆదివారం జానమద్ది సాహితీపీఠం పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జానమద్ది సాహితీ పీఠం పురస్కారాలను తెలుగు రాష్ట్రాలకు చెందిన డాక్టర్ మేడసాని మోహన్ (తిరుపతి), డాక్టర్ రేవూరు అనంత పద్మనాభరావు (హైదరాబాద్), ఏపీ రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ(హైదరాబాద్)కు, గ్రంథాలయ సేవా పురస్కారాన్ని మరెఅంకెగౌడ (కర్ణాటక)కు ప్రదానం చేశారు. పురస్కారం కింద రూ.10 వేల నగదు, శాలువాతో అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ తెలిపారు.

మారనున్న ముఖచిత్రాలు

ఎస్సీ కాలనీలకు నిధులు

పీఎంఏజీవై పథకానికి ఎంపికైన సీయూ కండ్రిగ గ్రామం

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: గత ప్రభుత్వ పాలనలో ఎస్సీ కాలనీలను పూర్తిగా వదిలేశారు. ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నా పట్టించుకున్న నాథుడే లేకుండా పోయారు. కానీ కూటమి ప్రభుత్వం ఎస్సీ కాలనీల అభివృద్ధికి నిధులు మంజూరు చేసింది. ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన (పీఎంఏజీవై) పథకంలో భాగంగా అభివృద్ధికి శ్రీకారం చుట్టనుంది.

ఇవీ వివరాలు..

జిల్లా: తిరుపతి **మండలాలు:** 19
ఎంపికైన గ్రామాలు: 52
మంజూరైన నిధులు: రూ.10.42 కోట్లు

గ్రామానికి రూ.20 లక్షలు..

50 శాతం కన్నా ఎక్కువ ఎస్సీ జనాభా నివసిస్తూ, అభివృద్ధికి దూరంగా ఉన్న గ్రామాలను కేంద్రం గుర్తించింది. ఒక్కో గ్రామానికి సుమారు రూ.20 లక్షలు మంజూరు చేయనున్నారు. వాటితో 2025-26 ఏడాదిలో తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్లు, మురుగు కాలువలు నిర్మించనున్నారు. జీవనోపాధి ప్రాధాన్య రంగాలపై అవగాహన కల్పించి జీవన విధానంలో మార్పు తీసుకురానున్నారు.

రెండేళ్లలో ప్రాధాన్య క్రమంలో..

ఇప్పటికీ చాలా గ్రామాల్లో తాగునీరు, మురుగు కాలువలు, రోడ్లు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇకపై అలాంటి గ్రామాల రూపురేఖలు మారనున్నాయి. ఈ నేపథ్యంలో మంజూరైన నిధులతో ఆయా శాఖల అధికారులు అంచనాలు రూపొందించి పనులు చేయాల్సి ఉంటుంది. రెండేళ్లలో ప్రాధాన్య క్రమంలో ఖర్చు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

మహిళతో రాపిడో రైడర్ అసభ్య ప్రవర్తన

తిరుపతి(నేరవిభాగం): మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన రాపిడో రైడర్‌పై కేసు నమోదు చేసినట్లు అలిపిరి ఎస్ఐ లోకేష్ తెలిపారు. తిరుపతికి చెందిన పెద్దయ్య రాపిడో బైక్ రైడర్‌గా వ్యవహరిస్తున్నాడు. అంకుర ఆసుపత్రి వద్ద ఓ మహిళ బ్యూటీ పార్లర్ నుంచి ఇంటికి వెళ్లేందుకు రాపిడో బైక్ కోసం నమోదు చేసుకుంది. శనివారం అర్ధరాత్రి బైక్ రైడర్ ద్విచక్ర వాహనంపై మహిళను ఇంటి వద్దకు తీసుకెళ్లాడు. వాహనం దిగేటప్పుడు అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేయడంతో భర్త, బంధువులు వచ్చి నిందితుడికి దేహశుద్ధి చేశారు. విధుల్లో ఉన్న సీఐ రామ్‌కిషోర్ నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అర్బన్ తహసీల్దారు ముందు ప్రవేశపెట్టి బైండోవర్ చేసినట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సమాధుల పండుగ

పాకాల, న్యూస్‌టుడే: దివంగతులైన తమ పూర్వీకుల ఆత్మలకు శాంతిని కోరుతూ సకల ఆత్మల(సమాధుల) పండుగను క్రైస్తవ సోదరులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దూరప్రాంతాల్లో ఉన్నవారు సైతం పాకాలకు వచ్చి సమాధుల తోటలోని బంధువుల సమాధుల వద్దకు వెళ్లి పూలతో అలంకరించారు. కొవ్వొత్తులు వెలిగించి వారి ఆత్మశాంతిని కోరుతూ స్మరించుకున్నారు. సీఎస్ఐ చర్చి పాస్టర్ ప్రేమ్‌కుమార్, ఆర్సీఎం చర్చి ఫాదర్ ఆంటోని రాజ్, సంఘస్థులు సమాధుల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

సమాధుల తోట వద్ద ప్రార్థనలు

బ్యాంక్ ఆఫ్ బరోడా Bank of Baroda టి.పి. ఏరియా బ్రాంచ్, తిరుపతి.
ప్రతాప్ థియేటర్ ఎదురుగా, తిరుపతి - 517501

సంక్షిప్త పద్ధతిన వాహనం ఇ-వేలం ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకమునకు మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలు/ హామీదారులకు తెలియజేయునది ఏమనగా పార్టీలు అమలు చేసిన తనఖా / ఋణ ఒప్పందం కింద సంక్రమించిన అధికారాలను ఉపయోగించి, క్రింద పేర్కొన్న తనఖాలో ఉన్న మోటారు వాహనాన్ని బ్యాంక్ తిరిగి స్వాధీనం చేసుకున్న / జప్తు చేయబడిన మరియు క్రింద పేర్కొన్న ఖాతా/ఖాతాలలో బకాయిలను వసూలు చేయడానికి వాహనం "ఎక్కడ ఉందో అలాగే", "ఎక్కడ ఉందో అలాగే" మరియు "ఏది ఉందో అలాగే" ప్రాతిపదికన విక్రయించబడునని ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

ఋణగ్రహీత/లు/హామీదారు పేరు మరియు చిరునామా	శ్రీ వేముల రవితేజ, తండ్రి : వి. మదన్ మోహన్, చిరునామా : E4, నేతాజీ కాలనీ, కరకంబాడి రోడ్డు, రేణిగుంట, తిరుపతి-517520 A/c No: 75520600010547, CIF ID: BH5066957
మొత్తం బకాయి	తేది.26-10-2025 నాటికి రూ.10,78,259.33 పైసలు
వాహనం తయారీ మోడల్ ఆర్‌టిఓ రిజిస్టర్డ్ నెం. రిజిస్టర్డ్ తేది	Model : RENAULT TRIBER RXZ MT 1L ECE Make:2023 ChasisNo.:MEERBC002P6184724 EngineNo.:B4DF424E035235 Colour:White Vehicle Regn.No.:AP40AA2297 Fuel: Petrol
ఇ-వేలం తేది, సమయం, ప్రారంభ సమయం, ముగింపు సమయం	తేది.18-11-2025, మధ్యాహ్నం గం.02.00 నుండి సాయంత్రం గం.05.00 వరకు
బిడ్ సమర్పించుటకు చివరి తేది మరియు సమయం	తేది.18-11-2025, ఉదయం గం.11.00 లలోపు
రిజర్వు ధర : ధరావతు (ఇఎమ్‌డి) : బిడ్ పెంపుదల మొత్తం :	రూ.4,80,000/- రూ.48,000/- రూ.10,000/-
బయానా (ఇఎమ్‌డి) డిపాజిట్ చేయవలసిన ఖాతా నెం. : ఐఎఫ్‌యస్‌సి కోడ్ : బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ :	A/cNo.75520015181869 IFSC : BARB0VJTIPA టి.పి. ఏరియా శాఖ, తిరుపతి.
వాహనం / చరాస్తి తనిఖీ తేది & సమయం	తేది.03-11-2025 నుండి తేది.17-11-2025 వరకు ఉదయం గం.10.30 ని.ల నుండి సాయంత్రం గం.04.30 గం.ల వరకు
వాహనం / చరాస్తి పార్కింగ్ ప్రదేశం	పార్కు చేయబడిన పార్కింగ్ యార్డ్: M/s. భాగ్యలక్ష్మి ఆటో ఫైనాన్స్, హీరో షోరూమ్ ప్రక్కన, రేణిగుంట రోడ్డు, తిరుపతి - 517520

పార్కింగ్ యార్డ్ నుండి వాహనాన్ని విడుదల చేసే తేది వరకు వాహన పార్కింగ్ చార్జీలు మరియు ఆర్.టి.ఓ. సంబంధిత చార్జీలను బిడ్డర్ భరించాలి.

పైన పేర్కొన్న క్రమసంఖ్య కోసం బ్యాంక్‌నెట్ ఆస్తి ID & వేలం ID వివరాలు కింద

క్రమసంఖ్య	Baanknet Property ID	Auction ID
1.	BARB0BH5066957	

విక్రయానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం, దయచేసి ఆన్‌లైన్ పోర్టల్ https://baanknet.com ఆసక్తి గల బిడ్డర్లు శ్రీ కె. మునిశేఖర్ గారిని మొబైల్ నెం. 9441152177 నందు సంప్రదించవచ్చును.

తేది: 29-10-2025, ప్రదేశం: తిరుపతి
సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

చేపల వేటకు వెళ్లి వృద్ధుడి దుర్మరణం

చౌడేపల్లె, న్యూస్‌టుడే: చేపల వేటకు వెళ్లిన వృద్ధుడు మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. 29ఎ.చింతమాకులపల్లెకు చెందిన మునస్వామి (65) పుంగనూరు- చౌడేపల్లె ప్రధాన మార్గం పక్కనున్న వ్యవసాయ క్షేత్రంలో నివాసం ఉంటున్నారు. సమీపంలోని చింతమాకులపల్లె చెరువులో చేపలు పట్టేందుకు శనివారం వెళ్లారు. ఆదివారం ఉదయం దుస్తులు ఉతికేందుకు వెళ్లిన మహిళలకు నీటిలో మృతదేహం కనిపించింది. వారు గ్రామస్థులకు తెలియజేయడంతో మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

ప్రమాదంలో గాయపడి.. బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: తుంబకుప్పం గ్రామానికి చెందిన ఉమాశంకర్(25) గత నెల 29న స్వగ్రామం నుంచి చిత్తూరుకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా మార్గమధ్యలో కాటప్పగారిపల్లె వద్ద అదుపు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతడు తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాసులు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వృద్ధుడి మృతి

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో వృద్ధుడు మృతిచెందిన ఘటన పట్టణంలోని మేలుపట్ల వద్ద ఆదివారం చోటుచేసుకుంది. చౌడేపల్లి మండలం కాటిపేరి గ్రామానికి చెందిన గంగప్ప(60) మేలుపట్ల వద్ద పెట్రోలు బంకులో ఆదివారం ఇంధనం నింపుకొని వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ గంగప్పను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై హరిప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని..

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు మందలించారని ఇంటర్ విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. నాగిరెడ్డిపల్లె పంచాయతీ చల్లావారిపల్లెకు చెందిన చెంగ్రాయప్ప కుమార్తె లావణ్య (17) పలమనేరు పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శనివారం కళాశాలకు వెళ్లకపోవడంతో ఆదివారం ఉదయం తల్లిదండ్రులు నిలదీశారు. దీంతో మనస్తాపానికి గురై గ్రామ సమీపంలోని మునీశ్వర స్వామి కొండపై చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. లావణ్య తండ్రి ఫిర్యాదు మేరకు పెద్దపంజాణి ఎస్సై మారప్ప కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకలి తీరుస్తున్నా.. ఆదరణ కరవు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కానీ వారికి వేతనాలు సకాలంలో అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వంటలు చేసేందుకు అప్పులు చేస్తున్నట్లు చెబుతున్నారు.

జిల్లాలో వివరాలు..

పథకం: మధ్యాహ్న భోజనం
కార్మికులు: 3,250 మంది
గౌరవ వేతనం: రూ.3 వేలు
నెలకు ఖర్చు: రూ.80 లక్షల నుంచి రూ.85 లక్షలు
చెల్లింపులు:
పాఠశాల విద్యార్థికి: రూ.5.45
ఉన్నత పాఠశాల: రూ.8.15

ఇస్కాన్‌లో రెండు నెలలుగా..

తిరుపతి ఇస్కాన్ పరిధిలో మధ్యాహ్న భోజన పథకం 395 పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. వీటిల్లో పనిచేసే కార్మికులకు జులై వరకు వేతనాలు చెల్లించినట్లు వివరాలు నమోదు చేశారు. తర్వాత నుంచి బకాయిలు వదిలేశారు. మంచి ఆర్థిక పరిపుష్టి కలిగిన ఇస్కాన్ లాంటి సంస్థలోనే వేతనాలు, ఖర్చులను కార్మికులకు జమ చేయకపోతే ఇబ్బందులు పడుతున్నట్లు కార్మికులు వాపోతున్నారు.

అధికంగా డిమాండ్లు.. మధ్యాహ్న భోజనం పథకంలో పనిచేసే కార్మికులకు ప్రతినెలా 5 లోపు వేతనాలు చెల్లించాలని, సిబ్బందికి గుర్తింపు కార్డులు, ఏకరూప దుస్తులు ఇవ్వాలని కార్మికులు డిమాండు చేస్తున్నారు. ప్రస్తుతం ఇస్తున్న నెలవారీ వేతనం రూ.3 వేల నుంచి రూ.10 వేలకు పెంచాలని కోరుతున్నారు. గ్యాస్, వంట పాత్రలను ప్రభుత్వం సరఫరా చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని వేడుకుంటున్నారు.

నిధులొస్తే జమచేస్తాం.. రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇస్తే జమ చేస్తాం. దీనిలో విద్యాశాఖ ప్రమేయం లేదు. జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు సెప్టెంబరు వరకు బిల్లులు చెల్లించాం. అక్టోబరు నెలకు సంబంధించినవి జమకావాలి. ఇస్కాన్ వారు జులై వరకు చెల్లించారు. ఆగస్టు మాసానివి గత గురువారం జమ చేసినట్లు తెలిపారు. - కేవీఎన్.కుమార్, డీఈవో, తిరుపతి

EENADU e Classifieds

HEALTH & CARE

PAEDIATRIC

శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పుట్టిన బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

JOBS

TELE CALLERS Female Qua: Any Degree & Basic System Knowledge. N. Sreenatha Reddy Recovery Agency, Bairagipatteda, Tirupati. ✆ 90328 01545.

PART TIME Jobs for Teachers with Experience and Fresher Wisdom Academy, SV Nagar, Tirupati. ✆ 98660 87500, 83415 54014.

Study Power (Education Loans)నందు పనిచేయుటకు Branch & Relationship Managers కావలెను. ✆ 9154133491.

తిరుపతి వరదరాజస్వామి గుడి వద్దనున్న IOC పెట్రోల్ బంకు నందు పనిచేయుటకు పంపు బాయ్స్/ గర్ల్స్ కావలెను. ✆ 94922 35378, 98662 33003.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

INVESTMENT PLOTS/ Farm House Plots/ Villa Plots for Sale: Lucky Ventures (India's No-1 Real Estate Company). ✆ 91145 61456.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU THE e WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి

B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

(c) eenadu

తిరుపతి

•తిరుపతి •చంద్రగిరి

ఫార్మసీ కళాశాలలో సంగీత పోటీలు

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ గ్రూప్ సాంగ్ దక్షిణ ప్రాంత స్థాయి పోటీలు వెంకట్రామాపురంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపల్, తిరుపతి ప్రాంత ప్రెసిడెంట్ నిరంజన్‌బాబు ఆధ్వర్యంలో భారత్ వికాస్ పరిషత్ జాతీయ కార్యదర్శి జనరల్ డీపీ శర్మతో పాటు పలువురు అతిథులు ప్రారంభించారు. దక్షిణ ప్రాంతంలోని వివిధ రాష్ట్రాల నుంచి పోటీలలో పాల్గొన్న బృందాలు తమ సంగీత ప్రతిభను ప్రదర్శించాయి. ప్రతిభ చాటిన వారికి ప్రోత్సాహక బహుమతులను అందించారు. జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం వీసీ రాణిసదాశివమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న తిరుపతి ఆర్యవైశ్యుల సంఘం సభ్యులు

ఘనంగా వన మహోత్సవం

చంద్రగిరి, న్యూస్‌టుడే: శ్రీవారి పాదాల మెట్ల మార్గం సమీపంలోని నారాయణి గార్డెన్స్‌లో తిరుపతి ఆర్యవైశ్యుల కార్తిక సంధ్య ఆకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా కార్తిక మాస వన మహోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు ఆకట్టుకున్నాయి. హాజరైన వారికి తిరుపతి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దుంపకుర్తి నరసింహులు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్తిక సంధ్య ఆకాడమీ గౌరవ అధ్యక్షుడు నరసింహులు, మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు, అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి శ్యాంసుందర్, కోశాధికారి మధుసూదనరావు, ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కన దీపోత్సవం.. తిరుపతి(బైరాగిపట్టెడ): శ్రీకోదండరామస్వామి ఆలయ దక్షిణ మాడ వీధిలోని చిగురు ఆధ్యాత్మిక కేంద్రంలో ఈనెల 5న తేదీన కార్తిక పౌర్ణమి సందర్భంగా దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ కేంద్ర వ్యవస్థాపకుడు హనుమంతరావు తెలిపారు.

అవినీతి నిర్మూలనతోనే అభివృద్ధి

తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: సమాజంలో అవినీతిని నిర్మూలిస్తేనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని తుడా ఛైర్మన్ సి.దివాకర్ రెడ్డి అన్నారు. తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఆదివారం విజిలెన్స్ అవేర్నెస్ వీక్- 2025 ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎస్వీయూ రెక్టార్ అప్పారావు, వర్సిటీ వీసీ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మఠం భవన పునర్నిర్మాణ నిర్ణయంపై హర్షం

తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే: హథీరాం మఠం భవనాన్ని పునర్నిర్మిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు కార్పొరేటర్ నరసింహాచారి తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు.

గుంతల రోడ్లు.. నరక ప్రయాణం

చంద్రగిరి, న్యూస్‌టుడే: మండలంలోని బుచ్చినాయుడుపల్లి పంచాయతీ పరిధి శంకరయ్యగారిపల్లి వద్ద సి.మల్లవరం-పీలేరు జాతీయ మార్గంలో పలుచోట్ల రోడ్డు ఛిద్రమై భారీ గుంతలు ఏర్పడి ఉన్నాయి. ఈ మార్గంలో గ్రావెల్, ఇసుక, కంకర టిప్పర్లు, లారీలు ఎక్కువగా ప్రయాణిస్తుండటంతో ఈ మార్గం, శంకరయ్యగారిపల్లి వద్ద జాతీయ జంక్షన్, మిట్టపాలెం పంచాయతీ వంతెన కింద, శ్రీసత్యసాయి కాలనీ సమీపంలో గుంతలున్నాయి. ఈ మార్గంలో రాత్రివేళల్లో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఇటీవల వర్షాలకు టన్నుల కొద్దీ బరువుగల వాహనాలు తిరగడంతో రోడ్డుపై ఏర్పడిన గుంతలు మరింత ప్రమాదకరంగా మారాయి.

శంకరయ్యగారిపల్లి వద్ద గుంతలు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం: రోడ్ల దుస్థితిపై ఎంపీడీవో, ర.భ.శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రోడ్లపై తడి ఆరాక మరమ్మతులు చేస్తాం.

-హారతి, పంచాయతీ కార్యదర్శి

మళ్లీ ఆ వైభవం చూస్తామా?

పాకాల, న్యూస్‌టుడే: పాకాల రైల్వే కూడలి పునర్ వైభవం కోసం ఎదురుచూస్తోంది. విశాలమైన ప్రాంగణంలో ప్రస్తుతం ప్రధాన స్టేషన్ వద్ద అభివృద్ధి పనులు జరుగుతున్నా ఏదో వెలితి కనిపిస్తోంది. చుట్టూ ఉన్న విశాల ప్రాంగణంలో కంపచెట్లు, ముళ్లపొదలు దర్శనమిస్తున్నాయి. లోకోషెడ్ ప్రాంతం బీళ్లుగా కనిపిస్తోంది. పరికరాలెన్నో తుప్పు పట్టి మట్టిలో కలిసిపోతున్నాయి.

వృథాగా వందలాది ఎకరాలు

పాకాల రైల్వే జంక్షన్‌లో నూతన భవన నిర్మాణం

205 ఎకరాల్లో విస్తరించినా..

దక్షిణమధ్య రైల్వే పరిధిలోని గుంతకల్ డివిజన్‌లో రెండో అతిపెద్ద రైల్వే జంక్షన్ పాకాల. 205 ఎకరాల్లో విస్తరించింది. 1890 లోనే అప్పటి బ్రిటీష్ వారు ప్రాధాన్యతనిచ్చారు. పరిసర ప్రాంతాల జంక్షన్లలో పని చేసే ఉద్యోగులకు ఇక్కడే సుమారు 400 క్వార్టర్లు ఉండేవి. ఉన్నతాధికారులైన ఆంగ్లేయుల కోసం 30 బంగ్లాలు నిర్మించారు. ఇక్కడి క్రూ పాయింట్ నుంచే గార్డులు, డ్రైవర్లు వెళ్లేవారు. బొగ్గు ఇంజిన్లను పునర్నిర్మించి మరమ్మతులు చేసి పంపించేవారు. బొగ్గు ఇంజన్లకు కాలం చెల్లడంతో లోకోషెడ్ ఖాళీ అయింది. డీజిల్ ఇంజిన్లొచ్చినా మరమ్మతుల వ్యవస్థను ఏర్పాటు చేయలేదు. చాంది సీచాక్ మినహా మిగిలిన క్వార్టర్లు ఖాళీ అయ్యాయి.

❖ పాకాల మార్గంలో ఇప్పటికీ 30 రైళ్లు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. తిరుపతి రైల్వే స్టేషన్‌ను ప్రస్తుతం ఆధునికీకరిస్తున్నా శ్రీవారి భక్తులు, ప్రయాణికులకు సరిపడా స్థలం లేదు. ఆ ఇబ్బందుల నుంచి వెసులుబాటుగా సమీపంలోని పాకాలకు రైళ్లను తరలించి ఇక్కడి నుంచి నడిపే అంశాన్ని అధికారులు పరిశీలించాలి.

వీటిపై దృష్టి సారిస్తే..

❖ ఇక్కడ విశాలంగా ఉన్న ఖాళీ స్థలంలో కోచ్ మరమ్మతులు లేదా నిర్మాణ వ్యవస్థను ఏర్పాటు చేయవచ్చు.

❖ ఖాళీ స్థలంలో ప్రత్యేక షెడ్లను ఏర్పాటుచేసి రవాణాను ప్రోత్సాహించేందుకు అవకాశం ఉంది. రైల్వే పరికరాలు, ప్రైవేటు కంపెనీల గిడ్డంగులు సైతం ఇక్కడ ఏర్పాటు చేయవచ్చు.

❖ క్వార్టర్ల స్థలంలో మరిన్ని రైల్వే అనుబంధ పరిశ్రమలు, కార్యాలయాలు నిర్మించి యువతకు ఉపాధి కల్పించవచ్చు.

❖ పాకాల- తిరుపతి మధ్య రెండోలైన్ సాకారమైతే మరిన్ని రైళ్లతో సందడి పెరిగే అవకాశం ఉంటుంది.

ముగిసిన బాలోత్సవం

శ్రీగోవిందరాజస్వామి డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా జరిగిన బాలోత్సవం ఆదివారం ముగిసింది. బాలోత్సవం వ్యవస్థాపకులు మల్లారపు నాగార్జున మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా బాలోత్సవం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ముగింపు సమావేశానికి సాకం నాగరాజ, గార్లపాటి దామోదర నాయుడు, జి.ఎన్.రెడ్డి, ఏనుగు అంకమనాయుడు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు. - **న్యూస్‌టుడే, తిరుపతి(విద్య)**

టెక్నీషియన్ల యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

తిరుపతి(గాంధీరోడ్డు): జిల్లా ఎలక్ట్రానిక్ టెక్నీషియన్ల యూనియన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. తిరుపతిలోని ప్రభుత్వ యువజన వసతిగృహంలో ఆదివారం యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా మణి, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ, కార్యదర్శిగా టి.ధనంజయులు, సంయుక్త కార్యదర్శిగా గిరి, కోశాధికారిగా నరసింహారెడ్డి తదితర సభ్యులను ఎన్నుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: సమస్య: బీటీఆర్ పురంలోని రెండోలైనులో మురుగుకాలువ వ్యర్థాలతో పూడిపోయింది. - **కృష్ణమూర్తి, స్థానికుడు**

సమాధానం: పూడికతీత పనులు చేయిస్తాం.

-**మనోజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి**

తిరుపతి(గ్రామీణం), న్యూస్‌టుడే: చిగురువాడ గ్రామంలోని పాత పంచాయతీ కార్యాలయం వద్ద చేతి బోరు మరమ్మతుకు గురయ్యింది. - **శంకర్, స్థానికుడు**

సమాధానం: సిబ్బందికి సూచనలు చేసి చేతి బోరు మరమ్మతు చేయిస్తాం. -**దయాసాగర్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో**

చంద్రగిరి గ్రామీణ, న్యూస్‌టుడే: సమస్య: ఎ.రంగంపేట పంచాయతీ పరిధిలోని బ్రాహ్మణ వీధిలో నీటి పైపు పగిలి నీరు రోడ్డుపై పారుతోంది. -**వైఎుర్ల స్వామి, గ్రామస్థుడు**

సమాధానం: బ్రాహ్మణ వీధిలో పగిలిన వ్యర్థ నీరు ఎవరిదో గుర్తించి నోటీసులిస్తాం. నీరు బయటకు రాకుండా పైప్లైనుకు దిమ్మెలు వేసి, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహిస్తాం. -**సురేష్, పంచాయతీ కార్యదర్శి**

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: సమస్య: బాబు జగ్జీవన్‌రాం పార్క్ ఎదురుగా ఉన్న రోడ్డుపై గుంతలు ఎక్కువగా ఉన్నాయి. - **జనార్దన్, కేశవాయనగుంట**

సమాధానం: పరిశీలించి గుంతలు పూడ్చిస్తాం.

- **శ్యాంసుందర్, ఎఈఈ, నగరపాలిక**

సమస్య: బండ్ల వీధిలో రోడ్డుకు ఇరువైపులా చెత్త దిబ్బలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. వ్యాపారులు దుకాణాల్లోని వ్యర్థాలను కూడళ్లలో కుప్పలుగా వేస్తున్నారు.

- **నాగరాజు, పెద్దకాపు వీధి**

సమాధానం: చెత్త దిబ్బల్ని ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు చేపడతాం. -**యువ అన్వేష్, వైద్యాధికారి, నగరపాలిక**

యర్రావారిపాళెం, న్యూస్‌టుడే: పసుపులేటివారిపల్లిలో వీధి దీపాలు వెలగడం లేదు. -**రమేష్**

సమాధానం: కొత్తవి ఏర్పాటు చేయిస్తాం.

-**హేమలత, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: రెడ్డెమాన్యం తండాలో వీధి దీపాలు వెలగడం లేదు. - **నవీన్, స్థానికుడు**

సమాధానం: సిబ్బందితో మరమ్మతు చేయిస్తాం.

- **మేనక, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: కొత్తపల్లి గ్రామంలో మురుగు కాలువలు లేక దుర్గంధం వెదజల్లుతోంది. - **ఈశ్వర్, స్థానికుడు**

సమాధానం: నివేదికలు పంపించి సమస్యకి పరిష్కారం చూపుతాం. -**రవితేజ, పంచాయతీ కార్యదర్శి**

భవనాలకు మరమ్మతులు

తిరుపతి(ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీ యూనివర్సిటీలోని భవనాలు వర్షాలకు లీకేజీలతో విద్యార్థులు, సిబ్బంది, ఆచార్యులు సతమతమవుతున్నారన్న అంశాన్ని గత నెల 28వ తేదీ 'ఎస్వీయూ భవనాలకు లీకులు' శీర్షికన 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన యూనివర్సిటీ ఉన్నత అధికార యంత్రాంగం వర్సిటీలో మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.15 లక్షల వ్యయంతో ప్రకాశం భవనం పైభాగంలో లీకేజీలు నిరోధించే ప్రక్రియలో భాగంగా కాంక్రీట్ వేసే కార్యక్రమాన్ని మొదలుపెట్టారు.

ఈనాడు స్పందన

రహదారి పనులు

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: పాతకాల్వ వద్ద వకుళమాత ఆలయం ముఖద్వారం ఆర్చి వద్ద గుంతలను కంకరతో పూడ్చారు. ఆలయానికి వెళ్లే జాతీయ రహదారి వద ఉన్న ఆర్చి వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు గుంతలు పడింది. ఫలితంగా ఆలయానికి వచ్చే భక్తులు గుంతల వల్ల ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై ఇటీవల ఈనాడులో వార్త వెలువడింది. స్పందించిన అధికారులు గుంతలకు కంకర నింపి చదనుచేశారు.

ఆకస్మిక మరణం

మా ఇంటి దైవం
శ్రీమతి ఇలపా సావిత్రమ్మ గారు
తేది: 2-11-2025 ఆదివారం
స్వర్గస్తులైనారు. తదుపరి
దహనక్రియలు
తేది: 3-11-2025 సోమవారం
ఉ॥ 9.00 గం॥లకు
దేవేంద్ర థియేటర్ ప్రక్కన ఉన్న
హరిశ్చంద్ర శ్మశానవాటిక నందు
కార్యక్రమం జరుగునని
తెలియజేయడమైనది.
శోకతప్త హృదయాలతో..

కీ॥శే॥ శ్రీమతి ఇలపా సావిత్రమ్మ గారు
W/o కీ॥శే॥ ఇలపా సుబ్రమణ్యం గారు
ప్రెసిడెంట్, శ్రీ కల్పకాంబిక నీలకంఠేశ్వర
స్వామి వారి దేవాలయం
భవాని నగర్, తిరుపతి.

ఇట్లు
కుటుంబ సభ్యులు
Cell: 80742 78523

కనులవిందుగా భరతనాట్య ప్రదర్శన

శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన చిన్నారుల భరతనాట్య ప్రదర్శన సందర్శకులను కనువిందు చేసింది. చెన్నైకు చెందిన ఆరుద్ర నృత్య అకాడమీ చిన్నారుల భరతనాట్య ప్రదర్శన జరిగింది.

-**న్యూస్‌టుడే, తిరుపతి(నగరం)**

పాచిపట్టిన పుష్కరిణి

పేరూరు బండపై పాతకాల్వ వద్ద ఉన్న వకుళమాత ఆలయం పుష్కరిణి పాచిపట్టి అధ్వానంగా మారింది. వర్షాలకు పుష్కరిణిలో నీళ్లు నిలిచిపోయాయి. దీంతో రాతికట్టడంతో నిర్మించిన పుష్కరిణి పాచిపట్టింది. నీళ్లు పసుపురంగులోకి మారాయి.

-**న్యూస్‌టుడే, తిరుపతి(గ్రామీణ)**

బాబోయ్ శునకాలు

స్థానిక తితిదే పరిపాలనా భవనం ఆవరణలో నిత్యం శునకాల తాకిడి ఎక్కువవుతోందని ఉద్యోగులు, పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికార యంత్రాంగం చర్యలు తీసుకుని శునకాల సమస్య నుంచి కాపాడాలని కోరుతున్నారు.

-**న్యూస్‌టుడే, తిరుపతి(తితిదే)**

రోడ్డు పక్కనే వ్యర్థాలు

దిగువరెడ్డివారిపల్లి రోడ్డుపక్కన చెత్త నిల్వలతో పేరుకున్నాయి. దుర్వాసనతో రాకపోకలు సాగించే వాహనదారులు అవస్థ పడుతున్నారు. సమస్య పంచాయతీ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ ఈవో చంద్రశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా.. చెత్తాచెదారం తొలగించి దోమల నివారణకు చర్యలు చేపడతామన్నారు. -**న్యూస్‌టుడే, చంద్రగిరి**

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి నా కక్షిదారురాలు అయిన ఎన్.శ్రీదేవి భర్త డా॥ వి.నటరాజ్ ప్రసాద్, డి.నెం. 556, బాలాజీ కాలనీ, తిరుపతి వారి సూచనల మేరకు తెలియజేయడం ఏమనగా!

క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి శ్రీమతి వి.రాణీ రుద్రమదేవి భర్త వీరమాచనేని క్రిష్ణరామ మోహన్ రావుకి డాక్యుమెంట్ నెం. 1441/1980 తేది. 14.03.1980 హక్కు విడుదల పత్రం ద్వారా సంక్రమించి తదుపరి ఆమెకు ఓ.వెంకటరెడ్డి తండ్రి ఓ. సిద్దారెడ్డి గారికి డాక్యుమెంట్ నెం. 6231/1990 తేది. 25.07.1990 మరియు డాక్యుమెంట్ నెం.6232/1990 తేది. 27.07.1990 చిత్తూరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో నమోదు కాబడి తదుపరి ఓ.ప్రమీల, ఓ.ప్రియాంక తండ్రి లేట్ ఓ.శ్రీధర్ రెడ్డి అనువారికి డాక్యుమెంట్ నెం.4003/2008 తేది. 24.07.2008 దాన శెటిల్‌మెంట్ దస్తావేజు ద్వారా సంక్రమింపజేసి తదుపరి వారు ఇరువురు భాగపరిష్కారము చేసుకొని, సదరు భాగపరిష్కారంలో షెడ్యూలు దాఖలా ఆస్తి ఓ.ప్రియాంకకు సంక్రమించి సదరు ప్రియాంక శ్రీరాం సిటీ యూనియన్ ఫైనాన్స్ నందు 3 మార్లు తనఖా ఉంచి సదరు తనఖాను తీర్చి, ఆమె మేరకు ఎటువంటి తనఖాలు అప్పులు ఇతర లావాదేవీలు లేవని రూఢీ చేయడం వలన, సదరు ఆస్తికి మున్సిపల్ పన్నులు వగైరాలు ఆమె పేరు మీద ఉన్నందున ఆమెకు పూర్తి హక్కు, బాధ్యతలు, స్వాధీనంలో ఉన్నందున సదరు ఆస్తిని నా కక్షిదారురాలు కొనుగోలు చేయుటకు నిశ్చయించడమైనది. సదరు ఆస్తికి సంబంధించిన కొన్ని పత్రములు అనగా శ్రీ బాలాజీ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటి తిరుపతి వారు వ్రాయించి ఇచ్చిన సేల్‌డీడ్ మరియు తేది.14.3.1980 సం॥న శ్రీమతి రాణీ రుద్రమాదేవికి, ఎస్.పి.వీరరాఘవుల నాయుడు మరియు ముగ్గురు వ్రాయించి ఇచ్చిన డాక్యుమెంట్ 1441/1980 దాన సెటిల్‌మెంట్ దాస్తవేజులు దారిపోయినవని చెప్పుచున్నారు. కావున క్రింద కనబరచిన ఆస్తిపై ఎవ్వరికైననూ ఎటువంటి హక్కు, అనుభవము, అప్పులు, తనఖాలు మరియు ఏవిధమైన లావాదేవీలు ఏవైనా ఉన్నయెడల సదరు లావాదేవీలను అంతేకాక క్రింద కనబరచిన ఆస్తికి ఓరిజినల్ పత్రములు ఉన్నయెడల వాటిని కూడా ఎందులకు ఆ పత్రములు వారి దగ్గర ఉన్నదని తెలియగోరుచున్నాము. కావున క్రింద కనిన ఆస్తికి ఎవ్వరికైనా ఎటువంటి ఆక్షేపణలు ఉన్నయెడల ఈ ప్రకటన వెలువబడిన రోజు నుండి 14 రోజులలోగా తెలుపవలసినదిగా తెలియగోరుచున్నాము. అట్లు ఎటువంటి ఆక్షేపణలు లేనియెడల నా కక్షిదారురాలు సదరు ఆస్తికి ఎటువంటి ఆక్షేపణలు ఎవ్వరికి లేవని భావించి సదరు ఓ.ప్రియాంక తండ్రి లేట్ ఓ.శ్రీధర్ రెడ్డి, ఫ్లాట్ నెం.511, స్పందన టవర్స్, ఉప్పరపల్లి రోడ్డు, తుమ్మలగుంట, తిరుపతి వారి దగ్గర నుండి రిజిష్టరు పత్రము పొందగోరుచున్నది. తదుపరి ఎటువంటి ఆక్షేపణలు వచ్చినను అవి చట్టరీత్యా ఎంతమాత్రము చెల్లనేరవని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు: చిత్తూరు రి.డి, శ్రీబాలాజీ రి.డి, తిరుపతి సబ్-డి, నెం.29రు తిరుపతి గ్రామలెక్కదాఖలా, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ 1వ వార్డుకు చేరిన బాలాజీకాలనీ రెసిడెన్షియల్ ఏరియాలో టి.యస్.నెం.953గా యుండి, సబ్-డివిజన్ కాబడిన పిదప టి.యస్. నెం. 953/1ఎ లో గల డోర్ నెం. 1-5-530 రు గల జాగా మరియు సదరు జాగాలో నిర్మించియుండు బిల్డింగ్‌కు **హద్దులు: తూర్పు:** డోర్ నెం.1-5-543 గల ఇల్లు, **పడమర:** రోడ్డు, **ఉత్తరం:** రోడ్డు, **దక్షిణం:** డోర్ నెం. 1-5-531 గల ఇల్లు, ఈ నాలుగు హద్దులు మధ్యన తూర్పు-పడమర అడుగులు 72.5కు మీటర్లు 22.112, ఉత్తర-దక్షిణం అడుగులు 59 కు మీటర్లు 18.071, మార్పు చ.అ.4277.5లు లేక చ.గ.475లు గల జాగాయున్నూ, సదరు జాగాలో గ్రౌండ్ ఫ్లోర్ చ.అ.1773.5 లలో నిర్మించియుండు ఏ.సి.సి. కట్టుబడిన్నీ, మరియు ఇందుపై ఫస్ట్ ఫ్లోర్ చ.అ. 525లలో నిర్మించియుండు ఆర్.సి.సి. కట్టుబడిన్నీ, చ.అ. 735 లలో నిర్మించియుండు ఏ.సి.సి కట్టుబడిన్నీ, సదరు గ్రౌండ్ మరియు ఫస్ట్ ఫ్లోర్ ఇండ్లకు అమర్చియుండు తలుపులు, ద్వారములు, అలమర్లు, కిటికీలు, గవాక్షులు, కరెంటు సర్వీసు, మీటరు

ఎం.నాగరాజు, ఎం.భాగ్యశ్రీ, ఎం.ఎన్.చారుకేశ, న్యాయవాదులు,
1-5-599/1, బాలాజీ కాలనీ, తిరుపతి. సెల్: 9848304990

నారా రోహిత్ దంపతులను కలిసిన నాయకులు

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: చంద్రగిరి మండలం నారావారిపల్లెకు ఆదివారం వచ్చిన సినీ నటుడు నారా రోహిత్ దంపతులను శాప్ ఛైర్మన్ రవి నాయుడు, తాతయ్యగుంట ఆలయ ఛైర్మన్ నైనార్ మహేష్‌యాదవ్ కలిసి అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. నూతన దంపతులకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు కొట్టే హేమంత్‌రాయల్, రంజిత్‌కుమార్, ప్రకాష్, మధు, లోకేశ్ ఉన్నారు.

రోహిత్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న రవినాయుడు, మహేష్‌యాదవ్

తూముకుంట చెరువు గండి పూడ్చివేత

భాకరాపేట, న్యూస్‌టుడే: చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ గ్రామంలో తూముకుంట చెరువు పూర్తిగా నిండిపోవడంతో గండి పడింది. స్థానిక తెదేపా నాయకులు.. ఎమ్మెల్యే పులివర్తి నానికి తెలియజేయగా ఆయన ఆదేశాల మేరకు మండల అధికారులు త్వరితగతిన పనులు ప్రారంభించి గండిని పూడ్చివేశారు.

ఎస్సీ కాలనీలో స్థల వివాదం

తిరుపతి(గ్రామీణం), న్యూస్‌టుడే: గ్రామీణ మండలం తుమ్మలగుంట పంచాయతీలోని ఎస్సీకాలనీలో ఇరువర్గాల మధ్య ఆదివారం స్థల వివాదం చోటుచేసుకుంది. స్థానికులు మాట్లాడుతూ అరుంధతివాడలో దశాబ్దాలుగా ఆ స్థలంలో మాతమ్మ తిరునాళ్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆ స్థలాన్ని తుమ్మలగుంట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇతరులకు విక్రయించేశారని చెప్పారు. స్థలం కొనుగోలు చేసిన వ్యక్తి జేసీబీతో అమ్మవారి శూలాల్ని తొలగించి అక్కడ ఉన్న పిచ్చిమొక్కలు చదను చేసేశాడని వాపోయారు. స్థలం కొనుగోలు చేసిన వ్యక్తి మాట్లాడుతూ ఈ స్థలాన్ని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నుంచి కొనుగోలు చేశామన్నారు. దీనికి సంబంధించి పత్రాలు మా వద్ద ఉన్నాయన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మహారాష్ట్ర మంత్రి

తిరుచానూరు, న్యూస్‌టుడే: తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారిని ఆదివారం మహారాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి గిరీష్ మహాజన్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయన ఆలయం వద్ద సూపరింటెండెంట్ రమేష్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

'వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తున్నాం'

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకిద్దామని వైకాపా ఎస్సీ విభాగం నాయకులు పిలుపునిచ్చారు. తిరుపతిలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆదివారం వైకాపా ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు రాజేంద్ర ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. నాయకులు రామచంద్ర, పి.కృష్ణయ్య, చింతారాజేంద్ర, నల్లానిబాబు, అజయ్‌కుమార్, చెంగయ్య, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి(భవానీనగర్): వైద్య కళాశాలలను ప్రైవేటు రంగానికి అప్పగించే నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, జీవో 590ను రద్దు చేయాలని మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు.

దుకాణం షట్టర్ తెరిచి చోరీ

తిరుపతి(నేరవిభాగం): దుకాణం షట్టర్ తెరిచి రూ.40 వేలు నగదు కాజేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుపతి తూర్పు ఎస్ఐ హేమాద్రి వివరాల మేరకు.. స్థానిక పొర్లవీధికి చెందిన ఉదయ్‌కుమార్ నిమ్మకాయల వీధిలో శ్రీలక్ష్మీ శ్రీనివాస్ హోల్‌సేల్ శారీస్ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఆదివారం దుకాణంలో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదం: ప్రయాణికులు సురక్షితం

చంద్రగిరి, న్యూస్‌టుడే: అగరాల సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం తిరుపతి నుంచి చిత్తూరు వైపు వేగంగా వెళ్తున్న కారు టైర్ పేలింది. డ్రైవర్ వేగాన్ని తగ్గించగా వెనుక నుంచి వస్తున్న మరో కారు ఢీకొంది. వాహనాల్లోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. జాతీయ రహదారిపై కొంత సమయం వాహనాల రాకపోకలు స్తంభించాయి.

నిండుకుండల్లా చెరువులు

☛ నియోజకవర్గంలో నిండిన 166 తటాకాలు ☛ ఆయకట్టు రైతుల్లో ఆనందం

పేరూరు చెరువుకు చేరిన నీరు

తిరుపతి(గ్రామీణం), న్యూస్‌టుడే: వర్షాలకు మొంథా తుపాను తోడవడంతో ఎప్పుడూ నిండని చెరువులు సైతం నీటితో కళకళలాడుతున్నాయి. నియోజకవర్గంలో సుమారు దశాబ్దంగా నిండని చెరువులు నిండుకుండను తలపిస్తున్నాయి. పొలాన్ని నమ్ముకుని జీవించే రైతులు చెరువుల్లో నీళ్లు చూడగానే ఎక్కడలేని ఆనందంలో ఉన్నారు. మరో మూడేళ్లు వ్యవసాయానికి నీటి ఇబ్బంది ఉండదని రెట్టించిన ఉత్సాహంతో రబీకి సిద్ధమవుతున్నారు.

వ్యవసాయమే ప్రధాన జీవనాధారం

చంద్రగిరి నియోజకవర్గంలో తిరుపతి గ్రామీణ మండలం మినహా చంద్రగిరి, పాకాల, రామచంద్రాపురం, ఎర్రావారిపాళెం మండలాల్లో వ్యవసాయం అధికంగా ఉంది. ఈ ఐదు మండలాల్లో 404 చెరువులు ఉన్నాయి. తిరుపతి గ్రామీణంలో 30 శాతం మంది రైతులు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. చంద్రగిరి, పాకాల, రామచంద్రాపురం, ఎర్రావారిపాళెం మండలాల్లో సుమారు 80 శాతం మంది రైతులకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. ఇన్నాళ్లు బోరు బావుల్లోని నీటి మీద ఆధారపడి పంటలు సాగు చేశారు.

మండలం	మొత్తం చెరువులు	నిండిన చెరువులు
తిరుపతి గ్రామీణం	24	8
చంద్రగిరి	13	5
పాకాల	106	8
రామచంద్రాపురం	15	2
ఎర్రావారిపాళెం	246	143
మొత్తం	**404**	**166**

సాగుకు సన్నద్ధం

వర్షాల కారణంగా 166 చెరువులు నిండటంతో రబీలో పంటలు సాగుచేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు. ఈ ఐదు మండలాల్లో మరో 50 చెరువుల్లో 70 శాతం నీళ్లు చేరాయి. నవంబరు, డిసెంబరు నెలల్లో ఇదేవిధంగా వర్షాలు కురిస్తే మిగిలిన చెరువులు సైతం నిండిపోయే అవకాశం ఉంది. ఈ మండలాల్లో సుమారు 10 వేల ఎకరాలు ఆయకట్టు ఉంది. ప్రధానంగా రైతులు వరి, వేరుసెనగ, చెరకు, టమోటా తదితర కాయగూరలు సాగుచేస్తున్నారు. నియోజకవర్గంలో ఎర్రావారిపాళెం మండలంలో అత్యధికంగా చెరువులు నిండడం గమనార్హం.

36వ వర్ధంతి



మా ఇంటి దైవం, మా తండ్రి గారైన
శ్రీ మాంగాటి వెంకట్రామిరెడ్డి గారు
మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన మీరు
మానుండి దూరమై 36 సం॥లు గడిచినను
మీ మధురస్మృతులను మరువలేకున్నాము.
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని
ఆ భగవంతుని ప్రార్థిస్తూ... ఇట్లు

కీ॥శే॥ మాంగాటి వెంకట్రామిరెడ్డి గారు
జననం 03-04-1922
మరణం 03-11-1989

భార్య:
మాంగాటి రామలక్ష్మమ్మ
మరియు కుటుంబ సభ్యులు
తిరుపతి

(c) eenadu

శ్రీకాళహస్తి

• శ్రీకాళహస్తి • సత్యవేడు

శ్రీసూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు

ఏర్పేడు: గుడిమల్లం శ్రీపరశురామేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన శ్రీసూర్యదేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలతో క్షీరం, నారికేళం, వివిధ సుగంధ ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించారు. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

పర్యాటకులూ.. జలపాతాల చెంతకు వెళ్లవద్దు

నాగలాపురం, న్యూస్‌టుడే: నాగలాపురం మండలంలోని భూపతీశ్వరకోన, సద్దికూడుమడుగుల వద్దకు పర్యాటకులు, భక్తులు వెళ్లవద్దని ఎస్సై సునీల్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. వాగుల్లో నీటి ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో పాటు కోనల్లో ప్రమాదకర పరిస్థితులున్న నేపథ్యంలో ప్రమాదాలకు భక్తులు ఎదురెళ్లవద్దన్నారు. నిబంధనలు అతిక్రమించి జలపాతాల వద్దకు వెళ్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యర్థాల తొలగింపుతో శుభ్రత

వ్యర్థాల తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సేవా సమితి సభ్యులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: స్వచ్ఛ శ్రీకాళహస్తి ప్రధాన లక్ష్యంగా చేసుకున్నట్లు యువతరం సేవా సమితి సభ్యులు తెలిపారు. ముక్కంటి ఆలయాన్ని ఆనుకుని ఉన్న భక్తకన్నప్ప కొండపై వ్యర్థాల తొలగింపు లక్ష్యంగా ఆదివారం సేవా సమితి ఆధ్వర్యంలో ఎకో సేవియర్స్, స్వచ్ఛపౌండేషన్, భారతసేవా ఫౌండేషన్, మన గుడి-మనబడి సేవా సంఘాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వ్యర్థాలను పాలిథిన్ సంచుల్లో నింపి వాళ్ల సొంత వాహనాల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. భక్తులు సందర్శనకు వచ్చే ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు.

నాట్యం.. రసరమ్యభరితం

కళాకారుల నృత్య ప్రదర్శన

కార్తిక మాసాన్ని పురస్కరించుకుని సాంస్కృతిక ఉత్సవాల్లో బెంగళూరు శివనృత్యాలయ స్కూలు, నెల్లూరుకు చెందిన ప్రభుత్వ సంగీత కళాశాలకు చెందిన కళాకారులు తమదైన నృత్య ప్రదర్శనతో ఆహుతులను రంజింప చేశారు. కళాకారులకు ఆలయం తరఫున ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులు అందజేశారు. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

తిరుచ్చిపై ఆండాళ్ అమ్మవారు

పద్మసరస్సులో గోదాదేవి విహారం

నారాయణవనం: స్థానిక శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కార్తిక తెప్పోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం ఆండాళ్ అమ్మవారు (గోదాదేవి) తెప్పపై ఊరేగారు. అమ్మవారు వేదం, నాదం నడుమ తెప్పపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తితిదే సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, ఆలయ ప్రధానార్చకులు శ్రీధర్ భట్టాచార్య, అర్చకులు శ్రీనివాసభట్టాచార్య, నరసింహ రాఘవభట్టాచార్య, సిబ్బంది. పాల్గొన్నారు.

బారుల తీరు.. భక్తుల బేజారు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వాయులింగేశ్వరుని దర్శనార్థం వచ్చే భక్తులు ట్రాఫిక్ చిక్కులతో ఇబ్బందులు తప్పడం లేదు. ఆదివారం వాయులింగేశ్వరుని దర్శనార్థం భారీగా భక్తులు తరలివచ్చారు. పొన్నాలమ్మ ఆలయం వద్ద వాహనాలు భారీగా బారులు తీరాయి. కార్‌పార్కింగ్ డబ్బులు వసూలు చేసే వాహనాలు నిలుపుదల చేయడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో భక్తులు అసంతృప్తిని వ్యక్తం చేశారు.



(c) eenadu

మగధ్‌లో మహా ఉత్కంఠ!

- ఒకే కులం, బంధువుల మధ్యే చాలాచోట్ల పోటీ
- రెబల్స్ ప్రభావమూ అధికమే..

బిహార్‌లోని మగధ్ ప్రాంతంలో అసెంబ్లీ పోరు తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఎన్డీఏ, మహాగఠ్‌బంధన్‌ల మధ్యలో గట్టి పోటీ నెలకొంది. జన్ సురాజ్ పార్టీ అభ్యర్థులు, రెబల్స్ ఈ రెండు కూటములకు తలనొప్పిగా మారారు. ఈ ప్రాంతంలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకే కులం మధ్య పోటీ జరుగుతోంది. కొన్ని చోట్ల బంధువులే పోటీపడుతున్నారు. ఇక్కడి 5 జిల్లాల్లోని 26 అసెంబ్లీ నియోజకవర్గాల్లో చాలా చోట్ల రెండు కూటములూ ఒకే వర్గానికి టికెట్లిచ్చాయి. రాష్ట్రానికి దక్షిణాన ఉన్న మగధ్‌లో ఔరంగాబాద్, గయా, అర్వాల్, జెహానాబాద్, నవడా జిల్లాలున్నాయి.

బేలాగంజ్, బోధ్ గయా, బారాచట్టీ, వజీర్‌గంజ్, నవడా, హిసువా, ఔరంగాబాద్‌లలో ఎన్డీయే, మహాగఠ్‌బంధన్ కూటములు టికెట్లిచ్చిన అభ్యర్థుల సామాజిక వర్గాలు ఒకటే కావడం విశేషం.

ఎన్డీయేకి సవాలే..

2020 అసెంబ్లీ ఎన్నికల్లో మగధ్ ప్రాంతం ఎన్డీయేకు షాక్ ఇచ్చింది. పక్కనే ఉన్న షాబాద్ మాదిరిగానే ఇక్కడా ఫలితాలు అనుకూలంగా రాలేదు. గత ఎన్నికల్లో మగధ్‌లోని 26 సీట్లలో కేవలం 6 చోట్లే ఎన్డీయే గెలిచింది. మహాగఠ్‌బంధన్ 20 చోట్ల విజయం సాధించింది. జెహానాబాద్, ఔరంగాబాద్, అర్వాల్ జిల్లాల్లో ఎన్డీయే ఖాతానే తెరవలేదు. ఇక్కడా కుష్వాహా, ఎస్సీల్లో చీలికతో ఆ కూటమి నష్టపోయింది.

- గత ఎన్నికల్లో ఎల్జేపీ ఒంటరిగా పోటీ చేసింది. ఈసారి ఎన్డీయేలోకి తిరిగిరావడంతో ఈ ప్రాంతంలో 6 సీట్లు ఆ పార్టీకి దక్కాయి. మాజీ సీఎం జీతన్ రామ్ మాంఝీ నేతృత్వంలోని హెచ్ఏఎం పార్టీకి 5 సీట్లు దక్కాయి. ఎస్సీ వర్గాల వారిని ఆకట్టుకునేందుకు ఆ వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీలకు 11 సీట్లను ఎన్డీయే కేటాయించింది. ఈ వ్యూహాన్ని ఎదుర్కొనేందుకు ఆర్జేడీ పలు చోట్ల అభ్యర్థులను మార్చింది. గత ఎన్నికల్లో ఆ పార్టీ 15 సీట్లను గెలుచుకుంది.

తీవ్ర ఉత్కంఠ

బేలాగంజ్‌లో ఈసారి పోటీ మాత్రం తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. జెహానాబాద్ ఎంపీ, ఆర్జేడీ అగ్ర నేత సురేంద్ర ప్రసాద్ యాదవ్ అగ్ని పరీక్షను ఎదుర్కొంటున్నారు. 2024 నవంబరులో ఈ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో ఆయన కుమారుడు విశ్వనాథ్ యాదవ్ పరాజయం పాలయ్యారు. అదీ బంధువైన మనోరమా దేవి చేతిలో కావడంతో ఆయనకు తల తీసినట్లయింది. ఈసారీ వారి మధ్యే పోటీ నెలకొంది. దీంతో సురేంద్ర ప్రసాద్ యాదవ్ చావోరేవో అన్నట్లుగా కుమారుడి తరఫున ప్రచారం చేస్తున్నారు.

- బేలాగంజ్‌లో 10 నియోజకవర్గాలుండగా.. జేడీయూ ఒక్కచోటే పోటీ చేస్తోంది.
- బోధ్ గయాలోనూ ఆర్జేడీ, ఎల్జేపీల మధ్య ఒకే వర్గానికి చెందినవారు పోటీ పడుతున్నారు. అయితే పాశ్వాన్ వర్గానికి చెందినవారే 1972 నుంచి 2020 మధ్య 8 సార్లు విజయం సాధించారు.
- బారాచట్టీలోనూ ఒకే వర్గం పోటీపడుతోంది. ఇక్కడ జీతన్ రామ్ మాంఝీ బంధువు జ్యోతి దేవి, మాజీ ఎమ్మెల్యే మనవరాలు తనుశ్రీ మాంఝీ పోటీ చేస్తున్నారు.
- వజీర్‌గంజ్‌లో సీనియర్ కాంగ్రెస్ నేత అవధేశ్ సింగ్‌తో భాజపాకు చెందిన వీరేంద్ర సింగ్ తలపడుతున్నారు. వీరిద్దరూ ఒకే వర్గానికి చెందినవారు.
- నవడాలో కుటుంబంలోనే పేరు సాగుతోంది. జేడీయూ నుంచి విభా దేవి, ఆర్జేడీ నుంచి కౌశల్ యాదవ్ తలపడుతున్నారు. వీరిద్దరూ ఎన్నికలకు ముందు అటు ఇటు పార్టీలు మారారు.
- హిసువాలో భూమిహార్ వర్గానికి చెందిన నీతు కుమారి (కాంగ్రెస్), అనిల్ సింగ్ (భాజపా) పోటీ చేస్తున్నారు.
- ఔరంగాబాద్‌లోనూ ఈ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా రాజకీయాలను ప్రభావితం చేస్తున్న భూమిహార్ వర్గం (అగ్ర వర్గం) నుంచే అభ్యర్థులు పోటీపడుతున్నారు. కాంగ్రెస్ నుంచి ఆనంద్ సింగ్, భాజపా నుంచి త్రివిక్రమ్ సింగ్ తలపడుతున్నారు.

దడపుట్టిస్తున్న రెబల్స్

మగధ్ ప్రాంతంలో ఎన్డీయే, మహాగఠ్‌బంధన్ కూటములకు రెబల్స్ బెడద భారీగానే ఉంది. వారు స్వతంత్రులుగానూ, జన్ సురాజ్ పార్టీ తరఫున పోటీ చేస్తున్నారు. రెబల్స్ కారణంగా గోవింద్‌పుర్, గురువా, నబీనగర్‌లలో త్రిముఖ పోటీ నెలకొంది.

- గోవింద్‌పుర్‌లో ఆర్జేడీ రెబల్, సిటింగ్ ఎమ్మెల్యే ఎండీ కమ్రాన్.. అధికారిక అభ్యర్థి పూర్ణిమా యాదవ్‌కు చెమటలు పట్టిస్తున్నారు. ప్రత్యర్థి, ఎల్జేపీ అభ్యర్థికీ వణుకు పుట్టిస్తున్నారు.
- గురువాలో జేడీయూ రెబల్ అభ్యర్థి సంజీవ్ శ్యామ్.. ఎన్డీయే అధికారిక అభ్యర్థిని ఇబ్బంది పెడుతున్నారు.
- నబీనగర్‌లోనూ జేడీయూ రెబల్ అభ్యర్థితో అధికారిక అభ్యర్థికి తిప్పలు తప్పడం లేదు.

నేషనల్ డెస్క్



మాడవీధుల్లో విహరిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీఉగ్రశ్రీనివాసమూర్తి

శ్రీవారి ఆలయంలో కైశిక ద్వాదశి ఆస్థానం

తిరుమల, న్యూస్‌టుడే: కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో కైశిక ద్వాదశి ఆస్థానం ఆదివారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున 4.30 నుంచి 5.45 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీఉగ్రశ్రీనివాసమూర్తి మాడవీధుల్లో ఊరేగి భక్తులకు అభయ ప్రదానం చేశారు. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తి ఇరు దేవేరుల సమేతంగా కేవలం కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధుల్లో దర్శనమిస్తారు. అనంతరం స్వామి, అమ్మవార్లను బంగారు వాకిలి వద్ద వేంచేపు చేసి అర్చకులు పురాణ పఠనంతో కైశిక ద్వాదశి ఆస్థానాన్ని నిర్వహించారు. చిన్నజీయర్‌స్వామి, తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, డిప్యూటీ ఈవో లోకనాథం, పారుపత్తేదార్ బాల, ఎస్వీ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

హన్మంతూ.. అడవి వదిలిరా..!

- మావోయిస్టు అగ్రనేతకు కుటుంబ సభ్యుల విజ్ఞప్తి

ఈనాడు, హైదరాబాద్: మావోయిస్టు పార్టీలో లొంగుబాట్ల పరంపర కొనసాగుతున్న నేపథ్యంలో అగ్ర నేతల కుటుంబ సభ్యులు తమ వారిని జనజీవన స్రవంతిలో కలిసేలా ఒప్పించేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారు. పార్టీ అగ్రనేత పాక హన్మంతు అలియాస్ ఊకే గణేశ్.. కందమాల్ అటవీప్రాంతంలో కార్యకలాపాలు సాగిస్తున్నారనే సమాచారం ఆధారంగా ఆయన బావ ప్రదీప్ మరికొందరితో కలిసి అడవి వెళ్లారు. అక్కడ వారం రోజులు వేచి చూసి, కలవడం సాధ్యం కాకపోవడంతో 5 నిమిషాల నిడివి ఉన్న వీడియోతో పాటు లేఖ విడుదల చేశారు.

చదువు ఆపేసి.. అడవిబాట: నల్గొండ జిల్లా చండూరు మండలం పుల్లెంలకు చెందిన హన్మంతు బీఎస్సీ చదువుతున్నప్పుడే పీపుల్స్‌వార్ ఉద్యమానికి ఆకర్షితులై, చదువు మధ్యలోనే వదిలేసి అడవిబాట పట్టారు. ప్రస్తుతం కేంద్రకమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. మావోయిస్టు పార్టీలో సౌత్ రీజినల్ బ్యూరో (ఎస్‌ఆర్‌బీ) కేంద్ర కమిటీ ప్రతినిధిగా మార్గనిర్దేశం చేస్తున్నారు. ఆయనపై రూ.25లక్షల రివార్డు ఉంది.

లేఖలో ఏముందంటే..: 'మీరు 43 ఏళ్లుగా ప్రజల కోసం పోరాడుతున్నారు. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా లేవు. మీతోపాటు పనిచేసిన నేతలు జనజీవన స్రవంతిలో కలుస్తున్నారు. మీరు కూడా ఆ బాట అనుసరించండి. శేష జీవితాన్నీ ప్రజల కోసం పోరాడటానికి మావంతు సహకరిస్తాం' అని ప్రదీప్ కోరారు.

ఈ నెలలో 2 భారీ ప్రాజెక్టులకు అంకురార్పణ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రెండు భారీ పరిశ్రమలకు ఈ నెలలో భూమిపూజ నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ ఉక్కు కర్మాగారం, శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో రక్షణ రంగానికి చెందిన కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ (కేఎస్ఎస్ఎల్) నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ సంస్థలు రెండు దశల్లో కలిపి రూ.1,37,400 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. రెండు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల నిర్మాణ పనులు ఒకే నెలలో ప్రారంభించడం ద్వారా ప్రపంచ దృష్టిని ఆకర్షించాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఈ కార్యక్రమాలకు ఆయా శాఖల కేంద్ర మంత్రులు రానున్నారు.

మడకశిరలో రక్షణ రంగ పరికరాల ఉత్పత్తి

శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో భారత్ ఫోర్జ్ అనుబంధ సంస్థ కేఎస్ఎస్ఎల్‌కు ఈ నెల 6న శంకుస్థాపన చేపట్టేలా నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరుకానున్నట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. బ్రిటన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 6న రాష్ట్రానికి తిరిగి రానున్నారు. అందుకు అనుగుణంగా కార్యక్రమాన్ని రూపొందించారు. సైన్యానికి అవసరమైన రక్షణ పరికరాలను తయారు చేసే డిఫెన్స్ ఎనర్జిటిక్స్ యూనిట్‌ను సంస్థ ఏర్పాటు చేయనుంది. ఇక్కడ ఆయుధాల్లో మందుగుండు సామగ్రిని నింపడం, తుపాకీ తూటాలను కేఎస్ఎస్ఎల్ తయారు చేస్తుంది. దీనికి 1,000 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. మొదటి దశలో రూ.1,000 కోట్లు, రెండో దశలో రూ.1,400 కోట్లు పెట్టుబడిగా పెట్టనుంది. రక్షణ రంగానికి అవసరమైన ఆయుధ సామగ్రి తయారీ, పరీక్షించే యూనిట్‌నూ ఏర్పాటు చేయనుంది. ఇందుకు మరో 500 ఎకరాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది.

ఉక్కు పరిశ్రమతో పాటు పోర్టు కూడా..

అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిత్తల్.. నిప్పాన్ స్టీల్ (ఏఎంఎన్ఎస్) రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో భారీ ఉక్కు కర్మాగారానికి ఈ నెల 14న శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయెల్ హాజరవుతారని అధికారులు తెలిపారు. ఈ నెల 14, 15న విశాఖలో నిర్వహించే భాగస్వామ్య సదస్సుకు కేంద్రం తరఫున ఆయన రానున్నారు. ఇదే సమయంలో ఉక్కు కర్మాగారానికి భూమిపూజ కూడా చేస్తారని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు మొదటి దశ 2029 నాటికి పూర్తి కానుంది. ఇక్కడ ఏటా 8.2 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో యూనిట్ అందుబాటులోకి వస్తుంది. రెండో దశను 2033 నాటికి పూర్తి చేయాలన్నది సంస్థ లక్ష్యం. ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు సొంతంగా పోర్టును సంస్థ నిర్మించనుంది. ఈ ప్రాజెక్టులకు 2,020 ఎకరాలను బుచ్చిరాజుపేట, చందనాడ, డీఎల్ పురం, రాజయ్యపేట, వేంపాడు గ్రామాల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది.

మొంథా బాధిత చేనేత కుటుంబాలకు ప్రభుత్వం భరోసా

ఈనాడు, అమరావతి: మొంథా తుపాను కారణంగా నష్టపోయిన చేనేత కార్మిక కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. నీట మునిగిన నూలు, రంగులు, రసాయనాలకు రూ.5 వేల చొప్పున నష్టపరిహారాన్ని అందించనున్నట్లు చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత తెలిపారు. వర్షాల కారణంగా ఉపాధి కోల్పోయిన చేనేత కార్మిక కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం, లీటరు పామాయిల్, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, పంచదార కిలో చొప్పున అందిస్తామన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'మొంథా తుపాను అనంతరం రాష్ట్రంలో చేపట్టిన సర్వేలో 27,982 చేనేత కుటుంబాలను తుపాను బాధిత కుటుంబాలుగా గుర్తించాం. నీట మునిగి 3 మగ్గాలు దెబ్బతిన్నాయి. మరో 3 మగ్గాలకు స్వల్ప నష్టం వాటిల్లింది. వీటికి అవసరమైన పరికరాల కొనుగోలుకు బాధితులకు రూ.10 వేలు అందిస్తాం. 718 మందికి చెందిన నూలు, రంగులు, రసాయనాలు తదితర వస్తువులు నీటిలో తడిసిపోయాయి. బాపట్ల జిల్లాలో అత్యధికంగా 8,567 కుటుంబాలు, కోనసీమ-4,278, కృష్ణా- 3,900, శ్రీకాకుళం- 3,333, నెల్లూరు-2,400, తిరుపతి జిల్లాలో 1,700 కుటుంబాలను తుపాను బాధిత కుటుంబాలుగా గుర్తించాం. మిగతా జిల్లాల్లోనూ బాధితులను గుర్తించి నిత్యావసరాలను అందజేస్తాం' అని వివరించారు.

అన్నవరంలో వైభవంగా తెప్పోత్సవం

హంస వాహనంలో స్వామి, అమ్మవార్ల విహారం



స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

అన్నవరం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా అన్నవరం సత్యనారాయణ స్వామివారి తెప్పోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. కార్తిక మాసం సందర్భంగా సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పంపా సరోవరం చెంతన ప్రత్యేక వేదికపై ఆసీనులను చేసి తులసీధాత్రి పూజ నిర్వహించారు. అనంతరం హంసవాహనంలో కొలువుదీర్చి పంపా రిజర్వాయర్‌లో మూడుసార్లు విహరింపజేశారు.

శాసనమండలిలో భాజపా ఫ్లోర్ లీడర్‌గా సోము వీర్రాజు

ఈనాడు, అమరావతి: శాసన మండలిలో భాజపా ఫ్లోర్ లీడర్‌గా సోము వీర్రాజును ఆ పార్టీ ఎంపిక చేసింది. విజయవాడలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. శాసనమండలిలో భాజపాకు ముగ్గురు సభ్యులు ఉన్నారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎంపీలు పాకా సత్యనారాయణ, సీఎం రమేశ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అధ్వానం

రేణిగుంట, న్యూస్‌టుడే: స్థానిక మేజర్ పంచాయతీలో రోజురోజుకు పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతోంది. 120 వీధులు ఉన్న రేణిగుంట పంచాయతీలో అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జ్యోతినగర్, పత్నీకులం, గణేష్ నగర్, అన్నైనగర్ ప్రాంతాల్లో ఈ పారిశుద్ధ్యం మరింత దారుణంగా మారింది. ఈ అంశంపై సర్పంచి నాగేశం వివరణ కోరగా రెండు రోజుల్లో శుభ్రం చేయిస్తామన్నారు.

అన్నీ.. సిఫార్సులే

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వాయులింగేశ్వరుడు కొలువుదీరిన శ్రీకాళహస్తీశ్వరాలయం ఊహించని విధంగా వచ్చిన రద్దీతో భక్తజన సంద్రంగా మారింది. కార్తిక మాసం రద్దీ ఎక్కువగా ఉన్నా వర్షాల నేపథ్యంలో రద్దీ పెద్దగా ఉండటం లేదు. ఆదివారం 35 వేలకు పైగా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సామాన్య భక్తులు గంటల తరబడి క్యూలైన్లల్లో నిరీక్షించారు. సిఫార్సులతో దర్శనాలు వేగంగా జరగడంతో పలువురు సామాన్య భక్తులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఇక రాహు, కేతు పూజలు 4,281 జరగ్గా, రూ.50 ప్రత్యేక దర్శనం 2,809, రూ.200 శీఘ్రదర్శనం 2,492, రూ.500 అంతరాలయ దర్శన టికెట్లు 570 అమ్ముడుపోయాయి.

ఇండియా విజయానికి పూజలు

శ్రీకాళహస్తి: మహిళల ప్రపంచకప్ పోటీల్లో టీం ఇండియా విజయం సాధించాలని కూటమి నేతలు పూజలు జరిపారు. తెదేపా పట్టణాధ్యక్షులు విజయకుమార్ నేతృత్వంలో పలువురు నేతలు ఆదివారం శ్రీశీతలాంబ అమ్మవారి ఆలయం వద్ద పూజలు చేశారు. పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పూజలు జరుపుతున్న కూటమి నేతలు

మొంథా పంట నష్టంపై పరిశీలన

దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న రాస్ ప్రతినిధులు

వరదయ్యపాళెం: మొంథా తుపాన్ కారణంగా దెబ్బతిన్న పంటలను తిరుపతి రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు, జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ఆదివారం పరిశీలించారు. రాస్ ప్రధాన శాస్త్రవేత్త డా.ఎస్.శ్రీనివాసులు, జిల్లా వనరుల కేంద్రం అధికారి దివ్య, కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు ఆధ్వర్యంలో అధికారులు ఆదివారం సీఎల్ఎన్‌పల్లి, కళత్తూరు, మరదవాడ, అంబూరు గ్రామాల్లో పర్యటించారు. వరి నాట్లు వేసిన రెండు రోజుల్లోనే 15 రోజుల పాటు వరుసగా వర్షాలు కురుస్తుండటంతో పొలాల్లో నీరు నిల్చి, వరి నాట్లు కుళ్లి పోయాయని రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ముంపునకు గురైన వరిలో కలుపు సమస్య, ఆకు ముడత తెగులు ఉండటాన్ని గుర్తించిన శాస్త్రవేత్తలు వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మందులపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో గౌరీ, విస్తరణాధికారి ప్రవీణ పాల్గొన్నారు.

డామిట్.. కథ అడ్డం తిరిగింది

ఎంపీపీ బహిష్కరణకు రంగం సిద్ధం?

వరదయ్యపాళెం: మండలంలో ఎంపీపీ రాజీనామా వ్యవహారం మళ్లీ కొత్త మలుపు తిరిగింది. గత స్థానిక ఎన్నికల్లో ఒప్పందం మేరకు చివరి ఏడాదిలో నూతన ఎంపీపీగా మండల వైకాపా కన్వీనరు దయాకర్‌రెడ్డి సతీమణి హేమలతను ఎంపీపీగా ఎన్నుకునేందుకు రంగం సిద్ధమైంది. అయితే ప్రస్తుత ఎంపీపీ పద్మప్రియ భర్త దామోదర్‌రెడ్డి నిరాకరించడంతో వివాదం ఏర్పడింది. చివరకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జోక్యంతో పార్టీ నుంచి బహిష్కరణ వేటు తప్పదని హెచ్చరించడంతో ఎట్టకేలకు తన సతీమణి పద్మప్రియతో రాజీనామా చేయించారు. అయితే దీనిపై ఇటీవల పర్యటనకు వచ్చిన జడ్పీ సీఈవో విచారణకు ఎంపీపీ సహకరించక పోవడంతో నూతన ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ ఆగిపోయింది. ఈ నేపథ్యంలో దామోదర్‌రెడ్డి మళ్లీ ఎంపీటీసీలతో 'భేరసారాలు' చేపట్టడం అధిష్ఠానానికి ఆగ్రహం తెప్పించింది. ఆయన తీరుతో విసిగిపోయిన అధిష్ఠానం చివరకు ఆయన నూతన ఎంపీపీగా దయాకర్‌రెడ్డి సతీమణి హేమలతకు సహకరించని పక్షంలో పార్టీ నుంచి బహిష్కరించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ వ్యవహారంతో మండల వైకాపా రెండు వర్గాలుగా చీలిపోయింది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

నాగలాపురం, న్యూస్‌టుడే: సమస్య: దక్షిణపు కోటవీధిలోని మురుగునీటి కాలువలు అధ్వానంగా మారాయి. మురుగు పేరుకు పోవడంతో దోమల బెడద, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. **- ఢిల్లీ, నాగలాపురం**

సమాధానం: రెండు రోజుల్లో కాలువల్లో వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయిస్తాం.
- చిన్నదురైసుధ, సర్పంచి, నాగలాపురం

ఏర్పేడు, న్యూస్‌టుడే: సమస్య: ఏర్పేడు మండలంలోని కందాడ పంచాయతీలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. బ్లీచింగ్ చల్లక పోవడం, ఫాగింగ్ చేయక పోవడంతో దోమల బెడద అధికంగా మారింది. **- వెంకటయ్య**

సమాధానం: సంబంధిత పంచాయతీ అధికారులతో చర్చించి వెంటనే సమస్యను పరిష్కరిస్తాం.
- రమణకుమార్, ఈవోపీఆర్డీ, ఏర్పేడు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: సమస్య: మండలంలోని ఇలగనూరు పంచాయతీలో పలుచోట్ల వీధిలైట్లు వెలగడం లేదు. తద్వారా అంధకారం నెలకొన్న వీధుల్లో రాత్రి వేళల్లో నడవాలంటే ఇబ్బందులు పడుతున్నాం. **- కిషోర్**

సమాధానం: సమస్య మా దృష్టికి రాలేదు. పంచాయతీ కార్యదర్శితో చర్చించి సమస్యను పరిష్కరిస్తాం.
- సురేంద్రనాథ్, ఎంపీడీవో, తొట్టంబేడు

విద్యార్థికి సన్మానం

పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

నాగలాపురం, న్యూస్‌టుడే: తిరుపతి చిగురువాడలోని ఢిల్లీ పబ్లిక స్కూల్ ఆవరణలో డీఈవో కుమార్ ఆధ్వర్యంలో ఏపీపీఎస్ఏ ప్రైవేటు పాఠశాలల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల అభినందన సభను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో నాగలాపురానికి చెందిన విద్యార్థి ఆకాష్(10వ తరగతిలో మార్కులు 555)ను డీఈవో కుమార్‌తో పాటు నిర్వాహకులు సన్మానించి ప్రశంసా పత్రాన్ని అందించారు.

'ప్రొటోకాల్ పాటించని వారితో ఎస్కార్ట్ వద్దు'

పోలీసుల తీరుపై ఎమ్మెల్యే అసహనం

నాగలాపురం, న్యూస్‌టుడే: సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన పోలీసులకు తమ వృత్తిధర్మాన్ని పూర్తిగా విస్మరించి ప్రైవేటు వ్యక్తులకు ఎస్కార్ట్‌గా వెళ్లడం దారుణమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అసహనం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధి కాని ఒక వ్యక్తి నాగలాపురానికి వస్తే ఆయన వెంట రెండు వాహనాలతో ఎస్కార్ట్‌గా వెళ్లిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేసినట్లు ఆయన 'న్యూస్‌టుడే'తో చరవాణిలో ఆదివారం తెలిపారు. ప్రొటోకాల్‌ను పూర్తిగా విస్మరించిన పోలీసులు ఇకపై తనకు ఎస్కార్ట్‌గా రావాల్సిన అవసరం లేదని.. తనకు ఇకపై పోలీసుల ఎస్కార్ట్ వద్దంటూ ఆయన వెల్లడించారు. గతంలో కేవీబీపురంలో, ప్రస్తుతం నాగలాపురంలో పోలీసుల తీరు అసహజంగా ఉందన్న ఆయన.. వీరిపై ఎస్పీ, డీఎస్పీలకు సమాచారమిచ్చానన్నారు. భవిష్యత్తులో ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రైవేటు వ్యక్తులకు బందోబస్తు నిలువకుండా పోలీసులు తమ గౌరవాన్ని తాము తగ్గించుకునే చర్యలకు పాల్పడవద్దని హితవు పలికారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

అంజలికి చెక్కును అందిస్తున్న శంకర్‌రెడ్డి

నాగలాపురం, న్యూస్‌టుడే: నాగలాపురంలోని గాంధీ వీధికి చెందిన అజిత్‌కుమార్ ఆరు నెలల కిందట మూత్రపిండాల వ్యాధితో మరణించాడు. అతని తల్లి అంజలికి ముఖ్యమంత్రి సహాయనిధిలో మంజూరైన రూ.5,51,777ల చెక్కును తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త శంకర్‌రెడ్డి ఆదివారం నాగలాపురంలోని వారి నివాసంలో అందించారు. కార్యక్రమంలో పల్లికొండేశ్వరాలయ ఛైర్మన్ పద్మనాభరాజు, నేతలు శ్రీనివాసులుయాదవ్, భాస్కరశెట్టి, శేషాద్రి, జయచంద్రనాయుడు, జాన్సన్, మునస్వామియాదవ్, ముజిఫర్‌రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

'టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి'

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలోని జిల్లా కార్యాలయ ఆవరణలో సంఘ సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి 30 శాతం మధ్యంతరభృతిని ఇవ్వాలని కోరారు. ఈ నెల 16వ తేదీన గూడూరులో జిల్లా కౌన్సిల్ సమావేశం జరుగుతుందని తెలిపారు. వెంకటాద్రి, వెంకటముని, హరి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల వితరణ

తొట్టంబేడు, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి పురపాలక శాఖలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పట్టణానికి చెందిన శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో దుస్తులు వితరణ చేశారు. స్థానిక ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ఈ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.

లారీని ఢీకొని.. ద్విచక్ర వాహనం దగ్ధం

తొట్టంబేడు : ముందు వెళ్తున్న లారీని ఢీకొని ద్విచక్ర వాహనం దగ్ధమైంది. రేణిగుంట-నాయుడుపేట జాతీయ రహదారి పెద్దకన్నలి సమీపంలో సర్వీసు రోడ్డుపై ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనదారుడు భరత్‌కుమార్ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు.

18 ద్విచక్ర వాహనాల స్వాధీనం

రేణిగుంట: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్లిమిట్టలో పోలీసులు 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం కార్డెన్ అండ్ సర్చ్ చేపట్టారు. అనుమతులులేని వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

యువ క్రీడాకారుడికి..

రేణిగుంట, న్యూస్‌టుడే: కేఎల్ఎం ఆసుపత్రి ప్రాంతానికి చెందిన అనోష్ ఫుట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనపరచడంతో పలువురు సన్మానించారు. 6వ తరగతి చదువుతున్న విద్యార్థి ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో మన రాష్ట్ర జట్టుకి గోల్ కీపర్ గా, బ్యాక్ ఫార్వర్డ్ క్రీడా కారుడిగా రాణించి జట్టు మూడో స్థానంలో నిలిచేందుకు కృషి చేశాడు. ఆదివారం పలువురు సన్మానించారు.

యువశ్రీ మురళికి తెలుగు సాహితీ పురస్కారం

సత్కారం అందుకుంటున్న యువశ్రీ మురళి

బీఎన్‌కండ్రిగ, న్యూటుడే: తెలుగు ఉపాధ్యాయులు, భాషోద్యమ నాయకులు యువశ్రీ మురళి తెలుగు సాహితీ పురస్కారం అందుకున్నారు. ఆదివారం పలమనేరులో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో 13వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన పలువురు సాహితీ ప్రముఖులకు తెలుగు తల్లి జ్ఞాపిక, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. సమితి అధ్యక్షులు తులసీనాథంనాయుడు, కార్యదర్శి పుష్ప, గార్లపాటి దామోదరనాయుడు, ఆముదాల మురళీ పాల్గొన్నారు.

(c) eenadu

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

ప్రమాదం తప్పించారు

వాకాడు: వాకాడు అశోక స్తంభం కేంద్రంలో 35 ఏళ్ల నాటి ఎండిన పెద్ద చెట్టు ఏడాది కాలంగా ప్రమాదకర స్థితిలో ఉంది. పలు మార్లు చెట్టును తొలగించాలని 'ఈనాడు'లో వార్తలు రావడంతో కలెక్టర్ వెంకటేశ్వర్ స్పందించారు. ఆయన ఆదేశాలతో ఆదివారం ర.భ.శాఖ ఇంజినీర్లు చెట్టును తొలగించారు.

స్పందనకు వందనం

విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు

వాకాడు: వాలమేడులో 100 కేవీ విద్యుత్తు నియంత్రికను డిస్కం అధికారులు ఆదివారం ఏర్పాటు చేశారు. గ్రామంలో 15 మంది రైతులకు సంబంధించిన నియంత్రిక నెల రోజుల క్రితం కాలిపోయింది. అధికారులు పట్టించుకోలేదని గత నెల 31న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. ఏడీ చెన్నయ్య స్పందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966

? కోట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ర.భ రోడ్డు వద్ద సూచిక బోర్డు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. - **ప్రసాద్**

● సూచిక బోర్డు ఏర్పాటు చేయిస్తాం. - **మల్లికార్జునరావు, ఇన్‌ఛార్జి ఏఈ** – న్యూస్‌టుడే, కోట

? తుమ్మలగుంట వద్ద నుంచి చెరువు కట్ట పైకి వెళ్లే రహదారి గుంతలమయంగా ఉంది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. - **సుబ్బయ్య, బాషా**

● ప్రతిపాదనలు పెట్టి గుంతలను పూడ్పించేలా చర్యలు తీసుకొంటాం. - **కిరణ్, ఏఈ పీఆర్** – న్యూస్‌టుడే, వాకాడు

? గూడూరులోని మాళవ్యనగర్ ప్రాంతంలో రోడ్డుపై వ్యర్థాలు వేస్తున్నారు. - **సుమ**

● సిబ్బందితో శుభ్రత పనులు చేయిస్తాం. రోడ్డుపై చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలి. - **వెంకటేశ్వర్లు, కమిషనర్**న్యూస్‌టుడే, గూడూరు పట్టణం

తాగునీరు.. తాగలేరు

నాయుడుపేట, న్యూస్‌టుడే: ఇటీవల వర్షాలతో జల వనరుల్లో కొత్త నీరు చేరింది. దీంతో తాగునీటి ట్యాంకుల నుంచి కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి. క్లోరినేషన్ చేయడంలో జాప్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్య సమస్యల బారిన పడే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

ఆసుపత్రుల్లో పెరుగుతున్న ఓపీ..

గూడూరు, సూళ్లూరుపేట డివిజన్లలో స్వర్ణముఖి, కాళంగి నదులు ప్రవహిస్తున్నాయి. తెలుగు గంగ ప్రాజెక్టు నుంచి తాగునీరు సరఫరా చేస్తున్నారు. వాతావరణ మార్పులతో సూళ్లూరుపేట, నాయుడుపేట, గూడూరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ సంఖ్య 350గా నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఎక్కువ మంది జలుబు, జ్వరాలతో వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

తుమ్మూరులో శుభ్రతకు నోచుకోని ట్యాంకు

నామమాత్రంగా నిర్వహణ..

నాయుడుపేట, చిట్టమూరు, కోట, వాకాడు, దొరవారిసత్రం, పెళ్లకూరు, సూళ్లూరుపేట, తడ మండలాల్లో స్వర్ణముఖి, కళాంగి నదుల నీరు సరఫరా చేస్తున్నారు. ఇక్కడ ట్యాంకుల నిర్వహణ బాధ్యతలను గుత్తేదారులకు అప్పగించారు. 15 రోజులకోసారి క్లోరినేషన్ చేపట్టాల్సి ఉన్నా అలా జరగడం లేదు. నాయుడుపేట మండలం విన్నమాల, మిట్టకండ్రిగ అత్తిమిట్ట, పూడేరు, రామారెడ్డికండ్రిగలో కలుషిత నీరు వస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

పురపాలికల్లోనూ అదే పరిస్థితి..

నాయుడుపేట పట్టణంలో తుమ్మూరు, జువ్వలపాళెం, విన్నమాల, బేరిపేట ఏఎంసీ ఆవరణ, ప్రభుత్వాసుపత్రి, ఎల్.సాగరం ప్రాంతాల్లో సీపీడబ్ల్యూ పథకాలు 30 వరకు ఉన్నాయి. ఇక్కడ నుంచి క్లోరినేషన్ లేకుండా నేరుగా నీటిని పంపింగ్ చేస్తున్నారు. దీంతో సమస్యలు వస్తున్నాయి. పరిశీలించి చర్యలు చేపడతామని డీఈ చంద్రశేఖర్ తెలిపారు.

నాడు - నేడు అదే తీరు

❖ తరగతి గదుల సమస్యతో ఉన్నత పాఠశాలలు

బాలాయపల్లి– డక్కిలి, న్యూస్‌టుడే: వసతుల కల్పన పేరుతో వైకాపా ప్రభుత్వం నాడు- నేడు పథకం కింద పాఠశాలలకు రెండు విడతల్లో నిధులు మంజూరు చేసి చివరకు అసంపూర్తిగా వదిలేసింది. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది. వెంకటగిరి నియోజకవర్గంలో పరిస్థితి ఇలా.

గోడలకే పరిమితం..

బాలాయపల్లి మండలం పిగిలాంలో నాలుగు గదుల నిర్మాణాలు గోడలకే పరిమితమైంది. ల్యాబ్, ప్రహరీ పనులూ అంతే. నిడిగల్లు ఉన్నత పాఠశాలకు సంబంధించి రెండో అంతస్తులో చేపట్టిన గదుల నిర్మాణాలు అసంపూర్తిగా వదిలేశారు. వెంగమాంబాపురంలో రూ.1.10 కోట్లతో చేపట్టిన నాలుగు గదులు, రెండో అంతస్తులో మూడింటికి కిటికీలు ఏర్పాటు చేయలేదు. మరుగుదొడ్లను పూర్తి చేయలేదు. జయంపులో రెండో అంతస్తులో చేపట్టిన గదుల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది.

రంగులు వేయకుండా..

డక్కిలి మండలం పాతనాలపాడు ఉన్నత పాఠశాల రెండో అంతస్తులో చేపట్టిన నిర్మాణాలు అలాగే వదిలేశారు. తీర్థంపాడులో మరుగుదొడ్లకు రంగులు వేయలేదు. డి.వడ్డిపల్లిలోనూ ఓ గదిని విస్మరించారు. మోపూరు ఉన్నత పాఠశాలలో అదనపు గదిని ఎలాగోలా సరిపెట్టారు.

నిడిగల్లు పాఠశాలలో అసంపూర్తిగా భవనం

తుది మెరుగులు మరచి..

వెంకటగిరి మండలంలో అమ్మపాళెం ఉన్నత పాఠశాలలో రెండంతస్తుల భవనానికి తుదిమెరుగులు దిద్దకుండా వదిలేశారు. క్రాస్‌రోడ్డు కూడలికి దగ్గర్లోని ఉన్నత పాఠశాల గదుల నిర్మాణం పూర్తికాకుండా ఉంచేశారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

ఈ విషయమై గతంలో ఉన్నతాధికారులకు నివేదించాం. ఆయా పాఠశాలల్లోని పనుల స్థాయిలను గుర్తించి పూర్తి చేయడానికి ప్రతిపాదించాం.
– నాగేశ్వరరావు, ఎంఈవో, బాలాయపల్లి

నిరీక్షించాలంటే అవస్థలే

కోట మండల కేంద్రంలోని కాంప్లెక్స్ సమీపంలోని ఉన్న బస్సు షెల్టరు నిరుపయోగంగా మారింది. వ్యర్థాలు, పనికిరాని మొక్కలతో పరిసరాలు అధ్వానంగా మారాయి. దీంతో ప్రయాణికులు వేచి ఉండేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ పనులపై మండల కేంద్రానికి వచ్చే వారికి అవస్థలు తప్పడం లేదు. వినియోగంలోకి తీసుకొస్తామని డిప్యూటీ ఎంపీడీవో వేణు తెలిపారు.
– న్యూస్‌టుడే, కోట

కాలువల్లేక కష్టాలు

సూళ్లూరుపేట పట్టణంలోని విక్రమ్‌సారాబాయి నగర్‌లో రోడ్డుపై మురుగు నిలిచిపోతోంది. ఇక్కడ కాలువ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో చిన్నవర్షం పడినా సమస్య ఏర్పడుతోంది. పాఠశాల విద్యార్థులు ఈమార్గంలో రాకపోకలు సాగించలేక అవస్థలు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం

ఆదమరిస్తే ప్రమాదం

కోట మండలంలోని విద్యానగర్ సమీపంలో ర.భ. రహదారి పక్కనున్న నియంత్రిక చుట్టూ రక్షణ కంచె లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. అక్కడే చెత్త వేస్తుండటంతో రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఏమాత్రం ఆదమరిచినా నియంత్రికను ఢీకొట్టే ప్రమాదం ఉందని, అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోట

రూ.లక్షలున్నా.. లక్ష్యానికి దూరం

కోట మండలంలోని చిట్టేడు బాలుర వసతి గృహం భవనం పూర్తిగా పాడైంది. ఇక్కడున్న 45 మంది విద్యార్థులు కొన్నాళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ఈ ఏడాది ప్రభుత్వం రూ.15 లక్షలు మంజూరు చేసింది. అయినా పనులు చేపట్టకపోవడంతో విద్యార్థులు ఎస్సీ వసతి గృహంలో చేరిపోయారు. న్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఇన్‌ఛార్జి సంక్షేమాధికారి గజేంద్రబాబు తెలిపారు. జు – న్యూస్‌టుడే, కోట

శిలాఫలకం సరే.. నిర్మాణం ఎప్పుడో?

వాకాడు-కోట మండలాల్లోని సముద్ర తీర గ్రామాలను కలుపుతూ స్వర్ణముఖి నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలని 1990లో తూపిలిపాలెం వద్ద శంకుస్థాపన శిలాఫలకం వేశారు. నాటి నుంచి నేటి వరకు శిలాఫలకమే ఉంది కానీ.. వంతెన నిర్మాణం చేపట్టలేదు. దీంతో మత్స్యకార గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నేటి పాలకులైనా పట్టించుకుని వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, వాకాడు

రథంపై అమ్మవారు

కాళికామాత ఉత్సవం

తడ, న్యూస్‌టుడే: మండలంలోని తడకండ్రిగలో కాళికాదేవి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. బాణసంచా వేడుకలు, మంగళ వాయిద్యాల నడుమ ప్రత్యేక రథంపై అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. విశ్వ బ్రాహ్మణ సంఘం మండలాధ్యక్షుడు పరంధామయ్య ఆచారి, ఉపాధ్యక్షులు బాబు, ఆర్ముగం ఆచారి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా మహాశివునికి రుద్రాభిషేకం

గూడూరు పట్టణం: స్థానిక ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో కార్తికమాసం సందర్భంగా మహాశివునికి రుద్రాభిషేకాన్ని ఆదివారం నిర్వహించారు. ఆలూరు శిరోమణిశర్మ మహాశివునికి విశేష పూజలను చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వనభోజన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు ఎ.శివకుమార్, ప్రతినిధులు రామ్మూర్తి లలిత, శ్రీనివాసరావు, పురుషోత్తంరావు, నరసింహరావు, రాజేశ్వరిదేవి తదితరులు పాల్గొన్నారు.

అన్నీ.. సిఫార్సులే

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వాయులింగేశ్వరుడు కొలువుదీరిన శ్రీకాళహస్తీశ్వరాలయం ఊహించని విధంగా వచ్చిన రద్దీతో భక్తజన సంద్రంగా మారింది. కార్తిక మాసం రద్దీ ఎక్కువగా ఉన్నా వర్షాల నేపథ్యంలో ఇటీవల భక్తుల సంఖ్య తగ్గింది. కానీ ఆదివారం 35 వేలకు పైగా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సామాన్య భక్తులు గంటల తరబడి క్యూలైన్లల్లో నిరీక్షించారు. సిఫార్సులతో దర్శనాలు వేగంగా జరగడంతో పలువురు సామాన్య భక్తులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. రాహు, కేతు పూజలు 4,281 జరగ్గా, రూ.50 ప్రత్యేక దర్శనం 2,809, రూ.200 శీఘ్ర దర్శనం 2,492, రూ.500 అంతరాలయ దర్శన టికెట్లు 570 అమ్ముడుపోయాయి.

పట్టణాభివృద్ధికి చర్యలు: ఎమ్మెల్యే

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పట్టణాభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, పుర ప్రజలకు అవసరమైన వసతులు కల్పించేలా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు. పట్టణంలోని వివేకానంద రోడ్డు నుంచి వాటర్ ట్యాంకు వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మహిళ క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ వీక్షణకు గడియారం స్తంభం కూడలి వద్ద ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, పట్టణ, గ్రామీణ సీఐలు కిషోర్‌బాబు, శ్రీనివాస్, నాయకులు చంద్రమౌళి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

✦ ఉమ్మడి నెల్లూరు జిల్లా సైదాపురం మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి గూడూరు వచ్చి ఎలాంటి డాక్టరు చీటీ లేకుండానే ఓ దుకాణంలో మత్తు ఇంజెక్షన్‌లను అధిక ధరలు చెల్లించి మరీ కొనుగోలు చేశారు.

✦ గూడూరు పట్టణంలోని ఓ మందుల దుకాణంలో డ్రగ్స్ ఉన్నాయని పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో 600 గ్రాముల గంజాయితో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేయడంతో స్థానికంగా కలకలం రేగింది. అయితే దుకాణం పక్కనున్న సందులో దొరికాయని తర్వాత చెప్పారు.

మత్తెక్కిస్తూ.. చిత్తు చేస్తూ..

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు డివిజన్‌లో ఔషధ దుకాణాలు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వాటిల్లో మత్తు పదార్థాల విక్రయాలు సాగుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కానరాని తనిఖీలు..

డివిజన్‌లోని గూడూరు, కోట, వాకాడు, చిల్లకూరు, చిట్టమూరు, బాలాయపల్లి, వెంకటగిరి, డక్కిలి మండలాల్లో 50 నుంచి 100కు పైగా మందుల దుకాణాలు ఉన్నాయి. అక్కడ మందులతో పాటు వైటనర్, ఇతర మత్తు ఇంజెక్షన్ల విక్రయాలు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. రైల్వే స్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో మత్తు వినియోగించే యువకులు తిరుగుతూ ప్రయాణికులను భయాందోళనకు గురి చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇలాంటి ఘటనలు నమోదు అవుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం..

మందుల దుకాణాల్లో నిబంధనల మేరకు మందులు విక్రయించాలి. అలా కాకుండా మత్తు పదార్థాలు, గర్భవిచ్ఛిత్తి మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
– ప్రశాంతి, ఔషధ నియంత్రణ అధికారిణి

కాలువలో మృతదేహం లభ్యం

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలో నివాసం ఉంటున్న మణికంఠ (35) మృతదేహం వరదయ్యపాళెం సమీపంలోని తెలుగుగంగ కాలువలో లభ్యమైనట్లు ఎస్సై ఏడుకొండలు తెలిపారు. డక్కిలి మండలానికి చెందిన మణికంఠ వెంకటగిరిలో నివాసం ఉంటున్నారు. గత నెల 18న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గాలించగా ఆదివారం కాలువలో మృతదేహం లభ్యం కావడంతో కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై చెప్పారు.

దంపతులపై దాడి

తడ, న్యూస్‌టుడే: మండలంలోని తడకండ్రిగలో కాళికామాత ఊరేగింపులో ఘర్షణ జరిగింది. చిలమత్తూరు లోకేశ్, ఆయన భార్య గాయత్రిపై అదే గ్రామానికి చెందిన అన్నదమ్ములు దినేష్, అభిషేక్ దాడి చేశారని పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. పాత కక్షల నేపథ్యంలో వారి మధ్య వివాదం చెలరేగింది. గాయపడిన లోకేశ్ సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రిలో చేరారు. అక్కడ మరోసారి లోకేశ్‌పై దినేష్, అభిషేక్‌తో సహా మరో ముగ్గురు దాడి చేయడంతో ఆయన అపస్మారక స్థితికి చేరుకున్నారు. దీంతో ఆయనను కుటుంబ సభ్యులు చెన్నై తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

పోక్సో కేసు నమోదు

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఓ దుకాణంలో పనిచేస్తున్న యువతితో అసభ్యకరంగా వ్యవహరించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఏడుకొండలు తెలిపారు. బాలాయపల్లి మండలంలోని గ్రామానికి చెందిన యువతి పట్టణంలోని దుకాణంలో పని చేస్తోంది. ఆమెతో యువకుడు పరిచయం పెంచుకుని మాయమాటలు చెప్పి మోసం చేశాడన్నారు. ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

చెంగాళమ్మ ఆలయంలో చోరీ

బాలాయపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పి.కొత్తపాళెం కాలనీలోని చెంగాళమ్మ ఆలయంలో చోరీ జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ తాళం తీసి నగదు చోరీ చేశారన్నారు. హుండీలో సుమారు రూ.50 వేలు నగదు ఉండొచ్చన్నారు.

19 వాహనాలు సీజ్

క్రైం కార్నర్

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని టిడ్కో గృహ సముదాయం వద్ద సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సర్కిల్ పరిధిలోని ఇంటింటా పోలీసులు తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 16 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను సీజ్ చేసినట్లు సీఐ చెప్పారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా వ్యక్తులు తిరిగితే సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు ఏడుకొండలు, గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్, కారు ఢీ

కోట, న్యూస్‌టుడే: విద్యానగర్ సాయిబాబా మందిరం సమీపంలోని ర.భ రోడ్డుపై ఆదివారం ఓ కారు, ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో కారు ముందు భాగం దెబ్బతింది. కారులో ఉన్న వ్యక్తి సురక్షితంగా బయటపడ్డారు. ఈ మార్గంలో కొంత సమయం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఎస్సై పవన్‌కుమార్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. విచారించి కేసు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

గూడూరు పట్టణం: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేతి వృత్తులపై శిక్షణ ఇస్తున్నట్లు సునీతా సేవ సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మీ తెలిపారు. గూడూరు పట్టణంలోని సంస్థ కార్యాలయంలో మహిళలకు ఉచితంగా వాషింగ్ పౌడర్ తయారీపై ఆదివారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభించారు. సంస్థ అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

నూతన గురువులకు సత్కారం

వాకాడు, న్యూస్‌టుడే: 2025 డీఎస్సీలో ఎంపికైన గురువులకు బాలిరెడ్డిపాలెంలోని శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సత్కారం జరిగింది. గురువులను సహకార సంఘం మాజీ అధ్యక్షుడు కె.దామోదర్‌రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి దీవి అనంతాచార్యులు, సాయిబాబా, సభ్యులు హరీష్‌రెడ్డి, శివకుమార్, వంశీ, శేఖర్, వినయ్, మోహన్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE, GUDUR
E.P. No: 154 / 2022
ARC No.MF/MG/130/2021
M/s Mahaveer Finance Ltd, having its Reg. Office At K.G Plaza, 41-44, T8/T9, 3rd Floor, G.P. Road, Chennai-600002, Rep. by its Authorized Person Cum Branch Manager, I.Sanjay Kumar ... Award-Holder
Vs
1. Balaji K
2. Masthanaiah K ... J.Drs

వేలం ప్రకటన

పై నెంబరున అవార్డు హోల్డర్ అవార్డు బాకీ రాబట్టుకొనుటకు 2వ జె.డి.ఆర్. తాలూకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని తే 19-11-2025 దిన ఉదయం 10-30 గంటల నుండి సాయంత్రం 5 గంటల లోపల పై తెలిపిన కోర్టులో బహిరంగ వేలంపాట జరుపబడును. కావున పాటదారులు ఎవ్వరైనా వేలం పాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.

SCHEDULE

Sri Potti Sriramulu Nellore District - Gudur Registration District - Kota Sub Registration - Kota Mandal - Puchhalapalli Village - Khata No. 378 - Survey No. 232-7-2 an extent of 1.48 cents of dry Land within the following boundaries : **East** : Land in Survey No. 232/5, **South** : Land in Survey No. 240, **West** : Land in Survey No. 231, 240, **North** : Land in Survey No. 232/6, With all easementary rights.
DHR Value of Rs. 1,00,000/-
Amin Value of Rs. 10,00,000/-
Market Value of Rs. 5,92,000/-

వి.జయరామారావు, B.A., B.L.,
అవార్డు హోల్డరు తరఫు అడ్వకేట్, నెల్లూరు

అపరిశుభ్రంగా తీరం

వాకాడు మండలంలోని సముద్ర తీరం తూపిలిపాలెం బీచ్‌లో అపరిశుభ్రత వాతావరణం పర్యాటకులకు కన్పిస్తోంది. ఎక్కడ చూసినా వ్యర్థాలు, మద్యం సీసాలు, ప్లాస్టిక్ కవర్లు, వాటర్ ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయి. పర్యాటకులు తిరుగుతున్న ప్రాంతంలో ఇలా అపరిశుభ్రంగా ఉండడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీచ్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, వాకాడు

రోడ్డేశారు.. తూములు మరిచారు

మాంబట్టు పారిశ్రామికవాడలో కొండూరు- కాదలూరు రింగు రోడ్డు మార్గంలో పెద్ద మాంబట్టు వద్ద తూము ప్రమాదకరంగా మారింది. ఇక్కడ రోడ్డు తరచూ బాగు చేస్తుండగా తూములను వదిలేస్తున్నారు. రెండు వైపులా గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతలు పూడ్చాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, తడ

యువరాజా జన్మదిన వేడుకలు

వెంకటగిరి, న్యూస్‌టుడే: వెంకటగిరి సంస్థానం యువరాజా సర్వజ్ఞ కుమార యాచేంద్ర జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం పోలేరమ్మ ఆలయంలో అభిమానులు పూజలు చేశారు. అనంతరం రాజాల నివాసం వద్ద కేకు కోశారు. సీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేసి, రక్తదాన శిబిరం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సాయికృష్ణ యాచేంద్ర సమక్షంలో అన్నప్రసాద వితరణ జరిగింది.

గుంతల దారిలో గజిబిజి

సూళ్లూరుపేట మండలంలోని సుగ్గుపల్లి గ్రామం నుంచి పట్టణానికి వెళ్లే మార్గం గుంతలతో అధ్వానంగా మారింది. ఈ దారిలో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలతో రోడ్డు పాడైందని, బాగు చేయాల్సి ఉందని పలువురు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం

ప్రణాళికాబద్ధంగా యూరియా సరఫరా

నాయుడుపేట, న్యూస్‌టుడే: రబీ సీజన్ ప్రారంభం కావడంతో ఎరువుల కొరత లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే చాలా మేర సేంద్రియ ఎరువులు వినియోగించేలా ఇన్నాళ్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దీనికి తోడు ఎరువులను సైతం అందుబాటులో ఉంచారు. పరిమిత సంఖ్యలో ఎరువులు వినియోగించేలా 3 విడతలుగా డీలర్లు, పీఏసీఎస్‌లు, రైతుసేవా కేంద్రాల ద్వారా నిర్ణీత ధరలకు పంపిణీ చేసేలా చూస్తున్నారు. ఎకరాకు 3 బస్తాల చొప్పున మూడు విడతల్లో యూరియా అందిస్తామని ఏడీఏ ఎం.నాగార్జున్ సాగర్ తెలిపారు.

ఓజిలి పీఏసీఎస్‌లో సరకు ఇస్తున్న అధికారులు

ఇవీ వివరాలు..

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	ఉన్న ఎరువు (టన్నుల్లో..)
నాయుడుపేట	15,587	2104.24
పెళ్లకూరు	19,950	2693.25
చిట్టమూరు	29865	4031.77
వాకాడు	17,972	2426.22
కోట	13,619	1838.05

పర్యాటకులూ.. జలపాతాల వద్దకు వెళ్లొద్దు

నాగలాపురం, న్యూస్‌టుడే: నాగలాపురం మండలంలోని భూపతీశ్వరకోన, సద్దికూడుమడుగుల వద్దకు పర్యాటకులు, భక్తులు వెళ్లవద్దని ఎస్సై సునీల్ ఆదివారం సూచించారు. వాగుల్లో నీటి ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో పాటు కోనల్లో ప్రమాదకర పరిస్థితులున్న నేపథ్యంలో ప్రమాదాలకు భక్తులు ఎదురెళ్లవద్దన్నారు. నిబంధనలు అతిక్రమించి జలపాతాల వద్దకు వెళ్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

యువశ్రీ మురళికి పురస్కారం

బీఎన్‌కండ్రిగ, న్యూటుడే: తెలుగు ఉపాధ్యాయులు, భాషోద్యమ నాయకులు యువశ్రీ మురళి తెలుగు సాహితీ పురస్కారం అందుకున్నారు. ఆదివారం పలమనేరులో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి 13వ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన పలువురు సాహితీ ప్రముఖులకు తెలుగు తల్లి జ్ఞాపిక, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. సమితి అధ్యక్షులు తులసీనాథంనాయుడు, కార్యదర్శి పుష్ప, గార్లపాటి దామోదరనాయుడు, ఆముదాల మురళీ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు అభినందనలు



శ్రీ కె.జయజయరావు గారు
తహశీల్దారు, కోట.

లక్కు. రఘునాథరెడ్డి
సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు
గూడలి, కోట (మం)

(c) eenadu

డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల మైదానంలో జరిగిన కార్తిక దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

అఖండ దీపం.. అనంత తేజం..!

వైభవంగా 'ఈటీవీ లైఫ్, ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ' కార్తిక దీపోత్సవం

జ్యోతి వెలిగించే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ దంపతులు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, డాక్టర్ జి. మధుకుమార్, గంటా శారద తదితరులు

తరలివచ్చిన అతిథులు : జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ దంపతులు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ చిరంజీవి రావు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సతీమణి గంటా శారద, బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ జి. మధుకుమార్, తిరుమల ఐఐటీ మెడికల్ అకాడమీ డైరెక్టర్లు కేఎస్‌వీవీ సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, లక్కీ షాపింగ్‌మాల్ నిర్వాహకులు నాగలక్ష్మి జ్యోతి వెలిగించి దీపోత్సవాన్ని ప్రారంభించారు. దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఈటీవీ న్యూస్ డిప్యూటీ కోఆర్డినేటర్ అమరేశ్వరరావు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న ఫణికుమార్‌శర్మ

కార్యక్రమానికి వస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, సీతంపేట: విశాఖ తీరం దీపకాంతుల హారమైంది. అలల తరంగాలకు ఓంకార నాదాలు తోడై వేదమంత్రాలు ధ్వనించాయి. ధగధగ దీపాలతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. 'ఈటీవీ లైఫ్, ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ' ఆధ్వర్యంలో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల మైదానంలో ఆదివారం రాత్రి 'కార్తిక దీపోత్సవం' అంగరంగ వైభవంగా జరిగింది. వందలాది మంది మహిళలు, యువతులు, చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణలో కార్యక్రమానికి తరలివచ్చారు. బేబీ జస్మిత సాయి ఆలపించిన భక్తి గీతం ఆకట్టుకుంది. కార్తిక దీపోత్సవానికి ఎలాంటి విఘ్నాలు కలగకుండా పులపుల ఫణికుమార్‌శర్మ నేతృత్వంలో గణపతి పూజ చేశారు. అంతకుముందు బాలభాను అర్చక సంఘం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణ నిర్వహించారు.

★ ప్రవచనకర్త నోరి నారాయణమూర్తి కార్తికమాస విశిష్టతను వివరించి సామూహికంగా అష్టోత్తరం పఠింపజేశారు. అనంతరం మహిళలతో దీపోత్సవ పూజ జరిపించారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ క్రతువులో మహిళలు భక్తి ప్రపత్తులతో దీపాలు వెలిగించి హరహర మహాదేవ అంటూ శివ నామస్మరణ చేశారు. నక్షత్ర మహా హారతితో కార్యక్రమాన్ని ముగించారు.

ప్రవచనం చెబుతున్న నోరి నారాయణమూర్తి

దీపానికి నమస్కరిస్తూ..

భక్తి పాటలు ఆలపిస్తున్న జస్మిత సాయి

స్పాన్సర్లకు జ్ఞాపికలు అందిస్తున్న నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్

జ్ఞాపికల ప్రదానం: కార్తిక దీపోత్సవ కార్యక్రమానికి సహకారం అందించిన పలు వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రతినిధులకు నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు. తిరుమల ఐఐటీ, మెడికల్ అకాడమీ డైరెక్టర్ మృత్యుంజయరావు, సీఎంఆర్ షాపింగ్‌మాల్ మార్కెటింగ్ మేనేజర్ వరకుమార్, మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుపత్రి, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సీవోవో డాక్టర్ ఆదిత్య, వైశాఖి సుందర్ స్కై లాంజ్ ప్రతినిధి రామకృష్ణ, విజన్ డెవలపర్స్ ఛైర్మన్ సురేశ్, ఎంవీఎస్ జ్యువెలరీ పార్కు ప్రతినిధి రంగ, తుమ్మిడి బ్రదర్స్ ప్రతినిధి బాబీ, సత్య్వ ప్రతినిధి మూలకోటి, శ్రీ కౌ అండ్ కాఫ్ విశాఖ మేనేజర్ రమేష్, కంకటాల ప్రతినిధి భరత్, లండన్ ఐవీఎఫ్ డైరెక్టర్ చంద్రారెడ్డి, కామధేను మిల్క్ జున్ను పౌడర్ నిర్వాహకులు రమేష్, గిరీష్, జే స్టూడియో ప్రతినిధి జ్యోతి, కేఎల్ వర్సిటీ, భూమాతా గ్రూప్, పూజా నువ్వుల నూనె, వైకుంఠ మహా రుచుల ప్రతినిధులకు జ్ఞాపికలు అందించారు.

తిరుగులేని 'అమ్మాయిలు'.. అభిమానుల సంబరాలు

మహిళల వన్డే క్రికెట్ వరల్డ్ కప్‌లో భారత జట్టు అమ్మాయిలు చెలరేగారు. ఫైనల్స్‌లో దక్షిణాఫ్రికాను మట్టి కరిపించి చిరకాలంగా ఊరిస్తున్న ప్రపంచకప్‌ను ముద్దాడారు. దీంతో నగరంలో క్రికెట్ అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఆదివారం పలు ప్రాంతాల్లో భారీ తెరలు ఏర్పాటు చేసి మ్యాచ్‌ను ఆద్యంతం వీక్షించారు. భారత్ గెలిచిన అనంతరం మువ్వన్నెల జెండాలు చేతపట్టి నృత్యాలు చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ విజయం మహిళా క్రికెట్‌కు మేలిమలుపని పలువురు క్రీడాకారులు హర్షం ప్రకటించారు.

–న్యూస్‌టుడే, విశాఖక్రీడలు, మురళీనగర్

అటైనా.. ఇటైనా.. ప్రమాదమే..!

ఆనందపురం కూడలిలోని రహదారి దుస్థితి ఇది. ఇటీవలి భారీ వర్షాలకు రహదారి పైన కొంత భాగంలో లేయర్ లేచిపోయింది. చోదకులు అప్రమత్తంగా లేకపోతే వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గానికి వెంటనే మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆనందపురం

చెత్త నుంచి విద్యుదుత్పత్తి ఇలా..

జిందాల్ ప్లాంటు నమూనాను పరిశీలిస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ తదితరులు

కొమ్మాది, న్యూస్‌టుడే: కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డులో జిందాల్ సంస్థ నిర్వహించే చెత్త నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేసే కర్మాగారాన్ని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పరిశీలించారు. గంజాయి దహనం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా, సీపీ శంఖబ్రతబాగ్చీ, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్, ఈగల్ టీం ఐజీ రవికృష్ణలకు ఆ సంస్థ ప్రతినిధి సతీష్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. చెత్త నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేసే విధానాన్ని నమూనాను ద్వారా అతిథులకు వివరించారు. అనంతరం జిందాల్ సంస్థ ఆవరణలో డీజీపీ చేతులమీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.

నిధులు జేబుల్లో.. దోమలు ఇళ్లల్లో..!

ఫాగింగ్ యంత్రాల డీజిల్ పక్కదారి
జీవీఎంసీలో యథేచ్ఛగా స్వాహాపర్వం

ఈనాడు–విశాఖపట్నం: జీవీఎంసీ పరిధిలో దోమల సంహారం పేరుతో స్వాహా పర్వానికి తెర లేపారు. మెకానికల్ విభాగంలో కొందరు సిబ్బంది... క్షేత్రస్థాయిలో పలువురు వార్డు స్థాయి నేతలు జత కలిసి మాయ చేస్తున్నారు. కాకి లెక్కలతో జేబులు నింపేసుకుంటున్నారు. వర్షాలతో దోమల బెడద పెరిగి నగరవాసులు ఇబ్బందులు పడుతుంటే... ఫాగింగ్ ప్రక్రియ నామమాత్రంగా జరుగుతున్నట్లు విమర్శలున్నాయి.

■ అధికారుల సమర్పించిన లెక్కలపై గతంలో ఫిర్యాదులు అందడంతో అప్పటి కమిషనరు ఆదేశాలతో విచారణ సైతం జరిగింది. ప్రస్తుతం మళ్లీ అదే పరిస్థితి కొనసాగుతోంది. విచిత్రమేమంటే 8 ఫాగింగ్ వాహనాల్లో కొన్ని మరమ్మతులకు గురై జీవీఎంసీ కార్యాలయంలోనే ఉన్నా.. లెక్కల్లో మాత్రం ఆ వాహనాలు నగరంలో తిరుగుతూ ఫాగింగ్ చేస్తున్నట్లు చూపిస్తున్నారు.

మెకానికల్‌లో మాయ: ఫాగింగ్ యంత్రాలు, వాహనాలకు పెట్రోలు బంకుల్లో డిజిటల్ కార్డులతో ఆయిల్ కొట్టించే బాధ్యతను జీవీఎంసీ మెకానికల్ విభాగం చూస్తోంది. ఇంత వరకు బాగానే ఉన్నా కొన్ని పెట్రోలు బంకుల యజమానులతో కొందరు అధికారులు కుమ్మక్కై డీజిల్‌ను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వాహనాలకు రోజుకు వంద లీటర్లు డీజిల్ కొట్టిస్తున్నట్లు లెక్కల్లో చూపిస్తుండగా, వారానికి ఒక్కసారి కూడా వార్డుల్లో ఫాగింగ్ వాహనాలు తిరిగిన జాడ కనిపించడం లేదు. ప్రతి నెలా ఈ వాహనాల ద్వారానే రూ.10లక్షల మేర నిధులు స్వాహా చేస్తున్నట్లు అంచనా.

మా వాహనాలకు నింపండి..

వార్డుల్లో హ్యాండ్ మిషన్‌లతో ప్రతి రోజూ ఫాగింగ్ చేయాలి. ఫాగింగ్ చేసినట్లు కార్పొరేటర్ సంతకం పెడితేనే బిల్లులు మంజూరు చేస్తారు. ఇక్కడే అసలు కథ మొదలవుతోంది. కొందరు కార్పొరేటర్లు, చోటా నాయకులు వార్డుల్లో ఫాగింగ్ పక్కన పెట్టి, ఆ డీజిల్‌ను సొంతానికి ఉపయోగించుకుంటున్నారు. 'ఈ రోజు నా వార్డులో ఫాగింగ్ అవసరం లేదు. నా కారుకు కొట్టండి' అంటూ కొందరు ప్రజాప్రతినిధులు డీజిల్‌ను వాడేస్తున్న ఘటనలు ఇప్పటికే వెలుగులోకి వచ్చాయి.

సీజనల్ సిబ్బంది ఎక్కడ?

దోమల నివారణకు సీజనల్ వర్కర్స్ పేరుతో రెండు నెలల కోసం 400 మంది సిబ్బందిని జీవీఎంసీ పరిధిలో నియమించుకున్నారు. ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున వేతనం ఇస్తున్నారు. వీరిలో అధికశాతం ముఖ ఆధారిత హాజరు కాగానే క్షేత్రస్థాయిలో కనిపించడం లేదనే ఆరోపణలున్నాయి. కొందరు కార్పొరేటర్లు తమ అనుచరగణానికే ఈ పోస్టులు ఇప్పించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

జీవీఎంసీలో..

ఫాగింగ్ వాహనాలు: 8 — రోజుకు ఇచ్చే ఆయిల్ (ఒక్కో దానికి): 100 లీటర్ల డీజిల్, 10 లీటర్ల పెట్రోలు

చిన్న యంత్రాలు (హ్యాండ్ మిషన్లు): 50 — రోజుకు ఇచ్చే ఆయిల్ (ఒక్కోదానికి): 15 లీటర్ల డీజిల్, 2లీటర్ల పెట్రోలు

ALL SAINTS CHRISTIAN LAW COLLEGE
Affiliated to A.U & Approved by Bar Council of India
Opp.R.T.C Complex,Dwaraka Nagar, Visakhapatnam
ADMISSION NOTICE
Candidates interested to join
LLB 5 years | LLB 3 years | LLM 2 years
Course in our law college for 2025-2026 are advised to contact college office.
5 years LLB Candidates who wish to change their options to our college from other law colleges may also contact.
Note: candidates with or without lawcet are eligible for admissions.
Principal: 8332978328,9491606933

WALK-IN-INTERVIEW
A multi crore Org. Requires the following candidates in Visakhapatnam division.
❖Sr. BRANCH MANAGERS: M/F
☛Qlf: Retired Gazetted officers and above.
☛Excellent Package (Salary + Allowences.)
❖PROBATIONARY OFFICERS: M/F
☛Qlf: Min. 1 year Exp. in any sector.
☛Age: 30 years & above. (Decent Package)
Packages Decide After Interview
INTERVIEWS ON :
3rd, 4th & 6th - Nov-25
Con: T.V. RAMARAO - D.G.M.
SEETHAMMADHARA, Vizag
Ph: 9553021026, 7702999763

పెళ్లి సంబంధాల కోసం వెతుకుతున్నారా..!

నేడు కమ్మ అవివాహితులకు 'ఈనాడు పెళ్లిపందిరి' ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదికైన 'ఈనాడు పెళ్లిపందిరి' కమ్మ అవివాహితుల కోసం ఉచిత ప్రొఫైల్, రిజిస్ట్రేషన్ నిర్వహిస్తోంది. అక్కయ్యపాలెంలోని 'ఈనాడు' కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమం జరుగుతోంది.

★ వివాహం కోసం ఎదురు చూస్తున్న అవివాహితులతో పాటు సంబంధిత కుటుంబీకులు **నేడు (సోమవారం, నవంబరు 3న)** ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పాల్గొని ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

★ మరిన్ని వివరాలకు **9154918858, 8008001616** ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు. ఫోన్ లేదా యాప్ ద్వారా కూడా ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. బయోడేటా, ఫొటోలను పైన తెలియజేసిన వాట్సప్ నంబర్లకు పంపవచ్చు.

– న్యూస్‌టుడే, అక్కయ్యపాలెం

సాగర దివ్యక్షేత్రం.. ప్రకృతి రమణీయం!

ఓ వైపు సముద్రపు గాలులు, మరోవైపు పచ్చటి కొండల నడుమ రుషికొండపై తిరుమల తిరుపతి దేవస్థానం (తి.తి.దే.) నిర్మించిన మహాలక్ష్మీ గోదాదేవి సహిత వేంకటేశ్వర స్వామి దివ్య క్షేత్రం కనువిందు చేస్తోంది. ప్రాంగణం నలువైపులా ఏపుగా పెరిగిన పూల మొక్కలు, పచ్చని గడ్డితో కళకళలాడుతోంది. దర్శనం అనంతరం భక్తులు అక్కడ కూర్చొని చల్లటి గాలులను ఆస్వాదిస్తున్నారు. కొండపై ఉన్న ఆలయాన్ని చేరుకునేందుకు ఘాట్ రోడ్డు అందుబాటులో ఉంది. నడిచి వెళ్లేందుకు వీలుగా మెట్ల మార్గం సైతం ఏర్పాటు చేశారు. ఎండ, వాన సమయంలో భక్తులు ఇబ్బంది పడకుండా మెట్ల పైన రేకులు అమర్చారు. – ఎండాడ, న్యూస్‌టుడే

వినూత్నం.. వివాహ ఆహ్వానం!

తాటి పత్రాలపై పెళ్లి పత్రిక రూపకల్పన

ఆహ్వాన పత్రికతో అజయ్‌కుమార్

ఈనాడు, విశాఖపట్నం: ఆరోగ్యానికి మేలు చేసే సంప్రదాయ, పురాతన విధానాలపై కొందరికి ఆసక్తి ఎక్కువ. నేటి ఆధునిక రోజుల్లోనూ అలనాటి పద్ధతులను పాటిస్తుంటారు. ఆ కోవకే వస్తారు... విశాఖ నగరానికి చెందిన బి. అజయ్‌కుమార్. విశాఖలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈయన ప్రదర్శించిన 'పెళ్లి పత్రిక' నమూనా ఎందరినో ఆకట్టుకుంది. దానిని తాటి ఆకులతో రూపొందించడం గమనార్హం. పెళ్లి పత్రికలను వైవిధ్యంగా తయారు చేస్తే ఎలా ఉంటుంది? అనే ఆలోచన రాగా ప్రయోగాత్మకంగా ఈ ప్రయత్నం చేశారు. ఆ కార్యాచరణను వివరిస్తూ 'కొంచెం పచ్చిగా ఉన్న తాటి ఆకులను ఉడకబెట్టాలి. బాగా ఆరిన తర్వాత వాటిని తగిన ఆకృతుల్లో కత్తిరించాలి. బూజు, పురుగు పట్టకుండా పసుపు, నూనె కలిపి లేపనంగా పూయాలి. ఐరన్ పెన్‌తో ఆకులు చిరిగిపోకుండా చాలా జాగ్రత్తగా అక్షరాలు రాయాలి. నల్ల బొగ్గు పొడి, సహజ రంగులను అక్షరాలపై పూస్తే స్పష్టంగా కనిపిస్తాయి. ఈ విధానంలో శ్లోకాలు, ఆహ్వానితుల పేర్లు, పెండ్లి కుమార్తె, కుమారుడి వివరాలు, విందు, కల్యాణవేదికలను రాశా. ప్రయోగాత్మకంగా కార్డులు తయారు చేసి పంచుతున్నాం' అని తెలిపారు. అజయ్‌కుమార్ గతంలో శాస్త్రవేత్తగా పనిచేశారు. ప్రస్తుతం రైతుగా మారి ఆధునిక వ్యవసాయం చేస్తున్నారు. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో పీహెచ్‌డీ కూడా చేస్తున్నారు.

నేడు 'వందేభారత్' 6.30 గంటల ఆలస్యం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: లింకు రైలు అందుబాటులో లేకపోవడంతో సోమవారం ఉదయం 5.45 గంటలకు బయలుదేరాల్సిన విశాఖ-సికింద్రాబాద్ (20833) వందే భారత్ రైలు మధ్యాహ్నం 12.15 గంటలకు బయలుదేరేలా మార్పు చేసినట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె. పవన్‌కుమార్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరాల్సిన సికింద్రాబాద్- విశాఖ (20834) వందే భారత్ రైలు రాత్రి 10 గంటలకు బయలుదేరడంతో సోమవారం రైలు ఆలస్యం కానుంది.

సదా మీ సంస్మరణలో..

సకల ఆత్మల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం సమీపంలోని శ్మశానవాటికలో దివ్య పూజబలి నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ విశ్వాసులు తమ కుటుంబీకుల సమాధులను పూలతో అలంకరించి, కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. –న్యూస్‌టుడే, జ్ఞానాపురం

అమృతమూర్తికి అశ్రునివాళి

జననం: 15-11-1959
మరణం: 24-10-2025

కీ॥శే॥ శ్రీమతి గొలగాని వెంకటలక్ష్మి గారు

మంచితనానికి మారుపేరుగా నిలిచి, అందరిని చిరునవ్వుతో పలుకరిస్తూ.. ప్రేమ, ఆప్యాయత, అనురాగాలు మాకు పంచిన మీరు మానుండి భౌతికంగా దూరమైనందుకు చింతిస్తూ... మీరు మానుండి దూరమైనా మీ మధుర స్మృతులు, జ్ఞాపకాలు మరువలేము. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలనిభగవంతుని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...

భర్త: గొలగాని బంగార్రాజు, B.Com, BL; SAIL

కుమార్తెలు - అల్లుళ్ళు
డా॥ ఆవుల త్రివేణి Professor, S.V.Veterinary University, Tirupati
డా॥ ఆవుల ప్రసాద్ Assistant Director, AHD, Tirupati
డా॥ పల్లా లావణ్య దేవి M.Tech, Ph.D; Associate Professor, AU
పల్లా శ్రీనివాసరావు M.Tech, MBA; TDP State President & MLA, Gajuwaka
డా॥ యడ్ల సౌజన్య దేవి MBBS; Civil Assistant Surgeon
యడ్ల రాజేష్ MBA, Corporator, Vijayanagaram

మనుమలు, మనుమరాళ్ళు:
ఆవుల షరిణి
ఆవుల మోక్షిత్
పల్లా అంజనా కృష్ణ శ్రీ.
పల్లా దేవ్ శ్రీ కృష్ణ సింహా
యడ్ల జై సృజన్
యడ్ల జస్విక్ రామ్

కుమారుడు - కోడలు
గొలగాని దశవతార యాదవ్ M.Tech (Ph.D); Software Architect
గొలగాని జయ మాధురి M.Tech; Software Engineer

మనుమలు, మనుమరాళ్ళు:
గొలగాని దేవకీనందన్
గొలగాని గీతాన్విక

బావగార్లు : కీ॥శే॥ గొలగాని అప్పన్న, కీ॥శే॥ గొలగాని చినరాములు, కీ॥శే॥ గొలగాని చిన్నారావు
కుమారులు : గొలగాని అప్పలనాయుడు, గొలగాని క్రిష్ణ, గొలగాని సత్యనారాయణ ప్రెసిడెంట్, గొలగాని కన్నారావు
తమ్ముడు : బీసపు సత్యనారాయణ - బీసపు బంగారమ్మ దంపతులు

పెద్దకర్మ: తేది. 03-11-2025 సోమవారం మధ్యాహ్నం 11.31 గం॥లకు

కొత్త గుంగూబూడి గ్రామం, కొత్తవలస నుండి అరకు రోడ్డు, ఎల్.కోట మండలం, విజయనగరం జిల్లాలో మా స్వగృహము నందు జరుపబడును.

భక్తిశ్రద్ధలతో సంస్మరణ దినోత్సవం

జ్ఞానాపురం, న్యూస్‌టుడే : ప్రతి కుటుంబంలో మృతి చెందిన వారి ఆత్మలకు నిత్య విశ్రాంతి కలిగేలా ఏటా నవంబరు మాసంలో ప్రత్యేక ప్రార్థనలు చేయాలని విశాఖ అగ్రపీఠాధిపతి ఉడుమల బాల పేర్కొన్నారు. సకల ఆత్మల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం సమీప శ్మశానవాటికలో ఆదివారం దివ్య పూజబలి నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రపీఠాధిపతి ఉడుమల బాల మాట్లాడుతూ... మరణించిన వారు చేసిన తప్పుల్ని మన్నించి, వారి ఆత్మలు దేవుని రాజ్యం చేరాలని అనుదిన ప్రార్థనల్లో గుర్తు చేసుకోవాలన్నారు. ముందుగా విశ్వాసులు పునీత పేతురు ప్రధాన దేవాలయం నుంచి శ్మశానవాటిక వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం ప్రతి సమాధి వద్ద దేవాలయం ఫాదర్ జొన్నాడ ప్రకాశ్, సహాయక విచారణకర్తలు ఫాదర్ ప్రేమ్‌కుమార్, ఫాదర్ థామస్, తదితరులు ప్రార్థనలు చేశారు. క్రైస్తవ విశ్వాసులు తమ కుటుంబీకుల సమాధులను పూలతో అలంకరించి, కొవ్వొత్తులు వెలిగించారు.

ప్రసంగిస్తున్న విశాఖ అగ్రపీఠాధిపతి ఉడుమల బాల

కపాలంలో కల్లోలం..!!

న్యూస్‌టుడే, వన్‌టౌన్

1 గాజువాక ప్రాంతానికి చెందిన 20 ఏళ్ల యువకుడికి మెదడుపోటు (స్ట్రోక్) రావడంతో మూతి, కాలు వంకర పోయి ఇటీవల కేజీహెచ్‌లో చేరాడు. చిన్న వయసు నుంచే మాదక ద్రవ్యాలు, మద్యానికి అలవాటు పడడంతోనే ఈ పరిస్థితి తలెత్తినట్టు వైద్యులు గుర్తించారు. చేతికందిన కొడుకు మంచాన పడడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

2 60 ఏళ్ల వృద్ధుడు స్ట్రోక్ బారిన పడి కేజీహెచ్‌లో చేరాడు. ఆయనకు నలుగురు కుమారులు ఉన్నా, ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆలనాపాలనా చూసే వారు లేక, తీవ్ర ఆందోళనతో ఒత్తిడి పెరిగి మెదడు పోటు వచ్చిందని, దాంతో కాలు, చేయి పడిపోయాయని కేజీహెచ్ న్యూరాలజీ విభాగం వైద్యులు పేర్కొన్నారు.

–ఇలా కేజీహెచ్‌లోని పలు విభాగాలకు ప్రతి నెలా స్ట్రోక్ కేసులు వస్తున్నాయి. బాధితుల్లో 70 శాతం పురుషులు, 30 శాతం మహిళలు ఉంటున్నారు.

స్ట్రోక్ రెండు రకాలు: రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టడం వల్ల వచ్చే స్ట్రోక్‌ను ఇన్‌ఫ్రాక్ట్‌గా పిలుస్తారు. మొత్తం బాధితుల్లో 85 శాతం ఇదే సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. మెదడులో రక్తనాళాలు చిట్లిపోవడం(సెరిబ్రల్)తోనూ స్ట్రోక్ వస్తుంది. బాధితుల్లో 15 శాతం మందికి ఇదే తరహా సమస్య ఉంటుంది.



ఇవీ లక్షణాలు.. మూతి వంకర పోవడం, కాలు, చేయి పడిపోవడం, మాట సరిగా రాకపోవడం వంటి తీవ్ర లక్షణాలతో పాటు, తలనొప్పి, వాంతులు, కంటిచూపు తగ్గడం, తూలి పడిపోవడం వంటి సాధారణ లక్షణాలు కనిపిస్తాయి.

కారణాలు..: వయసు మీరడం, జీవనశైలిలో మార్పులు, పొగ తాగడం, మద్యపానం, మాదక ద్రవ్యాల వినియోగం, మధుమేహం, రక్తపోటు, ఒత్తిడి పెరగడం, వ్యాయామం లేకపోవడం, స్థూలకాయంతో పాటు, నిద్రలో గురక పెట్టే వారు స్ట్రోక్ బారిన పడుతున్నారు. నోటిలో కురుపులు, దంత సమస్యలు, వాయు కాలుష్యం, కట్టెల పొయ్యి పొగ పీల్చడం వంటివి మెదడుపోటుకు కారణమవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు.

ఇదీ లెక్క 307 — 13 నెలల వ్యవధిలో కేజీహెచ్ న్యూరాలజీ విభాగానికి మెదడు పోటుతో వచ్చిన కేసులు. 211 పురుషులు, 96 మహిళలు

మెరుగైన వైద్యంతో నివారణ..

ఇటీవల కేజీహెచ్‌కు స్ట్రోక్ బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. బాధితులను 3 నుంచి 4 గంటల వ్యవధిలో ఆసుపత్రిలో చేర్పించి, మెరుగైన వైద్యం అందిస్తే ఫలితం ఉంటుంది. కేజీహెచ్‌లో చేరే వారికి అవసరమైన రోగ నిర్ధారణ పరీక్షలు పూర్తి చేసి, రూ.50 వేల విలువ చేసే త్రాంబోలైసిస్ అనే సూది మందు ఇస్తున్నాం. దీంతో పక్షపాత ఇబ్బందుల నుంచి రోగిని రక్షిస్తున్నాం. –డాక్టర్ ఎస్.గోపి, న్యూరాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

ఏ కష్టమొచ్చిందో ఏమో..!

● దంపతుల బలవన్మరణం ● మహిళ ఏడు నెలల గర్భిణి

అనిత, వాసు (పాతచిత్రం)

మాధవధార, గురుద్వారా, న్యూస్‌టుడే: దంపతులు బలవన్మరణానికి పాల్పడిన ఘటన నగరంలో ఆదివారం సాయంత్రం కలకలం రేపింది. మహిళ ఏడు నెలల గర్భిణి కావడంతో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. అక్కయ్యపాలెం సంగం శరత్ థియేటర్ సమీపంలో నివాసముంటున్న సూరిశెట్టి వాసు(32), అనిత(22)కు ఏడాది క్రితం వివాహం జరిగింది. వాసు కొంత కాలం డెలివరీ బాయ్‌గా పనిచేశాడు. ప్రస్తుతం డ్రైవర్, కాంట్రాక్ట్ పనులు చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం దంపతులిద్దరూ ఒక శుభ కార్యక్రమానికి వెళ్లొచ్చి ఉన్నట్టుండి విశ్రాంతి తీసుకుంటామని గదిలోకి వెళ్లిపోయారు. వాసు తల్లి శుభకార్యానికి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికొచ్చి పలుమార్లు తలుపు కొట్టినా తీయలేదు. కిటికీ వద్దకు వెళ్లి చూడగా కుమారుడు వాసు ఉరేసుకొని ఉండగా, కోడలు అనిత కిందపడి ఉంది. ఈ ఘటనను చూసిన తల్లి ఒక్కసారిగా సొమ్మసిల్లి కింద పడిపోవడంతో వెంటనే చుట్టుపక్కల వాళ్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. నాలుగో పట్టణ సీఐ సి.హెచ్.శ్రీకాంత్ సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించగా అప్పటికే ఇద్దరూ మృతి చెంది ఉన్నారు. అనిత గర్భంలో ఉన్న శిశువును కాపాడాలని బంధువులు వెంటనే కేజీహెచ్‌కు తీసుకెళ్లినప్పటికీ గర్భంలో ఉన్న ఆడ శిశువు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కేజీహెచ్‌కు తరలించారు.

★ పలు కోణాల్లో దర్యాప్తు: వాసు ఉరేసుకొని ఉండగా, అనిత కిందపడి ఉండటంతో ముందు భార్యను చంపి, అతను ఆత్మహత్య చేసుకున్నాడా, లేదా భార్య విషమిచ్చి అనంతరం ఉరేసుకున్నాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పెళ్లి జరిగినప్పటి నుంచి వీరిద్దరూ అన్యోన్యంగా ఉన్నారు. వీరి మధ్య ఎటువంటి వివాదాలు లేవని, ఆనందంగా ఉండేవారని పోలీసులు తెలుసుకున్నారు. చుట్టుపక్కల నివాసితుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు.

హత్యాయత్నం కేసులో మరో నిందితుడి అరెస్టు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం సమీప ఆటోనగర్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి యువకుడిపై జరిగిన హత్యాయత్నం కేసులో పరారీలో ఉన్న నిందితుడు కృపాలక్షణను అరెస్టు చేసినట్లు సీఐ జి.బాలకృష్ణ ఆదివారం తెలిపారు. ఈ ఘటనలో ఓ రౌడీషీటర్ కలిపి మొత్తం ఆయుధాలతో నిందితులో శనివారం నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న ఐదవ నిందితుడి కోసం రెండు బృందాలుగా పోలీసులు గాలించారు. ఆదివారం ఉదయం మధురవాడలో అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. సోమవారం న్యాయస్థానంలో హాజరుపర్చి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

పటిష్ఠ కార్యాచరణతో గంజాయికి అడ్డుకట్ట

కొమ్మాది, న్యూస్‌టుడే: విశాఖ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పట్టుబడిన సుమారు 10 వేల కిలోల గంజాయిని ఆదివారం కాపులుప్పాడ డంపింగ్‌యార్డు వద్ద దహనం చేశారు. ముఖ్య అతిథిగా డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి పరిధిలో ఏయే ప్రాంతాల్లో గంజాయి స్వాధీనం చేసుకున్నారో ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శన, పవర్ ప్రజెంటేషన్‌ను వీక్షించారు. సీపీ శంఖబ్రతబాగ్చి మాట్లాడుతూ మొత్తం 533 గంజాయి కేసుల్లో నిందితుల నుంచి 96 ద్విచక్రవాహనాలు, 16 ఆటోలు, 39 కార్లు, 2 లారీలు స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి రహిత నగరంగా తీర్చిదిద్దే సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. 15 డ్రోన్లతో పాటు 14 చెక్ పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన కెమెరాలను విశాఖ జిల్లాలో ఏర్పాటు చేసి నిరంతర నిఘా ఉంచుతున్నామన్నారు. కొన్ని ప్రధాన ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. రైల్వేస్టేషన్లు, బస్‌కాంప్లెక్స్‌లు తదితర ప్రాంతాల్లో ఉమ్మడి తనిఖీలు నిర్వహిస్తున్నామని, నగర పరిధిలో 866 మంది మాదకద్రవ్యాలు సేవించే వారిని గుర్తించి వారికి చికిత్స అందిస్తున్నామన్నారు. ఈగల్ టీంతో పాఠశాలలు, కళాశాలల్లో చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నామని డీజీపీ వివరించారు.

చిత్ర ప్రదర్శనను వీక్షిస్తున్న డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా, సీపీ శంఖబ్రత బాగ్చీ, కలెక్టర్ హరేంధిరప్రసాద్ తదితరులు

★ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా స్వాధీనం చేసుకున్న 80 వేల కిలోల గంజాయిని దహనం చేశామని ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ తెలిపారు. ఈగల్‌కు ప్రతి జిల్లాలో ఒక బ్రాండ్ అంబాసిడర్ ఉన్నారని, పిల్లల నడవడిక గమనించాలని, ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 1972కు ఫోన్ చేయాలని సూచించారు. ఇటీవల ఎన్‌సీబీ సమావేశానికి వెళ్లగా ఏపీ పోలీసు పని తీరును ప్రశంసించారన్నారు.

ఆలోచనను నివారించాలి

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా గంజాయి నిర్మూలనను ముందుకు తీసుకెళ్తోందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అన్నారు. యువతలో గంజాయి సేవించాలనే ఆలోచనను ముందు తగలబెట్టి గంజాయి వద్దు భాయ్ అని చెప్పాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టి నిర్మూలిస్తున్నాయన్నారు. విశాఖ పరిధిలో కేజీహెచ్, మానసిక ఆసుపత్రుల్లో డీఅడిక్షన్ కేంద్రాలు ఉన్నాయన్నారు. అంతకుముందు గ్రీన్‌వుడ్ వంటి పలు స్వచ్ఛంద సంస్థలను ప్రత్యేకంగా అభినందించారు. మాదకద్రవ్యాలు వినియోగించకుండా సేవలను అభినందించారు. కార్యక్రమంలో డీసీపీలు మేరీ ప్రశాంతి, కె.లతామాధురి, ఏసీపీలు ఎస్.అప్పలరాజు, లక్ష్మణమూర్తి, అన్నేపు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా క్షీరాబ్ది ద్వాదశి వేడుక

సింహాద్రినాథుడికి చిమ్మిలి నివేదన

సింహాచలం, న్యూస్‌టుడే: కార్తిక శుద్ధ ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సింహాద్రి అప్పన్న స్వామి దేవాలయంలో ఆదివారం సాయంత్రం క్షీరాబ్ది ద్వాదశి ఉత్సవం సంప్రదాయబద్ధంగా జరిగింది. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యుల నేతృత్వంలో అర్చక పరివారం ఉత్సవాన్ని జరిపించారు. తొలుత స్వామి వారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని దేవేరులు, శయన బేరం వేణుగోపాల స్వామి, ఆళ్వారాచార్యులు సహితంగా శోభాయమానంగా అలంకరించి ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై ఆసీనులను చేశారు. స్వామి ఎదుట రోలు, రోకలి అధిష్ఠింపజేసి ఆవాహన పూజలు, ఆరాధనలు చేశారు. రోటిలో పాలు, బెల్లం, నువ్వుల పప్పు వేసి వేదమంత్రాల నడుమ తొలుత చెరకు గడతో దంచారు. అనంతరం రోకళ్లతో చిమ్మిలి దంచి స్వామికి నివేదించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని తిలకించారు. అనకాపల్లి ప్రాంతానికి చెందిన ఆదారి కుటుంబీకులు ఆనవాయితీ ప్రకారం చిమ్మిలి నివేదనకు అవసరమైన ద్రవ్యాలను సమర్పించారు. కుటుంబంతో సహా ఉత్సవంలో పాల్గొని స్వామిని సేవించారు.

చెరకు గడలతో చిమ్మిలి దంచుతున్న అర్చకులు

వాక్‌థాన్‌లో పాల్గొన్న బ్యాంకు ఉద్యోగులు

అవినీతి రహిత సమాజ స్థాపనకు కృషి

కార్పొరేషన్, న్యూస్‌టుడే : బ్యాంకు ఉద్యోగులు విధుల్లో నిజాయతీగా ఉంటూ, బాధ్యతగా వ్యవహరించాలని యూనియన్ బ్యాంకు జోనల్ హెడ్ షాలిని అన్నారు. నిఘా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ద్వారకానగర్‌లోని జోనల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా ఎల్ఐసీ కూడలి వరకు అవగాహన వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఉద్యోగులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పౌరులు సత్యనిష్ఠతో ఉండాలని, వ్యక్తిగత జీవితంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జోనల్ విజిలెన్స్ అధికారి ఐవీ.కృష్ణ మాట్లాడుతూ... సామాజిక బాధ్యతతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రీజనల్ హెడ్ జె.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల ఇళ్లల్లో సౌర వెలుగులు

గురుద్వారా, న్యూస్‌టుడే

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ విద్యుత్తు వినియోగదారులకు ఉచిత సౌర విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. దీంతో ఈపీడీసీఎల్ పరిధిలోని ఆయా కేటగిరీల విని యోగదారులకు మేలు చేకూరనుంది. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఇంటి మిద్దెపై సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేసి తద్వారా విద్యుత్తు సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇప్పటి వరకు ఎస్సీ ఎస్టీ కేటగిరీల వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును ప్రభుత్వం భరిస్తోంది. సోలార్ ప్లాంట్ల ఏర్పాటు ద్వారా సంస్థకు ఆర్థిక భారం నుంచి కాస్త ఉపశమనం కలగడమే గాక సౌర విద్యుదుత్పత్తికి ఆస్కారం ఉంటుంది.

ఈపీడీసీఎల్ పరిధిలో..: సంస్థ పరిధిలోని 30 డివిజన్లలో ప్రస్తుతం 2,27,408 మంది ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగదారులు ఉన్నారు. వీటిలో ఒక్కో ఇంటికి రెండు కిలోవాట్ సామర్థ్యం గల సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేస్తారు. వీటికోసం మొత్తం రూ.1.20 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.60 వేలు రాయితీ రూపంలో అందిస్తుంది. మిగతాది నాబార్డ్ ద్వారా వచ్చే రుణంతో ఈపీడీసీఎల్ భరిస్తుంది. ఇందులో వినియోగదారుడు చేయవలసిందల్లా సోలార్ ఏర్పాటు తమకు సమ్మతమని సంస్థకు అంగీకార పత్రం ఇస్తే చాలు.

« 1 కిలోవాట్ సౌర పలకలు ఏర్పాటు చేయాలంటే 100 చదరపు గజాలు విస్తీర్ణం కావాలి. అలా రెండు కిలోవాట్లకు 200 చదరపు గజాలు కాగా తద్వారా నెలకు రూ.200, ఏడాదికి రూ.2,400 అద్దెగా తిరిగి చెల్లిస్తుంది. ఈ వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించిన టెండర్ ప్రక్రియను నెడ్‌క్యాప్ సంస్థకు అప్పగించారు. 30 డివిజన్లకు సంబంధించి ఇప్పటివరకు 14 డివిజన్లకు టెండర్లు పూర్తయ్యాయి.

★ ఇప్పటికే క్షేత్రస్థాయి సిబ్బంది ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు వెళ్లి వారిని ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటివరకు 1.33 లక్షల గృహ వినియోగదారులు అంగీకారం తెలిపారు. సమ్మతి తెలిపినందుకు చదరపు గజానికి నెలకు రూ.1 చొప్పున వినియోగదారుడికి తిరిగి అద్దె రూపంలో చెల్లిస్తుంది.

ఏడాదికల్లా పనులు పూర్తి

ఈ పథకంతో ఎస్సీ, ఎస్టీ గృహ విద్యుత్తు వినియోగదారులకు మేలు చేకూరుతుంది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో వినియోగదారుల నుంచి అంగీకారం పొందడం జరిగింది. టెండర్ల ప్రక్రియ పూర్తయిన డివిజన్లలో ఏడాదికల్లా పనులు పూర్తి చేస్తాం. ఈ విధానంతో వినియోగదారుడికి సంస్థ అద్దె రూపంలో కొంత మొత్తాన్ని చెల్లిస్తుంది. – దైవప్రసాద్, సీజీఎం, ఈపీడీసీఎల్

'వైకాపావి శవ రాజకీయాలు'

గాజువాక, న్యూస్‌టుడే : శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో చనిపోయిన వారిని అడ్డం పెట్టుకుని వైకాపా శవ రాజకీయాలు చేస్తోందని, దీన్ని తెదేపా కార్యకర్తలు తిప్పికొట్టాలని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం గాజువాక పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏ చిన్న దుర్ఘటన జరిగినా దాన్ని ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టిస్తూ గందరగోళానికి గురిచేస్తోందన్నారు. అనుకోకుండా పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో ఘోర విపత్తు జరిగిందన్నారు. క్షతగాత్రులను పరామర్శించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు యంత్రాంగానికి ఆదేశాలిచ్చి అప్రమత్తం చేశారన్నారు. ప్రభుత్వం బాధితులను ఆదుకోవడంలో సమయం వృథా చేయడం లేదన్నారు. వాస్తవాలు తెలుసుకుని ముందుకు వెళ్లాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, చిత్రంలో పలువురు కార్పొరేటర్లు, నాయకులు

నేడు ఫిర్యాదుల స్వీకరణ

కార్పొరేషన్, వన్‌టౌన్, న్యూస్‌టుడే : నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడమే లక్ష్యంగా సోమవారం ఉదయం 11 గంటల నుంచి జీవీఎంసీలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో ఫిర్యాదులు స్వీకరణ ఉంటుందన్నారు.

★ కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి ప్రజా ఫిర్యాదులు స్వీకరిస్తామని కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు పాల్గొని, ప్రజా వినతులు స్వీకరిస్తారన్నారు.

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి ఆదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి ఆదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

REAL ESTATE

FLAT FOR SALE

SEETHAMMADHARA

Rs.6999/Sft Luxury 3BHK 2450 Sft New Flat. North East Facing. 100% Vastu, Lift, Generator, 2 Parkings. Contact Ph: 7893126804

GENERAL

MVP కాలనీలో 3BHK ఫ్లాట్, సాగర్‌నగర్ మరియు PM పాలెంలో 2BHK ఫ్లాట్ బ్యాంక్‌లోన్ సదుపాయంతో అమ్మకం. Contact Phone: 8686997700.

HOUSE FOR SALE

GENERAL

22లక్షలకే 2BHK హౌస్ NH-16కి 800 మీ॥ సంగివలసలో వైజాగ్‌కి కేవలం, 24కి॥మీ॥ Prime Locationలో అమ్మకం. Contact Phone: 8374373299.

EENADU Classifieds

SECOND SALE

మిదున్ ఏజెన్సీ, కొనబడును: పాత A/Cలు, సెంట్రల్ A/Cలు, ఇన్వర్టర్, బ్యాటరీలు, ఫ్రిజ్, వాషింగ్‌మిషన్స్, ఫర్నిచర్, ఆన్‌లైన్ UPSలు కొనబడును. Cont:6309745364.

JOBS

Wanted Accounts Manager(M) Having Knowledge in Tally (People who Mailed before need not apply). E-Mail: info@premcoals.in

Hiring Sales Representatives with minimum Degree, Qualified Ladies for Srikara Infra Developers. Contact Phone: 7670992692.

JOB OPPORTUNITY
A Fast growing organisation, No.1 position in AP & TS, shortly open new branches at VSP (NAD, Seethammadhara, Madhurawada).
❖CHIEF ADMINISTRATION OFFICERS (M/F): Qualf: Retd., would be Retd. / VRS - State / Central. Yearly Package: 15 Lakhs (Salary + other allowances negotiable)
❖BUSINESS DEVELOPMENT MANAGERS: (M/F): Qualf: Non Banking, Chit Fund Companies or any Insurance Sectors. Yearly Package: 10 Lakhs (Salary + other allowances nego.)
❖RESIDENTIAL MANAGERS: Work from home and Part Time Jobs. Age: 30 Years above. Yearly Package: 7 Lakhs (Salary + other allowances nego.)
Interviews on 03-11-2025 నుండి
GORLE RAMARAO, GM
DOCTORS COLONY, VIZAG
✆9553529529, 9133366051

స్టేట్‌బ్యాంక్ లైఫ్‌లో సీతమ్మధారలో అడ్వైజర్స్ నియామకం అర్హత 10th, 30సం॥ ఆపైన రిటైర్డ్ ఎంప్లాయిస్ చిట్‌ఫండ్స్ గృహిణులు రియల్ ఎస్టేట్ ఏజెంట్స్‌కు అవకాశం. 7989349476.

ఫైనాన్స్ కంపెనీలో పనిచేయుటకు రికవరీ & ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్, సిస్టమ్ ఆపరేటర్స్ M/F కావలెను. మంచి జీతం +ఇన్సెంటివ్స్. 8019250190, 8885066228.

ఫైనాన్స్ రంగంలో అనుభవం గల వైజాగ్ బ్రాంచ్ కొరకు వైజాగ్‌సిటీ, అనకాపల్లి, గాజువాక, చోడవరం, నర్సీపట్నం ఏరియాలలో పనిచేయుటకు ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ స్టాఫ్ కంప్యూటర్ నాలెడ్జ్ కావలెను. ఆకర్షణీయమైన జీతం+ ఇన్సెంటివ్స్+TA. రాఘవ ఆటో ఫైనాన్షియర్స్, దొండపర్తి. Contact Ph: 7680880513, 9100902198, 9100980842.

విశాఖపట్నండిపో నందు మెకానిక్స్‌గా పనిచేయుటకు ఐటిఐ చదివి 1,2 సం॥ అనుభవంగల అభ్యర్థులు కావలెను. 15000/- జీతం PF, ESI. Contact: 9848078290.

విశాఖపట్నంలో ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు అక్కౌంటెంట్స్, టెలికాలర్స్ & రిసెప్షనిస్ట్ Only for Ladies కావలెను. Contact Cell: 99485 13538.

శ్రీ తిరుమల ఆటోఫైనాన్స్ (3 వీలర్) నందు పనిచేయుటకు బిజినెస్ & కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ కావలెను. జీతం: 15K+ పెట్రోల్ అలవెన్స్. జాబ్ లొకేషన్ : పాయకరావుపేట. Contact Ph: 9100960677.

MARKETING/ SALES

Hyd. based Tissue Mfg. Company needs Sales Marketing Teams 9 Nos. includes PDM/ SE/SO. ✆ 7997990685, abhilash@peaceforever.in

MEDICAL

రిహాబిలిటేషన్ సెంటర్‌లో పనిచేయడానికి Nursing స్టాఫ్ మరియు వార్డ్ బాయ్స్, వార్డ్ గర్ల్స్ కావలెను. Contact ✆ 6304142919, 9997403339.

SECURITY GUARDS

సెక్యూరిటీగార్డ్స్- ఆటోనగర్, మోదవలస, పెందుర్తి ఏరియాలలో అనుభవం ఉన్న గార్డ్స్ కావలెను. అర్హత: 10th, 8గం॥ డ్యూటీ. వయస్సు: 25-45 ✆ 9440387815.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఒడ్డుకు చేరిన విద్యార్థి మృతదేహం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం తీరంలో గల్లంతయిన తానాం వసతి గృహం విద్యార్థి మృతి చెందాడు. ఆదివారం ఉదయం భానుప్రసాదు మృతదేహం ఒడ్డుకు చేరింది. పోలీసులు విద్యార్థి మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. రావికమతం మండలం తోటకూరపాలెం గ్రామానికి చెందిన సూరెడ్డి భానుప్రసాదు(15) తానాం బీసీ బాలుర వసతి గృహంలో ఉంటూ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాలకు వెళ్లకుండా మరో నలుగురి విద్యార్థులతో కలిసి ముత్యాలమ్మపాలెం తీరంలో సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లి గల్లంతయ్యాడు.

నేడు కేంద్ర సహాయ మంత్రి రాక

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సోమవారం విశాఖ రానున్నారు. ఉదయం 8.45 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని, అక్కడ నుంచి అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెం వెళ్తారు. స్థానిక కార్యక్రమాలు పాల్గొని, మధ్యాహ్నం 1.30 గంటలకు బయలుదేరి 3.10 గంటలకు నగరంలోని రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకుంటారు. ఆ తర్వాత ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొని, రాత్రి 8.50 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల విజేత 'బుల్లయ్య' జట్టు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : ఏయూ అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఆదివారం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో ముగిశాయి. చివరి రోజు పోటీలను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ ప్రారంభించారు. అనంతరం వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళల విభాగంలో బుల్లయ్య జట్టు ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను సొంతం చేసుకుంది. విజయనగరం సత్య డిగ్రీ కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. పురుషుల విభాగంలోనూ బుల్లయ్య జట్టు విజేతగా నిలవగా, ద్వితీయస్థానంలో మిస్సెస్ ఏవీఎన్ కళాశాల జట్టు నిలిచింది. ఏయూ రెక్టార్ ఆచార్య కింగ్, వ్యాయామ విభాగాధిపతి ఆచార్య ఎన్.విజయమోహన్ చేతుల మీదుగా విజేత జట్లకు ట్రోఫీలు, పతకాలు అందజేశారు. ముగింపోత్సవంలో బుల్లయ్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, పీడీ బి.ఆర్.ఎస్.లక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఏయూ రెక్టార్ ఆచార్య కింగ్, వ్యాయామ విభాగాధిపతి విజయమోహన్

అంబులెన్స్‌లోనే ప్రసవం

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే: ఆసుపత్రికి తరలిస్తుండగా దారిలోనే అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవించింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పెదగంట్యాడ దరి గంగవరానికి చెందిన కోవిరి దేవి(24)కి ఆదివారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో భర్త అప్పలరాజు 108కు ఫోన్ చేశారు. ఎన్ఏడీ నుంచి అంబులెన్స్ వచ్చింది. దేవిని ఆసుపత్రికి తరలిస్తుండగా షీలానగర్ వద్దకు వచ్చేసరికి ఆమెకు నొప్పులు ఎక్కువైపోయాయి. 108 సిబ్బంది వైద్యులతో ఫోన్లో మాట్లాడి.. వారి సూచన మేరకు అంబులెన్స్‌ను పక్కకు ఆపి సాధారణ ప్రసవం చేయించారు. తదుపరి చికిత్స నిమిత్తం తల్లీబిడ్డను కేజీహెచ్‌కు తరలించారు. ఇద్దరు ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. అంబులెన్స్ పైలట్ కొండబాబు, ఈఎమ్‌టీ వాసుదేవరావులను పలువురు అభినందించారు.

బాలింత దేవిని కేజీహెచ్‌కు తరలిస్తున్న 108 అంబులెన్స్ సిబ్బంది

దొంగ గుర్తింపు కార్డులతో కర్మాగారంలోకి ప్రవేశం

ఉక్కునగరం(స్టీల్ సెక్టార్-3), న్యూస్‌టుడే : కర్మాగారంలో దొంగ గుర్తింపు కార్డులతో ప్రవేశించి దొంగతనానికి పాల్పడుతున్న ఇద్దరు నిందితులను సీఐఎస్ఎఫ్ సిబ్బంది అదుపులోకి తీసుకొని స్టీల్‌ప్లాంటు పోలీసులకు ఆదివారం అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. సీఐఎస్ఎఫ్ కంట్రోల్ రూమ్‌లోని సీసీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్న సిబ్బందికి వాచ్‌టవర్-3 వద్ద ఇద్దరు వ్యక్తులు గోడ వెలుపలకు కొన్ని వస్తువులు విసురుతున్నట్లు గుర్తించారు. భద్రతా సిబ్బందిని అక్కడకు పంపించగా.. అప్పటికే సుమారు 50 కేజీల ఇత్తడి, 40 కిలోల బ్లూమ్ ముక్కలను గోడ అవతలకు తరలించినట్లు గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకుని స్టీల్‌ప్లాంట్ పోలీసులకు అప్పగించారు.

సముద్రంలో యువకుడి గల్లంతు



రూపక్ సాయి (పాతచిత్రం)

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: పాతగంగవరం తీరంలో ఆదివారం రాత్రి యువకుడు గల్లంతయ్యాడు. న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదగంట్యాడ నుంచి బీచ్ సందర్శనకు బ్రహ్మానందం, తిరుపతి సాహు, శంకరసాహు, రూపక్ సాయి (22) వచ్చారు. వ్యూ పాయింట్‌లో ఉన్న రాళ్ల గుట్టల నుంచి దిగుతున్న క్రమంలో రూపక్ సాయి జారిపడ్డాడు. బలమైన కెరటాలు లాక్కెళ్లడంతో గల్లంతైనట్లు సీఐ తెలిపారు. సీతానగరం ప్రాంతానికి చెందిన రూపక్‌సాయి ఇంటర్ చదివాడు.

నూతన కార్యవర్గం ఎన్నిక

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా కొణతాల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీ.మురళీ మనోహర్ అధ్యక్షతన నగరంలో జరిగిన కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శులుగా సూరిబాబు, ఆదినారాయణ, ఉపాధ్యక్షునిగా జేమ్స్, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. వారితో మురళీమోహన్ ప్రమాణం చేయించారు.

కొణతాల శ్రీనివాస్

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్ష

వన్‌టౌన్, న్యూస్‌టుడే : యూపీఎస్సీ పరీక్ష ఆదివారం నగరంలో ప్రశాంతంగా ముగిసింది. మొత్తం ఏడు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 3,268 మంది అభ్యర్థుల కోసం ఏర్పాట్లు చేయగా, కేవలం 1058 మంది మాత్రమే హాజరయ్యారని అధికారులు తెలిపారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	111	105
లైవ్	138	125
డ్రెస్డ్	200	220
స్కిన్‌లెస్	228	230

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు

లక్ష్మీకాంత్ స్క్రీన్-1
మాస్ జాతర

స్క్రీన్-2
కె ర్యాంప్

7న సీఐటీయూ కవాతు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 7న డాబా గార్డెన్స్ సరస్వతీ పార్కు నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు కవాతు నిర్వహిస్తామని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ.కుమార్ తెలిపారు. ఆదివారం జగదాంబ సిటూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖలో సీఐటీయూ 18వ మహాసభలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో 7న సీఐటీయూ అనుబంధ సంఘాల కార్మికులంతా ఎరుపురంగు దుస్తులు ధరించి కవాతులో పాల్గొంటారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సాయినగర్ ఎస్సీ, బీసీ కాలనీలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన భరించలేకపోతున్నాం. – డి.నర్సింగరావు ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – డిప్యూటీ ఎంపీడీవో, సబ్బవరం.

?: సబ్బవరం కోమటి వీధిలో వ్యర్థాలు పేరుకుపోయి కంపు కొడుతున్నాయి. – పి.నాగేశ్వరరావు. ✓: వ్యర్థాలను తొలగించే ఏర్పాటు చేస్తాం. – డి.ప్రసాదరావు, గ్రామ సర్పంచి, సబ్బవరం.

వేపగుంట, న్యూస్‌టుడే: ?: 93వ వార్డు విరాట్‌నగర్ చౌకదుకాణాల సమీపంలోని వీధి దీపాలు వెలగడం లేదు. – రామారావు ✓: వెలగని దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. – హరిబహదూర్, జీవీఎంసీ ఏఈ, జోన్–8

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలం నాయుడుపాలెం పంచాయతీ పరిధి వెంకటాపురంలోని సామాజిక భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో స్లాబ్ పెచ్చులూడి పడిపోతున్నాయి. – శ్రీను ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – రమేష్ నాయుడు, ఎంపీడీవో, పరవాడ.

ప్రజారోగ్య విభాగంలో బినామీ డ్రైవర్లు

ఇష్టానుసారంగా సిబ్బంది విధుల నిర్వహణ

పట్టించుకోని అధికారులు, పాలకులు

వేపగుంట, న్యూస్‌టుడే: ప్రజారోగ్య విభాగంలో బినామీ డ్రైవర్లు పెరిగిపోతున్నారు. అనధికారికంగా కొందరు వీరిని నియమించుకొని వారే జీతాలు చెల్లించేస్తున్నారు. దీనిపై జోనల్ కార్యాలయం అంతా ఇదే చర్చ నడుస్తోంది. జోనల్ కార్యాలయం అధికారులు, జీవీఎంసీ ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వేపగుంట జోనల్ కార్యాలయం

ఇదీ బాగోతం..

వీధుల్లో చెత్తను తరలించేందుకు, వాహనాల్లో నింపేందుకు వేర్వేరుగా ప్రజారోగ్య విభాగంలో వాహనాలు ఉన్నాయి. కొన్ని వాహనాల డ్రైవర్లకు గుత్తేదారులు జీతాలు చెల్లిస్తున్నారు. మరి కొన్ని వాహనాల డ్రైవర్లకు జీవీఎంసీ చెల్లిస్తుంది. అయితే జీవీఎంసీ నుంచి జీతాలు తీసుకునే కొందరు డ్రైవర్లు వారి స్థానంలో అనధికారికంగా వారికి తెలిసిన వారిని డ్రైవర్లుగా పెట్టుకుంటున్నారు. వారికి వచ్చిన జీతంలో కొంత మొత్తాన్ని స్వయంగా వారే చెల్లించేస్తున్నారు. అనధికారికంగా పనిచేస్తున్న డ్రైవర్లు నైపుణ్యం కలిగిన వారు కాకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత అని ప్రశ్నిస్తున్నారు.

వినియోగంలో ఉన్న వాహనాలు

జోన్‌లో వినియోగంలో ఉన్న వాహనాల్లో గుత్తేదారుడు జీతాలు చెల్లిస్తున్న వాటిలో 73 క్లాప్ వాహనాలు, 2 బాబ్ కాట్లు ఉన్నాయి. 10 మ్యాక్సీక్యాబ్‌లకు, 5 టిప్పర్లకు, 3 పొక్లెయిన్‌లకు డ్రైవర్లుగా పని చేస్తున్న వారికి జీవీఎంసీ జీతాలు చెల్లిస్తుంది. జీవీఎంసీ నియమించిన డ్రైవర్లలో కొందరు పనిచేసేందుకు ఇష్టం లేక.. బినామీలను పెట్టుకొని. . వారు వేరే ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్నారు. స్వీపర్లుగా పనిచేస్తున్న కొందరు వాహనాలకు డ్రైవర్లుగా పనిచేస్తున్నారని పలువురు కార్మికులు చెబుతున్నారు. దీంతో వీధుల్లో చెత్త ఎత్తేందుకు సిబ్బంది సరిపోవడం లేదని వాపోతున్నారు.

ఎక్కడ నుంచైనా హాజరు..

డంపింగ్ యార్డు వద్ద వాహనం బయలుదేరడానికి ముందే శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ కార్యదర్శుల పర్యవేక్షణలో విధులకు హాజరైనట్లు ఫేస్ రికగ్నజేషన్ సిస్టమ్ ద్వారా హాజరు వేసుకోవాలి. విధులు ముగించుకుని వచ్చినప్పుడు అదే తరహాలో హాజరు నమోదు చేసుకొని వాహనాన్ని అప్పగించేయాలి. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఇది ఎక్కడా జరగడం లేదు. ఇన్‌స్పెక్టర్లు వారి లాగిన్‌ను డ్రైవర్లకు ఇచ్చేస్తున్నారు. దీంతో డ్రైవర్లు ఎక్కడ నుంచైనా విధుల్లో చేరినట్లు ఫొటోలు తీసుకునే అవకాశం ఉంటుంది. సమయానికి ఫొటో తీసి ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులకు పంపించేస్తున్నారు. అలా డ్రైవర్లు విధులకు వెళ్లకుండా అధికారులకు కాసులు చెల్లించేసి అనుకూలంగా మార్చుకుంటున్నారన్న వాదన వినిపిస్తోంది.

సమాధానం చెప్పలేక...

ఈ విషయమై ప్రజారోగ్య విభాగం అధికారులను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. వివరాలను తెలిపేందుకు వారు మొహం చాటేస్తున్నారు. ఏదో ఒక కారణం చెప్పి తప్పించుకు తిరుగుతున్నారు. దీనిపై వెంటనే సంబంధిత అధికారులు స్పందించి బినామీ డ్రైవర్లకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా కార్తిక దీపారాధన

భజనలు చేస్తున్న ఏకాహం భజన బృందం

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట సమీప రవినగర్ శేషాద్రి కొండపై కొలువైన కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో 24 గంటల ఏకాహం కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. రాత్రంతా ఆలయ ప్రాంగణంలో భక్తులు భజనలు చేసుకుంటూ స్వామిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్తిక దీపారాధన కార్యక్రమంలో భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస స్వామి ఏకాహం భజన బృందం సభ్యులను స్వామి వారి శాలువతో సత్కరించారు.

సరిపల్లి శివాలయంలో...

సరిపల్లి (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆదివారం సరిపల్లి గ్రామంలోని స్వయంభూ మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఎమ్మెల్యే గోత్ర నామాలతో పరమ శివుడికి పంచామృతాభిషేకం జరిపారు. వేదమంత్రాలతో ఆశీర్వదించి శేష వస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు, నాయకులు

కేదారేశ్వరుడికి ఉసిరికాయల అభిషేకం

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: కార్తిక శుద్ధ ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సుజాతనగర్ హరిహర క్షేత్రంలో కొలువైన కేదారేశ్వర స్వామికి ఆదివారం ఉసిరికాయల అభిషేకం జరిగింది. అర్చకులు తొలుత పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం వేద మంత్రాల నడుమ ఉసిరి కాయలతో అభిషేకించి విశేష అలంకరణ చేశారు.

సుజాతనగర్‌లో..

కిటకిటలాడిన జూ

ఎండాడ, న్యూస్‌టుడే: కార్తిక మాసం రెండో వారం పురస్కరించుకుని ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో తరలి వచ్చారు. నెమలి నాట్యాలు.. చింపాంజీ వయ్యారాలు.. వ్యాఘ్రాల గాండ్రింపులు వింటూ సందడి చేశారు. వన్యప్రాణులతో పలువురు ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సందడి గడిపారు. జూకు 3213 మంది రాగా రూ.2.68 లక్షల ఆదాయం వచ్చినట్లు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. సమీప కంబాల కొండ పార్కును 350 మంది రాగా రూ.25 వేలు ఆదాయం వచ్చిందని రేంజ్ అధికారి శాస్త్రి వెల్లడించారు.

పులుల ఎన్‌క్లోజర్ వద్ద సందర్శకులు

బాలుడిపై కోతి దాడి

కాలిపైన గాయం

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి రాతిచెరువు ప్రాంతంలో ఆదివారం ఓ బాలుడిపై కోతి దాడి చేయడంతో తీవ్ర గాయమైంది. బాలుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. రాతిచెరువు ప్రాంతంలోని ఓ వ్యక్తి కుక్కలు, కోతులు పెంచుతున్నారు. కాలనీకి చెందిన బాలుడు ధనుంజయ్‌కుమార్ గుడికి వెళ్లి తిరిగి వస్తుండగా హఠాత్తుగా కోతి దాడి చేసింది. దీంతో కాలుకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు బాలుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. జనావాసాల మధ్య జంతువుల పెంపకాన్ని అరికట్టాలని బాలుడి తండ్రి సతీశ్‌కుమార్ అధికారులను కోరారు.

చేతి బోరు ప్రారంభం

సరిపల్లి (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి మండలం సరిపల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చేతి బోరును ఆదివారం ప్రారంభించారు. సర్పంచి గొర్లె రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు గొల్లవిల్లి వెంకటరమణ ముఖ్య అతిథులుగా పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో రమేష్, సంతోష్ కుమార్, సన్నిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మురుగు పారే మార్గమేది..?

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి అమ్మ భగవాన్ ఆలయం సమీపంలోని ఓ వీధిలో మురుగు తిష్ఠ వేసింది. ఈ ప్రాంతంలో సరైన మురుగు నీటి వ్యవస్థ లేకపోవడంతో వీధిలోని ఓ బహుళ అంతస్తుల భవనంలోని నివాసాల నుంచి వచ్చే మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. కచ్చా రోడ్డు కావడంతో మురుగంతా నిలిచిపోయి తీవ్రమైన దుర్వాసన వస్తోందని నివాసితులు వాపోతున్నారు. మురుగు కారణంగా దోమలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

చోరీలు పునరావృతం చేస్తే చర్యలు..

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి నేర విభాగం పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీలు, ఇళ్ల దొంగతనాలు, గొలుసు దొంగతనాలు తదితర నేరాలు పునరావృతం చేస్తే కఠిన చర్యలు తప్పవని నేర విభాగం ఎస్సై డి.సూరిబాబు హెచ్చరించారు. ఆదివారం స్టేషన్ పరిధిలోని 30మంది సస్పెక్ట్ షీట్ హోల్డర్లకు కౌన్సెలింగ్ జరిపింది. ఎస్సై మాట్లాడుతూ నేరాలు కొనసాగిస్తే పీడీ చట్టం నమోదు చేసి నగర బహిష్కరణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెందుర్తి శాంతి భద్రతల విభాగంలో సీఐ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ జరిపింది.

కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న నేర విభాగం ఎస్సై సూరిబాబు

అనాథాశ్రమంలో రగ్గుల పంపిణీ

బాలలకు రగ్గులు పంపిణీ చేసిన సత్యసాయి భజన మండలి ప్రతినిధులు

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: సత్యసాయి శత జయంతి సందర్భంగా జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్‌లోని సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం రగ్గులు పంపిణీ చేశారు. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం కొత్త సుంకరపాలెంలోని హోయినా అనాథాశ్రమంలో బాలలకు వీటిని అందించారు. తొలుత సుజాతనగర్‌లోని సత్యసాయి భవనం వద్ద ఆటో డ్రైవర్లకు సత్యసాయి చిత్ర పటాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భజన మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రికెట్ అభిమానుల సందడి

పరవాడ, న్యూస్‌టుడే: మహిళల వన్డే ప్రపంచ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం భారత్- దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగిన సందర్భంగా పరవాడలో పండగ వాతావరణం నెలకొంది. యువత జాతీయ పతాకాలను పట్టుకొని సందడి చేశారు. పరవాడ సామాజిక భవనం వద్ద స్థానిక తెదేపా నాయకులు వర్రి చంద్రశేఖర్, పైలా కృష్ణ, బుజ్జి, దిన అప్పలనాయుడు ఆధ్వర్యంలో మ్యాచ్‌ను వీక్షించేందుకు భారీ తెరను ఏర్పాటు చేశారు. యువత పెద్ద ఎత్తున ఇక్కడకు చేరుకొని మ్యాచ్‌ను వీక్షించారు.

సంతబయలులో మ్యాచ్‌ను వీక్షిస్తున్న అభిమానులు

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

ప్రసన్నగౌరీ

పరవాడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగం సాధించలేనేమోనన్న భయంతో మనస్తాపం చెంది వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం పరవాడలో ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక గండి వెంకటశివ రాఘవకు, నర్సీపట్నం దరి కొత్తవీధికి చెందిన ప్రసన్నగౌరి(29)తో ఈ ఏడాది ఆగస్టులో వివాహం జరిగింది. అప్పటి నుంచి భార్యాభర్తలు అన్యోన్యంగా ఉంటున్నారు. రాఘవ ఫుట్‌వేర్ దుకాణం నిర్వహిస్తుంటాడు. ప్రసన్న గౌరి బీఎస్సీ, బీఈడీ పూర్తి చేసి టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్‌కు (టెట్) ప్రిపేర్ అవుతోంది. పెళ్లి అయిన తర్వాత తాను అనుకున్న విధంగా చదవలేకపోతున్నానని, టీచర్ ఉద్యోగం సాధించగలనో.. లేదో అని కొద్ది రోజులుగా తల్లికి చెబుతూ బాధ పడుతుండేది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం అల్పాహారం చేసి మొదటి అంతస్తులో ఉన్న గదిలో చదువుకునేందుకు వెళ్లింది. మధ్యాహ్నం భోజనం సమయం అయినప్పటికీ కిందకు రాకపోవడంతో భర్త వెళ్లి తలుపు కొట్టినా ఎంతకీ తెరవకపోవడంతో విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పాడు. తలుపులు పగులగొట్టి చూసేసరికి ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని వేలాడుతూ కనిపించింది. మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 60ఏళ్ల పైబడిన క్రీడాకారులకు నిర్వహించిన వివిధ పోటీల్లో నగరానికి చెందిన క్రీడాకారిణి బి.విజయలక్ష్మి మొదటి స్థానంలో నిలిచారు. ఆదివారం సూర్యాబాగ్ పోలీస్ బ్యారెక్స్ మైదానంలో 100 మీటర్ల పరుగును 20.4 సెకన్లలో పూర్తి చేసిన ఆమె, డిస్క్‌త్రోను 14.30 మీటర్ల దూరం విసిరి ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో అతిథుల చేతుల మీదుగా బహుమతి అందించారు.

బహుమతి అందుకుంటున్న విజయలక్ష్మి

స్పెయిన్ పర్యటనకు జీవీఎంసీ కమిషనర్

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : మహా విశాఖ నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ సోమవారం స్పెయిన్ పర్యటనకు వెళ్లనున్నారు. అక్కడ బార్సిలోనాలో నిర్వహించే స్మార్ట్‌సిటీ కాంగ్రెస్ ఎక్స్‌పో కార్యక్రమంలో పాల్గొని, తిరిగి 8వ తేదీన నగరానికి చేరుకుంటారని రాష్ట్ర సాధారణ పరిపాలన విభాగం ఉత్తర్వులు జారీ చేసింది.

రాష్ట్రస్థాయి పాటల పోటీలు ప్రారంభం

మెగా కల్చరల్ షోను ప్రారంభిస్తున్న క్లబ్ అధ్యక్షులు, ఉక్కు జీఎం ఎం.మధుసూదనరావు

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : స్టీల్ క్లబ్ ఆడిటోరియంలో ఆదివారం రాష్ట్రస్థాయి పాటల పోటీలు ఘనంగా నిర్వహించారు. స్టీల్ క్లబ్ అధ్యక్షులు, ఉక్కు జీఎం ఎం.మధుసూదనరావు ఈ కార్యక్రమం ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి 31 మంది ఇందులో పాల్గొని పాటలు పాడారు. కార్యక్రమంలో జీఎం వి.చిట్టిబాబు, క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి వై.రవికుమార్, కోశాధికారి వేణుగోపాల్, కె.రంగనాథం, బి.వి.రమణ, కె.రమేష్‌కుమార్, ఎ.రమేష్, వి.ఎస్.బి.రాజు, ఎం.భువన్ కుమార్, కె.ఎల్.నరసింహం, ఎం.కృష్ణ, వెంకటరాజు పాల్గొన్నారు.

సైనికునికి ఘన స్వాగతం

అగనంపూడి, న్యూస్‌టుడే: భారత సైన్యంలో హవల్దారుగా 17 ఏళ్లపాటు సేవలందించిన సైనికుడికి ఆదివారం స్వగ్రామంలో ఘన స్వాగతం లభించింది. అగనంపూడి పరిధి పెదమడక కాలనీకి చెందిన బంధం పెంటారావు మద్రాస్ ఇంజినీర్ రెజిమెంట్‌లో విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేశారు. విశ్రాంత సైనికునిగా తొలిసారిగా ఇంటికి వచ్చిన ఆయనను పెదమడక యూత్ ఆధ్వర్యంలో కాలనీలో ఊరేగించారు. పూలు చల్లుతూ దేశభక్తి గీతాలతో ఘనంగా స్వాగతం పలికారు.

ఏపీఐఐసీ నిర్వాసితులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

అక్కిరెడ్డిపాలెం(ఆటోనగర్), న్యూస్‌టుడే : జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో ఆదివారం సాయంత్రం ఏపీఐఐసీ నిర్వాసితుల సమావేశం జరిగింది. వివిధ కులసంఘాల నాయకులు, గ్రామాభివృద్ధి సంఘం ప్రతినిధులు, నిర్వాసితుల సంఘం ప్రతినిధులు, నిర్వాసితులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి మాట్లాడుతూ ఏపీఐఐసీ నిర్వాసితులకు ప్రభుత్వం వెంటనే ఇండ్ల స్థలాలు కేటాయించాలన్నారు. నిర్వాసిత సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం దీనిని తాత్సారం చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు కొల్లి అప్పలరెడ్డి, నావన సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

దానప్పతల్లి అమ్మవారి పండగ

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: ఉక్కు నిర్వాసిత కాలనీ దుగ్గపువానిపాలెంలో వేంచేసిన దానప్పతల్లి అమ్మవారి పండగ గోడపత్రికను ఆలయ కమిటీ ఆదివారం ఆవిష్కరించింది. 8న అమ్మవారి సారె, ముర్రాట పండగ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బొడ్డ గోవింద్, డీవీ అప్పారావు, బొడ్డ సన్యాసిరావు, ప్రగడ శ్రీనివాసరావు, దుగ్గపు నర్సింహమూర్తి, పిన్నింటి సంతోష్, పి.శంకర్రావు, పూడి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

మన ఆలయాలు భద్రమేనా..?

ప్రయివేటు ఆలయాలపై కొరవడిన పర్యవేక్షణ

పటిష్ఠ ఏర్పాట్లతోనే ప్రమాదాల నివారణ

పెందుర్తి, న్యూస్‌టుడే

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో శనివారం చోటు చేసుకున్న తొక్కిసలాటలో 9మంది భక్తులు దుర్మరణం చెందిన నేపథ్యంలో ఆలయాల్లో భక్తులు రద్దీని తట్టుకునేందుకు చేస్తున్న ఏర్పాట్లపై చర్చ జరుగుతోంది. విశాఖ జిల్లాలో వేలాది ఆలయాలుండగా అందులో దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఆలయాలు అతి స్వల్పమేనని చెప్పవచ్చు. పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆలయాలపై ఆశాఖ పర్యవేక్షణ లేకపోవడంతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఆలయాల నిర్మాణం, నిర్వహణ, పర్యవేక్షణపై ఒక స్పష్టమైన విధానం లేకపోవడంతో ఆలయ కమిటీల ఇష్టారాజ్యం జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కమిటీలు దృష్టి సారించాలి..

కొన్ని ప్రయివేటు ఆలయాల్లో ఇష్టారాజ్యం నడుస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయ కమిటీలు పండగలు, పర్వదినాల సమయంలో అధిక ధరలకు టికెట్లు విక్రయించి భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నాయి. కార్తికమాసం నేపథ్యంలో సోమవారాల్లో శివాలయాలకు వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. వారంతా దర్శనాల కోసం క్యూలైన్లలో వేచి ఉంటున్నారు. ముందుగా దర్శనాలు చేసుకోవాలన్న తలంపుతో కొన్నిసార్లు తోపులాటలు జరుగుతున్నాయి. భక్తుల క్రమబద్ధీకరణపై ఆలయ కమిటీలు దృష్టి సారించాల్సి ఉంది.

వేంకటాద్రిపై ఏర్పాటు చేసిన క్యూలైన్లలో భక్తులు

పెందుర్తి మండలంలో పెద్ద ఆలయాలు.. పెందుర్తి మండలంలో అనేక దేవాలయాలుండగా భక్తుల రద్దీ అధికంగా ఉండే పెద్ద ఆలయాలు కూడా ఉన్నాయి. వేంకటాద్రిపై కొలువుదీరిన శ్రీనివాసుడి ఆలయానికి నిత్యం భక్తుల రద్దీ ఉంటుంది. శని, ఆదివారాల్లో పదివేలకు పైగా దర్శనం చేసుకుంటారు. పండగలు, పర్వదినాల్లో ఆ సంఖ్య 30 వేలకు చేరుతోంది. గత ఏడాది వైకుంఠ ఏకాదశి నాడు 50 వేల వరకు భక్తులు దర్శనం చేసుకున్నారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఉన్న ఈ ఆలయంలో భక్తుల రద్దీని తట్టుకునేందుకు శాశ్వత ఏర్పాట్లు లేవు. క్యూలైన్లు, వాహనాల పార్కింగ్, ఎండావానలకు నీడ వంటి సదుపాయాలు పూర్తిస్థాయిలో లేవు. భక్తుల రద్దీ సమయంలో భక్త బృందాల సభ్యులే సేవలందిస్తుంటారు. పెందుర్తి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఆ దిశగా దేవాదాయశాఖ కార్యచరణ రూపొందించాలి.

నిబంధనల అమలుతోనే భద్రత

ఆలయాల నిర్మాణం చేయాలంటే దేవాదాయశాఖ నుంచి అనుమతులు తీసుకోవాలన్న నిబంధన అమలు చేసినప్పుడే భక్తులకు భద్రత లభిస్తుందని పలువురు నిపుణులు సూచిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాలు, నీటి వనరుల్లో ఆలయాలు నిర్మించడంతో పాటు పూజలు, సేవలు, దర్శనాల పేరిట భక్తుల నుంచి వసూళ్లను కూడా నియంత్రించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయాలని పేర్కొన్నారు.

ఉద్యానవనం .. ఆహ్లాదానికి దూరం

ఫోకస్

పెందుర్తి, న్యూస్‌టుడే: సువిశాలమైన ప్రాంగణం. చుట్టూ నిర్మించిన ప్రహరీ. ఇదేదో అందమైన ఉద్యానవనం అనుకుంటే పొరపాటు పడినట్టే. బయట నుంచి చూస్తే ఎత్తైన చెట్లు.. చల్లని నీడతో ఆహ్లాదంగా ఆకట్టుకుంటుంది. ప్రహరీ దాటి లోపలికి వెళ్తే అవాక్కవడం ఖాయం. అధ్వానంగా ఉన్న పరిసరాలు ముక్కు మూసుకునేలా చేస్తున్నాయి. ఇదీ జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి జనచైతన్య లేఅవుట్‌లోని పార్కు దుస్థితి.

నిరుపయోగంగా వాకింగ్ ట్రాక్, బెంచీ

నిర్వహణ లేక పరిసరాలు అధ్వానం

జన చైతన్య లేఅవుట్‌లో దశాబ్దాల క్రితం పార్కుకు కేటాయించిన ప్రదేశంలో ప్రహరీ నిర్మాణం, నడక మార్గాలు, కూర్చునేందుకు బెంచీలు, పార్కు మధ్యలో కుటీరం నిర్మించారు. అనంతరం పట్టించుకునే నాథుడు లేకపోవడంతో పార్కు ఆవరణ అధ్వానంగా మారింది. భారీ చెట్లు ఎక్కడపడితే అక్కడ ఉన్నాయి. మధ్యలో తుప్పలు పెరిగిపోయాయి. ప్రవేశ ద్వారం నుంచి ఎడమ వైపు ప్రాంతం చిట్టడవిని తలపిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు పార్కులోని కుటీరం వైపు ఉన్న పల్లపు ప్రాంతం నీటితో నిండిపోయి చెరువులా మారింది. దుర్వాసన, దోమలతో ఆవరణ అంతా అపరిశుభ్రత నెలకొంది. వినియోగానికి అనుకూలంగా లేకపోవడంతో నిర్మానుష్యంగా మారింది. దీంతో ఆకతాయిలకు ఆవాసంగా మారింది.

పార్కులో పెద్దఎత్తున నిలిచిపోయిన వర్షం నీరు

అభివృద్ధి చేస్తే ప్రయోజనం

పలు కాలనీల్లో పార్కు స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. కానీ ఇక్కడ ప్రహరీ నిర్మించి ప్రాథమిక పనులు పూర్తయినా అభివృద్ధికి మాత్రం నోచుకోలేదు. ఏళ్లుగా నిరుపయోగంగా ఉండిపోయింది. దీంతో చుట్టుపక్కల కాలనీ వాసులు ఆహ్లాదానికి దూరమవుతున్నారు. ఇప్పటికైనా దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి ఉద్యానవనాన్ని అభివృద్ధి చేస్తే కాలనీ వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కనులపండువగా నరహరి నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి దేవాలయంలో ఆదివారం నిత్య కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేద మంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు.

స్వామి, అమ్మవార్లు

నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తజనం

దాతకు ధ్రువపత్రం అందిస్తున్న పర్యవేక్షకుడు సునీల్‌కుమార్

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి సింహాచలం దరి రాజీవ్‌కాలనీకి చెందిన లంకా జయ మౌర్యసాయి ఆదివారం రూ.1,00,116 విరాళంగా సమర్పించారు. విరాళాన్ని దాత ప్రతినిధి నగదు రూపంలో ప్రొటోకాల్ పర్యవేక్షకుడు పి.సునీల్‌కుమార్‌కు అందజేశారు. అధికారులు స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

(c) eenadu

భీమిలి

సి ని మా లు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్- బైసన్ కాలామదన్
రాములమ్మ- కాంతారా
తాతా- కె-ర్యాంప్
సప్తగిరి- మాస్ జాతర

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పద్మనాభం, న్యూస్‌టుడే: రెడ్డిపల్లి గ్రామంలో కొలువై ఉన్న శిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం బాబాకు పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ఆలయ ధర్మకర్త మురళి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పొట్నూరు, శేరీఖండం, రెడ్డిపల్లి తదితర గ్రామాల భక్తులు హాజరయ్యారు.

పద్మనాభంలో భారీ వర్షం

పద్మనాభం, న్యూస్‌టుడే: మండల కేంద్రం పద్మనాభంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. గెడ్డలు పొంగి ప్రవహించాయి. వర్షానికి తోడు గాలులు తోడవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: ఎండాడ 100 అడుగుల దారిలో ఎక్కడికక్కడ స్పీడ్ బ్రేకర్లు వేయడంతో ఇబ్బంది పడుతున్నాం. – అపార్ట్‌మెంట్ వాసులు ✓: పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. – ఆరిలోవ ట్రాఫిక్ పోలీసులు

?: వెల్లంకి(ఆనందపురం)లో విద్యుత్ తీగలు కిందకి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. – వెల్లంకి వాసులు ✓: విద్యుత్ తీగలను సరి చేస్తాం. – విద్యుత్ సిబ్బంది

?: సుభాష్‌నగర్(సాగర్‌నగర్) ప్రధాన దారిలో మద్యం దుకాణం వద్ద వాహనాలు అడ్డంగా పెట్టడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం.– కాలనీవాసులు ✓: పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. – ప్రభాకర్, సీఐ

?: లక్ష్మీవానిపాలెం(మధురవాడ)లో సరైన కాలువలు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులు కరవయ్యాయి. – లక్ష్మీవానిపాలెం వాసులు ✓: క్షేత్రస్థాయిలో దృష్టి సారించి తగు చర్యలు తీసుకుంటాం. – కనకమహాలక్ష్మి, జెడ్సీ

?: బోయపాలెం నుంచి కాపులుప్పాడ ప్రధాన దారిలో విద్యుత్ దీపాలు వెలగడం లేదు. – బోయపాలెం వాసులు ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – సురేష్, విద్యుత్ ఏఈ

?: ఆనందపురం పూల మార్కెట్‌కు వెళ్లే దారిలో ఇరువైపులా రోడ్డు ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. – రవి కిశోర్, స్థానికుడు ✓: రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతాం. – ఆనందపురం ట్రాఫిక్ పోలీసులు

అద్దంలాంటి దారులు.. అధ్వానంగా మారి

పనోరమహిల్స్ సమీప మూడు రోడ్ల కూడలిలో రోడ్డుపై కాంక్రీటు వ్యర్థాలు

మధురవాడ, న్యూస్‌టుడే

మధురవాడ పరిసర ప్రాంతాల్లో రెడీమిక్స్ వాహనాల నిర్లక్ష్యంతో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా తయారవుతున్నాయి. అద్దంలాంటి రహదారులు ఎగుడుదిగుడుగా మారుతున్నాయి. మరోవైపు అతివేగం కారణంగా సాధారణ వాహనదారులు, పాదచారులు బెంబేలెత్తిపోతున్నారు. వీటిని నియంత్రించే ప్రక్రియలో జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రోడ్లపైన, పక్కన మిగిలిన కాంక్రీటు మిక్సర్‌ను ఇష్టానుసారం డంపింగ్ చేస్తున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

■ **ఐటీ హిల్స్ ప్రాంతాల్లో..:** మిథిలాపురి వుడా కాలనీ నుంచి ఐటీహిల్స్‌కు వెళ్లే రోడ్డు, మారికవలస కూడలి నుంచి తిమ్మాపురం బీచ్‌రోడ్డుకు వెళ్లే మార్గాలు, పనరోమ హిల్స్ నుంచి రెవెన్యూ కాలనీకి వెళ్లే మూడు రోడ్ల కూడలి తదితర చోట్ల సమస్య తీవ్రంగా ఉంటోంది. రెడీమిక్స్ రవాణా చేస్తున్న వాహనాలు కాంక్రీటు మిశ్రమాన్ని రోడ్లపై వదులుతూ వెళ్లడమే ప్రధాన సమస్యగా మారుతోంది. ప్రధానంగా లోడ్ దించిన తర్వాత మిగిలిన మిశ్రమం రోడ్ల పొడవునా వదిలేస్తున్నారు.

■ **నిబంధనలు మరచి..:** కాంక్రీటు మిశ్రమం తయారైన 5 నుంచి 6 గంటల్లోపే వాడాల్సి ఉంటుంది. లేకపోతే గడ్డకట్టి సహజత్వం కోల్పోతుంది. ఇందుకు రెడీమిక్స్ వాహనాలు నిర్ణీత సమయంలో గమ్యాన్ని చేరేందుకు అతి వేగంతో రోడ్లపై దూసుకొస్తున్నాయి. ట్రాఫిక్ నిబంధనల ప్రకారం అనుమతి లేని సమయాల్లో సైతం వాహనాలు రోడ్లపైకి వస్తుండటంతో సాధారణ వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

దీంతో కాంక్రీటు మిశ్రమం గడ్డకట్టి రహదారులకు అతుక్కుపోతోంది. ఇలా రహదారులు ఎగుడుదిగుడుగా తయారవడంతో పాటు అధ్వానంగా మారుతున్నాయి. పనోరమహిల్స్ మూడు రోడ్ల కూడలిలో కాంక్రీటు వల్ల నిత్యం వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ వ్యర్థాల నుంచి వచ్చిన రాళ్ల పిక్కల వల్ల పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా వీటిని నియంత్రించి చర్యలు తీసుకునే అధికారులు కరవయ్యారు. స్థానికంగా ఉన్న ఆయా కంపెనీల నుంచి జీవీఎంసీ సంబంధిత అధికారులకు నెలవారీ మామూళ్లు అందుతున్నట్లు పలువురు చెబుతున్నారు.

ఐటీహిల్స్ ప్రధాన రహదారుల పక్కన డంపింగ్ చేసిన వ్యర్థాలు

చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో నేత్ర పరీక్షలు

పాఠశాలలో నేత్రపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కొమ్మాది, న్యూస్‌టుడే: ఏటా విద్యార్థులతో పాటు వృద్ధులకు శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్రపరీక్షలు చేయడం అభినందనీయమని చంద్రంపాలెం ఉన్నత పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ జి.అచ్యుత్‌రావు అన్నారు. ఆదివారం శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో విద్యార్థులకు, వృద్ధులకు నేత్రపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందించడంతో పాటు శస్త్ర చికిత్సలు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. తొలుత పాఠశాలలో సృజనవాణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకారవేతనాల ఎంపికకు ప్రతిభా పరీక్ష నిర్వహించారు.

అయ్యప్ప పీఠం నిర్మాణానికి ఆర్థిక సహాయం

దాతలను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

ఆనందపురం, న్యూస్‌టుడే: కణమాం గ్రామంలో అయ్యప్ప స్వామి పీఠం నిర్మాణానికి దాతలు సుభాష్‌చంద్రబోస్, మజ్జి వెంకటరావు, కోరాడ వెంకటరావులు సుమారు రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించారు. వీరిని ఆదివారం కణమాం గ్రామ అయ్యప్పస్వామి పీఠం నిర్వహణ కమిటీ సభ్యులు సత్కరించారు. అనంతరం అన్నసమారాధన చేపట్టారు. కార్యక్రమంలో చందవరపు కుమార్, అయ్యప్ప భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● **ఆలయాల వద్ద రెవెన్యూ సిబ్బంది సేవలు**

పద్మనాభం, న్యూస్‌టుడే: కార్తిక మాసంలో భక్తుల రద్దీని పురస్కరించుకొని మండలంలోని వివిధ గ్రామాల ఆలయాల్లో భక్తుల రద్దీని నియంత్రించడానికి రెవెన్యూ సిబ్బందిని నియమిస్తూ తహసీల్దార్ కె.ఆనందరావు ఆదేశాలు జారీ చేశారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాట జరిగి తొమ్మిది మంది మృతి చెందిన నేపథ్యంలో కార్తిక సోమవారం, పర్వదినాల్లో అయినాడ, పద్మనాభం, బి.ఆర్.తాళ్లవలస, తునివలస, అనంతవరం, పాండ్రంగి, పొట్నూరు, కోరాడ, రెడ్డిపల్లి, బాందేవుపురం, పెంట గ్రామాల్లోని ఆలయాల వద్ద భక్తుల రద్దీని నియంత్రించడానికి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు.

● **ఎస్‌ఐలకు బాధ్యతల కేటాయింపు**

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల విభాగంలో పని చేస్తున్న ముగ్గురు ఎస్.ఐ.లకు ప్రాంతాలవారీగా బాధ్యతలను కేటాయించారు. భీమిలి పట్టణంతో పాటు బీచ్ రోడ్డు ప్రాంతాలను ఎస్.ఐ.లు రాధాకృష్ణ, గౌరీ పర్యవేక్షిస్తారు. అలాగే తగరపువలస, చిట్టివలస ప్రాంతాలతో పాటు తాళ్లవలస, మజ్జివలస, అమనాం, చిప్పాడ, దాకమర్రి అన్నవరం వంటి పంచాయతీలను ఎస్ఐ భరత్‌కుమార్ రాజు చూస్తారు. ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు వేర్వేరుగా బాధ్యతలను అప్పగించామని భీమిలి సీఐ తిరుమలరావు పేర్కొన్నారు.

● **అష్టలక్ష్మీదేవాలయంలో ప్రత్యేక పూజలు**

కొమ్మాది, న్యూస్‌టుడే: క్షీరాబ్ధి ద్వాదశి పురస్కరించుకుని అన్నంరాజునగర్‌లో కొలువైన అష్టలక్ష్మీదేవాలయంలో ఆదివారం 108 మంది కలశాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. క్షీరసాగరసయనునిగా శ్రీలక్ష్మీనారాయణుడుని భక్తజనులు సందర్శించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర్‌స్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు. 108 మంది దంపతులు కలిసి తమ కలశాలతో క్షీరాభిషేకం కనులపండువగా నిర్వహించి ఆలయ గర్భగుడిని పాలకడలిగా తయారు చేశారు. ఆలయ ధర్మకర్త అన్నంరాజుసత్యనారాయణమూర్తి, రమాదేవి దంపతులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తిక దామోదర దీపోత్సవం

నెయ్యి దీపాలతో హారతి ఇస్తున్న భక్తులు

ఆనందపురం, న్యూస్‌టుడే: గంభీరం ఐఐఎం రోడ్డులోని శ్రీరాధామదన్‌మోహన్ స్వామి ఆలయంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో 27 రోజులుగా జరుగుతున్న కార్తిక దామోదర దీపోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. భక్తులు దామోదర అష్టకం పాడుతూ శ్రీకృష్ణ భగవానుడికి నెయ్యి దీపాలతో హారతి ఇచ్చారు.

★ ప్రతి ఆదివారం నిర్వహించే శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమంలో డి.శివ క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ నృత్యకారుడి ఆధ్వర్యంలో చిన్నారులు సరియు, మోక్షిత, ఐశ్వర్య, అక్షయ, రితిక, జ్యోతిక, తిథిత, లహరి, భవిష్య, గీత, సంజన, జయశ్రీలు శ్రీకృష్ణ లీలలు నృత్యరూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో అంబరీష దాస తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

ధనలక్ష్మి (పాతచిత్రం)

ఆనందపురం, న్యూస్‌టుడే: వేములవలసలోని ఓ మద్యం దుకాణం వెనుక ఖాళీ స్థలంలో వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఇది. సీఐ వాసునాయుడు ఆదివారం తెలిపిన వివరాలిలా.. పీఎం పాలెం రెండో బస్సు స్టాప్ ఆర్‌హెచ్. కాలనీకి చెందిన ఎచ్చర్ల ధనలక్ష్మి (38) పదేళ్ల కిందట భర్తతో తగాదాపడి విడిగా ఉంటోంది. అప్పటి నుంచి తల్లి వద్ద ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు కొడుకులతో కలిసి జీవనం సాగించేది. కాగా మద్యానికి బానిసగా మారిన ఆమె గత కొంతకాలంగా ఇంటి నుంచి బయటకు వచ్చేసింది. భీమిలి సముద్రతీర ప్రాంతం, తగరపువలస, ఆనందపురం పరిసరాల ప్రాంతాల దుకాణాల్లో పని చేయగా వచ్చిన డబ్బుతో మద్యం తాగుతూ ఉండేది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం వేములవలసలోని ఓ మద్యం దుకాణం వెనుక స్థలంలో అనుమానాస్పద స్థితిలో తన దుస్తుల బ్యాగుతో విగతజీవిగా స్థానికులకు కనిపించింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి బంధువులకు సమాచారమిచ్చారు. ఆమె తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. ఆమె మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు

ఆలయ ప్రాంగణంలో డీఆర్‌డీవో డీజీ హరప్రసాద్ దంపతులు

సింహాచలం, న్యూస్‌టుడే: ఎన్ఎస్‌టీఎల్‌కు చెందిన డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌వీ హరప్రసాద్ ఆదివారం సతీసమేతంగా సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏఈవో, ప్రధానార్చకులు

సింహాచలం, న్యూస్‌టుడే: రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదివారం సాయంత్రం సింహాద్రినాథుడికి సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, వైదికులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: మద్దిలపాలెంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు ఎంవీపీ స్టేషన్ సీఐ ప్రసాద్ తెలిపారు. ఆ వివరాలిలా.. కొమ్మాది వైఎస్ఆర్ కాలనీలో నివాసముంటున్న బోయి నర్సింగరెడ్డి (28) శుక్రవారం ఉదయం కిన్నెర థియేటర్‌లో సినిమా చూసేందుకు ఇంటి నుంచి బయలుదేరాడు. మార్గ మధ్యలో మద్దిలపాలెంలో ఉన్న స్నేహితుడ్ని కలవడానికి వెళ్లాడు. అక్కడి నుంచి సంబంధిత సినిమాహాల్‌కు చేరుకునే సమయంలో థియేటర్ సమీపంలో డివైడర్ దాటుతుండగా ఓ కారు ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో ఆ మార్గంలో వచ్చిన ఓ లారీ చక్రాలు అతడి చేతిపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

బాధితులకు నిత్యావసరాల అందజేత

శివశక్తినగర్‌లో మత్స్యకారులకు నిత్యావసర సరకులు అందిస్తున్న కార్పొరేటర్ హేమలత తదితరులు

మధురవాడ, న్యూస్‌టుడే: తుపాను బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని తెదేపా రాష్ట్ర వాణిజ్య విభాగం నిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకట్రావు అన్నారు. 7వ వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ ఆదేశాలతో ఆదివారం వార్డు పరిధిలోని వాంబే కాలనీ, చంద్రంపాలెం తదితర రేషన్ దుకాణాల వద్ద తుపాను ప్రభావిత మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అందించిన సరకులను పంపిణీ చేశారు. వార్డు కార్యదర్శి కానూరి అచ్యుతరావు, తెదేపా సీనియర్ నాయకులు పిళ్లా రాము, పి.మోహన్‌కృష్ణ, నొడగల భవాని, భాజపా నాయకులు పాల్గొన్నారు.

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ 5వ వార్డు శివశక్తినగర్‌లో చౌకదుకాణం వద్ద మత్స్యకార కుటుంబాలకు బియ్యం, కందిపప్పు, నూనె, బంగాళదుంపలు, ఉల్లిపాయలను తెదేపా 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత చేతులమీదుగా పంపిణీ చేశారు. రాష్ట్ర నాయకులు వాండ్రాసి అప్పలరాజు, వార్డు అధ్యక్షులు నాగోతి వెంకటసత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఈగల రవికుమార్, కొండపు రాజు, ఓలేటి శ్రావణ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

7న సీఐటీయూ కవాతు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 7న డాబాగార్డెన్స్ సరస్వతీ పార్కు నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు కవాతు నిర్వహిస్తామని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ.కుమార్ తెలిపారు. ఆదివారం జగదాంబ సిటూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖలో సీఐటీయూ 18వ మహాసభలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో 7న సీఐటీయూ అనుబంధ సంఘాల కార్మికులంతా ఎరుపురంగు దుస్తులు ధరించి కవాతులో పాల్గొంటారు.

రెండు కార్లను ఢీకొట్టిన వ్యాన్

ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం-అనకాపల్లి 16వ జాతీయ రహదారిలో దుక్కవానిపాలెం టోల్ ప్లాజా వద్ద ఆదివారం ఉదయం ఆగి ఉన్న రెండు కారులను ఓ వ్యాన్ ఢీకొట్టిన ఘటన ఇది. ఈ ప్రమాదంలో కారు, వ్యాన్‌కి మధ్యలో ఉన్న మరో కారు నుజ్జయింది. టోల్ కోసం ఆగి ఉన్న రెండు కారులను పెందుర్తి నుంచి వస్తున్న వాహన శ్రేణిలోని ఓ వ్యాన్ అదుపుతప్పి ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని పోలీసులు పేర్కొన్నారు. ట్రాఫిక్ పోలీసులు పరిశీలించి వాహనాలను స్టేషన్‌కు తరలించారు.

కనులపండువగా నరహరి నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి దేవాలయంలో ఆదివారం నిత్య కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు.

నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

దాత ప్రతినిధికి విరాళం ధ్రువపత్రం అందిస్తున్న పర్యవేక్షకుడు సునీల్‌కుమార్

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి సింహాచలం దరి రాజీవ్‌కాలనీకి చెందిన లంకా జయ మౌర్యసాయి ఆదివారం రూ.1,00,116 విరాళంగా సమర్పించారు. విరాళాన్ని దాత ప్రతినిధి నగదు రూపంలో ప్రొటోకాల్ పర్యవేక్షకుడు పి.సునీల్‌కుమార్‌కు అందజేశారు. అధికారులు స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

మత్స్యకార కుటుంబాలకు 'కూటమి' అండ

తుపాను నష్టంతో నిత్యావసరాల పంపిణీ

తగరపువలస, గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: మొంథా తుపాను నేపథ్యంలో మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం చేయూతనిచ్చింది. ఆయా మండలాల్లోని తుపాను బాధితులకు ఉచితంగా రేషన్ అందిస్తోంది. విపత్కర సమయంలో తమను ఆదుకుంటున్నారని మత్స్యకారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

నియోజకవర్గ గణాంకాలు

మండలం	మత్స్యకార కుటుంబాలు
భీమిలి	2958
ఆనందపురం	9
పద్మనాభం	1
విశాఖరూరల్	289

★ ఒక్కో కుటుంబానికి 50 కిలోల బియ్యం, కిలో చక్కెర, కిలో కందిపప్పు, లీటరు పామాయిల్, కిలో బంగాళా దుంపలు, కిలో ఉల్లిపాయలు ఇచ్చిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు. కష్టకాలంలో ఉచితంగా రేషన్ ఇచ్చి ఆదుకున్నారు.
– సూరాడ సతీశ్, మంగమారిపేట



★ తుపాను కారణంగా వారం రోజులు వేటకు వెళ్లలేదు. ఇంట్లో ఏమీ లేదు. ఏం తినాలి? ఎలా అని ఆలోచిస్తుండగా వెంటనే రేషన్ ఇచ్చి ఆదుకున్నారు.
– అర్జిల్ల దానయ్య, చేపలుప్పాడ

★ కూటమి ప్రభుత్వం పేద ప్రజల ప్రభుత్వం. యాభై కిలోల బియ్యం సహా పప్పు దినుసులు, నూనె, కూరగాయలు వంటి నిత్యావసరాలన్నీ ఇచ్చారు.
– వాసుపల్లి ఎల్లాజీ (దిబ్బడిపాలెం)

★ **నెలవారీ రేషన్‌కు అదనంగా..:** నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో దాదాపు 3 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. 98 రేషన్ డిపోల ద్వారా ఉచిత రేషన్ పంపిణీ చేస్తున్నాం. ఇది నెలవారీ రేషన్‌కు అదనంగా ఇవ్వడం జరుగుతోంది. – శ్రీనివాస్ (పౌరసరఫరాల ఉపతహసీల్దారు, భీమిలి)

అయ్యప్ప పీఠాల్లో ఉచిత అన్నదానాలు

తగరపువలస, గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా భీమిలి మండలంలో పలు అయ్యప్ప పీఠాల్లో ఉచిత అన్నదానాలతో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. అయ్యప్ప, భవానీ, శివయ్య, గోవింద, తదితర దీక్షాపరులకు రోజూ మధ్యాహ్నం మండల కాలం (నలభై ఒక్కరోజు) పాటు భిక్ష ఏర్పాటు చేశారు. భీమిలిలో పదహారేళ్ల కిందట వీరాంజనేయ అయ్యప్ప పీఠం ప్రారంభించిన ఈ సంప్రదాయం క్రమంగా నియోజకవర్గమంతటా పలు ప్రాంతాలకు విస్తరించింది. అయ్యప్ప పీఠాల నిర్వాహకులు చేపట్టిన ఈ మహత్తర కార్యానికి పలువురు దాతలు అండగా నిలుస్తూ దాణ గుణాన్ని, భక్తి భావాన్ని చాటుతున్నారు.

● **పీఠంపేరు:** డొకరుపేట-కృష్ణంరాజుపేట గ్రామాల శ్రీ రామాలయ అయ్యప్ప స్వామి సేవా పీఠం
■ **ప్రదేశం:** భీమిలి గ్రామీణ మండలం లోని డొకరుపేట రామాలయం ప్రాంగణం
▲ **అన్నదానం:** గత నెల 17 నుంచి నవంబర్ 26వ తేదీ వరకూ
❖ **భిక్ష స్వీకరిస్తున్న వారి సంఖ్య:** రోజూ మధ్యాహ్నం దాదాపు 350 మందికి
◗ **నిర్వాహకులు:** గురుస్వాములు గాడు అప్పలనాయుడు, కరుభుక్త ఈశ్వరరావు, గాడు సన్యాసినాయుడు, సిరిగిడి చిన్న, టీపీ రాజు, తదితరులు. దాతల సహకారం తీసుకోకుండా పీఠంలోని సభ్యులే తమ సొంత నిధులతో చేస్తున్నారు.

కృష్ణంరాజుపేట రామాలయం పీఠంలో భిక్ష స్వీకరిస్తున్న స్వాములు

● తగరపువలస శ్రీ దుర్గాలమ్మతల్లి అయ్యప్పస్వామి సేవా పీఠం
■ జీవీఎంసీ ఒకటో వార్డు తగరపువలస బంగ్లామెట్ట ప్రాంతం
▲ గతనెల 18 నుంచి ఈనెల 27వ తేదీ వరకూ
❖ భిక్ష స్వీకరిస్తున్న వారి సంఖ్య: రోజూ మధ్యాహ్నం సుమారు 450 మంది
◗ గురుస్వాములు తమ్మిన సూరిబాబు, దొంతల పైడిరాజు, సూర్య, కుమిలి తిరుపతిరావు, బెవర సాయి, తదితరులు దాతల సహాయంతో ఏర్పాటు

● లక్ష్మీపురం అయ్యప్పస్వామి సేవా పీఠం
■ భీమిలి మండలం లక్ష్మీపురం గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయం ఆవరణ
▲ అక్టోబరు 22 నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకూ
❖ సుమారు 400 మంది
◗ ఆలయ ధర్మకర్త, గురుస్వామి గాడు తాతినాయుడు ఆధ్వర్యంలో దాతల సహకారంతో

● భీమిలి శ్రీ వీరాంజనేయ అయ్యప్పస్వామి సేవా పీఠం
■ భీమిలి బీచ్ ప్రాంతంలోని అయ్యప్ప ఆలయం
▲ గతనెల 22 నుంచి డిసెంబరు 5వ తేదీ వరకూ
❖ దాదాపు 600 మంది
◗ గురుస్వాములు ఎర్రినాయుడు, కదిరి జగన్నాథం, మొకర నర్సింగరావు, తదితరులు దాతలు, పీఠం నిధులతో ఏర్పాటు. రోజూ మధ్యాహ్నం అన్నదానంతో పాటు, ప్రతి బుధవారం డిసెంబరు 10వ తేదీ వరకూ ఉదయం అల్పాహారం అందిస్తారు.

★ **సంప్రదాయబద్ధంగా వంటకాలు:** అన్నం, పులిహోర, సాంబారు, రెండు రకాల కూరలు, పెరుగు, స్వీటు, అరటిపండు, తదితర వంటకాలతో వేడివేడిగా భోజనం పెడుతున్నారు. పనుల్లో బిజీగా ఉండే దీక్షాపరులు భిక్షకు ప్రత్యేకంగా వెళ్లాల్సిన అవసరం లేకుండా ఈ పీఠాలకు వచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు.

సందడిగా రుషికొండ బీచ్

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ బీచ్‌కు కార్తిక మాసం నేపథ్యంలో ఆదివారం అధిక సంఖ్యలో సందర్శకులు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. పిల్లాపాపలతో విచ్చేసిన వీరు మత్స్యరాశుల పార్కు, బోటింగ్ కేంద్రం, అటవీ స్థలాలు వంటి ఆహ్లాదకర ప్రదేశాలతో పాటు ఇసుక తిన్నెలపై సేదతీరుతూ ఉత్సాహంగా గడిపారు. సముద్ర స్నానాలు చేసేవారిని లోపలికి వెళ్లరాదంటూ మెరైన్‌పోలీసులు, టూరిజం బ్లూఫ్లాగ్ బీచ్, జీవీఎంసీ లైఫ్‌గార్డులు ప్రచారమాధ్యమాల ద్వారా అప్రమత్తం చేశారు.

కిటకిటలాడిన జూ

ఎండాడ, న్యూస్‌టుడే: కార్తిక మాసం రెండో వారం పురస్కరించుకుని ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో తరలి వచ్చారు. నెమలి నాట్యాలు.. చింపాంజీల వయ్యారాలు.. వ్యాఘ్రాల గాండ్రింపులు వింటూ సందడి చేశారు. వన్యప్రాణులతో పలువురు ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సందడిగా గడిపారు. జూకు 3213 మంది రాగా రూ.2.68 లక్షల ఆదాయం వచ్చినట్లు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. సమీప కంబాల కొండ పార్కుకు 350 మంది రాగా రూ.25 వేలు ఆదాయం వచ్చిందని రేంజ్ అధికారి శాస్త్రి వెల్లడించారు.

స్పెయిన్ పర్యటనకు జీవీఎంసీ కమిషనర్

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : మహా విశాఖ నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ సోమవారం స్పెయిన్ పర్యటనకు వెళ్లనున్నారు. అక్కడ బార్సిలోనాలో నిర్వహించే స్మార్ట్‌సిటీ కాంగ్రెస్ ఎక్స్‌పో కార్యక్రమంలో పాల్గొని, తిరిగి 8వ తేదీన నగరానికి చేరుకుంటారని రాష్ట్ర సాధారణ పరిపాలన విభాగం ఉత్తర్వులు జారీ చేసింది.

పర్యాటక స్పీడుబోట్లు పునరుద్ధరణ

సాగర్‌నగర్: రుషికొండ బీచ్‌లో పర్యాటక స్పీడు బోట్లను ఆదివారం పూర్తిస్థాయిలో పునరుద్ధరించారు. మొంథా తుపాను ప్రభావంతో ప్రభుత్వ యంత్రాంగం హెచ్చరికల మేరకు ముందు జాగ్రత్త చర్యగా గత నెల 26వ తేదీ నుంచి ఇక్కడ సముద్రంలో విన్యసించే ఆరు స్పీడు పడవలను నిలిపివేశారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో యథావిధిగా వీటిని నడుపుతున్నామని టూరిజం బోటింగ్ విభాగాధికారులు పేర్కొన్నారు.

అమృతమూర్తికి అశ్రుతాంజలి



కీ॥శే॥ శ్రీమతి చెట్టిపల్లి శిరోమణి గారు
మరణం: 24-10-2025
మంచితనానికి, మమతానురాగాలకు మారుపేరుగా నిలిచి, మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసిన మీరు మానుండి భౌతికంగా దూరమైనా మీ మధుర స్మృతులు, జ్ఞాపకాలు మా మదిలో నిలిచే ఉంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
శోకతప్త హృదయాలతో... మీ... కుటుంబ సభ్యులు
పెద్దకర్మ: తేది. 03-11-2025 సోమవారం మధ్యాహ్నం గం॥ 11.00ల నుండి
యండాడ, స్కైలైన్ అపార్ట్‌మెంట్స్‌లో మా స్వగృహము నందు జరుపబడును.
సెల్: 9182856329, 7396875180

(c) eenadu

విశాఖ తూర్పు

నగర పోలీసులు, స్టార్ హోటళ్ల మధ్య అవగాహన ఒప్పందం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: 7వ వేతన సంఘం సిఫా ర్సుల మేరకు ఐపీఎస్ అధికారుల ఆతిథ్యానికి సంబంధించి విశాఖ నగర పోలీసులు, స్టార్ హోటళ్ల మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. ఈ మేరకు బీచ్‌రోడ్డులోని ఓ హోటల్లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, పోలీసు అధికారులు, హోటల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా, పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య
పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769
మద్దిలపాలెం: 9912120229

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: 11వ వార్డు పరిధి బాలాజీనగర్, వివేకానంద కాలనీలో మూడు రోజులుగా కొళాయి నీరు రావడం లేదు. –అప్పలసూరమ్మ, బాలాజీనగర్ ✓: టీసీ ఆర్ కేంద్రం నుంచి నీటి సరఫరా తగ్గడం వల్ల ఈ సమస్య తలెత్తింది. ఆ ప్రాంతానికి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తాం. –వి.రాజేష్, సూపర్‌వైజర్, నీటి సరఫరా విభాగం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: 21వ వార్డు చినవాల్తేరు అన్నక్యాంటీన్‌కు వెళ్లే మార్గంలో కొద్ది రోజులుగా వ్యర్థాలు తరలించడం లేదు. –రాజు, చినవాల్తేరు ✓: తక్షణమే సిబ్బంది పంపించి సమస్య పరిష్కరిస్తాం. –గోవిందరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ?: ఎంవీపీకాలనీ మూలపాలెం, మత్స్యకార కాలనీలో దోమల బెడద అధికంగా ఉంది. –కళావతి, గృహిణి, మూలపాలెం ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి దోమల నివారణ చర్యలు చేపడతాం. –శ్రీనివాసరావు, మలేరియా విభాగాధికారి

ఇందిరానగర్ (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ?: పెదగొల్ల వెటర్నరీకాలనీ లక్ష్మీనారాయణ దేవాలయం వీధి, రాజీవ్‌నగర్‌లలో కుళాయిల ద్వారా మంచినీరు సక్రమంగా రావడం లేదు. –జ్యోతి ప్రసన్న, గృహిణి, రాజీవ్‌నగర్ ✓: కుళాయి నీటి సరఫరా సమయంలో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. –శ్రీనివాస్, ఏఈ, మంచినీటి సరఫరా విభాగం

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: 11వ వార్డు పరిధిలోని డ్రైవర్స్ కాలనీ, అప్పారావు కాలనీలలో అయిదు వీధి దీపాలు వారం రోజులుగా వెలగడం లేదు. –కె.రాజారావు, అప్పారావు కాలనీ ✓: సిబ్బందిని పంపి కాలనీలో వీధి దీపాలు మరమ్మతులు చేయిస్తాం. –రామకృష్ణ, వీధి దీపాల పర్యవేక్షకుడు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ?: బీచ్‌రోడ్డు యూత్ హాస్టల్ సమీప కాలువ వద్ద వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. –పర్యాటకులు ✓: రెండు రోజుల్లో సిబ్బందిని పంపించి వ్యర్థాలు తొలగిస్తాం. –గోవింద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

స్పందనకు వందన

ఎట్టకేలకు వ్యర్థాల తొలగింపు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: 19వ వార్డు ఎంవీపీకాలనీ సెక్టార్-12లోని కాలువల్లో తీసిన వ్యర్థాలు తొలగించక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ఆదివారం 'ఈనాడు'లో వెలువడగా.. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు స్పందించారు. సంబంధిత ప్రాంతంలో సిబ్బందితో పరిశుభ్రత చర్యలు చేపట్టి సమస్య పరిష్కరించారు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: గ్రామీణ తహసీల్దారు కార్యాలయ వెటర్నరీ కాలనీలో వారం రోజులుగా విద్యుత్ దీపాలు వెలగక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పలువురు 'మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తెచ్చారు. దీనిపై ఆదివారం 'ఈనాడు'లో వెలువడగా వీధిదీపాల విభాగం ఏఈ గాయత్రి స్పందించారు. సిబ్బందిని పంపి సమస్య పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

7న సీఐటీయూ కవాతు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 7న డాబాగార్డెన్స్ సరస్వతీ పార్కు నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు కవాతు నిర్వహిస్తామని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ.కుమార్ తెలిపారు. ఆదివారం జగదాంబ సిటూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖలో సీఐటీయూ 18వ మహాసభలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో 7న సీఐటీయూ అనుబంధ సంఘాల కార్మికులంతా ఎరుపురంగు దుస్తులు ధరించి కవాతులో పాల్గొంటారు.

డిసెంబరు 7న జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థుల సమావేశం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల (కాకినాడ) పూర్వ విద్యార్థుల సమావేశం డిసెంబరు 7వ తేదీన ఎంవీపీ కాలనీ ఐఐఏఎం కళాశాలలో నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపకులు ఎ.ఎస్.ఎన్.ప్రసాదరావు, సంఘం ప్రెసిడెంట్ ఒ.ఆర్.ఎం.రావు, జాయింట్ సెక్రటరీ బి.అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు ఎంవీపీకాలనీలోని ఐ.ఐ.ఎ.ఎం. కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు సమావేశమయ్యారు. ఆ రోజు పూర్వ విద్యార్థులందరూ తప్పక హాజరు కావాలని కోరారు. సంఘం కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్పెయిన్ పర్యటనకు జీవీఎంసీ కమిషనర్

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : మహా విశాఖ నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ సోమవారం స్పెయిన్ పర్యటనకు వెళ్లనున్నారు. అక్కడ బార్సిలోనాలో నిర్వహించే స్మార్ట్‌సిటీ కాంగ్రెస్ ఎక్స్‌పో కార్యక్రమంలో పాల్గొని, తిరిగి 8వ తేదీన నగరానికి చేరుకుంటారని రాష్ట్ర సాధారణ పరిపాలన విభాగం ఉత్తర్వులు జారీ చేసింది.

వెంటాడుతున్న సమస్యలు.. తప్పని వెతలు

హెచ్‌బీకాలనీ (మద్దిలపాలెం), న్యూస్‌టుడే

జీవీఎంసీ 15వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పలుమార్లు వినతులిచ్చినా ప్రయోజనం లేదని స్థానికులు వాపోతున్నారు. దుర్గానగర్, సింహాద్రిపురం, హెచ్‌బీకాలనీ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్య వెంటాడుతోంది. చర్చి సమీప తదితర ప్రాంతాల్లో కొన్ని రోజులుగా వ్యర్థాలు తరలించడం లేదు. తుపాను కారణంగా నేలకొరిగిన చెట్ల కొమ్మలు నేటికీ అలాగే ఉన్నాయి. పారిశుద్ధ్య సిబ్బంది వ్యర్థాలు తరలించకపోవడంతో దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

దుర్గానగర్‌లో ఓ రహదారి ఇలా..

★ సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంతో పాటు హెచ్‌బీకాలనీ, దుర్గానగర్, ఉక్కు కాలనీల పరిసర ప్రాంతాల్లో 20 రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. చీకటి పడితే సంబంధిత ప్రాంతీయులకు ఇక్కట్లు తప్పడం లేదు.

★ దుర్గానగర్ పరిసర ప్రాంతాల్లో బోరుబావులు అలంకారప్రాయంగా ఉన్నాయి. దాంతో నీటికి ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోతున్నారు. హెచ్‌బీకాలనీ ప్రాంతాల్లో పార్కింగ్ సమస్య వెంటాడుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

★ హెచ్‌బీకాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయ మార్గంలో రహదారులు రాళ్లు తేలిపోయి అధ్వానంగా కనిపిస్తున్నాయి. యూజీడీ కోసం తవ్విన గోతులను పనులు పూర్తయ్యాక పూర్తి స్థాయిలో పూడ్చిపోవడంతో కాలనీవాసులు, వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు.

కొండ వాలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు పిచ్చుకగూళ్లను తలపిస్తున్నాయి. ఎప్పుడైనా విద్యుత్ సమస్య తలెత్తితే, పరిష్కరించేందుకు వీటి కారణంగా ఎక్కువ సమయం పడుతోందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్థానిక సమస్యలపై దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

హెచ్‌బీకాలనీ మార్గంలో పేరుకుపోయిన వ్యర్థాలు

★ వీధుల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. అవి పాదచారులను, వాహన చోదకులను వెంటాడుతున్నాయని, చీకటి పడితే ఈ సమస్య మరింత అధికంగా ఉంటోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు బయటకు రావాలంటే భయపడుతున్నారని అంటున్నారు.

ప్రకృతి ఆధారిత పంట ఉత్పత్తులకు గిరాకీ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆ హబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రకృతి పంటల ఉత్పత్తుల సంతలో విక్రయాలు పెద్ద ఎత్తున సాగాయి. గత మూడు వారాలుగా ఇక్కడ గో ఆధారిత ప్రకృతి పంటల ఉత్పత్తులు విక్రయిస్తున్నారని తెలిసి నగర ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో రైతులు తెచ్చినవన్నీ చెల్లిపోయాయి. భారత్ కిసాన్ సంఘ్ కేంద్ర కమిటీ సభ్యులు జలగం కుమార స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సంతలో వివిధ జిల్లాల నుంచి రైతులు తాము పండించిన ప్రకృతి ఆధారిత పంటలను తీసుకువచ్చి విక్రయించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సంఘ్ నాయకుడు రాము, గో ఆధారిత ప్రకృతి పంటల రైతు సంఘం ప్రతినిధులు, పీఎల్ఎన్ రాజు, దాట్ల సుబ్రహ్మణ్యం, గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపకులు జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆరుద్ర రచనలు స్ఫూర్తిదాయకం

సమావేశంలో పాల్గొన్న వక్తలు

అల్లిపురం, న్యూస్‌టుడే : ఆరుద్ర రచనలు ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని తెలకపల్లి రవి అన్నారు. డాబాగార్డెన్స్ దరి అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సాహితీ స్రవంతి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆరుద్ర జయంతి ముగింపు వేడుకల్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న తెలకపల్లి రవి మాట్లాడుతూ తెలుగు సాహిత్యం, సినీ గీతాలు, అనువాదాలు, నాటక రచనల్లో ఆరుద్ర తన ప్రత్యేకత చాటుకున్నారన్నారు. అనంతరం 'తిమిరాన్ని తరిమేస్తాం' పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీకటి దివాకర్, అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పాలమరశెట్టి ఫ్రాన్సిస్, ఇతర సభ్యులు సత్యాజీ, రామకృష్ణ, చలసాని కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

కైలాసగిరికి సందర్శకుల తాకిడి

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: కార్తిక మాసం రెండో ఆదివారం సందర్భంగా పర్యాటక కేంద్రాల వద్ద సందర్శకుల తాకిడి అధికంగా కనిపించింది. కైలాసగిరికి రోప్‌వే, రోడ్డు మార్గంలో సందర్శకులు అధిక సంఖ్యలో చేరుకుని శివపార్వతుల విగ్రహాలు తదితర ప్రదేశాల వద్ద సందడి చేశారు. తెన్నేటిపార్కు, సీతకొండ మలుపు వద్ద వన భోజనాలు చేసి ఉల్లాసంగా గడిపారు. వివిధ విద్యాసంస్థల నుంచి పెద్దఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఎంవీపీకాలనీ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉంటూ కేడీపీఎం పాఠశాలలో చదువుకుంటున్న 30 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు రూ.15వేల సొంత నిధులతో బస్సు పాసులు సమకూర్చారు. ప్రతి రోజు సుమారు నాలుగు కి.మీ. దూరంలోని పాఠశాలకు నడిచి వెళ్తున్న విద్యార్థుల సమస్యపై స్పందించి ఈ విధంగా ఏర్పాటు చేశారు. సంబంధిత పాసులను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాప్‌రుద్ర ఆదివారం సంబంధిత వసతిగృహంలో విద్యార్థులకు అందజేశారు. స్థానిక నాయకులు బోర ధనరెడ్డి, ఎం.కృష్ణారావు, ఎ.శివరామకృష్ణ, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు పాసులు పొందిన వారితో వెలగపూడి ప్రతాప్‌రుద్ర

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

బీచ్ రోడ్డులో ఏసీబీ అధికారులు, సిబ్బంది ర్యాలీ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో అవినీతికి పాల్పడకుండా ప్రజలకు సేవ చేయాలని ఏసీబీ డీఎస్పీ బి.వి.ఎస్.ఎస్.రమణమూర్తి పిలుపునిచ్చారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా బీచ్‌రోడ్డులో ఆదివారం నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఉద్యోగి అవినీతిలో కూరుకుపోతే సంబంధిత కుటుంబం తీవ్ర మనోవేదనకు గురవుతుందన్నారు. కాళీమాత ఆలయం నుంచి వై.ఎం.సి.ఎ. వరకు నిర్వహించిన సంబంధిత ర్యాలీలో ఏసీబీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జెండాలు చెప్పే పనితీరు..

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3)న్యూస్‌టుడే : ఉక్కు కర్మాగారంలోని పలు విభాగాల పనితీరును ప్రతిబింబించేలా జెండాలను ఏర్పాటు చేశారు. ఆయా విభాగాలు తన రోజువారీ లక్ష్యాలను చేరుకున్నదీ.. లేనిదీ జెండాలను చూసి తెలుసుకోవచ్చని చెప్తున్నారు. లక్ష్యం చేరుకుంటే జెండా పైకి ఎగురుతూ ఉంటుంది. లక్ష్యాన్ని చేరుకోలేకపోతే ఆ విభాగం జెండాను కిందకు దించుతారు. ఇది ఉద్యోగుల్లో స్ఫూర్తి నింపి, పోటీతత్వం కూడా ఏర్పడుతుందని చెప్తున్నారు.

ఈడీ(వర్క్స్) భవనం వద్ద ఏర్పాటు చేసిన జెండాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: మద్దిలపాలెంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు ఎంవీపీ స్టేషన్ సీఐ ప్రసాద్ తెలిపారు. ఆ వివరాలిలా.. కొమ్మాది వైఎస్ఆర్ కాలనీలో నివాసముంటున్న బోయి నర్సింగరెడ్డి (28) శుక్రవారం ఉదయం కిన్నెర థియేటర్‌లో సినిమా చూసేందుకు ఇంటి నుంచి బయలుదేరాడు. మార్గ మధ్యలో మద్దిలపాలెంలో ఉన్న స్నేహితుడ్ని కలవడానికి వెళ్లాడు. అక్కడి నుంచి సంబంధిత సినిమాహాల్‌కు చేరుకునే సమయంలో థియేటర్ సమీపంలో డివైడర్ దాటుతుండగా ఓ కారు ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో ఆ మార్గంలో వచ్చిన ఓ లారీ చక్రాలు అతడి చేతిపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఆలయ దుర్ఘటన విచారకరం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని ఓ ప్రయివేటు ఆలయంలో జరిగిన దుర్ఘటన చాలా విచారకరమని భాజపా జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు అన్నారు. ఈ ఘటన నేపథ్యంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్, అనకాపల్లి ఎంపీ సి.ఎం.రమేష్ తదితర నాయకులు క్షతగాత్రులను పరామర్శించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారన్నారు.

★ సంబంధిత ఘటన చాలా బాధాకరమని వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ కూడా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందించి క్షతగాత్రులను పరామర్శించారని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిర్వాహకులు తగిన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు.

కనులపండువగా నరహరి నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి దేవాలయంలో ఆదివారం నిత్య కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆసీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతా మూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు.

నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తజనం

దాత ప్రతినిధికి విరాళం ధ్రువపత్రం అందిస్తున్న పర్యవేక్షకుడు సునీల్‌కుమార్

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి సింహాచలం దరి రాజీవ్‌కాలనీకి చెందిన లంకా జయ మౌర్యసాయి ఆదివారం రూ.1,00,116 విరాళంగా సమర్పించారు. విరాళాన్ని దాత ప్రతినిధి నగదు రూపంలో ప్రొటోకాల్ పర్యవేక్షకుడు పి.సునీల్‌కుమార్‌కు అందజేశారు. అధికారులు స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు

సింహాచలం, న్యూస్‌టుడే: ఎన్ఎస్‌టీఎల్‌కు చెందిన డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌వీ హరప్రసాద్ ఆదివారం సతీసమేతంగా సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఆలయ ప్రాంగణంలో డీఆర్‌డీవో డీజీ హరప్రసాద్ దంపతులు

సింహాచలం, న్యూస్‌టుడే: రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదివారం సాయంత్రం సింహాద్రినాథుడికి సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, వైదికులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏఈవో, ప్రధానార్చకులు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మద్దిలపాలెం, ఆరిలోవ, న్యూస్‌టుడే: ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంఎంటీసీ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభం వద్ద భక్తులు దీపారాధన చేశారు. కొత్త వెంకోజీపాలెంలోని శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వర ఆలయంలోనూ పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ★ పెదగదిలి అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలోనూ క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దార్లపూడి లక్ష్మణ శాస్త్రి, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రేమసదన్‌లో ఘనంగా దీపోత్సవం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: సత్యసాయి సేవాసంస్థలు, సత్యసాయి సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఎంవీపీకాలనీ ప్రేమసదన్‌లో సత్యసాయి సహస్ర దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు దీపారాధన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని సి.హెచ్.రంగనాథన్ ప్రారంభించారు. ఈ వేడుకల్లో భాగంగా వెయ్యి దీపాలతో ప్రాంగణాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్ది ఆకాశ దీపాలు వదిలారు. శ్రీసత్యసాయి సేవా సంస్థల విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.ఎన్.నాయుడు, విశాఖ సిటీ సమితి కన్వీనర్ బి.సాయికుమార్, యువత, మహిళ విభాగం సభ్యులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల దీపారాధన

ఎంవీపీకాలనీ సత్యసాయి మందిర ప్రాంగణంలో..

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

ప్రసన్నగౌరీ

పరవాడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగం సాధించలేనేమోనన్న భయంతో మనస్తాపం చెంది వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం పరవాడలో ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక గండి వెంకటశివరాఘవకు, నర్సీపట్నం దరి కొత్తవీధికి చెందిన ప్రసన్నగౌరీ(29)తో ఈ ఏడాది ఆగస్టులో వివాహం జరిగింది. అప్పటి నుంచి భార్యాభర్తలు అన్యోన్యంగా ఉంటున్నారు. రాఘవ ఫుట్‌వేర్ దుకాణం నిర్వహిస్తుంటాడు. ప్రసన్న గౌరీ బీఎస్సీ, బీఈడీ పూర్తి చేసి టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్‌కు (టెట్) ప్రిపేర్ అవుతోంది. పెళ్లి అయిన తర్వాత తాను అనుకున్న విధంగా చదవలేకపోతున్నానని, టీచర్ ఉద్యోగం సాధించగలనో.. లేదో అని కొద్ది రోజులుగా తల్లికి చెబుతూ బాధ పడుతుండేది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం అల్పాహారం చేసి మొదటి అంతస్తులో ఉన్న గదిలో చదువుకునేందుకు వెళ్లింది. మధ్యాహ్నం భోజనం సమయం అయినప్పటికీ కిందకు రాకపోవడంతో భర్త వెళ్లి తలుపు కొట్టినా ఎంతకీ తెరవకపోవడంతో విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పాడు. తలుపులు పగులగొట్టి చూసేసరికి ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని వేలాడుతూ కనిపించింది. మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిటకిటలాడిన జూ

ఎండాడ, న్యూస్‌టుడే: కార్తిక మాసం రెండో వారం పురస్కరించుకుని ఆదివారం సందర్శకులతో జూ కిటకిటలాడింది. స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో తరలి వచ్చారు. వన్యప్రాణులతో పలువురు ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సందడిగా గడిపారు. జూకు 3213 మంది రాగా రూ.2.68 లక్షల ఆదాయం వచ్చినట్లు క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. సమీప కంబాల కొండ పార్కుకు 350 మంది రాగా రూ.25 వేలు ఆదాయం వచ్చిందని రేంజ్ అధికారి శాస్త్రి వెల్లడించారు.

సందడిగా రుషికొండ బీచ్

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ బీచ్‌కు కార్తికమాసం నేపథ్యంలో ఆదివారం అధిక సంఖ్యలో సందర్శకులు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. పిల్లాపాపలతో విచ్చేసిన వీరు మత్స్యరాశుల పార్కు, బోటింగ్ కేంద్రం, అటవీ స్థలాలు వంటి ఆహ్లాదకర ప్రదేశాలతో పాటు ఇసుక తిన్నెలపై సేదతీరుతూ ఉత్సాహంగా గడిపారు.

★ సముద్ర స్నానాలు చేసేవారిని లోపలికి వెళ్లరాదంటూ మెరైన్‌పోలీసులు, టూరిజం బ్లూఫ్లాగ్ బీచ్, జీవీఎంసీ లైఫ్‌గార్డులు ప్రచార మాధ్యమాల ద్వారా అప్రమత్తం చేశారు.

పర్యాటక స్పీడుబోట్ల పునరుద్ధరణ

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ బీచ్‌లో పర్యాటక స్పీడు బోట్లను ఆదివారం పూర్తిస్థాయిలో పునరుద్ధరించారు. మొంథా తుపాను ప్రభావంతో ప్రభుత్వ యంత్రాంగం హెచ్చరికల మేరకు ముందు జాగ్రత్త చర్యగా గత నెల 26వ తేదీ నుంచి ఇక్కడ సముద్రంలో విన్యసించే ఆరు స్పీడు పడవలను నిలిపివేశారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో యథావిధిగా వీటిని నడుపుతున్నామని టూరిజం బోటింగ్ విభాగాధికారులు పేర్కొన్నారు.

బాధితులకు నిత్యావసరాల అందజేత

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: 22వ వార్డులో తుపాను బాధిత మత్స్యకారులకు ఆదివారం శివాజీపాలెం రేషన్ డిపో వద్ద వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ నిత్యావసరాలను పంపిణీ చేశారు. బియ్యం, కందిపప్పు, పామాయిల్, పంచదార, ఉల్లిపాయలు అందజేశారు. నాయకులు బొట్టా వెంకటరమణ, ఒమ్మి అప్పారావు, కోడిబోయిన ఆనంద్, పెసల శ్రీను, పోతు వెంకటప్రసాద్, నాగూర్ మీరా తదితరులు పాల్గొన్నారు. ★ జీవీఎంసీ 15వ వార్డులోని మత్స్యకారులకు నాయకులు ఎం.రవికుమార్ తదితరుల ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. మహేష్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ, న్యూస్‌టుడే: 13వ వార్డు పరిధి లక్ష్మీనగర్‌లోని 20 మత్స్యకార కుటుంబాలకు వీటిని అందించినట్లు వార్డు కార్పొరేటర్ సునీత పేర్కొన్నారు. కూటమి నాయకులు పి.ధర్మారావు, వై.సురేష్, మజ్జి రమణి, ఎన్.పైడిరాజు, కె.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పెదవాల్తేరు, విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: తుపాను సమయంలో చేపలవేట జరగక ఇబ్బందులు పడిన మత్స్యకారులకు పెదవాల్తేరు ఆదర్శనగర్‌లో ఆదివారం 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య చేతుల మీదుగా ఈ సరకులు పంపిణీ చేశారు. వార్డు అధ్యక్షుడు నెక్కంటి సత్యనారాయణ, తెదేపా నాయకులు కృష్ణ, పరమేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ★ పదో వార్డు పరిధిలో 30 మంది మత్స్యకార మహిళలకు ప్రభుత్వం ప్రకటించిన నిత్యావసరాలను స్థానిక నాయకులు, అధికారులు అందించారు.

శివాజీపాలెంలో లబ్ధిదారులకు సరకులు అందిస్తున్న కార్పొరేటర్ మూర్తియాదవ్

పెదవాల్తేరు ఆదర్శనగర్‌లో..

దుస్తుల దుకాణం ప్రచారం కోసం ఆన్‌లైన్ గేమ్స్

నిర్వాహకులపై కేసు

మాధవధార, న్యూస్‌టుడే: ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లో గివ్‌వే పేరుతో ఆన్‌లైన్ ఆటలో యువతను పాల్గొనేలా చేసి తన దుకాణానికి రప్పించుకునేందుకు ప్రయత్నించిన దుస్తుల దుకాణం యజమానిపై ఆదివారం ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు. జగదాంబ కూడలి వద్ద ఉన్న డీపీవై పేరుతో వస్త్ర దుకాణం ఉంది. యజమాని తన దుకాణంలో తక్కువ ధరకు బ్రాండ్ దుస్తులను విక్రయిస్తున్నాడు. దాన్ని ప్రచారం చేసుకునేందుకు మద్రిపాలెం ఈద్గా స్థలం పరిసర ప్రాంతాల్లో దుస్తులు పెట్టానని వాటిని కనిపెట్టి ఉచితంగా తీసుకోవచ్చునని ఇది ఒక గేమ్ తన ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ ఛానెళ్లలో పెట్టాడు. దీంతో ఒక్కసారిగా 300 మందికిపైగా యువకులు అక్కడకు చేరుకొని చుట్టుపక్కల తుప్పలు, పలు వాహనాల్లో గాలించారు. దీంతో అక్కడ ట్రాఫిక్ నిలిచిపోయి ఏమి జరిగిందో తెలియక చుట్టుపక్కల నివాసితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎయిర్‌పోర్టు పోలీసులు అక్కడకు చేరుకొని, నిర్వాహకులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఇటువంటి గేమ్స్ పెట్టి ప్రజలను, నివాసితులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు.

సంఘటన ప్రాంతంలో గుమిగూడిన యువకులు

అమృతమూర్తికి అశ్రుతాంజలి

కీ॥శే॥ శ్రీమతి చెట్టిపల్లి శిరోమణి గారు
మరణం: 24-10-2025

మంచితనానికి, మమతానురాగాలకు మారుపేరుగా నిలిచి, మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసిన మీరు మానుండి భౌతికంగా దూరమైనా మీ మధుర స్మృతులు, జ్ఞాపకాలు మా మదిలో నిలిచే ఉంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

శోకతప్త హృదయాలతో... మీ... కుటుంబ సభ్యులు

పెద్దకర్మ: తేది. 03-11-2025 సోమవారం మధ్యాహ్నం గం॥ 11.00ల నుండి యండాడ, స్కైలైన్ అపార్ట్‌మెంట్స్‌లో మా స్వగృహము నందు జరుపబడును.
సెల్: 9182856329, 7396875180

(c) eenadu

నేటి నుంచి గౌరీ పరమేశ్వరుల పంచమరాత్రి మహోత్సవాలు

మురళీనగర్, న్యూస్‌టుడే: శ్రీగౌరీ సంక్షేమ సేవా సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరుల పంచమరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈనెల 3 నుంచి 8 వరకు జరిగే ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం గౌరీపరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ఠాపన, 4న సామూహిక కుంకుమ పూజ, 5న దీపాలంకరణ, 6న అమ్మవారి సారె ఊరేగింపు, 7న సామూహిక రుద్రాభిషేకం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. జీవీఎంసీ 50వ వార్డు సెక్టార్-8 ఎగువ ప్రాంతంలో ఉన్న సంఘం కార్యాలయం ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

■ స్పెయిన్ పర్యటనకు జీవీఎంసీ కమిషనర్

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: మహా విశాఖ నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్‌గర్గ్ సోమవారం స్పెయిన్ పర్యటనకు వెళ్లనున్నారు. అక్కడ బార్సిలోనాలో నిర్వహించే స్మార్ట్‌సిటీ కాంగ్రెస్ ఎక్స్‌పో కార్యక్రమంలో పాల్గొని, తిరిగి 8న నగరానికి చేరుకుంటారని రాష్ట్ర సాధారణ పరిపాలన విభాగం ఉత్తర్వులు జారీ చేసింది.

■ నేడు సహకార సదస్సు

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-8 వైశాఖి స్పోర్ట్స్ పార్కులో సోమవారం సాయంత్రం 5 గంటలకు సహకార సదస్సు నిర్వహించనున్నట్లు విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు పాలకవర్గం సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కాలనీవాసులందరూ హాజరు కావాల్సిందిగా పిలుపునిచ్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

- న్యూస్‌టుడే, జగదాంబకూడలి: ?: జీవీఎంసీ 38వ వార్డు చేపలరేవును ఆనుకుని ఉన్న నడకమార్గాలను స్థానిక మత్స్యకారులు ఆక్రమించి... వలలు, చేపలు ఉంచడంతో రాకపోకలు సాగించేందుకు వీల్లేక పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. - స్థానిక నివాసి

✓: పరిశీలించి తక్షణమే నడకమార్గాలను ఖాళీ చేయిస్తాం. - సీహెచ్.గంగాధర్, వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్

- న్యూస్‌టుడే, జగదాంబకూడలి: ?: జీవీఎంసీ 37వ వార్డు వైజాగ్ చేపలరేవు సమీప ప్రభుత్వ గృహాల సముదాయం వీధిలో వేగ నియంత్రికలపై జీబ్రాగుర్తులు లేవు. దీంతో వాహనచోదకుల తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. - రాజారావు, స్థానికుడు

✓: పరిశీలించి, జీబ్రాగుర్తులు వేయిస్తాం. - మల్లయ్యనాయుడు, జోన్-4 జేఈ

గురుద్వారా, న్యూస్‌టుడే: ?: సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం ఎదుట వైపు పైపులైన్ నుంచి మంచినీరు వృథా అవుతోంది. శివారు ప్రాంతాలకు సక్రమంగా నీరు అందడం లేదు. - రాజు, ✓: పైపులైనును మరమ్మతులు చేసి నీటి వృథాను అరికడతాం. - రహీం, మంచినీటి సరఫరా ఏఈ

మురళీనగర్, న్యూస్‌టుడే: ?: జాతీయ రహదారి సమీపంలో గంగా గోదావరి బహుళ అంతస్తుల సమీపంలో గత నాలుగు రోజులుగా వ్యర్థాలు తొలగించడం లేదు. దుర్వాసన వస్తోంది. - నారాయణమూర్తి, ✓: సిబ్బందిని పంపి చెత్త తొలగించేలా చూస్తాం. - వెంకటరమణ, 51వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 50వ వార్డు సెక్టార్-6 మురళీనగర్‌లో ఉన్న చెత్త కుండీలు వ్యర్థాలతో నిండి పోయాయి. తీవ్ర దుర్వాసన వెదజల్లడంతో పాటు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. - ఆర్.రమేశ్, స్థానికుడు, ✓: సిబ్బందిని పంపించి వ్యర్థాలను తొలగిస్తాం. - బి.సుధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

బడి సంచి.. భారం తగ్గించి..

మాధవధార, న్యూస్‌టుడే

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల పుస్తకాల సంచి బరువు తగ్గించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఏడాదికి రెండు సెమిస్టర్ల విధానానికి శ్రీకారం చుట్టింది. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఈ విధానంలోనే పుస్తకాలను ముద్రించారు. మొదటి విడత పుస్తకాలను పాఠశాల తెరిచిన వెంటనే జూన్‌లో పంపిణీ చేశారు. ప్రస్తుతం రెండో విడత పుస్తకాలు అందజేస్తున్నారు. రెండు సెమిస్టర్ల విధానంలో పుస్తకాలను ముద్రించడంతో పుస్తకాల సంఖ్య తగ్గి విద్యార్థుల బ్యాగు సులువుగా తీసుకెళ్లడానికి అవకాశం ఉంటుందని పలువురు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

స్కూల్ బ్యాగులతో విద్యార్థులు

ఉత్తరం నియోజకవర్గంలో..

పాఠశాలలు	సంఖ్య	విద్యార్థులు
జీవీఎంసీ ప్రాథమిక	13	880
ప్రాథమికోన్నత	2	325
ఉన్నత	8	1365
మొత్తం	23	2570

పుస్తకాల కుదింపు ఇలా..

రెండు సెమిస్టర్ల విధానంలో ఒకే పుస్తకంలో మూడేసి పాఠ్యాంశాలు పొందుపరిచారు. 1, 2 తరగతులకు ఆంగ్లం, తెలుగు, గణితం, కలిపి ఒకటి, మరో వర్క్‌బుక్ ఇచ్చారు. 3, 4, 5 తరగతులకు తెలుగు, ఆంగ్లం, కలిపి ఒకటి, గణితం, పరిసరాల విజ్ఞానం కలిపి మరొకటి ఇచ్చారు. 6, 7, 8, 9 తరగతులకు తెలుగు, ఆంగ్లం, హిందీ కలిపి ఒకటి, జీవ, భౌతిక, రసాయన శాస్త్రాలు కలిపి మరొకటి, సాంఘిక శాస్త్రంలో చరిత్ర, భూగోళం, అర్థ, పౌరశాస్త్రాలు కలిపి ఒక పుస్తకం ముద్రించారు. గతంలో ఈ పుస్తకాలు నాలుగుండేవి. పదో తరగతి వారికి కూడా సెమిస్టర్ విధానాన్నే కొనసాగిస్తున్నారు.

అప్పన్నస్వామికి పూజలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జనసేన నగర అధ్యక్షుడు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దంపతులు ఆదివారం సింహాచలం అప్పన్నస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. స్వామి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

ఆలయం వద్ద ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు

30 వరకు ఉచిత వైద్యపరీక్షలు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: నగరంలోని మెడిసి ఆసుపత్రి ఆధ్వర్యంలో సామాజిక బాధ్యతగా సంతానం లేని వివాహితులకు ఈనెల 30 వరకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహిస్తామని ఆసుపత్రి ఎండీ శిరీషరాణి తెలిపారు. డాబాగార్డెన్స్‌లోని ఒక హోటల్లో నిర్వహించిన సమావేశంలో మిసెస్ తెలుగు యూఎస్ఏ టైటిల్ విజేత డాక్టర్ తిరుమలిని పాల్గొని... కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రిక ఆవిష్కరించారు. అనంతరం తిరుమలినీ వైద్యులు సత్కరించి, జ్ఞాపిక అందజేశారు.

తిరుమలినీకి జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ శిరీషరాణి

డిసెంబరు 12న పూర్వ విద్యార్థుల సమావేశం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: కాకినాడ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశాన్ని డిసెంబరు 12న ఎంవీపీకాలనీలోని ఓ కళాశాలలో నిర్వహిస్తామని ఆర్టీసీ ఆర్ఎం, కళాశాల పూర్వ విద్యార్థి బి.అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం కాకినాడలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో పలు అంశాలపై చర్చించామన్నారు.

గుంతల పూడ్చివేత

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: రోడ్లను తవ్వేసి నెల రోజులు పూడ్చకుండా వదిలేయడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడి సమస్యలపై 'గోతులు భయపెడుతున్నాయ్..!' శీర్షికతో 'ఈనాడు'లో గత నెల 31న శుక్రవారం ప్రచురించిన వార్తకు జీవీఎంసీ అధికారులు స్పందించారు. అక్కయ్యపాలెం మహారాణిపార్లర్ కూడలిలోని గోతులను కాంక్రీట్‌తో పూడ్చారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సిమెంట్ పలకల ఏర్పాటు

పూర్ణామార్కెట్ (అల్లిపురం), న్యూస్‌టుడే: నగరంలోని రామకృష్ణ మార్కెట్ కూడలి, వెంకటేశ్వర మెట్ట సమీప ప్రధాన రహదారిలోని భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూతలు శిథిలమై గోతులు ఏర్పాటయ్యాయి. రాకపోకలు సాగించే వాహనచోదకుల ఇబ్బందులపై ఇటీవల 'ఈనాడు'లో 'మార్గాల్లో మృత్యు కుహరాలు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో జోన్-4 ఇంజినీరింగ్ అధికారులు స్పందించి... మ్యాన్‌హోల్స్‌పై సిమెంట్ పలకలు ఏర్పాటు చేయించారు.

ఈనాడు కథనానికి స్పందన

ప్రకృతిని చిత్రించి.. బహుమతి సాధించి..

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

చిత్రలేఖనంలో పాల్గొన్న విద్యార్థులు, విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ జి.సతీష్, ఇన్‌ఛార్జి జి.ప్రసాద్

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: ప్రస్తుతం సాంకేతికత అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విద్యార్థులకు అనేక అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని బన్సాల్ కళాశాల ప్రిన్సిపల్ జి. సతీష్ పేర్కొన్నారు. శాంతిపురం, శంకరమఠం రోడ్డులోని కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో 'ప్రకృతి అందాలు'(పర్వతాలు, నదులు, చెట్లు, జంతువులు, పక్షులు) అంశాలపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. యషిక అగర్వాల్ ప్రథమ, షేక్ మెహక్ ద్వితీయ, పి.తరుణి తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ జి.సతీష్, ఇన్‌ఛార్జి జి.ప్రసాద్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరి చేరవని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ బి.సి.ఎస్.ఎన్.మూర్తి అన్నారు. ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపకులు స్థానికంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో సీఐ ఎం.శ్రీనివాస్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్.వి.బాబ్జీ, అధ్యాపకులు పి.రామకృష్ణారెడ్డి, ఎస్.భాస్కరరావు, ఎ.వినోద్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు

ప్రదర్శనలో పాల్గొన్న వైకాపా నాయకులు, కార్యకర్తలు

మృతులకు కొవ్వొత్తులతో నివాళి

కార్పొరేషన్, న్యూస్‌టుడే : శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన వారికి ఆదివారం రాత్రి వైకాపా ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి, బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. పార్టీ నగర అధ్యక్షుడు కేకే.రాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రన్నాయుడి సేవలు మరువలేనివి

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: కేంద్ర మాజీ మంత్రి, దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు సేవలు మరువలేనివని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. అక్కయ్యపాలెం ఎన్‌జీజీఓఎస్ కాలనీలో ఆదివారం ఆయన వర్ధంతి సభ నిర్వహించారు. ఎర్రన్నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా హేమంత్‌కుమార్ మాట్లాడుతూ నిరంతరం ప్రజల పక్షాన నిలబడి వారి సంక్షేమమే ధ్యేయంగా ఎర్రన్నాయుడు పనిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో జింజారి గోవింద్, సనపల తిరుపతిరావు, రజని, రేష్మ, సుహాసిని, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

ఎర్రన్నాయుడు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న హేమంత్‌కుమార్ తదితరులు

భక్తిశ్రద్ధలతో దీపారాధన

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 14వ వార్డు గణేష్‌నగర్‌లోని త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవస్థానంలో ద్వాదశి సందర్భంగా ఆదివారం రాత్రి ఆలయ అర్చకులు సారిపాక సూర్యనారాయణ, వి.ఎస్.కుమార్ ఆధ్వర్యంలో దీపారాధన నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లోని భక్తులు అధికసంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. ఆలయ అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ పర్యావరణానికి హానికరం కలగకుండా మట్టి ప్రమిదలతో దీపారాధన చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షుడు జి.కృష్ణ, కార్యదర్శి ఎం.ఎస్.ప్రకాశరావు, జాయింట్ కార్యదర్శి టి.వెంకటరావు, కోశాధికారి ఎం.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

దీపారాధనలో పాల్గొన్న భక్తులు

స్పందనకు వందన

ఎట్టకేలకు శుభ్రత పనులు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 36వ వార్డు సున్నపువీధిలో నెల రోజుల నుంచి భూగర్భడ్రైనేజీ లీకై, తీవ్ర దుర్వాసనతో పాటు పరిసరాలు అధ్వానంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో వార్త ప్రచురితమవడంతో అధికారులు స్పందించి.. తమ సిబ్బందితో శుభ్రత పనులు చేయించారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 60ఏళ్ల పైబడిన క్రీడాకారులకు నిర్వహించిన వివిధ పోటీల్లో నగరానికి చెందిన క్రీడాకారిణి బి.విజయలక్ష్మి మొదటి స్థానంలో నిలిచారు. ఆదివారం సూర్యాబాగ్ పోలీస్ బ్యారెక్స్ మైదానంలో 100 మీటర్ల పరుగును 20.4 సెకన్లలో పూర్తి చేసిన ఆమె, డిస్కస్‌త్రోను 14.30 మీటర్ల దూరం విసిరి ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో అతిథుల చేతుల మీదుగా బహుమతి అందించారు.

బహుమతి అందుకుంటున్న విజయలక్ష్మి

7న 'కోర్ట్' సినిమా ఉచిత ప్రదర్శన

సీతంపేట, న్యూస్‌టుడే: ఇటీవల కాలంలో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న 'కోర్ట్' తెలుగు సినిమాను ఈనెల 7న ఉదయం 9.15 గంటలకు విశాఖ పౌర గ్రంథాలయంలో ప్రదర్శించనున్నట్లు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వ్యవస్థాపకులు నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ మేరకు దీనికి సంబంధించిన కరపత్రాలను గ్రంథాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. విశాఖకు చెందిన యువ దర్శకుడు జగదీశ్‌తో ముఖాముఖి నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

రూ.49.50 లక్షలతో కమ్యూనిటీ భవనం నిర్మాణం

కంచరపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 48వ వార్డు ఇందిరానగర్-2లో రూ.49.50 కమ్యూనిటీ భవనం నిర్మాణం చేపట్టనున్నారు. ఈ మేరకు ఆదివారం కాలనీవాసులతో వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు గంకల కవిత, భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు గంకల అప్పారావు మాట్లాడారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీలో ఆమోదం లభించిందని పేర్కొన్నారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. కవిత, అప్పారావులను కాలనీవాసులు సత్కరించారు.

గంకల కవిత, భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు అప్పారావులను సత్కరిస్తున్న గ్రామస్థులు

దుస్తుల దుకాణం ప్రచారం కోసం ఆన్‌లైన్ గేమ్స్

నిర్వాహకులపై కేసు

మాధవధార, న్యూస్‌టుడే: ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లో గివ్‌వే పేరుతో ఆన్‌లైన్ ఆటలో యువతను పాల్గొనేలా చేసి తన దుకాణానికి రప్పించుకునేందుకు ప్రయత్నించిన దుస్తుల దుకాణం యజమానిపై ఆదివారం ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు. జగదాంబ కూడలి వద్ద ఉన్న డీపీవై పేరుతో వస్త్ర దుకాణం ఉంది. యజమాని తన దుకాణంలో తక్కువ ధరకు బ్రాండ్ దుస్తులను విక్రయిస్తున్నాడు. దాన్ని ప్రచారం చేసుకునేందుకు మర్రిపాలెం ఈద్గా స్థలం పరిసర ప్రాంతాల్లో దుస్తులు పెట్టానని వాటిని కనిపెట్టి ఉచితంగా తీసుకోవచ్చునని ఇది ఒక గేమ్ తన ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ ఛానెళ్లలో పెట్టాడు. దీంతో ఒక్కసారిగా 300 మందికిపైగా యువకులు అక్కడకు చేరుకొని చుట్టు పక్కల తుప్పలు, పలు వాహనాల్లో గాలించారు. దీంతో అక్కడ ట్రాఫిక్ నిలిచిపోయి ఏమి జరిగిందో తెలియక చుట్టుపక్కల నివాసితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎయిర్‌పోర్టు పోలీసులు అక్కడకు చేరుకొని, నిర్వాహకులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఇటువంటి గేమ్స్ పెట్టి ప్రజలను, నివాసితులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు.

సంఘటన ప్రాంతంలో గుమిగూడిన యువకులు

తగాదాల్లో తలదూర్చకండి

గురుద్వారా, న్యూస్‌టుడే: మద్యం మత్తులో పడి తగాదాల్లో తలదూర్చితే కేసులు తప్పవని ద్వారకా సీఐ డి.వి.రమణ రౌడీషీటర్లను హెచ్చరించారు. స్టేషన్ పరిధిలో గల రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని, ప్రవర్తనను మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. గంజాయి తాగడం, అమ్మకాలకు సహకరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికీ చాలా మంది వీధుల్లో సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారని అలాంటివి మా దృష్టికి వస్తే సహించబోమన్నారు. ఎస్సైలు పాల్గొన్నారు.

రౌడీషీటర్లను హెచ్చరిస్తున్న సీఐ రమణ

సిమెంట్ పలకలు.. శిథిలం..!

జగదాంబకూడలి, న్యూస్‌టుడే

పాతనగరంలోని ఏవీఎన్ కళాశాల నుంచి వెలంపేటకు వెళ్లే మార్గం మలుపులో మురుగు కాలువ గట్టు శిథిలమైంది. కాలువపై పలకలు అస్తవ్యస్తంగా మారాయి. దీంతో రాకపోకలు సాగించే వాహన చోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువ గట్టుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

దర్పణం

■ దరఖాస్తుల ఆహ్వానం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : విశాఖ ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిందీ విభాగంలో అతిథి అధ్యాపకులుగా పని చేసేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ ఆర్.మంజుల తెలిపారు. ఎంఏ హిందీతో ఉత్తీర్ణతతో పాటు నిబంధనలు ప్రకారం నెట్, సెట్ అర్హత లేదా పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 5లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

ప్రసన్నగౌరి

పరవాడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగం సాధించలేనేమోనన్న భయంతో మనస్తాపం చెంది వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం పరవాడలో ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక గండి వెంకటశివ రాఘవకు, నర్సీపట్నం దరి కొత్తవీధికి చెందిన ప్రసన్నగౌరి(29)తో ఈ ఏడాది ఆగస్టులో వివాహం జరిగింది. ప్రసన్న గౌరి బీఎస్సీ, బీఈడీ పూర్తి చేసి టెట్‌కు ప్రిపేర్ అవుతోంది. పెళ్లి అయిన తర్వాత తాను అనుకున్న విధంగా చదవలేకపోతున్నానని, టీచర్ ఉద్యోగం సాధించగలనో.. లేదో అని కొద్ది రోజులుగా తల్లికి చెబుతూ బాధపడుతుండేది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం అల్పాహారం చేసి మొదటి అంతస్తులో ఉన్న గదిలో చదువుకునేందుకు వెళ్లింది. మధ్యాహ్నం భోజనం సమయం అయినప్పటికీ కిందకు రాకపోవడంతో భర్త వెళ్లి తలుపు కొట్టినా ఎంతకీ తెరవకపోవడంతో విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పాడు. తలుపులు పగులగొట్టి చూసేసరికి ఉరేసుకొని వేలాడుతూ కనిపించింది. మృతురాలి తల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జయహో... భారత్..!

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : మహిళల ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు ఘన విజయం సాధించడంతో ఆదివారం రాత్రి నగరంలో అభిమానులు సందడి చేశారు. నగరంలో పలుచోట్ల పెద్ద తెరలు ఏర్పాటు చేయడంతో క్రీడాభిమానులు, స్థానికులు మ్యాచ్‌ను వీక్షించారు. చివరకు దక్షిణాఫ్రికా జట్టుపై భారత్ విజయం సాధించడంతో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేసి, ఆనందాన్ని పంచుకున్నారు.

విశాఖ వ్యాలీ పాఠశాలలో మ్యాచ్ తిలకిస్తున్న అభిమానులు

7న సీఐటీయూ కవాతు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 7న డాబాగార్డెన్స్ సరస్వతీ పార్కు నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు కవాతు నిర్వహిస్తామని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ.కుమార్ తెలిపారు. ఆదివారం జగదాంబ సిటూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖలో సీఐటీయూ 18వ మహాసభలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో 7న సీఐటీయూ అనుబంధ సంఘాల కార్మికులంతా ఎరుపురంగు దుస్తులు ధరించి కవాతులో పాల్గొంటారు.

23న రాజ్యాంగ దినోత్సవ సదస్సు

సీతంపేట, న్యూస్‌టుడే: రామాటాకీస్ రోడ్డులోని డా.బి.ఆర్.అంబేడ్కర్ భవన్‌లో భీమ్‌సేన్ వార్ ఆధ్వర్యంలో ఈనెల 23న భారత రాజ్యాంగ దినోత్సవ సదస్సు నిర్వహిస్తున్నామని సంఘం ప్రధాన కార్యదర్శి వసంత రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను అంబేడ్కర్ భవన్ ఆవరణలో ఆవిష్కరించారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జి.ఉమామహేశ్వరరావు, రవికుమార్, రాంబాబు, విజయానంద్, గురుమూర్తి, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న భీమ్‌సేన్ వార్ నాయకులు

ఆరుద్ర రచనలు స్ఫూర్తిదాయకం

అల్లిపురం, న్యూస్‌టుడే : ఆరుద్ర రచనలు ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని తెలకపల్లి రవి అన్నారు. డాబాగార్డెన్స్ దరి అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సాహితీ స్రవంతి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆరుద్ర జయంతి ముగింపు వేడుకల్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న తెలకపల్లి రవి మాట్లాడుతూ తెలుగు సాహిత్యం, సినీ గీతాలు, అనువాదాలు, నాటక రచనల్లో ఆరుద్ర తన ప్రత్యేకత చాటుకున్నారన్నారు. అనంతరం 'తిమిరాన్ని తరిమేస్తాం' పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీకటి దివాకర్, అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పొలమరశెట్టి ఫ్రాన్సిస్, ఇతర సభ్యులు సత్యాజీ, రామకృష్ణ, చలసాని కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న వక్తలు

PUBLIC NOTICE

As per instructions given to me from my client **Union Bank of India, Muralinagar Branch, Visakhapatnam,** represented by its Branch Manager, Mr. Balaga Trinadh I am issuing this public notice.

Notice is hereby given that the following original link documents (1) Regd Sale Deed No. **284/1992** dated 20-03-1992 regd at SRO, Dwarakanagar, executed by Bhagavathi Sarojini D/o Sridhar in favour of Mukoni Ravi Kumar S/o A Raman Nair, (2) Regd Sale Deed No.**1521/1996** dated 17-05-1996 executed by Mukoni Ravi Kumar S/o. A Raman Nair in favour of Mohammad Ahmad Alikhan S/o. Late M F Khan and (3) Regd Sale Deed No. **1535/1996** dated 01-07-1996 SRO Dwarakanagar, executed by Mukoni Ravi Kumar S/o. A. Raman Nair in favour of Mohammad Ahmad Alikhan has been misplaced while shifting his house from Steel Plant Township to Kurmannapalem on 24-01-2024, not traced yet. The report of the same has been lodged by the present owner Mr. Venkata Narasimha Sharma Duvvuri at the Station House Officer at Duvvada on dated 13-12-2024, vide Report No. MLD012400485424 through the Grama Sachivalayam (Village Secretariat), regarding the missing original sale deeds. The Police issued not traced Certificate.

(1) Schedule of Regd Sale Deed No.1521/1996, dated 17-05-1996: Site measuring an extent of 150 sq.yds or 125.419 sq.mts being undivided and unspecified share of 300 sq.yds together with ground floor measuring 1220 sft constructed upto slab level situated in Plot No. 47 full and 46 part covered by Survey No 49/2D2 of Madhavadhara Village, within the limits of Municipal Corporation Visakhapatnam, Dwarakanagar Sub Registration District and bounded by: **Boundaries : EAST** : Site of Sanapala Padmavathi 41'3" or 14.35 mts; **SOUTH :** Site of Nirmala Kumari 64' or 22.27 mts; **WEST:** 30 feet wide road 41'3" or 14.35 mts; **NORTH :** Site of E. Parvathi and M. Venkata Rao 66'11" or 23.28 mts

(2) Schedule of Regd Sale Deed No. 1535/1996 dated 01-07-1996: Site measuring an extent of 150 sq.yds or 125.419 sq.mts being undivided and unspecified share of 300 sq.yds together with First Floor measuring 1220 sft constructed upto slab level situated in Plot No. 47 full and 46 part covered by Survey No 49/2D2 of Madhavadhara Village, within the limits of Municipal Corporation Visakhapatnam, Dwarakanagar Sub Registration District and bounded by: **Boundaries : EAST** : Site of Sanapala Padmavathi 41'3" or 14.35 mts; **SOUTH :** Site of Nirmala Kumari 64' or 22.27 mts; **WEST:** 30 feet wide road 41'3" or 14.35 mts; **NORTH :** Site of E. Parvathi and M. Venkata Rao 66'11" or 23.28 mts

The party approached the bank authorities i.e., Union Bank of India, Visakhapatnam for availing Mortgage Loan and if anyone has got any objection, claim or any purpose on the schedule mentioned property, shall contact the below mentioned person with all the relevant original documents within 7 days from the publication of this notice, else will be treated as there is no any claim, objection or purpose in this regard.

Date: 02.11.2025 **Place:** Visakhapatnam | **N. SUVARNA RAJU** (Advocate), D.No 40-52-60, Sanjay Nagar, Kailasapuram Road, Visakhapatnam. **Cell: 9848550336**

(c) eenadu

గాజువాక

•గాజువాక •విశాఖ పశ్చిమం

పెట్రోలు చోరీ చేస్తున్న వారి గుర్తింపు

గోపాలపట్నం, న్యూస్‌టుడే : రాత్రివేళల్లో ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్ చోరీ చేస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే.. జీవీఎంసీ 89వ వార్డు బాలాజీనగర్, ఎల్లపువానిపాలెం, భగత్‌సింగ్‌నగర్, కొత్తపాలెం, చంద్రనగర్ పరిసర ప్రాంతాల్లో కొన్ని నెలలుగా బైకుల్లోని పెట్రోల్ దొంగతనాలు జరుగుతున్నాయి. శనివారం అర్ధరాత్రి బాలాజీనగర్‌లోని ఒక ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైకుల నుంచి పెట్రోల్ చోరీ పాల్పడుతున్నట్లు ఒక సీసీ కెమెరాలో నమోదైంది. దీంతో ఆదివారం స్థానిక ఇంటి యజమాని గోపాలపట్నం క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాలను పరిశీలించగా.. ఎల్లపువానిపాలెంకు చెందిన ఓ పాతకాల విద్యార్థులుగా గుర్తించారు. వీరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

గౌరమ్మకు పూజలు నిర్వహిస్తున్న ప్రతినిధులు

ఘనంగా గౌరమ్మ సారె వేడుక

బీసీరోడ్డు(గాజువాక), న్యూస్‌టుడే : గాజువాక 65వ వార్డు బాపూజీకాలనీలో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గౌరమ్మకు సారె వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పిండివంటలు, పండ్లు, ఫలహారాలను అమ్మవారికి నివేదించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య
గాజువాక: 98494 65088
పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

సమస్య: బీసీరోడ్డు నెహ్రూనగర్, వికాసనగర్‌లో మట్టిగుట్టలు ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. రాళ్లు తెచ్చి పోగులు పెడుతున్నారు. -వసంతరావు, బీసీ రోడ్డు.

సమాధానం: శానిటరీ సిబ్బందిని ఆదేశించాం. -డాక్టర్ కిరణ్‌కుమార్, ఎంఎహెచ్‌ఓ

?: పాతగాజువాక నుంచి దరిమిలింద, చిల్లర నాయుడుకాలనీకి వెళ్లే దారిలో ఎల్‌ఈడీ దీపాలు సరిగ్గా వెలగడం లేదు. -రాంబాబు, పాతగాజువాక, సీహెచ్ పార్థసారథి, పంతులగారిమేడ.

✔: పరిశీలించి దీపాలు మరమ్మతు చేస్తాం. -శివ, వీధి దీపాల నిర్వాహకుడు

పందుల నివారణకు చర్యలు

స్పందనకు వందనం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : సమస్యాత్మకంగా తయారైన పందుల బెడదపై జీవీఎంసీ వెటర్నరీ సిబ్బంది చర్యలు చేపట్టారు. 'ఈనాడు'లో శనివారం 'గాజువాకలో వరాహాల బెడద' శీర్షిక వార్త వచ్చిన సంగతి తెలిసిందే. స్పందించిన అధికారులు జోనల్ కార్యాలయం రోడ్డు, చినగంట్యాడ, శ్రీనగర్‌లో స్పెషల్ డ్రైవ్ చేపట్టి షూటర్లతో కాల్పివేతలు చేపట్టారు.

ఇరుకు బజారు.. నిత్యం బేజారు

విస్తరణకు గ్రహణం

మహిళా రైతు బజారులో రద్దీ

గాజువాక, న్యూస్‌టుడే : గాజువాక మహిళా రైతుబజారు విస్తరణకు ఏళ్లుగా గ్రహణం వీడడం లేదు. జనావాసాల మధ్యనున్న ఇరుకు బజారులో నిత్యం రైతులు, కొనుగోలుదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. దీన్ని అభివృద్ధి చేస్తామంటూనే జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు కాలయాపన చేస్తున్నారు. దీనివల్ల గాజువాక నడిబొడ్డున ఉన్న శ్రీనగర్‌లోని బజారుకు వెళ్లాలంటే జడుసుకుంటున్నారు, కిక్కిరిసిన స్టాళ్లు వాహనదారులకు పరీక్ష పెడుతున్నాయి.

పెరిగిన స్టాళ్లు..విడని కష్టాలు..జిల్లా వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో రెండు దశాబ్దాల క్రితం పాతగాజువాక శ్రీనగర్‌లో ఈ మహిళా రైతుబజారును ఏర్పాటు చేశారు. తొలుత 46 స్టాళ్లతో గ్రామీణ మహిళా రైతులు వ్యవసాయ ఉత్పత్తులను ఇక్కడ విక్రయించేవారు. అయితే గ్రామీణ ప్రాంతం నుంచి రైతులు రావడానికి ఇబ్బందులు పడుతుండటంతో ఇక్కడి చిరు మహిళా వ్యాపారులకు అమ్ముకోవడానికి అవకాశం కల్పించారు.

★ నాణ్యమైన సరుకు లభిస్తుండటంతో కొనుగోలుదారుల తాకిడి పెరిగింది. ప్రస్తుతం 73 స్టాళ్లు, గిరిజన ఉత్పత్తుల దుకాణంతో రోజూ బజారు కిక్కిరిసి ఉంటోంది. సగటున 5 టన్నుల వరకు కూరగాయల విక్రయాలు జరుగుతాయి. అయితే దీన్ని విస్తరించాలన్న ప్రతిపాదన పదేళ్లుగా నలుగుతున్నా నేటికీ ఒక కొలిక్కి తీసుకురాలేదు. మల్టీపర్పస్ మార్కెట్ యార్డుగా తీర్చిదిద్దడానికి నిర్మించినా స్థల సమస్య, వనరుల కొరత, పార్కింగ్ కష్టాలు ఇబ్బందికరంగా నిలిచాయి.

దారిలోనే..: తగిన వసతులు లేకుండా బజారు బయట రోడ్డు మీదే వాహనాలను పార్కు చేస్తున్నారు. అసలే ఇరుకైన, ఆపై అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్‌తో కైలాసనగర్, చుట్టుపక్కల వాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ బజారును ఆనుకుని అనుబంధ మార్గాల్లో ప్రైవేటు కూరగాయల దుకాణాలు, తోపుడుబళ్లు ఉన్నాయి. బజారుకు 100 మీటర్ల దూరం వరకూ ఎలాంటి దుకాణాలు ఉండరాదని నిబంధనలున్నా అక్కడ అమలు కావడం లేదు. ఏటా పెరుగుతున్న అవసరాలను దృష్టిలో పెట్టుకుని బజారు విస్తరణ, ఆధునీకరణకు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

★ ఈ పరిస్థితిపై గాజువాక మహిళా రైతుబజారు ఇన్‌ఛార్జి వరలక్ష్మిని సంప్రదిస్తే.. జిల్లా ఉన్నతాధికారుల పరిశీలనలో విస్తరణ ప్రతిపాదన ఉందని, ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. పార్కింగ్ సమస్య వల్ల కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారని, దీన్ని త్వరలోనే అధిగమిస్తామని పేర్కొన్నారు.

దారిలో వాహనాల పార్కింగ్

బస్సు మొరాయించే.. ట్రాఫిక్ స్తంభించే

బాజీకూడలి రోడ్డులో స్తంభించిన వాహనాలు

నిలిచిన ఆర్టీసీ బస్సు

గోపాలపట్నం, న్యూస్‌టుడే : గోపాలపట్నం రైల్వేస్టేషన్ కూడలి రోడ్డులో ఆదివారం భారీ ట్రాఫిక్ ఏర్పడింది. సింహాచలం నుంచి ద్వారకానగర్ వెళ్లే బస్సు స్థానిక బీఆర్‌టీఎస్ మధ్య రోడ్డు (సింహాచలం రైల్వేస్టేషన్)లో మొరాయించింది. దీంతో ప్రయాణికులను దింపేసి.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. దీని వల్ల బీఆర్‌టీఎస్ మధ్యలోకి వెళ్లాల్సిన భారీ వాహనాలు పెట్రోల్‌బంక్ కూడలి నుంచి బాజీకూడలి వెళ్లే సేవామార్గంలో వెళ్లాయి. దీనివల్ల సేవామార్గంలో వాహనాలు స్తంభించి బారులు తీరాయి. బస్సు మరమ్మతులు పూర్తిచేయించి పంపించాక ట్రాఫిక్ అదుపులోకి వచ్చింది.

మస్తానప్ప సేవలు మరువలేనివి

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కు కార్మిక నాయకుడు వై.మస్తానప్ప ప్రథమ వర్ధంతి ఉక్కునగరంలో ఆదివారం జరిగింది. కార్యక్రమంలో పలువురు ఉక్కు కార్మిక సంఘాల, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మస్తానప్ప సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, వైఎస్సార్‌టీయూసీ స్టేట్ జోనల్ అధ్యక్షులు పి.వి.సురేష్, జిల్లా అధ్యక్షుడు ఆర్.అనిల్, పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎం.రాజశేఖర్, యు.రామస్వామి, వి.ఆర్.మోహన్ కుమార్, పరంధామయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: పెదగంట్యాడలో మస్తానప్ప ప్రథమవర్ధంతిని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటక్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్ రాష్ట్ర ఎస్సీసెల్ నాయకులు మార్డుపూడి పరదేశి, పిట్టారెడ్డి, జిల్లా నాయకులు పీవీ సురేశ్, అనిల్‌కుమార్, తిప్పల దేవన్‌రెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి, శంకరనారాయణ, గంట్యాడ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మస్తానప్ప చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఎర్రన్నాయుడికి ఘన నివాళులు

గాజువాక: కేంద్ర మాజీమంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు వర్ధంతి పురస్కరించుకుని ఆదివారం శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో గాజువాక తెదేపా ప్రతినిధి బృందం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించింది. రాష్ట్ర తెదేపా మీడియాసెల్ మాజీ డైరెక్టర్ పప్పు రాజారావు, నాయకులు కాంతారావు, కృష్ణ, డాక్టర్ దుబా రాజు, వానపల్లి జగ్గారావు, ఇమంది విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఎర్రన్నాయుడికి నివాళులర్పిస్తున్న తెదేపా నాయకులు

సిమెంటు కంపెనీ ఏర్పాటు తగదు

నిరసనలో అపార్టుమెంటు నివాసితులు

శ్రామికనగర్ (పెదగంట్యాడ), న్యూస్‌టుడే: పెదగంట్యాడలో అదానీ సిమెంటు కంపెనీ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పట్టణ వార్డు, నివాస సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. 70వ వార్డు పరిధిలోని అపార్టుమెంట్ల నివాసితులు ప్లకార్డులు ధరించి వీధుల్లో నినాదాలతో హోరెత్తించారు. సంఘాల అధ్యక్షుడు బీపీ త్రినాథస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అలయంలో కోటి దీపోత్సవం

ఉక్కునగరం: కార్తిక శుద్ధ ఏకాదశి సందర్భంగా ఉక్కునగరం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం కోటి దీపోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దీపోత్సవ కార్యక్రమంలో ఉక్కునగరం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ఆత్మల సంస్మరణ దినం

సింధియా(హైమానగర్), న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతం గుల్లలపాలెం శ్మశాన వాటికలో ఆదివారం కేథలిక్ మిషనరీ ఆధ్వర్యంలో ఆత్మల సంస్మరణ దినం నిర్వహించారు. స్థానిక ఆర్సీఎం సెయింట్ జోసఫ్ చర్చి, సెయింట్ ఆన్స్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రైస్తవ గీతాలను ఆలపించారు. సమాధులను అలంకరణ చేశారు.

గుల్లలపాలెంలో ఆత్మల సంస్మరణ దినం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రమాదం 'అంచున' ప్రయాణం..

నిత్యం రద్దీగా ఉండే బీసీ రోడ్డులో ఆదివారం మినీ వ్యాన్‌లోడు వెనుక నిల్చుని ఇద్దరు మహిళలు ప్రయాణించడం ఆందోళన కలిగించింది. అసలే గతుకులరోడ్డు ఏ మాత్రం చేతులు జారినా పడిపోయే ప్రమాదం ఉంది. -న్యూస్‌టుడే, పెదగంట్యాడ

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో రాణింపు

మల్కాపురం, న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతానికి చెందిన విశ్రాంత ఉద్యోగి **ఆకుల కనకరాజు** (72) అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటారు. ఆదివారం నగర పరిధిలో నున్న పోలీస్ బ్యారెక్స్‌లో మాస్టర్స్ అసోసియేషన్ వారు నిర్వహించిన జిల్లాస్థాయి పరుగు పోటీల్లో 100 మీటర్స్‌లో పాల్గొని బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. కనకరాజు ప్రస్తుతం గాంధీగ్రాం షిప్‌యార్డుకాలనీ డిగ్రీ కళాశాలలో వ్యాయామ ఉపాధ్యాయులుగా విధులను నిర్వహిస్తున్నారు.

తైక్వాండోలో ప్రతిభ



మల్కాపురం, న్యూస్‌టుడే : మల్కాపురం పరిధిలోని నౌసేనాబాగ్ పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం-1లో ప్రథమ ఏడాది ఇంటర్ చదువుతున్న **డి.సత్యశ్రీఅంజనీప్రియ** ఈనెల 1 నుంచి ఏలూరులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో 64 కేజీల బాలికల విభాగం బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా బాలికను కేవీ అధ్యాపకులు అభినందించారు.

దానప్పతల్లి అమ్మవారి పండగ

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: ఉక్కు నిర్వాసితకాలనీ దుగ్గపువానిపాలెంలో వేంచేసిన దానప్పతల్లి అమ్మవారి పండగ గోడపత్రికను ఆలయ కమిటీ ఆదివారం ఆవిష్కరించింది. 8న అమ్మవారి సారె, ముర్రాట పండగ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బొడ్డ గోవింద్, డీవీ అప్పారావు, బొడ్డ సన్యాసిరావు, ప్రగడ శ్రీనివాసరావు, దుగ్గపు నర్సింహమూర్తి, పిన్నింటి సంతోష్, పి.శంకర్రావు, పూడి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

భక్తిశ్రద్ధలతో పూజలు

కణితి కాళింగవీధిలోని పంచముఖేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: కార్తిక మాసం ద్వాదశి సందర్భంగా కాళింగవీధిలోని పంచముఖేశ్వరస్వామి ఆలయంలో మహిళలు క్షీరాబ్ది ద్వాదశి పూజలు ఆదివారం నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు తరలిరావడంతో సందడిగా మారింది.

ఏపీఐఐసీ నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

అక్కిరెడ్డిపాలెం(ఆటోనగర్), న్యూస్‌టుడే : జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో ఆదివారం సాయంత్రం ఏపీఐఐసీ నిర్వాసితుల సమావేశం జరిగింది. వివిధ కులసంఘాల నాయకులు, గ్రామాభివృద్ధి సంఘం ప్రతినిధులు, నిర్వాసితుల సంఘం ప్రతినిధులు, నిర్వాసితులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి మాట్లాడుతూ ఏపీఐఐసీ నిర్వాసితులకు ప్రభుత్వం వెంటనే ఇండ్ల స్థలాలు కేటాయించాలన్నారు. నిర్వాసిత సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం దీనిని తాత్సారం చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు కొల్లి అప్పలరెడ్డి, నావన సింహాచలం, పెట్లి అర్జునరావు, కొల్లి పెంటయ్య, బల్లంకి అప్పారావు, పట్నాల ప్రసాద్, సుబ్రహ్మణ్యం, మణిరాజు, లక్ష్మణరావు, బాబూరావు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్తు వాహనాలకు అనుమతి తప్పనిసరి

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారం ప్రాంగణంలో సొంత విద్యుత్తు వాహనాల వినియోగానికి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఉక్కు భద్రతా విభాగం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. ఈనెల 4లోపు సీఐఎస్ఎఫ్ నుంచి ముందుగానే అనుమతి పత్రం పొందాలన్నారు. ఈ పత్రం లేకుండా వాహనాన్ని కర్మాగారంలోకి అనుమతించరన్నారు.

పెదకోరాడ అంగన్‌వాడీకి విరాళం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: నిరాదరణకు గురైన పెదకోరాడ అంగన్‌వాడీ కేంద్రం అభివృద్ధికి గ్రామకమిటీ ప్రతినిధులు ముందుకొచ్చారు. గ్రామ ప్రతినిధి గొందేశి వెంకటరమణారెడ్డి తన వంతుగా రూ.15వేలు, భవన మరమ్మతులకు అవసరమైన సామగ్రిని అందజేశారు. ఆదివారం గ్రామకమిటీ అధ్యక్షుడు బసా పేర్రెడ్డి చేతుల మీదుగా అంగన్‌వాడీ టీచర్ కుమారికి అందించారు. గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సైనికునికి ఘన స్వాగతం

అగనంపూడి: భారత సైన్యంలో హవల్దారుగా 17 ఏళ్లపాటు సేవలందించిన సైనికుడికి ఆదివారం స్వగ్రామంలో ఘన స్వాగతం లభించింది. అగనంపూడి పరిధి పెదమడక కాలనీకి చెందిన బంధం పెంటారావు మద్రాస్ ఇంజినీర్ రెజిమెంట్‌లో విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేశారు. విశ్రాంత సైనికునిగా తొలిసారిగా ఇంటికి వచ్చిన ఆయనను పెదమడక యూత్ ఆధ్వర్యంలో కాలనీలో ఊరేగించారు.

కళారత్నకు స్మృతి పురస్కారం

సింధియా, న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం హిమాచల్‌నగర్‌కు చెందిన కళారత్న సుంకరి చలపతిరావుకు ఆదివారం ఆర్ట్ అసోసియేషన్ గిల్డ్ ఆధ్వర్యంలో స్మృతి పురస్కారాన్ని అందజేశారు. విజయవాడలో జరిగిన 'చింతా నారప్ప స్మృతి' పురస్కారాన్ని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా చలపతిరావు అందుకున్నారు.

పాటల పోటీలు ప్రారంభం

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : స్టీల్ క్లబ్ ఆడిటోరియంలో ఆదివారం రాష్ట్రస్థాయి పాటల పోటీలు ఘనంగా నిర్వహించారు. స్టీల్ క్లబ్ అధ్యక్షులు, ఉక్కు జీఎం ఎం.మధుసూదనరావు ఈ కార్యక్రమం ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి 31 మంది ఇందులో పాల్గొని పాటలు పాడారు. కార్యక్రమంలో జీఎం వి.చిట్టిబాబు, క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి వై.రవికుమార్, కోశాధికారి వేణుగోపాల్, కె.రంగనాథం, బి.వి.రమణ, కె.రమేష్‌కుమార్, ఎ.రమేష్, వి.ఎన్.బి.రాజు, ఎం.భువన్ కుమార్, కె.ఎల్.నరసింహం, ఎం.కృష్ణ, వెంకటరాజు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న క్లబ్ అధ్యక్షులు, ఉక్కు జీఎం ఎం.మధుసూదనరావు

తుపాను వేళ.. 'రక్షణ' గోడ

ధైర్యంగా కొండవాలు నివాసితులు

గోపాలపట్నం, ఎన్ఏడీకూడలి, న్యూస్‌టుడే : వర్షమొచ్చినా..తుపాను వచ్చినా కొండవాలు ప్రాంతవాసులు బితుకుబితుకుమంటూ గడిపేవారు. గతేడాది సెప్టెంబరు 8న గోపాలపట్నంలోని శ్రీరామ్‌నగర్ కొండచరియ విరిగిపోవడంతో భవనాలు గాల్లో నిలబడ్డాయి. దీనిపై పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు స్పందించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కొండవాలు ప్రాంతంలో వర్షాలు, తుపాన్లు వచ్చినా ధైర్యంగా ఉండేలా కొండచరియలు విరిగిపోకుండా, మట్టిపెళ్లలు రాలకుండా రక్షణగోడలు నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. మొన్నటి మొంథా తుపాను సమయంలో రక్షణ గోడ వల్ల కొండవాలు ప్రాంత వాసులు భయం లేకుండా గడిపారు.

నిర్మించిన.. నిర్మిస్తున్న.. నిర్మించాల్సిన ప్రాంతాలివే.. * జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఇ, ఎఫ్ బ్లాక్‌లో ప్రమాదకరంగా గుర్తించిన మూడు భాగాల్లో సుమారు రూ.2.24 కోట్లతో 50, 50, 100 మీటర్ల పొడవునా, 10 అడుగుల ఎత్తు, రెండు అడుగుల వెడల్పుతో పునాదులు లోతుగా తీసి రక్షణ గోడలు నిర్మించారు.

✦ 91వ వార్డు రామకృష్ణనగర్‌లో సుమారు రూ.1.80 కోట్లతో 40 అడుగుల పొడవు, 30 మీటర్ల ఎత్తులో రక్షణ గోడలు నిర్మించినట్లు జీవీఎంసీ 8వ జోన్ డీఈ ఎస్.వెంకటలక్ష్మి, 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ పేర్కొన్నారు.

✦ జీవీఎంసీ 90, 91వ వార్డులోని రామకృష్ణనగర్, లక్ష్మీనగర్ ఇ, ఎఫ్ బ్లాకుల్లో ఇంకా రక్షణ గోడలు నిర్మించాల్సి ఉంది. వాటికి నిధుల మంజూరు కోసం నివేదిక పంపించారు.

✦ లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో రక్షణ గోడకు సంబంధించి ఇంకా 20 శాతం పనులు ఇంకా మిగిలి ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

రామకృష్ణనగర్‌లో ఇళ్లు జారిపోకుండా 30 అడుగుల ఎత్తున నిర్మించిన రక్షణగోడ

లక్ష్మీనగర్ ఎఫ్.బ్లాక్‌లో రక్షణ చర్యలు

బాలుడికి విద్యుదాఘాతం

గోపాలపట్నం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 92వ వార్డు ఎస్సీబీసీకాలనీకి చెందిన పి.రోహన్(11) ఇంటికి దీపావళి సందర్భంగా రంగుల విద్యుత్తు దీపాలను అలంకరించారు. ఇది తొలగించేందుకు ఆదివారం సాయంత్రం దీపాల వైర్లకు రాయికట్టి ఇంటిపైకి విసిరాడు. దీంతో హెచ్‌టీ లైన్లకు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. కేజీహెచ్‌కు తరలించగా బాలుడు కోలుకున్నాడు.

PASSPORT LOST

THOTA ADITYA son of Thota Appala Narasinga Rao Residing at **D.No 12-19-1** Sila Ram Nagar B.C Road, New Gajuwaka, Visakhapatnam - 530026. AP I have Lost my Original Passport bearing **No. X3804860** while Travelling from Gajuwaka to Autonagar Surroundings on **15-10-2025** if found anyone Please Contact

✆7288858012

క్రికెట్ అభిమానుల సందడి..

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: మహిళా ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ఉక్కు నిర్వాసిత గవరవీధిలో పెద్ద ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. భారత్-దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న ఫైనల్ మ్యాచ్ కోసం దుర్గా యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్క్రీన్‌లో స్థానికులంతా కలిసి తిలకించారు. ప్రతి ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లు ఇక్కడ తెరలు ఏర్పాటు చేసి చూస్తారు.

ఉక్కు నిర్వాసిత గవరవీధిలో ఏర్పాటుచేసిన ఎల్ఈడీ స్క్రీన్‌పై క్రికెట్ వీక్షణం

గోపాలపట్నంలో..

గోపాలపట్నం, న్యూస్‌టుడే : మహిళా ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో భాగంగా ఆదివారం ఫైనల్ మ్యాచ్ కావడంతో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ఆధ్వర్యంలో గోపాలపట్నంలోని పశ్చిమ తెదేపా కార్యాలయం వద్ద బిగ్‌స్క్రీన్ ఏర్పాటు చేశారు. క్రీడాభిమానులు, మహిళలు క్రికెట్ పోటీలను ఆసక్తికరంగా తిలకించారు.

గణబాబు నివాసం వద్ద ఏర్పాటు చేసిన తెర

జీవన్ కుమార్‌ను అభినందిస్తున్న నాయకులు

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ

అగనంపూడి, న్యూస్‌టుడే : ఇటీవల అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అగనంపూడికి చెందిన ఎ.జీవన్‌కుమార్ ప్రతిభ కనబరిచారు. పోటీల్లో బంగారు పతకం సాధించడంతో పాటు త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం పెదమడక ఫిట్‌నెస్ క్లబ్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆయనను అభినందించి ఘనంగా సత్కరించారు. తెదేపా నాయకులు బి.సత్యనారాయణ, విందుల రాజు, గుర్రం నూకరాజు, డొక్కా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనపై సమరం

అవగాహన ర్యాలీలో పాల్గొన్న సంఘం సభ్యులు

గోపాలపట్నం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆదివారం గోపాలపట్నం కళాసేవా పీఠం ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్.సోములు మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా విస్మరించాలన్నారు. గౌరవ అధ్యక్షులు చందు సుబ్బారావు, బంగార్రాజు, రామదాసు, శ్రీనివాసరావు, వెంకట్, రామారావు, అప్పారావు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త కార్యవర్గం ఏర్పాటు

సింధియా, న్యూస్‌టుడే: జీవీఎంసీ 61వ వార్డు ఆర్కేపురంలోని యునైటెడ్ చర్చిలో ఆదివారం కొత్త కార్యవర్గం ఏర్పాటైంది. కొత్త సంఘ అధ్యక్షుడిగా పి.సువర్ణరాజు, కార్యదర్శిగా టి.జ్ఞానేష్, ఉపాధ్యక్షులుగా డైసీ మార్టిన్, సంయుక్త కార్యదర్శిగా డి.జాన్, కోశాధికారిగా వి.డి.జాషువా, సంయుక్త కోశాధికారిగా వై.సాల్మన్‌రాజుతో పాటు సభ్యులను ఎన్నుకున్నట్టు కార్యవర్గం తెలియజేసింది. ఈ కమిటీ రెండేళ్లపాటు కొనసాగుతుందని వివరించింది.

నూతన కమిటీల నియామకం

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 68వ వార్డు అప్పన్నకాలనీ మండపంలో ఆదివారం గ్రామ సగర సంక్షేమ సంఘం, రామాలయం సేవాసంఘం సభ్యుల ప్రత్యేక సమావేశం జరిగింది. రెండు సంఘాల నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల పర్యవేక్షకులు గండికోట తాతారావు తెలిపారు. సగర సంక్షేమ సంగం గౌరవ అధ్యక్షులుగా గుర్రం గోవిందు, అధ్యక్షులుగా జి.పెద్ద సింహాచలం, కార్యదర్శిగా గుర్రం రాజు, సమన్వయకర్తలుగా గండికోట తాతారావు, జి.చిన్న సింహాచలం, కోశాధికారిగా రాంబాబు, రామాలయం కమిటీ గౌరవ అధ్యక్షులుగా పిండి అప్పలరాజు, అధ్యక్షులుగా జి.నాగరాజు, కార్యదర్శిగా వెంకటరావు, సమన్వయకర్తలుగా జి.త్రినాథ్, ఆర్.శ్రీనివాస్, రాజేశ్‌తో పాటు పలువురు తమ బాధ్యతలు స్వీకరిస్తూ ప్రమాణ స్వీకారం చేశారు.

నూతన కార్యవర్గ ప్రతినిధులు

బహిరంగ ప్రకటన మరియు హెచ్చరిక

మా క్లయింటు అయిన శ్రీమతి ఉప్పలపాటి సీతామహాలక్ష్మి W/o (లేటు) ఉప్పలపాటి నరసింహారావు, నివాసం డోర్ నెం. 24-19-2/1/6, ఫ్లాట్ నెం. HIG-174, వినాయక్‌నగర్, శ్యామలానిలయం, విశాఖపట్నం మరియు వీరి కుమారుడు ఉప్పలపాటి వెంకట సురేష్ గార్లు మాకు ఇచ్చిన భోగట్టా మేరకు లోకులు యావన్మందికి తెలియజేయునది ఏమనగా మా క్లయింట్లు వద్ద నుండి జంపన వి.యస్.ఎన్. రాజు S/o (లేటు) జె.ఎ.ఎన్. రాజు, నివాసం డోర్ నెం. 6-64-27/7, రోడ్ నెం. 10, శ్రామికనగర్, పాత గాజువాక, విశాఖపట్నం వారు ఋణముగా రూ. 30,21,538/-లు పొందియున్నారనిన్నీ, సదరు ఋణము నిమిత్తము సదరు వ్యక్తి తేది. 16-07-2024న ఒక ప్రాంశరీ నోటుకూడా వ్రాయించి ఇవ్వడం జరిగినదనిన్నీ సదరు వ్యక్తి సదరు ఋణమును తీర్మాణం చేయకుండా ఉండుటచేత మా క్లయింట్లే సదరు వ్యక్తిపై మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి యందు O.S. 69/2025 అను దావాను తీసుకొనిరాగా సదరు దావాయందు సదరు వ్యక్తియొక్క ఈక్రింద తెల్పబడిన షెడ్యూలు దాఖలా ఆస్థిని జప్తును కోరుతూ I.A. 327/2025 అను పిటీషన్‌ను కూడా దఖలు పరచడం జరిగినదనిన్నీ, అదేవిధంగా సదరు మా క్లయింట్లు వద్దనుండి పైన తెల్పబడిన జంపన వి.యస్.ఎన్. రాజు గారి తమ్ముడు అయిన సుధీర్‌వర్మ గారు కూడా మా క్లయింట్ వద్దనుండి రూ. 37,70,730/-లను ఋణముగా తీసుకొని తేది. 16-07-2024న ఒక ప్రాంశరీ నోటు కూడా ఇవ్వడం జరిగినదనిన్నీ, తదుపరి సదరు వ్యక్తి కూడా సదరు ఋణమును చెల్లించనందున సదరు వ్యక్తిపైన మా క్లయింట్లు సదరు పైన తెల్పబడిన మహారాజశ్రీ కోర్టు యందు O.S. 70/2025 అను దావాను తీసుకొనిరావడం జరిగినదనిన్నీ, అందలి దావా యందు సదరు క్రింద తెల్పబడిన షెడ్యూలు దాఖలా ఆస్థిని జప్తు కోరుతూ IA 328/2025 అను జప్తు పిటీషన్‌ను కూడా వేసియున్నారనిన్నీ, కాగా పై రెండు కేసుల యందు సదరు ఇరువురు ప్రతివాదులు మహారాజశ్రీ కోర్టువారి యొక్క నోటీసులు కూడా పుచ్చుకున్నారనిన్నీ, తదుపరి పైన తెల్పబడిన రెండు కేసుల విషయం దాచిపెట్టి లోకులకు సదరు క్రింద తెల్పబడిన ఆస్థిని అమ్మజూపే ప్రయత్నం చేస్తున్నారనిన్నీ, కావున లోకులు ఎవ్వరుకూడా ఈక్రింద తెల్పబడిన షెడ్యూలు దాఖలా ఆస్థిపైన ఒప్పందం చేసుకోరాదని మరియు సదరు ఆస్తిపైన ఎటువంటి లావాదేవీలు జరపరాదనిన్నీ, అట్లు జరిపిన మా క్లయింట్లు యొక్క హక్కులను బంధింపజాలవనిన్నీ మరియు అటువంటి లావాదేవీలు చెల్లవుగాక చెల్లవనిన్నీ ఇందుమూలంగా లోకులు యావన్మందికి తెలియజేయడమైనది.

SCHEDULE

The Property which is constructed in an extent of 242 Sq yards or 203.28 Sq meters having Ground Floor RCC 1623 SFT + 1st Floor ACC 144 Sft. vide D.No.12-79/3, TAX Assessment No.10863630, which is situate in Aganampudi Village in S.No.144, within the limits of GVMC and with the Limits of SRO of Lankelapalem bounded by: **East** : RCC House of Mulagapati Krishnam Raju; **South:** Vacant site vide Plot No.171; **West:** RCC House of Seethini Appala Raju vide Plot No.69; **North:** Road.

DURGAM'S LAW CHAMBER

D.V.V.R. PRATAP, R. SARADA NAGARJUN, B. SRINIVASA RAO
D.V.V.S.S. HARSHA VARDHAN, R. LAHARI, V.E.S. PRASAD
ADVOCATES
D.No. 38-40-78, Main Road, Marripalem, Visakhapatnam-18
Ph: 9848418166, 99859 96813

(c) eenadu

ఈనాడు విజయనగరం

సోమవారం నవంబరు 3, 2025

పెళ్లి సంబంధాల కోసం వెతుకుతున్నారా

కాపు/ తెలగ అవివాహితులకు సువర్ణావకాశం

నేడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, కాపు/తెలగ అవివాహితులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. 'ఈనాడు' కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు వివాహం కోసం ఎదురుచూస్తున్న అవివాహితులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (03 నవంబరు 2025 సోమవారం) ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

★ వివరాలకు 91549 18858, 80080 01686ను సంప్రదించవచ్చు. ఫోన్/యాప్ ద్వారా కూడా రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయో డేటా, ఫొటోలు పైన తెలియచేసిన వాట్సాప్ నంబర్లకు పంపవచ్చు.

మన ఫైటర్లు వీరే!!

ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న ఈఈ వెంకటరమణ

విజయనగరం అయ్యన్నపేట, రింగురోడ్డు, అర్బన్, న్యూస్‌టుడే: ఇటీవల వచ్చిన మొంథా తుపాను వణుకు పుట్టించింది. అయినప్పటికీ కొందరు అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో మెరుగైన సేవలు అందించి, ప్రజలకు అండగా నిలిచారు. ఇలాంటి వారిని ప్రభుత్వం గుర్తించి, 'సైక్లోన్ మొంథా ఫైటర్ అవార్డ్స్' పేరిట సత్కరించింది. విజయవాడలో శనివారం జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా నీటిపారుదల శాఖ ఈఈ ఎం.వెంకటరమణ, రామచంద్రపురం వీఆర్వో ఎ.రాజ్‌మోహన్, లక్ష్మీపురం ఆశా కార్యకర్త వై.బంగారమ్మ జ్ఞాపికలు అందుకున్నారు. వీరిని మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో అభినందించారు.

గంగచోళ్లపెంట వద్ద కొద్దిపాటి వర్షం కురిసినా కన్పిస్తున్న గోతులు

ఆ 6 కి.మీ.లు.. అడుగేయాలంటే గుండెలదురు!

రాళ్లుతేలిన రహదారి

గజపతినగరం నుంచి మెంటాడ మధ్యలో సుమారు ఆరు కి.మీ. రహదారి గోతుల మయంగా మారింది. ఈ దారిలో ప్రయాణించేందుకు వాహనచోదకుల గుండెలు అదురుతున్నాయి. మెంటాడ మండలంలోని ఆంద్ర, అనంతగిరి మండలంలో కొన్ని గ్రామాల ప్రజలు వైద్యం, విద్య, ఇతర అవసరాలకు నిత్యం గజపతినగరం వచ్చిపోయేందుకు ఈ దారే ఆధారం. మూడు మండలాల్లోని 50 గ్రామాలకు ఇదే ప్రధాన మార్గం. పురిటిపెంట గ్రామం నుంచి చిట్టాయవలస, మద్రివలస కూడలి వరకు రహదారి వెతుక్కోవాలి. ఇటీవల వచ్చిన మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు మరిన్ని గోతులు ఏర్పడ్డాయి. వీటిల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. విషయాన్ని ఆర్అండ్‌బీ ఏఈ అజయ్ భార్గవ్ వద్ద ప్రస్తావించగా మెంటాడ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.4.50 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. – న్యూస్‌టుడే, గజపతినగరం

పాలిథిన్ ముట్టమని ప్రమాణం.. 15 ఏళ్ల ప్రయాణం

వినూత్న పద్ధతిలో ఎరువు తయారీ..

న్యూస్‌టుడే– బొబ్బిలి

బొబ్బిలి పట్టణం జిల్లాలోని మిగతా పురపాలికలకు ఆదర్శంగా నిలుస్తోంది. శతశాతం ప్లాస్టిక్ నిషేధం.. తడి చెత్తతో ఎరువు తయారీ.. వ్యర్థాలతో బయో గ్యాస్ ఉత్పత్తి.. పొడి చెత్తలో పనికొచ్చే వ్యర్థాలు వేరుచేసి విక్రయించడం తదితర కార్యక్రమాలతో ఉత్తమ పురపాలికగా పేరొందుతోంది.

పట్టణాలు, గ్రామాల్లోకి అడుగుపెట్టగానే ప్లాస్టిక్ గ్లాసులు, సంచులు గుట్టలుగా కనిపిస్తాయి. ఖాళీ ప్రదేశాలన్నీ వాటితోనే నిండి ఉంటాయి. బొబ్బిలిలో 15 ఏళ్లుగా 120 మైక్రాన్ల కంటే తక్కువ ఉండే పాలిథిన్‌ను నిషేధించారు. ఎక్కడ చూసినా కాగితం, జనపనార, వస్త్రాలతో తయారు చేసిన సంచులే కనిపిస్తాయి. తాగునీటి ప్యాకెట్లను కూడా నిషేధించారు. కల్యాణ మండపాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో ట్యాంకర్లతో పురపాలిక తాగునీటిని అందిస్తుంది. ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంతో శతశాతం అమలవుతోంది.

వినూత్న పద్ధతిలో ఎరువు తయారీ

లార్వా కంపోస్టు విధానంలో వ్యర్థాల నుంచి 15 రోజుల్లోనే ఎరువును తయారు చేస్తున్నారు. ట్యాంకుల అడుగున కొంత ఇసుక, మెటల్ వేసి రోజుకు 40 కిలోలు తడి చెత్త వేస్తారు. వీటిపై పురుగులుగా మారే గుడ్లు 10 గ్రాములు పిచికారీ చేస్తున్నారు. ఇవి తడిచెత్తను ఆహారంగా తీసుకుంటున్నాయి. అవి విసర్జించిన వ్యర్థాలు ఎరువుగా మారుతున్నాయి. ప్రస్తుతం 30 ట్యాంకులు అమర్చారు. వీటి నుంచి వచ్చే నల్లటిరసం పంటలకు ఎరువుగా వాడుకోవచ్చు. దీనికోసం ట్యాంకు దిగువన ట్యాపులు ఏర్పాటు చేశారు. గుడ్లతో తయారయ్యే పురుగులు బయటకు వచ్చేందుకు పైన పైపు ఏర్పాటు చేశారు. వాటిని కోళ్ల మేతగా ఉపయోగిస్తారు. పుర కార్యాలయం పైన సోలార్ పలకలు అమర్చారు. దీనివల్ల నెలకు రూ.50 వేలు విద్యుత్తు బిల్లు ఆదా అవుతోంది.

నాన్నా.. నీవెంటే వస్తున్నా..

మనవడి మృతి తట్టుకోలేక నాన్నమ్మ మృత్యువాత

నలుగురు బిడ్డలకు జన్మనిచ్చిందామె.. వారిలో ఇద్దరు కుమారులు, కుమార్తె వివిధ కారణాలతో చనిపోయారు.. మరో కుమార్తె అత్తవారింట్లో ఉంటోంది.. ఉన్న కుమారుడి బిడ్డే వృద్ధురాలికి ఆధారమయ్యాడు. ఏ కష్టమొచ్చినా తీర్చుతూ.. ప్రేమగా చూసుకుంటూ కుమారుడిని మరిపిస్తున్నాడు.. తనకు ఏ చింతా లేదని భావించిన ఆమె తలపై పిడుగులాంటి వార్త పడింది. ఒక్కగానొక్క మనవడు ఇకలేడని.. అనారోగ్యంతో అందరాని లోకాలకు వెళ్లాడన్న విషయం తెలిసి గుండెలవిసేలా రోదించింది.. కన్నీరును ఆపుకోలేక.. బాధను దిగమింగుకోలేక తనూ లోకాన్ని విడిచిన విషాదకర ఘటన ఎస్.కోట మండలంలో చోటుచేసుకుంది.

గంగరాజు (పాత చిత్రం)

కన్నాలమ్మ (పాత చిత్రం)

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: మనవడు మృతిని తట్టుకోలేక నాన్నమ్మ ప్రాణాలు విడిచిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మూలబొడ్డవర పంచాయతీ శివారు లచ్చందొరపాలెం గ్రామానికి చెందిన గొర్గి గంగరాజు(26) ట్రాక్టర్ డ్రైవర్‌గా చేస్తున్నాడు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పెద్ద కుమారుడు చనిపోవడంతో అతని కుమారుడైన మనవడు వద్దే ఉంటున్న కన్నాలమ్మ(65) దీన్ని తట్టుకోలేకపోయింది. ఆదివారం ఉదయం గుండెపోటుతో తనువు చాలించింది. గంగరాజుకు భార్య లక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఒకే ఇంట్లో ఒక్కరోజు తేడాలో ఇద్దరు మృతి చెందడంతో కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

3076 మంది రైతులకు నష్టం

విజయనగరం అర్బన్, రింగురోడ్డు, రాజాం, న్యూస్‌టుడే: మొంథా తుపాను కారణంగా జిల్లాలోని 665.69 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. 644.03 హెక్టార్లలో వరి, మొక్కజొన్న- 6.40, పత్తి- 4.93, మినుములు 1.01 హెక్టార్ల మేర దెబ్బతింది. ఈమేరకు 3,076 మంది రైతులు ఇబ్బంది పడ్డారని అధికారులు తెలిపారు. సమస్యలు ఉంటే 83310 56279 నంబరును సంప్రదించాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో జరిగే సామాజిక ఆడిట్‌కు బాధితులు హాజరు కావాలని, అభ్యంతరాలుంటే రాత పూర్వకంగా తెలియజేయాలని కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి తెలిపారు.

VISAKHA LAW COLLEGE

Affiliated to A.U & Approved by Bar Council of India

Thagarapulavasa, Bheemili, Visakhapatnam

ADMISSION NOTICE

Candidates interested to join

LLB	LLB	LLM
5 years	3 years	2 years

Course in our law college for 2025-2026 are advised to contact college office.

5 years LLB Candidates who wish to change their options to our college from other law colleges may also contact.

Note: candidates with or without lawcet are eligible for admissions.

Principal: 7382478328, 8331888327

కార్తిక వనవిహారాల సందడి

తాటిపూడి(గంట్యాడ), న్యూస్‌టుడే: కార్తికమాసం మొదటి ఆదివారం సందర్భంగా తాటిపూడిలో వనవిహారాల సందడి నెలకొంది. జలాశయం గట్టు మరమ్మతుల కారణంగా పర్యాటకులు సమీప తోటల్లో గడిపారు. తర్వాత బోటుషికారుకు యువత పోటీపడ్డారు. సాయంత్రం 5.30 గంటల వరకు విహరించారు. అయిదురోజుల విరామం తర్వాత పునఃప్రారంభమైన బోటు షికారుకు మంచి స్పందన లభించిందని సూపర్‌వైజర్ కృష్ణ తెలిపారు.

చింతొద్దు.. చెంతకొస్తారు

- కుష్ఠు అనుమానితుల గుర్తింపునకు సర్వే

న్యూస్‌టుడే– రాజాం

జిల్లాలో కుష్ఠు అనుమానితులను గుర్తించేందుకు 1,790 బృందాలతో ఈనెల 17 నుంచి 30 వరకు ఇంటింటా సర్వే చేపట్టనున్నారు. అపోహలు, భయాలతో చాలామంది లక్షణాలున్నా బయటకు రావడంలేదని అధికారులు అనుమానిస్తున్నారు. కొన్నిప్రాంతాల్లో వీటిపై భయాందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో వయసుతో సంబంధం లేకుండా అందరినీ పరిశీలించాలని బృందాలను ఏర్పాటు చేశారు.

- కుష్ఠుపై సచివాలయ సిబ్బంది గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపడతారు. ● ఎస్‌హెచ్‌జీ సభ్యులు, విద్యార్థులు అందరికీ అవగాహన కల్పిస్తారు. ● లక్షణాలు గుర్తిస్తే జిల్లా కుష్ఠు నివారణ అధికారికి సమాచారం ఇవ్వాలి.

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, డీఎంహెచ్‌వో తదితరులు

జిల్లాలో కేసులు ఇలా..

సంవత్సరం	కేసులు
2020–21	156
2021–22	235
2022–23	317
2023–24	338
2025–26	142

(ఇంత వరకు)

ఆదరణ కరవు..

రోగులకు ఆదరణ కరవవుతోంది. రాజాం మండలం పొగిరిలో కుష్ఠునివారణ కేంద్రం ఉన్నా.. ఆలనాపాలనా లేదు. దాతల సాయంతో రోగులకు భోజనాలు పెట్టి నెట్టుకొస్తున్నారు. 1962లో దీన్ని డెన్మార్క్ దేశం సాయంతో 11 గదులతో నిర్మించారు. భవనంలో 73 శాతం గదులు పూర్తిగా శిథిలమయ్యాయి. సిబ్బంది సరిపడా లేరు.

అండగా ఉంటాం.. మైక్రో బ్యాక్టీరియా లెప్రే అనే సూక్ష్మ క్రిమి వల్ల వ్యాధి సోకుతుంది. చికిత్స పొందని బాధితుల నుంచి తుంపర్ల ద్వారా ఇతరులకు సోకుతుంది. చికిత్స కాలం 6 నుంచి 12 నెలలు. తొలి దశలోనే అప్రమత్తమైతే నయమవుతుంది. బాధితులను పూర్తిగా పర్యవేక్షిస్తున్నాం.

– కె.రాణి, కుష్ఠువ్యాధి నియంత్రణ విభాగం పర్యవేక్షణ అధికారిణి

ఇవీ అనుమానిత లక్షణాలు..

● చర్మంపై స్పర్శలేని మచ్చలు ● చల్లని, వేడి వస్తువులను గుర్తించలేకపోవడం ● అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం ● కనురెప్పలు, కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోవడం ● కాళ్లు, చేతుల తిమ్మిర్లు ● ముక్కుదిబ్బడ, ముక్కులో నుంచి రక్తం కారడం ● మందమైన, ఉబ్బెత్తుగా బత్తాయి తొక్కలా మెరిసే జిడ్డుగల చర్మం ● గడ్డలు, సున్నితత్వం కోల్పోవడం ● చెవులు, వీపు, మెడపై నొప్పి లేని బొడిపెలు ● చేతి, కాలి వేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం ● తెలియకుండానే చేతులు, కాళ్లలో బొబ్బలు రావడం ● కనురెప్పలు మూతపడకపోవడం.

రామతీర్థంలో తెప్పోత్సవం

నెల్లిమర్ల: రామతీర్థం దేవస్థానంలో ఆదివారం తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి విశేష పూజలు చేశారు. ఉత్సవమూర్తులను పల్లకీలో భాస్కర పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం చేశారు. ఈవో శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక భద్రత

రామనారాయణం ఆలయం వద్ద పోలీసుల బందోబస్తు

విజయనగరం రింగురోడ్డు, గ్రామీణం, న్యూస్‌టుడే: కార్తిక సోమవారం సందర్భంగా శైవ క్షేత్రాలకు భక్తులు పెద్దఎత్తున వెళ్లే అవకాశం ఉందని, ఈమేరకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పారిశుద్ధ్య పనులు, క్యూలైన్లు, రద్దీ నియంత్రణ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆదివారం రామనారాయణం ఆలయం వద్ద సీఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

- కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అర్జీదారులు 1100 కాల్‌సెంటర్‌ను సైతం సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.

మొరాయించిన స్పిల్‌వే గేటు

తాటిపూడి(గంట్యాడ), న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో తాటిపూడి జలాశయానికి వచ్చిన వరద నీటిని మూడు స్పిల్‌వే గేట్ల ద్వారా విడుదల చేసిన సంగతి తెలిసిందే. స్పిల్‌వేకు నాలుగు గేట్లు ఉండగా, మూడు గేట్ల నుంచే నీరు విడుదల చేశారు. ఈ గేట్లను మాన్యువల్, ఎలక్ట్రికల్ ఆపరేటింగ్ ద్వారా దించవచ్చు. అయితే, గేట్ల రోకర్ ఆరమ్‌లు, బాటమ్ నసీళ్లు వరదతాకిడికి దెబ్బతిని మొరాయించాయి. శని, ఆదివారాల్లో సిబ్బంది మాన్యువల్‌గా రెండు గేట్లు దించారని ఏఈ శంకర్ తెలిపారు. మూడో నంబర్ గేటు 2 ఇంచుల మేర కిందకు దిగకపోవడంతో సుమారు 200 క్యూసెక్కుల నీరు బయటకు పోతోందన్నారు. ప్రస్తుతం 1000 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు తెలిపారు.

(c) eenadu

పవిత్ర ప్రాంతం.. వ్యర్థాలకు నిలయం

శిథిల స్థితిలో దీపాల సన్నిధి

విజయనగరం నగరపాలక సంస్థ పరిధి లోని కొత్తపేట కుమ్మరవీధి సమీపంలో ఉన్న గ్రంధి కిత్తయ్య కోనేరు అధ్వానంగా దర్శనమిస్తోంది. నిర్వహణ లేకపోవడంతో వ్యర్థాలకు నిలయంగా మారింది. చుట్టూ ఆక్రమణలతో కనుమరుగవుతోంది. ఒక ప్పుడు ఇది ఆధ్యాత్మిక కేంద్రంగా ఉండేది. పరిసర ప్రాంతాల వారు స్నానాలకు ఈ నీటిని వినియోగించేవారు. మధ్యలో ఉన్న దీపాల సన్నిధి వద్దకు చేరుకుని పూజలు చేసేవారు. మధ్యలో నేల బావులు ఉండేవి. ఇవి పరిసర ప్రాంతాల్లోని చేతిపంపులు ఎండిపోకుండా కాపాడేవి. వైఎస్సార్ నగర్‌కు వెళ్లే దారి లోని శ్మశానవాటికకు వెళ్లేవారు ఇక్కడే స్నానపానాలు ఆచరించేవారు. రానురానూ పరిస్థితి మారి పోయింది. గట్టుపై సైతం కొందరు ఇళ్లు కట్టేశారు. కొన్ని నిర్మాణాలు ఇంకా కొనసాగుతున్నాయి. చుట్టూ ప్లాస్టిక్ పేరుకుపోతోంది. నీటి రంగు మారిపోయింది. తీవ్ర దుర్వాసన వస్తోంది. ఇటీవల గండి ఈ చెరువుకు పడడంతో పక్కనున్న ప్రధాన దారి మీదుగా నీరు పారుతోంది. అధికారులు స్పందించాలని బాగు చేయాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం రింగురోడ్డు

విజయనగరంలో వ్యర్థాలతో నిండిన గ్రంధి కిత్తయ్య కోనేరు

తవ్వకం ముగిసింది.. మృత్యువు కాసింది

గంట్యాడ మండలంలోని పెణసాం నుంచి కిర్తుబర్తి, గొడియాడ వెళ్లే మార్గాల్లో మృత్యువు పొంచి చూస్తోంది. ప్రధాన రహదారికి ఆనుకుని 30 నుంచి 40 అడుగుల లోతున క్వారీ గుంతలు న్నాయి. గతంలో ఇక్కడ తవ్వకాలు సాగాయి. కొన్నేళ్లుగా ఆగిపోయాయి. ప్రస్తుతం భారీ లోయల్లా కనిపిస్తున్నాయి. వర్షాల సమయంలో నిండా నీరు చేరి, పశువులు, మనుషుల ప్రాణాలు తీస్తున్నాయి. ఇక్కడ ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ముప్పు తప్పదు. గతంలో పెణసాం వద్ద ట్రాక్టర్ బోల్తా పడగా ఇద్దరు మరణించారు. గొడియాడ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి ఓ బస్సు పల్టీలు కొట్టింది. ఈ ఘటన జరిగిన కొన్ని రోజుల్లోనే మరో బస్సు బోల్తా పడింది. పక్కనే లోయ ఉండడం గమనార్హం. అప్పట్లో చోదకులు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. ఇటుగా నిత్యం 20 గ్రామాల వారు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. పరిశీలించి, చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ ఏఈ విక్రమ్ తెలిపారు.

– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

ప్రధాన రహదారి పక్కనే తవ్వకాలు ఇలా..

భద్రగిరి పీటీజీ బాలికల పాఠశాలలో మ్యాచ్ చూస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి తదితరులు

శివంగుల్లా కదిలారు.. శిఖరాన చేరారు

విజయనగరంలో..

భారత్, దక్షిణాఫ్రికా మధ్య ఆదివారం జరిగిన మహిళల క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి పీటీజీ బాలికల పాఠశాలలో విద్యార్థులతో కలిసి టీవీలో వీక్షించారు. భారత్ బ్యాటింగ్ చేసినప్పుడు ఫోర్లు, సిక్స్‌లు కొట్టిన సమయంలో ఆనందాన్ని పంచుకున్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు వస్తుందన్నారు. ప్రిన్సిపల్ సత్యవతి, తెదేపా మండల కన్వీనర్ నరేష్ పాల్గొన్నారు. ❖ క్రీడా శాఖ ఆధ్వర్యంలో విజయనగరంలోని రాజీవ్ మైదానంలో ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ❖ అశోక్ బంగ్లాలో తెదేపా ఆధ్వర్యంలో స్క్రీన్ ఏర్పాటైంది. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు వీక్షించారు. మ్యాచ్ గెలిచాక నగరంలో సంబరాలు జరిగాయి. – న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం, విజయనగరం క్రీడావిభాగం

భైరవ కొండపై బౌద్ధారామం

నీలావతి సమీపంలోని కొండపై బౌద్ధస్థూపం

రాతి మెట్ల దారి

గంట్యాడ మండలం నీలావతి గ్రామ సమీపంలోని భైరవ కొండపై ఉన్న బౌద్ధారామం ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. ఎత్తయిన కొండలపై 29 ఎకరాల విస్తీర్ణంలో బౌద్ధుల స్థూపాలు, దుర్గాభైరవుని ఏకశిలా విగ్రహం, పూజా ప్రాంతాలు కనిపిస్తాయి. ఇక్కడే రాములోరి పాదముద్రికలు, నిత్యం నీటితో కళకళలాడే 16 అడుగుల లోతున్న కొలను, పలు ఆకారాల్లో స్థూపాలు, రాతి మెట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కార్తికమాసంతో పాటు ఏటా మహా శివరాత్రి రోజున వేల మంది దర్శించుకుంటారు. వనభోజనాలు పెద్దఎత్తున జరుగుతుంటాయి. పురావస్తుశాఖ దీనిని పర్యవేక్షిస్తోంది. ఇప్పటికే పలు చోట్ల అభివృద్ధి పనులు చేపట్టింది. సంరక్షణకు ఓ కాపలాదారును నియమించింది. విజయనగరం జిల్లా కేంద్రం నుంచి నేరుగా 7 కిలోమీటర్ల దూరంలోని నరవ గ్రామానికి చేరుకుని, అక్కడి నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నీలావతి గ్రామానికి వెళ్లాలి. అక్కడి నుంచి ఆటోలు, ద్విచక్ర వాహనాల మీదుగా నేరుగా భైరవ శిఖరానికి చేరుకోవచ్చు.

– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

ప్రాంతం విజయనగరం పరిధి శ్రీకాకుళం

జీఆర్పీ స్టేషన్ పరిస్థితి ఇదీ..

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: విజయనగరం నడిబొడ్డున రైల్వే స్టేషన్ ఉంటుంది. సీఎంఆర్ కూడలి సమీపంలో పట్టాలు రెండు పాయలుగా విడిపోతాయి. ఎడమ వైపు పార్వతీపురం, కుడి వైపునకు వెళితే శ్రీకాకుళం చేరుకోవచ్చు. ఈ లైన్‌లో ఏ ప్రమాదం జరిగినా పొరుగు జిల్లా పోలీసులే వస్తుండడం గమనార్హం. దీంతో మృతదేహాల గుర్తింపు, బాధిత కుటుంబ సభ్యులకు అప్పగింత, కేసుల నమోదు, ట్రాన్స్‌ఫర్ తదితర అంశాల్లో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

139 నంబరుపై అవగాహన

విజయనగరం జీఆర్పీ పరిధి ఇలా..

లైన్	దూరం (కిలోమీటర్లలో)
విజయనగరం- కొత్తవలస	34
కొత్తవలస- గోరాపూర్	114
విజయనగరం- కూనేరు	100
బొబ్బిలి- సాలూరు	16

ఆ 264 కిలోమీటర్లే.. ఈస్టుకోస్టు పరిధిలోని విజయనగరం స్టేషన్ ముఖ్యమైన వాణిజ్య కేంద్రంగా గుర్తింపు పొందింది. దీనికి అనుబంధంగా ఉన్న కొత్తవలస, ఎస్.కోట, విజయనగరం, గజపతినగరం, చీపురుపల్లి, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం స్టేషన్లు కీలకమయ్యాయి. వీటితో పాటు ఒడిశా సరిహద్దులోని గోరాపూర్ వరకు విజయనగరం పరిధిలోకే వస్తుంది. ఈ లైన్ల మధ్య ఏం జరిగినా జీఆర్పీ స్టేషనే చూసుకుంటుంది. అయితే జిల్లా కేంద్రంలోని సీఎంఆర్ మాల్, వెంకటలక్ష్మి కూడలి దాటాక శ్రీకాకుళం జీఆర్పీ పరిధిలో ఉంది. ఏదైనా జరిగితే 69 కిలోమీటర్ల దూరం నుంచి అక్కడి పోలీసులు రావాల్సి వస్తోంది.

గుర్తు తెలియకపోతే అంతే..

ఉమ్మడి జిల్లా మీదుగా వెళ్లే రైళ్ల ద్వారా ఒడిశా, బిహార్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల వారు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు మరణిస్తే శ్రీకాకుళం పోలీసులు వచ్చే వరకు ఆగాల్సి వస్తోంది. ప్రమాదాలు జరిగినా అదే పరిస్థితి. గత అయిదేళ్లలో 108 మృతదేహాలకు రైల్వే పోలీసులే అంత్యక్రియలు నిర్వహించారు. మరో 274 మంది పట్టాలు దాటుతూ మరణించారు. ప్రమాదవశాత్తూ 117 మంది మృత్యువాత పడగా.. 30 మంది వరకు ఆత్మహత్యలు చేసుకున్నారు.

నేరాలకు అడ్డా..

అటు ఒడిశా, ఇటు విశాఖ మన్యానికి విజయనగరం మధ్యలో ఉండడంతో పెద్దఎత్తున గంజాయి సరఫరా సాగుతోంది. గత రెండేళ్లలో 388 కిలోలను స్వాధీనం చేసుకుని, 35 మందిని అరెస్టు చేశారు. 20 మంది చోరులను కూడా అదుపులోకి తీసుకున్నారు. అయితే కొందరు కేటుగాళ్లు జీఆర్పీ పరిధి దాటి ఎక్కుతూ స్థానిక అధికారుల కళ్లుగప్పుతున్నారు. విస్తీర్ణం పెద్దది కావడం వల్లే పరిధిని విడదీశారని, సమస్యలను గుర్తించి ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు ఓ అధికారి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. రైల్వే పరంగా ఎలాంటి సమస్య ఉన్నా 139ను సంప్రదించాలని కోరారు.

పుస్తకాలు చదివేలా.. చిత్రాలు గీసేలా!!

14 నుంచి గ్రంథాలయాల వారోత్సవాలు

కేంద్ర గ్రంథాలయంలో పుస్తకాలు

– న్యూస్‌టుడే, మయూరికూడలి

విద్యార్థులు, పాఠకుల్లో ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించేందుకు గ్రంథాలయాలు సిద్ధమవుతున్నాయి. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు 58వ వారోత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా విజయనగరంలోని కేంద్ర గ్రంథాలయంలో పాటు ఉమ్మడి జిల్లాలోని 41 శాఖల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. శాఖతో పాటు స్వచ్ఛంద సంస్థల సహకారంతో వారం రోజుల పాటు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

బోలెడు ఆటలు..

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 1 నుంచి పదో తరగతి విద్యార్థులకు జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో పాటలు, నృత్యం, వక్తృత్వ, క్విజ్, రచనలు, చిత్రలేఖనం, కథల పోటీలు, వివిధ రకాల ఆటలు నిర్వహిస్తారు. కంప్యూటర్ శిక్షణ, పుస్తక పఠనం ఉంటాయి. నమోదు లేకుండానే హాజరు కావొచ్చు. ముగింపు రోజున జ్ఞాపికలు, బహుమతులు, ప్రశంసాపత్రాలు అందిస్తామని కేంద్ర గ్రంథాలయం ఇన్‌ఛార్జి లక్ష్మి తెలిపారు.

కార్యక్రమాలు ఇలా..

తేదీ	అంశాలు
14న	బాలల దినోత్సవం విశిష్టత, ఉత్సవాలు ప్రారంభం
15	పుస్తక ప్రదర్శన, మత్తు పదార్థాల నివారణపై అవగాహన, పుస్తక పఠనం
16	గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేసిన వారి చరిత్ర
17	కవి సమ్మేళనం, కవులు, రచయితల పరిచయం
18	చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, ఇన్‌డోర్ క్రీడలు
19	దిశ చట్టంపై అవగాహన, మహిళాభివృద్ధిపై సదస్సులు
చివరి రోజు	డిజిటల్ గ్రంథాలయాలు, నచ్చిన పుస్తకం చదవడం, ముగింపు కార్యక్రమం

గుంత మారదు.. చింత తీరదు

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలకు పలుచోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. బీటీ దారులు సైతం పాడయ్యాయి. పైడితల్లి పండగ సందర్భంగా వేసిన ప్యాచ్ వర్కులు లేచిపోయాయి. ఇక్కడ నగర పాలక సంస్థ, ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్‌కు చెందిన దారులున్నాయి. అన్నింటిదీ ఇదే పరిస్థితి. ధర్మపురి నీళ్ల ట్యాంకు సమీపంలోని విల్లాల రోడ్డు అధ్వానంగా దర్శనమిస్తోంది. గజానికో గుంత ఏర్పడడంతో చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిశీలించి బాగు చేస్తామని కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

మిత్రమా.. కుశలమా..!

కొత్తవలస జడ్పీ ఉన్నత పాఠశాలలో 1980- 81లో పదో తరగతి చదువుకున్న వీరంతా ఆదివారం తుమ్మికాపల్లి సమీపంలో సమావేశమయ్యారు. చదువు అనంతరం వీరిలో చాలామంది ఉపాధి, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో చేరారు. దాదాపు 45 ఏళ్ల తర్వాత కలిసిన మిత్రులతో ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ.. ఆనందంగా గడిపారు. విద్య నేర్పిన ఉపాధ్యాయుల్ని ఆహ్వానించి సత్కరించాలని, పాఠశాలకు తమ వంతుగా సాయపడాలని నిర్ణయించినట్లు విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ఉద్యోగి, జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు గవర సూరిబాబు, పూర్వ విద్యార్థులు కాళేశ్వరరావు, సత్యనారాయణ తెలిపారు.

– న్యూస్‌టుడే, కొత్తవలస

తుమ్మికాపల్లిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

నేడు గుత్తేదారుల ధర్నా

విజయనగరం పట్టణం: గత రెండేళ్లలో పూర్తి చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నామని ది విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ప్రస్తుతం చేపడుతున్న పనులు ఆపేసి, సోమవారం ధర్నా చేయనున్నామన్నారు. ఇప్పటికే కమిషనరు పి.నల్లనయ్యకు నోటీసు అందజేసినట్లు అధ్యక్ష, కార్యదర్శులు బి.బంగారురాజు, ఆర్.రాజ్‌కుమార్, టి.సురేష్‌బాబు తెలిపారు.

నాగావళి ఉగ్ర రూపం..

మొంథా ప్రభావం, ఎగువున కురిసిన వర్షాలకు నాగావళి నది నిండుగా ప్రవహిస్తోంది. తీర గ్రామాల్లోని ప్రజలు స్నానాలకు వెళ్లొద్దని ఇప్పటికే అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. కార్తికమాసం నేపథ్యంలో పలు చోట్ల కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. పాలకొండ సమీపంలో ఆదివారం ఇలా ఉద్ధృతంగా ప్రవహిస్తూ కనిపించింది. – న్యూస్‌టుడే, పాలకొండ

బాధిత కుటుంబాలకు అండ

ప్రవీణ్ తల్లిదండ్రులకు నగదు ఇస్తున్న స్నేహితులు

సాలూరు, న్యూస్‌టుడే: సాలూరు పట్టణంలోని సారికవీధికి చెందిన బి.పార్థసారథి కుమారుడు ప్రవీణ్ లండన్‌లో ఉంటూ తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. రెండు కిడ్నీలు పాడయ్యాయని వైద్యులు పేర్కొన్నారు. దీంతో పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తూ వైద్య పరీక్షలు చేయించుకుంటున్నాడు. ఈక్రమంలో విషయం తెలుసుకున్న అతడి మిత్రులు స్పందించారు. రూ.1.50 లక్షలు సేకరించి ఆదివారం బాధిత కుటుంబానికి అందించారు. స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెదేపా నేత విక్రం మరణ, స్థానికుడు సారిక ఉదయ్ తెలిపారు.

పార్వతీపురం పురపాలక, పట్టణం, న్యూస్‌టుడే: పార్వతీపురం ఆర్టీసీ బస్టాండులో జరిగిన పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడిన కళాసీ రెడ్డి రమేష్‌కు తూర్పుకాపు సంక్షేమ సంఘం ఆర్థిక సాయం అందించింది. రాగాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సేకరించిన రూ.1.70 లక్షల నగదును ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మూడు నెలలకు సరిపడా సరకులు ఇచ్చారు. బి.సీతారాం, ఎం.కృష్ణమోహన్, ఎం.రాజా, కె.బాలకృష్ణ పాల్గొన్నారు.

EENADU e Classifieds

EDUCATION

HOME TUITIONS

8th క్లాస్ స్టూడెంట్‌కు అన్ని Subjects క్లాసు చెప్పుటకు విజయనగరం ఉడా కాలనీ నందు హోమ్ ట్యూటర్ (M/F) కావలెను. C: 7207307421.

REAL ESTATE

WANTED

Wanted 200-400 Sq.Y. Site development based Ayyanapeta, Kamakshi Nagar, Vizianagaram & Visakhapatnam ✆ 9052451919.

JOBS

గజపతినగరం శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేయుటకు మార్కెటింగ్ అనుభవం కలిగిన యువతి,యువకులు కావలెను. C:7659990665, 9492218996

Solar Companyలో పనిచేయుటకు M/F Accountant కావలెను. Tally Compulsary రావలెను. C: 9492731212, 9494703452.

E-KARTలో అర్జెంటుగా స్త్రీ/పు కావలెను. Q: Inter, Any డిగ్రీ, జీ: 15,000/-. Online are available. 9381912123, 7731816950.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

వారు కట్టరు.. వీరు ఆగరు

కొండగూడెం సమీపంలో ప్రమాదానికి గురైన ట్రాక్టరు

సంతకవిటి మండలం కొండగూడెం గ్రామ సమీపంలోని ఆర్అండ్‌బీ రహదారిలో సాయన్న గెడ్డపై ఉన్న వంతెన శిథిలమై నాలుగు నెలల కిందట కూలిపోయింది. అప్పటి నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. ఆదివారం ఓ వ్యక్తి ట్రాక్టర్ తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా.. ట్రక్కు బోల్తా పడింది. చోదకుడికి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. నాలుగునెలలైనా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని ఆర్అండ్‌బీ ఏఈ సతీష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా.. ప్రయాణాలు చేయొద్దని హెచ్చరిక బోర్డులు పెట్టినా పట్టించుకోకుండా వెళ్తున్నారన్నారు. కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సంతకవిటి

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

శివాజీ (పాతచిత్రం)

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కవిటి మండలం జగతి గ్రామ సమీపంలోని మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం పెదమానాపురానికి చెందిన జి.శివాజీ(25) భారత్ గ్యాస్ ఏజెన్సీలో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. రెండు రోజుల కిందట ఇద్దరు కార్మికులతో కలిసి కవిటిలోని వివిధ గ్రామాల్లో గ్యాస్‌లైన్ పైపు నాణ్యత, వాడే విధానాన్ని పరిశీలించాడు. శనివారం రాత్రి వేరే టెక్నీషియన్ వద్ద ద్విచక్రవాహనం తీసుకుని సోంపేట వెళ్తుండగా జగతి వద్ద అదుపుతప్పి కిందపడి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవివర్మ తెలిపారు.

బస్సు కింద పడి..

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గంట్యాడ మండలంలోని వసాది గ్రామ కూడలిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్న ప్రమాదంలో సీహెచ్.దాలినాయుడు(70) దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తవెలగాడకు చెందిన దాలినాయుడు కొన్నేళ్లుగా విశాఖపట్నంలో కుమారుడు వద్ద ఉంటున్నారు. పింఛను కోసం శనివారం స్వగ్రామానికి వచ్చారు. తిరిగి విశాఖపట్నం వెళ్లేందుకు ఆదివారం కోడలు ప్రియాంకతో వసాది- కె.వెలగాడ కూడలిలో బస్సు కోసం ఉన్నారు. విజయనగరం నుంచి ఎస్.కోట వెళ్తున్న బస్సు ప్రయాణికులతో రద్దీగా ఉండడంతో వేరే సర్వీసు ఎక్కేందుకు ముందుగా వెళ్తుండగా గమనించని ఆర్టీసీ చోదకుడు వాహనాన్ని ముందుకు పోనివ్వడంతో కిందపడి అక్కడికక్కడే మృతిచెందారు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

ఉపాధికి వచ్చి..

కొత్తవలస, న్యూస్‌టుడే: ఉపాధి కోసం వలసొచ్చిన యువకుడు బస్సు కింద పడి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ షణ్ముఖరావు వివరాల ప్రకారం.. అసోంకు చెందిన దీపక్ బౌమిక్(33) ఉపాధి కోసం కొత్తవలస వచ్చారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద విశాఖ వెళ్తున్న బస్సు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తూ జారిపడ్డాడు. వెనక చక్రం ఆయన పైనుంచి వెళ్లడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆధార్ కార్డు ఆధారంగా దీపక్‌ది అసోంగా గుర్తించారు. కుటుంబీకులకు సమాచారం ఇచ్చామని, వారు వచ్చిన తర్వాత కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

కొత్తవలస, న్యూస్‌టుడే: అప్పుల బాధ, అనారోగ్యం తాళలేక ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై జనార్దనరావు వివరాల మేరకు.. అడ్డూరువానిపాలెం రాయల్‌సిటీకి చెందిన యల్లపు హేమ సింహ రాఘవేంద్రరావు(35) కాంట్రాక్టు పనులు చేసేవారు. శనివారం మధ్యాహ్నం పంకాకు ఉరేసుకున్నారు. కుటుంబ సభ్యులు గమనించి, పెందుర్తి ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. అప్పుల బాధతో పాటు అనారోగ్యం కారణంగా ప్రాణాలు తీసుకున్నాడని ఆయన తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు సీఐ షణ్ముఖరావు తెలిపారు.

వెంకన్న ఆలయంలో చోరీ

సీతానగరం, న్యూస్‌టుడే: లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం ఆవరణలోని వెంకన్న ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆదివారం ఉదయం వెళ్లేసరికి తాళం పగులగొట్టి ఉండటంతో అర్చకులు పరిశీలించారు. రెండున్నర తులాల బంగారం, 5 కిలోల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. డీఎస్పీ రాంబాబు, సీఐ రంగనాథ్, ఎస్సై సింహాచలం చేరుకుని దర్యాప్తు నిర్వహించారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97609

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80081 11237

వేదికపై పుస్తకాలతో విద్యాధర్, బిక్కి కృష్ణ, గంటేడ గౌరునాయుడు, జీఎస్.చలం, జైపాల్‌రావు తదితరులు

'స్వేచ్ఛ నా సందేశం' పుస్తకావిష్కరణ

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: విజయనగరానికి చెందిన జీవీఎస్.జైపాల్‌రావు రచించిన 'స్వేచ్ఛ నా సందేశం' పుస్తకాన్ని ఆదివారం విజయనగరంలోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. విమల సాహితీ సంస్థ అధ్యక్షుడు విద్యాధర్, కవి, సినీ గీతాల రచయిత బిక్కి కృష్ణ, అరసం అధ్యక్షుడు జి.ఎస్.చలం, కార్యదర్శి రత్నాల బాలకృష్ణ, రచయిత గంటేడ గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాధర్ మాట్లాడుతూ.. గ్రామీణ, సామాజిక సమస్యలపై తనదైన శైలిలో రచనలు చేశారని కొనియాడారు. ప్రతిఒక్కరూ చదవాల్సిన పుస్తకమని చెప్పారు. సామాజిక స్పృహే రచయితల ప్రతిభకు కొలమానమన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	125	220	230

(c) eenadu

బొబ్బిలి

•బొబ్బిలి •రాజాం •గజపతినగరం •చీపురుపల్లి

వాహనాలు కూరుకుపోతున్నాయ్

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలి మండలం కారాడ వద్ద వర్షాలకు రహదారి గోతులమయమైంది. పారాది వద్ద కాజ్‌వే మునగడంతో శ్రీకాకుళం, రాజాం, తెర్లాం తదితర ప్రాంతాల వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. లారీలు గోతుల్లో కూరుకుపోతున్నాయి. ఆదివారం కారాడ వద్ద భారీ వాహనంలోని విద్యుత్తు తీగల కట్టలు పడిపోయాయి. ట్రాఫిక్ నిలిచిపోయింది. మరోవైపు రహదారి పనులు జరిగేవిధి ప్రారంభమవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమస్యలు లేకుండా ఏర్పాట్లు చేస్తామని ఏఈ రాజు తెలిపారు.

రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో ఆదివారం కూరగాయల ధరలు (కిలో రూ.లలో) ★ టమాటా: 45 ★ వంకాయలు: 50 ★ దొండ: 40 ★ బీర: 54 ★ బెండ: 50 ★ కాకర: 40 ★ చిక్కుడు: 35 ★ ఆనపకాయ (ఒకటి): 25 ★ అరటి (జత): 20 ★ మునగ: 70 ★ ఉల్లి: 30 ★ బంగాళదుంప: 30 ★ అల్లం: 55 - 80 ★ వెల్లుల్లి: 80 ★ పచ్చిమిర్చి: 60 ★ క్యాబేజీ: 40 - న్యూస్‌టుడే, రాజాం

తెరపై ఈనాడు

★ ఎస్‌వీసీ సీతారామా: మాస్ జాతర ★ ఎస్‌వీసీ సీతారామ మినీ: కె-ర్యాంప్ ★ ఎస్‌వీసీ అప్సర: బాహుబలి ది ఎపిక్ - న్యూస్‌టుడే, రాజాం

బొబ్బిలి.. ★ లక్ష్మి: బైసన్ ★ వాసవి: మాస్ జాతర ★ టీబీఆర్ స్క్రీన్-1: బాహుబలి ది ఎపిక్ ★ టీబీఆర్ స్క్రీన్-2: కె-ర్యాంప్ - న్యూస్‌టుడే, బొబ్బిలి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి - 80085 74348

? గింజేరు మండల పరిషత్తు పాఠశాల చుట్టూ పొదలు పెరిగాయి. - స్థానికులు ● సమస్య పరిష్కరిస్తాం. - ఎంఈవో విలకొలరావు, ఎంఈవో-2 - గంట్యాడ గ్రామీణం

? రాజాం పట్టణంలోని మల్లికార్జున కాలనీలో ప్రధాన మురుగునీటి కాలువ పూడికలతో నిండిపోయింది. మురుగునీరు రహదారిపైకి పోతుంది. - స్థానికులు ● కాలువను శుభ్రం చేయిస్తాం. - ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ - న్యూస్‌టుడే, రాజాం

4న మెగా నేత్ర వైద్య శిబిరం

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి ప్రాంతీయ ఆసుపత్రి ప్రాంగణంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో ఈనెల 4న మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మానవీయత సంస్థ వ్యవస్థాపకుడు బీవీ గోవిందరాజులు తెలిపారు. విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు రోగులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రహరీలు లేవు.. రక్షణ కరవు

న్యూస్‌టుడే- సంతకవిటి, వంగర, రాజాం పట్టణం

గత ప్రభుత్వం బడులను పూర్తిగా నాశనం చేసింది. అనాలోచిత నిర్ణయాలతో పాఠశాలల్లో చేరికలు, హాజరు తగ్గేలా చేశారు. కూటమి ప్రభుత్వం గాడిన పెట్టే చర్యలు ప్రారంభించినప్పటికీ పలు సమస్యలు తీవ్రంగా వేధిస్తున్నాయి. ప్రధానంగా పాఠశాలలకు రక్షణ గోడలు లేక అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఆవరణల్లోనే మద్యం తాగి, సీసాలను మైదానాల్లో పగులగొడుతున్నారని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిసరాలను నాశనం చేస్తున్నారని వాపోతున్నారు. రాజాం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 264 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 16,121 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 140 పాఠశాలలకు రక్షణ గోడలు లేవు.

మండలం	పాఠశాలలు	ప్రహరీ లేనివి
సంతకవిటి	74	39
రేగిడి	81	40
రాజాం	58	36
వంగర	51	25

ప్రహరీ లేని వంగర మండలం తలగాం ప్రాథమిక పాఠశాల

■ వంగర మండలం తలగాం ప్రాథమిక పాఠశాలలో రూ. 16 లక్షల నాడు- నేడు నిధులతో కొత్తగా భవనాలు నిర్మించారు. రక్షణ గోడ మాత్రం ఏర్పాటు చేయలేదు. ఆవరణ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతోంది. రోజూ ఉదయం వచ్చేసరికి మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయని ఉపాధ్యాయులు వాపోతున్నారు. గ్రామ పెద్దలు, మండల అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఉపయోగంలేకుండా పోయిందని చెబుతున్నారు. ఎంఎస్ఆర్ పురం, కొప్పర ఉన్నత, బంగారువలస ప్రాథమిక పాఠశాలల్లో ఇదే పరిస్థితి.

■ సంతకవిటి ఉన్నత పాఠశాలలో 20 ఏళ్ల కిందట నిర్మించిన రక్షణ గోడ శిథిలమైంది. ఇక్కడే జూనియర్ కళాశాల ఉంది. రక్షణ గోడ, గేటు లేవు. బస్టాండ్ సమీపంలోనే ఉండటంతో ఆకతాయిలు ఇక్కడే ఉంటున్నారు. పాఠశాల ఆవరణలోనే ఆటోలు పెడుతుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు చెబుతున్నారు. పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా.. కొద్దిరోజులు సమస్య తప్పిందని, మళ్లీ అదే పరిస్థితి నెలకొంటోందని వాపోతున్నారు.

■ రాజాం పురపాలిక పరిధి కొండంపేట ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ లేకపోవడంతో కుక్కలు, పందులు, పశువులు లోపలికి వచ్చేస్తున్నాయి. వర్షం పడితే నీరు గదుల్లోకి చేరుతోంది.

"చర్యలు తీసుకుంటాం..: ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. రక్షణ గోడలు లేని బడుల్లో ఉపాధిహామీ నిధులతో ప్రహరీలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. - రామారావు, సమగ్ర శిక్షా ఏపీసీ, విజయనగరం"

అ'పూర్వ' కలయిక

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కొత్తవలస వద్ద మామిడితోటలో వనభోజనాలు నిర్వహించారు. కుటుంబాలతో కలిసి రోజంతా ఆనందంగా గడిపారు. 'ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్' పేరుతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రూ. 4 లక్షలతో పాఠశాలలో నిర్మించిన మైక్‌షెడ్‌ను పరిశీలించారు. ఈ ఏడాది చేయనున్న సేవా కార్యక్రమాలను అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొత్తా సాయి ప్రశాంత్‌కుమార్, బీవీ అచ్యుత్‌కుమార్ వివరించారు. గౌరవాధ్యక్షుడు పీఎల్ఎన్ రాజు, రాజాం రోటరీ అధ్యక్షుడు గట్టి సాపారావు, డిప్యూటీ ఎంపీడీవో వానిలపల్లి శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, మురళీకృష్ణ, భాను, జ్యోతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో భద్రత పరిశీలన

తెర్లాం, న్యూస్‌టుడే: ఎస్పీ ఆదేశాలతో ఆదివారం తెర్లాం మండలంలోని కూనాయవలస, కొరటాం, ఎం.ఆర్.అగ్రహారం, ఆమిటి, చినపాలవలస తదితర గ్రామాల్లోని శివాలయాలను ఎస్సై బి.సాగర్‌బాబు, సిబ్బంది పరిశీలించారు. భద్రత, భక్తులకు కల్పించే సదుపాయాలపై ఆరా తీశారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఏఎస్సై బాస్కరరావు ఉన్నారు. ★ వైకేపల్లి (గంట్యాడ): మండలంలో జగ్గన్నగా వైకుంఠగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు. గంట్యాడ, తాటిపూడి, గింజేరు, పెదవేమలి, సిరిపురం, నీలావతి ఆలయాల్లో కార్తిక సోమవారాలు, పౌర్ణమి రోజుల్లో బందోబస్తు నిర్వహిస్తామన్నారు.

పట్టణం.. సమస్యలతో సతమతం

రాజాం పట్టణంలో మౌలిక వసతుల లేమి వెంటాడుతోంది. కాలువలు, రహదారుల నిర్మాణం చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. బిల్లులు సకాలంలో మంజూరు కావడంలేదని గుత్తేదారులు వెనుకంజ వేస్తున్నారు. వాసవీనగర్, ప్రశాంతినగర్, ఈశ్వరనారాయణ కాలనీ, బాబానగర్, గాంధీనగర్, అమ్మవారికాలనీ, విద్యా, వరలక్ష్మీనగర్ ప్రాంతాల్లో ఇబ్బందులు నెలకొన్నాయి. నిధుల వెసులుబాటును బట్టి పనులు చేపడతామని కమిషనర్ కె.శ్రీనివాసరావు చెప్పారు.- న్యూస్‌టుడే, రాజాం

తవ్వారు.. వదిలేశారు..!

రాజాం మండలంలోని బొద్దాం ఉన్నత పాఠశాల ఆవరణలో రక్షిత మంచి నీటి పథకం పైపులైన్ల మరమ్మతుల కోసం తవ్విన గుంతను అలానే వదిలేశారు. సుమారు పది రోజులవుతున్నా పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారింది. విద్యార్థులు ఆటలు ఆడే సమయంలో పడిపోయే అవకాశముందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం ఉన్నతాధికారులకు తెలియజేశామని హెచ్ఎం గురుమూర్తి చెప్పారు. - న్యూస్‌టుడే, రాజాం గ్రామీణం

గజానికో గుంత.. అతుకుల బొంత

రామభద్రపురం నుంచి బాడంగి, బొబ్బిలి వెళ్లే రహదారి మధ్యలో గజానికో గుంత ఏర్పడి అధ్వానంగా మారింది. సుమారు 15 కిలోమీటర్ల మేర పాడైపోయింది. బోల్తాపడుతున్నామని చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రూ. 4.5 కోట్లు మంజూరు చేసి నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించలేదు. పనులు మొదలుపెట్టడానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. - న్యూస్‌టుడే, రామభద్రపురం

కాజ్‌వే నిర్మించక కష్టాలు

చీపురుపల్లి మండలం ఆర్ధివలస- పీఎస్ లక్ష్మీపురం ప్రధాన దారిలో ఆర్ధివలసకు అనుకుని గెడ్డపై కాజ్‌వే నిర్మించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కంకర దారితో పాటు కాజ్‌వే నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. గుత్తేదారు పనులు చేయకుండా వదిలేశారు. విషయం జేఈఈ పి.చంద్రశేఖర్ వద్ద ప్రస్తావించగా.. క్షేత్రస్థాయిలో పరిశీలించి, వివరాలు తెలుసుకుని, చర్యలు తీసుకుంటామన్నారు.
- న్యూస్‌టుడే, చీపురుపల్లి గ్రామీణం

శిథిల భవనాలతో చింత..!

బొండపల్లి మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. వ్యవసాయ కార్యాలయం పూర్తిగా శిథిలమవడంతో బొండపల్లి రైతు సేవా కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్నారు. పాత ఖజానా, ఉపాధి కార్యాలయాలు పాడయ్యాయి. సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. విషయం ఎంపీడీవో గిరిబాల వద్ద ప్రస్తావించగా.. నిధులు మంజూరుకాగానే మరమ్మతులు చేపట్టి, వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. - న్యూస్‌టుడే, బొండపల్లి

స్పందనకు వందనం

విద్యుత్తు లైన్లకు మరమ్మతులు

సంతకవిటి, న్యూస్‌టుడే: తుపాను గాలులకు సంతకవిటి మండలం సిరిపురం తాగునీటి పథకానికి సంబంధించిన విద్యుత్తు స్తంభాలు, నియంత్రిక లైన్లు పాడైపోయాయి. ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీనిపై 'ఈనాడు'లో వార్త ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. ఏఈ వై.వినయ్‌కుమార్, సిబ్బంది మరమ్మతులు చేపట్టారు.

ప్రధాన దారిలో ప్రమాదం తప్పింది

సంతకవిటి, న్యూస్‌టుడే: సిరిపురం సమీపంలో రెల్లిగెడ్డ ప్రవాహానికి రహదారి కోతకు గురై ప్రమాదకరంగా తయారైంది. సంతకవిటి- పొందూరు మండలాలను కలిపే రహదారి కావడంతో ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. దీనిపై ఈనెల 1న వార్త ప్రచురితమవడంతో ర.భ.శాఖ అధికారులు స్పందించారు. కోతకు గురైన రహదారికి మరమ్మతులు చేపట్టారు.

గుంత పూడ్చారు

వంగర, న్యూస్‌టుడే: ఎం.సీతారాంపురంలో తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైపులైను లీకవడంతో మరమ్మతుల కోసం తవ్వి, గుంతను వదిలేశారు. ప్రమాదాలు జరిగే అవకాశముందని చోదకులు భయాందోళన చెందారు. దీనిపై గతనెల 27న వార్త ప్రచురితమైంది. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చిన్నయ్య స్పందించారు. గుంతను కప్పించారు.

పనికిరాని మొక్కల తొలగింపు

రాజాం పట్టణం న్యూస్‌టుడే: రాజాం పట్టణం పరిధిలోని సారధి గ్రామానికి వెళ్లే దారిలో మానసిక దివ్యాంగుల పాఠశాల వద్ద విద్యుత్తు స్తంభానికి పనికిరాని మొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా మారింది. దీనిపై ఈనెల 2న వార్త ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. మొక్కలు తొలగించారు.

ఆక్రమణలు.. పట్టించుకోని అధికారులు

న్యూస్‌టుడే- బొబ్బిలి

బొబ్బిలి పట్టణంలోని మార్కెట్‌లో రహదారుల మధ్యలో వ్యాపారాలు సాగిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాలువ నుంచి రెండు మీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణకు పాల్పడుతున్నారు. మార్గం కుచించుకుపోయి నడవడానికి కూడా వీలుకాని పరిస్థితి. ట్రాఫిక్ వ్యవస్థ కూడా అస్తవ్యస్తంగా ఉంది. కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగిస్తే కొంతవరకు ఇబ్బందులు తప్పుతాయి. చినబజారు, సీతయ్యమ్మ కూరగాయల మార్కెట్, తాండ్రపాపారాయ- మేదరబంద రహదారులపై నడవడం సాహసంగా మారుతోంది.

కూడలిలో ఇక్కట్లు..

పట్టణంలోని గొల్లవీధి కూడలి నుంచి అప్పయ్యపేటకు వెళ్లే మార్గంలో ఇరువైపులా దుకాణాలు వెలిశాయి. కాలువలపై నిర్మాణాలు చేపట్టి రహదారికి దగ్గరగా వచ్చేయడంతో బస్సులు తిరగడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాల్తేరు, వాడాడ తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులు తిరగకలేకపోతున్నాయి. ఇరువైపులా ఆటోలు నిలపడం మరో పెద్ద సమస్య. పదే పదే కౌన్సిల్ సమావేశాల్లో ఆక్రమణలు తొలగించాలని కౌన్సిలర్లు విన్నవించుకుంటున్నా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా.. ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని పురపాలిక కమిషనర్ రామలక్ష్మి తెలిపారు.

గొల్లవీధి కూడలిలో బస్సు తిప్పేందుకు అవస్థలు

ప్రమాదం జరగకముందే పట్టించుకోండి

తెర్లాం, న్యూస్‌టుడే: తెర్లా మండలం పణుకువలస ఎత్తు కాజ్‌వేపై రహదారి బీటలతో కుంగిపోతున్నట్లు కనిపిస్తుండడంతో చోదకులు భయపడుతున్నారు. ఇది చిలకపాలేం- రాజాం - రామభద్రపురం ప్రధాన రహదారి. రోజూ వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గతంలో లారీలు ఢీకొని రక్షణగోడ రెండువైపులా బాగా దెబ్బతింది. కొద్ది రోజులుగా రహదారి బీటలువారుతోంది. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి, ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విషయం తమ దృష్టికి వచ్చిందని, రూ. 2.50 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపించామని ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారి అప్పలరాజు తెలిపారు.

ఇనాం భూముల సమస్యకు పరిష్కారం

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి మండలం నీలాద్రిపురంలో సుమారు వందేళ్లుగా ఉన్న ఇనాం భూముల సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. ఎమ్మెల్యే కళా వెంకటరావు చొరవతో రెవెన్యూ అధికారులు ఇనాం భూములను చట్టప్రకారం సెటిల్మెంట్ చేశారు. గ్రామంలో సుమారు 204 ఎకరాల భూములు కొన్నేళ్లుగా రైతుల సాగులో ఉన్నా.. ఎలాంటి హక్కులు లేక ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే ఆదేశాలతో తహసీల్దారు బంగారాజు సెటిల్మెంట్ చేశారు. ఇనాందారులు ఎన్.రాజగోపాలరావు, ఎస్.నర్సమాంబకు చట్టప్రకారం దాదాపు 66 ఎకరాలు కేటాయించారు. మిగతాది సాగుదారులకు ఇచ్చారు. ఇనాందారులకు కేటాయించిన భూములను సాగుదారులైన రైతులు ఎకరా రూ. 2 లక్షలు చొప్పున కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదిరింది. ఇందుకు అడ్వాన్స్ వారికి అందజేశారు. తెదేపా నేతలు పి.బలరాం, ఎస్.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఇచ్చిన నగదు ఇనాందారులకు అందజేస్తున్న తహసీల్దారు

8న మహాజన సభ

చీపురుపల్లి, న్యూస్‌టుడే: విజయనగరంలో ఈనెల 8న జరిగే పొరుగు సేవల ఉద్యోగుల జిల్లా మహాజన సభను విజయవంతం చేయాలని చీపురుపల్లి డివిజన్ అధ్యక్షుడు మీసాల లక్ష్మణరావు కోరారు. సంబంధిత గోడప్రతులను ఆదివారం చీపురుపల్లిలో ఆవిష్కరించారు. పొరుగు సేవల ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం, హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి రౌతు కనకరాజు, సభ్యులు రామకృష్ణ, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాగుణంతో మెలగాలి

విద్యార్థులకు సూచనలిస్తున్న అధికారులు

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు సేవా కార్యక్రమాలను అలవర్చుకుంటే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని వక్తలు అన్నారు. విజయనగరం మండలం అయ్యన్నపేట ఎస్‌కే డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో గంట్యాడ మండలంలోని కరకవలసలో ఎన్ఎస్ఎస్ శిబిరం ఏర్పాటు చేశారు. ముగింపు కార్యక్రమంలో సామాజిక కార్యకర్త అబ్దుల్ రవూఫ్ మాట్లాడారు. రోజుకో కార్యక్రమంతో ప్రజలకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు రామభద్రరాజు, సమన్వయకర్త సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఈత పోటీలకు ఎంపిక

సంతకవిటి, న్యూస్‌టుడే: సంతకవిటి మండలం మండవకురిటి ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఏ.సాయిభార్గవి, పి.నాని రాష్ట్రస్థాయి ఈత పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎం.రమణమ్మ, వ్యాయామ ఉపాధ్యాయుడు సుదర్శనరావు ఆదివారం తెలిపారు. ఈనెల 3 నుంచి 5 వరకు గుంటూరు జిల్లా పల్నాడులో రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలిలో కారుణ్య ఫౌండేషన్ కార్యాలయంలో ఆదివారం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఛైర్మన్‌గా జేసీ రాజు, ఉపాధ్యక్షుడిగా నాగురు రమేష్, కార్యదర్శిగా సీహెచ్ ప్రవీణ్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా కె.రామకృష్ణ, కోశాధికారిగా చిన్నారావు, లీడ్ ఆర్గనైజర్‌గా డేవిడ్ జే విక్టర్, ట్రస్టీలుగా మెర్సీభాయి, పి.వి.విమల కుమారిని ఎన్నుకున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

బొబ్బిలి, న్యూస్‌టుడే: వరి, మొక్కజొన్న, చెరకు, అపరాలు, పత్తి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘ నాయకులు డిమాండు చేశారు. ఆదివారం బొబ్బిలిలోని సిటు కార్యాలయంలో పలు గ్రామాల రైతులతో సమావేశమయ్యారు. 9న జరగనున్న జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు గోపాలం కోరారు. ● మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బడే త్రినాథ్, కార్యదర్శిగా యు.ప్రసాద్, కోశాధికారిగా ఆర్.శ్రీను, ఉపాధ్యక్షులుగా రెడ్డి త్రినాథ, లక్ష్మణరావు, సభ్యులు ఎన్నికయ్యారు.

ద్విచక్రవాహనం బోల్తా: ఇద్దరికి గాయాలు

రామభద్రపురం: ద్విచక్రవాహనం బోల్తాపడి ఇద్దరు గాయపడిన ఘటన రామభద్రపురంలో చోటుచేసుకుంది. ఏఎస్సై అప్పారావు వివరాల ప్రకారం.. మెంటాడ మండలం పోరాం గ్రామానికి చెందిన మాదేవు కన్నంనాయుడు, బాడంగి మండలం పూడివలస గ్రామానికి చెందిన బోని గౌరమ్మ ద్విచక్రవాహనంపై ఆదివారం పూడివలస వెళ్తుండగా రామభద్రపురంలో ప్రధాన రహదారి గోతిలో ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. బాడంగి సీహెచ్‌సీకి, అక్కడ నుంచి విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో మహిళకు..

తెర్లాం: జగన్నాథవలస గ్రామానికి చెందిన బొత్స అరుణ ఆదివారం తన ఇంటి ముందు పాత్రలు శుభ్రం చేస్తుండగా.. వీధి కుక్కలు దాడిచేశాయి. ఈ ఘటనలో ఆమె చెయ్యి, కాలుపై తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రాజాం ఆసుపత్రికి తరలించారు.

బ్లేడుతో కోసుకున్న మాజీ జవాన్

రాజాం: రాజాం పట్టణంలోని గాయత్రీ కాలనీకి చెందిన మాజీ సీఆర్‌పీఎఫ్ జవాన్ శ్రీనివాస్ బ్లేడుతో శరీరంపై కోసుకుని గాయపర్చుకున్నాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా ఘటన జరిగినట్లు సమాచారం. ఎలాంటి ఫిర్యాదు అందలేదని రాజాం పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో యువకుడి హల్‌చల్

రాజాం: రాజాం పట్టణంలో సీతారామా థియేటర్‌లో సినిమా చూసేందుకు వచ్చిన ఓ యువకుడు శనివారం రాత్రి హల్‌చల్ చేశాడు. మరుగుదొడ్ల వైపు ఉన్న అద్దాన్ని చేతితో పగలగొట్టాడు. సిబ్బంది ప్రశ్నించగా.. యువకుడితో పాటు స్నేహితులు ఎదురు తిరగడంతో పోలీసులకు సమాచారం అందించారు. యాజమాన్యం విన్నపం మేరకు మందలించి వదిలేశారు.

ఆలయాల హుండీల చోరీ

వంగర: వంగర మండలం కొప్పరవలస, కొత్తవలస శివాలయాల్లో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హుండీలను పగులగొట్టారు. వాటిలోని నగదు చోరీ చేశారు. ఎటువంటి ఫిర్యాదు అందలేదని వంగర పోలీసులు తెలిపారు. నిత్యం ఆలయాల్లోని హుండీలు చోరీలకు గురవుతున్నా.. ఎటువంటి చర్యలు ఉండడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు.

మాక్ అసెంబ్లీకి ఎంపిక

బాడంగి: రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్రస్థాయిలో జరిగే మాక్ అసెంబ్లీలో పాల్గొనేందుకు బాడంగి ఉన్నత పాఠశాల విద్యార్థిని కోమలికి అవకాశం దక్కింది. 26న జరిగే సమావేశాల్లో నియోజకవర్గం తరఫున పాల్గొనుందని ఉపాధ్యాయులు తెలిపారు.

కాశీబుగ్గ ఘటన బాధాకరం

చీపురుపల్లి, గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాట జరిగి, దేవుడి దర్శనం కోసం వచ్చిన భక్తులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఎమ్మెల్యే కళా వెంకటరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. భక్తులు మృతి చెందగానే వైకాపా నేతలు శవరాజకీయాలకు తెరలేపారన్నారు. ఆలయ కమిటీ సభ్యులు రక్షణ కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసి, ప్రభుత్వం పట్టించుకోకపోతే నిందించవచ్చని, అదేదీ లేకుండా ఇష్టానుసారంగా మాట్లాడడం సరికాదన్నారు. ● రాజాం: ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ రాజాంలో మాట్లాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

రూ.18 లక్షలతో అభివృద్ధి పనులు

చీపురుపల్లి గ్రామీణం: చీపురుపల్లి మండలం రామలింగాపురం ఎస్సీ కాలనీలో జడ్పీ నిధులు రూ. 10 లక్షలు, మండల పరిషత్తు నిధులు రూ. 8 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ తెలిపారు. ఆదివారం సీసీ రహదారి, కాలువ నిర్మాణ పనులు ప్రారంభించారు. నాయకులు ఇప్పిలి అనంతం, వి.శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్తికమాస పూజలు

గంట్యాడ గ్రామీణం: కార్తికమాసం సందర్భంగా ఆదివారం రామవరంలో అష్టలక్ష్మీ పూజలు చేశారు. ● వంగర: వంగర మండలం రాజులగుమ్మడలో సత్యనారాయణస్వామి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

సచివాలయానికి దారేది?

రాజాం పట్టణంలోని సత్యనారాయణపురం సచివాలయం పాత బస్టాండ్ ఆవరణలో ఉంది. అక్కడకు వెళ్లేందుకు దారి లేదు. చుట్టూ ఆటోలను నిలిపేస్తున్నారు. ఆవరణంతా బురద, చెత్తతో నిండిపోయింది. కుళ్లిన కూరగాయలు, పశువుల వ్యర్థాలతో దుర్గంధం నెలకొంటోంది. పనులపై వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పురపాలిక కమిషనర్ కె.శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. వెంటనే పారిశుద్ధ్య సిబ్బందిని పంపుతామని చెప్పారు. - న్యూస్‌టుడే, రాజాం

ఆంక్షలతో దేశానికి నష్టం

బొబ్బిలి, న్యూస్‌టుడే: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆంక్షలతో దేశానికి తీవ్ర నష్టం కలుగుతుందని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి అన్నారు. ఆదివారం బొబ్బిలిలోని ఇందిరాగాంధీ డిగ్రీ కళాశాలలో గురజాడ అధ్యయన వేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. అమెరికా నుంచి దిగుమతయ్యే ఉత్పత్తులపై పన్నులు వేయకపోవడంతో నష్టం జరుగుతుందన్నారు. నాయకులు వై.స్వామినాయుడు, వి.ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర నాయకురాలు విజయగౌరి

గణిత ప్రతిభా పరీక్షలో సత్తా

వంగర, న్యూస్‌టుడే: వంగర మండలం అరసాడ ఉన్నత పాఠశాలలో ఆదివారం మండలస్థాయి సిక్కోలు గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. మండలంలోని పలు పాఠశాలల నుంచి 125 మంది విద్యార్థులు హాజరయ్యారు. అరసాడ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి ఎల్.లోకేశ్, బాగెమ్మపేట విద్యార్థి భార్గవనాయుడు ప్రతిభ చాటారు. జిల్లాస్థాయి పోటీలకు హాజరవుతారన్నారు. ● సంతకవిటి: సంతకవిటి ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు మండలస్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. 150 మంది హాజరయ్యారు. ఏడుగురిని జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్లు గణిత ఉపాధ్యాయులు పి.కిషోర్‌కుమార్, కె.కృష్ణంరాజు తెలిపారు.

జనావాసాల మధ్యనే మురుగు

రాజాం పట్టణంలోని పాతబస్టాండ్ వెనుక కాలనీలో ఖాళీ స్థలాలు మురుగు కూపంలా మారుతున్నాయి. నివాసాల మధ్యలోనే ఖాళీ స్థలాలు లోతట్టుగా వదిలేయడంతో ఈ దుస్థితి నెలకొంటోందని స్థానికులు వాపోతున్నారు. దుర్వాసన, దోమల బెడద భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో పలు విద్యాసంస్థలు, ఆసుపత్రులు ఉండడంతో అక్కడికి వచ్చేవారంతా ఇబ్బంది పడుతున్నారు. విషయం పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. చర్యలు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, రాజాం పట్టణం

(c) eenadu

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

ఆనంద రాగం.. స్నేహ గీతం

ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: మండలంలోని రెల్లి గౌరమ్మపేట ప్రాథమికోన్నత పాఠశాలలో 2016-17 పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం అదే చోట కలిశారు. గత స్మృతులు గుర్తు చేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం చదువు చెప్పిన గురువులను సత్కరించారు.

కేసులు నమోదు చేయాలి

విజయనగరం పట్టణం: అక్రమంగా కబేళాలు నిర్వహిస్తూ, పశువులను చంపుతున్న వారిపై కేసులు నమోదు చేసి, రౌడీ షీట్లు తెరవాలని గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని కార్యాలయంలో మాట్లాడారు. నగరంలో పెద్దఎత్తున వధ జరుగుతున్నా చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. సత్యనారాయణ, శాంతి, నీలాపుదేవి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల నిమజ్జనోత్సవం

కొత్తవలస, న్యూస్‌టుడే: గత కొద్ది రోజులుగా వీరభద్రపురంలో నిర్వహిస్తున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు శనివారం రాత్రి ముగిశాయి. ఉత్సవ విగ్రహాన్ని మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించి నిమజ్జనం చేశారు.

గురజాడ గృహ సందర్శన

విజయనగరంలోని మహాకవి గురజాడ వెంకట అప్పారావు స్వగృహాన్ని ఆదివారం పలు ప్రాంతాలకు చెందిన కవులు, రచయితలు, సాహితీవేత్తలు సందర్శించారు. కవి, విమర్శకుడు, భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ ఛైర్మన్ డా. బిక్కి కృష్ణ, తెలుగు ఆచార్యుడు డా. సుంకర గోపాలయ్య, ప్రముఖ భౌతికశాస్త్ర అధ్యాపకుడు జి. వి. ఎస్. జయపాల రావు తదితరులున్నారు. గురజాడ జీవిత చరిత్రను ఆయన వారసురాలు ఇందిర తెలియజేశారు.

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారులకు అభినందన

విజయనగరం అర్బన్, రింగురోడ్డు, నెల్లిమర్ల, న్యూస్‌టుడే: విశాఖ ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ కళాశాలల రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు 5 బంగారు, 3 రజత పతకాలు సాధించారు. ఎస్. పల్లవి, టి. లావణ్య, జి. శ్రావణి, ఎ. యశ్వశ్రీ, ఆర్. రాంబాబు, ఎ. లిఖిత, జి. కిరణ్‌కుమార్, వి. అఖిల్‌తో పాటు శిక్షకుడు చల్లా రామును ఆదివారం విజయనగరంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, పోలిపల్లిలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు అభినందించారు. తెదేపా విశాఖ ఉత్తర పరిశీలకుడు రవిశేఖర్, సత్యనారాయణ ఉన్నారు.

ఓం.. నమః శివాయ

బొద్దాం రామాలయం ఆవరణలో శనివారం రాత్రి సహస్ర దీపాలంకరణ చేపట్టారు. ఉమా బ్రహ్మలింగేశ్వర ఆలయంలో శివ పార్వతుల కల్యాణం జరిపించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విశేష పూజలు చేశారు. – న్యూస్‌టుడే, వేపాడ

కాశీబుగ్గ ఘటన దురదృష్టకరం

మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు

భోగాపురం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. ఆదివారం పోలిపల్లిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి సహాయక చర్యలు, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేసిందన్నారు. వైకాపా నాయకులు విమర్శలు చేయడం తగదన్నారు. ఆ ఆలయం పూర్తిగా ప్రైవేట్ ఆధీనంలో నడుస్తోందని, నిర్వాహకులు ప్రభుత్వానికి ముందస్తు సమాచారం ఇవ్వలేదని స్పష్టం చేశారు. నాయకులు కె. చంద్రశేఖర్, పి. అప్పలనారాయణ, ప్రసాదరావు, మండలాధ్యక్షుడు కె. సత్యనారాయణ పాల్గొన్నారు. ● ఎల్.కోట: వైకాపా డీఎన్‌ఏలోనే శవ రాజకీయాలున్నాయని ఎమ్మెల్యే లలిత కుమారి ఆరోపించారు. తన నివాసంలో మాట్లాడారు. ఏఎంసీ ఛైర్మన్ సీహెచ్. మల్లునాయుడు, రమణమూర్తి పాల్గొన్నారు.

భక్తులంతా ఒకేసారి రావడంతోనే ప్రమాదం

విజయనగరం అర్బన్: కాశీబుగ్గలో జరిగిన ప్రమాదం కలచి వేసిందని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఎక్కువ మంది భక్తులు ఒకేసారి రావడంతో తొక్కిసలాట జరిగిందన్నారు. ● విజయనగరం రైల్వే స్టేషన్‌లో పార్కింగ్ ఛార్జీలు తగ్గించడంతో పలువురు ప్రయాణికులు, కార్మికులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

వియనగరం అర్బన్, రింగురోడ్డు, న్యూస్‌టుడే: ఏపీ హియరింగ్ హ్యాండీక్యాప్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నగరంలోని ఏపీ ఎన్జీవో హోమ్‌లో జరిగింది. అధ్యక్షులుగా టి. సూర్యనారాయణ, వి. అచ్యుత రామమూర్తితో పాటు మరో 9 మందిని ఎన్నుకున్నారు.

రహదారులు నిర్మించాలని వినతి

శృంగవరపుకోట: పుణ్యగిరి న్యూ కాలనీలో రహదారులు, కాలువలు నిర్మించాలని కోరుతూ స్థానికులు ఎమ్మెల్యే లలితకుమారికి వినతిపత్రం అందించారు. తెదేపా నాయకులు పి. అప్పలరాజు, కె. వాసు, రవి, కన్నతల్లి తదితరులు ఉన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, అధికారులతో ప్రతిపాదనలు చేయిస్తామన్నారని చెప్పారు.

బ్యాడ్మింటన్ జట్లు సిద్ధం

విజయనగరం క్రీడా విభాగం: తిరుపతిలో ఈనెల 5 నుంచి 7 వరకు జరగనున్న అండర్-14, 17 రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా జట్లు సిద్ధమయ్యాయి. నగరంలోని ఇండోర్ స్టేడియంలో ఎంపికలు జరిగాయి. స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు కోరాడ గోపాలరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పర్యవేక్షణ పెంచాలి

కొత్తవలస: రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల్లో వైద్యుల పరవేక్షణ పెంచి, ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని విస్తృత దళిత సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డా. బి. వెంకటరావు డిమాండ్ చేశారు. ఆదివారం వియ్యంపేట డా. బి. ఆర్. అంబేడ్కర్ బాలికల గురుకులాన్ని సందర్శించారు.

‘ప్రాణాలు పోతేగానీ పట్టించుకోరా?’

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ప్రాణాలు పోతేగానీ స్పందించరా అని జిందాల్ నిర్వాసితులు ప్రశ్నించారు. ఆదివారం బొడ్డవరలో నిరసన తెలిపారు. 135 రోజులుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. తమ భూములు తమకి ఇచ్చే వరకు పోరాటం, దీక్షలు కొనసాగుతాయన్నారు.

మాట్లాడుతున్న వెంకటపతిరాజు, పక్కన నాయకులు

క్షత్రియ భవన్‌కు స్థలం కేటాయించాలి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: విశాఖలో క్షత్రియ భవన్‌ను స్థలం కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరామని ఆ సంఘ రాష్ట్ర ఛైర్మన్ సీహెచ్. వెంకటపతిరాజు అన్నారు. ఆదివారం భవానీనగర్‌లో కార్తిక వనభోజన కార్యక్రమంలో మాట్లాడారు. అక్కడ మల్టీ పర్పస్ భవనం నిర్మించి వృద్ధాశ్రమం, యువతకు శిక్షణా కేంద్రం తదితరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్సీలు పెనుమత్స సూర్యనారాయణరాజు, ఇందుకూరి రఘురాజు, మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, క్షత్రియ పరిషత్తు విజయనగరం అధ్యక్షుడు పి. సీతారామ రాజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: డివిజన్ స్థాయి నుంచి జనసేన బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి పిలుపునిచ్చారు. నగరంలోని 5, 8, 38వ డివిజన్లలో ఆదివారం ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాలను ఆమె ప్రారంభించారు. నాయకులు పుష్పకుమారి, శ్రీనివాస్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.







కార్యాలయ ప్రారంభోత్సవంలో యశస్వి తదితరులు

జయంత్యుత్సవాలు

విజయనగరం పట్టణం: నగరంలో ఆదివారం పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి నాలుగో డివిజన్ కార్పొరేటరు ఎం. శ్రీనివాసరావు తదితరులు నివాళులర్పించారు.

అవగాహన ర్యాలీలు

శృంగవరపుకోట: అందరూ అక్షరాస్యత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగుండాలని పీవో శ్రీనివాసరావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్-2 యూనిట్ విద్యార్థులు ఆదివారం శ్రీనివాసాకాలనీ, పుణ్యగిరి న్యూ కాలనీలో ర్యాలీలు నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు.

పశు మాంసం స్వాధీనం

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: విజయనగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో అనధికారికంగా నడుస్తున్న కబేళాపై ఒకటో పట్టణ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. 600కిలోల మాంసం, రెండు వాహనాలు, మూడు కత్తులను సీజ్ చేసి, నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ చౌదరి తెలిపారు.







రేపు 'ఈటీవీ' కార్తిక దీపోత్సవం

నేడు ఎంట్రీ పాసుల పంపిణీ

శివకేశవులు ఇద్దరికీ ఎంతో ప్రీతికరమైనది కార్తిక మాసం. దీంతో సమానమైన మాసం, గంగతో సమానమైన తీర్థం లేదని పురాణోక్తి. విశేష పుణ్య సంపదను ప్రసాదించే ఈ మాసంలో దీపారాధనకు ఉన్న ప్రాధాన్యం అసమానమైనది. 'ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ, ఈటీవీ లైఫ్' ఛానళ్ల ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే మహిళలకు పూజ సామగ్రి నిర్వాహకులే సమకూరుస్తారు. ఎంట్రీ పాసులు ఒక రోజు ముందుగా అంటే సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్యలో తణుకు పట్టణంలోని నూలి గ్రౌండ్స్, జ్యూయల్ హోమ్స్ పక్కన, ఎస్ఎన్‌వీటీ జూనియర్ కాలేజ్ వద్ద పంపిణీ చేస్తారు. పరిమిత సంఖ్యలోనే పాసులు ఉంటాయి. చిన్నపిల్లలకు అనుమతి లేదు. నేలపై కూర్చోగలిగే వారు మాత్రమే హాజరు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

–ఈనాడు, తణుకు

సమయం: ఈ నెల 4న (మంగళవారం) సాయంత్రం 5 గంటలకు

స్థలం: నూలి గ్రౌండ్స్, జ్యూయల్ హోమ్స్ పక్కన, ఎస్ఎన్‌వీటీ జూనియర్ కాలేజ్ వద్ద, తణుకు

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ · ఈటీవీ తెలంగాణ · ఈటీవీ Life

ఈ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం 4న సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు.

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: సోమవారం కలెక్టరేట్లో జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ నాగరాణి తెలిపారు. డివిజన్, మండలం, మున్సిపల్ కార్యాలయాల్లోనూ ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

రావిపాడు: చేనేత కార్మికులకు బియ్యం, నిత్యావసర సరకులు అందజేస్తున్న మంత్రి రామానాయుడు

వైకాపాది విధ్వంస పాలన: నిమ్మల

పోడూరు, న్యూస్‌టుడే: వైకాపా ఐదేళ్ల పాలన అరాచకాలు, విధ్వంసం, వేధింపులు, కక్షలతో సాగిందని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. పోడూరు మండలం రావిపాడులో తుపాను బాధిత చేనేత, మత్స్యకార కుటుంబాలకు ఆయన ఆదివారం రాత్రి బియ్యం, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, ప్రధాని నరేంద్రమోదీల కలయిక రాష్ట్ర సమగ్ర ప్రగతికి బాటలు వేస్తుందన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు.

ఈ దారికో దండం..

తాడేపల్లిగూడెం పట్టణంలోని బ్రహ్మానందరెడ్డి మార్కెట్ వారపు సంతలో అనేక అసౌకర్యాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రతి వారాంతపు రోజున నిర్వహించే సంతకు చుట్టుపక్కల సుమారు 100 గ్రామాల ప్రజలు నిత్యావసర సరకులతో పాటు కూరగాయలు, అపరాలు తదితరాలు కొనుగోలు చేసేందుకు వస్తుంటారు. చినుకు పడితే చాలు రహదారులపై బురద చేరి అడుగు వేయలేని దుస్థితి. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రధాన రహదారి ఇలా మారడంతో వినియోగదారులు లోపలికి రావడం లేదని వ్యాపారులు వాపోతున్నారు.

- న్యూస్‌టుడే, బ్రహ్మానందరెడ్డి మార్కెట్(తాడేపల్లిగూడెం వన్‌టౌన్)

బతికి సాధించు.. బతుకునిచ్చి చూపించు!

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే

పురుషులతో సమానంగా మహిళలు దూసుకెళ్తున్నారు. అన్ని రంగాల్లోనూ రాణిస్తూ.. తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. అయినా, కొన్నిచోట్ల ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. మెట్టినింట్లోనూ భద్రత లేకుండా పోయింది. అతివలకు అండగా ఉండాల్సిన అత్తింటి వారే వేధింపులు, భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. కట్టుకున్నోడే కన్నెర్ర చేస్తుండటంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ తరహా ఘటనలు పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది.

ఏలూరు రెండో పట్టణానికి చెందిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగినిని భర్త నిత్యం వేధించేవాడు. అదనపు కట్నం తేవాలని ఒత్తిడి చేసేవాడు. ఆ బాధ తాళలేక ఆమె నాలుగు నెలల కిందట ఉరేసుకొని ఉసురు తీసుకుంది.

నరకం అనుభవిస్తూ.. భర్త, ఆయన కుటుంబ సభ్యులు చూపుతున్న నిరాదరణను తట్టుకోలేక.. శారీరక, మానసిక హింసలు భరించలేక కొందరు మహిళలు తనువు చాలిస్తున్నారు. అర్ధాంతరంగా జీవితాన్ని ముగించుకుంటున్నారు. కొందరు ధైర్యం చేసి పోలీసు స్టేషన్ గుమ్మం తొక్కి న్యాయ పోరాటం చేస్తున్నారు.

మొదట్లో సజావుగానే.. ప్రేమ వివాహాలు.. పెద్దలు కుదిర్చిన సంబంధాలు.. కులాంతర పెళ్లిళ్లన్నీ మొదట్లో బాగానే ఉంటున్నాయి. కాలం గడిచే కొద్దీ కొన్ని కుటుంబాల్లో ఇబ్బందులు మొదలవుతున్నాయి.

ఉభయ జిల్లాల్లో కేసుల వివరాలిలా.. (ఇప్పటి వరకు)

కారణాలు	2023	2024	2025
వరకట్న మరణాలు	12	09	06
ఆత్మహత్యలు	111	106	115
వేధింపులు	315	296	255
వరకట్న వేధింపులు	155	139	93

కట్నం తేలేదని, ఇస్తానన్న చెల్లింపులు సకాలంలో ఇవ్వలేదని, ప్రేమ వివాహంతో ఆస్తి దక్కకుండా పోయిందని.. ఇలా అనేక కారణాలతో అగ్నిసాక్షిగా మనువాడిన భార్యనే వేధిస్తున్నారు.

మరోవైపు కట్నం హారతి కర్పూరంలా కరిగించి వ్యసనాలు, మద్యానికి బానిసైన భర్తలు.. తమ అర్ధాంగులను పుట్టింటి నుంచి డబ్బులు తేవాలని శారీరకంగా, మానసికంగా ఇబ్బంది పెడుతున్నారు.

- వరకట్న వేధింపులతో సతమతం
- మెట్టినింట్లో అతివలకు రక్షణ కరవు

'గృహ హింస, అదనపు కట్నం, ఇతరత్రా వేధింపులకు గురైతే పోలీసుల దృష్టికి తీసుకురండి. బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే చర్యలు తీసుకుంటాం. తొలుత భర్త, అతడి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తాం. మారకపోతే తగిన గుణపాఠం చెబుతాం. బాధిత మహిళలకు అన్నివిధాలా న్యాయం చేస్తాం. అత్యవసరమైతే టోల్‌ఫ్రీ నంబరు 122కు ఫోన్ చేయొచ్చు' అని ఏలూరు మహిళా పోలీసుస్టేషన్ సీఐ సుబ్బారావు తెలిపారు.

గౌడ/శెట్టిబలిజ కుల అవివాహితులకు సువర్ణావకాశం

నేడు గౌడ/శెట్టిబలిజ కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, **గౌడ/శెట్టిబలిజ కుల** అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు నేడు (03 నవంబరు 2025, సోమవారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు **80086 21414 & 91549 18858** ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్లో యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫోటోలు పైన తెలిపిన ఫోన్ నెంబర్లకు సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

చెంగట నల్లదివో.. శేషాచలము

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: క్షీరాబ్ది ద్వాదశి నాడు ద్వారకాతిరుమల శ్రీవారి తెప్పోత్సవం ఆదివారం రాత్రి కనులపండువగా జరిగింది. తొలుత హంస ఆకారంలో తెప్పను విద్యుద్దీపాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఆలయం వద్ద నుంచి తొళక్కం వాహనంపై ఊరేగింపుగా నృసింహసాగర్(పుష్కరిణి) వద్దకు తోడ్కొని వచ్చారు. క్షేత్రంలో ఊరేగుతూ వస్తున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు నీరాజనాలు పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లను తెప్పపై కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త నివృతరావు, ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు శ్రీవారికి హారతులు పట్టి తెప్పోత్సవాన్ని ప్రారంభించారు.

నేత్రపర్వం.. సోమేశ్వరుడి పుష్పాలంకరణ

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: కార్తిక మాసం క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వర జనార్దన స్వామి ఆలయంలో సోమేశ్వరస్వామికి ఆదివారం ఉదయం పంచామృతాభిషేకం చేశారు. సాయంత్రం స్వామికి నాగాభరణం, తులసీదళం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి సహస్రనామ పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పంచారామ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 8 వేల మంది భక్తులు వచ్చి స్వామిని దర్శించినట్లు ఆలయాధికారులు తెలిపారు. దర్శనం, లడ్డూ ప్రసాదం రూ.1,14,850, అన్నప్రసాదం కానుకల రూపంలో రూ.95,498 ఆదాయం వచ్చినట్లు ఈవో డి.రామకృష్ణ, ధర్మకర్తల మండలి ఛైర్మన్ చింతలపాటి బంగార్రాజు తెలిపారు.

శ్రీహరి.. జల విహారి..!

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట క్షేత్రంలో క్షీరాబ్ది ద్వాదశి వేడుకలు ఆదివారం రాత్రి నేత్రపర్వంగా జరిగాయి. ఉమారామేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని ఉపాలయాల్లో కొలువైన రమా సత్యనారాయణ స్వామి, రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాలస్వామి వార్ల తెప్పోత్సవాలను స్థానిక రామగుండం చెరువులో వైభవంగా నిర్వహించారు. ఈ వేడుక తిలకించేందుకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. స్వామి, అమ్మవార్లను మూడు పర్యాయాలు చెరువులో జల విహారం చేయించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున బాణసంచా కాల్చారు.

కావాలి.. భూలక్ష్ములు

వీరవాసరం, న్యూస్‌టుడే: అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలనుకునే మహిళలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. కూరగాయలు, ఎరువుల దుకాణాలు ఏర్పాటుకు, శుద్ధి చేసిన ఆహార పదార్థాలను స్థానికంగా, విదేశాలకు ఎగుమతి చేసేలా అతివలను తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఉంది. ఇందుకోసం స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను ఎంపిక చేసే కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు.

జిల్లాలో డ్వాక్రా సంఘాలు: 30,093
గ్రామ సంఘాలు: 897
సభ్యులు సుమారు: 3 లక్షలు
మహిళా రైతు సంఘాల ఏర్పాటు లక్ష్యం : 1,100

- సాగుకు సాయం.. ఉపాధికి ఊతం
- వ్యాపారాభివృద్ధికి ప్రోత్సాహం

ఎంపిక.. ఉపాధి ఇలా..

- జిల్లాలోని 20 మండలాల్లో ఒక్కో మండలం నుంచి 30 నుంచి 55 సంఘాలను ఇప్పటికే ఎంపిక చేశారు.
- ప్రతి సంఘంలో ఇద్దరు మహిళా రైతులు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు.
- ఎంపిక చేసిన సంఘాల సభ్యులు ప్రతి నెలా బ్యాంకులో చేసే పొదుపుతోపాటు అదనంగా రూ.100 చొప్పున ఆరు నెలలు బ్యాంకు ఖాతాలో జమ చేయాలి.
- పొదుపు చేసిన మహిళా రైతు సంఘానికి వ్యవసాయ పరికరాలు, ఎరువులు, కూరగాయల దుకాణాలు, ఆహార శుద్ధి పరిశ్రమ ఏర్పాటుకు సహాయం చేస్తారు.
- శుద్ధి చేసిన ఆహార ఉత్పత్తులను స్థానికంగా, విదేశాలకు ఎగుమతులు చేసుకునేలా అవగాహన, శిక్షణ కల్పిస్తారు.
- ఇప్పటికే స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు 80 శాతం రాయితీతో అందజేసిన వ్యవసాయ డ్రోన్లతో పలువురు ఉపాధి పొందుతున్నారు.
- కొనుగోలు చేసిన యంత్ర పరికరాలు, ట్రాక్టర్లను అద్దెకు ఇవ్వడం ద్వారా ఉపాధి పొందొచ్చు.

అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి.. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని మహిళా రైతులు అందిపుచ్చుకోవాలని డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్. వేణుగోపాల్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా మహిళా రైతు సంఘాల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారిని ఈ జాబితాలోకి తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మెరుగైన ఉపాధి కోసం అవసరమైన వారికి శిక్షణ ఇప్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

బీచ్ రోడ్డుపై ఇసుక మేట

మొగల్తూరు, న్యూస్‌టుడే: కేపీపాలెంసౌత్‌లోని బీచ్ రహదారిపై ఇసుక మేట వేసింది. ఇక్కడి బీచ్‌లో సుమారు ఆరు కిలోమీటర్ల మేర గతంలో రెండు వరుసల రహదారి నిర్మించి మధ్యలో విభాజకానికి ఖాళీ వదిలారు. ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో సముద్రం పోటెత్తడంతో అలలతో పాటు కొట్టుకొచ్చిన ఇసుక ఒక వరుస రహదారిపై మేట వేసింది. బీచ్‌లోకి పర్యాటకులను అనుమతిస్తే వారి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఈ అంశాన్ని 'న్యూస్‌టుడే' ఎంపీడీవో త్రిశూలపాణి దృష్టికి తీసుకెళ్లగా బీచ్‌రోడ్డులో ఇసుక మేటల తొలగింపునకు చర్యలు చేపడతామని చెప్పారు.

కార్తికం.. సమైక్య జీవన సందేశం!
లాంచీ ఎక్కాలి.. గోదారి దాటాలి..
6లో

నైపుణ్య విద్యకు శ్రీకారం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: కాలం మారింది.. చదువూ మారుతోంది. ఉద్యోగం పొందాలన్నా.. జీవితంలో రాణించాలన్నా విద్య ఒక్కటే సరిపోదు. అందుకే వారి భవితకు భరోసా కల్పించేలా ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ)కు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

విద్యార్థి దశ నుంచే ఆసక్తి ఉన్న రంగంపై శిక్షణ ఇప్పించి వారిలో నైపుణ్యాలు పెంపొందించే దిశగా కార్యాచరణ అమలు చేస్తున్నారు. కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా బయట పరిస్థితులు, మన చుట్టూ ఉండే వాతావరణంపై అవగాహన కల్పిస్తున్నారు.

విద్యుత్తు ఆధారిత వస్తువుల మరమ్మతులు

జిల్లాలోని 27 పాఠశాలల్లో పీఎంశ్రీ అమలు చేస్తున్నారు. 12500 మంది విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులతో స్వయం ఉపాధికి బాటలు వేస్తున్నారు. పదో తరగతి పూర్తయ్యే నాటికి ఎలక్ట్రానిక్స్, వ్యవసాయం, బ్యాంకింగ్ సేవలు, ఫుడ్ ప్రాసెసింగ్, బ్యూటీ కోర్సులు, ఆటోమోటివ్, కంప్యూటర్, ఐటీ రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నారు.

- క్రీడాభివృద్ధికి మైదానాలు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. షటిల్, వాలీబాల్ కోర్టులు, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటుకు ఒక్కో పాఠశాలకు రూ.5 లక్షల చొప్పున కేటాయించారు.
- పాఠశాల స్థాయిలోనే ఆవిష్కరణలకు వీలుగా కెమిస్ట్రీ ల్యాబ్‌లకు రూ.15 లక్షల చొప్పున ఇచ్చారు.
- క్రిమి సంహారక, రసాయన ఎరువులు వాడకుండా పాఠశాల ఆవరణల్లోనే రూ.1.50 లక్షలతో శాశ్వత కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేశారు.
- బ్యాంకులు, పరిశ్రమలు, వ్యాపార సంస్థలను సందర్శిస్తారు. చదువు పూర్తయ్యే నాటికి శిక్షణతో కూడిన ధ్రువపత్రాలు అందజేస్తారు.

విహార యాత్రకి వెళ్లొద్దాం..

తరగతి గదులకే పరిమితం కాకుండా ఒక్కో పాఠశాలలోని 10 శాతం విద్యార్థులను విహార యాత్రలకు తీసుకెళ్తారు. ఇందుకు ఒక్కో విద్యార్థికి రూ.500 చొప్పున ఖర్చు చేస్తున్నారు. జాతీయ దినోత్సవాల్లో స్వాతంత్ర్య ఉద్యమ నాయకుల గురించి విద్యార్థులకు తెలియజేసేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనికి రూ.25 వేల చొప్పున ఇచ్చారు.

నిరీక్షణ ఫలించి.. ప్రయోజనాలు కల్పించి!

- ఉద్యోగోన్నతులు, ఈహెచ్ఎస్ వర్తింపు
- ఆర్టీసీ సిబ్బంది సంక్షేమానికి చొరవ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఉద్యోగుల అభ్యున్నతి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సుమారు ఆరేళ్లుగా ఉద్యోగోన్నతులకు ఎదురు చూస్తుండగా.. ఇటీవల ఆ కలను సాకారం చేసింది. వెనువెంటనే మరో వరమిచ్చింది. సంస్థ ప్రభుత్వంలో విలీనమయ్యాక.. ఉద్యోగులు పలు రకాల సదుపాయాలు పొందలేక పోయారు. ఆ లోటును సర్కారు సరిచేస్తూ.. విస్తృత ప్రయోజనాలు కల్పిస్తుంది.

ఉభయ జిల్లాల వివరాలిలా..

జిల్లా	ఉద్యోగులు	విశ్రాంత ఉద్యోగులు
ఏలూరు	1,600	1,300
పశ్చిమ	1,400	1,200

తాజాగా విశ్రాంత ఉద్యోగులకు కూడా ఈహెచ్ఎస్ వర్తించేలా ఉత్తర్వులు జారీ చేసింది. 2020 జనవరి 1న ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం కాగా.. ఆ తర్వాత ఉద్యోగ విరమణ పొందిన వారికి వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. వీరికి ఇకపై ఈహెచ్ఎస్ పథకం ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం పొందే అవకాశం కలగనుంది.

ఒకసారి చెల్లిస్తే చాలు.. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు ఒకసారి ప్రీమియం చెల్లిస్తే జీవితాంతం వైద్యం పొందొచ్చు. విశ్రాంత ఉద్యోగి భార్యకూ ఉచిత వైద్యం అందిస్తారు. నెట్‌వర్క్ వైద్యశాలలతోపాటు ఆర్టీసీ ఆసుపత్రుల్లోనూ ఉచిత వైద్యం, మందులు అందజేస్తారు. ఆర్టీసీ ఆసుపత్రుల సిఫార్సు మేరకు ఈహెచ్ఎస్ వైద్యశాలల్లో చికిత్స అందిస్తారు. రెగ్యులర్ ఉద్యోగుల తరహాలో మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం ప్రభుత్వం కల్పించింది. పర్యవేక్షకుడి విభాగం వరకు రూ.38,572 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. సహాయ మేనేజరు, ఆపై ర్యాంకున్న వారు రూ.51,429 చెల్లించాలి.

మూడో వంతు.. లెక్కలకందని తంతు!

బీమా నిబంధనలతో అన్నదాతలకు నిరాశ

మార్టేరు, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా కీలక దశలో ఉన్న వరి పంట దెబ్బతింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్ర పరిశీలన చేస్తూ పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో బీమా పరిహారం నిబంధనలు రైతులను నిరాశ పరుస్తున్నాయి. మార్గదర్శకాల ప్రకారం.. సాగు విస్తీర్ణంలో 33 శాతం (దాదాపు మూడో వంతు) పంట దెబ్బతింటేనే నష్ట పరిహారం అందుతుంది. కానీ అధికశాతం విస్తీర్ణంలో దెబ్బతిన్న పైరు మూడో వంతు లోపే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కీలక దశలో చేలు దెబ్బతినడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం ఉంటుందని.. దీనిని ఇప్పుడు అంచనా వేయడం ఎలా సాధ్యమని రైతులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

పైకి కనిపించని తీవ్రత.. పొలాల వద్ద కొబ్బరి, ఇతర చెట్లు ఉన్న దిబ్బలకు సమీపాన చేలు గాలులకు పూర్తిగా నేలనంటాయి. ఇలాంటి చేలు పైకి తక్కువ విస్తీర్ణంలో ఉన్నట్లు కనిపించినా మొత్తంగా లెక్కిస్తే నష్టం ఎక్కువగానే ఉంటుంది. ఇలాంటి పొలాలను వ్యవసాయ శాఖ నష్ట పరిహారానికి పరిగణనలోకి తీసుకోకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొంత విస్తీర్ణంలో చేలు పాడైనా తమకు భారమేనని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి 33 శాతం నిబంధన సడలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అత్తిలి ప్రాంతానికి చెందిన రైతు రామకృష్ణ ఎకరం విస్తీర్ణంలో వరి సాగు చేశారు. తుపాను ప్రభావంతో పొలం చుట్టూ దుబ్బులు నేలకొరిగాయి. మధ్యలో పైరు సాధారణంగా ఉండటంతో నష్టం 33 శాతం కంటే తక్కువని అధికారులు అంచనా వేయడంతో నష్ట పరిహారం వచ్చే అవకాశం లేకుండా పోయింది. సాగు ఆరంభంలో వర్షాలకు నారు దెబ్బతిందని, ఇప్పుడు పంట చేతికొచ్చే దశలో చేను నేలకొరగడంతో దిగుబడిపై ప్రభావం ఉంటుందని ఆయన వాపోతున్నారు. దుబ్బులను నిలబెట్టేందుకు కూలీలకు రూ.2 వేల వరకు వెచ్చించాల్సి వచ్చిందని చెప్పారు.

ప్రాథమిక అంచనా ఇలా.. పశ్చిమగోదావరి జిల్లాలో 2.15 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగైంది. 10,309 ఎకరాల్లో చేలు నీట మునిగాయని, మరో 16,072 ఎకరాల్లో నేలకొరిగాయని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

ప్రభుత్వానికి నివేదిస్తాం.. జిల్లాలో దెబ్బతిన్న పంట వివరాలను ఏపీఏఐఎంఎస్ యాప్‌లో నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ వివరాలను ప్రభుత్వానికి నివేదించి నిబంధనల ప్రకారం నష్ట పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటాం.

- వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి, భీమవరం

ప్రయోగాత్మకం మ్యాజిక్ డ్రెయిన్

విస్సాకోడేరులో తొలిసారిగా నిర్మాణం

విస్సాకోడేరు(పాలకోడేరు), న్యూస్‌టుడే: తడి, పొడి చెత్త నుంచి వానపాముల ఎరువు తయారీ, ఆలం నీటి శుద్ధి ప్లాంట్‌తో సత్ఫలితాలు సాధించి జిల్లాలోనే ఆదర్శంగా నిలిచిన విస్సాకోడేరు గ్రామం మరో ప్రయోగాత్మక పథకానికి నాంది పలికింది. వంకాయలపాలెం వెళ్లే మార్గంలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరంతా రోడ్డుపై నుంచే ప్రవహిస్తుండటంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. దీనికి పరిష్కారంగా మ్యాజిక్ డ్రెయినేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సుమారు 120 గృహాలకు ఉపయోగపడేలా 175 మీటర్ల మేర డ్రెయిన్ నిర్మాణం చేపట్టారు. డ్రెయినేజీలోకి వచ్చిన మురుగు నీరు ఎక్కడికక్కడ ఇంకిపోయేలా 100, 65, 40, 20 సైజు కంకరతో సుమారు 2.5 అడుగుల లోతుగా నిర్మాణం చేపట్టినట్లు సర్పంచి బొల్లా శ్రీనివాస్ తెలిపారు. నిర్మాణం అనంతరం డ్రెయినేజీ పనితీరును బట్టి గ్రామంలోని అన్ని వీధుల్లో ఇదే విధంగా మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మిస్తామని ఆయన తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

భీమడోలు, న్యూస్‌టుడే: సైబర్ మోసాలపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి జిల్లా ప్రజాప్రయోజన సేవల శాశ్వత లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్ అన్నారు. ఈ నెల 9న జాతీయ న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవం సందర్భంగా.. పోలసానిపల్లి బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అధ్యక్షత వహించారు. మేరీగ్రేస్ మాట్లాడుతూ.. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని వివరించారు.

(c) eenadu

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూములు, ప్రభుత్వ స్థలాల్లో కొబ్బరి చెట్లను పేదలకు పంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు కోరారు. భీమవరం ప్రజా సంఘాల కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బాతిరెడ్డి జార్జి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని చాలా ప్రభుత్వ స్థలాల్లో ఉన్న కొబ్బరి చెట్లు 99 సంవత్సరాల లీజుతో భూస్వాముల చేతుల్లో ఉన్నాయన్నారు. జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ నవంబర్ 10, 11 తేదీల్లో వ్యకాసం జిల్లా మహాసభలు అత్తిలిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు కేశవరపు పెద్దిరాజు, కండెల్లి సోమరాజు, బళ్ల చిన వీరభద్రరావు, శిష్టు ఆత్రేయ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచే విద్యుత్తు సేవలు

అందుబాటులో ఏపీఈపీడీసీఎల్ యాప్



విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఏపీఈపీడీసీఎల్ ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టింది. ఆండ్రాయిడ్ వినియోగదారులు ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీని ద్వారా వచ్చిన సమస్యలను విద్యుత్తు శాఖ అధికారులు పరిశీలించి సత్వరం పరిష్కరిస్తారు. - న్యూస్‌టుడే, విశాఖపట్నం, ఏలూరు టూటౌన్

జిల్లా	ఏలూరు
కనెక్షన్లు	7,50,049
ప్రతినెలా బిల్లు (రూ. కోట్లు)	రూ.151.19 కోట్లు

బిల్లు చెల్లించొచ్చు: విద్యుత్తు బిల్లులను వెల్లించేందుకు బిల్‌ను ద్వారా సర్వీసు నంబరు, వరవాణి నంబరు పొందుపరిస్తే సంబంధించిన వివరాలు ప్రత్యక్షమవుతాయి.

సప్లయి పొజిషన్: వినియోగదారుడు సర్వీసుకు సంబంధించి విద్యుత్తు సరఫరా తీరును ఎప్పటికప్పుడు లైవ్‌లో చూసుకునే సదుపాయం కలదు.

మొబైల్ లింకింగ్: విద్యుత్తు వినియోగదారులు తమ విద్యుత్తు కనెక్షన్‌కు సంబంధించి వరవాణి నంబరును అనుసంధానిస్తే విద్యుత్తు బిల్లుల సమాచారం వరవాణికి అందుతుంది.

ఎనర్జీ కాలిక్యులేటర్: ఏ పరికరానికి ఎంత విద్యుత్తు ఖర్చవుతుందో దీని ద్వారా తెలుసుకోవచ్చు. నెలవారీ విద్యుత్తు వినియోగానికి సంబంధించిన మీటరు రీడింగ్ వివరాలు పొందుపరిస్తే బిల్లు సమాచారం కనిపిస్తుంది.

కస్టమర్ కేర్: వినియోగదారులు తమ సమస్యలను ఇందులో పొందుపరచొచ్చు. అందుకు సంబంధిత వివరాలు, అవసరమైన అన్ని లింకులు ఇందులో పొందుపరిచి ఉంటాయి.

లింక్ ఆధార్: వినియోగదారుడు విద్యుత్తు సర్వీసుకు ఆధార్ వివరాలను జత చేసుకోవచ్చు.

కనెక్షన్: వినియోగదారులు వాడిన యూనిట్లు.. చెల్లించాల్సిన నగదు.. బిల్ లెడ్జర్ వివరాలు అందుబాటులో ఉంటాయి.

లాడ్జ్ కంప్లైంట్: విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు వంటి ఫిర్యాదులు వినియోగదారుడు నేరుగా ఫిర్యాదు చేయడమే గాక కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్య పరిష్కారం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు.

వ్యూ బిల్: సర్వీసు నంబరు నమోదు చేసుకుని నెలవారీ విద్యుత్తు బిల్లులకు సంబంధించిన నగదు చెల్లించొచ్చు.

అధికారుల వివరాలు: వినియోగదారుల పరిధిలోని అధికారుల ఫోన్ నంబర్లు లభ్యమవుతాయి. ఫోన్ చేసి సంప్రదిస్తే సమస్యలు నివృత్తి చేసుకోవచ్చు.

టారిఫ్: వినియోగదారులకు సంబంధించిన టారిఫ్ వివరాలు ఇందులో పొందుపరిచి ఉంటాయి.

క్విక్ పే: సర్వీసు నంబరు, వరవాణి నంబరును నమోదు చేస్తే సంబంధిత బిల్లు వివరాలు వస్తాయి. అక్కడి నుంచి బిల్లు చెల్లించొచ్చు.

క్రీడాకారులకు ప్రోత్సాహకాలు

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశానుసారం జిల్లాలోని అర్హులైన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్ తెలిపారు. పోర్టల్‌లో ఈ నెల 4లోపు http://sports.ap.in/#registration/player-registration వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అవకాశాన్ని జిల్లాలోని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని.. మరిన్ని వివరాలకు 95735 52108, 82473 02497 నంబర్లను సంప్రదించాలని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అంధ ఉపాధ్యాయులను మినహాయించండి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: అంధ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని ఏపీ దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వీర్రాజు విజ్ఞప్తి చేశారు. 2010కు ముందు డీఎస్సీలో ఉపాధ్యాయ కొలువు సాధించి, విధులు నిర్వర్తిస్తున్న గురువులను టెట్ నుంచి మినహాయించాలన్నారు. డీఎస్సీలో ప్రతిభ కనబరిచి ఉద్యోగంలో కొనసాగుతున్న అంధులు కంప్యూటర్ ఆధారిత పరీక్ష రాయడానికి ఇబ్బందులు పడే అవకాశముందన్నారు. అంధ ఉపాధ్యాయులను ముఖ ఆధారిత హాజరు నుంచి మినహాయించాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కార్తికం.. సమైక్య జీవన సందేశం!

సందడిగా వన సమారాధనలు

సామాజిక స్పృహ మేళవింపుతో సార్థకత

పాలకొల్లు, న్యూస్‌టుడే: కార్తికమాసం అంటే ఎంతో ప్రత్యేకం. ఈ నెలలో నిర్వహించే ప్రత్యేక పూజలు, వ్రతాలు, దీక్షలు ఆధ్యాత్మిక వైభవానికి, వన సమారాధనలు సమైక్య జీవనానికి ప్రతీకలుగా నిలుస్తాయి. నియమ నిష్ఠలు, క్రమబద్ధమైన జీవన విధానాలు పాటించే ఈ రోజుల్లో సామాజిక స్పృహతో మెలిగితే భవిష్యత్తుకు ఉపకరించే మార్పులకు బాటలు వేసినట్లే. వనసమారాధనలు, ఇతర కార్యక్రమాలు వేడుకలు, వినోదాలకే పరిమితం కాకుండా పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారిస్తే భావితరాలకు ఎంతో మేలు చేసినట్లే.

మొక్కలతోనే మనుగడ

జిల్లా విస్తీర్ణంలో 33 శాతం ఉండాల్సిన పచ్చదనం పశ్చిమలో కేవలం 11 శాతానికే పరిమితమైంది. ఏలూరు జిల్లాలో 6,603 ఎకరాల్లో అటవీ భూములున్నా వనాల పెంపకంలో నిర్లక్ష్యం నెలకొంది. వన సమారాధనల్లో ఉసిరి చెట్లకు పూజలు చేసి వదిలేయకుండా ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటేలా ప్రోత్సహిస్తే పరిస్థితిలో మార్పు వస్తుంది.

ఉసిరి చెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పాలిథిన్‌ను పాతేద్దాం

గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2 నుంచి ఏక వినియోగ ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్నా క్షేత్ర స్థాయిలో పెద్దగా ఫలితాలు కనబడటం లేదు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సగటున రోజుకు 80 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు వన సమారాధనలు వేదికలు కావాల్సిన ఆవశ్యకత ఉంది. ఈ వేడుకల్లో ఏ రూపంలోనూ పాలిథిన్‌ను వినియోగించకుండా జాగ్రత్త వహించాలి. పాలిథిన్‌తో తలెత్తే అనర్థాలను పిల్లలకు తెలియజేస్తే సత్ఫలితాలు వస్తాయి.

చీకట్లు తొలగాలి..

'పవిత్రమైన కార్తిక మాసంలో ఆచరించే పద్ధతులను తర్కంతో కూడా కొనసాగిస్తే ఉత్తమ ఫలితాలుంటాయి. పేద, ధనిక అనే తేడా లేకుండా అంతా ఒక్కటేననే భావనను నింపే వేదికలే కార్తిక వన సమారాధనలు. కార్తిక దీపాలు మనసులో చీకట్లను తొలగించి వెలుగును నింపుకోవాలనే భావనకు ప్రతీకలు. కార్తిక మాస ఉపవాసాల్లో ఆరోగ్యకరమైన జీవనానికి సరిపడా మితాహారం తీసుకోవాలనే సందేశం ఇమిడి ఉంది.' అని ఆచంట మండలం కొడమంచిలికి చెందిన ఆధ్యాత్మిక గురువు మానేపల్లి రామలింగేశ్వరశర్మ చెప్పారు.

శోభాయమానంగా గ్రామోత్సవం

స్వామి, అమ్మవార్లు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి గ్రామోత్సవం ఆదివారం సాయంత్రం శోభాయమానంగా నిర్వహించారు. ఆలయం నుంచి గురవాయిగూడెం, చక్రదేవరపల్లి గ్రామాల్లోని ప్రధాన వీధుల మీదుగా సాగిన గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో సువర్చలాదేవి సమేతంగా ఆసీనులైన స్వామికి మహిళలు హారతులు పట్టారు.

అరటి రైతు.. విలవిల

మొంథాతో తీవ్ర నష్టం

న్యూస్‌టుడే, తణుకు: మొంథా అరటి రైతులకు అంతులేని ఆవేదన మిగిల్చింది. తుపాను ప్రభావంతో వీచిన ఈదురుగాలులకు తోటలు విరిగిపడ్డాయి. ఎకరాకు దాదాపు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. పంట చేతికొచ్చే దశలో నిలువునా కూలిన తోటలను చూసి రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

జిల్లాలో అధికంగా కర్పూరం, చక్రకేళీ వంటి అరటి రకాలు 19 వేల హెక్టార్లలో సాగు చేస్తున్నారు. తుపాను ప్రభావానికి నరసాపురం, మొగల్తూరు, ఆచంట, పెనుమంట్ర, పాలకొల్లు, యలమంచిలి, ఇరగవరం, పోడూరు, తాడేపల్లిగూడెం, పెనుగొండ మండలాల్లో ప్రాథమిక అంచనా ప్రకారం 302.24 హెక్టార్లలో తోటలు దెబ్బతిన్నట్లు ఉద్యాన శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో అత్యధికంగా నరసాపురంలో 56.43, యలమంచిలిలో 50.4 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు అంచనా వేశారు.

ఎస్.ఇల్లింద్రపర్రులో విరిగిన అరటి చెట్టును చూపిస్తున్న రైతు

అరటి పంట కాలం ఏడు నుంచి ఎనిమిది నెలలు. ప్రస్తుతం కాయ దశలో ఉంది. పంట ఆరంభం నుంచి ఇప్పటి వరకు దుక్కి దున్నడానికి ఎకరాకు దాదాపు రూ.10 వేలు, 800 పిలకల కొనుగోలుకు ఒక్కొక్కటి రూ.12 చొప్పున, ఎరువులకు రూ.25 వేల చొప్పున రెండుసార్లు, వెదురు కర్రకు పాతవి రూ.ఒక్కొక్కటి రూ.20, కొత్తవి అయితే రూ.60 నుంచి రూ.70 అయింది. వెరసి ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి అవుతుందని, అదే కౌలు అయితే అదనంగా రూ.50 వేల నుంచి రూ.60 వేలు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాలిక జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ తదితరులు

క్రీడా స్ఫూర్తి పెంపొందించుకోండి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని డీఈవో వెంకట లక్ష్మమ్మ అన్నారు. శనివారపుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన రెండ్రోజులపాటు కొనసాగిన అండర్-17 బాలబాలికల తైక్వాండో అంతర్ జిల్లాల పోటీలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు డీఈవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలబాలికలు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. బాలికల విభాగంలో విజయనగరం, బాలుర విభాగంలో చిత్తూరు జిల్లాలు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్నాయి. ఆయా జట్లకు వెంకట లక్ష్మమ్మ ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. అంతర్ జిల్లాల స్థాయిలో గెలుపొందిన జట్లు అరుణాచల్ ప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాయని ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. ఎంఈవో అరుణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు ప్రకాశ్, ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

లాంచీ ఎక్కాలి.. గోదారి దాటాలి..

కార్తికంలో వీరభద్రుడి దర్శనం ప్రత్యేకం

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం మండలం పట్టిసీమ వద్ద గోదావరి మధ్యలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో వీరభద్రుడు స్వయంభూగా అవతరించాడు. దక్ష ప్రజాపతి తలపెట్టిన దక్షయజ్ఞానికి పరమశివుడిని పిలవకపోవడం, పుట్టింటిపై మమకారంతో వెళ్లిన సతీదేవికి తీరని అవమానం జరగడంతో సహించలేక ఆత్మాహుతికి యత్నిస్తుంది. దానిని చూసి పరమశివుడు ఉగ్రుడై ప్రళయతాండవం చేసి తన జటాజూటం నేలకేసి కొట్టడంతో వీరభద్రుడు అవతరించాడు. ఆయనకు పరమశివుడు పట్టసం అనే ఆయుధం ఇచ్చి దక్షుడి శిరస్సు ఖండించమని ఆదేశించాడు. దీంతో వీరభద్రుడు దక్షయజ్ఞం ధ్వంసం చేసి దక్షుడి శిరస్సు ఖండించి దేవకూటాద్రి పర్వతంపై చేసిన ప్రళయ తాండవానికి భూమి అదిరింది. దానిని చూడలేక దేవతలు అగస్త్యమహామునిని వేడుకోగా.. ఆయన వచ్చి వీరభద్రుడ్ని ఆలింగనం చేసుకుని శాంతింపజేశారు. అనంతరం వీరభద్రుడు అక్కడే స్వయంభూగా వెలిసినట్లు స్కంధ పురాణంలో పేర్కొన్నారు. పరమశివుడు ఇచ్చిన ఆయుధం పట్టసం కావడంతో పూర్వం పట్టసంగా పిలువబడిన గ్రామం కాలక్రమంలో పట్టిసీమగా పేరుగాంచింది.

వీరేశ్వరస్వామి

కార్తికం.. దర్శనీయం

కార్తికమాసం నెలరోజులు.. కార్తిక మాసంలో శని, ఆది, సోమవారం పర్వదినాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని అభిషేకాలు, లక్షబిల్వార్చన పూజలు నిర్వహిస్తున్నారు.

ఇలా చేరుకోవచ్చు.. రాజమహేంద్రవరం, నిడదవోలు నుంచి పట్టిసీమ 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడ నుంచి పట్టిసీమకు బస్సు సౌకర్యం ఉంది. నది దాటేందుకు రేవులో లాంచి ఉంటుంది. జంగారెడ్డిగూడెం వైపు నుంచి వచ్చే వారు జంగారెడ్డిగూడెంలో దిగి అక్కడ పోలవరం బస్సు ఎక్కాలి. కన్నాపురం కూడలిలో దిగి ఆటోలపై కిలోమీటరు దూరంలోని పట్టిసీమ చేరుకోవాలి. అక్కడ ఆటోలు ఎప్పుడూ అందుబాటులో ఉంటాయి.

సాఫ్ట్ బాల్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

కామవరపుకోట, న్యూస్‌టుడే: సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించినట్లు సభ్యుడు మళ్ల రాజు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8, 9 తేదీల్లో గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఇందులో పీఈటీలు టి.శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు, ఎం.నాగేశ్వరరావు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఈత పోటీలకు..

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: స్థానిక అల్లూరి సీతారామరాజు సమీప బిశ్వనాథ్ భర్తియా ఈత కొలనులో ఆదివారం జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఉభయ జిల్లాల వ్యాప్తంగా సుమారు 70 మంది క్రీడాకారులు తరలివచ్చారు. ఫ్రీ స్టైల్, బ్రెస్ట్ స్ట్రోక్, బ్యాక్ స్ట్రోక్, బటర్‌ఫ్లై తదితర అంశాల్లో పోటీలు నిర్వహించగా.. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖ వేదికగా జరగనున్న పోటీల్లో క్రీడాకారులు ఉమ్మడి జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని సంఘ కార్యదర్శి ఐ.మల్లికార్జున్ తెలిపారు.

బడి సంచి బరువు తగ్గించి

వేగంగా రెండో సెమిస్టర్ పుస్తకాల అందజేత

పెనుగొండ, చింతలపూడి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎక్కువ పుస్తకాలతో బరువైన సంచి మోయడంతో అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. నిపుణుల సూచన మేరకు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు పుస్తకాల సంఖ్య తగ్గించాలని ప్రభుత్వం సెమిస్టర్ విధానం అమలు చేస్తోంది. ఏడాదికి రెండు సెమిస్టర్లు అందుబాటులోకి తెచ్చింది. మొదటి విడత పుస్తకాలు పాఠశాలల పునఃప్రారంభం రోజునే అందజేశారు. అప్పట్లో ప్రకటించినట్లే అక్టోబరులో రెండో విడత పుస్తకాలను అందజేశారు. అన్ని పాఠశాలల్లో వీటిని పంపిణీ చేస్తున్నారు. నీ జిల్లాలో మొత్తం పాఠశాలలు 1,710 ఉండగా.. 1,04,963 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాల పంపిణీ వేగంగా జరుగుతోంది. మొత్తం 2 లక్షలకు పైగా పుస్తకాలను ఆయా మండల కేంద్రాలకు పంపించారు.

మూడు సబ్జెక్టులు కలిపి రూపొందించిన ఆరో తరగతి పాఠ్య పుస్తకం

విద్యార్థులకు మేలు.. పుస్తకాల సంఖ్య తగ్గడంతో విద్యార్థులకు సంచి బరువు తగ్గుతుంది. రెండు, మూడు సబ్జెక్టులు కలిపి పుస్తకాలు రూపొందించడంతో విద్యార్థులకు మేలు. - సుధాకర్, డీవైఈవో

సెమిస్టర్ విధానంలో..

- 1, 2 తరగతులకు తెలుగు, ఆంగ్లం, గణితం కలిపి ఒక పుస్తకం, వర్క్‌బుక్ ఒకటి ఇచ్చారు.
- 3, 4, 5 తరగతులకు తెలుగు, ఆంగ్లం కలిపి ఒకటి, గణితం, పరిసరాల విజ్ఞానం కలిపి మరో పుస్తకం ఇచ్చారు.
- 6, 7, 8, 9 తరగతులకు తెలుగు, ఆంగ్లం, హిందీ కలిపి ఒకటి, జీవ, భౌతిక, రసాయన శాస్త్రాలు కలిపి మరొకటి, భూగోళం, చరిత్ర, అర్థ, పౌరశాస్త్రాలు కలిపి ఇంకో పుస్తకం ముద్రించారు. గతంలో ఈ పుస్తకాలు నాలుగు ఉండేవి.
- పదో తరగతి విద్యార్థులకు ఒకటే సెమిస్టర్ విధానాన్ని కొనసాగిస్తున్నారు.

శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్య క్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ ఆదివారం కొనసాగింది. కార్తిక మాసం, సెలవు రోజు కావడంతో భక్తులు వేల సంఖ్యలో తరలి వచ్చారు. అయ్యప్ప స్వామి మాలధారులు సైతం శ్రీవారి ఆలయాన్ని సందర్శించారు.

బాలికల ఆత్మరక్షణకు కరాటే

జిల్లాలో 208 పాఠశాలల ఎంపిక

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: బాలికల ఆత్మరక్షణ కోసం కరాటేలో శిక్షణ ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. బాలికల్లో మనోధైర్యం పెంపొందించడం, శరీర దారుఢ్యం, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, అవసరమైనప్పుడు తాము రక్షించుకునే నైపుణ్యాలు సాధించడమే లక్ష్యంగా 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రాశిక్షణ్' పేరుతో ఈ నూతన పథకం ప్రారంభిస్తున్నారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో బాలికలకు కరాటేలో శిక్షణ ఇచ్చే కార్యక్రమం పాఠశాలల్లో అమలు చేశారు. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం కరాటే శిక్షణను నిలిపివేసింది. ఈ మేరకు ఏలూరు జిల్లాలో మొత్తం 232 పాఠశాలలను ఎంపిక చేసి ఆయా పాఠశాలల్లోని బాలికలకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

20 తరగతులు.. ఆరు నుంచి ఇంటర్ చదువుతున్న బాలికలకు కరాటేలో రెండు నెలలు పాటు 20 తరగతులు నిర్వహించనున్నారు.

కరాటే శిక్షణ పొందుతున్న బాలికలు

ఒక్కో తరగతి 90 నిమిషాలు చొప్పున జరగనుంది. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా ఏలూరు జిల్లాలో ఎస్ఆర్ఆర్ ప్రాజెక్టు ద్వారా 55 పాఠశాలలు, రాణి రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఫౌండేషన్ ద్వారా 177 పాఠశాలలు బాలికలకు కరాటేలో శిక్షణ ఇవ్వనున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 208 పాఠశాలలను ఎంపిక చేయగా.. ఎస్ఆర్ఆర్ ప్రాజెక్టు ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు. దీనిపై ఏలూరు జిల్లా బాలికాభివృద్ధి అధికారిణి నవీన మాట్లాడుతూ.. పాఠశాలల ఎంపిక పూర్తయిందని, త్వరలోనే బాలికలకు కరాటేలో శిక్షణ ఇస్తామన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడి దుర్మరణం

ఉండి, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ఢీకొని మోపెడ్‌పై వెళ్తున్న వృద్ధుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఉండి ఎస్సై ఎండీ నసీరుల్లా అందించిన వివరాల మేరకు.. ఆకివీడులోని మాదివాడకు చెందిన గంధం రాఘవులు (72) వ్యవసాయం చేస్తుంటారు. మధుమేహంతో బాధపడుతున్న ఆయన భీమవరంలోని ఆయుర్వేద ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్నాడు. ఆదివారం ఉదయం భీమవరం వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకొని మధ్యాహ్నం తన మోపెడ్‌పై తిరుగు ప్రయాణమయ్యాడు. ఉండి నక్కారాజుగుంట ప్రాంతానికి వచ్చేసరికి 165 జాతీయ రహదారిపై వెనుక నుంచి ఏలూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా ఢీకొట్టి ప్రమాదానికి గురిచేశాడని ఎస్సై నసీరుల్లా తెలిపారు. సంఘటనా స్థలిలోనే రాఘవులు ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

కార్యక్రమంలో పాల్గొన్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో గార్మి షరీఫ్

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: గన్‌బజార్ ఫెన్షన్ మహల్ హజరత్ మహబూబ్ సుభాని మహాత్ములవారి జెండా చెట్టు వద్ద అహలే సున్నత్ వల్ జమాత్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గార్మి షరీఫ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్ములవారికి గంధం సమర్పించారు. జనాబ్ ముఫ్తి అబ్దుల్ అజీజ్ సాహెబ్ ప్రసంగించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జమాత్ గౌరవాధ్యక్షుడు ఎస్.ఎం.అక్బర్, అధ్యక్షుడు సాబీర్ హుస్సేన్, వ్యవహారాల కమిటీ అధ్యక్షుడు రాజా అహ్మద్, అంజుమన్ అధ్యక్షుడు ఎం.డి.ఆరిఫ్, ముస్లిం మైనార్టీ నాయకుడు కాలేషా తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆదిప్రసాద్

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనలతో ప్రజలను మోసం చేసి డబ్బులు దొంగలిస్తున్న కర్ణాటకకు చెందిన శరణప్ప గంగప్ప, కార్తిక్ ఉమాపతి, శశికుమార్, రుద్రప్ప, సతవాడ సందీప్‌లను అరెస్టు చేశామని సీఐ ఆదిప్రసాద్ వివరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నిందితులు రాష్ట్రంలోని వివిధ పట్టణాల లాడ్జిల్లో రిజిస్టర్లు దొంగిలించి వాటిలోని ఫోన్ నంబర్లు సేకరిస్తారు. తరువాత ఆ నంబర్లకు ఫోన్ చేసి సగం ధరకు బంగారం అమ్ముతాం అని చెప్పి, ప్రజలను ఒంటరి ప్రదేశాలకు రప్పించి నకిలీ బంగారం చూపి, తర్వాత వారిని చాకుతో బెదిరించి డబ్బులు తీసుకుని పారిపోతారని సీఐ తెలిపారు. ఈ ముఠా ఇటీవల పట్టణంలోని ఎంవీఆర్ లాడ్జి మేనేజర్ వీరా బత్తుల వెంకటరత్నాన్ని నమ్మించి రూ.నలభై వేలు తీసుకొని కత్తితో బెదిరించి పారిపోయారు. ఈ ఘటనలో దర్యాప్తు చేపట్టగా నిట్ సమీపంలో జాతీయ రహదారిపై ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,510 నగదు, చాకు, కారు, రిజిస్టర్లు స్వాధీనం చేసుకున్నామని, వారిని విచారించి మరో ఇద్దరు నిందితులను గుర్తించి అరెస్టు చేశామని సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, డీఎస్పీ డి.విశ్వనాథ్ ఎస్సైలు నాగరాజు, బాదం శ్రీను, సిబ్బందిని అభినందించారు.

ద్వారకాతిరుమలలో సినీ ఫక్కీలో చోరీ

నిద్రిస్తున్న వారిపై మత్తు మందు చల్లి.. బంగారు వస్తువుల అపహరణ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమలలోని ఓ ఇంట్లో సినీ ఫక్కీలో చోరీ జరిగింది. ఇంటిలో నిద్రిస్తున్న వారిపై మత్తు మందు స్ప్రే చేసి సుమారు 8 కాసుల బంగారు వస్తువులను దొంగిలించారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పోలుబోయిన లక్ష్మయ్య కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నారు. వారంతా శనివారం రాత్రి భోజనం చేసి నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి నిద్రపోతున్న వారిపై మత్తు మందు చల్లారు. వారు తీవ్ర మత్తులోకి వెళ్లగానే.. బీరువాలోని సుమారు 8 కాసుల బంగారు వస్తువులను చోరీ చేశారు. లక్ష్మయ్య, అతని భార్య ఉదయం నిద్రలేచేసరికి.. ఇంటి తలుపులు తీసి ఉండటం.. వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్ తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు.. స్వాములకు గాయాలు

కొత్తపేట, న్యూస్‌టుడే: అంతర్వేది, అప్పనపల్లి ఆలయాల దర్శనానికి వచ్చిన అయ్యప్ప మాలధారులు ప్రయాణిస్తున్న కారు ఆదివారం అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం గంటి గ్రామంలోని కాలువలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో పలువురు స్వాములకు గాయాలయ్యాయి. ఏలూరు మండలం రాఘవపురానికి చెందిన 14 మంది అయ్యప్ప స్వాములు, 8 మంది మహిళలు ఆలయాల దర్శనానంతరం బొలేరో వాహనంలో తిరిగి వెళ్తుండగా వాహనం అదుపుతప్పి కాలువలోకి దూసుకుపోయింది. ఐదుగురికి తీవ్ర గాయాలవగా మిగిలిన వారు సురక్షితంగా ఉన్నారు. గాయపడిన వారిని కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. దీనిపై ఏవిధమైన ఫిర్యాదు అందలేదని కొత్తపేట ఎస్సై సురేంద్ర తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

REAL ESTATE

HOUSE FOR SALE

ఏలూరు కొత్తపేట అడపావారి వీదిలో ఈస్ట్, వెస్ట్ ఫేస్ 125 గ॥ల్లో RCC బిల్డింగ్ అమ్మకమునకు కలదు. సంప్రదించండి. ✆ 81850 62325.

TO LET

COMMERCIAL

తణుకు పట్టణం వైపు ఉన్న రైల్వేగేటు వద్ద గల సురక్షా హాస్పటల్ ఎదురుగా వున్న భవనంలోని మొదటి అంతస్తులో గల 24 వందల SFT విస్తీర్ణం అద్దెకు ఇవ్వబడును. బ్యాంకులకు, ఆసుపత్రులకు, ఇతర వ్యాపార కార్యాలయాలకు ఉపయోగపడును. Cont: 88863 44499.

SECOND SALE

వాషింగ్‌మిషన్స్, LED TV లు, ఫ్రిజ్‌లు, ఇన్వర్టర్స్, AC లు లేటెస్ట్ మోడల్స్ తక్కువ వాడి ఫుల్ కండీషన్‌తో తక్కువ ధరలో అమ్మకము. ✆ 87121 68544.

JOBS

Immediate openings for Customer Service Executive & Branch Manager Positions in Cherukuri Group, Located in Eluru, Tanuku, Guntur & Vijayawada. Qual: Min Inter. ✆ 9885206666, E-mail: hr@cherukurigroup.org.

వామకుంట గ్రామం తిరువూరు (M) ఖమ్మం దగ్గర DTCP అప్రూవ్డ్ ప్లాట్స్ మార్కెటింగ్ చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. లేడీస్ & జెంట్స్. 9642223242.

రామకృష్ణ గ్రూప్ Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషెంట్ల సేవకు ఇంటిపని, వంటపని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు కావలెను. భో+వ+ జీతం: 16-18K ✆ 9704051122, 9010680011.

హైదరాబాద్ హోంకేర్‌లో ఏజెంట్లకు మంచి అవకాశం. వర్కర్స్‌ని పంపితే ప్రతినెలా 2వేలు కమీషన్. వర్కర్స్ జీ: 18k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 89775 47749.

భీమవరంలో పద్మప్రియ ఫైనాన్స్‌నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం+ఇన్సెంటివ్స్. ✆ 93924 88877, 99851 61166.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డ ధర

★ For the Information of Trade & Industry

★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.80 పైII

తణుకు ఆఫీసు: 08819-224254

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact

9000180626, 9989993175

పెర్కిపాలెంలో ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం

పెర్కిపాలెం (భీమవరం), న్యూస్‌టుడే: ఎన్ఎస్ఎస్ ద్వారా యువతకు సేవా భావం అలవడుతుందని వీరవాసరం ఎస్ఆర్కేబీవీ అండ్ ఎస్ఎస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి వి.దుర్గాప్రసాద్ అన్నారు. వీరవాసరం డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో పెర్కిపాలెంలో ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం నిర్వహించారు. ఆదివారం రెండో రోజు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలో మొక్కలు నాటారు.

సేవలు హర్షణీయం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం- తాడేరు రోడ్డులోని వృద్ధుల ఆశ్రమానికి నిత్యావసర సరుకులు, పండ్లు, రొట్టెలను భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు సతీమణి సత్యవాణి ఆదివారం అందజేశారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.ప్రశాంత్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

భీమవరం

•భీమవరం •ఉండి

అన్నదాత సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. నరసాపురం మండలం సీతారాంపురం సొసైటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం జరిగింది. మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మొంథా తుపాను నష్టాన్ని నియంత్రించేలా ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిచ్చాయన్నారు. తుపాను బాధితులు, ఉపాధి కోల్పోయి ఇబ్బంది పడుతున్న మత్స్యకారులకు ప్రభుత్వం చేయూతనిస్తోందన్నారు. మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

భీమవరం పట్టణం:	80085 74471	ఆకివీడు:	800085 74525
భీమవరం మండలం:	80085 74533	ఉండి:	80085 74526
పాలకోడేరు:	80085 74467	కాళ్ల:	94401 04042
వీరవాసరం:	80085 74475		

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ? పీపీరోడ్డు పొడవునా పైపులైను లీకేజీలున్నాయి. నీరు వృథాగాపోయి కలుషితమవుతోంది. వ్యాధుల ముప్పు పొంచి ఉంది. **- జి.శ్రీను, ప్రైవేటు ఉద్యోగి**

? పోలీసు బొమ్మ కూడలి నుంచి ఇండియన్ బ్యాంకు రోడ్డులో పైపులైను నుంచి నీరు డ్రెయిన్‌లోకి చేరుతోంది. **- రవికాంత్**

✔ పైపులైను లీకేజీలను వెంటనే అరికడతాం. **- పి.శ్రీనివాసరావు, ఎంఈ**

ఉండి, న్యూస్‌టుడే: ? వర్షం కురిస్తే ఉండి అడ్డరోడ్డు పంట సమీపంలో రాష్ట్రీయ రహదారిపై మురుగు నిలిచిపోతోంది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. **- వెంకటేశ్వరావు, వ్యాపార ఉద్యోగి**

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- కె.శ్రీహరిరావు, ఆర్అండ్‌బీ ఏఈ**

వీరవాసరం, న్యూస్‌టుడే: ? 165 జాతీయ రహదారి వెంబడి వీరవాసరం దంతులగొంది యార్డు సమీపంలో వ్యాపారులు చెత్త పారబోస్తున్నారు. కుక్కలు, కాకులు ఆ వ్యర్థాలను రహదారిపైకి ఈడ్చుకొస్తుండడంతో దుర్వాసన వస్తోంది. **- రాంబాబు**

✔ వ్యర్థాలను తొలగించేస్తాం **- కె.లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి, వీరవాసరం**

? దూసనపూడి మీదుగా ప్రయాణించే అడవికొలను పంట కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. **- ఆనందరావు**

✔ వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- జి.సత్యనారాయణ, జలవనరుల శాఖ ఏఈ, వీరవాసరం**

పాలకోడేరు, న్యూస్‌టుడే: ? పెన్నాడపాలెం ఆలయం వద్ద రోడ్డుపై వర్షం నీరు నిలిచిపోవడంతో తరచూ ఇబ్బందులు పడుతున్నాం. దోమలు, దుర్వాసన బాధలు అధికమయ్యాయి. **- ఎం.శ్రీనివాస్,**

✔చర్యలు తీసుకుంటాం. **- వెంకట్రాజు, కార్యదర్శి, పెన్నాడ అగ్రహారం**

మురుగు పారదు.. సమస్య తీరదు

ఇంకా వీడని మొంథా ముప్పు

న్యూస్‌టుడే, చినఅమిరం(భీమవరం గ్రామీణ): మొంథా తుపాను ప్రభావం ఇంకా కళ్లముందు కనబడుతూనే ఉంది. వర్షం కురిసిన ప్రతిసారి భీమవరం మండలంలోని పల్లపు ప్రాంతాలు ముంపు బారిన పడుతున్నాయి. మూడు రోజులుగా ఎండ కాస్తున్నా ఆనాటి ప్రాంతాల్లో చేరిన నీరు ఇంకా అలాగే ఉంది. ఎప్పుడు తొలగుతుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. దాని వల్ల వివిధ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

★ చినఅమిరం, రాయలం, తుందుర్రు, జేత...పూడి, తాడేరు, కొవ్వాడలో వరి పొలాలు ఎక్కువశాతం మునిగిపోయాయి. ఈ మండలంలో *5,984* వేల ఎకరాల్లో వరి వేయగా *3,340* వేల ఎకరాల్లో పంట నీట మునిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వెంపలో కొత్తపేట, పెదగరువు, నాగిడిపాలెం, దెయ్యాలతిప్ప, రామాయణపురం, గొల్లవాని తిప్ప, కొమరాడ, ఎల్ఐసీ పురం, గూట్లపాడు తదితర గ్రామాల్లోని ఆవాస ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. వీరవాసరంలో పలు పొలాలు, వీరవల్లిపాలెం, తోలేరు, మత్స్యపురి తదితర గ్రామాల్లోనూ పరిస్థితి దారుణంగా తయారైంది.

భీమవరం మండలంలోని ఇళ్ల ముందు నిలిచిన వర్షపునీరు

➡ ఇది భీమవరం మండలం దొంగపిండి నుంచి గుట్లపాడు వరకు ప్రధాన రహదారి. ర.భ.శాఖ ఆధ్వర్యంలో రూ. కోట్లతో అభివృద్ధి చేశారు. మూడు గ్రామాల్లోని ఆక్వా చెరువుల నీరు రోడ్డుపై చేరి కాలువలా మారింది. నాలుగు రోజులుగా ఇక్కడి పరిస్థితి దారుణంగా ఉంది.

నీరు తొలగిస్తున్నాం.. అన్ని పంచాయతీల్లో ప్రత్యేకంగా క్లోరినేషన్, పారిశుద్ధ్య నిర్వహణ పనులు ప్రారంభించాం. పల్లపు ప్రాంతాల్లో నీరు తొలగించే పనులు చేపట్టాం. **- రామాంజనేయప్రసాద్, పంచాయతీ విస్తరణాధికారి**

ప్రమాణస్వీకారం చేయిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే రామాంజనేయులు తదితరులు

రైతుల శ్రేయస్సుకు పాటుపడండి

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రైతుల అభివృద్ధికి పాటుపడాలని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. కొమరాడ సహకార పరపతి సంఘం నూతన కమిటీ అధ్యక్షుడు రాట్నాల సత్యనారాయణ, సభ్యులు మల్లుల పరమేశ్వరరావు, వర్రె గణేష్ ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. రాజకీయాలకతీతంగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని నాయకులు వారికి సూచించారు. ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, భాజపా జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రెండు దశాబ్దాలుగా అన్నప్రసాదం వితరణ

ఆహారం వడ్డిస్తున్న సంఘం అధ్యక్షుడు, కార్యదర్శులు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: సుమారు 20 ఏళ్లుగా అన్నప్రసాద వితరణ చేయడం సోమేశ్వరుడి ఆశీర్వాదమేనని జిల్లా రైస్ మిల్లర్ల సంఘాధ్యక్షుడు సామంతపూడి శ్రీరామరాజు ఆదివారం అన్నారు. కార్తిక మాసం సందర్భంగా పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వర జనార్దన స్వామి ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ప్రారంభించి ఆయన మాట్లాడారు. వెంకటసాయి రైస్ మిల్లు అధినేత అర్జంపూడి బాబూరావు, వెంకటలక్ష్మి పోలావతి దంపతులను ఆయన అభినందించారు. సంఘం జిల్లా కార్యదర్శి కొత్త శ్రీనివాస్, భీమవరం రైస్ మిల్లర్ల సంఘాధ్యక్షుడు చవాకుల నరసింహారావు, పోలిశెట్టి దాసు, వానపల్లి బాబూరావు, వేగేశ్న రాంబాబు, చెక్క సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న చిన్నారులు

అదరగొట్టేశారు..

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: కమ్మ సంక్షేమ సంఘం కార్తిక వనసమారాధన ఆదివారం భీమవరంలో ఘనంగా నిర్వహించారు. కమ్మ సేవా సమితి పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నృత్యాలతో చిన్నారులు అదరగొట్టారు. సినీ పాటలకు అనుగుణంగా స్టెప్పులు వేశారు. బాలల నృత్యాలతో ఆ ప్రాంగణం హోరెత్తింది. మహిళలకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కమిటీ సభ్యులు కొడాలి రమేష్, సబ్బిన శ్రీనివాస్, బొల్లెంపల్లి సంజయ్‌కుమార్, అబ్బూరి శ్రీనివాస్, గొడవర్తి మురళీకృష్ణ, మునగాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వనసమారాధన.. **పాతాళ్లమెరక(కాళ్ల), న్యూస్‌టుడే:** కాళ్ల మండలం పాతాళ్లమెరకలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వనసమారాధన నిర్వహించారు. ముందుగా ఉసిరి చెట్టుకు పూజలు చేసి పలు రకాల పిండివంటలతో నైవేద్యం సమర్పించారు. గ్రామస్థులు, దాతల సహకారంతో పెద్దఎత్తున నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచి కంతేటి శ్రీనివాసరాజు, ఉపసర్పంచి సుబ్బరాజు, ప్రసాదరాజు పాల్గొన్నారు.

వందేమాతరం గేయానికి 150 ఏళ్లు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: వందేమాతరం గేయానికి ఈ నెల 7 నాటికి 150 ఏళ్లు పూర్తవుతుందని.. ఈ సందర్భంగా 5 రోజులపాటు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు విజ్ఞాన వేదిక కన్వీనర్ రంగసాయి ఆదివారం తెలిపారు. వెంకట్రామ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్విట్ ఇండియా స్తూపం వద్ద జరిగే ముగింపు వేడుకలో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. అరసవల్లి సుబ్రహ్మణ్యం, కొండ్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరంలో కొల్లా భాస్కరమ్మ వీరరాఘవులు స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో పాలకొల్లు లయన్స్ కంటి ఆసుపత్రి సిబ్బంది గ్రామంలోని కొల్లా ట్రస్ట్ ఆసుపత్రి వద్ద ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వ్యాపారవేత్త కొల్లా శ్రీహరి కుటుంబ సభ్యులు ప్రారంభించారు. 225 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా 105 మందికి ఉచితంగా కళ్లజోళ్లు, 72 మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయిస్తామని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు కొల్లా రాము, మద్దాల గోవిందమ్మ, లయన్స్ కంటి ఆసుపత్రి మేనేజర్ అల్లూరి లక్ష్మీపతిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల కార్యవర్గం ఎంపిక

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) భీమవరం మండల శాఖ కార్యవర్గాన్ని ఆదివారం ఎంపిక చేశారు. ఏఆర్‌కేఆర్ పురపాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా కె.ఎస్.జి.కె.రాజు, కార్యదర్శిగా ఎ.సూర్యనారాయణ, కోశాధికారిగా పి.శ్రీనివాసరావు, అదనపు కార్యదర్శిగా వి.లెనిన్ బాబు, మహిళా కన్వీనర్లను ఎంపిక చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.దావీదు, జిల్లా ఆర్థిక కార్యదర్శి పి.వి.దుర్గాప్రసాద్, జిల్లా గౌరవాధ్యక్షుడు ఉంగరాల బ్రహ్మానందం పాల్గొన్నారు.

తూతూమంత్రంగా సివిల్ రైట్స్ డే

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: సివిల్ రైట్స్ డేని అధికారులు తూతూ మంత్రంగా నిర్వహించడం తగదని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు అన్నారు. భీమవరం పట్టణంలోని ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బత్తుల విజయ్ కుమార్ అధ్యక్షతన కేవీపీఎస్ జిల్లా సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు మాట్లాడుతూ జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సుల ప్రకారం ప్రతినెలా చివరి రోజు మండలంలోని ఒక గ్రామంలో అన్ని సామాజిక వర్గాలతో సివిల్ రైట్స్ డే నిర్వహించాలని సూచించినట్లు తెలిపారు. సమావేశాలకు కొందరు అధికారులు నామమాత్రంగా హాజరవుతున్నారన్నారు. దిగుపాటి రాజ్‌గోపాల్, చిన్నం నాగేశ్వరరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చరూ..

భీమవరం నుంచి లోసరి వెళ్లే ప్రధాన రహదారి బర్రెవానిపేట గ్రామ పరిధిలో గుంతలు పడి దారుణంగా తయారైంది. ఇటుగా ప్రయాణం నరకంగా మారిందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. దీనిపై ర.భ.శాఖ ఏఈ రాజశేఖర్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా త్వరలో గుంతలు పూడ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. **- న్యూస్‌టుడే, భీమవరం గ్రామీణ**

బీచ్‌లో పోలీసు బందోబస్తు

రక్షణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో దాసి రాజు

మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెంసౌత్, కేపీపాలెం సౌత్‌లలో బీచ్‌కు ఆదివారం పర్యాటకులు రాకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సముద్ర అలలు ప్రమాదకరంగా ఉండటంతో వారం రోజులుగా బీచ్‌కు పర్యాటకులను అనుమతించడం లేదు. రహదారులకు అడ్డుగా బారికేడ్లు ఏర్పాటు చేసి ఎస్సైలు జి.వాసు, వై.నాగలక్ష్మిల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గస్తీ నిర్వహించారు. ఆర్డీవో దాసి రాజు బీచ్‌ను సందర్శించి బందోబస్తు విధులపై సంతృప్తి వ్యక్తం చేశారు.

విలువలకు ప్రతిరూపం ఎర్రన్నాయుడు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ, ఉన్నత విలువలకు ప్రతి రూపంగా రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన ప్రజానాయకుడు ఎర్రన్నాయుడని వక్తలు కొనియాడారు. ఏపీ భవన, ఇతర కార్మికుల బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జి ఆధ్వర్యంలో ఆదివారం పోలీస్ ఐలాండ్ కూడలిలో ఎర్రన్నాయుడి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఆరోగ్యం.. ఆహ్లాదం..

పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లపై శ్రద్ధ

ఆకివీడు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలు పచ్చదనంతో కళకళలాడేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకుంటున్నారు. 2014-19లో తెదేపా పాలనలో కిచెన్ గార్డెన్స్ కు పెద్దపీట వేశారు. గత వైకాపా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోగా పూర్తిగా నీరుగార్చింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ఉండి, భీమవరం నియోజకవర్గాల్లోని అనేక పాఠశాలల్లో ప్రత్యేక శ్రద్ధతో కిచెన్ గార్డెన్స్ నిర్వహిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో తూతూమంత్రంగా కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల ఏర్పడిన వాతావరణం మొక్కల పెంపకానికి అనుకూలంగా ఉంది. ఆ దిశగా అడుగులేయాలని పలువురు సూచిస్తున్నారు.

పెదకాపవరం ఉన్నత పాఠశాలలో తోటకూర సేకరిస్తున్న విద్యార్థినులు

వనాల పెంపకం.. ప్రకృతి సేద్యంతో పెరటితోటల పెంపకానికి అనువుగా పాఠశాల ప్రాంగణంలో కొంత స్థలంలో తోటకూర, గోంగూర, పాలకూర తదితర ఆకుకూరలు.. బెండ, వంకాయ, బీర, దొండ, సొరకాయ సాగు చేస్తున్నారు. వాటితోపాటు పలు పాఠశాలల్లో జామ, బత్తాయి, నేరేడు, మామిడి, సపోట, బొప్పాయి తదితర పండ్ల మొక్కలు పెంపకం చేపట్టారు. ఈ వనాలను పర్యవేక్షించడానికి ఎకో క్లబ్ పేరుతో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కూడిన కమిటీలను ఏర్పాటు చేశారు.

ఇదీ లక్ష్యం.. మార్కెట్లో కొనుగోలు చేసి తెచ్చే కూరగాయలన్నీ పురుగు మందులు, ఎరువులతో కూడిన అవశేషాలతో నిండిపోతున్న విషయం తెలిసిందే. అలా కాకుండా సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలను మధ్యాహ్న భోజనంలో వండి అందిస్తే విద్యార్థులకు పోషకాలు అందుతాయనేది ప్రభుత్వ ఉద్దేశం. దీంతోపాటు విద్యార్థి దశ నుంచి మొక్కల పెంపకంపై అవగాహన కలుగుతుంది. పాఠశాలలో ఆరోగ్యకరమైన ఆహ్లాదకర వాతావరణ నెలకొంటుంది. అన్ని పాఠశాలల్లో తప్పకుండా కిచెన్ గార్డెన్స్ నిర్వహించేలా కృషి చేస్తామని ఎంఈవో ఎ.రవీంద్ర తెలిపారు.

ప్రమాదకరంగా పరివర్తకాలు

తక్కువ ఎత్తులో వరుసగా ఇలా..

రక్షణ లేకుండా ఫ్యూజ్ బాక్స్

ఆకివీడు ఆనాల చెరువు సమీపంలో రహదారి పక్కన వరుసగా ఉన్న మూడు విద్యుత్తు పరివర్తకాలు తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నాయి. వాటికి ఏర్పాటు చేసిన తీగలు, ఫ్యూజ్ బాక్సులకు రక్షణ చర్యలు ఏర్పాటు చేయలేదు. వాటిని ఆనుకొని ఆంజనేయ స్వామి ఆలయం ఉంది. అదే ప్రాంతంలో రహదారి ఇరుకుగా ఉంది. మలుపులు కూడా ఉన్నాయి. అటుగా రోజూ అధిక సంఖ్యలో విద్యార్థులు, భక్తులు, స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న ఈ పరివర్తకాలను వేరేప్రదేశానికి మార్చి రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఆకివీడు**

నిత్యాన్నదాన పథకానికి విరాళం

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: మావుళ్లమ్మ ఆలయంలో శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రూ. 50 వేలు విరాళం ఆదివారం సమకూరింది. చినఅమిరానికి చెందిన సింగంశెట్టి వెంకటచైతన్య, లక్ష్మీ దంపతులు నగదు అందించారని ఆలయాధికారి బి.ఎం.నగేష్ తెలిపారు. వారితో ప్రధానార్చకుడు మల్లికార్జునశర్మ ప్రత్యేక పూజలు చేయించి శేషవస్త్రం అందించారు. ఆలయాధికారి అమ్మవారి చిత్రపటం, రసీదు, ప్రసాదం అందించారు.

కొవ్వొత్తులతో ప్రదర్శన

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: కాశీబుగ్గ మృతులకు నివాళులర్పిస్తూ వైకాపా ఆధ్వర్యంలో భీమవరంలో ఆదివారం కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. మృతులకు నివాళులర్పించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి చినిమిల్లి వెంకట్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

వామ్మో... వాండ్రం రహదారి

బొండాడ మేజర్ డ్రెయిన్ గట్టుపై పడేసిన వ్యర్థాలు

ఉండి, న్యూస్‌టుడే: ఉండి నుంచి వాండ్రం మీదుగా కాళ్ల మండలంలోని కోపల్లె గ్రామానికి వెళ్లే ఆర్ అండ్‌బీ రహదారి అత్యంత దయనీయంగా మారింది. ఉండితో పాటు సమీప ప్రాంతాల్లో సేకరిస్తున్న చెత్తను వివిధ వాహనాల్లో తీసుకొచ్చి బొండాడ మేజర్ డ్రెయిన్ గట్లపై పారబోస్తున్నారు. తాగిపడేసిన కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ సంచులు, థర్మాకోల్ పెట్టెలు, చెట్ల కొమ్మలు తదితర వ్యర్థాలతో ఈ ప్రాంతం అపరిశుభ్రంగా తయారైంది. వాండ్రం రైల్వే గేటుకు కూతవేటు దూరం వరకూ ఇదే రీతిలో ఉంటోందని స్థానికులు వాపోతున్నారు. ఎన్నార్పీ అగ్రహారం గ్రామ పరిధిలో వ్యవసాయ భూముల్లోని మురుగునీరు ఈ రహదారి అంచులపైకి పొంగిపొర్లుతోంది. వర్షపు నీరు బొండాడ మేజర్ డ్రెయిన్‌లోకి దిగకుండా చెత్త గుట్టలు అవరోధంగా మారుతున్నాయని రైతులు చెబుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ సమస్య తీవ్రరూపం దాలుస్తోందని పలువురు ఆవేదన చెందుతున్నారు. దీనిపై డ్రెయినేజీ శాఖ ఏఈ జయప్రకాశ్ స్పందిస్తూ మురుగు కాలువ గట్ల సంరక్షణకు తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాబూరావుకు నివాళి

జోహార్లు అర్పిస్తూ..

వీరవాసరం, న్యూస్‌టుడే: కార్మికోద్యమ నేత చింతకాయల బాబూరావు మృతికి వీరవాసరం మండల సీఐటీయూ నాయకులు ఆదివారం నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.ఆంజనేయులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: చింతకాయల బాబూరావు మృతి సీపీఎంకు తీరని లోటని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఇంజేటి శ్రీనివాస్ పేర్కొన్నారు. తోకతిప్పలో బాబూరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొడ్డు లక్ష్మీపతి, శుభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

సుబ్బారావుపేట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం వాసవి క్లబ్ సౌజన్యంతో సుబ్బారావుపేటలోని గుణ్ణం వేణుగోపాల్ ఫంక్షన్ హాలులో రాష్ట్ర స్థాయి ఓపెన్ చదరంగ పోటీలు ఆదివారం ఘనంగా జరిగాయి. 18 జిల్లాల నుంచి 226 మంది పాల్గొన్నారు. భాజపా నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, జనసేన నాయకుడు బొలిశెట్టి రాజేష్, ఆంధ్ర క్లబ్ అసోసియేషన్ ఛీఫ్ అడ్వైజర్ కేవీవీ శర్మలు పోటీలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. చెస్ అకాడమి నిర్వాహకుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ పోటీల్లో ఓపెన్ కేటగిరిలో 5, ఏడు రౌండ్లలో 20 మంది మొత్తంగా 25 మంది విజేతలు ఈ నెల 22న విజయవాడలో నిర్వహించే ఆలిండియా 1800 రేటింగ్ లోపు పోటీల్లో పాల్గొంటారన్నారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి అనిల్, పవన్ గుప్త, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఫణికుమార్, బ్లూమ్స్ ఆంగ్లమాధ్యమ పాఠశాలల డైరెక్టర్ దుర్గాప్రసాద్, న్యాయనిర్ణేతలు కిరణ్ కుమార్, ప్రసాద్, రాంబాబు, అరవింద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జూద శిబిరాలపై దాడి

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు సంతమార్కెట్ ప్రాంతంలో, ధర్మాపురం అగ్రహారంలో నిర్వహిస్తున్న జూద శిబిరాలపై ఆకివీడు పోలీసులు ఆదివారం దాడి చేశారు. మొత్తం 10 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.12,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై రెండు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

పంట కాలువలోకి చచ్చిన చేపలు

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వ్యక్తులు చచ్చిన చేపలు (గొరకల్ని) తీసుకొచ్చి భీమవరం మండలం గూట్లపాడురేవు-తోకతిప్ప మధ్య లోసరి పంట కాలువలో పారబోశారు. దీంతో నీరు కలుషితమవడమే కాకుండా ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దీనికి కారణమైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. విషయం తెలియక ఈ నీటిని పంచాయతీ మంచి నీటి చెరువుల్లోకి నింపారని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తీర్థం స్వీకరిస్తున్న రామరాజు, నాగరాజు

రాయనివానిగూడెంలో మహాపడి పూజ

యండగండి (ఉండి), న్యూస్‌టుడే: రాయనివానిగూడెంలో అయ్యప్ప స్వాముల మహాపడి పూజ వైభవోపేతంగా నిర్వహించారు. తెదేపా నాయకుడు కాలా మల్లేశ్వరరావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో తొలుత గణపతి హోమం, కలశ పూజ, మహాపడి పూజ చేశారు. గురుస్వామి విజయ్‌తోపాటు అయ్యప్ప స్వాములు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజుతోపాటు పలువురు ప్రముఖులు పూజల్లో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో క్షీరాబ్ది ద్వాదశి వేడుక.. **ఉండి, న్యూస్‌టుడే:** కార్తిక మాసం క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా ఉండి కొత్తపేటలోని రాధా మదన మోహనస్వామి ఆలయంలో క్షీరాబ్ది ద్వాదశ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ చైతన్య మందిరంలో స్వామిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేదపండితులతో అభిషేకాలు చేయించారు. ఆలయ ముఖ మండలంలో ఉసిరి చెట్టును ఉంచి పూజలు చేశారు. స్వామివారి మహాప్రసాద వితరణ చేపట్టామని ఆశ్రమ ఇన్‌ఛార్జి శ్రీపాద కృష్ణస్వామి తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉండి : మదన మోహనస్వామి ఆలయంలో పూజలు

ఆకివీడు, న్యూస్‌టుడే: రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. భక్తులు ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించారు.

పాలకోడేరు, న్యూస్‌టుడే: మోగల్లులోని భద్రకాళీ సమేత భీమేశ్వరస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో.. **మాలవానితిప్ప(కాళ్ల), న్యూస్‌టుడే:** గ్రామ సుభిక్షం కోసం సర్పంచి సాగిరాజు సుబ్బరాజు కుటుంబ సభ్యులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో సహస్రనామ లింగార్చన, దీపాలంకరణ, కార్తిక దీపోత్సవం అనంతరం గంగా హారతి నిర్వహించారు. పెద్దఎత్తున గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి కల్యాణం.. **ఆకివీడు, న్యూస్‌టుడే:** ఆకివీడు సాలిపేట ప్రాంతంలోని వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఉదయం అధిక సంఖ్యలో మహిళలు బిందెలతో పసుపు నీళ్లు తీసుకొచ్చి స్వామికి అభిషేకం చేశారు.

వైభవోపేతం.. తెప్పోత్సవం

కాళ్లకూరు(కాళ్ల), న్యూస్‌టుడే: కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి శ్రీవారి తెప్పోత్సవం కనులపండువగా సాగింది. స్వామిని పుర వీధుల్లో శేషవాహనంపై ఊరేగింపుగా పద్మావతి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై ఉంచారు. బాణసంచా వెలుగులు, వేదమంత్రాల నడుమ గోవింద నామస్మరణతో ఊరేగించారు. ఉప సభాపతి రఘురామకృష్ణరాజు తనయుడు భరత్ ప్రత్యేక పూజలు చేశారు.

పంచారామ భక్తులకు అల్పాహారం.. **భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** గునుపూడి గ్రామ దేవత ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ ఆలయం వద్ద పంచారామ క్షేత్రం గునుపూడి సోమేశ్వర జనార్దన స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఆదివారం రాత్రి అల్పాహారం పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ భీమనాథం వీరశేషారావు, సభ్యుల ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మందికి ఆది, సోమవారాల్లో అల్పాహారం ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయాభివృద్ధి సంఘం సభ్యులు తెలిపారు.

(c) eenadu

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

ట్రాఫిక్ కష్టాల నుంచి ఊరట

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణంలో ట్రాఫిక్ రద్దీ కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తీరుపై 'ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి!' శీర్షికతో ఆదివారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై సీఐ రజనీకుమార్ స్పందించారు. లాకుల కూడలిలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్నట్లు గుర్తించి ఆ ప్రాంతంలో తాత్కాలిక విభాజకాలను ఏర్పాటు చేయించారు. తక్కువ స్థలంలో వీటిని ఏర్పాటు చేయడంతో రహదారికి ఇరువైపు కొంతమేర ఖాళీ ఏర్పడి ట్రాఫిక్ ఇబ్బందుల నుంచి కాస్త ఊరట లభించింది.

ఈనాడు కథనానికి స్పందన

రహదారిపై తాత్కాలిక విభాజకాలు ఏర్పాటు చేయిస్తున్న సీఐ

సూర్య భగవానుడికి అభిషేకాలు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురంలో వశిష్ఠ గోదావరి తీరాన ఉన్న బాపు ఘాట్ వద్ద సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పంచ హారతులు ఇచ్చారు.

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు సర్వోదయపురంలో ఉన్న సూర్య దేవాలయంలో అభిషేకాలు నిర్వహించారు. స్వామిని ఆభరణాలు, తులసి, పుష్పమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు.

పాలకొల్లు: అలంకరణలో స్వామివారు

గోకర్ణేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన

యలమంచిలి, న్యూస్‌టుడే: యలమంచిలి మండలం గుంపర్రులో కొలువైన సర్వమంగళ పార్వతీ సమేత గోకర్ణేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం లక్షపత్రి పూజను వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయ ప్రదక్షిణ, గణపతి పూజ, ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పంచారామ క్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వర స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. స్థానిక రేపాకవారి సత్రంలో భక్తులకు అన్నసమారాధన చేశారు.

గంగాలమ్మకు నైవేద్యాల సమర్పణ

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ఎల్బీచర్లలో కొలువైన గంగాలమ్మ ఆదివారం విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

మొగల్తూరు, న్యూస్‌టుడే: ముత్యాలపల్లిలో కొలువైన బంధీముత్యాలమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

సైకిళ్లపై శబరిమల యాత్ర

పోడూరు, పాలకొల్లు సాంస్కృతికం, న్యూస్‌టుడే: పాలకొల్లుకు చెందిన అయ్యప్ప మాలధారణ భక్తులు కన్నా రవి కుమార్, గంటా దుర్గారావు ఆదివారం సైకిళ్లపై శబరిమల యాత్రకు బయలుదేరారు. వీరు నరసాపురం రహదారిలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు చేయించుకుని యాత్ర ప్రారంభించారు. సుమారు 1,350 కిలోమీటర్ల యాత్రను 13 రోజుల్లో పూర్తిచేస్తామని, మార్గం మధ్యలో ఆలయాల్లో బస చేస్తామని వారు చెప్పారు.

వైభవోపేతం.. తెప్పోత్సవం

కాళ్లకూరు(కాళ్ల), న్యూస్‌టుడే: కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి శ్రీవారి తెప్పోత్సవం కనులపండువగా సాగింది. స్వామిని పుర వీధుల్లో శేషవాహనంపై ఊరేగింపుగా పద్మావతి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై ఉంచారు. బాణసంచా వెలుగులు, వేదమంత్రాల నడుమ గోవింద నామస్మరణతో ఊరేగించారు. ఉప సభాపతి రఘురామకృష్ణరాజు తనయుడు భరత్ ప్రత్యేక పూజలు చేశారు. కూటమి నాయకులు, చుట్టు పక్క గ్రామాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పరికరాలతో సరి.. నీళ్లేవి మరి!

అలంకార ప్రాయంగా ఆర్వో యూనిట్లు

పెనుగొండ, పోడూరు, నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: అంగన్‌వాడీల్లో విద్యాబుద్ధులు నేర్చుకొనే చిన్నారులకు శుద్ధి జలాలు అందించాలనే యోచనతో ప్రభుత్వం ఆర్వో పరికరాలను సమకూర్చింది. కానీ వీటిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అలంకార ప్రాయంగా మారాయి. అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో పలు కేంద్రాలకు గతేడాది, ఈ ఏడాది మార్చిలో ఆర్వో యూనిట్లు అందించారు. కొన్ని చోట్ల నీటి సరఫరా లేక, మరికొన్ని కేంద్రాల్లో పైపులైన్ల అమరిక పనులు చేసే అవకాశం లేకపోవడంతో ఇవి వృథాగా మారాయి.

● పోడూరు మండలం గుమ్మలూరు శివారు రావి గొప్పు అంగన్‌వాడీ కేంద్రంలో నీటి శుద్ధి పరికరం ఇలా నిరుపయోగంగా మారింది. ఈ కేంద్రానికి ట్యాంకు లేకపోవడంతో ఆర్వో పరికరానికి ఈ పరికరానికి నీరు సరఫరా అయ్యే పైపులు అమర్చలేదు. చిన్నారులు ఇళ్ల నుంచి సీసాలతో నీటిని తెచ్చుకుని తాగుతున్నారు.

ఇదీ పరిస్థితి..

● నరసాపురం మండలంలో 89 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 37 కేంద్రాలకు ఏడాది కిందట ఆర్వో యూనిట్లను ప్రభుత్వం అందించింది. పలు కేంద్రాల్లో ఈ పరికరాలు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో చిన్నారులు ఇళ్ల నుంచి తాగునీటిని తెచ్చుకుని తాగుతున్నారు. ● పెనుగొండలో 8వ నంబరు అంగన్‌వాడీ కేంద్రంలో యంత్రం మరమ్మతులకు గురైంది. దీంతో కుళాయి నీటినే పిల్లలకు అందిస్తున్నారు. కొఠాలపర్రులో 143వ నంబరు కేంద్రంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

ప్రాజెక్టు	కేంద్రాలు	ఆర్వో యూనిట్లు
పెనుమంట్ర	211	67
పాలకొల్లు	258	110

త్వరలోనే వినియోగంలోకి: ఈ అంశంపై ఐసీడీఎస్ పెనుమంట్ర సీడీపీవో కృష్ణకుమారి స్పందిస్తూ నీటిశుద్ధ యంత్రాల మరమ్మతులు, నిర్వహణకు నిధులు మంజూరయ్యాయని.. త్వరలోనే వాటిని అందుబాటులోకి తెస్తామని వివరించారు.

నేడు రెండు గ్రామాల్లో 'పల్లె పల్లెకు మన పితాని'

పోడూరు, న్యూస్‌టుడే: 'పల్లె పల్లెకు మన పితాని' కార్యక్రమాన్ని పోడూరు, కవిటం గ్రామాల్లో సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బీఎస్ఎల్ మంగా కుమారి తెలిపారు. స్థానిక ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లవచ్చన్నారు. మండల స్థాయి అధికారులంతా ఈ కార్యక్రమానికి విధిగా హాజరు కావాలని సూచించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు జిల్లాల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బీఆర్ఎంవీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆ సంస్థ కోఆర్డినేటర్ భూపాల్ మహిళల భద్రత, రక్షణ చట్టాలు, మానవ అక్రమ రవాణా నిరోధంపై అవగాహన కల్పించారు. చరవాణి, ఆన్‌లైన్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రావు, యూన్లీ లక్ష్మీబాయి, ఆర్ భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన కూరగాయల ధరలు

పెనుగొండ గ్రామీణ, పెనుమంట్ర, న్యూస్‌టుడే: గత వారంతో పోలిస్తే కూరగాయల ధరలు స్వల్పంగా పెరిగినట్లు పెనుగొండ మండలం దొంగరావిపాలెంలోని హోల్‌సేల్ మార్కెట్ వ్యాపారులు తెలిపారు. ఆదివారం నాటి ధరలు (10 కిలోలకు రూపాయల్లో) ఇలా ఉన్నాయి. దొండ- 300, దోస- 250, నల్ల వంకాయ- 700, తెల్ల వంకాయ- 700, బెండ- 600, నాటు చిక్కుడు- 800, బీట్‌రూట్- 500, క్యారెట్- 500, బంగాళాదుంప- 300, పచ్చిమిర్చి- 230, క్యాబేజీ- 300, ముల్లంగి- 700, ఉల్లి- 250 నుంచి 300, టామాటా (25 కిలోల ట్రే)- 600.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. నరసాపురం మండలం సీతారాంపురం సొసైటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం జరిగింది. మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మొంథా తుపాను నష్టాన్ని నియంత్రించేలా ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాన్నిచ్చాయన్నారు. తుపాను బాధితులు, ఉపాధి కోల్పోయి ఇబ్బంది పడుతున్న మత్స్యకారులకు ప్రభుత్వం చేయూతనిస్తోందన్నారు. మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. సహకార సంఘం పాలకవర్గాలు రైతుల అభ్యున్నతే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, డీసీఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ, ఏఎంసీ ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, సీపీఐ రాష్ట్ర నాయకుడు నెక్కంటి సుబ్బారావు, మాజీ ఎమ్మెల్యే అంగర రామమోహన్, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు, కొత్తపల్లి జానకీరామ్, మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, మత్స్యకార సహకార సంఘాల జిల్లా అధ్యక్షుడు మైల వసంతరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి నిమ్మల

తుపాను బాధితులకు చేయూత

పాలకొల్లు, న్యూస్‌టుడే: యలమంచిలి మండలం లక్ష్మీపాలెం, గంగడపాలెం గ్రామాల్లో తుపాను బాధితులకు బియ్యం, నిత్యావసరకులను మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం పంపిణీ చేశారు. తనను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజల కోసం రోజుకు 18 గంటల పాటు శ్రమిస్తున్నట్లు మంత్రి తెలిపారు. నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, ఆరిమిల్లి చిన్ని, బెజవాడ శ్రీను, కడలి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

తీరంలో పోలీసు బందోబస్తు

మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెంసౌత్, కేపీపాలెంసౌత్‌లలో బీచ్‌కు ఆదివారం పర్యాటకులు రాకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సముద్ర అలలు ప్రమాదకరంగా ఉండటంతో వారం రోజులుగా బీచ్‌కు పర్యాటకులను అనుమతించడం లేదు. రహదారులకు అడ్డుగా బారికేడ్లు ఏర్పాటు చేసి ఎస్సైలు జి.వాసు, వై.నాగలక్ష్మిల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గస్తీ నిర్వహించారు. ఆర్డీవో దాసి రాజు బీచ్‌ను సందర్శించి బందోబస్తు విధులపై సంతృప్తి వ్యక్తం చేశారు.

రక్షణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో రాజు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం	80085 74504	ఆచంట	90631 44737
పాలకొల్లు	80085 74510	పెనుగొండ	80085 74469
పోడూరు	90631 44741	పెనుమంట్ర	91212 29087

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? దేవునితోట ప్రాంతంలో డ్రెయిను పూడిపోయి మురుగు రహదారిపైకి చేరుతోంది. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. - కోటేశ్వరరావు, నరసాపురం

✔ చర్యలు తీసుకుంటాం. - ఎం.అంజయ్య, పురపాలక కమిషనర్

నరసాపురం, న్యూస్‌టుడే: ? పార్కు రోడ్డులో రహదారి పక్కన చెత్త పేరుకుపోయింది. ఆ ప్రాంతంలో వ్యర్థాలు చెల్లాచెదురై పారిశుద్ధ్యం క్షీణిస్తోంది. - కె.రమేశ్, నరసాపురం

✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి చెత్త ఆ తరలింపు పనులు చేయిస్తాం. - జీవీవీఎస్ పాత్రుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

మొగల్తూరు, న్యూస్‌టుడే: ? కేపీపాలెం సౌత్‌లో జంగిల్ ఛానల్ గట్టుపై చెత్త వేస్తున్నారు. వ్యర్థాలు దిగువకు చేరి జలాలు కలుషితమవుతున్నాయి. - నాగాంజనేయులు, స్థానికుడు

✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - ఎం.నవీన్‌కిరణ్, డిప్యూటీ ఎంపీడీవో

పెనుగొండ, న్యూస్‌టుడే: ? మునమర్రులోని పలు ప్రాంతాల్లో మురుగు నిలిచిపోవడంతో దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నాం. - ఎ.శేఖర్‌బాబు, స్థానికుడు

✔ డ్రెయిన్లను శుభ్రం చేయించి దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తాం. - టి.సూర్యనారాయణమూర్తి, ఎంపీడీవో

స్పందనకు వందనం

వీధి దీపాలకు మరమ్మతులు.. పెనుగొండ, న్యూస్‌టుడే: చెరుకువాడ పరిధి కుమ్మరవారి వీధి ప్రాంతంలో వీధిదీపాల సమస్యపై గత నెల 30న 'ఈనాడు- మేమున్నాం..మీకు తోడుగా'లో ప్రచురితమైన వార్తకు సర్పంచి నక్కా శ్యామలసోని, ఎంపీడీవో టి.సూర్యనారాయణ మూర్తి స్పందించి మరమ్మతులు చేయించారు.

గీత వృత్తి పరిరక్షణకు అఖిలపక్షం మద్దతు

తణుకు, న్యూస్‌టుడే: గీత వృత్తి పరిరక్షణ అఖిలపక్షం మద్దతివ్వడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక అమర వీరుల భవనంలో ఆ సంఘం జిల్లా కమిటీ అధ్యక్షులు కామన మునిస్వామి అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం గీత కార్మికుల పట్ల వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతున్న ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు పాల్గొని గీత వృత్తి కాపాడేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. వైకాపా పట్టణ అధ్యక్షుడు శేషగిరి, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు నాగరాజు, వైకాపా లీగల్ సెల్ అధ్యక్షుడు సాయిబాబారెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్‌తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నరసింహమూర్తి

వైకాపా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన భక్తుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ పాలకొల్లులో వైకాపా ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల శ్రీహరిగోపాలరావు(గోపి) మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. నాయకులు యడ్ల తాతాజీ, నడపన గోవిందరాజుల నాయుడు, చెల్లెం ఆనందప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ.. పోడూరు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో మంజూరైన 17 వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్మించి నిర్వహించాలని వైకాపా నాయకులు ఆదివారం పోడూరు శివారు చంద్రరాజుచెరువులో సంతకాల సేకరణ చేపట్టారు.

చెట్టు కూలి.. గుంత మిగిలి!

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: వడలి- పెనుగొండ ప్రధాన రహదారిలో పంట కాలువను ఆనుకుని ఉన్న నిద్రగన్నేరు వృక్షం ఇటీవల కూలిపోయింది. కొందరు ఈ చెట్టును తొలగించి కలప తరలించుకెళ్లారు. కానీ అక్కడ ఏర్పడిన భారీ గుంతను పూడ్చకుండా వదిలేశారు. దీని వల్ల రాత్రి వేళ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రేవు దారి.. రూపు మారి!

యలమంచిలి మండల కేంద్రంలో గోదావరి రేవు మార్గానికి వెళ్లే అనుసంధాన మార్గం ఇటీవల వర్షాలకు ఇలా అధ్వానంగా మారింది. స్థానిక రైతులతో పాటు కార్తికమాసంలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులు ఈ మార్గం నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గం పొడవునా గాళ్లు ఏర్పడటంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానికు వాపోతున్నారు.

- న్యూస్‌టుడే, యలమంచిలి

అడుగడుగునా గుంతలే!

పోడూరు, న్యూస్‌టుడే: పాలకొల్లు- పెనుమదం రహదారి గోతులమయంగా మారింది. అప్పన్నచెరువు మార్గంలో, రైసు మిల్లు సమీపాన భారీ గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాహన చోదకులు రహదారికి ఓ పక్క నుంచి వెళ్లాల్సి వస్తోంది. వర్షాలు కురిస్తే ఈ రహదారి మరింత అధ్వానంగా మారుతోందని.. గుంతలను తక్షణం పూడ్పించాలని స్థానికులు కోరుతున్నారు. గోతులు పూడ్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ అధికారులు చెప్పారు.

ఏటి గట్టు.. రక్షణ తీసికట్టు!

నరసాపురం పట్టణం న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో వశిష్ఠ గోదావరి ఏటిగట్టుపై కాలిబాట వెంబడి రక్షణ కంచె(రెయిలింగ్) దిమ్మలను ఆకతాయిలు ధ్వంసం చేశారు. ఇక్కడ కాలిబాట దిగువ భాగంలో గట్టు ఏటవాలుగా ఉండటంతో ఎవరైనా పొరపాటున జారిపడితే నేరుగా నదిలోకి వెళ్లిపోయే ప్రమాదముందని పర్యాటకులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించి వెంటనే చర్యలు చేపడతామని పురపాలక కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు.

ఆలయంలో చోరీ

మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెంసౌత్ కూడలిలో ఉన్న వినాయకుడి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. దుండగులు ఆలయం తలుపులు పగులకొట్టి హుండీ ఎత్తుకెళ్లారు. దానిలో నగదు తీసుకుని హుండీని ముళ్లపొదల్లో విసిరేశారు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేశారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించగా జాగిలం కొంతదూరం వెళ్లి బస్టాండు వద్ద ఆగింది. దర్యాప్తు చేసి నిందితులను పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

ముళ్ల పొదల్లో హుండీ

పోలీసుల అదుపులో నిందితులు?

మొగల్తూరు, న్యూస్‌టుడే: నరసాపురం మండలం తూర్పుతాళ్లలోని ఆభరణాల తాకట్టు దుకాణంలో చోరీ కేసు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. సుమారు ఏడాదిన్నర కిందట ఈ ఘటన జరగగా.. సుమారు కిలో బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. పోలీసులు విభిన్న కోణాల్లో దర్యాప్తు చేపట్టి ఎట్టకేలకు కేసును ఛేదించినట్లు సమాచారం. నిందితులంతా నియోజకవర్గంలో పలు గ్రామాలకు చెందినవారని తెలిసింది.

పంచాయతీ కార్యదర్శి మృతికి సంతాపం

పెనుమంట్ర, న్యూస్‌టుడే: పెనుమంట్ర పంచాయతీ కార్యదర్శి మంచిరాజు సీతారామారావు (56) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లి. ఆయన మృతికి సర్పంచి తాడిపర్తి ప్రియాంక, ఉపసర్పంచి భూపతిరాజు శ్రీనివాసరాజు, పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

సందడిగా వన సమారాధనలు

ఆచంట, న్యూస్‌టుడే: కొడమంచిలిలో కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. స్థానికులతో పాటు మండలంలో పలు గ్రామాల నుంచి సంఘీయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ యువత ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల పలు సంస్థల్లో కొలువులు సాధించిన యువతను అభినందించారు.

పాలకొల్లు: వేదికపై చిన్నారుల నృత్యం

శెట్టిబలిజ వర్తక సంఘం ఆధ్వర్యంలో.. ఆచంటలో శెట్టిబలిజ వర్తక సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, యువత వ్యాపార, రాజకీయ రంగాల్లో రాణించాలని సూచించారు. పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

గౌడ సేన ఆధ్వర్యంలో.. పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో గౌడ సేన ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధనను ఘనంగా నిర్వహించారు. తొలుత ఉసిరిచెట్టు వద్ద కార్తిక దామోదర పూజలు చేశారు. అనంతరం చిన్నారులు ఆటపాటలతో అలరించారు. ఏఎంసీ ఛైర్మన్ కోడి విజయభాస్కర్, పలువురు నాయకులు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమైక్య భావనతో అభ్యున్నతి

పెనుగొండ, న్యూస్‌టుడే: సమైక్య భావనతో అభ్యున్నతి సాధ్యమని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తెలిపారు. పెనుగొండ మార్కెట్ యార్డు ఆవరణలో తాండ్రపాపారాయుడు వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తిక వనసమారాధనలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా దామోదర పూజల అనంతరం వనభోజనాలు చేశారు. అనంతరం పితానిని సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని

వందేమాతరం గేయానికి 150 ఏళ్లు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: వందేమాతరం గేయానికి ఈ నెల 7 నాటికి 150 ఏళ్లు పూర్తవుతుందని.. ఈ సందర్భంగా 5 రోజులపాటు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు విజ్ఞాన వేదిక కన్వీనర్ రంగసాయి ఆదివారం తెలిపారు. వెంకట్రామ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్విట్ ఇండియా స్తూపం వద్ద జరిగే ముగింపు వేడుకలో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. అరసవల్లి సుబ్రహ్మణ్యం, కొండ్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిని కలిసిన విద్యుత్తు ఈఈ

నరసాపురం, న్యూస్‌టుడే: మొగల్తూరు మండలం శేరేపాలేనికి చెందిన కొత్తపల్లి రాంబాబు భీమవరంలో విద్యుత్తు డీఈగా పని చేస్తూ ఈఈగా ఉద్యోగోన్నతి పొంది రాజమహేంద్రవరానికి బదిలీ అయ్యారు. రాంబాబు ఆదివారం రుస్తుంబాదలో కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చేలా విధులు నిర్వహించాలని ఆయనకు సుబ్బారాయుడు సూచించారు.

నిర్వహణ లేమితో అవస్థలు!

7 వార్డు నివేదన

ఓటర్లు : 1270
జనాభా : 1648

ప్రాంతాలు: కోర్టు వీధి, కోటిపల్లి వారి వీధి, స్టీమర్ రోడ్డు, మెయిన్ రోడ్డు, పాలంకి వారి వీధి, కావలి ఆదినారాయణ వీధి, సర్వారి వీధి, బ్యాంకు వీధి, వైఎన్‌కేవీ హాలు వీధి.

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో ప్రధాన రహదారి 7వ వార్డు మీదుగా వెళ్తోంది. ఈ రహదారి దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్య ఎక్కువ ఉంది. దీంతో నిర్వహణ పనుల్లో లోపాలతో స్థానికులకు అవస్థలు తప్పడం లేదు. ఈ ప్రాంతంలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంది. డ్రెయిన్లు పూడిపోయి మురుగు నిలిచిపోతోంది. దోమల బెడద వీపరితంగా ఉంది. వీధి దీపాల మరమ్మతులు, పందుల సంచారంతో పాటు పలు సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

అధ్వానంగా డ్రెయిన్

✦ ప్రధాన రహదారితో పాటు బ్యాంకు వీధి, ఇతర ప్రాంతాల్లోని మార్గాల్లో గుంతలు ఏర్పడ్డాయి. ✦ దాదాపు అన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ నిర్వహణ సక్రమంగా లేదు. ✦ బ్యాంకు వీధిలో తెలగ కల్యాణ మండపం వద్ద, వైఎన్‌కేవీ హాలువీధి ప్రాంతాల్లో చెత్తను సక్రమంగా తొలగించడం లేదు. ✦ తెలగ కల్యాణ మండపం సమీపాన డ్రెయినుపై కల్వర్టు దెబ్బతినటంతో మురుగు నిలిచిపోతుంది. ✦ స్టీమర్ రోడ్డు, బ్యాంకు వీధి, పాలంకి వారి వీధి, శివాలయం ప్రాంతాల్లో వీధి దీపాలు సక్రమంగా వెలగటం లేదు.

సమస్యలు పరిష్కరిస్తాం..

7వ వార్డులో సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటాం. రహదారుల మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి పెడతాం. పందుల బెడద లేకుండా తగు చర్యలు చేపడతాం.

- ఎం.అంజయ్య, పురపాలక కమిషనర్

పర్యాటకులకు ఆహ్లాదం.. పంచాయతీలకు ఆర్థిక భారం!

మొగల్తూరు, న్యూస్‌టుడే: పర్యాటకులకు ఆహ్లాదం పంచుతున్న బీచ్ నిర్వహణ వ్యయం గ్రామ పంచాయతీలకు గుదిబండలా మారింది. మొగల్తూరు మండలంలోని పేరుపాలెం సౌత్, కేపీపాలెంసౌత్‌లలో బీచ్‌కు సెలవు రోజుల్లో, కార్తికమాసం, పర్వ దినాల్లో వేలాది మంది పర్యాటకులు తరలివస్తుంటారు. వారి రక్షణకు ఏర్పాట్లు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాకు రూ.లక్షల్లో వ్యయం అవుతుంది. ఈ వ్యయంలో కొంత మొత్తం మండల పరిషత్తు నుంచి మంజూరవుతోంది. మిగిలి మొత్తాన్ని పంచాయతీల నిధుల నుంచే వెచ్చిస్తున్నారు. పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీల్లో తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, గ్రామాభివృద్ధికి వెచ్చించాల్సి ఉంటుంది. కానీ రూ.లక్షల నిధులను బీచ్‌లో నిర్వహణకు వెచ్చించడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బీచ్ నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసేలా చూడాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదిస్తాం.. సముద్రతీర ప్రాంత గ్రామాల్లో బీచ్‌ల నిర్వహణకు నిధుల సమస్య ఉంది. దీనిపై నివేదిక రూపొందిస్తున్నాం. ప్రజాప్రతినిధులకు ఆ నివేదికను అందించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తాం.

- ఎం.నవీన్‌కిరణ్, డిప్యూటీ ఎంపీడీవో, మొగల్తూరు

గత మూడేళ్లలో వెచ్చించిన నిధులు(రూ.లక్షల్లో) ఇలా..

సంవత్సరం	పేరుపాలెం	కేపీపాలెం	మండల పరిషత్తు
2022	4.98	3.20	4.00
2023	3.59	3.26	5.00
2024	4.10	3.67	4.00

దిగబడి.. ప్రమాదకరంగా మారి

పోడూరు, న్యూస్‌టుడే: గుమ్మలూరు-వద్దిపర్రు మార్గంలో వద్దిపర్రు వంతెన సమీపాన రహదారి మురుగు బోదె వైపు దిగబడిపోయింది. ఈ మార్గం పూర్తిగా కుంగిపోతే రాకపోకలు నిలిచిపోతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో సుమారు 5 కిలోమీటర్ల మేర రహదారిని రూ.2.30 కోట్లతో అభివృద్ధి చేశారు. దీనిలో 200 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మించారు. ఈ భాగంలో కొంతమేర మురుగుబోదెలోకి కుంగింది. ఈ పనులు చేసిన గుత్తేదారుకి ఇప్పటి వరకు బిల్లులు కూడా చెల్లించలేదని అధికారులు చెబుతున్నారు. రహదారి దిగబడిన విషయాన్ని గుత్తేదారుడు దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ మూర్తి తెలిపారు.

రహదారి దెబ్బతిన్న ప్రాంతం

పైపులైను పనులే కారణమా?.. జల్ జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన పైపులైన్ల పనుల కోసం రహదారులకు చేర్చి గుంతలు తవ్వుతున్నారు. వీటిని సకాలంలో పూడ్చకపోవడంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. వద్దిపర్రులోనూ పైపులైన్ల ఏర్పాటు పనుల కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు.

(c) eenadu

తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

ఆకట్టుకున్న నృత్యోత్సవం

వీరంపాలెం(తాడేపల్లిగూడెం వన్ టౌన్), న్యూస్‌టుడే: వీరంపాలెంలోని బాలాత్రిపురసుందరీ ఆధ్యాత్మిక పీఠంలో శ్రీముప్పవగోపాల కల్చరల్ అకాడమీ విజయవాడ వారి ఆధ్వర్యంలో కార్తిక మాస ప్రత్యేక నృత్యోత్సవాన్ని ఆదివారం నిర్వహించామని పీఠం వ్యవస్థాపకుడు వెంకటరమణ శాస్త్రి తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. భక్తుల కోరిక మేరకు వేడుకలు నిర్వహిస్తున్నామని, సుమారు 300 మంది నృత్య కళాకారులు పాల్గొన్నారన్నారు.

ఘనంగా వన మహోత్సవం

రామన్నగూడెం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: రామన్నగూడెంలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తిక వన మహోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. మహోత్సవంలో భాగంగా భక్తులకు భోజనాలు వడ్డించారు.

భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	99488 53114
తణుకు	85558 50851
తణుకు గ్రామీణం	63005 79402
అత్తిలి	91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? తాడేపల్లిగూడెం యాగర్లపల్లి రజక సంఘం వీధిలో మురుగు బోదె నిండటంతో భరించలేని దుర్వాసన వస్తోంది. - సుబ్బారావు, స్థానికుడు

✔ సమస్య పరిష్కరిస్తాం. - సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

? తాడేపల్లిగూడెం హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి గణేశ్ నగర్‌కు వెళ్లే రహదారి నిర్మాణం దీర్ఘకాలంగా కొనసాగడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. - రాజేంద్ర, స్థానికుడు

✔ త్వరితగతిన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపడతాం - ఏసుబాబు, పురపాలక కమిషనర్

వెలగని దీపం.. ఎవరిది పాపం..!

పట్టించుకోని అధికారులు

తణుకు, న్యూస్‌టుడే

తణుకు పురపాలక సంఘం పరిధిలో పలు చోట్ల కారు చీకట్లు కమ్ముకుంటున్నాయి. ప్రధాన దారులు, పట్టణ వీధులు, కాలనీలలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. రాత్రి సమయాల్లో స్థానికులు, వాహనదారులు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. విష సర్పాలు, వీధి కుక్కల స్వైర విహారంతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా వీధి దీపాలకు రూ.లక్షలు ఖర్చు చేస్తున్నప్పటికి అధికారులు పట్టించుకోకపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అసలు లేవు..

పట్టణంలో 34 వార్డులుండగా 5255 వరకు వీధి దీపాలు ఉన్నాయి. ఇందులో సుమారు 300 వెలగడం లేదు. కొన్ని చోట్ల మసకగా, మినుకు మినుకుమంటూ వెలుగుతున్నాయి. హౌసింగ్ బోర్డు, న్యూబ్యాంక్, ఎన్‌జీవో, బ్యాంక్, ఇరగవరం కాలనీలతో పాటు పలు వీధుల్లో మరమ్మతులకు గురయ్యాయి. రోజుల తరబడి ఉంటున్నాయని పట్టించుకునే నాథుడే లేరని స్థానికులు వాపోతున్నారు. పలు ప్రాంతాల్లో లైట్లను చెట్ల కొమ్మలు కమ్మేయడం, మరి కొన్ని ప్రాంతాల్లో స్తంభాలకు అసలు దీపాలే లేవు.

పాతవూరు పశువుల ఆసుపత్రి వద్ద లూథరన్ చర్చి సమీపంలో..

పర్యవేక్షణ లేక..

ఎక్కడెక్కడ వీధి దీపాలు వెలగడం లేదో ఆయా సిబ్బంది పరిశీలించి పాడైపోయిన వాటి స్థానంలో కొత్తవి అమర్చాలి. కానీ దీపాలు బాగు చేసేందుకు సిబ్బంది ఉన్నప్పటికీ తనిఖీలు చేయకపోవడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పలు చోట్ల చీకట్లు అలుముకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి దీపాలు ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్య శిబిరానికి స్పందన

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మంచిలిలో ఆదివారం అత్తిలి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శిరగాని నాగేశ్వరరావు, బిందులత దంపతుల ఆర్థిక సహకారంతో వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

పాల్గొన్న లయన్స్ క్లబ్ సభ్యులు, వైద్యులు

జిల్లా లయన్స్ సభ్యులు పుట్టా జయ శిబిరం ప్రారంభించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రతి నెలలో మండలంలో ఒక్కో గ్రామంలో లయన్స్ క్లబ్ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. తణుకు ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. క్లబ్ సభ్యులు శివ, వెంకట్రావు, వెంకటేశ్వరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రుడికి లక్ష బిల్వార్చన

తణుకు, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా పైడిపర్రు శ్రీభద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామి వారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం మహారుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన అనంతరం కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

క్షీరాబ్ది ద్వాదశి పూజలు.. ఇరగవరం, న్యూస్‌టుడే: కార్తిక మాసంలో వచ్చే క్షీరాబ్ధి ద్వాదశి పర్వదినాన్ని పలు ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించుకున్నారు. ఇరగవరంలో శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామి, రేలంగిలో రుక్మిణి సమేత వేణుగోపాల స్వామి, లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

కేశవ స్వామికి.. తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: మండపాక గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీకేశవ స్వామి ఆలయంలో క్షీరాబ్ధి ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు ఉదయాన్నే స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, సహస్రనామార్చన, నక్షత్ర హారతి కార్యక్రమం నిర్వహించారు. భక్తులు తీసుకొచ్చిన తులసి మాలలతో విశేష అలంకరణలో స్వామి వారు దర్శనమిచ్చారు. సాయంకాలం ఆలయం వద్ద కార్తీక దీపారాధనలు నిర్వహించి ద్వాదశి పూజలు చేశారు.

సాయిబాబా ఆలయంలో అన్నసమారాధన

ఇరగవరం, న్యూస్‌టుడే: కార్తిక మాసం పురస్కరించుకుని రేలంగి సాయి బాబా ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: మండపాక గ్రామంలో బలుసు వారి వీధిలో ఉన్న శ్రీబాల గణపతి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఇంటి నుంచి బయటికి రాలేని వృద్ధులకు ఇంటికే భోజన ప్రసాదం పంపామన్నారు. ఆలయంలో ఉన్న గణపతి ప్రతిమ 62 సంవత్సరాల క్రితం వెదురు కలపతో తయారు చేయబడిందని, ప్రతీ సంవత్సరం తెల్ల కాగితంతో అలంకరించి పూజించడం ఈ గణపతి విశిష్టత అని పేర్కొన్నారు.

వెదురు కలపతో గణపతి

సమన్వయంతో తుపానును ఎదుర్కొన్నాం: ఆరిమిల్లి

మాట్లాడుతున్న రాధాకృష్ణ

తణుకు, న్యూస్‌టుడే: తుపాను ప్రభావాన్ని అధికారులు, కూటమి నాయకులు సమన్వయంతో సమర్థవంతంగా ఎదుర్కొన్నామని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలో తుపాను ప్రభావానికి గురైన బాధితులకు 25 కిలోల బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలు పంపిణీ చేసి మాట్లాడారు. తుపాను హెచ్చరికలు వచ్చి నాటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ప్రాణ, ఆస్తి నష్టం రాకుండా ముందస్తు చర్యలు చేపట్టారన్నారు. ముఖ్యమంత్రి స్ఫూర్తితో నాయకులు, అధికారులు తుపాను ప్రభావాన్ని ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బందికి చిరు సత్కారం చేసి అభినందించారు. తణుకు నియోజకవర్గంలో అంచనా ప్రకారం 4 వేల ఎకరాల్లో పంట నష్టం ఏర్పడిందని అధికారులు నివేదికలు ఇచ్చారని, నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

సంచార వాహనంపై ఇంటికే వైద్యం

తణుకు, న్యూస్‌టుడే: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం సంచార శకటం ద్వారా ఇంటింటికి వైద్యం కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు హుస్సేన్ అహ్మద్, నిమ్మగడ్డ అచ్యుత రామయ్య పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి మంచానికే పరిమితమైన వృద్ధులకు ఉచిత వైద్య సేవలందించారు. సభ్యులు ఆకుల వెంకటేశ్వరరావు ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులు అందజేశారు. ఉచిత వైద్య సేవలు కావాల్సినవారు 99853 43530, 90592 92717 నంబర్లను సంప్రదించాలన్నారు. సంఘ కోశాధికారి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోగికి మందులిస్తున్న వైద్యుడు

గీత వృత్తి పరిరక్షణకు అఖిలపక్షం మద్దతు

తణుకు, న్యూస్‌టుడే: గీత వృత్తి రక్షణ బాటకు అఖిలపక్షం మద్దతివ్వడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక అమర వీరుల భవనంలో ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కామన మునిస్వామి అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం గీత కార్మికుల పట్ల వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతున్న ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు పాల్గొని గీత వృత్తి కాపాడేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. వైకాపా పట్టణ అధ్యక్షుడు శేషగిరి, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు నాగరాజు, వైకాపా లీగల్ సెల్ అధ్యక్షుడు సాయిబాబా రెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, మహిళా సంఘం నాయకురాలు అజయకుమారి, సామాజిక పోరాట సమితి వ్యవస్థాపకుడు మురళి, కాంగ్రెస్ పార్టీ తణుకు నియోజకవర్గ అధ్యక్షుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నరసింహమూర్తి

952 ఎకరాల్లో వరి పంట నష్టం

ఇరగవరం, న్యూస్‌టుడే: మొంథా దాటికి ఇరగవరం మండలంలో 952 ఎకరాల వరి పంట నష్టానికి గురైనట్లు మండల వ్యవసాయాధికారి రాఘవేంద్రరావు ఆదివారం చెప్పారు. వ్యవసాయ సిబ్బంది నాలుగు రోజుల నుంచి మండలంలోని 21 గ్రామాల్లోనూ క్షేత్రస్థాయిలో పర్యటించి దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారన్నారు. నష్టపోయిన పంట వివరాలు, రైతుల జాబితాను ప్రభుత్వానికి పంపించామని ఆయన వివరించారు.

దారి అధ్వానం.. రాకపోకలకు గండం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: దువ్వ నుంచి వరిఘేడు వెళ్లే మార్గం అధ్వానంగా మారింది. దువ్వ ధానేశ్వరి అమ్మ వారి ఆలయం, వరిఘేడు, బల్లిపాడు, అత్తిలి గ్రామాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. నిత్యం అనేక మంది భక్తులు, ప్రజలు ఇటుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇంత ప్రాధాన్యత ఉన్న ఈ రోడ్డు ఏళ్లుగా నిర్మాణానికి నోచుకోవడం లేదని స్థానికులు, చోదకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై ర.భ శాఖ ఏఈ యశ్వంత్ మాట్లాడుతూ.. దువ్వ-వరిఘేడు 2.5 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.2.5 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరవ్వగానే పనులు చేపడతామన్నారు.

నమ్మండి... ఇది దారేనండి..!

తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే: పరిమెళ్ల గ్రామం జగనన్న కాలనీ వాసులను సమస్యలు వేధిస్తున్నాయి. సరైన వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలోకి వెళ్లేందుకు సరైన దారి లేకపోవడంతో వర్షం కురిస్తే రోజుల తరబడి నీరు నిలవడంతో బురద పేరుకుపోయి దుర్వాసన వస్తోందని ఆవేదన చెందుతున్నారు. మురుగు వెళ్లేందుకు డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల మధ్య నీరు నిలవడంతో దోమలు దండయాత్ర చేస్తున్నాయని, జ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదం.. పట్టించుకోని యంత్రాంగం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: దువ్వ గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధాన మార్గం వద్ద ఉన్న డ్రెయినేజీపై మూతలు ధ్వంసమై నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దువ్వ, సూర్యారావుపాలెం, కొండయ్యపాలెం, ముద్దాపురం, కోనాల గ్రామాల నుంచి సుమారు 400 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో విద్య అభ్యసిస్తున్నారు. దీంతో పిల్లలకు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని తల్లిదండ్రులు భయాందోళనలు చెందుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా కనీస చర్యలు చేపట్టడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ డ్రెయినేజీ ఎన్‌హెచ్ఏఐ పరిధిలోకి వస్తుందని అధికారులు తెలియజేస్తున్నారు.

కాశీబుగ్గ ఘటన కలచివేసింది

తణుకు, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటన తనను కలచి వేసిందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం తణుకులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపి మౌనం పాటించారు. తొక్కిసలాటలో 9 మంది ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. మంత్రి నారా లోకేశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయమందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాధాకృష్ణ అన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

ఒకరికి తీవ్ర గాయాలు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: దువ్వ-అలంపురం జాతీయ రహదారిలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన ఇది. స్థానికుల వివరాల ప్రకారం.. ముద్దాపురానికి చెందిన వ్యక్తి వెంకయ్య కాలువ సమీపంలో అల్లంపురం వైపు జాతీయ రహదారిని దాటుతుండగా తాడేపల్లిగుడెం నుంచి తణుకు వైపుగా వెళ్తున్న మరొక ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ముద్దాపురంకు చెందిన రాంబాబు తీవ్ర గాయాలపాలయ్యాడు. 20 నిమిషాలు వరకు 108 రాకపోవడంతో ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని తణుకు ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ ఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదని తణుకు గ్రామీణ ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

పెరిగిన కూరగాయల ధర

బ్రహ్మానందరెడ్డి మార్కెట్(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: బ్రహ్మానంద రెడ్డి మార్కెట్‌లో కూరగాయల ధర పెరిగింది. గతంతో పోల్చితే బీర, వంకాయ తెలుపు, నలుపు, దొండ, బెండ రూ.10 నుంచి రూ.40 వరకు పెరిగాయి. మిగిలినవి స్థిరంగా ఉన్నాయి. ముందుముందు ఇదే పరిస్థితి కొనసాగితే కూరలు కోసం అగచాట్లు పడాల్సిందే అని వినియోగదారులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కూరగాయ పంటలు దెబ్బతినడంతో కూరగాయలు సరఫరా తక్కువగా వస్తుండటంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి.

	కిలో (రూ॥ల్లో)
బీరకాయ	80
వంకాయ	120
చిక్కుళ్లు	100
బంగాళా దుంప	30
పచ్చిమిర్చి	50
టమాట	40
ఉల్లి పాతవి	20
దొండ	60
బెండ	80
క్యారెట్	80
అల్లం(కొత్తది)	100
కాకర	60
దోసకాయ	50
ఆనపకాయ	40

పేరుకే కుళాయి.. ట్యాంకర్ రావాల్సిందేనోయ్!

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే

తాడేపల్లిగూడెం పట్టణంలో వర్షాకాలంలోనూ దాహం కేకలు ఆగడం లేదు. ప్రధానంగా పట్టణ శివారు ప్రాంతాల్లో కుళాయిల నుంచి పూర్తి స్థాయిలో నీరు రాక అవస్థలు పడుతున్నారు. అమృత్ పథకంలో భాగంగా నూతన పైపులైన్లు, ఇంటింటికి కుళాయి కనెక్షన్లు వేసినా బిందెడు నీళ్ల కోసం పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. రోజూ నీరు సరఫరా చేస్తున్నారనే మాటే కాని శివారు ప్రాంతాల్లో నివసించే వారికి ఇబ్బందులు తప్పట్లేదు.

సుదీర్ఘ కాలంగా సమస్య

తాళ్లముదునూరుపాడులో సుదీర్ఘ కాలం నుంచి నీటి సమస్య వేధిస్తోంది. అధికారులకు పలు మార్లు సమస్యను తెలిపిన పరిష్కారం కావడం లేదు. కుళాయిలున్నా రెండు మూడు బిందెలు వరకే నీరు వస్తాయి. మరల ట్యాంకర్ల కోసం ఎదురు చూడాల్సి వస్తోందని వాణి వాపోతున్నారు.

నిల్వ చేసుకుంటున్నాం

కుళాయి నీరు సరిపోక ప్రైవేట్ నీటి శుద్ధి కేంద్రాలను ఆశ్రయిస్తున్నాం. ట్యాంకర్ల ద్వారా వచ్చే నీటిని నిల్వ చేసుకుని వాడుకోవాల్సిన పరిస్థితి వస్తుందని రాజేశ్వరి ఆవేదన చెందుతున్నారు.

అలంకార ప్రాయంగా.. తాళ్ళముదునూరుపాడు, జువ్వలపాలెం, దొమ్మర్ల, కడకట్ల హౌసింగ్ బోర్డు, వీకర్స్, మిలటరీ కాలనీలు, శివాలయం వీధి, నరసింహరావుపేట ప్రాంతాల్లో కుళాయిలు ఉన్నప్పటికి పూర్తి స్థాయిలో నీరు రావడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. నీరు వచ్చే సమయంలో మోటారు వేసుకునే పరిస్థితి లేకపోవడంతో ఎగువ ప్రాంతాల వారికి నీళ్లు రావట్లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డబ్బాల్లో నిల్వ చేసుకున్న నీరు

తప్పని ఎదురు చూపులు..

పట్టణంలో సుమారు 20 ప్రాంతాల్లో సమస్య ఉండగా 8 ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నారు. రోజు విడిచి రోజు ట్యాంకరు రావడంతో స్థానికులకు ఎదురు చూపులు తప్పడం లేదు. కొన్ని ప్రాంతాల్లో రెండు రోజులకు ఒకసారి ట్యాంకు రావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రైవేట్ నీటిశుద్ధి కేంద్రాల నుంచి రూ.30 చెల్లించి తెచ్చుకుంటున్నామని చెబుతున్నారు.

పరిష్కారానికి కృషి

పట్టణంలో నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాం. నూతన పైపులైను ఏర్పాటు చేసి సమస్య ఉన్న చోట సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం.

- ఏసుబాబు, పురపాలక కమిషనర్

డిసెంబర్ 13న మాలల భారీ సదస్సు

తణుకు, న్యూస్‌టుడే: పశ్చిమ గోదావరిలో ఉన్న అన్ని మాల సంఘాలు ఏకమై జేఏసీగా ఏర్పడి డిసెంబర్ 13న తాడేపల్లిగూడెంలో భారీ సదస్సుల నిర్వహిస్తామని మాల సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక కులాన్ని అణచివేసే ప్రయత్నం చేస్తుందన్నారు. ఆదివారం తణుకులో న్యాయవాది సురేశ్ అధ్యక్షతన నిర్వహించిన మాల సంఘాల జేఏసీ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా తణుకు నియోజకవర్గ జేఏసీని ఏర్పాటు చేశారు. కమిటీ ఛైర్మన్‌గా అర్జున్, కోఛైర్మన్లు ఏసు, రాము, సురేశ్ బాబు, విజయ్, ప్రధాన కార్యదర్శిగా రవి, సభ్యులు రాజేశ్, మహేశ్ తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఘనంగా రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

సుబ్బారావుపేట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం వాసవి క్లబ్ సౌజన్యంతో సుబ్బారావుపేటలోని గుణ్ణం వేణుగోపాల్ ఫంక్షన్ హాలులో రాష్ట్ర స్థాయి ఓపెన్ చదరంగ పోటీలు ఆదివారం ఘనంగా జరిగాయి. 18 జిల్లాల నుంచి 226 మంది పాల్గొన్నారు. భాజపా నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, జనసేన నాయకుడు బొలిశెట్టి రాజేష్, ఆంధ్ర క్లబ్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ కేవీవీ శర్మలు పోటీలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. చెస్ అకాడమి నిర్వాహకుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ పోటీల్లో ఓపెన్ కేటగిరిలో 5, ఏడు రౌండ్లలో 20 మంది మొత్తంగా 25 మంది విజేతలు ఈ నెల 22న విజయవాడలో నిర్వహించే ఆలిండియా 1800 రేటింగ్ లోపు పోటీల్లో పాల్గొంటారన్నారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి అనిల్, పవన్ గుప్త, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఫణికుమార్, బ్లూమ్స్ ఆంగ్లమాధ్యమ పాఠశాలల డైరెక్టర్ దుర్గాప్రసాద్, న్యాయనిర్ణేతలు కిరణ్ కుమార్, ప్రసాద్, రాంబాబు, అరవింద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థితో మాట్లాడుతున్న తాతాజీ

'ప్రజలను ఏమార్చేందుకే అక్రమ అరెస్టులు'

తణుకు, న్యూస్‌టుడే: రాష్ట్ర పరిపాలనను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందని.. మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరావు అన్నారు. ఆదివారం స్థానిక వైకాపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.వేల కోట్లు అప్పులు చేసి అవి కనిపించకుండా ప్రజలను ఏమార్చేందుకే అక్రమ అరెస్టుల పర్వానికి తెర తీశారన్నారు. ● వైకాపా ఆధ్వర్యంలో ఆదివారం నరేంద్ర కూడలి వద్ద కాశీబుగ్గ ఘటనలో మృతి చెందిన వారికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి..

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మొంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం దువ్వ, ముద్దాపురం గ్రామాల్లో దెబ్బతిన్న వరి చేలను ఆయన పరిశీలించారు.

కవి వేమూరికి పురస్కారం

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన ప్రముఖ కవి వేమూరి శ్రీనివాస్ 2025 సంవత్సరానికి గాను డా.సాయిశ్రీ స్మారక సాహితీ పురస్కారాన్ని ఆదివారం అందుకున్నారు. సిరిముప్వ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గమిని ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ ఎస్‌పీఎఫ్ కమాండెంట్ ఎస్పీ డా.కొండా నరసింహారావు పురస్కారాన్ని అందజేశారు. వక్తలు మాట్లాడారు. అనంతరం ఘనంగా దుశ్శాలువాతో సత్కరించారు. సంస్థ అధినేత పెద్దోజు శ్రీనివాస్, వెంకట్రమణా సేవా సంస్థ నిర్వాహకుడు పెదరామకృష్ణ, కైండ్‌నెస్ ఫౌండేషన్ అధ్యక్షుడు మాణిక్యాలరావు, బీవీఆర్ కళాకేంద్ర వ్యవస్థాపకుడు వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

శాకాహారంతో ఆరోగ్యకర జీవనం

భీమడోలు, న్యూస్‌టుడే: శాకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరంగా జీవించవచ్చుని పిరమిడ్ సొసైటీ శిక్షకులు అన్నారు. భీమడోలులో శాకాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ.. ప్రదర్శన చేపట్టారు. స్థానిక సాయిబాబా ఆలయ కూడలి నుంచి సంత మార్కెట్ మీదుగా బస్టాండు కూడలి వరకు ర్యాలీ సాగింది. ప్రతిరోజు శాకాహారం తినాలని.. జంతువులతో ప్రేమగా మెలగాలని ప్లకార్డులు ప్రదర్శించారు.

5న అవగాహన సదస్సు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 5న ఉద్యాన పంటల క్లస్టర్ల అభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఉప సంచాలకుడు షాజా నాయక్ తెలిపారు. ఈ సదస్సులో ఉద్యాన పంటల సాగు, మద్దతు ధర, ఇతరత్రా అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో అనుభవమున్న రైతులు, అభ్యుదయ పారిశ్రామికవేత్తలు, రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ప్రతినిధులు హాజరు కావాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

'లిక్కర్ స్కామ్ గజదొంగలు బయటకు వస్తున్నారు'

తణుకు, న్యూస్‌టుడే: లిక్కర్ కుంభకోణం గజదొంగలు బయటకు వస్తున్నారని తణుకు ఏఎంసీ ఛైర్మన్ కొండేటి శివ అన్నారు. ఆదివారం స్థానిక కూటమి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జోగి రమేశ్ అరెస్టు పట్ల మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. కొండను తవ్వి ఎలుకను పట్టుకున్నారంటూ నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈ కుంభకోణంలో మరింత మంది జైలుకు వెళ్లడం ఖాయమని, కారుమూరి సైతం జైలుకు వెళ్తారన్నారు. మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో రాత్రి పగలు అధికారులు, నాయకులను సమన్వయం చేసి రాధాకృష్ణ ఆస్తి, ప్రాణ నష్టం రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారని వివరించారు.

నివాళులు అర్పిస్తున్న నాయకులు

విలువలకు ప్రతిరూపం ఎర్రన్నాయుడు

పోలీస్‌ఐలాండ్ కూడలి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ, ఉన్నత విలువలకు ప్రతిరూపంగా రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన ప్రజానాయకుడు ఎర్రన్నాయుడని వక్తలు కొనియాడారు. ఏపీ భవన, ఇతర కార్మికుల బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జి ఆధ్వర్యంలో ఆదివారం పోలీస్ ఐలాండ్ కూడలిలో ఎర్రన్నాయుడి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఏపీ తేదేపా ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ ముత్యాల సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'దివ్యాంగుల హక్కులను కాలరాయొద్దు'

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: సమాజంలో దివ్యాంగులను దాతృత్వం, సానుభూతికే పరిమితం చేయడం వారి హక్కులకు అవకాశాలను దూరం చేయడమేనని దివ్యాంగ మహా సంఘటన జాతీయ అధ్యక్షుడు నందూరి రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక కేఎన్‌రోడ్డులో ఆదివారం దివ్యాంగ నాయకుడు పులిమి లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఎంవీవీ రాఘవేంద్రరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కడుపునిండా భోజనం పెట్టి వ్యక్తిగత వివరాలు సేకరించడతో పాటు తీవ్ర వైకల్యం గల వారి వెంట సంరక్షకులు లేకుండా చేయడం వివక్ష చూపడమన్నారు. మహా సంఘటన జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, నాయకులు వీర్రాజు, శ్రీనివాసరావు, బాలాజీ నాని తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి నాదెండ్ల రాక

గణేష్‌నగర్(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: ఏపీ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నేడు తాడేపల్లిగూడెం వస్తున్నారని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఆరుగొలను ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని వివరించారు.

అపోలో హాస్పిటల్స్, హైదరాబాద్

Apollo HOSPITALS

ప్రఖ్యాత వైద్య నిపుణులు ఇప్పుడు

తణుకు & భీమవరం లో

5 నవంబర్ 2025 | 10:30 AM - 1:30 PM
భాగ్యశ్రీ ఆసుపత్రి, తణుకు.

5 నవంబర్ 2025 | 2:30 PM - 5 PM
కృష్ణ హాస్పిటల్, ఉండి రోడ్, భీమవరం.



ఈ సమస్యలు ఏమైనా ఉన్నట్లైతే డాక్టర్ గారిని సంప్రదించండి.

డా కిరణ్ వర్మ ఉద్దరాజు
కన్సల్టెంట్ - ఆర్థోపెడిక్ & జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్
MBBS, MS (Orthopaedics)

• తుంటి, మోకాలు, భుజం మొదలైన కీళ్ల మార్పిడి
• మోకాళ్ళ సమస్యలు • మోకాలు, భుజం యొక్క ఆర్థోస్కోపీ ఆపరేషన్లు అవసరమైనవారు
• అత్యాధునిక రోబోటిక్ సర్జరీ ద్వారా మోకాళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స చేయబడును.

అపాయింట్మెంట్ కొరకు: +91 8074 936 811

(c) eenadu

ఈనాడు
వైఎస్సార్ కడప
సోమవారం నవంబరు 3, 2025

పాలకొండల పాదాన బుగ్గ కుండ

చుట్టూ కొండలు.. హరిత సిరులు.. పాలధారలా జలపాతాలు.. మధ్యలో పాలకొండల పాద భాగాన నిండుకుండలా బుగ్గవంక జలాశయం.. వర్షాకాలంలో కనువిందు చేసేలా ఉంటుందీ ప్రదేశం. ఇటీవల మొంథా తుపానుతో బుగ్గవంక ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరడంతో మరింత అందంగా కనిపిస్తోంది. ఈ చిత్రం ప్రకృతి ప్రేమికుల కళ్లను కట్టిపాడేస్తోంది. - న్యూస్‌టుడే, కడప (చిన్నచౌకు)

లాహిరి.. లాహిరి.. రక్షణ మరిచిరి!

సోమశిల వెనుక జలాల్లో రక్షణ లేని పడవ ప్రయాణం ఆందోళన కలిగిస్తోంది. కుడమలూరు అంకాలమ్మ ఆలయం సమీపంలో నిల్వ ఉన్న జలనిధి చెంతకే వాహనాలు వెళ్తున్నాయి. ఆదివారం సెలవు కావడంతో ఎంతోమంది ఇక్కడికి వస్తున్నారు. మత్స్యకారులు చేపల వేటకు వినియోగిస్తున్న నాటు పడవలు, బుట్టల్లో పర్యాటకులు కుటుంబ సమేతంగా విహరిస్తున్నారు. లైఫ్ జాకెట్లు లేకుండా ఇలా ప్రయాణించడం ప్రమాదకరమే. ప్రభుత్వం జల విహారానికి తగిన రక్షణ ఏర్పాట్లు చేస్తే బాగుంటుందని పర్యాటకులు సూచిస్తున్నారు. - న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

బడి భవనం పాఠాలు చదువుకు భరోసా ఇవ్వాలి. తరగతి ఆహ్లాదకరంగా ఉండాలి. ఇందుకు భిన్నంగా ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరు పంచాయతీ నరసన్నగారిపల్లె ప్రాథమిక పాఠశాల ఉంది. ఇక్కడ బాలురు 13, బాలికలు 12 మంది విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులకు విద్యా బోధన చేయడానికి ఇద్దరు మహిళా ఉపాధ్యాయులను నియమించారు. రెండు భవనాలు ఉన్నప్పటికీ ఇవి శిథిలావస్థకు చేరాయి. ఎప్పుడు కూలిపోతాయో, ఎలాంటి ముప్పు జరుగుతుందోనని పిల్లలు భయం భయంగా చదువుకోవాల్సి వస్తోంది. వర్షాలకు భవనం పైకప్పు, గోడలు వాన నీటితో తడిసిపోతున్నాయి. సిమెంటు పెచ్చులు రాలిపోతున్నాయి. ఇనుప చువ్వలు బయటపడ్డాయి. భయం నీడలో ఇంకెన్నాళ్లు చదువులు అంటూ విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. - న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

ఒంటిమిట్టకు తితిదే జేఈవో రాక

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయం అభివృద్ధి పనులు, వచ్చే ఏడాది మార్చి నెల ప్రారంభం కానున్న శ్రీరామ నవమి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ముందస్తుగా పరిశీలన చేయడానికి తితిదే సంయుక్త కార్యనిర్వహణాధికారి వెంకయ్య చౌదరి సోమవారం ఒంటిమిట్టకు రానున్నారు. ఈ మేరకు తితిదే పాలన అధికారులకు సమాచారం అందింది. అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం బోయనపల్లిలో తితిదే నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం కార్యక్రమానికి జేఈవో హాజరుకానున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏర్పాట్లు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కడప కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సభాభవనంలో జరిగే కార్యక్రమంలో కలెక్టర్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో పాటు పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు. అర్జీదారులు తమ సమస్యలను వారి దృష్టికి తీసుకురావచ్చన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మున్సిపల్, మండల కేంద్రాల్లో కూడా ప్రజల నుంచి సంబంధిత అధికారులు అర్జీలు స్వీకరిస్తారన్నారు.

డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ నేడు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి తెలిపారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన వినియోగదారులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వినియోగదారులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చరవాణి నంబరు: 89777 16661కు ఫోన్ చేసి సమస్య తెలియజేయవచ్చన్నారు. చరవాణి నంబరు: 91333 31912కు చాట్ ద్వారా కూడా సమస్య తెలుపవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఈ-పంట నమోదుకు గడువు పెంపు

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో సాగు చేసిన వ్యవసాయ పంటల నమోదుకు ఈ నెల 8 వరకు గడువు పెంచారు. ఈ మేరకు ప్రభుత్వం అన్ని జిల్లాల వ్యవసాయ శాఖ కార్యాలయాలకు ఆదేశాలిచ్చింది. సాధారణంగా గత నెల 31వ తేదీ నాటికి గడువు ముగిసింది. కానీ కొన్ని జిల్లాల్లో ఇంకా ఈ పంట నమోదు పూర్తి కాకపోవడంతో అన్ని జిల్లాల అధికారులు ప్రభుత్వానికి వినతి చేయడంతో ఈ అవకాశం ఇచ్చింది. ఈ నెల 8వ తేదీ ఈ పంటలో నమోదైన వివరాలను సామాజిక ఆడిట్ కోసం జాబితాను ప్రదర్శిస్తారు. ఎవరైనా ఆ జాబితాలో తప్పులు దొర్లాయని ఫిర్యాదు చేసుకోవచ్చు. వాటిని పరిష్కరించిన అనంతరం ఈ నెల 15న తుది జాబితా ప్రచురిస్తారని ఆదేశాల్లో సూచించింది. జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిపి ఇప్పటి వరకు 2,86,628 ఎకరాల్లో ఈ పంట కింద నమోదు చేశారు.

తెలుగు జనం మెచ్చిన బ్రౌన్ శాస్త్రి

- పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- వేడుకగా జానమద్ది హనుమచ్ఛాస్త్రి శత జయంతి

కడప చరిత్రపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, కలెక్టర్ శ్రీధర్, అధికారులు

మారుతీనగర్ (కడప), న్యూస్‌టుడే: తెలుగు భాషణమే భూషణమని.. ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ ఆంగ్లేయుడు అయినప్పటికీ తెలుగు మీద మమకారంతో ఎన్నో సాహిత్య గ్రంథాలను సేకరించి వాటిని తెలుగులోకి అనువాదం చేశారని, తెలుగుభాషా సాహిత్యాలు ఈ రోజు ఇంత దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయంటే దానికి మూల కారణం సీపీ బ్రౌన్ అని, అలాంటి తెలుగు సూర్యుడు సీపీ బ్రౌన్ పేరిట స్మారక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి అనేక గ్రంథాలను సేకరించి దేశవ్యాప్తంగా లక్షలాది మందికి పరిచయం చేసి సాహితీ పరిమళాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి అని పూర్వ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు కొనియాడారు. హనుమచ్ఛాస్త్రి శత జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన జానమద్ది స్మారక పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా గ్రంథాలయంలోని తాళపత్ర, తామ్ర పత్రాలను, ఇతర గ్రంథాలను పరిశీలించారు. సీపీ బ్రౌన్, జానమద్ది హనుమచ్ఛాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాతృభాష పరిరక్షణకు కేవలం పుస్తకాలు రాయడం, అవార్డులు ఇవ్వడం, కార్యక్రమాలు నిర్వహించడంతోనే సాధ్యం కాదని, అది ప్రజా ఉద్యమంగా రూపుదాల్చాలన్నారు. మాతృభాషకు సేవలందించిన వారికి పురస్కారాలు అందించడం ఆనందంగా ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఉన్నతాధికారులు, అధికారులు సమావేశాల్లో నేటికీ ఆంగ్లంలో మాట్లాడుతుండడం బాధాకరమన్నారు. వారంతా తెలుగు భాషలోనే మాట్లాడాలని, అధికారికంగా ఇచ్చే ఉత్తర్వులు తెలుగులోనే ఇవ్వాలని సూచించారు. న్యాయస్థానాల్లో కూడా తెలుగులో తీర్పులిచ్చే అవకాశం కల్పిస్తే సాధారణ పౌరులకు సైతం అర్థం అవుతుందన్నారు. జానమద్ది హనుమచ్ఛాస్త్రి చేపట్టిన గ్రంథాలయ యజ్ఞం మహోన్నతమైనదని, వారసత్వం అంటే ఆస్తులు, పదవులు పంచుకోవడం కాదని, ఇలాంటి మంచి కార్యాలు చేపట్టడమే నిజమైన వారసత్వం అని కొనియాడారు. ప్రతి గ్రామంలో గ్రంథాలయం, దేవాలయం, సేవాలయం ఏర్పాటు చేయాలన్నది తమ ఆకాంక్ష అని ప్రజలు ఆ దిశగా చొరవ తీసుకోవాలన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి ఎంతో చిత్తశుద్ధితో కృషి చేశారని జానమద్ది హనుమచ్ఛాస్త్రి కుమారుడు జానమద్ది విజయభాస్కర్‌ను అభినందించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, ప్రముఖ సాహితీవేత్త ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, కలెక్టర్ చేరుకూరి శ్రీధర్, వైవీయూ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య పద్మ, నగర ప్రముఖులు, జానమద్ది కుటుంబ సభ్యులు, భాషా ప్రేమికులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

శత జయంతి వేడుకల్లో జిల్లా ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు

పరువు గోవింద.. తిరుపతికి వేరే దారుందా!

గ్రీన్‌ఫీల్డ్ నిర్మాణం మరింత ఆలస్యం ◆ ఆర్థిక వనరుల పరంగా ఇబ్బందులు

అధ్వానంగా ఉన్న కడప- రేణిగుంట జాతీయ రహదారి

ఈనాడు, కడప

వివిధ రాష్ట్రాల ప్రజలు ఎక్కువగా ప్రయాణించే కడప-రేణిగుంట జాతీయ రహదారి (716) మరింత అధ్వానంగా మారింది. ఈ మార్గంలో వాహనాలు నడపలేక చాలా మంది కడప నుంచి రాయచోటి మీదుగా తిరుపతికి చేరుకుంటున్నారు. తిరుపతికి ప్రత్యామ్నాయ దారులు ఏమైనా ఉన్నాయా అని అంతర్జాలంలో వెతికే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. కొందరైతే రోడ్డు దుస్థితిపై వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారు. దీంతో రాష్ట్రం పరువు మంటగలుస్తోంది. మరో వైపు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణ గుత్తేదారు నిర్లక్ష్యం కారణంగా పనులకు ఆలస్యం అవుతోంది. ఈలోపు ఇప్పుడున్న పాత రోడ్డును బాగు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

వాహన చోదకుల ప్రధాన సమస్యలివీ

- ఈ రహదారి కొన్ని చోట్ల భారీ గోతులేర్పడ్డాయి. వీటిని దాటుకోలేక కారు, ద్విచక్ర వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితి. గుంతలు తప్పించడానికి ముప్పుతిప్పలు పడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు.
- వర్షమొస్తే నీరు.. ఎండకాస్తే దుమ్ముతో చుట్టు పక్కల నివాసం ఉండే ప్రజలు అల్లాడిపోతున్నారు.
- కడప- రేణిగుంట మధ్య ప్రయాణ సమయం 2.30 గంటలు కాగా 4.30 గంటల వరకు పడుతోంది. వాహనాలు మరమ్మతుకు లోనుకావడం, ప్రమాదాలకు గురికావడం జరుగుతోంది.

15 రోజుల్లో మరమ్మతులు

వర్షాల అడ్డంకి లేకపోతే 15 రోజుల్లో గుంతలు పూడుస్తామని జాతీయ రహదారుల విభాగం అధికారులు చెబుతున్నారు. ఆదివారం ప్రారంభించిన రోడ్డు రెన్యువల్ పనులు ఆరు నెలల్లో పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. రైల్వేకోడూరు నుంచి భాకరాపేట వరకు 72 కి.మీ మేర రెన్యువల్ చేస్తారు. రైల్వేకోడూరు-రేణిగుంట మధ్య ఉన్న రోడ్డు గ్రీన్‌ఫీల్డ్‌లో కలుస్తుంది. ఇక్కడ త్వరలో చేపట్టే పనుల్లో గుంతలు మాత్రమే పూడుస్తారు.

నిర్మాణ ప్యాకేజీలివి

- రేణిగుంట- కడప జాతీయ రహదారి (ఎన్‌హెచ్-716)ను నాలుగు లేన్లుగా విస్తరించే ఈ ప్రాజెక్టును రెండు ప్యాకేజీలుగా విభజించారు. ఇది హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్‌ఏఎం) కింద నిర్మాణం జరగనుంది.
- ప్యాకేజ్-1 కడప- చిన్న ఓరంపాడు సెక్షన్ (64.2 కి.మీ)
- ప్యాకేజ్-2 చిన్న ఓరంపాడు- రేణిగుంట సెక్షన్(57.35)
- ఈ రెండు ప్యాకేజీలను లక్ష్మీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలపర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు 2023 మార్చి 24న అప్పగించారు.

హెచ్‌ఏఎం విధానంలో నిర్మాణం

హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్‌ఏఎం)ను కేంద్ర ప్రభుత్వం 2016 జనవరిలో ప్రవేశపెట్టింది. భారీ పెట్టుబడులు అవసరయ్యే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులో ఆర్థిక భారాన్ని ప్రభుత్వ-ప్రైవేటు డెవలపర్ల మధ్య పంచుకోవడమే దీని ప్రధాన ఉద్దేశం. ఈ మోడల్ ప్రాజెక్టు నిర్మాణ దశలో మొత్తం వ్యయంలో 40 శాతం కేంద్ర ప్రభుత్వం, మరో 60 శాతం ప్రైవేటు భాగస్వామ్యం కింద గుత్తేదారు భరించాల్సి ఉంటుంది. నిర్మాణం పూర్తయిన తర్వాత 15 ఏళ్ల నిర్వహణ సమయంలో దశలవారీగా బిల్లులు చెల్లిస్తుంది. రూ.3,150 కోట్ల వ్యయంతో చేపట్టే ప్రాజెక్టులో 60 శాతం గుత్తేదారు భరించాల్సి ఉండటంతో ఆర్థిక వనరులు సమకూర్చుకోవడానికి తలెత్తిన ఇబ్బందులతో పనులు చేపట్టడానికి ఆలస్యమైంది.

రైల్వేకోడూరు- భాకరాపేట మధ్య జరుగుతున్న రహదారి పనులు

శ్రీచరణి అదరహో!

భారత నారీ జయహో..

సత్తా చాటిన కడప బిడ్డ

మ్యాచ్ వీక్షిస్తున్న శ్రీచరణి తల్లిదండ్రులు

అసలే వరల్డ్ కప్.. భారత మహిళల క్రికెట్ జట్టు ఏకంగా ఫైనల్స్ చేరింది. ఆపై మన కడప బిడ్డ శ్రీచరణి అందులో ఆడుతోంది. ఆదివారం దక్షిణాఫ్రికాతో ఫైనల్స్ పోటీ వీక్షించేందుకు జిల్లావ్యాప్తంగా పలుచోట్ల బిగ్ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారత మహిళల జట్టు విశ్వ విజేతగా నిలవాలని, శ్రీచరణి ఫైనల్స్‌లో రాణించాలని ఆకాంక్షిస్తూ బ్యానర్లు ఏర్పాటు చేయించారు. జిల్లాలోని మహిళ క్రికెటర్లు ఆలయాల్లో పూజలు చేశారు. పెద్ద స్క్రీన్‌పై వరల్డ్ కప్ ఫైనల్స్ చూడడం ఒక ఎత్తైతే అందులో భారత నారీమణులు విశ్వవిజేతలుగా నిలవడంతో సంబరాలు అంబరాన్నంటాయి. శ్రీచరణి తల్లిదండ్రులు ఇంట్లోనే టీవీకి అతుక్కుపోయి బిడ్డ ఆటను ఆస్వాదించారు. ఆయా చిత్రాలివి. - న్యూస్‌టుడే, కడప క్రీడలు, ఎర్రగుంట్ల

కడప నగరంలో అర్ధరాత్రి గెలుపు సంబరాలు

విద్యార్థులూ.. తస్మాత్ జాగ్రత్త!

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే: ఎడతెరపి లేని వర్షాలు, మొంథా తుపాను తీవ్రత తగ్గడంతో పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ పాఠశాల యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు కొన్ని సూచనలు చేసింది.

- పాఠశాల ఆవరణంలో శిథిల భవనాలు, పైకప్పు ఉరుస్తున్న భవనాల్లోకి విద్యార్థులు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అందులో తరగతులు నిర్వహించరాదు.
- పాఠశాల ఆవరణంలో భవన నిర్మాణ పనులు జరుగుతుంటే అక్కడ తీసిన గుంతల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి. గుంతల వైపు పిల్లలు వెళ్లకుండా సూచనలు ఇవ్వాలి. వెంటనే వాటిని పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలి.
- పాఠశాలల పరిసరాల్లో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, ఫ్యూజ్ బాక్సులు ఉంటే వాటి వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

కంభంవారిపల్లె బాలుర వసతిగృహం ఆవరణంలో ఉన్న విద్యుత్తు స్తంభం

- ముఖ్యంగా వసతి గృహాల్లోని విద్యార్థులు స్విచ్ బోర్డులు, విద్యుత్తు తీగల వద్దకు వెళ్లకుండా చూడాలి.
- పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యుత్తు మరమ్మతులు చేపట్టాలి.
- విద్యార్థులు బడికి వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు మార్గంలో వాగులు, వంకలు, కాలువలు దాటి వెళ్లాల్సిన పరిస్థితి ఉంటే, అక్కడ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.
- కుళాయిలు, చేతి పంపుల నుంచి వచ్చే తాగునీరు వర్షానికి కలుషితమయ్యే అవకాశం ఉంది. కారణంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజన సమయంలో కాచి చల్లార్చిన నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలి.
- పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలు తొలగించాలి. పిచ్చి మొక్కలు ఎక్కువగా ఉంటే పాములు వచ్చే అవకాశం ఉంది. పాఠశాల తరగతి గదిలో పురుగులు, పాములు ఉంటాయనే ఉద్దేశ్యంతో గదులను జాగ్రత్తగా శుభ్రం చేయాలి.
- పాఠశాల ఆవరణంలో నీటి నిల్వలు లేకుండా చూడాలి. నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది, వాటి వల్ల విద్యార్థులకు జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. నీరు నిల్వ ఉంటే బ్లీచింగ్, దోమల మందు పిచికారీ చేయాలి.
- మురుగు కాలవలు పొంగి, ప్రవహిస్తున్నందున, వాటికి దూరంగా నడవాలని ఉపాధ్యాయులు సూచించాలి.

ఈ నెలా ఉడకలేదు!



చౌక దుకాణాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేసే రేషనులో ఈ నెలా బియ్యం, అరకిలో పంచదారతోనే సరిపెడుతున్నారు. ఏ నెలకు ఆ నెల కందిపప్పు వస్తుందని పేదలు ఎదురుచూపులతోనే కాలం వెళ్లదీస్తున్నారు. గత నెలలో అరకొరగా రాగులు అందించారు. ఈ సారి అవీ కూడా లేవు. రేషను దుకాణాల్లో నిత్యావసరాల సరుకులు అందజేస్తేనే తమకు మేలని పేదలు చెబుతున్నారు. అసలే కూరగాయల ధరలు పెరిగిపోయాయి. కందిపప్పు కొందామంటే కిలో రూ.120 నుంచి రూ.140 వరకు బహిరంగ మార్కెట్‌లో పలుకుతోంది. అదే రేషనులో ఇస్తే కేవలం రూ.67లకే వచ్చేది. నలుగురున్న చిన్న కుటుంబం నాలుగు రోజులు పప్పుతో భోజనం చేసేందుకు వీలుండేది. కానీ ప్రభుత్వం నుంచి సరఫరా ఆగిపోవడంతో డీలర్లు ఇవ్వలేకపోతున్నారు. దుకాణానికి వచ్చే ప్రతి లబ్ధిదారుడు కందిపప్పు రాలేదా? అని అడుగుతూ నిరాశగా వెళుతున్నారు. చౌక దుకాణాల ద్వారా బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు, పామాయిల్, గోధుమ పిండి, రాగులు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఎన్‌ఫోర్స్‌మెంటు ఉప తహసీల్దారు వెంకటరెడ్డిని వివరణ కోరగా కందిపప్పు సరఫరా రాలేదన్నారు. ప్రభుత్వం నుంచి వస్తే పంపిణీ చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

జిల్లాలో మండలాలు	30
కుటుంబాలు	5,78,841
చౌక ధరల దుకాణాలు	1,239
లబ్ధిదారులు	17.61 లక్షలు
ప్రతి నెలా కావాల్సిన కంది పప్పు	578.84 టన్నులు

పాపఘ్ని... వరదాయిని



పాపఘ్ని నది ఇరు జిల్లాలకు వరదాయినిగా మారింది. ఈ నది ప్రవహించే మార్గంలోని గ్రామాల్లో తాగు, సాగునీటికి ఇబ్బందులు లేకుండా సస్యశ్యామలం చేస్తోంది. కర్ణాటక రాష్ట్రంలోని చిక్కబళ్లాపుర జిల్లాలోని శిడ్లఘట్ట వద్ద పుట్టి ఉమ్మడి అనంతపురం, చిత్తూరు జిల్లాల మీదుగా అన్నమయ్య జిల్లాలో ప్రవేశిస్తోంది. ఈ నదిపై గాలివీడు మండలం వెలిగల్లు వద్ద జలాశయం నిర్మించారు. అక్కడి నుంచి లక్కిరెడ్డిపల్లె, చక్రాయపేట, వేంపల్లె, పెండ్లిమర్రి, వీరపునాయునిపల్లె, కమలాపురం మండలం మీదుగా ప్రవహిస్తూ కుందూతో కలిసి వల్లూరు మండలంలో పెన్నానదిలో కలుస్తుంది. తాగునీటి పథకాలు, పరివాహక గ్రామాల్లో వేలాది ఎకరాల భూములున్నాయి. అయిదేళ్లుగా వర్షాలు సక్రమంగా కురవక పాపఘ్ని నది ఎడారిని తలపించింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాపఘ్ని నదిలో జలకళ సంతరించుకుంది. దీంతో నదిలోని తాగునీటి పథకాల ఫిల్టర్లు, పరివాహక గ్రామాల్లో వ్యవసాయ బోర్లలో భూగర్భ జలమట్టం పెరిగింది. పాలకొండలను చీల్చుతూ పచ్చదనాన్ని పెంచుతూ వేంపల్లె మండలం 'గండి' వద్ద సాగిపోతున్న నదిని చిత్రంలో చూడవచ్చు. - న్యూస్‌టుడే, వేంపల్లె

దేవుడా.. నీవే దిక్కు!

కోవెల.. కారాదు కన్నీళ్లకు దారిలా

నిత్యపూజకోనస్వామి దర్శనం కోసం భక్తుల బారులు

ఒంటిమిట్ట, కొండాపురం, న్యూస్‌టుడే: ఆలయం భక్తుల్లో ఆధ్యాత్మిక చింతన పెంచుతోంది. గుడి ప్రజలను భక్తి మార్గం వైపు నడిపిస్తోంది. మునుపటి కంటే ఇష్ట దైవం దర్శన భాగ్యం కోసం రానురాను భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. దేవదాయశాఖ, తితిదే, ప్రైవేటు ధార్మిక సంస్థల పర్యవేక్షణలో నడుస్తున్న ఆలయాల్లో గట్టి భద్రతను ఏర్పాటు చేయడం లేదు. అసౌకర్యాలు వెక్కిరిస్తున్నాయి. సరైన వసతులు కల్పించడం లేదు. ముందుచూపు కొరవడింది. పండగలు, ఉత్సవాలు, ఊరేగింపు వేడుకల సమయంలో ఇష్ట దైవాన్ని కనులారా దర్శించి మనసారా పారవశం పొందాలని వస్తున్న వారికి ఆయా కోవెలలో సరైన వసతుల్లేక కన్నీళ్లు తెప్పిస్తోంది. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఏకాదశి వేళ తోపులాటలో తొమ్మిది మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఈ ఘటనతోనైనా జిల్లా యంత్రాంగం భద్రతపై దృష్టి సారించాలని జనం కోరుతున్నారు.

ఎక్కడెక్కడ ఎలా ఉందంటే..

- సిద్దవటం మండలం నిత్యపూజకోన స్వామి చెంతకు వెళ్లాలంటే భక్తులకు ప్రయాస తప్పడం లేదు. లంకమల అభయారణ్యంలో కొలువై ఉండటంతో సరైన రహదారి వసతి లేదు.
- పంచలింగాల నుంచి 3.50 కి.మీ దూరం కాలినడకన వంకలు, వాగులు దాటుకొని చేరుకోవాల్సి ఉంది. నీటి గుండం (జలపాతం) నుంచి 500 మీటర్ల దూరం ఇబ్బందికరంగా ఉంది. ఇరుకు మార్గంతో అవస్థలు తప్పడం లేదు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా రెప్పపాటులో ప్రమాదం జరిగే అవకాశం ఉంది.
- కపర్థీశ్వరస్వామి గుడి చెంతకు భక్తులు ఎక్కువగా వస్తారు. పెండ్లిమర్రి మండలం పొలతల మల్లికార్జునస్వామి ఆలయం ప్రముఖ శైవ క్షేత్రంగా ప్రసిద్ధి ఉంది. ఇక్కడ కూడా సరైన వసతుల్లేవు. వెయ్యినూతుల కోనలోనూ అదే తీరు. ఏంటీ దుస్థితి అంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- కొండాపురం మండలం పెన్నానది ఒడ్డున బాలప్పకోనలో ఎలాంటి క్యూలైన్లు, బారికేడ్లు లేవు. ఇక్కడే కాకుండా ప్రొద్దుటూరు అగస్త్యేశ్వరస్వామి, ముక్తి రామలింగేశ్వరస్వామి, పుష్పగిరితో పాటు మరికొన్ని క్షేత్రాలను దర్శించాలని అధిక సంఖ్యలో వస్తున్నారు.

(c) eenadu

పొంచి ఉన్న ప్రమాదం.. రాకపోకలకు అసౌకర్యం

ముక్కొండ వద్ద నిర్మిస్తున్న పీఎంఏవై-ఎన్టీఆర్‌నగర్‌లో దారి అధ్వానంగా తయారైంది. కాలనీ వద్ద పెద్ద గోతులు పడ్డాయి. రాకపోకలకు లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో కాలనీ ఎగువన ఉన్న కొండ నుంచి నీటితో పాటు అక్కడి వీధుల్లోకి చేరి ప్రమాదకరంగా గోతులు ఏర్పడ్డాయి. వాహన రాకపోకలతో గోతులు పడ్డాయి. ఎగువన కొండ వెంట ట్రెంచింగ్ ఏర్పాటు చేసి కాలనీలోకి నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, మైదుకూరు, ఈనాడు, కడప

వర్షపునీటితో పొలాల మునక

మైదుకూరు, న్యూస్‌టుడే: మండలంలో వనిపెంట నుంచి పప్పునపల్లె వెళ్లే దారికి మురుగుకాలువ లేక పోవడంతో దారి పక్కన పెద్దఎత్తున వర్షపునీరు నిల్వ చేరుతోంది. దాదాపు 20 ఎకరాల పరిధిలో నీరు నిల్వ చేరడంతో పంటను నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. పొలాల్లో నీరు నిల్వ చేరకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మామిడి తోటలో నిలిచిన వర్షపు నీరు

వక్ఫ్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: కడప నగరంలోని మస్జిదే ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్‌లో ఆదివారం వక్ఫ్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన సదస్సును ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సభ్యుడు షేక్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ దావూద్ బాషా, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అడిషనల్ డైరెక్టర్ జాకీర్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ వసీంలు పాల్గొని రిజిస్ట్రేషన్‌లో వక్ఫ్ ఆస్తుల గురించి ఎలా నమోదు చేసుకోవాలో వివరించారు. ఆన్‌లైన్ డిసెంబరు 5వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పలువురు మస్జిదే ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

4.01 టీఎంసీలకు చేరిన వెలిగల్లు నీటిమట్టం

గాలివీడు, న్యూస్‌టుడే: వెలిగల్లు జలాశయం గరిష్ఠ నీటి సామర్థ్యం 4.64 టీఎంసీలు కాగా ఆదివారం 4.01 టీఎంసీలకు చేరింది. ఇటీవల కురిసిన వర్షానికి 1.5 టీఎంసీల నీటి మట్టం పెరిగింది. పాపాఘ్ని నది ఎగువ నుంచి 350 క్యూసెక్కుల నీటి ప్రవాహం చేరుతోంది. కుడి కాలువకు 110 క్యూసెక్కులు, రాయచోటి, గాలివీడు నీటి పథకాలకు ఆరు క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం భద్రత దృష్ట్యా సిబ్బందితో రాత్రుల్లో గస్తీ ఏర్పాటు చేసినట్లు డీఈఈ భాస్కర్‌బాబు తెలిపారు.

మహారాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో, కడప
క్రెడిటార్ ఐ.పి. నెం.68/2025

శ్రీమతి కస్సెయ్యగారి హిమబిందు, తండ్రి కె.క్రిష్ణారెడ్డి, వయస్సు 50 సం॥లు, హిందూ కులం, నివాసం ఏపీ హౌసింగ్ బోర్డు కాలనీ, యల్.ఐ.జి-2, డి.నెం.366, కడప. ...పిటీషనరు

వర్సెస్

1.శ్రీమతి రాఫెల్ విక్టోరియ నిర్మల, భర్త షేక్ అబ్దుల్ హమీద్, వయస్సు 63 సం॥లు, డి.నెం.42/505, ఎన్.జి.ఓ. కాలనీ, కడప. Another address: డి.నెం.3/1280, కో-ఆపరేటివ్ కాలనీ, కడప. 2.షేక్ కరిముల్లా, తండ్రి షేక్ రహ్మతుల్లా, వయస్సు 33 సం॥లు, ముస్లిం కులం. 3.షేక్ సయ్యద్ ఉస్మ, తండ్రి షేక్ కరిముల్లా, వయస్సు 28 సం॥లు, రెస్పాండెంట్సు నెం.2 & 3. వీరి నివాసం డి.నెం.10/1056, ట్రంక్ రోడ్డు, కడప. 4. అఫీషియల్ రిసీవర్, డిస్ట్రిక్ట్ కోర్టు కాంప్లెక్స్, కడప. ...రెస్పాండెంట్స్

పబ్లిక్ ప్రకటన

పై కనిన పిటీషనర్ పై కనిన 1వ రెస్పాండెంట్ తన ఇంటి అవసరార్థం రూ.7,00,000/-లు అప్పు తీసుకొని అప్పుపత్రం పై కనిన పిటీషనరు పేరున సాక్షుల సమక్షంలో వ్రాయిడం జరిగినది. తర్వాత 1వ రెస్పాండెంట్ పై కనిన పిటీషనరుకు డబ్బు ఎగరగొట్టాలనే ఉద్దేశ్యంతో తన పేరు మీద వున్న ఆస్తిని నామమాత్రపు దస్తావేజును తేదీ: 10.06.2025 దస్తావేజు నెం.3752/2025ను 2వ మరియు 3వ రెస్పాండెంట్సు పేర నామమాత్రపు విక్రయ దస్తావేజును వ్రాయించడం జరిగినది. కావున సదరు నామ మాత్రపు దస్తావేజును కాన్సిల్ చేసి 1వ రెస్పాండెంట్‌కు సంబంధించిన ఆస్తిని వేలం వేసి పిటీషనరుకు రావలసిన బకాయి ఇప్పించవలసినదిగా కోరి ఉన్నారు. కావున సదరు దస్తావేజును రద్దుపరచడంలో యెవరికయినను అభ్యంతరములు ఉన్నచో పై కనిన కోర్టులో 13.11.2025న ఉదయం 10.30 గంటలకు స్వయంగా గానీ, అడ్వకేట్ ద్వారా గానీ హాజరు అయి అభ్యంతరములు తెలుపుకొనవలయును. మీరు హాజరు కాని యెడల మీ పరోక్షమున తీర్మానం చేయుదురని ఇందుమూలకంగా తెలియజేయుచున్నాము.

షెడ్యూలు: RCC ఇంటి డి.నెం.42/505-2, 42వ వార్డు, జయనగర్ కాలనీ, చిన్నచౌక్ మజరా, కడప జిల్లా, సర్వే నెం.91/1 & సర్వే నెం.752/2 మొత్తం విస్తీర్ణం Ac 0.75 చదరపు అడుగులు. హద్దులు: తూ: ప్లాట్ నెం.432 మరియు ఎ. 0.04 1/2 అడుగులు, ప: డి.నెం.42/505-1, ఉ: రోడ్డు, ద: డి.నెం.42/505-1.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
సం/- యం.సుధాకర్ బాబ్జీ
అడ్వకేట్, కడప.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప ట్రాఫిక్ రాణా పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. చెన్నూరుకు చెందిన సూరి (26) ఆదివారం తన సొంత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై పులివెందులకు వెళ్తుండగా ఫాతిమా కళాశాల వద్దకు రాగానే వాహనం అదుపు తప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS

రవికిరణ్ ఎంటర్ ప్రైజెస్ పెన్నార్ మినరల్ వాటర్ బాటిల్స్ 1 లీటరు, Half లీటరు బాటిల్స్ జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేయుటకు డిస్ట్రిబ్యూటర్స్, డీలర్స్ కావలెను. సంప్ర: 94915 90112.

కడప ఆర్టీ ఇంగ్లీషు మీడియం స్కూల్ నందు ఫిజిక్స్, బయాలజీ ప్రైమరీ పిల్లలకు బోధించుటకు టీచర్లు & PET (మహిళ) కావలెను. సంప్ర॥ 94933 71898, 83319 51098.

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

HOSPITALITY

కడప నగరం, హిమాలయ ఆసుపత్రి నందు పనిచేయుటకు నర్సింగ్ స్టాఫ్, వార్డుబాయిలు, ఆయమ్మలు కావలెను. సెల్: 9100745905.

JOBS

Wanted Experienced Drivers and Security persons for a Reputed Educational Institution in Rayachoty. Contact: 8217200025, 7093473533.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే
Contact: KDP: 9989997626, 8008514248 PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

ఇంటి నుంచే విద్యుత్తు సేవలు

● అందుబాటులో ఏపీఎస్పీడీసీఎల్ యాప్



విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఏపీఎస్పీడీసీఎల్ ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టింది. ఆండ్రాయిడ్ చరవాణుల్లో ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీనిద్వారా వచ్చిన సమస్యలను విద్యుత్తు శాఖ అధికారులు పరిశీలించి సత్వరం పరిష్కరిస్తారు.

- న్యూస్‌టుడే, రాయచోటి, ప్రొద్దుటూరు గ్రామీణ

జిల్లా	అన్నమయ్య	వైఎస్సార్
కనెక్షన్లు	8,32,872	8,10,992
ప్రతినెలా బిల్లు (రూ. కోట్లు)	52	67.08

బిల్లు చెల్లించొచ్చు: విద్యుత్తు బిల్లులు చెల్లించేందుకు బిల్‌పే ద్వారా సర్వీసు నంబరు, చరవాణి నంబరు పొందుపరిస్తే సంబంధించిన వివరాలు ప్రత్యక్షమవుతాయి.

నూతన కనెక్షన్ : నూతన కనెక్షన్ కోసం సమగ్ర వివరాలను యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. అధికారులు పరిశీలించి కనెక్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటారు.

మొబైల్ లింకింగ్ : విద్యుత్తు వినియోగదారులు తమ విద్యుత్తు కనెక్షన్‌కు సంబంధించి చరవాణి నంబరును అనుసంధానిస్తే విద్యుత్తు బిల్లుల సమాచారం చరవాణికి అందుతుంది.

ఎనర్జీ కాలిక్యులేటర్ : ఏ ఉపకరణానికి ఎంత విద్యుత్తు ఖర్చవుతుందో దీని ద్వారా తెలుసుకోవచ్చు. నెలవారీ విద్యుత్తు వినియోగానికి సంబంధించిన మీటరు రీడింగ్ వివరాలు పొందుపరిస్తే బిల్లు సమాచారం కనిపిస్తుంది.

కస్టమర్ కేర్: వినియోగదారులు తమ సమస్యలను ఇందులో పొందుపరచొచ్చు. అందిన సలహా వివరాలు, అవసరమైన అన్ని లింకులు ఇందులో పొందుపరిచి ఉంటాయి.

ఫీడ్ బ్యాక్: విద్యుత్తు శాఖ అందిస్తున్న సేవలపై అభిప్రాయాలు పంచుకోవచ్చు.

కన్‌జంప్షన్: వినియోగదారులు వాడిన యూనిట్లు.. చెల్లించాల్సిన నగదు.. బిల్ లెడ్జర్ వివరాలు అందుబాటులో ఉంటాయి.

పేమెంట్ హిస్టరీ : వినియోగదారులు నెలవారీగా చెల్లించిన విద్యుత్తు బిల్లుల సమాచారం ఇందులో ఉంటుంది.

ఎనర్జీ సేవింగ్స్ టిప్స్ : విద్యుత్తు ఉపకరణాలు వాడుతున్నప్పుడు ఆచరించాల్సిన పొదుపు సూచనలు విపులంగా ఉంటాయి.

పే బిల్: సర్వీసు నంబరు నమోదు చేసుకుని నెలవారీ విద్యుత్తు బిల్లుకు సంబంధించిన నగదు చెల్లించొచ్చు.

అధికారుల వివరాలు : వినియోగదారుల పరిధిలోని అధికారుల ఫోన్ నంబర్లు లభ్యమవుతాయి. ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

టారిఫ్ : వినియోగదారులకు సంబంధించిన టారిఫ్ వివరాలు ఇందులో పొందుపరిచి ఉంటాయి.

క్విక్‌పే : సర్వీసు నంబరు, చరవాణి నంబరును నమోదు చేస్తే సంబంధిత బిల్లు వివరాలు వస్తాయి. అక్కడినుంచి బిల్లు చెల్లించొచ్చు.

ఘనంగా జానమద్ది సాహితీపీఠం పురస్కారాల ప్రదానం

పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప నుంచి సత్కారం అందుకున్న అవధాని మేడసాని మోహన్, డాక్టర్ గుమ్మడి గోపాలకృష్ణ, రేపూరు అనంతపద్మనాభరావు, అంకె గౌడ

కడప (మారుతీ నగర్), న్యూస్‌టుడే: ప్రముఖ సాహితీ వేత్త, బ్రౌన్ గ్రంథాలయ రూపశిల్పి దివంగత డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి జయంతిని పురస్కరించుకుని కడపలోని సీపీ బ్రౌన్ కార్యాలయంలో ఆదివారం జానమద్ది సాహితీపీఠం పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జానమద్ది సాహితీ పీఠం పురస్కారాలను తెలుగు రాష్ట్రాలకు చెందిన డాక్టర్ మేడసాని మోహన్ (తిరుపతి), డాక్టర్ రేపూరు అనంత పద్మనాభరావు (హైదరాబాద్), ఏపీ రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ (హైదరాబాద్), గ్రంథాలయ సేవా పురస్కారాన్ని మరో అంకెగౌడ (కర్ణాటక)కు ప్రదానం చేశారు. పురస్కారం కింద రూ.10 వేల నగదు, శాలువాతో అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయ భాస్కర్ పాల్గొన్నారు.

ప్రతి నెలా పౌర హక్కుల దినోత్సవం జరపాలి

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: దళితులు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలు, ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించే విధంగా ప్రతి నెలా పౌర హక్కుల దినోత్సవం జరపాలని రాష్ట్ర మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఇమ్మానుయేలు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 5వ తేదీ బుధవారం అంబేడ్కర్ విగ్రహం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ అధికారులకు వినతిపత్రం అందజేస్తామన్నారు. అంబేడ్కర్ ఆశయాల కోసం తలపెట్టిన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

5న సీతారాముల కల్యాణం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా ఈ నెల 5వ తేదీ బుధవారం ఉదయం 9.30 గంటలకు సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తామని ఆలయ తనిఖీ అధికారి నవీన్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాములోరి పరిణయ వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన వివరించారు.

డ్రాగా ముగిసిన అండర్-14 తొలి రౌండ్ క్రికెట్ పోటీలు

కడప క్రీడలు, న్యూస్‌టుడే : ఏసీఏ సౌత్‌జోన్ అండర్-14 మెన్ మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో తొలి రౌండ్ పోటీలు డ్రాగా ముగిశాయి. కడప, అనంతపురం జట్లకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఈ మ్యాచ్‌లకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

84 పరుగులు చేసిన మోక్షజ్ఞ | నాలుగు వికెట్లు శ్రీచరణ్ | బ్యాటింగ్‌లో రాణించిన తాహిర్

❖ వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియంలో 2 వికెట్ల నష్టానికి 68 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండో రోజు (ఆదివారం) బ్యాటింగ్ చేపట్టిన కడప జట్టు 89.3 ఓవర్లు బ్యాటింగ్ చేసి 8 వికెట్లు కోల్పోయి 249 పరుగుల స్కోరు వద్ద తన తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. జట్టులో తాహిర్ 63, అష్ఖాన్ 49 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లలో యశ్వంత్ సూర్య 3, అంకిత్ 2 వికెట్లు తీసుకున్నారు. ఆపై కర్నూలు జట్టు తన రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించి రెండో రోజు మ్యాచ్ ముగిసే సమయానికి 4 వికెట్లు కోల్పోయి 58 పరుగులు చేసింది. కడప బౌలర్ మునిజ్ఞానేశ్వర్‌కు 3 వికెట్లు దక్కాయి. మ్యాచ్ డ్రాగా ముగిసింది. కడప జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

❖ కెవోఆర్ఎం మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో 3 వికెట్ల నష్టానికి 86 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు బ్యాటింగ్‌ను ఆరంభించిన అనంతపురం జట్టు 83.4 ఓవర్లలో 242 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. జట్టులో మోక్షజ్ఞ 84 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్ శ్రీచరణ్ 4 వికెట్లు తీసుకున్నారు. ఆపై నెల్లూరు జట్టు తన రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించి మ్యాచ్ ముగిసే సమయానికి 6 వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. జట్టులో సమీర్ 59 పరుగులు చేశారు. అనంతపురం బౌలర్ రోహిత్‌తేజేశ్వర్ రాజుకు 3 వికెట్లు పడ్డాయి. ఈ మ్యాచ్ కూడా డ్రాగా ముగిసింది. అనంతపురం జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది.

4న సబ్ జూనియర్స్ కబడ్డీ జిల్లా స్థాయి ఎంపికలు

కడప క్రీడలు: బద్వేలులోని బిజివేముల వీరారెడ్డి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల మైదానంలో ఈ నెల 4న సబ్ జూనియర్స్ కబడ్డీ జిల్లా స్థాయి ఎంపికలు చేపడుతున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురుశేఖర్, వెంకటసుబ్బయ్య తెలిపారు. బాల బాలికలకు వేర్వేరుగా ఎంపికలు చేపడతామన్నారు. ఎంపికైన వారు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

కమనీయం.. వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల జయంతి మహోత్సవాల్లో రెండో రోజు సుప్రభాత వేదస్వస్తి పారాయణం నిత్యపూజలు విశేషంగా నిర్వహించారు. అనంతరం 417 కలశాలను మహిళలు ఊరేగింపుగా మాడవీధుల మీదుగా ఉద్యానంలోని స్వామివారి శిలామూర్తికి కలశ స్నపన పూజలు చేశారు. పూర్వపు మఠాధిపతి కుమారులు వేంకటాద్రిస్వామి, భద్రయ్యస్వామి, వీరంబట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి శిలా మూర్తికి క్షీరాభిషేకం, పంచామృత అభిషేకం చేశారు. రాత్రి అంగరంగ వైభవంగా, కనులపండువగా గోవిందమాంబా సమేత వీరబ్రహ్మేంద్రస్వాముల వారి కల్యాణోత్సవాన్ని పండితులు ఇమకంటి జనార్దన శివాచార్య బృందం నిర్వహించింది. స్వామి వారి కల్యాణానికి నంద్యాల జిల్లా మహానంది ఆలయ ఈవో శ్రీనివాసుల రెడ్డి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆ తర్వాత స్వామివారి గ్రామోత్సవం, హరికథా కాలక్షేపాన్ని భక్తులు తిలకించారు. సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, ప్రసాద వినియోగం, కార్తిక సహస్ర దీపార్చన, పలు పూజలను చేపట్టనున్నామని నిర్వాహకులు తెలిపారు.

కలశాలతో మాఢ వీధుల్లో మహిళలు

కల్యాణంలో మంగళ సూత్రాన్ని చూపుతున్న వేద పండితులు

వసతి గృహ విద్యార్థులపై వివక్ష చూపితే చర్యలు

వసతి గృహం నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

పులివెందుల, న్యూస్‌టుడే: పేద విద్యార్థులంటే అంత అలుసా.. వారిపై ఎందుకంత వివక్ష అని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఏపీ గిరిజన సమీకృత బాలికల వసతి గృహం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పులివెందులలోని నగరిగుట్టలో ఉన్న గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహాన్ని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా చూసి వసతి గృహం అధికారులు సుజాత, శిరీషలను ప్రశ్నించారు. రికార్డులలో ఉన్నదానికి నిల్వ ఉన్న సరకులకు వ్యత్యాసం ఉండడం, విద్యార్థినుల గదుల్లోకి మరుగుదొడ్ల నుంచి నీరు వస్తుండటాన్ని ఆయన గమనించారు. వారికి సరైన వసతులు కల్పించకపోవడప అసహనం వ్యక్తం చేశారు. భోజనం సరిగా పెట్టడంలేదని ఫిర్యాదులందాయని.. తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో మోపూరి దేవస్థాన ఛైర్మన్ రమణారెడ్డి, కడప పార్లమెంటరీ కార్యదర్శి మైసూరారెడ్డి, జ్ఞానేశ్వరనాయుడు, శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పొలం బాట పట్టిన ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

వేంపల్లె, న్యూస్‌టుడే: నిత్యం ల్యాప్‌టాప్‌లపై సాంకేతిక విద్యతో కుస్తీపట్టే ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఆదివారం పొలంబాట పట్టారు. జాతీయ సేవాపథకం(ఎన్ఎస్ఎస్) 2, 6, 7 యూనిట్ల ఆధ్వర్యంలో వీరన్నగట్టుపల్లె, ఇడుపులపాయ, చింతలమడుగుపల్లెల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ అధికారి కోనప్ప ఆధ్వర్యంలో వాలంటీర్లు వరి పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. సేంద్రియ ఎరువులతో పంటలసాగు వల్ల ప్రయోజనాల గురించి వారు రైతులకు వివరించారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ అధికారులురవికుమార్, రత్నకుమారి, 150 మంది వాలంటీర్లు పాల్గొన్నారు.

వీరన్నగట్టుపల్లె పొలాల్లో ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ అధికారి కోనప్ప, అధికారులు

నూతన ఉపాధ్యాయులకు ట్రెజరీ ఐడీలు కేటాయించాలి

వీరబల్లి, న్యూస్‌టుడే : నూతన ఉపాధ్యాయులకు ట్రెజరీ ఐడీ త్వరితగతిన చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల సంఘం (అపస్) గౌరవాధ్యక్షులు పరశురాం డిమాండు చేశారు. ఆదివారం వీరబల్లిలో నిర్వహించిన అపస్ సమావేశంలో ఆయన, జిల్లా అధ్యక్షుడు నరసింహులు మాట్లాడారు. క్లస్టర్ పోస్టుల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని కోరారు. అనంతరం అపస్ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. వీరబల్లి గౌరవ అధ్యక్షుడిగా మధుసూదన్ రాజు, గౌరవ సలహాదారుడిగా విజయ్‌కుమార్‌రెడ్డి, మండల అధ్యక్షుడిగా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా సి.హెచ్. రమణ, అదనపు ప్రధాన కార్యదర్శిగా చెన్నకేశవ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రామ్మోహన్, ఆర్థిక కార్యదర్శిగా మల్లికార్జున శెట్టి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అపస్ (ఏపీయుఎస్) జిల్లా కార్యదర్శి బాలాజి, నాయకులు పాల్గొన్నారు.

పూడ్చేసిన మృతదేహం వెలికితీత.. నిందితుడి అరెస్టు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : అనారోగ్యంతో మృతి చెందిన యువకుడి మృతదేహాన్ని ఓ వ్యక్తి మంత్రతంత్రాల కోసం పట్ట పగలే వెలికితీసిన ఘటన ఆదివారం జరిగింది. మదనపల్లె పట్టణానికి చెందిన దిలీప్‌రావ్ (23) అనారోగ్యంతో ఈ నెల 1న బెంగళూరులో మృతి చెందాడు. అదే రోజు సాయంత్రం కుటుంబ సభ్యులు మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె మార్గంలోని శ్మశాన వాటికలో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఆదివారం ఉదయాన్నే ఓ వ్యక్తి మృతదేహాన్ని వెలికి తీస్తుండగా పశువుల కాపర్లు గుర్తించి మందలించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో అతను మళ్లీ శ్మశానానికి వచ్చి మృతదేహాన్ని పూడ్చిన ప్రాంతంలో మట్టిని తవ్వుతుండగా.. ఈ సమయంలో మృతుడికుటుంబ సభ్యులు వచ్చి అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేశారు. మృతదేహం ఎందుకు బయటకు తీస్తున్నావని ప్రశ్నించినా అతను సమాధానం చెప్పక పోవడంతో గట్టిగా నిలదీశారు. దీంతో తనపేరు గోవిందు అని తాను జైపూర్ నుంచి వచ్చి మదనపల్లెలో ఉంటున్నట్లు హిందీలో తెలిపాడు. తన చిన్నాన్న మహేష్ చనిపోయాడని అతనితో మాట్లాడేందుకు యువకుడి మృతదేహంతో మంత్రతంత్రాలు చేసేందుకు వెలికితీసినట్లు ఒప్పుకున్నాడు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ కళా వెంకటరమణ తమ సిబ్బందిని పంపి అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

నిందితుడిని తీసుకెళ్తున్న పోలీసు

అదనపు క్రమబద్ధీకరణ రాయితీకి మరో అవకాశం

డిసెంబరు 31 వరకు పొడిగింపు

-న్యూస్‌టుడే, మైదుకూరు

గృహ అవసరాల విద్యుత్తు సర్వీసులపై అదనపులోడ్ క్రమబద్ధీకరణకు 50శాతం రాయితీ అవకాశాన్ని డిసెంబరు 31వ తేదీ వరకు పొడిగించారు. తక్కువ లోడ్ తీసుకుని ఎక్కువ విద్యుత్తు వినియోగం చేస్తున్న వారికి అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు గతంలో జులై 31వ తేదీ వరకే అవకాశం కల్పించారు. అయితే రాయితీ అవకాశాన్ని డిసెంబరు 31 వరకు పొడిగించినట్లు ఏడీఈ శ్రీకాంత్ తెలిపారు. వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అదనపు లోడ్‌కు కిలోవాట్ వారీగా చెల్లించాల్సి ధర (రూపాయల్లో)

అదనపు లోడ్	పాత ధర	ప్రస్తుత ధర
1 కిలోవాట్	2250	1250
2 కిలోవాట్	4450	2450
3 కిలోవాట్	6650	3650
4 కిలోవాట్	8850	4850
5 కిలోవాట్	11550	6050

టెంకాయ కొట్టేదెప్పుడు!

● బద్వేలులో ప్రారంభానికి నోచుకోని రైతుబజారు

-న్యూస్‌టుడే, బద్వేలు

బద్వేలు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్టు యార్డులో అర కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన రైతు బజారు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. తమ వ్యవసాయ పొలాల్లో పండిన కూరగాయలను మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల రైతులు ప్రమాదకర మైదుకూరు ఎన్‌హెచ్‌ఏ రోడ్డుపైనే విక్రయాలు చేస్తున్నారు. ఈ మార్గంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు, పుర ప్రజలు భయాందోళనకు లోనవుతున్నారు. ప్రతి శుక్రవారం జీవాల సంత ఇక్కడే జరుగుతుంది. వాహనాల పార్కింగ్ అక్కడే చేస్తున్నారు. ఈ మార్గంలో వచ్చిపోయే వాహనాల వేగం కూడా ఎక్కువే. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు నిత్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవితం వెళ్లదీస్తున్నారు. వాహనాలు వేగంగా వెళ్లడంతో తరచూ ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగుతోంది. ఇంత జరుగుతున్నా పాలకులు అధికారులు రైతుబజారును ప్రారంభించకుండా మీనమేషాలను లెక్కిస్తున్నారు. ఈ విషయాన్ని కడప సహాయ వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకులు అజాద్ దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకుపోగా త్వరలోనే రైతుబజారును ప్రారంభిస్తామన్నారు.

నిరుపయోగంగా బద్వేలులోని రైతుబజారు

హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల సందడి

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: హార్సిలీహిల్స్‌కు సందర్శకుల తాకిడి పెరిగింది. బెంగళూరుతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులతో కొండపై ఆదివారం సందడి నెలకొంది. ఇటీవల కురిసిన వర్షాలకు హార్సిలీహిల్స్ అటవీ ప్రాంతం పచ్చదనంతో కళకళలాడుతోంది. మానస సరోవరం, గంగోత్రి చెరువు, కుంటలు, చెక్‌డ్యాంలు నిండిపోయి మొరవలు పారుతున్నాయి. ఈ క్రమంలో కొండపై ఉన్న కొత్త, పాత వ్యూపాయింట్లతో పాటు గాలిబండపై నుంచి ప్రకృతి అందాలను వీక్షించారు. పర్యాటకులు కాండ్లమడుగు నుంచి కొండపైకి కాలినడకన ఉత్సాహంగా వెళ్లారు. హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల రద్దీ గత కొన్నిరోజులుగా ఆశాజనకంగా ఉందని పర్యాటక శాఖ మేనేజరు శ్రీధర్ తెలిపారు.

హార్సిలీహిల్స్ గాలిబండపై సందర్శకులు

(c) eenadu

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

చెరువు మరవపై గ్రామస్థులు

రాచ్చెరువు అలుగు వద్ద సందడి

కలసపాడు, న్యూస్‌టుడే: మండలంలోని రాచ్చెరువుకు రెండు రోజుల కిందట అలుగు పారడంతో స్థానికులు అక్కడికి చేరుకుని సందడి చేస్తున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో రద్దీ పెరిగింది. పొరుగున ఉన్న ప్రకాశం జిల్లా కొమరోలు ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు రాచ్చెరువు పూర్తిగా నిండడంతో నీటి ఉద్ధృతి పెరిగింది.

కన్యతీర్థంలో కార్తిక పూజలకు ఏర్పాట్లు

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: కార్తిక మాసంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కన్యతీర్థంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తుంటారు. రెండో సోమవారం సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి వస్తారని ఆలయ కమిటీ నిర్వాహకులు ఆదివారం ఆలయ ప్రాంగణంలో బారికేడ్లతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు.

భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు

సమాధుల తోటలో ప్రార్థనలు

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: క్రైస్తవులు వారి పుర్వికుల సమాధి తోటలో ఆదివారం ఆల్ సోల్స్ డే (సకల ఆత్మల పండగ) జరుపుకొన్నారు. క్రైస్తవ కుటుంబాలు పెద్దలను స్మరించుకుని సమాధులను పూలమాలలతో అలంకరించి, కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అభిషేక గురువులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఆలయ అధ్యక్షుడిగా సత్యనారాయణ

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని కొత్రపాటిపల్లి పంచాయతీలోని కాల్వకట్ట లక్ష్మీదేవి, గోదాదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ అధ్యక్షుడిగా చాటకొండు సత్యనారాయణ నాలుగోసారి ఎంపికయ్యారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యదర్శిగా చాటకొండు సుధాకర్, కోశాధికారిగా గాజులపల్లి ఓబయ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామస్థులు అధ్యక్షుడిని పూలమాలతో ఘనంగా సన్మానించారు.

పోరుమామిళ్ల ఆలయ అధ్యక్షుడిని సన్మానిస్తున్న కమిటీ ప్రతినిధులు

పునాదుల్లోనే కూరగాయల మార్కెట్

–న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

ప్రొద్దుటూరు పురపాలక సంఘ కూరగాయల మార్కెట్, వాణిజ్య సముదాయాల భవనాల నిర్మాణాలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. వైకాపా పాలన నుంచి బిల్లులు సకాలంలో మంజూరు కాలేదు. పట్టణ నడిబొడ్డున 2.50 ఎకరాల భూమిలో 60 వాణిజ్య, 360 కూరగాయల గదుల మార్కెట్‌ను రూపొందించాలని నిర్ణయించారు. ఇందుకు రూ.50.9 కోట్ల నిధులను అప్పటి ప్రభుత్వం కేటాయించింది. తొలుత రూ.20 కోట్ల మేర పనులు ప్రారంభించారు. 2023 జులై నాటికి రూ.5.18 కోట్లు విడుదల చేశారు. ఎన్నికల ప్రకటన విడుదలైననాటి వరకు ఒక్క బిల్లును వైకాపా ప్రభుత్వం మంజూరు చేయలేదు. దీంతో నిర్మాణ పనులు నెమ్మదించాయి. కూటమి ప్రభుత్వం వచ్చే నాటికి రూ.5 కోట్ల విలువైన పనులు చేశారు. అనంతరం బిల్లులు రాకపోవడంతో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పనులను నిలుపుదల చేశారు.

ఆరు నెలలుగా అందని బిల్లులు

కలెక్టర్ మాటలు బేఖాతరు

ఆధునికీకరణ కూరగాయల మార్కెట్ నిర్మాణం పూర్తి చేయడానికి గదులన్నింటికీ ఓపెన్ యాక్షన్ వేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి కమిషనర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా గదులకు వచ్చే నిధులతో మిగిలిన పనులు పూర్తి చేయాలన్నారు. ఇది క్షేత్ర స్థాయిలో ఇది అమలుకాలేదు. దీంతో పనుల్లో పురోగతి కనిపించలేదు.

గుత్తేదారుకు నోటీసు

నిర్మాణ పనులు పూర్తి చేయాలని రెండు మాసాల కిందట కమిషనర్ రవిచంద్రారెడ్డి గుత్తేదారుకు నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ పోర్టల్‌లో బిల్లులను నమోదు చేయకపోవడం వలన బిల్లులు రావడం లేదని, వెంటనే మంజూరు చేస్తే పనులు చేపడతామని గుత్తేదారు కమిషనర్‌తో పాటు పురపాలక ఎస్ఈకి జవాబిచ్చారు. గుత్తేదారుకు బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు చేపట్టలేదు. కాగా నిధులకు ఎలాంటి కొరత లేదని కమిషనర్ రవిచంద్రారెడ్డి 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

నిర్మాణ దశలో నిలిచిన పనులు

ఓంకారంలో వన భోజనాలు

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలోని ఓంకార క్షేత్రంలో ఆదివారం కార్తిక వన భోజనాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మృత్యుంజయ స్వామికి ఉదయం రుద్రాభిషేకం, విశేష పూజలు చేశారు. పార్వతీపరమేశ్వరులకు, శివలింగం, నందీశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. మధ్యాహ్నం వనభోజన కార్యక్రమం సందడిగా సాగింది.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

శ్రీశైలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

మైదుకూరు, న్యూస్‌టుడే : కార్తిక మాసాన్ని పురస్కరించుకుని సోమవారం శ్రీశైలానికి సూపర్ లగ్జరీ ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు మైదుకూరు డిపో మేనేజర్ శ్రీలత తెలిపారు. మైదుకూరు నుంచి సోమవారం ఉదయం 6:15 నిమిషాలకు బస్సు బయలుదేరి అక్కడి నుంచి మధ్యాహ్నం 1:50 నిమిషాలకు తిరిగి మైదుకూరుకు బయలుదేరనున్నట్లు తెలిపారు.

ప్రొద్దుటూరులోని టీబీఆర్ పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఇన్‌ఛార్జి నారాయణరెడ్డి, చిత్రలేఖనం ఉపాధ్యాయుడు కల్యాణ్

విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రొద్దుటూరు గీతాంజలి పాఠశాల ప్రిన్సిపల్ అరుణ

చిత్రలేఖనంలో ప్రతిభ

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా ప్రొద్దుటూరు పట్టణంలోని గీతాంజలి పాఠశాలలో విద్యార్థులకు 'మీకు ఇష్టమైన పండగ' అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఇందులో లాస్యశ్రీ (8వ తరగతి), పానియా (9వ తరగతి), ప్రణవి (7వ తరగతి) విద్యార్థులు ప్రతిభ చాటారు. వారికి ప్రిన్సిపల్ అరుణ బహుమతులు అందించారు. ● పట్టణంలోని ఎస్వీవీ ప్రభుత్వ బాలుర పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో లోకేశ్ (10 తరగతి), హైరున్నీసా (9వ తరగతి), ఉష (8వ తరగతి) విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో రాణించారు. ప్రధానోపాధ్యాయుడు అమర్‌నాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు బహుమతులు అందించారు. ● పట్టణంలోని రవీంద్ర పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో అరవింద్ (7వ తరగతి), హిమవర్ధిని (9వ తరగతి), సాయిదీక్షిత (7వ తరగతి) విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కరస్పాండెంట్ ప్రభాకర్‌రెడ్డి, హెచ్ఎం భాదర్‌వలి బహుమతులు అందించారు. ● టీబీఆర్ పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో మహిదర్ (9వ తరగతి), సాయి ఆరాధ్య (8వ తరగతి), మేఘన (7వ తరగతి) విద్యార్థులు విజేతలుగా నిలవగా వారికి పాఠశాల ఇన్‌ఛార్జి నారాయణరెడ్డి, చిత్రలేఖనం ఉపాధ్యాయుడు కల్యాణ్ బహుమతులు అందించారు.

ప్రొద్దుటూరు ఎస్వీవీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న హెచ్ఎం అమర్‌నాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు

ప్రొద్దుటూరులోని రవీంద్ర పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కరస్పాండెంట్ ప్రభాకర్‌రెడ్డి, హెచ్ఎం భాదర్‌వలి

అపూర్వ కలయిక.. ఆత్మీయ పలకరింపు

కొండాపురం, న్యూస్‌టుడే: మండలంలోని తాళ్ల ప్రొద్దుటూరు జడ్పీ పాఠశాలలో 2004-05 ఏడాది పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 20 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులందరూ కలుసుకొని తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. నాటి గురువులు రామచంద్రుడు, ఈశ్వరయ్య, శంకర్‌రెడ్డి, రేణుకారెడ్డి, జయమ్మ, గురివిరెడ్డి, శ్రీకాంత్, భాస్కర్, హనుమంతరెడ్డి, సాంబశివారెడ్డిని ఘనంగా సన్మానించారు.

తాళ్లప్రొద్దుటూరు జడ్పీ పాఠశాలలో ఆనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

పూర్వ ఉప రాష్ట్రపతి దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును కడపలో ఉపాధ్యాయ సంఘాల నేత ఒంటేరు శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు కలిశారు. మెమో 57 అమలు ప్రక్రియ వేగవంతం కోసం సహాయం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చిస్తానని చెప్పినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

ఓటు ఆవశ్యకతపై ప్రచారం

మైదుకూరు: ఓటు ఆవశ్యకతపై స్థానిక బాలికల డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పట్టణంలో పలువీధుల్లో ప్రచారం చేశారు. ప్రిన్సిపల్ సురేఖ, ప్రోగ్రాం ఆఫీసర్ రవికిరణ్ ఉన్నారు.

డీఆర్ఎస్‌వీ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండర్ల అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఆదివారం ర.శ.కా విశ్రాంతి భవనంలో ఎన్నికలు నిర్వహించారు. విశ్రాంత సబ్ రిజిస్ట్రార్లు వెంకటసుబ్బయ్య, రామమూర్తి అధ్యక్షతన బ్యాలెట్ పేపర్ల పద్ధతిన ఓటింగ్ జరిగింది. జమాలుద్దీన్ అధ్యక్షుడిగా, మునిశేఖర్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం అధ్యక్ష, ఉపాధ్యక్షులను బంధుమిత్రాదులు పూలమాలలు వేసి అభినందించారు.

ఎన్నికల అధికారి నుంచి నియామక పత్రాన్ని స్వీకరిస్తున్న జమాలుద్దీన్

O.S. No.60/2023

Canara Bank (erstwhile Syndicate Bank) Represented by its Branch Manager, Khajipeta Branch, Khajipeta Mandal, Kadapa District. ...వాది

Vs

1. J.Lakshmi Devi, D/o J.Subba Reddy, Hindu, aged about 30 Years, Agriculture & Business, Residing at Thudumaladinne Village, Khajipeta Mandal, Kadapa District.
2. J.Rama Devi, D/o J.Subba Reddy, Hindu, aged about 32 Years, Agriculture & Business, Residing at Thudumaladinne Village, Khajipeta Mandal, Kadapa District. ...ప్రతివాదులు

1వ మరియు 2వ ప్రతివాదులకు సమన్లు

పై దావా మీ హాజరు కొరకు 18.11.2025వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు పై తెలిపిన కోర్టు నందు వాయిదా ఉన్నది. కావున మీరు స్వయంగా గానీ, మీ తరపున వకీలు ద్వారా గానీ హాజరయ్యి, మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షము నందు కేసు తీర్మానించబడును.

By order of the Court

సం/- కె.వెంకటసుబ్బయ్య, B.A., B.L., వాది తరపు న్యాయవాది. Cell: 9704890225.

విద్యుదాఘాతంతో గేదెల మృతి

కొండాపురం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని బెడుదూరు గ్రామానికి చెందిన పాడిరైతు దేవిడ్‌కు చెందిన రెండు గేదెలు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. బాధితుడి వివరాల మేరకు.. గేదెలను మేతకు రామిరెడ్డిపల్లె వైపు తీసుకువెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో శనివారం విద్యుత్తు తీగలు తెగి కింద పడటంతో వాటిని రెండు గేదెలు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్తు ఏఈ వీరారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు.

మృతి చెందిన పాడి గేదెలు

ఇసుక రవాణా విషయంలో వాగ్వాదం

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని బిస్మిలాబాద్ వద్ద పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా విషయంలో ఆదివారం ఇరువర్గాల మధ్య వాగ్వాదం చేటుచేసుకుంది. ఇసుక రవాణాలో డబ్బుల వసూలు విషయంలో వాగ్వాదం చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయంపై తహసీల్దారు శోభన్‌బాబు మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు.

జూదరులు అరెస్టు

ఖాజీపేట, న్యూస్‌టుడే: మండల సీఐ వంశీధర్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మండలం పాటిమీదిపల్లె గ్రామం నుంచి అంకాలమ్మగుడికి వెళ్లే దారిలోని రేకుల షెడ్ వద్ద జూదం ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి నగదు, ఆట కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

మద్యం సీసాల స్వాధీనం

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని కవలకుంట్ల ఎస్సీకాలనీకి చెందిన మాదన బాలసుబ్బయ్య అక్రమంగా మద్యం సీసాలను తరలిస్తుండగా పట్టుకున్నామని ఎస్సై కొండారెడ్డి తెలిపారు. అతని వద్ద నుంచి పది సీసాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని వివరించారు.

గోడ నిర్మాణంపై ఘర్షణ.. కేసు నమోదు

కాశినాయన, న్యూస్‌టుడే: మండలంలోని ఉప్పలూరు ఎస్సీ కాలనీలో ఓ ఇంటి గోడ నిర్మాణంపై శిఖామణి, మరియమ్మ వర్గాలు పరస్పరం శుక్రవారం ఘర్షణ పడిన ఘటనలో ఇరువర్గాల్లోని 13 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. శిఖామణి తన ఇంటి వద్ద గోడ నిర్మిస్తుండగా మీరు రస్తాకు అడ్డంగా కడుతున్నారని మరియమ్మ వర్గం అడ్డు చెప్పడంతో పరస్పరం ఘర్షణ పడ్డారు. ఈ విషయంపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్ చేరుకొని స్టేషన్ ముందే మళ్లీ ఘర్షణ పడ్డారు. ఈ ఘటనపై ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని అన్నారు.

మైలవరం జలాశయానికి నీటి విడుదల

కొండాపురం: గండికోట జలాశయం నుంచి మైలవరం రిజర్వాయర్‌కు నీటి తరలింపు కొనసాగుతోందని జలవనరులశాఖ ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ఈఈ మాట్లాడుతూ జలాశయంలోని ఒక గేటు ద్వారా మైలవరం రిజర్వాయర్‌కు 2 వేల క్యూసెక్కుల నీటిని పంపుతున్నట్లు తెలిపారు. అవుకు జలాశయం నుంచి గండికోట ప్రాజెక్టుకు సుమారు 2 వేల క్యూసెక్కులు, పెన్నా, చిత్రావతి నదుల ద్వారా వెయ్యి క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి చేరుతుందన్నారు. గండికోట జలాశయంలో ప్రస్తుతం 26.70 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

ఎట్టకేలకు ఇనుప ద్వారం ఏర్పాటు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక బొల్లవరం రోడ్డు పక్కన రేషన్ సరకులకు నిల్వగా వినియోగిస్తున్న మూడు గోదాంలకు సంబంధించి ప్రధాన ప్రవేశ మార్గం వద్ద కొత్తగా ఎట్టకేలకు ఇనుప ద్వారాన్ని ఏర్పాటు చేశారు. దీనిపై గత సెప్టెంబరు 30న 'భద్రత శూన్యం.. అసాంఘిక శక్తులకు ఊతం' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీంతో ఎంఎల్ఎస్ పాయింట్ గోదాంల పీడీ లింగస్వామి దెబ్బతిన్న ద్వారానికి మరమ్మతులు చేపట్టి ఇనుప గేట్లు ఏర్పాటుతో అసాంఘిక పనులకు తెరపడిందని హమాలీలు తెలిపారు.

బొల్లవరంలోని పీడీఎస్ గోదాంల ప్రహరీకి ప్రధాన ఇనుప ద్వారం

ఊట నీటి నుంచి జనానికి విముక్తి

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: మొంథా తుపాను వలన కురిసిన వర్షాలకు మోరగుడి గ్రామం 3వ వార్డులోని వీధుల్లో, ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని మోటార్ల సహాయంతో బయటకు తోడేశారు. సిమెంటు రహదారి, కాలువలు లేకపోవడంతో గత కొద్ది నెలల నుంచి ఊట ఏర్పడి నీరు మొత్తం చేరుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. కొందరు దుర్వాసన భరించలేక ఇళ్లు కూడా ఖాళీ చేసి వెళ్లారు. ఈ సమస్యపై శుక్రవారం 'ఈనాడు'లో ''గంగ' వెర్రులెత్తుతున్న కుటుంబాలు' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో సయ్యద్‌ఉన్నిసా గ్రామంలో పర్యటించి సిబ్బందితో నిల్వ ఉన్న నీటిని బయటకు తోడించేశారు. అలాగే శాశ్వత పరిష్కారంలో భాగంగా డీఎంఎఫ్ నిధుల కింద రూ.4.99 లక్షలతో సిమెంటు రహదారిని కూడా నిర్మిస్తామని ఆమె చెప్పారు.

మోటార్ల సహాయంతో ఇళ్లలో ఉన్న నీటిని బయటకు తోడుతున్న సిబ్బంది

గోకుల్‌నగర్‌లో శుద్ధి నీరు సరఫరా

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పట్టణ శివారున ఉన్న గోకుల్‌నగర్‌లో పురపాలక సంఘం శుద్ధి జలాలను పంపిణీ చేస్తోంది. రెండు మాసాల పాటు ఈప్రాంతంలో కలుషితనీరు సరఫరా అయింది. ఈ విషయాన్ని 'ఈనాడు' అధికారుల దృష్టికి పలు మార్లు విన్నవించింది. పురపాలక తాగునీటి విభాగ ఏఈ సురేంద్రనాథ్‌రెడ్డి, సిబ్బంది కలుషిత నీరు రావడానికి కారణమైన ప్రాంతాన్ని గుర్తించి సరిచేశారు.

వైద్యవిద్య ప్రైవేటీకరణ తగదు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: ఉచితంగా వచ్చే వైద్యవిద్యను ప్రైవేటీకరణ చేయొద్దని ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి అన్నారు. రంగసముద్రం సర్పంచి చిత్తా రవిప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యవిద్య ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ప్రసాదు, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి గిరిప్రణీత్‌రెడ్డి, వైకాపా నాయకులు నాగార్జునరెడ్డి, డాక్టర్. కల్యాణ్‌చక్రవర్తి, సి.బాషా, రాజశేఖర్, లక్ష్మీనారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కొండయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువులకు రాయితీ దాణా రాదేమీ!

–న్యూస్‌టుడే, చాపాడు

పాడిపశువుల పెంపకందారులకు గ్రాసం కొరత లేకుండా ప్రభుత్వం 50 శాతం రాయితీతో ఇటీవల పశువుల దాణా అందించింది. ఒక్కో బస్తా (45 కిలోలు) రూ.1100 ఖరీదుకాగా, రైతు రూ.550 చెల్లించాల్సి ఉంది. మండలానికి 645 బస్తాలు చొప్పున కేటాయించినట్లు అప్పట్లో చెప్పారు. అందులో ఒకసారి 160, తర్వాత 80 బస్తాలు చొప్పున ఇచ్చారు. తర్వాత మూడు నెలలవుతున్నా దాణా రాలేదని రైతులు ఎదురు చూస్తున్నారు. రైతుసేవా కేంద్రాలకు, గ్రామీణ పశువైద్యశాలలకు సరకు కేటాయించి పాడి రైతులకు సరఫరా చేస్తే అందరికీ లభిస్తుందని పశువైద్య సిబ్బంది కోరుతున్నారు. ఈ విషయమై పశుసంవర్ధకశాఖ జేడీ శ్రీనివాసులును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా దాణా అవసరతపై ప్రభుత్వానికి నివేదించామని, మంజూరుకాగానే సరఫరా అయ్యేటట్లు చేస్తామన్నారు.

రైతులకు అందిస్తున్న దాణా (పాత చిత్రం)





(c) eenadu

నిత్యావసర సరకుల పంపిణీ

బియ్యం బస్తాను పంపిణీ చేస్తున్న ఆశాకిరణం సేవా సంఘం ప్రతినిధులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: మండలంలోని చింతరాజుపల్లె పంచాయతీ ఏరికలపాలెంలోని పేద కుటుంబాలకు సిద్ధవటానికి చెందిన ఆశాకిరణం సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. పేదలను ఆదుకోవాలన్న ఉద్దేశంతో తాము ఈ సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ సంఘం అధ్యక్షుడు టి.గురునాథరెడ్డి, కార్యదర్శి ఎన్.వెంకటసుబ్బయ్య, కోశాధికారి కె.గంగాధర్‌రెడ్డి తెలిపారు. ఉపాధ్యక్షులు కె.గంగయ్య, టీఎస్ నరసింహారెడ్డి, జి.మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

బాధితురాలికి చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

పులివెందుల, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. ఆయన తన నివాసంలో 40 మందికి ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.46 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. పేదలకు మేలు చేసే కూటమి ప్రభుత్వాన్ని అందరూ ఆదరించాలన్నారు. కార్యక్రమంలో కడప పార్లమెంటరీ కార్యదర్శి మైనూరు, జ్ఞానేశ్వరనాయుడు, రమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మల్లెల శ్రీను తదితరులున్నారు.

మైనర్లకు వాహనాలిస్తే కేసులు తప్పవు

మైనర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ నరసింహులు

వేంపల్లె, న్యూస్‌టుడే: మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు తప్పవని పట్టణ సీఐ నరసింహులు హెచ్చరించారు. స్థానిక బిడాంమిట్టలో ఆదివారం రాత్రి కాలనీవాసులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలా చేయడం వల్ల వారికి ఏవైనా సమస్యలు తలెత్తుతాయన్నారు. ఈ విషయం తల్లిదండ్రులు దృష్టి సారించి మైనర్లను వాహనాలకు దూరంగా ఉంచాలన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపాల్‌నాయక్ పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇచ్చేలా కృషి చేయాలని వినతి

కడప విద్య, న్యూస్‌టుడే: ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధనకు, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చేవిధంగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేయాలని కోరుతూ మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడును ఆదివారం నగరంలో కలిసి ఆపస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. మాజీ ఉప రాష్ట్రపతిని కలిసిన వారిలో ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు వెంకట్రామిరెడ్డి, సుబ్బరాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, చంద్రమోహన్, నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌ఈఎంఎస్ పథకం.. విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులకు వరం

● గత ప్రభుత్వ హయాంలో రద్దు.. పునరుద్ధరించిన కూటమి సర్కారు
● జిల్లాలో రెండు వేల మందికి ప్రయోజనం ● సర్వత్రా హర్షం

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: ఆర్టీసీలో సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన వారికి కూటమి ప్రభుత్వం తీపి కబురు వినిపించింది. గత ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన అనంతరం 'విశ్రాంత ఉద్యోగుల వైద్య పథకం'(ఆర్‌ఈఎంఎస్)ను రద్దు చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని తిరిగి అమలు చేయడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆరు ఆర్టీసీ డిపోలతో పాటు ఆర్టీసీ జోనల్ వర్కుషాప్‌ను కలుపుకొని రెండు వేల మంది విశ్రాంత ఉద్యోగులున్నారు. వీరందరికీ ఈ పథకం వర్తిస్తుంది. ● 2020లో అప్పటి ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఈ పథకాన్ని రద్దు చేయడంతో చాలా మంది విశ్రాంత ఉద్యోగులు పలు రకాల ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రూ.లక్షలు వెచ్చించి ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోవాల్సి వచ్చేది. ఇటీవల ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును కలిసిన పలువురు విశ్రాంత ఉద్యోగులు ఈ పథకాన్ని అందుబాటులోకి తేవాలని కోరారు. ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో తిరిగి ఈ పథకాన్ని అమలు చేస్తూ రెండు రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పథకంలో చేరాలనుకునే వారు విశ్రాంత సూపరింటెండెంట్ హోదా కలిగిన వారు ఒకేసారి రూ.38,572, అసిస్టెంట్ మేనేజరు, ఆపై హోదా కలిగిన విశ్రాంత ఉద్యోగులు రూ.51,429 ప్రభుత్వానికి చెల్లించాలి. డబ్బులు చెల్లించిన విశ్రాంత ఉద్యోగి అతనితో పాటు తన భార్యకు ఆర్టీసీ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం అందిస్తారు. ఆర్టీసీ ఆసుపత్రిలో వైద్యం లేకుంటే ఈహెచ్‌ఎస్ ఆసుపత్రికి బదలాయిస్తారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో కూడా వైద్యం చేయించుకునే సౌలభ్యముంది. భార్యాభర్తలకు రూ.4 లక్షలు విలువ చేసే వైద్యం ఈ పథకం ద్వారా అందిస్తారు.



ప్రభుత్వానికి కృతజ్ఞతలు : ఆర్‌ఈఎంఎస్ పథకంతో చాలా ఉపయోగం. వృద్ధులకు ప్రస్తుతం వివిధ రకాల వ్యాధులు ప్రబలుతున్నాయి. సర్వీస్‌లో లేకపోవడంతో రూ.లక్షలు వెచ్చించి వైద్యం చేయించుకునే స్థోమత ఉండదు. ఒకసారి డబ్బులు చెల్లిస్తే జీవిత కాలం ఉచితంగా వైద్యం పొందవచ్చు. ప్రస్తుతం రూ.4 లక్షలు విలువ చేసే వైద్యం అందిస్తారు. **- రవీంద్రనాథ్ వర్మ, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి, కడప**

మాలాంటి వారికి వరమే : గతంలో రద్దైన ఈ పథకాన్ని కూటమి ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించడం ఎంతో సంతోషంగా ఉంది. విశ్రాంత ఉద్యోగులకు తక్కువ పింఛన్ వస్తుంది. ఒకేసారి రూ.38,572 చెల్లిస్తే ఆర్టీసీ ఆసుపత్రులు లేదా ఈహెచ్‌ఎస్ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం పొందవచ్చు. తమ లాంటి వారికి ఈ పథకం ఒక వరం లాంటిది. **- సుబ్బారెడ్డి, విశ్రాంత ఉద్యోగి, కడప**

రౌడీషీటర్ల కదలికలపై నిఘా

కడపలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలోని రౌడీషీటర్ల కదలికలపై నిత్యం నిఘా ఉంటుందని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ అన్నారు. రౌడీషీటర్లు నేరప్రవృత్తికి స్వస్తి పలకాలని ఆయన సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం అన్ని ఠాణాల పరిధిలోని రౌడీషీటర్లను ఠాణాలకు పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీట్ ఉన్నప్పుడు ఎక్కడైనా గొడవల జోలికి వెళ్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందుల నుంచి శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఆదివారం సాయంత్రం ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటన పులివెందులలోని నల్లపురెడ్డిపల్లె రింగ్‌రోడ్డులో చోటు చేసుకుంది. బస్సులో ప్రయాణిస్తున్న డేరంగుల వెంకటేష్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ సమయంలో 55 మంది ప్రయాణికులు ఉన్నారని.. డ్రైవర్ వైఎస్ఎన్‌రెడ్డి సమయస్ఫూర్తితో వ్యవహరించారని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై పులివెందుల ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశామని డీఎం ప్రేమ్‌కుమార్ తెలిపారు.

పెన్నపేరూరులో ఇరు వర్గాల ఘర్షణ

పెన్నపేరూరు(ఒంటిమిట్ట), న్యూస్‌టుడే: మండలంలో పెన్నపేరూరు ఎస్సీ కాలనీలో ఇరు వర్గాల మధ్య వివాదం తలెత్తింది. సమీప బంధువుల మధ్య కొన్నిరోజుల నుంచి మనస్పర్థలు ఉన్నాయి. నివాసాల వద్ద వాహనాలు నిలిపే అంశంపై తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం మరోసారి గొడవ పడ్డారు. రెండు వర్గాల వారు ఒకరిపై మరొకరు భౌతిక దాడులకు దిగారు. దీంతో కాలనీలో ఉద్రిక్తత నెలకొంది. కొంతమంది వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. మహిళకు గాయాలు

కలకడ, న్యూస్‌టుడే : కలకడ సమీపంలోని బాటవారిపల్లె ఉన్నత పాఠశాల సమీపంలోని చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడటంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. చెన్నూరుకు చెందిన నరసమ్మ ఆదివారం ఆటోలో పీలేరుకు చేపలు విక్రయించడానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బాటవారిపల్లె సమీపంలోకి రాగానే ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో నరసమ్మకు తీవ్రగాయాలయ్యాయి. రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సమాజ సేవే ఎన్ఎస్ఎస్ లక్ష్యం

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న వైవీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త వెంకట్రామిరెడ్డి

వేంపల్లె, న్యూస్‌టుడే: సమాజసేవే ఎన్ఎస్ఎస్ లక్ష్యమని యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) సమన్వయకర్త వెంకట్రామిరెడ్డి అన్నారు. వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం తంగేడుపల్లెలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గ్రామాలకు వెళ్లి ప్రజలకు సేవ చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఓబుల్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ డిప్యూటీ సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి, విజయలక్ష్మి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ

కడప విద్య, న్యూస్‌టుడే: కడప నగరంలోని నాగరాజుపేటలో ఆదివారం కోటిరెడ్డి మహిళా కళాశాల విద్యార్థినులు ఎన్ఎస్ఎస్-2 ప్రోగ్రాం అధికారి డాక్టర్ శచీదేవి ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్యం, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ 'వ్యక్తిగత పరిశుభ్రత', 'ఆరోగ్యకరమైన ఆహారం', 'వారానికి కనీసం అయిదు రోజులు అరగంట పాటు నడక పది నిముషాల మెడిటేషన్' వంటి అలవాట్ల ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చునని ప్రచారం చేశారు. సీజనల్ వ్యాధులు, మద్యపానం, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించి విద్యార్థినులు పాదచారులు, స్థానికులు అవగాహన కల్పించారు.

నాగరాజుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న కోటిరెడ్డి మహిళా కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులు

జ్యోతి ఆలయాభివృద్ధికి కృషి

ఆలయం వద్ద మాట్లాడుతున్న భాజపా నేత సాయి లోకేశ్

సిద్దవటం, న్యూస్‌టుడే: శ్రీశైలం దేవస్థానానికి దక్షిణముఖ ద్వార కోవెలగా ప్రసిద్ధి చెందిన సిద్దవటం మండలం జ్యోతి సిద్దవటేశ్వర స్వామి కోవెల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని అన్నమయ్య జిల్లా భాజపా అధ్యక్షుడు సాయిలోకేష్ తెలిపారు. పురాతనమైన జ్యోతి సిద్దవటేశ్వరస్వామి కోవెలను ఆదివారం ఆయన సందర్శించారు. కామాక్షి, జ్యోతిర్లింగేశ్వరస్వామి, గాలిగోపురం, బయల్పడిన శివలింగాలను, మరికొన్ని కట్టడాలను తిలకించారు. ఆయన మాట్లాడుతూ చారిత్రకంగా ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ కోవెల అభివృద్ధికి నోచుకోక శిథిలావస్థలో దర్శనమివ్వడం బాధకరమన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తామని ఆయన తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్, తెదేపా మాజీ మండల మోహన్‌రెడ్డి, ఒంటిమిట్ట అధ్యక్షుడు భానుచందర్, భాజపా నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు నోచుకోని బహుజన నగర్

బహుజన నగర్‌లో అధ్వానంగా ఉన్న రోడ్డును పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

మారుతీనగర్, న్యూస్‌టుడే: దశాబ్దాలు గడుస్తున్నా నగరంలోని బహుజన నగర్, సాగర్ కాలనీల్లో సరైన రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ సౌత్‌జోన్ నాయకులు పగడపూల మల్లికార్జున ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక బహుజన నగర్‌లో ఆదివారం పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నగరపాలక యంత్రాంగానికి పన్నుల వసూలులో ఉన్న శ్రద్ధ మౌలిక వసతులు కల్పించడంలో లేదని.. పేదల కాలనీల్లోని సమస్యలు పరిష్కరించాలని నగర పాలక కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేస్తున్నామని ఈ ఆందోళనకు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర నాయకులు శంకర్‌నాయక్, ఈశ్వరయ్య, భాగ్యలక్ష్మి, మహేష్, రమణ స్థానికులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక

వేంపల్లె : రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు వేంపల్లె జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న శివకేశవ అనే విద్యార్థి ఎంపికయ్యారు. భారత రాజ్యాంగ వారోత్సవాల్లో భాగంగా రెండు రోజుల కిందట పులివెందులలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్విజ్ పోటీల్లో ఈ విద్యార్థి పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ విద్యార్థి పాల్గొనున్నారు. ఈ పోటీలకు ఎంపికైన విద్యార్థిని హెచ్ఎం శివమునెమ్మ, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

పద్మశాలీయ సేవా సంఘం ఆధ్వర్యంలో వన భోజనాలు

కడప విద్య, న్యూస్‌టుడే: కడప నగరంలోని పద్మశాలీ కల్యాణ మండపంలో ఆదివారం పద్మశాలీయ సేవా సంఘం ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షుడు అవ్వారు వెంకటసుబ్బయ్య అధ్యక్షతన శ్రీభద్రావతి భావనారాయణ స్వాముల వారి కల్యాణం నిర్వహించారు. అనంతరం సామూహిక వన భోజన కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా దేవాదాయశాఖాధికారి గంజి మల్లికార్జున మాట్లాడుతూ.. ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో సంస్కృతి, నైతిక విలువలు, సేవా భావం పెంపొందించడానికి దోహదం చేస్తాయని వివరించారు. కార్యక్రమంలో నాయకులు అవ్వారు సుబ్బరాయుడు, బాల యానాదయ్య, రాటాల గోపి, బొడగల వెంకట్రామయ్య, మామళ్ల చిన్నవెంకటసుబ్బయ్య, గునిశెట్టి శ్రీనివాసులు, గునిశెట్టి సాయి, పుత్తా శివరామయ్య పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

'కార్మికుల హక్కులు కాలరాస్తే ఉద్యమిస్తాం'

మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ నాగేశ్వరరావు

మారుతీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తే ఉద్యమిస్తామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీఐటీయూ 18వ ఆల్ ఇండియా మహాసభలు డిసెంబరు 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగుతాయని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, జిల్లా కార్యదర్శులు సత్యనారాయణ, వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షులు భైరవ ప్రసాద్ పాల్గొన్నారు.

శిల్పారామంలో సందడి

కళావేదికపై నృత్యం చేస్తున్న విద్యార్థులు

మారుతీనగర్, న్యూస్‌టుడే: శిల్పారామం కళా వేదికపై ఆదివారం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఎంతగానో అలరించాయి. వారాంతపు సెలవు రోజు కావడంతో నగర ప్రజలు, చిన్నారులు, మహిళలు పెద్ద ఎత్తున శిల్పారామానికి చేరుకుని సేద తీరి సందడి చేశారు. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలనాధికారి కృష్ణప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మురాదియా దర్గా గంధోత్సవం

గంధాన్ని తీసుకొస్తున్న మురాదియా దర్గా పీఠాధిపతి

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కడప నగరంలోని మురాదియా దర్గాలో ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రాత్రి ఘనంగా గంధోత్సవాన్ని దర్గా ప్రతినిధులు చేపట్టారు. దర్గా పీఠాధిపతి మహమ్మద్ జమాలుల్లా ఇంటి నుంచి ఫకీర్ల మేళతాళాలతో, విన్యాసాలతో దర్గాలో గంధాన్ని సమర్పించి ఫాతెహా చేసి ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

6న గ్రామ వార్డు సచివాలయాల ఎదుట ఆందోళన

మారుతీనగర్, న్యూస్‌టుడే: మొంథా తుపాన్‌తో నష్టపోయిన రైతులకు పంటల బీమా పెట్టుబడి రాయితీ పరిహారం చెల్లించాలని డిమాండు చేస్తూ ఈ నెల 6 వ తేదీన జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర స్థానిక జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: మొంథా తుపానుతో నష్టపోయిన చేనేత కార్మికులను ఆదుకోవాలని జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున డిమాండ్ చేశారు. కడపలోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అకాల వర్షం, తుపాను నేపథ్యంలో జిల్లాలోని అనేక మంది చేనేత కార్మికులు ఇబ్బందులు పడ్డారన్నారు. జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా సర్వే చేసి చేనేతలను ఆదుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో చేనేతలకు ఇచ్చిన హామీల అమల్లో భాగంగా 200 యూనిట్ల విద్యుత్తు ఉచితంగా ఇవ్వాలని.. ఏడాదికి రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

తెదేపాలో కష్టపడిన వారికే గుర్తింపు

జగన్నాథరెడ్డిని సత్కరించిన వేంపల్లె తెదేపా మైనార్టీ నేతలు

వేంపల్లె, న్యూస్‌టుడే: తెదేపా కోసం కష్టపడిన వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ బోరెడ్డి జగన్నాథరెడ్డి అన్నారు. వేంపల్లె పట్టణానికి తెదేపా మైనార్టీ నేతలు షేక్ అహ్మద్‌అలీ, గౌస్, మస్తాన్ ఆదివారం రామిరెడ్డిపల్లెలో జగన్నాథరెడ్డిని కలిసి సత్కరించారు. జగన్నాథరెడ్డి మాట్లాడుతూ.. పార్టీని నమ్ముకున్న వారికి రాబోయే రోజుల్లో మరింత మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్వీయ చరిత్ర నా స్మృతి పథంలో పుస్తకావిష్కరణ

మారుతీనగర్, న్యూస్‌టుడే: రైతు కుటుంబంలో పుట్టి ఆరోగ్య మంత్రిగా ఎదిగిన నిగర్వి రామమునిరెడ్డి అని రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. ద్వారకా నగర్‌లోని శ్రీకృష్ణాలయంలో ఆదివారం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో 'స్వీయ చరిత్ర నా స్మృతి పథంలో' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. స్వీయ చరిత్ర రాయడం కత్తి మీద సాములాంటిదని అలాంటిది రామమునిరెడ్డి ఎంతో జాగ్రత్తగా రాశారని.. నేటి యువతకు ఇలాంటి పుస్తకాలు మార్గదర్శకాలుగా ఉపయోగపడతాయన్నారు. విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, పెద్దిరెడ్డి నీలవేణి, తవ్వా వెంకటయ్య, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, రచయితలు

బురదపై సన్న కంకర.. చోదకులకు అవస్థ

నగర శివారులోని రిమ్స్ వద్ద ఉన్న క్రైస్తవుల సమాధుల తోటకు వెళ్లే దారి బురదమయంగా మారడంతో దానిపై సన్న కంకర పోశారు. దీంతో వాహనాల రాకపోకలు వాటిపైనే సాగుతున్నాయి. పలు వాహనాలు ఇరుక్కుపోయాయి. మరోదారి లేకపోవడంతో పొలాల్లో నుంచి వెళ్లాల్సి వచ్చింది. ఆదివారం పలువురు క్రైస్తవుల సమాధుల వద్దకు వెళ్లేందుకు కాలినడకన వెళ్లాల్సి వచ్చింది. **- న్యూస్‌టుడే, కడప చిన్నచౌకు**

కనుల పండువగా కార్తిక మహోత్సవాలు

వేంపల్లె, న్యూస్‌టుడే: వేంపల్లెలో గౌరీదేవి అమ్మవారి కార్తిక మహోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా స్థానిక సంఘం వీధిలో వెలసిన ఆలయంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరుకు చెందిన సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని సరస్వతిదేవిగా తీర్చిదిద్దారు. స్థానిక మెయిన్‌బజారులోని అమ్మవారిశాలలో గౌరీదేవి అమ్మవారిని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వల్లూరు: కార్తిక పౌర్ణమి ముందుగా వచ్చే ద్వాదశి సందర్భంగా ఆదివారం రాత్రి వల్లూరు శివాలయంలో క్షీరాబ్ధి ద్వాదశి పండగ పూజలను మహిళలు వైభవంగా నిర్వహించారు. తులసి కోట(బృందావనం)ను చీరతో అందంగా అలంకరించి చుట్టూ దీపాలు ఏర్పాటు చేసి సుమంగళిలు గోత్రనామాలతో పూజలు ప్రారంభించారు. తీర్థ ప్రసాద వితరణ చేశారు.

చింతకొమ్మదిన్నె : బుగ్గలేటిపల్లె సమీపంలోని గంగమ్మ ఆలయంలో ఆదివారం గంగమ్మ దేవతకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారికి బోనాలు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలోని వినాయకస్వామి వీరభద్రస్వామి వైద్యనాథీశ్వడు ఆంజనేయస్వామికి పూజలు చేశారు.

వేంపల్లె : సరస్వతీదేవి అలంకారంలో గౌరీదేవి

వల్లూరు: తులసి పూజలో పాల్గొన్న మహిళా భక్తులు

చింతకొమ్మదిన్నె : పూజలందుకున్న గంగమ్మ

రైతుబజారులో కూరగాయల ధరలు

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతుబజారులో కూరగాయల ధరలు కిలో (నిన్నటివి) ఇలా...బంగాళదుంప-40, క్యాబేజి-25, క్యారెట్-70, బీన్స్-0, బీట్‌రూట్-55, కీర-30, దోస-40, దొండకాయలు-45, ముల్లంగి-35, అల్లం-60, 80, కాలీఫ్లవర్-34, క్యాప్సికం-55, టమాట-16, మిరపకాయలు-25, వంకాయలు-55, బెండకాయలు-40, బీర-45, కాకర- 50, మటిక్కాయ-50, చిక్కుడు-50, అలసందకాయలు-45, అనపకాయలు-55, ఉల్లిపాయలు-15, 20, మునగకాయలు-60.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu